వసిష్ఠ రామ సంవాదం

(యోగ వాసిష్ఠమ్)



మూడవ సంపుటం

నిర్వాణ ప్రకరణము

శ్రీ వసిష్ఠ - రామ సంవాదము

(శ్రీవాల్మీకి మహర్షి ప్రణీత యోగవాసిష్ఠము)

మూడవ సంపుటం

నిర్వాణ ప్రకరణము

అనుసృజన:

వై. హెచ్. రామకృష్ణ

రామకృష్ణ మఠం

దోమలగూడ, హైదరాబాదు-500 029

Published by
Adhyaksha
Ramakrishna Math
Domalguda, Hyderabad - 29

I - 1M - 08 -2010
12026

12028 (Set)

Printed at :
RP Printers, Hyderabad.

Bound at
Pridhvi Binders, Hyderabad.

ప్రవేశిక

అఖండ రామాయణంలోని చివరి ప్రకరణం అయిన నిర్వాణ ప్రకరణంలోకి ఇప్పుడు ప్రవేశిస్తున్నాం. ఆరు ప్రకరణాల్లోకీ శ్లోక సంఖ్యాపరంగా ఇది పెద్దదవటమేకాదు; ఇందులో చర్చించిన అంశం కూడా గంభీరమైనది. మొదటి ప్రకరణాల్లో చర్చించిన అంశాలు సూక్ష్మమైనవైతే, ఇందులో చర్చించిన విషయం సూక్ష్మతరం, సూక్ష్మాతి సూక్ష్మం అని పేర్కొనవలసి ఉంటుంది. నిజానికి అన్నింటిలో చర్చించిన విషయం ఒక్కటే ఐనప్పటికీ ఏ స్థాయినుంచి, ఏ భూమికనుంచి, ఏ కోణం నుంచి విషయాన్ని విశ్లేషిస్తున్నాం అన్న దాన్ని బట్టి చర్చించిన అంశం విభిన్నంగా వ్యక్తమవుతుంది.

ఈ ప్రపంచ మంతా ఉదయాస్తమ రహితమై, అఖండప్రకాశ రూపమై, నిర్మలమై, శిలవలె మౌనరూపమై, నిర్వికారమైనట్టి శాంతమగు బ్రహ్మయే అయిఉన్నది అంటుంది ఈ ప్రకరణం. ఇది కేవలం భావన కాదు. పరమ సత్యం. మనకు అనుభవమౌతున్న జగత్తు అవిద్యారూపం. అజ్ఞాన జనితం. బ్రహ్మానికి వేరైన సత్తాలేనిది. కావున ఈ ప్రకరణం నుంచి మనకు, ద్రష్ట దర్శన దృశ్య త్రిపుటిని భేదించి, భిన్నత్వంలో ఏకత్వాన్ని దర్శించి, ఏకత్వరూపంగా మిగిలిపోవలసిందని శాస్త్రమాత ఉద్బోధము.

వాయువు, వాయు స్పందన ఏవిధంగా వేరుకావో అదేరీతిన చైతన్యం లేదా చిత్తు మరియు విషయ జగత్తు వేరు కావు. చిత్ స్పందనే జగత్తు.

చైతన్యానికి వేరుగా ఏమీ లేదని, ఇంద్రియాలు, వాటికి అధిష్ఠానమైన మనస్సు, మనోకల్పితమైన విషయ ప్రపంచంతో సహా సర్వం బ్రహ్మమయమని ఈ ప్రకరణం నుంచి జ్ఞాని గ్రహిస్తాడు. దేహం అందులోని చిత్ రెండూ వేరు కావన్న భావం కలిగిన సాధకుడు బ్రహ్మభావాన్ని పొందుతాడు. నిర్వాణ సౌఖ్యాన్ని అనుభవిస్తాడు. సర్వం చిన్మయమని గ్రహించిన వ్యక్తి శోక మోహరహితుడై, భేదదృష్టి వీడినవాడై ఏకత్వానుభవం పొంది కేవలానంద స్వరూపుడిగా నిలుస్తాడు.

నిర్వాణ ప్రకరణం లో చెప్పిన విషయాన్ని సులభంగా గ్రహించాలంటే ముందు ప్రకరణాల్లో పేర్కొన్న విషయాన్ని అవగతం చేసుకుని ఉండాలి. ఉత్పత్తి, స్థితి ప్రకరణాలు దృశ్యావిర్భావానికి మరియు దృశ్యానుభూతికి కారణాలు బోధించాయి అని అనుకున్నట్లైతే; నిర్వాణ ప్రకరణం సముద్రం నుండి ఉద్భవించే తరంగాలు ఏవిధంగా సముద్రానికి భిన్నం కావో అదేవిధంగా దృశ్యజగత్తు కూడా చిదభేదం కాదని ఉద్ఘాటిస్తుంది. మనోనిర్మితమైన వస్తు ప్రపంచం మనస్సుతో సహా చిత్ శక్తియే. చిద్విలాసమే. చిదాంతర్గతమే. చిద్రూపమే. చిన్మయమే. చిత్స్ఫురణయే అని తెలుపుతుంది. ఐతే జగత్తు చిదభిన్నం ఐనప్పుడు పురుష ప్రయత్నం చేయటం, మోక్షాన్ని పొందటం అన్నీ అసంగతాలు కావా అంటే మనకు ఇంద్రియగోచర జగత్తుకు సంబంధించిన ఎరుక ఉన్నంత సేపు ఆ ఎరుక తొలగే వరకూ ప్రయత్నం చేయాల్సిందే. అంటే మొదటి ప్రకరణాల్లో చెప్పిన విచారణ అనే పురుష ప్రయత్నాన్ని అనుష్ఠించి మనస్సును పరిశుద్ధ మొనర్చుకున్న జిజ్ఞాసువు మాత్రమే ఈ ప్రకరణం లో పేర్కొన్న కేవలాద్వైతాన్ని అనుభవ మొనర్చుకోగలడు. అలా కాకుండా ఇందులోని ఉత్కృష్ట భావనలను అపరిశుద్ధ మనస్కుడికి బోధిస్తే విరుద్ధంగా, విపరీతంగా అర్థంచేసుకునే ప్రమాదముంది. అందువలన శాస్త్రంలో పేర్కొన్న విషయాన్ని అందులో పేర్కొన్న క్రమంలోనే చదవాలి.

– ప్రకాశకులు

విషయ సూచిక

❖❖❖

రఘునాథాయ నాథాయా సీతాయాః పతయే నమః

శ్రీ వసిష్ఠ - రామ సంవాదము

VI. నిర్వాణ ప్రకరణం

(పూర్వార్థం)

పదిహేనవ రోజు

I. ప్రకరణ పరిచయం

1. అవ్యక్త ఆత్మ స్వరూపం

సూర్య భగవానుడు తన సహస్ర కిరణ జాలములను లోకములపై ప్రసరింపజేయటంతో ఉదయారంభమైనది. రామలక్ష్మణాదులు మహర్షి వసిష్ఠులవారి ఆశ్రమం ప్రవేశించి మహర్షిని సుస్వాగతపూర్వకంగా ఆశ్రమంనుండి సభాప్రాంగణమునకు రథముపై తోడ్కొని వచ్చారు. సభ యథారీతిగా ప్రారంభమైంది.

శ్రీ వసిష్ఠ మహర్షి : ఆత్మానంద స్వరూపులగు ప్రియశ్రోతలారా! లోకకళ్యాణ, చిరుదరహాసాలంకారుడ వగు ఓ రామచంద్రా! ఈ రోజు నుండి మనం నిర్వాణము గురించిన సంవాదంలో ప్రవేశిస్తున్నాం.

ఓ రామచంద్రా! ముముక్షు వ్యవహారం మొదలుగా మనం అనేక విషయాలు చెప్పుకోవటం జరిగింది. క్రమంగా నీవు నీ చిత్త విహంగాన్ని హృదయమనే పంజరంలో ఉంచి వశపరచుకుంటు న్నావు కదా? నాయనా! హంస పాలు స్వీకరించేటప్పుడు, అందులోని జలభాగాన్ని వదలి పాలసారమే గ్రహిస్తుంది కదా! అట్లాగే మన ఈ సుదీర్ఘ సంవాదములోని అసంగతమైనది, దుర్బోధ్యమైనది ఏదైనా ఉంటే..అది విడిచి, సారాన్ని జాగ్రత్తగా గ్రహిస్తున్నావని నేననుకుంటున్నాను.

1. వాసనాక్షయం, 2.మనో నాశనం, 3. ప్రాణ నిరోధం, 4. జ్ఞానాభ్యాసం...

ఈ నాలిగిటి గురించి అనేక విశేషాలు మనం ఉపశమన విభాగంలో చెప్పుకున్నాం. వాటినన్నిటినీ నీవు చక్కగా స్వబుద్ధితో పరిశీలించి, అనుగమించాలి. ఈ పథం అనుసరిస్తే నీవు బద్ధుడవు కావు. అట్లా గాకుండా, శ్రద్ధ, పట్టుదల, ప్రయత్నము ఆశ్రయించక, కేవలం దిగులుపడుతూనో ...లేక ఇంద్రియ విషయ సేవనతోనో రోజులు గడిపేస్తూ ఉంటే ...వింధ్యపర్వత శిఖరం నుండి అమాయక ఏనుగు పతనమైనట్లు ఈ జీవుని అధఃపతనం అనివార్యం. మన ఈ సంవాదములోని అంతర్లీనసారాన్ని గ్రహిస్తూ, తమ తమ సాధనలను కొనసాగించుకుంటూ ఉండమని సర్వజనులకు మరొక్కసారి గుర్తు చేస్తున్నాను. శ్రద్ధ, అవగాహన పెంపొందించుకోకపోయాడా, బాటసారి చీకటి పడుటచే ఒక అడవిలో చిక్కుకున్నట్లు, ఈ జీవుడు ఈ సంసారారణ్యంలో చిక్కుకోవలసి వస్తుందని హెచ్చరిస్తున్నాను.

ఓ రామా! సంగరహితుడవై యథాప్రాప్తములైన లోకవ్యవహారములను ఆచరించుటయే శాస్త్ర సిద్ధాంతం. దీనిని నీవు గ్రహించి ఉదారచిత్తుడవగుము.

ఇంతవరకూ ఉపశమనము గురించిన విభాగంలో చిట్ట చివరివరకూ మనం చెప్పుకొన్న విషయాలలోని గంభీరార్థం జ్ఞాపకం ఉంచుకుంటున్నావు కదా!

ఇప్పుడిక శాశ్వత సిద్ధి ప్రసాదించగల మరికొన్ని విశేషాలు చెప్పుకోబోతున్నాం. అయితే, అభ్యాస-వైరాగ్యాలను నిరంతరం అలవర్చుకుంటూ ఉండవలసిందే. తద్వారా తత్త్వచింతన సుస్థిరరూపం పొందుతుంది. తత్త్వం చక్కగా గ్రహించటంచేత దుర్భేధ్యమైన వాసనావేశం బలహీనపడుతుంది. అప్పుడు శోకరహితమైన 'తత్పదం' తప్పక లభిస్తుంది. మన ఈ వర్తమాన సంవాదం అందుకు తప్పక సహకరించగలదు. అందుచేత మీమీ శాస్త్రప్రవచితమైన, ఆశ్రమోచితమైన అభ్యాసాలు చక్కగా నిర్వర్తిస్తూ ఉండండి.

దేశ-కాల-కారణములచే పరిచ్ఛేదమొందజాలని బ్రహ్మమే ఈ జగత్తు రూపంగా వెలయు చున్నది. అయితే, చమత్కారంగా ద్వైత భ్రాంతిని మాత్రం కలుగజేస్తోంది. నిర్విషయమై, సమమై, శాంతమయమైనట్టి బ్రహ్మమొక్కటే ఉన్నది. ఇక్కడ అన్యత్వానికి తావేలేదు. ఈ విషయం పదే పదే నిరూపించుకున్నాం. నిరూపించుకోబోతున్నాం కూడా!

ఇక అహంకారమంటావా... అద్దానిని లేని దానిగానే చూడు. ఈ పిపీలికాది బ్రహ్మ పర్యంతరం (పురుగు నుండి, బ్రహ్మదేవుని వరకూ) ప్రశాంతంగా సర్వశరీరములలోనూ ప్రసరించి ఉన్న ఆత్మను దర్శించగలగటమే "అపరోక్షానుభవం." నిజానికి చిత్తము గాని, అవిద్య గాని మనస్సు గాని, జీవుడు గాని లేనేలేవు. ఇవన్నీ ఆ బ్రహ్మమునందు ఏర్పరచబడుచున్న కల్పనలు మాత్రమే. భోగములు, అద్దాని పట్ల ఏర్పడే వృత్తులు, ఆసక్తి, అనుభవం - ఇవన్నీ కూడా సముద్రంలోని తరంగాలులాగా బ్రహ్మములోనే ఉద్భవిస్తున్నాయి. స్వర్గ-భూ-పాతాళ లోకములలోను, భూత-వర్తమాన-భవిష్యత్తులలోను, బ్రహ్మదేవునిలోనూ, స్తంభములో కూడా... ఆ పరబ్రహ్మమొక్కటే జ్వాజ్వల్యమానంగా ప్రకాశించుచున్నది. దానికి భిన్నమైనదంటూ ఏదీ లేదు. గ్రాహ్య-త్యాజ్యము లలోనూ, బంధుమిత్ర వ్యవహారములందు, తదితర సర్వ ఉపాధులలోనూ ఆద్యంతరహితమై విజృంభి స్తోంది ఆత్మయే.

అజ్ఞాన భ్రమ ఉన్నంతవరకు జలంలో తరంగభావనలాగా 'జగత్ కల్పన' అనే చిత్తము యొక్క ద్వితీయ ఆవృత్తి ఉండనే ఉంటోంది.

"నేను దేహమును, ఈ దృశ్యమంతా నిజమే అయి ఉన్నది, ఇది నేను, అవి నావి" ...ఇటువంటి కల్పనలు, భావతమకములు ఉన్నాయంటే మనోచాంచల్యము ఏర్పడుచున్నట్లే! జీవుడు సజ్జన - సద్విషయ - సద్వివేక సాంగత్యం ద్వారా పూర్ణత్వం సంతరించుకోనంత వరకు చిత్తం నీచత్వం పొందుతూనే ఉంటుంది. సర్వసమదర్శనం ద్వారా విశ్వభ్రాంతిని బలహీనపరచుకుంటే గాని తన స్వరూపమేమిటో ఈ జీవునకు అర్థం కాదు, తోచదు కూడా! అజ్ఞానం అనే గుడ్డితనం వలన మోహం, మోహం వలన మూర్ఖత్వం, మూర్ఖత్వం ద్వారా విషయ ఆశలు, విషయవాసనలు వచ్చి పడుతున్నప్పుడు మరి జీవుడు ఉపాయాలను ఆశ్రయించాలి కదా? హృదయవనంలో ఆశల దుర్గంధం నిరంతరం ఉబుకుతుంటే 'ఆత్మవిచారణ' అనే చకోరం ఎట్లా ప్రవేశిస్తుంది? భోగములను ఆశించటం

కాస్త ఆపి, సమచిత్తం పెంపొందించుకోకపోతే ఈ జీవుని పీడించే పాశాలు తెగేదెట్లా? తృష్ణను జయించి శీతల మనస్కుడు కాకపోతే ఈ జీవునికి స్వస్వరూప ప్రబోధం వినబడేదెట్లా? అవునా, కాదా?

శ్రీ రాముడు: ఔను మహర్షీ! అయితే, 'చిత్తం' అనబడేది అనే పిశాచి అసలు ఉత్పన్నం కాకుండేదెట్లా?

శ్రీ వసిష్ఠ మహర్షి: ఈ ఎదురుగా కంటికి కనబడే వస్తువులను "లేనివి"గా, అతి దగ్గరగా అనుభవ మయ్యే ఈ దేహమును "బాహ్యమగు ఉపకరణ మాత్రం"గా చూడగలిగిన నాడు జీవునికి చిత్తం ఉత్పన్నమే కాకుండగలదు. 'నేను పుట్టుక – చావుల మధ్య ఇరుక్కున్న ఒక అల్ప జీవుడను' అనే ప్రారంభ భ్రమతో బాటు తదితర అసంఖ్యాక భ్రమలకు కారణమగుచున్న 'జగత్తు' అనబడేది అంతరంగంలో శాంతించటమే అన్నిటి కన్నా అతి ముఖ్యమైన ఉపాయం. అందుకు శ్రవణ–మనన–నిధి–ధ్యాసనల ద్వారా హృదయంలో ఆత్మ సాక్షాత్కరించటమొక్కటే మార్గం. మిథ్యాభ్రమలు కలిగించే అజ్ఞానం శాంతించి 'పరమార్థదర్శనం' అనే సూర్యుడు ఉదయిస్తే చిత్తం దానంతట అదే ఎండుటాకు వలె నేల రాలుతుంది. నిప్పులో పడ్డ నేయి వలె లేకుండాపోతుంది.

శ్రీరాముడు : మహాత్మా! మహాత్ములలో కూడా 'చిత్తం' ఉంటుందా?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఉంటుంది. అయితే సముద్రం ఒడ్డున నీరు ఎండిన చోట నీటి జాడలు కనిపిస్తాయి చూచావా! అట్లా పేరుకు మాత్రమే ఉంటుంది. ఎందుకంటే మహాత్ముల చిత్తం పరాపరదర్శనంతో కూడుకొని ఉంటుంది. జీవన్ముక్తమై ఉంటుంది. శుద్ధసత్వమయమగుటచే నామకః మాత్రమే అయి ఉంటుంది. వారిలో వాసనలు సత్వమయమై ఉండటం చేత వారిది చిత్తము అని అనిపించుకోదు. 'సమరసము' అను రుచితో కూడిన ఆ తత్త్వజ్ఞులు అమనస్కులే! వారు లోకహితైషులై ఈ ప్రపంచంలో సంచరిస్తూ ఉంటారు. శుద్ధులై, శాంతులై, మహోన్నతులై, సంయతీంద్రియులై తమ లోపల, బైట అద్వైతజ్యోతి సమన్వితులై ఉంటారు. ద్వైత వాసనలు వారిని సమీపించలేవు. ఈ దృశ్యము అనే తృణములు (గడ్డిపరకలు) వారి జ్ఞానము అనే అగ్నికి ఆహుతై అవిషయములగుచున్నాయి. వారి సంచారములు, మనోధర్మములు లోకకళ్యాణోద్దేశ్యం మాత్రమే కలిగి ఉంటాయి. అట్టి చిత్తంలో ఇక భ్రమలేవీ ఉండవు.

దగ్ధమైన బీజం మరల అంకురిస్తుందా? ఆ మహా మహితాత్ముల హృదయాకాశంలో మోహం ఉద్భవించదు.

దేనినైతే మనం 'చిత్తము' అని పిలుస్తున్నామో అది మూఢులకు పదే పదే జన్మజరామరణములు కలిగించటానికి కారణమౌతోంది. జ్ఞానుల చిత్తం ఒక మహాశిల్పి చేతిలోని ఉలిలాగా గొప్ప ఉపయుక్త మగు ఉపకరణమగుచున్నది. అనగా, అదే చిత్తము "జ్ఞానానందమయ దృష్టి"ని సంపాదించుకోవటానికి పరికరమగుచున్నది. అట్టి చిత్తము అజ్ఞాని యొక్క చిత్తంలాగా పదే పదే పునరుత్పత్తి పొందటం లేదు.

శ్రీరాముడు : ఏకత్వం తాండవిస్తోందని చెప్పబడే ఈ జగత్తు మాకు పరిపరి విధాలుగా కనబడటానికి కారణమేమిటి?

శ్రీ వసిష్ఠ మహర్షి : స్వస్వరూపము, సర్వ స్వరూపము అగు బ్రహ్మమును ఏమరచుట చేతనే!

బ్రహ్మబృంహైవ హి జగజ్జగచ్చి బ్రహ్మబృంహణమ్।
విద్యతే నానయోర్భేదశ్చిద్ఘన బ్రహ్మగోరివ॥ (శ్లో. 51 సర్గ 95)

అయితే ఈ జగత్తు, బ్రహ్మము, శుద్ధ చిత్తము – ఈ మూడు వేర్వేరు కాదని గ్రహించు. అవి అభేదమైనవే! మిరియములో కారం ఉన్నట్లు... మూడు జగత్తులూ చిత్‌లోనే ఉన్నాయి.

శ్రీరాముడు : స్వామీ! ఈ జగత్తు ఉత్పత్తి, ప్రళయముల మాటేమిటి?

శ్రీ వసిష్ఠ మహర్షి : జగత్ యొక్క ఉత్పత్తి, ప్రళయములు కేవలం కల్పిత మాత్రములే. ఇక అది ఉండటం ఉండకపోవటం (సత్ – అసత్) అనునదంతా ఖండజ్ఞానముచే ఏర్పడుచున్నదే! భ్రాంతి చేత చైతన్యమునందు జడత్వము ఆపాదించబడి, గాంచబడుతోంది. ఫలితంగా అట్లు జడ భావనచే చూస్తున్న ద్రష్టయగు ఈ జీవుని ఇక సర్వ అప్రతిష్ఠలు, సర్వ అల్పావగాహనలు చుట్టుముట్టుచున్నాయి. అతను దుఃఖితుడౌతున్నాడు. మరి ఆ దుఃఖాలు తొలగక్కర్లేదా?

శ్రీరాముడు : ఈ జీవుని అంతరాంతరాలలో దుఃఖం పేరుకుని ఉన్న మాట మాత్రం నిజం. అది తొలగవలసిన అగత్యమున్నదనునది అత్యావస్యకం కూడా!

శ్రీ వసిష్ఠ మహర్షి : అందుకు విచారణ చేయాలి. కాస్త విచారణ చేస్తే, "ఈ జడ జగత్తు వాస్తవమే కాదు" అని తేలుతోంది. కల్పనలన్నీ కల్పనలను ఆశ్రయించే స్వభావం గల ఈ జీవునియందే ఉన్నాయి గాని... జగత్తునందు కాదు.

ఈ దృశ్యమును చిన్మయముగా భావించగలిగిన చిత్తము శుద్ధమైనట్లే. అద్దానిలో బైట, లోపల ఇక కల్పనలు ఉండవు.

ఆత్మయే స్వరూపముగా గల ఈ జీవుడు స్వస్వరూపమును ఏమరచినప్పుడల్లా అల్పత్వము పొందుతున్నాడు. అందుచేత సర్వ జనులారా! మీ యొక్క సత్యస్వరూపం ఈ నామ రూపాత్మక దేహం కాదు. జగత్తులోని ఒక పదార్థం కాదు. అది ఆద్యంత రహితమై, నిరంశమై, చిదాత్మకమై అఖండమై ఈ కనబడే దాని కంతటికీ అతీతమైయున్నదని గుర్తు చేస్తున్నాను. మరల–మరల ఆ పరిపూర్ణత్వమును స్మరించి, అద్దానిచే శాంతులై అప్పుడు ఈ సర్వమును పరికించండి. అప్పుడు, "జగత్తు – చిత్తము – బ్రహ్మము ఒక్కటే వేర్వేరు కాదు" అను గూడార్థం మీకు తప్పక గోచరించగలదు. స్ఫటికము వలె శుభ్ర స్వరూపుడగు ఈ జీవుడు తనకు తానే కల్పనచే ఈ సంసారరూపంగా క్రీడయందు వలె తాండవమాడుచున్నాడు.

ఓ రామచంద్రా! ఈ కనబడే పదార్థములేవీ నీవు అయి ఉండలేదు. అవి నీ యందు లేవు. నీవు వాటియందు లేవు. ఓ అవ్యక్తరూపా! చిద్ఘనాత్మా! చిదానంద స్వరూపుడా! ఆద్యంతవివర్జితుడా! సర్వవ్యాపీ! శుద్ధ చిత్త సమన్వితుడా! స్వాంత స్థితుడా! లీలామాత్రజగద్ధారీ! మావంటి మునులందరికీ ధ్యేయమైనవాడా! నీ వాస్తవ స్వస్వరూపమునకు వేనవేల నమస్కారాలయ్యా! ప్రతి ఒక్క జీవుడు నీ స్వరూపమే! నీవే ప్రతి ఒక్క జీవుని స్వరూపం కూడా! మేమంతా నీస్వరూపమే! ఆత్మారాములమే!

❖❖❖

2. లేనిది లేనిదానిగా చూడాలి

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామా! సముద్రంలో అనంత సంఖ్యలో తరంగాలు లేవటం లయించటం జరుగుచున్నట్లు, ఈ జగత్తులు అనంత సంఖ్యలో ఆత్మయందు ఉత్పన్నమై లయిస్తున్నాయి. ఎవ్వడైతే అద్వైత భావనచే భావాభావ వివర్జితుడై ఉంటాడో, ముక్త స్థితిలో ఉంటాడో అతనియందు ఈ జగద్వాసనలే కానరావు. స్వప్నానికి రూపం లేనట్లే, ఈ జగత్తులకు వాస్తవమైన రూపమేదీ లేదు!

అసలు ఈ 'జగత్తు – జీవుడు' అనునవి చిత్తము యొక్క కల్పనలే సుమా! ఇక మిగతావాటి గురించి వేరుగా చెప్పేదేమున్నది?... అందుచేత జగద్వాసనలు (Worldly tendencies) క్షయించాలి.

వాసనలు క్షీణమొందగానే నీవు చిత్‌సముద్రుడవౌతావు. మహా గంభీరుడవు, సౌమ్యుడవు, ఆత్మారాముడవు కాగలవు.

అగ్ని నుండి వేడి, పుష్పము నుండి సుగంధం, కాటుక నుండి నలుపు, చెఱుకు నుండి తీపి, తేజము నుండి వెలుతురు, జలము నుండి తరంగం వేరుకానట్లు... 'చిత్తము' అనే స్వకీయ సంకల్ప వ్యవహారము కంటే జగత్తు అనబడేది వేరు కాదు.

చితో న భిన్నో 'అనుభవో', భిన్నో న అనుభవాత్ 'అహం' ।
న మత్తో భిద్యతే 'జీవో', న జీవాత్ భిద్యతే 'మనః' ॥
మనసో న ఇంద్రియం భిన్నం, పృథక్ దేహశ్చ న ఇంద్రియాత్
న శరీరాత్ జగత్ భిన్నం, జగతో నాఽన్యదస్థి హి ॥

చిత్ కంటే అనుభవం వేరు కాదు. అనుభవం 'అహం' (నేను)కు వేరు కాదు. 'అహం' జీవుని కంటే వేరు కాదు. అట్టి జీవుడు మనస్సు కంటే అన్యమైనవాడు కాదు. మనస్సు ఇంద్రియార్థములకు వేరుగా లేదు. ఇంద్రియార్థములు ఇంద్రియాల కంటే వేరు కాదు. ఇంద్రియాలే శరీరం. అట్టి ఇంద్రియ విషయాలే ఈ జగత్తు – ఇంక వేరే ఏమున్నది? ...ఈ విధంగా చూస్తే ఈ జగత్తు చిదాకాశమే అయి ఉంది.

జ్ఞానదృష్టికి ఇదంతా స్వకీయ కల్పనామాత్రమే! జ్ఞాని యొక్క భావనలో ఇదంతా తొందరగా గాని, నెమ్మదిగా గాని, అసలుగా గాని ప్రవర్తించుటయే లేదు.

అఖండమైన ఆత్మజ్ఞానం లభించిన వారికి ఆకాశ స్వరూపమగు పరబ్రహ్మమొక్కటే తనలో – తనతో తానై దృశ్యజగత్తుగా వెలయుట స్ఫురిస్తోంది. తదితరమైనదేదీ వారికి అగుపించుటయే లేదు. అట్టి మహనీయులకు శూన్యం శూన్యంలోను, సత్యం సత్యంలోను, పూర్ణం పూర్ణంలోను తెలియవస్తున్నాయి.

జ్ఞాని అందరి వలే లోక వ్యవహారాలు నిర్వర్తిస్తున్నప్పటికీ... అతనిలో ఒక ప్రత్యేకత ఉంటుంది. అతనికి దేనిపట్లా కూడా ఆసక్తి అనేది ఉండదు. అందుచేత అతనికి కర్తృత్వ భోక్తృత్వాలు కూడా ఉండవు. కనుక ఏది ఎట్లు చేస్తున్నా, ఏదీ చేయనివాడే అవుతాడు. ఆసక్తితో కూడి ఉన్నప్పుడు

మాత్రమే క్రియలు సుఖ దుఃఖములుగా పరిణమించటం జరుగుతోంది. ఆసక్తి లేకపోతే కర్తృత్వం ఉండదు. సుఖ దుఃఖాలూ ఉండవు.

అనంతమగు ఆకాశమే తూర్పు - పడమర - పైన - క్రింద... మొదలైన వాక్య వ్యవహారాలుగా ఏర్పడుచున్నది కదా! బ్రహ్మమే కర్తృత్వాభిమానం చేత జగత్తుగా సంకల్పించబడుతోంది.

ఎవని చిత్తము ఆకాశము వలె శుద్ధమైనదో, ఎవడు సదాచారపరాయణుడో, ఎవడైతే మట్టి - చెక్క లాగా సంతోష దుఃఖములకు అచలితుడో, ఎవడు తనను చంపవచ్చిన శత్రువును కూడా అకృత్రిమ స్నేహంతో పరబ్రహ్మంగా దర్శించగలుగుతాడో... అట్టివాడే పరమసత్యాన్ని దర్శించటానికి అర్హత సంపాదించుకో గలుగుతాడు.

శ్రీరాముడు: మహాత్మా! ఈ జీవుడు ఎప్పుడు సుఖ దుఃఖములకు అతీతుడవగలుగుతాడు?

శ్రీ వసిష్ఠ మహర్షి : నదిలోని నీరు గట్టుమీద ఉన్న వృక్షమును మొదలంట సమూలంగా పెకలించు నట్లు హృదయంలోంచి మదము, మాత్సర్యము మొదలైన వాసనలు మొదలంటా నిర్మూలించ బడినప్పుడు మాత్రమే ఈ జీవుడు సుఖదుఃఖాతీతుడు కాగలుగుతాడు. రాగ ద్వేషాలకు అసలు కారణములేమిటో విచారించి, హృదయగుహలోంచి ఈ సర్వ వికారములను వెడల గొట్టకపోతే, కాషాయ వస్త్రాలు మాత్రమే ధరించిన అసాధువులాగా ఎంత విన్నా, ఎంత చదివినా ఏం లాభం?... అట్టివాడు తెలుసుకుంటూ కూడా తెలియనివాడే అవుతాడు.

అంతేకాదు. ఎవని యందైతే కర్తృత్వ భోక్తృత్వాభిమానములు సమూలంగా తొలగి ఉంటాయో, బుద్ధి నిర్లిప్తమై ఉంటుందో... అతడు ఈ లోకంలో ఉన్నవారందరినీ చంపినా కూడా చంపనివాడు గానే ఉంటాడు.

శ్రీరాముడు: అట్టి నిరంహంకారం ఎట్లా సాధ్యం?

శ్రీ వసిష్ఠ మహర్షి : స్వతహాగా లేని దానికి 'ఉన్నది, ఉన్నది' - అని సద్భావనను కల్పించటమే మాయ. ఇంక అహంకారమో... స్వతఃసిద్ధంగా లేనే లేదు.

జ్ఞానాన్ని అవలంబించటం చేత ఈ విషయం సుస్పష్టమౌతోంది. లేనిది లేనట్లుగా గ్రహించటమే జ్ఞానం. జ్ఞాని హృదయంలో దృశ్య ప్రపంచవాసనలకు చోటు లభించదు. అట్టివాడు సామంతులను లోబర్చుకుంటున్నట్లు ఈ సంసార వ్యవహారములను నిర్ద్వంద్వంగా జయించగలుగు చున్నాడు.

ఈ ప్రపంచంలోని పదార్థములు కనిపిస్తున్నప్పుడు, కనిపించనపుడు, వైభవ-దారిద్ర్యములు వచ్చి పోవునపుడు, ఆరోప - అపవాద దశలందు, తదితరజనులతో ఏర్పడే సంయోగవియోగ సందర్భములందు ఎవనికి సంతోషము గాని విషాదముగాని కలుగవో - అట్టి మహనీయుని శాస్త్రములు 'జీవన్ముక్తుడు' అని పిలుస్తున్నాయి. ఓ సర్వసభికులారా! మీరు జీవన్ముక్తులయ్యేందుకు సాధనలు కొనసాగించెదరు గాక!

❖❖❖

3. మేలుకొలుపు

శ్రీరాముడు: స్వామీ! నిర్మలమగు చిదాత్మ "మనస్సు, బుద్ధి, అహంకారం, ఇంద్రియాలు, తదితర జీవులు" అనువాటిలోకి వెళ్ళి వెళ్ళి చిక్కుకున్నదే? ఎందుచేత? అట్టి బంధం విడివడేది ఎట్లా?

శ్రీ వసిష్ఠ మహర్షి: నీవు చెప్పే మనస్సు, బుద్ధి మొదలైనవి చిన్మయసత్తను అతిక్రమించి ఎక్కడో ఉన్నాయనుకుంటున్నావా? బృహత్ స్వరూపమైన ఆత్మయే నానాత్వమంతా భ్రమింపజేస్తోంది. మెల్లకన్నువానికి ఒకే వస్తువు అనేక వస్తువులుగా కనిపిస్తుందే! వరుసలో నిలబెట్టిన దర్పణములలో ఒకే వ్యక్తి యొక్క అనేక ప్రతిబింబములు అనేక కోణములలో అగుపిస్తాయి చూచావా! ఇదీ అంతే!

అంధకారం తొలగితే ఆ చీకటిచే కల్పించబడిన క్రీనీడలు కూడా తొలగుతాయి కదా! మూర్ఖ సమన్వితమగు భోగవాసనలు ఉపశమిస్తే అజ్ఞానం కూడా వినష్టమైపోతుంది. 'తృష్ణ' అనే విశూచివ్యాధి ఉపశమిస్తుంది. చిత్తవాసనలు తమ బంధువులగు అనేక ఆవేశ కావేషాలతో సహా తొలగుతాయి. దారం తెగిపోగానే దానికి గుచ్చబడిన ముత్యములు జారిపోవునట్లు సర్వ సంసార సంస్కారాలు సన్నగిల్లుతాయి.

అమనస్కం - ఆ ఓ రామా! సంకల్పములు త్యజించుటచే అనాసక్తిపూర్వకమగు అమనస్కం లభిస్తుంది. శాస్త్రములు చేయిఎత్తి చూపుడువేలుతో చూపుచున్నది 'ఆత్మ' అనుపేరుతో గల ఆ అమనస్కమే! ఈ మర్మాన్ని గ్రహించక ఆత్మ అనగా మరేదో బాహ్య విషయంగా గ్రహించేవారు శాస్త్రహంతకులేనని నా అభిప్రాయం. అట్టివారు శాస్త్రములలోని పైపై మధ్యేమార్గ విషయములను మాత్రమే గ్రహించేవారు సుమా!

అజ్ఞానమే సర్వ జాడ్యములకూ కారణం. గాలి వేగం తగ్గితే పద్మం కదలికలు మాని నిశ్చలత్వం పొందుతుంది. అట్లాగే అజ్ఞానం క్షీణిస్తే ఇక ఈ దృశ్య వ్యవహారాలేవీ మనస్సును వ్యాకులపరచలేవు. నాయనా! రామా! నీవు ఈ వాక్యములను విని ఆసక్తి-అనాసక్తులను విడుస్తూ మనోస్థిరత్వం పొందుచున్నావనే అనుకుంటున్నాను.

ప్రియ శ్రోతలారా! అంతఃపురంలో నిదురిస్తున్న రాజు భేరీనినాదం విని నిదురలేస్తాడు చూచారా? మీరు కూడా నా ఈ ఉపదేశ వాక్యాలు విని అజ్ఞాన నిద్ర నుండి జాగృతమవ్వండి. ఓ రామచంద్రా! సామాన్యుల హృదయాలలో కూడా ఈ మన సంవాద వాక్యాలు హత్తుకుపోతాయి. ఇక అతి ఉదారహృదయుడవైన నీ పట్ల వ్యర్థమెందుకవుతాయి? ఎండచే ఎండి ఉన్న నేల నీరు పడగానే వేగంగా పీల్చునట్లు, "అత్యంత ప్రయత్నశీలము, జిజ్ఞాస సమన్వితం" అగు నీ హృదయంలో ఈ ప్రవచనాలు స్థిరత్వం తప్పకపొందుతాయి. మహనీయుల అనుభవాలు నీకు శిరోధార్యమౌతాయని, ఆయా విశేషాలన్నీ హృదయంలో పదిలపరచుకుంటున్నావని నాకు తెలుసు.

❖❖❖

4. అయోమయం నుండి స్వస్థానానికి... !

శ్రీరాముడు : హే మహర్షీ! పరమ పవిత్రమగు తమ ముఖ కమలం నుండి వెలువడుచున్న గురువాక్యములు నాకు అత్యంత విశ్రాంతిని, ప్రశాంతతను కలుగజేస్తున్నాయి. మీ ప్రవచనం వింటున్నప్పుడు నా యొక్క స్వానుభవమేమిటో చెపుతాను వినండి.

హే ప్రభూ! అమృతతుల్యములగు మీ వాక్యములలోని అంతర్లీన గానామృతం గ్రోలుచున్నాను. బాహ్యాంతరాలలో సంచరించే నా చిత్తం క్రమంగా శాంతమును సంతరించుకుని నా స్వరూపంతో ఐక్యం పొందుతోంది. చాలా సంవత్సరాలు అనావృష్టిచే శుష్కమైన పొలం ఒక రోజు కుండపోత వర్షంచే తడిసి ఆనందం పొందునట్లు... నా మనస్సు మీ వాక్యధారలచే అభిషిక్తమై పరమానందం పొందుతోంది. ఏనుగు మొదలైన జంతువులు ప్రవేశించని సరస్సు నిశ్చలమగునట్లు నేను నిశ్చల ప్రశాంతతను అనుభవిస్తున్నాను. పొగమంచు తొలగితే రహదారిలో దూరం నుండి వస్తున్న వాహనాలు సుస్పష్టంగా కనబడునట్లు... ఈ కనబడే దృశ్యంలో యథాతథమగు బ్రహ్మము సుస్పష్టమౌతోంది. దిక్ మండలమంతా ప్రసన్నంగా దృశ్యమానమౌతోంది. ఆశలు అనే మృగతృష్ణ యొక్క అనుపాను లేమిటో తెలిసిపోతున్నాయి. ఆసక్తి అనే వృథా శ్రమ దరిజేరటం లేదు. వసంతకాలంలో చెట్లు చిగురిస్తుంటే కోయిల ఆనందంగా కుహూనాదాలు చేస్తున్నట్లు...నేను విషాదములన్నిటి నుండీ తొలగినవాడనై ఆనందభరితుడనగుచున్నాను. ఎచ్చటైతే అమృతాస్వాదన కూడా స్వల్పాతిస్వల్ప విషయమై ఉంటుందో, అట్టి ఆత్మానందం నాకు తారసపడుతోంది.

ఆత్మయే స్వరూపముగా గల నాకు ఇదే నా నమస్కారం. అట్టి ఆనందం ప్రసాదిస్తున్న మీకు నమస్కారం!

సూర్యుడు ఉదయించగానే పిశాచమునకు సంబంధించిన భ్రమలు ఇంకా మిగులుతాయా? జ్ఞానోదయమగుచుండగా కల్పనలన్నీ నశిస్తున్నాయి. సంశయములన్నీ తొలగుతున్నాయి. శరత్కాలం లోని ఆకాశంలాగా నా హృదయం నిర్మలము, శాంతము, అనంతము - అయిన ఆనందమును పొందుతోంది. 'ఆత్మయందు కళంకం ఎట్లా, ఎప్పుడు, ఎక్కడి నుండి ఎందుకొచ్చింది?' ...ఇటువంటి సంశయాలన్నీ చీకటి రాత్రిలో ఉదయించిన పూర్ణచంద్రుని కిరణాలచే ఏర్పడిన దృశ్యమాన జగత్తులాగా విశదమగుచున్నాయి. సర్వము సర్వదా సర్వత్రా ఆత్మయే ఏర్పడి ఉండగా... ఇక 'ఇది వేరు, అది వేరు' అనే మిథ్యాకల్పనలకు తావెక్కడిది?

హే సద్గురూ! ఏదో తెలియని ఆవేదనకు, అగమ్యమునకు ఆలవాలమైన నా 15 రోజుల క్రితం స్థితినీ, ఇప్పటి నా స్థితినీ పోల్చి చూచినప్పుడు, అప్పటి నా మనోవేదనలను తలచుకోగానే నవ్వు వస్తోంది. 'ఆశలు-అవి తీరుట' మొదలైన దృష్టుల నుండి వైదొలగి తృష్ణారహితమగు స్థానం చేరుకున్నాను. మీ 'వాక్' అను అమృతధారలతో స్నానం చేసిన నేను ఇప్పుడు సర్వాత్మభావనను, సంపూర్ణ స్వభావమును సంతరించుకుంటున్నాను. తమ దయచేత బ్రహ్మభూమికను అధిరోహిస్తున్నాను.

ఇప్పటి నా దృష్టికి సూర్యమండలము కూడా పాతాళము వలె అధోవిషయమగుచున్నది. 'ఆసక్తి – అనాసక్తి' అనే సముద్ర తరంగముల నుండి లేచినవాడనై స్వస్వరూపమునందు సుప్రతిష్ఠితుడ నగుచున్నాను. స్వమహిమ యందు సర్వోత్కృష్ట రూపముతో వెలుగొందుచున్నాను.

ఆత్మయే స్వరూపముగా గల నేను నమస్కరింపతగినవాడనగుచున్నాను. అట్టి నాకు పదేపదే ఇవే నా నమస్కారములు.

ప్రభూ! ఇన్ని మాటలెందుకు? మీ వచనాలు నా హృదయ పద్మకోశంలో ప్రవేశించి అనుభవ జ్ఞానమును ప్రసాదిస్తున్నాయి. తద్ద్వారా నిత్యానంద స్వరూపమగు జీవన్ముక్త స్థితి పొందుచున్నాను.

❖❖❖

5. మోహం ఎట్లా తొలగుతుంది?

శ్రీవసిష్ఠ మహర్షి: శ్రీరామా! చాలా సంతోషం. నీ వాక్యములచే నేను ప్రసన్నుడనై నా ప్రవచనాన్ని కొనసాగించటానికి ఉద్యుక్తుడను, సముత్సాహుడను అగుచున్నాను.

ఇప్పుడు నీకు 'మోహం ఎట్లా తొలగుతుంది?' అనే విషయమై కొన్ని విషయాలు చెపుతాను. నీకు భేద బుద్ధి తొలగిందని నాకు తెలుసు. అయినా కూడా ఎల్లవేళలా జ్ఞానాభివృద్ధి అవసరమే. అందుచేత యథావిధిగా శ్రద్ధతో విను. మనం చెప్పుకోబోయే విశేషాలు ప్రీతికి, మనోసౌమ్యతకు తోడ్పడతాయి. ఈ తత్త్వము గ్రహించినవారి దుఃఖములు వాటంతట అవే తొలగిపోగలవు.

ఏ జీవుడైతే పంచభూతాత్మకమైన ఈ దేహమునందు ఆత్మ భావన సలుపుచున్నాడో, (ఎవడైతే 'నేను ఈ దేహమును మాత్రమే' అని తలచుచున్నాడో)... అతనిని అతని ఇంద్రియములే మరల మరల పరాభవిస్తున్నాయి. 'అనాత్మ భావన' అను దోషము యొక్క ప్రభావం అట్టిది మరి! అట్లా కాకుండా ఏ జీవుడైతే ఆత్మ జ్ఞాన పరాయణుడై, ఆత్మ తృప్తుడై ఉంటాడో... అతని ఇంద్రియములు అతనిని తమ మిత్రునిగా భావించి సేవిస్తాయి. ఆసక్తి–అనాసక్తులు త్యజించిన జీవునకు ఈ దేహము గాని, మరొక దేహం గాని పొందవలసిన అగత్యం గాని, అభినివేశం గాని ఉండదు. వాటి రాక పోకలకు ఆతడు అప్రమేయుడై మౌనంగా, లీలగా, క్రీడగా ఈ సర్వమును ఆస్వాదిస్తున్నాడు.

ఆత్మకు, శరీరమునకు సంబంధమే లేదు. చీకటి –వెలుగుల వలె ఆ రెండూ పరస్పర విరుద్ధాలై ఉన్నాయి. అందుచేత జడము, తుచ్ఛము, వినాశనశీలము, కృతఘ్నము అగు శరీరము అనబడే ఒక జడ వస్తువుకు ఏమి కావలసివున్నదో అదే అగుగాక! సర్వ శక్తిమంతము, ఉదయాస్తమయ రహితము, నిర్లిప్తము, అప్రమేయము, వికార రహితము అగు ఆత్మకు ఈ శరీరము ఉండటం చేత గాని, (లేక) లేకపోవుట చేత గాని కలిగే హాని లేదు. మేలు లేదు. ఆత్మయొక్క 'నిత్యోదయము (Ever Wakeful)' అనే లక్షణం ఈ భౌతిక శరీరానికి ఎట్లా వర్తిస్తుంది? చిన్మయమగు నీ స్వస్వరూపాన్ని నీవు భావన చేస్తూ ఉంటే 'నేను మృణ్మయమగు ఈ శరీరమును' అనే జడభావన చీకటిలో మటుమాయమౌతుంది.

శ్రీరాముడు : అయితే మహర్షీ! ఈ లోక వ్యవహారములు శరీర సహాయంతోనే నిర్వర్తించబడుచున్నాయి కదా!

శ్రీవసిష్ఠ మహర్షి : ఈ లోక వ్యవహారములు ఆత్మ-శరీరముల కలయికచే జరుగుచున్నట్లు అనిపించ వచ్చు గాక! అయినా కూడా వాస్తవానికి అవి రెండూ విరుద్ధ ధర్మాలు గల వస్తువులు. అత్యంత సూక్ష్మ మగు ఆత్మకు, అత్యంత స్థూలమగు శరీరానికి సంయోగమే అసంభవం. ఇక ఒకదానిలో మరొకటి ఐక్యమవటం ఎట్లా సిద్ధిస్తుంది? కనుక శరీర భావన, ఆత్మభావన ఒకచోట ఏర్పడి ఉండజాలవు.

ఆత్మభావన లేనప్పుడు శరీరభావన ఉన్నట్లే!... శరీరభావన లేనప్పుడు ఆత్మభావన ఉంటున్నట్లే!

సద్వస్తువగు బ్రహ్మం జడం కాజాలదు. ఆరోపిత దృష్టిచే బ్రహ్మం దేహంగా అగుచున్నట్లు భ్రమ గొలుపుచుండవచ్చుగాక! అయినప్పటికీ సర్వ వ్యాపియగు ఆత్మకు శరీరముతో సంబంధం లేదు.

శరీరము యొక్క ధర్మములు ఆత్మ యొక్క ధర్మములు వేరు వేరు.

దేహేన దేహగస్యాపి కమలస్యేవ వారిణా ।
మనాగపి న సంశ్లేషో బ్రహ్మణో దేహసత్తయా ॥ (శ్లో॥ 14, సర్గ 60)

నీటిలో తామర పువ్వు ఉన్నంత మాత్రంచేత నీరు, తామరపువ్వు ఒక్కటి అవనట్లు... దేహికి దేహమునకు సంబంధం లేదు. ఏదైనా సంబంధం కనిపిస్తుంటే, అది ఆరోపితం మాత్రమే. దేహము ఉన్నంత మాత్రంచేత బ్రహ్మమునకు ఎట్టి దోషమూ అంటదు.

బ్రహ్మము సర్వదా నిర్దోషము, సమము. ఒక ఇంట్లో ఒక మనిషి ఉన్నాడనుకో. అంతమాత్రం చేత ఆ ఇంటియొక్క లక్షణములు మనిషివౌతాయా? ...లేక, మనిషి యొక్క లక్షణాలు ఇంటివి అవుతాయా? ఇదీ అంతే.

ఒకచోట గాలి వేగంగా వీస్తోందనుకో. ఆ గాలి యొక్క వీచికలు ఆకాశమును అంటుతాయా? శరీరము యొక్క లక్షణములైనట్టి జన్మ-జరా-మరణములు, ఆత్మకు అంటవు. అట్లాగే ఇక్కడి సుఖ-దుఃఖాలు, ఆసక్తి – అనాసక్తులు కూడా ఆత్మకు అంటవు. అందుచేత 'వీటివేటికీ సంబంధించనట్టి ఆత్మ'ను గ్రహించి పరమానందమును నిరభ్యంతరంగా పొందవచ్చు. ఇక ఈ శరీరములు, మనస్సు వగైరా బ్రహ్మ మహాసముద్రజలంలోని తరంగముల వంటివిగా చూడు. నిజానికి జలానికి తరంగాల లాగా, ఆత్మ చైతన్యమునకు అవన్నీ పరికల్పితములు మాత్రమే!

నీళ్ల కదలికచే కనబడే నీళ్లలోని సూర్యప్రతిబింబము యొక్క కదలికలను సూర్యబింబానికి ఆపాదించలేం కదా! శరీరంలో మనకు కనిపించే మార్పుచేర్పులను శరీరికి ఆపాదించటానికి వీలు లేదు. ఆత్మ ఏ క్షణంలోనూ ఎట్టి క్షోభా పొందటానికి ఆస్కారమే లేదు. అందుచేత ఈ జగత్తు ఏమిటో అవగాహన చేసుకోవటానికి ముందుగా కాస్త 'సమదృష్టి' స్థిరపడేటట్లు అభ్యాసం చేయి. అప్పుడు 'సత్యవస్తు జ్ఞానం' ఏర్పడి వాస్తవమేమిటో నీకే గోచరించగలదు. దేహమునకు సంబంధించిన అజ్ఞాన దృష్టులు తొలగాలంటే దేహి గురించిన వాస్తవ జ్ఞానమొక్కటే అసలైన ఔషధం.

'చీకటి' అంటే ఏమిటి? వెలుగు లేకపోవటమే కదా! జ్ఞానం కలిగి ఉండకపోవటమే (అనగా) దేహి యొక్క స్వరూపం ఎరిగి ఉండకపోవటమే 'అజ్ఞానం'. ఈ దేహము యొక్క పరికల్పనకు అట్టి అజ్ఞానమే కారణం. ఆత్మయొక్క స్వభావం గ్రహించని కారణంగా 'మోహము' అనే ఒక విషవృక్షం మొలచి నలువైపులా శాఖలు విస్తరించుకుంటోంది. 'జ్ఞానముయొక్క రీతి ఏమిటి? ఆత్మ యొక్క స్వభావమేమిటి?'... అనే ప్రశ్నలకు వివరణాత్మకమైన సమాధానం గ్రహించకపోవటం చేతనే విపత్తులన్నీ వచ్చిపడుచున్నాయి. బ్రహ్మము యొక్క స్వరూపమేమిటో తెలియకుండా ఊరకే ఇక్కడా అక్కడా సంచరించటం ఏమాత్రం సముచిత విషయం కాదు. గాలి వీస్తున్నప్పుడు తోటలోని మొక్కలు అటూ ఇటూ కదలుచున్నట్లు ఇంద్రియ ద్వారములనుండి ప్రాణవాయువులు ప్రసరిస్తూఉంటే వారు ఆ లోకములలోనూ, ఈ లోకములలోనూ ప్రవేశించి ఊరికే గ్రహించటం, విసర్జించటం, ఆలాపించటం మొదలైన పనులు ఈ జీవులలో అనేకులు చేస్తున్నారు. ఒక్కొక్క ఉపాధి స్వీకరించటం శబ్ద, స్పర్శ, రూప, రస, గంధ ప్రవాహంలో అవయవాలు క్షీణింపజేసుకోవటం, ఉన్మత్తులై ఏవేవో ఆశ – నిరాశలు మూటగట్టుకోవటం... ఇవీ సంసార జీవులు ఇక్కడ చేస్తున్న సుదీర్ఘకార్యక్రమాలు!

నీళ్లలో పడి నానిన చెక్కముక్కలాగా రాగద్వేషములకు వశులై మునిగి తేలుచూ అనేక జన్మలు వారు గడిపివేస్తున్నారే గాని 'ఇంతకీ నేనెవ్వరు?' అనే ప్రశ్నను శోధించటం లేదు. వచ్చి పోతూ ఉండే భావాలలో మాత్రమే కొట్టుమిట్టాడుచున్నారే?

జీవులందరూ జ్ఞాన విషయంలో అత్యంత జాగరూకులై ఉండాలి సుమా! అజ్ఞానం అత్యంత నీచదశలను పొందింపజేయగలదు. కమ్మరి ఉపయోగించే తిత్తిలో గాలి వెలువడునట్లు జ్ఞానరహితు లగు జీవులలో ప్రాణ వాయువులు ప్రయోజనమేమీ లేకుండానే సంచరిస్తున్నాయి. వారు ప్రాణములు కలిగి ఉండి ఉపయోగం లేనివారే అగుచున్నారు. వారి చలనములన్నీ ప్రయోజనం లేనివే. వ్యర్థమైనవే. వింటి యొక్క నారి శబ్దం చేస్తున్నట్లు అజ్ఞానులగు జీవులు ఏవేవో గర్విత–నీరస–జాతి–ప్రాంత కల్పనలతో కూడిన శబ్దాలు పలుకుతూ ఈ భూమిపై సంచరిస్తున్నారు. అడవిలోని దుష్టఫలములు తిని పిట్టలు పిచ్చి ఎక్కి కేకలు వేసివేసి చివరికి చస్తున్నట్లుగా ఆత్మజ్ఞానము లేని ఫలాభిలాషలను ఆశ్రయించి సంసార జీవులు చివరికి ఉన్మత్తస్థితులను, మృత్యువు యొక్క రుచులను తెచ్చి పెట్టుకుంటు న్నారు. అజ్ఞాన కార్యక్రమములతో తృప్తి పొంది లోకవ్యవహారములు సలుపుతూ కాలం గడపటం నా ఉద్దేశంలో కాలుచున్న శిలపై చల్లటి చోటు వెతకటం వంటిది. అజ్ఞానులతో కూడి రోజులు దొర్లించటం మోడువారిన చెట్టుక్రిందకి విశ్రాంతికై పరుగులు తీయటం వంటిది. అజ్ఞాన విషయ సమాచార వినోదములతో కాలం వెళ్లబుచ్చటం ఆకాశమును అట్టలతో మోదటం వంటిది. రుచికరమైన పదార్థములను బురదలో ముంచటం వంటిది. అజ్ఞానవిషయాలు సంభాషించటం ఆకాశములోని మేఘములను చూచి కుక్కలవలె మొరగటం వంటిది.

'అజ్ఞానమాపదాం నిష్ఠా' – అజ్ఞానమే అన్ని ఆపదలకూ పుట్టినిల్లు. దాని వలన కలిగే అనర్థాలకు అంతులేదు.

'సంసారము' అనబడేది అజ్ఞానము చేతనే కదా... ఉత్పన్నమౌతోంది! సుఖ-దుఃఖాలు, నిష్ఠురత్వం. వేదన-రోదనలు, ఆవేశకావేశాలు, ఈ శరీరము, దీనిచే ఏర్పడే సంబంధాలు... ఇవన్నీ అజ్ఞాన వృక్షము యొక్క ఫలములే!

అనాత్మ అయినట్టి ఈ శరీరమే తానుగా తలచు మూర్ఖునికి దుఃఖమెన్నటికీ తొలగదు. సత్యమును వదలి అసత్యం వెంట పరుగులుదీస్తూ 'ఈ మాయ నాపట్ల తొలగదేమి?' – అని కేకలు వేసి ఏం లాభం? అసత్యదర్శనంచే పదే పదే కాలు జారిపడి లేచుచుండటమే సుఖమనుకొనే వారికి నేను సత్యం ఎట్లా తెలియపర్చగలను? తమ చర్మమును చాకుతో కోసుకుంటూ, "మేము కాయనే కోస్తున్నాం... అంతా మాకు తెలుసు" అని పలికే వానికి ఎవ్వరేం బోధించగలరు?

శ్రీరాముడు: నిజమే స్వామీ! అయితే, ఆనందమయమగు ఆత్మయే స్వరూపముగా గల ఈ జీవునకు దుఃఖం ఎక్కడి నుండి వచ్చిపడుతోంది?

శ్రీవసిష్ఠ మహర్షి : చక్కటి నేలపై కొంత కాలానికి పిచ్చిచెట్లు లేచునట్లుగా, సుఖ స్పర్శల నుండి దుఃఖాలు పుట్టుకొస్తున్నాయి. దేహమనే బూరుగు నుండి 'వాసనలు' అనే పాములు పడగలెత్తుచున్నాయి. అవి మనస్సను మదగజమును కట్టిపడేస్తున్నాయి. చేనులో కలుపు మొక్కలలాగా అజ్ఞాని (ఆత్మ సమాచారం పరికించనట్టి వాని) హృదయంలో ఆశలు లేస్తున్నాయి. దుష్కృత్యములు నీచ బాటలలో నడిపిస్తూ ఈ జీవుని 'నరక యాతనలు' వేచి ఉన్న చోటికి తీసుకుపోతున్నాయి.

అనేక కల్పితానందములు, కాలక్షేపములు మూర్ఖుని సంతోషింపజేయటానికే కాబోలు, ఈ జగత్తుచే విరచించబడుచున్నాయి. అతని ఆసక్తికి అనుగుణంగా సృష్టి కర్త ఇక్కడి వ్యవహారములను మలచుచున్నాడు. ఈ జీవుడిక పరనింద, ఈర్ష్య, రాగము మొదలైన వ్యతిరిక్త, దుర్వాసనల వైపుగానే ఆకర్షితుడగుచున్నాడు. ఇక సరి అయిన సమయం చూచుకొని చింతలన్నీ అతని హృదయంలో ప్రవేశిస్తున్నాయి. జన్మనుండి ఆశ నిరాశలు, వాటి నుండి భావి ఉపాదులు, ఆ ఉపాధుల నుంచి మరల ఆశ నిరాశలు, జీవుని పట్ల కొనసాగుతూనే పోతున్నాయి. అతడు మరలమరల బాల్య – యౌవన – వార్ధక్య – మృత్యువులను చర్వితచర్వణంగా పొందుచున్నాడు.

జ్ఞానులు - ఇక జ్ఞానుల వ్యవహారమంతా వేరొక విధంగా ఉంటోంది. అజ్ఞానులకు సుదీర్ఘం గానూ, దాటనలవికానిదిగానూ ఉంటే, జ్ఞానులు తమ స్వరూపమును సాక్షీభూతమగు చైతన్యమాత్రంగా గాంచుచున్నారు. అందుచేత ఈ సంసారతతంగమంతా గోష్పాదప్రాయం (ఆవు డెక్క ఏర్పరిచే గుంటంత) అగుచున్నది. ఇక్కడ కనబడే అన్నపానాది విశేషములలో అతడు తగుల్కొనుట లేదు.

❖

అజ్ఞానికి ఈ జగత్తు యొక్క విన్యాసాలేమిటో, వీటి అంతు ఎక్కడో తెలియటం లేదు. పంజరంలో చిక్కుకున్న చిలుకలాగా అతడు వాసనాపరంపరలో చిక్కుకుని ఉంటున్నాడు. అతని చిత్తవృత్తులు బాహ్య వస్తు జాలముల వైపుకే ప్రసరిస్తున్నాయి గాని, అంతర్ముఖం కావటం లేదు. బోయవాడు పక్షులను పట్టుకోవటానికి బియ్యపు గింజలు చల్లునట్లు ఈ ప్రపంచం నిండా ఇంద్రియములకు ప్రియాప్రియములు కలిగించగలిగే అనేక వస్తువులు, విషయాలు, విశేషాలు

కల్పించబడ్డాయి. అతడు ఇంద్రియ భోగమత్తుడై 'ఇళ్లు, వాకిళ్లు, ప్రతిష్ఠలు, బంధువులు, ఆనందములు, అనుభవములు, చెట్లు, పూలు, ఆకాశం, నేల' మొదలైన వాటికి తాను సంబంధితుడై పోతున్నాడు. అనేక భేదకల్పనలకు లోను అగుచున్నాడు. కల్పనామాత్రమైన కల్పవృక్షం వివిధ చిత్ర -విచిత్ర పదార్థాలను కల్పించి అభీష్ట సిద్ధిని భ్రమింపజేస్తుంది చూచావా! ఎన్ని అభీష్టములు ఈడేరితే ఏం ప్రయోజనం? ...కొత్త కోరికలు పుట్టుకొస్తూనే ఉంటాయి కదా! ఈ ప్రపంచంలో కూడా పూర్ణానంద కరమగు వస్తువేదీ లభించుటయే లేదు.

ఆహాఁ! ఏమి ఈ మోహము యొక్క మాహాత్మ్యం! కల్పనామాత్రమైన అజ్ఞానవనంలో 'భోగాభిలాషలు' అనే పక్షులు నివసిస్తున్నాయి. 'ఉత్పత్తి' అనే ఆకులతో, 'పుణ్యపాపములు' అనే ఫలాలతో 'భోగములు' అనే పూలగుత్తులతో 'కామ-క్రోధములు' అనే లతలతో ఈ అజ్ఞానవనం విరాజిల్లుతోంది. సూర్యుడు అస్తమించగానే చీకట్లు కమ్ముకుంటున్నట్లు జ్ఞానదృష్టి మరుగున పడగానే సర్వ దోషములు ప్రవేశిస్తున్నాయి. ఓ రామా! అజ్ఞాన వృక్షశాఖలు 'నానావిధ జగత్తులు' అనే ఫలములను ప్రసాదిస్తున్నాయి. అవి పైకి మాత్రమే మధురంగా ఉండి లోన మిథ్యాత్వం, భంగురత్వం, ఆద్యంతత్వము కలిగి ఉంటున్నాయి. అట్టి అజ్ఞానవనమును సమూలంగా నశింప జేస్తే గాని ఈ జీవునకు శాంతి లభించదు సుమా!

❖❖❖

6. అజ్ఞానాంధకార విభూతులు

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రాఘవా! అజ్ఞానాంధకారం యొక్క విభూతులు ఏమని వర్ణించాలి! హృదయంలో మదం ఉద్భవించగా దృష్టి అధోగతిపాలగుచున్నది. స్త్రీల చిలిపి చూపులచే ఆకర్షితుడై ఈ సంసార జీవుడు క్షణంలో తన దృక్పథములన్నీ అధోగతి పాలు చేసుకొని ఆ చిలిపి చూపులకు ఆహారమగుచున్నాడు. అతడు మన్మథునకు ఆంతరంగికదాసుడై ఉన్మత్త వేషధారుడగుచున్నాడే!

అహో! ప్రజలు కొంచెం దూరంగా ఆలోచించటం లేదే! ఏ దేహములైతే అజ్ఞానమోహాన్ని కలిగించి స్వస్వరూపం పట్ల ఏమరుపు కలిగిస్తున్నవో అట్టి స్త్రీ పురుష శరీరములు కొద్ది సంవత్సరముల తరువాత ఏమి కానున్నాయి? కుక్కలకు, గ్రద్దలకు ఆహారం అగుచున్నాయి. కవులు మాత్రం ఈ స్త్రీ-పురుష శరీరములను చంద్రునితోను, మంచి గంధముతోను, పూలలోని సున్నితమగు పుప్పొడితోను పోలికలు కల్పించి జనులకు భ్రమ కల్పిస్తున్నారు. రక్తమాంస భరితమగు ఈ శరీరభాగములను సువర్ణ కలశములతోనూ, పద్మమాలికలతోను, దొండపండ్లతోనూ ఉత్ప్రేక్షలు కల్పించి కవులు భ్రమను ఇనుమడింపజేస్తున్నారయ్యా! అల్పములగు కణపులతోను, ఎముకలతోను కూర్చబడిన ఈ స్త్రీపురుష శరీరములు ఆయా అలంకారములు, పట్టు వస్త్రములు ధరించి చూపులకు విందొనర్చుచుండగా ఈ అజ్ఞాన జీవులు 'ఆహా!ఓహో!' అనుకుంటూ కేరింతలు కొట్టడమా! ఇదంతా భ్రమ, పిచ్చి కాక మరేమిటో చెప్పు?

ప్రారంభంలో కొంచెం ఆనందం చూపి, క్రమంగా దుఃఖముల పాలు జేయగల అతిస్వల్ప, తుచ్ఛమైన మత్తు పదార్థములు ఈ జీవునిచే ఊడిగం చేయించుకుంటున్నాయే! ధనము, నారీజనము, తదితర సంపదలు ఇవన్నీ జీవునికి దుఃఖం తొలగించగలుగుచున్నాయా? ఏమి చిత్రమో గాని, ఎన్నెన్ని పొందినా కూడా, ఎప్పటికప్పుడు దుఃఖములు శతాధికమే అగుచున్నాయే! ఒక సుఖానికి ఒక దుఃఖం ఎదురుచూస్తూనే ఉంటోంది. ఈ సుఖదుఃఖాలు ఒకదానికొకటి కారణమగుచూ వస్తూ, పోతున్నాయి... ఈ జీవుడు ఇది గమనించడేం? ఇక్కడి ప్రయాసలన్నిటికీ అసలు కారణమేమిటో వెతకడేం?

కామ్యకర్మలతో అర్థవాద వాక్యములతో మాయారణ్యం పరిఢవిల్లుతోంది. మోహం అవిశ్రాంతంగా నిరంతరంగా అనేక ప్రవృత్తులను ఉత్పత్తి చేసుకుంటూ పోతోంది.

ప్రతి విషయం మొదట సుఖంగా ఉన్నట్లే ఉంటోంది. ఇంతలోనే అది అనేక రాగద్వేషములను కల్పిస్తోంది. చివరికి విషలత యొక్క రసంలాగా శారీరక మానసిక రుగ్మతలకు కారణమగుచున్నది. ఇక అది హృదయమును దుఃఖింపజేస్తోంది. ఎండింపజేస్తోంది. స్వకీయ కల్పిత కార్యక్రమములే ధూళి వలె లేచి వివేక సూర్యుణ్ణి కప్పివేస్తున్నాయి.

ఈ జీవుడు మొండితనంతో ఇంద్రియ విషయములను నమ్ముకొని కూర్చుంటున్నాడు. ఇక కాలయముడు తన నిష్ఠుర కార్యక్రమములతో శ్రమించి ప్రోగుచేసుకున్న సర్వవస్తు జాలములను కడుపారా మ్రింగి త్రేన్చుచున్నాడు. ఈ జీవుడు అందుకు ఎర అగుచూ, ఒక ఉపాధిని వదిలి మరొక ఉపాధిని ఆశ్రయిస్తూ వక్ర గమనములు చేస్తున్నాడే గాని, వివేక దృష్టిని పెంపొందించుకోవటం లేదు. 'ఆత్మ సమాచార శ్రవణం' అనే చంద్రోదయం కాకుండానే అనేక యౌవన రాత్రులు వ్యర్థంగా గతిస్తున్నాయి. ప్రాపంచిక విషయాలను మరలమరల ఉచ్చరిస్తున్న ఈ నాలుక అలసి అలసి చివరికి ఒకనాటికి శిథిలమైపోతోంది. దుఃఖము, శోకము, దారిద్ర్యములతో కూడిన అనేక పరిస్థితులు ఉవ్వెత్తున ఎగురుచున్నాయి. కట్టుదిట్టము లేని జీవిత ప్రాంగణంలో 'లోభము' అనే గుడ్లగూబ ప్రవేశించి యథేచ్ఛగా సంచరిస్తోంది. 'ముసలితనం' అనే పిల్లి వచ్చి 'యౌవనం' అనే ఎలుకను పట్టుకొని, చెవులు సాగదీసి మరీ చంపుతోంది. పైకి మెరుస్తూ లోన నిస్సారంగా ఉండే అనేక కల్పిత వ్యవహారాలు ఈ జీవుని చుట్టుముట్టి ఉన్నాయి. అనేక ప్రవృత్తములతో కూడిన ఈ జగత్గృహం ఆకాశాన్ని ఆక్రమించుకుని ఉంటోంది.

ఈ విశాల సంసార సముద్రం నిత్యం అనేక శరీరములను చప్పరించి మ్రింగుచున్నది. కృత్రిమమైనట్టి ఈ వినీలాకాశం అనేక సూర్యులను, గ్రహములను ధరించి ఉంటోంది.

ఈ జగత్తు 'ఆశలు' అనే త్రాడుచే కట్టబడి 'వాసనలు' అనే కమ్ములు గల ఇంద్రియ పంజరంలో నియమించబడి ఉన్నది. జీవులు ఈ జగత్ పంజరంలోకి ప్రవేశించి ఇక్కడ చిక్కుకొని కొన్నాళ్ళకు నశిస్తున్నారు. ఇక్కడి జనులు ఏవేవో ఆరోపిత దృష్టులను ఆశ్రయించి స్వస్వరూపమగు ఆత్మను విస్మరించి ఇక్కడ సంచరిస్తున్నారు. 'మేము అంతటివాళ్లం. మా జాతి ఇంతటిది' అని చెప్పుకొని

మురుస్తూ ఈ రక్తమాంస నిర్మితమైన దేహ నరక భూములలో చిక్కుకుంటున్నారు. అయ్యో! దేవతా జన్మలు పొందిన జీవులు కూడా స్వర్గమార్గంలో ఎగిరే పక్షులలాగా సంచరిస్తున్నారే గాని, ఆత్మజ్ఞానం విషయమై వివేకులవటం లేదే? ప్రవృత్తిచే కామ్యకర్మలవైపు ఆకర్షితులై ఈ జీవులలో అనేకులు ఊర్ధ్వ, అధోలోకాలలో పచార్లు చేస్తున్నారే గాని, ఆత్మజ్ఞానులుగా తమను తాము తీర్చిదిద్దుకోవటం లేదు.

ఈ భవసాగరంలో 'సృష్టి' అనే క్షుద్ర చేప 'కాలము' అనే ముసలి కొంగకు ఆహారం అవుతోంది. కామం అనే కుమ్మరి క్షణభంగురమైన అసంఖ్యాక 'శరీరాలు' అనే కుండలను తయారు చేసి, ఈ సృష్టి చక్రమును త్రిప్పుచున్నాడు. కల్ప ప్రారంభం నుండి అనేక యుగములు గడచి పోయాయి. అనేక జగత్తులు పుట్టాయి. నశించాయి. వర్తమాన జగత్తులో ఒక మూల ఒదిగి ఉన్న ఈ జీవుడు అనేక ఆశనిరాశల మధ్య ఆసక్తి, అనాసక్తుల మధ్య చిక్కుకుని సుఖ దుఃఖాలు నిర్వచించు కుంటూ, కొట్టుమిట్టాడుతున్నాడు. ఎడతెరిపి లేకుండా ఏవేవో విపరిణామములన్నీ పొందుతున్నాడు. యుగములు, మన్వంతరములు గడచిపోతున్నాయి. ఇంత జరుగుచున్నా మూర్ఖులబుద్ధి ఏదీ గుర్తించటం లేదు. ఏం ఆశ్చర్యం!

ఆహా! ఈ కనబడే శరీరాలన్నీ 'వాసన' చే ప్రేరితమై సంచరిస్తున్నాయి కదా! శత్రువులను చీల్చిచండాడి, ముల్లోకములూ ఏలుతున్న ఇంద్రుడంతటి వాడు కూడా వాసనల చేతనే ప్రేరేపించబడి, చరిస్తున్నాడే! వాసనల మూలం ఆసక్తియే!

ఆసక్తియే సృష్టికి మూలం - ఏదో నియతి ఈ 'సృష్టులు' అనే ధూళి కణములను లేవదీసి కాల సర్పం ముంగిట పడవేయుచున్నది. ఈ కనబడే వస్తుజాలమంతా 'వినాశనము' అనే బడబాగ్నిలో ప్రవేశించి నశించటానికే ఉద్యుక్తమౌతోంది. ఆకస్మికములు, విచిత్రములు, స్వభావసిద్ధములు అగు ఈ వస్తుజాలములను చూచి జీవుడు నమ్మిక కలిగి ఉండటమేమిటి? వీటిలో ఏ ఒక్కదానికైనా నిశ్చలమైన ఉనికి ఉన్నదా? లేదే! సముద్ర తరంగాలు ఎంత నిశ్చలమో....ఈ ద్రవ్య శక్తులు అంతే నిశ్చలం. 'కాలం' అనే ఉన్మత్తసింహం 'జగత్తులు'అనే గున్న ఏనుగులను వేటాడి హింసించి, భక్షించటం మనం స్పష్టంగా చూస్తున్నాం కదా!

ఈ జగత్తులన్నీ వాసనాఫలములను అన్వేషిస్తూ జన్మించి, కొద్దిసేపు కనిపించి మరల ఎటకో మటుమాయమౌతున్నాయి.

'విధి' అనే ఒకానొక చిత్రకారుడు 'చిత్తము' అనే పటము మీద 'పంచేంద్రియములను రంగులతో' సంసార చిత్రములను సృష్టిస్తున్నాడు.

❖

కాలము యొక్క ప్రవాహం ఎంతటి చిత్రమైనది! క్షణాలు, నిమిషాలు, గంటలు, రోజులు, సంవత్సరాలు, యుగాలు, మన్వంతరాలు – రూపంలో ఎంతవేగంగా ముందుకు సాగిపోతోంది! అది అసత్తు నుండే తన ప్రవాహం ప్రారంభించింది. భావాభావసమన్వితులై, రాగద్వేషభరితులై ఈ జీవులు కాలం వెంట దొర్లించబడుచున్నారు. బ్రహ్మదేవుని నుండి క్రిమికీటకముల వరకు గల

జీవులన్నీ తమ యొక్క సుకృత, దుష్కృతములకు సంబంధించిన చింతలచే పీడింపబడుచున్నారు. అదృశ్యంగా ఎక్కడో ఉండి కాల స్వరూపుడు స్థావరజంగమము లన్నిటినీ క్షణభంగురంగా చేసి వేస్తున్నాడు. స్థావరములు ఆ కాలుని కన్ను కాస్త కప్పి తమ శరీరములను నేలలో దాచి శీత వాత తాపములను సహిస్తూ జగత్తుకు స్థావర ఫలములను ఇస్తున్నాయి. ఇక ఈ జంగమ జీవులు ఏమీ తెలియకపోయినా అంతా తెలిసినట్లే ఈ భూమిపై అటూ ఇటూ సంచరిస్తున్నారు. త్రిలోకముల దృశ్యపరంపరలు సృష్టించే అజ్ఞానాంధకారంలో ప్రవేశించి ఘంఘుమధ్వనులు చేస్తున్నారు. 'కాలుడు' అనే భిక్షుకుడు బ్రహ్మాండము అనే భిక్షపాత్రలో అనేక జీవులను పొంది భక్షించి ఆకలితీరక మరల భిక్షకై కేకలు వేస్తూనే ఉన్నాడు. ఈ త్రిలోకములు, ఈ సూర్య చంద్రులు, త్రిమూర్తులు, ఈ భూ పర్వత ప్రాంతాలు, ఈ స్థూలసూక్ష్మకారణ దేహములు, ఆ కాలుని శరీర విభాగములే కాబోలు. బ్రహ్మలు, బ్రహ్మాండములు క్షణికములై కాలుని ముందు ప్రభవించి చటుక్కున మటుమాయ మవుతున్నాయి.

కల్పములు నిమిష కాలంలో గడచిపోతున్నాయి. ఒక్క నిమిషంలో అనేక కల్పములు ఏర్పడు తున్నాయి. త్రిమూర్తులంతటి వారు ఒక్క నిమిషంలో అంతర్హితులగుచున్నారు. విషయరహితం, వస్తురహితం అయిన బ్రహ్మపదమున సంభవం కానిదేమున్నది.

ఓ రామచంద్రా! జగత్ సంబంధములగు నానావిధ కల్పనలన్నీ అజ్ఞానము వలననే కలుగు చున్నాయి. ఈ బాల్య యౌవన వార్ధక్యాలు, ఈ సంపద, లేక ఆపద, ఉపతాపములు – ఇవన్నీ అజ్ఞానాంధకారము యొక్క విభూతులు మాత్రమే.

❖❖❖

7. అవిద్యా సంభ్రమం

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామా! 'చిత్' అనే పర్వతసమీపాన ఏర్పడి ఉన్న 'సంసారము' అనే అరణ్యంలో 'అవిద్య' అనే లత ఎట్లా పెంపొందుచున్నదో చెబుతాను విను.

'బ్రహ్మాండం, త్రిలోకాలు, జీవులు, జననమరణాలు, సుఖదుఃఖాలు, జ్ఞానాజ్ఞానాలు' అనే విశేషములతో ఈ అవిద్య ఏర్పడి ఉంటోంది. ధ్యాసచే ఇంద్రియ ద్వారాలతో కూడిన ఈ ఉపాధులు ఏర్పడుచున్నాయి. ఉపాధిని ఉపయోగించుటచే సుఖబుద్ధి కలుగుతోంది. అట్టి సుఖబుద్ధి ఆసక్తికి కారణమగుచూ అవిద్యను ఉదయింపజేస్తోంది. యజ్ఞము, దానము మొదలైన సత్క్రియలు సుఖమును ఫలింపజేసి, మధురఫలాలను ఇస్తున్నాయి. దొంగతనం, హింస మొదలైన దుష్క్రియలు దుఃఖాలు అనే చేదుఫలాల నిస్తున్నాయి. దారిద్ర్యము, అవమానము, మొదలైన అనేక దుఃఖకర విషయాలచే ఈ జీవులు అనేక బాధలకు లోను అగుచున్నారు.

శ్రీరాముడు : హే మహర్షీ! అవిద్య ఎట్లా ఉదయిస్తోంది?

శ్రీవసిష్ఠ మహర్షి : ఏదైతే లేనేలేదో....అద్దానిని 'ఉన్నది'....అని సంకల్పించుటచేతనే అవిద్య ఉదయిస్తోంది. ఆ అవిద్య సృష్టిని కల్పిస్తోంది. భావనల యొక్క దృఢత్వం చేత పదార్థములకు

సంబంధించిన సుఖదుఃఖములు రూపం పొందుతున్నాయి. అజ్ఞానం చేత అవిద్య వృద్ధిచెందుతోంది. అజ్ఞానఫలములను ప్రసాదిస్తోంది. అయితే 'ప్రత్యక్ తత్త్వవిమర్శ'కు సంబంధించిన జ్ఞానం వలన ఉన్నతమగు భూమికలను అధిరోహింపజేయగల బుద్ధి ఉదయిస్తోంది. ఆ బుద్ధి, బుద్ధికే సాక్షియగు సప్తమ భూమికను అధిరోహించటానికి దోహదపడుతోంది. ఏది తెలుసుకోవటానికి బుద్ధి ప్రయత్నిస్తోందో ఆ తెలియబడేదే తానగుచున్నది. (*బ్రహ్మైవ, స బ్రహ్మవిత్, బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి* – అను వేదవాక్యార్థం ఫలిస్తోంది).

కల్పనలతోనూ, వాసనలతోనూ, తీవ్రమగు దృశ్య సంబంధములతోనూ, రాగములతోనూ అవిద్య ప్రవృద్ధమౌతోంది. అవిద్య కొన్ని కార్యములకు, ఆ కార్యములు మరింత అవిద్యకు కారణమగు చున్నాయి. హృదయంలో విద్యను అవిద్య కప్పివేస్తోంది. విషయవాసనలే దాని ఆలంబనం. ఈ జీవుడు అవిద్యచే ఆవరించబడినవాడై పశువులు, ఇళ్లు, పుత్రులు, పౌత్రులు మొదలైనవాటి సమాగమం చేత కాలం గడుపుతున్నాడు. ఋతువులు, మాసాలు, సంవత్సరాలు గడచిపోతున్నాయి. ఈలోగా ముసలితనం వచ్చి మీద పడుతోంది. ఏమీ తెలియకుండానే ముసలితనం వచ్చిపడిన తరువాత ఇక్కడ ఇళ్లు, వాకిళ్లు, పుత్రులు, పౌత్రులు అతనిని రక్షిస్తాయా? ఎందుకు ఇంతకాలం జీవించినట్లు? ఏమి పొందినట్లు? అజ్ఞానంలో మునిగి తేలుతూ జీవితమంతా వెచ్చించినందుకు ఫలితంగా అతని ఉత్తర గతులు నికృష్టంగానే ఉండబోతున్నాయి. విచారణ లేకపోవటం చేత ముసలితనం దుర్భరమే అగుచున్నది. చేతిలోని పండు నేలజారినట్లు ఒకనాడు ఈ దేహం నేలకూలుతోంది. ఇంద్రియములు ఉన్నన్నాళ్లు అజ్ఞాన దిశలకే పరుగులు తీసిన ఆ జీవుడు కళ్లెదురుగా ఇంద్రియములు బలహీనపడటం అనుభవిస్తున్నాడు. అవి జీవించిన కాలమునకు సంబంధించిన, విషయాస్వాదన సామర్థ్యము కోల్పోగానే ఎంతటి నిస్సారస్థితి అనుభవిస్తున్నాడో... చెప్పనలవికాదు.

ఈ జగత్తంతా అవిద్య చేతనే ప్రవర్తిస్తోంది. సూర్యచంద్రనక్షత్ర గ్రహమండలాలు అవిద్య చేతనే నిర్విరామంగా, ఆకాశంలో శ్రమించి సంచరిస్తున్నాయి. అవిద్య చేతనే మహత్తరమగు ఆత్మ స్వరూపుడగు ఈ జీవుని అల్ప వస్తువులు కూడా ఆకర్షించి విచలితుణ్ణి చేస్తున్నాయి. ఇంద్రియములు, తృష్ణ, సంకల్పములు – ఇవన్నీ అవిద్య చేతనే తైతక్కలాడుచున్నాయి. అవిద్య యొక్క ఊడలు సప్త సముద్రములలోనికి, అఖాతములలోనికి, పాతాళ, దేవలోకాలకు విస్తరించి ఉన్నాయి. రాగ ప్రవృత్తిచే కామ్యకర్మలకు ఉపక్రమిస్తున్న జనులు తమ చుట్టుప్రక్కల గల జనులను కూడా తమవలె అవిద్య కర్మలవైపుగా ప్రోత్సాహపరచుచూ తద్వారా అవిద్యను పెంచి పోషిస్తున్నారు. కుకర్మలతో కృత్రిమ ఉపాయములతో, స్వర్గసుఖ నిర్వచనములతో మూర్ఖజనులచే అవిద్య పరిపోషించబడుతోంది.

❖

అయితే ఇదే జగత్తు వివేకులకు అవిద్యా నిర్మూలనమునకు ఉపయోగిస్తోంది. ఆయా శాస్త్రోచిత విధి విధానాలన్నీ నివృత్తి సంపద పెంపొందించుటకు ఉపకరిస్తున్నాయి. వారికిక్కడ మోక్ష సంపద, బ్రహ్మానందవర్షము లభిస్తున్నాయి.

అందుచేత తప్పు జగత్తులో లేదు. జీవుడు జగత్తును ఉపయోగించే, సమన్వయించుకునే విధానంలోనే జ్ఞానఅజ్ఞాన ప్రవృద్ధములు దాగి ఉన్నాయి.

ఈ జగత్తు అనేక సాంసారిక విషయములకు ఆలవాలమై ఉండవచ్చుగాక! అనేక అల్ప కార్యక్రమములు, ద్వైతవ్యవహారములు తారసపడుగాక! ఇట్టి అవివేక జగత్తులో ఉంటూ వివేకులు ఇక్కడ భిన్నత్వం నుండి సమరసము, అచ్యుతము అగు ఏకత్వానుభూతి సాధిస్తున్నారు. విషంలోంచి అమృతం సాధిస్తున్నారు. ఇదంతా క్షణికం, మార్పు చేర్పుల మయం కావచ్చు గాక. ఇది జ్ఞానవిచారణకు ఉపయోగించగలదు. అయితే వివేకివై జీవించటం నీవు నేర్చుకోవాలి. జ్ఞాన సముపార్జన, నిర్మల హృదయసముపార్జనకై నీ దృష్టిని సారించాలి. వివేచనాపూర్వకంగా ప్రయత్నించే వారికి ఈ జగత్తు ఉద్ధారణోపాయములు ప్రసాదించగల సామర్థ్యం కలిగియున్నదని నీవు గ్రహించు.

ప్రపంచం నిండా అవిద్య ఉండుగాక. నీ యందు అద్దానిని ప్రవేశించనీయకు. పడవ నీళ్లలో ఉన్నా ఆ నీరు పడవలోకి ప్రవేశించగలుగుతుందా? సమగ్ర సూక్ష్మ అవగాహన పెంపొందించుకునే వివేకులను చూసి ఇక్కడి అవిద్య దాసోఽహమనగలదు. అవివేకులకు అనేకత్వముతో కూడిన అనుభవం ప్రసాదిస్తూనే వివేకులకు అభేదమగు అనుభవం ఈ జగత్తు ప్రసాదించగలదు.

వత్సా! రామా! ఒక గడ్డి పరక నుండి హరిహరాదుల వరకు స్ఫురిస్తున్న ఈ దృశ్య ప్రపంచ మంతా అవిద్యా మాత్రమే సుమా! అట్టి ఈ అవిద్యను నశింపజేయవలసి ఉన్నది. దీనిని సమూలంగా దాటివేస్తే ఆత్మానుభవం అనే లాభం కలుగుతుంది. అట్లు దాటివేయటానికి నీవు అనుక్షణం సిద్ధంగా ఉండు.

❖❖❖

8. కార్య అవిద్య - కారణ అవిద్య

అప్పుడు వసిష్ఠుని వాక్యములు వింటున్న శ్రీరామచంద్రుని అందమైన రెండు కళ్లూ ఆశ్చర్యంతో విచ్చుకున్నాయి.

శ్రీరాముడు: హే మహానుభావా! అవిద్య గురించి, వివేకము గురించి, జ్ఞానసముపార్జన గురించి, ఈ జగత్తు జ్ఞానసముపార్జన నిమిత్తం వివేకులకు సాధనంగా అవటం గురించి మీరు చెప్పే విషయాలన్నీ శిరోధార్యాలే. ఒప్పుకోవలసిందే. అవన్నీ ప్రత్యక్ష సత్యాలుగా నాకు అవగతమౌతున్నాయి.

అయితే మీరు చివరిగా చెప్పిన విషయం నాకు కొంచెం తికమకగా ఉంది. 'శుద్ధ సత్త్వ స్వరూపులగు హరిహరాదులు కూడా అవిద్యలోని విభాగమే' అనే వాక్యం యాదృచ్ఛికంగా చెప్పారా? లేక, అదే మీ ఉద్దేశమా? ఎందుకంటే ఆ వాక్యం నాకు విభ్రాంతిని కలిగిస్తోంది. ఈ విషయం నాకు చక్కగా వివరించ ప్రార్థన.

అప్పుడు వసిష్ఠ మహర్షి రాముని ఉద్వేగం చూచి పకపకా నవ్వారు.

శ్రీవసిష్ఠ మహర్షి : రామా! నీ ప్రశ్న నాకు సంతోషం కలుగజేసిందయ్యా! చెబుతాను, శ్రద్ధగా విను.

మనందరి స్వస్వరూపమైనట్టి ఆ సచ్చిదానంద వస్తువు నిజానికి సంవిత్ (knower), సంవేద్యము (That being known), సంవేదము (The act of knowing)– అనే మూడింటిచే స్పర్శించబడేది కాదు. అది శాంతం, సర్వాత్మకం, అనుభవైకవేద్యం. అది చెప్పటానికి గాని, చూడటానికి గాని అలవి కానిది.

సృష్టికి పూర్వం అది అట్లే ఉన్నది. అయితే ఆకారరహితమగు జలంలో ఆకార సహితమగు తరంగాలు ఏర్పడుచున్నాయి కదా! అట్లాగే సృష్టికాలంలో అది నామరూప సహితమై ఒప్పారుచున్నది. 'బ్రహ్మము' అనే సంజ్ఞతో పిలువబడుచున్న అట్టి వస్తువు నుండి 'జగత్తులు' అనబడే కళలు లేచి వేరు వేరు స్వరూప–స్వభావాలు ప్రదర్శిస్తున్నాయి. అట్టి ప్రదర్శన చేతనే గుణములు అనే భేదములకు ఆపాదయోగ్యమగుచున్నది. సూర్యుని తేజము ఒకచోట ముదురు ఎండగా, మరొక చోట లేత ఎండగా, ఇంకొక చోట నీడగా ఏర్పడుచున్నట్లు ఈ స్థూల – సూక్ష్మ– మధ్యమాలుగా ఆ సచ్చిదానంద వస్తువే కల్పన స్వీకరిస్తోంది. ప్రథమంగా మనస్సు, మధ్య స్థితిలో హిరణ్యగర్భుడు, స్థూల స్థితిలో ఈ విరాట్‌గా అగుచున్నది ఆ బ్రహ్మమే.

అవిద్యాం ప్రకృతిం విద్ధి గుణత్రితయధర్మిణీమ్ ।
ఏషైవ సంసృతిర్జన్తోరస్యాః పారం పరం పదమ్ ॥ (శ్లో॥ 6, సర్గ 9)

ఇట్టి గుణత్రయములతో కూడుకునియున్న ప్రకృతియే అవిద్య. అదియే సంసారం. అట్టి త్రిగుణములకు ఆవల పరమపదము వెలయుచున్నది. కార్య కారణ విద్యల అసాధారణత్వమును అనుసరించి త్రిగుణములు త్రైవిధ్యమై (3x3=9) రకములుగా వెలయుచున్నది.

1) తమోతమము ⟶ స్థావరము (రాయి–రప్ప వగైరా)
2) తమోరజము
3) తమోసత్వము
4) రజోతమము
5) రజోరజము
6) రజోసత్వము
7) సత్వతమము
8) సత్వరజము
9) సత్వసత్వము ⟶ (త్రిమూర్తులు)

(స్థావరము ↓ త్రిమూర్తులు)

అవిద్యను అనుసరించి ఈ దృశ్యప్రపంచమంతా పై తొమ్మిది మిశ్రమములను ఆశ్రయించి కనబడుతోంది. దైవీసత్వములో పుట్టిన వారి అవిద్య ప్రాకృత గుణరహితం (Sans worldly qualities) అయి ఉంటుంది. అట్టి దైవీసాత్వికులై హరిహరాదులు నిర్మలపదమున వెలయుచున్నారు. సాత్వికమైన ప్రకృతి యొక్క అంశను ఆశ్రయించి ఎవరైతే సాత్విక స్వరూపులగు హరిహరాదులను ఆశ్రయిస్తున్నారో, వారు క్రమేపీ వారి యొక్క శ్రద్ధ, ప్రయత్నముల బలిమిచే శుద్ధ సాత్వికులు అవుతారు.

సత్యాంశమునకు చెందిన శివాది దేవతలు ముక్త పురుషులు. ఈ ప్రపంచమున్నంత వరకూ వారు వెలయుచూ ఉంటారు. నీ దృష్టిలో ఈ ప్రపంచమే లేనప్పుడు వారలు కూడా ఉండరు.

ఈ విధంగా శివకేశవాది దేవతలు అవిద్యలోని విభాగమే అయినప్పటికీ వారిని ఆరాధించటం చేత కార్య-అవిద్య నశించగలదు. కారణ అవిద్య శేషిస్తుంది. స్వస్వరూప జ్ఞానముచే ఆ కారణ-అవిద్య కూడా తొలగి అది విద్యకు ఆధారమగుచున్నది. శివకేశవాది దేవతలను ఆరాధ్యంగా గ్రహించి చేసే ఆరాధన ఆ జీవునకు దేహభావాతీతుడగుటకు, శుద్ధ బ్రహ్మస్వభావుడగుటకు ఉపకరిస్తోంది.

శ్రీరాముడు : ఈ ప్రపంచం ఎక్కడి నుండి వస్తోంది? ఎప్పుడు లేకుండా పోతోంది.

శ్రీవసిష్ఠ మహర్షి : విత్తులోంచి చెట్టు, మరల చెట్టులోంచి విత్తు, విత్తులోంచి చెట్టు, మరల చెట్టు లోంచి విత్తు ఉత్పన్నమగుచున్నట్లు... కార్యం నుండి కారణం, కారణంలోంచి కార్యం ఉత్పత్తి అవుతున్నాయి. కార్య-కారణ సంబంధమే 'ప్రపంచం' అని వ్యవహరించ బడుతోంది. అట్టి కార్య-కారణముల సంబంధమే అవిద్య. కార్య-కారణములకు అంతర్గతంగా శుద్ధ సత్వస్వభావమైన విద్య పరివేష్ఠితమై ఉన్నది. కనుకనే విద్యలోంచి అవిద్య ప్రకటితమౌతోంది. అనగా ఈ ప్రపంచం అనే అవిద్య శుద్ధమగు విద్యలోంచి ఉత్పన్నమై మరల ఒకప్పటికి విద్య యందు విలీనమైపోతోంది.

శ్రీరాముడు : సాత్వికము, పూర్ణము అగు విద్య నుండి తద్విరుద్ధ స్వభావము, స్పర్ధయుక్తము, అపూర్ణము అగు అవిద్య ఎట్లా ప్రభవిస్తోంది?

శ్రీవసిష్ఠ మహర్షి : వాస్తవానికి ఈ విద్య-అవిద్యల భేదం జలము-తరంగములకు ఉన్న భేదంలాగా కల్పిత మాత్రమేనని గ్రహించు. సత్యము, నిత్యము అయిన దానిని ఆశ్రయించి ప్రశాంత మానసుడవై ఉండటమే విద్య. అనిత్యములైన వాటిని అనాలోచితంగా ఆశ్రయిస్తూ ఉంటే అవిద్య అంతకంతకు వృద్ధి అవుతోంది. నిత్యసాత్వికములకు ప్రతీకగా శివకేశవాది నామరూపములను సాధన ద్రవ్యంగా గ్రహించుటచే ఈ జీవుడు విద్య వైపుగా పయనిస్తున్నాడు.

శ్రీరాముడు : విద్య-అవిద్యలు ఒకదానికొకటి వ్యతిరిక్తమైనవి కావా?

శ్రీవసిష్ఠ మహర్షి : ద్విత్వభావనయే అవిద్య కదా! పరమార్థమగు అద్వైత భావనచే భేదభావన తొలగుతుంది. జల-తరంగములకు భేదం లేనట్లే విద్య-అవిద్యలకు భేదం లేదు. భేదమే లేదు కాబట్టే అవిద్యలోని ఒకానొక విభాగము విద్యను ప్రసాదించగలుగుతోంది.

శ్రీ రామచంద్రా! ఈ విద్య-అవిద్యలను అతిక్రమించినప్పుడు ఏది మిగిలి ఉంటోందో...అది అన్ని సమయాలలోను ఏర్పడియే ఉన్నది. అయ్యది జ్ఞానాజ్ఞానాలకు అతీతం. అది అనుభవైకవేద్యము మాత్రమే. అక్కడ అన్ని శబ్దములూ నిశ్శబ్దమౌతాయి. అది వాద ప్రతివాదముల చేతనూ, నామరూపాల చేతనూ, శబ్దార్థాల చేతనూ అందించబడగలిగేది కాదు. అయితే వాద ప్రతివాదాలు, నామరూపాలు, శబ్దార్థాలు సాధన రూపంలో ఉపకరిస్తున్నాయి. అవన్నీ అనుభవజ్ఞానం యొక్క సమక్షంలో సాధ్యం యొక్క సంప్రాప్తి కాగానే లౌకికవ్యవహార సాధనాలలాగానే ప్రక్కకు తొలగుతాయి. సాధ్యం (లేక) జ్ఞేయమునకు ప్రతిరూపమగు చిహ్నం గాని, సంకేతం గాని, శబ్దం గాని లేదని అనుకున్నాం కదా!

అదియే నా యొక్క, నీ యొక్క సత్యస్వరూపం.

నాయనా! ఈ జ్ఞానజ్ఞేయములు, విద్యావిద్యలు 'లేవు' అనియే గ్రహించు. వివేకముతో సద్వినియోగపరచుకో. చివరికి సర్వ కల్పనలు దాటివేయి. అప్పుడు శేషించే దానిలో ఈ క్షణమందే ఎప్పటికీ సుస్థిరుడవై ఉండు. వాస్తవానికి ఇక్కడ ఏదీ లేదు. ఉన్నట్లు కనబడుచున్నదంతా చిద్వస్తువును ఆశ్రయించే ఉన్నది. ఆ చిద్వస్తువు సర్వ ఉపాధులలోనూ సమంగా ఏర్పడి ఉన్నది.

అయ్యది సామాన్య వస్తువువలె తెలియబడేది కాదు. అయితే, దాని అభాస(Reflection) వల్లే వస్తువులన్నీ తెలియబడుచున్నాయి. అందుచేత అవిద్య కూడా సత్ అనియే పిలువబడుతోంది. సత్ వాచకమైన అవిద్య విద్య వలన తొలగిపోతోంది. కాబట్టి,అట్లా తొలగుచున్న దానిని మిథ్య అంటున్నాం.

అందుచేత రామా! నీయందు విద్య – అవిద్యలలో అవిద్య విభాగకల్పన తొలగాలి. అందుకు ఉపకరించే అవిద్యాంశ నాశ్రయించటమే ఉపాయం. అవిద్యా సంక్షయం చేత విద్యావిభాగం కూడా తొలుగుతుంది. అప్పుడు విద్యా ఫలాభియుక్తమగు ఉపాధిశూన్య, అవ్యాప్త పూర్ణానందత్వం శోభిల్లు తుంది. అట్లు శేషించే విషయరహిత స్థితిచే పరమార్థం దర్శనమౌతుంది. సర్వాత్మక సంబంధితమైన తత్త్వదర్శనానంతరం ఇక మిగిలినదీ, పొందవలసినదీ ఏమీ ఉండదు.

ఆ జ్ఞానాజ్ఞాన అతీత స్థితి ఆకాశము కంటే ఉన్నతము, శూన్యము అయి ఉన్నది. అయితే, అది చిదాత్మకమే గాని శూన్యం కాదు. అది ఉపాధిపరిమితమని అనుకోకూడదు. చిదానందము ఉపాధి వ్యవహారములన్నిటినీ అతిక్రమించినదై ఉన్నది.

పాలలోంచి నేయిలాగా, సూర్యకాంత మగియందు అగ్నిలాగా, అగ్ని నుండి విస్ఫులింగముల లాగా, ఆ ఆత్మచైతన్యము నుండి ఈ దేశ–కాల–నిమిత్తములు వెలువడుతున్నాయి. "సముద్రం నుండి అలలు వేరా? మణినుండి శుభ్రకాంతులు వేరుకాదు కదా? అట్టి సాక్షీమాత్ర చైతన్యం నుండి ఈ చరాచరజగత్తు కూడా ఏదో వేరైనది కాదు"....అని ప్రవచించబడుతోంది.

లోపలా, వెలుపలా బ్రహ్మము కాక వేరొక వస్తువే లేదు. వస్తువుల కదలిక ఆకాశమునకు ఆపాదించబడునట్లు, గుణరహితమగు ఆ చిద్వస్తువునకు గుణములు కల్పించబడుచున్నాయి. శివ కేశవాది తత్త్వములకు గుణకల్పన చేసి ఆరాధన కొరకై ఉపయోగించబడుచున్నాయి. బ్రహ్మము యొక్క సామీప్యతచే ఈ దేహములు స్పందిస్తున్నాయి. నీటిలోని నురుగు మొదలైనవి నీటి కంటే వేరు కానట్లు ఈ దృశ్యమంతా బ్రహ్మము యొక్క వికల్పమే కాబట్టి, బ్రహ్మము కంటే వేరు కాదు. సర్వేశ్వరుడు సాధకుల భక్తి సౌలభ్యము కొరకై ప్రతీకలుగా ప్రసాదిస్తున్నట్లు గ్రహించబడుగాక!

ఆకాశము కంటే సూక్ష్మము, అమూర్తము, రూపశూన్యము అగు ఆ చిద్వస్తువునందు వాస్తవానికి దానికన్యమైనదేదీ ఏనాడూ ఉండియుండ లేదు. ఇక శివకేశవు లంటావా? ఇదంతా కూడా ఉండబోదు.

❖❖❖

9. అవిచారణమాంద్యము - చికిత్స

శ్రీవసిష్ఠ మహర్షి : అందుచేత రామా! నీకు కనిపిస్తున్న ఈ స్థావరజంగమ జగత్తు, ఇందు సంచరిస్తున్న ఈ శరీరధారులు, ఈ సర్వమూ – వాస్తవానికి బ్రహ్మము కంటే వేరు కాదని గ్రహించు. అట్టి బ్రహ్మమునకు వాస్తవానికి పుట్టటం, పోవటం అనే జాడ్యమే లేదు. దానికి జీవకల్పన లేదు. కనుక 'నేను జీవుడను' అను భావమే వ్యర్థము. ఇట్టి భావము వలన ఈ జీవుడు పొందగలిగేదేమిటో చెప్పు?... 'నేను బ్రహ్మమునే' అని ఎందుకు తలచరాదు?

ఈ జీవుడు మొట్టమొదట దేహముతో సంబంధం కల్పించుకుంటున్నాడు. క్రమంగా బాహ్య భోగాభిలాష అభివృద్ధి చేసుకుంటున్నాడు. 'నేనెవరు? ఈ దృశ్యమేమిటి? దేనితో నాకు ఏ సంబంధం ఉన్నది? నేను దేనికి కర్తను? దేనికి భోక్తను?' అని సద్విమర్శకు ఉపక్రమించకుండానే దేహమున్నంత వరకు కాలం గడిపివేస్తున్నాడు. త్రాడు నందు పాము యొక్క భావనను కల్పించుకొని చూస్తున్నట్లు ఈ వింత వస్తుజాలముల మధ్య, సంఘటనల మధ్య రాత్రింబవళ్లు వెళ్లబుచ్చుచున్నాడు.

వివేక దృష్టితో పరిశీలించినప్పుడే భ్రాంతి తొలగుతుంది. తెలియబడినప్పుడు సర్వమూ ఆత్మయే అగుచున్నది. జ్ఞానము యొక్క పరాకాష్ఠ అదే!

స్వస్వరూప చైతన్యమే స్వసత్తారోపితమైన మలినబీజమును ఆశ్రయించి అవిద్యగా రూపం పొందుతోంది. అవిద్యను దాటి పోయినప్పుడు సర్వ ఉపాధులకూ అతీతమైన ఆత్మతత్త్వం యొక్క ఉనికి ఎరుగబడుతోంది. చిత్తము యొక్క తాదాత్మ్యమే జగత్తు యొక్క రూపం. ఒకచోట ఇల్లు ఉన్నదనుకో. ఆ స్థలాకాశమును ఇల్లు ఆరోపించి చూస్తాం కదా! చిత్తమున్న చోటనే భ్రాంతిమయ జగత్తు ఉంటోంది. చిత్తము నశిస్తే భ్రాంతి తొలగుతుంది. రథంలో ప్రయాణించేవాడు పరిసరాలు పరుగులు తీస్తున్నట్లు భ్రమించుచున్నట్లు, చిత్తం తాను కదలుచూ ఆత్మకు కల్పనలు కల్పించి వ్యాకుల పడుతోంది. పట్టుపురుగు లాగా చిత్తము తనలోంచి స్రవించే వస్తుసంబంధ అభ్యాసమును వస్తువులలోంచి లభిస్తున్నట్లుగా భ్రమించి బంధమును అనుభవిస్తోంది. వాసనాతంతువులచే పరిమితమును ఆచ్ఛాదించుకొని తన అపరిమితత్వమును ఏమరుచుచున్నది. అంతర్బాలకత్వంను (Inner Childishness) అభవించుచూ ఆ విషయం తానే ఎరుగజాలకున్నది.

శ్రీరాముడు: స్వామీ! ఇక్కడ గల స్థావరములు "ఘనీభవించిన మూర్ఖత్వమా...?" అన్నట్లుగా పడి ఉన్నాయి. అవివేకము యొక్క పరమావధిని ధరించి వాటియందు చైతన్యము మూగగా ఉన్నది కదా! ఆత్మ చైతన్యం దృష్ట్యా వాటిని ఎట్లా అన్వయించుకోవాలి?

శ్రీవసిష్ఠ మహర్షి : ఈ స్థావరములలోని చైతన్యమును – మత్తుగా త్రాగి రహదారి ప్రక్కన గాఢ నిద్ర అనుభవిస్తూ పడి ఉన్న బాటసారిలోని జీవత్వపు 'ఎరుక స్థితితో' – పోల్చవచ్చు. అవి నిద్రా పరవశుని వలె సుఖదుఃఖములను గ్రహించు యోగ్యతను కోల్పోయి ఉన్నాయి. 'ముందు వెనుకల గురించి చింతించుట' అనే మననశక్తి కూడా వాటియందు లేదు. ముగ్ధ – నిర్విషయ రూపము

ఆశ్రయించి వందల వేల సంవత్సరాలు గడుపుతున్నాయి. అయితే దేహియగు ఈ జీవుడు కూడా జీవించి ఉన్న కాలంలో మూడవవంతు అట్టి ముగ్ధ - మౌన - జడ నిష్ప్రపంచక - నిర్విషయ రూపమును అనుభవిస్తూనే ఉన్నాడు కదా!

అట్టి స్థావర జన్మలు ఆత్మజ్ఞానముచే లభించే సాత్వికోన్నత స్థితికి బహుదూరంగా ఉన్నాయని చెప్పబడుతోంది. అంతర్భావములు నిద్రాణమై ఉండి, ఆ భావములకు ప్రతిస్పందనము నిర్వహించ లేని స్థితిలో ఉండుటచే ఆ స్థావర స్థితి అత్యంత దుఃఖకరమగు స్థితి. కర్మేంద్రియిలు, జ్ఞానేంద్రియాలు, మనస్సు కూడా జడ - శూన్య స్థితిలో ఉండటం చేత అవి సత్తామాత్రములై మూగ - జడ స్థితిని అనుభవిస్తున్నాయి.

శ్రీరాముడు : వేదవేద్యులగు మహర్షీ! ఒక యోగి మనస్సును నశింపచేసి జ్ఞానకర్మేంద్రియాలను అధిగమించిన వాడై చైతన్యమాత్రుడై ఉండుటయే సర్వోత్కృష్టమగు మోక్షము యొక్క స్వరూపమని అంటారు కదా! మరి, స్థావరములలో నిర్విషయ - మనోరహిత సత్తకు, జ్ఞాని యొక్క మనోరహిత స్థితికి అత్యంత సుదూరమైన 'తేడా' ఉన్నదని అంటున్నారే? స్థావరాలలోని సత్త మనోరహితమైనదే కదా!

శ్రీవసిష్ఠ మహర్షి: స్థావరాలలో బుద్ధి పూర్వకమైన విచారణ అంటూ ఏదీ ఉండదు. అట్టి స్థితి దుష్కృతముల - దుర్వాసనల - దురవగాహనల వలన లభిస్తోంది. దానికి శాస్త్రములు ప్రతిపాదించే ఆత్మజ్ఞానం పొందటానికి యోగ్యత, అర్హత ఉండవు. ఇక మోక్షస్థితి అంటావా? శాస్త్ర విహితమైన కర్మానుష్ఠానం చేత చిత్తము శుద్ధి సంపాదించగా ఏర్పడే అవగాహన కదా! శ్రవణ - మనన- నిధి - ధ్యాసాది అనేక ప్రయత్నముల ప్రభావం చేత వాసనలు సమూలంగా నాశనం కాగా, ఏర్పడే నిత్యోదిత చైతన్య పరిపూర్ణ స్థితి అది.

1.	దుర్వాసనల భారంచే స్పందన కోల్పోయినట్టి మనో జడ స్థితి.	⟶ స్థావరములు
2.	వాసనారాహిత్యంచే ఏర్పడే పూర్ణ చైతన్య అమనస్కస్థితి	⟶ ఆత్మస్థితి

వాసనారహిత అమనస్కస్థితికి, నిద్రాణమైన జడస్థితికి, అస్థిమశకాంతరం (ఏనుగుకు - ఒక దోమకు ఉన్నంత) తేడా ఉన్నది. ఆత్మతత్త్వమును చక్కగా గ్రహించుట చేత ఏర్పడే వాసనాపరిత్యాగమే 'కైవల్యపదవి' అని పిలువబడుతోంది.

❖

విత్తనంలో అంకురలక్షణాలన్నీ మౌనంగా దాగి ఉన్నట్లు, గాఢనిద్ర పోయేవానిలో సంకల్పములు ఉండి కూడా ప్రస్ఫుటం కాకుండా ఉన్నాయి. అట్లాగే జడములలో వాసనలు సుషుప్తమై వెలయు చున్నాయి. ఆ వాసనలే మరల జాగ్రత్ స్థితికి, పునర్జన్మకు కారణములగుచున్నాయి. మరి స్థావరాలకు మరల జన్మ లేదనటం ఎట్లా సంభవం? సుషుప్తంలో అణిగి ఉన్న వాసనలతో కూడి, మనోధర్మరహితమై,

జడత్వము ఆశ్రయించి ఉన్న స్థావర జన్మలు కూడా దుఃఖసహితములగు అనేక వందల జన్మలు పొందటానికి వేచియే ఉన్నాయి. అనగా, జడ ధర్మమును ఆశ్రయించిన స్థావరములు మరల సుషుప్త ధర్మము వహించి జన్మలు పొందవలసిన అగత్యం ఉన్నది.

ఒకవేళ, జడధర్మమే మోక్షమని అనుకుంటే, ఇక శాస్త్రోక్తమైన ప్రయత్నములను వదలి మత్తు పదార్థములను స్వీకరించి, మత్తుగా పడి ఉండటం మంచిది కదా! కనుక, జడత్వమనేది మోక్షమని అనిపించుకోవటానికి వీలు లేదు.

విత్తనంలో పుష్పలక్షణములు, మట్టియందు కుండధర్మములు అంతఃస్థితమై ఉన్నట్లు స్థావరము లందు పునర్జన్మ సంస్కారవాసనలు దాగి ఉన్నాయి. వాసనాబీజములు నిర్బీజములై సమూలంగా నశించటమే 'తురీయం' అని అనిపించుకుంటుంది. అంతే కానీ, జీవజంతు జాలం సుషుప్తి పొందినంత మాత్రంచేత అది 'సిద్ధి' అని అనిపించుకోదు.

శ్రీరాముడు: వాసనలు వృద్ధి చెందటానికి కారణమేమిటి?

శ్రీవసిష్ఠ మహర్షి : అజ్ఞానముతో కూడిన దృశ్యతదాత్మ్య అభాసయే అందుకు కారణం. వాసన, అగ్ని, ఋణం, వ్యాధి, శత్రుత్వము, అనురాగము, వైరము – ఇవన్నీ కొంచెం మిగిలి ఉన్నా మరల ప్రవృద్ధమౌతూ ఉంటాయి. వాసనలు ఇచ్ఛ – ఆశలు సహాయంతో క్రమాభివృద్ధి పొంది మహానర్థాలకు కారణమగుచున్నాయి. వివేకి అయినవాడు వాటిని సమూలంగా నిశ్శేషంగా త్యజించాలి. తీవ్ర ప్రయత్నంలో ఉద్భూతమయ్యే జ్ఞానాగ్నిచే వాసనాబీజాలను దగ్ధం చేయాలి. సత్తా సామాన్య రూపస్థితి పొందినవాడు ఈ శరీరము ఉన్నప్పుడు లేనప్పుడూ కూడా అద్వైత–నిత్య శాంత స్థితి పొందుతాడు. అట్టివాడు ఇక జన్మించడు. దుఃఖములను పొందడు.

❖

స్థావరములు తరగని వాసనా బీజములతో, ఉత్పత్తి పొందబోవు రసభావంతో, (అయితే) అంతర్గతంగా – చిచ్ఛక్తి సమన్వితములై నిద్రించుచున్నాయి.

ఆత్మశక్తియే జడములందు జడరూపంగానూ, రాయియందు కాఠిన్యంగాను, కాష్ఠంలో (చెక్కలో) ధ్వంస రూపంగానూ, కత్తియందు పదును రూపంగానూ, మట్టికుండ యందు జలధారణ సమర్థం గానూ, వస్త్రము నందు చలి నివారణ శక్తిగానూ, బంగారము నందు ఆభరణత్వంగానూ వెలయు చున్నదని సునిశిత బుద్ధితో గ్రహించు. వాసనాబీజశక్తి విత్తనమునందు దాగి ఉండి తగిన వాతావరణం లభించగానే వికాసం పొందే మహావృక్షములాగా, జగదనుభవంగా బయల్వెడలుతోంది. అట్టి వికాసము నుండి అనేక రూపనామ పరంపరలను పొందుతూ మహాప్రయాణం చేస్తోంది.

నిజానికి ఆత్మ చైతన్యమునకు నామరూప ఉపాధిత్వంగాని, స్థావర జంగమత్వం గానీ లేదు. రూపరహితమగు ఆకాశమునందు మేఘముల ఆచ్ఛాదనచే రూపముగా స్ఫురిస్తున్నట్లు, ఆవృతచైతన్యం జడాది దృశ్య దశలను పొంది కనిపించటం జరుగుతోంది. కనుక, రామా! ఈ అజ్ఞానముచే ఆవరించబడిన చిచ్ఛక్తి యొక్క వాస్తవ స్వరూపమేమిటో గమనించు. అంతేగాని అవాస్తవమగు

స్థావర జంగములను చూచి భ్రమించకు. భూతాకాశము రూపరహితమైనట్లే ఆత్మాకాశం సదా, సర్వదా విషయరహితం.

అసన్మయము అగు 'అజ్ఞానము' అనే నిస్సార వస్తువు నలువైపులా వ్యాపించి భ్రాంతిబుద్ధికి రకరకములుగా, స్థావర జంగమాత్మకంగా తోపింప జేయుచున్నదయ్యా! అయితే ఆత్మ దృష్టితో అల్ప దృష్టిని జయిస్తే ఈ సంసారము బ్రహ్మమే అవుతుంది గానీ, భ్రమను కలిగించజాలదు. దీని నంతటినీ ఆత్మదృష్టితో చూస్తున్నపుడు సర్వదుఃఖములు నశించుచున్నాయి. ఆత్మదృష్టికి విరుద్ధంగా 'ఆవరణ' కల్పించుకొనుటయే అవిద్య. అవిద్యలోంచి దృశ్యజగత్తుకు సంబంధించిన జడ-జీవాది స్ఫురణలు కలుగుచున్నాయి.

శ్రీరాముడు: ఈ నామరూపాత్మక ఆవరణ కల్పిస్తున్న అవిద్య యొక్క అసలైన రూపమేమిటి?

శ్రీవసిష్ఠ మహర్షి : అవిద్యకు రూపమంటూ ఏదీ లేదు.

అవిద్యారూపరహితా యావదేవావలోక్యతే ।
తావదేవ గలత్యాశు తుహినాణుర్యథాతపే ॥ (శ్లో॥ 31, సర్గ 10.)

సర్వరూపశూన్యమైన అవిద్య ఎంతవరకు విచారించబడితే అంతవరకూ ఎండకు మంచులాగా, కరిగి పోవుచున్నది. నిద్రలోంచి లేస్తున్న మనుజుడు ఎంతవరకు జాగ్రత్‌వృత్తులు వచ్చి జేరితే అంతవరకూ నిద్రమత్తు తొలగినట్లే కదా! "ఇది ఏమిటి?"- అని ఎంతవరకు పరిశీలిస్తామో అంత వరకు విషయ పరిజ్ఞానం లభిస్తుంది. ఎంతవరకు వెలుతురు విస్తరిస్తే అంతవరకూ చీకటి దూరమౌతూ ఉంటుంది. అట్లాగే, ప్రయత్నపూర్వకంగా ఎంతవరకూ అవలోకిస్తూఉంటే అంతవరకు అవిద్య క్షీణిస్తూ వస్తుంది.

ఒకడు ఒక చీకటి గదిలో నిలబడి ఉన్నాడనుకో! "ఈ చీకటి యొక్క అసలైన రూపమేమిటి?" అని తెలుసుకుందామని దీపం వెలిగించి వెతికితే, ఆ దీపపు వెలుతరులో చీకటి రూపమేమిటో కనబడుతుందా? దీపం వెలగగానే చీకటి మటుమాయమౌతుంది. ఎందుకంటే, వెలుతురు లేక పోవటమే చీకటి కదా! జ్ఞానం ప్రభవించిందా, అజ్ఞానము యొక్క నామ-రూపములు కూడా లభించవు. నెయ్యి యొక్క ఘనస్వరూపం (పేరు నెయ్యి యొక్క ఘనాకారం) పరిశీలించటానికి వేడి చేశామనుకో, ఆ ఘనాకారం యొక్క పొడవు వెడల్పులు ఏమగుచున్నాయ్? మటుమాయమౌచున్నాయి కదా! అట్లాగే, అవిద్య విచారించబడినప్పుడు, ఆ విచారణ యొక్క తీవ్రత చేత, ఆ అవిద్య 'ఇది' అని నిర్దేశింపబడక పారిపోవుచున్నది.

కొంచెం మాత్రమే విచారిస్తే కొంచెమే తొలగుతోంది. అసలు విచారణయే చేయకపోతే, అసద్రూపమగు భ్రమగా అనుభవమగుచు అది అవస్తువు అయి కూడా జీవుని ఈ నిబిడాంధకార రూపంలో చుట్టుముట్టుతోంది. కనుక రామా! అవిచారణామాంద్యమును వదలి, విచారణ చేసి చూడు అప్పుడు నీకు 'అవిద్య లేనిదే' అని తెలియబడగలదు. విచారణ చేయకుండా, ధ్యాన-భక్తి-యోగాది ప్రయత్నాలు లేకుండా రోజులు గడపుతూ ఉంటే ఈ అవిద్య తనంతట తానే తొలగుతుందా? ...లేనే లేదు.

శ్రీరాముడు: కార్యకారణములచే రూపాంతరం చెందుచూ, కనబడుచున్న ఈ అవిద్యాదృశ్యతరంగం విలీనమవటానికి ఉపాయమేమిటి?

శ్రీ వసిష్ఠమహర్షి : "రక్త-మాంస-బొమికలచే పంజర రూపంలో తయారై కనిపిస్తున్న ఈ శరీరంలో చిక్కుకుని ఉన్న నేనెవడను?" అని విచారణ చేయటమే అందుకు ఉపాయం. సర్వ అసద్రూపములను మొదలంట్లా త్యజించివేయటాన్నే 'అవిద్యా క్షయం' అని పిలుస్తున్నాం. అప్పుడు శేషించి ఉన్నదే ఆత్మ కదా! ఒకడు ఒక భుజకీర్తిని ధరించునప్పుడు మరల తొలగించినప్పుడు అతడు యథాతథంగానే ఉంటున్నాడు కదా! ఈ జగత్తులను ధరిస్తున్నప్పుడు, త్యజించునప్పుడు కూడా 'ఆత్మ' ఒకే తీరుగా ఉండి ఉంటోందని గ్రహించు. ఆత్మ ఎప్పుడూ ఏదీ పొందటం లేదు. కోల్పోవటం లేదు. "అది సదా యథాతథం" - అని వేదోపనిషత్తుల గానం కదా!

అవిద్య తొలగినప్పుడు శేషించి ఉండే వస్తువు శాశ్వతము-సద్రూపము అగు బ్రహ్మమే కదా! ఆత్మ సర్వమును ధరిస్తోంది. మరల పాము కుబుసమును విడుచునట్లు విడచివేస్తోంది. ఆత్మ యొక్క సమక్షమునందే అవిద్య ప్రవర్తించటం - నివర్తించటం కూడా జరుగుతోంది.

అట్టి సారభూతమగు ఆత్మయే నీవు కదా! ఆత్మ అనుభవైకవేద్యము. నాలుక ఒక మధురమైన వస్తువును ఆస్వాదిస్తున్నప్పుడు ఆ అనుభూతిని ఏ వర్ణనల చేతనూ మరొకరెవరికీ అందించగలిగేది కాదు. అట్లాగే, ఎవరికి వారే స్వస్వరూప సందర్శనంచే అది ఆస్వాదించవలసిందే! ఆత్మయే ప్రతిఒక్కని శాశ్వత స్వరూపం, వాస్తవ స్వస్వరూపం అయిఉన్నది.

రామా! మరల చెప్పుచున్నాను. 'అవిద్య' అనేది అసలు లేనేలేదు. ఈ కనబడేదంతా అఖండిత మగు బ్రహ్మమే అయి ఉన్నది. బ్రహ్మమే అవిద్యగా భ్రమచే అనిపిస్తోంది. సత్ - అసత్ కల్పనలన్నీ బ్రహ్మము నందే, బ్రహ్మము చేతనే, బ్రహ్మము గానే కలుగుచున్నాయి.

'కుండ' మట్టికాదని, 'వస్త్రము' దూది కాదని, 'శకటం' కొయ్య కాదని, అనిపించటం తెలివి తక్కువతనమే కదా! 'ఇది బ్రహ్మము కాదు' అని అనిపించటమే అవిద్య. 'ఇదంతా బ్రహ్మమే' అను నిశ్చయమే అవిద్యా క్షయం. ఇక్కడున్నదంతా శివం - శాంతం - అద్వైతం తప్పితే ఇక ఇక్కడా, ఎక్కడా, ఇప్పుడూ, మరెప్పుడూ, ఏదీ, మరేదీ లేదు. లేనే లేదు. ఉండజాలదు.

❖❖❖

10. కర్తవ్యములు జ్ఞానమునకు అడ్డు కావు

శ్రీవసిష్ఠ మహర్షి : నాయనా! రామచంద్రా! మరలమరల ఆత్మతత్త్వ విషయమై వినటం మననం చేయడం వంటి అభ్యాసముల వలన మాత్రమే ఈ దృశ్యం ఇక హృదయంలో చిగురించకుండా ఉండగలదు. అనాత్మభావనపోయి ఆత్మభావన సంతరించుకోవాలంటే విషయం ఆరూఢం కావాలి. అందుచేతనే ఒకే విషయం మరల మరల నేను చెప్పటం జరుగుతోంది. కనుక నేను చెప్పేది పరిశీలకుడవై విను.

అజ్ఞానమేతద్బలవదవిద్యేతరనామకమ్ ।
అభ్యాసేన వినా సాధో నాభ్యుదేత్యాత్మభావనా ॥ (శ్లో.2, సర్గ.11.)

ఈ 'అవిద్య' అనబడే అజ్ఞాన-అనాత్మ భావనలు వందల-వేల జన్మలలో మూటకట్టుకున్న ద్వైతవాసనలవలన బలం పుంజుకుని దట్టంగా పెనవేసుకుని ఉన్నది.

ఇది అనేకసార్లు జాగ్రత్‌లో కళ్లు మొదలైన ఇంద్రియములు ఉపయోగిస్తున్నప్పుడు, 'స్వప్నం' అనే ఊహయందు పొందిన అనుభవపరంపరల చేతనూ, అనేకసార్లు చావు-పుట్టుక లందలి భావోద్రేకముల చేతనూ ప్రాబల్యం పొంది ఉంటోంది. అందుచేత శ్రవణ మననాది తీవ్రయత్నములు ఎంతో అవశ్యకమై ఉన్నాయి.

ఇక ఆత్మజ్ఞానం అంటే ఏమిటి? అది పంచేంద్రియాలకు అగోచరమైనది. ఆరవ ఇంద్రియము, సంకల్ప స్వరూపము అయిన మనస్సు కూడా లయించగా, అప్పటికీ సత్తామాత్ర రూపమై వెలయుచున్నది, ఇంద్రియముల వలన కలుగుచున్న వృత్తులకు ఆవల ప్రత్యక్ష, వృత్తిరహిత స్వభావమై ఆత్మ ప్రకాశిస్తోంది. మరి అట్టిది భౌతికమైనదిగా ఎట్లా కనిపిస్తుంది చెప్పు?

కాబట్టి రామా! హృదయ వృక్షమును దట్టముగా పెనవేసుకుని ఉన్న అజ్ఞాన-లతను సంక్షయింపజేయాలి సుమా! "మరల మరల జ్ఞానమును అభ్యసించటం" అనే చురకత్తిని ఉపయోగించి ఆ అజ్ఞాన-లతను త్రెంచి స్వస్వరూపమును సిద్ధింపజేసుకోవాలి.

శ్రీరాముడు : మహర్షీ! ఈ జీవుని జీవితము రాజ్యపాలన, అన్నపానాదుల సముపార్జన మొదలైన శరీరరక్షణ వ్యవహారములకే అధికభాగం సరిపోతోంది కదా!

శ్రీవసిష్ఠ మహర్షి : నాయనా! రామా! ఈ అన్నపానాది లౌకిక వ్యవహారములు జ్ఞానసముపార్జనకు, అవిద్యా నాశనమునకు, అడ్డుగా ఉన్నాయని అమాయక జీవులు మాత్రమే భ్రమిస్తున్నారు. అది సరికాదు. నీవు అట్టి అల్ప అభిప్రాయములను దరిజేరనీయవద్దు. జనక మహారాజు రాజ్యపాలనాది వ్యవహారములను నిర్వర్తిస్తూనే జ్ఞానాభ్యాసపరుడై, జ్ఞానిఅయి విహరించటం అందరం చూస్తున్న విషయమే. అభ్యాసబలం చేతనే ఆతడు కర్మనిరతుడై కూడా 'నేను సర్వకర్మ వ్యవహారములకూ అతీతుడను' అను నిశ్చయాత్మక బుద్ధిని అభ్యాసఫలంగా సంపాదించుకున్నాడు. పూర్ణజ్ఞాన నిశ్చయము గల విష్ణుమూర్తి అనేక అవతారములతో గర్భవాసం అనుభవించి, జన్మించి ధర్మరక్షణ, భక్తపాలన చేస్తూనే స్థిరచిత్తుడై నిశ్చలుడై, నిర్లిప్తుడై ఉన్నారు. సర్వదా అంబతో కూడుకొనియున్న శివభగవానుడు, సరస్వతీదేవితో కూడుకొనియున్న బ్రహ్మదేవుడు, రాగరహితులై, అఖండజ్ఞాన సమన్వితులై అవిద్యకు ఆవల నిశ్చలులై ఉన్నారు. సృష్టి-లయ కార్యములలో నిమగ్నమై ఉన్నారు. అయినా కూడా వారు భక్తులకు కరుణతో, వరములను, జ్ఞానమును ప్రసాదిస్తున్నారు. గుణ సహితులై వర్తిస్తున్నారు. అట్టి మహనీయుల నిశ్చయమే నీకు కూడా కలుగుగాక!

దేవతల గురువగు బృహస్పతికి, అసురుల గురువగు శుక్రాచార్యులకు, త్రిలోకసంచారియగు నారదమహర్షికి, పులస్త్య- అంగీరస - ప్రచేతస - భృగు - క్రతు - అత్రి - శుకాది ఋషిసత్తములకు,

ఈ సభకు వేంచేసి ఉన్న అనేకమంది మహనీయులకు, జీవన్ముక్తులకు, రాజర్షులకు, బ్రహ్మర్షులకు, నాకు కర్మల వ్యవహారం పట్ల ఎట్టి నిశ్చయం ఉండి...కర్మలు నిర్వర్తించటం జరుగుతోందో, అట్టి నిశ్చల ఆత్మైక్యస్థితి, అపరోక్ష, అద్వైతజ్ఞానానుభూతి పెంపొందించుకుంటూ, నీకు విధించిన కార్యములను నిర్వరిస్తూ ఉండు. కర్మల తదనంతరం జ్ఞానం కాదు. జ్ఞానివై కర్మలు నిర్వర్తించు.

శ్రీరాముడు: భగవంతుడా! వసిష్ఠమహర్షీ! మీరు చెప్పిన మహనీయులందరూ ఏ నిశ్చయమును అనుసరించి, అవిద్యాశోకరాహిత్యమగు పదవిని అలంకరించి ఈ దృశ్యజగత్తులో సంచరిస్తున్నారో – అది వివరించమని ప్రార్థిస్తున్నాను.

శ్రీవసిష్ఠ మహర్షి : సునిశిత బుద్ధితో నేను చెప్పేది గ్రహిస్తున్నట్టి నీకు వారి సునిశ్చయమేమిటో వివరించి చెబుతాను విను. ఇప్పుడు నేను చెప్పే వివేక భేరీనినాదం సర్వ వేదాంత సిద్ధాంతసారమే అయి ఉన్నది.

❖❖❖

11. వివేక భేరీ నినాదం

వివేకుల భేరీ నినాదం ఇట్లా ఉంటుంది. ఈ కనబడే జగత్తుల యొక్క స్థితిగతులన్నీ ఘనీభూతమై ఏర్పడి ఉన్నట్లుగా అనిపిస్తోంది కదా! అయితే వివేకులగు మహనీయుల దృష్టిలో ఇదంతా మాయకమై ఉండి కూడా పవిత్రబ్రహ్మ స్వరూపంగానే వ్యవస్థించియున్నది.

బ్రహ్మ చిద్బ్రహ్మ భువనం బ్రహ్మ భూతపరమ్పరాః ।
బ్రహ్మాహం బ్రహ్మ మచ్ఛత్రుర్బ్రహ్మ సన్మిత్రబాన్ధవాః ॥ (శ్లో 17, సర్గ 11.)

బ్రహ్మమే జీవచైతన్యముగా ప్రకటితమౌతోంది. చైతన్యాభాసకమగు ఈ చతుర్దశభువనములు (14 లోకములు), వాటిలో ఉండే అసంఖ్యాక జీవులు కూడా బ్రహ్మమే! నేను, నా బంధువులు, నా శత్రువులు, నన్ను ఆక్షేపించేవారు–అందరూ బ్రహ్మమే అయి ఉన్నారు.

భూత, భవిష్యద్వర్తమాన కాలములు సముద్రంలోని తరంగముల లాగా బ్రహ్మమునందే విజృంభిస్తున్నాయి. పదార్థ సంపదలు కూడా బ్రహ్మమే. బ్రహ్మము బ్రహ్మముచేతనే పరిలక్షించబడటం (Being aimed at), గ్రహించబడటం, ప్రేరేపించబడటం, అనుభవించబడటం... జరుగుతోంది. బ్రహ్మము తనయందు తానే తన మాయాశక్తిచేత వివర్తము చెందుతూ 'తదితరం" గా వర్ధిల్లుచున్నది. నన్ను అధిక్షేపించుచూ, ఉపేక్షించుచూ, ప్రశ్నించుచూ, వేధించుచూ కనబడేదేదైతే ఉన్నదో– 'అదంతా' బ్రహ్మమే కనుక బ్రహ్మమునకు నేను ప్రియమొనర్చెదను గాక!

ఆకాశంలో మేఘముల సమావేశం ఏదో వనముయొక్క ఆకారంలాగా ఉన్నట్లు భ్రమచే తోచుచున్నది చూచావా? అది పసిపిల్లవాడి అమాయకదృష్టి వంటిదే కదా! అట్లాగే రాగద్వేషాది వ్యవస్థలన్నీ కేవలం ద్రష్టయొక్క కల్పిత దృష్టుల ఫలితం మాత్రమే. బ్రహ్మనిష్ఠని అవేమీ స్పృశించలేవు. అఖండబ్రహ్మైక్యవేద్యులకు సర్వసంకల్పములు మొదలంట్లా నశించి ఉంటాయి. అందుచేత వారిపట్ల

రాగమునకు సంబంధించిన సంకల్ప ప్రసంగం ఉండదు. వారి రాకపోకలు, కాళ్లుచేతుల కదలికలతో సహా సర్వ కార్యక్రమములూ పూర్ణస్వభావమై, బ్రహ్మరససమన్వితములై ఉంటాయి. వారు సర్వేసర్వత్రా స్వస్వరూపమునే దర్శించటం చేత ఇక ఎవరి మీద ద్వేషం? "ఈ జగత్తంతా నా హృదయాకాశ విన్యాసమే"... అని వారు ఆస్వాదిస్తున్నారు.

ఆనందైక రసమగు బ్రహ్మమే అంతటా, అన్నిటా, అన్నివేళలా ప్రకాశించుచుండగా... ఇక సుఖమేమిటి? దుఃఖమేమిటి? అన్ని వైపులా బ్రహ్మమే బ్రహ్మమునందు దీపిల్లుచున్నది. ఇక నేనో? బ్రహ్మము కంటే వేరుగా నేను మరెచ్చటా లేను.

కుండ – మట్టి – దూది – అంతా బ్రహ్మమే. నాతో సహా అంతా బ్రహ్మమే అయి ఉండుట చేత, ఇష్టం అయిష్టం మొదలైన కల్పన అంతా మిథ్యయే. అట్టి కల్పనల యొక్క అవసరంగాని, అనవసరంగాని లేదు. ఈ దేహ బ్రహ్మము మరణ బ్రహ్మమునందు ప్రవేశిస్తోంది. ఉభయ స్థితులూ బ్రహ్మమే అయి ఉన్నాయి. కనుక మరణము గురించి భయపడటం గాని, కోరుకోవటం గాని చేయవలసిన పనేమున్నది?

ఎవరైనా సుఖదుఃఖాలు అనుభవించే వారు ఇక్కడున్నారని అనుకుంటే, అది అజ్ఞానాంధకారంలో త్రాడును చూసి పాము అని అనుకోవటం వంటిదే.

అంతయూ బ్రహ్మమే కాబట్టి 'ఇది నేను చేశాను' అని భావించవలసిన పని లేదు. తరంగముల కదలికలు నీరు నుండి వేరుగా ఉన్నవి కాదు కదా. నీటిలో కదలికలే లేకపోతే ఇక తరంగములకు ఉనికి–నామ–రూపములు ఎక్కడినుండి వస్తాయి? బ్రహ్మమే లేకపోతే సుఖదుఃఖములకు ఉనికియే ఉండేది కాదు.

కెరటములు జలమే కదా! ఇక కెరటములకు 'జలములో లయించుట' అనే వ్యవహారం ఎక్కడున్నది? అట్లాగే ఈ జీవుడు బ్రహ్మమును సంపాదించుటయో, తాను బ్రహ్మము నందు లయించుటయో ఏముంటుంది? ఈ జీవుడు బ్రహ్మమే కదా! ఇక్కడేదీ మరణించుట లేదు. తరగుట లేదు. పెరుగుట లేదు. అయితే, తరంగములు 'చలించుట' అను చలనస్వభావమును వీడకయే నిజస్వభావమున జలముగా వెలయునట్లు 'ఈ పాంచ భౌతిక దేహాన్ని నేను' అను జడస్వభావమును ఉన్నప్పుడు – లేనప్పుడు కూడా స్వస్వభావమగు తత్త్వరూపమున వెలసి ఉండెదను గాక! తరంగములు నిశ్చలత్వం పొందితే జలంగానే ఉంటాయి కదా! అనిశ్చలంగా ఉన్నప్పుడు కూడా అవి జలమే! బంధము–మోక్షము అను ఉభయ స్థితులలో బ్రహ్మమే ఉన్నది. నేను అజ్ఞానినైనా, సుజ్ఞానినైనా కూడా బ్రహ్మమే అయి ఉన్నాను.

బంధ–మోక్షములు లేనే లేవు. ఒకవేళ ఉంటే... వాటి వాస్తవ స్వరూపం బ్రహ్మమే! శాస్త్రాలు (ఉపనిషత్ మొదలైన గ్రంథాలు) అతాత్త్వికమగు జడ రూపమును పరిత్యజించి... తద్వ్యతిరిక్తమగు 'తత్త్వభావన పొందటం' అనుదాని గురించి ప్రవచిస్తున్నాయి. అదంతా కూడా ఆభరణము నందు బంగారమును, తరంగము లందు జలమును గాంచుట వంటిది మాత్రమే. 'తత్త్వభావన' అనగా

'నీవు'గా 'నేను'గా కనిపించేదంతా బ్రహ్మమే – అను భావన. ఈ క్షణం తరువాత ఎప్పుడో ఎక్కడో పొందవలసిన మరొక స్థితి, స్థానములు కాదు. "ఇది బ్రహ్మం కంటే వేరొకటి"... అను బ్రహ్మవ్యతిరిక్త భావమే ప్రకృతి అని, మాయ అని పిలువబడుతోంది.

ఈ జీవజడాది రూపములన్నీ బ్రహ్మము నందే ఆరోపించబడుచున్నాయి. భేదభావన ఉన్న చోట మాత్రమే మోహం, దుఃఖం ఉంటాయి. వాస్తవము, నిత్యము, అప్రమేయము అగు బ్రహ్మమును ఎరుగుటచే ఇక అవి ఉండవు. తెలియని వారికి ఈ జగత్తు దుఃఖమయం. తెలిసిన వారికి ఇదంతా అఖండానందరసైక పూర్ణము. గ్రుడ్డివానికి ఈ జగత్తంతా అంధకారమయం. జ్ఞానచక్షువులు కలవారికి ఇదంతా ప్రకాశమయం. అజ్ఞానికి ఈ జగజ్జాలం బంధమయం. జగదేక ఆత్మజ్ఞానం చేత ఇదంతా దివ్యానందమయం.

ఓ బిడ్డలారా! సకల జీవులారా! మమాత్మ స్వరూపులారా! రాత్రిపూట శిశువు చీకటి వైపు చూచి భూతములను ఊహించి భయపడునట్లు, మీరు ఈ జగత్తులోకి వచ్చి వ్యామోహితులై ఇక్కడి అల్ప లాభాలాభములను చూచి ఉలిక్కిపడుచున్నారు. ప్రాప్తవయస్కుడు చీకటికి ఏమాత్రం భయపడ నట్లుగానే, జ్ఞానము ప్రాప్తించినవాడు 'బ్రహ్మము' అనే నిండుకుండ అయి తనను తాను దర్శించుకొను చున్నాడు. విశ్వమంతా తన రూపంగా ఆస్వాదిస్తున్నాడు. అందుచేత, అతనికి ఎట్టి భయ దుఃఖాలు అంతరమున కలగటమే లేదు. తరంగములు లేవటం, పడటం మిథ్యయే అయినట్లు ఇక్కడ జీవించటం, మరణించటం అనేవి మిథ్యయే. ఇదంతా భ్రాంతిచేతనే కల్పితంగా ఆత్మయందు దృశ్య సంబంధిత భ్రమగా కలుగుతోంది. బాల్యాజ్ఞానంలాగా 'ఇది ఉన్నది – అది లేదు' అనే పరికల్పన ఆత్మ యందు ఆత్మచే ఏర్పరుపబడుతోంది. ఇక్కడ ఉన్న విశేషం ఇంతకుమించి ఇంకేమీ కాదు.

ఒక దీపం యొక్క కిరణపుంజములు బయలుదేరి నిష్కారణంగానే తదితర పదార్థములను ప్రస్ఫుటింప జేయుచున్నట్లు బ్రహ్మము నుండి బయలుదేరిన చిత్‌పుంజములు జగత్తును ప్రస్ఫుటింప జేయుచున్నాయి. బ్రహ్మము 'జగత్‌నిర్వచనము' అనే ఆత్మశక్తిని ప్రకటించుచున్నప్పటికీ అది సర్వదా తనయందు తానే వెలయుచున్నది.

కెరటముల మధ్య గల జలకణములు కించిత్ ఘనీభవించటం చేత జలంలో నురుగు ఏర్పడుతోంది. ఆ జలకణములు తునిగినప్పుడు, తిరిగి జలముగానే రూపం దిద్దుకుంటోంది కదా! అట్లాగే ఏదో కారణం చేత ఆత్మ కల్పితరూపములను సంతరించుకుంటోంది. ఆ కారణం నిరోధించ బడినప్పుడు తిరిగి బ్రహ్మముగానే శేషిస్తోంది. సముద్రంలో జలం లేకపోతే కెరటములు గాని, బుడగలు గాని ఉండేవా? బ్రహ్మమే లేకుంటే మనోబుద్ధ్యాది అంతఃకరణములుగాని, ఈ శరీరములు గాని ఏర్పడగలిగేవే కాదు. సముద్రం ప్రశాంతమయినప్పుడు కెరటాలు, నురుగు, వీచికలు, జలకణాలు శమించగా, ఇక ప్రశాంతజలత్వం స్వాభావికమే అయినట్లు కల్పనలు త్యజించినప్పుడు ఈ జీవుడు స్వాభావికంగానే స్వతఃసిద్ధము, నిర్మల–సర్వాత్మ స్వభావమగు బ్రహ్మముగానే ప్రకాశిస్తున్నాడు. ఈ శరీరములు, ఈ సంపద–ఆపదలు, ఈ హర్ష–విషాదములు, ఈ ధర్మార్థ కామ పురుషార్థములు

– అన్నీ కూడా తిరిగి బ్రహ్మము నందే ప్రవేశిస్తున్నాయి. 'బ్రహ్మమున జగత్తులు ఉండటం' అనగా 'బంగారమునకు ఆభరణమునకు సంబంధించిన ఆకారము ఉండటం' వంటి కల్పితం మాత్రమే. ఈ విచిత్రం ఇంతవరకే గాని మరింకేమీ కాదు. మూఢులు స్వస్వరూప అజ్ఞానావేశం చేత ద్విత్వం కల్పించుకొని బాధపడుచున్నారు.

ఈ మనస్సు బుద్ధి, శబ్ద స్పర్శ రూప రస గంధము లనబడే పంచతన్మాత్రలు, ఇంద్రియాలు – ఇవన్నీ 'ఏకైక బ్రహ్మమే' అయి ఉన్నాయి. అట్లే అనేక ఆత్మలు ఎక్కడా లేవు. కొండగుహలో చేయ బడిన 'ఓహో' అను ధ్వని ప్రతిధ్వనించి ఆ గుహలో అనేక వైపుల నుండి అనేకసార్లుగా 'ఓహో...ఓహో' ధ్వని వినబడుతుంది. అవి మరొకరెవరో పలుకుతున్నట్లు అనిపిస్తుంది. అట్లాగే ఇక్కడ ద్వితీయ భ్రాంతి కలుగుతోంది. 'వాచారంభం... మొదలే అసంభవం 'అనునట్లుగా 'నేను, నీవు, ఇది, అది, చిత్తము, అనుభవము' – మొదలైనదంతా ఆత్మయందు ద్వైతభ్రాంతిని కల్పించుచూ, లేచుచున్నది.

కలలో ఒక జీవుడు తన కల్పితరూపములగు అనేక రూపములను దాల్చి తానే ఆ రూపములతో ప్రతిస్పందిస్తున్నాడు చూచావా? బాగా పరిశీలించిన తరువాత స్వస్వరూప బ్రహ్మమే ఈ జీవ జగత్ భావములను ప్రదర్శించుచున్నట్లు జ్ఞానులు గ్రహిస్తున్నారు. అందుచేత ఆత్మలో 'భ్రమింపజేయుట' అను ద్విత్వమునకు సంబంధించిన చమత్కారం అప్రసిద్ధమైనదేదీ కాదు. అయితే బురదలో పడి ఉన్న మణి బురదయొక్క తాపటం చేత 'అది మణి' అని గ్రహించకపోవటం, ఏదో గులకరాయి ముక్కలాగానే గ్రహించబడటం జరుగుచున్నట్లు, బ్రహ్మమని భావించకపోవటం చేత బ్రహ్మమే అజ్ఞానముగా పరిఢవిల్లుతోంది. ఇది ఎంత చిత్రం!

అయితే మనం చెప్పుకున్న తత్త్వజ్ఞులు సర్వము బ్రహ్మముగా దర్శిస్తున్నారు. తన ఆత్మయే అంతంతరమునందు స్వయం ప్రభువై స్వయం జ్యోతిస్వరూపమై, మహత్తుగా అంతటాఅన్నిటా ఆక్రమించి ఉన్నట్లు గ్రహిస్తున్నారు.

అజ్ఞానులకు మాత్రమే ఖండభావన కలుగుతోంది. అజ్ఞానులే 'అజ్ఞానం...అజ్ఞానం' అని వాపోవుచున్నారు. మణి అని తెలియగానే బురదచే కప్పబడిన రాయి మణిగా గుర్తించబడునట్లు, అంతా బ్రహ్మమే అని తెలియబడగానే నాలుగు దిక్కులందూ బ్రహ్మమే అనుభవమగుచున్నది. బ్రహ్మం సర్వశక్తిమంతము. అందుచేత అన్యకారణమేదీ లేకుండానే స్వశక్తి చేతనే అది ఎట్లు భావన చేస్తే అట్లే అనుభవమగుచున్నది. చివరికి పూర్ణముగా భావించినప్పుడు పూర్ణముగానే అగుచున్నది.

బ్రహ్మము కర్మ–కర్త–కరణ–కారణ రహితం. అది అనామయమైనది. అందుచేత, వేదజ్ఞులు దానిని స్వయంభువం (తనంతటతానే ప్రభవించునది) స్వయం ప్రభువు, స్వయం కారణం అని వర్ణిస్తున్నారు. బ్రహ్మమే అపరిజ్ఞాతమైనప్పుడు 'అజ్ఞానము' అని 'మాయ' అని పిలవబడుతోంది. అది తన అజ్ఞానాన్ని వినాశనమొనర్చుకుని పరిజ్ఞాతమైతేనో? అదే జ్ఞానంగా అగుచున్నది. గ్రహించక, శత్రువుగా భావిస్తాం చూచావా! గ్రహించిన తరువాతనో... శత్రుభ్రమ అనే అజ్ఞానం తొలగి అతడే మిత్రుడిగా తెలియవచ్చుచున్నాడు కదా! విచారణ–వైరాగ్యములు లోపించుట చేతనే జీవ–జగత్తులలోని

బ్రహ్మము అస్పష్టంగా ఉండిపోతోంది. ఈ జీవ జగద్రూపము అయుక్తమని, విచారించినప్పుడు నిలబడజాలదని, అసద్రూపమని గ్రహించిన తరువాత బ్రహ్మభావము తనంతటతానే తక్షణమే సుస్పష్టమై ఉదయించగలదు. 'ముత్యపుచిప్పలో వెండి ఉండజాలదు' అని తెలిసిపోయిన తరువాత ఇంక అందులోంచి వెండిని పొందటానికి ప్రయత్నం ఉండదు కదా! బ్రహ్మమును ఎరిగిన తరువాత ఇక "ఈ జగత్తులో ఏదో పొందటల్లేదే?"... అనే దుఃఖభ్రమ ఉండదు.

ఈ జగత్తు బ్రహ్మమున ఉండటం అసంగతమని తెలిసి రాగానే భోగ్యవస్తువుల పట్ల విరాగం స్వయంసిద్ధమౌతుంది. ఎప్పుడైతే ద్వైతము అసత్యమని, అసంభవమని అసంగతమని గ్రహిస్తామో... మరుక్షణం 'బ్రహ్మభావన' అనే సూర్యుడు స్వయంగా ఉదయిస్తున్నాడు. అటు తరువాత 'ఇది సత్యం, ఇది మిథ్య' అను భావనను కూడా త్యజించి మహనీయులు పరమవైరాగ్యాన్ని అవధరిస్తూ ధన్యులగుచున్నారు.

'నేను-నాది' అను గ్రహణాగ్రహణముల కారణంగా అహంకారము ఆత్మవస్తువును స్ఫురించకుండా అడ్డుతగులుతోంది. అయితే వివేకులగు మహనీయులు ఆత్మవస్తువును అహంకారము తాకలేదని, హింసించలేదని ఎరిగియే ఉంటున్నారు. "కార్య-కారణ సంఘాతమగు ఈ శరీరమే నేను కాదు. ఇక తదితరం గురించి వేరే చెప్పేదేమున్నది?" అని గ్రహించి జనకాది మహాత్ములు స్వతఃగానే బ్రహ్మభావాన్ని ఆశ్రయించి ఉంటున్నారు. 'నేను బ్రహ్మమును' అనుజ్ఞానం సంపాదించుకొని, పదిలపరచుకొని ఉండటం చేత వారి సర్వభావనలు అనుక్షణం తమ స్వరూపంలోనే తక్షణమే విలీనమగుచున్నాయి. 'ఇదంతా కూడా బ్రహ్మమే' అనుభావనాపటిమచే వారు నీవు-నేను మొదలైన వాటిని నీళ్లలో పడిన ఉప్పుబొమ్మలాగా స్వాహా చేసివేస్తున్నారు. 'అస్తి-భాతి-ప్రియము-నామము-రూపము' అను ఐదు రీతులుగా చెప్పబడే ఈ జగత్తు, ఇందలి వస్తుజాలములు వారు బ్రహ్మమునందు, లయం చేసి గ్రహించటం చేత వారు మోహమును, దుఃఖమును, కర్మత్వమును తొలగించివేస్తున్నారు. సర్వదా పరమ శాంత-నిర్మల-నిర్లిప్త స్వరూపులై వెలయుచున్నారు. అట్టి బ్రహ్మైక్య స్వరూపులగు మహనీయులగానం ఏమిటో చెపుతాను విను.

❖❖❖

12 ఆత్మజ్ఞాని యొక్క సింహనాదం

శ్రీవసిష్ఠ మహర్షి: ఆత్మ స్వరూపము యొక్క మహోన్నత్యం గ్రహించిన ఆత్మానుభవసమన్వితుల 'సుప్రకటన' ఏమిటో చెపుతాను విను.

ఆత్మజ్ఞాని యొక్క సింహనాదం - అహో! నేను స్వస్థుడనైనాను. సర్వసమరస స్వభావుడనైనాను. వాస్తవమునకు నేను బ్రహ్మమును. కనుక సర్వదా స్వభావ సిద్ధంగానే శోకరహితుడను. జ్ఞానమును సంపాదించకోవటంచేత 'కల్పనలు' అనే కలనుండి విముక్తుడనయ్యాను. నేను దేనినీ గ్రహించటం లేదు. త్యజించటం లేదు. ఈ శరీరమును నమ్మి ఉండవలసిన అవసరం లేదు. అట్లా అని త్యజించ

వలసిన అగత్యమేమీ లేదు. ఇందలి రక్త - మాంస - అస్థి - ధాతువులు, ఈ మొత్తం శరీరం నా యొక్క ఒకానొక చిత్కళమాత్రమే.

బ్రహ్మము అనబడే నిత్యసత్యమును నేనే. సూర్యునితోను, నక్షత్రములతోను నిండియున్న ఈ సర్వ ఆకాశము కూడా నా చేతనే ఆక్రమించబడియున్నది. చిత్‌చైతన్యము రూపముతో ఈ సృష్టిని, తదితర సృష్టులను పూర్ణం చేసి ఉంటున్నాను.

ఈ భూమి దీనిపైగల జీవరాసులు, మొక్కలు, పొదలు, అడవులు, కొండలు, సముద్రం, సముద్ర ప్రాణులు కూడా నేనే. బ్రహ్మైకత్వం పొందుటచే అవన్నీ నాకన్నా వేరుగా ఉండవు. ఇవ్వటం, పుచ్చుకోవటం, ముడుచుకోవటం, నింపటం, కదలటం, వదలటం, మొదలైన ప్రాణి ధర్మములన్నీ నేనే అయి ఉన్నాను. చిదాత్మరూపుడనై విభిన్న రూపములను ధరించి లతలందు, కాండలందు, విత్తనములందు, అంకురములందు తిష్ఠవేసుకొని ఉంటున్నాను. ఇదంతా చిదాంతర్గతమై నా స్వరూపమే అయి ఉన్నది. శాంతరసాత్మకమగు పరబ్రహ్మమునైన నేను అంతటా అన్నిటా అనవరతమూ జాజ్వల్య మానంగా వెలుగుచున్నాను. 'సర్వమేకాత్మ పరంబ్రహ్మ' అను నిశ్చయము కలిగి ఉండుటచే వేదములు ఉపయోగించే సశబ్దములగు 'చిదాత్మ, బ్రహ్మము, సత్యము, సత్, అమృతము, జ్ఞానము, శివము, శాంతము, అద్వైతము, సర్వము' మొదలైనవి నాపట్ల సముచితములౌచున్నాయి. వేదాలు - ఉపనిషత్తులు నా స్వరూపగానమే చేస్తున్నాయి.

సర్వమేకాత్మ పరంబ్రహ్మజ్ఞాన స్వరూపుడనగు నేను సర్వముగాను, కేవల చిన్మాత్రము గాను, బాహ్యానికి అభాసమాత్రం గాను, అమలం గానూ, సర్వభూతాత్మబోధకం గాను, సర్వత్రా వెలయు తత్త్వము గాను, శాంతము గాను, చైతన్యము గాను, చిద్బ్రహ్మము గాను ఏర్పడి ఉన్నాను.

మనోబుద్ధ్యాది అన్ని ఇంద్రియవ్యాపారములందు అనుశ్రుతంగా స్వప్రకాశస్వరూపంగా, విభేద రహితంగా ప్రవేశించియున్నాను. శబ్ద స్పర్శాదులతో నిర్మించబడిన ఈ జగత్తుకు మూలకారణంగా, అక్షయ స్వరూపుడనై ఉంటూ ఇంద్రియ ద్వారముల నుండి సంకల్ప-వికల్ప రూపములుగా ప్రసరిస్తున్నాను. తెంపులేని తేజోపుంజములతో అనామయమగు చిద్బ్రహ్మముగా లోపల, బయట ప్రసరించుచూ నేను నేనుగానే వెలుగొందుచున్నాను.

యోగిపుంగవులు మౌనవ్యాఖ్యల ద్వారా ప్రకటిస్తున్న పరబ్రహ్మతత్త్వాన్ని నేనే. నిత్యానుభవ స్వరూపుడనగుట చేత నా స్వరూపమును ఎవరూ ఎక్కడా తిరస్కరించజాలరు. సమస్త కర్మచక్రములు నా వలననే ప్రవర్తించుచున్నాయి. నిర్లిప్తము, సుషుప్తి సదృశము, చిద్బ్రహ్మము అగు నా రూపమే వనములలో ప్రశాంత స్వరూపంగా వెల్లివిరియుచున్నది. ఒక పురుగు అనుభవించే ఆనందము నుండి బ్రహ్మదేవుని ఆనందం వరకూ గల అన్ని ఆనందములూ నా అనంతానంద సముద్రంలోని కణలేశము మాత్రమే. నాయొక్క బ్రహ్మానంద సాగరములోని కొన్ని చిన్న కణములు ఈ భూత-భవిష్యత్ -వర్తమాన బ్రహ్మాండములుగా, దేశకాల పరిచ్ఛన్నములగు ఖండ-సుఖములుగా ఒకింత ప్రతిబింబిస్తు న్నాయి. కాముకుడగు జీవుడు చంద్రుని చూచినప్పుడు, అందమైన స్త్రీ నాసాగ్రం చూచినప్పుడు

ఏర్పడే ఆహ్లాదం నా అవిచ్ఛిన్నసత్తాత్మక నిర్విషయ చిద్రూపానందం యొక్క ఒక అల్పకణము మాత్రమే. రాత్రిపూట పూర్ణచంద్రుని చూస్తున్నప్పుడు ఆ చూచువాని చూడబడే చంద్రుని మధ్య ఏర్పడి ఉన్న నిర్విషయ చిదానందమును నేనే.

నా స్వరూపమునకు సుఖ దుఃఖ – కల వికలనములు లేవు. నిర్మల సత్యానుభవరూపాత్మకమైన చిత్ బ్రహ్మాత్మను కదా! దూరంగా ఉన్న వస్తువులను దర్శింపజేయుచున్న పంచభూతాల సమ్మేళనముల మేళవింపుకు కారణమగుచున్న తత్త్వశక్తిని నేనే. ఖర్జూరము మొదలైన మధుర ఫలాలలోని మాధుర్యం అను రసశక్తిని నేనే. ఏ చిత్‌శక్తి జీవుని రూపంలో అత్యంత సామాన్యములగు సుఖదుఃఖములను పొందుచున్నదో, అది చిత్‌శక్తిస్వరూపుడనగు నన్ను ఎరుగుటచే వినిర్ముక్తమగుచున్నది. జ్ఞాన–అజ్ఞాన ఉభయ స్థితులలోనూ, ఉభయ స్థితుల మధ్య నెలకొనియున్నది నేనే.

నేను లాభాలాభములకు, సుఖదుఃఖములకూ అందువాడను గాను. సమత్వముచే అప్రసంగ వ్యవహారం, నిరాకారం, ఖేదానందాతీతం – అగు చిద్రసబ్రహ్మమునే గాని, మరింకేమీ కాను. భూమి–సూర్యుల మధ్య ఏర్పడి ఉన్న ద్రష్ట యొక్క నిర్విషయ దృష్టిని, శాంతచిత్స్వరూపుడను నేను.

జాగ్రత్–స్వప్న–సుషుప్తులలో అధ్యస్తము, అతీతము (Inside Placed - Placed beyond) అయినట్టి తురీయము అనబడు అనామయ చిత్‌బ్రహ్మాత్మక రూపం నాదే. నేను ఈ అసంఖ్యాక జీవరాశులనబడే క్షేత్రాలలో సమస్థితుడనై ఒప్పారుచున్నాను. జ్ఞాన ప్రకాశవంతమగు నా చిద్రూపము అత్యంతమనోహరము. సంభోగానందలవము, అమృతాస్వాదన మాధుర్యము ఎవరికీ మాటలలో చెప్పనలవి కానట్లు స్వాత్మానుభవేకవేద్యమగు నా బ్రాహ్మీస్వరూపమును ఎవరూ ఎన్ని వాక్యములు ఉపయోగించినా చెప్పజాలరు.

తామరతూడులలో దారం పైకి కనబడకుండా లోపల ఉండి ఆ తూడు నిలచుటకు కారణమగు చున్నది కదా! ఆధారము పరిశీలనాత్మకదృష్టికి మాత్రమే అగపడుచున్నది. అట్లాగే అన్ని శరీరములలో ప్రసరించి ఉండి, ఆ శరీరములు నిలచుటకు కారణమై, విచారించినవారికి మాత్రమే సుస్పష్టమగుచున్న చైతన్య స్రవంతిని నేనే. సమస్తభువనములూ పూర్ణంగా ఆక్రమించుకొని ఉన్నప్పటికీ ఈ భువనాలలోని వస్తుజాలములకు నేను దుర్లక్ష్యమే అయిఉంటున్నాను.

మేఘమాలను స్పందింపజేస్తున్న చిదానందరూపుణ్ణినేనే! ప్రేమాస్పదంగా కనిపించే అంతటి లోనూ, పాలలోని నేయివలె అంతర్లీనమై, అంతః స్నేహంగా ఉపలక్షితమై అనుభూతియోగ్యమగుచున్న చిచ్ఛక్తి నేనే. పాలలో నేయి అంతటా వ్యాపించి ఉన్నట్లు 'క్షయం' అంటూ లేనట్టి చిత్‌గా ఈ సృష్టి అంతా నేను నిండి ఉన్నాను. పర్వత పదార్థముల లోపలా, వెలుపలా సర్వదా సర్వగతమై వెలయు సత్తా సామాన్యం నా స్వరూపమే. దర్పణంలాగా సర్వమును తనయందు ప్రతిబింబింప జేయగల సర్వగత బ్రహ్మము అనగా నేనే గాని, మరింకొకటేదో కాదు.

❖

ఎట్టి మాలిన్యములకూ చోటు ఉండనట్టి శుద్ధచిత్ స్వరూపుడను కదా! నా స్వరూపము సర్వ తేజస్సులనూ ప్రకాశింపజేయునట్టిది. సర్వ సంకల్పములనూ ఫలింపజేయునట్టిది. ఈ సర్వము

నాదే కనుక సర్వలోభములకూ నేను పరాకాష్ఠ కూడా. అట్టి నా యొక్క నిత్యస్వరూపమును నేను ఆరాధిస్తున్నాను. సాధన సమయంలో బాహ్యంలోని వస్తువును భగవానునిగా ఆరాధించాను. ఇప్పుడు నా ఆరాధ్యం నేనేనని గ్రహిస్తున్నాను. ఆరాధకుడు, ఆరాధన – ఆరాధ్యం కూడా నేనే. నేను, తదితరులు కూడా ఉపాసిస్తున్నది నన్నే.

అట్లు నా ఆరాధ్యమగు స్వస్వరూపమే కుండ, వస్త్రము, తటాకము, గొయ్యిలందు కూడా సద్రూపముగా వెలుగొందుచున్నది. అండజ– స్వేదజ – జరాయుజ – ఉద్భిజ జీవులలోని చైతన్యము అదే! నా సత్వబుద్ధనిత్య స్వరూపము జాగ్రత్ దశలోకూడా సర్వవిశేషాతీత్వకారణంగా నిర్వికారమై ఉండుటచే 'నిత్యనిద్రితం' అనటానికి కూడా అర్థమగుచున్నది. గాఢనిద్రలో ఏ క్షణంలోనైనా జాగ్రత్‌ను స్వీకరించటానికి నిత్యసిద్ధమై ఉండుటచే 'నిత్యజాగ్రత్' అని కూడా చెప్పబడటానికి అర్థమగుచున్నది.

ఈ జగత్తులో అనేక జీవులచే అనేక నామరూపములతో మంత్ర – తంత్రములతో ఉపాసించ బడుచున్నది ఏదైతే ఉన్నదో, అది నా స్వరూపమే అయి ఉన్నది. అగ్నియందు ఉష్ణం గాను, మంచు నందు చల్లదనం గాను, అన్నము నందు మాధుర్యం గాను, కత్తియందు వాడి గాను, చీకటియందు నలుపు గాను– పైకి కనిపించక అనుభవరూపమున స్ఫురించుచున్నాను. అట్టి సర్వాంతర్యామియగు నన్ను నేనే ఉపాసించుకొనుచున్నాను. ఉపాసించబడుచున్నాను.

వెలుపలా, లోపలా వెలుగుచూ అత్యంత సామీప్యమున ఉండిన నా ఆత్మస్వరూపమును ఎరుగకపోవుటచే నేను ఇంతకాలం అజ్ఞానినై ఎక్కడెక్కడో వెతికాను. ఏవేవో మార్గాలలో ఉపాసించాను. సర్వసంకల్పములకు అతీతమై సర్వ సంరంభములకు ఆవల ఉండి, కామ–క్రోధ–భోగ–ాంక్షలకు విరహితమై, కారణరహితమై, నిరహంకారమై... ఏ నా సత్యస్వరూపమైన చిదాత్మ కలదో, అద్దానికి మరల మరల నమస్కారం. నమస్కారం!

నా స్వరూపమే అన్నిటా వెలయుచూ నిర్లిప్తంగా ఆద్యంతరహితంగా ఏకరస స్వరూపంగా ఏర్పడి ప్రకాశిస్తోంది కదా! అద్దానిని సూక్తములచే భజిస్తున్నాను. మూడులోకములలోని ముక్త పురుషులచే గానము చేయబడుచు, అన్నిటా ప్రతిబింబించుచూ, జాగ్రత్‌లో ఇంద్రియములను ఉపయోగిస్తూ, స్వప్నంలో ఊహయందు సంచారం చేస్తూ, సుషుప్తిలో నిశ్శబ్దమగుచు, బహిరంగంలో జగత్తులనూ, అంతరంగంలో సంకల్పములనూ ఉంచుకొని ప్రచ్ఛన్నంగా ఉండి ఉండే ఆ చిదాత్మను నేను సర్వదా పొందియే ఉన్నాను. అది సృష్టికాలంలో సర్వసత్తలు కల్పించుకుంటోంది. ప్రళయ కాలంలో ఆ సర్వసత్తలు తన యొక్క అసత్ యందు లయం చేసుకుంటోంది. అట్లు సర్వసత్తలు తన యందు లయం చేసుకొనే ఆత్మసత్త ఇప్పటికే నేనైయున్నాను. నేను అదై ఉన్నాను. అది నేనై ఉన్నది. అదియే నేను. సోఽహమస్మి!

సర్వ రూపములందూ విహరించుచూ, సర్వమునకూ స్నేహధారియై, తన అధోభాగమున భావాభావములను రచించుకొనుచూ, అవి లేనప్పుడూ చలన రహిత నిశ్చల దీపంలాగా ఉంటూ, నిరుపాధిక ప్రేమకు స్థానము, ఆధారమూ అయి ఉంటూ, అవివేక దృష్టిచే జడదేహ ధర్మములు

ఆపాదించబడుతూ, ముక్తులకు ముక్తస్వరూపమున గోచరిస్తూ, 'చిత్' దీపమై ఉన్న నన్నే అందరూ అన్నిటా ఉపాసిస్తున్నారు. అట్లు ఆరాధించేవారు, ఉపాసించేవారు నాకు వేరైనవారు కారు.

'జీవము' అనే తటాకంలో 'హృదయము' అనే పద్మమునందు రహస్యంగా దాగి "కాళ్లు–చేతుల కదలికలు" అనే బాహ్యప్రదర్శనా సదృశమైన 'చిదాత్మ' అనబడే నా పరరూపమునకు నా జీవరూపముచే భక్తితో సాష్టాంగ ప్రణామములు చేస్తున్నాను. ఆ చిదాత్మ ఎక్కడో పుట్టినది కాదు. దాని యందు ఏదీ జనించుటలేదు. ఎవరి చేతా హరింపబడేది గాదు. అది పూర్వమూ ఇప్పుడూ ఎప్పుడూ సత్యతత్త్వమై వెల్లివిరిసియున్నది. అది శబ్ద–స్పర్శ–రూప–రస–గంధముల రూపమున ఒకచోట కించిత్ అభివ్యక్తమగుచూ...మరొకచోట ఆత్మజ్ఞానుల హృదయ స్థానంలో శాంతి వహించి ఉంటూ నదిలో గల వివిధ స్థానములలోని జలంలాగా అన్ని స్థితులలోనూ ఒక్కటే అయి ఉన్నది. ఆకాశకోశం వలె బట్టబయలే అయి ఉన్నది. సర్వలోకములకూ నామరూపములను ఒసగుచూ, తాను మాత్రం నామరూప రహితమై ఉన్నది. మహామహిమశాలి అయిఉండి కూడా తన యొక్క అజ్ఞాన విభాగముచే ఉపాధులలో ప్రవేశించి తన ముంగిటే తాను 'ఆశ' అను భిక్షం ఎత్తుచూ 'ఆదిభిక్షువు' అని అనిపించు కుంటోంది. సర్వమునకు కర్త అయి ఉండి వాస్తవానికి అకర్తగానే ఉంటోంది. అట్టి సర్వాత్మనే ఇంకా ఇంకా ఉపాసిస్తాను. ఆస్వాదిస్తున్నాను.

అదియే నేను. నేనే అది. నాఉపాసన నా కొరకే! ఉపాస్యము నేనే! సరే, ఉపాసకుడను నేనే నని చెప్పాలా...?

నేను సకల ప్రపంచరూపుడను. ఇదంతా నాదే. ఇన్ని ఉపాధులలోనూ అహంకారముగా ఒప్పుచున్నది నేనే. అయినా కూడా నేను మరేదీ అగుటలేదు. నా తత్త్వమేమిటో తెలిసిన నేను ఇక సర్వరుగ్మతలనుండి విముక్తుడను. ఈ జగత్తు కృత్రిమమగు మాయ అగుగాక. లేక, సత్యమే అగుగాక! రెండు అవగాహనలలోనూ 'అవగాహనాసాక్షినై' నేను ఉండనే ఉన్నాను.

ఇంతకుమించి నా గురించి నేను చెప్పుకోవటానికి మాటలు లేవు. చాలవు.

❖

ఓ రామచంద్రా! చూచావా! శివకేశవులు, జనకాది తదితర మహనీయులు ఇట్టి అవగాహన సృష్టీకరించుకొని, అటుపై ఈ సృష్టిలో తమతమ విహితమగు కార్యములను నిర్వర్తిస్తున్నారయ్యా! మనం చెప్పుకున్నదంతా ప్రతి ఒక్కరి యొక్క స్వస్వరూపమునకు సంబంధించిన నిర్వివాద సత్యము. ఎవ్వరైనా ఈ స్వస్వరూపస్తోత్రం పఠించుటచే సత్యసంకల్పులగుచున్నారు. ప్రతిఒక్కరు స్వస్వరూప భావము పొందుటకు అర్హులే అయి ఉన్నారు సుమా!

స్వస్వరూపమునకు, తదితరంగా ఉంటున్న వికల్పములన్నీ స్వయంకల్పిత నిరోధములే గాని మరింకేమీ కాదు.

❖❖❖

13. ఆత్మానుభూతిపరులు

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! జీవన్ముక్తులగు జనకుడు మొదలైనవారి ఆత్మావగాహన ఏమిటో నీకిప్పుడు విశదీకరించి చెప్పాను. వాళ్లంతా ఎట్లా విగతజ్వరులై సత్యములలో కెల్లా సత్యం, శాంతం అయిన పదమున వెలయుచున్నారో గమనించావు కదా! ఆ విధంగా వారు పరిపూర్ణాత్మను పొంది, సమబుద్ధులై సర్వాసక్తులనూ త్యజించి, నిర్లిప్తులై నిరహంకారులై జీవన్మరణాలకు నిందాప్రశంసలకు పట్టుబడక ఈ జగత్తులో యథేచ్ఛగా సంచరిస్తున్నారయ్యా! స్వభావ సిద్ధంగానే వినమ్ర స్వభావులై, మేరువు వలె ధీరులై, సర్వ ఉత్ప్రేక్షలను (Sense of Comparisons) త్యజించి, సూక్ష్మలక్ష్యమును భేదించిన వారై ఈ ప్రపంచంలో విహరిస్తున్నారు. అంతరంగము నిండా 'సమ దృష్టి'ని నింపివేసి ద్వీపములందు, దేవతోద్యానములందు, తూగుటుయ్యాలలందు, పర్వత స్థాణువు లందు, వీథులందు, గృహములందు నిశ్చింతగా చరిస్తున్నారు. అట్టి మహనీయులలో కొందరు ఛత్ర చామరములు కలిగియుండి ధర్మార్థకామములకు సంబంధించిన ఆయా కార్యక్రమములు నిర్వర్తిస్తూ రాజ్యములు ఏలుచున్నారు. మరికొందరు వేద స్మృతులచే నిర్దేశించబడిన శిష్టాచార క్రియలను తాము నిర్వర్తిస్తూ, తదితరుల చేత నిర్వర్తింపజేస్తూ చరిస్తున్నారు. ఇంకొందరు మౌనము వహించి తమ సమున్నత భావతరంగములచే ఈ జగత్తుపై అవ్యాజమైన ప్రేమ ప్రవింపజేస్తున్నారు. ఇంకొందరు ఈ జగత్తులోని దుష్టస్వభావజీవులను శిక్షిస్తూ, సాత్వికులకు రక్షణ కల్పిస్తూ 'యుద్ధము' మొదలైన అనేక అవిశ్రాంత వ్యవహారములు నిర్వర్తిస్తున్నారు. వారంతా నిర్భయులై శత్రుభావరహితులై, ప్రశాంతచిత్తులై ఉంటున్నారని గ్రహించు. స్త్రీ, హాస్య, ఆహార, విహార, భోగ్య, అభోగ్యాలలో తదితర జీవులలాగానే కనబడుచున్నప్పటికీ వారు సమచిత్తులై, జ్ఞానమునుండి తొలగనివారై ఉంటున్నారు.

అట్టి ఆత్మోత్కృష్టలబ్ధులలో కొందరు ఉద్యానవనములలో విహరిస్తూ అప్సరస గీతములను వింటున్నారు. ఈ విశ్వామిత్రాది మరికొందరు సర్వజనుల క్షేమసుఖములను ఉద్దేశించి వేదనిర్దేశితమైన యజ్ఞ యాగాదులు నిర్వర్తిస్తున్నారు. ఇంకొందరు గృహస్థాశ్రమంలో ఉంటున్నారు. ఇంకా కొందరు భయంకర యుద్ధభూమిలో ఉంటున్నారు. ద్వంద్వయుద్ధంలో పాల్గొనుచున్నారు. వాళ్లు ఎక్కడున్నా ఏమి చేస్తున్నా... తమ మనస్సునందు మాత్రం ఎట్టి ఆసక్తిలేక, ఉపాధి శూన్యులై స్థిర-శాంతి-సత్వ పదమును అధిరోహించి ఉంటున్నారు. కులశైలములు సముద్రంలో మునుగు గాక! ఆ ఆత్మైక్య స్వరూపులు ఈ ప్రపంచంలో తారసపడే సంఘటనలలోనూ, సంకటములలోనూ మునుగరు. ఈ మహదైశ్వర్యములు వారిని తాకవు. నిశ్చలులై సర్వదా చిరునవ్వుతో సంచరిస్తున్నారు. రమణీయము, విలాసపూర్ణము అగు ఆత్మసామ్రాజ్యం పొందిన తరువాత ఈ జగత్తులోని ఆటుపోట్లు ఎంతటివి? వనంలో గ్రీష్మకాలమందు బంతిమొక్కలు వాడినట్లుగా వారు మానము పొందరు. మంచుచే లతలు విస్తరించినట్లు వారు విషయ భోగసమూహములను చూచి ఆనందించరు. నిందించరు.

శ్రీరాముడు : వారికి అట్టి పరమోత్కృష్టమగు అవగాహన అలవడుటకు ముఖ్యమైన కారణం ఏది?

శ్రీవసిష్ఠ మహర్షి : కర్తృత్వాభిమానం జయించి ఉండటం చేతనే వారికదంతా సాధ్యమగుచున్నది. వారు అంతా గ్రహిస్తూనే ఏదీ పొందటం లేదు. కోల్పోవటం లేదు. కార్యములు ఆచరిస్తున్నప్పుడు శత్రువులను జయిస్తున్నప్పుడు పొంగటం లేదు. శత్రువులచే ఆక్రమించబడుచున్నప్పుడు క్రుంగటం లేదు. సుఖదుఃఖములు రావచ్చుగాక! పోవచ్చు గాక! అవి వారికి హర్షకోశములు కలిగించలేక పోతున్నాయి. ఆత్మైక్యానుభూతిపరులై ఉండటం చేత ఇక్కడి విపత్తులు చూసి మోహించటం లేదు.

అవి తొలగగానే కేరింతలు కొట్టటం లేదు. చిన్నపిల్లలు గంతులేస్తుంటే ఇంటి యజమాని చిరునవ్వుతో చూస్తూ పట్టించుకోకుండా ఉండునట్లు అతడు ఈ జగద్వ్యవహారములను చూస్తున్నాడు. తమ వర్ణాశ్రమధర్మాలను ఆచరిస్తూ నిష్క్రియమగు అపరమేరువువలె ధీరత్వం వహించి ఉంటున్నాడు.

ఓ రామా! నీవు కూడా ఈ క్షణమే సర్వదోష వినాశనమగు ఆత్మైక్యదృష్టిని అవలంబించు. ఈ దృశ్యమునకు సంబంధించిన అల్పాహంభావనమును వదలిపెట్టి 'ఆత్మా-హమ్' కార భావనను పూని ఎప్పటివలె విహరించు. ఈ సర్గ పరంపరలను యథాదృష్టితో అవలోకించుచు, మేరువు వలె స్థిరత్వమును, సముద్రము వలె గాంభీర్యమును వహించి భ్రమరహితుడవై వెలయుము. అంతే గానీ, అట్టి సర్గముల వెంటబడవలసిన అవసరం నీకేమున్నది? ఈ కనబడేదంతా ప్రకాశపూర్వకమగు చైతన్యము మాత్రమే కదా! ఇక్కడ సత్యాసత్యములు అయినవి గాని, కానివిగాని, మరింకొకటేదో గాని లేవు. సంసారద్వైతభావము క్షయింపచేయి. భ్రాంతిబుద్ధిని జయించు. అనాసక్త బుద్ధిని ఆశ్రయించిన వాడవై బ్రహ్మత్వమును అవలంబించు. అంతేగాని, ఈ సంసారమును చూచి ఉద్విగ్నుడవై శోకమోహాలు పొందకు. భ్రాంతిచే లేచుచున్న 'చిత్తభ్రమలు' అనే గడ్డిపరకలచుట్టూ నీ మనస్సు ఎందుకు తిరుగాడాలి?

శ్రీరాముడు: హే భగవాన్! వసిష్ఠమహర్షీ! సూర్యకిరణస్పర్శచే వికసించే పద్మంలాగా తమ అనుగ్రహం చేత ఇప్పుడు నేను ప్రబోధితుడనైనాను. ఆహా! ఏమి ఆశ్చర్యం! మీ వాక్య ప్రభావం చేత హృదయంలో ఎక్కడో అట్టడుగున ఉన్న మోహం కూడా తొలగుతోంది. ఎండవేడికి మంచు కరుగునట్లు భ్రాంతి తన నామరూపాలతోసహా తొలగుతోంది. సందేహాలు కనపడటమే లేదు.

ఇక మీరు ఎట్లా సెలవిస్తే అట్లే చేయటానికి సిద్ధంగా ఉన్నాను.

హే సాధూ! ఇన్నాళ్లకు నా మోహ - మాత్సర్యములు తొలగి, శోకరహితుడ నయ్యాను. ఇప్పుడే ఇక్కడే ఆత్మస్వరూపుడనై వెలయుచున్నాను. 'నేను బద్ధుడను, మోక్షమును సంపాదించాలి' అను భ్రమవాక్యాలు తొలిగాయి. ఇప్పుడు ఏకాంతబుద్ధితో జ్ఞానసంపద ప్రవృద్ధం చేసుకోవటానికి, రాజ్యపాలన చేయటానికి కూడా సంసిద్ధుడనై ఉన్నాను. ఆత్మారాముడనై సర్వేసర్వత్రా ఆత్మరూపంగా ఆక్రమించి విరాజిల్లుచున్నాను.

❖❖❖

II. ప్రాణ నిరోధ యోగోపదేశము

భుశుండోపాఖ్యానం

1. యోగసాధన - జ్ఞానము

శ్రీరాముడు : హే సద్గురు బ్రహ్మన్! శ్రీవసిష్ఠ మహర్షీ! ఈ నిర్వాణ ప్రకరణ పరిచయ వాక్యాల రూపంలో మీరు చెప్పిన ప్రారంభ విశేషాలు వినిన తరువాత 'సమ్యక్‌జ్ఞానఫలమగు జీవన్ముక్తిని ఎట్లా సంపాదించవచ్చు?' అనే విషయం తెలియుచున్నది.

ఇంతవరకూ 'జ్ఞానార్జన ద్వారా ముక్తి ఎట్లా సంపాదించవచ్చు?' అన్న విషయం మీరు ప్రవచించారు. అయితే 'ప్రాణస్పందనమును నిరోధించి వాసనావిలయమును, జీవన్ముక్తిని ఎట్లా సంపాదించవచ్చు?' అనే విషయం వినాలని ఉన్నది. ప్రాణనిరోధం ఎట్లు చిత్తశాంతికి ఉపకరిస్తోందో చెప్పమని ప్రార్థన.

శ్రీవసిష్ఠ మహర్షి : 'యోగము' అనేది సంసార విముక్తికి తరుణోపాయమని మనం ప్రతిపాదించు కుంటున్నాం కదా! చిత్తమును ఉపశమింపజేయగల అట్టి యోగము రెండు విధములు–

1. ఆత్మజ్ఞాన విచారణ(జ్ఞాన యోగం), 2.ప్రాణములను నిరోధించటం (ప్రాణాయామ యోగం)

శ్రీరాముడు : మహాత్మా! ఈ రెండింటిలో ఏది సులభం? ఏది తక్కువ క్లేశంతో సుసాధ్యం? ఏది రమ్యమైనది? దేని వల్ల త్వరగా సర్వదుఃఖాలు నశిస్తాయి? 'యోగ' శబ్దానికి అసలైన అర్థమేమిటి?

శ్రీవసిష్ఠ మహర్షి : 'యోగము' అను శబ్దాన్ని జ్ఞాన సముపార్జన, ప్రాణ నిరోధం – అను రెండింటికీ శాస్త్రములు ఉపయోగిస్తున్నాయి. చిత్తముయొక్క ఆ వృత్తిని ఏ మార్గంలో నిరోధించగలిగితే అదే 'యోగం' అను శబ్దముచే ఉద్దేశించబడుతోంది. అయితే సాంఖ్యశాస్త్రానుసారం'యోగము' అను శబ్దానికి 'ప్రాణనిరోధం' అను దానికే ముఖ్యంగా ఉపయోగించబడింది. ఈ జ్ఞాన – ప్రాణనిరోధాలు రెండూ వేదజ్ఞులచే రెండు ఉపాయాలుగా ప్రతిపాదించబడుచున్నాయి. ఈ రెండూ చివరికి ఒకే అంతిమ ప్రయోజనానికి దారి తీస్తాయని సాంఖ్యశాస్త్రంతో సహా సకల శాస్త్రాలు ఒప్పుకుంటున్నాయి.

కొందరికి యోగం అసాధ్యంగానూ, కష్టతరంగానూ కన్పట్టుచున్నది. మరికొందరి అనుభవం మరొక రీతిగా ఉంటోంది. వారు జ్ఞాన విచారణ కష్టసాధ్యమని, ప్రాణ నిరోధం లేకపోతే నిశ్చలత్వం అసాధ్యమని అభిప్రాయం ప్రకటిస్తున్నారు.

శ్రీరాముడు : మహాత్మా! ఈ విషయంలో మీ అభిప్రాయమేమిటి?

శ్రీవసిష్ఠ మహర్షి : 'జ్ఞానవిచారణ' అనేది సకల జనులకూ సుసాధ్యమేనని నేను తలచుచున్నాను.

వివేకముతో కూడిన తీవ్ర విచారణచే అజ్ఞానము ఒకసారి దూరం చేయబడిందా...ఇక అది కలలో కూడా మరల కనిపించదు.

జ్ఞానము సర్వదా ఈ జీవుని యందు వెలయుచునే ఉన్నది. విచారణచే అజ్ఞానము తొలగితే చాలు... ఇక జ్ఞానం స్వయంగా ప్రకాశించగలదు. దానికొరకై ప్రాణనిరోధం, హఠయోగం వంటి ఆర్భాటాలు తప్పక ఆచరించవలసినవి కాదని నా అభిప్రాయం. 'ప్రాణనిరోధం' అను కార్యక్రమంలో ఆసనము, అనుకూలమైన ప్రదేశం, నియమ– నిబంధనములకు సంబంధించిన క్రమక్రమం ఉంటాయి కదా! జ్ఞాన విచారణ ఎక్కడైనా, ఎప్పుడైనా చేయ తగ్గది.

మరొక్క విషయం. ప్రాణ నిరోధయోగ నియతి యొక్క పరాకాష్ఠ, పరిసమాప్తి జ్ఞాన సముపార్జన తోనే సుమా! ఇంకొక్క ముఖ్యవిషయం కూడా విను. తీవ్ర సంవేదన (A Strong wish to reach the sense of self) ఉన్నవారికి 'ఏది సుసాధ్యం? ఏది కష్టతరం'... అనే ప్రశ్న ఉదయించదు. ఎందుకంటే ఈ రెండిటి మేళవింపుచే పోనుపోను కేవలానుభవము శేషించగలదని అనేకమంది సాధకుల నిత్యానుభవం.

నీకు ఇంతవరకూ అంతఃస్థమగు 'నిర్మలజ్ఞానము' యొక్క స్వరూప స్వభావాలేమిటో ఎక్కువగా చెప్తూతూవస్తున్నాను కదా! అయితే ప్రాణాపాననిరోధము జ్ఞానకాముకులకు 'ఆత్మ' సాక్షాత్కారహేతువు కాగలదు. అది ఆకాశగమనము వంటి కొన్ని భౌతికమైన విద్యలకు (అష్టసిద్ధులకు) కూడా కారణం కాగలదు. దేహాన్ని ఆశ్రయించి నిర్వర్తించబడే అట్టి ప్రాణనిరోధయోగం గురించి చెప్పుచున్నాను విను.

అభ్యాసపూర్వకమైన ప్రయత్నం చేత ప్రాణాపానాలు వశం కాగలవు. అవి నిరోధించబడుచున్న కొలదీ చిత్తంలో సమత్వానుభవం అధికమౌతూ ఉంటుంది. ప్రాణచలనం స్థిరత్వం పొందుచుండగా వాసనలు క్షయిస్తున్నాయి. చిత్తవృత్తుల ప్రకోపం సన్నగిల్లుతూ ఉంటుంది. అట్టి అభ్యాసం చేత చిత్తం కొండలా స్థిరబడుతుంది. గాలి చెట్లను కదల్చవచ్చునేమోగాని కొండను కదల్చగలదా?... అట్లాగే దృశ్యములు ఆ సాధకుని చిత్తమును చలింపజేయలేవు. ఇట్టి నిశ్చల చిత్తస్థితిలో వాక్కుకు అగోచరమైన, సర్వనిర్వచనములకూ అతీతమైన పరమానందస్థితి లభిస్తుంది. అతడు అనంతాత్మైక్య స్థితిని అధిరోహించగలడు.

చిత్తవృత్తులే జగత్తు. చిత్తవృత్తిరాహిత్యమే సర్వవేదాంత సిద్ధాంతసారం.

అట్టి ఉత్కృష్ట స్థితి జ్ఞానవిచారణ–ప్రాణనిరోధములనబడే రెండింటివలనా సాధ్యమే. స్థిర సంకల్పము నిస్సంకల్పమునకు దారి తీస్తుంది. నిస్సంకల్పం లభించిన తరువాత ఇక ఏ ప్రయత్నముల అవసరమూ ఉండదు. సర్వత్యాజ్యం వలన నిత్యము – అఖండము – అప్రమేయము అగు ఒకానొక ఉత్కృష్టానుభూతితో కూడిన అనుభవస్థితి లభించగలదు.

❖❖❖

2. వసిష్ఠ - భుశుండ సమాగమం

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రాఘవా! యోగమార్గము గురించి, తద్ద్వారా సంకల్పశమము గురించి, కాలముయొక్క అతి విచిత్రమైన 'గతి' గురించి, సృష్టిపరంపరల చమత్కారం గురించి విశదీకరించగల ఒక సంవాదమును నీకు వివరిస్తాను. ఈ సంవాదము నాకు 'భుశుండుడు' అను పేరుగల కాకి జాతివాడగు యోగితో జరిగింది. ఆ మహానుభావుని అనుభవములేమిటో చెబుతాను విను.

❖

'పరబ్రహ్మము' అనబడే మహాసాగరంలోని జలకణము వంటి ఒక అల్పవిభాగంలో ఈ జగత్తులన్నీ వెలయుచున్నాయి. ఈ సృష్టికి కారణస్వరూపుడుగా కమల సంభవుడగు బ్రహ్మదేవుడు వెలయుచున్నారు. అట్టి బ్రహ్మదేవుని యొక్క సంకల్ప మానస పుత్రుడను నేను. తపోధ్యానముల బలం చేత సప్తర్షిమండలంలో స్థానం సంపాదించాను. వైవస్వత మన్వంతరం వరకు నేను ఇట్లే ఉండబోవుచున్నాను.

అట్టి నేను ఒకానొకనాడు ఏదో సందర్భంలో స్వర్గంలోని ఇంద్రసభకు వెళ్లాను. అక్కడి సభలో ఈ నారదుడు మొదలైన మహర్షులందరూ ఉన్నారు. అప్పుడు జరిగిన ప్రసంగంలో 'చిరంజీవత్వం' గురించి సంభాషించుకోవటం జరిగింది. అప్పుడు శతతాపుడు అనే పేరుగల ముని లేచి నిల్చున్నారు. ఆయన "మాననీయుడు, ప్రమాణకుశలుడు, అవసర మాత్ర ప్రసంగి" అని ప్రసిద్ధి. సభంతా నిశ్శబ్దమైనది. శతతాపముని ప్రసంగించటం ప్రారంభించారు.

శతతాపముని : ఓ సభికులారా! మీరంతా 'చిరంజీవత్వం' గురించి అనేక విశేషాలు చెప్పుకుంటున్నారు. ఈ సందర్భంలో ప్రత్యక్షసాక్షియగు ఒక చిరంజీవుని గురించి చెబుతాను వినండి.

మేరు పర్వతం యొక్క పద్మరాగమయమైన ఒక శిఖరం ఉన్నది. ఆ శిఖరంపై కల్పతరువు ఉంది. దానిలో దక్షిణంగా ఒక ప్రాంతంలో బంగారు లతలతో నిర్మించబడిన ఒక పెద్ద పక్షులగూడు ఉన్నది. ఆ పక్షులగూడులో 'భుశుండుడు' అనే ఒక కాకి ఉన్నది. ఆ కాకి తన హృదయంలో ఎట్టి రాగం లేనిదై ఉన్నది. ఆ వాయసమును పోలిన చిరంజీవులు భూమి మీదగాని, తదితర లోకాలలోగాని మరొకరు ఉండరు... ఉండబోరు. అతడు మహామతి, ఆసక్తిరహితుడు, శ్రీమంతుడూ కూడా! అతడు శాంతుడై, మనస్సును జయించిన వాడై, త్రికాలవేత్త అయి పరమ విశ్రాంతి అనుభవిస్తూ దీర్ఘకాలం గడుపుతున్నాడు. అట్టి వికల్పరహితమగు జీవనము పొందటమే ధన్యం. అతని వంటి పరమ పురుషార్థమగు యోగజీవనము అత్యంత దుర్లభమని నా అభిప్రాయం.

❖

ఆ శతతాపముని భుశుండిని దృష్టాంతంగా తీసుకుని చిరంజీవత్వమునకు సంబంధించిన అనేక విశేషాలు ముచ్చటించారు. అప్పుడు సభ్యులడిగిన అనేక ప్రశ్నలకు వివరణ కూడా ఇచ్చారు.

సభ ముగిసింది. సభలోని వారంతా తమతమ నివాస స్థానములకు జేరుటకు బయలుదేరారు. నాకు మాత్రం శతతాపముని చెప్పిన భుశుండుని దగ్గిరకు స్వయంగా వెళ్లి సంభాషించాలని,

'యోగము' గురించి వివరణాత్మకంగా ఆయన చెప్పే విశేషాలు తెలుసుకోవాలని బుద్ధి పుట్టింది. తిన్నగా మేరు పర్వత శిఖరాగ్రం వైపుగా బయలుదేరాను.

❖

బ్రహ్మ – విష్ణులోకములకు ఆలవాలమైన ఆ మేరుశిఖరం యొక్క అగ్రభాగంలో గల ఒక ప్రదేశంలో కొన్ని కాకులు సభదీర్చి ఉన్నాయి. భుశుండ వాయసము సభా మధ్యంలో ఉంది. వారు తాత్త్విక విషయములు సంభాషించుకుంటున్నారు. నన్ను చూడగానే మహామహుడగు ఆ భుశుండ వాయసము దిగ్గున లేచి నన్ను సమీపించి, తన సంకల్ప జనిత హస్తములతో నాకు పుష్పాంజలి సమర్పించారు. ఆసనం అధిరోహింపజేసి అర్ఘ్యపాద్యములు సమర్పించి కుశల ప్రశ్నల తరువాత మధురాక్షరములతో స్నేహపూర్వకంగా ఇట్లు పలుక ప్రారంభించారు.

భుశుండుడు : హే భగవాన్! వసిష్ఠమహర్షీ! మీకు సుస్వాగతం. నా అనేక జన్మజన్మార్జిత పుణ్యఫలంగా ఈ రోజు మహామహిమాన్వితమగు మీ దర్శనం లభించింది. ధన్యుడనైనాను. మీ పవిత్ర హృదయంలో సర్వదా సర్వసమత్వ అఖండభావన వెలయుచూ, మీ పెదవులు ఎల్లప్పుడూ లోకకళ్యాణమునకు కారణమౌతూ ఉంటాయి. ఈ మాయామయజగత్తులో సంచరించే మావంటి అల్పజ్ఞాన జీవులకు మీ దర్శనం అమృతతుల్యం వంటిది. మీ చరణ దర్శనము చేతనే మీ శుభాగమనమునకు కారణ మేమిటో నాకు తెలియవచ్చింది. మీ పవిత్ర పాదస్పర్శ వలన నేను, ఇక్కడి తదితర వాయసములు గొప్ప పుణ్యం సంపాదించుకున్న వారమైనాము. దేవలోకము నందు ఇంద్రసభలో 'చిరంజీవి' ఐన మా ప్రసంగంరాగా... అది మా పట్ల మీ దర్శనభాగ్యంగా పూలజల్లు కురిసింది.

శ్రీవసిష్ఠ మహర్షి : హే ఉత్తమ విజ్ఞాన సమన్వితుడా! మిత్రమా! భుశుండా! మీ మధురమైన పలుకులు వింటుంటే నాకు ఎంతో సంతోషం కలుగుతోంది. మీరు తత్త్వము ఎరిగినవారు. ఆత్మ దర్శనముచే పునీతులు. భయంకరములగు భవసర్పములు మిమ్ము ఏమాత్రం సమీపించలేక పోతున్నాయి. మీ చిరంజీవత్వం గురించి శతతాపముని దేవసభలో ఎంతో ప్రశంసించి పరోక్షంగా మీ దర్శనం చేసుకోవటానికి అవకాశం కల్పించారు.

ఓ మహానుభావా! మీ చరిత్ర ఏమిటి? ఎచ్చట జన్మించారు? మీ ఆయువు ఎంత? ఎవరిచే నిర్దేశింపబడి ఇక్కడ నివసిస్తున్నారు? ఇంతటి ఆత్మైక్యజ్ఞానం, ప్రశాంత మనఃస్థితి ఎట్లా పొందగలిగారు? ఈ విషయములను నాకు వివరించి చెప్పవలసినదిగా మిమ్ము అర్థిస్తున్నాను. మహాత్ముల చరిత్రలు వినటం మహదానందకరమగు విషయం కదా!

భుశుండుడు : త్రిలోక పూజ్యులు, సప్తర్షులలో అగ్రగణ్యులు అగు మీరు వినగోరినది తప్పక చెప్ప వలసిందే! మీ వంటి మహనీయులతో సంభాషిస్తేచాలు... మేఘములు వేంచేయగానే సూర్యతాపం తొలగునట్లు మా వంటివారి పట్ల అశుభాలన్నీ వినష్టమైపోతాయి. సావధానులై, ఉద్వేగరహితులై వినండి.

❖

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఆ తరువాత వర్షమేఘశ్యాముడు, సర్వాంగసుందరుడు, సరళ బుద్ధి సమన్వితుడు, హర్ష-మాత్స ర్యరహితుడు, ఈ జగత్తులన్నిటినీ తన చేతిలోని ఫలం వలె చూడ గలుగువాడు, భోగములన్నీ గడ్డిపరకలలాగా పరిత్యజించినవాడు, పుట్టుక, దృశ్యముల రహస్యం ఎరిగిన వాడు, పరాపరదర్శి, ధీరుడు, స్థిరుడు, జ్ఞాన సముద్రంలో విశ్రమించినవాడు, పరిపూర్ణ మనస్కుడు, శుద్ధుడు, విశ్రాంతి పొందిన బుద్ధి కలవాడు, వేదోపనిషత్ పాఠముల అంతర్లీనగాన మేమిటో ఎరిగినవాడు, ఆత్మజ్ఞానం అవధరించినవాడు, ఎల్లప్పుడూ నవశరీరధారి అగు ఆ భుశుండుడు చిరునవ్వుతో గంభీరములు, శుద్ధములు, అమృతసమానములు అగు మాటలతో యోగ సాధనా విశేషం గురించి చెప్పసాగారు. భ్రమరమునకు తేనె ప్రసాదించే పుష్పంలాగా నాకు తన కథను ఇట్లా వినిపించసాగారు.

❖❖❖

3. భుశుండుని జన్మవృత్తాంతం

భుశుండుడు : హే వసిష్ఠ మహర్షీ! మొట్టమొదట నా జన్మవృత్తాంతం చెబుతాను వినండి. దేవదేవుడైన ఆ హరుడు కైలాసంలో దేవాభివందితుడై వెలయుచున్నారు కదా! ఒక లత వృక్షమును ఆశ్రయించి ఉండునట్లు జగదంబ, పార్వతీదేవి ఆయన అర్ధ శరీరమును ఆక్రమించుకొని ఉన్నది. ఆ సాంబశివుని జటాజూటంలో, గంగామాత అలంకారమై ప్రకాశిస్తూ ఉంటుంది. క్షీరసాగర మథనమున ఉద్భవించిన వాడు. అమృతమును ప్రవహింపజేయువాడు, దర్పణభూతుడు అగు చంద్రుడు ఆ సాంబశివునికి చూడామణిగా అలరారుచున్నాడు. కాలకూటవిషం ఆయన కంఠాన్ని అలంకరించియున్నది. ఆయన ప్రళయకాల సమయములో తన మూడవకంటి చూపుచే లేవదీయబడిన పరమాణుధూళి నుండి 'మాయ' అనే వీబూదిని నిర్మించి 'జ్ఞానము' అనే జలముతో తడిపి తన నుదుటన అలంకరించి ఉంటాడు. సర్వ శరీరములలోని అస్థులే ఆయన రత్నహారం. ఆకాశమే ఆయన వస్త్రం. సర్వజీవుల భౌతికదేహములు చేరవలసిన శ్మశానమే ఆయన నివాసం. ఎట్టిటి వస్త్రం కపాలమాల ధరించి ఆయన సంచరిస్తూ ఉంటారు. జీవుల భుజములే ఆయన భుజకీర్తులు. దిక్పాలకులంతటి వారిని దహించుట, ఈ జగత్తునంతటినీ ఆహారపు ముద్దగా చేయుట, అసురులకు భయమును గొలుపు భీషణ నృత్యములు చేయుట మొదలైనవన్నీ ఆయన లీలలు. ఆ పరమేశ్వరుడు సత్య సంకల్పుడు కదా! తన కించిత్ యోచనచే ఈ జగత్తులన్నిటినీ శుభప్రదం చేస్తూ ఉంటాడు. ఆయన విలాసంగా చెయ్యి ఊపినంత మాత్రం చేత త్రిపురములను భస్మం చేయగలిగిన వాడు. ఆయన యొక్క ధ్యాన నిష్ఠ స్నేహ-రాగవర్జితమై, సర్వ భావములకు అతీతమై కొండవలె నిశ్చలంగా ఉంటుంది. ఆ శివుని నివాసంలోనే జయ, విజయ, జయంతి, అపరాజిత, సిద్ధ, రక్త, అంబుస, ఉత్పల – అను అష్టమాతృకలు వసిస్తూ ఉంటారు.

ఆ అష్ట మాతృకలలో ఒకరగు అంబుసకు 'చండుడు' అను కాకి వాహనంగా ఉన్నది.

❖

ఒకసారి ఆ అష్టమాతృదేవతలు ఏదో కారణంచేత ఆకాశంలో సమావేశమైనారు. అప్పుడొక గొప్ప ఉత్సవం కల్పించబడింది. ఆ ఉత్సవంలో వారు తుంబుర-భైరవులను పూజించారు. తరువాత మధురపానమత్తులై తమలో తాము ఇట్లు సంభాషించుకున్నారు.

“మన అష్టమాతృ దేవతలను ఆ ఉమాపతి కొంత చులకన చేసి చూస్తున్నట్లు మాకు అనిపిస్తోంది. కనుక మనం మన శక్తులేమిటో పరాక్రమములేమిటో చూపించాలి. వారిని వినోదింపజేయాలి. అప్పుడిక ఆయన మనలను చులకన చేయరు. మన పట్ల ప్రేమాస్పదులౌతారు.”

ఇట్లా నిశ్చయించుకున్నారు. ఆలోచన వచ్చిందే తడవుగా వారు రుద్రశక్తియగు ఉమ యొక్క వదనమును ఇతర అంగములను తమ మంత్ర బలంతో వివర్ణం చేసివేశారు. ఆ తరువాత వారు శివుని అర్ధాంగమగు ఉమను అపహరించి తమ మండలానికి తీసుకుని వచ్చారు. వారు ఆమెను అవహేళనం చేయలేదు. ఆమెను తమ మంత్రశక్తిచే బలికి తేబడిన జీవిగా సంకల్పించారు. ఆమె ఒక్కొక్క అవయవమును చేబూని నృత్యగీతికలతో ఆనందధ్వనులు చేస్తూ, అరచుచూ ఉత్సవం చేసుకున్నారు. వారి చప్పట్ల-సింహగర్జనల శబ్దములు ఆకాశమును నింపివేశాయి. కొండగుహలు ప్రతిధ్వనించాయి. వాళ్లు సురాపానం గుటకలు వేస్తూ, హాస్యనృత్య పానములు చేయుచూ ఉన్మత్తవృత్తులై ఉత్సవం చేసుకోసాగారు. ఒకరి నోట్లో ఒకరు ఉపాహారాలు అందించుకుంటూ ఒకరినొకరు త్రోసుకుంటూ, పట్టుకొనుచూ విచ్చలవిడిగా సంచరిస్తూ శిష్టాచారములను తారుమారు చేయసాగారు.

ఇక వారివారి వాహనాలు కూడా రక్తపానం చేసి నృత్యం చేయసాగాయి. బ్రహ్మవాహనమగు హంస, అలంబుని వాహనమగు చండుడు కూడా ఆ వాహనముల సమూహంతో కలిశారు. వారు కూడా పానోన్మత్తులై నృత్యం చేస్తూ సురతేచ్ఛపొందారు. ఆ హంసలు అంబుస యొక్క వాహనమగు కాకితో అన్యయోని సంభోగం పొందాయి. ఆ చండుడు అను కాకి ఏడు హంసలకు భర్త అయి వారి ఇచ్ఛానుసారం క్రీడించగా ఆ హంసలు గర్భమును దాల్చాయి.

❖

ఆ తరువాత నృత్యోత్సవం ముగిసింది. మాయారూపిణులగు ఆ అష్టమాతృకలు యజ్ఞ భోక్తములను శూలి(శివుడు)కి ఆహారంగా సమర్పించారు. అప్పుడు ఆ చంద్రశేఖరుడు తనకు తన ప్రియపత్నినే బలిగా ఇవ్వటం గమనించి కోపగించాడు. అప్పుడా మాతృగణములు తమ అంగముల నుండి తిరిగి ఉమను సృష్టించి ఆ శివునికి ఇచ్చి అదే ఉత్సవంలో శివకళ్యాణం చేశారు. అప్పుడది చూసి శివపార్వతులు సంతోషించారు. ఉత్సవం ముగిసింది. అందరూ తమ తమ నెలవులకు వెళ్లిపోయారు.

గర్భవతులైన హంసలు తమ యజమానియగు బ్రహ్మణిని (సరస్వతీ దేవిని) సమీపించి జరిగినదంతా వివరించి క్షమాభిక్ష వేడుకున్నారు. అప్పుడు హంసవాహినియగు సరస్వతీదేవి ఆ హంసలకు విశ్రాంతి ప్రసాదించి తాను నిర్వికల్ప సమాధినిష్ఠురాలైనది.

ఆ హంసలు ఆ తరువాత విష్ణుభగవానుని నాభి ప్రదేశంలో ఉండే కమలంలో ప్రవేశించి అక్కడ విహరించసాగాయి. అవి కాలక్రమేణా 21 అండములను ప్రసవించాయి. ఆ అండములలోంచి

21 కాకులం ఉద్భవించాం. అట్లు ఉద్భవించినట్టి నేను, నా సహోదరులగు 20 కాకులు సరస్వతీ దేవిని సమీపించాం. మా స్తోత్ర పాఠములచే ఆ మాతను నిర్వికల్ప సమాధి నుండి విరమింపజేశాం. ఆ తల్లి మాకు తత్త్వమును బోధించినది. ఆమె దయ వలన పవిత్రమగు ముక్తిని దర్శించాం.

ఆ తరువాత మేము 21 మందిమి పితృదేవులగు చండుని సమీపించి భక్తి ప్రపత్తులతో సాష్టాంగదండ ప్రణామం చేశాం. వారి పాదపద్మములను భక్తిప్రపత్తులతో పూజించాం అప్పుడాయన మాతో ఇట్లా సంభాషించారు.

పితృదేవులగు చండుడు : పుత్రులారా! పుత్రవాత్సల్య యగు ఆ సరస్వతీదేవి దయవలన కల్పిత తంతువులచే నిర్మించబడిన సంసారము నుండి బయటకు వెలువడితిరి కదా?

మేము : అవును తండ్రీ! జగజ్జననియగు బ్రాహ్మీమాత దయ వలన మేము తెలుసుకొనవలసినదంతా తెలుసుకున్నాం. ఇక మేము ఏకాంతంగా ఉండవలసిన స్థానమేదో సెలవివ్వలసినదిగా మిమ్ములను ప్రార్థిస్తున్నాం.

చండుడు : కుమారులారా! నేను ఇతఃపూర్వం మేరు పర్వతములోని ఒక శిఖరం సమీపంలో ఒక గొప్ప గూడు నిర్మించి ఉన్నాను. మీరు అక్కడ నిశ్చింతగా నివసించండి. అక్కడ సద్విచారణసమన్వితులైన అనేక వాయసములు (కాకులు) నివసిస్తున్నారు. మీరు కూడా అక్కడే నివసిస్తూ భోగమోక్షములు రెండు పొందండి.

❖

ఇట్లు పలికి ఆయన మమ్ములను ఆశీర్వదించి ఆహార పానీయములతో ముద్దు చేసి పంపారు. మేము అక్కడి నుండి బయలుదేరాం. సూర్యమండలమును, స్వర్గలోకమును దాటి బ్రహ్మలోకమునకు వచ్చాం. లోకమాతాపితరులగు సరస్వతీ-బ్రహ్మదేవులకు కొంతకాలం శుశ్రూష చేసి వారి నుండి బ్రహ్మతత్త్వం విన్నాం. వారి బోధలను, ఆశీర్వచనములను పొంది మరల అక్కడి నుండి బయలుదేరాం. లోకపాలకుల పురములను దాటి ఇక్కడికి వచ్చాం. ఇక్కడ మౌనం అభ్యసిస్తూ అనేక సంవత్సరాలు గడిపాం.

హే మహానుభావా! వసిష్ఠా! మేమెట్లా పుట్టామో, పెరిగామో, ఎట్లా జ్ఞానం పొందామో, ఎట్లా ఉపశాంతి మనస్కులమైనామో.... మీకంతా వివరించి ఉన్నది ఉన్నట్లుగా చెప్పాను. ఇక మిగిలినది చెప్పటానికి ఆజ్ఞాపించ ప్రార్థన...

❖❖❖

4. నిర్లిప్తుడను - అప్రమేయుడను

శ్రీవసిష్ఠ మహర్షి : మిత్రమా! భుశుండా! మీ నిరహంకారత్వమును, వినమ్రతను చూచి నేను ఎంతో సంతోషిస్తున్నానయ్యా! ఏదీ! తరువాత విశేషాలు చెప్పండి. వందల-వేల-లక్షల సంవత్సరాల పూర్వం మీరు చూచిన జగత్తు ఎట్లా ఉన్నది? ఇప్పటి ఈ జగత్తు ఎట్లా ఉన్నది?

భుశుండుడు : మునీంద్రా! ఈ జగత్తు పూర్వ తత్పూర్వకల్పములలో ఎట్లా ఉన్నదో, ఇప్పుడు కూడా అట్లే వెలయుచున్నది. నేను అనేక కల్పవృక్షముల మీద వ్రాలి ఉన్నాను. ఈ వర్తమానకల్పమును కూడా పూర్వ తత్పూర్వ కల్పములను చూచినట్లే దర్శిస్తున్నాను.

మిమ్ములను ఇప్పుడు నిర్విఘ్నంగా చూడగలగటం కూడా నా జన్మజన్మల పుణ్యఫలం అయి ఉన్నది. మరల మరల నాచే, నాతోటి కాకులచే అర్ఘ్యపాద్యములను, ఫలహారములను, చందన తాంబూలాదులను స్వీకరించండి... ఇప్పుడు నా నుండి ఇంకా ఏమి తెలుసుకోవాలనుకుంటున్నారో ఆజ్ఞాపించండి.

శ్రీవసిష్ఠ మహర్షి : పక్షిరాజా! ఇప్పుడు నాదొక చిన్నసందేహం. మిమ్ము పోలిన శక్తిశాలురు, బుద్ధిమంతులు అగు మీ మిగతా 20 మంది సోదరులు ఏరి? వారు కనబడరేం? మీరొక్కరే కనిపిస్తున్నారేమిటి? వారందరూ ఏమైనారు?

భుశుండుడు : మహర్షీ! చెపుతాను, వినండి. మేము ఇక్కడికి వచ్చి చేరిన తరువాత ఒకదాని వెనుక మరొకటిగా అనేక రోజుల సమూహములు గడచిపోయాయి. అనేక యుగములు గతించాయి. ఒకప్పుడు మేం 21 మందిమీ కలిసియే ఉన్నాం. కొంతకాలం తరువాత అనుంగు సోదరులందరూ తమ భౌతిక దేహములను తృణప్రాయంగా త్యజించి శివసాన్నిధ్యం పొందారు.

దీర్ఘాయుషో మహాన్తోఽపి సన్తోఽపి బలినోఽపి చ ।
సర్వ ఏవ నిగీర్యన్తే కాలేనాకలితాత్మనా ॥ (శ్లో॥ 10, సర్గ 20)

అలక్షితస్వరూపమగు కాలము మహాబలవంతులనూ, దీర్ఘాయుష్కులనూ, మహాత్ములను కూడా మ్రింగివేస్తుంది కదా!

శ్రీవసిష్ఠ మహర్షి : భుశుండా! మరి మీ విషయమేమిటి? ద్వాదశాదిత్యులను కూడా తన కంఠమున అలంకరించుకొని చెలరేగు మహాప్రళయ వాయువులు మిమ్మేమీ చేయలేదా? అవి స్పృశించకుండా మీరెట్లా దేహసమేతులై ఏర్పడి ఉన్నారు? ఉదయాస్తమయములను కలుగజేసే కాలము భూమిపై గల అన్ని వస్తువులనూ దహిస్తుంది కదా! మిమ్ములను సమీపించనే లేదా? తీవ్ర శీతోష్ణములను ఎట్లా సహించి ఉన్నారు? ప్రళయకాలమేఘములు మిమ్ము కష్టపెట్టనేలేదా? జగత్తంతా విషమయమగు క్షోభతో దద్దరిల్లుచుండగా నిత్యయౌవనులై మీరీ గూటిలో ఎట్లా మనగలిగారు?

భుశుండుడు : బ్రహ్మజ్ఞా! నా ఈ పక్షిజన్మ గురించి మీకు తెలియనిదేమున్నది? ఆకాశంలో సంచరిస్తూ సర్వజనులచే దూషించబడే ఈ పక్షిదేహం అన్ని ఉపాధులలోకి తుచ్ఛమైనది. ఇట్టి తుచ్ఛజీవముల కొరకే ఆ విధాత నిర్జనములైన వనములూ, శూన్యమయమగు ఆకాశమును నిర్మించారు. ఇట్టి పక్షి జాతి యందు ఆశాపాశములచే బద్ధుడైన జీవునికి కలుగు దుఃఖపరంపరలు వర్ణించసాధ్యమా?

అయితే... మేము నిత్యమూ ఆత్మతృప్తిని పొంది ఉన్నాం. స్వాభావికమగు స్వస్వరూపముచే సంతుష్టులమై ఉన్నాము. అనగా "మాస్వస్వరూపము సర్వదా యథాతథం కదా!" అను ఆత్మోపాసనచే సంతృప్తులమై కాలమునకు కేవల సాక్షిత్వం వహించి ఉంటున్నాం.

నిర్విషయ, నిర్విశేష వస్తువునందు కలుగుచున్న ఈ 'జన్మలు పొందుట' అను భ్రమలకు లోను కాకుండా నిజగృహంలో కాలం వెళ్లబుచ్చుచున్నాం. ఏదీ కోరుకోవటం లేదు. ఏదీ త్యజించటం లేదు. అనగా మేము జీవించి ఐహిక, ఆ ముష్మికములను కోరం. మరణించి ఈ దేహమును త్యజించకోరం. నిత్యశుద్ధనిరతిశయానంద స్వరూపులమై ఇప్పుడు ఇక్కడ ఎట్లున్నామో అట్లే స్వస్వరూపమున నివసించుచూ కాలము యొక్క గమనమునకు కూడా కేవల సాక్షీభూతులమై ఉంటున్నాం.

అందుచేతనే మేము కాలమునకు బద్ధులవటం లేదు. మేము లోకము యొక్క జనన మరణములు అనేకం చూచాం. కానీ 'ఈ జగత్తు మిథ్యయే!' అనే నిర్ణయం కలిగి ఉన్నాం. వేద వాక్యములు, గురువాక్యములు మా హృదయంలో ప్రవేశించి సుదృఢత్వం పొందాయి. మనస్సు తన చంచలత్వం వీడి సౌమ్యత్వం పొందింది. ఆత్మసింహాసనం అధిరోహించి, సూక్ష్మమగు కాలగతిని చిరునవ్వుతో చూస్తున్నాం. వాస్తవానికి మా పితృదేవులు చందునిచే నిర్మించబడిన అతిపొడవైన, బంగారు లతానిర్మితమైన ఈ పక్షులగూటిలో దివారాత్రములు తెలియవు. అయినా కూడా స్వబుద్ధితో కాలముయొక్క గతిని, త్రికాలములను గ్రహించగలుగుచున్నాం.

హే మహానుభావా! మా మనస్సు తత్త్వజ్ఞానబలం చేత సారాసారవిభేదమంతా వీడినదై అవాఙ్మానస గోచరమైన స్థానంలో పరమవిశ్రాంతి పొందుతోంది. సుస్థిరతను శాంతిని సర్వదా అనుభవిస్తోంది. సంసారవ్యవహారములచే పుట్టుచూ తుచ్ఛమైన అనేక ఆశాపాశములచే బంధింపబడి అటూ ఇటూ ఎగురుతూ గంతులేసే తదితర భూకాకముల వలె మేము దేనికీ భయమును గాని, ఉద్వేగాన్ని గాని, ఆశగాని, ఇష్టాద్వేషాలుగాని పొందటం లేదు. అందుచేత ఇక్కడ ఎట్టి దుఃఖాలూ పొందటానికి మాపట్ల కారణమేలేదు. అనిష్ట-వినష్టములకు ఏమాత్రం ధైర్యం కోల్పోవక పరమ శాంతితో కూడిన దృక్కులతో అప్రమేయత్వం వహించి ఉన్నాం. భయంకరమైన ఆపదలు ఒనగూడి నప్పుడు కూడా మేము పాషాణమువలె స్థిరత్వం వహించి ఉన్నాం. స్ఫటికమువలె కేవలం సాక్షీ భూతంగా వెలయుచున్నాం. ఆరంభంలో సుఖకరంగాను, క్రమంగా పేలవంగానూ ఉండే ఈ జగత్తు నందలి అనేక పదార్థ సమూహములు వస్తున్నాయి. పోతున్నాయి. అయితే వాటి రాక పోకలు మమ్ము ఏమాత్రమూ బాధించటం లేదు. అవి ఎటునుండి వస్తున్నాయో, ఏమి కానున్నాయో మేము మా వివేకబలం చేత మున్ముందుగానే ఎరిగి ఉంటున్నాం. హే భగవాన్! వసిష్ఠ మహర్షీ! ఈ భూతజాలములు, వాటి సమ్మేళనములు జనించినను, మరణించినను మరణించకున్ననూ మాకు ఏం సంబంధం? 'భూతములు' అనే నదీ ప్రవాహములు మరల మరల ఎటునుండో వచ్చి, కాలం అనే మహాసముద్రంలో ప్రవేశిస్తున్నాయి. ఇక మేమో, ఒడ్డున ఉండే కొండలాగా ఇక్కడ తటస్థంగా ఉన్నాం. వాటివేటినీ లెక్కగొనుచున్నవారము కానేకాము.

మేము ఇక్కడేదీ గ్రహించటం లేదు. త్యజించటం లేదు. మా పాదములు సంసారము నందు జాగ్రత్తగా మసలుచుండటం చేత మృదువుగా ఉన్నాయి. ఈ సంసారము వలన జనించే అజ్ఞాన పరంపరల పట్ల నిర్మోహమాటముతో కూడిన అనాసక్తి కలిగి ఉండటంచేత జడమాత్రంగా,

అర్థరహితంగా ఉన్నాయని కూడా చెప్పవచ్చు. ఈ తీరుగా ఈ కల్పవృక్షముపై గల ఈ గూటిలో ఎట్టి చింతలూ లేకుండా చిరంజీవులమై ఉన్నాము. శోకభయరహితులగు మీ వంటి పుణ్యపురుషుల బోధలచే అనుగ్రహింపబడినవారమై తత్ఫలితంగా మాయారహితులమై ప్రకాశిస్తున్నాం.

ఎప్పుడైనా అనుకోకుండా ఈ మా మనస్సు ఏమైనా సంసార వ్యవహారములను సరిచూడటానికి కాస్త ఇటూ అటూ వెళ్లిందనుకోండి.... వెంటనే తత్త్వమును నెమరువేయుటచే వాటి రాగద్వేషాది లంపటం (బురద)లో మేం వశీభూతులం కావటంలేదు. మొట్టమొదలే మా మనస్సు నిర్వికారము, క్లేశరహితము అగు ఆత్మయందు ఉపశమించి ఉంటోంది. మా చిత్‌తరంగములు సర్వదా సర్వత్రా బ్రహ్మాకారమును పొంది ఉన్నాయి. పున్నమినాటి చంద్రుని చూచిన సముద్ర తరంగముల వలె ఎప్పుడైనా భావతరంగములు లేచుచున్నప్పటికీ మేము సముద్ర స్వరూపులమై ఈ సముద్రతరంగముల వంటి భావములను వీక్షిస్తున్నామేగాని, భావముగా దిగజారటంలేదు. సర్వ భావముల కంటే కూడా ప్రత్యేకమైయున్న మా స్వరూపమును ఆస్వాదించుటే మా యొక్క యోగసాధనం.

హే మహాత్మా! పాల సముద్రం మథించగా అమృతం పుట్టగానే ఎంతటి ఆనందమునకు కారణమైనదో... మీ ఈ రాకచే మేము అంతటి ఆనందం పొందుతున్నాం. ఈషణాత్యాగులగు మీ వంటి మహాత్ముల దర్శనముతో సమానమై ఆత్మ కళ్యాణ విషయం ఇంకేమున్నది? మా భావాతీత యోగసాధనం మరింతగా ఇనుమడిస్తోంది.

ఆపాతమాత్రరమ్యేభ్యో భోగేభ్యః కిమవాప్యతే ।
సత్సఙ్గచిన్తామణితః సర్వసారమవాప్యతే ॥ (శ్లో 39, సర్గ 20.)

ఆపాతరమణీయములగు ఈ ప్రాపంచిక భోగముల వలన ఏం లాభం? తమరి 'దర్శనము' అనబడు 'సత్సంగచింతామణి' నుండి సర్వసారమగు జ్ఞానమే లభిస్తుంది.

హేమహర్షీ! మీ వాక్యములు ధీరగంభీరములు, స్నిగ్ధకోమలములు. సరళమాధుర్యములు అయి ఉన్నాయని అనేకమంది శ్రోతల అభిప్రాయం. మీరు త్రైలోక్యతత్త్వ సారమును ఎరిగినవారు. హే సాధూ! సాధుసంగమం సకలభయములనూ తొలగిస్తుంది. మేము ఆత్మతత్త్వమును గ్రహించి ఉన్నప్పటికీ మీతోటి ఈ సంభాషణచే మరింత పవిత్రులం అయ్యాం. మా దుష్కృతములన్నీ నశించినట్లే. మా జన్మ సార్థకమైనదని తలచుచున్నాం.

❖❖❖

5. ధారణచే మహాప్రళయసాక్షిత్వం

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ భుశుండ మహాశయా! కాలవాయువీచికలు ఈ స్థానమును స్పృశించవే లేదా? అయితే మీరు కాలముయొక్క అనేక చమత్కృతులు గాంచి ఉంటారే!

భుశుండుడు : ఘోరములగు కల్పాంతవిక్షోభములు అరుదెంచిననూ, విషమగాలులు వీచిననూ పితృ సంకల్ప నిర్మితమైన ఈ గూడు ఉన్నట్టి కల్పవృక్షం మాత్రం కంపించక స్థిరంగానే ఉన్నది.

లోకాంతరములు విహరించే వారికి కూడా ఈ స్థానం అగమ్యమై ఉండటం వలన నేను నిశ్చింతగా ఎట్టి బాధలు లేకుండా ఇక్కడే ఉన్నాను. సప్తద్వీప సమన్వితమైన ధరావలయమును చాపచుట్టినట్టు చుట్టి హిరణ్యాక్షుడు అపహరిస్తూ ఉంటే శ్వేతవరాహమూర్తి ఆకాశం నుండి ఉద్భవించి ఆ హిరణ్యాక్షుని సంహరించి భూమిని యథాస్థానంలో ఉంచినప్పుడు గానీ... దేవరాక్షస గణం క్షీరసముద్రమును మథిస్తుండగా కూర్మమూర్తి మందర పర్వతమును తన భుజములపై ధరించినప్పుడు గానీ... దేవ రాక్షసుల మధ్య భయంకరమగు సంగ్రామం జరుగుచున్నప్పుడు గానీ... సూర్య – చంద్రమండలములు పడిపోగా ఈ జగత్తులు అత్యంత క్షోభ చెందినప్పుడు గానీ... కాలనేమి భుజస్కంధముల మధ్య చిక్కిన మేరు పర్వతం కొంచెం చలించినప్పుడు గాని... అమృతకలశమును గొనివచ్చుచున్న గరుడుని రెక్కలహోరుకు సిద్ధులు పడిపోవుచున్నప్పుడుగాని... గరుడుడు జన్మించి భూమండలమును జలమయం చేస్తున్న వేళ సంకర్షణ రుద్రుడు సహస్రశీర్షములతో భూమిని దాల్చినపుడు గాని... ఆదిశేషుడు తన వేయి తలలనుండి కల్పాగ్ని జ్వాలలను విరజిమ్ముచున్నప్పుడు గాని... ...ఈ కల్పవృక్షం చలించలేదు. మా స్వస్థానంలో యథాతథంగానే ఉన్నాము.

ఓ ఋషిసత్తమా! చెడుచోట్ల ఉండే వారికే ఆపదలు వస్తాయి గాని, అచల స్థానమున ఉండే మాకు ఆపదలెందుకు కలుగుతాయి?

శ్రీవసిష్ఠమహర్షి : ఓ మహాబుద్ధీ! కల్పాంతవాయువులు వీచి, ఆ ప్రభావంచే సూర్యచంద్రులే గతితప్పుచుండగా....మీరు ఎట్లు చలించకుండా విజ్వరులై ఉన్నారు?

భుశుండుడు : మహర్షీ! ఒక కృతఘ్నుడు కష్టకాలం వచ్చిపడినప్పుడు మిత్రుని త్యజించి ఎచటకో వెళుచున్నాడు చూచారా! ఆ తీరుగా కల్పాంతమున వ్యవహారజగత్తు అదృశ్యమగుచున్నప్పుడు నేను ఈ నీడను త్యజించుచున్నాను. ఆ సమయంలో నేను సర్వకల్పనలూ వీడి, క్రియారహితుడనై ఆకాశంలో ప్రవేశిస్తాను. ద్వాదశాదిత్యులు తమ తాపవేగముచే భూమి యొక్క ఉదరమును ఖండ ఖండితంగా చేస్తున్నప్పుడు 'నేను వరుణడను' అను ధారణ చేసి ధీరుడనై, చలించకుండా ఉంటాను. కొండలను పిండి చేస్తూ ప్రళయవాయువులు వీస్తున్నప్పుడు 'నేను పార్వతీదేవిని' అను ధారణ చేత ఆకాశంలో చంచలరహితుడనై స్థిరత్వం వహించి ఉంటాను. మేరువు మొదలైన పర్వతములు కరిగి పోవుచూ సర్వ జగత్‌పదార్థములూ ఏకద్రవంగా మారిపోవుచుండగా నేను వాయువువలె ప్రవహిస్తూ ఉంటాను. స్థూల – సూక్ష్మాది తత్త్వములతో కూడిన బ్రహ్మాండమంతా విలీనమై పోవుచుండగా నేను 'పరమపదము'న అచలుడనై సుషుప్తునివలె ధారణ అవలంబించి ఉంటున్నాను.

మరల బ్రహ్మదేవుడు సృష్టి ప్రారంభించేవరకూ అట్లాగే పరమపదమున ధారణను కొనసాగిస్తు న్నాను. తదనంతర సృష్టి ప్రారంభం కాగానే ఈ బ్రహ్మాండమున ఈ కల్పవృక్షంపై గూటిలో ప్రవేశిస్తున్నాను. ఈ విధంగా అనేక కల్పాంతములకు సాక్షినై ఉన్నాను.

శ్రీవసిష్ఠ మహర్షి : అంటే.....మీ స్వకీయమైన ధారణశక్తి చేతనే కల్పాంతములకు కూడా పట్టుబడక, కల్పాంతములందు అఖండితంగా ఉన్నారన్న మాట! అత్యంతాశ్చర్యం!

నాదొక చిన్న ప్రశ్న. మీ వంటి ఇతర యోగులు మీ వలెనే ధారణ చేయక, వారు వేరు వేరు అధికార శరీరములను పొందటమో, లేక ముక్తిని ప్రాప్తింపజేసుకోవటమో చేస్తున్నారేమిటి?

భుశుండుడు : మీ ఈ ప్రశ్నకు నాకు తెలిసిన సమాధాన మొక్కటే – పరమేశ్వరుని నియతి అట్టిది! అది అనుల్లంఘనీయం. నేను ఈ తీరుగానూ, నావంటి ధారణసమర్థులగు తదితర యోగులు ఆయా తీరులుగానూ ఉండవలెననునది సర్వాత్మకుని సంకల్పమనుకోవాలి. బ్రహ్మజ్ఞాన ప్రతిపాదక మగు ఒక మహత్తర గ్రంథం కొందరికి మీమాంసా మాత్రంగా. మరికొందరికి స్వస్వరూపజ్ఞాన ప్రసాదితంగా ఎందుకుంటోందో ఎవరం ఏమి చెప్పగలం? ఇదంతా 'భగవత్ సంకల్పమాత్రమైన సృష్టి యొక్క నియతి' అని పెద్దలు అంటూ ఉంటారు. ఏది ఎట్లా జరుగవలెనో ఎవరికి నిర్ణయింప శక్యం? ఏది ఎట్లా ఉండవలెనో అది అట్లాగే వెలయుచున్నది. ఇదే 'స్వభావము' అని 'నియతి' అని, 'నిశ్చయం' అని పిలువబడుతోంది. ఇంతకు మించి ఏ సమాధానమూ నాకు తెలియదు.

ఇక నా విషయం చెప్పమంటారా? ప్రతిసారి నా ప్రాణయోగసాధన కారణంగా ఒనగూడిన సంకల్పవశంచే కల్పాంతప్రళయ సమయంలో ఆకాశంలో ప్రవేశిస్తున్నాను. మరల తదనంతర సృష్టిలో ఇచ్చటికే వచ్చి ఉంటున్నాను.

❖❖❖

6 సుదీర్ఘ సృష్టి చమత్కారం

శ్రీవసిష్ఠ మహర్షి : అత్యంత దీర్ఘాయువు కలిగి, మోక్షమును అధిరోహించినట్టి అనుభూతిని అనుభవిస్తూ, యోగికి యోగ్యమైన మనస్సును జ్ఞాన విజ్ఞానములను పొంది, అంతులేని ధీరత్వంతో మీరు ప్రకాశిస్తున్నారు. సర్వమూ కాలయమునకు 'ఎర' అగుచుండగా మీరు మాత్రం మీ ధారణా శక్తిచే కాలముచే బంధింపబడకుండా ఉన్నారు. పురాతన విషయములన్నీ ప్రత్యక్షంగా చూచిన మీరు అనేక విషయములు చెప్పుటకు సమర్థులు. ఓ మంగళహృదయా! అనేక విధములగు సృష్టులను, ప్రతిసృష్టులను, సామాన్య ప్రళయములను, అవాంతర ప్రళయములను, మహాప్రళయములను చూచిఉన్నారు కదా! ఆ సృష్టులలో ఏఏ ప్రత్యేక విషయములు సందర్భోచితమో... అవి చెప్పమని నా విన్నపం.

భుశుండుడు : మహాత్మా! వినండి – ఈ సుమేరుపర్వతం క్రిందగల భూమి అంతా వృక్షములు గాని, గడ్డిగాని, శైలము (Rock)గాని లేక, కేవలం శూన్యంగా ఉండటం చూచాను. భూమి 11000 సంవత్సరాల కాలం భస్మరాశితో నిండి ఉన్నది. అప్పుడు భూమిపై సూర్యుడు గాని, చంద్రుడు గాని లేకపోవటం చేత పగలు రాత్రి భేదమే ఉండేది కాదు. కాలమునకు కొలతబద్ద లేకపోయినా నేను నా విజ్ఞానదృష్టితో సూర్యచంద్రుల కంటే విశిష్టమైన కాలగమనాన్ని గమనించాను.

భూమి సగం పగలు, సగం రాత్రితో కొంతకాలం ఉండిపోయింది. దేవాసుర సంగ్రామ సమయంలో జనులు భూమిలోని అంతర్భాగంలో దాగి ఉండుటచే ఈ భూమి కొంతకాలం జన శూన్యమైపోయింది.

ఒకప్పుడు భూమి అంతా నాలుగు యుగములవరకూ రాక్షసస్త్రీలకు అంతఃపురమైయున్నది. మరొకప్పుడు ఈ జగత్తంతా సముద్రజలంచే ఆక్రమించబడుటచే ఇక త్రిమూర్తులు, మేరు పర్వతం తప్ప మరింకేమీ లేదు. రెండు యుగముల కాలం భూమిపై ఇతర సృష్టి ఏదీలేక, కేవలం వన వృక్షములచే నిబిడీకృతమైయున్నది.

ఒకసారి నాలుగు యుగముల కాలం సృష్టంతా పర్వతములతోనూ, స్థాణువులతోనూ నిండి పోయింది. ఆ సమయంలో జనులకు సస్యవ్యవసాయాది వృత్తులు లేవు. పదివేల ఏండ్లు భూమి చనిపోయిన రాక్షసుల దేహములతో, భీకర మృగములతో నిండిపోయి ఉన్నది.

ఒకసారి అనంత సృష్టిలోని ఏమూల నుండో ఒక గొప్ప 'కారుచీకటి' బయలుదేరింది. ఆ గాఢాంధకారం ప్రసరించిన చోట నక్షత్రాలు కూడా అంతర్హితమైపోయాయి. నక్షత్రాలు మటుమాయ మవటం చూసిన విమానచారులగు ఆకాశచరులు భయంతో కేకలు వేస్తూ తమ ఉపాధులు కోల్పోవడం నేను చూచాను.

మరొకసారి వింధ్యపర్వతం గాలిలో లేచి దక్షిణదిక్కును రాళ్లమయంగా చేసివేయటం చూచాను. అప్పుడు 'వింధ్యపర్వతాన్ని నిరోధించటానికి అగస్త్యమహర్షి లేకపోయారే' అని నేను అనుకున్నాను.

హే బ్రహ్మజ్ఞా! ఇట్టివేయగు అనేక విషయాలు నాకు గుర్తుకొస్తున్నాయి. అవన్నీ మీకు పెద్దగా చెప్పవలసిన విషయాలు కాదు. కొన్ని ముఖ్యవిషయాలు చెబుతాను. నేను వందకు మించిన మనువులను చూచాను. నానావిధ కార్యక్రమములతో నిండిన వందలాది చాతుర్యుగములు గాంచాను.

ఏది ఏమైతేనేం? 'స్వాత్మతత్త్వము' దృష్ట్యా చూచినప్పుడు విరాట్-బ్రహ్మాండమే కనిపిస్తుంది. సమాహితచిత్తానికి ఈ సర్వమూ 'నరులు- సురులు' అనే భేదం కనిపించదు. 'జీవులు' అనబడు ప్రకాశాత్మకమగు తేజోపుంజములతో కనిపించే విరాట్ పురుషుడు మాత్రమే గోచరిస్తాడు.

అనేక వైవిధ్యములతో కూడిన ఈ విచిత్ర సృష్టిలో మద్యపానాసక్తులు, నిందిత కర్మిష్ఠులు, దృశ్య ప్రసంగాలతో బ్రతుకులు గడిపే జీవులు ఉన్నారు. వారు ఒక దుఃఖం నుండి మరొక దుఃఖం నకు, ఒక భయం నుండి మరొక భయమునకు ప్రయాణించటం చూస్తూ ఉంటే నా హృదయం కించిత్ ద్రవిస్తుంది. మీవంటి బ్రహ్మజ్ఞానుల వాక్యములు వారు వినకపోవటం నాకు చమత్కారం అనిపిస్తూ ఉంటుంది. ఒక్కొక్కప్పుడు ప్రియవర్తనులగు జనులు లేకపోవటంచేత ఒక్కొక్క భూవిభాగం సారహీనమై ఉండటం చూస్తూ ఉంటాను. అయితే, "అంతా మాయయే కదా!"... అని తెలిసి ఉండటం చేత సర్వము పట్ల కృతకృత్య మౌనస్వభావంతో చూస్తూ ఉన్నాను.

ఒక్కొక్కప్పుడు స్త్రీ – పురుష సంయోగం లేకుండానే మానసిక సంకల్పంచే జనించిన భృగువు మొదలైన మహనీయుల జననం చూచాను. అవాంతర ప్రళయం తటస్థించినప్పుడు భూమిపై పర్వతములు, వృక్షములు జీవులు నిర్మూలనమయ్యేవి. అప్పుడు భూమియే నిరుపయోగమయ్యేది. అప్పుడు యోగసిద్ధి పొందిన మానవులు, దేవతలు నాలాగానే ఆకాశమును ఆశ్రయించటం గమనిస్తూ ఉండేవాడిని. ఈ సృష్టి ఒక్కొక్కప్పుడు ఇంద్రుడుగాని, రాజుగాని లేక, ఉత్తమ – మధ్యమ

– అధమ తారతమ్యములుగాని కలిగిఉండటం లేదు. అంతా అజ్ఞానమయం అయిపోతోంది. అప్పుడు సర్వేశ్వరుని అంశలు జీవులుగా జన్మించి ధర్మసంస్థాపన చేయటం గమనించాను.

ఇక ఈ సృష్టికి మునుముందటి ఆయా ప్రయత్నములు, భువనత్రయవిభాగం ఏర్పడటం, పర్వతములు రూపు దిద్దుకోవటం, జంబూద్వీప ఆవిర్భావం, వర్ణాశ్రమ ధర్మముల రచన, భూమండల విభాగం, నక్షత్రచక్ర సంస్థాపన, ధ్రువనక్షత్రోదయం, ఈ సూర్యచంద్రుల ఉత్పత్తి....ఇవన్నీ నిన్న మొన్నటి సంగతులు.

అట్లాగే ఇంద్ర – ఉపేంద్రుల వృత్తాంతం, దేవ–దానవ–మనుష్య చక్రవర్తులు నియమించ బడటం, మత్స, కూర్మాది అవతారములు, సముద్ర మథనం, గరుడుని జన్మ, సముద్రాలు ఏర్పడటం – ఇవన్నీ ఈ రోజు జరిగిన సంఘటనలవలె నా కనిపిస్తున్నాయి. ఇవన్నీ నా కన్నా వయస్సులో చిన్నవారు, ఈ కల్పమువారు అగు మీరు చూచినవే కదా!

ఒక కల్పంలో గరుడవాహనుడగు విష్ణువు సృష్టికి యజమాని అయి ఉంటున్నారు. ఇంకొక కల్పంలో హంసవాహనుడగు బ్రహ్మదేవుడు యజమాని. మరొక కల్పంలో వృషభవాహనుడగు ఈశ్వరుడు అంతటికీ యజమాని. ఒక కల్పంలో బ్రహ్మదేవుడైన జీవుడు మరొక కల్పంలో శివుడ గుచున్నాడు. ఏమి ఈ సృష్టి చమత్కారం!

❖❖❖

7. చిత్ర విచిత్ర సంఘటనలు

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ భుశుండమహాశయా! చిత్రవిచిత్రములైన ఈ సృష్టికి సంబంధించిన మరికొన్ని ప్రత్యేక విశేషాలు, సంఘటనలు వినాలని అనుకుంటున్నాను.

భుశుండుడు : ఈ సృష్టిలోని అనేక వస్తుజాలములు కాలగర్భంలో కలిసిపోతున్నట్లే, అనేక చిత్ర విచిత్ర సంఘటనలకు నేను సాక్షినై ఉండటం జరిగింది. వాటిలో అనేక సామాన్య విషయాలు నా స్మృతి పథంలో కూడా లేవు. కొన్ని విశేషాలు గుర్తున్నవి చెపుతాను వినండి.

మహనీయులగు మీరు, భరద్వాజుడు, తదితర అనేక మహర్షులు, గణేశుడు, గౌరి, గాయత్రి మొదలైన వారి జన్మవృత్తాంతాలన్నీ నాకు నిన్న మొన్నటి సంఘటనలు. నేనిట్లా చూస్తుండగానే మీకు ఎనిమిది జన్మలు గతించాయి. ఈ ఎనిమిదవ జన్మలో ఇప్పుడు నా దగ్గరకు వచ్చారు. ఆ జన్మలన్నీ బ్రహ్మపుత్రుడుగా జరిగినవి కావు. ఒకసారి ఆకాశం నుండి, మరొకసారి జలం నుండి, వాయువు నుండి, అగ్నినుండి, పర్వతాల నుండి జన్మించటం జరిగింది. ఇప్పుడీ వర్తమాన 'సర్గ'ను బోలినవే ఇతఃపూర్వం మూడు చూచాను. అంతకుముందు సర్గలు ఇందుకు భిన్నంగా ఉండేవి.

భూమి నీటిలో మునిగిపోవుచుండగా కూర్మమూర్తిచే ఐదుసార్లు కాపాడబడటం చూచాను. కూర్మ – వరహామూర్తులచే కాకుండా, మరికొందరిచే ఈ భూమియొక్క విధ్వంసనా యత్నములు విఫలం చేయబడటం చూచాను. దేవతలు, రాక్షసులు అమృతం కొరకు సముద్రమథనం చేయటం ఐదుసార్లు నాకు గుర్తున్నది. కొన్ని సర్గలలో పరశురాముడు జన్మించి రాజవంశ నిర్మూలనం

చేయగా, మరికొన్ని సర్గలలో అతడు జన్మించటం జరుగలేదు. హరి అనేక కలియుగాలలో బుద్ధుడుగా జన్మించటం నేనెరుగుదును. చంద్రమౌళియగు శివుని యొక్క త్రిపురాసురల సంహారాలు, దక్షయజ్ఞ విధ్వంసములు నా జ్ఞప్తిపథంలో ఉన్నాయి.

ఓ మునీంద్రా! వేరు వేరు యుగములలో వేదములకు సంబంధించిన పఠన – నియమ – నిష్ఠ – బ్రహ్మచర్య – గురుశుశ్రూషాది విధివిధానములు వేరు వేరు రీతులుగా ఉంటున్నాయి. ఒకే కథనం బోధిస్తూ కొన్ని పురాణాలు వివిధ యుగములలో విభిన్న పాఠములు, వ్యాఖ్యలు కలిగి ఉంటున్నాయి. వేదవేత్తలగు వ్యాస వాల్మీకాదులు మరల మరల భారతరామాయణాది ఇతిహాసాలు రచిస్తూ ఉండటం నాకు తెలుసు. ఇప్పుడెక్కడా ఎవ్వరికీ తెలియని 'అఖండ రామాయణము' అను లక్ష శ్లోకములలో రచించబడిన ఇతిహాసం గురించి నాకు తెలుసు. ఆ లక్ష శ్లోకములలో జ్ఞానము కరతలామలకం చేయబడింది. ఆ గ్రంథమే ఇప్పుడు వాల్మీకిచే 32000 శ్లోకములలో బోధించబడి కొద్దిమంది శిష్యుల పఠన విషయమై ఉంటోంది. దీనిని మీరు కాలక్రమేణా ఒక సందర్భంలో అవతారమూర్తియగు శ్రీరామచంద్రునికి బోధిస్తారు. ఇప్పటి రామాయణ కథ ఇతఃపూర్వం 11 సార్లు తిరిగి రాయబడింది. అవన్నీ వాల్మీకియో, మరొకరో తిరిగి రాశారు. పూర్వపు అనేకమంది వ్యాసులు రాసిన మహాభారతములు అనేక మార్లు విస్మరించబడి, మరల విరచించబడ్డాయి. 6 మార్లు వ్యాసులో, మరొకరో రాసిన భారతములు విస్మరించబడ్డాయి. ఇప్పుడు 7వ సారి భారతం వ్రాయబడుచున్నది.

పురాణములు ఒక్కొక్క యుగంలో ఒక్కొక్క తీరుగా ఉంటున్నాయి. పదార్థ సమూహములు కూడా ఎప్పుడూ ఒక్కతీరుగా ఉండటం లేదు. విష్ణుమూర్తి శ్రీరాముడుగా 11 సార్లు అవతారం ఎత్తడం నాకు తెలుసు. శ్రీ నరసింహస్వామి 3 సార్లు అవతారం ఎత్తి మూడు వేర్వేరు యుగాలలో హిరణ్యకశ్యప వధ చేయడం నాకు గుర్తుంది.

హే మునీశ్వరా! ఇంతదాకా ఏదో మీరు ప్రశ్నించారు కాబట్టి నా జ్ఞాపకపేటికలోంచి కొన్ని విశేషాలు చెప్పాను. ఇంతకూ అసలు సత్యమేమిటో కూడా మనం ఇక్కడ చెప్పుకోవాలి కదా!

భ్రాంతిమయమగు ఈ జగత్తు అస్సలు స్వతఃగా లేనేలేదు. జలముపై బుడగల వలె ఇదంతా క్షణికమే అయి ఉన్నది. సముద్రం ఒడ్డున కూర్చునిఉన్నవానికి సముద్రజలంలో కెరటాలు వచ్చి పోవుచున్నట్లు అంతరమున గల చైతన్యమునందు అనిత్యములగు ఈ సృష్టిపరంపరలు లేస్తున్నాయి, పడిపోతున్నాయి. ఈ సర్వమూ సంకల్పమాత్ర భ్రాంతియే కదా. అనేక సృష్టులు ఒకే తీరుగా ఉండటం, అనేక తీరులుగా ఉండటం, సగం ఒకే తీరుగా ఉండటం, ఈ త్రిలోకములు ఏర్పడటం, అందులో జీవులు వచ్చిపోవటం, వివిధ జీవుల కర్మలు--ఇవన్నీ కూడా ఒకే జలంలోని అనేక తరంగములవంటివేనని మీకూ తెలుసుకదా!

ప్రతి మన్వంతరంలోనూ ఈ జగత్క్రమమంతా విపర్యయం పొందుతోంది. దీని పుట్టుక, ఉనికి, నాశనము తారుమారగుచున్నది. నా బంధువుల, భృత్యుల ఆశ్రమములు వేరు వేరగుచున్నాయి. నా నివాస స్థానం ఒక్కొక్కసారి ఒక్కొక్కచోటికి మారుతూ వస్తోంది. ఒకసారి వింధ్యశృంగముపైన,

మరొకసారి సహ్యాపర్వతంపైన ఇంకొకసారి మేరు పర్వతంపైనా గూడు మారుచున్నది. ఒకసారి ఎందరో బంధుజనులు నా వెంట ఉండి ఉంటున్నారు. మరొకసారి దీర్ఘకాలం ఒంటరిగా ఉంటున్నాను. ఇట్లు యుగయుగాలుగా, కల్పకల్పాంతాలుగా నేనుమాత్రం ఈ తీరుగానే ఉండిపోతున్నాను. దిశలు, అందలి వస్తువులు తారుమారగుచున్నప్పటికీ నేనుమాత్రం 'ప్రత్యభిజ్ఞానబలం' చేత ఎట్టి మార్పులూలేక, ఆ సర్వమునూ సాక్షీమాత్రుడనై గమనిస్తున్నాను. ఈ జగత్తు, జగత్తులూ - అంతా కూడా సత్-అసత్‌మయమని, ఆత్మయందు ఉద్భవించుచున్న భ్రమ మాత్రమేననీ నాకు తెలుసు. అందుచేత నా బుద్ధికి ఏ క్షణంలోనూ ఎటువంటి మోహం కలగటం లేదు. ఆత్మయొక్క మాయాశక్తిచేతనే ఈ పదార్థములన్నీ ఈ విధంగా విజృంభిస్తున్నాయి. దిక్కుల భేదం వలన వ్యవస్థయే మారిపోయినట్లు అనుభవమౌతుంది కదా! అట్లాగే తల్లి-తండ్రి, భార్య-భర్త, అన్న-తమ్ముడు కాలగతి యొక్క మహిమచే మిత్రులు, శత్రువులు కూడా అగుచున్నారు. పురుషులు స్త్రీలుగా అగుచున్నారు. ఆచార వ్యవహారముల నియమ నిబంధనములు మారిపోతున్నాయి.

ఒకొక్కకాలంలో జనులు వేదాలను, వేద నిషేధాలను పూర్తిగా వదిలి చరిస్తున్నారు. ఒక చిన్న రచన, ఒకచిన్న క్రియా విశేషం మొత్తం ఆచార వ్యవహారాలను సమూలంగా మార్చివేసిన సంఘటనలు నా జ్ఞప్తిపథంలో ఉన్నాయి. ఒకప్పుడు బ్రహ్మదేవుడు ధ్యానమగ్నుడై అనేక యుగములు గడుపగా ఈ బ్రహ్మాండమున దేవ రాక్షససమూహములు లేవు. అందుచేత ఇది క్రియారహితమై ఉన్నది.

ఈ నా దీర్ఘజీవితంలో 10కి పైగా మనోమాత్ర నిర్మిత సృష్టులు వేరువేరు నవలల వలె గాంచియున్నాను. ఆ మానసిక సృష్టులలో పంచభూతాత్మికమైన దేహములు లేవు. కేవలం ఊహలే పరస్పరం ప్రవర్తించి సకల అనుభవరూపంగా స్ఫురిస్తూ ఉంటాయి. అనేక దేశ, కాలములతో, ప్రదేశ, - వేషభాషలతో, విచిత్ర కార్యక్రమములతో, పరస్పర విరుద్ధములైన నిర్వచనములతో ఈ సృష్టి అంతా పరిఢవిల్లుతోంది.

❖❖❖

8 చాంచల్యరాహిత్యం - అమృతత్వం

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ విహంగరాజమా! ఈ బ్రహ్మాండమంతా ఇంత చమత్కారంగా మరల మరల విచలితమగుచున్నది కదా! ఇందలి జీవులు మృత్యువుచే అనేకమార్లు బాధింపబడుచున్నారు. మరి అట్టి మృత్యువు మిమ్ములను మాత్రం సమీపించనేలేదు. ఇది మీకు ఎలా సాధ్యపడింది?

భుశుండుడు : సర్వజ్ఞా! మీకు అంతా తెలుసు. అయినా అడుగుచున్నారు. అయితే, ప్రభువు కోరి నట్లే భృత్యువు నిర్వర్తిస్తాడు కదా! బ్రహ్మవేత్తలగు మీరు ప్రశ్నించారు గనుక మరల విశదీకరించి చెబుతాను. మీ ఆజ్ఞను పాలించుటయే మిమ్ములను ఆరాధించటం కదా!

ఆభరణములేవీ లేనివానికి దొంగలు వచ్చి దొంగిలించగలిగేదేమి ఉంటుంది? అట్లాగే ఎవని హృదయంలో అయితే 'వాసనా తంతువులు' అనే దోషం ఉండదో అట్టి వానిని మృత్యువు హింసించ

జాలదు. ఎవనికి ఆశాపాశజనితమైన మనోవ్యాధులు ఉండవో, అట్టివానియందు మృత్యువు వచ్చి కలిగించగల మార్పు చేర్పులేమీ ఉండవు. మనస్సు యొక్క చాంచల్యము జయించబడిందా – ఇక 'నేను క్షయించుచున్నాను' అను భావన నిరర్థకమై, నిరోధించబడుతోంది.

ఆశయే అన్ని చింతలకూ కారణం. 'ఆశించుట' అను జీవునియొక్క అవిజ్ఞానజనిత స్వభావమే మృత్యువుకు విషాగ్నిజ్వాలలు వెడలగ్రక్కగల శక్తిని ప్రసాదిస్తోంది. మనస్సులో 'ఇది కష్టం–అది కాదు' అనే తరంగపరంపరలు మొట్టమొదట బయల్వెడలుచున్నాయి. అవి రాగద్వేషములను కల్పన చేస్తున్నాయి. రాగద్వేషములు, లోభగుణమునకు కారణమగుచున్నాయి. లోభం కోపాగ్నులను జనింపజేసి హృదయంలో జ్ఞానజలమును ఆవిరిగా చేసేస్తున్నది. ఎక్కడినుంచో కామము వచ్చి హృదయమును పిప్పి చేసేస్తున్నది.

తత్ఫలితంగా మృత్యువు విలయతాండవం చేయగలుగుతోంది. ఎవరైతే అద్వితీయమును నిర్మలమును, పవిత్రమునగు ఆ పరమపదమును ఆశ్రయిస్తారో... వారియొక్క విశ్రాంతి స్థానమును బాధించగల సమర్థత మృత్యువునకు లేదు. ఈ శరీరం అనే ఉద్యానవనంలో 'మనస్సు' అనే చంచల స్వభావం గల కోతి సంచరించకపోతే 'మృత్యువు' అనే వననాశనం ఎందుకు జరుగుతుంది?

మహాత్మా! ఈ జీవుడు సమాహితచిత్తమును సంపాదిస్తేచాలు, అన్ని రుగ్మతలూ తొలగుతాయి. సంసారదోషమునకు కారణములైన దృశ్య దోషములు సమాహితచిత్తుని ఏమాత్రం బాధించలేవు. ఈ శారీరక మానసిక దోషములు అతని దగ్గరకు వెళ్లలేవు. సమత్వము అనుదానిని అనుభూతిగా చేసుకున్నవానికి ఇక్కడి స్మృతి–విస్మృతులు, జాగ్రత్–స్వప్న–సుషుప్తులు ఉండియూ, లేనివే అగుచున్నాయి.

ఎవని హృదయంలో కామక్రోధవికారములు జనింపజేసి, అంధకారమయం చేయగల చింతలు ఉండవో– అట్టివానినే మనం 'సమాహితచిత్తుడు' అని పిలుస్తాం. ఎవని కర్మలైతే దానం, ప్రతిగ్రహణం, త్యాగం, యాచన – మొదలైన దోషములు లేకుండా ఉంటాయో, అతని చిత్తము సమాహితత్వము అవధరిస్తున్నట్లు. ఈ ధనాది ఆర్జనలు, కృషి, నిర్మాణాది కార్యములు, రాగద్వేషాది గుణము, హృదయ భేదకములగు తదితరుల దూషణవాక్యములు, కఠినములగు ఆయా సామాజిక స్థితిగతులు సమాహితచిత్తునిలో ఏ మార్పుదుఃఖము, ఆవేశము, నీరసము మొదలైనవి కల్పించలేవు సరికదా... నదుల జలాలన్నీ సముద్రం కోరకుండానే సముద్రంలోకి ప్రవేశిస్తున్నట్లు, మహత్తర గుణములను వెంటబెట్టుకుని లాభజనకములగు సుఖములన్నీ వాటంతట అవే ఆ సమాహిత చిత్తుని సమక్షమునకు చేరుకుంటాయి.

కనుక 'మృత్యువు అనునది నాపట్ల నిష్క్రియము, నిర్వీర్యము అయిపోవాలి' అని ఏ జీవుడైనా అనుకుంటే, అతడు తన మనస్సును ముందుగా భోగాభిలాషారహితంగా తీర్చిదిద్దుకోవాలి. భ్రమలన్నీ ఒక్కటొక్కటిగా బయటకు పంపివేయాలి. అప్పుడా మనస్సు తనయందు పారమార్థిక సుఖమునకు చోటు కలిగి ఉంటుంది. క్రమంగా సత్యసంకల్పత్వం సంతరించుకుంటుంది.

'అనేకత్వము' అనేదే అపవిత్ర దృష్టిపిశాచం ఈ జీవుడు సత్యసంకల్పుడు కావాలంటే – అనగా, తాను అనుకున్నది పొందాలంటే, ముందుగా 'ఇక్కడి అనేకత్వము ఉన్నది' అనే అపవిత్రదృష్టి దరిజేరకుండా చూచుకోవాలి. అప్పుడు మనస్సు పవిత్రమై, పరమపదమున స్వస్థి పొందుతుంది. ఇక మృత్యువు నిష్క్రియం అయిపోగలదు.

మృత్యువుకు అతీతుడు కావాలంటే -

1. 'పరిపక్వదశ' ప్రసాదించగల ధ్యాన – కర్మ – పఠనాది కార్యక్రమములను శ్రద్ధా–ఆసక్తులతో తీవ్రతరం చేసుకోవాలి.

2. క్రమక్రమంగా హితకరము, సర్వదుఃఖనివర్తకము, నిత్యము అగు జ్ఞానమును సంపాదించే టట్లుగా ఈ మనస్సును నియమించాలి.

భూతవర్తమానభవిష్యత్తులందు ఏదైతే నిత్యమై, అనంతమై సాధుజన సేవితమై సర్వహితకరమై యున్నదో, అట్టి పదము వైపుగా ఈ మనస్సును ప్రవర్తింపజేయాలి. బుద్ధికి కూడా పరమప్రకాశమై, అమృతసారమై, ఎనలేని, తెంపులేని సుఖప్రదమగు మహాస్థానమునందు మనస్సును సంలగ్నం చేయాలి. అట్టివారి మహత్తర దృష్టియందు మృత్యువుతో సహా ఈ ఎదురుగా కనిపించేదంతా లేనిదే అగుచున్నది.

హే మహర్షీ! దేవతాస్త్రీ సాంగత్యాదులలో కూడిన దివియందుగాని, పర్వత, రాజ్య, సముద్ర, వనములతో కూడిన భూలోకమునందు గాని, నాగ, అసుర కన్యలతో కూడిన పాతాళలోకము నందుగాని – నిత్యము, స్థిరము, సుఖము అయినది ఒక్కటి కూడా ఏదీ లేదుకదా! ఈ బ్రహ్మాండ సాగరంలోని మూడు లోకములూ ఆధి వ్యాధులనే తరంగములతో కదులుచూ, దుఃఖములు అనే సుడిగుండములతో, తుచ్ఛములగు అనేక అల్పాశయక్రియావ్యవహారములతో నిండి ఉన్నాయి. ఇందులో ఎక్కడ నిజమైన సుఖము, శాంతి ఉన్నాయి చెప్పండి? కాస్త హృదయమును సరళం చేసి కొంచెం మనస్సును ఆనందపరచే చిత్తవృత్తులు కూడా ఏమాత్రం స్థిరత్వం కలిగి ఉండుటలేదు కదా! ఇక్కడి సంకల్పవికల్పములేమైనా జీవునకు శాశ్వత శుభమును కలుగజేస్తున్నాయా? లేదు. ఇక ఈ ఇంద్రియసుఖములంటారా? ప్రతిదీ కాస్త సుఖం, గంపెడంత దుఃఖం! అవి మూర్ఖజీవుని అల్పాయుష్షులను తమవైపు ఆకర్షించి అతనిని చివరికి దుఃఖిగాను, రిక్తహస్తునిగాను చేసివేస్తున్నాయే! అవి అందించే విషయసుఖములను సమాహితచిత్తుని విశ్రాంతి, ప్రశాంతతలతో సరిపోల్చగలమా? ఏమాత్రం కుదరదు.

న పరమేకమహీతలరాజతా నచ వరం విబుధామరరూపతా ।

నచ వరం ధరణీతలనాగతా స్థితిముపైతి హి యత్ర సతాం మనః ॥ (శ్లో॥ 33, సర్గ 23.)

విశ్రాంతి పొందిన సాధువుల మనస్సుతో ఈ ప్రపంచంలో గొప్ప గొప్ప విషయాలుగా కనిపించే ఏకచ్ఛత్రాధిపత్యముగాని, దేవలోకత్వముగాని, పాతాళరాజ్యాధికారంగాని కించిత్ కూడా తులతూగలేవు.

మనస్సు విశ్రాంతి పొందిందా... ఇక, శాస్త్ర పాండిత్యంతోను, వక్తృత్వాది గుణములతోను, కర్మకాండతోను పనేమున్నది? అనుభవైకవేద్యమైనది కరతలామలకమౌతుంది.

అసలు ఆత్మకుస్వభావసిద్ధమే అయి ఉన్న శాంతి దేనిచే బాధించబడుతోంది?...

ఈ దేహము యొక్క వ్యాధులచే నా పని అయిపోతోంది... నాకు స్వర్గ సుఖములు కావాలి... నాకు పతనం అనివార్యం... ఈ దేహమనోబుద్ధులే నా రూపం... ఇటువంటి అల్పభావ పరంపరలే స్వస్వభావమగు శాంతిని పాడుచేస్తున్నాయి.

మూఢునికి మాత్రమే ఈ జగద్విషయాలు మొట్టమొదట బహురమ్యంగా కనిపిస్తున్నాయి. క్రమేణ అవి అతనిని పట్టుకుని మృత్యువుకు ఉపాహారంగా అందజేస్తున్నాయి. మహాత్ములు మాత్రం ఈ ఎదురుగా కనిపించే సర్వమునూ అవలీలగా ఆవలకు నెట్టివేసి ఉంటున్నారు. 'ఆశ' అను దానిని దగ్గరకు రానీయకుండా, శాశ్వతసుఖ విశ్రాంతిని తమ సొంతం చేసుకుంటున్నారు. "మృత్యువు దైనందికమైన నిద్ర వంటిదే" అని గ్రహించి జన్మ, జీవన్-మృత్యువులను అధిగమించినట్టి "తేజోమయ ఆత్మా౽హంధృష్టి" ని అలవరచుకొని ఉంటున్నారు.

❖❖❖

9. ప్రాణవాయుగతుల ఉపాసన

భుశుండుడు : హే బ్రహ్మవేత్తా! బాగా వింటున్నారు కదా!

ఏకైవ కేవలా దృష్టిః నిరాపాయా గతభ్రమా
విద్యతే సర్వవిత్త్వేషు సర్వశ్రేష్ఠా సమున్నతా॥

నిజానికి 'భ్రమరహితము-సర్వశ్రేష్ఠము-మహోన్నతము' అగు "అద్వైతదృష్టి" ఒక్కటే సమస్త జ్ఞానమునకు సమున్నత సత్ఫలమైయున్నది.

ఆత్మచిన్తా సమస్తానాం దుఃఖానాం అన్తకారిణీ
చిర సంభృత దుఃస్వప్న సంసారభ్రమహారిణీ॥

ఈ జీవుడు అనాదికాలం నుండి తనవెంట అవిద్యాకామ్యకర్మలను తెచ్చిపెట్టుకుంటూ ప్రతిజన్మలోనూ పెంచి పోషించుకుంటున్నాడు. ఇప్పుడాతనికి దుఃస్వప్నసంసార భ్రమ నుండి, సర్వ దుఃఖానుభవముల నుండి విముక్తి అత్యంతావశ్యకం. అందుకు సరి అయిన ఔషధం సేవించాలి కదా! ఏమిటా ఔషధం? ఈ సర్వమును, సర్వులనూ 'ఏకాత్మ స్వరూపం'గా దర్శించటమే ఔషధం. అట్టి 'ఆత్మచింతన' అనునది ప్రశస్తమగు పవిత్రమైన మనస్సునందే ఉదయిస్తోందిగాని, మరెక్కడో కాదు. అయితే స్వల్పత్వం ఆశ్రయించే వారికి దుశ్చింతలు, అనర్థాలు, దుఃఖాలు ఉండనే ఉంటున్నాయి. అవి మొదలంటా వినాశనమైనప్పుడు మాత్రమే స్వస్వరూపాత్మజ్ఞానం అబ్బుతోంది. వెన్నెల వస్తే కారుచీకటి మటుమాయం అవుతుంది కదా! సర్వసంకల్పములు వర్జించినప్పటి ఆత్మచింతన మనస్సులోని మాయ, భ్రాంతి, మోహము అనే మకిలిని కడిగివేస్తోంది.

అయితే ఒక్క విషయం! సర్వసంకల్పములకు సమాధానమై, అత్యంత శ్రేష్ఠమైన 'నిరంతరాత్మ చింతన' అనేది మీవంటి జ్ఞానసమన్వితులగు మహాత్ములకు అత్యంత సులభమై ఉంటోంది. మాలాటి మందమతుల విషయానికి వస్తే అది సుదుర్లభమే అవుతోంది. మావంటి వారిని మా చేతనే కల్పించుకొనిన అజ్ఞానం ఆవరించి ఉంటోంది. మా సునిశ్చయాలు క్షణంలో స్వల్ప సంఘటనలచే చంచలమౌతున్నాయి.

అయితే 'నిరంతరాత్మచింతన' అనే రాణిని మీవలె మేము పొందలేకపోయినప్పటికీ, ఆ రాణిగారికి కొందరు ప్రియచెలికత్తెలున్నారు. వారు కూడా ఆమెవలెనే మహాఘనులే. వారు కూడా జ్ఞానచంద్రుని చల్లని కిరణములైయున్నారు. అట్టి ఇష్టసఖులలో ఒక చెలికత్తెను నేను పొందాను. దాని పేరు "ప్రాణచింతన"

ఈ ప్రాణచింతన కూడా సర్వదుఃఖక్షయకారకమే. సౌభాగ్యమును వర్ధిల్లింపజేయగలదు. ఒక జీవుడు జీవించుటకే హేతువగుచున్న ప్రాణచింతన-అనుయోగాభ్యాస మూలముననే నేను చిరంజీవుడనయ్యాను.

శ్రీవసిష్ఠ మహర్షి : భుశుండమహాశయా! ముందుగా 'ప్రాణచింతన' అంటే ఏమిటో వివరించి చెప్పండి. తద్వారా మీ చిరంజీవత్వము యొక్క రహస్యమును కూడా విశదపరచ ప్రార్థన.

భుశుండుడు :

సర్వ వేదాంత వేత్తాసి! సర్వసంశయనాశకః ।
మామ్ ఏతత్ పరిహాసార్థం, మునే! పృచ్ఛసి వాయసమ్ ॥

స్వామీ! వసిష్ఠమహర్షీ! మీకు వేదాంత శాస్త్రమంతా తెలుసు. ముముక్షువుల అందరి సంశయములనూ మీరు దూరం చేస్తూ ఉంటారు. అయినప్పటికీ ఏదో పరిహాసార్థం ఈ కాకి చేత పలికిస్తున్నారు. అయినప్పటికీ మీవంటి మహనీయులతో ఏర్పడే ఉత్తర-ప్రత్యుత్తర సంవాదముచే ఆ విషయమై మరికొంత చక్కగా పునశ్చరణ చేసుకోవటానికో, ఆలోచించుకోవటానికో మంచి అవకాశంగా నేను భావిస్తున్నాను. వినండి చెపుతాను.

పశ్య ఇదం, భగవన్! సర్వం దేహగేహం, మనోరమమ్ ।
త్రిప్రకారమహాస్థూణం, నవద్వార సమావృతమ్ ॥
పుర్యష్టకకలత్రేణ, తన్మాత్ర స్వజనేన చ ।
అహంకార గృహస్థేన సర్వతః పరిపాలితమ్ ॥

ప్రకృతిచే ప్రసాదించబడిన అత్యంత రమణీయమైన ఈ దేహమును చూస్తున్నారు కదా! ఈ దేహమనే ఇంటికి 'వాత-పిత్త- కఫములు' అనే మూడు స్థంభాలు ఉన్నాయి.

వాతము = వాయువు; పిత్తము = ధాతువులు (పైత్యరసాదులు); కఫము = శ్లేష్మము

ఈ దేహమునకు 9 ద్వారాలున్నాయి- 2 కన్నులు, 2 ముక్కు రంధ్రములు, 2 చెవులు, 1 నోరు, 1 గుదస్థానము, 1 మర్మాయవము

ఈ దేహమనే ఇంటికి యజమాని అహంకారం.

ఈ ఇంటికి గృహిణి 'పుర్యష్టకం'. పుర్యష్టకం అనగా –

1. జ్ఞానేంద్రియ పంచకం : చెవులు, చర్మము, కళ్లు, నాలుక, ముక్కు
2. కర్మేంద్రియ పంచకం : వాక్కు, కాళ్లు, చేతులు, పాయువు, ఉపస్థ
3. వాయు పంచకం : ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన వాయువులు. (వాయువు యొక్క వేరు చలన దిశలను అనుసరించి చెప్పబడినవి)
4. భూతపంచకము : భూమి, వాయువు, అగ్ని, జలము, ఆకాశము.
5. అంతఃకరణ చతుష్టయం : మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము.
6. అవిద్య : ఆత్మదృష్టి నుండి చ్యుతి
7. కామము : లేనిదేదో ఆశించే స్వభావం. "ఏవో మార్పు చేర్పుల చేత గాని ఆనందం లేదు" అని తలచటం.
8. కర్మము : క్రియావ్యాసంగము.

పంచతన్మాత్రలే ఆ ఇల్లాలికి సహకరించే పనిమనుషులు. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములే ఆ పంచతన్మాత్రలు. వాళ్లు ఈ శరీర గృహము యొక్క బాగోగులు చూస్తున్నారు. మన మనో నేత్రాలకు ఈ శరీర గృహం ఎదురుగా కనిపిస్తోంది కదా!

చెంప ప్రక్కగా ఉన్న చెవులే దీని మిద్దెలు (పై మెట్లు). 'వెంట్రుకలు' అనే రెల్లుతో ఈ గృహం కప్పబడి ఉన్నది. ముఖంలోని కళ్లు ద్వారముల వంటివి, రెండు భుజములు శరీర గృహంలోని ఉపమందిరముల వంటివి. బాహ్యమున ఉన్న ఆయావిషయ పరిజ్ఞానాలు, ఈ గృహానికి ద్వార పాలకుల వలె ఉండి శబ్ద, స్పర్శ, రూప, రస, గంధముల రూపమున వార్తలు లోనికి తేవటం జరుగుతోంది.

ఈ శరీర గృహంలో 'ఆత్మ' అనే ఒకానొక వెలుగు ప్రసరిస్తుండుటచేతనే ఇది వర్తిల్లగలుగు తోంది. ఈ గృహయజమానియగు జీవుడు జాగ్రత్తులో ఉన్నప్పుడు వరండాలో పచార్లు చేస్తున్నట్లుగా ఉన్నది. ఈ శరీరగృహం లోపల రక్త-మాంసములనే పేడ-నీళ్లచే అలుకబడినట్లుగా ఉంటోంది. బొమికలు అనే కొయ్య చేత, నరములు అనే త్రాళ్ల చేత ఈ శరీరగృహం పడిపోకుండా గట్టిగా నిలచి ఉన్నది.

❖

ఓ మునినాయకా!

ఇడాచ పిఙ్గలాచ అస్య, దేహస్య ముని నాయక ।
సుస్థితే కోమలే మధ్యే పార్శ్వకోష్ఠే నిమీలితే ॥

ఈ దేహము యొక్క మధ్యభాగంలో రెండు కోమలమైన సూక్ష్మనాడులు ఉన్నాయి. శాస్త్రకారులు వీటికి – 1. ఇడ, 2. పింగళ – అని పేర్లు పెట్టారు.

పద్మయుగ్మత్రయం యన్త్రమ్ అస్థిమాంసమయం మృదు
ఊర్ధ్వ-అధోనాలమ్ అన్యోన్యమ్ ఇలత్ కోమల సద్దలమ్
సేకేన వికసత్ పత్రం సకలాకాశచారిణా
చలన్తి తస్య పత్రాణి మృదువ్యాప్తాని వాయునా
చలత్సు తేషు పత్రేషు స మరుత్ పరివర్ధతే ॥

వాతాహతే లతా పత్రజాలే బహిరివాభితః
వృద్ధిం నీతః సనాడీషు కృత్వా స్థానమనేకథా
ఊర్ధ్వ-అధో వర్తమానాసు దేహే అస్మిన్ ప్రసరత్యథ
ప్రాణ-అపాన-సమానాద్యైః తతః సహృదయానిలః
సంకేతైః ప్రోచ్యతే తజ్ఞైః విచిత్రాచార చేష్టితైః॥

ఈ రెండు నాడులూ అప్రకాశితభావంతో వెలయుచున్నాయి. ఈ రెండు నాడుల మధ్య ఒక స్థానంలో 'అస్థిమాంస మయము, అతిసున్నితము' అగు హృదయం ఉన్నది. ఆ హృదయపద్మం యొక్క నాళములు పైకి క్రిందకు వ్యాపించి ఉన్నాయి. హృదయము యొక్క దళములు అత్యంత కోమలంగా, పరస్పర మిళితంగా ఉన్నాయి. అట్టి హృదయ స్థానం నుండి శక్తి బహిర్గతంగా, అంతర్గతంగా ప్రయాణిస్తూ ఉన్నది. అదియే ప్రాణశక్తి , ప్రాణతత్వం.

ఇది ఇట్లా ఉండగా, ప్రాణతత్త్వము ముక్కు చివర నుండి పాదముల వరకు దేహాకాశమున విస్తరించి ఉన్నది. ముక్కు నుండి వాయువు పీల్చబడుతోంది కదా! అలా స్వీకరించబడుచున్న వాయువును 'అపానవాయువు' అని అంటారు. అపానవాయువు యొక్క సేచనము (Intake) వలన హృదయ కమలం వికసించటం జరుగుతోంది. (1) స్వీకరించబడుచున్న (2) విడచిపెట్టబడుచున్న వాయువు వలన హృదయ కమలం వికసించటం, ముకుళించటం జరుగుతోంది.

ఈ వాయువులు హృదయముచే ఆకులను కదలించుచుండగా, క్రమంగా వాటి వీచికలు నలుదిక్కులా వ్యాపించి నాడీఛిద్రములందు ప్రవేశించి వృద్ధిపొందుచున్నాయి. అట్లా అభివృద్ధి చెంది దేహమున భిన్నభిన్న స్థానములను కల్పించుకుంటున్నాయి.

ప్రాణవాయు వ్యాపారములు -

1. అపానవాయువు : అధోముఖముగా ప్రసరిస్తోంది.
2. వ్యానవాయువు : నాడులు సంకోచింపచేయటం విస్తరింపజేయటానికి పనిచేస్తోంది.
3. ఉదానవాయువు : ఊర్ధ్వముఖంగా చలిస్తూ ఉంటుంది.
4. సమానవాయువు : దేహమందలి వివిధ ప్రదేశాల సమానత్వాన్ని నెలకొలుపుతూంటుంది.
5. సప్రాణవాయువు : మొత్తం చలనమును సుస్థిరీకరిస్తూ ఉంటుంది.

ఈ ఐదు పేర్లు ఒకే ప్రాణవాయువు యొక్క (లేక, ప్రాణశక్తి యొక్క) ఊర్ధ్వ, అధోనాడీ మండలమున ప్రవేశించినప్పటి విభిన్న కృత్యముల పేర్లు సుమా!

చంద్రబింబము నుండి కిరణములు వెలువడుచున్నాయి చూచారా? అట్లాగే ప్రాణశక్తి అంతా హృదయము నుండి వెలువడి దేహమధ్యమునకు, ఊర్ధ్వ-అధోభాగములకు వ్యాపిస్తోంది. అట్లు వ్యాపించుచూ నాడీసమూహములో ప్రకాశిస్తోంది. అట్లా ప్రవేశించి 'గమన (పోవటం), ఆగమన (రావటం), కర్షణ (కదల్చటం), హరణ (విభాగించటం), విహరణ (కలపటం), పతన (పడవేయటం), ఉత్థాన (లేపటం) – మొదలైన క్రియలను చేస్తూ ఉంటోంది.

హృదయపద్మము నందలి వాయువును విజ్ఞులు ప్రాణము అని పిలుస్తున్నారు. అట్టి ప్రాణ వాయువు ఈ శరీరమును ఉద్దీపించగల శక్తులన్నీ కలిగియున్నది. ప్రాణవాయువు యొక్క ఒకానొక శక్తి వల్ల కళ్లు కదలుచున్నాయి. మరొక శక్తి వల్ల స్పర్శ గ్రహించబడుతోంది. ఇంకొక శక్తి ముక్కులో ప్రవేశించి ఆఘ్రాణము (Smell) యొక్క అనుభవం కలిగిస్తోంది. వేరొక శక్తి వల్ల అన్నం జీర్ణమగు చున్నది. అట్టి ఒకానొక శక్తి వలన గొంతులోని నాళములు ప్రవర్తించి మాటలు వెలువడుచున్నాయి. ఇంతెందుకు? యంత్ర నిర్మాత ఇచ్ఛానుసారం యంత్రశక్తి యంత్రమును చలింపజేస్తూ వివిధ కార్యములను నిర్వర్తింపజేస్తోంది చూచారా? వాయుదేవుడు ఈ శరీరమునందు ప్రవేశించి వివిధ కార్యములను ఒనర్చుచున్నాడు.

తత్ర ఊర్ధ్వ-అధో ద్విసంకేతౌ ప్రసృతావనిలౌ, మునే! ।
ప్రాణ-అపానావితిఖ్యాతౌ ప్రకటౌ ద్వావరానిలౌ ।
"తయోః అనుసరన్ నిత్యం, మునే! గతిమ్ అహం స్థితః"॥

ఓ మునీంద్రా! నా హృదయమున ఊర్ధ్వగమనం నిర్వర్తించే ప్రాణవాయువు. అధోగమనం నిర్వర్తించే అపానవాయువు ప్రకాశ్యభావమున వెలయుచున్నాయి కదా! ఇక నేను, నిత్యము-సర్వదా వీటియొక్క గతిని గమనిస్తూ, అనుసరిస్తూ ఉన్నాను.

ఈ ప్రాణాపానములు సదా శీతఉష్ణములై ఆకాశమున తిరుగుచూ ఈ శరీరము అనే యంత్రమును మోయుచుండగా, నేనుమాత్రం నిర్విషయుడనై ఎట్టి శ్రమ పొందక ప్రశాంత స్థితియందు ఏర్పడి ఉంటున్నాను.

ఈ ప్రాణాపానములు హృదయకాశమునకు సూర్యచంద్రుల వంటి అగ్నిసోమ (Hot & Cool) స్వభావయుతమై ఉంటున్నాయి. ఈ శరీరమనే పురమునకు మనస్సు అంగరక్షకుడు. మనస్సు అనే రథమునకు ఈ ప్రాణాపానములు రెండు చక్రములవంటివి. అహంకారమనే రాజుకు రెండు ప్రియమైన గుఱ్ఱములవంటివి.

ఓ బ్రహ్మజ్ఞా! ఇక నేను చేస్తున్నదేమిటో మరికొంత విశదీకరించి చెపుతాను వినండి.

ఈ ప్రాణద్వయం (ప్రాణ – అపానములు) జాగ్రత్ – స్వప్న – సుషుప్తులందు సర్వదా సమభావమున ఈ దేహమునందు వెలయుచున్నాయి కదా! వాటియొక్క 'గతి'ని అనుసరిస్తూ నేను సుషుప్తునివలె కాలమును గడుపుచున్నాను. వీణతంతువులోని వేయవవంతు ఎంతటి సూక్ష్మంగా ఉంటుందో... అంత సూక్ష్మప్రసరణతో వాటిని అనుసరిస్తూ ఉంటున్నాను.

అవిరతగతయోః “గతిః” విదిత్వా హృదిమరుతోరను సృత్య చోదితాం తామ్ ।

న పు నరిహ హి జాయతే మహాత్మన్, ముదితమనాః పురుషః ప్రణష్టపాశః ॥

ఈ ప్రాణాపానద్వయం సర్వదా హృదయపద్మమున సంచరిస్తున్నాయి. ఇవి అనేక శాస్త్రములచే అనేక పేర్లతో వర్ణించిచెప్పబడినవి.

ఈ వాయుగతులను ఉపాసించే జీవుడు మృత్యుపాశమునుండి వెలువడగలుగుతాడు. పరమానంద లాభమును పొందుతాడు. అతడు మరల జన్మించుట లేదు. అట్టిప్రాణోపాసకు మనస్సు సర్వదా సంతోషముతో నిండినదై సర్వపాశముల నుండి విడివడుచున్నది.

❖❖❖

10. రేచక - పూరక - కుంభకములు : ప్రాణాపానముల ఉత్పత్తి - లయస్థానములు

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ భుశుండ మహాశయా! మీరు ప్రాణ అపానముల గతిని అనుసరిస్తూ ఉంటున్నానని అన్నారు కదా! మీ సాధన, సాధ్యముల గురించి మరికొంత వివరించండి.

భుశుండుడు : ఉపాధ్యాయుడు అన్నీ తెలిసియే విద్యార్థిని ప్రశ్నిస్తూ ఉంటారే! జగద్గురువులగు మీరు అన్నీ ఎఱిగి ఉండి కూడా కేవలం వినోదార్థమై ప్రశ్నిస్తున్నారు. అయినా మీ వాక్కు శిరోధార్యం కదా! వినండి.

పాణో అయమ్ అనిశం, బ్రహ్మమ్! స్పందశక్తిః సదాగతిః ।

స బాహ్య - అభ్యన్తరే దేహే ప్రాణో అయమ్ ఉపరి స్థితః ॥

అపానోఽపి అనిశం, బ్రహ్మన్! స్పందశక్తిః సదాగతిః ।

స బాహ్య - అభ్యన్తరే దేహే త్వపానోఽయమ్ వాక్ స్థితః ॥

జాగ్రతః స్వప్నతశ్చైవ ప్రాణాయమో అయమ్ ఉత్తమః ప్రవర్తతే! ॥

ఓ బ్రహ్మజ్ఞా ! ఈ దేహమునకు లోపల-వెలుపలా కూడా ప్రాణవాయువు తనయొక్క స్పందనశక్తిని ప్రదర్శిస్తూ సంచారం చేస్తోంది. అట్లాగే స్పందన శక్తియుతమైన అపానవాయువు కూడా! జంటగాయకులలో ఒకరు గానం చేస్తూ ఆపుచుండగా మరొకరు అందుకుంటూ ఉంటారు చూచారా? అట్లాగే ఈ ప్రాణ అపానములు జాగ్రత్ - స్వప్న సమయములలో దేహమునకు బాహ్యమున, అంతరమున కూడా ఒకటి నిస్పందనమగుచుండగా రెండవది స్పందన సంతరించు కోవటం జరుగుతోంది. అట్టి ప్రాణ-అపానముల యామమునకు (గతికి) సంబంధించిన జ్ఞానము సంపాదించుకొని ఉండటం జీవునికి పరమశుభప్రదమైయున్నది. ప్రాణాపానముల గతిని అనుసరించి రేచకము - పూరకము - కుంభకము అనే మూడు ప్రాణవాయు స్థితులు ఇటు దేహము యొక్క అంతరమున, అటు దేహమునకు బాహ్యమున నిరంతరం సహజసిద్ధంగా ఏర్పడుచున్నాయి.

1. రేచకము - "హృదయంలో నుండి వెలుపలికి ప్రాణవాయువుల ప్రయాణం చేయు స్థితి.

బాహ్యోన్ముఖత్వం ప్రాణానాం యద్హృదంబుజకోటరాత్ ।
స్వయసేనాస్తయత్నానాం తం ధీరా 'రేచకమ్' విదుః ॥

'హృదయము' అనే పద్మకోటరం నుండి అప్రయత్నంగానే (స్వాభావికంగా) ప్రాణశక్తి వెలికి వస్తూ ఉంటుంది. అట్టి 'బాహ్యోన్ముఖత్వము' అనే అసంకల్పిత చర్యనే 'రేచకము' అని విజ్ఞులు పిలుస్తున్నారు.

2. (బాహ్య అభ్యంతర) పూరకము - "ముక్కు కొన నుండి 12 అంగుళాలు బాహ్యమునకు; 12 అంగుళాలు లోనికి – హృదయము వరకు వాయువు పూరించబడి ఉండు స్థితి."

ద్వాదశాంజుల పర్యంతం బాహ్యమ్ ఆక్రమతాం అధః ।
ప్రాణానాం అంగసంస్పర్శో యః స 'పూరక' ఉచ్యతే ॥
బాహ్యాత్ పరాపతత్య అన్తరపానే యత్నవర్జితః ।
యోఽయం ప్రపూరణః స్పర్శో విదుస్తమపి 'పూరకమ్' ॥

బాహ్యమున (నాసికాగ్రం – ముక్కు కొన నుండి) 12 అంగుళముల దూరము నుండి ప్రాణము తన స్పందన ప్రారంభించి దేహమును సంస్పర్శించుచూ... ఆ 12 అంగుళాల ప్రదేశమును అపానవాయు రూపంగా (బాహ్యం నుండి అంతరమునకు విడువబడినదిగా) నిండి ఉంటోంది. ఇది అప్రయత్న పూర్వకంగా జరుగుతోంది. ఇది బాహ్యాపూరకం.

అట్లాగే నాసిక నుండి అపానవాయువు హృదయం వరకు ప్రాణములు అపాన రూపంగా ప్రవేశించి ఉంటోంది. ఇది అంతరపూరకం. అట్లు యత్నరహితంగా బాహ్య –అంతరములందు ప్రాణవాయువు పూరించి ఉండు స్థితియే "బాహ్య – అభ్యంతర పూరకములు" అని సూచింపబడింది.

3. కుంభకము - హృదయ మధ్యంలో ప్రాణవాయువు లేనట్టి – అపానవాయువు ఉపశమించి నప్పటి స్థితి :

అపానే ఽస్తంగతే ప్రాణో యావత్న అభ్యుదితో హృది ।
తావత్ సా 'కుంభకావస్థా' యోగిభిర్యానుభూయతే ॥

అటు తరువాత హృదయంలో ప్రవేశించిన అపానవాయువు ఉపశమనం పొందుతోంది. అట్టి సమయంలో హృదయ మధ్యం (అపానవాయువు ఉపశమించి – ప్రాణవాయువు ఇంకా ఉదయించక) ...ప్రాణవాయు రహితమై ఉంటోంది. అట్లు హృదయంలో ప్రాణవాయువు లేనంత వరకు 'కుంభకము' అని చెప్పబడుతోంది. అట్టి కుంభ స్థితి యోగాభ్యాసము చేత మాత్రమే అనుభూతమౌతోంది.

రేచకః కుంభకశ్చైవ పూరకశ్చ త్రిధాస్థితః
అపానస్య ఉదయస్థానే ద్వాదశాన్తాత్ అధోబహిః
స్వభావాః సర్వకాలస్థాః సమ్యక్ యత్నవివర్జితాః
యే ప్రోక్తా స్ఫారమతిభిఃతాన్ శృణు త్వం, మహామతే!

ఈ విధంగా 'ప్రాణాయామము' అనునది రేచక-పూరక-కుంభకములనబడే మూడు విధాలుగా ఒప్పుచున్నది. బాహ్యమున అపాన ప్రారంభ స్థానము నుండి నాసాగ్రము (Nostrils) వరకు గల 12 అంగుళముల ప్రదేశంలో ప్రాణాయామ ప్రక్రియ సాధారణ సమయంలో అసంకల్పితంగా, అప్రయత్నపూర్వకంగా నిరంతరం జరుగుతోంది. అట్లాగే నాసాగ్రం నుండి హృదయప్రదేశం వరకు కూడా నిరంతరం త్రివిధమైన (పూరక-కుంభక-రేచకములు) ప్రాణాయామం జరుగుతోంది.

ఓ మహామతీ! నిర్మల బుద్ధులగు యోగుల తమ సాధనా సారమగు అనుభవం ఎలా ఉంటోందో వినండి.

కుంభకానుభవం -

ద్వాదశాఙ్గులపర్యన్తాత్ బాహ్యాత్ అభ్యుదితః, ప్రభో ।
యో వాతఃతస్య తత్రైవ స్వభావాత్ పూరకాదయః ॥

హే ప్రభో! నాసాగ్రం - బాహ్యమున 12 అంగుళముల దూరంలో గల స్థానం ...ఈ రెండిటి మధ్య గల 12 అంగుళముల ప్రదేశంలో వెలయు వాయువు నందు రేచక, పూరక, కుంభకము లనే త్రివిధ ప్రాణాయామ ప్రక్రియ నిరంతరం జరిగి పోతున్నదని అనుకున్నాం కదా!

మృత్ అన్తరస్థ అనిష్పన్న ఘటవద్యా స్థితిః బహిః ।
ద్వాదశాఙ్గుల పర్యన్తే నాసాగ్రసమసంముఖీ ।
వ్యోమ్ని నిత్యమ్ అపానస్య తం విదుః "కుంభకం" బుధాః ॥

అట్టి ప్రక్రియలో ఆ రెండిటి మధ్య అపానవాయువు ఆకాశము వలె వెలయుచున్నది. బాహ్యమున 12 అం.ల స్థానము వద్ద (At the point at a distance of 12" from Nose) ప్రాణములు అపానవాయువు (Inward Bound air)గా ఇంకనూ రూపుదిద్దుకొనని సమయమొక్కటి ఉన్నది. మట్టి యందు ఇంకను రూపుదిద్దుకొనని కుండయొక్క ఆకారము వలె ప్రాణవాయువునందు అపానత్వము దాగి ఉన్న స్థితి అది. అనగా వాయువు కదులుటకు సిద్ధమై ఇంకా నిశ్చలత్వమును వీడనప్పటి స్థితి. అపానవాయువు యొక్క అప్పటి నిస్పంద స్థితిని 'బాహ్యకుంభకం' అంటున్నారు. అనగా...

బహిరస్తం గతే ప్రాణే యావన్నాపాన ఉద్గతః ।
తావత్ పూర్ణం సమావస్థం బహిష్ఠం కుంభకం విదుః ॥

...బహిరస్థమైన ప్రాణము తన చలనమును త్యజించి కూడా ఇంకా అపానత్వము (Reverse motion) అవధరించక 'సమావస్థ'లో ఉండి ఉన్నంత సమయం... ఆ స్థితి బాహ్యకుంభకం అనిపించు కుంటోంది.

పూరకానుభవం -

బాహ్యోన్ముఖస్య వాయోర్యా నాసికాగ్రావధిర్గతిః ।
తం బాహ్యపూరకం తు ఆద్యం విదుర్ యోగవిదో జనాః ॥

నాసాగ్రాదపి నిర్గత్య ద్వాదశాన్త అవధిర్గతిః ।
యోవా యోస్తం విదుర్ధీరా అపరం బాహ్య పూరకమ్ ॥
ద్వాదశాన్తాద్యదుత్థాయ రూపపీ వరతా పరా ।
అపానస్య బహిష్ఠం తమ్ అపరం పూరకం విదుః ॥

అపానవాయువు చలనము ప్రారంభించి నాసికాగ్రం (ముక్కుపుటలు) చేరుచుండగా ఆ 12 అంగుళముల ప్రదేశంలో బాహ్యపూరకం జరుగుతోంది. ముక్కు పుటల నుండి హృదయ స్థానము వరకు వాయువు ప్రవేశించియున్న సమయంలో అంతరపూరకం జరుగుతోంది.

రేచకానుభవం -

యత్త దన్తర్ముఖత్వంస్యాదపానస్యోదయం వినా ।
తం బాహ్య రేచకం విద్యాచిన్త్యమానమ్ విముక్తిదమ్ ॥

బాహ్యమున నిష్పందమగు ప్రాణవాయువు యొక్క స్పందనమునకు సంబంధించిన ప్రయత్నమే బాహ్య రేచకం. అట్లాగే హృదయమున గల ప్రాణవాయువు బయల్వెడలుటకు ఉపక్రమిస్తున్న ప్రయత్నమే అంతర్‌రేచకం.

బాహ్య-అభ్యంతర కుంభకాదులను-ప్రాణాపానములస్వభావమును గమనించటం :

బాహ్యానాం, అభ్యంతరాంశ్చ ఏతాన్ కుంభకాదీన్ అనారతమ్ ।
ప్రాణాపాన స్వభావాంస్తాన్ బుద్ధ్వా భూయో న జాయతే ।
అష్టావేతే మహాబుద్ధే రాత్రిందివమను స్మృతాః ॥

ఈ బాహ్య-అభ్యంతరీయమునగు ప్రాణ-అపానముల యొక్క కుంభక - రేచక - పూరకముల అనావృత్త (Non-Moving, Non-Avocative) స్థానములను గ్రహిస్తూ ఉండగలిగిన మహనీయునకు ఇక పునర్జన్మకు కారణములుండవు. అనగా అట్టి జీవుడు పునర్జన్మరహితుడగుచున్నాడు.

నాచే ఈ చెప్పబడుచున్న 'బాహ్యపూరక-కుంభక-రేచకములు, అంతర్‌పూరక-కుంభక -రేచకములు, బాహ్య-అంతరంగ అనావృత్త స్థితులు' అనబడే వాయులీయమైన 8 అవస్థలు రాత్రింబవళ్లు బుద్ధిపూర్వకంగా అభ్యసించుచు రాగా, అట్టి జీవునకు తప్పక సులభంగా ముక్తి లభిస్తుంది. అనగా అతడు మనోవృత్తులను క్రమంగా జయించి 'స్థిరత్వము'ను అనుభూతం చేసుకో గలుగుతాడు.

ఈ దేహవాయువులు అతి చంచలములైనవి సుమా! అయితే, అభ్యాసబలంచేత వాటి చంచలత్వం జాగ్రత్తులోను, స్వప్నంలోను, సుషుప్తిలోను, కదులుచున్నప్పుడు, కదలకుండనప్పుడు అన్ని కాలము లందూ, అన్ని వేళలందూ నిరుద్ధం (control) కాగలవు. అనగా, అవి అభ్యాసవశంగా బుద్ధికి లోబడి ఉండగలవు. బుద్ధిపూర్వకంగా ఈ రేచక - పూరక - కుంభకములను అనుష్ఠించు జీవుని మనస్సు ఆయా భోజనాది కార్యములు ఆచరిస్తున్నప్పటికీ కర్తృత్వశూన్యమై వెలయగలదు.

ప్రాణచింతనారతుడగు వాడు అల్పసమయంలోనే దృశ్యవస్తువులను పరిత్యజించి కైవల్యమును పొందుచున్నాడు. ఒక శాకాహారి బాటప్రక్కన పడి ఉన్న చచ్చిన ఎద్దు యొక్క చర్మమాంసములను ఏ విధంగా ఏవగించుకుంటాడో ఆ విధంగా ప్రాణాయామ సాధకుడు విషయాకర్షణలకు స్వభావ సిద్ధంగా దూరంగా ఉంటాడు.

నాచే ఇంతవరకూ వర్ణించబడిన ప్రాణచింతనను అభ్యసించిన అనేకులు కృతబుద్ధులై పొంద వలసిన దానిని పొందారు. సర్వావస్థలందునూ అట్టి ప్రాణదృష్టిని అవలంబించినవారు మరల బంధములను ఆశ్రయించటానికి కారణములుండవు. ప్రాణాపానములను నిరుద్ధం చేసి, తత్త్వజ్ఞానం పొందగలిగినాడు – ఇక అతడు సర్వదా సర్వకార్యములు ఒనర్చుచున్నప్పటికీ తనకు తాను సర్వదా నిర్మల స్వభావముననే వెలయుచున్నాడు. అతడు మోహమును పొందక, సుఖంగా ఉంటున్నాడు.

❖

ప్రాణవాయువు హృత్‌పద్మదళము నుండి లేచి 12 అంగుళ భాగమువరకు ప్రసరించి నిశ్చలంగా ఉండటమే “ప్రాణము యొక్క అభ్యుదయం.”

అట్టి ద్వాదశాంగుళ స్థాన శేషప్రాంతం (Residual space) నుండి హృదయ పద్మమున ప్రవేశించి నిశ్చలంగా ఉండుటయే “అపాన వాయువు యొక్క అభ్యుదయం.”

ప్రాణవాయువు ద్వాదశాంగుళ పరిమిత శూన్యస్థానమునకు ప్రవహించుచున్నప్పుడు, అదే సమయంలో అపాన వాయువు అదే మార్గం అవలంబించి లోనికి జొచ్చుచూ ఉంటుంది.

ప్రాణవాయువు బహిరాకాశము వైపుకు ఉన్ముఖమై ఒక అగ్నిశిఖవలె, సూర్యకిరణ కాంతివలె ప్రవహించుచుండగా, అపానవాయువు హృదయాకాశము వైపు నీటి వలె క్రిందికి ప్రవహిస్తోంది. చంద్రరూపమున, చంద్రకాంతుల వలె, శీతల ప్రదేశ జలం వలె చల్లబరుస్తోంది.

శ్రీవసిష్ఠ మహర్షి : మిత్రమా! ఈ ప్రాణా–పానముల గమన లక్షణముల గురించి, వీటికి దేహముతో గల అవినాభావ సంబంధం గురించి మరికొంత వివరించండి.

భుశుండుడు : అంతర్గతమైన ప్రాణవాయువు సూర్యుని లేక అగ్ని రూపమున ఈ శరీరమును పరిపక్వమొనర్చుచూ ఉంటుంది. ప్రాణవాయువు హృదయాకాశమును ముందుగా తప్తమొనర్చి, ఆ తరువాత ముఖాగ్రభాగమును (The outerspace of face) కూడా తప్తమొనర్చుచున్నది.

అపానవాయువో... నిమేష మధ్య కాలంలోనే ముందుగా ముఖాగ్రభాగమును తప్తమొనర్చి ఆ తరువాత హృదయాకాశము వైపుగా కూడా ప్రవహించి నైర్మల్యం చేస్తోంది.

ఎక్కడైతే ప్రాణము అపానమును దాని కళలతో సహా గ్రహిస్తోందో అట్టిది బ్రహ్మస్థానము. ఆ బ్రహ్మపదమును పొందువారు ఇక జగత్‌భ్రమలను పొందరు.

అట్లాగే, అపానము ఎక్కడైతే ప్రాణమును, దాని కళలను గ్రహిస్తుందో అచ్చోటి పరమ పదమును పొందినవారు జన్మరహితులగుచున్నారు.

❖

ఓ మునిసత్తమా! ప్రాణవాయువే బహిరంతరాకాశములందు సూర్యుని రూపమున ప్రకాశిస్తోంది. అట్లా ప్రకాశిస్తూ, ఇంతలోనే ఆహ్లాదకరమగు చంద్రరూపమును పొందుతోంది. తిరిగి, తాపయుక్తమును పొందుతోంది. ప్రాణవాయువులు సూర్యత్వమును త్యజించి, చంద్రత్వమును పొందుటకు ముందు 'ప్రాణాపానములు ఉత్పత్తికి పూర్వసమయం' అని యోగులు గ్రహిస్తున్నారు. అట్టి పూర్వసంధి సమయంలో ఒకానొక 'ప్రాణవాయువు లయత్వం పొందిన స్థితి' ఏర్పడి ఉంటోంది. ఆ స్థితిలో అశరీరత్వము, నిష్క్రియత్వము, నిర్మనస్కము, అప్రమేయత్వము మొదలైన ఆత్మ యొక్క వాస్తవస్వభావములు అనుభూతములౌతున్నాయి. అట్టి అతీతత్వ స్థితిలో ఆ యోగి, లేక సాధకుడు దేశకాలాది సర్వ పరిచ్ఛిన్నములకూ అతీతుడై, అనిర్వచనీయ తేజోరాశి అయి వెలుగొందుచున్నాడు. అనగా, అతడు ఈ మనస్సు–హృదయముల మధ్య 'ప్రాణాపానముల మధ్యస్తము' అను సాధన సహాయంతో స్వాధిష్ఠానమగు తన రూపమును గ్రహిస్తున్నాడు. అట్టి స్వస్వరూపమగు పరమాత్మ యొక్క అనుసంధానమును బడసి పునర్జన్మరహితుడగుచున్నాడు.

యోగి తన హృదయంలోనే మధ్యగా ఉదయాస్తమయములు (ప్రాణా–పానముల ఉత్పత్తి, లయం, ఉభయములూ రహితమైన స్థితి), గమనాగమనములు కలిగి తేజోవంతుడగుచున్నాడు. ఎవడు తన యందు మనఃసహితమగు ఆత్మభగవానుని (లేక, ప్రాణయోగ పరిభాషలో చంద్ర సహితుడగు సూర్యుని) గాంచుచున్నాడో... ఆతడే యథార్థ ద్రష్ట. ఈ బయట ఉన్న చీకటి ఉన్నా ఫరవాలేదు. లేకున్నా ఫర్వాలేదు. ఎవ్వడైతే తన హృదయమున ఉన్న అంధకారాన్ని నిర్మూలించు కుంటాడో, ఆతడే ప్రకృతిసిద్ధమగు సిద్ధిని బడసినవాడు. 'బయట చీకటి తొలగాలి' అని అనుకుంటే, అప్పుడు జగత్తును ఉద్దేశిస్తూన్నట్లే కదా! కానీ ఈ ద్రష్ట దృశ్యము కంటే అత్యంత సూక్ష్ముడు. హృదయంలో అంధకారం క్షీణించిందా, ఇక మరుక్షణమే ఆత్మ అవలోకితమగుచున్నది. ఉదయ అస్తమయముల వంటి ఈ ప్రాణాపాన సమన్వితమగు ప్రాణశక్తి యొక్క ఆరాధన హృదయమున గల పెనుచీకటిని తొలగించుటకు సమర్థమగుచున్నది. ప్రాణతత్త్వమును చక్కగా, బుద్ధిపూర్వకంగా గ్రహించి... అనుకరించు వారికి ముక్తి కరతలామలకమగుచున్నది. అందుచేత శ్రద్ధగా ప్రాణ తత్త్వమును ఆశ్రయించి జ్ఞానసూర్యుని దర్శనం పొందవచ్చు.

అపానము ఎక్కడ అస్తమిస్తోందో, ఆ హృదయ విభాగ స్థానమునందు ప్రాణశక్తి ఉదయించి బహిర్ముఖమగుచున్నది.

ఈ ప్రాణ – అపానముల ఉదయాస్తమయములు 'నీడ తొలగిన చోట ఎండ రావటం, ఎండ వచ్చే చోట నీడ తొలగటం' వంటిది. ప్రాణ– అపానాలలో ఒకటి తొలగిన చోట రెండవది ఉత్పన్నమౌతూ ఉంటుంది. మొట్టమొదట ఈ యోగరహస్యాన్ని చక్కగా, సుస్పష్టంగా గ్రహించాలి–

ప్రాణవాయువు అస్తమించగా అపానవాయువు అభ్యుదయస్థితి – బాహ్యకుంభకం

అపానవాయువు అస్తమించి ప్రాణవాయువు ఉదయించు స్థితి – అంతఃకుంభకం

ఈ బాహ్యకుంభకం గాని, అంతఃకుంభకం గాని, రెండూ గాని అవలంబిస్తూ వస్తే, ఇక అట్టి సాధకునకు శోకమునకు స్థానమే ఉండదు.

'ప్రసరించు ప్రాణమునంతటినీ రేచకం ఒనర్చి, ఇక స్వచ్ఛమగు కుంభకం అభ్యసించగలిగితే సకల మానసిక రుగ్మతలూ తొలగటం ఖాయం.

బాహ్యరేచక కారణమగు ప్రాణవాయువు లోపలికి ప్రవేశించుటను గాంచినవాడు జన్మరహితుడే అవుతాడు. ప్రాణ - అపానములు రెండు విలీనం పొందితే ఇక శాంతాత్మపదం లభ్యం అవుతుంది.

❖

బాహ్య అంతర 'కుంభక'రూపమగు అపానము ప్రాణమును గ్రహించటానికి ఉద్యమిస్తున్నప్పుడు, ఆ సమయంలో చేసే విచారణచే ఈ దేశకాలములు చిన్మాత్రరూపములుగా గ్రహించబడతాయి. అనగా, ప్రాణము అపానమును హృదయమునందుగాని, వెలుపలగాని గ్రహించటానికి ఉద్యమిస్తున్నప్పుడు, ఆ సమయంలో చేసే విచారణ దేశకాలముల అపరిచ్ఛిన్నత యొక్క అనుభూతికి దారి తీస్తుంది. అప్పుడు దుఃఖరహితపదము సుస్థిరమౌతుంది.

కనుక మహర్షీ! ప్రాణాపానములు రెండు పరస్పరగ్రస్తములైనప్పుడు ఈ సాంసారిక దృష్టికి తారసపడే దేశకాలములు స్వతఃసిద్ధంగానే విలీనం చెందుతాయి.

ప్రతిజీవుడు....ప్రాణవాయువు అస్తమించిన తరువాత అపానవాయువు ఇంకా ఉదయించని స్థితిని రోజంతా పొందుచూనే ఉన్నాడు. దానిని యోగ పరిభాషలో 'అయత్న సిద్ధమగు బాహ్య కుంభకం' అని అంటారు.

అయితే నిర్యత్న సిద్ధమగు అంతఃకుంభకమే పరమపదము. "అదియే ఆత్మయొక్క నిశ్చలస్థితిని ఉపాసించటం" అని యోగులు గమనిస్తున్నారు. అదియే విశుద్ధము-పరము అగు చైతన్యము.

ప్రాణాపానముల సూక్ష్మలయ స్థానం - మేము అసిధారగా నిరంతరం ఉపాసిస్తున్న ఆత్మ విషయమై చెపుతాను... వినండి.

పుష్పంలో సుగంధం ఉన్నట్లు ప్రాణమునకు ఈవలఆవల చిదాత్మ వెలయుచున్నది. అది ప్రాణము కాదు. అపానము కాదు. జలమునందు దాహము యొక్క ఔషధత్వం అంతర్లీనమై ఉన్నట్లు చిదాత్మ ఈ దేహం నందు ఆక్రమించుకొని ఉన్నది. అది సజీవము కాదు. నిర్జీవం కాదు.

ఆ చిదాత్మ ప్రాణలయమునకు సన్నిహితం. ప్రాణచలనములకు దూరస్థం. ప్రాణాపానములకు మధ్యస్థము.

ఆ చిదాత్మ ప్రాణములకే ప్రాణం. జీవమునకు పరమ జీవనము. ఈ దేహం మొత్తం మీద అగ్రగణ్యుడు అతడే. మనస్సు యొక్క మననం... బుద్ధియొక్క బోధకం... అహంకారమునకు అహంకారోత్పత్తి కారణం... - ఇదంతా కూడా ఆ చిదాత్మయందు వెలయుచున్నది. అతడే అంతా అయి వెలయుచున్నాడు. ప్రాణ-అపాన అంతర్గతుడై ఉన్నాడు.

అతడు 'పరంజ్యోతి' అని, 'శుద్ధబ్రహ్మపవిత్రమూర్తి' అని 'సర్వపాపపావనుడు' అని విద్వత్కవులు వర్ణించి చెప్పుచున్నారు. అతడే ఈ 'మనస్సు, బుద్ధి, అహంకారము' అనే భావనలను పొందుచున్నాడు. అయితే తన యొక్క స్వస్వరూపము నుండి ఏమాత్రం చ్యుతుడు కాకయే వెలుగొందుచున్నాడు.

అట్టి నిష్కళంకచిదాత్మమూర్తి, 'అపానవాయువు అస్తమించక-ప్రాణవాయువు ఉదయించని' అనిర్వచనీయమైన చోట అత్యంత సుస్పష్టంగా వెలుగొందుచున్నాడు.

అతడు సర్వవ్యాపకుడు అయి ఉండి కూడా ప్రాణాపానముల మధ్య నాసాగ్ర- ఆకాశప్రదేశంలో దృఢానుభూతిని ప్రసాదిస్తున్నాడు. ఎక్కడైతే ప్రాణాపానములు అస్తమించి, మరల ఉదయించక ఉంటున్నాయో ఆ తావు ఆ చిదాత్మయే.

బాహ్య - అభ్యంతరీయములగు ప్రాణఅపానముల ఉత్పత్తి స్థానము, యోగము యొక్క ప్రారంభప్రదేశం, యోగి యొక్క అంతిమ లక్ష్యము అదే. జీవుడు ఈ 'ప్రాణ-అపానములు' అనే రథాన్ని అధిరోహించి ఉంటున్నాడు. ప్రాణాపానములకు అతడే శక్తి అయి ఉండి, అల్పమేధస్కులకు పరిఛిన్నుని వలె తోచుచున్నాడు. ప్రాణాపానములవలె తోచుశక్తి ఆతడే. 1. హృదయమున 'ప్రాణవాయుకుంభకం' గాను, 2. బయట 'అపానవాయుకుంభకం'గాను, 3. బయటనుండి లోపలికి 'పూరకం'గాను ఆయా భావములందు ఆతడే వివర్తమొందుచున్నాడు.

అంతేకాదు ఆతడు... ప్రాణాపాన పరిచారకుడై, ...అద్దాని అస్థిత్వబోధకుడై, ...ప్రాణోపాసన అభ్యాసమునకు లభ్యుడై, ...రూపహీనుడై, ...జాజ్వల్యమానంగా వెలుగొందుచున్నాడు.

ప్రాణస్పంద హేతువు అతడే సుమా! ప్రాణములు శక్తిస్వరూపమైతే, ఇక, ఆత్మభగవానుడు... 'ఆ శక్తి ఎవరిదో'...ఆతడు సుమా! ఇంద్రియ విషయ స్పర్శ కారణము, విషయానందములకు కల కారణము అతడే.

హే మహర్షీ! ఎవ్వనియందైతే ఈ విభేదనావిభాగ కళంకం ఏమాత్రం లేదో, నిజానికి ఈ కల్పనా సమూహములన్నీ ఎవని నాశ్రయించుకుని ఉన్నాయో, ఎవని వైభవము స్వానుభవమే అయి ఉన్నదో- ఆ సకల దేవతావందితుడు, సర్వశ్రేష్ఠుడు అగు పరమాత్మను మేము ప్రాణ సశాంతస్థాన సేవనం ద్వారా ఉపాసిస్తున్నాం. నిరంతరం శరణు వేడుతూ తరిస్తున్నాం. జగత్తులోని నా రూపం 'జీవాత్మ' ఈ 'జీవుడు' అనుజగన్నాటకంలోని జగత్తులోని నా పాత్రకు ఆధారమైనదే నా "పరమాత్మ రూపం". జీవాత్మచే ప్రాణోపాసన ద్వారా పరమాత్మను ఉపాసిస్తున్నాం. ఇదే మా 'చిరంజీవము' యొక్క మర్మగర్భ రహస్యం.

❖❖❖

11. ప్రాణాపానముల సమాధానం

భుశుండుడు :

ఏషాహి చిత్తవిశ్రాంతిః మయా ప్రాణసమాధినా ।
క్రమేణానేన సంప్రాప్తా స్వయమాత్మని నిర్మలే ॥

నేను ప్రాణములను దిగ్విజయంగా సమాధానపరచాను. చిత్తమున విశ్రాంతి పొంది క్రమముగా నిర్మలాత్మ స్వరూపుడనయ్యాను.

శ్రీవసిష్ఠ మహర్షి : అనగా, మీరు ఉద్దేశపూర్వకంగా ప్రాణాపానములను అవలంబిస్తూ ఉన్నారా?

భుశుండుడు : ప్రాణాపానములకు అంతర్గతమైనయున్న చిదాత్మను అవలంబిస్తున్నాను. అందుచేత... ఒక ప్రక్క ఆ మేరు పర్వతం చలిస్తున్న సమయంలో కూడా నేను కించిత్‌కూడా, ఒక అరనిమిషం కూడా చలించటం లేదు. కూర్చున్నప్పుడు, నిలబడేటప్పుడు, నడుస్తున్నప్పుడు, మేల్కొని ఉన్నప్పుడు, నిదురిస్తున్నప్పుడు ఈ నా 'ఆత్మసమాధి' చెదురుటయే లేదు.

శ్రీవసిష్ఠ మహర్షి : ఈ జగత్తులో నిత్య-అనిత్యాలైన ఇష్ట-అయిష్టాలైన, సుఖ దుఃఖ కారకాలైన ఆయా విషయాలు వచ్చిపోతూ ఉండటం సహజం కదా! ఆ సమయంలో మీ అభ్యాసమెలా ఉంటోంది?

భుశుండుడు : ఆ సమయంలో అంతర్ముఖుడనై స్ఫటిక స్వచ్ఛ భావమగు ఆత్మయందు వెలసి ఉండటం చేత అవన్నీ స్పందింపజాలకున్నాయి.

వాయువు నిరోధింపబడిన నిరోధింపబడుగాక! ప్రబల నదీప్రవాహం అడ్డగించబడిన అడ్డగించ బడుగాక! నేను ఆత్మసమాధి విరుద్ధములగు ఏ విషయములనూ ఏమాత్రం స్మరించటమే లేదు. నాయొక్క దృశ్యవిషయ స్మరణరాహిత్యబలం చేత ఇక్కడ ఏవీ కూడా నా ఆత్మ సమాధికి విఘ్నం కలిగించ లేకున్నాయి.

హే మహర్షీ! ఈ ప్రాణ - అపానగతులను అనుసరిస్తూనే అంతరంగుడు, బహిర్నిలయుడు కూడా అయిన పరమాత్మను దర్శిస్తూ ఉండటంచేత అత్యంత స్వభావసిద్ధంగా సర్వశోకవిషయములకు అతీతుడనై ఉంటున్నాను. ఉత్తమోత్తమ పదమును అలంకరించి ఉన్నాను. ధీరస్వభావుడనై మహా ప్రళయం మొదలుకొని అసంఖ్యాకజీవులు కాలప్రవాహంలో మునగటం, తేలటం సాక్షీభావంగా దర్శిస్తూ వస్తున్నాను. ధీరోదాత్తుడనై, చిరంజీవుడనై ఇక్కడే వెలయుచున్నాను. సర్వఫలేచ్ఛలను జయించివేశాను. దేని పట్లా ఎట్టి అభిమానమూ లేకుండానే ఆయా ప్రాప్తములైన కర్మలు నిర్వర్తిస్తూ ప్రపంచం పట్ల సుషుప్తునిలాగానూ, అనుభవం విషయంలో 'కేవలీస్వభావం"తోనూ ఉండి ఉంటున్నాను. 'ఇది ఇష్టం, ఇది కాదు.....ఇది గ్రహించాలి. ఇది త్యజించాలి' అనే చింతలన్నీ ఆత్మదర్శనదృష్టిచే అత్యంత స్వల్పమైనవిగా గాంచుచున్నాను. కేవలం పరమాత్మయందే వెలయుచుండుటచే రాగము లేదు. మనోరాగ (జాడ్య) రహితమగుటచే చిరంజీవినయ్యాను. ప్రాణాపానసమయోగసమయంలో నిర్వర్తించే 'సమనుస్మరణ' యొక్క ప్రభావముచేతనే నాకు కేవలాత్మానుభవసంతుష్టియందు ప్రవేశం లభించింది. 'ఇది పొందాను; అది పొందలేదు; ఇక ఇది పొందుతానో, లేదో...?' మొదలగు చింతలు దరిజేరనీయకపోవటమే నా చిరంజీవత్వము యొక్క రహస్యం.

నా విషయం గాని, పరుల విషయం గాని, దేనినీ... ఎన్నడూ స్తుతించటం లేదు, నిందించటం లేదు. అందుచేతనే ఇట్టి మహత్ శుభమును పొందగలిగాను. శుభములకు పొంగటం, అశుభములకు క్రుంగటం... ఇదంతా స్వల్పత్వాన్ని తెచ్చిపెట్టుకోవటమే కదా! ఆ రెండిటి విషయంలోనూ సంతోష దుఃఖములను అనుసరించకుండా యథాతథంగా నేను ప్రాణాపానములను ఆశ్రయించటం కొన సాగించటం చేతనే చిరంజీవత్వం నాకు స్వభావసిద్ధమవుతోంది. సర్వ ద్వైతబాధ లక్షణములను

త్యజించిన వాడనై 'పరమ త్యాగము' అవలంబించి సర్వమునూ సర్వదా త్యజించి ఉన్నాను. అందుచేత ఏర్పడిన బుద్ధిబలంచేత జీవితాభినివేశమనతగు మరణమును కూడా త్యజించివేశాను.

ప్రాణానుకరణ బలం చేత నా మనస్సు చాపల్యరహితమై శోకహీనమై క్రమంగా స్వస్థతను, సమాహితస్థితిని పొందింది. ఆకాశమువలె కాష్టమును, స్త్రీని, కొండను, గడ్డిపరకను ఒకే స్పందనతో గాంచుచున్నాను.

"ఈ రోజు ఏంచేశాను? రేపు ఏంచేయాలి?" అనే చింతన నాకు లేదు. ఈ శరీరానికి సంబంధించిన హాని-వృద్ధులతో నేను సంబంధం పెట్టుకోవటం లేదు. "ఇతడు మిత్రుడు, అతను కాదు, ఇతను మాకంటే వేరు, వీళ్లు అయినవాళ్లు, వాళ్లు కాని వారు" – అనే క్రీనీడ దరి జేరకుండా ఎల్లప్పుడూ ఆత్మజ్ఞానాగ్నిని ప్రజ్వరిల్లజేయుచున్నాను. "చైతన్యభగవానుడగు నేనే నానాత్వముగా కూడా ఏర్పడి, తద్వారా నాకు కనిపించేదంతా అయిఉన్నాను. కనుక నాకు వేరైన నానాత్వం ఎక్కడా లేదు. ఉండదు" – అను అచ్యుత భావన సృష్టీకరించుకొని ఉంటున్నాను. ప్రాణ–అపానముల మధ్య నిత్యతృప్త స్వభావంచే వెలసి ఉండటం చేత 'ఈ దేహమే నేను' అనే అభిమానం నాకు కలగటమే లేదు.

గాఢ నిద్రపోయేవాని దృష్టిలో ఈ జగత్తు మొదలంటా 'లేనిది'గా అవుతుంది. చూచారా? అట్లాగే సర్వకర్మల ఆరంభదశనుండి 'ఈ జగత్తు లేదు' అని గ్రహించియే ఉంటున్నాను. ఆయా కాలములందు వచ్చి వెళ్లే అర్థానర్థములను ఈ కుడి–ఎడమ చేతులను చూస్తున్నట్లు సమానభావముతో గాంచుచున్నాను.

'స్వరూపచ్యుతి' లేనట్టి 'స్థైర్యశక్తి'తో ఇతరుల పట్ల సర్వభూతాత్మభావన కలిగినవాడనై చూస్తున్నాను. స్నేహమయమైన మనోదృష్టులతో అంతటినీ ఋజువుగా (Straight forwardly), అకుటిలముగా (Non viciously) దర్శిస్తున్నాను. ఈ శరీరం మీద, తల నుండి క్రింద పాదములవరకు – ఎచ్చటా, దేని మీదా కొంచెం కూడా అభిమానం లేదు. 'అహంకారం' అనే బురదను 'ప్రాణాపానముల సంధి' అనే జలంతో పరిశుభ్రపరిచి స్వస్థుడనై ఉన్నాను. అభిమాన శూన్యుడనై ఉండటం చేత ఏది శారీరకంగా ఈ ఈ కార్యములు నిర్వర్తిస్తున్నప్పటికీ మనస్సు మాత్రం నిత్య నిర్మల నైష్కర్మ్య సిద్ధిని బడసింది. ఎప్పుడైనా ఏదైనా నూతన విషయం కొంచెం తారసపడినప్పుడు నా మనస్సు 'ప్రాణాతీత – అలౌకిక – అనిర్వచనీయ చిదాత్మోపాసన' వలన గర్వదోష రహితమై ప్రవర్తిస్తోంది.

ఇతరులను పరాభవించే సందర్భము, సామర్థ్యము ఏర్పడినప్పుడు కూడా నేను ఇతరులను పరాభవించను. నా బుద్ధి స్థిరత్వం పొంది ఉండటం చేత ఒకవేళ ఇతరులు పరాభవిస్తున్నప్పటికీ నాకు దుఃఖలేశం కూడా కలగటం లేదు. సర్వభూతములందున్న చిదాత్మను సదా దర్శిస్తూ ఉండటం చేత సర్వసమదర్శినై సర్వత్రా ఏర్పడి ఉండగలుగుచున్నాను.

అందుచేతనే నేను చిరామయజీవిని. సర్వదా సమాహితుడనై ఉంటూ, ఇక ఆశాపాశజనితమగు చిత్తవృత్తులను హృదయంలోనికి జొరనివ్వటం లేదు.

బహిర్విషయములందు మౌనం వహించి వాటినన్నిటినీ అసత్తుగా గాంచుచున్నాను. ఆత్మ విషయము నందు అనుక్షణం ప్రబుద్ధుడనై ఈ చేతులను చూస్తున్నట్లుగా దాని సత్తను గాంచుచున్నాను.

❖

పరుల కష్టసుఖముల పట్ల అవి నాకే అబ్బినట్లు దుఃఖించుచు, సుఖించుచున్నాను. అందరికీ నేను ప్రియుడనే.

ఆపదల పట్ల నిర్లిప్తుడనై అచలుడనై, ధీరుడనై ఉన్నాను. 'అయ్యా! భుశుండా! నీవు జగన్మిత్రుడవయ్యా' అని నాకు నేను సర్వదా గుర్తు చేసుకుంటున్నాను. ఈ సంపదల హెచ్చుతగ్గులు నేను పొందటం లేదు. నేను నేను గాను. నాకు 'నా' అనువారు ఎవరూ లేరు. నేను ఎవరికీ చెందను. నాకు ఎవరూ చెందరు. ...అయినా కూడా ఈ దృశ్యమాన జగత్తంతా నేనే!

"నేనే దేశ కాలములను విభజిస్తున్న ఆకాశమును" – అనే సమాధానము సంపాదించుకున్నాను. 'అంతయూ నిండియున్న అద్వితీయుడను' అను ఆత్మాహంకారబుద్ధి నాయందు అణువణువునా ఏర్పడి ఉన్నది. ప్రాణాపానముల లయస్థానంలో నన్ను నేను ప్రతిక్షేపించుకొని ఈ తదితరమంతా దర్శిస్తున్నప్పుడు 'ఇక్కడ కనబడే మట్టి – మట్టికుండ, కొయ్య – శకటము' ఇవన్నీ 'చిత్'గా అత్యంత స్పష్టమై నాకు గోచరిస్తున్నాయి.

అట్టి దృష్టిబలం చేత నేను అనామయ చిరంజీవత్వం పొందాను. ఈ పాంచభౌతిక దేహంతో 'భుశుండవాయసము' అని ఒక ప్రక్క పిలువబడుతూనే, ఇక్కడ ఉండి 'బ్రహ్మాసాగరంలో తరంగములు' అనతగ్గ ఈ త్రిలోకముల జన్మ–స్థితి–లయములకు మూలస్థానంగా నన్ను నేను గాంచుచున్నాను.

❖

ఈ జగత్తులన్నీ ఉత్పత్తి అగుచున్నదెక్కడ? ఇవన్నీ భావనయొక్క ఘాత – ప్రతిఘాతములే అని నేను గ్రహించాను. "సర్వసాక్షియగు ఆత్మయందే మనోబుద్ధులను ఆశ్రయించి ఈ జగత్తులు ఉత్పత్తి – పతనములను పొందుచున్నాయి' అని గమనిస్తున్నాను.

❖❖❖

12 వీడ్కోలు

భుశుండుడు : హే మహర్షీ! ప్రాణాపానముల మధ్యస్థమగు అనుభవయోగముచే నేను ఎట్లా చిరంజీవుడనైనానో చెప్పాను. మీ యొక్క దర్శనముచే ఆత్మజ్ఞానానుభవం పొంగిపొరలుతోంది. అందుకే జ్ఞానసాగరస్వరూపులగు మీముందు స్వతంత్రించి నా ఆత్మానుభవమును వర్ణించాను.

శ్రీవసిష్ఠ మహర్షి : హే భగవంతుడా! భుశుండా! మీరు చెప్పిన వాక్యముల వెనుక దాగిన మహత్తర తత్త్వాన్ని చూచి నేను ఆశ్చర్యపడుచున్నాను. మీరు మహాత్ములు. చిరంజీవులు. ద్వితీయ బ్రహ్మ వలె వెలుగొందే మిమ్ములను దర్శించే మహద్భాగ్యం ఈ రోజు నా కబ్బింది. ధన్యుడను. హే ప్రభూ! పావనమొనర్చ గల అఖండితమగు ఆత్మైక్యవాక్యాలు మీరిప్పుడు పలికారు.

నేను దేవతల ఐశ్వర్యములను, విద్వాంసుల జ్ఞానసంపదను చూచాను. మిమ్ములతో పోల్చగల తత్త్వజ్ఞాన సంపన్నులు చాలా చాలా అరుదుగా మాత్రమే కనిపిస్తారు. మీవంటి పూర్ణతప్తస్వరూపులు తారసబడటం అత్యంత దుర్లభమని నేను ఘంటాపథంగా చెప్పగలను.

అనేక ముత్యపు చిప్పలు వెతికిన తరువాత ఎక్కడో ఒకచోట అత్యంత విలువైన ముత్యం గల ముత్యపుచిప్ప కనుగొనినట్లు మీ దర్శనం ఈ రోజు లభించింది. ముక్తపురుషులు, పుణ్యాత్ములు అగు మీతో సంభాషించటం ఒక మహత్తర యోగసాధనా ఫలంగా నేను భావిస్తున్నాను.

ఇక నాకు సెలవు ఇప్పించ ప్రార్థన. మధ్యాహ్న కృత్యములు ఆచరించటానికై స్వగృహమైన సప్తఋషి మండలం జేరవలసియున్నది.

అప్పుడు భుశుండుడు తాను ఆసీనుడై ఉన్న వృక్షం నుండి నా ముందుకు వచ్చి నిలిచారు. సంకల్ప కల్పితమైన రెండుచేతులతో పువ్వులు కోసి నాకు అర్ఘ్య-పాద్యములు సమర్పించారు. ఆకాశ మున పయనమై వెళ్లుచున్న నన్ను సాగనంపుతూ ఆమడదూరం ఎగురుతూ వచ్చి అనుజ్ఞను పొంది వెనుతిరిగారు. సాగరంలో తరంగం అదృశ్యమైనట్లు నేను అక్కడ నుండి అదృశ్యుడనై నిజాశ్రమం జేరాను. సాధుజన సంగమం ఎంతటి మధురమైనదో, ఆనందప్రదమైనదో చెప్పటానికి నాకు మాటలు చాలవు.

ఓ రాఘవా! ఈ సంఘటన కృతయుగారంభంలో 200 సంవత్సరాలు గడిచిన తరువాత జరిగింది. ఇప్పుడు త్రేతాయుగం వచ్చింది 4000 ఏళ్లు గడచిన తరువాత నీవు జన్మించావు. భుశుండుడు ఆ కొండపైనే అజరారూపంలో ఉండి ఉన్నాడు.

విన్నావు కదా రామా! భుశుండుని కథలోని అంతరంగ కథనాన్ని గ్రహించి నీవు నీ ఉచిత - అనుచితములను నిర్ణయించుకో. ఈ కథనం పఠించినవాడు జరామరణముల పట్ల భ్రాంతి తొలగి అసత్యమగు మాయను సత్వరం దాటివేయ గలడు.

❖❖❖

13. దేహభావం భ్రమ మాత్రమే

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! భుశుండుని వృత్తాంతం విన్నావు కదా! ఆతడు ప్రాణాభ్యాస పూర్వకంగా ప్రాణనియామకదృష్టిని అవలంబించి 'జ్ఞానయోగం' నిరంతరం ఆశ్రయించి ఉంటున్నాడు. తత్ఫలితంగా బ్రహ్మపదమును పొంది ఉన్నాడు. నీవు కూడా అభ్యాస - వైరాగ్యములను ఆశ్రయిస్తే ఆతడు పొందిన స్థితి తప్పకుండా పొందగలవు. నిర్లిప్తబుద్ధితో ప్రాణాపానములను అభ్యసించే వారికి చిదాత్మైక్యభావం చాలా సులువుగా లభిస్తోంది.

ఇప్పుడు నీకు రెండు విజ్ఞాన దృష్టుల గురించి చెప్పటం జరిగింది - 1. ప్రాణ నిరోధము, 2. జ్ఞాన విచారణ... ఈ రెండిటిలో నీకు ఏది నచ్చితే ఆ మార్గంలో ప్రయత్నించు. లేదా, రెండింటినీ మేళవిస్తూ నీ సాధన కొనసాగించు. అతి త్వరలో ఆత్మైక్యానుభవం నీ ముంగిట వచ్చి వాలగలదు.

శ్రీరాముడు : ఓ భగవంతుడా! వసిష్ఠమహర్షీ! మీరు భూలోకసూర్యులై జ్ఞాన కిరణములను ప్రసరింపజేసి మా ఆత్మ స్వరూపమును కప్పిపెట్టి ఉంచే హృదయాంధకారమును పటాపంచలు చేస్తున్నారు... ఇక మేము ప్రబుద్ధులమై, ప్రవిష్టులమై స్వస్వరూపమున ప్రవేశిస్తున్నాం. అపర వసిష్ఠులవలె వెలయుచున్నాం.

మీరు ఇప్పుడు అలౌకిక ఆనందప్రాప్తికి కారణముగల భుశుండుని విశేషాలు చెప్పారు. ప్రాణాపానముల 'గతి'ని వివరిస్తూ ఈ అస్థి - చర్మ నిర్మితమగు ఈ శరీరం గురించి కొన్ని సూక్ష్మతరమైన విషయాలు చెప్పారు.

అయితే స్వామీ!... అసలు ఈ శరీరం ఎట్లా నిర్మించబడింది? ఇది ఎటు నుండి ఇక్కడకు వస్తోంది? ఇది ఎట్లా స్థితి కలిగి ఉంటోంది? ఇందులో నివసించేవాడు మరెక్కడి నుండి వచ్చి ఇక్కడికి చేరాడు? ఈ శరీరానికి - శరీరికి సంబంధం కలగటానికి కారకులగుచున్నదెవరు?... ఈ విషయాలు విశదీకరించమని నా ప్రార్థన.

శ్రీవసిష్ఠ మహర్షి : నీ ప్రశ్నలకు ఏదైతే సమాధానమైయున్నదో... అయ్యది పరమార్థతత్త్వాన్ని చక్కగా గ్రహించటానికి, దోషములన్నీ దూరీకరించటానికి మనకు ఉపకరించగలదు. నీ ప్రశ్నలకు సమాధానం విను.

❖

అస్థి-చర్మయుతమై, రక్త-మాంస విలేపితమగు ఈ శరీర గృహం ఎవరూ నిర్మించి ఉండలేదు. జీవుని శ్వాస వలె, వాయువు యొక్క చలనములాగా, నది యొక్క ప్రవాహం వంటిదై కన్పట్టు ఈ శరీరం "ప్రవాహపతితంగా, కాకతాళీయంగా" ఏర్పడుతోంది. జలంలో ప్రతిబింబించే చంద్రుని లాగా ఈ దేహచమత్కారం ఒక 'అలీకము (Illusion) లేక "అభాస" మాత్రమే. చంద్రుడు జలంలో ప్రతిబింబించటానికో, లేక దృశ్యము దర్పణంతో ప్రతిబింబించటానికో ఒక కర్త కావాలా? అక్కర్లేదు కదా! మిథ్యామయమగు ఈ శరీరం కూడా ప్రతిబింబిత చంద్రుని లాగా 'సత్-అసత్'రూపమై వెలయుచున్నది. దీని కర్తృత్వం ఎవ్వరికీ ఆపాదించలేం!

వస్తుతః ఆకాశంలో ఒక్క చంద్రుడు మాత్రమే ఉన్నప్పటికీ మెల్లకన్ను గలవానికి భ్రాంతి చేత రెండు-మూడు చంద్రులు ఉన్నట్లు అగుపడుతుంది. చూచావా? ఈ శరీరం కూడా అట్లే అగబడుచున్నది. ఇది స్వతఃగా లేదు. కాని దేహభ్రాంతి ఉన్నవానికి ఇది ఉన్నట్లే అగపడుతోంది. అందుచేతనే 'ఇది సదసదాత్మకం' అని విజ్ఞులు వర్ణించి చెప్పుచున్నారు. ఒక విధంగా ఉన్నది, మరొక విధంగా లేదు.

స్వప్నము వాస్తవానికి మిథ్యయే కదా! నీటి కంటే వేరుగా నీటిబుడగ ఉన్నదా?... అయినప్పటికీ అవి వేరు వేరుగా కనిపిస్తున్నాయి. నీటి బుడగ అనేది ఆకారం దృష్ట్యా మాత్రమే అయినప్పటికీ నీటి దృష్ట్యా అసత్యమే కదా!

అట్లాగే ఆకారాదుల దృష్ట్యా ఈ దేహము సత్యమువలె అనిపిస్తున్నప్పటికీ, ఆత్మదృష్ట్యా ఈ దేహము మిథ్యయే అని గ్రహించు.

ప్రతిభాస కారణంగా ఎడారిలో ఎండమావులు కనిపించి అమాయక జీవులకు జలభ్రాంతిని కల్పిస్తున్నాయి. అదే, అనుభవముగలవానికి, లేదా, దగ్గిరకు పోయి చూచినవానికో 'ఇక్కడ జలము ఉండదు. తరంగాలూ ఉండవు' – అని తెలిసిపోతోంది. అట్లాగే అల్పజ్ఞానానుభవం ఆవరించి ఉన్నప్పుడు శరీరము యొక్క ఉనికి ఘనీభూతమై ఉంటోంది. ఆత్మబోధచే, "ఈ శరీరము–దీనిచే ఏర్పడే అనుభవజ్ఞానం అసత్ మాత్రమే' అని తెలియవస్తోంది. 'అభాసమాత్రమే' అగు ఈ శరీరము ప్రముఖమైనట్లు, దీని అనుభవమును గాంచుచున్న ఆత్మవస్తువు శరీరముకంటే ప్రత్యేకము, ఉత్కృష్టము, అసంబంధితము అయికూడా అముఖ్యమైనట్లు భ్రమ ఏర్పడి ఉంటోంది.

శ్రీరాముడు : ఈ శరీరము ఆత్మకు ఏర్పడటానికి అసలు కారణం?

శ్రీవసిష్ఠ మహర్షి : 'నేను ఈ శరీరమును' అను రూపంలో గల ఆత్మయొక్క చమత్కారమైన స్వయంకృత సుదృఢభావనావేగమే శరీరము యొక్క అనివార్య భ్రమకు కారణం. అయితే జ్ఞానదృష్టికి 'ఈ శరీరభావన కేవలం భ్రమ' అని తెలియవస్తోంది.

ఓ రామా! ఈ శరీరభ్రాంతి జీవునకు ఉండవలసిన అవసరమే లేదు. ఈ క్షణమే నిశ్శంకగా నిశ్చింతగా దీనిని విడచివేయవచ్చు... ఎందుకంటావా?... కేవలం సంకల్పమాత్రంచే ఇట్టి వేలాది స్వప్న సదృశంగా శరీరాలు కలుగగలవు. లయించగలవు. ఇట్టి సంకల్ప నిర్మిత శరీరాలలో దేనిని గ్రహిస్తావు?... దేనిని త్యజిస్తావు?

శ్రీరాముడు : శరీరం పోయినప్పుడు కూడా ఈ జీవుడు ఉంటాడు కదా! అప్పుడు జీవుడు ఉంటున్నది ఎందులో? శరీరాలు ఏ మూలనుండి వచ్చి పడుతున్నాయి?

శ్రీవసిష్ఠమహర్షి : హాయిగా మృదువైన తల్పంపై నిదురిస్తున్న ఒకవ్యక్తి స్వప్నంలో ఏర్పడే దేహములతో దిక్కులన్నీ తిరిగివస్తున్నాడు. ఆ స్వప్న సంబంధిత స్వ–పర దేహాలన్నీ ఎక్కడి నుండి వస్తున్నాయి? ఏ దేహంతో ఈ జీవుడు స్వప్నానుభవం చవిచూస్తున్నాడు?

జాగ్రత్‌లో కూడా మనస్సు అనేక చోట్ల తిరిగి వస్తోంది. ఏ శరీరంతో? అంతా ఊహ చేతనే కల్పించబడుతోంది కదా! ఈ జాగ్రత్‌లో ఏర్పడే 'రాజ్యం ఏలటం, పరస్పర ప్రేమాభివేశాలు, సంబంధ–బాంధవ్యాలు, క్రీడా వినోదాలు'–అన్నీ కూడా 'ఊహ'యే తమయొక్క మూలముగా కలిగి ఉన్నాయి. స్వప్నంలోని దేహాలన్నీ ఊహచే నిర్మించబడుచున్నట్లే, ఈ జాగ్రత్‌లోని వ్యవహారాలకు కూడా ఊహయే మూలం. అందుకే ఇది 'జాగ్రత్‌స్వప్నం' అని, స్వప్న వ్యవహారమును 'స్వప్నజాగ్రత్' అని పిలుస్తూ ఉంటారు.

స్వప్నంలోని బంధువుల వలెనే ఈ జాగ్రత్ దృశ్యానుభవమంతా మనోకల్పితమే. అట్లాగే ఈ మాంస–అస్థిమయ పృథ్వీ–జల–ఉష్ణ–వాయు ఇత్యాది సమావేశరూపమైన పార్థివ శరీరం కూడా మనోకల్పితమే నని గ్రహించు. సంపదలు, శరీరము, దేశము మొదలైనవన్నీ చిత్తము నందలి సంకల్పములచే కల్పించబడే విలాసములు మాత్రమే.

దీర్ఘస్వప్నమిమం విద్ధి దీర్ఘం వా చిత్తవిభ్రమమ్ ।
దీర్ఘం వాపి మనోరాజ్యం సంసారం రఘునన్దన ॥ (శ్లో. 28, సర్గ 28)

రఘునందనా! నీవీ సంసారమును దీర్ఘస్వప్నం గానో, దీర్ఘచిత్తభ్రాంతి గానో, దీర్ఘ మనోరాజ్యం గానో గ్రహించు. నా ఈ వాక్యములలోని వాస్తవత్వం 'జ్ఞానసూర్యుడు' నీలో ఉదయించిన మరుక్షణం సుస్పష్టంగా అవగతమౌతుంది. జాగ్రత్ సమయంలో స్వప్నం 'లేనిదే' అయినట్లు జ్ఞానలాభసమయంలో ఈ జగత్ మిథ్యయే అయి కనబడుచున్నది.

ఇతఃపూర్వం కమలజన్ముడగు బ్రహ్మదేవుని ఉత్పత్తి గురించి చెప్పేటప్పుడు 'సంకల్పకల్పనామయ మగు మనస్సే ఆడంబరమగు ఈ విచిత్రజగద్రచనకు ఉపక్రమిస్తోంది' అని అనుకున్నాం కదా! అట్లాగే నీకు కనబడుచున్న ఈ శరీరం కూడా మనస్సు యొక్క ప్రతిభాస మాత్రమే. మనస్సు దేనిని ఎట్లా భావిస్తే అది అట్లే అవుతోంది. మనస్సు యొక్క కల్పిత అభాసయే జీవునిచే జగత్తుగా చూడబడుతోంది.

పూర్వదేహం తరువాత ఈ దేహం కల్పించబడినట్లు ఈ దేహం తరువాత కల్పించబడబోయే దేహాలు కూడా కల్పితమాత్రములే. వాసనాధిక్యతను అనుసరించి ఈ శరీరము సంఘటితమౌతోంది. భవిష్యత్ కూడా అట్లాగే సంఘటితమవబోతోంది. అయితే స్వతఃగా పూర్ణుడవైన నీవు ఈ శరీర-జగత్ సంకల్పములన్నిటికీ అతీతమైనవాడవు సుమా! నీ యొక్క పురుషకారమును ఉపయోగించి మనస్సును అంతర్ముఖం చేస్తే వాస్తవ స్వరూపమేమిటో గోచరమౌతుంది. అప్పుడు 'ఇదంతాచిన్మాత్రమే' అని గ్రహించగలుగుతావు.

ఓ రామా! ఈ ఎదురుగా పంచేంద్రియములకు తారసపడుచున్న దృశ్యజగత్తును 'అన్యథా'గా భావించావా, అన్యమే అవుతుంది.' 'ఇది, అది, నేను, నాది, మేము, మాది, వారు, వీరు'- మున్నగు భావనలు ఇతఃపూర్వం అనేకసార్లు మననం చేయటం చేత ఆ భావనాదార్ఢ్యం చేత ఇదంతా ఆత్మ స్వరూపుడగు ఈ జీవునకు నీకు వేరై ఉన్న దానివలె భ్రమింపజేస్తోంది. భావన యొక్క గొప్పతనం ఎంతటిదంటే, ఏ భావన దృఢంగా చేయబడుతుందో అదియే సత్యమై అనుభవమౌతుంది. కాముకునకు తన ప్రియురాలే అన్ని వైపులా కనబడుతుంది. అది భావన యొక్క ప్రభావమే కదా! రాత్రి కల కనే టప్పుడు అప్పటికి అది పరమసత్యంలాగానే అనుభవమౌతోంది. ఎందుచేత? మరి అప్పటి భావన అట్టిది.

భావనాబలం చేతనే ఈ సంసారం సత్యంగా తోచటం జరుగుతోంది. స్వప్నంలో కొద్ది నిమిషాల కాలం అనేక రోజులుగా తోస్తోంది చూచావా! అట్లాగే, సంకల్పమాత్రం, క్షణికం అగు ఈ సంసారం దీర్ఘాతిదీర్ఘంగా తోచుచున్నది. ఎండమావులు తటాకరూపంలో స్ఫురిస్తున్నట్లు అసత్యమైన, భౌతిక పరమైన ప్రియాప్రియ సంబంధ బాంధవ్యాలు సంకల్ప పరంపరల బలం చేతనే నిలచి ఉంటున్నాయి.

ఒక చిత్రమైన కంటిజబ్బు వలన ఆకాశంలో మయూరపింఛాలు కనిపిస్తాయి. దోష రహితమైన చూపు గలవానికి ఆకాశం మాత్రమే కనిపిస్తుంది. సమదృష్టి గలవాడు సంకల్పమాత్రజనితమగు ఈ సంసార సంరంభమును చూచి దూరంగా ఉండి నవ్వుకుంటున్నాడు. సంసార దోషముచే

పరితప్తుడైన జీవుడు ఇక్కడ దుఃఖము, భయము, వేదన, అవమానము, మమకారము, నిరుత్సాహము కలిగించ గల అనేక విషయపరంపరలు గాంచుచున్నాడు. బాలుడు స్వసంకల్పిత మనోరాజ్యంలో పులిని, నక్కను, దయ్యమును ఊహించి ఉలిక్కిపడి బిగ్గరగా ఏడ్చునట్లు సంసారాసక్తుడు అడుగడుగుకు అనేక ఆందోళనలు తెచ్చిపెట్టుకుని మరీ అనుభవిస్తున్నాడు.

శ్రీరాముడు: ఆ భయం తొలగేది ఎట్లా, మహర్షీ?

శ్రీవసిష్ఠ మహర్షి : ఆత్మ ఒక్కటే ఇదంతా ప్రసరించి భాసిస్తూ ఉండగా ఇక భయాదులు ఎవరికి, ఎవరి వలన కలగాలి? భయము పొందుచున్న జీవుడు తన అజ్ఞానం తొలగించుకున్నాడా... ఇక ఆతడు నిర్మలుడు, శుద్ధుడు అయి ఈ జగత్ మోహమునకు లోనవడు. కనుక 'సమ్యక్ దర్శనం' అను అభ్యాసమే ఉత్తమమైన ఉపాయం. జ్ఞానం సుస్థిరమైన చోట ఇక సంసారం ఉండదు. సమ్యక్ దర్శనంచే మనోబుద్ధులను విశుద్ధపరుస్తూ తద్వారా జ్ఞానం సుస్థిరపరచాలి.

శ్రీరాముడు : సమ్యక్ దర్శనం అంటే ఏమిటి?

శ్రీవసిష్ఠ మహర్షి : ఈ జగత్తంతా అభాసమాత్రమేనని, ఇది సత్తుగాని, అసత్తుగాని కాదని గ్రహించటం. జీవితం, మరణం, స్వర్గము, జ్ఞానం, అజ్ఞానం, నీవు, నేను, సమస్త సంసారం, దిక్కులు – ఇవన్నీ చిదాభాస అని తెలియటమే సమ్యక్ దృష్టి. ప్రయత్నబలం చేత తప్పకుండా యథార్థదర్శనం ఈ జీవునకు సాధ్యపడుతుంది.

యథార్థదర్శనం లభించిన తరువాత ఇక మనసు సత్యము, నిత్యము అయిన 'సర్వగత స్వస్వరూపం' నుండి చ్యుతి పొందదు. ఈ ప్రపంచం యొక్క సత్ – అసత్ లక్షణాన్ని గ్రహించి క్రమంగా నిష్కామంతో కూడిన పరమశాంతిని పొందుతుంది. మనస్సు దేనినీ నిందించదు. స్తుతించదు. దుఃఖించదు, సంతోషించదు. ఆ జీవుడు తాపత్రయరహితమగు పూర్ణత్వమును ఆశ్రయించి ఉండటం చేత సమాధాన పూర్వకమైన ప్రశాంతానందమును పొందుతాడు.

అందరికీ మరణం అనివార్యమే అయినప్పుడు నా మరణం గురించి గాని, నా బంధువుల మరణం గురించి గాని దుఃఖించవలసిన పనేమున్నది?

జన్మించిన ప్రతివాడు అంతో, ఇంతో సంపదలు, ఆపదలు అనుభవించక తప్పేది కాదు. ఇక ఇందులో సంతోషించవలసినదీ, వేదన చెందవలసినదీ ఏమున్నది?

బృంహత్యుదేతి స్ఫురతి బుద్బుదౌఘ ఇవార్ణవే ।
ఇదం హి జగతాం జాలం కిమత్ర పరిదేవనా ॥ (శ్లో 57, సర్గ 28)

సముద్రంలో అసంఖ్యాకంగా తరంగాలు లేచి పడుచున్నట్లు ఈ సంసార సముద్రంలో జగత్తులు లేచి, పెరిగి, విప్పారి, చివరకు లయించిపోతున్నాయి. ఇందుకు గాభరా ఎందుకు?

ఇట్లా ఉంటుంది... అతని అవగాహన. సద్వస్తువు ఎప్పటికీ సద్వస్తువే. అసత్తు అసత్తే. అసత్ ఎన్నటికీ 'సత్' అవజాలదు. ...మాయ ఆత్మ సమక్షం యొక్క వైచిత్ర్యం మాత్రమే. ఇక ఈ

శరీరమంటావా... ఇది అవిద్యా కామ్యకర్మ యొక్క విచిత్ర దోషముచే ఉదయిస్తోంది. భూత - భవిష్యత్ - వర్తమానకాలాలలో 'నేను' అనబడేది ఆత్మకు వేరై లేనేలేదు. ఇక ఇక్కడ దుఃఖమునకు తావెక్కడిది?

తత్త్వదర్శియందు "ఈ శరీరము కంటే నేను భిన్నుడను. చిదాత్మయే అయి ఉన్నాను. ఇక క్రొత్తగా సంపాదించే సద్భావమేమిటి? ఇప్పుడు అసద్భావం ఉండటమేమిటి? నేను దేని కొరకై క్రొత్తగా ఎందుకు దుఃఖించాలి?" అను రూపంలో ఉండే దృఢనిశ్చయం తొలగదు. అందుచేత, అతని మనస్సు ఈ సంసారంలో ఉదయించనే ఉదయించదు. సకల బాహ్య వస్తువులందు ఉద్వేగము తొలగి కేవలీ బ్రహ్మభావన అఖండశాంతపూర్వకంగా సంతరించుకుంటుంది. తిత్తిరపక్షి తన గూటిని నిర్మించుకోవటానికి కోమలమైన తృణకణములను ఎంచుకుంటున్నట్లు ఆ బ్రహ్మవేత్త సంసారములోని అసారము నంతా వదిలి, దాని విశేషాల పట్ల ఏమాత్రం ఆసక్తి, నమ్మకం లేక, కేవలం బ్రహ్మజ్ఞాన సంబంధిత విషయాలను మాత్రమే దృష్టిలో పెట్టుకుని ఉంటాడు.

గట్టిత్రాటి చేత ఎద్దు కట్టబడినట్లు, ఇష్ట-అయిష్ట-రాగ-ద్వేషాది రూపమైన 'సంసారాసక్తి' చేతనే మనిషి బంధించబడి నీచత్వమునకు, స్వల్పత్వమునకు ఈడ్వబడుచున్నాడు.

అందుచేత రాఘవా! నీవు ఈ సంసారం ఏర్పడుచున్న వైనమంతా జాగ్రత్తగా గమనించు. 'ఆసక్తి, అనాసక్తి' అను రెండిటినీ త్యజించి నిరామయుడవై సంచరించు. కేవలం కర్తవ్యమైనదానిని మాత్రమే ఆచరించు. అకర్తవ్యమును ఎన్నడూ ఆచరించవద్దు. 'ఈ జగత్తు అభాస మాత్రమే' అని గుర్తు పెట్టుకుంటూ ఉంటే, క్రమంగా అట్టివాని హృదయం శీతలమౌతుంది. ఈ సర్వపదార్థముల మీదా భ్రాంతి త్యజించి సర్వమూ బ్రహ్మచైతన్యముయొక్క అభాసమాత్రంగా గ్రహించు. ఆ తరువాత చిత్త కల్పనాకళంకమగు ఆ అభాసభావన కూడా త్యజించి భావాభావరహితుడవై వెలుగొందుము. చిదాకాశమయుడవు కమ్ము. నీ రూపమును సర్వగామి, సర్వవర్ణనలకు అతీతము, సర్వసమము అగు నిత్యనిర్మలాకాశముగా గాంచుము. ఆపై అనుభవమాత్రమే గాని, మనం మాటలు ఉపయోగించి ఏమీ చెప్పుకోలేం.

1.నేను 'అహమ్' అను ప్రత్యయ పరిమితుడను గాను, 2.ఈ భోగజాలమంతా సత్యం కాదు.

...ఈ రెండు భావాలు అంతరంగంలో సుస్థిరమైన మరుక్షణం ఈ ఆడంబర దృశ్యజగత్తు వ్యర్థమగు 'మోహము' అనే అనర్థాన్ని కలిగించజాలదు. (లేదా)

1. నేను సర్వసముడను, సర్వమయుడను, 2. 'ఎరుక' అను చిత్స్వరూపుడను. తెలుసుకొంటున్న నేను తెలియబడేదానిచే బంధించబడటం ఎట్లా సంభవం?... అని అయినా భావించవచ్చు.

పై దృష్టులలో నీకు ఏది రమ్యమని అనిపిస్తే, అది ఆశ్రయించు. లేదా... రెండింటినీ మేళవించి సమాశ్రయిస్తూ, క్రమంగా, అంతరంగంలో ఉండే రాగద్వేషాలను క్షయింపజేసి, అటుపై ఈ జగత్తులో హాయిగా విహరించు. ఓ రామా! స్వర్గ - మర్త్య - పాతాళ లోకములలోని దేని పట్లా రాగద్వేషములు లేనివాడు నిబద్ధింపబడడు. ఇది సత్యం.

❖

మూఢులగు జనులు రాగద్వేషసహితులై అనేక కార్యక్రమములలో నిమగ్నమై ఉపాధియున్న దినములన్నీ అల్ప ఆశయములతో గడిపివేస్తున్నారు. చివరికి ఆ కార్యక్రమములన్నీ వ్యర్థ విపరీత ప్రయోజనములకే దారి తీస్తున్నాయి. తగలబడుతున్న వనంలోంచి సాత్వికజీవులగు జింకలు పరుగులు లంకించుకుంటున్నట్లు, రాగద్వేష దూషితమైన చిత్తములోంచి సాత్వికగుణాలు బయటకు వెళ్ళిపోవుచున్నాయి.

రాగద్వేషములు ప్రవేశించని హృదయం కల్పతరువు. అతని వద్ద లభించనిదేమీ ఉండదు. చమత్కారం చూచావా, రామా? కొందరు శాస్త్రప్రవచనపాటవాలు కలిగిఉండికూడా తమలోని రాగద్వేషములు గుర్తించి, త్యజించలేకపోతున్నారు.

"నేను సంపదలకు అర్హుడను. అనర్హులంతా సంపదలు సంపాదిస్తున్నారు. నేను పొందవలసినవి పొందలేకపోతున్నాను"... ఇట్టి అనేక తుచ్ఛధనేచ్ఛలను, సంసారప్రమత్తతలను ఆశ్రయించి శాశ్వతవస్తువును కోల్పోవుచున్నారు ఈ జనులు...!

ధనము, బంధువులు, మిత్రులు, ప్రతిష్ఠలు - ఇవన్నీ వస్తూ పోతూ ఉంటాయి. ఆ పరమేశ్వరమాయ ప్రియాప్రియములగు భావాభావములు కల్పించి ఈ జగద్వ్యవహారాన్ని తనదైన శైలిలో నడుపుతోంది.

ఈ క్షణిక జగత్తునందు అనురాగమేమిటి? విరాగమేమిటి? దీనిపట్ల ఉపేక్షయే మేలు. భోగ లోలుడగు వ్యక్తిని దృష్టిలో పెట్టుకుని 'మాయ' అనే మాంత్రికుడు ఈ జగత్తులోని వస్తువులను, వ్యవహారములను, సంఘటనలను రచించుకొని పోతున్నాడు. ఇక్కడ కనిపించే ధన, జన, దేహము లన్నీ మిథ్యయే గాని వాస్తవం కాదు. మధ్యలో ఏర్పడి, మధ్యలోనే లేకుండా పోయేవి వాస్తవమెట్లా అవుతాయి? ఆది – మధ్య – అంతములలో ఉండేది కేవలం ఆత్మ ఒక్కటి మాత్రమే. ఆద్యంతములలో సత్యము గానిది మధ్యలో మాత్రం సత్యమెట్లా అవుతుంది?

శ్రీరాముడు: మీ ప్రతిపాదన తిరస్కరించటానికి వీలు లేనిదని నేను ఒప్పుకుంటున్నాను. అయితే, జీవులంతా మనోవ్యథచే బాధింపబడుచున్నారు కదా! రంగుటద్దాలవంటి మాయపొరలు తొలగేది ఎట్లా?

శ్రీవసిష్ఠ మహర్షి: త్రికాలముల చేత బాధించబడేది ఏదైనా సరే అట్టి దానిపై ఆసక్తిగొన్నామా, ఇక అట్టి ఆసక్తి యొక్క పరిణామం మనోవ్యథయే అగుచున్నది. 'ఒకడు అభూతకల్పన కల్పిస్తే మరొకడు అందులో ప్రవేశించి పచార్లు చేస్తున్నాడు' అనే వాక్యం ఎట్టిదో ఈ సంసారభ్రమ కూడా ఒక మాయా జీవుడు కల్పిస్తే అనేక మంది మాయాజీవులు ఇందులో ప్రవేశించి గొప్ప ఆసక్తితో గంతులు వేస్తున్నారు.

ఓ రామా! నీవీ సంసారభ్రమయందు పడవద్దు సుమా! ప్రాణివర్గముతో కూడిన ఈ సంసారమును తత్త్వజ్ఞులు ఒక గారడీని చూచినట్లు చూస్తున్నారు. మూఢులను మాత్రం ఇది ఎంతో కలవరపెడుతోంది. ఇదంతా సుదీర్ఘమైన స్వప్నంలో కనిపించే ఒక నగరం వంటిది. 'అజ్ఞానము'

అనే నిద్రకు ఉపపక్రమించేవానికి మాత్రమే ఈ సంసారస్వప్నం వాస్తవానుభవమై ప్రాప్తిస్తోంది. సర్వత్రా అనుశ్రుతమగు ఈ సుదీర్ఘ స్వప్నసదృశ సంసారమును ఖాతరే చేయవద్దు.

శ్రీరాముడు: ఈ జీవునికి సంసారమనేది ఎక్కడ నుండి వచ్చిపడుతోంది?

శ్రీవసిష్ఠ మహర్షి: చెప్పాను కదా! ఇదంతా గాఢమగు అజ్ఞాన నిద్రనుండే వచ్చిపడుతోంది. నిధిని పొందినవాడు దరిద్రమును త్యజించునట్లు, నీవీ సంసారమును త్యజించు, ఓ రామా! ఉత్తిష్ఠ! సూర్యుని చూడగానే పద్మము వికసించునట్లు నీవు అఖండము, అప్రమేయము, నిత్యము, సత్యము స్వస్వరూపము అగు ఆత్మ యందు మెళుకువ తెచ్చుకో. ప్రబుద్ధుడవై లేచి సర్వత్రా నిండియున్న నీ అనామయ ఆత్మ స్వరూపమును గాంచుము. సుశీతలమగు జ్ఞాన వాక్యములను నేను నీపై వర్షింప జేయటం నీవు ప్రబుద్ధుడవై, పరమజ్ఞానమును పొందటానికే కదా! ఈ నా మేలుకొలుపు వాక్యం (ఉత్తిష్ఠవాక్యం) ప్రతిఒక్క శ్రోతకు, ప్రతిఒక్క పాఠకునికి ఉద్దేశ్యించినదే సుమా!

ఓ సర్వసభికులారా! మీరంతా మీ యొక్క సత్యస్వరూపమును దర్శించెదరు గాక! వాస్తవానికి మనలో ఎవ్వరికీ జన్మదుఃఖ దోషభ్రాంతులు తమంతట తాముగా లేవు. అందుచేత భ్రాంతిపూర్వకమగు జగద్విషయములను ప్రక్కన ఉంచి, ఆత్మయందు సుస్థిరులై వెలయుదురు గాక! ఓ రామచంద్రా! నీ యందు వికల్పదోషములకు తావే లేదయ్యా! సారవంతము, విక్షేపరహితము అగు దృష్టిని పొందినవాడవై పరమశుద్ధమగు పరబ్రహ్మమున వెలసియే ఉన్నావయ్యా!

❖❖❖

14. సంకల్పము - మాంసమయ దేహం

స్వస్థచిత్తుడైన రాఘవుడు వసిష్ఠమహర్షి వాక్యాలు వింటూనే ఆత్మయందు విశ్రమించి పరమానందం పొందాడు. ఆ సభలోని అనేక మంది సభికులు కూడా ప్రబోధులైనవారై తమ స్వస్వరూపమునందు తాము ఉపశమనం పొందారు. పొలం నీరుతో నిండగానే రైతు ఆ జల ప్రవాహాన్ని కొద్దిసేపు ఆపుతాడు చూచావా! అట్లా వసిష్ఠమహర్షి శ్రీరాముని అంతరంగ ప్రశాంతానుభవమును గమనించి తన వచనామృతాన్ని కొద్ది సేపు ఆపారు.

కొద్ది క్షణాలైన తరువాత శ్రీరాముడు చురుకైన, సుకుమారమైన తన కళ్ళు తెరచి చిరునవ్వుతో తన సంతృప్తిని ప్రకటిస్తూ తిరిగి వినటం కొనసాగిస్తున్నట్లు కళ్ళలో ఉత్సాహం ప్రకటించాడు. అది చూచి మహర్షి ప్రియశిష్యుని హృదయంలో బోధను సుస్థిరం చేసే ఉద్దేశంతో తన వాక్యములను కొనసాగించారు.

శ్రీవసిష్ఠ మహర్షి: ఓ రామచంద్రా! నీవు చక్కగా బోధింపబడి ఆత్మతత్త్వమును పొందావు. చాలా సంతోషం. అయితే అద్దాని నుండి చలించి, మరల సంసారంలో ప్రవేశించనేవద్దు సుమా!

శ్రీరాముడు: మహర్షీ! ఈ సంసారచక్రం యొక్క పరిభ్రమణానికి అసలైన నాభిస్థానం ఏది?

శ్రీవసిష్ఠ మహర్షి : 'సంకల్పించుట' అనునదే సంసారముయొక్క నాభిస్థానం. హృదయం రాగ ద్వేషములతో సంక్షుభితమై ఉన్నంతకాలం ఈ సంసారము యొక్క నాభి ఎంత ఆపటానికి ప్రయత్నించినా ఆగక తీవ్రవేగంగా తిరుగుతూనే ఉంటుంది. కాబట్టి ఈ సంసారచక్ర పరిభ్రమణం నిరోధించా లనుకుంటే ప్రజ్ఞ-సౌజన్య-శాస్త్రయుక్తమైన పురుషప్రయత్నం కావాలి. చిత్తమును మూర్ఖ కార్యక్రమముల నుండి విరమింపజేయాలి. అసదాత్మకమగు ఈ జగత్తు 'అంతానిజమే' అను రీతిగా అనుభవమవటానికి కారణం అజ్ఞానరూపమగు సంకల్ప పరిభ్రమణమేనయ్యా! 'సంకల్పించుట' అను స్వభావం చేత ఆత్మస్వరూపుడగు ఈ జీవుడు శరీరమును ఆశ్రయించి, విషయవాసనలను కల్పించుకొని జన్మజన్మాంతర పరంపరలను పొందుచున్నాడు.

శ్రీరాముడు : చిత్ర పటంలోని రంగుల రేఖనమువలె ఈ దేహం కారణంగా జీవుడు అనేక సుఖదుఃఖములను నిరంతరం పొందుచూనే ఉన్నాడు.

శ్రీవసిష్ఠ మహర్షి: అవును. అయితే, ఈ దేహము గురించి వగచవలసిన పనేమిటి? చిత్రంలోని శరీరంకంటే కూడా ఈ పాంచభౌతికశరీరం తుచ్ఛమైనది.

ఈ మాంసమయదేహం మనం ఎంతగా రక్షించాలని ప్రయత్నించినా కాలక్రమేణా శిథిలం కాక తప్పదు. అందుకనే, ఈ మాంసమయదేహం కంటే చిత్రపటంలోని మానవుడే నయమని చమత్కారంగా అంటూ ఉంటారు. ఇట్టి మాంసమయ దీర్ఘసంకల్ప శరీరములపట్ల విశ్వాసముగాని, అనురాగంగాని, నమ్మకంగాని ఏర్పరుచుకోవలసిన పనేమున్నది?

ఈ మాంసమయదేహం కంటే స్వప్నమయదేహమే కొంతనయం. ఎందుకంటే స్వప్నదేహం చాలా స్వల్పకాలికం కనుక, అది మాంసమయదేహము పొందేంతగా పెద్ద సంఖ్యలో సుఖదుఃఖములు పొందదేమో!

ఈ మాంసమయ శరీరమును జాగ్రత్తగా పరిశీలించి అర్థం చేసుకుంటే ఇది ఆత్మయొక్క సంకల్పబలం చేతనే నిలచి ఉంటోంది. ఇది వాస్తవానికి మిథ్యయే. మూఢులు మాత్రమే దీని గురించి వ్యర్థంగా దుఃఖం పొందుచున్నారు. నిద్ర పోయేవాని కల కరిగిపోతే నష్టం ఏముంటుంది? మెల్లకన్ను వానికి కనిపించే రెండవ చంద్రుడు కనిపించకుండాపోతే అతడు కోల్పేయేదేమున్నది? ఎండమావులలో నీరు తొలగితే అది విచారించవలసిన విషయమా? అట్లాగే రామా! "సంకల్ప మాత్రము, స్వభావ నశ్వరము - అగు ఈ మాంసమయదేహం వృద్ధి చెందినా నశించినా - దేహి లేక శరీరికి వచ్చే నష్టమేమీ లేదు'.. అనే దృఢభావం నీవు ఎల్లప్పుడూ కలిగి ఉండు.

కల చెదిరి మెళుకువ వస్తే, "కలలో మరణించాను. మెళకువలో జన్మించాను"... అని అనము కదా! వాస్తవానికి ఈ దేహసంబంధమైన జన్మ-జీవన్-మృత్యు-పునర్జన్మలు ఇంతమాత్రమే!

❖

భూషితే దూషితే దేహే న హి కించిచ్చితః క్షతమ్ ।
న చిదస్తముపాయాతి నాత్మా చలతి రాఘవ ॥ (శ్లో 27, సర్గ 29)

నిజానికి ఈ శరీరం దూషించబడినా, భూషించబడినా చైతన్యమునకు అవి సంబంధించవు. ఆత్మ దేనికీ విచలితం కాదు.

స్వస్వరూపమగు బ్రహ్మమునకు వికృతి పొందే అవస్థయే ఉండదు. మరి ఈ దేహము క్షీణిస్తున్నప్పుడు ఆ 'క్షతి'దేనికి? గుండ్రంగా తిరిగే చక్రయంత్రాన్ని అధిరోహించినవానికి నాలుగు దిక్కులలోని వస్తువులన్నీ గిఱ్ఱున తిరుగుచున్నట్లు అగుపిస్తాయి చూచావా? ఆత్మస్వరూపుడగు ఈ జీవుడు 'మనస్సు' అనే చంచల స్వభావాన్ని అధిరోహించి "ఈ దేహంతో బాటే పుడుతున్నాను. దీని తోనే జీవిస్తున్నాను. ఇది వినష్టమైతే ఇక నా పని ఆఖరు" – అని భ్రమిస్తున్నాడు. నీవు మాత్రం ధీర బుద్ధి కలవాడవై, ఈ భ్రమలయందు కూలవద్దు.

సంకల్పమే ఈ దేహము యొక్క నిర్మాత. ఒకడు చీకట్లో త్రాడును చూసి 'పాము' అని అనుకుని అనేక భావవికారాలకు లోనయినట్లు, ఈ దేహము జీవునికి సద్వస్తువువలె భ్రమింపజేస్తోంది. ఇక ఈ శరీరంతో గాంచబడేవన్నీ భ్రమకాక మరేమౌతాయి? వీటి కర్తృత్వమే అసత్యమైనప్పుడు ఇక కార్యములుమాత్రం సత్యమెట్లా అవుతాయి? భ్రాంతి సమయంలో ఈ జగత్క్రియలందు పాల్గొనే ఈ దేహము సత్యమైనదానివలె గోచరిస్తోంది. ఏది ఏమైనా దీనికి స్వకీయమైన కర్తృత్వం లేదు. కర్తృత్వమునకు కారణం ఇచ్ఛ కదా! జడమగు ఈ దేహమునకు ఇచ్ఛ–అనిచ్ఛలు ఎక్కడుంటాయి?

అందుచేత 'ఈ జగత్తుకు కర్త అనువారెవ్వరూ లేరు' అని సిద్ధాంతీకరించబడింది. ప్రకంపన రహితమగు దీపము గదిలో జరిగే కార్యములకు సాక్షిమాత్రమే వెలయుచున్నది చూచావా? ఆత్మ సర్వదా "కేవలద్రష్ట" అయి వెలయుచున్నది. ఆకాశమున సూర్యభగవానుడు ఉండి నిర్లిప్తుడై, నిమిత్తమాత్రుడై దినకృత్యములకు కారణభూతుడగుచున్నట్లు నీవు కూడా ఆత్మత్వం సంతరించుకుని ఈ రాజ్యకార్యాదులకు నిమిత్తమాత్ర కారణుడవై ఉండుము. ఓ సర్వజనులారా! మీరంతా మీ కుంటుంబాది సర్వ కర్తవ్యములందు నిమిత్తమాత్రులై ఉండటం అలవర్చుకోండి.

❖❖❖

15. అహంకారమును ఎదుర్కొనేది ఎట్లా?

శ్రీరాముడు : తండ్రీ! ఈ అహంకారం ఎప్పటి నుండి ఎందుకు ఎక్కడినుండి వచ్చిపడుతోంది?

శ్రీవసిష్ఠ మహర్షి : అసత్యము, శూన్యము అగు ఈ దేహగృహంలోకి ఎప్పుడో వచ్చి అహంకారం ప్రవేశించింది. బాలుడు తన అజ్ఞానంచే కల్పించుకొనిన 'బూచోడు'తో పోల్చతగిన ఈ అహంకార దేహాత్మస్వభావము ఎప్పుడు వచ్చి చేరిందో చెప్పలేం.

అయితే సాధుజనులగు జ్ఞానులు ఈ అహంకారభూతమును దగ్గిరకు రాకుండా చూచుకుంటూ ఉంటారు.

అస్య మా భృత్యతాం గచ్ఛ త్వమహంకారదుర్మతేః ।
అస్య భృత్యతయా రామ నిరయః ప్రాప్యతే ఫలమ్ ॥ (శ్లో 40, సర్గ 29)

ఓ రామా! నీవు ఈ అహంకార భూతమునకు దాసుడవు కావద్దు. దానిని సేవించే వారికి అది మరల మరల నరకలోక దర్శనం చేయించగలదు సుమా!

మహాపురుషులగు జ్ఞానులు ఈ అహంకార మమకారములు అల్లంత దూరంగా ఉండగానే తమను సమీపిస్తున్నట్లు గుర్తిస్తున్నారు. గుర్తించగానే సమాధి-జ్ఞానయోగము మొదలైనవి ఆశ్రయించి తగు జాగ్రత్త పడతారు. ఆ రెండిటినీ పారద్రోలి, ఇక ఆపై ఈ సంసారశూన్యనగరమును చూచి ఏమాత్రం భీతి చెందరు. ఇక తదితర జీవులనేకులు ఈ శరీరగృహములలో నివసిస్తూ అనంతకోటి శరీరములను వినాశన మొనర్చుకొనుచున్నారు. ఎప్పటికప్పుడు 'ఈ శరీరమే నేను' అను బుద్ధిని పదిలపరుచుకుంటున్నారేగాని, అట్టి దోషబుద్ధిని విడవటానికి యత్నించరేం? ఇది ఎంత ఆశ్చర్యం! దీనికి కారణమేమిటో నేను చెప్పలేను. అట్టి మూర్ఖత్వం కొనసాగించుటే అన్ని అనర్థములకు మూల కారణమనుటలో ఏమాత్రం సందేహం లేదు.

గ్రస్తే చిత్తపిశాచేన దేహసద్మని యే మృతాః ।
పిశాచస్యేవ యా బుద్ధిర్నాపిశాచస్య రాఘవ ॥ (శ్లో 45, సర్గ 29)

ఎవరైతే తమ చిత్తమును విడువకయే ఈ శరీరమును కోల్పోతారో వారి పిశాచబుద్ధి యథాతథంగా కొనసాగుతూనే ఉన్నది. ఓ సాధూ! అహంకార పిశాచ నివాసస్థానమగు ఈ దేహం పై విశ్వాసం కలిగి రోజులు గడిపేవాడు పిశాచంతో సమానుడే!

ఈ దేహగృహం శాశ్వతమైనది కాదు. ఈ విషయం ఎవరికి తెలియదు? తెలుసు. అయినా కూడా తగినంతగా పట్టించుకోవటం లేదే! ఏమి ఆశ్చర్యం!

కనుక, ఇంద్రియాల యొక్క, ఇంద్రియ విషయాల యొక్క నశ్వరత్వమును జ్ఞప్తియందు ఉంచుకుని నీవు అహంకారమును సంపూర్ణంగా విడచివేయి. ఆత్మవస్తువును ఆశ్రయించి ఉండు. అహంకారగ్రస్థులై నరకములకు పోదలచుకున్నవారిని కాపాడ గల బంధువు లెవరూ ఉండరు. అహంకారంతో కూడి ఏపని చేసినాసరే, అది విషాన్నంలాగా దుష్ఫలితాలనే ఇస్తుందని సర్వజనులకూ గుర్తు చేస్తున్నాను. ఏ జీవుడైతే వివేకవైరాగ్యములను త్యజించి అహంకారానికే పట్టం కడతాడో, అట్టివాడు అనేక విధముల నష్టం పొందటమే అవగలదని సర్వజీవుల శ్రేయోభిలాషులమగు మేం మునులం హెచ్చరిస్తున్నాం. వారు ఆయా చర్యలచే కాలాగ్నికి ఇంధనమగుచున్నారని వాత్సల్య భావంతో హెచ్చరిక చేస్తున్నాం. వారికి ఇహపరములలో సుఖం లేనేలేదు.

1. దేహతాదాత్మ్యము, 2. మనోచంచలత్వము... ఈ రెండే ఈ దేహ గృహంలో సంచరించే భూత పిశాచాలు సుమా! ఏ దేహకోటరంలో అహంకార సర్పం బుసలుకొడుతూ ఉంటుందో, అయ్యది శీఘ్రంగా దుఃఖమేఘములను ఆహ్వానిస్తోంది. తగు జాగ్రత్త వహించకుంటే వర్తమాన భవిష్యత్తులు ఈ జీవునకు దుర్భరం కానున్నాయని మా హెచ్చరిక.

శ్రీరాముడు : మరి మేము ఈ అహంకారమును ఎదుర్కొనేది ఎట్లా?

శ్రీవసిష్ఠ మహర్షి : ఈ అహంకారం ఉంటే ఉండనీ! ఊడితే ఊడనీ. నీవుమాత్రం మనస్సుతో అహంకారం వైపుగా చూడనేవద్దు. అది లేనిదానిగా, నిష్ప్రయోజన మైనదానిగా భావించి

ఉదాసీనుడవగుము. దానిని లోలోన తిరస్కరించి, దానిని అసలు పట్టించుకోకపోతే, ఇక అది నిన్నేమీ చేయలేదు.

శ్రీరాముడు : మహర్షీ! ఈ శరీరంలో 'చిత్తము' అనే పిశాచం ఉండి ఆత్మను కలుషితం చేస్తోంది కదా? ఎంతవిన్నా మేము ఈ చిత్తమును రహితం చేయలేకపోతున్నాం. ఏం చేయాలి?

శ్రీవసిష్ఠ మహర్షి : శరీరగృహంలో 'చిత్తము' అనే పిశాచం ఉన్నప్పటికీ అనంతవిలాసుడగు ఆత్మకు కలుగగల దోషమేమీ లేదు. ఆకాశము సర్వే సర్వత్రా వ్యాపించి ఉండి భూ-అగ్ని-జల-వాయువులను తనయందు కలిగి ఉండి కూడా, వాటితో ఏమాత్రం సంబంధం లేకయే ఉంటోంది కదా! అట్లాగే ఆత్మయందు ఈ మనోచిత్త అహంకారాలు ఉన్నప్పటికీ ఆత్మకు వాటితో సంబంధం లేదు. చిత్తము యొక్క రూపం ఇష్టమే కదా! ఎవడైతే 'ఈ శరీరమే నేను- ఈ ఇంద్రియ విషయములు నాకు ముఖ్యము' అను చిత్తాహంకారములకు హృదయంలో పెత్తనం ఇచ్చి ఉంటాడో అట్టివాడు పడేపాట్లు నేను మాటలతో చెప్పలేను. 'హాఁ! నేను చచ్చాను. అయ్యో! నేను శరీరం తప్పించి గతిలేని వాడను. శరీరం ద్వారా ఏర్పడే సంబంధాలే వాస్తవం. నేను దుఃఖిని. ఒక జీవుడను. అల్పుడను' అని తలచటమే అహంకార- చిత్తముల విన్యాసం. అది గమనించి హృదయగృహంలో పెత్తనం ఆత్మభగవానునికి ఇవ్వాలి. 'నేను అసంగుడను, అప్రమేయుడను. నిత్యుడను. సర్వాత్మకుడను. శుద్ధుడను' అను ఆత్మస్వభావాన్ని ఆశ్రయించి ఉండాలి. ఆత్మకు మనోచిత్తాహంకారాది మరి దేనితోనూ సంబంధం లేదు. అనగా, 'నా స్వస్వరూపము మనోచిత్తహంకారాలు కావు' అను ధ్యానం కలిగి ఉంటే క్రమంగా ఈ చిత్త పిశాచం ఆటకట్టినట్లే.

శ్రీరామచంద్రా! ఈ జడము, అనివార్య వినాశన సమన్వితము, సర్పరజ్జువు వలె భ్రాంతి భూయిష్ఠము అగు శరీరమును గ్రహించేపని చేస్తున్నది అహంకారమేగాని, ఆత్మకాదు. ఎందుకంటే ఆత్మ సర్వదా నిష్క్రియమైనది. అది పుట్టదు, పెరగదు, ముదుసలి అవదు, చావదు. ఒక పెద్ద వృక్షం పుట్టి, పెరిగి నశించేది ఆకాశంలో అయినప్పటికీ, ఆ జన్మ - వృద్ధి - హాని లతో ఆకాశమునకు సంబంధం లేదుకదా! 'నేను సర్వదా దేనికీ సంబంధం లేని ఆత్మస్వరూపుడను' అని అనునిత్యం అభ్యసించాలి. అంతేగాని 'ఈ చిత్తం, ఈ అహంకారం ఉన్నాయే? ఏం చేయాలి? ఎట్లా తొలగించు కోవాలి?'... అని ఎంతగా పరితపించినా ఎన్ని జన్మలు ఆ విధంగా గడపినా లాభం లేదు. సంబంధం ఉండవలసిన అగత్యం లేనివాటితో సంబంధం పెట్టుకోవటమే చిత్తము యొక్క రూపం. అదే అహంకారం. అదే సంసారం.

దీపము తన యందు ఎట్టి ఇచ్ఛ లేకుండానే గదిలోని ఆయా వస్తువులను కనబడేట్లు ప్రకాశింపజేస్తోంది. అట్లే ఆత్మప్రకాశం చేతనే ఈ 'చిత్తము' అనేది రూపుదిద్దుకుని ప్రకాశమాన మవుతోంది. గదిలోని ప్రకాశమానమయ్యే వస్తువులకు - దీపమునకు సంబంధం లేదు కదా! జడ స్వరూపమగు ఈ చిత్తాహంకారాలకు - ఆత్మకు సంబంధం లేదు. భూమికి - ఆకాశమునకు ఏం సంబంధమయ్యా?

ఓ రఘునందనా! వాస్తవానికి నీవు సర్వజ్ఞమగు ఆత్మయే గాని మరింకేమీ కాదు. మరి నీవు ఈ చిత్తాహంకారాలను చూచి ఎందుకు మోహం చెందాలి? అట్టి మోహమును దగ్గరకు రానీయకు. శూన్య స్వరూపమగు మనః పిశాచము ఆత్మను తాకనైనా లేదు. అయితే అది 'నేను ఆత్మను స్పృశిస్తున్నాను. సంతోషింపజేస్తున్నాను. దుఃఖింపజేస్తున్నాను'...అని మాత్రం అనుకుంటూ ఉంటుంది. అది 'రాజుగారికి నేను ఎంత చెపితే అంతే' అని సేవకుడు అనుకోవటం వంటిది.

సంసారకారి, ధైర్యమును నాశనం చేసేది, అమంగళకరము అగు ఈ చిత్తవిభాగాన్ని విడచిపెట్టి అప్పుడు శేషించేదేమిటో – అద్దానినే ఆశ్రయించి ఉండు.

ఓ సర్వసభికులారా! మరల మరొక్కసారి మీకందరికి గుర్తుచేస్తున్నాను. చిత్తపిశాచముచే ఆక్రమించబడిన అంతరంగం కలవారిని శాస్త్రములు గాని, గురూపదేశములు గాని, బంధుజనులు గాని, మరెవ్వరైనా గాని రక్షించలేరు.

ఇంద్రియ వ్యాపారముల పట్ల ఏర్పడే సత్యత్వబుద్ధి – ఆకర్షణలే చిత్తము యొక్క రూపం. కొంచెం బురదలో ఉన్న దున్నపోతునైతే బయట పడవేయవచ్చు గాని, లోతైన బురదలో ఇరుక్కుని ఉన్న దున్నపోతును లేవదీయటం తేలికైన పని కాదు కదా! ఇంద్రియ వ్యాపారాలలో లోతుగా మునిగి ఉన్న ధ్యాసగల వానిని సంబోధనల చేత ఎట్లా కాపాడటం? అదే కొంచెం ధ్యాసగల వానికో?... అట్టి ధ్యాస తగ్గుముఖం పట్టుచున్న వానికో?... శాస్త్రార్థములు సులభంగా చిత్తశమనం ప్రసాదించ గలుగుతాయి. అందుచేతనే శాస్త్రములు అనేక అభ్యాసములను ప్రతిపాదిస్తున్నాయి.

❖

చిత్తం జగత్తును కలచివేస్తోంది. ఈ దేహపురమును అజ్ఞానమయం చేసివేస్తోంది. అంతరంగం నందు చిత్తము బీభత్సపూర్వకమైన తాండవం చేస్తుంటే భయపడనివారెవ్వరు?

ఆహా! రామా! ఈ జగన్నగరంలో కొద్ది దేహగృహాలలో మాత్రమే చిత్తపిశాచం యజమానియగు ఆత్మకు అంకితమై ఉంటోంది. అందుచేత ఆ కొద్ది దేహగృహాలు సాధుత్వమునకు నివాస వసతులకు యోగ్యమై ఉంటున్నాయి. మిగతా జగత్తు చిత్త పిశాచమునకు మాత్రమే నివాసయోగ్యమౌతోంది. ఈ జగదరణ్యం అధికభాగం 'మోహము' అనే చెత్త కుప్పలచే నిండి ఉంటోంది.

కేవలం ధృతి పూర్వకమైన పురుష ప్రయత్నంచేతమాత్రమే మమకార – అహంకార భూతపిశాచములను పారత్రోలటం సాధ్యం.

నీవు మాత్రం అజ్ఞాన ఏనుగును సంహరించే సుజ్ఞాన సింహంలా ఈ సంసారారణ్యంలో విహరించు. అంతేగాని గడ్డిపోచలను తింటూ క్షణక్షణం భయముతో రోజులు గడిపే లేళ్ళలాగా విషయములను భక్షిస్తూ ఆయుష్షు వృథా చేసుకోకు. బంధుజనుల పట్ల ఏర్పడే మమకారాదుల వలన, విషయేచ్ఛల వలన ఏర్పడే ఆనందం అత్యంత క్షణికమాత్రమని గ్రహించు. ఇక దాని పరిణామమో, మహాభయ – దుఃఖ – భ్రాంతి. ఇది గమనించి, సాధుజనులమార్గమును అనుసరించు. మహార్థము (The final essence)ను విచారించు. ఆత్మను ఒక్కదానినే ఆశ్రయించు. అంతేగాని,

అపవిత్రము – తుచ్ఛము – దుర్భరము – క్షణభంగురము – దురాకృతిసమన్వితము అగు ఈ శరీరము కొరకై విషయసుఖములందు మునుగవద్దు. ఎందుకంటే అట్టి మార్గంలో 'చింత' అనే క్రూరమగు రాక్షసి పొంచి ఉండి, నీ జ్ఞానధనం మ్రింగి వేయటానికి ఎత్తులు వేస్తూ సిద్ధంగా ఉన్నది.

ఈ శరీరమును 'సంకల్పము' అను పేరుగల ఒకడు నిర్మించాడు... 'అహంకారము' అను మరొకడు వచ్చి దీనిని ఆశ్రయించాడు... 'మనస్సు' అను ఇంకొకడు ఇక్కడి సుఖదుఃఖములను అనుభవిస్తున్నాడు... ఈ మూర్ఖ సంసారచక్రం విచిత్రంగా పరిభ్రమిస్తోంది.

జీవులంతా ఇది ఎంతగానో గమనించవలసిన విషయం సుమా!

❖❖❖

III. దేవతార్చన
(శ్రీ సాంబశివ - వసిష్ఠ సంవాదము)

1 అర్చన-నిర్వచనం

శ్రీవసిష్ఠ మహర్షి: శిలకు ఘనత్వమే రూపమై ఉన్నది. మరింకేదీ (గుండ్రం, చదరం మొదలైనవి) అసలైన రూపం కాదు కదా! అట్లాగే ఆత్మకు చిత్, సత్తా సామాన్యము అనునవే రూపములై ఉంటున్నాయి. దేహములు, సుఖదుఃఖాది భోగములు, జగత్తు మొదలైనవి ఆత్మయొక్క రూపం కాదు.

పాషాణం నుండి పాషాణత్వం వేరు కాదు. ఘటం (కుండ) కంటే ఘటత్వం వేరు కాదు. అట్లాగే మనస్సు ఆత్మకంటే వేరు కాదు.

ఓ రామచంద్రా! ఒకప్పుడు కైలాసనాథుడు, భక్తవత్సలుడు అగు సాంబశివుడు ఈ విషయం గురించి, తత్త్వదర్శనము యొక్క ఉపాయం గురించి నాయొక్క సంసారదోష నివారణార్థం నాకు బోధించటం జరిగింది. 'మనస్సనేది ఆత్మ కంటే వేరుకాదు' అనేది సుస్పష్టపరుస్తూ మనోమార్గమైన దేవతార్చన అనే ఒక మహత్తరవిషయం సుబోధపరచారు. ఆ విషయములు ఇప్పుడు ప్రస్తావిస్తాను.

❖

స్వర్గలోకమునకు ఆవల 'కైలాసం' అనే పేరుగల ఒక పర్వతం ఉన్నది. అక్కడ అర్ధేందుశేఖరుడగు శివుడు జగన్మాత పార్వతితో కూడి ప్రమథగణసమేతుడై ఉంటూ ఉంటారు. నేనొకసారి శిష్యగణంతో ఆయనను పూజించటానికి కైలాసశిఖరం సమీపించాను. అక్కడ గంగానది ఒడ్డున ఒక ఆశ్రమం నిర్మించుకొని శివలింగం ప్రతిక్షేపించి ఇక రోజూ పూజించటం ప్రారంభించాను. తపోనియమములను అవలంబించి కొంతకాలం గడిపాను. ఆ సమయంలో సిద్ధ పురుషులు అక్కడకు వచ్చి నాకు తాత్త్విక విషయాలు విశదపరుస్తూ ఉండేవారు. శివతత్త్వం గురించిన సంభాషణతో ప్రశాంతంగాను, ఆనందంగాను, సువిజ్ఞానసమృద్ధంగాను రోజులు గడచిపోతూ ఉండేవి.

ఒకరోజు నా పూర్వకృతమైన పుణ్యం ఫలించింది. ఆ రోజు శ్రావణమాసం, కృష్ణపక్షం, అష్టమి తిథి. సాయంకాలం ప్రదోషకాలం గడచింది. నేను ఒకచోట ఆసీనుడై హృదయపూర్వకంగా శివభగవానుని స్మరిస్తూ ఉన్నాను.

అది సాయం సమయం దిక్కులన్నీ నిశ్శబ్దంగా ఉన్నాయి. చీకటి క్రమంగా పరిసరాలన్నీ ఆక్రమించ వేయసాగింది. క్రమక్రమంగా జంతువులు తమతమ నివాసాలను జేరటం చేత ఏమాత్రం వాటి అలికిడి వినబడటం లేదు. ఆ పరిసర వాతావరణమంతా కాష్టంలాగా స్పందరహితంగా ఉంది.

నిమిషాలు మౌనంగా గడచిపోతున్నాయి. కళ్ళు మూసుకుని ఉన్న నన్ను, ఏదో తెల్లటి కిరణం తాకినట్లు అనిపించి కనులు తెరచాను. దూరంనుండి ఏదో తెల్లటి వెలుగు ఆ ప్రదేశాన్ని సమీపిస్తున్నట్లు గమనించాను. క్రమంగా దిక్కులు తేజఃపుంజములతో నిండి ప్రకాశించసాగాయి. కొంచెం చకితుడనై నిలబడి జ్ఞాన దృష్టితో నలువైపులా పరికించి చూచాను. ఆహా! పరమాశ్చర్యం!

భగవంతుడు, చంద్రకళాధరుడు, దేవాదిదేవుడు అగు మహాదేవుడు అమ్మ పార్వతీదేవి చేయి పట్టుకుని, నందీశ్వరుడు త్రోవ చూపుచుండగా, మేమున్న పర్వతసానువు వైపుగా వస్తున్నారు. నేను శిష్యులను ఉత్సాహపరచి అర్ఘ్యపాద్యములు, పుష్పాంజలులు తీసుకొని ఎదురేగాను. పాదపద్మాలకు సాష్టాంగ దండప్రణామాలు సమర్పించి కళ్ళకు హత్తుకుని జగత్‌మాతాపితరులను ఆశ్రమానికి భక్తిపూర్వకంగా గొనివచ్చాము. పుష్పాసనం సమర్పించాము. మందార పుష్పములతో అభిషేకించాము. బహువిధ స్తోత్ర పాఠములతో శాస్త్ర–భక్తియుక్తంగా పూజించాం. అట్టి స్తోత్రపూజలచే మా అందరి అంతఃకరణం సుశీతలమైంది.

అటు పై సుఖాసీనులై లోకరక్షకుడగు చంద్రశేఖరుడు అమృత వచనాలతో ఇట్లా ప్రశ్నించారు.

శ్రీశివ భగవానుడు : పుత్రా! వసిష్ఠా! నీవు, నీ శిష్యులు కుశలమే గదా!

శ్రీవసిష్ఠ మహర్షి : దేవేశ్వరా! సర్వలోకాధీశ్వరా! మహేశ్వరా! భవానీపతీ! త్రిలోచనా! మీ 'నామ స్మరణ' అనే మంగళప్రదమగు శుభకార్యమున నిమగ్నమైన వారికి ఇక దుష్ప్రాప్యమనేది ఏముంటుంది? నీ యెడ భక్తి గలవారికి ఇక భయం ఉండదు. సర్వ విధములా, సర్వదిక్కులా అభయమే! నీ అనుస్మరణానందమును గ్రోలు చిత్తము గలవారు అందరికీ పూజ్యాతిపూజ్యులౌతారు.

ఎచ్చట శివస్మరణ జరుగుతుందో – అదియే దేశము, అదియే జనపదము, అదియే పర్వతము. హే ప్రభో! నీ స్మరణయే పూర్వపుణ్యఫలము. వర్తమాన పుణ్యకర్మల అభివర్ధకము. భవిష్యత్ సుఖవృక్ష బీజకము. హే భూతపతీ! మిమ్ములను స్మరించటమంటే ధైర్యము – జ్ఞానము – మోక్షముల ప్రాకారం సమీపించటమే అవుతుంది. మిమ్ములను పూజించటమనే చింతామణి దొరకటానికి నేను ఎంతటి పుణ్యం చేసి ఉంటానో!

శ్రీశివ భగవానుడు : చాలా సంతోషం నాయనా! మరి... నీ చిత్తము శాంతిని పొంది పరమపదమున సుస్థిరం మంగళప్రదం అయి ఉంటోంది కదా?

శ్రీవసిష్ఠ మహర్షి : హే భగవాన్! మీ దయ వల్ల దిక్కులన్నీ పూర్ణమై శాంతమై శివమై కన్పట్టుచున్నాయి.

శ్రీశివ భగవానుడు : మంచిది. ఇప్పుడు నీకేమైనా సంశయాలుగాని, ఏమైనా తెలుసుకోవాలని గాని ఉన్నదా?

శ్రీవసిష్ఠ మహర్షి : హే పరంధామా! నాకు ఒక్క విషయంలో మీ ప్రవచనం వినాలని ఉన్నది. ఆ విషయం మీ ముందు ప్రస్తావిస్తాను. నాపై దయతో నాకు వివరించమని ప్రార్థిస్తున్నాను–

"ఉద్విగ్నరహితము, పాపక్షయకరము, సర్వకళ్యాణవర్ధకము అనునిత్యాచరణకు సులభాతి సులభం అగు ఒకానొక 'దేవతార్చనావిధానం' గురించి శ్రీశివ భగవానుడే విశదీకరించగల సమర్థులు'

అని మునిలోకంలో ఒకానొక ప్రతీతి ఉన్నది. ఈ సందర్భంలో నా మనస్సులో ఆ విషయం తళుక్కు మని మెరిసింది. ఆ దేవతార్చన (లేక) పూజా విధానం గురించి మీ నుండి తెలుసుకోవాలని ఉన్నది. నాకు, మీ బిడ్డలగు ఈ నా శిష్యులకు ఆ దేవతార్చన గురించి ప్రవచించమని విన్నపం చేస్తున్నాను.

శ్రీశివ భగవానుడు: బిడ్డా! చాలా ఉచితమైన విషయమే అడిగావు. జీవునకు ముక్తి ప్రసాదించగల ఒకానొక ఉత్తమమైన అర్చన గురించి చెపుతాను. బుద్ధి కుశలత, భక్తి ప్రపత్తులు గల నీవు, నీ శిష్యులు అందుకు తప్పక అర్హులు.

❖

'దేవతార్చన అంటే ఏమిటి? 'దేవుని అర్చించుట' అని కదా! దేవతార్చనకు ఉపక్రమించే ముందు "దేవుడు అనగా ఎవ్వరు? ఎక్కడున్నాడు?" అనే విషయం తెలుసుకోవాలి. అది తెలుసుకోకపోతే అర్చన యొక్క ఉత్తమప్రయోజనం లభించదు.

'దేవుడు' అనగా ఎవరు? పుండరీకాక్షుడగు విష్ణువా? త్రిలోచనుడగు శివుడా? కమల సంభవుడగు బ్రహ్మయా? వాయువా? సూర్యచంద్రులా? అగ్నియా? నీరా? బ్రాహ్మణ క్షత్రియులా?...

అద్వితీయమగు దేవత వీరెవ్వరూ కారు. మనం ఇద్దరం కూడా కాదు. లక్ష్మి – సరస్వతి – పార్వతి నామ రూపములు కాదు. దేహ–చిత్త రూపము ఒప్పువారెవ్వరూ కాదు.

ఇక సత్యమగు దేవత ఎవరంటావా?... విను.

అకృత్రిమమై, ఆద్యంతరహితమై, నామ–రూప–దేశ–కాలములచే పరిమితము కానిదై, స్వస్వరూపమునకు వేరుగా లేక, కేవల సం–విత్ స్వరూపమైనదేదో ...అదియే 'దేవతార్చన' యందు 'దేవత' అని గ్రహించు.

వత్సా! వసిష్ఠా! ఆకారాదులతో కూడి, పరిచ్ఛిన్నమగు, పరిమితమైన దానియందు అత్యుత్తమమగు దేవతాభావం ఎట్లా కుదురుతుంది? సర్వులయందు, సర్వమునందూ సర్వదా ఏర్పడి ఉన్న చైతన్యమే 'దేవత' అను శబ్దముచే ఉద్దేశించబడి, పూజార్హమవుతోంది. సర్వరూపములు తానై ఉన్న ఆ చైతన్యము మాత్రమే వాస్తవమగు సత్తచే ఒప్పారుచున్నది. ఇక తదితరములన్నీ ఆత్మస్వరూపమునందు విరాజిల్లు చున్నాయి. ఆ మంగళమయ తత్త్వమును గ్రహించలేని బాలుర వంటివారి కొరకై కల్పిత దేవత యొక్క అర్చన విధించబడింది. పదిమైళ్ళు వెళ్ళవలసిన వానికి ఒక మైలు వరకూ నడవటానికి పనికి వచ్చే ఉపాయాలు విభజించి బోధిస్తున్నట్లు... మధ్యే మార్గంగా రుద్రుడు మొదలైన దేవతల ఉపాసన దైవజ్ఞులచే, పురాణములచే అందించబడుచున్నాయి.

ఇయత్తాది పరిచ్ఛిన్నం రుద్రాదేః ప్రాప్యతే ఫలమ్ ।
అకృత్రిమమ్–అనాద్యన్తం ఫలమ్ ఆనంద ఆత్మనః ॥

రుద్రుడు మొదలైన నామరూపములతో కూడిన దేవతల ఉపాసన వలన లభించే ఫలితం పరిచ్ఛిన్నమైనది. అది కొంతదృష్టివరకే పరిగణకు యోగ్యం. అయితే, అది, "సర్వాంతర్యామి–సర్వతత్వ స్వరూపుడు" అగు పరమాత్మ యొక్క ఉపాసనకు దారితీసినప్పుడే ఉపాసన యొక్క

ఆశయం సిద్ధించినట్లు. (పరమ్+ఆత్మ = ప్రతిజీవుని యొక్క - ఈ జగన్నాటకములోని పాత్రలకు ఆవల ఉన్నట్టి నిజస్వస్వరూపం)

అపరిచ్ఛిన్నమగు ఆత్మదేవోపాసనవలన లభించే ఆనందం అకృత్రిమము, అనాది, అనంతం, శాశ్వతం కూడా. అకృత్రిమమగు స్వస్వరూపానందముగాక ఏదో కృత్రిమఫలితమును పొందగోరి ఉపాసనకు ఉపక్రమించే వాడు ఆహ్లాదకరమగు మందారపూదోటను వదలి ముళ్ళపొదలవైపు దృష్టి సారిస్తున్నట్లే. వారు అనవసర, నిష్కారణ క్లేశములు ఆహ్వానిస్తున్నట్లే.

పూజ్యవిషయం చక్కగా గ్రహించిన బ్రహ్మజ్ఞులు నిర్మలుడు, మంగళమయుడు, చిన్మాత్ర స్వరూపుడు అగు ఆత్మభగవానునే అర్చిస్తున్నారు, వారి ప్రధానమైన పుష్పాలు ఏమిటో తెలుసా?...

1. సర్వసమత్వము... 2. శాంతి... 3. బోధ.

శమ బోధాదిభిః పుష్పైః దేవ ఆత్మాయదర్చ్యతే ।
తత్తు దేవార్చనం విద్ధి, న ఆకారార్చనమర్చనమ్ ॥ (శ్లో 128, సర్గ 29)

వత్సా! ఈ మూడు పుష్పాలతో అన్నిరూపులా అంతయూ నిండి ఉన్న ఆత్మదేవుని అర్చించటమే నిజమైన అర్చనగాని, ఏదో ఒక ఆకారాన్ని తీసుకుని భౌతికమైన పుష్పాలతో పూజించటం నిజమైన పూజ కాదు. పూజారహస్యం ఎరిగినవారు బోధ-శాంతి-సమత్వ పుష్పములచే దేశ-కాల-నిమిత్తములను పట్టించుకోకుండా సర్వదా అనుక్షణ-అకృత్రిమ పూజ కొనసాగిస్తున్నారు.

శ్రీవసిష్ఠ మహర్షి : తత్త్వము, ఆమూలాగ్రం గ్రహించిన వారిలో కొందరు సమాధినుండి లేచిన తరువాత సాకారమును అర్చిస్తున్నారు కదా! స్వామీ! దానికి ఏదైనా ప్రత్యేక కారణం ఉన్నదా?

శ్రీశివ భగవానుడు : చిన్నపిల్లలు ఆనందం కొరకే ఆటలు ఆడుకుంటారుగాని ఏదో కృత్రిమమైన ప్రయోజనం ఆశించి కాదు కదా! ఆ రీతిగా కొందరు మహనీయులు సమాధి నుండి విడివడినప్పుడు సాకారమును అర్చించటం జరుగుతోంది. అయినా కూడా, ఆ మాత్రానికి 'నిరాకారుడు, మంగళ మయుడు, పరమకారణుడు' అగు ఆత్మయే వారికి పూజ్యవస్తువు కాకుండాపోవుట లేదు. అట్టి నిరాకార పరబ్రహ్మమును ఉద్దేశించి సంజ్ఞగా సాకారమును వారు అర్చిస్తున్నారని నీవు గ్రహించు. అందుచేత పరమకారణమగు ఆత్మయే నిజమైన దేవత.

అట్టి ఆత్మ దేవతను జ్ఞానార్చనతో అనంతరం పూజించాలి. ఆత్మపూజయే ముఖ్యమగు పూజ. ఆయన గాక మరి పూజ్యులెవరూ లేరు.

అవ్యయ చిదాకాశమగు బ్రహ్మమే జీవభావముపొంది ఈ సకల జీవులుగా ప్రకాశిస్తోందని గ్రహించి అటుపై ఆత్మార్చన నిర్వర్తించు. ఆత్మార్చకులకు ఈ కనబడే దృశ్యమంతా ఆత్మదైవమే! సకల ద్రష్టలు ఆత్మసంప్రదర్శనమే!

శ్రీవసిష్ఠ మహర్షి :

చిద్వ్యోమైవ కిలాస్తీహ పారావారవివర్జితమ్ ।
సర్వత్రాసంభవచ్చేత్యం యత్కల్పాన్తేఽవశిష్యతే ॥ (శ్లో 134, సర్గ 29)

ప్రభూ! చిదాకాశరూపియగు ఆత్మభగవానుడు ఈ జగద్భావమును, జీవభావమును ఎట్లా పొందుచున్నాడో, ఆ క్రమమును తెలియజేయ ప్రార్థన.

శ్రీశివ భగవానుడు : పారావారవర్జితము (That which does not have limitation) అగు చిదాకాశమొక్కటే వెలయుచున్నది. దానికి పుట్టుకగాని, పరిణామముగాని అసంభవమైయున్నది.

కల్పాదిలో ఉన్నదదే! ఈ ఈ కల్పనా వర్తమానంలో కూడా క్రీడిస్తున్నది అదే! కల్పాంతము నందు మిగిలేది కూడా అది మాత్రమే!

సూర్యకాంతి నలువైపులా ప్రసరిస్తూ ఉండగా 'తీవ్రమైన కాంతి – సగం వెలుగు – క్రీనీడ–నీడ' ఏర్పడుతూ ఉంటాయి చూచావా? అట్లాగే అపరిచ్ఛిన్నమగు చిదాకాశం 'మాయ' అను మార్గమున స్పందించుచుండగా త్రిగుణసమన్వితమగు ఈ జగత్తు రూపమున ప్రకాశిస్తోంది. స్వప్నంలోని నగరంలా భాసించే ఈ జగత్తు చిద్రూపమునందే భ్రాంతి చేత అనుభవమవటం జరుగుతోంది.

విచారించి చూస్తే ఈ జగత్తుకు మూలమే కనిపించదు. నిర్మలమగు ఆత్మ ఒక్కటే సర్వదా ఏర్పడి ఉంటోంది.

శ్రీవసిష్ఠ మహర్షి : హే భగవాన్! చైతన్యము జీవరూపమును ధరించి మరల మరొకప్పుడు స్వస్వరూపమును గాంచుచున్నదని అనవచ్చునా?

శ్రీశివ భగవానుడు : అట్లా చెప్పటానికి కూడా వీలులేదు. ఎందుకంటే స్వభావసిద్ధంగానే అద్వయము, అపరిణామియగు ఆత్మవస్తువు అస్వభావమగు జీవత్వం పొందటమేమిటి? ఇక ఈ జగత్తు ఎక్కడిది అంటావా? చూచువాడు స్వయంగా సంకల్పించు 'మాయావరణ' వల్లే ఇయ్యది జగత్తుగా తోచటం జరుగుతోంది. ఇంత కన్నా వేరే విశేషం ఇక్కడేదీ లేదు. కనుక ఈ జగత్తు అనబడేది వాస్తవానికి అపరిణామియగు చిదాకాశమే అయి ఉన్నది. ఇందు అన్యభావానికి తావే లేదు. కనుక ఈ పర్వతములు, జీవులు, పంచభూతములు మొదలైన భేదవికారమంతా చిన్మాత్రమేనని గ్రహించు.

సర్గ ప్రారంభం నుండి పర్యవలోకించి చూడు. ఈ స్వర్గ – మర్త్య – పాతాళ లోకాదులలో చైతన్యముగాక మరింకేదైనా కలదా చెప్పు?

ద్వైతజగత్తు స్వప్నము వలె 'మాయ', లేక, 'స్వకీయకల్పనావ్యాసంగము' వలననే అనుభవించ బడుతోంది. తత్త్వదృష్టితో పరికించి చూస్తే, చిదాకాశమే 'జగత్తు– చిత్తము – ఆత్మ – నీవు – నేను' అను రూపములుగా అనుభవమౌతోంది. ఏదైతే ద్వితీయంగా జగత్తురూపమున కనిపిస్తోందో, అదంతా చిదాకాశంకాక మరింకేమీ కాదని గ్రహించు. ఆ చిదాకాశము స్వప్నస్వప్నమున ఎట్లు గోచరిస్తోందో, ఈ జాగ్రత్‌స్వప్నమునకూడా అట్లే గోచరిస్తోంది. చిదాకాశమును తీసివేస్తే కలకనేవాడు లేని కలలా, చూచేవాడు లేని జగత్తులాగా మరింకేమీ మిగలదు. అనగా చిదాకాశమే లేకుంటే ఏదీ ఉండదు. ఏదీ ఏర్పడదు. చూచేవాడు లేకుండా చూడబడేది ఎక్కడైనా ఉంటుందా? ప్రతిజీవుడు చిదాకాశస్వరూపుడే!

ఈ 'జగత్తు' అని పిలువబడేదంతా నిశ్శేషంగా చిదాకాశమే. అదియే చిన్మాత్రము అగు బ్రహ్మము. అదియే నీ యొక్క, నా యొక్క, పురుగు నుంచి బ్రహ్మదేవుని వరకు గల సర్వజీవుల యొక్క వాస్తవ స్వరూపం.

శ్రీవసిష్ఠ మహర్షి : హే అంబాసమేతుడువగు సాంబశివా! ఈ జగత్తులు ఎక్కడి నుండి ఏర్పడుచున్నాయి?

శ్రీశివ భగవానుడు : ఆ పరమాకాశము, లేక, చిదాకాశమునుండే సంకల్పబలంచేత ఈ జగత్తులు లేచి, బ్రహ్మమును ద్వైతరూపమున గోచరింపజేస్తున్నాయి. కాబట్టి నీకు ఏదైతే జగద్రూపంగా గోచరించటం జరుగుతోందో – అదంతా 'స్వస్వరూప–చిదాకాశమున భావనామాత్రంగా ఏర్పడుచున్న స్వప్నం' అని గుర్తెరుగుము. ఒకని స్వప్నంలో కనిపించే కుండ, వస్త్రము, వ్యక్తులు–అన్నీ కూడా ఆ స్వప్నద్రష్ట యొక్క స్వరూపం గాక మరింకేమిటి? జాగ్రత్తు కూడా జాగ్రత్‌ద్రష్టయొక్క స్వరూపం తప్పితే మరింకేమీ కాదయ్యా! ఒకడు తన స్వప్నంలో హావ–భావాలు కల్పించుకొని ప్రేమ–కోప–తాపాలు అస్వాదిస్తున్నట్లుగానే,–జాగ్రత్తులోకూడా, స్వీయకల్పనా పూర్వకంగా ప్రేమ–కోపము–తాపము–ఇత్యాది విశేషాలన్నీ ఆస్వాదిస్తున్నాడు.

కనుక మహర్షీ! మరొక్కసారి చెప్పుచున్నాను. ఇక్కడ అగుపించే సృష్టి విశేషాలు, త్రికాలానుగత మగు భావాభావపదార్థములు, దేశకాలాలు, చిత్తం మొదలైనవన్నీ చైతన్యం మాత్రమే. వేదోపనిషత్తులచే పరమార్థ సత్యముగా నిర్దేశింపబడి, నిరూపించబడిన ఆత్మ చైతన్యమే 'నీవు' రూపియు, 'నేను' రూపియు 'జగత్తు' రూపియు అయి ఉన్నదని గ్రహించు. చిదానందమగు శివతత్త్వమే అంతటా, అన్ని వేళలా వెలయుచున్నది.

అట్టి సర్వాత్మకుడగు చిదాత్మయే పరమ పూజ్యమగు దేవత. అంతేగాని, ఒక్క నామమో, రూపమో పరమపూజ్యమెట్లా అవుతుంది? చెప్పు?

సర్వస్య వస్తుజాతస్య జగతో అన్యస్య, తే, మమ,
దేహోహి చేతనాకాశం, పరమాత్మైవ, నేఽతరమ్ ॥

ఆ పరమపూజ్యమగు చిదాకాశమే నాయొక్క తదితరుల యొక్క దృష్టికి కనబడే జగత్తులలోని సర్వశరీరముల మూలరూపం. అతడిని విడచి వీటికి వేటికీ స్వరూపమే ఉండదు. వత్సా! స్వప్నము సంకల్పముల రూపమేకదా! కలలో కనిపించిన నగరానికి వేరే రూపం ఎక్కడున్నది? సృష్ట్యాది నుండి ఇప్పటిదాకా, ఇకముందు ఏర్పడే రూపములన్నిటికీ, వచ్చిపోయే సర్వ వస్తుజాలములకు చిదాకాశముకాక, వేరే రూపమే లేదు. ఏ నామ రూపాలు నీకు అగుపిస్తున్నాయో, అవన్నీ కల్పిత మాత్రములు. ఆపాదిత మాత్రములు.

❖❖❖

2. సర్వమయ మహాచిత్

ఏవం సర్వమిదం విశ్వం పమాత్మైవ కేవలమ్ ।
బ్రహ్మైవ పరమాకాశమ్ ఏష దేవః పరః స్మృతః ॥
తదేతత్ పూజనం శ్రేయన్ తస్మాత్ సర్వమవాప్యతే ॥

శ్రీశివ భగవానుడు: బిడ్డా! వింటున్నావా? ఈ విధంగా ఈ విశ్వమంతా కేవలం పరమాత్మస్వరూపమై వెలయుచున్నది. పరమాకాశమగు ఆ పరబ్రహ్మమే 'దైవము' అని జనులచే సంబోధించబడుచున్నది. ఆ దేవత పూజ ఒక్కటే సర్వ మంగళకరము. ఆ దేవతయే అన్నిటికీ ఆధారభూతమై వెలుగొందుతోంది. అందుచేత అట్టి పూజ వలన లభించనిదంటూ ఏదీ ఉండదు. ఆ దేవతాపూజకు బాహ్య సాధనములేవీ అక్కర్లేదు. అందువల్ల కలిగే తెంపులేని సుఖంతో పోల్చతగ్గది మరేదీ లేదు.

నాయనా! నీవు ప్రబుద్ధుడవైనావు. తత్త్వజ్ఞానం సముపార్జించావు. సప్తఋషులలో ఒకడవు అగు నీవు ఎంతటి జ్ఞానసంపన్నుడవో నాకు తెలుసు. అందుచేత నీకు, నీ ద్వారా అనేకమంది ముముక్షువులకు అతిరహస్యమైన ఆత్మదేవతార్చనను స్పష్టీకరిస్తున్నాను. విను.

ఆ పరదేవతను పూజించటానికి ఈ పుష్ప - దీప - నైవేద్యములతో పనిలేదు.

అవ్యుత్పన్నధియో యే హి బాలపేలవచేతసః ।
కృతిమార్చామయం తేషాం దేవార్చనముదాహృతమ్ ॥ (శ్లో 5, సర్గ 29)

ఈ కృత్రిమ పుష్పపూజ అనేది సత్యబుద్ధి పూర్తిగా వికసించని, బాలురవంటి అమాయక చిత్తము గలవారికి, అంతరంగంలో దృశ్యవిషయాలపై అభినివేశం కొనసాగుచున్నవారికి, తత్త్వమేమిటో పూర్తిగా తెలియనివారి కొరకు ఆత్మజ్ఞులచే-శాస్త్రములచే విధించబడుతోంది. తత్త్వజ్ఞానంచే శమదమాది గుణాలు ఇంకా అలవడవలసి ఉన్నవారిని సన్మార్గపరులుగా చేయటానికి దీప-ధూప-పుష్పాలు సమర్పించటం, మూర్తిని కల్పనచేయటం, భౌతిక వస్తువులతో దేవతార్చన మొదలైనవి ప్రారంభదశలో రచించి శాస్త్రములు అందిస్తున్నాయి. సాధక జనులు మధ్యేమార్గంగా ధూప-పుష్పాదులతో మూర్తిని పూజిస్తున్నారు. అది మంచిదే. అయితే అంతటితో సంతసించి ఊరుకోవడం సరికాదు. అసలు విషయమేమిటో వారు తెలుసుకోవాలి. నిజకల్పిత వస్తువులతో భౌతిక పూజచేసి, ఆపై పరమోన్నతమగు సత్యవస్తువు గురించి విచారణ చేయకుండా... కేవలం స్వప్నతుల్యం, మిథ్యామాత్రం అగు స్వర్గలోకం మొదలైనవి లభిస్తే మాత్రం, ఆ ఫలాలతో తృప్తి చెందితే ఎట్లా? కల్పిత పూజచే కల్పిత ఫలములు పొందినంత మాత్రం చేత అసంతృప్తిరహితమైన స్థానం ప్రాప్తించుటలేదు. అందుకే, పూజ్యితమైనదేదై ఉన్నదో, అద్దాని గురించి సుస్పష్టమైన అవగాహన అత్యావశ్యకం.

❖

దైవము – ఓ జ్ఞాన శ్రేష్ఠా! నిన్ను బోలిన తత్త్వజ్ఞులు చేయ తగిన పూజ ఏమిటో చెపుతున్నాను. విను. ఏ దేవుని గురించి నేను చెప్పుచున్నానో, ఆతడు మాకు కూడా 'ఆది'.

అయితే అతడు ఎక్కడో కనబడనిచోట లేడు. ఈ త్రిభువనములకు ఎవడు సర్వదా ఆధారభూతుడై ఉన్నాడో అతడే ఆ పరమాత్మ. అతడు సర్వసంకల్పములకూ ఆవల అప్రమేయుడై సర్వజీవుల యందు, సర్వము నందు ప్రకాశిస్తున్నాడు. అయినా కూడా, సర్వసంకల్పములకూ ప్రారంభమూ, ఆధారమూ, స్థానమూ ఆతడే!

ఆతడు మంగళమయుడు. సర్వమూ శుభప్రదం చేస్తున్నాడు. సర్వమూ అయినా కూడా ఏదీ కాకుండానే ఉంటున్నాడు. సర్వకార్యములనూ ప్రకాశింపజేసేది ఆతడే. ఈ దిక్కులచే, కాలముచే ఆతడు పరిచ్ఛిన్నుడు కాడు. ఆ నిర్మల – చిన్మాత్ర – సర్వరూప – రూపరహితమూర్తియే 'దైవము' అను శబ్దముచే శాస్త్రాదులచే చెప్పబడుచున్నాడని గ్రహించు. ఈ నామ రూపాదులన్నీ అందుకు ప్రతీక మాత్రమేనని మరువకూడదు.

ఆ చైతన్యం సర్వఫలాలకూ అతీతమై, అన్నిటా ప్రకాశించుచున్నది. అన్నిటికీ సృష్టి–స్థితి–లయాలకు కారణమై సర్వదా నిష్క్రియమై వెలుగొందుచున్నది. ఆయనకే 'పరమాత్మ' అనే బిరుదు ఉన్నది. ఆయన భావ–అభావముల మధ్య వెలుగొందుచుండు 'బ్రహ్మము' అని కూడా చెప్పబడుతోంది. 'ఓం' 'తత్' 'సత్' 'మహాసత్' స్వభావముచే సర్వత్రా సముడై వెలయుచున్నాడు. 'మహాచిత్' అను పరమార్థముతో కూడిన శబ్దార్థములచే గూడా చెప్పబడుచున్నాడు. లత యందు రసము సర్వత్రా ఏర్పడి ఉన్నట్లు, ఆతని తత్త్వము సత్తా సామాన్యరూపమున, లేక మహాసత్తరూపమున సర్వేసర్వత్రా అనుశ్రుతమై జాజ్వల్యమానంగా వెలుగొందుచున్నది. ఓ పాపరహితుడగు వసిష్ఠ మహర్షీ! నీయందు, నీ ధర్మపత్నియగు ఈ అరుంధతి యందు, నా యందు, ఈ పార్వతి యందు, ప్రమథగణము నందు, నీ శిష్యులందరి యందు సమముగా వెలుగొందుచున్నది ఆ ఆత్మదేవత యొక్క మహాచిత్ తత్త్వమేనయ్యా! ఉత్తమబుద్ధులగు తత్త్వవేత్తలు 'దేవుడు' అని నిర్దేశించి శ్లాఘించుచున్నది ఆయననే! అంతేగాని, హస్తపాదాదులతో కూడిన ఒక ఆకారము దేవదేవుడెట్లా అవుతాడు? ఆ ఆకారంలో కూడా మహాచిత్ యొక్క ప్రత్యక్షమే ఆరాధించబడుచున్నదని జ్ఞప్తియందుండు గాక! ప్రతీకతో తన్మయులై ముఖ్యోద్దేశమును ఏమరుచుట ఉచితమా? కాదు. ఈ సంసారసారం కూడా ఆ చిత్‌తత్త్వమే. 'అహం' రూపియగు ఆ మహాచిత్ తత్త్వము నుండే అన్నీ కూడా లభిస్తున్నాయి గనుక, అదియే సర్వమయమగు దేవత.

చిదానందస్వరూపుడు – ఓ బ్రహ్మజ్ఞా! మహాచిదానంద స్వరూపుడగు ఆ పరమాత్మ ఎక్కడో దూరంగా ఉన్నాడని అనుకోనేవద్దు. అది దుష్ప్రాప్యవస్తువు కాదు. ఎందుకంటే మన సర్వదేహము లందు, ఆకాశమునందు కూడా విరాజిల్లుచున్నది ఆయనే. ఆయన యొక్క 'చిత్' అను మహిమయే ఈ కార్యములన్నీ ఒనర్చుచున్నది. ఆయన ఆయారూపములతో భోజన – పాన – పాలన – గమన – నిశ్వసన – జ్ఞానాది కృత్యములు ఒకవైపు ఒనర్చుచూనే వాస్తవానికి ఏదీ చేయకయే ఉన్నాడు. ఇదిగో, విచిత్ర చేష్టలు చేస్తూ ప్రవర్తిస్తున్న ఈ దేహమును చూచావా? ఈ దేహపురి కూడా అతని ఉనికి చేతనే, అతని ఉద్దేశానుసారమే ప్రవర్తించగలుగుతోంది. అతడు ఇందులో (అన్నమయ –

ప్రాణమయ – మనోమయ – విజ్ఞానమయ – ఆనందమయములు అనబడే) పంచకోశ సమన్వితుడై బుద్ధి అనే గుహకు మహేశ్వరుడై, రాజాధిరాజై వెలుగొందుచున్నాడు.

అతడు వాక్–మనస్సులకు అతీతుడు. అయితే, ఆ రెండిటినీ వెలిగించుచున్నది ఆతడే! అతడు మనోవాక్కులకు నామరూపములకు ఆవల ఉన్నవాడు. అయినా కూడా సద్గురువరేణ్యులు తమ శిష్యులకు బోధించటానికి 6వ ఇంద్రియమైన మనస్సుకు కూడా అతీతుడు, నిర్మలుడు అయిన ఆ ఆత్మదేవునకు "చిత్ " అనే సంజ్ఞ ఇస్తున్నారు.

శ్రీవసిష్ఠ మహర్షి : ఆ ఆత్మభగవానుని గ్రహించటానికి మరికొన్ని విశేషాలు చెప్పండి?

శ్రీశివ భగవానుడు : అతడు చిన్మయుడు. అన్నిటి కంటే సూక్ష్ముడు. సర్వవ్యాపి. నిర్లేపుడు. ఈ కనబడే రూపాలన్నింటినీ ప్రకాశింపజేయుచూ, సర్వదీపాలలో వెలుగొందుచున్న అగ్ని వలె వెలుగొందుచున్న వాడు తానే' అయి కూడా, సదా సర్వదా నిష్క్రియుడు. అత్యంత నిర్మల చిద్వస్తువగు ఆతడే జగత్‌సిద్ధికై జగత్క్రియలన్నీ ఒనర్చుచున్నాడు. ఆయన నుండి 'చైతన్యస్ఫూర్తి' అనే సుందరశక్తి వెలువడి నానావిధ రూప భేదములను ఒనర్చుచూ సర్వవిధ భావ–అర్థములను ప్రకటిస్తోంది. ఆయనచే భావకల్పన చేయబడే అనేక విభేదములలో ఒకదానిపేరు ఆకాశము. మరొకదాని పేరు జీవుడు. అట్లాగే చిత్తు, కల, చిత్తము, క్రియ, ద్రవ్యము – వగైరా కూడా. ఆయన అనుభవ వైచిత్ర్యమును అనుసరించే భావన, వికారము, ప్రకాశము, శైలము, తమస్సు, చంద్రుడు, ఇంద్రుడు, యక్షుడు – మొదలైనవి రూపు దిద్దుకుంటున్నాయి. వసంతకాలం ఇచ్ఛారహితంగానే చెట్లను చిగురింపజేయటం లేదా? ఇదంతా కూడా అట్టిదే.

నిజానికి ఈ మూడు లోకాలలో 'చిత్' తప్పించి ఇంకేమున్నది? చిత్‌యే ఆత్మభగవానుని శరీరం. (చిత్=ఎఱుక, ఉద్దేశము) చిద్రూపియగు ఆ ఈశ్వరుడు 'శరీరములు' అనే బురద ప్రదేశంలో సంచారం చేస్తూ 'చిత్తభ్రమలు' అనే సంకల్పపూర్వకమైన మధువును ఆస్వాదిస్తున్నాడు. నదీజలంలో సుడులు ఉన్నట్లు ఆయన యొక్క చిత్ ప్రపంచంలో ఈ దేవ – మనుష్య – రాక్షస – జంతు ఉపాధులు ఉంటున్నాయి. ఈ జగత్తులన్నీ చిత్‌సత్త నుండే ప్రవహిస్తున్నాయి.

అత్యంతభ్రమలు కలుగజేసే ఈ సంసారమంతా ఆ చిత్ చక్రమున పడి తిరుగాడుతోంది. చిత్తమయములు, బంధహేతువులు అగు కర్తృత్వ – భోక్తృత్వములే సంసార చలనము సుమా!

మేఘములు వచ్చి సూర్య తాపమును పారద్రోలునట్లు ఆ చైతన్యమే చతుర్భుజవిష్ణురూపమును ధరించి శంఖ–చక్ర–గదాధారి అయి అసురులను వధిస్తోంది. వృషభవాహనుడు, త్రినేత్రుడు, చంద్రశేఖరుడు అయి రుద్రరూపమున ఈ గౌరితో కూడి లోకములకు శుభములు చేకూరుస్తోంది. చిద్ధ్యానము రూపంలో విష్ణుమూర్తి నాభికమలంలో జన్మించి వేదములు ధరించి బ్రహ్మగా రూపు దాలుస్తోంది. చెట్టుకు పూలు, కాయలు, ఆకులు కాస్తున్నట్లు అద్దానికే అనంత శరీరములు ఉద్భవిస్తున్నాయి. అదియే సూర్యరూపమై ఈ జీవ–జంతుజాలములకు తన కిరణములచే జీవనము ప్రసాదిస్తోంది. చంద్రుడై ఓషధరూపమున జీవరసమును సంరక్షిస్తోంది.

ఆ చిత్తే దర్పణమున ప్రతిబింబించే దృశ్యంగా ఈ జగత్ ప్రతిబింబమును గ్రహించి, తనపై తానే సుఖ–దుఃఖములను ఆపాదించుకుంటోంది. జలశక్తియే జలరూపమున సముద్రముగా అయి అనేక వస్తువులను తనయందు ధరిస్తున్నట్లు ఆ చైతన్యమే తనయందు ఈ 14 లోకములను కలిగి ఉంటోంది. చిత్తే చిదాకాశమున 'దృశ్యము' అనే పుష్పాలతోను, 'సంకల్పము' లనే పిందెలతోనూ, 'సత్త' అనే ఫలములతోను, సదసత్తులనే ఆకులతోనూ కూడిన సంసారలతగా ఉద్భవిస్తోంది. విచారణ చేసినప్పుడు 'దృశ్యము అనేది లేదు ఉన్నదంతా ఆ చిదానందమే' అని తప్పక తెలియవస్తోంది.

ఈ జీవులందరూ ఆ చిల్లత ఆకులేనయ్యా! వాసనారసమువల్లనే జన్మ కర్మల వ్యవహారమంతా రంజిల్లుతోంది. అనేక సవికల్పములతో, విషయపరంపరలతో, రకరకాల యత్నములతో, త్రిజగత్తులనే రంగస్థలములతో విరాజిల్లుచున్నది చిత్తే. ఋతువులతో కూడిన కాలస్వరూపంగాను, కొండ మొదలైన ఆయా వస్తుజాలముగాను, అండజ – స్వేదజ – బీజజ – గర్భజాది చతుర్విధ ప్రాణులతోను, సర్వాంగ ప్రవృత్తులతోనూ, సూర్య – చంద్ర ప్రభలతోనూ ప్రభవిస్తున్నది ఆ చిత్తే.

ఆహా! వసిష్ఠమహర్షీ! ఎంత ఆశ్చర్యం! ఆ చిత్తే సర్వత్రా వస్తువులను కల్పించి, వాటిపట్ల అభిమానమును చేకూర్చుకొని, వాటికి ప్రసిద్ధిని ప్రసాదిస్తోంది. చైతన్యముయొక్క ప్రభావం చేతనే చైతన్యస్వరూపుడగు ఈ జీవునకు జడమగు దేహముల పట్ల ప్రియాప్రియములు కల్పనాపూర్వకంగా దృశ్యదేహమును ధరించి, తమను తాము చైతన్యము నుండి వేరైనట్లుగా భావించుకుని నృత్యం చేస్తున్నాయి. గదిలో దీపం ప్రకాశిస్తూ ఆయా వస్తువులను ప్రకాశింపజేయుచున్నట్లు 'త్రైలోక్య దీపశిఖ' అగు చైతన్యమే ఈ జగత్తునందలి సర్వకార్యములనూ ప్రకాశింపజేస్తోంది. చైతన్యమే ఈ జాగృతిక పదార్థముల ఆకారమును వహించినదై సర్వసందర్భములలోనూ అందరిచేత పరిలక్షితమై ఉంటోందని గ్రహించు.

కనుక, పుత్రా ! ఈ నామ రూప పదార్థములన్నీ చిత్తే తనయందు ధరిస్తోంది. సూర్యుడు బ్రహ్మాండంగా ప్రకాశిస్తూ ఉంటే, ఇంటిలోని ఒక గదిలో చీకటి ఉన్నట్లుగా ఆ చిత్తు యొక్క నీడయే సకల పదార్థముల జడతను కల్పిస్తోంది. ఈ ముల్లోకాలలో స్థితమై కనబడుచున్న ఈ శరీరజాలాలన్నీ కూడా చిత్‌ఛాయ తొలగగానే స్పర్శకు కూడా యోగ్యత కోల్పోతున్నాయి. చైతన్యము ఈ దేహగృహంలో నివసిస్తూ 'సంకల్పములు' అనే పిల్లవాళ్ళను కని పోషించుకుంటోంది.

చైతన్య సంపర్కం లేకపోతే ఈ నాలుక రుచి చూడలేదు. చైతన్యముకంటే వేరైనదేదీ ఎక్కడా ఎవరిచేతా గాంచబడుట లేదు. చైతన్యము వినా – బొమికలు, చర్మము, వెంట్రుకలు – గల ఈ దేహము ప్రవర్తించగలదా? లేదు.

ఇన్ని మాటలెందుకు? ఓ మునీశ్వరా! ఈ చరాచర సృష్టిలో జన్మ – స్థితి– లయములను పొందుచున్న ప్రతిది చైతన్యమే. అదికాక వేరొకటేదీ లేదు. చైతన్యము యొక్క ఉనికి చేతనే (ఉండటం చేతనే) తదితరమంతా ఏర్పడి ఉండటం జరుగుతోంది.

❖❖❖

3. చిత్తు: జడ-చైతన్య విభాగములు

శ్రీవసిష్ఠ మహర్షి : తండ్రీ! నాదొక చిన్న సందేహం. ఈ కనబడేదంతా చిద్వ్యాప్తమే అయినప్పటికీ, ఈ శరీరం మరణించినప్పుడు, మూర్ఛిల్లినప్పుడూ ఇది చేష్టావిలీనమై ఒక రాయి-రప్పలాగా అయి ఉంటోంది కదా! అంటే 'ఈ శరీరం మొట్టమొదట చైతన్యవంతమై మరొక్కప్పటికి చిద్రహితమగుచున్నది' అనియే కదా అర్థం? చైతన్యం ఈ విధంగా ఎందుకు ఒకప్పుడు దేహమునందు ప్రత్యక్షమై, మరొకప్పుడు (మరణానంతరం) అంతర్ధానమవుతోంది?

శ్రీశివ భగవానుడు : నాయనా! నీవు అడిగింది చాలా పెద్ద ప్రశ్న. అందుకు సమాధానం వివరిస్తున్నాను. విను.

❖

ఈ శరీరమందు ఏ సర్వభూతమయ చిత్ విరాజిల్లుతోందో, అట్టి చిత్ రెండు విధములు-

1. కర్తృత్వ - భోక్తృత్వ స్వభావము. ఇదియే 'విజ్ఞానమయము' అను పేరుతో చెప్పబడుతోంది.
2. కూటస్థమగు 'నిర్వికల్పచైతన్యము' లేక, "నిష్క్రియ కేవల స్వస్వరూపం".

రెండవదగు నిర్వికల్పచైతన్యమే తన యొక్క సంకల్పబలం చేత 'నేనొక జీవుడను' అని భావన చేసి విజ్ఞానమయత్వం పొందుతోంది. ఒకడు స్వప్నంలో వేరొక స్త్రీని చూచి దుశ్శీలుడైనట్లు, ఒక బలాఢ్యుడు తన యొక్క ఊహా లోకంలో ఒక మహాబలవంతుని కల్పించుకొని ఆతనితో కుస్తీ పట్టి ఓడి డీలా పడినట్లు... ఆ నిర్వికల్పచైతన్యం వికారాలను సంకల్పించుకుంటోంది. ఒక శాంతస్వరూపుడు అనుకోకుండా, ఆకస్మికంగా క్షణికావేశం చేత గొప్ప కోపం చూపించినట్లు, ఆ నిర్వికల్పచైతన్యం తనను ఒక జడవస్తువుగా భావించి స్వకల్పనాబలం చేత సవికల్పమగు బుద్ధికి విషయమగుచున్నది.

ఆ చిత్ తనకుతానే స్వయంగా ఇటు పరమాణురూపాన్ని, అటు శబ్దస్పర్శాది భోగ్య రూపాన్ని స్వకల్పన చేసుకుంటోంది. మాయతో కూడిన చైతన్యమునకు తాను విషయమగుచున్నది. తరువాత సమష్ఠి ప్రాణరూపాన్ని పొందుతోంది. అదే "హిరణ్యగర్భరూపం" అని శాస్త్రాలు వర్ణిస్తున్నాయి.

ఆ తరువాత పంచీకృతమగు సూక్ష్మభూతములతో కూడి దేశవిభాగమును, కాల విభాగమును పొందుచున్నది. క్రమంగా ప్రాణమును ధరించి జీవత్వమును పొంది మనోబుద్ధులను ధరిస్తోంది. రత్నములను అన్వేషిస్తూ బయలుదేరిన ఒక సాధకుడు త్రోవలో ఒక ఆటవిక స్త్రీని చూసి, మోహించి, ఆటవికులలో ఒకడై బయలుదేరిన పనినే మరచిపోయినట్లు, అది సంసారభావమును పొందుతోంది. అనగా, ఆ బ్రహ్మచైతన్యము అజ్ఞానమునకు చోటిచ్చి తన స్వరూపం విషయమై శరీర-జీవరూపములను సంకల్పించుకుని, అట్టి సంకల్పములచే తన యొక్క సహజత్వమును కప్పివేసుకొని ఉంటోంది. భోగసంపర్కములచే మరల మరల 'సంసారి' అగుచున్నది. చూచావా?

అనన్తసంకల్పమయీ జాడ్యసంకల్పపీవరా ।
చిజ్జాడ్యాన్మోదమాయాతి పయః పాషాణతామివ ॥ (శ్లో 75, సర్గ 30)

అనంత సంకల్పమయమగు ఆ చిత్తు తన యొక్క జడసంకల్ప విభాగముచే స్థూలభావము ధరించి 'మోహము'ను పొందుతోంది. అతిశీతలత్వం చేత నీరు పాషాణంలాగా గడ్డకట్టి ఆకారాదులను ప్రకటిస్తున్నట్లు, అనంతగుణ గంభీరమగు ఆ చిత్తు పరిమిత విషయములగు జడ సంకల్పములను, స్థూలభావములను ధరించి మోహమును పొందుచున్నది.

మోహగ్రస్తమై 'తృష్ణ' అనే స్వయంకల్పిత త్రాళ్ళతో కట్టబడినదై కామ, క్రోధములకు లోను అగుచు, భయములచే పీడించబడుచు, భావాభావగ్రస్తమగుచున్నది. తన యొక్క అనంతత్వమును, అప్రమేయత్వమును, నిత్యత్వమును బొత్తిగా మరచి పరిచ్ఛిన్నత్వమును భావన చేస్తూ కునికిపాట్లు పడుతోంది. 'దుఃఖం' అనే భయంకర అగ్నిచే దహించబడుచున్నది. అశుభమగు శోకంతో వ్యాకులమై, "అయ్యో! ఇప్పుడీ దుఃఖమోహములే ప్రత్యక్షంగా నా స్వభావమై పోయినాయే? ఇప్పుడింకేం చేయాలి? నన్ను ఎవరు కాపాడుతారు? ఓ దైవమా! ఎక్కడున్నావు?" ...అని వగర్చుచూ, ఈ శరీరాన్ని నమ్మి నానా తిప్పలు తెచ్చుకుంటోంది. 'నాకు అండ, తోడు కావాలి. ఈ శరీరంతో ఏర్పడే బాల్య-యౌవన-వార్ధక్యాలు నాకే చెందినవి' అని అనుకుంటోంది. ఒక గొప్ప అడవి ఏనుగు బురదలో చిక్కుకొనినట్లు మహత్తరమగు చిత్ ఈ 'అపార సంసారవికారములు' విడువలేక కొండరాళ్ళమధ్య చిక్కుకున్న జింకలాగా దిక్కుతోచక, భ్రష్టమై, బాధాపరితప్తమై గావుకేకలు వేస్తోంది. అనేక సుఖదుఃఖములకు, దీనత్వమునకు తన అంతరంగమే ఉత్పత్తిస్థానమని గమనించలేకపోతోంది. చిన్నపిల్లవాడు బాటలో నడుస్తూ ఎదురుగా ఊహాజనితమైన దయ్యమును గాంచి, ఇక, భయవికారములను పొంది వెనుకకు తిరిగి పరుగులు తీస్తూ గావుకేకలు పెడుతున్నట్లు ఈ చిత్తు ఊహచే ఆపదలను కల్పించుకొని భ్రమ పూర్వకము, స్వయంకల్పితము అగు సంసారారణ్యంలో పరుగులు తీస్తోంది. తుచ్ఛ విషయాలలో క్రిందా, మీదా పడుచూ, దోషజాలములో చిక్కుకుని అధఃపతనం పొందుతోంది.

అయితే మహర్షీ! ఇదంతా చిత్తు యొక్క జడవిభాగం చూపుతున్న జగన్నాటకం మాత్రమే. ఎందుకంటే... ఆ చైతన్యము యొక్క కూటస్థవిభాగం నిర్వికల్పమై, నిర్విభాగమై, నిశ్చింతగా ఎక్కడ ఉండాలో, అక్కడే ఉన్నది. అది తన యొక్క జడ విభాగంలో కర్తృత్వ, భోక్తృత్వ సంకల్పములను లీలగా మాయచే స్వప్నసదృశంగా పొందుతోంది.

❖❖❖

4. చిత్తుయొక్క విన్యాసం - వివశత్వం

శ్రీశివ భగవానుడు : ఇంకా ఈ భావాభావ విభాగమగు జడవిభాగపు చిత్తుయొక్క విన్యాసమేమిటో చెపుతాను విను.

స్వయంగా అనంతగుణసాగర స్వరూపి అయిన చిత్తు ఇక్కడ చేస్తున్నదేమిటి? స్వసంకల్పితమైన సంకల్పమాత్ర సంకటంలో పడి అనేక విపత్తులలోనూ, దుఃఖ పరంపరలలోనూ, అనర్థములలోనూ చిక్కుకున్నది. జడావస్థలో చిక్కుకుని నరకాది లోకములలో ప్రవేశించి విశేషకష్టములను చవిచూస్తోంది.

వృక్ష-జంతు ఉపాధులను కూడా అనుభవిస్తోంది. ఇంతలోనే మనుష్యత్వమును పొంది, కొంత వ్యవహారకౌశలత్వం సంపాదిస్తోంది. కానీ ఏం లాభం? చాలా చతురతతో బంధహేతువులైనట్టి ధనపుత్రాదులతో లేనిపోని కల్పిత సంబంధములను ఆశ్రయించి అనేక ఆశ - నిరాశ - దురాశల మధ్య చిక్కుకుంటోంది. అనేక విపత్పరిణామములలో సంచారం చేస్తూ అందరి సంశయములకూ కారణమౌతోంది. మోక్ష మార్గంగా స్వస్వరూపధ్యానానందమునకు ఉపయోగించే వివేకమును ఆశ్రయించటమే లేదు. పిదప మృత్యుసమయం రాగానే, అల్పజలంలో చిక్కుకున్న పెద్ద చేపలాగా విలవిల్లాడిపోతోంది. ఒక రోజు ఆ ఉపాధిని కోల్పోతోంది. మరల మరొక ఉపాధిని ఆశ్రయిస్తోంది.

ఆహాః! బాల్యము అసమర్థతలోనూ, యౌవనము చింతా దుర్వ్యసనములతోనూ, వార్ధక్యం దుఃఖములతోనూ గడచిపోవుచుండగా చివరికి అవివేకకారణంగా అజ్ఞానవ్యవహారవర్తి అయి నిస్సహాయంగా 'మరణము' అనే దరిజేరుతోంది.

ఆతడు మరణాంతరం కూడా దృశ్యం నుండి అప్పటికీ ముక్తిని బడయటం లేదు. ఆ జీవుడు కర్మ వైచిత్ర్యాన్ని అనుసరించి స్వర్గంలో అప్సరసగానో, పాతాళంలో నాగకన్యగానో, దైత్యుల భవనంలో అసురిగానో, కులపర్వతంలో కిన్నెరగానో, భూమిపై మానవిగానో, రాక్షసుల రాజ్యంలో రాక్షసిగానో, అడవిలో కోతిగానో, కొండప్రాంతంలో సింహంగానో, మేరు పర్వత ప్రాంతంలో విద్యాధరిగానో, అరణ్యంలో 'వృక్షం-లత-జంతువు' గానో జన్మలు ఎత్తుచున్నాడు. ఎంత చిత్రమో కదా! ఇదంతా కూడా సంకల్ప వికల్ప విభాగమునకు సంబంధించిన చిత్తు యొక్క స్వకీయ సంకల్ప ప్రాభవం చేత జరిగే నిష్కారణ సంచలనమే కదా!

అయితే ...ఆ చైతన్యమే నారాయణుడై క్షీరసాగరమున శయనించుచున్నాడు. కైలాసమున త్రిలోచనుడై అర్ధనారీశ్వర స్వరూపంతో విరాజిల్లుచున్నాడు. దేవతలకు పరిపాలకుడై ఇంద్రసింహాసనం అధిరోహించి మూడులోకములు పాలిస్తున్నాడు. మేఘమై వర్షమును కల్పించుచున్నాడు. వాయురూపుడై ఈ భౌతికదేహము లన్నింటినీ స్పందింపజేయుచున్నాడు.

క్షణాలు, నిమిషాలు, సంవత్సరాలు, యుగాలు, మన్వంతరాలు - అయి కాలరూపమున సదా ప్రవహిస్తూనే ఉంటున్నాడు. ఒకచోట రసస్వరూపుడై వృక్షాదుల బీజరూపంగా ఉంటున్నాడు.

ఇంకొకచోట పాషాణ స్వరూపుడై మౌన ముద్ర వహిస్తున్నాడు. మరొకచోట నదీనద స్వరూపం గానూ, ఇంకా వికసిత పుష్పాలుగా ...పక్వఫల సమూహంగా ...కాష్ఠ, అగ్ని స్వరూపంగా ...శీతల జలరూపంగా ...ఆకాశవాణి వంటి శూన్యరూపంగా - ఈ విధంగా ఆ చైతన్యం సర్వమయంగా, సర్వగామిగా, సర్వశక్తిమంతంగా ప్రకాశిస్తోంది.

అది ఆకాశంకంటే కూడా ఎంతో నిర్లిప్తమై, అన్ని వస్తువులకంటే భిన్నమై ఉన్నది.

నీరు స్పందించి తరంగములు మొదలైన రూపములను ధరిస్తోంది చూచావా? అట్లాగే చైతన్యము కూడా వివర్తంపొంది తనను ఎచ్చట ఏ రూపంగా భావిస్తోందో, అక్కడ అట్లే అనుభవమునకు గోచరమౌతోంది. భావాలన్నింటికీ నాందీస్థానం అదే!

ఆ చైతన్యమే తన వాస్తవస్వరూపంగా గల ఈ జీవుడు ఒకానొక జన్మ–జరా–పునర్జన్మల మార్గంలో పయనిస్తూ అనేక యోనులలో పరిభ్రమిస్తున్నాడు. సుడిగుండములలో పడ్డ గడ్డిపరకలాగా ఎక్కడెక్కడికో వెళ్ళుచున్నాడు. గాడిద తన ఓండ్రకు తానే భయపడునట్లు ఈతడు తన సంకల్పములకు తానే భీతిల్లుచు ఒక అబల, ముగ్ధ, చంచలమగు బాలికవలె ప్రవర్తిల్లుచున్నాడు.

వత్సా! చైతన్యమే ఈ జగత్తు యొక్క జీవశక్తి. అయితే ఏం? అది వివశ అయి పశుధర్మమును పొందుతోంది. కర్మానుసారంగా దీనికి అట్టి దురవస్థలు, దుఃఖసంకటములు, భ్రాంతులు కలుగుచున్నాయి, ధాన్యపుగింజ నశ్వరమగు ఊకను దాల్చి ఉన్నట్లు, అది కూడా సంకల్ప – వికల్ప – ఇచ్ఛా – జాడ్యములను ధరిస్తోంది.

❖

చైతన్యమే అల్పకాలం అవిద్యారూపంలో కూడా ఉంటోంది. ఆహా! ఆ చైతన్యం భర్తృహీన అగు నాయికలాగా జీవభావం పొంది దురదృష్టసంతప్తము, వైభవవంచితము అయి శోకిస్తోంది!

జడరూపియగు అవిద్య యొక్క సామర్థ్యం ఎంతటిది? పూర్ణబ్రహ్మ స్వభావమగు చైతన్యం అవిద్యావశం చేత తన నిజస్వభావమును విస్మరించి అధః పతనార్థం ఎటకో అరుగుచున్నది. ఎంత కష్టమైన విషయం

శ్రీవసిష్ఠ మహర్షి : హే మహేశ్వరా ! చైతన్యమే స్వరూపముగా గల ఈ జీవుని జడత్వంవైపు పతనం అతి ఘోరంగా, అత్యంత దుఃఖప్రదంగా ఉంటోంది. నిజమే! దీనికి ఉపాయం ఏమిటి? జీవునికి దుఃఖాలు తొలిగేది ఎట్లా?

❖❖❖

5. చైతన్యం సర్వదా సర్వత్రా యథాతథం

శ్రీశివ భగవానుడు : నీ ప్రశ్నకు సమాధానమే మన ఈ సంభాషణ యొక్క ముఖ్యోద్దేశం.

ఒకడు కలకంటూ, ఆ కలలో 'నేను పిచ్చివాణ్ణి' అని భావించి ఎలుగెత్తి ఏడవటంలో అర్థం ఏముంది? ఆ స్వప్నద్రష్ట 'నేను దుఃఖయుక్తుడను' అని భావించి వ్యాకులపడుచున్నట్లు, చైతన్యము కూడా తనకు వినష్టమనేదే లేకపోయినప్పటికీ, వినష్టమును సమీపించబోవుచున్నట్లు భయపడుతూ మధ్య మధ్య వెఱ్ఱికేకలు వేస్తోంది.

కుమ్మరి సారె తీవ్రవేగంగా తిరుగుతూ ఉంటే, అది సుస్థిరంగా ఉన్నట్లు చూచేవాడు భ్రమించుచున్నట్లు చైతన్యము 'అహం' ప్రత్యయ భ్రమవశంచేత ఈ జగత్తును సుస్థిరమైనదానిగా గాంచుచున్నది.

శ్రీవసిష్ఠ మహర్షి : స్వామీ! చైతన్యముయొక్క సంసారానుభవమునకు కారణమేమిటి?

శ్రీశివ భగవానుడు : చిత్తమే! అయితే చిత్తము అనేది చిత్‌చైతన్యము యొక్క విలాసమేగాని మరింకేమీ కాదు. చిత్ వ్యతిరిక్తమగు వస్తువంటూ వేరే ఎక్కడా ఏదీ లేదు.

'చిత్'కు కారణమే లేదు. కనుక చిత్తమునకు విషయమగుచున్న చిత్ పరికల్పితములగు ఈ దృశ్యము, జగత్తులు కూడా కారణరహితమే. కనుక ఈ జగత్తు అసత్యమే అయి ఉన్నది.

అసత్యమైన దానికి కారణమేముంటుంది? 'కథలో మంత్రి రాజును ఎందుకు చంపినాడు?' అనే ప్రశ్నకు సమాధానం కూడా కథలాగానే కల్పితమే అయి ఉంటుంది కదా!

వత్సా! అసలు విషయమేమిటో విశదీకరిస్తాను విను. పాషాణంలో తైలం ఉంటుందా? చంద్రునిలో నలుపు ఉన్నదా? "సూర్యుడు ఉదయిస్తున్నాడు, అస్తమిస్తున్నాడు" ...అని లోక ప్రతీతి కదా! అయితే సూర్యబింబానికి వాస్తవానికి ఉదయాస్తమయాలు ఉన్నాయా? ఆకాశమునకు అడ్డు, అవధులు ఉంటాయా? ఉండవు. అట్లాగే చైతన్యానికి దృశ్య-దర్శనాలు గాని, కర్త-కర్మ-కారణాలు గాని, ప్రమాత-ప్రమేయ-ప్రమాణములు గాని, చిత్తవృత్తి - చేతనము(క్రియ) - చేత్యము (జగత్తు)లు గాని లేవు.

'ఆకాశము' అనుదానికి 'దిక్కులు' అనునది ఆరోపితం మాత్రమే కాదా? (సూర్యుడు-భూమి యొక్క స్థితిగతులు లేనప్పుడు తూర్పుపడమరలు ఎక్కడుంటాయి?) చైతన్యము నందు 'నేను, నీవు, అతడు' అను భేదములు, నానాత్వ - అనానాత్వములు, నామరూప సంబంధములు అసంభవం. సూర్యమండలంలో 'రాత్రి' అనేది ఎలా సాధ్యం? చైతన్యము నందు దృశ్యవస్తు విశేషం ఉండటానికే అవకాశం లేదు. వస్తు-అవస్తు తత్త్వాలకు కుదిరేది కాదు.

ఒక గుండ్రాయి అంతరంలో పుష్పలత ఉంటుందా? అట్లాగే చైతన్యమునందు శూన్య - అశూన్య భావాలకు కారణమే ఉండజాలదు.

అటు ఆకాశాన్ని చూడు. అది పైన, క్రింద, ఇటువైపు, అటువైపు ప్రసరించి, 'విశాలత, శూన్యత, అశూన్యత, దిక్కు, కాలము' మొదలైన వాటికి సంబంధించక సర్వదా సర్వత్రా విస్తరించి ఉన్నది. అది అట్లుండగా 'అందులో అది ఉన్నది. ఇది ఉన్నది'అని మిగతా నాలుగు భూతములను (అగ్ని, వాయు, భూమి, జలము) గురించి ఆపాదిస్తున్నాం. వాటిచే ఆకాశం ఖండితమౌతోందా? లేదు. ఆకాశం సర్వదా దేనికీ సంబంధించక తనయందు తానే కేవలం తన యొక్క స్వచ్ఛభావమున వెలయుచున్నది. అట్లాగే, చైతన్యం కూడా అందులో కనిపించే శూన్యత, అశూన్యతాభావములకు కట్టుబడక సర్వదా సర్వత్రా నిర్మలంగానే ప్రకాశిస్తోంది. ఒకానొక చిత్తం చేత దర్శించబడే 'సంసార కూపము' అనే అనర్థం చైతన్యము యొక్క విలక్షణత్వమును స్పర్శించుటయే లేదు. ఆ చైతన్యం ఎక్కడ ఉండాలో అక్కడే నిర్వికారమై, జ్వరరహితమై ఉన్నది.

మరిక దోషము ఎట్లు కలుగుతోంది? జలంలో తరంగంలాగా చైతన్యము నందు 'చిత్తత్వము' అనే ఒక చమత్కారం ద్యోతకమౌతోంది. దాని పురాణనామమే హిరణ్యగర్భుడు. ఆ 'చిత్తస్రష్ట' నుండి దేహేంద్రియాదుల పట్ల 'అహంభావం' అను సంసారానర్థమంతా దాపురిస్తోంది. అట్టి అహంభావాన్ని తొలగించి చూడు. ఇక సంసారమనబడేదేదీ అగపడదు. నిత్య - బుద్ధ - స్తబ్ధ - శివచైతన్యము మొట్టమొదట ఎట్లా ఉన్నదో ఒకప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ అంతటా అట్లే ఉన్నది. ఇక వగచటం

దేని కొరకో చెప్పు? ఈ కనబడేదంతా సమిష్టి సృష్టిక్రియలతో సహా చైతన్యము యొక్క క్రీడ లేదా లీల వంటివే!

ఈ జీవుడు తత్త్వమును వింటూ కూడా, ఈ దేహేంద్రియముల పట్ల అహంభావమును తొలగించుకోకపోయాడా – ఇక ఇందులో చిక్కుకోవటంచేత కథ మొదటికి వస్తుంది. కాక, ఆతడు ఈ శరీరంతో సహా ఈ ముల్లోకములు తృణప్రాయం, నిస్సారం అని గ్రహించాడా, తన యొక్క చైతన్యస్వరూపం కరతలామలకం అవుతుంది.

అయితే... ఈ జీవునకు దృశ్యతాదాత్మ్యం తేలికగా తనంతట తానే పోయేది కాదు. ఈ దృశ్య సంసార అనేకత్వభావన జయించటానికి పురుషకారం ఆశ్రయించాలి. అంతేగాని, అది తనంతట తానే తొలగదు. పురుషకారమే లేకపోతే చైతన్య స్వభావమును ఎవ్వరూ సాధించలేరు. పురుషకారబలం చేత దోషదృష్టి తొలగిందా, ఇక ఈ జీవునికి మరెవరో స్వస్వరూపమును వివరించి చెప్పవలసిన అగత్యం ఉండదు. అందుకే శాస్త్రాలు సాధకజీవుల పురషకారము కొరకై 'పూజ' మొదలైన ఆయా విధి–విధానములను అందిస్తున్నాయి.

నిర్వికల్పాద్వితీయా చిద్యాసౌ సకలగా సతీ ।
పరమైకా పరా సాచ్ఛా దీపికా తేజసామపి ॥ (శ్లో 16, సర్గ 31)

అహంభావమును త్యజించి. సంసారానర్థమును దూరం చేయగలిగితే, మరుక్షణం ఆ జీవుడు సర్వవ్యాపకము, నిర్వికల్పము, అద్వయము అగు ఆత్మలక్షణాలను పుణికిపుచ్చుకోగలడు. ఇందులో సందేహం లేదు. ఆ ఆత్మచైతన్యమే తేజోపదార్థములన్నింటినీ ప్రకాశింపజేయు నిర్మలవస్తువు.

అయ్యది నిత్యోదితం, నిర్మనస్కం, నిరంజనం, నిర్వికారం, నిత్యనిర్మలం, సర్వప్రకాశకం కూడా! అదియే చలిచీమనుండి బ్రహ్మదేవుని వరకూ (పిపీలికాది బ్రహ్మపర్యంతం) అన్ని రూపములుగా వెలయుచున్నది. సర్వత్రా సాక్షిగా స్పందనారహితంగా ప్రకాశిస్తోంది. దానిని మరింకేదీ ప్రకాశింప జేయుట లేదు. అదిమాత్రమే స్వయంప్రకాశకం.

ఈ జీవుని వాస్తవ స్వరూపమగు చైతన్యం – నిర్మలం, అప్రమేయం, శాంతం – అయినప్పటికీ, అది ఈ దేహములను భావన చేయటం చేత తన స్వస్వభావమును ఏమరచి వికల్పమగుచున్నది. ధూళిమిళితమైన జలం దోషభూయిష్టంగా కనబడినప్పటికీ నీరు స్వయంగా నిర్మలమైనదే కదా! చైతన్యం అజడమై ఉండి కూడా, జడంగా కనబడుతోంది. సర్వగామి అయి కూడా సంకుచితత్వం కనబరుస్తోంది. నిర్వికల్పమగు సూక్ష్మావస్థలో నుండి ప్రాణమయమగు లింగశరీరమున ప్రతిబింబిత మగుచున్నది. సూక్ష్మమగు దారం యంత్రంలో ప్రవేశించి పెద్ద వస్త్రంగా మారుచున్నట్లు, అది హస్త, పాదాది అవయవములను తన ఉపకరణములుగా ప్రకటిస్తోంది.

ఈ జీవుని యొక్క ఏ వాసనామయచిత్తమైతే స్వప్నమున ప్రవేశించి ఆ స్వప్నమును గాంచు చున్నదో, అదియే జాగ్రత్తు నందు–బయట విషయముల రూపముననూ, అంతరమున బోధ రూపముగానూ వెలయుచున్నది.

అనగా... ఆ చైతన్యమే జాగ్రత్‌సమయమందు మనోరూపంతో వెలయుచునే, విషయాకృతిని దాల్చుచూ జ్ఞాన – అజ్ఞానాత్మికమగుచున్నది. ఒక సద్వర్తనుడు సాంగత్యవశంచేత దుర్విషయములను ఆహ్వానించినట్లు, అతినిర్మలమగు చైతన్యము ఈ దేహాది ఆకారములను అవధరించి ఇక తదనుకూల మైన చింతలను పొందుతోంది. రాగి బంగారంలో కలియటం చేత ఆ బంగారం రాగియొక్క రంగు తదితర లక్షణములను సంతరించుకుంటోంది. ఆ మిశ్రమంలోంచి రాగిని తొలగిస్తే బంగారం తన సహజ సిద్ధ ధవళఛాయలను వెదజల్లుతుంది కదా! చైతన్యము కూడా అశాశ్వతము కల్పితము అగు ఇంద్రియ విషయములతో సంయోగ వియోగానుభవములను పొందుతూ, శుద్ధాశుద్ధ భావనలను తెచ్చిపెట్టుకుంటోంది. అద్దం అపరిశుద్ధంగా ఉన్నప్పుడు ముఖం కనిపించదు చూచావా! ఆ అద్దమును శుభ్రపరిస్తే? ప్రతిబింబం స్వచ్ఛరూపం దాల్చగలదు కదా! అట్లాగే అజ్ఞానము వలన జీవ–జడ భావములను ఒక అనునిత్య స్రవంతివలె కల్పన చేసుకొని, ఆ కల్పనలలో ప్రవేశించి ఆయా స్థితి గతుల భావనచే బంధమోక్షాది దిగ్భ్రమములను పొందుచున్న ఈ చైతన్యము కూడా తత్త్వబోధచే మరల స్వకీయమగు నిర్మల – సహజ – నిర్వికల్ప స్వభావమును పుణికిపుచ్చుకోగలుగుతోంది.

ఆ చైతన్యము గురించి తెలుసుకొనకపోవటం చేతనే ఈ సంసారసంరంభమంతా ఉదయించి కలవరపెట్టడం జరుగుతోంది. చైతన్యముయొక్క స్వరూపమేమిటో గ్రహించావా... ఇక ఈ సంసారము తుచ్ఛమై, లయమై 'లేనిది'గా అనుభవమవగలదు. కాదూ... 'అసత్ భావమును ఆశ్రయించటం జరిగితే అప్పుడు స్వతఃగా నిత్యస్వభావి అయికూడా వినాశత్వము ఆపాదించుకోవటం జరుగుతోంది. ఒక పెద్దకొండ చివరగల మహావృక్షం యొక్క పువ్వు అధఃపతనమౌతున్నట్లు, సూక్ష్మమగు చిత్ పదార్థపు అల్పస్పందన ఈ విశాల జీవభావంగా పరిణమిస్తోందని గ్రహించు.

అయితే!... ఈ సర్వము చిత్పదార్థము యొక్క స్పందనయే కదా! కనుక ఈ బాహ్యముగా కనిపిస్తున్న రూపరసాదులసత్త కూడా అద్వితీయమగు చైతన్యమే అయిఉన్నది. ఇక అధ్యస్తములగు భేదాభేదములంటావా? అవి అజ్ఞానదృష్టికి సంభూతములగుచున్నాయి. జ్ఞానబలంచేత అవన్నీ స్వయంగా లయం కాగలవు. అనగా, కల్పితక్రీడలోని అంతర్గతవిశేషములు వంటివి కాగలవు.

ఈ చిత్త – ఇంద్రియములతో అనుభూతమయ్యే ఏ 'సత్త' ఉన్నదో... అది కూడా సాక్షిచైతన్యమే గాని వేరే ఏదో కాదు. సర్వకార్య వ్యవహారములు చైతన్యస్ఫూర్తి చేతనే జరుగుచున్నాయి. ఏ స్థానమైతే చూడటానికి వీలుగా చైతన్యము ప్రకాశిస్తోందో అద్దానిని 'కళ్ళు' అంటున్నాం. అంతర్గత వృత్తియే కన్ను ద్వారా బహిర్గతమై కుండ, వస్త్రము మొదలైన ఆకృతులను దాల్చి, వాటి ఆకృతులను అనుభవించటం జరుగుతోంది.

చర్మము, దానిని స్పృశించే వాయువు – ఈ రెండూ జడములే. అయితే, ఈ రెండిటి యొక్క సంయోగమగు 'స్పర్శ' అనే అనుభవం 'తత్' జ్ఞానమగు చైతన్యము వలననే సంభవమౌతోంది.

అట్లాగే, గంధతన్మాత్ర కూడా! 'గంధము – దానిని స్పందించే ప్రాణవాయువు' ఈ రెండింటికి ఏర్పడే సంయోగము 'గంధజ్ఞానము'చే గ్రహించబడుతోంది. ఆ గంధజ్ఞానము చిత్తవృత్తికి

సంబంధించినది. ఆ చిత్తవృత్తినే 'అంతఃకరణం' అని పిలుస్తున్నాం. అట్టి జ్ఞానమును అంతః కరణమనే పరిచ్ఛిన్న ప్రదేశము నుండి వేరు చేసి, చూస్తే, అది చైతన్యము యొక్క ఉనికి చేతనే ఏర్పడుచున్నదని గ్రహిస్తాం. శబ్దతన్మాత్ర శ్రవణేంద్రియ వాయువుతో కూడటాన్నే 'శబ్ద సంవిత్తు' అంటున్నాం'. అంతఃకరణ వృత్తి రహితంగా చూస్తే అయ్యది కూడా నిర్వికల్పము, సుషుప్తి సదృశము అగు చైతన్యము యొక్క ప్రాశస్త్యమే గాని, మరింకేదో కాదు.

అందుచేత 'చైతన్యరూపమగు చిదాత్మ ఎచ్చటో, ఎన్నడో, ఏదో నిర్వర్తించిన తరువాత లభించేది' అని అనటం సరియే కాదు.

❖

కర్మేంద్రియముల 'ప్రవృత్తి' వలన కలుగుచున్న సంకల్ప కాలుష్యమే, "చిత్తము, మనసు, లేక, చింత" అనబడుతోంది. ఆ ప్రవృత్తియే మనోవృత్తి. ఆ మనోవృత్తులకు సాక్షి అగు వృత్తిరహిత చైతన్యమేదైతే ఉన్నదో – అదియే నిర్మలమగు ఆత్మచైతన్యం. ఆహా! వసిష్ఠ మహర్షీ! చూచావా... కాలః కాలమై, అనంతమై అద్వితీయమైన ఆ చైతన్యమునకు మనమందరం ఎంత సమీపంగా ఉన్నామో...! అసలు, అదియే మనమై ఉన్నాము కదా!

ప్రకాశాత్మకమగు ఆ చైతన్యమే తనయందు తాను వెలయుచూ స్ఫటికమణిలాగా తనయందు ఈ జగత్తులను ధరిస్తోంది.

మరొక్క విషయం...! అద్వితీయమగు ఆ చైతన్యం ఈ జగత్తులను ధరిస్తూ త్యజిస్తూ ఉంటున్న ప్పటికీ అద్దానికి ఉదయాస్తమయాలు గాని, స్థిర-చలనాలు గాని, హాని-వృద్ధులు గాని లేనే లేవు.

ఆ చైతన్యం తన యొక్క సంకల్పబలం చేతనే జీవభావాన్ని దాల్చుచున్నది. అది సంకల్ప రహితమైనప్పుడు – "ఈ జగత్తుగా అనుభూతమయ్యేదంతా తానే – అనే వాస్తవం గ్రహిస్తోంది. అట్లు గ్రహించి, స్వస్వరూపమున (లేక) తన యందు తానే వెలయుచున్నది.

ఈ జీవుని రథం అహంకారం; అహంకారం యొక్క రథం బుద్ధి; బుద్ధియొక్క రథం మనస్సు; మనస్సు యొక్క రథం ప్రాణం; ప్రాణం యొక్క రథం ఇంద్రియాలు; ఇంద్రియముల రథం ఈ శరీరం; శరీరం యొక్క రథం కర్మేంద్రియాలు... ఇన్ని రథాల యొక్క కార్యం 'స్పందన'. ఇదంతా నిశ్చలమగు ఆత్మస్పందనా చమత్కారమే!

జరామృత్యు మయమై కనిపించే ఈ దేహ పంజరంలో ప్రతిబింబించే జీవవిహంగం ఆ ఆత్మేశ్వరుని విభూతియేగాని మరింకేదో కాదు. నాయనా! ఈ ప్రపంచమంతా ఆత్మ యందు ఒక తుచ్ఛమగు స్వప్నంలాగా ప్రతిభాసిస్తోంది. ఇట్టి జగత్తునందు కొంచెం కూడా సత్యం లేదు. శ్మశాన వాటికలోని మురికి గుంటలలోని నీరులాగా, ఇది అత్యంత త్యాజ్యార్హం.

❖

ప్రాణములు ఎటువైపుకు వెళ్తుంటే, కల్పనల రూపమైన సంకల్పం కూడా అటువైపుకే పరుగు లెత్తుతూ ఉంటుంది. వెలుతురు ఎక్కడ పడుతుంటే అక్కడే రూపములు కనిపిస్తున్నట్లు, బలవంతుడగు

ప్రాణములు ఉన్నచోటే సంకల్పసంచలనం అనుభూతమౌతోంది. అరణ్యంలో వాయువు ప్రవేశిస్తేనే చెట్లకదలికలు కలుగుచున్నట్లు మనస్సు ఉన్నచోటే సంసారం. మనస్సు లీనమైనచోట సంసారమునకు తావు ఉండదు.

ప్రకాశము లేకపోతే రూపమే ఉండదు కదా! అట్లాగే ప్రాణవాయువులు లేకపోతే మనస్సనేది బొత్తిగా ఉండదు. గాలి వెంటే దుమారం కూడా వెళ్ళుచున్నట్లు ప్రాణవాయువులు వెళ్ళే వేపుగానే మనస్సు కూడా వెళ్తోంది. రథం ఎటు వెళ్ళితే సారథి కూడా అటే పోతాడు కదా! ప్రాణవాయు చలనస్పర్శ చేత అన్నరసమును వ్యాపింపజేయు నాడులు స్పందిస్తున్నాయి. చక్షురాది ఇంద్రియముల జ్ఞానం కలుగుతోంది. చిత్తము - మనస్సులతో నిర్మించబడేదే లింగశరీరం కదా! అది 'ప్రాణము' అను దర్పణంలో ప్రతిబింబిస్తోంది.

ఈ విధంగా 'చైతన్యం యొక్క వ్యాపకత్వం ప్రాణవాయువు యొక్క కార్యమే' అని అంటూంటారు.

శ్రీవసిష్ఠ మహర్షి: స్వామీ! చైతన్యము ప్రాణసహిత పదార్థములలో మాత్రమే ఉన్నదని అనవచ్చునా?

శ్రీశివ భగవానుడు : ఆకాశమువలె స్వచ్ఛమగు చైతన్యము జడ-అజడ పదార్థములన్నిటా ఉన్నది. ప్రాణవాయుస్పందనచే స్పష్టంగా అభివ్యక్తమై, అద్దాని సంచలనముచే అనుభవమునకు గోచరమౌతోంది. చైతన్యము ప్రాణవాయువులవలన ఉద్బోధితమై ఎదురుగా అధ్యస్తమైయున్న చైతన్యముతో అభేదత్వం పొందుతోంది.

జీవదశ యందు ప్రాణముండుటచే జడమగు దేహం నానావిధ యత్నములు చేస్తోంది. ఈ శరీరము ప్రాణవాయువులు లేనప్పుడు శూన్యము, నిశ్చలము అగుచున్నది.

పరమచైతన్యం పుర్యష్టకంలో (పంచేంద్రియాలు, మనస్సు, బుద్ధి, అహంకారం) ప్రతిబింబితమవుతోంది. ఒక దృశ్యం అద్దంలో ప్రతిబింబించినట్లుగా రాతిలో ప్రతిబింబించదు కదా! కార్యములన్నిటికీ కారణమగుచున్న మనస్సే పుర్యష్టకం. అంతేగాని నిస్తేజమగు కాళ్ళు, చేతులు పుర్యష్టకం కాదు.

సంకల్పమయములగు ఈ దృశ్యజాలములన్నీ దేని నుండి ఉదయిస్తున్నాయో, ఎందులో వెలయుచున్నాయో, ఎందులో అనుభూతములగుచున్నాయో, దేనిచే మనస్సు తదితర దేహాకారాలుగా భ్రమించబడుచున్నదో - ఆ పరమ వస్తువే విశ్వము. అదియే పరమాత్మ.

❖❖❖

6. అజ్ఞానము యొక్క చమత్కారం!

శ్రీవసిష్ఠ మహర్షి : హే పరమేశ్వరా ! ఆ పరమచైతన్యము జీవుల శరీరములలో ప్రవేశించి కార్యములను ఆచరిస్తున్న విధి గురించి కొన్ని విశేషాలు మీ దగ్గర నుండి తెలుసుకోవాలని ఉన్నది. అది చలనయుక్తమై 'స్నాత - భోక్త - బ్రాహ్మణ -క్షత్రియ' మొదలైన సంజ్ఞలను పొందుచున్న విధానమేమిటో చెప్ప ప్రార్థన.

శ్రీశివ భగవానుడు : ఆ చైతన్యమునకు ఒక శక్తి ఉన్నది. అదియే... "ఆవరణ శక్తి".

ఆ ఆవరణశక్తి తనకు ఆశ్రయమగు బ్రహ్మమును మరుగున పరిచి, లేదనిపించుచూ పూర్వార్జితం, సంస్కారజనితం – అగు వివిధ యత్నాలతో కూడిన మనోభావాలు పొందుతోంది. మనోవాక్కాయాలకు సంబంధించిన ఆయా క్రియా విశేషాలచే చైతన్యము జడమువలె అగుచున్నది. అట్లు వ్యవహారదశను పొందిన బ్రహ్మశక్తి జ్ఞానేంద్రియాలను, కర్మేంద్రియములను కూడా పొందుతోంది. మాయ యొక్క ప్రభావం చేత ఆ పరమచైతన్యం తనలో తానే 'జగత్తు' అనే గంధర్వనగరం (ఊహాజనిత అనుభవపూర్వకస్థానం) సృష్టించుకుంటోంది.

ఒకవైపు భావనా సమన్వితమగు ఈ సృష్టిని కల్పించుకుంటూ... అదే సమయంలో మరొకవైపుగా ఏదీ సృష్టించక 'యప్పటియట్లే' ఉంటోంది. ఆ సమన్వయం జలం – తరంగాకారముల వంటిది.

జడమగు ఈ దేహంలో 'చిత్తం లేదా మనస్సు' అనేవి లేకపోతే ఇది కట్టె, రాయితో సమానమే. చిత్తము ఉన్నప్పుడు ఆకాశంలో ఎగురవేయబడిన రాయిలాగా చలనము కలిగి ఉంటోంది. అత్యంత జడమగు ఇనుప ముక్క అయస్కాంతము యొక్క సామీప్యతచే చలిస్తున్నట్లు సర్వాంతర్యామియగు ఆత్మదేవుని సామీప్యతవలన ఈ దేహం చలించి ఆయా క్రియలను నిర్వర్తించగలుతోంది.

సర్వవ్యాపియగు ఆ 'చిత్‌శక్తి' బలం చేతనే ఈ జీవులందరూ వికాసం పొందుచున్నారు. కాబట్టి... నీతోను, నాతోను సహా ఈ జీవులందరూ చైతన్యము యొక్క ప్రతిబింబమాత్రులే.

శ్రీవసిష్ఠ మహర్షి : పంచభూతములచే నిర్మించబడి, కనబడుచున్న ఈ జీవులందరూ నిష్క్రియమగు ఆత్మయందలి ప్రతిబింబములు ఎట్లా అవుతారు?

శ్రీశివ భగవానుడు : నిష్క్రియమగు అద్దంలో వస్తువుల కదలికలు కనబడుచున్నాయి కదా? ఇదీ అట్టిదే. ఈ జీవుడు బ్రహ్మము యొక్క ప్రతిబింబమే అయి కూడా, తన నిజస్వరూప విస్మరణం వల్ల స్వవ్యతిరిక్త భావపరంపరా రూపమగు పంచభూత సంబంధమైన జడానుభవం పొందుచున్నాడు. అదంతా ఒక సాత్వికజీవుడు ఏదో మోహవశం చేత కుకర్మలను ఆచరించి దురభ్యాసాలకు లోనయి నట్లుగా జరుగుతోంది.

చైతన్యము స్వస్వభావం విస్మరించటం చేతనే చిత్తభావం పొందుతోంది. అన్నీ తెలిసి కూడా ఒకడు మోహవశం చేత వికలత్వం పొందటం ఎంతటి ఆశ్చర్యమో, ఇదికూడా ఆ విధంగా ఆశ్చర్యకర విషయమే! కాని ఇది జరుగుట స్ఫురిస్తోంది. తరంగముల వలన నీరు చలిస్తున్నట్లు ప్రాణవాయువులచే అధ్యస్తమైన ఈ శరీరం చైతన్యానికి చలనమును ఆపాదిస్తోంది. వాయువుల వలన నౌక చలిస్తూ ఉండగా అందులోని వస్తుజాలం కూడా చలిస్తున్నట్లు దేహయంత్రాలన్నీ జీవభావం పొందుచున్నాయి. ఈ దేహం ఆత్మ నుండి మనన క్రియను సంపాదించి ఆత్మదేవుని సామీప్యమాధుర్యం చేత కదలుతూ తానే ఆత్మను స్పందింపజేస్తున్నట్లు ప్రదర్శితమౌతోంది. ప్రజ్ఞానం యొక్క చమత్కారం అంతటిది!

హే బ్రహ్మజ్ఞా! పరమాత్మ ఈ శరీర శకటమును నడిపించగోరి, మనస్సు – ప్రాణము అనే రెండు చక్రములు నిర్మించుకుంటున్నారు. చైతన్య పరమాత్మ జడరూపమును గ్రహించి జీవభావము

పొందినవారై ఈ బాహ్య మనో-ప్రాణాలనే గుఱ్ఱములను ఎక్కి, ఎటకో పయనిస్తూ తమ స్వస్వరూపాన్ని ఈషణ్మాత్రంకూడా త్యజించకపోయినప్పటికీ ఈ పంచభూతాత్మిక జగత్తులో సంచారం చేస్తున్నారు. జగత్తులో "నేను జన్మిస్తున్నాను" అను రూపంగానూ, స్వప్నంలో "నేను దర్శిస్తున్నాను" అను రూపంగానూ స్వకీయ మాయచే సంకల్పములు చేసుకుంటున్నారు.

కానీ ఆయన ఏమాత్రం ఎక్కడికీ వెళ్ళుట లేదు. తరంగత్వం జలం నుండి వేరైనదెప్పుడు? ఎప్పుడూ లేదు. చైతన్యము కూడా జగత్తు నుండి భిన్నం కాదు. ఆత్మచైతన్యమును ఆశ్రయించుకొనియే చిత్తవృత్తులు జీవజగత్తులను స్ఫురింపజేయుచున్నాయి. వెలుతురు యొక్క ప్రసరణచే రూపములు ప్రకాశించుచున్న, ఆత్మచైతన్య ప్రకాశము వలననే సర్వము ప్రకాశిస్తోంది.

కనుక పుత్రా! దీపం ఉన్న ఇల్లులాగా నిరామయమగు చైతన్యము ఉండటం చేతనే నీకు కనబడే ఈ జీవులు నీకు ప్రకాశిస్తున్నారు.

ఒకే జలం నుండి అలలు, ఆ అలల నుండి బుడగలు, ఆ బుడగల నుండి నురుగు, ఆ నురుగు నుండి తెల్లటి తెలుపు ప్రకటనమగుచున్నట్లు ఈ జీవుని నుండే ఆధి-వ్యాధులుగా గల దుఃఖాలన్నీ పుట్టి పెరుగుచున్నాయి. 'నేను ఈ శరీరపరిమితుడను' అని సుదీర్ఘంగా అనుకుంటూ ఉండటం చేత ఈ జీవుడు దుఃఖ-దైన్యములతో చివుకుతున్నాడు. చైతన్యమే అన్నిటికీ ఆధారమై కూడా తన సంకల్పపరంపరలతో నిర్మించుకున్న శరీరాలలో ఆ చైతన్యం వివశత్వం పొందుతోంది.

శ్రీవసిష్ఠ మహర్షి : ఇది అత్యంత చిత్రం కదా!

శ్రీశివ భగవానుడు : చిత్రమే ! కానీ, ఏం చేయాలి? మత్తుగా కల్లు త్రాగిన మనుజుడు తన శరీరం మురికితో నిండినా గ్రహించలేడు చూచావా? చైతన్యం కూడా వివశత్వం పొంది తన సర్వాధార - స్వప్రకాశక - స్వస్వరూపాన్ని ఏమరిచి బాలునివలె దుఃఖాలను పొందుతోంది. కల్లుతో మత్తెక్కిన వాడు మత్తు దిగిన తరువాత తాను మత్తెక్కి చేసిన పనులను దూరంగా విడచున్నట్లు, చైతన్యము కూడా మోహమును త్యజించినప్పుడు స్వస్వరూపాన్ని గ్రహించి, జగత్తు యొక్క రహితత్వం దర్శిస్తోంది. కుష్టురోగియొక్క శరీరంలోని కొన్ని భాగాలు నిర్వీర్యమై స్పర్శరహితమైనట్లు, సర్వవ్యాపకమగు చైతన్య స్వరూపుడగు ఈ జీవుడు ఒకచోట ఒకానొక శరీర పరిమితమై నట్లు సంకుచితత్వం ఆపాదించు కుంటున్నాడు.

❖

ఈ భౌతికదేహం శిథిలమగుచూ ఉండగా హస్తపాదాది అవయవములు ప్రాణవాయువుల ప్రసరణ కోల్పోతాయి. అప్పుడు హృదయమున హృదయకమలదళం చలనరహితంకాగా, విసనికఱ్ఱ వీచటం ఆపినప్పటి గాలిలాగా అంతరమున జరిగే ప్రాణవాయు సంచలనం ఆగుతుంది. ఆ విధంగా ప్రాణవాయువులు లోన అడగినప్పుడు జీవుడు నామరూప ఉపాధిరహితుడై కారణస్వరూపుడై వెలయుచున్నాడు. అతని మనస్సు రజోగుణహీనమై, నిరాధారమై, ప్రాణవాయువులతో లీనమై ఉంటుంది. అనగా 'కారణాత్మకత' పొందుతోంది. మరల విత్తులోంచి చెట్టులాగా మరొక దేహ రూపమున ప్రకాశించటం జరుగుతోంది.

ఈ విధంగా వైకల్యం పొందుచున్న మూలకారణంతో పుర్యష్టకం ఏర్పడటం, ఉపశమించటం, మరల ఏర్పడటం జరుగుతోంది.

'స్వస్వరూపమును మరచుట' అను మోహము వలననే చైతన్యము చేత్యాకారం (The form that all being perceive) పొందటం జరుగుతోంది. ఆ చేత్యాకారమునందు వాసనామోహములు స్పందిస్తున్నాయి. ఇక అందులోంచి అనేక కల్పనలు బయలుదేరుతున్నాయి.

హృదయ కమల దళములు వికసిస్తూ ఉండగా పుర్యష్టకం (పంచేంద్రియ వ్యాపారములు – మనస్సు – బుద్ధి – జీవాహంకారము) మరలమరల పరిస్ఫుటమౌతోంది. హృదయకమలదళం నిశ్చలమైనప్పుడు పుర్యష్టకం కూడా వినష్టమౌతోంది. శరీరమధ్యంలో పుర్యష్టకం ఉన్నంతవరకూ ఆ చైతన్యము జీవదశ పొందుతోంది. పుర్యష్టకం క్షీణించిందా ... శరీరం మృతమైనదని చెప్పబడుతోంది.

అట్లాగే కఫ – వాత – పిత్తముల వలనగాని రాగద్వేషాదులనే మలరాసి యొక్క తీవ్రప్రకోపం వల్ల గాని, శస్త్రాదుల చేతగాని ప్రాణవాయు ప్రసరణం నిరోధించబడగా, అప్పుడు కూడా హృత్పద్మ యంత్రం ప్రకోపించదు. అప్పుడు పుర్యష్టకం, వాయుయంత్రం వలన నిరోధించబడి బహిష్కృతమైన గాలివలె, నెమ్మదిగా ఆకాశమున కలిసిపోతోంది.

ఈ జీవుడు కేవలం తన సంకల్పముల వశం చేతనే మరణాది అనేక దుఃఖములను అనుభవించుచున్నాడు. సంస్కారబలంచేతనే శరీరమునందలి పద్మయంత్రం ఎడతెరిపి లేకుండా చరిస్తోంది.

వాసనా విమలా యేషాం హృదయాన్నావసర్పతి ।
స్థిరైకరూపజీవాస్తే జీవన్ముక్తాశ్చిరాయుషః ॥ (శ్లో 35, సర్గ 32)

ఎవరిహృదయంలో అయితే సర్వదా పవిత్రమైన ఆత్మతత్వమునకు సంబంధించిన వాసనలు ఉంటాయో ...అట్టి జీవులు శాశ్వతము, ఏకరూపము, జీవన్ముక్తములతో కూడిన చిరంజీవత్వమునందు వెలయుచున్నారు.

శ్రీవసిష్ఠ మహర్షి : స్వామీ! శరీరం నేలకూలినప్పుడు మనస్సుగతి ఏమౌతోంది?

శ్రీశివ భగవానుడు : హృత్పద్మయంత్రం నిరుద్ధమైనప్పుడు ప్రాణవాయువులు సశాంతిస్తాయని అనుకున్నాం కదా! అప్పుడీ భౌతికశరీరం ధృతిశక్తిని వీడి కట్టె, మట్టితో సమానమై భూమి మీద కూలుతుంది. పుర్యష్టకం ఆకాశంలో లీనమైపోతుంది. మనస్సు కూడా ఆకాశంలో తన ఉనికిని గాంచు తుంది. అనాది కాలం నుండి అభ్యాసబలమును కలిగి ఉన్న వాసనతో నిండిన మనస్సు ఎచ్చటెచ్చట పరిభ్రమిస్తుందో అచ్చటచ్చట స్వర్గ–నరకములను గాంచుతూ ఉంటుంది. ఇక ఈ శరీరమంటావా! ఒక గృహస్తు ఇల్లు వదల వెళ్ళినపుడు పాడుపడుచున్నట్లు, ప్రాణములు లేచిపోగానే శరీరం శవరూపం దాల్చి శిథిలమౌతోంది.

సర్వగామియగు బ్రహ్మచైతన్యమే చేత్యభావం పొందుతోంది. అనగా "తెలివి ... తెలుసుకొనుట" అను భావం ఆశ్రయిస్తోంది.

చేత్యభావం నుండి	→	చేతనాభావన
చేతనా భావం నుండి	→	జీవభావం
జీవభావం నుండి	→	మనస్సు
మనస్సు నుండి	→	సూక్ష్మమగు పుర్యష్టకం
పుర్యష్టకం నుండి	→	శబ్ద, స్పర్శ, రూప, రస గంధము లనెడి విషయాలు.

సూక్ష్మశరీరం (పుర్యష్టకం) సంకల్పములను తన ఒడిలో వేసుకొని భావనాబలం వలన ఒక స్వప్నభ్రమ వలే ఈ స్థూల శరీరములను గాంచుచున్నది. ఆ భావనాదృఢత్వం చేత ఈ శరీరమును సత్యమైన దానిగా తలచి, దీనియందు ఆసక్తిగొన్నదై తన సర్వాంతర్యామిత్వాన్ని, సర్వనియామకత్వాన్ని బొత్తిగా ఏమరుస్తోంది. చైతన్యము సూక్ష్మభూతాత్మకమై, ప్రాణమయమగు ఈ పుర్యష్టక సమన్వితమైన శరీరమును లేవదీయుచుండగ జనులు 'ఈతడు జీవించియే ఉన్నాడురా' అని చెప్పుకుంటున్నారు. ఆ పుర్యష్టకము నశించి చిత్తము ఆకాశమున లీనమైనప్పుడు శరీరము కొయ్య, రాయిలాగా అచేతనమగుచున్నది. అప్పుడు 'ఈ శరీరము మృతమైనది' అని అంటున్నారు. క్రొత్తదగు చిగురుటాకు కాలక్రమంగా ఎండిపోవునట్లు ఈ శరీరం కూడా ఒకనాటికి వాడిపోతోంది.

అయితే ఇక్కడ మరొక చమత్కారం మనం గమనించాలి. చైతన్యము అజ్ఞానవశంచేత చావుగాని, పుట్టుకగాని లేని తన బ్రహ్మస్వరూపమును మరచి వివశత్వం, శక్తిరాహిత్యం అనుభవిస్తోంది. మృత్యు సమయంలో హృత్‌పద్మయంత్రం జీవస్మృతిని కోల్పోయి చలనరహితమై ఉంటోంది. ప్రాణ వాయువు నిరుద్ధమైనప్పుడు మనిషి మృతి చెందాడని అనుకుంటున్నారు. అంతమాత్రానికి ఆతని కాల్పిక జగత్తు అంతమైనట్లు కాదు. నిదురించునప్పుడు కాల్పిక జగదనుభవం కొంచెం విరామం పొందినట్లు వర్తమాన తదనంతర దేహముల మధ్య కాల్పిక జగత్తు కొంచెం విరామం పొందుతుంది.

❖

యథా జాతాని జాతాని చాన్యాన్యన్యాని కాలతః ।
వృక్షాత్పర్ణాని శీర్యన్తే శరీరాణి తథా నృణామ్ ॥ (శో 49, సర్గ 32)
జాయన్తే చ మ్రియన్తే చ శరీరాణి శరీరిణామ్ ।
పాదపానాం చ పర్ణాని కా తత్ర పరిదేవనా ॥ (శో 50, సర్గ 32)

వత్సా! వృక్షం యొక్క ఆకులు యథాసమయంలో పుట్టి, ఎండి రాలిపోతున్నట్లే, ఈ మనుష్యుల శరీరాలు కూడా పుట్టి, పెరిగి నశిస్తున్నాయి. జనన, మరణములు ఈ దేహమునకు స్వాభావికములే కదా! ఇక ఇందుకై దుఃఖం ఎందుకు?

చిత్ సముద్రంలో ఏ ఏ వైపుల నుండి ఎన్నెన్ని శరీరములు బుద్బుదపంక్తుల వలె లేస్తున్నాయో ఎవరు చెప్పగలరు? బుద్ధిమంతులకు వీటి పట్ల శాశ్వతబుద్ధి ఉండదు. ఇక బ్రహ్మచైతన్యం ఆకాశ – అనాకాశములందు ప్రసరించియున్నదై కూడా సర్వదా యథాతథంగా ఉండి ఉన్నది. చిత్తదర్పణంలో

ప్రతిబింబిత చైతన్యమే కనబడుతోంది. చిత్తధారులు చిత్తముచే పరిమితమైన చైతన్యమునే చూస్తూ భ్రాంతిని పొందుచున్నారు. చిత్తమును ఒకవస్త్రమువలె, ఒక ఆభరణమువలె ధరిస్తున్నట్టి చైతన్యమును గమనించలేకపోతున్నారు.

పరిపూర్ణం, నిర్మలం అగు చిదాకాశమున శుభాశుభకర్మలు తత్ సంబంధిత సుఖ దుఃఖాలు వాటికి సంబంధించిన కల్పనాపుంజములు, ఆపాతరమణీయ భోగభావనలు, వివిధ జననమరణ పరంపరలు ఆకాశంలో గాలివీచికలులాగా ప్రసరించి ఆత్మను విముగ్ధం చేసి తపింపజేస్తున్నాయి.

ఏది ఏమైనా కావచ్చు. ఆత్మసర్వదా నిర్వికార – నిత్యోదిత – నిష్కళంక సమన్వితమైనది. అది దేనికీ తగిలి ఉండటం లేదు. అన్నిటికీ సాక్షీభూతమై మొట్టమొదట ఎచ్చట ఎట్లున్నదో, ఇప్పటికీ అచ్చటే, అట్లే ఉన్నదని మరొక్కసారి గుర్తు చేస్తున్నాను.

ఆ ఆత్మ భగవానునికి ఈ శరీర జననమరణాలతో ఎప్పుడూ, ఏ మాత్రం సంబంధం లేదు.

❖❖❖

7. అపరిమితంలో పరిమితమా ?

శ్రీవసిష్ఠ మహర్షి : హే చంద్రశేఖరా! ఇప్పుడు నాకు కలిగే కొన్ని సందేహాలను మీ ముందు ఉంచుతాను.

1. అనంతం, ఏకరసం, అద్వైతం – అగు చిద్వస్తువునందు 'చిత్తం' అనే ద్వితీయ వస్తువు ఎట్లా ఏర్పడింది?
2. అచిత్తంలో ద్వైతం ఎట్లా అరూఢమౌతోంది.
3. చిదాత్మకు దుఃఖజాడ్యం ఎట్లా కలుగుతోంది?
4. జ్ఞానం సంపాదించేది ఎట్లా? ఆ దుఃఖజాడ్యం ఎట్లా తొలిగేది?

... ఈ విషయాలు వివరించవలసినదిగా నా విన్నపం

శ్రీశివ భగవానుడు : నాయనా! వసిష్ఠా! 'సర్వశక్తియుతము – ఏకత్వము' అయి ఉన్నదొక్కటే అన్ని వైపులా, అన్ని వేళలా వెలియుచున్నదని ముందే చెప్పాను కదా! నిజానికి పారమార్థిక దృష్టిలో దానియందు ఏ సమయంలోనూ ద్వైతాద్వైత భావాలూ, విషయాలూ లేనేలేవు.

ద్వైతభావం ఉంటే ఏకత్వమనేది మరొకటి ఉంటుంది. ఒకటేదో రెండు అవటమే ద్వైతం కదా! ఈ రెండూ కూడా చిన్మాత్రమగు బ్రహ్మము పట్ల సత్యం కాదు.

'రెండు' అనే భావం 'ఒకటి' అనుదాని లోంచే కలుగుతోంది. వాస్తవానికి బ్రహ్మమును ద్వైతమని గాని, అద్వైతమని గాని వర్ణించలేం. బ్రహ్మ ద్వైతాద్వైత వివర్జితం.

అయితే ...వ్యావహారిక పరమార్థ బోధ అది 'అద్వైతం' అని ప్రతిపాదించబడుతోంది. అదంతా తెలిపేవాడు ఔత్సాహికులగు తెలుసుకునేవారి వర్తమాన సమాచారం, సౌలభ్యములను అనుసరించి

చేస్తున్న మధ్యేమార్గమని గ్రహించు. లోకవ్యవహార సిద్ధికై ఆ విధంగా ద్వివిధ బోధ ఒనర్చబడి నప్పటికీ... పరమార్థ వస్తువు నందు చిత్తము అనబడే ద్వితీయం ఉండటం అసంభవం.

❖

కానీ, భావనచే ద్వితీయమైనదైన చిత్తము, అద్దాని నుండి తదితరమైనదంతా అనుభవమవటం జరుగుతోంది. అదెట్లా అంటావా?... బీజము ఒక్కటే అయినప్పటికీ అది వృక్షశాఖ, ఫల, పత్ర, పుష్ప, పల్లవాది వివిధ నామరూపాత్మకమై వ్యవహరించబడుతోంది కదా! అట్టి వ్యవహారసత్తా అంగీకరించటానికి ఇష్టం లేకపోయినప్పటికీ కీడేమిటి? బీజములోని రస శక్తియే ఆ విధంగా రూపం దిద్దుకొంటోందని ఎందుకు జ్ఞాపకముంచుకోరాదు?

ఎందుకంటే, చిత్‌యే చేత్యాది రూపంగా స్ఫురిస్తోంది. దాని సారమే అన్నిటా నిండి ఉన్నది. ఈ నామరూపాది వికారజాలమంతా ఆ చిద్వస్తువు నుండే లేచి కార్యకారణ భేదములతో వస్తు రూపమున సార్థకమగుచూ వ్యవహరించబడుతోంది.

అనగా... 1. పారమార్థిక, 2. వ్యావహారిక, 3. ప్రాతిభాసిక – ములగు సర్వ పదార్థములు కూడా బ్రహ్మసత్త చేతనే ఆవరించబడి ఉన్నాయని గ్రహించు. కనుక ఈ కనబడే సర్వమూ బ్రహ్మసత్తయే కాబట్టి సత్యమే కదా! కాని ద్రష్ట స్వకీయ సంస్కారానుసారం కొంత భ్రాంతిని జోడించి పరికిస్తున్నాడు. అట్టి అజ్ఞానం తొలగాలి. "పటిక బెల్లం యొక్క రుచి గురించి వర్ణన కన్నా అనుభవం మిన్న" అన్నట్టుగా, "వస్తు పరిశీలనాత్మక సాక్షాత్కారం" ఒక్కటే సర్వమునూ స్పష్టం చేయగలదు. జలకణములు, తరంగములు, బుద్బుదములు మొదలైనవన్నీ జలంనుండి ఏమాత్రం వేరైనవి కానట్లు... సర్వశక్తిత్వము కూడా బ్రహ్మము నుండి వేరుకాదు.

సర్వశక్తిత్వములోనే వస్తుశక్తి ఏర్పడి ఉంటోంది. కనుక ఈ కనబడుచున్నదంతా బ్రహ్మమునకు వేరు కాదు. బ్రహ్మము సత్యమే కదా! తత్త్వదృష్టితో చూస్తే బ్రహ్మమునకు శక్తికి అభేదమే ఉంటుంది. పుష్ప–ఫల–పల్లవాదులు లత నుండి వేరా? లత బీజములో ఉండి ఉన్న బీజశక్తి కంటే వేరా?

ఈ ద్విత్వము, ఏకత్వము, జగత్తు, అహం, త్వం ఆదిగాగల భావములన్నీ కూడా చిద్వస్తువు నుండి ...అనగా, తెలుసుకుంటున్న వానియొక్క 'తెలివి'అను స్వరూపమునుండి బయలుదేరుచున్నాయి. కనుక అవి అద్దాని నుండి వేరైనవి కావు. ఈ విధంగా ఈ దేశ కాలాది భేదములు చిద్వస్తువు నుండి వేరు కాదు.

ఇప్పుడు 'ద్వైతం ఎట్లా వచ్చిపడుతోంది?'అనే విషయానికి వద్దాం. నీ ఈ ప్రశ్న 'చైతన్యము లేక చిద్వస్తువు కంటే అన్యమైనదేదో ఉన్నది' అను ఆశంక నుండి బయలుదేరుతోంది. చిద్వస్తువు గాక వేరొకటేదీ లేనే లేదు. కనుక, నీ ప్రశ్న మొదలే అనుచితం. చిదాత్మ సత్త యొక్క ఉనికి చేతనే సంకల్పమాత్రముగా దేశ–కాల–క్రియ–నియతి మొదలైనవన్నీ ఆ చిదాత్మకే అనుభవమౌతున్నాయి. కనుక అవన్నీ చిదాత్మ యొక్క స్వయంకల్పిత స్వీయానుభవములే! చిదాత్మ స్వరూపములే!

జల తరంగములనే మనం ప్రవాహం – కెరటాలు మొదలైన పేర్లతో కూడా ఉద్దేశిస్తున్నాం

కదా! అట్లాగే చిదాత్మ ఒక్కటే బ్రహ్మమని, జడమని, చైతన్యమని, చిత్తమని, చేత్యమని పేర్కొనబడుచున్నదని జ్ఞానదృష్టికి, నిర్మల దృష్టికి తప్పక తెలియవస్తోంది.

జలం తరంగములు అనబడు మరొకటిగా మారుతోందా? లేదు. బ్రహ్మము స్వయముగా నిర్వికారమే. జలము మరొకటిగా ఉదయించటం అసంభవమే అయినప్పటికీ, తరంగం కనిపిస్తోంది కదా! అట్లాగే బ్రహ్మమునే 'తెలుసుకొనబడుచున్నది' లేక చేద్యము అని కూడా అంటున్నాం. ఆ పరబ్రహ్మమే వివిధ ద్రష్టలచే సత్యము, ఈశ్వరుడు, శివము, శూన్యము – మొదలైన వివిధ నామములచే పేర్కొనబడుతోంది.

అయితే ...ఆ పరమాత్మ నామరూపములకు అతీతమైనది. వాక్కుకు అగోచరమైనది. ఇక ఎదురుగా కనిపిస్తున్న ఈ జగత్తు 'చిత్‌లత యొక్క ఫల పుష్పములు' అని అనవచ్చును.

ఆ చైతన్యము 'అవిద్య' అనబడే ఉపనేత్రములను ధరించి 'జీవుడు' అనబడే రెండవచంద్రుని (రెండవ చంద్రుడు వాస్తవానికి లేడు కదా!) దర్శిస్తోంది. మరొకరకంగా చెప్పాలంటే ...ఆ చైతన్యము తనంతట తానే తనను జడముగాను, బ్రహ్మము నుండి వేరుగాను భావించుకుని వికల్పమయములగు వివిధ భావములను దాల్చుచున్నది.

అయితే, బిడ్డా! ఆ చైతన్యము సర్వదా నిష్కళంక రూపముననే వెలయుచున్నదయ్యా! తత్సమయముననే కల్పితమగు కళంకరూపమున సంసారనదియందు మునిగి ఔపాధిక చైతన్యముతో (ఉపాధితో కనిపించే స్వరూపంతో) ఇటూ అటూ సంచరిస్తోంది. మనస్సు, బుద్ధి, దేహాహంకారములకు నిలయమైన ఈ 'శరీరం' అనే పుర్యష్టకమునందు ఐక్యత కల్పించుకుని జీవరూపములను పొందుతోంది.

ఈ జీవుడు చిత్స్వరూప ప్రకాశం వల్లే చిన్మయుడై జీవిస్తున్నాడు. సూక్ష్మశరీర ధారి అయి, ఇక ఈ జీవుడు 'నేను పంచభూతాత్మక స్థూల దేహమును' అని భావించి, భావించి, అట్టి ద్రవ్యత్వంతో కూడి, వీర్యంగా స్త్రీ గర్భంలో చేరుతున్నాడు. 'చూడు, చూడు... నేను పుట్టాను, నాకు ప్రాణము లున్నాయి' అని తలపోయుచున్నాడు.

ఈ జీవుని ఆది–మధ్య–అంతం కూడా బ్రహ్మమే. అయినా కూడా పైన మనం చెప్పుకున్నట్లుగా భావించుకుంటూ, స్థూలదేహాన్ని అనుభవిస్తూ, స్థావరజంగమాది పదార్థాలను తనకు ఎదురుగా గాంచు చున్నాడు. ఇంకా చెప్పాలంటే, ఆయా వాసనల వలన ఆయా వస్తువుల రూపంగా మారుచున్నాడు.

సూక్ష్మం నుండి స్థూలానికి - సూక్ష్మ శరీరమునందు ఉన్నట్టి చైతన్యము నందు మాయచే సూక్ష్మ శరీర భావన యొక్క దార్ఢ్యం తగ్గి స్థూలశరీర వాసనలు ప్రబలటం జరుగుతోంది. అందుకు ఫలితంగా అకస్మాత్తుగా, కాకతాళీయంగా చైతన్యము తన సూక్ష్మశరీరం పరిత్యజించి స్థూలదేహం ఆశ్రయించి ఉంటోంది. ఒక "పిరికివాడు, మందబుద్ధి" – తన ఎదురుగా మసక చీకట్లో ఎఱ్ఱటి కనుగుడ్లు, జుట్టు విరగబోసుకున్న బేతాళుణ్ణి ఊహచే గాంచుతూ ఉంటాడు చూచావా? ఈ చైతన్యము అద్వితీయమై ఉండి కూడా తన యొక్క ద్వితీయ సంకల్పముచేత ద్వైతమును గాంచుచున్నది.

❖❖❖

8. సంకల్ప రాహిత్యం

అయితే ...'నేనేమీ చేయుటలేదు' (నాఽహంకర్తా) ...అని భావించినంత మాత్రం చేత పురుషునకు ఆ జరుగుచున్న క్రియా విశేషములపట్ల కర్తృత్వం తొలగుతుంది చూచావా? అట్లాగే, తిరిగి చైతన్యము అద్వైతభావమును ఆశ్రయించగానే ద్వైతభావన స్వభావసిద్ధంగానే ఉపశమిస్తోంది.

ద్విత్వసంకల్పతో ద్విత్వమేకస్యైవ ప్రవర్తతే ।
అద్విత్వసంవిదా ద్విత్వమనేకస్యాపి నశ్యతి ॥ (శ్లో 30, సర్గ 33)

ఈ విధంగా ఆ అద్వితీయవస్తువు ద్విత్వసంకల్పమువలన ద్వైతభావన పొందుతూ, మరల మరొకప్పుడు అద్వైత భావము వలన నానాత్వమును నశింపజేసుకుంటూ ఉంటోంది. నానాత్వమునే మనం 'జగత్తు' అని అంటున్నాం. ఇదంతా ఇంత మాత్రమే అయి ఉన్నది.

అవికారుడు, సర్వగతుడు, నిత్యోదయుడు, వృత్తి జాడ్యము లేనివాడు అగు పరమాత్మయందు రెండవదంటూ ఏదీ లేదు. ఉండజాలదు. ఇక ఈ జగత్తులు, మనోరాజ్యములు, గంధర్వనగరములు అంటావా ...ఇవన్నీ చైతన్యము యొక్క సంకల్పపరంపరలచే రచించబడినవి మాత్రమే. సంకల్పములు ఉన్నప్పుడు అవి ఉంటున్నాయి. సంకల్పములు క్షీణించిన మరుక్షణం అవి లేకుండా పోతున్నాయి. సంకల్పములు లేనప్పుడు మిగులునదేదో... అదియే నీవు, నేను, అంతయు కూడా.

సంకల్పశ్రమ! - ఓ మునీశ్వరా! సంకల్పాలు కలిగి ఉండటమే శ్రమతో కూడుకున్న వ్యవహారం. సంకల్పములు లేకపోతే ఎట్టి కష్టమూ ఉండదు. సంకల్పయక్షుడే ఈ సంసారాన్ని రచిస్తున్నాడు. అయితే, సంకల్ప వ్యవహారం తనంత తానుగా క్షయించదు. దానికి సాధన అవసరమౌతోంది. 'సంకల్పించక పోవటం' అనే అభ్యాసం దానికి సరి అయిన మందు.

శ్రీవసిష్ఠ మహర్షి: అయితే ఈ జీవుడు స్వసంకల్పవశం చేతనే దుఃఖితుడౌతున్నా డంటారా?

శ్రీశివ భగవానుడు: అవును. ప్రబలమగు సంకల్పవశం చేత వచ్చి చేరుతున్న ఆ దుఃఖం మరల తిరోమార్గంలో సహకరించగల సంకల్పముల వలననే క్షీణించ గలదు. సంకల్పరాహిత్యం చేత జీవుడు దుఃఖరహితుడౌతున్నాడు. 'సంకల్పములు చేయక పోవటం' అనేది అంతతేలిక కాదని జనులు భావిస్తున్నారు కాని సంకల్పములు చేయడంతోనే క్రియాశ్రమ ఉన్నది. ఎంత కొద్దిగా సంకల్పించినా సరే, చివరికి మనుష్యుడు దుఃఖజాలంలోనే పడుతున్నాడని హెచ్చరిస్తున్నాను. అసంకల్పం (సంకల్ప రాహిత్యం) వైపుగా కొంచం ప్రయత్నిస్తూ ఉన్నా... అవి కొంతకొంత తగ్గుతూ రాగలవు. సంకల్పించక పోవటం చేత అట్టి మనుజుడు అక్షయ సుఖమును పొందుచున్నాడు.

కనుక, పుత్రకా! ఈ మనుజుడు 'సంకల్ప సర్పము' నుండి విడివడనంతవరకూ రమణీయమగు నందనవనం కూడా ఈతనికి సుఖం కలిగించలేదు. ఇది గ్రహించి నీవు స్వకీయమైన 'వివేకము'అను వాయువును వేగంగా ప్రవహింపజేయి. ఈ 'సంకల్పములు' అనే మేఘపుంజములను చెదరగొట్టివేయి. శరత్కాల ఆకాశంలాగా పరమోత్తమ నిర్మలత్వం పొందెదవు గాక!

అంతేగాని, సంకల్పోన్మత్తుడవై సంకల్పనదీజలంలో తెలియరానిచోట్లకు కొట్టుకుపోవద్దు.

శ్రీవసిష్ఠ మహర్షి : ఈ సంకల్పించు దురభ్యాసమును అధిగమించటం ఎట్లా?

శ్రీశివ భగవానుడు : 'శుభకార్యక్రమములు, భగవత్ స్తోత్రములు' మొదలైన వాటిచే ఈ సంకల్పనదీ జలమును శుష్కింపజేయాలి. సంకల్పములతో తేలిపోయే మనస్సును నెమ్మదిగా ఓదార్చి క్రమంగా నిర్మల మనస్కుడవు కమ్ము.

నాయనలారా! నీ చిదాత్మ సంకల్ప సుడిగాలులచే ఎగురగొట్టబడి ఎండిన ఆకులాగా, ధూళి కణంలాగా భూతాకాశంలో నిష్కారణంగా పరిభ్రమిస్తోంది. నీవు నీ చిదాత్మయొక్క యథార్థరూపమును వీక్షించు.

స్వసంకల్పానకాలుష్యం వినివార్యాత్మనాత్మనః ।
పరం ప్రసాదమాసాద్య పరమానన్దవాన్భవ ॥ (శ్లో 40, సర్గ 33)

స్వయంగా నీకు నీవే ఆత్మను ఆవరించి ఉండే సంకల్ప కాలుష్యాన్ని దూరం చేయి. పరమనిర్మల భావమును పొంది పరమానందయుక్తుడవు కమ్ము.

పరమశక్తియుతమగు ఈ ఆత్మ దేనిని ఎట్లు భావించుచున్నదో అద్దానిని అట్లే తన సంకల్పవశం చేత గాంచుచున్నది. కనుక 'ఈ జగత్తులు ఎక్కడినుండి పుడుతున్నాయి?' అన్న నీ ప్రశ్నకు సమాధానం 'ఇదంతా సంకల్ప వశంగానే జనిస్తున్నది' అని చెప్పవలసి వస్తోంది. అంతకుమించి ఇందుకు వేరే కారణమేదీ వాస్తవానికి లేదు.

ఎందుకంటే ఇదంతా 'శివము'అని సంకల్పిస్తే శివమే అగుచున్నది. కాదూ... 'బంధం' అని సంకల్పిస్తే బంధమే అవుతోంది. ఈ జగత్తు ఏదైనా ఒక్కటి అయి ఉంటే మరి అందరికీ అట్లాగే అనిపించాలి కదా! అట్లాలేదే? కొందరికి బంధమని మరికొందరికి శివమని ఎందుకనిపిస్తోంది? అందుచేత బ్రహ్మజ్ఞా! సంకల్పములు క్షీణించాయా ...ఇదంతా ఎచ్చటనో విలీనమైపోతోంది. సంకల్పములచే అనుక్షణం నిర్మించబడుచున్న అనేక జన్మపరంపరలు నిస్సంకల్పబలంచే ఉష్ణము వలన మంచుగడ్డ యొక్క ఆకారాలులాగా – పరమపదమున విలీనమైపోతున్నాయి.

ఈ సంకల్పములకు మూలం తృష్ణ. కర్మోత్సాహము అందుకు ఫలితం.

తృష్ణను మొదలంట పెకలించినవానికి సంకల్పత్యాజ్యం అతి సులభం. సత్యదృష్టి, దూరదృష్టి, ఉత్తమదృష్టి పెంపొందించుకున్నవాడు తృష్ణను విషతుల్యంగా దూరంగా త్యజించగలడు. చూచావా నాయనా! ఈ సంసారబంధ – దుఃఖ వ్యవహారములన్నిటికీ అసలు కీలకం ఈ వస్తు–విషయములను దుష్టబుద్ధితో కూడి సంకల్పించుచుండుటయే.

శ్రీవసిష్ఠ మహర్షి : సంకల్పాలు తొలగినప్పటికీ జగత్తు ఉండియే ఉన్నదనుకోండి? అప్పుడేం చేయాలి?

శ్రీశివ భగవానుడు : అప్పుడీ జగత్తును అభాసముగా , ప్రతిభాసగా గ్రహించు. ఇది సంపూర్ణంగా తమ యందు తొలిగేంత వరకు జ్ఞానులు దీనిని గంధర్వనగరంగా స్వప్నభావంతో గాంచుచున్నారు.

ఒకానొక రాజు 'నేను రాజును' అనే విషయం మరచిపోయి నిష్కారణంగా మనోకల్పితమైన

శోక – దారిద్ర్యములను అనుభవిస్తున్నాడు. ఆ దుఃఖం తొలిగేది ఎట్లా? ఆ మనోకల్పన నుండి మెళుకువ తెచ్చుకున్నవాడై – తాను రాజు అనే విషయం జ్ఞాపకానికి రావటంచేతనేకదా! 'స్వస్వరూపస్మృతి' అనే సూర్యుడు ఉదయించగానే సర్వ సంసారాంధకారాలూ ఎచటికో ఎగిరిపోతాయి. స్మృతిభ్రంశమైన రాజుకు ఆప్తులు పూర్వస్మృతి కలుగ జేస్తున్నట్లు తన స్వస్వరూపమును ఎరుగుటకు ఉద్యమించిన జీవునకు గురువులు, శాస్త్రములు ఆప్తవాక్యాలు ప్రసాదిస్తున్నాయి. అవి గ్రహించినప్పుడాతడు ఆత్మారాముడై నిరామయుడై, వెలయగలడు.

1. తన ఇతఃపూర్వపు ఆత్మైక్య స్వభావస్థితి, 2. వర్తమాన సంసార మోహం …ఈ రెండింటిలో ఏ ప్రయత్నం బలవత్తరమైనదైతే అదే రాణిస్తోంది. అందుచేత ఈ వర్తమాన 'దృశ్యతదాత్మ్యం' అనే సంసార మోహం నశించాలంటే, (లేక) దానిచే ఆక్రమితమైన స్మృతి తొలగాలంటే, "శుభేచ్ఛ, శ్రవణ, మనన, నిధిధ్యాస" లనే సాధన చతుష్టయం అత్యావశ్యకం. అట్టి ప్రయత్నం లేకపోతే ఈ నా ఆప్తవాక్యాలు ఒంటబట్టవు. వీణాతంతువులలో ఏది పెద్దధ్వని చేస్తుంటే, అదియే వినబడుతూ ఉంటుంది కదా!

కనుక వసిష్ఠా! నీవు 'నేను అద్వితీయమగు ఆత్మను' అను ఏకత్వ భావనకు ఉపక్రమిస్తూ ఉంటే నా ఈ ఆప్తవాక్యాలు నీకు ఎంతగానో ఉపకరించి, నిన్ను సంసారముయొక్క ఆవలి ఒడ్డుకు జేరుస్తాయి. అట్టి భావనతో యుక్తుడవైతే నీవు బ్రహ్మమే కాగలవు. నిన్ను పోలిన వారు కేవల బాహ్యపూజకు పరిమితులు అవటం ఉచితం కాదు.

నీకు పూజనీయమగు దేవత ఆ 'పరమార్థసత్' ఒక్కటే. ఇది అదిగాక తక్కిన అర్చనాయత్నాలు – అనగా ప్రతిమానిర్మాణం, పూజాద్రవ్యాలు మొదలైనవన్నీ మనోకల్పనామాత్రంగా తెలుసుకున్నవాడవై అనవరతం చిదాత్మ పూజయందు ఉపక్రమించు. ప్రతిమాదులు ఆత్మయొక్క సంజ్ఞలు. అంతేగాని అట్టి కార్యక్రమమంతా ప్రతిమాపరిమితం కాదు. అందుచేత ముఖ్యంగా ప్రతిమపూజ చేస్తున్నప్పుడు అద్వైత నిర్వృత్త భావనలతో పూజ సలుపుతూ ఉండు.

❖❖❖

9. చైతన్యము - విశ్వము

శ్రీశివ భగవానుడు : హే మహర్షీ ! ఇప్పటి వరకు నాచే వర్ణించి చెప్పబడుచున్న 'ఆత్మదేవపూజ' అనుదానిచే నిజానికి విశ్వమే పూజించబడుతోంది. ఈ విశ్వము–

1. బాధిత దృష్టికి … అసత్తు. 2. అధిష్ఠాన దృష్టికి … సత్తు.
3. వ్యవహారదృష్టికి … ఇందులో ఏకత్వ – ద్విత్వములు ఉన్నాయి.
4. పారమార్థిక దృష్టికి … ఇందులో ఏదీ లేదు. చూచువాడే చూడబడేదాని యందు అణువణువూ ప్రసరించి, ఏర్పడి ఉన్నాడు.

…ఈ 4 విషయాలూ యుక్తియుక్తములే.

చైతన్యము యొక్క మోహచమత్కారమే ఈ సంసారం. తత్త్వ దృష్టికి ... దృక్‌స్వరూపుడు, ద్రష, దృశ్యముల – సమన్వయమగు చైతన్యము సర్వదా నిష్కళంకము, అసంసారి, అన్నిటి కంటే మునుముందుగానే ఏర్పడి ఉన్నది, భేదరహితము కూడా.

"ఈ దేహాదులే నేను" అనే కళంకం ఆ నిర్మలచైతన్యాన్ని బంధించినట్లు అనుభవాన్ని కల్పిస్తోంది.

"ఈ కనబడేదంతా సర్వకర్తయగు నాకంటే వేరుకాదు' అని గ్రహించబడిందా" ... మరుక్షణం చైతన్యము ఈ సర్వము నుండి విడివడుచున్నది.

ఆహా! సర్వవ్యాపితమైన నిష్కళంకచైతన్యం బాహ్యపదార్థములను భావించి ద్విత్వమును పొంది, తన అఖండసత్తను చిత్రముగా ఏమరుచుచున్నదే! అది ఈ శారీరక సుఖ దుఃఖములతో కూడినదై, కల్పిత అసత్యపదార్థములను సత్యమైనవిగా గ్రహిస్తోంది. వ్యావహారిక దృష్టికి నామరూపాత్మకముగా తోచు ఈ దృశ్యమునకు ఎట్టి ధర్మమూ లేదు. ఇది సత్య – అసత్య సమన్విత వికల్పములు గానీ, స్వతఃసిద్ధ సుఖదుఃఖదాయకము గానీ ఏదీ కాదు. వాస్తవానికి ఇదంతా కూడా నిరవయవము–విశుద్ధము–పూర్ణము–నిర్హేతుకము అగు బ్రహ్మమే అయిఉన్నది. అది ఆకాశము వలె వికాసముపొంది జాగృత–స్వప్న–సుషుప్తులతో కూడి సంసారాన్ని కల్పించుకుంటోంది. "ఆధ్యాత్మికము, ఆధిభౌతికము, ఆధిదైవికము" అను మార్గముల గుండా ఈ జగత్తును తన స్వశక్తిచే వికసింపజేస్తోంది. అయితే తన ఇంద్రియములలో ఒకటైన మనస్సు వలననే మనస్సు నిర్జింపబడగా అప్పుడు సత్యమేమిటో స్వయముగా ప్రకాశిస్తోంది. ఈ జగత్తులన్నీ ఆ సత్యంలో విలీనమైపోతున్నాయి. ఒకప్పటి కల్పనయగు ఈ క్షుద్రసంసారం భంగపడుతోంది.

ఇట్టి స్థితిని సంపాదించు మహనీయుని ఉపనిషత్తు మొదలైన శాస్త్రములు 'ఇతి' అను శబ్దం చేత నిర్వచిస్తున్నాయి. ఆ మహనీయుడు మరల సంసారంలో జన్మించనట్టి కృతనిశ్చయంతో ఉంటు న్నాడు. అతని సత్తాను వేయించబడిన (మరల మొలకెత్తని) విత్తనంతో బుధులు పోలుస్తూ ఉంటారు.

దృశ్య పదార్థములన్నీ అకృత్రిమంగా బాధింపబడటం చేత .. సత్తా అప్పుడు 'దృక్' స్వరూపంగా మారిపోతోంది. కనుక ఆత్మానుభవి 'పశ్యంతి – ద్రష్ట – చూచువాడు' అను పేర్లతో పిలవబడుచున్నాడు. అట్టి మహత్పురుషుడు చిత్త విషయములను ఇక స్మరించడు. 'మనోమోహములు' అనే మేఘముల నుండి విడివడినవాడై, అతీతుడై నిర్మలాకాశము వలె విరాజిల్లుతాడు.

ఇంతకు ముందు అతడు అనేక విషయ వస్తువుల గురించి అనేక చిత్త చాంచల్యములను పొంది ఉండవచ్చు గాక... ఇప్పుడీ జీవన్ముక్తియందు అవన్నీ తొలగిపోతున్నాయి. ఆతడు భౌతికంగా చూస్తే ఈ సంసారసాగరంలో దేహి అయి ఉన్నట్లే ఉంటాడు. అయితే ఏం? అంతరంగము నందు ఈ జీవదశయందు ఉత్తీర్ణుడై నిఖిల పదార్థములందు లేనివాడై ఉంటున్నాడు. ఆతనిని వర్ణించటానికి మాటలు చాలవు. ఆతడు పునర్జన్మ బీజరహితమైన నిరతిశయానంద స్వరూపం అపరిమితంగా పొంది నిశ్చింతగా విశ్రమించియే ఆయా ప్రవాహపతిత కార్యక్రమములందు పాల్గొనుచున్నాడు.

అది మనోక్షయమైనప్పటి నిర్వికల్పచైతన్య స్థితి. చైతన్యముయొక్క ప్రప్రథమ స్థితి.

❖

మనోదశ నుండి విడివడిన చైతన్యమే సూర్యచంద్రాది జ్యోతిష్య పదార్థాల నుండి, అజ్ఞానాది సకల అంధకారముల నుండి వేరై విశాలమగు ఆకాశము వలె స్వచ్ఛ స్వభావమున వెలయుచున్నదని చెప్పుకున్నాం కదా! అనంతరం కాలక్రమంగా సకల బాహ్య విషయ ఔత్సుకతను విడచి, వాయువుచే కదల్చబడని నీరు వలె నిశ్చలభావంలో వెలయుచున్నది. చైతన్యస్థానం స్పందనను త్యజించిన వాయువు వలె ఒకానొక నిర్వికల్ప స్థితికి సంబంధించినది. ఇక ఇందు కనిపించే జ్ఞానశక్తి లేక 'ఎరుక' అను విన్యాసం ఒకానొక నిర్వికల్ప స్థితికి చైతన్యమునకు చెందినది. అట్టి జ్ఞానశక్తి గురించి కొన్ని విశేషాలు చెప్పుకుందాం.

జ్ఞానశక్తి - ఈ జ్ఞానశక్తి యొక్క రూపం ఆకాశం కంటే అత్యంత నిర్మలం. సద్వస్తువు యొక్క ఉనికియే జ్ఞానశక్తి యొక్క అస్థిత్వమునకు కారణం. జ్ఞానశక్తి యొక్క రూపం, కారణం, చిదాత్మయే. స్పందన శక్తికి కారణమగు ప్రాణము ఈ శరీరం లేకపోయినప్పటికీ సామాన్య వాయురూపమున ఉంటుంది. అట్టి ప్రాణశక్తి కంటే అత్యంత నిర్మలము, సూక్ష్మము అగు చిదాత్మకు వినాశనమనేది ఉండదు. ఇక జనన మరణములు ఎవరికి? అటువంటి భ్రమయే ఉండవలసిన అవసరం లేదు.

ఈ జీవులంతా ఎవరు? చైతన్య స్వరూపులే! మనో ప్రాణములతో నిండి ఉన్న ఈ శరీరములన్నిటి యందూ చైతన్యం అభివ్యక్తం అవుతోంది. వాస్తవానికి చైతన్యము సర్వదా సర్వము నందూ బాహ్య-అభ్యంతరములలో ఆక్రమించుకొనియే ఉన్నది.

పరమ రహస్యమగు చమత్కారం నీవు గ్రహించటానికి వీలుగా నీకొక చిన్న దృష్టాంతం చెపుతాను విను. ఒకచోట ఒక దర్పణం అమర్చామనుకో. అందులో దృశ్యం ప్రతిబింబిస్తోంది. దర్పణం లేకపోతే కూడా బింబం ఉన్నది గాని, ప్రతిబింబించటం జరుగదు. ఈ చైతన్యం విషయం కూడా అట్టిదే. అది సర్వేసర్వత్రా ఉండి కూడా మనోప్రాణములు ఉన్న చోటే 'జీవుడు'అను రూపంలో ప్రతిబింబిస్తోంది. ఒక దర్పణంపై దట్టంగా ధూళి పేరుకుని ఉంటే, అందులో ప్రతిబింబం కనబడదు కదా! అట్లాగే ప్రాణము లేని చోట చిత్ ప్రతిబింబించటం లేదు. సర్వవ్యాపియగు ఈ చైతన్యం బాహ్యవస్తు ఆకారితమగు చిత్తవృత్తులతో కూడి ఈ శరీరమును స్పందింపజేస్తోంది. అది అచ్చోట ఒక్కొక్కప్పుడు తన గురించి తానే పరిమితత్వమును ఆపాదించుకుంటోంది.

❖

ఆ చైతన్యము తత్త్వబోధను పొందుచున్నప్పుడు పరమ పదకళ్యాణ ప్రదమగు కైవల్య రూపమున విరాజిల్లుతోంది. ఆ చైతన్యము వస్తువులను ప్రకాశింపజేయుచూ, వాటికి 'సత్త'ను ప్రసాదిస్తోంది. చైతన్యం నుండి సత్తను పొందిన ఈ వస్తుజాలం దేశ-శబ్ద-వాచ్యములను సంపాదించుకుంటున్నాయి.

ఇక అది సుఖములన్నిటి యొక్క పరమావధి... శుభములన్నిటిలోకి అత్యంత శుభప్రదము.. వినాశనము లేని ఈ పవిత్ర స్థితియే చైతన్యము యొక్క ఆత్మైక్యావస్థ.

వత్సా! ఈ భూమిక యందు వసించటమే ఇన్నిన్ని జన్మల యొక్క ఏకైక లక్ష్యము. అన్ని మార్గములలోని అందరి పథికులకు అదియే చేరవలసిన గమ్యమై ఉన్నది.

అది నీ స్వస్వరూపమే కదా! అందుచేత అందు ఏర్పడి ఉన్నప్పుడు గాని జీవునిలో అంతర్గతంగా దాగి ఉన్న అసంతృప్తి తొలగదు. లోకములలో కనిపిస్తున్న అన్ని ఆరాటముల యొక్క అంతర్లీన సత్యమైన గమ్యం అదే. ప్రయాణం చేయువాడు ఇల్లు చేరితే గాని మానసిక విశ్రాంతి పొందనట్లు అప్రమేయ స్వస్వరూపం జేరిన జీవుని ఆనందము, విశ్రాంతి వర్ణనాతీతం.

అందుకు మార్గం 'సంకల్ప త్యాగమే'! అది నీ రూపం నీవు పొందటమే! కనుక, అద్దానిని కష్ట సాధ్యం అని ఎవరూ అనటానికి వీలు లేదు.

ఆ స్థితి నా వాక్కుకు కూడా అతీతమై, అభివర్ణించటానికి అశక్యమై, అనుభవముతో కలిగే ఐక్యమై ఉన్నది. మౌనమే అద్దాని గురించిన వ్యాఖ్య. అది నీకు నీవు పొందవలసినదే! కాబట్టి ఏమి చెప్పినా వాక్యములు ఒకచోట ఆగవలసినదే. ఆ తురీయాతీత అకళంక స్థితి జాగ్రత్-స్వప్న-సుషుప్తులకు అతీతమైయున్నది.

అదియే సనాతన దైవము. నీవు పూజించవలసిన దైవము ఆతడే. అందు నీవు నిత్యము అఖండుడవై వెలయుము.

❖

నాయనా! 'ఈ విశ్వము యొక్క ఉపాదాన కారణం ఆ చైతన్యమే'... అని భావన చేస్తూ ఉంటే, నీ పట్ల ఈ విశ్వమంతా చిన్మయమే అగుచున్నది. లేదా, "ఈ విశ్వము దీని ఉపాదానకారణం కంటే వేరు కాదు"... అని భావిస్తే అప్పుడు కూడా ఆ విజ్ఞుడు ఇందులో తన్మయుడు కాడు.

శ్రీవసిష్ఠ మహర్షి : ఈ విశ్వమే మీరు ఇప్పుడు నిర్వచిస్తున్నట్టి చైతన్యమా? కాదా?

శ్రీశివ భగవానుడు : చైతన్యము 'ఉపాదానకారణము - కార్యము'లకు అతీతమైనది. వాస్తవానికి 'విశ్వము' అనబడేదేదీ లేదు. అది ఉత్పత్తి అవటంలేదు. వినష్టం కావటంలేదు. ఈ బ్రహ్మాండమంతా కూడా ఏకాకారమగు ఆకాశకోశము వలె శూన్యము. కేవలం చైతన్యం ఒక్కటే అద్వైత ఘనచేతన రూపమున వెలయుచున్నది. నిర్వికారమగు ఆ చైతన్యము సమక్షంలో సాపేక్షిక నిత్యములగు ఆకాశ-కాలాదులు కూడా అనిత్యములే, శూన్యములే. పసిబాలుడు ఆట బొమ్మతో కల్పిత దృష్టిచే ఆడుకుంటున్నట్లే ఈ ఆకాశము, శిల, ఇల్లు మొదలైనవి.

భేదభావనలే జగత్తు గాని, అది మరింకేమో కాదు. చైతన్యమే సత్యము అయి ఉండి, అసత్యమువలె భ్రమింపబడుతోంది. ఇదంతా కూడా వాక్కునకు అతీతమగు శాంతి, శివ స్వరూపము, ప్రణవ తురీయ మాత్రము అగు బ్రహ్మమే సుమా!

❖

ఇట్లు పలికి ఆ సాంబశివుడు మౌనం వహించాడు. సర్వసంసార ఉపశమనమగు అనిర్వచనీయ తురీయాతీత పదమున విశ్రాంతి పొందాడు. అప్పుడాయన చిత్తవృత్తి పరమానంద చిదేకరూపమున పరిణతి పొందింది. మనస్సు తన స్వరూపమును వీడి అనంత నిశ్చలత్వము పొందింది.

❖

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ ప్రియ సభికులారా! తురీయానంద స్వరూపులారా! మీ మీ స్వస్వరూపం గురించి మూర్ఖత్వమును ఆపాదించుకుని స్వల్పత్వము పొందవలసిన పనేమున్నది? లెండి మీ స్వస్వరూప మాతృగృహమున ప్రవేశించి శాంతమును పొందండి.

❖❖❖

10. నిజాత్మ భగవానుడు

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఆ విధంగా పరమేశ్వరుడు ముహూర్తకాలం నిర్విషయకమైన సర్వాత్మక చిదానందంలో చిద్విలాసులై గడిపాడు. మరల కళ్ళు తెరిచాడు. నాపై వాత్సల్యం కురిపిస్తూ చిరునవ్వు ప్రకటించారు. ఆయన పెదవుల నుండి మరల జ్ఞానవాక్యామృతం ఇట్లు నా పై వర్షించింది.

❖

శ్రీశివ భగవానుడు : ఓ మునిసత్తమా! మహర్షి వసిష్ఠ శిష్యజనులారా! మొట్టమొదటగా విచారణ చేసి మీ స్వస్వరూపమేమిటో గ్రహించండి. అంతేగాని గాలి తనకు తానుగా వీచి, ధూళిని లేపి, తెలివి తక్కువగా ఆ ధూళిని తన యందు నింపుకుంటున్నట్లు నీవు అనర్థజాలమును పనిగట్టుకొని ఆశ్రయించి అవి నీ మనస్సును నింపివేయునట్లు చేసుకోవద్దు.

నాయనా! వసిష్ఠా! నీవు చూడతగ్గ బాహ్యవిషయాలన్నీ చూచావు. వినవలసిందంతా విన్నావు. ఇంకనూ భ్రాంతితో పని ఏముంది? తత్త్వవేత్తలగు వారు ఈ సంసారములో వదలవలసినవి గాని, ఆశ్రయించవలసినవి గాని గాంచరు. శాంతి-అశాంతిమయ సంసార విశేషములను నీవు ఇత పూర్వమే 'విజ్ఞానం' అను చురకత్తితో కత్తిరించివేశావు. కాబట్టే ధీరుడవయ్యావు. ఇప్పుడిక నిర్మలాత్మ దర్శనమును కాదనేవారెవరు? సమస్త ప్రపంచమునకూ లోపల వెలుపల వెలయుచూ, ఆత్మదర్శివి అయి ఉంటూనే, ఈ దృశ్యదశలో ప్రవచించబడుచున్న నా ఈ ఉపదేశాలు ప్రస్తుతం విను. అటు తరువాత ఈ దృశ్యజగత్తులో సంచరించేటప్పుడు ఈ బోధ యొక్క సారాన్ని అనుకరిస్తూ ఆచరించు.

నీవంటి నిర్మల హృదయుడు దృశ్యదశలో ఉన్నప్పటికీ వచ్చే లోటేమీ ఉండదు. అఖండం, అప్రమేయం, నిత్యం, నిర్మలం - అగు ఆత్మార్థ లాభం కొరకు శ్రవణ మననాదులచే పదే పదే ప్రయత్నించవలసిందే. ప్రయత్నించని వారికి ఎక్కడైనా ఏదైనా లభిస్తుందా?... లభించదు కదా!

శ్రీవసిష్ఠ మహర్షి : హే ఆశ్రితవత్సలా! పరమేశ్వరా! బాహ్యదేహాదు లందు ఆత్మబుద్ధిని అనునిత్యం పరిత్యజించాలని చెప్పారు కదా! ఈ దేహాత్మ బుద్ధినుండి విడివడటానికి ఉపాయాలు చెప్పవలసినదిగా నా ప్రార్థన.

శ్రీశివ భగవానుడు : ఈ శరీరం ప్రాణవాయువు వలన ఒక యంత్రంలాగా చలిస్తోంది. ఆ ప్రాణవాయువు యొక్క చలనమే లేకపోతే ఇది స్పందనారహితమై మూగదానిలాగా ఉండిపోయేది. ప్రాణాయామ (ప్రాణచలన) ఉపాసకులు ప్రాణచలనమునకు సాక్షిత్వమును 'సాధన' గా ఎన్నుకొను చున్నారు. క్రమంగా వారి బుద్ధి నిర్మలమై ప్రాణముల చలన స్వభావం నుండి విడివడి నిశ్చలత్వం

సముపార్జించుకుంటోంది. నిర్మల, నిశ్చలబుద్ధి స్వభావసిద్ధంగా పరమాత్మ యొక్క ఆస్వాదన యందు ప్రవేశిస్తోంది. దేశకాలములను, సమస్త దృశ్యవస్తు అనుభవమును త్యజించి విడివడుతోంది. జడ భావాల నుండి విముక్తిని పొంది, అపరిచ్ఛిన్నత్వంతో కూడిన ఒకానొక అనిర్వచనీయసత్తను సంతరించు కుంటోంది. ఆ సత్తయందు దిక్కులు, కాలము అనే పరిచ్ఛిన్నత ఉండదు. అట్లాగే, భక్తి–జ్ఞాన–కర్మోపాసకులు కూడా వారి వారి ఆయా శాస్త్రోచిత మార్గములలో బుద్ధిని నిర్మలం చేసుకుంటున్నారు.

శ్రీవసిష్ఠ మహర్షి : మహాదేవా! ఈ దేహం ఉన్నంత వరకు జీవునకు అట్టి అపరిచ్ఛిన్న సత్త లభించదు కదా! ఎందుకంటే దేహం ఉన్నంతవరకూ దిక్కులు, కాలము ఉండియే తీరుతాయి కనుక!

శ్రీశివ భగవానుడు : నాయనా! ఈ దేహం ఉండటం చేతగాని, ఏవో చేయవలసిన పనులు ఉండటం వలన గాని అట్టి అపరిచ్ఛిన్న సత్తా యొక్క అనుభవం ఇబ్బంది పడుతుంది – అని మూర్ఖత్వముచే మాత్రమే జీవులు కొందరు భావిస్తున్నారు. అది సత్యం కాదు. శరీరధారులై అనేక కార్యక్రమములందు నియమితులై కూడా 'తురీయము, అకలంకము, అనామయము'అగు ఆ అఖండ, అప్రమేయానుభవం ఆవరిస్తున్న మహనీయులెందరో ఉన్నారు. ఆ స్థితియందలి ఆనందము అన్ని వస్తువుల నుండి, అన్ని కాలముల నుండి లభించే ఆనందముకంటే కూడా మహత్తరమైనది. అతీతమైనది.

చూచావా! ఎట్టి ప్రయాస లేని సంకల్పత్యాజ్యం ఎట్టి స్థితికి జీవుని తీసుకురాగలుగుతుందో! ఆ ఆనందమును గాంచుచూ జీవన్ముక్తుడు అనంతశాంతిని అనుభవిస్తూ వెలయుచున్నాడు. సంకల్ప స్వరూపమైన మనస్సు 'ఆత్మానంద సంకల్పము' సంధించబడగా …అప్పుడు మనస్సునందే మనస్సు లయించు 'సర్వప్రయత్న రహిత స్థితి' అది.

❖

చైతన్యము బ్రహ్మాకార అఖండ చిత్తవృత్తిని చేబట్టుచున్నప్పుడు 'బ్రహ్మము అనగా నేనే' అను బ్రహ్మైక్య భావము పొందుతోంది. తత్ఫలితంగా నామ రూపాత్మకమగు 'బ్రహ్మము–ఆత్మ' మొదలైన సంజ్ఞలను అతిక్రమించి కేవల స్వరూపమున వెలయుచున్నది. అప్పుడు అది మనస్సుతో పంచ ఇంద్రియాలతో సహా ఆరు విధములైన భావవికారముల నుండి విడివడి తమస్సుకు పరమున ఉన్న స్వస్వరూపమున వెలుగొందుచున్నది. నిష్కళంకమై, తురీయాది నామములకు కూడా అతీతమై, కాలం కంటే కూడా శాశ్వతమైనట్టి ఏ తన నిజస్వరూపం గలదో, అట్టి 'పురుషార్థరూపం' పొందుతోంది.

హరి – హర – బ్రహ్మ – ఇంద్రులు కూడా ఆ చైతన్యమే. నిఖిలాకృతియు, సర్వగామియు, నిత్యోదితము అగు ఆ చైతన్యం అగ్ని, నీరు, చంద్రుడు, సూర్యుడు మొదలైన రూపములన్నీ దాల్చు చున్నది. ఆ చైతన్యమే ప్రతి జీవుని ఆత్మకూడా. ఆ చైతన్యమును ఎరిగినవారు శోకరహితులగుచున్నారు.

కాల్చబడిన లోహము నుండి అగ్ని రవ్వలు వెలువడుచున్నట్లు, మహాసముద్ర జలం నుండి నీటి తుంపరలు వెదజల్లబడుచున్నట్లు ఆ చైతన్యము నుండి వెలువడుచున్న బ్రహ్మాదులు కూడా భ్రాంతిమయులే. వారు ఈ కల్పనాజాలాన్ని విస్తరింపజేస్తున్నారు. అనగా అవిద్య బ్రహ్మ మొదలుకొని ఈ ప్రపంచము వరకూ శాఖోపశాఖలుగ వ్యాప్తమై విస్తృతమౌతోంది. వేదములు, వేదార్థములు,

క్రియా కలాపములు, జీవులు – ఇవన్నీ అవిద్యా ప్రాంగణంలో చిక్కుబడి ఉంటున్నాయి. ఈ అవిద్య అనంతమై ఎన్ని విధములైన దేశకాలములుగా విస్తరించి ఉంటోందో చెప్పనలవి కాదు.

❖

ఓ మునిసత్తమా ! ఆ చైతన్యమే బ్రహ్మ విష్ణు శివాదులకు కూడా పరమపిత అని గ్రహించు. కాయలన్నిటికీ చెట్టే కారణమై ఉన్నట్లు ఆ నిఖిలాత్మమహాశయుడే మనందరికీ మూలం అగుచున్నాడు. మన స్వరూపమగు ఆ చిదాత్మయే అన్నిటి యొక్క సత్త కూడా. ఆతడే వివిధములగు జ్ఞానములను కూడా కలుగజేయుచున్నాడు. ఆతడు అన్ని వస్తువులందూ, అన్ని జీవులందూ, అన్ని ఇంద్రియము లందూ వ్యక్తమై ఉంటున్నాడు. సర్వతేజోవంతమై సదా సర్వత్రా ఉదయించుచూ, తత్త్వవేత్తలచే వందనార్చనములు స్వీకరించుచున్నాడు.

సంవేదనాత్మకతయా గతయా సర్వగోచరమ్ ।
న తస్యాహ్వానమన్త్రాది కించిదేవోపయుజ్యతే ॥ (శ్లో 24, సర్గ 35)

ఇప్పుడు చెప్పు. సర్వత్రా వెలయుచున్న ఆ చైతన్య భగవానుని అర్చించటానికి సామాన్యమైన పూలతో చేసే పూజ, ఆవాహనాది మంత్రములు ఎందుకు? అన్నిటా ఉండి ఉన్నవానిని ఎక్కడికి ఆహ్వానిస్తావు?

నాయనా! ఆయన నిత్యాహ్వానమును గ్రహించి జ్ఞాన స్వరూపమున అన్నివైపులా అన్ని వేళలా లభ్యుడగుచున్నాడు. ఆయనయే స్వీకరించబడు వస్తువుల రూపమున, వాటికి మననం చేసే మనస్సు రూపమున, ఆ మనస్సున సంకల్పించే ద్రష్టరూపమున ప్రకాశిస్తున్నారు. ఓ మునీశ్వరా! సురేశ్వరుడగు ఆ చిదాత్మనే అన్నిటికీ ఆర్యునిగా, పూజ్యునిగా, నమస్యునిగా, స్తుతార్హునిగా... గ్రహించు. ఆతడే మహద్వస్తువులన్నిటి యొక్క పరాకాష్ఠ. వాస్తవానికి ప్రతిఒక్కరియొక్క ఇష్టదైవం ఆసర్వాత్మకుడే! సర్వాంతర్యామియే! సర్వతత్వస్వరూపుడే!

జరాశోకభయవినాశకరమగు ఆ ఆత్మతత్త్వమేమిటో తెలుసుకున్న జీవునకు – వేయించిన విత్తు మరల మొలకెత్తని రీతిగా జన్మలు ఉండవు. ఎందుకంటే, "నేను ఇప్పటికీ, మరెప్పటికీ నిత్యోదిత చైతన్యస్వరూపమే! నాకు వర్తమాన జన్మగాని, ఇతఃపూర్వపు జన్మలుగాని, ఇక ముందటి జన్మలు గాని మొదలే లేవు" – అని గ్రహిస్తున్నాడు.

మనందరి యొక్క జ్ఞాన రూపమై వెలయుచున్న సర్వాభయప్రదాతయగు ఆ దేవదేవుని ఉపాసన అత్యంత సులభం. జన్మయే లేని ఆ ఆత్మతత్త్వము నిజానికి నీ సత్యరూపమే అయి ఉన్నది కదా! ఇక వ్యర్థమగు బాహ్య దృష్టులకు ముగ్ధుడవగుచున్నావేమిటి?

❖❖❖

11. తస్మై సర్వాత్మనే నమః

శ్రీశివ భగవానుడు : కుమారా! వసిష్ఠా! చిద్రూపుడగు ఆ ఆత్మదేవుని సాక్షాత్కారం చేసుకుంటే ఇక పునర్జన్మలకు సంబంధించిన మనోవృత్తులన్నీ స్వయంగా తొలగుతాయి. 'విశుద్ధమై, స్వానుభూతి నుండి వేరొకటి కానట్టి ఆ ఆత్మజ్ఞానమే సంసారరోగ నివారణి' అని బ్రహ్మవేత్తలగు మహనీయులు నిర్దేశిస్తున్నారు. నిర్మలచిత్సారమైన ఆ ఆత్మయే బీజములన్నిటికీ బీజము. కారణములన్నిటికీ కారణము. ఈ సంసారసాగరంలో తారసపడే కర్మలన్నీ అద్దాని ఆరాధనయే. అది అన్నిటికీ తానే కారణమై, తాను సర్వదా అకారణమై ఉంటోంది. అది ఎల్లప్పుడూ నిష్కళంకమైనది. అది నీ స్వరూపమే సుమా! ఇక మోహమెందుకు?

అది భావించబడుచున్న సర్వ పదార్థములందలి భావనా స్వరూపమైయున్నది. అట్లే కూడా అభావనీయ – జన్మరహితమగు అభావ స్వరూపముననే వెలయుచున్నది.

అదియే అందరి బుద్ధి వృత్తులనూ ప్రకాశింపజేస్తోంది. జీవుల అంతరమున చిత్సారరూపమును వెలయుచున్నది. అది తన ప్రత్యక్ స్వరూపమున ఏర్పడి ఉంటూనే అదే సమయమున ఈ జీవుల బుద్ధివృత్తులందు వ్యాపించి ఆ బుద్ధి యొక్క ప్రసరణముచే బాహ్యవస్తువుల ఎరుకకు కారణమౌతోంది.

ఒకవైపు నిర్విషయమై ఉంటూ, మరొకవైపు సర్వ విషయములకూ తానే స్థానమగుచున్నది. అది ఎట్లా అంటావా? బంగారము వాస్తవానికి ఆకార రహితమై, అదే తరుణంలో తానే గాజులుగా, గొలుసులుగా, ఉంగరంగా అగుచున్నది కదా! ఆ రీతిగా ఆత్మభగవానుడు సర్వవేద్య వస్తుజాతము (తెలియబడే అన్ని వస్తువుల) అంతర్హితస్వరూపమై ఒప్పుచున్నాడు. వాస్తవానికి ఏకరూపుడై ఉండి కూడా మాయ వలన బహురూపములుగా భావించబడుచున్నాడు.

ఆతడు సకల జ్యోతుల జ్యోతి స్వరూపం (జ్యోతిర్జ్యోతిః మహర్జ్యోతిః). అలౌకికం, నిర్మలం – అగు ఆ ఆత్మను ప్రకాశింపజేయగలిగేది మరొక్కటేదీ లేదు. అదొక్కటే ప్రకాశములన్నిటికీ మూల స్థానం. అదియే నానావిధ బీజస్వరూపములుగా వెలయుచున్నది. బ్రహ్మజ్ఞులు ఈ విషయం సుస్పష్టంగా దర్శిస్తున్నారు, ప్రవచిస్తున్నారు.

❖

వత్సా! ఈ భూమి, ఈ ఆకాశము మొదలైన పంచభూతములు ఆత్మయందు వెలయుచున్నాయని అనుకుంటున్నావేమో! లేదు. ఈ వ్యావహారిక విషయములుగాని, ప్రాతిభాసికములగు వ్యష్టి సమష్టి జీవులు గాని ఆత్మ యందు లేవు. ఎందుకంటే ఈ జగత్‌సత్త, అవ్యాకృతమగు కారణసత్త లయించగా, అప్పుడు శేషిస్తున్న చిన్మాత్రసత్తయే అది కదా! అయితే ఆ ఆత్మదేవుడు నిర్విశేషస్వరూపుడు అయికూడా, ఆ 'చిత్తవికృతులు' అనే దోషములకు అవ్యాకృతకారణము బాహ్యకారణము రజోరూపము కూడా అగుచున్నాడు. రూపరహితమగు ఆకాశస్వరూపుడై ఉండి దేహములు మొదలైన రూపాలతో కర్తృత్వ భోక్తృత్వములను వహిస్తున్నాడు. అయినప్పటికీ ఆయన నిష్క్రియుడు, నిర్లిప్తుడు. చిత్తరూపమున

వికాసము పొందిన ఆ మహాచైతన్యమున అసంఖ్యాకములగు 'జగత్తులు' అనే ఎండమావులు తోచుచున్నాయి. అయితే ఆత్మదేవుని పూర్ణత్వమునకు ఇవేమీ లోటు కావు.

❖

నాయనా! చమత్కారం చూచావా? స్వయం ప్రకాశమగు ఆ చిదాత్మయందు ఈ జగత్తు తన సత్తను పొందుపరచుకొని ఉన్నప్పటికీ 'చిదాత్మయందు జగత్తులనేవి ఉండజాలవు' అని అనవలసి వస్తోంది. అగ్ని యందు విస్ఫులింగము, రంగు కాంతి, రవ్వలు, ప్రకాశము – మొదలైన అనేక వైచిత్ర్యములు బయల్వెడలుచున్నప్పటికీ అది తన ఉష్ణస్వభావం వీడటం లేదు కదా! ఆత్మయందు సర్వవిరుద్ధ ధర్మములు సమావేశమౌతున్నాయి. ఆయన మహామేరువులను తన గర్భమునందు ధరించి దానిని ఆచ్ఛాదనమొనర్చుచున్నప్పటికీ ఆతడు అణుస్వరూపుడు. కల్పమును ధరిస్తూ కూడా తన నిమేష స్వరూపమును ఏమాత్రం త్యజించటం లేదు. ఆహా! వెంట్రుకయొక్క చివరిభాగంలోని అల్పకణము యొక్క ఒక లక్షవ వంతు వలె అతిసూక్ష్ముడై కూడా భూమ్యాకాశము లందు అంతటా వ్యాపించియున్నాడు. ఈ భూమి, నక్షత్రమండలములు అన్నీ కలసి కూడా ఆయన యొక్క పరాకాష్ఠను ఊహించనైనా లేవు. ఆయన స్వయంగా సంసారమును రచించకపోయినప్పటికీ... కర్తృత్వమంతా ఆయనదే. మహత్కర్మలను ఆచరిస్తున్నప్పటికీ ఆయనకు కర్తృత్వమును ఆపాదించటమే కుదరని పని. ఆయన ద్రవ్యములన్నీ అయి కూడా ఈ ద్రవ్యములేవీ ఆయన కాదు. ప్రాతఃకాలము ఆయన వలననే ఏర్పడుచున్నప్పటికీ ఆయన ఎల్లప్పుడూ ఉషోదయస్వరూపుడే. ఒక దృష్టాంతం. 'సూర్యుడు ఉదయిస్తున్నాడు'... అని జనులు అనవచ్చు గాక! నిత్య ప్రకాశమానుడగు సూర్యునికి ఉదయించటం, అస్తమించటం ఉంటాయా? ఉండవు. (అయినా కూడా ఉదయం, సాయంకాలం సూర్యుని వలననే ఏర్పడుచున్నాయి కదా! "ఉషోదయ సూర్యుడు – మధ్యాహ్న ప్రచండ సూర్యుడు – అస్తమయ పసుపుపచ్చని సూర్యుడు"... అని జనులు వ్యవహరిస్తున్నారు కదా!

❖

ఆ పరమాత్మను అనేకులు అనేక కల్పనలతో ఆరాధిస్తున్నారు. 'భిండి – భిండి – భిడిండి... ఖిలేమత్త –పుపిచ్ఛాలి ...సాలఘ ...వివిత్ ...చలిత్ ...సదాలో ...కాలాసో ...గులుగులు ...శిలి' ఇట్టి అర్థరహిత, అర్థ ఆపాదిత శబ్దాలు కూడా ఆయన పట్ల వేదమంత్రాలై కూర్చుంటున్నాయి. 'ఆకాశ కుసుమం' వంటి ఊహామాత్ర శబ్దాలుకూడా ఆయనకు సరిపోతున్నాయి. ఆయన కానిది, ఆయనకు ఆపాదించజాలనిది ఏదీ లేదు.

యస్మిన్ సర్వమ్, యతః సర్వమ్, యః సర్వమ్, సర్వతశ్చ యః ।
యశ్చ సర్వమయో నిత్యం, తస్మై సర్వాత్మనే నమః ॥

ఎవని యందు సర్వము ఉన్నదో ...ఎవ్వని నుండి అంతా ఏర్పడుతుందో, ఎవడు సర్వము అయి ఉన్నాడో ...సర్వము నందు ఎవడు సారమై ఉన్నాడో ...ఎవడు ఎల్లప్పుడూ సర్వమయుడై ఉంటున్నాడో ...అట్టి సర్వాత్మకునకు ఇదే నా నమస్కారం.

ఏ ఆత్మ పురుషుడు సుకుమారములగు తత్త్వాత్మ పుష్పములను ధరించినవాడై, ఈ జగత్తును మోహింపజేయు స్వరూపము కలిగి ఉంటున్నాడో, 'సంకల్పములు' అనే తన పిడికిలిని బిగించి, ఈ మాయానాటకమంతా ఆడిస్తూ, ఆడుతున్నాడో ...ఆయనను ఏమని పిలవాలి? ఎట్లా నిర్వచించాలి? అయితే అతడు అనుభవమునకు లభించడని అనుకోవద్దు సుమా! నిత్యము, అనుక్షణికంగా, అన్ని సందర్భములలోను అంతటా, అన్నిటా, అన్నియుగా, ఇక్కడ, అక్కడ సర్వదా అనుభవమగుచున్నదంతా పరమాత్మయే! ఆయన అద్వితీయుడు కదా! కనుక ఇదంతా పరమాత్మ విన్యాసమే!

❖❖❖

12. చిదాత్మ యొక్క దర్శన ప్రదర్శనములు

శ్రీశివ భగవానుడు : ఆ సర్వేశ్వరుని యందు అనేక అర్థవిహీన వాక్యములు కూడా సత్యమే అగుచున్నాయని అనుకున్నాం కదా! ఈ 'జగత్‌సత్త' అను మణికి ఆయన పేటిక వంటివాడు. మాయా యుక్తుడగు ఆ చైతన్యభగవానుని యందు వికసింపజాలని శక్తి అంటూ ఏదీ లేదు. ఈ విచిత్ర జగత్తు ప్రకాశించటమే అందుకు నిదర్శనం. ఈశ్వర సంబంధమగు 'చిత్‌సత్త'యే ధాన్యాది బీజములందు దాగుకొని ఉన్నది. తరువాత వివిధ క్రియలు, మట్టి, నీరు, కాలం మొదలైనవాటి సహాయంతో అంకురోత్పాదనం సంతరించుకుంటోంది. క్రమంగా ధాన్యమగుచున్నది. ఆ తరువాత అన్నమగుచున్నది. ఆ అంకురశక్తియే నీటియందు రసస్వరూపంగా, దేహమునందు సంయోగశక్తి స్వరూపంగా దాగి ఉంటోంది. ఆ ఈశ్వరశక్తి నీరు, నాలుక యొక్క సంయోగముచే ఉదరమున ప్రవేశించి శరీరమును ఉత్తేజపరుస్తోంది. ఆ చిత్‌సత్త పుష్పములందలి ఆఘ్రాణంగా వెలయుచు ఘ్రాణేంద్రియాన్ని వికాసమొనర్చి ముక్కురంధ్రములకు ఉల్లాసం కలిగిస్తోంది. అది శిలయందు ప్రవేశించి ఆ శిల యొక్క శూన్యభావమును తొలగించి, అద్దానికి వ్యవహారసత్తా కల్పిస్తోంది. ఆ చిత్ సత్తా తాను తానుగా ఉంటూనే తన స్వరూపాన్ని వీడకుండా సర్వమును కల్పిస్తోంది. అందుకు దృష్టాంతంగా... ఒక యువకుడు, "ఆహాఁ! ఆ స్త్రీ అంత అందంగా ఉన్నది కదా!" అను భావన కల్పన చేస్తూండగా, ఆ సమయంలో ఆతడు తన స్వస్వరూపము కోల్పోవటం లేదు కదా! ఇది కూడా అట్టిదే ! తండ్రి తన కుమారుని స్వకార్యనిర్వహణం కొరకు నియమిస్తాడు చూచావా? అట్లాగే ఆ చిత్‌సత్త సమస్త చలనాలకూ ఆలవాలమగు వాయురూపమును ధరించి, చర్మమును స్పర్శించి స్పర్శజ్ఞానోత్పత్తికి కారణమౌతోంది.

ఒక సమయంలో ఆ చిత్‌సత్త తనను తానే ఏమరచి జగత్తులో ప్రవేశించి శబ, స్పర్శ, రూప, రస, గంధాల అనుభవ కల్పనలలో తేలియాడుతోంది. అది మరొక సమయంలో తన యొక్క వాస్తవ స్వరూపసిద్ధి కొరకు... అనగా మోక్షార్థం ...తన్ను తాను 'నిఖిల జగత్తు యొక్క సమ్మిళిత సత్తారూపం' అగు ఏకాత్మగా గాంచుచున్నది. అప్పుడు ఈ జగత్తునంతటినీ ఆకాశము వలె శూన్యంగా చేసివేస్తోంది.

అదియే కాలతత్త్వంలో కూడా ప్రతిబింబిస్తోంది. సర్వమునకూ మార్పు చేర్పులను కలిగిస్తోంది. బ్రహ్మ, విష్ణు, రుద్ర, సదాశివ, ఈశాది తత్త్వాలతో ఆరంభమైన ఈ జగత్తు అంతా పరివర్తనశీలమే కదా!

కార్యములన్నిటినీ సరిజూస్తూ ఉండే 'నియతి' యే ఆ మూలశక్తి 'అది ఇట్టిది. అట్టిది కాదు' అని చెప్పటానికి కూడా వీలు లేదు. ఆ చైతన్యసత్త తనంతట తానే స్వయంగా సిద్ధించి ఉంటోంది. దానిని మరొకటేదీ సిద్ధింపజేయటం లేదు. చీకటిలో ఉన్న ఇంట్లో దీపం వెలిగించగానే ఆ ఇంట్లోని వస్తువులన్నీ అగుపిస్తాయి కదా! ఆ 'చైతన్యభగవానుడు' అనబడే అపరిచ్ఛిన్నజ్యోతి వలననే జగత్తులు అనే వస్తుపరంపరలు అనుభవమౌతున్నాయి. అదియే 'పరమాకాశము' అనే నాట్యశాలలో స్వశక్తి సంపాదిత మగు 'సంసారము' అనే నాటకమును ఒకవైపు ప్రదర్శించుచూ, మరొకవైపు దర్శించుచూ తాను మాత్రం ఉభయములకూ సాక్షియై వెలయుచున్నది.

❖

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ జగన్నాథా! చిదాత్మయగు ఆ సదాశివుని శక్తులు ఎట్టివి? అవి ఎట్లా వెలయు చున్నాయి? 'సాక్షిభావం' అంటే ఏమిటి? ఆయన శక్తి సమూహం ఏ కార్యములు చేస్తూ ఉంటుంది? అవి ఎన్ని? ఈ విశేషాలు చెప్ప ప్రార్థన.

శ్రీశివ భగవానుడు : ఓ సౌమ్యా ! ఆ చిదాత్మ భగవానుడు అప్రమేయుడు. దేనితోనూ ప్రమేయం లేని వాడు. దేనికీ సంబంధించనివాడు. పరమశాంతిమయుడు. మంగళమయుడు. పరమసౌమ్యుడు. చిన్మాత్రరూపుడు. అయితే కొన్ని చమత్కారమైన శక్తులు ఆయనను ఆశ్రయించి ఉన్నాయి. అవి ఇచ్ఛాశక్తి... ఆకాశసత్త... కాలసత్త... మహాసత్త... జ్ఞానశక్తి... క్రియాశక్తి... కర్తృత్వశక్తి... మొదలైనవి అవి. ఇట్లా అంటే, ఆ శక్తులకు అంతు లేదని కూడా చెప్పబడుతోంది.

శ్రీవసిష్ఠ మహర్షి : స్వామీ ! అవన్నీ పరమాత్మను వెంటనంటి ఉన్నాయా? పరమాత్మలో ఉన్నాయా? ఆ శక్తులకు ఆ బహుత్వమంతా ఎక్కడి నుండి వచ్చింది? పరమాత్మకు ఆ శక్తులకు భేదం ఏమైనా ఉన్నదా? లేక పరమాత్మ, ఆయన శక్తులు అభేదమా?

శ్రీశివ భగవానుడు : నాయనా! అనంతరూపుడు మంగళమయుడు అగు ఆ చిదాత్మయందు ఆయా వికల్పములన్నీ ఆపాదించబడుతున్నాయి. మనం దేనికి ఒకానొక విశేషం ఆపాదిస్తున్నామో... అట్టి ఆపాదిత విశేషానికి ఆ వస్తువుకు భేదమేమున్నది? అట్లాగే పరమాత్మకు ఆయన మాయా విశేషమునకు కొంచెం కూడా భేదం లేదు. ఆ మాయాశక్తి 'తెలుసుకొనువాడు – కర్మలు నిర్వర్తించు వాడు – అనుభవించువాడు – సాక్షీభూతుడు' అగు జ్ఞాతృత్వ – కర్తృత్వ – భోక్తృత్వాది లక్షణములతో గూడి వివిధ ఆకృతులను ధరిస్తోంది. జలం బుద్బుద తరంగాదుల రూపం పొందుచున్నట్లు అది అట్లా జరుగుతోంది.

ఆ చిదాత్మ యొక్క మాయాశక్తి 'కాలము' అను ఆశ్రమంలో శిక్షణ పొందిన 'బ్రహ్మాండము' అనే నృత్యమండపమునందు ఈ జగత్‌నృత్యం సాగిస్తోంది. 'పరము – అపరము'అను సంజ్ఞలతో ఒప్పుచూ ఆ కాలమే 'నియతి' అని పిలువబడుతోంది. 'క్రియ, కృతి, ఇచ్ఛ, కాలము' మొదలైనవి నియతి అనుదానికి పర్యాయపదములే !

శ్రీవసిష్ఠ మహర్షి : మహాత్మా ! నియతి అంటే ఏమిటి?

శ్రీశివ భగవానుడు : 'నియతి' అనగా నియమించునది అను అర్థాన్ని సూచిస్తుంది. పరమాత్మ యొక్క మాయాశక్తియే గడ్డిపరక నుండి బ్రహ్మదేవుని వరకు కల్పనచే అనుభవజ్ఞానం ప్రతిపాదిస్తోంది. వందలాది కల్పనలే మాయ యొక్క రూపం. తత్త్వబోధ కలుగనంతవరకు ఆ మాయ సత్యాన్వేషణ లేని ఆత్మను ఆవరించుకుని ఉండి, ఈ జగన్నాటకమును నిర్వర్తిస్తోంది. ఈ జగన్నృత్యం వివిధ రసములతో నిండి 'వివర్తము' అను ఆంగిక అభినయంతో చిత్తమును ఆకర్షిస్తోంది. ఆ అభినయం అయిపోయిన తరువాత ప్రళయంలో సర్వం రహితమై ఉంటోంది. మరల, ప్రళయానంతరం ఇతః పూర్వపు మాయానాటకం కొనసాగుతోంది. గాఢనిద్రా సమయంలో జ్ఞాపకాలన్నీ మౌన ముద్ర వహించి మరల నిదుర లేవగానే పేట్రేగుతాయి చూచావా? అట్లాగే ప్రళయకాలంలో జగత్–కాల దృష్టులన్నీ దాగి యుండి, మరల సృష్టి సమయంలో ప్రదర్శించబడుతున్నాయి.

ఈ బ్రహ్మాండమంతా నియతి యొక్క నాట్యశాల అని అనుకున్నాం కదా! ఈ మాయాజీవులే 'నియతి' అను జాణ యొక్క అంగభూషణములు. సుఖ దుఃఖ దశలే ఆ మాయావ్యవహారము యొక్క హావభావములు. ఈ సంసారనాటకాభినయమంతా వివిధ వికారభంగిమలతో నిండి ఉంటోంది. ఒకవైపు ఈ మాయ ఇట్లుండగా, మరొకవైపు ఈ జీవుని వాస్తవస్వరూపమగు ఆ పరమేశ్వరుడు అనునిత్యం ఏకరసస్వరూపమున సర్వమునకు కేవలసాక్షి అయి ఒప్పారుచున్నాడు.

ఆయన వలననే, ఆయనకొరకే, ఆయన చేతనే ఈ తతంగ విన్యాసమంతా జరుగుతోంది. ఒకానొకడు చేసేపని వేరు, ఆ చేయువాడు వేరు కదా! అయినా కూడా చేసే పనిని బట్టే చేయువాడు అనుభవమౌతున్నాడు. పరమాత్మ ఈ జగత్ నటన – నాట్యముల నుండి విభిన్నుడైనప్పటికి, వ్యావహారికంగా మాత్రం ఆతడు ఈ విశ్వమునకు అభిన్నుడనియే చెప్పవలసి వస్తోంది.

బంగారం 'ఉంగరం' అనబడు ఒకానొకటిగా మారినదా?... లేదు. ఉంగరం ఆకార రహిత మగు బంగారం యొక్క ఆకారదృష్టియే. బంగారం కాక, ఉంగరంలో ఇంకేమీ లేదు కదా! కనుక ఉంగరమంతా బంగారమే. ఉంగరానికి వేరుగా బంగారం మరెక్కడో ఉన్నదని అనలేం కదా! ఇదంతా కూడా అట్టిదే. సర్వమూ చూచువానిలో నిబిడీకృతమై ఉన్నది. ఈ విశ్వం చూచుచున్నవాడిచ్చే అర్థం మాత్రమే! ఈ విశ్వం యొక్క పరమార్థం చూచువాడే ! చూచువాడు విశ్వమునకు అర్థము ఇచ్చేవాడు కనుక, ఆతడు విశ్వములో లేడు. విశ్వం కంటే అత్యంత సూక్ష్ముడైయున్నాడు. ఆ చూచువాడు (ద్రష్టయే) ఆ పరమ చైతన్యం యొక్క స్వరూపం. ఎందుకంటే ఆతని వాస్తవతత్త్వం చైతన్యమే కనుక!

❖❖❖

13.బాహ్యపూజ – అంతర్‌పూజ

శ్రీశివ భగవానుడు : వత్సా ! వసిష్ఠా ! వింటున్నావుకదా ! సర్వస్వరూపుడగు ఆ చైతన్య భగవానుడే దేవాదిదేవుడు. ఆతడు అనుభూతి స్వరూపుడు. సర్వులకు, సర్వమునకు అంతర్యామి. సర్వమునకు ఆశ్రయమైన ఆ దేవాదిదేవుడే సాధుపురుషులకు పూజ్యాతి పూజ్యుడు సుమా! ఆయనయే కుండ

యందు, వస్త్రమునందు, శకటమందు మనుష్యులయందు దేవతలయందు వెలయుచున్నాడు. ఆయనయే శివుడు, విష్ణువు, బ్రహ్మ కూడా. ఇంద్ర–కుబేర–యమాది ఆయా అనేక రూపము తోనే గాక, నామరూప రహితముగా, శూన్యముగా కూడా ఆతడు ఆరాధించబడుచున్నాడు. సర్వాత్మకుడై స్వస్వరూపమున కూడా వెలయుచున్న ఆ మహాదేవునే సర్వము ఎరిగిన జ్ఞానులు ఆరాధిస్తున్నారు.

ఓ మహామతీ! ఆ మహాదేవునికి ఈ లోకమున బాహ్యమున అంతరమునకూడా పూజలు సమర్పించబడు చున్నాయి.

1. బాహ్యపూజ - ఈ దేహంతో చేసే పూజలు జనులు శాస్త్రోక్తములగు స్నానములతో, ఆచమనాది క్రియలతో ఈ బాహ్య పూజలు చేస్తున్నారు. మంచిదే కానీ, నా దొక ప్రశ్న. దేహాత్మ బుద్ధితో చేసే బాహ్యపూజలు నిరాకారము–నిర్మలము–అనంతము అగు ఉత్కృష్ట వస్తువు లభించాలంటే మధ్యే మార్గంగా కొంతవరకే ఉపయోగిస్తాయి. కాబట్టి సాధకుడు అంతటితో తృప్తిపొందితే ఎట్లా?

2. అంతర పూజ - పూజింపబడుతున్న వస్తువు ఎటువంటిది? దేహములన్నిటిలో సాక్షీభూతుడై వెలుగు చిద్రూపుడు. ప్రతి జీవునియందు "ఎరుక – అను జ్యోతిస్వరూపమున వెలుగొందుచున్నవాడు. సత్–చిత్–ఆనందం స్వరూపుడగు ఆతనియందే ఈ సర్వం ఉంది. ఆతడే ఈ సర్వమునందు వేంచేసి ఉన్నాడు. ఆ చిద్రూపునికి సంబంధించిన జ్ఞానార్చనే అంతరపూజ. ఆ చిద్రూపమును ప్రయత్న పూర్వకంగా గ్రహించటం, దర్శించటం, సర్వదా ధ్యానిస్తూ ఉండటం ఆ పూజయొక్క విధానం.

నిజానికి ఈ అంతరపూజకు ఒక క్రమం అంటూ లేదు. నియమ నిష్ఠల శ్రమ ఉండదు. కనుక ఓ వసిష్ఠా ! త్రిభువనధారుడగు ఆ సర్వేశ్వరుని నీకు కనబడుచున్న జీవుల వాస్తవ స్వరూపంగా (అట్టి ఎరుకచే) పూజించు. అట్టి 'ధ్యాస' అంతరమున కలిగి ఉండటమే ఆత్మ దేవునికి పూజాపుష్పాలు. ఈ జగత్తులోని సర్వ జీవులకూ ఆతడే ప్రకాశస్వరూపుడై, 'ప్రకాశము'లన్నింటికీ నియామకుడై ఉన్నాడు. అత్యంత సునిశిత విమర్శనా బలంతో "అహం యొక్క సారవంతమైన విభాగం పరమ పరిశుద్ధమగు చిత్ప్రకాశమే" – అని గ్రహించు. ఇక నీ మనస్సును, దృష్టిని సర్వదోష వివర్జితం చేయి. ఎప్పుడు, ఎక్కడ, ఎవ్వరు తారసబడినాసరే ..."ఈ సహజీవి యొక్క స్వరూపం నా యొక్క నిర్మల చిత్‌స్వరూపమే!" అను ధర్మమును అభ్యసించు.

ఆ పరమేష్ఠి వర్ణనాతీతుడు. అయినా కూడా కేవలం నీ యొక్క లక్ష్యశుద్ధి కొరకు ఆ పరమాత్మను వేదములు ఎట్లా వర్ణనచేస్తున్నాయో చెపుతాను, విను.

❖

అపార పరమాకాశము యొక్క విశాల వైశాల్యము ఆయన కంఠభాగం. క్రిందనున్న అనంత ఆకాశకోశం ఆయన పాదపద్మములు. ఈ దిఙ్మండలములు ఆయన భుజస్కంధములు. ఈ బ్రహ్మాండములన్నీ కలిసినా కూడా ఆయన యొక్క హృదయకోశంలో ఒకానొక మూల మాత్రమే ఒదిగి ఉంటున్నాయి. ఆతడు పరమాకాశములకు ఆవల – ఈవల కూడా విస్తరించి ఉన్నాడు.

ఆయన శరీరముయొక్క నలువైపులా బ్రహ్మ – ఇంద్ర – హరి – హరాదులు కల్పనామాత్రులై వెలయుచూ ఆయనకు శోభ కలుగజేస్తున్నారు.

ఈ చతుర్విధ జీవరాసులూ జలచరములు, భూచరములు, ఆకాశచరములు, వాయు చరములు ఆయన దేహంలోని రోమముల వంటివారు.

ఈ అనేకానేక ఇచ్ఛాదులతో కూడిన త్రిజగత్తులు ఆయన దేహంలోని నాడీ మండలములు. ఆయన ప్రతిఒక్కరికీ సంబంధించినవారే! ప్రతిఒక్కరికి చెందినవారే! ప్రతి ఒక్కరికీ, తమ తమ స్వరూపమే అయి ఉన్న ఆ దేవదేవుడే సర్వులకూ పరమపూజ్యుడై వెలయుచున్నాడు. ఆ చిన్మాత్రుని నిజరూపం అనుభూతియే.

అనుభూతి స్వరూపుడగు ఆయన సర్వవ్యాపియై, సర్వాశ్రయుడై, సర్వమునందు ఎల్లప్పుడూ జాజ్వల్యమానంగా వెలుగుచున్నాడు.

శివ, బ్రహ్మ, హరి, కుబేం, ఇంద్రాది దేవతలు ఆయనే. వివిధ రూపములు ఒకే సమయంలో ధరించుచుండుట చేత విద్వత్కవులు 'అనంతుడు' అను బిరుదును ఆయనకు ఇచ్చారు.

ఎట్టి భేదానికీ ఎప్పుడూ లోను కానట్టి 'అద్వితీయ సత్త'యే ఆయన శరీరం. అంతేగాని ఆయనకు వేరే భౌతికప్రదమైన, ఆకార-వికారములకు సంబంధించిన రూపమేదో ఉన్నదని భ్రమపడ వద్దు.

ఈ జగత్తులను వివర్తింపజేసే కాలము ఆయనకు ద్వారపాలకుడు. ఈ నదీ - సముద్ర - మహాసముద్ర - పర్వతాదులతో నిండిన లోకములతో కూడుకున్న బ్రహ్మాండములన్నీ ఆయన బృహత్ శరీరములోని ఒక చిన్న విభాగం. ఓ మహర్షి! ఓ తదితర ప్రియ జీవులారా! సహస్ర చక్షుడు, సహస్ర శిరుడు, సహస్ర హస్తుడు, శాంతుడు, స్వస్వరూపుడగు ఆ ఆత్మదేవుడు అత్యంత సామీప్యమున ఉండి ఉండగా, ఇక ఆయనను మీరు ఎట్లా ఏమరుస్తున్నారు? ఆ దేవదేవుని గురించి చింతించటం సర్వదా అలవాటు చేసుకోండి. "సర్వ స్పందనలు, సర్వ వాక్-మనో-బుద్ధి-చిత్త-అహంకారాలు ఆ ఆత్మ భగవానుని చిద్విలాసములే!" ...అని అనుస్మరణ పూర్వకంగా సందర్శిస్తూ, ఈ దృశ్యమును ఆస్వాదించటం అలవరచుకోండి.

ఆయన దర్శన-అఘ్రాణ-స్పర్శన-రసన-శ్రవణ-మనన శక్తులు సర్వేసర్వత్రా వ్యాప్తములై వెలయుచుండుటయే ఈ జగత్తుకు నిర్వచనం. వాటన్నిటి యందు ఆయన విస్తరించి ఉన్నాడు కాబట్టి, ఆయన 'సర్వవ్యాపి' అని పిలిపించుకుంటున్నాడు.

మననమునకు కర్త ఆయనే! అందుచేత... 'మననమునకు ముందే ఉన్నవాడు, అతీతుడు' అని ఆయనను అనక తప్పదు. ఆయన సర్వకాలములందూ సర్వమునకూ కర్తయై ఈ సంకల్పిత విషయములన్నీ ఆయనే అనుగ్రహిస్తున్నారు.

సర్వమయుడగు ఆ పరమాత్మ ఎక్కడో ఆకాశంనందో, భూమియందో దాగిలేరు. సర్వదా నిఖిలభూతముల మధ్య నిశ్శబ్దంగాను, సర్వశబ్దమయుడుగాను మహాప్రకాశమానుడై ఉంటున్నారు. పరమమంగళ స్వరూపుడగు ఆతడొక్కడే అన్నిటినీ అనుగ్రహించగల సాధనభూతుడు. ఆయనను అట్లని గ్రహించి శ్రద్ధాసక్తులతో పూజించండి.

ఆత్మదేవుని పూజ - ఓ బ్రహ్మవిత్ శ్రేష్ఠా ! ఇక ఆ అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని ఆర్చించటం ఎట్లాగో చెపుతాను ...విను.

స్వసంవిద్రూపుడగు ఆ ఆత్మదేవుని పుష్ప, ధూప, దీప, కుంకుమ, నైవేద్యాదులతో పూజించటం ప్రారంభమున మనోనైర్మల్యము కొరకు మాత్రమే అవుతుంది. అంతమాత్రం చేత 'నేను సంపూర్ణమగు పూజ నిర్వర్తించాను' అని అనుకుని ఊరుకోకూడదు. అవి ఉన్నా, లేకున్నా కూడా... 'ఈ ఎదురుగా కనబడే వారంతా ఆత్మస్వరూపులే' అను భావనను అభివృద్ధి పొందింపజేయటమే వాస్తవమైన పూజ. అట్టి ఆత్మబోధ అనాయాస లబ్ధము, శాంతిమయము, నిరంతరసుసాధ్యము, సులభము కూడా. 'నాకు తారసపడే ఈ ప్రతిఒక్క జీవుని వాస్తవ స్వరూపం నిత్యము – అఖండము – అప్రమేయము అగు పరమాత్మయే' అను నిరంతర ధ్యానమే 'పరధ్యాస', 'పరమధ్యాస' అని పిలువబడుతోంది. అదియే పరాపూజ కూడా. అట్టి పరాత్పరతత్త్వము అభ్యసించకుండా చేసే ఈ భౌతిక పుష్పముల పూజ అల్పప్రయోజకారే సుమా!

పూజ చేస్తున్నప్పుడు 'నాచే పూజించబడే ఆ పూజాలక్ష్యం ఏమై ఉన్నది?' అని గ్రహించి ఉండాలి కదా! ఆకారమును పూజిస్తున్నప్పటికీ పూజాలక్ష్యము ఆకారపరిమితమైనది కాదని గుర్తుంచుకోవాలి. అది ఏమరిస్తే మనం పూజించే నామరూప ప్రతీక దేని యొక్క ఉద్దేశమో అది ఏమరిచినట్లే అవుతుంది కదా! మరి అజ్ఞానశిల ద్రవించేది ఎన్నటికి?

పూజాలక్ష్యమగు ఆ పరమాత్మ మన అంతరమున విశుద్ధ చిన్మాత్రస్వరూపంగా ఉన్నారు. 'అంతరహృదయ అభ్యాంతరంగ – హృదయాంతరంగుడు' అయి ఉంటూనే బాహ్యమును వెలిగిస్తున్నారు. బాహ్య ప్రదర్శనరూపంగా ఈ దర్శన – శ్రవణ – స్పర్శన – ఆఘ్రాణ – భోజన – శయన – స్వప్న – నిశ్వాసన – సంభాషణ – త్యాగాదులందు ఆక్రమించుకొని ఉంటున్నాడు. అట్టి వానిని 'ధ్యానము' అనే పుష్పముతో పూజించాలి.

ఆయన తత్త్వమును అంతటా గాంచటమే ధ్యాన విధానం. ధ్యాసయే ధ్యానము. ధ్యానము లేకపోతే ఆత్మదేవుని పొందజాలం. ధ్యానబలం చేత ఆత్మ తప్పక ఎవరికైనా సరే అనుభూతమౌతుంది. ఆత్మ భగవానుడు ధ్యానించే వారిని ప్రసన్నుడై సమీపిస్తున్నాడు.

మూఢుడగువాడు కూడా 13 రెప్పపాట్ల కాలం (13 seconds) సర్వాత్మకుని స్వస్వరూప అనుసంధాన పూర్వకంగా అర్చిస్తే గోదానఫలం లభిస్తుంది. 100 రెప్పపాట్ల కాలం అర్చిస్తే అశ్వమేధ యజ్ఞఫలం లభించగలదు. కొన్ని నిమిషాలు సర్వభూతమయుని ఆత్మ సమర్పణ పూర్వకంగా అర్చిస్తే, ఎన్నో రాజసూయ యాగాల ఫలములు లభిస్తాయి.

ఒకరోజంతా అర్పిస్తే పరమకైవల్యము లభించగలదు.

నాయనా! ఈ భౌతిక పరిమిత పూజ కన్నా ఆ ఆత్మదేవుని ధ్యానార్చనం ఎంత సమున్నతమైనదో చెప్పటానికి మాత్రమే ఇది చెప్పాను. ఆ పరమదేవుని ధ్యానమే 'పరమయోగం'. అదియే సులభము, సర్వోత్తమము అగు క్రియ.

సర్వాత్మధ్యాననిరతియే ఆత్మదేవుని బాహ్యాభ్యంతరపూజ. ఏ మనుజుడైతే నిఖిల పాపహరము, పరమపవిత్రము అగు ఆ పూజను శాంతమనస్కుడై నిర్వర్తిస్తూ ఉంటాడో ...అతడు నా వలెనే ముక్తుడై ఆత్మ పదమును పొందుతాడు. ఓ మహర్షీ! సురాసుర శ్రేష్ఠులలో అనేకులు దైనందికంగా, అనుక్షణికంగా నిర్వర్తిస్తున్న ఆ ఆత్మపూజను నీవు కూడా నిర్వర్తించు.

❖❖❖

14. ఆత్మాభిషేకం

శ్రీశివ భగవానుడు : ఇప్పుడు 'అంతరపూజ' గురించి మరికొన్ని విశేషాలు చెపుతాను. శ్రద్ధగా విను. 'అంతరపూజ' అనేది ధ్యానాత్మకమైనది. అది శయన-సంచార-క్రియాది సర్వ అవస్థలలో తెంపు లేకుండా నిర్వర్తించవచ్చు.

ఈ పూజలో సర్వస్థితుడు సర్వస్వరూపుడు, రూపనామరహితుడు అగు పరమశివ శబ్దము యొక్క అర్థాన్ని ధ్యానించాలి.

పురాణకల్పితమైన పరమశివ రూపం సాధన కొరకై గ్రహించవచ్చు. అయితే ధ్యాసను రూప పరిమితం చేసి ఊరుకోకూడదు సుమా! సకల బోధనలను తన సాన్నిధ్య మాత్రంచేత ప్రసాదిస్తున్న ఆత్మస్థితునిగా ఆ సాధ్యవస్తువును గ్రహించు.

ఇక నీ సాధన అనునిత్యం చేయి. పయనిస్తున్నప్పుడు, లేస్తున్నప్పుడు, నడుస్తున్నప్పుడు, భోగ సమూహములను అనుభవిస్తున్నప్పుడు వాటిని విడుస్తున్నప్పుడు ఆతడే అన్ని వేళలా అన్నివైపులా నిర్వికల్ప శాంతరూపమున వెలయుచున్నాడని గ్రహించు. నీ స్వస్వరూపుడే అగు ఆ ఆత్మస్వామిని యథా ప్రాప్తములగు స్వరూపజ్ఞానములతో అనుక్షణం పూజించు.

ఆత్మ ప్రారబ్ధ కర్మ భోగాల ప్రవాహంలో పడి మాలిన్యం పొందినట్లు అజ్ఞాన దృష్టికి మాత్రమే గోచరిస్తుందని ఎరిగి ఉండు. నీ స్వభావమును 'విశుద్ధాత్మబోధ' అను జలంతో స్నానం చేయించి బోధోపచారములలో బోధలింగమును పూజించి ధన్యుడవు కమ్ము.

శ్రీవసిష్ఠ మహర్షి : అంతటికీ ఆత్మయగు ఆతనిని ఎట్లా పూజించటం? ఎట్లా అభిషేకించటం? 'బోధోపచారములు' అంటే ఏమిటి?

శ్రీశివ భగవానుడు : 'బోధోపచారములు' అంటే ఏమిటో, వాటితో ఆత్మ భగవానుని ఎట్లా పూజించాలో చెపుతాను విను.

❖

ఆకాశమండలమును ప్రకాశింపజేయు ప్రచండ కిరణస్వరూపుడగు సూర్యుడు ఆతడే! చల్లని కిరణములు ప్రసరింపజేయు చంద్రుడు కూడా ఆతడే!

ఆ ఆత్మదేవుడు ఈ సర్వ ప్రతిభాసిక పదార్థములందూ సంవిత్స్వరూపుడై వెలయుచున్నాడు. శరీరద్వారములందూ, ముఖములందూ, ప్రాణస్వరూపుడై ప్రవహించుచున్నాడు. ఈ శబ్ద-స్పర్శ-రూప

-రసాది విషయములను తన ఆనందస్వభావంతో కలిపి వాటిని మధురంచేసి ఆస్వాదిస్తున్నాడు. కనుక నీవు శబ్ద స్పర్శాది విషయములను పొందుతున్న సమయంలో ఆత్మమాధుర్యమును జోడించి భావిస్తూ వాటియందు పాల్గొనుము.

ఆయన 'ప్రాణ-అపానములు' అను చక్రాలు గల రథమును అధిరోహించి గూఢుడై నాయందు, నీయందు నీకు తారసపడుచున్న సర్వజీవరాసులయందును హృదయాంతరమున విశ్రమిస్తున్నట్లు గుర్తించి ఆరాధించు. జ్ఞానములన్నీ గ్రహించే "మహాజ్ఞాని", కర్మలన్నిటి యొక్క "మహాకర్త", భోగములన్నిటినీ భోగించు "మహాభోక్త", స్మృతులన్నిటినీ స్మరించు "మహాస్మర్త", భావాభావములన్నీ ధరించు "మహాభావకుడు", ఎట్టి చింతలూ లేనప్పుడు పరిశేషించు "మహానిర్వికల్పస్వరూపుడు", సర్వమునూ తన ఉనికిచే పవిత్రం చేస్తున్న "మహామంగళ స్వరూపుడు" ఆయనయేనని ఆరాధించు. నీవు చేస్తున్న సర్వక్రియలకూ కారణభూతుడు ఆతడేనని భావన, చింతన చేయి.

ఆయన వాస్తవానికి కళారహితుడు. కానీ ఉపాధివశంచేత నీకు ఎదురుగా కళాసహితుడై నీ యొక్క తదితర ఉపాధులయొక్క రూపంలోనూ, పైన ఆకాశంలోనూ, నేలలోనూ ఆయా రూప-రస -భావనా సమన్వితుడై సంచరిస్తున్నాడు. అరంజితుడై కూడా రంజితునివలె కన్పట్టుచున్నాడు.

ఆతడు మరెక్కడో లేడయ్యా! నీ శరీరమునందు అంతటా వ్యాపించియున్న బోధస్వరూపుడు ఆతడే! ఆయన నీ మనస్సు యొక్క మననశక్తి యందు వెలయుచున్నాడు. ప్రాణాపానము లందు సదా ఉదయిస్తున్నాడు. నీ హృదయంలోను, కంఠంలోను నాసాపుటములందు తేజోరాశి అయి ఒప్పారుచున్నాడు.

శైవ శాస్త్రంలో చెప్పబడిన 36 తత్త్వములందు, వాటికి ఆవల ఈవల కూడా ఆక్రమించుకుని ఉన్నాడు.

కల - వికలనము మొదలుగా 'ఉన్మనీ- మనోన్మనీ' అనబడు సవికల్పసమాధి స్థితులందు, వాటినన్నిటినీ దాటినట్టి స్థితులందు కూడా కళాప్రపూర్ణుడై ప్రకాశిస్తున్నాడు. నీ యొక్క శబ్ద స్పర్శాది విషయములన్నీ సృష్టిస్తూ నీ మనస్సు అనే పక్షిని అటూ-ఇటూ ఎగురవేస్తున్నాడు. నీ యొక్క వాక్పథము నందు, వాచ్య, లక్ష్యములందూ యథేచ్ఛగా సంచరిస్తున్నాడు. నువ్వుగింజలన్నిటిలో నూనె ఉన్నట్లు, ఆయన సర్వ శరీరములందూ 'తెలుసుకోవటం' అను రూపముతో ప్రత్యక్షమై ఉంటున్నాడు. తనకు కళంక మనేదేదీ లేకుండానే ఈ పంచభూత సమ్మిళితమైన స్థూలదేహములన్నీ దాల్చుచూ కాఠిన్యమగు మూర్తిత్వము వహిస్తున్నాడు. సకల హృత్పద్మములలోనూ మధుర రసరూపుడై అచింత్యమానుడై ఉంటున్నాడు. ఆయనను ఎక్కడో ఎన్నడో చూడాలని భ్రమించనక్కర్లేదు. అనుభూతి స్వరూపమున నలువైపులా ప్రత్యక్షమయ్యే ఉన్నాడు. ఆహా! ఆయన ఆయా దేహములలో స్వస్వరూపాన్ని మరచి, జీవభావమును ధరించటమేమిటి? భోగ మోక్షముల కొరకై ఆరాటపడటమేమిటి? అనేక చోట్ల అనేక చిత్రవిచిత్ర స్వయంకల్పిత మాయా ప్రతిబంధకములను కల్పించుకొనటమేమిటి? స్వ - అతిరిక్తములగు పదార్థ రూపములను ధరించి క్షణంలో ద్వైతభావములు పొందటమేమిటి?...

ఎంతటి చమత్కారం! మేము ఈ మాయ కావల దాగిన ఆయన అప్రమేయ – నిష్కళంక – నిత్య – నిరుపమ – చిదానంద స్వరూపం సర్వదా గాంచుచున్నాం. నీవు కూడా అయ్యది దర్శనాభ్యాసంచే సర్వత్రా దర్శించటం నిర్వర్తించెదవు గాక!

❖

శ్రీవసిష్ఠ మహర్షి : తండ్రీ ! ఆయనను సర్వదా, సర్వత్రా, సదా ధ్యానించటం ఎట్లాగో చెప్పండి.

శ్రీశివ భగవానుడు : "ఈ కాళ్ళు, చేతులు మొదలైన అవయములతోనూ, జుట్టు, గోళ్ళతోను ఉన్న ఈ దేహము నందున్న నేనే ఆ పరమశివుడను" అని భావించుకోవటమే చిదానందరూపం : శివోఽహమ్ : శివోఽహమ్ ఆ ధ్యానము యొక్క పరాకాష్ఠ.

"భార్యలు అత్యంతప్రియుడగు భర్తను సేవిస్తున్నట్లు ఈ వివిధ మనఃశక్తులన్నీ సర్వదా శివ స్వరూపుడనగు నన్ను ఉపాసిస్తున్నాయి. ఈ మనస్సనేది నా స్వస్వరూప గృహానికి ద్వారపాలకుడు. ఈతడు జగత్రయములలోని వివరణలను నాకు సర్వదా విన్నవించుకుంటున్నాడు. ఆలోచనయే నా ఆంతరంగిక వార్తా విశ్లేషనుడగు ప్రతిహారి (Messenger). విశుద్ధమగు బుద్ధి నా భుజశక్తి. క్రియాకలాపాలన్నీ నా మెడలో ధరించిన మణిహారం. సర్వజ్ఞాన విశేషములు నా శరీరానికి ఒప్పే ఆభరణములు. కర్మేంద్రియ–జ్ఞానేంద్రియములు నా గృహద్వారములు.

ఇక నేనో...? అనంతుడనగు, ఆత్మను ! శివానంద స్వరూపుడను.

శివోఽహమ్! శివోఽహమ్!

నా ఆకృతికి పరిమితమంటూ లేదు. పూర్ణము, ఏకము, ఆద్యము అగు ఆత్మస్వరూపమున వెలయుచూ వస్తువులన్నీ పరిపూర్ణం చేస్తున్నాను."

❖

ఇట్లు ఆత్మదేవ భావమును చింతన చేస్తూరాగా, అప్పుడు నీ హృదయం ఆత్మదేవత్వంతో పూర్ణమగుచున్నది. అట్టి అంతరపూజచే నీ యందలి దీనత్వమంతా పారద్రోలి వేయగలుగుతావు. అప్పుడిక నీకు ఉదయాస్తమయములు గాని, జనన మరణములుగాని, సంతోష – విరాగములుగాని, వాంఛా – అసంతృప్తులు గాని, గ్రహణ – త్యాగములు గాని ఉండవు. హృదయం సర్వసమ భావముతో నిండిపోతుంది.

నాయనా! వసిష్ఠా! ఆకృతి, ఆచరణలతో నిత్యం నిస్సంకోచంగా జీవన్ముక్తత్వము వహించటం అభ్యాసం చేయి. అంతేగాని, "నేను దుర్బలుడను. పాపిని, స్వల్పుడను. దేనిపైననో ఆధారపడి ఉన్న వాడను" ...మొదలైన వాటికి అంతరంగంలో స్థానాలు కేటాయించ వద్దు. ఆత్మదృష్ట్యా నీవు ఎట్టి వాడవో ఎంతటివాడవో గ్రహించి ఉంటూనే కార్యములను, ఉచితానుచితమును అనుసరించి నిర్వర్తిస్తూ ఉండు. ఆత్మ దృష్ట్యా సహజీవులు ఎట్టివారో ...అది కూడా ఏమరువవద్దు. "అంతా శివమయమే" – అను అనుభూతిని, ఆస్వాదనను, స్వావలంబనమును ఏమాత్రం విడువనే వద్దు.

సమదర్శియగు మహామతి సంపూర్ణంగా సౌమ్యభావం పొంది, సుందరమగు మనస్సుతో శరీరం ఉన్నంతవరకు సమరసపూర్వకమైన ఏకాత్మభావనయందే వెలయుచున్నాడు. అదియే ఆతని

అంతర్దేవ పూజ. నీవు చేయు అట్టి పూజకు అధి దేవత నీవే! నీ ఆత్మ స్వరూపమే! నీ సర్వస్వముతో, సమత్వము పొందిన బుద్ధితో, అనాయాసంగా లభించే క్రియా – కర్మ – వస్తుజాలంతో చిన్మయదేవుడగు స్వస్వరూపమును ఉపాసించు ... ఆరాధించు. ఈ జగత్తంతా నీయందే దర్శించు నిన్నే ఈ జగత్తునంతా సందర్శిస్తూ ఆస్వాదించు.

❖

ఆ ఆత్మదేవుని పూజించటానికి గంధము పుష్పము మొదలైన బాహ్య వస్తువులను సమకూర్చుకో వలసిన అగత్యం కూడా లేదని నీవు ఇప్పటికే గ్రహించి ఉంటావు. ఎట్ట ఎదుట కాకతాళీయంగా లభిస్తున్న ఆయా సర్వవస్తువులతోనూ నీకు అభిన్నమైన ఆ దేవదేవుని పూజించవచ్చు. అట్టి పూజా కార్యక్రమం అకృత్రిమంగా, ప్రయాసరహితంగా జరిగిపోతూ ఉండుగాక! ఏ ఏ జాతివారికి వారి శాస్త్రములందు ఎట్టి విధి విధానములు కర్తవ్యములుగా చెప్పబడ్డాయో... ఆయా రీతులను అనుసరించి తమకిష్టమైన విధానములతో, వస్తువులతో, క్రియలతో సర్వసమభావి అయి ఆ ఆత్మదేవుని పూజించ వచ్చు. నీయందు, నాయందు తదితర సర్వజీవులయందు ఏక–సమ రూపమున వెలయుచున్న ఆ ఆత్మ భగవానుని జనులు తమ తమ ఐశ్వర్యాదులను అనుసరించు భక్ష్య – భోజ్యములను సమర్పిస్తూ కూడా పూజించెదరు గాక! శయన, ఆసన, గమనాది సర్వావస్థలయందు తత్క్రియలచే ఆ శుభ స్వరూపుని ఆరాధించవచ్చు.

నాయనా ! కాంతా సంగమ, అన్న పానాది సర్వ విధ భోగములను – ఆ ఆత్మదేవునికి సమర్పిస్తూ ...ఆయన యొక్క తత్త్వమును సంపూర్ణంగా గ్రహించి ఆయన్ను అవిచ్ఛిన్నంగా పూజించండి. ఆత్మ జ్ఞానార్థమై వేటినైనా త్యజిస్తుంటే, ఆ త్యాజ్యము ద్వారా ఆత్మదేవ పూజ చేయి. ఎప్పుడైనా ఆధి వ్యాధులు అనుభవించవలసి వచ్చాయనుకో... తద్ద్వారా జనించే మోహాలను, తదితర ఉపద్రవాలను, దుఃఖ పారవశ్యములను ఆ ఆత్మదేవునికే సమర్పించు. వాటి రాకపోకలకు క్రుంగిపోక, వాటియందు పూజా భావాన్ని జతచేర్చాలి. ఈ జగత్తులో తారసపడుచున్న సర్వప్రయత్నాలను, జాగ్రత్–స్వప్నాలు ఏర్పడుచున్న తీరులను ఆ ఆత్మభగవానునికే అర్పించి అర్చించాలి. ఇందు ఇక ఏ దోషం నీకుండదు.

సంసార ప్రవాహమున పడిన జీవుడు తాను దరిద్రుడైనపుడు ఆ దారిద్ర్యమును ఆయనకు సమర్పించాలి. రాజైనప్పుడు రాజుగా తాను చేయవలసియున్నదంతా ఆయా క్రియా పుష్పముల రూపమున శుద్ధుడు – స్వస్వరూపుడు అగు పరమాత్మను పూజించాలి. సంసారి అయినప్పుడు ఆ సంసారిత్వమును ఆయనకే సమర్పించాలి. నానా విధములగు సందర్భానుచితములైన యుద్ధ సంరంభముల తోడను, సంతోషం యొక్క చాంచల్యము తోడను, రాగద్వేషముల విలాసము తోడను, సౌమ్యుడగు ఆ ఆత్మదేవుని ఆరాధించాలి. ఆ ఆత్మదేవుని సాన్నిధ్యం చేతనే సత్పురుషులు పూజార్హులగు చున్నారు. ఆ సర్వాత్మ చంద్రునివలె చల్లనిది. మాధుర్యమగు మైత్రితో సర్వ హృదయములందూ వెలుగొందే ఆయనను సేవించాలి. మైత్రి, కరుణ, ఉపేక్ష, ముది, క్రోధనిగ్రహ సామర్థ్యములన్నీ తన స్వరూపమైన ఆత్మ దొర పాదాలపై ఉంచే పుష్పాలుగా భావించబడుగాక! ఆకస్మికంగా లభించేవి,

ప్రయత్నం చేసిన తరువాత ప్రాప్తించేవి, అనుభవించేవి, "క్షణిక భోగభాగ్యములు అన్నీ కూడా ఆయనకు వినయముతో సమర్పించబడుగాక. విహిత నిషిద్ధములగు భోగ అనురాగ, త్యాగములతోను, కోరబడిన – కోరబడని యుక్తాయుక్త క్రియల చేతను, త్యజించి – త్యజించని భోగ – స్నేహ, సంబంధముల చేతను, ఆ సర్వాత్మకుని పూజయే నాచే జరుగుచున్నది" – అను భావ, అనుభవములు పొంది ఉండెదవుగాక!

❖

ఆత్మదేవుని పూజలో విజ్ఞులు 3 రకాల పుష్పాలను ఉపయోగిస్తూ ఉంటారు.

1. గతించిపోతున్న విషయాలను ఉపేక్షించటం.
2. లభ్యపడుతున్న విషయాలను ఉద్విగ్నరహితంగా, రాగద్వేషరహితంగా ధర్మాధర్మ విచక్షణతో నిర్వర్తించటం.
3. ఉభయ సమయములలో నిర్వికారులై, సమత్వ సమన్వితులై ఉండటం.

...వీటిని ఆత్మస్వరూపుడగు శివపూజాయత్నములు అని పిలుస్తూ ఉంటారు.

కాబట్టి కుమారా ! ఇష్ట – అనిష్టములగు సర్వ విషయములందునూ సంపూర్ణమగు 'అకృత్రిమ సమత్వం' సంపాదించుకో. సదా ఆత్మార్చనావ్రతం నిర్వర్తించు.

'సర్వం బ్రహ్మమే' అను దృష్టి వలన స్వతఃసిద్ధంగా సర్వశుభాలు ఒనగూడగలవు. "బ్రహ్మం, మాయ"అను రెండు వేరు వేరు విషయములు కలిసి ఉన్నాయను దృష్టి వలననే ఇక్కడ శుభాశుభములు సంభవిస్తున్నాయి. ఆత్మార్చనా వ్రతుడు 'సర్వము ఆత్మయే' అని దృఢంగా గ్రహించి ఉండటం చేత వైషమ్యములు తొలగుతాయి. సర్వసమత్వం స్వభావసిద్ధమౌతుంది. 'ఆపాతరమణీయాలు, ఆపాత దుస్సహాలు – అగు విషయములన్నిటి యందూ సమత్వబుద్ధి కలిగి ఉండేవాడు స్వతఃసిద్ధంగా ఆత్మార్చనావ్రతుడు అయినట్లే!

నిత్యాత్మవ్రతం - అందుచేత మహర్షీ ! "అదియే నేను, ఇది నేను కాదు" మొదలైన భేదవిభాగ సంబంధాలగు కల్పనలను కూడా పరిత్యజించు. "సర్వం బ్రహ్మమే"అను అభేధ దృష్టి అవలంబించటమే నిత్యాత్మ వ్రతం.

"ఆత్మయే నానావిధ రూపములు గాను, నానా విధములగు వికారములు గాను ఈ నా దేహంగాను ప్రకటితమగుచున్నది. సర్వే సర్వత్రా ఆత్మ ఉపలభ్యమగుచున్నది"అను అభ్యాసమును "నిత్యాత్మ వ్రతము" అని పిలుస్తున్నారు. ఇష్ట–అయిష్టములను, మిథ్యాత్మబుద్ధిని పరిత్యజించి, వీటినన్నిటినీ స్వాత్మ మాత్రంగా గ్రహించటమే ఆత్మదేవుని కొరకు చేసే సర్వకైంకర్యము. సముద్రము నదీ సమూహములను వాంఛించక, త్యజించక, తాను కారణము గాక ప్రవాహపతిత మాత్రంగా స్వీకరిస్తుంది కదా! ఆత్మార్చకుడు సుఖదుఃఖ హేతువులగు జగద్విషయములను యథాతథంగా గాంచుచూ, క్రుంగక – పొంగక ఉంటాడు. అవమానాది దుఃఖకర పరిస్థితులందు, ప్రాణాపాయాది ఘోరసంకటము లందు, రాజ్య – పూజ్యాది పురస్కార సందర్భములందు, ఉద్వేగ – ఉత్సాహ –

నిరుత్సాహాలు పొందక నిర్లిప్తంగా – ఆత్మార్పణ బుద్ధితో గాంచుచూ ఉంటాడు. తన యొక్క ప్రతిక్రియ – ఉదాసీనతలు కూడా ఆత్మదేవుని పాదాలకు సమర్పించే పూజాపుష్పాలుగా దర్శిస్తున్నాడు.

దేశ, కాల, క్రియలవలన సంభవించే శుభాశుభములను నిర్వికారబుద్ధితో గ్రహించటం అనేది ...ప్రత్యేకంగా ఉద్దేశించకపోయినప్పటికీ ... ఆత్మార్చనయే అవుతుంది.

ఆత్మార్చనావిధానం అత్యంత సులభ సాధ్యం. సమతారసమే ఈ బోధ యొక్క సారం.

సమతా మధురా రస్యా రసశక్తిరతీన్ద్రియా ।

తయా యద్భావితం చేత్యమమృతం తత్క్షణాద్భవేత్ ॥ (శ్లో 56, సర్గ 39)

సమతారసము అత్యంత మధురము, ఇంద్రియా తీతమునునై యున్నది. అట్టి సమతా రస సమన్వితమైన బుద్ధిచే పొందబడే ఇంద్రియ విషయాలు కూడా క్షణంలో అత్యంత సుమధురమౌతాయి. అట్టి బుద్ధి క్రమంగా నిర్వికారంపొంది భూతరహిత (భూ–జల–అగ్ని–వాయు రహిత) ఆకాశంలాగా ప్రశాంతత పొందగలదు. మనస్సు స్వస్వరూపమున విలీనమౌతుంది. అదే అనాయాసమగు దేవార్చన. ఆ ఆత్మార్చన చేయువాడు బహిర్‌ప్రకృతి సంబంధములగు సంసారకార్యములను ఒనర్చుచున్నప్పటికీ, అంతరమున పరిపూర్ణుడై ఉంటాడు. అజ్ఞాన పరిభ్రమణం క్షీణిస్తుంది. అహంకార మేఘం తొలగి శరత్కాలాకాశం లాగా స్వస్వరూపం పరిఢవిల్లుతుంది.

ఓ వసిష్ఠా! జీవద్దర్శనం చేస్తూనే, ఏతత్ క్షణంలో కూడా బ్రహ్మపదమున వెలయుము. అప్పుడే పుట్టిన బిడ్డలాగా వికల్పరహితుడవై ఉండుము. చిత్తమునకు చిదాభాసునకు కూడా మూలకారణమగు సర్వమంగళమయ ఆత్మనే గాంచుచుండు. నీ స్వరూపమునకు మనోవృత్తి రూపమగు స్వల్పత్వమును ఆపాదించవలసిన అవసరం నీకు గాని, మరెవరికి గానీ లేదు. అట్టి ఆరోపణ ఆత్మోపాసనారాహిత్యం వలననే జరుగుతోంది. ప్రపంచ వస్తు ఆకారములను వాటిని ప్రకాశింపజేసే సూర్యతేజస్సుకు ఆపాదించటం ఉచితమెట్లా అవుతుంది? తుచ్ఛ మనోవృత్తులు నీపట్ల ఉపశమించుగాక! “పుట్టువాడను, సంబంధితుడను” మొదలైన భేదభావములన్నీ నీపట్ల అస్తమించి, ఇక నీవు స్వప్రకాశరూపుడవై వెలుగొందెదవు గాక! స్వయంగా నీవే అయి ఉన్న (తత్త్వమ్) ఆ ఆత్మదేవునికి ఈ దేశ, కాల, క్రియాదు లన్నీ అప్రయత్నంగా, అనాసక్తి పూర్వకంగా సమర్పించివేయి. అప్రయత్నంగా లభించే సర్వ సంఘటనలను అర్పించి అర్చించు. వాంఛారహితమగు బుద్ధితో ఆత్మారాముడవై వెలుగొందు!

❖❖❖

15. అనంత స్వస్వరూపమునకు అల్పత్వం ఆపాదించటమా?

శ్రీవసిష్ఠ మహర్షి : స్వామీ! సాంబశివా! మీరు పూజాసంరంభముగాని, ప్రతిమా నిర్మాణం గాని అవసరం లేని చిదాత్మశివుని పూజ గురించి చెప్పి నన్ను తరింపజేస్తున్నారు. అట్టి పూజ అత్యంత అనాయాసమని, నేను చేసే యథాక్రమములైన కృతాకృతములను ఆత్మదేవుని పరంగా సమర్పించి ఉండటమేనని గ్రహిస్తున్నాను. ప్రతిమాదులు కూడా అవసరం లేని అట్టి పూజ వలన ఆత్మదేవుడు

సంతసించి నా యొక్కరూపానుభూతిగా సాక్షాత్కరించగలరని ఎరుగుచున్నాను. అయితే, అట్టి పూజకు ప్రయోజనము, ఫలితము ఎట్టివో మరికొంత వివరించమని నా విన్నపం. అంతేకాదు, నాది మరొక చిన్న సందేహం. రాగద్వేషము లనేవి సర్వానర్థములకు కారణం కదా! అట్టి రాగ ద్వేషములతో కూడా ఆత్మదేవుని పూజించవచ్చని మీరు ప్రకటిస్తున్నారేమిటి?

శ్రీశివ భగవానుడు : నేను వర్ణిస్తున్న ఆత్మశివుని సర్వవిధ సమర్పణతో కూడిన పూజకు ప్రతిఫలం పారమార్థికానందమును, మాయాభంగమును స్వతఃసిద్ధమైన రీతిలో నీ స్వస్వరూపుడైన ఆత్మదేవుడు ప్రసాదిస్తారు. సర్వము ఆత్మభగవానుని చమత్కారంగా దర్శించటమే ఆత్మోపాసన! అదియే ప్రపత్తి అనగా! ఇక రాగద్వేషముల విషయమై విను.

నిప్పురవ్వలు నిప్పు నుండి బహిర్గతమైనంత మాత్రంచేత అవి నిప్పుకంటే వేరైనవి కాదు కదా! అట్లాగే రాగ ద్వేషములని పిలువబడుచున్నవి కూడా వాస్తవానికి ఆత్మకంటే వేరైనవి కావు. నిత్యమగు ఆత్మను నవరసాలతో కూడిన జగత్‌రూపముగా గ్రహించుటే ఆయనయొక్క పూజ. సుఖభోగములను, దారిద్ర్యదీనత్వములను సమముగా చూచుటయే ఆత్మార్చన.

ఆత్మయే ఆకాశము మొదలుకొని ఘటము వరకు, జాగ్రత్ మొదలుకొని స్వప్నసుషుప్తుల వరకు సర్వఅవస్థలను అలంకరించియున్నదయ్యా! ఈ జగత్తు ఆ ఆత్మశివుని వలననే, ఆయన యందే ఇందలి సర్వకళలతో సహా ప్రకాశిస్తోంది. "నా స్వరూపము కూడా మౌన, ప్రశాంత, పరమానంద కళాస్వరూపమగు ఆ ఆత్మ శివుడే!" అని గ్రహించు.

ఆత్మయొక్క 'సత్త' లేకుంటే ఒక పరమాణువు కూడా ప్రకాశించజాలదు. అందుచేత "ఇదంతా ఆత్మరూపమై వెలయుచున్నది" – అనే విషయం నీవు ఒక్క క్షణం కూడా మరువకూడదు. అట్టి పరమసత్యము మాత్రమే ఈ జీవుని సర్వ అజ్ఞానములనుండి – అన్నివేదనలనుండి రక్షించగలదు.

శ్రీవసిష్ఠ మహర్షి : అవశ్యం స్వామీ! అయితే, ఎంత ఆశ్చర్యం! ఎంత విచిత్రం! నిష్క్రియుడు, వృత్తిరహితుడు అగు ఆత్మశివుడు ఈ నానా విధపదార్థములుగా జీవుడు–బుద్ధి మొదలైన తత్త్వములుగా విస్తరించుచున్నాడు. ఆయా జీవులతో ఉంటూ స్వస్వరూపమును ఏమరచుచున్నాడే? స్వయం కల్పిత మగు స్వమాయచే అసంపూర్ణత్వమును గాంచుచున్నాడే! సర్వాత్మకము, అనంతము, మంగళ మయము అగు ఆత్మయందు పూజ్య – పూజక – పూజాది విభ్రమములన్నీ ఎక్కడ నుండి వచ్చాయో కదా! అవన్నీ పరిచ్ఛిన్నాకారముననే సంకల్పితములగుచున్నాయి కదా!

శ్రీశివ భగవానుడు : శాంతుడగు ఆత్మేశ్వరునియందు పరిచ్ఛిన్నములగు ఈ వికల్పములు సంభవించ టానికి వీలే లేదు. నిత్యము, నిర్మలము, సర్వశక్తిమయము, అనంతము అగు ఆ ఈశ్వరతత్త్వము ఈ పరిచ్ఛిన్న రూపనామములతో పూజ్య–పూజకాది భారముతో కుదించుకుపోవటమనేది కుదరనే కుదరదు. అత్యంత నిర్మలమగు ఏ చిద్రూపమునుండి ఈ జగత్తులన్నీ క్షణంలో పుట్టి, పెరిగి, లయ మవుతున్నాయో... అట్టి భగవంతుని ఒకానొక ఆకృతిగాగాని, రూపనామములుగా గాని పరిమితం చేయటం అనుచితమే అవుతుంది. ఇక, రూప – నామములను శ్రద్ధకొరకై సంజ్ఞగా స్వీకరించటం ఉచితమే గాని "అది మాత్రమే దైవం" అని భావించటం ... అనంతునకు అల్పత్వం ఆపాదిస్తున్నట్లే

అవుతుంది కదా! తత్త్వజ్ఞులగు మహనీయులంతా ఈ విషయం ఎరిగియే తమ తమ ఇష్టదైవానికి సంబంధించిన సాధనలు కొనసాగిస్తున్నారు.

ఇక పరమేశ్వరుని దేశకాల పరిచ్ఛిన్నునిగా తలచుచూ అట్టి స్వల్పానుభూతి వీడని వారికి నేను ప్రవచిస్తున్నట్టి ఈ చెప్పబడిన ఆత్మదేవపూజా విధానం ఉచితమార్గంలో ఉపయోగించును గాక!

ఓ వసిష్ఠా! నీవు ఇప్పుడే, ఇక్కడే సర్వపరిచ్ఛిన్న దృష్టులనూ పరిత్యజించు. నీతో సహా కనబడే ఈ సర్వమును ఏకాత్మకుడవై స్పష్టీకరించుకో. తత్త్వభావాన్ని ("ఈ కనబడే 'నీవు' అనబడునది సర్వాత్మకుని కిరణపుంజమే" అను భావం) అవలంబించి సముడవై, శాంతుడవై విషయాసక్త శూన్యుడవై, నిరామయుడవై ఉండుము. "ఆత్మతత్త్వమును విశదపరచుట" అను యథాప్రాప్తమైన ధర్మమును అకర్తృత్వబుద్ధితో నిర్వర్తించు. శుభాశుభములన్నీ ఉపాహారంగా సమర్పించి ఆత్మేశ్వరుని అర్చించు.

మహర్షీ ! ఎప్పుడైతే నీవు ఈ దేహమును - దేహిని వేరుపరచి మర్మగర్భమగు సత్యమును దర్శించటం ప్రారంభిస్తావో ...అప్పుడు నీవు సాధుపురుషులగు వారి గుణములను పొందినట్లే. అప్పటి నుండి "తత్త్వమును వేరుగా సంపాదించటం" అనేది ఉండదు. అతిత్వరలో మాయాకళంకం తనంతట తానే సంపూర్ణంగా తొలగగలదు. ఆపై ఈ బాహ్య జగత్తు నీయందు సంలగ్నం కాజాలదు. ఒక స్ఫటికంలో దృశ్యము ప్రతిబింబించినప్పటికీ, అయ్యది దానికి అంటుతుందా?

ఈ జన్మ - జర - మరణ - పునఃజన్మాదులు నీకు అంటవు.కనుక లే లెమ్ము. ఆత్మదేవుని పట్ల బహిర్‌పూజ, అంతర్‌పూజ ప్రారంభించు.

❖❖❖

16. అవిద్య నుండి ... విద్యకు !

శ్రీవసిష్ఠ మహర్షి : హే పరమశివా! పరమోత్కృష్టమగు ఆత్మదేవుని పూజ బోధించినందుకు మేమంతా మీకు ఎంతో కృతజ్ఞులం. మీరు కురిపిస్తున్న కరుణారసవీక్షణ భక్తసులబత్వం వర్ణించి చెప్ప గల భాషాసామర్థ్యం నా వద్ద లేదు. స్వామీ ! సర్వసందేహాలు నివర్తించగల మీ వంటి సద్గురువుల దర్శనం లభించటం ఎన్నో జన్మలలో మేం చేసుకున్న పుణ్యఫలమే అవుతుంది.

సవినయుడనై ఒక ప్రశ్నను మీకు నివేదించుకుంటున్నాను. మహాత్మా! బ్రహ్మము సర్వ ధర్మములకు, సర్వ మనోబుద్ధులకు, సర్వవాక్యములకూ అతీతము కదా! అట్టి సర్వాతీతమైనదానికి 'శివుడు' అని గాని, 'పరమాత్మ' అని గాని శబ్దములతో చెప్పుకోవటమెందుకు? ఆయన ఏ వర్ణమునకూ అలభ్యుడుకదా! ఇక "సత్త, శూన్యం, విజ్ఞానం" మొదలైన పిలుపులకు అర్థమెట్లా అవుతోంది ?

శ్రీశివ భగవానుడు : నాయనా! ఇచ్చట ఆద్యంతరహితము, స్వయం జ్యోతియు అగు 'సద్వస్తువు' ఒక్కటే ఉన్నది. అది నామ రూప రహితమైనప్పటికీ అద్దాని బోధ కొరకు, సాధన కొరకు అనేక నామరూపములు ఉపయోగించబడుచున్నాయి. అంతేకాదు. అది ఈ ఇంద్రియములకు అలభ్యమవటం చేత 'శూన్యము' వలె కూడా తోచుచున్నది.

శ్రీవసిష్ఠ మహర్షి : అది ఇంద్రియములకు, మనస్సు మొదలైన యుక్తులకు కూడా గోచరించనిదై నప్పుడు ఈ ఇంద్రియ మనోబుద్ధులతో చేసే ఏ క్రియలైనా దానిపట్ల నిష్ప్రయోజనమే అవుతాయి కదా? ఇక అద్దానిని ఆయా కార్యక్రమముల సహాయంతో, భౌతికమైన విధులతో చేరగలమను నిశ్చయమేమున్నది?

శ్రీశివ భగవానుడు : మనస్సు యొక్క ఎట్టి వృత్తులూ ఆ ఆత్మవస్తువును ప్రకాశింపజేయలేని మాట నిజమే. అయితే సాత్వికము, బ్రహ్మాకారము అగు బుద్ధివృత్తియొక్క బలంచేత అవిద్యయొక్క ఆవరణం తొలగించబడుతోంది. అవిద్యావరణం తొలగిందా – బ్రహ్మము తనంతట తానే ప్రకాశించుచున్నది. అట్టి స్వయంప్రకాశానుభవమును బోధకులు 'ఆత్మసాక్షాత్కారం' అని పిలుస్తున్నారు. అట్టి తన స్వరూప అనుభవ స్థిరత్వమును అనుభవించటానికి ఈ ఇంద్రియ, ఇంద్రియార్థములతో అవసరమే లేదు. ఎందుకంటే అది ఇంద్రియములకు విషయమే కాదు కదా!

శ్రీవసిష్ఠ మహర్షి : అట్టి స్వీయస్వరూప అనుభవ స్థిరత్వమునకు క్రమక్రమమైన మార్గమేదైనా చెప్పి, మమ్ము తరింపజేయ ప్రార్థన.

శ్రీశివ భగవానుడు :

1. మొదట "ఇంద్రియాతీతం, అనిర్వచనీయం అగు నా స్వరూపం ఎప్పటి నుంచో 'ఇంద్రియ విషయాలు'అనే బురదలో నిష్కారణంగా ఇరుక్కున్నది. అందుకు ఫలితంగా అజ్ఞాన భావవీచికలు, అల్పలక్ష్యాలు నన్ను కప్పి ఉంచుతున్నాయి. ఇప్పుడు నేను నా స్వరూపాన్ని సముద్ధరించు కోవటం ఆవశ్యకం" – అని జీవుడు గ్రహించాలి. పట్టుదలతో కూడిన కార్యక్రమానికి ఉద్యుక్తుడు కావాలి.

2. అట్టి ముక్తి నొందతలచినవాడు శమదమాదులను (Control of Internal & External Senses) పెంపొందించుకోవాలి. క్రమంగా సాత్విక అవిద్యాంశములు బలపరచుకోవాలి.

3. "సత్సంగము – సద్గురువులు – శాస్త్రవచనములు" అను సాత్విక అవిద్యాంశ సహాయంతో బ్రహ్మాకార చిత్తవృత్తులను అనుసరిస్తూ రావాలి.

4. క్రమంగా తానే పూర్ణ బ్రహ్మస్వరూపంగా వెలయు గాక! అది మాత్రమే విద్యాంశ.

శ్రీవసిష్ఠ మహర్షి : సత్సంగము, గురువులు, శాస్త్రము, బ్రహ్మాకారవృత్తి అవలంబించటం – అనేవి కూడా అవిద్యాంశలోనివేనా ఏమిటి?

శ్రీశివ భగవానుడు : అవును. అవన్నీ 'సాత్విక అవిద్యాంశ విభాగాలు' అని అంటున్నారు. చాకలి వాడు చవుడుతో వస్త్రములోని మురికిని వదలించి, ఆ తరువాత ఆచవుడును, వస్త్రములోని మురికిని ఉతకటం ద్వారా వదిలిస్తున్నాడు కదా! మంచినీటితో ఆ వస్త్రాన్ని మొత్తంగా పరిశుభ్రపరచి ఆర వేస్తున్నాడు.

జనులు కాలిలో ముల్లు విరిగినపుడు మరొక ముల్లుతో కాలిలోని ముల్లును తొలగించి... ఆ తరువాత రెండు ముళ్లనూ తొక్కరాని చోట పారవేసి వస్తున్నారు. అట్లాగే సాధకుడు సత్సంగమును, తదనుకూలమైన చిత్తవృత్తులను ఆశ్రయిస్తూ... ఆత్మస్వరూప ప్రాప్తి వరకూ కొనసాగిస్తున్నాడు.

కాబట్టి బ్రహ్మము తప్ప తక్కినవన్నీ అవిద్యాంశములేనని గ్రహించు.

బ్రహ్మము అనగా తత్ ప్రయత్నశీలుడగు ద్రష్టయే కదా! నీ స్వరూపానుభవ పర్యంతమే ప్రయత్నమనే దాని యొక్క అవసరం ఉంటుంది. చిరాభ్యాస ఫలంగా సౌభాగ్యవశంగా పూర్ణబ్రహ్మాకార వృత్తి లభిస్తుంది. అవిద్య నశిస్తుంది. అప్పుడాతడు తనను తాను సర్వత్రా అవలోకించగలుగుతాడు. అట్టి ఐక్యతావలోకనమునే శాస్త్రములు 'ఆత్మప్రాప్తి' అని 'మోక్షము' అని, 'మనోవాక్ అగోచర స్వస్థితి' అని, 'శివైక్యము' అని 'శివసాన్నిధ్యము' అని చెప్పుచున్నాయి.

ఒకడు అపరిశుభ్రమగు అరచేతులను పరిశుభ్రపరచడానికి బొగ్గుపొడిని తెచ్చి రుద్ది, ఆపై శుభ్రమగు నీటిలో ఉభయమురుకులను తొలగించి శుభ్రపరుస్తున్నాడు కదా! శాస్త్ర, సత్సాంగత్యాది సాత్విక అవిద్యాంశతో అంతరంగంలోని రాజసిక, తామసిక అవిద్యాంశను తొలగించి, 'విచారణ' అను ప్రయత్నమనే మనస్సును జతచేర్చి ప్రయత్నం కొనసాగిస్తుంటే... ఆ పై క్రమంగా అన్ని విధాల అవిద్యాంశను తొలగించటం జరుగగలదు. అప్పుడు స్వయం ప్రకాశకమగు ఆత్మ ఒక్కటే నిర్మలమై ప్రకాశిస్తుంది. అట్టి నిర్మలమగు ఆత్మయే నీ యొక్క, నా యొక్క, తదితర సర్వజీవులయొక్క వాస్తవ స్వరూపం. చిత్రమేమిటంటే... ఆత్మయే ఆత్మవలన ఆత్మగురించి ఆత్మవిచారణ మొనర్చుచున్నది. చివరకి తాను ఆత్మగానే శేషించుచున్నది. అంతేగాని ఒకటినుండి మరొకటేదో ఎప్పుడో బయల్వెడలటం లేదు, ప్రవేశించుటలేదు. ఇక ఇందు "బుద్ధి-మనస్సు వాటి వృత్తులు" మొదలైన అవిద్యకు ప్రమేయం ఏమున్నది చెప్పు? కనుక "అవిద్యాక్షయమే ఆత్మరూప సుస్థిరత"అని నిత్యానిత్య వివేకులు స్పష్టాతి స్పష్టముగా ఎరిగియే ఉన్నారు.

సంకల్ప పరంపరలు ఉన్నంతవరకూ ఆత్మ తెలియబడజాలకున్నదని చెప్పవలసివస్తోంది. అయితే గురూపదేశములు, శాస్త్ర పఠనం, శాస్త్ర ప్రతిపాదిత నియమాదుల అనుసరణం... ఇవన్నీ దుస్సంకల్పములతో ఆవరించబడినట్టి ఈ జీవుని సత్ సంకల్పములవైపు మరల్చుచున్నాయి. సత్ సంకల్పములు మోహరాహిత్యమునకు, నిశ్చలత్వానికి... ఆపై క్రమంగా ఆత్మానుభవానికి దారి తీస్తున్నాయి. గురూపదేశాదులు స్వయంగా తామే ఆత్మానుభవం అవటం లేదు. ఎందుకంటావా? 'గురూపదేశాదుల ద్వారా ఆత్మజ్ఞానం పొందుదును గాక'... అని సంకల్పించునది ఇంద్రియ సమష్టి ద్వారానే కదా! కానీ పరబ్రహ్మమో, ఈ ఇంద్రియములన్నిటికి కూడా అతీతమై ఆ ప్రయత్నించు వాడే అయి ఉన్నదని ఏమరవకుండబడుగాక! ఈ ఇంద్రియ విషయములన్నీ తిరస్కరించబడగా అప్పటికీ ప్రకాశించుచున్నది అది. కనుక గురూపదేశాదులు సహకారిక కారణాలు మాత్రమే. ఆత్మ పదప్రాప్తికి అసలైన కారణం ఆత్మ వస్తువే. సర్వకారణ కారణం ఆత్మయే.

యద్వస్తుః యత్క్షయేప్రాప్తం తత్తస్మిన్ సతి నావాప్యతే ॥

ఏ అవిద్య లేకున్నప్పుడు మాత్రమే సత్యవస్తువు లభిస్తుందో ...అట్టి అవిద్య మిగిలి ఉండగా ఆత్మ ఎట్లు అనుభూతమౌతుంది చెప్పు?

❖

కనుక సాధకభక్తజనులకు నేను గుర్తు చేస్తున్నదేమిటంటే ...వారి సాధనల యొక్క అంతిమ సాధ్యము వారి ఆత్మయే అయున్నది. ఆత్మ సర్వదా నిత్యము, స్వయం ప్రకాశకము, అఖండము, అప్రమేయము అయి ఉన్నది.

ఒకావిడ పండుగరోజు పెట్టిలోంచి బంగారపు గొలుసు తీసి ధరించింది. కొద్దిసేపైన తరువాత ఆ విషయం మరచి ఏమరు పాటుగా పెట్టె తెరచి ఆ బంగారు గొలుసు వెతకటం ప్రారంభించింది. కనపడలేదు. ఇల్లంతా వెతుకుతూనే ఉన్నది. దుఃఖిస్తోంది. మరల మరల, మూల మూలలా వెతికి వెతికి నీరసంగా చతికిలపడి రోదిస్తోంది. ఇంతలో కాకతాళీయంగా ఆ పక్కింటావిడ వచ్చి 'ఒదినగారూ! మీ మెడలో గొలుసు చాలా బాగున్నదండీ !' అని పలకరించింది. వెంటనే ఆ ఇల్లాలు, "అయ్యో దాని కోసమేనండీ, ఈ ఏడుపు. అది కనబడటం లేదు!" అని గొల్లున ఏడవసాగింది. అప్పుడా పక్కింటామె, "అదేమిటండీ? మీ మెడలోనే ఉన్నది కదా" ...అనగానే ఆ ఇల్లాలు మెడ తడిమి చూచుకుని 'అరె ! ఈ గొలుసు ఇక్కడే ఉన్నదా!' అని మహదానందపడి ఆ ప్రక్కింటామెకు సంతోషంతో కృతజ్ఞతలు చెప్పుకున్నది. శిష్యుడు సద్గురువుకు కృతజ్ఞతలు చెప్పుకోవటం ఇటువంటిదే సుమా!

ఈ సంఘటనలో "ప్రక్కింటావిడ వచ్చి గొలుసు ఇచ్చింది" అని అనటం సమంజసమా! అట్లాగే గురూపదేశాదులు ఆత్మవస్తువును ప్రసాదించుట లేదు. 'ఆత్మ – ఆత్మజ్ఞానం' కూడా ప్రతి జీవుని యందు స్వతఃగా సర్వదా ఉండియే ఉన్నాయి. అయితే గురూపదేశ, శాస్త్రానుకరణాదులు ఆత్మజ్ఞాన ప్రాప్తికి మహత్తరమైన సహకారం అందిస్తున్నాయనుటలో సందేహం లేదు.

శిష్యుని అజ్ఞాన వినాశనము కొరకే గురూపదేశాలు అవసరమగుచున్నాయి. అజ్ఞాన ఆవరణ నశించిందా – అంతవరకూ అనిర్దేశ్యమూ, అదృశ్యమూ అయున్న ఆత్మ శివుడు ప్రసన్నుడై తన యందు, సర్వమునందూ అనుభవమగుచున్నాడు. శాస్త్రములు, గురుప్రవచనములు ఆత్మను విశదీకరిస్తున్నాయే గాని, ఆత్మను క్రొత్తగా ప్రతిపాదించుట లేదు. ప్రసాదించుట లేదు. ఆత్మానుభవమనేది శిష్యుని (సాధకుని) అంతరంగ అనుభవస్థితియే గాని అది మరొకరు ఎక్కడి నుండో ప్రసాదించగలిగేది కాదు. గురువే స్వయంగా ఆత్మానుభవం ప్రసాదించగలిగితే ఇక, ఒక ఉత్తమ గురువు యొక్క శిష్యులందరూ ఆత్మానుభవం పొందాలి కదా? పొందుచున్నారా? కొందరు మాత్రమే పరమోన్నతమైన అఖండానుభూతి పొందుచున్నారేం? అది శాస్త్రముల గురువుల లోపం కాదు. సాధకుని లక్ష్యశుద్ధికి అద్దానిని ఆపాదించక తప్పదు. బడిలో ఒకే ఉపాధ్యాయునిచే బోధింపబడే విద్యార్థులలో ఉత్తమ – మధ్యమ – అధములు ఉన్నట్లే, శాస్త్రకారులు ప్రవచిస్తున్న స్వయంప్రకాశిక స్వస్వరూపాత్మ కథనం విషయంలో కూడా! వారివారి శ్రద్ధ హృదయ నైర్మల్యములను అనుసరించి ఉత్తమ – మధ్యమ – అధమ అవగాహనలతో కూడిన శిష్యులు లేక సాధకులు ఉంటూ ఉంటారు.

కాబట్టి ఆత్మ స్వయముగా స్వయంబోధ వలననే గ్రహించబడుతోంది.

అది అట్లుండగా కూడా, గురూపదేశ – శాస్త్రార్థ విచారణలు లేకపోతే ఆత్మబోధ సులభంగా లభించటం లేదు. వాటి సంయోగము వలననే ఆత్మబోధ జీవులకు సుసాధ్యమగుచున్నది. అది

దృష్టిలో పెట్టుకొనే సృష్టికర్తయగు బ్రహ్మ భగవానుడు నిన్ను నియమించి ఉన్నారు. లోక కళ్యాణార్థమై నేనీ సమాచారం నీకు అందించటం అందుకే జరుగుతోంది.

మరొక దృష్టాంతం చెపుతాను ...విను. సూర్యుని కాంతిలో వస్తువులు ప్రకాశిస్తున్నాయి. అయితే ఆ కనబడే వాటిని గుర్తించే వాడెవడు? నీవే కదా! పగటివేళ సూర్యకాంతిలో జనులు వస్తువులు గుర్తిస్తున్నట్లే... 'గురు శాస్త్రార్థ నిరంతర సంయోగం" అను వెలుగులో ఆత్మానుభూతి సంతరించుకోవలసింది సాధకుడే సుమా!

❖❖❖

17. గురువులు

ఈ జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, వీటికి సంబంధించిన సుఖ దుఃఖాలు... వీటి నన్నిటినీ దాటి వేయగా, అప్పటి అతీత దృష్టికి ఇంకా శేషించి ఉండేదేమిటో ...అదియే "శివుడు – తత్ – సత్ – ఆత్మ – స్వస్వరూపము" మొదలైన శాస్త్రీయ నామాలతో వ్యవహరించబడుతోంది. ఇక ఈ జాగ్రత్ స్వప్నాదులంటావా? దీనిని మాయగా దర్శిస్తున్నప్పుడు 'ఇది లేనే లేదు' అని తెలియవస్తోంది. ఆత్మగా దర్శించామా ...ఇది 'నిత్యసత్త'గా అనుభవం కాగలదు. ఆత్మ ఆకాశము కంటే నిర్మలం. అంతే కాకుండా "అది అనుభూతిపరునికంటే వేరే ఏదో కాదు"అని గ్రహించు. "అది అనంతము, అనిర్దేశము. అదొక్కటే సత్ ...మిగతాదంతా అసత్" అనునది సునిర్ణయమై ఉన్నది.

❖

శిష్యుల మనో అవగాహన స్థితులను అనుసరించి వారికి మార్గమును చూపటానికి గాను వివిధ తరగతులకు సంబంధించిన గురువులు ఉండటం జరుగుతోంది. వారిని మూడు విధములుగా విభజించవచ్చు–

1. కేవల తాత్త్విక గురువులు : వీరు విశుద్ధమగు ఆత్మైక్యమును ప్రతిపాదించుచున్నారు. 'సాక్షాత్ తత్త్వమ్ అసి" అను వాక్యార్థముచే మహత్తరమగు ఉత్కృష్ట సత్యము వీరిచే బోధింప బడుతోంది. వారు స్వయముగా విచిత్రమగు ఈ జగత్తును విశుద్ధమగు తత్త్వమును ఐక్యమొనర్చి ఆత్మస్వరూపమునను సుస్పష్టపరచుచున్నారు. ఆ అనుభవమును శిష్యులకు అందించ ప్రయత్నిస్తున్నారు.

2. పండిత గురువులు : వీరు సత్యాసత్య విమర్శకు చెందిన వాఙ్మయమును, సంవిధానములను కల్పనచేసి శిష్యులకు జీవన్ముక్తత్వ మార్గంలో సహకరిస్తున్నారు. వీరు అనేక సిద్ధాంతములను ప్రతిపాదిస్తూ శిష్యులను పరమార్థమునకు కడు దగ్గరగా కొనిపోవుచున్నారు. విధి–విధానములను రచించి సాధన మార్గమును అందిస్తున్నారు. "ఈ జగత్తు అసత్యము, బ్రహ్మమే సత్యము" అను అవగాహనను పెంపొందించ ప్రయత్నిస్తున్నారు.

3. ప్రతిపాదన గురువులు : వీరు ఈశ్వరునకు అనేక గుణములను, నామ రూపములను ఆపాదించి, చిత్ర – విచిత్ర కథనములను కల్పించి శిష్యులను ఉపాసకులుగా తీర్చిదిద్దుతున్నారు.

అనేక గుణములను, సంగతులను రచించి ఉపాసకుల దృష్టిని దృశ్యము నుండి మరల్చి ఉత్తమ సాధకులుగా మలుస్తున్నారు. చిన్న పిల్లలకు కథలు కల్పించి చెప్పి వారిని అల్లరి నుండి మరల్చి చదువుకోవటానికి సిద్ధం చేస్తాం చూచావా? వీరు కూడా నామరూపాతీతమగు ఆత్మతత్త్వమునకు నామరూపములు కల్పనచేసి అందిస్తున్నారు. "అవిద్యాంశ" సహాయంతో అవిద్యను తొలగించు యత్నము చేయుచున్నారు.

ఈ ముగ్గురు బోధకులు మహనీయులే. ఎందుకంటే అవిద్యా సముద్రంలో కొట్టుకుపోతున్న జీవులను వీరు ఆదుకుని జ్ఞాన - విచారణ - సన్మార్గము వైపుగా నడిపిస్తున్నారు కదా!.

అయితే సర్వ విద్యల యొక్క అంతిమ ప్రయోజనం ఆత్మతత్త్వమే. ఈ జీవుడు తన్ను తాను ఎరిగినప్పుడు బోధకుల రచనలన్నీ ప్రయోజనం పొందినవై ఇక ఉపశమిస్తాయి. ఆత్మతత్త్వమే అత్యాంతికమైన సారం.

ఇది గ్రహించి జనులు చింతారహితులయ్యెదరు గాక! ఈ లోకంలో తత్త్వవేత్తలు అనేకులు ఉన్నారు. ఎచ్చటైతే మా వంటి దేవతలు కూడా భృత్యులై ఉంటారో ...అట్టి పరమపదమును కూలంకషంగా ఎరిగి అఖండ - అప్రమేయ - నిత్య - సర్వాతీత - సర్వసమన్విత స్వభావమునందు ఆ తత్త్వవేత్తలు ప్రతిష్ఠితులై ఉన్నారు.

❖❖❖

18. జగత్తుకు మూలం భావనయే!

శ్రీవసిష్ఠ మహర్షి : హే భక్తవశంకరా! ఈ జగత్తు అనబడేది ఆత్మయందు వాస్తవానికి లేదు. అయినాకూడా ఉన్నట్లుగా భ్రమింపజేస్తోంది. ఇది ఎట్లా జరుగుతోంది?

శ్రీశివ భగవానుడు : బిడ్డా ! "బ్రహ్మము - శివము - దైవము - భగవాన్ - తత్త్వము - విష్ణు"... మొదలైన అనేక శబ్దములచే చెప్పబడుచున్న అర్థమగు వస్తువు ఒక్కటే.

అది చిత్తు (ఎఱుక) అయి ఉన్నది. ఇందులో సంశయం పెట్టుకోవలసిన ఆగత్యం ఏమాత్రమూ లేదు. అట్టి శుద్ధచిత్ గురించి ఏమని చెప్పాలి? ఎట్లా చెప్పాలి? ఆకాశం అనేది పంచభూతాలలోఒకటి కదా! అది ఊహకే అందదు. అంతటి సూక్ష్మభూతమగు ఆకాశం కూడా ఆ ఏకైక చిద్వస్తువు ముందు కొండంత ఘనీభూతమని గ్రహించు. అది నాయందు, నీయందు తదితర సర్వజీవులయందు సర్వదా సమరసభావమున నెలకొని ఉన్నది. "తెలుసుకొనుచున్నవాడు" అను రూపమున వెలయుచున్న ఆ చిత్తు ఒకానొకప్పుడు "తెలియబడుచున్నది ...(చేత్యము)"గా స్వయంగా అగుచున్నది. ఒకడు తన స్వప్నంలో ఎక్కడో ఉన్న గ్రామం ప్రవేశించి అక్కడి జనులతో ఒకడిగా నివసించుచున్నట్లు... చైతన్యము "తెలుసుకొనుచున్నాను" అను భావనద్వారా అహంభావమును అనుసరించుచున్నది. అట్టి 'అహం' కల్పన నుండి క్రమంగా దేశకాల కల్పనలు ఉదయిస్తున్నాయి. శూన్యరూపముగ అట్టి తత్సంబంధిత శతాధిక కల్పనలన్నీ అహంభావమునకు మిత్రులగుచున్నాయి. అహంభావము

స్పంద విజ్ఞానమును సంపాదించుకుని క్రమంగా ప్రాణస్పందనమును పొంది 'జీవశక్తి' అను పేరును పొందుచున్నది. ఆ జీవశక్తి "నేను" అను నిశ్చయం చేసుకొని అజ్ఞాన మార్గమున నిలబడు చున్నది. ఆ జీవశక్తిలో శబ్దశక్తులు, జ్ఞానశక్తులు, క్రియాశక్తులు ఏర్పడి తమతమ రూపములను విస్తరింపజేసుకుని ఈ జగత్తు అనబడు దానిని కల్పించుకుంటున్నాయి. ఈ శక్తులన్నీ సంకల్పము, స్మృతి అను రెండింటితో కూడి "అపంచీకృతమగు మనస్సు" అను సంజ్ఞను పొందుచున్నాయి. పండితులు ఈ మనస్సును ఆత్మరాజుయొక్క బాహ్య కవచముగా చెబుతూ ఉంటారు.

ఈ మనస్సు అంతస్థమగు బ్రహ్మశక్తితో కూడుకుని "జ్ఞాత" అని పిలువబడుతోంది. 'జ్ఞాతృత్వము' అనబడేది ఆత్మయొక్క స్వయంప్రకాశ శక్తివలననే కలుగుతోంది. అట్టి సందర్భంలో చైతన్యము కొన్ని శక్తులు ప్రకటిస్తోంది. ఆ శక్తులు అంతస్థమగు కల్పనావ్యవస్థ నుండి బహిర్గతమై బాహ్యమున ప్రకటనమగుచున్నాయి. కనుక 'జగత్తు' అనునది చిత్ స్వరూపజీవుని స్వయంకల్పిత భావాభావ స్వరూపమే అయున్నది.

దృశ్య ప్రపంచం

1. వాయుసత్త	...	స్పందసత్త
2. స్పర్శసత్త	...	త్వక్‌సత్త
3. తేజసత్తా	...	రూపసత్త
4. జలసత్త	...	స్వాదుసత్త
5. రససత్త	...	గంధసత్త
6. భూమిసత్త	...	ఖనిజసత్త
7. జగత్‌సత్త	...	దేశసత్త
8. కాలసత్త	...	పరిణామసత్త

బీజము పుష్ప ఫల శాఖాది అనేక తత్త్వములు తనయందు నిశ్శబ్దంగా దాచుకుని ఉంటుంది చూచావా? మనస్సు కూడా ఆకారవర్జితములగు ఈ సత్తలన్నీ తనకు అభిన్నమైన రూపంలో తన యందు నిక్షిప్తం చేసుకొని దేశ కాలానుగతంగా బాహ్యమున అనుభవరూపంలో పొందుతోంది.

అపరిచ్ఛిన్న బోధ స్వరూపమగు బ్రహ్మమే పై 8 విధముల స్ఫురిస్తూ "పుర్యష్టకం" అని అనిపించుకుంటోంది. అంతమాత్రం చేత ఆ బ్రహ్మం తన యొక్క స్వస్థితిని కోల్పోతోందని మాత్రం భ్రమించవద్దు. ఎందుచేతనంటావా? అజ్ఞానదృష్టికి పరిణామం, పర్యవసానాలు తోచుచుండవచ్చు గాక! తత్త్వదృష్టికి మాత్రం అవన్నీ అసంపన్నములగు విషయములే.

శ్రీవసిష్ఠ మహర్షి : ఈ జగత్తు అనబడేది అసలు ఏదై ఉన్నది?

శ్రీశివ భగవానుడు : ఇది జ్ఞానరూపము కాదు. జ్ఞేయరూపము కూడా కాదు. ఇది చిదా భాసము నందలి చేతనం అని కూడా అనలేం. శాస్త్రములు ఈ జగత్తుకు 'మాయ' అనే బిరుదును ప్రసాదించాయి ...ఇది స్వతహాగా లేదు. అయితే భావనను ఆశ్రయించి అనుభూతం అవుతోంది. సముద్రమునకు

ఆధారం జలమే కదా! ఆ జలం కెరటములు, మంచు మొదలైన మరెన్నో విలాసములతో తోచుచున్నది. అట్లాగే పరబ్రహ్మమునందు పుర్యష్టకం సత్స్వరూపమున గోచరిస్తోంది. కారణం? భావనాపర్యవసానమే!

ఈ దృశ్యప్రపంచము ఆత్మ చైతన్యదృష్టితో పరికించి చూచినవారికి ఇందు కనబడే సర్వమూ సంవిదాత్మ (సత్ (ఉనికి) + చిత్ (ఎఱుక) + ఆత్మస్వరూపంగా) స్వరూపముగా కన్పట్టగలదు. ఈ సర్వము సంకల్పనగరం వలె, పరిజ్ఞాతమగుచుండవచ్చుగాక! సత్యము గ్రహించువారికి ఇదంతా శివభావము పొందుతోంది.

గ్రహింపబడినప్పుడే ఇదంతా ఉన్నది. అజ్ఞాతమై తెలియబడనప్పుడు ఇది వస్తువే కాదుకదా! కాబట్టి 'దృశ్యం స్వతహాగా లేదు. కాని సంకల్పించబడుచున్న కారణంగా ఉన్నట్లు తోచుచున్నది' అని సమీక్షించవలసి వస్తోంది. జ్ఞాన దృష్టిచే ఈ జీవుడు "ఈ జగత్తు నా యొక్క చిదానందరూప చమత్కారమే" అని గ్రహిస్తున్నాడు.

శ్రీవసిష్ఠ మహర్షి : చిన్మాత్ర స్వభావమగు ఆత్మ వస్తువు తనంతటతాను తన యందు దృశ్యభావమును పొందుచున్నది' అని ఈ జగత్తును నిర్వచించవచ్చునా?

శ్రీశివ భగవానుడు : ఆత్మ యొక్క ఒకానొక విభాగమునందు భావనారూపమైన శబ్ద – స్పర్శాది అనుభవ స్వరూపమైన తన్మాత్రసత్త ఏర్పడి ఉంటోంది. అదియే ఆత్మ యొక్క సూక్ష్మ శరీరము. ఆ సూక్ష్మశరీరముచే ఈ స్థూలమైనదంతా ఆత్మ చేతనే దర్శించబడుచున్నదని శాస్త్ర ప్రవచనం. ఈ సిద్ధాంతం ప్రకారం ఈ జగత్తంతా ఆత్మ యొక్క సంకల్ప–వికల్పముల స్వరూపం మాత్రమే. కనుక మిథ్యయే కదా!

బ్రహ్మము తన యందు సూక్ష్మ – స్థూలభావములను కల్పించుకొని దేనినైతే పొందుతోందో ...అదియే ఈ స్థూలజగత్తుకు మూలకారణం. ఆత్మయందు 'నేను స్థూలమునకు సంబంధించిన వాడను' అను అభిప్రాయం రూపుదిద్దుకున్నప్పుడు మాత్రమే జగత్తు యొక్క అనుభూతి, అనుభవములు రూపం పొందటం జరుగుతోంది. అప్పుడు కళ్ళు మొదలైన ఇంద్రియార్థములు ఆయా కల్పిత విషయాలు గాంచుచున్నాయి. ఆ తరువాత క్రమంగా 'నేను పురుషుడను' అని సంకల్పించుకుని కాకతాళీయంగా జీవరూపం ధరించి 'అమ్మయ్య' అనుకుంటోంది. క్రమంగా కలకంటున్న మనిషి వలె స్థూలదేహము నుండి ఈ దృశ్య స్థూల విషయములలో ప్రవేశించి తన సుఖ దుఃఖములన్నీ తనకు తానే నిర్వచించుకుంటోంది. ఆ సుఖ దుఃఖ, సామాన్య ప్రత్యేక విషయ సమూహమునకే 'జగత్తు' అని పేరు.

శ్రీవసిష్ఠ మహర్షి : స్వామీ! సాంబసదాశివా! మీరు చెప్పినట్లు దృశ్యజగత్తు స్వప్నసదృశమే అయి ఉండవచ్చు గాక! మొత్తం మీద ఇది జీవునకు దుఃఖ భాజకమౌతోందని అనటంలో సందేహం లేదు. దుఃఖ క్షయం అవటానికి ఉపాయాలు అత్యవసరమైయున్నాయి.

శ్రీశివ భగవానుడు : అందుచేతనే కదా, మన ఈ సంవాదం ! లోకగురువై నీవు తత్త్వశాస్త్ర ప్రబోధ నిర్వర్తించవలసి ఉన్నదయ్యా!

అనేకసార్లు 'కావలెను, పొందవలెను, చేరవలెను' ...అను రూపములో ఉండే అధ్యాసలచే జీవుడు వర్తమాన స్వస్థితి నుండి చ్యుతుడౌతున్నాడు. సంకల్పపరంపరలకు ఉద్యమిస్తున్న తరుణంలో వాసనలు రూపుదిద్దుకుంటున్నాయి. అట్టి అంతరంగవాసనలే సర్వదుఃఖములకూ మూలం.

ఈ జగత్తు ఒకని దృష్టిలో ఉన్నదా? ...అయితే ఆతని వాసనలే ఆ జగదనుభవానికి మూల కారణం. 'ఎండమావులు' అని ఎరుగబడిన తరువాత ఆ ఎండమావులలోని జలం ఇక భ్రమింప జేయదు కదా! అట్లాగే, ఈ జగత్తు స్వకల్పనా మాత్రంగా, స్వవాసనానుసారంగా ప్రతిఫలించే అనుభూతి, అనుభవ చమత్కారంగా సుస్పష్టమైతే... ఇకప్పుడు అట్టి ఈ జగత్తు ఎవ్వరిని దుఃఖింప జేయగలదు చెప్పు?

స్వప్నంలో చూచిన పదార్థములు నిదురలేవగానే కనబడటం లేదని ఒక బాలుడు మారాం చేస్తూ ఉంటే ఆ బాలుడికి ఏం చెబుతాం? 'నాయనా అవన్నీ కల్పితమాత్రములు, ఊహా జనితములు. అవి వాస్తవం కాదు' అనునదే వాస్తవమైన సమాధానం కదా! ఈ జగద్విషయములు ఆత్మ యందు అట్టివే! ఈ పదార్థానుభవములలో స్వప్నత్వమే ఉన్నది కాని, సత్యము లేదను ఎరుకయే వీటిని జయించటం సుమా!

'చూచువాడు, మనస్సు, మనన ధర్మము, అహంభావం చేత అనుభవమగుచున్న ఈ జగత్తు' ... ఇవన్నీ లయిస్తే, అప్పుడు, సన్మాత్రయుతమగు పరబ్రహ్మమొక్కటే పరిదృష్టమై అనుభూతమౌతుంది.

యత్ర నో వాసనా నైవ వాసకో నైవ వాస్యతా ।
కేవలం కేవలీభావః సంశాన్తకలనభ్రమః ॥ (శ్లో 55, సర్గ 41)

ఎద్దానిలో అయితే 'వాసనలు, కోరబడునవి, కోరువాడు' అనునవన్నీ మూగబోయి అర్థ రహితత్వమును సంతరించుకుని ఉంటున్నాయో ...అయ్యదియే కేవలీభావం. అట్టి కేవలీభావమును ఆశ్రయించి ఉండటం కైవల్యం. అట్టి కైవల్యమొక్కటే సర్వదుఃఖములు శమించగల చోటు.

కుమారా! ఈ జగత్తు సత్యమవనీ! అసత్యమవనీ! కల్పనను తొలగిస్తే మరుక్షణం ఇక్కడ ఏమీ మిగలదు. జగత్తు తొలగితే ఇక దుఃఖమునకు కారణమేముంటుంది? ఊహామాత్రమగు బేతాళకల్పన వలె ఈ జగత్తు భ్రమింపజేస్తోందేకాని, ఇది ఆత్మవస్తువును ఆక్రమించగలిగినది కాదు, అతిక్రమించ జాలదు. స్వకీయ కల్పనచే ఏర్పడిన భ్రమ తొలగిందా ...ఇక ఈ జీవునకు అక్షయమైన శాంతి లభించ గలదు. ఏ జీవుడైతే ఈ జగత్తుపై, అహంకారంపై 'ఇవి సత్యమైనవే' అను నమ్మిక కలిగి ఉన్నాడో ...ఆతనికి బోధించటమెట్లాగో నాకు తెలియదు.

అందుచేత తత్త్వవేత్తలు వివేకవంతునికి మాత్రమే ఉపదేశం చేయగలుగుతారు. బహువిధములైన భ్రమలందు చిక్కి, మిథ్యయగు దేహములందు అభిమానము కలవారై మూర్ఖత్వము వహించేవారికి ఇక గురూపదేశం ఎట్లా చేయటం? అట్టి వానికి బోధించటం ఒకడు స్వప్నంలో కనిపించిన కుమార్తెకు జాగ్రత్‌లో సంబంధం వెతకటం వంటిది. అట్టి వారి పట్ల తత్త్వబోధ నిష్ప్రయోజనమై, వ్యర్థమై వాదప్రతివాదనలతో ముగుస్తోంది.

❖❖❖

19. దృష్టియే సృష్టి

శ్రీవసిష్ఠ మహర్షి : హే భగవాన్ ! ఇంతకుముందు 'ఈ జీవుడు నిష్కారణంగా దేహభ్రమను (ఈ దేహమే నేను. దేహపరిమితుడను – అను రూపంగా ఏర్పడే భ్రాంతిని) గాంచుచున్నాడు'... అని చెప్పారు కదా! సృష్ట్యాదిలో చిదాకాశస్వరూపుడగు ఈ జీవుడు ఈ దేహస్థితిని ఎట్లు కొనితెచ్చు కుంటున్నాడు? దాని మర్మమేమిటి?

శ్రీశివ భగవానుడు : ఒకడు స్వప్నం కల్పించుకుని అందులో ప్రవేశించి, ఆ స్వప్నంలో వస్తువులను, దేహములను, సంఘటనలను గాంచుచున్నాడేc! అదేవిధంగా, ఈ జీవుడు 'తానే' అయున్న పరబ్రహ్మం నుండి తనకుతానే భావనాజగత్తును కల్పించుకొని, ఆ కల్పిత భావనాప్రదేశంలో ప్రవేశించి, ఆ తరువాత ఈ అనేక జగత్తులను గాంచుచున్నాడు. చిన్మయబ్రహ్మం సర్వవ్యాపి కదా! స్వప్నంలో దూర ప్రాంతం వెళ్ళి అనేక పనులు చేసివస్తున్నట్లు ఈ జీవుడు దేహధారి అయి అనుక్షణం ఆకాశాదులకు సంబంధించిన అనేక భావపరంపరలను ఆస్వాదిస్తున్నాడు. ఆతడు ఆ మార్గంలో పయనిస్తూ... తన స్వరూపమేమిటో తానే ఏమరుచుచున్నాడు. నామరూపరహితుడై ఉండి కూడా ఇక్కడి నామ రూపములను తనపై ఆపాదించుకొనుచున్నాడు. 'నేను అవ్యక్తము... అనిర్దేశము అగు సనాతనుడను కదా' ...అనే అనుభవం ఏమరచి 'నేను నిన్న–మొన్న ఈ దేహంలో పుట్టాను. దీనితోనే ఏదో అగుచున్నాను. ఎటకో పోతున్నాను' అని సంకుచితభావనను స్వీకరించి ఉంటున్నాడు. ప్రప్రథమమున సమష్ఠికల్పనా స్వరూపుడై, హిరణ్యగర్భుడై ఇక తదితరమైన వ్యవహారమంతటికీ కారణభూతుడగు చున్నాడు. అనగా, "నాలోని ఒకానొక సంకల్పిత స్వస్వరూపమే సృష్టికర్తయగు హిరణ్యగర్భుడు కూడా" – అని గ్రహించు. ఈ సంకల్పమయములైన పదార్థములు, విశేషములు అన్నీ 'బూచి' అను శబ్దంలాగా శూన్యమాత్రములే అయినప్పటికీ అజ్ఞానదృష్టికి సత్యమువలె గోచరిస్తున్నాయి.

ఇట్లు ప్రప్రథమున ఏర్పడిన జలంలోని ప్రథమతరంగం వంటి 'అహం' భావన నుండి తదితర జగత్తు ఏర్పడుతోంది. అదియే సృష్ట్యాది.

ప్రథమ సంకల్పమే ప్రథమ పురుషుడు. ఆతడు తన సృష్టికి తానే ద్రష్టయగుచున్నాడు. క్రీనీడ వంటి తన ద్వితీయ స్వరూపము యొక్క పరిచయంచే చిదాకాశమాత్రమగు స్వస్వరూపము యొక్క విస్మృతిచే అనంత సంసారముగా ఏర్పడుచున్నాడు.

నిమేష ఏవ కల్పో యో మహాకల్పపరమ్పరామ్ ।
ప్రతిభాసవిపర్యాసమాత్రేణానుభవత్యలమ్ ॥ (శ్లో 10, సర్గ 42)

కల్పనాపటుత్వ సమర్థుడగు ఆతడు ప్రతిభాస యొక్క విపర్యయమును అనుసరించి నిమేష కాలంలో మహాకల్ప పరంపరలను అనుభవించుచున్నాడు.

అంతేకాదు ... ప్రతి పరమాణువు నందు, ప్రతి ఆకాశ విభాగమునందు ప్రతిక్షణంలోనూ సృష్టి, మహాసృష్టి, కల్ప, మహాకల్ప, భావ – అభావాలు నిరంతరం ఉదయిస్తూనే ఉన్నాయి. వాసనా

సామాన్యము అనుసరించి ఈ అనేక సృష్టులు కొందరు జీవులకు సమాన రూపములుగా కనబడు చున్నాయి. అట్టి ఈ సృష్టులందు స్వసంస్కార కారణంగా ఎవరెవరైతే అంతర్గతులగుచున్నారో... వారి వారికి ఆ సంస్కారములను అనుసరించి ఇవన్నీ వివిధ రూపములుగా కన్పట్టుచున్నాయి.

ఇక సదాత్మక దృష్టి కలవారికి ఈ సృష్టులన్నీ శూన్యమాత్రంగా తెలియవస్తున్నాయి.

పరమవ్యోమమగు శివము నందు ఇవన్నీ వాస్తవానికి లేనే లేవు. అద్దాని యందు ఇవి స్వస్వరూపాకాశత్వమే పొందుచున్నాయి. కలలో ఒక పెద్ద కొండను చూచి ఎక్కనారంభించావనుకో ...అనేక శ్రమలకు, భయములకు లోనగుచున్నావనుకో ...నిదుర లేవగానే ఆ కొండ, ఆ శ్రమ, ఆ భయం ఏమౌతున్నాయి? మటుమాయమై రహితం (శూన్యం) అవుతున్నాయి కదా! అట్లాగే అజ్ఞానం తొలగిన మరుక్షణం ఈ అసత్ - సత్ రూపములగు సృష్టులన్నీ మటుమాయమై పోతున్నాయి. 'ప్రథమ సృష్టికర్త నుండి పురుగువరకు సృష్టులన్నీ ఎట్టి దేశకాలములను ఆక్రమించుకొని ఉండనే లేదు' ...అనే విషయం అప్పుడే తేటతెల్లమౌతోంది.

ఈ సృష్టి పరంపరలన్నీ స్వతఃగా ఆత్మ స్వరూపములే కదా! కనుక వాటికి 'కల్పించబడిన సత్త' అనునది ఏదీ లేదు. 'క్షణికసత్త' కూడా లేదు. అవన్నీ జనించుట లేదు. నశించుట లేదు.

శ్రీవసిష్ఠ మహర్షి : మరిదంతా?

శ్రీశివ భగవానుడు : (చిరునవ్వు చిందిస్తూ) చైతన్యమే తనయందు తాను సంకల్పరూపమున ఈ విస్తార ప్రపంచవైచిత్ర్యమును విస్తరింపజేసుకుంటోందని చెప్పాను కదా! స్వప్నంలో కనిపించే ఒక నగరంలాగా ఇవన్నీ పుట్టుచూ గిట్టుచున్నాయి. స్వప్నంలో ఎదురుగా కనిపించే పెద్ద కొండ కదల్చటం అసాధ్యమైనట్లు ఘనీభూతమై అగుపించవచ్చు గాక! కానీ, అది స్వప్న స్వభావమును అధిగమించి ఉండజాలదు కదా! అట్లాగే ఈ జగత్తు కూడా దేశకాలముచే పరిపుష్టమై అగుపించవచ్చు గాక! ఈ జగత్తు ద్రష్ట యొక్క సంస్కారములను అనుసరించి సంస్కార పరిమిత మాత్రమై ఉంటోంది. ఒక్కొక్కరికి ఒక్కొక్క రీతిగా అనుభూతమౌతోంది. ఒకనికి సుందరముగా తోచువ్యక్తిగాని, వస్తువుగాని మరొకరికి తద్వ్యతిరిక్తంగా ఉంటోంది. ఒకనికి సామాన్యమైనట్లు తోచే ఒక వస్తువో, సంఘటనయో మరొకరికి మహత్తరమైన దానివలె అనుభూతమౌతోంది. ఇక ఇందులో ఏది సత్యం? ఏది కాదు? వస్తువులు, వ్యక్తులు లాగానే దేశకాలములు కూడా భావనామాత్రములై, భావనను ఆశ్రయించి, అనుసరించి ఉంటున్నాయి. జీవభావం ఉత్పన్నమైన క్షణం నుండి ఈ కార్యక్రమములన్నీ జన్మ-జీవన్-మృత్యువులతో సహా ఇట్లే జరుగుచున్నాయి. కీటకం మొదలైన క్షుద్రజీవుల నుండి సర్వసృష్టికర్త యగు బ్రహ్మదేవుని వరకు సర్వజన్మ-కర్మలూ సంకల్పములను అనుసరించే, సంకల్పం చేతనే ఏర్పడు చున్నాయి. ఈ జగత్తు యొక్క అంతర్గతమైన కారణం సంకల్పమే. ఈ సృష్టిలో కొన్ని విషయములు పరమాణు ప్రమాణములు. మరికొన్ని విషయములు మహాప్రమాణములుగా ఉన్నాయి కదా! ఆ భేదం కూడా సంకల్పము చేతనే ఏర్పరుచబడుచున్నది. గతించిన, గతిస్తున్న, గతించబోవుచున్న సృష్టులన్నీ సంకల్ప మాత్రాలేనయ్యా!

❖

ఏది ఏమైనా పరమార్థసాక్షాత్కారము వలన ఈ సంసార వైచిత్ర్యములన్నీ తప్పక నశించగలవు. ఇందేమీ సందేహం లేదు. దృష్టియే సృష్టి. దృష్టి పరమాత్మమయం అయితే ...సృష్టి పరమాత్మమయమే అవుతుంది. దృష్టి పదార్థమయమైతే సృష్టి కూడా పదార్థమయంగానే తోచుచున్నది. ఇంతకు మించి ఇక్కడ మరే విశేషం లేదు.

శ్రీవసిష్ఠ మహర్షి : మహాదేవా! జీవుడు తిరిగి శాంతమయమగు బ్రహ్మమునందు ప్రతిష్ఠ పొందటానికి దగ్గర త్రోవ ఏది?

శ్రీశివ భగవానుడు : భేదదృష్టులు ఉపశమించటమే ఉపాయం. అభ్యాసమే అందుకు మార్గం. ఇందులో నిరుత్సాహపడవలసిన అవసరం ఎవరికీ లేదు. శాస్త్రాలు అందుకు అనేక మార్గాలు ప్రబోధిస్తున్నాయి. శ్రద్ధగా లక్ష్యశుద్ధితో సర్వసమత్వం అభ్యసిస్తూ వస్తే అది తప్పక ప్రతి జీవునకు సులభ సాధ్యమౌతుంది. కనుక జనులు దిగులు, బద్ధకము, అశ్రద్ధ, ఆలస్యములను దూరంగా ఉంచి సాధనకు ఉపక్రమించెదరు గాక! బ్రహ్మభావనను అనుక్షణికం చేయాలి. నిమిషంలో నూఱవ భాగం బ్రహ్మవ్యతిరక్తమగు దృష్టి వైపుగా చ్యుతిపొందటం జరిగిందా ...ఇక మరుక్షణం సంసారము ఉదయించగలదు. 'చిద్ఘన రూపమున ప్రతిష్ఠితమగుటయే బ్రహ్మజ్ఞానము' – అని జ్ఞానులు ఎరిగియే ఉన్నారు.

ఓ మునీశ్వరా! 'ఎరుగుట' అను క్రియకు కర్తయగు నీవే వేదములచే 'బ్రహ్మము' అని చెప్పబడుచున్నావు. భావాతీతము, త్రిగుణాతీతము అగు ప్రతిఒక్కరి స్వస్వరూపమే 'బ్రహ్మము' అని, 'పరమాత్మ' అని – శాస్త్రకారులచే, వేదద్రష్టలచే వ్యవహరించబడుతోంది.

నీ దృష్టి యందు దృశ్యస్వభావమగు ఈ సృష్టి సత్యమువలె ఏర్పడి ఉన్నంత వరకు నీవు చిద్వస్తువుగా వికసించజాలకున్నావు. నీవు ఎప్పుడైనా సరే ...దృశ్యమునకు సాక్షిమాత్రుడవే గాని, దృశ్యములోని ఒకానొకటివి కావు. స్వప్నద్రష్ట స్వప్నవస్తువులకంటే సర్వదా విశిష్టమైనవాడే కదా! అంతేగాని, స్వప్నాంతర్గత పరిమితుడు కాదుకదా!

అసత్యాలగు దిక్–దేశ–కాల పరిచ్ఛేదాల వల్ల ఆత్మ తన పట్ల తానే నిష్కారణంగా క్షుద్రత్వాన్ని ఆపాదించుకుంటోంది. శబ్దస్పర్శాది తన్మాత్రలతో తాదాత్మ్యం చేత జీవభావాన్ని పొందుతోంది. ఇక దేవ, దానవ, మానవ, జంతు, కీటక, లత – ఆదిగా అనేక బాహ్యరూపాలను దాల్చుతోంది. ఒక చమత్కార మేమంటే ...నిజానికి ఇదంతా సర్వదా అనంతం, నిత్యం అగు బ్రహ్మానికి పుష్పమాల వలె ఉన్నది.

సత్–అసత్‌లుగా గ్రహించబడుచున్న ఈ విశ్వమంతా విశ్వకర్మయందు ఒదిగి ఉంది. ఇక ఆ విశ్వకర్మ ఎక్కడున్నాడు? ఆయన దూరంగా లేడు. దగ్గిర కాదు. ఊర్ధ్వ–అధో భాగాలలో ఎక్కడో లేడు. ఆయన నా వాడు – నీ వాడు కాదు. ఆయన పూర్వం వాడు కాదు. భవిష్యత్ కాలం వాడు కాదు. ప్రాతఃకాలముననో, మరెప్పుడో లేడు. ఆతడు సత్–అసత్తులు కాదు. ఆ రెండింటి అంతరాళమున లేడు.

అయినా కూడా ...ఈ మిథ్యా పరంపరములన్నిటికీ ప్రమాత (One who is the subject)ఆ బ్రహ్మచైతన్యమే గాని మరింకొకరెవరో కాదు. ఎవరి ఆధిపత్యంలో బహిర్ వ్యవహారాలన్నీ ఫలరూప మగుచున్నాయో ...ఆయన పట్ల సర్వ ప్రమాణములు, సోదాహరణములు, వాక్యపరంపరలు

పూర్తిగా సుస్పష్టీకరించటానికి ప్రయత్నించి కూడా అందుకు అసమర్థములే అగుచున్నాయి. ఆయన ప్రమాణ-ప్రమేయములకు అతీతుడు.

❖

నాయనా! వసిష్ఠా! నీవు అడిగినదానికి సమాధానం చెప్పాను. నీకివే నా ఆశీస్సులు. పార్వతీ! ఇక మనం అభిమత స్థానమునకు పోయెదము గాక!

❖

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! వింటున్నావు కదా! సర్వశుభంకరుడగు ఆ నీలకంఠుడు అట్లా తన ప్రసంగాన్ని ముగించి జలతరంగంలాగా పార్వతీ జగన్మాతాసమేతుడై అంతర్ధానమైనారు. నేను ఆ ఆది మాతాపితలు పాదపద్మములు నేలతాకిన చోట పుష్పాంజలి సమర్పించాను.

త్రిలోకాధిపతియగు ఉమావల్లభుడు అంతర్ధానమైన తరువాత నేనప్పుడు అక్కడే ప్రశాంతంగా ఆసీనుడనై ఆయన చేసిన ఉపదేశములను చింతించసాగాను. క్రమంగా విశుద్ధినొందాను. ఇక అప్పటి నుండి పవిత్ర బుద్ధియందు ఆత్మదేవుని 'బాహ్య - అంతర్‌పూజ' నిర్వర్తించసాగాను.

దాని వలన పరమ శాంతిని పొందినవాడనయ్యాను. ఇక జడోపాసనతో నాకు అగత్యం లేకపోయింది. అయితే ఏం? సర్వాంతర్యామి, సర్వతత్త్వ స్వరూపుడు, సర్వతత్త్వ విదూరుడు అగు ఆ పరమాత్మను నామ, రూపసహితంగా కూడా నామనో తృప్తికొరకు పూజిస్తూ, ఆరాధిస్తున్నాను. ఆయన నామరూప పరిమితుడు కాదని గ్రహించియే ఉంటున్నాను.

❖❖❖

20. అనుక్షణిక పూజాభావం

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఆ విధంగా సర్వేశ్వరుడు, సర్వజ్ఞుడు, దయాకరుడు అగు సాంబశివుడు జగత్ రహస్యమును, బాహ్యపూజ, అంతర్‌పూజలు గురించి నాకు విశదపరచారు. నేను వారు చెప్పినదానిని అంతరంగంలో మననం చేసుకుని తదనుసారం ఈ జగత్తును దర్శించటం అభ్యసిస్తూ ఉన్నాను. నీవు కూడా అట్లే ఈ జగత్తు యొక్క వాస్తవ-అవాస్తవములేమిటో సాంబశివుల ప్రవచనానుసారం గ్రహించి ఆపై యథావిధిగా కార్యాకార్యములను నిర్వర్తించు. భ్రాంతి చేతనూ, స్వయంకల్పితమైన అభిలాషోద్వేగంచేతనూ ఆత్మయందు ప్రతిబింబిస్తున్న ఈ జగత్తునందు సత్యమేమున్నది? ఒక జమీందారుని "అయ్యా! తమది ఏమి అందం! ఏమి గుణం! ఏమి బలం! ...కల్పవృక్షము వంటివారు" ...అని స్తోత్రం చేస్తుంటే ఇక ఆయన తనను అట్లే భావించి ఆ యాచకునకు అవీ ఇవీ దానం చేయునట్లు ఆత్మస్వరూపుడగు ఈ ద్రష్ట కూడా కల్పితములైన వానిని నిజమేనను రీతిగా ప్రవర్తిస్తున్నాడు. తత్ఫలితమే ఈ జీవుడు, జగత్తు మొదలైనవి.

శ్రీ సాంబశివుడు బోధించిన అంతర్ - బహిర్ ఆత్మ దేవార్చనయందు నిరతుడనైన నేను బాహ్యమునందు ఆయా కార్యములను నిర్వర్తించుచూ వ్యథారహితుడనై రోజులు గడుపుచున్నాను.

'యథా ప్రాప్తములగు క్రియలు, ఆచారములు' అను పుష్పములతో అవిచ్ఛిన్నంగా నాయందు, సర్వులయందు ఏకస్థుడై ఉన్న ఆ ఆత్మభగవానునికి అవిచ్ఛిన్నంగా అనుక్షణికంగా పూజ సల్పుచున్నాను. 'సుఖముగా నిద్రించుటకు ఉపక్రమిస్తున్నాను' అను అనుభవపుష్పం కూడా ఆత్మశివునికి అర్పించి నిద్రకు ఉపక్రమించటం చేత గాఢ నిద్రయందు కూడా నా శివపూజ కొనసాగుచున్నట్లే అగుచున్నది.

నేను శివ బోధామృతానుసారం చేసే నిరంతర పూజ సర్వ శరీరధారులూ సర్వదా చేస్తూనే ఉన్నారు. కానీ, వాటియొక్క ఉత్తమలాభం పొందకున్నారు. అజ్ఞానముచేత అనుక్షణికమైన పూజాభావం అలవడడంలేదు. అందుచేత 'నేను ఈ కర్మను ఇందుకొరకై చేస్తున్నాను' అను కర్మరత, కర్మఫలసంగ భావనను అతిక్రమించలేకపోతున్నారు. ఇక జ్ఞాననిష్ఠులగు యోగులో, సావధానచిత్తులై తాము నిర్వర్తించే సర్వకార్యములందూ పూజాబుద్ధిని కలిగి ఉంటున్నారు. కనుక రామా! నీవు సర్వ క్రియ, సర్వభావ, సర్వఅనుభవములతో శివపూజా బుద్ధి సంపన్నుడవై నీ చిత్తమును 'నిస్సంగము' చేసివేయి. అట్టి చిత్తముతో ఈ సంసారారణ్యంలో నిశ్చింతస్వభావుడవై విహరించు. అప్పుడు నీవు ఇక దుఃఖములను పొందే ప్రసక్తే ఉండదు.

యథాద్రవత్వం పయసి, యథా స్పందో నభస్వతి ।
యథా నభసి శూన్యత్వం, తథా సర్గత్వం ఆత్మని ॥

నీటి యందు ద్రవత్వం, గాలి – ఆకాశములందు వీచికా – శూన్యత్వములు ఎట్లా సహజములే అయి ఉన్నాయో, అట్లా ఆత్మయందు ఈ సృష్టి – స్థితి – లయ కల్పనలు సహజమై ఉంటున్నాయి.

రామా! ఈ ధన–జన–సంయోగ వియోగాదు లప్పుడు కూడా నీవు ఆత్మదృష్టిని అవలంబిస్తూ విచారణ చేయి. అంతేగాని 'లభించినప్పుడు ఉబ్బిపోవటం, కోల్పోయినప్పుడు దుఃఖితుడవు కావటం' నీవెందుకు చేయాలి? సంసారముయొక్క తీరే అది కదా! ఈ జగత్తునందలి వ్యవహారములన్నీ ఇట్లు వచ్చి అట్లుపోవుచు అజ్ఞానులైనవారిని మరల మరల పరాభవిస్తున్నాయి. సరియైన తర్కముతో కూడిన పరిశీలన లేకపోవటంచేతనే ఈ ధన జన సంబంధములన్నీ జడములు, కల్పితములై ఉండి కూడా ఆత్మస్వభావ, స్వరూపుడగు జీవుని దుఃఖితుని చేయగలుగుచున్నాయి.

ఓ నిర్మలమతీ! ఈ జగత్తు నీది కాదు. నీవు ఇందులో లేవు. ఈ జగత్తు అసలు ఏమీ కాదు. ఇక నీవు ఎందుకు, దేనికొరకై పరితపించాలి?

'ఈ జగత్తు తుచ్ఛమైనది' అనే దృష్టి నీకు నచ్చకపోయిందనుకో... అప్పుడు 'ఆత్మ దృష్ట్యా ఈ జగత్తంతా నేనే' అను లక్ష్యార్థమును అనుసరించు. ఈ జగత్తు దృశ్యంగా చూస్తే తప్పక పరిణామయుత మైనదే కదా! ఇక దుఃఖమెందుకు? శోకమెందుకు? నీవో, మార్పు చేర్పులు ఉండనట్టి చిన్మాత్ర రూపుడవు కదా!

ఈ జగత్తు స్వయంప్రతిపత్తి లేని జడస్వభావమైనది. జగత్తు అను రూపం పొందబడేది నీ కంటే భిన్నమైనది కాదు. కనుక ఇందులో ఆశ్రయించవలసినదేది? విసర్జించవలసినదేది? తరంగములు కూడా సముద్రమే కదా! సముద్రం తన తరంగములను వదలటమనేది ఎక్కడా

ఉండదు కదా! ఈ జగత్తు ఆత్మస్పందనమందలి భావనా తరంగములే! ఇక ఇక్కడ హర్ష శోకములకు ఆస్కారమెక్కడిది?

అందుచేత రామచంద్రా! నీవు అనునిత్యం చిదేకత్వమును ఆశ్రయించి ఉండు. జగత్తుకు కారణమై ఏర్పడి ఉంటున్న చిత్తవృత్తులన్నిటినీ గాఢ నిద్రా పరవశునివలే గాంచుచూ ఉండు. ఈ క్షణంలోనే తురీయావస్థ యందు వెలయుము. జగత్తు అను వైషమ్యమునుండి విడివడుము. ఈ జగత్తును కూడా ప్రకాశింపజేయుటకు కారణమగుచున్న బ్రహ్మంతో ఐక్యము స్థాపించుకొని ఉండు. నిత్యము ఉదారబుద్ధితో 'ఆత్మ దేవార్చనము' చేయుచూ పరిపూర్ణమగు సముద్రమువలె వెలయుము.

రఘునందనా! నీవు, ఈ జగత్ స్వభావం గురించి విన్నావు కదా! గ్రహించవలసినదేమిటో గ్రహించి పరిపూర్ణబుద్ధి సమన్వితుడవయ్యావు. వైరాగ్యప్రకరణంలో నీవు ప్రశ్నించినవాటిలో ఇంకనూ దేనికైనా సమాధానాలు కావాలా? చెప్పు.

శ్రీరాముడు : బ్రహ్మజ్ఞా! ఇప్పుడు నా అనుమానాలన్నీ సంపూర్ణంగా తొలగినాయి. తెలుసుకోవలసిన దానినంతా తెలుసుకున్నాను. అకృత్రిమమైన ఆనందం లభించింది.

ఇప్పుడు నాకు 'ఏది జీవుడు – ఏది బ్రహ్మం' అనే ప్రశ్నలు లేవు. మనోకల్పితాలైన పదార్థములు కూడా లేవు. అప్పుడు (14 రోజుల క్రితం) అజ్ఞానం చేత ఆత్మయందు కళంకం అగుపించింది. ఆ భ్రాంతి ఇప్పుడు తొలగిపోయింది. ఇదంతా తమ అనుగ్రహం వల్లే సాధ్యపడింది. ఆత్మ స్వరూపుడనైన నేను పుట్టడం లేదు. చావటం లేదు. ఎట్టి కళంకాలూ పొందటం లేదు. సర్వం బ్రహ్మమయమే కదా!

కనుక హే సద్గురూ! నాకిక ఎట్టి సంశయములుగాని, ప్రశ్నలుగాని కోరికలు గాని, నిరుత్సాహ కారణాలు గాని లేవు. విశ్వకర్మ యొక్క యంత్రం చేత త్రిప్పబడుచున్న సూర్యమండలం వలె నా చిత్తం అంధకార రహితమైనది. మహాపర్వతం ఒక చిన్న గులకరాయిని కోరుకుంటుందా? దేశ కాలాదులు క్రొత్తగా ఇవ్వగలిగినదేదీ లేదు. ఎట్టి వాంఛలు లేక, ఆశారహితుడనై వెలయుచున్నాను. 'ఇది విడువవలసినది, ఇది స్వీకరించవలసినది, ఇది ఉన్నది, ఇది లేదు' – అను శ్రమలన్నీ నశించాయి. ఇక నేను స్వర్గమును కోరను, నరకమును ద్వేషించను.

మందర పర్వతంలాగా ధీరుడనై ఆత్మయందే నిశ్చల ప్రతిష్ఠితుడనై ఉన్నాను. 'సంసారము' అనే మహాసముద్రం నుండి 'జగత్తులు' అనే నీటి తుంపరలు – అటూ – ఇటూ వెదజల్లబడుగాక! నాకు అవి భ్రమను కలిగించలేవు.

ఓ మునిసత్తమా! 'రాముడు' అనే పర్వతం 'సంసారము' అనే పిల్లగాలికి చంచలించడం మానివేసి, భ్రమరహితమై విశ్రాంతిని పొందుచున్నది. ఆత్మారాముడనై చెన్నొందుచున్నాను.

'ఇది వస్తువు, ఇది అవస్తువు' అంటూ కల్పనలు చేసుకుంటూ ఉండేవారి హృదయములు మాత్రమే ఈ సంసారముచే భయంకరంగా పీడింపబడుచున్నాయి. మూఢత్వముచే మహత్తరంగా తోచే ధన, జన, యౌవనాదులు ఇప్పుడు విషయార్హతను కోల్పోయాయి.

హే భగవంతుడా! తమ ప్రవచనాప్రవాహముచే నా యందలి అరిషడ్వర్గములు (కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు) అనే పిల్ల కెరటాలు అస్మదానందజలంలో ముంచివేయబడి, మ్రింగివేయబడ్డాయి. నేను వృత్తి రహితుడను అవటం చేత జడమైన ఈ సంసారం తల ఒంచుతోంది. సర్వ సంపదలకు పరాకాష్ఠ సర్వ ఆపదలకు పరిసమాప్తి స్వస్వరూపచిదాకాశధ్యానమేనని గ్రహించాను. హే పరమేశ్వరా! 'సంసారసాగరము' అని చెప్పబడుచున్నదానిని నేను జయించబడిన రాజ్యము వంటిదిగా గాంచగలుగుచున్నాను.

భూమానందమును పొంది పూర్ణుడనయ్యాను. సర్వ ఆశలు హరించిపోయాయి. ఈ నా పూర్ణత్వమును ఎవ్వరూ ఛేదించలేరు.

పరిగలితవికల్పితాముపేతం ప్రగలితవాఞ్ఛమదీనసారసత్త్వమ్ ।
త్రిజగతి యదతిప్రసన్నరూపం ప్రముదితమన్తరనుత్తమం మనోమే ॥ (శ్లో 36, సర్గ 43)

నా మనస్సు ఎట్టి ఇంద్రియ విషయములూ, వికల్పములూ లేక సుదృఢమైన స్థిరత్వం పొందింది. సర్వ వస్తువులనూ అధిగమించి నిరతిశయమైన ఆనందం పొందుతూ నా మనస్సు సర్వోత్తమమైన పదమున వెలయుచున్నది.

❖❖❖

21. కల్పనాజగత్తు - జీవబాటసారులు

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రాఘవా! ఈ ఇంద్రియాలు తమ తమ విషయము లందు ప్రవర్తిల్లుచున్నంత మాత్రం చేత బంధం ఏర్పడదు. సంగం, కర్తృత్వాభిమానం ఉన్న చోట మాత్రమే బంధం ఏర్పడుతుంది. ఈ ఇంద్రియాలకు గోచరించే విషయాలు ప్రాప్తిస్తున్నప్పుడు వాటి యందు ఏర్పడే అభినివేశమే దుఃఖములు కలిగిస్తున్నాయనే విషయం ఎవరికి తెలియదు? బాలురవంటి జీవులు మాత్రమే ఈ దృశ్య విషయములందు సంతోషం కలుగజేసే విశేషాలను వెతకుచూ, వాటి ప్రాప్తాప్రాప్తముల కొరకై తాపత్రయపడుచున్నారు. నిత్యానిత్యమును ఎరుగుచున్న ప్రౌఢులు ఈ దృశ్యవిషయములపై ఏమాత్రం విశ్వాసము, ఆశ పెంపొందించుకోరు. బాలురు మాత్రమే లభిస్తున్న సంతోషం కలుగజేసే మూర్ఖులే తప్ప ...

క్షణికసుఖాభినివేశానికి అసలు కారణమేమిటి?... వాంఛలు.

అవన్నీ దుఃఖదాయకాలుగా పరిణమించునవే సుమా! అఖండానందం కొరకై స్వల్పానందాలను అధిగమించక తప్పదు. ఒకసారి ఆ బ్రహ్మపదం పొందిన వారికి ఇక అహంభావం బాధించదు. అది స్ఫురించదు. ఆత్మజ్ఞాన శైల శిఖరంపై విశ్రాంతి తీసుకుంటున్న ఈ బుద్ధి ఇక 'స్వల్పత్వము' అనే అవరోహణం ఆశ్రయించకుండు గాక!

ఎవరి మనస్సులో 'అనంత బ్రాహ్మీదృష్టి' ఉదయించిందో ...జ్ఞానమేరు శిఖరం అధిరోహించినట్టి అట్టివారు "నేను – నాది" అనే పాతాళ లోకమున పడరు.

ఓ రామచంద్రా! నీ స్వభావము సమత్వము, సత్యములకు ఆలవాలమైనట్లు నాకు అగుపిస్తోంది. ఆత్మ వస్తువు నందు ప్రతిష్ఠితుడవగుట నాకు తెలియవస్తోంది. నీ యందలి ఆశ, భావన, మనస్సులు సర్వదా ఆశారాహిత్యం – అభావన – అమనస్కం పొందు గాక! ఏ ఏ వస్తువులు నీవు పొందుచున్నావో ఆయా వస్తువులన్నీ పరిపూర్ణమగు చిన్మయసత్తగానే గాంచుము.

అజ్ఞాతాత్మా నిబద్ధోసి, విజ్ఞాతాత్మా న బధ్యసే ।
రామ! త్వం స్వాత్మన్ ఆత్మానం బోధయస్వ బలాదతః ॥

రామా! ఆత్మజ్ఞానం లేకపోయిందా, బద్ధుడవవుతావు. ఆత్మజ్ఞానం సంపాదించుకుంటే ముక్తుడవు కాగలవు. కనుక మననము మొదలైన అభ్యాసములచేత స్వయంగా ఆత్మబోధనను సంపాదించుకో. అవాసనత్వం సంపాదించు. ఏ స్థితియందైతే భోగసుఖములందు ఆశ అనునది ఉండదో... ఎప్పుడు ఆయా వస్తువులు తారసపడుచున్నప్పుడు నిరపేక్షగా ఉండగలుగుతావో ...ఆ స్థితి అవాసనత్వం అనిపించుకుంటుంది. అట్టి స్థితి ఆకాశము వలె నిర్మలమైనది.

వాసనారహితమైన చిత్తముతో సందర్భానుచితకర్మలు ఆచరించు. అనుకూల ప్రతికూలాదులు వందలకొలది వచ్చినా సరే, నిర్వికారుడవై ఉండు. 'తెలుసుకొనువాడు – తెలివి – తెలియబడునది' ఈ మూడిటిని ఆత్మయందు ఒక్కటిగా చేసివేయి. దుఃఖాదులను కూడా ఆత్మ భావనమునందు లయింపజేయి. అప్పుడు మరల సంసారమును పొందటానికి కారణమే ఉండదు.

చిత్తోన్మేషనిమేషాభ్యాం సంసారప్రలయోదయౌ ।
వాసనాప్రాణసంరోధాదనిమేషం మనః కురు ॥ (శ్లో 16, సర్గ 44)

మనస్సు వికసిస్తే జగత్తు ఉంటుంది. మనస్సు లయిస్తే జగత్తు లేకుండా పోతుంది. కాబట్టి మనస్సును ప్రాణాయామాది నిర్దుష్ఠ కార్యక్రమముల సహాయంతో వాసనానిరోధం, విషయశూన్యం చేయి.

అభ్యాస, సంయమనాలతో ప్రాణాలను ఉద్విగ్నరహితం చేయి. ప్రాణం యొక్క ఉదయము వలననే 'సంసారం' అనేది పుట్టి పెరుగుతోంది. ప్రాణశక్తి యొక్క సద్వినియోగ ప్రభావంచే ఈ సంసారము లయింపజేయవచ్చు కూడా!

ఇక కర్మలంటావా! అవి అజ్ఞానము ఉన్నప్పుడు ఉన్నట్లే ఉంటాయి. అజ్ఞాన లయం జరిగిన మరుక్షణం కర్మలు, వాటి ప్రభావములు లేనివే అవుతాయి.

జగత్తు నిర్వచనం - గాలిచే లేవబడిన ధూళి వలన ఆకాశము మలినమైనట్లు కనబడుతుంది కదా! చిత్త స్పందనము వలన ఈ సంసారము అనే అనర్థం అనుభవమవటం జరుగుతోంది.

జగత్తు అంటే చూచేవాడు, చూడబడేది అను రెండిటి మధ్యగల సంబంధం మాత్రమే!

అనగా ...ఈ జగత్తు నీకేవిధంగా గోచరిస్తోందో...అట్లా గోచరించటానికి కారణం నీవు అద్దానితో స్వయంగా ఏర్పరచుకొంటున్న సంబంధమే అయి ఉన్నది. కాబట్టి నీ జగత్తుకు పరమకారణం

నీవే గాని మరింకెవ్వరో కాదు. ఒక చిత్రం లోని పురుషుడి హృదయంలో భావాలు అనేవి ఉండవు కదా! అట్లాగే ఒకవేళ నీ అంతరంగంలో దృశ్య–దర్శనములకు సంబంధించిన సంకల్పమే లేకపోతే, నీలో జగత్తుగా అనుభవమౌతున్న దానియొక్క భావనయే ఉండేదికాదు.

కాబట్టి భావనయే జగత్తు. నీవో?... భావమునకు ఆవల ఉన్న వాడవు. భావించువాడవు. భావాతీతుడవు. 'మాయ' అనేది కూడా చిత్తం యొక్క స్పందన నుండే పుడుతోంది. నీటిలో కదలికలు లేకుంటే అలలు ఉంటాయా? చిత్తం స్పందించటం మానివేస్తే మాయ కూడా లేకుండా పోతుంది.

శ్రీరాముడు : మాయ లేకపోతే 'జీవుడు' అనబడే వాడు కూడా ఉండడు కదా?

శ్రీవసిష్ఠ మహర్షి : అలలు నీరు కానిదెప్పుడు? నీటిలో అలలు లేకపోతే నీరు లేకుండా పోతోందా? మాయ రహితమైనప్పుడు సర్వము – నిత్యము – నిర్లిప్తము – అగు స్వస్వరూపం ఉండనే ఉంటుంది. 'సత్'అని వేదములచే ప్రతిపాదించబడే నినాదము యొక్క అర్థం అదే. జీవుడు శివస్వరూపుడే! కనుక జీవుడు రహితుడై శివస్వరూపుడవటమెక్కడున్నది.

చిత్తము యొక్క అచిత్తస్థితి -

శ్రీరాముడు : చిత్తము యొక్క స్పందన ఉపశమించేదెట్లా? మరెన్నటికీ చిత్తము ప్రకోపించకుండేదెట్లా?

శ్రీవసిష్ఠ మహర్షి : ఈ జీవుడు తత్త్వమును పొంది వాసనలు త్యజించినాడా ...లేక ప్రాణాభ్యాసముచే చిత్త స్పందన సుస్థీకరించబడినదా ...ఇకప్పుడు ఈ జీవునకు చిత్తము యొక్క నిస్పందము ప్రాప్తిస్తుంది. అట్టి చిత్తము యొక్క అచిత్తస్థితిని 'పరమపదము' అని చెప్పుచున్నారు.

❖

ఓ రామచంద్రా! ఈ విషయేంద్రియములతో ఏర్పడే సంబంధం వలన లభిస్తున్న సుఖం బ్రహ్మానందము యొక్క అత్యంత స్వల్పాంశము మాత్రమే.

'సర్వము బ్రహ్మమే' అనునది బ్రహ్మానందము యొక్క బాహ్యస్వరూపం. అట్టి పూర్ణానుభవం మనోక్షయము వలననే, లేక, చిత్తము యొక్క అస్పందన వలననే సాధ్యం. సంకల్పములన్నీ సంకల్పించువానియందు లయించుటయే బ్రహ్మానందమునకు నాంది. చమత్కారం చూచావా? ఆ బ్రహ్మదేవుని కల్పనలో ప్రవేశించిన ఈ జీవులు అనే బాటసారులు అనేకమంది 'స్వస్వరూపసుఖము' అనేది అసలు గుర్తించటమే లేదే!

చిత్తము ద్వారా లభించే సుఖము కృత్రిమము, దేశ కాల పరిమితము, దుష్ఫలిత సమన్వితము అయి ఉంటుంది. ఇక చిత్త వినాశనంచే అవధరించబడే సుఖం అనంతమైనది. అది మాటలకందనిది. అట్టి సుఖమునకు తరుగు ఉండదు. కనుక అద్దానిని 'నిర్హేతుకసుఖం' అనికూడా అంటారు.

శ్రీరాముడు : చిత్తము ఎక్కడి నుండి వచ్చి పడుతోంది.

శ్రీవసిష్ఠ మహర్షి : బాలుడు దయ్యమును ఊహించుకుని ఉలిక్కిపడతాడు చూచావా? భ్రాంతి చేతనే చిత్తం యొక్క అస్థిత్వం ఉపలభ్యమౌతోంది. తత్త్వబోధ వలన భ్రాంతి తప్పక తొలగగలదు.

ఉన్నట్లుగా అగపడుచున్న చిత్తము లేనట్లు తెలియబడుచున్నప్పుడు అది లయం పొందుచున్నది. సత్తుగా తోస్తున్న చిత్తము జ్ఞానముచే అసత్తుగా అగుచున్నది.

ఈ ప్రపంచములోని నామ, అర్థ భేదములన్నీ చిత్తమే కల్పిస్తోంది. చిత్తము 'బోధ'చే 'సత్యము' అగు నిజాత్మరూపం సంతరించుకుంటోంది. అని అనిపించుకొంటోంది. జ్ఞాని వివిధ కార్యములు నిర్వర్తించుచున్నప్పటికీ ఆతని చిత్తము జ్ఞాన సమన్వితమై ఉండడటం చేత దానిని 'సత్వము' అని అంటారు. జ్ఞానము దృఢపడినచోట చిత్తము ఉండనట్లే.

భ్రాంతియే బీజముగా గల చిత్తము జ్ఞానార్జనకు నియమించబడినప్పుడు ఆ చిత్తము తనయందుతానే లయమగుచున్నది. చిత్తముతో బాటు భ్రమకూడా మటుమాయమౌతోంది.

బాహ్య విషయములు అభ్యాసపూర్వకంగా కౌతుకంతో కూడి సంకల్పిస్తున్నప్పుడు అట్టి తతంగమే చిత్తము అను పేరుతో పిలువబడుతోంది. అంతకుమించి చిత్తమనగా మరింకేదో కాదు.

ఈ జీవుడు అపరోక్ష జ్ఞాన మార్గంగా తన సత్స్వరూపమునే (ఉనికినే) తాను స్మరిస్తున్నప్పుడు అట్లు స్మరిస్తూ, అనుభవిస్తూ ఉండగా బాహ్య జగత్తుకు రాహిత్యము ఏర్పడుచున్నది. అప్పటి స్థితిని 'చిత్త రాహిత్యము' అని పిలుస్తున్నాం. చిత్తము ఉన్నా, ఉండకపోయినా సత్తుకు అభావమనేదే లేదు కదా!

1. వికల్పమయమైన చిత్తము, 2. అద్దానిచే కల్పించబడే సర్వ పదార్థానుభవములు ...

ఈ రెండు అవస్తువులేనని ఆత్మబోధాసమన్వితులగు జ్ఞానులు ఎరిగియే ఉన్నారు. ఈ చిత్తము స్వస్వరూపమును ఎరిగినదా ...ఇక ఆ తరువాత కొంతకాలం తురీయమున విహరించి, ఆపై తురీయాతీతమగు పదమునందు ప్రకాశిస్తోంది.

బ్రహ్మమే ఈ విశాలమగు జగద్భ్రమయందు విలాసంగా సంచరిస్తోంది. ఏక-అనేకములందు సర్వదా ప్రసరించి ఉన్నది, సర్వుల నిత్య సత్యస్వరూపము అదియే.

బ్రహ్మమొక్కటే ఉన్నది.

అదియే సర్వులస్వస్వరూపం! సత్స్వరూపం!

తదితరమైనదేదీ లేదు.

❖❖❖

పదహారవ రోజు

IV. బిల్వఫలం - శిల - మృగతృష్ణ ఉపమానాలు

1. బిల్వఫల ఉపమానం

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రాఘవా! ఆత్మతత్త్వబోధకులు కొందరు బిల్వఫలము (మారేడు పండు) ను ఉపమానంగా చేసుకొని తమ అనుయాయులకు ఆత్మతత్త్వము బోధిస్తూ ఉంటారు. రమణీయము, విస్మయోల్లాసకరము, సంక్షిప్తము అగు ఆ బిల్వోపమానం అనే చమత్కారం చెపుతాను. ఇది జ్ఞానప్రదమని లోకప్రతీతి.

❖

ఒక పెద్ద బిల్వఫలం ఉన్నది. అది విమలము, విపులము, ప్రస్ఫుటము కూడా. ఆ ఫలం యొక్క సత్తా అసంఖ్యాక యోజనాలు విస్తరించి ఉన్నది. వందలవేల మహాయుగాలు గడచిపోతున్నప్పటికీ ఆ ఫలం క్షయం కావటం లేదు. అవదు. దాని రసము అక్షయము. దాని సారయుక్తమగు రసము అమృతము వలె అత్యంత మధురం. ఆ బిల్వఫలం అతి పురాతనమైనది. అది ఎంతటి పురాతనమో ఎవరమూ చెప్పలేం. అయితే ఏం? బాలచంద్రుని కళల వలె అది ఎప్పటికప్పుడు నూతనము, కోమలమూ కూడా! అది అత్యంత శోభతో అచలంగా, దృఢంగా ఉన్నది. మహాప్రళయ వాయువులు కూడా దానినేమీ కదల్చలేకున్నాయి. దాని వైశాల్యము ఇన్ని కోట్ల యోజనములని చెప్పజాలము. ఈ జగత్తు యొక్క స్థితికి అదే కారణం. అయితే దాని మూలమేమిటో కారణమేమిటో ఎవరికీ తెలియదు.

ఈ కనబడే బ్రహ్మాండ సమూహములన్నీ ఒక కొండ మీద వెదజల్లబడిన ఆవగింజల వలె ఆ బిల్వఫలం లోపలే వెదజల్లబడి ఉన్నాయి.

ఈ పంచేంద్రియ-మనస్సులకు విషయమగుచున్నదేదైనా సరే... ఆ ఫల రసమును అతిక్రమించ జాలదు. అది రాలటానికి చోటే లేదు. ఎందుకంటే అది అంతటా, అన్నిటా ఆక్రమించుకొని, అంతయూ తన యందే కలిగి ఉంటోంది. ఆ ఫలరసమును అతిక్రమించినది, అతిక్రమించగలిగినది ఎవరూ, ఏదీ లేదు. లేవు. ఈ జన్మ - జర - మరణము లనేవి దానిని స్పర్శించక, దాని యందే భ్రమాత్మకమై ఒదిగి ఉంటున్నాయి.

బ్రహ్మ - విష్ణు - రుద్ర - ఇంద్రాదులు గాని, మరెవ్వరైనా గాని దాని 'ఉత్పత్తి' అనే మూలం కనుగొన లేకపోతున్నారు.

శ్రీరాముడు : మహర్షీ! ఆ బిల్వఫలం ఏ వృక్షమునకు కాసింది? ఆ వృక్షం ఎక్కడుంది.

శ్రీవసిష్ఠ మహర్షి : ఆ ఫలమునకు వృక్షముగాని, అంకురముగాని, తత్సంబంధితమైన కొమ్మలు గాని ఏమీ లేవు. అది ఏకపిండ ఘనాకారమై తోచుచున్నది. ఏకరసమై ఉన్న అద్దానికి ఉత్పత్తి – పెరుగుట – తరుగుట అనే పరిణామ లక్షణాలేవి అగుపడుటలేదు. అది సమస్త ఫలాల సారమా... అని అనిపిస్తోంది. మహాకృతి కలిగిన అద్దాని యందు గుజ్జు – గింజలు లేక ...అది నిర్వికారమై, నిరంజనమై ఉన్నది.

అది శిలవలె నిర్లిప్తమై ఉన్నది. చంద్రబింబము వలె అద్దాని నుండి అమృతానందం నిత్యమూ స్రవిస్తోంది. స్వసంవేద్యమగు నిరతిశయానందమున ప్రకాశిస్తోంది. శీతలమగు, వినీలమగు స్వయంప్రకాశముచే వెలుగొందుచూ సకల సౌఖ్యములకు ఆలవాలమై ఉన్నది. అద్దానిని చూచి 'అది పర్వతము వంటి ఒక జడమగు మట్టి ముద్ద' అని కొందరు భ్రమిస్తున్నారు. ఈ జనులంతా అద్దాని యందే ఇమిడి ఉండి కూడా అద్దాని స్వరూప స్వభావములేమిటో గ్రహించలేకపోతున్నారు. అనేకులు అద్దాని ఉనికి గురించి కూడా తెలియకయే వందల, వేల ఉపాధులలో సుఖదుఃఖ భావములు కల్పించుకొని అతిదీర్ఘకాలం గడిపివేస్తున్నారు.

అది అగోచరములగు సర్వ ఆనందముల సారస్వరూపమైయున్నది. అది అనంతమై, త్రివిధ (సృష్టి, స్థితి, లయ – త్రికాల) పరిచ్ఛేదరహితమై ఉన్నది. నిత్యమై, అనునిత్యమై స్వాత్మచమత్కృతి చేత ప్రభవించుచున్నది. ఆత్మచమత్కృతి యొక్క అధ్యాసయే ఆ బిల్వఫలం యొక్క అనుభవం. బుద్ధికి ఆవల ఉన్నదై, ఆ బుద్ధి యొక్క సన్నివేశ వైచిత్ర్యానికి తానే కారణమై ఉంటోంది. అది బుద్ధిని కల్పించు కుంటూనే బుద్ధికి ఆవల, ఈవల కూడా ప్రసరించి ఉంటోంది. తన స్వరూపాన్ని ఒక వైపు ఏమాత్రం వదలకుండానే మరొకవైపు స్థూల – సూక్ష్మ – అణు – కార్య – కారణములను వ్యక్తీకరిస్తోంది.

అది సనాతనము. అయితే ఏం? దానికి వార్ధక్యము మొదలైన దశలు లేవు. అది తన యందు 'స్త్రీ, పురుష, జడ, జంతు' – అనే కల్పనలు నిర్వర్తించుతూ ఆ కాల్పనికాలకు సంబంధించక స్పృశించబడక ఉంటోంది. 'ఇది అన్యము, ఇది భిన్నము' – అనే కల్పనాతరంగం ఆ నిశ్చల ఫల రసము నందే ఏర్పడటం జరుగుతోంది.

ఆ బిల్వఫలం వాస్తవానికి ఏమిటి?

ఏదీ కాదు. స్వప్రకాశకుడగు చిన్మయము దృష్ట్యా అది అవిద్యాదులకు ముందే ఉన్న ఆత్మ చమత్కృతియే. అద్దానికి ద్వైతము అనేది పొసగదు. దానికి బాహ్యము ఉంటే కదా... ద్వితీయం గురించి యోచన?

ఆ బిల్వఫలం స్వశక్తిచే తనయందు కావాలని అహంకారాదులను కల్పించుకుంటోంది. అక్కడి నుండి ఆకాశ కాలములకు సంస్థానమగుచున్నది. అది సంకల్పములను వికసింపజేయటం ద్వారా రాగద్వేష హేయ ఉపాధేయాదులను తనపట్ల ఆపాదించుకుంటోంది. ఆశలు, నిరాశలను తనకు తానే కారణమై రచించుకుంటోంది. 'ఇది, అది, నాది, నీది' మొదలైనవి తనకు అంతర్విభాగ మైనప్పటికీ తనకు ద్వితీయమైనట్లు కల్పన చేసుకుంటోంది.

❖

ఓ రాఘవా! ఆ బిల్వఫలంలోనే బ్రహ్మాండాలన్నీ ఉన్నాయి. అయితే 'బ్రహ్మాండాలు ఉన్నాయి' – అనేది కూడా కల్పన మాత్రమే. అంతేకాదు. 'ఎదుట, వెనుక, దూరం, దగ్గిర, భూతకాలం, వర్తమాన కాలం, భవిష్యత్‌కాలం' – అనునవన్నీ కూడా ఆ బిల్వ ఫలము నందలి అనుభూతిపరమైన కల్పిత విషయాలు మాత్రమే. కల్పనలకు ఆటపట్టైన ఆ ఫలము జీవులతోకూడిన బ్రహ్మాండ మండలములకు క్రీడామండపము వలె గోచరిస్తోంది.

❖

ఆ ఫలము యొక్క చమత్కృతిచే అందు వేలాదిజీవులు వర్షపుంజంలోని బుడగల వలె క్షణ క్షణం శరీర ధారణం, శరీర త్యాగం చేస్తున్నారు. అందులోంచి రుద్రగణం బయలుదేరి, వారు ఈ సృష్టి యందు ఆశగొనిన విషయబద్ధులను 'ప్రళయం' అను ఒకానొక కాలవిభాగంలో కలిపివేసి వినాశనం చేసివేస్తున్నారు. సృష్టిసంహారాలు, స్వర్గ వైభవాలు, నరక దుఃఖాగ్నులు, జగత్‌భావ, అభావాలు …అన్నీ కూడా తెరపై క్రీనీడలలాగా ఆ ఫలమునందే కల్పిత ఆరోపిత దృష్టులచే దర్శించబడుతున్నాయి.

❖

ఆ బిల్వఫలములోని ఒకానొక చిన్నమూల గల ఒక బిందువులో ఈ అసంఖ్యాక పాలపుంతలతో కూడిన నక్షత్రాల సమూహమంతా విరాజిల్లుతోంది. అది బ్రహ్మము అనే మహాసముద్రపు ఒడ్డున అంతు లేకుండా వెలయుచున్నది. ఆకాశమే దానికి ఆశ్రయం. కానీ ఆకాశమంతా ఉన్నది అందులోనే!

ఆ ఫల మధ్యంలోగల మహాసముద్రాలలో జలం బదులుగా 'క్రియలు, వాటి నుండి ఫలితములు, ఆ ఫలితముల నుండి మరికొన్ని క్రియలు" అనే భీకర తరంగాలు అవిశ్రాంతంగా ఘోషణ శబ్దములతో ప్రవహిస్తున్నాయి. ఆ తరంగాలలో 'జీవులు' అనే నీటిచుక్కలు చిందరవందరగా ప్రతిబింబిస్తున్నారు.

ఆ జలంతో 'కాలము' అనే ఉపరితలవాయువీచికల ప్రభావంచే ప్రళయము, మహాప్రళయము అనే సుడిగుండాలు ఏర్పడి ఉంటున్నాయి.

కాలము - గాలి ఆకాశంలో అటూ ఇటూ వీస్తున్నట్లు ఆ నిశ్చల బిల్వఫలంలో కాల వీచికలు వీస్తున్నాయి. ఈ చంద్రుడు మొదలైన జోతిష్పదార్థాలన్నీ ఆ కాల ప్రవాహంలోని చిన్న చిన్న చారలు. అది బయటకు క్షణ, విఘడియ, ఘడియ, దిన, మాస, సంవత్సర, యుగ, చాతుర్యుగ, మన్వంతర, అయనముల – రూపంలో ఉంటోంది. దాని యొక్క మరొక విశిష్టమైన వైపు 'కాలాతీతమైనది'. ఈ జరా, మృత్యు, విద్య, అవిద్య, సమృద్ధ, అసమృద్ధాది – విశేషములన్నీ కాలబద్ధం మాత్రమే. ఆ బిల్వఫలమో… కాలమునకు అతీతమైనది.

❖

అయితే… ఆ బిల్వఫలం సంకల్పమాత్రం చేతనే ఇన్ని విశేషములతో, వర్ణింపశక్యం గాని మరెన్నో రీతులుగా వెలయుచున్నది. అది ఏకమే అయి ఉండి ద్వైతమును ధరిస్తోంది. మరి, దానిని ఏకం అనాలో, ద్వైతం అనాలో, మరింకేమనాలో తెలియని అద్దాని పరిశీలకులు అద్దాని గురించి అనేక సిద్ధాంతపరమైన వాగ్వివాదములు చేసుకుంటున్నారు.

'అది వివిధాత్మికము కాదు .... సర్వదా ఏకాత్మికమే' ... అనేది వేదాంత శాస్త్ర పరిశోధన యొక్క సమాధానం. ఎందుకంటావా? అద్దానిలో స్వజాతి విజాతీయములు, స్వపరములు లేనే లేవు. ఉన్నట్లు అనిపించేదంతా వాస్తవం కాదు.

దానికి ఉనికి ఉన్నది. కానీ స్వరూపం లేదు. అది అంతా తెలుసుకొనుచున్నది... కానీ, అది తెలియబడుట లేదు. అది స్వయంగా ఆనందస్వరూపం... కానీ సుఖదుఃఖాల కల్పనలన్నీ దానివే. అది సకల ద్వైత వికల్పములకూ 'ఉపశాంతి'యగు ఏకైక సమరూపము.

అదియే 'చిచ్ఛక్తి' అనబడే ఆదిశక్తి. అది సర్వాత్మకమైన 'మహద్బ్రహ్మ బిల్వఫలం'.

❖

శ్రీరాముడు : భగవంతుడా! సర్వసారజ్ఞా! ఆత్మానుభవులు ఉపయోగించే బిల్వఫల ఉపమేయం (Metaphor) 'చిద్ఘనబ్రహ్మసత్త' గురించేనని నాకు అర్థమయింది. ఈ 'నీవు – నేను' అహంకారాలన్నీ ఆ చిత్ యొక్క రూపాలేనని, ఇక ఇందు ద్వైత–ఐక్య కల్పనా భేదాలు లేవని గ్రహిస్తున్నాను. అయితే ...ఒక బిల్వఫలం ఎప్పటికైనా వాడిపోతుంది కదా...?

శ్రీవసిష్ఠ మహర్షి : ఏ ఉపమానమైనా బ్రహ్మతత్త్వాన్ని సంపూర్ణంగా విశదీకరించలేదు. విజ్ఞులు ఒక్కొక్క ఉపమానాన్ని ఒక్కొక్క విషయ పరిజ్ఞానం కొరకై వాడుతూ మనకు అందిస్తూ ఉంటారు. ఉపమానా లనేవి ఆశ్రితుడగు శిష్యుని సామాన్య, దైనందికానుభవాలను దృష్టిలో పెట్టుకొని ఉంటాయి సుమా!

కనుక "బిల్వఫలంలోని గుజ్జు నాశనమైతే బిల్వఫలం కూడా నశిస్తుంది కదా! అట్లాగే బ్రహ్మాండాలు (జగత్తులు) నశిస్తే బ్రహ్మము కూడా నశిస్తుంది"...అని అనుకోకు. బ్రహ్మమునకు పెరుగు–తరుగులు ఉండవు. అది ఏ క్షణంలోనూ మరొకటిగా అగుటలేదు ...అవదు. మిరియపు గింజలో కారం అంతర్లీనమై ఉన్నట్లు జగత్తులలో బ్రహ్మము సారం–రసం అయి, అంతర్లీనంగా అనునిత్యమై ఉంది.

❖❖❖

2. శిల - శిల్పి - శిల్పము

శ్రీవసిష్ఠ మహర్షి : ఆధ్యాత్మ వాఙ్మయంలో ఆత్మతత్వమును ప్రవచించే బహు ప్రచారమై ఉన్న మరొక ఉపమానం కూడా చెప్తాను ...విను.

ఒకచోట ఒక గొప్ప శిల ఉన్నది. అది అతి నునుపుగాను, స్పష్టంగాను, ప్రకాశవంతం గాను, మృదువైన స్పర్శతో కూడి మహావిస్తారమై ఉన్నది. ఆ మహావిశాల శిలపై అనేక పద్మాలు నగిషీ చేయబడి ఉన్నాయి. ఆ పద్మముల దళాలు ఒకదానినొకటి తాకుతూ ఉన్నాయి. ఆ శిల్పి ఎవరో కానీ... అందులో కొన్ని పద్మములు బాగా వికసించి ఉన్నాయి. మరికొన్ని కొంత వికసించి ఉన్నాయి. కొన్ని పైకి లేచి ఉన్నాయి. ఇంకొన్ని ముడుచుకుని ఉన్నాయి. కొన్ని క్రిందకు వ్రేలాడుతూ కనిపిస్తున్నాయి. ఇంకొన్ని పడుకొనిన భంగిమలో కనిపిస్తున్నాయి. అయితే అన్ని పద్మముల మొదళ్ళు కలిసియే ఉన్నాయి. వాటిలో కొన్ని పద్మముఖములు పరస్పర సంలగ్నములై ఉన్నాయి.

కొన్ని ఊర్ధ్వ, అధో మూలములు కలిగి ఉన్నాయి. కొన్నిటికి మూలములే కనిపించటం లేదు.

శ్రీరాముడు : గురువర్యా ! నేను తీర్థయాత్రలకు వెళ్ళినప్పుడు సాలగ్రామ క్షేత్రంలో (ఒక విష్ణుక్షేత్రం) ఒక పెద్ద కొండరాయిని చూచాను. ఆ శిల మీరు వర్ణించినట్లు పద్మములచే అలంకారితమైన వనం సుదీర్ఘంగా చిత్రీకరించబడి ఉంది. మీరు చెప్పేది వింటుంటే ఆ గండశిల గుర్తుకు వచ్చింది. ఒక ఘడియకాలం ఆ శిల్పచాతుర్యం గమనిస్తూ ఉన్నాను కూడా ...ఇంక చెప్పండి.

శ్రీవసిష్ఠ మహర్షి : ...మంచిది. నేను దృష్టాంతంగా తీసుకుని వర్ణించి చెప్పే పెద్ద శిల–శిల్పచాతుర్యం తీర్థయాత్రలు చేస్తూ చూచావు కదా! పద్మవన చిత్రీకరణను, శిలను ఒకే చూపుతో చూడటం జరిగింది కదా!

శ్రీరాముడు : అవును. చూడకేం! శిల – శిల్పములు ఒక్కచోటే ఒక్కటిగానే ఉన్నాయి కదా!

శ్రీవసిష్ఠ మహర్షి : అదే రీతిగా ...'దృష్టమయమైన బ్రహ్మము'ను నీవు అనుక్షణం చూస్తూనే ఉన్నావు.

శిల్పరచనలో కనిపించేదానికంతటికీ శిలయే స్థానము, మూలము, వాస్తవరూపము, ఆలంబనము, అధిష్ఠానము కదా! బ్రహ్మమే ఈ సర్వజీవులకు అట్టి ఆలంబనము అయి ఉన్నది. బ్రహ్మము ప్రాణమునకే ప్రాణమగు "చిద్ఘన ఆనందం" అయి ఉన్నది.

శ్రీరాముడు : ఈ "శిల – దానిపై చెక్కబడిన పద్మవనం" అనే దృష్టాంతం చెప్పుటలో మీ ఆంతర్యమేమిటో వివరంగా చెప్పమని నా విన్నపం.

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రఘుకుల తిలకమా! నేను ఉదహరిస్తున్న ఆ అపూర్వమగు శిల బ్రహ్మమే అయి ఉన్నది. ఆ బ్రహ్మ శిలపై ఈ జగద్విశేషములన్నీ కనిపిస్తున్నాయి. అయితే ఏం? శిల్పముపై కనిపించేవన్నీ శిలయే అయినట్లు, ఇక్కడ పరిపరి విశేషములతో కూడిన జగత్తు అనబడేది లేదు. బ్రహ్మము మాత్రమే ఉన్నది. బ్రహ్మమునందు బ్రహ్మమునకు వేరైనదేదీ లేదు... ఉండదు.

శిలలో ప్రతి అణువూ శిలాతత్త్వమే కదా! "ఘనత్వము, ఏకాత్మకము" అనునవి 'చిత్' నందు ఉన్నాయి గదా! అందుచేత ఆ చిత్‌ను శిలతో పోలుస్తున్నారు.

❖

అత్యంత విశాలము, సూక్ష్మము అగు ఆకాశమునందు వాయువు ఉన్నట్లు ఆ చిత్ శిలయందు దృశ్యము ఉన్నది. ఈ ఆకాశము, భూమి, వాయువు, పర్వతములు, దిక్కులు ... ఇక్కడ జగత్తులో వెలయుచున్నాయి. ఇక్కడ చిన్న రంధ్రంలో కూడా ఖాళీ లేదు. అయితే, ఈ జగత్తు వేరే ఏదో వస్తువై ఉన్నట్లు అనిపిస్తోంది. శిలపై పద్మవనం చూస్తున్న వానికి రకరకాల భంగిమలలో పద్మములు కనిపిస్తూ ఉన్నాయి. "సరోవరం... అందులో పద్మములు" అనే పరిశీలనతో చూచేవారి దృష్టిపథంలో శిల గురించిన దృష్టి ఏమరువబడుతుంది కదా!

'చిత్' నుండి ఈ జగత్తు వేరు కాదు. సర్వమూ శుద్ధ చిదాత్మకమే! వేరుగా అనిపించేదంతా కల్పన... లేక... మాయ మాత్రమే.

శ్రీరాముడు : అయితే, మహర్షీ! చిత్ శిలయందు చెక్కబడే ఈ జగత్ శిల్పానికి తన ఊహ – తెలివి – కల్పనచే కర్తృత్వం వహించే శిల్పి ఎవరు?

శ్రీవసిష్ఠ మహర్షి : ఇంకెవరు? ద్రష్టయే (చూచువాడే!) ద్రష్ట తన సంకల్పస్వరూపమైన మనస్సుచే ఈ చిత్ శిలయందు భూత – వర్తమాన – భవిష్యత్ 'అనుభవములు' అను చిత్రములను చిత్రిస్తున్నాడు.

❖

ఇక ఈ కాల భంజకములు (Compartments of Time) వాస్తవములుగా తోచుచున్నప్పటికీ, వాస్తవములు కాదు. బ్రహ్మశిలయందు విభిన్నములగు పదార్థములు స్ఫురిస్తున్నప్పటికీ వాస్తవానికి బ్రహ్మము ఏకమగు ఘనపిండమే.

ఈ నీకు కనబడే సృష్టి చిత్ శిలయే అయి ఉన్నది. ఇప్పటి ఒక శిల్పము ఆ రూపము పొందక ముందు అంతవరకూ ఎక్కడ దాగి ఉన్నది?

శ్రీరాముడు : అంతకు ముందు ఆ శిల్పం శిలలోనే మౌనంగా దాగి ఉండి ఉంటుంది కదా? శిలా విభాగంలో శిల్పం చెక్కబడింది.

శ్రీవసిష్ఠ మహర్షి : అట్లాగే సుషుప్తి దశలో ఈ జగత్తుకు సంబంధించిన అనుభవ సంస్కారం ద్రష్ట యందే నిశ్శబ్దమై ఇమిడి ఉంటోంది. శిలయందు చిత్రించబడిన పద్మమునకు (ఆ శిలకు వేరుగా) ఉత్పత్తి ఏముంటుంది? వినాశనమేమి? ఆ రీతిగానే చిత్‌నందు చిత్రించబడే ఈ జగత్తులకు కూడా ఉత్పత్తీ లేదు... వినాశనమూ లేదు. శిలయందు శిల్పంలాగా ఆ ఆత్మయందు జగద్దృశ్యం సందర్శించ బడుతోంది.

సాధ్వియగు ఒక స్త్రీ హృదయంలో సుదీర్ఘ కాలం దూర ప్రాంతంలో ఉండిపోయిన ఆమె భర్త యొక్క రూపము, సంభాషణా చమత్కారాలు, కరస్పర్శాది అనుభవాలు, హాస్య–లాస్యాలు ఉన్నట్లు, అనంత వికారములు కలిగిఉన్న ఈ ఈ బ్రహ్మాండములు కూడా ద్రష్టలోనే రూపము కలిగిఉన్నాయి కాని, బాహ్యమున కాదు.

❖

శ్రీరాముడు : మహర్షీ ! 'వికారములతో కూడిన ఈ బ్రహ్మాండములు, వీటి భేదములన్నీ దర్శిస్తున్న ద్రష్ట... ఉభయములు చిన్మాత్రమే' అను యుక్తి యుక్తియుక్తమే కదా? ఉచితమే కదా?

శ్రీవసిష్ఠ మహర్షి : బ్రహ్మమే ఉన్నది. బ్రహ్మాండములు మనోకల్పనా వైచిత్ర్యము మాత్రమే! నీటియందు నీటి బొట్టు విలీనమైనట్లు ఈ జగత్తుకు సంబంధించిన వర్తమానానుభవ వికారములన్నీ చిన్మాత్ర దర్శనము (Perceiving Absolute self) నందు విలీనమైపోగలవు.

చిత్ అనంతం కదా! దాని వికారాలు కూడా అనంతమే. అయితే, నామరూపాలుగా ఆవిర్భవించే వన్నీ కాలానుగతంగా ఆ రూపనామాలు కోల్పోతాయి కదా! ఈ జగత్తులో ప్రతిదీ రూపాదులు పొంది, కొంత సమయం తరువాత కోల్పోతున్నది. వాటి అనుభవం ద్రష్ట యొక్క అవగాహనను అనుసరించి మాత్రమే ఉంటున్నది.

కవులచే వర్ణించబడే గంధర్వనగరం నామమాత్రమే అయినట్లు, ఈ జగత్సృష్టులు కూడా నామ మాత్రములే! ఒక కవి యొక్క రచనలో తారసపడే పాత్రల మధ్య తీవ్రము, సంచలనయుక్తము,

భాషా ప్రయుక్తము అయినట్టి భావావేశాలు ఏమౌతున్నాయి. కథతోనే ముగుస్తున్నాయి కదా! సృష్టి అనబడే ఒకానొక దృష్టిని మొట్టమొదట చైతన్యమే గ్రహిస్తోంది. ఆ గ్రహించబడేదంతా కాలానుగతంగా చైతన్యమునందే లయం అగుచున్నది. జలం అనేక తరంగాకారాలు ధరించి, ఆ తరువాత ఆ తరంగాకారాలను తనయందు లీనం చేసుకోవటం లేదా!

దృశ్యజగత్తు నందు స్ఫురించుచున్న ఈ వస్తు వికారములన్నీ వాస్తవానికి అర్థశూన్యములు. అన్నీ చైతన్యమునందు ప్రతిభాసించి ఆ ప్రతిభాసక చైతన్యమునందే లయిస్తున్నాయి.

శ్రీరాముడు : ఈ వస్తు వికారాలు జీవుని ఆశ్రయించటానికి ఏదైనా ప్రత్యేకమైన కారణం ఉంటుందా?

శ్రీవసిష్ఠ మహర్షి : ఇక్కడి వస్తువికారాదులకు స్వతంత్రమైన ఉనికిలేదు. వాటిని దర్శిస్తున్న చైతన్యము అట్లు సంకల్పించుట చేతనే అవి ఆ విధంగా తారసపడుచూ, అనుభవమౌతున్నాయి. కనుక ఈ సర్వం సంకల్ప మాత్రమే. ఆత్మ విచారణా సమన్వితమగు అత్యుత్తమ సంకల్పం నందు అనగా స్వస్వరూపం యొక్క అఖండ అప్రమేయ నిత్యత్వములు సంకల్పించుచున్న సమయంలో తదితరమైన సంకల్పములు తమ రూపము కోల్పోతాయి. అప్పుడు "నిర్విషయ – నిర్విశేష – అనిర్వచనీయ" స్వస్వరూపానందానుభవం సంభవించగలదు. అదియే ఈ సంసారమునకు సముచిత సమాధానం.

❖

బ్రహ్మము అనంతము. నిరర్థకమైన క్రియలు – వర్జన, గ్రహణములు కూడా బ్రహ్మమే! ఈ వికారాదులన్నీ బ్రహ్మమునందే ఉదయిస్తున్నాయి. బ్రహ్మమునందే అస్తమిస్తున్నాయి. కనుక సర్వదా, సర్వము పట్ల నిశ్చింతుడవై, అనంత స్వభావుడవై ఉండుము.

మృగతృష్ణ - ఈ సృష్టిని మృగతృష్ణతో పోల్చవచ్చు. మృగతృష్ణలో గల చిన్నతరంగం, పెద్దతరంగం –అన్నీ భ్రమాత్మకములైనవే కదా? పెద్దతరంగం పెద్దగా, భ్రమాత్మకమనీ, చిన్నతరంగం చిన్నగా భ్రమాత్మకమనీ అనం కదా? ఈ జగత్తు భ్రమచే దర్శించబడుచూ, స్వస్వరూప జ్ఞానముచే 'రాహిత్యము' వహిస్తోంది.

పుష్పం, ఫలం మొదలైన వృక్ష విభాగములన్నీ బీజము యొక్క అనువృత్తములే కదా! అట్లాగే ఈ సమస్తం చిత్ సత్త యొక్క అనువృత్తియే. అనగా...విత్తనంలోని సత్త 'అంకురం, శాఖ, పల్లవం– మొదలైన రూపములుగా క్రమంగా వికృతిని పొంది వాటికి తానే కారణమౌతోంది కదా!

చిత్ నందలి సత్తయే ఈ తదితర జగత్తుగా ప్రభవిస్తోంది. కనుకనే 'ఈ జగత్తుకు కారణం చిత్ సత్తయే'... అని సిద్ధాంతీకరించ బడుతోంది. చిత్ సత్తా సర్వదా ఏకమే అయి ఉండి కూడా, ద్వైత భావమునకు కారణమయి ఉంటోంది.

ఈ జగత్తు ఎక్కడినుండి కలిగింది? ఆత్మవిషయమై ఏమఱుపుకు సంబంధించిన జాడ్యకల్పన నుండే కలిగింది.

అయితే... చిత్తు జడముగా మారుతోందా? ...లేనేలేదు. అది అట్లు మారదు. మారజాలదు.

తెలుసుకొనుచున్న వాని ఉనికి, విస్తారముల చేతనే 'తెలియబడుచున్నది' అనేది మనగలుగుతోంది.

అయితే, తెలుసుకొనుచున్నదేదో, అది తెలియబడుచున్నదానిగా, ఘనీభవించటం లేదు. 'చిత్ – అచిత్' అనబడే రెండు వస్తువుల ఉనికియే లేదు. ఏకో సత్...! ఉన్నది ఒక్కటే. రెండవదగు దానికి స్వయం సంబంధమైన ఉనికి లేదు.

మహాశిలయందు చెక్కబడిన అనేక రూపములు శిలయే అయినట్లు, ఈ జగత్తు బ్రహ్మమునకు వేరుగా లేదు. రేఖలు, ఉపరేఖలతో గూడిన మహాశిలవలె బ్రహ్మమే ఈ మూడు లోకములకు ఆలవాలమైయున్నది.

శ్రీరాముడు : స్వామీ! ఈ నేను – నీవు అనునవన్నీ ఎప్పుడు, ఎక్కడ ఆరంభమౌతున్నాయి?

శ్రీవసిష్ఠ మహర్షి : శిలయందు పద్మవనం శిల్పిచే చెక్కబడింది కదా! శిల్పి తన కల్పనాచాతుర్యం అనుసరించి శిల్పం తయారు చేస్తున్నాడు. కల్పన యోచన నుండి, యోచన వాసనల నుండి ఉద్భవిస్తున్నాయి. జనుల అభిరుచిని అనుసరించియే శిల్పి శిల్పములో దృశ్యవిశేషాలను చిత్రీకరించుచున్నాడు కదా! అట్లాగే, ఈ దృశ్యజగత్తు కూడా జనుల సంస్కారాలను అభిరుచులను అనుసరించే కల్పించబడుతోంది.

శిల్పి యందలి కల్పనా సమూహములకు పుట్టుక ఏమి? చావు ఏమి? అట్లాగే చిత్ నుండి కల్పనచే బహిర్గతమగుచున్న 'నేను' 'నీవు' అనునవన్నిటికి జన్మలేదు. క్షయమూ లేదు.

అజ్ఞానముచే 'నేను', 'నీవు'తో సహా ఈ తదితర జగత్తులు ఉన్నట్లు తోచుచున్నది. జ్ఞానముచే ఈ 'నేను' 'నీవు', త్రివిధ కర్మలు – ఇంద్రియగోచర జగత్తులు భావనామాత్రమని తెలియవస్తోంది. కనుక, 'నేను', 'నీవు' మొదలైనవాటికి ఉత్పత్తికి కారణం స్వస్వరూపము యొక్క వాస్తవ స్వభావము ఏమరుచుటయే. ఆ ఏమరుచుటనే 'అజ్ఞానం' అని పిలుస్తున్నాం. స్వస్వరూపము యొక్క ఏమరుపే 'తెలియక పోవటం' అని విజ్ఞులు పిలుస్తున్నారు. అట్లు తెలియకపోవుటచేతనే కొందరు జీవులు ఈ జగత్తుని వస్తుసమూహములను ఎప్పటికప్పుడు సంకల్పదర్పణము ద్వారా దర్శించుచూ ఇవన్నీ నిత్యమని భావిస్తున్నారు.

శిలలోని శిల్పవిభాగం, శిల్పరహిత విభాగం – అంతా కూడా శిలకు ఏమాత్రం వేరు కాదు కదా?... అట్లాగే ఇక్కడ తోచుచున్న జగత్‌కర్త, ఆయన కర్తృత్వం, తత్కార్యమగు ఈ జగత్తు ...అంతా కూడా చిత్స్వరూపం (ఎరుక స్వరూపం) మాత్రమే! ఆత్మ దర్శనమైనదా... ఈ జగత్తు, దీని ఆవిర్భావ తిరోభావాలు గణనలోకే రావు. దీనినే వేదాంత వాఙ్మయ రచయితలు 'కేవలీస్థితి' అని జగత్ రాహిత్యం అని వర్ణిస్తున్నారు.

ఒక చమత్కారమేమంటే... ఈ జగత్తు గాని, ఆ బ్రహ్మము గాని ఎవరి చేతా సృష్టించబడుట లేదు...! నాశనము చేయబడుట లేదు!

పర్వత శిఖరం పర్వతం నుండి వేరు కాదు కదా. శిఖరం పర్వతం యొక్క వికారం కూడా కాదు. పర్వతము సదా శిలామయము మాత్రమే. బ్రహ్మము, సృష్టి కేవలం ఉల్లాస విలాసాలను (లీల) సూచిస్తున్నాయి.

ఆయా శిల్పుల వివిధములైన - విరుద్ధములైన మనో కల్పనా భేదముల వలన శిలలో వివిధ రీతులుగా శిల్పాలు అనబడే ఆకారాలు గోచరిస్తున్నాయి. అట్లాగే ప్రకృతి సిద్ధంగా కూడా శిలలు అనేక రూపాలను (ఆకారాలను) దాల్చుచూ ఉండటం జరుగుతోంది కదా! అంతమాత్రం చేత ఆయా శిల్పాలన్నీ శిల కంటే వేరుగా ఉంటున్నాయా? ఈ జగత్తు నానావిధ జీవుల విరుద్ధ కల్పనా భేదాలతో కూడి ఉన్నది. ఏది ఏమైనా బ్రహ్మం సర్వదా స్వస్వరూపం నందే స్వస్వరూపం గానే వెలయుచున్నది.

ఇక్కడి వైచిత్ర్యం ఏమంటే... ఎచ్చట ఏ ఆకృతి కల్పించబడుచున్నదో, అచ్చట ఆ ఆకృతియే వెలయుచున్నది. ఇందు వస్తుగతమైన భేదమేమీ లేదు. కనబడుచున్న వస్తువులన్నిటిలో బ్రహ్మాస్తతయే వెలయుచున్నది. బ్రహ్మ సత్తయే పదార్థముల సత్త. నిద్రించేవాడు స్వప్నంలో చూచే వస్తువులకు, ఆ స్వప్నమునకు సంబంధించిన కల్పనకు భేదమేమైనా ఉన్నదా? లేదు. అయినా కూడా ఆ స్వప్న సమయంలో అభేదాన్ని గుర్తించక అప్పటికి మాత్రం ఆ స్వప్నద్రష్ట వివిధములైన అనేకానుభూతులు పొందుచున్నాడు కదా! అటువంటిదే జాగ్రదవస్థ కూడా! ఈ జాగ్రత్‌ద్రష్ట తాను చూచే పదార్థములకు తన కల్పనలకు అభేదం తెలియక ఇక్కడ అనేకత్వానుభూతి అనుభవిస్తున్నాడు. ఈ జగత్తు వికసించినా ...ఇది నామమాత్రమే! బ్రహ్మసత్త మాత్రమే వాస్తవము. ఇదంతా వాసనామాత్రమే! స్వతహాగా ఇది చిద్ఘనప్రకాశమవటం చేత, నిత్య ప్రశాంతము. ఈ సృష్టి బ్రహ్మమందు తోచుచున్నప్పటికీ ఎక్కడా 'ద్వైతము' అనేది ఉండజాలదు.

❖❖❖

3. ఇక భేదమెక్కడిది?

శ్రీరాముడు : హే మహర్షీ! మీరు చిత్‌ను అచేతనమగు బిల్వఫలంతోను, శిలతోను పోల్చారు కదా! దాని తాత్పర్యమేమిటో కూడా కొంచెం వివరించండి.

శ్రీవసిష్ఠ మహర్షి : 'చిత్' తత్త్వము స్వరూపమునకు సంబంధించిన ఉత్సుకతను ఆశ్రయించినప్పుడు మాత్రమే ఈ సృష్టి సంభవిస్తోంది. సృష్టి అంటే స్వసత్త "యుగ - సంవత్సరములు - వస్తు సంబంధ అనుభూతి విశేషాలు" అను స్వప్నమునందు తన ప్రవృత్తిని ప్రవేశింపజేయుటయే.

వాస్తవానికి ఇక్కడ స్వగత భేదములకు తావు లేవు. దేశకాలాదులు బ్రహ్మము యొక్క కల్పనయే కాబట్టి, అవి కూడా చిన్మయములేనని చెప్పటానికి అర్హమగుచున్నాయి. కనుక ఇక్కడ 'ఇది చిత్-ఇది అచిత్' అనే విభేదం చేయజాలము.

'శబ్దములు, శబ్దార్థములు, వాసనలు, సంకల్ప వికల్పములు - వాటినన్నిటినీ అట్లు గ్రహిస్తున్న జ్ఞాత మొదలైనవన్నీ ఏకాత్మకములే' అని సూక్ష్మబుద్ధితో గ్రహించు. ఇక 'అసత్తు' అని దేనిని చెప్పవలె? ఫలం, అందలిగుజ్జు, రసం - ఇవన్నీ ఒకే వస్తువు అయినప్పటికీ 'ఇది రసం, ఇది గుజ్జు' అని వ్యవహరించబడుతోంది కదా! చిత్తు కూడా ఒకే విధమైన సద్ఘనమైనప్పటికీ వివిధ నామరూపాలతో వ్యవహరించబడుచున్నదని స్పష్టీకరించుకో. వాస్తవమైన ఏకైక స్వసత్తను ఏమరచి ఉండటమే అసత్తు!

❖

1. ఈ సృష్టి వైచిత్ర్యములన్నీ పెక్కు కాక పోయినప్పటికీ పెక్కుగానూ, అవికృతము గాకున్నను వికృతముగా కనిపించుచున్నాయి.

2. అయితే రాతితో మలచబడిన పద్మంలాగా, అద్దంలో ప్రతిబింబించే జంతు వృక్షాదులతో కూడిన అరణ్యంలాగా ఈ జగత్తు చిత్‌నందు ప్రతిఫలిస్తోంది.

3. నిజానికి ఈ జగత్తు బాహ్యమున లేదు. మరి ఎక్కడున్నది? ద్రష్టయగు నీయందే... నీ వల్ల... నీ యొక్క సంకల్పప్రతిపాదితంగా ప్రకాశిస్తోంది. చిత్ నందు చిత్‌చే కోరుకోబడే జగత్తులన్నీ ఇచ్ఛానుసారంగా స్ఫురిస్తున్నాయి.

ముత్యపుచిప్పలో ముత్యాలు ఉన్నట్లు 'చిత్‌శక్తి'అనే పేటికలో జగత్తులు అనే ముత్యాలు ఉన్నాయి. సరియైన విచక్షణ, విమర్శన లేకుండా చూడటంచేత ఈ జగత్తులు ద్రష్టయొక్క దృష్టిచే నిర్మించ బడినవైనట్లు కాకుండా ...మరింకెవరి చేతనో ఎన్నడో ఎందుకో నిర్మించబడియున్నట్లు అనిపిస్తోంది. సూర్యభగవానుడు తన ఉదయాస్తమయములచే రాత్రింబవళ్ళు కల్పిస్తున్నట్లు, ఆ చిత్ సూర్యుడు కూడా తన యొక్క సంకల్ప, వికల్పములచే ఈ జగత్తులను తోపింపజేయటం, ఇంతలోనే తనయందు విలీనమొనర్చుటం చేస్తున్నాడు.

ద్రష్ట ప్రసరించని దృశ్యము లేదు. దృశ్యము ద్రష్ట యొక్క స్వరూపమే! దృశ్యము 'ద్రష్ట యొక్క కల్పన' అను ముడిపదార్థంతో తయారయి ఉంటోంది.

సముద్రంలో కనిపిస్తున్న తరంగాలకు ఆధారం ఏమిటి? సముద్రజలమే కదా! ఆ తరంగాలు జలం నుండి వేరైనవా? నిరాకారమైన జలం తరంగాల రూపం సంతరించుకుంటున్నప్పటికీ, జలం సర్వదా తన నిరాకారత్వం కోల్పోతుందా? లేదే! అట్లాగే ఈ జగత్తులు చిత్ సత్తనుండి తన అఖండ – అప్రమేయ – నిత్యసాక్షీస్వభావాన్ని కోల్పోవటం లేదు. కోల్పోబోదు. ఓ రామచంద్రా! "ఇప్పుడు ఉన్నవి ఇతఃపూర్వం ఉండి నశించినవి, ఇక ముందు రాబోయేవి అయిన జగత్తులన్నీ కూడా చిత్ శిలయందు చెక్కబడిన శిల్పములు వంటివే. చిత్ జలంలోని తరంగముల వంటివే"... అని ఆత్మసద్విమర్శకులమగు మేమంతా గ్రహించి ఉన్నాము.

భావపదార్థములన్నీ అభావ పదార్థముయొక్క చమత్కారమైన ఒక అంశ మాత్రమే! అట్టి పదార్థసారంతోనే (నేను చెప్పిన దృష్టాంతంలోని) బిల్వఫలం నిండి ఉన్నది. కాబట్టి, సర్వపదార్థములూ 'బిల్వఫలంలోని రససారమే' అని రూఢి చేసుకో. ఈ తెలియబడుచున్నవన్నీ మృణ్మయములు కాదు. చిన్మయములే! భావనలలోంచి ఉదితములగుచున్న అనుభవములే! ఆ చిన్మయములైనవాటి యొక్క తత్త్వము చిత్తేగాని, మరింకేమీ కాదు.

❖

శిలను విడచి 'ఈ శిలయందు అనేక పద్మములు ఉన్నాయే!' అనునది ఏదో మాటవరుసకే అవుతుందిగాని, శిల నుండి బయటగా ...మరొకటిగా పద్మములు ఉన్నట్లు అవదే! చిత్ నుండి వేరు చేసి చూస్తే ఈ జగత్తు 'అసత్తు' అవుతుంది. శిలానిర్మితపద్మంలో శిల లేకుండా చూడు...అక్కడ

పద్మమెక్కడున్నది? ఇక్కడ తారసపడే నానాత్వమంతా ఒకే శిలపై చెక్కబడిన ఆకారములవంటిది మాత్రమే. ఇందులో సందేహించవలసినపనేమీ లేదు.

శిల గురించి పూర్తిగా ఏమరిచినప్పుడు 'ఇది పువ్వు, ఇది కాయ, ఇది మనిషితల, ఇది జంతువు, ఇది మిత్రుడు, ఇది మనసైన్యం, ఇది శత్రుసైన్యం' – అనబడు శిల్పకళా విశేషాలన్నీ ఆకట్టుకుంటూ ఉంటాయి కదా. 'సర్వమూ శిలామయమే' అనే దృష్టితో చూస్తున్నప్పుడు ...ఆ విభేదాలు ఏమౌతాయి? అర్థరహితమౌతాయి కదా! ఈ జగత్తుల ఉత్పత్తి, క్షయాలు అట్టివే! ద్రష్ట యొక్క స్వస్వరూప, స్వస్వభావముల దృష్ట్యా పరిశీలిస్తే ఇక్కడ సర్వదా అవిభక్తమైన (Indivisible) చిద్ఘనజ్ఞానమే లభిస్తుంది.

శ్రీరాముడు : అసలు 'అనేకత్వము' అనే భ్రమ ఎందుకు ఏర్పడుతోంది.

శ్రీవసిష్ఠ మహర్షి : దాహముచే పరితపిస్తున్న కొందరు మూర్ఖ, అవిజ్ఞాత జీవులు జలం కొరకై అటూ ఇటూ చూస్తున్నారు. వారిలో ఒకడికి మృగతృష్ణ, అందులో జలం కనిపించాయి. 'అదిగోరోయ్! అక్కడ జలం ఉన్నట్లే ఉన్నది' ...అని పొలికేక వేసి పరుగులు తీస్తున్నాడు. ఇక తదితర అమాయక జీవులు 'అక్కడ జలం లేకపోతే మనవాడు కేక ఎందుకు వేస్తాడులే'– అని అనుకుంటూ పరుగులు తీస్తున్నారు. 'ఈ ఎండలో ఈ ఎడారి ఇసుకమయమే కదా! ఇక్కడ నీరు ఎట్లా ఉంటుంది? మెరుస్తున్నంత మాత్రం చేత అది జలమే అవవలసిన పనిలేదు కదా?'–అని వారు విమర్శించటం లేదు. వారి ఆర్తి అలాంటిది.

అయితే ..."ఆ సువిశాల ఎడారి, ఇసుక ప్రాంతంలో నీరు ఉండటానికి అవకాశం లేదు" అని గ్రహించినవారు, "అది గాలి వీచికలు, సూర్యకిరణముల మేళవింపు మాత్రమే..." అని గ్రహించి తదితర అమాయకజనుల వలె నిష్ఫలమైన శ్రమకు లోనుకాకుండా 'అసలు, నిజమైన జలం ఎక్కడ లభిస్తుంది' అని వెతికి వాస్తవమైన జలం ఉండే స్థానం వైపు పయనిస్తున్నారు.

ఈ జీవుడు తనను సత్ – అసత్‌మయమగు శరీరమాత్రుడుగా తలచుచున్నాడు. కాని ఆతడు వాస్తవానికి చిన్మాత్రుడు. తెలియబడుచున్న సర్వమునకు ఆధారభూతుడు. పరస్వరూపుడు.

యథా సమ్యక్ పయోరాశిః కోటరే కలనోన్ముఖమ్ ।
ద్రవత్వాత్స్పన్దతేఽస్పన్దం తథేదం చిద్ఘనాన్తరమ్ ॥ (శ్లో॥ 16, సర్గ 47)

జలము స్వతహాగా స్పందనరహితమైనప్పటికీ ద్రవత్వస్వభావం చేత పల్ల ప్రదేశములందు కదిలే స్వభావం కలిగి ఉన్నట్లు తోచుచున్నది కదా! అదేవిధంగా చిత్‌ఘనము తనయందు స్వతహాగా చలన – సంచలనములు కలిగి ఉండనప్పటికీ, జగత్తును స్వీకరించుచున్నప్పుడు స్పందనసహితము వలె తోచుచున్నది.

శిలయందు ఉన్న (చిత్రంచబడిన) శంఖము వాస్తవానికి శిలయే అయినట్లు, చిత్ శిలయందు ప్రకటితమగుచున్న ఈ జగత్తు అనబడేది చిన్మయస్వరూపముకాక మరింకేదీ కాదు. అయినప్పటికీ, సాధారణ బుద్ధికి ఇదంతా మరింకేదోగా కానవస్తోంది. ప్రియశిష్యా! రామచంద్రా! నీవు మాత్రం ఈ దృశ్యమునంతటినీ – స్వశరీర – మనో – బుద్ధి – చిత్త – అహంకారములతో సహా, సర్వదా చిన్మాత్రంగానే దర్శించు. దీని యందు ఏ సమయమందూ ఎట్టి వికారములూ లేనే లేవు.

ఈ జగత్తుకు జననమరణాలు లేవు. ఇది స్వభావ శాంత సమన్వితమై కూడా మిథ్యా దృష్టిచే ఉద్వేగముతో కూడిన నవరసములను, అసంఖ్యాక సంభ్రమములను కలుగజేయగలుగుతోంది. బ్రహ్మము తనకు తానుగా ప్రకాశిస్తూ అదే కారణంగా తదితరమైన సర్వమునూ ప్రకాశింపజేస్తోంది.

ఈ జగత్తు వాసనామాత్రమగుట చేత అనిత్యం... ఇది బ్రహ్మం నందే ఉండుట చేత నిత్యం.

నిజమైన పద్మము యొక్క తీవ్రధ్యాస గలవారికి శిలలోని పద్మము, పద్మమునకు సంబంధించిన అనుభూతిని కలుగజేస్తోంది. శిలను ఏమరచేటట్లు చేస్తుంది. శిలాప్రతిమలపై చిత్రించిన శృంగార చిత్రం కాముకుడగు వానికి తదనుగుణమైన స్ఫురణోత్సాహం కలుగజేస్తోంది. అయితే, అది వాస్తవానికి శిలే కదా...! ఈ జగత్తు ద్రష్ట యొక్క భావన, అవగాహన, ఉద్దేశము, అనుభూతులను– అనుసరించి తదనుగుణంగా అనుభవమౌతుంది. అఖండము, నిత్యము, నిర్మలము, అప్రమేయము – అగు బ్రహ్మానుభూతి సమన్వితునికి ఇదంతా స్వచ్ఛం, అద్వితీయం అగు బ్రహ్మముగానే అనుభవమౌతోంది. శిలచే చిత్రించబడిన ఎలుగుబంటి దూరంగా ఉండి చూచే బాలురవంటి వారికి 'అరె! ఆ ఎలుగుబంటి నా వైపే గుఴ్ఱున చూస్తోందే!" అని అనిపించవచ్చు. దగ్గరకు వెళ్ళి చూస్తేనో... అది నిష్క్రియమగు శిలయేనని తెలిసిపోతోంది కదా! బ్రహ్మభావాభ్యాస ప్రభావంచే ప్రకాశించే ప్రశాంత హృదయులకు ఈ జగత్తు అనుద్వేగకరమగు మౌనతత్త్వముగా తెలియవస్తోంది.

శిల యందు శిలత్వము, శిల్పత్వము, శిల్పాంతర్గత కథనము – ఉన్నట్లు బ్రహ్మమున బ్రహ్మత్వము, ఈ జగత్తు కూడా ఉన్నాయి.

చెట్టు, చెట్టు యొక్క ఆకారము 'ఒక్కటే' అయినట్లు ... బ్రహ్మము, జగత్తు వేరు వేరు కాదు. రెండు చిన్మయములే! ఈ కనబడేదంతా మృణ్మయదృష్టి కలవారికి మృణ్మయంగాను, చిన్మయ దృష్టి కలవారికి చిన్మయంగాను అనుభూతమౌతోంది.

❖

ఓ రాఘవా! మరొకసారి ప్రకటిస్తున్నాను. 'చిత్తు'లాగానే ఈ జగత్తుకు కూడా ఉత్పత్తి వినాశనాలు లేవు. ఎండమావులను ప్రకాశింపజేస్తున్నది ఆకాశంలోని సూర్యుడే కదా! బ్రహ్మమే ఈ జగత్ప్రకాశానికి కారణమగుచున్నది. ఒకే జలం ఎండ వేడిమిచే ఆవిరి, మేఘాలు, వడగళ్ళుగా అగుచున్నది కదా! తత్త్వజ్ఞులకు ఈ సర్వ పదార్థముల మూలం బ్రహ్మమేనని తెలుసు. వారు గొప్ప పర్వతం నుండి ఒక గడ్డిపరక వరకు సర్వమూ బ్రహ్మమయమేనని గ్రహించియే సంచరిస్తున్నారు.

జలపరమాణువునందు ఏ రసశక్తికలదో ...స్థూలమగు జలమునందు కూడా అదే గోచరిస్తుంది కదా! ఆ చిత్‌శక్తియే పంచీకృత అపంచీకృతములగు స్థూలసూక్ష్మ భూతములందు నిండి ఉన్నది. ఒకే విధమైన 'శక్తి' గడ్డిలోను, ఆకులలోను, లతలలోను, ఈ కనబడే నానావిధపదార్థములందూ దాగి ఉన్నది కదా! (సర్వమ్ శక్తిమయమే!) బ్రహ్మమే ఈ నానా విధములుగా తోచుచున్న వివిధ వస్తువులతో పరివ్యాప్తమైయున్నది. నెమలి గుడ్డులో నెమలి పింఛము యొక్క రంగురంగులు దాగి ఉన్నవి కదా! పరమాణువు నందు పదార్థస్వభావమంతా ఒదిగి ఉంటోంది. బ్రహ్మమునందు

గుణములు, ఆ గుణములకు ఆధారమగు ఆవిర్భావ, తిరోభావములు, వాటిని అనుభూతి పొందే గుణి...అన్నీ కూడా రసస్వరూపమై ఒదిగి ఉన్నాయి. అయినప్పటికీ అవన్నీ బ్రహ్మమునందు ఆపాదితములైనవేనని గ్రహించు.

వివేకదృష్టితో పరికించి చూచేవానికి "ఈ నానాత్వమునకు కారణమైన బ్రహ్మము అద్వయము" అని తెలిసిపోతోంది. వాస్తవానికి అది ద్వైత - అద్వైతములకు కూడా అతీతమైనది. సత్ - అసత్తులయందు సమత్వమున ఏదైతే సర్వదా వెలయుచున్నదో...అదియే బ్రహ్మము. అనుభూతములన్నీ బ్రహ్మమునందే, బ్రహ్మముచేతనే ఉదయిస్తున్నాయి. అద్దాని సమక్షమునందు అనుభూతి ఉంటోంది. లయిస్తోంది.

ఈ జగత్తు చిద్రసముతో నిండిఉన్నదై, తనకు తానే ఉనికిని కల్పించుకుంటోంది. జగత్తు అనే రసము బ్రహ్మము నందే ప్రకాశిస్తోంది. బ్రహ్మమునకు వేరుగా జగత్తు లేదు. జగత్తంతా బ్రహ్మరసముచే నింపివేయబడి ఉన్నది. ఇక భేదమెక్కడికి?

❖❖❖

4.స్వస్వరూపానంద సుస్థిరత్వం

శ్రీవసిష్ఠ మహర్షి : ఒక నెమలి గ్రుడ్డులో - నెమలి యొక్క రూపం, పింఛం, ఆ పింఛంలోని రంగుల వలయాలు, జూలు, పెద్ద రెక్కలు, సన్నటి పొడవైన కాళ్ళు, గోళ్ళు- మొదలైనవన్నీ దాగి ఉన్నాయి కదా! అట్లాగే విశుద్ధమగు చిత్ అండముతో అహంకారము-బుద్ధి-చిత్తము మొదలైన వాటితో కూడిన అంతర్ జగత్తు ...దిక్కులు - ఆకాశం మొదలైన వాటితో కూడిన బాహ్యజగత్తు అనభ్యుతములై (As non-Provoked) వెలయుచున్నాయి.

ఆ చిద్ఘనానందమే ఈ సర్వ శరీరావయవాలకు రసమై - "ప్రాణంగాను - విషయసుఖసారాలైన చిత్తవృత్తి భేదాలుగాను, భోగ్య - భోగాది వస్తువులుగాను" - అద్దంలోలాగా ప్రతిబింబిస్తున్నది.

మనం ప్రతిబింబితమైన విషయానందమును చూస్తున్నప్పుడు ...ఆ ప్రతిబింబమునకు మూలమైన చిద్ఘనరూప నిరతిశయానందము యొక్క ఉనికిని ఒప్పుకోక తప్పదు. ఆ నిరతిశయానందం స్వాత్మానుభవ రూపమే సుమా! స్వాత్మానుభవరూపమునే తురీయమని కూడా అంటున్నారు. అట్టి నిరతిశయానందాన్ని మునులు, దేవతలు, గణములు, సిద్ధులు, మహర్షులు అగు వారిలో అనేకులు అనుభవిస్తూనే ఉన్నారు. నిర్నిమేషులై స్థిరపడిన దృష్టిని అధిరోహించి, దృశ్యదర్శన రహితులై నట్టి మహనీయులెందరో ఆ స్వస్వరూపానందమున తేలియాడుచున్నారు. అట్టి దృశ్యదర్శనరహిత మైనట్టి స్వస్వరూపంలో నిలకడ పొందలేక ప్రాణ చలన చిత్త విక్షేపములకు చోటిచ్చుటచేతనే ఈ జీవులలో అనేకులకు ఆ ఆనందం అనుభవానికి రావటం లేదు. ఇంతకు మించి వేరే కారణమేదీ లేదు.

శ్రీరాముడు : హే మహర్షీ ! మీరు ఉదహరిస్తున్న "స్వస్వరూపానంద సుస్థిరత్వం" మరికొంత విస్తారంగా వివరించండి.

శ్రీవసిష్ఠ మహర్షి : స్వస్వరూపము యొక్క మహత్తరానుభవమనునది ఎరిగి ఉన్న ఆత్మజ్ఞులు ఈ కర్మలలో నిమగ్నమగుచున్నప్పటికీ ...వారు బాహ్య వస్తువుల చింతనలో ఒక్క నిమిషం కూడా నిమగ్నమవటం లేదు. జ్ఞానజ్ఞేయములను సర్వదా త్యజించివేసి ఉంటున్నారు. అనగా 'తెలుసుకునేది, తెలియబడేది' అను ద్వంద్వమునకు ఆవల తమ స్వరూపమును ప్రతిక్షేపించుకుని ఉంటున్నారు. అట్టి దృష్టి-అవగాహన-భావన-అనుభవములను శాస్త్ర పరిభాషలో 'సమాధి' అని పిలుస్తున్నారు. ఒక చిత్రంలోని మనిషికి స్పందనాస్పందనములు ఉండవు కదా! స్వస్వరూపానుభవి యొక్క అంతరంగం స్పందనాస్పందరహితంగా ఉంటుంది. వారు చిత్తమును, చిత్తమునకు ఆశ్రయమై ఉంటున్న విషయములను సదా త్యజించినవారై ...తత్ఫలితంగా 'భూమానందము' అని చెప్పబడే 'సర్వ సమభావన'ను పొందుచున్నారు.

ఆ పరమేశ్వరుడు అంతరమున స్వస్వరూపానందమయుడై ఉండి కూడా బాహ్యమున 'మాయ' అగు ఈ జగత్తును నడిపిస్తున్నారు కదా! అదే రీతిగా ...జ్ఞానోదయమై, స్థిర స్వభావులైన మహానుభావులు అంతరమున స్వస్వరూపమును ప్రతిక్షేపించుకుని, ఇక బాహ్యమున వ్యవహారములు సలుపుచూ ఉన్నారు. ఓ రామా! నీవు కూడా నిరభ్యంతరంగా ఇప్పటికిప్పుడే అజ్ఞానమయములైన ద్వైత భావములను వదలివేయి.

శ్రీరాముడు : అప్పుడు కర్మలు నిర్వర్తించటం సులువు కాదేమో!

శ్రీవసిష్ఠ మహర్షి : కాలానుగుణంగా సంప్రాప్తించే కర్మలలో పాల్గొనుచూ భూమానందము, లేక సమాధిని అవధరిస్తున్న వారెందరో ఉన్నారయ్యా! నీ అంతరంగ సునిశ్చితబుద్ధిని బయటనుండి నిన్ను అడ్డుకోగలిగేది ఈ చరాచర సృష్టిలో ఏదీ లేదు.

చంద్రకిరణములు వృక్షములందు, ఆకులందు, చిగుళ్ళయందు ప్రవేశించి వాటిని రసభరితం చేస్తూనే తన ప్రశాంత తత్త్వమును కొనసాగిస్తున్నాయి కదా! చంద్రకిరణములు ఒకానొక చోట అగ్నిగుండముపై ప్రసరించినంత మాత్రం చేత చంద్రమండలం తన చల్లదనం కోల్పోతుందా?... లేదు కదా! మహాత్ముల బుద్ధి - 'చిత్తవృత్తులు, బాహ్యవిషయముల'తో కూడుకుని ఉన్నప్పటికీ సర్వదా నిరతిశయానందమును అభివ్యక్తం చేస్తూనే ఉంటోంది. వారి వాక్కు, యోచన - అన్నీ కూడా 'ఇచ్ఛ, ఆశయ, ద్వేష, ఉద్వేగ, నిరుత్సాహములను' అధిగమించి ఉంటున్నాయి. అందుచేత అన్నివేళల, అన్ని స్థితులందు విక్షేపరహితమైన ఆహ్లాదమును వారు ప్రాప్తించుకుని ఉంటున్నారు.

చంద్రుని వెన్నెలకు రూపమేముంది?... అదేవిధంగా శుద్ధసంవిత్తుకు ఎట్టి రూపమూ లేదు. స్వస్వరూపానుభవజ్ఞులు రూపాతీతమైన అనుభవమునందు వెలయుచున్నారు.

అట్టి స్వస్వరూపానుభవం చూడబడజాలదు. ఉపదేశించబడజాలదు. అది దూరం కాదు. దగ్గర కాదు. అది కేవలం అనుభవయోగ్యం అని చెప్పాలి. దానికి దేహేంద్రియ మనోప్రాణములు లేవు. సంకల్ప-వాసనలు లేవు. అది జీవుడు కాదు. స్పందన కాదు. సంవిత్తు కాదు. జగత్తు కాదు. అత్యంత సన్నిహితం-దూరం-మధ్యం కాదు. శూన్యం-అశూన్యం-శూన్యాశూన్యాలు కూడా కాదు.

శ్రీరాముడు : మరి అట్టి స్వస్వరూపమును గుర్తించటం, అధిరోహించటం ఎట్లా?

శ్రీవసిష్ఠ మహర్షి : ఈ నా వాక్యములు ఉత్తమవివేకంతో విచక్షించుకో. అది అధిరోహించవలసినది నీవేగాని, నేను గురువుగా ఇంతకు మించి స్పష్టపరచలేను.

ఇక్కడి దేశకాలాదులచే 'స్వస్వరూపానందప్రతిష్ఠ'ను నిర్వచించలేం. ఎందుకంటే అది దేశకాలాదులందలి పదార్థమేదీ కాదు. అయితే ఏం? దేశకాలాదులుగా పరిచ్ఛిన్న స్వభావం ప్రదర్శిస్తున్నది అదే! అది విషయములన్నింటికీ వేరయి కూడా, తానే అనంతములగు వాసనలతో గూడిన హృదయ కోశమును కలిగి ఉంటోంది. అద్దాని స్వస్వరూపమహిమ వలననే దృశ్యవస్తువులు ఆవిర్భవించి విలయమొందుతున్నాయి. స్వస్వరూపసత్తకు శాస్త్రములు 'ఆత్మ' అను పేరుపెట్టాయి. అది నిష్కారణమై, కారణములన్నిటికీ కారణమై చెన్నొందుచున్నది. ఈ వాయువు, అగ్ని మొదలైనవన్నీ దాని రూపమును మార్చలేవు. ఇహలోక, పరలోకములు ఆ స్వస్వరూప సద్రూపమును మరొక తీరుగా చేయజాలవు. వేలకొలది దేహములు ఉత్పన్నమై, వినాశమగుచుండగా ఆ స్వస్వరూపం మాత్రం స్వస్థానముననే ఉండి వాటన్నిటికీ సాక్షి మాత్రమై వెలుగొందుతోంది. అద్దాని వెలుగుచేత ...అద్దాని సమక్షంలో ఈ వేలాది దేహములు వస్తున్నాయి, పోతున్నాయి.

ఆత్మాకాశము యొక్క బయటగాని, లోపలగాని ఎట్టి వికారములు మార్పు చేర్పులు లేవు. ఈ దేహములకు స్ఫురిస్తున్న వికారములేవీ ఆత్మకు ఉండజాలవు. అట్లని ఈ దేహములు ఆత్మ కాక మరొకటేదో నని అనుకోవద్దు. ఇక్కడ వికారములు స్ఫురించటానికి కారణం 'బోధ' యొక్క వికృతియే గాని మరొకటేదీ కాదు. అందుచేత పరిపక్వమైన స్వబుద్ధిని సంపాదించిన జ్ఞానులు ఈ విశ్వమును 'ఆత్మ'గానే గ్రహిస్తున్నారు.

శ్రీరాముడు : అట్టి అఖండమగు స్వస్వరూపసమేతుడనగు నాకు ఇక్కడ కర్తవ్యమేమిటి? అకర్తవ్యమేమిటి?

శ్రీవసిష్ఠ మహర్షి :

ప్రజ్వలన్నపి కార్యేషు నిర్వాణో నిర్మమో భవ ।
యదిదం దృశ్యతే కించిజ్జగత్స్థావరజంగమమ్ ॥ (శ్లో 18, సర్గ 48)

తత్సర్వం బ్రహ్మ నిర్ధర్మ నిర్గుణం నిర్మలాత్మకమ్ ।
నిర్వికారమనాద్యన్తం నిత్యం శాన్తం సమాత్మకమ్ ॥ (శ్లో 19, సర్గ 49)

ఇక్కడ అవిశ్రాంతంగా కార్యములు ఒనర్చుచున్నప్పటికీ, నీవు నిర్వికారమగు ఆత్మను ఇక్కడ దర్శిస్తూ ఉండు. ముక్తాత్మ స్వరూపుడవై సర్వప్రకాశకమగు స్వీయ కాంతితో ప్రకాశించు.

కనులకు కనబడుచున్న ఈ స్థావరజంగమాత్మక జగత్తు అంతా నిర్గుణము, నిర్మలాత్మకము ఉపాధిధర్మ విరహితము అగు బ్రహ్మమేనయ్యా! అది ఆద్యంతహీనము, నిత్యము, శాంతము, సన్మాత్రము అయి ఉన్నది ఇక నీకు సందేహమెందుకు?... వికారాదులెందుకు?

వత్సా! ఈ కాల–కర్మ–కారణ–కర్మ–క్రియ–నిదాన–సృష్టి–స్థితి–లయ–స్మరణ–విస్మరణాదులన్నీ కూడా బ్రహ్మమేనని గ్రహించు. బ్రహ్మముతో మాత్రమే ఐక్యము సంపాదించుకో. అప్పుడిక ఈ సంసారచక్రములో పడి పరిభ్రమించటం జరగనే జరగదు.

❖❖❖

5. ఆత్మ సర్వదా నిర్మలమే!

శ్రీరాముడు : హే పరమ బ్రహ్మజ్ఞా! గురుదేవా ! "నిరతిశయము మహోత్తమము"అగు బ్రహ్మవస్తువు నందు దేశ-కాల-నిమిత్తములు అనే పరిచ్ఛేదమే లేదని మనం అనుకుంటున్నాం కదా! అట్టి వికారాలకు తావు లేనపుడు మరి అది భావ-అభావముల రూపంలో ఎట్లు, ఎందుకు ప్రకాశిస్తోంది?

శ్రీవసిష్ఠ మహర్షి : ఆత్మకు భూత-భవిష్యత్తు-వర్తమానములతో పరివర్తనమంటూ లేదు. అది కాలముచే బద్ధమైనది కాదు.

పాలు పెరుగుగా మారుతున్నప్పుడు 'పాలు పెరుగుగా పరివర్తనమౌతోంది' అని అంటున్నాం. ఆ పరివర్తనమునే 'వికారం, పరిణామం' అనే మాటలతో వ్యవహరిస్తున్నాం. ఎందుకంటే ఇక పెరుగు తిరిగి పాలుగా మారే ప్రసక్తి ఉండదు కదా! బ్రహ్మం-జగత్తు అట్టి పాలు-పెరుగు వంటివి కాదు.

బ్రహ్మమునకు పరివర్తనం లేదు. అది జగత్తుగా మొదలే మారటం లేదు.

అయితే ...ఈ జగత్తు యొక్క ఆదిమధ్యాంతము లందు కేవల నిర్మల బ్రహ్మమే వెలయుచున్నది.

పాలకు ఉండే వికృతి బ్రహ్మానికి లేదు. బ్రహ్మం 'అనాది, అనంతం' – అగు వస్తువు. అందుచేత అవయవసంయోగం, అన్యద్రవ్య సంబంధం మొదలైనవి బ్రహ్మమునకు సంబంధించి లేవు. ఇక సర్వసమమగు బ్రహ్మమునందు ఒకనికి కనిపించే ఈ జగత్తు స్వయంకృతభ్రమకు సంబంధించిన వివర్తం మాత్రమే. బ్రహ్మమును భావన చేసేవానికి భావ – అభావ జగత్తు మిథ్యగానే తెలియవస్తోంది. బ్రహ్మము అనగా సంస్పర్శరహితమగు చిదాత్మయే కదా! అద్దానిలో జ్ఞానజ్ఞేయములు లేవు.

బ్రహ్మమునందు జ్ఞానజ్ఞేయములు కూడా లేవు. అది సృష్టికి పూర్వమున, పరమున కూడా ఉన్నది. అద్దాని యందు జగత్తు మొదలైన భ్రమలు లేనేలేవని గ్రహించు. పూర్వమున, పరమున ఒకే తీరుగా ఉన్న బ్రహ్మము మధ్యలో మాత్రం మరొక తీరుగా అగుచున్నదా? లేదు. లేనే లేదు. మధ్యకాలంలో ఇంకొక రీతిగా తోచటం కేవలం భ్రమ మాత్రమే.

"ఆత్మ ఆది-అంతము లందు, మధ్యలోను సర్వత్రా సర్వవైపులా సమస్వరూపమున వెలయు చున్నది." ఇక ఈ దృశ్య-దర్శన వివర్తము ఉంది చూచావు?... ఇది ఆత్మ సంబంధీయమే కాని, 'ఆత్మతత్త్వం మాత్రం కాదు. ఆత్మ సంబంధీయమైన దానితో ఆత్మ వికారం పొందుట లేదు.

సర్వశక్తిమంతమగు బ్రహ్మము లేక ఆత్మ రూపరహితము... ఏకము... నిత్యము కూడా. అందుచేత ఈ భావవికారాలకు అది ఎన్నడూ వశమగుటలేదు.

శ్రీరాముడు: మరి పరిపూర్ణము – నిర్మలము – సద్రూపము – ఏకము అగు బ్రహ్మమున 'అజ్ఞానం' అనతగ్గ అవిద్య ఎక్కడ నుండి వస్తోంది?

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఈ భూత, భవిష్యత్, వర్తమాన కాలములందు 'బ్రహ్మతత్త్వం' ఒక్కటే వెలయుచున్నదని మరొక్కసారి చేతులెత్తి ప్రకటిస్తున్నాను – అది అనాది ...అనంతము!

ఇక అవిద్య ఏమంటావా?... అవిద్య అనునదే లేదు. ఇది నిశ్చయమగు సత్యము.

ఇక బ్రహ్మము యొక్క సద్భావం గురించి, అసత్ విభాగం గురించి వేరువేరుగా చెప్పుకోవటం కేవలం ఉపదేశ సౌలభ్యం కొరకు మాత్రమే. 'ఇది బ్రహ్మతత్త్వము'... అని అనుభవజ్ఞుడగు గురువు శిష్యులకు ప్రతిపాదించి చెప్పుకొస్తున్నప్పుడు, ఆ శిష్యులకు అవగతమవటానికి వీలుగా అనేక వాచ్య-వాచక శబ్దములన్నీ కల్పించబడుచున్నాయి. అంతేకాని, అదంతాకూడా బ్రహ్మమునుండి వేరైన మరొకదానిని వర్ణించడం కానే కాదు. నీవు, నేను, జగత్తు, భూ, దేవలోకములు, మనోబుద్ధి, చిత్తాహంకారాలు -। అన్నీ కూడా ఆద్యంతరహితమగు బ్రహ్మము కాక మరింకేమౌతాయి? అవిద్య అనేది ఒకించుక కూడా లేదు. ఇక వివర్తము, అవిద్య, భ్రమ...అనునవన్నీ నామమాత్రమే. అవన్నీ ఆత్మ యొక్క ఏమరుపును ఉద్దేశిస్తున్నాయని గ్రహించు. అవిద్య అనునది సత్యం యొక్క అభావం మాత్రమే నని ఈ సభలోని, తదితర ప్రపంచంలోని అనేకమంది తత్త్వజ్ఞులు ఎరిగియే ఉన్నారు.

ఓ రాఘవా! 'లేనిదే' అగు అవిద్య ఎట్లా ఉదయిస్తుంది? ...అది సత్యమెట్లా అవుతుందయ్యా!

శ్రీరాముడు : ప్రభూ ! మరి మీరు ఉపశమన (ప్రకరణ) ప్రవచన సందర్భంలో "అవిద్యను ఎట్లా సంబోధించాలి?" - అను విషయంలో అనేక విశేషాలు చెప్పారు కదా! దాని మాట ఏమిటి?

శ్రీవసిష్ఠ మహర్షి : అవును, చెప్పాను. అప్పుడు కొంత అజ్ఞానదశలో ఉండటం చేత నీకు అలా కల్పించి చెప్పవలసి వచ్చింది. ఇప్పుడు క్రమేపీ సంభాషణలు ఆత్యంతిక జ్ఞాన విషయాన్ని సమీపిస్తున్నాయి. ఇప్పుడు నీవు ప్రబోధితుడవు అయ్యావు. ఇక నీకు అట్లు చెప్పవలసిన పని లేదు.

అవిద్య జీవుడు మొదలైన కల్పనలన్నీ అజ్ఞానదశలో శిష్యులకు ఉపదేశించటానికి పండితులచే కల్పించబడ్డాయని నీకు ముందే చెప్పాను కదా!

మనస్సు అజ్ఞానదశలో ఉన్నప్పుడు శాస్త్రోక్తము అయిన 'అవిద్యా ఉపదేశము' లేకుండా ఎన్ని విధములుగా "తత్త్వమ్, సోఽహమ్" వంటి మహావాక్యాల పరమార్థటం ఉపదేశించినప్పటికీ ఆ మనస్సులో ప్రబోధము ఉదయించటం లేదు. ఒక విద్యార్థికి అతని దశను అనుసరించి అతని పరిభాషలో విషయాన్ని బోధించవలసి ఉంటుంది. ఉత్తరోత్తరా ప్రారంభంలో ఉపయోగించే యుక్తులు అవసరం ఉండదు కదా!

శిష్యుడు యుక్తులతో బోధింపబడి ఆత్మతత్త్వం విశదీకరించబడి, ఆ తరువాత 'తత్ త్వమ్ - ఆ అఖండమగు ఆత్మయే నీవు'... నీవు చూస్తున్న నీవు, కూడా - అని సుస్పష్టీకరించబడుతోంది.

నూరురకాలుగా ప్రయత్నించి కూడా సాధించబడని ఒక కార్యం యుక్తిచే సాధించబడుతోంది కదా! అజ్ఞానికి సందేహములు తొలగని వారిని సమీపించి 'అంతయూ ఆత్మయేనయ్యా' అను సిద్ధాంతం చెప్పితే లాభమేమిటి? అది ఒక శిలను-మిత్రునిగా భావించి తన కష్టములు చెప్పుకొని ఉపాయాలకు సంప్రతించటం వంటిదే అవుతుంది.

మూఢుడు యుక్తి వలన, ప్రాజ్ఞుడు తత్త్వము వలన బోధించబడుచున్నారు. యుక్తి సహాయంతో బోధించకపోతే మూర్ఖుడు ప్రాజ్ఞుడు అయ్యేదెట్లా?... నీవు ప్రబోధం పొందే వరకు 'యుక్తి'తో బోధించాను. ఇప్పుడు ప్రబుద్ధుడవటం చేత సూటిగా తత్త్వమునే చెప్పుచున్నాను.

నాయనా! ఇక విను-

బ్రహ్మాహం త్రిజగద్బ్రహ్మ త్వం బ్రహ్మాఖలు దృశ్యభూః ।
ద్వితీయా కలనా నాస్తి యథేచ్ఛసి తథా కురు ॥ (శ్లో॥ 23, సర్గ 49)

నీవు, నేను, త్రిజగత్తులు, దృశ్యములు -మొదలైనవన్నీ నిశ్చయంగా బ్రహ్మమే! ఇక్కడ ఇంకొక వస్తువన్నది లేదు. ఇది గ్రహించి ఆపై, నీ ఇష్టానుసారం వ్యవహరించు. గ్రహించిన తరువాత యథారీతిగా వ్యవహరిస్తుంటే బ్రహ్మము యొక్క వాస్తవ తత్త్వమునకు వచ్చే హాని ఏమీ ఉండదు.

అసంవేద్యమహాసంవిత్కోటిమాత్రం జగత్త్రయమ్ ।
ఏకప్రత్యయవాన్తః కుర్వన్నపి న లిప్యతే ॥ (శ్లో॥ 24, సర్గ 24)

'సర్వవిధ భ్రాంతులు లేనట్టి - జ్ఞేయము కాజాలనట్టి చైతన్య బ్రహ్మమొక్కటే సర్వే సర్వత్రా అనుస్రుతమైయున్నది'... అని గ్రహించి కార్యములను నిర్వర్తించే వానిని ఆ కర్మసంగ దోషములుగాని, దుఃఖ దోషములుగాని అంటవు.

ఓ రాఘవా! "కూర్చుని ఉన్నప్పుడు ఊపిరి పీల్చుచున్నప్పుడు, నిద్రించుచున్నప్పుడు, చదువునపుడు, వ్రాయునపుడు కూడా "నేను సర్వదా ప్రకాశరూపుడు, చేతనుడు, సర్వవ్యాపియగు పరమాత్మనే" అనియే భావించు. నీవు కనుక మమకారము కించిత్ కూడా లేక, నిరహంకారుడవై, ప్రాజ్ఞుడవై ఉంటే తక్షణమే సర్వ జీవులూ ఎందులో వెలయుచున్నారో ...అట్టి శాంత చిదేకరసమగు బ్రహ్మము అవుతావు.

సత్యం, ఆద్యంతరహితం, ప్రకాశమయం - అగు ఆ పరమపదమే నీవు. నీవు సర్వదా సర్వ వ్యాపివయి, ఏకాత్మకుడవై, శుద్ధచైతన్య స్వరూపుడవై వెలయుచునే ఉన్నావు. ప్రపంచంలోని కుండలన్నీ కూడా మట్టికి అభిన్నమైనవే కదా! బ్రహ్మ మొదలుగా సర్వమునందు సదాత్మ ఒక్కటే వెలయుచున్నది.

ప్రకృతి ఆత్మ కంటే వేరు కాదు. ఘటం (కుండ) యందు మట్టి యొక్క మృణ్మయతే వెలయు చున్నది కదా! ఆత్మయే ప్రకృతియందు వెలయుచున్నది.

ఒకచోట నిశ్చలమైన నీరే మరొకచోట సుడిగుండాలు ప్రదర్శిస్తోంది కదా! ఆత్మ యొక్క ఒకానొక స్పందనయే ఈ ప్రకృతి. కనుకనే ప్రకృతి ఆత్మయే అవుతుంది. 'వాయువు-వాయువు యొక్క స్పందనం' పేరుకు మాత్రమే వేరు కదా! ఆత్మ - ప్రకృతులు వేరు వేరుగా అగుపిస్తున్నప్పటికీ వాస్తవానికి అవి వేరు వేరు కాదు. అట్టిది రజ్జు-సర్ప భ్రాంతి వలె అజ్ఞానము చేత ఉదయించి, మరల జ్ఞానముచే తొలగిపోతోంది.

చిత్క్షేత్రంలో 'కల్పన' అనే బీజం ఉదయించి 'చిత్తం' అను అంకురమునకు త్రోవతీస్తోంది. అదే సంసారం. అది భూత - భవిష్యత్తుల కల్పనకు కారణమౌతోంది. ఆ కల్పనా బీజం 'ఆత్మ విజ్ఞానం' అనే అగ్నిలో దగ్ధమైతే ఆపై 'వాసనలు'అనే నీరు పోసినాకూడా, కారణరూపమైన చిత్తాంకురం చిగురించదు.

ఓ రామా! నీవు ఆత్మబోధను పొందావు. పొందిన బోధనను ఆకళింపు చేసుకుని అజ్ఞాన ప్రసూతము, భ్రమయుక్తము అగు ద్వైతభావమును పరిత్యజించివేయి.

ఆత్మైక్యభావరూపమైన నిరతిశయానంద వైభవమునందు పరిపూర్ణుడవగుము. అభయాత్ముడవు కమ్ము. త్రికాలములందూ కూడా 'దుఃఖము'అనునది స్వతహాగా లేదు... ఇదియే మేము చెప్పు పరమార్థసారము.

❖❖❖

6. శరీరముయొక్క రాకపోకలు

శ్రీరాముడు : హే మహర్షీ!

జ్ఞాతం జ్ఞాతవ్యమఖిలమ్, దృష్టం ద్రష్టవ్యమక్షతమ్ ।

పరేణ పరిపూర్ణాఃఽస్మో బ్రహ్మజ్ఞానామృతేన తే ॥

తప్పకుండా తెలుసుకోవలసి ఉన్నదానిని నేను తెలుసుకున్నాను. చూడవలసినది చూస్తున్నాను. మీరు ప్రసాదించిన జ్ఞానామృతం గ్రోలి పరిపూర్ణుడనయ్యాను.

పూర్ణాత్పూర్ణమిదం పూర్ణం పూర్ణాత్పూర్ణం ప్రసూయతే ।
పూర్ణేనాపూరితం పూర్ణం స్థితా పూర్ణే చ పూర్ణతా ॥ (శ్లో॥ 2, సర్గ 50)

పూర్ణము నుండి పూర్ణము పూర్ణ స్వరూపమున వెలయుచూ వెలువడుచున్నది. పూర్ణము పూర్ణమున ప్రకాశిస్తోంది.

హే బ్రహ్మజ్ఞా! పిల్లలు తండ్రిని వేడుకతో ప్రశ్నిస్తారు చూచారా! అట్లా మిమ్ములను మరల ప్రశ్నిస్తున్నాను. దయచేసి కోపగించుకోకండి! ఇట్లా పదే పదే ఆయా కోణముల నుండి ప్రశ్నించటం చేత మీ నుండి జాలువారే అమృతవచనములు నా తదితరుల జ్ఞాన విజ్ఞానములను పెంపొందిస్తాయి అనునదే నా సదుద్దేశం. హే మహాత్మా ! ఇప్పుడు నా ప్రశ్న వినండ–

ఒక మృతుని యొక్క కళ్ళు, ముక్కు, నాలుక, చర్మం – మొదలైన ఇంద్రియాలు కనబడు చున్నప్పటికీ అవి ఎందుచేత విషయములను గ్రహించలేకపోతున్నాయి? సజీవుని ఇంద్రియాలు ఎందుచేత విషయాలను గ్రహించగలుగుచున్నాయి? ఈ ఇంద్రియాలు బయటికి వెళ్ళి తెచ్చిన విషయాల సమాచారం హృదయంలో "అనుభవం" అను రూపంలో ఎలా రూపం పొందగలుగు చున్నాయి?... 1. ఇంద్రియం, 2. విషయం – ఇవి రెండూ వేరు వేరైనవి కదా! అవి పరస్పరం ఆకర్షించ గలగటం ఎట్లా జరుగుతోంది? దృశ్యం యొక్క పరిజ్ఞానం హృదయంలో ఎలా ప్రకటితమౌతోంది?

హే పరమేశ్వరా! వసిష్ఠమహర్షీ! ఇప్పటి వరకూ జరిగిన ప్రసంగంలో మీరు ఈ విషయాలు వివరించి ఉండవచ్చు. అయినా, మళ్ళా మీ నుండి ఈ విశ్లేషణా ప్రవచనాలు వినాలని అనిపిస్తోంది. ఒకే విషయం అనేక సోదాహరణాలతో చెప్పటం, వినటం చేత ఈ మీ ప్రవచనం ఆత్మతత్త్వమును మరింతగా విశదపరచగలదని నా ఉద్దేశం! నా అభ్యర్థన!

శ్రీవసిష్ఠ మహర్షి : ప్రత్యక్ష ప్రమాణములైనట్టి 'ఇక్కడి వస్తు సముదాయాలు, ఇంద్రియాలు, ఆ

ఇంద్రియ ద్వారాలలో కాపురముంటున్న చిత్తం' వీటి అసలు రూప – తత్త్వ – స్వభావము లేమిటో విశేషంగా విచారణ చేసిన వారికి 'ఇవన్నీ చైతన్యము కంటే వేరు కానే కాదు' అని తెలియవస్తోంది

ఆకాశము వలె అత్యంత శుద్ధమైన చైతన్యము మాయతో కూడినదై పూర్వ – పరవాసనలను (ఇంద్రియ వ్యవహార పరంపరలను) నిరంతరం భావన చేస్తోంది. అట్టి వాసనల యొక్క ఆవరణను వేదాంత పరిభాషలో 'పుర్యష్టకం' అని పిలుస్తున్నారు.

ఆ బ్రహ్మమే 'ఇంద్రియాల యొక్క విషయాలు, ఇంద్రియాలు, చిత్తం'... అనే ప్రకృతి లేక పుర్యష్టకంగా స్వయంగా... స్వయం కల్పన (లేక) మాయచే... వివర్తము చెందుతోంది. పుర్యష్టకంగా వివర్తం చెందిన చిత్ చిత్తవృత్తులను దాల్చుచు తన యొక్క అజ్ఞానానికి తానే కారణమై ఉంటోంది.

ఇక మృత్యువు విషయానికి వద్దాం. మృత్యు సమయంలో ఏం జరుగుతోంది?... ప్రాణశక్తి ప్రసరణచే చరించే ఈ దేహం కాలానుగతంగా శిథిలత్వం సంతరించుకుంటోంది. అనగా, ఉపకరణ మాత్రమైన కాళ్ళు, చేతులు, కళ్ళు, చెవులు, ముక్కు గల ఈ జడదేహం నిర్వీర్యమై నిరుపయోగమై పోతోంది. మృత్యు సమయంలో పుర్యష్టక సమన్వితమైన సూక్ష్మదేహం ఈ స్థూల దేహం నుండి వెలువడటం చేత ఈ ఇంద్రియాలు సామర్థ్యం కోల్పోతున్నాయి. యంత్రశక్తి కోల్పోయిన యంత్రంలాగా ఇది నిస్తేజమై పోతోంది. శరీరం నిరుపయోగమైనప్పటికీ వేలకొలది జగత్తులను ప్రతిఫలించగల 'దర్పణం' వంటిదగు పుర్యష్టకం (5 ఇంద్రియార్థాలు, మనస్సు, బుద్ధి, చిత్తం) ఉండియే ఉంటోంది.

శ్రీరాముడు: అట్టి 'పుర్యష్టకం' గురించి మరికొన్ని విశేషాలు చెప్పవలసినదిగా ప్రార్థన.

శ్రీవసిష్ఠ మహర్షి : బ్రహ్మము ఆద్యంతరహితము, నిరామయము, తేజోమయము కదా! అట్టి బ్రహ్మము తనయొక్క చిద్విలాసంచేత తన కొరకై తాను ఆకాశము మొదలైన సూక్ష్మభూతములను సృష్టించుకుంటోంది. అది స్వయంగా కల్పనారహితమే! అయినప్పటికీ, అది జగత్తుకు బీజమై అపంచీకృత భూతపంచకము కలిగియున్న దగుచున్నది. తద్వారా బ్రహ్మాండమును సృష్టించి, అందు ప్రతిబింబిస్తోంది. సూత్రప్రాణమై శరీరమధ్యమున సూక్ష్మరూపంతో ప్రవేశిస్తోంది. అట్లు ప్రవేశించిన చైతన్యమును 'జీవుడు' అని అంటున్నాం.

ఆ జీవుడు వాసనల వలన అవయవములను కల్పించుకుంటున్నాడు. ఆ అవయవములతో కలిగిన సంబంధం చేత భౌతికమైన పుష్టిని పొంది బాహ్య అభ్యంతరములకు 'స్పందితుడు' అగుచున్నాడు.

'అహం' భావము	వలన	అహంకారమును,
మననము	వలన	మనస్సును,
నిశ్చయము	వలన	బుద్ధిని
ఇంద్రియస్నేహము	వలన	పదార్థజగత్తును,
దేహభావము	వలన	దేహమును ...

... ఇట్లే తదితర విషయములన్నీ పొందుచూ పుర్యష్టకము (శబ్ద–స్పర్శ–రూప–రస–గంధ–మనోబుద్ధి–చిత్తముల సమ్మేళణం) అని పిలువబడుటకు అర్హుడగుచున్నాడు.

జ్ఞానేంద్రియ వ్యాపారములు	ప్రవర్తిస్తున్నప్పుడు	జ్ఞాతృత్వముగాను,
కర్మేంద్రియ వ్యాపారములతో	ప్రవర్తితమైనప్పుడు	కర్తృత్వముగాను
వాటి ఫలములను పొందునట్లు	భావిస్తున్నప్పుడు	భోక్తృత్వముగాను
వాటన్నిటా ఉదాసీనము	పూనినప్పుడు	సాక్షిత్వముగాను,
భోగములందు	అధ్యస్థమౌతున్నప్పుడు	చిత్ప్రధానముగాను
విషయములను	పర్యాలోచించినప్పుడు	జీవుడుగాను,
జడప్రధానంగా	యోచిస్తున్నప్పుడు	పుర్యష్టకంగాను,

...చెప్పబడటం, స్వీకరించటం జరుగుతోంది.

❖

ఇట్లు శరీరమున ప్రవేశించిన జీవుడు కాలక్రమంగా తాదాత్మ్యబుద్ధిని పొంది ఆయా కాల సంభవములగు సుఖదుఃఖములను పొందుచున్నాడు. పుర్యష్టకము యొక్క స్వభావమును అనుసరించి అనంతవాసనాకల్పితములగు రూపములను ఆతడు ధరిస్తున్నాడు. నేలపై ఉంచబడిన బీజము ... నీళ్ళు చల్లినప్పుడు... అది చిగురించి ఒక మహావృక్షమవుతోంది చూచావా? ఈ జీవుడు కూడా వాసనా సేవితుడై జగత్ రూపాన్ని ధరిస్తున్నాడు. మిథ్యాజ్ఞాన కారణంగా తన యొక్క ఆద్యరూపాన్ని ఏమరచి తనను ఈ శరీరాదులుగా భావించుకుంటున్నాడు. సముద్ర తరంగాలలో పడిన చెక్క ముక్క పైకి క్రిందికి తేలియాడుచూ ఎక్కడెక్కడికో తీసుకుపోబడుతుంది. అట్లాగే వాసనాక్రాంతుడగు జీవుడు కూడా సంసార సముద్రంలో పడి ఉత్కృష్ట, నికృష్ట జన్మల వైపు బలవంతంగా ఈడ్వబడుచున్నాడు.

అయితే ...సనకుడు, సనందనుడు మొదలైన మహనీయుల వంటి శుద్ధాత్మలు తమ ఇతః పూర్వపు సాధనాబలం చేత ఈ కల్పంలో తమ ప్రథమ జన్మయందే 'బోధ'ను పొందుచున్నాడు. భవబంధ విముక్తుడై పరమపదమున వెలయుచున్నాడు. మరికొందరు జీవులు కొద్దిజన్మల తరువాత, ఇంకా కొందరు జీవులు చాలా జన్మలు ఎత్తి చాలా కాలం శ్రమించిన తరువాత ఆత్మజ్ఞానం సంపాదించుకుంటున్నారు. క్రమక్రమానుసారం పరమపదమును పొందుచున్నారు.


ఇదీ ...శరీరం దాల్చే విధానం.

❖

ఇంద్రియముల సాయంతో వస్తువులను గ్రహించటం, చిత్తము యొక్క శరీరముగా వివర్తమొందిన చైతన్యం 'పంచేంద్రియములు, మనస్సు'తో కూడి ప్రవర్తించటం ఆరంభిస్తోంది. ఆయా వస్తువులతో కూడిన బాహ్యదృశ్యము తన వద్దకు అరుదెంచుచుండగా తాను ఈ చక్షువులు ఆక్రమించియున్న ఆకాశమునందు ప్రవేశించి అందలి చైతన్యముతో ఏకమగుచున్నది.

ఇంకొక రకంగా చెప్పాలంటే ...ఆ జీవుడు 'చైతన్యస్పర్శ' అను అధ్యాసతో వస్తువునకు సంబంధించిన ఒకానొక ఏకత్వము పొందుచున్నాడు. ఆయా విషయములన్నీ అజ్ఞానము చేత అట్లట్లు లభిస్తున్నాయి. అట్టి బాహ్య విషయములతో సంపర్కం జీవచైతన్యముతో కూడిన శరీరములోని

ఇంద్రియములకు మాత్రమే ఏర్పడటం జరుగుతోంది. మృతుని దేహంలో చైతన్యం ప్రసరించక పోవటంచేత కేవల జడ ఇంద్రియములకు 'అనుభవం' అనేది ఉండటం లేదు.



'ధ్యాస' అను ప్రతిబింబం తిరిగి వచ్చి కల్పనలకు కర్త అయిన జీవుని అంతరంగంలో ప్రవేశించి 'అనుభవము' అనబడుదానికి యోగ్యమగుచున్నది. ఇక జీవుడు ఎట్టి కల్పన చేస్తున్నాడో ...అట్టి అనుభవాన్నే పొందుచున్నాడు. అంతేగాని... 'అనుభవం' అనేది బయట ఎచ్చటనో లేదు.

❖

ఈ నేత్రగోళములు నియమించబడినప్పుడు బాహ్యమైన గోడ కుండ మొదలైన చిత్తవృత్తులు అందులో ప్రవేశిస్తున్నాయి. అటు కన్ను గోళాలలో ప్రవేశించిన ప్రతిబింబంతో జీవుడు తన ధ్యాస అను శక్తితో కూడినప్పుడు మాత్రమే ఇది 'కుండ, గోడ' మొదలైన దృశ్యానుభవం ఏర్పడటం జరుగుతోంది. ఇట్టి సంయోగసంజనితానుభవం ఒక బాలునకు, పశువుకు, లతకు కూడా ఏర్పడుతోంది.

జీవుని లోపల ఎక్కడో ఉన్న దివ్యకిరణములు బాహ్యంగా దూరమున ఉన్న విషయములను ఆలింగనం చేసుకుని ఆ విషయమునకు సంబంధించిన జ్ఞానమును జీవునికి అందిస్తోంది. దానికి జీవుడు స్వసంస్కారానుసారంగా అనుభవంగా గ్రహిస్తున్నాడు. అట్లాగే ఆకాశం నుండి శబ్దం చెవి యందు ప్రవేశించుట చేత, గంధము వాయువు నుండి నాశికా పుటములలో ప్రవేశించుట చేత వాటి వాటి జ్ఞానాన్ని జీవుడు 'అనుభవం' అను రూపాన్ని ఇస్తున్నాడు. కనుక దృశ్యం పట్ల ఏర్పడే అనుభవ అభినివేశ, తిరస్కార, నిర్లిప్తాదులకు అసలైన కారణం జీవుడే (ద్రష్టయే).

జీవుని యందు ఏదైతే ప్రతిబింబిస్తోందో ...అద్దానినే 'జగత్తు' అనే పేరుతో పిలుస్తున్నారు. అంతేగాని, 'జగత్తు' అనగా, – ఈ ఎదురుగా కనిపించే చెట్లు – ఇళ్ళు – వాకిళ్లు – ఊళ్ళు కాదు.

శ్రీరాముడు : హే జ్ఞానశ్రేష్ఠా! అత్యంత జడమైన అద్దంనందు, నీటియందు, లేత చిగురాకులయందు ప్రతిబింబము వలె కనిపించేదేమిటి? ...ఆ ప్రతిబింబానికీ, ఈ జీవునిలో ప్రతిబింబించు 'జగత్తు' అనుదానికి భేదమేమైనా ఉన్నదా?

శ్రీవసిష్ఠ మహర్షి : అత్యంత జడములైన అద్దం–ప్రతిబింబం, చిత్త వృత్తులు–వస్తువు యొక్క అనుభవం ఒక్క తీరైనవే. అయితే ఈ జీవుని ద్రష్టత్వం, ఈ జీవుడు చూస్తున్న జగత్తు ...రెండు భ్రాంతియే.

ఈ జగత్తునందు నీకు విశ్వాసం కలుగకుండు గాక! వాస్తవానికి ఉన్నది చిత్సాగరం ఒక్కటే. ఈ అహంకారములన్నీ అనంత చిత్సాగరంలో చిన్నచిన్న తరంగాల వంటివి మాత్రమే.

అట్టి చిత్సాగరంలో దేశ కాలాదులనేవే లేవు. తరంగములన్నిటిలో జలం అనుశ్రుతమై ఉన్నది

కదా...! అట్లాగే ఆత్మ అహంకారములన్నిటిలో అనుస్రుతమై ఉన్నది. ఉన్న సత్యం ఇది. కాబట్టి ఎల్లవేళలా తదితరములపట్ల అనాసక్తచిత్తుడవై వెలయుము.

'ఈ సుఖదుఃఖములన్నీ మిథ్య' అని నీ బుద్ధి గ్రహించి శాంతియుతమై ఉండుగాక! భవమాయ అను వ్యాధి నుండి సర్వదా విముక్తుడవై ఉండెదవు గాక! ఏకాగ్రచిత్తంతో ఆనందమయమైన సామ్యభావమును అవలంబించు. బ్రహ్మభావమున నివిష్ఠుడవు కమ్ము.

❖❖❖

7. భ్రమలు తొలగాలంటే జ్ఞానోదయం కావాలి

శ్రీరాముడు : స్వామీ వసిష్ఠ మహర్షీ ! మీ వంటి ఉత్తమోత్తమ భవరోగ వైద్యుని సమీపించినట్టి రోగికి ఇక భయమెక్కడిది? మీరు చెప్పేది పరమసత్యం. మాకు వేరుగా ఏ ఆధారాలు అక్కర్లేదు.

అయినా సవినయంగా ఒక చిన్న ప్రశ్న మీ ముందు ఉంచుతున్నాను – ఆత్మయే స్వరూపంగా గల జీవునకు–కల్పనయే మూలంగా గల పుర్యష్టకమునకు సంబంధం ఎట్లా, ఎందుకు, ఏ కారణంగా, ఏ ప్రయోజనం కొరకు ఏర్పడుతోంది?

శ్రీవసిష్ఠ మహర్షి : శుద్ధ బ్రహ్మం నందు ఈ చక్షురాది ఇంద్రియాలు గాని వాటికి విషయాలైనవి గాని లేవు. అవన్నీ మొట్టమొదట సమష్ఠి జీవుని యందు (హిరణ్యగర్భుడు, పద్మజుడు, బ్రహ్మదేవుడు మొదలైనవి ఆ సమష్ఠి జీవుని పురాణనామాలు) అనుభూత మగుచున్నాయి. అవే ఈ వ్యష్టిజీవుని యందు కూడా అనుభవమౌతున్నాయి.

ఆ హిరణ్యగర్భుని యందు భావనాబలంచే పుర్యష్టకం, విషయాలను గ్రహించు శక్తి ద్యోతకమౌతున్నట్లే వ్యష్టిజీవుని యందు కూడా అవి ఉదయిస్తున్నాయి.

❖

ఇక్కడ వ్యష్టిజీవుడు, దేహముల గురించి కొన్ని విశేషాలు ప్రస్తావిస్తాను–

మాతృగర్భమున ఉన్న వ్యష్టిజీవుని (పిండానికి) 6వ మాసంలో పుర్యష్టకం, కళ్ళు మొదలైన ఇంద్రియాలు ఆవిర్భవిస్తున్నాయి. ఇక అప్పటి నుండి ఆ పుర్యష్టకానికి సంబంధించిన మాధ్యమం ద్వారా గాంచుచున్నాడు. సర్వప్రథముడగు సమష్టి జీవుని మనస్సులో లాగానే వ్యష్టిలో కూడా సంవేదన (The act of knowing) ఇంద్రియాలు సుసంపన్నమౌతున్నాయి. ఇక సంవిత్తు (The Knower) అంటావా? వ్యష్టిలో సంవిత్తు, సమష్టి జీవుని (హిరణ్యగర్భుని) సంవిత్తు ఒక్కటే. అనగా సృష్టికి ముందు సంవిత్తు నందు 'వ్యష్టి – సమష్టి' అనే భేదం లేదు.

సంవిత్తు సర్వదా విశుద్ధమే. అద్దాని యందు జలతరంగంలాగా 'అహం' అనే అభిమానం పునాదిగా గల పుర్యష్టకం బయల్వెడలుతోంది.

సంవిత్తు సర్వదా ఏకమాత్రము, అనంతము, విశుద్ధము అఖండము, అనిర్దేశమూ కూడా!

నిర్దోషము, నిర్మలము అగు సంవిత్తు నందు మరొకదాని ఉనికి అసంభవం. అద్దాని యందు గుణదోషములు గాని, మనస్సు గాని, మరింకేమియు గాని లేవు.

సంవిత్తు ఒక్కటే సత్యం. మిగిలినవన్నీ అసత్యములు. ఈ స్థూలములు, ఈ దేశకాలములు, ఈ వ్యష్టి – సమష్టి... ఇవన్నీ పరిచ్ఛిన్నములు.

సంవిత్తు మనస్సు యొక్క రూపం, మనస్సుకు ఉద్భవస్థానం. మనస్సు అనగా – మననమునకు గోచరమగు 'బుద్ధి' వృత్తి ... యొక్క అధ్యాసయే కదా!

వాస్తవానికి ఆ సంవిత్తు మనస్సు కాదు. బుద్ధికాదు. జీవుడు కాదు. పుర్యష్టకం కాదు.

జ్ఞానప్రకాశమే సంవిత్ తత్త్వం యొక్క స్వరూపం – అని గ్రహించు. మూఢులు అద్దానిని 'లేదు' అనివచిస్తున్నారు. కాని అదియే మనస్సు, ఇంద్రియాలకు అతీతమై వెలయుచు "పరమాత్మ" అనబడుచున్నది. 'ఆ బ్రహ్మము లేక సంవిత్ నుండి చిన్మూర్తియు, మననాత్మకుడు అగు జీవుడు ఉద్భవిస్తున్నాడు' ...అనుమాట కూడా భ్రమయే అయినప్పటికీ, ఉపదేశ సౌకర్యార్థం అట్లని విజ్ఞులచే శిష్యపాఠంగా చెప్పబడుతోంది.

శ్రీరాముడు : స్వామీ! అత్యంత విశుద్ధుడు, సంవిత్ స్వరూపుడు అగు ఈ జీవునికి మరి ఈ ఆవరణ భూతమైన 'సంసారం' అనే వ్యాధి ఎక్కడి నుండి ఎట్లా వచ్చింది? ముందుగా ఈ విషయం చెప్పండి.

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామా! ఒకనికి వ్యాధి వచ్చి గొప్ప బాధపడుచున్నాడు. ఇప్పుడు 'ఈ వ్యాధి ఇతనికి ఏమి తింటే వచ్చింది? ఏం చేస్తే వచ్చేది కాదు?' అను మీమాంస ముఖ్యమా?... చికిత్స ముఖ్యమా?... చెప్పు!

శ్రీరాముడు : చికిత్స చేసి వ్యాధిని రూపుమాపటం ముఖ్యం...!

శ్రీవసిష్ఠ మహర్షి : అవును కదా! ఇప్పుడీ జీవుని అవిద్య వచ్చి బాధిస్తోంది. "ఎందుకొచ్చింది? ఎప్పుడొచ్చింది? ఏం చేస్తే వచ్చింది?" అను ప్రశ్నలకన్నా, ...ఇప్పుడేం చేయాలి? అవిద్య ఎట్లా తొలగుతుంది? ఏ ఏ విచారణాది ప్రయత్నములకు ఉపక్రమించాలి?"... అనునది ముఖ్యం. ఈ విషయం మన సంవాదంలో మనం చెప్పుకొనియే ఉన్నాం. ఇప్పుడు "అవిద్య అంటే ఏమిటి? విద్య ఏమిటి?" అనునది విచారణ చేయటం అత్యంతావశ్యకం. అట్లా విచారణ చేస్తూరాగా...స్వస్వరూపం పరిశేషించగలదు. తత్సంబంధమైన తదితర విషయాలన్నీ వాటంతట అవే అవగతమౌతాయి.

❖

'సంవిత్'– జ్ఞానస్వరూపం. అట్టి జ్ఞానము ప్రశాంతమైనది. అదియే నిఖిల వస్తువులలో నిండి ఉన్నది. ఒక చిన్న మణిలో పెద్ద పర్వతం ప్రతిబింబిస్తున్నట్లు జ్ఞానమునందే ఈ ఆకాశము మొదలైనవి ప్రతిబింబిస్తున్నాయి. వ్యవహారరీత్యా సత్యములని అనిపిస్తున్నప్పటికీ ఈ పదార్థాలన్నీ వాస్తవం కాదు. అయితే ఇవన్నీ జ్ఞానమునందే వెలయుచున్నాయి. అట్టి సంవిత్‌జ్ఞానము కొరకు నీవు జగత్ సంబంధ మైన సర్వ విషయములు సమర్పించి వేయి. జీవన్ముక్తమున వెలయుచూ నిర్మలుడవై ప్రకాశించు.

శ్రీరాముడు : ఈ దృశ్యజగత్తులో కనిపించే పదార్థముల అసలు రూపం ఏమిటి?

శ్రీవసిష్ఠ మహర్షి : దృశ్య జగత్తులో కనిపించే పదార్థాలన్నీ అవిద్య చేతనే అట్లు పదార్థరూపంలో కనిపిస్తున్నాయి. వాటియొక్క అసలురూపం అవిద్యయే! ఒక్కసారి అవిద్యనే పరికించి చూచావా ... వీటన్నిటి యొక్క అవిద్యారూపం తొలగిపోయి, ఇక మరల ఉదయించదు.

శ్రీరాముడు : హే ఆప్తబంధూ ! కనులకు ఎదురుగా కనిపిస్తున్న ఈ వస్తుజాలమును అసత్తుగా అంగీకరించటం ...ఎట్లా?

శ్రీవసిష్ఠ మహర్షి : ఓహో! అదా నీ సందేహం! అట్లా అయితే ఈ కనబడే వస్తువులన్నీ అందరికీ ఒకే తీరుగా కనిపిస్తూ ఉండాలి కదా! అది అట్లా జరుగుతోందా? ఒక గడ్డిపరక ఆవుకు మృష్టాన్న భోజనంలా కనిపిస్తోంది. మరి మనిషికో? అట్లా కనిపిస్తోందా?...లేదు.

వస్తువులన్నీ కూడా ఎండమావులలాగా భ్రమాత్మకములే! అవి అసత్తు అయి ఉండి కూడా అజ్ఞానం వల్ల సత్స్వరూపంగా తోచుచున్నాయి. నాయనా! భ్రమ తొలగాలంటే జ్ఞానోదయం కావాలి. అప్పుడే వాటి వాస్తవ స్వరూపం గోచరిస్తుంది.

'జీవుడు' 'పుర్యష్టకం' మొదలైనవన్నీ అవిద్యా భ్రమలేనయ్యా! అయితే సత్యమగు ఆత్మ యొక్క సాన్నిధ్యంలోనే అవిద్య యొక్క కల్పన కలుగుతోంది. అట్టి కల్పనావిభాగమును మనం అసత్ అని అంటున్నాం. 'అవిద్య చేతనే ఈ జీవుడు తదితరజీవులు' మొదలుగా గల కల్పనలు దర్శించబడు చున్నాయి ...అని శాస్త్రములు ఘోషిస్తున్నాయి.

శ్రీరాముడు : అవిద్య అంటే ఏమిటో, దాని ఆనుపానులు ఎట్లు ఉంటాయో మరల ఈ సందర్భమునకు ఉచితమగునట్లు వివరించండి.

❖❖❖

8. అవిద్యయొక్క ఆనుపానులు

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! విషయ రహితం, వ్యాపకరహితమగు చిత్ తత్త్వం ఒకానొకప్పుడు నిశ్చల జలంలోని తరంగంలాగా "అంతరంగ బాహ్యత్వములు" అనే విభాగమునకు సంబంధించిన ఒకానొక ఉత్సుకత పొందుతోంది. 'బాహ్యకళ' అను కళంకముచే పుర్యష్టకాదులుగా ప్రభవిస్తోంది. అనగా చిత్ చిత్తత్వమును స్వీకరించడం జరుగుతోంది. అట్టి చిత్తత్వముతో ఏ వస్తువును ఏ రూపంగా భావిస్తున్నదో ...అది అట్లే ప్రాప్తింపజేసుకుంటోంది. బాలుడు మనస్సులో భూతమును కల్పించుకొని రాత్రిపూట కనబడే మోడువారిన చెట్టును ఒక భూతంలాగా భావించి అనుభూతి పొందుతాడు చూచావా? జీవచైతన్యము కూడా స్వయంగా పంచతన్మాత్ర (శబ, స్పర్శ, రూప, రస, గంధముల) కల్పనను సత్యమైనట్లు భావనను ఆశ్రయించి జీవరూపమును పొందుతోంది. ఆ తరువాత తన యందు ఇంద్రియాలు ఏర్పడుటను కూడా గాంచుచున్నది. అంకురం నుండి వృక్షశాఖలు ఏర్పడి ... ఆ వృక్షశాఖలు అంకురము కంటే వేరైనట్లు తోచుచున్నాయి కదా! అట్లాగే ఈ దృశ్య జగత్తు చిత్ కంటే వేరుగా తోచుచున్నది. చిత్ స్వరూపుడగు ఈ జీవుడు మనస్సు-కుండ మొదలైన బాహ్య

వస్తువులను తన వాసనానుసారంగా సత్యములే అని భావిస్తున్నాడు. చంద్ర కిరణములుగా గాంచ బడుచున్నది చంద్రప్రకాశమేగాని మరొకటి కాదు కదా! …విషయేంద్రియ సంబంధం వలన కలుగుచున్న విషయసుఖములు ఆ చైతన్యము యొక్క ఆత్మానందమే!

మిరియం యొక్క కారం మిరియం నుండి వేరు కాదు. శూన్యం అనేది ఆకాశం నుండి వేరు కాదు. విషయ విజ్ఞానాలన్నీ ఆత్మనుండి వేరు కాదు. "సంసార విషయాలు భోగించాలి" అనేది ఆత్మ యొక్క 'సంకల్పం' అను ఆవరణ నుండే బయలుదేరుచున్నాయి. ఆ తరువాత "అట్టి బంధ నియమం నుండి వైతొలగాలి" అను పురుషార్థం ఆశ్రయించబడినప్పుడు ఆ భ్రమేచ్ఛ తొలగి స్వస్వరూపప్రకాశం అనుభవమౌతోంది. ఈ రెండవ పురుషార్థం కొరకు శాస్త్రాలు పారలౌకిక కర్మలు, కార్యక్రమాలు ప్రతిపాదిస్తున్నాయి. ఖండసారి పానకమే పటిక బెల్లం అవుచున్నది చూచావా? ఆత్మయే ప్రవృత్తిని వదలి నివృత్తి మార్గం కొరకై శాస్త్రాలను అనుసరించుట, తద్వారా నివృత్తి ఫలాన్ని పొందటం జరుగు తోంది. ఒకటి మరొకదాని ప్రయత్న దార్ఢ్యం వలన ఓడింపబడుతోంది. ఈ విధంగా ఈ ప్రవృత్తి-నివృత్తి అను రెండు మార్గములు అనంతకాలంగా వెలయుచున్నాయి. కానీ…

సంనివేశవికారాదిదేశకాలాదిసంభవాత్ ।
సంభవత్యత్ర సత్వీశే దేశకాలాద్యసంభవాత్ ॥ (శ్లో॥ 28, సర్గ 51)

ఆత్మ ఆకాశము వలె పరివర్తనను కలిగిఉన్నది కాదు. ఎందుకంటే దేశకాలాది పరిచ్ఛిన్నములు, సంయోగ వియోగాలు, తదితర వికారాలు ఉన్న చోట మాత్రమే పరివర్తనం అనేది సంభవిస్తుంది. ఆత్మ యందు అవన్నీ ఏవీ లేవు. కనుక ఆత్మకు పరివర్తనం అసంభవం.

❖

వసంతకాల-రసం వనంలో ప్రవేశించినప్పుడు అది ఒకచోట పుష్పం గాను, మరోచోట లేచిగురు రెమ్మలుగాను మారుచున్నది. ఏది ఎట్లు ఏర్పడుచున్నా రసం ఒక్కటే! కాని ఆ రసం వివిధమైన ప్రకటన లను కలిగి ఉంటోంది. వాటి నుండి వివిధ కార్యాలు నెరవేర్చబడుచున్నాయి. అట్లే ఆత్మ తనయందు "ఇది కుండ, ఇది గోడ" అను రూపంలో ద్వైతభావం పొందుతోంది. వాస్తవానికి అద్దాని సత్త అద్వితీయ మైనది. మేఘము మొట్టమొదట సూర్యకిరణ రూపముననే ఉండి ఆ తరువాత తన కిరణ ప్రభావంతో జలాన్ని స్వీకరించి మేఘ స్వరూపం సంతరించుకొని …మరల వర్షించి తరువాత యథారూపంగా సూర్యకిరణ తత్త్వంగా శేషిస్తోంది కదా! సదసద్రూపమగు ఆత్మ కూడా జగత్తుగా మారి ఆ తరువాత వచ్చే జగత్తులకు తానే కారణకారణమై ఉంటోంది. సర్వేశ్వరుడగు ఆత్మయందు "ఇది ఇట్లు అవుతుంది …అది అట్లు కాదు" అను రూపముగల భావనలన్నీ విస్తరించి ఉన్నాయి. ఈ క్రమమును ఖండించటం ఎవరి వల్ల అవుతుంది?

పరిశీలించి చూస్తే స్వచ్ఛమగు ఆకాశమునకు మార్పు చేర్పులు ఏమి ఉంటాయి? ఆకాశమునందు ఆకాశమే ఏర్పడి ఉన్నట్లు ఆత్మ యందు ఆత్మయే సర్వదా నెలకొని ఉన్నది. ఆత్మ యందు ఆత్మయే ఎల్లప్పుడు ప్రకాశిస్తోంది కాని …అందు మరొకటేదీ ఏర్పడటం లేదు, ప్రకాశించటం లేదు.

❖❖❖

9. జన్మ - జన్మాంతరములు

కానీ... ఏకము, అద్వితీయము అగు చిన్మయము స్వాభావికంగా భావనలు పొందుతోంది. అట్లు భావననుండే ద్వైతము అనుభూతమౌతోంది. అట్లు పొందుచున్నప్పుడు వస్తువులు శక్తిగను, జీవుడుగను ప్రతిబింబిస్తోంది. బంగారం చేత తయారయిన ఆభరణాలు బంగారం యొక్క ఉనికి చేతనే పచ్చటి ఛాయలు వెదజల్లుచున్నాయి కదా! బంగారం, ఆభరణం లాగా మనస్సు నందు చైతన్యము, జడము కలసి ఉంటున్నాయి.

ఈ ఆత్మను ఎవరు ఎట్లు గ్రహిస్తున్నారో ...అది అసత్యమైనప్పటికీ అట్లే జరుగుతోంది. ఇక అద్దానికి తిరుగు లేకుండా పోతోంది. బంగారము అన్ని ఆభరణములలోనూ ఉన్నది కదా!

చిత్తు సర్వవ్యాపకము!... అద్దాని చైతన్యము మనస్సులో కూడా ఉన్నది.

చిత్త-దేహాలకు కారణమైన ఈ చైతన్యం ఎప్పుడు ఎక్కడ ఏ రీతిగా భావించుకుంటోందో ... అప్పుడు అక్కడ ఆ రీతిగా దేవ, నం, స్థావరాది భావాలను పొందుతోంది. ఈ చిత్తం తన యందలి వాసనావికాస వైచిత్ర్యాన్ని అనుసరించి నానావిధ ఆకారాలను, కాలనియమాలను "ఉపాధుల ఆగమన, నిష్క్రమణములను" పొందుతోంది. అదంతా స్వప్నంలాగా భాసిస్తోంది. స్వప్నంలో "నగరం-పూతోట-జనులను" చూస్తున్నట్లే జీవుడు ఒక ఉపాధికి సంబంధించిన శబ్ద, స్పర్శ, రూపాది విషయాలు, తదితర ఉపాధులతో సంబంధ బాంధవ్యాలు పొందుతోంది. ఆ ఉపాధి తరువాత వేరే మరొక ఉపాధి, దానితో వేరే మరికొన్ని సంబంధాలు ... ఈ విధంగా ఈ వ్యవహారం జీవుని పట్ల చర్విత చర్వణంలాగా జరిగిపోతోంది. మెళుకువతో ఉన్నవాడు నిదురపోవటం, ఆ నిదురలో స్వప్నం, ఆ స్వప్నంలో ఏవేవో విశేషాలు గాంచడం, ఆ గాంచుచున్నప్పుడు మెళుకువ (జాగ్రత్) కు సంబంధించి ఏ విషయమూ దృష్టి - జ్ఞప్తులందు ఉండకపోవడం మరల మెళుకువకు వచ్చినప్పుడు యథాతథంగా ఉండి ఉండటం జరుగుతోంది చూచావా? ఈ జీవుడు కూడా ఒక ఉపాధితో ప్రవేశించటం, ఉపాధి సహితుడై చరిస్తూ కొంతకాలం తరువాత ఉపాధిరహిత యథాతథస్థితి పొందటం జరుగుతోంది. ఏ స్వప్నమూ శాశ్వతం కాదు. కాని స్వప్న ద్రష్ట మాత్రం శాశ్వతం కదా! అట్లాగే ఏ ఉపాధీ శాశ్వతం కాదు. ఉపాధులద్రష్టగా తానుమాత్రం శాశ్వతం!

శ్రీరాముడు : ఈ జనన మరణాలు జీవుని పట్ల ఎందుకు ఏర్పడుచున్నాయి?

శ్రీవసిష్ఠ మహర్షి : అవిద్య వలన జీవుడు ప్రతిభాసను గాంచుచున్నాడయ్యా! నిజానికి జన్మించటం, మరణించటం కూడా వాస్తవములు కావు.

శ్రీరాముడు : మరణానంతర ప్రతిభాస కూడా ఈ జీవించి ఉన్నప్పటి ప్రతిభాస వంటిదేనా?... ఆ రెండిటికీ గల సంబంధమేమిటి? విభేదమేమిటి?

శ్రీవసిష్ఠ మహర్షి : మరణానంతర ప్రతిభాస ఈ దేహం ఉన్నప్పటి వంటి ప్రతిభాస వంటిది కాదు. ఎందుకంటే ... ఈ దేహం ఉన్నప్పుడు జీవుడు బాల్య-యౌవన-వార్ధక్యములు తదనుగుణమైన

సంబంధ బాంధవ్యములు, అనుభవములు పొందుతున్నాడు కదా! అవన్నీ కాలానుగతంగా కాలబద్ధమై ఏర్పడుతున్నాయి.

ఇక మరణాంతర ప్రతిభాసకు వస్తే ...ఆ స్థితి కాలబద్ధమైనది కాదు. కానీ వాసనాబద్ధమైనది. వాసనలు శరీరం ఉన్నప్పుడు లేనప్పుడు ఈ జీవుని ప్రభావితం చేస్తూ తదనంతర స్థితిగతులను నిర్ణయిస్తున్నాయి. అనగా "మరొక శరీరం పొందటం" అనేది కేవలం వాసనలవలననే జరుగుతోంది గాని, కాలం వలన జరగటం లేదు.

అలాగే స్వప్నమునకు – జీవజాగ్రత్ జగత్తుకు మరొక తేడా ఉన్నది. స్వప్నంలో చూడబడుచున్న జగత్తు ఆ సమయమందలి ఊహ – వాసనల సమ్మేళనముచే ఏర్పడుచున్నది. ఆ స్వప్నంలోంచి ఆ స్వప్న ద్రష్ట అటు 'గాఢనిద్ర' అను జడస్థితికో, (లేక) 'మెళుకువ' అను జాగ్రత్‌స్థితికో పయనించి అప్పటి వరకూ గాంచుచున్న స్వప్నాన్ని అంతటితో అక్కడే త్యజిస్తున్నాడు. అది ఊహ యొక్క రాక పోకల వంటిది.

ఇక... జాగ్రత్ విషయానికి వస్తే... ఆ జీవుడు అనంతకాలంనుండి కలిగి ఉంటున్నట్టి వాసనలలో ఏవేవైతే మరణసమయంలో గోచరమౌతాయో... అవి భావి శరీరానికి కారణమౌతున్నాయి.

శ్రీరాముడు : మరణ సమయంలో గోచరించే వాసనలకు ఏదైనా ప్రత్యేకమైన కారణమున్నదా?

శ్రీవసిష్ఠ మహర్షి : అట్టి మృత్యు సమయ వాసనాదార్ఢ్యం అనేదానికి కారణం అనేక జన్మ పరంపరల అభ్యాసమేగాని ... దానికి మరొకటేదీ కారణం కాదు. జీవితాంతం ఆశ్రయిస్తూ వస్తున్న వివశత వలన "నేను అస్వాతంత్రుడను" అనే భావన గట్టిపడి అది పునర్జన్మకు మూలకారణమౌతోంది.

శ్రీరాముడు : తండ్రీ! మరి అందుకు ఉపాయమేమిటి? ఇక గత్యంతరం లేదా? ఈ జన్మ మృత్యు పునర్జన్మల పంజరంలో జీవుడు కొట్టుకుంటూ ఉండాల్సిందేనా?

శ్రీవసిష్ఠ మహర్షి : మార్గాంతరం (గత్యంతరం) ఎందుకు లేదు? ఉండబట్టే మనం ఈ సంవాదమునకు ఉద్యుక్తులమయ్యాం కదా! శాస్త్రాలు ఈ జీవునకు కొన్ని మహావాక్యాలు ప్రసాదిస్తున్నాయి. (అహమ్ బ్రహ్మాఽస్మి ...తత్త్వమ్...సోహమ్... సర్వమ్ ఖల్విదమ్ బ్రహ్మ) ఇట్టి మహావాక్యార్థం యొక్క నిరంతర మననం వలన " నేను అఖండ–అప్రమేయమైన బ్రహ్మాన్ని; సర్వతత్త్వ స్వరూపుడను" ...అను సదవగాహన సుస్థిరమౌతుంది. అదే బ్రహ్మభావన. దానిని బ్రహ్మసాక్షాత్కారం అని కూడా పిలుస్తున్నారు.

అట్టి బ్రహ్మభావన మాత్రం వాసనామయస్వప్నం వంటిది కాదు. దానినే వివిధ శాస్త్రాలు "చిత్‌బ్రహ్మము, శివము, అద్వైతము, చతుర్థము" మొదలైన శబ్దములతో ప్రవచిస్తున్నాయి. ఆ చిత్ భగవానుడు "తత్ జాగ్రత్" దృష్టిచే, లేక, "తురీయ దృష్టి" చేత గాంచబడుచున్నాడు.

ఓ రాఘవా! ఇక్కడ ఏ జాగ్రత్–స్వప్న–సుషుప్త్యావస్థలు కనిపిస్తున్నాయో... ఇవన్నీ ఆ బ్రాహ్మీ స్థితి సముపార్జించిన యోగి దృష్టిలో లేవు. అందుచేత ఆ మూడిటిచే ఆతడు లభ్యుడు, అనుభవ గమ్యుడు కాడని గ్రహించు. అట్టి మహనీయుడు వాసనారహితుడవటంచేత ఆతడు వాసనా సహితులగు వారిచే గుర్తించబడుట లేదు.

ఈ కనబడే జీవులంతా కూడా అట్టి నిర్మల, నిరంజన చైతన్యమేగాని మరింకొకటేదీ కాదు. అట్టి అద్వితీయుడగు చిదాత్మయే ఇక్కడ మనకు జీవుడుగా ప్రకటితుడగుచున్నాడు. తన యొక్క చిత్స్వభావం వల్ల ఇక్కడ పూర్వపు "దృష్ట – అదృష్ట" వస్తువులను విషయాలను గుర్తు ఉండి, గుర్తు లేక కూడా స్వప్నమునందు లాగా గాంచుచున్నాడు.

నిరంతర భావనాపరంపరల విశేషం చేత ఈ సంసారజీవునికి ఇంతవరకూ చూడబడిన విషయాలు, అభిప్రాయాలు, అనుభవాలు, అభిరుచులు క్రమంగా సన్నగిల్లి ఆ స్థానంలో కాలక్రమేణా కొత్తవి వచ్చి చేరుతున్నాయి. కొన్ని కొద్దికాలంలో లుప్తమైపోతున్నాయి. మరికొన్ని దీర్ఘకాలం ఉంటున్నాయి. జలంలో తరంగంలాగా పుట్టిన ప్రతిభావన ఒక రోజుకు లయించ వలసిందే! కానీ ఇంతలో నూతన తరంగంలాగా వాసనానుసారంగా నూతన భావనలు వచ్చిపడుతున్నాయి. దీని కంతటికీ ఒక క్రమముగాని, నియమము గాని ఉండవలసిన అవసరం లేదు. ఎందుకంటే, అవన్నీ ఆపాదితాలైనవే కదా! పైగా, పురుష ప్రయత్నం వాసనలను జయించగలుగుతుంది – అని మనం అనుకున్నాం కదా!

ప్రాక్తనీ వాసనాద్యాపి, పౌరుషేనైవ జీయతే ।
హ్యః కుకర్మాద్యయత్నేన ప్రయాతి హి సుకర్మతామ్ ॥

నిన్న చేయబడిన ఒక అపక్రమమైన కార్యము ఈ రోజు ఆచరించబడే సుకర్మయొక్క ప్రభావంచేత సక్రమమమైపోగలదుగా! ఉత్తమ ప్రయత్నశీలురు వాసనలు తప్పక జయించగలుగుతారు.

❖❖❖

10. మోక్ష తత్త్వము

ఈ జీవుడు, దేహము మొదలైనవన్నీ వాసనల యొక్క పరిణామమే సుమా! ఇవన్నీ ఉపశమించాలంటే ఉపాయం ఒక్కటే. ఆ ఉపాయము, లేక లక్ష్య స్థానమునకు శాస్త్రకారులు 'మోక్షము' అను పేరు పెట్టారు. మోక్షము అంటే 'నేను – ఈ జగత్తు కూడా సర్వ వాసనలకు సంబంధం లేనట్టి అప్రమేయమగు శివము లేక ఆత్మతత్త్వమే' అను అచంచల దృఢ నిశ్చయం.

మోక్షము లభించే వరకు ఈ జీవుడు – జన్మ – పునర్జన్మలు తప్పునవి కావు. ఈ ఇంద్రియములు – దేశకాలములు వికసించటం, ముకుళించటం మోక్ష పర్యంతమూ కొనసాగుతూనే ఉంటుంది. వాసనలు శేషించునంతవరకూ దీనిని నిరోధించటం ఎవరితరం కాదు. బాలుని స్వకీయ కల్పనలే భూతములను సృష్టిస్తున్నాయి. అట్లాగా, వాసనయే పంచభూత పరికల్పితమైన ఈ శరీరములను తోపింపజేస్తున్నాయి. శరీరంగా కల్పించబడుచున్న వాసనలు మోక్ష పర్యంతమూ ఉంటూనే ఉంటాయి.

'పుర్యష్టకం' అంటే ఏమిటి? 'మనస్సు, బుది, అహంకారము, పంచతన్మాత్రలు' ...అను వాటితో గూడిన ఆతివాహికమైన సూక్ష్మ శరీరమే కదా! అయితే, చిదాత్మ యొక్క స్వరూపం అమూర్తం (formless) – అపంచీకృతం (భూమి, అగ్ని మొదలైన పంచభూతములచే తయారు కాబడినది కాదు) కూడా!

ఈ భౌతికమైన ఆకాశం పంచీకృతం. చిత్‌యో? అది దేనితోనూ తయారుకాబడినది కాదు. ఈ జీవుని లింగదేహం (సూక్ష్మదేహం, అతివాహిక దేహం) భావనామయం మాత్రమే! అందులో పంచభూతాలు లేవు. కాల, ఆకాశాలు లేవు. కనుక మనో–బుద్ధి–చిత్త–అహంకారములతో కూడిన సూక్ష్మదేహం కూడా అపంచీకృతమే!

శ్రీరాముడు : "మోక్షము" అనునది స్థూల దేహానికా? సూక్ష్మదేహానికా?

శ్రీవసిష్ఠ మహర్షి : స్థూలమైన దానికి ముక్తి లేదు. బంధమూ లేదు. అసలు ముక్తి అంటే ఏమిటని అనుకుంటున్నావ్? వైరాగ్యాదులు అభ్యసిస్తూ రాగా... కల్పనలన్నీ తొలగిపోతాయి. కల్పనలున్నది ఆతివాహిక (లేక, లింగ) దేహంలోనేగాని స్థూల దేహంలోకాదు. కల్పనలన్నీ అతిక్రమించబడగా నీ కల్పనారహిత స్వస్వరూపం నీకు అవగాహన కావటమే, అనుభవ లభ్యమగుచుండుటమే ముక్తి – మోక్షం కూడా! కల్పనలకు ఆది మూలము అయిన నీవే ఆ సద్వస్తువు కదా! జడ కల్పనలన్నీ స్వస్వరూపంలో విలీనమొనర్చబడగా అప్పుడు సుషుప్తినిబోలిన చైతన్యం యొక్క అనుభవమాత్రమైన ముక్తిస్థితి ఈ జీవునకు లభిస్తుంది.

చూచావా? అది లభించటం, లభించకపోవటం ఈ జీవుని చేతిలోనే ఉన్నది. 'అది నాకెట్లా లభిస్తుంది? అది సులభమా?' అనే మీమాంస ఈ జీవుడు ఎంతగా త్యజించవలసియున్నదో నీవు గమనిస్తున్నావు కదా!

స్వప్నంతో పోల్చతగ్గ ఈ సూక్ష్మ శరీరం మోక్షం లభించనంత వరకు స్థావర జంగమాత్మక యోనులలో పరిభ్రమిస్తూనే ఉంటుంది. ఒకే దేహం ఒకప్పుడు జాగ్రత్‌ను, మరొకప్పుడు స్వప్నమును, ఇంకొకప్పుడు సుషుప్తిని పొందటం చూస్తూనే ఉన్నాం కదా! సుషుప్తిలో మనస్సు ఈ జాగ్రత్ – స్వప్నములను విలీనం చేసుకుని బీజభావమున దీపిస్తోంది.

స్థావరాది యోనులలో సుషుప్తి అత్యంత ఘనీభూతమై ఉన్నది. కించిత్ జాగ్రత్‌తో కూడి వృక్షయోనులలో కొంత తక్కువగా, కొంచెం ప్రబోధము ఉన్నది. అట్టి ప్రబోధం మనుష్యులలో మరింత జాగృతంగాను, ఉత్సాహంగాను ఉన్నది. సుషుప్తి కూడా కొంత చోటు చేసుకునియే ఉన్నది. అదియే గాఢనిద్రా పరవశస్థితి.

చిత్తము యొక్క జాడ్యప్రకర్షణయే సుషుప్తి... చిత్త భ్రమణమే సంసృతి... తత్వబోధయే విముక్తి.

ఇక తురీయావస్థ స్వస్వరూపమునందు జాగృత్ వంటిది – అని శాస్త్రములు మనకు బోధిస్తున్నవి. ఆత్మశాస్త్ర ప్రవచనముల ప్రబోధము వలన జీవుడు నిర్మలుడై విశుద్ధుడై 'పరమాత్మ' అగుచున్నాడు. జీవుడు స్వస్వరూపము విషయమై ప్రబోధితుడవటమే ముక్తి అని అనబడుతోంది. అట్టి ముక్తి జీవన్ముక్తి అని, విదేహముక్తి అని రెండు విధములుగా చెప్పబడుతోంది. దేహపరిమితమైన సర్వ స్పృహలు జయించి... అనంత దేహత్వము – సర్వ దేహాతీతత్వములను సంతరించుకున్నప్పటి నిశ్చల స్వస్వరూపానుభవమే విదేహ ముక్తిగా చెప్పుచున్నారు.

ఏదైతే జాగృత్ – స్వప్న – సుషుప్తులలో మార్పు చేర్పులు లేక, నిర్విషయమై నిరాధారమై, అస్పృశ్యమై అనునిత్యం అనుస్రుతంగా ప్రసరించి ఉన్నదో … అట్టి ఈ జీవుని వాస్తవ స్వరూపమును 'తురీయ' మంటున్నారు. దానినే బోధ అని కూడా పిలుస్తున్నారు. తనను తాను తురీయముగా అవగాహన చేసుకొను అవస్థ తురీయావస్థ. తురీయావస్థ నుండి జీవుడు తురీయాతీతమును సంపాదించు కుంటున్నాడు. అదియే 'చిన్మాత్రము, బ్రహ్మ స్వరూపం పొందటం!'

బుద్ధి యొక్క పురుషకార ప్రయత్నము వలన "బోధ" లేక, "తురీయము" అనునవి లభించటం జరుగుతోంది. అట్టి పురుషకారబలంచేత, తత్త్వజ్ఞానబలం చేత పరమాత్మను గురించిన ప్రమాణములన్నీ ఈ శరీరము కలిగియున్నప్పుడే గ్రహించి తన్మయుడౌతున్నాడు. "ఇంతవరకు సత్యమని నమ్మిన శరీరములు – భయములు – అన్నీ కూడా దీర్ఘమైన స్వప్నవిభ్రమం" – అని గ్రహిస్తాడు.

ఎందుకంటే జీవుని అంతరమున చిత్కళ కాక మరింకేమీ లేదు. ఆ చిత్కళనే అన్యభావంగా గాంచి ఈ జీవుడు నిష్కారణంగా శోకిస్తున్నాడు. ఈ జీవునిలో ఆ పరమాత్మగాక ఇంకేమీ లేదు. ఇక, ఇక్కడ–అక్కడ కనబడే జగత్తు ఏమిటంటావా?

యత్రయత్ర జగత్ దృష్టమ్, అహో! మాయావిజృంభితమ్!
స్థల్యన్తః క్వథత్ అంబూనాం, యథానానా భ్రమోదయః
జీవాణూనాం తథైవాంతః మిథ్యా సంసరణోదయః
బన్ధోస్య – "వాసనాబన్ధో", మోక్షస్యాత్తౌ వాసనాలయః" ॥

ఇక్కడ ఏ ఏ జగత్తు కనబడుచున్నదో … ఇదంతా వాసనావిజృంభణము మాత్రమే. మూకుడులో మరుగుచున్న నీరు రకరకాల రూపవిన్యాసములను దాలుస్తూ కనబడుతుంది చూచావ్? అట్లా చిత్ చైతన్యము సంసారమునందు అనేకానేక జీవుల రూపంలో వారి అంతరంగముల రూపంలో కనబడుతోంది.

వాసనల చేతనే అట్లా కనిపిస్తోంది. జీవునకు వాసనా బంధమే బంధము. ఆ వాసనలు లయించుటయే మోక్షం. జడమగు సుషుప్తి వాసనలకు పరమావధి.

తురీయాతీతమో … వాసనారాహిత్యం …! జీవుని నిజస్వరూపం వాసనారహితమైన తురీయమే అయున్నది. అది మరచి వాసనల ననుసరించటం చేతనే స్వప్నంలోలాగా స్థావరాది వివిధ భావనలు జీవుడు పరిగ్రహిస్తున్నాడు.

వాసనలు తీవ్రంగా ఉన్నప్పుడు స్థావరయోనులు పొందుచున్నాడు. వాసనలు మధ్యస్థాయిలో ఉన్నప్పుడు జంతుయోనులను పొందుచున్నాడు. వాసనలు తక్కువగా ఉంటే మనుష్య, గంధర్వ రూపములు పొందుచున్నాడు.

వాసనల పెరుగు తరుగులే తదనంతర ఉపాధులను నిర్ణయిస్తున్నాయి. సుషుప్తి తొలగి, ఆపాదమస్తకం ప్రాణాహంకారము ప్రసరించినప్పుడు 'నేను ఇట్టి శరీరమును కలిగి ఉన్నాను. ఇది నా బాహ్యమైన జగత్తు' అను భావనకు బద్ధుడగుచున్నాడు.

ఓ రామచంద్రా! ఇదంతా స్వప్నంలో కనిపించిన తటాకంలో జలతరంగం వంటిది మాత్రమే! వృత్తులచే వాస్తవానికి విచ్ఛిన్నుడు కానట్టి ఈ జీవుని అంతఃకరణం నుంచి కళ్ళు మొదలైన ఇంద్రియముల ద్వారా 'ఎరుక' అను స్రవంతి ఈ కుండ – గోడ మొదలైన వస్తువులపై ప్రసరించి వాటిని 'ఎరుగుట' అను రసముతో నింపివేస్తోంది. అప్పుడు 'గ్రహించునది – గ్రహించబడునది' అను రూపంలో వాసనల యొక్క సత్త విచిత్రంగా స్ఫురిస్తోంది.

ఇట్లు అంతఃస్థితమగు ఆత్మచైతన్యమే గ్రాహ్య – గ్రాహక – వాసనా రూపమున 'దృశ్యము' అనబడు మృగతృష్ణగా ప్రకాశిస్తోంది. సకల గ్రాహ్య – గ్రాహక సంబంధములు వాసనాధ్యస్తములైన భ్రమలు మాత్రమే. మరింకేమీ కాదు. ఇక ఈ దృశ్యము వాస్తవమెట్లా అవుతుంది చెప్పు? నిజానికి ఇక్కడ ఆత్మ గ్రహించునది గాని, త్యజించునది గాని ఏదీ లేదు. చిదాత్మ ఒక్కటే బయట – లోపల కూడా ప్రకాశిస్తోంది. ఈ త్రిజగత్తులు చిత్ చమత్కృతియే.

నిజంగా, అవలోకిస్తే సముద్రంలో తరంగాలు, సుడులు, బుడగలు, జలమునకు వేరుగా ఉన్నాయా? లేదు. సముద్రమంతా జలమయమే కదా! ఈ జగత్తునందు వాసనలు అవస్థలు దృష్టి యొక్క అవస్థలు మాత్రమే.

అనాద్యము, ఆద్యము కూడా అయినట్టి అయిన పరమపదమే ఇదంతానయ్యా!

❖❖❖

V. శ్రీకృష్ణార్జున సంవాదం

1 అనాసక్తి యోగం

శ్రీరాముడు: హే సద్గురూ! మీరు ఈ జాగ్రత్‌ను స్వప్నం వంటిది మాత్రమేనని సిద్ధాంతీకరిస్తున్నారు కదా! స్వప్నం విషయానికి వస్తే ప్రతి ఒక్క జీవుని స్వప్నం ప్రత్యేకమై, ప్రక్కన ఉన్నవానికి సంబంధించనిదై ఉంటోంది. జాగ్రత్ అట్లా ఉండటం లేదు. ఒక గోడ – కొండలవలెనే ప్రాప్తిస్తోంది. అనేకులందరికీ ఒకే విధంగా ఉంటున్న ఈ జాగ్రదవస్థ స్వప్నం వంటిదని అనటం ఎంతవరకు కుదురుతుంది?

ఈ ప్రశ్నకు మీరు సమాధానం ఇతఃపూర్వపు ప్రకరణంలో ప్రవచించటం జరిగింది. అయితే ఈ నిర్వాణ ప్రకరణం సందర్భంలో ఈ విషయమై మీ విశ్లేషణ, ప్రవచనాలను వినాలని ఉంది.

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! 'ఈ జాగ్రత్ సమష్టి జీవుని స్వప్నము మాత్రమే' అని వేదాంత వాఙ్మయం ప్రకటిస్తోంది. ఇదంతా కల్పిత సంసారం. ఇది సత్యం కాదు. అసత్యం కాదు. సమష్టిజీవుని స్వప్నం ఈ వ్యష్టి జీవుని స్వప్నం కంటే విశిష్టమైనది. అయితే ప్రతి ఒక్క జీవుని జాగ్రత్ భావాలు ఆ జీవుని 'జాగ్రత్‌స్వప్నం' మాత్రమే! ఒక జీవుని నిద్రా సంబంధమైన స్వప్నం ఊహాసంబంధమై కొన్ని క్షణాలలో పుట్టి, కొద్ది క్షణాలలోనే నశిస్తోంది. సమష్టిజీవుని స్వప్నం కూడా "అసత్యము, అవస్తువు" అయి ఉన్నది. అయితే, కాలమానం దృష్ట్యా కొంత సుదీర్ఘకాలం వెలయుచున్నది. అట్లాగే, ఈ జాగ్రత్ స్వప్నం కంటే మరికొంత అధికంగా సత్యము వలె తోచుచున్నది. అయినా రెండూ సత్యం కాదు.

ఈ జీవుడు ఒక స్వప్నం గాంచిన తరువాత అందుకు భిన్నమైన మరొక స్వప్నం గాంచుచున్నాడు కదా! అట్లాగే సమష్టి జీవుని కల్పనలో ఈ వ్యక్తిగత జీవుడు ప్రవేశించి ఒక్కొక్క ఉపాధితో ఒక్కొక్క విభిన్నమైన స్వప్నకాలిక సుదీర్ఘానుభవం పొందుతున్నాడు. ప్రతి ఒక్కని ప్రతిఒక్క జాగ్రత్ అనుభవంలో స్వప్న సదృశ్యమైన అసత్యం రాజ్యం ఏలుతోంది. సమష్టి జీవుని (హిరణ్యగర్భుని) కల్పనామహిమ ఇట్టిది మరి!

ఈ జీవుని పట్ల, "ఒక దేహం, తదనంతరం మరొక దేహం" – అను రూపంగా కనిపించే ప్రహసనం కూడా, "ఒక స్వప్నం, మరునాడు కనిపించే మరొక స్వప్నం" – అను వ్యవహారం వంటిదే!

అజడమైనట్టి బ్రహ్మవస్తువు... సమష్టి జీవుని 'అంశ' అయినట్టి ఈ వ్యక్తిగత జీవుని మోహవశమై జడంగా గాంచబడుచున్నది. స్వయంజ్యోతి అయిన ఆత్మప్రకాశం ఈ సమష్టి–వ్యష్టి కల్పనల రూపంలో 'స్వప్నభ్రమ' అనే జగన్నాటకం ప్రదర్శిస్తోంది. ఆత్మ ప్రకాశమే లేకపోతే సమష్టి జీవుడు లేడు... వ్యక్తిగత జీవుడు ఉండడు ...జగత్తు ఉండజాలదు. స్వప్న ద్రష్ట లేకపోతే స్వప్నం ఎవరికి?

అయితే, ఆత్మ యథాతథం. ఈ జగత్తు ఆత్మ యొక్క భావనా చమత్కారం మాత్రమే! ఇక దేని గురించైనా దిగులుదేనికి? వేదన ఎందుకు?

సూర్యుని వలన ప్రకాశించే ఈ త్రిజగత్తులలోనికి జీవులు పరస్పర భేదకల్పనలు ఒనర్చుకొని భ్రమిస్తున్నారు. ఈ వ్యక్తిగత భ్రమలకు మూలకారణమైన సమష్టి జీవుడు అనంతుడు. ఆత్మ సర్వగతం అవటం చేత అది ఎక్కడ ఏ కల్పనకు ఉపక్రమిస్తే అక్కడ ఆ కల్పన అట్లే పరిఢవిల్లుతోంది. ఇటువంటి మాయా కల్పితమైన దృశ్యమునందు ఏర్పడి ఉన్న కల్పనపట్ల ఆసక్తి అనవసరం. ఆసక్తియే బంధము. అనాసక్తియే ముక్తి. రాబోయే ద్వాపర యుగంలో మహావిష్ణువు శ్రీ కృష్ణుడుగా అవతరించినప్పుడు ఈ అనాసక్తియోగం గురించి ఆయన అర్జునునకు ఉపదేశించటం జరుగుతుంది. పాండునందనుడగు అర్జునుడు యుద్ధమునకు ఉపక్రమించే ముందు శ్రీకృష్ణభగవానుడు ప్రవచించబోయే "దృశ్య అనాసక్తి, యోగాభ్యాసంచే పెంపొందగల ఆత్మయోగం" విని తరిస్తాడు.

శ్రీరాముడు: స్వామీ! రాబోయే యుగంలో జరగబోయే మహత్తరమగు ఆ శ్రీకృష్ణార్జున సంవాదంలోని కొన్ని ముఖ్య విశేషాలు విశదీకరించమని ప్రార్థిస్తున్నాను.

శ్రీవసిష్ఠ మహర్షి : విను ...చెపుతాను.

❖❖❖

2 ఆత్మకు జననమరణాలు లేవు

ఆకాశమును ఆశ్రయించుకొని ఆకాశము వెలయుచున్నట్లు... కేవల ఆత్మను ఆశ్రయించుకుని ఆద్యంతరహితమైన అస్తి – సన్మాత్రము అనునది ఆత్మచే పరికల్పించబడి అనంతమై వెలయుచున్నది.

నిర్వికారమగు ఆత్మయందు వికారరూపమగు ఈ సంసారభ్రమ అంతా గాంచబడుచున్నది. బంగారంలోనే రకరకాల ఆభరణాలు, జలంలోనే రకరకాల తరంగాలు ఉంటున్నాయి కదా! ఆత్మ యందే ఈ 14 విధములైన జీవజాలాలు (చతుర్దశభువనాలు) వలలో చిక్కుకున్న పక్షులలాగా చిక్కి ఉంటున్నాయి. ఇక శ్రుతి, స్మృతులలో వర్ణించబడిన యమ, ఇంద్ర, చంద్ర, సూర్యాది లోక పాలకులు ఈ భూత పంచకంతో కూడిన సంసారానికీ, ఇందలి లోకాలకూ నాయకత్వం వహిస్తూ ఉంటున్నారు. ఆ లోకపాలకులు – ధర్మాధర్మములను, సుకృత దుష్కృతాలను అనుసరించి జీవులకు శుభాశుభప్రదాతలై లోకాలు పాలిస్తున్నారు.

లోకపాలకులలో ఒకడైన యమభగవానుడు సృష్టి ప్రారంభం నుండి ఇప్పటి వరకూ కర్మఫల ప్రదాతగా నిగ్రహ–అనుగ్రహముల రూపంలో ధర్మాధర్మప్రవృత్తులను అనుసరించి జీవులకు అధమ – ఉత్తమ ఉపాధులు ప్రసాదిస్తూ ఉంటున్నారు. తాను మాత్రం స్థిరచిత్తుడై ఆత్మానుభవి అయి, నిశ్చలుడై తన నియమిత విధులను నిర్వర్తిస్తున్నాడు.

ఆ యముడు ప్రాణులను హింసించుట వలన కలిగే వికలములను తొలగించుకొనుటకు ప్రతి ద్వాపర యుగాంతంలోనూ తపస్సు చేస్తూ ఉంటాడు. ఆయన ఒకప్పుడు 8 ఏళ్ళు, మరొకప్పుడు 10 ఏళ్ళు, ఇంకొకప్పుడు 12–14 సంవత్సరాలు ... తపస్సు చేస్తూ ఉంటారు. అట్లా తపోనియమితులై ఔదార్యం వహించి ఉన్నప్పుడు మృత్యువు ఈ జగత్తునందలి ఏ ప్రాణినీ స్వయంగా హింసించదు.

నిదురిస్తున్న మదపుటేనుగును వేలాది దోమలు ఆశ్రయిస్తున్నట్లు ఆ సమయంలో ఈ భూమండలం అనేక విధములైన జీవులతో నిండి ఉంటుంది. అప్పుడు విచిత్రజీవులతో నిండిన ఈ భూదేవత యొక్క భారాన్ని తగ్గించటానికి దేవతలు అనేక ఉపాయాలతో సంహారకార్యం నిర్వర్తిస్తారు. ఈ విధంగా భూభారం తగ్గించటం కొన్ని వేలసార్లు జరిగింది.

రాబోయే ద్వాపరయుగంలో కూడా సూర్యపుత్రుడు, పితృ నాయకుడు అగు యముడు ప్రాణి హింస వలన కలిగిన సంతాపం పోగొట్టుకోవటానికి 12 సంవత్సరాల పాటు తపస్సు చేస్తాడు. అప్పుడీలోకంలో మృత్యువు అనేదే ఉండదు. భూమి అంతా చెట్టు, పుట్టలతో నిండి భారవంతం అవుతుంది. అప్పుడు భూమాత భూభారం సహించలేక డస్సిపోతుంది. పరాభూత అయి, దీన అయి తనపతి అగు శ్రీహరిని శరణువేడుతుంది. అప్పుడు శ్రీహరి దేవతల అంశను పరిగ్రహించి నర – నారాయణులు అను రెండు రూపాలతో అవతరిస్తాడు. ఆ నర–నారాయణులలో నరుడు పాండవ మధ్యముడైన అర్జునుడు గాను, నారాయణుడు దేవకీ వసుదేవుల సుతుడు శ్రీకృష్ణుడుగాను భూమిపై అవతరిస్తారు.

పాండవులు పాండురాజు కుమారులు. అందులో పెద్దవాడైన ధర్మనందనుడు యుధిష్ఠిరుడు అను పేరుతో ప్రసిద్ధికెక్కుతాడు. ఆతడు సముద్రము వంటి రాజ్యమునకు చక్రవర్తి అయి ధర్మవేత్తగా ఖ్యాతి గడిస్తాడు.

'దుర్యోధనుడు' అనునాతడు పాండవుల పెదతండ్రి అయిన ధృతరాష్ట్రుని కుమారుడు. ఆ దుర్యోధనుడు పాండవులలో ద్వితీయుడైన భీమసేనునితో బద్ధవైరం కలిగి ఉంటాడు. కాలక్రమేణా ధృతరాష్ట్రుని నూర్గురు కుమారులు, అతని తమ్ములు పాండురాజు యొక్క ఐదుగురు కుమారులు భూమండలం కొరకై 18 అక్షౌహిణీల సైన్యం సమకూర్చుకుని యుద్ధానికి సమాయత్తమౌతారు.

యుద్ధం ప్రారంభించే సమయంలో విష్ణు భగవానుని 'అర్జున'శరీరం 'యుద్ధం – జననాశనం' విషయంలో తర్జన భర్జన పడుతుంది. ప్రాకృతభావం పొందటం చేత హర్షామర్షాన్వితమై అజ్ఞాన యుక్తం అవుతుంది. "బంధువులను సంహరించడం ఉచితమా? యుద్ధము చేయకుండా ఊరుకోవడం ఉచితమా?" – అనే ధర్మసందేహం అతని అంతరంగాన్ని కలచివేస్తుంది. ఇక మహావీరుడగు అర్జునుడు ఇరువైపులా ఉన్న రక్త సంబంధీకులగు బంధువులను గాంచి 'అయ్యో! నా బంధువులను నేను వధించటమేమిటి?" అని తలచి అత్యంత విషాదం పొందుతాడు. అతని మనోదౌర్బల్యమును గమనించిన శ్రీకృష్ణ భగవానుడు ఉభయసేనల మధ్య రథంలో ఈ విధంగా అర్జునునకు బోధిస్తారు.

❖

శ్రీకృష్ణ భగవానుడు: ఓ అర్జునా! ఏమిటి నీ మీమాంస? నీ బంధుజనులు మరణిస్తారేమోననా? "ఇది ధర్మమా? కాదా?" అనునది నీకు పరిశీలనాయోగ్యం కావాలే తప్ప, జనన–మరణములను, బంధు–అబంధుత్వాలను బట్టి కర్తవ్య–అకర్తవ్యములను నిర్ణయించటం ఉచితమనిపించుకోదు సుమా! ఇక్కడ చంపే వారెవ్వరు? చచ్చే వారెవరు? నీవు గాని, నీ బంధువులు గాని, తదితరులు గాని

ఆత్మయే స్వరూపంగా కలిగి ఉన్నారు. అంతేగాని, ఈ ఎదురుగా కనిపిస్తున్న పాంచభౌతికదేహములు మనందరి అసలు స్వరూపం కాదు.

ప్రతి జీవుడు ఆత్మస్వరూపుడే గాని, భౌతికదేహ పరిమితుడు కానే కాదు. ఆత్మకు జనన మరణాలు లేవు. ఈ దృశ్య-దేహ-మనో-బుద్ధి-చిత్త-అహంకారా లనే ఆరు రకాల భావాలు ఆత్మ యందు లేవు. ఆత్మ అనునది ఇప్పుడు గాని, ఇతఃపూర్వం గాని, ఇకముందు గాని జన్మ పొందటం లేదు. మరణించటం లేదు. అది నిత్యమై, వాస్తవమై, పురాతనమై – సదా వెలుగొందుచున్నది. శరీరాలు రావచ్చు, పోవచ్చు... ఆత్మకు ఏమీ అవదు. ఆత్మను చంపుచున్నామని గాని, తామే చచ్చుచున్నామని గాని తలచేవారు నిర్వికారమగు ఆత్మతత్త్వమేమిటో ఎరుగనివారు మాత్రమే! ఆత్మ ఎవరినీ చంపదు, తాను చావదు. అనంతము, ఏకరూపము, సత్‌స్వరూపము, ఆకాశము కంటే సూక్ష్మము, సర్వదా అప్రమేయము అగు ఆత్మను ఎవరేం చేయగలరు?

కాబట్టి అర్జునా! నీవు ఆత్మను అఖండముగా, అనంతముగా, ఆదిమధ్యాంత రహితముగా గ్రహించు. నీవు ఎవరనుకుంటున్నావ్? అపరిచ్ఛిన్నము, దోషరహితము, చైతన్యస్వరూపము అగు ఆత్మవే నీవు! అందుచేత, ఇక్కడ పాంచభౌతిక విషయమైన బంధు సంయోగ-వియోగములకు సంబంధించిన సుఖదుఃఖములు నిన్ను ఎట్లా అంటగలవు చెప్పు?

❖❖❖

3 కర్మ రహస్యం

శ్రీకృష్ణ భగవానుడు:

అర్జున! త్వం నహన్తా! త్వమ్ అభిమానమలం త్యజ ।
జరామరణనిర్ముక్తః స్వయమాత్మాసి శాశ్వతః ॥

ఓ అర్జునా! శాశ్వతము, జరా-మరణములు ఉండనిది అగు ఆత్మవే నీవు. కనుక “నేను చంపబోవువాడను కదా”! మొదలైన స్వల్ప అభిమానములను పరిత్యజించు.

యస్య నాహంకృతో భావో, బుద్ధిర్యస్య న లిప్యతే ।
హత్వాపి స ఇమాంల్లోకాన్ నహన్తి న నిబధ్యతే ॥

ఎవనికి “నేను దీనికి కర్తను అను” అహంకారం కించిత్ కూడా ఉండదో, ఎవరి బుద్ధి అయితే దోషరహితమై ఉంటుందో... అట్టివాడు ఆయా క్రియలచే బంధింపబడుటలేదు. ఎవడైనా సరే, తన లోపల ఎట్టి జ్ఞానం కలిగి ఉంటాడో, బాహ్యమున అట్టి అనుభవమే పొందుతూ ఉంటాడు. కాబట్టి దేహాభిమానాన్ని త్యజించు. అప్పుడు దేహాలచే స్పర్శించబడనట్టి దేహిని నీవు దర్శించగలుగుతావు.

అర్జునుడు: హే కృష్ణా! ఈ బంధువధను తలచుకున్నప్పుడు నేను పరితాపం పొందుచున్నాను. ఇది ఎట్లా తొలిగేది?

శ్రీకృష్ణ భగవానుడు: నీ పరితాపమునకు కారణమేమిటి? చెపుతాను... విను. "నేను వీరిని చంపువాడను" అను హంతకత్వపు అభిమానం నిన్ను ఆవరించింది. ధర్మాధర్మముల విచక్షణను వదలి పాపాదులను స్మరించి సుఖదుఃఖములకు లోను అగుచున్నావు. నిజానికి ఈ ప్రపంచంలో ఆత్మను ఆవరించి ఉన్నట్లు కనిపించే సత్వరజస్తమో గుణములే ఆయా కర్మలను ఆచరిస్తున్నాయి. అది అట్లు జరుగుచుండగా అహంకారముచే విమూఢుడగు ఈ జీవుడు 'ఇదంతా నేనే చేస్తున్నాను' అని అనుకుని భ్రమ పొందుచున్నాడు. అట్టి 'అహంకర్తాస్మి' అనే కర్తృత్వ భావనతో గర్వించుటయో, వాపోవుటయో చేస్తున్నాడు. తాను కర్తృత్వ భోక్తృత్వరహితమగు ఆత్మననే విషయం ఏమరుస్తున్నాడు.

చక్షుః పశ్యతు కర్ణశ్చ శృణోతు, త్వక్ స్పృత్విశదమ్ ।
రసనాచ రసం యాతు కాఽత్ర కోఽహమితి స్థితిః? ॥

మహాత్ముల దృష్టి ఇంకోరకంగా ఉన్నది. 'కన్నులు చూస్తున్నాయి. చెవులు వింటున్నాయి. చర్మం స్పర్శించుచున్నది. నాలుక రుచి చూస్తోంది. వీటితో నాకేమి సంబంధం?" అని వారు భావన చేస్తున్నారు. అంతఃకరణమునకు బహిర్ ఇంద్రియములకు వేరైన విశిష్టమైన ఆత్మస్వరూపులమని, ఆత్మ దేనికి సంబంధించినది కాదని (అప్రమేయమని) గ్రహించి ఉంటున్నారు. కాబట్టి "వీరు కష్టం పొందుచున్నారే!' అనువారి ఆత్మకు ఆ కష్టాలతో ఏమి సంబంధం? అర్జునా! అనేక విశేషాలు ఒకచోట ఒనగూడుటచే జరిగే ఒకానొక కార్యమును చూచి ఈ జీవుడు 'ఇదంతా నా వలననే జరుగుచున్నది' అని అనుకోవటం ఎంతటి హాస్యాస్పదం? అది దురభిమానం కాక మరేమిటి?

కర్మలు అందరూ చేస్తున్నారు. అయితే...

కాయేన మనసా బుద్ధ్యా కేవలైరింద్రియైరపి ।
యోగినః కర్మ కుర్వన్తి సంగం త్యక్త్వా "ఆత్మశుద్ధయే" ॥

యుక్తాయుక్త వివేకులగు యోగులు కూడా కర్మలు నిర్వర్తిస్తున్నారు. అయితే ఈ మనో–బుద్ధి –ఇంద్రియ–శరీరములను ఆయా కార్యములందు నియమించి 'సంగము' అనేది లేకుండా, కేవలం ఆత్మశుద్ధి కొరకు ఆయా నియమిత శాస్త్ర ప్రవచిత కర్మలు లోక కళ్యాణమును, లోకానుకూలతను దృష్టిలో పెట్టుకొని సేవాభావంగా స్వధర్మాన్ని నిర్వర్తిస్తున్నారు. ఎవరి శరీరమందైతే అహంకారం అనే దుర్గంధం అలముకొని ఉండదో... ఎవ్వరు రాగద్వేష రహితులై ఉంటారో... అట్టివారు ఈ లోక వ్యవహారములు ఆచరిస్తున్నప్పటికీ భోగించని వారే! దుశ్శీలుడైన మానవుడు తెలివి కలవాడైనా, పండితుడైనా శోభించడు కదా! అట్లాగే మమకారం అనేది ఉన్నచోట ఆత్మత్వం భాసించదు.

నిర్మమో, నిరహంకారః, సమదుఃఖసుఖః క్షమీ,
యః స కార్యమకార్యం వా, కుర్వన్నపి న లిప్యతే ॥

అహంకార, మమకారాలు లేనివాడు, సుఖదుఃఖాలను సమంగా గాంచువాడు, క్షమాశీలుడైన వాడు ఆయా కార్యాలను నెరవేరుస్తున్నప్పటికీ లిప్తుడు కాడు. ఓ పాండుసుతా! ఈ క్షాత్రవ కర్మయే ఇప్పటి నీ స్వధర్మమైయున్నది. స్వకర్మ అనునది ఎటువంటిదైనా సరే... అది తప్పక శుభం చేకూరుస్తుంది. ఈ యుద్ధం చేయుట అనే కర్మ కుత్సితం మొదలైన ఆయా దోషాలతో కూడుకుని ఉండవచ్చు

గాక. అయినప్పటికీ నీ యొక్క ధర్మ నిర్వహణార్థం నీకు నియమించబడినది. నీవు నిర్వర్తించవలసిందే. అయితే, నీ ఈ శాస్త్రవిహిత స్వధర్మమును సర్వాత్మకుడగు పరమాత్మకు సమర్పిస్తూ ఆరాధనాపూర్వకంగా నిర్వర్తించావా... నీ స్వధర్మం నిన్ను అమృతతుల్యునిగా చేస్తుంది. ఈ ప్రపంచంలో ఒక మూర్ఖునకు కూడా స్వధర్మమే శ్రేయోదాయకం అవుతోంది. ఇక ధర్మరక్షణ కంకణధారివైన నీవంటి బుద్ధిమంతునకు వేరే చెప్పేదేమున్నది?... అహంకార రాహిత్యుని జయాపజయములు లిప్తం చేయలేవు.

యోగస్థః కురుకర్మాణి సంగం త్యక్త్వా ధనంజయా!

నిః సంగస్త్వం యథాప్రాప్త కర్మన్న నిబధ్యతే ॥

ఓ ధనంజయా! నీవు బ్రహ్మ పరిపూర్ణమగు బుద్ధితో ఆసక్తిని పరిత్యజించి కర్మలను నిర్వర్తించు. నిస్సంగివై యథాప్రాప్తములైన కర్మలను నిర్వర్తించు. సంగరహితుడవై స్వధర్మ నిరతిపూర్వకంగా కర్మలను ఆచరిస్తూ ఉంటే, అప్పుడు ఆ కర్మలు నిన్ను బద్ధునిగా చేయజాలవు. కాబట్టి ఆయా సర్వ సందర్భములలో శాంతమగు బ్రహ్మభావముతో కూడుకొని ఉండు. ఉద్వేగరహితుడవై 'ఈ కర్మలన్నీ బ్రహ్మమయములే' అను ఎరుకతో ఆచరించు.

బ్రహ్మపూర్ణమగు ఆచరణ కలవాడు తత్-క్షణంలో బ్రహ్మమే అగుచున్నాడు.

ఒకవేళ 'బ్రహ్మము' అనబడే సత్ చిత్ ను స్వభావసిద్ధంగా ఆశ్రయించి ఉండటం కష్టమనిపిస్తోందా? నీవు చేస్తున్న సర్వ కర్మలు సమర్పణ చేసి ఆ కర్మలు నిర్వర్తించే నీవు మాత్రం ఈశ్వరాత్ముడవై నిరామయుడవై ఉండుము. "ఈశ్వరుడు సర్వజీవులయందు సమస్థితుడై ఒకే రీతిగా వెలయుచున్నాడు" అని గ్రహించి ఉండటమే ఈశ్వరాత్మత్వం. అట్టి అవగాహనచే నీవు ఈ భూమండలమునకే ఒక అలంకారమై ఉంటావు. క్రమంగా సంకల్పములన్నిటినీ సంపూర్ణంగా త్యజించివేయి. శాంతచిత్తుడవు, సమదర్శివి కమ్ము. అట్టి అభ్యాసం చేత ముక్తి లభించగలదు.

మోహం తొలగాలంటే సత్సాంగత్యము, ఈశ్వరార్పణపూర్వకమైన కర్మనిరతి, బ్రహ్మార్పణము, జ్ఞానయోగము అనునవే మార్గములు.

అర్జునుడు: హే కృష్ణా! నా అజ్ఞాన మోహం తొలగడానికి గాను – 1. సత్సాంగత్యం, 2. ఈశ్వరార్పణం, 3. జ్ఞానయోగం, 4. బ్రహ్మార్పణం – వీటి గురించి సవివరంగా చెప్పండి.

శ్రీకృష్ణ భగవానుడు: ...విను.

1. **సత్సాంగత్యము -** 'సత్' స్వభావమునకు సంబంధించిన శ్రవణమననాదులు, జ్ఞానులతో స్నేహం, సంభాషణ, శ్రవణం.
2. **ఈశ్వరార్పణము -** సహజీవులను ఈశ్వరరూపంగా దర్శించటం. ఈశ్వర సేవాభావంతో ప్రేమ, కరుణ మొ॥న సాత్విక గుణములను ప్రవృద్ధపరచుకోవటం
3. **జ్ఞాన యోగము -** ఉత్తమ బుద్ధిని సంపాదించుకునే ప్రయత్నములే 'జ్ఞానయోగ స్థితి' కి త్రోవ తీస్తున్నాయి.
4. **బ్రహ్మార్పణం -** "నేను, జగత్తు" మొదలైన వాటి యందు ఏర్పడే అహంభావాన్ని బ్రహ్మానికి సమర్పించటం. అంటే 'అధ్యాస'ను అధిష్ఠానమైన బ్రహ్మానికి అభిముఖం చేయటం. సర్వం బ్రహ్మమునకు చెందినవిగా భావన కలిగిఉండటం.

ఓ అర్జునా! బ్రహ్మం అంతర్‌శూన్యమై, బహిర్‌శూన్యమై పాషాణం వలె చిద్ఘనమై, పరమశాంతమై, ఆకాశకోశము వలె స్వచ్ఛమై వెలయుచున్నది. అయ్యది ఈ దృశ్యం కంటే, ఈ దృశ్యాన్ని పరికించే ద్రష్ట కంటే కూడా అత్యంత సూక్ష్మము. అయితే ఏం? అట్టి బ్రహ్మము నుండి ఈ స్థూల జగత్తుల అనుభవం ఉత్పన్నమౌతోంది. అట్లు జగత్తుగా తోచుచున్నదంతా స్వప్నసదృశమే!

బ్రహ్మమునందు జగత్తులు ఆరోపించబడుచున్నాయి. అనగా... బ్రహ్మము యొక్క స్వల్పాంశము లోని అత్యంత స్వల్ప విభాగమునందు 'జీవుడు' అనునది భ్రమచే ఆరోపించబడుతోంది.

అట్టి భ్రమయందు (బ్రహ్మము వేరు, ఈ జీవుడు వేరు–అను అల్పదృష్టులందు) నీవు మాత్రం చిక్కుకోవద్దు. నిజానికి ఏ వస్తువునందైతే పరిచ్ఛేదము ఏర్పడటానికి ఏమాత్రం వీలే లేదో... అట్టి అపరిచ్ఛేద వస్తువునందు పరిచ్ఛేదము స్వీయ అజ్ఞానముచే దర్శించబడుతోంది. ఏది ఎట్లు ఉన్నప్పటికీ, బ్రహ్మము నందు పరిచ్ఛేద, అపరిచ్ఛేద సంబంధమైన అహంభావం యుక్తియుక్తమే కాదు. అఖండమైన వస్తువునందు అనేకత్వ భావనను ముందు వదలివేయటం అభ్యసించు. 'అహంకారము అనబడేది కూడా బ్రహ్మము నుండి వేరైనది కాదు' అను అవగాహనను పెంపొందించుకో. జలమయమగు సముద్రంలో జలరూపములగు తరంగాలు కనబడుచున్నట్లు బ్రహ్మమునందు అహంకార–మమకార, తరంగ–ఉపతరంగాలు స్ఫురిస్తున్నాయి. ఇక దేనిని చూచైనా ఎందుకు దుఃఖించటం చెప్పు? విచిత్రము లైన 'భిన్న భావాలు' అనే వైచిత్ర్యాలు జ్ఞానమయమైన ఆత్మయందు భ్రమచే స్ఫురిస్తున్నాయి. ఎందులో అయితే ఈ నానాత్వము, తదితర భావపరంపరలూ స్ఫురిస్తున్నాయో, అది సత్యవస్తువగు ఆత్మయే అయి ఉన్నది. అట్టి ఏకత్వము నందు నీ బుద్ధిని ఎందుకు నిలపరాదో చెప్పు?

ఈ విధంగా ఉత్తమబుద్ధితో విమర్శించి సారాసారములను గ్రహించిన పురుషుని యందు క్రమంగా "అహం–నాది" అనునవి ఉపశమిస్తున్నాయి. అప్పుడు అకృత్రిమమైన కర్మఫలత్యాగం సిద్ధించ గలదు. అట్టి అకృత్రిమ ఫలత్యాగమును సన్యాసము అని పిలువబుడుచున్నది.

కర్మఫలత్యాగ పూర్వకమైన సన్న్యాసము వలన సంకల్పత్యాగం అనే అసంగస్థితి నీకు సుసాధ్య మౌతుంది. తద్ద్వారా కర్మల పట్ల ఈశ్వరార్పిత బుద్ధి జనించి, సుదృఢమౌతుంది. కల్పన లన్నీ ఈశ్వరుని యందు ఏకీభూతమొనర్చి, ద్వైతబుద్ధిని విలీనమొనర్చుటే ఈశ్వరార్పణం.

అర్జునుడు: ఈ భేద భావాలన్నీ ఎందుకు ఏర్పడుచున్నాయి?

శ్రీకృష్ణ భగవానుడు: అనేకం అనేది అజ్ఞానం వలన ఏకైక చిదాత్మయందే కల్పించబడుచున్నదని చెప్పాను కదా! జ్ఞానికి బ్రహ్మము, జగత్తు వేరువేరైనవి కావు.

ఓ విజయా! ఈ దిక్కులు, ఈ జగత్తు, ఈ ద్వైతాద్వైతములు, ఇక్కడి కర్మలు, అట్టి కర్మలను ఆశ్రయించి ఉన్న యోచనలు, కాలం, వస్తు సంబంధమైన భ్రాంతులు – ఇవన్నీ నేనే. అందుచేత నాయందు మనస్సు ఉంచుము. నా భక్తుడవు కమ్ము. అప్పుడు నన్నే పొందుతావు.

❖❖❖

4. పరాపరములు

అర్జునుడు:

ద్వే రూపే తవ, దేవేశ! పరంచ, అపరమేవచ ।
కీదృశం తత్కదారూపం తిష్ఠామి ఆశ్రిత్య సిద్ధయే ॥

హే దేవేశా! మీకు పరము, అపరము అను రెండు రూపములు ఉన్నాయని చెప్పగా విన్నాను. ఆ రెండు ఎట్టివి? ఆ రెండిటిలో దేనిని ఆశ్రయిస్తే త్వరగా సిద్ధిని పొందవచ్చు?

శ్రీకృష్ణ భగవానుడు: అవును. నాకు రెండు రూపాలున్నాయి.

1. సామాన్య రూపము - ఈ కాళ్ళుచేతులతో, శంఖచక్రగదాది ఆయుధాలతో కనిపించే రూపం. నీవు ప్రబోధితుడవు కానంత వరకు వేదవిధిని అనుసరించి ఈ సామాన్య (నామ-రూపాదులతో కూడిన) రూపాన్ని పూజించు.

2. పరరూపం - అది ఆద్యంతరహితమైనది. దీనిని బ్రహ్మం, ఆత్మ, పరమాత్మ మొదలైన శబ్దాలతో వేదోపనిషత్తులు పేర్కొంటున్నాయి. నీవు ప్రబోధితుడవు కానంత వరకూ సామాన్య రూపాన్ని దాటి చూడలేవు. ప్రబోధితుడవైన మరుక్షణం నా పరరూపాన్ని గ్రహిస్తావు. ఆద్యంతరహితమగు నా పర రూపమును గ్రహించావా... ఇక నీవు మరల జన్మించవు. చిత్తశుద్ధిని పొందితే గ్రహించ వలసిన దానిని గ్రహించ గలుగుతావు.

కాబట్టి నీవు సాధన సమయంలో ఈ నా సామాన్య రూపాన్ని (సాకారోపాసన) గ్రహించు. అయితే, సాధన కొనసాగుచుండగా అతిత్వరలో 'విజ్ఞానైక స్వభావమగు బ్రహ్మం సర్వదా విశుద్ధం' అను వినూత్నమైన అవగాహన పెంపొందుగాక. క్రమంగా విజ్ఞాన దృష్టిచే 'జీవుడనగా ఎవరు? ఈశ్వరుడు అనగా ఎవరు?' అను పరిశీలన నిర్వర్తించు. జీవేశ్వరులను వేదాంత పరిభాషలో త్వమ్, తత్ అను శబ్దాలచే ఉద్దేశిస్తున్నాయి. ఆ రెండిటిని శోధించుచూ పోవుచుండగా ఏకమగు అఖండాత్మ ప్రస్ఫుటం కాగలదు. అదియే నా నిజస్వరూపమని గ్రహించు.

ఇదంచాఽహమ్ ఇదం చాఽహమ్ ఇతి యత్ ప్రవదామ్యహమ్ ।
తదేతత్ ఆత్మతత్త్వం తు తుభ్యం హి ఉపదిశామ్యహమ్ ॥

అయితే, 'ఇది నేను, ఇది నేను' అని నాచే ప్రవచించబడే దానియొక్క ఉద్దేశము ప్రతి ఒక్క జీవుని స్వస్వరూపమగు ఆత్మతత్వమే, అనగా అధిష్ఠానము, సాధకుని స్వస్వరూపమగు ఆత్మతత్త్వాన్నే సూచిస్తున్నాయని సాధకులు మరువకూడదు సుమా! కనుక శంకలన్నీ పరిత్యజించి సర్వదా సత్యమగు ఏకాత్మయందు ప్రకాశించుము.

సర్వభూతస్థమాత్మానం సర్వభూతానిచాత్మని ।
పశ్య త్వం యోగయుక్తాత్మా, సర్వత్ర సమదర్శనః ॥

నీవు యోగయుక్తాత్ముడవగుము. సర్వభూతాలలో గల ఆత్మనే దర్శించు. సర్వభూతములను ఆత్మయందే దర్శించు. సర్వత్రా సమదర్శివై ప్రకాశించు!

సర్వభూతస్థమాత్మానం, భజత్యేకత్వమాత్మనః ।
సర్వథా వర్తమానోపి, న స భూ యోఽ భిజాయతే ॥

ఏది ఎట్లు నిర్వర్తిస్తున్నప్పటికీ నీవు ఆత్మైకత్వ దృష్టిని ఆశ్రయించే ఉండు! సర్వభూతములందు ఏకరీతిగా వెలయుచున్న ఆత్మనే గాంచుచున్నచో... ఇక నీవు సర్వవిధ కార్యములు నిర్వర్తిస్తున్నప్పటికీ, నిన్నవి అంటవు. నీవు అందులో మరల తగుల్కొనవు.

❖

సర్వజీవుల, సర్వశబ్దముల అసలైన అర్థం ఏకత్వమే అయి ఉన్నది. అందరి, అన్నిటి, ఏకశబ్దార్థం ఏదైతే ఉన్నదో, అదే ఆత్మ. అయితే, అట్టి ఆత్మ ఇక్కడ కళ్ళకు కనబడే స్థూల భూతములు కాదు. కళ్ళకు కనబడని సూక్ష్మభూతములు కాదు. కళ్ళకు, మనస్సుకు విషయము కాకపోయినప్పటికీ అది క్షణంలో అనుభవమునకు లభ్యం కాగలదు. ఎందుకంటే, మనందరిలో ఉండి సర్వమును పొందుచున్నది అదే సుమా! ఈ ముల్లోకములలో గల చిత్తములన్నిటి లోపల వెలయుచు, ఆ చిత్తములన్నిటినీ ప్రకాశింప జేయుచూ, "నేను" – అను అనుభూతికి కారణమగుచున్నది ఆ ఆత్మయే.

ఈ ముల్లోకాలలో ఆయా పదార్థాలు చూస్తున్నప్పుడు ఇది ఆవు, ఇది కొండ అని తెలుసు కొంటున్న రసానుభవ జ్ఞానమే ఆత్మ. అది సర్వశరీరములలోనూ అనుభవ రూపమై ఉండి కూడా, అది అందరికీ అనుభవవిషయంగా లభ్యమవటం లేదు. సత్–అసత్ వివేకులగు వారికి అది అత్యంత సుస్పష్టంగా ఘనీభూతమై గోచరిస్తోంది.

సమగ్ర పయసామ్ అంతః యథా ఘృతమివ స్థితమ్ ।
తథా సర్వపదార్థానాం దేహానాం సంస్థితః పరః ॥

పాలలో అంతటా నెయ్యి ఉన్నది. అయితే అది పాలు తోడేసి చిలికితేనే లభిస్తుంది. అట్లాగే సర్వ శరీరాలలో, సర్వ పదార్థాలలో పరమాత్మ సర్వదా వేంచేసి ఉన్నారు. నిర్మలబుద్ధి సంపాదించుకున్న వారికి అది అత్యంత స్వభావసిద్ధంగా ఇక్కడే, ఇప్పుడే అనుక్షణికమై సర్వే, సర్వత్రా అనుభవమౌతోంది.

రత్నములలోని అంతస్థితమైన కాంతియే ఆ రత్నముల బహిఃప్రకాశము, కాంతి పుంజములుగా వెలయుచున్నది కదా! ఈ సర్వ శరీరములందు అంతర్గతమై ఉన్న ఆత్మయే 'చిత్' అను బహిః ప్రకాశమునకు కారణమగుచున్నది.

ఒకచోట కొన్ని కుండలు పేర్చబడ్డాయనుకో... ఆ కుండలన్నిటి లోపల, వెలుపల ఆకాశం ఏర్పడి ఉన్నది కదా! ఈ ముల్లోకములలోని శరీరములన్నిటిలో 'అహం' రూపమున ఆత్మయే వెలయు చున్నది. అయితే సాంసారిక దృష్టి గలవారికి అది అగుపించటం లేదు. ముత్యాలు గ్రుచ్చబడిన దారం కనిపించక పోయినప్పటికీ... దారమే లేకపోతే ముత్యాలు ఒక వరుసలో నిలువవు కదా! ఈ శరీర సమూహము లన్నిటిలోనూ ఆత్మ అలక్షితమై వెలయుచున్నది.

ఆ బ్రహ్మదేవుని మొదలు ఒక గడ్డిపరక వరకు గల సర్వపదార్థములు ఆత్మయందే అధ్యస్తమై వెలయుచున్నాయి. అట్టి ఆత్మను జన్మరహితమైన దానిగా, విపరిణామ రహితమైన దానిగా జ్ఞానులు

ఎరుగుచునే ఉన్నారు. అట్టి ఆత్మయొక్క అధ్యాస యే అహంకారము – జగత్తు మొదలైన భ్రమలు ఏర్పడి ఉండటానికి కారణమైయున్నది. అయినా కూడా ఆత్మ స్వస్వరూపము కోల్పోక సర్వదా యథాతథంగా అఖండమై విషయాతీతమై, నిర్వికల్పమై ఉండనే ఉంటోంది.

ఆత్మైవ ఇదం జగద్రూపం, హన్యతే హన్తివా అత్రకిమ్? ।

శుభాశుభైః జగదుః ఖైః కిమస్య అర్జున! లిప్యతే? ॥

ఓ అర్జునా! ఈ జగత్తు యొక్క వికారములన్నీ ఆత్మయే. వంకరటింకర తరంగాలన్నీ జలమే కదా! అట్టి ఏకము, సర్వము అగు ఆత్మ ఎవరిని చంపుతుంది? ఎవరి చేత చస్తుంది చెప్పు? ఇక శుభాశుభములగు ఈ జాగృతిక దుఃఖములచే నీవు దుఃఖితుడవు కావలసిన పనేమున్నది? అనేక వస్తువులను తనయందు ప్రతిబింబించే అద్దమునకు, ఆ వస్తువుల రాకపోకలకు సంబంధమేమైనా ఉన్నదా? వస్తుసంబంధమైన శుభాశుభాలను ఆ దర్పణం పొందుతోందా? లేదు కదా! ఆత్మ సర్వదా సాక్షి అయి ప్రకాశిస్తూ, ఈ నశించు శరీరములందు స్వతహాగా అవినాశి అయి వెలయుచున్నది. అట్టి ఆత్మను దర్శించువాడే యథార్థదర్శి.

"ఈ సర్వము నేనే" అయితే, "ఈ శరీరాలన్నిటిలో ప్రతిబింబించే 'అహం' అను చిదంశయే 'నేను'. అంతే గాని జడంశములగు, ప్రతిబింబిత చిదంశములగు ఈ శరీరాదులు నేను కాదు."

"దర్పణంలో ప్రతిబింబించే ప్రతిబింబాలను నిషేధించి దర్పణమును నిరూపిస్తున్నట్లు ఈ సర్వమూ నా యందు ప్రతిబింబించవచ్చు గాక!... అయినా, ఈ అహంకారాదులు నా స్వరూపం కాదు"

అనే నా ఉభయవాక్యాలనూ సూక్ష్మబుద్ధితో అర్థం చేసుకో. దర్పణము వలె స్వచ్ఛస్వభావుడను, పదార్థములకు అసంబంధితుడను అద్వయుడను సర్వాత్మకుడను అగు నన్ను ఎరిగినప్పుడు నీవు సర్వ దుఃఖములు అధిగమించగలవు.

❖❖❖

5. నేను సర్వదా అకర్తను

ఓ అర్జునా! సముద్రంలో నీరు కదులుచున్నట్లు చిత్తమునందు అభిమానవృత్తులు ప్రవర్తిస్తు న్నాయి. అట్టి అభిమానవృత్తుల ప్రభావం చేతనే ఈ సృష్టి ప్రళయ వికారములన్నీ కలుగుచున్నాయి. వాస్తవానికి నీకు కనబడే ఎత్తైన పర్వతములన్నీ శిలామయమే కదా! వృక్షములన్నీ కొయ్యయే కదా! తరంగములన్నీ జలమే కదా! అలాగే పదార్థములన్నీ ఆత్మయే అయి ఉన్నది.

సర్వభూతస్థమాత్మానం సర్వభూతానిచాత్మని ।

యఃపశ్యతి తథాత్మానం, అకర్తారం, సపశ్యతి ॥

సర్వజీవుల యందు ఆత్మను, సర్వజీవులను ఆత్మయందు గాంచుట అభ్యసిస్తున్నవాడు ఆత్మను దర్పణమువలె అకర్త అని గ్రహించగలుగుతాడు. "నేను ఈ సర్వజీవుల యందు వెలుగొందుచున్నాను. ప్రత్యక్షమై ఉన్నాను. ఈ సర్వజీవులు నాయందే వెలుగొందుచున్నారు. ప్రత్యక్షమై ఉన్నారు. అయితే,

అట్టి నేను నిర్విషయుడిని అకర్తను అభోక్తను" – అని ఎవ్వరు స్వస్వరూపము విషయమై ఎరుగుచున్నారో, ...వీరే సత్యమును దర్శించుచున్నవారు... సత్యద్రష్టలు. ఓ పార్థా! మరల చెప్పుచున్నాను–

నానాకార వికారేషు తరంగేషు యథాపయః ।
కటకాదిషు వా హేమ, భూతేషు తథా, అర్జున ॥

నానావిధ ఆకృతులలో కనిపించే తరంగములన్నీ జలం కాక మరింకేమిటి? ఉంగరం, గొలుసు, గాజులు మొదలైన ఆభరణాలన్నీ బంగారమే కదా!

అంతయూ ఆత్మయే అయున్నది. ఇందులో నీవు సందేహించవలసినదేమీ లేదు. ఆత్మయే భూతములన్నిటా వెలయుచున్నది. సామాన్యములైన ఈ పదార్థములు, ఈ జీవులు, మహత్తరమగు ఆ బ్రహ్మము ఒక్కటే అని గ్రహించు. వీటికి ఒకదానితో మరొకదానికి భేదమే లేదు. నిర్వికారమగు బ్రహ్మమొక్కటే అన్నివైపులా వెలయుచుండగా ఇక జగత్తు – ఆ జగత్తులోని భావవికారాలకు చోటు ఎక్కడిది చెప్పు? జగత్తు అనేదే బ్రహ్మమునకు వేరుగా లేనప్పుడు, అట్టి జగత్తులో 'బంధువధ' అనునదెక్కడ? వృథాగా మోహం చెందవద్దు సుమా! అందుచేత ముందుగా బ్రహ్మం గురించి విను. విని, మననం చేయి. చేసి, చక్కగా బ్రహ్మమును అనుభవమునకు తెచ్చుకో. తెచ్చుకుని సమరసతత్త్వాన్ని అనుక్షణికంగా ఆశ్రయించు. అట్లు ఆశ్రయించి అనేకమంది సాధుపురుషులగు జీవన్ముక్తులు ఈ లోకంలో నిశ్చింతులై విహరిస్తున్నారు. వారు మానమోహముల నుండి విడివడుచు న్నారు. సంగ దోషాన్ని జయించి అసంగస్థితిని సంపాదించుకుంటున్నారు. సుఖదుఃఖములనబడే స్వకీయ భ్రమాత్మక నిర్వచనాల నుండి ముక్తిని బడయుచున్నారు. అవ్యయమగు పరమపదాన్ని అధిరోహించుచున్నారు.

వారి మార్గమే నీకు శిరోధార్యం. కనుక కర్మలలో నిస్సంగుడవై సర్వసమత్వాన్ని అధిరోహించు.

❖❖❖

6. ఆత్మార్పణం

శ్రీకృష్ణ పరమాత్మ : హే మహాబాహో! అర్జునా! నీకు ప్రీతి, హితము చేకూర్చాలనేదే నా ఉద్దేశం. అందుచేత పరమశ్రేయోదాయకము, ఉత్తమము అగు విషయాలు మరికొన్ని చెప్పుచున్నాను. శ్రద్ధగా విను –

ఈ భౌతిక శరీరాంతార్భాగమై ఉంటున్న శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు అనే పంచతన్మాత్రలు బాహ్య విషయాలను స్పర్శిస్తున్నప్పుడు 'ఇది సుఖము కనుక కావాలి. అది అసుఖం. కనుక వద్దు' – అనే భావాలు కలుగజేస్తున్నాయి, సుఖ భావంగాని దుఃఖ భావంగాని స్థిరంగా ఉండవు. సుఖ దుఃఖ భావాలన్నీ వచ్చిపోయే స్వభావం కలిగినవి. ఒకప్పుడు సుఖకరమని అనిపించినది మరొకప్పుడు, "ఎందుకొచ్చిన కర్మరా?"...అనురూపంగా దుఃఖదాయకమౌతోంది. అందుచేత వాటియందు నమ్మకం ఉంచవద్దు. వాటిని సహించగలిగే శక్తిని పెంపొందించుకో. వాటిని ఎదుర్కోవాలంటే సహనానికి మించి వేరే ఉపాయం లేదు.

నీవు వాస్తవానికి స్వతఃగా అద్వయ పరిపూర్ణానంద స్వభావుడవు. ఈ తన్మాత్రస్పర్శలు లేవు. సుఖదుఃఖములు లేవు. ఇవన్నీ నీ భావాభావాంతర్గతములు. నీవో? భావాతీతుడవు. నిత్యనిర్మలుడవు. ఆద్యంతరహితుడవు. నిరవయుడవు. పరిపూర్ణుడవు. అట్టి నీకు ఈ బంధుమిత్రుల సంయోగ – వియోగ – దుఃఖములు ఎట్లా కలుగుతాయో చెప్పు?

నీ సంపూర్ణత్వమగు స్వస్వరూపమును ఏమరచుటచేతనే ఇదంతా కూడా సంభవిస్తోంది. లేక, ఈ రీతిగా అనుభవమౌతోంది. కాబట్టి 'విషయేంద్రియ సంయోగం' అను భ్రమను నశింపజేయి. ధీరుడవై సుఖదుఃఖములందు సమభావమును కలిగి ఉండుము. అప్పుడే నీవు అమృతత్వానికి అర్హుడవౌతావు. అట్టి అమృతత్వమే నీ సత్యరూపం.

అర్జునుడు: నిజమే. అయినా ఈ సుఖదుఃఖములను సహించటం సులభమా?ఎట్లా?

శ్రీకృష్ణ భగవానుడు: అసద్వస్తువులగు ఈ సుఖదుఃఖాలన్నీ కూడా ఆత్మయందే పరికల్పితాలై వెలయుచున్నాయి. నీవు సర్వదా ఆత్మ స్వరూపుడవే గాని మరేదీ కాదు. వాస్తవానికి ఆత్మలో సుఖదుఃఖ లేశమనునది ఉండజాలదు. అట్టి ఆత్మతత్త్వమొక్కటే సర్వత్రా సమమై అంతయూ వెలయుచుండగా ఇక అనాత్మ అనునది ఎక్కడ ఉండగలుగుతుంది?

నాసతో విద్యతే భావో, నాభావో విద్యతే సతః ।
నాస్త్యేవ సుఖదుఃఖాదిః, పరమాత్మాస్తి "సర్వగః" ॥

ఈ బంధుమిత్రాది సంబంధములు అనే అసత్తుకు అసలు స్వకీయమైన ఉనికియే లేదు. కల్పనచే అవి ఏర్పడి, కల్పనచే అనుభవమౌతున్నాయి. మరొక కల్పనచే లయమైపోతున్నాయి. ఇక మనందరి స్వరూపమగు సత్తకు 'లేకపోవటం' అనే వినాశనమే ఉండదు. అందుచేత అసత్యములగు సుఖదుఃఖములనేవి స్వతఃగా ఉన్నవి కావు. అది అట్లు పరికల్పించబడటం చేత మాత్రమే ఆయా రీతిగా తోచుచున్నాయి.

అంతటా సర్వవ్యాపియగు పరమాత్మ ఒక్కటే వెలయుచున్నది.

జగత్తు ఉన్నది – లేదు... జగత్తు – ఇచ్చటి సంబంధాదులు... జగత్తు – ఆత్మ.... జగత్తు – ఆత్మల మధ్య ఏర్పడియున్న మనస్సు... మొదలైన విశేషాలన్నీ అధిగమించు. అప్పటికీ నీ యందు శేషించి ఉండు చిత్‌స్వరూపమునందు ప్రతిష్ఠితుడవై ఉండుము. ఓ విజయా! ఆత్మ చేతనమైనది. ద్రష్టత్వము అను క్రియా విశేషమును ఆశ్రయించి... ఈ దేహము నందు వెలయుచున్నా కూడా సుఖమును హర్షించదు. దుఃఖమునకు క్రుంగదు. ఆత్మ సర్వదా సర్వత్రాయథాతథం.

మరి దుఃఖములను పొందుచున్నదేది?... జడరూపమగు చిత్తమే వాస్తవానికి దేహరూపం పొందుతోంది. అదియే తనకు తాను సుఖదుఃఖములను తయారు (కల్పించుకుని) చేసుకుని అనుభవిస్తోంది.

ఈ శరీరము ఉప్పొంగవచ్చు. క్షీణించవచ్చు. ఆత్మకు ఎట్టి మార్పుచేర్పులు ఉండవు. ఇక ఈ అనుభవములు సంగతేమిటంటావా? ఇక్కడ తారసపడే అల్ప సామాన్య, ఆశ్చర్యకర, సుఖదుఃఖ

అనుభవములన్నీ ఆ అనుభవములను పొందే మనస్సుతో సహా – మాయ నుండి భ్రమచేత ఏర్పడి ఉంటున్నాయి. భ్రమ అనునది అజ్ఞానము నుండి బయల్వెడలుతోంది. ఈ శరీరము, ఇంద్రియములు, సుఖ దుఃఖములు మొదలైనవన్నీ ద్రష్టయొక్క కల్పనయే గాని, అవి వేరుగా (స్వయంగా) లేనే లేవు. అసలు ఆత్మకంటే వేరైనదానిని ఎవ్వరు ఎక్కడ కల్పించగలరు చెప్పు?

బంధువులను, తదితర సంఘటనలను చూస్తున్నప్పుడు నీకు కలిగే సుఖ-దుఃఖ భ్రాంతి అజ్ఞానం వలననే సంభవిస్తోంది. అజ్ఞానం చేత ఏది సంభవిస్తుందో... అదంతా జ్ఞానంచే మాత్రమే... నశించగలదు. అందుచేత అభ్యాసపూర్వకంగా సమ్యక్‌బోధను సంపాదించుకో.

అర్జునుడు: జ్ఞానం, అజ్ఞానం, సమ్యక్‌బోధ – అను వాటి గురించి మరికొంత వివరించి చెప్పండి.

శ్రీకృష్ణ భగవానుడు: చెపుతాను... విను.

ఒకడు చీకటి సమయంలో అత్యవసరమైన పనికొరకై బాటలో వస్తూ వస్తూ ఎదురుగా అంత దూరంగా మెలికలుగా పడి ఉన్న దానిని చూచి "అయ్యబాబోయ్! త్రాచుపాము!" – అని పెద్దగా అరిచాడు. వళ్ళు వణకటం ప్రారంభించింది. ముందుకు వెళ్ళక తప్పదు. వెళ్ళాలంటే ఆ పాము బుస్సున మీదికి వస్తుందేమో? ఇప్పుడు ఏం చేయాలి? – అని ఆ బాటసారి భయంతో పరితపిస్తున్నాడు. పాము కాటు వేసినప్పుడు నురుగు కక్కుకోవటం, యమయాతన అనుభవించటం, విషప్రభావం చేత ఒళ్ళు నీలం కావటం, చావటం మొదలైన వినిన, చూచిన వార్తలతో అతని మనస్సంతా నిండిపోయాయి.

ఇంతలో ఆ ప్రక్కగుడిసెలలో ఉండే ఒక అవ్వ ఆ కేకలు విని ఒక దీపం చేతపట్టుకుని అక్కడ కొచ్చింది. దీపపు కాంతి అటువైపు చూపి "ఒరే అబ్బాయ్! ఇక్కడ పాము లేదు, గీము లేదు. అది త్రాడు మాత్రమే. కావాలంటే కొంచెం చూడు నీకే తెలుస్తుంది" అని చెప్పింది. ఆ దీపపు కాంతిలో తాను కూడా కళ్ళు తెరచి బాటసారి చూచాడు. అరె! అది పాము కాదు. "ఏదో చాంతాడు ముక్క. అనవసరంగా భయపడ్డాను" అని గ్రహించాడు. అంతే, ...మరుక్షణం అతని భయాలు, కేకలు అన్నీ ఉపశమించాయి. అట్లాగే, అజ్ఞానజనుల దుఃఖభ్రాంతులు, శరీరతదాప్య భ్రమలు – ఇవన్నీ కూడా, "శాస్త్రములు, జ్ఞానులు" – అందించే సమాచారముచే నశించగలవు.

ఈ శరీరమును అవధరిస్తున్న 'శరీరి'యొక్క వాస్తవ స్వరూపం బ్రహ్మమే.

విష్వగ్విశ్వమజం బ్రహ్మ న నశ్యతి న జాయతే ।
ఇతి సత్యం పరం విద్ధి బోధః పరమ ఏష సః ॥ (శ్లో 15, సర్గ 54)

ఈ విశ్వమంతయు పూర్ణబ్రహ్మమే. బ్రహ్మము జనించుట లేదు, నశించుట లేదు. ఇదియే పరమసత్యము. ఇదియే జ్ఞానము.

బ్రహ్మ మహాసముద్రమునందు 'సంకల్పములు' అనే తరంగాలు ఎప్పుడో లేచి, మరెప్పుడో ఆ బ్రహ్మ మహాసముద్రమునందే లయమౌతున్నాయి. జ్ఞానోదయ కాలమందు అవన్నీ కూడా బ్రహ్మమే అగుచున్నాయి. స్వస్వరూపమగు బ్రహ్మము యొక్క వాస్తవ స్వభావమును సంతరించుకున్న వానికి

ఈ దేశ-కాల-క్రియలు, నీవు-నేను అనే ఈ భావవికారములు మొదలైనవన్నీ కూడా బ్రహ్మముగానే తెలియవస్తున్నాయి. వాస్తవానికి ఇక్కడ అనుభవమయ్యే భేదాభేదములు బ్రహ్మమునందు లేవు - అనే నిర్మలమైన అవగాహన పరిఢవిల్లుతోంది. స్వస్వరూపమును ఏమరచినప్పటి ఈ దేశ-కాల-దేహ క్రియాదుల కల్పితానుభవ పరంపరలే అజ్ఞానము యొక్క స్వరూపం.

❖

కాబట్టి, అర్జునా! నీవు ఇప్పటికిప్పుడు సకల భయశోకాలను, మానమదాలను, సుఖదుఃఖ నిర్వచనములను, సర్వ కోర్కెలను వదలి ఉండుట అభ్యాసం చేయి... అసద్రూపమగు ద్వైతభావమును పరిత్యజించే ప్రయత్నం చేయి. సద్రూపుడవు కమ్ము. నీవు ఈ యుద్ధం చేస్తున్నప్పుడు కూడా నీ సర్వ కర్మలను, భావములను బ్రహ్మముతోడ నింపివేయి. నీ యొక్క సుఖ, దుఃఖములను, లాభాలాభాలను, జయాపజయములను శుద్ధబ్రహ్మముతో ఐక్యమొనర్చివేయి. నీవు బ్రహ్మసముద్రుడవే గాని, ఒక తరంగమో, బుడగయో కాదు. హీనములైన 'నేను ఒక జీవుడను' మొదలైన భావములకు తావీయవద్దు, తత్త్వనిశ్చయము చేసుకుని, గుహలోని వాయువువలె నిశ్చలత్వము వహించి, అటుతరువాత ప్రకృత కార్యమగు ఈ యుద్ధమును ఆచరింపుము. "నేను ఆచరించేది, భుజించేది, ఇచ్చేది, వ్రేల్చేది... అంతయూ ఆత్మయే" అను స్థిర నిశ్చయము కలిగియుండుటయే సమ్యక్‌బోధ. అదియే ఆత్మార్పణము అని కూడా చెప్పబడుతోంది.

ఎవడు తనయందు ఏ భావాన్ని ఆశ్రయించి ఎట్లు నిశ్చయుడై ఉంటాడో... అతడు దానినే పొందటం జరుగుతుంది. అందుచేత సత్యమగు బ్రహ్మమును పొందుటకుగాను నీవు బ్రహ్మాకార స్థిర చిత్తుడవు కమ్ము. అప్పుడు నీవు కార్య-కారణాతీతమగు బ్రహ్మమే కాగలవు. ఇందులో సందేహం లేదు.

బ్రహ్మజ్ఞుడైనవాడు కర్మఫలాలను ఆశింపక, ఈ సర్వకర్మలు-పూర్వాపరాలతో సహా బ్రహ్మమే"... అను భావనతో యథాప్రాప్తములైన కర్మలను ఆచరించుచున్నాడు. అందుకు ప్రయోజనంగా బ్రహ్మమే అగుచున్నాడు. ఏ మనుష్యుడైతే సర్వకర్మలయందు నిష్క్రియమగు బ్రహ్మమును, బ్రహ్మమునందే సర్వకర్మలను గాంచుచున్నాడో... అతడే అందరిలోకి బుద్ధిమంతుడు. అతడే పరిపూర్ణకర్మి అని కూడా చెప్పబడుచున్నాడు.

❖❖❖

7. అకామకామి

ఓ ధనంజయా! నీవు లాభ - అలాభాదులకు, లభ్య-అలభ్యాదులకు వశీభూతుడవు కావద్దు. యథాప్రాప్తాలైన కర్మలను నిర్వర్తించటమే ఉచితం. అయితే అట్లు నిర్వర్తించే సమయంలో అనాసక్తుడవై ఉండుము. ఆసక్తిని సమూలంగా త్యజించి యోగస్థుడవై కర్మలు ఆచరించుము.

అజ్ఞానము ఆశ్రయించక.... కర్మలయందు ఆసక్తి లేక కర్మల సహిత - రహితత్వములకు అతీతుడవై సర్వదా సముడవై వెలయుము.

కర్మ ఫలాసక్తిని విడచి నిత్యతృప్తుడవై – నిరాశ్రయుడవై యథాప్రాప్తములైన కర్మలు ఆచరిస్తూ ఉంటే, అప్పుడాకర్మలు నీపట్ల లేనివే అవుతాయి. 'నేను ఇది చేయుచున్నాను'..... అను కర్తృత్వబుద్ధియే ఆసక్తి, అకర్తృత్వ బుద్ధియే అనాసక్తి. మనస్సు అజ్ఞానావృతమైనప్పుడే ఆసక్తి ప్రబలుతుంది. అట్టి కర్తృత్వబుద్ధి విభాగమునకు సంబంధించిన మనస్సును వెంటనే పరిత్యజించుము. పరతత్త్వమును సుస్పష్టముగా ఆకళింపు చేసుకుని అనాసక్తబుద్ధితో స్వధర్మములైన కర్మలను ఒనర్చుచున్న మహాత్మునికి మరింకెన్నడూ కర్తృత్వబుద్ధి కలగదు.

అకర్తృత్వాత్ "అభోక్తృత్వమ్", అభోక్తృత్వాత్ సమై ।
సమైకత్వాత్ "అనంతత్వమ్", తతో "బ్రహ్మత్వమ్" ఆతతమ్ ॥

'నేను దేనికీ కర్తను కాదు' అను అభ్యాస యోగముచే 'నేను దేనికీ భోక్తను కూడా కాదు' అను అవగాహన బలం పుంజుకుంటుంది. అభోక్తృత్వము వలన సమత్వము లభ్యపడుతుంది. సమత్వము నుండి అనంతత్వము, అనంతత్వము వలన బ్రహ్మత్వము సిద్ధించగలవు. ఎట్లాగైనా సరే, నీవు ఇక్కడ నానాత్వమును పరిత్యజించు. పరబ్రహ్మైక్యము పొందు లక్ష్యం గల ఆచరణలను ఆశ్రయించు. అప్పుడు విధ్యుక్తములైనప్పటికీ నీవు ఆ ఈకర్మలకు కర్తవు కావు. ఎవని కార్యములు కామసంకల్ప వర్జితములో అవి ప్రారంభమునందే జ్ఞానాగ్నిచే దగ్ధం కాబడినాయో అట్టి వానిని శాస్త్రములు 'పండితుడు' అని పిలుస్తున్నాయి. సముడు, సౌమ్యుడు, స్థిరుడు, స్వస్థుడు, శాంతుడు, విషయనిస్పృహుడు అగువాడు కర్మలు ఆచరించుచున్నప్పటికీ నైష్కర్మియే అగుచున్నాడు.

❖

అందుచేత కిరీటీ! నీవు ద్వంద్వ రహితుడవై ఆత్మవంతుడవై యథాప్రాప్తములైన స్వధర్మానుకూల మగు కర్మలు ఆచరించుచూ, ఈ భూమండలమును అలంకరించుము. ఏ మూఢుడైతే కర్మేంద్రియాలను మాత్రం నిరోధించి ఆయా విషయానుభవములను మనస్సునందు స్మరించుచున్నాడో అట్టివాడు "మిథ్యాచారి" అని పిలవబడుచున్నాడు. ఎవరైతే ఇంద్రియములను ఆయాకర్మలందు నియమించే టప్పుడు మొదలే సంగరహితుడై కేవలం కర్మలను కర్మేంద్రియాల సహాయంతో నిర్వర్తిస్తున్నాడో... అట్టి అనాసక్త కర్మయోగం అత్యంత ప్రాశస్త్యమైనది సుమా!

నదులు సముద్రంలో ప్రవేశించగానే అవి తమ ప్రవాహత్వాన్ని సముద్రజలంతో ఏకం చేసి ఆ సముద్రజలంలో ఉపశమిస్తాయి చూచావా?... ఎవనియందు దృశ్యాదులు ప్రకాశించగానే అవన్నీ నిర్వికారమగు బ్రహ్మమునందు లయమైపోతాయో... అట్టి పురుషుడు పరమశాంతిని పొందుచున్నాడు.

అంతే గాని కోర్కెలు కోరుకొంటూ రోజులు గడుపుచున్నవాడు, ఉపాధులు ధరిస్తున్నవాడు ఎప్పటికీ శాంతిని పొందుటయే లేదు.

❖❖❖

8. దేహి - దేహము - వాసనలు

శ్రీకృష్ణ భగవానుడు: ఓ పార్థా! ఇక్కడ ఇంద్రియములకు తారసబడే ఆయా భోగములపై నమ్మిక కలిగి ఉండవద్దు. అయితే, యథాప్రాప్తములైన కర్మలను మాత్రం సమత్వ – నిర్వికారబుద్ధితో నిర్వర్తిస్తూ ఉండు. ఇక ఈ దేహములంటావా? ఇవి జన్మ – జరా – మరణాది స్వభావయుక్తమై అనాత్మ అయిఉంటున్నాయి.

అనాత్మన్ ఆత్మతాం దేహే మా భావయ భవాత్మని ।
ఆత్మన్యేవాత్మాతం సత్యే భావయా అభవరూపిణి ॥

అనాత్మభూతములగు ఈ శరీరాదులందు ఆత్మభావం కలిగి ఉండకుము. వికార రహితమగు సత్య వస్తువునందే ఆత్మభావము కలిగి ఉండుము.

దేహనాశే, మహాబాహో! న కించిదపి నశ్యతి! ।
ఆత్మనాశోహి నాశఃస్యాత్ ! నచాత్మానశ్యతి ధ్రువః ॥

గొప్ప బాహువులు గల ఓ అర్జునా! ఈ శరీరం నశించినంత మాత్రం చేత ఇక్కడేమీ నశించటమే లేదు. ఆత్మ నశించినప్పుడే అది నాశం అని అనిపించుకుంటుంది. అయితే... ఆత్మకు నాశనమనునదే లేదు. ఇది సత్యం. చిత్తం కంటే కూడా అత్యంత సూక్ష్మమైన ఆత్మ జీర్ణమొనర్చ బడజాలదు. కనుక ఆత్మను చిత్తమునుండి వేరు చేసి కర్మలను నిర్వర్తించిన, ఏమియు నిర్వర్తించనివాడవే అగుచున్నావు.

'కర్తృత్వం' అంటే ఏమిటి? ఆసక్తియే కదా!... ఇప్పటికిప్పుడే నీవు 'అజ్ఞానం' అను మూర్ఖత్వాన్ని పరిత్యజించు. అందుకుగాను జ్ఞానులను ఆశ్రయించు. అనాసక్తమతి అయిన మహాత్ముడు కర్తృత్వ అహంకారం పొందనే పొందడు.

ఆత్మ అవినాశి అని, ఆద్యంతరహితమని విజ్ఞులు ఎరిగియే ఉన్నారు. ఆత్మ నశించుచున్నదను భ్రమ నీకు అర్హమే కాదు. అట్టి భ్రమయే అన్ని దుఃఖాలకు మూలకారణం. ఆత్మజ్ఞులు ఆత్మను నశించు దానిగా ఎంచరు. వారు తమయందే ఆత్మను ప్రత్యక్షం చేసుకుని ఉంటారు. ఇక ఈ శరీరాదులందు ఆత్మబుద్ధిని కలిగి ఉండరు.

అర్జునుడు : ఓ జగన్నాథా! శ్రీ కృష్ణా! అట్లా అయితే అజ్ఞానుల శరీరము నశించినప్పటికీ కూడా దాని వలన వారికి కలిగే నష్టమేమీ లేదు కదా?

శ్రీకృష్ణ భగవానుడు : అవును. అజ్ఞానుల విషయమైనా సరే, ఈ దేహం నశించినంతమాత్రంచేత ఎక్కడా నశిస్తున్నదేదీ లేదు. అవినాశియగు ఆత్మ ఒక్కటే సర్వే–సర్వత్రా వెలయుచుండగా ఇక ఈ దేహములు నశించినంత మాత్రంచేత ఎవరికి మాత్రం ఏమి నష్టం?

మోహము వలననే 'ఇది లభించింది – ఇది వినష్టమైనది' అనునదంతా తోచుచున్నది. గొడ్రాలి రెండవ కుమారుడు ఎక్కడైనా తారసపడతాడా? అట్లాగే పరిశీలన సహాయంతో భ్రమను

త్యజించిన వానికి ఈ శరీరాలు – వాటి వినాశనములు అసలు కనిపించనే కనిపించవు. అసత్తగు "నా దేహము – వారి దేహము" మొదలగు భావములన్నిటికీ స్వతః అయిన ఉనికియే లేదు. సర్వభావములు ఎందులో కలుగుచున్నాయో... అట్టి సమరస వస్తువుకు వినాశనముగాని, అభావము గాని లేవు. జ్ఞానులు సత్ – అసత్తుల విభాగము విషయంలో నిర్ణయం చేసుకునే వర్తిస్తున్నారు.

అవినాశితు తద్విద్ధి యేన సర్వమిదం తతమ్ ।
వినాశం అవ్యయస్యఅస్య! న కశ్చిత్ కర్తుమర్హతి ॥

అర్జునా! సర్వవ్యాపియగు ఆత్మ అవినాశి అని గ్రహించు. అవ్యయమగు ఆత్మను ఎవ్వరూ వినాశనం కావించలేరు.

అన్తవన్త ఇమే దేహా, నిత్యస్యోక్తాః శరీరిణః ।
అనాశినో, అప్రమేయస్య! తస్మాత్ ఉద్ధ్యస్వభారత! ॥

నీకు కనబడుచున్న ఈ శరీరాలన్నీ ఒకనాటికి నశించవలసిందే. అయితే ఏం? ఈ శరీరాలను ధరిస్తున్న శరీరి నాశరహితమైనది. అద్దానికి ఈ దేహాదులతో ఏమాత్రం ప్రమేయం లేదు. ఆత్మ (దేహి) యొక్క ఉనికి దేహాదులతో వచ్చేది కాదు, దేహాదులతో పోయేది కాదు. అందుచేత ఈ దేహాదులను దృష్టిలో పెట్టుకుని, వీరంతా నశిస్తారేమోననే శంకతో నీ స్వధర్మమైన యుద్ధం మానవలసిన అవసరం లేదు. అఖండము, సర్వగమము అగు ఆత్మ ఒక్కటే వెలయుచుండగా ఇక అసత్తైనదంతా ఎక్కడ ఎట్లు ఏర్పడగలదో చెప్పు? అవినాశి, అనంతము, సత్‌స్వరూపము అగు ఆత్మను గురించి ఎవరైనా దుఃఖించవలసినపనేమున్నది?

కారణం, దానికి సంబంధించిన కార్యం, అద్దానిచే కనబడే అనేకత్వం – ఇవన్నీ పరిత్యజించ బడగా అప్పుడు ఆ ఏకత్వ – అనేకత్వముల మధ్య శాంత పరమపద స్వస్వరూప మొక్కటే వాస్తవమైన ఉనికిని కలిగి ఉన్నది. తక్కినదంతా భ్రమయే!

అర్జునుడు: అయితే భగవాన్! నాదొక చిన్న సందేహం. ఆత్మకు 'మరణం' అనే ధర్మమే లేదు కదా! అట్టి ఆత్మ "అయ్యో నేను మరణించబోవుచున్నాను" అని ఎందుకు అనుకుంటోంది? మరొక ప్రశ్న కూడా వినండి. ఈ మానవుల యొక్క, ఈ లోకాల యొక్క, స్వర్గ, నరకాదుల యొక్క స్థితి గతు లన్నిటికీ కారణం ఏమిటి?

శ్రీకృష్ణ భగవానుడు: బ్రహ్మమే తన యొక్క 'అధ్యాస' అను చమత్కారమును ప్రకటించుచు శరీరము లందు వెలయుచున్నది. "ఆకాశము, వాయువు, నీరు, అగ్ని, భూమి, మనస్సు, బుద్ధి" అను తన్మాత్రలతో కూడి జీవుడుగా అగుచున్నది. ఆవుదూడ త్రాడుచే లాగబడునట్లు, పక్షిపిల్ల పంజరంలో చిక్కునట్లు ఈ జీవుడు తనకుతానుగా శరీర బద్ధుడగుచున్నాడు. వాసనానుసారంగా దేహమును ధరిస్తున్నాడు. ప్రస్తుత దేహం శిథిలమైనప్పుడు వాసనలను కొనసాగించిన కారణంగా మరొక దేహం పొంది వేరైన దేశకాలములను గాంచుచున్నాడు. వాయువు ఒక పుష్పముపై ప్రసరించి అక్కడి గంధమును తనవెంట గొనిపోవునట్లు ఈ జీవుడు ఒక దేహము నుండి వాసనలను గొనిపోయి

మరొక దేహంతో కొనసాగిస్తున్నాడు. చక్షురాది ఆయా ఇంద్రియముల సంస్కారమును వెంటబెట్టుకుని దేహ-తదనంతర దేహములను పొందుచూ తనయందు తానే సుదీర్ఘమైన ప్రయాణం చేస్తున్నాడు.

ఈ శరీరముతో ఏర్పడే సంబంధమంతా కేవలం వాసనలచేతనే ఏర్పడుతోంది. వాసనలే రహితమైతే ఇక అట్టి జీవునకు "నేను ఈ దేహమునకు సంబంధించిన వాడను" ...అను భావన, అనుభవములు ఉండవు. అప్పుడు శేషించేది పరమపదమే అయి ఉంటుంది.

వాసనాయుక్తుడగు జీవుడు అన్న - పాన - మైథునములచే ధ్యాసయుక్తుడగుచు నానావిధ యోనులందు తిరుగాడుచున్నాడు. 'భ్రమ' అను భారమును మోయుచు ఇంద్రియ ధర్మములందు ఆసక్తి కలవాడై తనస్వరూప మెట్టిదో పూర్తిగా ఏమరచుచున్నాడు.

దేహో నిస్పన్దతామేతి, జీవే కౌన్తేయ! నిర్గతే ।
నిస్పన్దావయవా భోగః శాంతవాతి ఇవ ద్రుమః ॥

ఎప్పుడైతే జీవుడు అను చైతన్యసత్త స్వరూపుడు ప్రాణసంచలనముతో సహా దేహము నుండి బయల్వెడలుతాడో... అప్పుడు ఈ దేహం చలనరహితమౌతోంది. గాలి ఆగిపోతే లత యొక్క కదలిక ఆగిపోతుంది చూచావా? అట్లా దేహి దేహము నుండి బయలు వెడలినప్పుడు ఈ దేహం నిస్పందం (స్పందరహితం) అవుతోంది. అప్పుడు, 'ఈతడు మరణించాడు' అని చెప్పబడుతోంది. అయితే ఇక్కడ దేహి, దేహమును త్యజించాడు. అంతమాత్రమే ఇక్కడి విశేషం.

ఈ జీవుడు శరీరం నుండి బయల్వెడలిన తరువాత అక్కడ ఉన్న ఆకాశమునందు తన వాసనా బలం చేత తన వాసనలన్నీ రూపుదాల్చినట్లు గాంచుచున్నాడు. వాసనల "తీవ్రత దిశ - క్రమము" లను అనుసరించి మరల పాంచ భౌతిక సమ్మేళనములను ఆశ్రయించి ఇతఃపూర్వమునకు వేరైన దేశ కాలాలను గాంచుచున్నాడు. ఈ మహా ప్రయాణం అనంత కాలంగా కొనసాగుతూనే ఉంటుంది. ఈ ఒక శరీరనాశనము-నూతన శరీర ఆవిర్భావం కూడా స్వప్నానుభవం వంటివే. అయితే ఏం? శరీరముతో కూడిన విషయములు సంబంధములన్నీ కూడా ఎప్పటికప్పుడు వాస్తవమైనట్లు అజ్ఞానవశం చేత పరికించుచున్నాడు. నిద్రలో కలకంటున్న వానివలె నీవు ఇదంతా చూచి భ్రమించవలదు.

❖❖❖

9. వాసనాక్షయం - ఆత్మానుభవం

ఏ వస్తువు ఏ రీతిగా ఏర్పడుచున్నదో... దాని వినాశనము కూడా అట్లే జరుగుతోంది. సృష్టి ప్రారంభంలో ఈ సమష్టి సృష్టికర్త (హిరణ్యగర్భుడు, బ్రహ్మదేవుడు) తన యొక్క పూర్వ కల్ప వాసనలను అనుసరించి గుల్మము, ఆవు మొదలైన జీవజాతములను కేవలం కల్పన సహాయంతో సృష్టిస్తున్నాడు. అందుచేత ఇక్కడ దృశ్యజగత్తు, ఇందలి జీవన్-మృత్యువులతో సహా సర్వం కల్పన మాత్రమే.

కుమ్మరివాని రకరకాల కుండలలాగా ఈ వివిధ జీవ జంతు జాతులు కల్పించబడుచున్నాయి. కుమ్మరివానికైతే మట్టిని కుండలుగా మలచటానికి 'సారె' మొదలైన ఉపకరణాలు కావలసి ఉంటుంది. మరి ఈ దృశ్య జగత్తు విషయమో? సమష్టి సృష్టికర్తకు ఎట్టి ఉపకరణాలు అక్కర్లేదు. ఎందుకంటే

ఇదంతా మనోకల్పితమే కదా! ఒక కథారచనవలె కల్పన కల్పనలోనే ఉదయిస్తోంది. కల్పనలోనే కొనసాగుతోంది. కల్పనలోనే లయిస్తోంది. కల్పనయందే ఉపశమిస్తోంది.

జీవునికి-జగత్తుకు గల సంబంధం కథారచయితకు-కథారచనకు గల సంబంధం వంటిదే!

ఈ జగత్తు మొదలు - చివర కూడా కల్పనయే కాబట్టి ఇది వర్తమానంలో కూడా మిథ్యయే. కల్పనతో కూడినది వాస్తవమెట్లా అవుతుంది? జీవుని స్వరూపం జ్ఞానశక్తియే. అట్టి జ్ఞానశక్తి చేతనే పదార్థాల ఉనికి అనుభవమౌతోంది. ఆ అనుభవం యొక్క రూపం కల్పన చేతనే నిర్మించ బడుతోంది. కనుక ఈ జగత్తు ఆరోపితమైన భ్రమతో కూడిన దృష్టి కారణంగా ఘనీభూతమైన సంసార సాగరంగా (ఆత్మానుభవ - వ్యతిరేకమైనదిగా) తోచుచున్నది.

❖

ఈ జగత్తు ద్రష్ట యొక్క వాసనలను అనుసరించి అనేకానేక విధములుగా స్ఫురించుచున్నది. ఆ వాసనలు ఇతఃపూర్వపు కర్మ, భావనల పరంపరావిశేషము చేతనే ఆయా వర్తమాన రూపములు కలిగి ఉన్నాయి. ఇతఃపూర్వపు పురుషకారముచే ఏర్పడిన వాసనలు వర్తమాన పురుషకారం యొక్క ఉచ్ఛ-నీచములను అనుసరించి ఇక ముందు బలహీనపడటమో, బలపడటమో జరుగుతోంది. నిన్న సంపాదించుకున్న ధనం ఈ రోజు చేసే వినియోగ - సముపార్జనలను అనుసరించి తరగటమో, పెరగటమో జరుగుతుంది కదా! నిన్న తిన్న ఆహారమువలన కలిగిన అజీర్ణమువంటి ఏదైనా అనారోగ్యం ఈ రోజు సేవించే ఔషధంచేత తొలగించబడుతోంది చూచావా! అట్లాగే, వర్తమానంలో నిర్వర్తించే తపస్సు, దానం, ధ్యానం, కర్మఫల సమర్పణ - వంటి ఉత్తమ కర్మలు ఔషధరూపంలో ఇతఃపూర్వపు వాసనలను తగ్గించగలవు. తొలగించగలవు. జీవుడు వాసనలను తొలగించుకొన్నప్పుడు అతని యందు ఆత్మస్వభావం స్వయంసిద్ధంగా ప్రకాశించగలదు. అందుచేత అర్జునా! నీవు ఎంత శ్రమించి అయినా సరే, శాస్త్రవిహిత ధ్యానాది కార్యక్రమములను, నీకు విధించిన కర్మల ఫలసమర్పణను ఏక సమయంలో అత్యంత శ్రద్ధతో నిర్వర్తించు. అంతే గాని, ఇంద్రియాల వెంట మనస్సుతో పరుగు లిడి వెనుక - ముందు చూచుకోకుండా వాసనలను మరింత మూటగట్టుకోకు. అప్పుడు మానవజన్మ అను అవకాశమును దుర్వినియోగపరచినవాడవే అవుతావు.

ఈ జీవునికి ఎదురుగా ధర్మ, అర్థ, కామ, మోక్షములనే చతుర్విధములైన పురుషార్థములు ఉన్నాయి. అయితే ఈతడు దేనిని గ్రహించి విశేషంగా ప్రయత్నించటం జరిగితే... ఆ ప్రయత్న ప్రాబల్యముల ననుసరించి ఆ పురుషార్థమే సిద్ధించగలదు. ఇది గ్రహించి ఉండుట చేతనే వింధ్యపర్వతం పగులునంతటి ప్రళయవాయువులు వీచుచున్నప్పుడు కూడా ధీమంతులైనవారు తమ యొక్క శాస్త్రవిహిత పురుషకారాన్ని వదలిపెట్టరు.

అర్జునుడు: హే జగత్పతీ! ఈ జగత్ స్థితికి, స్వర్గ నరకములు, సృష్టి మొదలైన కల్పనలకు అసలు కారణమేమిటో చెప్పండి.

శ్రీకృష్ణ భగవానుడు: అర్జునా! అజ్ఞానావృతుడైన జీవుడు తనయొక్క అభ్యాసబలం చేత చిరకాలం నుండి ఈ స్వర్గ-నరకాదులను గాంచుచున్నాడు. స్వర్గ-నరకాది సంసార సంభ్రమానికంతటికీ కారణం

వాసనలే. కాబట్టి వాసనాక్షయం వలననే నీకు నిత్య శ్రేయస్సు సమకూరుతుంది. వాసనలు రహితమైతే 'జీవుడు' అనబడునదే ఉండదు. అనగా, ఇదే జీవుడు స్వయముగా శివస్వరూపమై ప్రకాశించగలడు.

అర్జునుడు: దేవదేవా! వాసనలు దేనివలన కలుగుచున్నాయి? అవి సమూలంగా నశించేది ఎట్లా?

శ్రీకృష్ణ భగవానుడు: అజ్ఞాన భ్రమ నుండి వాసనలు లేచి... అనాత్మ యందు ఆత్మభావాన్ని కలిగిస్తు న్నాయి. ఆత్మజ్ఞానం పెంపొందించుకుంటేనే అజ్ఞానం నశించి వాసనలు విలీనం కాగలవు. ఓ కౌంతేయా! నీవు ఆత్మ గురించి విన్నావు, విచారించావు, గ్రహించావు. ఇక 'ఇది, నేను, నాది, నా వారు' అను రూపంలో గల వాసనలను త్యజించటంలో జాప్యం ఎందుకు? అభ్యంతరమేమిటి?

అర్జునుడు: హే శ్రీ కృష్ణా! నాదొక సందేహం. ఏది దేనిని ఆశ్రయించి ఉంటుందో, అది నశించినప్పుడు ఆ ఆశ్రయించబడేది కూడా నిరాశ్రయమౌతుంది కదా! మీరు వాసనలు రహితమైతే జీవుడనబడేవాడే ఉండడని ప్రవచించారు. జీవుడే లేకపోయినప్పుడు ఇక ఇటు అనర్థదాయకమగు సంసారాదులు, అటు పరమానందావిర్భావమగు ఆత్మసాక్షాత్కారమును అనుభవించే వాడెవడు?

శ్రీకృష్ణ భగవానుడు: ఓ మహామతీ! వాస్తవానికి ఆత్మయే ఉన్నది. జీవుడనబడే వాడు ఆత్మకు వేరుగా లేడు. ఆత్మసర్వదా అఖండమే గాని అది ఎన్నడూ ఈ ఈ జీవులుగా ఖండితమగుటలేదు. ఆత్మయే వాసనత్వం వహిస్తోంది. అట్టి ఆత్మజ్ఞానం సముపార్జించుకొనుచున్నప్పుడు అకృత్రిమంగా అజ్ఞానాన్ని విసర్జించటం జరుగగలదు. వాసనల నుండి విడివడినప్పుడు ఇంకనూ ఈ జీవుని యొక్క ఏ స్థితి శేషించి ఉంటోందో అద్దానిదే ఆత్మస్థితి అని, మోక్షం అని పిలవటం జరుగుతోంది. ఏ ద్రష్ట అయితే అజ్ఞానదశలో "నేనొక అల్పజీవుడను. ఈ జగత్తు నిండా కష్టాలే! ఇక్కడ దుఃఖములే నా గతి"... అని తలచుచున్నాడో అదే ద్రష్ట (జీవుడు) సర్వ వాసనలూ నశించనప్పుడు 'నేను ఈ సర్వ ఉపాధులకు అతీతమైనట్టి – మునుముందే ఉన్నట్టి నిర్వికార – ఆత్మ చైతన్యమును' అని అనుభవపూర్వకంగా గ్రహిస్తున్నాడు. 'నేను ఉపాధిని ఉపయోగించే ప్రజ్ఞను' అని తననుతాను ఎరుగువాడు ఇక 'ఉపాధి' – (లేక) 'జీవుడు' అని ఎట్లా అనిపించుకుంటాడు చెప్పు?

ఓ పార్థా! నీవు జీవన్ముక్తుడవగుము. యథార్థమగు ఆత్మతత్త్వమును దర్శించుము. వాసనా జాలం నుండి విడివడినవాడు మాత్రమే 'ముక్తుడు' అని అనిపించుకుంటున్నాడు. వాసనాక్షయం కానంత వరకు ఎంతటి శాస్త్రకోవిదుడు అయినప్పటికీ పంజరమున చిక్కిన పక్షిలాగా బద్ధుడే సుమా!

ఎంతగా బోధించినా మాయయందు కాపురముండే వానికి ఆత్మ దుర్దర్శనము. ఇంద్రజాలంలో కనిపించే భ్రమ విశేషాల వంటి ఈ జగత్ సంబంధాలను నమ్ముకుని కూర్చున్నవానికి ఆత్మ యొక్క దేహాతీతత్వం – అఖండత్వాల గురించి ఎంత చెప్పితే ఏమున్నది?

అందుచేత... శాస్త్రాలలో ప్రవచించబడిన విధివిధానాలను శ్రద్ధగా అనువర్తించు. సాధనాదు లను ప్రవృద్ధం చేసుకో. తద్వారా, వాసనలను నశింపజేసుకో. అప్పుడు నీవు తప్పక ముక్తుడవౌతావు. మరొక్కసారి ప్రకటిస్తున్నాను– వాసనాక్షయమే మోక్షం... వాసనలు కలిగియుండటమే బంధం.

❖❖❖

10. స్వధర్మ నిరతి

శ్రీకృష్ణ భగవానుడు : ఓ కిరీటీ! 'వాసనారాహిత్యం' అనేది అమోఘమైన ప్రయోజనం కలిగి ఉంది. వాసనలు రహితమైనప్పుడు నీవు జీవన్ముక్తము, అత్యంత సుఖప్రదము అగు మనశ్శాంతిని పొంద గలుగుతావు. వాసనల ప్రభావంచేతనే 'నేను నా బంధువులను చంపుచున్నానే?'...అనే దుఃఖం నీలో ప్రవేశించి నీ యొక్క స్వధర్మనిరతిని, ధర్మాధర్మ విచక్షణను కించిత్ కప్పిచేసింది. కనుక నీవు 'ఈ బంధువులు నావారు' అనే దుఃఖమాలిన్యమును త్యజించు. జరామరణముల శంక విడిచిపెట్టు. ఆకాశము వలె విశాల హృదయము సంపాదించుకో. 'ఇష్టము – అయిష్టము' ...అను సంకల్పములను దరిజేరనీయ వద్దు. 'ఇది నా అభిలాష కనుక ఇది ఇట్లే ఉండాలి' అను రూపమును దాల్చుచున్న కామమును వదులుము.

ప్రవాహపతితం కార్యమిదం కించిద్యథాగతమ్ ।
కురు కార్యాణి కర్మాణి! న కించిదిహ నశ్యతి॥

నీకు విధించబడిన 'యుద్ధం చేయుట' అను ధర్మమును శుభాశుభఫలత్యాగబుద్ధితో నిర్వర్తించుటే ఉచితం. స్వధర్మనిరతి నిష్కామబుద్ధితో నిర్వర్తిస్తున్నప్పుడు అది నీ తత్త్వబోధకు దోహదమే అవుతుంది కాని అంతరాయం కాజాలదని గ్రహించు. ఇక్కడ వాస్తవానికి ఏదీ జనించేది లేదు. నశించేది లేదు.

పారంపర్యంగా, శాస్త్రానుసరణంగా, సంఘనియమానుసారంగా, ప్రవాహపతితంగా వస్తున్న విహిత కర్మలను ఆచరించటమే జీవన్ముక్తుల స్వభావమై ఉంటోంది. ఎవరైనాసరే, విధి – విహితములైన స్వకర్మలను యోగబుద్ధితో ఆచరించి ఆ సర్వాత్మకునకు సమర్పణ చేయుట చేతనే 'జీవన్ముక్తి' అనబడు సముద్ధరణ సులభరీతిగా పొందగలడు. అంతేగాని కేవలం కర్మలు త్యజించి ఊరుకున్నంత మాత్రం చేత ఎవరికీ ముక్తి లభించదు.

"ఇదం కర్మ త్యజామి, ఇదం ఆశ్రయామి"–ఇతి నిర్ణయః ।
మూఢస్య మానసోరూపం! జ్ఞానినస్థు సమాస్థితిః ॥

'అయ్యో ఈ కర్మ చేయవలసి వస్తోందే? ఆ కర్మ చేస్తే బాగుండునే?' అనే రూపంగల నిర్ణయాలు, భావాలన్నీ అజ్ఞానులందలి మానసిక వికారములు మాత్రమే. జ్ఞానులు సర్వ సమయములందూ సమస్థితియందే వెలయుచున్నారు.

ప్రవాహపతితం కర్మ కుర్వన్తః శాంత చేతసః ।
జీవన్ముక్తాః సుషుప్తస్థాః స్ఫురన్తి అత్ర సుషుప్తవత్॥

వారు యథాప్రాప్తములై నిర్జీవమైయున్న కర్మలను శాంతచిత్తులై సంకల్పరహితులై, నిద్రించుచున్న వారి యందుండు 'ప్రజ్ఞ' వలె మౌనం వహించి స్వయంజ్యోతి స్వభావులై నిర్వర్తిస్తున్నారు. వారి మనన శక్తి స్వాభావికంగానే తాబేలు అంగముల వలె ఇంద్రియ విషయాల నుండి మరలి హృదయం నందు ఏకీకృతమును పొంది శాంతైశ్వర్యమగు స్వస్వరూపము వైపుగా ఎక్కుబెట్టి ఉంటోంది. అట్టి జీవన్ముక్తులైన మహనీయులు పరమాత్మయందే నిత్యము స్థైర్యం పొంది ఉంటున్నారు.

ఆహా! 'చిత్తము' అనే శిల్పి తనయొక్క అధిష్ఠానమగు పరమాత్మయందు మూలమంటూ ఏదీ లేనట్టి ఈ 'త్రిజగత్తులు' అనే శిల్పచాతుర్యమును ప్రకటించుచున్నాడు కదా! అందుచేత పరమాత్మ విషయవిశేష రహితమైనప్పటికీ ఈ విశ్వమంతా కూడా పరమాత్మ స్వరూపమై, పరమాత్మయందే ఉన్నది. అయితే పరిమిత దృష్టి గలవారు శిల్పమునే చూస్తారు గాని, శిలను చూడజాలరు చూచావా? అట్లాగే ఈ త్రిజగత్ ఆకారాది విశేషములన్నీ (అజ్ఞానావగాహనచే) పరిమితజ్ఞాన దృష్టికి పరమాత్మ స్వరూపంగా – కానవచ్చుట లేదు. ఇవన్నీ అజ్ఞానాకాశంలో – అంతఃకరణవృత్తులు – అనే కుంచెచే చిత్రించబడి అద్భుతంగా విస్తరించి ఉన్నాయి. సమష్టిమనః స్వరూపుడగు హిరణ్యగర్భుడు తన యొక్క సత్యసంకల్ప ప్రభావంచే ఈ త్రిజగత్తులను, వీటికి ఆధారమైన సూక్ష్మాకాశమును పరికల్పన చేస్తున్నాడు. అట్టి ఈ సమష్టి భ్రమ అనాది అయినది. ఇది గడ్డిపరకలచే నిర్మించబడిన గోడ వలె సారశూన్యము. ఇదంతా 'మాయ' లేక 'భ్రమ' అను మూలపదార్థముచే నిర్మించబడుతోంది. దీనిని మూఢులు సత్యమైనదానివలె గాంచుచున్నారు. విజ్ఞులు ఇందలి సారాసారములను ఎరిగి, తమ వివేకమును సర్వదా కాపాడుకుని ఉంటున్నారు. నాటకంలోని సంఘటనలలో తన్మయమై రసానుభవం పొంది అమిత దుఃఖము పొందే ప్రేక్షకునిలాగా ఈ జీవులు తమ విస్తార స్వస్వరూపమును ఏమరచుచున్నారు. రంగుల చిత్రం – రంగులు ఒక్కటే అయినట్లు... 'ఈ జగత్తు – దానిని దర్శించే మనస్సు – ఈ జగత్తును దర్శించే కర్త' ఈ మూడిటికీ కనిపించే భేదం వాస్తవమైనది కాదు. ఆ మూడిటి ఏకతపిమే (లేక) జగత్తు–మనస్సు–ద్రష్టల సంయోగమే జగదనుభవానికి అసలు కారణం.

❖❖❖

11. మనోకల్పన

ఓ పార్థా! మనస్సు చేసే 'త్రిజగత్తులు' అనే చిత్రరచనంతా ఆకాశమువలె అత్యంతశూన్యమైనది. స్వప్నంలో ఉన్నప్పుడు క్షణంలో త్రిజగత్తులను అనుభవించే ఆ మనస్సే జాగ్రత్‌లో కూడా అనేకానేక కల్పనలను అనుభవిస్తోంది.

కథయే ఒక కల్పన. ఇక అందలి పాత్రలు స్వభావాల గురించి వేరే చెప్పాలా? అట్లాగే, మనస్సే ఒక కల్పన. ఇక దాని సృష్టులమాట వేరే చెప్పేదేముంది? అయితే అట్టి కల్పనలను చిరాభ్యాస వశం చేత జనులు సత్యమని తలుస్తున్నారు. ఈ జగత్‌దృశ్యం ఏమాత్రం యథార్థం కాదని మరల గుర్తు చేస్తున్నాను. భ్రమయందు సత్యమైనదేమి ఉంటుంది? కానీ ఈ విషయం తత్త్వబోధ సముపార్జించిన వారికి మాత్రమే అవగతమౌతోంది. ఒక సమయంలో సత్యమైనట్లు తోచుచున్న ఈ జగత్తు తత్త్వజ్ఞానము పొందినవారికి – చీకటి తొలగిన తరువాత సుస్పష్టమయ్యే వస్తుజాలంలాగా – కల్పిత మాత్రంగా తెలిసిపోతోంది. జగదృష్టులన్నీ ద్రష్టలో లీనమై రహితమైపోతున్నాయి. అప్పుడు చిత్తశిల్పిచే నిర్మించబడిన భావాభావములన్నీ రూపరహితమై ఆత్మతత్త్వమును సంతరించుకుంటున్నాయి. వాస్తవానికి...

ఈ జగత్తు నీయందు లేదు... నీవు ఈ జగత్తునందు లేవు... నీకు వేరుగా జగత్తు లేదు.

ఇప్పుడు చెప్పు! ఎవరి వలన ఎవరు చంపబడుచున్నారు?

రోధ్యరోధక సంమోహం త్యక్త్వా ఖే విమలోభవ।
ప్రవృత్తిరేవ న వ్యోమ్నః ప్రవృత్తిశ్చైవ ఖాత్మికా ॥

'ఈ చచ్చువాడు – చంపువాడు' అను వ్యర్థమైన ప్రేలాపనలన్నీ త్యజించు. పవిత్ర భావ సమన్వితుడవై బ్రహ్మాకాశమున వెలయుము.

బ్రహ్మమునకు ఎట్టి ప్రవృత్తీ లేదు! ప్రవృత్తి వలె తోచుచున్నదంతా బ్రహ్మమే. అందుచేత కాలము, క్రియలు, వాటి భేదాభేదములు ఇవన్నీ నిశ్చయంగా బ్రహ్మమే. మనస్సు నందు ఊహచే కల్పించబడే ఊహాప్రపంచం ఏ విధంగా రసానుభూతి కలిగించ గలుగుతోందో... అట్లాగే అదే రీతిగా శూన్యమాత్రమగు ఈ పాదార్థిక జగత్తుకూడా ఊహతో కూడినదై రసానుభూతి కలిగిస్తోంది. స్వతఃగా ఇది శూన్యమాత్రమే!

ఓ అర్జునా! చిత్తములోనే జగత్తుల ఉదయాస్తమయములు జరుగుచున్నాయి. నిర్మాణము – క్షయము – జన్మ – మృత్యువు మొదలైనవన్నీ క్షణిక విషయములై ఉంటున్నాయని గ్రహించు. నీవు కొంచెం మోహం ఆశ్రయించి మోహగ్రస్తుడవై నీ మనోరాజ్యమున 'వీరు నావారు – వీరు చచ్చుచున్నారు' అనే వ్యథ – ఆఘాతములను గాంచుచున్నావు.

అట్టి అసంగత కల్పనలన్నీ ఉపదేశవశం చేత క్షీణించగలవు సుమా!

❖

ఈ మనస్సు ఆత్మయొక్క సంకల్పమే అవటం చేత ఇది మహత్తరమైన శక్తిని పొంది ఉంటోంది. అది క్షణంలో సువిశాల మనోరాజ్యమును కల్పించగల నిపుణత కలిగి ఉన్నది. దాని శక్తి వలననే మిథ్యయగు ఈ సంసారము 'అనాది – అనంతము' వలె భ్రమింపజేస్తోంది. ఒక్క క్షణాన్ని యుగంగా కల్పన చేయగల ఈ మనస్సే సత్యమును అసత్యముగా, అసత్యమును సత్యముగా చేయగలదు. భ్రాంతిచే చిత్రవిచిత్రములగు జగత్సమూహములను దర్శిస్తోంది. ఇట్టి ఈ కల్పన నిత్యముక్తమగు ఆత్మయందే అధ్యస్తమైయున్నదని గ్రహించు. స్వతఃగా తుచ్ఛమై, క్షణికమై, కల్పనామాత్రమైన ఈ జగత్తుపట్ల జన్మజన్మల జాడ్యమును ఆశ్రయించిన జీవులు అజ్ఞానముచే గొప్పనమ్మకము కలిగి ఉంటున్నారు. భ్రమయగు ఇదంతా భ్రమ తొలగుటచే తొలగిపోగలదు. కానీ భ్రమచే "అయ్యో! దీనిని ఎట్లా దాటటం?" అని జనులు తలచుచున్నారు. ఇదంతా స్వయంకల్పిత గుణసమన్విత ఊహాప్రదర్శనా చమత్కారమేనని గమనించటం లేదు!... ఎంత ఆశ్చర్యం!

❖

ఓ అర్జునా! మరల ప్రకటిస్తున్నాను. ఆత్మయందు ప్రతిభాసగా కల్పించబడు అజ్ఞాన తత్త్వమగు ప్రవృత్తిగాని, నివృత్తిగాని ఎన్నటికీ వాస్తవం కాదు. చిత్త శిల్పి లేడు. చిత్తం లేదు. ఉన్నట్లు కనబడుచున్న దంతా ప్రతిబింబం మాత్రమే. జలానికి, జలంలో ప్రతిబింబించే దృశ్యానికి ఏమి సంబంధం? ఆహా! ఏమి చిత్రం? ఆధారమే లేని చిత్రం ఉజ్జ్వలమై, భ్రమాసక్తులను కలుగజేస్తూ తాండవిస్తోంది కదా!

ఇదంతా కూడా ఒక గొప్ప చిత్రకారునిచేత చిత్రించబడిన కళాఖండంలాగా సంసారజీవుల దృష్టిని చిత్రంగా ఆకర్షిస్తోంది. 'కటిక చీకటి నుండి తేజోమయమైన సూర్యచంద్ర నక్షత్రాలు బయల్వెడలుతాయి' అను చమత్కారవాక్యంలాగా, 'భేదదృష్టులు' అనే విలాసంతో 'నానాత్వము' అను విస్తారముతో వెలయుచున్నది.

'జగత్రయం' అనే దేవనటి (Damsel) బ్రహ్మాకాశమున పరికల్పితమై ఉంటోంది. బుద్ధి ఆ దేవనటి నృత్యం చేసే నాట్యశాల. ఏది ఎచ్చట ఎట్లా గ్రహించబడినప్పటికీ అదంతా బుద్ధి వృత్తుల చమత్కారమే కదా. బుద్ధి యొక్క హావ భావ విలాసములే జగత్ నిర్మాణము యొక్క మూలపదార్థమని విజ్ఞులు ఎరిగియే ఉన్నారు. బుద్ధి యొక్క చపలత్వము ననుసరించి ఆ బుద్ధిని మరింత తనవైపుగా ఆకర్షించటానికి ఎవరో కాముకుడు ఇదంతా పరికల్పిస్తున్నాడు. ధర్మ, అర్థ, కామములను నిర్వచించే ప్రవృత్తి-నివృత్తులు ఆ దేవనటి యొక్క అంగవస్త్రములు.

నానావిధ విలాపములతో గూడిన ఈ త్రిలోకములను మనస్సు అనే కల్పనా చాతుర్యం గల చిత్రకారుడే రచిస్తున్నాడు. మనస్సు యొక్క మూలం కల్పనయే కదా! ఇకమనస్సుతో మనస్సులో పొందబడే ఈ దృశ్యము కూడా కల్పనయే! కనుక అర్జునా! ఇదంతా చూచి నీవు మోహము చెంద వలసిన పనేమీ లేదు. ఇదంతా శూన్యమాత్రము... స్వయం కల్పితమైన భ్రమ మాత్రమే.

❖❖❖

12. అసాధ్యం కాదు సుసాధ్యమే

శ్రీకృష్ణ భగవానుడు: ఈ దృశ్య కళాఖండానికి రంగులతో గోడపై నిర్మించిన కళాఖండానికి ఒక ముఖ్యమైన తేడా ఉన్నది. రంగుల చిత్రంకన్నా ముందు గోడ ఉండాలి కదా! కానీ ఈ మహాశ్చర్యం చూడు! ఈ దృశ్య కళాఖండం విషయంలో మొదట చిత్రము, ఆ తరువాత దానికి ఆధారం నిర్మించ బడుచున్నాయి.

జగత్తు అనబడే నిరర్థకమైన వ్యవహారంలోనికి జీవుడు అనువాడు ప్రవేశించి జగత్తునకు అర్థమును కల్పన చేసి అనుభవిస్తున్నాడు. మొట్టమొదట నిరాధారమగు జగత్తు... ఆ తరువాత జగదనుభవమునకు ఆధారమగు కల్పన ఒనగూడుతున్నాయి. ఆహా! మాయ ఎంత చిత్రమైనది. 'జలంలో సొరకాయ మునుగుతోంది. బండరాయి తేలుతోంది" అన్న వాక్యంలాగా జీవుడు వచ్చి ఇక్కడ అర్థములను కల్పించి భావాభావములను పరంపరగా పొందుచున్నాడు.

ఓ ఫల్గుణా! నీవు బ్రహ్మజ్ఞానము పొందియే ఉన్నావు కదా! మనోరాజ్యమును బోలు ఈ దేహాది శూన్య పదార్థములపట్ల నీకు ఆసక్తి ఎందుకో చెప్పు? స్వతహాగా శూన్యమగు ఈ జగత్తునందు 'ఇది నాది, వీరు నావారు' అను అనర్థములకు అర్థమేమున్నది?

అంతాకూడా 'ఆకాశమునందు ఆకాశము ఏర్పడి ఆకాశమునందు విలీనమగుచున్నది. ఆకాశము ఆకాశముచే విభాగించబడుచున్నది. (తూర్పు ఆకాశం - పడమర ఆకాశం లాగా?)

ఆకాశం ఆకాశము చేతనే ఆవరించబడుతోంది' ...అను విచిత్ర వ్యవహారంలా ఇక్కడ ఏర్పడి ఉంటోంది సుమా!.

ఓ అర్జునా! ఈ జగత్తునంతా అనంతము – విస్తృతము అయిన వాసన ఒకానొక చాంతాడువలె చుట్టుకొని ఉన్నది. అనంతమగు ఆకాశమును అల్పమగు మేఘము ఆవరించి ఉన్నట్లు చిదాకాశమును వాసనామేఘము ఆవరించి ఉంటోంది. అద్దంలో దృశ్యం ప్రతిబింబిస్తోంది చూచావా! అట్లా బ్రహ్మం నందు ఈ జగత్తు ప్రతిబింబిస్తోంది. బ్రహ్మమే ఈ జగత్తుకు అధిష్ఠానం. అందుచేత జగత్‌జాడ్యం వదలాలంటే బ్రహ్మజ్ఞానము కాక మరింకే ఉపాయంలేదు. ఇదంతా కూడా బ్రహ్మమునకు అనన్యమై ఉన్నది. ఇక్కడా – అక్కడా కూడా బ్రహ్మమే ప్రకాశిస్తోంది. కాబట్టి ఇక ఇక్కడ ఎవరు ఎవరివలన వినాశనము పొందగలరు చెప్పు?

❖

నా ఉపదేశం యొక్క ముఖ్యోద్దేశం... నీవు వాసనారహితుడవగుటకు యత్నించాలనేదే సుమా! 'వాసనారాహిత్యం' ఎవడు సంపాదించుకోడో అట్టివాడు సర్వ శాస్త్రకోవిదుడైనప్పటికీ, గొప్ప కార్యదక్షుడు అయినప్పటికీ ఏం లాభం? అతడు పంజరంలోని చిలకలాగా వాసనాపంజరంలో బద్ధుడై ఉంటున్నాడు. చిత్తం అనే భూమిపై స్వల్ప వాసనలు మిగిలి ఉన్నప్పటికీ వాటి వల్ల మరల సంసారారణ్యం విశాలమై విస్తృతి పొందటం జరిగే ప్రమాదమున్నది.

అర్జునుడు : మరి అనేక వాసనలు సంక్షిప్తమైయున్న మనస్సు గల నావంటి వారికి సంసారమును అతిక్రమించటం దుర్లభమే కదా!

శ్రీకృష్ణ భగవానుడు: ఓ అర్జునా! నీవు నిరుత్సాహ పడవద్దు. నీవు మహావీరుడివి కదా! అభ్యాసమును ఆశ్రయించు. అభ్యాసబలం చేత హృదయంలో 'సత్యజ్ఞానం' అనే అగ్నిచే వాసనాబీజాన్ని సంపూర్ణంగా దగ్ధం చేయి. అప్పుడు నీ మనస్సు ఈ సుఖదుఃఖాలు అందించే వస్తుజాలంలో చిక్కుకోదు. సర్వుల స్వరూపం ఆత్మయే అయి ఉండగా ఆత్మను ఆశ్రయించటం అసాధ్యమెట్లా అవుతుంది? సర్వ ఆశలను ఇప్పటికిప్పుడే మొదలంట విడిచివేయి. ప్రతిఒక్కరికీ ఆత్మస్వభావమగు అసంగ – అప్రమేయాదులు సంతరించుకోవటం సుసాధ్యమేనని సిద్ధాంతీకరిస్తున్నాను.

శాన్తాత్మా విగతభయోజ్ఝితామితాశో నిర్వాణో గలితమహామనోవిమోహః ।
సమ్యక్త్వం శ్రుతమవగమ్య పావనం తత్తిష్ఠాత్మన్యపహతి రేకశాన్తిరూపః ॥ (శ్లో 12, సర్గ 58)

అందుచేత నీవు శాంతాత్ముడవై, మోహశూన్యుడవై, ప్రశాంతమనస్కుడవై నీకు విధించబడిన ధర్మమును నిశ్చింతగా నిర్వర్తించు. కర్మలు నిర్వర్తిస్తున్నప్పుడు – లేనప్పుడు కూడా సర్వదా ఆత్మయందు నిర్వికల్ప స్వభావమును అవధరించి ఉండు.

❖❖❖

13. నేర్పుతో కూడిన ప్రయత్నము

అర్జునుడు :

నష్టో మోహః స్మృతిః లబ్ధా త్వత్ప్రసాదాత్ మయా, అచ్యుతా! ।
స్థితోఽస్మి గతసందేహః। కరిష్యే వచనం తవ ॥

ఓ అచ్యుతా! నీ అనుగ్రహం వలన నా మోహం నశించింది. 'స్వతః సిద్ధమగు ఆత్మతత్త్వము యొక్క స్మృతి' – అనే బ్రహ్మసాక్షాత్కారం లభించింది. నా సందేహాలన్నీ తొలగినాయి. నీ ఉపదేశాలను అనుసరించి ఇప్పుడు నేను యుద్ధం చేయటానికి సిద్ధంగా ఉన్నాను. నీ వాక్యముల సమీక్ష మరొక్కసారి వినాలని నా కుతూహలం.

శ్రీకృష్ణ భగవానుడు : నాయనా! అర్జునా! నీకు విస్తారంగా చెప్పవలసిన పనేమున్నది? చిత్తము ఉపశమించుట చేతనే జన్మసార్థకమౌతుంది. కామాది వృత్తులు నశిస్తేనే చిత్తం ఉపశమిస్తుంది. వృత్తులన్నిటికీ మూలం వాసనలే. వాసనలు తమ తమ వృత్తులతో సహా రహితం కావాలంటే అభ్యాసం ఒక్కటే ఉపాయం. ఏదైతే వ్యావహారిక సహిత స్థితిలో 'ప్రత్యక్ చేతనము' అని అనిపించు కుంటుందో... అదియే వాసనారహిత స్థితి సంపాదించుకున్నప్పుడు ఈ ఉపాధికి అతీతమగు – సర్వమునకు కేవల నిర్మల సాక్షీభూతమగు బ్రహ్మమే అగుచున్నది. ఆ నిర్మల బ్రహ్మమే సర్వులయందు సర్వత్రా సర్వ వేళలా వ్యాపించి ఉన్నదను దృష్టియే ఉత్తమ దృష్టి.

అయితే... ఎక్కడో ఆకాశములో సుదూరంగా విహరిస్తున్న పక్షిని ఈ కళ్ళు చూడలేవు కదా! అట్లాగే "స్వప్నజాగ్రత్" అనుభవమునకు మాత్రమే పరిమితమైన ఈ భౌతికమైన ఇంద్రియములకు ఆ ఆత్మపదము అవస్తువే అయి ఉంటోంది. చైతన్యమే ఈ ఇంద్రియములన్నిటికీ ఉత్తేజ – విషయ పరిజ్ఞానముల సామర్థ్యము ప్రసాదిస్తున్నది. అయితే ఏం? ఇంద్రియములు ఆత్మను సమీపించలేవు. నిర్వచించలేవు.

అత్యంత శుద్ధము, సర్వసంకల్పవర్జితము అగు ప్రత్యక్‌చేతనమే ఈ కనబడే వివిధ వస్తువులను ప్రకాశింపజేస్తున్నది. ఆ ప్రత్యక్ చేతనం మాత్రం ఒక వస్తువు వలె కనబడేది కాదు. అతి సూక్ష్మ గ్రాహ్యమైనది. అందుచేత శ్రవణము, మననము మొదలైన శుద్ధవాసనలు లేకపోతే మలినవాసనలు తొలగవు. మహత్తరమైన ప్రయత్నం ఉంటేనే సూక్ష్మతరమగు ఆత్మను గాంచగలవు. ఆత్మజ్ఞానానుభవము పొందబడినప్పుడు మాత్రమే ఈ జగత్తు యొక్క ఆభాస నశిస్తోంది.

వాసనా లయం ఆత్మ దర్శనానికి కారణమౌతోంది... ఆత్మ దర్శనం వాసనా లయానికి కారణ మౌతోంది.

ఓ అర్జునా! "అయ్యో ఈ వాసనలు ఎలా తొలగుతాయ్?"...అని అనుకుంటూ మననం చేస్తూ దిగాలుబడి కూర్చుంటే ఏం లాభం? నీవు ప్రయత్నశీలుడవు కావాలి. అగ్నిపర్వతంపై మంచు బిందువులు కురిస్తే ఏమౌతాయి? క్షణంలో రూపుమాసిపోతాయి. అట్లాగే శుద్ధమగు ఆత్మ యొక్క అనుభవం పొందిన తరువాత అవిద్య సమీపించిందా... అది మౌనంగా విలీనం కావలసిందే.

అయినా... తుచ్ఛము, భోగధూళి సమన్వితము, అల్పదృష్టి ప్రదాత, బంధప్రదాత – అగు వాసన ఎచ్చట? జగత్తులన్నీ వ్యాపించియున్న చైతన్యమెచట? వాసనలు చైతన్యమును బంధించటమేమిటి?

నాయనా! నీవు బ్రహ్మభావమును శరణువేడు. "కాల బద్ధం కాని బ్రహ్మమును నేనే" అను అనుభూతిని సుస్థిరీకరించుకో. వాసనల గురించిన వేదనను–ధ్యాసలను వదిలివేయి.

ఆత్మ వలననే పరిపూర్ణము – శుద్ధము అగు ఆత్మ ఎరుగబడుతోంది! నానావిధ వికారములగు ఈ దృశ్యములన్నీ రాజుగారి ముందు నర్తకి నృత్యంలాగా ఆత్మ సమక్షంలో స్ఫురించి విలీనమవుతున్నాయి. అయినప్పటికీ ఆత్మ ఆకాశమువలె అప్రమేయ తేజోవిరాజితమై వెలుగొందుచున్నది. పూర్ణము – జగద్వివర్జితము – వాక్కుకు అతీతము అగు ఆ పరవస్తువుతో పోల్చతగినది ఎక్కడా ఏదీ లేదు. కనుక ఫల్గుణా! నీవు సర్వదా హృదయంలోని వాసనల నివృత్తికొరకై నేర్పుతో కూడిన ప్రయత్నంలో ఉండు. క్రమంగా సంసార భయరహితుడవై, భగవంతుడవై ప్రకాశించగలవు.

❖

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఆ విధంగా త్రిలోకనాథుడైన శ్రీకృష్ణ భగవానుడు అర్జునునికి బోధించటం ముగించి మౌనం వహిస్తారు.

సూర్యభగవానుని స్పర్శచే కమలములు వికసించినట్లు అర్జునుని హృదయపద్మం శ్రీ కృష్ణుని జ్ఞాన స్పర్శచే వికసిస్తుంది. ఆతడు శోకరహితుడౌతాడు. గాండీవధారి అయి తన విధ్యుక్తమైన యుద్ధమును నిర్వర్తిస్తాడు.

❖❖❖

14. ఆత్మయొక్క కృతనిశ్చయం

శ్రీవసిష్ఠ మహర్షి : రాబోయే ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు అర్జునుని ఎదుట ప్రవచించబోయే నిర్మలాత్మ దృష్టిని నీవుకూడా అవలంబించు. ఈ నామరూపాత్మకమగు జగత్తునంతటినీ బ్రహ్మముతో ఐక్యమొనర్చి నిస్సంగమగు సన్న్యాసమునందు సర్వదా వెలయుము. అసంయోగమే సులభశరణ్యం.

'పరమాత్మ' అనగా ఎవరు? - పరమాత్మ త్రికాలములందు సత్యము. సర్వదా ప్రకాశించునది. ప్రపంచాతీతం కనుక అత్యంత దూరస్థమైనది. సర్వవ్యాపి అవటం చేత అత్యంత సామీప్యమైనది.

అద్దాని యొక్క విశిష్టత ఏమిటంటే.... నీవు అద్దానియందు ప్రతిష్ఠితుడవైన మరుక్షణం నీవే ఆ వస్తువవుతావు. ఇక నీకు అద్దానినుండి భిన్నమైన ఉనికియే సంభవించదు. అదియే చిత్తవృత్తులన్నిటియందు ప్రతిబింబిస్తోంది. ఈ జ్ఞాతృ – జ్ఞాన – జ్ఞేయములు తమ భేదములు కోల్పోయిన మరుక్షణం ఇక శేషించేది ఆ పరమాత్మయే. ఆ పరమాత్మతత్త్వంలో ఏకత్వమే పరమోత్తమపదమని గ్రహించు. అదియే ఆనందం యొక్క అవధి. అది దృక్కులనన్నిటి కంటే పరమదృక్ (the perceiver of all perceivers). మహత్ విశేషము లన్నిటి కంటే పరమశ్రేష్ఠము. గౌరవనీయము లన్నిటికంటే కూడా గౌరవనీయమైనది.

అయితే... విషయములన్నిటికీ అతీతమైనదైనప్పటికీ, ఆత్మ సంవిత్‌స్వరూపమైనది. (It has the form of Existence and Knowledge) అది శూన్యం అని మాత్రం అనుకోకు. ఎందుకంటే అది జ్ఞానమయం. మంగళప్రదము. శ్రేయములన్నిటి కంటే శ్రేయోదాయకం కూడా! అద్దాని యందే సర్వదేహములలోని సర్వ అనుభవములు ఉనికి కలిగి ఉన్నాయి. ఇక్కడ నీకు కనబడేదంతా సత్స్వ రూపంగా తోచటానికి కారణం ఆ బ్రహ్మవస్తువు యొక్క ప్రభావమే. 'జగత్' అనే నువ్వులలో నూనె, జగత్ వృక్షము నందలి రసము, జగత్ పశువునకు పాలకుడు అదియే. 'ప్రాణులు' అనే ముత్యములందు సూత్రమువలె వ్యాపించి ఉన్నది ఆ ఆత్మయే! అదియే 'పంచభూతములు' అను మిరియపు గింజలందు కారం.

పదార్థములందలి పదార్థత్వము... సద్వస్తువులందు గల సత్త... అసద్వస్తువుల యొక్క మిథ్యాత్వము... ఇవన్నీ కూడా ఆ పరమోత్తమ తత్త్వమేనయ్యా! ఇదంతా ఇట్లా ఉండగా, ఇక్కడ కనబడే జగత్ భావములన్నీ అజ్ఞానము వలననే ప్రకాశిస్తున్నాయి. అయితే ఆత్మతత్త్వము జ్ఞానదార్ఢ్యము వలననే ప్రకాశించగలదు.

శ్రీరాముడు: ఈ ఇంద్రియములకు విషయములగు పదార్థములన్నీ ఆత్మజ్ఞానమును మరుగు పరచుచున్నాయి కదా! ఈ అడ్డు జీవునికి తొలిగేది ఎట్లా?

శ్రీవసిష్ఠ మహర్షి: ఇక్కడి ఇంద్రియ భావనలన్నీ 'విచారణ' అను వాయువీచికా ప్రభావంచే నశించ గలవు. అహంకారం మొదలుకొని ఇంద్రియాలకు గోచరించే ఒక చిన్న వస్తువు వరకు అన్నీ కూడా ఆత్మయందు పరికల్పించబడిన భ్రమలే కానీ మరింకేమీ కాదు. ఎవరికైతే ఈ కల్పిత పదార్థ – విషయాదులందు నమ్మకం ఏర్పడి ఉంటుందో... వారు మాత్రమే ఇక్కడ బద్ధులగుచున్నారు. ఈ జగత్తు యొక్క మొదలు–చివర కూడా అహంకారము యొక్క పర్యవసానం మాత్రమే.

❖

ఆద్యంతరహితమగు ఆ బ్రహ్మాకాశమును ఎవరు 'ఇట్టిది' అని నిర్వచించగలరు?

ఓ రామచంద్రా! ఆత్మయొక్క కృతనిశ్చయము పొందినవారు కర్మలన్నిటినీ ఆచరించిన వారే అగుచున్నారు. అట్టి సమస్థితిని సంపాదించిన వారి మనస్సు ఇక ఎక్కడా ఎట్టి ఉదయాస్తమయములు పొందటమే లేదు. జగత్ రహితమైనట్టి బ్రహ్మమయ శరీరమును సంపాదించుకున్నవాడు ఒకానొక అనిర్వచనీయమగు అద్వైతభావమును అధిరోహించి ఉంటున్నాడు. నిద్రాసమయంలోని మనస్సువలె నిర్వికారుడై ఉంటున్నాడు. ఒకవేళ వ్యవహారములు నిర్వర్తిస్తున్నప్పటికీ ఆతడు ఏ సమయంలోనూ ఎట్టి క్షోభ పొందటం లేదు. అతని హృదయం కించిత్ చలనమునకు కూడా లోను కావటం లేదు. అద్దంలో ఏఏ దృశ్యములు ప్రతిబింబిస్తున్నప్పటికీ ఆ అద్దం ఏమన్నా మార్పు–చేర్పులు పొందుతోందా? అట్లాగే ఆత్మానుభవజ్ఞుడు ఈ జగత్తుల అనుభవం పొందుచున్నప్పటికీ అదంతా తన స్వస్వరూపమునకు మార్పు చేర్పులు ఏర్పరచలేవని సుస్పష్టంగా గ్రహించియే ఉంటున్నాడు.

ఆ నిశ్చలమగు ఆత్మయే నీ స్వరూపం. తదితరమైనదంతా ప్రతిబింబం మాత్రమే!

❖

వాస్తవానికి ఇక్కడగాని, మరెక్కడ గాని 'చిత్' తప్పితే మరింకేదీ లేదు. ఇక ఈ ఏకము – అనేకము – గురువు – శిష్యుడు – ఉపదేశము మొదలైనవన్నీ ఆ 'చిత్' యొక్క ఉపాంగములు మాత్రమే. ఒక్కమాటలో చెప్పాలంటే శాంతమగు ఆత్మ – 1. తన యందు తానే జగత్తుగా వివర్తం పొందటం, 2. జగత్ అతిక్రమించి సర్వశేష్యముగా అనుగమించటం – అను ఉభయ చిద్విలాసము లను ప్రకటించుచున్నది.

వివర్తము ఉపశమిస్తే జగత్తు కూడా ఉపశమిస్తుంది. ఎందుకంటే, చిత్ యొక్క వివర్తమే ఈ జగత్తు. అట్లు వివర్తం పొందకపోవటమే పరమపదము.

జగత్తు యొక్క ఉపశాంతి – వాసనాక్షయం అనునవి అవిభాజ్యములని గ్రహించు. ఆత్మయొక్క ఈ జగత్ స్పందనమంతా కల్పితం మాత్రమే! అందుకనే... 'అజడమగు స్పంద శూన్యత్వమే బ్రహ్మము' అని విజ్ఞులు చెప్తూచూ ఉంటారు.

అట్టి బ్రహ్మ స్వభావమే నీవై ఉండగా ఇక కల్పనామాత్రమైన ఈ జగత్తు గురించి నీకు దుఃఖం గాని మోహం గాని ఏర్పడవలసిన అగత్యమేమున్నదో చెప్పు? ఈ జగత్తంతా జడాకృతియే కదా! ఇది 'అనాత్మదర్శన ప్రభావం' తప్పితే మరింకేమీ కాదు. ఈ జగత్ కల్పనము 'సత్యమే' అని నమ్మిన వారికి ఇది అట్లే సత్యం వలె తోచుచున్నది. "కల్పన నుండి అనుభవం. అనుభవమే జగత్తు. కనుక కల్పన సత్యమెట్లా అవుతుంది?" అను అవగాహన ద్వారా జగత్‌భావన లయం చేస్తున్న వారికి ఇదంతా సారశూన్యమగుచున్నది. సర్వభావములు చైతన్యములో లయం చేసిన మరుక్షణం చైతన్యమొక్కటే మిగులుతుంది.

చైతన్య వివర్తమే (చైతన్యముయొక్క స్వస్వరూపమునకు సంబంధించిన ఏమరుపే) సంసారభ్రమ అని మనం చెప్పుకున్నాం కదా! ఇంతకు మించి ఇక్కడ మరింకే విశేషం లేదు. "ఇది జ్ఞానుల – శాస్త్రముల తుది నిర్ణయం. దృఢనిశ్చయం," – అని మరొక్కసారి ప్రకటిస్తున్నాను.

శ్రీరాముడు: హే మహర్షీ! ఈ కార్య – కారణ – కర్తృత్వాలు ఎదురుగా ఉండగా భావనను లయం చేయటం, ఇద్దాని నుండి బ్రహ్మమును వేరు చేసి ఆశ్రయించటం ఎంతో దుర్లభమైన ప్రక్రియ అని, సులభ సాధ్యం కాదని కొందరి అభిప్రాయం.

శ్రీవసిష్ఠ మహర్షి : ఉంగరం, గొలుసు, గాజులు మొదలైన ఆభరణాలు బంగారం కంటే వేరైనవా? కాదు కదా! ఈ కార్య–కారణ–కర్తృత్వాలనేవి బ్రహ్మము నుండి వేరుగా లేవు. చిత్ యొక్క స్పందనయే "సంకల్పించుట, భ్రమించుట..." మొదలైనవన్నీ కూడా. అట్టి చిత్ యొక్క స్పందనమునే మనం 'చిత్తము' అని అంటున్నాం. 'తరంగము అనబడేది జలమే. అట్లాగే, చిత్తము దాని సర్వచర్యలతో సహా చిత్‌యే'... అని తెలియకపోవటమే అజ్ఞానం. అజ్ఞాన కారణంగా బ్రహ్మము నుండి జగత్తు వేరైనదైనట్లు అనిపించటం జరుగుతోంది. అజ్ఞానము వలన ఏది ఏర్పడుతుందో అది తొలిగేది ఎట్లా? జ్ఞానము చేతనే. జ్ఞానముచే అజ్ఞానం జ్ఞానమునందు లయం అవగలదు. జ్ఞాన ప్రకాశముచే చిత్తము తొలగి ఆ స్థానంలో 'చిత్' ప్రకాశించగలదు.

ఆత్మతత్త్వము గ్రహించిన తరువాత ఇక భోగవాసనలు కూడా స్వయంగా క్షీణిస్తున్నాయి. భోగవాసనల చింతారాహిత్యమే జీవన్ముక్త లక్షణము. జీవన్ముక్తుడు భోగవాసనలను చింతించక పోవటానికి కారణం... ఆ భోగవాసనల కంటే కూడా అత్యంత ప్రియమైన ఆత్మ యొక్క అనుభూతి లభించటమే! తృప్తిగా భుజించినవాడు చిరుతిళ్ళు కోరుకుంటాడా? జీవన్ముక్తుడు అత్యంత స్వాభావికంగా ఇక్కడి భోగవస్తువులు నిస్సారమని, అర్థరహితమని, అల్పవిషయమని గ్రహిస్తున్నాడు.

❖❖❖

15. జీవన్ముక్తుని పరమ లక్షణములు

శ్రీవసిష్ఠ మహర్షి: ఓ రాఘవా! ఇప్పుడు నీకు జీవన్ముక్తుని పరమ లక్షణములు ఎట్లా ఉంటాయో మరొక్కసారి ఇప్పటి సందర్భానుచితంగా చెబుతాను విను.

❖

జీవన్ముక్తుడు స్వాభావికంగానే భోగములను వాంఛించడని అనుకున్నాం కదా! ఆత్మ ఒక్కటే ఈ భోగ్యభోక్తృత్వములు మొదలైన నానావిధ రూపాలుగా ఉన్నదను నిశ్చయజ్ఞానం అతని యందు సర్వదా ఏర్పడి ఉంటోంది. అట్టి నిశ్చయమును అభ్యాసవశంగా అలవర్చుకొనువాడే జీవన్ముక్త శబ్దమునకు అర్హుడగుచున్నాడు. అట్టి బుద్ధిమంతుడు ఆయా యథాప్రాప్తాలైన భోగాలను అనుభవించ వలసివస్తున్నప్పటికీ అనుభవించనివాడుగానే అగుచున్నాడు. ఆకాశాన్ని పిడికిలితో గుద్దితే ఆకాశానికి ఏమౌతుంది? జీవన్ముక్తుని క్రియలు లోకానుకూలత అను ఉద్దేశమును మాత్రమే కలిగి ఉంటాయి కాబట్టి అవన్నీ సంగమునకు ఏమాత్రం కారణం కాజాలవు. అతడు కృత్రిమమైన వ్యవహార బుద్ధి కలిగియుండి, "ఈ కృత్రిమ వ్యవహారబుద్ధి కూడా భ్రాంతి రూపమే" అని గ్రహించియే ఉంటాడు. ఇక్కడ ఏది భ్రమమాత్రమో, ఏది భ్రమరహిత త్రికాలాబాధ్యసత్యమో విభాగయోగముచే గ్రహించని వారికి నిరతిశయానందరూపమైన ఆత్మతత్త్వప్రాప్తి లభించటమనేది దుర్లభము.

ఈ కనబడే పదార్థాలన్నీ జీవన్ముక్తుడు ఆత్మతత్త్వానుభవమునందు విలీనం చేసివేస్తున్నాడు. దృష్టి యొక్క సమున్నతిని సాధించటం మాని ఒకడు ఈ భౌతిక దేహాన్ని శుష్కించుకుని ఏం ప్రయోజనం? ఖండించుకుని ఏం లాభం? భ్రమ ఆమాత్రానికి తొలగుతుందా? అజ్ఞానం సమూలంగా తొలగనంత వరకూ ఆ అజ్ఞాన రూపమగు స్పందన కలుగుచూనే ఉంటుంది. పరిపూర్ణజ్ఞానం కలిగిన క్షణంలో ఆర్తి, దుఃఖం, భ్రమ, ప్రలోభం – వంటి సర్వవికారాలూ వాటంతట అవే తొలగుతాయి. దీపం కొండెక్కగానే దాని ఉష్ణం, ఆకారం, కాంతులు – తమంతట తామే తొలగుతాయి కదా!

అయితే... 'ప్రశాంత దీపికను బోలిన చిత్తునందు స్పందాస్పందనములు లేవు'... అనునది ఉత్తమ సత్యము, సిద్ధాంతము కూడా!

❖

ప్రాణవాయువు స్పందనరహితమైనప్పుడు దానికి 'ఉన్నది – లేదు' మొదలైనవి ఆపాదించలేం. అలాగే చిత్తము స్పందనరహితమైనప్పుడు 'చిత్' నందు చిత్తం ఉన్నదని గాని, లేదని గాని చెప్పలేం. శుద్ధ చిత్తము కేవల ఆత్మ స్వరూపమే అయి ఉన్నది. చిత్తము చిత్‌లో ఏకమై ఉన్నప్పుడు బంధ – మోక్షము లనేవి ఆపాదించలేం. అసలీ చిత్ వ్యర్థమగు ఆకృతుల పట్ల గ్రాహ్యాత్యాజ్యములు త్యజిస్తే ఇక బంధమోక్షములనబడేవే ఉండేవికావు. కనుక 'నాకు మోక్షం కావాలి' అను ఆవేదన కూడా అంతఃపూర్ణానుభవమునకు హాని కలిగిస్తోందని చెప్పవలసివస్తోంది. 'ఆ మోక్షం నాకు వలదు' అను భావనను ఆశ్రయించినా కూడా అది బంధముగానే ఉండి ఉంటోంది.

అందుచేత బంధమోక్షములు రెండూ స్మరించకుండుటచేత నీకు పరమశ్రేయస్సు లభిస్తుంది.

'పరమ పదము' అంటే ఏమిటి? - స్వయం ప్రకాశమై, చైతన్య స్వరూపమై, సర్వాశ్రయమై, విషయవర్జితమైనదే పరమపదము. అది భావనకు ఆవల ఉన్నది. భావనకు ఈవల మాత్రమే ఈ దేహాదులు ఉన్నాయి. సర్వ సంకల్పములు అందులోంచే బయలుదేరుతున్నాయి. మరి సంకల్పములు అద్దానిని బంధించటమేమిటి? కనుక 'బంధము' అనబడేదానికి అర్థం, ఆస్కారం కూడా లేవు.

శ్రీరాముడు: మరి బంధమోక్షము లెవరికి?

శ్రీవసిష్ఠ మహర్షి: మహాచైతన్యము యొక్క స్పందనము ఏదైతే ఉన్నదో.... అద్దానికే బంధమోక్షములు ఆపాదించబడుతున్నాయి. అయితే 'ఇదంతా కూడా ఆత్మయొక్క స్పందనము మాత్రమే' అని గ్రహించ బడిన తరువాత ఇక బంధమోక్షములు లేవని స్వభావసిద్ధంగానే తెలియవస్తోంది. ఈ విధంగా ఎరిగినంత మాత్రం చేతనే అహంకారాదులన్నీ శమించి ఆశ్రయరహితమగుచుండగా... ఇక ఎవడు దేనిచేత, ఎక్కడ ఎట్లు బంధితుడౌతాడు చెప్పు?

ఇంద్రియ పరిమితసంబంధమే బంధము... ఇంద్రియములకు సాక్షియగు ఆత్మతోటి ఏకత్వ సిద్ధియే బంధరాహిత్యము.

వివేకి అయినవాడు 'ఇది నా సంకల్ప విభాగం. ఇది సంకల్పముల నుండి వివర్తమగుచున్న అనుభవం. ఇది సంకల్పాలకు ముందే ఉన్న నా చిత్‌చైతన్య స్వరూపం'... అని విభాగించి గాంచ గలుగుచున్నాడు. అట్టి స్వనిర్మిత సంకల్ప విభాగమునంతటినీ మిథ్యగా గాంచగలుగుచున్నాడు. ఇకప్పుడు క్రియాత్మక సంకల్పములు ఉండిఉంటున్నప్పటికీ సర్వమును స్పందాతీతమైన తత్త్వముగా గమనించుచున్నాడు. ప్రబుద్ధమైన చైతన్యసమన్వితుడై ఈ దృశ్యప్రపంచమును అదృశ్యమునందు విలీనమొనర్చుచున్నాడు.

❖

చిద్ఘనమగు ఆత్మ సర్వదా స్పందానాతీతమైన స్థితి అవధరించియే ఉన్నది. అద్దాని రూపమే స్పందనారూపమగుచున్నది. ఇట్టి బోధ దృఢపడిన జీవన్ముక్తుడు ఈ జగత్తులను ఆత్మయొక్క 'నిర్వృత్త తేజము'గా అనుభూతిని పొందుచున్నాడు.

ఓ రామచంద్రా! తదితర సర్వము ముక్షువులారా! ఈ నా వర్తమానం జాగ్రత్తగా వినండి.

"చైతన్యము యొక్క ప్రకాశమే చిత్ స్పందనము. ఆ ప్రకాశము యొక్క ఒకానొక కిరణమే ఈ జగత్తు" అను అవగాహనచే మరిక్కడ చైతన్యప్రకాశము తప్పితే ఏదీ ఉండదు. అనేకమంది దేహులు ఇక్కడ సుదీర్ఘమైన ఇంద్రియస్వప్నమును గాంచుచుండగా... ఒక్క జ్ఞాని మాత్రం అందుకు భిన్నమైన దర్శనమును కలిగి ఉంటున్నాడు సుమా! అతడు తన నిజస్వరూపమగు ఆత్మను సర్వవ్యాపిగా, సర్వాంతర్యామిగా, సర్వరసస్వరూపంగా, నామరూపాతీతంగా గాంచగలుగుచున్నాడు. తనకు ఆద్యంతాలు లేవని ఎరిగి ఉంటున్నాడు.

యత్రోదేతి ప్రసభమనిశం సర్వసంవిత్తి సత్తా ।
యస్మిన్నేతే సకలకలనాకార పంకా గలన్తి ।
ఉద్యన్త్యేతే స్వదనుసుభగం యత్ర సర్వోపలమ్భా ।
ధ్యానేనైవం తమవగమయ ప్రత్యగాత్మానమన్తః ॥

ఓ ప్రియరామచంద్రా! ఏ పరమాత్మయందు నిరంతరము జగదాకారప్రాప్తి, అద్దానినుండి ప్రీతిపూర్వకమగు విషయానుభవం కూడా అనుభవమౌతోందో, ఎవనిలో సమస్త సృష్టి సమూహాల సత్త జనిస్తోందో అట్టి సాక్షిరూపమగు నీ స్వస్వరూపపరమాత్మను నీ అంతఃకరణంలోనే వీక్షించు.

నీ సాక్షి రూపమే ఆ పరమాత్మ. ఇక కల్పిత జగత్తు నందలి సత్యాసత్యాల గురించి దుఃఖించుట మూర్ఖత్వమే అవుతుంది... ఇదియే ఈ బోధ సారం.

❖❖❖

16. స్వకంఠాభరణం

శ్రీవసిష్ఠ మహర్షి: ఓ రఘురామా! ఈ ప్రకారంగా ఆత్మపదమే సమస్తమునకు ఆది. బ్రహ్మ - విష్ణు - మహేశ్వరాది మహత్స్వరూపులు ఆ పరమపదమునందే నెలకొనియుండి ఈ ముల్లోకములను పరిపాలిస్తూ లోకపూజ్యులై ఉంటున్నారు. స్వర్గవాసులలో కొందరు జ్ఞానులై ఆకాశగమనాది క్రీడలచే స్వర్గమున క్రీడిస్తున్నారు. అదేవిధంగా ఈ మనుష్య, దేవ, గంధర్వ, తిర్యగాది - జాతులలో కూడా కొందరు జీవులు ఆత్మతత్త్వమును ఎరిగినవారై బ్రహ్మానందపూర్వకంగా ఈ లోకంలో విహరిస్తున్నారు. మనుష్యానందము నుండి బ్రహ్మదేవుని ఆనందము వరకు పరికించి చూస్తే, సర్వానందముల కంటే ఆత్మానందమే (లేక) బ్రహ్మానందమే పరాకాష్ఠ. అట్టి బ్రహ్మైక్యానందమును పొందిన జీవుడు ఇక మరణ-జననాది దుఃఖములను పొందడు. అందరూ ప్రాణాధారములనుకొనే విషయాలచే ఆతడు నిరోధించబడజాలడు. ఏ జీవుడైనా సరే, ఆ పరమాత్మ యొక్క 'సర్వవ్యాపక చిన్మాత్రము' (లేక) 'ఆత్మయొక్క సత్తా సామాన్య రూపము'ను ఏ కొంచెం ఎరిగినప్పటికీ ఆతడు ధన్యుడే. ఒక్క నిమిషం కాలం స్వస్వరూపం అవధరించినప్పటికీ, అట్టివాడు యుక్తచిత్తుడేనని చెప్పబడుచున్నాడు. అతనికిక జన్మమృత్యుజరావ్యాధులుండవు. ఆతడు ఈ దేహము నుండి తన స్వరూపమును విభేదపరచి గాంచగలడు. ఆయా అనివార్య యథాప్రాప్త కార్యక్రమములు అతనిని సంతాపమొనర్చజాలవు.

శ్రీరాముడు: మహర్షీ! మీరు 'సత్తా సామాన్యము' గురించి చెబుతూ వస్తున్నారు కదా! అట్టి సత్తా సామాన్యము... 1. ఈ మనస్సు, బుద్ధి, అహంకారాది సమస్తము లీనమైనట్టి నిర్విశేష రూపమని మీ ఉద్దేశమా?... లేక, 2. మనోబుద్ధ్యహంకారాలు ఉండియే ఉన్నట్టి సవిశేషరూపమా?

ఎందుకంటే... మనోబుద్ధ్యహంకారాలు లేకపోతే దానిని వర్ణించటమెట్లా? నిర్ణయించటమెట్లా? మనోబుద్ధ్యహంకారాలు ఉన్నంత వరకు దుఃఖం తొలగదు కదా! అవే కదా సంసారానికి మూలం?

శ్రీవసిష్ఠ మహర్షి: ఓ రామచంద్రా! మనం అనేక విశేషాలు చర్చించుకున్న తరువాత మరల ఈ ప్రశ్నకు వచ్చామేమిటి?

అయినా కూడా ...ప్రశ్న ఉచితమే. చెబుతాను. విను.

❖

ఏది సమస్త జీవులందూ, ఈశ్వర భావమునందు, ముక్తియందు కూడా అనుగతమై వ్యాపించి ఉన్నదో... ఏదైతే సమస్త దేహములలోనూ తినుట, త్రాగుట, గ్రహించుట మొదలగు సమస్త వ్యవహారములను కావించుచున్నదో... ఏదైతే సుషుప్తి – ప్రళయములందు సమస్తమును తనయందే లయం చేసుకుంటోందో... ఏది తురీయపదమునందు సమస్త విషయములను త్యజించినదై సర్వమునకు అతీతమై ప్రకాశించుచున్నదో... ఏది నీ యొక్క, నాయొక్క, సర్వుల యొక్క వాస్తవ స్వస్వరూపమేఅయిన్నదో...

...అద్దానిని 'బ్రహ్మము, సత్తాసామాన్యము' అని కూడా అంటున్నాం. మన ఈ సంవాదము యొక్క ఉపలక్షితము, చర్చనీయాంశము అదే.

అది సర్వవ్యాపి. ఆద్యంతరహితము. ఒక స్త్రీ కంఠాభరణం తన మెడలోనే ఉంచుకొని ఆ విషయం మరచి తన కంఠం తప్ప మిగతా చోట్లంతా ఆ ఆభరణంకోసం వెతుకుచున్నట్లు ఈ జీవుడు ఆ ఆనందమయతత్త్వమును తనయందే ఉంచుకొని ఆ విషయం తెలియక ఎక్కడెక్కడో వెతుకుచున్నాడు. 'అది నీయందే నీ స్వరూపంగా ఇక్కడే ఉన్నదయ్యా' అని శాస్త్రకారులు గుర్తు చేస్తు న్నారు. వేదాంత వాఙ్మయమంతా జీవునకు ఆతని "అప్రమేయ, అనంత, నిర్వికల్ప, అఖండ, వాస్తవ స్వభావ, తత్త్వములను" నిరూపిస్తూ చూపటానికే ఇంతటి విస్తారంగా రచించబడినదై ఉంటోంది.

అట్టి వాస్తవ స్వస్వరూపమే కారణ కారణం అయినప్పటికీ అక్కడ 'సవిశేషమా? నిర్విశేషమా?' అనే మీమాంస ఉండదు. ఈ విశేషములు ఇట్లే ఉండగా అది అట్లే ఉంటోంది. కాబట్టి ఒకటి తరువాత మరొకటి, ఒకటి లేనప్పుడు మరొకటి... అను భ్రమ త్యజించు.

'ఆ ఆత్మవస్తువు ఇట్టిది' అని నిర్ణయించటానికి ఈ మాటలు, సంజ్ఞలు సరిపోవు. అయినా శిష్యునికి అది చూపుచూ మేం మా పరిమితమగు ప్రవచనాశైలితో వర్ణించి చెప్పుచున్నాం.

ఆత్మస్తోత్రం - ఆ అనంతాత్మ...

ఆకాశమునందు ఆకాశముగాను, శబ్దము నందు శబ్దరూపంగాను, చర్మేంద్రియమునందు స్పర్శరూపంగాను, ఘ్రాణేంద్రియమునందు గంధ రూపంగాను ...ప్రకటితమౌతోంది.

ఆ ఆత్మయే శరీరమునందు శరీరత్వంగా భూమియందు భూసారత్వంగాను, జలమందు రసత్వంగాను, వాయువు నందు వాయుత్వంగాను, తేజము నందు తేజో రూపంగాను, బుద్ధియందు బుద్ధి రూపంగాను, మనస్సునందు మనో రూపంగాను, అహంకారమునందు అహంకార రూపంగాను, సంవిత్ నందు సంవిద్రూపంగాను, చిత్తము నందు చిత్త రూపంగాను, చతుర్విధ ప్రాణులందు చేతన రూపంగాను, దేవతలందు దేవతా రూపంగాను, మనుష్యులందు మనుష్య రూపంగాను, క్రిమికీటకాదులందు కీటక రూపంగాను, యుగ-సంవత్సరములందు కాల రూపంగాను, క్రియాదులందు క్రియా రూపంగాను, నియతి యందు నియమిత రూపంగాను, స్థితియందు స్థిర రూపంగాను, నశించే వస్తువులందు నాశన రూపంగానూ... ప్రకటితమౌతోంది

బాల్యంలో బాల్యరూపంగాను, యౌవనంలో యౌవనరూపంగాను, వార్ధక్యంలో వృద్ధ రూపంగాను, మరణమునందు మృత్యు రూపంగాను... ఆ పరమాత్మయే స్థితి కలిగి ఉన్నాడు.

❖

సముద్రంలోని తరంగాలు జలముకంటే వేరా? ఈ సమస్త పదార్థములు ఆ పరమేశ్వరునికి భిన్నమైనవి కావు. అయితే, ఈ పదార్థములలో ఏ అనేకత్వము గోచరిస్తోందో... అదంతా అసత్యమే అయియున్నది. దృష్టాంతానికి ఒక్కొక్కడు చూచేది ఒక్కొక్క విశేషం అయినప్పటికీ, అందరిలోని 'చూపు' ఒక్కటేకదా! చూపు - స్పర్శ - రుచి మొదలైనవి వేరువేరైనప్పటికీ అనుభవములన్నిటి యొక్క అర్థప్రదాత అనుభవస్వరూపుడు అగు దేహి ఒక్కడే కదా!

పిల్లవాడు కొరివిదయ్యమును కల్పన చేసుకుంటున్నట్లు సత్యమగు చిత్‌స్వభావమే ఈ జగత్తుయొక్క కల్పన గావించుచున్నది.

మహాత్ముడగు ఓ రామచంద్రా! 'ఈ అనుభవమయ్యేదంతా చిద్రూపుడనగు నేనే. నేనే లీలా మాత్రంగా ఇదంతా వ్యాపించి ఉన్నాను'... అను నిశ్చయముతో కూడుకున్నవాడవై ఉండుము. శాంత చిత్తుడవగుము. స్వమహిమయందు వర్తించుము. నీ స్వసంకల్పమహిమవలననే ఏదేది ఎట్లెట్లు తోచుచున్నదో... అట్లట్లు నీయొక్క సత్త ప్రకటనమగుచున్నదని గ్రహించు.

❖

సాయం సమయమైనది. 15వ రోజు సంవాదము ముగించబడింది. శాంతి ప్రవచనములు ప్రవచించబడ్డాయి. సభికులంతా తమ యొక్క నిత్య - అనిత్య కల్పిత-వాస్తవ స్వరూప విభాగములను వివేకదృష్టిచే పరికించటం గురించి చింతన చేస్తూ గృహోన్ముఖులయ్యారు.

దశరథుడు, రామచంద్రుడు, మంత్రివరేణ్యులు, తదితర రాజ పరివారం ఆ సంవాద శ్రవణము నకు వేంచేసిన ముఖ్యులందరి వసతి - అతిథి మర్యాదలను పర్యవేక్షించటంలో నిమగ్నులయ్యారు.

అయోధ్యా ప్రజలు తమ ప్రియరాజకుమారుడు రామచంద్రుని నిమిత్తంగా తమకు లభించిన జన్మజన్మల ప్రయోజనమైన శ్రీ వసిష్ఠ - శ్రీరామ సంవాదము గురించి చెప్పుకుంటూ ఆనందిస్తున్నారు. ఆ మరునాడు (16వ రోజు) జరుగబోయే చర్చనీయాంశముల గురించి తమకు తోచిన విధంగా

సంభాషించుకోసాగారు. సుదీర్ఘకాలం వర్షాలు లేక నిస్సత్తువగా ఆకాశంవైపు దృష్టి సారించుచూ ఎదురు చూచే వన్యజీవులు ఒక్కసారి తొలకరి వాన కురియగానే ఎంతటి సంరంభంగా ఉంటాయి? అయోధ్యారాజ్యంలోని ప్రజలు అంతటి సందడిగా కన్పట్టసాగారు.

❖❖❖

(పదిహేనవ రోజు విచారణ పూర్తి అయింది)

❖❖❖

VI. జీవుడు - స్వప్నపరంపరలు

1 స్వప్నసదృశ సిద్ధాంతం

శ్రీరాముడు: మునీంద్రా! ఈ పాంచభౌతిక సృష్టి అతి చమత్కారంగా తాండవిస్తోంది. ఇదంతా ఒకానొక మహత్తర సంకల్పము అని అనక తప్పదు. అట్టి చమత్కార సృష్టి రచనా వ్యవహారంలో రెండు రకాల సంకల్పాలు గోచరిస్తున్నాయి.

1. వ్యష్టి సంకల్పం - ఇందు 'జీవులు' అనబడు వ్యష్టి సంకల్పులు ఉపాధి సహితులై ప్రవేశిస్తున్నారు, నిష్క్రమిస్తున్నారు.

2. సమష్టి సంకల్పం - ఒకానొక సమష్టితత్త్వము ఇక్కడ ఏర్పడి ఉండి, జీవుల ఉపాధులకు ప్రేరణ, సంరక్షణ, సంచారం, కాలం, ఆహారం, సంక్షయం – వంటి కార్యక్రమములకు కారణమగుచూ వ్యవహరిస్తోంది. అట్టి సమష్టితత్త్వమునకు రచయిత అయిన సమష్టి జీవుని 'హిరణ్యగర్భుడు' అని కొన్ని శాస్త్రములు వర్ణిస్తున్నాయి.

'సమష్టి జీవుడగు హిరణ్యగర్భుని స్వప్నమే ఇదంతా!' – అని ప్రతిపాదించే శాస్త్రాల విషయమై మీ అభిప్రాయములు తెలియజేయ ప్రార్థన. వేదాంత వాఙ్మయంలో ప్రసిద్ధమైయున్న 'స్వప్నసదృశ సిద్ధాంతం' గురించి వివరించమనవి.

శ్రీవసిష్ఠ మహర్షి: "పూర్వకల్పంలో సమష్టి సంకల్పుడగు హిరణ్యగర్భుని స్వప్నమే ఈ వర్తమాన జగత్తు. అతని వాసనల ప్రకటనమే ఈ ప్రపంచం" అనే ఒకానొక సిద్ధాంతం లోక ప్రచారమైయున్నది. ఈ సిద్ధాంతము ననుసరించి "ఆ హిరణ్యగర్భుడు (సమష్టి స్వప్నమాత్ర జగత్తుకు కర్త) అజ్ఞానదశ యందు ఉన్నప్పుడు ఈ జగత్ రచన నిర్వర్తించినాడు. సమష్టి స్వప్నకర్త ఆ స్వప్నమునుండి ముక్తి నొందినాడు. అందుచేత ఈ జగత్తు వాస్తవానికి లేదు" అని సిద్ధాంతీకరించబడుతోంది. దీనిననుసరించి 'ఈ జగత్తు స్వప్నసదృశం మాత్రమే. సమష్టి జీవుడగు హిరణ్యగర్భుని స్వప్నంలో తదనుకూలమైన భ్రమ సమన్వితులగు జీవులు స్వప్న సదృశంగా ఇందులో ప్రవేశించి, సంచరించి, మరొకప్పుడు బహిర్గతులగుచున్నారు. – అని సిద్ధాంతీకరించబడుతోంది. ఆ సిద్ధాంతమును అనుసరించి కూడా 'ఈ జగత్తు వాస్తవానికి లేదు' అనియే నిరూపించబడుతోంది కదా!

చైతన్యము సర్వవ్యాపకమైనది. అట్లా అయి కూడా అయ్యది ఇట్లు సమష్టి జీవునిగా, అటు వ్యష్టి జీవునిగా వ్యవహారము రచించుకుంటోంది. తాను వ్యాపించి, అట్లు వ్యాపించినచోట దృశ్యమును

పరికల్పించుకుని తన చుట్టూ ఈ దీర్ఘ సంసారమును అనుభవిస్తోంది. ఈ సంసారము "సమ్యక్ దర్శనము" అను దివ్యౌషధముచే మాత్రమే తొలగగలదు. అజ్ఞాన కారణంగా ఏర్పడిన అసమ్యక్ దర్శనం, లేక సంసారం, విజ్ఞాన కారణంగా తప్పక తొలగగలదు. "ఇక్కడెక్కడా అనేకమనేది లేదు. ఏకత్వమే ఇందలి సత్యం" అను జ్ఞాన ప్రాప్తిచే నిద్రలేచిన వాని స్వప్నంలాగా 'సంసారము' అనబడు దృశ్యపరిమితానుభవం తనంతట తానే పలాయనం చిత్తగిస్తుంది.

"సమష్టి సంకల్పస్వరూపుడు తత్త్వజ్ఞానలాభం పొంది ఉండటం చేత ఈ ప్రపంచం గడచిపోయిన స్వప్నం వంటిది" – అనునది స్వప్నసదృశ సిద్ధాంత సారం.

అందుచేత ఈ జగత్తు ఇప్పటికే గడచిపోయిన ఒక స్వప్న కథనం వలె, ఊహాకల్పిత భావావేశంతో కూడిన సంఘటనానుభవం వలె ద్రష్ట యొక్క స్వయంకల్పితానుభవం. నాశనమాత్రం, సారహీనం అని గ్రహించు. ఇది దర్పణాంతర్గతమైన ప్రతిబింబంలాగా వ్యష్టి–సమష్టి జీవుల సత్స్వరూపం నందు ప్రతిబింబిస్తోంది.

జరిగిపోయిన స్వప్నం - 'ఇదంతా సమష్టి జీవుని గతించిపోయిన స్వప్నం మాత్రమే' అనునది ఒక సిద్ధాంతమని అనుకున్నాం కదా! అట్టి స్వప్నం నుండి సమష్టి జీవుడగు హిరణ్యగర్భుడు (బ్రహ్మదేవుడు – సమష్టి ఇచ్ఛకు ప్రదాత) సృష్టి స్వప్నం నుండి నిదుర లేచినప్పటికీ, అజ్ఞానముచే ఉదయించిన వ్యక్తిగతాభిమాన రూపమైన "అహం" ఇందు ప్రవేశించి ఇక్కడ కల్పనను కొనసాగిస్తోంది. చమత్కారంగా ఇదంతా స్వప్న సదృశంగా కాకుండా దృఢమైన సత్యం వలె పొందటం జరుగుతోంది. కనుక దృశ్య ప్రపంచం యొక్క నిర్వచనం 'ద్రష్ట యొక్క అజ్ఞాన కారణమైన అపరిపక్వ, పరిమిత దృష్టియే.'

శ్రీరాముడు: మహర్షీ! ఈ జగత్తు 'హిరణ్యగర్భుడు' అనబడే సమష్టి ఇచ్ఛారచయిత యొక్క స్వప్నం మాత్రమేనని సెలవిచ్చారు. అట్టి సమష్టి సంకల్పుడు అజ్ఞానమనే స్వప్నం నుండి ఇతఃపూర్వమే నిదుర లేచాడని కూడా చెప్పారు.

ఒకడు నిదురలో స్వప్నం గాంచుచున్నాడనుకోండి. అతడు నిదుర లేవగానే ఆ స్వప్నం కూడా ముగించబడుతుంది. ఒకని యొక్క గతించిన స్వప్నంలో మరొకరు ప్రవేశించటమనేది, దానిని కొనసాగించటమనేది చాలా ఊహాతీత విషయాలు. యుక్తియుక్తం అని అనిపించదు. హిరణ్యగర్భుని అజ్ఞానం తొలగగానే అతని స్వప్నమాత్రమైన ఈ సమష్టి జగత్తు కూడా వైదొలగాలి గదా! ఇది ఎందుకు వినాశనమొందటం లేదు?

శ్రీవసిష్ఠ మహర్షి: స్వప్నము అత్యంత క్షణికమైనది. అయితే ఆ స్వప్న ద్రష్ట యొక్క భోగదృష్టిని అనుసరించి అది ఆ స్వప్న ద్రష్టకు సుదీర్ఘంగా అనుభవమౌతోంది.

ఈ సమష్టి సృష్టి కూడా 'భోగము' అనే వ్యసనం లేక ప్రతిబంధకాన్ని ఆధారంగా చేసుకుని కొనసాగుతోంది. సర్వేసర్వత్రా ప్రసరించుచున్న చైతన్యం సమష్టి జీవునిగా ఒక వైపు కల్పనను ప్రారంభించి వ్యష్టి జీవునిగా మరొకవైపు అనుభవపరంపరను కొనసాగిస్తోంది. ప్రతిభాసవంటి సమష్టి జీవుని జగత్స్వప్నమున జీవజగత్తులు తోచుచు అనంత ప్రవాహరూపమున వెలయుచున్నాయి.

ఒకనికి కలలో కనిపించేవన్నీ అంతర్గత భావతరంగాలే కదా! భోగాభిలాషతో కూడిన అంతర్గత భావతరంగాలే జగత్తు యొక్క అనుభవముల రూపమున సమష్టి – వ్యష్టి ద్రష్టలకు ఇద్దరికీ ఘనీభూతమై ఇట్లు ప్రాప్తిస్తున్నాయి.

❖

బీజం ఎటువంటిదైతే చెట్టుకూడా అట్టిదే అవుతుంది కదా! స్వప్న పురుషుని వంటి హిరణ్యగర్భుని (ప్రజాపతి) యొక్క స్వప్నమాత్రమైన ఈ జగత్తు కూడా స్వప్నము వంటిదే. అసత్యమగు మనః సంకల్పము ద్వారా గాంచబడేదంతా అసత్యమే అవుతుంది కదా! ఈ ప్రపంచానుభవం అసత్యమైనదే! ఇక్కడ కల్పన అను ఊహా సంబంధమైన మనో వికారం నిశ్చల స్వస్వరూపం నుండే నిశ్చలజలంలో ఆవిర్భవిస్తోంది. ఇది నిశ్చల నిరాకారజలంలో చిన్న గులకరాయిని వదలినప్పుడు ఏర్పడే చంచల ఆవృత్తముల వంటిది. అదియే జగత్తు యొక్క ఉత్పత్తి. అంతేగానీ కేవలం పంచభూతాల కలయిక మొదలైనవి జగదుత్పత్తి కాదు. ఆ విధంగా ఏర్పడిన కల్పన జన్మ జన్మాంతరాలుగా, స్వర్గ నరకాదులుగా విస్తారం పొందుతోంది. అట్టి దృశ్య వ్యవహారం నందు సత్యత్వబుద్ధి ఉంచవలసిన అవసరమే లేదు.

ఎవరికైనా సరే, ఈ జగత్తు పట్ల పాతుకుపోయి ఉన్న 'ఇది సత్యమే' అను రూపంలో ఏర్పడిన బుద్ధి (లేక) అవగాహన అయుక్తం మాత్రమే. అట్టి భ్రమాత్మకమైన నమ్మికను ఎంత త్వరగా త్యజిస్తే అంత మంచిది.

కల్పము - సమష్టి జీవుడగు ప్రజాపతి ఒక్క నిమిషంలో గాంచిన త్రిజగత్ స్వప్నం అత్యంత దీర్ఘమై 'కల్పము' అను శాస్త్రీయనామంచే చెప్పబడుతోంది. ఈ జీవులంతా చూచుచున్నది 'సృష్టి' అనబడు ఆ క్షణకాల స్వప్నాన్నే! చిత్ యొక్క కల్పనలగు ఈ దృశ్య సమూహాలు నీటి యందు అలల లాగా అనుక్షణం లేచి, లయమౌతున్నాయి. ఈ 'కల్పములు – సృష్టులు – స్వర్గములు' అను పేర్లతో చెప్పబడే దృశ్యపరంపరా వ్యవహారములు సత్యము కానే కాదని గుర్తు చేస్తున్నాను.

ఈ దృశ్య ప్రపంచం మిథ్యయేనని గ్రహించు. ఈ జీవులు తమయొక్క సంకల్పముల ద్వారా (లేదా) 'అంతరంగం నందు కల్పించుకొనిన సమాలోచనలు / భావనాతరంగాలు' అను వాహనం అధిరోహించి ఇద్దాని యందు ప్రవేశించి ఇదంతా వాస్తవమేనని, ఇక్కడ సుఖదుఃఖాలు కలవని ఎంతో నమ్మకం పెంపొందించుకుని వ్యవహరిస్తున్నారు. స్వర్గ నరకాదుల అనుభవం పొందుచున్నారు. క్షణక్షణం మారిపోతూ ఉండే ఈ జగత్తు 'ఇది శాశ్వతం – విస్తారం – సత్యం – అనుసరణీయం – దాటుటకు అశక్యం ...అని గమ్మత్తుగా అనిపించటమే ఇక్కడి చమత్కారం. ఒక స్వప్నం తరువాత మరొక స్వప్నం ఏర్పడుతూ ఉన్నప్పటికి స్వప్న ద్రష్ట ప్రతిస్వప్నమునూ తనయొక్క పరిమితముగా, అది మాత్రమే వాస్తవమైనట్లు గాంచుతూ ఉంటాడు కదా! ఈ జీవుని బాల్య–యౌవన–వార్ధక్యదశలు, సుఖ–దుఃఖ సంఘటనలు, జన్మ–మృత్యు–జన్మాంతరములు ఎప్పటికప్పుడు క్షణికమే అయినప్పటికీ "నేను బాలుడను – నేను యువకుణ్ణి – నేను ముసలివాడను – నేను సుఖిని – నేను దుఃఖిని – నేను పుట్టుచున్నాను – నేను చచ్చుచున్నాను" అను ఎంతో ఘనీభూతమైన వర్తమానానుభవ భ్రమకు

లోను అవుచున్నాడు. ఈ జగద్విషయములన్నీ కాల ప్రవాహంచే ఎటకో అనుక్షణం కొట్టుకుపోబడు చున్నాయని ఎవరికి తెలియదు? అయినా కూడా ఈ జీవుల సుఖదుఃఖములకు అంతు కనబడుతోందా? ఇక్కడ హిరణ్యగర్భుని స్వప్నం, జీవుని వ్యక్తిగతమైన స్వప్నం – ఒకచోటికి వచ్చి కాపురం చేస్తున్నాయి. ఇక చూడు, చమత్కారం! ఇదంతా సంసారసాగరం – అనంత దుఃఖమయం – విధి వైపరీత్యం – విధి చిద్విలాసం – అధిగమించుటకు అసాధ్యం అను రూపం గల అనేక సమ్మిళితాలతో కూడి అనుభవ పరంపరలు ఎదురుగా ఏర్పడి ఉంటున్నాయి.

శ్రీరాముడు: ఎందుచేత అట్లా ఏర్పడుతోంది?

శ్రీవసిష్ఠ మహర్షి: ఎందుచేత అని ఏమున్నది? ఏది ఎట్లా గాంచబడితే అది అట్లే ఉండటం అనేది ఆత్మకు గల ఒకానొక శక్తి. అట్టి శక్తి భ్రమతో కూడి ప్రవర్తిస్తున్నప్పుడు సృష్టి సంభవిస్తోంది. భ్రమ వల్ల సంభవం కానిదేమున్నది? అయితే... స్వప్నంలో అప్పటి భ్రమ అప్పటికి సత్యమే అయినప్పటికీ ఆ స్వప్నం మెళుకువ వచ్చిన తరువాత వ్యవహారయోగ్యం కాగలదా? భ్రమలకు చెందిన జీవుడు వాటితో కూడా తమకము పొందుచున్నాడు. అట్లే ఈ జగత్తు కూడా!

ఈ సృష్టి, దీని కర్తయగు ప్రజాపతితో కూడా... ప్రళయం పొందిన మరుక్షణం... ఆత్మవస్తువు ఒక్కటే శేషించి ఉంటుంది. దృష్టి లయమొందినప్పుడు ఇక శేషించేది ద్రష్ట మాత్రమే కదా! విషయ రహితమగు ద్రష్టయే సత్ – చిత్ – ఆనందస్వరూపుడగు పరమాత్మయొక్క నిర్వచనం. ఆత్మస్వరూపుడగు పరమాత్మ ప్రతిఒక్క జీవుని స్వస్వరూపుడై ఎట్టఎదుట నిలచియే ఉండగా ...అజ్ఞాన జీవులు ఎక్కడెక్కడో వెతకుచున్నారు.

అజ్ఞానము వలననే భూత భవిష్యత్ వర్తమానములందు త్రిలోకములలో చిత్రవిచిత్రాలైనవన్నీ తోచుచున్నాయి. చైతన్యము వాస్తవానికి నిర్విషయమైనది. నిర్విషయము – సర్వము అగు ద్రష్టయందు ఎందుకో ఆశ్చర్యంగా ఈ త్రికాల, త్రిజగద్విషయాలు ప్రదర్శనమగుచున్నాయి. ఈ ప్రపంచంలోనూ, ఈ మనస్సులోనూ చమత్కారాలకు లోటు ఏమున్నది? అయితే నీటిలో నిప్పు ఉంటుందా?

శ్రీరాముడు: ఉండదు కదా!

శ్రీవసిష్ఠ మహర్షి: అయితే ఏం? సముద్ర జలంలోంచి బడబాగ్ని బయలుదేరుతోంది. శూన్యంగా మానవులకు కనబడే ఆకాశంలో విమాన విహారులగు దేవతలకు ఆశ్రయమైన స్వర్గ – మహర్ మొదలైన లోకాలు విస్తరించి ఉన్నాయి. మృత్తికారహితమైన (మట్టి ఏమాత్రం లేనట్టి) కొండ శిఖరంపై మహావృక్షాలు వెల్లివిరుస్తున్నాయి. నిస్సారమగు ఒక గండశిల దేవతా విగ్రహంగా మలచబడగా, ఆ విగ్రహం భక్తులచే పూజింపబడి మహత్తరమైన ప్రయోజనాలు ప్రసాదిస్తోంది. శిలలో ప్రాణులు జీవిస్తున్నాయి. రాతిలో కప్ప బ్రతుకుతోంది కదా! ఒక శిలనుండి నీరు ప్రవహించి అది పొడవైన జీవనదిగా పరిణమిస్తోంది. కొద్ది నిమిషముల నిద్రాసమయంలో సుదీర్ఘమైన కాల వ్యవహారం స్వప్న ద్రష్ట పొందుచున్నాడు. కల్ప వృక్షం – మణి వంటి జడవస్తువులు ఆరాధకులకు పుంఖానుపుంఖములైన ప్రయోజనములను వరంగా ప్రసాదిస్తున్నాయి. ఒకడు స్వప్నంలో తాను

చచ్చినట్లు, తన బంధువుల రోదనను వినుచున్నట్లు పరస్పర వ్యతిరిక్త విషయములను గాంచుచున్నాడు. ఆకస్మికంగా గంగ ఉద్భవించి పాతాళం జేరటం లేదా? జీవుని ప్రయత్నం లేకుండానే ఆ జీవుని పొట్టలో ప్రవేశించిన ఆహారం పచనమై శక్తిరూపం దాలుస్తోంది. పెద్ద పర్వతములు జడమై ఉండి కూడా రెక్కలు దాల్చి గాలిలో లేచి జనావాసంపై వ్రాలి సర్వనాశనం చేస్తున్నాయి. చింతించుచూ ఉండగా కొన్ని కోరికలు ఫలిస్తున్నాయి. మరికొన్ని కోరికలు ఎంత చింతిస్తున్నా ఫలించటమే లేదు. 'నా బాల్యం, నా యౌవనం ఇట్లాగే ఉండుగాక!" అని కోరుకుంటే అది ఫలిస్తోందా! లేదు. యంత్ర నిర్మితమగు జడవస్తువులు స్వయంనిర్ణయాధికారంతో కర్మలు నిర్వర్విస్తున్నాయి. అతి పెద్దవగు గ్రహాలు, నక్షత్రాలు, ఉపగ్రహాలు భూమిమీద నుండి చూస్తున్నప్పుడు మిణుకుమిణుకుమంటా అతి చిన్నవై కనిపిస్తున్నాయి. ఇంద్రజాల – గంధర్వ విద్య ప్రదర్శనం చూస్తున్నప్పుడు అదంతా నిజమేనని భ్రమ కలిగి అనుభూతులన్నీ ఏర్పడుచున్నాయి. కల్పితమగు ఆకాశమున విస్తార జీవ – జగత్ అనుభవాలు కనిపిస్తున్నాయి. యంత్ర–ఓషధాల ప్రయోగాల వల్ల ఆశ్చర్యకర ప్రయోజనాలు కలుగు చున్నాయి. భయము నుండి మదము ఉద్భవిస్తోంది.

ఈ విధంగా ఈ జగత్తులో చిత్ర విచిత్రములకు లోటేమున్నది? అందుకే భ్రమలో సంభవం కానిదేమున్నదని మనం అనుకున్నాం కదా! (అఘటనా ఘటనాపటీయసీ మాయా – అని అంటారు కదా!) ఈ జగత్తు గురించి "దీని నుండి నేను తప్పించుకోలేను" – అని ఒక సమయంలో అనిపిస్తున్నప్పటికీ జ్ఞానం లభించినప్పుడు 'ఇది అర్థరహితం. కనుక ప్రతిబంధకమయ్యే శక్తి దీనికి లేదు'... అనునది కూడా అనుభవం కాగలదు. అప్పుడీ జీవునికి స్వస్వరూపము నందు పరమవిశ్రాంతి లభించగలదు. ఇక ఈ ఉపాధులంటావా... జ్ఞానుల దృష్టిలో వీటి రాకపోకలు, తదితర వ్యవహారాలు తాము గాంచే ప్రశాంత స్థితికి ప్రతిబంధకమే కాదు.

రసావేశం దృష్ట్యా ఈ జగత్తు భ్రమ మాత్రమే. బ్రహ్మ రూపం దృష్ట్యా ఇక్కడ అసత్యమేదీ లేదు. జగత్ రూపంలో వీక్షిస్తే ఇక్కడ సత్యమేదీ లేదు.

ఈ విధంగా ఈ సృష్టి స్వప్నమున అన్నియు, అంతటా సంభవములే అయి, అట్లట్లు గాంచ బడుచున్నాయి. సృష్టిస్వప్నమునందు ముగ్ధుడగుచున్న జీవుడు ఇదంతా యథార్థమని, ఇది ఇట్లే ఉండబోతోందని భావించుచున్నాడు. ఒక భ్రమ తరువాత వెనువెంటనే మరొక భ్రమ చోటు చేసు కోవటం జరుగుతోంది. 'ఇదంతా అత్యంత స్థిరం' అను స్థిరబుద్ధిని ఆశ్రయించుట చేతనే జీవుడు మోహం చెందుచున్నాడు. లేడి పచ్చిక మేసే ప్రయత్నంలో ఒక గోతిలోంచి బయటబడి మరోగోతిలో పడుచున్నట్లు ఈ జీవుడు సంసారము మీద గల నమ్మికతో ఒక దేహంలోంచి మరొక దేహంలో ప్రవేశిస్తూ దేశ ద్రిమ్మరిలా సంచరిస్తున్నాడు.

❖❖❖

2. స్వప్నంలో ఇంకొక స్వప్నం

శ్రీవసిష్ఠ మహర్షి: ఓ రామచంద్రా! ఈ జీవుడు ఒకటి తరువాత మరొకటిగా అనేక స్వప్నములను గాంచుచున్నాడు. అనేకచోట్ల వేర్వేరు భ్రమలను ఒకేసారి కూడా పొందుచున్నాడు. "స్వప్నంలో ఇంకొక స్వప్నం, ఆ స్వప్నంలో మరొక స్వప్నం" – ఈ విధంగా స్వప్న–స్వప్నాంతర్గత పరంపరలను గాంచు చున్నాడు. ఈ విషయం నిరూపిస్తూ ... 'జీవట స్వప్నదేహపరంపరలు' అని పేరుతోనూ, 'శతరుద్రీయం' అనే ఒకానొక విశేషం నా దృష్టిపథంలో మెరుస్తోంది. ఆ వృత్తాంతం ఇప్పుడు చెబుతాను... విను.

❖

ఒకానొక సుదూర ప్రాంతంలో 'జీవటుడు' అనే పేరుగల గొప్ప సాధకుడొకడు ఉన్నాడు. అతడు జన్మతః గొప్ప విజ్ఞాని. బాల్యంలోనే గృహమును త్యజించి సన్న్యాసాశ్రమం స్వీకరించాడు. భిక్షాటనంతో దేశసంచారం చేస్తూ ఉండేవాడు. ఆ పరివ్రాజకుడు ఒక ప్రక్క దేశాటనం చేస్తూనే తన తీవ్రమైన సాధన కొనసాగిస్తూ ఉండేవాడు. క్రమంగా శాంతి, ఓర్పు, వైరాగ్యం, తపస్సు, శాస్త్ర పరిజ్ఞానం అతనిని ఆశ్రయించాయి. ఆత్మజ్ఞానంతో ఆతని స్వరూప–స్వభావాలు పరమప్రశాంతత్వము సంతరించుకున్నాయి.

అతడు ఒకసారి తనను ఆశ్రయించిన కొద్దిమంది శిష్యులతో ఒక గ్రామప్రాంతం చేరాడు. అక్కడి ప్రశాంత వాతావరణం అతనికి ఎంతో నచ్చింది. ఆ గ్రామంలోని నివాసిత ప్రాంతానికి కొంత దూరంలో ఒక పాడుబడిన ఇల్లు కనిపించింది. ఒకటి రెండు రోజులలో శిష్యుల సహాయంతో దానిని ఒక ఆశ్రమంగా తీర్చిదిద్దాడు. అక్కడే కొన్ని రోజులు నిరంతర సమాధిని అభ్యసించాడు. క్రమంగా అతని యందు సాంసారిక వాసనలన్నీ వైదొలగాయి. చిత్తము శుద్ధము అతి పవిత్రము అయింది. సత్య సంకల్ప సమన్వితం అయింది. అనగా, చిత్తము పరిశుద్ధం పొంది, తద్వారా ఏది ఎట్లు సంకల్పిస్తే అది అట్లే సంభవమవగల సంకల్ప సిద్ధిత్వం పొందింది. ఇక అతని చిత్తము మౌనము – సర్వత్వము – చంచలరాహిత్యము – గుణాతీతత్వము వహించి ఉంటోంది.

ఒకరోజు అతడు యథారీతిగా ఆసనము ధరించి సమాధిని అభ్యసిస్తున్నాడు. ప్రశాంతజలంలో తరంగం ఉద్భవించినట్లు అతని అంతరంగంలో "నిర్విషయమగు ఆత్మయందు ఈ కార్యకారణవ్యవస్థ యొక్క చమత్కారమంతా ఏమిటి?" అను రూపంలో ఒక జిజ్ఞాస ఉద్భవించింది. "ఈ జగత్తంతా ఒక లీలయే కదా! కేవలం వినోదార్థం అధ్యాత్మశాస్త్రజ్ఞులు కూడా కలిగియుండే ఒకానొక చిత్తవృత్తిని అవలంబించి కొద్దిసేపు ఈ జగత్ చమత్కారం చూచి రావాలి"... అని అనుకున్నాడు. అట్టి సంకల్పం ఉత్పత్తి అయి రూపం దిద్దుకుని, బలపడగానే ఆతడు కనులు మూసుకున్నాడు. ఇంతవరకూ అతనికి అనుభవమగుచున్న ఆత్మధర్మమును కొంచెం ఏమరచి చిత్తధర్మమును ఆశ్రయించాడు. అంతవరకూ ఒక క్రమముగా పారుచున్న జలం తన క్రమము కోల్పోయి అకస్మాత్తుగా సుడులు పొందుతుంది చూచావా? అట్లా ఇంతవరకూ నామ–రూప–గుణ అతీతత్వమును వహించిన అతని మనస్సు

నామ-రూప-గుణ సహితత్వమును ఆశ్రయించింది. అంతే! ఇక యతిధర్మమును కోల్పోయి, ధర్మరహితుడగు ఒక అజ్ఞాని యొక్క స్వభావ - సంకల్పములను లీలగా అవధరించాడు.

'నేను' జీవటుడు అనే పేరుగల ఒక మానవుణ్ణి కదా! - అని అనుకోసాగాడు. నిరవయవము అపరిమితము అగు స్వభావము నుండి చ్యుతుడై కేళీవినోదంగా హస్త-పాద పరిమితమైన దేహస్వభావం ఆశ్రయించాడు. భిక్షకుని రూపంలో అతని భౌతికదేహము - సమాధి యథాతథంగా ఉండగానే అతని చిత్తము మరొక జీవ-పాంచభౌతిక దేహం కల్పించుకుని అక్కడి నుండి బయలుదేరింది.

'ఊళ్ళో విశేషాలేమిటో చూచివద్దాం' అని తలచిన అతని చిత్తము నూతన జీవట ద్వితీయ దేహంతో ఊరిలో ప్రవేశించింది. ఆ ద్వితీయ జీవటుడు వీథులలో అటూ ఇటూ తిరుగుతూ ఉండగా ఒకచోట ఒక చెట్టు తొఱ్ఱలో ఒక తేనెతుట్టె కనిపించింది. ఒడుపుగా ఆ చెట్టు ఎక్కి తేనెతుట్టెను నేలకు దించాడు. ఆ తేనెపట్టులో గల తేనెను శుభ్రంగా త్రాగాడు. ఇక అక్కడి నుండి బయలుదేరాడు. అక్కడి వీథులలో సంచరించే జనులను ఆశ్రయించి కొన్ని డబ్బులు సంపాదించాడు. ఆ సమీపంలో గల ఒక కల్లు దుకాణంలో ప్రవేశించాడు. అక్కడి వారితో సరసాలు ఆడుతూ అర్ధరాత్రి వరకూ మత్తుగా త్రాగాడు. ఒక తాగుబోతు పాడుచున్న తత్త్వపు పాటలు విన్నాడు. అర్ధరాత్రి ఇక అక్కడి నుండి బయలు దేరి తూగుతూ ఒక ఇంటి అరుగుపై నిద్రకు ఉపక్రమించాడు. ఆ నిద్రలో అతను ఒక కలలో ప్రవేశించాడు. తనను ఒక పాఠ్య - అధ్యయనములతో కూడిన సత్కర్మపరుడగు బ్రాహ్మణ బాలకునిగా గాంచసాగాడు.

❖

ఆ బ్రాహ్మణ బాలకుడు బ్రాహ్మణగృహంలో ఉంటూ, తండ్రి దగ్గర సంధ్యావందనం, వేదాలు నేర్చుకుంటున్నాడు. చాలాకాలం తదితర విద్యార్థులతో కూడి అనేక శాస్త్ర విషయాలు నేర్చుకుంటు న్నాడు. క్రమంగా యుక్త వయస్సు వచ్చింది. వివాహం చేసుకుని పిల్లలను కన్నాడు. వారి కోసం అనేక శ్రమలకు ఓర్చి, ధనం సంపాదిస్తూ ఉండేవాడు. చాలా రోజులు గడిచాయి. ఒక రోజు నిత్య నైమిత్తిక కర్మలను విశేషపూజలను అర్ధరాత్రి వరకు ఇంటివద్దే నిర్వర్తించాడు. రాత్రి పొద్దుపోయింది. రోజంతా అలసి ఉన్న ఆ బ్రాహ్మణునికి ఆ రాత్రి రాజాశ్రయం గురించి యోచిస్తూ నడుం వాల్చగానే నిద్రపట్టింది. ఆ నిద్రలో తానొక సామంత రాజకుమారుడైనట్లు కలగాంచాడు.

❖

ఆ సామంతరాజ కుమారుడు బాల్యం నుండే ఎన్నో కష్టాలు పడవలసి వచ్చింది. అతనికి చెందవలసిన సింహాసనం ఆక్రమించటానికి అతని దాయాదులు ఎన్నో కుట్రలు పన్నారు. రాజభక్తులగు కొద్దిమంది మంత్రుల సమాలోచనల సహాయంతో అతడా కుయుక్తులన్నీ పటాపంచలు చేసి సింహాసనం అధిష్ఠించాడు. కొన్ని సంవత్సరాలు రాజ్యం ఏలాడు కూడా!

ఒక రోజు ఆ సామంతరాజు రోజూలాగానే రాచ కార్యములన్నీ ముగించుకుని అంతఃపురంలో ప్రవేశించాడు. ఆ మరునాడు తాను వరించిన చక్రవర్తి యొక్క రాజకుమార్తె స్వయంవరానికి వెళ్ళవలసి ఉన్నది. ఆ విషయమై మరునాటి ప్రయాణ సన్నాహాలకు ఆజ్ఞాపించాడు. ఆ రాత్రి

అంతఃపురంలో తీయటి ఆలోచనలలో నిమగ్నమయ్యాడు. అతనికి తెలియకుండానే ఎప్పుడో నిద్రలోకి జారుకున్నాడు. ఆ నిద్రలో అతడు ఒక చక్రవర్తి అయినట్లు కలగాంచాడు.

శ్రీరాముడు: ఆ జీవట భిక్షువు పరివ్రాజకుడై ఆ గృహంలోనే త్రాగుబోతుగా... త్రాగుబోతుగా ఉంటూనే జీవట బ్రాహ్మణుడుగా... జీవట బ్రాహ్మణుడుగా ఉంటూనే ఒక సామంతరాజుగా... సామంతరాజుగా ఉంటూనే ఒక చక్రవర్తిగా... కొనసాగుచున్నాడా? ఇదంతా ఎట్లా జరుగుతోంది?

శ్రీవసిష్ఠ మహర్షి: అవును. భిక్షకుడుగా ఆ గృహంలో ఉండియే త్రాగుబోతుగాను, తదితరులు గాను కొనసాగుచున్నాడు. ఎక్కడికక్కడ నిద్రకు ఉపక్రమించినప్పుడు మరొక నూతన స్వప్నంలో ప్రవేశించి కల్పిత ఉపాధులను అనుభవించుచున్నాడు. "ఇది ఎట్లా?" – అనే విషయాన్ని కొద్దిసేపు తరువాత చర్చిద్దాం. ఇప్పుడు చక్రవర్తి దాకా వచ్చాడు కదా!

❖

ఆ చక్రవర్తి చాలాకాలం నానావిధ భోగములు అనుభవించాడు. అనేక రాచకార్యములు చక్కబెట్టుచూ ఉన్నాడు. శత్రు – మిత్రులకు సముచితరీతిగా దండన – సత్కారములను నిర్వర్తించాడు. పట్టపురాణులతో విహరిస్తూ, సామంతరాజులను పరిపాలిస్తూ, మహాసామ్రాజ్యం ఏలాడు. అందమైన రాజపుత్రికలను నయానా, భయానా, తన సొంతం చేసుకొనే వాడు. ఒకసారి ఒక రాజపుత్రిక అతనిని వివాహం చేసుకోవటానికి తిరస్కరించింది. అతనిలో పట్టుదల ఎక్కువైంది. అక్కడి రాజ్యంపై దండెత్తి ఆ రాజ్యాన్ని, రాజపుత్రికను కబళించాలని పన్నాగం పన్నసాగాడు. మంత్రులతో, సైనికాధికారులతో రాజకీయ ఎత్తుగడలు, యుద్ధవ్యూహ రచనలతో 15 రోజులు అవిశ్రాంతంగా గడిపాడు. ఒక రోజు దండయాత్రకు బయలుదేరి త్రోవలో సైనికశిబిరం నిర్మించాడు. ఆ రోజు మంత్రులతో చాలా సేపు సమాలోచనలు చేశాడు. ఆ తరువాత నృత్యవినోదాలతో చాలా రాత్రి గడచిపోయింది. మర్నాడు చాలా కార్యక్రమములు, రాజకీయపు ఎత్తుగడలు నిర్వర్తించవలసి ఉన్నదికదా! ఆ రాత్రి పొద్దుపోయిన తరువాత కొంచెం విశ్రాంతి తీసుకుంటూ ఉండగా, ప్రియురాలి పట్ల అతని ఆలోచనలను మరుగు చేస్తూ నిద్ర అతనిని ఆక్రమించింది. ఆ నిద్రలో తానొక అప్సర (దేవతాస్త్రీ) అయినట్లు కలగన్నాడు.

❖

ఆ అప్సరస తన ప్రియాతి ప్రియుడగు ఒక దేవతా పురుషునితో కూడి ఎక్కడెక్కడో సంచరిస్తూ ఉండేది. ఆ దేవతా పురుషుడు తన పట్ల ధ్యాస మరల్చకూడదనే పట్టుదలతో అనేక కుయుక్తులు పన్నుతూండేది. ఒకసారి ఆ దేవతా పురుషుడు తనపై విరక్తి కలిగియుండటం అప్సరస గమనించింది. ఎంతో దుఃఖితురాలైనది. ఏకాంతంలో దుఃఖిస్తూ, కుత్సిత భావాలతో నిండిన మనస్సుతో, రతిక్రీడ యందు డస్సినదై నిదురకు ఉపక్రమించింది. ఆ నిద్రలో తాను ఒక లేడిగా వనంలో సంచరిస్తున్నట్లు కలగన్నది.

❖

ఆ లేడి పచ్చికను, చిగురుటాకును నమలుతూ ఒక అడవిలో సంచరించేది. ఒక రోజు ఒక పులిని దూరం నుండి చూచి ఎంతో భయంతో ఒక పొదలో దూరింది. ఆ పొదలో కొన్ని పూతీగలు

ఆ లేడి కాళ్ళకు చుట్టుకున్నాయి. ఆ తీగలను విదిలించుకోవటానికి ఎంతో ప్రయత్నించి విఫలమైనది. చివరికి సొలసి అక్కడే కించిత్ నిద్రకు ఉపక్రమించింది. ఆ నిద్రలో తన భయం యొక్క పరిణామంగా ఒక పూల తీగగా అయినట్లు కలగన్నది.

❖

శ్రీరాముడు: అదేమిటి స్వామి! పూర్ణ – శుద్ధ – చైతన్య సమన్వితుడగు ఆ జీవట భిక్షువు ఎక్కడ? ఆతడు అర్ధజడమగు పూతీగగా పరిణమించటమేమిటి? ఆశ్చర్యంగా ఉన్నదే!

శ్రీవసిష్ఠ మహర్షి: ఇందులో ఆశ్చర్యం ఏమున్నది?

తిర్యక్చోఒఒః ప్రహ్యాన్తి స్వప్నం చిత్తస్వభావతః ।

దృష్టానాం చ శ్రుతానాంచ చేతః స్మరణమక్షతమ్॥

దేవతలు కావచ్చు. మానవులు కావచ్చు. జంతువులు, వృక్షములు, పూతీగలు కావచ్చు... ఆయా జీవులందరూ తమతమ చిత్తముల స్వభావమును అనుసరించే స్వప్నసదృశ జగత్తులను గాంచుచున్నారు. అఖండము, అప్రమేయమూ, అనిర్దేశము – అగు ఆత్మతత్త్వానుభవం తప్ప తదితరమైనదంతా స్వప్నసదృశ్యం కాదా? మరింకేమిటి? ప్రతిఒక్కజీవుని అంతరంగ సంస్కారములే అతడు చూచే, వినే, పొందే – దృశ్య శబ్దార్థ అనుభవములకు అవగాహనలకు ముఖ్య కారణములై ఉంటున్నాయి. జీవునిలో పేరుకునియున్న సంస్కారముల ప్రదర్శనయే వారి వారి జగదనుభవములై ఉన్నాయి. సంస్కారములు, అవగాహనలు ఈ రెండూ ఒకదానిపై మరొకటి ప్రభావితమవుతూ ఉంటున్నాయని జనులు గమనించెదరు గాక!

శ్రీరాముడు: ఆ పరివ్రాజకుడు పూతీగగా స్వప్నానుభవం పొందుతూ ఇంకా ఏం చేశాడు?

శ్రీవసిష్ఠ మహర్షి: ఆ పూతీగ కొంతకాలానికి పత్ర – పుష్ప – ఫలములతో ఒక పెద్ద లతాగృహంగా విస్తరించింది. ఆ లతా గృహంపై అనేక తుమ్మెదలు ఝుంకారం చేస్తూ వ్రాలుతూ ఉండేవి. కొంతకాలం తరువాత ఆ లతలోని సాక్షి చైతన్యం గాఢనిద్రకు ఉపక్రమించింది. ఆ పూలతలోని భావికాలపు అంకుర బుద్ధి మరల స్వప్నోన్ముఖమైనది. సంసారానుగతంగా తాను ఒక తుమ్మెద అయినట్లు కలగాంచింది.

❖

ఆ తుమ్మెద అనేక రకాల పుష్పాలపై వ్రాలుచూ అనేక ప్రదేశాలలో తన సుందరమైన రెక్కలతో విహరిస్తూ ఉండేది. ఒకసారి అది ఒక తామర పుష్పంలో ప్రవేశించింది. పుష్పరసాన్ని గ్రోలింది. అక్కడ మత్తును పొంది మోహవశంగా తామరతూడులో ప్రవేశించి అక్కడ చిక్కుకున్నది. ఈ జడమగు మనస్సు మోహవశం చేత పొందని కష్టాలు, చేరని దుష్ట ప్రదేశాలు ఉంటాయా? తామర తూడులో చిక్కుకున్న ఆ తుమ్మెద ఇట్లా ఆలోచించసాగింది.

అరె! ఈ తామరతూడులో చిక్కుకుని కదలలేని పరిస్థితిలో ఉండిపోయానే? ఇప్పుడేం చేయటం? అయినా ఫరవాలేదులే! తెల్లవారుతుంది. ఈ తామర రెక్కలు విచ్చుకుంటాయి. నేను బయటపడతాను. ఇంకా అనేక పూవులలోని మధువును గ్రోలుతూ హాయిగా ఉంటాను...

అని అనుకుంటూ వేచి ఉన్నది. ఇంతలో ఒక మదపుటేనుగు ఆ కొలనులో ప్రవేశించి అల్లకల్లోలం చేసింది. తన మొరటు పాదాలతో సుతిమెత్తని తామరపూలన్నిటినీ నిష్కర్షగా త్రొక్కివేసింది. మూర్ఖులు రమ్యమైన వస్తువులను పాడుచేయటంలో సిద్ధహస్తులై ఉంటారు కదా! అప్పుడా ఏనుగు దంతము యొక్క ఒరిపిడికి తామరపూవు నలిగి ఒడ్డున విసిరి వేయబడింది. తూడులో వున్న తుమ్మెదకు గాయాలై మూర్ఛిల్లింది. అట్లు మూర్ఛిల్లే ముందు ఏనుగుకు సంబంధించి భయాందోళనలకు సంబంధించిన చాంచల్యమును అనుసరించి తానొక మదపుటేనుగు అయినట్లు స్వప్నం పొందింది.

❖

ఆ మదపుటేనుగు రాజీవితో విశాలమైన అరణ్యంలో చాలాకాలం సంచరించింది. ఒక రోజు ఏమరుపాటు చేత రాజభటులు దానిని బంధించటానికి నిర్మించిన ఒక పెద్ద గోతిలో చిక్కుకుంది. రాజభటులు ఆ ఏనుగును బంధించి తమ రాజు దగ్గరకు తీసుకుపోయారు. ఆ రాజు ఏనుగును అనేక యుద్ధాలలో వినియోగిస్తూ ఉండేవాడు. అది దీర్ఘమైన తొండంతో శత్రుసైనికుల దేహాలను ఒడపుగా చుట్టుచుట్టి నేలకేసి బాదటంలో ఎంతో ప్రావీణ్యత కనబరచేది. అందుచేత అక్కడి సేనాపతికి ఆ ఏనుగంటే ఎంతో ఇష్టం. కొంతకాలానికి ఆ ఏనుగు ముసలిది అయింది.

ఒకసారి ఆ రాజ్యమును కబళించటానికి శత్రురాజులు చుట్టుముట్టారు. ఆ యుద్ధంలో ఎంతో మంది శత్రుసైనికులను ఆ ఏనుగు తన పాదఘట్టనలతో నలిపివేసింది. చివరకు కొందరు సైనికులు ఆ ఏనుగును శూలములతో గండస్థలంపై పొడిచారు. అది నేలకూలి మూర్ఛిల్లింది. ఆ ఏనుగు జీవిత కాలమంతా తన గండస్థలంపై వ్రాలే దోమలను త్రోలే ధ్యాస కలిగి ఉండటం చేత, తత్సంబంధమైన సంస్కార ప్రాభవానికి లోనై ఒక దోమ అయినట్లు కల గాంచింది.

❖

ఆ దోమ ఒక కొలనులో అటూ ఇటూ తిరుగుతుండేది. ఆ కొలనులో కొన్ని హంసలు ఉన్నాయి. ఆ హంసలపై వ్రాలే నిరంతర ధ్యాస చేత అది ఒక హంస శరీరంపై నిదురిస్తూ తానొక హంస అయినట్లు మనఃప్రవేశం చేసింది.

❖

హంసగా పరిణమించిన ఆ జీవుడు ఆ తరువాత దీర్ఘకాలం విభిన్నమైన యోనులలో ప్రవేశ – నిష్క్రమణములచే పరిభ్రమిస్తూ మరికొన్ని జన్మలు గడిపాడు. ఆ తరువాత ఉపాధిక్రమంగా మరల హంస అయినాడు. ఆ హంస బ్రహ్మదేవుని వాహనమగు రాజహంస గురించి విని 'నేను కూడా బ్రహ్మదేవుని వాహనమగు రాజహంస అయితే ఎంత బాగుంటుంది'... అని నిరంతరం చింతిస్తూ ఉండేది. బ్రహ్మదేవోపాసన నిర్వర్తిస్తూ ఉండేది. కొంతకాలానికి ఒక విషపురుగు కాటుకు గురి అయి ఆ దేహం నిర్వీర్యమైనది. పూర్వవాసనా ప్రభావం చేత బ్రహ్మదేవుని వాహనమగు రాజహంసగా జన్మించింది. జీవట భిక్షువు నుండి చూస్తే అది 99వ జన్మ.

ఆ రాజహంస అత్యంత వినయముతో, శ్రద్ధగా, భక్తి పూర్వకంగా పరతత్త్వ స్వరూపుడగు బ్రహ్మదేవుని సేవిస్తూ ఉండేది. అట్టి సేవాప్రభావంగానూ, తన యొక్క వినయ – విధేయతలకు

ప్రతిఫలంగానూ 'వివేకం' పొందింది. భగవానుడగు బ్రహ్మదేవుడు తనను ఆశ్రయించ వచ్చిన దేవ–ముని–ఋషిపుంగవులకు బోధించే బ్రహ్మతత్త్వమును తాను కూడా వినేది. ఆ రాజహంస తన వివేక – వైరాగ్యముల బలం చేత లౌకిక భోగములను ఇంద్రియార్థములను సారశూన్యమని గ్రహించి, లౌకికమైన వస్తుదృష్టిని అధిగమించింది. జీవన్ముక్తి పొందింది. బ్రహ్మదేవునితో సమానంగా 'తదనంతర విదేహ ముక్తి'కి అన్ని విధముల అర్హత సంపాదించుకున్నది.

❖❖❖

3. రాజహంస - రుద్రుడు

శ్రీవసిష్ఠ మహర్షి: సన్న్యాసి, భిక్షుడు అగు జీవటుడు ఇప్పుడు జీన్ముక్తత్వము అవధరించి హంస అయి భగవంతుడగు బ్రహ్మదేవుని సేవలో నిమగ్నుడై ఉన్నాడని అనుకున్నాం కదా! బ్రహ్మదేవునితో లోకసంచారం చేయగలిగే అవకాశం పొంది ఉండటం చేత ఆ హంస యొక్క పవిత్ర జ్ఞానదృష్టి మరింత ఉత్కృష్టత పొందింది. ఒకసారి బ్రహ్మదేవునితో రుద్రలోకం వెళ్ళటం జరిగింది. రుద్రుని దర్శనం చేసుకుని అర్చించింది.

'రుద్రుని అర్చించుటచే నేనిప్పుడు రుద్రుడను' అని భావన చేసింది. *(నారుద్రో రుద్ర మర్చతి)* మరుక్షణం ఆ జీవటుడు అద్దంలో ప్రతిబింబము ప్రవేశించినట్లు యోగజ్ఞానయుక్తమగు రుద్రరూపం దాల్చింది.

శ్రీరాముడు: మహర్షీ! జీవటుడు జీవన్ముక్తుడయ్యాడు కదా! మరల రుద్రుడుగా ఎట్లా జన్మించాడు? అప్పుడాతడు జీవటుడుగా విదేహముక్తి సమన్వితుడని కూడా మీరు చెప్పారు కదా?

శ్రీవసిష్ఠ మహర్షి: సంసార జీవులు ఇంద్రియానుభవములకు సంబంధించిన సంస్కారం కలిగి ఉంటారు. అందుచేత వారు ఒక ఉపాధిని త్యజించినప్పుడు తమ యొక్క అంతర్గతమై ఉన్న సాంసారిక సంస్కారాలచే ప్రభావితులై, తదనుభవానికి అనుకూలమైన ఉపాధి పరంపరలను పొందుతూ ఈ సంసారారణ్యంలో సంచరిస్తున్నారు. వారియందు 'పునరావృత్తి' అను దోషం ఉండి ఉంటోంది. అట్టి పునరావృత్తి దోషం చేత జన్మ – జన్మాంతరములు ఒక పరంపరగా వచ్చిపడుచున్నాయి.

అయితే, జీవటుని వ్యవహారం వేరు. ఆతడు జీవన్ముక్తుడు అవటంచేత 'జీవన్మరణములు' అను జాడ్యం అతనికి లేదు. అతడు సారూప్యముక్తి అనుభవిస్తున్నాడు. ఒకడు ఒక సమయంలో ఒక ఆలోచనను ఆశ్రయించి కొద్దిసేపయిన తరువాత ఆ ఆలోచనను త్యజించి మరొక ఆలోచనను స్వీకరిస్తాడు చూచావా? ఆలోచన – ఆలోచనల మధ్య తన స్వస్వరూపం త్యజించటం లేదు కదా! జీవటుడు కూడా హంస యొక్క అనుభవమును త్యజించి రుద్రుని యొక్క అనుభవం స్వీకరించాడు. 'నేను ఉపాధులకు జన్మ జన్మాంతరాలకు సంబంధించిన వాడను కాను' అను అకృత్రిమ స్వభావంతో కూడిన యోగజ్ఞానములు సంపాదించి ఉండుటచే అతనికి 1. సత్యసంకల్పబలం (సంకల్పించింది సత్యమయి ప్రాప్తించటం) 2. సంకల్పాతీతత్వం రెండూ కూడా ఒనగూడుచున్నాయి.

గంధము వాయువును అనుసరిస్తూ తన స్వరూప స్వభావములను త్యజించినట్లు అతడు హంస శరీరం త్యజించటం, రుద్ర శరీరం స్వీకరించటం జరుగుతోంది. యోగులు ప్రారబ్ధశేషానుభవం కొరకై పూర్వ శరీరములను విడవటం, నూతన శరీరం స్వీకరించటం లీలగా నిర్వర్తిస్తారు. తదితర సంసార జీవులు వేదన–ఆవేశములతో కూడిన కౌతుకంచేత ఉపాధులను పొందుచూ, దేహ పరిమితులై అల్పయోచనాపరులై, దృశ్యమునకు దాసులై సంచరిస్తూ ఉంటారు.

ముక్త జీవునకు బద్ధజీవునకు మధ్య ఉన్న భేదం అవగాహనకు సంబంధించినది మాత్రమే.

❖

జీవటుడు రుద్రత్వం స్వీకరించి, రుద్రుడై ప్రధానమైన గణపతిత్వం పొందాడు. శివలోకంలో ఉచితములను, ఆచారములను నిర్వర్తిస్తూ రుద్రపురియందు యథేచ్ఛగా విహరించసాగాడు. అట్లా రుద్రుడుగా ఉండగా ఒక రోజు తన జ్ఞానైశ్వర్య ప్రభావం చేత ఒక్కసారి తనయొక్క సుదీర్ఘమైన పూర్వజన్మలన్నీ అవలోకించసాగాడు. ఆతడప్పుడు ఆవరణశూన్యమైన జ్ఞానశరీరమున వెలయు చున్నాడు. అట్టి జ్ఞానావరణ నుండి తను జీవట ఉపాధికి ముందు – వెనుక ఎత్తిన అనేక పూర్వ జన్మలవైపు ఒక్కసారి దృష్టి సారించి, ఇట్లు తలపోయసాగాడు.

జీవటరుద్రుడు: ఆహా! 'చిత్తవృత్తులను అవలంబించాలి' అని అనుకుని ఎన్ని దేహములలో ప్రయాణించి వచ్చాను. ఈ మాయ ఎంత చిత్రమైనది? జ్ఞానానందమయ స్వరూపుడగు నాకు జన్మ ఏమిటి? మృత్యువేమిటి? ఎండమావులలో జలం ఉండునట్లు ఈ మాయకు వాస్తవమైన ఉనికియే లేదు. కాని, అత్యంత ఘనీభూతమై ఉన్నట్లు అనుభూతిని కలిగించగల శక్తి ఈ మాయ కలిగియున్నది. అట్టి శక్తి ద్వారా ఈ విశ్వమునంతటినీ మోహింపజేయగలుగుతోంది. 'పారమార్థిక చిత్' స్వరూపుడగు నాకు అనేకసార్లు అనేక సంకల్పసమూహములు ఉదయించాయి. ఆ సంకల్పములు ఆయా పంచభూత సముదాయములను నిర్మించుకుంటూ త్యజిస్తూ ఈ సంసారవనంలో పచార్లు చేసి ఇక్కడికి వచ్చాయి. సర్వశక్తిమంతుడనగు నా యొక్క చిదంశము ఒకవైపు చెక్కుచెదరక ఉన్నది. మరొక వైపు నా జడంశమునకు ఈ ఆకాశాది విభాగములు ఒనర్చబడుచున్నాయి. నేను స్వీయస్వేచ్ఛాఉపక్రమమును ఆశ్రయించి చిదాభాసుడనై ఈ స్థూల – సూక్ష్మదేహములలో సమష్టి – వ్యష్టితత్త్వములుగా వెలయటం జరిగింది. నా యొక్క జడంశము సూక్ష్మ – స్థూలములగు తన్మాత్ర విభాగములుగా పరిణామం పొందింది. ఆయా దేహముల వాసనావైచిత్ర్యములను అనుసరించి రంగుల మేళవంలాగా హావ–భావ –రూప–గుణ వైచిత్ర్యములను ప్రదర్శించింది. నేను జ్ఞానినై ఉండి కూడా ఆయా సమయ సందర్భాలలో ఆయా ఉపాధి సంబంధితమైన తాదాత్మ్యము ప్రకటించాను. దేహభావమును స్వీకరించిన సమయంలో నా యొక్క అనంత స్వరూపమును కించిత్ ఏమరచినవాడనై ఆయా ఉపాధులలో కునుకులు తీశాను. ప్రతి ఒక్క ఉపాధీ తన చుట్టూ ఒక్కొక్క ప్రత్యేకమైన సృష్టిని పొందింది. కొన్ని కొన్ని సంబంధ–బాంధవ్యములను ఆస్వాదించింది. ఇట్లా అనేక సృష్టులలో ప్రవేశిస్తూ నిష్క్రమిస్తూ నా వెంట 'విషయములు' అనే అభ్యాసమును తెచ్చిపెట్టుకున్నాను. అయితే కొన్ని కొన్ని సృష్టులలో

(జన్మలలో) నిర్వర్తించిన శమదమాది సాధన సంపత్తి కూడా నా వెంటనంటి వచ్చింది. ఇప్పుడు నేను విషయరహితుడను కావాలి కదా! అందుచేత నా వెంటనంటి ఉన్న సాధన సంపత్తికి తోడుగా మరికొంత సాధనధనాన్ని సంపాదించి తద్వారా మరికొంతగా విషయములను అధిగమిస్తాను.

❖

రుద్రత్వ సంకల్పావరణను ఆశ్రయించి ఉన్న ఆ పరివ్రాజకుడు ఒకచోట పద్మాసనాశీనుడైనాడు. గతించిన ఆవరణలను విజ్ఞానబలంచే పఠించి మహత్తరమైన అవగాహనను పొంది మహాస్థైర్యం పొందాడు. 'ఇక త్యజించవలసినది త్యజిస్తాను' అను నిమగ్నములో ప్రవేశించాడు.

మొట్టమొదట స్థూలదేహావయవములైన ఈ కాళ్ళు, చేతులు మొదలైన వాటిని 'వీటితో నాకు సంబంధమే లేదు' అను అప్రమేయత్వాన్ని స్వీకరించాడు. ఆ తరువాత సూక్ష్మదేహావయవములైన మనో – ప్రాణాదులను కూడా అధిగమించాడు. బహిరంగ విషయములగు బాహ్యావిషయాలాపన మొదలైన బాహ్య సంసక్తిక స్వభావమును దాటివేశాడు. "అంతర్యామియగు తత్త్వాన్ని ఆరాధిస్తున్నాను" అనురూపంలో ఉండే తత్త్వ – ఆరాధనలను కూడా అధిగమించాడు.

తానే సర్వాత్మకుడయ్యాడు. తక్కిన స్వభావములన్నిటికీ అసంబంధితుడైనాడు.

❖

శ్రీరాముడు: అట్టి విషయత్యాజ్య – అనుభవగ్రాహ్యాలను ఎట్టి మంత్ర – తంత్ర – ఉపాసన – సాధనలను ఆశ్రయించకుండానే ఆ పరివ్రాజకుడు సంపాదించాడా?

శ్రీవసిష్ఠ మహర్షి: ఈ చిత్తమునకు ఒక లక్షణమున్నది. అది ఎప్పుడు దేనిని దృఢంగా భావన చేస్తే అప్పుడు అట్లే పరిణమిస్తుంది. భావానుగత అనుభవములుగా నూతన భావనలో ప్రవేశిస్తూ క్షణంలో క్రితం భావనను తనయందు విలీనం చేసుకోగలదు. చిత్తంలో ఆ మహత్తర శక్తి పొందుపరచబడి ఉన్నది.

శ్రీరాముడు: ప్రతి ఒక్కరి చిత్తమునకు మీరు చెప్పిన మహత్తర శక్తి ఉన్నది కదా?

శ్రీవసిష్ఠ మహర్షి: అవును ఉన్నది. అయితే అనేక ఇంద్రియ – దృశ్య – భావవిషయాలను ఆశ్రయించే వారి చిత్తము అతిచంచలమై ఉండటంచేత తాను ఉదేశించినట్లుగా ఎక్కడా ఏదీ పొందటానికి అశక్తత చెందుతోంది. అందుచేత సాధకులు చిత్తమునకు ఏకాగ్రత అభ్యసింపజేస్తేగాని సంసారమును జయించలేరు. ఈ జీవుడు సాధనచే తన భావాలు తనకు శ్రేయోదాయకులగు సేవకులుగా ప్రవర్తింపజేయగలడు. సాధన కొరవడినప్పుడో, ఈ జీవుడు తానే తన భావాలకు సేవకుడగుచున్నాడు.

చిత్తము యొక్క దేహము చింతనయే కదా! ఒకడు పరస్పర భావములలో ఏది ఎక్కువగా చింతన చేస్తే అదియే ఆ చిత్తమునకు సంప్రాప్తిస్తూ ఉంటోంది.

❖

ఆ జీవటరుద్రుడు ఆత్మసిద్ధిని పొందికూడా కించిత్ శాస్త్ర విరుద్ధమైన లౌకిక వాసన శేషించటం చేత తన గతించిన దేహములందు క్రీడలాగా, లీలాగా మరల పరిభ్రమించాడు.

భక్తి సాధనములు, శాస్త్ర అధ్యయనములు నిర్వర్తించే బ్రాహ్మణ దేహమునందు, సామంతరాజ దేహమునందు, అప్సరస, లేడి, తుమ్మెద, ఏనుగు దేహ భావములందు, అట్లాగే తదితర ఉపాధులందు, ...ప్రవేశించటం, అప్పటి వాసనలను ప్రదర్శించటం, బయల్వెడటం... మొదలైనవి క్రీడించాడు.

జీవట రుద్రుడు: ఆహా! సత్యము వలె భాసించే ఈ సంసారారణ్యంలో అనేక మానసిక సృష్టులలో ప్రవేశించి అనేక దశలను అనుభవించాను. నా యొక్క బ్రహ్మస్వరూపం నుండి చ్యుతుడనై వేలాది సంవత్సరాలు, వందలాది చాతుర్యుగాలు గడిపాను. భిక్షుకుని ఉపాధి ధరించి ఉండగా బ్రహ్మజ్ఞానానికి కొంచెం అర్హత సంపాదించుకున్నాను. మరల, అక్కడి నుండి కూడా సంసారం మీద ఉత్సుకతచే ప్రమాదవశంగా భావనాసముద్ర తరంగాలలో అనేక జన్మపరంపరలు గడిపాను. రాజహంస – మానసిక జగత్తులో ప్రవేశించినప్పుడు భగవంతుడగు బ్రహ్మదేవునితో ఏర్పడిన సత్సాంగత్యం చేత ఆత్మస్వరూప జ్ఞానం వికసించింది కదా! పూర్వాభ్యాసాలన్నీ జ్ఞానయోగంచే ఫలించగా ఇట్లు రుద్రుడ నయ్యాను. జీవటుడుగా అత్యంత దృఢమైన శాస్త్రీయ సాధనాభ్యాసం నిర్వర్తించాను. అయినా కూడా ఒకింత 'మాయపట్ల అభిలాష' అను చ్యుతి ఘటిల్లినందుకు ఫలితంగా ఇట్లు అత్యంత వివశములైన, విరసములైన యోనులలో పరిభ్రమించవలసి వచ్చింది. ఏదిఏమైనా కూడా శాస్త్ర ప్రవచితాభ్యాసమే జీవుని యందు విజయముగా మార్గప్రదమౌతుంది. 'సత్యమేవ జయతే' అని శాస్త్రకారులు చెప్పియే ఉన్నారు కదా! సత్యము మాత్రమే జీవుని కాపాడగలదు. కాకతాళీయన్యాయం చేత ఈ జీవునకు సాధుజన సంగం లభిస్తోంది. అట్టి సాధుజన సంగం సద్వినియోగ పరచుకున్న జీవుడు దృశ్యాతీతత్వం సాధించగలుగుచున్నాడు. దృశ్యాతీతం యొక్క అభ్యాసబలం చేత వాసనలు జయించబడుచున్నాయి. ఏ అశుభవాసనలైతే ఈ జీవుల అంతరంగంలో దాగి ఉన్నాయో, అవి ప్రయత్నపరుల యందు మాత్రమే క్షీణిస్తున్నాయి. అందుచేత పురుషప్రయత్నమే శ్రేయోదాయకం.

పూర్వ – తత్పూర్వ జన్మలలో ఏదేది నిరంతరంగా అభ్యసించబడుతోందో... అదియే దృష్టికి సత్యముగా తోచటం జరుగుతోంది. శుభచింతనాభ్యాసం వలన అశుభచింతనలు తొలగుతాయి.

ఏదేది జాగ్రత్ – స్వప్నములందు సుదృఢంగా భావిస్తామో అదియే సత్యముగా అనుభూత మవుతోంది. అంతేగాని, ఇందులో మరొకరెవరిదో పాత్ర లేదు. "నన్ను ఎవరో భ్రమింపజేస్తున్నారు" అని అనుకుంటే అది భ్రమ మాత్రమే. తత్త్వ చింతనచేతనే నాకు ఈ పరిశీలనా సామర్థ్యం లభించింది. కల్పితమైన దేవార్చన మొదలైనవే ఫలప్రదాతలగుచుండగా తత్త్వచింతన శుభప్రదం కాకుండా పోతుందా? అయి తీరుతుంది.

నా యొక్క చ్యుతికి కారణమేమిటి? ఆత్మతత్త్వవిచారణను ఏమరచి శాస్త్రములలోని అనాత్మ విభాగపు విషయములకు గ్రుడ్డిగా పరిమితుడనగుట చేతనే. ఫలితంగా, సుఖ – దుఃఖమిశ్రితములగు ప్రయోజనములచే పరిమితుడనయ్యాను. వాటి వలన అవిచ్ఛిన్నమగు ప్రయోజనం కలుగలేదు.

అసలీ సంసారము యొక్క చింతన – భావనలు కొంచెం ఆశ్రయించినంత మాత్రం చేతనే సుదీర్ఘ ఉపాధిపరంపరా ప్రహసనమంతా వచ్చి పడుతోంది. భావన – చింతన త్యజించటం చేత

అనర్థములన్నీ జయించబడుచున్నాయి. భావన – చింతన ఉన్నంత వరకూ దేవతా ఉపాధులు కూడా ఉత్కృష్టతను ప్రసాదించలేవని తెలిపోయింది.

❖

ఎంత ఆశ్చర్యం! తన స్వరూప స్వభావములను ఏమరచిన ఈ జీవుడు 'ఈ శరీరమే నా స్వభావం' అని నమ్ముకుని ఉండటం సంభవిస్తోంది. అసత్యభావములను ఆశ్రయించటంచేత ఆత్మ స్వరూపుడగు ఈ జీవుడు తనను తాను అనేక నీచస్థితులకు, తుచ్ఛ ఉపాధులకు దుఃఖ పరంపరలకు మోసుకెళ్ళుచున్నాడు. తత్త్వదృష్టితో చూస్తే... ఉపాధులూ లేవు, జన్మమృత్యువులూ లేవు. ఈ ఉపాధులు, వాటి సంబంధిత వ్యవహారాదులు మధ్యలో వస్తున్నాయి. మధ్యలోనే పోతున్నాయి. భూత – భవిష్యత్ – వర్తమానములచే స్పృశించబడనిదేదైనా ఉంటే అది నా స్వస్వరూపమగు ఆత్మ ఒక్కటే. సత్ – చిత్ స్వరూపుడనగు నాకు ఇట్టి అసత్ అగు ఉపాధులతో సంపర్కం కలగటమేమిటి? నేను ఈ దృశ్య జగత్తుతో అనుబంధం కలిగి ఉండటమేమిటి? ఆకాశంలోని నీలపువర్ణం భ్రమమాత్రమే అయినట్లు... జగత్‌భ్రమ అజ్ఞాన కారణంగానే ఉదయిస్తోంది.

కనుక 'సాధన' అనేది ఆత్మను పొందటానికి అవసరం లేదు. అనాత్మ విషయములందు అభిలాష తొలగటానికి మాత్రమే సాధన యొక్క అవసరం.

ఈ జగత్తు యొక్క వాస్తవరూపం బ్రహ్మమే. ఇద్దాని అసన్మయసత్త పరబ్రహ్మమునందే అకారణంగా బహుశః వినోదార్థమై ఏర్పడి ఉంటోంది. కనుక ఈ కల్పనలు బ్రహ్మమే స్వరూపముగా గల నన్నేం చేస్తాయి? ఇప్పుడు నేను చూచిన (నిద్రకుపక్రమించినప్పటి) దేహములన్నీ వినోదార్థమై ఏర్పడి సమ్యక్‌జ్ఞానప్రకాశము వలన నా స్వరూపమునందే ఏకీకృతం కాగలవు.

శ్రీవసిష్ఠ మహర్షి: ఈ విధంగా చింతిస్తూ ఆ భిక్షుకుడు "కల్పనారాజ్యము" అనతగిన – తాను నిద్రపొందిన – అనేక ఉపాధులలో మరొకసారి పచార్లు చేసివచ్చి తిరిగి రుద్ర ఉపాధిలో ప్రవేశించాడు. అతడు సత్యసంకల్పుడవటం చేత అతని క్రితం 99 జన్మలలోని స్వప్నతుల్య సత్తు ఒక్కసారి అనువృత్తమయింది. అతను జ్ఞానలాభం పొంది ఉండుటచేత తన యొక్క రుద్రత్వం, జీవజటాడి పూర్వదేహములు ఒకేసారి వీక్షించగలిగాడు.

❖❖❖

4. వివిధ ఉపాధుల సమావేశం

శ్రీవసిష్ఠ మహర్షి: ఇప్పుడు 'రుద్రుడు' అను ఉపాధి – అనుభవములలో సన్యాసి భిక్షువు ఉన్నాడు కదా! అట్టి ఉపాధితో మరల రుద్రలోకమునుండి బయలుదేరాడు. తన యొక్క తాత్త్వికబలం చేత జీవటుడు ఉన్న బ్రహ్మాండంలో ప్రవేశించాడు. జీవటుడు ఉన్న ప్రదేశం చేరాడు. జీవట భిక్షువును సమాధి నుంచి ఉత్థానపరిచాడు. ఆ ఇద్దరు కలసి త్రాగుబోతును సమీపించారు. జీవట త్రాగుబోతు ఆ సమయంలో సుష్టుగా తేనె, మద్యం త్రాగి నిదురిస్తున్నాడు కదా! రుద్రుడు జీవటభిక్షువు ఆ

జీవట త్రాగుబోతును నిదురలేపాడు. ఆ ముగ్గురి చైతన్యం ఒక్కటే అయినప్పటికీ మాయ యొక్క భావావేశం చేత అది ముగ్గురు వ్యక్తులైనట్లుగా ప్రకటన – ప్రవర్తనలు కలిగి ఉన్నది.

భిక్షువు, త్రాగుబోతు, రుద్రుడు – ఒకరితో ఒకరు కొద్దిసేపు సంభాషించుకుని ఇక అక్కడి నుండి బయలుదేరారు. ఆ ముగ్గురూ చిదాకాశమునందు గల మరొక పాంచభౌతిక బ్రహ్మాండంలో ప్రవేశించారు. బ్రాహ్మణ యువకుని సమీపించారు.

ఆ విప్రుడు కూడా జీవటుని మనస్సు యొక్క పరిణామమేకదా! ఆ విప్రుడు ఉన్న ప్రదేశం అనేక ప్రాణుల శబ్దములతో నిండియున్నది. ఆ బ్రాహ్మణుడు తన భార్యతో ఏకశయ్యపై నిదురించి ఉన్నాడు. ఆ విప్రుని భార్య 'ఈ నా భర్త నా బహిర్ ప్రాణం' అను భావనతో, నిదురపోతూనే, తన భర్త యొక్క కంఠమును ఆలింగనమొనర్చుకుని ఉన్నది. రుద్ర, జీవట, భిక్షువులు తమ యొక్క చైతన్యత్వమును ఉపయోగించి ఆ విప్రుని ప్రబుద్ధుని చేశారు. అప్పుడా విప్రుడు ముగ్గురినీ చూచి తనను చూచుకొని కించిత్ విస్మయ పరవశుడైనాడు. రుద్రునితో బోధింపబడి, విషయమంతా గ్రహించి ఉద్వేగరహితుడైనాడు.

ఆ తరువాత ఆ రుద్ర – జీవట – ద్రిమ్మర – విప్రులు నలుగురు అక్కడి నుండి బయలుదేరారు. 'చిదాకాశము యొక్క చిత్త వికృతి' అనతగ్గ మరొక బ్రహ్మాండలో ప్రవేశించారు. అక్కడ గల సామంత రాజు నిద్రించి ఉన్న ద్వీపంలో ప్రవేశించారు. బంగారుఛాయతో అంతఃపురంలో నిద్రిస్తున్న ఆ సామంతరాజును తమ యొక్క చిత్తచైతన్యం సహాయంతో ప్రబుద్ధుని చేశారు. ఇప్పుడా ఐదుగురు ఐదుగురైనప్పటికీ ఏకభావముననే వెలయుచున్నారు. అదే విధంగా ఆ ఐదుగురు సామ్రాట్టును సమీపించి అతనిని నిదురలేపారు.

అట్లే వారు తమ సూక్ష్మ శరీరంతో తక్కిన ప్రపంచములందు తిరుగుతూ అక్కడక్కడ నిద్రించియున్న తదితర జీవట చైతన్య ఛాయలనన్నిటినీ ప్రబుద్ధం చేశారు. మృతులైన వారిని, నిద్రించే వారిని కూడా మేల్కొలిపారు. వారందరి చిత్తమంతా 'బ్రహ్మహంస'గా పరిణామం పొంది రుద్రభాసమును పొందారు. రుద్రుని చిత్త–చేతనాంశాలు వారి చిత్తాలను చేతనమొనర్చాయి కదా! వారి దేహాలన్నీ జ్ఞానైశ్వర్యంచే ఆశ్రయించబడ్డాయి. వారంతా శతసంఖ్యాక రుద్రులై విరాజిల్లారు.

❖

శ్రీరాముడు : స్వామీ! 'జీవటుడు' అనుపేరుగల జీవుడు ఒక్కడే అయిఉండి వంద ఉపాధులు వేరు వేరుగా ఎట్లా కలిగి ఉన్నాడు. ఒకే సమయంలో ఆ వంద ఉపాధులు వేరు వేరుగా ఎట్లా ఉద్బోధ పొందగలిగాయి? ఇది విచిత్రంగా ఉన్నదే!

శ్రీవసిష్ఠ మహర్షి: చైతన్యము అనంత శక్తియుతము. ఈ 'శతరుద్రీయకథనం' అనబడే జీవటుని చైతన్యము యొక్క శతాది ఉపాధులలో ప్రవేశించటం, నిష్క్రమించటం, ఉపక్రమించి ఆ సమయంలో మరొక ఉపాధిని ఉత్తేజపరచటం... ఇదంతా చైతన్యమునందు సాధ్యమే.

పరమేశ్వరుని ఐశ్వర్యము ఇట్టిదే సుమా! అతడు ఏకమే అయి ఉండి అనేకములందు వివిధ రీతులుగా ప్రతిబింబిస్తున్నాడు. 'జ్ఞానము' అనునది ఒక్కటే అయినప్పటికీ అది వివిధ శరీరములందు

ఉండి వేరు వేరు జ్ఞేయములను ఆస్వాదిస్తోంది. సూర్యుని ప్రకాశము ఒక్కటే అయినప్పటికీ అందులోంచి బయలుదేరిన వేరువేరు కిరణములు వేరు వేరు వస్తువులపై ప్రసరించి ప్రకాశింపజేస్తున్నాయి. జలం ఒక్కటే అయినా అసంఖ్యాక తరంగాలుగా ప్రకటితమౌతోంది. అగ్ని 'ఒక్కటే' అయిఉండికూడా, అనేకచోట్ల వేరువేరు దీపములను వెలిగించుచు వేరువేరు దృశ్యవిషయములపై కాంతిని ప్రసరింపజేస్తోంది కదా! అట్టి "ఏకము నుండి అనేకము" అను చమత్కారం విశదీకరించటానికే మనం ఇక్కడ ఈ శతరుద్రీయం చెప్పుకుంటున్నాం.

❖

మనం చెప్పుకుంటున్న ఆ శతరుద్రీయమూర్తి ఆవరణ శూన్యమగు చిన్మయ స్వరూపమున విరాజిల్లుచున్నాడు. ఆతడు పరిశుద్ధ స్వరూపమును ఆశ్రయించుట ద్వారా ఈ జగత్తులో అంతర్యామి అయ్యాడు. ఈ ప్రాతిభాసిక జగత్తుకు ఆధారుడయ్యాడు. ఓ రామచంద్రా! ఈ విధంగా చిదాకాశంలో వందలకొలది శతరుద్రమూర్తులు వెలయుచున్నారు. నీకు – నాకు ఇప్పుడు ఇక్కడ అనుభూతమయ్యే ఈ వర్తమాన జగత్తు భిక్ష – రుద్రకల్పితమైన జగత్‌శతములలో పదకొండవది.

శ్రీరాముడు: మహర్షీ! ఆ జీవటుడు ఏ విధంగా వందలకొలది ఉపాధులలో ప్రవేశించాడో అదే విధంగా ప్రతిజీవుడు తన సుదీర్ఘ సంచారంలో అనేక ఉపాధులలో ప్రవేశించటం, నిష్క్రమించటం చేస్తున్నాడు కదా! అంటే అతనిలో కూడా జీవటుని లాగానే వివిధ అంతర్గత జీవులు వ్యక్తిగతమైన వివిధ ప్రపంచములను దర్శించటం జరుగుచున్నది కదా! ఆ వివిధ జీవులు అంతర్గత జీవులు ఒకరితో మరొకరు కలవటం ఎప్పుడైనా జరుగగలదా?

శ్రీవసిష్ఠ మహర్షి: సంసార జీవుడు తానున్న దానిలో భ్రాంతిచే బద్ధుడై ఉంటున్నాడు. అందుచేత తన స్వరూపాలైన తదితర జీవులను కలియలేకపోతున్నాడు. ఈ జీవుడెప్పుడు జ్ఞానంచే ప్రబుద్ధుడవుతాడో, అప్పుడు "నేను ఇన్ని రూపములుగా ఉంటున్నాను' అను నూతనానుభవంలో ప్రవేశించగలడు. ఈ వేరు వేరుగా కనిపించే జీవులన్నీ జ్ఞానియందే ఉంటాయి. వాటన్నిటిలో తానే ఉంటాడు. జ్ఞాని కానంత వరకు అట్టి అనుభవం దుర్లభం. మనం చెప్పుకున్న ఆ భిక్షుకుడు ప్రబుద్ధుడైనాడు. ఎవ్వరిలో తత్త్వజ్ఞానం ఉదయిస్తుందో అట్టివారు 'సముద్రములోని వేలాది తరంగాలలోని ఒకే జలం' ...లాగా సర్వజీవులలోని ఏకాకారమును అనునిత్యం వీక్షించగలుగుచున్నారు. ఇక అప్రబుద్ధులైన వారంటావా... వారు ఈ దృశ్యములో గల స్థూల విషయములకు బద్ధులై గ్రహించుచు, 'ఆత్మ యొక్క ఏకాకృతిని' గ్రహించలేకపోతున్నారు.

జలం యొక్క ద్రవత్వం చేత ఒక తరంగం, మరొక తరంగంతో పూర్ణంగా కలిసే విధంగా, స్థూలబుద్ధి తొలగుటచే ఇతఃపూర్వపు ఉపాధుల పరస్పర సమ్మేళనం సంభవిస్తోంది. ప్రబుద్ధ జీవులు తమ యొక్క చిన్మాత్రసమైక్యతా స్వభావంచే తదితర జీవులతో పరస్పరత్వం పూర్ణంగా పొందగలుగుచున్నారు.

ఈ 'సంసృతి'యందు మనకు కనబడుచున్న నానావిధ జీవజాతమంతా నిజానికి కల్పితము, అసత్యం అయి ఉన్నాయి. ఈ జీవులంతా సర్వవ్యాపియగు చిత్‌శక్తియందే ఉండి ఉన్నారు. అందుచేత

చిత్‌శక్తి వలెనే ఇవి కూడా సత్యమువలె తోచుచున్నాయి. ఎప్పుడైతే ఈ జీవుడు సర్వజీవుల తత్త్వమైన ఆ పరబ్రహ్మముతో ఐక్యమొందుతాడో... అప్పుడు, 'బ్రహ్మము తప్పితే మరింకేమీ లేదు. తదితరంగా అగుపించేదంతా స్వయంకల్పితమైన భ్రమమాత్రమే' అని గ్రహిస్తాడు. అప్పుడట్టి విజ్ఞానం సముపార్జించిన ద్రష్టకు తదితర జీవులతో ఒకానొక అంతర్గతమైన పరస్పర సమ్మేళనం లభిస్తోంది. భూమిని ఎక్కడ త్రవ్వితే అక్కడ సర్వవ్యాపకమగు ఆకాశం ప్రకాశిస్తూనే ఉంటుంది కదా! స్వయమాత్మానుభవులకు సర్వవైపులా స్వస్వరూపమే తాండవిస్తూ ఉంటుంది.

ఓ రామా! సర్వవ్యాపకము, సత్యము అయినట్టి చైతన్యము యొక్క అభ్యాసబలంచే తత్త్వదర్శనముచే తదితరమైనదంతా లయిస్తుంది. ఏ మనోబుద్ధి – చిత్త – అహంకారములు నిరోధించాలని జనులు అనుకుంటున్నారో, అదంతా కూడా నిర్మల హృదయులగు సర్వజ్ఞులకు చిన్మాత్రము (లేక) నిర్మల చైతన్యముగానే అనుభవమౌతోంది. అనేక బంతులలో నిండి ఉన్న గాలి ఒకే గాలి కదా! వివిధ నదులలో లభించే జలం వాస్తవానికి జలం దృష్ట్యా ఒక్కటే కదా! వేరు వేరు వస్తువులు వేరు వేరు చోట్ల తగలబడుచుండవచ్చు గాక! 'అగ్ని' సర్వదా ఒక్కటే కదా! వివిధ ప్రదేశములలో వివిధ ధర్మములు గల పదార్థజాలం ఉండవచ్చు గాక! కానీ, ఆకాశం ఒక్కటే కదా!

అట్లాగే సర్వభూతములందలి ఆత్మసత్త ఒక్కటే. ఒకే 'ఆత్మసత్తా చైతన్యతత్త్వం' సర్వత్రా వెలయుచున్నదని అనుభూతమొనర్చుకో.

శిల ఒక్కటే అయినప్పటికీ ఒక శిల్పి అనేక ఆకారాలుగా మలచి చిత్ర విచిత్ర శిల్పాలుగా తయారుచేసి మన ముందు ఉంచుతున్నాడు. మనం వాటినన్నిటినీ చూచి 'ఆహా! గొప్ప కళాకారుడే!' అని సంతోషిస్తున్నాం. అట్లాగే ఏకైక చిద్రూపమే ఈ విస్తార జగత్తుగా వెలయుచున్నది.

శ్రీరాముడు: మహర్షీ! ఈ జగత్తు వస్తుతః ఏమై ఉన్నది?

శ్రీవసిష్ఠ మహర్షి: 'ఇంద్రియాదులకు విషయమే కానట్టి, శుద్ధమైన – చిదేకరసమైన పరబ్రహ్మమునందు మనస్సుననుసరించి స్ఫురించే విషయరూపమైన అన్యథాజ్ఞానమే జగత్తు'... అనునదే ఈ జగత్తుకు నిర్వచనం. ఈ జగదాకార మనోజడత్వమంతా కారణమంటూ లేనిదే అగుచూ 'ఆకాశము నందు శూన్యము' అను చమత్కారంలాగా వర్తించుచున్నది. చూచువానిలో కలుగు మిథ్యాజ్ఞానం కాకుండా ఈ జగత్తుకు వేరే కారణమంటూ ఏదీ లేదు.

❖❖❖

5. దృశ్య వృత్తి - దృశ్య నిర్వృత్తి

శ్రీవసిష్ఠ మహర్షి: ఓ రామచంద్రా! ఇప్పుడు ఒక పరమ సత్యమును ప్రతిపాదిస్తున్నాను.... విను.

ఈ దృశ్యమును గూర్చిన వృత్తియే బంధము. దృశ్యజ్ఞాననిర్వృత్తియే మోక్షము. అంటే... 'ఈ దృశ్యములో నేను ఒకానొక వస్తువును గాని, విషయమును గాని కాను. ఈ దృశ్యము నా యందు విషయము కాదు' అను సర్వ సంబంధాతీతమైన జ్ఞానమునే మోక్షజ్ఞానం అని పిలుస్తున్నారు.

1. ఇవేమీ నేను కాదు, 2. ఇదంతా నేనే ఈ రెండిటిలో నీకు ఏది నచ్చితే అద్దానిని శీఘ్రంగా దృఢతరం చేసుకో.

అంతేకాదు... సృష్టి-అసృష్టి, బంధం-మోక్షం, జ్ఞానం-జ్ఞానం యొక్క అభావం... ఇవన్నీ కూడా సాక్షి యొక్క జ్ఞానస్వభావాలు మాత్రమే కనుక అవి సాక్షికి అభిన్నాలే. ద్రష్టను బట్టే దృశ్యాలు ఉంటున్నాయి. ద్రష్ట కంటే అవి వేరుగా ఉన్నాయని ఎవరూ నిరూపించలేరు. ఇది స్పష్టంగా తెలుసుకున్నవాడవై ఆ తరువాత ఇక నీ ఇచ్ఛ వచ్చినట్లు ఈ జగత్తులో సంచరించు.

❖

ఈ జగత్తు అనబడేది చూడనంతమాత్రం చేత లేకుండా పోగలదు. అట్టి దీని గురించి ప్రయాస ఎందుకో చెప్పు? ఈ జగత్తును త్యజించినప్పటికీ ఏ స్వసత్త శేషించియే ఉంటోందో... అది ఎప్పటికీ, ఎల్లస్థానము లందూ లభించియే ఉన్నదని గ్రహించు.

ఈ జగత్తు అనేది దీనిని స్మరించుట చేతనే కనబడుతోంది... స్మరించబడనప్పుడు లేకుండా పోతోంది.

ఈ జగత్తుకు సాక్షియగు నీ స్వస్వరూపుడు అట్టి సంస్మరణ - విస్మరణలకు కర్త అయి కర్తృత్వ - అకర్తృత్వ స్వభావుడై ఉన్నాడు. అతడు జగత్తు ఉన్నప్పుడూ ఉన్నాడు. జగత్తు లేనప్పుడూ ఉన్నాడు. అతనిని స్పష్టీకరించుకున్నవాడవై ఆ తరువాత ఈ జగత్తునందు నీ ఇష్టమైనదానిని ఆశ్రయించు.

తరంగము నీటి యొక్క స్పందమే కదా! ఈ జగత్తు కూడా నీ స్వస్వరూపమగు 'చిత్తు' యొక్క హృదయ స్పందన మాత్రమే. స్వస్వరూపభావము నుండి ఏర్పడిన కించిత్ 'చ్యుతి' మాత్రమే!

జల - తరంగములకు గల భేదమే బ్రహ్మము - జగత్తులకు ఉన్నది.

అనగా, ఏమిటి?... ఈ జగత్తుకు, బ్రహ్మమునకు సత్యదృష్టిలో అసలు భేదమే ఉండి ఉండలేదు.

నీటియందు మొట్టమొదట 'తరంగములు' అనేవి లేవు. ఆ తరువాత కూడా లేవు. చూచువాడు నీటి యొక్క చలనవ్యవస్థకు 'తరంగములు' అను పేరు పెట్టి పిలుచుచున్నాడు. 'తరంగములన్నీ జలం మాత్రమే'... అను విషయం మరచుచున్నాడు. అలాగే, బ్రహ్మమునందు మొట్టమొదట ఈ జగత్తు లేదు. ఇప్పుడూ లేదు. తరువాత కూడా లేదు. కానీ అజ్ఞానదృష్టి కలిగియున్న వాడు మాత్రం తన యొక్క ఆరోపణ దృష్టి చే ఈ కార్యభూతమగు జగత్తును పరిగణించుచున్నాడు. కనుక ఈ జగత్తు 'వేదన' వలన లభిస్తోందని, 'వేదనాక్షయం' చేత ఇక్కడేమీ లేదని తత్ప్రయత్నపరులు ఎరిగియే ఉన్నారు. ఈ సభలోని అనేకమంది విజ్ఞులు ఈ విషయం తెలుసుకొనియే ఉన్నారు.

❖

కాబట్టి "స్వయం ప్రకాశ ఆత్మరూపము - చైతన్యమాత్రము అగు బ్రహ్మమే అవిద్యావరణము స్వస్వరూపమును ఏమరచి జగత్తు స్వరూపంగా కల్పించుకొనుచున్నది"... అనునదే ఇక్కడ సిద్ధాంతము. 'చిత్' రూపమగు పరమాత్మయొక్క పారమార్థిక స్వరూపం జ్ఞానమయమేగాని, జడం కాదు. ఇక ఈ జగత్తు అంటావా?... ఇదంతా ద్రష్ట యొక్క భేదభావము వలన కల్పించబడినది మాత్రమే!

ఓ రామచంద్రా! అట్టి భేదభావమును శ్రుతులు చెప్పుచున్న ఉపాయములను అనుసరించి క్రమక్రమంగా ఉపసంహరించుకో. అప్పుడు 'ఈ జగత్తు కేవలం నామమాత్రం'... అని గ్రహించ గలవు. అట్టి నామమాత్రమైనది కూడా బ్రహ్మమున లేదు. అది సర్వదా ప్రశాంతము, శివస్వరూపము, నిష్కళంకము అయి ఉన్నదని గ్రహించు.

❖

ఈ జగత్తంతా సర్వదా ఆత్మచైతన్యమే ఉన్నది. 'జగత్తు యొక్క శబ్ద - అర్థములు బ్రహ్మము కంటే వేరైనదేదో కాదు'... అని మరొక్కసారి ప్రకటిస్తున్నాను. జగత్తు - బ్రహ్మము అనబడే రెండు వస్తువులు ఏనాడూ లేవు. తరంగ-జలము లనబడే రెండు వస్తువులు ఏనాడైనా ఉన్నాయా?

శ్రీరాముడు: అవట్లా జీవునకు ఎందుకు స్ఫురిస్తున్నాయి?

శ్రీవసిష్ఠ మహర్షి: చెప్పాను కదా! కేవలం అజ్ఞానమే అందుకు కారణం. అజ్ఞానమనేది సత్యమును పరిశీలించక పోవటం చేతనే కలుగుతోంది. పరిశీలించక పోవటమనేది ప్రయత్నలోపం వలన, విషయములందు చిక్కిన మనస్సు ప్రబుద్ధం కాకపోవటం చేత సంభవిస్తోంది. అజ్ఞానావస్థలో కనిపించే ద్వైతము జ్ఞానము వికసించగానే తొలగిపోవుచుండగా... ఇక జగత్ - బ్రహ్మములకు ద్వైతము ఎట్లా ఆపాదించగలవు చెప్పు? కాబట్టి జగద్భ్రమ తొలగటం, సంసారమును దాటటం, మోక్షమును పొందటం... ఇవన్నీ శిష్యునిలో సత్యదృష్టిని నిదురలేవటానికే చెప్పుచున్నాం. అంతేగాని, అవన్నీ వాస్తవానికి అసంగతములే.

❖❖❖

6. గణపతిత్వం

శ్రీరాముడు: మునీశ్వరా! మనం జీవట భిక్షుకుని స్వప్నోపాధుల గురించి ప్రస్తావించుకుంటున్నాం కదా! అతని జీవట - భిక్షు - బ్రాహ్మణ - హంసాది శరీరములకు ఆ తరువాత ఏమి సంభవించింది?

శ్రీవసిష్ఠ మహర్షి: రుద్రుని ప్రేరేపణచే నిదురలేచిన జీవట-భిక్షు-బ్రాహ్మణ-హంసాదులు రుద్రుని అనుసరించారు కదా! వారంతా పరస్పరములకు సంబంధించిన భూత-భవిష్యత్-వర్తమాన వ్యాపారములను వీక్షించి కృతకృత్యులైనారు. నిర్వేదనచే సుఖవంతులైనారు.

అప్పుడు రుద్రుడు 'నేను కొంతసేపు నిదురించెదను గాక!' అనుకున్నాడు. స్వాంశసంభూతులగు ఆ జీవటుడు, బ్రాహ్మణ యువకుడు, సామంతరాజు మొదలైనవారిని చూచి ఇట్లు ఆజ్ఞాపించాడు.

శ్రీరుద్రుడు: ఓ జీవటాదులారా! మీరు మీమీ తావులకు వెళ్ళండి. అక్కడి మీ భార్య - పుత్రాది సహజీవులతో కొంతకాలం ఉండండి. మీ భోగవాసనలు తృప్తి పొందిన తరువాత తిరిగి నా దగ్గిరకు రండి. ఆ తరువాత మీరంతా నా అంశమున రుద్రనగరంలో రుద్రగణరూపాన్ని ధరించెదరు గాక! మహాప్రళయంలో ఈ జగత్తంతా క్షయం కాగానే మనమంతా కలిసి పరమపదమున ప్రవేశిద్దాం.

❖

శ్రీవసిష్ఠ మహర్షి: ఓ రాఘవా! భగవంతుడగు రుద్రుడు వారందరినీ అట్లు ఆజ్ఞాపించి అంతర్ధానమైనాడు. ఇక వారంతా అంతరమున రుద్రగణములుగా వెలయుచు, బాహ్యమునమాత్రం సంసార దర్శనమును చేయు సాక్షి రూపమును ధరించారు. తమ తమ సంసారములలో ప్రవేశించారు. అక్కడక్కడ గాఢనిద్రలో ఉన్న భౌతిక ఉపాధులను నిదురలేపారు. మరల యథాతథంగా 'భార్య – ఆహారము – రాజ్యము – అను బంధములు' మొదలైన అనేక విషయములతో కూడిన సంసారమును అనుభవించసాగారు. ఇదీ, ఇప్పటి పరిస్థితి. వారంతా మరికొంతకాలం భోగములను అనుభవించ గలరు. ఆ తరువాత తమ శరీరానంతరం రుద్రలోకం పొందగలరు. ప్రమథగణంలో చేరి రుద్రభక్తులకు సుఖ–శాంతి–ఐశ్వర్యములు కలిగిస్తూ కొన్నాళ్ళు గణత్వము పొందుతారు. ఆకాశంలో దర్శనమిచ్చే నక్షత్ర మండలంలాగా వారు అప్పుడప్పుడూ లోకంలో అక్కడక్కడా భౌతిక రూపమున వెలయుచూ లోక కళ్యాణకారకులై జనులకు సాధన రూపంగా ప్రాప్తించగలరు.

❖❖❖

7. సంకల్పిత దేహములు

శ్రీరాముడు: హే గురువర్యా! తమరు చెప్పిన జీవటరుద్రుని కథనం నాకు చాలా ఆశ్చర్యం గొలుపుతోంది. నాకు కొన్ని సందేహాలు కూడా కలుగుచున్నాయి. జీవట – బ్రాహ్మణ – సామంతరాజాదులన్నీ ఆ భిక్షుకుని నిద్రకుపక్రమించినప్పటి స్వప్నతుల్యమైన సంకల్ప రూపములే కదా! అట్టి సంకల్ప రూపములు సత్యమై ఎట్లా భాసించాయి? సంకల్పము భౌతికంగా ఏర్పడటం, ఆయా బ్రహ్మాండముల లోని సంసారంలో తదితర జీవులతో సంయోగాదులు ఎలా ఒనగూడాయి?

శ్రీవసిష్ఠ మహర్షి: సర్వమునూ సర్వదా ఆక్రమించి ఉన్న (అధిష్ఠానమగు) చిత్ అంశము నందు ఈ భౌతిక–మానసిక జగత్తులు సత్యంవలె భాసిస్తున్నాయి. ఆద్యంత విద్వత్ దృష్టిచే చూస్తే ఈ సత్–అసత్ యుక్తములగు సంకల్పవిషయములకు స్వయంగా అస్థిత్వం లేదు. వాటికి అస్థిత్వం ఉన్నట్లు తోచటానికి కారణం ఏమిటంటావా? అవన్నీ దేనిపై ఆరోపించబడుచున్నాయో... అది నిత్యసత్యమగు బ్రహ్మం అగుట చేతనే!

ఆ సర్వము ఆత్మయే - అయితే జీవుల భోగదృష్టిని అనుసరించి ఈ సంకల్పిత విషయాలు క్రియాసామర్థ్యముతో అగుపడుచున్నాయి. ఈ సంకల్ప మాత్ర విషయములను నీవు వివేక బలంతో పరిత్యజించవలసి ఉన్నదని గ్రహించు.

స్వప్నంలో కనబడేవన్నీ కేవలం మానసిక సంకల్ప తరంగములు మాత్రమే కదా! సర్వకాలము లందూ అధిష్ఠానుభూతము అగు సత్‌చిత్ స్వరూపం స్వతఃగా స్వచ్ఛమై ఉండికూడా... ఈ దేశ – దేశాంతర ఆగమన – నిష్క్రమణాది క్రియా వ్యవహారాలన్నీ తోపింపజేస్తోంది. అయితే అట్టి ఆరోపిత సమయంలో కూడా అయ్యది అధిష్ఠానముగానే వెలయుచున్నది సుమా! 'దేశము – దేశాంతరము' అనబడేవి 1. ఇంద్రియపాటవము, 2. కాలము, 3. మార్గాన్వేషి ...అనే మూడు ఒనగూడినప్పుడు మాత్రమే సంభవిస్తాయి కదా! అలాగే చిత్‌వస్తువు లేకపోతే స్వప్న – జాగ్రత్ సుషుప్తులు సంభవించవు.

శ్రీరాముడు: ఓ మహర్షీ! ముక్కుకు సూటిగా అడుగుచున్నాను. ఈ దృశ్యరూపంగా పరిణమించేదంతా ఎట్లు, ఏ ప్రభావం చేత పరిఢవిల్లుతోంది?

శ్రీవసిష్ఠ మహర్షి: బ్రహ్మం సర్వాత్మకమైనది. తత్కారణంగా బ్రహ్మమే స్వరూపంగా గల ఈ అనుభవ స్వరూపుడగు జీవుని సంకల్పములను అనుసరించి పూర్వవాసనానుగతంగా 'చిత్తము' అనబడేది రూపుదిద్దుకుంటోంది. అట్టి చిత్తమునకు ఏదేది ఎప్పుడెప్పుడు పర్యాలోచితం అవుతుందో... అప్పుడప్పుడు అదంతా దృశ్యరూపముగా పొందబడుతోంది.

శ్రీరాముడు: ఒకడు ఏది సంకల్పిస్తే అది అట్లే దృశ్యరూపంగా పరిణమించగలదని మీ ఉద్దేశమా?

శ్రీవసిష్ఠ మహర్షి: అవును. సంకల్పము ననుసరించే దృశ్యము ఉంటోంది, ఉండగలదు.

శ్రీరాముడు: అయితే, ఒకడు 'ఇది ఇట్లు ఉండుగాక' అని సంకల్పించాడనుకోండి. ఉదాహరణకు ఒకడు ఒక కొండను చూచి 'ఇది పిండి అగు గాక' అని సంకల్పించినంత మాత్రంచేత అది పిండి అయిపోవటంలేదు కదా?

శ్రీవసిష్ఠ మహర్షి: ఎంత సంకల్పించినప్పటికీ అనేకులకు భౌతికమైన విషయములు సంకల్పానుసారం పరిణమించటం లేదు. ఉత్తమమైన అభ్యాసయోగం లేకపోతే పదార్థజాలం సంకల్పానుసారం ఉనికిని పొందజాలదు. యోగ, విజ్ఞానదృష్టి పొందినవారు సర్వత్రా తమ యొక్క సంకల్పానుగతంగా పదార్థాలను నిర్దేశించగలుగుచున్నారు. అదియే 'యోగబలం' అని పిలువబడుతోంది. యోగబలం అనేది ఏకాగ్రత యొక్క సాధనానంతర ప్రయోజనమేనని గ్రహించు. ఏకాగ్రత యొక్క సాధనబలం లేకపోతే ఎవ్వరికైనాసరే, సంకల్పసిద్ధి' అనే ఫలం లభించదు.

అభినివేశము + ధ్యాస ----> చిత్తము.

అట్టి ఈ చిత్తము ఉద్వేగసహితమైన ఒక విషయాన్ని సంస్మరణ పూర్వకంగా ఆశ్రయిస్తోంది. ఇంతలోనే అతిత్వరలో ఆ విషయాన్ని వదలి మరొక విషయాన్ని స్మరిస్తోంది. ఈ విధంగా అది అనుక్షణం ఉభయభ్రష్టత్వం పొందుతోంది. చిత్తము యొక్క చాంచల్యం కారణంగా సంకల్పములు బలహీనమై సిద్ధిని కలుగజేయలేక పోతున్నాయి. ఏకనిష్ఠుడగువాని కార్యములు నెరవేరటం లోకవిదితమే కదా! దక్షిణ దిక్కుగా ప్రయాణించేవారు పడమర దిక్కునగల గ్రామములు చేరజాలనట్లు సంకల్పార్థనిష్ఠులు మాత్రమే సంకల్పిత విషయాలు పొందగలుగుచున్నారు. సంకల్పము యొక్క ఏకాగ్రత – ప్రయోజనం గురించి ఇదివరకే అనేక విషయాలు ప్రస్తావించుకున్నాం కదా!

జనులు ఎట్టెదుటగా ఉన్న విషయములందు మాత్రమే బుద్ధిని నిలిపి, అంతవరకు మాత్రమే పరిమితమైన వివేచననే గ్రహిస్తున్నారు. వారు సంకల్పిత వస్తువును పొందగోరికూడా ఏకనిష్ఠులు కాకపోవటం చేత, ఏకాగ్రత పొందలేకపోతున్నారు. వారు వాస్తవానికి సంకల్పిత వాంఛితములను గాని, ఎదురుగానున్న వస్తువులనుగాని అసంపూర్ణంగా మాత్రమే పొందటం జరుగుతోంది.

అయితే ఆ భిక్షువు ఏకనిష్ఠుడవటం చేత రుద్రత్వం, సర్వాత్మకత్వం, రుద్ర సంబంధమైన సర్వజ్ఞత్వం పొందగలిగాడు. ఏకాగ్రత యొక్క ప్రయోజనంగానే అతనికి 'స్థితి' అనే పరమోన్నత అనుభవం కలిగింది. ఏకాగ్రతే లేకపోతే అనేక మందిలాగానే అతనికీ భావించినది లభించేది

కాదు. అంతరాళ వాసులగు జీవటుడు – బ్రాహ్మణుడు – సామంతరాజు – చక్రవర్తి మొదలైన వారు ఆ భిక్షుకుని సంకల్పఫలములగు జీవులే అయినప్పటికీ వారందరు వేరు వేరు లోకములలో ఉన్నప్పుడు ఒకరి గురించిన అనుభవం మరొకరికి కలుగుటలేదు. రుద్ర చైతన్యం యొక్క సమావేశేచ్ఛ వలననే ఆ వివిధ ఉపాధుల ప్రజ్ఞలు ఒకటితో మరొకటి ఒకచోట సమావేశమైనాయి.

శ్రీరాముడు: చైతన్యము దృష్ట్యా భిక్షుకుని మొదలు రుద్రుని వరకు ఒక్కటే అయి ఉన్నది కదా! ఒకరికి మరొకరు తెలిసి ఉండకపోవటం ఏమిటి?

శ్రీవసిష్ఠ మహర్షి: మాయ యొక్క వైచిత్ర్యం ఏమని చెప్పమంటావ్? ఈ జీవునికి ఈ ఉపాధికి ముందు విషయాలతో సంబంధమే ఉండటం లేదు కదా! నీవు ఒక స్వప్నాన్ని గాంచుచున్నావనుకో... అప్పుడు జాగ్రత్‌కు సంబంధించిన విషయముతో గాని, క్రితం రోజు స్వప్నాలతోగాని సంబంధం ఉంటోందా? లేదు. అట్లాగే ఇది కూడా!

ఆ పరమాత్మ యొక్క సంకల్పబలం చేతనే ఈ జీవసృష్టులు, వీటిలో భేదాజ్ఞానయుతులు – అప్రబుద్ధులగు జీవులు... మొదలైన వారంతా ఉత్పన్నమవటం జరుగుతోంది. అట్టి ఏక – అనేక శక్తి యొక్క ప్రకటన చేతనే రుద్రుడు – భిక్షువు మొదలైన వివిధ రూపములు ఏర్పడ్డాయి. అవన్నీ 'సంకల్పము, నిష్ఠ, ధ్యానము' అను త్రివిధత్వము యొక్క చమత్కారమేనని గ్రహించు.

ఈ కనబడు జీవులంతా భిక్షుకుని స్వప్నసదృశ వివిధ జీవుల వంటివారే సుమా! ఈ జీవుడు తన ధ్యానచింతాబలమును అనుసరించి ఏకత్వం, బహుత్వం, విజ్ఞత్వం, మూర్ఖత్వం, పాండిత్యం, నరత్వం, దేవత్వం మొదలైనవన్నీ పొందుచున్నాడు. ఆ వివిధ పరస్పర వ్యతిరిక్త ధ్యానములను... ఒక్కసారి అనేక ధ్యానములను, అనేకసార్లు ఒక్కొక్క ధ్యానమును పొందటం జరుగుతోంది.

ధ్యానమును బట్టి నైజము ఉంటోంది. నైజము (స్వభావము)ను బట్టి ఉపాధులు ఉంటున్నాయి. పరిమిత – అపరిమిత నైజముల నుండి భావనలు, భావనల నుండి నైజము ఏర్పడుచున్నాయి. అయితే ఈ జీవుడు పారమార్థికంగా బ్రహ్మ స్వరూపుడే.

బ్రహ్మస్వరూపుడగు ఈ జీవుడు అనంతుడు, సర్వశక్తిమంతుడు కూడా అయి ఉన్నాడు. అట్లయి కూడా ఒకే శరీరమున అభిమానము వహించి ఉన్నప్పుడు ఒక్క శరీరవ్యవహారమునకు మాత్రమే పరిమితుడై ఉంటున్నాడు. ఆతడు స్వతహాగా అపరిచ్ఛిన్నుడై ఉండటం చేత ఒక్కసారే అనేక శరీరములను ఆశ్రయించ గల అంతర్గతశక్తి ఉన్నవాడేనని యోగులు ఎరిగియే ఉన్నారు. అనేక శరీరములను ఆశ్రయించినప్పుడు ఆ వివిధ వ్యవహారములు ఒక్కసారే నిర్వర్తించగల 'చిత్‌శక్తి' ప్రతీజీవుని యందు దాగియే ఉన్నది సుమా! అట్టి అనేక శరీరముల ప్రకటనను అవతార పురుషులలోను, మహాయోగులగు లోకగురువులందు, మంత్రతంత్ర సమన్వితులగు రావణాది కొందరు అసురులందు కూడా మనం గాంచుచూనే ఉన్నాం.

❖

ప్రాణుల యొక్క కర్మలను అనుసరించే సర్వేశ్వరునియందు ఈ పిపీలికాది బ్రహ్మపర్యంతం ఉపాధులు, 'భూ–స్వర్గ–నరక–పాతాళాది లోకాలు' అనబడే ఈ సృష్టి అంతా వికసిస్తోంది. వాస్తవానికి

పరమేశ్వరుని యందు ఈ హింసాజనిత వైషమ్యాలుగానీ, కష్టసుఖాలు, సుఖదుఃఖాలు' మొదలైనవి గానీ లేవు. జీవులు ఏది కోరుకుంటున్నారో... అదే చిదాత్మయందు స్పందించి స్వయంగా సుసంపన్నం అవుతున్నది. స్వయంగా ఆపాదించుకున్న దేశ-కాల-క్రియా క్రమాలను ఈ జీవులు మోహం జోడించుకొని పొందుచున్నారు. ఇక్కడ 'ఏకాగ్రత - అనేకాగ్రత' అనే రెండు దృష్టులు పోటీపడి, జీవుని అభిలాష, అభ్యాసము, శ్రద్ధ, అవగాహలను అనుసరించి ఒకటి రెండవదానిని ఆక్రమించివేసి ఉండటం జరుగుతోంది. ఏకము, అనేకము మొదలైన అనుభవములన్నీ కూడా జీవుని నుండే బయలుదేరుచున్నాయి.

"ఈ దృశ్యమునకు వేరె, కేవల సాక్షినై, భావ నియామకుడనై ఉన్నాను... అను రూపంగా ఉండే భావౌన్నత్యమును సాధించిన యోగులు తమ ఇచ్ఛానుసారం శరీరములను ధరించగలుగుచున్నారు. యోగౌన్నత్యము లేని జీవులు కర్మల - ఇచ్ఛ - ఉద్వేగములననుసరించి ప్రవాహపతితులై, అస్వతంత్రులై విధివశంగా ఉపాధులను పొందుచున్నారు. సాధన, జ్ఞానములను అనుసరించే జీవునిలో యోగశక్తి రూపుదిద్దుకుంటోంది.

యోగశక్తి యొక్క పాటవమును అనుసరించి యోగి - యోగినులు తమ గృహమునందుగాని, వేరువేరు చోట్లగాని, వేరు వేరు లోకములందుగాని ఒకేసారి ఒకటి - రెండు - అనేక దేహములను ధరించు శక్తి కలిగి ఉంటున్నారు. అదంతా ధ్యాన - ధారణాఫలితంగా సుసాధ్యమేనని గ్రహించు. అలాగే మరికొందరు యోగులు నిగ్రహ-అనుగ్రహ సమర్థములగు అధికార దేహాలను ధరించి ధర్మ, శాస్త్ర, విధాన సంరక్షణములు నిర్వర్తిస్తున్నారు. ఇంకా కొందరు యోగులు ప్రారబ్ధమును త్వరితంగా పూర్తి చేయటానికి ఇహ-పరలోకములలో విభిన్న దేహములను అనుభవించటం కూడా ప్రసిద్ధమే.

ఇక మరికొందరు యోగులు ఉన్న చోట ఉండియే జగత్తులో అనేక చోట్ల అనేక కార్యక్రమములు నిర్వర్తిస్తూ ఉంటారు. ఉదాహరణకు కార్తవీర్యార్జునుడు అనే చక్రవర్తి తన గృహంలో ఉంటూనే జగత్తులోని అనేక మూలల గల తదితర రాజులను గడగడలాడిస్తూ శాసిస్తూ ఉండేవాడు. ఇలాంటి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. విష్ణుభగవానుడు లక్ష్మీసమేతుడై క్షీరసాగరంలో ఉండియే, ఇట్లు ఈ పృథివిపై ధర్మరక్షణార్థం అనేకసార్లు అనేక భూచర-జలచర అవతారాలు ఎత్తుతున్నాడు. అట్లాగే యోగినులు సువర్లోకంలో యోగిణీగణం మధ్యలో ఉంటూనే ఈ భూలోకంలో అనేకచోట్ల తమకు సమర్పించబడుచున్న బలులను గ్రహిస్తూన్నారు. ఇంద్రుడు స్వర్గ సింహాసనమున ఉండి అదే తరుణంలో భూలోకంలోని యజ్ఞశాలలో యజ్ఞభోక్తగా సాక్షాత్కారమౌతున్నాడు. శ్రీమన్నారాయణ అవతారమగు 'శ్రీరామచంద్రుడు' అను ఆరాధ్య స్వరూపుడవగు నీవు ఈ అవతారంలోనే ఒకానొక సందర్భంలో 14,000 రూపములు ధరించి 14,000 మంది రాక్షసులతో ఒకేసారి పోరాడి సంహరించి మరుక్షణం మరల ఒకే రూపం పొందటం చేస్తావు. ఈ మానవ రూపంతో అనేకమంది భక్తులకు ఆరాధ్యదైవమై యుగ-యుగాంతరములందు రామభక్తుల ప్రణామాలు స్వీకరించి వారిని అనుగ్రహిస్తూ ఉంటావు. శ్రీరామావతారమగు ఆ మహావిష్ణువు ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడుగా అవతరించి దుర్యోధనుని

సభలోను, యుద్ధరంగంలో అర్జునుని విషాదం పోగొట్టి అనుగ్రహించటానికి శతసహస్ర విశ్వరూపధారి అయి భక్తులకు ప్రత్యక్షమౌతాడు. మళ్ళీ తన విశ్వరూపాన్ని ఉపసంహరించి మానుషరూపం ప్రకటించి, ఆ తరువాత అనంతకాలం ఆశ్రితవాత్సల్యంతో భక్తులముందు మానవరూపంలో ప్రత్యక్షమై ఉండగలడు.

'నిమి' అనే పేరు గల ఒక రాజర్షి విదేహముక్తిని సంపాదించాడు. అట్టి విదేహముక్తి సమన్వితుడై సమస్త దేహాల నేత్రాలతో దర్శన ప్రక్రియారూపంతో వసించుచున్నాడు. ఒకే సమయంలో ఈ భూత-భవిష్యత్-వర్తమాన దేహాల కళ్ళలో ప్రవేశించి ఉంటున్నాడు. భగవంతుడు సర్వదా ఒక్కడే అయినప్పటికీ అసంఖ్యాక అవతారాలతో ఆయా భక్తుల ముందు ప్రత్యక్షమగుచున్నాడు. ద్వాపర యుగంలో శ్రీకృష్ణభగవానుడు పదహారువేల రూపములు ధరించి పదహారు వేలమంది గోపికలతో ఒకేసారి క్రీడించగలడు.

ఇట్టి చమత్కారమును అనుసరించే ఆ భిక్షువు జీవటుడు, రాజు, చక్రవర్తి మొదలైన అనేక ఉపాధులను వేరు వేరు జగత్తులలో దాల్చాడు. రుద్రశక్తిచే ఉపాధులను ఒకచోట సమాయత్తపరచాడు కూడా. మరల ఆ ఉపాధులు తమతమ లోకములలో ప్రవర్తించేటట్లు సంకల్పించాడు. వారందరూ తిరిగి రుద్రుని చేరగలరు. వారంతా భూ - స్వర్గ - బ్రహ్మ - విష్ణు - మహేశ్వర లోకములలో పూజార్హులు కాబోవుచున్నారు కూడా!

❖❖❖

8. మోహవశాత్తుగా సుదీర్ఘ పయనం

శ్రీవసిష్ఠ మహర్షి: ఓ రామచంద్రా! ఆ భిక్షుకుడు ఒకచోట ఆసీనుడై కొంచెం చింతన చేసి తనయందుతానే తన పూర్వ ప్రారబ్ధమును వేరువేరుగా ఆయా... ఉపాధుల రూపంలో వేరువేరు దేశ-కాలములలో గాంచటం జరుగుతోంది. వాస్తవానికి "అతనికి అనుభవయ్యేది - ఆతడు" ఈ రెండూ... కూడా ఆత్మయే కాక మరింకేదీ కాదు.

ఈ జీవులందరి విషయం కూడా ఇట్టిదేనని గ్రహించు. మరణ కాలమున సారభూతమైన స్వకర్మయే ఉత్తరోత్తర జన్మలకు కారణమగుచున్నది. స్వప్నసదృశమైన ఇట్టి జన్మపరంపరలు మోక్షస్థితివరకు భాసిస్తూనే ఉంటాయి. అయినా కూడా ఇదంతా చిదాకాశముకంటే వేరే మరొకటేదీ కాదు. ఆత్మయే ఈ సంసార విభాగములన్నీ తననుండి వేరు చేసుకుని "అనుభవము" అను పరిజ్ఞానం ద్వారా తనయందే ఇదంతా పొందుతోంది. ఇక ఈ వర్తమాన జన్మ విషయానికి వస్తే ఇది ఇతఃపూర్వము మృతించిన జీవుడు పొందుచున్న మరొక స్వప్నం అనికూడా అనవచ్చు. ఓ రఘురామా! ఈ విధంగా స్వతఃగా అపరిచ్ఛిన్నుడగు ఈ జీవుడు పరిచ్ఛిన్నుడై దేహాదులను ఎట్లు పొందుచున్నాడో తెలియజేయటమే ఈ భిక్షుకోపాఖ్యానం యొక్క ఉద్దేశం. ఆ భిక్షుకుడే కాదు ఆత్మ నుండి విచ్యుతులైనట్టి ఈ జీవులందరూ కూడా పైనచెప్పిన విధంగా ఒక మోహమునుండి మరొక మోహం పొందుచున్నారు. ఇదంతా కూడా ప్రతిరోజూ ఒకడు ఒక స్వప్నంలో ప్రవేశించి, ఆ తరువాత ఆ మరునాడు మరొక స్వప్నంలో ప్రవేశించటం వంటిదేనని గ్రహించు.

పర్వతాగ్ర పరిభ్రష్టోహ్యధో అధ ఉపలోయధా ।
పరమాత్మ పరిభ్రష్టో జీవః స్వప్నమిమంధృథమ్ ॥

పర్వతశిఖరం పైనున్న ఒక శిల విభాగం క్రిందకు జారి అధఃపతనం అవుతూ ఎక్కడో లోయ లోకి పడిపోతోంది చూచావా? పరమాత్మ నుంచి చ్యుతి పొందిన ఈ జీవుడు 'దేహపరంపరలు' అనే అధఃపతనాన్ని గాంచుచున్నాడు. తన అభ్యంతరమున ఉన్న మాయ వలన శైథిల్యం పొంది 'నేనీ అల్ప శరీరాన్ని' అని భ్రమిస్తున్నాడు. "దేహాల రాక–పోకలకు ఆవల అప్రమేయమై వెలుగొందే ఆత్మయే నా స్వరూపం"... అను ఆస్వాదన పెంపొందనంత వరకు ఈ ప్రయాణం ఇట్లే కొనసాగుతోంది.

అతనెప్పుడో యథార్థం తెలుసుకుని, అప్పుడు తక్షణం ఈ శరీరములతో భ్రమచే ఏర్పడే సంబంధములను గుర్తెరిగి ఆత్మ యొక్క అనుభవమును పొందగలడు.

శ్రీరాముడు: ఆహా! మునీంద్రా! ఈ జీవుని పట్ల 'విషయము' అనే మోహం ఎన్నెన్ని చిత్రములకు దారి తీస్తోంది! ఈ జీవుడు తానెవరో తన నిజస్వరూపము ఏమిటో గ్రహించకుండా, ఈ విషయ స్వప్నమునందు నిదురిస్తున్నాడు కదా! నానావికారములతో కూడిన తన మనస్సుచే 'మిథ్యాజ్ఞానం' అనే రాత్రియందు సకల భేదదృష్టులతో కూడిన ఈ దృశ్య సమూహములను తనయందు తానే పొందుచున్నాడు. ఇట్టి మాయా జగత్తునందు అన్నియూ సంభవమేనని నేను ఒప్పుకుంటున్నాను. మీరు సంభవయోగ్యమేనని చెప్పినది తప్పక అనుభవసిద్ధమే.

ఇప్పుడు నాదొక చిన్న ప్రశ్న – మీరు చెప్పిన మహాత్ముడగు ఆ భిక్షుకుడు నిజంగా ఉన్నాడా? లేక మా మీద దయతో బోధ కొరకు 'భిక్షుకుడు' అనువాని గురించి, ఆతని ఉపాధి పరంపరల గురించి కల్పించి చెప్పారా? ఈ విషయం తెలియజేయవలసినదిగా నా విన్నపం.

శ్రీవసిష్ఠ మహర్షి: ఇప్పుడు నేను చెప్పిన భిక్షుకుని వృత్తాంతమంతా నేను భౌతికంగా చూచి చెప్పినది కాదు. అదంతా నా అంతర్దృష్టిచే ఈ బోధరూపంగా ఈ సందర్భంలో స్ఫురించింది. అయినా కూడా "అది యాదృచ్ఛికం, అయథార్థం కాజాలదు" అని అనుకుంటున్నాను. నా దివ్యదృష్టి యొక్క బలంతోనే కదా, నేనిదంతా చెప్పుచున్నది!

నీవిప్పుడు అడిగావు కనుక నేను ఈ రోజు రాత్రి సమాధిని అవలంబించి ఈ ముల్లోకాలు సంచరించి వస్తాను. ఆ భిక్షుకుడు నిజంగా ఉన్నదీ, లేనిదీ నీకు రేపు ఉదయం బోధలో వివరిస్తాను.

❖

రాజులు, పౌరులు, తదిర సభికులు శ్రీ వసిష్ఠమహర్షిని సమీపించి ఆయనకు పాదాభి వందనములు సమర్పించారు. సభికులంతా ఆహా! మేము ఈ జన్మ – మృత్యువుల మధ్య పరిమితులమై ఉన్నామని ఇంతకాలం అనుకుంటూ వచ్చాం. మమ్ములను రోదింపజేయుచున్న ఈ మాయ కేవలం స్వకీయమైనదే కదా! ఇంతకీ ఆ భిక్షుకుడు వసిష్ఠ మహర్షికి తారసపడతాడా? ఏమో? రేపు ఆయన ప్రవచించే విశేషాలు వినవలసిందే! అని చెప్పుకుంటూ గృహోన్ముఖులయ్యారు

❖❖❖

(పదహారవ రోజు విచారణ పూర్తి అయింది)

❖❖❖

పదిహేడవ రోజు

9. సూక్ష్మదేహంతో అన్వేషణ

శ్రీవాల్మీకి మహర్షి: ఓ భరద్వాజా! వింటున్నావుగా! మరునాడు 17వ రోజు సభ పునః ప్రారంభమైంది. ఆకాశంలో నక్షత్రాల లాగా శ్రీరామలక్ష్మణాదులతో, తదితర మహనీయులతో ఆ అయోధ్యలోని సభ ప్రకాశకాంతులు విరజిమ్ముచున్నది. సభికులంతా వసిష్ఠ మహర్షి కనుగొనినదేమిటో వినాలని ఉత్సాహపడుచున్నారు. దయాశాలురగు సాధుపుంగవులు ఈ సంసారజనుల పాట్లు చూచి, వారికి బలవంతంగానైనా సరే బోధ చేస్తూనే ఉంటారు. అట్లాగే శ్రీ వసిష్ఠ మహర్షి ఎవరి ప్రశ్నకై వేచి ఉండకుండానే ఇట్లు బోధ కొనసాగించారు.

❖

శ్రీవసిష్ఠ మహర్షి: ఓ సభికులారా! నిన్నటిరోజు చిట్టచివర ఈ రామచంద్రుడు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పాలనే ఉద్దేశంతో జరిగిపోయిన రాత్రి నేను సమాధిని ఆశ్రయించాను. సూక్ష్మశరీర ధారినై జ్ఞాననేత్రంతో మూడు లోకాలూ అన్వేషించాను. ఆ భిక్షుకుని కొరకై వెదుకుచూ సప్తద్వీప – సప్తకుల సమన్వితమగు ఈ పృథివిపై అంతటా ధ్యానమార్గంలో పరిభ్రమించాను.

మనోరాజ్యం బయట దొరికేది కాదు కదా! ఆ భిక్షుకుడు కనబడనంత వరకూ నేను అట్లే మారుమూలలా తిరుగాడుచూనే ఉన్నాను.

రాత్రి మూడవ జామున గాలిచే కొట్టబడిన ఒక పెద్ద సముద్రతరంగంవలె నేను ఉత్తరదిక్కుగా వెళ్ళటం జరిగింది. అక్కడ 'వల్మీకం' అనే పేరుతో ప్రసిద్ధి కెక్కిన ఒక ప్రాంతం ఉన్నది. ఆ జనపథం దాటగానే 'జిన' అనే ఒక గ్రామం ఉన్నది. ఆ గ్రామంలో 'విహారం' అనే పేరు గల ఒక జనసమ్మర్దమైన స్థానం ఉన్నది. అక్కడ చాలా ఇళ్ళు ఉన్నాయి. ఆ ఇళ్ళకు కొంచెం దూరంగా 'దీర్ఘదృశుడు' అను పేరుతో జనులు పిలిచే ఒక భిక్షుకుడు ఉన్నాడు. ఆతడున్నది పాడుబడిన ఒక కుటీరంలో. సామాన్యంగా ఆతడు ఆ కుటీరం వదలి బయటకు రాడు. అతడు అక్కడ ఎంతకాలంగా ఉంటున్నాడో అక్కడివారి కెవ్వరికీ తెలియదు. అక్కడివారెవ్వరూ అతనిని అంతగా ఏమీ పట్టించుకోరు. అక్కడి పెద్దలు మాత్రం అతనిని 'దీర్ఘదృశుడు' అని పిలుస్తూ ఉంటారు. అతనికి కొద్దిమంది శిష్యులు మాత్రం ఉన్నారు. వారిని గురించిన వివరాలు అక్కడి కొద్దిమందికి మాత్రమే తెలుసు. ఆ భిక్షుకుడెప్పుడన్నా రాత్రి కొంత పొద్దుపోయిన తరువాత తన భిక్షుపాత్ర పుచ్చుకొని కొన్ని ఇళ్ళకు వెళ్ళుచూ ఉండేవాడు. మౌనంగా నిలబడే ఆతనికి వాళ్ళు కొంచెం ఆహారం ఇవ్వగానే ఊరి చివరి కుటీరం వైపు మౌనంగా నడచి వెళ్ళిపోతూ ఉండేవాడు.

ఒక రోజు ఆతడు ఆ కుటీరానికి గల తలుపు మూసి ధ్యాననిమగ్నుడైనాడు. ధ్యానమునకు ఉపక్రమించే ముందే తన శిష్యులను ఒక నెల వరకూ తన సమాధిని భంగపరచవద్దని ఆజ్ఞాపించాడు. ఇప్పటికి ఆతడు 21రోజులు సమాధిలో ఉన్నాడు. నేను సూక్ష్మదేహినై ఆ కుటీరంలో ప్రవేశించాను. ఆతని ప్రియశిష్యులు తమ గురువు యొక్క ఆజ్ఞను అనుసరించి బయటనే ఉన్నారు. వారలు ఆ కుటీరంలో ప్రవేశించకపోవటం గమనించాను.

ఆతడు సమాధిలో ఉండి వేలాది సూర్యుల కాంతితో ఒప్పారుచున్నాడు. దీర్ఘ సమాధిలో ఉన్న ఆతనితో సంభాషించటానికి నేను సాహసించనైనా సాహసించ లేకపోయాను. ఆతని శిరోజములు కపిలవర్ణం సంతరించుకున్నాయి. ప్రాణములు నిరుద్ధమై ఉన్నాయి.

ఒక్కసారి అక్కడి నుండి నేను భూత – భవిష్యత్‌లలోకి తొంగిచూశాను. ఆతడు ధ్యాననిష్ఠలో ఉన్నది 21 రోజుల క్రితమే అయినప్పటికీ, తన చిత్తంతో వేలాది సంవత్సరాలు అనుభవించాడు. ఆతడు ఈ రోజే శరీరమును వదలి విదేహకైవల్యము పొందబోవుచున్నాడు.

❖

ఓ రామచంద్రా! ఆతని విదేహ కైవల్య చమత్కారమంతా గమనించి నేను ఆతనికి నా ఆతివాహిక దేహంతో సాష్టాంగనమస్కారం సమర్పించి వెనుకకు మరలాను. అప్పుడు నీ ప్రశ్నకు ఉచిత సమాధానం ఇచ్చే ఉద్దేశంతో 'ఇతః పూర్వకల్పంలో కూడా ఇట్టి చరిత్ర–ధారణ–విదేహముక్తి కలిగి ఉన్న భిక్షుకుడెవరైనా ఉన్నాడా? లేడా? గ్రహించాలి' అని అనుకున్నాను. నేనిప్పుడు చూచి వచ్చినది రెండవ భిక్షుకుడని, ఇంతకు ముందు కల్పంలో కూడా ఇట్టి చరిత్ర గల భిక్షుకుడున్నాడని గమనించాను. అప్పుడు నేను ఇంకా ముందు కల్పములు కూడా తరచిచూశాను. ఎంతో చతురతతో అంతకు ముందటి కొన్ని కల్పముల వరకూ వెదకినా కూడా మరి మూడవ భిక్షుకుడు అంతకు క్రిందటి ఆ కల్పములలో నాకు తారసపడలేదు.

❖

తిరిగి ఆశ్రమం ప్రవేశించిన నేను అట్టి భిక్షుకుని వృత్తాంతం గల వారెవరైనా ఇంకా ఉన్నారేమో గ్రహించటానికి మరికొంత ప్రయత్నించాలని అనుకున్నాను. అప్పుడు మరల సూక్ష్మదేహినై ఈ సృష్టి నుండి బయలుదేరి మరొక భవిష్యత్ సృష్టిలో ప్రవేశించాను. చిదాకాశమున వెలయుచున్న ఆ భవిష్యత్ సృష్టిలో 3వ భిక్షుకుడు ఉండి ఉండటం గమనించాను. బ్రహ్మ నిర్మితమైన ఆ సృష్టిలో కూడా మన ఈ వర్తమాన సృష్టి లాగానే అనేక జగత్తులు ఉన్నాయి.

శ్రీరాముడు: మీరు భవిష్యత్తులో ఉండబోయే ఆ సృష్టిలో ఇప్పుడే ఎలా ప్రవేశించగలిగారు? అందులో కూడా ఈ మన సృష్టిలాగానే పదార్థములు మొదలైనవి ఉన్నాయా?

శ్రీవసిష్ఠ మహర్షి: యోగబలంచేతనే నా మనస్సుకు అది సుసాధ్యమయింది. ఆ భవిష్యత్ సృష్టిలో కూడా ఇక్కడ తారసపడే పదార్థములను, ఆకారములను చూశాను. ఇటువంటివే అనేక జగత్తులు ఆ సృష్టిలో కూడా ఉన్నాయి.

ఈ సృష్టిలో ఆ భిక్షుకుడు, బ్రాహ్మణుడు, రాజు మొదలైనవి ఉన్నట్లే ఆ భవిష్యత్ సృష్టిలో కూడా అప్పటి భిక్షుకునకు ఆయా ఉపాధి పరంపరలు కల్పితమై ఉండగలవు.

ఓ రామచంద్రా! ఒక్క విషయం ఇక్కడ ప్రకటించదలచుచున్నాను. ఆ భిక్షుకునికి సంభవించినట్లే నాకు, నీకు, ఈ సభికులకు, తదితర జీవులందరికీ ఇట్టివి, ఇందుకు భిన్నమైనవి అయిన అనేక పూర్వ, తత్పూర్వ... భవిష్యత్, తత్‌భవిష్యత్ వృత్తాంతాలతో కూడిన అనేక కథనాలు జరిగిపోతూనే ఉన్నాయి. ఆ రాబోయే సృష్టిలో ఈ నారదమహర్షి ఇట్లే ఉండబోవుచున్నారు. ఈ సభలోని కొందరి కొందరి జ్ఞాన చరిత్రలు ఇట్లే ఉండబోవుచున్నాయి. ఈ సభలోని కొందరు ఆ రాబోవు సృష్టిలో అత్యున్నత జ్ఞానులై, మరికొందరు అల్పజ్ఞానులై ఉండబోవుచున్నారు.

ఇదంతా కూడా ఈ మాయ ఉన్నంతవరకూ... ఇలా ఒకసారి కాదు... అనేకసార్లు సంభవించ గలదు. ఇట్లు పూర్వం కూడా సంభవించింది. మరల భవిష్యత్‌లో సంభవించబోతోంది. సముద్ర తరంగాలను చూచావు కదా? అవి ఒకసారి విస్తరిస్తున్నాయి. మరొకసారి ఉపశమిస్తున్నాయి. ఒక్కొక్కసారి ఒకే తీరైన తరంగాలు మరల మరల వెలువడుచున్నాయి. ఇంతలోనే మరికొంతసేపు వేరు వేరు ఆకారం గల తరంగాలు ఎక్కడి నుంచో వస్తున్నాయి. అట్లాగే సృష్టి పరంపరలు మాటిమాటికీ విస్తరిస్తున్నాయి. మరల ఉపశమిస్తున్నాయి. కొన్ని సృష్టులు ఒకదానిలో మరొకటి అత్యంత సాదృశం కలిగి ఉంటున్నాయి. కొన్నిటికి అసలు పోలికయే ఉండటం లేదు. ఆహా! ఈ మాయ ఇట్లు విస్తరించి మహాత్ములగు వారిని కూడా మోహమున ముంచెత్తుతోందే!

శ్రీరాముడు: ఈ మాయ ఎట్లా కల్పించబడుతోంది? మానసిక చింతన చేతనా? లేక ఇదంతా శారీరక యత్నము చేతనేనని అనవచ్చునా?

శ్రీవసిష్ఠ మహర్షి: ఇదంతా ప్రతిభాస చేతనే ఉత్పన్నమౌతోంది. శారీరక - మానసిక యత్నములు లేకుండానే మాయ పరిఢవిల్లగలదు. మాయయే ఆ భిక్షుకుని విషయంలో 21 రాత్రులు అనేక యుగ - మన్వంతరముల అనుభవం కల్పించటం జరుగుతోంది. ఆయా సమయములందు ఆయా ఆకారములన్నీ దీర్ఘప్రయాణీకుడగు ఈ జీవునిచే మాయయే అనుభవింపజేస్తోంది. స్వస్వరూపసత్యం కించిత్ ఏమరచటమే మాయయొక్క చమత్కార విన్యాసానికి 'నాంది'.

మనస్సు యొక్క గతి ఎంతటి భయంకరమైనదో... గమనిస్తున్నావా?

అంతటికీ కారణం ప్రతిభాసయేనని మరొకసారి ప్రకటిస్తున్నాను. మనస్సు యొక్క అలజడియే ఈ భూత - వర్తమాన - భవిష్యత్ సృష్టులన్నిటికీ మూలపదార్థం సుమా! కదలుచున్న జలంలో అస్తవ్యస్తంగా బింబం ప్రతిబింబిస్తున్నట్లు, చంచలమగు మనస్సునందు ఆత్మస్వరూపమాత్రమగు ఈ దృశ్యం అస్తవ్యస్తంగా ప్రతిభాసిస్తోంది. ప్రతిభాసఖండములగు ఈ జగత్తులు, అట్టి ప్రతిభాస మాత్రమగు ఈ జగత్తులలోని ఈ జీవులు, వీరి వ్యవహారపరంపరలు - ఇవన్నీ కూడా మాయ యొక్క కార్యములే అయినప్పటికీ వీటికి వ్యవహార సత్త, కార్య-కారణ వైచిత్ర్యము, ఘనీభూతమైన సుఖ-దుఃఖ అనుభవాలు ఏర్పడి ఉంటున్నాయి. ఇదంతా సర్వవ్యాపకము, సర్వాత్మకము, చిదేకరసము

అగు బ్రహ్మమే అయినప్పటికీ మాయా దృష్టి ఉన్నంత వరకు ఇదంతా ఇట్లే ఉంటోంది. ఉండబోతోంది. తత్త్వబోధచే మాయ తొలగిందా... ఇక ఈ సృష్ట్యాదుల భ్రమ దానంతట అదే తొలగగలుదు.

❖❖❖

10. బ్రహ్మైక్య ప్రతిపాదన

దశరథ మహారాజు: ఓ మహర్షీ! మీరు ఆ భిక్షుకుని గురించి చెప్పిన విశేషాలన్నీ చాలా చమత్కారంగా ఉన్నాయి. నాదొక చిన్న విన్నపం. ఇది సముచితమేనని మీరు అనుకుంటే మీరు ఆ భిక్షుకుడు ఉన్నచోటికి సూక్ష్మశరీరధారులై సమీపించి అతనిని సమాధి నుండి లేపండి. మనం భటులను, మంత్రులను పంపి ఆయనను ఆ కుటీరం నుండి ఇక్కడికి సాదరంగా ఆహ్వానిద్దాం. ఆతని అంతరంగ వాణి ఏమిటో మేము మరింతగా గ్రహించవచ్చునేమోనని నా ఉద్దేశం.

శ్రీవసిష్ఠ మహర్షి: ఓ మహారాజా! ఆ మహాభిక్షుకుని శరీరం ఇప్పుడు ప్రాణరహితమై ఉన్నది. నేడే ఆతడు ఆ భౌతికదేహం త్యజించవలసి ఉండుట దైవనియతి. ఈ విషయం నేనిదివరకే చెప్పాను కదా!

ప్రాణచలనమునకు ఆధారమైన అన్నరసం ఆతని దేహమునందు పూర్తిగా శుష్కించి ఉన్నదని ఆతనిని చూడగానే నేను గమనించాను. ఇప్పుడాతడు జీవితుడుగా లేడు. ఎందుచేతనంటావా? ఆ దేహమును అనుభవించుటకు కావలసియున్న ప్రారబ్ధం ఆతని యందు ఏమాత్రం శేషించి ఉండలేదు. అట్టి ప్రారబ్ధం ఏమాత్రమైనా మిగిలి ఉంటే నేనే ఆతనిని సమీపించినప్పుడు పునరుజ్జీవితుని చేసి ఉండేవాడిని. ఆ శరీరమునందలి జీవుడు జీవన్ముక్తుడై, బ్రహ్మహంస అయి వెలయుచున్నాడు. ఆతడీ దృశ్య ప్రపంచ విశేషమునకు తిరిగివచ్చి, దేహముచే ఈ భౌతికలోకంలో మనబోటి వారితో ప్రవర్తించుటకు సిద్ధపడే సూచనలు కనిపించుటలేదు.

శ్రీరాముడు: మహాత్మా! ఆతని పాంచభౌతిక దేహమునకు ఏమి కానున్నది?

శ్రీవసిష్ఠ మహర్షి: ఆ భిక్షుకుడు తన శిష్యులకు వీడ్కోలు పలికేటప్పుడు 'ఒక మాసం వరకు ఈ గది తలుపులు తెరువవద్దు' అని నిర్దేశించి ఉన్నాడు కదా! ఆతని భృత్యులు ఆతని దర్శనము కొరకై బయటయే నిరీక్షిస్తూ ఉన్నారు. ఒకవేళ మీరు మీ భటులను పంపినప్పటికి ఆ శిష్యులు వారిని లోన ప్రవేశించనివ్వరు.

గురు ఆజ్ఞను అనుసరించి నెలరోజులూ గడచిన తరువాత వాళ్ళు ఆ గది తలుపులు తెరుస్తారు. ప్రియాతిప్రియుడగు తమ గురువు ఆ దేహమును త్యజించినట్లు కనుగొంటారు. ఆ భౌతిక దేహమును శుభ్రపరచి నదీజలంలో వదులుతారు. ఆ తరువాత ఆ సమాధిని ఆశ్రయించినచోట ఒక పూజా మందిరం నిర్మించగలరు. పూజ – భక్తి వ్యవహారార్థమై అక్కడ ఆ భిక్షుకుని ప్రతిమను నెలకొల్పుతారు. ఆ ప్రతిమ ఆ భిక్షుకుని భక్తులందరికీ ప్రియదేవతామూర్తిగా, ఉపాస్యదైవంగా ఆరాధించబడనున్నది. దృఢమనఃకల్పితమగు సర్వాత్మ–పరబ్రహ్మము యొక్క సంజ్ఞారూపంగా వారికి–వారివారి శిష్య పరంపరలకు సాక్షాత్కరిస్తూ మార్గదర్శకమై సుదీర్ఘకాలం పూజింపబడగలదు. కాలక్రమేణా అనేకచోట్ల

ఆ ప్రతిమవంటివే అనేకం నిర్మించబడి అనేకమంది సాధకజనులచే జగద్గురుభావంతో ఆరాధించ బడబోతోంది.

ఇట్లు నేను ఆతనిని సమీపించిన క్షణంలో ఆతడు ఆ దేహమునందే ముక్తుడై వెలయుచున్నాడు. ఆతని దేహం వినష్టమైపోయింది. కాబట్టి నాయొక్క పునఃప్రాణస్పందనయత్నం ఆతని పట్ల సఫలం కాలేదు.

❖

ఓ రామచంద్రా!

ఏషా గుణమయి మాయా దుర్బోధేన, దురత్యయా
నిత్యం సత్యావబోధేన సుఖేనైవాతివాహ్యతే ॥

త్రిగుణమయమగు ఈ మాయ జీవుని జ్ఞానము వలననే తన యొక్క విక్షేపశక్తిచే అనేక భ్రాంతిపరంపరలను విస్తరింపజేస్తోంది.

అయితే... జ్ఞానం వల్ల ఈ సర్వము ఆకృతిని కోల్పోగలదని గ్రహించు. ఈ మాయ అసత్యమే. అయితే ఏం? ఇది ఈ జగత్తులను ప్రదర్శించుచున్నది. ఆభరణంలో బంగారం దృష్టిన పడకుండా – ఆకారం దృష్టిని ఆకర్షిస్తున్నట్లు ఈ మాయ కూడా సత్యవస్తువును అన్యవిధంగా అనిపించేటట్లు చేస్తోంది. "జలమందు తరంగంలాగా పరమాత్మ యందు ఈ సృష్టులు అవాస్తవమైనవి మాత్రమే" అని శ్రుతులు చేతులెత్తి ప్రకటిస్తున్నాయి. ఒక్కసారి మొదలంటా ఈ సర్వమును మాయగా వీక్షించావా... సర్వభ్రమలు మరుక్షణం తొలగిపోతాయి.

ఆ పరమాత్మయే స్వయంకల్పితమైన అవివేకం చేత జీవత్వమును పొంది క్రీడగా స్వప్న – స్వప్నాంతరములను , జన్మ జన్మాంతరాలను పొందుచున్నాడు. ఓ రామచంద్రా! నీవు ఈ సర్వమును ఆత్మగానే అవలోకించు. అప్పుడు 'చిన్మాత్రం' మాత్రమే అన్ని వైపులా శేషించగలదు. 'బోధ' యొక్క బలం చేత ఏదైతే సర్వమూ ఆత్మగా తెలియవస్తోందో... అదియే అజ్ఞాన సమయంలో ముళ్ళపొదల వలె 'సంసారమండలం'గా ఉదయించి, ఏర్పడి ఉంటోంది. ఆ భిక్షుకుడు గాంచినవన్నీ మనఃతరంగ మాత్రములు, స్వప్నతుల్యములు మాత్రమే.

సమష్టి జీవుడగు హిణ్యగర్భుని మనోసంకల్పనిర్మాణమగు ఈ సృష్టి స్వప్నతుల్యం మాత్రమే. కాబట్టి వ్యష్టిజీవుడు చూచుచున్నది కూడా స్వప్నమే అయి ఉన్నది. ఇదంతా అశుద్ధచిత్తమున ఉదయించి అట్టి చిత్తదోష బలం చేతనే సత్యమైన దానివలె వెలయుచున్నది. చిత్తశుద్ధిని పొందినప్పుడు మాత్రమే ఇదంతా స్వప్నవిలాసము వలె అసత్యమని, అసత్తుల్యమని బోధపడగలదు. అప్పుడు "ఈ ప్రత్యేక జీవుడే కోటానుకోట్లుగా వెలయు బ్రహ్మాండ రూపుడు కూడా!" అని గ్రహించగలుగుతావు.

ఈ జీవుడు వ్యష్టి–సమష్టిగా, లేక సాధారణ–అసాధారణ ప్రపంచరూపంగా స్ఫురించుచున్నాడు. ఏది ఎట్లా స్ఫురించినా, స్ఫురించకపోయినా... ఆతడు అదంతా తన హృదయమున ఏర్పడే ప్రతిభాసకు అను రూపములగు విషయములే పొందుచున్నాడు.

అనగా ఈ 'జీవుడు' అనబడే ద్రష్ట తననుతానే తన ఆత్మను జగత్తు రూపంగా – దృశ్యం రూపంగా – స్వప్నమునందువలె – దర్శిస్తున్నాడు.

ఆ అనురూపములన్నీ ఒక్కొక్కసారి సుదీర్ఘంగా గాంచుచున్నాడు. అదంతా భ్రమయే కనుక స్వప్నమువలె మిథ్యయే అయున్నది. ఈ జీవుడు 'తత్త్వచ్యుతుడు' అయి చిత్తసత్తను ఆశ్రయించి క్రమక్రమంగా ఈ దేవ, నర, జంతు మొదలైన యోనులలోని ఒకానొకదాని యందు పడి జరామరణ దుఃఖాలను అనుభవిస్తున్నాడు. దేహములను సమాశ్రయిస్తున్న ఆ చైతన్యము చిత్తస్పందనము వల్ల జగత్ స్వప్నములను గాంచుచున్నది. ఆయా స్వప్నాలలో పాతాళ లోకాన్నో, లేక బ్రహ్మ లోకాన్నో కల్పించుకుని ఆయా భోగాదులచే తన్మయం పొందుచూ వెలయుచున్నది.

ఆ బ్రహ్మ చైతన్యమే ప్రాణకల్పనను ఒనర్చుకొని, ఆ ప్రాణవశమున ఉండు స్పందనరూపమును గ్రహించుచున్నది. అందుకు ఫలితంగా 'జీవుడు' అను పేరును బడయుచున్నది. తద్వారా 'నేను దేహమును' అనే భ్రమకు వశమగుచున్నది. ఆ దేహం నుండి పంచేంద్రియాల ద్వారా బయటకు వెడలి విషయాకారాన్ని పొంది విషయజ్ఞాన తదాత్మ్యము పొందుతోంది. ఇక ఏం చెప్పాలి? అనేక సంభ్రమములలో పడి పొరలుచున్నది.

ఏది ఎట్లైతే ఏం? ఈ జీవుని వాస్తవరూపం ప్రత్యగాత్మయే కదా! 'చిత్త ఉపాధి' అనే భ్రాంతి గొనినంత మాత్రం చేత బ్రహ్మం యొక్క స్వభావం మరొకటిగా మారగలదా? మారదు. దర్పణంపై నీటిచుక్కలు పడటంచేత ప్రతిబింబం అస్తవ్యస్తంగా కనబడవచ్చు. అంత మాత్రంచేత నీ ముఖం అస్తవ్యస్తం అవుతుందా? కాదుకదా! బ్రహ్మము ఎల్లప్పుడూ బ్రహ్మముగానే ఉన్నది. బ్రహ్మమునందు గల ఉపాధియోగం చేతనే ఇవన్నీ సంభవిస్తున్నాయి. ఉపాధి ఉండుట చేత గాని, లేక... లేకపోవుట చేత గాని పరమాత్మయందు కలిగే మార్పు చేర్పులేమీ ఉండవు. "బ్రహ్మము మునుపటి యోగ్యత పోగొట్టుకొంటోంది" అను వాక్యం ఏ సమయమునందునూ యుక్తియుక్తం కాదు. వేలకొలది అధ్యాసలు ఉండవచ్చు గాక! అధిష్ఠానం స్వస్వరూపాన్ని విడువదు. విడువజాలదు. ఎన్ని భావోద్రేకాలు ఏర్పడినా ఒకడు తన 'నేను'ను విడచి ఉండకపోవటమే అందుకు తార్కాణం. అందుచేత జీవబ్రహ్మైక్యం చేకూరుటకు ఎట్టి ఆటంకము లేదు. ఇదియే పరమపురుషార్థము.

❖

శుద్ధ ఆకాశము ఆకాశముననే వెలయుచున్నది కదా! జలము జలముననే వెలయుచున్నది. 'తరంగములు పొందుచున్నది కాబట్టి జలం జలత్వం నుండి బయల్వెడలింది.' ...అని ఎవరైనా సిద్ధాంతీకరిస్తారా? లేదు కదా! అట్లాగే వ్యావహారిక దృష్టితో చూచినా సరే, ఈ జగత్తు బ్రహ్మముననే వెలయుచున్నదని గ్రహించు. ఇక పరమార్థ దృష్టితో చూస్తే, వేరుగా చెప్పవలసిన పనేమున్నది?

దర్పణం – ప్రతిబింబం – బింబం – ఒకింత వేరువేరని తోచవచ్చునేమో. కానీ, ఈ జీవలోకం బ్రహ్మమునకు వేరుగా ప్రతిష్ఠ కలిగి ఉండలేదు. బాలురు అద్దంలో తమ ప్రతిబింబం చూచి భయం, ఉత్సాహం, ఉద్రేకం, ఆవేదన – పొందునట్లు అభయ బ్రహ్మమున వెలయుచున్న తమను

తామే చూచుకుని ఈ జీవులు భ్రమచెందుచున్నారు. తమ భావోద్రేకములే తదితరమంతా ప్రవేశించి ఇష్టము, అయిష్టము, కోపము, నిర్లిప్తము - మొదలైనవన్నీ అనుభవరూపాలుగా పరిణమింప జేస్తున్నాయని గమనించలేక పోతున్నారు.

❖❖❖

11. పరమ నిశ్శంక స్థితి

శ్రీరాముడు: అట్టి 'అన్యధా' అను బోధ ఎట్లా ఆత్మయందు ఉత్పత్తి అవుతోంది?

శ్రీవసిష్ఠ మహర్షి: (చిరునవ్వు నవ్వుతూ)

> **స్పందే స్పందీకృతేచ ఇహ స్వతః సంజ్ఞా విలీయతే ।**
> **సాప్యలం పరిణామేన లీలయే అగ్నౌ ఘృతం యథా॥**
>
> **చిత్స్పన్ద ఏవ చిత్స్పన్దే సర్వాత్మని విజృమ్భితః ।**
> **స్పన్దాస్పన్దౌ జృంభణాది కల్పితం! నాఽత్ర వాస్తవం ॥**

ఈ ద్వైతభావనకు, ఈ 'అన్యధా' భావనకు కారణం 'బుద్ధి యొక్క స్పందన' మనే చెప్పాలి. సమాధిని అభ్యసించటం ద్వారా ఈ బుద్ధి యొక్క స్పందనను నిలిపివేయటం జరిగితే అప్పుడు మిగిలి ఉండే స్థిరబుద్ధిని 'చరమసాక్షాత్కారం' అని పిలుస్తారు. అగ్నియందు నేయిని వ్రేల్చినట్లు అప్పటి చరమసాక్షాత్కార స్థిరబుద్ధిని కూడా బ్రహ్మమునందు వ్రేల్చితే అది విలీనమై ఆత్మ యొక్క అఖండ - అప్రమేయాది సంపదతో ఈ జీవుడు ప్రకాశించగలడు.

చిత్ స్పందనరూపమగు పరమాత్మయందే చిత్ స్పందనరూపమగు ఈ జగత్తు ప్రకాశించు చున్నది. కానీ, నిజానికి స్పందనము, అస్పందనము, జృంభణము మొదలైనవన్నీ చిదాత్మ పట్ల కల్పిత విషయములే అగుచున్నాయి.

ఓ రామా! ఈ జగదనుభవం వెయ్యి గొడ్డళ్ల వ్రేటులకైనా తెగదేమోనని అనిపించవచ్చు గాక! ఇదంతా కల్పనామాత్రమే కనుక, ఇదంతా కల్పనాత్యాగముచే నశించగలదు. అనగా, ఇప్పుడు 'దాట రానిది'గా అనిపించేదంతా కల్పనలన్నీ నశించినప్పటి దృష్టికి ఇది ఏదీ కాదు.

అందుచేత ఈ జగత్తు ఏదీ కాదు. శుద్ధచిన్మాత్రమగు స్వస్వరూపబ్రహ్మం ఒక్కటే ఒకే రీతిగా వెలయుచుండగా, ఇద్దానిని తత్త్వదృష్టితో పరికించకపోవటం చేత ఇందు "స్పందం, అస్పందం, ఏకం, అనేకం"... మొదలగు భావావేశాలు స్ఫురిస్తున్నాయి. ఇదంతా 'ఏదీ కాని ఒక శిలయందు కల్పించుకున్న ఏవేవో "శిల్ప-శిలా సంబంధ ప్రియాప్రియములు" వంటివి మాత్రమే. అందుచేత ఈ జగత్తు కల్పితం మాత్రమేనని గ్రహించు.

శ్రీరాముడు: 1. 'ఈ సర్వము బ్రహ్మమే', 2. 'సర్వమునకు అతీతమైనది బ్రహ్మము'... ఈ రెండు వాక్యములలోని సముచితార్థం విశదపరచమని ప్రార్థన.

శ్రీవసిష్ఠ మహర్షి:

సారేణ తు విచారేణ "సర్వ" శబ్దార్థ యోః సమే
చిన్మాత్రమేవ జ్ఞాతేఽయం నాస్తీత్యపి నవిద్యతే॥

'సర్వ' శబ్దము యొక్కయు, దాని అర్థము యొక్కయు ఏకస్వభావం విచారణచే తెలియవస్తుంది. అప్పుడు చిన్మాత్రవస్తువు సర్వదా ఒక్కటేనని నీవే గ్రహిస్తావు. ఆ సమయంలో భావాభావరూపము మాత్రమే అగు ఈ ప్రపంచం నీ యొక్క నిర్మలావగాహనచే లేకుండా పోగలదు. ఓ సర్వసభికులారా! ప్రియ ప్రవచన శ్రోతలారా! నా ఈ మాటలు విశ్వసించండి. ఈ ప్రపంచం ఏనాడు మీ కల్పనలకు వేరుగా లేనే లేదు. అవిచారణ యొక్క విస్తృతి చేతనే ప్రకృతికి చిహ్నమగు ఈ భేదమంతా ఉదయిస్తోంది. ఈ కనబడే భేదములన్నీ విలీనమైనప్పుడు ఆ పరవస్తువు ఒక్కటే మిగులుతోంది. మనం ఈ విషయమై అనేక రీతులలో అనేక కోణాలనుండి చెప్పుకుంటున్నాం. ఇంకా చెప్పుకోబోతున్నాం. ఏది ఏమైనా ఉన్న యథార్థ స్థితి ఇది. దీనిని మరెవ్వరూ మరొక విధంగా ఒనర్చజాలరు. అజ్ఞానం (లేక) అబోధ వలన నానాత్వదర్శనమంతా సంభవిస్తోంది. జ్ఞానం వల్ల నానాత్వదర్శనమంతా తొలగి పోగలదు. అప్పుడీ జీవుడు స్వయంగా పూర్ణచిద్రూపుడై ప్రకాశించుచున్నాడు. ఇదియే పరమార్థము.

అట్టి 'పరమ నిశ్శంక స్థితి' యందు సుస్థిరులై ఉన్న మహనీయులెందరో ఈ సభకు వేంచేసి మన ఈ సంవాదమునకు సాక్షులై దీనిని పరమపావనము, లోకకల్యాణపూరితము చేస్తున్నారు. వారంతా ఇప్పటికే ఆశ్రయించి ఉన్న అట్టి నిశ్శంకస్థితి (సందేహ రాహిత్య స్థితి) మరియు అభయస్థితి యొక్క బలం చేత మాత్రమే బంధమోక్షాల కల్పనలు, జాగ్రత్-స్వప్న-సుషుప్త్యాది ఆయా సంక్షుబ్ధావస్థలు ఈ జీవులు అధిగమించగలరు. అప్పుడు మాత్రమే ద్వైతభ్రాంతి సంపూర్ణంగా తొలగిపోగలదు.

❖

అజ్ఞానం వల్లే ద్రష్ట, దర్శనం, దృశ్యం – అను త్రిపుటీజ్ఞానంతో కూడిన ఈ జగత్తు అనబడేది ఉపలభ్యమౌతోందని పదే పదే ప్రకటిస్తున్నాను. ఏది అజ్ఞానంచే పొందబడుతోందో... అదంతా అసత్ లేక అసత్యమే సుమా! అట్టి అసత్‌కు నివృత్తి, లేక శమనం ఏమిటి? 'బ్రహ్మం మాత్రమే సత్యం (బ్రహ్మ సత్యం జగన్మిథ్యా)' అనునదే జ్ఞానం! అట్టి శుద్ధాత్మస్వరూపమగు శాంతియే (ఆత్మయే) సర్వే – సర్వత్రా వ్యాపించియున్నది. అది అట్లుండగా ఇక అందులో త్రిపుటికి చోటెక్కడిది?

సంకల్పం వలననే చిత్తం, ప్రాణం మొదలైనవన్నీ స్పందించుచున్నాయి. జ్ఞానోదయం అయినప్పుడు సర్వ సంకల్పాలు జ్ఞానవస్తువగు స్వస్వరూపమునందు లయించగలవు. సంకల్పాలు తొలగి పోయినప్పుడు స్పందనం అస్పందనమౌతుంది. చైతన్యం సంకల్పాలను వీడిన మరుక్షణం స్పంద-అస్పందాలు అనే భేదభావాలు తొలగిపోతాయి. మేఘాల వెనుక ఉన్న సూర్యుడు సర్వదా స్వయం ప్రకాశకుడే అయ్యున్నట్లు సంకల్పాలకు ఆవల ఉన్న చిత్ సర్వదా స్వయంప్రకాశకమే! వాస్తవానికి స్వయంజ్యోతి, స్వయం చైతన్య, స్వయమాత్మ – స్వరూపుడగు ఈ జీవుని స్వస్వరూపాన్ని దురవగాహన అనే మేఘాలు ఆవరించి ఉన్నాయి. అట్టి అల్ప-సంకుచిత-పరిమిత భావనా మేఘతరంగాలు అధిగమిస్తేనే చిద్ఘన బ్రహ్మము అనుభూతమవగలదు.

ఓ రాఘవా! నీవు విశాలమగు చిద్ఘనబ్రహ్మాపదమును అధిష్ఠించుము. "నేను సర్వదా పూర్ణుడనే" అను భావమునందు వెలయుము. నీవు చేయు సంకల్పాలన్నీ కూడా చిద్ఘనబ్రహ్మంతో ఏకరస స్వరూపము పొందియుండు గాక! 'ఇదివేరు... వారువేరు' అను పృథక్‌భావాన్ని త్యజించి ఉండు. ఓ సర్వజనులారా! 'మోక్షం' అనగా ఎన్నటికో, ఎక్కడో లభించేది కాదని మీరంతా గ్రహించి ఆత్మైక రసమును సంపాదించెదరు గాక! నిర్దోషమగు బోధసారమును గ్రహించెదరుగాక! భావాభావములు తమ యందు లయం చేసి వర్తించు మహనీయులు స్పర్శించు పదార్థములన్నీ అమృతమయం అవుతాయి. సత్యము యొక్క మహిమ అట్టిది సుమా!

భావాభావముల కల్పనకు ఏది కారణమై ఉన్నదో ...అద్దానిని నీవు నీ బుద్ధితో గమనించు. అట్టి కారణాత్మక చైతన్యం నందు సుస్థిరుడవై, ఈ బాహ్య విషయ జగత్తుకు అతీతుడవై చిద్బ్రహ్మం నందు విశ్రాంతి సుఖాన్ని అనుభవించు. పూర్ణాపూర్ణ దశలన్నీ ఏకీకృతమగునది ఏదైతే కలదో ...అదియే నీ స్వస్వరూపం. అంతేగాని, అది ఏదో తొలగిన తరువాత ఎప్పటికో ప్రాప్తించబోయేది కాదు సుమా! అట్టి బాల్యక్రీడలకు తావిచ్చి అజ్ఞుడవు కావద్దు.

❖❖❖

12.మౌన ధారణ

శ్రీవసిష్ఠ మహర్షి: ఓ రామచంద్రా! నీవు చిత్తము యొక్క స్వాభావికమైన ప్రవృత్తులను అనుసరించటం వదిలివేయి. 'సుషుప్తమౌనము' ను ఆశ్రయించుము. కల్పనా మాలిన్యములన్నిటినుండి విడివడుము. ఆ పరమపదం మాత్రమే అనుసరణీయం. ఆ పరమపదం నందు ఏది కలదో ...అదే నీవగుము. అదే నీ సత్య స్వరూపమై ఉండటంచేత అక్కడొక్కచోట మాత్రమే అకృత్రిమమైన శాంతి లభిస్తుంది. మరెక్కడా కాదు. అట్టి ఆత్మైక్యస్వరూపం నుండి చ్యుతిపొందకుండా దేదీప్యమానంగా వెలుగొందు!

శ్రీరాముడు: మౌనీశా! వాక్ సంయమ రూపమైనట్టి 'వాక్ మౌనం', ఇంద్రియాల సంయమ రూపమైనట్టి 'ఇంద్రియమౌనం' ఈ దేహాన్ని క్రియారహితం చేసే 'కాష్ఠమౌనం'ల గురించి నేను విని ఉన్నాను. మీరిప్పుడు 'సుషుప్తమౌనం అవధరించు' అని ఆజ్ఞాపించారు కదా! అదేమో దయచేసి వివరించండి.

శ్రీవసిష్ఠ మహర్షి: శాస్త్రకారులు సాధనపరులగు మునులను రెండు తరగతులుగా విభజించి చెప్పుచున్నారు.

1. కాష్ఠతాపస్సులు: వీరు బ్రహ్మవస్తువును భావన చేయక కేవలశుష్క క్రియలగు చాంద్రాయనం, ఇంద్రియ హఠం మొదలైనవి నిర్వర్తించేవారు.

2. జీవన్ముక్తులు: వీరు యథాభూతమగు బ్రహాన్ని వహించి ఉన్నవారు. తమ స్వస్వరూపమును అఖండమైనదిగా, అప్రమేయమైనదిగా, నిత్యమైనదిగా నిర్మలమైనదిగా, సత్యమైనదిగా సర్వమైనదిగా ధారణ వహించి ఉండేవారు. వీరు ఆత్మను ఆత్మయందు భావనాభ్యాసం చేస్తూ ఉంటారు. వీరు తదితరుల వలెనే (లేక) తదితర తపస్యుల వలెనే బాహ్యమున వ్యవహరిస్తూ ఉండవచ్చు గాక! అభ్యంతరమున మాత్రం నిరతిశయానందమును గ్రోలుచూ తృప్తిని వహించి ఉంటారు.

శ్రీరాముడు : 'మహామౌనము' అనగా నేమి? అది ఎవరికి లభ్యపడుతోంది?

శ్రీవసిష్ఠ మహర్షి: శాంతిభావమును పొందిన చిత్తనిశ్చయమునే 'మౌనం' అని అంటారు. మౌన విదులగు శాస్త్రకారులు 'ప్రథమ మౌనం నాలుగు రకాలుగా విభజించి చెప్పుచున్నారు.

1. వాక్ మౌనము : వాక్కును నిరోధించటం.

2. అక్షమౌనము : బలవంతంగా ఇంద్రియాలను నిగ్రహించి ఉంచటం. ఇదే ఇంద్రియ మౌనం అని కూడా అంటారు.

3. కాష్ఠ మౌనము : సర్వదేహ ప్రయత్నాలను విడిచిపెట్టి ఉండటం.

→ ఈ మూడూ 'కాష్ఠ మౌనం' అనే అంటారు. కాష్ఠతపస్వియే వీటిని అవలంబిస్తున్నాడు.

4. సౌషుప్త మౌనము : ఇంద్రియ–మనస్సులకు అతీతము వహించి విషయ రాహిత్యస్థితిని అభ్యసించటం. వీరు ఈ భౌతిక జగత్తును తిరస్కరించి ఏకాంతులై గాఢనిద్రతో పోల్చదగిన సమాధిని సాధన చేస్తూ ఉంటారు.

→ ఇది కాష్ఠమౌనంలోని ఉత్తరోత్తర స్తితి. జీవన్ముక్త లక్షణం.

❖

ఇక ఐదవది ఒకటుంది. అది మహామనో మౌనం. మనస్సు సంచలనరహితమగు స్థితి అది. ఇది సామాన్యజనులకు మూర్ఛ, గాఢ నిద్రలందు మాత్రమే ఏర్పడుతుంది. ఇది కాష్ఠ తపస్యులకు సాధ్యకాలంలో ఏకాగ్రత యొక్క తీవ్రతను అనుసరించి కలుగుచున్నది. అందుచేత మనోమౌనమును కాష్ఠమౌనంగానే పరిగణిస్తారు. అయితే, ఒక విధంగా చూస్తే, ఇది నాలుగిటిలోనూ పాల్గొనుచునే ఉన్నది కనుక ఐదవదిగా చెప్పరు.

జీవన్ముక్తులు ఆత్మతత్త్వమును అనుభవించుచున్నప్పుడు ఈ సర్వదృశ్యములలో ఉంటూ కూడా వాటి పట్ల ఒకానొక అతీతస్వభావమున సుస్థిరులై ఉంటారు. అందుచేత వారు మౌనాన్ని 'సుషుప్త మౌనం' అని పిలుస్తారు. కాష్ఠ తపస్వి మూడు విధములైన మనో, ఇంద్రియ, కాష్ఠమౌనాలను సాధనా పరిణామంగా అనుభవిస్తున్నాడు. సుషుప్తమౌన స్థితియందు 'తురీయావస్థ' అంతర్గతమై ఉంది. అయితే అది జీవన్ముక్తస్థితిలో మాత్రమే కాష్ఠమౌనసాధకులకు అనుభవయోగ్యమౌతుంది. అనగా, అభ్యాసబలం చేత కాలక్రమంగా సౌషుప్తమౌనం లేక జీవన్ముక్తస్థితి సాధకునకు లభిస్తోంది.

శ్రీరాముడు : మహాత్మా ! మోక్ష సాధకజనులకు వాక్ – అక్ష – కాష్ఠ మౌనముల అభ్యాసం నిర్వర్తించటం తప్పనిసరి అని మీ ఉద్దేశమా?

శ్రీవసిష్ఠ మహర్షి: జ్ఞాన సముపార్జనమే అన్నిటికంటే పరాకాష్ఠ. వాక్ – అక్ష – కాష్ఠ మౌనములు అభ్యాసపరంగా మౌనములే అయినప్పటికీ, అవి అశుద్ధ చిత్తం యొక్క దృఢనిశ్చయాలే అగుచున్నాయని గ్రహించు. అందుచేత అట్టి నిశ్చయములు జీవునకు జ్ఞానము లక్ష్యమయి ఉండకపోతే బంధమునే కలిగిస్తున్నాయి. జ్ఞాన బలం తోడైతే తప్పక ఉపకరిస్తాయి.

కాష్ఠమౌని బలవంతంగా ఇంద్రియములను నిగ్రహించుచున్నాడు కదా! తద్వారా జరుగుచున్న దేమిటి? లోపల అహంభావము యొక్క స్మృతిని వెలుపల ఆ దృశ్యప్రపంచమును, వాఙ్మయ ప్రపంచముల సంపర్కములను త్యజించటానికి శ్రమతో ప్రయత్నిస్తున్నాడు. అతడు నిరోధ ప్రయత్న శీలుడై ఉంటున్నాడు. నిద్రపోవువాడు కూడా ఈ జాగ్రత్ జగత్‌ను తిరస్కరించి మౌన – జడస్థితిని ఆశ్రయించి ఉంటున్నాడు. అది ఈ దేహారోగ్యానికి ఉపయోగిస్తూందేమో గాని, ఈ మాయాజగత్‌ను అధిగమించటానికి ఉపయోగించదు కదా! అట్లాగే కాష్ఠమౌని జ్ఞానదృష్టిని స్వీకరించకపోతే, సర్వేసర్వత్రా అజ్ఞానముతో కూడి ఆవరించియున్న పరిశుద్ధాత్మత్త్వమును దర్శించజాలడని నా అభిప్రాయం. అయితే జ్ఞానముతో కూడిన సాధన జీవుని జీవన్ముక్తునిగా తీర్చిదిద్దగలదు."అందుకు ఇది మాత్రమే మార్గం" అని ఏ ఒక్క సాధన విషయంలో కూడా ఎవరమూ నిర్దేశింపజాలమని గ్రహించు.

❖

జీవన్ముక్తుని ఆత్మదృష్టి అనునిత్యం వికల్పరహితమై ఉంటోంది. అతడు నివురుగప్పిన నిప్పు వలె ఆత్మచైతన్య ప్రకాశభావమును అంతటా గాంచుచునే ఉంటాడు. ఇక నిరోధయత్నమునందు నిమగ్నమైయున్న కాష్ఠమౌని, అట్టియత్నమునందు మనసా – కర్మణా నియమితుడై ఉండటం చేత అతని పూర్ణానుభవమునకు 'ప్రయత్నము' అనే ఒక తెర అడ్డుగా ఉండటం గమనార్హం. వాక్ – ఇంద్రియ – కాష్ఠములకు సంబంధించిన త్రివిధ మౌనములను ఆశ్రయించినవారు సమాధినుండి లేచినప్పుడు, వారి చిత్తము తగినంతగా నిర్మలం అయి ఉండకపోతే... మరల అది చంచలత్వం పొందుతోంది. ఇక తత్త్వజ్ఞుడై సుషుప్తమౌనము ఆశ్రయించినవాని చిత్తము మొదలంట జయించివేయ బడగలదు. చిత్తమే నశిస్తుంది. కనుక ఇక అట్టి వానిపట్ల చంచలత్వము పొసగదు. అనగా 'అంతయూ ఆత్మయే' అను దృష్టిని సుస్థిరపరచుకుంటూ కాష్ఠమౌనమును అభ్యసించేవారు క్రమేపీ కృతకృత్యులై జీవన్ముక్తులై వెలయగలరు.

సుషుప్తమౌనులు జ్ఞానసమన్వితులైనప్పుడు స్వయంగా పూర్ణాత్మయందు వెలయుచున్నారు. అట్టి ఆత్మానుభవస్థితియందు వారు రెండు విధములైన నిర్ణయములు ఆశ్రయించి ఉండటం జరుగుతోంది.

1. కర్మసన్యాసం: "వాక్ – ఇంద్రియ – కాష్ఠ (దేహము)లు బంధములే కనుక వీటి పట్ల పరిత్యాజ్య భావముతో ఉంటాను." (లేక)

2. కర్మయోగం: "ఈ వాక్–ఇంద్రియ–దేహములు కూడా సచ్చిదానందము యొక్క విలాసములే కదా! అందుచేత అవి వాటి ధర్మములను లోకానుకూలంగా నిర్వర్తించు గాక! కర్మయోగం సమర్పిత భావంతో ప్రవాహపతితమైనదంతా నిర్వర్తిస్తాను."

ఏది ఎట్లైననూ వారికి 'ఈ ఉభయంలో ఇది మంచిది– అది కాదు, వీళ్ళు గొప్ప వాళ్ళు – వాళ్ళు కాదు... ఇటువంటి ఉపాధేయబుద్ధి ఉండదు. అట్టి ఉపాధేయాతీత అనుభవం గల యోగులకు సుషుప్తమౌని, జీవన్ముక్తుడు... మొదలైన పేర్లు శాస్త్రకారులు ఇచ్చారు. అట్టి మౌనం 'నా స్వరూపానికి పునర్జన్మ గాని, ఈ జన్మ గాని లేదు. కనుక నేను సర్వదా జన్మరహితుడను'... అను అవగాహన

పెంపొందించుకొన్న వారికి సులభ సాధ్యమౌతుంది సుమా! 'సుషుప్తమౌనం' జీవన్ముక్తులలో జన్మ – కర్మలచే స్పృశించబడక నిశ్చలమై, స్వభావసిద్ధియై ఉంటుంది.

శ్రీరాముడు : 'సుషుప్త మౌనము' అనునది జీవన్ముక్తులకు స్వభావసిద్ధమై అంతర్గతంగా ఉంటుందని సెలవిచ్చారు కదా! అట్టి సుషుప్తమౌనము గురించి మరికొన్ని విశేషాలు వినాలని నా అభిలాష.

శ్రీవసిష్ఠ మహర్షి: ఆత్మదర్శనం అయితే సుషుప్తమౌనం అత్యంత సహజమై సిద్ధించగలదు. తదితర వాక్–ఇంద్రియ–కాష్ఠ మౌనాల వలె ఇది సిద్ధించటానికి కొత్తగా పడవలసిన కష్టమేమీ ఉండదు."నేను సత్యమును, సర్వుల స్వరూపుడను" అను ఆత్మానుభూతి పొందుచుండగా ఇక సుషుప్తమౌనం కొరకై ప్రాణనిరోధంతో గాని, పూరక – కుంభక–రేచకములతో గాని పని లేదు. అది సిద్ధించిందా... ఇక విషయాలు లభించుటచే హర్షంతో ఉప్పొంగటం గాని, అవి లభించనప్పుడు కృంగటం గాని ఉండదు. ఆ స్థితియందు నానాత్వ కల్పన ఉదయించదు, శాంతించదు. సుషుప్తమౌని ఈ జగత్ విచిత్ర కల్పనల మధ్య ఉండవలసి వచ్చినపుడు కూడా 'అవన్నీ భ్రమలేకదా'... అని గ్రహించియే ఉంటాడు. ఆత్మజ్ఞాన బలం చేత సుషుప్తమౌనం అకృత్రిమం అవుతుంది.

❖

సాధనా బలిమిచే ఉచిత కాలంలో చిత్తం తన యొక్క చిత్తత్వం కోల్పోయి ఆత్మత్వం సంతరించు కుని ఉంటుంది. అనగా చిత్తం చిత్తంగా ఉండక ఆత్మగానే ప్రకాశిస్తూ ఉంటుంది. ఇక అతనికి 'నేను మనస్సును త్యజించాలి. నిరోధించాలి' అనే విభ్రాంతితో అవసరముండదు. అతని మనస్సునందు కర్తృత్వ – భోక్తృత్వాది అభిమానాలు గాని, సత్తు–అసత్తు మొదలైన విభేదాలు గాని ఉండవు. ఆ సుషుప్త మౌనంలో విభాగించునది, విభాగించబడునది – అనేవేవీ స్ఫురించవు. అతని యందు సర్వప్రయత్నాలు విలీనమౌతాయి. ఇచ్చుట గాని, మరెచ్చుటగాని ఆత్మతత్త్వము గాక మరింకేమి కలదో చెప్పు?

"ధ్యానక్రియ ఉన్నప్పటికీ... లేనట్టి త్రిపుటీశూన్యస్థితియే అది" అని విజ్ఞులు ప్రకటిస్తున్నారు. 'నానాత్వభ్రమపూర్ణమగు ఈ జగత్తు ఆత్మతత్త్వముననే వెలయుచున్నది'... అను దృష్టితో కూడిన అభేద – నిస్సందేహ స్థితియే సుషుప్తమౌనం అని అనిపించుకుంటోంది. నానాత్వజ్ఞానమునకు ఆశ్రయమైన ఆ పరమ శివమునందే సర్వము వెలయుచున్నాయను అనుభవం సుషుప్తమౌనికి అత్యంత సులభంగా కరతలామలకమౌతుంది.

ఆ తత్త్వానుభవం సర్వవ్యాపకము అయి ఉండుటచే ఆకాశమువంటిది. కాని అది శూన్యము కాదు కాబట్టి, ఆకాశం కానిది. సకలుర స్వస్వరూపి కాబట్టి మిథ్యకానిది, పరతత్త్వాన్ని గ్రహించుటచే చిత్తము ఎవరికి ప్రశమనము పొందుతుందో అట్టివాడే సుషుప్తమౌన సంజ్ఞకు అర్హత పొందుచున్నాడు. అచ్చుట సర్వవికల్పములు శూన్యమై, బహిర్విషయజ్ఞానాతీతమై సర్వోపశమన జ్ఞానయుక్తమై, సత్–అసత్ అతిరిక్తమై ఉండగల 'ఉత్తమమౌనస్థితియే' అయిఉంటుంది. భావాభావదశలు ఏర్పడుచున్నప్పుడుకూడా అజ్ఞానము ఏర్పడక, ఆత్మానుభవస్థితి నుండి వివర్తమనునది లేకుండా ఉండుటయే సుషుప్తమౌనం అనిపించుకుంటుంది.

చిత్తవృత్తులు ఉపశమిస్తే వాటి వ్యాపారములగు ఈ జగత్ భేద భావాలు కూడా ఉపశమిస్తాయి. ఆ క్షణమే చిత్తము సమత్వం పొందుతుంది. ఇకప్పుడు జగతు, నీవు, నేను, వారు, మనస్సు – వంటి మనో కల్పనలు ఉండవు. "ఈ జగత్తంతటా నేనే వ్యాపించి ఉన్నాను. ఇక "శబ్దార్థమాత్రమంతా నిర్వికారమగు సత్తాసామాన్యమే" అను అవగాహన అతడు సుస్పష్టంగా కలిగి ఉంటాడు. విషయభావముచే పరిమితుడు కాకపోవుటచే అతడు అపరిమితుడై ఉంటాడు. సుషుప్తమౌనమే తక్కిన మౌనములన్నిటియొక్క ఆశయసిద్ధి.

అనంతమగు ఆ సుషుప్తమౌనం ప్రబోధము మాత్రమే. ఆ ప్రబోధమే అవిద్యను లేకుండా చేయు తురీయస్థితి. 'అవిద్యను తొలగించుచున్నాను' అను రూపంలో ఉండే వృత్తులు కూడా అక్కడ లేకుండా పోతాయి కాబట్టి అద్దానిని 'తురీయాతీతస్థితి' అని కూడా అంటున్నారు.

1. సుషుప్తరూపసమాధి, 2. తురీయసమాధి, 3. తురీయాతీతసమాధి ...ఈ మూడు పేర్లతో చెప్పబడుచున్న ఏకైక ఆత్మస్థితి జ్ఞానికి జాగ్రత్‌నందు, స్వప్నమునందు కూడా అనుక్షణికమై అనుభూతం కాగలదు.

నాయనా! రామచంద్రా! నీవు బ్రహ్మభూతుడవైతివి. ఇక ఈ భౌతిక దేహమును ఉపయోగించి సర్వత్రా నైపుణ్యముతో ఇక్కడి వ్యవహారార్థమును అనుసరించుము. నీవు ఇప్పటికే జీవన్ముక్తస్థితి పొంది ఉన్నావు. ఆకాశమువలె అత్యంత నిర్మలుడవు, శాంతి మొదలైన పవిత్రవృత్తులచే అలంకృతుడవు అయున్నావు. తురీయమునందే ఈ దేహస్థితిని పొంది ఉన్నావు. స్థూల సూక్ష్మములను పరిత్యజించి ఆకాశమువలె శూన్యుడు కాగలవానికే అట్టి సుషుప్తమౌనం లేక జీవన్ముక్తి ఏర్పడి ఉంటోంది. నీయందు అట్టి లక్షణములు స్వతఃసిద్ధంగా ఉండనే ఉన్నాయి. కాబట్టి నిస్సంశయుడవై, నిర్వికారుడవై, నిర్విచారముగా ప్రకాశించుము. 'ఓం' అను సంజ్ఞచే చెప్పబడిన శబ్దార్థమును గ్రహించినవాడవై సంసారవాసనాశూన్యుడవై తురీయపదమునే అధిష్ఠించి ఉండుము. లీలామాత్రంగా నీవు నిర్వహించ వలసి వస్తున్నవాటియందు పాల్గొనుము. 'ఈ దృశ్యము ఇట్లున్నదేమిటి?' అనునదంతా కూడా కేవలం అంతరానుభూతమగు స్వప్నమువంటిది. ఈ సత్యమును గ్రహించి చిదాకాశకళ యందు చ్యుతిరహితుడవై వెలయుము.

❖❖❖

13. ప్రాణ-మనోసంయోగం

శ్రీరాముడు: గురువర్యా! మీరు భిక్షుకోపాఖ్యానం ప్రవచించేటప్పుడు శతరుద్రీయం (100 మంది రుద్రులు) అనుదానిలో నూరవవాడు రుద్రుడు అగుచున్నాడా? లేక గణముల కంటే వేరుగా రుద్రుడు ఒకడు ఉన్నాడా? అనగా రుద్రుడు తదితర జన్మలన్నిటికీ యజమాని, లేక, అధిపతా? లేక అతడు కూడా వంద జన్మలలోని ఒకడా? ఎందుకంటే మీరు ఒకచోట రుద్రుడు – రుద్రగణం అని అన్నారు. మరొకచోట ఆ 'వందమంది రుద్రులు'... అని ప్రయోగించారు.

శ్రీవసిష్ఠ మహర్షి: భిక్షుకుడు గాంచిన నూఱు స్వప్నములే నూఱు విధములైన శరీరములు గ్రహించటం జరిగిందని చెప్పుకున్నాం కదా! ఆ స్వప్నశతమూర్తులే... ఈశ్వరుని (ముఖ్యరుద్రుని) పరిచారకులు అని చెప్పునపుడు 'గణములు' అని అనబడినది. ఐశ్వర్య-సామ్యములను పరిగణించినప్పుడు 'శత రుద్రులు' అని చెప్పబడినది.

'శతరుద్రులు' అని చెప్పబడినది - రుద్రుని యందు, రుద్రగణం నందు (లేక) శతరుద్రులందు ఆ భిక్షుకుని చైతన్యమే సమముగా విస్తరించి ఉండటం చేతనే.

శ్రీరాముడు: తండ్రీ! ఒక దీపం నుండి అనేక దీపములు వెలిగించినట్లుగా ఆ భిక్షుకుని చిత్తం 100 చిత్తములను కల్పించిందా? ఒకే చిత్తము నుండి అనేక చిత్తములు ఎట్లా కల్పించబడినాయి?

శ్రీవసిష్ఠ మహర్షి: ఆ భిక్షుకుడు మాయావరణము లేనివాడు. జ్ఞాని. జ్ఞానైశ్వర్యం కలిగి, మాయావరణం లేనట్టి మహనీయులు ఒకానొక ప్రతిభాసాసంపద కలిగి ఉంటారు. వారు ఏ కల్పన చేయాలను కుంటారో అట్టిది మాయ యందు ప్రతిబింబితమై, అది తదితర జగత్ కల్పన లాగానే వ్యవహార యోగ్యమై భాసిస్తుంది.

ఎందుచేతనంటావా? వారు జ్ఞానబలం చేత "సర్వాత్మకత్వం, సర్వవ్యాపకత్వం" అవధరించి ఉంటారు కాదా ! అందుచేత ఈ బ్రహ్మానుభవులు - సర్వజ్ఞమగు బుద్ధిచే ఏది భావన చేస్తే అది ఈ తీరుగానే ఏర్పడుచూ ప్రాప్తిస్తూ, పరిఢవిస్తూ ఉంటుంది.

శ్రీరాముడు: మహర్షీ! అట్టి జ్ఞానైశ్వర్యము, సత్యసంకల్పము, సర్వాత్మకత్వము అవధరించిన ఆ రుద్రభగవానుడు (కపాలియగు శివుడు) మెడలో కపాలమాలిక ధరించి, ఒళ్ళంతా బూడిద పూసుకుని దిగంబరుడై, శ్మశానవాసి అయి, కాముకుడై ఎందుకు ఉంటున్నాడు. అతడు జ్ఞానైశ్వర్యం కలిగి ఉండి, మాయావరణారహితుడై ఉండి కూడా అట్లు ప్రవర్తిస్తున్నాడేమిటి? మరొక ప్రశ్న. అట్టి జ్ఞానైశ్వర్య పరిపూర్ణులు శాస్త్రాలు వచించే నియమ-నిష్ఠల పట్ల ఎట్టి ఉద్దేశం - ప్రతిస్పందన కలిగి ఉంటారు?

శ్రీవసిష్ఠ మహర్షి: సిద్ధిని పొంది, జీవన్ముక్తులై, పరమైశ్వర్యము పొందియున్న మహనీయులు తమ దేహములను శాస్త్రీయ క్రియలందు గాని, భౌతికభోగ ఐశ్వర్యములందు సామాన్యంగా సానుకూల్యత వహించి ఉంటారు. అయితే, వారు "సాంఘికమైన తదితరమైన నియమనిబంధనలకు బద్ధులై ఉంటేనే జ్ఞాన్న సిద్ధిని పొందినట్లు అని వ్యాఖ్యానించటానికికూడా కుదురునది కదా!

వారు వేదవిధులకు దాసులు కారు. శాస్త్రములు అజ్ఞానులను ఉద్ధరించటానికే విధి-విధానాలు ప్రతిపాదిస్తున్నాయి. సుజ్ఞానికి శాస్త్రములు క్రొత్తగా నియమించి చెప్పవలసినదేదీ ఉండదు. అందుచేత అజ్ఞానులకు శుభకరాలుగా తోచే శాస్త్రీయ - లౌకిక కామ్యకర్మాదులు ఆత్మజ్ఞులగు జ్ఞానశీలురకు ఆవశ్యకమని గాని-అనావశ్యకమని గాని అనిపించకపోవచ్చు. ఎందుకంటే వారికి ప్రారబ్ధం యొక్క ఉనికియే ఉండదు. కనుక సామాన్యులకు దుఃఖకరాలుగా తోచే విషయాలు విజ్ఞానులకు అత్యంత సామాన్యమైన విషయాలుగా ఉంటాయి.

క్రియ - నియమము మొదలైనవన్నీ అజ్ఞానుల కొరకే కల్పించబడ్డాయి. ఎందుచేత వారి చిత్తము రాగద్వేషములతో కూడిన వేలాది విషయములతో అనుసంధానమై, ఖండఖండములుగా

ఉండి ఉంటుంది కనుక. అంతేకాదు. ఈ సంసారజీవులలో అనేకులు 'పెద్ద చేప చిన్న చేపను హింసించటం సమంజసమే' అను మత్స్యన్యాయముతో కూడిన కుత్సిత - పాపదృష్టులు కలిగి ఉంటున్నారు. వారికి సమరసమగు ఆత్మ యొక్క సమాచారమే తెలియదు. కనుక క్రియ - నియమాలు, చెయ్యవలసినవి - చెయ్యకూడనివి, సవ్య - అపసవ్యముల నిర్దేశము ఎంతో ఆవశ్యకము.

'ఇవి చేస్తే శుభప్రదం. అవి చేయకుంటే అశుభం. ఇవి చేశారో దుఃఖితులౌతారు' అని ప్రవచిస్తూ సంసారజీవుల ఇష్టానిష్టములను శాస్త్రకారులు నియమం చేస్తున్నారు. అదంతా అత్యంత అవసరం. అయితే, జీవన్ముక్తులగు ప్రాజ్ఞులు ఇష్ట - అయిష్ట విషయములందు చిక్కుకొని ఉండరు. వారు జితేంద్రియులై వాసనాపథమును అతిక్రమించి ఉంటారు. అందుచేత వారు 'ఇది ఇట్లా ఉండాలి... అది అట్లు ఉండకూడదు' అని కోరుకోకుండానే ప్రవాహపతితమై సందర్భమౌతున్న కార్యములను కాకతాళీయ న్యాయమును అనుసరించి ఆచరించుచున్నారు.

కాకతాలీయవద్రూఢాం క్రియాం కుర్వన్తి తే సదా
న కుర్వన్త్యపి వై కించిన్నైషాం క్వచిదపి గ్రహః ॥

క్రియలు నిర్వర్తించినా, లేక నిర్వర్తించకపోయినా వాటన్నింటి యందు వారికి కించిత్ కూడా ఆసక్తి ఉండదు. బ్రహ్మ-విష్ణు-మహేశ్వరులు కూడా ఇట్లాగే కాకతాళీయ న్యాయమును అనుసరించి మనుష్యాది జన్మలు స్వీకరించి కార్యములను ఆచరించుచున్నారు.

న నిన్ద్యమస్తి నానిన్ద్యమ్, నోపాదేయమ్, న హేయతా,
న చ ఆత్మీయం, న చ పరం, కర్మ జ్ఞవిషయం క్వచిత్ ॥

జీవన్ముక్తులగు ఆయా సిద్ధ పురుషులకు నింద్య - అనింద్యములు గాని, గ్రాహ్య - త్యాజ్యములు గాని, స్వ - పర భేదములు గాని ఉండవు. వారిని బంధించగలిగిన కర్మ ఈ భూనభోంతరాలలో ఏదీ లేదు. సృష్టి యొక్క ప్రారంభం నుండి అగ్నికి ఉష్ణము, జలమునకు రుచి - ప్రవాహ స్వభావం మొదలైనవి ఏర్పడియే ఉంటున్నట్లు ఆ ఈశ్వరేచ్ఛను అనుసరించి హరి-హరాది క్రియలు, బ్రాహ్మణ -క్షత్రియాది ధర్మములు లోకంలో వెల్లివిరుస్తున్నాయి.

శ్రీరాముడు: అయితే మహర్షీ ! అగ్నికి ఉష్ణము స్వభావసిద్ధమే అయినట్లు అజ్ఞానులకు అజ్ఞానం కూడా స్వభావసిద్ధమేనని అనవచ్చునా ? వారి ఆచరణలు కూడా ఈశ్వరేచ్ఛేనని తలచవచ్చునా ?

శ్రీవసిష్ఠ మహర్షి : కాదు. ఈ అజ్ఞానం సృష్ట్యాది నుండి అభివ్యక్తమైనది కాదు. ఈ జీవుడు అజ్ఞానవిభాగ సంకేతములను అనుసరించి ఐహిక - పారలౌకిక సుఖ దుఃఖములను కలిగించు స్త్రీ-ధన-జన వ్యవహారములను అన్వయించుకొని అనుసరిస్తున్నాడు. అనగా తన సుఖ దుఃఖములు తానే నిర్వచించుకుంటున్నాడు. అట్టి నిర్వచనముల వెనుక ఉన్న అభ్యాసపూర్వకమైన అజ్ఞానమును తొలగించటానికి ధ్యాన, దాన, పూజాది కార్యక్రమములతో కూడిన విధివిధానములను శాస్త్రములు జనులకు ప్రతిపాదిస్తున్నాయి. సాధనాక్రమము ననుసరించి మనస్సు శుద్ధమగుచుండగా ఈ జీవుడు పవిత్రుడు కాగలడు. ఆత్మత్వమే ఈ జీవుని స్వతః సిద్ధస్వభావంగాని విషయత్వం కాదు. విధ్యుక్తము

– ప్రవాహపతితము అగుచున్నదంతా ఈశ్వరేచ్ఛ అని, ఆసక్త–అనాసక్త, సుఖ–దుఃఖ, హేయ–ఉపాధేయ భావనలంతా అజ్ఞాన కల్పితములని ఎఱుగువాడు సులభంగా ముక్తుడగుచున్నాడు.

❖❖❖

14. విదేహముక్తి - మౌనము

శ్రీరాముడు : మహాత్మా ! శరీరియగు జీవుని యందు ప్రసిద్ధమై ఉండే 4 విధాలైన మౌనాల గురించి వివరించి చెప్పారు. అట్లాగే 'విదేహముక్తి – మౌనము" ల గురించి కూడా చెప్పమని అర్థిస్తున్నాను.

శ్రీవసిష్ఠ మహర్షి: 'విదేహముక్తి' అనునది ఆకాశం కంటే కూడా అత్యంత నిర్మలమైన చిన్మయాత్మాకాశం. "దేహాదులచే గాని, అహంకారాదులచే గాని పరిమితం కాబడనట్టి దృశ్యస్వరూపుడను నేను" ... అని స్వస్వరూపావగాహనకు సంబంధించినది అది. అదియే పరమశ్రేయం, పరం, మోక్షం కూడా. అద్దాని గురించి కూడా కొన్ని విషయాలు ప్రస్తావిస్తాను. విను.

విచ్ఛిన్న రహితము – విషయరహితము అగు సమాధి యొక్క అభ్యాసం వలనను, వివేక విచారణలతో కూడిన జ్ఞానయోగముననూ "సంపూర్ణ జ్ఞానము" పొందినవారున్నారు. వారిని 'సాంఖ్య యోగులు' అని శాస్త్రకారులు పిలుస్తున్నారు.

మనం ఇతఃపూర్వం చెప్పుకున్న 'హఠయోగం' అభ్యసిస్తూ, తద్వారా ప్రాణాదులను నిరోధించి క్రమంగా అనామయము, ఆద్యంతరహితము అగు పదమును అధిరోహించేవారు కూడా ఉన్నారు. వారిని "హఠయోగయోగులు' అని పిలుస్తారు. సర్వ కర్మ ఫల సమర్పణ చేయువారు "కర్మయోగులు". ఈ సాంఖ్యయోగులు, యోగయోగులు... ఇద్దరూ కూడా యోగసాధన ద్వారా పొందాలనుకోతగినది శాంతము–అకృత్రిమము అగు పరమపదమే ! కొందరు కేవలం వివేక – విచారణములతో కూడిన 'సాంఖ్యము' ద్వారా మరికొందరు 'సర్వకర్మఫలత్యాగం' అను కర్మయోగము వలన, ఇంకొందరు క్రియాయోగ–ధ్యానాల సమాయంచే ఈ జన్మయందే ఆ పరమపదం పొందుచున్నారు. వారు తమ మనోబుద్ధులను సర్వ నియామకుడగు ఆ పరమేశ్వరునికి సాంగపూర్వకంగా సమర్పించి తాము సర్వరహితత్వము సంపాదించుకుంటున్నారు.

అయితే సాంఖ్యము – యోగము ఒక్కటే. ఆ రెండిటిలోనూ అంతర్లీనమై అనుస్యూతంగా ఉన్నది 'సర్వత్యాగ బుద్ధియే'... అని ఎవరు గ్రహిస్తారో వారే తత్వాన్ని ఎరిగినవారు ఎందుకంటే సాంఖ్యులు తమ వివేక–విచారణ ద్వారా, యోగులు తమ కర్మఫల సమర్పణ ద్వారా చేరే ఆద్యస్థానం ఒక్కటే. ఎక్కడ ప్రాణము యొక్క వృత్తులు కూడా విషయమే కావో, ఎక్కడ వాసనాజాలం – జన్మకర్మలు అతిక్రమించబడియున్నవో... అట్టి అనుభవైకవేద్య స్థానమే 'పరమపదము' అని గ్రహించు.

❖

నాయనా! వాసనలనే చిత్తము అని అంటాం. అదియే ఈ సంసారమునకు మూల కారణం. ఈ సంసారమునకు వాసనలకు వేరైన మరొక కారణమేదీ లేదు. వాసనలే సంకల్ప పరంపరలను

ఉత్పత్తి చేస్తోంది. సంకల్పాలు ఏదో విధంగా సన్నగిల్లితే వాసనలూ సన్నగిల్లుతాయి. దానితో పాటు ఈ సంసారం సన్నగిల్లుతుంది. అట్టి వాసనలు నే చెప్పిన సాంఖ్యం-యోగం రెండిటిలోనూ విలయం పొందుతాయి. రెండిటిలో గల ప్రయత్నం తత్త్వజ్ఞానానుభవ రూపంగా మార్చబడుచుండగా ఇక ఈ సంసారం తన యొక్క కారణత్వం కోల్పోతుంది.

బాలుడు 'బేతాళం (దయ్యం)' అను దానిని కల్పించుకుని చూస్తూ ఉంటాడు చూచావా? ఈ మనస్సే శరీరాన్ని ఆత్మగా గాంచుచున్నది. ఇట్లా గాంచుటయే సంసారం కనుక సంసారానికి కారణం మనస్సే. ఎప్పుడైతే ఈ మనస్సు ఆత్మజ్ఞానంచే నింపబడి పునీతమౌతుందో... మరుక్షణం దీనికి శరీరమే కనిపించదు. మనస్సు శాంతించిందా, సంసారం స్వభావ సిద్ధంగానే ఉపశమిస్తోంది.

దేహాలు నిర్విషయమై ఉండటమే విదేహముక్తి లక్షణం.

మనస్సు శాంతించాలంటే ఆత్మదర్శనం తప్పితే వేరే ఉపాయం లేదు. నిద్రించే వానికే స్వప్నం. అసత్యమైన స్వప్నంలో "నేను మరణించాను" అను స్వప్న రూపమైన స్వమరణం కలగటం కూడా జరుగునట్లు ఆత్మదర్శనం ఒనర్చనివానికే మనస్సు ఉత్పన్నమౌతోంది. స్వప్నంలో చూచిన స్వమరణం నిదుర లేవగానే ఉండదు కదా ! ఆత్మ దర్శనమైన తరువాత ఆ మనస్సుకు ఏమౌతుందో ఏమీ చెప్పలేం సంసారదృష్టిని కలుగజేస్తున్న మనస్సు జ్ఞానంచే చంచలరహితం అగుచుండగా అప్పుడు మాత్రమే నేను చేస్తున్న ఈ ఆత్మబోధ హృదయంలో ప్రవేశించగలుగుతుంది అప్పుడిక బంధ-మోక్షముల ఛాయలన్నీ వాటంతట అవే తొలగిపోతాయి.

సాధనాత్రయం -

1. దృఢమగు ఏకత్వము యొక్క అభ్యాసం. (భిన్నత్వంలో ఏకత్వం సందర్శించటం.)
2. ప్రాణనిరోధం (రేచక-కుంభక-పూరకములవంటి ప్రాణయోగోపాసనలను అభ్యసించటం)
3. మనోనిగ్రహం (ఇంద్రియ విషయాలను మననం చేయక, వాటికి అతీతత్వం వహించటం అభ్యసించటం)

...ఈ మూడిటినీ మోక్ష కారణమగు ' సాధనాత్రయం' అని అంటూ ఉంటారు. ఇదియే సర్వ శాస్త్రముల తాత్పర్యం.

❖

శ్రీరాముడు : మునీంద్రా! మధ్యమాధికారి అనుసరిస్తూ ఉండే ప్రాణవిలయం మోక్షమునకు కారణం అగుచున్నదని అంటున్నారు కదా ! మరణ సమయంలో కూడా ఈ జీవుని విషయంలో ప్రాణాలు నిరోధించబడుచున్నాయి. మరి, అందుచేత మృతి అనునది కూడా మోక్షార్హత కలిగించగలదని అనవచ్చునా?

శ్రీవసిష్ఠ మహర్షి: 1. ప్రాణ నిరోధము, 2. సాంఖ్యము, 3. కర్మయోగము... ఈ మూడు ఉపాయాలు పరిలక్షితమైనది మనోనిరోధం వైపునకే. మనో నిరోధమే శ్రేష్ఠాతిశ్రేష్ఠం. అది ఏ ఉపాయం చేతనైనా సరే... ఎంత త్వరితంగా లభిస్తే అంతమంచిది.

ఇక మరణం విషయానికి వద్దాం. ఒకడు మరణించినంత మాత్రం చేత అతని మనః ప్రాణములు ఆతనిని విడచివేయవు.

దృష్టాంతానికి ఒకడు మూర్ఛిల్లినాడనుకో, లేక గాఢంగా నిద్రిస్తున్నాడనుకో. అంతమాత్రం చేత ఆతని కోరికలు, ఆశలు, శంకలు, వృత్తులు నశించుచున్నాయా?... లేదు. అవి నీటియందు కరిగిన ఉప్పు వలె వాసనా రూపమున వెలయుచున్నాయి. అట్లాగే ఒకడి ఈ భౌతిక శరీరం మరణించినంత మాత్రంచేత మనోలయం గాని, వాసనావిలయం గాని జరుగుటలేదు. ఆ దేహి మరల మరొక దేహంతో ప్రత్యక్షమైన (లేక) ఆవిర్భవించిన మరుక్షణం ఆ వాసనలు మరల ప్రకోపిస్తు న్నాయి. మరణకాలంలో ప్రాణాలు ఈ భౌతిక దేహాన్ని త్యజిస్తున్నాయి. ఇంతలోనే వాసన – కామ్య కర్మలచే ఉపస్థాపితమైన భవిష్యత్ దేహాకారమును అనుభూత మొనర్చుకొనుచున్నాయి. బాహ్యాకాశంలో తదనుకూలమైన తన్మాత్ర సమన్వితమైన అనుభూతులను ఆశ్రయించి అనుభవమును కొనసాగిస్తున్నాయి

ఈ భూతతన్మాత్రలు వాసనాత్మకములే గాని మరింకేమీ కాదని గ్రహించు. ఈ వాసనలు తదనుకూలమైన మనోప్రాణములనే ఆశ్రయించుకొని ఉంటాయి. తదితరమైన మనోప్రాణాలను ఈ భూతతన్మాత్రలు తాకజాలవు. ఈ విషయములు వేదములచే చెప్పబడి ఉండటమే కాదు... యుక్తి చేత కూడా గ్రహించవచ్చు. ఈ జీవుని విషయంలో ప్రాణములు భవిష్యత్ దేహవాసనలతో కూడియే పూర్వదేహమును పరిత్యజించుచున్నాయి. అందుచేత తరువాతి దేహముకూడా వాసనల వలననే ఉత్పన్నమగుచున్నది. 'వాసనలు' అనగా సంకల్ప పరంపరల ఉత్పత్తి స్థానమే కదా!

పుష్పములలోని సుగంధమే నువ్వులలో ప్రవేశిస్తోంది. ఆ నువ్వులు గానుగయందు నలుపబడుట అను క్లేశము ననుభవించి నూనెగా పరిణమిస్తోంది. అట్లాగే శరీరమునందున్న హృదయాకాశము తోడను, తదంతర్గతమగు ప్రసరణ స్వభావం గల వాయువుల తోడను కలసి ఈ మనస్సు క్లేశములు పొందుచున్నది. అందుచేత 'మృతి చెందిన వెంటనే ప్రాణములు నిరోధం పొందుతాయి'... అని నీవు అన్నది యుక్తియుక్తం కాదు. జలముతో నిండిన ఒక కుండను తటాకంలో ముంచినంత మాత్రంచేత ఆ కుండలో జలం నశించిందని అనటానికి వీలు లేదు కదా! వాసనాసమన్వితమైన ఈ మనస్సు కూడా అదృశ్యమైపోయేది కాదు. మరణమాత్రం చేత మనస్సు నశించదు. ప్రాణములు నశించవు. ప్రాణములు వర్తమాన భౌతిక దేహమును మాత్రం త్యజిస్తున్నాయి. కిరణరహితుడైన సూర్యుడు ఉండజాలడు కదా! అట్లాగే మనోరహితమైన ప్రాణాలు ఉండజాలవు. అంతేకాదు. తిత్తిరిపక్షి నోట కరచిన గడ్డిపరకను ఉచితాహారం కనబడేవరకు పట్టుకునే ఉంటుంది. మనస్సునందు జ్ఞానోదయం అయిందా, ఇక ఆ మనస్సు వాసనాశూన్యమై తనకు కారణమైయున్న స్వస్వరూపమునందు విలయం పొందుచున్నది. అప్పుడిక మనస్సు, ప్రాణం స్పందనాభావం పొందకుండా ఉంటాయి. అట్లు మనస్సు స్పందనాభావం మానివేస్తే ఇక మిగిలేదేమిటి? కేవలం అఖండశాంతియే. కాబట్టి రామా! జ్ఞానం యొక్క శక్తి వలననే నీ దృష్టిలో ఈ పదార్థముల యొక్క అస్థిత్వం తొలగిపోవుచున్నది. అప్పుడు ప్రాణం – చిత్తం కూడా ప్రశాంతిస్తున్నాయి. ప్రశాంతి పొందిన మనస్సు దేహభావాన్ని ధరింపదు.

❖

ఏ వాసనలైతే నాశనం కాగా, పరమపదము లభిస్తుందో ...అట్టి వాసనలనే మనం 'మనస్సు' అని వర్తమానంలో అంటున్నాం. వాసనలే చిత్తము కూడా. అవి లేకుండుటే పరమపదము. జ్ఞానం ఉదయిస్తే అప్పుడు అది వాసనతో కూడిన అన్నిటినీ తిరస్కరించి వేస్తుంది. ఆ జ్ఞానమే ఆత్మతత్త్వముగా పరిణతి పొందుతోంది. ఆత్మతత్త్వము విక్షేపరహిత అనుభవ స్వరూపంగా వెలయుచున్నది. ఈ విషయమునే అనుభవిష్టులగువారు వేద – ఉపనిషత్‌ల రూపమున, మరెన్నో శాస్త్ర సిద్ధాంతముల రూపమున స్వస్వరూపాత్మజ్ఞానమును లోకమునకు చాటుచున్నారు.

త్రాడును చూచి 'పాము' అని భ్రమించువాడు 'అది త్రాడే' అని తెలియగానే సర్వవికారములు త్యజించివేస్తాడు కదా! ఈ దృశ్య జగత్‌పట్ల ఈ జీవునకు ఏర్పడి ఉంటున్న ఆశ – ఆవేశరూపములైన సంసారము వివేకము చేతనే స్వయంగా నశించగలదు. 1.ఏకత్వాభ్యాసము 2.ప్రాణ నిరోధము 3.మనోలయములలో... ఏ ఒక్కటి సిద్ధించినా సరే, తక్కినవన్నీ స్వాభావికంగానే సిద్ధించగలవు. విసనకఱ్ఱ వీచటం ఆగిపోతే, అట్టి వీచుట వలన కలిగే వస్తువుల కదలికలు కూడా ఆగిపోతాయి కదా! ప్రాణవాయుస్పందన నిర్వృత్తం కాగా మనస్సుచే పొందబడే విషయాలు కూడా సశాంతిస్తాయి.

'మృత్యువు' విషయమై మనం కొన్ని విషయాలు ఇక్కడ మననం చేసుకుందాం. ఈ దేహి దేహమును వహించటం మనందరి పట్లా చూస్తున్నాం కదా! అన్నపానాదులచే ప్రవృద్ధమగుచున్న ఈ దేహం వ్యాధుల ప్రబలత్వం చేతనో, వార్ధక్యం చేతనో, యుద్ధము నందు ఖండింపబడటంచేతనో, ఏవైనా ఆకస్మిక సంఘటనల వలననో ఒక రోజున నిరుపయోగ స్థితి పొందుతోంది. శరీరం పతనం కాగానే ఇంతకాలం ఈ శరీరమును ఉత్తేజపరుస్తూ కార్యోన్ముఖం చేస్తున్న ప్రాణవాయువులు ఈ శరీరమును విడచి బాహ్యాకాశమునందలి వాయువుతో లీనమగుచున్నాయి. మనస్సు ప్రాణములను అనుసరిస్తున్నది. నేలకూలి నిరుపయోగమై ఉన్న ఆ జీవుని భౌతిక దేహాన్ని బంధువులు త్యజిస్తున్నారు. ఆతని బంధువులకు తదితరులకు ఆతడు జ్ఞాపకమాత్రుడు అగుచున్నాడు.

ఇక, ఆ మరణించిన జీవుని విషయానికి వద్దాం. ఆతని ఒక విభాగమగు పాంచభౌతిక దేహం నేలకూలింది కదా! ఇంకా ఆతనికి రెండు దేహాలు ఉన్నాయి.

1. మానసిక దేహం (సూక్ష్మదేహం, ఆతివాహికదేహం); 2. చిత్ దేహం (కారణదేహం)

ఈ భౌతికదేహం త్యజించిన ఆ జీవుడు అప్పుడే, అచ్చటే తన వాసనలను అనుసరించి స్వకీయ కల్పనారూపమైన సమస్త ప్రపంచాన్ని గాంచుచున్నాడు. ప్రతిజీవుని యొక్క వర్తమాన దృశ్య ప్రపంచ దర్శనం కూడా అటువంటిదే!

మొదటి ఉపాయం : ప్రాణ, మనోనిశ్చలాభ్యాసం - ఇక ప్రాణవాయువుల విషయమంటావా? ఈ జీవులందరి ప్రాణవాయువులు కర్మల చేత శరీరములను విడిచి, మరల కర్మల చేతనే ఆకాశమున ఉద్భవిస్తున్నాయి. ఈ విధంగా జీవులకు ప్రాణవాయువులతో సంయోగ – వియోగములు నిరంతరం ఏర్పడుచున్నాయి. ఈ జీవులు వాసనామయాలై శరీరం ఉన్నప్పుడు – శరీరం లేనప్పుడు కూడా వాసనామయమగు సుర–నర–పశ్వాది దేహాలను గాంచుచున్నారు. ఈ జీవుడు అతను ఆశ్రయించే ఉపాధిని అనుసరించే ఆచార – వ్యవహారములు పరిరక్షించుకొనుచున్నాడు.

గాలివీచటం ఆగిపోయినప్పుడు పుష్పములందు గల సుగంధం కట్టుబడిపోతుంది కదా! అట్లాగే మనస్సు యొక్క స్పందనము శాంతిస్తే ప్రాణవాయువుల చలనము కూడా కట్టుబడిపోతుంది.

❖

ఈ జీవుని ప్రాణం – చిత్తం ...ఇవి వేరుగా ఉండజాలవు. నువ్వులు – నూనె, పుష్పములు – సువాసన, ప్రాణము – మనస్సు ...ఇవి కలిసియే ఉంటాయి కదా!

మనస్సు యొక్క స్పందనయే ప్రాణము... ప్రాణము యొక్క స్పందనయే మనస్సు.

ఇవి రెండూ రథికుడు – సారథివలె కలిసియే విహరిస్తున్నాయి. అగ్నికి ఉష్ణమునకు పరస్పరం ఆధార – ఆధేయ సంబంధం ఉంటోంది కదా! అట్లాగే, మనస్సు – ప్రాణములు ఒకదానిపై మరొకటి ఆధారపడి ప్రదర్శితమగుచున్నాయి. అవి పరస్పరం లయం పొందినప్పుడు మోక్షము అను ఉత్తమ కార్యమును (నిశ్చలస్థితిని – స్థానమును) సంపాదించుకుంటున్నాయి.

ఏకతత్త్వ ఘనాభ్యాసాచ్చానం శామ్యత్యలం మనః
తల్లీనత్వాత్ స్వభావస్య, తేన ప్రాణోఽపి శామ్యతి ॥

మనస్సు పూర్ణంగా శమించటం అనేది ఏకత్వం యొక్క దృఢాభ్యాసం వల్ల సుసాధ్యపడుతుంది. అప్పుడు మనస్సు యొక్క అంతర్గతమైన ప్రాణాలు కూడా మనస్సుతో పాటే శమించుచున్నాయి. అంతేగాని శరీరం నిరుపయోగమైనంత మాత్రంచేత (దేహం మరణించినంత మాత్రంచేత) ప్రాణాలు శమించటం లేదని గుర్తు చేస్తున్నాను.

విచార్యయత్ అనన్తాత్మతత్త్వం, తన్మయతాం నయ
మనస్తత స్తల్లయేన తదేవ భవతి స్థిరమ్ ॥

ఓ రామచంద్రా! నీవు తత్త్వ విచారణను ఆశ్రయించు. అనంతమగు ఆత్మతత్త్వమునందు నీ మనస్సు తన్మయమయేట్లు చేయి. ఆత్మతత్త్వమునందు లయమొందిన మనస్సు ఆత్మయే అవుతుంది. అప్పుడది తన చంచలత్వం త్యజించి అకృత్రిమమైన స్థిరత్వం పొందుతుంది. అప్పుడు ప్రాణాలతో బంధం సంశాంతిస్తుంది. లేదా...

యదేవాతితరాం శ్రేయో, అనుపలమ్భో, ఉపలమ్భయోః,
ద్వయోరప్యసతోస్తత్ర శేషేవాపి స్థిరోభవ ॥

రెండవ ఉపాయము - ఉపలంభము (perception) అనుపలంభము (Non-perception) అను రెండింటి పట్లా కూడా ఏది నిర్వికారమై సర్వ విషయాతీతమై ఉన్నదో, అట్టి శ్రేయోదాయకమునందు ప్రాణమనస్సులను ధారణమొనర్చి నీవు స్థిరుడవు కమ్ము. ఈ విధంగా తత్త్వభావనావృత్తి కూడా చరమ సాక్షాత్కారము వలన వినష్టమై ఆభావత్వము పొందనంత వరకు నీవు నీ అభ్యాసమును కొనసాగిస్తూనే ఉండు. "నాతో సహా ఈ సర్వము ఆత్మ యొక్క సంప్రదర్శనమే! విన్యాసమే!"... అనునదే తత్వభావనావృత్తి.

ఆహారం లేకపోతే ఈ శరీరం క్షీణిస్తూ ఉంటుంది కదా! అట్లాగే విషయములకు సంబంధించిన సంచయము సన్నగిల్లుతూ ఉంటే మనస్సు సన్నగిల్లుతూ ఉంటుంది. అట్టి మనోరాహిత్యం అత్యంత

శుభప్రదం. ప్రత్యాహారపరాయణులు క్రమక్రమంగా నిర్వికల్ప సమాధియందు తమ మనః ప్రాణాలను విలయం చేస్తున్నారు. అప్పుడిక పరమవస్తువు ఒక్కటే శేషిస్తుంది. ధారణాదుల వలన మనస్సు ఏకాగ్రమగుచుండగా ఇక అది బాహ్యవికారములను వీడి ధ్యానలక్ష్యమగు ఏకత్వం సంతరించుకో గలదు. అభ్యాసవశం చేత సర్వత్రా సమదర్శనం సుసాధ్యమేనని నేను అందరికీ మనవి చేస్తున్నాను. అందుచేత ఏకత్వము అను లక్ష్యశుద్ధితో సాధన కొనసాగించవలసినదిగా సాధకులకు నా విన్నపం.

ఓ రామా! అవిద్య యొక్క రూపమే ద్వైతం. అవిద్య అనునది లేని వస్తువై ఉన్నది. నీ స్వరూపమే అగు పరతత్త్వం ఆత్మజ్ఞానం వలననే సంప్రాప్తిస్తోంది. కనుక శాస్త్రీయ యుక్తియుక్తములను గ్రహించిన బుద్ధితో ధారణ – ధ్యానాల ద్వారా జ్ఞానాన్ని జనులు అభ్యసించెదరు గాక! శరత్కాల మేఘం తొలగగానే, ఆ మేఘం నుండి కురుస్తున్న మంచు కూడా తొలగిపోతుంది కదా! సూర్యప్రకాశం అధికమగుచుండగా 'చలి' క్రమంగా దానంతట అదే తొలగుచున్నది. మనస్సు శాంతిస్తూ ఉంటే అద్దాని 'వికార మృగతృష్ణ' యగు ఈ సంసారచపలత్వం దానంతట అదే ఉపశమిస్తుంది.

చిత్తమే అవిద్య అని అనుకున్నాం కదా! …అందుచేత నీవు తత్త్వ విచారణను ఎల్లప్పుడూ ఆశ్రయించు. మనస్సును బ్రహ్మాంకితం చేయి. పరిణతి పొందిన మనోవిభాగం మాత్రమే చంచల విభాగమైన మనస్సును నిరోధించగలుగుతుంది. మనస్సు కొద్ది క్షణములైనా పరమపదము నందు విశ్రాంతి పొందుతూ ఉండటం అభ్యసిస్తూ ఉంటే, క్రమంగా బ్రహ్మాకార నిరతి తప్పక లభించగలదు. నిరతిశయమగు ఆనందరసాస్వాదనం పొందుచున్న మనస్సు విషయములను ఇచ్ఛగించమన్నా ఇచ్ఛగించదు. నీవు సాంఖ్యం ఆశ్రయిస్తావా? లేక, యోగం ఆశ్రయిస్తావా? కాక, ఆ రెండూ ఆశ్రయిస్తావా? అది నీ ఇష్టం. మొత్తం మీద మనస్సు బ్రహ్మాకారం పొందాలనే పరిలక్ష్యమును కలిగి ఉండు. అద్దానిని ఏమరవకు. మంచినీటి సరస్సులో స్నానం చేసి వచ్చేవాడు దోవలో కనబడే మురికిగుంటను చూచి ఆకర్షితుడౌతాడా? బ్రహ్మాభ్యాసం చేసేవానికి ఇక మనస్సు ఆత్మతత్త్వమే పొందుతుంది కాని విషయత్వం కాదు.

ఏ చిత్తంలో అవిద్య తొలగుతుందో, దానినే జ్ఞానులు సత్వము అని పిలుస్తున్నారు. ఆ సత్వం సంసారబీజాన్ని దగ్ధం చేసి, ఇక ఆ బీజం యొక్క పునరుత్పాదన స్వభావాన్ని వినష్టం చేసివేయగలదు. అట్టి సత్వం ఉదయించిందా, …ఇక బ్రహ్మాభావం నుండి చ్యుతి ఉండదు. ఆతనిలో అవిద్య, వాసనా బీజం స్వయంగా విచ్ఛిన్నములగుచున్నాయి. అట్టిది అజ్ఞులకు అసంభవమేమో అని అనిపిస్తోంది. కాని సాధన – ప్రయత్నం ఉన్నవారికి మార్గం – లక్ష్యం సులభసాధ్యమేనని ప్రకటిస్తున్నాను. నేను చెప్పిన త్రివిధ ఉపాయాలు ఆశ్రయించుటచే పొందబడు జీవన్ముక్తి స్థితియందు జాగ్రత్ – స్వప్న – సుషుప్తులు అనబడే మూడు అవస్థలు, భ్రాంతి, ఆ భ్రాంతి యొక్క బీజాలు, మనస్సు కూడా లయించగలవు. అప్పుడు దగ్ధమైన వస్త్రంలాగా సత్వము మాత్రమే మిగులుతుంది. ఇక అద్దానియందు సంసారకారణములైన రాగద్వేషములు ఏర్పడజాలవు. అట్టి సత్వమాత్రశేష్యమే విదేహముక్తి.

❖❖❖

VII.బేతాళ ప్రశ్నలు

1. ఆరు ప్రశ్నలు

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! తత్త్వ విచారణచే జ్ఞానసముపార్జన అత్యంతావశ్యకం. జ్ఞానోత్పత్తి అయిన తరువాత 'ఇది జీవుడు – ఇది చిత్తము' అను కల్పనలు ఇక మిగలవు.

విచారణ చేయటమే అవిద్యోపశమనమునకు ఉపాయం. ఎందుకంటే అవిద్యకు మూలం అవిచారణయే కదా! అందుచేత ముముక్షువు జ్ఞానోదయ పర్యంతమూ విచారణ చేస్తూనే ఉండాలి. జ్ఞానోదయమునే 'మోక్షము' అనికూడా అంటున్నాం.

'మనస్సు – అహంకారము' మొదలైనవాటికి ఎండమావులలోని జలంలాగా అసలు ఉనికియే లేదు. అవి ఉన్నట్లు అనిపించటమంతా భ్రమచేతనే సుమా! కొంచెం విచారణకు ఉపక్రమించటం జరిగినా సరే ...అవి లయం పొందుతాయే! ఇక తాత్సారం ఎందుకు? వేదన చెందవలసిన పనేముంది?

ఈ 'సంసారస్వప్న విభ్రమము' గురించి ఒక సందర్భంలో ఒక బేతాళుడు కొన్ని ప్రశ్నలు ప్రతిపాదించటం జరిగింది. ప్రసంగవశంగా అవిప్పుడు నాకు గుర్తుకు వస్తున్నాయి. శుభకరములగు ఆ ప్రశ్నలేమిటో ...విను.

❖

వింధ్య పర్వత ప్రాంతంలో అనేక జనపదాలు, మహారణ్యాలు కూడా ఉన్నాయి. ఆ ప్రాంతంలో గల ఒకానొక దట్టమైన అడవిలో భీకరమైన శరీరం గల ఒక బేతాళుడు ఉండేవాడు. ఆతనికి జ్ఞానులంటే మహాయిష్టం, అజ్ఞానులంటే మహాతిరస్కార భావం ఉండేది. ఒకసారి 'అజ్ఞానులను' మాత్రమే నేను భక్షిస్తాను... అనే నిర్ణయం తీసుకున్నాడు.

అతడు ఒక కిరాతరాజ్యం ప్రవేశించాడు. మంత్రతంత్రాలపై అత్యంత ప్రవేశము, అభిరుచిగల ఆ కిరాతరాజ్యపు ప్రజలు ఆతనికి బలులు ఇచ్చి సంతోషపెట్టేవారు. ఆతడు కిరాతరాజ్యంలో అడవిలో గల ఒక మఱ్ఱిచెట్టును నివాసంగా ఏర్పరచుకొని తనకు ఇవ్వబడే బలులను స్వీకరిస్తూ అక్కడి ప్రజలకు రోగవిముక్తి మొదలైన సుఖములను ప్రసాదిస్తూ ఉండేవాడు. తాను మాత్రం జ్ఞాన బలంతో నిత్యతృప్తుడై నిశ్చలమగు సమాధియందు కాలం గడుపుతూ ఉండేవాడు.

❖

ఆతడు ఆకలైనప్పుడు ఆ బాటలో వచ్చే బాటసారులను చంపి స్వాహా చేసేవాడు. అయితే, తాను జ్ఞాని అయి ఉండడంచేత, ఆకలిగా ఉన్నాసరే ...నిష్కారణంగా సుజనులను చంపేవాడు కాదు. దుష్ట – దుర్మార్గ – దురాచారులను మాత్రమే ఆహారంగా తీసుకునేవాడు. క్రమంగా బేతాళుని

విషయం తెలిసిన అక్కడి ప్రజలు సత్ప్రవర్తనులై భక్తి –జ్ఞానములు పెంపొందించుకున్నారు. అందుచేత ఆతనికి అక్కడ భక్షించుటకు తగినవారే దొరుకుట లేదు. ఆకలిచే ప్రేరితుడై ఆహారమగుటకు అర్హులగు వారికోసం వెతుకుతూ కిరాతరాజ్యానికి దగ్గరలో ఉండే ఒక నగరంలో ప్రవేశించాడు. అర్ధరాత్రి అయింది. అక్కడి రాజు నగరపరిసర ప్రాంతంలోగల దొంగలను, దుష్టులను, దారిదోపిడీ చేసేవారిని పట్టుకోవటానికి బయలుదేరి యాదృచ్ఛికంగా బేతాళునకు ఎదురుపడ్డాడు. అప్పుడు ఆ రాజును చూచిన బేతాళుడు 'ఆహా! ఈ రోజు నా పంట పండింది. మంచి కండపుష్టి గల ఈ మనుజుడెవ్వడో ఇటువైపే వస్తున్నాడు. ఈ రోజు ఈతడే నాకు ఆహారం' అని అనుకున్నాడు. రాజు వస్తున్న మార్గంలో ఎదురుపడి తన భయంకరరూపం ప్రదర్శించాడు.

❖

బేతాళుడు : ఓయీ! బాటసారీ! నేనెవరో తెలుసా! దిక్కులు పిక్కటిల్లచేసే శక్తిగల బేతాళుడను. ఈ రోజు నీవు నాకు ఆహారమవటానికే ఇటు వచ్చావు. ఇక తప్పించుకోలేవు. నాకు భోజనం కమ్ము.

రాజు : ఏం బేతాళా! బాగానే ఉన్నది గాని, మరి నెనెవ్వరో తెలుసా? ఈ దేశపు రాజును. న్యాయ పూర్వకమగు 'క్రూరమృగ వధ' – అనే నా విధ్యుక్తధర్మమును నిర్వర్తించటానికి ఈ నిర్జన ప్రదేశానికి వచ్చాను. నేను నీకు ఎటువంటి ఇబ్బందీ కలిగించ లేదే! అన్యాయంగా నన్ను బలవంతంగా భక్షించటానికి ప్రయత్నించావా? ...ఈ ఆయుధాలతో నీ తల వేయివ్రక్కలు చేసివేయగలను.

బేతాళుడు : ఓ రాజా! నేనెవరినీ అన్యాయంగా భక్షించనను వ్రతం గలవాడిని. అయితే నిన్ను భక్షించటం న్యాయమో, అన్యాయమో తెలియాలి కదా?

మరొక విషయం. నీవు ఈ దేశపు రాజువు కదా! ధర్మశాస్త్రానుసారం నీ రాజ్యంలో ప్రవేశించి ఉన్న నాకు ఆకలి దప్పికలు తీర్చటం నీ కర్తవ్యమే! నీవు వధించటానికి అర్హుడవైతే మాత్రం నిన్ను ఈ రోజు వదలిపెట్టేది లేదు. వ్యర్థంగా విజ్ఞులను వధించటం నా ప్రవృత్తియే కాదు. అజ్ఞులను వదలిపెట్టే ప్రసక్తీ లేదు.

ఇప్పుడు నేను కొన్ని ప్రశ్నలు అడుగుతాను. నీవు సమాధానం చెప్పు. నీ సమాధానమును బట్టి నీ యొక్క జ్ఞానాజ్ఞానాలు గ్రహించి, నీవు నాకు ఆహారమవకుండటానికి తగినవాడవో, కాదో నేను నిర్ణయిస్తాను.

రాజు : నీవు మనుష్యులను భక్షించే ముందు వారు వివేకులో, అవివేకులో ... జ్ఞానులో, అజ్ఞానులో ... పరిశీలించి అజ్ఞానులను మాత్రమే భక్షిస్తూ ఉంటావా? ...చాలా ఆశ్చర్యంగా ఉన్నదే! నీ వంటి బేతాళులకు కూడా సిద్ధాంతాలు, నియమాలు ఉంటాయా?

బేతాళుడు : (బిగ్గరగా పకపకా నవ్వి) ఇప్పుడు నిన్ను నేను కొన్ని ప్రశ్నలడుగుతాను. ఆ ప్రశ్నలకు నీ సమాధానమేమిటో చెప్పు. ఆ సమాధానాలను అనుసరించి నిన్ను భక్షించవచ్చునో, లేక నమస్కరించి శరణువేడాలో నేను గ్రహిస్తాను.

బేతాళ ప్రశ్నలు -

1. ఈ సృష్టిలో అసంఖ్యాక బ్రహ్మాండములున్నాయి కదా! ఇవన్నీ కూడా ఏ సూర్యుని యొక్క సూర్యరశ్మిలోని, సూక్ష్మపరమాణువులు, లేక, త్రసరేణువులు అయి ఉన్నాయి?

2. ఆ బ్రహ్మాండ త్రసరేణువులు ఏ మహాకాశవాయువులో స్ఫురించుచున్నాయి?

3. ఒకాయన ఉన్నాడు. ఆయన అనేక స్వప్నములను నిష్కారణంగా గనుచున్నాడు. ఆ అనేక స్వప్నములలోని ప్రతి ఒక్క స్వప్నములో మరల ఇంకెన్నెన్నో ఉపస్వప్నములను కూడా గనుచున్నాడు. ఒక స్వప్నం వదలి వెంటనే మరల ఇంకొక స్వప్నంలోకి వెనువెంటనే ప్రవేశిస్తున్నాడు. ఆతడు ఎన్ని స్వప్నాలు కనుచున్నప్పటికీ తన స్వరూపం మాత్రం త్రికాలములలో యథాతథంగానే కలిగి ఉంటున్నాడు. ఆయనను నీవెక్కడైనా చూచావా? ఎవ్వరాయన?

4. అరటి పట్టలను విప్పుకుంటూపోతూ ఉంటే చివరికి బయటనున్న ఆకాశమే లోన కూడా శేషించి ఉంటుంది. అట్లాగే ఈ స్వప్నస్వప్నాంతరములలో బయట-లోపలకూడా అవిచ్ఛిన్నంగా అఖండంగా వెల్లివిరిసి సదా ఉన్నది ఏమిటి? ఎవరు?

5. మనకెదురుగా ఈ దృశ్యప్రపంచం ఉన్నది. దీనిలో విశాల ఆకాశము, భూత సముదాయం, సూర్యమండలము, మేరు పర్వతం ... ఇవన్నీ ఘనీభూతమై ఎదురుగా ఉన్నాయి. ఇవి అత్యంత మహత్వముతో ప్రవర్తిస్తున్నాయి. అయితే ఇవన్నీ కూడా ఒకానొకని అణుఅంశమునందు ఒక పరమాణు పరిమాణమై ఇమిడి ఉన్నాయి? ఆతడెవడు? ఆతడెక్కడ ఉంటున్నాడు.

6. అవయవరహితుడగు ఒకానొక పురుషుడున్నాడు. 'ఆకారము' అనే వికారము ఆతనియందు లేదు. అయితే ఏం? ఆయనయొక్క ఒక స్వల్పాంశ ఈ రాళ్ళు-మట్టి-పర్వతము-దేహములతో కూడిన పాదార్థిక జగత్తుకు అస్థిత్వం కల్పిస్తోంది. అట్టి అస్థిత్వము కల్పిస్తున్నదెవరు? ఆయనను నీవెక్కడైనా చూచావా?

ఓ రాజా! ఇప్పుడు నిన్నొక ఆరు ప్రశ్నలు అడిగాను. వీటికి నీకు సమాధానం తెలియకపోతే 'ఆత్మద్రోహి'వి అవుతావు. దేహబుద్ధి పరిమితుడవు అవుతావు. యముడు లోకములను మ్రింగుచున్నాడు చూచావా? నీవు సమాధానాలు చెప్పకపోయావో ...నేను కూడా నిన్ను, నీ ప్రజలను చప్పరించి మ్రింగివేస్తాను. ఇక నీ ఇష్టం.

రాజు ఆ ప్రశ్నలన్నీ శ్రద్ధగా విన్నాడు. ఆతని పెదిమలు చిరునవ్వుతో విచ్చుకున్నాయి. ఇక ఒక్కొక్క ప్రశ్నకు సమాధానం ఇవ్వనారంభించాడు :

ఒకటవ ప్రశ్న - ఈ బ్రహ్మాండములు ఏ సూర్యరశ్మిలోని త్రసరేణువులు?

ఒకచోట ఒక ఫలం వ్రేలాడుతూ ఉన్నది. ఆ ఫలమే ఈ బ్రహ్మాండము. ఆ ఫలం (ఈ బ్రహ్మాండము) నీకూ, నాకూ, తదితర అసంఖ్యాక జీవులకు ఆశ్రయభూతమై ఘనము - ద్రవము - ఉష్ణము - వాయువు - ఆకాశము అను, పంచభూతములను ఆవరణగా కలిగియున్నది. అది జ్ఞానులకు అత్యంత చంచలంగానూ, అజ్ఞానులకు ఘనీభూతంగానూ, స్థిరంగానూ అగుపిస్తోంది.

జీవుల ఆశ – తృష్ణలు ఆ ఫలమును అనంతరీతులుగా ద్యోతకమయ్యేటట్లు చేస్తున్నాయి. (కనుక ఆశ – తృష్ణలే ఆ బ్రహ్మాండము యొక్క నిజాకారం).

అట్టి వేలాది ఫలాలతో కూడిన ఒక కొమ్మ ఉంది. ఆ కొమ్మ కదలుచున్న అనేక చిగుళ్ళు కలిగి ఉంది. ఆ కొమ్మ ఎంతో ఎత్తుగా ఉండి ప్రకాశిస్తోంది. జీవుల భావపరంపరలు, కల్పనయే ఆ కొమ్మ యొక్క వాస్తవాకారం.

అట్టి వేలాది కొమ్మలు కలిగిన ఒక మహావృక్షం ఉన్నది. ఆ మహావృక్షం ఎంతో విశాలంగా వ్యాపించి దుర్నిరీక్ష్యమై ఒప్పుచున్నది. అట్టివేయగు వేలాది వృక్షములు గల ఒక మహారణ్యం ఉన్నది. ఆ మహారణ్యం వృక్షములతోనే కాకుండా ఎత్తైన పొదలతో దట్టంగా వ్యాపించి చొరరాకున్నది.

అట్టివేయగు అనేక మహారణ్యసమూహములతో కూడిన మహోన్నతమగు ఒక పర్వతం ఉన్నది. అట్టి అనేక పర్వతపంక్తులకు ఆకరమైన ఒక సువిస్తార 'దేశం' ఉన్నది. ఆ దేశము ఊహకందనంత సువిస్తారంగా ఏర్పడి ఉన్నది.

అట్టి దేశములు అనేకం గల మహాద్వీపమొకటి ఉన్నది. ఆ ద్వీపమునందు చిత్రవిచిత్రమైన అనేక నదులు–సరస్సులు ఉన్నాయి. ఆ నదీ–సరస్సులు నిరంతరం రకరకాల ఆకారములతో కూడిన పుట్టిన–పుట్టబోవు అనేక ప్రవాహపరంపరలతో ఒప్పుచున్నాయి.

అట్టివేయగు అనేక మహాద్వీపములు తనయందు కలిగియున్న ఒక మహాపీఠం ఉన్నది. ఆ మహాపీఠం అతిచిత్రవిచిత్ర రచనా సమన్వితమై ఉన్నది. అట్టి అనేక మహా పీఠములతో సమన్వితమై ఉన్న ఒక మహాలోకం ఒకటి ఉన్నది.

అట్టి వేలాది లోకములతో గూడిన భయమును గొల్పు ఒక మహాండకోశము ఉన్నది. అట్టి వేలాది మహాండకోశములకు ఆధారమైయున్న ఒక మహాసాగరం ఉన్నది. ఆ మహాసాగరం స్పందనారహితమై విపుల బ్రహ్మాండకోశజలరాశికి నిలయమైయున్నది.

ఓ బేతాళా ! అంతేకాదు. ఆత్మ విలాసమైన 'మహార్ణవం' ఒకటున్నది. మనం చెప్పుకున్న మహాసాగర సమూహములు ఆ మహార్ణవంలో చిన్న చిన్న తరంగముల వలె ఒప్పుచున్నాయి.

అట్టి మహార్ణవములు అనేకం తన ఉదరమున కలిగియున్న మహాపురుషుడొకడున్నాడు. ఆతడు సర్వవ్యాపి అయి మహోన్నతుడై, 'విష్ణువు' అను పురాణ నామముతో కూడా వెలయుచున్నాడు. అట్టి వేలకొలది మహాపురుషుల మాలను తన వక్షస్థలమున ధరించిన పరమపురుషుడొకడున్నాడు. ఆతనిని రుద్రుడు అనే పురాణనామంతో కూడా పిలుస్తూ ఉంటారు.

అట్టివే వేలకొలది పరమపురుషులగు రుద్రులు రోమముల వలె అనాయాసముగా వెలువడు చున్నారో ...అట్టి మహాసూర్యుడొకడు కలడు. సర్వప్రాణులకూ ప్రత్యక్షములగుచున్న ఈ బ్రహ్మాండ – రుద్రాది కల్పనలన్నీ మహామండల రూపుడగు ఆ మహాసూర్యుని దీప్తులయి ఉన్నాయి. ఎదురుగా దృశ్యమానమగుచున్న ఈ బ్రహ్మాండమంతా కూడా ఆ మహాసూర్యకాంతిలో కనిపించే అసంఖ్యాక త్రసరేణువులలో ఒకానొకటి మాత్రమే. చిదాత్మయే ఆ మహా సూర్యుడు.

చిదాత్మయే ఈ జగత్తంతటికీ 'తెలియుట, తెలియబడుట' అను వెలుగు, వేడిమిలను ప్రసాదించు చున్నాడు. ప్రతిజీవుని స్వస్వరూపము అట్టి చిదాత్మయే! ఇదే నీ మొదటి ప్రశ్నకు సమాధానం–

ఆ చిదాత్మసూర్యుని రశ్మిలోని సూక్ష్మ పరమాణువులే ఈ బ్రహ్మాండములన్నీ కూడా!

విజ్ఞానమే ఈ చిదానంద సూర్యుని ఆత్మ! ఈ జగత్తును ప్రకాశింపజేయటమే ఆయన చేస్తున్న మహత్తర కార్యక్రమం. ఈ విశాలమగు బ్రహ్మాండములన్నీ ఆయన కాంతిపుంజములే!

భౌతికమగు ఆకాశాన కనిపించే సూర్యునిచే ఈ జగత్తంతా శోభిల్లుతోంది చూచావా? అట్లాగే ఆ విజ్ఞాన సూర్యుని చిత్–కాంతుల వలన ఈ జగత్తులు సత్త పొందుచూ, శోభతో ప్రకాశిస్తున్నాయి.

ఓయీ! బేతాళుడా! ఆ మహాచిత్ సూర్యునే 'భగవంతుడు' అని, 'పరమాత్మ' అని 'బ్రహ్మము' అని శాస్త్రవేత్తలు పిలుస్తున్నారు. ఈ త్రిలోకములు ఆ బ్రహ్మము అనే మణికాంతులలో ప్రకాశిస్తాయి. ఉత్తమాధికారులగు ఆ మహాసూర్యుని పారమార్థికతత్త్వమగు ఆత్మ అఖండాకారమున అన్ని స్థితులందు ప్రత్యక్షమగుచునే ఉన్నది. అనధికారులకో, అది తెలియరావటం లేదు. అగ్నియందు విస్ఫులింగములు వేరువేరు వలె బయల్వెడలుచున్నాయి చూచావా? అలాగే ఆ ప్రత్యగాత్మయందు జీవజగత్తులు వేరువేరుగా తోచుచు, కర్తృత్వం – భోక్తృత్వం మొదలైన అనేక విభ్రమములు కలుగజేస్తున్నాయి.

ఓ బేతాళ మహాశయా! పారమార్థిక దృష్టితో చూస్తే అవేవీ కూడా ఒకింతైనా లేవు. చిదాత్మ ఒక్కటే సర్వదా సర్వత్రా సర్వాత్మకమై ప్రకాశిస్తోంది. అందుచేత నీ ప్రశ్నాడంబరమంతా వదలిపెట్టి సుశాంతుడవు కమ్ము.

రెండవ ప్రశ్న - ఈ బ్రహ్మాండములు, ఈ భావాభావములు ఏ మహాగగన వాయువునందు ధూళిరేణువులై స్ఫురిస్తున్నాయి? అని కదా...?

ఒకానొక చోట ధూళి ఉన్నది. ఆ ధూళి కోట్లాదిమైళ్ళ విస్తారం విస్తరించి అత్యంత లోతుగా ఆక్రమించి ఉన్నది. ఆ ధూళిలో రకరకాల రంగుల ధూళికణములు కలసిపోయి ఉన్నాయి.

1. కాలసత్త (కాలము అనురూపం గల మాయా సత్త).
2. స్పందనసత్త (క్రియాశక్తి ప్రధానమైన సత్త)
3. చిన్మయసత్త (ఎరుగుట అనునది ప్రధానముగాగల సత్త)
4. చిదాభాససత్త (విషయములందు ప్రతిబింబించే చమత్కారం)

ఇవన్నీ అత్యంత సూక్ష్మ పదార్థములవటం చేత వాటిని 'ధూళికణములు' అని వేదములు అభివర్ణిస్తున్నాయి. అట్టి రేణువులన్నీ 'పరమాత్మ'అనే వాయువునందు లేచుచు వివిధ ఆకారములు కల్పించుకొనుచున్నాయి.

పరమాత్మే అన్నిటా వెలుగు సత్త. ఆయన యందే కాలం మొదలైన సత్తలు ప్రతిబింబిస్తున్నాయి. ఆయన నిర్మలుడు, నిర్విషయుడు కదా! ఆయనలో ఆధార, ఆధేయాలు, వ్యపదేశాలు (Misinter pretation) ఎక్కడి నుండి వచ్చాయి? ...అనే సందేహమే అక్కర్లేదు. ఒక పుష్పాంతర్గత రసమే తనలో 1.పుష్పశరీరం, 2.సువాసన ... అనేవి కల్పించుకుని గంధానికి ఆధేయమై వెలయుచున్నది కదా!

పరమార్థసత్తయే కాలసత్త మొదలైన భేదములన్నీ తనయందు కల్పించుకుని వాటన్నిటికీ తానే ఒకవైపు ఆధారమై మరొక వైపు అనుభవమునకు కారణభూతమై (ఆధేయమై) వెలయుచున్నది.

ఈ "కాలము-క్రియ-ఎరుక-విషయాస్వాదన" అను వేరు-వేరు రంగుల ఇసుకరేణువులను ఒకదానితో మరొకటి అనంతకోట్ల దేహోపాధి పరంపరలను ఆటబొమ్మలవలె పరమాత్మతత్త్వమే నిర్మించుకుంటోంది. ప్రతి ఆటబొమ్మను ఆశ్రయించి నీవు-నేను-ఇది-అది-అక్కడ-ఇక్కడ-ఇప్పుడు-అప్పుడు-ఏకానేక ఆంతరంగిక స్ఫురణలను జతజేరుస్తోంది. ఇంతలోనే ఆ ఆటబొమ్మలను నిర్మించుకొని ఆటలాడుకొంటోంది. ఆ విధంగా స్ఫురించే అనంతకోటి చమత్కారాలలో నీ దేహం ఒకటి. నా దేహం మరొకటి. ఆత్మతత్త్వమే అంతటా సత్యం మిగిలినదంతా కల్పన మాత్రమే!

మూడవ ప్రశ్న- ఒక స్వప్నంలో మరొక స్వప్నం, స్వప్నం తరువాత మరొక స్వప్నం ...ఈ విధంగా స్వప్నాలు, స్వప్నాంతర స్వప్నాలు, స్వప్న తదనంతర స్వప్నాలు గనుచున్నప్పటికీ ఆ స్వప్న - స్వప్నాంతరాలతో సంబంధం లేక, తన నిర్మల స్వభావాన్ని ఏ కాలమందూ త్యజించనట్టి ఆ స్వప్నద్రష్ట స్వరూపుడెవడు?... అని కదా, నీ ప్రశ్న?

నీ యొక్క, నా యొక్క, ప్రతి ఒక్కరి వాస్తవ స్వస్వరూపమే ఆ పరమాత్మ. అట్టి పరమాత్మ లేక, బ్రహ్మమే ఈ 'జగత్తు' అను మహాస్వప్నమును, ఆ జగత్స్వప్నంలో 'నేను దేహమును' అను మరొక స్వప్నమును, ఆ దేహతాదాత్మ్య స్వప్నంలో 'జాతి, దేశము, మతము, అయినవారు, కానివారు..." మొదలైన ఇంకెన్నో ఉపస్వప్నములను కల్పించుకొని పొందటం జరుగుతోంది. అయితే అట్టి స్వప్నములు పొందుచున్నప్పుడు, ఆ స్వప్నములలో విస్తరించి ఉన్నది తానే అయినప్పటికీ, తనయొక్క నిజరూపం కోల్పోవటం లేదు. స్వప్నదోషములు స్వప్న ద్రష్టను కళంకితం చేయగలవా? వస్తువుల సంయోగ వియోగములు ఆకాశమును మరొకరీతిగా మలచగలవా?... లేనేలేదు!

ఆత్మ ఆయా స్వప్నముల లోపలా-వెలుపలా విస్తరించి ఉన్నప్పటికీ, ఈ స్వప్న జాగ్రత్ విషయ సముదాయాలు ఆత్మ యొక్క ఔన్నత్యాన్ని దిగజార్చలేవు. ఆత్మసర్వదా, అన్నిటా నిస్సంగమున, జ్యోతిరూపమున వెలుగుచూనే ఉన్నది. అట్టి శాంతం, మహదానందం, సర్వశక్తిమంతం - అగు ఆత్మను ఏమరచి ఈ జనులు నశ్వరములగు పదార్థముల సమ్మేళన-విభజనములను చూచి ఎందుకో వ్యథలు చెందుచున్నారు. సంసారమంతా స్వప్నతుల్యమే! స్వస్వరూపమే పరమసత్యము! పరమసత్యము మాత్రమే నిత్యము! అనునిత్యము!

నాలుగవ ప్రశ్న- అరటి చెట్టు కాండములో గల అరటిపట్టలను విప్పుచూ పోగా ... లోపల ఇక చిట్టచివరగా 'ఆకాశము' కాక మరింకేమీ మిగలదు. ఈ స్వప్న - స్వప్నాంతరములలో ఉన్నదంతా కల్పనను తొలగిస్తూ తరచి చూస్తే ఇక శేషించేదేమిటి?

స్వప్న ద్రష్టయొక్క స్వస్వరూపమే! ద్రష్ట యొక్క స్వరూపమే స్వప్నములో కల్పిత రూపంగా ప్రవేశించి ఉన్నది. కనుక స్వప్నము యొక్క వెలుపల - లోపల ఉన్నది ద్రష్టయే. ఈ విశ్వం యొక్క అంతరాంతరము లందు బ్రహ్మమే వివర్తితమై ఏర్పడి ఉంటోంది. బ్రహ్మము యొక్క అణువులే

అంతటా వెలయుచున్నాయి. వివర్తితం అగుచున్న ఈ 'జగత్‌విస్తృతి'కి ఆ బ్రహ్మమే సత్తయి ఉన్నది. అట్టి స్వస్వరూపమునకు నామరూపములు లేవు!

కాని సర్వజగత్ భావ–అనుభవములకు అది ఆలవాలం కనుక ...దానిని 'ఆత్మ' అను పేరుతో పిలుస్తున్నారు. 'సత్‌బ్రహ్మం' అని కూడా అది అందుకే పిలువబడుతోంది.

అద్దాని గురించి 'అట్టిది' అని ఎవరమూ చెప్పలేము. ఆ బ్రహ్మము సర్వధర్మ శూన్యము. అందుకని పదార్థ వ్యవహారముల దృష్ట్యా అది శూన్యం అని కూడా వర్ణింపబడుతోంది.

ఈ బుద్ధికి కనబడే వస్తువులలో అది ఏదీ కాదు. ఎందుచేతనంటే బుద్ధిని కూడా గ్రహించునది అదే! దానియందు ఏవీ లేవు. అయినా కూడా, అది తప్పితే ఇక్కడ మరొక్కటేదీ లేదు. మనోబుద్ధులకు అదియే సత్త ప్రసాదిస్తోంది. గుణములు కలవాడు లేకపోతే గుణములు ఉంటాయా? అట్లాగే అదే లేకపోతే జగత్తు లేదు, దాని అనుభవం లేదు. స్వప్నము, స్వప్నకారణము, స్వప్నమునకు ముందు – వెనుకల ఉన్నది స్వప్నకర్తయే కదా! జగత్తు విషయములో కూడా ...జగత్తు, జగత్ కారణము, జగత్తుకు ముందు వెనుకల ఉన్నది జగత్ ద్రష్టయే.

వస్త్రమునందలి	వస్త్రసత్త	దారములోనూ ఉన్నది
దారములోని	దారసత్త	దూదిలో ఉన్నది
దూదిలోని	దూదిసత్త	ప్రత్తికాయయందు ఉన్నది
ప్రత్తికాయలోని	ప్రత్తిసత్త	ప్రత్తివృక్షమునందున్నది
ప్రత్తివృక్షములోని	ప్రత్తివృక్షసత్త	ప్రత్తి బీజమునందున్నది
బీజములోని	బీజసత్త	మట్టి–జలమునందున్నది

ఈ విధంగా, ఒక విధమైన సత్త మరొకవిధమైన సత్తగా పర్యవసించటం జరుగుతోంది. ఇట్టి సత్తయొక్క క్రమమును పరిశీలించిన విజ్ఞులు... ఇట్లు సిద్ధాంతీకరిస్తున్నారు.

ఎక్కడెక్కడ ఏఏ క్రమముచే ఏఏ సత్త భావించబడుచున్నదో ...అదంతా కాలానుగతంగా ఆయా భావాకృతులను వీడి, అనుభవజ్ఞరూపమగు 'చిన్మాత్రము' గానే పరవశించుచున్నది. అట్టి నిర్మల మగు చిద్వస్తువే ఈ జగద్రూపముగా వ్యాపించి ఉన్నదని జనులు గ్రహించెదరు గాక !"

బేతాళుడు : ఓహో ! అద్భుతం చాలా బాగా సమాధానం చెప్పావు.

రాజు : .... **ఐదవ ప్రశ్న -** ఈ విశాలమగు భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము అను పంచభూత సముదాయమునకు ఈ బ్రహ్మాండమండలమే ఆధారమై ఉన్నది కదా! ఈ బ్రహ్మాండ మండలం, సూర్యమండలం, మేరు పర్వతము ...ఇట్టి అత్యంత విస్తార పదార్థములన్నీ ఏ అణువు నందు పరమాణురూపంగా ఉన్నాయి? ...అని కదా, నీ ప్రశ్న?

ఆ పరమాత్మ సూక్ష్మాతిసూక్ష్మము, ఇంద్రియాలకు అలభ్యము అవటం చేత 'ఆతడు పరమాణు స్వరూపుడు; అణోరణీయాన్' అని వేదములు ప్రవచిస్తున్నాయి. అనంతగుణవిశిష్టుడు అవటం చేత మేరు పర్వతమునకూ ఆతడే ఆధారుడు కూడా! ఆతడు లింగ–స్వరూపభేదములకు సంబంధించని

వాడు. కనుక, సులభసాధ్యుడు కాదని కొందరి అభిప్రాయం. అయితే, జ్ఞానుల అనుభవమునకు అత్యంత సులభ ప్రాప్యుడు అగుచున్నాడు. అనేక బ్రహ్మాండములతో కూడిన ఈ జగత్తంతా కూడా ఆత్మదేవుని ఒకానొక అణువు యొక్క ఒకానొక అంశ మాత్రమే.

ఈ కనబడే బ్రహ్మాండములన్నీ సూక్ష్మతరములగు చిత్కణములచే పరిచ్ఛిన్నమై ఇట్లు దృష్టికి ప్రాప్తిస్తోంది. అందుచేత "ఆత్మదేవునియందు పరిచ్ఛిన్నమై ఉంటోంది" అను పాఠ్యాంశములన్నీ మిథ్యా పాఠములే. స్వప్నంలో చూచే వస్తువులన్నీ స్వరూపహీనములే అయినట్లు, ఈ జాగ్రత్ బ్రహ్మాండాదులన్నీ స్వతఃగా చూస్తే (అణువుల సముదాయమే కాబట్టి, భావానుగతమే కాబట్టి) స్వరూపహీనములేనని చెప్పక తప్పదు. కనుక ఆత్మదేవునియందు ఇది ఒక అణువువలె పరిచ్ఛిన్నము... అనునదంతా మిథ్యయే. ఇవన్నీ సూక్ష్మనాడులందు స్వప్నసమయంలో తోచే కల్పిత పదార్థ పరమాణువుల వంటివే. వీటన్నిటి యొక్క అంతిమ స్వభావం 'బ్రహ్మమే' అని జ్ఞానులు దర్శిస్తున్నారు.

కాబట్టి ఆత్మయందే ఈ పంచభూతములు, బ్రహ్మాండములు ఒక స్వల్ప విభాగమునందు అనుభూతమవుతున్నాయి. కాని ఆత్మకు విభాగమూ లేదు. అణువూ లేదు. పరమాణువూ లేదు. ఇదే నీ ఐదవ ప్రశ్నకు సమాధానం

బేతాళుడు: ఓ రాజా! నీ సమాధానం యుక్తియుక్తమే. నీవు పరమసత్యమును ప్రకటించుచున్నావని నాకు స్పష్టంగా తెలియవస్తోంది. నా 6వ ప్రశ్న మరొక్కసారి విన్నవిస్తాను.

శిలలన్నీ ఒకచోట కూడితే పర్వతం అవుతుంది. కనుక శిలలే పర్వతానికి అస్థిత్వం కల్పిస్తున్నాయని అందరికీ తెలిసిన విషయమే. అయితే ఒకానొక నిరవయవ పురుషుడు శిలలకు, తదితర సర్వమునకు తానే ఉనికి అయి అస్థిత్వమును ప్రసాదిస్తున్నాడు. అట్టి రాజాధిరాజైన మహత్పురుషుడు ఎవడు? అతనిని నీ వెప్పుడైనా చూచావా?

రాజు : ఓం! చూచాను, చూస్తున్నాను ! అయితే ఈ భౌతికమైన కళ్ళతో కాదు. మనం ఇంతవరకూ వివరించి చెప్పుకున్న ఆ బ్రహ్మమే కళ్ళు-చెవులు మొదలైన వాటికి అగోచరం కాబట్టి 'ఆతడు పరమాణువుకే పరమాణువు'అని మనం ఈ సంభాషణలో గ్రహించియే ఉన్నాం కదా! ఆతడు సర్వ వ్యాపి అవటం చేత 'స్థూలమగు మహాపర్వతము వంటివాడు' అని కూడా విజ్ఞులు అంటున్నారు.

అధ్యారోపదృష్టికి	అదియే ఆకార-అనాకారములన్నిటికీ అవయవము.
అపవాద దృష్టికి	అది సర్వదా నిరవయవము.

ఆతడే సర్వవ్యాపకుడై నెగడుచున్నాడు. ఓ సాధూ! ఈ జగత్రయం ఆ విజ్ఞాన స్వరూపుని సారమై, ఆతనియందే వెలయుచున్నది. అట్టి స్వస్వరూపుని సామవేదం 'మహత్పురుషుడు'గా గానం చేస్తోంది.

ఓ బేతాళా ! ఈ జగత్రయమును ఆత్మవిజ్ఞాన స్వరూపంగా గ్రహించు. ఆ విజ్ఞానాత్మ దేవుడే నీవు, నేను కూడా! అట్టి నన్ను వినష్ట మొనర్చగలిగిన వారెవరు? నిన్ను స్వస్వరూపందృష్ట్యా వినష్టమొనర్చగలిగినది కూడా ఏదీ లేనేలేదు. కాబట్టి నీవు నా ఈ సమాధానమును అనుసరించి త్వరగా అనుభవపదమును అధిరోహించుము.

అట్లు అధిరోహించి సర్వ గర్వాలను విడనాడినవాడివై స్వస్వరూపమున అనంత శాంత అనుభవుడవు కమ్ము.

❖❖❖

2. సర్వసమత్వము

శ్రీవసిష్ఠ మహర్షి : రాజు ఇచ్చిన సమాధానాలు విని బేతాళుడు "ఈతడు తత్త్వజ్ఞుడు" – అని గ్రహించాడు. ఆతని సమాధానాలు బేతాళుని మనస్సుకు శాంతిని ప్రసాదించాయి. ఆతడు రాజుకు సాష్టాంగదండప్రణామం చేశాడు. శాంతచిత్తుడై పరమానందవస్తువును మననం చేసుకోవటం చేత, ఆ బేతాళుడు ఆకలిని కూడా మరచి సమాధిని పొందాడు.

❖

ఓ రామచంద్రా ! ఆ రాజు చెప్పినట్లు ఈ జగత్తంతా చిద్రూపపరమాణువు నందే ఉన్నదని గ్రహించు. చిన్నపిల్లవాడు ఒకచోట కూర్చుని "నేనిప్పుడు మా చుట్టాల ఊరు వెళ్ళాను. అక్కడ అక్క–బావ–చెల్లి–అన్న తదితర తోటివారితో ఆడుకుంటున్నాను" ఇటువంటి ఊహలలోకి వెళ్ళుతూ ఉంటాడు. ఇంతలో "ఒరే ఎక్కడున్నావురా? రా ఇంట్లోకి!" అని తండ్రి పిలుపు వినబడగానే ఆ ఊహ నుండి బయల్వెడలి (లేక) ఆ ఊహను వదలి "ఏమిటి నాన్నా"? అంటూ ఇంట్లోకి వస్తాడు. దీనిని 'బాలభ్రాంతి' అంటాం.

ఈ విశ్వమంతా 'బాలభ్రాంతి'లాగా జ్ఞానవిచారముచే తప్పక ద్రష్టయందు విలీనమైపోతోంది. చివరకు పరమపదమే శేషిస్తోంది. కనుక ఇక నీవు నీ మనస్సును ఈ విషయములనుండి – దృశ్య సమూహముల నుండి త్వరగా వెనుకకు మరల్చుము. నిశ్చలాత్మకమగు ఆత్మబుద్ధిని ఆశ్రయించు. అట్లా ఉంటూనే స్వాభావికంగా నిన్ను సమీపించే కర్మలను వ్యవహారములను నిర్లిప్తుడవై ఆచరించు.

ఓ మననశీలా! మనస్సుచే మనస్సును ఆకాశమువలె నిర్మలం చేయి. ఏకైక వస్తువు అయున్న ఆత్మయందు వృత్తులన్నీ లయం చేసి 'ప్రశాంతచిత్తము' ను సంపాదించుకో. అట్టి ప్రశాంత చిత్తముచే నీవు సర్వత్రా బ్రహ్మభావమును దర్శించి, తద్వారా సమదర్శివి కమ్ము. మోహశూన్యుడవగుము.

యథాప్రాప్తములగు విషయములను నిర్లేపబుద్ధితో అనుసరించువారు భగీరథుని వలె అసాధ్యమగు దానిని కూడా తప్పక సాధించి తీరుతారు.

ఎవడైతే పూర్ణముగా శాంతచిత్తుడై, పరితృప్తాంతఃకరణుడై, ఆత్మయందు ఆత్మచే నిత్యతృప్తుడై వెలయుచున్నాడో ...ఆతనికి అత్యంత దుర్లభమైన అభీష్టములు కూడా సిద్ధించగలవు. గంగావతరణలో భగీరథుడు, సగరుడు మొదలగు వారి చరిత్రలే అందుకు దృష్టాంతం.

కాబట్టి రామా! నిర్విచారుడవై, ఇక ఆపై సర్వక్రియాశీలుడవగుచుండుము. సర్వసమత్వమును అధిరోహించి, యథారీతిగా సర్వకార్యములు నిర్వర్తించుము.

❖❖❖

VIII. భగీరథ యత్నం

1. శ్రీత్రితల-భగీరథ సంవాదం

శ్రీరాముడు: మహాత్మా! మీరు ప్రసంగవశంగా భగీరథ చక్రవర్తి పేరు చెప్పటం జరిగింది. భగీరథ చక్రవర్తి గురించి మీరు కొన్ని విషయాలు మాకు ఆశ్రమంలో బోధించియే ఉన్నారు. ఆ భగీరథుడు చిత్తపరిపక్వత ఎట్లా సంపాదించాడో చెప్పవలసిందిగా విన్నపం.

శ్రీ వసిష్ఠ మహర్షి: విను ...చెబుతాను.

భగీరథుడు కోసలవంశ తిలకుడై జన్మించి యౌవన ప్రాంగణంలో ప్రవేశించగానే అతి విశాల సామ్రాజ్యానికి చక్రవర్తి అయ్యాడు. ఆతడు చిన్నప్పటి నుండే పరమధార్మికుడు. ఆయనను సమీపించిన ప్రజలు ప్రార్థన అను పరిశ్రమ లేకుండానే తమ అభీప్సితములు పొందేవారు. ఆతని ముఖమండలం ఎల్లప్పుడూ చంద్రమండలంలాగా అతి ప్రసన్నమై ఉండేది. ఆతడు ఒక్క క్షణంలో పాత్రాపాత్రము ఎరిగి సజ్జనులకు ధనములను ఇస్తూ న్యాయమగు దానిని తృణమైనా వదలక తన ప్రజల సుఖశాంతులను దృష్టిలో పెట్టుకుని రాజ్యపాలన చేస్తూ ఉండేవాడు. వజ్రవేధ మణి వజ్రమునకు రంధ్రం చేసి ఆ వజ్రమునకు శోభ చేకూరుస్తుంది చూచావా? ఆతడు తన శత్రువులను, దొంగలను, దురాశాపరులను బంధించి వారిని అనేక ఉపాయములచే సచ్ఛరిత్రులుగా, సద్గుణసమన్వితులుగా తీర్చిదిద్దేవాడు. ప్రజల మధ్య రహస్యంగా సంచరిస్తూ వారిలోని అధర్మప్రవృత్తి గమనించి వారిలోని కార్యవిరతిని, దుష్టాచారములను, ప్రలోభప్రవృత్తులను పోగొట్టుతూ ఉండేవాడు. తన పరాక్రమముచే శత్రురాజులకు సింహస్వప్నమై ఉండేవాడు. బ్రహ్మవేత్తల వద్ద ఆర్ద్రాంతఃకరణుడై ఎంతో అణకువతో మెలగేవాడు.

ఆతడొకప్పుడు కపిల ముని శాపంచేత పాతాళగర్భమున చిక్కిన తన పూర్వీకులను ఉద్ధరించదలిచాడు. ఎడతెగని తపః క్లేశములచే బ్రహ్మదేవుని, శంకరుని, జహ్నుమునిని మెప్పించి భూపాతాళములకు గంగాజలము ప్రవహింపజేశాడు.

ఓ రామచంద్రా! ఇక ఆ భగీరథుని యౌవనంలో జరిగిన కొన్ని విశేషాలు ఇచ్చట ముచ్చటించుకుందాం. భగీరథునికి నీలాగే యౌవనంలోనే సంసారాన్ని గూర్చిన 'విచారణ'తో గూడిన చమత్కార బుద్ధి కలిగింది. యౌవ్వనంలోనే అట్టి సమబుద్ధి కలగటం ఈ లోకంలో కొంత దుర్లభమైన విషయమే.

ఆతడొకసారి ఒక ఒంటరి ప్రదేశంలో ఆసీనుడై ఇట్లు చింతించసాగాడు.

భగీరథుడు : (తనలో) ఆహా! ఈ జగత్‌యాత్ర ఎంత అసమంజసమైనది? ఎంతటి ఉద్వేగములతో కూడి ఉన్నది? తెల్లవారుతోంది. ప్రొద్దుగ్రుంకుతోంది. రాబోయే కాలం రానే వస్తోంది. వర్తమానం 'గతం' అనే అగాధంలో పడి మటుమాయమౌతోంది. ఇక దినచర్యలన్నీ నిన్నటి లాగానే ఈ రోజు,

రేపు కూడా ఉంటున్నాయి. ఈ కర్మలు, వాటి ఫలములు ...వీటిలో ఏం ప్రత్యేకత ఉన్నది? తిన్నదే మరల తింటున్నాం. ఈ రాజ్య – గృహ – జన వ్యవహారములలో అపూర్వమైనది ఏమున్నది? ఏది పొందితే అన్నీ పొందినట్లే అవుతుందో ...అట్టి దేదైనా పొందాలిగాని, అల్ప విషయాలు ఆశ్రయిస్తూ ఎందుకీ జీవితం? నాకు తారసపడుచున్న ఈ వస్తుసముదాయమంతా నిస్సారమని, అర్థరహితమని, చివరకు దుఃఖకరములేనని తెలిసిపోతోంది. పుట్టుక–చావుల మధ్య గల జీవితం అను అవకాశాన్ని అర్థంపర్థం లేని పనులకు వెచ్చించి ఏం ప్రయోజనం? చర్వితచర్వణంగా, గానుగ ఎద్దులా నిర్వర్తించే ఈ తినటం, త్రాగటం, వాగటం – వంటి నిరర్థక క్రియలలో కాలమంతా వెచ్చించుచున్నందుకు నాకు సిగ్గనిపించటం లేదేం? అల్పప్రతిఫలాలు–దుఃఖ ప్రయోజనాలు అగు విషయేంద్రియ కార్యక్రమాలతో సంతోషించి రోజులు గడపటమనేది కుక్క బొమికను నోటకరచుకొని గొప్ప వస్తువుగా తలచి వీథులందు సగర్వంగా పరుగెత్తటం వంటిది కాక మరేమిటి?

ఇట్లు ఆలోచిస్తూ ఆ భగీరథుడు సంసార వ్యవహారమంతా పరికించి చూశాడు. అజ్ఞానాంధకార పర్యవసానాలను, సంసారం యొక్క విన్యాసాన్ని చూచి మిక్కిలి భీతిచెంది, తన కులగురువగు త్రితల మహర్షి ఆశ్రమానికి అప్పటికప్పుడు బయలుదేరాడు. ఆయనను సమీపించి సాష్టాంగ నమస్కారం సమర్పించాడు.

❖

భగీరథుడు : తండ్రీ! సద్గురూ! మా సంగతి గమనిస్తూనే ఉన్నారు కదా? సారశూన్యమగు ఈ సంసార మహారణ్యంలో చిక్కుకుని మేము బక్కచిక్కిన ఎద్దులాగా అలమటిస్తున్నాం. అంతులేని 'ఆశలు' అనే ముళ్ళపొదలలో ఎప్పుడో చిక్కుకున్నాం. అనేక సుఖదుఃఖాల రాకపోకలు మమ్ము అనుక్షణం పీల్చి పిప్పిచేస్తున్నాయి. ఇక్కడ కనిపించే తుచ్ఛ – అల్పకాలిక విషయాల పట్ల మాకు క్షణక్షణం ఏర్పడు చున్న రాగ–ద్వేషాలు కాలమేఘంలా క్రమ్ముకుని మమ్ములను అజ్ఞానంలో కప్పి ఉంచి ఆట ఆడిస్తు న్నాయి. అనేక కర్మలందు ఆసక్తి గలవారమై మేము మా ఉత్తరోత్తర గతులేమిటో గ్రహించలేకపోతున్నాం. ఒకవేళ గ్రహించినా, మా బుద్ధి మాకు వ్యతిరేకమై ఉండటం చేత నిస్సహాయులమైన కాలయాపనాన్ని, కాల దుర్వినియోగాన్ని నిరోధించలేకపోతున్నాం. ఊరకుక్క నిస్సారంగా వీథివీథికి, ఇంటింటికి తిరిగి, మరల మురికి గుంటకు చేరుతుంది చూచారా? మేము కూడా మతితప్పి స్వర్గ – నరక – మనుష్య లోకాలలో తచ్చాడి తిరిగి అంధకారమయమగు అజ్ఞాన స్థానాలలో చేరుకుంటున్నాం?

హే కరుణా సముద్రా! నా పుణ్యవశం చేత ఈ రోజు మిమ్ములను సమీపించాలని, శరణు వేడాలని బుద్ధి పుట్టింది. 'జరామరణ మోహాలు' అనే ఆకృతి ధరించిన ఈ దుఃఖాలు ఉపశమించేది ఎట్లా? సంసారహేతువుల నుండి నన్ను నేను ఎట్లా రక్షించుకోవాలి? సెలవివ్వండి.

త్రితల మహర్షి : నాయనా ! ఎందుకీ దిగులు? నీవు నిరుత్సాహపడటమేమిటి? మహాప్రయత్న శీలుడవగు నీవు 'దుర్లభం – నిస్సహాయం – దుస్సాధ్యం' అంటూ అల్ప శబ్దములు పలుకుచున్నావేం?

1. శుశ్రూష, 2. శ్రవణము, 3. గ్రహణము, 4. ధారణ... ఇవి సాధన చతుష్టయం కదా!

వీటిని అవలంబించు. క్రమంగా వైషమ్యరహితుడవు కమ్ము. సామ్యస్థితి సంపాదించుకో. అనాది సిద్ధమైన బ్రహ్మరూపమున ఆవిర్భవించు.

జ్ఞేయం అయినట్టి ప్రత్యక్‌తత్త్వాన్ని గ్రహించటానికి నీకున్న అన్ని మార్గాలను, అవకాశాలను, సాధనలను ఉపయోగించుకో. అప్పుడు తత్త్వజ్ఞానము నందు తప్పకుండా పరిపూర్ణత పొందుతావు. నిర్మలస్వరూపుడా! తత్త్వజ్ఞానివైన మరుక్షణం ఆ దుఃఖాలన్నీ వాటంతట అవే తొలగిపోతాయి. ఇక సంశయాలూ ఉండవు. సంసారగ్రంథులూ ఉండవు.

భగీరథుడు : 'జ్ఞేయం' అంటే ఏమిటి?

త్రితల మహర్షి : 'తెలుసుకోవలసినది తెలుసుకోవటం' ...అనే అర్థాన్ని ఉద్దేశించి శాస్త్రకారులు జ్ఞేయం అనే శబ్దాన్ని ఉపయోగిస్తున్నారు. పరమపవిత్రం, సర్వగతం, నిత్యం, జ్ఞాపకములన్నిటికీ ఆధారం - స్థానము అయిన జ్ఞప్తి రూపమగు ఆత్మయే జ్ఞేయము.

'ఆత్మ' అనగా ఏది? ఎక్కడున్నది? నీ యొక్క స్వస్వరూపమే ఆత్మ కదా! అనగా జ్ఞేయము నీ యొక్క వాస్తవ స్వరూపమే! అట్టి ఆత్మకు మాయాబంధం లేదు. దుఃఖం లేదు. అలసత్వం లేదు.

భగీరథుడు : మునీశ్వరా ! తమరు ఒకప్పుడు తాత్త్విక విషయాలు బోధిస్తూ రెండు గొప్ప విషయాలు నాకు చెప్పారు-

1. ఆత్మ నిర్గుణము, నిర్మలము, శాంతము చ్యుతిరహితము.
2. ఆత్మ ఒక్కటే అయి అన్ని కాలములందూ, అందరియందును ఒకే విధంగా వెలయుచున్నది.

ఈ దేహాదులకు వాస్తవమైన అస్థిత్వము లేదని, ఆత్మకు మాత్రమే అస్థిత్వము కలదని మీరు బోధించగా నేను శ్రవణం చేశాను. మీరు ప్రవచించింది అత్యంత యుక్తమని కూడా గ్రహించాను. అయితే సత్-అసత్‌లకు సంబంధించిన ఉభయ బోధలలోని సదాత్మకత్వము తగినంతగా బోధపడ లేదని నా కనిపిస్తోంది. నేనెప్పుడు ఏ ఉపాయం అవలంబించి ...తద్ద్వారా విక్షేపం లేని శాంతిని సంపాదించుకోగలను? ఏ మార్గం అనుసరించి ఆత్మ సంవిత్తును ఇప్పుడు నేను పొందాలి? ఈ విషయం నాకు విశదీకరించి చెప్పండి.

త్రితల మహర్షి : ... ఊఁ! ఇంకొంత స్పష్టంగా నీ సందేహమేమిటో చెప్పు.

భగీరథుడు : మహర్షీ! అఖండాకారము, శాంతము, నిర్మలము అని మీచే వర్ణించబడిన ఆత్మ నాకు అనుభూతమగుటలేదు. ఎందుచేత?

త్రితల మహర్షి : ఎందుచేతనంటే... 1.ఈ రాజ్యం పట్ల అభిమానం, 2.అట్టి సంసర్గం వలన ప్రాప్తించే అనేక విషయాలలో నీ చిత్తం తగుల్కోవటం... ఈ రెండు కారణాల వల్ల నీకు ఆత్మ స్పష్టంగా అనుభూతమగుట లేదు.

నీ హృదయాకాశమున అమానిత్వం (గర్వం రహితమై పోవటం) ఉదయించిందా, అప్పుడు నీ యందు 'అభిమానం' అనే జాడ్యం తొలగిపోతుంది. అభిమానవిరహితమైన చిత్తం మాత్రమే

జ్ఞేయమును గ్రహించగలదు. అనగా ...జ్ఞేయానికి – నీకు మధ్య 'అభిమానం' అనే తెర అడ్డుగా ఉంటోంది. జ్ఞేయమును గ్రహించినప్పుడు నీ చిత్తం ఆ జ్ఞేయమునందు నెలకొని, ఇక తన చిత్తత్వం త్యజించివేయగలదు. అప్పుడు నీవు పూర్ణ స్వభావాన్ని బడయగలవు. ఇక ఆ తరువాత తత్స్వభావం నుండి చ్యుతి ఉండదు. 'ఈ దేహంచే నేను జన్మిస్తున్నాను. దీనితో మరణిస్తున్నాను. మరొక దేహంతో పునర్జన్మ పొందుచున్నాను' ...అను పునర్జన్మ స్వభావం పొందవు.

ఓ భగీరథా ! ఏది జ్ఞానమో, ఏది అజ్ఞానమో ముందుగా తెలుసుకో.

భగీరథుడు: 'జ్ఞానము' అనుదానికి సవివరమైన నిర్వచనం ప్రసాదించ ప్రార్థన.

త్రితల మహర్షి :

అసక్తిం, అనభిష్వంగః పుత్ర–దార–గృహాదిషు ।
నిత్యం చ సమచిత్తత్వమ్ ఇష్ట–అనిష్టోపపత్తిషు ॥
ఆత్మనో అనన్యయోగేన తద్భావనమ్ అనారతమ్ ।
వివిక్తదేశ సేవిత్వమ్ అరతిః జనసంసది ॥
అధ్యాత్మజ్ఞాన నిత్యత్వమ్ తత్త్వ జ్ఞానార్థదర్శనమ్ ।
ఏత జ్ఞానమితి ప్రోక్తమ్, అజ్ఞానం తదతో అన్యథా॥

'జ్ఞానము' అనగా మా ఉద్దేశంలో ఏమిటో విను–

1. భార్య, పుత్రులు, గృహములు మొదలైన దృశ్య సంబంధమైన విషయముల పట్ల ఆసక్తిగాని, 'అవి నావి' అను మమకారము గాని ఉండకపోవటం.
2. నీ ఇంద్రియములకు ఇక్కడ ఇష్ట అయిష్టములు తారసపడుతూ ఉంటాయి కదా! అట్టి ఉభయ విషయముల పట్ల సమచిత్తుడవై ఉండటం
3. అనన్యమగు ఆత్మ వస్తువును అన్ని వేళలా భావన చేస్తూ ఉండటం.
4. జనులతో ఏర్పడే సంబంధ వ్యవహారములతో అభిరుచి పొందక ఏకాంత స్థానమును సేవిస్తూ ఉండటం.
5. జ్ఞాన విషయమై శ్రవణ మననముల నిరంతరాభ్యాసం.
6. తత్త్వార్థమైన ఆ అఖండ – నిర్మల – నిత్య పరమాత్మ స్థానమును – ఎక్కడికి నీ చూపు వెళ్ళితే అక్కడ – దర్శిస్తూ ఉండటం.

ఇవి 'జ్ఞానం' అని అంటున్నాం. వీటికి సానుకూలం కానివన్నీ 'అజ్ఞానం' అని మా ఉద్దేశం. నాయనా! అహంభావమును ఉపశమింపజేసి, నీ చిత్తం నుండి రాగద్వేషములను వెడలగొట్టావా... మరుక్షణం సంసారమనే వ్యాధికి దివ్యౌషధమైనట్టి జ్ఞానం నీకు తప్పక లభిస్తుంది. శాస్త్రాదులచే, మా వంటి గురువులచే ప్రతిపాదించబడే సర్వసాధనాల ముఖ్యఫలం అనహంకారమేనని గ్రహించు. నీలో అహంకారం ఉన్నంత వరకూ 'అమానిత్వం' మొదలైన దైవీసంపత్తికి చోటెక్కడిది?

భగీరథుడు: గురువర్యా! వృక్షము పర్వతముపై అధిరోహించి తిష్టవేసుకుని కూర్చుంటుంది చూచారా?

అట్లా అహంభావము నా ఈ శరీరము నందు దృఢంగా పాతుకుపోయి ఉన్నది. దయచేసి, అది ఎట్లా తొలగుతుందో చెప్పండి.

త్రితల మహర్షి : వత్సా ! అందుకు ఉపాయం ఊసురోమంటూ, దుఃఖిస్తూ కూర్చోవటం మాత్రం కానే కాదు. విషయ భోగముల పట్ల 'అభిలాష' అప్రయత్నశీలునియందు జన్మ-జన్మకూ పేరుకుపోతూ ఉన్నది. అట్టి అభిలాష వ్యసనమై 'వాసనలు'గా అంతరంగమునందు వ్యాపించి ఉంటున్నది. ఆ వాసనలు ఆత్మను ఆవరించి ఉండటంచేతనే పరమానందమయమగు నీ స్వస్వరూపము నీ కనుభవం కావటం లేదు. ఇప్పుడేం చేయాలి? దిగాలుపడి కూర్చుంటే ఎట్లా? లే! లేచి పురుషప్రయత్నమును ఆశ్రయించు. అట్టి పురుషప్రయత్న బలంచే నీ యందు పేరుకొనియున్న భోగవాసనలను పరిత్యజించు. భోగాల గురించి చింతించటం మానివేయి. అప్పుడు అహంకారం కూడా వినాశనం కాక తప్పదు.

అయ్యో! ఈ నా రాజ్యం పోతుందేమో?... కొంతకాలం తరువాత ఏ కారణం చేతైనా ఇప్పట వలె నన్నెవరూ గౌరవించరేమో?... అందరూ నన్ను యాచిస్తూ ఉండగా వారికి-వీరికి దానధర్మాలు చేస్తున్నాను, అట్టి నేను భిక్షుకుడనై ఇంకొకరిని ఏదైనా యాచించే సమయం రాదుకదా?... నేను గొప్పవాడి నని చాలామంది అనుకుంటున్నారు కదా! రేపు అనేకమంది ప్రజలు, ఆ శత్రురాజులు నన్ను ఎగతాళి చేయరుకదా! నా పట్ల ఏదైనా అసమర్థత వచ్చిపడుతుందా?... ఈ రోజు బాగానే ఉన్నది. మరి రేపు సరి అయిన అన్నపానములు, గృహాదులు ఉండకపోతే రేపు నా గతి ఏమిటి?... నేను వీరి కొరకై ఏదైనా చేస్తే బాగుండు !...

...ఇటువంటి రూపంలో ఉండే అనేకానేక చింతల వల్ల నీకు లజ్జాభిమానాలు కలుగుచున్నాయి. ఇటువంటి చింతలు నీ కొరకై గృహాభిమాన రూపంలో ఒక గొప్ప పంజరం తయారుచేసిపెట్టాయి. అట్టి పంజరమే నీ నిరుత్సాహ - దిగుళ్ళకు కారణమై ఉంటోంది. అట్టి విషయ పంజరం సంపూర్ణంగా భగ్నం కానంత వరకూ నీలో అహంకారం కాపురం చేస్తూనే ఉంటుంది. అహంకారం నీ చిత్తంలో భయాన్ని గొలిపేటట్లు తాండవం చేస్తుంటే నీకు శాంతి ఎక్కడిదయ్యా? వాస్తవానికి 'నావి' అనుకునే ఏవీ నీవి కావు. 'నావి' అను రూపం గల ఆవేశమే నీ వివేక బుద్ధి వికసించకుండా అడ్డుకుంటోంది.

❖

ఓ రాజా! నీవిప్పుడు 'వివేకబుద్ధి' అనే స్నేహితుని సహాయం ఆశ్రయించు. నీకిప్పుడు చెప్పిన అజ్ఞాన విషయాలన్నీ పరిత్యజించు. నిశ్చలతను అలవర్చుకో. అప్పుడా ఆత్మపదం నీకు కరతలామలకం అవుతుంది. 'నాది' అనునది అహంకార - మమకారముల జాడ్యంచేతనే నిన్ను పట్టి పీడిస్తోంది. కాబట్టి అహంకార-మమకారాలు వదిలేదెట్లాగో యోచించు.

ఇక, అహంకారత్యాగం కొరకై ఏమి చేయాలో చెప్పమంటావా?... నీవిగా నీవు భావిస్తూవస్తున్న రాజోపయుక్తమైన ఛత్ర - చామరాది చిహ్నములను అన్నిటినీ పరిత్యజించు.

ఈ రాజ్యలక్ష్మిని ఎవరికైనా సమర్పించివేయి. శరీరాభిమానం ప్రారత్రోలి, ఎవ్వరికంటే నీవు ఉన్నతుడవని అనుకుంటున్నావో ...వారివారి దగ్గిరకు వెళ్ళి భిక్ష ఎత్తు. తద్వారా "నేనే అంతటి వాడినీ - ఇంతటివాడిని" - అనే భ్రమను వదిలించుకో!

ఇచ్ఛారాహిత్యం అలవరచుకో! అనగా, సర్వ ఇచ్ఛలను ఆ ఇచ్ఛలకు సంబంధించిన ప్రయత్నములను వదలివేయి.

'జీవాత్మ ఎవరు? సంసారమేమిటి? మోక్షం ఎప్పుడు వస్తుంది? ... అనే ప్రశ్నలను పరిత్యజించు. "ఇదంతా... నాతో-నీతో సహా... పరమాత్మ విన్యాసమే" - అనే అవగాహనను, అనుభూతిని నిరంతర భావన ద్వారా ఆశ్రయించు.

అట్టి ప్రశ్నలకు అనేక వివరములను ఇస్తున్న నీ గురువైన నన్ను కూడా త్యజించివేయి.

అంతా వదలిన తరువాత ఇకప్పుడు ముముక్షువులకుండవలసిన ఉత్తమగుణములందు మాత్రమే దృష్టిసారించు. భోగ-త్యాగములను జగన్నాటకములోని క్రీడా వినోదములుగా గమనిస్తూ పరిత్యజించు.

జగత్తులో ఉంటూ జగత్తులో లేనివాడగుము. సర్వత్యాగివైన మరుక్షణం నీవు మోక్షస్వరూపుడవే! అప్పుడు సర్వోత్కృష్టమగు బ్రహ్మభావమును పొందగలవు. సంసారభ్రాంతికి నీయందు కొంచెం చోటు కూడా ఇక దొరకదు.

❖❖❖

2. సర్వ పరిత్యాగం

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఆ విధంగా భగీరథుడు కులగురువైన త్రితల మహర్షిచే బోధించబడ్డాడు. ఆశ్రమం నుండి బయలుదేరి అంతఃపురం చేరాడు. గురువు చెప్పిన విషయాలన్నీ ఒకటి తరువాత మరొకటిగా చాలాసార్లు మననం చేసుకున్నాడు. ప్రతివాక్యాన్ని స్వబుద్ధితో బాగా విచారణ చేశాడు. ఇక తన తరువాత కర్తవ్యమేమిటో దృఢంగా నిశ్చయించుకుని స్థిరసంకల్పుడయ్యాడు.

కొద్దిరోజులు మౌనంగా గడిచిపోయాయి. 'సర్వత్యాగము' అను సంకల్పబలం సిద్ధించాలనే ఉద్దేశంతో సోమయాగము నుండి విశ్వజిత్ యాగము వరకు గల అనేక యజ్ఞములను నిర్వర్తించాడు. అవన్నీ ముగియగానే ఇక తాత్సారం చేయలేదు. పాత్రాపాత్రముల విచారణ చేయకుండా బ్రాహ్మణులకు, బంధువులకు, తదితరులకు అనేక గోవులను అశ్వములను భూమిని, బంగారమును అమితంగా ఇచ్చివేశాడు. అంతఃపురంలోని అమూల్య వస్తువులను అక్కడి పరిచారికలకు, పేదవారికీ ఇచ్చి వేయగా, ఇక ఆతడు కట్టుబట్టలతో మిగిలాడు. రాజు చేస్తున్న దానాలన్నీ చూచి "ఏమిటి? ఈతనికి ఏమన్నా పిచ్చి పట్టలేదు కదా?" అని మంత్రులందరు గుసగుసలాడసాగారు.

ఒక రోజు రాజసభ అనేక సంరంభములతో జరుగుచుండగా, భగీరథుడు లేచి నిలుచున్నాడు. "ఓ కోసలదేశ ప్రజలారా! మంత్రులారా! మీ అనుజ్ఞతో నేనీ రాజ సింహాసనాన్ని పరిత్యజించదలిచాను. మీరు ఎరిగియే ఉన్నారు. ఆతడు రాజుగా మీకు సేవలందించుగాక!" అని అభిప్రాయం వెలిబుచ్చి, సభ నుండి వెనువెంటనే బయల్వెడలి అంతఃపురం జేరాడు.

నాలుగు రోజులు పోయిన తరువాత ఒక రోజు ఒక ఆంతరంగికుని పిలిచి ఆ కోసల రాజ్యాన్ని జయించాలని ఎంతో కాలంగా కలలు కంటున్న శత్రురాజుకు కబురుపెట్టి, తన రాజ

సింహాసనాన్ని ఆ శత్రురాజుకు సమర్పించివేశాడు. ఆ శత్రురాజు ఎంతో సంతోషంగా కోసల రాజ్యాన్ని తన సొంతం చేసుకున్నాడు.

ఇక భగీరథుడు ఒక గోచీ మాత్రం ధరించి అక్కడి వారందరి కన్నులు కప్పి ఎక్కడో తనకే అప్పటికి తెలియని సుదూర ప్రాంతానికి ఒంటరిగా వెళ్ళిపోయాడు.

❖

ఆ భగీరథుడు తన పేరు ఊరు తెలియని సుదూర గ్రామములందు, అరణ్యములందు ఓపికతో వసించసాగాడు. ఇలా ఆతని జీవితం గడచుచుండగా కొంతకాలానికి ఆతని చిత్తంలోని వాసనలన్నీ తొలగిపోయాయి. అచిరకాలంలోనే పరమశాంతి లభించగా, ఆత్మయందు విశ్రాంతి పొందాడు.

అట్టి నిర్వికార స్థితిని పొందిన భగీరథుడు భూమండలమున గల అనేక ద్వీపాలలో సంచరిస్తూ ఒక రోజు సుదీర్ఘ ప్రయాణవశంగా తాను ఇతఃపూర్వం రాజ్యమేలిన కోసల రాజ్యంలో ప్రవేశించాడు.

'ఇది ఒకప్పుడు నా రాజ్యం, నా నగరం' అనే సంస్కారం లేకుండానే ప్రధాననగరాన్ని (ముఖ్యపట్టణం) యాదృచ్ఛికంగా చేరాడు. అక్కడ వీధులందు తిరుగుతూ పౌరుల వద్ద మంత్రుల వద్ద భిక్ష యాచిస్తూ ఉండేవాడు.

కొందరు పౌరులు, కొందరు మంత్రులు ఆతనిని గుర్తించటం జరిగింది. అయితే ఆతడు అదేమీ పట్టించుకోలేదు. అయినప్పటికీ ఆతనిని చూచిన కొద్దిమంది మంత్రులు పౌరులు ఖేదచిత్తులయ్యారు. 'ఆహా ! ఎంతటి మహారాజు ! అంతటివాడు ఈ రోజు ఇక్కడ భిక్షాటనం చేయటమా? మనలను తన కన్న బిడ్డల వలె చూచిన ఈ భగీరథ చక్రవర్తి మనలను యాచించటమా? అరుగులపై, చెట్టు నీడలలో నిద్రించటమా? ఇది అసమంజసం' ...అని తలచిన కొందరు పౌరులు ఆతనికి మధురపానీయములు, ఆహారం తెచ్చి ఇవ్వటం ప్రారంభించాడు. ఆతడు తనకు ఆకలి తీరువరకు మాత్రమే ఎవరిచ్చినా ఏమీ అనకుండా స్వీకరించి 'శుభం' పలికి ఊరుకునేవాడు. కొందరు ఆయనను తమ గృహములకు ఆహ్వానించారు. 'లేదు. నాకు ఎక్కడున్నా ఒక్కటే. నాకేమీ కష్టమనిపించనప్పుడు మీకెందుకు తాపత్రయం? మీరు యథా విధంగా మీమీ పనులు చూచుకోండి"...అని చెప్పి మరొక వీధికి వెళ్ళిపోతూ ఉండే వాడు, ఆ చక్రవర్తి !

4,5 రోజులు గడిచేటప్పటికి భగీరథుని రాక గురించి కోసల రాజ సింహాసనం అనుభవిస్తున్న రాజుకు ఎవరో చెప్పటం చేత తెలిసింది. ఎవరినో సేవకులను పంపించి భగీరథుని అంతఃపురానికి ఆహ్వానించాడు. కానీ భగీరథుడు ఆ ఆహ్వానం స్వీకరించలేదు.

అప్పుడా శత్రురాజే భగీరథుడున్న ప్రదేశానికి వచ్చి "హే భగీరథ చక్రవర్తీ! మీరు మహత్తర ఉదార స్వభావులు. ప్రజలకు మీరంటే ప్రాణం. మీ పరిపాలనను ఇప్పటికీ వారు మధుర స్వప్నం వలె భావించటం నేను గమనించాను. పరిపాలనాదక్షులగు మీ ముందు నేనెందుకూ కొరగానని గ్రహించాను. రాజులమైనందుకు మనం కోరుకునేది ప్రజల క్షేమమే కదా! నాకు కుమారులు లేరు. మిమ్మల్నే నా కుమారుడుగా తలుస్తాను. దయచేసి మీ సింహాసనం మీరు అలంకరించి ప్రజలకు,

నాకు ఆనందం చేకూర్చండి. నేను మీ రాజ్యం మీకు సమర్పించి మీకు భృత్యుడనై ఉండటానికి సంసిద్ధుడను... అని అనేక విధాల బ్రతిమలాడాడు. నచ్చచెప్పజూచాడు. లాభం లేకపోయింది. ఆ రాజు ప్రేమతో ఇచ్చిన ఒక పండు తప్పితే భగీరథుడు ఇంకేమీ ముట్టుకోలేదు. రాజ్యం విషయంగాని, రాజకీయ విషయాలుగాని, బంధువుల విషయంగాని, మరింకెవ్వరి గురించిగాని భగీరథుడు సంభాషించనైనా లేదు. ఏదైనా ఆ శత్రురాజు చెప్పవస్తే వినలేదు కూడా!

మరొక నాలుగు రోజుల తరువాత భగీరథుడు ఆ నగరం నుండి కాలినడకన బయలుదేరాడు. త్రోవలో కోసలదేశ గ్రామాలూ, పట్టణాలూ ఉన్నాయి. అక్కడక్కడి ప్రజలు భగీరథుని గుర్తుపట్టి గౌరవ – ఆశ్చర్య – దుఖాదులు ప్రదర్శించటం చూచి వాటన్నిటికీ చిరునవ్వుతో సమాధానం ఇస్తూ తన ప్రయాణం కొనసాగించి, క్రమంగా త్రితల మహర్షి ఆశ్రమం చేరాడు. ఆయన భగీరథుని సాదరంగా ఆహ్వానించారు. భగీరథుడు మాత్రం తదితర శిష్యుల లాగానే గురుశుశ్రూష చేస్తూ ఆ ఆశ్రమంలోనే కొన్ని రోజులు గడిపాడు. అట్లా కొంతకాలం గడిచింది.

త్రితలుడు శిష్యుడగు భగీరథుని త్యాగబలం, ఆత్మావలోకనాభిలాష చూచి ఆశ్చర్యచకితుడైనాడు. ఒక రోజు శిష్యులందరినీ, భగీరథునితో సహా, సమావేశపరిచాడు.

"ఓ ప్రియశిష్యులారా! 'సర్వము త్యజించు' – అని ఈ భగీరథునికి బోధించాను. ఈతడు సర్వమును త్యజించి గురువగు నాకన్నా కూడా సమున్నతమోక్షస్థానంలో సంస్థితుడైనాడు. ఈ రోజు నుండి ఈతడు నాకు శిష్యుడు కాడు. ఈతనికే నేను శిష్యుడను. ఈతనిని సేవిస్తూ నేను అనుసరించ దలిచాను. మీరందరూ మీమీ ఇచ్ఛానుసారం మరొక గురువును ఆశ్రయించవచ్చు" అని ప్రకటించాడు.

ఆ తరువాత గురుశిష్యులగు త్రితలమౌని – భగీరథులు కలసి పాదచారులై అక్కడి నుండి ఏ నిమిత్తం లేకుండానే బయలుదేరారు. వనములందు, గ్రామములందు, పర్వతప్రాంతములందు, పట్టణములందు సంచరిస్తూ అక్కడక్కడా కొంతకాలం గడిపారు.

వారిరువురు ఈ దేహసంబంధమైన, గ్రహణ – త్యాజ్యముల రెండింటికీ అతీతమగు మానసిక స్వస్థితితో సామ్యభావము పొంది, ఆత్మసుఖ విశ్రాంతి అనుభవిస్తూ ఉండేవారు. అకృత్రిమమగు సుఖ విశ్రాంతిని పొందుతూ ఉండేవారు. ఒక రాజు వెన్నెలకాంతిలో తన ఉద్యానవనంలో సంచరిస్తున్నట్లు వారు నిశ్చింతులై శోక – భయ – ఉద్వేగరహితులై, సుఖదుఃఖ ప్రసంగము లేనివారై అనేక ప్రదేశములలో సంచరిస్తూ ఉండేవారు.

ఎద్దాని సమ్ముఖంలో విషయానందములు అర్థరహితములగుచున్నాయో, ఏదైతే సుఖస్ఫురణ గాని, దుఃఖస్ఫురణగాని, మధ్యస్థమైనదిగానీ కాదో ...అట్టి నిర్విషయ పరమానందమును వారు అనునిత్యం అనుభవిస్తూ బాలురు సంచరించే ఆటస్థలంలాగా ఈ భూమిపై గల అనేక ప్రాంతాలలో ప్రవేశించారు. ఈ జన – ధన – తదితర వైభవములు, బ్రహ్మలోకవాసులవరకూ గల అణిమాదిసిద్ధులు వారి దృష్టికి రహదారి ప్రక్కగా ఉన్న ఎండుగడ్డిపరక వలె స్వల్పమైనవిగా తోచేవి. వారిద్దరూ మనుష్య భోగముల నుండి దివ్యభోగముల వరకు పరమవైరాగ్యము కలిగి ఉండేవారు.

❖

ఓ రామచంద్రా! ప్రారబ్ధకర్మ వల్ల ఈ శరీరం లభిస్తోంది. మరల కర్మల చేతనే ఇది క్షీణించ బోతోంది. అయితే ఎవరు ఆత్మయందు అనుక్షణికమైన ధారణ కలిగి ఉంటారో ...అట్టి వారికి ఈ ప్రారబ్ధ – ఆగామి – సంచిత క్రమములన్నీ వర్తించవు. ఈ శరీరాలు, తత్సంబంధిత వ్యవహారాలు చిన్న పిల్లల ఆటలుగా తోచేవారికి, స్వస్వరూప అనుభూతియందు, నిశ్చలులై ఉన్నవారికి ఇక ప్రారబ్ధం లేదు. ఆగామీ లేదు. అనగా అవన్నీ వారి దృష్టిలో విషయరాహిత్యం సంతరించుకుంటాయి. సర్వస్థితులందు సమవర్తియగు ఆత్మను సర్వదా సందర్శించేవారికి సంసారమెక్కడిది? సంసారమే లేనివారికి కర్మలు–ఫలాలు ఏమి ఉంటాయి?

❖

ఆ మునులిద్దరూ పూర్వ కర్మల వలన లభించే సుఖ–దుఃఖముల రెండిటినీ ఆనందంగానే చూడసాగారు. వారి స్వస్వరూపమే ఆనందమయమయినప్పుడు ఇంక లోటేమున్నది? ఇచ్ఛను పూర్తిగా వదలి ఉండుటచే వారిద్దరకీ స్వాభావికంగానే పరమశాంతి లభించింది.

❖❖❖

3. పునః పట్టాభిషేకం - గంగావతరణం

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రాఘవా ! ఆ విధంగా ఆ త్రితల – భగీరథులు శాంతైశ్వర్య మనస్కులై ఒక సారి అయోధ్య రాజ్యం చేరుకున్నారు. ఆ రాజ్యం ఏలే మహారాజు అప్పటికి కొద్దిరోజుల క్రితమే మరణించి ఉండటం జరిగింది. ఆ మహారాజుకు సంతానం లేదు. అక్కడి ప్రజలు ఖిన్నులై తమకు ప్రాప్తించిన అరాజకత్వము పోగొట్టుకోవటానికి ఉత్తమార్హత గల వ్యక్తి కొరకై వెతకుచున్నారు.

అక్కడ వేదజ్ఞులు కొందరు దైవేచ్ఛానుసారం ఆకస్మికంగా భగీరథుని చూడటం జరిగింది. చక్రవర్తికి ఉండే రేఖలు, ముఖవర్చస్సు వారికి భగీరథునిలో కనిపించాయి. వెంటనే వేదపండితుల నిర్ణయం అక్కడి మంత్రులకు చేరవేయబడింది. వారు కలిసికట్టుగా వచ్చి తమకు రాజు కావలసినదిగా భగీరథుని ప్రార్థించారు. హర్ష వైషమ్యాలు లేకయే సర్వుల సంక్షేమ సంతోషాలు కోరటం మహనీయుల నైజం. త్రితల మహర్షి అభిప్రాయం కూడా అదే అవడం చేత భగీరథుడు అందుకు కాదనలేదు. అక్కడి సైనికులు అప్పటికప్పుడు భగీరథుని పేరు అడిగి తెలుసుకొని “భగీరథ మహారాజుకు జై” అను నినాదాలు పలికారు. పట్టపు ఏనుగు తేబడింది. ఆ భగీరథుడు భిక్షుకుని రూపంతోనే ఏనుగును అధిరోహించాడు. ఆ రోజు మొదలుకొని కొన్ని రోజులుగా గొప్ప ఆడంబరములతో పట్టాభిషేక మహోత్సవం జరిగింది.

❖

ఆ సమయంలోనే కోసల మహారాజు మరణించియున్నాడు. తమ భగీరథ చక్రవర్తే అయోధ్యకు రాజయ్యాడని కోసలరాజ్యమంత్రి వర్యులకు – ప్రజలకు తెలిసింది. వెంటనే సభాప్రముఖులు అయోధ్యకు వెళ్ళి భగీరథుని కలిశారు.

“హే మహారాజా! తామే కదా మా ప్రభువులు. పెద్ద చేపవచ్చి చిన్న చేపను గుటుక్కున మ్రింగినట్లు మీరు రాజ్యం ధారబోసిన రాజు మృత్యువుచే మ్రింగివేయబడ్డాడు. ఆతనికి సంతానం లేరు. అందుచేత, మీరు ఈ అయోధ్యతో బాటు కోసల రాజ్యమును కూడా మహాచక్రవర్తి అయి పరిపాలించండి. తమరు యోగులే! ఇందులో సందేహం లేదు. అయితే, యోగులు కూడా తాము కోరకుండా ప్రాప్తించిన ప్రవాహపతితములగు కార్యములను ధర్మబుద్ధితో నిర్వర్తిస్తారు కదా! మన ప్రజల కోరిక మన్నించండి.” అని వేడుకున్నారు. భగీరథుడు చిరునవ్వుతో వారి కోరికను అంగీకరించాడు.

ఆ విధంగా భగీరథుడు మరల సప్తసాగర చిహ్నితమైన భూమండలమునకు చక్రవర్తి అయ్యాడు. ఆతడిప్పుడు బ్రహ్మజ్ఞానము పొందియున్నాడు కదా! అందుచేత అజ్ఞాని వలె కాక ...సమదర్శి అయి, శాంతమనస్కుడై వీతరాగుడై, మాత్సర్య - విస్మయములు లేనివాడై యథాప్రాప్తములైన కార్యములందు నియమితుడైనాడు.

❖

ఒకప్పుడు ఆ భగీరథుని ముత్తాతలు సగరులు గొప్ప యజ్ఞం చేశారు. ఆ యజ్ఞములో నియోగించబడిన యజ్ఞాశ్వం కనబడ లేదు. వారు భూమండలమంతా యజ్ఞాశ్వం కోసం సగరులు వెతికారు. అది పాతాళం జేరినట్లు తెలియరావటంతో, వారు భూమిని త్రవ్వటం ప్రారంభించారు. ఫలితంగా సాగరాలు ఏర్పడ్డాయి. ఆ సగరులు పాతాళం జేరారు. అక్కడ యజ్ఞాశ్వం కోసం వెతక సాగారు. అక్కడ వాళ్ళు కపిలముని ఆశ్రమం ప్రవేశించి ఆయన కోపకారణంగా శపించబడి భస్మీభూతులయ్యారు. వారిని పునీతులను చేయాలి.

ఈ విషయం గరుడుడు చెప్పగా కోసల రాజ్యంలోని కొందలు ప్రజలు విన్నారు.

ఆ వార్త మన భగీరథుని చెవినబడింది. ‘మా ముత్తాతలను పునీతులుగా చేయడం ఎట్లా’? అను విషయం ఆతడు విజ్ఞులతో సంప్రదించాడు. శాస్త్రకారులు ‘అయ్యా ! అందుకు ఒక్క ఉపాయం ఉన్నది. స్వర్గలోకంలోని మందాకినీ నదిని పాతాళం వరకు తీసుకుపోగలిగితే ఆ నదీజలస్పర్శచే నీ వంశీకులు పవిత్రులౌతారు. అయితే అది అత్యంత దుస్సాధ్యమైన విషయం’... అని రాజుకు తెలియజేశారు.

అప్పటికి ఇంకా గంగానది భూమిపై ప్రవహించ లేదు. అప్పుడు భగీరథుడు తన వంశీయుల సూక్ష్మదేహములను పునీత మొనర్చాలని నిర్ణయించుకున్నాడు. బ్రహ్మదేవుని కరుణకై గొప్ప తపస్సు ప్రారంభించాడు. కొంతకాలానికి బ్రహ్మదేవుడు ప్రత్యక్షమైనాడు.

బ్రహ్మదేవుడు : బిడ్డా! భగీరథా! నీ సుదీర్ఘ తీవ్ర తపస్సుకు మెచ్చాను. నీకు ఏమి కావాలో కోరుకో.

భగీరథుడు : తండ్రీ! బ్రహ్మదేవా! మేమంతా మీ భావనాస్వరూపులమే కదా! నా అంతరంగమేమిటో మీకు తెలియదా? స్వర్గంలోని మందాకినీ నదిని పాతాళం వరకు జేర్చి ఆ పవిత్రజలంతో మా ముత్తాతలగు సగరుల సూక్ష్మదేహాలను పునీతం చేయాలనునది నా ఉద్దేశం.

బ్రహ్మదేవుడు : నాయనా! నీవు చేపట్టినది పవిత్రము, మహత్తరము అగు లక్ష్యము. కానీ అదంత సులభం కాదు.

భగీరథుడు : కాకపోవచ్చు. కానీ పరమాత్మ స్వరూపులగు మీ దర్శనమైన తరువాత ఇక దుస్సాధ్యాలేమి ఉంటాయి? కనుక నాకు మార్గం ఉపదేశించి ఉద్ధరించండి.

❖

ఆ తరువాత బ్రహ్మదేవుని ఉపదేశానుసారం భగీరథుడు అనేకసార్లు తపస్సు - శ్రమలకు ఓర్చి ప్రయత్నించాడు. ఈశ్వరుని, జహ్నుమునిని తపస్సుచే సంతోషింపజేసి మందాకిని భూమిపై గంగానదిగా అవతరించటానికి కారకుడయ్యాడు. ఆకాశము నుండి జగత్పతియగు చంద్రశేఖరుని శిరముపై ఆకాశగంగ ఒప్పారుటచే సాంబశివుడు గంగాధరుడైనారు. స్వర్గమున ఉండే పవిత్ర మందాకిని భూమిపై గంగగాను, పాతాళంలో భోగవతిగాను అవతరించి త్రిపథగామి అయింది. ఆ నదీజలం యొక్క స్పర్శచే సగరులు పవిత్రులైనారు.

అజ్ఞానమును తొలగించి ధర్మప్రబోధి అయిన గంగామాత తనయొక్క పుణ్యజలముతో, అనంతకాలం ఈ భూమిని, ఆశ్రితులను పవిత్రం చేస్తూనే ఉండగలదు.

చూచావా రామా ! సగరుడు, అంశుమంతుడు, దిలీపుడు మొదలైన పరాక్రమవంతులకు కూడా దుర్లభమైన గంగావతరణం ఆ వంశమున జన్మించిన భగీరథుడు తన శాంతి-తృప్తి-సమదర్శనాది గుణముల బలంతో సాధించాడు. ఆ గంగయే సగర పుత్రులకు, సముద్రమునకు కూడా సంజీవని అయింది.

ఎవరైతే పూర్ణశాంతచిత్తులై ఉంటారో, ఆత్మ తత్త్వమును అలవరచుకుంటారో ... అట్టివారికి అసాధ్యములైనవి సుసాధ్యములౌతాయి.

❖❖❖

IX. చూడాలోపాఖ్యానం (మోక్ష నిర్వచనం)

1. శిఖిధ్వజ రాజ్యపాలన

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! స్థిర-సమత్వబుద్ధి అలవరచుకుంటేనే ఆత్మలాభాన్ని ఈ జీవుడు పొందగలడు. ఆయా యథాప్రాప్తములైన కర్మలను నిర్లేపబుద్ధితో ఆచరిస్తూ ఉండేవారికి అవి అధ్యాత్మయానమునకు ఏమాత్రమూ ఇబ్బంది కలిగించలేవు. ఇక ఈ కనబడే వైభవములంటావా... వీటినన్నిటినీ శిఖిధ్వజ మహారాజువలె మనస్సులో పరిత్యజించు. అట్టి మనస్సును విషయముల నుండి ఈవలకు గొని వచ్చి ఆత్మయందు నిలిపి నిశ్చలుడవగుము. ఇక ఈ భౌతికదేహమంటావా? ఇది ఏఏ క్రియలు నిర్వర్తించవలసి ఉంటోందో... అది అట్లే అగుగాక! మనస్సు మాత్రం సర్వమునకు అతీతత్వము సంతరించుకొనును గాక!

శ్రీరాముడు: మహర్షీ! ఆ శిఖిధ్వజుడెవరు?ఆతడు మోక్షమును ఎట్లా బడయగలిగాడు? హే బ్రహ్మజ్ఞా! మా జ్ఞానాభివృద్ధికై ఆ విషయాలు విశదీకరించమని ప్రార్థన.

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామా! క్రితం కల్పంలోని ద్వాపరయుగంలో 'శిఖిధ్వజుడు' అనే అతను, ఆతని భార్య చూడాల జన్మించియున్నారు. అట్లాగే ఈ కల్పంలో కూడా రాబోయే ద్వాపరయుగంలో కూడా వారిద్దరు జన్మించి వివాహం చేసుకోబోవుచున్నారు.

శ్రీరాముడు : స్వామీ! పూర్వం జరిగింది. ఇప్పుడు జరుగుతుందని, ఇకపై మళ్ళీ అదే జరుగబోతోందని అంటున్నారు కదా! ఈ భూత-భవిష్యత్-వర్తమానాలకు కారణమేమిటో ముందుగా చెప్పండి.

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఈ జగత్ సృష్టి విషయంలో బ్రహ్మ మొదలైన సృష్టికర్తల 'సత్య సంకల్ప జ్ఞానము' యొక్క అనివార్యస్వభావం అంతర్లీనంగా కారణమై ఉంటోంది. ఆ అనివార్య సంకల్ప స్వభావమునే శాస్త్రకారులు నియతి అని పిలుస్తున్నారు. వస్తువులకు-కాలగతికి గల ఆ అనివార్య స్వభావమును ఎవరూ నివారించలేరు.

దృష్టాంతానికి... మామిడి చెట్టుకు అనేక ఫలములు కలుగుచున్నాయి. అవన్నీ మామిడి పళ్ళే అయి ఉంటున్నాయి. మరల అట్టివేయగు అనేక ఫలములు ప్రతి సంవత్సరం కలుగుచున్నాయి. ఆ వృక్షము యొక్క ఒకానొక మామిడిటెంక కాలక్రమేణా మరొక మామిడి వృక్షం అవుతోంది. ఆ వృక్షమును ఛిన్నం చేస్తే?... అవన్నీ తొలగుతున్నాయి. అట్లాగే...

పూర్వ సన్నివేశములనేకముల ననుసరించి అట్టివేయగు కొన్ని, వాటికి కొనసాగించు కథనాలతో వేరైన సన్నివేశాలు మరికొన్ని - ఈ వర్తమానంలో ఏర్పడుచున్నాయి. వర్తమానంలో ఏర్పడి ఉన్న కొన్ని సన్నివేశాలు రాబోవు కాలంలో మరల ఏర్పడటమో, లేక ఇక్కడి నుండి కొనసాగటమో జరుగు

చున్నాయి. అందుకే 'ఇప్పుడు సాదృశ్యమై ఉన్న కొన్ని సంఘటనలకు పూర్వకర్మలో, తత్పూర్వ సంఘటనలో కారణంగా కలిగియున్నాయి. కనుక ఇదంతా ఒక సుదీర్ఘ కార్యకారణ సంఘాతము'... అని కార్య – కారణాంతరములను పరిశీలించే కార్య–కారణ పండితులు (ఉత్తర మీమాంస కోవిదులు) సిద్ధాంతీకరిస్తూ ఉంటారు. అయితే... అజ్ఞానం తొలగిందా... ఈ సాదృశ్యము, ఈ జగదాకారం కూడా తొలగిపోతాయి.

ఒకే రకమైనవి, అనేక రకాలైనవి అయిన తరంగాలు సరోవరంలో లేచి మరల ఎక్కడో లయిస్తున్నాయి చూచావా? ఈ సంసారంలో కూడా పూర్వం తోచిన విషయములే మరల మరల తోచుచున్నాయి. మనం చెప్పుకున్న శిఖిధ్వజరాజు విషయంలో కూడా ఇట్లే జరుగుతోంది. ఇప్పుడు నేను చెప్పబోవు శిఖిధ్వజ కథనం రాబోవు ఒక ద్వాపర యుగంలో జరుగబోయేది. ఇట్టిదే క్రితం మన్వంతరములోని ద్వాపరయుగంలో కూడా జరిగింది.

నాలుగు యుగాలు గడచిన తరువాత కాలక్రమంగా చతుర్థ సృష్టి ప్రారంభమౌతుంది. అప్పుడు ఏడవ మనువు గతించి, ఎనిమిదవ మనువు అధికారంలోకి వస్తారు. ఆ చతుర్థసృష్టిలో కృత – త్రేతాయుగాలు గడచిపోయి ద్వాపరయుగం వస్తుంది. ఆ కాలంలో ఒకానొకప్పుడు ఈ కథానాయకుడు శిఖిధ్వజుడు జన్మించనున్నాడు. ఇక ఆ చరిత్ర మనం ప్రస్తావించుకుందాం.

❖

జంబూద్వీపంలో గల ఒకానొక భూఖండంలో మాళవరాజ్యం ఉన్నది. ఆ మాళవదేశపు రాజధాని ఉజ్జయిని. ఆ పట్టణంలో శిఖిధ్వజుడు జన్మించి రాజయ్యాడు. ఆతడు గొప్ప ధైర్యశాలి. సదాచారం, శౌర్యం, ధైర్యం, ఔదార్యం, శమాది సంపత్తి, మౌనం – వంటి ఉత్తమ గుణాలతో రాజ్యం ఏలుచున్నాడు. అనేక యజ్ఞములు నిర్వర్తించాడు. అనేకమంది శత్రువీరులను జయించాడు. అయినా కూడా అతడు కోమల మృదుమధుర స్వభావుడు, ప్రేమసాగరుడు, లౌకిక శాస్త్రవేత్త కూడా! అతడు అనేక ప్రజాహిత కార్యక్రమాలు ప్రారంభించి ప్రజాహితుడైనాడు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల విషయంలో అక్కడి చుట్టు ప్రక్కల రాజులు ఆతనిని సంప్రదించటం, అనుకరించటం, ఉదాహరణగా తీసుకోవటం చేస్తూ ఉండేవారు. "నేను శ్రమిస్తాను. తద్వారా జనించిన సంపదను అందరికీ పంచి పెడతాను" అనునది ఆతడు సోదాహరణ పూర్వకంగా తదితర జనుల ముందుంచిన గొప్ప సిద్ధాంతం. "శాంతి, వినయం మన రాజు వద్దనే మనం నేర్చుకోవాలి" అని రాజ సేవకులు ఎప్పుడూ సంభాషించు కుంటూ ఉండేవారు. ఆతని పాలనలో దేశ సంపదలు పెరిగాయి. ప్రజలలో పొరపొచ్చాలు ఉండేవి కావు. ఆతని వాక్యములు ఇతరులకు సద్భావనను, ఐకమత్యమును, వినయ – విధేయతలను నేర్పేటట్లుగా ఉండేవి. ప్రజలు ఆ రాజును ప్రాణప్రదంగా ప్రేమించేవారు. ఆతని పాలనలో మాళవ రాజ్య ప్రజలు హాయిగా, ప్రశాంతంగా రోజులు గడుపుతూ ఉండేవారు. ఇటువంటి మహారాజు లభించటం మేము చేసుకున్న పుణ్యఫలం – అని ప్రజలు అనుకుంటూ ఉండేవారు.

ఆ శిఖిధ్వజుని బాల్యంలోనే పితృవియోగం సంభవించినప్పటికీ క్రుంగిపోలేదు. రాజభక్త పరాయణులగు మంత్రుల ఉత్తమ యోచనలతో పదహారవ ఏటనే సింహాసనం అధిరోహించాడు.

అతి త్వరలో అతని కీర్తి దేశవిదేశాలలో విస్తరించినది. ఆతడు యుక్త వయస్సులో సౌరాష్ట్ర రాజకుమారి అగు చూడాలను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వారిద్దరూ అన్యోన్యచిత్తులవటం చేత వారి ప్రేమ ప్రవర్ధిల్లింది. ఆ చూడాల మహా సౌందర్యవతి. అంతే కాదు. ఆమె గాన, నృత్య, వాద్యాది కళలలో నిష్ణాతురాలు. అనేక పూజలు, నోములు నిర్వర్తించి, చిన్న వయసులోనే తన హృదయంలో జ్ఞాన బీజాలు పొందిన మహాసాధ్వి. ఆమె శాస్త్రార్థములను గొప్ప వివేకంతో పఠించే పండితురాలు కూడా.

పార్వతీ పరమేశ్వరుల వలె, లక్ష్మీ నారాయణుల వలె ఆ చూడాల–శిఖిధ్వజులు ప్రకాశిస్తూ ఉండేవారు.

ఆ శిఖిధ్వజ మహారాజు రాజసభలో ప్రతిరోజూ దైనందిన కార్యక్రమాలు ముగిసిన తరువాత కొంతసేపు సత్సంగం జరుగుచూ ఉండేది. అందులో అనేక పురాణ కథాకాలక్షేపాలు, ఆధ్యాత్మశాస్త్ర చర్చలు చోటు చేసుకుంటూ ఉండేవి. శ్రుతి వాక్యాలు, వాటిని విశదపరచగల కథలు, చరిత్రలు ఆ సత్సంగంలో వినిపించబడుతూ ఉండటం చేత ప్రజలలో సాత్వికత, ఉత్తమాశయాలు పెంపొందుతూ ఉండేవి. ఒక్కొక్క రోజు రాజే ఆధ్యాత్మికోపన్యాసం చేస్తూ ఉండేవాడు. ఆతనికి అనేక శాస్త్ర విషయములు తెలిసి కూడా నేను 'జ్ఞానిని' అనే కించిత్తు అహంభావం కూడా ఉండేది కాదు.

ఇట్లా చాలా కాలం గడచింది. చిల్లికుండలో నీళ్ళు ఉండేదెంతసేపు? వారి యౌవనం క్రమంగా కాలముచే గ్రసించబడుచుండగా వారిద్దరూ మధ్య వయస్కులయ్యారు.

❖❖❖

2. ఆధ్యాత్మ శాస్త్రముల యొక్క ఆవశ్యకత

శ్రీ వసిష్ఠ మహర్షి : ఒక రోజు చూడాల శిఖిధ్వజ దంపతులు చంద్రకాంతిలో ఉద్యానవిహారం చేస్తూ ఒక పూలపొదల ప్రక్కన ఇసుక తిన్నెపై ఆసీనులై చల్లగా వీచే గాలులు ఆస్వాదిస్తూ ఇట్లు సంభాషించుకోసాగారు.

శిఖిధ్వజుడు : ప్రియసఖి చూడాలా! ఏమి ఈ విచిత్ర జగత్తు! ఈ జీవుడు శరీరమును గైకొని అనేక వ్యవహారములందు పరిభ్రమిస్తున్నాడు, బాగానే ఉన్నది కానీ.....తరంగ సమూహముల వలె ఈ దేహములన్నీ క్షణభంగురములే కదా! అక్కడి మహావృక్షం చూడు! నవనవలాడుతూ పళ్ళు వ్రేలాడుతున్నాయి. ఆ పళ్ళన్నీ పక్వమై ఒకనాటికి రాలిపోవలసిందే! అట్లాగే ఈ దేహము కూడా కొన్నాళ్ళకి వినాశనమొందటం అనివార్యమే కదా! అక్కడి తటాకంలో కలువపూలు చూచావా? వాటిపై క్షణక్షణం మంచురాలుటచే అవి ఎంతగా శిథిలమైపోతున్నాయో! అట్లాగే ఈ శరీరముపై ముసలితనం కొంచెంకొంచెంగా వచ్చిపడుతోంది. దోసిలిలోని నీరువలె ఆయుష్షు అనుక్షణం క్షయం అయిపోతోంది. ఒకవైపు ఈ భోగతృష్ణ వర్షాకాలంలోని సొరతీగలాగా పెరుగుతుంటే.... మరొక వైపు యౌవనం పర్వతం మీద నుంచి జారిపడే నదీజలం లాగా ఎచ్చటెచ్చటికో పరుగులు తీస్తోంది.!

ఈ జీవుడికి అనుభవించే శక్తి క్షీణిస్తున్నా, అనుభవించాలనే కోరిక తరగకపోవటంచేత ఈ జగద్వ్యవహారమంతా అసంతృప్తిని, దుఃఖపరంపరలను కలుగజేస్తోందే! ఈ శుష్క శరీరము ఇంద్రజాలము వలె అసత్యమైనప్పటికి ఇందులో భ్రమలకు మాత్రం కొదువలేదు.

చూడాల : ఓ ప్రాణనాథా! మీరు చెప్పినదంతా అక్షరాలా నిజం. తృష్ణ హృదయంలో ఆవిర్భవించి, తుచ్ఛ క్రియలందు ఆసక్తిని రగిలింపజేస్తోంది. క్రుళ్ళిన మాంసముపై ఈగలు వ్రాలునట్లు ఈ ఇంద్రియములు అల్ప విషయములపై వ్రాలి వెనుకకు మరలక, మొరాయిస్తున్నాయి.

శిఖిధ్వజుడు : అవును. వర్షాకాలంలో జలంపై నీటిబుడగవలె ఈ దేహములు క్షణికమైనవే కదా! వీటిని నిజమని సుదీర్ఘకాలం నిలువబోతున్నాయని నమ్మి, మనం ఏవేవో సంబంధ - బాంధవ్యములతో అనుబంధం కల్పించుకొని రోజులు గడుపుతున్నాం. పర్యవసానం? ఈ శరీరం జీవులమగు మనలను మోసం చేసి ఒక రోజు తన దారి తాను చూసుకుంటోంది.

చూడాల : శరీరంతోబాటే మనస్సు కూడా కృంగి, విరసభావం పొందుతోంది.

శిఖిధ్వజుడు : ఈ సంసారమంతా ఇంతే! ఈ ప్రపంచంలో సుందరమైనదీ, ఎప్పటికీ ఉండేదీ ఒక్కటి కూడా లేదు.

చూడాల : కానీ ఆశ మాత్రం చావటం లేదు.

శిఖిధ్వజుడు : ఓ చూడాలా! మనం ఈ సంసారమును ఎట్లాగైనా సరే... అతిత్వరలో జయించాలి.

చూడాల : అందుకు దివ్యౌషధం ఆధ్యాత్మశాస్త్రమే. అనగా ఆత్మజ్ఞానాన్ని ప్రతిపాదించే పాఠములే!

❖

ఆ రోజు నుండి వారిద్దరూ ఆధ్యాత్మశాస్త్రం ఆమూలాగ్రం మరింత ఏకాగ్రతతో అభ్యసించాలని నిర్ణయించుకున్నారు. ఇద్దరూ కలసి మాళవదేశంలో గల అనేకమంది శాశ్వత శాంతి పరిలక్షితులు, బ్రహ్మగతచిత్తులు, బ్రహ్మనిష్ఠులు - ఆత్మశాస్త్రవేత్తలు అగు మహనీయులను సమీపించి వారివద్ద "ఆత్మవిద్య", లేక, "భౌమావిద్య" ను వినటం, నేర్చుకోవటం ప్రారంభించారు.

జీవుని యొక్క స్థూల-సూక్ష్మ-కారణ దేహాలు; మనస్సు, దాని స్వభావం; బుద్ధి-చిత్తం -అహంకారాల నిర్వచనాలు; ఆత్మ యొక్క తత్త్వం; దేహి-దేహాల సంబంధం, అసంబంధం; ఇంద్రియాలు-విషయాలు-విషయాలతో తాదాత్మ్యం; ఈ జీవునిలోని జన్మ-జన్మాంతర విభాగం, జన్మరాహిత్య విభాగం; బంధం- మోక్షం; ద్రష్ట-దర్శనం-దృశ్యం; కర్త-హేతువు-క్రియ; జ్ఞానం -జ్ఞేయం-జ్ఞాని ...

...ఇటువంటి అనేకమైన ఆధ్యాత్మశాస్త్ర విశేషాలు దృష్టాంతపూర్వకంగా వింటూ ఉండేవారు. మరల అంతఃపురం ప్రవేశించి అనేక అధ్యయన విశేషాలన్నీ చర్చించుకుంటూ ఉండేవారు. పరస్పరం బోధించుకుంటూ, వారిద్దరూ ఆ పరమాత్మ యందే తమ ధ్యాస, ప్రీతి కలిగి ఉండేవారు. కేవలం ఆత్మారాధన యత్నమునందే నిమగ్నమై ఉండేవారు. అయినా కూడా, శిఖిధ్వజుడు రాచకార్యముల కొరకు శత్రురాజులను భయపెట్టుటలో, తమ రాజ్యములోని సంపదలను పెంపొందించుటలో,

కీర్తి-ప్రతిష్ఠలను పెంపొందించుటలో ప్రయత్నపరుడై ఉండేవాడు. ఏ కారణాల చేతనోగాని, ఆతనికి ఏకాగ్రత కొంచెం కుంటువడుతూ ఉండేది. చూడాల మాత్రం తాను విన్న ఆధ్యాత్మిక శాస్త్ర విషయాలను ఏకాగ్రచిత్తంతో రాత్రింబవళ్ళు మననం చేస్తూ ఆయా విషయాల యుక్తియుక్తములను స్వబుద్ధితో పరిశోధిస్తూ, పరిశీలిస్తూ ఉండేది. స్వతహాగా సునిశిత బుద్ధి కలిగి ఉండుటచే ఆమె తాను విన్న విషయాలను హృదయస్థం చేసుకుంటూ తన ప్రపంచదర్శనాన్ని పవిత్రం చేసుకుంటూ ఉండేది. మరొకవైపు తన భర్తకు రాచకార్యాలలో అవసరమైన సలహాలు, సహకారాలు అందిస్తూనే ఉండేది. "భర్తను సేవించటంలో ఈమెకు ఈమే సాటి" అని శిఖిధ్వజుడు తన భార్య చూడాల గురించి అనుకుంటూ ఉండేవాడు.

❖❖❖

3.ఆత్మ ప్రబోధం కలిగించేవే అనుసరణీయాలు!

ఒక రోజు చూడాల అంతఃపురంలోని తన ఏకాంత మందిరంలో సుఖాసీనురాలై ఇలా పర్యాలోచించ సాగింది-

చూడాల : ఈ శరీరం తన వ్యాపారాలలో ఉండనీ! లేక, ఏ కారణం చేతనో ఎప్పుడో ఒకప్పుడు ఊడనీ! ఇందులో విశేషమేమున్నది? నేను 'విచారణ' అను మార్గాన్ని ఇప్పుడు అవలంబిస్తాను.

❖

ఈ శరీరం కార్య-కారణ సంభూతమైనది. ఇట్టి ఈ దేహంలో ఎక్కడో త్రికాలాల చేత స్పర్శించబడజాలని మహత్తరము, సత్యము అగునదేదో దాగి ఉన్నది. అది చైతన్యం కావచ్చు, సత్-చిత్-ఆనందం కావచ్చు. పరమాత్మ కావచ్చు. 'స్వస్వరూపం' కావచ్చు ...మరింకే పేరుతోనైనా శాస్త్రకారులచే పిలువబడవచ్చు. దానిని యోగాన్ని ఆశ్రయించో (లేక) విచారమార్గాన్ని అనుసరించో, ఎట్లాగైనా సరే అనుభవపూర్వకంగా అతిత్వరలో ఎరుగవలసి ఉన్నది. అది ఎరుగవలసింది నేనే గాని మరెవరో కాదు. శాస్త్రములు, శాస్త్రకారులు, శాస్త్రప్రవచకులు, అనుభవజ్ఞులు... వీళ్ళంతా అది ఏమై ఉన్నదో నాకు గుర్తు చెప్పుచున్నారు. వారంతా మార్గదర్శకులు మాత్రమే! మార్గాన్ని అన్వేషించి, ప్రయాణించి, పొందవలసింది – నేనే గాని వారు కాదు. అట్టి త్రికాలాబాధ్యమగు నా యందలి 'సత్యం' గురించి ఇప్పుడు నేను స్వయంగా నాయందు అన్వేషించి కనుగొన యత్నించెదను గాక!

❖

ఎప్పటి నుండో తెలియదు గాని, ఈ దేహం పట్ల, దేహంలోని ఇంద్రియాలకు విషయాలగు ఈ జగత్ విషయాల పట్ల దురవగాహనతో కూడిన ఒకానొక అనుబంధం ఏర్పడి ఉంటోంది. ఆ అనుబంధం మోహాన్ని కల్పిస్తోంది. కాలక్రమంగా పుట్టి కాలక్రమంగా నశించగల కల్పిత వస్తువుల పట్ల ఆకర్షితురాలిగా చేస్తోంది. నిస్సహాయురాలనై నేను సత్యం-నిత్యం అగుదానిని ఏమరచి ఉంటున్నాను.

కస్యాయమాగతో మోహః? కథ మభ్యుత్థితః క్వ వా?
దేహస్తావజ్జడో మూఢో, నాఽహమిత్యేవ నిశ్చయః ॥

అసలు ఈ 'మోహము' అనేది ఎందుకు కలుగుతోంది? ఎవరు కల్పిస్తున్నారు. ఎట్లు, ఎచటి నుండి వచ్చిపడుతోంది? నాయందు మోహం కలిగి ఉంటున్నదెవరు? మోహానికి అతీతమై ఉన్నదెవరు? భ్రాంతి తొలగిందా ... నాయందు భ్రాంతుడు కూడా తొలగుతాడు. స్వస్థత చెందుతాడు. అసలు భ్రాంతికి నిమిత్తం ఏమిటి? మూలమేమిటి? ఏది ఏమైనప్పటికీ, ...మూఢము, జడము అయిన ఈ పాంచభౌతిక దేహం మాత్రం నేను కాదు.

ఎందుకంటే ...'నేను' అని ప్రసిద్ధమై ఉన్నది ఏది కలదో, అది జడంగా మూఢంగా ఉండటం లేదు. కాని, చిన్నప్పటి నుండీ "నేను ఒక స్త్రీని. ఈ రంగు, ముక్కుతీరు, జుట్టుగల ఆకారమును"... అని బుద్ధి వృత్తులు ఆశ్రయించి ఉండటం చేత 'నేను శరీరమును' అనే భావం ఆరూఢమై ఉంటోంది. మారుచున్న ఈ దేహం – మారని నేను' ...ఈ రెండింటినీ విడదీసి చూడకపోవటం చేత, దేహ ధర్మములను నాపై ఆపాదించుకుంటూ పోతున్నాను. ఇట్లా ఎన్ని ఉపాధులు వచ్చి పోయాయో!

నాలో బుద్ధి వృత్తులు ఉన్నాయి. బుద్ధి వృత్తులే లేకపోతే శరీర జ్ఞానమే కలిగేదికాదు. కాబట్టి శరీరం స్వయంగా జడమైనప్పటికీ బుద్ధి వృత్తులు ఈ శరీరం పట్ల భావాలూ, అభిప్రాయాలు అనుభవాలూ కలుగజేస్తున్నాయి. తద్వారా నాకు వాటితో తాదాత్మ్యం అనే వ్యాపారం ఏర్పడుతోంది.

ఇక ఈ కాళ్ళు, చేతులు, తదితర కర్మేంద్రియాల సంగతేమిటి? ...అవన్నీ ఈ దేహానికి వేరు కాని (దేహాంతర్గత) అవయవాలే కదా! అవయవాలకు, అవి చేసే కర్మలకు, వాటిని ఎరుగుచున్న జ్ఞానేంద్రియాలకు భేదం లేదు. అవయవాలు, అవయవాలతో జ్ఞానరూపమై ఉన్న 'అవయవి'... ఈ రెండు స్వయం ప్రవర్తన కలిగి ఉన్నవి కావు. కనుక రెండూ జడములే. ఈ అవయవాల వంటివే మనోబుద్ధులు కూడా.

"ఒకాయన చేతి కఱ్ఱతో రాయిని దొర్లిస్తున్నాడు" అని అనుకుందాం. కఱ్ఱతో రాయిని కదల్చునట్లు ఈ దేహాన్ని మనస్సే చలింపజేస్తోంది. మనస్సు ఇంద్రియాలన్నిటితో సంయోగం చెందే మరొక పదార్థం మాత్రమే.

అయితే మనస్సుకు స్వయంసంకల్పాత్మక శక్తి లేదు. ఆ చేయి కఱ్ఱను ప్రేరేపిస్తున్నట్లు నిశ్చయాత్మక బుద్ధి చేత మనస్సు ప్రేరేపించబడుతోంది.

చెయ్యికి కూడా స్వయంనిర్ణయాధికారం లేదు. చేయిని కదల్చే మననరూపమగు మనస్సు జడమే! ఎందుకంటే, 'మననం చేయువాడు' – ఉన్నప్పుడే కదా, మననశక్తి ప్రయుక్తమయ్యేది!

అట్లాగే బుద్ధికి కూడా తనను ప్రేరేపించు మరొక తత్త్వం ఉంది. అందుచేత బుద్ధి కూడా జడమే. ఒక పల్లపు ప్రదేశంలో జలం వేగంగా ప్రవహించునట్లు 'అహంకారము' బుద్ధిని చలింపజేస్తోంది.

అయితే, బాగా పరిశీలిస్తే అహంకారానికి కూడా స్వయంకృతమైన ఉనికి లేదు. అహంకారం అనబడేది అంతక్రితమే ఏర్పడి ఉన్న ఏదో తత్త్వంచే ప్రవర్తింపజేయబడుతోంది.

బాలుడు దయ్యమును కల్పించుకొని గాలిలో చూస్తాడు. అలాగే చిదాకాశస్వరూపుడనగు నేను 'ప్రాణము' అను ఉపాధిచే శబ్ద–స్పర్శ–రూప–రస–గంధాలు పొందుచున్నాను. అనగా జీవుడే తనకు తాను జీవత్వాన్ని కల్పన చేసుకుంటున్నాడు.

కాబట్టి జీవుడు 'అహంకారం' కంటే ముందే ఉండి ఉన్నాడు. జీవుడు అనగా 'ప్రాణములు' అను ఉపాధితో కూడిన చిదాకాశము ...మాత్రమే.

ఈ "నీవు, నేను, అతడు... అనునవన్నీ చిదాకాశమునందు అనుభవమయ్యే కల్పిత అనుభవాలు మాత్రమే. బింబచైతన్యమే ఈ జీవులందరిలోనూ ప్రతిబింబిస్తోంది. కనుక జీవుని వాస్తవరూపం బింబచైతన్యమే గాని, ప్రతిబింబ ఖండము కాదు. ప్రతి జీవుడు వాస్తవానికి పరిపూర్ణుడే! పరిపూర్ణుడై కూడా ఈ 'జీవితము' అనుదాని యందు పరిమితము వలె తోచుచూ ప్రతిబింబిస్తున్నాడు. 'విషయాలను ప్రకాశింపజేయుట' అను కళంకంచే నిర్మల చైతన్యం కప్పబడి ఉంటోంది. ఆ సాక్షి చైతన్యమే "నేను జీవుడను" అని కూడా తెలుసుకొంటూ ఉంటోంది. అందుచేత నిత్యం – ఆత్మరూపం అగు 'చిత్‌స్వరూపము' వలననే 'జీవుడు' అనువాడు జీవిస్తున్నాడు. అంతేగాని జీవుడనువాడు స్వయంప్రకాశకుడు కాడు. కనుక జీవుడనబడువాడు కూడా జడమే!

వాయువు వలన సువాసనలు ప్రసరిస్తున్నాయి. పల్లం వలన నీరు ప్రవహిస్తోంది. చిద్రూపమే దృశ్య విషయములందు ప్రసరిస్తూ, భ్రమలను కలిగి ఉంటూ జీవునకు జీవనమైయున్నది. అనగా తాదాత్మ్యాభ్యాసం చైతన్యమును జడంగా ప్రదర్శిస్తోంది. జీవభ్రాంతిని కల్పిస్తోంది. ఆహాః! ఇన్నాళ్లూ నేనెక్కడ నిద్రిస్తున్నానో తెలిసింది. ఏ ఉపాయాలు అవలంబిస్తే అవిద్యావరణం తొలగి దృశ్యస్వప్నం నశించి చైతన్యమునకు ప్రబోధం లభిస్తుందో ...అవియే ఇప్పుడు నాకు అనుసరణీయాలు.

❖❖❖

4. తనయందు తానై ఉన్న ఆత్మసత్త

శ్రీ వసిష్ఠ మహర్షి: వింటున్నావా రామచంద్రా! ఇట్లా చూడాల చింతించ ప్రారంభించింది. క్రమంగా ఆత్మతత్త్వమును గ్రహించింది.

❖

చూడాల : ఆహా! ఏమి నా అదృష్టం! చాలాకాలం తరువాత నిర్మలమగు జ్ఞానమును నేనిప్పుడు గ్రహించగలిగాను. ఆత్మయోగమును ఆశ్రయించిన తరువాత ఇక చ్యుతికి అవకాశమెక్కడున్నది? ఆత్మ స్వరూపము గ్రహించుటచే సర్వము ప్రాప్తించినట్లే! ఇక కోరుకోవలసినదేమున్నది?

ఈ మనస్సు, బుద్ధి, ఇంద్రియాలు ఇవన్నీ చిద్విలాసం యొక్క పరిచ్ఛేదానికి హేతువైనట్లు కనిపించినప్పటికీ... అసత్తచే ఈ ప్రపంచమంతా ద్వితీయచంద్ర భ్రాంతి వలె కల్పితమాత్రమే కదా! వాస్తవానికి ఇక్కడ సత్తస్వభావమగు 'మహాచైతన్యం' ఒక్కటి మాత్రమే వెలయుచున్నది. అది కళంక రహితం. ప్రతి ఒక్క జీవుని శుద్ధస్వరూపం. సంవేదన మాత్రం. అది భూమానందస్వరూపం. మంగళ స్వరూపం. అది తనను తానెప్పుడూ త్యజించటం లేదు. కనుక అచ్యుతం. అవిద్య తొలగిన మరుక్షణం ప్రకాశించేది అదే ! అది నిత్యోదితం. 'బ్రహ్మము, పరమాత్మ' అని వేదాంతాది అధ్యాత్మ శాస్త్రములచే పేర్కొనబడుచున్నది అదే.

1. చిత్తం, 2. చేత్యం(దృశ్యం), 3. చేతనం – అనే త్రిపుటి ఆ మహాచైతన్యం కంటే ఎప్పుడూ వేరు కాదు. ఆ సాక్షీభూత మహాచైతన్యమే త్రిపుటికి ఉనికిని, ఉత్తేజాన్ని కలుగజేస్తోంది. మహాచైతన్యం యొక్క పాత్ర లేకపోతే త్రిపుటి తనంతట తానుగా ఏమీ చేయజాలదు. ఒక దానిని మరొకటి స్పర్శించ జాలవు. సాక్షిచైతన్యం త్రిపుటికి మున్ముందుగానే ఉంది. కనుక అది ఆద్యచిత్. అది త్రిపుటి జనితాలగు ప్రమాణాలపై ఆధారపడి ఉన్నది కాదు.

ఆ మహాచైతన్యం యొక్క అక్షయరూపం ఏమిటి? విషయరహితమగు 'చిత్' తత్త్వమే కదా! అదియే మనస్సు–బుద్ధి–ఇంద్రియాలు గాను, ఇంద్రియాలకు గోచరమగుచున్న విషయాలు గాను విస్తరిల్లుచున్నది. 'మనో–బుద్ధులు' అనే రంగు వేసుకున్న మరుక్షణమే భూత–భౌతిక పదార్థాలతో కూడిన దృశ్యం యొక్క సత్త ఆవిర్భవిస్తోంది. కాబట్టి... 'జగత్‌సత్త' అను శబ్దార్థాన్ని కలిగి ఉన్న ఈ పదార్థాలన్నీ కూడా మహాచైతన్యం యొక్క రూపాంతరాలే అయి ఉండాలి కదా! స్ఫటికంలో దృశ్యం ప్రతిబింబించవచ్చు గాక! కాని దృశ్యం స్ఫటికాన్ని స్పర్శించలేదు కదా ! ఆ మహాచైతన్యం కూడా తాను నిర్లిప్తంగా ఉంటూనే తన యందు 'భావపరంపరలు' అను ప్రతిబింబాన్ని కలిగి ఉంటోంది. జగత్ సత్తగా వ్యవహారసత్తగా స్ఫురిస్తోంది. అనగా, మహాసత్తకు రెండు రూపాలున్నాయి.

1. మూర్తము (Form) ; 2. అమూర్తము (Formless)

ఉభయము అయి ఉండటం చేత అద్దానిని 'మూర్తి' అని పిలుస్తూ ఉంటారు.

కాబట్టి ఈ ఎదురుగా కనబడే జగత్తు మహాచైతన్యం యొక్క వివర్తశక్తి వలననే నిలబడి ఉండ గలుగుతోందని చాలా తేలికగా తెలిసిపోతోంది. 'మాయ' కంటే వేరుగా ఈ జగత్తు యొక్క సత్త సంభవించ జాలదని స్పష్టంగా నిరూపణమౌతోంది. ఆభరణాలన్ని బంగారంతో తయారవుతున్నాయి. ఆభరణంలోని ఆకారం వదిలేసి చూస్తే మిగిలేదేది? బంగారమే కదా! దృశ్య సత్త యొక్క నామరూపాలు నశించినప్పుడు (ప్రళయ సమయంలో) బ్రహ్మత్వమే స్వయంగా శేషించుచున్నది. ఇంకొకరకంగా చెప్పాలంటే ...మాయ తొలగగా, ఇక ఆత్మసత్తే ఆనందైక రసస్వరూపంగా తనను తాను అనుభవిస్తోంది.

❖❖❖

5. నిర్మలశాంత స్వరూపం

జాగ్రత్‌లో ఈ మనస్సు ఇంద్రియాలలో ప్రవేశించి అనేక విషయాలు దర్శిస్తోంది, అనుభవి స్తోంది. స్వప్న సమయంలోనో? ఇంద్రియాలు మౌనం వహించి ఉంటున్నాయి. అయితే ఏం? మనస్సు తనకు తానే మహాసముద్రమై 'స్వప్నానుభవాలు' శబ్ద–స్పర్శ–రూప–రస–గంధ సంబంధమైన భావనా తరంగాలను తనయందు పొందుతోంది. స్వప్నద్రష్ట స్వప్నం కంటే వేరుగా ఉంటున్నాడు, వేరుగా ఉంటూనే... తనకు తానుగా ఇటు స్వప్నంలోనూ, అటు జాగ్రత్‌లోనూ అనేక భావనా తరంగాలలో ప్రవేశ నిష్క్రమణాలు నిర్వర్తిస్తున్నాడు. అయినా కూడా, ద్రష్ట ద్రష్టగానే ఉంటున్నాడు గాని మరింకొకటిగా అగుచుండుటలేదే !

మహాచైతన్యంలో సృష్టి లేదు. అయినా అందు జగత్తు ఉదయించినట్లు (అజ్ఞానదృష్టికి) తోచుచున్నది. చిద్రూపమగు ఆత్మ స్వప్నంలోనూ, జాగ్రత్‌లోనూ కూడా తన యొక్క కల్పిత రూపాలనే దృశ్యం నందు గాంచుచున్నది. పూర్ణచిదాత్మ కంటే ఎక్కడా ఏదీ లేదు. అహంభావ రహితమగు చిన్మాత్రయే సర్వత్రా వ్యాపించి ఉన్నది.

న తస్య జన్మమరణే, న తస్య – సదసద్గతీ ।
న నాశః సంభవత్యస్య, చిన్మాత్ర నభసః క్వచిత్॥

ఆ మహాచిత్ (లేక) చిన్మాత్రం (లేక) స్వస్వరూపానికి జనన–మరణాలు లేవు. అది ఎక్కడా ఏ మాత్రం పరిచ్ఛిన్నమే అవటం లేదు. ఆ చిన్మాత్రాకాశానికి ధ్వంసం అంటూ లేనే లేదు. అట్టిది అసంభవం అయి ఉన్నది.

అచ్ఛేద్యోఽ యమ్, అదోహ్యోఽ యమ్ చిదాదిత్యో అతినిర్మలః ।
అహో ను చిరకాలేన శాన్తాస్మి పరినిర్వృతా ॥

ఆ చిదాదిత్యుడు అత్యంత నిర్మలుడు. ఆతనికి ఛేదన – దహనములు లేవు. ఉండవు. నేను చిత్ సూర్యుడిని. అంతేగాని ఆయన ప్రతిబింబించే 'జీవుడు' అను ప్రతిబింబాన్ని ఎట్లా అవుతాను? సర్వదా స్వప్నద్రష్టనేగాని, స్వప్నంలో కనిపించే అనేకరూపాలుగాని, ఆ అనేక స్వప్నాంతర్గత రూపములలో ఒకానొకరూపంగాని ఎట్లా అవుతాను? అవను.

సూర్యబింబం సూర్యబింబంగానే ఉంటుంది. "నీటిలో సూర్యబింబం ప్రతిబింబిస్తోంది కాబట్టి ఆకాశంలోని సూర్యుడు నీటిలో ప్రవేశించాడు" అని ఎవరైనా అనగలరా? ...అంటే మాత్రం అది నిజమా?... కాదు. నేను బుద్ధిలోను, మనస్సులోను ప్రతిబింబిస్తున్నంత మాత్రం చేత నా యొక్క మహాచైతన్య స్వరూపం పోగొట్టుకుంటున్నానా? లేనేలేదు.

ఇక జరిగిపోయిన జీవభ్రమల గురించి ఆలోచించవలసిన పని నాకు లేదు. ఆహా! నేడెంత సుదినం! ఇప్పుడు నేను భ్రమరహితమగు నిర్వాణమును పొందుచున్నాను! ఆత్మాకాశమంతా ఆవరించి ఉన్నది నేనే! అట్టి నా వాస్తవ స్వరూపంలో దృశ్యాభాస లేదు. నేను సర్వదా అత్యంత నిర్మలము, అజము, అచ్యుతము అయి ఉన్నాను. నా స్వరూపవిస్తారంచే ఈ పధ్నాలుగు లోకాలు, ఈ చరాచర జగత్తు సర్వదా నింపివేయబడియున్నది.

నా యొక్క నిజస్వరూపము బాధారహితమైనది. నిర్మలమైనది. సర్వదృశ్య పదార్థములకూ పరమైనది. దేశ–కాల–వస్తువులచే అపరిచ్ఛిన్నమైనది. ఈ నా స్వరూపము అనంతము.

బ్రహ్మం నుండి వెలయు ప్రాణులు, వారి కర్మఫలాలు, ఆ ఫలాలను సంపాదించటానికి ఏర్పడి ఉన్న సాధనాలు, ఫలరహిత క్రియలు ...ఇవన్నీ బ్రహ్మం నందు జడమాత్రాలై స్వయంగా ఆత్మాకాశ రూపాలే అయి ఉన్నాయి. ఈ కనబడే దేహాలు, ఇందలి దేహులు, ఈ నా దేహం, ఇందలి 'చూడాల' అని చెప్పబడు ఈ దేహి ...ఇవన్నీ ఆత్మాకాశరూపాలే! అందువల్ల ఈ జగత్తంతా అకృత్రిమ చైతన్యమే అయి ఉన్నది. కుమ్మరివాని బొమ్మలు, వాటి కదలికలు ...అంతా మన్నే కదా !

ద్రష్ట-దృశ్యమయీ సత్తా చిన్మాత్రైక్యమయీ తథా,
ఇదమైక్యమ్-ఇదమ్ ద్విత్వమ్ అహం-నాఽహమితీతి చ ॥
క ఇవ భ్రమ సంమోహాః? కథం కస్య కుతః క్వ వా?
స్వమనస్తమనాయాసం ఉపశాన్తాస్మి సంస్థితా ॥

అట్లే ద్రష్ట-దృశ్యమయ ఈ జగత్తంతా చిన్మాత్రం మాత్రమే. 'ఇది ఏకం, అది అనేకం, ఇది నేను, అది నేను కాదు'... అను వాటికి ఇంకా ఆయా తదితరములైన భ్రమ సమ్మోహాలకు స్థాన మెక్కడ? ఆ భ్రమలు ఉన్నదెవరికి? అవి ఎందువలన ఎచ్చటి నుండి రాగలవు? ఇక అవన్నీ లేనివే!

ఆత్మ ఒక్కటే సత్యము. లేనివాటిని పొందట మేమిటి? తొలగించుకోవట మేమిటి? నేను ఎప్పటికీ కూడా అనంత పరమార్థస్వరూపాన్నే! కనుక, శాంతియే నా స్వభావమై ఉన్నది.

❖

ఇప్పటికి నేను 'మోక్షసుఖం' అనగా ఏమో గ్రహించాను. నా స్వస్వరూపమున వెలయుచున్నాను. అజ్ఞానకాలంలో కూడా నేను నెలకొని ఉన్నది నా యందే కదా! అయితే నేను నా వాస్తవ స్వరూపాన్ని కించిత్తు ఏమరచాను... అంతే! ఆ కారణం చేత ఇప్పుడొచ్చే లోటేమీ లేదు.

ఈ కనబడుచున్న చేతనాచేతనములు... వాటిని అనుభవించుచున్న భావములు... ఇవన్నీ ఆత్మకు అభిన్నములై ఆత్మాకాశముననే వెలయుచున్నాయి. 'ఇది, నేను, అతడు' మొదలైనవన్నీ భావనా మాత్రములే. ఆత్మయో, భావనకు ముందే ఉన్నది. అది పరమశాంతము, నిరాలంబము, కేవలము, పరస్వరూపము, శుద్ధము, సర్వము – అయి వెలయుచున్నది.

ఆత్మ తప్పితే ఇక్కడగాని, మరెక్కడా గానీ ఏదీ లేదు. నేనే ఆ ఆత్మను!

ఇట్లు చూడాల పరమాత్మతత్త్వమును గ్రహించింది. రాగము, మోహము, తమోవిలాసము... అనే అవస్థాత్రయం నివృతమై, నిర్మలశాంతి స్వరూపమున ఆమె విరాజిల్లింది.

❖❖❖

6. చూడాల స్వకీయ విచారణ

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఆ చూడాల ఒకవైపు తన భర్త శిఖిధ్వజునికి రాజ్యపాలన విషయాలలో చేదోడు వాదోడుగా సహకరిస్తోంది. మరొకవైపు కొంచెం సమయం దొరికినప్పుడల్లా ప్రతీరోజూ తాను ఆత్మ శాస్త్రవేత్తల దగ్గర వినియున్న భౌమావిద్య, లేక ఆధ్యాత్మవిద్యను సునిశితబుద్ధితో పరిశీలిస్తూ ... "నేనే ఆ అఖండము, అప్రమేయము, అగు నిర్మలాత్మను. నాకు అనుభవమయ్యేదంతా నా స్వరూప విస్తారమే!"...అను అనిర్వచనీయానుభవమును, సాక్షీ మహత్త్వమును స్థిరీకరించుకుంటూ ఉండేది. అంతర్వృత్తి చేత తన స్వాభావికమైన 'స్వాత్మారామము'ను ఆశ్రయించి ఆత్మతత్త్వం నందు స్థితి కలిగి ఉండేది. ఆమె యథాప్రాప్తములైన కార్యాలను, దినచర్యలను ఏవీ త్యజించలేదు. అయితే రాగ-ద్వేష-సంగ వర్జితమైన, నిర్ద్వంద్వమైన, ఇచ్ఛారహితమైన, సుసమగ్రమైన అవగాహన – అంతరంగ

సంస్థితత్వం మాత్రం పెంపొందించుకుంటూ ఉండేది. సందేహ జాలములను త్యజించివేస్తూ సంసార సముద్రమును ఆత్మస్వభావౌన్నత్యముచే అధిగమించసాగింది. పరమాత్మజ్ఞాన లాభముచే లభించే 'పరమపదము' నందు విశ్రాంతి పొందుతూ ఉండేది.

మనం ఆమె మనోస్థితి గురించి ఎంతగా చెప్పుకున్నప్పటికీ ...అది ఉపమానాలన్నిటి కన్నా అతీతమైనది. కనుక 'అనిర్వచనీయం' అనక తప్పదు. ఈ విధంగా ఆ రాజపత్ని అత్యల్ప కాలంలో 'ఆత్మజ్ఞాన సంయుక్త' అయినది. ఆమెకు అంత స్వల్పకాలంలో అది ఎట్లా సాధ్యపడింది?'...అని శ్రోతలెవరైనా ఆశ్చర్యపడతారేమో! ...అజ్ఞాని యందు అకస్మాత్తుగా ఎట్లా సంసార భ్రమలు ప్రవేశిస్తున్నాయో ...జ్ఞాని యందు అంతే వేగంగా, అంతే అకస్మాత్తుగా ఆ అజ్ఞాన వీచికలు (శీఘ్ర గతిని) వినాశన మొందుచున్నాయి. ఆ చూడాల 'ప్రతి ఒక్కని స్వగృహమే'... అన తగిన ఆత్మపదము నందు విశ్రాంతి పొంది, శరత్కాల మేఘపంక్తి వలె శోభిల్లింది.

ఓ రాఘవా ! ఒక గోవు పచ్చగడ్డి, నీరు గల ఒక విస్తార ఏకాంత ప్రదేశం పొందిన తరువాత ఇక వ్యాకులతకు కారణమేముంటుంది? 'జాగ్రత్' ఆదిగా అవస్థలన్నిటిలో సాక్షీభూతమై, జాగ్రదాది ఆయా అవస్థలచే బంధింపబడ జాలనిదై, సదా-సర్వత్రా ఏకమై ఉండే ఆత్మతత్త్వము నందు స్థిరులైన వారికి ఇక వ్యాకులత యొక్క అగత్యం ఉంటుందా? ఉండదు. స్వవివేకం యొక్క పూర్ణానంద స్వరూపం ఆమె యందు ఆవిర్భవించింది. ఇక ఆ చూడాల యొక్క స్వభావం నూతన పుష్పలత వలె శోభించింది. ఆమె ముఖంలో బ్రహ్మానందం యొక్క ప్రభావ వీచికలు 'వర్చస్సు'గా ప్రకాశించసాగాయి.

❖

ఒక రోజు శిఖిధ్వజుడు తన భార్య చూడాల ముఖంలో వెల్లివిరుస్తున్న ఆనందశోభను చూచి కించిత్ ఆశ్చర్యచకితుడైనాడు.

శిఖిధ్వజుడు: ఓ ప్రియ లలనా! చూడాలా! ఈ మధ్యగా నీ ముఖాన ఏదో నూతనోత్సాహం, నూతన కాంతులు విరజిమ్ముచున్నవే! మరల లేతయౌవనం పొందిన దాని వలె, పూర్ణచంద్ర శోభతో వెలుగొందుచున్నావే?

అమృతం తాగినప్పుడో, ప్రపంచ మొత్తానికి మహారాణివయినప్పుడో ముఖం ఎట్లుంటుందో... నీ వట్లు కనబడుచున్నావు. నీ శరీరంలో శాంతి, సౌందర్యం, గొప్ప శోభ ప్రకాశిస్తున్నాయి. భోగాశ త్యజించి, 'సమత్వం' పొందిన మునివరేణ్యుల వర్చస్సు నీలో ప్రస్ఫుటమౌతోంది. ఒకానొక గంభీరత్వం, పూర్ణత్వం నీలో ద్యోతకమౌతున్నాయి.

ఓ ప్రియురాలా! పరిహాసంగా అడుగుచున్నాను... నీ మనస్సు ఈ ముల్లోకాలలోని అమృతాన్ని అంతా గ్రోలి, ఆత్మానందశోభచే ముల్లోకాలను తృణప్రాయం చేసివేసిందా ఏమి? నీ కళ్ళలో ప్రపంచం లోని సౌమ్యం, సంతృప్తి, ప్రశాంతత అంతా వచ్చి కాపురం చేస్తున్నట్లుగా ఉందే? ఎండమావుల జలభ్రమ తొలగినప్పటి ఎడారి ప్రదేశంలాగా, క్షీరసాగరం సంతరించుకుని ఉండే పూర్ణత్వంలాగా, ఆనందసారంతో కూడుకుని నీ చిత్తం చమత్కారంగా ప్రభవిస్తున్నట్లు నా కనిపిస్తోంది. ఈ నీ శరీరం

ఇతఃపూర్వానిదే అయినప్పటికీ ఇప్పుడు అనిర్వచనీయ చిదానందసమన్వితమై బ్రహ్మానందప్రదమై మా అందరి కళ్ళకు కనిపిస్తోంది.

ఏమిటి విశేషం చెప్పు? దేవతలు ప్రత్యక్షమై అమృత కలశములను నీచే త్రాగించారా? నీ యొక్క హఠయోగసాధనచే మృత్యువుకు కూడా అందజాలనట్టివి అగు అలౌకిక శక్తులేవైనా సంపాదించావా? చింతామణిని గాని, త్రైలోక్యములపై ఆధిపత్యాన్ని గాని ఏ విష్ణువో ప్రత్యక్షమై ప్రసాదించ లేదు కదా?... అసలు విశేషమేమిటో నీ నుండి నేను వినాలని కొద్ది రోజులుగా అనుకుంటున్నాను. ఏదీ, చెప్పవూ?

చూడాల: ఓ ప్రియ రాజా! నా యందు మీకు నూతన తేజోసమన్వితమైన వర్చస్సు, ప్రశాంతత ద్యోతకమవటానికి నేనెరిగి నంత వరకూ కారణమేద్దై ఉండి ఉన్నదో అది చెపుతాను... వినండి.

మూఢత్వం వహించినప్పుడు జీవులకు ప్రియంగా తోచే దేహాత్మభావాన్ని నేను త్యజించాను. నిరాకారం, సంపూర్ణం అయినట్టి బ్రహ్మాత్మభావనను జ్ఞానబలంతో ఆశ్రయించాను. తత్ఫలితంగానే ఈ భౌతిక దేహంలో మీకు ఒకానొక అనిర్వచనీయ వర్చస్సు లేక శోభ కనిపించటం జరుగుతోంది.

ఈ దేహంతో సహా ఈ చరాచర జగత్తులో ఉన్నవన్నీ పరిచ్ఛిన్నం, కాలగతిని అనుసరించి రాక-పోకలు కలవి అయి ఉన్నాయి కదా!

వీటిని మనస్సులో పరిత్యజించాను. అట్టి పరిత్యాజ్యానంతరం శేషించియున్న నిర్మలమనస్సుతో ...భూత-వర్తమాన-భవిష్యత్తులలో ఒకే విధంగా వెలుగుచూ, ఈ మూర్త-అమూర్త ప్రపంచానికి సంబంధించనట్టి 'అపరిచ్ఛిన్న బ్రహ్మం' ను ఆశ్రయించి ఉన్నాను. ఏ ఆత్మ అయితే ద్రష్ట దృష్టిని అనుసరించి సృష్టి సమయంలో కొంచెం పరిచ్ఛిన్నంగాను, లయకాలంలో పరిచ్ఛిన్న రహితంగానూ కన్పట్టుచున్నదో... కానీ యథార్థానికి సర్వదా నిరాకారము, నిరాలంబమో అట్టి ఆత్మను గాంచు చున్నాను. అనగా నిరాకారకూటస్థ భౌమానందము అగు సుమధుర స్వభావమును అభ్యసిస్తున్నాను.

ఇప్పుడు నేను అనుభవిస్తున్న భోగములచే ఎట్లు సంతుష్టురాలనై ఉంటున్నానో... అట్లాగే అనుభవించని భోగాల పట్ల కూడా సంతుష్టియే కలిగి ఉంటున్నాను. ఎందుకంటే నా స్వరూపం చేతనే నాకు సంతుష్టి కలుగుచుండుటచే, సంతుష్టియే నా స్వరూపమగుచున్నది. దృశ్య విషయాల సంసర్గం కలుగుట చేతగాని, కలుగకుండుట చేతగాని నాకు సుఖ-దుఃఖాలు ఏర్పడవలసిన అగత్యమే లేదని గ్రహించాను. ఆకాశం వలె స్వచ్ఛమై 'కేవల హృదయస్థితి'ని పొందుచున్నాను. దృశ్య సంపర్కం లేని మనస్సుచే ఏకాకినై సర్వమునందు క్రీడించుచున్నాను.

ఈ రాజ్యలీల నందు నేను ఉండియే ఉండలేదు. ఈ దేహమునందు ఉన్నంత మాత్రం చేత నా యొక్క 'పూర్ణాత్మస్థితి'కి వచ్చే లోటేమీ లేదు. ఈ భోగాలతో గాని, ఇక్కడ తారసపడే తదితర విషయాలతో గాని నాకు ఏనాడూ సంబంధం లేదు. లజ్జ-అభిమానం-కోపం-భయం నాకు లేవు. నాకు సంబంధం లేని వాటిచే నేను బంధింపబడటమేమిటి? ...కనుక నాకు బంధమూ లేదు, మోక్షమూ లేదు.

నేను స్వతహాగా ఆకారరహితుడనైనప్పటికీ ఈ అనేక బ్రహ్మాండములకు ప్రభువునై ఉన్నాను. ఆత్మచే ఆత్మయందు పూర్ణప్రభతో వెలుగొందుచున్నాను.

'అధిష్ఠానదృష్టి'తో చూస్తే... ఈ దేహాదులన్నీ నేనే. నేను నిత్య సత్యమై ఈ దేహాదులందు ప్రసరించి ఉన్నాను. 'అపవాద దృష్టి' ప్రకారం ఇవేమీ నేను కాదు. 'దేహాత్మ దృష్టి'తో ఈ దేహ-మనో-బుద్ధులేవీ సత్యమే కాదు.

వెయ్యేల?... అంతయూ నేనే! సర్వతత్త్వాత్మకుడను! ఇదేమియూ నేను కాదు! సర్వతత్త్వ విదూరుడను! నేనిప్పుడు సుఖాన్ని కోరుటలేదు. దుఃఖానికి వాపోవుట లేదు. అర్థమును వాంఛించుట లేదు. అనర్థమును ద్వేషించుట లేదు. యథాప్రాప్తములైన వస్తువులతో సంతృప్తిని పొందుచున్నాను.

రాగద్వేషము లనేవి లేనట్టి బుద్ధితో 'శాస్త్రదృష్టి' అనే స్నేహితురాలితో కూడి ఈ జగత్తునందు విహరిస్తున్నాను.

ఓ ప్రాణనాథా! ఈ నేత్ర ప్రకాశంచే తదితర ఇంద్రియాలచే, ఈ మనోబుద్ధులచే నేనేమేమి చూస్తున్నానో, పొందుచున్నానో, అనుభవిస్తున్నానో... అదంతా మిథ్య అయి ఉన్నది. అందుచేత ఈ ఇంద్రియ - మనోబుద్ధుల నుండి వియోగం పొందినదాననై, ఆ 'నిష్ప్రపంచవస్తువు'ను నా యందే గాంచుచున్నాను.

❖

శ్రీవసిష్ఠ మహర్షి: ఓ రామచంద్రా! ఆ చూడాల ఆత్మయందు విశ్రాంతి పొందుతూ చెప్పే వాక్యాలలోని అంతర్గత ఆత్మానుభవరసాన్ని శిఖిధ్వజుడు గమనించనే లేదు. చిన్నపిల్లలు పెద్ద-పెద్దమాటలు మాట్లాడుచున్నప్పుడు తండ్రి చూపే అవహేళనను మాత్రం ప్రకటించాడు.

❖

శిఖిధ్వజుడు: ఓ ప్రియురాలా! నీవు బాలికవు కనుకనే ఇటువంటి అసందర్భమైన మాటలను, పాఠ్యాంశాల వలె వల్లిస్తున్నట్లు చెప్పుచున్నావు. అటువంటి పిచ్చి ఆలోచనలను కట్టిపెట్టి, ఇంతవరకూ ఏ రాజ్యవ్యవహారంలో నాతోబాటు పాల్గొనుచున్నావో, అట్లే ఈ కార్యక్రమాలను కొనసాగించు.

ఏమిటి నీవన్నది? ప్రత్యక్ష సద్రూపమైనట్టి ఈ ఆకారమును త్యజించి... అప్రత్యక్షమై, ఊహా సంబంధితమైన నిరాకారాన్ని ఆశ్రయిస్తున్నావా? శూన్యంచే శోభిస్తున్నావా? అనుభవించునట్టి భోగాలచే సంతుష్టి పొందుచున్నావా? అనుభవించని వాటిచే కూడా సంతుష్టి పొందుచున్నావా?

మూర్ఖురాలి వలె శయ్య-ఆసనము త్యజించి ఎక్కడో వెతకటమా? ఈ మిత్రభృత్యాది రూపాలను, రాణివాసపు భోగాలను, వాటికి సాధన భూతాలగు ధనాధులను పరిత్యజించి పిశాచి వలె ఎక్కడో సంచారం చేయడం ఉచితమని నీ అభిప్రాయమా? ఎవరు చెప్పారీ మాటలు? జ్ఞానులు ప్రవచనాలన్నీ విని నేర్చుకున్నది ఇదా? 'మోక్షం' అంటే ఏవో ఉబుసుపోని ఆలోచనలనుకున్నావా? ఏదో కోపం వచ్చి వస్త్ర, భోజన, శయ్య, త్యజిస్తేనూ, మొండిగా ఆకలి దప్పికలను సహిస్తేనూ మోక్షం వస్తుందా?

నేను దేహమునకు అన్యమైన విషయమును... ఇవేమీ నేను కాదు... ఇవన్నీ నేనే... ఇవి నాలో లేవు... వీటన్నిటిలో నేనే ఉన్నాను... వీటన్నిటికీ, వేరై నేనెక్కడో ఉన్నాను... ఇటువంటి

పరస్పర వ్యతిరేకార్థ వాక్యములు స్వీకరించి ఏం సాధిద్దామనుకుంటున్నావు? నీవు ప్రయాణించేది ఎటో నీకైనా తెలుసా?

'కళ్ళకు కనిపిస్తున్నదంతా మిథ్య. ఇందులో నేను చేస్తున్నది మరొకటి'... ఇట్టి అసద్వాక్యముల ప్రేలాపన ఏ జీవునికైనా శోభ అవుతుందా? ఇన్ని జ్ఞాన విషయాలు విన్నావు. నీతో బాటు నేనూ విన్నాను. జీవించి ఉండగానే శ్రమించి సాధన చేసి ఉత్తమ బుద్ధిని సంపాదించుకోవాలి కదా! అది మానివేసి 'మనస్సు, బుద్ధి వదిలేశాను. మనో బుద్ధులను త్యజించి మరొకచోటకు చేరుచున్నాను' ...అని అంటున్నావే?

ఓ చూడాలా! నీవు మాట్లాడే మాటలు తాత్త్వికోపన్యాసం వినిన ఐదుసంవత్సరాల బాలిక మాట్లాడుచున్నట్లున్నాయి గాని, నీవంటి ప్రౌఢ మాట్లాడాల్సిన మాటలుగా లేవు. వాక్యాలకు పెడర్థం కల్పించుకొని పిచ్చిదానివి కావద్దు. ఉచితానుచితాలు నాకు తెలియవా? పిచ్చి ఆలోచనలు కట్టిపెట్టి నా వలెనే రాజ్యవిషయాలు చూచుకుంటూ తపస్సు, ధ్యానం చేయి. ఇంకా తాత్త్వికోపన్యాసాలు విను. అంతే గాని, మనస్సును చెదరగొట్టుకొని పిచ్చిదానివై వీధుల వెంట తిరుగు మార్గంలోకి వెళ్ళకు.

❖

శ్రీవసిష్ఠ మహర్షి: ఓ రామచంద్రా! ఆ విధంగా శిఖిధ్వజుడు ఆ చూడాల మాటలకు కొంచెం కోపం, అపహాస్యం ప్రకటించి, పకపకా నవ్వుతూ ఆ చూడాల చెయ్యి పట్టుకొని ఆ రోజు అవశ్యం నిర్వర్తించవలసియున్న సభాకార్యక్రమ నిర్వహణకై అక్కడినుండి బయల్వెడలాడు. చూడాల తన ప్రియపతి శిఖిధ్వజుని వెంటనంటి అడుగులు వేస్తూ ఆ సమయంలో ఇట్లా అనుకున్నది.

❖

చూడాల: (తనలో) అయ్యో! నా ప్రియుడైన ఈ రాజు ఆత్మయందు విశ్రాంతి పొందకపోవుటచేతనే నా వాక్యార్థములను గ్రహించలేకపోయాడు కదా! దృశ్యముపై అపేక్ష, అల్పావగాహన, అసమగ్రమైన అభిప్రాయములు ఉన్నంతవరకూ ఆత్మానుభవమునకు సంబంధించిన ఉత్కృష్టవాక్యములు పిచ్చివాని మాటలవలెనే అనిపిస్తాయి కాబోలు. సరే! ఇప్పుడు చేసేదేమున్నది? సముచితమైన సమయం ఆసన్నమైనప్పుడే ఈయనకు చెప్పటం మంచిది కదా!

❖

ఇట్లు చింతించుచూ తాను కూడా భర్త వెంట సభలో ప్రవేశించింది. యథారీతిగా ఆయా రాచకార్యములు నిర్వర్తించుటలో భర్తకు ఉపాయములు, యోచనలు, అభిప్రాయములు అందించింది. ఆ తరువాత కూడా యథావిధంగా తన ఆత్మచింతనావ్యాపారమునందు సంలగ్నచిత్త అయి, రోజులు గడపసాగింది. రెండు వేరు వేరు దృక్పథాలు – ఆశయాలు కలిగి ఉన్న వారిరువురూ తదితర సర్వ విషయాలందూ లోకరీతిగానే (లౌకిక వ్యవహారాలన్నీ) నిర్వర్తిస్తూ ఉన్నారు.

ఒకసారి శిఖిధ్వజ మహారాజు శత్రురాజులను జయించటానికి మూడు సంవత్సరాల కాలం విదేశాలకు వెళ్ళవలసి వచ్చింది. ఆ మూడు సంవత్సరాలు చూడాలయే రాజస్థానంలో ఆయా రాచ కార్యములు నిర్వర్తిస్తూ ఉండేది. ఆ సమయంలో నిత్యతృప్త అయి, ఇచ్ఛారహిత అయి అఖండము

– అప్రమేయము – నిత్యము అగు ఆత్మాభ్యాసం ("నేనే ఆత్మను" అను సమాధి యొక్క అభ్యాసం) కొనసాగిస్తూ ఉండేది. ఒక రోజు ఆమె మానసికాకాశంలో ఆకాశగమన ఇచ్ఛ స్వయంగా ఉద్భవించింది. అందుచేత ఆ రాజపుత్రి అప్పటికప్పుడే రాజ్యాన్ని వదలి ఒకానొక నిర్జన స్థానం ప్రవేశించింది. ఒక ప్రశాంతమైన ఏకాంత ప్రదేశం ఎన్నుకున్నది. అచ్చట తనకు అనుకూలమైన ఉచితాసనం వేసి అవయవాలను దృఢపరచుకున్నది. ఆకాశగమన విద్య సిద్ధికొరకై ఊర్ధ్వగామి యగు ప్రాణవాయువులను భ్రూమధ్యంన నిరోధించటమనే అభ్యాసాన్ని చిరకాలం ఆచరించింది. కుండలినీ శక్తిని ఉద్బోధించి క్రమక్రమంగా యోగాభ్యాసంచే ఆకాశగమన శక్తిని ప్రభవింప జేయసాగింది.

❖❖❖

7. సుషుమ్నానాడి

శ్రీరాముడు: మహాత్మా! నాదొక సందేహం. ఈ స్థావర–జంగమాత్మకమైన ప్రపంచమంతా క్రియా సిద్ధంగా కనిపించుచున్నది కదా! అయితే "క్రియ" అనే స్పందనం యొక్క సిద్ధి దేని వల్ల కలుగుతోంది?

ఏదైనా "చలనక్రియ" వలన కలుగుచున్నదంటారా?... లేక ఆత్మ వలననా?

ఏదైనా చలనక్రియ వలననే అయితే, అప్పుడు ఆత్మను 'క్రియావస్థ'గా మార్చగల ఒక దోషం ఏర్పడుచున్నట్లే అవుతోంది. ...పోనీ, 'ఆత్మ వలన' అని అంటారా?...

ఆత్మ నిష్క్రియాత్మకమైనదని చెప్పుచున్నారు కదా? మహాత్మా! ఏ క్రియ యొక్క దృఢాభ్యాసం చేత ప్రయత్నశీలుడగు జీవునకు 'ఆకాశగమనము' మొదలైన విద్యలు లభిస్తున్నాయి? ఒకడు ఆత్మజ్ఞుడు అయినా, కాకపోయినా సిద్ధి కొరకో, లేక విలాసం కొరకో ఆకాశగమనం, ప్రత్యక్షం కావటం, మాయమవటం మొదలైన ఫలాలు ఎట్లు ఏ ప్రయత్నంచే పొందుచున్నాడో చెప్పండి.

శ్రీ వసిష్ఠ మహర్షి: ఈ ప్రపంచంలోని సాధ్యవస్తువులన్నీ 3 రకాలుగా విభజించి చెప్తూతూ ఉంటారు.

1. **ఉపాధేయములు -** ఎట్టి ప్రయత్న ఫలితమైన వస్తువు ఒకని అనుకూల్యమునకు సహకరిస్తున్నాయో అట్టి ప్రయత్నములను 'ఉపాధేయములు' అని పిలుస్తారు.
2. **హేయములు -** ఒకనికి ప్రతికూలమైన ఏ వస్తువులు ప్రయత్నముచే త్యజించబడుచున్నాయో అట్టి వానిని 'హేయములు' అని అంటారు.
3. **ఉపేక్ష -** వేటివేటిని ఉపేక్షించుటచే ఒకనికి అనుకూలమౌతుందో అట్టి ప్రయత్నములకు 'ఉపేక్ష్యములు' అని పేరు పెట్టారు.

సుఖకరమైన పదార్థములు ఏవి కలవో అవే ఉపాధేయములు. తద్విరుద్ధమైనవి... త్యాజ్యములు, లేక, హేయములు. ఈ రెండు విధములు కానివి... మధ్యస్తములు లేక ఉపేక్షములు.

అయితే... సద్బుద్ధియగు జ్ఞానికి ఎప్పుడైతే 'సర్వమూ ఆత్మమయం'గా స్ఫురిస్తుందో, అప్పుడు ఈ మూడూ ఆతని దృష్టిలో ఉండవు.

❖

జ్ఞాని ఒకప్పుడు లీలగా ఈ మూడిటినీ ఉపేక్షాభావంతో చూస్తాడు. అనగా, ఈ మూడూ కూడా అతనికి తోచక మటుమాయమౌతాయి. సర్వమూ ఆత్మమయమై ఉండగా, ఇంక వదలవలసిన దేమున్నది? స్వీకరించవలసినది ఏది?

కానీ జ్ఞానికి ఏదైతే ఉపేక్షామాత్రంగా ఉంటుందో, అదంతా మూఢునికి ఉపాధేయం అవుతోంది. గొప్ప వైరాగ్యశీలురకు అది హేయం అవుతోంది.

❖

ఇక నీవు ప్రశ్నించిన సిద్ధుల విషయానికి వద్దాం, వసంత ఋతువు వచ్చి భూతలమును ప్రసన్నంగా చేస్తూ ఉంటుంది కదా! అట్లాగే సిద్ధులన్నీ కూడా యథోచితమైన దేశ-కాల-ద్రవ్య రూప సాధనలను అనుసరించి మామిడి ఫలంలో దాగి ఉన్న రుచిలాగా, ఈ జీవుణ్ణి సంతోష పెట్టటానికి వచ్చి చేరుచున్నాయి. ఆ దేశ-కాల-ద్రవ్యాలలో కూడా దేశకాలాదుల ఉత్తమత్వం చేత "క్రియ" యొక్క ఉత్తమత్వం చేకూరుతోంది. ఉత్తమ క్రియచేతనే ఉత్తమఫలసిద్ధి సంభవిస్తోంది.

'ఆకాశ గమనం' వంటి సిద్ధులు, వాటి సాధనా సామగ్రి సృష్టికర్తచే పొందుపరచబడి ఉన్నాయి. అవి 1. సిద్ధగుటిక, 2. సిద్ధాంజనము, 3. సిద్ధఖడ్గము, 4. సిద్ధపాదుక -మొదలైనవి. వాటిని వివరించి సిద్ధులు సంపాదించటానికి ఉపకరించే శాస్త్రాలు కూడా ఉన్నాయి. 'ఉడ్డామరతంత్ర, యోగినీకల్పం' మొదలైన కొన్ని శాస్త్రాలలో సిద్ధులకు సంబంధించిన సాధనలు వివరించబడ్డాయి.

ఇప్పుడు నీ ప్రశ్నకు వద్దాం. ఆ క్రియలను నిరూపించటం నీ ప్రశ్న యొక్క ఆశయమా?

నాయనా! జిజ్ఞాసువులగు (ఆత్మను ఎరుగు లక్ష్యముతో వివేకులై ప్రయత్నించువారు), వారికి వాటి యందు ప్రవృత్తి కలిగితే మహాదోషం సంభవించగలదని నా మనవి. హెచ్చరిక కూడా! అది జ్ఞాన నిరూపణకు హాని కనుక ఇక్కడ అప్రస్తుతమనే చెప్పాలి. ఇప్పుడు మనం మణి-మంత్ర-ఓషధాది సిద్ధుల గురించి చెప్పుకోవటం మన ఈ ఆత్మతత్త్వనిరూపణ సందర్భానికి ఉచితం కాదు. అట్లాగే సిద్ధ ప్రదేశాలు, అక్కడ సాధనచే పొందగల సిద్ధులు కూడా అప్రస్తుతమే. అందుచేత వాటిని వదలి ఈ శిఖిధ్వజ కథా విషయ సందర్భంగా వచ్చి ఉన్న ప్రాణాదివాయు నిరోధం, తద్వారా లభించే కొన్ని సిద్ధుల గురించి మాత్రం ప్రస్తావిస్తాను విను.

❖

మామూలుగా ప్రాణవాయువులు సామాన్యజీవుని అధీనంలో ఉండక, తమ ప్రకృతి నియమాన్ని అనుసరించి ప్రవర్తిస్తూ ఉంటాయి. సాధనచే అట్టి ప్రాణవాయువులు సాధకుని అధీనంలోకి రాగలవు.

1. ఇతర సాధ్యవస్తువుల వాసనలను వదలి యోగశాస్త్ర ప్రవచితమైన క్రియలచే నవద్వారాలను సంకోచం గావించటం. - కాయము, శిరస్సు కంఠములను సమంగా ఉంచటం, నిశ్చలంగా నాసికాగ్రమును అవలోకించటం మొదలైన క్రియలు.

2. భోజన - ఆసనాదుల శుద్ధత్వం

3. ఉత్తమ శాస్త్రార్థభావన చేత

ఇట్లాగే ఉత్తమ ఆచారం చేత, సజ్జన సహవాసం చేత, సుఖాసనం చేత కొంతకాలం ప్రాణాయామం అనునిత్యంగా దృఢంగా అభ్యసించటం చేతనూ, కోపలోభాది గుణాలు సుదీర్ఘకాలంగా త్యజించటం చేతనూ ప్రాణవాయువులు అట్టి అభ్యాస జీవుని వశంలో ఉంటాయి. అప్పుడు ప్రాణాది వాయువులు రేచక–కుంభక–పూరక క్రియలందు ఒక అణకువతో కూడిన భృత్యుని వలె ఆ సాధకుని ఆజ్ఞలు నెరవేరుస్తాయి. ఎప్పుడైతే దేహంలో చలిస్తున్న ఆ ప్రాణవాయువులు దేహికి వశీకృతమౌతాయో అప్పుడు ఆ దేహికి విద్య మొదలైన సంపద మొదలుకొని, కోరుకున్న సిద్ధులే కాక, మోక్ష సంపద వరకు సమస్త సంపదలు సుఖసాధ్యమౌతాయి. ఈ జీవులు కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యా లనే ఆరు శత్రువులకు (అరి షడ్వర్గానికి) మనస్సులో స్థానం కల్పించి తద్ద్వారా ప్రాణ వాయువుల నియమించడంలో నిస్సహాయులౌతున్నారు. యోగ కుశలురు ఈ అరి షడ్వర్గాన్ని జయిస్తూ క్రమంగా ప్రాణవాయువులను అత్యంత సులభంగా తమ వశం చేసుకోగలుగుచున్నారు సుమా!

సుషుమ్నానాడి - ఈ శరీరంలో 'సుషుమ్నా' అని యోగశాస్త్రంచే పిలువబడుచున్న శక్తిరేఖా రూపమైన నాడి ఉన్నది. అది విస్తరించబడిన శాఖలతోనూ, నలువైపులా చుట్టబడి ఉన్నది. ఇది మర్మసానాన్ని ఆశ్రయించుకుని ఉన్నది. అది వందలకొద్దీ ఉపనాడులచే సమాశ్రయించబడి ఉన్నది. ప్రేగులచే పరివేష్టించబడి ఉన్నది.

ఆ సుషుమ్నానాడి వీణాతంతువుల మూలభాగంలోని చలనలయలాగా రేఖారూపమైన ఆవర్ణం కలిగి ఉంటోంది. నీటిలోని ప్రవాహ ప్రక్రియ లాగా మౌనంతో కూడిన సంచలన క్రియ కలిగి ఉంటోంది. 'ఓం' కారంలోని అర్ధభాగం వలె కుండలంతో సమానమై ఉంటోంది.

ఈ సుషుమ్నానాడి దేవ, అసుర, మనుష్య, మృగం, జలచరం... సమస్త ప్రాణులందు కూడా ఉన్నది. చలిచే పీడించబడేవాడు ముడుచుకుని ఉన్నట్లు, నిద్రిస్తున్నప్పటి పాము వలె ఈ సుషుమ్నానాడి అసాధనపరులలో ముడుచుకుని ఉంటోంది. ప్రళయాగ్నిచే మ్రింగబడుచున్న చంద్రుని వలె కుండలం యొక్క ఆకృతి కలిగి ఉన్నదై, స్వచ్ఛమై ఉంటోంది.

'శక్తి స్వరూపం' అని చెప్పతగ్గ ఈ నాడి గుదస్థానం నుండి భ్రూమధ్య పర్యంతం వరకు గల సర్వరంధ్రాలను స్పృశిస్తోంది. బాహ్యానికి ప్రాణవాయువుల స్పందనతో కూడుకొని ఉంటోంది. అభ్యంతరంలో మనోవృత్తుల చంచలం కలిగి ఉన్నదగుచున్నది. అది మూలాధారమున వెన్నెముక చివరగా వీణాశబ్ద వేగం వలె శోభాయుక్తమై ఉన్నది. శబ్దబ్రహ్మ రూపంలో పరాశక్తిని స్ఫురింప జేస్తోంది.

ఇది అరటిబోదెను పోలి కుండలాకారంగా ప్రవహిస్తూ ఉండటంచే దీనినే 'కుండలిని' అని కూడా అంటున్నారు. ఈ కుండలిని ప్రాణ – ఇంద్రియ – మనోబుద్ధుల వంటి దేహాల్లోని సమస్త శక్తులకు హేతుభూతమై ఉండటం చేత ఇది సర్వులకు స్ఫూర్తి ప్రదమైయున్నది. ఈ కుండలినీ శక్తియే తన ఊర్ధ్వకృతమైన ముఖంచే ప్రాణవాయువును పైకి, అపానవాయువును క్రిందకు త్రోయుచూ దేహస్పందనానికి కారణమై ఉంటోంది. శ్వాస గొనుచూ ఆడ త్రాచులాగా చరిస్తోంది.

❖

హృదయంలో ఉండే ప్రాణవాయువు ఎప్పుడైతే కుండలిని చేత ఆకర్షించబడి అపాన వృత్తిచే కుండలినీ పదం పొందుతుందో, అప్పుడు పంచీకృతమైన అంతఃకరణంతో అపంచీకృతమైన జ్ఞాపకం, సంకల్పం, ఇష్టం, కార్యకుశలత, ధ్యానం - ఇత్యాది వృత్తి భేదాలతో కూడిన జ్ఞానం పుడుతోంది. ఆ జ్ఞానమే జీవుని దేహసంబంధమైన ఆవిర్భావానికి నాంది. ఆ జ్ఞానమే 'జీవసంవిత్తు' అని కూడా అనబడుతోంది.

ఈ విధంగా కమలము నందు భ్రమరం లాగా దేహంలో స్ఫురించే కుండలిని బుద్ధి-ప్రాణాలకు జ్ఞాన-క్రియా శక్తులను ఇస్తోంది. అదే విధంగా అంతఃకరణము నందు ఇంద్రియార్థములకు (శబ్ద - స్పర్శ - రూప - రస - గంధములకు) స్ఫూర్తిని కలుగజేస్తోంది. కుండలినియే ఇంద్రియార్థముల నానావిధ రూపములుగా ప్రదర్శితమౌతోంది.

ఈ కుండలిని ఎంతెంత వేగంగా స్ఫురిస్తుందో... అంతంతగా ఈ కళ్ళు మొదలైన ఆయా ఇంద్రియాలకు తటస్థపడు వస్తుజాలం యొక్క స్పష్టమైన జ్ఞానం జనిస్తోంది. అలాగే బుద్ధి-ప్రాణాలకు కూడా అదే స్ఫూర్తి ప్రదాత అని అనుకున్నాం కదా! అట్టి స్ఫూర్తిచే ఈ కార్య-కారణ యంత్రానికి ప్రేరకుడైన 'ప్రమాత' యొక్క స్పష్టజ్ఞానం కూడా పుడుతోంది. హృదయ కోశంలోని నాడులన్నీ కూడా ఈ కుండలినీ నాడికి సంబంధం కలిగి ఉండి తద్వారా శక్తి - స్ఫూర్తులను పొందుచున్నాయి. అంతే కాదు నదులన్నీ సముద్రంలో ఉత్పన్నమై మరల సముద్రంలోనే లయిస్తున్నాయి చూచావా? దేహంలోని నాడులలోని శక్తితత్వం కుండలినియందు ఉత్పన్నమై మరల కుండలినిలోనే లయిస్తున్నాయి. అది ప్రాణరూపమున ఊర్ధ్వగమన మందు, అపానరూపమున అధోగమనమునందు ఉన్ముఖమవటం చేత సాధారణార్థంలో 'కుండలినియే సమస్త ఇంద్రియ జ్ఞానములకు బీజము'... అని చెప్పబడుతోంది.

శ్రీరాముడు: ఓ మునీంద్రా! దేశ-కాల-వస్తువులచే పరిచ్ఛిన్నం కానటువంటి చిత్-చైతన్యము మాత్రమే ఈ అంతయు అయి ఉన్నది కదా! మరిప్పుడేమో "కుండలినీ కోశము చేతనే సర్వవిధములైన సంవిత్తు (జ్ఞానము) ఉదయిస్తోంది" అని అంటున్నారు. అసలీ ఇంద్రియ జ్ఞానం ఎందుకు ఎలా ఉదయిస్తోంది? అదంతా ఎలా సాధ్యం?

శ్రీ వసిష్ఠ మహర్షి: వత్సా! రామచంద్రా! సర్వకాలములందు సమస్తము చైతన్యము మాత్రమే అయి ఉన్నది. ఇందులో సందేహించవలసినదేదీ లేదు. అయితే పంచభూత - పంచతన్మాత్రల చమత్కారం చేత ఆ చైతన్యం యొక్క అభివ్యక్తం ఒక్కొక్కచోట అత్యంత విశేషమైన ప్రకటనతో కన్పట్టుచూ ఉంటుంది. ఉదాహరణకు సూర్యుడు ఆకాశంలో ఒకే రీతి ప్రకాశిస్తున్నాడు. ఆ సూర్యభగవానుని ప్రకాశం నీళ్ళలోను, దర్పణంలోనూ విశేషంగా భాసిల్లుతోంది కదా! అట్లాగే చైతన్యం అంతటా విద్యమానమై ఉన్నప్పటికీ అది దేహములందు, బుద్ధులందు విశేషమైన స్పష్టతతో భాసిల్లుతోంది. నీ స్వరూపం యొక్క కాంతి పుంజాలు అన్ని వైపులా ప్రసరిస్తూ ఉంటాయి. అయితే ఎక్కడ దర్పణం ఉంటుందో అక్కడ మాత్రమే నీ రూపం ప్రతిబింబిస్తుంది, అక్కడ మాత్రమే చూడగలుగుతావు. దర్పణం అక్కడ లేనప్పుడు కూడా నీ యొక్క ప్రతిబింబ సంబంధమైన కాంతిపుంజాలు ప్రసరిస్తూనే ఉన్నాయి కదా!

ఆత్మ నిర్లిప్తంగా అంతటా ప్రసరించియే ఉంటోంది. మనోబుద్ధులున్న చోట స్పష్టంగా ప్రతిబింబితమగుచున్నది. రాళ్ళయందు, మట్టియందు అస్పష్టమైన మౌనస్వరూపం వహించి ఉంటోంది. దేవ – మనుష్యాదులలో సుస్పష్టంగా భాసించుచున్నది. ఇక వృక్షాదులందు ఇష్టా–ఇష్టముల వివేకము లేకుండానే ప్రకటనమగుచున్నది. ఆత్మ శక్తిరేఖాదృశమై ఆనువర్తమవటమే కుండలిని యొక్క నిర్వచనం.

❖❖❖

8. వాసనలు - ఉపాధులు

శ్రీరాముడు: ఈ దేవతలు – మనుష్యులు – జంతువులు – స్థావరములందు 'సంవిత్తు' ఉదయిస్తున్న క్రమము గురించి మరల ఒక్కసారి సందర్భోచితంగా వివరించమని తమకు నా ప్రార్థన.

శ్రీ వసిష్ఠ మహర్షి: చైతన్యము సర్వదా అవికారము, నిరామయము కూడా! ఈ చేతనాచేతనంగా కనిపించే ప్రపంచమంతా ఆ చిన్మాత్ర – సన్మాత్ర – సూక్ష్మ – విభు – అసంగ – సంగచైతన్యము చేతనే వ్యాపించి ఉన్నది.

నిరాకార నిర్వికల్ప చైతన్యము యొక్క ఒకానొక కల్పితమైన స్వల్పాంశమునందు మాయచే ఆకాశము మొదలైన సూక్ష్మభూతముల అధ్యాస ఏర్పడి ఉంటోంది. అనగా ఆ చైతన్యమే భూత తన్మాత్రల రూపమున వెలయుచున్నది. అట్టి పంచభూతతన్మాత్రలే 1.ప్రాణము, 2. మనస్సు, 3. బుద్ధి, 4. కర్మేంద్రియములు, 5. జ్ఞానేంద్రియములు – అను ఐదు విధాలుగా అభివ్యక్తమౌతున్నాయి. అద్దానినే 'లింగశరీరం' అంటున్నాం. చైతన్యమే లింగ శరీరమున ప్రతిబింబరూపంగా ప్రవేశించి తన పట్ల తనే అచ్చోట జీవభావమును (నేనొక జీవుడను – అను భావం) కల్పించుకొంటోంది, లేక, ఆపాదించుకుంటోంది.

అయితే, రామా! అట్టి ప్రవేశమేదైతే ఉన్నదో ...అది 'ఒక వస్తువు మరొక దానిలో ప్రవేశించటం వంటిది'... అని తలచవద్దు మరి! చైతన్యము పంచతన్మాత్రల ద్వారా జ్ఞాన క్రియలందు ప్రవేశించటం... అనేది ఒకే అగ్నిదేవుడు నూరు దీపాలుగా వెలుగుతూ ఉండటం వంటిది. ఈ విధంగా ఆ చైతన్యం తన యొక్క వికారాలతోనూ, జాగ్రత్–స్వప్న–సుషుప్త్యాది అవస్థాభేదాలతోనూ గూడినదై జీవభావంగా ప్రస్ఫుటించుకొనుచున్నది.

ఈ విధంగా లింగశరీర నిర్మాణమున పరిశేషించిన కొన్ని తన్మాత్రలు దేవ, మనుష్య, జంతు, స్థావరాది వాసనలను ప్రదర్శిస్తున్నాయి. చైతన్యమే ఒకచోట 'నేను దేవతను' అని, మరొకచోట నేను మనుష్యుడను అని ఇంకొక చోట నేను వృక్షమును అని అనేక చోట్ల అనేక రీతులుగా కల్పనను ఆశ్రయించటం జరుగుతోంది. ఆయా వాసనలను అనుసరించి సంకల్పములతో కూడినదై పంచీకరణము ద్వారా ఈ సకల దేహభావములను పొందుతోంది. ఒకే వ్యక్తి స్వప్న – జాగ్రత్తులలో వేరువేరైన దేహభావములతో వ్యవహరిస్తున్నట్లు ఒకే చైతన్యం ఈ ఏకానేక వివిధ దేహముల భావనలను కలిగి ఉంటోంది. అట్టి వాసనాసహిత భావనాతరంగములలో కొన్ని ద్రవ్య భావములను మరికొన్ని దేశ – కాల విభాగముల భావనను కలిగి ఉంటున్నాయి.

ఈ విధంగా ఈ జగత్తంతా కూడా 'శబ్ద - స్పర్శ - రూప - రస - గంధములు.... అనే భౌతిక భావముచే గమనించబడు పంచన్మాత్రల క్రియయే అయి ఉన్నది. అధిష్ఠానమైన చైతన్యమే అంతటా నిండి ఉన్నది. అది ఈ తతంగమంతటియందూ అవ్యక్తమై పూలదండలోని దారం లాగా సర్వదా ఆధారరూపంగా ప్రసరించి ఉంటోంది.

❖

ఈ మనుష్యాది దేహములందు లింగశరీర ప్రాధాన్యము ద్వారా ముఖ్య చేతనత్వం కలుగుతోంది. ఆ లింగశరీరము ప్రాణము, మనస్సు, బుద్ధి, కర్మేంద్రియములు, జ్ఞానేంద్రియములు - అను పంచకముచే నిర్మించబడుచున్నదని అనుకున్నాం కదా! ఇక జంతుశరీరాల విషయానికి వస్తే వాటి యందు ఇటు లింగ - అటు స్థూలశరీరముల మధ్య స్థూలత్వము అధికమైన పెత్తనం చెలాయిస్తోంది. అందుచేత తిర్యగాది జంతువులలో 'జడచేతనత్వం' అధికంగా ప్రకటితమౌతోంది.

ఇక స్థావరాదులందు అంతరంగ చైతన్య జ్ఞానం ఉన్నప్పటికీ బాహ్యాన ఘనీభూతమైన అత్యంత జడత్వం ఏర్పడి ఉంటోంది. అనగా చేతనమే స్థావరాదులందు అత్యంత జడత్వం అనుభవిస్తోంది.

దృష్టాంతానికి... ఒక విశాలమైన పాత్రలో నేయి ఉన్నదనుకో. అది మధ్యాహ్నపు ఎండతీవ్రతకు ద్రవీభూతం గాను, కాబట్టి చంచలంగాను, సాయంకాలం శీతలవాయు స్పర్శచే ఘన-ద్రవ సమన్వితం గాను, (కొంత భాగం చంచలంగాను, మరి కొంతభాగం ఘనీభూతంగాను), రాత్రి శీతలత్వం కారణంగా అత్యంత ఘనీభూతమై చంచల రహితంగానూ ఉంటుంది చూచావా?

సముద్రం ఒకచోట చంచలంగా, మరొకచోట కొంత మాత్రమే చంచలంగా, ఇంకొకచోట తరంగరహితమై నిశ్చలంగానూ ఉంటుంది కదా! 'తరంగములున్న చోట సముద్రం, తరంగములు లేనిచోట సముద్రం కాదు'... అని ఎవరైనా అంటున్నారా? అనరు కదా!

అట్లాగే... మహాచైతన్యము దేవతాజీవులందు అత్యుత్తమమైన సుస్పష్టతతోనూ, మానవులందు కొంత స్పష్టతతోను, జంతువులందు కొంత అధికమైన జడత్వముతోను రాళ్ళు - కొండలు - మట్టియందు (స్థావరములందు) అత్యంత జడత్వముతోనూ ఏర్పడి ఉంటోంది. ఆ చైతన్యము యొక్క చంచలమునకు - జడత్వమునకు సంబంధించిన న్యూన - ఆధిక్యతలు ఎట్లా ఉన్నప్పటికీ... ఇదంతయూ చైతన్యమయమే గాని మరింకేమీ కాదు.

❖

కనుక ఓ రామచంద్రా! దేహము మొదలైన రూపములుగా పరిణతి చెందిన పంచతత్వములు 'ప్రాణధారణ' వలన చేష్టితములగుచు చేతనవంతమై ఒప్పుచున్నాయి. ఆ చైతన్యమే శిలాది రూపాలుగా పరిణతి రూపుదాల్చినప్పుడు జడంగా కనిపిస్తోంది. ఈ శిలలు బాహ్యావాయువుల అధీనంలో ఉండి కదలుచు, అంతరాంతరమున చేతనములుగానే ఉన్నాయయ్యా!

ఈ విధంగా స్పర్శ - రూపాది పంచతన్మాత్రల స్వభావవశం చేతనే ఈ అనేక వికల్పములన్నీ చూడబడచున్నాయి. చైతన్యజ్ఞులకు ఇదంతా ప్రశాంత - విస్తార - కల్పనారహిత చైతన్యం చేతనే

సమాక్రమించబడుచున్నట్లు నిత్యానుభవం అవుతోంది. ఇదంతా స్వాత్మ స్వభావమగు చైతన్యము యొక్క విన్యాసచమత్కారమేనని సభికులంతా గ్రహించెదరు గాక!

శ్రీరాముడు: స్వామీ! చైతన్యమే స్వాత్మస్వభావమైయున్నది కదా! అది వికల్పాత్మకం ఎట్లా అవుతోంది?

శ్రీ వసిష్ఠ మహర్షి: చైతన్యం సర్వదా స్వాత్మస్వభావముననే పూర్ణత్వం, అఖండత్వం వహించి ఉన్నది. అయితే అది లీలగా వికల్పాన్ని భావన చేస్తోంది. అదంతా వికల్పం కాదు అని కూడా చెప్పవచ్చు. మన ఈ ఆత్మబోధ కొరకు 'వికల్పం' అని చెప్పుకుంటున్నాం. ఎట్లా అంటావా? శీతలం – ఉష్ణం – హిమం – అగ్ని.... ఇటువంటి విరుద్ధ శబ్దములన్నీ ఒకానొక ముందుగా నిర్ణయించుకొనిన స్థితి నుండి తత్సంబంధంగా చెప్పుకొనుచున్నవే కదా! ఈ చిత్, జడము మొదలైన శబ్దములన్నీ అటువంటివే! వాసనల యొక్క 'అంశ'తో విరుద్ధ వికల్పభావములు కూడుకొని ఉంటున్నాయి. అట్టి విరుద్ధ వికారాలతో పంచభూతాలు స్ఫురిస్తున్నాయి.

వాసనలు లేకపోతే అప్పుడు విరుద్ధ కల్పనలే ఉండవు. ఇది జడం కదా! అది దేవత కదా! ఆ స్వప్నద్రష్ట నిత్యచైతన్య రూపుడైనప్పటికీ, స్వప్నంలో స్థావర-జంగమాది విశేషములుగా ఆ స్వప్నద్రష్టకు అనుభవమవటమే ఈ తతంగమంతటికీ దృష్టాంతం. వచ్చేది దున్నపోతు కదా?' ...అనే అన్ని భావాలకూ వాసనలే అసలు కారణం.

పంచతత్వాలు ఒకప్పుడు స్ఫురిస్తాయి. మరొకప్పుడు స్ఫురించవు. వాక్కుకూడా పంచతత్వాధీనమే కదా! సత్యమగు చైతన్యము త్రికాలాబాధ్యమై ఉన్నది. మహా చైతన్యమునకు చైతన్యము – జడత్వము మొదలైనవి ఆపాదించటం కుదరనే కుదరదు.

అథవా... ఈ పంచతత్వముల స్థితి వల్ల మహాచైతన్యానికి వచ్చే లోపం గాని, అర్థవ్యతిరిక్తం గానీ ఏమీ లేనే లేవు.

బుద్ధిమంతుడైన వాడు అసలీ చిత్తాన్ని అటూ ఇటూ పరుగెత్తేటట్లు చేస్తున్న వాసనల గురించి ఆక్షేపణ చేసుకోవాలి. వాటిని అరికట్టేటందుకు సరైన ఉపాయం కోసం వెదకాలి. ఈ వాసనలు దేవాది శుభరూపములందు ప్రబుద్ధం గాను, జంతు – స్థావరాది జడాధిక రూపాదులందు సుప్తం గాను, సత్త్వ-జడ ప్రవృత్తమగు మానవ రూపములందు మిశ్రమంగాను ఉంటున్నాయి. అయితే మానవ ఉపాధి కర్మనిర్వహణకు ఉత్తమ ప్రదేశం అయి ఉండటం చేత ఇక్కడ ఉత్తమ ప్రయత్నం కలవారు వాసనలను తమ మనోవీథి నుండి కొంతసులభంగా పారద్రోలి వేయ గలుగుచున్నారు.

వాసనలను అనుసరించే ప్రాణాది పంచకం (ప్రాణులు – మనస్సు – బుద్ధి – కర్మేంద్రియాలు – జ్ఞానేంద్రియాలు) యొక్క ఆయా రూపాలు సంతరించుకుని ఉంటున్నాయి. ఎప్పుడైతే ఈ ప్రాణాది పంచకం ఆక్షేపణ చేయబడుతుందో... అప్పుడు వాసనాక్షయమైన రూపఫలం అనుభవ మవుతుంది.

ఓ ముముక్షువులారా! వాసనలను క్షీణింపజేయటం ఆపి స్వభావాదుల గురించి ఎంతగా చింతిస్తే మాత్రం ఏం ప్రయోజనం? ఆకాశంపై ధూళి విసరితే ఎంత ప్రయోజనమో, ఏమి

ప్రయోజనమో – వాసనల గురించి పట్టించుకోకుండా, ఆ వాసనలచే అనుభవమయ్యే స్వభావముల గురించి సుదీర్ఘంగా మాట్లాడుకోవటం అట్టిదేనని నా ఉద్దేశం. ఎవరికి వాసనలు క్షీణిస్తాయో అట్టి వారికి కొండంత సువర్ణరాశులు కూడా ఎండుగడ్డిపరకలతో కూడిన గుట్టమాత్రంగా కనిపిస్తాయి. వారి దృష్టికి ఈ కనబడే స్థావరజంగమ భోగాలు, వివేకసహితమైన దేవలోక భోగాలు, అక్కడి సుందరదేహాలు... ఒక పురుగు జీవితంలాగానే అతిమామూలై కన్పట్టగలవు. ఎప్పుడు? వాసనలు క్షయించినప్పుడు.

❖

ఓ రఘురామా! నీకు మరింత సుస్పష్టపడటానికి గాను మరొక్కసారి చెప్తున్నాను, విను. ఈ ప్రాణులలో... స్థావరాదులు సుషుప్తవాసనలు కలిగి ఉంటున్నాయి. దేవ – మనుష్యాది కొన్ని జాతులు ప్రబుద్ధ వాసనలు కలిగి ఉంటున్నాయి. పశుపక్ష్యాదులేమో కలుషితవాసనలు కలిగి ఉంటున్నాయి. మోక్షగాములగు వారిలో వాసనలు క్షీణిస్తూవస్తున్నాయి. మోక్షస్వరూపులలో వాసనా రాహిత్యం ప్రకాశిస్తోంది.

ఈ స్థావర – జంగమములగు నానావిధ ప్రపంచంలో ఇంతకు మించిన తేడా ఏదీ లేదు.

వాసనావైచిత్ర్యము చేతనే పంచతత్వ సమన్వితములు ఏర్పడుచున్నాయి. ఈ ద్రష్టలంతా తమ సంవిత్తులలో వ్యవహారానికి అనుకూలమైన 1. మనస్సు, బుద్ధి మొదలగు అంతరింద్రియములు, 2. కాళ్ళు – చేతులు మొదలైన బాహ్య ఇంద్రియములు – ఆయా సంజ్ఞలతో కూడినదై పొందుచున్నారు. వాసనా చమత్కారం చేతనే ఈ సర్వ సజీవ, సజడ జాతులలోని ఆయా స్వభావములన్నీ చమత్కారంగా ప్రకటితమౌతున్నాయి. ఆవు, గాడిద మొదలైన తిర్యక్‌జాతి జంతువులకు 4 కాళ్ళు, 2 కొమ్ములు, 1 తోక ఇటువంటి సంజ్ఞలన్నీ వాసనాజాల పర్యవసానమే! మానవులలో కొన్ని సంజ్ఞలు, రాళ్లు మొదలైన స్థావరాలలో వేరొక సంజ్ఞ – ఈ విధంగా తమతమ వాసనలను అనుసరించి వ్యవహార యోగ్యమైన అవయవాది ఆయా సంజ్ఞలు ఏర్పడుచున్నాయి. మధ్య చివరకూడా చంచల జడరూపములై రూపం పొందుచున్నాయి. మరలా అధిష్ఠాన సద్రూపం దృష్ట్యా చూచామనుకో... ఇవన్నీ ఏవీ ఉండిలేవు. శబ్ద-స్పర్శ-రూప-రస-గంధాలన్నీ 'సత్‌చిత్'కు అలంకార మాత్రమై వెలయుచున్నాయి.

శాస్త్రవేత్తలచే ప్రవచించబడే ఒకానొక ఉపమేయం ఇక్కడ ఉదహరిస్తాను–

ఈ 'సృష్టి' అనబడే ఆకాశవృక్షానికి సంకల్పరూప పరమాణువే బీజం. ఇంద్రియములు వాటి పుష్పాలు. విషాయాలు సుగంధం. ఇచ్ఛయే ఆ సుగంధానికి ఆకర్షించబడుచున్న తుమ్మెద. ఈ చంచల ఇంద్రియ క్రియలు ఆ వృక్షముయొక్క గాలివాటు కదలికలు. స్వర్గాది లోకములు అద్దాని శాఖలు. మేరువు మొదలైన పర్వతాలు అద్దాని మూలం. ఆకాశనగల నీలిమేఘాలు ఈ వృక్షమును చుట్టుకొనియున్న లతలు. భూతభవిష్యత్తు వర్తమాన కాలాలలోని ఈ ఈ ఉపాధులన్నీ, ఈ చతుర్విధ ప్రాణులన్నీ ఆ వృక్షముయొక్క పళ్ళు. ఆకాశాది పంచతత్త్వాలు ఈ వృక్షముయొక్క బీజాలు.

శ్రీరాముడు: హే మహర్షీ! శాస్త్ర ప్రవచితమైన మీరు వర్ణిస్తున్న వృక్షం అసలు ఉన్నదెక్కడ?

శ్రీ వసిష్ఠ మహర్షి: (చిరునవ్వు చిందిస్తూ) మంచి ప్రశ్నవేశావు. ఆ మహావృక్షం 'సంసారము' అనే పేరుతో ప్రసిద్ధి కెక్కినదే! ఇక "కేవలం స్వవివేకశూన్యం చేత స్వయంగా ఆత్మయందే ఉద్భవిస్తోంది. కనుక అది ఆత్మయందే ఏర్పడి ఉన్నది. ఓ భూత-వర్తమాన-భవిష్యత్ సర్వజీవులారా! మీరంతా ఆత్మస్వరూపులు మాత్రమే! అంతేగాని సంసారజీవులు కాదు. ఇది ఎంత త్వరగా ఎరిగితే, అనుభవ సమన్వితులైతే... అంత మంచిది!

ఓ రామచంద్రా! నీ వివేకబుద్ధిని సర్వదా నిద్రలేపి ఉంచు. 'జీవ - జడ' ఆదిగా గల వివిధ రూపాలుగా నీకు కనిపిస్తున్నవన్నిటినీ వివేక దృష్టితో ఆత్మగానే చూచావా... సముద్రంలో తరంగాల లాగ సర్వమూ విలయమైపోతాయి. సముద్రంలో ఒకవైపు తరంగాలు పుట్టుచూ, మరొకవైపు లయిస్తూ ఉంటాయి కదా! అలాగే బహిర్ముఖదృష్టి కలవారికి ఇవన్నీ జడత్వ భావనచే ఉన్నాయి. బహిర్ముఖ భావనచే పొందబడుచున్నాయి. అదే సమయంలో... అంతర్ముఖావలోకితమైన దృష్టి కలవారి పట్ల వివేకోదయకారణంగా స్వయంగా శమిస్తున్నాయి. వాసనా ప్రాప్తి రాహిత్యం సంపాదించు కున్న మరుక్షణం ఇక నీవీ సంసారములో స్థితియే పొందవు. వాసనలు లేనివారికి జగత్తుగా కనిపించేదంతా "స్వస్వరూపాంతరంగం" గానే ఆస్వాదించబడుతోంది.

వాసనలు కలిగి ఉన్న జీవులు అనంతకాలం ఈ వస్తుసమన్విత జగత్తులో పరిభ్రమిస్తూనే ఉంటారు. ఇక దిగులు దేనికి చెప్పు?... నీ వివేకాన్ని మరల మరల నిదుర లేపు. అదే అన్నిటికీ పరమౌషధం. తద్వారా వాసనలు జయించు.

❖❖❖

9. ఆధి - వ్యాధులు

శ్రీ వసిష్ఠ మహర్షి: నాయనా! రామచంద్రా! ఇప్పుడు మనం కుండలిని విషయమై పరిశీలన కొనసాగిద్దాం.

ఈ స్థూలదేహంలో మూలాధార ప్రదేశంలో, కుండలిని యందలి లోభాగంలో ప్రాణాది పంచకం యొక్క బీజం ప్రాణవాయు రూపంలో సదా స్ఫురిస్తూ ఉంటుంది. అట్టి స్ఫురణ ప్రభావంచే కుండలిని ప్రాణరూపంలో స్ఫురిస్తూ ప్రాణవాయుధర్మం చేత మరియు నిజధర్మం చేత మూడు రూపాలుగా పరికల్పించబడుతోంది - 1.స్పందనము, 2.స్పర్శ, 3.సంవిత్తు

ఈ కుండలినీ శక్తియే...

2. ఎరుక కావించటంచేత 'కళ' అని పిలుస్తున్నారు.
3. చేతితం ఒనర్చటంచేత చిత్తము అంటున్నాం.
4. జీవించటాన్ని ప్రసాదించటంచేత జీవము అని చెప్పుచున్నాం.
5. మననం చేయటం చేత మనస్సు అని అభివర్ణిస్తున్నారు.
6. సంకల్పించటంచేత సంకల్పము అని ప్రవచిస్తున్నారు.

7. అదియే అహంకారము యొక్క రూపమునకు ప్రభవస్థానం.

8. తనయందు బోధ కలిగి ఉండుటచే 'బుద్ధి' అనిపించుకుంటోంది.

ఈ విధంగా కుండలినీ శక్తిని పుర్యష్టకం అని కూడా పిలుస్తున్నారు. ఈ కుండలినీ శక్తి దేహములో అత్యుత్తమ జీవస్థానం అయున్నది.

❖

ఈ కుండలిని అధోదిశలో ఉన్నప్పుడు అపాన రూపంగా ఉంటుంది. మధ్యప్రదేశంలో ఎల్లప్పుడు సమానరూపంలో నిశ్చలంగా ఉంటుంది. అపాన – సమానములచే పరిపోషింపబడు చున్నప్పటికీ దీనికి ఊర్ధ్వవృత్తి ఉదానరూపంగా ఉంటుంది.

ఈ విధంగా ఇది దేహంలో స్వస్థతను పరిపోషిస్తూ ఉంటుంది. కుండలిని కనుక సమానవృత్తి ధరించకపోతే దేహములోని జీవసంవిత్తు సర్వప్రయత్నముల చేత అధోమార్గం గుండా బైటికి పోగలదు. అలా బలంగా బైటకు పోవటం చేత ఆ దేహము మృత్యువునకు లోను కాగలదు.

ప్రాణా – అపాన వృత్తిని నిరోధించటం ద్వారా కుండలిని యొక్క ఊర్ధ్వ – అధోగమనములను సర్వదా త్యజించి, 'సమానవృత్తి' యొక్క ఆశ్రయం చేత జీవసంవిత్తు ఆత్మయందు నెలకొని ఉంటే... అప్పుడు ఆ ప్రాణి యొక్క సమస్త వ్యాధులూ నశిస్తాయి. ఆ జీవి మృత్యువును కూడా జయించివేయగల శక్తిని కలిగి ఉంటాడు.

❖

ఒక్కొక్కసారి సామాన్య నాడుల యొక్క వ్యాపార దోషం చేత శరీరంలో ప్రవేశించిన అన్నరసం పచనం కాదు. అప్పుడు దేహంలో సామాన్య రోగాలు ఉత్పన్నమౌతాయి. క్రమంగా ప్రధాన నాడుల వ్యాపార భాగంలో ప్రధానరోగాలు జనిస్తాయి.

శ్రీరాముడు: స్వామీ! ఈ జీవునికి ఆధి – వ్యాధుల వలననే సర్వదుఃఖాలు వచ్చి పడుచున్నాయని అంటూ ఉంటారు కదా! అవి రెండూ ఎలా ఉత్పన్నమౌతున్నాయి? ఎట్లా తొలగుతాయి?

శ్రీ వసిష్ఠ మహర్షి: ఔను. ఆధి – వ్యాధులు రెండూ జీవుని దుఃఖమునకు కారణభూతములే. వాటి యొక్క నివృత్తి చేత మాత్రమే జీవునికి 'సుఖం' అనేది లభ్యపడేది. జ్ఞాన ప్రభావం చేత అవి రెండూ సమూలంగా నశించాయా... అప్పుడది 'మోక్షము' అని అంటున్నాం. అవి రెండూ ఒకానొకప్పుడు ఒకదాని కొకటి కారణమై ఈ శరీరంలోనే పుట్టుచున్నాయి. ఒక్కొక్కప్పుడు ఒక్కొక్కటి తీవ్రతరమై ఉంటోంది. చాలా సందర్భాలలో ఈ రెండూ కూడియే ఉంటున్నాయి. అవి ఒకసారి క్రమక్రమంగాను, మరొకసారి అకస్మాత్తుగాను ఉద్భవిస్తున్నాయి. అజ్ఞానమే రెండిటియొక్క కారణం.

"వ్యాధి" - శరీరమునకు సంబంధించిన దుఃఖమును 'వ్యాధి' అంటారు. శరీరవ్యాధులు ఎట్లా ఉత్పన్నమౌతున్నాయో విను!

1. కోరికలు మరల మరల స్ఫురించటం చేత.

2. చిత్తము అనుక్షణం అతిచంచలమై ఏమాత్రం జయింపబడకపోవటంచేత.

3. దోషభూయిష్ఠమైన ఆహారం భుజించటంచేత.
4. దుర్వాసన, మురికి, తదితర దోషములతో కూడిన స్థలంలో నివసించటంచేత.
5. కల్మషములతో కూడిన వాయువులను చిరకాలం సేవించటంచేత.
6. అయుక్తమైన కాలములో వ్యవహరించటంచేత.

(ఉదా:వేళ కాని వేళ (లేక) అత్యంత ఆలస్యంగా భుజించటం, మిట్టమధ్యాహ్నం వంటి అయుక్తమైన సమయాలలో నిద్రించటం, ఏదో చూస్తూనో, వింటూనో, జూదం వంటి ఆటలు ఆడుతూ అనేక గంటలుగా నిద్రపోక పోవటం మొదలైనవి.)

7. దురలవాట్లకు ప్రోత్సాహం లభించే దుర్జనసాంగత్యం చేయటంచేత.
8. దుష్టభావాలు భావన చేయటం చేత. (కామ, క్రోధ, అసూయా, ద్వేషాదులు)
9. అన్నరసం ప్రవేశించని కారణంగా నాడీరంధ్రాలు బలహీనపడటం, క్షీణించటం వలన.
10. అన్నరస ప్రవేశం అవసరమైన దాని కంటే ద్విగుణీకృతంగా నాడీరంధ్రములను ప్రపూర్ణం చేయటం చేతనూ, తద్వారా ఆ అన్నరసం దీర్ఘకాలం నాడీ రంధ్రాలలో వేచి ఉండటంచేత.
11. కఫ - పిత్తాది ప్రకోపం కారణంగా ప్రాణములు వ్యాకులమవటంచేత.
12. దెబ్బలు మొదలైనవి తగలటంచేత అవయవాలు, సున్నితవిభాగాలు శిథిలమవటంచేత

...ఇటువంటి ఆయా అనేక దోషాల చేత అస్వస్థత సంభవిస్తోంది. వ్యాధి ఈ దేహం యొక్క ఆకారాన్నే మార్చి దౌర్బల్యంగానూ, అపక్రమమైన ఆకారంగానూ తయారుచేసి వేయగలదు.

పూర్వజన్మ యొక్క (లేక) ఈ జన్మ యొక్క శుభ-అశుభ బుద్ధులలో ఏది అధికంగా ఉంటుందో అది 'ఈ వ్యాధి' యొక్క క్రమమును, సుదీర్ఘత్వాదులను నియోగిస్తూ ఉంటుంది.

ఈ విధంగా భూత పంచకమైన ఈ దేహంలో ప్రవేశించే పదార్థ జాలముల ఉచిత - అనుచితములను అనుసరించి ఈ దేహంలోనే వ్యాధి జనిస్తోంది. రసవిభాగముననుసరించి ఉచితము, అధర్వణవేద - ఆయుర్వేదాది శాస్త్ర ప్రవచితము అయిన ఆయా పదార్థముల సేవనం చేత 'వ్యాధి' అనునది ఉపశమించటం జరుగగలదు. ఆహార పరిశుభ్రత, సమయాసమయ విచక్షణ, కాల నియమానుసారమైన లంఖణం మొదలైనవి అర్హమైనంతగా ఆచరించే వారి శరీరంలో ప్రవేశించే ఆహారం అతిత్వరగా పచనమైపోతుంది. అట్లా కాకుండా దేహంలో దీర్ఘకాలం ఆహార పదార్థాలు అపచన స్థితిలో ఉంటే రోగకారకములౌతాయి.

'వ్యాధి' అనేది రెండు విధములు -

1. సామాన్య వ్యాధి - ఆకలి, దప్పిక... ఇట్టి వ్యవహారములతో ఉత్పన్నమయ్యేది 'సామాన్యము' అని అంటాం. ఇష్ట - అనుకూల వస్తువుల ప్రాప్తిచే ఆకలి, దాహము మొదలైనవాటి వల్ల పుడుతున్న వ్యవహారిక వ్యాధులు నశిస్తాయి.

2. విరస వ్యాధి - దేహంలోని వివిధ రసముల సంచలనము, క్రియా విశేషంవలన శరీరం మనగలుగుతోంది. అట్టి రసముల ఉత్పత్తి కుంటుపడటం చేతనో, మిక్కిలిగా ఉత్పత్తి అవటం

చేతనో దేహంలోని రక్త-మాంస-ప్రేగు-బొమికలు తమ సాధారణ క్రియాతత్త్వాన్ని కోల్పోవటమో, విపరీత ప్రవర్తనమో జరుగుచున్నప్పుడు ఏర్పడు వ్యాధులను 'విరసవ్యాధి' అంటారు.

ఆహారం వలననే ఈ దేహం పరిపుష్టి చెందుతోంది కదా! మరల ఆహారము యొక్క అనియమితాదుల వలననే దేహమునకు సామాన్య-విరసాది వ్యాధులు వాటిల్లుచున్నాయి. అయితే సృష్టి కర్త ఆయా వివిధ రసములను ప్రకృతియందు (వృక్షాలందు వ్రేళ్ళయందు, ఫలములందు, ఆకులందు) పొందుపరచారు. అట్టి రసమయ పదార్థముల వినియోగముచే దేహము యొక్క రస సామాన్యత కాపాడబడి వ్యాధి చికిత్స పొందగలదు. అధర్వణవేదం, ఆయుర్వేదంవంటి గ్రంథములలో వాటిని ఉపయోగించు వివరణలు పొందబరచబడి ఉన్నాయి. వైద్యులు చేసే ఆయా చికిత్సా విధానాలచే వ్యాధులు నయమగుచున్నాయి. అట్లాగే మంత్రం, పవిత్ర తీర్థములలో స్నానం చేయటం, ఓషధులున్న ప్రదేశంలో నివసించి అక్కడి గాలి పీల్చడం - ఇటువంటివి దేహారోగ్యాన్ని కాపాడు చున్నాయి. ఇవన్నీ ఆశ్రమ విద్యార్జన సమయంలో నీకు బోధింపబడియే ఉన్నాయి కదా! సాధకుడు తన శరీరంలో సరసము కొనసాగేటట్లు, విరసము ఏర్పడకుండానూ చూచుకోవటం ఉచితం.

ఆధి - వాసనలు కారణంగా పుట్టే మనస్సుకు సంబంధించిన బంధాన్ని 'ఆధి' అంటారు. ఆధికి ముఖ్యకారణం అజ్ఞానముచే అభ్యాసవశంగా ఏర్పడిన సాంసారిక వాసనా జాలములే! తత్త్వ జ్ఞానం వల్ల మాత్రమే అజ్ఞానం తొలగుతుంది.

ముఖ్యసేవకుడు అంతఃపురాన్ని కాపాడుచున్నట్లు చిత్తమే ఈ శరీరాన్ని పర్యవేక్షిస్తూ, కాపాడు తోంది. అయితే తత్త్వజ్ఞానం, ఇంద్రియనిగ్రహం లేనప్పుడు నిశ్చలవాయువు వంటి ఈ చిత్తం తన స్థిరత్వాన్ని సూక్ష్మత్వాన్ని కోల్పోయి చంచలాన్ని ఆశ్రయిస్తోంది. "ఇది పొందాలి, అది పొందలేదు, ఇదే ఇష్టం, ఈ రూపం, ఆ శబ్దం, ఈ కథనం, ఆ దూషణం" - ఇలా రాగద్వేషాలచే జడత్వం, చంచలత్వం కలిగి ఉంటోంది. ఇంకేముంది? వర్షాకాలపు మంచులాగా మహామోహ ప్రదాలగు మానసిక రోగాలు (ఆధులు) ఉత్పన్నమౌతున్నాయి.

జన్మాది వికారాలకు కారణమౌతున్నదానిని "సారము" అని అంటారు. సారం వలన మానసిక చాంచల్య కారణంగా కోపం, దుఃఖం, నిరుత్సాహం, దైన్యం, భయం, అనునిత్య చంచలత్వం, ఆవేశ కావేషాలతో కూడిన మనో చపలత్వం (పిచ్చి), దుష్టమైన సంకుచితత్వం - ఇవన్నీ ఏర్పడు చున్నాయి. ఇవన్నీ దేహంపై దుష్ప్రభావం చూపించి విరసత్వానికి క్రమంగానో, ఒక్కసారిగానో దారి తీస్తున్నాయి. మానసిక వ్యాధి నశిస్తే దానికి సంబంధించిన మానసిక వికారాలూ (కోప - తాపాదులు) నశిస్తాయి.

ఆత్మజ్ఞానం లేకపోతే సారం నశించదు. "అది త్రాడు మాత్రమే" అని పూర్తిగా తెలియకపోతే పాము యొక్క భ్రాంతి ఎట్లా నశిస్తుందో చెప్పు?... వర్షాకాలపు నదీ ప్రవాహం ఒడ్డున ఉన్న వృక్షాలను ఏ విధంగా సమూలంగా నశింప జేస్తుందో అట్లాగే ఆత్మజ్ఞాన బలం పుంజుకున్నప్పుడు ఈ జన్మాది వికారరూపమైన ఆధి క్షయిస్తుంది. అప్పుడాజీవుడు ఆధి-వ్యాధులకు అతీత్వం సంతరించు కుంటాడు. ఆధి-వ్యాధుల విలాసం సమూలంగా నశించబడుతుంది.

10. ఆధి - వ్యాధుల ఉపశమనోపాయాలు

శ్రీరాముడు: హే జగద్గురూ! 'ఆధి' చేత 'వ్యాధి' ఉత్పన్నం కాగలదనునది యుక్తి యుక్తమే. అట్లాగే ఆయా రససమన్వితములగు ప్రకృతిసిద్ధమైన ఓషధులచే దేహ సమరసత్వము పునఃప్రతిష్ఠించబడి, తద్వారా వ్యాధులు ఉపశమించగలవనేది దైనందికానుభవమే.

అయితే నా సందేహం వినండి. వ్యాధి అనేది ఔషధాల చేత ఉపశమిస్తుంది కాని, 'మంత్రాలు, పుణ్యాలు, తీర్థస్నానాలు' – వల్ల ఎలా ఉపశమిస్తుందో మా బోధ కొరకై వివరించండి.

శ్రీవసిష్ఠ మహర్షి: విను – మానసిక వ్యాధుల చేత చిత్తం వ్యాకులమైనప్పుడు ఈ శరీరం కూడా వ్యాకులత్వం పొందుతుంది. ఉదాహరణకు తీవ్రకోపంతో ఉన్న వ్యక్తి తన ఎదురుగా ఉన్నవాటిని యుక్తాయుక్తమైన అవగాహనతో చూడలేడు. అలాగే బాణం దెబ్బ తిన్న జింక తన ముందుగా ఉన్న మార్గం వదలి ఎటో పిచ్చిగా పరుగులు తీస్తుంది. మానసిక వ్యాధిగ్రస్తుడు తనను సమీపించిన బంధువులను గుర్తించలేక ఏవో కుమార్గముల వైపు, కుశబ్దముల ఉచ్చారణతో కదలిపోతూ ఉంటాడు.

సెలయేటి నీరు ఒక క్రమంగా ప్రవహిస్తూ ఉండగా, ఒక ఏనుగు ఏరులో ప్రవేశించిందనుకో ...అప్పుడు సూటిగా ప్రవహిస్తున్న ఏటిజలం ఒడ్డువైపుగా కదులుతుంది కదా! అలాగే మానసిక వ్యాధులచే వ్యాకులమైన ప్రాణవాయువు తన సమత్వాన్ని వదలి అన్యమార్గంగా ప్రవహిస్తుంది. అది అసమ్యక్ స్థితి (Inequal placement) పొందుతుంది. సర్వసమదృష్టి లేని రాజు వలన ఆ పరిపాలనకు సంబంధించిన ప్రజాధర్మాలు, సర్వ సంక్షేమ కార్యక్రమాలూ కుంటువడతాయి చూచావా? అట్లాగే ప్రాణవాయువు గనుక అపసవ్యస్థితిలో ప్రవహిస్తూ ఉంటే, నాడులు విషమం పొందుతాయి. అప్పుడీ శరీరం విహ్వలమౌతుంది. చెదరగొట్టబడిన నీరు విధివిధానం లేకుండా చెదరుమదురై పోతుంది చూచావా? మామూలుగా ప్రాణవాయువుచే నింపబడి స్పందిస్తున్న నవనాడులూ, తదితర ఉపనాడులూ కొన్నిచోట్ల అధికంగానూ, మరికొన్ని చోట్ల అల్పంగానూ ప్రాణవాయువును పొందుతాయి. ప్రాణ సంచారం సరిగ్గా లేకపోతే భుజించబడిన ఆహారములు అల్పజీర్ణత్వంగాని, అజీర్ణత్వంగాని, అతి జీర్ణత్వంగాని పొందుతాయి.

❖

ప్రవాహానుకూలంగా వదలిపెట్టబడిన బంతి సుదీర్ఘంగా ప్రక్కవాటు పొందకుండా వెళ్తుంది కదా! అట్లాగే ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానము లని పిలువబడే పంచప్రాణాలలో 'సమాన ప్రాణవాయువు'చే భుజింపబడిన అన్నం చక్కగా రసంగా మార్చబడి శరీరమంతటా ఆయా స్థానములకు సమాన ప్రాణంచే చేర్చబడుతుంది. మనస్సునందు ఉద్వేగం ఉండి ఉన్నప్పుడు శరీరంలో ప్రవేశించిన అన్నం కొన్నిచోట్ల నిరోధం పొందుతూ ఉంటుంది. అట్లు అంతర్గతంగా అధిక సమయం ఉండిపోయిన అరసపరిణామమైన అన్నము ధాతువైషమ్యంగా పరిణమించి స్వభావవశంగా దేహం నందు వ్యాధిత్వం పెంపొందింపజేస్తుంది. దేహాన్ని పెద్దపొట్ట మొదలైన కురూపాలను కూడా

కలుగ జేయగలదు. అట్టి ధాతువైషమ్యం మనస్సును వైషమ్యపరచుటలో మరింత వైఖరి చూపుతుంది. ఈ విధంగా మానసిక వ్యాకులత చేత వ్యాధి, వ్యాధి చేత మరింత మానసిక వ్యాకులత ఏర్పడుతూ ఉంటాయి. సర్వసమ 'భావన' ఆశ్రయించనంతకాలం మానసిక వ్యాకులతలకు అంతూ పొంతూ ఉండవు. ఈ విధంగా ...ఆధి చేత వ్యాధి సంభవిస్తోంది. ఆధి లేకపోతే వ్యాధి నశిస్తోంది.

మంత్రములు - ఇక నీ వడిగిన ప్రశ్నయగు 'మంత్రం' విషయానికి వద్దాం.

బీజాత్మకములైన మంత్రవర్ణములు ఆ సాధకుని భావ – సత్సంకల్పావేశమును అనుసరించి రోగ నివారణ నిర్వర్తించగలవు. శక్తికి – భావనకు పరస్పర సంబంధమున్నది. ప్రాణముగాని, కుండలిని గాని భావేకాగ్రత చేతనే కదా సంచయము పొంది ఉన్నాయి! వాయువు, అగ్ని, భూ, జల, ఆకాశ – పంచభూతత్త్వం బీజాక్షరోచ్చారణతో కూడిన భావసమన్వితమైన ఆరాధనచే మంత్రద్రష్టకు కార్యనిర్వహణార్థం సహకరించగలవు. ఈ చరాచర సృష్టియంతా సమష్టితత్త్వమగు హిరణ్యగర్భుని భావనాకల్పనయేనని మనం ఇతఃపూర్వం చాలాసార్లు చెప్పుకున్నాం కదా! ఈ మనస్సు కూడా భావనారూపమే!

అట్లాగే శుద్ధమైనట్టి సేవాభావము – పవిత్ర హృదయముతో కూడిన 'సాధుసేవ' అనే క్రియ మనస్సుకు సుఖత్వం, నిర్మలత్వం ప్రసాదించగలదు. తద్వారా తదితరములైన ఆధి, వ్యాధుల శమనము వంటి శుభప్రయోజనములన్నీ కలుగుతాయి.

అంతఃకరణశుద్ధి చేత ప్రాణవాయువు సక్రమంగా ప్రవహిస్తోంది. రాగ, ద్వేష, లోభముల వంటి వ్యతిరిక్తతత్త్వముల వల్ల అంతఃకరణం అపరిశుద్ధమై దేహం నందలి ప్రాణవాయు ప్రసరణమును అపక్రమం చేస్తోంది.

సాత్వికములగు శాస్త్రప్రవచిత మంత్రోచ్చారణ, భక్తి, శాంతం వంటి అనుకూలతత్త్వాలు అధికమగుచుండుట చేత అంతఃకరణశుద్ధి ప్రాప్తించగలదు.

పూర్ణచంద్రుడు ఉదయిస్తుంటే ప్రపంచం ఎట్లా ప్రకాశిస్తూ ఉంటుందో, అట్లా శుద్ధ చిత్తంలో ఆనందం వెల్లివిరుస్తూ ఉంటుంది. అంతఃకరణ శుద్ధిచే దేహమంతా ప్రాణవాయువులు సక్రమంగా ప్రవహిస్తూ ఉండగా తద్వారా అన్నం చక్కగా పచనమొనర్చబడి సమస్త వ్యాధులు నశిస్తాయి. మనస్సు నందు సంతోషం–ఉత్సాహం–హాస్యం లను పరిపోషించుకుంటూ ఉంటే, భౌతిక దేహం కూడా సమప్రాణ ప్రసరణ పొందుచున్నదై ఆయురారోగ్యాలను పొందుతూ ఉంటుంది.

ఇవి నన్ను పవిత్రం చేస్తాయి ...అను సాధకుని ఆంతరంగికమైన భావనయే అతనికి సహకారికమగుచున్నది.

ఈ విధంగా కుండలినీ కథా ప్రసంగం సందర్భంలో ఆధి – వ్యాధులు ఏ విధంగా ఉత్పత్తి అవుతున్నాయో, అవి ఏ విధంగా ఉపవమనములు పొందుచున్నాయో చెప్పుకున్నాం. ఇప్పుడు ప్రస్తుత ప్రసంగమైన కుండలినికి వద్దాం.

❖❖❖

11. యోగశక్తులు

శ్రీ వసిష్ఠ మహర్షి: సుగంధమునకు ఆధారమేమిటి? పుష్పమే కదా? అట్లాగే 'పుర్యష్టకము' అను పేరు గల జీవునకు ప్రాణము అను పేరు గల కుండలినియే ఆధారమైయున్నదని గ్రహించు. ఈ కుండలిని యందు పూరకము అనే ప్రాణాభ్యాసముచే ఎప్పుడైతే జీవుడు సంస్థితుడౌతాడో అప్పుడాతడు మేరువు వంటి స్థిరత్వం పొందుతాడు. ఈ శరీరం యొక్క గురుత్వం సిద్ధిస్తుంది. ఎప్పుడైతే మూలాధారం నుండి బ్రహ్మరంధ్రం వరకు శరీరమంతా తిన్నగా గాలి నిలుపబడుతుందో... అప్పుడు ప్రాణవాయువు యొక్క ఆకర్షణ వలన కుండలినీ సంవిత్తు పైకి పంపబడుతుంది. అప్పుడు ఆ దేహికి శారీరక - మానసిక పరిశ్రమ సహించ గల ఓర్పు, నేర్పులు ప్రాప్తిస్తాయి. ప్రాణవాయువు యొక్క ఆకర్షణ చేత కుండలిని కఱ్ఱ వలె దీర్ఘత్వం పొందుతుంది. నాడులన్నిటినీ తనతో తీసుకొనుచూ దేహాన్ని త్రాళ్ళచే బంధించబడిన పూతీగ వలె శీఘ్రంగా పైకి పోవుచున్నది. బావి యొక్క లోతు నుండి బయటకు లాగబడుచున్న బొక్కెన తనతో బాటు నీటిని కూడా పైకి తీసుకువస్తుంది చూచావా? ఆ విధంగా వాయువుతో పూరించి, నవరంధ్రాలను మూసివేసి, అప్పుడీ శరీరాన్ని కూడా "కుండలినీ సంవిత్తు" పైకి తీసుకుపోగలదు. ఇదియే యోగి యొక్క ఆకాశగమనం.

యోగులైన వారి (కుండలినీ సంవిత్తు యొక్క ఊర్ధ్వగమనాన్ని అభ్యసించిన వారి) ఆకాశగమనం యొక్క అభ్యాసం చేత ఊర్ధ్వ దిశను పొందుచున్నారు. అభ్యాసరహితులగు సామాన్య జనులకు ఇది ఇంద్రపదవి పొందినంతగా తోచుచున్నది.

అశరీరులగు సిద్ధుల దర్శనం - ఆకాశమున అశరీరులై సంచరించు సిద్ధులను కూడా దర్శించ వచ్చు. అది ఎట్లాగో చెబుతాను, విను-

'ఇతర నాడీ వ్యాపార నిరోధకరూపం' అయినట్టి 'రేచక ప్రాణాయామ ప్రయోగం' యొక్క సమయ-సందర్భాలలో ప్రాణవాయువులను కుండలినీ శక్తిచే బ్రహ్మనాడి యందు (సుషుమ్నానాడి యందు) ప్రవహింపజేయవచ్చు. అప్పుడు శిరస్సు యొక్క రెండు కవాటాల సంధిరూపమైన కవాట ప్రదేశానికి (సహస్రారమునకు) 12 అంగుళముల వెలుపల ఉన్న షోడశాంత స్థానమున ముహూర్త కాలం (12 seconds) ఉంటే అప్పుడు ఆకాశంలో సంచరించే సిద్ధపురుషుల దర్శనం అవుతుంది.

శ్రీరాముడు: మహర్షీ! ఈ ఇంద్రియాలు, వీటి పట్ల గల దృష్టి దివ్యత్వం పొందకుండానే షోడశాంత స్థానంలో ప్రాణధారణ ఒనర్చినంతమాత్రం చేత సిద్ధుల దర్శనం కాదేమోకదా? ఈ విషయం దయచేసి వివరించండి.

శ్రీ వసిష్ఠ మహర్షి: అవును. నీవు చెప్పింది నిజమే. భూమిపై చరించే జనులు మలినమైన అజ్ఞానముచే ఆశ్రితమైన ఇంద్రియధ్యాసలు ఉన్నంత వరకూ వాయురూపులైన (ఆకాశంలో సంచరించే) సిద్ధులను చూడలేరు. అయితే, విజ్ఞాన - యోగాభ్యాసములచే శుద్ధమైనట్టి మనస్సుకు ఒకానొక అధికారత్వం ప్రాప్తిస్తోంది. అట్టి మనస్సుచే సుదూర దర్శనం చేయగల బుద్ధి పొందబడుతుంది. అట్లాగే నిర్మల

సునిశిత మనోబుద్ధులచే ఆకాశంలో సంచరించే సిద్ధులను తప్పక చూడవచ్చు. అంతేకాదు. ఆ సిద్ధులు స్వప్న సదృశ్యంగా జనులకు వారి అభీష్టములను కూడా నెరవేరుస్తూ ఉంటారు. స్వప్నదర్శనం ఎట్లా ఉంటుందో ఆ సిద్ధుల దర్శనం కూడా అట్లాగే ఉంటుంది. అయితే ఆ సిద్ధులు కరుణతో ప్రసాదించే వర–దానాది ఫలాలు మాత్రం భౌతికప్రపంచంలో సిద్ధించగలుగుతాయి. ఇదే ఇందులోని విశేషం.

పరకాయ ప్రవేశం - రేచకాభ్యాస రూపమైన యుక్తి చేత క్రమంగా ముఖానికి 12 అంగుళాల వెలుపల ప్రాణవాయువును నిలుపవచ్చు. అట్లు నిలపటం చిరకాలం అభ్యసిస్తూ వస్తే మరొక శరీరంలో ప్రవేశించ గల ప్రావీణ్యత, అది కోరుకొను వారికి లభించగలదు. ఇవన్నీ సందర్భం వచ్చింది కనుక పురశ్చరణగా చెప్పటం జరుగుతోంది సుమా!

❖

శ్రీరాముడు: శిష్యుడు శరణువేడుతూ ఒక వేళ అల్పవిషయములకు సంబంధించిన ప్రశ్నలు వేసినప్పటికీ తమవంటి జగద్గురువులు దయచూపుతారేగాని, కోపగించరు కదా!

ఈ మాయామయ ప్రపంచం స్వతఃగా లేనేలేదని, దృష్టిని బట్టి మాత్రమే అనేక రీతులుగా స్ఫురిస్తోందని అందుచేత ఇదంతా అనియతా స్వభావం కలిగియున్నదని మీరు ఈ సంవాద సమయంలో అనేకసార్లు మాకు ఉద్బోధించటం జరిగింది. అయితే, ఈ ప్రపంచంలో పదార్థములు – తదితరములు నియతాబద్ధమై ఉంటున్నాయి. ఇదంతా ఎట్లా సందర్భపడుతోంది? ఈ ప్రశ్న సందర్భానుచిత మనుకుంటే మరొక్కసారి "స్వభావ నియతి" గురించి కొన్ని విశేషాలు ప్రస్తావించండి.

శ్రీవసిష్ఠ మహర్షి: ఓ రామచంద్రా! సత్యసంకల్పుడైన ఆ పరమాత్మ నిర్ణయమైన 'స్వభావం' లేక 'నియతి' అనే శక్తి కల్పాదియందు ఏ విధంగా స్ఫురిస్తోందో... అదే కల్పాంతం వరకు ఉంటోంది.

అసలు, అవిద్య అవస్తువే కదా! అట్టి నియతి యందు కొన్ని విశేషమైన తత్త్వాలు ప్రకటనమౌతూ ఉంటాయి. ఇది ఇట్లా ఉండగా, శరద్రుతువులో కొన్ని ప్రదేశాలలో వసంత ఋతుపుష్పాలు ఫలిస్తూ ఉంటాయి చూచావా! వస్తు శక్తి కూడా అక్కడక్కడ కొంత భిన్నత్వంతో గోచరిస్తూ ఉంటుంది.

ఏకంగా, అనేకంగా, నియతస్వభావంగా, అనియతక్వ భావంగా – కన్పట్టుచున్న ఈ జగత్తంతా నిజానికి బ్రహ్మరూపం మాత్రమే అయున్నది. జీవుల కర్మలు, ఆయా ఫలభోగ కార్యక్రమముల కొరకు మాత్రమే బ్రహ్మము యొక్క "అజ్ఞాన – నియతిల విభాగం" కొంతకాలం వరకు నియతస్థితిని ధరించి విజృంభిస్తోంది.

❖

శ్రీరాముడు: స్వామీ! మరొక్క విషయం. యోగులు సూక్ష్మరంధ్రం గుండా ప్రయాణించటానికి అణుత్వాన్ని, ఆకాశమునంతా నింపివేయటానికి బృహతత్వమును అదే దేహమునకు సిద్ధింపజేసుకో గలుగుచున్నారు! అట్టి సూక్ష్మ – సువిశాలత్వములు ఒకే దేహమునకు ఎట్లా ఏర్పడుచున్నాయి?

❖❖❖

12. చైతన్య - జడముల పరస్పర హేతుత్వం

శ్రీ వసిష్ఠ మహర్షి: ఓ రామచంద్రా! దేహమునకు సంబంధించిన సూక్ష్మ – విస్తీర్ణయోగముల గురించి క్రమంగా చెప్పుకుందాం. ముందుగా విజ్ఞాన – జడ విజ్ఞేయాలకు, సత్ – అసత్‌లకు సంజ్ఞలైనట్టి 1.అగ్ని–శీతలాలు, 2. సూర్య–చంద్రతత్త్వాలు, 3.వెలుగు–చీకట్లు, 4. చైతన్య–జడములు …ఒకదానితో మరొకటి కార్యకారణత్వం ఎట్లా కలిగి ఉంటున్నాయో, కొన్ని శాస్త్ర ప్రతిపాదిత విషయాలు ప్రస్తావిస్తాను విను, ఆ ప్రమాణములు జడ – చైతన్య 'పరస్పర కార్యకారణ సంబంధం' ఎరుగటానికి సహకరిస్తాయి.

జఠరాగ్ని - దేహనిర్మాణం (అగ్ని - స్థూలం) - 'కొయ్య, అంపము' – ఈ రెండిటి యొక్క సంఘర్షణల వలన కొయ్య రెండుభాగాలుగా అగుచుండగా నిప్పు రవ్వలు జనించి పైకి – క్రిందికి ప్రసరిస్తున్నాయి చూచావా? అట్లాగే సౌమ్య స్వరూపమగు ప్రాణవాయువులు దేహంలో సంచరిస్తూ ఉండగా వాటి ఊర్ధ్వ–అధో గమనాల సంఘర్షణచే (ప్రాణ–అపానాలు ఒకదానితో మరొకటి తాకుచుండుటచే) స్వభావసిద్ధంగా జఠరాగ్ని ఉత్పన్నమౌతోంది. ఈ జఠరాగ్ని 'దేహం' అనే యంత్రంలో మొట్టమొదటగా ఉదరభాగంలో ఉత్పన్నమౌతోంది. ఉదరభాగమున నాభికి పైన, క్రింద కలుస్తూ ఉండే రెండు తోలు తిత్తులచే నిర్మితమైన స్థూలమాంస విభాగంలో ఈ జఠరాగ్ని పుడుతోంది. ఆ స్థూలమాంస విభాగం – క్రింద గల జలం చేత, పైన ప్రసరిస్తున్న వాయువు చేత – కదలడం జరుగుతోంది. గాలిచే పొదరిల్లు కదలించబడుచున్నట్లుగా, అది వాసనలచే కదిలించబడుతోంది.

ఆ స్థూలమాంస విభాగం యొక్క క్రిందభాగంలో 'మూలాధారం' అను నిజస్థానమున 'కుండలిని'… ముత్యపు పెట్టెలో ముత్యాలహారం వలె…శక్తి–ప్రజ్ఞ తత్త్వంగా వెలయుచున్నది.

ఈ కుండలిని సర్వులకు ప్రాణప్రదాత అయి ఉండటం చేత ఇది అత్యంత పవిత్రమైనది. అది తిరుగుచున్న రుద్రాక్షల వలె ఎప్పటికప్పుడు మూలాధారం వద్ద సరసరలాడుతూ ఉంటుంది. కఱ్ఱతో కొట్టబడిన ఆడత్రాచుపాము వలె అది ఎల్లప్పుడూ ఊర్ధ్వముఖమునకు పరివర్తనశీలమై ఉంటోంది. ప్రాణ, అపానముల సంఘర్షణకు, జఠరాగ్ని యొక్క ఉత్పత్తికి ఈ కుండలినియే ప్రేరణ కారణమై ఉన్నది. అనగా, ప్రాణ – అపాన ఊర్ధ్వ – అధోగతులకు ఉత్ప్రేరకం ఇదే.

ఈ కుండలినీ శక్తియే – తుమ్మెద కమలంపై వ్రాలునట్లు – నేత్రాలు మొదలైన ఇంద్రియాలలో ప్రవేశించి స్వతహాగా జడస్వరూపమైన ఆ కళ్ళు, చెవులు మొదలైనవి విషయములను గ్రహించగల 'బోధ'ను ప్రసాదిస్తోంది. ఈ బయట ప్రపంచంలో గాలి వీస్తున్నప్పుడు చెట్లు కదులుచూ ఉంటాయి చూచావా? అట్లాగే ఈ కుండలినీ శక్తి అభ్యంతరములగు ప్రాణవాయువులకు ఒక క్రమశిక్షణ పూర్వకమైన కదలికను కల్పిస్తూ జ్ఞానేంద్రియశక్తులను, హృదయకమలమును నాడి సమూహములను జడస్థితి నుండి ఉత్తేజపరుస్తూ క్రియాశీలకం చేస్తోంది.

కుండలినీ శక్తిచే కదల్చబడుచున్న ప్రాణవాయువులు భుజించిన అన్నాన్ని జీర్ణం చేస్తూ తద్వారా శరీర నిర్మాణానికి, పరిరక్షణకు కారణమౌతున్నాయి. అది ఎట్లాగో చెపుతాను విను.

ప్రాణవాయువులచే స్పర్శించబడటం చేత, (ఉత్తేజపరుపబడటం చేత – కొట్టబడుట చేత), హృదయం యొక్క నాడులు కంపించటం జరుగుతోంది. అట్టి నాడుల యొక్క కంపనచే శరీరంలో ప్రవేశించిన అన్నం మొట్టమొదట రసంగా మారుతోంది. ఆ రసం క్రమంగా రక్తంగా మారుతోంది. రక్తం క్రమంగా మాంసమగుచున్నది. మాంసం చర్మం అగుచున్నది. చర్మం మేధస్సు అగుచున్నది. మేధస్సు మజ్జగాను, మజ్జ బొమికలుగాను, బొమికలు శుక్లం రేతస్సుగాను... ఇట్లు ఒక పదార్థం విలక్షణమైన మరొక పదార్థంగా పరిణామం చెందటం జరుగుతోంది. ఇదంతా కూడా భూమి నుండి వృక్షంలో ప్రవేశించి రసం పుష్ప–పల్లవ–ఫలాదులుగా పరిణమించటం వంటిదని నీవు గ్రహించవచ్చు. 'జడప్రతీతి' యగు వెదుళ్ళు ఒకదానితో మరొకటి ఒరిపిడి పొందటం చేత అగ్ని పుడుతుంది చూచావా? అట్లాగే ప్రాణ అపానాలు దేహంలో ఒకదానితో మరొకటి కుండలినీ ప్రోత్సాహ బలంచేత ఒరిపిడి పొంది తద్వారా జఠరాగ్ని పుడుతోంది. ఆ జఠరాగ్ని అన్నరసం మొదలు అంతిమధాతువైన శుక్రరసం వరకు పరిణామాన్ని కలిగింపజేస్తోంది. ఉష్ణతత్త్వం ఆహార పదార్థములను రసంగా మారుస్తుంటే, శీతలతత్త్వం తదనంతర కార్యక్రమం నిర్వర్తిస్తోంది.

స్వభావపరంగా ఈ కంటికి కనబడే భూమి శీతల స్వభావంతో కూడి ఉన్నది. అయితే ఇది సూర్యతేజస్సుచే ఉష్ణం పొందుతోంది కదా! అట్లాగే శీతల–వాత స్వభావం గల ఈ దేహం, దీని అంగాంగాలలో ప్రసరిస్తున్న జఠరాగ్ని వల్ల ఉష్ణత్వం పొందుతోంది. చూచావా ఆ సర్వేశ్వర శక్తి! ఈ సర్వదేహములలో కుండలినీ శక్తి స్వరూపము దాల్చి ఎంతటి తతంగం నడిపిస్తోందో కదా!

'ప్రాణ–అపాన' జనితమైనట్టి జఠరాగ్ని యొక్క తేజం నక్షత్రమండలం వంటి ఆకారం కలిగి ఉన్నదై ఉంటోంది. అది హృదయకమలమున సంచరించే బంగారుతుమ్మెద వలె ప్రకాశిస్తోంది. దేహమంతా ఉత్తేజమానమై ప్రకాశిస్తున్న ఆ జఠరాగ్ని కొందరు యోగిపుంగవులకు ఉపాస్యవస్తువుగా అగుచున్నది. అట్టి జఠరాగ్ని ప్రకాశమును ఆరాధ్య భగవంతుడుగా చిద్రూపంగా చింతన చేస్తూ ఉంటే కాలక్రమేణా అట్టి యోగాభ్యాసపరునికి 'సర్వపదార్థముల అంతరాంతరం వైపుగా దర్శించగల సిద్ధి' లభిస్తోంది. అప్పుడా యోగి లక్ష యోజనాల దూరంలో ఉన్న వస్తువును కూడా అరచేతిలోని అరటిపండును చూచినట్లు చూడగలుగుతాడు.

అగ్ని, శీతలముల ప్రవర్తనం - మాంసరూపము యొక్క ఖండములచే పూర్ణమైయున్న 'హృదయము' అనే తటాకంలో కమలము వలె ఈ జఠరాగ్ని ప్రకాశిస్తోంది. అగ్నికి కట్టెలు కావాలి కదా! ఆ జఠరాగ్నికి ఈ జీవుడు స్వీకరించే అన్నజలాదులు ఎండుకట్టెల వలె అగుచున్నాయి. శరీరంలోని స్వభావ శీతలత్వం ఎండవేడిమిని ఉపశాంతపరచే చంద్రునిలాగా – ఆ జఠరాగ్నిని తదితర అంతర్‌దేహ విభాగములను మండించకుండా ఉపశాంతపరుస్తున్నది.

సూర్య – చంద్రాది సంజ్ఞలు

1. సూర్యుడు –	తేజోరూపం ఉష్ణ స్వభావం	→	"సత్" "చిత్"లకు	→	"విద్య" సంజ్ఞ

2. చంద్రుడు – చీకటి రూపం శీతల స్వభావం → "అసత్" "జడము"లకు → "అవిద్య" సంజ్ఞ

ఈ బాహ్య జగత్తులో ఏఏ ఉష్ణత్వమైతే ప్రసరించి ఉన్నదో అదంతా కూడా సూర్యుని యొక్క 'తేజోరూపము' అయి ఉన్నది. చంద్రునియందు భూమియందు స్వభావసిద్ధంగా శీతలత్వం ఏర్పడి ఉన్నది. ఈ రెండిటి చేతనే, భౌతికంగా చూస్తే, ఈ బాహ్యజగత్తంతా నిర్మించబడుతోంది. ప్రతి ఒక్క వస్తువు అగ్ని – శీతలాల వేరు వేరు పాళ్ళ కలయికయే! ఈ భౌతికమైన అగ్ని-శీతలాల తత్త్వమే సూర్యచంద్రుల (అగ్నిష్టోమ) చమత్కారం. ఇక చైతన్యపరంగా చూస్తే విజ్ఞులగు యోగులు ఈ సూర్యచంద్ర (లేక అగ్ని-శీతల) తత్త్వములను చిత్-జడముల ప్రదర్శనాచమత్కారంగా సంజ్ఞలుగా దర్శిస్తున్నారు. అనగా, ఈ జగత్తంతా 'చిత్, జడము' అనే ఉభయ స్వరూపాలచే సంఘటితమై ఉంటోంది. యోగులు 'సత్ – అసదాత్మక మైనప్పటి బ్రహ్మం యొక్క ఒకానొక అవిద్యాంశయే ఈ జగత్ ఆకారంగా ప్రకాశిస్తోంది. అదియే ఇందు 'అగ్ని, శీతలం' అనే రెండు పరస్పర విరుద్ధ తత్త్వాలుగా ప్రవేశించి ఉంటోంది... అని గ్రహిస్తున్నారు అనగా ఆత్మతత్త్వ పరిలక్షితులగు ఆ బుద్ధి మంతులు (సాధకులు) – జ్ఞాన ప్రకాశం (సంవిత్), ఆత్మజ్ఞానం (విద్య), చైతన్యం – మొదలైనవాటికి 'సూర్యుడు' లేక 'అగ్ని'ని సంజ్ఞలుగా దృష్టాంతీకరిస్తున్నారు.

అదే విధంగా ...అసత్తు, అవిద్య, జడము మొదలైన వాటిని – 'చంద్రుడు' లేక 'శీతలము' అనే సంజ్ఞలుగా దృష్టాంతీకరిస్తున్నారు. సూర్య – చంద్రుల, అగ్ని-శీతలముల కలయికయే ఈ బాహ్య సృష్టి కదా! "సత్-అసత్‌ల కలయికే ఈ బాహ్య-అభ్యంతర సృష్టి అయి ఉన్నది" ...అనేదే అట్టి యోగ సాధకులకు ఉపాస్య వస్తువై ఉంటోంది.

అయితే ఓ రామచంద్రా! ఈ జగత్తంతా 'పరమ విజ్ఞానమగు సత్ చిదానంద స్వస్వరూపం యొక్క ఒకానొక తుచ్ఛాంశం అయి ఉన్నది' ...అని నీవు ఇప్పటికిప్పుడు గ్రహించి ఉండు. అనగా "కంటికి కనిపిస్తున్న ఈ జడజగత్తు, జడదేహం మొదలైనవన్నీ చైతన్య-స్వస్వరూపం యొక్క ఒకానొక అంశమే" అనునదే అగ్ని-ష్టోమయోగ సాధన. ఇక ఈ జీవుడో... స్వయంగా చైతన్యస్వరూపుడే!

❖❖❖

13. అగ్నిలో శీతలం! విజ్ఞానం (లేక) ప్రజ్ఞ నుండి జడ వ్యవహారం!

శ్రీరాముడు : మహర్షీ! ఇప్పుడు నాదొక సందేహం ఈ జీవుడు సర్వదా నిత్యోదిత – శుద్ధవిజ్ఞానంతో కూడిన శుద్ధచైతన్య స్వరూపుడే అగ్నిలో శీతలంలాగా అగ్ని, వాయు స్వరూపుడగు సూర్యుని నుండి జడ స్వరూపుడగు చంద్రుని లాగా ... విజ్ఞానంలో (శుద్ధ సంవిత్‌లో) అజ్ఞానం ఎట్లా ఉదయిస్తోంది?

శ్రీ వసిష్ఠ మహర్షి : మంచి ప్రశ్నే వేశావు.

"అగ్ని వాయు స్వరూపుడగు సర్యుడు ప్రజ్ఞకు, శీతల-జడ ప్రకాశమగు చంద్రుడు ఈ జగత్ దర్శనమునకు సంజ్ఞలు" - అని అనుకున్నాం కదా!

1. విజ్ఞానం (శుద్ధ విజ్ఞానం), 2. జడ వ్యవహారం (విజ్ఞానంచే తెలియబడేదైన విజ్ఞాన జడం) - ఈ రెండూ కూడా పరస్పరం కార్యవ్యవహారం నెరవేరుస్తూ పరస్పర సంస్థితములై ఉన్నాయి.

"చెట్టులోంచి విత్తు. విత్తులోంచి చెట్టు" లాగా ఈ విజ్ఞాన - జడ వ్యవహారములు రెండూ ఒకదానికి మరొకటి ఉపాదాన కారణమై ఉంటున్నాయి.

'రాత్రి గడచిపోయింది కాబట్టి పగలు; పగలు గడచిపోయింది కాబట్టి రాత్రి' వలె ఒకదానికి రెండవది నిమిత్తకారణమై ఉంటున్నది.

'వెలుగు-చీకటి' లాగా ఒకదానితో మరొకటి వ్యతిరిక్త కారణం కలిగి ఉంటున్నది. 'బింబము - ప్రతిబింబా'ల వలె అవి రెండూ ఒకే సమయంలో ఉండియే ఉంటున్నాయి. ఎండ-నీడల వలె (ఎండ ఒక ఆకారంపై పడినప్పుడు 'నీడ' ఏర్పడియే ఉంటుంది. నీడ కనబడుతోందంటే ఎండ కాస్తున్నట్లే) ...అవి రెండూ పరస్పర అనుమాన కారణములై ఉంటున్నాయి. ఆ విజ్ఞాన-జడ వ్యవహారాల కార్య-కారణ పరిణామాలు (భావాలు) రెండు రకాలుగా ఉంటున్నాయి.

1. సద్రూప పరిణామం - తాను తానుగా ఉంటూనే రెండవదిగా పరిణమించటం. దృష్టాంతాలు: బీజాంకుర కార్య-కారణ భావం... విత్తు తాను నశించక తన నుండి వృక్షంగా పరిణమించటం; మట్టి మట్టిగా ఉంటూనే కుండగా పరిణమించటం; బంగారం బంగారంగా ఉంటూనే ఆభరణంగా అవటం.

జ్ఞాన ప్రకాశము అట్లు జ్ఞాన ప్రకాశంగా ఉంటూనే జడమగు జగదనుభవం పొందుతూ జడ స్వభావ సమన్వితమై ఉండటం.

2. వినాశకరపరిణామం - ఒకటి నిర్వీర్యమగుటచే (లేక, ఏమరవబడుటచే) రెండవది పరిణమించటం. దృష్టాంతాలు : దివారాత్ర కార్య - కారణభావం ...రాత్రి గడచిన తరువాత పగలు, పగలు గడచిన తరువాత రాత్రి రావటం.

విజ్ఞాన - జడవ్యవహారములలో, లేక (సత్-అసత్‌లలో) ఒకటి లేకుండా పోయినప్పుడు రెండవది ఏర్పడుచూ ఉండటం.

❖

1. అప్రత్యక్ష ప్రమాణం -

సద్రూప పరిణామస్య మృద్ఘటక్రమ సంస్థితేః ।
అక్షోపలమ్భాదితరత్ ప్రమాణం నోపయుజ్యతే ॥

"సద్రూపం నుండి - అసద్రూప జగత్తుగా కనిపించే జడతత్త్వం అను ప్రత్యక్షమునకు ఏదో అప్రత్యక్షమైన ప్రమాణం ఉన్నది" ...అని అనుకుంటూ ఉండటం యుక్తియుక్తం కాదు. మరెక్కడో ఏదో 'అనిర్వచనీయమైన, తాకరాని, చూడరాని తత్త్వం ఉండి, తనకు అనుకూలంగా ఇక్కడ ఉన్న

సర్వమును నడిపిస్తోంది. ఇక్కడ జీవులందరు ఆ అనిర్వచనీయ అప్రత్యక్ష తత్త్వము చేతిలోని జడమగు చదరంగపు పావులు మాత్రమే”... అని కొందరు తమ భావనలను కొనసాగిస్తున్నారు.

అయితే, ఇటువంటి అభిప్రాయాలు పైకి సొగసుగా కనబడవచ్చు గాక! జ్ఞాన విషయంలో అల్పసాధకులకు, బద్ధకస్థులకు ఇట్టి అభిప్రాయాలు అనుకూలంగాను, ప్రియంగాను అనిపించవచ్చు గాక! అట్లాగే సాధన యొక్క కించిత్ ప్రారంభదశలో సాధకులను సన్మార్గ నిరతులుగా చేయటానికి ఇటువంటి అప్రత్యక్షప్రమాణ వాక్యాలు కొంచెము ఉపకరిస్తూ ఉండవచ్చు గాక! ఏది ఏమైనా అట్టి అప్రత్యక్ష ప్రమాణం – చెప్పింది ప్రశ్నించకుండా వినేవారికి – ఊహాజనితమై అంగీకారయోగ్యం కావచ్చునేమో గాని, సత్యశీలురగు యుక్తాయుక్తముల పరిశీలకులకు అట్టి అప్రత్యక్ష ప్రమాణం నిరూపణకు దొరకుట లేదు. పిల్లవాడికి ‘బూచి’ గురించి కథలు చెప్పి, ‘ఎఱ్ఱటి కళ్ళు, రెండు దంతాలు, బారెడు గడ్డం, పది అడుగల నాలుక’ ...అను వర్ణనలు ఆపాదించి ఆ పిల్లవాడు అల్లరి చేయకుండా కొంచెం భయపడి చెప్పిన మాట వినటానికి దాది చెప్పుచున్నది. ఆ పిల్లవాడు ఆ బూచిని ఊహించుకుని అట్టి ఊహాబలంచే నిజంగానే ఉన్నట్లు అనుభూతి పొంది, కొంత అల్లరి మానవచ్చు గాక! అంతమాత్రానికి ఆ ‘బూచి’ అనబడేది సత్య నిరూపణార్హం అవుతుందా?...

ఓ రామచంద్రా! ఈ జీవుడు కల్పిత మధ్యే మార్గగాథలతో కాలయాపన చేయక, ‘ఏది ఆత్యంతిక సత్యం? ఏది కల్పితం? నా వాస్తవ స్వరూపమేమిటి? ఆపాదితమాత్రమైన దేమిటి ? నే నెవరు? ఈ జడ జగత్తు ఏమిటి? దేహిగా నా స్వభావమేమిటి? దేహతాదాత్మ్యంచే అనుభవ మవుతున్న దేమిటి ...ఇట్టి ప్రశ్నలకు సరియగు అవగాహన ఎంత తొందరగా పెంపొందించుకుంటే అంత మంచిది.

‘ఎక్కడో ఏదో ఉండి దీన్ని నడిపిస్తోంది. మట్టిలోంచి కుండలాగా, ఇది ఏదో తెలియనిదానిచే నిర్మించబడుతోంది. దాని దయ, నా ప్రాప్తి. ఇప్పటికి ఇంతే’ ...అని సరిపుచ్చుకొని ఉండటం ఉచితం కాదు. శ్రేయస్సు కాదు. తానే ప్రజ్ఞా స్వరూపుడై ఉండగా సత్ స్వరూపుడై ఉండగా ‘మరొక టేదో ఉన్నది’ అని అప్రమాణమైన దానిపై (అనుమాన ప్రమాణమైన దానిపై) ఆధారపడి ఊరుకుంటే, – ఈ జీవుడు స్వస్వరూప విషయంలో ఎరుగవలసినది ఎరుగవలసినంతగా ఎరుగుట లేదని, అది జీవుని సమస్యకు పరిపూర్ణమగు సమాధానం కాజాలదని జనులందరికీ మనవి చేస్తున్నాను.

2. అభావ ప్రమాణం లేక అనుపలబ్ధి ప్రమాణం - రాత్రి, పగలు ఉంటున్నాయి కదా. అయితే రాత్రి అయిందా... పగలు ఉండదు. తెల్లవారిందా... రాత్రి మిగలదు, అట్లాగే విజ్ఞాన, జడ వ్యవహారాలలో (సత్–అసత్‌లలో) ఒకదానిని అభావించుటచే రెండవది ఉండదు. భావనయే ఈ జగత్తు. అభావన చేసినప్పుడు జగత్తు ఉండదు. జగత్తును భావన చేస్తున్నప్పుడు ఒక ద్రష్ట యొక్క నిర్మల ప్రజ్ఞ ఏమరచబడుచున్నది... ఇదియే అభావ అనుపలబ్ధ ప్రమాణం.

ఈ అభావ ప్రమాణం కొంతవరకు యుక్తి యుక్తమనవచ్చు. ఎందుకంటే అసత్‌యొక్క అభావన సత్ యొక్క భావనగా పరిణమించగలదు కనుక.

3. అకర్తృత్వ ప్రమాణం - కొందరు యుక్తివాదులు 'మట్టిలోంచి కుండ తయారవటానికి మట్టిలో కర్తృత్వం ఉండక్కర్లేదు. అట్లాగే జగత్తుకు కర్త లేదు. అచేతనమగు మట్టిలోంచి చేతనమగు కుండ తయారవుచున్నట్లు అచేతనమగు తత్త్వంలోంచి చేతనమగు ఈ జగత్తు పుడుతోంది. ఇక జగత్ నిర్మాత, దైవము మొదలైనవన్నీ కల్పితమాత్రమేగాని, ఇంతకుమించి ఎక్కడా ఏదీ లేదు ...అను సిద్ధాంతం ప్రతిపాదిస్తున్నారు. అయితే వారి దృష్టిలో ఈ ఎదురుగా కనిపించే వస్తువులను మించి ఇక ఎక్కడా ఏదీ లేదు. ఇట్లా వారు ఆస్తికులను ప్రశ్నిస్తున్నారు.

ఈ ప్రతిపాదనలో సాధనాదుల అనావశ్యకత – దేహాత్మ బుద్ధి పొంచి ఉన్నాయి. జీవుని ఈ పదార్థ జగత్ పరిమితునిగా ప్రతిపాదించబడుతోంది. అందుచేత ఇట్టి ప్రతిపాదనలను త్యజించటమే ఉచితం. ఇట్టి ఆయా కల్పనలన్నీ అనవస్థానబుద్ధి వలన అనిపిస్తున్నాయి.

శ్రీరాముడు : మహర్షీ! అప్రత్యక్ష ప్రమాణం కంటే అభావ ప్రమాణం ఉత్తమమని అంటున్నారు కదా! అభావము అనేది ఒకానొక అనుభవ స్థితి కదా! జగత్తును అభావించినప్పుడు ఆత్మానుభూతియే శేషిస్తుంది కదా! ఇక, అభావమును కూడా చీకటి – వెలుగులు, అగ్ని–శీతలముల వలె ఒకానొక ప్రమాణంగా మాత్రమే చెప్పుచున్నారేమిటి?

శ్రీ వసిష్ఠ మహర్షి :

> **ప్రత్యక్షవత్ అభావోఽపి ప్రమైవ రఘునందనా!**
> **అగ్న్యభావోపి శీతాస్య ప్రమాణం సర్వజన్తుషు ॥**

ఓ రఘునందనా! ప్రత్యక్షము లాగానే అభావము కూడా ఒక ప్రమాణమే. ఎందుకంటే 'నేనిప్పుడు అభావన చేస్తున్నాను' అను ప్రక్రియలో అభావన యొక్క భావన ఉండనే ఉన్నది కదా!

ఉష్ణము యొక్క అభావమే శీతలము యొక్క అనుమానము అగుచున్నది. కొందరు 'ప్రత్యక్షమైనదంతా అసత్తు. దీనిని అభావించుటయే సత్తు' అని ప్రవచిస్తున్నారు. అయితే అభావించటం కూడా ప్రత్యక్షంలోని ఒక ప్రమాణమే కదా! ప్రమాణం స్వతహాగా సత్యం కాదు. 'అది సత్యవస్తువును నిరూపించటానికి ఆశ్రయించబడే ఒకానొక సహకారిక ఉపాయం వంటిది, లేక దృష్టాంతము వంటిది అని సభికులంతా గ్రహించి ఉండెదరు గాక! ఒకడు శీతలము గురించి చెప్పటానికి గాను ఉష్ణము యొక్క అభావము ప్రమాణంగా తీసుకోవటం వంటిది. విజ్ఞానము యొక్క అభావమే ఈ మాయా జగత్తు యొక్క అంతర్లీన రహస్యం.

❖❖❖

14. చిత్ - జడపరిణామ చమత్కారం

చిత్ యొక్క సద్రూప పరిణామం - చిత్, తన యొక్క 'సద్రూప పరిణామం' అనే భావనకు సంబంధించినట్టి, ఆశ్రయం చేత 'జడమునకు సంబంధించిన అనుభవం' ఏర్పడటానికి కారణ మవుతోంది.

చిత్ యొక్క జడరూప వినాశన పరిణామం - అట్టి జడత్వము యొక్క సుదీర్ఘ భావనచే చిత్ తనను తానే ఏమరచుచున్నది. 'చిత్ లేదు జడమే ఉన్నది' – అను రూపంలో ఉండే చిత్ యొక్క వినాశకరపరిణామముచే ఈ జీవునకు మహాజడత్వం, సుదీర్ఘ దృశ్యతాదాత్మ్యం సంప్రాప్తిస్తున్నాయి. ఫలితంగా, ఈ జీవుడు తనయొక్క చిత్ స్వరూపమును పూర్తిగా మరచిపోయి, 'ఈ జడమే నా ఉనికి' అను నిద్రాణస్థితికి వస్తున్నాడు.

జడము యొక్క సద్రూప పరిణామం - దృశ్య విషయ సంబంధమైన ఘనీభూత భావనయందు చిక్కుకున్న జీవుడు ఎప్పుడో తనయొక్క చిత్‌చైతన్య రూపమును ఏమరచినట్లు గుర్తిస్తున్నాడు. తిరిగి ఇంటికి జేరే గృహయజమాని లాగా, (జడ విషయాలనే సాధనగా గైకొని) "తన చిత్ స్వరూపమునకు తిరిగి మరలటమే దుఃఖశమనోపాయం" – అని గుర్తిస్తున్నాడు. ఇదే జడం యొక్క చిత్ వైపుగా ఏర్పడే సద్రూప పరిణామం.

జడము యొక్క వినాశన పరిణామం - జడములకు సంబంధించిన సాధనలను ఉపకరణములుగా తీసుకొని తీవ్ర ప్రయత్నం చేస్తూ ఉండగా, ఆ సాధకుడు తన జడ స్వభావమును పూర్తిగా త్యజించి క్రమంగా 'చిత్ చైత్య స్వరూపుడు' అయి ప్రకాశిస్తున్నాడు. ఇది జడము యొక్క వినాశన పరిణామము.

చిత్ చైతన్యము యొక్క చిత్ ఏమరపు – జడభావనా పరిణామం; పరిణామం (అసద్రూప పరిణామం) యొక్క పునః చిదనుభవ – జడభావ వినావన పరిణామం (సద్రూప పరిణామం)

(చిత్ = తెలుసుకుంటున్నది. జడము = తెలియబడేది.)

ఈ విధంగా చిత్ చైతన్యము – జడమునకు, జడము – చిత్ చైతన్యమునకు 'సద్రూప – వినాశ' పరిణామ రూపములలో కార్య – కారణములౌతున్నాయి.

అనగా ...చైతన్యంలోంచి భావనా పరిణామంగా జడం వస్తోంది. జడంలోంచి పురశ్చరణ భావనా పరిణామం చేత చైతన్యం లభిస్తోంది.

చైతన్యం జడమునకు కారణమౌతోంది. అట్లాగే జడం – చైతన్యమునకు కారణమై పరిణమిస్తోంది.

శ్రీరాముడు : జడం చేతనమునకు కారణమవటమేమిటి స్వామీ?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఔను జడ వస్తువులను విషయాన్ని, తత్సంబంధమైన విధి విధానాలను ఆశ్రయించి ఒకడు 'చైతన్యానుభవం' అనే ఆవలి ఒడ్డు చేరుచున్నాడు కదా! ఇదియే మనకు ఇక్కడ దృష్టాంతం.

ఈ జడ – చైతన్యముల పరిణామ – విపరిణామములే ఈ సృష్టి యొక్క చమత్కారం. జడ – చైతన్యముల భావాభావపరిణామములే ఈ వివిధ జీవులలో కనబడే వైవిధ్యం అయి ఉన్నది.

ఈ సిద్ధాంతం ఇంకొంచెం సుస్పష్ట పరచటానికి ప్రకృతికి సంబంధించిన రెండు – మూడు విశేషములను ఇక్కడ దృష్టాంతంగా తీసుకుంటాను.

1. సూర్య (అగ్ని) చంద్రుల (శీతలము) దృష్టాంతం - అగ్ని తన 'ప్రజ్వలనం' అనే సద్రూప పరిణామంచే పొగను వెడల గ్రక్కుతోంది. ఆ పొగ మేఘరూపమును పొందుతోంది. ఆ మేఘముల నుండి శీతలరూపము (చంద్రుని సంజ్ఞ) నిర్మించబడుతోంది. ఇది అగ్ని యొక్క సద్రూప పరిణామం.

ఆ అగ్ని తాను నశించుచున్నప్పుడు కూడా శీతలత్వంగా పరిణమిస్తూ వాయురూపము పొందుతోంది. ఆ వాయువు మేఘమునకు, మేఘము శీతలరూప చంద్రునకు కారణమౌతోంది. ఇది అగ్ని యొక్క వినాశన పరిణామం... ఇది చిత్ నుండి జడమునకు సంజ్ఞగా గ్రహించు.

జడమగు సముద్రంలో తరంగాల రాపిడికి బడబాగ్ని పుడుతోంది. ఆ బడబాగ్ని సప్తసముద్రాల లోని జలం ఆవిరి కావటానికి కారణమౌతోంది. ఆ ఆవిరి మేఘాలుగా అగుచున్నాయి. ఆ మేఘాల నుంచి 'జలరూప చంద్రుడు' నిర్మించబడుచున్నాడు. ఆ చంద్రుని సూర్య తేజస్సు జలరూప చంద్రుని 'అమావాస్య' వచ్చే సరికి పూర్తిగా మ్రింగి, మరల శుక్లపక్షంలో తన నుండి వెడలగ్రక్కుచున్నది. ఇదంతా జడంలోంచి చైతన్య పరిణామమునకు 'సంజ్ఞ'గా చెప్పబడుతోంది.

చంద్రునితో గూడిన వసంత-గ్రీష్మ ఋతువులలో భూమిపై ఉష్ణవాయువులు జనిస్తున్నాయి. ఆ ఉష్ణ వాయువులు భూమిపై గల శీతల - జలములను పీల్చి మేఘములుగా పరిణమిస్తున్నాయి. ఆ మేఘములు శరత్-వర్ష ఋతువులలో వర్షించటం చేత మరల భూమి జలంలో నిండిపోతోంది. జడంలోంచి చైతన్యం చేసే రాకపోకలకు ఇది కూడా ఒకానొక దృష్టాంతం.

శ్రీరాముడు: మహర్షీ! సూర్యుని కిరణాల చేతనే జలం పానం చేయబడుచున్నది కదా! తద్వారా మేఘాలు... అవి వర్షించటం జరుగుతోంది.

శ్రీ వసిష్ఠ మహర్షి: అవును. అప్పుడు కూడా జలం తనయొక్క సద్రూపపరిణామం చేత సూర్యుని కిరణస్థితి పొందుచున్నది కదా! జలమే ఆవిరి రూపమును పొందుతోంది కనుక జలం అగ్నికి కారణమగుచున్నట్లే కదా! ఉష్ణత్వ కారణంగా వినాశన పరిణామం చేత జలము అగ్నిరూపత్వం పొందుతోంది. అనగా జలము తనయొక్క వినాశకర పరిణామం చేత అగ్నికి కారణమౌతున్నట్లే!

జడము తన వినాశన పరిణామం చేత చైతన్యానుభవం ఏర్పడటానికి కారణమవటమనుదానికి ఇది సంజ్ఞగా శాస్త్రములు ఉద్బోధిస్తున్నాయి. అగ్ని యొక్క నాశనముచే అద్దాని సద్రూప పరిణామం 'శీతలం' శీతలం యొక్క నాశనం చేత అద్దాని సద్రూప పరిణామం 'అగ్ని'

దీనిని చైతన్యం - జడముల సద్రూప - అసద్రూపముల పరస్పర పరిణామ చమత్కారంగా అన్వయించి గ్రహించవలసినదిగా సభికులకు నా మనవి.

2. దివా రాత్రము దృష్టాంతం - ఓ రాఘవా! మనం ఇప్పుడు చెప్పుకునే దృష్టాంతాలలో...

చిద్రూపానికి - అగ్ని, సూర్యుడు, ప్రకాశం; జడానికి - జలం, చంద్రుడు, చీకటి... సంజ్ఞలుగా ఉదహరించుకుంటున్నామని ఇక్కడ మరొక్కసారి గుర్తుచేస్తూ... చైతన్య-జడముల పరస్పర కార్య-కారణాల వ్యవహారాన్ని వివరించే ఉద్దేశంతో పగలు-రాత్రులను ఉదహరించుకుంటున్నాం.

అగ్ని (సూర్యుడు) తొలగుటచే శీతలం (చంద్రుడు), శీతలం నశించుటచే అగ్ని పరిణమిస్తున్నట్లే, పగలు గడచిపోయిన తరువాత రాత్రి వస్తోంది. రాత్రి గడచిన తరువాతనో, తిరిగి తెల్లవారుతోంది, పగలు వచ్చిపడుతోంది. ఒక చిన్న ప్రశ్న. పగలు, రాత్రి కానట్టి సమయమంటూ ఏదైనా ఉన్నదా?

శ్రీరాముడు : ఉదయ సంధ్యా సమయం, సాయం సంధ్యాసమయం ఉన్నాయి కదా స్వామీ?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఉన్నాయా? ఎక్కడున్నాయి?

> **తమః ప్రకాశయోః ఛాయా - తపయోః దిన రాత్రయోః ।**
> **మధ్యే విలక్షణరూపం ప్రాజ్ఞైరపి న లభ్యతే ॥**

1. చీకటి - ప్రకాశము; 2. నీడ - వెలుగు; 3. రాత్రి - పగలు ...ఈ మూడు ద్వంద్వములకు మధ్య తద్విలక్షణమైన స్థితి ఏదైతే 'సంధ్యా సమయం' అనే పేరుతో చెప్పుకుంటున్నామో... అది మహాప్రాజ్ఞులకు కూడా లభ్యపడటం లేదు.

అట్లాగే సత్-అసత్, చైతన్యం-జడముల మధ్య ఆయా రెండిటికీ విలక్షణమైన దేదీ గొప్ప గొప్ప సాధకులకు కూడా అనుభవమవటం లేదు.

అట్టి వెలుగు - నీడల మధ్య ఏదైనా సంధిరూపం ఉండిఉంటే అది కూడా అశూన్యరూపమే అవుతుంది. ఎందుకంటే అట్టి సంధిరూపం ఆ వెలుగు-నీడల రెండిటి రూపం అయి ఉండాలి కదా!

అట్లాగే భావ-అభావాలు కూడా! అభావనలో కూడా "అభావనను భావన చేయటం" అనే భావన ఉండనే ఉంటుంది కదా!

ఏ విధంగా అయితే చీకటి - వెలుగులచే ఈ భూమి మీద రాత్రింబవళ్ళు ఏర్పడుచున్నాయో .... అట్లాగే చిత్-జడములచే వాటి వివిధ పాళ్ళ కలయికచే ...ఈ ప్రపంచంలోని సమస్త ప్రాణులు స్ఫురిస్తున్నాయి. ఈ జగత్తంతా చిద్రూప జడముల మిశ్రమం మాత్రమే!

❖

జడము నందు కనిపించేదంతా చైతన్యము యొక్క ప్రకాశమే!

రాత్రి చిమ్మచీకటితో నల్లగా ఉండవచ్చు గాక! సూర్యుడు ఉదయించిన మరుక్షణం ఆ చీకటి అంతా పటాపంచలౌతోంది చూచావా! నిర్మలమైన చిత్ సూర్యుడు ఉదయించగానే ఈ సంసారాంధకారమంతా వినాశనమొందుతోంది.

అర్ధరాత్రి చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. అయితే చంద్రుడు జడము, స్వయం ప్రకాశ రహితము కదా! మరి ఎట్లా ప్రకాశిస్తున్నాడు? సూర్య ప్రకాశమే ఆ చంద్రునిలోని వెన్నెల అయి మనకు ప్రాప్తి స్తోంది. అయితే చంద్రప్రకాశము కనబడుతోంది గాని, ఆ చంద్రుని వెలిగించే సూర్యుడు కనబడుటలేదు కదా! జడమగు ఈ దేహమున స్వసత్తయే (స్వయం ప్రకాశమగు సూర్య ప్రకాశమువలె) అసత్త వలె (రాత్రియందు సూర్యుని ఉనికి - ప్రభావములు లేనట్లుగా అనిపిస్తున్నట్లు)... ప్రకాశిస్తోంది. పరిమితమైన జ్ఞానం కలవారికి చంద్రప్రకాశం వెనుక గల సూర్యుని ఉనికి తెలియరానట్లు, దేహ తాదాత్మ్య దృష్టి కలవారికి చైతన్యం యొక్క ఉనికి తెలిసిరావటం లేదు.

సూర్యుని నుండి బయలుదేరిన సూర్య ప్రకాశరూపమగు అగ్ని చంద్రమండలంలో ప్రవేశిస్తోంది. జడమయమగు ఆ చంద్రమండలమును స్ఫురద్రూపంగా చేస్తోంది. అట్లాగే, చిద్రూపం అనే అగ్ని ఈ దేహంలో ప్రతిష్ఠమౌతోంది. ఆ చిద్రూపాగ్ని జీవితపర్యంతం 'అహం' భావమును ప్రకాశితంగా

చేస్తోంది. చంద్రుని చూస్తున్నప్పుడు, "ఆహాఁ! ఈ చంద్రుడు ఎంత అందంగా ప్రకాశిస్తున్నాడు!" అని అనుకుంటున్నాం. ఆ చంద్రునిలోని వెలుగు సూర్యునిదే కదా! అట్టి సూర్య-చంద్రుల ప్రభవాలు అభేదాలే అగుచున్నాయి. అభేదాధ్యాసచే సూర్యునిలో ఉత్పన్నమయ్యే ప్రభామండలము చంద్రునిలోని ప్రభ ఒక్కటే కదా! ఆ చిత్ చైతన్యమే లేక, చిదానందమే స్వసంవిస్మయము పొందినదై 'నేను మనుష్యుడను. సంబంధితుడను, దేహస్వరూపుడను' ...ఇత్యాది స్వకీయమైన అనుభవములను ఆశ్రయించి, దేహస్థమై ఉంటోంది.


❖

అగ్ని (కాంతి) సర్వే సర్వత్రా ఉండి ఉన్నప్పటికి అది దీపం ఉన్న చోటే ప్రకాశం వెడలగ్రక్కు చున్నట్లు 'క్రియ – ఉపాధి' లేకుండా కేవల చైతన్యము పైకి భాసించదు. దీపము ద్వారా ప్రకాశము ఎరుగబడుచున్నట్లు ...దేహము ద్వారానే ఆ చైతన్యము ఎరుగబడుచున్నది.

చితః – చేత్యో ఉన్ముఖత్వేన లాభః సైవ చ సంసృతిః ।
నిశ్చేత్యాయాః శుభో లాభో నిర్వాణం వా తదేవ హి ॥

అజ్ఞానముచే కప్పబడిన చైతన్యము విషయముల వైపు ఉన్ముఖం అవటమే... 'సంసారము' అను రూపమైన అనర్థప్రాప్తి కారణం. విషయరహితమగు చైతన్యానుభవమే – శుభం, లాభం, మోక్షం కూడా!

ఒకచోట ఒక పెద్ద గోడ ఉన్నది. అయితే దట్టంగా క్రమ్ముకుని ఉన్న చీకటి చేత ఆ గోడ ఏ మాత్రం కనిపించటమే లేదు. ఆలోగా తెల్లవారింది. సూర్యుని ఉదయకాంతులు ఆ గోడపై ప్రసరించాయి. ఇప్పుడు ఆ గోడ సుస్పష్టంగా కనిపిస్తుంది కదా! సూర్యకాంతి – గోడ పరస్పరం కలియటం చేత ఆ గోడ యొక్క దర్శనం అవుతోంది. అట్లాగే సూర్యకాంతి-చంద్రుల వలె ఈ దేహంలో చైతన్య రూపుడగు దేహి, జడరూపమగు పంచభూత మిశ్రమం (చంద్రుడు – సూర్యకాంతిచే ప్రకాశించబడే గోడ) కలిసి ఉంటున్నాయి. దేహి యొక్క సుదీర్ఘము – ఘనీభూతము అయిన దేహ స్వరూప భావనచే పరమ జడమగు కేవలీ జడస్థితి సంభవిస్తోంది. అట్లా కాకుండా ఈ ఉపాధితో ఏర్పడే తాదాత్మ్యం యొక్క నివృతిచే ఆ దేహికి అత్యంతానందం ఉదయిస్తుంది. అది అగ్ని యొక్క (లేక) చైతన్యము యొక్క 'కేవలీస్థితి' అవుతుంది.



ప్రాణ, అపానవాయువుల సమన్వయం - ఇప్పుడు మనం సంభాషించుకుంటున్న 'చిత్ – జడ' సూర్యచంద్ర తత్త్వాన్ని దేహము నందలి ప్రాణవాయువుల గతికి అన్వయిద్దాం.

ప్రాణవాయువు ఉష్ణ ప్రకృతి కలిగియున్నది. అనగా, అగ్ని రూపమైయున్నది. అపానవాయువు శీతల ప్రకృతి కలిగియున్నది. ఒక ఆకారము – దాని నీడలాగా ఈ రెండు కూడా తమతమ మార్గములలో ప్రవర్తిస్తూనే ఒకదానితో మరొకటి ముఖాముఖి అగు చున్నాయి.

శీతల స్వభావమైనట్టి అపానవాయువు నందు ఉష్ణ స్వభావమై, అగ్ని రూపమగు ప్రాణవాయువు సత్త పొందుచున్నది. వస్తువు అద్దంలో ప్రతిబింబించినట్లుగా అపానవాయువు ప్రాణవాయువునందు సత్త పొందుతోంది. ఈ విధంగా ఆ రెండిటికి అన్యోన్యమైన తాదాత్మ్య స్థితి ఏర్పడుతూ ఉంటోంది.

ఈ బాహ్య జగత్తులో గోడ మొదలైన జడ వస్తువుల ప్రకాశమును జనింపజేస్తున్నదెవరు? సూర్యుడే కదా! సూర్యుడే లేకపోతే ఈ భూమిపై ప్రకాశమే ఉండేది కాదు. అట్లాగే చిద్రూపమగు అగ్ని, లేక కాంతి ఈ దేహమున ఏర్పడి ఉండి మూలాధారం నుండి కంఠం వరకు గల చంద్ర ప్రకాశ శక్తిని ఉత్పన్నం చేస్తోంది. చిద్రూప సూర్యుని నుండి శక్తిని పొందిన ఆ మనోరూపమైన చంద్రశక్తి ఈ దేహంలో వాక్‌శక్తిగా, దర్శనశక్తిగా, వినికిడి శక్తిగా, స్పర్శగ్రహణ శక్తిగా ప్రదర్శితమౌతోంది.

❖❖❖

15. సాధన - ఉపాసన

ఓ రామచంద్రా! ఇంతవరకు మనం కుండలిని గురించి, ప్రాణ–అపానాల పరస్పర సంయోగం గురించి కొన్ని విశేషాలు చెప్పుకున్నాం. ఇప్పుడు యోగోపాసన ఎట్లా చేయాలో చెప్పుతాను విను.

ప్రాణ, అపానముల సంధిస్థాన ఉపాసన - ముఖమునకు దాదాపు 12 అంగుళముల దూరమున చంద్రుని యొక్క 16వ కళ సూర్యకళగా అగుచున్నది. అనగా అపానం యొక్క 16వ కళ ప్రాణముగా (అనగా ప్రాణశక్తి యొక్క – బాహ్యం నుండి – దేహములోనికి తిరుగు ప్రయాణ ప్రారంభ స్థానం) రూపం పొందుతోంది. ఆ సంధిస్థానంలో నీవు నీ ధ్యాసను నిలుపు. అట్లాగే హృదయాకాశమున ఎక్కడైతే ప్రాణవాయువు సమాప్తి పొందుచుండగా అపానవాయువు కేవల నిజస్థితియందు ఉన్నదో, అనగా ప్రాణవాయువు సమాప్తి అయి, అపానవాయువు ఇంకను బయల్వెడలవలసి ఉన్నట్టి సంధిస్థానంలో (ప్రాణశక్తిలో) నీ ఏకాగ్రధ్యాసను నిలుపు.

ఈ ప్రాణ – అపానముల సంధిస్థానం గురించి మనం ఉపశమన ప్రకరణంలోను, ఈ నిర్వాణప్రకరణంలో భుశుండోపాఖ్యానంలోను చెప్పుకున్నాం.

ఓ రామచంద్రా! చిత్ సూర్యుడు అగ్ని – ఉష్ణరూపుడని, జడ చంద్రుడు శీతలరూపుడని చెప్పుకున్నాం కదా! 1. అర్ధరేచక, 2. అర్ధ పూరకముల అంతరమున ఈ ప్రాణ–అపానములు ప్రతిబింబ రూపంలో ఉంటాయి. అవియే మనం చెప్పుకున్న సంధిస్థానాలు. అచ్చట నీవు స్థిరుడవై ఉండు. అభ్యాసవశం చేత అట్టి స్థిరత్వపు ఉనికి అనుక్షణికం అవగలదు.

బాహ్య జగత్తులో ఋతువులు, రాసులు, సంక్రాంతి - ఈ బాహ్య జగత్తులో వసంత, గ్రీష్మ, వర్ష, ఋతువులందు ($3\times2=6$ నెలలు) భూమిపై గల ఉష్ణంచే శీతలం స్వీకరించబడుతోంది. దీనిని శీతలం యొక్క (చంద్రుని) అగ్ని సంక్రాంతి అంటున్నారు.

ఇక, శరత్, హేమంత, శిశిర ఋతువులందు భూమిపై గల శీతలంచే ఉష్ణం గ్రహించ బడుతోంది. దీనిని అగ్ని యొక్క శీతల (చంద్ర) సంక్రాంతి అంటున్నారు.

ఈ శీతలము యొక్క అగ్ని సంక్రాంతి		అగ్ని యొక్క శీతల సంక్రాంతి

సంధికాలమున మేషాది రాసులందు సూర్య సంక్రాంతి సంభవిస్తోంది. అయితే ఈ బాహ్య సంక్రాంతులు తృణప్రాయములు. చాలా స్వల్ప విషయములు.

ఈ దేహాంతర్గతంగా కూడా ప్రాణ – అపానములు సూర్య – చంద్రుల వలె ప్రవర్తిస్తూ ప్రాణ–అపానముల సంక్రాంతులను కలిగి ఉంటున్నాయి. అవి జీవునికి సంబంధించిన ముఖ్య సంక్రాంతులు. వాటి గురించి వివరిస్తాను. విను.

దేహాంతర్గత సంక్రాంతులు -

శీతలం యొక్క అగ్ని సంక్రాంతి - శరీరమునందలి జఠరాగ్నిచే అపానవాయువు యొక్క అంతర్గత శీతలత్వము గ్రహించబడే టప్పుడు శీతలము యొక్క అగ్ని సంక్రాంతి అగుచున్నది.

అగ్ని యొక్క శీతల సంక్రాంతి - ప్రాణవాయువు యొక్క అంతర్గత ఉష్ణత్వముచే బాహ్యమున ఉన్న శీతలత్వము గ్రహించబడుచున్నప్పుడు అగ్ని యొక్క శీతల (లేక చంద్ర) సంక్రాంతి అవుతోంది.

ఈ శీతలము యొక్క అగ్ని సంక్రాంతి	↓ ↑	అగ్ని యొక్క శీతల సంక్రాంతి

...మధ్యలో ఏర్పడియున్న సంధియందు అగ్ని సంక్రాంతి సంభవిస్తోంది.

ఓ రామచంద్రా! ఈ విధంగా దేహంలోని అగ్ని–శీతల సంక్రాంతులను ఎరుగుము. ఇవే ప్రాణ అపానాల సంక్రాంతి కూడా అని గ్రహించు. ఇవే ముఖ్య సంక్రాంతులు. బాహ్య ప్రసిద్ధ సంక్రాంతి, ఉత్తరాయనం, దక్షిణాయనం... ఇవన్నీ కూడా ప్రాణ–అపానాల గతి భేదం ద్వారా ఈ దేహాభ్యంతరం లోనే ఉన్నాయి. వాటిని ఎరిగినవారు యోగుల సభలో ప్రముఖులై శోభిస్తున్నారు.

❖❖❖

16.కుండలిని - అష్టసిద్ధులు - జ్ఞానసాధన క్రమం

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! 'యోగుల దేహాలు ఏ విధంగా అతిచిన్నవి గాను, అతిపెద్దవి గాను అగుచున్నాయి?' ...చెప్పమని అడిగావు కదా! ఇప్పుడా క్రమమేమిటో చెబుతాను, విను.

ఈ హృదయచక్రము యొక్క కోశములోని పై భాగంలో బంగారు తుమ్మెదలాగా, సాయంకాల మేఘములోని మెఱుపులాగా ఒకానొక అగ్నికణం (లేక) విస్ఫులింగం ప్రకాశిస్తోంది. అది అభౌతికం. (శక్తి గురుత్వాకర్షణలతో పోల్చ తగినది.) జ్ఞాన స్ఫురణ... అనతగినది. ప్రజ్ఞా సంబంధమైనది. ఉషోదయంలో సూర్యుడు ఉదయించి ఈ భూమిపై నలువైపులా ప్రసరిస్తూ చిమ్మచీకటిని పటాపంచలు

చేస్తాడు చూచావా? ఆ అగ్నికణం కూడా ప్రవర్ధమానమగు సంవిత్ స్వరూపముచే (జ్ఞానస్వరూపముచే) శీఘ్రంగా వృద్ధి చెంది దేహమంతా ప్రసరిస్తోంది. సూర్యభగవానుడు ఆకాశమును ప్రకాశింపజేయు నట్లు ఆ అగ్ని విస్ఫులింగం ఈ దేహమును ప్రకాశింపజేస్తోంది. భౌతికమైన అగ్ని బంగారమును ద్రవింపజేయుచున్నట్లు ఆ విస్ఫులింగం ఈ దేహమునంతటినీ ద్రవింపజేస్తోంది. అది నఖ-శిఖ పర్యంతము దేహమంతా ప్రవహించి ఈ దేహములోని జడత్వమును తొలగించి చైతన్యముతో నింపివేస్తోంది. బాహ్యజగత్తులోని ఉష్ణము వస్తువుల తడిని పీల్చి, ఆ వస్తువులను పొడిగా చేయునట్లు (తడిని తొలగించునట్లు) ఆ ప్రజ్ఞాతత్త్వం అంతరింద్రియములలో ప్రసరించి యోగశక్తిచే అందలి జడత్వమును తొలగించి ఉత్తేజపరుస్తోంది.

ఈ విధంగా అది దేహంలో దేహమునకు వేరైన మనోరూపసూక్ష్మమున ఉండి ఉంటోంది. ఇట్లు పార్థివ, అటు జల దేహాల రెండిటినీ ఉత్తేజపరచి తాను కూడా వాటియందు లీనమై ఉంటోంది.

ఆ విస్ఫులింగం ఉద్భవమై ఇంకనూ దేహమందు ప్రసరించవలసియున్న క్షణములలో కుండలినీ శక్తి సుషుమ్నానాడీ రహితమై, (కానీ) తనయొక్క సంస్కారముచే శోభితమై ఉంటోంది. అగ్నిలో బయల్వె డలటానికి సిద్ధమై ఉన్న పొగలాగా కుండలినీ శక్తి అతివాహిక దేహం నందు స్థితి కలిగి ఉంటోంది.

ఆ అగ్నికణం (విస్ఫులింగం) బాహ్యమున మనస్సు - బుద్ధి - జీవుడు మొదలైనవి కలిగి ఉన్నదై అంతరమున చిత్కళాప్రకాశము కలిగి ఉన్నదై 'పొగపంక్తి' వలె భాసిస్తోంది.

ఆ విస్ఫులింగముతో కూడిన కుండలినీ శక్తి యోగులకు ధ్యాన విషయములగుచున్నది. ఆ శక్తిని ఎక్కడ నియమిస్తే అక్కడికి వెళ్ళి ఆ రూపమును పొందగలదు. ధ్యానాభ్యాసముచే యోగులు ఆ శక్తిని ఆశ్రయించి, ఆరాధించి తమ ఇచ్ఛాంగీకారయోగ్యంగా చేస్తున్నారు. ఆ కుండలినీ శక్తిని ధ్యానాభ్యాసముచే వశం చేసుకున్నప్పుడు ఆ యోగి పర్వత - గోడ - శిల - స్వర్గ - పాతాళాది లోకములలో ఎక్కడికి కావాలనుకుంటే అక్కడికి క్షణంలో వెళ్ళగలడు.

ఆ కుండలినీ శక్తి ఒక దేహంలో జడభాగాన్ని విసర్జించి ఇంకొక దేహంలో ప్రవేశించి ఆ నూతన దేహాన్ని రసపూర్ణం చేసివేయగలదు అది రసపూర్ణత్వ విభూతిచే ఏ దేహాన్ని భావన చేస్తే ఆ దేహాకారాన్ని శీఘ్రంగా ధరిస్తోంది. ఒక గొప్ప చిత్రకారుని బుద్ధిలో ఏ రేఖాకృతి ఉద్దేశించబడుతుందో, అది ఏ విధంగా చిత్రకళా ఖండమై ప్రకటనమగుచున్నదో, అట్లాగే కుండలినీ శక్తి కూడా యోగి ఇచ్ఛానుసారం ఏ రూపం భావిస్తే ఆ పాంచభౌతిక రూపం ధరిస్తోంది.

తల్లి గర్భంలో ప్రవేశించిన సూక్ష్మమగు బీజశక్తి కాళ్ళు, చేతులు, కళ్ళు, చెవులు మొదలైన తత్త్వాలు గల దేహాంకుర స్థితి పొందటం కూడా అట్టి ప్రక్రియయే! అయితే అది ప్రవాహపతితమైనదే గాని, బుద్ధిపూర్వకమైనది కాదు. అనగా, యోగ సాధనచే స్వాధీనమైనది కాదు. ఆ కుండలినీ శక్తి తదనంతర దృఢభావనచే బొమికలు చర్మము మొదలైనవి గల వేరైన దేహమును పొందగలుగుతోంది. అదియే క్రమంగా యోగసాధనచే తాను అనుకున్నట్లు దేహపరిణామమును మార్చగలదు. అతివాహిక దేహసహితమైన కుండలినీ శక్తి చిన్నదేహమును, పెద్దదేహమును కూడా ధరించగలుగుతోంది.

(కుండలిని = శక్తి + ప్రజ్ఞ + నేను)

ఆయా యోగశక్తులు యోగశాస్త్రంలో అష్టసిద్ధులుగా ప్రసిద్ధికెక్కాయి -

1. అణిమాసిద్ధి - అణు స్వరూపుడవటం
2. గరిమాసిద్ధి - బృహత్ స్వరూపుడవడం
3. లఘిమాసిద్ధి - దూరప్రదేశాలను క్షణంలో జేరటం
4. మహిమాసిద్ధి - ఆయా మహిమలు (వస్తువులను సృష్టించటం వంటిది) ప్రదర్శించటం.
5. ఈశిత్వసిద్ధి - అనేకచోట్ల ఒకేసారి ఏర్పడి ఉండటం
6. వశిత్వసిద్ధి - ఎదుటివారి మనోబుద్ధులను వశం చేసుకోగలగటం
7. ప్రాకామ్యసిద్ధి - కోరినవి నిర్మించుకోగలగటం, కోరగానే పొందటం, ప్రసాదించ గలగటం.
8. ఇచ్ఛాసిద్ధి - సంకల్పించినది సంకల్పించినట్లుగా సిద్ధింపజేయ గలగటం.

కుండలినీ అధ్యాస దేహాంకుర స్థానం నుండి (అనగా, ఈ భౌతికదేహం తల్లిగర్భంలో చైతన్యవంతమగు క్షణమును కూడా) యోగులు సాధన వస్తువుగా ఆరాధిస్తున్నారు. అంతకుముందు కూడా ఏ మనోబుద్ధ్యాది సూక్ష్మదేహాకారమైయున్నదో, ఆ చిత్ శక్తి విస్ఫులింగమును ఆరాధించిన యోగులు ఈ జన్మకర్మల రహస్యమును సాదృశంగా ఎరుగుచున్నారు.

ఇప్పటిదాకా చిదగ్ని కణతత్త్వాన్ని (లేక) కుండలినిని ఆరాధించే యోగులు పొందగల అణిమాది సిద్ధుల గురించి ప్రస్తావించాను. ఇప్పుడు తద్వారా లాభించగల జ్ఞానసాధ్య క్రమాన్ని వివరిస్తాను. విను.

జ్ఞానసాధ్య క్రమం -

ఏకం 'చిన్మాత్రం' అస్తి ఇహ శుద్ధం సౌమ్యమ్, అలక్షితమ్,
సూక్ష్మాత్-సూక్ష్మతరమ్ శాన్తం, న జగత్-న జగత్ క్రియా ॥

ఈ ప్రపంచమునందంతటా 'చిన్మాత్రవస్తువు' మాత్రమే ఉన్నది. అది సర్వదా ఏకమై (అనేకంగా అవటమే లేదు), శుద్ధమై (ఏ దోషమూ దానికి అంటటం లేదు), సూక్ష్మం కంటే కూడా సూక్ష్మాతి సూక్ష్మమై ఉన్నది. అయితే అద్దానిలో ఈ జగత్తూ లేదు... ఇందలి క్రియావ్యవహారాలూ లేవు. ఆ చిన్మాత్రం ఎప్పుడైతే తనయొక్క 'అధ్యాసచే తనకు తానే' సంకల్పము వైపు ఉన్ముఖం చేసుకుంటోందో... మరుక్షణం అది కలుషితమైనదానివలె కనబడి 'జీవుడు' అను నామధేయమునకు అర్హమగుచున్నది.

అసత్యమేవ సంకల్ప, భ్రమేణ ఇదం శరీరకమ్,
జీవం పశ్యతి మూఢాత్మా, బాలో యక్షమివోద్ధతమ్ ॥

మూఢుడగు బాలుడు ఇంద్రజాలం - ఐంద్రజాలికులను గాంచునట్లు ఈ జీవుడు తన 'అసత్య భావనావశం' చేత తనయందు ఈ స్థూల-సూక్ష్మ శరీరాలను గాంచుచున్నాడు. ఎప్పుడైతే ఈ జీవుని ప్రజ్ఞ-అవగాహన అను జ్ఞానదీపంచే సమ్యక్ ప్రకాశం పొందుచున్నదో... అప్పుడు మేఘ రహితమైన నిర్మలాకాశం లాగా సంకల్పం యొక్క మోక్షాన్ని సంపాదించుకుంటున్నాడు. అనగా, సంకల్ప సహాయంచే సర్వసంకల్పాలకు మునుముందే ఉన్న స్వస్వరూపాన్ని గాంచుచున్నాడు. సంకల్ప క్షయం చేత ఈ స్థూల దేహభావం తైలరహితదీపంలాగా శమిస్తోంది.

నిద్రావ్యపగమే జంతుః యథా స్వప్నం న పశ్యతి,
జీ౨_వోపి భావితే సత్యే తథా దేహం న పశ్యతి ॥

నిద్రిస్తున్న ఒకప్రాణి నిద్ర నుంచి మేల్కొనగానే ఇక ఆ ప్రాణి కంటున్న కల మటుమాయ మవుతుంది కదా! అట్లాగే, మిగలదు కదా! సత్యమును ఎఱిగిన తరువాత ఈ జీవుడు ఇక ఈ దేహ భావమును గాంచడు. నిర్మలాత్మ భావనచే వెలుగొందుతాడు.

అతత్త్వే తత్త్వభావేన జీవో దేహావృతః స్థితః ।
నిర్దేహో భవతి శ్రీమాన్ సుఖీ తత్త్వైక భావనా ॥

అతత్త్వములైనట్టి ఈ దేహము మొదలైనవాటియందు 'ఇవియే నా స్వరూపం' అను తత్త్వభావనం చేయటం చేతనే జీవుడు దేహవశుడై ఉండటం జరుగుతోంది. ఏకతత్త్వమగు బ్రహ్మము యొక్క భావన చేయటం చేత అతడు దేహాతీత స్వభావుడై, శ్రీమంతుడు, సుఖి కాగలడు.

ఓ రామచంద్రా! అనాత్మరూపములగు ఈ శరీరాదులందు ఆత్మభావన చేయటం' ...అను రూపంలో ఉండే ఒకానొక నిబిడాంధకారం ఈ జీవుని చుట్టూ అలముకొని ఉన్నది. ఆ అంధకారం ఈ భౌతిక సూర్యోదయంచే నశించేది కాదు. సుమా! మరి? ఆత్మ యందు 'నేను నిత్యోదితమైన నిర్మలాత్మ స్వరూపుడను' అను ఆత్మభావన చేయాలి. "సర్వవ్యాపి అయి, నిరంజనమై, నిర్మలమైనట్టి చిన్మాత్రమే నేను" అను ఒక్క జ్ఞాన సూర్యోదయం చేత మాత్రమే ఈ అజ్ఞానజనితమైన అసత్తుల్య జీవత్వాంధకారం నశించగలదు. అంతకు మించి వేరే ఉపాయం లేదు.

మిగతా ఉపాయాలన్నీ అందుకొరకై ఉన్నాయి. మరి అట్టి ఆత్మభావనను సముపాదించటం ఎట్లా? మహాత్ములగు ఆత్మజ్ఞానులు, సత్యసంకల్పులు ఈ భూమిపై ఆయా సర్వజాతులలోను సంచరిస్తూ ఈ భూమిని పావనం చేస్తున్నారు. ఈ జనులు వారెలా భావన చేయుచున్నారో గమనించి శీఘ్రంగా అట్లే అనుసరించెదరు గాక!' "దృఢమైన భావన" కు సర్వము సుసాధ్యమేనని అందరూ ఎరిగిన విషయమే. ఒకనికి ఏమీ తెలియకపోవచ్చు గాక! అతని దృఢమైన భావన విషమును అమృతంగానూ, అమృతమును విషంగానూ చేసివేయగలుగుతుంది.

ఏవం యథా యదేఎ౨హ భావ్యతే దృఢభావనాత్,
భూయతే హి తదేవా౨శు తదిత్యాలోకితం ముహుః ॥

దృఢభావనచే ఏ పదార్థం ఎట్లు అవలోకించబడుతుందో... అప్పుడది అట్లే అగుచుండుట మనందరం అనేకసార్లు రోజూ చూస్తున్న విషయమే. ఈ "దేహం, దేహ సంబంధిత విషయాలు సత్యమే" అను దీర్ఘాభ్యాసభావనచే చూచుచుండుటచే దేహి దేహసంబంధమాత్రుడుగా అవగతమగు చున్నాడు. ఈ దేహాదులను తత్సంబంధిత విశేషాలను అసత్యభావనచే దర్శించువారికి దేహి యొక్క బ్రహ్మాకాశరూపం అనుభవమగుచున్నది. కుండలినీ ధ్యానం అందుకు సాధకునికి ఉపకరించగలదు. ఉత్తములగు యోగులు కుండలినీ ధ్యానంచే సత్వరమే దేహభావనను జయించి బ్రహ్మతత్త్వభావనను – బ్రహ్మేత్మాహంభావనను సంతరించుకుంటున్నారు. అల్పపరిలక్షితులగు యోగులు అణిమాది

సిద్ధులను ఆశ్రయించి పునః సంసారమునకు వెనుతిరుగుచున్నారు. ప్రజ్ఞావంతులగు యోగులకు అణిమాది అష్టసిద్ధులు ఉన్నప్పటికీ మహదాశయ సంపన్నులై ఉండటం చేత అవి వారికి భూషణాలు అగుచున్నాయే గాని తిరోగనమమునకు కారణములు కాలేవు. మహదాశయుల దృష్టిలో అణిమాది సిద్ధులు బాటలో కనిపించే గడ్డిమొక్కలవంటివి మాత్రమే!

❖

సాధుపుంగవులలో అగ్రగణ్యుడవగు ఓ రామచంద్రా! నీకింతవరకూ చిదగ్నికుండలినీ శక్తుల ఆరాధన, అణిమాది సిద్ధులు, అణిమాది పదప్రాప్తి యందలి జ్ఞానయుక్తి గురించి కొన్ని విశేషాలు విశదీకరించాను. ఇప్పుడు యోగాభ్యాసబలంచే యోగులు నిర్వర్తించే మరొక దేహప్రవేశం గురించి వివరించి ఈ యోగము గురించిన విషయమును ముగిస్తాను.

పరకాయ ప్రవేశం - మనిషి వాయువునుండి పుష్పగంధమును ఆకర్షించి ముక్కును ఉపయోగించి ఘ్రాణము అనుభవిస్తాడు చూచావా? జీవుడు కూడా కుండలినీ శక్తిరూప గృహం నుండి బయల్వెడలి మరొక దేహములో కుండలినీ సమన్వితుడై ప్రవేశించగలుగుతాడు. ఆ యోగి ఆ మరొక దేహమును ఎంతకాలం ఉపయోగిస్తూ ఉంటాడో... అంతకాలం ఆతనిచే అతని పూర్వదేహం త్యజించబడినదై ఉంటుంది. ఆ అన్యదేహంలో తన ఇష్టం వచ్చినంతకాలం ఉన్న తరువాత ఆతడు మరల ఆ దేహాన్ని ఒక రాయి – కొయ్య – చెక్కలను విడచినట్లు విడచిపెట్టేస్తున్నాడు. చెట్లకు నీరుపోయువాడు తాను ఏ చెట్టుకు నీరు పోయాలనుకుంటే ఆ చెట్టుకే పోస్తూ మరల ఆ చెట్టును వదలి తన ఇచ్ఛ వచ్చినట్లు మరొక చెట్టును సమీపిస్తాడు చూచావా? ఆ విధంగా యోగి కూడా తన ఇచ్ఛానుసారంగా ఏ స్థావర జంగమ దేహమును ప్రవేశించాలనుకుంటే ఆ దేహమునందే ప్రవేశించగలుగుచున్నాడు. ఎవరి సంపదను అనుభవించాలనుకుంటే అతని దేహ, మనో, జీవ, బుద్ధులందు తాను ప్రవేశించు చున్నాడు. ప్రతి ఒక్క దేహి ఈ తన దేహమును కూడా అట్టి రీతిగానే మాతృదేహంలో ప్రవేశించి ఆశ్రయించి ఉంటున్నాడని కూడా సూక్ష్మబుద్ధితో గ్రహించు. అయితే అది కర్మజాల కారణమైన ప్రవాహపతిత వ్యవహారం.

ఇట్లు ఆ యోగి అన్యశరీరంలో ప్రవేశించి ఆ అన్యశరీరమునకు సిద్ధించియున్న సంపదను అనుభవించి మరల తన పూర్వదేహం ఇంకా ఉండి ఉంటే, అందులో ప్రవేశించగలడు. లేదా, తన కిష్టమైన మరొక దేహంలోనైనా ప్రవేశించగలడు. కాదా, ఉత్కృష్టులగు యోగులు ఆ అన్యశరీర భోగానంతరం... సమస్త ప్రతిబింబభూతములగు ఉపాధులను, బింబభూతములగు సమస్త దేహులందును, ఈ జగత్తంతటా వ్యాప్తమైయున్న తమ ఆత్మను దర్శించగలరు. ఇట్టి తమ యొక్క ఆత్మ సంవిత్తుచే ఈ సర్వమునూ పరిపూర్ణం ఒనర్చి ఉండగలుగుచున్నారు.

ఓ రామచంద్రా! యోగైశ్వర్యములలో అన్నిటికన్నా ఉత్తమమైనది. ఘనమైనది, పవిత్రమైనది స్వస్వరూపానుభవమే. యోగైశ్వర్యులగు కొందరు మహనీయులు దోషరహితము, నిత్యోదయము అగు తమ స్వరూపమును ఎరిగి, అందు ప్రవేశించినవారై ఉంటున్నారు. అట్టి మహాత్ములు దేనిని వాంఛిస్తారో దానిని శీఘ్రంగా పొందగలుగుతారు.

అయితే, తత్త్వజ్ఞాని అయినవాడు ఆయా అల్పసిద్ధులను గొప్పవిగా భావించడు. నిరతిశయానంద రూపమగు ఆత్మనే అన్నిటికన్నా అధికమైన దానిగాను, ప్రియమైనదానిగాను, మహత్తరమైనదానిగాను ఎరిగియే ఉంటాడు.

❖❖❖

17. వెతికేది చిల్లిగవ్వ కోసం - దొరికేది చింతామణి

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! నీవు అడిగిన రీతిగా ఇప్పటివరకూ కుండలినీ యోగం, సిద్ధులు, యోగముచే జ్ఞానం మొదలైన ఆయావిషయాలు ప్రస్తావించాను. ఇప్పుడు తిరిగి చూడాల – శిఖిద్వజుల కథా ప్రసంగానికి వద్దాం.

❖

రాజపత్ని చూడాల రాజ్యమును వదలి ఒకానొక ఏకాంత ప్రదేశంలో అణిమాది సిద్ధుల కొరకై ప్రాణాయామాదుల దృఢాభ్యాసం ప్రారంభించిందని అనుకున్నాం కదా! ఆత్మ తత్త్వజ్ఞాన బలంచే సంపాదించుకున్న ఏకాగ్రత, పవిత్రతల ప్రభావం వల్ల ఆమె అతి స్వల్పకాలంలో అణిమాది శక్తులచే, తత్సంబంధిత గుణాలచే సుసంపన్నురాలైనది.

ఆమెయందు జ్ఞానము ఇంకా పవిత్రం కాగా, ఇక మోహకాలుష్యం, తాపత్రయాలు ఏ కొద్ది మిగిలినా, అవి కూడా వినాశనం పొందాయి. ఆమె హృదయం గంగాజలంలాగా నిర్మలము, శీతలత్వము పొందాయి.

ఆమె యథాప్రకారం గృహోన్ముఖురాలై భర్తచే నిర్వర్తించబడవలసిన ఆయా రాజధర్మములను పవిత్ర భావనతో నిర్వర్తిస్తూ 'సహధర్మచారిణి' అను మాటకు పూర్ణార్థత పుణికిపుచ్చుకున్నది.

ఒకవైపు రాజ్యభారాన్ని వహిస్తూనే మరొకవైపు ఆ చూడాల ఒకప్పుడు ఆకాశమార్గమున పోవుచూ, మరొకప్పుడు సముద్రకోటరములలో ప్రవేశిస్తూ, ఇంకొకప్పుడు భూమండలమంతా చుట్టి... సంచారాలు చేసివస్తూ ఉండేది. ఎన్ని సిద్ధులు సంపాదించినప్పటికీ ఆమె తన సహజసిద్ధమగు స్త్రీ భావమును వదలలేదు. ఆమె చిత్తం తన పతియొక్క వక్షస్థలం నుండి ఒక్క క్షణం కూడా విముక్తమవలేదు.

ఆమె ఇచ్ఛానుసారం కొన్ని సమయాలలో సమస్త రాజ్యములందూ, సమస్త లోకములందూ 'లక్ష్మి'వలె నివసించుచూ ఉండేది. ఒకవైపు మహారాణికి సంబంధించిన భూషణాలు ధరిస్తూ సభా కార్యక్రమముల వంటి రాచకార్యములు నిర్వర్తిస్తూనే ఉండేది. కొంచెం సమయానుకూలమైనప్పుడు ముత్యాలలో దారం ప్రవేశించినట్లు, పర్వతాలతో కూడిన భూమిపై మేఘాలు క్రమ్మినట్లు కాష్ఠ, తృణ, శిలమయ భూ ప్రదేశములందు; ఆకాశ, వాయు, అగ్ని, జలాది భూతజాత ప్రదేశములందు నిర్విఘ్నంగా ప్రవేశిస్తూ ఉండేది. యమ, వరుణ, కుబేర, వరుణ, ఇంద్రాది లోకపాలకుల నగరాల లోను, ఆకాశములోని దశదిశల అంతరాంతరాళములలోనికి వాయుతరంగంలాగా ప్రవేశ,

నిష్క్రమణాలను సల్పుతూ ఉండేది. అంతే కాదు. పశుపక్ష్యాదులతోను, పిశాచాదులతోను, నాగ - దేవ-దైత్యులతోను, విద్యాధర-అప్సరస-సిద్ధులతోను, సామీప్య-స్నేహ సంభాషణలు నిర్వరిస్తూ ఆనందిస్తుండేది.

అట్లా అనేక జగత్తులలో పచార్లు చేస్తూ కొన్నిసార్లు తన భర్త అంతరంగంలో కూడా ప్రవేశించింది. అశరీరి అయి అనేక సంజ్ఞలతో జ్ఞానామృతమును వర్షించటానికి, ఉపదేశించటానికి ఏవేవో ప్రయత్నాలు చేసింది కూడా! కాని స్థూలదృష్టిని ఆశ్రయించి ఉండటంచేత ఆమె భర్త శిఖిధ్వజుడు ఆమె యొక్క విజ్ఞానవైభవాన్ని గాని, ఆమె సూక్ష్మ మార్గాలలో చెప్పే జ్ఞానబోధలను గాని ఏమాత్రం తన హృదయంలోకి స్వీకరించనే లేదు. మధ్య మధ్య తన భార్య చూడాల గురించి యోచిస్తున్నప్పుడు 'నా ప్రియురాలు చూడాల ఉట్టి పిచ్చిది. ఏమీ తెలియనిది. సంగీతం, నృత్యం మొదలైన వాటిలో ప్రావీణ్యురాలే! కానీ ఏం లాభం? ఇంత తెలిసి, ఇంతగా ప్రయత్నిస్తున్నా నాకే ఆత్మవిద్య అలవడలేదు. ఏమీ తెలియకపోయినా, ఏదో ఊహించి ఏదేదో అనుకునే నా భార్య చూడాల వంటి వారికి ఆత్మ విద్య యొక్క ఆనుపానులు కాస్త తెలియాలంటే కూడా ఎన్ని వందలసార్లు జన్మించాలో కదా! 2 సంవత్సరాల చిన్న పిల్లవాడికి అస్త్ర విద్య ఏం తెలుస్తుంది? మా చూడాల కూడా ఏమీ తెలియని అమాయకురాలు, పాపం!" అని తనలో అనుకుంటూ ఉండేవాడు. స్వల్పజ్ఞానులు తదితరుల జ్ఞానాదులపై తమవైఖరికి అనుకూలమైన అభిప్రాయములు కలిగి ఉండి, తమకు తదితరుల జ్ఞాన-అజ్ఞానాదులు తెలుసునని అనుకోవటం సాధారణమైన విషయమే కదా!

శ్రీరాముడు : మహర్షీ! ఆ చూడాల తన భర్త సమక్షంలో ప్రత్యక్షమై తన సిద్ధులను చూపి, ఆ తరువాత ఆత్మ విద్యను మరల బోధించవచ్చు కదా! అట్లా అయితే శిఖిధ్వజునకు తన భార్య యొక్క సామర్థ్యముపై గౌరవాదులు ఉండి అప్పుడు ఆమె బోధించేది శ్రద్ధ-యోచనలతో వినేవాడేమో?

శ్రీ వసిష్ఠ మహర్షి : యజ్ఞ విధానం, తత్త్వరహస్యం ఎరిగిన మహనీయులు అల్పాధికారులకు ఆయా యజ్ఞక్రియలను విడమరచి చూపరు చూచావా? బహుప్రాచుర్యమైన దేవతా విగ్రహమునకు వస్త్ర విభూషణాది అలంకారాలు చేస్తున్నప్పుడు భక్తులకు అది ప్రదర్శించక తెరకడతారు కదా! అట్లాగే ఆ చూడాల కూడా ఆత్మయందు విశ్రాంతి పొందని ఆ రాజుకు తన ఆకాశగమనాది సిద్ధులను ప్రదర్శించుటకు ఉద్దేశించలేదు.

శ్రీరాముడు : మహర్షీ! ఇప్పుడు నా మానసికాకాశంలో ఒక గొప్ప సందేహం పుట్టుకోస్తోంది. ఆ చూడాల గొప్ప యోగి, సిద్ధురాలు, ఆత్మజ్ఞాన - అనుభవ సమన్వితురాలు కదా! అంతటి చూడాల ఎంతెంతో ప్రయాసపడినప్పటికీ తన భర్తకు ఆత్మవిద్య నేర్పలేకపోతోందే! ఇక సిద్ధులు మొదలైనవి లేనట్టి గురువులు తమ శిష్యులలో ఆత్మానుభవం ప్రేరేపించటం ఎంతటి దుస్సాధ్యమైన విషయం!

శ్రీ వసిష్ఠ మహర్షి : నీవు చెప్పిన అభిప్రాయముతో నేను ఏకీభవించటం లేదు. ఎందుచేతనంటావా?

ఉపదేశక్రమో, రామ! వ్యవస్థామాత్ర పాలనమ్ ।
జ్ఞప్తేస్తు కారణం శుద్ధా శిష్యప్రజ్ఞైవ రాఘవ! ॥

ఓ రఘురామా! "గురువు, ఉపదేశించటం, ఉపదేశక్రమం'... ఇవన్నీ కూడా ఒకానొక వ్యవస్థాక్రమం, శాస్త్ర మర్యాదను కాపాడటం కోసం మాత్రమే. యథార్థానికి శిష్యునిలో జ్ఞానబోధ జనించటానికి గురువు యొక్క పాత్యాంశములు మొదలైనవి అసలైన కారణం కాదు. శిష్యుని జ్ఞానప్రాప్తికి అతని శుద్ధమైన బుద్ధియే అసలైన కారణం.

న శ్రుతేన న పుణ్యేన జ్ఞాయతే జ్ఞేయమాత్మనః ।
జానాతి ఆత్మానమ్ ఆత్మైవ సర్పః సర్పపదాన్ ఇవ ॥

ఏదో శ్రవణం చేతనో, శబ్దజ్ఞానం చేతనో, తదితరమైన పరోక్షజ్ఞానంచేతనో, పుణ్యకార్యములు నిర్వర్తించటం చేతనో ఆత్మ తెలియబడదని గ్రహించు. మరి? పాముయొక్క అడుగుజాడలను పామే గ్రహించగలుగుతుంది. అట్లాగే, ఆత్మయే ఆత్మను ఎఱుగగలదు.

"ఆత్మ యొక్క సంకల్ప – ఉద్దేశములు" లేకుండా ఆత్మకు ఆత్మ గురించి మరెవరూ ఎరుకపరచలేరు.

శ్రీరాముడు : మీరు చెప్పేది చమత్కారంగా ఉంది. అట్లా అయితే, గురూపదేశం ఈ జగత్తులో ఆత్మజ్ఞానమునకు ఎట్లా కారణమౌతుంది? గురూపదేశమే లేకపోతే ఆత్మజ్ఞానం లభించటం దుర్లభమని కొన్ని శాస్త్రములు సిద్ధాంతీకరిస్తున్నాయే?

శ్రీ వసిష్ఠ మహర్షి : (చిరునవ్వు నవ్వుతూ) నీవు అడిగిన ప్రశ్నకు సమాధానంగా విజ్ఞుల సభలలో 'చిల్లిగవ్వ కోసం వెతుకుతూ ఉంటే చింతామణి దొరుకుతుంది' అను ఒక దృష్టాంతం చెప్పుతూ ఉంటారు. అది ఇప్పుడు ప్రస్తావిస్తాను విను.

చిల్లిగవ్వకోసం వెతుకుతుంటే చింతామణి దొరకటం - వింధ్య పర్వత ప్రాంతంలో గల బోయజాతి వారు నివసించే ఒక పల్లెలో ఒక ఆటవికుడు (కిరాతకుడు) ఉన్నాడు. అతని దగ్గర చాలా ధనం ఉన్నది. అయితే ఏం? అతను పరమ లోభి. అతని దగ్గర ఎంత ధనం ఉన్నదో అతనికే తెలియదు. కానీ ఆతడు చిల్లిగవ్వ కోల్పోవటానికి కూడా ఎంతమాత్రం సిద్ధపడడు. అంతటి లోభ రాగ సంబంధమైన తుచ్ఛ భావాదులు కలిగి ఉన్నాడు.

ఒకసారి అతను ఏదో అవసరమైన పని ఉండి వింధ్యాచల మార్గంలో ఏదో పట్టణం వైపు వడివడిగా నడచి వెళ్ళుచున్నాడు. ఆ వేగానికి ఒకచోట జేబులోంచి ఒక చిల్లిగవ్వ గాలిలోకి ఎగిరి దట్టంగా ఎదిగి ఉన్న పచ్చగడ్డి దుబ్బులో పడిపోయింది. 'అయ్య బాబోయ్! నా చిల్లిగవ్వ పడిపోయింది నాయనోయ్! అని గంతులేసి ఇక ఆ చిల్లిగవ్వకోసం రెల్లుదుబ్బులలో వెతకటం ప్రారంభించాడు. ఒక గంట గడచిపోయింది. చిల్లిగవ్వ కనబడనే లేదు. అయినా ఇంకా వెతుకుతూనే ఉన్నాడు. ఆ మార్గంలో ఆతనికి తెలిసియున్న కొందరు బాటసారులు అటు వెళ్ళుచూ అతనిని పలకరించారు.

బాటలో వెళ్ళే ఎవరో జనులు: ఏయ్ కిరాతా! ఏమిటి... వెతుకుతున్నావ్?

కిరాతకుడు: ఒక చిల్లిగవ్వే ఎక్కడో పడిపోయింది. రెండుగంటలుగా వెతికినా ఇంకా కనబడలేదు. అందుకే మళ్ళీ వెతుకుతున్నాను.

బాటసారులు : నీకేమైనా పిచ్చి పట్టిందా? ఒక్క చిల్లిగవ్వకోసం ఇంతసేపు వెతుకుతున్నావా? పైగా ఇంకా వెతుకుతావా? నీకు బోలెడు డబ్బు ఉన్నది కదా! అంత డబ్బు ఎదురుగా పెట్టుకుని వెతకట మేమిటి? అవతల చీకటి పడిపోతోంది చూచావా? లేదా? చీకటి పడిందంటే ఇక్కడికి ఏవైనా క్రూరమృగాలు వస్తే రావచ్చు.

కిరాతకుడు : డబ్బు ఉంటే ఉండొచ్చు గాక! ఇప్పుడా ఊసు ఎందుకు? ఈ చిల్లిగవ్వను ఎందుకు పోగొట్టుకోవడం? వెతగా-వెతగ్గా ఈ చిల్లిగవ్వ ఇప్పుడు దొరకిందనుకో. అప్పుడు నేను ఆ చిల్లిగవ్వను ఉపయోగించి క్రయవిక్రయాలు చేస్తాను. ఒక చిల్లిగవ్వ పది చిల్లిగవ్వలౌతాయి. ఆ 10 చిల్లిగవ్వలతో మరేదైనా వ్యాపారం చేస్తే 2000 చిల్లిగవ్వలౌతాయి. అప్పుడీ చిన్న చిన్న వ్యాపారాలు మానేసి మా బోయవాళ్ళ దగ్గిర అటవీ సంపదలను కొని వాటిని పట్టణంలో అమ్ముకుంటాను. అవే లక్షలక్షల చిల్లిగవ్వలౌతాయి. ఇక మీరు పదండి. మీకేం తెలుసు డబ్బు విలువ?

కిరాతుని లోభపూరితమైన అమాయకపు వాక్యములు విని ఆ బాటసారులు పకపకా నవ్వుకున్నారు. 'వీడొక మూర్ఖుడు. చెప్పితే వినడు. వీడిగతి ఇంతే. ఇక పదండిరా' ...అని హాస్యం చేస్తూ వాళ్ళంతా వెళ్ళిపోయారు. కిరాతుడు మాత్రం ఆ చిల్లిగవ్వ కోసం వెతుకుతూనే ఉన్నాడు. అప్రమత్తుడై, మరల-మరల ఆ చిల్లిగవ్వ దొరికితే తాను ఏం చేయగలడో ఊహించుకుంటూ ఆ చుట్టు ప్రక్కలంతా చూస్తున్నాడు. మూడు రోజులు గడచిపోయాయి.

చివరికి అతనికి చిల్లిగవ్వ కనిపించలేదు. కానీ, ఆశ్చర్యం! మూడో రోజు సాయంకాలమౌతూ ఉండగా అతనికి ఆ రెల్లు గడ్డిలో దేదీప్యమానమైన, మహత్తర సమన్వితమైన ఒక 'చింతామణి' దొరికింది. ఏది అభ్యర్థిస్తే అది ప్రసాదించగల గొప్ప శక్తి ఆ మణికి ఉన్నదని గ్రహించాడు. దానిని చూచి ఆ కిరాతుడు చాలా ఆనందం పొందాడు. ఎంతో సంతోషంగా ఆ చింతామణిని గుప్పెట్లో దాచుకుని ఇంటికి చేరాడు. ప్రపంచంలోని భోగైశ్వర్యములన్నీ ఆ చింతామణి యొక్క ప్రభావం చేత లభించుచుండటంచే హాయిగా ఉన్నాడు.

❖

ఓ రామచంద్రా! ఇదీ కథ. ఇది జ్ఞానుల సభలో ఎందుకు ముచ్చటిస్తారో చెబుతాను విను. చిల్లిగవ్వకోసం వెతుకుతుంటే ఆ బోయవానికి చింతామణి లభించినట్లు శాస్త్రముల ఉపదేశాలు వింటూ ఉండగా కూడా ఆత్మజ్ఞానం లభించటం జరుగుతోంది. గురువులు శబ్దములను ఉపయోగించి ప్రత్యక్ష పరిమితులై (దృశ్యవ్యవహార పరిమితులై) దిక్కు గానక సంచరిస్తూ తమను ఆశ్రయించిన శిష్య జనులకు 'పరోక్షజ్ఞానం' అందిస్తున్నారు. ఈ శబ్దజన్యమైన పరోక్షజ్ఞానం గురువాక్యానుసారం అన్వేషిస్తూ ఉండగా ఎప్పుడో నిత్యము అపరోక్షము అయినట్టి 'ఆత్మజ్ఞానం, ఆత్మానుభూతి లభిస్తున్నాయి.

ప్రియ రాఘవా! గురువు యొక్క ఉపదేశంచే 'శబ్దవృత్తులు' మాత్రమే జనిస్తున్నాయి. అయితే, బ్రహ్మం ఇంద్రియాలన్నిటి కంటే పరం అయినది కదా! ఇంద్రియాలను నియమించేది, ఉపయోగించేది అయిన బ్రహ్మం ఆ ఇంద్రియాలకు విషయం ఎట్లా ఎవుతుందో చెప్పు? ఇక శబ్దబోధల విషయానికి వస్తే అవన్నీ ఇంద్రియజ్ఞానానికి సంబంధించిన చిత్తవృత్తులచే రచించబడినవే కదా! ఇదంతా

దృష్టిలో పెట్టుకుంటే, 'నిత్య, అపరోక్ష బ్రహ్మానుభవం శిష్యుని శుద్ధబుద్ధియందే ఉద్భవిస్తోంది. అంతే గాని కేవల ఉపదేశమాత్రంచేత అది ఆత్మతత్త్వోదయమునకు స్వయంగా హేతువు కాజాలదు' ... అని ఎవరైనా గ్రహించవచ్చు.

అయితే మరొక్క విషయం. చిల్లిగవ్వకోసం వెతికి ఉండకపోతే ఆ బోయవానికి అసలు చింతామణియే కనబడేది. కాదు కదా! అట్లాగే గురూపదేశం, పురాణాదుల సంసేవనం లేకపోతే ఆత్మతత్త్వం ప్రాప్తించదు. మహదర్థరూపమైనట్టి ఆత్మతత్త్వం ఒకడు పొందటానికి సూటిగా గురూపదేశమే కారణం కాకపోయినప్పటికీ... 'గవ్వకోసం వెతకటమే చింతామణి దొరకటానికి కారణం' అనునది మనం కాదని అనలేం కదా! గురూపదేశం వింటూ ఉండగా శిష్యుని ప్రజ్ఞను అనుసరించి ఎప్పుడో ఆత్మతత్త్వానుభవం లాభిస్తోంది.

పశ్య రాఘవ! మాయేఽ మం, మోహినీ మహతామపి ।
అన్యత్ అన్విష్యయతే యత్నాత్! అన్యత్ ఆసాద్యతే ఫలమ్ ॥

చూడు రామా, ఎంత చమత్కారమో! ఈ మాయ మహాత్ములైన వారిని కూడా మోహింపజేస్తోందయ్యా! యత్నశీలురై గురుశిష్య వ్యవహారమునందు, అన్వేషించేదేమో ఒక వస్తువు కోసం. తీరా ఫలితం చూస్తే ఆ దొరికేది మనోవాక్కులకు విషయం కానే కానట్టి వస్తువు!

మనుజుడు ఒక పనికోసం యత్నం కొనసాగిస్తూ ఉండగా, మరొకటైన ఫలితమో, ప్రయోజనమో ఒనగూడటం లోకంలో అందరికీ అనేక సందర్భాలలో అనుభవమయ్యే విషయమే. ఒకదాని కొరకై చూస్తూ ఉండగా, ఇంకొకటేదో కనబడుతుంది. ఒకదాని కొరకై వింటూ ఉండగా ఇంకొకటేదో వినబడుతుంది. అట్లాగే ఈ జీవుడు కూడా దేని కోసమో (దృశ్య-పలముల కోసం) అంతరంగంలో ఉద్దేశించి తీవ్రప్రయత్నం జరుగుచుండగా ఆత్మజ్ఞానమే లభిస్తోంది.

శాస్త్రములు జీవుని ప్రయత్నమునందు అట్టేబెట్టి ఉంచటానికి ఉపకరిస్తున్నాయి. గురువులు పరోక్షస్మృతి కలిగిస్తున్నారు. శిష్యుడు అపరోక్షజ్ఞానం సంపాదిస్తున్నాడు.

ఆత్మజ్ఞానమే నిజమైన సంపాదన. అందరూ దేహం ఉండగానే ఆర్జించవలసినది అదే! అట్టి ఆత్మజ్ఞానం సంపాదించుకుని, ఆ తరువాత ఇక శేషించిన జీవితమున తారసపడే ఈ జగద్భ్రమను అసంగముగాను అనిచ్ఛాపూర్వకంగానూ గడపటం శ్రేయస్కరమని నా ఉద్దేశం.

❖❖❖

18. శిఖిధ్వజ వనవాసం

శ్రీ వసిష్ఠ మహర్షి: ఇక శిఖిధ్వజుని విషయానికి వద్దాం! అతడు మూడు సంవత్సరముల జైత్రయాత్ర దిగ్విజయంగా ముగించుకొని మాతృదేశం చేరాడు. అయితే, అతడు తత్త్వజ్ఞానం సంపాదించుకోక పోవటంచేత అనేక మోహాంధాకారములలో చిక్కుకుని ఉన్నాడు. తాను మహారాజు కనుక తనకు అభీష్టమైన వస్తువులకేం కొదువలేదు. కాని... "ఈ రాజ్యభోగాలన్నీ ఆత్మజ్ఞానంముందు తుచ్ఛమైనవే గదా! మరి నాకు ఆత్మజ్ఞానం లభించటమెట్లా?" ...అని ఎప్పుడూ వ్యాకులపడుతూ ఉండేవాడు.

అతని మనస్సు ఎక్కడో కొండగుహలలోనో, అరణ్యప్రదేశాలలోనే ఏకాంతంగా ఉండాలని కోరుకుంటూ ఉండేది. మన ఈ విశ్వామిత్రమహర్షి నిన్ను తీసుకువెళ్ళటానికి వేంచేయకమునుపు నీవు అంతః పురంలో పరధ్యానంగా ఉండేవాడివే! అట్లాగే ఆ శిఖిధ్వజుడు కూడా భృత్యుల సాంత్వన అనునయ వాక్యాలతో బ్రతిమలాడితే గాని దైనందిన క్రియలను కూడా నిర్వర్తించే వాడు కాదు. నిరంతరం వైరాగ్యశీలుడై ఒక సన్న్యాసిలాగా ఉండాలని ఎప్పుడూ కోరుకునేవాడు. రాజ్య సంపదలను తలచు కున్నప్పుడల్లా ఆతనిలో విరక్తి ఇంకా ఎక్కువ అయ్యేది. ఇక అక్కడి నుండి ఆత్మజ్ఞానోదయం కోరుకున్నవాడై రకరకాల ప్రయత్నాలు ప్రారంభించాడు. బ్రాహ్మణులకు, దేవాలయాలకు, స్వజనులకు అనేక భూ-సువర్ణదానాలు సమర్పించాడు. చాంద్రాయణాది అనేక వ్రతాలు నిర్వర్తించాడు. అనేక పవిత్రక్షేత్రాలను, వనములను, తదితర పవిత్ర ఆశ్రమాలను సందర్శించి, అక్కడక్కడ కొద్ది రోజులు గడిపివచ్చాడు. అంతా బాగానే ఉన్నది కాని, ఏ లాభం? నిధిని కోరుకునే వాడు ఎంతగా త్రవ్వినా నిధి లభించకుంటే ఎంత నిరుత్సాహంగా ఉంటాడో, ఆ రాజు కూడా శోకరాహిత్యము సంపాదించుకోలేక పోయాడు. దైన్యం, నిరుత్సాహం అతని వెంటనంటి ఉండేవి. రాత్రులందు అతనికి నిద్రపట్టేది కాదు. 'నా ఈ సంసారవ్యాధికి ఔషధం ఏమిటిరా?' అని ఎల్లప్పుడూ చింతిస్తూ ఉండేవాడు. ఆ రాజ్యం, రాచరికపు మర్యాదలు, తదితరమైన సంరంభాలు ఆతనికి విషం వలె కనిపించేవి. వాటిపట్ల ఆతనికి రోతపుట్టింది. ఎదురుగా ఉన్న మహావిభవములన్నీ ఆతనికి గొప్ప బంధనాలుగా తోచేవి. ఒకరోజు ఒక ఏకాంత స్థలంలో తన ప్రక్కనే కూర్చుని ఉన్న తన ప్రియాతిప్రియ చూడాలతో ఇలా పలికాడు.

శిఖిధ్వజుడు : ఓ ప్రేయసీ! చూడాలా! చాలాకాలం ఈ రాజ్యం, రాజ్యవిభవములు అనుభవించాను కదా! ఇప్పుడు నాకు ఎంతో వైరాగ్యం కలుగుతోంది. అందుచేత వీటన్నిటినీ వదలి అడవులలో ఏకాంత ప్రదేశం ఆశ్రయించాలని అనుకుంటున్నాను. వనవాసియగు మునికి ఇక్కడి సంసారంలో ఉండే దుఃఖాలు, సుఖాలు, ఆపదలు, సంపదలు ఉండవు కదా! అందుచేత ఇవి కల్పించే మోహాల నుండి తప్పించుకోవటం తేలిక అవుతుంది. రాజుగా ఉన్నంతవరకూ "అయ్యో! ఈ రాజ్యం ఏమౌతుందో? శత్రురాజులు బలం పుంజుకుంటున్నారేమో! వారితో యుద్ధం చేయగల సామర్థ్యం సంపాదించటం ఎట్లా? ఒకవేళ యుద్ధం చేశామనుకో... అది జన నష్టానికి కారణమై అదంతా పాపంగానే పరిణమిస్తుంది కదా!" ...ఇటువంటి సమస్యలు వనవాసులకు ఉండవు కదా! నా ఉద్దేశంలో ఈ రాజ్యాలు ఏలే వారికంటే వనవాసులదే ఉత్తమమైన సుఖం అయి ఉన్నది. పైగా, అరణ్యాలలోని ప్రకృతి సాధనపరులకు అత్యంత అనుకూలంగా ఉంటుంది. ఏకాంతమగు వనాలలో ఈ మనస్సుకు లభించే సుఖం ఇంద్రలోకంలో గాని, బ్రహ్మలోకంలో గాని, చంద్ర లోకంలో గాని అనేక మంది మధ్య గడిపేవారికి గాని ఏమాత్రం లభించదని నేను గమనించాను. నేను ఏకాంత ప్రదేశం వెతుక్కుంటూ అరణ్యములలో ప్రవేశించదలచాను. అందుకు నీవు అడ్డుచెప్పవనే అనుకుంటు న్నారు. నీవంటి కుల స్త్రీలు భర్త కోరికలకు ప్రతికూలంగా వ్యవహరించరనేది లోకవిదితమే కదా!

చూడాల : హే ప్రాణనాథా! ఏ సమయంలో ఏ కార్యం ఉచితమో ఆ సమయానికి ఆ కార్యం నిర్వర్తించటమే 'శోభ'అని అనిపించుకుంటుంది. ఆ ప్రకృతిని చూడండి. వసంతకాలంలో పుష్పాలు

పుష్పిస్తాయి. శరత్కాలానికి ఫలములు శోభిస్తాయి. అదే అందం కదా! 'వానప్రస్తం' అనే ఆశ్రమం వార్ధక్యం వచ్చిన వారికి ఉచితం. మీ వంటి యౌవనవంతులకు వనవాసం ఉచితమెట్లా అవుతుంది? అందుచేత వనవాసానికి ఇప్పుడు మీరు వెళ్ళాలనుకోవటం నాకేమాత్రమూ ఇష్టం లేదు.

మనిద్దరం వార్ధక్యచిహ్నాలు వచ్చేవరకు ఈ గృహస్థాశ్రమం నిర్వర్తిద్దాం. వార్ధక్యం పొడచూపగానే ఇద్దరం కలిసి వనవాసానికి వెళ్ళిపోదాం. ఎందుకా? మీరు మహారాజు. ఏదో మామూలు గృహంలో నివసిస్తున్నవారు కాదు. ఇప్పుడు సమయం కాని సమయంలో ప్రజాపాలనను వదలి వనవాసానికి వెళ్ళిపోతే, స్వధర్మమును నిర్వర్తించకపోవటం చేత, అది పాపమే అవుతుంది కదా! ఉచితమైన సమయం ఆసన్నం కాకుండా మీరు రాజ్యపాలనను వదలి అడవులలోకి వెళ్ళి తపస్సు చేసుకుంటానంటే రాజ్యం సంగతి, ప్రజల సంగతి ఏం కావాలి? సేవకుడు చెప్పాపెట్టకుండా యజమానిని విడిచి వెళ్ళితే ఆ యజమాని అనేక విషయాలు తెలియక ఇబ్బంది పడడా? అట్లాగే ఈ మన ప్రజలు కూడా ఇబ్బందులు పాలు అవరా? మీ మంత్రులు, సేనాధిపతులు తప్పక అడ్డుకుంటారని నా ఉద్దేశం.

శిఖిధ్వజుడు : ఓ కమలనేత్రీ! నీవు చెప్పిన విషయాలన్నీ నేను ముందుగానే ఆలోచించాను. దయ చేసి నా ఈ వనవాస ప్రయత్నానికి విఘ్నం కలిగించవద్దు. ఇప్పటికే నేను ఏదో సుదూరమగు వనములకు ఏకాంతవాసం కోసం తపస్సు చేసుకోవటానికి వెళ్ళినట్లే భావించు. ఈ విషయమును ప్రజలకు తగు సమయంలో తెలియజేసి వారి ఆలన - పాలన నీవు చూస్తూ ఉండు.

చూడాల : పోనీ, మీరు లేని ఈ రాజ్యం నాకెందుకు? నేను కూడా మీ వెంట వనవాసానికి వస్తాను. కాదనకండి.

శిఖిధ్వజుడు : లేదు చూడాల! నీవింకా చిన్న పిల్లవు. నీవు వనములకు వచ్చి అక్కడి దుర్భరజీవితం గడపటం ఉచితం కాదు. వనవాసమనేది పురుషులకే ఎంతో కష్టసాధ్యమైన విషయం. కఠినమైన అవయవాలు గల వారికే వనవాసం ఎంతో కష్టమనిపిస్తుంది. నీ వంటి అతి సున్నితమైన దేహం కలవారు వనవాసానికి అసలు ఏమాత్రం అర్హులే కాదు. నా మాట విని ఈ రాజ్యాన్ని పరిపాలిస్తూ నీవు ఇక్కడే ఉండు. నీవు నా సహధర్మచారిణివి. అర్ధాంగివి కదా! ఇంటి యజమాని ఎటైనా వెళ్ళి నపుడు కుటుంబాన్ని నడిపించటం స్త్రీలకు గొప్ప వ్రతం అవుతుంది. నీవిక్కడే ఉండి నేను నిర్వర్తించ వలసియున్న రాజ్యపాలనను నిర్వహించు. నీ పాలనాసామర్థ్యముపై నాకు-మనప్రజలకు నూటికి నూఱుపాళ్ళు నమ్మకం ఉన్నది.

ఈ శిఖిధ్వజుడు మరింకా ఏమీ మాట్లాడకుండా, జవాబు కోసం వేచి ఉండకుండా అక్కడి నుండి లేచాడు. గబగబా రాజాంతఃపురానికి నడచి వెళ్ళాడు. చూడాలకు అవాక్కవుతూ, ఏం మాట్లాడటానికి పాలుపోక, భర్తను అనుసరించి తాను కూడా అంతఃపురంలో ప్రవేశించింది. ఇంతలో బాగా చీకటి పడింది. ఆ దంపతులిద్దరూ దైనందికమైన స్నానాదులను, సాయం సంధ్యా వందనాది కార్యములను నిర్వర్తించారు. శిఖిధ్వజుడు తనకత్యంత ప్రీతీపాత్రురాలగు చూడాల సహవాసంతో శయనాగారమున నిదురించాడు.

❖

అర్ధరాత్రి అయింది. పట్టణ ప్రజలంతా గాఢ నిద్రకు ఉపక్రమించటం చేత వీధులన్నీ నిర్మానుష్యమై నిశ్శబ్దమును సంతరించుకుని ఉన్నాయి. శిఖిధ్వజుడు మెల్లగా కనులు తెరిచాడు. తన గుండెపై అరచేయి ఉంచి గాఢనిద్రను అనుభవిస్తున్న చూడాల ముఖంవైపు చూచాడు. నెమ్మదిగా ఆమె చేయిని నిద్రాభంగం కాకుండా ప్రక్కకు పెట్టి శయనము నుండి లేచాడు. చిన్న నిట్టూర్పుతో మనస్సులోనే 'శలవు' చెప్పాడు. శయనాగారం నుండి బయటకు వచ్చాడు. అక్కడ అంతఃపురంలో సంచరించే అంగరక్షకులతో "నేను ఒంటరిగా దొంగలను, దుష్టాచారపరులను నిగ్రహించటానికి బయలుదేరుచున్నాను. మీరంతా మీమీ నియమితకార్యములలో జాగరూకతతో నిమగ్నులై ఉండండి" అని ఆజ్ఞాపించి నిస్పృహుడగు ఆ రాజు అక్కడి నుండి బయలుదేరాడు. కొద్ది దూరం నడచిన తరువాత ఒక్కసారి వెనుతిరిగి 'ఓ రాజ్యలక్ష్మి! నీకు నమస్కరిస్తూ శలవు తీసుకుంటున్నాను' అని రెండు చేతులూ ఎత్తి నమస్కరించాడు. ఆతని కళ్ళు చెమర్చాయి. ఆప్యాయతతో అక్కడి రాజ్య పరిసరలములను కళ్ళతో చూచి ఇక ప్రయాణం కొనసాగించసాగాడు.

❖

క్రమంగా నడచుకుంటూ అంధకార బంధురము, భయంకరము అయిన ఒక అరణ్యంలో ప్రవేశించాడు. ఆ మహారణ్యం దాటే సరికి భళ్ళున తెల్లవారింది. అక్కడి నుండి శూన్యారణ్యం వైపుగా పోవుచూ త్రోవలో గల ఒక తటాకం వద్ద సంధ్యాది క్రియలు నిర్వర్తించాడు. మరల ఒక వనం వరకు నడిచే సరికి సాయం సమయమైనది. అక్కడ సాయంసంధ్యా క్రియలు నిర్వర్తించి అక్కడ దొరికే కొన్ని పళ్ళు భుజించి అక్కడనే ఒక అనువైన ప్రదేశంలో ఆ రాత్రి విశ్రాంతి తీసుకున్నాడు. ఈ విధంగా వనాలు, దట్టమైన అడవులు, పురములు, పర్వత ప్రాంతాలు, నదీ ప్రాంతాలు దాటుతూ 12 రోజులు ప్రయాణించి మనుజులెవ్వరూ ప్రవేశించని మందర పర్వతంపై గల ఒక దుర్గమమైన అరణ్యంలోకి ప్రవేశించాడు. అక్కడ క్షుద్ర జంతువులు సంచరించనట్టి ఒక అందమైన ప్రదేశం కనబడింది. అక్కడ అప్పటికప్పుడు పూలతలను ఉపయోగించి ఒక ఆశ్రమం నిర్మించుకున్నాడు. ఆ ప్రక్కనే ఒక సెలయేరు ప్రవహిస్తూ ఆ ప్రదేశం ధ్యానాదులకు, నివసించటానికి యోగ్యమై ఉన్నది. అక్కడి అడవులలో సంచరించి వెదురు దండం. భోజనపాత్ర, పూజాపాత్ర, పుష్పాల పాత్ర, కమండలం, రుద్రాక్షమాల, చలి కాచుకోవటానికి నారతో తయారు చేసుకున్న ఒక బొంత, ఆసనం, మృగచర్మం మొదలైన వస్తువులను సంపాదించుకున్నాడు. ఆ కుటీరమును నివాసయోగ్యంగానూ, ధ్యానానుకూలం గాను అమర్చుకున్నాడు. ఇక సాధనకు ఉపక్రమించాడు.

తెల్లవారు జామున లేవటం, ప్రాతః సంధ్యాపూర్వకంగా జపం చేయటం, ఆ తరువాత చుట్టు ప్రక్కల వనములలో పూలు కోసుకొని రావటం, పూజ నిర్వర్తించటం, రాత్రిపూట ఫలములను కందమూలములను, ఇంకా, అక్కడే దొరికే సాత్త్వికాహారవస్తువులను సేవించటం... ఈ విధంగా ఆ పర్ణశాలలో సాధనను కొనసాగిస్తూ ఆ శిఖిధ్వజుడు చాలా రోజులు గడిపాడు. తన రాజ్యం గురించి గాని, అక్కడి తదితర రాజకీయ విశేషాల గురించి గాని, తన ప్రియురాలు చూడాల గురించి గాని అతడు స్మరించేవాడు కూడా కాదు. హృదయంలో వివేకం జనిస్తూ ఉంటే ఇక

అల్పవిషయములగు రాజ్య సంపదల గురించి ఇళ్ళు-వాకిళ్ళ గురించి తలచుకొనే వాడెవడు, ఒక్క మూర్ఖుడు తప్ప?

❖❖❖

19. చూడాల - శిఖిధ్వజ పునఃదర్శనం

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఆ విధంగా మందర పర్వతారణ్యంలో శిఖిధ్వజుడు కుటీరం కట్టుకొని ఉండగా ఇక్కడ చూడాల ఏం చేస్తోందో చూద్దాం.

❖

ఆ అర్ధరాత్రి శిఖిధ్వజుడు శయనాగారం నుండి లేచి రాణిని, రాజ్యాన్ని వదలి వెళ్ళిపోయాడు కదా! తెల్లవారుజామున చూడాలకు మెళుకువ వచ్చింది. ప్రక్కన శిఖిధ్వజుడు ఉండవలసిన చోటు శూన్యమై ఉండటం గమనించింది. ఆమె ముఖం మ్లానమైంది. హృదయములోని ఖేదం చేత ఆమె అందమైన ముఖం స్వేదబిందువులను వర్షించాయి. వ్యాకులత, నిరుత్సాహం పొంది కొద్ది క్షణాలు ఆ శయ్యమీదనే కూర్చుని ఇట్లు అనుకోసాగింది.

చూడాల : (తనలో) ఆహా! నా పతి నన్ను విడచి వనవాసానికి వెళ్ళినట్లే ఉన్నారే! ఈయన వెళ్లిపోవాలనుకోవటం ఎంతటి దుఃఖకరమైన విషయం! ఇప్పుడు నా కర్తవ్యమేమిటి? నేను కూడా నా పతి ఉన్న చోటికి వెళ్ళటమే బాగుగదా! ఎందుకంటే పతియే ఏ స్త్రీకైనా శరణ్యస్థానమని శాస్త్రాలు చెప్పుచున్నాయి.

ఇట్లా ఆలోచించి ఆమె భర్తను అనుసరించటానికే నిశ్చయించుకున్నది. యోగశక్తితో శయ్య నుండి పైకి లేచింది. అణిమాదిసిద్ధులను ఉపయోగించి కిటికీ గుండా బయల్వెడలి ఆకాశమార్గాన్ని ఆశ్రయించింది. సిద్ధులకు కూడా ఆశ్చర్యం గొలిపేటట్లుగా ఆకాశమార్గంలో పరిభ్రమించుచు తన భర్త కొరకై అటూ ఇటూ సంచరించింది. ఒక కీకారణ్యంలో ఖడ్గధారి అయి శిఖిధ్వజుడు అడుగులు ముందుకు వేస్తూ వెళ్ళుచుండటం గాంచింది. ఆకాశకోశముననే ఉండి భర్తను గమనిస్తూ ఒక్కసారి భవిష్యత్తులోకి తొంగిచూసింది. యోగబలం చేత తన భర్త ఎట్లు ఏ నిమిత్తం చేత ఏ దేశ కాలములందు ఎట్టి క్రియలచే అభ్యుదయం పొంది నిరతిశయ బ్రహ్మానందమును సంపాదించుకోబోవుచున్నాడో... అదంతా కొద్ది క్షణాల కాలంలో వీక్షించింది. భవిష్యత్తులో తన భర్త అవశ్యం పొందుబోవు దానిని సుస్పష్టంగా గమనించింది. అట్టి భవిష్యత్తుకు అనుకూలంగా ఉండటమే ఉచితమని భావించి తన గమనాన్ని ఆపింది.

"ఇప్పుడు నేను నా భర్తను సమీపించటం ఉచితం కాదు. చాలా కాలము గడచిన తరువాత మాత్రమే నేను అతనిని సమీపించగలను. ఈశ్వర నియతిని ఎవ్వరు అడ్డుకోగలరు? పైగా, ఆతని నిష్ఠ నా వలన కుంటుపడటం, అందుకు నేను కారణమై ఉండటం మంచిదా? కానే కాదు. నా భర్త ఆజ్ఞాపించినట్లు నెరవేర్చుట చేతనే అతనికి మరింత ప్రియార్హురాలను కాగలను కదా!"

...ఇట్లు యోచించి చూడాల వెనుకకు మరలింది. మరల అంతఃపురంలో ప్రవేశించి శయనస్థానమున నిద్రించింది. ఆ మరునాడు రాజసభలో ప్రసంగిస్తూ 'ఓ సభికులారా! పుర ప్రముఖులారా! మన శిఖిధ్వజ మహారాజు రాజ్యరక్షణ, ప్రజా సంక్షేమం ఉద్దేశించి ప్రవాసం వెళ్ళి ఉన్నారు. వచ్చేసరికి చాలా రోజులు పట్టవచ్చని ఆజ్ఞాపించి ఉన్నారు. ఆయన వచ్చేవరకూ మనందరమూ అత్యంత జాగురూకులమై ధర్మపాలన, రాజ్యవ్యవహారాలు నిర్వర్తించాలని మహారాజు యొక్క నిర్దేశము' ...అని ప్రకటించింది. ఇక ఆ రోజు నుండి సమదృష్టితో ప్రజాహితంగా రాజ ప్రతినిధిగా రాజకార్యాలను నిర్వర్తిస్తూ ఉండేది. ఆ శిఖిధ్వజ-చూడాల దంపతులు ఒకరు అరణ్యం లోను, రెండవవారు రాజ్యంలోను ఉండి ఆయా ధర్మాలు నిర్వర్తిస్తూ ఉండగా రోజులు, పక్షాలు, నెలలు సంవత్సరాలు గడచిపోయాయి. కాల ప్రవాహం ఎవరికోసం ఆగుతుంది? ఈ విధంగా పద్దెనిమిది సంవత్సరాలు గడచిపోయాయి.

❖

కాలం ఎంత చమత్కారమైనది! ఇది చూస్తూ-అది వింటూ ఉండగానే రోజులు-సంవత్సరాలు గడచిపోతాయి. విజ్ఞులు కాలమును ధనాదులకంటే అధికంగా సద్వినియోగ పరచుకుంటున్నారు.

అజ్ఞులో... కాలం యొక్క గతిని గమనించక ఆహార-నిద్రా-మైధునాది దృశ్యవ్యాపకాలలో సమయాన్ని వెచ్చించుచు రిక్తహస్తాలు మిగిల్చుకుంటున్నారు. కాలగతిచే పదే పదే మోసగించబడు చున్నారు.

పద్దెనిమిది సంవత్సరములు గడచిపోయిన తరువాత ఒక రోజు చూడాల ఇట్లు అనుకున్నది.

చూడాల : (తనలో) ఇన్ని సంవత్సరములు నా భర్త శిఖిధ్వజుడు సాధన చేసి ఉండటం చేత అతని సర్వ రాగ-ద్వేషములు అంతరించి ఉంటాయి. అప్పటికి ఆత్మతత్త్వజ్ఞాన ప్రాప్తికి అర్హమైన సమయం ఆసన్నమైనట్లే. ఇంకా అలశ్యం దేనికి?

ఆత్మకార్యం యొక్క భవితవ్యం నిర్వర్తించటానికి ఈ రోజే కార్యోన్ముఖురాలనై మందర పర్వత ప్రాంతంలో తపస్సు చేస్తున్న నా భర్తను సమీపిస్తాను.

❖

ఆ రాత్రే అంతఃపురం నుండి చూడాల బయలుదేరింది. వాయుమార్గంగా పయనిస్తూ ఆ మార్గంలో తారసబడే మహానుభావులగు సిద్ధ పురుషులకు నమస్కరిస్తూ త్రోవలో మేఘమండలమును, విద్యుత్ (మెఱుపు) సమూహాలను చూచింది. అది చూచి తన భర్త ఒడిలో తాను గడిపిన మధుర క్షణములు గుర్తుకొచ్చాయి. స్త్రీ సహజమైన భర్తృ సమక్షానందనము గుర్తుకు వచ్చింది. చిరునవ్వు నవ్వుతూ ఇట్లు అనుకున్నది.

చూడాల : (తనలో) ఈ జీవిత పర్యంతమూ ఈ ప్రాణుల స్వభావం యధాతధంగానే ఉంటుంది గాని, శమించదు కాబోలు! సింహం వంటి భుజాలతో పరమ ప్రేమాస్పదుడగు నా భర్తను త్వరగా చూడాలని నా మనస్సు ఉత్కంఠత పొందుతోందే! అనేక వివేక విషయాలచే బోధింపబడి కూడా ఈ

నా మనస్సు శిఖిధ్వజుని సమక్షం కొరకై ఉవ్విళ్ళూరుతోంది. ఎంత నిరోధించప్రయత్నించినా నా ప్రియుని దర్శనం కొరకు వ్యాకులపడుతోంది. ఈ మెల్లని వాయువులు, ఈ చంద్రకిరణాలు, ఈ మేఘపంక్తితో కాంతులు విరజిమ్మే మెఱుపులు ఇవన్నీ నా మనస్సు యొక్క ఉత్కంఠతను ఇంకా అధికం చేస్తున్నాయి కదా!

ఓ చిత్తం యొక్క అజ్ఞాన విభాగమా! నీవింకా వ్యర్ధ ఆడంబరాలను వదలలేదా? ప్రియచిత్తమా! ఆకాశం వలె నిర్మలమైన నీ వివేకమంతా ఇప్పుడు ఏ చోటికి పోయింది? అయినా చిత్తసఖీ! ఇదీ నీ తప్పు కాదులే! నీ పతి యొక్క ప్రేమను ఎంతగానో పొందినట్టి నీవు అతని కోసం ప్రత్యుత్సాహ పడటంలో ఆశ్చర్యం ఏమున్నది? ఏది ఏమైతేనేం! నీవు నీ చాంచల్యంచే ఎట్లు ప్రవర్తించినా సాక్షి స్వరూపం – నిశ్చలం అగు నా ఆత్మ స్వరూపానికి వచ్చే లోటు ఉండదు. కదా!

ఓ 'చూడాల' నామంతో పిలువబడుచున్న పాంచభౌతిక స్త్రీ శరీరమా! నీవు వ్యర్థంగా ఎందుకు దేని కొరకై సముత్సాహపడుచున్నావు? ఎవని కౌగిలింతకై తత్తరపడుచున్నావో ఆ నీ ప్రియసఖుడగు శిఖిధ్వజుని దేహం ఇప్పుడు వృద్ధత్వం సంతరించుకుని ఉంటుంది కదా! పైగా 18 సంవత్సరాలు ఏకాంతంగా తపస్సు చేస్తూ ఉండటం చేత ఎంతో కృశించి ఉంటుంది. ఇక అంతటి తపస్సు ప్రభావం చేత వాసనారహితుడై ఉంటాడు. అతని మనస్సు స్త్రీని లాలించే ఉత్సాహం కలిగి ఉంటుందని ఎట్లా అనుకుంటావు?

ఎక్కడెక్కడో వర్షం కురిస్తే ఆ జలమంతా నదిలోకి ప్రవహించిన తరువాత ఏ నీరు ఎటునుంచి వచ్చిందో భేదమేమైనా నదీజలంలో అగుపిస్తుందా? నా భర్త యొక్క మునుపటి, ఇప్పటి, ముందు ముందు వాసనలన్నీ ఆత్మ కంటే భిన్నం కాదు. ఆతడిప్పుడు ఆత్మానుభవమొక్కటే లక్ష్యంగా కలిగి ఉంటాడు కదా! ఏకాంతంలో అనాసక్తుడై, ఏకాత్మరూపుడై, ఇచ్ఛారహితుడై ఉన్న నా భర్త యొక్క భౌతికమైన కరస్పర్శకు ఈ నా కరాలు ఉత్సుకత పొందటం ఒక చమత్కారమే అవుతుంది.

ఓ నా చిత్తమా! ఇప్పుడా శిఖిధ్వజుడు శుష్కించిన మహావృక్షంలాగా చిక్కిశల్యమై కనబడతాడని నేను ఊహిస్తున్నాను. అయినా కూడా నీతో బాటే నేను కూడా ఆతనిని త్వరగా చూడాలని ఉత్కంఠ పొందుచున్నాను. నేను యోగబలం చేత ఆతనిని ఆత్మజ్ఞానిగా చేస్తాను.

ఆత్మజ్ఞాని అయిన తరువాత ఆతని మనస్సును సంకల్పం వైపు కించిత్ ఉన్ముఖం చేస్తాను. అప్పుడాతనిని ఆలింగనం చేసుకుంటాను. మరల ఆతనిని రాజ్య పట్టాభిషిక్తునిగా చేసి ఇక ఈ శేష జీవితాన్ని ఇద్దరం సుఖంగా గడిపివేస్తాం. ఆహా! చాలా కాలానికి నా మనోరథం సిద్ధిస్తోంది.

అయినా, తత్త్వచింతనలో నా భర్త తక్కువ వాడా? కాదు. గొప్ప మహాసామ్రాజ్యాన్ని, అనేక విజయ పరంపరలచే లభించిన పెద్ద ధనాగారాన్ని నన్ను ...జ్ఞానసముపార్జన కొరకై ఒక్క క్షణంలో విడచి అరణ్యంలో ఏకాంత ప్రదేశం చేరిన గొప్ప జ్ఞానసంపన్నుడు. బాహ్యా–అభ్యంతరములలో కూడా గొప్ప విచారణాతత్పరుడు కాబట్టే రాజ్యము యొక్క ఊసైనా ఎత్తకుండా పద్దెనిమిది ఏళ్ళు వనవాసంలోనే ఉన్నాడు. కనుక అంతటి మహనీయుడగు నా భర్తతో పునఃసమాగమం చిన్న

విషయమెట్లా అవుతుంది? మా ఇద్దరిదీ జ్ఞానమార్గమే కదా! సమానమైన మనోవృత్తులు కలవారు ఒకరినొకరు కలియటం సమస్త సుఖముల కంటే అత్యంత అధికమైనది కదా!

❖

ఇట్లా ఆలోచనలు చేస్తూ ఆ చూడాల తన భర్త నివసిస్తున్న పర్ణశాలను సమీపించింది. ఏకాంతంగా నివసిస్తున్న తన భర్తను అశరీరి అయి చూసింది. ఆహా! ఆతని శరీరపు తీరే మారిపోయింది కదా! ఒకప్పుడు కిరీటము, కుండలాలు, ఇంకా ఎన్నో దివ్యాభరణాలు ధరించిన శరీరం ఇప్పుడు ఎండుటాకు వలె చిక్కి శల్యమై ఉన్నది. అతడు ఇచ్ఛారహితుడై, నార వస్త్రములు ధరించి ఏకాకిగా ఉన్నాడు. ఆ వనంలో ఒకచోట కూర్చుని పూలతో మాలను కట్టుచున్న తన భర్తను చూసి ఎంతో విషాదం పొందింది. "ఆహా! అజ్ఞానంచే కలుగు మూర్ఖత్వం ఎంత భయంకరమైనది! మూర్ఖత్వం చేతనే కదా, ప్రాణులు అనేక నీచాతినీచ పరిస్థితులు పొందుచున్నారు! ఏది ఏమైతేనేం? నా భర్త రాగద్వేషాల నుండి విడివడి ఉన్నాడు కదా! ఈతని నిర్మల చిత్తంలో ఆత్మతత్త్వం చాలా తేలికగా ప్రతిఫలిస్తుంది"...అని తలచసాగింది. అగ్నిష్టోమ (అగ్ని – చంద్రధారణ) యోగాన్ని కొద్ది క్షణాలు ధ్యానం చేసింది.

❖❖❖

20. సుఖ దుఃఖాదులన్నీ - స్వయంకల్పిత మాత్రములే!

శ్రీ వసిష్ఠ మహర్షి : శిఖిధ్వజుడు తాను ప్రతి రోజూ పూజచేసే ఈశ్వరునికి పుష్పాలంకారం చేయాలని అందమైన ఘుమఘుమలాడే పుష్పాలతో మాల కట్టుచూ ఏదో చిన్నచప్పుడైనట్లు ఉంటే తల ఎత్తి చూచాడు. ఎదురుగా అల్లంత దూరం నుండి చిరునవ్వు చిందిస్తూ ఒక ముని బాలకుడు తాను కూర్చుని ఉన్న వైపుగా నడచి వచ్చుచుండటం గమనించాడు. బాలకుడు విభూతిరేఖలతో, మూర్తీభవించిన తపఃశక్తి వలె ఉన్నాడు. ఆతని దేహం బంగారపు ఛాయతో మెరుస్తోంది. మెడలో తెల్లని ముత్యాలహారం వ్రేలాడుతోంది. తెల్లని జందెం, పట్టు వస్త్రములు ధరించి ఉన్నాడు. రెండు చేతులలోనూ వీణ వ్రేలాడుతోంది. చేతులకు, మెడలోను రుద్రాక్షమాలలు అలంకరించుకొని ఉన్నాడు. ఆతని పాదములు నడుస్తున్నప్పుడు నేలను అంటక భూమికి జానెడు ఎత్తులో ఉన్నాయి. చెవుల కుండలాలు ధగధగాయమానంగా మెరుస్తున్నాయి. ముఖం గొప్ప తేజస్సుతో మెరుస్తోంది. గొప్ప దేహపుష్టితో కనిపిస్తున్నాడు. నుదుటిన తెల్లటి భస్మం తిలకంగా ధరించాడు. ఆ ముని బాలకుడు తనవైపే రావటం గమనించి శిఖిధ్వజుడు తటాలున లేచి నిలుచున్నాడు. "ఎవ్వరో దేవతా కుమారుడు కాబోలు, ఎందుకో ఇటు వస్తున్నాడు" అని తలచాడు. వినమ్రతతో పాదుకలను విసర్జించి రెండు చేతులూ జోడించి ఆతనికి ఎదురేగాడు.

శిఖిధ్వజుడు : ఓ దేవరాజ కుమారా! శిఖిధ్వజ నామధేయుడగు ఈ వానప్రస్థాశ్రమవాసి మీకు వినమ్రతతో నమస్కరిస్తున్నాడు. దయచేయండి. ఈ పత్రాసనం పై సుఖాసీనులవండి. నాచే అర్పించబడుచున్న ఈ పుష్పాంజలి స్వీకరించండి.

ముని బాలకుడు : ఓ రాజర్షీ! తమకు నమస్కారం. మీరు ప్రేమతో ఇస్తున్న పుష్పములు నాకు శిరోధార్యం. నాకు ఎంతో సంతోషాన్ని కలుగజేస్తున్నాయి. మీరు కూడా సుఖాసీనులవండి.

శిఖిధ్వజుడు : హే దేవపుత్రా! తమరి దర్శనముచే ఈ రోజు అత్యంత ఫలప్రదమైందని తలచుచున్నాను. ఈ అర్ఘ్యపాద్యములు స్వీకరించండి.

ఇక చెప్పండి. తమకు సర్వదా శుభమగు గాక! తమరు ఎచ్చటి నుండి ఇటువైపుగా వస్తున్నారో, తమ నామధేయాదు లేమిటో, ఏమికోరి ఇటువైపుగా దయచేసారో, మేము మీకు ఎట్టి సేవ చేయ గలమో శలవీయ ప్రార్ధన. ఈ వానప్రస్థాశ్రమ దేహి మిమ్ములను సేవించి తద్వారా మీ దర్శన భాగ్యానికి కృతజ్ఞత తెలుపటానికి సిద్ధంగా ఉన్నాడు.

ముని బాలకుడు : ఓ రాజర్షీ! ఈ భూతలంపై నేను అనేక ప్రదేశాలలో సంచరించటం జరిగింది. ఎక్కడా కూడా మీ నుండి పొందినంతటి అతిథి పూజాసత్కారాలు పొంది ఉండలేదు. మీరు నిష్కాముడు గాను, పాపరహితుడు గాను కనిపిస్తున్నారు. ఇంతటి వినయం గల మీరు పరమేశ్వర అనుగ్రహించే దీర్ఘాయుష్కులయ్యెదరు గాక!

ఓ సాధూ! మొట్టమొదట మీ విషయమేమిటో చెప్పండి. సువిశాలమగు సామ్రాజ్యమును వదలి ఈ వనవాసానికి వచ్చారేమిటి? శాంతసమన్వితమగు మనస్సుతో సర్వ కోరికలు త్యజించి మోక్షం కొరకు మాత్రమే ఈ తపస్సు చేస్తున్నట్లు నాకనిపిస్తోంది. అయినా ఖడ్గధారవలె అతి కష్ట మైనది, అత్యంత సౌమ్య-శాంత చిత్తులకు మాత్రమే అర్హమైనది అయిన వానప్రస్థాశ్రమం ఇంత చిన్న వయస్సులోనే ఎందుకు స్వీకరించారు?

శిఖిధ్వజుడు : హే మహాత్మా! మీరు దేవతా స్వరూపులు గదా! అందుచేత చూడగానే అంతా గ్రహించగలగటంలో ఆశ్చర్యమేమున్నది? అవును. మీరన్నట్లు మోక్షమును సంపాదించగోరి ఈ వానప్రస్థాశ్రమం చాలా సంవత్సరాలుగా సేవిస్తున్నాను.

ఓ దేవా! మీయందు నాకు లోకోత్తరమైన శోభ కనిపిస్తోంది. గొప్ప ప్రతిభచే వెలుగొందు చున్నారు. తమ దేహం చంద్రుని యొక్క అమృతమయ కిరణాలచే నిర్మించబడినదా - అన్నట్లున్నది. తమ దర్శనంచే మనస్సు ప్రశాంతత, ఉత్తేజం, అనిర్వచనీయమైన ఆనందం పొందుచున్నాయి. మీ అవయవాలు అతి కోమలం, సుందరం అయి, నేను వదలి వచ్చిన రాజ్యాన్ని పాలిస్తున్న నా ప్రియపత్ని చూడాల దేహాన్ని గుర్తు చేస్తున్నాయి. హే మహాత్మా! శిరం నుండి పాదం వరకు పరమ శాంతం, మహారమణీయం ప్రస్ఫుటిస్తున్న మీ ఈ సుందరదేహానికి ఈ మల్లెపూల దండను కూడా సమర్పించటానికి నాకు అనుజ్ఞ ఇవ్వండి. పుష్పదళముల వలె అత్యంత కోమలంగా కనిపిస్తున్న మీ అంగాలు సూర్యరశ్మి తాకితే కందిపోతాయేమోననిపిస్తోంది. దేవపూజకై నిర్మించిన ఈ తెల్లటి పుష్ప మాల తమ దేహస్పర్శచే సాఫల్యం పొందుచున్నది.

హే మహానుభావా! మీకు తెలియని ధర్మములేమి ఉంటాయి? మనలను సమీపించిన అభ్యాగతి, ఎవ్వరైనాసరే, భగవంతునితో సమానం. అందులోనూ మీ వంటి దేవతామూర్తులు అభ్యాగతి అయి

రావటమంటే, అది మా మానవులకు భగవంతుడు ప్రసాదించే గొప్పవరం. స్వామీ! మరల అడుగుచున్నందుకు ఏమీ అనుకోకండేం! తాము ఎవరి పుత్రులు? ఏ నామధేయం మిమ్ములను అలంకరించి ఉన్నది? ఎక్కడి నుండి ఏ నిమిత్తం ఇటువచ్చి ఈ నా ఆశ్రమం పావనం చేస్తున్నారు?... ఈ సంశయాలు తొలగించమని వేడుకొనుచున్నాను.

ముని బాలకుడు : రాజా! ఇంతటి వినమ్రతతో అడుగుతుంటే చెప్పకుండా ఉంటానా? మీరడిగిన ప్రశ్నలన్నిటికీ సవివరంగా సమాధానం చెప్పుచున్నాను. వినండి.

ధర్మమూర్తి అయి, భక్తి పారవశ్యంతో నారాయణ జపం చేస్తూ, భక్తులకు ప్రియదర్శనం ప్రసాదిస్తూ ఈ ముల్లోకాలలో సంచరిస్తూ ఉండే నారద మహర్షి గురించి మీరు వినే ఉంటారు కదా!

శిఖిధ్వజుడు : నారదమహర్షి గురించి వినకపోవటమేమిటి? వారు మహాభక్త శిఖామణులు. అందరికీ ప్రాతఃస్మరణీయులు. ఆబాలగోపాలం వారి గురించి తెలుసు. వారు లోకకళ్యాణమూర్తులు కదా!

మునిబాలకుడు : వారి కుమారుడనే నేను.

శిఖిధ్వజుడు : ఆశ్చర్యం! వారు బ్రహ్మచారులు కదా!

మునిబాలకుడు : అవును. అది లోకవిదితమే. అయితే, ఒక విశేషం చేత నేను పుత్రుడనై జనించాను. ఆ దేవర్షి ఒకానొక సమయంలో మేరు పర్వతం పైగల ఒక గుహ యందు ధ్యాననిష్ఠులై ఉన్నారు. ఆయన తపస్సు చేస్తున్న గుహకు అతి సమీపంగా విశాలమైన తరంగాలతో గంగానది ప్రవహిస్తోంది.

ఒక రోజు ధ్యానము ముగిసిన తరువాత కళ్ళు తెరుస్తూ ఉండగా ఆ మహర్షికి గంగానదీజల ప్రాంతం నుండి జలక్రీడల యొక్క గొప్ప కోలాహలం వినిపించింది. "ఆశ్చర్యంగా ఉన్నదే! ఈ జన దూరమైన ఏకాంత ప్రాంతంలో సందడిగా జలక్రీడలాడుచున్నది ఎవరై ఉంటారు?" ...అనే కుతూహలంతో ఆయన గుహ నుండి బయటకువచ్చి చూచారు. వినోదంగా నది ఒడ్డుకు వచ్చి చూడగా రంభ, తిలోత్తమ మొదలైన అప్సరసలు జలక్రీడలాడుతూ కనిపించారు. పురుషులు లేనట్టిఆ ప్రదేశంలో వివస్త్రలై వారు నగ్న సౌందర్యంతో ప్రకృతినే పరవశింపజేస్తూ స్నానమాడు చున్నారు. అంత్యంతరమణీయమైన ఆ ప్రకృతి సౌందర్యాన్ని నగ్నదేహాలతో పరవశులై జలకాలాడుతున్న సౌందర్యరాసులైన ఆ అప్సరసలను చూస్తున్న ఆ నారదమహర్షి యొక్క మనస్సు అకస్మాత్తుగా వివేకరహితమైనది. ప్రమత్తత పొందింది. గ్రీష్మఋుతువు యొక్క చివరిలో గాలి తాకిడికి మేఘాలు వర్షించి ఫలాలు నేలరాలినట్లు ఆ మహర్షి వీర్యం స్ఖలితం అయింది. ఆతడు చ్యుతవీర్యుడైనాడు.

శిఖిధ్వజుడు : మహాత్మా మీరు చెప్పేది చాలా ఆశ్చర్యంగా ఉన్నదే? మహాజ్ఞాని, జీవన్ముక్తుడు, రాగ వర్జితుడు, ఇచ్ఛారహితుడు, పూర్ణస్వభావుడు, బాహ్య అభ్యంతరాలలో నిత్యం ఆకాశస్వరూపపుడై నిర్మలంగా విస్తరించి ఉన్నవాడు కదా, ఆ నారదమహర్షి! అంతటి బ్రహ్మర్షి అప్సరసలను చూచి చ్యుతవీర్యుడు అయినాడా? ఇది ఎట్లా సాధ్యం?

అభ్యాగత బాలుడు : ఓ రాజర్షీ! ఈ మూడు లోకాలలో ఉత్పత్తి అగుచున్న సమస్త ప్రాణులకూ,

ఆ మాటకు వస్తే... దేవతలకు కూడా... ఈ దేహ వ్యవహారమంతా స్వభావసిద్ధంగా రెండు విధాలుగా ఉంటోంది- 1. దుఃఖ స్వభావం, 2. సుఖ స్వభావం.

ఒకడు అజ్ఞాని కావచ్చు, జ్ఞాని కావచ్చు. ఈ దేహము ఉన్నంతవరకు ఇది సుఖదుఃఖమయమై ఉంటోంది. 'తృప్తి' కలిగించే పదార్థాలు లభించినప్పుడేమో సుఖం వృద్ధి చెందుతోంది. 'ఆకలి' మొదలైన వాటిచే దుఃఖం వృద్ధి చెందుతోంది.

అట్లా అవటానికి స్వభావమే కారణం. దేహం యొక్క దేహ-ప్రకృతి స్వభావమే సుఖదుఃఖాదులు వచ్చిపడటానికి కారణమగుచున్నాయి. దేహి తన యొక్క సత్య-నిర్మల-నిత్య-అప్రమేయ దేహి స్వభావాన్ని ఒక్క క్షణం ఏమరచాడా, దేహ స్వభావం ఆతనిని క్రమ్మివేయటానికి సిద్ధంగా ఉంటుంది. ఇక వర్షాకాలపు మేఘంలాగా ఆ దేహిపట్ల ఆ దృశ్యం ఉల్లాసం పొందగలదు, అందుచేత మనం నిరంతరం ఆత్మానుసంధానం చేయాలి. క్షణం - క్షణం మధ్య గల సంధిరూపమగు అతి స్వల్పకాలం కూడా ఆత్మను విస్మరించకూడదు.

స్వరూపే నిర్మలే సత్యే నిమేషమపి విస్మృతే ।
దృశ్యముల్లాసమాప్నోతి ప్రావృషీవ పయోధరః ॥

ఆత్మను (శరీరి స్వభావాన్ని) విస్మరించామా, దృశ్య పిశాచం చిత్తం నుండి ఉల్లాసం పొందుతుంది. సముద్రం వలె అన్ని శాస్త్రవిశేషాలు తన యందు కలిగి ఉన్న జ్ఞాని విషయంలోనూ అంతే. అజ్ఞాని విషయంలోనూ అంతే.

చీకటి - వెలుగులాగా, రాత్రి - పగలులాగా సుఖదుఃఖముల కలయికచే ఈ శరీరం స్థితి పొంది ఉంటోంది.

'ఈ దేహాదులే నా స్వరూపం, ఆ దేహాదులు ఆతని రూపం' ఈ విధంగా దేహాదుల పట్ల ఆత్మభావమును దేహి అజ్ఞానముచే దర్శిస్తున్నాడు. ఇంకేమున్నది? సుఖ - దుఃఖకారణములు రెండూ ఆతనియందు నాటుకొని ఉంటున్నాయి. తెల్లని వస్త్రమును నల్లని రంగు తాకితే, ఆ రంగు వస్త్రమును అంటుకుంటోంది. అదే ఒక స్ఫటికమును తాకితే అంటుకుంటుందా? తత్త్వజ్ఞానవశం చేత ఈ సుఖ-దుఃఖములు జ్ఞానిని స్పర్శించనైనా లేవు.

అందుచేత, ఈ జీవుడు 'కోపం-ఆవేశం-చెడువిషయాల మననం"... మొదలైన వాటిని దరిజేరనీయక పోవటమే ఉచితం. ఎందుకంటే, అవి నిర్మల మనస్సును కూడా కలుషితం చేయగలవు.

ఒక స్ఫటికమణి ఉన్నదనుకో, దాని సమీపంలో ఎరుపురంగు వస్తువేదైనా ఉంటే ఆ వస్తువు యొక్క సమీపంలో ఉన్నంత వరకూ స్ఫటికమణి కూడా ఎరుపుగా కనిపిస్తుంది. జీవన్ముక్తుని విషయం ఆ స్ఫటికమణి వంటిది కూడా కాదు. ఎందుకంటే జీవన్ముక్తుడు తన యొక్క తత్త్వజ్ఞాన కారణం చేత సుఖదుఃఖములచే కొంచం కూడా ప్రభావితం కాదు.

వస్తునః శ్లేషమాత్రేణ ఘనరంజితమేతి ధీః ।
గతేఽపి వస్తుని దృఢం బుద్ధిర్యా పరితాపితా ॥

గతాఽపి కుంకుమే, వస్త్రం తదీయమనురంజనమ్
న జహాతి యధామూఢః తథా విషయ రంజనమ్ ॥

ఒక తెల్లటి రంగుగుడ్డ తీసుకొని కుంకుమజలంలో ముంచామనుకో. ఆ తెల్లటి వస్త్రం కాస్తా ఎఱ్ఱగా ఉంటుంది. ఆ తరువాత మంచినీళ్ళతో కడిగి కుంకుమను తొలగించినా ఎరుపురంగు గుడ్డను అంటియే ఉంటుంది కానీ, తొలిగిపోదు కదా! మూఢుడు వస్తువును సమీపించగానే ఆ వస్తువు యొక్క ఆకర్షణాది ప్రభావం చేత ఆతని బుద్ధి కాస్తా కలుషితమౌతోంది. ఒకవేళ ఆ వస్తువును అక్కడి నుండి తీసివేసినా, ఆ మూఢుని బుద్ధిలోని కాలుష్యం మాత్రం పోదు.

దీనిని బట్టి నీవు గమనించవలసినదేమిటి?... బంధ-మోక్షాలనేవి బుద్ధియందే వ్యవస్థితాలై ఉన్నాయి. విషయాలను దృఢంగా భావన చేయటమే 'బంధం'. విషయాలను భావన చేయకపోవటమే 'మోక్షం'. ...మరల చెప్పుచున్నాను. బంధమోక్షాలు వస్తువుల ఉనికి - నాశనాలకు సంబంధించినవి కావు. "దేహం వస్తువులకు దగ్గిరగా ఉన్నదా? దూరంగా ఉన్నదా?" ...అను దాని ననుసరించి బంధ-మోక్షాలు ఉండవు. బుద్ధి యొక్క విషయ భావన-అభావనలే జీవుని బంధ-మోక్షాలు నిర్ణయిస్తున్నాయి.

శిఖిధ్వజుడు: ప్రభో! తమ వచనములు అతి స్వచ్ఛములై, విశాలమైన అర్థమును ప్రతిపాదిస్తున్నాయి. నెమలి మేఘాల శబ్దం ఒకసారి విన్న తరువాత ఇంకా, ఇంకా వినాలని కోరుకుంటుంది చూచారా! అట్లాగే మీరు చెప్పుచూ ఉంటే ఇంకా, ఇంకా సవిస్తారంగా వినాలని నా మనస్సు ఉవ్విళ్ళూరుతోంది. ఈ సందర్భంగా నాదొక చిన్న ప్రశ్న. ఈ పుత్రుడు, రాజ్య సంపద, ధనం, ప్రతిష్ఠలు - మొదలైన ఆయా విషయాల లాభ - వినాశనాలు జరుగుచున్నప్పుడు ఈ జీవునకు సుఖ-దుఃఖాలు అనుభవ మవుతున్నాయి. అవన్నీ దూరంగా ఉన్నప్పుడు, దగ్గిరగా ఉన్నప్పుడు కూడా జీవుని క్షోభింపజేస్తున్నాయి, మరి! అట్టి సుఖ-దుఃఖాలు ఏ క్రమం చేత ఏర్పడుచున్నాయ్?

ముని బాలుడు : ఆ సుఖదుఃఖాలన్నీ ఏర్పడటానికి కారణం ఆ జీవుడు తన యొక్క అనంతమగు సాత్మతత్త్వాన్ని తెలుసుకొని ఉండకపోవటమే.

1. సమీపమున ఉన్న బాహ్య విషయములు,
2. ఈ శరీరము యొక్క నేత్ర, హస్త, స్పర్శాది ఆయా సంఘటిత విషయములు,
3. అనుమాన - ప్రమాణములచే ఆలోచింపబడే దూరస్థమైన, లేక, భవిష్యత్ సంబంధమైన అనుకూల - ప్రతికూల విషయాలు.

వీటినన్నిటినీ ఈ జీవుని యొక్క బుద్ధి స్వీకరిస్తోంది. అవిజ్ఞత కారణంగా బుద్ధియందున్న 'సుఖ సంవిత్తు' క్షోభ చెందుతోంది. అట్టి క్షోభ భోక్తయగు జీవుని యొక్క కుండలినీ నాడి యందు స్వయంగా ప్రకటితమౌతోంది.

ఈ జీవుని హృదయంలో ఆతని భోగానుభవం కొరకై వేరువేరు నాడులున్నాయి. అవన్నీ దేహమంతా ప్రసరించి ఉన్నాయి. ప్రాణవాయువులచే పూరితమైన ఈనాడులన్నిటిలో జీవుడు

స్వయంగా స్ఫురించుచూ ఆక్రమించుకుని ఉన్నాడు. ఒక వృక్షము యొక్క (లేదా) ఒక లత యొక్క మూలభాగంలో నీరుపోస్తే ఆ నీరు వృక్షమంతటా (లేక లత అంతటా) రసరూపంలో ప్రవేశిస్తోంది కదా! అట్లాగే స్పర్శ మాత్రంచేత జాగృతుడైన ఈ జీవుడు కూడా సుఖ-దుఃఖానుభవాలను వెతుక్కుంటూ శరీరమంతా ప్రాణస్వరూపుడై ప్రసరించి ఉంటున్నాడు.

సుఖాదుల అనుభవము కొరకై వేరు వేరు నాడులున్నాయి. సుఖానుభవమున ప్రవృత్తుడైన జీవునకు శీఘ్రంగా 'స్వస్థత' అనుభవానికి వస్తోంది. దుఃఖానుభవమున ప్రవృత్తుడైనప్పుడో, లేక, సుఖానుభవప్రవృత్తికి నిరోధం కలిగినప్పుడో ఆ జీవుని అనుభవమునకు అస్వస్థత చేకూరుతోంది. ఒకడు 'సువాసనను ఆఘ్రాణించాలి' ...అని అనుకున్నప్పుడు ఆ జీవుని సంవిత్తు సుఖమును వెతుక్కుంటూ ముక్కులోకి వేంచేస్తోంది. అప్పుడు కర్పూర - చందన - ధూప - పుష్పాది మార్గములు ఆ జీవుని బాహ్య ప్రపంచంలో వెతుకుచున్నాడు. ఘ్రాణము కొరకు సుఖానుభవనాడులు విస్తరిల్లి తెరుచుకుంటున్నాయి. సువాసన లభించకపోవటం దుఃఖమౌతోంది. లభించటం చేత వచ్చే స్వస్థత లేక దుఃఖరాహిత్యం 'సుఖం' అని అనిపించుకుంటోంది. జీవుని సుఖసంవిత్తు ఘ్రాణములోనికి అసలు ప్రసరించదనుకో! అప్పుడు? ఆ జీవునికి సుఖదుఃఖాలు ఉండేవే కావు. 'సుఖం కావాలి' అనుకోవటంతో దుఃఖం ప్రారంభమైనది. అయితే విషయ స్పర్శచే ఏర్పడే సుఖం వాస్తవమైన సుఖం కాదు. అది సంవిత్తు యొక్క ప్రతిబింబిత సుఖం మాత్రమే.

ఎంతవరకైతే ఈ జీవుడు అత్యంత చంచలమైన నాడి మార్గంలో ప్రవేశించనే ప్రవేశించడో... అనగా, అతని సంవిత్తు వృత్తులను అనుసరించదో... ఎంతవరకూ తాను ఉన్నచోటే శాంతుడై ఉంటాడో... అంతవరకూ ఆతడు 'ముక్తుడు' అని చెప్పబడుచున్నాడు.

ఎంతవరకైతే ఈ జీవుడు నాడీమార్గంలో ప్రవేశించి అక్కడ ప్రశాంతంగా ప్రసరించి ఉన్న ప్రాణవాయువులను సుఖాభిలాషచే సంక్షోభమొందించుకుంటున్నాడో, అంతవరకు ఆతడు 'బద్ధుడు' అని గ్రహించు.

శిఖిధ్వజుడు : అయితే ఈ జీవుని స్వస్వరూపం త్యజించి అట్టి సుఖదుఃఖానుభవము వైపుగా ప్రేరేపిస్తున్నదెవరు? దైవమా? మరింకెవరన్నానా?

ముని బాలకుడు : ఈ జీవుడు స్వయం ప్రకాశస్వరూపుడు. ఆతనిని మరెవ్వరో ఎక్కడి నుండో ప్రేరేపించటం లేదు. ఆతని ప్రేరణకు ఆతడే కారణం. విషయముల గురించిన సుఖదుఃఖాల మనన స్ఫురణచే ఆతనికి బంధం ఏర్పడుతోంది. దీనినే 'చిత్త స్పందన' అని శాస్త్రకారులు పిలుస్తున్నారు.

సుఖము యొక్క అభావనచే దుఃఖం వచ్చి చేరుతోంది. దుఃఖం యొక్క అభావనచే సుఖభావనకు చోటు లభిస్తుంది. సుఖదుఃఖముల అభావనచేతనే ఈ జీవునకు మోక్షం సిద్ధించగలుగుతుంది.

ఈ విధంగా - 1. సుఖ-దుఃఖముల సత్త బంధము, 2. ఆ రెండింటి యొక్క అభావన మోక్షము... అను రెండు నిర్దేశిత మార్గాలనూ ఆత్మశాస్త్రజ్ఞులు ఎత్తి చూపుతున్నారు.

ఈ జీవుడు సర్వదా శాంతస్వరూపుడే. అయితే ప్రజ్ఞను ఏమరచి ఇంద్రియాలు ఉపయోగిస్తున్నప్పుడు ఏర్పడే అనురాగాదులు శాంతిని భంగపరుస్తున్నాయి. దుష్ట ఇంద్రియాలచే విషయాలకు

సంబంధించిన సుఖదుఃఖ దశలు ఎంతవరకు ఏర్పడకుండా ఉంటాయో, అంతవరకు ఈ జీవాత్మ శాంతచిత్తంతో సౌమ్యం వహించి ఉండగలదు.

ఇక్కడ మనం నేర్చుకోవలసినదేమిటి? సుఖదుఃఖాలు తటస్థపడుచున్నప్పుడు సమస్వభావాన్ని అలవరచుకుంటూ ఉంటే, ఈ జీవుడు మోక్షార్హత సంపాదించుకోగలడు.

❖

చంద్రుని చూడగానే మూర్ఖ సముద్రం ఎక్కడ లేని ఉల్లాసం ప్రదర్శిస్తుంది చూచావా? అనేక జన్మలలోని దుష్ట అభ్యాస–దురవగాహనల కారణంగా ఈ జీవుడు తనపై అజ్ఞానపు పొరలు తనకు తానే సాలె పురుగు వలె కల్పించుకుంటున్నాడు. స్వతహాగా స్వయం ప్రకాశ – స్వయంచైతన్య స్వరూపుడే అయిన ఈ జీవుడు స్వయం నిర్మిత సంస్కారాల ప్రభావం చేత సుఖవిషయాన్ని గాని, దుఃఖ విషయాన్ని గాని గాంచినపుడు అభ్యంతరమున 'ఉల్లాసం' అను చంచలత్వాన్ని పొందుచున్నాడు. పిల్లి మాంసాన్ని తలచుకుంటూ మాంసం ఎదురుగా ఉన్నప్పుడు, లేనప్పుడూ కూడా 'మ్యావ్–మ్యావ్' అంటూ సంక్షోభం చెందుతుంది చూచావా? జీవుడు కూడా సుఖాల యొక్క, తత్సాధన భూతాలైన ధనాదుల యొక్క రాగంచే అనేక ఉత్సాహ – నిరుత్సాహ భావాలను తన చుట్టూ కల్పించుకొని క్రుగ్గుచున్నాడు. క్షోభిస్తున్నాడు. కారణమేమిటి? మూర్ఖత్వమే!

శిఖిధ్వజుడు : ఔను, దేవమునీ! మీరు చెప్పిందంతా పరమ సత్యం. అందుకు నాకు సాక్ష్యం (దృష్టాంతం) నేనే! మరి ఆ జీవుడు బాగుపడే మార్గమేదైనా ఉన్నదా?

ముని బాలకుడు : ఎందుకు లేదు? తప్పక ఉన్నది. స్వాత్మజ్ఞానమగు శుద్ధబోధ యొక్క అభ్యాసం చేత "సుఖ–దుఃఖాదులనేవి లేవు" అనే అనుభవస్థితి సుస్థిరమగు గాక! అట్టి సుస్థిరతచే "స్వస్వరూప చాంచల్య రాహిత్యం" అను అలౌకికమైన దారుఢ్యం ఈ జీవుడు సంపాదించుకోవటమే ఉచితం. సద్గ్రంథ పఠనం వల్ల, గురుబోధ వల్ల 'శుద్ధరూపుడనగు నా యందు ఈ సాంసారిక సుఖాలూ లేవు, దుఃఖాలూ లేవు. నేను వ్యర్థంగా విషయసుఖాదులందు దురవగాహన, అపభ్రంశమైన నిర్వచనాలు కల్పించుకుంటున్నాను' అని గ్రహిస్తున్నాడు. ప్రబుద్ధుడై పరమశాంతిని, 'నిర్వాణం' అని పిలుబడే మోక్షానుభవాన్ని సంపాదించుకుంటున్నాడు. 'విషయ జనితసుఖాలు అవస్తువులు' అనే అభ్యంతర జ్ఞానం చేత జీవుడిక వాటి వైపు మరలక, కేవలము శాంతుడై ఒప్పుచున్నాడు. "అంతయూ చిదాకాశమగు బ్రహ్మమే. అనగా నా వాస్తవ స్వరూపమే సర్వే సర్వత్రా వెలయుచున్నది. (మమాత్మా సర్వభూతాత్మా)" అను దృఢ నిశ్చయం తనయందు నెలకొనుచుండగా జీవబ్రహ్మైక్యభావన అనుభూత మవుతుంది. ఈ జగత్తంతా శూన్యమాత్రమే అని ఎరుగుచుండగా ఇక ఆ జీవుడు దేనికీ క్షోభ చెందడు. బ్రహ్మం తోటి ఐక్యం పొందుచుండగా ఇంక క్షోభకు, విభ్రమానికి అవసరమేమిటి? అవకాశమెక్కడ?

"నేనే ప్రథమ సృష్టియందు కల్పితుడనైనట్టి హిరణ్యగర్భుడను. సర్వమునకు అంతర్యామిని. సర్వజీవాత్మల రూపంలో ఈ సంసారవనంలో లీలగా పచార్లు చేస్తున్నాను" అని గ్రహిస్తున్నాడు.

ప్రియరాజర్షీ! ఇక్కడ తారసపడుచున్న ప్రతిజీవుడు స్వకీయకల్పన చేతనే స్వయంగా బంధ

మోక్షాల మార్గములను కల్పించుకుని అందులో అనువర్తిస్తున్నాడు. తత్త్వబోధచే ముక్తుడగుచున్నాడు. ఇక్కడ గాని, మరెక్కడగాని ఇంతకుమించి మరే విశేషం లేదు.

శిఖధ్వజుడు: ఓ దేవపుత్రా! మీ వివరణ నాకు తృప్తిని కలుగజేసింది. అయితే మరొక్క చిన్నవిషయం కూడా వివరించండి. సుఖసంచార యోగ్యములైన ఆయా నాడులందు ఈ జీవుడు ఎప్పుడు ప్రవేశిస్తున్నాడు? అప్పుడాతని యొక్క వీర్యపతనం ఎట్లా అగుచున్నది?

మునిబాలకుడు : మహారాజు తన సేనలను యుద్ధసమయంలో ఆయా పనులందు చెల్లాచెదురుగా నియమిస్తాడు చూచావా? అట్లాగే స్త్రీ యొక్క స్వరూపాన్ని చూచినప్పుడు తన యొక్క రాగవాసనలచే ఉద్బోధితుడై ఈ జీవుడు స్వభావవశం చేత మౌనంగా తన దేహమంతా ఆక్రమించి ఉన్న ప్రాణ వాయువులను క్షోభితములుగా చేసివేస్తున్నాడు. ఆ సమయంలో ప్రాణవాయువు యొక్క చేష్టచేత మేధస్సు నందలి – మజ్జ యందలి సారం తన యొక్క సుగంధయుక్తమైన రజం లేక సూక్ష్మాంశాన్ని త్యజించుచున్నది. అట్లా బయలుదేరిన ఆ రజం (Minute Particles) నాడి ద్వారా అధోభాగం నుండి శుక్రరూపంలో స్వభావవశం చేత బయటకు పోవుచున్నది.

శిఖిధ్వజుడు : ఓ దేవపుత్రా! మీరు ఆత్మజ్ఞులు. ఈ జగత్‌స్థితి యొక్క పూర్వాపరాలు ఎరిగి ఉన్నవారు. మీ వచనాలు వింటూ ఉంటే మీరు పరమజ్ఞానులని తెలియవస్తోంది. ఇప్పుడు మీరు 'స్వభావవశం చేత' అనే శబ్దం ప్రయోగించారు. 'స్వభావం' అంటే ఏమిటి?

ముని బాలకుడు : సృష్ట్యాదియందు హిరణ్యగర్భుడు ప్రాణుల కర్మలను అనుసరించి ఆయా జీవుల యొక్క ఏ ధర్మములు తనయందు స్ఫురింపజేసియున్నాడో ఇప్పుడూ కూడా ఆయా పదార్థములు, ప్రాణులు అవే ధర్మములు కలిగి ఉండి ఈ జగత్ ప్రదర్శనకు రచనలుగా ఉండి ఉంటున్నాయి. దీనినే శాస్త్రములు 'స్వభావము' అని పిలుస్తున్నాయి. జలంలో బుద్బుదములు పుట్టి నశిస్తున్నట్లు, కాకతాళీయ న్యాయం చేతను ఘుణాక్షర న్యాయం వలె (ఒక చెట్టు యొక్క కాండంపై మసిపురుగు భాష గానీ, అక్షరాలు గానీ ఏమీ తెలియకపోయినా ఏదో అక్షరాన్ని తొలచటం) ఇదంతా కూడా మాయయే. అగ్ని ఉష్ణంగానూ, జలము శీతలంగానూ... ఈ విధంగా, సృష్ట్యాదిగా ఏ పదార్థం ఏ ధర్మములతో కూడి ఉన్నదో దానినే పండితులు 'స్వభావం' అంటున్నారు.

పంచభూతములను ఆయా మిశ్రమంగా ఆయా ధర్మముల వైపుగా ప్రేరేపించుచున్న దెవరు? ఏదో ఒకానొక ప్రజ్ఞయే అయి ఉండాలి కదా! ఆ సమష్టి ప్రజ్ఞనే హిరణ్యగర్భుడు, సమష్టి తత్త్వము, సమష్టి జీవుడు, స్వభావము మొదలైన సంజ్ఞలతో పిలుస్తున్నారు.

స్వభావ కారణం చేతనే ఈ జగత్తు మహావృద్ధిని పొందటం, ఇందులో పలువిధ వికారయుక్తాలగు దేహాలు ప్రాణవాయు సమన్వితమై పరిభ్రమించటం జరుగుతోంది. ఇందులో గల కొన్ని దేహాలు వాసనాక్షయముచే జ్ఞానయుక్తములై మరల ఈ వాసనామయ ప్రపంచంలోకి తిరిగి ప్రవేశించటం లేదు. ఇక మరికొన్ని అజ్ఞాన దేహములైతే ఈ ప్రపంచంలోకి వస్తున్నాయి, పోతున్నాయి. పునః ప్రవేశం చేస్తున్నాయి. (ఇక్కడ దేహం ... అనగా దేహి అనే అర్థం అన్వయించుకోవాలి)

❖❖❖

21. స్ఫటిక ఘటంలో జననం

ముని కుమారుడు: ఓ మహారాజా! ఈ జగత్తంతా కూడా ఆత్మ యొక్క ఒకానొక చిత్కళా స్వభావవశం చేత ఉత్పన్నమౌతోంది. వాసనల చేత స్థితి పొందుతోంది. ధర్మాధర్మవశం చేత వెలయుచున్నది. ఎప్పుడైతే వాసనలు క్షయిస్తాయో ఇక ఆపై జీవుడు ధర్మాధర్మములందు తగుల్కొనటం ఉండదు. కాబట్టి ఈ సంసారం మరల ఏర్పడి ఉండదు. ఇక్కడ అనుభవమయ్యేదంతా 'మాయానుభవమే' అని ఈ సందర్భంలో గుర్తు చేస్తున్నాను.

శిఖిధ్వజుడు : చాలా చక్కగా ప్రవచించారు. ఓ మహావక్తా! మీరు చెప్పుచున్న మాటలన్నీ కూడా అత్యంత ఉదారంగాను, గొప్ప అర్థాలతో కూడుకొనినవి గాను, అనుభవయోగ్యమైనవి గాను, నిగూఢాలు గాను, పరమార్థ సాధకాలుగాను, నాకు అనిపిస్తున్నాయి. మీ వాక్య వైభవాన్ని వింటున్నప్పుడు అత్యంత తృప్తి, శాంతి కలుగుతున్నాయి. మీ జన్మ వృత్తాంతం సంక్షిప్తంగా చెప్ప ప్రార్థన. ఆ తరువాత ఆత్మజ్ఞానపూరితమైన తమ ప్రవచనాన్ని అవకాశమున్నంత విస్తారంగా వినాలని నాకున్నది.

బ్రహ్మదేవుని పుత్రుడైన నారదమహర్షి తన వీర్యమును ఎక్కడ, ఏ విధంగా స్థాపన చేశారు?

మునికుమారుడు : అప్సరసలను వినోదంతో చూచిన ఆ మహర్షి స్ఖలనానంతరం వెంటనే మనస్సును తిరిగి యథాప్రకారం తన బుద్ధితో వివేక-విశుద్ధ సమన్వితం చేశారు.

అంతటి తపశ్శాలి, మహర్షి యొక్క వీర్యము మహత్తర తేజోమయమై ఉంటుంది కదా! అందుచేత ఆయన అక్కడికి దగ్గిరలో కనబడిన స్ఫటిక నిర్మితమై, ప్రకాశమానమైన ఒక ఘటంలో స్థాపన కావించారు. స్వసంకల్పంతో క్షీరమును సృష్టించి ఆ ఘటములో నింపారు. సర్వదా లోకకళ్యాణకారకులగు ఆ మహర్షి ఆ ఘటమును తాను తపస్సు చేసే గుహలోనికి తీసుకువెళ్ళి అగ్ని కార్యములతోను, మంత్రోచ్చారణతోను అతి పవిత్రం చేశారు. ఒక మాసము కాలంలో ఆ ఘటములోని వీర్యము వృద్ధి చెందింది. మాసం గడచిపోగానే ఆ ఘటం లోంచి పరిపూర్ణమయిన అవయవాలతో శోభిస్తున్న ఒక బాలుడు బహిర్గతుడైనాడు. ఆ బాలుడు దినదిన ప్రవర్ధమానుడగు చుండగా, నారదమహర్షి జాతకకర్మ, ఉపనయనం మొదలైన సంస్కారాలను నిర్వహించారు. తన వద్ద గల మహత్తర విద్యావైభవమంతా ఆ బాలునికి ప్రసాదించారు. అచిరకాలంలోనే ఆతనిని తనంతటి విద్యాపారంగతునిగా తీర్చిదిద్దారు. ఒక రోజు ఆ మహర్షి ఆ బాలుణ్ణి తన తండ్రి బ్రహ్మ దేవుని దగ్గరకు తీసుకువెళ్ళారు. తనకు భక్తి పారవశ్యంగా సాష్టాంగదండప్రమాణాలు సమర్పిస్తున్న మనుమణ్ణి చూచి బ్రహ్మదేవుడు ఆ బాలకుణ్ణి వేద-వేదాంత విద్యలలో కొద్దిసేపు పరీక్ష చేశారు. ఆ తరువాత తన ఒడిలో కూర్చోబెట్టుకుని ఆతనిని ఆశీర్వాద మాత్రం చేత సర్వజ్ఞునిగా, జ్ఞానసాగరునిగా తీర్చిదిద్దారు. అప్పుడు 'కుంభుడు' అని నామకరణం చేశారు.

ఆ "కుంభుడు" అనబడు నారదపుత్రుడు, బ్రహ్మదేవుని మనుమడు మరెవరో కాదు... నేనే! నేను, నా తండ్రి బ్రహ్మ లోకంలోనే కలసి ఉంటున్నాం. ఇక తదితర బంధువుల విషయమేమిటంటారా?

సాధన – ఆరాధనలచే నాకు గాయత్రీదేవి పినతల్లి అవుతుంది. సరస్వతీదేవి నాకు తల్లి. నాలుగు వేదములు నేను ఆడుకునే క్రీడాస్థలం. ఇక నేను చేసే పనేమిటంటారా? లీలా నిర్మిత స్వరూపుడను, పరిపూర్ణుణ్ణి అయి ఉండటంచే నేను నిర్వర్తించవలసిన కార్యమంటూ ఎక్కడా ఏదీ లేదు. ఏ నిమిత్తం లేకపోయినప్పటికి నేను బ్రహ్మాండాలన్నీ స్వేచ్ఛగా సంచారం చేస్తూ ఉంటాను. భూమిపై సంచరించాలని అనుకున్నప్పుడు ఇటు కూడా వస్తూ వుంటాను. నేను భూమిపై సంచరిస్తున్నప్పుడు నా ఈ పాదాలు నేలను తాకవు. ఈ భూమి యొక్క ధూళిరేణువులు నా అంగాలను స్పృశించవు. ఈ శరీరం గ్లాని పొందటమంటూ ఉండదు. ఈ రోజు ఎప్పుడూలాగానే ఆకాశమార్గంలో పోతున్నాను. ఇక్కడ మీరు కనిపించారు. దైవేచ్ఛానుసారం మీతో సంభాషించాలని అనిపించింది. ఇక, ఇక్కడికి వచ్చాను. ఇదీ నా చరిత్ర.

ఓ రాజర్షీ! మిమ్ము ఆకాశంలోంచి చూచాను. వనవాసముచే చిత్తశుద్ధిని సంపాదించినారని గ్రహించి సంతోషమనిపించింది. ఉత్తములైన మీవంటివారితో ప్రశ్న–సమాధానాలు నిర్వర్తించటం నాకు ఒక చక్కటి అవకాశమని, జ్ఞాన విశేషముల పరస్పర సంభాషణం మానవులలో కనిపించే ప్రియసమాగమము వలె ఒక మాధుర్యమైన విశేషమని నా అభిప్రాయం.

❖

ఇట్లు కుంభమహర్షి చెప్పిన వాక్యములతో ఈ 17వ రోజు సంవాదము ఇక్కడ ముగించారు. శాంతి వచనాలు ప్రవచించబడ్డాయి. సభికులంతా గొంతులు కలిపి "జ్ఞానం సర్వదా పరిఢవిల్లు గాక! లోకములు సుఖ – శాంత – ఐశ్వర్య – ఆనంద – పరస్పరానూకూల్యములతో ఉత్తమ సంపద సమన్వితమగు గాక!" – అను అర్థమును ప్రవచించే వేదవాక్యాలు వల్లించారు. సభ చాలించబడింది.

❖❖❖

(పదిహేడవ రోజు విచారణ పూర్తి అయింది)

❖❖❖

పద్దెనిమిదవవ రోజు

22. క్రియ - జ్ఞానములు

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! నిన్నటి రోజు మనం చెప్పుకుంటున్న కుంభమహర్షి – శిఖిధ్వజ సంవాదమును, తదనంతర కథా విశేషాలను కొనసాగిద్దాం.

❖

శిఖిధ్వజుడు : ఓ దేవపుత్రా! కుంభర్షీ! జన్మజరామృత్యురూపమగు ఈ సంసారమున చిక్కుకునిఉన్న నేను ఎప్పుడో, ఏ జన్మలోనో మహత్తరమైన పుణ్యకార్యములు చేసి ఉంటాను. అందుకు ప్రయోజనంగా ఈ రోజు ఆకాశంలో ప్రయాణిస్తున్న మీకు నన్ను చూసి నాతో కొంత సమయం సంభాషించాలని అనిపించి ఉంటుంది. హే మహాత్మా! నేనిప్పుడు భాగ్యవంతులలో కెల్లా గొప్ప భాగ్యవంతుడినని అనుకుంటున్నాను. ఎందుకంటారేమో? అమృతప్రవాహం వంటి మీరు చెప్పే మాటలు, మీ తోటి సాంగత్యము ఏమైనా చిన్న విషయాలా? తమ వంటి మహనీయులతో ఏర్పడే సమాగమం ఈ చిత్తమును ప్రశాంతపరచినట్లుగా రాజ్యలాభం, చక్రవర్తిత్వము మొదలైనవి కలిగించగలవా? లేనేలేదనునది ఘంటాపథం. మీ వంటి సాధువులతో సమాగమం వలన నా వంటి సామాన్యునికి కూడా రాగద్వేషరాహిత్యరూపమగు అపరిచ్ఛిన్న బ్రహ్మానందం లభించగలదు. రాజ్యలాభం మొదలైన కల్పితమాత్రమైన తుచ్ఛసుఖములెక్కడ? మీ సామీప్యతలో ఏర్పడగల ఆత్మానుభవ లాభం ఎక్కడ? ఈ రెండింటికీ కొంచం కూడా పోలిక లేదు.

కుంభర్షి : (శిఖిధ్వజుని వాక్య ప్రవాహమును కించిత్ నిరోధిస్తూ) అదంతా అట్లా ఉండనివ్వండి. నేను నా జన్మ వృత్తాంతమంతా చెప్పాను కదా! ఇప్పుడిక మీ విషయం గురించి చెప్పండి. హే సాధూ! మీరు ఈ పర్వతంపై ఇంతకాలంగా ఏం చేస్తున్నారు? ఏమి సాధించగోరి దుర్భరమైన ఈ ఏకాంత వనవాసాన్ని ఇంత సుదీర్ఘకాలంగా నిర్వర్తిస్తున్నారు? ఇంకా ఎంతకాలం ఈ వనవాసం కొనసాగించాలనుకుంటున్నారు?... మీ వంటి మహాత్ములగు తాపసులు అసత్యం పలుకటమన్నది ఎరుగరు కదా! అందుచేత ఇందుకు అసలైన కారణాలేమిటో వివరించండి.

శిఖిధ్వజుడు : ఓ కుంభమహర్షీ! మీరు సర్వజ్ఞులు. సర్వలోక వృత్తాంతముల యథాస్థితి అంతా ఎరిగియున్నవారు. ఇక మీ దగ్గిర దాయగలిగినది ఏముంటుంది? చెపుతాను. నేనేమీ చెప్పకుండగానే అంతా గ్రహించగలిగినట్టి మహత్తర శక్తి సంపన్నులు మీరు. అయినా అడిగారు కాబట్టి ఉన్నదున్నట్లు అంతా వివరిస్తాను స్వామీ!

ఈ సంసారమును చూచి భీతిల్లినవాడనై నేనీ వనవాసం చేస్తున్నాను. నా పేరు శిఖిధ్వజుడు. మాళవదేశపు రాజును. 'ఉజ్జయిని' అను పేరుగల రాజధానిని, మాళవదేశ సంపదను త్యజించాను.

జనన–జరా–మరణ వృత్తాంతములతో భయమును గొలిపే సంసారవ్యవహారమును గమనించి భీతిల్లినవాడనై దీనిని ఎట్లాగైనా జయించాలని 18 సంవత్సరాలుగా ఈ ఏకాంత వనవాసం ఆశ్రయించాను.

సుఖం పునః పునః దుఃఖం, పునర్మరణ–జన్మనీ ।
భవతస్తేన తప్యేఽహం, తత్త్వజ్ఞ! వనవీథీషు ॥

హే తత్త్వజ్ఞా! ఇక్కడంతా ఉన్నదేమిటి? ఇంతలోనే దుఃఖం, ఇంతలోనే సుఖం! ఇంతలోనే జన్మ, ఇంతలోనే మృత్యువు. ఇకదాని తరువాత మరొకటి వస్తూనే ఉంటాయి గాని వీటికి అంతెక్కడున్నది? ఇదంతా గమనించిన నేను ఈ సంసారచక్రం నుండి విడివడాలని ఉద్దేశించి వనవాసాన్ని ఆశ్రయించాను. ఇన్నేళ్ళు గడిచాయి. అనేక దిక్కులలో సంచరించాను. ఉగ్రమైన తపస్సు కూడా చేశాను. ఏం లాభం? నా మనస్సుకు కొంచెం కూడా విశ్రాంతి లభించనే లేదు. నా ఈ ప్రయత్నాలు ఒక కొలిక్కి రావటం లేదు. ఇంతవరకూ ఏ ఫలితమూ కనబడటం లేదు. ఏ అసంపూర్ణత్వంతో ఈ వనవాసం ప్రారంభించానో... అది ఇంకా కొనసాగుచూనే ఉన్నది. కీటకములచే భక్షించబడే వృక్షంలాగా నిస్సహాయుడనై నేనీ ఏకాంతవనంలో శుష్కిస్తూ ఏం చేయాలో పాలుబోక ఇక్కడే ఇట్లా ఇంకా రోజులు గడపుచున్నాను. సుదీర్ఘమైన తపఃధ్యానాది ఆయా క్రియలను బాగా ఆచరిస్తూనే ఉన్నాను. అయినా కూడా ఫలితం కనబడటం లేదు. ఒక దుఃఖంలోంచి ఇంకొక దుఃఖంలోకి పయనించటమే నా పనిగా అవుతోంది. అమృతతుల్యంగా చెప్పబడే వేదోక్తకర్మలతో గూడిన ఉపాసన నాకు విశ్రాంతి కలిగించకపోవటం చేత నాకు క్రమంగా విషమువలెనే అనిపిస్తోంది? మహర్షీ! నా గురించిన ముఖ్యమైన వివరాలు ఇవి. ఇక తదితర వివరాలు పెద్దగా చెప్పుకోవలసినవేమీ కావు.

కుంభమహర్షి : ఓ రాజర్షీ! ఒకసారి పితామహులగు బ్రహ్మదేవునికి ఒక ప్రశ్నవిన్నవించాను. 'తాతగారూ! 1. జ్ఞానము, 2.క్రియ ...ఈ రెండిటిలో ఏది శ్రేయోదాయకమైనది? దానికి భగవంతుడగు బ్రహ్మదేవుడు ఆశ్రితవాత్సల్యంతో ఇట్లా సమాధానమిచ్చారు.

❖

బ్రహ్మదేవుడు :

జ్ఞానం హి పరమం శ్రేయః కైవల్యం తేనవేత్త్యలమ్
కాలాతివాహనాయైవా వినోదాయోదితా క్రియా॥

వత్సా! కుంభా! నీ కింకా సందేహం దేనికి? జ్ఞానమే పరమశ్రేయమైనది. జ్ఞానం చేతనే ఈ జీవుడు మోక్షార్హుడై పూర్ణానుభవాన్ని సంతరించు కుంటున్నాడు. ఇక క్రియల విషయ మేమంటావా? క్రియలన్నీ జ్ఞానం యొక్క అర్హత సంపాదించుకోవటానికి చెప్పబడ్డాయి. లేదా, కేవలం స్వర్గాది భోగాల వినోదం కొరకు, కాలయాపన కొరకు చెప్పబడ్డాయి. అయితే ...ఇక్కడొక విశేషమున్నది.

అలబ్ధజ్ఞానదృష్టినాం క్రియా అత్ర పరాయణమ్ ।
యస్య నాస్తి అంబరం పట్టం కంబలం కిం త్యజత్య సౌ ॥

ఒకడికి ఇంకా పట్టువస్త్రాలు లభించలేదనుకో. ఉన్న గుడ్డలు, కంబళి తీసిపారవేయడు కదా! ఎవరికి ఇంకా జ్ఞానం లభించలేదో అట్టివారికి క్రియలే (సాధనా కార్యక్రమములే) ఆశ్రయమై ఉన్నాయి. అందుకొరకే శాస్త్రములు క్రియాక్రమములను (పూజ-ధ్యానము-అష్టాంగయోగాలు-దేవాలయాలు-వ్రతాలు-తీర్థాలు మొ॥) రచించి సాధనపరులకు అందజేస్తున్నాయి.

ప్రతిక్రియకు కొన్ని ప్రయోజనాలుంటాయి. ఆ ప్రయోజనాలు మరికొన్ని క్రియల ఆవశ్యకతను కలిగిస్తూ ఉంటాయి. ఈ క్రియా ప్రయోజనముల వ్యవహారమునకు అంతు ఉన్నట్లు కనబడదు.

నేను (కుంభమహర్షి) : తాతగారూ! మీరు చెప్పేది విషయాన్ని మరింత జటిలం చేస్తోందే! క్రియలు తప్పవంటున్నారు. ఆ క్రియల ప్రయోజనములు మరికొన్ని క్రియలకు ఆవశ్యకతను కల్పిస్తాయంటున్నారు. ఇదంతా... పెద్ద చిక్కు వచ్చి పడుతోంది కదా!

బ్రహ్మదేవుడు : ప్రియ మనుమడా! కుంభా! గాభరాపడకు. ఇక్కడ మరొక విషయం. నీవు గమనించు. అజ్ఞాని వాసనాయుక్తుడై ఉండటం చేత అతని సమస్త క్రియలు ఫలయుక్తములౌతున్నాయి. వాసనలు క్షయిస్తూ ఉండగా జ్ఞానియొక్క సమస్త క్రియలు ఫలరహితములుగా ఉండిపోతున్నాయి.

నీళ్ళు పీల్చనప్పుడు ఫలసహితమైన లత కూడా నిష్ఫలత్వం (ఫలములను పొందకపోవటం) పొందుతుందే! అట్లాగే వాసనల అభావం జ్ఞాన సముపార్జితుని ఫల ప్రదాలగు క్రియలు కూడా నిష్ఫలత్వం పొందుతాయి. శరద్రుతువు వచ్చిన తరువాత ఇక వర్షాకాలపు మేఘాలు మిగలవు కదా!

వాసన యొక్క నాశనంచే క్రియల యొక్క ఫలదీకరణం కూడా నశించగలదు. రెల్లు తీగకు స్వభావసిద్ధంగానే ఫలాలు కాయనట్లు, వాసనారహితమగు క్రియ ఫలాన్ని ఇవ్వదు.

సయక్షవాసనో బాలో యక్షం పశ్యతి, నాఽన్యథా ।
సదుఃఖవాసనో మూఢో దుఃఖం పశ్యతి నాఽన్యథా ॥

భూతప్రేతాలకు సంబంధించిన వాసనలు కలిగి ఉన్న బాలునికి చీకట్లో భూతప్రేతాలు తాండవమాడుచున్నట్లు కనిపిస్తాయి. అదే, అట్టి వాసనయే లేని మరొక బాలుడికో? అక్కడ చీకటి మాత్రమే కనిపిస్తుంది. సుఖదుఃఖాలకు సంబంధించిన వాసనలు కలిగి ఉన్న జీవునికి మాత్రమే సుఖదుఃఖాలు అనుభవమవుతాయి. అటువంటి వాసనలు అంతరంగంలో లేనివానికి సుఖం ఉండదు. దుఃఖం ఉండదు.

గొప్ప ఆకారం కలిగిన ఒక శుభక్రియ గాని, అశుభక్రియ గాని జ్ఞానికి ఏ ఫలం కలుగజేయలేదు. వాస్తవానికి అహంకారాదుల రూపంగా కనబడే ఈ 'వాసన' అనేది ఒక వస్తువే కాదు. అది అజ్ఞానం యొక్క అభ్యాసం మాత్రమే. అది వస్తుతః మిథ్య మాత్రమే. ఎడారిలో ఎండమావుల మహాసముద్రం ఎట్లా ఉదయిస్తోంది? ఆ చూచేవాడి అసత్యమైన అవగాహన చేతనే కదా! అట్లాగే వాసనలు, క్రియల పట్ల ఏర్పడే ఫలాభిలాష అజ్ఞానం చేతనే ఏర్పడుచున్నాయి. తెలివిగలవాడికి ఎడారిలో జల తరంగాలు కనిపించనట్లు (ఎండమావులే గాని జలం కాదని గ్రహించునట్లు)... "అంతయూ సర్వదా బ్రహ్మమే కదా!"...అను భావనచే ఎవని అజ్ఞానం నశిస్తూ ఉంటుందో, అట్టివాని యందు వాసన ఉదయించదు. వాసనలను పరిత్యజించాడా... ఇక ఆ జీవునికి జరామరణ వర్జితమైన పునర్జన్మానుమానరహితమైన పరమపదము ప్రాప్తిస్తోంది.

ఓ కుంభా! అసలు మనస్సుయొక్క రూపం ఏమిటి? వాసనాసహితమగు మననమే మనస్సు యొక్క స్వరూపం. వాసనారహితమైన మనస్సు జ్ఞానరూపమే అవుతుంది. జ్ఞానవస్తువు ప్రాప్తిస్తుంది. అట్టి జీవునకు, "నేను దేహంతో పుట్టుచున్నాను. దేహంతో నశిస్తున్నాను. మరల మరొక దేహంతో పుట్టువాడను" ...అను రూపంలో ఉండే పునర్జన్మ యొక్క భ్రమ ఉండదు.

❖

కుంభమహర్షి : చూచారా శిఖిధ్వజా! బ్రహ్మదేవుడు మొదలైన మహాత్ములంతా 'జ్ఞానమే పరమ శ్రేయోదాయకము' అని నిర్ద్వంద్వంగా ఎలుగెత్తి ప్రకటిస్తున్నారు కదా! మీరు అజ్ఞానివలె ఇక్కడ ఏవేవో క్రియా వ్యవహారములు కల్పించుకొని కాలక్షేపం చేస్తున్నారేమిటి? "ఇది నా దండము. అది నా కమండలం. ఇవి నా రుద్రాక్షలు. ఇది నా ఆసనం" ఇటువంటి తపోరూపాలైన అనర్థ విలాసాలతో క్రీడిస్తూ రోజులకు రోజులు గడిపివేస్తున్నారే?

కోఽహం? కథమిదం జాతం? కథం శామ్యతి? చేతి భోః,
రాజన్! ఆవేక్షసే కస్మాత్? కిమజ్ఞ ఇవ తిష్ఠసి?
"కథం బంధః? కథం మోక్షః?" ఇతి ప్రశ్నాన్ ఉదాహరన్
పారావారవిదాన్ పాదాన్ కస్మాత్, రాజన్! న సేవసే?

నేనెవరు?... ఈ ప్రపంచం ఎట్లా ఉత్పన్నమై ఉంటోంది?... ఇది ఏ ప్రకారంగా శమిస్తుంది? ...ఇటువంటి విషయాలను విచారణ చేయకుండా అజ్ఞానివలె ఏవేవో క్రియా వ్యవహారములకు పరిమితులై సంవత్సరాలు జరిగి పోతుంటే చూస్తూ ఊరుకొని ఉంటున్నారేం?

అసలీ బంధం అనేది ఎట్లా కలుగుతోంది? మోక్షం ఏ సమాచారం వల్ల సంపాదించుకోవచ్చు? ...ఇటువంటి ప్రశ్నలను అఖండ వాక్యార్థాలను వదలి ఊరకే క్రియలు నిర్వహించి ఊరుకుంటే లాభ మేముంటుంది?... అఖండ వాక్యార్థం అయినట్టి ఆత్మపదాన్ని ఎఱిగిన మహనీయులెందరో ఈ భూమిపై ఉన్నారు కదా! వారి పాదాలను ఆశ్రయించి, శరణువేడి వారి దగ్గర ఆత్మజ్ఞానం సంపాదించుకోకుండా ఇక్కడ కూర్చుని రోజులు వృథా చేసుకుంటున్నారేమిటి? ఈ తపోకార్యమంతా బహిర్ముఖ వృత్తి రూపమని, శ్రమాదులచే దుఃఖప్రదమని ఇంకా మీరు గమనించనే లేదా? కొండ రాయిపై పురుగు సంచరిస్తున్నట్లు మీరు అమూల్యమైన జీవితాన్ని ఇక్కడ కూర్చుని నశింపజేసు కుంటున్నారే?

అందుచేత సమదృష్టి గల సాధువులకై వెతకి వారిని సమీపించండి. వారిని సేవించి, సంతోషింప జేసి అప్పుడు మీరు చక్కగా ప్రశ్నించి సమాచారం సంపాదించుకోవాలి. వారి సాంగత్యం చేతనే జ్ఞానం, యుక్తి (ఉపాయం) లభిస్తున్నాయి. అద్దానిచే జీవుడు ముక్తిని సంపాదించుకుంటున్నాడు. ఆ సాధువులు తమ అనుభవాల సారాన్ని ప్రసాదిస్తూ అండగా వారి లాగానే అభ్యాస – వివేకాల ద్వారా క్లేశదాయకాలగు ఈ బహిర్ముఖ వృత్తులను నిరోధించి అంతర్ముఖుడవు కావాలి. ఆహారం కొరకై నేలపై అటూ–ఇటూ సంచరించే కీటకమునకు త్వరితంగా ఆహారం లభించినట్లు మీరు కోరుకున్న జ్ఞానం అప్పుడు లభిస్తుంది. కొండరాయిపై ఉన్న కీటకంలాగా ఇక్కడ ఒంటరిగా ఎన్ని సంవత్సరాలుంటే ఏమి లాభం?

శిఖిధ్వజుడు : (నీళ్ళు నిండిన కళ్ళతో) ఓ కుంభమహర్షీ! ఇంతకాలానికి నేను ఈ రోజు తమ వాక్యాలచే బోధితుడనగుచున్నాను. ఆహా! నా అజ్ఞానంచే జ్ఞాన పురుషుల సాంగత్యం వదలి ఈ మహారణ్యంలో ఏకాంతవాసినై ఆయుష్షు అను అవకాశాన్ని వృథా చేసుకుంటున్నానని గ్రహిస్తున్నాను. అమ్మయ్య! నా పాపమంతా ఇప్పటికి శమించినదని నా కనిపిస్తోంది. ఎందుకంటే బ్రహ్మలోక నివాసులు, సాక్షాత్తు నారదమహర్షి పుత్రులగు మీ వంటి మహాత్ములు నా దగ్గిరకు దయచేసి నాకు జ్ఞానామృతం ప్రసాదిస్తూ పునీతుణ్ణి చేస్తున్నారు.

హే దేవపుత్రా! మీరే నా గురువులు. మీరే నా తండ్రి, మిత్రులు కూడా! నేను తమ శిష్యుణ్ణి. మహానుభావా! తమ పాదపద్మాలకు సాష్టాంగదండ ప్రణామాలు సమర్పిస్తున్న నాపై దయ చూపండి.

ఎద్దానినైతే మీరు సర్వము కంటే శ్రేష్ఠమని అనుకుంటున్నారో, ఏది ఎరిగిన తరువాత ఇక నాకు శోక-మోహాలు ఉండవో, దేనిచే నేను సుఖస్వరూపుడనై విశ్రాంతి పొందగలుగుతానో... అట్టి బ్రహ్మం యొక్క ఉపదేశాన్ని నాకు శీఘ్రంగా ప్రసాదించమని వేడుకొనుచున్నాను. 'జ్ఞానం' ప్రసాదించే చర్చ - పాఠ్యాంశాలలో మట్టి-కుండ, దూది-వస్త్రం మొదలైన దృష్టాంతాలు, వెలుగు - వెలిగించబడునది, జీవాత్మ - పరమాత్మల సమన్వయం మొదలైన అనేక మార్గాలు ఉన్నాయి. వాటన్నిటిలో ఏది ఉత్తమ మార్గమని మీరనుకుంటే ఆ మార్గంలో నాకు బోధించండి. సంసార దుఃఖాలను ధరింపజేయునట్టి, దాని నుండి ఉద్ధరింపజేసే జ్ఞాన విభాగాలను నాకు బోధించమని సవినయుడనై అర్థిస్తున్నాను.

కుంభమహర్షి : ఓ రాజర్షీ ! నా వాక్యాలపై మీకు శ్రద్ధ ఉంటే మంచిదే. మీ ప్రశ్నలన్నిటికి నాకు తెలిసినంత వరకు సమాధానాలు చెప్పటానికి సంతోషంగా సిద్ధంగా ఉన్నాను. అయితే శ్రద్ధ లేక పోతే మాత్రం కొండరాయికి ఎదురుగా కాకి కావు కావు మన్నట్లు నా వాక్యములు వ్యర్థములవుతాయి. కాబట్టి జ్ఞానోపదేశం చేయకపోవటమే ఉచితమవుతుంది. ఏదో వినోదం కోసమో, కాలక్షేపం కోసమో, "ఇది కాదు - అది కాదు" అని కేవలం సిద్ధాంత తిరస్కారోద్దేశం తోనో, (లేక) "కొంత విని, తరువాత చూసుకుందా లేఁ!" ఇటువంటి అర్ధ ఆశయాలతోనో సంభాషించాలనుకునే వారికి వక్త యొక్క వాక్కు, ఉద్దేశం అనర్థమై... బయల్వెడలి నిష్ప్రయోజనమౌతాయి. చీకటిగా ఉన్నచోట నేత్రమునకున్న చూచేశక్తి ఎందుకు పనికివస్తుంది? "చూడకూడదు లేఁ!"... అనుకునే వాడి ముందు కాంతి ప్రసరింపజేసి ఏం ప్రయోజనం?"

శిఖిధ్వజుడు : మహాత్మా! మీరు చెప్పే బోధ విషయాలను, మీరు ఎన్నుకునే బోధమార్గాలను వేద వచనాల వలె - ఏ పూర్వాపర చర్చలు ఇప్పటికి లేకుండా - యథాతథంగా స్వీకరించటానికి నేను సిద్ధంగా ఉన్నాను.

కుంభమహర్షి : తండ్రి చెప్పినది పిల్లవాడు "ఎందుకూ?'. అని ప్రశ్నించకుండా గ్రహిస్తాడు చూచారా? అట్లాగే మీరు కూడా కొంత సమయం వాక్యాల అర్థం శ్రద్ధగా గ్రహించండి. "అంతా విన్న తరువాత ఇది నాకు శ్రేయస్సును కలుగజేస్తుంది" అని ఇప్పటికి భావించండి. హేతువును త్యజించి చెవులకు

ఇంపుగా ఉండే పాటలాగా నా వాక్యాలకు వినండి. మన ఈ సంభాషణలో మీ చరిత్రనే దృష్టంగా చేసి చెప్పుతాను. మనం చెప్పకోబోయే ఆయా కథా విశేషాలు, చర్చనీయాంశాలు, బోధనా విధానాలు మంద మతులకు కూడా బోధజనకాలై ఉండగలుగు గాక! ఇక బుద్ధిమంతుల గురించి వేరే చెప్పేదేమున్నది? మన ఈ సంభాషణా సారాంశం సంసారభయం నుండి ఎవరినైనా దాటించ గలదుగాక! ఇక మనం బోధనా విషయంలో ప్రవేశిస్తున్నాం, జాగరూకుడవై, అప్రమత్తుడవై విను!

❖❖❖

23. మణి సాధకుడు - గాజుమణి

కుంభమహర్షి : ఓ శిఖిధ్వజ మహారాజా! ఒక కథా ప్రసంగంతో మన ఈ బోధ ప్రారంభిద్దాం–

ఒక ఊళ్ళో నాకు ఒక గొప్ప ధనికుడున్నాడు. ఆతని ఇల్లు ఇటు సంపదతోనూ, అటు ఉదార గుణములతోనూ ప్రసిద్ధమై ఉన్నది. అనేక కళలందు ఆతడు నేర్పరి. అస్త్ర విద్యయందు కూడా నిపుణుడు. వ్యవహారదక్షత కలవాడు. అన్నీ బాగున్నాయి కానీ, 'పరమాత్మపదము' గురించి ఆతను తగినంతగా పట్టించుకోలేదు. ఆలోచించనూ లేదు.

ఒకసారి ఆతనికి 'ప్రపంచంలో అన్నిటికన్నా మహత్తరమైన వస్తువేదైనా సంపాదించాలి' అని అనుకున్నాడు. 'అటువంటి వస్తువు ఏదై ఉన్నది?' అని అనేక మందిని సంప్రదించాడు. ఎవ్వరో సర్వపదార్థ స్వభావాలనూ ఎరిగిన పండితులు, "అటువంటి వస్తువు ఒకటి ఉన్నది. దాని పేరు చింతామణి. అది ఎవరి దగ్గర ఉంటే వారు ఎప్పుడు ఏది కోరుకుంటే అది తక్షణం లభించగలదు. అయితే దానిని సంపాదించటం అంత సులువైన విషయం కాదు. అనేక జన్మల సుకృతఫల భాగ్యంగా అది లభించవలసిందే. కొందరికి అది ఈ జన్మంతా ప్రయత్నించినా లభించదు. కానీ, ఈ జన్మలో చేసిన ప్రయత్నం చేత వచ్చే జన్మలో, లేక రేండు, మూడు జన్మల తరువాతో కొద్ది ప్రయత్నానికే లభిస్తుంది. ఇక మరికొందరికి కొన్ని జన్మలుగా చేసిన ప్రయత్నం చేత ఈ జన్మలో త్వరగా లభిస్తుంది" ... అని శాస్త్రనిక్షిప్తమైన వివరణ ఇచ్చారు.

ఇక ఆ ధనికుడు ఎట్లాగైనా సరే ఆ చింతామణిని సంపాదించి ప్రపంచంలోని కోటీశ్వరు లందరిలోకి ప్రప్రథముణ్ణవాలని నిర్ణయించుకున్నాడు. శాస్త్రజ్ఞులు శాస్త్రాల నుండి చదివి విశదీకరించిన మార్గాలలో చింతామణి కొరకై ధ్యానం–పూజ–నిష్ఠ – మంత్రోచ్చారణ ఉపవాసాదులు ప్రారంభించాడు. సుదీర్ఘకాలం (అనగా, కొన్ని సంవత్సరాలు) ప్రయత్నం కొనసాగించటానికి కావలసిన పదార్థ పరిసరాలన్నీ ఒనగూర్చుకుని ఇక అత్యంత పట్టుదలతో 'చింతామణి' యొక్క ఆరాధన ప్రతి రోజూ అనేక గంటలు నిర్వర్తిస్తూ ఉండేవాడు.

ఇరవై రోజులు గడిచాయి. ఇరవ ఒక్కటవ రోజున మధ్యాహ్నధ్యానం 'పూజ' నిర్వర్తిస్తూండగా దేదీప్యమానమై, కాంతిపుంజములను నాలుగు దిక్కులకూ వెదజల్లుతూ, ధగద్ధగాయమానంగా ప్రకాశిస్తూ, చూపరుల హృదయంలో ఉత్సాహ ఐశ్వర్యాన్ని నింపివేస్తూ చింతామణి ప్రత్యక్షమైంది.

ఆ ధనికుడు మూసిన తన కళ్ళపైబడ్డ కాంతి పుంజాలకు ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు. తనకు చేయి చాపితే అందేంత దూరంలో గాలిలో నిరాలంబంగా ప్రకాశిస్తూ ఆ చింతామణి కనిపించింది. ఇక చేతులతో దానిని పట్టుకొని సొంతం చేసుకోవటమే తరువాయి. మన ధనికుడు పరమానంద పడిపోయాడు. మంత్రోచ్చారణ ఆపి ఆ చింతామణిని చూచి ఇక దానిని సొంతం చేసుకోవాలని కూర్చున్న చోటి నుండి లేచాడు.

శిఖిధ్వజుడు : ఓ దేవర్షీ! ఆతనికి అంత సులభంగా చింతామణి లభించిందా?

కుంభమహర్షి : ఇందులో ఆశ్చర్యమేమున్నది? ప్రయత్నాన్ని బట్టే కదా, ప్రయోజనం!

తస్య యత్నేన మహతా కాలేన అధ్యవసాయినః
సిద్ధశ్చిన్తామణి కిం వాన సిద్ధతి ఉద్యతాత్మనామ్?

ప్రయత్నశీలుడై ఉండటం చేత ఆతని ఏకాగ్రత – పట్టుదలల ఫలితంగా ఇరవై ఒక్క రోజులలోనే చింతామణి లభించింది. ఒక్క చింతామణి ఏమిటయ్యా? ఈ మానవుడు ప్రయత్నశీలుడు కావాలే గాని, సాధించలేని దంటూ ఏది ఉంటుంది?

ప్రవృత్తిమ్ ఉద్యమం ప్రజ్ఞాం ప్రయుంక్తే ఖేద-ఖేదవాన్
అకించనోఽపి శక్తత్వం సమవాప్నోతి అవిఘ్నతః॥

ఎవ్వడైతే ప్రజ్ఞ (తెలివితేటలు) ఆశ్రయించి ఖేదరహితుడై ప్రయత్నంనందు ప్రవృత్తుడై ఉంటాడో... అట్టివాడు కొంచెం శక్తితోనే నిర్విఘ్నంగా అనుకున్నది సాధించి తీరుతాడు. త్వరగా కూడా సాధిస్తాడు.

సరే! ఆ ధనికుడు గాలిలో వ్రేలాడుచు ప్రశాంతకాంతి వీచికలు వెదజల్లుచున్న ఆ మణికి ఇంకొంచెం దగ్గిరగా అడుగులు వేసి, ఆ మణిని చూస్తూనే ఒక్కసారి ఆగిపోయాడు. అతని మనస్సులో ఒక సంశయం మొలకెత్తి మహావృక్షంగా రూపం పొందసాగింది. ఏదైనా శీఘ్రంగా లభిస్తుంటే 'ఇందులో ఏదో తిరకాసు ఉన్నది' అనే అనుమానం కలగటం జనులలో పరిపాటియే కదా!

అంతవరకూ అతనిలో ఏర్పడిన ఆశ్చర్య-ఆనందాల మధ్యగా విషాదంతో కూడిన అనుమానం చోటు చేసుకున్నది.

❖

ఆ ధనికుడు : ఏమిటి? ఇది చింతామణే? దీని రూపం, తేజస్సు చూస్తుంటే మంత్రశాస్త్రంలో చెప్పిన చింతామణికి సరిపోతోంది. కానీ...! నా బొంద! సంవత్సరాల తరబడి ప్రయత్నిస్తే కూడా చింతామణి లభించటం కష్టసాధ్యమని పండితులు అనగా విన్నానే! ఇరవై రోజులలో చింతామణి ప్రత్యక్షం కావటమా? అదీ... నాకు? లాభం లేదు. ఇది కనుక చింతామణి అయితే నాకు ఇంత త్వరగా ప్రత్యక్షం అయ్యేదే కాదు. కచ్చితంగా ఇది చింతామణి కాదు. పోనీ దీనిని తాకి చూద్దామా? తాకగానే ఇది మాయమైపోతుంది కదా! మంత్రశాస్త్రంలో కొన్ని మాయా చింతామణులు (చింతామణి కాకపోయినా చింతామణివలె కనిపించేవి) ఉంటాయని చెప్పారు కదా! ఇంత స్వల్ప ప్రయత్నంతో చింతామణి లభించటమనేది కల్ల. జీవితాంతంగా చేసే మహా ప్రయత్నం చేత మాత్రమే అది లభిస్తుందని ఎందరో అనగా విన్నాను కదా!

ఆ! ఇప్పుడు తెలిసిపోయింది. నేను లోభిని. నా లోభకారణం భ్రాంతి చేత నా సంకుచితమైన కళ్ళకు ఈ కల్పితమైన రత్నం కనబడుతోంది. ఇది మణియే కాదు. ఇదేదో నా ఊహామాత్రమే. సర్వ సిద్ధులు ప్రసాదించగలిగే మణి అనే భాగ్యం అంత తేలికగా అబ్బేది కాదు. అల్పకాలంలో కూడా చింతామణి వంటి గొప్ప ఐశ్వర్యం పొందగలిగేవారు ఎక్కడో కొందరు ఉంటారు. వాళ్ళంతా గొప్ప తపశ్శక్తి గల మహాభాగ్యశీలురు. నాలాంటి ఒక సామాన్యమైన మానవునికి అది ఇంత స్వల్పకాలంలో ఇంత తేలికగా లభించే ప్రసక్తే లేదు. పది రోజులు ప్రయాణిస్తే గాని కనబడని కాశీ పది నిమిషాలు నడిచేసరికి కనబడిందంటే అది కాశీ కాదు. ప్రక్క ఊరు మాత్రమే.

ఇట్లా ఆలోచిస్తూ ఆ ధనికుడు కళ్ళు మూసుకుని తిరిగి రెండడుగులు వెనక్కి వేసి యథాస్థానంలో కూర్చుని రుద్రాక్షమాలతో చింతామణి గురించి జపం కొనసాగించాడు.

న యదా యేన లబ్ధవ్యం న తత్ప్రాప్నోత్యసౌ తదా
చిన్తామణిరవాప్తో౽పి దుర్ధియా హేలయోజ్ఝితః

ఎప్పుడు ఎవరికి ఏది లభ్యం కాతగి ఉండదో, అప్పుడాతడు అది పొందడని ఇందుకే అంటారు కాబోలు. ఆతడు చింతామణిని పొందాడు. కాని తన అల్పబుద్ధిచే నిరాదరించాడు. చాలాసేపు వేచి ఉండి ఆ చింతామణి, సాధకుడు స్వీకరించక పోవటం చేత ఎటో వెళ్ళిపోయింది. ఎందుచేతనంటే ఎవరు సిద్ధులను ఆదరించకుండా ఉంటారో వారిని ఆ సిద్ధులు విడచి వెళ్ళిపోతాయని మంత్రశాస్త్ర సిద్ధాంతం. సిద్ధులు వస్తున్నప్పుడు అవి ఆ సాధకుని విచక్షణకు పటుత్వం కలుగజేస్తాయి. అవి విడచి వెళ్ళుచున్నప్పుడు ఆత్మజ్ఞానరహితులగు సాధకుల విచక్షణా జ్ఞానాన్ని కూడా తమ వెంట లాక్కుపోతాయి.

ఆ ధనికుడు చింతామణి యొక్క సిద్ధికై మరల తన ప్రయత్నం కొనసాగించాడు. మరికొంతకాలం గడచింది. ఒకరోజు పరిహాసకులు, వంచకులు అగు కొందరు ఆకాశ సిద్ధులు ఒక గాజుతో నిర్మిత మైన మణి ఆకారాన్ని ఆతని ఎదురుగా గాలిలో వ్రేలాడగట్టారు. మన ధనికుడు కళ్ళు తెరచి ఆ గాజు వస్తువును చూచి, 'అమ్మయ్య! ఇదీ, చింతామణి' అని తలచి పరుగున పోయి దానిని చేతి లోకి తీసుకున్నాడు. మహదానందపడ్డాడు. దానిని భద్రంగా దాచుకుని ఇక అక్కడి నుండి బయలుదేరి ఇంటికి వచ్చాడు. అజ్ఞానంచే మోహితుడైనవాడు త్రాడును చూచి పామనుకోవటం, స్థలాన్ని చూచి జలం అనుకోవటం, ఒక చంద్రుని చూచి రెండు చంద్రులనుకోవటం, అమృతం చూచి మృతమను కోవటం, మృతమును చూచి అమృతమనుకోవటం మామూలే కదా!

ఆతడు ఇంటికి చేరిన తరువాత ఆ మణిని ఎవరికీ కనబడకుండా దాచుకున్నాడు. 'చింతామణి లభించిన తరువాత సమస్తం ప్రాప్తించినట్లే కదా! ఇక నేను ఎక్కడికైనా దూరప్రాంతం వెళ్ళి అక్కడ గొప్ప భవనాలను, సేవకులను, సుఖమయమగు వస్తువులను సృష్టించుకొని ఆనందంగా ఉంటాను'... అని తలచాడు. ఆతనికి ఆతని ఇల్లు, అందులో ఆయా వస్తువులు చాల అల్పమైనవిగా కనిపించాయి. వాటినన్నిటిన వాళ్ళకి వీళ్లకీ ఇచ్చివేశాడు. 'ఈ దేశంలో ఏం సుఖమున్నది? ఇదంతా పాపులచే ఆవరించబడింది. ఈ పాత ఇంటితో నాకేంపని? మా బంధువులలో నన్ను చూచి ఏడ్చేవాళ్ళే గాని

ఒక్కడు మంచివాడు లేడు. దూరప్రాంతానికి పోయి సంపదలు కలవాడినై ఇష్టమున్నన్ని సంవత్సరాలు హాయిగా ఉంటాను'... అని అనుకున్నాడు. ఉన్న ఊరును, బంధువులను, ఇంటిని వదిలేసి ఒక్క చింతామణిని మాత్రం తీసుకుని ఇక బయలుదేరాడు. సుదూర ప్రాంతంలోని ఒక అడవిలో ఒక చెట్టు క్రింద కూర్చుని ఇక ఆ గాజుమణిని బయటకు తీశాడు. ఎదురుగా పెట్టి "ఓ చింతామణిగారూ! ఇక్కడ నాకొక నగరం కావాలి. ఆ నగరంలో నాకు సర్వసేవలు చేయటానికి అందమైన స్త్రీలు, విహరించటానికి ఉద్యానవనాలూ, తినటానికి ప్రపంచంలో మరెక్కడా దొరకని మధురపదార్థాలూ ఉండాలి. మా అంతఃపురపు గోడలు ఖరీదైన నవరత్నాలచే పొదగబడి ఉండాలి..." ఇట్లా కళ్ళు మూసుకొని వర్ణిస్తూ పోతున్నాడు. "ఆహా! ఇప్పుడు నేను గొప్ప సింహాసనంపై అధిష్ఠించి ఉంటాను. ప్రపంచంలో మరెక్కడా లేని అతి సౌందర్యవతులగు స్త్రీలు నాకు వింజామరలు వీస్తూ ఉంటారు. ఇక కళ్ళు తెరుస్తాను" ...అని నెమ్మదిగా కళ్ళుతెరిచాడు. కానీ ఏం లాభం! తాను ఆ అడవిలో చెట్టు క్రిందనే ఉన్నాడు. శరీరంపై అందమైన వస్త్రాలు, ఆభరణాలు ఉన్నాయేమోనని చూచుకున్నాడు. ఏమీ లేదు. చిరిగిన బట్టలు, ఆకలి, దాహం, ఎదురుగా గాజుమణి, అడవి – ఇవన్నీ యథాతథంగానే ఉన్నాయి. "ఏమిటిరా ఇదీ?" అని అనుకుంటూ ఉండగా ...ఇంతలో నరమాంసం మరిగి అత్యంత ఆకలితో ఉన్న ఒక పులి తనకు అతి దగ్గరగా గాండ్రించటం మాత్రం వినిపించింది.

❖

ఓ శిఖిధ్వజా! ఈ మనుజుడు మూర్ఖత్వం కారణంగా తెచ్చిపెట్టుకునే ఆపదలు, దుఃఖాలు వార్ధక్య – మరణాల వలన కూడా రావు. మానవుని నెత్తిమీద నల్లటి జుట్టు ఉన్నట్లు ప్రపంచంలోని ఆపదలన్నీ మూర్ఖుని నెత్తిమీదే నృత్యం చేస్తూ ఉంటాయి.

❖❖❖

24. తప్పించుకుని కూడా మరల చిక్కిన ఏనుగు

కుంభమహర్షి : ఇప్పుడు నీకు ధనికుని వృత్తాంతం చెప్పాను కదా! ఇటువంటిదే ఇంకొక వృత్తాంతం చెబుతాను. ఇది ఒక ఏనుగు యొక్క కథ.

కొంతకాలం క్రితం వింధ్యపర్వత ప్రాంతపు అడవులలో ఒక గొప్ప ఏనుగు సంచరిస్తూండేది. దాని రెండు పొడవైన దంతాలు తెల్లగా ప్రకాశిస్తూ చాలా బలంగా ఉండేది. అది తలచుకుంటే మహా వృక్షాలను సైతం కూకటివ్రేళ్ళతో సహా తన దంతములతో పెకలించి వేయగలదు. అది యథేచ్ఛగా అక్కడి అడవులలో సంచరిస్తూ సుఖంగా కాలం గడుపుతోంది.

కొందరు జీవులు 'అన్ని రోజులు మనవే' అనుకుంటూ రోజులు గడుపుతూ గర్విస్తూ, హూంకరిస్తూ ఉంటారు. ఈ లోగా ఏవేవో కష్టాలు వచ్చిపడుతూ ఉంటాయి. అట్లాగే... ఆ ఏనుగుకు కూడా ఒకసారి ఒక కష్టం వచ్చి పడింది.

ఒక మావటి వాడు అందమైన, పెద్దకాయం గల ఆ ఏనుగును ఎట్లాగైనా సరే బంధించి రాజుగారికి బహుమతిగా ఇచ్చి డబ్బును, హోదాను సంపాదించుకోవాలని యోచించాడు. కొద్దిరోజులు

ఆ ఏనుగు సంచరించే అడవులలోని ఆనుపానులన్నీ కనిపెట్టాడు. రకరకాల ఉపాయాలతో, ఎట్లాగైతేనేం, ఆ ఏనుగును ఒక పెద్ద వృక్షం క్రింద గొలుసులతో బంధించాడు. ఇక ఆ ఏనుగును రాజ్యానికి తోలుకు పోవటానికి కావలసిన అంకుశం, మోకు త్రాళ్ళు తేవటానికి గూడెం వెళ్ళాడు.

రెండురోజులు గడచిపోయాయి. మూడవరోజు మావటివాడు పరికరాలన్నీ మూట కట్టుకుని ఏనుగును బంధించిన ప్రదేశం చేరేసరికి చాలా చీకటి పడింది. తెల్లవారి ఏనుగును రాజనగరానికి తీసుకుపోవచ్చునని యోచించి ఆ రాత్రి ఆ మహావృక్షం మీద వసతి చేసుకుని నడుంవాల్చాడు. బాగా కునుకు పట్టింది.

ఇక ఆ ఏనుగు మూడురోజులుగా గొలుసులతో బంధించబడి ఉండటం చేత చాలా వ్యధ చెందింది. దానిలో కసి పెరిగింది. తన ఓపికనంతా కూడదీసుకుని గొలుసులను త్రెంచటానికి ప్రయత్నించసాగింది. మావటివాడికి నిద్రపట్టడం చేత ఇది గమనించటం లేదు. ఒక్కొక్క గొలుసే తెగిపోవటం ప్రారంభమైనది. సరిగ్గా తెలతెల్లవారుతుండగా చివరిగొలుసు కూడా పుటుక్కున తెగిపోయింది. అదే క్షణంలో మరొక చమత్కారమైన సంఘటన జరిగింది.

మహావృక్షముపై నిదురిస్తున్న మావటివాడు నిద్రమత్తులో ఉండి ఒళ్ళు తెలియని స్థితిలో డుబుక్కున ఏనుగు మీదకు ... ఏనుగు మీదనుంచి నేలమీదకు పడ్డాడు. ఆతడు ఏనుగు పాదాల దగ్గర పడటం జరిగింది. తను మూడు రోజులుగా పడిన బాధంతా గుర్తుకు వచ్చి ఆ ఏనుగు కోపంగా పాదం ఎత్తింది. పాదం కనుక మావటి వాని పొట్టమీద ఉంచి నలిపితే ఆ మావటివాడు బొమికలు కూడా మిగలకుండా నుజ్జునుజ్జు అయ్యేవాడే! కానీ తన పాదం మావటి వాని పొట్టను తాకుచుండగా ఆ ఏనుగుకు మావటివానిపై ఏదో జాలి కలిగింది.

ఏనుగు (తనలో) : నా కాళ్ళ దగ్గిర పడిన ఈ మావటి వానిని ఒక్క క్షణంలో మాంసపు ముద్దగా మార్చి వేయగలను. నన్ను మూడు రోజులు బాధించిన ఈతడు అంతటి శిక్షకు అర్హుడే. వీడికి నేను ఏ హానీ చేయకపోయినా నన్ను గొలుసులతో కట్టి పడేసి ఉంచాడు. ఏమైతేనేం? నిద్రమత్తులో నా కాళ్ళ దగ్గిర పడిన వీడిని చంపటం ఏం ఉచితం? ఇక దుర్మార్గుడగు వీడికీ నాకూ తేడా ఏమున్నది? వీడు మనిషి అయి కూడా అజ్ఞానిగా ఉన్నాడు. మూడు రోజులు నన్ను ఈ మహావృక్షానికి గొలుసులతో కట్టి ఉంచాడు, జంతువునైనప్పటికీ నాకు కూడా ఆకలి-దప్పికలు ఉంటాయని, ఆహార-పానీయాలు లేకపోతే కష్టపడతాననీ వాడు గుర్తించనేలేదు. నేను జంతువునే కావచ్చు. వీడి కన్నా ఉత్తమజ్ఞానం కలిగి ఉండటమే గొప్ప. అప్పుడు లోకం నన్ను మెచ్చుకుంటుంది. లేదంటే లోకం నన్ను కూడా నీచునిగా జమ కట్టుతుంది. వీడు చస్తే, అమాయకులగు వీడి భార్య - పిల్లలు పోషించే వారు లేక యాతనలు పొందుతారు కదా! పోనీలే. వీడి కర్మానికి వీడిని వదిలేద్దాంలే.

తం పురః పతితం దృష్ట్వా మత్తేభః కరుణాం యయౌ ।
స్ఫురత్స్ఫారగుణాః సన్తః సన్తి తిర్యగ్గతావపి ॥

ఒక ఏనుగు తనను కష్టాలు పాలు చేసినప్పటికీ, తోటి జీవియగు ఆ మావటి వాని పట్ల

ఎంతటి కరుణ ప్రకటించిందో! విశాలమైన గుణములు, దృక్పథములు గల మహాత్ములు జంతు దేహములలో కూడా ఉన్నారు.

ఆ విధంగా ఏనుగు మావటి వాని పొట్టపై నుండి తన పాదాన్ని ఉపసంహరించింది. వడి వడిగా యథేచ్ఛగా అడవులలో ప్రవేశించింది.

❖

ఆ ఏనుగు అట్లా వెళ్ళగానే మావటివాడు నెమ్మదిగా కళ్ళు తెరిచాడు. క్రింద పడిన పాటుకు దిమ్మరిల్లిన అతని శరీరము, బుద్ధి కొద్దిసేపట్లో స్వస్థత పొందాయి. నెమ్మదిగా మామూలు మనిషి అయ్యాడు. నిందిత కార్యములు ఆచరించే వారికి బలం త్వరగా వృద్ధి చెందుతుందని అంటారు, ఇదే కాబోలు! ఇక ఆతడు ఇట్లా అనుకున్నాడు.

"ఆరి నాయనోయ్! కొద్దిగా ఏనుగు కాలేసి ఉంటే చచ్చేవాడిని! ఎందుకో నన్ను చంపలేదు. ఏం ఏనుగురా ఇది? దీనికి పోయే కాలంరాను! గొలుసులనే త్రెంచుకున్నదే! దొరికినట్లే దొరికి తప్పించుకున్నది. దీని మోహాన ఇంత పెట్టుబడి పెట్టి ఈ చాంతాళ్ళు పరికరాలు తెచ్చి సొమ్మంతా నాశనం చేసుకున్నాను. తీరా చూస్తే ఈ ఛండాలపు ఏనుగు తప్పించుకున్నది. సరే! దీనిని నేను వదలుతానా? దీని అంతు చూడాల్సిందే! ఇంతకీ ఇది ఉండేదెక్కడో గమనించి ఇంకేదైనా ఉపాయంతో దీనిని పట్టుకుని తీరాలి! దీనిని బంధించిన తరువాతే ఇంటికి పోయేది!"

...ఆ దుష్టుడు ప్రాణం దక్కింది కదా అని కొంచం కూడా అనుకోవటం లేదు. పైగా ఆ ఏనుగును అపశబ్దములతో దూషిస్తూ ఇక బయలుదేరాడు. దుష్టులు సాత్వికుల క్షమాగుణం చూచి కసిని పెంచుకుంటారే తప్ప, మంచిని మంచిగా గుర్తించలేరు కాబోలు!

ఆ మావటి వాడు కొద్ది రోజులకు ఏనుగు విశ్రమించే చోటు కనిపెట్టేశాడు. ఆ ఏనుగుకు కనబడకుండా లతల వెనుక దాక్కుంటూ, ఇక ఆ ఏనుగు నడిచే బాటలో తను తెచ్చుకున్న పలుగు, పాఱలతో ఒక పెద్ద కందకం త్రవ్వాడు. ఆ కందకం పైకి కన్పించకుండా పూలతీగలతో కప్పి పలచగా మట్టి కప్పాడు.

మరునాడు ఉదయం ఆ ఏనుగు లేచి అడుగులు వేస్తూ ఆ కందకంలోకి పడిపోయింది. ఇక ఆ కందకంలోనే నిస్సహాయంగా అటూ ఇటూ తిరగసాగింది. మావటివాడు "దీని శిఖతరగా! దొరికిందిరా!" అని అనుకుంటూ ఆ ఏనుగును మరల గొలుసులతో బంధించాడు.

ఆ ఏనుగు ఇప్పటికీ ఆ కందకంలోనే చిక్కి ఉన్నది.

చూచావా శిఖిధ్వజా! మొదలే గనుక ఆ ఏనుగు మావటి వానిని చంపి ఉంటే ఇప్పుడీ దుర్దశ పట్టేదా? కాదు. కందకంలో చిక్కేది కాదు. గొలుసులచే బంధింపబడేది కాదు.

❖

ఆ వింధ్యాచలగజేంద్రునిలాగానే వర్తమాన క్రియలలో మూర్ఖత్వముతో తలమునకలై ఉంటున్న ఈ జీవుడు రాబోయే కాలంలో వచ్చే విషయాలను గమనించటమే లేదాయే! "గొలుసుల బంధాన్ని

త్రెంచుకున్నాను కదా! ఇంక నాకేం?" ...అని ఏనుగు అనుకున్నదే గాని, "ఈ మావటివాడు నన్ను వదలుతాడా? మరల బంధించటానికి యత్నిస్తాడేమో?" ...అనే అనుమానమే దానికి రాలేదు. దూరాలోచన లేకుండా మూర్ఖత్వం వహించి ఉండటం చేతనే ఆ ఏనుగుకు ఆ గతి పట్టింది కదా!

మౌర్ఖ్యం హి బన్ధనమవేహి పరం, మహాత్మన్!
బద్ధో, న బద్ధ ఇతి చేతసి తద్విముక్త్యై: ॥
ఆత్మోదయం త్రిజగదాత్మమయం సమస్తం
మౌర్ఖ్యేస్థితస్య సహసా నను సర్వభూమిః ॥

ఓ శిఖిధ్వజ మహారాజా! మూర్ఖత్వమే జీవునకు పరమబంధమని గ్రహించు. "నేను బద్ధుడను. ఇంక ఇంతే! ఇంతకుమించి ఏమీ ఎవరూ చేయగలిగింది లేదు" అను రూపం గల ఒకానొక పరమ మూర్ఖత్వాన్ని ఈతడు వహించి ఉంటున్నాడు. ఈతని స్వరూపం సర్వదా ఆత్మయే కదా! బంధం ఎక్కడి నుండి వస్తుంది? "నేను దేహ బద్ధుడను. మనో బద్ధుడను" అని మూర్ఖంగా ఇక ఎవరు ఎంత చెప్పినా వినకుండా, అనుకోవటమే బంధం. "నేను బద్ధుడను కాను. ఆత్మ స్వరూపుడనగు నేను దేనిచే ఎట్లు బంధింపబడతాను?" ...అని భావన చేయటమే ముక్తి. కాబట్టి రాజా! ఈ సర్వం ఆత్మచే నిండి ఉన్నదని, ఇక్కడి త్రివిధ (ఆధిభౌతిక – ఆధిదైవిక – ఆధ్యాత్మిక) బంధనాలతో కూడి సమస్త జగత్తు తదితర సమస్తమూ, ఆత్మయేనని గ్రహించు. ఆత్మ విషయాలన్నిటికీ అతీతమైనదై ఉండగా విషయాలు అద్దానిని ఎట్లా బంధిస్తాయి?

శిఖిధ్వజుడు : మరి దుఃఖమునకు కారణం?

కుంభమహర్షి : సర్వ బంధములకు, తత్ఫలితమైన దుఃఖములకు బీజక్షేత్రం మూర్ఖత్వము వహించి ఉండటమేనని గ్రహించవలసినదిగా నా మనవి.

శిఖిధ్వజుడు : మహర్షీ! ఇప్పుడు మీరు 'మణిసాధకుడు, వింధ్యాచల గజేంద్రుడు' అని రెండు కథలు చెప్పారు. వాటిని ఏదో తాత్పర్యాన్ని ఉద్దేశించి చెప్పి ఉంటారు. అది ఏమిటో వివరించి చెప్పండి.

కుంభమహర్షి : ఇప్పుడు నీ చిత్తఫలకంపై రెండు విచిత్రమైన కథా చిత్రాలు చిత్రించాను కదా! ఇప్పుడా రెండు రేఖాచిత్రముల వ్యాఖ్యానమేమిటో చెప్పుచున్నాను. సావధానంగా విను.

❖❖❖

25. ఒక బంధం నుండి మరొక బంధంలోకి

కుంభమహర్షి : ఇప్పుడు రత్నసాధకుని గురించి విచారిద్దాం. శాస్త్రములందు కుశలుడు, కానీ తత్త్వ జ్ఞానం ఎరుగని వాడు అగు ఆ రత్నసాధకుడు మరెవరో కాదు. నా ఉద్దేశంలో నీవే!

శిఖిధ్వజుడు : నేనా?

కుంభమహర్షి : అవును. అక్షరాలా నీవే. ఎందుకంటే నీవు శాస్త్రజ్ఞానంలో కుశలుడవే. కానీ, తత్త్వజ్ఞానంలో మాత్రం విశ్రమించలేదు.

ఇక "చింతామణి" అనగా స్వాభావికం, సర్వదుఃఖవినాశకం అయినట్టి "సర్వత్యాగం" అనునదే! ఆ సర్వత్యాగాన్ని నీవు ఈ అడవికి రాక ముందే శాస్త్ర ప్రవచనాలు విని సంపాదించావు. శుద్ధమగు సర్వత్యాగంతో సమస్తం లభిస్తుంది. సర్వత్యాగం ముందు చింతామణి ఎంతటిది? దాని ముందు బ్రహ్మదేవుని ఐశ్వర్యం కూడా దిగదుడుపే అవుతుంది. ఆత్మజ్ఞానోదయ కారకమగు సర్వత్యాగం నీకు సిద్ధించింది. అందుచేతనే స్త్రీ–ధన–బాంధవ్య సహితమగు సామ్రాజ్యాన్ని క్షణంలో వదలి ఇక్కడికి రాగలిగావు.

అయితే, అన్నింటినీ త్యజించి ఇక్కడికి వచ్చినా నీవు 'అహంకార, మమకారాలను మాత్రం హృదయం నుండి పారద్రోలలేదు. సంపూర్ణ త్యాగంచే నీకు జగత్తు పూర్ణానందమగు బ్రహ్మస్వరూపంగా అనుభవమయ్యేదే! అయితే, మమకారాన్ని ఇంకా కలిగి ఉండటం చేతనే నీవు ఇంకా త్యాగ–అత్యాగ రూపాలగు వికలంచే ఆవరించబడిఉన్నావు. ఈ కారణం చేత నీ యందు బ్రహ్మానందం ఇంకా భాసించుట లేదు.

సర్వత్యాగరూపమగు 'ఆత్మానందమణి' తప్ప వేరొక చింతామణితో పనిలేదు.

'బ్రహ్మానందము' అంటే ఏమిటి? సర్వమూ త్యజించివేయగా ఆ త్యాగరూపమగు మహోదయమే బ్రహ్మానందం. 'ఊహూ! బ్రహ్మానందం చాలా కాలం సాధన చేసిన తరువాత మరేదో అన్యంగా లభిస్తుంది. అంతేగాని ఇక్కడ అంత తేలికగా దొరికేది కాదు' అను అపోహతో ఉన్నావు గాని, "ఇప్పటికిప్పుడు ఇక్కడ అన్నీ త్యజిస్తే అప్పుడిక శేషించేదే బ్రహ్మానందము" అని గ్రహించుట లేదు. "ఎప్పుడో, ఎప్పటికో, ఎక్కడో, ఎన్నడో"... అనే స్వల్ప అభిప్రాయవీచిక నీలో క్రమంగా దృఢం కాగా నీవు సంపాదించుకున్న సర్వత్యాగబుద్ధి కాస్తా తిరోగతి పొందింది.

గొప్ప గాలి వీచి చెట్లు కదలుతుంటే పక్షులు నిశ్చలతను కోల్పోయి 'కావ్ కావ్ – కీచ్ కీచ్' అంటూ గాలిలోకి లేస్తాయి చూచావా? అనేక శాస్త్ర రహస్యాలు విజ్ఞుల ద్వారా విని కూడా నిశ్చిత అభిప్రాయం కలిగి ఉండకపోవటం చేత నీవు సమకూర్చుకున్న సర్వత్యాగ బుద్ధి కూడా నిశ్చలత్వం త్యజించి, వీథిన పడింది.

త్యాగి అయినవాడికి ఇక చింతలతో పనేముంది? చింతలతో పూర్ణుడైనవాడికి త్యాగం ఎలా సాధ్యపడుతుంది? గాలివేగంగా వీస్తూ ఉంటే, "ఓ వృక్షమా! కాస్త కదలకుండా నిశ్చలంగా ఉండు" అని కేక వేస్తే ఆ వృక్షం నిశ్చలంగా ఉంటుందా?

సంకల్పము అని దేనిని అంటామో అదియే చింత. చింతయే చిత్తము. అంతేగాని చిత్తము అనగా మరింకేదో కాదు. అట్టి చింతలు ఉండియే ఉండగా చిత్తము యొక్క త్యాగము ఎట్లా లభిస్తుంది చెప్పు?

ఈ "ముల్లోకాలు" అను జాలానికి ఆధారభూతం చిత్తమే. అది కొద్దిసేపు ఉన్నా... ఉన్నంతసేపూ చింతచే గ్రస్తమై ఉంటోంది. అట్టి చిత్తం ఉండి ఉండగా ఇక నీకు 'సర్వత్యాగఫలం' ఎక్కడి నుండి వస్తుంది? కాస్త చప్పుడైతే పావురాలు పైకి ఎగిరిపోతాయి చూచావా? నీ అంతఃకరణం సంకల్ప గ్రహణమును కొంచెం నిర్వర్తించగానే నీ 'సర్వత్యాగం' ఎటో ఎగిరిపోయింది.

నీవు చేసిన శాస్త్ర పఠనం, సాధనలు, ఆత్మశాస్త్రజ్ఞులు అందించిన సమాచారం, నీ భార్య చూడాలతో కూడి చేసిన తాత్త్విక సంభాషణలు, వివేకముతో స్వయంగా చేసిన పరిశీలన ఇవన్నీ ప్రసాదించిన ప్రయోజనంగా 'సర్వత్యాగం' అనే చింతామణి నిన్ను సమీపించింది. 'సర్వత్యాగమే పరమ మోక్షస్థానం' అని విని ఉండి కూడా నీవా సర్వత్యాగాన్ని స్వీకరించి ఉండవలసింది పోయి, "మోక్షమంటే ఈ మాత్రానికే వస్తుంది! గొప్ప తపోధనులకే రావటం లేదు. ఇక నేనెంత? అందుకని ఇంకా తపస్సు చేసి మోక్షానికి అర్హత సంపాదించుకుంటాను" ...అని భావించి సర్వత్యాగమణిని అనాదరించావు. సర్వత్యాగమణినీ సమీపం నుండి వెళ్ళిపోగానే 'సంకల్పాలు' అనే నీ కళ్ళకు 'తపస్సు' అనే గాజుమణి కనిపించింది. "ఆహా! ఇదండీ, అసలైన మార్గం" అని అనుకోసాగావు. బాలుడు నీళ్ళలో చంద్రుని చూచి, 'ఈ దాదికి బుద్ధిలేదు. చంద్రుడు నీళ్ళలో ఉన్నాడు. ఈ నీళ్లలో చేతులు పెడితే చేతులకు దొరకుతాడు. చంద్రుని పట్టి ఇవ్వమంటే ఆకాశం వైపు చూపించి ఆ చంద్రుని ఎవరూ చేతులతో పట్టుకోలేరయ్యా! ... అని అంటుందేమిటి? ఆమెకు ఏమీ తెలియదులే" ...అని అనుకున్నట్లు నీవు కూడా ప్రయత్నిస్తున్నావు. "త్యాగేనతు కైవల్యమ్" అని ఆత్మవేత్తలు నీకు చెప్పితే కూడా, త్యాగమంటే ఏమిటో బాగా విని కూడా "ఎక్కడో ఒంటరిగా తపస్సు చేసి అప్పుడు త్యాగం సంపాదిస్తాను" ...అని భావన చేయసాగావు. క్రమంగా దుఃఖహేతువైన ఏకాంత తపస్సుకై ఇక్కడికొచ్చి ఈ దండం, కమండలం, రుద్రాక్షలు, పర్ణశాలను పట్టుకు వ్రేలాడుచున్నావు.

ఓ శిఖిధ్వజా! నీవు తక్కువవాడివా? కాదు. స్వయంగా యుక్తాయుక్త – నిత్యానిత్య విచక్షణ కలవాడివి. మహారాజుగా ఉంటూనే అనునిత్యం ఉదయ – సాయం సంధ్యావిధుల రూపంలో ధ్యానాలను నిర్వర్తించే అభ్యాసపరుడవు. ఆత్మతత్త్వాన్ని పఠనాదులచే గ్రహించినవాడివి. ఆ తరువాత మీ దేశంలోని ఆత్మజ్ఞులను ఆహ్వానించావు. వారు ప్రవచించే ఆయా ఆత్మశాస్త్ర ప్రతిపాదిత విశేషాలను విన్నావు. ఈ దృశ్య విషయాల పట్ల అనాదరణను, వాసనారాహిత్యాన్ని చక్కగా ప్రారంభించావు.

అది మరికొంత వివేకంతో కొనసాగించి ఉంటే సర్వత్యాగఫలం లభించేదే! ఇంతలోనే "అబ్బే! ఇక్కడ కూర్చుంటే కాదు. తపస్సు చేస్తేగాని లాభం లేదు" ...అని క్లేశయుక్తమైన తపస్సు వైపుగా నీ ధ్యాస మళ్ళింది. ఈ ఏకాంతవనవాస తపస్సు వలన ఏం లభించింది? మొదట ఇల్లు, రాజ్యం మొదలైనవి వదలటం చేతను, మధ్యలో శీత–వాతాదులను సహించవలసిరావటం చేతను, చివరికి ఫలసంగం చేతా ఈ కార్యక్రమమంతా నీకు దుఃఖాన్నే కలుగజేయడమే ఇక్కడ జరిగింది.

అమితానందముత్సృజ్య సుసాధ్యం యః ప్రవర్తతే ।
మితే వస్తుని దుఃసాధ్యే స్వాత్మహా శఠః స్మృతః ॥

ఎవరైతే "ఆత్మానందదాయకము, తేలికైన సాధనము, అపరిమితము" అయినట్టి సర్వత్యాగాన్ని వదలి పరిమితాలైన ఇట్టి తపస్సులందు ప్రవృత్తుడౌతాడో అట్టివాడు తనకు తానే ద్రోహం చేసుకున్నవాడు మొండివాడు, (ఆత్మహంతకః, శఠః) అవుతాడే గాని సుఖి అవడు సుమా!

"తపస్సు చేత నేను ఇక్కడ ఆత్మవస్తువుతో ఏకత్వము సంపాదిస్తాను" అని తలచి ఇక్కడ ఈ అజ్ఞానగృహంలో చిక్కుకున్నావు. ఇక్కడ సర్వత్యాగము సంపాదించాలని ప్రయత్నించకుండా

విఫలుడవౌతున్నావు. "రాజ్యం దుఃఖపూరితం కదా" అని దానిని వదలి ఇక్కడకి వచ్చి "వనవాసం" అని ఈ దృఢబంధనంలో చిక్కుకున్నావు. ఒక బంధం నుండి బయల్వెడలి ఇంకొక బంధనంలోకి ప్రవేశించినట్లైనది నీ పని! ఇంతకు ముందెప్పుడూ నీకు వనవాసం అనుభవమై ఉండకపోవటం చేత ఇక్కడి శీత-వాత-తాపాలు నీ ఈ సుకుమార దేహాన్ని బాధించి కృశింపజేశాయే గాని, కొత్తగా ఇక్కడ నీవు సాధించినదేదీ లేదు. "ఈ వనవాసానికి వచ్చి నేను చింతామణిని పొందుచున్నాను" అని అనుకుంటున్నావే గాని యథార్థానికి నీవు పట్టుకున్నది గాజుమణి మాత్రమే.

ఓ అందమైన కనులు గల శిఖిధ్వజా! ఈ విధంగా నీ కథను మణిసాధకుని గాజుమణికి అన్వయించి చెప్పాను. ఇప్పుడు నేను చెప్పిన సమన్వయమును జాగ్రత్తగా పరిశీలించి ఆ తరువాత 1.సర్వత్యాగం, 2. తపస్సులలో ...దేనిని ఎన్నుకోవాలనుకుంటావో, ఇక నీ ఇష్టం. స్వయముగా నీ బుద్ధితో యోచించి అర్హమైన దానిని, ఉపయుక్తమైన దానిని ఆశ్రయించు. ఏది ఉపయుక్తమనుకుంటే అద్దానిని నీ చిత్తకోశములో నెలకొల్పి అప్పుడు ఫలప్రాప్తి పర్యంతము ఆచరించు.

❖❖❖

26. జ్ఞానము కొరకు త్యాగం

కుంభమహర్షి : ఇంతవరకూ నీకు చింతామణిల కథలో ఉద్దేశమేమిటో చెప్పాను కదా! ఇక ఇప్పుడు వింధ్యాచలంలో ఒక కందకంలో చిక్కుకున్న గజేంద్రుని కథలోని ఉద్దేశమేమిటో విను.

వింధ్యపర్వత శ్రేణులలో ఆ ఏనుగు సంచరిస్తున్నట్లు నీవీ భూమిపై సంచరిస్తున్నావు. వైరాగ్య వివేకములే నీ దంతములు. ఇక ఆ ఏనుగును పట్టుకోవటానికి ప్రయత్నించిన మావటివాడు ఎవర నుకున్నావ్? దుఃఖప్రదం, శత్రురూపం అయినట్టి నీ అజ్ఞానమే!

ఆ ఏనుగులాగా నీవు కూడా శాస్త్రజ్ఞాన రూపమైన గొప్పబలం కలవాడివే. అయితే ఆత్మవిషయమై ఏర్పడి ఉన్న 'అజ్ఞానం' అనే మావటివాని చేత నీవు ఒక దుఃఖం నుండి మరొక దుఃఖానికి, ఒక భయం నుండి మరొక భయానికి పరిగెత్తించబడుచున్నావు. ఆ ఏనుగు ఇనుపగొలుసులతో బంధింప బడితే, నీవేమో అనేక ఆశాపాశాలచే బంధింపబడ్డావు.

ఆశాహి లోహరజ్జుభ్యో విషమా, విపులా, దృఢా ।
కాలేన క్షీయతే లోహం! తృష్ణాతు పరివర్ధతే ॥

ఆశాపాశములతో పోల్చితే ఇనుప గొలుసులు ఎంతటివి? విషంతో సమానమైన ఆశాపాశాలే అతి దృఢమైనవి. ఎందుచేత నంటావా? ఇనుపగొలుసులైతే ఎంతో కొంత కాలానికి త్రుప్పుపట్టి విరుగుతాయి. ఇక ఆశాపాశాలో? కాలం గడుస్తూ ఉంటే ఇంకా ఇంకా వృద్ధి చెందుతాయి!

ఆ ఏనుగు బంధించబడి ఉంటే మావటివాడు చూస్తూ వినోదిస్తున్నట్లు ఏకాంతమున బంధించ బడి ఉన్న నిన్ను చూచి నీ అజ్ఞానం వినోదంగా పరికిస్తోంది. ఆ ఏనుగు గొలుసులను విఱగగొట్టినట్లు, నీవు రాజ్యాది భోగాలను త్యజించావు. అంతవరకు బాగానే ఉన్నది. కానీ...

కదాచిత్ సుకరం శస్త్ర శృంఖలా బంధభేదనమ్,
న త్వస్య మననః, సాధో! భోగాశా వినివారణం॥

నీవు మనస్సులోని భోగాల గురించిన ఆశను మాత్రం నివారించలేదు. ఆ ఏనుగు బంధాలను త్రెంచివేయు క్షణాలలో మావటివాడు ఆ ఏనుగు మీదపడినట్లు రాజ్యమును త్యజించునప్పుడు అజ్ఞానం నీ కాళ్ళ క్రిందకు వచ్చిపడింది.

శిఖిధ్వజుడు : రాజ్యమును త్యజించటం 'త్యాగం' కాదంటారా?

కుంభమహర్షి : త్యాగమే. అయితే, త్యాగం అనేది రెండు రకాలుగా ఉంటున్నది.

1. విరక్త త్యాగం -

యదా విరక్తః పురుషో భోగాశాం త్యక్తుమిచ్ఛతి,
తదా ప్రకమ్పతే అజ్ఞానం ఛేద్యే వృక్షే పిశాచవత్ ॥

విరక్తుడగు మనుజుడు భోగాలపై ఆశలను వదలి పెట్టడానికి ప్రయత్నించగానే కొమ్మలు కొట్టినా కూడా ఆ మోడువారిని చెట్టు మీద పిశాచం వ్రాలినట్లు అజ్ఞానం ఆతని నెత్తి మీద వ్రాలి ఆతనిని కంపింపజేస్తుంది.

2. వివేక త్యాగం -

యదా వివేకీ పురుషో భోగాన్ సంత్యజ్య తిష్ఠతి,
తదా పలాయతే అజ్ఞానం ఛిన్నే వృక్షే పిశాచవత్ ॥

వివేకి అగువాడు భోగములు త్యజించటం జరిగిందనుకో ...వృక్షం మొదలంట ఛేదించబడగా పిశాచం పలాయనమగునట్లు ఆతని అజ్ఞానం కూడా పలాయనం చిత్తగిస్తుంది.

❖

అంపంతో ఒక వృక్షాన్ని నరికి వేశామనుకో, ఆ వృక్షంపై ఉన్న గూళ్ళు కూడా నేలకూలుతాయిగా. నిశ్చయపూర్వకంగా భోగజాలాలను పరిత్యజించి ఉంటే అప్పుడు అజ్ఞానం కూడా నేల కూలేదే? కానీ నీవు చేసినదేమిటి? రాజ్యాదులైతే వదలిపెట్టావు. ఈ అడవిలోకి వచ్చిపడ్డావు. అజ్ఞానం తొలగగానే నీ యందు జ్ఞానమును ప్రవేశింపజేయాలి కదా? అందుకు చేయవలసినదేమిటి? ఏ మహాత్ముల పాదములనైనా ఆశ్రయించి జ్ఞానమును సంపాదించుకొని ఉండి ఉంటే మనస్సు యొక్క త్యాగమును గుర్తెరిగే వాడివి. అట్టి మనోత్యాగరూప మహాఖడ్గంతో అజ్ఞానమును వినాశనమొనర్చేవాడివే! మనస్సును త్యజించకుండా మనస్సుకు విషయములైన రాజ్యాదులను మాత్రమే త్యజించావు. అందుచేత మనస్సు ఉండనే ఉండి అది మరల ప్రకోపించి నీ కొంపముంచింది. మనోత్యాగం సంపాదించలేదు కనుక అజ్ఞానం నిన్ను మరల ఓడించింది. అది నిన్ను ఈ 'తపస్సు' అనే మహాకందకంలోకి త్రోసివేసింది. పద్దెనిమిది ఏళ్ళు తపస్సు చేసిన తరువాత ఇప్పుడిక ఏమి చేయాలో నీకు పాలుపోవటం లేదు. ఎందుకంటే రాజ్యాన్ని వదలావేగాని, ఆ రాజ్యమును దేనిచే ధరించావో ఆ మనస్సును ఎలా వదలాలో నీవు గ్రహించయత్నించలేదు. రాజ్యాన్ని వదిలేటప్పుడే ఏ అజ్ఞానం మిగిలి ఉన్నదో, ఆ అజ్ఞానాన్ని జ్ఞానప్రాప్తిచే సమూలంగా నశింపజేసుకొని ఉంటే, అది

మరల నిన్ను బాధించేదే కాదు. మావటి వాడు ఏనుగును బంధించటానికి కందకం ఏర్పాటు చేసినట్లు నీ అజ్ఞానమే ఈ తపోదుఃఖాన్ని కలుగజేసింది. ఏనుగును బంధించటానికి ఉపయోగించే పరికరాలు నీ అజ్ఞానం యొక్క అంతరమున సంచరించే 'చింత'. నీవు జ్ఞానవిషయాలు తెలియనివాడవేం కాదు. కానీ లాభమేముంది? 'అజ్ఞానం' అనే శత్రువు కొద్ది క్షణాలకాలంలో 'తపస్సు' అనే కందకం లోకి నిన్ను ఈడ్చుకొచ్చింది. ఆ కందకం బయటకు కోమల పూతీగలచే కప్పిపెట్టినట్లు నీ ఈ తపో దుఃఖం కొంచెం శాంతి, మౌనం మొదలైన గుణ ప్రవృత్తులచే ఆవరించబడింది. ఆ విధంగా తపో కందకంలో ఈ రోజు వరకూ కూడా బద్ధుడవై పడి ఉన్నావు.

ఓ రాజా! ఈ విధంగా నీవే ఆ ఏనుగువు. ఆశయే గొలుసు. నీ అజ్ఞానమే ఆ మావటి వాడు. ఉగ్ర తపస్సు చేయాలనే పట్టుదలే కథలోని కందకం. నీవు సంచరించే ఈ భూతలమే వింధ్యపర్వత ప్రాంతం. ఇదంతా ఎరిగినవాడవై ఇక నీకు ఏది సముచితమో అదియే చక్కగా ఆచరించు.

❖❖❖

27. సర్వత్యాగమంటే వస్తు త్యాగమా?

కుంభమహర్షి : ఓ శిఖిధ్వజ మహారాజా! జ్ఞానులగు మహనీయులెందరో గ్రంథస్థంగాను, నీవు ఆహ్వానించగా వచ్చి నీ సభలలోను, మనం చెప్పుకునే అనేక సర్వత్యాగాల గురించి, తదితర జ్ఞాన విషయాల గురించి చెప్పారు. నీవు వినియే ఉన్నావు. అదట్లా ఉంచు.

నీ ప్రియురాలు చూడాల గొప్ప నిపుణత కలిగియున్న ఆత్మజ్ఞాన సంపన్నురాలు కదా! ఆమె ఏ జ్ఞాన – విజ్ఞానములు నీకు చెప్పిందో అవన్నీ నీ వెందుకు స్వీకరించలేదు చెప్పు? ఆత్మజ్ఞానులలో ముఖ్యులైనవారిలో ఆమె ఒకరు కదా! ఆమె ఏదేది చెప్పిందో అదంతా సత్యము, ఆదరింపబడవలసినది, అనుష్ఠానయోగ్యము అయి ఉన్నది. ఆమె ఏమి చెప్పుచున్నదో మనోబుద్ధులను కొంచం ఏకాగ్రపరచి విన్నావా? ఆమె మాటలు వినబడుచుండగానే, అంతకుముందే నీవు ఏర్పరచుకొన్న కొన్ని అభిప్రాయములలో ప్రవేశించి జ్ఞాన సూచనలను పరిశీలించనైనా లేదు. "ఈమె స్త్రీ కదా! ఈమెకేమి తెలుసు?" అని ఉదాసీనంగా ఊరుకున్నావు. చెప్పేవారి భౌతిక, సాంఘిక విషయాలు ముఖ్యమా? చెప్పే విషయం ముఖ్యమా నీకు? పోనీ, ఆమె మాట అలా ఉంచు. "నా భార్య కదా! నాకే తెలియనిది ఈమెకేం తెలుస్తుంది?" అని ఊరుకున్నావు సరే. నీ స్వబుద్ధితో సర్వత్యాగము గురించి విచక్షించి అప్పుడు బుద్ధి స్థిరత్వం సంపాదించుకొని ఉండవలసింది. అదీ నీవు చేయనేలేదు!

శిఖిధ్వజుడు : ఆగండాగండి మహాత్మా! ఒక్కమాట. నేను రాజ్యమును, గృహమును ఆ ప్రాంతమునే త్యజించివేశానే! ప్రాణప్రదయగు భార్యను కూడా వదలిపెట్టి వచ్చేశానే! ఇవన్నీ వదలి ఇక్కడకు వచ్చిన తరువాత కూడా అది 'సర్వత్యాగం' అవదంటారా? అంతకన్నా ఎవరు మాత్రం ఏం త్యజిస్తాడు?

కుంభమహర్షి : (చిరునవ్వుతో)

ధనం దారా గృహం రాజ్యం భూమిః ఛత్రంచ బాంధవాః ।
ఇతి సర్వం న తే రాజా! సర్వత్యాగోహి క స్తవ ॥

ఏమి రాజా? నీవు చమత్కారంగా మాట్లాడుచున్నావే! అక్కడి ధనము, భార్య, ఇల్లు, రాజ్యం, భూమి, పదవులు, అధికారులు, బంధువులు... ఇవన్నీ 'నీవి' అని అనుకుంటున్నావా? నీ బాటలో అవి, వాటి బాటలో నీవు కాకతాళీయంగా తారసపడటమే కదా ఇదంతా?

శిఖిధ్వజుడు : ...!

కుంభమహర్షి : ఏమి, మాట్లాడవేం? నీవి కానివి నీవు వదలటమేమిటి? నీవి కానివి వదిలితే నీకు సర్వత్యాగఫలం ఎట్లా లభిస్తుంది?

తవాస్త్యేవాపరత్యక్తః సర్వస్మాద్భాగ ఉత్తమః ।
తం పరిత్యజ్య నిః శేషమ్ ఆయాస్యసి విశోకతామ్ ॥

నీచే త్యజించబడవలసియున్న సర్వోత్తమ విభాగము ఒకటి ఉన్నది. అద్దానిని వదలనే లేదు. ఆ ముఖ్య విభాగమును పరిత్యజించి దుఃఖరాహిత్యాన్ని పొందు.

శిఖిధ్వజుడు : ఏమిటి! ఇంకా నేను వదలవలసినది ఉన్నదా? తెలిసింది మహాశయా! రాజ్యాదులు వదిలిపెట్టి ఈ వనమునకు వచ్చి "వనం నాది" అని పద్దెనిమిది సంవత్సరాలుగా అనుకొని ఉన్నాను కదా! మీ ఉద్దేశం ఇదే అయి ఉంటుంది. ఇప్పుడు చూడండి పర్వతవృక్షాదులతో కూడిన ఈ వనము పట్ల నాకు గల ఆపేక్షను ఇప్పటికిప్పుడే త్యజించివేస్తున్నాను చూడండి.

❖

ఓ రామా! కుంభర్షి వాక్యాలచే ప్రేరితుడైన జితేంద్రియుడు, మహావీరుడు అయిన ఆ శిఖిధ్వజుడు కనులు మూసుకున్నాడు. కించిత్ మాత్ర 'స్ఫురణ'చే హృదయంలో స్ఫురించే ఆ పరిసరముల పట్ల ప్రీతిని-ధూళితో కప్పబడిన అద్దమును తుడిచినట్లు-తుడిచివేసాడు. నెమ్మదిగా కళ్ళు తెరిచాడు.

శిఖిధ్వజుడు : ఇప్పుడు చెప్పండి మహర్షీ! వృక్ష-పర్వత-లతాదులతో అలంకరించబడి ఉన్న ఈ వనం యొక్క పరిసరాల పట్ల గల నాకు ఏర్పడి ఉన్న ప్రియత్వాన్ని, వాటికి సంబంధించిన ఇష్ట-అయిష్ట-కోప-తాప-అభిప్రాయ-దురభిప్రాయముల సంబంధమైన సర్వ వాసనలను క్షణంలో త్యజించి వేశాను. కాబట్టి ఇక ఇప్పుడు చెప్పండి! ఇప్పుడు నాకు సర్వత్యాగం సిద్ధించినట్లే కదా!

కుంభమహర్షి : (పకాలున నవ్వుతూ) ఏమిటీ! ఇక్కడ గల వృక్షాలను, స్థలాన్ని, లతలను, జల-సరోవరాలను త్యజిస్తున్నావా? బాగున్నదయ్యా! నీవు ఇక్కడికి రాక ముందే ఇవన్నీ ఇక్కడున్నాయి. ఇక్కడి నుండి నీవు వెళ్ళిపోయిన తరువాత కూడా ఇవి ఇక్కడే ఉంటాయే! వీటిని పట్టుకుని "ఇవి నావి" అని ఎట్లా అంటావు?

శిఖిధ్వజుడు : అవును. ఇవి నావి కావు.

కుంభమహర్షి : మరి! "నా మిత్రుడు ధరించిన ఆతని వజ్రపు ఉంగరం నేను త్యాగం చేస్తున్నాను"... అన్నట్లున్నది నీ వాక్యం! ఇవి నీవి కానప్పుడు వీటిని నీవు త్యజించటమేమిటి? తద్వారా సర్వత్యాగసిద్ధిని సంపాదించటమేమిటి, ఏవో పరాచికాలు కాకపోతే? నీవు పరిత్యజించవలసింది ఇది కాదు. ఇంతకన్నా ఉత్తమమైన ఒకానొక నీయందలి విభాగమును నీవు పరిత్యజించనే లేదయ్యా! నీదైనదేదో,

అది వదలకుండా ఏవేవో వదలి "వదలాను కదా!" అంటావేమిటి? పరిత్యాజ్యావశ్యకమైనట్టి నీయందు చోటు చేసుకున్న విభాగమును నిశ్శేషంగా త్యజించి అప్పుడు తద్వారా దుఃఖరాహిత్యం పొందటం గురించి యోచించు.

శిఖిధ్వజుడు : ఓ కుంభ మహాశయా! పోనీ, అవన్నీ కాకపోతే, ఇప్పుడింకా నా దగ్గిర ఉన్న ఈ నా యజ్ఞపాత్ర, అగ్నికార్యము చేసే యజ్ఞవాటిక, ఈ కుటీరం, పులిచర్మము మొదలైనవి కూడా త్యాగం చేసి వస్తాను. చూస్తూ ఉండండి.

❖

ఓ రాఘవా! శాంతుడు, శుద్ధచిత్తుడు అయిన ఆ మహారాజు తను ఆసీనుడైయున్న ఆసనం నుండి తటాలున లేచి నిలబడ్డాడు. కుంభ ఋషి (మునిపుత్ర రూపంలో ఉన్న చూడాల) మాత్రం అసనము మీదే ఉండి శిఖిధ్వజుడు చేస్తున్న చర్యలను మౌనంగా చూస్తున్నాడు. "ఈతడు ఏం చేస్తాడో చూద్దాం – ఇదంతా ఇతనికి శ్రేయమే కాబోవుచున్నది గదా!" ...అనుకుంటూ కుంభుడు ఆతని కదలికలను మాత్రం మెదలకుండా గమనిస్తున్నాడు.

శిఖిధ్వజుడు గంభీరవదనంతో కుటీరంలో ప్రవేశించాడు. యజ్ఞపాత్రలు మొదలైన సామాగ్రిని ఆశ్రమం నుండి బయటకు తీసుకుని వచ్చి ఒకచోటికి చేర్చాడు. అక్కడికి కొద్ది అడుగుల దూరంలో ఎండు కట్టెలను తెచ్చి అగ్ని రగిల్చి మంటచేశాడు. రగులుతున్న మంటలలో ఒక్కొక్క వస్తువును విడువసాగాడు.

శిఖిధ్వజుడు : ఓ జపమాలా! నీవు గొప్ప స్వామి భక్తపరాయణుడవై నన్ను కొలిచావు. ఇక నేను చేసినదేమిటి? స్వార్థసాధనతత్పరుడనై ఇంతవరకూ నీకెంతో శ్రమ ఇచ్చాను. ఇప్పటికి నీ సేవ పరిసమాప్తమైనది. ఇప్పుడు జపము–తపము మొదలైన కర్తవ్యములకు సంబంధించిన భ్రాంతి నాయందు తొలగింది. ఇక నీతో నాకేమీ పనిలేదు. నీతో కూడా నేను అనేక మంత్రరూప మహారణ్యాలలో సంచారం చేసిచేసి అలసిపోయాను. మనిద్దరం కలసి ఎన్నో సిద్ధక్షేత్రాలు చూచాం. ఇక నేను ఆత్మయందు విశ్రమించే సమయం ఆసన్నమైనది. అందుచేత నీవు ఈ అగ్నిలో ప్రవేశించి నీ మూల ప్రకృతిలో విశ్రమించు.

ఓ పులిచర్మమా! మనుష్య రూప మృగమువంటి నేను ఒక మృగం నుండి ప్రాప్తించిన నిన్ను అనేకసార్లు బాధిస్తూ ధర్మాసనం మీద పరచాను. నిన్ను ధరించిన ఆ మృగదేహి ఇప్పుడు ఎన్నో దేహాలలో ప్రవేశిస్తూ నిష్క్రమిస్తూ ఎక్కడో ఉండి ఉంటాడు. నీ మూల ప్రకృతి యగు ఆకాశం నందు ఎప్పుడో విలీనం కావలసిన నీవు నా వలననే ఇంకా ఈ చర్మాకారం వహించి ఉన్నావు. "ఏకాంతం – తపస్సు" ... అని అనుకుంటూ నిన్ను నీ పుట్టినిల్లు అగు ఆకాశానికి చేరకుండా నేను నిరోధించాను. ఇప్పుడిక నీకు స్వదేశమగు ఆకాశస్థితి ఈ అగ్ని ద్వారా ఒనగూడుగాక!

ఓ దండమా! ఓ కమండలమా! గుండ్రని ఆకృతిగల నీవు ఇంతకాలం నాకోసం జలమును ధరించేదానివి. మీరు చూపిన సౌజన్యమునకు, నేను చేయగల ప్రత్యుపకారమేమున్నది? ఓ జల పాత్రమా! అగ్నిచే శుద్ధిపొంది నన్ను సేవించావు. తిరిగి నిన్ను అగ్నికి అర్పిస్తున్నాను.

ఓ రాఘవా! ఈ విధంగా పలుకుచూ ఆ శిఖిధ్వజుడు ఆయా వస్తువులను భోజన సామాగ్రిని కూడా అగ్నికి ఆహుతి చేసివేశాడు. కమండలము వంటి కొన్ని పవిత్ర వస్తువులను ఆ బాటలో పోవుచున్న ఒక బాటసారికి ఇచ్చివేసాడు. అప్పుడు తిరిగి కుంభుని ముందు నిలబడి ఇలా పలికాడు.

❖

శిఖిధ్వజుడు : ఓ కుంభమహర్షీ! మీరు నేను చేస్తున్నదంతా గమనిస్తున్నారు కదా! నాకు ఈ వస్తువులపై గల ప్రీతిని తొలగించుకోవటానికీ, మీరు ప్రవచించినట్లు నిష్క్రియుడను కావటానికీ ఈ వస్తువులన్నీ అగ్నికి వదలివేశాను. ఇదంతా చూచి మీరు ఖేదమొందకుండెదరు గాక! అయోగ్యమైన వస్తువులను లోకంలో కలిగి ఉండరు కదా! సర్వత్యాగము సంపాదించే సమయం ఆసన్నమగుటచేతనే అవి అగ్నిలో మండి నేడు బూడిద అగుచున్నాయి. ఇంకా చూస్తూ ఉండండి. రెల్లు గడ్డితో నిర్మించిన ఈ ఆశ్రమ మందిరమును కూడా ఇప్పుడే అగ్నికి ఆహుతి ఇచ్చి దీనిని కూడా త్యజించినవాడనవుతాను.

❖

ఇలా పలికి శిఖిధ్వజుడు కణకణమండే రెండు కట్టెపుల్లలను తెచ్చి పర్ణశాలను కాల్చివేసాడు. ఇంకా అక్కడా – ఇక్కడా ఏవైనా వస్తువులు కనిపిస్తే వాటినన్నిటినీ విసరివేయటమో, విరగగొట్టటమో, అగ్నిలో పడివేయటమో, దారినపోయేవారికి ఇచ్చివేయటమో చేశాడు. నార వస్త్రములన్నీ తగలబడి బూడిద అయినాయి. ఇక శిఖిధ్వజుడు కట్టుబట్టలతో "నావి" అని చెప్పుకోవటానికి వస్తువులేమీ మిగలకుండా మిగిలాడు.

శిఖిధ్వజుడు : ఆహా! కుంభమహర్షీ! నా జీవితంలో చాలా కాలం గడిచిపోయిన తరువాత 'సర్వత్యాగము' అనే మహత్తరమైన సందేశం మీరు నాకు ప్రదర్శించారు. ఇప్పుడు, ఈ గోచీ తప్ప మరే వస్తువు కలిగిలేను. ఈ గోచీని కూడా లోకులకొరకై మాత్రమే ధరించాను గాని, ఈ జీవునకు ఏదో మమకారం ఉండి కాదు.

ఈ సమస్త పదార్థములూ "నావి కావు" అని వాటిపట్ల మమత్వం వదలివేశాను. కాబట్టి నేనిప్పుడు సర్వత్యాగస్థితి పొందినట్లే కదా! ఇప్పుడు నేను శుద్ధుడను. సులభంగా ప్రబోధం పొందాను. ఈ ప్రపంచములోని సర్వపదార్థములూ ఇవి నావి అను మమత్వం ఏర్పడి ఉండటం చేతనే చివరికి దుఃఖభాజకములుగా పరిణమించటం జరుగుతోందని గ్రహించాను. బంధహేతువులన్నీ ఒక్కొక్కటీ తొలగుచుండగా ఇకనేను పరమశాంతిని పొందుచున్నాను. నేనిపుడు నిర్విషయుడనైనాను. సర్వదా తృప్తుడనగుచున్నాను. మీరు చెప్పిన మార్గంలో సర్వమూ త్యజించటం చేత సుఖవంతుడనై ఒప్పు చున్నాను. వివిధ బంధములన్నీ నశించాయి. కాబట్టి సర్వత్యాగము ఆచరించిన వాడనే కదా!

ఓ దేవపుత్రా! ఇప్పుడు నేను దిగంబరుడనై మిగలటం, సర్వ వస్తువులను వాటి పట్ల అపేక్షను మీ కళ్ళ ముందే త్యజించివేయటం చూచారు. కాబట్టి నేను మహాత్యాగాన్ని సంతరించుకున్నట్లేనని ఇప్పటికైనా ఒప్పుకుంటారా? లేదా?

కుంభమహర్షి : ఏమిటి నీవు సర్వత్యాగివా? కాదు. అర్ధ త్యాగివేకాని నీవు సర్వత్యాగివి మాత్రం కాదు. సర్వత్యాగానికి ఒక ముఖ్యమైన గురుతు ఉన్నది. అది ఏమిటంటే... సర్వత్యాగం వల్ల నిర్హేతుకమైన జహేతువు యొక్క అగత్యం లేకుండానే – పరమానందం స్వభావసిద్ధం అవుతుంది. అందుచేత ఓ రాజా! నీవు సర్వత్యాగం యొక్క అభినయం చెయ్యకయ్యా! నటన కాదు ఇప్పుడు కావలసింది. నిజమైన త్యాగం కావాలి. త్యజించటమవసరమై ఉన్న నీయొక్క అత్యుత్తమ విభాగం ఇంకా కలిగియే ఉన్నావు. దానిని పూర్తిగా త్యజిస్తేగానీ నీకు సర్వత్యాగం సిద్ధించదు.

శిఖిధ్వజుడు: (తనలో) ఏమిటీయన ఇట్లా అంటాడు! అన్నీ త్యజించాను కదా! ఇప్పుడు రాజ్యం లేదు, బంధువులు లేరు, ధనాదులు లేవు, రాజవస్త్రాలు, నారవస్త్రాలు కూడా లేవే! కనీసం నివసించటానికి... అంతఃపురం మాట దేవుడెరుగు... ఉన్న రెల్లుగడ్డి కుటీరాన్ని కూడా అగ్నికి ఆహుతి చేసి వదిలేశానే! జపమాల, యజ్ఞపాత్రలు అన్నీ వదలి తగులబెట్టటమో, పారవేయటమో, ఇచ్చివేయటమో చేశానే! ఇంకా నా దగ్గిర ఏమున్నదని ఈ పెద్దమనిషి వదలమంటాడు? ఏదో ముఖ్యమైన విభాగం ఇంకా మిగిలియే ఉన్నది. అది త్యజించు... అని ఇంకా అంటూనే ఉన్నాడే ఈయన! ఏది ఏమైనా ఇప్పుడు నేను సర్వత్యాగిని అయి మోక్షార్హత సంపాదించుకోవలసిందే! ఎట్లాగైనా ఈతని లెక్కకు నేను సర్వత్యాగి అను పదమునకు అర్హుడనని అనిపించుకోవసిందే. లేకుంటే... ఇన్నాళ్ళిక్కడ ముక్కుమూసుకుని ఈ తపస్సు చేయటం ఎందుకు? సరే ఇప్పుడింకా నా దగ్గిర ఏమున్నది?

❖

ఇట్లా ఆలోచిస్తూ శిఖిధ్వజుడు బుఱ్ఱ బద్దలుకొట్టుకుంటూ ఉంటే, ఆ కుంభమహర్షి పరమ ప్రశాంతమైన చిరునవ్వుతో ఆ పరిసరములను అగ్నికి ఆహుతి అగుచున్న ఆయా వస్తు సముదాయాన్ని, ఇటు శిఖిధ్వజుని వైపూ చూస్తూ మౌనం వహించి ఉన్నాడు. శిఖిధ్వజుడు మాత్రం పరీక్షించబడుచున్న విద్యార్థిలాగా బుఱ్ఱగోక్కుంటూ యోచిస్తున్నాడు. కొద్దినిమిషాలు గడిచేసరికి ఆతని మనస్సులో ఒక సమాధానం తళుక్కుమన్నది. తటాలున కూర్చున్న చోటినుంచి లేచాడు.

శిఖిధ్వజుడు: ఓ దేవర్షీ! ఇంతసేపూ "త్యజించటానికి ఇంకా ఏమి మిగిలింది?" అని మూర్ఖుడనై ఆలోచిస్తున్నాను. ఇప్పుడు తట్టింది. బహుశః ఇంతసేపూ మీరు కూడా ఇదే ఉద్దేశిస్తున్నారని గ్రహించివేశాను. ఇంకా ఈ దేహం మిగిలియే ఉన్నది కదా!

అసలు అన్ని అనర్థాలకూ దేహమే కారణం. దేహము కలిగియుండటమే బంధం భవరోగం కూడా"... అన్న శాస్త్రవాక్యాలు నాకు ఇప్పుడు గుర్తుకు వచ్చాయి. దేహమే దేహికి ఐహికమోహమని చెప్పగా విన్నాను. ఈ దేహంలో కళ్ళు, చెవులు, తదితర ఇంద్రియాలు ఉన్నాయి. సర్వాతీతమైన ఆత్మ స్వభావం నుండి నేను ఇంద్రియార్థములను ఆశ్రయించి, విషయములపై వాలుట చేతనే సర్వ అనర్థములు వచ్చి పడుచున్నాయి. ఈ దేహం త్యజించి దేహరహితుడగు పరిశుద్ధ దేహి (విదేహుడను) అయితేనే నా ఈ సర్వత్యాగం సంపూర్ణమయినట్లు. పరమజ్ఞానులగు మీ సమక్షంలో అన్నీ అగ్నిపరం చేసినట్లు ఈ నా దేహాన్ని కూడా అగ్నికి ఆహుతి ఇచ్చి మీ చేత 'సర్వత్యాగి' అని పిలిపించుకుంటాను.

ఇంక కుంభుని అభిప్రాయమునకు ఎదురుచూడకుండా ఆ శిఖిధ్వజుడు గంభీరముగా అగ్నివైపు అడుగులు వేయసాగాడు. ఇంకా అగ్ని కొద్ది అంగుళముల దూరంలో ఉండగా "ఓ రాజా! ఆగు" అని కుంభర్షి కేక పెద్దగా వినబడింది. గురు ఆజ్ఞను తెలివి గలవాడెవడైనా పాటిస్తాడు కదా! రాజు ఆగి ఒక్క అడుగు వెనక్కు వేసి కుంభర్షి వైపు తిరిగాడు.

కుంభమహర్షి : దా! ఇటొచ్చి కూర్చో! ఆ! ఇప్పుడు చెప్పు, ఏమిటి నీవు చేస్తున్నది? సంసారమునకు కారణం నీవా, ఈ దేహమా? నిపరాధియగు ఈ దేహం ఏం పాపం చేసిందని నీవు అగ్నిలోకి త్రోసివేయాలనుకుంటున్నావు? యజమాని ఇంకా మేత వేయలేదని ఒక తెలివి లేని ఎద్దు ప్రక్కనే గల దూడను తన్నినట్లుంది నీవు చేసేపని. ఆటలో ఓడిపోతున్నామని ఉక్రోషంతో ఆటవస్తువును విరగగొట్టితే ఏమిటర్థం? కఱ్ఱతో కొట్టిన వాడిని వదలి కఱ్ఱను పట్టుకుని తగలబెట్టితే ప్రతీకారం చేసినట్లౌతుందా? ఇల్లు దోచిన దొంగను వదలి దొంగలు పడ్డ ఇంటిని, గోడలను పగలగొట్టి ఏమి ప్రయోజనం? జడము, దీనము, మూగతపస్వి అయినట్టి ఈ దేహము నీకేం అపరాధం చేయలేదే! దీనిని త్యజించకు. త్యజించవలసింది దేహమును కాదు.

పాప మీ దేహం ఎవరినీ ఏమీ అనకుండా తనయందు తానే మౌనముగా ధ్యానమున నెలకొనియున్నది. కట్టె నీళ్ళలో కొట్టుకుపోతుంటే... ఆ కట్టె బలతరంగాలచే దొర్లించబడుతోంది గానీ, తనకు తానుగా కదలి వెళ్ళటం లేదే! అట్లాగే ఈ దేహము తానుగా ఏమీ చేయటం లేదు. దీనిని మరొకటేదో ఉపయోగిస్తోంది. ఏకాంతవాసంలో ఉన్న ఒక తాపసిని ఒక మదించిన దొంగ బాధించినట్లున్నది నీ వ్యవహారం! శిక్షకు యోగ్యుడైన మరొకడు ఈ దేహంలో ఉండి విషయేచ్ఛను, అల్పాశయములను ప్రదర్శిస్తూ ఉంటే ఆ దోషిని వదలి, ఈ దేహాన్ని శిక్షిస్తానంటావేమిటయ్యా బాబూ! ఒక తోటమాలి మామిడి వృక్షం దగ్గరకు వెళ్ళి "ఓ వృక్షమా! ఈ పళ్ళు నీవలననే రాలాయి. కనుక నిన్ను ఈ గొడ్డలితో నరికివేస్తాను" అంటే ఏం లాభం, మామిడి పళ్ళు రాలింది, తుపాను గాలికైతే? చేతనైతే గాలిని పట్టుకుని ప్రశ్నించాలి? సుఖదుఃఖములకు ఉత్పత్తి స్థానం దేహము కావచ్చు. కానీ, ఉత్పత్తికి కారణం దేహం కాదు. అది వేరే ఉన్నది. కారణమును వదలి కార్య సాధన మాత్రమగు ఈ దేహమును ప్రశ్నిస్తే అదేం చేస్తుంది చెప్పు? పుష్పాలు, ఫలాలు నేలరాలటానికి గాలి కారణంగాని చెట్టు కారణం కానట్టే శరీరం చలించటానికి కారణమగుచున్నది మరొకటి ఉన్నది. దానిని పట్టుకుని శిక్షించు.

సరే! ఒకవేళ ఈ శరీరాన్ని త్యజిస్తావు. అంతటితో సమస్య తీరుతోందా? అబ్బే, లాభమే లేదు. ఎందుకంటావా, మరణానంతరం మరొకదేహం వస్తుంది. అయితే ఆ దేహం ఈ దేహంతో సమానంగా జ్ఞానార్హమై ఉంటుందని చెప్పగలమా? జ్ఞానార్హతకు మానవ ఉపాధి కన్న ఉత్తమమైనదేది ఉన్నది? సాధనకు, గురుసేవల వంటి ఉత్తమ కార్యక్రమాలకు పఠన, గ్రహణాదులకు ఇంత అవకాశం మరల లభిస్తుందని నమ్మకమేమున్నది? పోనీ ఏదో దేహం లభిస్తుందనుకో, అప్పుడైనా సర్వత్యాగం లభిస్తుందని అనగలమా? లభించాలంటే ప్రయత్నించాలి కదా! అట్టి ప్రయత్నరూపమైన కార్యక్రమం ఇప్పుడే

నిర్వర్తించవచ్చు కదా! కనుక ఏ విధంగా చూచినా, దేహమును మంటలో పడవేయడం ఉపాయమే కాదు. మరణించినంత మాత్రం చేత సర్వత్యాగఫలితమగు మోక్షం లభిస్తుందంటే ఇక సాధనలు, గురువులు, విచారణలు ఎందుకు? మరణోపాయాల మీదనే గ్రంథాలు రాసుకోవచ్చు కదా!

“కనుక దేహము త్యజిస్తాను అనే నీ అభిప్రాయం ...నేను చూపు సర్వత్యాగానికి మార్గమే కాదు. దేహాన్ని అగ్నిలో ఆహుతి చేయటం వ్యర్థమైన ఆలోచన. ఒక మదపుటేనుగు వృక్షమును అటూ ఇటూ కలుస్తున్నట్లు... ఈ దేహమును కూడా ఏదైతే సంక్షుభితం చేస్తోందో, అట్టి ఆ పాప వస్తువును త్యజించు. మరుక్షణం మహాత్యాగవంతుడవౌతావు. అద్దానిని త్యజించటం చేత అసలీ దేహములే ఇక ఉత్పన్నం కావు. కాదూ, ఈ దేహమును మాత్రం అగ్నిలోనో జలంలోనో పడవేసి నశింపజేయాలనుకుంటే మరల మరల దేహాలు వచ్చిపడుతూనే ఉంటాయి. కనుక త్యజించటం అత్యవసరమై ఉన్న నీ యందలి సూక్ష్మ విభాగం ఎలా త్యజించాలో యోచించు.

శిఖిధ్వజుడు: హే సద్గురూ! మీరు చెప్పింది అత్యంత యుక్తియుక్తం. ఇప్పటి దాకా అసలు ఏది త్యజించాలో గుర్తించడానికి నా అల్పమైన తెలివితేటలు ఉపయోగించానే గాని, మిమ్మల్ని సంప్రదించనే లేదు. ఇప్పుడు మిమ్ములను శరణువేడి అభ్యర్థిస్తున్నాను.

కేనాఽయం చాల్యతే దేహః?కిం బీజం జన్మకారణామ్?
కస్మింస్త్యక్తే పరిత్యక్తం సర్వం భవతి సుందర!

సుందరరూపుడవగు ఓ దేవఋషీ! వినమ్రుడనై, సాష్టాంగదండప్రణామములు సమర్పిస్తూ మిమ్ములను వేడుకుంటున్నాను. నా ఈ సందేహములు తీర్చండి. ఈ భౌతికదేహం దేనిచే చలించ బడుతోంది? ఈ జన్మ – కర్మలన్నిటికీ బీజ కారణం ఏమిటి? దేనిని త్యజించటంచే అంతా కూడా త్యజించబడినది (సర్వత్యాగం) అగుచున్నది?

❖❖❖

28. మనస్సును అధిగమించటమే “సర్వత్యాగం”

కుంభమహర్షి: ఓ సాధుపుంగవా! శిఖిధ్వజ మహారాజా! ఈ దేహమును, ఇళ్ళు – వాకిళ్ళను, రాజ్యమును, వంటపాత్రలను, కుటీరములను వదలితేనో, లేక, తగలబెడితేనో సర్వత్యాగము కానే కాదని మరొక్కసారి నిర్ద్వంద్వంగా ప్రకటిస్తున్నాను.

మరి ఈ దేహాదుల కార్యక్రమమంతా ఏదై ఉన్నదో, ఏది నాలుగు వైపులా వ్యాపించి ఆయా అనుభవాలన్నిటికీ అసలు కారణమైయున్నదో... అద్దానికి శాస్త్రజ్ఞులు మనస్సు, వాసనలు, అహంకారం మొదలైన పేర్లు పెట్టారు. అదీ... నీవు త్యజించవలసింది.

శిఖిధ్వజుడు:

సర్వం, సర్వగతం, సర్వహేయం–త్యాజ్యం చ సర్వదా ।
సర్వం కిముచ్యతే? బ్రూహి, సర్వతత్త్వవిదాంవర ॥

హే సర్వతత్త్వములను ఎఱిగినవారిలో శ్రేష్ఠుడా! "ఇక్కడి రాజ్యము, భార్య, వస్తు సముదాయము మొదలైనవిగా ప్రకటనమగుచు, సర్వమునందు వ్యాపించి ఉన్నదై సర్వదా త్యాజ్యము అయినట్టిది" ...ఏదైతే ఉన్నదో అద్దాని గురించి నాకు తెలియజేయండి.

కుంభఋషి:

సాధో! సర్వగతాకారం జీవప్రాణాది నామకమ్ ।
న జడం, నాజడం భ్రాన్తం "చిత్తం" సర్వమితి స్మృతమ్ ॥

ఓ సాధూ, వినండి! నీ యొక్క స్వస్వరూపమునందు ఒకానొక విభాగం ఉన్నది. నీ అనుభవ ప్రారంభానికి కించిత్ ముందే ప్రవేశించి ఏర్పడి ఉంటోంది. ఆ స్వల్పవిభాగమే సర్వగతమైన ఆకృతి కలిగి ఉన్నదగుచున్నది. అది ఆయా ప్రదేశములలో జీవం, ప్రాణం మొదలైన నామాలు కలిగినదై ఉంటోంది. అది చేతనం కాదు.

పోనీ, జడం అని అందామా! అది తదితరాలైన బాహ్య విషయాలను ప్రేరేపించుచుండుటచే జడం కూడా కాదు. అయితే అది భ్రమశీలమై ఉన్నది. అది "ఆత్మ యొక్క దృశ్య విషయ మనన" స్వభావ విభాగం అని గ్రహించిన వేదజ్ఞులు దానికి 'చిత్తము' అని పేరుపెట్టారు. మనస్సు మొదలైనవన్నీ అదే. "అదియే ఇక్కడ అనుభవమగుచున్న సర్వం" అని ఆత్మజ్ఞులచే సిద్ధాంతీకరించబడుతోంది.

ఓ రాజా! చిత్తమునే నీవు భ్రమ అని కూడా గ్రహించు. ఇంతెందుకు? అదియే ఈ మనుజుడు సుమా! మనుజుడంటే దేహం కాదు. మనుజుడంటే చిత్తమే. చిత్తమే మనస్సు కూడా! నీవు జగజ్జాలం అని సంబోధించేది కూడా ఆ చిత్తమునే. ఒక్క మాటలో చెప్పాలంటే చిత్తమే సమస్తము. చిత్తమే సంసారము గాని, దృశ్యజగత్తు సంసారం కానే కాదు.

❖

ఒకచోట ఒక మహావృక్షమున్నదనుకో, ఆ వృక్షమునకు పూలు, కొమ్మలు, ఆకులు, కాయలు, కాండము మొదలై ఆయా విభాగములు వెల్లివిరుస్తాయి. "ఆ వృక్షమునకు అసలైన కారణమేమిటి?" అను ప్రశ్నను మథించి వెతికితే "ఒకానొకప్పుడు అక్కడి నేలలో జేరిన బీజమే"... అనే సమాధానం రాక తప్పదు. అలాగే ఈ దేహాదులు, ఈ రాజ్య – రాజ సంబంధములు, ఆశ్రమవాస అభినివేశములు, బంధము, మోక్షము మొదలైనవాటికన్నిటికీ మనోబీజమే (లేక చిత్తబీజమే) అసలైన కారణం.

ఇప్పుడు నీవు రాజ్యమునో, కమండలమునో త్యజిస్తున్నావు. ఏం లాభం? ఒక దయ్యం వదిలితే ఇంకొక దయ్యం పట్టుకుంటుంది. నీవు వదలవలసింది వీటిని కాదు.

సమస్తమునకు బీజమైన మనస్సును లేక చిత్తమును త్యజించవయ్యా! అప్పుడు తదితరమైన సమస్తమూ త్యజించబడినదే అగుచున్నది. మనస్సును త్యజించినప్పుడు మాత్రమే సర్వత్యాగం సంభవ మవుతుంది. మనస్సు కంటే అతీతత్వము సంతరించుకోవటమే మనోత్యాజ్యం. మనస్సును వదలకుండా ఆ మనస్సు పట్టుకునే ఎన్ని వస్తువులను, లేక, విషయాలను వదిలితే ఏం లాభం? మనస్సు ఉండట మంటేనే విషయములను, లేక వస్తువులను ధరించి ఉండటం కదా!

సర్వధర్మా అధర్మావా, రాజ్యాది విపినాది వా,
“సచిత్తస్య పరందుఃఖమ్! నిశ్చిత్తస్య పరం సుఖమ్!”

ఇప్పుడు దుఃఖం ఎక్కడి నుండి వస్తుందో చెబుతాను విను. చిత్తము కలిగి ఉన్నంత కాలం సమస్త ధర్మాధర్మములు, రాజ్యాదులు, వనవాసం చేయటాలు, తపశ్చర్యలు మొదలైనవన్నీ దుఃఖ రూపాలుగానే పరిణమిస్తాయి. చిత్తరహితునికో... అవన్నీ సుఖ రూపాలుగా అగుచున్నాయి.

ఒక బీజం మహావృక్షం కావటం మనం చూస్తూన్నాం కదా! అట్లాగే చిత్తం (లేక) మనస్సు కూడా ఈ సమస్త జగద్రూపంగాను, ఈ దేహ సమూహములుగానూ పరిణామమొందుచున్నది. గాలి వీచికలచే వృక్షము, భూకంపముచే పర్వతము, కమ్మరివానిచే కొలిమితిత్తి, కదల్చబడుచున్నట్లే చిత్తముచే ఈ శరీరము కూడా చలింపబడుచున్నది. ఈ సమస్త ప్రాణుల భోగముల యొక్క (అట్లాగే) దేహ ధర్మములైనట్టి చావు – పుట్టుకల యొక్క, ఇంకా మునుల శమ, దమ, ధారణ మొదలైన సుదృఢభావముల యొక్క పేటిక ఏదయ్యా అంటే ...అది చిత్తమే సుమా!

ఇదం ప్రవర్తతే సర్వం చిత్తమేవ జగత్తయా ।
దేహాద్యాకారజాలేన చిత్తం జీవో మనోమయమ్ ॥

సమస్త దేహముల ఆకారంగా, జగదాకారంగా పరిణమిస్తున్నది, ప్రవర్తిస్తున్నది చిత్తమే. అసలు అంత ఎందుకు? (చిత్తోహి జీవః) ఈ జీవుడే చిత్తమయుడై ఉన్నాడు. అట్టి చిత్తమే ఆయా క్రియారూప వ్యాపారములచే... “అంతఃకరణం, బుద్ధి, మహత్తు, అహంకారం, ప్రాణం, జీవుడు, మనస్సు” మొదలైన పేర్లచే చెప్పబడుతోంది. వేదాంత శాస్త్రం “ఇదంతా చిత్తము యొక్క ప్రవాహ పతిత ఫలమే” అని నొక్కివక్కాణిస్తోంది. కాబట్టి, ఆ చిత్తమును త్యజించావా, సమస్త ఆధి – వ్యాధులకు ‘హద్దు’ అయినట్టి సర్వత్యాగము కావించినట్లే అవుతుంది.

త్యాగవేత్తలలో శ్రేష్ఠుడవగు ఓ శిఖిధ్వజ మహారాజా!

చిత్తత్యాగం విదుః సర్వత్యాగం, త్యాగవిదాంవర
తస్మిన్ సిద్ధే మహాబాహో! సత్యం కిం నాఽనుభూయతే?

“ఇంకా ఏదో పొందాలి” అను రూపం గల చిత్తాన్ని త్యజించడమే ‘సర్వత్యాగం’ అని పేర్కొ బడింది. అంతేగాని ఇల్లు, వాకిలి వదిలేసి వస్త్రాల రంగు కాషాయం చేసుకున్నంత మాత్రం చేత అది ‘గృహత్యాగం, బంధుత్యాగం’ అనిపించుకుంటుందేమో గాని, సర్వత్యాగం మాత్రం కానే కాదు. చిత్తత్యాగం అనబడే సర్వత్యాగం సిద్ధించిందా, ఇక పరమానంద రూపమగు సత్యపదార్థ అనుభవం ఎందుకు ఈ జీవునికి కలుగదు? తప్పకుండా కలుగుతుంది. చిత్తం త్యజించబడిన తరువాత కార్యవిభాగ పరంపర అయినట్టి ద్వైతమూ ఉండదు, కారణవిభాగమైనట్టి ‘ఏకమూ’ ఉండదు. ఇక కేవలం పరమశాంతమై, స్వచ్ఛమై, నిరామయమై, ఏకమైనట్టి మన పరమాత్మ తత్త్వమే శేషిస్తుంది.

❖

ఈ ‘సంసారము’ అనే విస్తారమైన పంట పండుచున్న క్షేత్రం చిత్తమే గాని బాహ్యమైన ఏదో విషయమో, ప్రదేశమో కాదు. క్షేత్రమే నశిస్తే ఇక ధాన్యరూపమన తగినట్టి ఈ సంసారం ఎందులోంచి

మొలచుకొస్తుంది? జలమే పలు ఆకారలైన తరంగాలుగా పరిణమిస్తున్నది కదా! మనస్సే భావాభావాల రూపంలో చిత్రవిచిత్రాలైన క్రియలను నిర్వర్తిస్తూ ప్రవాహపతితంగా ఆయా పదార్థముల ఆకారంగా రూపుదిద్దుకుంటోంది. సర్వత్యాగమును చిత్త త్యాగరూపంలో నిర్వర్తించాలి. అప్పుడు పరమాత్మ సర్వత్రా సంప్రాప్తించినదగుచున్నది. 'ఏదో లేదు' అనే వెలితి కాస్తా కనబడకుండా పూడుకుపోతుంది.

❖

ఓ త్యాగశీలా! మరొక సూక్ష్మగ్రాహ్యమగు విషయం చెప్పుచున్నాను విను. నీవు ఆయా వస్తువులను విశేషములను త్యజించావు. బాగున్నది. అనగా, అవన్నీ నీకు త్యాజ్యవస్తువులు గానూ, నీవేమో త్యజించువాడవు గానూ ఉన్నావు కదా! అట్లాగే ఇన్నిటినీ త్యజిస్తున్న నీవు కూడా (అహంకారం) నిన్ను త్యజించ గల మరొక వస్తువునకు త్యాజ్యవస్తువై ఉన్నావు.

అయితే త్యాజ్యవస్తువును (అహంకారాన్ని) నీవు నీ స్వరూపంగా (లేక) ఆత్మగా అనుకుంటున్నావు ఇంకొక విధంగా చెప్పాలంటే, ఏ అహంకారంతో నేను ఇది వదులుతాను, అది వదులుతాను... అని చిలుక పలుకులు పలుకుచున్నావో ఆ 'నేను, నేను' అనబడు అహంకారమే అసలైన త్యాజ్యవస్తువు. అట్టి అహంకారాన్ని వదలకుండా అహంకారానికి విషయములై ఉంటున్న ఈ దేహాదులను వదిలితే ఏం లాభం? ఈ కారణం చేతనే నీకు సర్వత్యాజ్య ప్రయోజనమైన సర్వాత్మత్వం చేకూరటం లేదు.

❖

ఇంకొక చమత్కారమైన, ఘనీభూతమైన సత్యం చెబుతాను విను. ఎవని చేత ఈ సమస్తం త్యజించబడుతుందో ఆతడు సర్వమునకు అప్రమేయమై ఉన్న ఆత్మ స్వరూపుడే అవుతాడు. ఆత్మ చేతే ఈ జగత్తంతా అవధరించబడుతోంది అనగా భూత-భవిష్యత్-వర్తమానాలలో ఉన్నట్టి ఈ జగత్తంతా కూడా ఆయా జగద్విషయములచే అపరిచ్ఛిన్నమగు నీ - నా ఆత్మ చేతనే ధరించబడినదగుచున్నది. చూచావా? సర్వమూ త్యజించినవాడు సర్వమును ఆక్రమించిన వాడే అగుచున్నాడు.

యేన సర్వం పరిత్యక్తం తస్యన్ శూన్యేఽపి సంస్థితం ।
జగత్సర్వం త్రికాలస్థం తన్తౌ ముక్తావలీ యథా ॥

ఆ సమస్తమూ పరిత్యజించిన వారియందు, లేక ఆ విషయ శూన్యరూపుని యందు - ఒకే దారమునకు ముత్యములన్నీ గ్రుచ్ఛబడినట్లు - ఈ జగత్తులన్నీ కూడా స్థితి నొందియున్నవై ఉంటాయి.

తైలం లేని దీపం ఏ విధంగా వస్తువులన్నీ పరిత్యజిస్తుందో అట్లా ఈ సమస్తమును అహంకారంతో సహా పరిత్యజించావనుకో... అప్పుడు తైలం గల దీపం వలె ఈ సర్వం నీ స్వరూపంచే ప్రకాశమాన మైనదగుచున్నది. అనగా, చిత్తము నందు ఉన్న సర్వ పదార్థములనూ త్యజించి తైలం లేని దీపం వలె ఎవడు శాంతి పొందుతాడో అట్టివాడు సర్వత్యాగ రూపమగు ప్రకాశాత్మగా ఉద్భవిస్తున్నాడు. అప్పుడు తైలం గల దీపం వలె సర్వసమన్వరూపుడై వెలుగొందుచున్నాడు.

శిఖిధ్వజుడు: ఒక గృహం స్తంభాలచే నిలబెట్టబడి ఉంటోంది. స్తంభం కూలిపోతే ఇల్లు పడిపోతుంది కదా! చిత్తం త్యజించబడితే చిత్తం చేత నిలబెట్టబడుచున్న ఈ దేహం కూడా నేల కూలుతుందా?

కుంభమహర్షి: నీవడిగిన ప్రశ్నకు సమాధానంగా ఒక దృష్టాంతం చెబుతాను విను. ఇప్పుడు నీవు రాజ్యాన్ని, నీ సతీమణి చూడాలను, ఇక్కడికి నేను వచ్చిన తరువాత ఈ కుటీరాన్ని, తదితర పరికరాలను త్యజించావు. అన్నీ వదలినా కూడా వాటన్నిటినీ వదలుచున్న నీవు ఉండియే ఉన్నావు కదా!

శిఖిధ్వజుడు: నేను లేకుండా ఎందుకుపోతాను? వాటిని వదిలేది నేనే కదా! ఆ వదలుచున్నట్టి నేను ఉంటే కదా, వదలటమనేది!

కుంభమహర్షి: బాగా చెప్పావు. అట్లాగే చిత్తమును త్యజించుటచే ఏర్పడే సర్వత్యాగానంతరం కూడా జ్ఞానరూపమగు ఆత్మ శేషించియే ఉంటుంది. ఈ దేహ – జీవాహంకారం మటుమాయమై తత్‌స్థానంలో సర్వాత్మత్వం, అప్రమేయత్వం పరిఢవిల్లుతాయి.

సమస్త వస్తుదాహేఽపి యథా త్వం నేఽతరోన్నృప ।
సర్వత్యాగత ఏవాఙ్గ యథా నిర్వాణముచ్యతే ॥

రాజా! అన్ని వస్తువులను అగ్నికి ఆహుతి చేశావు. అయినా కూడా నీవు ఉన్నావు. అట్లాగే సర్వత్యాగం చేసిన తరువాత కూడా ఏ ఆత్మగా ఈ దేహం ఉన్నప్పుడు లేనప్పుడు కూడా శేషిస్తావో – దానినే మోక్ష శాస్త్రం 'నిర్వాణం' అని పిలుస్తోంది. అది నీకంటే అన్యమైనదేదో కాదని గ్రహించు.

గొప్ప ప్రకాశవస్తువులగు సూర్య–చంద్ర–నక్షత్రాలన్నీ శూన్యమగు ఆకాశాన్ని ఆశ్రయించుకొని ఉంటున్నాయి కదా! అట్లాగే పదార్థవిషయ శూన్యమగు చిత్స్వరూపమే సమస్త జ్ఞానానికి ఆశ్రయమై ఉన్నది. ఒకడికి ఆకాశంపై కోపం వచ్చి ఒక ఉలిని తీసుకుని ఆకాశాన్ని బాదనారంభించాడనుకో... అసంగం, ఉదాసీనం అయినట్టి ఆకాశాన్ని ఉలి దెబ్బలు బాధించగలవా? 'సర్వత్యాగం' అను అమృతపానం చేసిన మనుజుని ఈ జన్మ–జర–మరణాది వ్యవహారములు స్పర్శించనైనా లేవు. ఇక బాధించటమనే ప్రసక్తి ఎక్కడిది?

సర్వత్యాగో మహత్త్వస్య కారణం నిర్మలద్యుతేః ।
సర్వం త్యజసిచేత్ అస్మాత్‌బుద్ధిః స్థైర్యం బృహత్తమమ్ ॥

అన్నిటి కన్నా కూడా సర్వత్యాగం మహత్తరమైనది. ఎందుకంటావేమో? సర్వం త్యజించినప్పుడే నీ బుద్ధి స్థిరత్వం పొందినదై మనో నిర్మలం అనుభవమౌతుంది. తద్వారా బుద్ధికి సర్వోత్తమత్వం ప్రాప్తించగలదు.

సర్వత్యాగమే పరమానందమైనది, దానికి భిన్నమైన సమస్తం దారుణమైన దుఃఖానికి కారణమై ఉంటోంది.

కనుక చిత్తాన్ని, అహంకారాన్ని ఎలా త్యజించాలో బాగా విచారణ చేసి, గ్రహించి తదనుకూల మైన ఉపాయాలను ఆశ్రయించి ఉండమని నా విన్నపం. వేద వేదాంగాలు ప్రతిపాదించే 'ఓం' అను సంజ్ఞ యొక్క అర్థాన్ని అంగీకరించినవాడవై, ఆ అర్థసారాన్ని ఆశ్రయించినవాడవై ఆ తరువాత ఇక నీ ఇచ్ఛానుసారం ఏది ఎట్లు ఉచితమనుకుంటావో అట్లే ఆచరించు. పైగా, మరొక చమత్కారం విను.

సముద్రం బడబాగ్నిలోకి జలాన్ని త్యాగం చేస్తోంది. ఆ జలం ఆవిరై ఆకాశంలో మేఘ రూపం పొందుతోంది. ఆ మేఘం వర్షించి నదీనదముల రూపంలో తిరిగి సముద్రంలో ప్రవేశిస్తోంది. ఎవడెంత త్యాగం చేస్తాడో తిరిగి అంతయూ పొందుతాడు. సర్వమూ త్యాగం చేశాడా, సర్వమూ పొందుతాడు. రాజుగారికి రాజ్యంలోని సర్వమూ ప్రాప్తించినదే అయినట్లు చిత్తత్యాగరూపమగు సర్వత్యాగముచే సదా, సర్వత్రా సమస్తము ప్రాప్తించినదే అవుతుంది.

పాత్ర గనుక ఖాళీగా ఉంటే మనం అందులో మధురమగు పళ్ళరసముతో నింపవచ్చు. అట్లాగే మనస్సు నుండి నాది, నాకు కావాలి, నాకు ఉండాలి... అను రూపంలో ఉండే అజ్ఞానమును, తత్సంబంధిత భావపరంపరావ్యవహారములను త్యజిస్తే అట్టి సర్వత్యాగస్థితియందు మాత్రమే ఆత్మప్రసాదకమగు జ్ఞానము వర్ధిల్లుతుంది.

అట్టి సర్వత్యాగమహేశ్వరులగు ఎందరో మహనీయులు ఈ భూమిపై సర్వకాలాల్లో ఉన్నారు. ఉదాహరణకు శాక్యముని (బుద్ధదేవుడు) సంశయరహితుడై మేరుపర్వతం వలె స్థితి కలిగి ఉన్నారు.

సర్వత్యాగో, మహరాజ! సర్వసంపత్సమాశ్రయః ।
న గృహ్ణాతి హి యత్కించిత్ సర్వం తస్మై ప్రదీయతే ॥

మరల చెప్పుచున్నాను. సర్వత్యాగమే సమస్త సంపదలకు ఆశ్రయమై ఉన్నది. ఎందుకంటే ఎవడు ఏది గైకొనడో, ఆతనికి అది ఇవ్వబడుచున్నది.

అందుచేత మహారాజా! సర్వపరిత్యాగం చేయి, అప్పటికీ "ఏకాంతం, స్వస్థం, ఆకాశం" వంటి ఏ నీ రూపం శేషించియే ఉందో, అట్టి రూపుడవే అయి ఉండు. నీవు అంతా త్యజించావు. మంచిదే. అయితే అంతటితో ఆగకూడదు. ముఖ్యంగా, ఏ మనస్సుతో ఇదంతా త్యజించావో అద్దానిని కూడా త్యజించు. అభిమాన, అహంకారాలను కూడా పరిత్యజించు.

"ఈ రాజ్యము, భార్య, ఈ పరిసరములు మొదలైనవి నావి కావు" అని ఏ విధంగా ఒక్క క్షణంలో నిర్ణయించుకున్నావో... అదేరీతిగా, "ఈ మనస్సు, అభిమానము, అహంకారం – ఇవేవీ నావి కావు " అనే నిశ్చయాన్ని ఆశ్రయించుకొని ఉండు. అప్పటి నీ స్థితియే ముక్తి, మోక్షం కూడా!

❖❖❖

29.బ్రహ్మముకాక మరింకెక్కడా ఏ ఇతరమైనదీ లేదు

శిఖిధ్వజుడు అంతా శ్రద్ధగా వింటూ కొంచెంసేపు మౌనం వహించాడు. తరువాత ప్రశాంత – సమగ్రత్వములను వహించి ఉన్న కుంభర్షి ముఖం వైపు చూచాడు.

శిఖిధ్వజుడు: మీరు చెప్పినదంతా అత్యంత శ్రద్ధగా జాగరూకుడనై విన్న తరువాత 'ఈ చిత్తమును (లేక) మనస్సును త్యజించటమెట్లా?' అని యోచించాను. ఆకాశంలోని పక్షి, చెట్టుపై గంతులేసే కోతి లాగా ఈ మనస్సును నేను మాటిమాటికీ త్యజించటానికి ప్రయత్నించినప్పటికీ మరల వచ్చి

పడుతూనే ఉన్నది. ఈ మనస్సును ఎట్లా పట్టుకోవాలో తెలుసు కాని, ఆయా పదార్థములను త్యజించినట్లు మనస్సును (లేక) చిత్తమును ఎట్లా త్యజించాలో మాత్రం నాకు ఏమాత్రం అవగతం కావటం లేదు. మీరు నాకు రెండు విషయాలు తెలియజేయాలి.

1. ఈ చిత్తం, లేక, మనస్సు స్వరూపం ఏమిటి? 2. దీనిని పరిత్యజించే విధానమేమిటి?

కుంభమహర్షి: అనేక జన్మలుగా శబ్ద దృశ్య స్పర్శాది విషయాల పట్ల ఈ జీవునికి అభిమానం, అభిలాష, ఆకాంక్షలతో కూడిన ఒకనొక అనుబంధం ఏర్పడుతోంది. సంకల్పాల నుండి అభిలాష, అభిలాష నుండి అభ్యాసం, సుదీర్ఘ అభ్యాసం నుండి వాసనలు ఏర్పడుచున్నాయి. అట్టి వాసనలే చిత్తం యొక్క రూపం. వాసనలకు పర్యాయపదమే చిత్తం. అంతకుమించి చిత్తమనగా మరింకేమీ కాదు.

శిఖిధ్వజుడు: అట్టి చిత్తాన్ని జయించటం అంత తేలిక అంటారా, ఏదో మీ బోటి మహత్తర జన్మలను పొందిన వారికి తప్పితే?

కుంభమహర్షి:

త్యాగస్తస్యాతి సుకరః సుసాధ్యః స్పన్దనాదపి,
రాజ్యాదపి అధికానందః కుసుమాదవి సుందరః ॥

రాజర్షీ! నా ఉద్దేశంలో చిత్తత్యాగం చాలా తేలికైన పని. తప్పకుండా సాధ్యమే. ఊపిరి పీల్చు కోవటం కన్నా కూడా తేలికైనది. రాజ్యాధిపత్యం కన్నా పోల్చలేనంత ఆనందకరమైనది. పుష్పం కంటే కూడా అత్యంతరమణీయమైనది.

అయితే మూర్ఖత్వం ఎవరు వహించి ఉంటారో, వారికి నేను చేయగల ఉపకారమేదీ లేదు. ఒక సామాన్య పౌరుడు చక్రవర్తి కాగలడా? ఒక పువ్వుతో వింధ్యపర్వతాన్ని కదల్చగలమా? అట్లాగే ఆత్మజ్ఞులు చెప్పే ఉపాయాలను సంకోచిస్తూ పెడచెవిన పెట్టే మూర్ఖులకు, అల్పమైన ఆశయాలకై తాపత్రయపడే వ్యర్థజీవులకు అది దుస్సాధ్యమని నేననక తప్పదు.

శిఖిధ్వజుడు: మహాత్మా! వాసనలచే వ్యాకులమైనట్టి ఈ చితం యొక్క స్వరూపమేమిటో మీ వచనాల ద్వారా నేను గ్రహించాను. అందుకు మీకు కృతజ్ఞతలు కూడా వ్యక్తం చేస్తున్నాను. అయితే అట్టి చిత్తత్యాగం విషయానికి వచ్చేసరికి అది వజ్రం మింగటం కంటే కూడా చాలా దుస్సాధ్యమని నా కనిపిస్తోంది. మీరేమో "అబ్బే! అది చాలా తేలికయ్యా"! అని ప్రవచిస్తున్నారు.

మీరంటే నారదమహర్షి పుత్రులు. తపోసంపన్నులు. బ్రహ్మదేవునిచే జ్ఞానం ప్రసాదించబడినట్టి మహామహిమాన్వితులు. మీకు చిత్తాన్ని జయించటం ఒక లెక్కలోనిది కాదు. మరి మా సంగతేమిటి? ఈ చిత్తం మాకు సంసార దుర్గంధాన్ని, దుఃఖదాహాన్ని తప్పించుకోవటానికి వీలు కానట్టి జగద్వ్యవహారా లను, ఏమాత్రం అర్థంకాని మోహాన్ని, విషయాల వైపుగా పతనాన్ని, అనేక దేహపరంపరలను కలుగజేస్తోంది. పైగా, ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టుకోలేడు కదా! రాజాధిరాజులను కూడా పాదాక్రాంతం చేసుకోగల మహావీరుడగు చక్రవర్తి కూడా అంతఃపురంలో మహారాణి ముందు దాసోఽహమన్నట్లు మేము ఈ చిత్తానికి దాసులమై అనువర్తిస్తున్నాం. మా హృదయంలోనే ఉదయించి

ఉన్న ఈ చిత్తాన్ని త్యజించటమెట్లా? బాహ్యవస్తువునైతే ఒక్కక్షణంలో వదలవచ్చు. హృదయంలో తిష్ఠ వేసుకుని ఉన్న చిత్తాన్ని వెడలగొట్టటమెట్లా? అధిగమించటం ఎట్లా కుదురుతుంది?

కుంభమహర్షి: చిత్తత్యాగం తేలిక అను, లేక కష్టమను. ఏది ఏమైనా చిత్తం యొక్క సమూల నాశనమే సంసార క్షయం. చిత్తం త్యజిస్తేనే ఈ జీవునికి నిశ్చింత. లేదా తిప్పలు తప్పవు. అంతకు మించి వేరే మార్గం లేదు. చిత్తమును నశింపజేయాలంటే ఆ చిత్తమును త్యజించాలి.

శిఖిధ్వజుడు: మహాత్మా! మీ వాక్యామృతం గ్రోలటం చేత "చిత్తత్యాగం చేతనే చిత్తం యొక్క నాశనం ఒనగూడుతుంది" అనే విషయం నేను బాగా గ్రహించాను. కానీ ఏం లాభం? ఈ చిత్తం యొక్క అభావం ఎట్లా సంపాదించాలో నేను ఏమాత్రం గ్రహించలేకపోతున్నాను. ఈ విషయమై మార్గమేమిటో చెప్పి నన్ను కాపాడండి.

కుంభమహర్షి: శాఖ-ఫల-పల్లవాలుగా విస్తరిల్లిన మహావృక్షం వంటి ఈ చిత్తానికి బీజం 'అహంకారం' అను జ్ఞానమే! అట్టి వృక్షమును సమూలంగా పెల్లగించాలంటే నీవు ఆకాశం వలె సువిస్తార హృదయుడవు కావాలి. అనగా నీ హృదయాన్ని నిరావరణంగా, విక్షేపరహితంగా తీర్చిదిద్దుకోవాలి.

శిఖిధ్వజుడు: (కొద్ది నిమిషాలు తనలో యోచన, తర్జన భర్జనలు చేసుకున్న తరువాత) ఓ మునీశ్వరా! ఇప్పుడు నాలో చిత్తవృక్షం గురించి మరికొన్ని ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.

ఈ చిత్తము యొక్క మూలమేమిటి? దీని ఉత్పత్తి స్థానమేది? ఇది ఎట్లా అంకురిస్తోంది? దీని యొక్క శాఖలు, కాండము ఏమై ఉన్నాయి? దీనిని సమూలంగా పెల్లగించటమెట్లా?... ప్రభో! మీ పాదములంటి ప్రణమిల్లుచున్నాను. ఈ విషయాలన్నీ నాకు తెలియజేయండి.

కుంభమహర్షి: ఈ చిత్త వృక్షమునకు మూలం అజ్ఞానముచే ఉదయించే అభిమానమునకు కర్తయగు జ్ఞాతయే! పరమాత్మను ఆశ్రయించియున్న మాయయే దీని క్షేత్రం.

ప్రప్రథమంగా ఉత్పన్నమైన ఈ చిత్తం నుండే "పరిచ్ఛిన్న అహం" అను నిశ్చయరూపమైనట్టి, అనుభవాత్మకుడైనట్టి చిదాభాసుని అంకురం జనిస్తోంది. నిశ్చయాత్మకమై నిరాకారమైనట్టి చిత్తక్షేత్రంలో వెలసిన దానినే "బుద్ధి" అని పిలుస్తున్నారు. నిజానికి "నిర్వికారం, నాశరహితం" అయిన చైతన్యమే మిథ్యాభూతమై 'చిత్తం' అనే ధర్మంతో సంబంధం కల్పించుకున్నదై "జీవుడు" అనే నామధేయానికి అర్హమగుచున్నది. కనుక చిత్తక్షేత్రం ఏర్పడి ఉన్న స్థానం కూడా ఆత్మయే!

ఆ చిత్తం నాడి, బొమికలు, రక్తమాంసాలతో కూడిన ఈ భౌతిక దేహాన్ని నిలబెట్టి ఉంచటానికి గృహస్తంభం వంటిది అగుచున్నది. అనగా ఈ దేహం ఉద్భవమవటానికి మూలం చిత్తం. మధ్యలో అనుభవమయ్యే వాసనలు కూడా చిత్తమే. బాహ్య-అభ్యంతరాలలో కూడా వృక్షరసస్వరూపం వంటిదై ఈ దేహం పడిపోకుండా రక్షిస్తోంది. ఇంద్రియానుభవాలన్నీ చిత్తవిన్యాసం కాక మరింకేమీ కాదు.

ఓ రాజా! చెట్టు కొమ్మలను త్రెంచినట్లుగా మొట్టమొదట చిత్తరూప ప్రసరణములగు విషయ భోగాసక్తులను త్రెంచుకుంటూ పోవాలి. అద్వితీయమగు ఆత్మదర్శనం చేత ఈ చిత్త వృక్షాన్ని సమూలంగా నశింపజేయాలి. ఇదీ నీవు చేయవలసిన పని!

శిఖిధ్వజుడు: మహానుభావా! ఇప్పుడు మీరు రెండు విషయాలను ఆజ్ఞాపించారు–

1. చిత్తముచే ఏర్పడుచున్న విషయభోగాసక్తిని ఉపశమింపజేయటం;
2. ఆత్మాసాక్షాత్కారంచే చిత్తమును సమూలంగా నశింపజేయటం.

ఈ రెండు ఇప్పుడు నా కర్తవ్యములై ఉన్నాయని ఒప్పుకుంటున్నాను. అయితే, వీటినిప్పుడు నేను ఎట్లా సాధించగలనో సవివరములతో కూడిన ఉపాయములేమైనా చెప్పండి.

కుంభమహర్షి: క్రమంగా చిత్తము నుండి "కర్మలు–కర్మఫలాలు–కర్తృత్వం–భోక్తృత్వం" అనే భ్రమాత్మక విషయములను బయల్వెడలగొట్టటం అభ్యసించు. అప్పుడు చిత్తము తప్పక స్వాధీనమవగలదు. అటుపై చిత్తము చిత్‌స్వరూపమై విరాజిల్లుచున్నది.

శిఖిధ్వజుడు : మరి అవశ్యంగా నిర్వర్తించవలసి ఉన్న ఫల – క్రియాదుల విషయమేమిటి? వాటిని త్యజించమంటారా?

కుంభమహర్షి: ఈ చిత్తం ఫల–క్రియాదులతో కూడిన వాసనల రూపంగా ప్రకటితమౌతోంది. అట్టి ఫల–క్రియాదులందు ఆసక్తిని కలిగి ఉండకపోవటమే. (అనాసక్తి కలిగి ఉండటమే) ఈ చిత్తమును జయించే ఉపాయం. అట్టి అనాసక్తి ఎట్లా ఏర్పడుతుంది? అంతర్ముఖ వృత్తిచే సర్వ విషయాల కంటే మధురాతి మధురమైన ఆత్మ యొక్క విచారణ చేస్తూ ఉంటే క్రమంగా ఫల–క్రియాదులందు ఆసక్తి స్వయంగా సన్నగిల్లుతుంది. అట్లు ఫలక్రియాదుల వైపుగా ప్రసరించే ఆసక్తులను త్యజించి మౌనివై, శాంతుడవై సర్వవాదోపవాదాలను త్యజించు. ఆత్మ విచారణలో మాత్రమే తత్పరుడవగుము.

ఓ రాజా! ఈ దృశ్య విషయాల పట్ల అనాసక్త బుద్ధిని పెంపొందించుకో. అట్టి అనాసక్త బుద్ధిచే యథాప్రాప్తాలైన కర్మలను ఆచరిస్తే, అంతరంగంలో తిష్ఠవేసుకున్న ఈ చిత్తాన్ని అతి సులభంగా త్రెంచి వేయవచ్చు. పురుషప్రయత్నంచే విషయాభిముఖ స్వభావాన్ని ఛేదించుచుండగా అప్పుడు ఈ చిత్త వృక్షాన్ని ఛేదించటం సులభతరం అవుతుంది. ఏది ఎట్లా ఐనా సరే, ఈ చిత్తవృక్షాన్ని సమూలంగా పెరికివేయటంలోనే ఈ జీవుడు అధిక ప్రయత్నశీలుడై ఉండాలి. అనగా, చిత్తవృక్ష శాఖయగు విషయాభిలాష త్యజించటం గౌణమైతే, మూలాన్నే ఛేదించటం ప్రధానమైన కార్యక్రమమని గ్రహించు.

ఓ మహారాజా! ఈ విధంగా ఆత్మవిచారణ పరాయణుడవై, ముఖ్యంగా చిత్తవృక్షం యొక్క మూలచ్ఛేదనమునందు తత్పరుడవైతే అప్పుడు శీఘ్రంగా "అచిత్తత్వదశ" ప్రాప్తించగలదు.

శిఖిధ్వజుడు: చిత్తవృక్షమును దహింపజేయటంలో నాకు ఉపకరించే 'అగ్ని' ఏది?

కుంభమహర్షి : "నేనెవరు? నా వాస్తవమైన స్వభావం ఏమిటి"? అనే ప్రశ్నను చిట్టచివరి వరకు విచారణ చేయి. స్వస్వరూపానుభవ సాక్షాత్కారం వరకు ఆ విచారణ కొనసాగించు. అట్టి విచారణయే చిత్త వృక్షమును మొదలంట దహించి వేయగల అగ్ని.

శిఖిధ్వజుడు : మహర్షీ! "నేను ఎవరు?" అను ప్రశ్నను నా స్వబుద్ధితో చాలాసార్లు విచారణ చేశాను. అయినా కూడా...

కుంభమహర్షి : చేశావు కదా! మంచిది. అయితే నీ స్వబుద్ధిచే చేసిన విచారణచే నీవెవరో చెప్పు?

శిఖిధ్వజుడు : నేనీ ఎదురుగా కనబడే జగత్తును కాదు. జగత్తు నాది కాదు. నేను జగత్తుకు సంబంధించినవాడను కాను. ఈ పృథివి, పర్వతాలు, ఇక్కడి వనాలు, ఆకుల కదలికలు నేను కాదు. ఇవి నాకు సంబంధించినవి కావు. నేను వీటికి సంబంధించినవాడను కాను. అట్లాగే, జడమాత్రములై ఉండటం చేత కాళ్ళు, చేతులతో కూడిన ఈ దేహం మొదలైనవి కూడా నేను కాదు.

కుంభమహర్షి : బాగు బాగు.

శిఖిధ్వజుడు : కర్మేంద్రియాలు గాని, జ్ఞానేంద్రియాలు గాని నేను కాదు. మనస్సును కాదు. బుద్ధిని కాదు. జడమే అయి ఉండటం చేత 'అహంకారము' కూడా నేను కాదు.

ఓ దేవఋషీ! బంగారపు ఉంగరంలో బంగారం – ఉంగరం అనునవి వేరు వేరు వస్తువులు కాదు కదా! బంగారంలో ఉంగరం అనబడు మరొకటెక్కడున్నది? అట్లాగే చిదాత్మయందు జడమగు అహంకారం వేరుగా లేదు. మృగతృష్ణ, ముత్యపుచిప్పలో వెండి అసద్రూపాలే అయినప్పటికీ భ్రమ చేతనే ప్రసిద్ధములై ఉంటున్నాయి కదా! అదే విధంగా జడమగు అహంకారం కూడా అసత్తు మాత్రమే. లేక, అది ఆత్మ యొక్క ఆసక్తి రూపం. ఆసక్తికి వేరుగా అహంకారం లేనే లేదు. అట్లాగే – 14 లోకాలకు ఆధారం శబ్దాది విషయాలు. ఆ శబ్దాది విషయాలకు ఆది కారణం ప్రకృతి కదా!... అట్టి ప్రకృతి కూడా చిదాత్మయందు వేరుగా లేదు. మునీశ్వరా! ఈ విధంగా అహంకార మలం యొక్క మార్జనం (Washing off) ఎరిగియే ఉన్నాను. అయితే, ఆ ఆనందైక సాక్షి చైతన్యమును మాత్రం ఎరగలేకపోతున్నాను. బహుశః అందుచేతనే ఇంకా దుఃఖితుడనై మిగిలిపోతున్నాను.

కుంభమహర్షి : పాపరహితుడవు, బుద్ధిమంతుడవు అగు ఓ శిఖిధ్వజ మహారాజా! శరీరం దగ్గిర నుండి అహంకారం వరకు నీవు కావని బుద్ధితో గ్రహించానని అంటున్నావు. సంతోషం! నీవు ఏవేవి కావో చెప్పుచున్నది యుక్తి–యుక్తమే! ఇంతకీ నా ప్రశ్న 'నీ వెవరు?' అని కదా! ఇవేవీ నీవు కాకపోతే ఇంతకీ నీవేదై ఉన్నావో, అది చెప్పు.

శిఖిధ్వజుడు : హే దేవపుత్రా! అదీ చెబుతాను వినండి. ఎద్దానియందైతే ఇటు జడరూపాలగు శబ్ద–స్పర్శ–రూప–రసాది విషయాలు... అటు వాటి సంబంధితమైన ఆనందం అనుభూతమగు చున్నాయో, ఎద్దాని యందు ఈ బుద్ధి యొక్క వృత్తులు ఆరూఢమై తద్వారా ఈ సమస్తము యొక్క విభాగం నిర్ణయించబడుచున్నదో, అట్టి శుద్ధ చిన్మాత్ర సాక్షి చైతన్యమునే నేను.

కానీ, అంతటి శుద్ధుడనగు నాకు ఏ కారణం చేతనో ఈ దేహాహంకారమునందు, "దీనికి నేను చెందినవాడను"... అను రూపంతో కూడిన ఆత్మాభిమానం సంలగ్నమై ఉంటోంది. అట్లు నిష్కారణంగా ఎందుకు అట్టి సంలగ్నమేర్పడుతోందో నాకు అర్థమవటం లేదు. అంతేకాదు 'బ్రహ్మపదం' అని దేనిని అంటున్నారో నేను గ్రహించలేకపోతున్నాను. హే మహర్షీ! చాలా కాలంగా ఎంతో ప్రయత్నించి కూడా 'ఆత్మయొక్క ఆవరణం' అనదగిన అసలైన అనాత్మరూప అహంకారాన్ని నేను రహితం చేయ లేకపోతున్నాను. కాబట్టే మహద్దుఃఖాన్ని అనుభవిస్తున్నాను.

కుంభమహర్షి : అట్లాగా? ఏ మహాదోషము నీయందు సంలగ్నమైనట్లు నీ కనిపిస్తోందో, దేనిచే నీవు సంసారివై పడి ఉంటున్నావో, అట్టిది సత్తయా? లేక అసత్తయా? కొంచెం యోచించి చెప్పు?

శిఖిధ్వజుడు : మహాత్మా! అది సత్తయో, అసత్తయో నాకు తెలియదు. "చిత్త వృక్షమునకు బీజము" అని మీరు చెప్పిన అహంకారం గురించి కూడా నాకు పెద్దగా తెలియదు. దానిని వదలించుకునే ఉపాయమేమిటో నాకు తెలిసిరావటం లేదు. ఒకవేళ ఎలాగో అలా దానిని త్యజించాననుకోండి... మరల ఎటువైపు నుంచో మరింత బలం పుంజుకుని అది కొద్దిసేపట్లో వచ్చిపడుతోంది!

కుంభమహర్షి : ఓహో! అదా సంగతి? బాగా ఉన్నది. అయితే ఈ ప్రపంచంలో ఒక కార్యం ఉన్నదీ అంటే, దానికొక కారణం ఉండియే తీరాలన్నది ఒక సుప్రసిద్ధమైన సిద్ధాంతం కదా! ఒకవేళ కారణం లేకనే ఏదైనా కార్యం ఉన్నట్లుంటే అది రెండవ చంద్రుడు (మెల్లకన్నులకు కనబడే రెండు చంద్రబింబాలు) వలె లేనిదే అగుచున్నది. కాబట్టి కారణమనేదే లేకపోతే, అట్టిది బాగా పరిశీలించుట చేత లేనిదిగానే (అసత్తుగానే) అగుచున్నది కదా!

ఇప్పుడు నా ప్రశ్న ఏమిటంటే... ఏ అహంభావం కారణంగా కలిగి మనస్సు, జగత్తు మొదలైన అంకురం ఉత్పన్నమైనదో, అట్టి అహంభావం ఏ కారణం చేత ఉత్పన్నమైనదని నీకు అనిపిస్తోందో కొంచెం సేపు స్వబుద్ధితో విచారించి నాకు చెప్పు.

శిఖిధ్వజుడు : (కొంచెంసేపు అంతరంగ మథనం చేసిన తరువాత) ఓ మునీశ్వరా! మీరు చెప్పినట్లు నేను అంతరంగంలో అహంకారం గురించి స్వబుద్ధితో పరిశీలన చేశాను.

ఈ దేహం, తదితర దృశ్య పదార్థములు ఏర్పడి ఉండి, అవి తటస్థించటం చేతనే అహంభావం ప్రస్ఫుటమౌతోంది. కనుక అహంభావం అను దోషానికి కారణం దేహంతో సహా ఏర్పడిన దృశ్యమేనని నాకు అనిపిస్తోంది. అట్టి అహంకారాన్ని ఎట్లా శమింపజేయాలో నాకు చెప్పండి. ఎందుకంటే చిత్తం ఒకవైపు విషయాల వైపు ఉన్ముఖమౌతుంటే అహంభావం దుఃఖములు కలిగించుట కొరకే జనిస్తోంది. విషం ఉపశమించటానికి ఔషధం సేవించినట్లు నేను విషయాల నుండి ఉపశమించటానికి ఏం ఔషధాలు వాడాలో చెప్పండి.

కుంభఋషి : ఓ రాజా! ఎరుగుచున్న ఈ చిత్తం (వేద్యం) ఎరుగబడుచున్న విషయాలు... ఈ రెండిటిలో దృశ్యమే చిత్తం యొక్క ఉన్ముఖమునకు కారణమని నీవు అన్నావు కదా! ఈ విషయమై, అనగా 1. "సంసారానుభావానికి చిత్తం కారణమా? 2. చిత్తమునకు లభిస్తున్న విషయాలు చిత్తాన్ని ప్రలోభపరుచుటచే దృశ్య విషయాలే కారణమా?" అనే విషయం మరికొంత పరిశీలించి నీకేమనిపిస్తున్నదో చెప్పు? దృశ్యం స్వతహాగా జడమైనప్పటికీ అద్దానికి చిత్తమును తన మార్గంలో స్పందింపజేయటానికి స్పందనశక్తి ఎట్లా లభిస్తోందో యోచించు.

శిఖిధ్వజుడు : ఓ మునీంద్రా! వేద్యం (చిత్తం), వేదనం (విషయం); మరియు చేత్యం, చేతనం... ఈ ఉభయ ద్వంద్వాలు ఏర్పడటానికి కారణం దేహం, తదితర పదార్థముల ఉనికియేనని నాకు అనిపిస్తోంది. కళ్ళకు కనబడకపోవుటచే అసత్యం వలె అనిపించే వాయు వీచికలే వృక్షం యొక్క కదలికలకు కారణమగుచున్నట్లు జడములే అయినప్పటికీ శరీరాది వస్తువులు ఉన్నాయి కాబట్టి వాటిని గూర్చిన విజ్ఞానం ఉదయిస్తోంది. శరీరమే లేకపోతే ఇంద్రియాలుండేవి కావు. ఇంద్రియాలు

లేకపోయినా, వాటికి విషయమగుచున్న పదార్థాదులు లేకపోయినా వేదన, బంధం (తెలియబడుటచే ఏర్పడే సాంసారిక వ్యవహారం) ఉండేది కాదు. అయితే, ఈ దేహాది వస్తువుల 'అభావము'ను నేను సంపాదించుకుని ఉంటే అప్పుడు విషయముల సంబంధ – బంధనములు నాకు ఉండేవి కాదేమో! అభావం ఎట్లా సంపాదించుకోవాలో నాకర్థమగుట లేదు.

కుంభమహర్షి : ఓ రాజా! ఈ దేహాది పదార్థముల సత్త యథార్థంగా ఉండి ఉంటే నీవు చెప్పినట్లు వాటి యొక్క జ్ఞానమునకు అవియే కారణమని మనం అనవచ్చు. దేహాదుల సత్తయే లేదు కదా! మరి ఈ దేహాదులకు అనుభవాన్ని కలిగింపజేసే మనస్సును స్పందింపజేసే స్వయంశక్తి ఎక్కడున్నది?

శిఖిధ్వజుడు : దేవమునీ! ఏ వస్తువు యొక్క స్వరూపం, ఆకారం, తదితర లక్షణాలు ప్రత్యక్షంగా లభ్యమగుచున్నాయో, ఇక అది 'అసద్రూపం' అని మీరు ఎట్లా వ్యాఖ్యానిస్తారు? "అది వెలుగునిస్తు న్నప్పటికీ వాస్తవానికి అది చీకటి"... అనటం కుదరదు కదా!

కాళ్ళు, చేతులు మొదలైనవన్నీ కలదై, క్రియాఫలయుక్తమై స్పష్టంగా ఉన్నట్లు సత్తుగా అనుభూత మగుచున్న ఈ దేహం 'లేనిది' ఎట్లా అవుతుంది?

కుంభమహర్షి : మనం ఇప్పుడు ఒకసారి అనుకున్నట్లు ఒక వస్తువు యొక్క 'కారణం' లేనిదే అయినప్పుడు, ఇక ఆ కార్యవస్తువు కూడా లేనిదే అవుతుంది. అద్దాని జ్ఞానమేదైతే ఉన్నదో అదంతా భ్రమ మాత్రమే అవుతుంది. ఇప్పుడీ శరీరం విషయానికి వద్దాం. శరీరముండటం చేతనే బంధనం ఉంటోందని నీవు అన్నావు కదా! ఈ శరీరం ఏ కారణం చేత ఏర్పడి ఉంటోంది? బీజమే లేకపోతే వృక్షం కూడా లేనిదే అయినట్లు కారణం లేకపోవుటచే ఈ 'దేహం' అనబడే కార్యం కూడా లేనిదే అగుచున్నది. ఎండమావులలోని జలం యొక్క అనుభవం ద్రష్ట యొక్క భ్రమ వల్లే కలుగుచున్నట్లు... ఏ కార్యమైనా సరే కారణం లేకపోతే అది లేనట్లే. అందుచేత ఓ మహారాజా! ఈ శరీరం, తదితర దృశ్య వ్యవహారం అసత్తు అయి ఉన్నాయి. అనగా, ఈ శరీరం, ఈ దృశ్యం మొదలైవి ద్రష్ట యొక్క మిథ్యాభ్రమచే ఉదయించినవిగా ఎరుగుము.

ముత్యపు చిప్ప మిలమిల మెరుస్తోంది కాబట్టి అందులో వెండి లభిస్తుందంటే ఒప్పుకుంటావా? 'ఆకాశంలో రెండవ చంద్రుడు నాకు కనిపిస్తున్నాడు' అని ఒక మెల్లకన్నువాడు అంటే, నీవు రెండవ చంద్రుని ఉనికి అంగీకరిస్తావా?... 'గొడ్రాలి రెండవ కుమార్తె చాలా అందంగా ఉంటుంది' అని ఎవరైనా అంటే ఆ సౌందర్యవర్ణనం నీకు నమ్మదగినదౌతుందా?... వాటన్నిటికీ కారణం అలభ్యం. కాబట్టి కార్యం కూడా లేదు. అట్లాగే 'ఈ శరీరాదులు కారణ రహితమగుటచే లేవు'... అని గ్రహించు. అది అసద్రూపమే.

శిఖిధ్వజుడు : కళ్ళకు కనబడే శరీరము, దృశ్యము లేవంటున్నారే? దేహమునకు కారణం లేదని ఎందుకనుకోవాలి? "ఈ దేహోత్పత్తికి తండ్రియే కారణం" అని ఎందుకనరాదు?

కుంభమహర్షి : వాస్తవానికి తండ్రి అనబడువాడు, అతని దేహాదులు కారణరహితమైయున్నాయి. అసత్తు నుండి ఉత్పన్నమైనదంతా అసత్తేనని చెప్పక తప్పదు కదా! బీజం లేకుండా వృక్షం సంభవించనట్లు

...పదార్థములకు కార్యములకు కారణం ఉండాలి. ఆ కారణమును 'బీజము' అని పిలుస్తున్నారు. బీజకారణం లేనిదే అయినప్పుడు అట్టి దాని గురించిన జ్ఞానము కూడా భ్రమయే అవుతుంది. నిర్బీజమైన వృక్షము భ్రమమాత్రమే అయినట్లు ఈ దేహములు, వాటితో కల్పన చేసుకోబడే బాంధవ్యములు ఇవన్నీ మతి యొక్క భ్రమయేనని సిద్ధాంతీకరించబడుతోంది.

శిఖిధ్వజుడు : ఈ దేహంలాగానే, తండ్రిదేహం, ఆ తండ్రి దేహమునకు కారణమైన తాతదేహం కూడా అకారణమవటం చేత అసత్ దృశ్యం అని తేలుస్తున్నారు. ఒక దేహం అసత్ కనుక, ఆ అసత్ నుండి వచ్చిన మరొక దేహం కూడా అసత్తేనని మీరు నిర్ణయిస్తున్నారు. ఇంతవరకు, పోనీ, మీరు చెప్పినదే కాసేపు ఒప్పుకుందాం. ఈ ముల్లోకాలలోని ప్రజాసృష్టిస్రష్టలగు ఋషులున్నారు కదా! మనువు, దక్షుడు, మరీచి మొదలైన ఋషులు ఆదిపురుషులని, వారే ఈ పుత్ర – పిత్ర – పితామహాది సమస్త ప్రాణికోట్ల సంతతికి కారణమని పురాణములలో చెప్పబడినది కదా! కాబట్టి ఈ దేహానికి పూర్వాతి పూర్వమైన కారణం ఉన్నట్లే కదా! మరి అకారణమని ఎందుకనుకోవాలి? ఈ సృష్టి జీవుల దేహాలన్నిటికీ ఆదికారణం ఆది పితామహుడగు హిరణ్యగర్భుడేనని మనం నిర్ణయించవచ్చు కదా!

కుంభఋషి: కారణం యొక్క అభావం (లేక) అలభ్యం చేత అది పితామహుడు కూడా ఈ జీవ–దేహాల వల్లే లేనివాడై ఉన్నాడు. ఎందుకంటే కారణం లేనప్పుడు ఇక ఏ పదార్థాల ఉనికి లేనట్లే!

శిఖిధ్వజుడు : సముద్ర జలంలోని మొట్టమొదటి తరంగం వలె చిత్ సాగరంలోని ప్రప్రథమ విజ్ఞాన తరంగమే ఈ హిరణ్యగర్భుడు అని వేదజ్ఞులు ప్రవచిస్తున్నారు. ఆతని సంకల్పమే ఈ జడ – చేతన జగత్తు. అట్టి సమష్టి సృష్టి విజ్ఞానం (లేక) ప్రజ్ఞ యొక్క కార్యమగు ఈ జగత్తు మనకు ఎదురుగా ఉన్నది కదా! కార్యం ఉన్నది కనుక కారణమగు సృష్టి ప్రజ్ఞకు యజమానియగు (కర్తయగు) హిరణ్యగర్భుడు ఉండి తీరాలి. మీరు 'హిరణ్యగర్భుడు కూడా కారణం లభించని కారణంగా లేనే లేడు' అని ఎట్లా నిర్ణయిస్తున్నారో నాకు అర్థమగుటలేదు. "సృష్టి ఉన్నది గాని, సృష్టికి కర్తలేడు" అని మీరు అంటుంటే 'కుండ ఉన్నది గాని, మట్టి లేదు, వస్త్రం ఉన్నది గాని దూది లేదు, గోడ ఉన్నది గాని ఇటుకలు లేవు"... అన్న వాక్యాల వలె అర్థరహితం కాదంటారా?

కుంభఋషి : ఓహో...అదా నీ సందేహం? కొన్ని సిద్ధాంతాల ద్వారా పితామహుడగు హిరణ్యగర్భుడు లేనివాడేనని భ్రమచే ఉన్నట్లు దర్శించబడుచున్నదని మనం నిరూపించుకోవచ్చు.

1. కాలమునకు అతీతమైనదే సత్యం! - ఏది సత్యమో, సత్తయో అది త్రికాలాబాధ్యమై ఉండాలి. కాలమునకు లోబడినవన్నీ భ్రమ మాత్రమే! లేక అసద్వస్తువులే! లేక అసత్యమే!

ఏదైనా ఒకప్పుడు ఉండి, మరొకప్పుడు లేకపోతూ ఉంటే దానిని త్రికాల బాధితము అంటాం. కాలము చేత వచ్చి కాలము చేత పోయేది సద్వస్తువు కాదు. "నిన్న లేదు. కానీ ఈ రోజున ఉన్నది. మరి రేపటి రోజుకు లేకుండా పోతోంది" అనునదేదైనా సరే, వాస్తవానికి లేనిది. మరి ఉన్నట్లు అనిపిస్తోందే? అట్లా అనిపించటానికి కారణం అసత్‌దృష్టి, అల్పమైన (లేక) సంకుచితమైన అవగాహన, నిత్యానిత్యముల అవివేకము అని అనక తప్పదు.

"సమష్టి సృష్టి ప్రజ్ఞాస్వరూపుడగు పితామహుడు (హిరణ్యగర్భుడు) బ్రహ్మం నుండి లేక చిత్ సాగరం నుండి ప్రకటితమయిన మొదటి తరంగం వంటివాడు"...అని నీవే అన్నావు కదా! అంటే ఆ సమష్టి సృష్టి ప్రజ్ఞకు ముందు ఏమున్నది? బ్రహ్మం లేక చిత్ సాగరం కదా! కనుక సృష్టి-కర్త కూడా సర్వదా వస్తుతః బ్రహ్మమే అయి ఉన్నారు. చిద్వస్తువే సర్వదా ఉన్నది. భ్రమ చేతనే హిరణ్యగర్భుని యొక్క ద్వితీయమైన ఉనికి అనుభవమౌతోంది.

2. ఈ సృష్టి భ్రమయే - సమష్టి సృష్టి ప్రజ్ఞ బ్రహ్మానికి వేరుగా లేదని, ఏది ఉన్నట్లుగా కనబడుతోందో అది భ్రమతో కూడిన దృష్టిచే అట్లనిపిస్తోందని అనుకున్నాం కదా! కనుక ఆ పితామహుని సంకల్పమగు ఈ సృష్టి, ఇందలి వ్యష్టి ప్రజ్ఞలు, సమష్టి ప్రజ్ఞలు భ్రమయే! సదా, సర్వదా ప్రజ్ఞయే ఉన్నది కాని, ఆ ప్రజ్ఞకు విషయాలగు ఈ దేహాలు, జీవులు, ఆ జీవుల జన్మ, కర్మఫలములు, ఆ జీవులకు బంధ మోక్షాలు ఏర్పడటం ఇవన్నీ భ్రమ మాత్రమే! భ్రమ కారణంగా గల తదనంతర విశేషాలన్నీ భ్రమయే కదా! కల్పనచే ఏర్పడియున్నవన్నీ కూడా కల్పనా విశేషాలే కదా! ఈ శరీరం, ఈ శరీరాన్ని ధరించే వ్యక్తిగత జీవుడు, ఆతని ప్రారబ్ధ-సంచిత-ఆగామి కర్మలు, జన్మమృత్యువులు, వ్యక్తికి వ్యక్తికి మధ్య కనబడే సంబంధ బాంధవ్యములు, మనవారు కానివారు, మనజాతి-వేరుజాతులు, భాషా-ప్రదేశ సంబంధమైన మానవ దేవత జంతు తదితర విభాగాలు ఇవన్నీ భ్రమయే. ఎండమావులే భ్రమ అయినప్పుడు ఆ భ్రమలోని ఒక తరంగానికి, మరొక తరంగానికి గల భౌతికపరమైన విభేదములు భ్రమ కాదా? కనుక హిరణ్యగర్భుని నుండి పురుగు వరకు ఉన్నది సద్వస్తువగు నిర్మల ప్రజ్ఞయే. అదియే బ్రహ్మం. విషయరహిత ప్రజ్ఞయే బ్రహ్మం. విషయ సహితమైనదంతా భ్రమయే.

3. ఈ సృష్టి అంతా బ్రహ్మమే! - ఒక వస్తువు నుండి ఏ కారణం లేకుండానే మరొక వస్తువు బయల్వెడలుతోందంటే ఆ రెండవ వస్తువు మొదటి వస్తువుకు భిన్నమైనది కాదు. జలంలోంచి ఏర్పడే తరంగం జలానికి భిన్నం కాదు. ఒక తరంగానికి, మరొక తరంగానికి మధ్య కనిపించే పొడవు, వెడల్పుల తేడా భ్రమయే. ఆ రెండు తరంగాలు జలమే కదా! జలానికి "తరంగం అను మరొకటి అగుట" అనే ధర్మం లేదు. తరంగంగా కనిపించేదంతే జలమే. అగ్నిజ్వాలలు అగ్ని నుండి వేరైనవి కావు.

అట్లాగే... నీవు చెప్పినట్లు చిత్ సాగరం నుండి ప్రప్రథమంగా బయలుదేరిన 'హిరణ్యగర్భుడు, పితామహుడు' అను పేర్లతో పిలువబడే సమష్టి సృష్టిప్రజ్ఞ (బ్రహ్మదేవుడు) ఆకాశంలోని ద్వితీయ చంద్రుని వలె, మట్టిని ఏమరచినట్టి కుండ వలె, బంగారాన్ని గమనించనప్పటి ఆభరణం వలె అసత్ దృష్టి ఫలితమే! లేక, భ్రమచే ఏర్పడిన అవగాహన, మరియు కల్పన మాత్రమే! ఈ విధంగా ఈ దేహ-జీవాదులంతా కల్పితానుభవములే!

ఈ విధంగా పితామహుడగు హిరణ్యగర్భుడు బ్రహ్మము కంటే వేరు కాదు. భ్రమ (లేక) అవిద్య విద్యచే మాసిపోతుంది. అజ్ఞానం తొలగితే బ్రహ్మమే సమష్టి సృష్టి ప్రజ్ఞగా తెలియవస్తుంది. ఈ కారణం చేత ఆ బ్రహ్మమే స్వరూపంగా గల సమష్టి ప్రజ్ఞా స్వరూపుని సంకల్పం నుండి ఏర్పడిన ఈ జీవ-జడ సృష్టి కూడా బ్రహ్మమే. బ్రహ్మానికి ఎక్కడైనా వేరుగా అనిపిస్తే అది భ్రాంతి మాత్రమే.

భూత-భవిష్యత్-వర్తమానాలలో ఉన్నదంతా బ్రహ్మమే. బ్రహ్మం నిర్విషయమైనట్లే ఈ సృష్టి కూడా నిర్విషయమైనప్పటికీ భ్రమచే విషయ సమన్వితమైనట్లుగా గోచరిస్తోంది.

❖

ఓ శిఖిధ్వజా! ఈ విధంగా సత్ (పౌరాణికంగా విష్ణువు) యొక్క నాభి నుండి ఏర్పడిన హిరణ్యగర్భుడు, ఆ హిరణ్యగర్భుడు కారణం నుండి ఏర్పడిన మనువు, దక్షుడు, మరీచి మొదలైన ఋషులు, వారిచే కల్పన చేయబడిన ఈ సృష్టి అనే కార్యం - ఇవన్నీ కూడా బ్రాహ్మీ దృష్టిచే బ్రహ్మం, ద్వితీయ దృష్టిచే భ్రమ అయి ఉన్నాయి.

సృష్టి, జీవుడు, బంధం, మనస్సు, బుద్ధి ఇటువంటి ఏ దృఢప్రతీతి నీకు ఉండి ఉన్నాయో వాటిని త్యజించటమే సర్వత్యాగం. బ్రహ్మమునకు సంబంధించిన ద్వితీయత్వం నీ యందు - మన ఈ సంభాషణా బలిమిచే - నివృత్తమైనదని నేను తలచుచున్నాను. ఇక ప్రతిభాస మాత్రం చేత ఏ కొంచెంగాని ఇంకా శేషించి ఉన్నదో, అద్దానిని తత్త్వసాక్షాత్కారంచే రహితమొనర్చుకో.

ఓ రాజా! చైతన్యం కంటే భిన్నంగా కనిపించేదంతా అసత్త మాత్రమే. హిరణ్యగర్భుని దగ్గర నుండి ఒక గడ్డి వరకు కూడా ఆ సర్వస్వరూప దేవదేవుడే కార్య-కారణ పరంపరా రూపంగా వికసితుడై ఉంటున్నాడు. సర్వాత్మకుడు, అనునిత్య చైతన్యమూర్తి అగు ఆ ఈశ్వరుడు తన యందు తానే హిరణ్యగర్భుడు - వ్యక్తిగత జీవుడు మొదలైన నామరూపాలతో స్వయంగా ప్రదర్శితుడై ఉంటున్నాడు. కాబట్టి సమస్త ద్వైతం కూడా శాంతమగు బ్రహ్మరూపమే అయి ఉన్నది.

❖❖❖

30. 'అహంకారం' అనేది ఒక భ్రమ మాత్రమే

శిఖిధ్వజుడు :

ఆబ్రహ్మ స్తంభపర్యంతం యద్యయం భాసతే భ్రమః,
అర్థక్రియాఽసమరర్థశ్చ తత్కథం దుఃఖ కారణమ్?

మహాత్మా! మీరు చెప్పినట్లు సృష్టికర్తయగు బ్రహ్మదేవుని నుండి గడ్డిపరక వరకు ఈ జగత్తంతా మృగతృష్ణాజలం వలె మిథ్యగానే భాసిస్తోందని కొద్దిసేపు అనుకుందాం. ఇప్పుడు మృగతృష్ణా జలంలో నీరు త్రాగటం చేత ఎవరికైనా దాహం సమసిపోతుందా? లేదు కదా! కానీ ఈ జగత్ పదార్థాల విషయం అట్లా లేదే! ఇవన్నీ క్రియా సామర్థ్యాలై ఉన్నాయి. ఇక్కడి ఆహారం తింటే ఆకలి తీరుతోంది. జలం త్రాగితే దాహం పోతోంది. ఇవన్నీ ఎట్లా జరుగుచున్నాయి? ఈ వస్తు సముదాయం జీవునికి దుఃఖకారణం కూడా అగుచున్నది కదా? ఈ సుఖ దుఃఖాలు జీవునికి వస్తువు యొక్క ప్రాప్తాప్రాప్తాలచే కలుగుచున్నాయనేది మీరు కాదనటానికి వీలు లేదు కదా?

కుంభమహర్షి : ఓ రాజర్షీ! జలానికి భౌతికంగా కొన్ని ధర్మాలు కనిపిస్తున్నాయి. దానికి ఆకారం లేదు. అది చలిస్తుంది. త్రాగితే దాహం తీరుస్తుంది. స్పర్శిస్తే సుతిమెత్తగా స్పర్శాస్పర్శంగా అనుభవ

మవుతుంది. అయితే, అది జలం శీతలత్వం చేత గడ్డ కట్టిందనుకో. మంచుగడ్డగా ఘనీభూతమై ఆవిర్భవించిన ఆ జలానికి ఇప్పుడు ఆకారం ఏర్పడుతోంది. పొడవు, వెడల్పులు కనబడుచున్నాయి. బాగా దాహంగా ఉన్నవాడు మంచుగడ్డను మ్రింగటం అనుకూల విషయం కాదు కదా! ఆ ఘనీభూతమైన మంచుగడ్డలో కత్తి ఆకారం నిర్మించబడితే, అట్టి మంచు ఖడ్గంతో ఒక అరిటి చెట్టును నఱకవచ్చు. అనగా మంచుతో నిర్మించిన వస్తువుకు జలమునకు లేని ధర్మాలు అగుపిస్తున్నాయి. ఆ నీరు ఆవిరి అయినప్పుడు వేఱువేఱైన ప్రయోజనాలు సిద్ధిస్తున్నాయి. కాని కఠినమగు మంచుగడ్డతో నిర్మించబడిన వస్తువు జలముకన్నా వేరా? నీటికన్నా నీటి ఆవిరి వేరా?

సత్య సంకల్పుడగు ఈశ్వరుని భావనయే ఈ జగత్తు. భ్రమ రూపమగు ఈ జగత్తు ఆయా అర్థక్రియాదులచే వ్యాపించి ఉన్నది. అట్టి అర్థక్రియాదుల పరిమిత దృష్టిగల వారికి జగద్భావన వెనుక గల భావనారాయణుడు అగుపించటం లేదు.

ఈ ఎదురుగా ఉన్నదంతా అజ్ఞానముచేతనే అనేక అజ్ఞాన విషయ పరంపరా సమనిత్వమై అగుపిస్తోంది. అజ్ఞానం శిథిలం అవుతూ ఉంటే క్రమంగా జగదనుభవం కూడా శిథిలమై వస్తూ ఉంటుంది. మూల అజ్ఞాన నాశనంచే ఈ జగత్తు యొక్క రాహిత్యం అనుభవం కాగలదు.

నేను చెప్పే ఈ విషయం అనేక మంది విజ్ఞులు ఎరిగియే ఉన్నారు. (ఉపనిషదాది) వేదాంత వాఙ్మయంలో గ్రంథస్తమయ్యే ఉన్నది. కనుక ఇది నేను క్రొత్తగా చెప్పుచున్నది కాదు. నీవు నీ ప్రియురాలు చూడాల కూడా అనేకసార్లు ఆత్మజ్ఞానం వినియే ఉన్నారు.

అజ్ఞానం ఉన్నంతవరకూ ఈ జగత్తు ఉండియే ఉన్నట్లు అనుభవమై తీరుతుంది. అజ్ఞానం తొలగినదా, నీ దృష్టిలో ఈ జగత్తు లేనిదని తెలిసిపోతోంది.

అజ్ఞానం తొలగేది ఎట్లా? "నేతి, నేతి" ...అను అవాస్తవత్యాగరూపమై నిరోధాభ్యాసంచే నీ యొక్క బాహ్యాకారవృత్తి స్థూలత్వం నుండి వైదొలగి సూక్ష్మత్వం సంచరించుకుంటుంది. అట్టి దృష్టి యొక్క సూక్ష్మత్వంచే అజ్ఞానం వైదొలగి నీ అంతరంగమందలి ఆ ప్రదేశంలో జ్ఞానం వెల్లివిరుస్తుంది. అట్టి జ్ఞానం యొక్క ప్రకాశంచే పరమపదం లేక, 'ఆత్మయొక్క సాక్షాత్కారం' లభిస్తోంది. అప్పుడు జగత్తు యొక్క సంపూర్ణ విలయం లభిస్తోంది. ఈ జగత్తులో ఏ వస్తువైనా సరే... సూక్ష్మత్వం పొందుతూ ఉంటే క్రమంగా అద్దాని వర్తమాన స్థూలత్వం వైదొలగగా క్రమంగా అది అకారాదుల యొక్క సంపూర్ణ రాహిత్యమును పొందుతుంది. ఏ జీవుడైతే వర్తమానంలో ఈ దేహాన్ని ఉపయోగించి స్థూలానుభవాలైన శబ్ద స్పర్శరూపాదులను, సంబంధ-బాంధవ్య-అసంబంధ-అబాంధవ్యములను, సంచిత-ఆగామి -ప్రారబ్ధాది కర్మవాసనలను దర్శిస్తున్నాడో... అట్టి ఆతడి దృష్టి స్వస్వరూపజ్ఞానబలిమిచే సూక్ష్మత్వం పొందగా అప్పుడు 'నేను జీవుడను- ఇది సాధన- అది లక్ష్యం' మొదలైనవన్నీ పోయి 'అఖండం - అప్రమేయం అగు ఆత్మయే నా స్వరూపం' అనే నూతనానుభవం సర్వే సర్వత్రా వెల్లివిరుస్తోంది.

అనేనైవ క్రమేణైవం త్వమాదిపురుషో నృపః
భ్రమాకారోదయం విద్ధి మృగతృష్ణాంబువత్ స్థితమ్ ॥

ఓ ప్రియమహారాజా! క్రమక్రమంగా అట్టి అజ్ఞానం యొక్క శైథిల్యం చేత చివరికి నీవే శుద్ధ చిన్మాత్రమగు ఆది పురుషుడవై, హిరణ్యగర్భుని ఉత్పత్తికి కూడా ముందే ఉన్న శుద్ధ చిత్ చైతన్యమై శేషించగలవు. ఇకప్పుడు నీ అనుభవం ఈ జగత్తు విషయంలో మరొకటిగా ఉంటుంది. అనగా చైతన్యం కంటే భిన్నంగా కనబడుచున్న ఈ దృశ్యజగత్తు మృగతృష్ణలోని జలతరంగాల గురించి అంతయూ ఎరిగిన వానివలె మిథ్యారూపమై అనుభవం కాగలదు. బ్రహ్మదేవుడే (సమష్టిసృష్టి అను కర్తృత్వమే) స్వతహాగా లేదని, తద్వారా ఈ ప్రాణిసమూహమంతా కూడా ఆ రీతిగానే భ్రమచే దర్శన మిస్తున్నాయని అప్పుడు నీవు ఒప్పుకుంటావు. స్వయంగా ఏదైతే ప్రసిద్ధమైలేదో, అద్దానిచే ఏ కార్యం సిద్ధించగలదు చెప్పు? మృగతృష్ణాజలంలాగా ఉదయించిన ఈ ప్రాణి కోట్ల యొక్క ఏ బాహ్య రూపం నీకిప్పుడు అనుభవమౌతోందో, అదంతా కూడా తత్త్వవిచారణచే ముత్యపు చిప్పలోని వెండి లాగా 'అకారణం కనుక ఇవి లేవు. ఉన్నదల్లా సర్వాత్మకమగు చైతన్య మొక్కటే' అని ఎవరూ కొత్తగా చెప్పకుండానే గ్రహిస్తావు. మరల సిద్ధాంత పరంగా ఒక వాక్యం చెప్పుచున్నాను.

కారణాభావతః కార్యమభూత్వా భవతీతి యత్
మిథ్యాజ్ఞానాదృతే తస్య నరూపముపపద్యతే

కారణం లేకుండానే ఎక్కడైనా ఏదైనా కార్యం ఉన్నట్లనిపిస్తే అట్టిదాని రూపం మిథ్య మాత్రమే.

మిథ్యాదృష్టి ప్రేక్షితం తు న కదాచనవిద్యతే
మృగతృష్ణాంబసా కేన ఘటకేః పరిపూరితాః?

ఎవడైనా మృగతృష్ణలో ప్రవేశించి కుండ నిండా మంచినీళ్ళు నింపుకొని ఇంటికి తీసికెళ్ళగలడా? మిథ్యా దృష్టిచే మిథ్యయే లభిస్తుంది. మిథ్యాదృష్టిచే ఉదయించిన దేహి-దేహ సంబంధాది పదార్థములన్నీ వివేక దృష్టితో వీక్షించామా, ఇక వాటికి ఎక్కడా ఉనికి ఉండజాలదు.

శిఖిధ్వజుడు : మీరు చెప్పే యుక్తాయుక్త వాక్యాలు మహత్తరమైన అర్థం ప్రసాదిస్తున్నప్పటికీ ఇంకా నాకు ఒక అనుమానం కొంచెం శేషించియే ఉన్నది. అది ఏమిటంటే?... "ఆదిస్రష్ట అయినట్టి బ్రహ్మదేవునికి అజం - అవ్యక్తం - శాంతం, అచ్యుతం... అయినట్టి పరబ్రహ్మం కారణమై ఉన్నది" అని మనం ఎందుకు అనుకోకూడదు? అప్పుడు ఈ సృష్టికి కారణం ఉన్నట్లే అవుతుంది కదా!

కుంభమహర్షి : ఓ రాజా! నీవు అడిగిన ప్రశ్నలోనే సమాధానం కూడా ఉన్నది. అయినా, నీకు సమాధానం చెప్పుచున్నాను విను. నీవు వేద వేదాంతోపన్యాసాలు నీ ప్రియురాలు చూడాలతో కూడి విన్నావు కదా! శ్రుతి వాక్యాలు కొన్ని ఇక్కడ ఉదహరిస్తాను.

నేహ నానాఽస్తి కించన (ఇక్కడ నానాత్వమనేది కించిత్ కూడా లేదు); తదేదత్ బ్రహ్మపూర్వ మతఃపరమ్ (ఇప్పుడు, మరొకప్పుడు కూడా బ్రహ్మము బ్రహ్మముగానే ఉన్నది); అసంగోహి అయం పురుషః (ఈ జీవుడు వాస్తవానికి దేనితోనూ సంగము లేనివాడు)... ఇటువంటి వాక్యముల నిర్వచనము, విశ్లేషణము నీవు విని ఉన్నావు. వాటి గురించి నీ భార్య చూడాలతో సంభాషించావు కదా! వీటిని బట్టి గ్రహించవలసిన దేమిటి?

కూటస్థమగు బ్రహ్మము పరిణామరహితం, అద్వయం, ప్రపంచాతీతం, సదా నిర్వికల్పం, నిర్గుణం కదా! అట్టి బ్రహ్మమునందు కార్యకారణ కల్పన ఎక్కడున్నది? అది సమష్టి ఇచ్ఛాజ్ఞాన స్వరూపమగు (లేక, సమష్టి సృష్టి కర్తయగు) బ్రహ్మదేవుని సృష్టికి కారణమై ఉండటమేమిటి?

ఓ రాజా! బ్రహ్మము సర్వదా కార్యకారణ భావవర్జితమైయున్నది. శుద్ధ బ్రహ్మము లేక ఆత్మ దేనికీ కార్యముగాని కారణముగాని అవదు, అవజాలదు.ఒక నాటకంలోని ఒక పాత్ర యొక్క గుణగణాలకు ఆ పాత్రధారి కారణమా? కార్యమా? ఏదీ కాదు కదా!

కర్త – కర్మ – కారణ రహితమైన, ఉపాదాన – నిమిత్తకారణ వర్జితమైన, అప్రతర్క్యమైన తర్కముచే పొందుటకు, నిరూపించుటకు విషయము కానట్టి అవిజ్ఞేయమైనట్టి బ్రహ్మము 'హిరణ్యగర్భుడు' అను సృష్టికర్తను సృష్టించుటకు కారణమెట్లా అవుతుంది?

ఇంద్రియములను వెలిగించేది ఇంద్రియములకు విషయం కాజాలదు. కన్నును పనిచేయింపజేసే విషయ విజ్ఞానశక్తి ఆ కళ్ళకు కనబడే నామరూపాత్మక వస్తువు ఎట్లా అవుతుంది? అందుకే అది 'అవిజ్ఞేయము' అనే బిరుదుకు అర్హమగుచున్నది.

బ్రహ్మం దేనికీ కారణం కాదు. కాబట్టి అది సర్వదా కర్తృత్వ రహితమై ఉన్నది. ఒకవేళ 'కార్య కారణాత్మకమైన ఈ జగత్తు ఉన్నది" అని నీవు ఇంకా అనుకుంటున్నావనుకో... అప్పుడు, "ఈ జగత్తు అంతా ద్వైత–ఐక్య లక్షణ వర్జితం, దేశ–కాల–వస్తు పరిచ్ఛేదశూన్యం, అనాది, అనంతం, అయినట్టి బ్రహ్మమేగాని మరింకొకటేమీ కాదు" అను భావనను ప్రారంభించి దృఢపరచుకో.

అప్రతర్క్యం, అవిజ్ఞేయం, యచ్ఛివం, శాన్తమవ్యయమ్,
తత్కథం కస్య కేనైవ కర్తృ–భోక్తృ కథా భవేత్?

మనందరి వాస్తవ స్వరూపమగు బ్రహ్మము:

1. అప్రతర్క్యమైనది (IT IS NOT OBTAINABLE BY LONG ARGUMENTS) 2. అవిజ్ఞేయమైనది (IT CANNOT BE KNOWN BECAUSE IT ITSELF IS THE KNOWER) 3. శివం (శుభప్రదమైనది) 4. శాంతము 5. అవ్యయమైనది (IT IS IMPERISHABLE) ...అట్టి సర్వాత్మక బ్రహ్మము దేనికి కర్త అవుతుంది? దేనికి భోక్త అవుతుంది?

కనుక ఈ జగత్తు, ఇందలి పుత్ర – మిత్ర – కళత్రాది సంబంధములు, తదితర జగద్విషయములు దేనిచేతనూ నిర్వర్తించబడలేదు. కనుక అవన్నీ లేనివే అవుతాయి.

ఆత్మయే స్వరూపముగా గల నీవు ఇందు దేనికీ కర్తవు కావు. భోక్తవూ కావు. ఇదంతా కూడా జన్మరహితమై, శాంతమై, శివమై ఒప్పుచున్నది. ఈ జగత్తు దేని యొక్క కార్యమూ కాదు.

ఈ జగద్రూపమంతా మనం ఇంతవరకూ చెప్పుకున్నట్లు భ్రమ చేతనే సిద్ధించుచున్నదగుచున్నది. ఇదంతా దేని యొక్క కార్యమూ కానందున ఈ ఆవిర్భూతమై కనబడు సృష్టి లేనిదే అని మరల నిర్ణయించి చెప్పుచున్నాను. ఇక్కడి పదార్థాల అభావమే వాస్తవమైన సిద్ధి. ఆ పదార్థాల భావనయో... అవాస్తవమైన

సిద్ధి. పదార్థాలే లేనప్పుడు, ఇక వాటి యొక్క జ్ఞానం మాత్రం ఎక్కడున్నది? ఆ జ్ఞానాన్ని ప్రకటించే అహంకారం మాత్రం ఎక్కడున్నది. కాబట్టి నీయందు 'అహంకారం' అను దోషం ఉండటానికే వీలు లేదు. ఒకవేళ ఉంటే అది భ్రమ యొక్క విన్యాసం మాత్రమే. అనగా, తెలియబడే ఈ జగత్తు భ్రమ అయినట్లే, అహంకారం కూడా భ్రమయే. కాబట్టి నీవు శుద్ధుడవు. సదా విముక్తుడవు. ఆత్మరూపుడవగు నీకు బంధమోక్షాలు ఉండటానికి ఎప్పుడూ వీలులేదు.

శిఖిధ్వజుడు : ఓ దేవర్షీ! తమరు యుక్తియుక్తంగా ఉత్తమమైన కథనం ప్రవచించారు. ఔను. మీరు సెలవిచ్చినదంతా అక్షరసత్యం.

1. బ్రహ్మము దేహ–జగత్తులుగా పరిణమించటానికి కారణమే లేదు. 2. బ్రహ్మం ఈ జగత్తుకు కర్త కాదు. 3. కర్త అనేవాడే లేడు కనుక ఈ జగత్తు స్వతహాగా లేనిదే అయి ఉన్నది. 4. జగత్తే లేదు కనుక నామరూపాత్మకమైనదంతా భ్రమచేతనే అనుభవమవటం జరుగుతోంది. 5. భ్రమ తొలగటం చేత "బ్రహ్మమే సర్వదా బ్రహ్మం నందు నెలకొని ఉన్నది"...అని నిర్మల దృష్టిచే తెలియవచ్చుచున్నది. పై ఐదు ఉత్తమ వాక్యాలు నాకు ప్రస్ఫుటమౌతున్నాయి.

కనుక ఈ నామరూపాత్మక జగత్తుకు మాతాపితలు చిత్తాహంకారాలే. అయితే చిత్త – అహంకారాలు ఏ క్షణమందునూ కొంచెం కూడా లేవు. ఈ విధంగా 1. జగత్తు, 2. చిత్తం, 3. అహంకారం – మొదలైనవి "లేనివే" అవటంచేత నేను శుద్ధుడను, విబుద్ధుడను, శివస్వరూపుడను అయి ఉన్నాను.

చైతన్యానికి వేరైన విషయ సమూహాలు ఏమాత్రం లేవని మీరు బోధించారు. మీరు చెప్పుచుండగా ఒకవైపు వింటూనే, మరొక వైపుగా పదార్థాల గురించి మీరు చెప్పిన కోణం నుండి విచారణ చేస్తూనే ఉన్నాను.

అధ్యారోపం (లేనిది ఆరోపించటం); అపవాదం (ఉన్నది సరిగ్గా గుర్తించకపోవటం)... ఈ రెండు మార్గములలో నేను ఇంతకాలంగా మత్తుడనై భ్రమిస్తూ సుదీర్ఘకాలం గడిపివేశాను. ఈ రెండు మార్గాలను మీ వాక్యాలు ప్రసాదించిన జ్ఞాన కాంతిచే పరిశీలించగా ఇప్పుడు అహంకారం మొదలుకొని ఈ దృశ్యప్రపంచం వరకు సమస్త పదార్థాలు అసత్యాలుగా, బాలుని వినోద–విషాదాల వలె, భ్రమ–లీలా మాత్రంగా తెలిసిపోతున్నాయి. తత్ఫలితంగా సమస్తం బోధించబడుటచే ఇక నేను ఆకాశకోశం వలె విక్షేపరహితుడనై ఉన్నాను.

అట్టి నా స్వరూపానికి నేనే నమస్కరిస్తున్నాను. చిరకాలానికి దేశ–కాల–క్రియా సమూహ సహితమైన పదార్థ దృష్టి శమించింది. ఇప్పుడిక నేను అవినాశినై, నిర్వికారుడనై, బ్రహ్మాత్ముడనై స్థితి నొంది ఉన్నాను. శాంతుడను, తృప్తుడను అయి సర్వత్రా వెలయుచున్నవాడనని నన్ను నేను దర్శిస్తున్నాను. నేను ఎక్కడికీ పోవటం లేదు. ఎక్కడి నుండీ వచ్చుట లేదు. ఉదయించటం లేదు. అస్తమించటం లేదు. ఎప్పుడూ ఎట్లున్నానో ఎప్పటికీ అట్లే ఉండి ఉంటున్నాను. తమరు కూడా అట్లే ఆనందైక రస స్వరూపులై సర్వదా ఉండండి.

నేను ఆత్మస్వరూపుడను. శుద్ధుడను. శివస్వరూపుడను. పవిత్రుడను. మౌన స్వరూపుడను.

❖

ఇట్లు అఖండ బ్రహ్మాకారం ఉదయించటం చేత ఆ శిఖిధ్వజుడు బ్రహ్మము నందు ఘనీభూత మౌనస్వరూపుడై, శాంతిస్వరూపుడై ప్రకాశించాడు. గాలి వీచని చోట నిశ్చలంగా ప్రకాశించే దీపం లాగా రెండు ఘడియల కాలం నిశ్చలుడై ఉండిపోయాడు.

❖❖❖

31. బ్రహ్మము యథాతథంగా ఉండి ఇక్కడ వినోదిస్తోంది!

శ్రీవసిష్ఠ మహర్షి : కుంభఋషి రాజు వైపు చూచాడు. ఆతడు శీఘ్రంగా నిర్వికల్ప సమాధి వైపు అభిముఖం అవుతున్నట్లు గమనించాడు. తన యొక్క స్వలీలచే ఆతనిని త్వరితంగా ప్రబోధితం చేశాడు. కుంభుడు సంకల్పశక్తిచే పిలిచిన ఆ పిలుపును అందుకుని శిఖిధ్వజుడు మెల్లగా సమాధి నుండి బహిర్ముఖుడైనాడు. కుంభుని వైపు కృతజ్ఞతలను తెలుపుచూ కనులు తెరిచి చూచాడు.

❖

కుంభర్షి : ఓ రాజా! నీవిప్పుడు అజ్ఞాన నిద్ర నుండి మేల్కొన్నావు. శివరూపుడవై చెన్నొందుచున్నావు. ఇంతలోనే నిర్వికల్ప సమాధిలో ప్రవేశిస్తుండటం గమనించి నిన్ను ఈ భౌతిక ప్రపంచం వైపుగా అభిముఖం చేశాను.

అమృతానంద స్వస్వరూపాన్ని గ్రహించిన తరువాత ఇక ఈ దృశ్యాన్ని అస్తమింపజేయుట చేత గాని, అస్తమింపజేయక పోవుటచేత గాని వచ్చే ప్రయోజనం లేదు. నిష్ప్రయోజనమూ లేదు. ఒక్క పర్యాయం ఆత్మను దర్శించిన తరువాత నీ ఇష్టానిష్టాలన్నీ నశించాయి. నీవు ఇప్పుడు సమస్త కల్పనల నుండి విముక్తుడవై వెలయుచున్నావు. జీవన్ముక్తుడవయ్యావు. ఇక మోహకారణాలు నీయందు లేవు.

❖

శిఖిధ్వజుడు ఆ కొద్ది క్షణాలలోనే విశ్రాంతి చిత్తుడై, ముక్తాత్ముడయ్యాడు. కుంభఋషిచే మేలుకొలుప బడ్డాడు కదా! లీలామాత్రంగా దృశ్యవస్తువు యొక్క సత్తను గాంచుచు కుంభుని వైపు చూచి ఇట్లు పలికాడు.

శిఖిధ్వజుడు : హే పరమజ్ఞాతా! కుంభ మునీంద్రా! మీరు ఇప్పటిదాకా వచించిన దానిని అనుసరించి నాకు అంతా సుబోధకమైనది. అయినప్పటికీ బోధ యొక్క సుదృఢత కొరకై మరల ఒక చిన్న ప్రశ్న అడగాలని అనిపిస్తోంది.

శివే శాంతే నిరాభాసే పదే అనుల్లసితాత్మని,
ద్రష్టృ దర్శన దృశ్యాఖ్యో విశ్వాత్మా ప్రత్యయః కుతః?

శివమై, శాంతమై, నిరాభాసితమై సర్వదా అప్రకటితమైన ఆత్మయందు 1. ద్రష్ట, 2. దర్శనం, 3. దృశ్యాల – సమావేశమగు ఈ దృశ్య ప్రపంచ ప్రతీతి ఎట్లా, ఎక్కడి నుండి, ఎందుకు ఏర్పడుతోంది?

కుంభమహర్షి : మహారాజా! నీవు చక్కటి ప్రశ్న వేశావు. వాస్తవానికి అజ్ఞానావరణము తొలగుటచే నీవు స్వయంప్రకాశకుడగు సూర్య భగవానునివలె ప్రకాశిస్తున్నావు. నీ కింక ఏ శంకలూ లేవని

నాకు తెలుసు. అయినా కూడా నీ ప్రశ్నకు సంబంధించిన విషయం మనం ఇంకా చర్చించలేదు కనుక, నీ ప్రశ్న వర్తమానానికి సముచితమే. విను, చెపుతాను.

❖

అనేక పదార్థములచే పూర్ణమైనట్టి ఈ చరాచర ప్రపంచం నీకు కనిపిస్తోంది కదా! ఇదంతా కూడా ఒకానొకప్పుడు కల్పాంతంలో నశించబోవుచున్నది. ఆ మహాకల్పాంతమున అంతా నశించిన తరువాత ఇంకా శేషించేదేమైనా ఉన్నదా? నాశనానికి విషయమే కాని ఒకానొకటి ఉన్నది. అద్దానినే శాస్త్రజ్ఞులు ఆత్మ, సన్మాత్రం, చిన్మాత్రం మొదలైన పేర్లతో సంబోధిస్తున్నారు. అది వాక్యాలకు అందనిది. అయినప్పటికీ శిష్యవాత్సల్యంతో అది మాచే ఏవో ఆయా శబ్దాలతో వర్ణించబడుతోంది.

అప్రతర్క్యమ్, అవిజ్ఞేయమ్, సమమ్, శివమ్, అనిందితమ్ ।
బ్రహ్మ నిర్వాణమాపూర్ణమాపూర్ణోదిత సంవిదా ॥

ఈ విధంగా వాచాతీతమగు మనలోని ప్రతి ఒక్కరి స్వస్వరూపమే అగు ఆ బ్రహ్మము అనేక ఉత్తమ వచనములచే అద్దానిని దర్శించేవారిచే, వేదోపనిషత్ ఆదిగా గల ఆయా గ్రంథములచే ప్రవచించబడుతోంది. ఆత్మానుభవజ్ఞులు తమ వాక్కులచే మనకు ఇట్లు చెప్పుచున్నారు.

అప్రతర్క్యం, అవిజ్ఞేయం, సమం, సర్వత్రా ఏకరసము,శివము, నిర్వాణరూపం,న ర్వత్రా ఉదయించినది, నిజబోధచే పూర్ణమైఒప్పునది ఆ బ్రహ్మము సూక్ష్మతర పదార్థముల కంటే సూక్ష్మమైనది. స్థూలతరపదర్థాములకంటే స్థూలమైనది. గురుతరములన్నిటి కంటే గురుతరమైనది. శ్రేష్ఠతర పదార్థములన్నిటి కంటే శ్రేష్ఠతరమైనది.

ఒక పరమాణువు కూడా మహా సూక్ష్మమగు ఆత్మయందు కొండంత స్థూలమనిపించుకుంటుంది. ఆ ఆత్మ ఎదుట ఆకాశము కూడా అత్యంత స్థూలమైనదే అవుతుంది. అది ఎంత స్థూలమైనదంటే, అద్దాని ఎదుట ఈ సమస్త బ్రహ్మాండము ఒక అణువు వలె గోచరిస్తుంది.

❖

ఓ రాజా! పూర్వ – తత్ పూర్వ కర్మానుసారం, అధ్యాసానుసారం కనిపించే అనేక ప్రాణికోట్లతో కూడిన ఈ జగత్తు యొక్క ఏ స్ఫురణ అనుభూతమౌతోందో, అదంతా కూడా 'పరమాత్మ నుండి ఉత్పన్నమైన బ్రహ్మదేవుని (సమష్టిగతమైన ప్రజ్ఞ యొక్క) అహంభావ రూపమగు జ్ఞానధ్యానము'... అని నీవు ఎఱిగి ఉండుము. ఆ బ్రహ్మదేవుని అహంభావమునందే ఈ జగత్తు విషయరూపమున స్థితి నొందియున్నది. అట్టి జగత్‌స్థితినే 'విరాడ్రూపం' అని కూడా పిలుస్తున్నారు.

❖

వాయువుకు, వాయు వీచికలకు భేదం లేనట్లు; శూన్యత్వం, ఆకాశాలు ఒక్కటే అయినట్లు; చిన్మాత్రం, అందులోంచి బయలుదేరిన అహంభావ స్ఫురణకు – ఏమాత్రమూ భేదం లేదు.

దేశకాలాలకు అసంబంధితమైన జలం వివిధ రీతులైన పేర్లతో (నదీనద నామధేయాలతో) అకారణంగా ఉన్నట్లే దేశ – కాల వస్తువులచే అపరిచ్ఛిన్నమగు పరమాత్మయందు అకారణంగా ఈ

జగత్తు స్థితి కలిగి ఉంటోంది. ఆకారరహితమగు బంగారం రకరకాల ఆకారాలచే రకరకాల ఆభరణ నామాలను (గాజులు, గొలుసు, ఉంగరం మొదలైన పేర్లను) పొందుతోంది చూచావా? తాను నిరాకారమై ఉండి కూడా బ్రహ్మం అకారణంగా వివిధ దేశ-కాల-వస్తు పరిచ్ఛిన్నమైన ఈ జగత్తును తనయందు ప్రకటీకరిస్తోంది. ఈ జగద్రూప రాజ్యానికి బ్రహ్మమే చక్రవర్తి. సర్వశ్రేష్ఠం, నాశరహితం, ద్వైతవర్జితం, నిర్మలం, శాంతం – అయినట్టి బ్రహ్మం యొక్క సమక్షంలో ఈ జగత్తు ఒక తృణం వలె అతి తుచ్ఛమై తోచుచున్నది. పరమ శ్రేయోదాయకమగు బ్రహ్మం ఉండటం చేతనే ఈ జగత్తు శోభను, సత్తను ప్రదర్శించగలుగుతోంది. ఇందలి సారం బ్రహ్మమే! బ్రహ్మమొక్కటే సర్వత్రా వ్యాపించి చిన్మాత్ర స్వరూపమై, నిరుపాధిక ప్రేమపదమై, అద్వితీయమై, ద్వైత – ఐక్యరహితమై సర్వదా ఉండి ఉంటోంది.

❖

పైన మనం ఇప్పటిదాకా వర్ణించుకున్న శాస్త్ర ప్రవచిత విశేషముల కారణంగా 'ద్వితీయమైన కల్పన' అనేది ఎక్కడా లేదు. సర్వదా పూర్ణమై, అక్షయమై, నిర్మలమైనట్టి ఆత్మతత్త్వమే ప్రకాశించుచున్నది. అది సదా సర్వరూపమై, సర్వాకారముగా ఉదయిస్తూ ఒప్పుచున్నది.

అయినా కూడా అది కళ్ళకు కనబడేది కాదు. చేతులచే నిర్వర్తించబడే కర్మ సంబంధితమైనది కాదు. అది వాటన్నిటికీ కార్యమూ కాదు, కారణమూ కాదు. ఆ బ్రహ్మము ప్రత్యక్ష – అనుమానములచే ఎక్కడో పొందబడేది కాదు. అయితే అది ఎవరికి వారే తమ అనుభవముగా ధ్రువీకరించుకోవలసినది.

ప్రపంచంలో ఏది పొందితే ఏం లాభం? నిరతిశయానంద స్వరూపం, సర్వశ్రేష్ఠం, సర్వరూపం, సర్వాత్మకం, అతి సూక్ష్మం, స్వచ్ఛం, అనుభవమాత్రం – అగు ఆ బ్రహ్మం ఒక్కటే మహత్తరసాధ్యమైన వస్తువు. 'చిన్మాత్రం, పరమాత్మ స్వరూపం' ఇత్యాది శబ్ద, తదర్థ రూపమై వ్యక్తావ్యక్త స్వరూపమై, నిరాభాసమై, దృక్ మాత్రమైనది ఆ బ్రహ్మం.

పరమార్థ దృష్టికి అది మాత్రమే సత్తు. వ్యవహారదృష్టికో అది అసత్తుగా అనిపించటమే ఇక్కడి చమత్కారం! ఇట్లు సత్ – అసత్ రూపంగా భాసించే బ్రహ్మమునకు కారణత్వం ఎట్లా సంభవిస్తుందో చెప్పు రాజా?

ఆ బ్రహ్మం నామ రూపరహితం. కాబట్టి దేనికీ బీజం కాదు, కారణం కాదు. కనుక, వ్యాపక రూపమగు ఆ పరమాత్మ నుండి ప్రమాణ, ప్రమేయాల రూపమగు ఈ జగత్తు కించిత్ కూడా జనించజాలదు. ఈ జీవుని అనుభవం ఎట్లా ఉన్నాసరే సర్వుల స్వరూపమగు ఆత్మ కర్త-కర్మ-కరణాది రహితమై ఉన్నది. సత్యమై, నాశనరహితమై, చిద్ఘనమాత్రమై, నిరాభాసమైయున్నది. ఆ ఆత్మస్వరూపం స్వయంగా అనుభవమాత్రమై ఉన్నదని మాత్రం తప్పకుండా సిద్ధాంతీకరించవచ్చు.

❖

కాబట్టి ఓ రాజర్షీ! మనం నీ ప్రశ్నకు సమాధానరూపంగా ఇప్పటి వరకూ చెప్పుకున్న దానిని అనుసరించి ఆ పరబ్రహ్మం నుండి ఏదీ ఉత్పన్నమగుట లేదు. ఎందుకంటే జలంలో

సకారణంగా పుట్టిన తరంగాలు జలం కంటే వేరని ఎవ్వరంటారు? ఇక బ్రహ్మం నుండి నిష్కారణంగా ఉత్పన్నమైన ఈ జగత్తు ఎట్లు ఎవనికి, ఎందుకు దేనికంటే భిన్నంగా లభించగలదు చెప్పు? ద్రష్ట లందరి స్వరూపం బ్రహ్మమే అయి ఉండగా ఒక ద్రష్టకు వేరొక ద్రష్ట నుండి అనుభవమయ్యేది బ్రహ్మం కాక మరేమిటి? 'దేశకాల వస్తువులచే అపరిచ్ఛిన్నమగు పరబ్రహ్మమున అకారణంగా ఈ జగత్తు ప్రదర్శితమౌతోంది'... అని ఇతఃపూర్వమే అనేక చోట్ల శాస్త్రకారులు నిర్ణయించి చెప్పారు. నీవు మీ రాజసభలో జరిగిన అనేక సత్సంగములలో ఈ విషయాలు - శాస్త్రజ్ఞుల ప్రవచనాలను వినియే ఉన్నావు కదా!

శిఖిధ్వజుడు : మహాత్మా! "జలములో తరంగాలు సకారణమై ఉన్నాయి. బ్రహ్మమున ఈ అహంకార - జగదాదులు అకారణమై ఉన్నాయి" అని మీరు చెప్పినప్పుడు ఈ సకారణ - అకారణ వ్యవహార మేమిటో నేను గ్రహించలేకపోతున్నాను.

కుంభమహర్షి : రాజా! విను.

పంచ భూతాల సమ్మేళనంచే జలం ఏర్పడుతోంది. ఆ జలంచే సముద్రం తయారగుచున్నది. బాహ్యమున వాయు ప్రసరణ కారణంగా జలం తరంగాల రూపంగా ప్రసరిస్తోంది. అందుచేత 'జల తరంగాలు సకారణమై ఉన్నాయి' - అవి మనం అంటున్నాం. బ్రహ్మం నుండి అహంకారం పుట్టుకకు కారణమేదైనా ఉన్నదా? ఎవరైనా చెప్పగలరా? లేదు. అందుచేత "బ్రహ్మం నుండి అహంకారం పుట్టటానికి సహకారిక కారణం లేదు' అని అనవలసివస్తోంది. కనుక 'బ్రహ్మం అహంకారంగానూ, జగత్తుగానూ పరిణమిస్తోంది' అని అనటానికి కుదరదు" అని చెప్పటానికే సకారణ - అకారణ పదాలను ప్రయోగించాను. అయితే 'బ్రహ్మం నందు అకారణంగా ప్రకటనమయ్యే అహంకార, జగదాదులు బ్రహ్మముకంటే వేరుకాదు' అనే సిద్ధాంతమును తత్త్వజ్ఞానం లేకపోతే ఎవ్వరూ ఎరుగ జాలరు. ఇక నీ విషయానికి వస్తే నీవు 'తత్త్వజ్ఞానం' (లేక) 'అద్వైతజ్ఞానం' ఎరిగియే ఉన్నావు కదా! కాబట్టి ఈ సిద్ధాంతం నీకు అత్యంత సులభంగా సుబోధకం కాగలదనే ఉద్దేశంతో అట్లా చెప్పాను.

ఓ రాజా! ఈ 'జగత్తు' గానీ, 'అహం' మొదలైనవిగానీ పరమాత్మయందు లేవు. కనుక ఈ జగత్తు జగత్‌శబ్దార్థరహితమైన శివమే (లేక) బ్రహ్మమే అయి ఉన్నది.

ఆకాశమునందు ఆకాశముకంటే సూక్ష్మమైన సంకల్పమయ ఊహానిర్మిత గంధర్వనగర రచన ఎట్లున్నదో, ఆకాశమునందు నిత్యశాంతమగు శూన్య సత్త ఎట్లు ఏర్పడి ఉన్నదో, ఈ జగత్తు కూడా ఆ విధంగానే ఈశ్వరుని యందు శూన్య సత్తారూపమై మౌనముగా ఏర్పడియున్నదని గ్రహించు.

ఈ జగత్తును చైతన్యరూపంగా గాని, లేక శూన్యరూపంగా గాని లెస్సగా ఎటిగానా, అప్పుడిది బ్రహ్మరూపమే కాగలదు. సమ్యక్ జ్ఞాన ప్రభావంచే ఈ జగత్తు అమృతతుల్యము కాగలదు. అట్లా కాకుండా, అసమ్యక్ జ్ఞానముచే చూచావా, ఈ జగత్తంతా కూడా అమంగళకరమై, మహాదుఃఖ ప్రదమై సంప్రాప్తించగలదు సుమా!

ఒకడు ఏ భావంతో ఏ అనుభవమును దర్శిస్తాడో, ఆతనికి అది అట్లే అనుభూతమవగలదు. మాయతో కూడిన ఈశ్వరుడు కూడా భావనను అనుసరించియే తత్సంబంధిత పదార్థ రూపమును

సంతరించుకుంటున్నాడు. (యద్భావమ్ తత్భవతి). ఒకడు అమృతమును 'ఇది విషము' అను భావనచే భుజిస్తే అది అట్లే అనుభవమవగలదు.

'జ్వాలా తిమిరము' (కంటికి వచ్చే ఒకానొక జబ్బు)చే ఆకాశంలో వెంట్రుకలు ముత్యములు ఉన్నట్లు అగుపిస్తాయి. అట్టి రూపములెన్ని కనిపించినా వాస్తవానికి అవన్నీ ఆకాశము మాత్రమే కదా! ఈ జగత్తు స్ఫురిస్తున్నప్పటికీ వాస్తవానికి ఇది బ్రహ్మ సత్తయే అయి ఉన్నది. ఎందుచేత ఈ జగత్తు స్ఫురిస్తోందంటావా? చిత్స్వరూపమగు పరబ్రహ్మము తనయందు ఎందుకో ఒకప్పుడు మందప్రబోధయుక్తమై ఉంటోంది. అప్పుడు అది తనయందు 'దేహము – దేహి' మొదలైన జగత్స్వరూపములను గాంచుచున్నది. అది మరొకప్పుడు దృఢజ్ఞానయుక్తము కాగా, అప్పుడు తన పట్ల తానే పరమశాంతమగు కేవల శివరూపముగా భాసించుచున్నది.

శిఖిధ్వజుడు : ఓ దేవర్షీ! మీరు చెప్పేదంతా వింటుంటే నాకు "అహం – అనేది కూడా బ్రహ్మమేనా? ఎట్లా?" – అనే ప్రశ్న ఇంకా కొంత కొనసాగుచునే ఉన్నది.

కుంభఋషి : అట్టి నీ ప్రశ్న అనుచితమేనని చెప్పక తప్పదు. ఎందుకంటావేమో? ఏదైనా వాస్తవంగా ఉన్నదైతే, 'అది బ్రహ్మమా లేక మరొకటియా?' అనే ప్రశ్న – దానికి ఒక సమాధానం ఉండవచ్చునేమో! ఏ వస్తువైతే వాస్తవంగా విద్యమానమై లేదో, ఇకది "బ్రహ్మమా?కాదా?" అని అడగటమెందుకు? "కలలో సంపాదించిన ధనం ధనం కాదంటారా? ఎట్లా?"...అన్నట్లున్నది నీ ప్రశ్న.

ఏది విచారణ చేయగా 'అట్టిది లేనేలేదు!' అని నిరూపించబడుతోందో, అద్దాని లాభ నష్టముల గురించి, నిత్యానిత్యాదుల గురించి విచారణచే గాని, తరచి తరచి ప్రశ్నించటం చేతగాని ఏం ప్రయోజనం?

బంగారానికి 'దీని ఆకారం ఇట్టిది' అనునదేమీ ఉండక పోయినా.... సువర్ణం అన్న తరువాత... ఏదో ఒక ఆకారం ఉండి ఉంటుంది కదా! అట్లాగే 'జగత్తు – అహంభావాలు' ...అనేవి లేకపోతే 'ఏది బ్రహ్మం? ఏది కాదు?' అనే ప్రశ్నార్హత కూడా ఈశ్వరునియందు ఉండదు.

కారణము అనేది లేనందువలన జగత్తు యథార్థమునకు 'లేనిదే' అగుచున్నది. కాబట్టి బ్రహ్మమే జగద్రూపంగా, అహంరూపంగా విజృంభించుచున్నదగుచున్నది. అయితే, ఆ బ్రహ్మము తన స్వరూపం యొక్క 'పరిణామం' అనేది కించిత్తు కూడా గావించకయే, యథాతథంగా తాను ఉంటూనే... ఈ విధంగా జగద్రూపమున, అహం రూపమున ఉంటోంది.

దంపతులు కామప్రేరితులై యథాతథస్వరూపులై ఉంటూనే పుత్రుడు జన్మించటానికి కారణమగు చున్నట్లు 'మాయ' అను ఆవరణంతో కూడిన ఈశ్వరమయములగు ఈ సమస్త పదార్థాలూ ఆ ఈశ్వరుని ప్రేరణచే అనుభవానికి అర్హత పొందుచున్నాయి. అట్టి ప్రేరణ కొరకై ద్రష్ట – దృశ్యం అను రెండూ పరస్పరం ప్రేరితములై తత్ప్రయోజనంగా ఈ పంచభూతాత్మక సమూహమును, వాటి కార్యచమత్కారాన్ని గావించుచున్నాయి. అనగా చిన్మాత్రమే మాయాసమేత చిన్మాత్రము ద్వారా ఆయా వివిధ రూపములు ధరించి ఆయా కార్యాకార్యముల రూపమున పరిచ్ఛిన్నమై ఉంటోంది. చిన్మాత్రమే మాయా సమన్వితమై సృష్టి రూప చమత్కారంగా సాక్షాత్కారవైభవం ప్రదర్శిస్తోంది.

పూర్ణాత్ పూర్ణాన్యుద్ధరన్తి, పూర్ణాత్పూర్ణాని చక్రిరే
భవన్తి, పూర్ణాత్ పూర్ణాని పూర్ణమేవాఽవశిష్యతే ॥

పూర్ణరూపమగు బ్రహ్మము నుండి పూర్ణరూపములే అగు ఈ జగత్ – అహంకారాలు, వాటిని ధరించినట్లు కనిపించే ఈ జీవులు మాయచే ప్రకటితమగుచున్నారు. పూర్ణమునుండి బయల్వెడలినట్టి వాటి యొక్క క్రియాదుల చమత్కారములన్నీ పూర్ణములే.

ఈ జీవులంతా పూర్ణమునుండే బయలుదేరి, పూర్ణములోనే ఉంటూ, తిరిగి పూర్ణరూపులే అగుచున్నారు. మాయతో కూడుకున్నప్పుడు కూడా ఈ జీవుల రూపం బ్రహ్మమే! మాయావరణము తొలగినప్పుడు శేషించేదీ బ్రహ్మమే! చిన్మాత్రమగు ఆత్మయందు చిన్మాత్రరూపమగు జగత్తు స్ఫురిస్తోంది. యథార్థానికి బ్రహ్మము సృష్టిరూపరచనగా స్ఫురించకయే స్ఫురిస్తున్నట్లు తోచుచున్నది.

ఓ రాజర్షీ! మరల ప్రకటిస్తున్నాను. ఇక్కడ గానీ, మరెక్కడగానీ, చిన్మాత్రమగు ఆత్మయందు చిన్మాత్రమే స్ఫురిస్తోంది. ఆ స్ఫురణయే జగద్దృష్టికి జగత్తుగా ప్రసిద్ధమగుచున్నది. ప్రత్యగాత్మకమగు చైతన్యము తన యొక్క నిరామయ – తేజోమయ – ఆద్యంతరహిత చిత్స్వరూపమును ఏమాత్రం వదలకయే, సృష్ట్యాదియందు అనేక విధములైన మనోరూపములను పొంది వినోదిస్తోంది. పరమాత్మ తన యొక్క స్థూలరూపకల్పనచే ప్రకాశశీలుడై స్వయంగా విరాట్ స్వరూపమును (సమష్టి సృష్టికర్త స్వరూపం, సృష్టి ప్రజ్ఞా స్వరూపం) ధరిస్తున్నాడు. ఆ పరమాత్మయే మరల వ్యష్టిజీవభావముచే జగద్భ్రాంతికి కారణముగా అగుచున్నాడు. ఈ జగత్తును సత్యముగా చూచుచున్నాడు. మరొకప్పుడు పరమార్థదృష్టిచే దానిని సత్తుగా పరమాత్మరూపంగా గాంచుచున్నాడు. ఆతడే భావన యొక్క దార్ఢ్యములే చేత అండజ – స్వేదజ – బీజజాది చతుర్విధ ప్రాణుల రూపత్వమును, ఇటు దృశ్యరూపత్వమును క్షణంలో పొందుచున్నాడు.

'జగత్తు' అని పిలువబడే ఈ శాంతరూప బ్రహ్మము స్వభావముగానే నామరూపరహితమై అనిర్వచనీయమై ఒప్పుచున్నది. ప్రకాశరూపమై, అనుభవాత్మకమై, సదా – సర్వదా ఏకమైనట్టి పరబ్రహ్మము స్వమాయచే నిజచమత్కృతి ద్వారా అహంకార – జగత్తుల వలె దృశ్య – దర్శనరూపమై వెలయుచున్నది. ఉన్న సత్యమిదియే! తదితరమైనదంతా కల్పన మాత్రమే!

❖❖❖

32. భావనయొక్క అభావన

కుంభమహర్షి : ఓ రాజర్షీ! ఈ చమత్కారమంతా గమనిస్తున్నావు కదా! ఆకారరహితమైన బంగారం తన సువర్ణత్వం కోల్పోకుండానే దేశ – కాల పరిచ్ఛిన్నమగు ఆభరణముల రూపముగా అకారణంగా ఉంటోంది చూచావా? అట్లాగే పరమాత్మయందు నిష్కారణంగా ఈ జగత్తు జనింపజేయునది – జనించునది – సృష్టికర్త – సృష్టి అను భావక్రమంచే ఏర్పడి ఉంటోంది. ఆభరణమైనా, చతురస్రాకారమైనా, మరొక రూపమైనా బంగారం సర్వదా బంగారమే కదా!

పరమాత్మ నుండి ఏదీ ఉత్పన్నమవటం లేదు. మరేదీ లయించటం లేదు.

స్వసత్తాయాం స్థితం బ్రహ్మ నబీజం, న చ కారణం,
శుద్ధానుభవమాత్రం తత్ తస్మాత్ అన్యత్ న విద్యతే
కించిత్ జగదహన్తాది తదేవానన్తమస్తి హి ॥

బ్రహ్మము తన సత్తయందే తానున్నది. అది దేనికీ బీజము కాదు, కారణమూ కాదు. అది శుద్ధము, అనుభవమాత్రము అయి ఉన్నది. అది మరింకేమీ కాదు, అవదు. కనుక మరొక దేనితోనో దానిని ఎరగటమనేది లేదు. ఇక ఈ జగత్ – అహంభావాదులంటావా? ఇవేవీ ఎప్పుడూ లేవు. ఆ బ్రహ్మమే అనంతమై, సమస్తమై ఉన్నది.

శిఖిధ్వజుడు : హే మహర్షీ! 'ఆ పరమాత్మయందు జగత్తు – అహంకారము మొదలైనవి లేవు' అనే మీ నిర్ద్వంద్వమైన ప్రకటనను నేనిప్పుడు గ్రహించాను. అయితే, అసలీ సృష్టియొక్క జ్ఞానం ఎట్లా భాసిస్తోందో...... ఆ విషయం నాకు తెలియజేయండి. తద్వారా అజ్ఞానమును నిరోధిస్తాను.

కుంభఋషి : ప్రియమిత్రమా! శిఖిధ్వజా! ఏ అనాది అయిన అనంతమైన–సమస్తమైన–సర్వాధిష్ఠానమైన సన్మాత్రము ఈ సృష్టిని విస్తరింపజేస్తోందో... అదియే సృష్టిజ్ఞానముగా కూడా భాసిస్తోంది.

అందుచేతనే 1. అధ్వస్తములైనట్టి ఈ జగత్ అహంకారాదులు, 2. అధిష్ఠానమగు సచ్చిన్మాత్ర బ్రహ్మము... ఈ రెండు అభేదములైనవై ఉన్నాయి. ఇదంతా సచ్చిన్మాత్రమే అయి, జగత్తుగా భాసిస్తోంది. ఇక వేరు వేరు సిద్ధాంతములు కూడా ఉన్నాయి.

విజ్ఞానవాదులు = ఈ జగత్పదార్థములన్నీ విజ్ఞానము యొక్క పరిణామము మాత్రమే.

గౌతమవాదులు = బాహ్యములగు పంచభూతముల సత్తయే ఈ జగత్పదార్థములు.

గౌతములు = శూన్యం మాత్రమే ఉంది. అంతకుమించి ఏదీ లేదు. ఇతరమైనదంతా భ్రమయే.

...ఈ వాదాల అంతర్గతాన్వేషణచే 'బ్రహ్మమే ఇదంతా' అను ఉత్కృష్టానుభవమే సిద్ధించగలదు. ద్రష్టయే దృశ్యానుభవంగా ప్రతిబింబిస్తున్నాడనునది సూక్ష్మదృష్టికి ప్రస్ఫుటం కాగలదని గ్రహించు.

ఎవరైనా ఏదైనా సిద్ధాంతం ప్రతిపాదించవచ్చు గాక! సర్వవాదాలలోను అంతర్లీనమై ఉన్నది జ్ఞానమే కదా! జ్ఞానమే లేకపోతే వస్తు సాక్షాత్కారం ఎట్లా కలుగుతుంది? కాబట్టి జలమందు ద్రవత్వం లాగా సమస్త పదార్థములందూ ద్రష్ట యొక్క జ్ఞానమే విస్తరించి ఉన్నది. అట్టి జ్ఞానమునే 'చిన్మాత్రం' అని అంటున్నాం. ప్రతి అనుభవము వెనుక జ్ఞానం మూల పదార్థమై దాగియున్నది సుమా! చిత్తు జ్ఞానస్వరూపమే. ఇక 'చిత్తు జడజగద్రూపంగా భాసిస్తోంది' అనేది 'ముత్యపు చిప్పలో వెండి వెల్లివిరుస్తోంది' అను అనుభవంలాగా కారణరహితం, అనిర్వచనీయం కూడా!

ఆ చిన్మాత్రం సాత్త్విక భావాలలోనూ, దానికి విరుద్ధ భావాలలోనూ కూడా ప్రతిబింబిస్తోంది. పరస్పర వ్యతిరిక్త – అనుయుక్తములైన భావ–అభావాలలో ప్రత్యక్షమై ఉంటూనే మరొకవైపు ఆ భావాదులకు సంబంధించక తన అనంత చిన్మాత్రం కొనసాగిస్తూనే ఉంటోంది. అది ఇటు జగదాకారం గాను, అటు చిన్మాత్రరూపంగాను ఒకే సమయంలో ఏర్పడి ఉండగల సామర్థ్యం కలిగియే ఉంటోంది.

వాస్తవానికి మన స్వస్వరూపము ఒకప్పుడు తానెట్లు ఉన్నదో, ఇప్పుడు ఇంకొకప్పుడు ఇట్లే ఉండటం జరుగుచున్నదని గ్రహించుటచేతనే మోక్ష స్వరూపానుభవం లభ్యమగుచున్నది. 'చిత్' స్వరూపమునకు విరుద్ధములైన అసత్య - అస్వచ్ఛ భావములు అసత్యములు కాబట్టే అవి చిన్మాత్రమగు పరమ పదమునకు నిరోధములుగా ఉంటున్నాయి.

శిఖిధ్వజుడు : మహాత్మా! స్వచ్ఛమగు చిద్రూపమే అస్వచ్ఛమగు జగద్భావమునకు కారణమగుచున్నదని మనం అనుకొనవచ్చునా?

కుంభమహర్షి : అట్లా సిద్ధాంతీకరించటం ఎట్లా కుదురుతుంది? విజ్ఞుల అనుభవం, శ్రుతి-స్మృతి వాక్యములను అనుసరించి 'స్వస్వరూపమగు బ్రహ్మం చేష్టా-స్ఫురణ రహితము, అప్రతర్క్యము, అవిజ్ఞేయము, అప్రమేయము, అకర్తృత్వము' అని మనం వింటున్నాం. కాబట్టి బ్రహ్మము ఏ కారణమునకు, తనకుతానుగా కారణం కాదు. అనగా ఈ సృష్టికి బీజమే లేదు. అందుచేత ఈ సృష్టి కూడా యథార్థానికి లేనిదే అగుచున్నది. ఓ మహారాజా! ఈ సృష్టి అనబడునది 'చైతన్యము యొక్క ఒక అధ్యాస' అనటం తప్పించి దీనికి మరొక ఏ యుక్తి కూడా కుదరదు.

చిన్మాత్రమొక్కటే ఉన్నది. ఈ జడమైన సృష్టి కొంచెం కూడా లేదు. ఇక, అహంభావము - జగత్తు... అనబడేవేవైతే ఉన్నాయో, అవన్నీ కూడా చిన్మాత్రము ఆయా రూపములుగా స్వయముగా స్వయం శక్తిచే ఏర్పడే చమత్కృతి విన్యాసము మాత్రమే! జలము జరజర ప్రవహిస్తున్నప్పుడు ఏర్పడే మెలికలతో కూడిన ఆకారంలాగా చైతన్యము చైతన్యంగా ఉంటూనే ఒక సమయంలో స్వయంకల్పిత జగత్తును గాంచుచూ తన నిత్యత్వ - నిర్మలత్వ అప్రమేయత్వాదులను ఏమరుచుచున్నది.

శిఖిధ్వజుడు : దేవర్షీ! యాదృచ్ఛికవాదుల అభిప్రాయం అనుసరించి "ఈ జగత్తు యాదృచ్ఛికంగా, లేక, ఆకస్మికంగా ఉదయించింది" అని కదా! మరి ఆ వాదన విషయంలో మీ అభిప్రాయం ఏమిటి?

కుంభమహర్షి : 'యాదృచ్ఛికంగా ఎందుకు ఉదయించింది?'... అనే ప్రశ్నకు వారు సమాధానం అందించలేకపోతున్నారు. కారణం ఉంటే కదా, కార్యం ఉండేది? కారణం లేకుండానే కార్యము ఉన్నదంటే అది యుక్తియుక్తమెట్లా!

❖

ఓ శిఖిధ్వజ మహారాజా! ఆ పరమాత్మ ద్విత్వ - ఏకత్వాతీతుడై, కార్య కారణములకు సంబంధించిన సర్వభావముల రహితుడై ఉన్నాడు. ఇక ఈ ప్రపంచమున కంటికి తోచే జడాంశము సంగతేమింటంటావా? ఇది "ఆకాశంలో వికసించిన పుష్పం" అను మాటలాగా కల్పనా మాత్రమే! ఈ దృశ్యమంతా నశ్వర స్వభావము కలిగియున్నదవటం చేత ఈ జగత్తు ఆత్మను ఎరిగిన పండితుల దృష్టిచే సర్వదా లేనిదే... అని గ్రహించబడుతోంది. ద్రష్ట మాత్రమే ఉన్నాడు. ద్రష్ట జగత్తు కన్నా ముందే చిన్మాత్ర స్వరూపుడై ఉన్నాడు. ఆ చిన్మాత్ర స్వరూపుడు తన అనంత తత్త్వంలో ఒకానొక మూల జగత్తు అనబడు చమత్కారమును స్వయంగా ఎవరి ప్రమేయమూ లేకుండానే కలిగి ఉంటున్నాడు. అనంతమగు ఆకాశంలో ఒక చిన్న ప్రదేశంలో ప్రకాశమానమగు సూర్యబింబం, ఆ సూర్యబింబంచే

ప్రకాశించబడే చంద్రబింబం ఉన్నట్లు... నిత్య – అద్వితీయ – అఖండ స్వరూపమునందు కించిత్ ప్రదేశంలో ఈ దృశ్యవ్యవహారం ప్రతిబింబిస్తోంది. ఆకాశమును ఏ పదార్థమైనా సంకుచిత పరచ గలదా? ఏదైతే నీ వాస్తవతత్త్వము, లేక, స్వరూపము అయి ఉన్నదో... అద్దానిని ఈ ద్రష్ట – దృశ్య వ్యవహారములు ఎట్లా పరిమితపరుస్తాయని అనుకుంటున్నావో, నా కర్థం కావటం లేదు? చిద్రూపానికే 'నాశనం కలదు' అని నీవు అనదలచుకుంటే అద్దానిని జనింపజేసేది, నశింపజేసేది ఇంకొకటి ఉండాలి కదా, ఏది? చిత్తు యొక్క ఈ జన్మ – నాశనముల అనుభవం చిత్తుకే గాని మరెవ్వరికో కాదు కదా! మనం చిద్రూపం అని పిలిచేది అహంకార–జగదాదుల ఉనికి లేములకు కూడా సాక్షీభూతమై, అసంబంధితమై ఉంటున్న దానిని కదా! అహంకార – జగదాదులకు సంబంధించినది మాత్రమే. ఈ జన్మ మృత్యు కర్మ – అకర్మ, ధ్యాన – పరధ్యాన వ్యవహారాలు. మట్టికి – మట్టిబొమ్మకు ఆకాశంతో ఏం సంబంధమున్నది?

శిఖిధ్వజుడు : అవును! మీరు చెప్పేది అక్షరాలా నిజం. ఎద్దాని సమక్షంలో కారణకారణమే వాస్తవానికి అకారణమైయున్నదో, అట్టిచిదాకాశ స్వరూపుడనే నేను. మరొకటేదీ అవటానికే వీలులేదు. నా అనంత అప్రమేయ స్వరూపం యథాతథంగా ఎప్పటియట్లే ఏర్పడి ఉండగా నా యందు కల్పిత మాత్రమై ఈ శిఖిధ్వజ నామధేయం, దేహ, మహారాజాది ఆపాదిత విషయాలు, జన్మమృత్యు ఇత్యాది ప్రసంగాలు భ్రమ దృష్టి గలవానికి మాత్రమే దర్శనమౌతున్నాయి. అవన్నీ లేవు. అప్రమేయమగు చిన్మాత్రం మాత్రమే ఉన్నది. నా చిదాకాశ స్వరూపం మరింకొకటేదీ అగుటలేదు. సమస్తానికీ నేనే ఆదిని. నాకు ఎక్కడ ఏది అనిపిస్తోందో అదంతా నా యొక్క చిత్ ప్రకాశమునకు సంబంధించిన ఒకానొక కాంతిపుంజం మాత్రమే!

అయితే ఓ ఆత్మబంధూ! మన ఈ సంవాదము యొక్క ప్రాశస్త్యము కొరకు, మహనీయమగు మీ అమృతవాక్కులను గ్రోలటానికి మాత్రమే ఒక చిన్న ప్రశ్న మీ ముందు ఉంచుచున్నాను.

స్వభావవాదులు చిత్తు నిత్యము ఉత్పన్నమౌతోంది. నిత్యము నశిస్తోంది"... అని ప్రతిపాదిస్తు న్నారు కదా! ఈ విషయమై తమ అభిప్రాయం?

కుంభమహర్షి : వారు ప్రతిపాదించే స్వభావవాదం వేద వాక్యములకు సరిపోవుట లేదని నా అభిప్రాయం. 'ఆత్మ సర్వదా అఖండమై చిదేకరసరూపమై వెల్లివిరుస్తోంది' అని శ్రుతులు గానం చేస్తుంటే ఇక నీవు అనుమానం కలిగి ఉండవలసిన పనేమున్నది? ఈ ప్రపంచంలో ఈ అనేక పదార్థముల ప్రాప్తి రూపంగా ఏదైతే సంభవిస్తోందో, అట్టి అనుభవమంతా, ఈ దేహాదులతో సహా కేవలం చిత్తు యొక్క ఒకానొక చమత్కారం మాత్రమే.

చిత్తత్త్వమాత్ర సత్తాస్తి ద్విత్వం –ఐక్యంచ నాస్తి అలమ్,
అతః పదార్థ సత్తాయా అభావే సతి! భూపతే!

ఓ భూపతీ! కేవలం చిన్మాత్ర ఒక్కదానికే 'సత్త' ఉన్నది. ఇక ద్విత్వ ఏకత్వములంటావా, అవన్నీ ఎప్పుడూ లేవు.

యథార్థానికి పదార్థముల సత్త లేనే లేదు. 'పదార్థములకు సత్త ఉండటం అసంభవం' అను భావనను దృఢంగా ఆశ్రయించావా... అప్పుడు 'అహంభావం' కూడా తనంతట తానే రహితమై పోతుంది. ఇక అహంభావాన్ని జయించటానికి వేరే మరో ప్రయత్నం అవసరమే ఉండదు. అసంభవ భావనచే ఇక చిత్తుకు అన్యంగా చిత్తము అనునది ఎక్కడుంటుంది? చిత్తమే లేకపోతే జన్మ - మృత్యువుల అనుభవం ఎవరికి? ఈ దేహానుభవమే యోచన యొక్క మహాసముద్రంలో ఒక చిన్న తరంగము వంటిది అవుతుంది. నీవో, మహాసముద్ర స్వరూపుడవై ఉన్నావు.

ఈ విధంగా చిత్తము ఉండదు, అహంకారం ఉండదు, వాటి భిన్నత్వము ఉండదు. జీవ-బ్రహ్మ భేదం ఉండదు. చిత్-అచిత్ భేదం గాని, దృశ్యానుభవభేదం గాని ఉండజాలవు. కాబట్టి రాజా! ముదట వాసనారాహిత్యం అభ్యసించు. అంతే! ఇక శాంతమనస్కుడవై, మౌనివై, చిదాకాశమయుడవై ఆత్మమాత్రుడవై శేషించగలవు. "శుద్ధచైతన్యదృష్టి"ని అవలంబించటం చేత జడ పదార్థముల అభావం స్వయంగా సిద్ధించగలదు. అప్పుడు నీవు సదేహుడవైనా, విదేహుడవైనా, సమస్త పదార్థములందున్నను వాటి కంటే భిన్నంగా ఉన్నావు... అను ఒక నిశ్చలమైన కొండవలె, స్థిరంగా, శుద్ధాత్మ స్వరూపుడవై ఉండగలవు. అట్టి మోక్ష స్వరూపాన్ని నీవు ఆశ్రయించ వలసి ఉండగా, 'నాకు ఎప్పటికైనా మోక్షం లభించకూడదా?" అని ఎటో ఆకాశంలోకి చూస్తూ మీనమేషాలు లెక్కపెట్టుకోవటమేమిటో చెప్పు?

❖

"భావన యొక్క అభావన" అను చిన్న ప్రయత్నం చేత చిత్తంలోంచి అహంకారం శమిస్తుంది. వేదార్థము యొక్క భావన చేతను, విద్వాంసుల అనుభవమును విని హృదయస్థం చేయుటచేతను సత్య జ్ఞానానందమైన బ్రహ్మమే శేషిస్తోంది. అనుభూతమయ్యే బ్రహ్మమొక్కటే సత్యము. అట్టి స్వబోధచే చింతాది వృత్తులు తప్పక బాధితమౌతాయి. ఇక బ్రహ్మమునకు వ్యతిరిక్తమైనదంటూ ఏదీ మిగలదు. ఇకప్పుడు చింతలకు కారణం కనబడదు.

ఓ రాజా! మనం ఇప్పటిదాకా చెప్పుకున్న కారణాల చేత నీవు పదార్థ-దేహాదుల స్వరూపం అయి ఉండలేదు. నిర్మలమై, అకారణమై, సమస్తమునకు ఆదియై, ముక్తమై, నిత్యమై, అనేక రూపమై నప్పటికీ ఏకరూపమే అయి, శూన్యమై, నిరామయమై, అసత్పదార్థములన్నిటికీ అధిష్ఠానమై, సర్వజగద్రూపమై నప్పటికీ అవికారమై, శ్రుతులచే ప్రతిపాదించబడే ఏ బ్రహ్మం గలదో... అదే నీవై ఉన్నావు. "అది ఇంకా పొందవలసి ఉన్నదేమో?" అను నీ సంశయాన్ని ఇక త్యజించమని నా ప్రార్థన.

❖❖❖

33. చిత్తమనేది లేదు!

శిఖిధ్వజుడు : అందరి స్వస్వరూపం విషయమై దేవఋషియగు మీ నిర్వచనం అమోఘమని, తప్పకుండా యుక్తి యుక్తమని, పరమశ్రేయోదాయకమని నేను ఒప్పుకుంటున్నాను. మీరు నాకు చేస్తున్న మేలుకు మీకు ఎట్లా, ఏమిచ్చి కృతజ్ఞతలు చెప్పుకోవాలో నాకు తెలియటమే లేదు.

ఇదంతా, బ్రహ్మలోకం నుండి ఈ నారదపుత్రుల రూపంలో మా జనులందరిపై వర్షిస్తున్న బ్రహ్మానంద వర్షమని నాకు అనిపిస్తోంది.

హే దేవర్షీ! ఇంతవరకు బాధిస్తూ ఏమి చేయాలో తెలియని పరిస్థితులలోకి త్రోసివేసిన ఈ చిత్త–అహంకార–జగత్తులకు సంబంధించిన నా అవగాహనను మీరు పరమ పవిత్రం చేస్తున్నారు. హే మహానుభావా! ఈ చిత్తము గురించి మరికొన్ని విశేషాలు మీ దగ్గర నుండి వినాలని ఉన్నది. "చిత్తము లేదు" అని నిరూపిస్తూ ఏఏ యుక్తులు ఇంకా చెప్పబడినాయో, అవేమన్నా నా బోధ కొరకై విశదీకరించవలసినదిగా నా మనవి. అట్టి పూర్వోక్తమైన యుక్తులు క్లుప్తంగానో, విస్తారంగానో చెప్పమని పాదాక్రాంతుడనై వేడుకొనుచున్నాను. ఎందుకంటే చిత్తము యొక్క అభావమును నేను ఇంకా సంపాదించుకొనవలసియున్నదని అనుకుంటున్నాను.

కుంభమహర్షి :

> **చిత్తం నా స్త్యేవ, హే రాజన్! కదాచిత్, కించన, క్వచిత్!**
> **యచ్చే–దం చిత్తవత్ భాతి, తద్బ్రహ్మాభిదమవ్యయమ్ ॥**

హే రాజన్! నీకు ఇంకా సందేహం దేనికి? చిత్తము ఏ సమయంలోనూ లేదు. ఇక నీకు చిత్తమువలె భాసించేది ఏదైతే ఉన్నదో... అది స్వయముగా అవ్యయమగు బ్రహ్మమే అయున్నది. జ్ఞానము యొక్క బలిమిచే ఎప్పుడైతే జ్ఞేయ రూపమగు జగత్తే లేదని మనం అనుకున్నామో, ఇకప్పుడు 'నీవు – నేను' ...మొదలైన కల్పిత రూపములు ఎక్కడుంటాయి? ఎక్కడి నుండి వస్తాయి?

ఈ జగత్తు యథార్థానికి లేదయ్యా! ఈ వాక్యం చాలాసార్లు చెప్పుకున్నాం కదా! "ఇక్కడ ఏదైతే ఉదయిస్తున్నట్లు మనకు అనిపిస్తోందో, అదంతా బ్రహ్మమే" అను జ్ఞానం కలిగిన తరువాత ఇక ఎవనికి 'చిత్తము' అనబడేది గోచరిస్తుంది? ఏ స్థితిలో 'అంతయు బ్రహ్మమే' అని అనుభవమౌతోందో, అట్టి స్థితియందు ఇక ఎవడు దేనిని ఎఱుగుచున్నాడు

మహాప్రళయానంతరం సృష్ట్యాదియందు ఈ జగత్తు అనబడేది యథార్థానికి ఉత్పన్నమే కాలేదు. ఇక 'చిత్తము ఉదయించింది' అని శాస్త్రములు చెప్పటమంతా నిర్విషయమగు దానిని విషయభావనతో ఆశ్రయించినట్టి ఈ జీవుని అట్టి భావననుండి విరమింపజేయటానికి చెప్పు మధ్యేమార్గ పాఠం మాత్రమే. ఎందుకంటే, సృష్ట్యాదియందు చిత్తము అనబడేది ఆత్మకంటే వేరుగా రూపుదిద్దుకోవటానికి ఉపాదానకారణం ఎక్కడున్నది? లేదు. అందుచేత, మునుముందుగా ఆత్మ మాత్రమే ఉన్నట్లు ఇప్పుడు కూడా ఆత్మయే ఉన్నది. కారణరహితముగా ఆత్మమాత్రమే ఉన్నట్లు ఇప్పుడు కూడా ఆత్మయే ఉన్నది. కారణరహితమగు అజ్ఞానబుద్ధిగాని, చిత్తాత్మకమగు జగత్తు గాని ఆత్మనుండి వేరుగా జనించటానికి అవకాశమే లేదు. 'తస్మాత్ యదిదమాభాతి భాసనం బ్రహ్మనే–తరమ్', కనుక ఇక్కడ జగదాకారంగా భాసించేదంతా బ్రహ్మమే కాని, మరింకొకటేది కాదు.

శిఖిధ్వజుడు : హే మహాత్మా! నామరూపరహితుడగు పరమాత్మ గురించి వేదాదులు కొంచెం విరుద్ధమైన పదజాలంతో ఆయా చోట్ల వచించటం జరుగుతోంది.

1. సర్వభూతాంతరాత్ముడై ఒకే పరమాత్మ వెల్లివిరిసి ఉన్నాడు (ఏకో వశీ సర్వభూతాంతరాత్మా)

2. ఒకే రూపము అనేక విధములుగా చేస్తున్నాడు (ఏకం రూపం బహుధా యః కరోతి)

...ఈ వాక్యములు 'పరమాత్మయే ఈ సర్వము రచిస్తున్నాడు' అని చెప్పుచున్నాయి కదా! మరి మనం పరమాత్మ 'అకర్మ' అని 'అభోక్త' అని 'అప్రమేయుడు' అని ఎట్లా అనగలుగుతాం?

కుంభర్షి : నీవు చెప్పిన ఇత్యాది వాక్యాలన్నీ ఈశ్వరుని విషయంలో అర్థారూపవాదాలు మాత్రమే. ద్రష్ట యొక్క అనుభవ జ్ఞానం, నిర్ణయాత్మక స్వభావాన్ని అనుసరించి అవి ఆయా అర్థములను ప్రతిబింబించటం, అవి వాస్తవత్వానుభవమును కలుగజేయటం జరుగుతోంది. కారణరహితమగు ఆత్మ విషయంలో ఉత్తమార్థమును ప్రతిపాదించే 'నిష్కలమ్ - నిష్క్రియమ్' అని కూడా అవే శాస్త్రములు పదప్రయోగం చేశాయి కదా! కనుక "ఆత్మ ఆయా రూపములుగా పరిణమిస్తోంది" - అనునది విద్వదనుభవమునకు విరుద్ధములైనది. అంతేగాని, పరిణామము అనేది ఆత్మకు ఆపాదించ వీల్లేదు. ఇక 'నామరూపరహితుడు, ద్వంద్వ వర్జితుడు, శీత-వాతాది దోషరహితుడు, నిరాకారుడు అగు ఈశ్వరుడు ఈ జగత్తును రచించుచున్నాడు - ఇటువంటివన్నీ తాత్పర్యరహితమైన వాక్యాలు. అవి అర్థారోపవాదములు మాత్రమే! ఇంకా చెప్పాలంటే, అవి హాస్యాస్పదమైన వాక్యాలని అనక తప్పదు.

ఈ విధంగా ఎటుచూచినా కూడా చిత్తము అనేది లేదు. ఈ జగత్తే వాస్తవం కానప్పుడు ఇక ఇద్దానికి అంతర్గతమై ఉన్న చిత్తము మొదలైనవి ఎక్కడుంటాయి?

శిఖిధ్వజుడు: చిత్తము గురించి చాలా విశేషాలు మీరు చెప్పియే ఉన్నారు. అసలీ చిత్తము దేనిచే నిర్మించబడి సంసిద్ధమౌతోంది?

కుంభమహర్షి : చిత్తము వాసనల రూపమే అయి ఉన్నది. వాసనలకు విషయమగు ఈ జగత్తే లేదు - అని మనం అనుకున్నాం కదా! జగత్తుకే అస్తిత్వం లేకపోతే, ఇక చిత్తమునకు మాత్రం అస్తిత్వం ఎక్కడున్నది? ఎట్లా ఉంటుంది?

మాయా సమన్వితమైన బ్రహ్మము తనయందు తానే నిర్మించుకునే కల్పనలనే మనం 'చిత్తం - జగత్తు' అను పేర్లతో పిలుస్తున్నాం. నీవు ఒక కల గంటుంటే ఆ స్వప్నములోనిదంతా నీ ఊహే కాబట్టి, అందులో ఉన్నదంతా నీ స్వరూపం గాక, మరొకరి మరొక స్వరూపం నీ ఊహలోకి ఎట్లా వస్తుంది? అట్లాగే బ్రహ్మం యొక్క ఊహయే ఈ చిత్తు - జగదనుభవాలు కాబట్టి అవి రెండూ, తదితర అహంకారాదులు బ్రహ్మం కంటే వేరు అవటానికి వీలులేదు. ఆ బ్రహ్మం యొక్క అనుభవం మరొకరెవరో ఉద్దేశించినదను ప్రతిపాదనయే మిథ్య.

బ్రహ్మము కంటే వేరొక సత్త ఉంటే, లేక, నిరూపించగలిగితేనే, అట్టి ప్రతిపాదన యుక్తియుక్త మౌతుంది. లేకుంటే కాదు.

స్వప్నద్రష్ట సగం నిద్రలో తన అంతర్గత వాసనలను అనుసరించి ఊహానిర్మితంగా సుఖ దుఃఖాదులను, ఆశ్చర్యక - అసహ్యాది ఏవేవో వస్తు - జీవ - దృశ్యాదులను పొందుచున్నాడు కదా! అట్లాగే, వాసనలను అనుసరించి ఈ జాగృత్ ద్రష్ట కూడా సుఖ-దుఃఖాదులను, ఆశ్చర్యక-అసహ్యాది

విషయములను గాంచుచున్నాడు. ఉభయ ద్రష్టలు "మేము బాహ్యమున ఇవి పొందుచున్నాం" అనియే భ్రమిస్తున్నారు. వాసనా విషయకమగు ఈ జాగ్రత్ దృశ్య జగత్తు గాని, స్వప్న దృశ్య జగత్తు గాని అసలు ఉత్పన్నమే కాలేదు... అని నీవు నిస్సంకోచంగా గ్రహించి ఉండు. "అబ్బే! నాకు ఉత్పన్న మైనట్లు కనబడుతోంది!"... అంటావా? అది నీ బ్రాహ్మీస్వరూపమును ఏమరచినపుడు ఏర్పడి ఉన్న భ్రమ మాత్రమే"... అని మా అనుభవమును రంగరించి ప్రకటిస్తున్నాం. అందుకు అనుభవజ్ఞులమగు మేము, శాస్త్రకారుల ప్రవచనములు, శాస్త్ర వాక్యములే ప్రమాణం.

ఇక చిత్తము విషయానికి వస్తే దృశ్యము ఏ విధంగా ఉత్పన్నమే కాలేదని అనుకుంటున్నామో, అట్లాగే చిత్తము కూడా కారణము ఉండజాలనందువల్ల మొదలే ఉత్పన్నం కాలేదు.

భ్రమను వీడి బ్రహ్మమును ఎంత త్వరగా దర్శించటం ఆరంభిస్తే అంత మంచిది. పరమాకాశం (పరబ్రహ్మం) అను పేరుగల చిదాకాశం మాత్రమే విశాలరూపమున సర్వేసర్వత్రా అనుభవమౌతోంది. ఇక నీ జగత్తు అనేది ఎక్కడున్నది?

దర్పణంలో కనిపించేదంతా దర్పణం యొక్క విభాగమేగాని, దర్పణంలో దర్పణమునకు సంబంధించనిదేదో ప్రవేశించి ఆ దర్పణమును మరొక దానిగా పరిణమింపజేయటం లేదే!

అట్లాగే 'చిత్ స్వరూపము' అనే అద్దంలో అనిర్వచనీయ రూపముచే ఏ కొంచెము 'చిత్తము' అను పేరుతో పిలువబడుతూ భాసిస్తోందో... అదంతా చిదాకాశమే అయి ఉన్నదని మరొక్కసారి చేతులెత్తి ప్రకటిస్తున్నాను.

❖

ఓ రాజా! పునరావృత్తి దోషం అయినప్పటికీ నీ యొక్క ఆరూఢత కొరకు మరల మరల నేను ప్రకటించక తప్పదు. యథార్థానికి చిత్తము గాని, జగత్ అనబడు క్రియగాని ఈనాడు లేదు, ఎన్నడూ లేదు. భ్రమను వీడక, భ్రమలోనే ఉండదలచిన వారికి అవి ఉంటున్నాయి. నిన్ను నీవే యుక్తి యుక్త వాక్యబలాన్ని ఆశ్రయించి భ్రమ నుండి బయల్పెడలజేసుకోవాలి గాని "ఎవరో వస్తారు! ఎప్పుడో ఏదో అవుతుంది! అప్పుడు ఈ భ్రమ పోతుంది" అని తలస్తూ ఈ విధంగా అడవు లందో, ఆరామములందో సంచరిస్తూ జ్ఞాన సమాచారమును పొందక కేవలం కమండలమును ఆశ్రయించటమో, గడ్డములను పెంచటమో, దూరంగా ఎక్కడికో వెళ్ళటమో చేసినంత మాత్రాన ఏం ప్రయోజనం?

ఓ రాజా! "సర్వానర్థకారకమగు నేను, నీవు, జగత్తు, చిత్తము ...అను వ్యవహారమంతా వాస్తవం కాదు. "సాక్షియగు నా కిదంతా స్వప్నమువలె భాసిస్తోంది" అని నీవు శీఘ్రంగా గ్రహించి ఉండటం ఉచితం, ఆవశ్యకం కూడా!

ఈ జగత్తు వాసన యొక్క విషయభూతము మాత్రమే. వాసన యొక్క అభావనను ఆశ్రయించి చూడు. అప్పుడు వాసన లేనిదే అగుచున్నది. వాసనతో బాటు వాసనారూపమైన చిత్తము, చిత్తరూపమైన జగత్తు మటుమాయమౌతాయి. అప్పుడు చిదాకాశమే శేషిస్తుంది. అనగా, ఏది అజ్ఞాన సమయంలో

జగత్తు, వాడు, వీడు, నేను, నీవు, నా మతం, ఈ వర్గం, ఆ దేశం, ఈ రాజ్యం, ఈ అడవి – మొదలైన జగద్విషయాలు అనుభవమౌతున్నాయో... అవన్నీ లేవని, చిదాకాశమే ఉన్నదని, ఈ కనబడేవన్నీ చిదాకాశ ఆపాదితములనీ జ్ఞానదృష్టికి తేటతెల్లమౌతోంది. అజ్ఞానిగా ఉన్నంతకాలం నీవు ఈ భూ ప్రపంచంలోని ప్రతి కీకారణ్యంలోనూ వందల–వేల యేళ్ళ తరబడి తపస్సు చేసినా లాభం లేదు. అంతరంగసార దర్శనం అను జ్ఞానంచే కల కలగా, అసత్యం అసత్యంగా, కల్పితం కల్పితంగా, నిత్యమైనది నిత్యంగా ఎఱుగబడగలదు.

ఓ రాజా! మరొక్కసారి గుర్తు చేస్తున్నాను.

అప్రబుద్ధైః అవగతం చిత్తం దృశ్యమిదం జగత్,
అసచ్చిత్తం నిరాకారం పూర్వముత్పన్నమేవ నో ॥

అజ్ఞాన దృష్టికి ఏ చిత్తము – తద్వారా – జగత్తు – దృశ్యము మొదలైనవన్నీ అగుపిస్తున్నాయో అట్టి అసత్తైన, నిరాకారమైన చిత్తము మొదటే ఉత్పన్నం కాలేదు. స్వప్నానికి స్వప్నద్రష్టకన్నా వేరే కారణం లేనట్లే జగదనుభవమునకు జాగ్రత్ ద్రష్టకన్నా వేరే ఎవరూ కారణం కాదు.

కనుక,"కారణము యొక్క అభావముచే సృష్ట్యాదిలోనే ఈ జగత్తు ఉత్పన్నం కాలేదు. ఇదంతా చైతన్యము నందు స్వయంకృతమై జలతరంగంలాగా ఏర్పడిన చైతన్యరూపమే అయినట్టి జగద్భావన యొక్క మాహాత్మ్యం అనునది మాత్రమే ఉత్తమోత్తమమైన సత్యం.

"సాకారము, స్థూలము, ప్రతిఘాతయోగ్యము అగు ఆకృతి కలిగినట్టిది అయిన ఈ దృశ్య వస్తువు అనాదియు, స్థిరము, జన్మవికారసహితము"... అని అనటం ఉచితం కాదు. అది ఆత్మజ్ఞులు అనుభవమునకు అనుకూలంగా లేదు. "ద్రష్ట యొక్క కల్పనయే ఈ జగత్తు" అనటానికి ఒక దృష్టాంతం, "ఇదంతా ఎవరికి ఎట్టి చిత్తం ఉంటుందో వారికి తదనుసారమే అనుభవమవటం" అనునదే సుమా!

❖

అయితే, ఇక్కడొక చమత్కారం గమనార్హం. ఇక్కడ జగత్తు వికారాలైనట్టి ప్రళయ – మహాప్రళయాదులు ఉన్నాయని శాస్త్రములు ప్రవచిస్తున్నాయి కదా! అట్టి ప్రళయ – మహాప్రళయాదులు కారణ అభావం చేతనో, లేక శాస్త్రానుభవం చేతనో నిరాకరించటానికి వీలు ఎట్లా కుదురుతుంది? "శాస్త్ర, అనుభవ, వేదార్థ, సిద్ధాంతాలచే చెప్పబడే ప్రళయాలు లేవు" అని గాని, శాస్త్ర – వేదానుభవాలే లేవని అనటం నా ఉద్దేశం కాదు. ప్రత్యక్షంగా జరుగుచున్న దానిని లేవు అన్నంత మాత్రాన ఏం లాభం? మనం సంభాషించుకునేదంతా 1.లోకానుభవ ప్రమాణం, 2.శాస్త్ర ప్రమాణం, 3.వేద ప్రమాణం... ఈ మూడింటికి సరిపోవుచూ ఉండాల్సిందే! అట్లా కాకుండా కేవలం లోక ప్రమాణం మాత్రమే తీసుకుంటే అట్లు ప్రతిపాదించేది "పదార్థములు మాత్రమే ఉన్నాయి. ఇంకేమీ లేవు. ఇంక తెలుసుకోవలసినది మరింకేమీ లేదు" అనే చార్వాకసిద్ధాంతం కన్నా ఉన్నతమైనది కాదు. అట్టి వానిని సజ్జనులు ఆశ్రయించరు.

అందుచేత మనం ప్రతిపాదించే అకారణ సిద్ధాంతం (కారణమే లేదు కనుక చిత్త – జగత్తులు లేవు – అనే సిద్ధాంతం) కొన్ని వాక్య పరంపరగా సమీక్షిస్తాను.

1. జీవునకు సాకార – ప్రతిఘాతయోగ్యమైన ఈ దృశ్య జగత్తు అనుభవమౌతోంది.

2. ఈ వస్తువు జగత్తుకు ఒకప్పుడు ఉత్పత్తి ఉన్నట్లే మరొకప్పుడు వినాశనము (ప్రళయ – మహా ప్రళయములు) అనివార్యం.

3. ఇట్టి సాకార – ప్రతిఘాతయోగ్య దృశ్య జగత్తునకు కారణం నిరాకార – అప్రతిఘుతమైనట్టి బ్రహ్మము కాజాలదు.

4. పదార్థముల అనుభవం దృష్టిని బట్టి ఉంటోంది. దృష్టియే సృష్టి. దృష్టియే చిత్తము.

5. వ్యవహార దృష్టిచే సాకారము పొందుచున్న ఈ జగత్తు అట్టి వ్యవహారదృష్టికి మాత్రమే అర్థ క్రియా సామర్థ్యము కలిగి ఉంటోంది

6. పరమార్థమున బ్రాహ్మీదృష్టిచే (బ్రహ్మము యొక్క అఖండ – అప్రమేయ దృష్టిచే) ఈ జగత్తు నిత్యము అలక్ష్యమై, అవిషయమై ఉంటోంది.

❖

కాబట్టి మనందరి ఏ బ్రాహ్మీ స్వస్వరూపమున్నదో ...అది సర్వదా నిరంశమై, ప్రతిఘాతయోగ్య మగు రూపం లేనిదై, నిరాకారమై, పూర్వము కంటే కూడా పూర్వమై, పూర్ణ స్వభావ యుక్తమై, శాంతమై, చిదాకాశమై, సర్వత్రా వర్తించునదై, ఉన్నది. అట్టి బ్రహ్మం యొక్క సమమగు ఆత్మప్రకాశం అను నిజస్వరూపం స్వయంగా ఈ "ప్రళయ – మహా ప్రళయాలు" అను జగద్వికారాలను ధరిస్తోంది.

ఆత్మస్వరూపము – అజ్ఞానదశయందు క్షణకాలంలోనే జగద్రూపంగా భాసిస్తోంది. మరొక క్షణంలో అదే ఆత్మస్వరూపము "తత్త్వమసి" వంటి అఖండార్థప్రదమగు వాక్యములను ఆశ్రయించి తద్వారా తన యొక్క ద్వైతరహితమగు నిజబ్రహ్మరూపంగా ప్రకాశిస్తోంది. వీటినే మనం బంధము అని, మోక్షము అని శాస్త్ర రచన కొరకు చెప్పుకుంటున్నాం.

బ్రహ్మైవేదమతః సర్వం, క్వచిన్న జగదాది ధీః?
క్వాచిత్తాదిః? క్వచిత్తాదిః? క్వద్వైత్యైక్యాది కల్పనా?

శాస్త్రీయమగు బోధచే అంతయూ బ్రహ్మమే అగుచున్నది. ఇక ఈ జగదాదులకు సంబంధించిన బుద్ధి ఎచట? చిత్తాదులెచట? అచిత్తాదులు ఎచట? ద్వైత – ఐక్య కల్పనలు ఎక్కడున్నాయి? ఇట్లు జ్ఞానం కలుగగా, ఈ జగత్తంతాకూడా ప్రశాంత రూపమై, నిరాలంబమై, జన్మరహితమై, అనాది అయి, యథాస్థితమైనట్టి (ఎప్పటియట్లే ఉన్నట్టి) బ్రహ్మమే అగుచున్నది. కానీ, అజ్ఞానుల దృష్టికి మాత్రం ఈ జగత్తు, ఇందలి సారాసారములన్నీ కూడా అసత్తుగా బ్రహ్మమునకు వేరైనదిగా ఎరుగబడుట చేతనే అటు నానారూపాలుగాగాని ఇటు ఏకరూపంగా గానీ కాకుండానే ఉన్నాయి.

కాబట్టి ఓ ప్రియమిత్రమా! శిఖిధ్వజ మహారాజా! నీవు... వ్యవహార దృష్టిచే యథాప్రాప్తములైన వ్యవహారములను ఆచరించు. తత్త్వ దృష్టిచే కాష్ఠమౌనమును అవలంబించి ఉండు. ఈ వాక్ మొదలైన ఇంద్రియ వ్యాపారరహితుడవై, ప్రశాంత స్వరూపుడవై ఏర్పడి ఉండు.

❖❖❖

34. ఈ జగత్తే బ్రహ్మము

శిఖిధ్వజుడు: హే బ్రహ్మన్! నేను మీ రాకచే ఎంతటి ధన్యుడనైనాను!

నష్టో మోహః స్మృతిః లబ్ధా త్వత్ప్రసాదాత్, మహామునే!
స్థితోఽస్మి గత సందేహో విశ్రాంతమతిరాత్మవాన్ ॥

తమ అనుగ్రహం చేత నా అజ్ఞానం నశించింది. ఆత్మ స్వరూపం ఇప్పుడు స్మృతికి (జ్ఞాపకానికి) వచ్చింది. ఇప్పుడు సంశయరహితుడనై ఆత్మయందు అనిర్వచనీయమైన విశ్రాంతిని పొందుచున్నాను. ఏది తెలుసుకోవాలో... అది తెలుసుకున్నాను. మాయారూపమగు మహాసముద్రమును దాటివేశాను. నేనిప్పుడు మహామౌనినై పరమశాంతుడనై, అహంకారవర్జితుడనై, ఆత్మజ్ఞాన సంపన్నుడనై ఉన్నాను.

ఆహాఁ! ఇంతకాలం ఈ సంసారారణ్యంలో మార్గం తెలియక తిరిగి తిరిగి అలసిపోయానే! ఇప్పటికి మార్గం చూపించే మీరు అనేక జన్మల పుణ్యఫలంగా లభించారు. ఇప్పటికి దుఃఖరహితమైనట్టి అక్షయ స్థానమును పొందాను. మీరు చెప్పినట్లు అజ్ఞానదశలో తెలియవచ్చే అహంకార సహితమైన ఈ స్వర్గ – మర్త్య – పాతాళములనబడే మూడు లోకములు లేవు. ఏదేది ఎక్కడెక్కడ భాసిస్తోందో అదంతా బ్రహ్మముగానే ఎరుగుచున్నాను. 'అహంకారం' విషయమై మీరు చెప్పే యుక్తియుక్తమైన ఆప్తవాక్యాలు వింటుంటే 'బ్రహ్మానందం' అని శాస్త్రకారులు చెప్పే అనుభవం యొక్క ఔన్నత్యం నిజంగా ఇప్పుడు అవగతమౌతోంది. ఏ దేవతలు నా ప్రపత్తికి సంతసించి ఈ రోజు మీ వాక్యామృతాన్ని వినే అవకాశాన్ని ప్రసాదించారో, వారికి కృతజ్ఞతలు చెప్పటానికి నాకు మాటలు రావడం లేదు. మీ వాక్య బలంచే 'అహంకారం లేదు' అని గ్రహిస్తున్నాను. ఎంతటి ఆశ్చర్యం!

కుంభమహర్షి: ఔను నిజమే! ఈ జగత్తే లేకపోతే ఇక అహంకారం ఎట్లు ఎవరికి భాసిస్తుంది? మాంత్రికుని మాయాకల్పన వంటి ఈ జగత్తుకు ఎక్కడా కారణం లేదు. ఇది సత్యమెట్లా అవుతుంది? ఇది గ్రహించి నీవు యథాప్రాప్తములైన ఆయా వ్యవహారములను నిర్వర్తిస్తూనే మౌనివై శాంత మనస్కుడవై, ఆత్మ మననశీలుడవై ఉండు.

శాంతమగు సముద్రంలో శాంతమగు కెరటమువలె ఏర్పడి ఉండు. ఇదంతా కూడా యథాస్థిత మైనట్టి శాంతపరబ్రహ్మమే అయి ఉన్నది. ఇక నేను, ఇది, జగత్తు మొదలైన శబ్దార్థముల వాస్తవ స్వరూపం శూన్యమే సుమా! ఆత్మరూపమగు ఆద్యంత రహితమైన చిదాకాశమే తనయొక్క చిత్ (ఎఱుక) అను చమత్కారం చేత చాకచక్యంగా ఈ జగద్రూపమున ప్రకాశిస్తోంది. బంగారుగొలుసులో గొలుసు ఆకారాన్ని ప్రక్కకు పెట్టామనుకో, ఇక అందులో బంగారం కాక మరింకేమున్నది? అట్లాగే, ఈ జగత్తు యొక్క నామరూపాలు ప్రక్కకు పెట్టామా ...ఇక ఇదంతా బ్రహ్మం మాత్రంగానే మిగిలి ఉంటుంది.

"సమష్టి అహంకారాత్మకుడు" అయిన బ్రహ్మదేవుడు స్వయంగా సంకల్పమాత్రుడే కదా! అట్లాగే 'వ్యష్టి అహంకారాత్మకుడు' అగు ఈ జీవుడు కూడా స్వయంగా సంకల్పమాత్రుడే అయి ఉన్నాడు.

సంకల్పరూపమే ఈ జగత్తు. సంకల్పము వల్లే బంధం కలుగుతోంది. అహంకారం కూడా సంకల్పం యొక్క ఒక ప్రకటన మాత్రమే. సంకల్ప త్యాగమునందు మోక్షం వ్యవస్థితమై ఉంటోంది.

అహమిత్యేవ సంకల్పో బంధోయాతి వినాశినే
నాఽహమ్ ఇత్యేవ సంకల్పో మోక్షాయ విమలాత్మనే ॥

'ఈ దేహాదులే నేను' అను సంకల్పము జ్ఞాన వినాశనకరమగు బంధమును కలుగజేస్తోంది. "ఈ దేహాదులు నేను ఏ క్షణంలోనూ కాదు" అను సంకల్పం నిర్మలమగు మోక్షమును కలుగజేస్తోంది. ఆత్మ సర్వదా ఈ బంధ మోక్ష విపర్యయపదాలకు సంకల్పాది శబ్దార్థములకు సాక్షీభూతమై ఉన్నది. అట్టి ఆత్మ స్వరూపం యొక్క సాక్షాత్కారజ్ఞానమును 'సద్బ్రహ్మం' అని, 'కైవల్యం' అని చెప్పుచున్నారు.

భావనయే బంధ–మోక్షాలను నిర్ణయిస్తోంది. 'అహంభావన' అను అజ్ఞానం లేకపోతే మోక్షం. 'అహంభావన' అను అజ్ఞానం కలిగి ఉంటే బంధం. కాబట్టి మహారాజా! నీవు దేహాహంభావనను ఇప్పుడే ఇక్కడే నిస్సందేహంగా త్యజించు. "నేను సద్రూపుడను. అహంభావరహితుడను" అనే జ్ఞానాన్ని అత్యంత అవశ్యంగా శీఘ్రంగా ఆశ్రయించి తద్వారా 'శుద్ధాత్మబోధి'వి కమ్ము. నిస్సంకల్పం (లేక) సంకల్పరాహిత్యం అను చిన్న ప్రయత్నం నీకు సమ్యక్ జ్ఞానాన్ని అతి త్వరగా ప్రసాదించగలదు. అప్పుడు క్రమంగా నీ నుండి అసద్రూప సంకల్పం స్వయంగా తనంతట తానే నశిస్తుంది.

సర్వ తర్కములకు అతీతమైన (అప్రతర్క్యమైన) పరమాత్మయందు కారణత్వం ఎట్లా సంభవిస్తుంది? కారణమే ఉద్భవించజాలనప్పుడు కార్యరూపమగు ఈ పదార్థములు ఎట్లా ఉంటాయి? పదార్థముల అభావనచే ఇక దానిలో అహంభావం ఎన్నటికీ ఉదయించజాలదు. అహంభావమే ఉదయించకపోతే ఇక ఈ ప్రపంచం ఎవరికి ఉన్నట్లు? ప్రపంచం యొక్క అభావనచే సమస్తం కేవలం పరబ్రహ్మ మాత్రమై శేషించగలదు.

యదిదం భాసతే తత్సత్పరమేవాత్మని స్థితం
పరంపరే పరాపూర్ణం సమమేవ విజృంభతే ॥

జ్ఞాన సముపార్జనకు పూర్వం ఏదైతే జగత్తుగా భాసిస్తోందో, అదంతా జ్ఞాన సమన్వితుడవైన తరువాత ఆత్మప్రసరణ సమన్వితమై అనుభవమౌతోంది, పరమార్థమున చూస్తే, – "సద్రూపమగు పరమాత్మ తన ఆత్మయందు తానే సర్వదా సంస్థితమైయున్నది" – అని గ్రహించబడుచున్నది. సమస్వరూపమగు పరమాత్మయే సమస్వరూపమగు జగత్తును తన చిత్కళతో నింపివేసి అదే సమయంలో తన పరస్వభావమును యథాతథంగా కలిగియే ఉంటున్నాడని జ్ఞాని ఎరుగుచున్నాడు.

వజ్రం అంతరమున నిశ్చలంగా ఉన్నది. కాని బాహ్యమున ఆ వజ్రం యొక్క కాంతి ఆయా సమీప వస్తువులను ప్రకాశింపజేయుచున్నది. "పరమాత్మ" అను వజ్రమణి యొక్క కిరణసమూహ ప్రతిబింబాకారమే పరమాత్మయందు ప్రకటితమయ్యే జగత్తు – అని గ్రహించి ఉండు.

సంకల్పములన్నీ (లేక ఊహలన్నీ) నశించగా, ఇక సంకల్ప నిర్మిత నగరానికి (లేక, ఊహానిర్మిత నగరానికి) స్వరూపం ఏముంటుంది? ఆకాశము కంటేకూడా స్వచ్ఛమైన, సదసన్మయమైయున్న ఈ జగత్తు కూడా నిర్మల – నిర్విషయాకాశముగానే గ్రహించు.

వస్తువులు కదులుచున్నప్పటికీ, ఆ వస్తువులు ఏ వజ్రశిలయందు ప్రతిబింబిస్తున్నాయో అది నిశ్చలం కదా! ఈ జగత్తును ఎవడు శాంత మననరహిత - మౌనతత్త్వముగా గాంచుచున్నాడో అట్టి వాడు మాత్రమే దీనిని సరిగ్గా దర్శిస్తున్నవాడౌతాడు.

ఓ రాజా! నీయందు సమ్యక్ జ్ఞానోదయం అగుగాక! అప్పుడు బాహ్యరూపాలగు ఈ లోకాలు, ఆంతరికములైన మనో బుద్ధి అహంకారాలు ఇవన్నీ నిస్సారమని, నామమాత్రా వశిష్టములని ఎవరూ చెప్పకుండానే గ్రహిస్తావు. అట్టి స్థితినే విజ్ఞులు "మోక్షం" అనే పేరుతో పిలుస్తున్నారు.

❖

వాయువు చలిస్తోంది. అయితే చలనము లేకపోయినప్పుడు కూడా వాయువు ఉన్నది కదా! దీపం వెలిగిస్తే వెలుగు వస్తోంది. దీపం వెలిగించనప్పుడు ఆ కాంతి ఆకాశంలో దాగి ఉన్నది కదా! ఆభరణం యొక్క రూపం ధరించనప్పుడు కూడా బంగారం ఉన్నది కదా! అట్లాగే జగత్తు యొక్క సన్నివేశం లేకపోయినప్పుడు కూడా బ్రహ్మము ఉన్నది. బ్రహ్మమునకు 'లేకపోవడం' అనేది ఉండదు. జగత్తు యొక్క ఈ జగత్ ప్రత్యయాకారములు, ఇందులోని నామరూపాదులు, వీటి యొక్క కల్పనను ప్రదర్శించే మనోబుద్ధ్యాదులు - ఇవన్నీ మిథ్యాభాసములు మాత్రమే! అయితే, ఇవన్నీ బ్రహ్మమునందే ఉండి, బ్రహ్మము నందే ప్రతిబింబిస్తున్నాయి.

సముద్రంలో వేలాది తరంగాలు ఉండవచ్చు గాక! తరంగాలన్నిటిలో ఉన్నది జలమే కదా! జలాన్ని గ్రహించిన తరువాత తరంగాల యొక్క శబ్దార్థాలు ఎక్కడ మిగులుతాయి? అట్లాగే బ్రహ్మమున అనేక సృష్టులు ఉండవచ్చు గాక! అవన్నీ కూడా బ్రహ్మమును గ్రహించిన తరువాత అర్థరహితములగు శబ్దాదులకు కూడా అనర్హములు కాగలవు. వాస్తవానికి ఈ సృష్టి నుండి శబ్దార్థములను వేరు చేస్తే అప్పుడీ సృష్టియే బ్రహ్మము. బ్రహ్మమే సృష్టి. 'ఇదంతయు బ్రహ్మమే (సర్వం ఖల్విదంబ్రహ్మ)' అను శ్రుతి వాక్యము యొక్క అర్థం ఇదే కదా! 'బ్రహ్మము' అను శబ్దమునకు అర్థం 'వృద్ధి కలిగించునది' అని కదా! కనుక 'బ్రహ్మము' అను శబ్దమునందు సర్గము లేక సృష్టి అనే అర్థం కూడా ప్రతిక్షేపించబడియే ఉన్నది. అట్లాగే 'సర్గము' అను శబ్దమునకు అర్థము 'త్యాగము' అని కూడా కదా! కాబట్టి 'సర్గము' అను శబ్దంలో త్రివిధ పరిఛేదాత్యాగరూపములగు "త్యాగము (బ్రహ్మము)" అనే అర్థం సంక్షిప్త పరిచియే ఉన్నది. అనగా బ్రహ్మమునకు, సర్గమునకు ఉన్న అర్థం ఒక్కటే ఆగుచున్నది. ఇట్టు సృష్టియే బ్రహ్మము, బ్రహ్మమే సృష్టి అని గ్రహించు.

"సమస్త శబ్దములు, ఆ శబ్దముల అర్థములు, వాటి భావనలు, ఆ భావనల ఉదయము" ఇట్టి సర్వరూపంగా వర్తించే చిదాకాశమేదైతే ఉన్నదో అద్దానినే 'బ్రహ్మము' అని పిలుస్తున్నారు.

మనం సమ్యక్ దర్శనం సిద్ధింపజేసుకుంటే అప్పుడు జగత్తు - బ్రహ్మము అనబడు ఉభయ శబ్దముల వాచ్యార్థం నివృత్తమౌతుంది. అప్పుడు వాటి లక్షణావృత్తి శేషిస్తుంది. ఇకప్పుడు మిగిలేది అనుభవం మాత్రమే! అజరమై, అమరమై, శాంతమైనట్టి ఏ పరబ్రహ్మము కలదో - అద్దాని నుండి బ్రహ్మ-జగదాది వాక్కులన్నీ వెనుకకు మరలుతాయి. (యతో వాచోనివర్తంతే అప్రాప్యమనసా సహో

– తతోవాగ్వినివర్తతే). యథాస్థితమైన ఏ ఈ జగత్తేదైతే ఉన్నదో, ఇది అతి దృఢమగు శిలారూపము వంటిదై పరబ్రహ్మస్వరూపమే అయున్నది.

ఈ జగత్తును నీవు మార్చటమో, వదలటమో, పట్టుకోవటమో మోక్షం కాదు. దీని వాస్తవ స్వరూపం గ్రహించి ఉండటమే మోక్షమనబడుచున్నది.

సర్వాత్మక జ్ఞానముచే బ్రహ్మము శేషించగలదు. అజ్ఞానముచే ఒక జీవుడు సర్వాత్మక జ్ఞానము కలిగి ఉండకపోవచ్చు గాక! అయినప్పటికీ ఇక్కడ సర్వదా ఏకాత్మక స్వరూపమగు బ్రహ్మమే ఉన్నది. బ్రహ్మమే తాండవించుచున్నది. బ్రహ్మమునకు జగత్తుకు వేరు వేరు సత్త లేదు.

❖❖❖

35. దృశ్యము ద్రష్టను పరిమితం చేయలేదు

శిఖిధ్వజుడు : మీరు ఇంతవరకు ఒక నూతన సిద్ధాంతమును ప్రతిపాదిస్తున్నారు. 'బ్రహ్మమే జగత్తు, జగత్తే బ్రహ్మము' అని ప్రవచిస్తున్నారు. ఈ బ్రహ్మము – జగత్తులకు మీరు చెప్పినట్లు ఒకే సత్త ఉన్నట్లైతే – పరబ్రహ్మమునకు కారణము సత్యమైనది, జగద్రూపమునకు కార్యము సత్యమైనది – అని నేను అనుకుంటున్నాను. అట్టి "కార్య–కారణన్యాయం" అను అవగాహన యుక్తియుక్తమే నంటారా?

కుంభ మహర్షి : ఓ రాజర్షీ! బ్రహ్మము సర్వదా ఏకమే అయినప్పటికీ ఆశ్రితులగు శిష్యులను ఉద్ధరించే ఉద్దేశంతో మహనీయులగు ఆత్మజ్ఞులు బ్రహ్మమును రెండు విధములుగా విభాగించి చెప్పుచున్నారు– 1. మాయతో కూడినట్టి బ్రహ్మము. 2. నిష్కళంక బ్రహ్మము.

మాయతో కూడిన బ్రహ్మమునకు జగత్తు యొక్క కారణత్వం ఉన్నదని బోధకొరకై చెప్పుకోవచ్చు. కాబట్టి అద్దానికి 'జగత్తు' అనే కార్యము ఏర్పడి ఉంటోంది. కానీ నిర్గుణ – శుద్ధ బ్రహ్మమునకు కారణం లేదు. కారణం లేదు కాబట్టి కార్యము కూడా లేదు.

నేహా౽స్తి కారణం కించిత్ న చ కార్యం కదాచన ।
విద్యమానమిదం సర్వం సర్వం శాన్తమయం జగత్ ॥

నిర్విషయమగు బ్రహ్మమునకు కార్యము గాని, కారణం గానీ లేవని ఇతఃపూర్వమే అనుకున్నాం కదా! అయితే మాయాదృష్టిచే ఈ కార్య – కారణ వ్యవహారం స్వీకరించబడుతోంది. యథార్థానికి విద్యమానమై కనిపిస్తున్న ఈ జగత్తంతా శాంతము, అజము అయినట్టి బ్రహ్మమే అయిఉన్నది.

ఒక కారణం నుండి ఏది ఉత్పన్నమౌతుందో, అట్టి కార్యం ఆ కారణమును పోలియే ఉంటుంది. ఏది ఉత్పన్నమే కాలేదో, అద్దానియందు ఇక సాదృశభావమెచ్చట? "ఇక్కడ ఈ చెట్టు ఉన్నది చూచారా! దీనికి కొమ్మలు, ఆకులు అన్నీ ఉన్నాయి. అయితే దీనికి బీజము మాత్రమే లేదు" అనే వాక్యం నిరర్థకమే కదా! అట్లాగే తర్కములకు లభించనిది, నామరూపరహితమగు ఆత్మయందు నామ

రూపాత్మకమైన జగత్తు యొక్క బీజం ఉండటానికే వీలులేదు. బీజం లేదు కనుక జగత్తు కూడా నిర్హేతుకమనే చెప్పాలి. అయితే భావనామాత్రమగు ఆత్మయందు భావనాత్మక జగద్భావం ఏర్పడు తుంది. అట్టి దేశ – కాల – వస్తువశం చేత సమస్త కారణములు, ప్రమాణములు సిద్ధిస్తున్నాయి. అయినా అకర్త విభాగమగు బ్రహ్మం ప్రమాణానికి గానీ, కారణానికి గానీ విషయం ఎట్లా అవుతుంది?

బ్రహ్మైవ త్వం స్వరూపం సద్యత్ సిద్ధితం ధారయస్వ తత్,
అసమ్యక్ దర్శి విషయం తదేవ జగదాచితమ్

ఓ మహారాజా! నీ స్వరూపం బ్రహ్మం కానిదెప్పుడు చెప్పు? "సద్రూపమై శుద్ధాకాశం వలె నిర్విశేషమయినట్టి బ్రహ్మమే నేను" అను భావనను నీ హృదయంలో అవధరించు. అజ్ఞానుల దృష్టి యందు బ్రహ్మమే జగత్‌రూపంగా వ్యాప్తమైయున్నది.

1. ఏకమై, శాంతమై, అజరమై, చిన్మాత్రమైనట్టి "ప్రమ" (బ్రహ్మజ్ఞానం)చే జగత్తు బ్రహ్మ రూపంగా ప్రమాణితం ఒనర్చబడుచున్నది; 2. బ్రహ్మాకారవృత్తి రహితమైన ఈ మనస్సు యొక్క భ్రాంతిచే అశాంతంగా దర్శించబడే సద్‌బ్రహ్మం ఈ జగద్రూపంగా ఎఱుగబడుచున్నది... ఈ రెండు దృష్టులు ఇక్కడ ఉన్నాయి.

ఈ చిత్తం స్వయంగా 'అన్యథా' అను భావన ధరించుట చేతనే తాను ఏకమగు బ్రహ్మస్వరూపాన్ని ఏమరచి ఇక్కడ అనేకమును దర్శిస్తోంది. అయితే ఈ చిత్తమును నమ్ముకొని జగత్తులో అనేకములో ఎంతవెతికినా బ్రహ్మం అనుభవం కాదు. పైగా ఇది నాశనస్వభావం కలది. కనుక నాశనస్వభావం గల వస్తువులనే ఆశ్రయించి క్రింది – మీద అగుచున్నది. అదియే ఆత్మానుభవమునకు అడ్డంకి అయి కూర్చుంటోంది. క్షణకాలం ఆత్మస్వరూపం యొక్క విస్మరణమే ...కల్పకాలం వరకు 'చిత్తం' అను శబ్దంగా చెప్పబడుతోంది. కనుక ఇప్పుడు సమ్యక్ జ్ఞానం అత్యావశ్యకం.

సమ్యక్ జ్ఞానం వలన నిస్సంకల్పం లభించగలదు. నిస్సంకల్ప బలంచే అసత్యమయినట్టి సంకల్పరూప చిత్తం క్షయించి మోక్షం సిద్ధించగలదు.

విశ్వము - 'విశ్వము' అనే శబ్దానికి అర్థం? "ఏవమ్ విశతీతి విశ్వమ్ – ఏదైతే అధిష్ఠానమున ప్రవేశిస్తోందో, అదియే విశ్వము"...అని కదా! ఈ విశ్వము తనయొక్క అభావమును స్వీకరిస్తోంది. ఇక అది స్వయంగా విద్యమానమై ఎట్లా ఉండగలదు?

ఎవడైతే రెండు చేతులెత్తి "నేనొక పరమదరిద్రుడను" అని ప్రకటిస్తున్నాడో, అతడు దరిద్రుడు గానే ఉంటాడుగాని ధనికుడని ఎట్లా అనిపించుకుంటాడు? సన్నిపాత జ్వరముచే ఒకడు 'నేను చచ్చినట్లేరా నాయనోయ్!" అని గోలపెట్టుచుండగా అతడిక చచ్చినవాడే అవుతాడు గాని, జీవనము గురించిన అనుభవం కలవాడు కాదు కదా!

ఒకడు కొరివిని పట్టుకుని '8' అను ఆకారంలో త్రిప్పుతూ ఉంటే అక్కడ గాలిలో '8' ఆకారం ఏర్పడి ఉన్నట్లు కనబడుతుంది చూచావా? మృగతృష్ణలో జలం మిలమిలమెరుస్తూ ఉన్నట్లే అగుపడుతుంది కదా! బాలునికి గాలిలో దయ్యము ఉన్నట్లే అనిపిస్తుంది కదా!

అట్లాగే ఈ జగత్ – చిత్తాదులు భ్రమచే మాత్రమే ఉన్నట్లు అనిపిస్తున్నాయి. ఏది సర్వదా భ్రాంతి పుంజమే అయ్యున్నదో అది సత్యమెట్లా అవుతుంది? అజ్ఞానజనితమైన భ్రమయే 'అంతః కరణం, చిత్తము' మొదలైన శబ్దములచే ఉద్దేశించబడుచున్నది.

సత్తువలె ఉన్నట్టి అసత్తగు అజ్ఞానమే 'చిత్తము' అను శబ్దమునకు నిర్వచనం.

'అసంవేదనం అజ్ఞానం, జ్ఞానం సంవేదనం భవేత్' – బ్రహ్మం యొక్క అనుభవం లేకపోతే అజ్ఞానమని, అట్టి అనుభవం ఉంటే జ్ఞానమని చెప్పబడుతోంది. 'అజ్ఞానసత్త' యొక్క అజ్ఞానం జ్ఞానానుభవ మాత్రం చేత తప్పకుండా నశించగలదు. ఎండమావులలోని జలం భ్రమయే అయినట్లు ఆత్మకు వ్యతిరిక్తమైన అనుభవాలన్నీ భ్రమమాత్రమే! "ఎండమావులలో జలం ఉండదు" అను జ్ఞానంచే జల భ్రాంతి నశిస్తుంది కదా! "భ్రాంతి కాకుండా చిత్తమనేది ఉండదు" అను జ్ఞానముచే చిత్త భ్రాంతి తప్పక తొలగగలదు. అజ్ఞాన భ్రమచే త్రాడును చూచినప్పటి పాము యొక్క భ్రమ భావన – "ఇది త్రాడు మాత్రమే" అని ఎరిగిన తరువాత – ఇంకా ఉంటుందా?

అట్లాగే ఆత్మయందు ఉదితమైనట్లు కనబడే 'మనస్సు' అనబడేది 1. 'మనస్సనేది భ్రమయే' అను ఎరుకచే, 2. 'ఆత్మయొక్క స్వభావం' అను జ్ఞానముచే తప్పక రహితమౌతోంది.

శిఖిధ్వజుడు : ఆత్మ నిర్విషయము, అప్రమేయము కదా! మరి చిత్తము, మనస్సు మొదలైనవన్నీ అసలు ఎందుకుంటున్నాయి? ఎందుచేత ఏర్పడుచున్నాయి?

కుంభమహర్షి : హే శిఖిధ్వజా! ఈ ప్రశ్నకు మన ఈ సంవాదములో ఇప్పటికే సమాధానం చెప్పుకున్నాం? అయినా కూడా నీవు అదే ప్రశ్న ప్రశ్నించటం జరుగుచున్నది సుమా! సరే, మరల ముక్కుకు సూటిగా సమాధానం చెప్పుచున్నాను.

చిత్తము, మనస్సు, అహంకారము మొదలగు సమస్తమూ కూడా అజ్ఞానము వలననే ఉన్నట్లుగా అనుభూతమగుచున్నాయి. ఆత్మజ్ఞానముచే లేనివిగా తెలియవస్తున్నాయి.

ఆత్మ తనను తానే ఏమరిచి, వ్యవహారసత్తను ఆశ్రయించటమే మనోబుధ్యహంకారాదుల శబ్దములతో సూచించబడుతోంది. అంతకు మించి వాటికి వేరే రూపముగాని, ఉనికి గాని లేవు. యథార్థానికి ఈ ప్రపంచంలో చిత్తం లేదు. అహంకారం లేదు. మనస్సు లేదు. వాటికి విషయాలగు ఈ దేహాదులు లేవు. కేవలం శుద్ధమగు బ్రహ్మ సంవిత్తు మాత్రమే ఉన్నదని మరల ప్రకటిస్తున్నాను.

చిన్మాత్ర సంవిత్తు స్వయం కల్పితంగా, అనిర్వచనీయ కారణంగా అజ్ఞానయుక్తమై చిత్తమును ప్రదర్శిస్తోంది. అదియే జ్ఞానయుక్తమైనప్పుడు చిత్త సంబంధితమైన సంకల్పములను త్యజిస్తోంది. సంకల్పముల అభావముచే ఇక సమస్తం పరిత్యజించబడుతోంది. గాలి వీచుటచే అగ్నిలో జ్వాలలు ప్రకటనమౌతాయి. గాలి వీచటం ఆగిపోతే? అగ్నిజ్వాలలుకూడా ఉపశమిస్తాయి. సంకల్పములచే ఏది (చిత్తాదులు) ఉత్పన్నమగుచున్నదో, అది సంకల్పం యొక్క అభావంచే నశిస్తోంది. సముద్రమంతా జలం చేతనే ఆక్రమించబడుచున్నట్లు ఈ జగత్తంతా కూడా బ్రహ్మసత్త చేతనే, లేక ద్రష్ట యొక్క అనుభవసత్త చేతనే వ్యాపించబడియున్నది.

నాఽహమస్తి, నచాఅన్యోస్తి, న త్వం, నై తే, న చిత్తకమ్
నేఽన్ద్రియాణి, నచాకాశమ్ "ఆత్మా-ఆత్మైకోఽస్తి నిర్మలః"

ఓ రాజా! ఈ ప్రపంచమున నేనుగాని, మరొకరు గాని, నీవు గాని, ఈ చిత్తాదులు గాని, ఇంద్రియాలు గాని, ఆకాశాలు గాని లేవు. ఒకవేళ ఇవి అనుభవమౌతూ ఉంటే అది మాయతో కూడిన ఆత్మ యొక్క అభ్యాస చమత్కారం మాత్రమే. కేవలం నిర్మలమైన ఆత్మ మాత్రమే, త్రికాలాలలోను ఉన్నది. ఒక దేహి చూచేవాడు, వినేవాడు, ఆఘ్రాణించేవాడు మొదలైన ఆయా సర్వవిషయాలలోనూ ఏకస్థుడై ఉన్నట్లే - ఆత్మ సర్వవస్తు రూపంగా కనిపించుచున్నది. అటువంటివే చిత్తము, నేను, నీవు, జీవ, జాతి, దేవ, తిర్యక్, మానవాది విభాగములు కూడా!

న జాయతే న మ్రియతే కించిత్ అస్మిన్ జగత్త్రయే,
కేవలోఽయం "చిత్-ఉల్లాసః" సత్-అసత్ భావనాత్మనా ॥

ఈ మూడు లోకములలో ఏదీ మరణించటం లేదు. ఏదీ కూడా జన్మించటమూ లేదు. మరి? సత్ - అసత్ భావనా రూపమగు ఇదంతా కూడా కేవలం చైతన్యము యొక్క ఉల్లాసము-విలాసము మాత్రమే అయున్నది.

సర్వమాత్మా పరంబ్రహ్మ సకృత్ ప్రకటమాతతమ్
ద్విత్వ-ఏకత్వేన విద్యతే న భ్రాంతిః న చ సంభ్రమః ॥

పరబ్రహ్మమగు ఆత్మయే ఏకకాలమున సర్వరూపముగా ప్రకటనమగుచున్నది. ఇక ద్విత్వము గాని, ఏకత్వము గానీ, భ్రాంతిగాని, మరణాది భయములు గానీ ఏవీ కూడా లేవు. సఖుడా! శిఖిధ్వజా! నీవు ఈ సమస్త ఇంద్రియములలోను, ఈ ఇంద్రియములకు విషయములగు పంచభూత సమన్విత సృష్టి (లేక) దృశ్యములోను, సత్తామాత్రస్వరూపుడవై వ్యాపించి ఉన్నావు. సత్త స్వరూపుడవైన నీవు దేనిచేతా దహించబడజాలవు. నిన్ను లిప్తము చేయగలిగేదేదీ ఇక్కడ లేదు. ఎక్కడా లేదు.

న తే వినశ్యతి, సఖే! న చ కించిత్ వివర్ధతే ।
నిర్మలాకాశ రూపస్య కైవల్యానన్తరూపిణః ॥

ప్రియ సఖుడా! నీ వాస్తవ రూపం నిర్మాలాకాశము వంటిది. స్వతహాగానే అనంతము, మోక్ష రూపమూ అయి ఉన్నది. అట్టి నీ స్వస్వరూపం కించిత్ కూడా నశించదు, వృద్ధి చెందదు. నీయందు ప్రస్ఫుటమగుచున్న ఇచ్ఛ, అనిచ్ఛ, క్రియ మొదలైన శక్తులన్నీ - సూర్యకిరణములన్నీ సూర్యబింబమే అయినట్లు - నీవే అయి ఉన్నాయి.

కిరణములు లేకుండా సూర్యబింబం ఉంటుందా? సూర్య కిరణాలు ఏ వస్తువుపై ప్రసరించినా, ఆయా వస్తువులు సూర్యకిరణాలను గాని, కిరణ స్వరూపుడగు సూర్యభగవానుని గాని బంధించగలవా? అట్లాగే చిత్ స్వరూపుడవగు నిన్ను చిత్త విషయాలు ఎట్లా పరిమితం చేస్తాయి? ఎట్లా బంధిస్తాయి?

...సర్వ వ్యవహారముల కంటే మునుముందుగానే సిద్ధమై, జన్మ-జరా-మృత్యురహితమై, అనాది అయి, వృద్ధి - పరిణామాది వికారాలు లేనిదై, సదా నిర్మలమై, ప్రకాశరూపమై, సద్రూపమై,

ఏకమై, కల్పనారహితమై, సర్వదా, 'స్వస్వరూప పరిచయము' అనునది లీలగా కలిగినదై ... ఏదైతే ఉన్నదో అట్టిది ఆత్మయే అయి ఉన్నది. అట్టి ఆత్మయే నేను, నీవు, ఒక చీమ, దోమ కూడా. మనమెవరం ఎన్నడూ ఈ దేహ, మనో, బుద్ధి, చిత్త, అహంకారాదులు కానేకాము. అవము.

❖❖❖

36. తరంగాలన్నీ జలమే! చిత్తములన్నీ చిత్తే!

శ్రీవసిష్ఠ మహర్షి : వింటున్నావు కదా, రామచంద్రా! ఆ విధంగా శిఖిధ్వజుడు కుంభుని అకృత్రిమమగు వాక్యార్థములు విన్నాడు. ఆ వాక్యాలు ప్రతిపాదిస్తున్న తన యొక్క ఆత్మ స్వరూపాన్ని మననం చేస్తూ క్రమంగా తన పూర్వభావాలను, తత్సంబంధమైన సంశయాలను త్యజించాడు. "శాశ్వతం, నిర్మలం అగు ఆత్మయే నా స్వరూపం కదా!" అను దర్శనంచే కనులు మూసుకున్నాడు. మనస్సు, వాక్కు తమ వ్యాపారాలు ఉపశమింపజేసుకున్నాయి. అతడు శిలయందు చెక్కబడిన ఒక విగ్రహంలాగా చేష్టా రహితుడైనాడు. ఒక ముహూర్తకాలం నిర్విషయ స్వయమాత్మానుభవం పొంది అప్పుడు కళ్ళు తెరిచాడు.

❖

కుంభఋషి: ఓ రాజా! యోగుల విశ్రాంతి స్థానము, మహత్తరము, శుద్ధము, వ్యాపకము, నిర్మలము, నిర్వికల్పము అగు సమాధియందు ప్రవేశించినట్లున్నావు. నిరతిశయానందదాయకమగు ఆత్మపదము నందు నీకు విశ్రాంతి లభించింది కదా? నీ అంతఃకరణం ప్రబోధమైనదా? భ్రాంతులను వదలివేశావు కదా? ఏది 'జ్ఞేయము' అని వేదాంత ప్రవచనాలు నిర్వచిస్తున్నాయో, అద్దానిని తెలుసుకున్నావు కదా! చూడవలసినది చూచావు కదా?

శిఖిధ్వజుడు : హే మహాత్మా! తమ అనుగ్రహం చేత మహావిభవరూపమగు భూమికను పొందాను. మహత్తరమైన ఆత్మ పదమును నాయందే దర్శించాను. విషయానందము నుండి బ్రహ్మదేవుని ఆనందము వరకు గల సర్వానందముల ఆవల స్థితిని పొందాను.

ఆహాఁ! ఈనాడెంత సుదినం! వేద్య పదార్థమును ఎఱిగిన తమతో సాంగత్యం మహత్తరమై లభించింది. నాకీనాడు అపూర్వము, అమృతమయము, సారయుక్తము అయినట్టి ఫలం మీరు ప్రసాదించడం జరిగింది. ఏ అమృతతత్త్వమైతే నేను నా జీవితపర్యంతం ఇప్పటి వరకూ త్రాగకయే ఉన్నానో, అయ్యది మీ వాక్యములను విన్నంత మాత్రం చేత స్వయంగా లభించింది. ఒక చిన్న విషయం మాత్రం నాకు చమత్కారంగా అనిపిస్తోంది. అనేక సందర్భాలలో ఆత్మ గురించి విజ్ఞులు చెప్పిన విషయాలను విన్నాను. అయినా కూడా, "అనంతము, ఆద్యము, అమృత స్వరూపము అయిన ఆత్మపదము యొక్క అనుభవం ఈనాడే లభించింది. మరి, ఇతఃపూర్వమే ఎందుకు లభించలేదా?'... అని కించిత్ ఆశ్చర్యంగా ఉన్నది.

కుంభఋషి : ఓ రాజా! దానికి కారణం నీ మనస్సు శమించటమే. ఈషణములు (ఈషణత్రయం) దారేషణ, పుత్రేషణ, ధనేషణ – అనే కషాయములు నివృత్తమైనాయి. తెల్లని, శుభ్రంగా ఉతికిన

వస్త్రంపై రంగు చక్కగా అంటుతుంది. మురికి గుడ్డపై రంగు అంటదు కదా! చిత్తము నిర్మలమైనప్పుడు మాత్రమే గురూపదేశ వాక్యములు అందులో ప్రవేశిస్తాయి. చిత్తము నిండా అనేక దోషములు ఉంటే, లౌకిక వాక్యముల పట్లే ఆ చిత్తము స్పందిస్తుందిగాని, ఆత్మ నిర్వచన పూర్వకమగు శాస్త్ర వాక్యములు ఆస్వాదించటానికి అట్టి చిత్తము సిద్ధమయి ఉండదు. అనేక జన్మలందు స్వయంగా ఆశ్రయిస్తూ ప్రోగుచేసుకొన్న స్వవాసనా స్వరూపములైన దోషములు దృష్టిని కలుషితం చేసి ఉంచాయి. నీవు చేసిన సాధనకు ప్రయోజనంగా, చెట్టునుంచి పరిపక్వమైన పళ్ళు నేలకు రాలినట్లు, లింగదేహం నుండి రాగద్వేషాది కషాయాలు, పాపభావనలు పూర్తిగా శమించాయి. ప్రవేశించిన గురు వాక్యములు మహత్తరమైన ప్రభావమును కలిగించాయి. తపస్సుచే నీ హృదయం నిర్మలత్వం సంతరించుకొన్నది కాబట్టే ఆకాశమున సంచరిస్తున్న నాకు నిన్ను సమీపించి జ్ఞాన విశేషాలు బోధించాలనే సంకల్పం కలిగింది. ఫలితంగా నీ యందు గల అజ్ఞానపూర్వకమైన అవగాహనలు శమించటం జరిగింది. జ్ఞాన పూర్వకమైన ప్రసంగములు రుచించాయి. ఉపదేశించిన అర్థములను ఇప్పటికిప్పుడే నీవు హృదయమున అవధరించావు. ఆత్మసాక్షాత్కార రూప జ్ఞానము యొక్క ప్రభావముచే ముక్తుడవైనావు. 'సత్సంగము' అను మిషచే నేడు నీ యొక్క సమస్త శుభాశుభ కర్మలు సంక్షయించాయి.

'చూచావా రాజా! ఈ రోజు మధ్యాహ్నం నేను నీ ముందుకు వచ్చేటప్పటికి నీ యందు చిత్తం, అహంకారం, మమకారం మొదలైన వాటితో కూడిన అజ్ఞానసత్త ఏర్పడి ఉన్నది. ఆ తరువాత నా వాక్యాల బోధచే నీ హృదయం ఆ అజ్ఞాన సత్తను త్యజించింది. చిత్తము క్షయం పొందగా, ఇక నీవు ప్రబుద్ధుడవైనావు. ఆత్మజ్ఞానము నీ యందు ప్రకాశమానమై కాంతి పుంజములను వెదజల్లుచున్నది.

ప్రియశిఖిధ్వజా! హృదయంలో ఎంతవరకు మనస్సు యొక్క సత్త ఉంటుందో, అంతవరకు అజ్ఞానం యొక్క స్థితి ఉండియే తీరుతుంది. చిత్తము చిత్తరూపాన్ని త్యజించిన మరుక్షణం జ్ఞానోదయం అవుతుంది. అసలు 'చిత్తము' అనగా ఏమిటి?

ద్విత్వ-ఏకత్వదృశౌ చిత్తం తదేవ అజ్ఞానముచ్యతే
ఏతయోర్ద్యో లయో దృష్టేస్తజ్జ్ఞానం సా పరా గతిః ॥

ద్విత్వ – ఏకత్వముల దృష్టియే చిత్తం. దానినే 'అజ్ఞానం' అని కూడా అంటున్నాం. పరమాత్మ సాక్షాత్కారం చేత ఈ ద్విత్వ – ఏకత్వములు రెండూ నశిస్తాయి. అట్టి నాశనమునే 'జ్ఞానము' అని, 'పరాగతి' అని పిలుస్తూ ఉంటారు.

ఓ రాజా! ఇప్పుడు నిన్ను చూస్తుంటే నాకు పరమ సంతోషంగా ఉన్నది. నీవు ప్రబుద్ధుడవు. విముక్తుడవు అయ్యావు. చిత్తం చేతనే అసత్ దృశం, సత్-అసత్‌మయము అగు జగత్తు యొక్క కల్పన ధరించబడుతోంది కదా! అట్టి చిత్తమును నీవు త్యజించావు. ఇక నీవు దుఃఖరహితుడవు, ఆయాస వర్జితుడవై ఉండుము. నిస్సంగిగా ఈ జగత్తులో తీర్థయాత్రాస్థలంతో సంచరిస్తున్నట్లు వ్యవహరించెదవు గాక! అద్వైతాత్మజ్ఞాన సంపన్నుడవై, మహోదయయుక్తుడవై మునివై, మౌనివై, నిర్మలమగు ఆత్మ స్వరూపమున స్థితి కలిగి ఉండు.

శిఖిధ్వజుడు : మహాత్మా! మీరు చెప్పినట్లు చిత్తభూమి మూర్ఖుని కొరకే రచించబడి ఉంటోంది. అయితే ఒక్క విషయం మిమ్ములను అడగాలని అనుకుంటున్నాను. ప్రబుద్ధుడు ఆత్మజ్ఞాని అయినవానికి చిత్తమే ఉండదు కదా! మరి అమనస్కులై కూడా మీ వంటి జీవన్ముక్తులు ఈ ప్రపంచంలో ఎట్లా వ్యవహరిస్తున్నారు? మనోరహితులై కూడా మనో విషయములగు లౌకిక కార్యములు ఎట్లా నిర్వర్తిస్తూ ఉంటారో వివరించ ప్రార్థన. ఈ విషయంలో నాకు కొన్ని దురభిప్రాయములే ఉన్నాయని నా కనిపిస్తోంది. అట్టి వాటిని మీ బోధ తుడిచివేయగలదనే ఉద్దేశంతో మిమ్ములను అర్థిస్తున్నాను.

కుంభ మహర్షి: ఔను! నీవు అన్నది నిజమే.

శిలలు ఎక్కడన్నా మొలకెలెత్తుతాయా? జీవన్ముక్తులయందు చిత్తమే ఉండదు. అయితే, 'చిత్తము' అంటే ఏమిటి? ఏ ఘనీభూతమైన వాసనలు మరల మరల ఉత్పన్నమయ్యే స్వభావం కలిగి ఉంటాయో, అది 'చిత్తము' అను శబ్దముచే చెప్పబడుతోంది. జ్ఞానికి అట్టిది ఉండదు.

జనులు ఏఏ వాసనలతో గూడి ఈ సంసారములో మరల మరల ప్రవేశిస్తున్నారో, అద్దానిని చిత్తము అంటున్నారు కదా! ఇక జ్ఞానులలో వాసనలు జగత్క్రియ నిర్వహణము వరకే కార్యక్రమము కలిగి ఉంటాయి. అవి పునఃపునః జనించే శక్తిని, స్వభావమును కలిగి ఉండవు. అందుచేత జ్ఞానియొక్క వ్యావహారిక చిత్తమును "సత్వము" అను పేరుతో పిలుస్తారు. జీవన్ముక్తులు, జితేంద్రియులు అగు మహాత్ములు సత్వము నందు ఉనికిని కలిగి ఉంటారు గాని చిత్తము నందు కాదు.

కనుక, మూఢ చిత్తమే, చిత్తము అని అనిపించుకుంటోంది. జ్ఞానయుక్తమగు చిత్తము సత్వము అవుతుంది. అజ్ఞానులకు చిత్తము ఉనికి స్థానమైతే, జ్ఞానులకు సత్వమే సర్వానుకూల స్థానం అవుతోంది.

భూయః ప్రజాయతే చిత్తం, సత్వం భుయో న జాయతే
అప్రబుద్ధస్య బంధోస్తి, న ప్రబుద్ధస్య, భూపతే!

చూచావా రాజా! మూఢత్వంతో కూడిన సంస్కారాలు లేక వాసనలు గల చిత్తమునే 'చిత్తం' అని అంటున్నారు గాని, జ్ఞానంతో కూడిన చిత్తమును 'చిత్తం' అనరు. అది 'సత్వం' అవుతుంది. సత్వం కూడా చిత్తం వలెనే ప్రవాహ పతిత వ్యవహార సామర్థ్యం కలిగియున్నప్పటికీ అద్దానిలో పునర్జన్మ యోగ్యత ఉండదు. "ఇది పొందుతాను, దీని తరువాత అది చేస్తాను. ఆ తరువాత ఇక చూచుకో, నేను ఇట్లా ఉండను, ఇకప్పుడు నాకేం!"... చిత్తం యొక్క క్రియా విషయాల స్వభావం ఇట్లా ఉంటుంది.

ఇక సత్వము యొక్క క్రియలో... నిత్యజాగరూకమై, నిత్య ప్రశాంత – సంతృప్త సమన్వితమై, అసంతృప్తి – ఆశాదులకు కారణమే కలిగి ఉండక ఉంటుంది. అది తాను అకర్తవ్య స్వరూపమై అవశ్యమైన దానిని స్వభావయుతంగా నిర్వర్తిస్తుంది.

చిత్తము ప్రతిఫలం వైపు ఉన్ముఖమై ఉంటుంది. సత్వము యొక్క స్వరూపమే సమాధాన స్థితి కనుక కర్మల సిద్ధాసిద్ధములపై అద్దాని సమస్థితి ఆధారపడి ఉండదు.

ఓ రాజా! ఈ జగత్తులో అప్రబుద్ధుడు మాత్రమే బంధమును గాంచుచున్నాడు. ప్రబుద్ధుడు సర్వదా నిర్వికారుడై, సత్వమునందు ఏర్పడి ఉండి, ప్రక్కింటివారి ఇంటిలో జరిగే వివాహాది

కార్యక్రమాలకు సహకరించే సద్గుణుడగు గృహస్థుని వలె ఈ జగత్తులో సర్వకార్యములు నెరవేరుస్తున్నాడు. కాబట్టి అజ్ఞానికి బంధముంటోంది. జ్ఞానికి బంధమునకు కారణమే అగుపించటం లేదు. చిత్తము మరల మరల ఉత్పన్నమౌతూ ఉంటుంది. సత్వము సర్వదా యథాతథంగా ఉంటుంది. అద్దాని మార్పు చేర్పులకు కారణముండజాలదు.

ఓ ప్రియా సఖుడవగు శిఖిధ్వజ మహారాజా! నీవు సత్వమయుడవై, మహాత్యాగివై ఉండుము. ఎందుకంటే, నీవు చేసిన ఆయా ప్రయత్నముల బలంతో చిత్తమును జయించివేశావని నాకు తెలుసు. నీవిప్పుడు వాసనలన్నీ త్యజించినవాడవై శోభిస్తున్నావు. నీ మనస్సు ఇప్పుడు నిర్మలాకాశముతో సామ్యము పొందుచున్నదని నేను గమనిస్తూనే ఉన్నాను. ఏది తదితరమైనట్టి సర్వరూపమై ఉన్నదో అట్టి చిత్తమును త్యజించుటచేతనే నీవు మహాత్యాగిని అగుచున్నావు. నీ విప్పుడు సమస్థితిని, ఉత్తమశమమును పొందుచున్నావు.

ఇప్పటికే నీవు రాజ్యాదులను, ధనాదులను, తపో – దాన ఫలాదులను, స్వర్గ – మోక్షములను ప్రబుద్ధమైన మేధాశక్తితోడను, పరమ జ్ఞానయుక్తమైన బుద్ధితోడను త్యజించివేశావు.

❖

తపో నామ క్రియన్ మ అత్ర దుఃఖ క్షయకరంభవేత్
క్షయాతిశయ నిర్ముక్తం యత్సుఖం సమతామయమ్ ॥

ఓ రాజా! వాస్తవానికి తపస్సు మొదలైనవి స్వయంగా దుఃఖమును క్షయింపజేయలేవు. అవి నీ మనో నైర్మల్యమునకు ఉపకరించే సాధనలు మాత్రమే. మనస్సు నిర్మలమైనప్పుడు జ్ఞానము ప్రవేశించుటచే ఏర్పడిన అవగాహన చేతనే దుఃఖములు క్షయించి, స్వభావసిద్ధమగు ఆనందము వెల్లివిరుస్తుంది. ఆనంద ప్రదమగు ఆత్మయే నీవై ఉండగా, నీకు ఆనందం ఇచ్చుటకై మరొక వస్తువు గాని, విషయం గాని ఎందుకు అగత్యమౌతాయి చెప్పు? మరి "ఏదో లభిస్తేగాని నా ఆనందం రూపు దిద్దుకోదు"... అని ఎందుకు అనిపిస్తోంది? అది మనస్సు చేసే కోతిపని. సమత్వమును సాధించామా, అప్పుడు మనస్సు త్యజించబడినది అయినట్లే, మనోత్యాగరూపమగు సమత్వముచే 'జ్ఞానము' అనే ఫలం ప్రత్యక్షంగా లభించగలదు. అట్టి జ్ఞానం యొక్క సమృద్ధిచే ఆత్మసుఖం అనుభవమౌతుంది. ఆత్మసుఖం సంపాదించుకున్న ద్రష్టకు క్షయ – అతిశయాలు (హాని – వృద్ధులు) ఉండవు. జ్ఞానముచే ఉత్పన్నమైన ఫలమే సత్యవస్తువు అయి ఉన్నది. అంతేగాని తపస్సు మొదలైన వాటిచే వచ్చే ఫలములు స్వయంగా సత్యవస్తువులు కావు. తపోయాగాదుల వలన స్వర్గలోకాదుల వంటి కొంత సుఖమయ ప్రయోజనములు కలుగవచ్చుగాక! ఆ ప్రయత్నములు జ్ఞాన దిశగా సంధించబడకపోతే ఉత్తమ ప్రయోజనం పొందనట్లే. తపో–యజ్ఞ–దాన, తదితర ఆచారాదులు మనస్సు యొక్క త్యాగం వైపుగా, జ్ఞాన సముపార్జనాలక్ష్యంతో నిర్వర్తించటమే ఉచితం. ఎందుకంటే స్వర్గాదిఫలాలు కూడా క్షణ భంగురాలే. వాటికి కూడా ఉత్పత్తి, నాశనములు ఉన్నాయి. అవన్నీ వర్తమానమునందు మాత్రమే అనుభూత సుఖమును ఇస్తాయేమోగాని, భవిష్యత్తును సానుకూల్యం చేయజాలవు సుమా!

స్వర్గో నామ కిమానందః? సోఽపి సందేహ సంస్థితః ।
అప్రాప్తస్వాత్మ సంసిద్ధేః క్రియాకాండః న శుభోభవేత్ ॥

ఆత్మజ్ఞానానందం ముందు స్వర్గాదులవి అత్యంత స్వల్పానందాలు మాత్రమే! ఎందుకంటే అట్టి స్వర్గానందాలు కూడా అనేక అపరాధములతో కూడి కాలక్రమేణా నశించునవై, సందేహాస్పదంగానే ఉంటున్నాయి. ఇక క్రియాకాండ అంటావా? అదంతా ఆత్మజ్ఞాన ప్రాప్తికి ముందు మాత్రమే శుభప్రదం. ఆ తరువాత వాటికి ప్రాముఖ్యమే లేదు. ఎవడికి ఇంకా బంగారం లభించలేదో, అతడే ఇత్తడి వస్తువులను కలిగి ఉంటాడు. బంగారపు వస్తువులు లభించిన తరువాత ఇత్తడి ముక్కలను జాగ్రత్త పరచుకోవలసిన పనేముంటుంది?

జ్ఞానియగు నీ ప్రియురాలు చూడాల సాంగత్యంలో నీకు జ్ఞానము సులభంగా లభించేదే. అయితే ఆమె వాక్యాలలోని అంతరార్థాన్ని నీవు అప్పుడు చూడలేకపోయావు. నిర్మలమైన వివేకంతో జ్ఞాన విషయాలను పరిశీలించటానికి బదులుగా హృదయములోని తపస్సుకు సంబంధించిన విక్షేపముల కారణంగా నీవు ఇట్లు అడవుల పాలయ్యావు. ఈ వానప్రస్థాశ్రమమునకు సంబంధించిన శ్రమ, తపోక్లేశము పొందవలసిన అవసరమేమున్నది? ఇంతకాలం నిమగ్నమైన తరువాత ఇప్పుడు కూడా జ్ఞానోపదేశమే అగత్యమై ఉన్నది కదా! ఓ రాజా! తపస్సు యొక్క ప్రయోజనమేమైతే ఉన్నదో, అట్టి ఫలము యొక్క ఆద్యంతములలో సుఖం లేదు. ఆ ఫలము యొక్క అనుభవకాలంలో మాత్రమే సుఖవంతమై ఉండగలదు. అయితే నీవు భౌతిక ప్రయోజనములను ఆశించక తపస్సు చేశావు. అందుచేత ఆ తపోప్రభావం చేత నీ చిత్త దోషాలు నేలరాలాయి. అందుచేతనే తత్త్వబోధకు సమయం సానుకూల్యమైనది. తపోరూప వికల్పాంశములన్నీ నీ పట్ల తత్త్వజ్ఞానము వినుటకు, గ్రహించుటకు కావలసిన పరిణతిని సంపాదించిపెట్టాయి. ఇక నీవు తత్త్వజ్ఞాన ఫలమును ఆస్వాదిస్తూ, ఆత్మజ్ఞానమున సంస్థితుడవై నిరభ్యంతరంగా ఉండవచ్చు. ఇప్పుడు నీవు నీ శ్రద్ధను చిదాకాశ తత్త్వమును ఎఱగటానికే వినియోగించమని నా ముఖ్యోపదేశం. ఎందుకంటే నీవు – నేనుతో సహా సమస్త పదార్థములు అట్టి అతిస్వచ్ఛమగు చిదాకాశమునుండే ఆవిర్భవిస్తున్నాయి. అద్దానియందే ఏర్పడి ఉంటున్నాయి. అద్దానిలోనే విలీనం కాబోతున్నాయి. ఇది గ్రహించిన తరువాత ఏవేవో కర్మ వ్యవహారముల ఆవశ్యకత ఏమున్నది?

ఇదం కార్యమ్, ఇదంనేఽతి సంకల్పా బ్రహ్మబిన్దవః,
వన్ధ్యం, శిఖిధ్వజ! త్యక్త్వా, పూర్ణమేవ సమాశ్రయ ॥

హే శిఖిధ్వజా! "ఇది ఇంకా, చేయాలి! అది ఎట్లాగైనా సరే, చేయకూడదు" ...ఇటువంటి ఇష్ట – అనిష్టారూపమైన ఏ సంకల్పములు నీకు ఏర్పడుచున్నాయో, అవన్నీ బ్రహ్మ మహాసముద్రము యొక్క నిష్ఫల బిందువులు మాత్రమే అయి ఉన్నాయి. జల బిందువులను త్యజించి సముద్రమును ఆశ్రయించటమే ఉత్తమం కదా! ఇష్టానిష్ట సంకల్పములను త్యజించి నీవు ఆత్మ రూప పూర్ణ మహాసముద్రమునే ఆశ్రయించు. ప్రియుడు కనబడనంతవరకూ ఒక ప్రియురాలు ఆ ప్రియునికి

సంబంధించిన ఏవైనా వస్తువులనో, చిత్రపటమునో కోరుకోవడం జరగవచ్చు గాక! ఒకానొక రోజు ప్రియుడే స్వయంగా వచ్చి నిలబడితే, ప్రియుని ప్రేమను అర్థించటమే ఉచితం. అంతేగాని, ప్రియుని చిత్రపటమును అభ్యర్థించవలసిన పనేమున్నది? ప్రియుని అభ్యర్థించుటచేతనే అతనిని పొందటమనే మనోరథం తీరుతుంది కదా! ఏవేవో ఇష్ట పదార్థముల కొరకు ప్రార్థించటం కంటే నిరతిశయ ఆనందరూపమగు ఆత్మ లాభమును ప్రార్థించటమే శ్రేష్ఠమని నా ఉద్దేశం. ప్రజ్ఞావంతులు బింబసూర్యుణ్ణి వదలి ప్రతిబింబ సూర్యుణ్ణి ఆశ్రయిస్తారా? లేదు. ఈ ప్రాపంచిక పదార్థములన్నీ సంకల్పవిరచితములు మాత్రమే. అంతేకాదు, ఇవి 'విపత్తి' లాగా అరమణీయాలై ఉన్నాయి. అటువంటి ఈ పదార్థములను, తత్సంబంధిత విషయ పరంపరలను మహాత్ములు లెక్కలోకి తీసుకోనే తీసుకోరు. అందుచేత ఓ ప్రియరాజా! నీవు జ్ఞాన లాభం సంపాదించుకో. క్రమంగా స్వర్గ – మోక్షదాయకములగు కర్మలన్నీ త్యజించు. అంతటా సమరూపముగా భాసించే ఆత్మయొక్క రూపము కలవాడవగుము.

సర్వ పదార్థములలోనూ రెండు అంశలు ఏర్పడి ఉన్నాయి– 1. సదంశము (Absolute presence), 2. అసదంశము (Relative presence).

సదంశమును సత్యరూపంగానూ, అసదంశమును నాశనరూపంగానూ... గ్రహించాలి. నీవు ఇచ్ఛారహితుడవై ఈ సమస్త పదార్థ సమూహములనూ అచంచల చిత్తంతో దర్శిస్తూ ఉండు.

వివేకము ఉదయించనంతకాలం స్వాభావిక ప్రవృత్తి చేత అపరాధపూర్వక పురుషకారం ఉత్పన్నమౌతూనే ఉంటుంది. అది ఈ మనిషిని సమీపించి సర్వ అనర్థములను కలుగజేస్తూనే పోతుంది. చిత్త చాంచల్యము లేనివానికి సంసారము అనబడేది సమీపించను కూడా లేదు. ఈ లోకంలో ఏఏ దుఃఖములు కనిపిస్తున్నాయో, అవన్నీ కూడా చిత్తచాంచల్యము చేతనే ఉత్పన్నమౌతున్నాయి. ఎవనియొక్క చిత్తమైతే స్థిరమై, శాంతమై, చేష్టారహితమై, అచంచలమై ఉంటుందో, అతడు మాత్రమే మహానంద సామ్రాజ్యమునకు అర్హుడగుచున్నాడు.

❖

కనుక ఓ రాజా! నీవు స్పందన – అస్పందనాలను, చేష్ట – నిశ్చేష్టములను ఏకము చేయి. ఉభయ ద్వంద్వములను 'సాక్షిమాత్రుడై ఉండుట' అను స్థితియొక్క అభ్యాసముచే ఐక్యపరచివేయి. అట్టి సాక్షిత్వమును కూడా బ్రహ్మాత్మైక్యమును పొందింపజేయి. భూమానందభావముతో కూడి, పూర్ణకాముడవై ఉండు.

శిఖిధ్వజుడు : హే మహానుభావా! చేష్ట–అచేష్టల (స్పంద–అస్పందముల) అభావం ఎట్లా సాధ్యం? ఏకత్వం పొందటం ఎట్లా?

కుంభఋషి : ఒక తరంగానికి, ఇంకొక తరంగానికి రూపభేదం ఉంటే ఉండవచ్చుగాక! తరంగములన్నీ జలము చేత నిర్మించబడినవే కదా! అంతా ఒకే సముద్రం కదా! చిన్మాత్రము దృష్ట్యా సమస్తమూ ఏకవస్తువే అయున్నది. తరంగములచే నిశ్చలజలం చేష్టితమగుచున్నట్లు, చిన్మాత్రము బుద్ధి వృత్తులచే చేష్టితమగుచున్నది. ఆత్మజ్ఞాన శాస్త్రము దేనినైతే సత్యము, జ్ఞానము, అనంతము అని వర్ణిస్తున్నదో,

అట్టి నిర్మలమగు చిన్మాత్ర బ్రహ్మమే ఈ సర్వము అయియున్నది. అనగా ఆ బ్రహ్మమే మూఢుల దృష్టికి జగత్తు రూపముగా కనబడటం జరుగుతోంది. చైతన్యము యొక్క స్పందనమే ఈ విశ్వము యొక్క సర్వస్వము. అట్టి స్పందనము నామము, రూపము అను రెండు చమత్కారములతో కూడినదై ఈ ప్రపంచంగా భాసిస్తోంది.

ఓ మునివరా! చైతన్యము యొక్క స్పందనాస్పందనాలు కూడా వాస్తవానికి చైతన్యమునకు అభిన్నమని, ఈ కనబడేదంతా ఆత్మయొక్క విన్యాసమేనని భావన చేస్తూ ఉండు. అప్పుడు అత్యంత శీఘ్రంగా ఆత్మరూపమగు నిర్మలమైన శివబ్రహ్మమే నీవుగా శేషిస్తావు.

'చిత్ యొక్క స్పందనమే ఈ సృష్టి' అను సమ్యక్ దృష్టిని నీవు ఆశ్రయించావా... అప్పుడు 'సృష్టి' అనబడునదంతా స్వయంగా, నీ పట్ల నశించగలదు. సమ్యక్ దృష్టి లేనివారికి మాత్రం సర్ప – రజ్జు భ్రాంతి వలె, ఈ జగత్తు పరిపరివిధములుగా తోచటం జరుగుతోంది.

❖

ఓ రాజా! 'సమ్యక్‌దృష్టి' యొక్క అభ్యాసము కొరకై మరొక్కసారి 'జలము'ను దృష్టాంతంగా తీసుకుని సమీక్షిస్తున్నాను.

తరంగాలతో కూడి ఉన్న జలాన్ని చంచల జలం అనీ, తరంగాలు లేనప్పటి జలాన్ని నిశ్చల జలం అనీ అంటాం. ఉభయ సందర్భములలోనూ జలం జలంగానే ఉన్నది! అంతేకాదు, యథాతథం గానే ఉన్నది! తరంగం ఏర్పడినంతమాత్రాన జలం యొక్క స్వాభావిక ధర్మాలు మారిపోయినాయా?

శిఖిధ్వజుడు : ఎట్లా మారుతాయి! "దాహం తీర్చుట" మొదలైన ఆయా ధర్మాలు ఎప్పటిలానే ఉంటాయి.

కుంభఋషి : అట్లాగే చిత్తు (చైతన్యం) స్పందన కలిగి ఉన్నప్పుడు, స్పందన కలిగి ఉండనప్పుడు కూడా ఆ చైతన్యం యొక్క నిర్మల–నిత్య–అఖండ–అప్రమేయాది స్వభావాలు యథాతథంగానే ఉంటున్నాయి.

సస్పన్దా చిత్తదభిదా, నిఃస్పన్దా త్వియమాతతా,
తుర్యాతీతపదారూఢా, వాచావక్తుం న పార్యతే ॥

స్పంసహితమగు చిత్తు (చైతన్యము) సృష్టి అనే పేరుచే పిలువబడుతోంది. అట్టి చిత్ స్పందన చేతనే ఈ జగత్తంతా వ్యాపించబడి ఉన్నది. స్పందనరహితమైన చిత్తో... 'తురీయాతీతపదము' నందు ఆరూఢమై ఉంటోంది. అయితే, తురీయాతీత చైతన్యము వాక్కునకు లభించేది కాదు. అది అనుభవైకవేద్యము మాత్రమే.

నేత్రములలోని తిమిరదోషం తొలగుతూ ఉంటే ఆకాశంలో 'రెండవచంద్రుడు'గా కనిపించేది మటుమాయమౌతుంది కదా! శాస్త్ర – సజ్జన సాంగత్యములు నిరంతరం అభ్యసిస్తూ రాగా, కాలక్రమంగా చిత్తము నిర్మలమై, తన సాక్షియగు చైతన్యముతో ఏకత్వం పొందగలదు. అప్పుడు జగత్తంతా ప్రసరించియున్న, తాండవిస్తున్న ఏకత్వము తప్పక అనుభవమవగలదు. అట్టి 'సాక్షియగు చైతన్యముతో సమస్తము యొక్క ఏకత్వము' కేవలం అనుభవమాత్రమేగాని అది గురువు వాక్యాలతో చెప్పగలిగేది కాదు. ఆ వాక్యాలు వినినంతనే శిష్యుడు అందుకోగలిగేది కాదు. అది ఎవరికి వారే

తమ జ్ఞానబలిమిచే నిర్మించుకొనవలసిన కైవల్య సామ్రాజ్యము. అయితే అట్టి అనుభవజ్ఞులు చెప్పే స్వానుభవములగు (ఉపనిషత్తు మొదలైన) శాస్త్రాలు మార్గదర్శకం, నిరూపణములు కాగలుగుచున్నాయి. అట్టి తురీయాతీత అనుభవజ్ఞులు తదితరులకు చెప్పే పరిమిత ఉపకరణములగు 'వాక్కులు' నిరూపణ అగుచున్నాయి. అవి తప్పితే వేరే నిరూపణ ఎట్లా?

ఓ సాధూ! నీవు ఇప్పుడు సత్య విషయమును గ్రహించావు. సమస్తమునకు సారభూతమైనట్టి, ఆదిమధ్యాంతరహితమైనట్టి స్వాత్మపదమునందే నిస్సందేహముగా స్థిరముగా నెలకొనియుండుము. ఈ శరీరాదుల భేదమంతా మిథ్య మాత్రమే. కనుక నిస్సంకోచంగా మహాచిత్స్వరూపుడవై, ప్రాదుర్భవించి ఉండుము. నిన్నిక శోకము యొక్క ఛాయ అయినాసరే సమీపింప జాలదు.

❖❖❖

37. ఋషి వాక్య మననం

కుంభ ఋషి : ఓ శిఖిధ్వజ మహారాజా! ఈ విధంగా ఈ సాయంకాలం మనం ఈ ప్రపంచం ఎట్లా ఉత్పన్నమౌతోంది? (అధ్యారోపం); ఇది ఎట్లా లయిస్తోంది? (అపవాదం)... అను ఉభయ విషయాల గురించి కొన్ని విషయాలు చెప్పుకున్నాం. దీనినంతా గ్రహించు. మననం చేయి. స్పష్ట పరచుకో. ఆపై నీకు వానప్రస్థం ఇష్టమనిపిస్తే ఇక్కడే ఉండు. లేదూ, రాజసింహాసనం అధిష్ఠించదలుచుకుంటే అట్లే చేయి. ఏది ఎట్లైనా ఫరవాలేదు, సర్వసాక్షిగా స్వభావించుకున్నవానికి ఎక్కడుంటే ఏమున్నది?

ఓహోః! మరచాను! ఇప్పుడు నేను అవశ్యం స్వర్గలోకం వెళ్ళవలసి ఉన్నది. ఈ రోజు మహా పవిత్రమైన పర్వదినం. బ్రహ్మలోకం నుండి స్వర్గలోకం పోతూ మార్గమధ్యంలో నిన్ను చూచి ఇటు వచ్చాను కదా! నా తండ్రి నారదమహర్షి ఇప్పటికే ఇంద్ర సభకు వేంచేసి ఉంటారు. ఆయన యొక్క ఇంతఃపూర్వపు ఆజ్ఞను అనుసరించి ఆయన వచ్చేసరికి నేను ఇంద్రసభలో ఉండి తీరాలి. ఉత్తములగు గురువులకు మనం ఉద్వేగం కలిగించటం ఏమాత్రం ఉచితమే కాదు కదా! ఇక నేను వెళ్ళి వస్తాను!

నీవు మాత్రం సంకల్పమును, ఇచ్ఛను సదా పరిత్యజించి నాచే చెప్పబడిన 'ఆత్మదృష్టి' యందు స్థితి కలిగి ఉండు.

శిఖిధ్వజుడు : అటులనే మహర్షీ! మీరు ఆజ్ఞాపించినట్లే ఆచరిస్తాను. అయితే, ఇప్పుడే వెళ్ళిపోతారా? వెళ్ళక తప్పదా?... సరే, మహామహితాత్ములగు మిమ్ములను ఉండమని అనగలిగేశక్తి నాకెక్కడున్నది? ఒక్క నిమిషం. మీ పాద పద్మములకు ప్రేమతో పుష్పాంజలి సమర్పించుటకు అనుజ్ఞ ఇవ్వండి.

❖

ఓ రామా! ఇట్లు పలికి శిఖిధ్వజుడు తటాలున లేచి నిలబడ్డాడు. పరుగులు తీస్తూ ఒక పూలమొక్కను సమీపించి నాలుగు క్షణాలలో దోసిలి నిండా సుకుమారమగు పుష్పములు కోసి కుంభఋషి ఉన్న స్థలానికి వస్తున్నాడు. ఆతడు అలా అడుగులు వేస్తూ కుంభుని సమీపిస్తున్నాడు. ఇంతలో శిఖిధ్వజుడు చూస్తూ ఉండగానే కుంభఋషి అంతర్ధానమైనాడు. కలలో చూస్తూ ఉన్న

ధనరాశులు హఠాత్తుగా మాయమైతే ఆ స్వప్న ద్రష్టకు ఎట్లా అనిపిస్తుంది? మన శిఖిధ్వజుడు కూడా అంతటి చకితుడైనాడు. అతనినే ధ్యానిస్తూ శిల్పంలాగా కాసేపు నిలబడి ఉండిపోయాడు. చాలాసేపటికి గాని పూర్తిగా తేరుకోలేదు.

శిఖిధ్వజుడు : (తనలో) సర్వాంతర్యామియగు హే పరమాత్మా! ఏమి మీ లీలా చమత్కారములు! సర్వదా ప్రకాశమానమై ఉన్న బ్రహ్మము యొక్క జ్ఞాపకమును 'ఈ కుంభ ఋషి ఆగమనము' అను మిషతో నాకు కలిగించారా! బ్రహ్మలోకం నుండి స్వర్గలోకానికి ఆకాశమార్గంగా వెళ్ళుచున్న ఈయన చల్లటి చూపులు నాపై ప్రసరించటం ఎంతటి సౌభాగ్యం!

నారదపుత్రుడైన ఈ కుంభు డెక్కడ? కమండలధారినై ఏవేవో క్రియావ్యవహారపరిమితుడనైన ఈ శిఖిధ్వజు డెక్కడ? ఇదంతా భాగ్యోదయ సమయం కాక మరింకేమిటి?

ఈయన చెప్పిన యుక్తుయుక్తవాక్యాల ప్రభావం చేత నాకు ఎంతటి శోభ అబ్బింది! మోహనిద్ర యందు ఉండి చాలా కాలంగా వ్యాకులుడనై ఉన్న నేను ఇప్పటికి ప్రబుద్ధుడనైనాను. ఇంతకాలం 'ఇది చెయ్యకూడదు – అది చెయ్యాలి' ఇటువంటి మిథ్యాభ్రమమయ చక్రంలో చిక్కుకుని వాక్కుచేత చెప్పనలవిగాని క్లేశములన్నీ అనుభవించానే! అప్పటి అజ్ఞానపు బురదలో చిక్కుకున్న స్థితి ఎచ్చట!... ఇప్పటి ఈ నా స్వాత్మ సామ్రాజ్యమెచట! ...పొంతనే కుదరదు. ఈ మహనీయుని దయవల్ల అమృతం నుండి ఉత్పన్నమైన ఆకృతిని ధరించాను. నా మనస్సు శీతలం, శుద్ధం, వాసనారహితం అయినది. ఇప్పటికి శాంతుడను, తృప్తుడను అయ్యాను. సుఖపూర్వకంగా ఉండి ఉన్నాను. ఇక ఈ చరాచర దృశ్యజగత్తు నుండి ఒక గడ్డిపరకకూడా నాకు అక్కర్లేదు.

ఇప్పుడు నేను ఈ జగత్తులో లేను. ఇది నాయందు లేదు. మరి? యథాస్థితంగా నా స్వరూపమున నేను సర్వదా ఏర్పడి ఉన్నాను. సర్వకార్యములకు ఆది కారణమై, కానీ, సర్వదా కారణరహితుడనై, స్వయం తత్త్వస్వరూపమున విరాజిల్లుచున్నాను. అజ్ఞాన – విజ్ఞాన ఉభయ సందర్భములలో నా స్వరూపము అప్రమేయ స్వయం ప్రకాశకముగానే ప్రభవిస్తోంది.

❖

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రాఘవా! వాసనారహితమగు అంతఃకరణం గల ఆ శిఖిధ్వజుడు ఇట్లు చింతన చేయసాగాడు. క్రమంగా మనస్సు విషయరహిత స్థితి పొందసాగింది. "భావాలకు అతీతమైన, ప్రశాంతమగు సాక్షిమాత్రమైన" అనుభవం సంతరించుకోసాగాడు. ఒక శిలయందు చెక్కబడిన శిల్పం లాగా మౌనం ధరించు సమాధినిష్ఠుడు అయ్యాడు. సంకల్ప వర్జితం, ఆశ్రయరహితం అగు ఆ మౌన సమాధిలో పర్వతశిఖరం వలె స్థిరప్రతిష్ఠితుడయ్యాడు. ఆ సమాధిలో సమరసమగు ఆత్మస్వరూపాన్ని పొందుచుండుటచే విశ్రాంతిచిత్తుడై, నిర్భయుడై, సంయోగ–వియోగద్వంద్వాలను అధిగమించిన వాడయ్యాడు. అట్టి నిర్ద్వంద్వయోగాభ్యాసబలం చేత అఖండ స్వభావం పొందాడు. విషయాల దృష్ట్యా గాఢనిద్రకు ఉపక్రమించిన వానిలా, ఆత్మానుభవం దృష్ట్యా నిత్యోదయ జాగ్రత్ అనుభవిగా ప్రకాశించాడు.

❖❖❖

38. కుంభ పునరాగమనం

శ్రీరాముడు : మహర్షీ! కుంభ ఋషి ఇంద్రసభకు బయలుదేరాడు కదా! ఆ తరువాత ఏం జరిగింది?

శ్రీవసిష్ఠ మహర్షి (చిరునవ్వుతో) : కుంభ ఋషి వేషము ధరించిన చూడాల శిఖిధ్వజునికి తత్త్వబోధ చేసిన తరువాత, ఆతని సమక్షము నుండి అంతర్ధానమై ఆకాశమార్గంలో ప్రవేశించింది. అక్కడ తన మాయారచితమైన దేవపుత్రుని రూపం త్యజించి సౌందర్యరాశియగు చూడాల రూపమును ధరించింది. ఆకాశమార్గంగా కొద్ది క్షణముల కాలంలో అంతఃపురంలో ప్రవేశించింది. అతి కొద్ది సమయంలో రాచకార్యములకు సంబంధించిన విధులను నిర్వర్తించసాగింది. మంత్రులతో సమాలోచనలు, వ్యవహార నిర్ణయములు యథారీతి ప్రారంభించింది.

మూడు రోజులు గడిచాయి. మూడు రోజుల తరువాత మరల కుంభ ఋషి రూపము ధరించి శిఖిధ్వజుడు ఉన్న వన ప్రదేశమును ఆకాశ మార్గంలో సమీపించింది. శిఖిధ్వజుడు మౌన – ప్రశాంత – నిర్విషయ స్వరూపమగు సమాధిని అవధరించి ఉండటం చూచింది.

❖

కుంభఋషి (చూడాల) : ఆహా! ఎంతో సౌభాగ్యవశం చేత ఇంతకాలానికి ఈ ప్రియ శిఖిధ్వజుడు స్వస్థుడై, శాంతుడై, సమదృష్టి కలిగి ఆత్మయందు విశ్రమించుచున్నాడు. అయితే ఈతడు ఇట్లాగే ఉంటే కొంతకాలానికి తైలరహిత దీపం లాగా దేహత్యాగం చేయటం జరుగవచ్చు. అటువంటి దేహత్యాగంతో ఈతనికి ఇప్పుడేమిపని? మరికొంతకాలం ఈ వనంలోనో, లేక రాజ్యములోనో దేహసహితుడై ఉంటూనే ఆత్మైక్యమును కూడా అనుభవించవచ్చును కదా! అందుచేత ఈతనిని ఈ సమాధి స్థితి నుండి నిదురలేపుతాను. కొంతకాలం ఈ భూమిపై సంచరించిన తరువాత ఉచిత సమయంలో ఇద్దరం విదేహకైవల్యమును ఆశ్రయించవచ్చు. నేను ఇంతవరకు ఈతనికి చేసిన ఉపదేశ ప్రభావం చేత ఇప్పుడీతడు సప్తమ భూమికలో ప్రవేశించకుండుగాక!

❖

ఈ విధంగా నిశ్చయించుకున్న ఆ చూడాల తన భర్త శిఖిధ్వజుని ఎదురుగా నిలబడి భీకరమైన సింహనాదాలు చేయసాగింది. ఆ శబ్దాలకు పర్వతాలు కంపించాయి. అక్కడి ఆరణ్యంలోని వన్యమృగాలు భయంతో అటూ ఇటూ పరుగులు తీశాయి. ఆకాశమంతా ధ్వని, ప్రతిధ్వనులతో నిండిపోయింది. అయితే ఏం? ఆ శబ్దములు శిఖిధ్వజుని చెవులను తాకినట్లు కూడా లేవు. అతను అట్లాగే నిశ్చలంగా ఉండటం చూచి చూడాల ఆయన భుజములను చేతులతో పట్టుకొని అటూ ఇటూ చాలాసార్లు కదిల్చింది. అయినా లాభం లేకపోయింది.

❖

కుంభఋషి : ఆహా! ఈ సాధు మహాత్ముడు సప్తమ భూమికా ప్రవేశము వరకు పరిణతి చెందాడే! ఈ 18 సంవత్సరాలుగా ఈతడు చేసిన తపస్సు అంతటి ఏకాగ్రత – నిష్ఠ కలిగి ఉన్నాయన్నమాట!

అయినా... ఈ మహాత్ముని ఇప్పుడు సమాధి నుండి లేపటం ఎందుకు? పోనీ, విదేహముక్తిని పొంది అక్కడే ఉండనిస్తే పోలేదా? నేను కూడా ఈ స్త్రీ శరీరమును పరిత్యజించి, ఇక మరల జన్మ లేనిదాననై నా పతితో కూడా పరమపదమును పొందితే సరిపోతుంది కదా!

ఇట్లా తలచి విదేహముక్తికి సంసిద్ధపడుచూ ఉండగా, ఆమెలో ఏదో మరొక ఆలోచన తళ్ళుక్కుమన్నది. అట్లాగే చేస్తాను. అయితే ఇక్కడ మరొక ముఖ్య విషయం సరిచూచు కోవలసియున్నది. ఈ మహారాజు ఇప్పుడు నిర్విషయ సమాధిని అత్యంత తీవ్రంగా ఆశ్రయించి ఉన్నాడు. ఈతని అంతఃకరణంలో జాగ్రత్తుకు సంబంధించిన బీజభూత విషయమేమైనా ఇంకా మిగిలి ఉన్నదా, లేదా? బీజంలో కొంచెం అంకురశక్తి మిగిలి ఉన్నా, మరల, తడి తగిలితే అంకురించటం ఆరంభించి ఎప్పుడో మహావృక్షంగా పరిణమిస్తుంది. అట్లాగే ఈతని అంతరంగంలో జాగ్రత్‌కు సంబంధించిన సంస్కార లవశేషం ఏ కొంచెం మిగిలినా సరే, ఈతడు మరల జాగ్రతుడౌతాడు. అట్లా జాగ్రతుడైనప్పటికీ ఈతడు జీవన్ముక్తుడే కాబట్టి నిశ్చింతుడై ఈ భూమిపై విహరించ గలడు.

ఒక వేళ ఈతడు లౌకిక సంబంధిత సంస్కారం కించిత్తు కూడా కలిగి ఉండకపోతే అప్పుడు నేను కూడా ఈ భౌతిక దేహం త్యజించి, నిర్వికల్ప సమాధిని అవలంబించి సప్తమ భూమికలో ఇప్పటికిప్పుడే ప్రవేశిస్తాను.

❖

ఇట్లా యోచిస్తూ కుంభఋషిరూపియగు చూడాల మరల భర్త దేహమును సమీపించింది. ఒక వైద్యుని వలె శిఖిధ్వజుని దేహమును స్పర్శచేతను, కళ్ళతోనూ నఖశిఖపర్యంతము పరిశీలించింది. ఆ శిఖిధ్వజుడు దేహమునందలి ముఖ్య నాడీ ప్రదేశములలో చేతి స్పర్శకు కించిత్తు స్పందిస్తున్నట్లు గమనించింది. ఉహూ! ఈతని దేహంలో జాగ్రత్తుకు సంబంధించిన, మనో సంబంధమైన, కించిత్తు శేషము ఇంకా ఉన్నది. ఎందుకంటే ఈతని దేహము నందు కొన్ని నాడీ మండలములలో ఉష్ణత్వము మొదలైన కొన్ని చిహ్నాలు ఇంకా ఉన్నాయి. కనుక ఎప్పుడో ఈతడు మరల మనస్సును ఉత్తేజపరచి జాగ్రత్తుకు తిరిగి రాగల అవకాశాలు లేకపోలేదు... అని తలచినది.

❖

శ్రీరాముడు : మహాత్మా! ఒక సాధకుడు చిత్తమును శమింపజేసి కొయ్య - మట్టిలాగా అచంచల స్థితి పొంది ఉన్నప్పుడు, అట్టి ధ్యానశీలుడగువానిలో మనస్సు ఇంకా శేషించి ఉన్నదో-లేదో ఎట్లా తెలుసుకోవచ్చు? ఆ దేహము గ్లాని పొందదా? ఎందుచేత?

శ్రీవసిష్ఠ మహర్షి : ఒక బీజంలో భవిష్యత్ సంబంధమైన పుష్ప-ఫలములకు సంబంధించిన సంవిత్తు మౌనంగా దాగి ఉంటుంది చూచావా? అట్లాగే సూక్ష్మదృష్టిని, జ్ఞానదృష్టిని అవలంబించిన హృదయంలో కూడా ఒక్కొక్కప్పుడు ఎక్కడో ఒక మూల ప్రబోధ కారణమైన మనస్సు యొక్క ఒక శేషం ఉండవచ్చు. అయితే అట్టి సమాధి నిష్ఠుడగు యోగి దేహం మాత్రం యథాతథంగానే ఉంటుంది. ఏ మనుజుడైతే చేష్టరహిత చిత్తం కలవాడై, ద్విత్వ-ఏకత్వరహితుడై, సచ్చిదాత్మ స్వరూపుడై, నిశ్చలంగా ఉంటాడో... అట్టి సమరూప అచంచలస్థితి పొందినవాని దేహం గ్లాని పొందదు, ప్రసన్నం కాదు,

అస్తమించదు, ఉదయించదు. ఆ దేహము సమరూపము కలిగి ఉంటుంది. అట్లా కాకుండా ఆ సాధకుడు ఇంకా ద్విత్వజ్ఞానయుక్తుడై, చేష్టలు నిర్వర్తించే మనస్సు కలవాడై ఉంటే ఆ దేహము వృద్ధి – క్షయములు పొందటం జరుగుతుంది. నిర్విషయ నిశ్చల సమాధియందున్న వాని దేహమునకు వృద్ధి క్షయములు ఉండవు. ఆ సాధకుడు నిశ్చల – నిశ్చితమనస్కుడై ఆ దేహమును త్యజిస్తేనే అది ఇక పంచభూతములందు ప్రవేశిస్తుంది.

చిత్తస్పందోహి సర్వేషాం కారణం జగతః స్థితేః!
రామ! భావవికారాణాం కుసుమానాం యథామధుః ॥

ఓ రామచంద్రా! పుష్పములకు వసంతకాలము కారణమగుచున్నట్లు సమస్త భావవికారములతో కూడియున్న 'ఈ జగత్తు యొక్క – ఈ దేహము యొక్క' స్థితికి చిత్తము యొక్క చేష్టలే కారణమై ఉంటున్నాయి. ఈ కారణం చేత చిత్తము ఇంకా శేషించియే ఉన్నప్పుడు ఈ దేహమును బలవంతంగా నిర్జీవింపజేసినప్పటికి, హర్ష – కోప – సంమోహములు ఇంకా ఉండియే ఉంటాయి. కాబట్టి మరియొక దేహము ఆ జీవుని కొరకు వేచియే ఉంటోంది. చిత్తము పూర్తిగా ప్రశాంతత పొందినప్పుడు అట్టి నిర్వాసనా చిత్తముచే దేహము త్యజించబడుచున్నప్పుడు భావవికారములకు స్థానమైన ఈ దేహము అట్టి దేహిని బాధింపజాలదు. జలము యొక్క సమస్థితి యందు తరంగాలు ఉండవు కదా! చిత్తము యొక్క సమస్థితియందు అద్దానిలో వృద్ధ – క్షయాది వికారములు గాని, రాగ – ద్వేషములుగాని కనిపించవు. ప్రారబ్ధకర్మ సంపూర్ణంగా క్షయించనంతవరకూ జీవన్ముక్తులకుండే సత్వము (విషయరహిత చిత్తము) అభావత్వం పొందకుండానే ఉంటుంది. ప్రారబ్ధ కర్మలు నివృత్తం కాగానే ఆ సత్వము అభావత్వం పొంది పూర్తిగా శమించటం జరుగుతుంది.

ఏ దేహమునందైతే ఇటు చిత్తము గాని, అటు సత్వము గాని ఏర్పడి ఉండదో, అట్టి దేహము ఎండయందు ఉంచబడిన మంచుగడ్డలాగా మృత్యువునందు విలీనమైపోతుంది.

ఆ శిఖిధ్వజుని దేహం విషయానికి వస్తే... అతడు నిర్విశేషసమాధిని ఆశ్రయించటంచేత, చిత్తరహితమైనప్పటికీ, అది తేజముతోను, సత్వాంశతోను కూడియే ఉన్నది. అందుచేత అది గ్లాని పొందలేదు. ఆ విషయం యోగాభ్యాసకురాలగు చూడాల ఆయా దేహనాడులలో స్పర్శకు లభించిన ఉష్ణమును బట్టి గ్రహించింది. యోగాభ్యాసకులకు అట్టి విజ్ఞానము సులభసాధ్యమే.

❖

ఉత్తమ స్త్రీయగు చూడాల భర్త దేహము నందు జాగ్రత్ వ్యవహార సంబంధమైన సత్వాంశమును గమనించి, తాను దేహత్యాజ్య ప్రయత్నమును ఉపసంహరించుకున్నది.

కుంభఋషి రూప చూడాల : ఈతనిని సమాధి నుండి విరమింపజేయటానికే ప్రయత్నిస్తాను. సూక్ష్మదేహాన్ని ఆశ్రయించి – సర్వవ్యాపకము, శుద్ధము అయినట్టి ఈతని చిత్తములో ప్రవేశిస్తాను. ఎప్పుడో అతి దీర్ఘకాలం తరువాత జాగృతం కావలసిన ఈతనిని ఇప్పుడే సమాధి నుండి మేలుకొలుపుతాను. లేకపోతే ఈతడు జాగృతమయ్యే వరకు ఒంటరికి ఉండటం ఉచితం కాదు.

❖

ఇట్లు విచారణ చేసి ఆ చూడాల ఇంద్రియ పంజర రూపమైనట్టి నిజదేహాన్ని వీడింది. భర్త దేహంలో ప్రవేశించింది. అతని యొక్క ఆద్యంతరహితమైన చిత్‌తత్త్వంలో స్థితిని పొందింది. హంస క్షీరం నుండి జలమును వేరు చేస్తుందే!

అట్లా నిర్వికల్ప సమాధియందు చైతన్యముతో ఏకత్వము పొందియున్న తన భర్త యొక్క 'బుద్ధి'ని వేరుపరచింది. అదే తీరుగా దేహంలో ఆ బుద్ధిచే స్పందన క్రియను ఉత్తేజపరచింది. మరల పక్షిగూటిలో ప్రవేశించినట్లు తన నిజకల్పిత కుంభఋషి దేహంలో ప్రవేశించింది. ఇతఃపూర్వం ఆసీన మైన ఎత్తైన శిలాసనంపై కూర్చుని ఏమీ తెలియనట్లు సామవేదం గానం చేయటం ప్రారంభించింది.

సామవేదగానం చెవులకు చేరుచుండగా ఆ రాజు యొక్క దేహం క్రమంగా సత్వగుణంతో శోభించసాగింది. అతని చిత్ ప్రబుద్ధమయి, జాగ్రత్ దేహవ్యవహారము వైపు ప్రసరించసాగింది. క్రమంగా అతడు సమాధి నుండి మేల్కొనుచూ కనులు తెరచి దృష్టిని వికసింపజేశాడు. ఎదురుగా కుంభఋషి ఆసీనుడై ఉండటం చూచాడు.

'అహో! మేం ధన్యులం. ఈ దేవఋషి స్వయంగా ఇక్కడికి విజయం జేశారు'... అని అనుకుంటూ లేచి నిలబడ్డాడు. పరమానందంగా దోసిలినిండా పూలు తీసుకుని కుంభఋషి పాదాలపై ఉంచి సాష్టాంగదండ ప్రణామములు సమర్పించాడు. కుంభఋషి చిరునవ్వుతో అదంతా గమనిస్తున్నాడు.

శిఖిధ్వజుడు : హే మహాత్మా! తమ పవిత్రమైన చిత్తముచే నా బుద్ధి ప్రేరేపించబడటం నా సౌభాగ్యం. మహాత్ములు ఇతరులను అనుగ్రహించే సమయంలో వారి చల్లటి చూపులు ప్రసరించేచోటనే కొంతసేపు ఏర్పడి ఉండటం నిజంగా గొప్ప ఫలప్రదమైన విషయం. మహాత్మా! మీ ఈ రాకకు కారణం నన్ను పవిత్రుణ్ణి చేయటానికేనని నేను అనుకుంటున్నాను. అంతకు వేరైన ఏదైనా కారణముంటే మిమ్ములను సేవించి, సంతోషింపజేసి, తరించటానికి ఈ శిఖిధ్వజుడు వినమ్రుడై సంసిద్ధంగా ఉన్నాడు.

కుంభమహర్షి : ఓ రాజా! నేను మొట్టమొదట వచ్చినప్పటి నుండి పరమ పవిత్రుడవగు నీ సామీప్యాన్ని నా చిత్తం విడువనే లేదు. స్వర్గలోకం రమణీయమైనదైతే కావవచ్చుగాక. నీ సమక్షం గుర్తుకు రాగానే నాకు అక్కడ నిలవాలని అనిపించలేదు. అందుకే మరల వచ్చేశాను. ఈ చిత్తము దేనిని రమ్యమనుకుంటే అద్దాని సమక్షమే ఆనందం కలిగిస్తుంది. ఏది రమ్యమని అనుకోకపోతే... అది ఎంతటి స్థానమైనా కూడా స్వల్పమాత్రంగానే ఉంటుంది. ఓ సాధూ! శిఖిధ్వజ మహారాజా! నీతో సమానమైన బంధువుగాని, ఆప్తుడు గాని, సుహృత్‌గాని, మిత్రుడు గాని, సఖుడు గాని, విశ్వాసపాత్రుడుగాని, శిష్యుడు గాని, ఈ భూ – నభోంతరాలలో మరెక్కడా లేదని నేను నమ్ముచున్నాను. అందుకే నీ చెంతకు వచ్చి ఇక్కడ కూర్చున్నాను.

శిఖిధ్వజుడు :

> **అహో! ను ఫలితం పుణ్యాపాదపైర్నః కులాచలే,**
> **యస్మాత్ భవాన్ అసంగోఽపి, వాంఛతి అస్మత్ సమాగమమ్ ॥**

ఆహా! ఏమి నా అదృష్టం! ఆ మందర పర్వతంపై గల పవిత్ర వృక్షాలకు సుందరమైన పుష్పాల మధురమైన ఫలాలు వెల్లివిరుస్తున్నట్లు నా అనేక జన్మల పుణ్యము ఫలప్రదమౌతోంది.

లేకుంటే అసంగులైన మీరు నా యొక్క స్నేహాన్ని కోరి స్వర్గాన్ని వీడి ఇక్కడికి రావటమా! హే ప్రభో! ఇదిగో ఉత్తమమైన వనం, అవిగో, రమణీయమైన పుష్ప-ఫల సంపదతో కూడిన వృక్షాలు, పిల్లగాలులు ఎంత సువాసనతో చల్లగా వీస్తున్నాయో గమనిస్తున్నారు కదా! ఇక మిమ్ములను సేవలచే సత్కరించటానికి ఈ శిఖిధ్వజ నామధేయుడగు మీ ఈ సేవకుడు ఉండనే ఉన్నాడు. కాబట్టి మీకు స్వర్గ-బ్రహ్మలోకాలు రుచించకపోతే నిస్సంకోచంగా ఇక్కడే ఉండండి. హే మహానుభావా! మీరు చెప్పిన యోగయుక్తిచే నేను ఏ విశ్రాంతిని పొందానో, అద్దాని ముందు స్వర్గాదులు కూడా రుచించ వనుటలో అతిశయోక్తి ఏముంది? అట్టి స్వచ్ఛమైన ప్రకాశయుక్తమైన స్థితిని ఆశ్రయించి ఇక్కడ ఉండండి. ఎప్పుడు స్వర్గాన్ని దర్శించాలని మీకనిపిస్తే అప్పుడే వెళ్ళండి. మీ ఇష్టానుసారం చరించండి.

కుంభ ఋషి : ఓ రాజా! మహత్తరమైన పరమపదంలో నీవు విశ్రాంతి పొందావు కదా! దుఃఖ పూర్ణమై, భేదమయమైనట్టి ఈ సంసారమును నీవు త్యజించినట్లే కదా? విచారణ చేయని కారణంగా మాత్రమే రమణీయంగా తోచే సంకల్పములయందు నీరసములగు భోగములయందు నీకు ఉండి ఉన్న ప్రీతి నిర్మూలనమయిందా? త్యజించటం, ఆశ్రయించటం (హేయ ఉపాధేయములు) అనే దశకు అతీతమైన, స్వయముగా పరమశాంతమైన సమస్థితి కలిగి ఉన్న స్థానమును నీ చిత్తము సంపాదించుకున్నదా? యథాప్రాప్తములగువాటిపట్ల రాగద్వేషరాహిత్యము సంతరించుకున్నదా?

శిఖిధ్వజుడు : హే మహాత్మా! తమ అనుగ్రహం చేత ఈ సర్వదృశ్య వ్యవహారములకు పరమైనట్టి "నా యొక్క ప్రతి ఒక్క జీవుని యొక్క" ఒకానొక మహత్తర స్థానాన్ని దర్శించాను. ఈ సంసారమునకు అక్కడ చోటే లేదు. పొందవలసినది అదే! మీ దయచే పొందవలసిన స్థితిని పొందాను. చాలాకాలం అర్థరహితంగా గడపిన తరువాత ఇప్పటికి నిర్విఘ్న విశ్రాంతిని పొందాను. ఇప్పటికి శాశ్వతమగు అకారణతృప్తిని పొందాను. ఇక నాకు ఉపదేశము యొక్క అవసరమంతా తీరిపోయింది. అంతటా, సర్వథా తృప్తుడనై, దుఃఖరహితుడనై ఉన్నాను... తెలుసుకొనవలసిన దాన్ని తెలుసుకున్నాను. పొందవలసినది పొందాను. త్యజించవలసినది త్యజించాను.

ఇప్పుడు ఆత్మపరతత్త్వాన్ని ఆశ్రయించియున్నాను. ఇక నాకు ఆత్మకు భిన్నమైనదేదీ ఎక్కడా కనిపించటమే లేదు. ఇప్పటికి మీ ప్రవచనమాహాత్మ్యంచేత సంసారం, మోహం, భయం, రాగం, మొదలైన దోషాలు లేనివాడనయ్యాను. నిత్యోదయరూపుడనయ్యాను. సముడను, సర్వసమమగు అంతఃకరణం కలవాడను అయ్యాను. సర్వము పట్లా సౌమ్యం వహించి ఉంటున్నాను. సర్వరూపుడనై, సర్వ కల్పనావినిర్ముక్తుడనై, ఆకాశకోశం వలె నిర్మలుడనై, సర్వత్రా ఏకరూపుడనై ఉన్నాను.

❖❖❖

39. లోక సంచారం

శ్రీవసిష్ఠ మహర్షి : ఆ శిఖిధ్వజ - చూడాలలిద్దరూ అక్కడే కొద్ది గంటలు ఆధ్యాత్మిక కథలు పరస్పరం చెప్పుకుంటూ ఉన్నారు. తరువాత అక్కడి నుండి ఒక పర్వత శిఖరంపై చేరారు. అక్కడ జీవన్ముక్తుల ఆచారములతో కూడినవారై ఆధ్యాత్మిక విషయాలు సంభాషించుకుంటూ, అక్కడే విహరిస్తూ

8 రోజులు గడిపారు. అక్కడి నుండి ఇంకా ఎన్నో ప్రదేశాలు సంచరించసాగారు. పరస్పరం సమానమైన స్నేహం, సమానమైన ధైర్యోత్సాహములు కలిగియున్నవారై పరస్పరం ప్రశంసించుకుంటూ సదా కూడియే ఉండేవారు. కలిసియే భుజించేవారు. కలిసియే శీతోష్ణాదులను పొందుచూ సమబుద్ధిని కలిగి ఉండేవారు. కలిసియే దేవతలను, మహనీయులగు ఆత్మజ్ఞులను పూజిస్తూ ఉండేవారు. 'ఇది ఇలు, అది గ్రామం, ఇది అడవి, అది పట్టణం, ఇది మనదేశం, అది వారి ప్రాంతం' – మొదలైన వికల్పములకు వాళ్ళ మనస్సునందు గాని, సంభాషణయందు గాని చోటు దొరికేదే కాదు.

ఆ స్నేహితులిద్దరూ ఒక్కొక్కప్పుడు ధూళిచే కప్పబడిన దేహములతో గ్రామములలోనూ, పట్టణ వీథులలోనూ సంభాషించుకుంటూ సంచరించేవారు. మరొకప్పుడు నిర్జనప్రదేశాలలో తిరుగుతూ ఉండేవారు. ఒకప్పుడు మంచి వస్త్రాలు ధరించేవారు. మరొకప్పుడు దిగంబరులై, ఆకులతో ఒళ్ళు కప్పుకొని తిరిగేవారు.

కొద్దిరోజులు ఏకచిత్తులై వారిరువురూ సంచరించటం చేత స్వయముగానే వాసనారహితమైన శిఖిధ్వజుని చిత్తము కుంభుని చిత్తమువలెనే పరమపవిత్రమై, ఉత్తమజ్ఞాన సమన్వితమై ప్రకాశించింది.

❖❖❖

40. నియతిని పాలించటమే ఉచితం!

శ్రీవసిష్ఠ మహర్షి : వింటున్నావా! రామచంద్రా! ఆ కుంభ – శిఖిధ్వజులిద్దరూ ఆత్మను ఎరిగినవారై, ఆత్మమాత్రనిష్ఠులై, లీలగా అనేక వనములు, తీర్థయాత్రా స్థలములు, నదీ నద ప్రాంతములు సంచరిస్తున్నారు కదా! ఒక రోజు వారిద్దరూ ఒక అతి సుందరమైన వనంలో యాదృచ్ఛికంగా ప్రవేశించారు. అచ్చటి మధురరసమైన ఫల పుష్పములు, కోయిలల కూహూరాగాలు, పూతీగలచే ప్రకృతి సిద్ధంగా – ఎవరి ప్రమేయం లేకుండా నిర్మించబడిన లతాగృహములు, నిర్మల జలం పారే సెలయేర్లు మొదలైనవన్నీ ఆ ఇరువురినీ ఎంతో ఆహ్లాదపరిచాయి.

శిఖిధ్వజుడు : మహర్షీ! ఏమి ఈ ప్రకృతి సౌందర్యం! ఇక్కడ మునులకు గొప్ప తపో ఏకాగ్రత, ప్రేమికులకు పరమోల్లాసభరితమైన ఏకాంతము ఈ రెండిటినీ ప్రసాదించగల గొప్ప ప్రావీణ్యత ఈ వనమునకు కనిపించటం లేదా? ఈ వనదేవత చూపరులకు అందిస్తున్న ఆహ్లాదమును అభినందించక తప్పదు.

కుంభ ఋషి : ప్రియసఖా! నీవు చెప్పిన దానిలో అనుమానమే లేదు. పద! ఈ వనంలోనే మనం కొద్దిరోజులు ఉందాం. ఈ వనదేవత ప్రదర్శించే ఈ పవిత్ర – పరమాహ్లాద ప్రకృతిని ఆస్వాదిస్తూ ఇక్కడి ఏదైనా చక్కటి ఒక లతాగృహమును ఎన్నుకుందాం. ధ్యానాదులకు ఇది ఎంతో సానుకూల్య ప్రదేశమనిపిస్తోంది.

శిఖిధ్వజుడు : తప్పకుండా! మీరు భావించినట్లే అగుగాక!

❖

ఆ ఇద్దరూ చేతులు కలుపుకుని ఆ వనంలోని సుందరవాతావరణం ఆస్వాదిస్తూ ముందుకు అడుగులు వేస్తున్నారు. కుంభుని మనస్సు మరింతగా పరవశించసాగింది.

కుంభరూప చూడాల (తనలో): ఆహాఁ! ఏమి ఈ వన సౌందర్యం! వసంతకాలపు అందాలు చూడాలంటే ఈ వనమునే చూడాలి. పైగా ఈ ప్రదేశమంతా చాలావరకూ నిర్మానుష్యంగా ఉన్నది. ఇక్కడి లతా గృహాల సౌందర్యం వర్ణించాలంటే మాటలు చాలవు. ప్రక్కనే ఈ సెలయేరు. నా ప్రక్కనే చూస్తేనేమో ఉదారచరితుడైన నా ప్రియ ప్రాణసఖుడు. అరాగరంజితమైన ఈ స్థితి నేను కోరుకోకుండానే నాకు లభించింది.

యథాప్రాప్తములైన భోగముల పట్ల 'తిరస్కారబుద్ధి' అనే పట్టుదల నాకెందుకుండాలి? అట్టి పట్టుదల కూడా జీవన్ముక్తులకు మూఢత్వమనే అనిపిస్తుంది కదా! నా ఈ పతి నవవయస్కుడే కదా! ఇట్టి ప్రియసఖుడు ప్రక్కన ఉండగా ఈ సుందరవాతావరణంలో భర్తతో సమాగమం పొందకపోతే ప్రకృతి ప్రసాదించిన ఈ స్త్రీత్వమునకు అర్థమేమున్నది? వివాహితయగు స్త్రీ తన భర్తతో ఏకాంతం లభించినప్పటికీ భర్తతో పొందు వాంఛించకపోతే ఆమె ఉత్తమ స్త్రీ ఎట్లా అవుతుంది? జ్ఞాని కూడా యథాప్రాప్తములైన ధర్మవిహితములైన భోగములను త్యజించడు కదా!

అయితే, ఈ నా ప్రియపతి ఇప్పుడు నన్ను నారదపుత్రుడగు కుంభఋషి అనియే తలుస్తున్నాడు. నన్ను ఆత్మజ్ఞానం ప్రసాదించిన పరమగురువుగా గౌరవిస్తున్నాడు. పైగా, సర్వత్యాజ్యము చేత ఆత్మానుభవాన్ని పొంది ఉన్నాడు. ఒకవేళ చూడాల రూపంలో ఈతనికి కనిపించినప్పటికీ ఈతడు నాతో రమించుటకు సిద్ధమవుతాడని నేననుకోను. మరిప్పుడేం చేయాలి?

❖

కుంభఋషి రూపంలో తన భర్తతో చేతులు కలిపి అడుగులు వేస్తున్న చూడాల కొంచెం యోచనలో పడింది. ఆమె ఏకాగ్రతతో గొప్ప తపస్సు చేసి ఉన్న మహాయోగి కదా! కొద్ది క్షణములలో ఒక ఉపాయం ఆమెకు స్ఫురించింది.

❖

కుంభఋషి : మహారాజా! హరెరేఁ! మరచాను! ఈ వనం చూస్తే గుర్తుకొచ్చింది. ఈ రోజే వసంత ఋతువు ప్రవేశిస్తోంది కదా! నేడు చైత్రశుద్ధపాడ్యమి. కనుక చాలా గొప్ప రోజు. ఈ రోజు స్వర్గంలో ఇంద్రసభ జరుగుతుంది. ఈ విషయం నాకు ఇంతవరకూ ఎందుకు గుర్తుకురాలేదబ్బా?

శిఖిధ్వజుడు : ఏమి దేవఋషీ! నేటి ప్రత్యేకత ఏమిటి?

కుంభఋషి : చిన్నగా 'ప్రత్యేకత'... అంటావేమిటి? నేడు అనేక మంది దేవతలు, ఋషులు ఇంద్ర సభలో సమావేశం కానున్నారు. నా తండ్రిగారు నారదమహర్షి కూడా వేంచేయనున్నారు. ఆయన సమ్ముఖమునకు నేను అవశ్యం వెళ్ళవలసి ఉన్నది. యథాస్థితమైన మర్యాదలను ఎప్పుడూ అతిక్రమించ కూడదు కదా! కనుక నిన్ను విడచి నేను వెళ్ళిరాక తప్పదు.

శిఖిధ్వజుడు : అదేమిటి గురువర్యా! తప్పక వెళ్ళిరండి.

కుంభ ఋషి : అట్లాగే వెళ్ళివస్తాను. నూతన పుష్పములతో కూడిన ఈ వనంలో విహరిస్తూ నీవు నా కొరకై ఉద్వేగరహితంగా ప్రతీక్షిస్తూ ఉండు. మరల సాయంకాలానికి తిరిగి వస్తాను. నాకు నీ సాన్నిధ్యం కలిగించే సుఖం ఆ స్వర్గలోకంలో ఏమాత్రం ఉండదు సుమా!

❖

ఇట్లా పలికి కుంభుడు సువాసనా భరితమైన పూలగుత్తులను మర్యాదపూర్వకంగా శిఖిధ్వజుని చేతికి అందించాడు. రాజు చూస్తూ ఉండగానే ఆకాశంలో పయనిస్తూనే దోసిలినిండా మల్లె పుష్పములను కల్పించి శిఖిధ్వజునిపై పూలవర్షం కురిపించాడు. కనుచూపుమేర రాజు కుంభుని చూస్తూనే నిలుచున్నాడు.

ఆకాశంలో ప్రవేశించిన చూడాల తన నిజ స్త్రీ రూపం ధరించింది. కొద్ది క్షణములలో అంతఃపురం ప్రవేశించింది. ముఖ్యులగు మంత్రులను పిలిపించి అవశ్యమైన రాజకార్యములు నిర్వహించింది. ఆయా ముఖ్య విషయములన్నీ పర్యవేక్షించింది. సాయంకాలానికల్లా మరల కుంభ ఋషి రూపంలో శిఖిధ్వజుని సమక్షంలో నిలచింది.

శిఖిధ్వజుడు కుంభ ఋషి ఆగమనాన్ని చూచి సంతోషించాడు. గబగబా అతనిని సమీపించి సుస్వాగతం పలికాడు. ఆతని ముఖంలోకి చూచి ఆశ్చర్యపోయాడు. ఎందుకంటే ఎప్పుడూ లేనిది... కుంభ ఋషి ముఖంలో దైన్యము, విషాదము తాండవిస్తున్నాయి.

❖

శిఖిధ్వజుడు: హే దేవఋషీ! ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ ఉండేవారు కదా! అత్యంత సూక్ష్మమైన తాత్త్విక విషయాలు చెప్పేటప్పుడు కూడా మీ ముఖంలో ఆటల గురించి మాట్లాడుకునే చిన్నపిల్లల కేరింతల వంటి ఆనందం ఎప్పుడూ ద్యోతకమయ్యేది. మరి ఈ రోజేమిటి ఇట్లా ఉన్నారు? మరి నా దృష్టి దోషమేమో తెలియదు గాని, మీ ముఖంలో ఏదో విషాదము, నైరాశ్యము కొట్టొచ్చినట్లు కనబడుచున్నాయి. తమరు సర్వసంగపరిత్యాగులు కదా! మీ యొక్క జ్ఞానదృష్టిచే ఈ దుఃఖకవళికలు త్యజించి ఇటు రండి.

ఈ ఆసనముపై కూర్చోండి. మహాత్మా! కమలాలు నీటిలో ఉన్నప్పటికీ జలం యొక్క తడిని స్వీకరించవు కదా! తమవంటి తత్త్వవేత్తలు సుఖ-దుఃఖాల వలన కలిగే స్థితిని ఆశ్రయించరు. ఒకవేళ ఏదో యాదృచ్ఛికంగా సుఖ-దుఃఖ సంఘటనలకు స్పందించవలసివచ్చినప్పటికీ, వాటిని హృదయంలో ప్రవేశింపనీయరు. అసలేం జరిగింది? మీరు ఇంత నిరుత్సాహంగా ఉండటానికి కారణమేమిటి?

కుంభఋషి : (విచారయుక్తమైన గద్గద స్వరంతో) హే రాజన్! ఈ 'దేహము' అనేది ఉన్నదీ అంటే, దీనితో పాటే కర్మేంద్రియాలు కూడా ఉంటాయి కదా! కర్మేంద్రియాలతో బాటే యథాప్రాప్తములైన ఆయా అనుభవాలూ ఉంటాయి. ఇట్టి దేహావస్థయందు కర్మేంద్రియాలచే ప్రాప్తములగు భోగాలను సమచిత్తులై అనుభవించాలి. అట్లా కాకుండా, కర్మేంద్రియాలను నిరుపయోగంగా ఉంచాలనుకోవటం ఒక రకమైన మొండితనమే అవుతుంది గాని, అది తత్త్వవేత్తల లక్షణం కాదు. ఈ శరీరానికి స్వభావ సిద్ధంగా ప్రాప్తించే ఆయా అవస్థల నుండి పారిపోవాలనుకుంటే అది తత్త్వవేత్తలు కానివారు

మాత్రమే తమ మూర్ఖత్వం చేత అట్లా అనుకుంటున్నారని మనం అనక తప్పదు. నువ్వులు ఎంతవరకు ఉంటాయో, అంతవరకు నూనె కూడా ఉంటుంది. ఎంతవరకు ఈ శరీరం ఉంటుందో, అంతవరకు కర్మేంద్రియాల హర్ష-శోక వ్యవస్థలు కూడా ఉంటాయి. 'నేను ఈ కర్మేంద్రియ వ్యవస్థను త్రెంచివేసి అప్పుడు శేషజీవితాన్ని గడుపుతాను'... అని ఎవడైనా అన్నాడనుకో, అది ఒక కత్తి తీసుకొని ఆకాశాన్ని త్రెంచటానికి ప్రయత్నించటం వంటిదే అవుతుంది. అనగా మూర్ఖత్వమే అనిపించు కుంటుంది. అవునంటారా? కాదంటారా?

'దేహమును జయించటం' అంటే కర్మేంద్రియములను నిరుపయోగంగాను, నిర్వీర్యంగాను ఉంచటం మాత్రం కాదని నా ఉద్దేశం. మరి? ఈ దేహదశయందు ఏ సుఖ-దుఃఖాదులు ఉన్నాయో వాటన్నిటిపట్ల అంతరంగంలో ఒకానొక 'అతీతత్వము' అను యోగ స్థితిని సంతరించుకుని ఉండటం – ఇదీ దేహమును జయించటమంటే. అద్దానిని యోగబలమని, సమాధి యొక్క అనుసంధానమని అంటారు. అట్టి సంయోగ – వియోగాతీతమగు యోగస్థితిని స్వభావసిద్ధం చేసుకొనే అభ్యాసం ఉత్తమంగాని, కర్మేంద్రియములను హఠయోగం చేత నిగ్రహించి, అట్టి మూర్ఖచర్యలచే ప్రాప్తించే దుఃఖమును సహించటం దేహభావత్యాగం అవదు, అవజాలదు. కనుక జ్ఞాని కూడా దేహం ఉన్నంత వరకు కాళ్ళు, చేతులు మొదలైన కర్మేంద్రియములను, చూపు – వినికిడి మొదలైన జ్ఞానేంద్రియములను ఆయా యథా ప్రాప్తములైన ఆచారములందు నియమిస్తూనే ఉంటాడు. ఉండాలి కూడా! అయితే అతడు మనోబుద్ధులందు సర్వదా సమత్వము వహించి ఉంటాడు. బ్రహ్మదేవుడు మొదలుకొని తదితర జ్ఞానులు, తత్త్వవేత్తలు అందరూ ఈ విధంగానే దేహస్థితియందు నెలకొనియున్నారు. ఎవ్వరైనా సరే ఈశ్వరేచ్ఛను పాటించి తీరవలసిందే కదా!

అజ్ఞ – తత్త్వజ్ఞ భూతాని దృశ్యజాతమిదం హి యత్
తత్సర్వమేవ నియతిం ధావత్యమ్బు యథా అంబుధిమ్ ॥

ఎక్కడ ఏ జలమున్నా చివరికి సముద్రం వైపుగానే పరుగులు తీస్తున్నట్లు, జ్ఞాని అయినా, లేక అజ్ఞాని అయినా జగత్తులోని ప్రాణులందరూ ఈశ్వర నియతినే పాటిస్తున్నారు. ఈశ్వర నియతిని అనుసరించే పరుగులు తీస్తున్నారు.

అయితే జ్ఞానులగువారు తమ తమ మనోబుద్ధులను పరిశుభ్రంగా ఉంచుకుని అంతరంగంలో సామ్యత్వం అవధరిస్తూ ఈ దేహము ఉన్నంతవరకు ఈశ్వర నియతిని పూర్ణముగా పాలిస్తున్నారు. ధర్మాధర్మములను ఈశ్వరానుకూలంగా నిర్ణయించి అనువర్తిస్తున్నారు.

ఇక అజ్ఞానుల విషయమో... వారు చేయవలసివస్తున్న వాటిని, చేయలేకపోతున్న వాటిని తలచుకుని క్షోభ చెందుతున్నారు. 'నేను ఈశ్వర నియతిని పాటిస్తున్నాను కదా'... అనే విషయం ఏమరచి సుఖదుఃఖ దశలకు వశులై, హతాశులై లక్షల కొద్ది దేహాలను ధరిస్తున్నారు. 'మాకు ఇది బాగు, అది కాదు. ఇట్లాగే ఉండాలి, అట్లా ఉండటం ఇష్టముండదు. ఇది మాకు సుఖం, అది దుః ఖం'... అని స్వకీయ నిర్వచన పరంపరలను ఆశ్రయించి ఈశ్వరనియతి యొక్క ప్రభావమేమిటో

ఏమరచుచున్నారు. ఫలితం? దేహస్థితి పర్యంతమూ బలవంతంగానూ, అపూర్ణముగానూ ఈశ్వర నియతిని పాలిస్తున్నారు.

ఇత్థం సుఖేషు, నను దుఃఖ-దశాసు చేత్థం స్థాతవ్యమితి అధిగతం యదిహాఙ్గ జీవైః
అజ్ఞజ్ఞభూత నివహస్ఫురితస్తదేవం "దుర్లంఘ్య ఏష నియతో నియతేర్విలాసః" ॥

ఓ రాజా! 'ఈ ప్రాణి ఈ జన్మలో ఈ సుఖస్థితులలో ఉండాలి - ఆ ప్రాణి ఆ సుఖ-దుఃఖ స్థితులలో ఉండాలి' - అని ఈ ప్రకారంగా ప్రతి ప్రాణి నుదుట ఆయా స్థితి - గతి విశేషాలన్నీ ముందుగానే వ్రాయబడి ఉన్నాయి. నుదుటి వ్రాతను ఎవరు తప్పించగలరు? జ్ఞానికైనా సరే, అజ్ఞాని కైనా సరే, 'నియతి' లేక 'పారబ్ధకర్మ యొక్క విలాసము'ను తప్పించటం ఎవరి తరం?

❖❖❖

41. దుర్వాస మహర్షి శాపం

శిఖిధ్వజుడు: హే మహానుభావా! వేదవిద్వరా! మీరు చెప్పినట్లే 'నియతి' లేక ప్రారబ్ధ విలాసాన్ని అనుసరించే ఈ ప్రాణులు తెలిసో, తెలియకో అనువర్తిస్తున్నాయి. ఇందులో క్షోభ చెందవలసిన పనేమున్నది? జన్మ - మృత్యువుల మధ్య మాత్రమే కనబడే ఆయా ప్రాప్తాప్రాప్త సంఘటనలను చూచి అజ్ఞాని అంతకుముందే అంతరంగంలో కలిగి ఉన్న సుఖదుఃఖాది నిర్వచనాల ప్రభావం చేత సుఖ-దుఃఖ భావపూరితంగా దర్శిస్తున్నాడు. జ్ఞాని ఈశ్వరేచ్ఛగా దర్శిస్తున్నాడు.

మీరు చెప్పినదంతా యుక్తియుక్తమే. ఇంతకీ ప్రశాంత సమన్వితమగు మీ ముఖంలో కనిపించే ఈ ఉద్వేగమునకు విషాదమునకు కారణమేమిటో వివరించకపోతిరి?

కుంభ ఋషి: తప్పకుండా! ఈ రోజు స్వర్గలోకంలో జరిగిన వృత్తాంతమంతా చెబుతాను. సావధాన చిత్తుడవై విను. నీ వంటి స్నేహితునితో వచ్చిన కష్టమంతా మనస్సు విప్పి చెప్పుకుంటే సగం బాధ తీరిపోతుంది. నిష్కపటియగు నీ ముందు ఉన్నదంతా చెబితేనే ఈ మనస్సు ప్రసన్నత్వం పొందగలదని ఎరిగియే శీఘ్రంగా ఇక్కడికి వచ్చాను. ఇక విను.

❖

నీకు ఈ ఉదయమే ప్రేమపూర్వకంగా పుష్పగుచ్ఛములను సమర్పించి ఇక్కడి నుండి బయలుదేరాను కదా! ఆకాశమార్గమును దాటి స్వర్గలోకంలో ప్రవేశించాను. అమరావతీ నగరంలో నా తండ్రిని దర్శనం చేసుకొని ఆయన వాత్సల్య - ఆశీర్వాదాలు పొందాను. ఇంద్రసభలో అనేక జ్ఞానసంవాదములు విని మరింత పవిత్రుడనయ్యాను. అయితే ఏం? నాలో ఇంకా బాల్యచాపల్యం వదలలేదు కాబోలు... సరే ఈ సంగతికి తరువాత వద్దాం.

సభ శాంతి ప్రవచనాలతో ముగిసింది. ఎందరో ఋషులు, వక్తలు నన్ను ప్రేమపూర్వకంగా పలకరించారు. పెద్దలనేకులికి హృదయపూర్వక నమస్కారాలు సమర్పించి వారి వద్ద ఆశీర్వాదం పొందాను. మరల నా తండ్రి నారదమహర్షిని సమీపించి పాదాభివందనం చేసి ఆయన ఆశీర్వాదం

కూడా పొందాను. సభలోని వారందరూ వారి వారి స్థానాలకు బయలుదేరారు. నేను కూడా ఇక మరొక మార్గంలో బయలుదేరాను. క్రమంగా వాయు మార్గంగా మేఘములను స్పృశిస్తూ వస్తున్నాను. వస్తూ వస్తూ ఉండగా నా ఈ దుఃఖమునకు కారణమైన ఒక చమత్కారమైన సంఘటన జరిగింది.

శిఖిధ్వజుడు: చెప్పండి మహాత్మా! ఏమిటది?

కుంభ ఋషి: జలపూరితమైన మేఘాల మధ్య నుండి దుర్వాస మహాముని వేగంగా వస్తూ ఉండటాన్ని చూచాను. ఆయనతో నాకు బాల్యం నుండి పరిచయం. నా తండ్రిగారు నారదమహర్షి, ఆ దుర్వాస మహర్షి అనేక భక్తి - జ్ఞాన విషయాలు సంభాషించుకోవడం నేను చాలాసార్లు విన్నాను. ఆయన నన్ను ఎంతో ప్రేమతో ఎప్పుడూ పలుకరిస్తూ ఉండేవారు కూడా!

ఆయన మేఘాల మధ్య నుండి వస్తూ ఉంటే మేఘాలలోని జల బిందువులు నుదిటిపై తాకాయి కాబోలు. ముఖంపై గల గంధం, విభూదిచారల రూపంగా ఏర్పడ్డాయి. తెల్లటి ఛాయగల ఆయన అల్పవస్త్ర సహితదేహం నీలి మేఘాలు ప్రతిబింబంచే నీలపు చీర ధరించిన అభిసారిక (వ్యభిచారిణి)ను గుర్తుచేస్తున్నట్లున్నది.

ఆయనపై నా చూపులు పడీపడకముందే నన్ను చూచి పకపకా నవ్వుతూ పలకరించారు. 'ఏమి కుంభ ఋషీ! భూలోకానికి పోవుచున్నట్లున్నావే? నిన్ను చూచి చాలాకాలమయిందయ్యా'... అని ఆప్యాయంగా పలికారు. నేను ఆయనను సమీపించి సాష్టాంగ నమస్కారం చేశాను. నెమ్మదిగా కళ్ళు తెరచి చూచి తటాలున నవ్వాను. నన్ను ఆయన ఆశీర్వదిస్తూనే, 'ఏమిటి నవ్వుచున్నావు?' అని కించిత్ హాస్యరసపూరితంగా అడిగారు. ఆయన మహానుభావుడని తపోలక్ష్మి యొక్క ముద్దుబిడ్డ అని నాకు తెలుసు. ఆగ్రహ-అనుగ్రహములలో ఆయన ఎంతటివాడో పురాణములను ఎఱిగిన నీకు వేరే చెప్పేదేమున్నది? అన్నీ తెలిసి కూడా బాల్యము నుండి ఆయనతో గల సంభాషణా స్వాతంత్ర్యమును పురస్కరించుకొని యౌవన పరిహాస చాపల్యంచేత మనస్సులో ఏర్పడిన చిలిపి ఆలోచనను అనాలోచితంగా మాటలలో పలికాను.

శిఖిధ్వజుడు: ప్రసంగవశంగా మహానుభావుడగు దుర్వాసమహాముని గురించి వినటం నాకు ఆనందంగా ఉన్నది. మహా తపస్వి, పరమజ్ఞానియగు ఆయనకు సర్వదా శుభమగుగాక! చెప్పండి. అప్పుడేమైనది? మీరు ఆయనతో ఏమన్నారు?

కుంభ ఋషి: నేను ఆయనతో 'ధవళఛాయతో మెరిసే మహా తపస్విని అగు మీ దేహాన్ని చూస్తున్నప్పుడు ఈ రోజు ఏమనిపిస్తోందో చెప్పమన్నారా? నీటి బిందువులు జాలువారుతూ, వాటిలో నీలి మేఘములు ప్రతిబింబించటం చేత మీరు నీలమేఘశ్యాములు అయ్యారు. అంతేగాదు, ఇంకా ఏమని పిస్తుందంటే!" అని కొంచెం వెనుకాటుగా ఊరుకున్నాను. అప్పుడా దుర్వాస మహర్షి చిరునవ్వుతో "ఊ! చెప్పవయ్యా ఏమనిపిస్తోందో?" అని చిరునవ్వు నవ్వారు.

ఇక నేను మనస్సులో మాట ఆపుకోలేక 'జలబిందువులతో కూడి జాలువారే నుదురుపైగల గంధ - విబూదులు, దేహముపై కప్పబడిన నీటి బిందువులలో ప్రతిబింబించే నీలమేఘచ్ఛాయ

లోంచి కనిపించే తెల్లటి దేహం అప్పుడే రతిలో పాల్గొనిన అతి సుందరమైన అభిసారికను (వేశ్య స్త్రీని) గుర్తుచేస్తున్నాయి" అని నోరు జారాను.

ఇక ఆ దుర్వాసముని ముఖ కవళికలు మారటం గమనించాను. కొంపమునిగిందని కనిపెట్టేశాను. 'మహర్షీ! క్షమించండి. కోపగించకండి' అని అంటూనే ఉన్నాను.

ఆయన అవేమీ వినిపించుకోనేలేదు. 'నారదమహర్షి పుత్రుడవనే గర్వంతో ఏది ఏ దృష్టితో చూడాలో గ్రహించక పెద్దలు, పూజ్యుల పట్ల ఇటువంటి దుర్వాక్యాలు పలుకుతావా! సరే. ఇదే నా శాపం. నీవు ఈ రోజు నుండి ప్రతిరాత్రీ పాలిండ్లతోను, కేశాలతోను, కామభావాలతోను, విలాసపూరిత మైన హావభావాలతోనూ కూడిన స్త్రీ రూపం పొందెదవు గాక!" అని మంత్రజలం సంప్రోక్షించారు.

నేనిక "అయ్యా! స్వామీ మునివర్యా! మహర్షీ! ఇదేమీ?"...అనే లోపల ఆ మునివరేణ్యులు అంతర్ధానమైనారు.

ఓ శిఖిధ్వజా! ఈ కారణం చేత నేను ఖిన్నుడనై ఏం చేయాలో తెలియక ఆకాశం నుండి ఇటువచ్చాను. ఆ మహర్షి అమోఘమైన శాపం ఊరికేపోదు కదా! ఇక ఈ రోజు నుండి రాత్రులందు కామభావాలతో కూడిన స్త్రీ రూపం పొందబోవుచున్నాను. ఆ దుర్దశను అనుభవించేదెట్లా? ఎప్పుడైనా రాత్రులందు నా తండ్రికి కనబడితే నేను ఏమని సమాధానం చెప్పాలి?

ఆహా! ఈ సంసారంలో ఉండునట్టి ప్రాణులగతి అతి భయంకరమైనది కదా! ఇక నేను కూడా 'గృధ్రమాంసన్యాయం' వలె (స్నేహంగా ఉన్న గ్రద్దలు మాంసాన్ని చూడగానే ఒకదానికొకటి హింసించుకుంటున్నట్లు) యువకులు చేసే అల్లరి పనులకు ఎఱ కావలసిందేనా? నన్ను అపహరించుకు పోవటానికి ఇప్పుడొక యువకుల సంఘం పుట్టుకొస్తుందేమో? స్వర్గంలో దేవగురువుల ఎదుట, ద్విజుల ఎదుట నిలబడి ముఖం చూపేదెట్లా?రాత్రులందు స్త్రీ దేహంతో నేను ఎక్కడ నివసించాలి?

❖

ఇట్లు పలికిన ఆ కుంభఋషి కొన్ని క్షణాలు వెక్కి వెక్కి ఏడ్చాడు. ఆ దుఃఖం ఆపి కళ్ళు తుడుచుకున్నాడు. కొంచెంసేపు ప్రశాంతంగా యోచించి మరల ఇలా అన్నాడు.

❖

కుంభ ఋషి: అయినా మహారాజా! నేనెందుకు ఈ విధంగా దుఃఖిస్తున్నాను? ఈ దేహం స్త్రీ రూపమైతే ఏమున్నది? పురుషరూపమైతే ఏమున్నది? ఆత్మకు కలిగే హాని ఏమీ లేదు కదా! ఆయా సందర్భానుచితములైన కర్మలన్నీ ఈ దేహమే పొందుతోంది గాని, నిర్విషయాత్మస్వరూపుడనగు నేను పొందుటలేదు కదా! ఇంకెందుకు దిగులు?

శిఖిధ్వజుడు:

పరిదేవనయాకోఽర్థో, దేవపుత్ర! తథైతయా?

హే దేవపుత్రా! అదంతా సరేగానీ, ఇప్పుడు విలపించి ఏం ప్రయోజనం? జరగనున్నది జరుగక మానుతుందా? అంతా ఈశ్వరచ్ఛే కదా!

యదాయాతి తదాయాతు దేహస్య, ఆత్మా న లిప్యతే
కాని చిద్యాని దుఃఖాని సుఖాని విహతాని చ,
తాని సర్వాణి దేహస్య, దేహినో నతు కానిచిత్ ॥

ఈ దేహానికి ఏది కావాలని ఉంటే అదే కానివ్వండి. మీరు చెప్పినట్లు ఆత్మకు దేనితోనూ సంబంధమే లేదు కదా! ఇక ఈ సుఖదుఃఖములంటారా... ఇవన్నీ ఏ నియతిచే విధించబడ్డాయో, అవన్నీ దేహముకొరకే గాని ఆత్మ స్వరూపుడగు 'దేహి' కొరకు కానే కాదు.

హే కుంభమహర్షీ! ఈ ప్రపంచ వ్యవహారాలు చూచి మీరా, ఖేదం పొందటం? మీరే ఖేదం పొందితే ఇక ఈ ప్రపంచంలో గల తత్త్వాన్వేషకులకు దిక్కెవరు? శాస్త్ర విషయాలను, స్వానుభవాలను రంగరించి ఆత్మతత్త్వమును ప్రకటించగల ఒక గొప్ప వైద్యునివంటి మీరే ఆత్మానుభవచ్యుతిని పొందితే ఇక మాకు చికిత్సకులు, ఎవరు? మేము ఎవరిని శరణువేడాలి? కనుక ఈ దైన్యత్వం మీకు ఉచితం కాదేమో గమనించండి. అయినా మీరు ఏదో సందర్భానుచితం కాబట్టి ఈ అనుకోని విషాద సంఘటనకు విషాద రసపూర్వకంగా బాహ్యస్పందనం ప్రకటించటం జరిగింది. ఇక యథాస్థితమైయున్న సర్వసమత్వమును, దుఃఖరాహిత్యమును ఎప్పటిలాగే అవధరించెదరు గాక!

❖

ఇటువంటి అనేక వాక్యములచే వారిరువురు పరస్పరం సమాధానపరచుకొంటున్నారు. ఇంతలో "కుంభునకు స్త్రీత్వ ధర్మము కలుగజేయటానికేనా?" అన్నట్లు జగద్దీపకుడగు సూర్యుడు అస్తమాద్రిని సమీపించసాగాడు. క్రమంగా బాటసారులకు మార్గములు కనబడకుండా పోనారంభించాయి. పక్షులు కిలకిల శబ్దాలు చేస్తూ గూటికి చేరనారంభించాయి. ఆత్మ సర్వదా ఏర్పడియే ఉండగా సాంసారిక దృష్టికి అగుపించక, జ్ఞానదృష్టి ఒనగూరుచుండగా స్వయంగా దర్శనమౌతుంది చూచావా? అట్లా నక్షత్రాల ఉనికిని దృష్టికి తెస్తూ కాంతి పుంజాలు ప్రసరించసాగాయి. ఒకవైపు సూర్యుడు అస్తమించుచుండగా మరొకవైపు ఇక్కడ కుంభుని భౌతికదేహం మెల్లమెల్లగా స్త్రీత్వమును ప్రకటించ ప్రారంభించింది. ముందుగా ఆమె కంఠనాదము సున్నితమవసాగింది.

❖

కుంభ ఋషి : ఓ రాజా! చూస్తున్నావు కదా! ఈ వనమంతా వసంతగాలులు వీస్తున్నట్లు ఈ దేహమంతా సిగ్గుతో నిండిపోతోంది. చేతికట్టు వలె ఈ అవయవములు తోచుచున్నాయి. నీ ఎదుట ఇప్పుడే ఈ దేహం స్త్రీత్వం పొందుతోంది. ఈ కేశములు ఎట్లా వృద్ధి చెందుచున్నాయో చూస్తున్నావా? తామరమొగ్గలు వికసిస్తున్నట్లు నా ఈ వక్షస్థలముపై స్తనద్వయం స్వోన్ముఖమై వృద్ధి చెందుతున్నది. ఈ వస్త్రములు కూడా చీలమండలము వరకు విస్తరిస్తున్నాయే! మహర్షి శాపం ఎంతటి మహత్తరమైనది? ఏమిటిది? స్త్రీలకు యోగ్యమైన ఆభరణములు కూడా తమంతట తామే ఈ దేహముపై వెలువడుచున్నాయే! ఇవి శ్రీదూర్వాస మహర్షి యొక్క శాపసౌందర్య చిహ్నాలు కాబోలు!

ఇప్పుడు స్త్రీ చిహ్నములన్నీ కలిగాయి. అయ్యో! ఎంత కష్టతరం! ఇప్పుడు నేను పూర్తిగా స్త్రీని అయ్యాను. పిరుదులు, మొల... ఇంతెందుకు, నా అంతఃకరణమే స్త్రీత్వం సంతరించుకున్నది.

❖

శిఖిధ్వజుడు కూడా కుంభుడు స్త్రీగా మారటం చూచి కళ్ళ తడిపెట్టుకున్నాడు. ఒక ఘడియ సేపు ఆ ఇద్దరి మధ్య దుఃఖముతో కూడిన మౌనము తాండవించింది... ముందుగా శిఖిధ్వజుడే కొంచెం తేరుకున్నాడు.

శిఖిధ్వజుడు : మహాత్మా! ఇదంతా మీరు చెప్పినట్లు దుఃఖకరమైన పరిణామమే. ఏదన్నా కానివ్వండి. మహాసత్వసంపన్నులగు మీరు తమ జ్ఞానౌన్నత్యమును వీడకుండానే ఈ దేహం విషయంలో స్త్రీగా మారారు. అయితే కానివ్వండి. జ్ఞానానికి దేహానికి సంబంధమేముంటుంది? మీరు ఆత్మవేత్తలు కాబట్టి 'నియతి' యొక్క అనివార్యత గురించి వేరుగా చెప్పేదేమున్నది? అవశ్యం జరగబోయే విషయాల గురించి మీరు ఖిన్నచిత్తులు కావద్దు. బుద్ధిమంతులు ఆయా సుఖ-దుఃఖ దశలు ఈ శరీరానికి సంబంధించినవే గాని, తమకు సంబంధించినవి కావని ఎఱిగియే ఉంటున్నారు కదా! మీరు కూడా అట్లాగే ఉండండి. ఇటువంటి ఆయా సుఖదుఃఖానుభవాలను అజ్ఞానులు మాత్రమే చిత్తంలో ప్రవేశించ నిస్తారు. నిత్యానిత్య వివేకజ్ఞానం కలిగిన మీవంటివారు వాటిని దేహ పరిమితమైన వాటిగా చూస్తారు.

కుంభ ఋషి : (చిరునవ్వుతో) ఓ రాజా! మీరు చెప్పినట్లే అగుగాక! రాత్రులందు దుర్వాసమహాముని నిర్ణయించినట్లు ఈ స్త్రీత్వమునే ధరిస్తూ ఉంటాను. ఇక దుఃఖం ఎందుకు? ఈశ్వర నియతిని నేను గాని, మరెవ్వరు గాని ఉల్లంఘించగలరా?

ఇట్లా సంభాషించుకుంటూ ఉండగా వారిద్దరి మనస్సులు దుఃఖరహితమైనాయి. ఇక యథా ప్రకారం ఆయా తాత్త్విక విషయాలు చర్చించుకుంటూ అర్ధరాత్రిదాకా గడిపారు. ఉద్వేగరహితులై ఆ రాత్రి గాఢనిద్రకు ఉపక్రమించారు.

❖

చూచావా రామా! ఈ విధంగా ఆ పట్టపు దేవియగు చూడాల పగలు పురుషరూపంలో ఆ శిఖిధ్వజునితో ఆ వనంలో సంచరించేది. రాత్రిపూట అవివాహితయగు కన్యాధర్మమును పాటిస్తూ తన పతికి మిత్రురాలై సంచరించేది. అక్కడినుండి అనేక వనములలో వారిద్దరూ అదే రీతిగా సంచరించేవారు. కొన్ని రోజులు గడిచాయి. ఒక రోజు సాయంకాలం కుంభరూపంలో చూడాల శిఖిధ్వజునితో ఇట్లా పలికినది.

❖❖❖

42. గాంధర్వ వివాహం

కుంభ ఋషి రూప చూడాల: హే శిఖిధ్వజ మహారాజా! ఇప్పుడు నాకొక క్రొత్త ఆలోచన వస్తోంది. నా ఈ వాక్యములు కాస్త ఓపికతో వినండి. నేను ప్రతి రోజు చీకటి పడేసరికి స్త్రీగా మారుచున్నాను కదా! అట్టి స్త్రీరూపమును సఫలం చేయటానికి ఒకానొక పతికి వివాహముద్వారా నన్ను సమర్పణ చేయాలనే ఇచ్ఛ జనిస్తోంది. ఈ ముల్లోకములలోను నీ ఒక్కడివే భర్తగా నా కిష్టమైనవాడవగుచున్నావు. కాబట్టి నన్ను వివాహం చేసుకొని రాత్రులందు భార్యగా స్వీకరించు. ఎట్టి పరిశ్రమ లేకుండానే ప్రాప్తించిన నీ వంటి మిత్రునితో స్త్రీపురుష సమాగమ సుఖము అనుభవించదలిచాను. దయచేసి

ఈ ఆలోచనను అంగీకరించవలసిందని, అడ్డుచెప్ప వద్దని నా మనవి. ఈ 'వివాహం' అనేది సృష్ట్యాది నుండి ఇప్పటి వరకూ ఒక వ్యవస్థగా ఏర్పడియే ఉన్నది కదా! అట్టి మనువు వంటి మహానీయులచే నిర్ణయించబడిన సాంఘిక విధానం, సర్వజనులకు శ్రేయము అయిన 'వివాహం' మనం చేసుకుంటే తప్పేమున్నది? పైగా, మనిద్దరి స్వభావం ఒకే తీరుగా ఉన్నది. ఇద్దరమూ కూడా సమస్త వస్తువుల యందు ఇచ్ఛ – అనిచ్ఛలను, వాటికి సంబంధించిన ఆయా ప్రయోజనములను త్యజించియున్నాము. అనగా, ఇచ్ఛానిచ్ఛరహితులమై ఉన్నాం. ఒకరినొకరం దీర్ఘకాలంగా స్వభావపూర్వకంగా ఎరిగి ఉన్నాం. స్నేహితులం. దంపతులం కావటానికి ఇంతకు మించిన అర్హత ఏమి కావాలి? కనుక నా అభీష్టాన్ని చెల్లించమని నా మనవి. ఈ విషయమై నీ ఉద్దేశమేమిటో వినటానికి సంసిద్ధంగా ఉన్నాను.

శిఖిధ్వజుడు : మహాబుద్ధిమంతుడవగు ఓ దేవర్షీ! మీరు ప్రతిపాదించిన దానిలో నాకు శుభంగాని, అశుభముగాని ఏదీ కనబడటం లేదు. మీకు ఎట్లు సమ్మతియో, అట్లే అగుగాక! ఈ నా చిత్తంనందు మీరు బోధించిన వాక్యబలం చేత సమత్వము సుస్థీకరణమయింది. అందుచేత నాకు సర్వము స్వాత్మగానే అనుభవమగుచున్నది. ఇక మీకు ఎట్లా ఇష్టమైతే అట్లే ఆచరించబడుగాక!

కుంభ ఋషి : అట్లా అయితే నేడే శుభలగ్నం. ఈ రోజు శ్రావణపూర్ణిమ కదా! నిన్ననే నేను వివాహ లగ్నాన్ని గణించి నిర్ణయించాను. నేటి రాత్రి పూర్ణచంద్రుడు ఉదయించగానే ప్రారంభపు అమృత ఘడియలలో మనిద్దరికీ గాంధర్వ వివాహం జరుగుతుంది. మన వివాహానికి కావలసిన సరంజామా, ప్రదేశాన్ని నిర్ణయించి అంతా సిద్ధం చేసుంచాను. ఈ పుష్పలతను, ఆ పర్వతశిఖరాలు, ఇక్కడి సెలయేళ్ళు, ఆకాశంలోని పాలపుంతలు మన ఈ వివాహానికి సాక్షులు, బంధువులు అగుగాక! ఇక లేద్దాం. మనం వివాహవేదిక కొరకై ఇంకా కొన్ని ఉత్తమ పుష్పాలు, చందనాది ద్రవ్యాలు ప్రోగుచేసుకో వలసి ఉంది.

ఓ రామచంద్రా! ఈలోగా పూర్తిగా పొద్దుగూకింది. కుంభుడు ప్రతిరోజులాగానే సుందర స్త్రీగా రూపం పొందాడు. ఆ ఇద్దరూ కలసి ఒక ఘడియకాలంలో దేవత, అధిదేవత, ప్రత్యధిదేవతలను పూజించటానికి కావలసిన ఫలపుష్పాలన్నీ సేకరించి వివాహ వేదికాస్థానం జేరారు. ఆ ఇద్దరూ ఆ ప్రక్కనే గల సరస్సులో చక్కగా స్నానాలు ఆచరించారు.

తరువాత వివాహ వేదికను సమీపించి ఆసీనులైనారు. మనోవాక్కులచే దేవత–పితృ–ఋష్యాదులను ప్రతిమాహ్వానం చేసి పూజించారు. ఆ ఇద్దరూ కూడా క్రియా ఫలముల పట్ల ఎట్లు ఇచ్ఛారహితులో, అట్లాగే క్రియాత్యాగము పట్ల కూడా ఇచ్ఛారహితులై ఉన్నారు. సంధ్యావందన – అఘమర్షణ మంత్రములను సమాప్తం చేసుకున్నారు.

అప్పుడు దేవఋష్యాది పూజానంతరం శాస్త్రోక్త విధిగా వివాహం చేసుకున్నారు. పరస్పరం హృదయసమర్పణ చేసుకున్నారు. లౌకిక మర్యాద పూర్వకమైన ఉత్తమ భోజనములను భుజించారు. ఇంతలో దంపతులకు ప్రధాన సఖియగు ఉత్తరరాత్రి ప్రారంభమైనది. ఉదయించిన సూర్యుని వలె తెల్లని వస్త్రములను ధరించిన స్త్రీ రూపియగు కుంభుడు శిఖిధ్వజుని సమీపించాడు.

స్త్రీ రూపిణి యగు కుంభుడు : మానప్రదుడవగుస్వామీ! 'మదనిక' అనే పేరుగల ఈ నీ భార్య నీ కరచరణములకు ప్రీతిపూర్వకంగా నమస్కరిస్తోంది. సిగ్గుతో నిండిన ఈ ఉత్తమ శరీరంతో, చంచల

కేశములతో నా అభ్యర్థనపై నన్ను స్వీకరించటానికి అంగీకరించుటచే పరమ ఆప్తుడవైనావు. అంతేకాదు ఉత్తమ భుజాలు గల నీ గంభీరమైన సుందరరూపం నన్ను ఈ సమయంలో కామపీడితగా చేస్తోంది.

❖

ఓ రామచంద్రా! ఆ విధంగా పలికి మదనిక శిఖిధ్వజుని పాదములు స్పృశించింది. శిఖిధ్వజుడు చిరునవ్వుతో ఆమె భుజములను స్పృశించి లేపి ప్రక్కనే కూర్చుండబెట్టుకున్నాడు. అప్పుడు మదనిక అక్కడి అనేక సుగంధలేపనాలతో భర్తను మరింత అలంకృతునిగా చేసింది. సుదీర్ఘకాలం దూరమైన ఆ దంపతులిరువురి ప్రణయవాగ్విలాసంతో నాటి రాత్రి కొద్ది క్షణముల వలె గడిచిపోయింది.

❖

ఎప్పుడు తెల్లవారిందో వారికే తెలియలేదు. సూర్యుడుదయించేసరి కల్లా మదనిక మరల కుంభుని రూపం పొందింది. ఆ రోజు నుండి వారిద్దరు పగటి పూట ప్రియమిత్రులుగానూ, రాత్రి యందు ప్రయాతిప్రియులగు దంపతులుగానూ రోజులు గడపసాగారు. అయితే చూడాల మాత్రం 3 రోజుల కొకసారి భర్త నిదురిస్తున్న సమయంలో రాజనగరం ప్రవేశించి, అక్కడి రాచకార్యములన్నీ చక్కబెట్టి మరల ఆ వనంలో భర్త సమక్షం చేరుతూ ఉండేది.

ఆ దంపతులు మహేంద్ర పర్వతముపై ఒక నెల రోజులు గడిపారు. ఆ తరువాత శక్తిమాన్ పర్వతముపైన, మైనాక పర్వతపు దక్షిణ భాగంలోను కొన్ని రోజులు గడిపారు. ఆ తరువాత ఉత్తరకురుదేశంలో 10 రోజులు, ఉత్తర కోసల దేశంలో 27 రోజులు గడిపారు. ఆ తరువాత అనేక ప్రదేశాలు సందర్శిస్తూ పగటిపూట మిత్రులుగానూ, రాత్రిపూట దంపతులుగాను విహరించసాగారు.

ఆ విధంగా కొన్ని నెలలు గడిచిపోయాయి. ఒక రోజు దేవతాపుత్రరూపియగు చూడాల ఇట్లా అనుకున్నది.

చూడాల : (తనలో) ఈ శిఖిధ్వజుడు పరమజ్ఞానియే. ఇందులో సందేహం లేదు. నాతో స్నేహ – దాంపత్యాదులు నిర్వర్తిస్తూ కూడా ఏమాత్రం కించిత్ కూడా అజ్ఞాన దృష్టిని గాని, జ్ఞానవ్యతిరిక్తమగు ప్రవర్తన – అభిప్రాయములను కలిగి ఉండటమే లేదు. స్త్రీ సాంగత్యము వలన ఈతనికి ఎట్టి దోష – సాంసారిక దృష్టి ఏర్పడుట లేదంటే ఈతడు మహాజ్ఞానులలో ఒకడుగా రూపుదిద్దుకుంటున్నట్లే! అయితే ఈతని చిత్తములో భోగములకు సంబంధించి ఆశాదులేమైనా ఉన్నాయా? లేవా? ఈ విషయం ఇప్పుడు పరీక్ష చేయాలి.

❖❖❖

43. ఇంద్రుని ఆహ్వానం

ఒక రోజు శిఖిధ్వజుడు ఒంటరిగా ఒక నది ఒడ్డున సుఖాసీనుడై కనులు మూసుకుని ఉన్నాడు. కుంభుడు సమీపవనంలోని ఫలపుష్పాలు తేవటానికి అంతకుముందే ఆతని అంగీకారమును తీసుకొని వెళ్ళి ఉన్నాడు.

ఇంతలో ఉత్తర దిక్కున గల తెల్లటి మేఘములవైపు నుండి ఏదో నూతన – అత్యాహ్లాదమైన కాంతి పుంజం తన నుదుటిని తాకినట్లు అనిపించింది. "ఆహా! ఏమిటిది?" అనుకొని కనులు తెరచి ఉత్తరం వైపుగా చూచాడు. ఆశ్చర్యం! అతి సున్నితమైన, ధవళఛాయతో ప్రకాశిస్తూ మిరుమిట్లు గొలిపే వస్త్రాలంకారములను ధరించి ఎవరో దివ్యపురుషుడు తను ఉన్న వైపుగా వస్తున్నట్లు గమనించాడు. 'ఎవరా?'... అని అనుకుంటూ లేచి నిలబడుచుండగా అగ్ని-వరుణ-వాయువు మొ॥న అష్టదిక్పాలకులు ఐరావతము మొ॥న చిహ్నములను అనుసరించి ఆ దివ్య పురుషుడు ఇంద్రభగవానుడని ఎవరూ ప్రత్యేకంగా చెప్పకుండానే రాజు గ్రహించాడు. గబగబా కొద్ది అడుగులు వేసి ఆయనకు సుస్వాగతం పలుకుచూ సాష్టాంగదండప్రణామం చేశాడు.

శిఖిధ్వజుడు : హే ఇంద్ర భగవాన్! మీకు జయమగు గాక! మీ పాదాలకు పదే పదే ప్రణామాలు. దివ్య పురుషులు, పరమాత్మయగు మీరు ఈ రోజు ఈ మానవప్రాణికి దర్శనమివ్వటం చేత ఈ శిఖిధ్వజుడు పునీతుడైనాడు. మహాత్ములగు మీవంటి వారి దర్శనం లభించటమనేది మా వంటి వారికి ఊహకందని విషయం. ఈ సేవకుడు మిమ్ములను సేవించి తరించుటకు సిద్ధంగా ఉన్నాడు. అయినా దేవరాజేంద్రా! తాము స్వయంగా ఇంతదూరం వచ్చే శ్రమ ఎందుకు తీసుకున్నారు? ములోకాలను ఏలే మీరు ఆజ్ఞాపించి ఉంటే నేనే వచ్చేవాడిని. తమ రాకకు కారణమేమిటో ఆజ్ఞాపించెదరు గాక! మీ పాదపద్మాలను సర్వసమర్పణ పూర్వకంగా సేవించటానికి ఈ మీ భృత్యుడు సర్వదా సంసిద్ధుడై ఉన్నాడు.

ఇంద్రదేవుడు (చిరునవ్వుతో) : హే శిఖిధ్వజ మహారాజా! సుందర సరోవరం చేత హంసలు ఆకర్షించ బడునట్లు నీ యొక్క ఉన్నతం, పవిత్రం అగు గుణ సంపదచే మేమంతా ఆకర్షించబడి నీ సమక్షానికి వచ్చాం. ఇక లే! స్వర్గమునకు పోవుదము. అక్కడ దేవతాస్త్రీలు నీయొక్క పుణ్యగుణ సంపదకు ఆకర్షితులై, ఉత్కంఠతో నీ రాకకై ఎదురు చూస్తున్నారు. నీ కోసం దేవదూతలు సిద్ధపాదుకలు, సిద్ధ గుటిక, సిద్ధ ఖడ్గము, రసాదులు తెచ్చియున్నారు. నీవు వాటిని స్వీకరించి సిద్ధమార్గం గుండా స్వర్గ మండలం చేరుటకు అంగీకరించు. నిన్ను ఆహ్వానించటానికే మేమందరం వచ్చాం. నీవు ఈ జీవన్ముక్త రూపంలో దేవతల నివాసములందు అనేక భోగాలు నీకు ఇష్టమున్నంతకాలం అనుభవించవచ్చు. నీ వంటి సాధుమహాత్ములు స్వయంగా ప్రాప్తించే ఐశ్వర్యాలను తిరస్కరించరు కదా! అట్లాగే ప్రాప్తించని ఐశ్వర్యాలను కాంక్షించరు. విష్ణుమూర్తి యొక్క సంచారంచే ముల్లోకాలు పవిత్రమైనట్లు నీరాకచే మేమంతా ఎంతో ఆనందించబోతున్నాం. ఇదిగో దివ్యరథం. అధిరోహించు. నీకు స్వర్గానికి సుస్వాగతం.

శిఖిధ్వజుడు : దేవేంద్రా! నన్ను స్వర్గమునకు ఆహ్వానిస్తున్నందుకు, అందుకు అంతటి మీరే స్వయముగా వచ్చినందుకు మీకు కృతజ్ఞతాభివందనములు సమర్పిస్తున్నాను. అయితే నాపై దయతో నేను చెప్పేది ఆలకించవలసినదిగా సమర్పించుకుంటున్నాను. నా ఈ హృదయ పూర్వక పుష్పాంజలులు, వినమ్రపూర్వక పాదస్పర్శ ప్రణామములు మరలమరల స్వీకరించ ప్రార్థన.

నాకు అన్ని స్థానములు సర్వ సంపదలతో కూడిన స్వర్గంతో సమానంగానే కనిపిస్తున్నాయి. అంతేకాదు నేను గాంచుచున్న పరమానందయుక్తమగు 'చిదాత్మతత్త్వము' అనే స్వర్గము అంతటా

విస్తరించి ఉన్నదేగాని అది ఒకచోట పరిచ్ఛిన్నమై ఉన్నది కాదు. నేను దర్శించే, ఉపాసించే ఆత్మానందం సర్వలోకాలకు – సర్వప్రదేశాలకు సర్వదా విస్తరించి, వేంచేసియే ఉన్నది. కాబట్టి హే ప్రభూ! నేను ఎక్కడున్నప్పటికీ సంతుష్టుడనై ఉన్నాను. సర్వత్రా క్రీడించుచునే ఉన్నాను. నా మనస్సు ఇచ్ఛారహితమై ఉండటం చేత సర్వత్రా ఆనందమయంగా కనిపిస్తోంది. ఆత్మానందాన్ని ఆస్వాదిస్తోంది. సర్వత్రా సర్వదా ఆక్రమించుకున్న బ్రహ్మానంద సాగరము కొరకై ఒకానొక పరిచ్ఛిన్నమైన ప్రదేశమునకు వెళ్ళవలసిన పనేమున్నది? కాబట్టి స్వర్గమును జేరి అక్కడ క్రొత్తగా పొందవలసినదేదీ కనిపించటం లేదు. కనుక నన్ను క్షమించవేడుకొనుచున్నాను. మీ ఆజ్ఞను నెరవేర్చనందుకు నన్ను క్షమించ ప్రార్థన.

ఇంద్రదేవుడు : ఓ శిఖిధ్వజా! మరొక్కసారి ఆలోచించు. ఇట్టి అవకాశం అత్యంత దుర్లభం. నీ వంటి విదితవేద్యులు పరిపూర్ణబుద్ధి సమన్వితులు అగు మహాత్ములు భోగాలను సేవించటం, సేవించక పోవటం ఒకే తీరుగా చూస్తారు కదా! సజ్జనులు ప్రారబ్ధకర్మ అనుభవించి క్షయింపజేసు కోవటమే యోగ్యమని అనుకుంటూ ఉంటారు. నీవు కోరకయే విధివిలాసంగా ఈ ఆహ్వానం లభించింది. కనుక స్వీకరించటమే ఉచితమని నేను అనుకుంటున్నాను.

శిఖిధ్వజుడు : ... (మౌనంగా ప్రశాంతతను వహించియే వినమ్రుడై నిలుచున్నాడు)

ఇంద్రదేవుడు: ఓ శిఖిధ్వజ మహారాజా! మీరు మౌనం వహించి స్వర్గమును స్వీకరించుటకు ఇచ్ఛగించకుంటే నేనిక వెడలుటయే యుక్తం కదా!

శిఖిధ్వజుడు : "ఇప్పుడు కాదు. మరొకసారి మీ దర్శనం ఆశ్రయించి వస్తాను'... అని మర్యాద క్రమమును అనుసరించి అంటూ ఉండగా, ఇంతలో ఇంద్రదేవుడు ఆ వాక్యములను చివరి కల్లా వినకుండానే సాంగ–సపరివారసమేతంగా అంతర్ధానమైనాడు.

"కుంభుడా! నీకు శుభమగు గాక!" ...అను వాక్యం మాత్రం ఆ దేవతలు విచ్చేసిన మార్గం నుండి పదే పదే మృదుమధుర స్వరంతో గానరూపంగా వినిపించింది. కొద్ది క్షణముల తరువాత కుంభుడు శిఖిధ్వజుని సమీపించాడు. శిఖిధ్వజుడు చెప్పుచుండగా జరిగినదంతా విని, ఆ కుంభుడు రాజు భుజములను మెచ్చుకోలుగా తట్టాడు.

❖

చూడాల తన అంతరాంతరంలో తన భర్త స్వర్గ సుఖాదుల పట్ల చూపిన ఉదాసీనతను, ఆతని మనస్సు భోగేచ్ఛల పట్ల వశీభూతం కాకపోవటాన్ని చూచి చాలాచాలా సంతోషించింది.

చూడాల(తనలో) : ఈ రాజు మనస్సు ఇంద్రుని ఆగమనమును క్షోభరహితంగాంచింది. ఈతని బుద్ధి ఉత్తమ నిర్ణయాన్ని, నిశ్చయాన్ని ఆశ్రయించి ఉన్నది. ఇంద్రుని పూజించుట మొదలైన లౌకిక కర్మలను పాటిస్తున్నప్పుడు శ్రద్ధను కూడా వీడలేదు. కనుక ఈతడు "భోగములు" అను మనస్సు యొక్క విభాగాన్ని పూర్తిగా జయించినట్లే! అయితే ఇంకొొక ముఖ్యమైన పరీక్ష చేయవలసి ఉన్నది. ఈ జీవుని హృదయం లోంచి ఎందుకో 'ఇది నాది... నాకే చెందినది' అనే ఒకానొక అజ్ఞాన నిర్మిత మైన లోభగుణం పుట్టుకొస్తోంది. ఇక అక్కడి నుండి అతి విలువైన జీవితమనే అవకాశాన్ని అల్ప

వస్తువుల కొరకై అల్పచింతనలతో వృథా చేసివేసుకుంటున్నాడు. సత్యము – నిత్యము అగుదానిని ఏమరచి నిష్కారణంగా దుఃఖమహా సముద్రంలోనికి తనను తానే త్రోసివేసుకుంటున్నాడు. దుష్ట గుణములు కలవాడు సాత్వికుని వేషం వేసినట్లు, లోభగుణం – లోపల విషమును కలిగి ఉండి – పైకి మాత్రం విజ్ఞులను కూడా "అవును! అవసరం కదా! లేకపోతే ఎట్లా?... ఆ మాత్రం ఎవరికైనా అనిపిస్తుంది"... ఇత్యాది రూపంగా మోసగిస్తోంది.

లోభం నుండి క్రోధం, క్రోధం నుండి మోహం పుట్టుకొస్తున్నాయి. ఆత్మానుభవానికి ఈ లోభ – క్రోధ – మోహాలు రెండు గొప్ప అడ్డులు కదా! మరి నా భర్త ఈ లోభ–క్రోధ–మోహాలను జయించాడో, లేదో ఒక చివరి పరీక్ష పెడతాను. ఈ పరీక్షలో నెగ్గాడా, ఇక ఈయనకు నేను చెప్ప వలసినదేమీ లేదు. అప్పుడు చూడాల రూపంలో ఈయనను సమీపించి చేసినదంతా చెప్పివేస్తాను. ఇక ఈ ఉపాధికి శేషించియున్న కాలమంతా ఈయన సేవలో–సాంగత్యంలో గడిపి, ఆ తరువాత విదేహముక్తిని ఆశ్రయిస్తాను. ఈయనతో ఉండటమనేది అడవులలోనైనా ఫరవాలేదు, లేక, రాజ్యంలో నైనా ఫరవాలేదు.

ఈ జగత్తులోని బాహ్య శత్రువులైతే దూషణ – తిరస్కారాదుల ద్వారా అహంకార జాడ్యం, మదం ప్రకోపించకుండా ఉండటానికి సహకరించి ఒక విధంగా మహోపకారమే చేస్తున్నారు. వారి వలన మహా అయితే, కొంచెం అవమానమో, లేక, ఒక్క ఉపాధికి హానియో మాత్రమే కలుగుతుంది. అదే అంతర్ శత్రువుల విషయమేమిటి?

ఓయీ! జీవుడా! "కామ–క్రోధ–మోహ–లోభ–మద–మాత్సర్యములచే 6 గురు అంతర్ శత్రువుల గురించి పట్టించుకోకుండా ఎక్కడో బాహ్య శత్రువుల పేర్లు మననం చేసి గంతులు వేస్తావేం? పరమానందము, ప్రతి జీవుని సొత్తు అగు ఆత్మానుభవమును నీకు కాకుండా చేస్తున్నది బాహ్య శత్రువులు కాదు. నీ అంతరంగంలో మారు వేషాలలో తిష్ట వేసుకున్న ఈ "అరిషడ్వర్గములు (6 శత్రువర్గములు) గురించి ఏం చేయాలో యోచిస్తున్నావా?" అని శాస్త్రకారులు నిలదీసి ప్రశ్నిస్తున్నారు.

కనుక జ్ఞాన సమన్వితుడు, మహాత్యాగి, జగద్విషయములకు అలభ్యుడు అగు నా భర్త శిఖిధ్వజుని శ్రేయస్సు కోరి ఈ చివరి పరీక్ష పెడతాను.

❖❖❖

44. తుది పరీక్ష

ఇంద్రుని ఆగమన – నిష్క్రమణముల తరువాత కొద్దిరోజులు ఎప్పటిలాగానే కాలగర్భంలో కలిసిపోయాయి. చూడాల పగటిపూట కుంభుని రూపంలోనూ, రాత్రిపూట మదనిక రూపంలోను శిఖిధ్వజునితో ఇటు తాత్త్విక చింతనలు, అటు ఉత్తమ దాంపత్యమును కూడా నిర్వర్తిస్తోంది.

ఒక రోజు సాయంకాలం అయినది. క్రమంగా సూర్యుడు అస్తమించుచుండగా కుంభుడు పరమేశ్వర పూజ కొరకై పూలు, పళ్ళు తదితర సరంజామా తేవటానికి వన ప్రదేశాలలో ప్రవేశించాడు. శిఖిధ్వజుడు అతని రాకకై వేచి ఉన్నాడు.

ఎంతసేపటికీ కుంభుడు రాకపోయేసరికి సాయం సంధ్యాసమయం అగుటచే సాయం సంధ్యావందనం నిర్వర్తించటానికి శిఖిధ్వజుడు సమీపంలోగల ఒక నదీ తటమును సమీపించాడు.

ఎప్పటిలాగానే భక్తి ప్రవత్తులతో సంధ్యావందనాన్ని, అఘమర్షణ జపాన్ని నిర్వర్తించి ప్రశాంత చిత్తంతో అడుగులు వేస్తూ తాము అక్కడ నివసిస్తున్న వసతి ప్రదేశం వైపుగా వస్తున్నాడు. త్రోవలో ఒక కొండ శిల ప్రక్కగా వస్తూ ఉండగా బాటకు సమీపాన గల ఒక లతా గృహం నుండి ఏవో పకపకలు వినిపించాయి. యాదృచ్ఛికంగా అటు చూస్తే అక్కడ మదనిక కనిపించింది. 'ఓహో! ఇక్కడున్నావా! ఇంత ఆలస్యమేమిటి?'... అని అంటూ అటువైపుగా నాలుగైదు అడుగులు వేశాడు.

అక్కడ కనబడిన దృశ్యం చూచి కొంచెంసేపు ఆగాడు. అక్కడ లతా గృహ ప్రవేశ ప్రాంతంలోగల ఒక పూల శయ్యపై పుష్పాలంకృతుడైన ఎవరో పురుషుని తొడలపై తల ఉంచి మదనిక సరససల్లాపాలు ఆడుతోంది. ఆ వ్యభిచార పురుషుడు, ఆ మదనిక లోకములను మరచి పరస్పర హాస్యయుక్తములగు ముఖాలతో సంలగ్నులైయున్నారు. ఒకరి కరస్పర్శతో మరొకరు ప్రేమానందమును అనుభవిస్తున్నారు. ఆ పరస్పర కామపీడిత చర్యలను కొద్ది క్షణములు గమనించిన రాజు కించిత్ కూడా ఉద్వేగం పొందలేదు. పైగా ప్రసన్నతతో కూడిన ముఖకవళికలతో 'ఆహా! ఈ వ్యభిచార స్త్రీ – పురుషులిద్దరూ ఎంత సుఖవంతులై ఉన్నారు!' అని తలచుచూ వెనుతిరిగాడు.

ఈలోగా ఆ వ్యభిచారులిద్దరి చూపు రాజుపై పడింది. రాజును గమనించిన మదనిక ఒక్కసారి ఉలిక్కిపడింది. పైట సర్దుకుంటూ ఆ విటుని భుజములపై నుంచి చేతులు వెనక్కు తీసుకున్నది. తటాలున అతనిని విడచి, పూశయ్య నుండి నేలపైకి దిగి నిలబడింది. అప్పుడు శిఖిధ్వజుడు అది గమనించి, వెనుకకు పోవుచూ, అడుగులు వేస్తూనే ' ఓ ప్రియురాలా! మదనికా! మీరిద్దరూ సుఖ వంతులై ఉండండి. నన్ను చూచి భీతిల్లవలసిన పని లేదు. నేను మీకు విఘ్నమును కలిగించను'... అని పలికాడు. కొంచెం వేగంగా కూడా నడవటం ప్రారంభించాడు. అప్పుడు మదనిక ముఖంలో విటుని సమాగమం చేత ఏర్పడిన ప్రసన్నత, 'రాజు మనస్సును వ్యాకులపరచాను కదా' అనే వ్యాకులత – రెండు ఒక్కసారే అత్యధికంగా ప్రస్ఫుటమయ్యాయి. ఒక చేతితో పైట, చీరకుచ్చెళ్ళు సర్దుకుంటూనే రాజు వెళుచున్న వైపుగా వేగంగా పరుగులు తీసింది. "రాజా! ఎక్కడున్నారు? ఈ మదనిక మీ మనస్సుకు కష్టం కలిగించింది కదా! మీరు ఈ నీచురాలిని క్షమించకండి. మీ చేతుల మీదుగా తుదముట్టించండి! మీరంటే నాకు ప్రేమ తగ్గలేదు. మీరు ఎటు వెళ్ళారో నేను గుర్తించలేకపోతున్నాను. దయచేసి బదులు పలకండి. నేను మీకు చెప్పుకోవలసినది ఒక ముఖ్యమైన మాట ఉన్నది. ఆ తరువాత మిమ్ములను ఇంకేమీ కోరను. ఓ రాజా! ఓ రాజా! నా అరుపులకు బదులు ఇవ్వరూ! నేను చెప్పుకునేదేమిటో ఒక్కసారి వినే అవకాశం ఇవ్వరూర? మీ వంటి చక్రవర్తి నేరం ఆపాదించ బడినవాడు చెప్పుకునేదేమిటో వినకుండా శిక్షను ఖరారు చేయరు కదా!" అని పెద్దగా కేకలు పెట్టుచూ అటూ ఇటూ తిరగసాగింది. రాజు జాడ కనిపించనే లేదు. అయినా అక్కడ గల రెండు మూడు బాట-ఉపబాటలలో వేగంతో కూడిన అడుగులతో తిరుగసాగింది. ఒక అరగంట గడచిన తరువాత ఒకచోట శిఖిధ్వజుడు కనిపించాడు. ఒక ప్రశాంతమైన ప్రదేశంలో బంగారు ఛాయతో

మెరిసే శిలా ఖండముపై కూర్చుని సమాధి తత్పరుడైయున్నాడు. చంద్రుని చల్లటి కాంతులతో ఆతని దేహ కాంతి ఏకత్వము పొందినదా – అని అనిపిస్తోంది.

మదనిక నెమ్మదిగా శిఖిధ్వజుని సమీపించింది. ఆమె వెక్కి–వెక్కి ఏడ్చు సన్నటి శబ్దములు మాత్రం ఆపుకోలేకపోతోంది. కొద్ది క్షణములకు ఆ శబ్దములు శిఖిధ్వజుని చెవిని సోకుటచే నెమ్మదిగా కనులు తెరచి చూచాడు. ఎదురుగా మదనిక నిలబడి ఉన్నది. ప్రశాంతంగా నాలుగు వైపులకు ఒక్కసారి కలియజూశాడు.

శిఖిధ్వజుడు : ఏమి మదనికా! ఇంత త్వరలో ఇక్కడున్నావేమిటి? మీ పరస్పర ప్రేమాభిలాషకు ఎవరైనా విఘ్నం కలిగించారా ఏమిటి?

మదనిక : ...హూ!

శిఖిధ్వజుడు : ఈ జగత్తులో ప్రతిప్రాణి కూడా ఆనందము కొరకే అఱ్ఱులు చాచుచున్నది. పోయి ఆ వ్యభిచార పురుషుని నీ ప్రణయవృత్తులతో సంతుష్టిపరచిరా.

మదనిక : హే రాజన్!...

శిఖిధ్వజుడు : ...? ఓహో! నీ కృత్యమును చూచి నాకేమైనా క్షోభ కలిగిందేమోనని దుఃఖిస్తున్నావా? లేనేలేదు. ప్రపంచంలో ఏఏ ప్రియమైన వస్తువులున్నాయో... అవన్నీ కూడా అందరి ఆనందము కొరకేనని విజ్ఞులు ఎరిగియే ఉన్నారు. అందుచేత, నాకు ఏమాత్రం మనఃస్తాపం కలుగనే లేదు. కనుక, నీవు బిడియపడక ప్రారంభించిన ప్రేమకార్యమును నిర్వర్తించియే రా.

నీ వంటి సుందర స్త్రీని చూచి ఈ ప్రమోదవాతావరణంలో ఆ విటుడు ఆకర్షించబడటం నాకు ఆశ్చర్యం కలిగించటం లేదు.

ఏమిటి నీ సందేహం? ఓ! నాతోటి స్నేహం గురించా? నా మిత్రుడు కుంభుడు వీతరాగుడు. సర్వానికి అతీతత్వం, సాక్షీమాత్రం అనువర్తించే మహాయోగి. ఇక నీవో, దుర్వాసమహాముని శాప సంకల్పంచే కల్పించబడిన చంచలస్వభావంతో గూడిన స్త్రీవి. కుంభర్షి సాన్నిధ్యముచే ఏర్పడిన విజ్ఞానానుభవం నాకు చెక్కుచెదరుట లేదు. కనుక 'మదనిక' అను స్త్రీ ఉపాధి ధరించిన ఇప్పటి నీవు ఏది చేయదలచుకుంటే అదియే నిస్సందేహంగా నిర్వర్తించవచ్చు. కాబట్టి వెళ్ళిరా. ఆ నీ విటుని కామ పీడితుని చేసి తద్వారా దుఃఖింపజేయడం విషయంలో ఉచితానుచితాలను నీకే వదిలివేస్తున్నాను.

❖

ఇట్లు పలికి శిఖిధ్వజుడు మౌనమును వహించాడు. ఆ మాటలు విన్న మదనిక కొంచెం కుదుటపడి దుఃఖము నుండి ఉపశమనం పొందింది.

మదనిక : మహాత్మా! మీరు చెప్పినమాట నిజమే. స్త్రీ స్వభావము అతి చంచలమైనది. పైగా స్త్రీకి పురుషుని కంటే 8 రెట్లు అధికంగా కామం ఉంటుందని కామశాస్త్రములు అంటూ ఉంటాయి.

శిఖిధ్వజుడు : (మౌనంగా, నిర్లిప్తంగా, నిర్వికారంగా ముఖ ప్రదర్శనం చేస్తూ మర్యాద కొరకు మాత్రమే అన్నట్లుగా కొంచెం ముఖకవళికను ప్రదర్శించాడు).

మదనిక : అందుచేత నాపై ఏమాత్రం కినుక వహించటం మీ వంటి జ్ఞానులకు భావ్యం కాదు. నాపై కోపం లేకుండా నేను చెప్పేది వినవలసిందిగా నా మనవి.

నేను మీకు చెప్పే, పూలకొరకై వనంలోకి వెళ్లాను కదా! తిరిగి వచ్చి చూచేసరికి మీరు కనబడలేదు. అప్పుడు మీరు సాయంసంధ్యావందనానికి నదీతటం వైపుగా వెళ్ళి ఉంటారని అనుకుంటూ... అటువైపుగా నేను కూడా వద్దామని బయలుదేరాను. ఈలోగా, ఎక్కడినుండి వచ్చాడో, ఆ కాముకుడు నన్ను సమీపించి సమాగమం కొరకై అతిదీనంగా ప్రార్థన చేశాడు. నా సౌందర్యమును శృంగారపరిభాషలో వర్ణించనారంభించాడు. అబలనైనట్టి నేను ఆ పరిస్థితులలో ఏమి చేయగలను చెప్పండి?

ఒక స్త్రీ వివాహిత కావచ్చు, అవివాహిత కావచ్చు. అటువంటి ఏకాంత ప్రదేశంలో అంతటి రసికావేశం గల కాముకుడు ఎదురుపడినప్పుడు చేయగలిగినదేమైనా ఉంటుందా, కాస్త ఆలోచించండి! భౌతికంగా బలవంతుడగు అట్టి జారుని ప్రేమావేశాన్ని నిరోధించటమెట్లా?

శిఖిధ్వజుడు : (అత్యంత సౌమ్యంగా గడ్డంపై చేతులు పెట్టుకుని ఎటువంటి భావన ప్రదర్శించకుండానే వింటున్నాడు. కళ్ళు మాత్రం అపరిచయస్తుని చూస్తున్నట్లు ఏ భావనా లేకుండా ఉన్నాయి)...

మదనిక : ఈ సమయంలో మరొకమాట కూడా చెప్పాలి. స్త్రీలో సౌందర్యం లేకపోవటమే పురుషుల అసంగమమునకు హేతువు కావచ్చుగాని, ఏ స్త్రీలో కామశాస్త్ర ప్రవచనములగు శృంగార లక్షణములు ఉంటాయో, అట్టి స్త్రీని ఏకాంతములో చూచినప్పుడు ఎవరికైనా సరే, కామోద్రేకం తప్పక కలుగగలదు. అందుచేత ఆ విటుని దూషించటం కూడా సందర్భానుచితం కాదని నా మనవి.

పైగా, ఏకాంత ప్రదేశంలో స్త్రీ పురుషులు తారసపడినప్పుడు వారిలో కామభావాలు కలుగ కుండా ఉంటాయా? అట్టి సమయంలో క్రోధ, నిషేధ, ఆక్రందనములు గాని, పాతివ్రత్యాది సాంఘిక వాదుల ప్రవచనాలు గాని జరుగవలసినదానిని నిరోధించలేవని నేను అనుకుంటున్నాను.

హే నాథా! అయినదేమో అయినది. నేను అబలను. చిన్నదానిని. మూఢురాలిని, అపరాధిని. కాబట్టి నన్ను క్షమించండి. ఇంకెప్పుడూ అటువంటి తప్పు చేయను. 'కామం', 'కామచాంచల్యం' అను వికారాన్ని ఇప్పటికిప్పుడు త్యజించివేస్తున్నాను. సాధుజనులు క్షమాశీలురు కదా! అందుచేత మీ సాంగత్యం నుండి నన్ను దూరం చేయకండి. మరింకేదైనా శిక్ష మీరు విధిస్తే అది నాకు శిరోధార్యం.

శిఖిధ్వజుడు : ఓ బాలికా! ఆకాశంలో వృక్షం ఉండదు కదా! అట్లాగే నా అంతః కరణంలో కించిత్ కూడా ఎవరి మీదా ఏ కోపం లేదు. అయితే సాధుజననింద్యమై ఉండటం చేత నేను నిన్నిక భార్యగా మాత్రం స్వీకరించదలచలేదు. పూర్వంలాగానే వీతరాగులగు మిత్రులుగా ఉండటానికి మాత్రం నేను నిస్సందేహంగా సంసిద్ధుడనే.

❖❖❖

45. చూడాల - శిఖిధ్వజ సమాగమం

శ్రీవసిష్ఠమహర్షి : ఓ రామచంద్రా ! అప్పుడు చూడాల తనలో ఇట్లా అనుకోసాగింది.

❖

చూడాల : (తనలో) ఆహా ! నా భర్తయగు ఈ శిఖిధ్వజుడు అత్యుత్తమమగు ఆత్మ పదమును ఇంత త్వరగా సంపాదించుకోవటం ఎంతటి పవిత్రమైన విషయం. ఈ మహాత్ముడు పూర్ణకాముడైనాడు. గొప్ప గొప్ప భోగములుగాని, మహత్తరమైన సిద్ధులు గాని, ఇంద్రలోకవాసం వంటి సుఖ సంపదలు గాని, సుఖదుఃఖములు గాని, సంపద– ఆపదలు గాని, ఈతని చిత్తమును హరించలేకపోతున్నాయే! నారాయణుని లక్ష్మీదేవి ఆశ్రయించినట్లు శాంతి, ధైర్యము, క్షమ, తృప్తి మొదలైన సమస్త జీవన్ముక్త లక్షణాలు ఈతని యందు వచ్చి చేరాయి.

కాబట్టి ఇప్పుడు నా వృత్తాంతమంతా స్మరింపజేయటానికి ఉచితసమయం ఆసన్నమయినట్లే. ఇక నేను కుంభరూపము కొనసాగించవలసిన అవసరమే లేదు.

❖

ఇట్లా తలచి పరమజ్ఞానియగు ఆ చూడాల అప్పటికప్పుడే మదనిక రూపమును త్యజించి చూడాల రూపం ధరించి ఆ రాజు ఎదుట నిలచింది. రాజు చూడాలను చూచాడు. వికసితనేత్రుడై కొంచెం ఆశ్చర్యమును ప్రకటించాడు.

❖

శిఖిధ్వజుడు: ఓ సుందరీ! నీ వెవరు? ఎక్కడి నుండి ఇక్కడికి వచ్చావు? నీవు వచ్చి ఎంతసేపైనది? ఈ ప్రదేశంలో నిన్నెపుడూ చూడలేదే ! ఈ ప్రాంతం చాలావరకు నిర్జనమైనది కదా! జన ప్రదేశం నుండి ఇంతదూరం ఎందుకు వచ్చావు? నిన్ను ఎక్కడో చూచినట్లు, నాకు బాగా పరిచయమున్నట్లు అనిపిస్తోంది. నిజానికి మాళవదేశాన్ని ఏలుతున్న రాణి చూడాలలా ఉన్నావు?

చూడాల: ప్రభూ ! నేను నిజంగా చూడాలనే. నేడు నా స్వాభావిక దేహంతో మీ సమక్షంలో నిలబడ్డాను. మీకు బోధించటానికి వచ్చిన కుంభుడను నేనే. అదంతా నా మాయా రచన మాత్రమే. కొద్ది క్షణాల క్రితం మీరు చూచిన మదనిక ఎవరనుకుంటున్నారు ? నేనే ఆ రూపమును మీ ముందు ప్రకటించాను. “ఇంద్రుడు పరివారసమేతంగా మీ దగ్గిరకు రావటం” అనేదంతా మీముందు ప్రదర్శించింది నేను సముపార్జించిన యోగశక్తి యొక్క కల్పితమాయ మాత్రమే. మీ దగ్గర నుండి కుంభునిరూపంలో సెలవు తీసుకుని వెళ్ళినది ఇంద్రసభకు కాదు. మన రాజధానికి వెళ్ళి రాచకార్యాలు చక్కబెట్టటం కోసమే.

మీరు మోహవశం చేత రాజ్యమును వదలి ఒంటరిగా వనములోని ఏకాంత ప్రదేశం చేరి తపస్సు ప్రారంభించారు. పద్దెనిమిది ఏళ్ళు గడచినా రాలేదు. మరి నేనేంచేయాలి ? రాజ్యపాలనా ధర్మం మీది కాని, నాది కాదు కదా ! నేను మిమ్ములను సేవించి తరించుట కొరకే ధర్మవశముగా

నియమించబడ్డదానను. మీ సహధర్మచారిణిని అవటం చేత మీ రాజ్యపాలనాధర్మాన్ని నేను నిర్వర్తించాను. అయితే మీ సహచర్యమునకు నేను అర్హురాలనై ఉన్నాను కదా! పైగా, అన్ని సంవత్సరములు గడిచినా మీరు సూక్ష్మము – అనునిత్యము అగు అప్రమేయాత్మతత్త్వమును గ్రహించటం లేదు. మీరు రాజ్యమును త్యజించియున్న సమయంలో యోగాభ్యాసంచే సంపాదించిన సిద్ధులను ఉపయోగించి మీకు మహాత్యాగ రూపమగు సంసారాతీతత్వమును విశదీకరించి మీ జ్ఞానానుభవమునకు సహకరించాలని నాకు అనిపించింది. మనిద్దరి దాంపత్యము పరిఢవిల్లుచుండగా, మన జ్ఞానము పరమపవిత్రము కాగా... ప్రారబ్ధమును పరిపూర్ణం చేసి ఉచితమైన సమయంలో మీతోబాటే విదేహముక్తిని ఆశ్రయించాలనేది నా ఉద్దేశం. అందుకే ఈ మాయా రచనను కొనసాగించి ఇప్పటిదాకా ఆ తంత్రాన్ని నడిపాను. ఇప్పుడు మీరు పరిపూర్ణ జ్ఞానులైనారు. ఆత్మానాత్మ వివేక సమన్వితులైనారు. పరోక్షజ్ఞాన దశ నుండి సర్వ రాగద్వేషములను జయించి అపరోక్ష జ్ఞానార్హత పొందారు. ఇప్పుడు మీరు అనుభవసమన్వితులగు జ్ఞానులలో అగ్రగణ్యులైనవారిలో ఒకరైనారు. మాయా రచన యొక్క ఉద్దేశమైనట్టి ఆత్మజ్ఞానాన్ని పొందారు. అందుకే నేను కల్పించిన మాయనంతా ఉపసంహరించి మీ ముందు వినమ్రురాలినై నిలబడ్డాను.

❖

శ్రీవసిష్ఠ మహర్షి : శ్రద్ధగా ఆలకిస్తున్నావా రామచంద్రా ! ఆ శిఖిధ్వజ మహారాజు అకస్మాత్తుగా చూడాల కనబడటం, కుంభ–ఇంద్ర–మదనికాదులు తన మాయా కల్పన మాత్రమేనని చెప్పటం... ఇవన్నీ విని ఆశ్చర్యపోయాడు. అప్పటికప్పుడే కనులు మూసుకొని ధ్యాననిష్ఠుడైనాడు. యోగనేత్రంతో పద్దెనిమిది సంవత్సరాల కాలంగా వర్తమాన క్షణం వరకు చూడాల నిర్వర్తించిన కార్యపరంపరలన్నీ కొద్ది నిమిషాలలో దర్శించాడు.

సమాధి నుండి మేల్కొన్నాడు. హర్షాతిశయంతో కనులు తెరిచాడు. అతిస్నేహభావయుతుడై ఆనందబాష్పాలు వదలుచు చూడాలను సమీపించి ఆమెను కౌగిలించుకున్నాడు. అప్పటి ఆ ఇరువురి పరస్పరానురాగం వర్ణించాలంటే వేయి నాల్కలుగల ఆ ఆదిశేషునికి మాత్రమే సాధ్యమేమో! ఆ దంపతులిరువురు పులకాంకిత శరీరులై ఒకరి కౌగిలిలో మరొకరు చాలా సేపు ఉండిపోయారు. ఆ తరువాత ఒకరి నుండి మరొకరు విడివడి మౌనభాష కళ్ళలో ప్రదర్శిస్తూ ఒకరినొకరు చూచుకుంటూ ఉండిపోయారు. మాటల కందని మధురభావాలు ఒకరినుండి మరొకరిని ముంచెత్తాయి.

❖

శిఖిధ్వజుడు : హే ప్రియురాలా! చూడాలా! ముగ్ధవు, బాలికవు అగు నీవు నీ మాయా రచనాది శ్రమలచే ఇంతటి అనురాగ ప్రవాహం వర్షిస్తావనేది నేను ఊహించనైనా లేదు. ఈ నీ పతి కొరకు ఇన్ని సుదీర్ఘ సంవత్సరాలు ఎన్నో క్లేశములు అనుభవించావు! దుస్సహమైనట్టి సంసార ప్రవాహంలో పడిన నన్ను ఏ మహోన్నత బుద్ధితో రక్షించావో అట్టి బుద్ధి – తెలివిలతో పోల్చగలిగినదేదీ నేను చూడలేదు, వినలేదు, ఊహించటం కూడా నా వల్ల కాదు. అరుంధతి, శచి, గౌరి, గాయత్రి, లక్ష్మి, సరస్వతి – వారి భర్తృప్రేమ ఈ నీ ప్రేమ ముందు వెలవెలపోతున్నది. వారంతా గొప్ప సేవలు చేశారు. అయితే నీవు నీ భర్తకు ఆత్మజ్ఞానమే ప్రసాదించావు.

ఎన్ని ఉపాయాలతో నీవు నన్ను పూర్ణజ్ఞానిగా తీర్చిదిద్దావు ! ఆశ్చర్యం! ఏ ప్రత్యుపకారం చేసి నిన్ను నేను సంతోషపెట్టగలను?

'కులస్త్రీ గనుక జ్ఞాని అయితే, ఇక ఆ పురుషుని పంటపండినట్లే, శిఖిధ్వజుని యథాశిఖిధ్వజ! కులస్త్రీ తన భర్తను అనాది – అనంతము అగు మోహ సాగరం నుండి కాపాడినట్లు శాస్త్రముల చేత, గురువుల చేతకూడా సమర్థము కాదు. కులస్త్రీయే పతికి సఖుడు, ఆప్తుడు, సోదరుడు, గురువు, సుహృత్, భృత్యువు, స్నేహితుడు, ధనము, సుఖము, శాస్త్రము, గృహము... సమస్తము కాగలదు. ...అను ఒక నూతన సిద్ధాంతమును నీవు నీ మహోన్నత సేవా నిరతిచే ఈ ప్రపంచంలో ప్రవేశింపజేశావు. కులస్త్రీలందరికీ తలమానికమయ్యావు.

అట్టి కులస్త్రీలను సర్వ ప్రయత్నముల ద్వారా, సర్వ విధములా పూజించాలి. పురుషుల సముద్ధరణ కులస్త్రీలపైనే ఆధారపడి ఉంటుంది కాబట్టి, పురుషులు తమభార్యలను అన్ని విధముల సత్కరించటం అత్యవసరమని భావికాల జనులందరికి ఇదే నా ప్రబోధం.

ఇచ్ఛారహితవు, సంసార సముద్రమును దాటివేసినదానవు అగు నీవు నన్ను కూడా సముద్ధరించాలనే కంకణం కట్టుకున్నావు. నాకు చేసిన ఉపకారమునకు ఋణం ఎట్లా తీర్చుకోగలను? నీవు మహాపతివ్రతవని నేను ప్రశంసించుచున్నాను. ఇంకా చెప్పాలంటే ఈ ప్రపంచంలోని పతివ్రతలందరినీ నీవు జయించావు. ఇక నుంచి స్త్రీల సౌజన్యము చర్చనీయాంశమయినప్పుడల్లా నీ పేరు మార్మ్రోగుగాక! సమస్తసద్గుణ సమన్వితమగు నిన్ను సృష్టి చేసినందుకు ఆ బ్రహ్మదేవునిపై అరుంధతి మొదలైన మహాసాధ్వులకు కొంచెం కోపం వస్తుందేమో కూడా! ఓ సతీ! మహాపతివ్రతవగు నిన్ను చూస్తే కించిత్ మరల ఉత్కంఠితుడనగుచున్నాను. రమ్ము. నిన్ను మరల ఆలింగనం చేసుకొనెదను గాక!

❖

శ్రీవసిష్ఠ మహర్షి : ఇట్లు పలికి శిఖిధ్వజుడు పరమసాధ్వియగు ఆ చూడాలన్ను ఆలింగనం చేసుకున్నాడు.

❖

చూడాల : దేవా! మీరు వ్యాకులచిత్తులై, శుష్కక్రియాతత్పరులై సూక్ష్మము – సులభము అగు సత్యమును గ్రహించక పోవడం చూచి నేను ఒకప్పుడు దుఃఖితురాలనయ్యాను. అట్టి నా దుఃఖాన్ని తొలగించుకోవటానికే మీకు తాత్త్విక సత్యము బోధించటానికై ఉద్యుక్తురాలనయ్యాను. కనుక ఒక విధంగా నేను నిర్వర్తించినదంతా నా స్వార్థం కొరకే గదా! ఇక ఇందులో నన్ను పొగడవలసినదేమి ఉన్నది?

శిఖిధ్వజుడు :

త్వయా యథా వరారోహే! స్వార్థః సంపాద్యతే శుభః ।
తమిదానీం తథా సర్వాః సాధయన్తు కులాంగనాః ॥

ప్రియ చూడాలా! నన్ను సముద్ధరించి శుభప్రదునిగా తీర్చిదిద్దటమే స్వార్థమనుకుంటే, ప్రపంచంలోని భార్యలందరు ఇట్టి స్వార్థమును కలిగి ఉండుటకు ప్రయత్నించెదరు గాక!

చూడాల : ఇప్పుడు చెప్పండి స్వామీ! ఇప్పుడు ఈ జగజ్జాలము యొక్క ఆవల విశ్రాంతి పొందుచున్నారా? తత్త్వపదార్థమును ఎఱిగినారా? పూర్వకాలపు అజ్ఞానము ఇంకా ఏమైనా మిగిలి ఉన్నదా? "ఇది చేయాలి. అక్కడికి వెళ్ళాలి. అదేదో పొందాలి" ...ఇటువంటి పూర్వకాలపు స్థితులు జ్ఞాపకమునకు వచ్చినపుడు అట్టి అపరిపక్వ తుచ్ఛస్థితులను చూచి ఇప్పుడు పకపకా నవ్వుకుంటున్నారు కదా! తుచ్ఛమగు సంకల్పములు, తృష్ణ మొ॥న కుకల్పములు మీ చిత్తము నుండి పలాయనం పుచ్చుకున్నాయి కదా!

ఇప్పుడు మీరు ఎట్లా ఉన్నారు? దేని యందు నిష్ఠ కలిగియున్నారు? దేనిని కోరుకుంటున్నారు? పూర్వకాలపు తపస్సు మొదలైన దేహక్రియలను చూచి ఇప్పుడు మీకేమనిపిస్తోంది? ఏదీ? కొద్ది విషయాలు చెబుతారా ?

శిఖిధ్వజుడు : ఓ ప్రియ చూడాలా ! నీవు ఏ వివేకం యొక్క అంతఃప్రకాశ రూపంచే స్థితి కలిగి ఉన్నావో గ్రహించాను. నేను కూడా అట్టి వివేకమునందే ప్రకాశ సాక్షీరూపంచే స్థితి కలిగి ఉన్నాను.

తత్త్వదర్శనం అనునది బాహ్యదర్శనమయ్యే విషయం కాదని, అది 'కేవలం స్వానుభవం'మాత్రమే నని గ్రహించాను. ఇప్పుడు నేను ఇచ్ఛారహితుడను. ఈ సర్వ జగద్విషయముల పట్ల నిస్పృహుడను. అంశ వర్జితుడను. ఆకాశమువలె స్వచ్ఛుడను. శాంతుడను, పరమార్థ సద్రూపుడను కూడా!

చాలాకాలం తరువాత నాయందు 'అహంకారము' అనే భ్రమ తొలగింది. నేను చిదాత్మనే అయి తద్రూపముననే వెలయుచున్నాను. హరిహరాదులు అడ్డం వచ్చినా నిషేధింపజాలనట్టి ఆత్మానుభవ మార్గాన్ని అధిరోహించి నిరతిశయానంద దశను పొందాను. ఒక్క చిన్మాత్రమునందు తప్ప మరింకే అన్యమైన దానియందును ఏ మాత్రం నిష్ఠ నాకు లేదు.

ఈ సంసార భ్రమ నుండి విముక్తుడనైనాను. పరమ సంతుష్టుడనైనాను. ఇక నాకు దేని గురించీ ఏ దిగులు లేదు.

భ్రమేణ అహం విముక్తోఽస్మి సంసారే, నీలిలోచనే,
న తుష్టోఽస్మి! న ఖిన్నోఽస్మి! నాయమస్మి! నచేఽతరత్ ॥

ఓ నీలి నేత్రాలు కలదానా! నేను కార్యవర్గమగు దృశ్యమును కాను, కారణమగు ద్రష్టత్వమునకు సంబంధించినవాడను గాను. ఈ సుఖ దుఃఖాలుగాని, ఇది గాని, మరొకటిగాని నేను కాదు.

న స్థూలోఽస్మి! న సూక్ష్మోఽస్మి! సత్యమస్మి చ సుందరీ!
తేజోబింబాత్ ప్రయాతేన భిత్తావపతితేనచ ॥

క్షయ – అతిశయ ముక్తేన ప్రకాశేన అస్మి వై సమః
శాన్తోఽస్మి! సామ్యనేతాఽస్మి! స్వస్థోస్మి, విగతాశయః

నేను స్థూలరూపుడను గాను. సూక్ష్మరూపుడను కూడా కాదు. ఏది నా వాస్తవ రూపమైయున్నదో అది సర్వదా సత్యము, అబాధితం అయి ఉన్నది. సూర్యమండలము నుండి బయలుదేరిన కొన్ని కిరణములు ఒక గోడపై పడుతున్నాయనుకో! అంతమాత్రం చేత గోడకు సంబంధించిన లక్షణములు

కిరణములకు ఆపాదించటానికి వీలులేదు కదా! గోడ పడిపోతే కిరణములు నశిస్తాయా? లేదు. సూర్యగోళమునుండి బయలుదేరే కిరణములు క్షయము గాని, అతిశయము గాని లేనట్టి తేజోరూపం. మరి గోడయో? కొన్ని జడ పదార్థముల సమ్మేళనం. సూర్య ప్రకాశము సర్వదా సమరూపముననే ఉన్నది. దానికి హెచ్చుతగ్గులు లేవు. కాని వస్తువు యొక్క స్థితి – గతులు, ఆకార – కోణాదులు, ప్రతి బహిర్గత స్వభావము (Counter- emitting of light waves) మొదలైన వాటిని అనుసరించి ఆ వస్తువు దృశ్యమానమౌతుంది.

నేను ప్రకాశమువలె సర్వదా సమస్వరూపుడను. శాంతుడను. ఈ ప్రపంచము యొక్క విషమత్వ – సృష్టి – వినాశనాదులతో నా స్వరూపమునకు ఏమాత్రం సంబంధము లేదు. ఈ మనో – బుద్ధి – అహంకారాదులు నా స్వరూపము పట్ల నిర్వర్తించబడే అసత్యమగు ఆరోపణలు మాత్రమే! సూర్యగోళమునకు ఉదయ–మధ్యాహ్న సాయంకాలములు ఉన్నాయా? అది నిత్య ప్రకాశమై ఉండగా అట్టి దానికి ఉదయ – మధ్యాహ్న – సాయంకాల – రాత్రులు ఎట్లా ఉండగలవు? పోనీ, అవి భూమికి సంబంధించినవా? భూమి సర్వదా ప్రకాశరహితమగు జడ పదార్థం కదా ! మరి అవి ఎవరికి సంబంధించినవి ? 'భూమి' అను వస్తువు ఉన్న స్థానము ననుసరించి ఏర్పడిన కాంతి యొక్క అల్ప–అధిక ప్రసరణలే రాత్రింబవళ్ళుగా అనుభవమౌతున్నాయి. అంతకు మించి రాత్రింబవళ్ళకు వేరుగా ఉనికి లేదు. సూర్యతేజస్సుకు రాత్రింబవళ్ళు లేనట్లు నేను మనోబుద్ధ్యాది విషయరహితుడను.

ఓ సాధ్వీ ! నేను ఏదై ఉన్నానో, అదియే నీవు కూడా అయి ఉన్నావు. అదియే సమస్త ప్రాణులు కూడా! అద్దానినే శాస్త్రములు 'బ్రహ్మము' అని పిలుస్తున్నాయి. నీవు నిర్వాణరూపమున ఈ దేహాదులు ఉన్నప్పుడు – లేనప్పుడు కూడా ఏ స్థితి పొంది ఉన్నావో, అదే నిర్వాణరూపమున నేను కూడా సర్వదా స్థితి పొంది ఉన్నాను. ఇంతకుమించి మౌనం వహించటం తప్పించి ఏమీ చెప్పజాలను. ఓ చూడాలా ! నీవు నా కొరకై ఎంతో శ్రమ తీసుకున్నావు. నారద పుత్రుడు మొదలైన మాయలన్నీ కల్పించి చూపించావు. నా భార్య రూపంలో వచ్చి ఉంటే నీ జ్ఞాన వాక్యములను యుక్తయుక్తమైనప్పటికీ "ఆ ! ఈ చూడాల చిన్నపిల్ల ! ఈమెకేం తెలుసు?" ..... అని ఉపేక్షయే చేసి ఉండేవాడిని. అసత్యమగు కల్పనల ద్వారా మహత్తర సత్యమును అతి సులభశైలితో ప్రత్యక్షపరచిన నీ బుద్ధిని వర్ణించటానికి నాకు నోట మాట రావటం లేదు.

నీవే నా గురువువు. నా జ్ఞాననేత్రమును తెరచి అజ్ఞానాంధకారముతో కూడిన అంతరంగ స్థితిని ఉద్ధరించావు కదా! నీకు నమస్కరిస్తున్నాను. నీ అనుగ్రహము చేతనే ఈ సంసారసాగరమును నేను దాటగలిగాను. అగ్నియందు పదిసార్లు పుటం ఒనర్చబడిన బంగారంలో ఇక మాలిన్యము ఉండదు కదా ! అనేక సంఘటనలను కల్పించి తద్వారా నన్ను నీవు మలరహితునిగా చేశావు.

ఇప్పుడు నేను శాంతుడనై, స్వస్థుడనై, కోమలుడనై, సర్వవ్యాపినై ఉన్నాను. ఆకాశమువలె అంతటా స్థితి పొందియున్నాను.

చూడాల : అయితే ఓ ప్రాణేశా! నా హృదయ ప్రియా! ప్రభో! ఇప్పుడిక మీకు ఏది ఇష్టమని అనిపిస్తోంది? ఈ అరణ్యవాసమా? లేక రాజ్యపాలనయా?

శిఖిధ్వజుడు : ఇప్పుడు ఇది చేయాలన్న ఉద్దేశము గాని, అది చేయకూడదన్న ప్రతి నిషేధము గాని నాకు లేవు. నీకు ఏది అభిమతమైతే నాకూ అదే. ఏదేది చేయవలసి వచ్చినా అది 'సమాధి యొక్క వ్యుత్థానకాలంలో సర్వమును ఆక్రమించుకొనియున్న నా స్వస్వరూపం ఒకచోట వ్యవహారమునందు ప్రతిబింబించటం' ...అనియే గ్రహిస్తున్నాను. అందుచేత నీకు ఏది ఇష్టమో! అదియే నాకూ ఇష్టం. అట్లే జరుగుగాక! దేనిపట్ల కావాలని గాని, అక్కర్లేదని గాని నాకు భావన ఏర్పడుట లేదు. నీకు ఏది ఎట్లు అనిపిస్తే అట్లే నిర్వర్తించు. నాకు దేనికీ అభ్యంతరం లేదు. మణి ప్రతిబింబమును అనిచ్ఛాపూర్వకంగా గ్రహిస్తుంది చూచావా ? ఇచ్ఛారహితమగు చిత్తముచే అనిందితమగు యథాప్రాప్త వస్తువును ధరించటానికి నేను సిద్ధంగా ఉన్నాను.

నేనెవరినీ, దేనినీ స్తుతించటం లేదు...... నిందించటం లేదు. నీ వెట్లు అనుకుంటావో అట్లాగే చేయి. తదనుకూలంగా చరించుటకు నాకేమీ నిషేధం లేదు.

చూడాల : హే మహాబాహూ! జీవన్ముక్తా! అట్లా అయితే నా అభిప్రాయమేమిటో చెబుతాను. విన్న తరువాత మీకేది అంగీకారమో అట్లే నిర్వహిద్దాం. మనిద్దరం సర్వత్రా ఏకత్వజ్ఞానం కలిగియున్నాం. రాజ్యపాలన అయినా, వనవాసమైనా మనకు రెండూ ఒక్కటే. ఇద్దరం అజ్ఞానముయొక్క ఆనుపానులను ఎఱిగాం కదా. ఇచ్ఛారహితులమై అకాశమువలె స్వచ్ఛముగా వెలయుచున్నాం. కనుక మనకు రాజ్యభోగముల పట్ల అపేక్షగాని, అనపేక్షగాని లేవు. ఎందుకంటే ఈ నేత్రేంద్రియములు తమకు ఏమి యోగ్యమో – ఆ విషయములను సేవించటం చేత 'చిన్మాత్రము' అగు ఆత్మకు క్రొత్తగా కలిగే విశేషమేముంటుంది? ఇది గ్రహించిన తత్త్వవేత్త ప్రవాహపతితమగు ఆయా విషయాలను సేవిస్తూ ఉంటాడు. ఓ పురుషోత్తమా! ఆద్యంతములలో మనం ఏ స్వభావం కలిగియున్నామో అట్టి దానినే స్వీకరిద్దాం. 'ప్రారబ్ధ కర్మ' అను దానిని అనుభవము ద్వారానే నశింపచేయాలి'....... అనునది శాస్త్ర సిద్ధాంతము కదా! కాబట్టి మనకు ఇప్పటికే ప్రాప్తించియున్న ' రాజ్యపాలన' అను ధర్మమును నిర్వహిస్తూ శేషించియున్న ఈ దేహము యొక్క ఆయువును గడిపివేద్దాం.ఆ తరువాత ఉచితమైన సమయంలో విదేహముక్తులమౌదాం.

శిఖిధ్వజుడు : ఓ ప్రియా చూడాలా! ఏదీ, చెప్పు! ఆద్యంతములలో మనం ఏ స్వభావంతో కూడుకొనియున్నాం? ప్రారబ్ధమును అనుభవించి ఆపై ఎట్లా ఉండబోతున్నాం?

చూడాల : మీరు మోహము చేతనే ఈ వనవాసం స్వీకరించారు కదా! అంతకు ముందో? రాజు కదా!ఒక్క మోహాన్ని మాత్రం త్యజించి మరల యథావిధంగా రాజుగానే అవండి. రాజసింహాసనంపై ఆసీనులై ప్రజాభీష్టానుసారం ధర్మనిరతులై రాజ్యపాలన చేయండి! 'మా రాజుగారు ఎప్పుడో వస్తారు! ఆ తరువాత ఇంకా సానుకూలమౌతుంది!' అని మాళవ రాజ్య ప్రజలు, మంత్రులు ఎదురుచూస్తున్నారు. ఏ ఏ పరిస్థితులలో ఉండి ఏవేవి నిర్వర్తించటం శాస్త్రానుకూలమో, లోకానుకూలమో ఆయా

నిర్వర్తించవలసియున్న వ్యావహారిక ధర్మములే జ్ఞానుల దృష్టిలో ప్రారబ్ధము. అంతకు మించి ప్రారబ్ధమనేదేదీ వారికి లేదు.

కాబట్టి మీ సింహాసనం మీరు అధిష్ఠించి ఎప్పటిలాగానే రాజ్యాన్ని పరిపాలించండి.

ఇక నేనో! మీ పట్టమహిషిగా రాజాంతఃపురంలో ఉంటూ మీ సాంగత్యముచే శోభను పొందుతాను. ఎప్పటిలాగానే ఉచితానుచితములగు ఆయా రాచకార్యములందు నా యోచనలను అందిస్తూ, "సహధర్మచారిణి" అను శబ్దమును అర్థప్రదం చేస్తాను. జ్ఞానులమగు మనిద్దరం ఆత్మజ్ఞాన విషయమై ఆప్తవాక్యములను ప్రసంగించుకుంటూ విశ్రాంతి కాలాన్ని గడిపివేద్దాం. మనకు అవగతము – అనుభవము అగుచున్న ఆత్మానుభవమును తదితర జ్ఞానాన్వేషకులతో పంచుకుందాం.

శిఖిధ్వజుడు : ఓ విశాలనేత్రీ ! అట్లా అయితే, మనిద్దరం స్వర్గములో నివసించటానికి కూడా స్వతంత్రులమై ఉన్నాము కదా !ఎచ్చట సిద్ధులగు దేవతల భోగైశ్వర్యములు ఉన్నాయో అట్టి స్వర్గలోకంలోనే మనం ఎందుకు నివసించకూడదు?

చూడాల : అటు స్వర్గలోకంలో గాని, ఇటు ఈ రాజ్యపాలనలో గాని క్రొత్తగా లభించే సుఖమేదీ లేదు. అఖండమగు స్వస్వరూపాత్మను గ్రహించటంచేత క్షోభ లేనివారమై, స్వస్థచిత్తముతో యథారీతిగా స్థితిని కలిగియున్నాము. "ఇది సుఖము – ఇది కాదు" – అనే ద్వంద్వం మనపట్ల నశించిపోయింది. ఇప్పుడు మనం సమరూపముచే శాంతపదమున సుఖముగా ఏర్పడియున్నాము కదా!

శిఖిధ్వజుడు : ఆహాఁ! చూడాలా! సమబుద్ధితో నీవు యుక్తియుక్తిమైనదానినే చెప్పావు. ఈ రాజ్యమును కలిగియుండుట చేతగాని,త్యజించుటచేతగాని మనకు క్రొత్తగా వచ్చే ప్రయోజనమేమున్నది?

సుఖ దుఃఖ దశా చిన్తాం త్యక్త్వా విగత మత్సరమ్.
యథా సంస్థానమేవేమౌ తిష్ఠావః స్వస్థతాంగతౌ॥

ఇక మనం సుఖ – దుఃఖ దశలకు సంబంధించిన సర్వ చింతనలు వదలివేద్దాం. మాత్సర్యరహితులమై స్వస్థత పొంది ఇతఃపూర్వంలాగానే స్థితి పొంది ఉందాం.

❖

శ్రీవసిష్ఠ మహర్షి : ఇటువంటి జ్ఞాన – విజ్ఞానయుక్తమగు సంభాషణలో ఆ రాత్రి తెల్లవారవచ్చింది. వారిద్దరు పరస్పర సమాగమమునందు అత్యంత ఉత్కంఠ కలవారైనప్పటికీ, వాసనారహితులై ఉండటం చేత ఉత్కంఠరహితులు కూడా! ఆ మరునాడు కూడా సంధ్యావందనాది దైనందిన దేవకార్యములను నిర్వర్తించి పగలంతా అనేక జ్ఞాన విషయాలు సంభాషించుకున్నారు. సాయంసంధ్య అయిన తరువాత తటాకం సమీపించి సాయం సంధ్యోపాసనాకార్యక్రమాలు నిర్వర్తించారు. స్వర్గస్థితిని కూడా నిరాదరించి ఆ ఇరువురు పూర్ణచిత్తులై ఒకే శయ్యపై ప్రణయచేష్టలతో ఆ రాత్రంతా గడిపారు. భోగలక్ష్మి, మోక్షలక్ష్మిల సేవలో వారిద్దరికీ ఆ రాత్రి ఒక క్షణంలాగా గడచిపోయింది.

❖❖❖

46. పునః రాజ్య ప్రవేశం

శ్రీవసిష్ఠ మహర్షి : ఆ రాత్రి గడచిన తరువాత మరునాడు ఆ దంపతులిద్దరూ ఒకరినొకరు అభిషిక్తులనుగా చేసుకున్నారు. "ఓ రాజా! మునులకు యోగ్యమైన శాంతతేజమును కొంచెం ఉపసంహరించి మాళవ రాజ్యపాలనకు అవసరమైయున్న శాసన తేజమును అవధరించెదరు గాక" అని చూడాల ఛలోక్తులు ఆడుచుండగా, ఇక అక్కడి నుండి ఆ దంపతులిద్దరూ బయలుదేరారు. మధ్య మధ్యలో ఆయా ప్రదేశములు తారసపడుచున్నప్పుడు ఇతఃపూర్వపు ఆయా అనుభవములను సంభాషించుకుంటూ క్రమంగా మాళవదేశం ప్రవేశించారు.

రాజదంపతుల పునరాగమనం గురించిన వార్త రాజధానియగు ఉజ్జయినీపట్టణం చేరింది. మంత్రులు, సామంతరాజులు మొదలైన వారంతా రాజు శిఖిధ్వజుని అనేక సంవత్సరాల తరువాత దర్శించటానికి, సుస్వాగతం పలకటానికి సమాయత్తమైనారు. ఉజ్జయినీ నగరమంతా అత్యంత సుందరంగా అప్పటికప్పుడే అలంకరించబడింది. శిఖిధ్వజుడు నగరంలో ప్రవేశించాడు. అప్పటికప్పుడే సమావేశమైన గొప్ప ప్రజానీకాన్ని చూచి రాజు సుదీర్ఘంగా ప్రసంగించాడు. తాను కార్యార్థి అయి వెళ్ళి తిరిగి వచ్చిన ఈ 18 సంవత్సరాల కాలం రాజ్యాన్ని తమ మంత్రాగంతో కాపాడిన మంత్రులను, తదితర సేనానాయకులను పేరు పేరునా పిలిచి సన్మానించాడు. ముఖ్యంగా చూడాలను మెచ్చుకోలుతో, పొగడ్తలతో ముంచెత్తాడు. ప్రజలందరికి తనపై గల వాత్సల్య-ఆప్యాయతలకు కృతజ్ఞతలు పలికాడు. అనేక మంది ప్రజలు సుదీర్ఘకాలం తరువాత తమ రాజు శిఖిధ్వజుని చూచిన ఆనందంతో కంట తడిపెట్టారు. రాజుగారి రాకను పురస్కరించుకొని ఉజ్జయినీ పట్టణంలోను, మాళవ రాజ్యమంతటా అనేక ప్రదేశాలలోను, సామంతరాజ్యాలలోను 7 రోజులు గొప్ప ఉత్సవం జరిగింది.

ఆ తరువాత శిఖిధ్వజుడు చాలాకాలం రాజ్యపాలన ప్రజానురంజకంగానూ, ధర్మ నిరతితోను, లోక కళ్యాణ దీక్షతోను నిర్వర్తించాడు. భయ - విషాద - అభిమాన - మాత్సర్యరహితుడై ప్రాప్తించిన కర్మలను రాగవర్జిత బుద్ధితో నిర్వర్తించాడు.

సుదీర్ఘకాలం రాజ్యపాలన నిర్వర్తించిన ఆ రాజు ఆ తరువాత ఒకానొక సమయంలో రాజ్యపాలనపై విరక్తుడై రాజ్యమును పుత్రునకు సమర్పించాడు. ఒకానొక ఉచితకాలంలో భార్య చూడాలతో సహా విదేహముక్తిని ఆశ్రయించి 'సన్మాత్రము' నందు శేషించాడు. ఆ దంపతులిరువురు 'పరమపదము' అను అమృతమును పొందారు.

❖

ఓ రామచంద్రా! నీవు కూడా ఈ శిఖిధ్వజ - చూడాలల వలె యథా ప్రాప్తములైన కార్య సమూహములను నిర్వర్తించు. మరొకవైపు సమాధియందు తత్పరుడవై ఉండు. భోగమోక్ష జ్ఞానైశ్వర్యమును అనుభవిస్తూ లోకపావనుడవై ఉండెదవు గాక! నీ ఈ రామావతారము మహత్తరమై, జనులందరికీ ఇహపరములందు మార్గదర్శకమగుగాక!

❖❖❖

X. బృహస్పతి - కచ సంవాదం

1. సర్వ త్యాగం అంటే ఏమిటి?

శ్రీవసిష్ఠ మహర్షి : రామచంద్రా! ఈ విధంగా శిఖిధ్వజుని మోక్ష కథను విన్నావు కదా! అందులో చెప్పబడిన మార్గంలో పయనిస్తే నీవు ఎన్నటికీ ఖిన్నుడవు కావు. అందులో అంతర్లీనంగా ప్రకటించ బడిన రాగద్వేషవినాశకారకమగు దృష్టిని అవలంబించి పూర్ణానందపథమున సుదృఢముగా నెలకొని ఉండు. శిఖిధ్వజుని లాగానే నీవు కూడా వ్యవహారం ఆచరిస్తూనే భోగమోక్షాలచే పూర్ణుడవై ఉండు.

ఆ శిఖిధ్వజుని లాగానే "పూర్వం ఒకప్పుడు బృహస్పతి కుమారుడైన కచుడు జ్ఞానిగా తీర్చిదిద్ద బడటం" అనే ఒక దృశ్యం నా మస్తిష్కంలో మెరుస్తోంది. సందర్భానుచితం కనుక ఆ సంఘటనను కూడా ఇక్కడ ప్రస్తావించుకుందాం.

❖

శ్రీమంతుడు, మహాజ్ఞాని, దేవ గురువు అగు బృహస్పతి గురించి నీవు వినే ఉన్నావు కదా! ఆయన కుమారుడు కచుడు. ఆతడు బాల్యంలోనే సర్వవిద్యా పారంగతుడైనాడు. యౌవనం ప్రవేశించే సరికి అఖండాత్మానుభవమునకు అనేక అర్హతలు సంపాదించుకున్నాడు. ఒక రోజు తండ్రి బృహస్పతి ప్రశాంతంగాను, ఆహ్లాదంగాను ఉన్న సమయంలో కచుడు సమీపించి ఒక ప్రశ్న అడిగాడు.

కచుడు : పితృదేవుల వారికి సాష్టాంగదండ ప్రణామములు.

బృహస్పతి : పుత్రా! పూర్ణజ్ఞానివయ్యెదవు గాక! ఏమిటి విశేషం? ఏదో అడగాలని వచ్చినట్లున్నావు! నిస్సంకోచంగా నీ సందేహమేమిటో చెప్పు.

కచుడు : తండ్రీ! ఈ జీవుడు ఎప్పుడూ సంసారపంజరంలో చిక్కుకుని నానా అగచాట్లు పడుచున్నాడే! అట్టి బంధనం నుండి విముక్తుడు కావటం ఎట్లా?

బృహస్పతి : కుమారా! అనేక మొసళ్ళకు ఆలవాలమైన ఈ సంసారసాగరం అతి దుర్భరమైనదే. అయితే 'సర్వత్యాగము' అను బలం నీకు ఉంటే ఆ మొసళ్ళు నిన్ను ఏమీ చేయలేవు. అప్పుడు నీవు నిర్భయంగా సంసారమును దాటి వేయవచ్చు.

కచుడు : అయితే నేను సర్వమును త్యజించి ఎటకో వెళ్ళిపోతాను.

బృహస్పతి : ...

బృహస్పతి మౌనం వహించాడు. 'అవును-కాదు' అనలేదు. 'సర్వత్యాగము' అను శబ్దమునకు కచుడు గ్రహించిన అర్థం అత్యంత అసంపూర్ణమైనదైనప్పటికీ అప్పటికి మాత్రం ఇంకేమీ పలుకలేదు. పుత్రుడు ఎటకో వెళ్ళుచున్నప్పటికీ బృహస్పతికి దుఃఖమేమీ కలుగలేదు. మహాత్ములు సంయోగ వియోగములందు మేరుపర్వతంలాగా స్థిరబుద్ధి కలిగి ఉంటారు కదా!

❖

కచుడు అక్కడి నుండి బయలుదేరాడు. ఇల్లు-వాకిలి-విడిచి మహారణ్యాలలో ప్రవేశించాడు. ఆ విధంగా 8 సంవత్సరాలు గడచిపోయాయి. ఒక రోజు ఒక మహారణ్యంలో ఒకచోట కాకతాళీయంగా కచుడు తండ్రిని కలుసుకున్నాడు. ప్రణామములు అర్పించాడు.

బృహస్పతి : పుత్రా! క్షేమమే కదా?

కచుడు : తండ్రీ! మీరు నన్ను సర్వత్యాగం చేయమన్నారు కదా! ఇప్పటికి 8 సంవత్సరాలు గడిచాయి.

బృహస్పతి : ఊ!

కచుడు : సర్వత్యాగం చేసి ఇన్నాళ్ళైనా నేనింకా అనిందితమైన విశ్రాంతిని పొందనే లేదు. ఎందుచేత? నన్నిప్పుడు ఏం చేయమన్నారు? అతిదీనుడనై మిమ్ములను వేడుకుంటున్నాను, చెప్పండి.

బృహస్పతి : చెప్పాను కదా! కొంత త్యజించి, కొంతపట్టుకుని ఉంటే సరిపోదు. సమస్తము త్యజించు. అప్పుడు విశ్రాంతి దానంతట అదే లభిస్తుంది.

❖

ఇట్లా అని బృహస్పతి ఇంకేమీ మాట్లాడకుండా అంతర్ధానమై నిజమార్గంగా వెళ్ళిపోయాడు.

తండ్రి అంతర్ధానమైన తరువాత కచుడు కొంచం సేపు యోచించాడు. 'ఏమిటి? నాన్నగారు సమస్తం త్యజించమంటున్నారు! అన్నీ వదిలాను కదా! అన్నీ వదలిన తరువాత ఇంకేమి త్యజించాలి?'... అని ఆలోచించగా, అతని మనస్సులో ఒక ఆలోచన వచ్చింది. "ఓహో!అదా! ఈ వస్త్రములు, బొంత, చేతికఱ్ఱ ఇవి కూడా త్యజించమని ఆయన ఉద్దేశం కదా! మంచిదే. వీటిని కూడా ఇప్పుడే త్యజిస్తాను"- అని అనుకున్నాడు. శరత్కాలాకాశం మేఘములను త్యజించునట్లు అతను తన వస్త్రములను, బొంతను, చేతి కఱ్ఱను అక్కడే వదిలేసి దిగంబరుడై బయలుదేరాడు. 3 సంవత్సరాలు గడిచాయి. ఒక రోజు అతను ఒక కొండగుహలో దిగంబరుడై ఉండగా తండ్రి, గురువు అయిన బృహస్పతి మరల తారసపడటం జరిగింది. భక్తితో తండ్రిని పూజించాడు. చాలా రోజులైన తరువాత చూడటం చేత బృహస్పతి ప్రేమగా అతనిని కౌగలించుకున్నాడు.

కొద్ది క్షణములైన తరువాత ఖేదచిత్తుడైన కచుడు గద్గదస్వరంతో ఇట్లా పలికాడు.

కచుడు : నేను బొంత, దండం, వస్త్రం అన్నీ త్యజించాను. సమస్తం త్యజించమని మూడు సంవత్సరాల క్రితం మీరు అన్నారు. అట్లాగే చేశాను. అయినప్పటికీ ఆత్మపదంలో విశ్రాంతి లభించనే లేదు.

బృహస్పతి : 'సమస్తం' అనగా ఏమిటి? వస్త్రాలా? కాదే. ఈ సమస్తం చిత్తమే అయి ఉన్నదని నీవు శాస్త్రకారుల వాక్యములు వినియే ఉన్నావు కదా! కనుక చిత్తమును త్యజించినప్పుడే సమస్తం త్యజించినట్లౌతుంది. చిత్తము ఉన్నంతవరకూ ఏదీ త్యజించనట్లే.

ఇట్లు పలికి బృహస్పతి వేగంగా ఆకాశమునకు ఎగిరి మరల ఎటో వెళ్ళిపోయాడు. అప్పుడు కచుడు ఖేదరహితమైన బుద్ధితో మరికొంత యోచించసాగాడు.

"అవును ! నా తండ్రి అన్నది నిజమే. ఈ వస్తువులను ధరిస్తున్నది చిత్తం చేతనే కదా! చిత్తాన్నే త్యజించాలి. అయితే చిత్తమును త్యజించటమంటే ఏమిటి? ఎట్లా?" - అని తీవ్రంగా చింతన

చేయసాగాడు. "ఒక వస్తువునైతే త్యజించవచ్చు. మరి, చిత్తమును ఎట్లా త్యజించటం?" అని చాలాసేపు యోచించాడు. అతనికి ఆ వాక్యములోని అర్థము గాని, ఉద్దేశము గాని ఏమాత్రం అవగాహనకు రాలేదు. 'పోనీ, ఈ దేహమును త్యజిద్దామా? ఇదొక్కటేగా నాకు మిగిలి ఉన్నది!' అని యోచించసాగాడు. 'లాభం లేదు. పదార్థమయమగు ఈ దేహం చిత్తం యెట్లా అవుతుంది? స్వయం ప్రతిపత్తి లేని దేహాన్ని త్యజించినంత మాత్రంచేత పితృదేవులు ఉద్దేశించిన చిత్తం యొక్క త్యాజ్యం అవదు'... అనుకున్నాడు.

మరిప్పుడేం చేయాలి? "ఎందుకు? మహాశత్రువగు చిత్తం గురించి నాన్నగారినే ప్రశ్నిస్తే పోతుంది కదా!" అనే ఆలోచన వచ్చింది. వెంటనే ఏమాత్రం తాత్సారం చేయలేదు. తండ్రిని దర్శించటానికి బయలుదేరాడు. దేవలోకంలో ఒకానొక ఏకాంత ప్రదేశంలో బృహస్పతి ఆసీనులై ఉన్నాడు.

❖

కచుడు : మహాత్మ ! పితృదేవా! మీరు చిత్తమును త్యజించమని ఆజ్ఞాపించారు. నేను ఈ దేవలోకాన్ని త్యజించాను. చివరికి వస్త్రాలు కూడా త్యజించాను. అంతేకాదు ఈ పాంచభౌతికదేహం త్యజించటం కూడా పెద్ద కష్టమేమీ కాదు. అయితే చిత్తమును త్యజించటం ఎట్లాగో నేను గ్రహించలేకపోతున్నాను. అది ఒక వస్తువా? దాని స్వరూపమేమిటో, ఎక్కడుంటుందో, ఎలా త్యజించాలో చెప్పండి. అది విని మీరు చెప్పినట్లే చిత్తమును త్యజించివేస్తాను.

బృహస్పతి : కుమారా! 'మనుజునికి గల అహంకారమే చిత్తము' అని చిత్తము గురించి ఎరిగిన విజ్ఞులు చెప్పుతూ ఉంటారు. ఈ జీవుని అంతరంలో ఏ అహంకారమేదై ఉన్నదో... అదే చిత్తము.

కచుడు : 33 కోట్ల దేవతలకు గురువగు ఓ బృహస్పతి గురువర్యా! 'అహంభావం' అనేది చిత్తము ఎట్లా అవుతుంది. అది అట్లా ఉంచి, నా దృష్టిలో అహంకారం త్యజించటమనేది దుష్కరమైన విషయమనిపిస్తోంది. అట్టి త్యాగం నేను ఎంత ప్రయత్నించినా కూడా సిద్ధించటమే లేదు. కాబట్టి ఈ అహంకారం ఎట్లా త్యజించాలో తెలుప ప్రార్థన.

బృహస్పతి : ఈ అహంకారం త్యజించటం కష్టతరమైన విషయమే. అయితే దీనికొక ఉపాయం ఉన్నది. ఆ ఉపాయాన్ని ఆశ్రయించావా, అహంకారాన్ని త్యజించటం పూవును నలిపినంత తేలిక అవుతుంది.

ఆ అహంకారమునకు ఏదైతే 'నిత్య - నిర్లిప్తసాక్షి' అయున్నదో... అట్టి సాక్షిమాత్రమును ఆశ్రయించావా అప్పుడు కనులు మూయుటకంటే కూడా అహంకారమును త్యజించటం సులభమని నీవు గ్రహించగలవు. ఇందులో అనుమానమే లేదు.

ఈ అహంకారం ఎట్లా పుడుతోందో ముందుగా గ్రహించు. అది ఎట్లాగో చెబుతాను, విను–

సాక్షియగు ఆత్మ యొక్క స్వరూప–స్వభావములు ఏమరచుటచేతనే, లేక ఆత్మ గురించి అజ్ఞానమాత్రం చేత అహంకారము అనబడే భ్రమ వస్తువు సిద్ధిస్తోంది. కనుక అహంకారము ఆత్మజ్ఞానముచే తప్పకుండా నశిస్తుంది.

మిథ్య అయి కూడా భ్రమచే ఉన్నట్లు తోచుటచేత 'అహంకారము' అనబడేది యథార్థానికి లేదు. యథార్థానికి లేకపోయినా ఉన్నట్లు అనిపించటానికి ఈ ప్రపంచంలో అనేక దృష్టాంతాలు ఉన్నాయి. ఒక పిల్లవాడి బుద్ధిలో భూతమునకు సంబంధించిన సమాచారం ఏర్పడి ఉండటం చేత, ఆ బాలునికి మసక చీకట్లో భూతము ఉన్నట్లే కనిపిస్తుంది.

మిథ్యాజ్ఞానానుభవం -

1. "ఏమిరా అబ్బాయ్! నీకు భూతం కనిపిస్తోందా?" అంటే, ఆ పిల్లవాడు "ఆహాఁ! ఉన్నది. చూచాను" అంటాడు. "ఎట్లా ఉంటుంది, నీవు చూచిన భూతం?" అని అడిగితే 'కొమ్ములు – పిల్లికళ్ళు – చారెడు ముక్కు – బారెడు నోరు" ... అని తాను ఎవరి దగ్గరో విన్న వర్ణనలన్నీ చెపుతాడు. అతను చూస్తున్న భూతం ఆతని బుద్ధిలోనే ఉన్నది కాని, బాహ్యమున కాదు కదా!

2. ఒకాయన ఏదో మసక చీకట్లో ఒక పెద్ద త్రాడును చూచి, 'నీకేం తెలుసు! ఆ పాము చుట్టలు చుట్టుకుని బారెడంత ఉన్నది. అది కాటువేసిందా, చచ్చామే ! ఆ మధ్య ఎవరినో ఇట్లాగే పాము కరచి వాడు చచ్చాడట కూడా! దానికి నోరు తెరచినప్పుడు మిరమిర మెరిసే కోరలు ఉంటాయి. అది ఊదిందా, ఆ విషం శరీరానికి తగిలి, ఇక మనం పుళ్ళు వచ్చి చావవలసిందే' ...ఇలా చెప్పుకుంటూ పోతాడు. ఆ పాముకు సంబంధించిన అనుభవ జ్ఞానమంతా ఉన్నదెక్కడ? ఆ భ్రమించేవాని బుద్ధిలోనే కదా! అది పాము కాకపోయినా, పాముకు సంబంధించిన వికారాలన్నీ ఆతని ఆలోచనలను కలచివేస్తూ ఉంటాయి.

3. ఎండమావులలో తరంగాలు చూచి "అదిగో! అక్కడ నీళ్ళు మిలమిల మెరుస్తుంటే నీళ్ళులేవని అంటారేం?" అని ఒక బాటసారి తోటివారిపై మండిపడతాడు. అక్కడ నీళ్ళు లేవు. అయినా ఆ బాటసారి బుద్ధిలో గల నీళ్ళకు సంబంధించిన సమాచారమంతా ఏకమై జలమునకు సంబంధించిన భ్రమను బలపరుస్తోంది కదా!

4. ఒక మెల్లకన్ను వానికి నిజంగానే రెండవ చంద్రబింబం కనిపిస్తుంది. 'అరేఁ! నాకు రెండవ చంద్రుడు స్పష్టంగా కనిపిస్తుంటే వీడెవడో రెండవ చంద్రుడు ఉండడమే అసంభవమని దబాయిస్తాడేమిటి?'... అని కొఱకొఱా చూస్తాడు.

ఈ నాలుగు దృష్టాంతాలులాగానే అహంకారం మిథ్యయే అయి ఉండి కూడా స్ఫురిస్తోంది. అజ్ఞానముచే అవన్నీ ఎట్లా కనబడుచున్నాయో, సత్తుగాని, అసత్తుగాని కానట్టి అహంకారము కూడా అట్లాగే ఉన్నట్లే అనిపిస్తోంది.

వాస్తవానికి ఆత్మ అంశరహితమైనది. అది సంకల్ప వర్జితమైనది. అంతేకాదు. ఈ సమస్తము సర్వదా అదే అయి ఉన్నది. సర్వవ్యాపకమగు అయ్యది పరమాణువు కంటే కూడా అత్యంత సూక్ష్మమైనది. అట్టి చిన్మాత్రము అగు ఆత్మ ఒక్కటే సత్యమై వెలయుచున్నది.

సర్వత్ర, సర్వదా, సర్వప్రకాశం, సర్వజన్తుషు ।
తదేవైకం కచత్యమ్బు విలోలా స్వబ్ధి వీచిషు ॥

సముద్రంలో అనేక తరంగాలున్నాయి. నిరంతరం ఎన్నో లయిస్తున్నాయి. మరికొన్ని పుట్టుకొస్తున్నాయి. అయితే తరంగాలన్నిటిలోనూ ఉన్నది ఒకే జలం కదా! సర్వదా, సర్వత్రా సర్వజీవుల రూపంగా – సర్వ జీవులందూ ఆ ఆత్మ ఒక్కటే ప్రకాశరూపమై స్ఫురిస్తోంది. అటువంటి ఆత్మయందు అహంభావం అనునది ఏ రూపంలో ఎట్లా ఉత్పన్నమౌతుంది చెప్పు? దీపంలో ఉండే నీలఛాయా విభాగం జలమంటే మనం ఒప్పుకుంటామా? అట్లాగే జలంలో చంద్రుడు, నక్షత్రాలు ఉంటాయా? ఆత్మయందు అహంకారమనునది ఉండజాలదు. కాబట్టి కుమారా, కచుడా! నీకు వ్యర్థముగా అనుభవమగుచున్న 'నేను–వాడు–నీవు' అను పరిమితాహంకార స్వరూపములపై నీవు విశ్వాసమును తొలగించుకో. ఎందుకంటావా? నీవు ఆత్మవు మాత్రమే. అట్టి ఆత్మయందు దేశ–కాల పరిచ్ఛేదములు ఎట్లా ఏర్పడతాయి? అది సర్వదా స్వచ్ఛమై నిత్యోదిత తత్త్వమై సర్వవ్యాపకమై సమస్తమునకు అధిష్ఠానమై ఉన్నది. సమస్త బ్రహ్మాండములకు ఆధారము, సారము కూడా ! అట్టి నిర్మలము, నిత్యము, అనంతరము, నిత్యానంద స్వరూపమే నీవు కూడా!

అఖండము, అద్వయము, సన్మాత్ర రూపము అయినట్టి నీ యందు ఇక పరిచ్ఛిన్నమగు "నేను" "నీవు" అను వాటికి ఉనికి ఉండటమే కుదరదు. ఒకే రసము వనమంతా విస్తరించి ఫలములుగాను, పుష్పములుగాను, ఆకులుగాను అగుచున్నది చూచావా! నీవే నీకు దర్శనమగు ఈ చరాచర జగద్విషయములుగా విస్తరిస్తున్నావు. ఇది గమనించి, స్వస్వరూప ఔన్నత్యమును గ్రహించి స్వస్థుడివి కమ్ము.

❖

శ్రీవసిష్ఠ మహర్షి : చూచావా రామా! ఈ విధంగా 'ప్రత్యగాత్మ–పరమాత్మ' ఈ ఇరువురి 'ఐక్యము' అనే పరమయోగమును దేవగురువగు బృహస్పతి తన కుమారుడగు కచునకు ఉపదేశించాడు. అది విని, మరల–మరల తాను అంతకు ముందే వినిన యుక్తుల చేత, స్వకీయ విచక్షణ చేత విచారణ చేసిన వాడై, ఆ కచుడు క్రమంగా 'లేనివస్తువే' అయిన అహంకారమును రహితం చేసుకున్నాడు. హృదయగ్రంథులు ఛిన్నమొనర్చుకుని, ప్రశాంత బుద్ధికలవాడై, ఏ వికారములు లేనివాడై స్వయంప్రకాశకమగు మణివలె వెలుగొందాడు. నీవు కూడా అట్లే స్వయమాత్మజ్యోతి స్వరూపుడవై వెలుగొందుము.

అహంకారమును అసత్తుగా ఎరుగుము

అహంకారమ్ అసత్ విద్ధి, ఏన మా ఆశ్రయ మాత్యజ ।
అసతః శశ్వ శృంగస్య కిలత్యాగ గ్రహౌ కుతః ॥

"ఈయనేమో కుందేటికొమ్మును ఆశ్రయిస్తున్నాడు. ఆయనేమో త్యజిస్తున్నాడు" ...అనే వాక్యానికి అర్థమేమన్నా ఉన్నదా? కుందేలుకు కొమ్మే ఉండదు కదా! అట్లాగే 'అహంకారము అనేది మిథ్య' అని తెలుసుకొని ఉండు. ఇక నీవు దానిని ఆశ్రయించనూ వద్దు, త్యజించనూ వద్దు. మిథ్య అయిన దానిని పట్టుకోవటం గాని, వదలటం గాని ఉంటాయా?

అసంభవత్యహంకారే, క్వతే మరణ-జన్మనీ ।
నభః క్షేత్రే తథా వృప్తం కేన సంగృహ్యతే ఫలమ్ ॥

"ఒకాయనకు ఆకాశంలో గొప్ప పొలం ఉన్నది. ఆ పొలంలో మామిడి వృక్షాలు ఉన్నాయి ఆ మామిడి వృక్షాలకు కాచినవే ఈ ఫలములు" ...అనే వాక్యం ఒప్పుకుంటామా? ఆకాశంలో పొలం ఎట్లా ఉంటుంది? అహంకారమే అసంభవమైనప్పుడు ఇక అహంకారం పుట్టటం చావటం అనేది ఎవరికి? ఎచ్చట?

నిరంశం శాంతసంకల్పం, సర్వభావాత్మకమ్ తతమ్ ।
పరమాదప్యణోః సూక్ష్మం చిన్మాత్రం, త్వమ్ అమనోమయమ్ ॥

సర్వ అంశలకు అతీతమై, శాంతమై సర్వభావాత్మకమై, పరమాణువు కంటే కూడా సూక్ష్మమై మనోరహితమై ఏ చిన్మాత్రము సర్వదా ఉండి ఉన్నదో.... ఓ రామా! అదియే నీవు.

యథా అంబస తరంగాది, యథా హేమ్నే అంగదాది చ ।
తదేవ తదివా భాసం తథా అహంభావ భావితః ॥

ఒకడు సముద్రం ఒడ్డున కూర్చుని 'ఇది చిన్నతరంగం, అది పెద్ద తరంగం'... అని అనుకుంటున్నాడు గాని, తరంగాలన్నిటిలోనూ ఉన్నది ఒకే జలం అని ఏమరచుచున్నాడు. 'ఇది ఉంగరం, అది గాజు, ఆ ప్రక్కది వడ్డాణం'... అని అనుకుంటున్నాడు గాని 'ఇదంతా ఒకే బంగారం' ...అని ఏమరచుచున్నాడు చాచావా ? అట్లాగే చిన్మాత్రుడైన ఈ జీవుడు 'అహంభావమును భావించ బడుచున్నాడు. ఓ రామా! మాయామమయమగు ఈ జగత్తంతా కూడా అజ్ఞానము చేతనే స్థితి పొందియున్నది. అయితే జ్ఞానముచే ఇదంతా కూడా బ్రహ్మరూపంగా అనుభవం కాగలదు. కనుక నీవు ద్వైత-ఏకత్వబుద్ధిని త్యజించు. అప్పటికీ శేషించియుండే దానియందు సుఖంగా స్థితి కలిగియుండు. అంతేగాని మిథ్యాపురుషుని వలె వ్యర్థంగా దుఃఖితుడవు కావద్దని నా మనవి.

ఈ సంసారము మహాసాగరమువలె దాటుటకు అత్యంత దుర్భరంగా అనిపించవచ్చు గాక! అయితే ఏం? ఎండకు మంచుకరిగిపోవునట్లు, జ్ఞానముచే ఇది పటాపంచలు కాగలదు.

❖❖❖

XI. మిథ్యా పురుషుడు

1. ఆకాశాన్ని భద్రపరచుకోవటమెట్లా ?

శ్రీరాముడు : మునీంద్రా! ఒక చాతక పక్షి చాలాకాలంగా వర్షపు జలం కోసం ఎదురుచూస్తూ ఉండగా, ఒక రోజు అనుకోకుండా దైవవశంగా కుంభపోతవర్షం పడితే ఎంత ఆనందిస్తుంది? మీరు కురిపించే జ్ఞానామృతంచే నా అంతరంగం అంతటి తృప్తిని శీతలత్వమును అనుభవిస్తోంది. సమస్త – అసమాన సంపదలకు ఆవల నేనిప్పుడు స్థితి కలిగియున్నాను.

అయితే, బాగా దాహంగా ఉన్న ఒక చకోరపక్షి ఎంతగా చంద్రకిరణాలు గ్రోలినా తృప్తి పొందనట్లు మీ వాక్యాలు ఇంకా ఇంకా వినాలని అనిపిస్తోంది. 'చాలు' అను తృప్తి కలగటమే లేదు.

మీ వాక్యములచే తృప్తుడనైనప్పటికీ మిమ్ములను మరల అడుగుచున్నాను. ఎంత తృప్తిచెందినా అమృతాన్ని వద్దు అని ఎవడూ అనడు గదా!

ఇప్పుడు మీరు "మిథ్యా పురుషుడు" అనువాని గురించి ప్రస్తావించారు. అవస్తువగు ఈ జగత్తును వస్తురూపంలో ప్రదర్శించే ఆ మిథ్యా పురుషుడెవడు? ఆతని కథ ఏమిటి?

శ్రీవసిష్ఠ మహర్షి : హాస్య సన్నివేశం వంటి ఆ మిథ్యా పురుషుని గురించి చెబుతాను విను.

❖

అందరికీ తెలిసియే ఉన్న ఒకానొక పురుషుడున్నాడు. ఆతను మాయాయంత్ర మయుడు. చిన్న పిల్లవాడిలాగా అల్పమైన బుద్ధిగలవాడు. మూఢత్వంలోను, మూర్ఖత్వంలోను ఆతనికి ఆతడే సాటి. ఆతడు ఒకానొక ప్రదేశంలో నివసిస్తున్నాడు. బాగానే ఉన్నదా...?

అయితే, అతడు పుట్టింది, పెరిగింది ఒక ఏకాంత ప్రదేశంలో. ఇప్పటికీ ఆతడు ఆ ఏకాంత ప్రదేశంలోనే ఉన్నాడు. అక్కడ ఆ మిథ్యా పురుషుడు తప్పితే మరింకెవరూ లేరు. ఆ ప్రదేశంలో ఏదేది ఉన్నదో అదంతా ఆతడి విన్యాసమే. అనేక దర్పణాలలో ఒకే మనిషి అనేక కోణాలలో ప్రతిబింబిస్తాడు, చూచావా? ఆ మిథ్యా పురుషుడే అనేక విశేషాలుగా అక్కడ (ఆతడు ఉన్న ప్రదేశంలో) ప్రతిబింబిస్తున్నాడు. ఆతనికి అనుభవమయ్యేదంతా ఆతని ఆభాస మాత్రమే!

అయితే ఏం ? 'ఇన్నిట్లో నేనే ఈ వివిధ రూపాలుగా ప్రతిబింబిస్తున్నాను'... అనే విషయం ఆ దుర్బుద్ధికి తెలియటం లేదు.

ఆతడు ఈ విధంగా ఆ ఏకాంత ప్రదేశంలో ఎదుగుచూ ఉండగా ఏం జరిగిందో విను. ఒక రోజు "నేనెవరినబ్బా?" అనే ప్రశ్న వచ్చింది. 'నేను నా చుట్టుప్రక్కల ఉండే ప్రదేశ ఆకాశమునకు చెందిన వాడను. అసలు నేను ఆకాశమునే. కాబట్టి నా ఈ ప్రదేశమును సర్వదా రక్షించుకోవటమే నా పని. – అనే సంకల్పం ఆతనిలో పుట్టింది.

మరి ఈ ప్రదేశాకాశమును రక్షించటానికి ఏం చేయాలి? "ఇది ఎటూ పోకుండా గోడలతో ఇల్లు కట్టిస్తే పోలా?" అని అనుకున్నాడు. ఇంకేముంది? తానున్న ఆ ప్రదేశంలో చుట్టూ ఓ పెద్ద ప్రహరీ గోడ కట్టి, దాన్ని పెద్ద గృహంగా తీర్చిదిద్దాడు . "తనది. తన రూపమే" అని అనుకున్న ఆ ప్రదేశాకాశాన్ని గృహాకాశంగా మార్చివేశాడు. ఆ గృహము యొక్క అంతర్భాగాకాశంలో కూర్చుని 'ఇక నాకేమీ ఫరవాలేదు. ఈ నాలుగు గోడల మధ్య నేను రక్షించబడినట్లే. దీనిని ఎప్పటికీ కాపాడుకుంటూ ఉండటమే నా పని. ఇక నాకేం అవసరం లేదు'... అని అనుకుంటూ సంతుష్టుడైనాడు.

రోజులు దొర్లుతున్నాయి. మాసాలు, ఋతువులు గడచి పోతున్నాయి. ఎండాకాలం ఎండ, వర్షాకాలం వర్షం వస్తున్నాయి. గతిస్తున్నాయి. ఏదైనా సరే, కాలగతికి హరించవలసినదే కదా! ఆ ఇల్లు కాస్తా, కాలగతిచే శిథిలమైపోయింది. గోడలు నేలకూలాయి. అప్పుడా మిథ్యా పురుషుడు ఇట్లా అనుకున్నాడు.

"అయ్య బాబోయ్! కొంపమునిగింది. ఈ గోడలు కాస్తా నేలకూలాయ్! ఓ గృహాకాశమా! నీవు నశించిపోయావా? అయ్యో! కొద్ది రోజులలో అంతు దొరక్కుండా పోయావే? ఇప్పుడేమిటి చేయాలి?"... అని దుఃఖించసాగాడు. తనదనుకున్న గృహాకాశాన్ని రక్షించటానికి అక్కడే ఒక నుయ్యి ఒకటి త్రవ్వుకున్నాడు. 'నా ఆకాశాన్ని ఈ నుయ్యిలో జాగ్రత్తగా పదిలపరచుకుంటాను' అని అనుకున్నాడు. ఇక ఆ కూపాకాశాన్ని రక్షించుకుంటూ రోజులు గడుపుచున్నాడు.

ఆ విధంగా కొన్ని సంవత్సరాలు గడచిపోయాయి. 'ఈ నుయ్యి నాది' అని అనుకుంటూ ఉన్నంత మాత్రంచేత కాలగతి ఊరకుంటుందా? కాలక్రమంగా కొన్నాళ్టికి గాలి – ధూళి ఏకమై ఆ నూతిని క్రమక్రమంగా పూడ్చి వేయసాగాయి. అట్లా ఆ కూపమంతా పూడిపోయేసరికి ఆ మిథ్యా పురుషునికి ఎక్కడ లేని దుఃఖాలన్నీ మళ్ళీ వచ్చిపడ్డాయి. 'అయ్యో! నేను నా ఆకాశమును తీసుకువచ్చి ఈ నుయ్యిలో కూపాకాశంగా మార్చి దాచుకున్నానా! ఈ పాడు ధూళి గాలికి లేచి నూతిలోకి పడటంతో ఈ నుయ్యి కాస్తా పూడుకుపోయింది. ఇప్పుడు నా ఈ ఆకాశాన్ని ఎక్కడ దాచుకోవాలి? సరే ఇక్కడ మట్టితో ఒకపెద్ద కుంభమును తయారుచేసి ఆ కుంభము (కుండ) ఆకాశాన్ని జాగ్రత్తగా దాచుకుంటాను"... అని అనుకున్నాడు.

క్రిందా – మీదా పడి ఒక కుంభాన్ని తయారు చేసుకున్నాడు. కుపాకాశాన్ని కుంభాకాశముగా మలచుకొన్న అనుభూతితో సంతోషం పొందాడు. 'అమ్మయ్య! ఇక ఫరవాలేదు. ఈ కుంభములో నా ఆకాశాన్ని కాపాడుకుంటాను. ఇంతే! ఇక ఎంతకాలమైనా కానీ!" ...అని సంతోషించాడు. అట్లా ఆ కుంభమును, అందులోని ఆకాశాన్ని చూచుకుంటూ కొద్ది నెలలు గడిపాడు. కొంతకాలానికి ఈ కుంభముకాస్తా చెత్త, మట్టి కూరుకుపోయి క్రమంగా ఎప్పుడో నామరూపాలు కనబడకుండా పోయింది. 'ఇదేంటిరా నాయనా! కుంభము కాస్తా నశించిపోయింది ? ఇప్పుడేం చేయాలి?' అని కొంతకాలం దుఃఖించాడు.

సరే! అప్పుడు అక్కడా–ఇక్కడా తిరిగి కొన్ని వాసాలు, రెల్లుగడ్డి, తాటాకులు సంపాదించి ఒక

పాకను నిర్మించాడు. ఈ పాకలో నాలుగు గదులున్నాయి. ఆ గొప్ప పాకశాలపై ఎంతో ఆసక్తి కలవాడై, తన్మయుడై తన ఆకాశాన్ని ప్రతిక్షేపించుకున్నాడు. మరికొంత కాలం తరువాత ఆ పాక కూడా నేలకూలింది. ఆకులు, రెల్లుగడ్డి ఎండి నశించిపోయాయి. మన మిథ్యా పురుషుని దుఃఖ స్థితి మరల పునరావృతమైనది. ఆ నాలుగు గదుల పాకశాల గురించి ఏడ్చి, ఏడ్చి కొన్నాళ్ళైన తరువాత గోగు పుల్లలు తెచ్చి ఒక ధాన్యపు కొట్టు (కుసూలము) నిర్మించాడు. అతి కొద్ది కాలంలో ఆ కుసూలము కూడా నేలమట్టమై హరించుకుపోయింది. అది నశించినప్పుడు ఆతని దుఃఖం వర్ణనాతీతం.

❖

ఓ రామచంద్రా! ఈ విధంగా ఆతడు ఇల్లు, నుయ్యి, కుండ, పాకశాల, ధాన్యపు కొట్టు మొదలైనవి నిర్మించుకోవటం... అవి కాస్తా నశించటం – ఈ విధంగా అనంతకాలం గడచిపోతోంది. అతను ఎంతో అభిమానంతో ఏదో ఒకటి నిర్మించుకోవటం, అది కాస్తా కాల ప్రవాహముచే నశించటం, అది నశించినప్పుడల్లా ఆ మిథ్యా పురుషుడు గొప్ప దుఃఖం పొందుతూ కొంతకాలం గడపటం–ఈ తతంగం సాగిపోతూనే ఉన్నది. అట్లా వేల కొలది రచనలు చేసుకుంటూనే ఉన్నాడు. అవన్నీ మరికొంత కాలానికి నశించటం జరుగుచూనే ఉన్నది.

ఇక ఆ మిథ్యా పురుషుడు ఒకప్పుడు 'నేను సుఖంగా ఉన్నాను. ఎందుకంటే నీ ఆకాశం ఇక్కడ పదిలపరచాను కదా!" ...అనుకోవటం, ఆ నిర్మించుకున్నది శిథిలం కాగానే భోరున ఏడవటం... ఇదంతా చూస్తుంటే నాకు జాలి కలుగుతోంది. కానీ ఏం చేయాలి? మేము చెప్పుచున్న దేమో అతడు వినడాయె!

❖❖❖

2. అహంకారమే ఆ మిథ్యా పురుషుడు!

శ్రీరాముడు : స్వామి! మీరు ఇంతవరకు వర్ణించి చెప్పిన ఆ మిథ్యా పురుషుడెవడు? ఆతడు ఆకాశ సంరక్షణ చేసుకొంటున్న తాపత్రయమంతా ఏమై ఉన్నది? ఆ మాయా పురుషుడు తను పుట్టిన తనదనుకొన్న స్థానమును (స్థలమును) కాపాడుకోవటానికి గృహాదులను నిర్మించుకోవటంలోను అవి నశిస్తున్నప్పుడు భోరున ఏడవటంలోను తాత్పర్యమేమిటి?

శ్రీవసిష్ఠ మహర్షి : ఆ మాయా యంత్రమయుడగు పురుషుని గురించి మనం చెప్పుకున్న విశేషాలకు సంబంధించిన తాత్త్వికార్థం ఏమిటో చెపుతాను విను.

❖

అతడు మరెవరో కాదు. ఆతడు శూన్యాకాశమునుండి ఆవిర్భవించిన ఈ 'అహంకారము' అనునదే! ఏ ఆకాశకోశమునందైతే ఈ జగత్తంతా అనంతమై భాసిస్తోందో... అదియే అహంకారము. అయితే అట్టి అహంకారం సృష్టికి పూర్వం స్వయంగా అసత్తై, శూన్యమాత్రమై ఉన్నది. ఏ మాయాకాశం

నుండి అహంకారమనునది ఉత్పన్నమౌతోందో అట్టి ఆ మాయాకాశము యొక్క ఉనికి – అధిష్ఠాన రూపముచే బ్రహ్మమునందే ఉండి ఉన్నది. అనగా, చిదాకాశమునందు ఆధ్యస్తమైన మాయాకాశము నుండి 'అహంకారము' అనేది ఉదయిస్తోంది సుమా!

అనాత్మయే అయినప్పటికీ 'ఆత్మత్వం' పొందిన ఈ అహంకారం మాయాకాశముననే (తాను జన్మించిన స్థానమునందే) వృద్ధి పొందుతోంది. అక్కడే 'ఇదిగో, ఇది నాకు ఇష్టం. అది ఇష్టం ఉండదు' ...మొదలైన అనేక రకములైన కల్పనలన్నీ కల్పించుకుంటోంది. ఇక ఆ అహంకారం ఇష్టమైన వాటిని సంపాదించుకోవటం కోసం, అయిష్టమైన వాటిని తొలగించుకోవటం కోసం సుదీర్ఘ కాలంగా మహాప్రయత్నముల సంరంభంలో మునిగి ఉంటోంది. అనాత్మయగు ఈ పాంచ భౌతికమైన దేహ పంజరమును – అద్దాని సంబంధమైన ఆశావిశేషాలను చూచుకుని 'ఇదే నా సర్వస్వం. ఇదే నా స్వరూపం. ఇంత మాత్రమే నేను' అని అనుకుని దేహాన్ని–ఆశలను రక్షించుకోవటానికి ప్రవృత్తమౌతోంది. అట్టి ఈ పాంచభౌతిక దేహం కాలంచే నిర్మించబడింది కనుక తప్పకుండా అయితే, కాలము చేత పొందబడేదంతా హరించబడవలసినదే కదా!

ఈ దేహం ఆయా అవస్థలలో కృంగిపోతూ ఉంటే ఇక ఆ అహంకారం 'గోవిందా! ఇక నా పని అయిపోతోంది. ఇక గతి లేదు. చేయగలిగినది లేదు'... అంటూ వాపోతున్నది. దేహమును ఆశ్రయించినంత కాలం దేహరంధ్రముల వంటి ఇంద్రియములకు విషయములగుచున్నవాటి పట్ల ప్రీతి–అప్రీతులను కల్పించుకొని ఉంటోంది. ఇక దేహము శిథిలమగుచున్నప్పుడు 'నా సర్వస్వము పోతుంది–నేను ఇట్లా శిథిలమౌతున్నాను'... అని గావుకేకలు పెట్టుచున్నది. ఆ విధంగా పూర్వ దేహములు నశించుచుండగా క్రొత్త క్రొత్తవగు ఉత్తరోత్తర దేహములను సృష్టించుకుంటోంది.

ఈ అహంకారమే మాయాపురుషుడు అదియే మిథ్యా పురుషుడు స్వతహాగా అసత్తే అయినప్పటికీ ఈ అహంకారము (నేను–నాది అను ఆవేశం) మాయచే వ్యర్థంగా ఉదయిస్తోంది. ఈ భూచర–జలచర ఆకాశచరాది అనేక దేహములను ఇష్టానిష్టముల కారణంగా ఆశ్రయిస్తోంది. ఎప్పుడు ఏ దేహమును ఆశ్రయించటం జరిగితే అదే తన పరిమితము, అవధులు అని సంకుచితత్వము సంతరించుకుంటోంది 'ఈ దేహాన్ని నేను ఏం చేసి రక్షించుకోవాలి?' అని అగచాట్లన్నీ తెచ్చిపెట్టుకుంటోంది.

అయితే ఏఏ జగదాకార విభ్రమములు అహంకారమును మోహింపజేస్తున్నాయో చెబుతాను విను– 1. జీవుడు 2. బుద్ధి 3. మనస్సు 4. చిత్తము 5. మాయ
6. ప్రకృతి 7.సంకల్పము 8. కల్పన 9. కాలము 10. కలన...

ఇటువంటి పేర్లన్నీ అహంకారము ఆశ్రయించే మోహ వేషములే! ఇటువంటి అనేక నామరూపములచే అనేకత్వము పొంది, వేలకొలది రూపములు ధరించి, తనచే కల్పించబడిన పదార్థములచే తానే విజృంభిస్తోంది.

అనగా, 'పూర్ణబ్రహ్మము' న 'అహంకారము' అనే మిథ్యాపురుషుడు భ్రమ (లేక మాయ, కల్పన)... అనతగిన కారణంగా ఉదయిస్తున్నాడు. అతడు భూతాకాశము యొక్క కల్పన కావించుకొనుచున్నాడు. మట్టి రాయి లేని గోడలాగా ఈ జగత్తు యొక్క రచనాచమత్కృతిని

నిశ్చయిస్తున్నాడు. తనంతట తానే జగజ్జలంలో కష్టాలను, చెప్పలేనన్ని చిక్కులను, దుఃఖములను, సుదీర్ఘకాలగతిని పొందుచున్నాడు.

❖

ఓ రామచంద్రా! ఆ మిథ్యా పురుషుడు ఘటాకాశములను "తనది-తన స్వరూపము" అను శంకతో ప్రవర్తిస్తున్నట్లుగా నీవు మాత్రం అట్టి క్లేశావస్థలకు చోటు ఇవ్వవద్దు. వాస్తవానికి నీ స్వరూపం. నా స్వరూపం. తదితరులందరి స్వరూపం ఆత్మయే కదా! ఆకాశము కంటే విస్తృతమై, శుద్ధమై, శివమై, శుభమైనట్టి ఆత్మను స్వీకరించటమేమిటి? రక్షించటమేమిటి ఎక్కడో ఏ దేహాదులందో ఉంచి కాపాడటమేమిటి? సర్వవ్యాపక మగు స్వస్వరూపమును ఈ దేహాదులచే కాపాడుచున్నామనుకొనేవారు కేవలం భ్రమ చేత, అవగాహనారాహిత్యం చేత అట్లా పలుకుచున్నారని గ్రహించు. ఈ శరీరము స్వభావవశం చేత నశిస్తే ఆత్మయే నశిస్తోందనే శంకచే కొందరు జనులు నిష్కారణంగా, వ్యర్థంగా దుఃఖిస్తున్నారు. అది వాస్తవం కాదు. కుండ పగిలితే లోన ఉన్న ఆకాశం నశిస్తుందా?... లేదు.

అట్లాగే... దేహములు నశించనప్పటికీ దేహి నశించడు. ఆ దేహినే మనం 'ఆత్మ' అని అంటున్నాం. ఏ జీవుడైనా 'దేహి'యే స్వరూపంగా కలిగి ఉన్నాడు గాని, ఈ దేహము అతని స్వరూపమే కాదు. ఆత్మయగు దేహి నిత్యమై, నిర్లేపమై అవినాశి అయి వెలుగొందుచున్నాడు.

ఓ రామచంద్రా! ఆత్మ సర్వదా శుద్ధ చిన్మాత్రమై, ఆకాశము కంటేకూడా అత్యంత సూక్ష్మమై, స్వానుభవమాత్రమై ఉన్నది. ఆకాశంలాగానే ఆత్మ కూడా ఏ సమయమందును నశించటం లేదు.

న జాయతే న మ్రియతే క్వచిత్ కించిత్ కదాచన ।
జగద్వివర్తరూపేణ కేవలం బ్రహ్మ జృంభతే ॥

ఆత్మ ఎప్పుడూ, ఎక్కడా ఉత్పన్నం కాదు నశించదు. అయితే. ఈ 'జగత్తు' అను వివర్త రూపంగా ప్రదర్శితమయ్యేదంతా ఆత్మయే గాని మరింకేదీ కాదు.

సత్యమ్, ఏకమ్ పదమ్, శాంతం, ఆదిమధ్యాన్త వర్జితమ్ ।
భావాభావవినిర్ముక్తమ్ - ఇతి మత్వా సుఖీభవ ॥

ఓ రాఘవా ! ఆ ఆత్మపదము సత్యమై, ఏకమై, శాంతమై, ఆదిమధ్యాంతరహితమై, భావ - అభావ వినిర్ముక్తమై ఉన్నదయ్యా ! ఇది సర్వదా గ్రహించి సుఖవంతుడవు కమ్ము.

ఇక అజ్ఞానమంటావా?... అది సమస్త ఆపదలకు స్థానం. అద్దానిలో ధ్రువము అంటూ ఏదీ లేదు. పైగా, అది జీవునిపట్ల అస్వాతంత్ర జనకమైనది. జీవుని వివేకమునకు అది శత్రువు వంటిది. మిథ్యయైనది. అందులో అంతర్గతమై ఉన్న విశేషాలన్నీ అజ్ఞానసమన్వితమగు దేహాభిమానమునకు సంబంధించినవి మాత్రమే! అటువంటి 'అహంకారము' అనే భూతాన్ని వదించుకోవాలంటే జ్ఞానమే శరణ్యం. నీవు సర్వదా జ్ఞానమును ఆశ్రయించి, ఆపై, అజ్ఞానమగు అహంకారమును త్యజించగా శేషించియున్న ఆత్మ పదమున దృఢంగా స్థితి కలిగిఉండెదవు గాక!

❖❖❖

3. అహంకారము ఆత్మకు అన్యమైనది కాదు

శ్రీవసిష్ఠ మహర్షి : ఈ సృష్టికి ముందే పరబ్రహ్మమునందు మొట్టమొదట 'మనస్సు' అనేది బయల్వెడలుతోంది. దాని రూపము మననమే గాని మరింకేదో కాదు. ఈ మననమే సువిశాలమగు జగద్రచనగా అనుభవమౌతోంది. అది ఇప్పటికీ పరమాత్మయందే ఉన్నది. పరమాత్మయందు ఉంటూనే తదితర కల్పనలన్నిటికీ హేతువుగాకూడా అయి ఉంటోంది. తరంగాలు ఎక్కడున్నాయి? సముద్రంలోనే కదా! కిరణ సమూహాలన్నీ ఎక్కడి నుండి వస్తున్నాయ్? సూర్య బింబము నుండే కదా! సువాసన ఎక్కడి నుండి వస్తోంది? పుష్పకోశము నుండే కదా! అట్లాగే మనస్సు కూడా బ్రహ్మమునందే ఉండి, బ్రహ్మము నందే వర్తిస్తోంది. అయితే చమత్కారం చూస్తున్నావా? ఈ మనస్సు అదృశ్యమగు ఆత్మను ఏమరచి జగత్తు యొక్క కల్పనలందు ఉపక్రమిస్తోంది. క్రమంగా దృశ్యజగత్తును తనయందు గాంచుచున్నది.

ఒకడు ఒక త్రాడును చూచి 'పాము ' అని బెంబేలెత్తుచున్నాడనుకో. 'పాము' అనేది ఎక్కడినుండి వచ్చింది? త్రాడును చూచినప్పుడే కదా! కనుక పాము త్రాడులోంచే వచ్చినట్టు కదా! అట్లాగే అత్మయందు మనస్సు బహిర్గతమౌతోంది. వాస్తవానికి త్రాడులో పాములేదు. ఆత్మయందు మనో-అహంకారాలు లేవు.

శ్రీరాముడు : నిర్లిప్తము, నిర్విషయము అగు అత్మ నుండి విషయరూపమగు మనస్సు ఉద్భవించటం చమత్కారమే కదా!

శ్రీవసిష్ఠ మహర్షి : ఎవడైతే 'సూర్య కిరణములు సూర్యుని కంటే వేరు'... అని అనుకుంటాడో, వానికి ఆ సూర్య కిరణములు అన్యమైనట్లే భాసిస్తాయి. 'బంగారము కంటే ఆభరణములు వేరైనవి'... అనుకునే వాని అనుభవం అట్లే (వేరైనట్లుగానే) ఉంటుంది గాని, అది 'బంగారం కదా' అని అతను అనుకోవటం లేదు. కానీ, 'సూర్యబింబము నుంచే బయలుదేరిన కిరణములు సూర్యునికి వేరైనవి ఎట్లా అవుతాయి? బంగారము కంటే ఆభరణం వేరైనదని అనటం ఎట్లా?'... అని భావించావనుకో? అప్పుడు మొదటి వానికంటే వ్యతిరిక్తమైన అనుభవమే ఉంటుంది.

తరంగములు చూచేవానికి తరంగబుద్ధియే ఉంటుందిగాని, జలబుద్ధి ఉండదు. "తరంగములు జలము కంటే వేరు కాదు" అని తలచేవాడికో? ఇతనికి జలబుద్ధియే ఉంటుంది గాని, తరంగ బుద్ధి ఉండదు. "బంగారము యొక్క ఆకారములైన ఆభరణములందు కూడా ఉన్నది బంగారమే"... గ్రహించేవాడు మహాబుద్ధిమంతుడై ఉంటాడు. అట్టివాడు "నిర్వికల్పుడు" అని చెప్పబడతాడు. "త్రిగుణాత్మకమైన కనిపించే ఈ దృశ్యాంతర్గత జీవులంతా త్రిగుణాతీతమగు పరమాత్మ యొక్క సంప్రదర్శనా విన్యాసమే" – అని గమనించడాన్నే 'నిర్వికల్పము' అను శబ్దముచే ఉద్దేశించబడుతోంది.

"అగ్ని జ్వాలలు అగ్ని కంటే వేరు" అని భావించేవానికి అగ్నిబుద్ధి నశించి జ్వాలాబుద్ధియే ఉంటుంది. "ఈ జ్వాలలు ఆకారసమన్వితాలు" అని కల్పన చేస్తే, అవి అట్లే గోచరిస్తాయి.

ఆకాశంలో పొగపంక్తిపోతుంటే “ఇవి మేఘములే” అని అనుకుంటాడేగాని, “ఇవి బయలు దేరినవి అగ్నిలోంచే” అనేది దృష్టికి రాదు. జ్వాలల యొక్క ఊర్ధ్వ వక్ర గమనములను మేఘముల లాగానే చూస్తాడు. ‘అగ్నిజ్వాల అగ్ని కంటే వేరు కాదు’ అనే బుద్ధి (లేక, భావన) కలవానికి అగ్నిబుద్ధియే సర్వదా కొనసాగుతుంది.

అంతయూ ఆత్మగా దర్శించువాడు వికల్పరహితుడని చెప్పబడుచున్నాడు. అట్టి వికల్పరహితుడైనవాడు ‘మహాపురుషుడు’ అనిపించుకుంటాడు. ఎవరికి సర్వసంశయములు సంక్షయించి ఉంటాయో... అతడే మహామతి. అట్టివాడు ఏది పొందాలో, అది పొందినట్లే. ఇక అతడు కల్పిత వస్తువులను, విషయములను, వ్యవహారములను చూచి కలత చెందడు. ఎందుకంటే అతడు సర్వదా సత్యత్వబుద్ధి చేతనే నిమగ్నుడై ఉంటాడు కదా!

ఓ రామచంద్రా! నీవు “ఇది మనస్సు – ఇది చిత్తము – ఇది బుద్ధి” ...ఇటువంటి అనేకత్వమంతా ఈ క్షణమే త్యజించు. 1. సంవేద్యరహితమై 2. శుద్ధచిన్మాత్రమై , 3.సాక్షి రూపమై, 4.అభ్యంతరవస్తువు మొదలుగా గల మహత్తర స్వభావయుక్తమై ఆత్మయందు స్థిరుడవై ఉండుము.

❖

ఒక చిన్న దృష్టాంతం చెబుతాను విను. వాయువు ఉన్నది. అది అంతటా ఏర్పడి వ్యాపించి ఉన్నది. అట్టి వాయువు నందు ఒకానొక చలనశక్తి (ప్రసరించు స్వభావము) ఉన్నది. ఫలితంగా వాయుతరంగాలు ఏర్పడుచున్నాయి. వాయువుయొక్క తరంగత్వము అకారణమనే చెప్పాలి. అయితే ఆ తరంగత్వము “జీవులను జీవింపజేయుట” మొదలుగా గల అనేక వ్యవహారములకు కారణ మగుచు, తాను మాత్రం నిష్కారణమై ఉంటోంది. అట్లాగే ఆత్మ కూడా స్వయంగా అకారణమైనప్పటికీ తనయందు సంకల్పాత్మక శక్తి కలిగి ఉంటోంది. అట్టి స్వయంకృతమగు సంకల్పాత్మకత్వం చేత ‘జగత్తు’ అను అనుభవమును తాను పొందుతూ, ఇద్దానికి కారణమగుచున్నది. అట్టి సంకల్ప వ్యవహార సందర్భంగా అది తననుండి ఏర్పడిన మనస్సును. అందలి భావాలను, ఆ భావాలకు విషయమగుచున్న ఈ సర్వమును అనుభవరూపంగా పొందుతోంది. సంకల్పకల్పనామయమై, ప్రపంచరూపమైనట్టి ఆ మనస్సు తన ఆకృతిని తానే భావన చేయుచు స్వయముగా ఉత్పన్న మగుచున్నది. సంకల్పాత్మకమైన సమష్టి చిత్తము సమస్త ప్రపంచమును గూర్చి సంకల్పించుచుండగా, ఈ సమస్త ప్రపంచరూపము పరికల్పించబడుతోంది. అది ఎట్లు దేనిని సంకల్పిస్తుంటే – ఆ సంకల్పములను అనుసరించి – క్షణకాలంలో అట్లే అగుచున్నది. ఆ సమష్టి చిత్తమే ఒక కీటకంగాను, బ్రహ్మదేవునిగాను, మేరు పర్వతంగాను, మనస్సు – జీవుడు – అహంకారం – చిత్తము మొదలైన వ్యవహారములుగాను స్వసంకల్పముచే ధరిస్తోంది.

ఈ చిత్తము ‘సంకల్పము’ అను మూల పదార్థముచే నిర్మించబడినదై, ద్వైత–ఏకత్వరూపమగు జగత్‌స్థితిని పొందుతోంది. ఇక ఆ తరువాత ఇద్దానియందు తనకు తానే స్వయంగా అనేకత్వమును సుదీర్ఘకాలం అనుభవిస్తోంది.

❖

కనుక రామా! సంకల్పముచేతనే ఈ విశాల జగత్తు కన్పిస్తోంది. ఈ కారణం చేత ఇది సత్యం కాదు. ఎందుకంటే, ఏదీ ఎట్లు అనుభవమౌతోందో... అదంతాకూడా సంకల్పమాత్రం మరియు సంకల్ప నిర్మితమే కదా!

ఈ జగత్తు మిథ్య కూడా కాదు. స్వప్నజాలము వలె ఇది అనిర్వచనీయమై ఉన్నది. స్వప్నము అసత్యమందామా... 'అనుభవం' అనేది ఉన్నది కదా! కాదు, సత్యమందామా?

స్వప్నం కల్పనామాత్రమే కదా! నిద్రకొనసాగిస్తున్నంతవరకు స్వప్నం సర్వ వికారములు కలిగిస్తూ, ఒక సందర్భ – అసందర్భ సంఘటనల కలయిక వలె కొనసాగుతూనే ఉంటుంది. సుఖదుఃఖాది రసాభావములు గాలి కెరటముల వలె ఉంటాయి. స్వప్న సంఘటనకు ఆ స్వప్న సమయంలో దుఃఖం ఉంటుంది కనుక వాస్తవముగా అది ఉన్నట్లే కదా! ఆ ప్రాణి నిదుర లేవగానే స్వప్నం లేదు. స్వప్న సంఘటనలు లేవు. అట్లాగే ఈ జాగ్రదనుభవం కూడా! నిద్రపోయినవాని జాగ్రదనుభవం నిద్రలేవగానే కొనసాగుచున్నట్లు, దేహము పోయిన తరువాత మౌనం వహించే జాగ్రదనుభవపరంపరలు మరల దేహము ప్రాప్తించగానే సంస్కార రూపములతో కొనసాగుచూనే ఉన్నాయి. అయితే ఆత్మస్వభావం జ్ఞానపూర్వకంగా సంతరించుకున్న మరుక్షణం ఈ దృశ్యము పట్ల – దేహదుల పట్ల ఏర్పడియున్న సర్వ సందేహాలు తొలగుతాయి.

ఈ జీవుని మనోరాజ్యం 'ప్రేమ – ద్వేషము – అభిమానము – ఆశ – నిరాశ – అజ్ఞానము – విజ్ఞానసాధనలు'... మొదలైన వాటితో కూడినదై వివిధ కార్యకలాపములతో భాసిస్తోంది కదా! అట్లాగే బ్రహ్మదేవుని [సమష్టితత్త్వము యొక్క (లేక) హిరణ్యగర్భుని] సువిశాల – సుదీర్ఘ మనోరాజ్యం కూడా 'కల్పితము – భావనామాత్రము' అగు చమత్కారములతో భాసిస్తోంది.

యథా భూతార్థభావిత్వాత్ తదేవత్ ప్రవిలీయతే ।
పరమార్థేన దృష్టంచేత్ తదిదం నైవ కించన ॥

యథార్థరూపంలో భావించేవానికి దీని మాయారూపమంతా లయించిపోతోంది. ఎందుకంటే బ్రహ్మరూపముగా భావించే వానికి ఇక్కడ మాయారూపమైనదేదీ ఉండియే ఉండదు.

దృశ్యంత్వ పరమార్థేన ప్రయాతి శతశాఖతామ్ ।
జలమ్ ఊర్మి–తరంగాది కలనార్థం పరిస్ఫురన్॥

'సముద్రం' అంటే ఏమిటి? జలం మాత్రమే కదా! అయితే అందులో తరంగాలు, ఆవృత్తాలు, నురుగు మొదలైనవన్నీ వివిధ కల్పనా రూపాలుగా స్ఫురిస్తున్నాయి. జలదృష్టిచే అవన్నీ జలమే కదా! ఆ పరమార్థమగు ఆత్మతత్త్వమే అపరమార్థ దృష్టిచే ఈ వందలాది సృష్టిశాఖల రూపంలో స్ఫురిస్తోంది.

సముద్రం తరంగములు మొదలైన రూపములన్నీ ధరిస్తున్నప్పటికీ సముద్రం సర్వదా జలమాత్రంగానే ఉంటోంది కదా! అట్లాగే ఈ జీవుడు 'దేహభావన' అను వ్యవహారమును ఆశ్రయించి వేలకొలది కర్మలు ఆచరించుచుండవచ్చు గాక! అనేక దేహములు పొంది ఉండవచ్చు, పొందబోవవచ్చుగాక! అదంతా కూడా 'మనస్సు యొక్క చలనము' మాత్రమే. 'కూటస్థమగు

చైతన్యము' అను ఆ జీవుని వాస్తవ స్వరూపమునందు అపూర్వమగు వికారమేదీ కించిత్తు కూడా కలగటం లేదు. కలుగదు. అందుచేత రామా! నీవు తుచ్ఛములగు సర్వభేదములను త్యజించు. ఇక నీవు నడుస్తున్నప్పుడైనా, వింటున్నప్పుడైనా, తాకుచున్నప్పుడైనా, మాట్లాడుతున్నప్పుడైనా, నిద్రిస్తున్నప్పుడైనా, వ్యవహరిస్తున్నప్పుడైనా 'నా ఆత్మ స్వరూపమునందు అపూర్వమైనదీ ఎక్కడా ఉండజాలదు' అని గ్రహించియే ఉండు. ఏ నీ వాస్తవ స్వరూపము అఖండమై, నిర్మలమై, అప్రమేయమై, సత్యమైయున్నదో, అద్దానినే భావన చేయుచూ ఇక ఏది ఎట్లో అట్లే నిర్వర్తించు. నీవు ఏది చేసినా, చూచినా, అదంతా కూడా నిర్మలమై, వ్యాపకమైనట్టి చిన్మాత్రమేనని' ఎఱుగుము. ఈ సర్వజీవుల, సర్వ పదార్థముల నిజస్థితి సారభూతమగు సత్‌చిత్ స్వరూపమే అయి ఉన్నది. ఆ 'సత్‌చిత్' కు అన్యంగా ఎక్కడా ఏదీ లేదు.

ఈ విశాల రూపంగా భాసించేదంతా బ్రహ్మము మాత్రమే ఈ జగత్తంతా సంవిత్‌మాత్రమే! ఇక్కడ మరొక కల్పన లేనే లేదు. సంవిత్ యొక్క స్ఫురణ మాత్రమైన 'జగజ్జాలము' అను పేరుగల ఇద్దానిలో 'అది వేరు – ఇది వేరు' అనేది. ఎట్లా ఏర్పడగలదు చెప్పు? సత్‌లో మిథ్యాగ్రహణం భ్రమమాత్రమే. మరియు... అంతటా ఒకే 'సంవిత్తు అను చైతన్యమై ఉండియున్నది కనుక, ఇక సంవేద్యము (తెలియబడునది) అను దాని యొక్క (తెలుసుకొనుదానికంటే వేరైన) ఉనికి ఎక్కడున్నది? దేనికైతే ఉనికియే లేదో అది ఉనికిగలదానిని ఎట్లా బంధించిగలదో చెప్పు? 'స్వప్నం ఎక్కడి నుండో బయలుదేరివచ్చి స్వప్నద్రష్టను బంధించి ఉంచుతోంది' అనేది అర్థరహిత వాక్యంగాక మరేమిటి? స్వప్నం స్వప్నద్రష్టలోంచే బయల్వెడలుతోంది కదా! కాబట్టి 'ఉనికి–ఎరుక' అను స్వరూపముగల నీకు నీ కల్పనచే ఎరుగబడే ఈ జగత్తు వలన బంధమోక్షములు ఏర్పడుతాయని ఎవరైనా అంటే అది పరిహాసవాక్యం మాత్రమే.

కనుక రామా!

మోక్షోయమేష ఖల బంధ ఇతి ప్రసహ్య చిన్తాం నిరస్య సకలాం విఫలాభిమానాం
మౌని, వశీ, విగతమానమదో, మహాత్మా! కుర్వన్స్వకార్యమనహంకృతిరేవ తిష్ఠ ॥

ఓ రామచంద్రా! "ఇది బంధము, ఇది మోక్షము" అనబడే వ్యర్థాభిమానము గురించిన చింతను సర్వప్రయత్నములచే వదిలివేయి. ఈ వాక్కు మొదలైన సర్వ ఇంద్రియములను అధిగమించివేయి. నీకు ప్రవాహపతితంగా ప్రాప్తమైన ఈ రాజ్యపాలనము మొదలైన ఆయా కార్యక్రమములను ఉచితరీతిగా నిర్వర్తించు. అట్లు నిర్వర్తిస్తూనే మౌనివై, సంయమివై అభిమాన–మదాదులు లేనివాడవై, అహంకార – మమకార వర్జితుడవై వెలయుము.

సంశయములన్నీ పారద్రోలి నిర్భయుడవై ఉండు. శాశ్వతమైనట్టి కూటస్థభావనను అవలంబించి ఉండు. మహాకర్తవు, మహాభోక్తవు, మహాత్యాగివి కమ్ము.

❖❖❖

XII. శ్రీ శివ - భృంగీశ్వర సంవాదం

(మహాకర్త - మహాభోక్త - మహాత్యాగి)

1. జీవన్ముక్త లక్షణములు

శ్రీరాముడు : హే మహర్షీ! 'మహాకర్త' 'మహాభోక్త' 'మహాత్యాగి' అను మూడు మహావ్రతాలు వేదాంత వాఙ్మయంలో ప్రసిద్ధమై ఉన్నాయి కదా! ఆ మూడిటి గురించి మీ ప్రవచనాన్ని వినాలని నా అభిలాష!

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ! తప్పకుండా. ఒకప్పుడు ఈ మహాకర్తది మూడు వ్రతముల గురించి భృంగీశ్వరునకు జగత్ప్రభువగు శివభగవానుడు ఒక సందర్భంలో బోధించటం జరిగింది. ఆ బోధను ఇప్పుడు ప్రస్తావించుకుందాం.

❖

ఒకసారి లోకపావనుడగు శివభగవానుడు ఏదో సందర్భంలో పరివార సమేతంగా మేరు శిఖరం యొక్క ఉత్తర భాగంలోని ఒక ప్రదేశంలో విడిది చేయడం జరిగింది. ఆ విడిది చేసియున్న రోజులలో ఒక సమయంలో మహా తేజస్వియగు భృంగీశుడు తనకు గల జీవన్ముక్తికి సంబంధించిన కొన్ని సందేహాలు నివారించుకోవటానికి భక్తజన వాత్సల్యుడగు స్వామిని సమీపించాడు.

భృంగీశుడు : హే భగవాన్! దేవ దేవేశా! సర్వజ్ఞా! పరమేశ్వరా! జీవన్ముక్తి విషయమై నా సందేహనివృత్తి కొరకు మిమ్మల్ని ఒక విషయం అడిగి తెలుసుకోవాలని ఉంది. నా పై దయతో నన్ను అనుగ్రహించండి.

ఈశ్వరుడు : రా నాయనా! ఇటొచ్చి కూర్చో. అడుగు ఏమిటి నీ సందేహం!

భృంగీశుడు : స్వామీ! అంతరంగ స్వామి అయిన మీకు నా గురించి అన్నీ తెలుసు. అయినా వైద్యుని దగ్గిరకు భవరోగమునకు గొప్ప వైద్యులు కదా! ఇక వినండి.

సంసార రచనాం, నాథ! తరంగ తరలామిమామ్ ।
అవలోక్య విముహ్యామి, తత్త్వ విశ్రాంతి వర్జితః ॥

మహాత్మా! నా ఎదురుగా ఏర్పడి ఉన్న ఈ చంచల సంసార రచనను చూస్తూంటే నాకు భయమేస్తోంది. నేను అనుక్షణం విమోహితుణ్ణి అవుతున్నానే గాని, ఆత్మతత్త్వంలో విశ్రాంతి మాత్రం పొందలేకపోతున్నాను. అప్పుడు నా కనిపించింది, నేను అపరిపక్వమైన నిర్ణయాలు కలిగియుండుట చేతనే సంసారసాగరంలో కొట్టుకుపోతున్నానేమో? అందుకే సద్గురువులు, సర్వ సాక్షిస్వరూపులు, పుత్రవాత్సల్య సమన్వితులగు మిమ్ములను ఆశ్రయిస్తున్నాను.

ఇప్పుడు నేను ఎటువంటి నిశ్చయం కలిగి ఉంటే ఈ జగద్రూప జీర్ణ గృహంలో దుఃఖ రహితుడనై ఉంటానో అట్టి ఉత్తమ - ప్రియవిషయమును నాకు బోధించండి.

ఈశ్వరుడు : పుత్రా! భృంగీశా! ఈ సంసారము గురించి నీకెందుకయ్యా భయం? సంశయములన్నీ వదిలిపెట్టి, నిర్భయమైన శాశ్వతమైన 'కూటస్థాత్మ'ను అవలంబించు. మహాకర్తవు... మహాభోక్తవు... మహాత్యాగివి కమ్ము.

భృంగీశుడు : అయ్యా! 'మహాకర్త' 'మహాభోక్త' 'మహాత్యాగి' అవటమంటే మీ ఉద్దేశ మేమిటో సవివరంగా దయచేసి చెప్పండి.

ఈశ్వరుడు : వత్సా! ఆ మూడింటిని నిర్వచిస్తూ చెబుతాను. విను.

❖❖❖

2. మహాకర్త

ఈశ్వరుడు : మహాకర్త అయినవాడు ఎట్లా ఉంటాడో ముందుగా వివరిస్తాను.

1. అసంశయుడు - *(ధర్మాధర్మౌ శంకా విరహితాక్షయః, యః కరోతి యధా ప్రాప్తౌ)* 'ఆత్మయందు కర్తృత్వం – అనే ధర్మమే లేదు' అను నిశ్చయం కలిగి ఉంటాడు. ఇక యథా ప్రాప్తాలైన ధర్మాధర్మాలను, 'ఇది చెయ్యవచ్చా? అది చేయవలసియున్నదేమో?' అనే సంశయములను మొదలే విడిచిపెట్టి ఉంటాడు. అనివార్యమగు ఆయా కర్మవ్యాసంగముల పట్ల నేను చేయవలసి ఉన్నదే ఇదంతా. చెయ్యవలసింది చేయవలసిందే! సందేహించవలసినది లేదు ...అను అవగాహన కలిగి ఉంటాడు.

2. అపేక్షారహితుడు - *(రాగ–ద్వేషౌ, సుఖం–దుఃఖం, ధర్మ–అధర్మౌ, ఫలా–అఫలే అనపేక్షేణమ్ యః కరోతి)* అతనికి రాగద్వేషాలు ఉండవు. "దీని వలన సుఖం రావాలే! అది దుఃఖం కదా! ఇదే నేనెందుకు చేయాలి? అది వాడెందుకు చేయకూడదు? ఇది చేస్తే ప్రయోజనం దానివలన ఏం లాభం?"...ఇటువంటి అపేక్షతో కూడిన భావాలు కలిగి ఉండడు. ఇక ఆతని రాగద్వేష – సుఖ దుఃఖ – ధర్మాధర్మ – ఫలాఫల కార్యాలన్నీ లోకానుకూలత కొరకు మాత్రమే ఉద్దేశించబడి ఉంటాయి గాని తన యొక్క అభిప్రాయం కొరకో, అపేక్ష, కొరకో కాదు.

3. ఉద్వేగ రహితుడు - *(మౌనవన్, నిరహంభావో, నిర్మలో, ముక్తమత్సరఃగతోద్వేగం యః కరోతి)* "ఏం, నేను ఎందుకు చేయాలట?... నేనింత చేస్తున్నానే! మరి జనం చూస్తున్నారా?... నీ తోటి వారు చేసేదంతా తప్పే!... నేను కాకపోతే ఇంకెవ్వడయ్యా చేయగలిగేది?... అసలు వీళ్ళందరి సంగతి చూడాలి!" ...ఇటువంటి ఉద్వేగ భావాలు ఆ మహాకర్తకు ఉండవు. సాంసారికమైన భావావేశాల పట్ల అంతరంగంలో మౌనం వహించి ఉంటాడు. కొండపైన చెట్టు కదులుతుందేగాని కొండ కదలదుకదా! "నేను అంతటివాడిని. ఈ పని ఇంతటిది"...అనే అహంకారం వహించడు. నిరహంకారం అభ్యసిస్తూ ఉంటాడు. ఎదుటివారి తప్పులను ఏకరువు పెట్టే దోషము ఆశ్రయించకుండా నిర్మలుడై ఉంటాడు. మాత్సర్యం దరిజేరనివ్వడు. సర్వ ఉద్వేగములను జయించినవాడై విధివశాత్తు తాను చేయవలసినది నిర్వర్తిస్తాడు.

4. శంకారహితుడు - *(శుభాశుభేషు కార్యేషు ధర్మాధర్మైః యస్యమనః కుశంకయా న లిప్యతే)* ఆయా శుభ–అశుభ కార్యవ్యవహారములందు ఎవని బుద్ధి అయితే అనుమానాలతో దోషభూయిష్ఠం కాదో, అతడే మహాకర్త. బుద్ధి నిశ్చలత కలవాడై ఎప్పటికి ఏది ప్రస్తుతమైనదో అద్దానిని ధర్మనిరతుడై నిర్వర్తిస్తూ ఉంటాడు.

5. నిర్ ఇఛ్ఛిన్నుడు - *(యః సర్వత్ర విగతస్నేహో, సాక్షివత్ స్థితః – కార్యే నిరిచ్ఛం వర్తతే)* అతనికి 'ఇది నాకు ఇష్టం.అది నాకు ఇష్టం కాదు' అనబడేదంటూ ఏదీ ఉండదు. ఎందుకంటే అతడు సర్వత్రా రాగరహితుడై ఉంటాడు. సర్వమునకు సాక్షిమాత్రుడై ఉంటాడు. ఇచ్ఛారహితుడై నిజాశ్రమధర్మములను నిర్వర్తిస్తూ ఉంటాడు.

6. ఆవేశ - ఆనందరహితుడు - *(ఉద్వేగానంద రహితః, సమయా, స్వచ్ఛయా, ధియా, యో న శోచతో, యో నోదేతి)* దేనికీ ఉద్వేగంగాని, ఆనందంగాని చెందదు. సమమైన – స్వచ్ఛమైన బుద్ధిని కలిగి ఉంటాడు. ఈ సుఖదుఃఖాలన్నిటికీ అతీతుడై నిర్మలమైన హృదయంతో ఈ 'జీవితం' అనుదానిని తన అనంత స్వరూపమునందలి ఒకానొక చిన్నచమత్కారముగా, ఒక కళగా గాంచుతూ ఉంటాడు.

7. అసంసక్త మనస్కుడు - *(యః యధార్థకాలే మతిమానః, అసంసక్తమనాః, మునిః, కార్యానురూపవృత్తస్తో)* అతడు ఆయా కాలాలో సంప్రాప్తించే విధి విధానాలను అసంసక్తంగా నిర్వర్తిస్తూ ఉంటాడు.కార్యానుకూలంగా ప్రవర్తిస్తూనే మహాబుద్ధిమంతుడై నిత్యానిత్యవివేకి అయి ఉంటాడు.

8. సమదర్శి - *(యః కర్తృతాం చ, కర్మ – అకర్మాచరంశ్చ ఉదాశీనః, యః అంతరః అత్యంతమ్ సమం యాతి)* ఉదాసీనుడై ఉంటూనే దైవికంగా ప్రాప్తించే విహిత–అవిహిత కర్మలను నిర్వర్తిస్తూ ఉంటాడు. అయినా కూడా కర్తృత్వము లేనివాడై ఉంటాడు. "ఇక్కడ తోచే కర్తృత్వమంతా అన్యప్రేరితమే కదా" అని ఎరిగియే ఉంటాడు. అత్యంత సమభావంతో ప్రకాశిస్తూ అందరితో వ్యవహరిస్తూ ఉంటాడు.

9. స్వభావశాంతుడు - *(యః స్వభావేనైవ శాంతః, యః హి శుభాశుభం ఆచరన్యో సమతాం వై నజహాతి)* స్వభావంగానే శాంతి స్వరూపుడై ఉంటాడు. ప్రాప్తించే ఆయా శుభాశుభ కర్మలు ఆచరిస్తూనే సమత్వమును, అంతరంగశాంతిని ఏమాత్రం వదులుకోడు.

10. సర్వదా సమమనస్కుడు - *(యస్య మనః జన్మస్థితి వినాశేషు, ఇదమ్ దేహాది ఉదయాస్తమయేషు చ సమమేవ యాతి)* ఈ శరీరం యొక్క పంచ వికారములయినట్టి జన్మ – స్థితి – వృద్ధి – క్షయ – వినాశన సమయములందు కూడా ఎవని మనస్సు సమత్వం కోల్పోదో... అతడే మహాకర్త.

భృంగీశుడు : ప్రభూ! కర్మలను నిర్వర్తించేటప్పుడు ఎట్లు మహాకర్తృత్వం వహించి ఉండాలో 10 విశేషణములతో వివరించారు. అద్భుతం. ఇప్పుడు కర్మ యొక్క ఫల భోక్తా సమయంలో మహాభోక్తృత్వం వహించి ఉండడమంటే ఏమిటో సవివరంగా చెప్పండి.

❖❖❖

3. మహాభోక్త

ఈశ్వరుడు : అట్లాగే, 'మహాభోక్త' గురించి చెబుతాను విను–

1. ద్వేష - కాంక్షారహితుడు - *(యః ప్రకృతం సర్వమ్ భుంక్తేచ, నకించిన ద్వేష్టి, తథా, నకించిత్ అభికాంక్షతి)* యథా ప్రాప్తములైన సమస్తమూ అనుభవిస్తున్నప్పుడు అతడు ఎవరినీ ద్వేషించడు. ఎవరి మీదా ఎట్టి కోపం అంతరంగంలో కలిగి ఉండడు. 'ఇది నేను ఎప్పటికి పొందుతానో?'...అని దేనినీ కాంక్షించడు.

2. పొందుతూ కూడా పొందని వాడు - *(యః ఆదదానశ్చపి చ నాదత్తే, ఆచరన్నపి చ నా–చరత్యాత్, భుంజానోపి చ న భుక్తే)* ఈ ఇంద్రియాలు విషయాలను గ్రహిస్తూ ఉండవచ్చు గాక. అతను అసంగమగు ఆత్మను గురించిన బుద్ధిచే ఏదీ గ్రహింపనివాడుగానే ఉంటాడు. కాళ్ళు–చేతులతో అనుభవములందు ఆచరణ కలిగియున్నప్పటికీ నిష్క్రియమగు ఆత్మబుద్ధినే ఆశ్రయించుకొని ఉంటాడు. సమస్తమును అనుభవిస్తున్నప్పటికీ నిత్యతృప్తమగు ఆత్మబుద్ధి యొక్క బలంతో ఏదీ అనుభవించని వాడుగానే ఉంటాడు.

3. అనుభవములన్నిటికీ సాక్షిమాత్రుడు - *(యః అఖిన్నఃత ధీః యో సకలం సాక్షివత్ పశ్యతి, అవగతేచ్ఛతి)* కేవలం సాక్షిమాత్రుడై సర్వ అనుభవములను దర్శిస్తూ ఉంటాడు. ఇచ్ఛారహితుడై ఖిన్నము లేనట్టి బుద్ధితో లోక వ్యవహారములన్నీ గాంచుతూ ఉంటాడు.

4.విక్షేపరహితుడు, భ్రమరహితుడు - *(యస్య మతిః సుఖైః దుఃఖైః క్రియాయోగైః భ్రమప్రదైః భావాభావైః నోత్క్రామతి)* ఇక్కడి సుఖ – దుఃఖములను, సంయోగ – వియోగ సమన్వితములగు కార్య వ్యవహారములను, భ్రమదాయకములగు లాభ – వ్యయాది విషయములను పొందుచున్నప్పుడు ఎవని బుద్ధి విక్షేపము పొందదో, ఆయా సర్వస్థితి – గతులందు మేధావి అయి ఉత్తమ అవగాహనను వీడడో... అప్పుడు అతడు మహాభోక్త అనిపించుకుంటాడు.

5.బ్రాహ్మీదృష్టి సమన్వితుడు - *(యో జరామరణమ్, ఆపదః రాజ్యం, దారిద్ర్యమేవచరమ్యమిత్యేవ వేత్తి)* ఆ మహాభోక్తకు వార్ధక్యము, మరణము, ఆపదలు, రాజ్యం దారిద్ర్యం ఇటువంటివన్నీ కూడా రమణీయంగానే ఉంటాయి గాని, దుఃఖదాయకం కాదు. ఎవడు ఈ సంసారరూప ప్రపంచం పై నమ్మిక, ప్రియత్వం ఏర్పరచుకుని ఉంటాడో... అట్టి వానికి మాత్రమే వార్ధక్యమరణాదులు దుఃఖ కారకములై ఉంటాయి. ఈ సంసారమునకు ఎట్టి స్థానం ఇవ్వాలో అట్టి స్థానమే ఇస్తే ఇక ఇవన్నీ అట్టివానిని చలింపజేయలేవు సుమా!

6. సర్వ సమబుద్ధిమంతుడు - *(యః మహాన్తి సుఖదుఃఖాని సమం పయాంసీవ సాగరః సముపగృహ్ణాతి)* మహాసముద్రం ఉన్నది. అందులోని జలంలో చిన్న పెద్ద కెరటాలు ఏర్పడుచున్నాయి. కెరటాల అల్పాధిక్యములవలన మహాసముద్రమునకు అల్పాధిక్యములు ఏర్పడగలవా? అట్లాగే, సూర్యకిరణములచే నీరు ఆవిరి అవుతోంది. సముద్రజలం తరిగిపోతోందా? నదుల ద్వారా నీరు

వచ్చి చేరుతోంది. సముద్రం ఉప్పొంగి పోతోందా? లేదు కదా ! మహాభోక్త కూడా మహాసముద్రం లాగా మహాశుభములు గాని, మహాదుఃఖములు గాని, వచ్చి పోతున్నప్పుడు పొంగడు, క్రుంగడు. వాటినన్నిటినీ సమబుద్ధితోనే గ్రహిస్తూ ఉంటాడు. అవన్నీ జీవతః ఆస్వాదిస్తూనే పరతః ఆస్వాదించని వాడై, స్పర్శించబడనివాడై ఉంటాడు.

7. సహజ సాత్వికగుణస్వభావుడు - *(యస్మాత్ అహింసా, సమత, తుష్టి,ఉపయాతి చ నో–పయాతిః)* చంద్రబింబము నుంచి సహజంగానే చల్లని కిరణాలు బయలుదేరుచున్నాయి కదా! అట్లాగే ఆ మహాభోక్త నుండి అత్యంత స్వభావ సిద్ధంగా అహింస, సమత్వము, సంతుష్టి మొదలైన ఉత్తమగుణములు ప్రసరిస్తూ ఉంటాయి. అయితే సహజ సాత్విక గుణములు అకృత్రిమమై ఉండటంచేత అవన్నీ, బయల్వెడలనట్లే అతడా అనుభవం పొందుతూ ఉంటాడు. అనగా అవి సహజసిద్ధము, అప్రయత్నపూర్వకము అయి ఉంటాయి.

8. సామ్యబుద్ధి సమన్వితుడు - *(యో కటుః, ఆమ్లమ్, లవణమ్, తిక్తం, అమృష్టమ్, ఉత్తమమ్ మృష్టిమ్, అధమమ్ సామ్యేన వేత్తి)* అతను కారం, పులుపు ఉప్పదనం, చేదు, అరుచికరమైనవి, రుచికరమైనవి, నికృష్టమైనవి – అన్ని పదార్థాలను సమబుద్ధితో చూడగలడు. స్వీకరించగలడుకూడా. రసములచే అతడు సంబంధితుడు, బంధితుడు కాడు. రసములను జయించి వాటికి అతీత స్థానమున నెలకొని ఉండుటచే అతడు వాటి పట్ల ఆశ – నిరాశలను కలిగి ఉండడు. జీవించుటకై తింటాడుగాని, తినటానికి జీవించడు. ఏది ఎట్లున్నా అతని సామ్యబుద్ధి చలించదు.

9. సమ - సౌమ్యద్రష్ట - *(యః సరసం, నీరసం,సురతం,విరతం,సౌమ్యో సమం, పశ్యతి)* రస సమన్వితమైనవి, రసవిహీనమైనవి. సుఖ ప్రదమైనవి, సుఖ విఘాతమైనవి...ఇటువంటి పరస్పరానుకూల – ప్రతికూల వ్యవహారాలు తారసపడుచున్నప్పుడు వాటినన్నిటినీ అతడు సమదృష్టితో, సౌమ్యదృష్టితో చూడగల శక్తి కలిగి ఉంటాడు. అతని సౌమ్య స్థితి వాటిచే చంచలం పొందదు. అతని సమదృష్టి ముందు అవన్నీ స్వల్ప విషయాలై ఉంటాయి.

10. సమత సుస్థిర సమన్వితుడు - *(యస్య మనః క్షారేచ, ఖండప్రకారేచ, శుభేచ, అశుభేచ సమతా సుస్థిరా భవతి)* “ఇదా, కారంగా ఉన్నది అది తియ్యగా ఉన్నది. ఇది శుభప్రదం. అది అశుభప్రదం – ఇటువంటి స్పర్ధభావాలు అతనికి ఉండవు. మనస్సు సమతాభావంతో సుస్థిరమై ఉంటుంది. “ఒకనికి ఒకటి శుభప్రదంగాను, అదే మరొకటి అశుభప్రదంగాను ఉండటం సృష్టి చమత్కారమైయున్నది” అని అతడు గ్రహించియుండుటచే వాటిని అనుభవించవలసి వస్తున్నప్పుడు అతనికి స్పర్ధ ఉండదు.

11. అభిలాషారహితుడు - *(యో భుంక్తే అభిలాషమ్ త్యక్త్వా,ఇదం భోజ్యం, ఇదం అభోజ్యమితి ఏవం వికల్పితమ్ త్యక్త్వా గతాభిలాషం భవతి)* “నా మటుకు నాకు ఇవి అనుభవించవలసినవి, అవి అనుభవించకూడనివి, కనుక ఇవి లభించాలి. అవి తొలగాలి”... ఇటువంటి అభిలాషలన్నీ, వికల్పములన్నీ దరికి రానీయడు. అభిలాష చేతనే ఈ జీవుడు నిబద్ధుడౌతున్నాడు. లేకపోతే ...సత్

స్వరూపుడగు ఇతడు అసత్తగు ఈ దేహ – ఇంద్రియ – విషయములచే నిబద్ధుడు అవటమేమిటి? ఏది – ఎక్కడ– ఎట్లు పొందవలసివచ్చినా కూడా, అవన్నీ వికల్పములే కాబట్టి, మహాభోక్తకు అవి అభ్యంతర– నిరభ్యంతరములు కాజాలవు.

12. సర్వసమస్వీకారుడు - *(యో బుద్ధ్యా భుక్తే ఆపదం, సంపదం, మోహమ్, ఆనందం, అపరమ్, ఇత్యాదినమయా యాతి)* ఒక రోజు సంపద – మరొక రోజు ఆపద, ఒక సమయంలో ఆనందం – మరొక సమయంలో దుఃఖమోహాలు, కొన్ని రోజులు ఉత్కృష్టత – మరికొన్ని రోజులు నికృష్టత ...జీవితమంతా ఇంతేకదా! చిన్న పిల్లల వంటి ఈ జీవులు వీటిని చూచి కేరింతలు కొట్టటమో, కెవ్వున ఏడ్వటమో చేస్తున్నారు. మహాభోక్తకు వాటి రాకపోకల చమత్కారం తెలుసు కనుక సమబుద్ధితో చూస్తూ ఉండగలడు. అతడే మహాభోక్త.

❖❖❖

4. మహాత్యాగి

1. ధియాసంత్యక్తుడు:బుద్ధితో సర్వము బాగుగా త్యజించినవాడు - *(యేనేతి ధర్మాధర్మౌ, సుఖం దుఃఖం, మరణ–జన్మని ఇత్యాది ధియా సంత్యక్తం)* ఉత్తమమైన బుద్ధి (లేక) తెలివితేటలు సంపాదించుకొని ఉంటాడు. అట్టి ఉత్తమ బుద్ధిచే ధర్మాధర్మములను, సుఖ – దుఃఖములను, జన్మ – మరణములను స్వతఃగా మొదలంట త్యజించివేసినవాడై ఉంటాడు. " ఆయా విశేషములచే నేను బద్ధుడనైనాను".. అను మీమాంస ఆ మహాత్యాగికి ఉండదు.

2. ఇచ్ఛ - శంక - వ్యవహార - నిశ్చయ పరిత్యక్తుడు - *(యేన ధియా సర్వేచ్ఛా: సకలాః శంకాః సర్వేహాః, సర్వనిశ్చయాః, పరిత్యక్తా)* ఈ ఇంద్రియములు, వాటి విషయములు ఎట్టివో, స్వభావమేమిటో ఎరిగి ఉంటాడు. అందుచేత సర్వ ఇచ్ఛలు త్యజించియే ఉంటాడు, "దీనివలన ఏది పొందుతామో? మళ్ళా అ తరువాత ఏమి కానున్నదో?"... ఇటువంటి అనుమానాలకు చోటివ్వడు. సమస్త శారీరక, వాచిక, మానసిక చేష్టలను– దూరస్తమగు అసంబంధిత విషయాలుగా గాంచుతూ ఉంటాడు. సమస్త నిశ్చయములచేతను కట్టుబడక పూర్ణాత్మ స్వరూపమునందు స్వభావమును అనుభవమును ఏర్పరచుకుని ఉంటాడు.

3. దేహేంద్రియసత్తత్యాగి - *(దేహస్య, మనసః ఇంద్రియాణాంహి – తత్‌దుఃఖత్యాగి, తత్ సత్తత్యాగి)* ఈ దేహ, ఇంద్రియ, మనస్సుల సత్తను వాటి వాటి దుఃఖ స్వభావంతో సహా మొదలే త్యజించి వేసి ఉంటాడు. ఏది త్యజించబడినదో అది దుఃఖమును కలిగింపజాలదు. తాను శుద్ధచైతన్య స్వరూపుడై ఉండగా ఈ దేహేంద్రియ మనస్సులు ఎట్లా పరిమితం చేస్తాయి? ఎట్లా బంధితుణ్ణి చేయగలవు చెప్పు?

4. నదేహ - నజన్మ - నకర్మ నిశ్చయుడు - (న మే దేహో, న జన్మాసి, న యుక్తే, అయుక్తే కర్మణి – ఇతి అంతర్ నిశ్చయవాన్ః) "ఈ దేహం నేను ఉపయోగించే ఒక బాహ్యవస్తువు, అంతేగాని ఇది

నేను కాదు, దీనికంటే ముందే ఉన్న నేను దేహంతో జన్మించేవాడిని కాదు. దేహంతో మరణించేవాడిని కాదు. ఏది నేనై ఉన్నానో అద్దానికి జనన – మరణ ధర్మాలు లేవు. ఒక ఉపకరణ మాత్రమగు ఈ దేహము యొక్క చేష్టలు దేహ ధర్మములే గాని నా ధర్మములు కావు. నాకు వాస్తవానికి దేహములేదు. విహిత – నిషిద్ధకర్మలులేవు. ఇష్టానిష్ట చేష్టలు లేవు".. ఇట్టి అంతఃకరణ నిశ్చయమును ఆ మహాత్యాగి కలిగి ఉంటాడు. 'ఇట్టి త్యజించియుండుట' అను స్వస్వరూప ధర్మమును సర్వదా వహించి ఉండుటచే అవన్నీ అతనికి అసంబంధిత విషయములే అవుతాయి.

5. మనో మనన పరిత్యక్తుడు - *(యేన ధర్మాధర్మమ్ మనో మననమీహితమ్ సర్వమ్ అన్తః పరిత్యక్తం)* అతడు శారీరకమైన ధర్మాధర్మములను, మనస్సు యొక్క మానసిక చేష్టలను, వాక్కు మొదలైన క్రియలను అంతరంగంలో పరిత్యజించి ఉంటాడు. సత్–చిత్– ఆనందమనబడు స్వభావమొక్కటే అతని పట్ల ఏర్పడి ఉండి ఉంటుంది. అట్టి అనుభవము ద్వారా సర్వమునకు అందజాలని అప్రమేయ స్వరూపస్వస్థుడై ఉంటాడు. సర్వధర్మములు, సర్వ చేష్టలు త్యజించివేసి ఉంటాడు. ఆయా దేహ మనోధర్మాలచే ఎవరూ ఆతనిని సంకుచితపరచలేదు. అతడు ఎవరినీ దేహ మనోధర్మా ధర్మ బద్ధునిగా గాంచడు. సదా అప్రమేయమగు ఆత్మగానే దర్శిస్తాడు.

6. సమ్యక్‌దర్శి : *(సాయేన యావతీ దృశ్యకలనా సకలేయం సుఘట సంతక్తా విలోక్యతే)* ఈ కనిపించే దృశ్య కల్పననంతటినీ అతడు 'సమ్యక్ దర్శనము' అనే పవిత్ర దృష్టిచే, "మిథ్యయే కదా!"... అని ఎఱిగి, సర్వమును త్యజించివేసి ఉంటాడు.

❖

నాయనా! భృంగీశా! ఈ విధంగా త్రయీవ్రతము అవలంబించు.

కర్మ నిర్వర్తిస్తున్నప్పుడు : 1.అసంశయుడవు, 2.అపేక్షారహితుడవు, 3.ఉద్వేగరహితుడవు, 4.శంకా రహితుడవు, 5.ఇచ్ఛారహితుడవు, 6.ఆవేశ ఆనందరహితుడవు, 7.అసంసక్త మనస్కుడవు, 8.సమదర్శివి, 9.స్వభావ శాంతుడవు, 10.సర్వదా సమమనస్కుడవు ...అయి ఉండు.

కర్మల భోక్తవైయున్నప్పుడు : 1.ద్వేష కాంక్షారహితుడవు, 2.పొందుతూ కూడా పొందనివాడవు, 3.అనుభవములన్నిటికి సాక్షి మాత్రుడవు, 4.విక్షేపరహితుడవు, 5.బ్రాహ్మీదృష్టి సమన్వితుడవు. 6.సర్వ సమబుద్ధిమంతుడవు, 7.సహజ సాత్త్విక గుణ స్వభావుడవు, 8.సామ్యబుద్ధి సమన్వితుడవు. 9.సమ – సౌమ్యద్రష్టవు, 10.సమత – సుస్థిర సమన్వితుడవు, 11.అభిలాషారహితుడవు, 12.సమస్వీకారుడవు కమ్ము.

ఈ జగత్తులో ఏర్పడే సంబంధముల విషయంలో : 1.ధియా సంత్యక్తుడవు, 2.ఇచ్ఛ –శంక – వ్యవహార– నిశ్చయ పరిరత్యక్తుడవు, 3.దేహేంద్రియ సత్త్యాగివి, 4.నాకు దేహ జన్మకర్మలు ఉండ జాలవు అను నిశ్చయం కలవాడవు, 5.మనోమనన పరిత్యక్తుడవు, 6.సమ్యక్‌దర్శివి ...అయి ఉండు.

త్యజించుటచే త్యాగివవుతావు. ఎవరు ఏది త్యజించరో అది మాత్రమే వారిని దుఃఖింప జేయ గలదు. అది మాత్రమే అతనికి సంసార విభాగమగుచున్నది,. ఏది త్యజించబడదగినదో

అది జయించబడినట్లే. కనుక భృంగీశా! నీవు మనం వివరించి చెప్పుకున్నట్లు మహాకర్తవు మహాభోక్తవు మహాత్యాగివి అగుచూ ఈ భూమిపై నిశ్చింతగా సంచరించు. ఇక ఈ సంసార దుఃఖాదులు నిన్ను సమీపించనైనా లేవు.

❖

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! భక్తజన సులభుడగు సాంబశివునికి భృంగీశునికి మధ్య జరిగిన సంవాదము విన్నావు కదా! ఆ పరమశివుడు బోధించియున్న దృష్టిని నీవు కూడా అవలంబించు. అన్నమయ – ప్రాణమయ – మనోమయ – విజ్ఞానమయ – ఆనందమయములనబడే పంచకోశములకు అతీతమైయున్న నీ స్వస్వరూపమును ఆశ్రయించు. అది జాగ్రత్ – స్వప్న – సుషుప్తములనబడే అవస్థాత్రయరహితమై ఉన్నదని గ్రహించియుండు.

ఏ ఆత్మ అయితే నిరంజనమై (దోషరహితమై) నిత్యోదితమై, విమలరూపమై, అనంతమై, ఆద్యమైయున్నదో..అట్టి బ్రహ్మమే నేను – అను నిశ్చయముతో సమస్త కల్పనారూపములను శమింపజేసినవాడవై, నిర్వాణ పదమును పొందియుండు. సమస్తకల్పములందు ప్రసిద్ధములైయున్న కార్యములన్నిటియొక్క బీజభూతము, నిరామయము – పరమాత్మ రూపమగు బ్రహ్మమే అయి ఉన్నదని విజ్ఞులు ఎరిగియే ఉంటున్నారు. విశాల సృష్టి భేదంతో వృద్ధి చెంది భాసిస్తున్న ఈ కనబడేదంతా చిదాకాశమే అయి ఉన్నది.

ఓ రామా! "బ్రహ్మము కంటే భిన్నంగా సత్తుగాని అసత్తు గాని ఎక్కడాకూడా కొంచమైనా సంభవించజాలదు" అని అంతఃకరణంలో దృఢనిశ్చయము కలిగియుండుము. సంశయములన్నీ త్యజించి సుఖముగా నిశ్చింతగా ఉండు.

అంతర్ముఖః సన్సతతం సమస్తం, కుర్వన్ బహిష్ఠం ఖలు కార్యజాతమ్.
నఖేద మాయాసి కదాచిదేవ, నిరాకృతాహంకృతితాముపైషి॥

ఓ ప్రియ రామచంద్రా! నీవు అంతర్ముఖుడవై 'నిరహంకృతి' పొందావా... అప్పుడిక బహిర్ముఖములగు ఈ సమస్త కార్యములు నెరవేరుస్తున్నప్పటికీ, ఎన్నటికీ ఖేదం పొందవు. ఖేదముల ఛాయ కూడా నిన్ను ఆవరించజాలదు.

❖❖❖

5. చిత్త శామ్య స్థితి

శ్రీరాముడు: హే భగవాన్! హే సర్వధర్మజ్ఞా!అహంకారము అనే పేరు కూడా కలిగి ఉన్న ఈ చిత్తం ఎప్పుడు ఏ పరిస్థితులలో శమిస్తుంది? లేక శమించనారంభిస్తుంది? వాసనారహితమగు చిత్తం ఏ ఏ లక్షణాలు కలిగి ఉంటుంది?

శ్రీవసిష్ఠ మహర్షి : బలాత్కారంగా జలం పద్మదళములను తాకినప్పటికీ జలబిందువులు పద్మదళములో ప్రవేశించలేవు కదా? ఎప్పుడైతే అహంకారమయమగు చిత్తము ప్రశమిస్తూ ఉంటుందో. ఎప్పుడైతే

జ్ఞానాగ్నిచే పాప సంకల్పాదులు ఉపశమిస్తూ ఉంటాయో అప్పుడు బలాత్కారముగా సమీపించే లోభమోహాలు కూడా శుద్ధచిత్తమును స్పృశించజాలవు. అట్టి వాని ముఖంలో అకృత్రిమమైన ప్రసన్నత, మైత్రి, కరుణ మొదలైన ఉత్తమగుణాలు వెల్లివిరుస్తూ ఉంటాయి. చిత్తము శమిస్తూ ఉంటే మెల్లమెల్లగా వాసనాగ్రంథులు ఛిన్నాభిన్నమై పోతూ ఉంటాయి. కోపము సన్నగిల్లుతూ ఉంటుంది. ఇంద్రియముల ప్రబలత్వం అల్పమౌతుంది. అట్టివానిని క్రమక్రమంగా దుఃఖము – ఖేదము దరిజేరలేకపోతాయి. అనగా అతని దుఃఖములు వృద్ధి చెందుటకు కారణమును కోల్పోతాయి. సుఖములు అభిమానమును కల్పించలేకపోతాయి. హృదయమునందు సర్వత్రా (ఆధి భౌతిక – ఆధిదైవిక – ఆధ్యాత్మిక) తాపత్రయ నివారకమగు సమత్వము ఉదయిస్తూ ఉంటుంది. ఒకవేళ ముఖంలో సుఖ–దుఃఖాదుల చిహ్నములు ఎప్పుడైనా కనిపించినా. ఎండలోని జలకణంలా అవి అల్పకాలం మాత్రమే ఉంటాయి. ఆ తరువాత 'ఇవి మిథ్యయే కదా" అను బుద్ధి కలుగుటచే అవి మనస్సును స్పృశించలేవు.

❖

చిత్తము శమించినప్పుడు, అట్టి మనుజుడు దేవతాగణమునకుకూడా వాంఛనీయుడౌతాడు. ఆ సమయంలో 'సర్వసత్త్వము' అనే శీతల చంద్రిక వాని యందు ఉదయించి ఉంటుంది. అతడు స్వభావ సిద్ధంగా శాంతము – ప్రియము – సేవాతత్త్వము – అవిరోధి – నమ్రత – తేజోయుక్తము– స్వచ్ఛము అయినట్టి మహత్తర స్వరూపమును, స్వభావమును సంతరించుకొని ఉంటాడు.

ఈ సంసారభ్రమ జనుల విషయంలో విభవ – దారిద్ర్యములచే విచిత్రము, అవగాహనకు అందనిది. దుర్భరము అయి ఉంటోంది కదా! అహంకారరహితులగు మహాత్ములకు అది దుఃఖమును గాని, ఆనందమును గాని కలిగించజాలదు.

ఎవడైతే "బుద్ధి యొక్క ప్రకాశమాత్రము – సమస్త ఆపదలను నశింపజేయునది" అగు అత్మజ్ఞానమును మోహవశంచే అశ్రయించటానికి సిద్ధపడడో, అతడు నరులలో అధమతరగతికి చెందినవాడగుచున్నాడని శాస్త్రజ్ఞులు ప్రవచిస్తున్నారు. అనేక దుఃఖములకు నెలవై, జనన – మరణ రూపముతో ఏర్పడియున్న సంసారసాగరమును దాటాలనుకునే పురుషుడు నిరతిశయానందమగు ఆత్మ విశ్రాంతి పొందుటకు ప్రయత్నించుటే ఉపాయం. అట్టి విశ్రాంతి లభించాలంటే "నేనెవరు! ఈ ప్రపంచమేమిటి! అత్మతత్త్వమనగా ఎట్టిది! తుచ్ఛభోగములతో ప్రయోజనమేమిటి!?"... ఈ విధంగా అభ్యసిస్తూ క్రమంగా విచార – వైరాగ్య సమన్వితమైన బుద్ధిని సంపాదించుకోవటమే అన్నిటికంటే ముఖ్యమైన ఉపాయం.

❖❖❖

XIII. మను - ఇక్ష్వాకు సంవాదము

(నే నెవరు!)

1 ఈ కనిపించేదంతా ఏమిటి!

శ్రీవసిష్ఠ మహర్షి : ఇక్ష్వాకు వంశజుడవగు ఓ రామచంద్రా! మీ వంశమునకు ఆదిపురుషుడైన ఇక్ష్వాకు చక్రవర్తి ఏ విధంగా ముక్తుడైనాడో ...ఆ వృత్తాంతం చెబుతాను. విను.

❖

ఈ అయోధ్యా నగరాన్ని చాలా కాలం క్రితం ఇక్ష్వాకు చక్రవర్తి పాలిస్తూ ఉండేవాడు. ఆయన చాలాకాలం రాజ్యం ఏలిన తరువాత ఒకసారి ఈ రాజ్యాదులందు విరక్తుడైనాడు. ఒక ఏకాంత ప్రదేశం చేరి మనస్సులో ఇట్లు చింతించసాగాడు.

ఇక్ష్వాకు చక్రవర్తి: (మనస్సులో) : ఈ దృశ్య ప్రపంచమంతా జన్మ - వార్ధక్యము- మరణము - సంక్షోభము - దుఃఖము మొదలైన అనేక భ్రమలకు స్థానభూతమై ఉన్నది కదా! ఇట్టి ఈ దృశ్య ప్రపంచమునకు అసలైన కారణమేమిటి!

అతడు చాలా రోజులు అలోచిస్తూనే ఉన్నాడు కాని, కారణం అతనికి తెలియరాలేదు. అప్పుడు, "లాభం లేదు! ఎంత యోచించినా నా బుద్ధికి తోచటమే లేదు. మరి ఈ దృశ్య ప్రపంచమునకు కారణమేమైయున్నదో తప్పక తెలుసు కోవలసినదే"... అని నిశ్చయించుకున్నాడు.

అతని పంట పండి ఒక రోజు భగవంతుడగు మనుప్రజాపతి అనుకోకుండా సభకు రావటం జరిగింది. కుశల ప్రశ్నానంతరం ఇక్ష్వాకువు ఇట్లు ప్రశ్నించాడు.

❖

ఇక్ష్వాకువు: హే మనుప్రజాపతి! అనేక జన్మలలో చేసిన పుణ్యంచే ఈ రోజు మీ దర్శనం లభించింది. బ్రహ్మలోకం నుంచి మీ రాకచే మేమంతా పరమ పవిత్రులమైనాం. మహాత్మా! కొంతకాలంగా కొన్ని సందేహాలు నన్ను పట్టి పీడిస్తున్నాయి. అటువంటి కష్టసమయంలో లోకపాలకులు లోకగురువులగు మీరు దర్శనమిచ్చారు. మిమ్ములను కొన్ని సందేహాలు అడిగి తెలుసుకోవటానికి అనుజ్ఞ ఇవ్వండి.

మనుప్రజాపతి : సందేహములా! ఊఁ! అడుగు.

ఇక్ష్వాకువు : స్వామీ! సవినయుడనై నా సందేహాలు మీ ముందు ఉంచుతున్నాను-

ఈ సృష్టంతా ఎక్కడినుండి ఇక్కడికి వచ్చింది? దీని బాహ్య స్వరూపమిట్లుండగా ఇద్దాని అసలు స్వరూపం వేరే ఏదన్నా అయి ఉన్నదా? ఉంటే దీని అసలు స్వరూపమేమిటి? దీని సంఖ్య ఎంత? పరిణామమెంత? ఇందులోని జీవులెంతమంది? దీనిని ఎవరు, ఎప్పుడు, ఎందుకు నిర్మించారు?

విశాలమైన వలలో ఒక పక్షి చిక్కుకుని గిలగిలలాడే విధంగా, నేను కూడా ఈ సువిశాల సంసారంలో ఎప్పుడో ఎందుకో చిక్కుకుని ఉన్నట్లు నాకు అనిపిస్తోంది. ఈ భయంకరమైన సంసార విభ్రమమునుండి నేను విముక్తుడను అయ్యేదెట్లా?

మను ప్రజాపతి: ఇక్ష్వాకా! ఇప్పుడు నీ ప్రశ్నలు, వింటుంటే నాకు చాలా సంతోషంగా ఉంది! జన్మ ఎత్తినందుకు ఏది సారభూతమై ఉన్నదో, ఏ ప్రశ్నలకు సమాధానం గొప్ప అనర్థములన్నీ ఛేదించి వేయగలదో... అటువంటి ప్రశ్నలను వివేకం యొక్క ఉత్కృష్టత చేతనే సమీపించగలిగావు.

నీ ప్రశ్నలకు సూటి అయిన సమాధానం చెబుతాను. ఉద్వేగరహిత-ప్రశాంత చిత్తంతో విను. మేము మా అనుభవాలు రంగరించి ఈ సమాధానాలను నీ ముందు ఉంచుచున్నాం-

యదిదం దృశ్యతే కించిత్ నాస్తినృప, కించన యథా గంధర్వనగరం ।
యథా వారి మరుస్తలే యత్త నో దృశ్యతే కించిత్ తన్ నకించిదివ స్థితమ్ ॥

ఏ దృశ్యమైతే నీకు ఎదురుగా కనబడుతూ "దీనిని అధిగమించటం నా వలన అవుతుందా?"... అనే గొప్ప సమస్యను ఉదయింపజేస్తోందో, అటువంటి ఈ దృశ్యం యథార్థానికి ఏమాత్రం లేదు. కొంచెం కూడా లేదు. "మరి, నాకు కనబడుతోంది కదా?" అని అంటావా? ఎండమావులలో (మృగ తృష్ణలో) రకరకాల ఆకారాలు గల తరంగాలు కూడా కనిపిస్తూ ఉంటాయి. మాయా సంబంధమైన గంధర్వ నగరంలో సుందరమైన వస్తువులు, కన్యలు కనిపిస్తారు. అవన్నీ యథార్థమా? అవెంత వాస్తవమో, ఈ కనబడేవీ అంతే!

ఇక్ష్వాకువు : మరి ఇక్కడ యథార్థమైనదంటూ ఏమైనా ఉన్నదా?

మను ప్రజాపతి : ఏది పంచేంద్రియముల కంటే మనస్సు కంటే కూడా అతీతమైయున్నదో, దేని గురించైతే సంభావన మహత్తర ప్రయోజనకారకమై ఉన్నదో, ఏది నాశరహితమై ఉన్నదో, అది మాత్రమే ఇక్కడ ఉన్నది. అదియే "సద్రూపమగు ఆత్మ అని చెప్పబడుతోంది. ఒక పెద్ద అద్దంలో కనిపించే ప్రతిబింబంలాగా అసంఖ్యాక దృశ్యములచే పూర్ణమై ఉన్న ఈ సృష్టిపరంపర చిదాత్మయందలి ప్రతిబింబం మాత్రమే. ఆ పరమాత్మ నుండి స్వభావంగా కొన్ని స్ఫురణ శక్తులు బయల్వెడలుచున్నాయి. అవి చిదాభాసాలు" అని పిలువబడుచున్నాయి. ఆ స్ఫురణశక్తులే బ్రహ్మాండ రూపాన్ని పొందుచున్నాయి. వాటిలో మరికొన్ని శక్తులు భూమ్యాకాశాది పంచభూత రూపత్వం పొందుచున్నాయి. తక్కినవి తక్కిన చతుర్విధ ప్రాణుల రూపము పొందినాయి.

ఇదియే జగత్తు యొక్క స్థితి ఇంతకు మించి ఇక్కడ బంధము లేదు, మోక్షమూ లేదు.

న బంధోఽస్తి నమోక్షోఽస్తి, బ్రహ్మైవాస్తి నిరామయమ్ ।
నైక్యమస్తి న చ ద్విత్వం సంవిత్సారం విజృంభతే॥

ఓ ప్రియా ఇక్ష్వాకూ! ఇక్కడ బంధం గాని, మోక్షం గాని, ఎవరికీ లేదు. నిర్వికారమగు బ్రహ్మం మాత్రమే కలదు. ఇందులో ఏకత్వమూ లేదు, ద్వైతమూ లేదు. చిదాత్మయే సంవిత్ సారంగా విజృంభిస్తోంది.

జలమంతా ఒక్కటే అయినప్పటికీ అనేక తరంగ భేదములచే విజృంభిస్తోంది కదా! ఒక తరంగానికి మరొక తరంగానికి ఉన్న భేదమేమిటి? రెండూ జలమే కదా! అయితే ఏం? జలం జలంగా ఉంటూ ఉండగానే అనేక తరంగాలుగా కనిపిస్తున్నది.

అట్లాగే ఒకే బ్రహ్మము అనేక జగత్ భేదములుగా కనిపిస్తోంది. ఏ భేదం కనిపిస్తోందో అది అవాస్తవం. కనుక దానిని 'మాయ (యా మా, ఏదీ స్వతఃగా లేదో!)... అని పిలువబడుతోంది. మాయామాత్రములే అగుటచే జీవునికి జీవునికి, నీకు, నాకు, ఆత్మకు భేదములు లేనివే అగుచున్నాయి. కాబట్టి నాయనా! నీవు ముందుగా బంధమోక్షములకు సంబంధించిన ఆశలను, భయమును దూరంగా త్యజించు.

సంసారభయ రహితుడవై ఉండుము. అభయ సారభూతమగు బ్రహ్మరూపుడవై ఉండు.

❖❖❖

2. కొంగు క్రింద బిడ్డను పెట్టుకొని ఊరంతా వెతికొచ్చినట్లు!

మను ప్రజాపతి : జలం తరంగాల రూపం పొందుతోంది చూచావా? చిన్మాత్ర సంవిత్తు స్వతహాగా విషయరహితమైనది. అయితే అది స్వయంగా ఎందుకో ఆయా సంస్కారాలచే అతి విచిత్రమై ఉన్న అవిద్య యందు ప్రతిబింబిస్తోంది. అట్టి ప్రతిబింబిత సంవిత్తు సంకల్పాల వైపుగా ఎందుకో ఉన్ముఖ మౌతోంది. ఫలితం ఈ జీవభావమును పొందుతోంది. అట్టి కారణ స్వరూపులగు ఈ జీవులు ఇతః పూర్వమే ఆవిర్భూతమైన సృష్టియందు తిరుగాడుచున్నారు. సృష్టి-దృశ్యము అనబడేవి ఇది ఇట్లుండగా వాస్తవానికి "జీవులు – వారి సుఖదుఃఖ దశలు" అనే మోహం మనస్సునందే ఉన్నదిగాని, ఆత్మయందు కాదు. నిర్మలజలంలో దృశ్యం ప్రతిబింబించినంత మాత్రంచేత దృశ్యం జలంలో ఉన్నట్లౌతుందా? కాదు.

అయితే... రాహువు అదృశ్యరూపుడైనప్పటికీ, ఒకానొక నీడ మాత్రమే అయినప్పటికీ చంద్రుని యందు కనబడే 'గ్రహణం'చే రాహువు అదృశ్యరూపం కనిపిస్తోంది కదా! అట్లాగే ఆత్మ అదృశ్యరూపం, అనుభవమాత్రం అయి ఉన్నది. అట్టి ఆత్మ దర్శనమవటం ఎట్లా? ఎట్లా అంటే ... ఆత్మ సాక్షాత్కారం ఒనర్చుటయందు అభిముఖమైన అంతఃకరణంచే మాత్రమే అది అనుభవైక వేద్యం అగుచున్నది.

ఇక్ష్వాకువు : అయితే నిర్మలాంతఃకరణులగు తమవంటి గురువులు అట్టి ఆత్మ సాక్షాత్కారం ప్రసాదించ గలరని లోకప్రతీతి కదా! స్వామి! మహానుభావా! నన్ను రక్షించి, నాకు ఆత్మసాక్షాత్కారం ప్రసాదించండి.

మను ప్రజాపతి : తప్పకుండా ప్రసాదించేవాడినే! అయితే ఇందులో ఒక చిక్కు ఉన్నది.

నశాస్త్రైః, నాఽపిగురుణా దృశ్యతే పరమేశ్వరః,
దృశ్యతే స్వాత్మనైవ ఆత్మా స్వయా సత్వస్థయా ధియా॥

ఆ పరమేశ్వరుడు (లేక 'స్వాత్మ') శాస్త్రములచే గాని, గురువులచే గాని కనిపించేవాడు కాదు. మరి? అహంకార – మమకారరహితమగు బుద్ధిచే తనచేతనే తాను కనిపిస్తున్నాడు. నీవు

పరమాత్మను దర్శించదలిచావా? అయితే త్రోవలో నడుస్తూ ఉండగా తారసపడే అపరిచిత బాటసారులను రాగద్వేష రహితబుద్ధితో చూస్తున్నట్లు ఈ ఇంద్రియాలను ఈ ఇంద్రియ విషయ ప్రపంచాన్ని కూడా చూడు. బుద్ధిమంతుడైనవాడు ఈ ఇంద్రియాలను గాని, వీటి విషయాలను గాని ఆదరించడు, అనాదరించడు. ప్రాప్తించిన పదార్థములతో కూడినవై ఈ దేహేంద్రియాలు సుఖంగానే ఉండుగాక! లేదూ ప్రాప్తించని పదార్థములచే పేదరికం పొందుగాక! ఓ మానవా! నీవు మాత్రం బుద్ధితో పదార్థమాత్రాలు అగు ఈ దేహాదులను మానసికంగా దూరంగా త్యజించు. పూర్ణ శీతలాంతఃకరుణుడవై ఉండు. నిత్యం ఆత్మమయుడవై ఉండు.

'దేహోఽహమ్' ఇతియా బుద్ధిః, సా సంసార నిబంధనీ,

న కదాచిత్ ఇయం బుద్ధిరాదేయా హి ముముక్షుభిః॥

'నేను దేహమును' అని ఏ బుద్ధి యొక్క విభాగం ఈ జీవుని సంసారమునందు బంధిస్తోందో గమనించబడు గాక. ముముక్షువైనవాడు అట్టి బుద్ధిని గ్రహించనే కూడదు. 'నేను సూక్ష్మమైన ఆకారం కంటే కూడా సూక్ష్మాతిసూక్ష్మమైన చిన్మాత్రంనే గాని, మరింకేమీ కాదు'... అను బుద్ధి జీవుని సంసారం నుండి విముక్తుని చేస్తోంది. అట్టి 'నిరంతరం – అచ్యుతం' అయిన బుద్ధిని నీవు సంపాదించుకో. అట్టి బుద్ధిబలంతో మాత్రమే నీవు సంసార బంధం నుండి విడివడగలవు.

నిర్మల జలం యొక్క లోపల, వెలుపల అంతటా సూర్యకాంతి ప్రసరించి ఉంటున్నట్లు, ఆత్మ సర్వ వస్తువుల యొక్క బాహ్య–అభ్యంతరములందు నిండి ఉన్నది. ఆయా ఆభరణములు రూపముల దృష్ట్యా వేరు–వేరుగా ఉంటున్నప్పటికీ, ఆభరణములన్నిటిలో ఒకే బంగారము ఉండి ఉన్నది కదా! ఇక వివిధత్వమనేది కేవలం ఆకార వైచిత్ర్యము తప్పితే మరింకేమీ కాదు. అట్లాగే ఈ సర్వ జగత్ పదార్థములందంతటా ఆత్మయే ఉన్నది. మాయా రచనాచమత్కారంచేత ఒక్కటే అయినప్పటికీ అసంఖ్యాక తరంగాలు తమంతట తామే ఎక్కడో పుట్టి మరెక్కడో లయిస్తున్నాయి. తరంగాలు కనబడుచున్నంత సేపు 'ఇది పెద్ద తరంగం – అది చిన్నది, ఇవి తరంగం – తరంగం ఢీకొనుటచే ఏర్పడే జలకణములు'... మొదలైన వర్ణనలకు సముద్రం అర్హమగుచున్నది. ఎన్ని అసంఖ్యాక తరంగాలు ఒకచోట లేస్తున్నా, ఆ తరంగాలు ఎన్నిచోట్ల కనిపిస్తున్నా, తిరిగి ఆ తరంగాలు ఎక్కడ లయిస్తున్నా, అన్ని తరంగాలలోనూ ఉన్నది – వాస్తవమైనది జలమే కదా!

కామము అనే ఈ సంసార మహా సముద్రంలో 'ప్రాణికోట్లు' అనే అసంఖ్యాక తరంగాలు అటూ – ఇటూ వర్తిస్తున్నాయి. 'జగత్సమూహములు' అనే నదులు ఈ సంసార మహాసముద్రంలో నిరంతరం ప్రవేశిస్తున్నాయి.

ఈ జీవులు 'వినాశనము'అనే బడబాగ్నిలో ప్రవేశించి జగత్తునుంచి నిష్క్రమిస్తున్నారు. మరల మరొకవైపు నుండి – నిరంతరం ప్రవేశిస్తున్నారు.

అగస్త్య మహాముని సముద్ర జలాన్నంతా త్రాగి కూడా ఇంకా తృప్తి చెందనట్లు, 'కాలము' అనే మహత్తరతత్త్వము ఈ జగత్తులను అసంఖ్యాకంగా తనయందు లయం చేసుకుంటూ కూడా

ఏమాత్రం తృప్తి పొందటంలేదు. ఏ ఆత్మయందైతే అట్టి మహత్తర మహాకాలము కేవలము ప్రతిబింబితమాత్రమై ఉన్నదో-అట్టి ఆత్మను నీవు నిరంతరం భావన చేయి. అంతేగాని అనాత్మభూతమగు ఈ దేహము మొదలైన దృశ్యజాలమును వందల - వేల జన్మలుగా భావన చేస్తూ పోతున్నా కలిగే ప్రయోజనం? ప్రవాహపతితములగు జన్మ - కర్మపరంపరలే తప్పించి మరింకేమీ కాదు. కనుక నీవు 'నిర్వాసనా భావన' యందు ఆరూఢుడవగుము. గూఢరూపమగు ఆత్మభావనను ఆశ్రయించి సుఖపూర్వకంగా ఉండు.

ఇక్ష్వాకువు : అట్టి ఆత్మను ఆశ్రయించటం, ఆత్మానుభవంలో ఆరూఢత పొందటం ఎట్లా? అందుకు మార్గాలేమిటి? ఎంతకాలం ఎట్లు శ్రమిస్తే నిర్వాసనాభావప్రాప్తి, ఆత్మానుభూతి కలుగుతాయి? అసలు ఆత్మ లభిస్తుందా? మిమ్ములను అట్టి ఆత్మానుభవం ప్రసాదించవలసినదిగా నా విన్నపం!

మను ప్రజాపతి: వెనుకటికి ఒక గొప్ప తెలివిగల స్త్రీ "అయ్యో ! నా బిడ్డ ఎక్కడ?" అని గాభరా పడసాగిందట.

కుచకోటర సంసుప్తం విస్మృత్య జననీ సుతం ।
యధారోదిత పుత్రార్థం తథాఽ త్మార్థమ్ అయం జనః॥

ఆవిడ పసిపిల్లవాడికి పైట క్రింద పాలిస్తూ ప్రక్కింటావిడతో ఆకశ-పోకశ కబుర్లు చెబుతోంది. ఈలోగా ఇంటాయన వచ్చి "ఏమే! పిల్లవాడేడీ? నిద్రపోతున్నాడా?"అన్నాడు. ఆ మహాతల్లి, "అవునండీ నిద్రపోతున్నాడు!" అని చెప్పి ఉబుసుపోక కబుర్లు కొనసాగిస్తోంది. ఈలోగా ఇంటాయన ఇంట్లో పిల్లవాడి కోసం చూస్తే కనబడలేదు. "ఏమే పిల్లవాడేడీ? ఇక్కడ లేడే?" అని గావుకేక వేశాడు. ఇక ఆ స్త్రీ ప్రాణాలు ఝల్లుమన్నాయి. "నెలల బాలుడు కదా! నా బిడ్డ ఎటూ వెళ్ళలేడే! మరెవరైనా ఎత్తుకుపోలేదు కదా?" అని అనుకొన్నది. ఆ ఆలోచన రాగానే ఇక పెద్ద పెట్టున ఏడవటం ప్రారంభించింది. ఇంటాయన ఇంట్లో చిందులేస్తున్నాడు. ఈ తతంగమంతా చూచిన ప్రక్కింటావిడ "ఏమిటి ఒదినగారూ?"అన్నది. అప్పుడా ఇల్లాలు "ఇంకా ఏమిటంటారేమిటండీ! నా కొంప మునిగింది. పసిపిల్లవాడు కనిపించటం లేదు. ఇక నేనేం చెయ్యాలి బాబోయ్? నా పిల్లవాడు ఎక్కడున్నాడు నాయనోయ్? ఏం పోయే కాలం వచ్చి ఇక్కడ పెత్తనాలు నేను చేస్తున్నానో? ఏమిటి నా గతి? ఎక్కడని వెతకాలి?"... అని భోరున ఏడవసాగింది.

ఈ జీవుడు కూడా ఆ మహాతల్లి లాగానే ఆత్మ కొరకే ఏడ్చుచున్నాడు. ఎక్కడెక్కడో వెతుకుచున్నాడు ఎందుచేత? అంతఃకరణమునందే నిత్యలబ్ధమైయున్న ఆత్మను ఏమరుచుటచేతనే! కనుక అతని దుఃఖం భ్రాంతిచే ఏర్పడినది మాత్రమే. పైట క్రింద గల పిల్లవాడిని తల్లి ఏమరచినట్లు తన అఖండ-అప్రమేయ స్వభావమగు ఆత్మను ఏమరచిన ఈ జీవునికి గుర్తు చేయటానికే శాస్త్రములు పరికల్పించబడ్డాయి.

అజరామరమ్ ఆత్మానమ్ అబుద్ధ్వా పరిరోదితి ।
హా హతోఽ హమ్! అనాథోఽ హమ్! నష్టోఽ స్మి ఇతి వపుర్వ్యయే ॥

స్వస్వరూపమగు ఆత్మ సర్వదా జరామరణ రహితమైనది. ఇది ఏమరచిన ఈ జీవుడు దేహమును మాత్రమే చూస్తూ "నేను ముసలివాడనయ్యాను. నా పని అయిపోయింది. అయ్యో! నేను చచ్చుచున్నాను! నాకు దిక్కెవరూ లేరు, నేను అనాథుడను"... ఇటువంటి బాల్య చాపల్యమువంటి ప్రేలాపనలు చేస్తూ నిష్కారణంగా దుఃఖిస్తున్నాడు. కనుక ఓ ఇక్ష్వాకా! ఆత్మ లభించటమేమిటి? దానిని మరొకరు నీ కివ్వటమేమిటి? అది సర్వదా నీ రూపమే అయి, నీచే పొందబడియే ఉన్నది. ప్రతి జీవుడు అదియే అయి ఉన్నాడు. ఇక, వివిధ కార్యరూపములతో కూడిన ఈ జగత్తేమి టంటావా...? జలము తన యొక్క చలనము వలననే తరంగములు మొదలైన అనేక రూపములుగా కనిపిస్తున్నట్లు, సంకల్పవశంచేత చిద్బ్రహ్మమే వివిధ కార్యపరంపరా రూపంగా వృద్ధి చెందుతోంది.

❖

ఓ కుమారా! ముందుగా నీ చిత్తమునందలి సంకల్ప వ్యవహారమును శమింపజేయి. సంకల్పాలు లయించగా, అప్పుడు శేషించి ఉన్న కళంకరహిత చిత్తాన్ని ఆత్మయందు సంస్థాపన మొనర్చివేయి. ఇక ఈ లౌకికమైన రాజ్యాది వ్యవహారములంటావా? వ్యవహారార్థం ఈ శరీరాదులతో ఆయా క్రియలు ఆచరించుచున్నప్పటికీ వీటినన్నిటినీ అభాస మాత్రంగా చూడు. అభాసమాత్రమే అయిన ఈ కర్మలు ఆత్మకు సంబంధించినవి కావు. ఆత్మచే ఏదీ ఆచరించనివాడవై (నిష్క్రియుడవై), స్వస్థుడవై, సుఖివై ... ఇక ప్రాప్తించిన ఆయా ధర్మములను నిశ్చింతగా, నిర్వికారంగా నిర్వర్తించు.

❖❖❖

3. జగత్తు చిత్ దర్పణంలోని ప్రతిబింబము మాత్రమే

మను ప్రజాపతి : ఓ ఇక్ష్వాకు మహారాజు! ఒక బాలుడు అనేక కల్పనలతో కూడిన ఆటలను ఆశ్రయించి ఆడుకుంటూ ఉంటాడు చూచావా? పరమాత్మ అస్పష్టరూపమగు తన "అవిద్యాశక్తి"చే ఆయా సృష్టి రూప క్రియలను ఆశ్రయించుచూ చిన్నపిల్లవాడివలే స్వయముగా క్రీడించుచున్నాడు. ఆటలు ఆడుకొంటున్న బాలుడు కొద్దిసేపైన తరువాత ఆ ఆటను, అందలి కల్పిత విశేషములను త్యజించి ఇంట్లోకి వెళ్ళిపోతున్నట్లు ఆ పరమాత్మ మరొక తరుణంలో తన జ్ఞాన దృష్టిచే 'విద్య' అను సంహారకశక్తిని ప్రదర్శిస్తున్నాడు. అట్టి సంహారశక్తిచే సర్వమును ఉపసంహరించి స్వాత్మయందు పునఃప్రవేశం చేస్తున్నాడు. తన నిర్మల – అప్రమేయ – నిస్సంగ – అఖండ స్వరూప – ఔన్నత్యమును సంతరించుకుంటున్నాడు.

ఇక్ష్వాకు చక్రవర్తి: ఈ జీవుడు దేనిచే బంధింపబడుచున్నాడో..... అట్టి శక్తి ఎక్కడి నుండి ఏర్పడుతోంది?

మను ప్రజాపతి :

> **స్వయమస్య తథాశక్తిర్ ఉదేత్యాం బధ్యతే యయా ।**
> **స్వయమస్య తథాశక్తిర్ ఉదేత్యున్ముచ్యతే యయా ॥**

దేనిచే ఆత్మయే వాస్తవ స్వరూపంగా గల ఈ జీవుడు బంధింప బడుచున్నాడో... అట్టి శక్తి

ఆతనియందే స్వయంగా ఉదయిస్తోంది. అంతే కాదు. ఏ శక్తిచే ఆతడు ముక్తుడగుచున్నాడో, అది కూడా వానియందే స్వయంగా ఆవిర్భవిస్తోంది. అనగా ఆత్మనుండే బంధనశక్తి ఒకప్పుడు బయల్వెడలి, మరొకప్పుడు లయిస్తోంది.

చంద్ర, సూర్య, అగ్ని, కాల్చబడిన ఇనుపచువ్వ – వీటన్నిటి నుండి ఎట్లా ప్రకాశము వేరుగా ఏర్పడుతుందో, ఎట్లా వృక్షం నుండి ఆకులు వేరుగా ఏర్పడుచున్నాయో, సెలయేరు నుండి జలకణాలు ఎట్లా బయల్వెడలుచున్నాయో... అట్లాగే విశాలమగు బ్రహ్మమునందు బుద్ధి – జగత్తు మొదలైనవి వేరుగా కల్పనచే ఏర్పడుచున్నాయి. బ్రహ్మమునందు కల్పనచే దర్శించబడేదంతా బ్రహ్మమే అయి ఉన్నది. అందుచేత జ్ఞానులకు ఈ జగత్తంతా ఆనందమయ బ్రహ్మముగానే అనుభవమౌతోంది. అజ్ఞానులకో ఇది బ్రహ్మమునకు వేరుగా తోచుచుండుటచే దుఃఖ ప్రదమౌతోంది. ఆహాఁ! ఈ జగత్తునంతా మోహింపజేస్తున్న ఈ మాయ ఎంతటి విచిత్రమైనది! సర్వాంగములను లోపల–బయట ఆక్రమించియున్న ఆత్మను ఈ మాయ కనబడకుండా ఉంచగలుగుతోందే! ఈ జీవుడు మాయను చూస్తున్నాడు గాని ఆత్మను చూడటమే లేదు. శాస్త్రములు మాయ గురించి బోధిస్తూ ఆత్మతత్త్వమును చూపుతూ – సుస్పష్టం చేస్తున్నాయి.

"చిదాదర్శమయం సర్వం జగత్" ఇత్యేవ భావయన్ ।
యస్తిష్ఠతి ఉపశాంతేచ్ఛం స బ్రహ్మకవచః సుఖీ ॥

"ఈ జగత్తంతా చిత్ అనే దర్పణం నందు వ్యాపించి ఉన్నది. ఎందుకంటే ఇదంతా ప్రతిబింబి స్తున్నది చిత్‌లోనే కదా!" అని భావన చేస్తూ ఎవడు సమస్త కోర్కెలు త్యజించి ఉంటాడో... అట్టి వానిని అజ్ఞాన బాణములు ఏమీ చేయలేవు. 'బ్రహ్మము' అను కవచమును ఆతడు ధరించి ఉంటే చాలు, ఇక ఆతడు మహాసుఖవంతుడు.

ఓ ఇక్ష్వాకూ! నీవు అహంకారరహితుడవై ఉండు. దుఃఖం ఉన్నదీ అంటే... అక్కడ అహంకార – మమకారములు ఉన్నట్లే. నీవు అభావరూపభావనతో సర్వవస్తువులు దర్శించు. అనగా "అంతయూ కూడా శూన్యమై నిరాలంబమైనట్టి చిద్రూప బ్రహ్మమే అయి ఉన్నది" అని భావన చేయి. "ఇది రమ్యమైనది, అది రమ్యమైనది కాదు. ఇది ఉచితము, అది అనుచితం. ఇది సానుకూలం, అది ప్రతికూలం"...ఇటువంటి వైషమ్యముతో కూడిన కల్పనయే నీ దుఃఖములన్నిటికి అసలైన బీజమై ఉన్నదని గ్రహించు.

ఇదం రమ్యం ఇదంనేఽతి, బీజం తే దుఃఖసంతతేః ।
తస్మిన్ సామ్యాగ్నినా దగ్ధా దుఃఖస్యావసరః కుతః ॥

ఎప్పుడైతే నీవు 'సమత్వము' అనే అగ్నిని ప్రజ్వలింపజేస్తావో ...ఇక సర్వ వైషమ్య కల్పనా బీజములు దహించబడతాయి. ఆపై దుఃఖానికి చోటెక్కడిది చెప్పు? కనుక 'సమాధి' అనే అభ్యాసానికి ఉపక్రమించు. 'సర్వ దృశ్య విస్మృతి' అనే మహాస్త్రాన్ని చేకూర్చుకో. పురుష ప్రయత్నబలంతో 'రమ్య – అరమ్య విభాగ కల్పన' లను అతి త్వరగా ఛేదించివేయి.

అభావనచే భావనను లయం చేయి. సర్వ దృశ్య విస్మృతిచే దృశ్య స్మరణను నిరోధించు. 'కర్మ' అనే అరణ్యాన్ని 'ఆసక్తి రాహిత్యము' అనే ఖడ్గంతో త్రెంచివేయి.

అట్టి నిజ ప్రయత్నంతో ఆకాశముకంటే కూడా అతి సూక్ష్మమైన బ్రహ్మమును పొంది దుఃఖరహితుడవగుము.

మొట్టమొదట మన ఈ సంవాదము యొక్క ప్రయోజనంగా వివేకమును సంపాదించు. ఇక 'సమాధి' అను అభ్యాసముచే 'బాహ్య కల్పనా అభాస'ను సన్నగిల చేయి. సత్య దృష్టితో చూడగల 'పవిత్రదృష్టి'ని నిదుర లేపు.

క్రమంగా పూర్ణాత్మానుభూతిచే జగమంతా వ్యాపించి ఉండు. జగమంతా వ్యాపించిన శరీరం కలవాడై, విభాగ రహితుడవై పరమానందం పొంది ఉండు. శాశ్వతంగా సంసారరోగ వర్జితుడవగుము. శాంతమై, సమమై, ఏకరసమై, స్వచ్ఛమైనట్టి చిన్మాత్ర దేహము కలవాడవై... సంసారభయ రహితుడవై ఉండుము.

❖❖❖

4. 'అహమ్' నుండి 'అనహమ్'

మను ప్రజాపతి : బిడ్డా! 'సర్వాత్మకత్వము' అనేది ఒక అనిర్వచనీయమైన అనుభవస్థితి. అది సాధ్యము, లక్ష్యము అయి ఉండగా అందుకు సాధనములను, మధ్యే మార్గమగు వేరు వేరు అనుభవ స్థితులను శాస్త్రకారులు ప్రవచిస్తున్నారు.

అనుభవమాత్రము, 'జ్ఞేయము' అగు సర్వాత్మకత్వము వాస్తవానికి మనోవాక్కులకు లభించేది కాదు. అయితే అందుకు తరుణోపాయములను, ఆయా అవస్థలను శాస్త్రకారులు ఎట్లా ప్రవచిస్తున్నారో చెబుతాను. విను–

ప్రజ్ఞాశ్రయము – విచారణ – అసంగము – విలాపినీ – శుద్ధ సంవిన్మయానందము – నిరతి శయానందము – పరమ యోగి / పరమ హంస / తురీయవస్థ.

❖

మొట్టమొదట 'నేనీ పరిమిత పరిజ్ఞానంతో జీవితమంతా వెచ్చించటమనేది అర్థంలేని పని".... అని ఈ జీవుడు ఎప్పుడో గ్రహిస్తున్నాడు. అట్టి వేదన ఉత్పన్నమైన మరుక్షణం ఆతని ప్రయత్నమునకు సహకరించటానికి శాస్త్రములు, అనుభవజ్ఞులు సిద్ధంగా ఉన్నారు. 'శాస్త్రాభ్యాసము – సజ్జన సహవాసము...'ఈ రెండింటిచే ప్రజ్ఞను వృద్ధి పరచుకోవాలి. ఇది ప్రజ్ఞాశ్రయం అనబడేది యోగి యొక్క మొదటి భూమిక. ఇక మనస్సు నిర్మలమగుచుండగా ఆ యోగి 'విచారణ' అనబడే రెండవ భూమికలో క్రమంగా ప్రవేశిస్తున్నాడు. "ఇది అల్ప కాలికం గతించిపోయేది...' అని క్రమంగా ఈ దృశ్యం విషయమై గ్రహిస్తున్నాడు. ఏది కాలబద్ధము, భ్రమతో కూడినది అయున్నదో, అట్టి విభాగాన్ని వేరు చేసి 'అసంగము' అను మూడవ భూమికలో ప్రవేశిస్తున్నాడు. క్రమంగా సాధన కొనసాగిస్తూ

ఉండగా వాసనలకు ఆశ్రయభూతమైన అవిద్య సన్నగిల్లుతూ ఉండగా ఆ యోగి (లేక, సాధకుడు) 'విలాపనీ' అనే నాలుగవ భూమిక (లేక, నాలుగవ అవస్థలో ప్రవేశిస్తున్నాడు. ఆ విధంగా విలాపనీ యందు సాధన కొనసాగుచుండగా కొంతకాలానికి 'శుద్ధ సంవిన్మయానందము' అను 5వ భూమికలో ప్రవేశిస్తున్నాడు. ఈ ఐదవ భూమిక శుద్ధ సంవిత్తుచే పూర్ణమై ఉంటుంది. ఆనందరూపమైన ఈ భూమికలో ప్రవేశించిన యోగిని 'జీవన్ముక్తుడు' అని అనవచ్చు. ఈ భూమికలో ఆతడు అర్ధ నిద్రితుడు గాను, అర్ధ జాగృతుని వలెను ఉంటాడు.

అట్టి ఐదవ భూమికలో కొంత కాలమున్న తరువాత యోగి 'స్వభావనిరతిశయానందము' అను ఆరవ భూమికలో ప్రవేశిస్తున్నాడు. ఈ భూమిక (లేక అవస్థ) బ్రహ్మాకారము అను అనుభవవృత్తి రూపంగానూ, స్వభావంగానే నిరతిశయానందరూపంగానూ ఉంటుంది. లౌకిక జగత్తు దృష్ట్యా ఇది సుషుప్తి రూపము వంటిది. ఇందులో ఏర్పడి ఉండే కించిత్ వృత్తి కూడా లయించుచుండగా ఆ 'పరమయోగి' (లేక, పరమహంస) కేవలముక్తి రూపమై, సౌమ్యమైనట్టి 'తురీయాతీతావస్థ' అనే ఏడవ భూమికలో ప్రవేశిస్తున్నాడు.

ఇట్టి 'తురీయాతీతావస్థ' అనే ఏడవ భూమిక పరా నిర్వాణరూపమైనది. ఈ సప్తమ భూమిక మిక్కిలి ప్రౌఢమైతే 'విదేహముక్తి' లభిస్తుంది. అట్టి ఏడవ భూమికకు అతీతమైన స్థితి కేవలానుభవమే తప్పించి సదేహుల సంభాషణకు అందేది కాదు. అయితే ఆ విదేహముక్తి అనుభవానికి లభ్యమే సుమా!

తురీయాతీతము -

7. తురీయాతీతము	:	స్వయంప్రకాశ రూపం, మనోవాక్కులకు అగోచరం
6. స్వభావ నిరతిశయానందము	:	కేవల స్వరూప మాత్ర – తురీయావస్థ
5. శుద్ధ సంవిన్మయానందం	:	సుషుప్తరూపం
4. విలాపనీ	:	స్వప్నరూపం
3. అసంగము	→	ఈ మూడు జాగ్రదవస్థలు
2. విచారణ జాగ్రదావస్థలు		
1. ప్రజ్ఞాశ్రయం–శాస్త్రాశయం		

మనోవాక్కులకు అగోచరం, కేవలానుభవమాత్రం.

'సప్తమ భూమికామహాసమత్వము' అనబడే 7వ భూమికలో అంతరంగమునందు సమస్తమూ లయించి పోతాయి. విషయములు భాసించవు. ఇట్టి యోగి 'ముక్తుడు' అని కూడా పిలువబడుచున్నాడు. 7వ భూమికలో ప్రవేశించిన వాని బుద్ధి సుఖములచే గాని, దుఃఖములచే గాని కొంచెం కూడా స్పృశించబడదు. 'ఈ శరీరం ఉన్నా ఒక్కటే! లేకున్నా ఒక్కటే' అను మహత్తర భావమును ఆతడు కలిగి ఉంటాడు. 'నేను మరణించటం లేదు. జీవించటం లేదు. నేను సత్తును గాను. అసత్తును గాను' అని గ్రహించి కేవలం ఆత్మారాముడై ఉంటాడు కాబట్టి ఈతనిని మనం 'జీవన్ముక్తుడు' అను శబ్దానికి సరితూగే అర్థంగా చెప్పుకుంటాం.

వ్యవహార్యుపశాన్తోవా, గృస్థోవా అథ వైకకః,
అహం న కించిత్ చిదితి, మత్వా జీవో న శోచతి॥

అలేపకోఽహమ్, అజరో, నీరాగః, శాంతవాసనః
నిర్మలోఽస్మి చిదాకాశ ఇతి మత్వా న శోచతి॥

అహమ్ అన్తాది రహితః శుద్ధోబుద్ధో అజరామరః
శాన్తః సమసమాభాస ఇతి మత్వా న శోచతి॥

తృణాగ్రేషు అంబరే భానౌ నర నాగ అమరేషుచ,
యత్తదస్తి తదేవ ఇతి మత్వా భూయో నశోచతి॥

'సంసారము – అనబడే దానిచే నేను లిప్తుడను అయ్యేవాడిని కాను. దేహధర్మములైన వార్ధక్యాదులు నా స్వస్వరూపమునకు లేవు. రాగద్వేషములు నా నిర్మల స్వస్వరూపమునకు లేవు. నేను వాసనా శూన్యుడను. నిర్మల చిదాకాశమాత్రుడను' అని ఎరిగియే ఉండటంచేత సుఖ–దుఃఖ ద్వంద్వములు అతనిని సమీపించనైనా లేవు.

"నేను వ్యవహారస్థుడనై ఉండవచ్చు. లేదా వ్యవహారములు లేనివాడనై ఉండవచ్చు. గృహస్థుడనైనా, సన్యాసిని అయినా సరే ...ఏది ఏమైనా, ఎట్లున్నా, నేను చిన్మాత్రుడను"అని విశ్వసించే యోగి ఇక దుఃఖము పొందే ప్రసక్తే ఉండదు.

"నేను ఆద్యంతాలు లేని వాడను. శుద్ధుడను. బుద్ధుడను. వార్ధక్యాదులు నాకు లేవు. అమరుడను. శాంతుడను. సర్వత్రా–సమంగా భాసించేవాడను" అని ఎరిగిన తర్వాత ఇక ఆ యోగిని శోకమోహాలు సమీపించటానికి సాహసించలేవు. 'ఒక గడ్డి పరక చివరి కొసభాగంలోను, ఆకాశమందు, సూర్యుని యందు, మనుష్యులందు, పాములందు, దేవతలందు ఏ సన్మాత్రము ఉండి ఉన్నదో, ఆ ప్రత్యేక చిన్మాత్రమే నేను'... అని ఈ విధంగా అఖండ వాక్యార్థం ఎరిగిన తరువాత దుఃఖించుటకు కారణమే కనిపించదు. "చిద్రూపుడనగు నా యొక్క మహిమయే సర్వజంతువులలోను, ఇటు భూమియందు, అటు ఆకాశమునందు అంతటా వ్యాపించియున్నది"... ఇట్లు అనంత విలాసయుక్తునిగా తనను తాను గ్రహించి తీర్చిదిద్దుకునే ఆ మహాత్ముని మరణాది దుఃఖములు ఎట్లా అడ్డుకుంటాయి?

❖

ఓ ఇక్ష్వాకూ! ఈ కనబడే వస్తువులలో సాంసారిక జీవుడు ఏదో సుఖాశతో వెతకుచున్నాడు. అయితే సుఖము ఎక్కడ లభిస్తుంది? వాసనలతో కూడిన అజ్ఞానికి ఏఏ పదార్థములు ఇప్పుడు సుఖములు కలిగిస్తున్నాయని నమ్ముకొని ఉంటున్నాడో, అవన్నీకూడా ఒకప్పటికి కాలక్రమేణా నశించేవే! కనుక నశించేటప్పుడు అవి అతి శీఘ్రంగా దుఃఖమును కలిగించబోతున్నాయి.

"మాకున్నవన్నీ ఇట్లాగే ఉంటాయి? ఈయన ఏమిటి, ఇట్లా అంటాడు?"...అని ఎవరైనా అనదలిస్తే ... వారికి – "భౌతికానుభవములకు ఉపకరణమైన దేహమే కాలక్రమేణా నశించబోతోంది కదా"...అని గుర్తు చేస్తున్నాం. అందుచేత, "ఏఏ వస్తువులు వాసనారహితమైన మనస్సుచే అనుభవించ

బడతాయో, అవి మాత్రమే దుఃఖరహితమైన సుఖమును అందించగలుగుతాయి'... అని జనులందరికీ నా మనవి.

అవినాభావ నిష్ఠత్వం ప్రసిద్ధం సుఖ-దుఃఖయోః,
తనువాసన మర్థో యః సేవ్యతే వా వివాసనమ్,
నాసౌ సుఖాయతే, నాసౌ నాశకాలేన దుఃఖ దః ॥

ఈ సుఖ-దుఃఖాలనేవి ఒకదానితో మరొకటి 'అవినాభావ సంబంధం' కలిగి ఉన్నాయి. 'ఇది సుఖం' అన్నచోట 'మరొకటి దుఃఖం' అని అనుకున్నట్లే అవుతుంది. వాసనారాహిత్యంచే ఏది అనుభవించబడుతుందో అది సుఖం కలిగించజాలదు. అది తొలగినప్పుడు దుఃఖం కూడా కలిగించజాలదు.

ఎవడు వాసనలు నశించిన బుద్ధితో ఏది చేస్తాడో, అది దగ్ధమైన బీజంలాగా మరల అంకురించజాలదు. అట్టివాని కర్మలన్నీ దేహేంద్రియముల చేతనే నిర్వర్తించబడుచుండగా, మనస్సు అకర్తృత్వము వహించి ఉండే సామర్థ్యము కలిగి ఉంటుంది. వాసనలు కలిగి ఉండే మనస్సు అకర్తృత్వమును వహించాలని అనుకున్నా కూడా ...వల్ల కాదు.

❖

ఇంద్రియ సమూహములన్నిటియందు ఏకస్థమైయున్న శుద్ధ చైతన్యము ఇంద్రియ వ్యవహారానికి కర్తగాని, భోక్తగాని ఎట్లా అవుతుంది? ఎందుకంటే ఈ ఇంద్రియములకు, 'అహం' భావనకు కూడా శుద్ధ చైతన్యం వేరుగా ఉంటోంది. అయితే ఆ శుద్ధ చైతన్యం జడమగు ఇంద్రియ అహంకారాదులకు ప్రవర్తనశక్తిని ప్రసాదిస్తోంది. ఆ చైతన్యతత్త్వమే ఇంద్రియాలను వెలిగిస్తోంది గాని, ఇంద్రియాలు అద్దానిని ప్రకాశింపజేయటం లేదని గ్రహించు. అయ్యది పూర్ణచంద్రదీప్తి వలె పూర్ణ ప్రకాశమానమై ఉన్నది. అదొక్కటే స్వయం ప్రకాశకమని, తక్కినదంతా అద్దాని ప్రభావ వీచికలు మాత్రమేనని ఎరిగి ఉండు. ఇక ఈ దేహం విషయం అంటావా! ఈ దేహము, దేహమునకు సంబంధించిన భావన, దేహముచే నిర్వర్తించబడే ఆయా క్రియలు ...ఇవన్నీ కూడా 'జ్ఞానము' అనే వాయువు గట్టిగా వీచినప్పుడు (ఇవి) నిర్విషయమై ఎటో కొట్టుకుపోతాయి.

❖

నీవు శాశ్వతం - నిర్మలం అగు చైతన్యస్ఫూర్తి అయి ఉన్నాయి. ఇక ఈ దేహమో? ఈ మధ్య కాలంలో వచ్చినది. మధ్యలోనే పోతోంది. ఈ దేహకళలు నీ చైతన్య కళలను కప్పి ఉంచగలవా? లేదు. మరి చైతన్య కళలను చూచి ఆనందించక ...ఈ దేహ కళలను చూచి దుఃఖించవలసిన పనేమిటి?

సర్వైవ హి కలా జంతోః అనభ్యాసేన నశ్యతి,
ఏషా జ్ఞాన కలాత్యన్తః సకృజ్జ్ఞాతా దినేదినే,
వృద్ధిమేతి బలాదేవ సుక్షేత్ర వ్యుప్తశాలివత్॥

దేహ సంబంధితమైన ఏ కళంకాలు ఉన్నాయో, అవన్నీ అనభ్యాసం వల్ల నశించిపోతాయి. అయితే స్వస్వరూప చైతన్యమునకు సంబంధించిన జ్ఞానకళ అట్టిది కాదు. ఆత్మజ్ఞానము జనించిందా,

అట్టి కళ తదితర దేహ సంబంధిత విషయముల వలె కాలబద్ధంకాదు. కాబట్టి మంచి ప్రదేశంలోని పూలమొక్కవలె దినదినం వృద్ధి చెందగలదు. అందుచేత నీవు దేహకళలను ఆశ్రయించటం తగ్గించి జ్ఞానకళను ఆశ్రయించు.

ఓ కుమారా! ఇక్ష్వాకా! సమస్త తటాక – నదీ – సముద్రములందునూ ఒకే స్వచ్ఛమైన జలం ఏర్పడి ఉన్నట్లు – ఒకే 'విశ్వరూప – సన్మాత్రము'అగు ఆత్మ ఈ సమస్త పదార్థములందును సర్వదా స్ఫురిస్తోంది. కనుక ఈ జగత్తంతా కూడా సమస్త విచిత్ర కల్పనా రహితమైయున్నదని, ఏకసత్తాంశమాత్రమని గ్రహించి ఉండు. వ్యక్తిగతమైనది ఎచ్చటైతే ఏమాత్రం లేదో, అట్టి జగదహంకారాదుల దాని గురించి లెక్కలు కట్టుకుందో దుఃఖించవలసిన పని నీకేమున్నది?

❖❖❖

5. సచ్చిదానందమును సంతరించుకో

ఇక్ష్వాకు చక్రవర్తి : హే ప్రజాపతీ! ఈ ఆత్మకు జీవత్వమనేది ఎంతవరకు అనివార్యమై ఉంటుంది?

మను ప్రజాపతి : ప్రియకుమారా! ఎంతవరకైతే విషయ భోగేచ్ఛల గురించి 'ఆశ' అనేది అంతర్గతంగా కలిగి ఉంటుందో అంతవరకు ఆత్మకు 'నేను జీవుడను' అనే దశ ఉండియే తీరుతుంది. మరి విషయ భోగాశ ఎక్కడి నుండి వస్తోంది? అది 'అజ్ఞానము' అనే వీచికయేగాని, అవివేకముచే సంప్రాప్తిస్తున్నదే గాని వాస్తవమైనది కాదు.

వివేకము బలం పుంజుకుంటూ ఉంటే భోగాశ తనంతట తానే క్షయిస్తూ ఉంటుంది.

విషయ భోగాశ క్షీణించగానే అప్పుడు ఆత్మ జీవదశను త్యజించి స్వభావసిద్ధము, అనామయము అగు 'బ్రహ్మరూపత్వం' పొందుతోంది. అప్పుడు దేహము ఉన్నా, ఉండకపోయినా బ్రహ్మానుభవం ఏర్పడియే ఉండగలదు.

బొక్కెన త్రాడుచే కట్టబడి క్రిందినుంచి పైకి, పైనుండి క్రిందకు బలవంతంగా తిరుగాడుతున్నట్లు, 'భోగవాంఛ' అనే అవివేక స్వభావం (చింతన) అనే త్రాడుచే కట్టబడి ఈ సంసార కూపం (నుయ్యి)లో తిరుగాడుతోంది. అట్టి చింతన అనే త్రాడుచే భోగవాంఛాస్వభావుడవై బంధించ బడబోకు.

ఈ భోగవాంఛ అనేది చాలా చమత్కారంగా జీవుని ఆవరించి ఉంటోంది. దాని రూపమేమిటో చెబుతాను విను.

"ఇది నాది -నేను దీనికి చెందినవాడను?" - 'ఇది నాది, నేను దీనికి చెందిన వాడిని'... అని ఘనీభూతమైన వ్యవహార భ్రమను ఎవరైతే మోహవశంచేత ఆశ్రయించి ఉంటారో ... అట్టి మూర్ఖులు ఇంకా క్రిందకు, అక్కడి నుండి ఇంకా ఇంకా క్రిందకు పడిపోతూనే ఉంటారు. నేను వీనికి చెందిన వాడిని. ఇతను నా వాడు. ఈ దేహం నేను ...ఈ ప్రకారంగా మోహమును ఆశ్రయిస్తూ ఎవరు జ్ఞానానికి దూరమౌతూ ఉంటారో వారిని ఎవరు ఎట్లా కాపాడగలరు? అట్టి మోహమును పరిత్యజిస్తూ ఉండేవారో ... క్రమక్రమంగా ఉన్నతిని సంపాదించుకోగలరు.

❖

కనుక ఓ రాజా! ఇప్పుడు నీవు చెయ్యవలసినదేమిటో చెబుతాను. స్వయం ప్రకాశరూపమగు నీ యొక్క ఆత్మను అవలంబించు. అట్టి సంపూర్ణభావనచే ఈ జగత్తులన్నిటినీ నింపివేయి. జగత్తులన్నిటా పూర్ణమొనర్చి వ్యాపించియున్న 'చిదాకాశము'నే గాంచుము. ఎప్పుడైతే అఖండ-అప్రమేయ-నిర్మల చిద్రూపమును సర్వే సర్వత్రా దర్శిస్తావో అప్పుడు నీవీ సంసార సాగరమును అధిగమించి పరమేశ్వరత్వం పొందుతావు. ఉత్తమ భావన చేయి. ఉత్తముడవౌతావు.

ఇక్ష్వాకువు : 'ఉత్తమభావన'అంటే తమ ఉద్దేశం చెప్పండి.

మను ప్రజాపతి : 'బ్రహ్మ, ఇంద్రుడు, విష్ణువు, వరుణుడు, ఈశ్వరుడు మొదలైన వారంతా ఏదేది చేయటానికి ఉద్యమిస్తున్నారో ...అదంతా కూడా చిత్ శరీరినగు నేనే చేయుచున్నాను'... అని భావన చేయి. 'చిత్'యొక్క విలాసము నిరంకుశము కాబట్టి ఏదేది ఎట్లు భావన చేస్తే అదియే క్రమంగా సిద్ధించగలదు. ఏ భావన యొక్క ఉత్కృష్టత త్రిమూర్తులలో ఉన్నదో అది కూడా నీవే అగుచున్నావు. అట్టి 'ఆత్మాఽహం' భావనచే దృశ్యము వైపుగా ఎక్కుబెట్టబడి ఉన్న చిత్తం ఉపశమించి బ్రహ్మాకారం పొందుతోంది. చిత్తం శమించగా, మృత్యువును అధిగమించి చిన్మాత్రత్వం (నేను శుద్ధ చిత్‌ను – అనే ఆరూఢత్వం) పొందిన వారికి ఏ పరమానందం లభిస్తోందో అది దేనితో పోల్చగలం?

ఇక ఈ జగత్తు విషయంలో ఎట్టి భావన కలిగి ఉండాలో ...చెబుతాను విను. "ఈ జగత్తు శూన్యం కాదు. అశూన్యమూ కాదు. చిద్రూపం కాదు. అచిద్రూపమూ కాదు. ఆత్మరూపం కాదు. అనాత్మ రూపం కాదు. ఇది భావన అను ప్రక్రియపై ఆధారపడి ఉన్నది..." అని గమనిస్తూ జగద్భావనను అధిగమించి ఆత్మను మాత్రమే ఆశ్రయించి ఉండు.

'ఆత్మ సాక్షాత్కారం' అనే సాక్షాత్ పారిమార్థిక స్వరూపం ప్రాప్తిస్తూ ఉండగా ఈ ప్రకృతి తనకు తానే స్వయంగా తొలగిపోగలదు.

ఏతత్ స్వరూపమాసాద్య ప్రకృతిః పరిశామ్యతి ।

న దేశో మోక్షనామాస్తి న కాలో నేఽతరా స్థితః ॥

"మోక్షం అని పిలుబడే స్థితి ఎప్పటికో, ఎంతోకాలానికి గాని రాదు. ఎక్కడో మరొకచోటు అది. మోక్షస్థితిలో మనం ఇట్లా ఉండం. మరొక స్థితిలో మరొకటేదో రూపంలో ఉంటాం"... అని లోక రీతిగా అనుకుంటూ ఉంటారు. అదంతా వాస్తవంకాదు. మోక్షమనేది ఎక్కడికో వెళ్ళిన తరువాతనో, ఏ మరొక స్థితి పొందిన తరువాతనో, ఏ కొంత కాలమో జరిగిన తరువాతనో వచ్చి కూర్చునేది కాదని గ్రహించు. మరి?

వ్యక్తిగతమైన అహంకారం (లేక) దేహగతమైన 'అహంకార – మమకారములు' అనే మోహం క్షయిస్తూండగా, ఆ ద్రష్ట అంతరంగంలో ఈ ప్రకృతి యొక్క ప్రభావం పరిశ్యామం పొందుతూంటుంది. అప్పుడా ద్రష్టకు "నేనే ఆత్మను. ఆత్మ గురించి చెప్పబడిన అఖండ అప్రమేయాది లక్షణములన్నీ నా స్వరూప వర్ణనలే"...అని సుస్పష్టమౌతుంది. అనుభవైక వేద్యమౌతుంది. అట్టి అవగాహన యొక్క – వాక్‌మనో అతీతమైన వైభవం – అనుభవాల ఔన్నత్యస్థితినే 'మోక్షం' అని పిలుస్తారు.

అనేక శాస్త్రముల అనేక కథా – సోదాహరణములు, విభాగ సిద్ధాంతములు, విధి విధానాదులు చెప్పుకుపోతున్నాయి. మా ఉద్దేశంలో అవన్నీ కూడా 'నేను నిత్యసత్యమగు నిర్మలాత్మను'... అని నిరూపించుటకొరకై (మధ్యే మార్గ ప్రతిపాద్యములై) ఉన్నాయి. అందుచేత వివిధ శాస్త్రముల గూర్చిన 'జిజ్ఞాస'అనే చపలత్వం కూడా శమించవలసిన వాటిలో ఒకటియే అయున్నది. అట్టి 'శాస్త్రార్థజిజ్ఞాస'అనే చపలత్వం కూడా శమించినవాడు, అనేక విధములగు కావ్య – నాటక కౌతుకములు కూడా లేనివాడు, సమస్త వికల్ప – ఉపద్రవములు తొలగినవాడు, సమరూపమగు జీవన్ముక్తత్వము సంపాదించుకొన్న మనిషి శాశ్వతమైన సచ్చిదానందముతో సుఖ పూర్వకంగా ఏర్పడి, ఈ ప్రపంచమున ఉండగలడు.

ఓ ఇక్ష్వాకూ! నీవు కూడా అట్టి సచ్చిదానందత్వము అనువర్తించుకో. సంతరించుకో. ఇక ఏది ఎట్లు ఉచితమో అట్లే అగుగాక!

❖❖❖

6. జీవన్ముక్త మాహాత్మ్యం

ఇక్ష్వాకు చక్రవర్తి : ప్రభో! పవిత్రమగు జీవన్ముక్తత్వము సంతరించుకున్న మహనీయుల ప్రవర్తన ఎట్లా ఉంటుంది? వారిలో ప్రత్యేకమైన లక్షణాలేమైనా కనిపిస్తాయా? వారితో ఎటువంటి సంబంధం కలిగి ఉండటం మావంటి వారికి అనుచితం? అసలు వాళ్ళు ఎక్కడెక్కడుంటారు?

మను ప్రజాపతి : జీవన్ముక్తునికి 'ఇక్కడే ఉండాలి – అక్కడ ఉండకూడదు' అనే సాంఘిక – లౌకిక సిద్ధాంతాలు వర్తించవు. ఎక్కడైనా ఏదో తింటూ, ఎవరో ఏ వస్త్రమో కప్పితే కూడా తన ఇచ్ఛానుసారం ఉండగలడు. వర్ణాశ్రమ ధర్మాలనుండి, శాస్త్రరూప యంత్రము నుండి అంతర్గతంగా విడువబడినవాడై ఉంటాడు. బాహ్యానికి ఏది ఎట్లు ఎంతవరకు లోకానుకూలంగా అవుతుందో, అది అట్లే అనుసరిస్తాడు. 'జీవన్ముక్తుడు' బోను నుండి సింహం లాగా ఈ జగజ్జాలము నుండి బయల్వెడలుచున్నాడు. వాక్కుచే అందనట్టి నిరతిశయానందము పొంది ఉంటాడు. విషయదశల నుండి విడివడినవాడగు ఆ యతివర్యుడు శరద్రుతువులోని మేఘరహిత నిర్మలాకాశంలాగా ఒకానొక అనిర్వచనీయ శోభను పొందుచున్నాడు. పర్వతముపైన గల ఒక పెద్ద మడుగులాగా గంభీరుడై, నిర్మలుడై ఒప్పుతూ ఉంటాడు. 'ఆత్మానంద రసాస్వాదము' నుండి చ్యుతుడు కావటానికి ఆతనికి కారణమే కనిపించదు. సదా, సర్వదా, సర్వ అవస్థలలోనూ ఆత్మయందే క్రీడిస్తూ ఉంటాడు.

సర్వకర్మఫలత్యాగీ, నిత్యతృప్తో, నిరాశ్రయః ,
న పుణ్యేన, న పాపేన లిప్యతే నేతరేణచ ॥

సమస్త కర్మల ఫలములను మొదలే త్యజించివేసి ఉంటాడు. నిత్యతృప్తుడై, నిరాశ్రయుడై ఈ మాయామేయ జగత్తు యొక్క నిత్యానిత్య రహస్యములను ఎఱిగి ఉంటాడు. పుణ్యపాపములుగాని, తదితరములైన హర్ష – శోకములు గాని ఆతనిని అంటజాలవు.

స్ఫటికః ప్రతిబింబేన యథాయాతి న రంజనమ్
తత్‌జ్ఞః కర్మఫలేనాన్తస్తథా నా యాతి రంజనమ్॥

ఒక స్ఫటికమును ఒకచోట ఉంచామనుకో. అందులో ఎదురుగా ఉన్న ఎరుపు రంగు వస్త్రం ప్రతిబింబించటం చేత స్ఫటికము ఎఱుపుగా కనిపిస్తుంది. అంతమాత్రం చేత "స్ఫటికం రూపాంతరం పొందింది"...అని అనగలమా? స్ఫటికం ఇతఃపూర్వపు నిర్మలత్వం కోల్పోతుందా? ప్రతిబింబిత వస్తువును ప్రక్కకి పెట్టగానే స్ఫటికం యథాతథమౌతుంది కదా! అట్లాగే ప్రారబ్ధ కర్మ ఫలరూపములగు ఇక్కడి సుఖ – దుఃఖాదులచేత ఆ జీవన్ముక్తుడు ఆత్మ స్వభావము నుండి ఏమాత్రం చ్యుతుడు కాడు. ఒక ప్రక్క జన సమూహం మధ్య విహరిస్తూనే, స్వతంత్ర బుద్ధితో ఆత్మారాధన చేస్తూనే ఉంటాడు. అద్దము తనలో ప్రతిబింబించే దృశ్యము వృద్ధిచెందినా ఖండింపబడినా ఖేదము పొందదు కదా! దేహము పూజించబడుచున్నప్పుడు, ఖండించబడుచున్నప్పుడు కూడా – అద్దంలో ప్రతిబింబించే దేహము మోహముగాని, గర్వముగాని, దుఃఖం గాని పొందనట్లు – ఆతడు దేనికీ ఖేద, దుఃఖ, మోహ, గర్వాదులు పొందడు. పూజింపబడనప్పుడు కూడా స్తుతి శూన్యుడై ఉంటాడు. పూజితుడు కాకున్నప్పటికీ వికార రహితుడై ఉంటాడు. ఒకప్పుడు ఆచారనియమములు పాటిస్తున్నప్పుడు, మరొక్పుడు పాటించని తరుణంలోను కూడా ఆతని ఆత్మావగాహన ఒకే తీరుగా ఉంటుంది. ఆ ఉభయములు ఆతనికి ఒక్కటే అవుతాయి.

తస్మాన్ నో ద్విజతే లోకో, లోకాన్నోద్విజతే చ సః
రాగద్వేషభయానన్దైః త్యజ్యతేఽపి చ యుజ్యతే॥

ఆతనిని చూచి లోకము, భయం పొందదు. లోకమును చూచి ఆతడు భీతుడు కాడు. ఒకప్పుడు రాగ–ద్వేష–భయ–ఆనందాలు త్యజించి ఉంటాడు. మరొకప్పుడు లీలామాత్రంగా కూడి ఉంటాడు. అవి ఉన్నా, లేకున్నా ఆతని ఆత్మానుభూతికి కొఱత ఉండదు. ఇక ఆతని తత్త్వజ్ఞానానుభవం యొక్క లోతును ఎన్నో లౌకిక తెలివి తేటలు కలవాడు కూడా కనుగొనలేడు. అయితే వ్యవహారానికి వస్తే శుద్ధచిత్తుడైన ఒక చిన్నపిల్లవాడికి కూడా ఆతను ఇట్టే వశమై ఉంటాడు.

తనుం తయ్జతు వా తీర్థే శ్వపచస్య గృహేఽపి వా
మా కదాచన వా రాజన్। వర్తమానేఽపి వా క్షణే॥

ఒక పవిత్ర క్షేత్రంలో దేహం విడచుచుండవచ్చు గాక. లేదా, మరెక్కడో అపవిత్రమైన పరిస రాలలో విడుచుచుండవచ్చు. ఈ శరీరమును సుదీర్ఘ కాలం కలిగి ఉండవచ్చు. అల్పకాలంలోనో, లేక మరికొద్ది క్షణములలోనో త్యజించవలసి ఉండవచ్చు. ఈ అన్ని సందర్భములలోనూ ఆతనికి ఏ ప్రత్యేకతా కనిపించదు. దేహ గ్రాహ్యంలోగాని, దేహ త్యాజ్యంలోగాని ఆతనికి విశేషమేదీ కనిపించదు. ఆతనియందు కోర్కెలేవీ ఉండనందువల్ల జ్ఞాన ప్రాప్తిపొందిన సమయంలోనే ముక్తిని పొంది ఉంటాడు. పఠన శ్రవణాదుల ద్వారా జ్ఞాన విషయములు పొంది ఆత్మానుభవి అయి శేషిస్తాడు గాని, "ఈ ఈ క్రియల తరువాతనే ముక్తి"... అనే వ్యవహారం యొక్క అగత్యం ఆతనికి ఉండదు.

ఈ ప్రపంచంలో జీవునికి ప్రతిబంధకమగుచున్నది అహంకారమే కదా! జీవన్ముక్తునిలో 'అహంకారభ్రాంతి' అనే బంధనం ఉండదు. జ్ఞానముచే అది స్వతఃసిద్ధంగానే రహితమైపోయి ఉంటుంది. ఆ జీవన్ముక్తుడే మోక్ష స్వరూపుడు. అంతేగాని ఆతని పట్ల మోక్షమనేది ఎక్కడినుండో వచ్చేది కాదు.

ఓ ఇక్ష్వాకు చక్రవర్తీ! అటువంటి మహనీయులు ఈ భూమిపై ఉన్నారు. వారు పూజనీయులు. వారిని పూజించినవారు, నమస్కరించినవారు కూడా పవిత్రులు, జ్ఞానైశ్వర్యులు కాగలరు. అందుచేత ప్రయత్నపూర్వకంగా అట్టి వారిని దర్శించాలి. నమస్కరించాలి, స్తుతించాలి. అభివందనలు సమర్పించాలి. ఎందుకంటే వారు ఇక్కడి సంసారరోగమును తమ చూపుచే, వాక్కుచే, స్పర్శచే శమింపజేయగలరు.

ఓ జనులారా! ఆత్మవేత్తలపట్ల మీరు భక్తి-ప్రపత్తులు కలిగి ఉండండి. ధర్మపరిరక్షణకు, సంసారమందు చిక్కుకున్న ఈ మనస్సును ఎప్పటికైనా ఇవతలకు లాగి 'మోక్షమార్గము' అను పవిత్ర ప్రదేశములో నిలిపి ఉంచటానికి ఈ లోకమునకు వారే దిక్కు. వారే ప్రవక్తలై ధర్మ సంరక్షణార్థం జన్మించి పెడత్రోవనపోతున్న ఈ జన స్రవంతిని దుఃఖముల నుండి కాపాడి లోకముకు మహోపకారం చేస్తూ ఉంటారు. ఆత్మవేత్తలను దర్శించటం, వారితో సంభాషించి ఆత్మజ్ఞానోన్నతిని సంపాదించటం వలన కలిగే పవిత్ర ఫలము యజ్ఞ-తీర్థ-తపో-దానాదులచే కూడా లభించజాలదు. ముముక్షువులగు జనులు తమ ప్రయత్నసౌలభ్యం కోసం జీవన్ముక్తులు, జ్ఞానులు అగు వారికొరకు వెతుకుతూ ఉండటం, వారు తారసబడినప్పుడు వినమ్రులై అనుద్వేగకరములైన ప్రశ్నలచే సంభాషించి తద్వారా ఆత్మజ్ఞాన వివేకమును పెంపొందించుకోవటం అవశ్య కర్తవ్యమై ఉన్నది.

ఓ ఇక్ష్వాకా! ఇక నీకు శుభమగుగాక! లోకములందు ఆత్మ వివేకము పరిఢవిల్లి, నా బిడ్డలగు ఈ జనులంతా దుఃఖరహితులగు గాక!

❖

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఇట్లు దీవించి భగవంతుడగు ఆ మనుప్రజాపతి శీఘ్రంగా బ్రహ్మలోకమునకు జేరుటకై అంతర్ధానమైనాడు. మహనీయుడగు మను ప్రజాపతి చెప్పిన ప్రతివాక్యమును వివేకముతో విశ్లేషించి, ఆత్మదృష్టిని దృఢంగా అవలంబించిన మీ వంశజుడగు ఆ ఇక్ష్వాకువు స్థిరచిత్తుడైనాడు.

❖❖❖

7. జీవన్ముక్తుడు - సామ్యస్థితి

శ్రీరాముడు : ఆత్మవేత్తలలో శ్రేష్ఠుడవగు ఓ వసిష్ఠమహర్షీ! మనం ఇన్ని రోజులుగా అనేక సందర్భములలో జీవన్ముక్తుని గురించి చెప్పుకున్నాం. అయినా కూడా మా పూర్వీకులైన ఇక్ష్వాకు చక్రవర్తి మను ప్రజాపతిని అడిగినట్లే నాకు కూడా మిమ్ములను అడగాలనిపిస్తోంది. జీవన్ముక్తులగు

మహనీయులు ఉన్నారని, వారిని సేవ - స్తోత్రాదులచే సంతసింపజేయటం విధ్యుక్తధర్మమై ఉన్నదని మనుప్రజాపతి చెప్పారు. సన్మతి అయిన జీవన్ముక్తుని వెతికి పట్టుకోవటం ఎట్లా? ఆతనిలో ఏ ప్రత్యేకతలు ఉంటాయి? సాంసారిక జనులలో ఉండనిది, జీవన్ముక్తులలో కనిపించేవి ప్రత్యేక లక్షణాలు ఏమైనా ఉన్నాయా? వారియందు ఏవైనా ఉత్తమ శక్తులు గాని, మరింకేమైనా గాని-మనం గుర్తించటానికి వీలుగా ఉంటాయా?

శ్రీవసిష్ఠ మహర్షి : జ్ఞానికి జ్ఞానమే అతిశయం. అజ్ఞానికి అజ్ఞానమే అతిశయం. ఇక సాంసారిక సిద్ధులంటావా? మనం చూడాలోపాఖ్యానంలోను, అంతకు ముందే మరికొన్ని సందర్భములలోను జ్ఞానము-భౌతికసిద్ధులు-ఈ రెండు ఒకదాని ననుసరించి మరొకటి తప్పక ఉండాలనే నియమమేదీ లేదని చెప్పుకున్నాం. ఇప్పుడు సందర్భం వచ్చింది కనుక మరికొంత విశ్లేషణం చేసుకుందాం.

❖

జ్ఞానికి, (లేక) జీవన్ముక్తునికి సాంసారిక సిద్ధుల విషయమై కొంచెము కూడా అతిశయముతో కూడిన పట్టుదల ఉండదు. ఎందుకంటే ఆతడు సర్వదా నిత్యతృప్తుడై, శాంతచిత్తుడై ఆత్మయందే నెలకొని ఉంటాడు.

జనులు ఎంతో తపస్సు చేసి, మంత్ర - తంత్రములను దీర్ఘకాలం ఆశ్రయించి, అప్పుడు ఆకాశగమనము మొదలైన భౌతికశక్తులు సంపాదిస్తున్నారు. జ్ఞాని ఆ మంత్రవేత్తను, ఆతని భౌతిక శక్తులను కూడా తన రూపంగానే దర్శిస్తూ ఉంటాడు. అందుచేత వాటి ప్రాప్తియందు ఆతనికి అపూర్వమైనదేదీ కనిపించదు. అనేక మంత్ర - తంత్రాదులను నిర్వర్తించుటలో అణిమ - గరిమ - లఘిమ - ఈత్వ - వశిత్వ - ప్రాకామ్య - ఇచ్ఛాది సిద్ధులు లభిస్తున్నాయి. అవన్నీ స్వప్రయత్నముల చేతనే సాధించబడుచున్నాయి. కాబట్టి అవన్నీ సపూర్వములే గాని, అపూర్వములైనవి కాజాలవు. ఆత్మజ్ఞాని స్వతఃగాను, అకృత్రిమంగాను సర్వాత్మభూతుడై ఉంటాడు. అందుచేత ఇతరులచే అనేక ప్రయత్నముల ద్వారా సంపాదించబడుచున్న ఆయా సాంసారిక సిద్ధులు ఆ సాధకులయందే తాను ఉండి ఉన్నట్లు అనుభూతి కలిగి ఉండడంచేత తనచేత సాధించబడుచున్నట్లే గాంచగలడు. మరి తాను వాటిని సాధించుటవలన కలిగే నూతన ప్రయోజనమేదీ ఆతనికి కనిపించదు.

ఏష ఏవ విశేషో అస్య న సమో మూఢబుద్ధిభిః
సర్వత్రా స్థాపరిత్యాగాన్నీరాగమమలం మన్యా
భావేత్తస్య మహాబుద్ధేర్నాసౌ వస్తుషు మజ్జతి ॥

'ఆత్మజ్ఞాని మూఢబుద్ధులతో సమానంగా ఉండడు.' రాగ-ద్వేషాదులు పొందడు. ఆత్మనిశ్చయం వదలడు. ఇదియే వాని యందలి విశేషం. అంతటా అనురాగం త్యజించివేసి ఉంటాడు. రాగ రహితుడైన ఆ మహాబుద్ధిమంత మనస్సు ఎల్లప్పుడూ నిర్మలంగా ఉంటుంది. అట్టివాడు పదార్థము లందు నిమగ్నం కాడు. ఓ రామచంద్రా! ఆతడు చిహ్నరహితుడు, శాంతచిత్తుడు, చిరకాల సంసారభ్రమ తొలగినవాడై ఉంటాడు. ఇక ఆతనిని గుర్తించటానికి చిహ్నమేమంటావా?

తజ్జస్య యత్ మదన - కోప - విషాద - మోహ
లోభ-ఆపదాం అనుదినం నిపుణం తనుత్వమ్

...ఆతనిలో కామ-క్రోధ-లోభ-మోహ-శోకాల వల్ల కలిగే ఆపదలు మొదలైనవి రోజురోజుకు ఆత్మానుభవ నిపుణతచే క్షయం పొందుతూ ఉంటాయి. వాటి రాహిత్యమే ఆతని చిహ్నం.

❖❖❖

8. మూడు అవస్థలు - తురీయం

శ్రీవసిష్ఠ మహర్షి : నిర్మలుడు, సర్వాంతర్యామియగు ఈశ్వరుడే ఈ జీవుడుగా కూడా పరిణమిస్తున్నాడు. ఒకానొక బ్రాహ్మణుడు తుచ్ఛమైన కోరికచే ఒక శూద్రస్త్రీయందు ఆసక్తుడై నిర్మల - సాత్విక సమన్వితమగు బ్రాహ్మణ ధర్మమును మెల్లమెల్లగా త్యజించి చివరికి శూద్రత్వమును ఆశ్రయిస్తూ ఉన్నట్లు ... ఈశ్వరుడు కూడా తన నిత్య పూర్ణానంద స్వభావమును త్యజించి బుద్ధి మొదలైనవాటితో కూడినవాడై 'జీవత్వము' అనబడుదానిని ఆశ్రయించి జీవుడు పరిణమించుచున్నాడు.

నిర్మల నిర్విషయమగు ఈశ్వరతత్త్వమునందు మొట్టమొదటగా జనించే 'భోక్తృత్వ - భోగ్యములు' అనే మహా ప్రారంభ కెరటాన్నీ "హిరణ్యగర్భాత్మకం" లేక "సమష్టి సృష్టి సంకల్పం" అని పిలుస్తూ ఉంటారు. హిరణ్యగర్భాత్మకమగు స్పందముచే జనించే ఈ 1.భోక్తృత్వము, 2.భోగ్యము ...అనే చమత్కారమైన ద్వంద్వములు ప్రతి సృష్టిలోను ఏ కారణము లేకయే స్ఫురిస్తున్నాయి.

ఈ జీవులంతా ప్రప్రథమంగా ఈశ్వరునినుండే వస్తున్నారు. ఆ తరువాత ఈ జీవులంతా వారి వారిచే మరల మరల కావించబడే కర్మల తరువాత అనేక శుభ-అశుభములగు జన్మ - జన్మాంతరములను అనుభవించుచున్నారు.

సమస్త జీవులు మొట్టమొదటగా నిష్కారణంగానే పరమపదము నుండియే బయల్వెడలు చున్నారు. అందుచేత, ఇక్కడి జీవుల జన్మ-కర్మలకు సంబంధించిన కార్య - కారణ భవము కూడా ఈ విధంగా నిష్కారణమే అగుచున్నది. ఏది ఏమైతేనేం? తరువాత తరువాత మాత్రం స్వస్వరూపమును ఏమఱచిన ఈ జీవులు నిర్వర్తించే కర్మలే వారి సుఖదుఃఖములకు కారణములగుచున్నాయి.

మరి కర్మలకు కారణమేమిటి? "దేహాత్మ జ్ఞానము"చే (నేను దేహ సంబంధితుడను అను అనుభవముచే) ఉత్పన్నమగుచున్న సంకల్పమే కర్మలకు కారణమగుచున్నది.

సంకల్పిత్వం హి బంధస్యకారణం, తత్పరిత్యజమ్ ।
మోక్షస్తు, నిః సంకల్పిత్వం తదభ్యాసపరో భవ ॥

ఓ రామచంద్రా! సంకల్పములతో కూడి ఉండుటయే బంధమునకు కారణము, సంకల్పములు లేక ఉండుటయే మోక్షం. అందుచేత నీవు 'సంకల్పము లేక ఉండటం' అనే అభ్యాసము నందు తత్పరుడవై ఉండు. సంకల్ప దశలను నిరంతరం మెల్లమెల్లగా త్యజిస్తూ ఉండు.

నీవు వ్యవహారరీత్యా అవశ్యం గ్రహించు విషయములను భావించవద్దు. అనగా భావాతీతుడవై నిర్వర్తించవలసిన దానిని యథారీతి నిర్వర్తించు. అంతేగాని గ్రాహ్య భావకుడవు (భావములను గ్రహించువాడివి) కావద్దు. అట్లాగే గ్రాహ్య భావకుడవు (భావించువానిని భావించువాడివి) కూడా కావద్దు. ఈ ఇంద్రియ సమూహములు ఆయా పదార్థములందు (లేక), విషయములందు కలిగియుండే "రాగము" వలననే ఈ జీవుడు బంధింపబడుచున్నాడు. రాగరహితుడై ఉన్నప్పుడు ఈతడు ముక్తుడే అగుచున్నాడు.

కించిత్ యత్ రోచతే తుభ్యం తద్బద్ధోసి భవస్థితౌ ।
న కించిత్ రోచతే చిత్తే, తన్ముక్తోసి భవస్థితౌ॥

ఓ రామా! ఏ వస్తువైనా నీకు రుచించుచున్నదా, అద్దానియందు రాగము ఏర్పడినప్పుడు ఏర్పడే స్థితిని 'సంసారము' అంటున్నాం. రాగము చేతనే జీవుడు సంసార స్థితియందు బద్ధుడగు చున్నాడు. చిత్తము నందు ఏ వస్తువు రుచించకపోతే ... ఇక అట్టి సంసారస్థితిలో ఉన్నప్పటికీ నీవు ముక్తుడవే అవుతావు. అందుచేత ఒక తృణము మొదలుకొని బ్రహ్మదేవుని శరీరము వరకు స్థావర జంగమమగు సమస్త పదార్థ సమూహమునందు నీకు కొంచెము కూడా రుచి ఏర్పడకుండుగాక!

యత్కరోషి యదశ్నాసి యజ్జుహోసి, దదాసి యత్ ।
న కర్తాసి, న భోక్తాసి తత్రముక్తమతిః, శమీ ॥

నీవు ఏది చేస్తున్నా, ఏది తింటున్నా, ఏది హోమ-దానాలు చేస్తున్నా 'ఆయా క్రియలన్నిటికీ నేను కర్తను కాదు. భోక్తను కాదు'... అను భావనతో అభిమానరహితుడవై, ఆత్మనిష్ఠుడవై ఉండు.

సన్తో అతీతం న శోచన్తి భవిష్యత్ చింతయంతి నో ।
వర్తమానం చ గృహ్ణన్తి కర్మ ప్రాప్తమఖండితమ్ ॥

జ్ఞానులగు మహాత్ములు గడిచిపోయిన దాని గురించి శోకించరు. గడపవలసియున్న భవిష్యత్తు గూర్చి చింతించరు. ప్రారబ్ధకర్మల ననుసరించి సంప్రాప్తిస్తున్న వర్తమానమును మాత్రం అఖండ స్వభావము కలిగి ఉంటూనే నిర్వర్తిస్తూ ఉంటారు. అంగీకరిస్తూ ఉంటారు. ఆస్వాదిస్తూ ఉంటారు.

ఈ 'తృష్ణ, మోహము, మదము'... మొదలైన వికారాలన్నీ మనస్సులోనే కాపురముంటున్నాయి. కాబట్టి విజ్ఞులైనవారు మనస్సుతోనే మనస్సులో అంతర్గతమైన వికారాలన్నీ ఛేదించివేయాలి. ముల్లును ముల్లుతోనే తీస్తాం. ఇనుముతోనే ఇనుమును ఛేదిస్తాం కదా! మనస్సులోని భ్రమ నశించటానికి నిర్మల మనస్సే ఉపకరణం. యుక్తమగు మనస్సుతో - అయుక్తమగు మనస్సును జయించు. మురికిని క్షారం మొదలైన మురికి వస్తువులతోనే తోమి, అప్పుడు, ఆ పాత్రను నిర్మల జలంతో పరిశుభ్రపరుస్తారు కదా! విషమును విషంతోనే నివారిస్తారు. అట్లాగే మనస్సును మనస్సుతోనే నిరోధించాలి.

❖

జీవుని రూపం ఈ బాహ్యమైన కాళ్ళు, చేతులు, ముఖం మాత్రమే కాదు. ప్రతి ఒక్క జీవునికి మొత్తం మూడు రూపాలున్నాయి.

1. స్థూలరూపం : ఇది కాళ్ళు – చేతులతో కనబడే పాంచభౌతిక సమన్వయం. ఇది జీవుని భోగములకు ఉపకరించే ఉపకరణం. ఇది మాత్రమే కళ్ళకు కనబడుతోంది.

2. సూక్ష్మరూపం : దీనిని 'అతివాహికం' 'చిత్తము' అని కూడా పిలుస్తున్నాం. దేనియొక్క స్వసంకల్పానుసారంగా ఈ ప్రపంచములన్నీ కలుగుచున్నాయో అద్దానికే 'అతివాహికం' అనే పేరు పెట్టారు. జీవుని గుణములు – స్వభావములు – ఆశలు – భావాభావములు – మానావమానములు మొదలైనవన్నీ ఏర్పడి ఉన్నది ఈ అతివాహికంలోనే! దీనిని భౌతికమైన కళ్ళతో చూడలేం కనుక 'సూక్ష్మం' అంటారు.

3. పరరూపం : ఈ మూడవ రూపం స్థూల – సూక్ష్మముల కంటే విభిన్నమైనది. జీవునియొక్క ఈ రూపం విశ్వమంతా వ్యాపించి ఉండటం చేత దీనిని 'విశ్వరూపం' అని కూడా అంటారు. ఇది ఆద్యంతరహితమైనది. సత్యమైనది. చిన్మాత్రమైనది, నిర్వికల్పమైనది. (ఇందులో వికల్పములనేవే ఉండవు. ప్రపంచమునకు 'సత్త' ప్రసాదించేది ఈ పరరూపమే.

ఓ రామచంద్రా! ఇప్పుడు నీవేం చేయాలి? మొదటి రెండు రూపములైన స్థూల – సూక్ష్మములను వదలిపెట్టి మూడవదైన 'పరరూపము' లేక 'చిత్‌పదము'ను ఆశ్రయించాలి. ఎన్ని రోజులుగా ఎన్ని చమత్కార వాక్యాలతో తత్త్వవిచారణ చేసినా ...దీని సారమంతా ఒక్క విషయమే. అదేమిటంటే... స్థూల – సూక్ష్మములందు ఆత్మబుద్ధిని విరమింపజేసి, చిత్ పదము (లేక) తురీయపదమును (లేక) పరరూపమును ఆశ్రయించి ఉండటం.

ఈ ఒక్క విషయం ఆరూఢపరచుకొంటే చాలు, ఇక మరింకేమీ అక్కర్లేదు. మనం చెప్పుకున్న మిగతాదంతా కూడా అట్టి ఆరూఢత యొక్క యుక్తియుక్తత గురించే సుమా!

తురీయం - నిర్వచనం :

శ్రీరాముడు : హే మునీశ్వరా! మీరు చెప్పే 'తురీయ పదమునందు, (పరదేహం నందు) మాత్రమే ఆత్మబుద్ధి కలిగి ఉండటం'... అత్యంత ముఖ్యమైన పాఠ్యసారం కదా! జాగ్రత్–స్వప్న–సుషుప్తులనే మూడిటికి పరిమితమౌతున్న ఈ జీవునకు ఆ మూడిటికి అలక్షితమైన 'పరదేహానుభవం, చేతికందటమే లేదు. అందుచేత తురీయరూపమైనట్టి ఆ పరదేహానుభవ నిశ్చలత గురించి చెప్పమని నా ప్రార్థన.

శ్రీవసిష్ఠ మహర్షి : రామచంద్రా! ఏదైతే 'అహమ్–అనహమ్, సత్–అసత్'లకు అతీతమై, దేనియందూ ఏమాత్రం సక్తముకాక, స్వచ్ఛమై–సమరూపమై ఉంటోందో అద్దానినే 'శుద్ధచైతన్యము' అని 'తుర్యము' అని, 'పరదేహము' అని అంటున్నాం. ఇదియే జీవన్ముక్తుల వ్యవహారమందలి సాక్ష్యావస్థ. ఈ పర దేహావస్థలో సంకల్పములు సంభవించవు. కాబట్టి ...ఇది జాగ్రత్తు కాదు. స్వప్నం కాదు. ఇందులో జడత్వం ఉండదు కనుక ఇది 'సుషుప్తి' కూడా కాదు. అందుకే దీనికి 'అవస్థాత్రయసాక్షి' అని కూడా పేరు ఉన్నది. ఈ జగత్‌స్థితి ఏ జ్ఞానిలో సంపూర్తిగా విలీనమైపోతుందో, అట్టి 'అప్పటికీ శేషించి ఉండే' స్థితియే ఆ తురీయం. జ్ఞానులకు ఆ తురీయ స్థితి అత్యంత సుస్థిరమై అనుభవమగుచుండగా, అజ్ఞానులకు ఈ క్షణికమాత్ర జగత్తు స్థిరముగా అనుభవమవటమే జ్ఞానాజ్ఞానుల దృష్టి భేదం.

అహంకారం త్యజించబడుచుండగా ...సమత్వము ఉత్పన్నమగుచుండగా ...చిత్తము ప్రశమనము పొందుచుండగా ...ఆ 'తురీయావస్థ'చేకూరుతూ ఉంటుంది.

నీవు ప్రబుద్ధుడవై, మరింత అధిక బోధను పొందాలనే ఉద్దేశంతో ఈ సందర్భంలో ఒక చిన్న దృష్టాంతం చెబుతాను విను.

❖

ఒకానొక అరణ్యంలో ఒక ఏకాంత ప్రదేశంలో ఒక ముని చిన్న ఆశ్రమం కట్టుకొని తపస్సు చేసుకుంటూ ఉన్నారు. ఒక రోజు ఆయన ఆశ్రమం యొక్క ఆవరణలో గల రావిచెట్టు క్రింద ఆసనం వేసుకుని మహామౌనము అనుభవిస్తున్నారు. ఒక బోయవాడు బాణములు ధరించి పరుగు పరుగున అక్కడి త్రోవలో వస్తూ మునిని చూచి ఆగాడు.

అయ్యా! మునీశ్వరా! నేను ఒక లేడిని బాణంతో కొట్టాను. ఆ లేడి గాయపడి పరుగు లంకించుకుని ఇటువైపే వచ్చింది. అది ఎటువైపు వెళ్ళిందో చెప్పగలరా? అని అడిగాడు.

దానికి ఆయన సమాధానం విను.

మునీశ్వరుడు: నాయనా ! మేము వనవాసులగు మునులం కదా! అందుచేత సమశీలురమై ఉంటాం. లోక వ్యవహారాలు తెలుసుకోవాలంటే అహంకారం ఉండాలి. వ్యవహారములకు సమర్థమైన అహంకారం నాయందు లేదు. అహంకారాదులన్నీ ఎందులో ఉన్నాయో అద్దానిని ఆశ్రయించి నేను ఉన్నాను.

బోయవాడు : అయ్యా! నేనడిగింది గాయపడిన లేడి గురించి. మీరేదో 'అహంకారం అదీ ...ఇదీ' అంటారేం? మీరు లేడిని చూచారా? అది చెప్పండి. చూడలేదా... చూడలేదని చెప్పండి.

మునీశ్వరుడు: మిత్రమా! నేను చెప్పేది కూడా నీవు అడిగినదానిగురించేనయ్యా! ఈ కళ్ళు – కాళ్ళు మొదలైన ఇంద్రియాలు స్వయంగా పనిచేస్తాయా చెప్పు? లేదు కదా! ఈ కళ్ళను పనిచేయించేదేమిటి!

బోయవాడు : ...?

మునీశ్వరుడు: చెప్పవయ్యా మరి? మనస్సు కదా!

బోయవాడు : మనస్సా? ... అది సరేలెండి ...

మునీశ్వరుడు: అవునా? అటువంటి అహంకారమయమగు నా మనస్సు ఎల్లప్పుడు నిజంగా ప్రశమించి ఉంటోందయ్యా! మనస్సుకు అతీతమైనదానిని ఆశ్రయించి ఉన్న నాకు, మనస్సుకు మాత్రమే విషయమైనది ఎట్లా అగుపిస్తుంది చెప్పు?

బోయవాడు : అది సరే అయ్యగారూ ! నా లేడి ...?

మునీశ్వరుడు: ఎప్పుడైతే మనస్సు శమిస్తోందో, ఇక నాకు జాగ్రత్‌గాని, స్వప్నంగాని, నిద్రావస్థగాని తెలియటమే లేదు. ప్రియమిత్రమా! ఏ మహత్తర తత్త్వమైతే జాగ్రత్‌లోంచి స్వప్నంలోకి, స్వప్నంలోంచి సుషుప్తిలోకి, సుషుప్తిలోంచి మరల జాగ్రత్‌లోకి పయనిస్తూ ఉంటుందో, అట్టి అప్రమేయమైన దాని గురించి ఇప్పుడు నేను మననం చేస్తున్నానయ్యా!

ఎద్దానిలో అయితే 'దృశ్యము' అనబడే దానికి స్థానమే లేదో ... అట్టి 'తురీయావస్థ' యందు నేను నెలకొని ఉన్నాను. ఇక నీ లేడి గురించి ఏం చెప్పమంటావ్? అట్టి నా మననమునకు ఈవలగాని, ఆవలగాని మరింకేదీ నాకు అగుపడడమే లేదు.

బోయవాడు : అయ్యగారూ! మీరు ఏదేదో చెప్పి బుఱ్ఱతినకండి. ఇంతకీ గాయపడిన లేడి ఎటు పోయిందో తెలుసునో, తెలియదో చెప్పవచ్చుగదండీ? అది చెప్పడేమిటిరా బాబు!

❖

ఇట్లా పలికి ఆ బోయవాడు 'ఈయనకేం తెలియదు, ఏదో మాట్లాడుతాడు. భలేవాడు దొరికాడురా నాయనా!' అనుకుంటూ లేడిని వెతకటానికి ఎటో బయలుదేరాడు. ఇక ఆ ముని "పాపం తన 'నిత్యసాక్షిత్వం' వదలి ఈ జీవుడు ఇంద్రియముల వెంట, లేళ్ళ వెంట పరుగులు తీస్తున్నాడు కదా! ఇతనికి ఈతని గురించే తెలియదాయె!" అని అనుకుంటూ తన మహామౌనాన్ని కొనసాగించాడు.

చూచావా రామా! "తురీయదశయందు మరింకొక అవస్థ ఏదీ ఉండదు'... అని చెప్పటానికే ఇక్కడ ఈ దృష్టాంతాన్ని చెప్పాను. పరదేహాన్ని ఆశ్రయించిన వాడు ద్రష్టత్వము కంటే ముందుగానే ఏర్పడి ఉంటాడు కనుక ఆతడు జాగ్రత్‌ద్రష్ట కాడు. స్వప్నద్రష్ట కాడు, సుషుప్త ద్రష్టకాడు. ఈ మూడు తురీయానికి ఈవల ఉన్నవానికే విశేషాలుగాని జ్ఞానముచే ఆవల ఉన్నవానికి అవి విశేషమే కాదు.

వికల్పరహితమగు శుద్ధ చైతన్యమే తురీయం. వాస్తవానికి ఇక్కడ ఆ శుద్ధ-బుద్ధ చైతన్యమే ఉన్నది గాని, తదితరమైనదేదీ లేదు, ఉండజాలదు కూడా. ఇక ఈ జాగ్రత్ స్వప్న-సుషుప్తులంటావా? ఇవి చిత్తం యొక్క మూడు రూపాలు మాత్రమే. అందుచేత చిత్తం వలే అవి కూడా మిథ్య మాత్రమే.

ఈ చిత్తము మూడు రూపములలో స్థితి కలిగి ఉంటోంది-

ఘోరము (జాగ్రన్మయం); శాంతము (స్వప్నమయం); మూఢము (సుషుప్తిమయం)... ఈ మూడు రూపములు లేనిదానిని 'మృతచిత్తం' అంటూ ఉంటారు.

అట్టి 'మృత చిత్తము'నందు ఏకమై, సమమైనట్టి 'సత్వము' నెలకొని ఉంటుంది. యోగులు దానిని ప్రయత్నపూర్వకంగా సంపాదించుకుంటున్నారు. ఓ రామచంద్రా! సమస్త సంకల్పములు రహితమగుచున్న 'తురీయపదము'నందు నిరామయమగు ఆత్మస్వరూపుడవై నీవు స్థితిని కలిగి ఉండెదవుగాక! సాధువులగు మహనీయులంతా అట్టి నిర్విషయ చిదానంద స్వస్వరూపమును దర్శిస్తూ తదితరమైనదంతా 'అతీతత్వము' అను యుక్తిచే త్యజించి ఉంటున్నారు.

❖❖❖

9. తురీయమునకు ఉపాయం

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! "ఆధ్యాత్మ శాస్త్రము యొక్క ముఖ్య సిద్ధాంతం ఏమై ఉన్నది?"... అని మనం పరిశీలిస్తే, 'ఈ సమస్త దృశ్య వ్యవహారము లేదు' అని నిరూపించటమే అయి ఉన్నది. ఇక్కడ అవిద్య లేదు, మాయ లేదు. మాయ - అనగా యాऽమా..."ఏది లేదో" ...అని శబ్దార్థమే

కదా! ఇక్కడ వాక్కు మొదలైన వాటికి అగోచరమైనట్టి శాంతమగు బ్రహ్మము మాత్రమే ఉన్నది. ఆ బ్రహ్మము పూర్ణమై, చిదాభాస ప్రతిబింబమునకు బింబరూపమై, స్వచ్ఛమై, సర్వాత్మకమై, సమమై, సమస్త కళలచే పరిపూర్ణమై ఉంటోంది. అట్టి 'బ్రహ్మము' అను పేరుగల వస్తువు గురించి జనులు వారి వారి బుద్ధిని అనుసరించి అనేక రూపములైన సిద్ధాంతములను కల్పించుకొనుచున్నారు. కొందరు 'అది శూన్యము' అని, మరికొందరు 'విజ్ఞానమాత్రము' అని, ఇంకొందరు 'అది ఈశ్వర రూపము' అని పరస్పర వాదోపవాదములు చేసుకుంటున్నారు. ఓ రామచంద్రా! నీవు మాత్రం అత్యంత త్వరితగతిని సమస్త వాదములను పరిత్యజించు. దృశ్యమునంతటినీ అంతరంగమునందు త్యజించివేసి ఉండు. మనోవర్జితుడవై ఉండు. శాంతచిత్తుడవై, నిర్వాణయుక్తుడవై, ప్రశాంతమైన బుద్ధిని సంపాదించుకున్న వాడవై మహామౌనివై ఆత్మయందే స్థితి కలిగియుండుము.

ఆత్మన్యేవా స్స్వ శాంతాత్మా, మూక-అంధ-బధిరోపమః,
నిత్యమ్ అంతర్ముఖో భూత్వా స్వాత్మనాన్తః ప్రపూర్ణ ధీః॥

ఒక మూగవానిలాగా, గ్రుడ్డివానిని బోలి, చెవిటి వాని చందంగా దృశ్యసంపర్కం లేనివాడవై ఉండు. నిత్యం అంతర్ముఖుడవై, శాంతస్వభావుడవై, పూర్ణబుద్ధితో, ఆత్మలోనే ఎల్లప్పుడూ నెలకొని ఉండు.

జాగ్రత్యేవ సుషుప్తస్థః కురు కర్మాణి రాఘవ ।
అన్తః సర్వపరిత్యాగీ బహిః కురు యథాఽఽగతం ॥

ఓ రాఘవా! జాగ్రత్తులో ఉన్నప్పుడు సుషుప్తియందు వలె కర్మలచే అస్పృశ్యత్వము వహిస్తూనే ఆయా విధ్యుక్తమైన కర్మలను నిర్వర్తించు. అనగా, అంతరంగమున సమస్తము త్యజించియే ఉండు. బాహ్యమున మాత్రం యథాప్రాప్తములైన కర్మలను ఆచరించు.

చిత్తము యొక్క ఉనికియే పరమ దుఃఖం. చిత్తము లేకపోవటమే పరమసుఖం. ఉన్న విషయం ఇది. కాబట్టి చిదేకాత్మ స్వరూపుడవై, ప్రియ - అప్రియములను ఏమాత్రం చింతించక క్రమక్రమంగా చిత్తమును క్షయింపజేస్తూ ఉండు.

దృష్ట్వా రమ్యమ్, అరమ్యంవా స్థేయం పాషాణవత్ సమమ్,
ఏతావతాత్మయత్నేన జితా భవతి సంసృతిః ॥

ఒక చిన్న ఉపాయం విను. ఈ ప్రపంచంలోని కొన్ని వస్తువులు రమ్యంగా ఉంటాయి. మరికొన్ని అరమ్యంగా అనిపిస్తూ ఉంటాయి. అట్టి రమ్య - అరమ్య వస్తువులను చూస్తున్నప్పుడు నీవు ఏతత్-పూర్వమువలె సమముగా ఉండటం అభ్యాసం చేయి. ఇంత మాత్రమైన నీ స్వప్రయత్నం తోనే ఈ సంసారం జయించివేయబడగలదు.

నవేదనీయం, న సుఖం, నాఽసుఖం, న చ మధ్యమం,
ఏతావత్ ఆత్మయత్నేన దుఃఖాంతో అనన్త ఆప్య తే॥

సుఖ దుఃఖములను గురించి గాని, వాటికి సంబంధించిన సాధనల గురించి గాని కొంచెం కూడా చింతించకూడదు. ఎవరికి వారే ఇంత మాత్రపు స్వప్రయాత్నానికి ఉపక్రమిస్తే చాలు,

అనంతానందము సంప్రాప్తించగలదు. జ్ఞాని ఈ ముల్లోకాలలోని సమస్త పదార్థముల సారాసారం లేమిటో గ్రహించి ఉంటున్నాడు. సర్వత్రా ప్రకాశముచే శోభాయమానమైన 'నిరతిశయ బ్రహ్మానంద అమృతము'చే పరిపూర్ణుడగుచున్నాడు. బుద్ధియందు పరిపుష్ఠుడై, 'జీవన్ముక్తి' అనే సుఖమును పొంది ఉంటున్నాడు. అతను బాహ్యమున సమస్తమైన కర్మలు నిర్వర్తిస్తున్నప్పటికీ అభ్యంతరమున మాత్రం ఏమీ చేయనివాడే అగుచున్నాడు.

❖❖❖

10. భూమికా ప్రవేశం

శ్రీరాముడు : స్వామీ! మీరు సప్త భూమికల గురించి, వాటి అభ్యాసకుల గురించి రెండు మూడు చోట్ల అనేక విషయాలు చెప్పారు. అయితే ఈ నిర్వాణ ప్రకరణము పూర్వార్థము చివరికొస్తున్న సమయంలో సప్తభూమికాసాధనల గురించి మరొక్కసారి సవివరంగా చెప్పుకోవటం ఉచితమని నా అభిప్రాయం. సప్తభూమికాభ్యాసం ఎట్లా గావించబడుతోంది? ఆయా భూమికలందున్న యోగులు ఎట్టి చిహ్నములు కలిగి ఉంటారు? దయతో మీరుకూడా సందర్భోచితమనే అనుకుంటే, చెప్పండి.

శ్రీవసిష్ఠ మహర్షి : యోగుల తాత్త్వికోన్నతిని విశదపరచే శాస్త్రప్రవచితమైన సప్తభూమికల గురించి, అంతిమ సాక్షాత్కారమైనట్టి భావాతీతత్వము గురించి ఇక్కడ పురశ్చరణ పూర్వకంగా చెప్పుకోవటం సముచితమే అవుతుంది. కనుక సప్త భూమికల గురించి మరికొన్ని విశేషాలు ప్రస్తావించుకుందాం.

❖

వేద వ్యతిరిక్త మార్గాలు అనుసరించేవారు తమ మూఢత్వమునకు తామే కారణమగుచు ఈ భౌతిక ప్రపంచంలో ఒక ఉపాధి నుండి మరొక ఉపాధికి అంతులేకుండా ప్రయాణిస్తున్నారు. పుట్టటం – పెరగటం – చావటం మరల మరొక ఉపాధిని ఆశ్రయించటం (మరల పుట్టటం) ఇట్లా చర్విత చరణంగా జరిగిపోతోంది. వారికి ఇంద్రియానుభవముల నుండి ధ్యాస మరలటం లేదు. కాల ప్రవాహంలో పడి వాళ్ళు స్థావర–జంగమ దేహములను నమ్ముకుని ఉంటూ తమ దుఃఖములకు కారణమేమిటో ఆరా తీయటం లేదు. వారికి ఎవరేం చెప్పగలరు?

వేద అనుకూల మార్గానుయాయుల విషయానికి వద్దాం. వీరిని రెండు విధాల విభజించవచ్చు.

1. ప్రవృత్తిమార్గం : "భోగములను సంపాదించి అనుభవించటమే ఉత్తమంగాని, వీటిని వదలి ఉండటమనేది అర్థరహితం. కనుక ఉత్తమ లోకాలు పొందాలి. అక్కడి సౌఖ్యములను పొందాలి..." అని అందుకు సాధనగా వేద ప్రవచిత మార్గాలలో ఉపక్రమించే వారే ఈ ప్రవృత్తిమార్గ బాటసారులు. "విషయ రహితమగు నిర్వాణం ఎవడికి కావాలి? భోగముల చేతనే నాకు శాంతి" అని తలచి వేద విహితములైన యజ్ఞము మొదలైన కర్మలు నిర్వర్తించే వారు ఈ కోవకు చెందుతారు. తాబేలు తన అవయవములను బయటకు రానివ్వటం, ఇంతలోనే ఏదైనా ఎదురు రాగానే లోపలికి తీసుకోవటం చేస్తుంది చూచావా? ఈ జీవుని మనస్సు కూడా ఒక దేహంలో ప్రవేశించటం, ఇంతలోనే మృత్యువు

ముఖంలో ప్రవేశించటం – ఇట్లా జన్మ – మృత్యువుల ప్రయాణాలు కొనసాగిస్తున్నది. వాస్తవమైన వివేకం ఉదయించనంత కాలం ఇది ఇట్లాగే చర్వితచరణంగా కొనసాగుతూ ఉంటుంది. ప్రవృత్తి మార్గంలో శ్రమతో బాటు పునరావృత్తి తప్పదు. అనేకసార్లు బలవంతంగా మృత్యుముఖమున ప్రవేశించి ఈ జీవుడు ఎప్పుడో 'ఈ అవివేకమంతా ఏమిటి?' అనే ప్రశ్నకు వస్తున్నాడు. "ఈ దేహమేమిటి? ఈ దేహ సంబంధమేమిటి? మరల మరల ఈ దుఃఖాలు ఎందుకొస్తున్నాయి? ఈ సంసారం యొక్క వ్యవస్థ అంతా అపారమైనది కదా! దీని వలన నాకు కలిగే ప్రయోజనం కొంచెమైనా కనబడటం లేదే? అనుచితమైన పరిణామాలు గల కర్మ వ్యవహారాలచే నేను రోజులు ఎందుకు గడుపుతున్నాను? ఇంతకీ నేనెవరు? ఎక్కడి నుండి వచ్చాను? నా వాస్తవ స్వరూపం ఏమిటి?"...అనే యోచన ఆతనికి వస్తోంది. 'అసలు నాకు నిజమైన విశ్రాంతి లభించే దెక్కడ?' ...అనే ప్రశ్నకు వస్తున్నాడు. ఇటువంటి ప్రశ్నలు ప్రారంభమవగానే ప్రవృత్తి తిరోగమించటం ప్రారంభించి, ఆతని స్వభావం నివృత్తి వైపుగా వెనుకకు మరలుతోంది.

2. నివృత్తి మార్గం : ఎప్పుడైతే ఈ జీవుడు సద్బుద్ధితో కూడుకున్నవాడై 'వైరాగ్యవంతుడనై నేను ఈ అపార సంసార సాగరమునుండి తరించేది ఎట్లా?"...అను విచారణ యందు తత్పరుడగుచున్నాడో ఇక ఇక్కడి నుండి సప్తభూమికా ప్రవేశం చేస్తున్నాడు.

జాగ్రత్ భూమికలు - ఆతనికి భోగములందు, వాటికి సంబంధించిన సాధనములందు చింతన క్రమక్రమంగా సన్నగిల్లుతూ ఉంటుంది. అనగా ఆతనిలో వైరాగ్యం (రాగరాహిత్యం) ఉదయించి, దిన దిన ప్రవర్ధమానమౌతూ ఉంటుంది. ఇక చిత్తశుద్ధికి కారణం కాగల జపం – ఈశ్వరారాధన మొదలైన క్రియలందు తత్పరుడౌతూ ఉంటాడు. అనుదినం తృష్ణను క్షయించుచుండగా ఆతనికి ప్రసన్నత అభ్యాసమౌతూ ఉంటుంది. ధనం–ప్రతిష్ఠ మొదలైన జడ క్రియలందు అరుచి పెంపొందు చుండగా అతని యందు 'ఇతరుల దోషముల గురించి ఊరకే సంభాషించటం' ఇటువంటి నిరర్థక కాలయాపనలు ఉపశమిస్తూ ఉంటాయి 'పుణ్యకార్యములు నిర్వర్తించాలి' అనే ఉత్సాహం పెల్లుబుకుతూ ఉంటుంది. ఇక ఇతరులకు గాని, తనకు గాని మనస్సునకు కష్టం కలిగించే ప్రవర్తనను సరిదిద్దుకుంటూ ఉంటాడు. పాపము పట్ల భయము కలిగి ఉంటాడు. భోగములను వాంఛించడు. స్నేహ, ప్రీతి, కోమల, ఉచిత, దేశకాల యోగ్యములైన మాటలను, భావములను, ప్రవర్తనను అలవరచుకుంటాడు.

ఇట్టి మార్గమును ఆశ్రయిస్తున్నవాడు 'శుభేచ్ఛ' అనే మొట్టమొదటి భూమికలో ప్రవేశించిన వాడగుచున్నాడు. ఈ భూమికలో కొనసాగుచున్న ఆ జీవుడు మనోవాక్కాయ కర్మలచే పవిత్రతను ఆశ్రయించడం, సజ్జనులను సేవించడం ప్రారంభిస్తాడు. ఎక్కడెక్కడినుండో జ్ఞాన వర్ధకములైన పుస్తకముల (శాస్త్రములను), వాక్యములను తీసుకువచ్చి పరిశీలిస్తూ ఉంటాడు. ఈ విధంగా ఆతడు క్రమంగా 'విచారణ' అనే రెండవ భూమికలో ప్రవేశిస్తాడు.

ఈ 'విచారణ' భూమికలో ప్రవేశించేవాడే ఉన్నతికి అర్హుడని, విచారణ లేనంతకాలం ఈ జీవుడు భ్రమార్థ సాధకునిగానే మ్రగ్గుతూ ఉంటాడని గ్రహించు. విచారణ అనబడే రెండవ భూమికలో

ప్రవేశించినవాడు వేద - ఉపనిషత్తు - సదాచారము సమాశ్రయిస్తూ ఉంటాడు. ధారణ - ధ్యానకర్మానుష్ఠానులగు మహనీయులను సంప్రదిస్తూ వివేకమును పరిపుష్టం చేసుకుంటూ ఉంటాడు. స్వయంగా శబ్దశాస్త్రము, వ్యాకరణ శాస్త్రము పఠనం చేస్తూ ఆ ప్రయత్నముచే లోక ప్రసిద్ధములైన వేదాంత శాస్త్రముల పరిశీలనచేస్తూ, పద - పదార్థముల విభాగం ఎరుగుతూ ఉంటాడు. గురుముఖతః శ్రవణం చేస్తూ అర్థసారాన్ని మననం చేస్తూ ఉంటాడు. ఇంటి యజమాని ఒక రోజు కుంచె చీపురును తీసుకొని తలకు గుడ్డ కట్టుకుని బూజు ఊడ్వటం, ఇంటిని పరిశుభ్రం చేయడం ప్రారంభించినట్లు ఆ సాధకుడు మనస్సులో గల అకార్యములను గుర్తించి విడిచిపెట్టుచూ, సకార్యములను ఆశ్రయించే సత్ప్రయత్నంలో ఉంటాడు. లోకమర్యాదను అనుసరించి బాహ్యానికి అభిమానము మొదలైనవాటిని కొంచెం ఆశ్రయించినప్పటికీ, ఆతను పాము తన కుబుసమును విడచునట్లు క్రమంగా మదము, అభిమానము, మాత్సర్యము, లోభము, మోహము, మొదలైన వాటిని త్యజించివేస్తూ ఉంటాడు. ఆతనియందు శాస్త్ర-సజ్జన సేవ పెంపొందుచుండగా ... క్రమంగా శాస్త్రముల రహస్యమును యథార్థంగా, సంపూర్ణంగా ఎఱుగుతూ ఉంటాడు.

ఆ విధంగా ఆ సాధకుడు తన సాధన కొనసాగిస్తూ-ప్రియుడు తన ప్రియురాలి ప్రక్కకు చేరునట్లు, "అసంగము" అని పిలువబడే మూడవ భూమికలో ప్రవేశిస్తాడు. అప్పుడు ఆ జీవుడు ["**అహం బ్రహ్మాస్మి**" (నేను బ్రహ్మమునే అయి ఉన్నాను), "**తత్త్వమసి**" (నా ఎదురుగా భౌతికంగా కనిపించే నీవు స్వయంగా బ్రహ్మమే అయివున్నావు), "**నేఽహ నానాస్తి కించన**" (ఇక్కడ నానాత్వమనేది కించిత్తు కూడా లేదు), "**ఏకోసత్, విప్రా బహుధా వదంతి**" (సత్ వస్తువగు బ్రహ్మము మాత్రమే ఉన్నది. ఇక బుద్ధి, మనస్సు, దేహం, దృశ్యం అనునవన్నీ కల్పితమాత్రాలే)...] ఇటువంటి వేదాంత వాక్యములకు ఉన్న అర్థమేమిటో గ్రహిస్తూ ఉంటాడు. బుద్ధి నిశ్చలం అవుతూ ఉంటుంది. హృదయాన్ని క్రమంగా తీర్చిదిద్దుకొని విశ్రాంతి తీసుకుంటూ ఉంటాడు. ఆధ్యాత్మిక శాస్త్రాధ్యయనాల ద్వారా సంసారాన్ని మనోవాక్కులచే దూరం చేసివేస్తూ ఉంటాడు. వైరాగ్య సాధన క్రమాలను అవలంబించడం ద్వారా జీవితమును ఉత్తేజమయం గాను, విస్తారం గాను చేసివేసుకుంటూ ఉంటాడు.

ఈ విధంగా సచ్ఛాస్త్రముల అభ్యాసం చేతను, పుణ్య కార్యములను ఆచరించటం చేతను జీవునికి ఆత్మదృష్టి ప్రసన్నమౌతూ ఉంటుంది. ఈ మూడవ భూమికను సంపాదించుకున్న బుద్ధిమంతుడు రెండు విధములైన అసంగములను స్వయంగా అనుభవిస్తూ ఉంటాడు. ఆ రెండు విధములైన అసంగముల గురించి, వాటి భేదం గురించి ఇప్పుడు ప్రస్తావిస్తాను. విను.

1. సామాన్యాసంగం

నాఽహం కర్తా, న భోక్తాచ, న బాధ్యో, న చ బాధకః
ఇత్యసంజనమర్థేషు సామాన్యాసంగనామకమ్॥

"నేను దేనికీ కర్తను కాదు. భోక్తను కాదు. బాధ్యుడను కాదు. బాధకుడను కాను" ...ఇటువంటి నిశ్చయంతో పదార్థములందు సంసక్తం కాకపోవటాన్ని 'సామాన్యాసంగం' అని అంటారు.

'అంతా కూడా పూర్వకర్మ నిర్మితమయి ఉన్నది. లేక, ఈశ్వరాధీనమై ఉన్నది. కనుక సుఖంలో గాని, దుఃఖంలో గాని నాకు ఏమాత్రం కర్తృత్వం లేదు. ఈ భోగాలను చూచి నేను మురియవలసిన పని లేదు. వాస్తవానికి భోగాలలో తగుల్కొనటమే మహారోగం. సంపదలన్నీ ఆపదామయాలే కదా! సంయోగాలన్నీ వియోగం కొరకే అయి ఉన్నాయి. మనస్సులో ఏ ఏ చింతలు కలుగుచున్నాయో, అవన్నీ కూడా బుద్ధి యొక్క వ్యాధి రూపాలు మాత్రమే. కాలం ఎల్లప్పుడు సమస్త పదార్థములన్నిటినీ మ్రింగివేయటానికి సంసిద్ధమై వేచి ఉంది కదా! ఇక నాకు దేని గురించి ఆశ? దేని గురించి దిగులు?'

ఇట్టి వాక్యార్థములందు ఆతని మనస్సు లగ్నమై ఉంటుంది. అనాసక్తి యొక్క బలంచేత ఆతనియందు పదార్థముల అభావం రూపుదిద్దుకుంటూ ఉంటుంది. దీనికే శాస్త్రకారులు 'సామాన్యాసంగం' అనే పేరు పెట్టారు.

2. శ్రేష్ఠాసంగం - క్రమంగా కొంతకాలానికి సామాన్యాసంగం శ్రేష్ఠాసంగంగా రూపుదిద్దు కుంటోంది. మహాత్ముల సాంగత్యం చేతను; దుష్టమైన అల్పమైన – సంకుచితమైన అభిప్రాయాదులు కలవారితో స్నేహ సంబంధములు తగ్గించుకొనటం చేతను; శ్రవణము, మననము మొదలైన వాటి అభ్యాస కౌశలం చేతను నిరంతరమైన అభ్యాసంతో కూడిన పురుష ప్రయత్నము చేతను... శ్రేష్ఠాసంగం అలవడుతోంది.

అట్టివారికి క్రమంగా, 'సంసారసముద్రము యొక్క ఆవలి ఒడ్డు – సమస్తమునకు సారము – కారణములకెల్ల కారణం' అయినట్టి ఆత్మవస్తువు అరచేతిలో ఉసిరికాయలాగా ప్రత్యక్షమౌతోంది. ఇట్టివాడు 'నేను కర్తను కాదు, ఈశ్వరుడే అన్నిటికీ కర్త'... ఇట్టి శబ్దార్థ భావన కూడా త్యజిస్తున్నాడు. 'పూర్వకర్మ లేదు. వర్తమాన కర్మ కూడా లేదు' అని గ్రహిస్తూ క్రమంగా ఇటువంటి మాటలను కూడా అధిగమిస్తున్నాడు. శాంతం, మౌనం వహిస్తున్నాడు. అట్టి స్థితి 'శ్రేష్ఠాసంగం' అని చెప్పబడుతోంది. ఆతనికి పూర్వ–వర్తమాన–భవిష్యత్ జన్మలు వేరువేరు కథాపుస్తకములను ఉబుసుపోకగా చదవటం వంటిదౌతూ ఉంటుంది.

ఏది లోన–వెలుపల, పైన–క్రింద, దిక్కులందు–ఆకాశమునందు, పదార్థమందు–అపదార్థ మందు, జడమునందు–చిదాభాసునియందు ...స్థితి కలిగి ఉండదో; ...ఏది 'స్వప్రకాశ చిత్' రూపమై పరమశాంతమై, వేరొక ప్రకాశకమైనదేదీ లేనిదై పదార్థరహిత ఆకాశం వంటిదై, జన్మ గాని–ఆదిగాని–అంతముగాని లేనిదై, ఏర్పడి ఉంటోందో ...అదే శ్రేష్ఠాసంగం అంటే !

ఎక్కడైతే ...'సంతోషం' అనే సుగంధంతో 'నిష్కామ సత్కార్యాలు' అనే నును రెక్కలతో, 'చిత్తం' అనే తూడు యొక్క చివర సంలీనమై ఉన్నదో ...అదే శ్రేష్ఠాసంగపద్మం. ఆ పద్మం చుట్టు విఘ్నరూపం కంటకాలు (ముళ్ళు) ఉండుగాక! అయితే ఏం? "అంతర్ విచారణ" అనే సూర్యుని నుండి కిరణ పుంజములు పొంది ఎప్పుడూ వికసించియే ఉండగలదు.

ఏ హృదయంలో ఈ 'శ్రేష్ఠాసంగం' అనే పద్మం వికసించి ఉంటుందో ...ఆ మహనీయుడు 'అసంసంగము' అనే మూడవ భూమికలో ప్రవేశించినట్లు చెబుతారు.

❖

చూచావా రామా! ఈ జాగ్రత్ భూమికలను మరల సమీక్షిస్తున్నాను ...విను.

మొట్టమొదటిది "శుభేచ్ఛ" కదా. అది ఎట్లా ఏర్పడుతోంది? శుద్ధాంతఃకరణులగు మహాత్ములను ఈ జీవుడు ప్రయత్నపూర్వకంగా ఆశ్రయించాలి. వారిని సేవించి, సుముఖులను చేసుకొని వారి అభిప్రాయములను, అనుభవములను, ప్రవచనములను సంపాదించాలి. మహనీయులగు ఆత్మజ్ఞులు లౌకిక సంపద కలవారివలె ప్రదర్శితులు కాకపోవచ్చు. వారు అనేకచోట్ల నివురుగప్పిన నిప్పువలె ఉంటారు. వారిని గుర్తించటమెట్లా? ఉత్తముల అభిప్రాయములే అందుకు శరణ్యం. వివేకులగు మహనీయులను ఆ సర్వేశ్వరుడు సాధకజనులపై గల ప్రేమచే సర్వకాలాలో ఈ భూమిపై ప్రసాదిస్తూనే ఉంటాడు. అయితే "ఈయన ఆత్మజ్ఞుడు. నిత్యానిత్య వివేకి. ఉత్తమ సమాచార సమన్వితుడు"... అని తెలిసి ఉండి కూడా, అట్టి వారిని ప్రయత్నపూర్వకంగా శరణువేడక ఊరకే తాత్సారం చేసేవారిని ఏమనాలి? అమృత కలశాలను సమీపంలో సిద్ధంగా ఉంచుకొని అల్పమైన తృణములవంటి ఇంద్రియ విషయాలపై ధ్యాసను, శ్రద్ధను చూపేవారిని బ్రహ్మ, విష్ణువులంతటి వారు కూడా కాపాడలేరు. ఓ జనులారా! మీరు శుద్ధాంతఃకరణులు, ఆత్మజ్ఞులు, వివేకులు అగువారి కొరకు వెతకండి. వారిని శరణు వేడండి. "ఆ! ఏముంది? ఎవరిని నమ్మగలం? ఇట్లాగే కానిద్దాం. చూద్దాంలే! ఇప్పుడు లాభం లేదు"... ఇటువంటి అల్ప – అశ్రద్ధపూర్వక – నిరుత్సాహ – బద్ధక వాక్యాలకు చోటిచ్చారా... గొప్ప అవకాశములను కోల్పోతున్నందుకు తరువాత విచారించక తప్పదు.

పుణ్యకార్యములచే మనస్సు పవిత్రం కాగా, ఉత్తమ వాక్యముల అర్థము పొందటానికి ఈ జీవునికి అర్హత ఏర్పడుతోంది. సాత్వికమైన గుణ సంపద పెంపొందించుకొనువారికి మహాత్ములు స్వయంగా తమ జ్ఞాన సంపదను అందిస్తూ ఉంటారు. ఈ విధంగా శుద్ధాంతఃకరణులగు మహాత్ముల సాంగత్యము చేతను, అనేక జన్మార్జితములగు పుణ్యముల సంచయముచేతను, కాకతాళీయ యోగం చేతను 'శుభేచ్ఛ' అనే మొట్టమొదటి భూమిక ఉదయిస్తోంది, బలవత్తరమగుచున్నది.

విత్తనం మొలకెత్తగానే రైతు ఏం చేస్తాడు? అది వాడిపోకుండా ముందుగా నీళ్ళు పోస్తాడు. అది ప్రవర్ధమానమైయ్యేరీతిగా తగు జాగ్రత్తలన్నీ తీసుకుంటాడు. అట్లాగే ప్రథమభూమిక ఉదయించ గానే ఆ జీవుడు వివేకంచే ప్రయత్నపూర్వకంగా దానిని కాపాడుకోవాలి, పాలించుకోవాలి, పెంపొందించు కోవాలి. సాధనచతుష్టయం (శమం, విచారణ, సత్సంగం, సంతోషం)తో కూడిన వైరాగ్యాది అంశమే శుభేచ్ఛకు అంకురం. అట్టి అంకురాన్ని విచారణను కొనసాగించుటచే అభివృద్ధి పరచుకోవాలి. ప్రతిరోజు రక్షించుకోవాలి. శుభేచ్ఛ అంతఃకరణంలో రూఢిపడిందా, ఇక అట్టి అంతఃకరణం ఇతర భూమికలన్నిటియొక్క ఉత్పత్తికి స్వయంగా అతిత్వరలో స్థానం కాగలదు. దీని నుండే సాధకుడు సర్వాత్మత్వము వరకు పయనించగలడు.

ఓ రామచంద్రా! ఈ విధంగా "అసంగసంగం" వరకు మూడు జాగ్రత్ భూమికల గురించి వర్ణించి చెప్పాను. 3వ భూమికలో స్థితి పొందినవాడు సమస్త సంకల్ప కల్పనలను అతి తేలికగా పారద్రోలగలుగుతాడు.

❖❖❖

11. జన్మ - జన్మాంతర ప్రయత్నం

శ్రీరాముడు : మహర్షీ! ఇప్పుడు ఈ సందర్భంలో రెండు సందేహాలను మీముందు ఉంచాలని అనుకుంటున్నాను–

1. ఒక జీవుడు మూఢత్వం తాండవించే పరిసరాలలో జన్మించాడనుకుందాం. భోగరాగాదులలో ప్రవృత్తుడై అధమత్వముతో జీవితం గడుపుచున్నాడనుకోండి. ఆతనికి యోగుల సాంగత్యం లభించకపోతే ఇక ఆతడు ఉద్ధరించబడేది ఎట్లా? ఇక ఆతని గతి అంతేనా? ఆతను మోహరాగాలలో మునిగితేలుతూ అధమ స్థితులకు దిగజారవలసిందేనా? ఆతడు ఎట్లా బాగుపడేది?

2. ఒకడు 'శుభేచ్ఛ' అనే మొదటి భూమికలోనో లేక రెండవ భూమికలోనో ప్రవేశించియుండగా ఆయుష్షు తీరిపోయిందనుకోండి. ఇప్పుడాతనికి ఎటువంటి గతి లభించబోతోంది?

శ్రీవసిష్ఠ మహర్షి : (చిరునవ్వుతో) ఓ రామచంద్రా! సాధకజనులపై గల అవ్యాజమైన ప్రేమచే అవతారమూర్తివగు నీవు ఈ ప్రశ్నలను ఈ సందర్భంలో అడుగుచున్నావన్న సంగతి నేను గమనిస్తున్నాను. మంచిది. అయితే ఈ విషయం ఇతఃపూర్వం మనం ఈ సంవాదంలో సంభాషించుకున్నదే. ఈ సందర్భమునకు ఉచితంగా మరికొన్ని విశేషాలతో ప్రస్తావిస్తాను.

❖

ఒకడు మూఢుడై అనేక దోషములను ఆశ్రయిస్తూ జీవితమును గడిపివేస్తున్నాడనుకో. అతడు ఎప్పటికైనా "నా ఈ మార్గం కుయుక్తమైనది. దోషభరితమైనది. దుఃఖభరితమైన యోనులకు దారి తీయగలదు"...అనే వివేకం పొందాలి. అట్టి వివేకం (లేక) వైరాగ్యం పొందనంతవరకు ఆతడు ఈ విశాల సంసారంలో ఉండియే తీరుతాడు. "ఇప్పుడు ఉపాయం ఏమిటి?"...అనే ప్రశ్నకు అతను రావాలి. అప్పుడు స్వవిచారణచేతనో, కాకతాళీయంగానో, (లేక) సాధుజన సాంగత్యం చేతనో ఉద్ధరించబడతాడు.

వైరాగ్యే అభ్యుదితే జంతోః, అవశ్యం భూమికోదయః
తతో నశ్యతి సంసార, ఇతి శాస్త్రార్థసంగ్రహః॥

అట్టి జీవునిలో 'వైరాగ్యం' ఉదయించాలి. వైరాగ్యం ఉదయించిన తరువాత, తప్పకుండా త్వరలోనే 'భూమిక' అనేది ఉదయిస్తుంది. తద్వారా సంసారము నశిస్తుంది. ఇది శాస్త్ర సిద్ధాంతము. వైరాగ్యము ఉదయించగానే ఆతనికి సహకరించటానికి సాధన-జ్ఞానపాఠముల రూపములో శాస్త్రములు సిద్ధంగా ఉన్నాయి.

అట్లా కాకుండా "నేను కుమార్గాన్ని దోషస్వభావాన్ని కొనసాగిస్తూనే ఉంటాను. మీకు చేతనైతే నన్ను ఉద్ధరించండి"...అని పలికేవారికి పదార్థములు ఎదురుగా ఉన్నా ...తిననివానికి ఆకలి తీరనట్లు ...శుభేచ్ఛ ప్రవృత్తం కాదు. సంసారం బంధశృంఖలాలను తగిలించి ఆతనిని తన వెంట త్రిప్పుకుంటూనే ఉంటుంది. అప్పుడు గురువులు చేయగలిగేదేమిటి చెప్పు? ప్రయత్నశీలుడైన జీవుడు పరిసరముల ప్రభావమును అధిగమించగలడు.

ఇక నీ రెండవ ప్రశ్నకు వద్దాం – 'దేహపతనం' అనేది – భూమికల దృష్ట్యా చూస్తే – ఒకడు నిద్రకుపక్రమించి, గాఢ నిద్ర తరువాత నిదురవలేవటం వంటిది. ఒకడు ఏ విషయపరిజ్ఞానంతో, సమాచారంతో ఉండి గాఢనిద్రకు ఉపక్రమిస్తాడో ...ఆతడు నిదురలేచిన తరువాత అదే పరిజ్ఞానం, అదే సమాచారం తిరిగి కొనసాగిస్తాడు కదా! అట్లాగే, ఒకడు ప్రథమభూమికయందో, లేక ద్వితీయ – తృతీయ – భూమికలయందో ఆరూఢుడై ఉండగా ఆతని ఈ భౌతికదేహం పతనమైనదనుకో. ఆయా భూమికల ననుసరించి పూర్వ దుష్కృతాలన్నీ సంక్షయించి ఉంటాయికదా. అందుచే అట్టి జీవుడు దేవతానగరములందో, లోకపాలకుల నగరములందో ప్రవేశించి క్రీడించగలడు. ఆ తరువాత పూర్వకాలకృతమైన పుణ్యసమూహం, దుష్కృతములు క్షయించిన తరువాత భూలోకంలో యోగి అయి జన్మిస్తాడు. శుద్ధులు, శ్రీమంతులు, గుణవంతులు, సజ్జనులు అగువారి ఇళ్ళలో పుడతాడు. అప్పుడిక పూర్వకాలికమైన వాసనలచే మరల యోగమును సేవిస్తాడు. ఆ బుద్ధిమంతుడు పూర్వాభ్యాసవశం చేత మరల యోగభూమికాక్రమమును గుర్తుకు తెచ్చుకోవటం జరుగుతుంది. మరల ఉత్తరోత్తర భూమికలను అధిరోహిస్తూ ముందుకు పోతూ ఉంటాడు.

❖❖❖

12. ఉత్తరోత్తర భూమికా సంప్రయాణం

శ్రీవసిష్ఠ మహర్షి : ఇప్పటిదాకా ఈ సందర్భంలో చెప్పుకున్న 1.శుభేచ్ఛ, 2.విచారణ, 3.అసంగం... అనే మూడు భూమికలు జాగ్రత్తుకు సంబంధించినవి. ఎందుకంటే ఇవి యథాప్రకారంగా జాగ్రత్తు లాగానే భేదబుద్ధిచేతనే ఏర్పడతాయి.

ఈ భూమికలలో ఉన్న ఉత్తరోత్తర యోగయుక్తులచే 'ఆర్యత్వం' ఉదయిస్తుంది. అనగా వీరు తదితరులచే, ఆరాధించబడుటకు అర్హులౌతారు. సద్గుణాధిక్యతచేత వారు పూజార్హులు, మార్గదర్శకులు అవుతారు. వీరిని చూచుటచే, పూజించుటచే మూఢజనులకు కూడా మోక్షంపట్ల అపేక్ష పుడుతుంది.

'ఆర్యుడు' అనగా ఎవరో ...ఇక్కడ కొన్ని విశేషాలు చెప్పుకుందాం.

ఆర్యుడు -

కర్తవ్యమాచరన్, కామమకర్తవ్యమనాచరన్,
తిష్ఠతి ప్రాకృతాచారో యః స 'ఆర్య' ఇతి స్మృతః ॥

ఎవడైతే నిత్య – నైమిత్తకమైన కర్తవ్యములను ఆచరిస్తూ, కర్తవ్యములు కాని వానిని కామ్యకర్మలను ఆచరించక ప్రస్థుతమైన ఆచారమునందు స్థితి కలిగి ఉంటాడో అట్టి వానిని 'ఆర్యుడు' అంటాం. ఈతడు సాంఘిక – లోక ప్రసిద్ధ ఆచారములకు అనుకూలంగా ఉంటాడు. శాస్త్రోక్తములైన వాటిని, చిత్తమునకు సౌమ్యము కలిగించగల వ్యవహారములను గ్రహిస్తూ ఉంటాడు. యోగికి ఈ 'ఆర్యత్వము' అనేది ప్రథమ భూమికలో అంకురిస్తుంది. ద్వితీయ భూమికలో వికసిస్తుంది. 3వ భూమికలో ఫలీభూతమౌతూ ఉంటుంది. ఇట్టి ఆర్యత్వ దశలో దేహపతనమైన యోగి శుభ సంకల్పములకు సంబంధించిన భోగములను చిరకాలం పొంది మరల యోగి అయి జన్మిస్తాడు.

ఈ మూడు భూమికల అభ్యాసంచే క్రమక్రమంగా అజ్ఞానమంతా నశిస్తుంది. 'సమ్యక్‌జ్ఞానం' ఉదయిస్తుంది. చిత్తము పూర్ణచంద్రునివలె శాంతి పొందుతూ ఉంటుంది.

నాలుగవ భూమిక ద్వైత శమము - స్వప్నసాదృశ్యభూమిక - ఇక నాలుగో భూమికలో ఆ సాధకుడు ప్రవేశిస్తాడు. ఈ భూమికలో ప్రవేశించిన యుక్తచిత్తులగు యోగులు జగత్తునంతటినీ విభాగరహితమైన దానిగానూ, అనాది-అనంతమైనట్టిదిగానూ, ఆనందరసైక స్వరూపంగానూ వీక్షిస్తూ ఉంటారు. ద్వైతము సర్వదా శమిస్తూ ఉంటుంది. ఈ 4వ భూమికలోని యోగులు ఈ జగత్తునంతటినీ ఒక స్వప్నమువంటిదిగా చూస్తూ ఉంటారు. అందుచేత దీనిని 'స్వప్నాసాదృశ్యభూమిక' అని అంటూ ఉంటారు. మొదటి మూడు భూమికలు జాగ్రత్ సంబంధములైతే, ఈ నాలుగవది స్వప్న సదృశ్యమైనది.

ఐదవ భూమిక అద్వైత బ్రహ్మాస్థితము - సుషుప్త ఘనుడు, ఆనందమయుడు, అంతర్ముఖుడు - ఇక ఐదవది సుషుప్త సాదృశ భూమిక. ఇందులో యోగి కేవలం సత్తా మాత్రంగా సంభాషించి ఉంటాడు. ఈతనిలో ద్వైతభావం (లేక) స్ఫురణ అనేది మచ్చుకైనా ఉండదు. కనుక అతి ప్రసన్నుడై ఉంటాడు. ఈతడు అసంగమగు తన స్వరూపము (లేక) ఆత్మస్వరూపము ఎరిగి ఉండటం చేత అద్వైత బ్రహ్మమునందే సదా స్థితి కలిగి ఉంటాడు. తోటి వారికి తన సర్వతత్త్వాత్మకం గురించి చెప్పుకోవటానికి మాటలు చాలవు. మూగవాడు తన ప్రియురాలిపై గల ప్రేమాధిక్యత చెప్పుకోజాలనట్లు ఈతడు తన సర్వాంతర్గతమైన ప్రేమాస్పద స్వరూపం ఇట్లని చెప్పజాలడు. తదితరులనందరినీ తన ఆత్మయొక్క విన్యాస ప్రకటనము వలె దర్శిస్తాడు. ఈ 5వ భూమిక సంపాదించిన యోగి బాహ్య వ్యాపార తత్పరుడై ఉన్నప్పటికీ అంతర్గతంగా ఘనీభూతమైన నిర్విషయత్వమును దాల్చి ఉంటాడు. ఆతని ఆనంద సాగరమునకు అవధులు ఉండవు. ఎవరూ అవధులు కల్పించజాలరు. తోటివారితో మాట్లాడుచున్నప్పుడు అంతా తెలిసి కూడా ఏమీ చెప్పజాలనట్లు ఉంటాడు. ఈతనిని సుషుప్తఘనుడు, ఆనందమయుడు, అంతర్ముఖుడు.. అని కూడా పిలుస్తున్నారు. ఈ 5వ భూమికను అభ్యాసం చేస్తూ వాసనారహితుడైన పూర్ణశాంతుడై ఉండటం చూసి 'ఈతడు నదరు – బెదరు లేని మొద్దురా'... అని కొందరు అనుకోవచ్చు. ఎందుకంటే అందరూ "గొప్ప విలువైనవి" అనుకునేవాటిపట్ల ఈతడు నిద్రాళువువలే ఉంటాడు.

అరవ భూమిక - తురీయము - ఉక్త సమయంలో, ఉక్త ప్రకారంగా 5వ భూమికను అభ్యసించే యోగి ఎప్పుడో 'తురీయం' అనబడే ఆరవ భూమికలో ప్రవేశిస్తున్నాడు. అచ్చట సత్తుగాని, అసత్తుగాని, అహంకారముగాని, అనహంకారముగాని భాసించదు. ఆ యోగి మనన వర్జితుడై ఉంటాడు. ద్వైత-అద్వైత వితర్కరహితుడై ఉంటాడు. గ్రంథి శూన్యుడై, సందేహములనేవేవీ లేనివాడై ఉంటాడు. భావనలకన్నిటికీ ఆవల నెలకొని ఉంటాడు. అట్టివాడు 'జీవించుట' అనబడు కార్యక్రమముచే స్పర్శించబడక ఉంటాడు. అతీత స్వభావము అలవరచుకొనటంచేత 'ఆత్మవంతుడై ఉండటం' అను విశేషంతో ప్రకాశిస్తూ ఉంటాడు. సర్వదా నిగృహీతత్వం (Non-taking) అలవరచుకొని ఉంటాడు. కర్మలచే నిబద్ధించబడక పోవటం చేత శాస్త్రములు ఈతనిని 'జీవన్ముక్తుడు'... అని పిలుస్తున్నాయి.

ఈ జీవన్ముక్తుడు శరీరము ధరించి ఉన్నప్పటికీ ముక్త రూపుడే. శరీరము ఉండి కూడా జగత్స్వభావరహితుడై ఉంటాడు. చిత్రపటంలోని దీపం గాలి వీచికలకు రెపరెపలాడుతుందా? లేదుకదా! అట్లాగే ఆతని బుద్ధి సర్వదా నిశ్చలత్వమును వీడదు. ఖాళీగా ఉన్న కుండకు లోపల – బయట కూడా శూన్యాకాశమే ఉన్నట్లు ఆతడు లోపల – బయట విషయాతీతమైన నిర్వికారవైనము కలిగి భాసిల్లుతూ ఉంటాడు.

అన్తః పూర్ణో బహిః పూర్ణకుంభ ఇవ అర్ణవే ।
కించిదేవైష సంపన్నస్త్వథవైష న కించన ॥

సముద్రంలో ఒక ఘటం (పాత్ర) ముంచబడిందనుకో. అప్పుడా పాత్ర యొక్క బయట – లోపల కూడా జలమే ఉన్నది కదా! అరవవ భూమికలో ఉన్న నిత్య నిరతిశయానందరూపుడగు ఈ యోగి బాహ్య – అభ్యంతరములందు పరిపూర్ణుడై, పరమాశ్చర్యరూపమును పొందినవాడై ఉంటాడు. తన యొక్క పరిపూర్ణ స్వభావముచే అన్నీ పొందినవాడై ఉంటాడు. 'ఇంకా ఈ లోకం పొందాలి! ఆ రూపం కావాలి. అచ్చటికి వెళ్ళాలి. ఇది ఇంకా ఏర్పడాలి'... అనే అసంపూర్ణ భావాలు ఆతనికి ఉండవు. ఓ రామా! ఈ నిత్యసిద్ధుని ముందు భౌతికసిద్ధులు సూర్యునికి చూపే దివిటీవంటివి. నిత్యసిద్ధుడై ఉండికూడా ఏమీ పొందనివాడై ఉంటాడు.

ఇట్లా 6వ భూమిక యందున్నవాడై క్రమంగా ఆ యోగి ఏడవ భూమికను పొందుచున్నాడు.

ఏడవ భూమిక విదేహముక్తిత్వం - ఈ 7వ భూమికను 'విదేహముక్తిత్వం' అని వర్ణిస్తున్నారు. ప్రాపంచిక భూమికలన్నిటికీ ఇది ఎల్ల. ఈ భూమిక వాక్కుకు అగోచరం అనబడుచున్నది.

కొందరు దీనిని శివం అంటున్నారు. మరికొందరు బ్రహ్మము అని పిలుస్తున్నారు. ఇంకొందరు ప్రకృతి–పురుషుల ఐక్యము యొక్క వివేకము అని భావిస్తున్నారు. కొందరైతే, "తాను చూస్తున్నదంతా తానే అయిఉండటం" అని అభివర్ణిస్తున్నారు. ఇంకా కొన్ని సైద్ధాంతిక విభాగాలలో దీనినే వాసుదేవత్వం – స్వర్గం – మహేశ్వరత్వం ఇట్లా నిజకల్పిత విభేదాలచే పలు విధాలుగా వర్ణించటం జరుగుతోంది.

అయితే రామచంద్రా! అది వచించటానికి అలవికానిమాట నిజమే కాని ...ఏదో విధంగా అద్దాని గురించి వర్ణించడం ఉపదేశించటం జరుగుతూనే ఉన్నది. అద్దాని భోగ–త్యాగ అధోగత్యాగ లక్షణాలు – ఉపదేశాలు కొనసాగుతూనే ఉన్నాయి. మంచిదే ! చివరికి మాత్రం అది అనిర్వచనీయమైన అనుభవం మాత్రమే.

❖

ఓ రామచంద్రా ఈ విధంగా సప్త భూమికల గురించి ఇక్కడ చెప్పాను. ఈ సప్తభూమికలు జీవుని స్థితిని నిర్ణయిస్తాయి కదా! అందుచేత మనం ఇతఃపూర్వమే (స్థితి ప్రకరణంలో) సవిస్తారంగా చెప్పుకున్నాం. అక్కడ 1.శుభేచ్ఛ, 2.విచారణ, 3.తనుమానస, 4.సత్త్వాపత్తి, 5.అసంసక్తి, 6.పదార్థాభావన, 7.తుర్యగము – అని వర్ణించాం. వేరు వేరు ఋషులు వేరు వేరు కాలాలలో ప్రవచించిన ఈ భూమికా సిద్ధాంతానికి కొంచెం పేర్ల భేదం ఉంటే ఉండవచ్చుగాని, సిద్ధాంతపరంగా సామ్యత్వమే కలిగి ఉందని గ్రహించు.

భూమికా యోగం గురించి మరి, ఈ వర్తమాన పరిశీలనను ముగించేముందు ఒక్క వాక్యం చెబుతాను– **అసాం అభ్యాసయోగేన న దుఃఖమనుభూయతే ॥**

ఈ సప్త భూమికలు అభ్యాసవశం చేతనే సంప్రాప్తిస్తాయి. అంతేకాని, ఓ జనులారా! అవి ఏవో ఉదాహరణపరిమితములనుకొని, మహనీయులెవరికో మాత్రమే సాధ్యమనుకుని విని ఊరకోకూడదు. అభ్యాసము కొరకే ఇవి చెప్పబడ్డాయి. శుభేచ్ఛలో ప్రవేశించే జీవుడు అభ్యాసవశంగా క్రమంగా ఉత్తరోత్తర భూమికలను అధిరోహించగలడు. ఈ భూమికల అభ్యాసయోగం చేత దుః ఖానుభవాలన్నీ త్వరితరీతిగా తొలగుతాయి. క్రమంగా దుఃఖం యొక్క అనుభవలేశంకూడా ఉండదు. కనుక ఏఏ భూమికలో ఏఏ లక్షణాలు చెప్పబడ్డాయో అవి ప్రయత్నపూర్వకంగా అలవరచుకోండి.

❖❖❖

13. ఇచ్ఛను అధిగమించాలి

శ్రీరాముడు: మహాత్మా! మీరు అత్యద్భుతంగా వర్ణించి చెప్పిన 'ఆ సప్తభూమికలలో ప్రవేశించటం, ఈ సంసారమును జయించి వేయటం' అనే ఉభయ విషయములను దృష్టిలో పెట్టుకొని ఏవైనా ఉపాయాలుగాని, దృష్టాంతోపమానాలు గాని ఉపదేశించ ప్రార్థన.

శ్రీవసిష్ఠ మహర్షి: ఓ రామచంద్రా! ఈ జీవునికి సంబంధించిన ఒక గొప్ప యుద్ధం జరుగుతోంది. ఆ యుద్ధంలో విజయం పొందాలి. పొందితేగాని సప్త భూమికలలో జీవుడు ప్రవేశించలేడు. అయితే యుద్ధభూమిలో ఒక గొప్ప ఆడఏనుగు శత్రుపక్షంలో ఉండి ఈ జీవుని గెలుపును నిరోధిస్తోంది. మందగమనము కలది, మహా – గర్వితమైనది, యుద్ధంలో మహా – ఉత్సాహము – నేర్పరితనము కలది అగు ఆ ఆడ ఏనుగును నిరోధించడం గురించి జనులంతా యోచించెదరు గాక! యుద్ధభూమిలో కలియతిరుగుచున్న ఆ ఆడఏనుగుకు గొప్ప భయమును గొలిపే దంతాలున్నాయి. అది ఘీంకరిస్తూ ఆ యుద్ధభూమిలో అటూ – ఇటూ సంచరిస్తూ ఉంటే చెప్పరాని అనర్థాలన్నీ వచ్చిపడుతున్నాయి. ఇప్పుడా ఏనుగును పట్టుకుని చంపాలి. లేకపోతే సప్తభూమికా ప్రదేశమును పొందగలిగే ప్రసక్తే లేదు. ఆ ఏనుగు యుద్ధభూమిలో యథేచ్ఛగా సంచరిస్తూ ఉన్నంతవరకూ ఎవడైనా సరే సప్త భూమికా ప్రవేశం చేయగల సామర్థ్యం పొందలేడు.

శ్రీరాముడు: మహర్షీ! ఆ ఏనుగు ఏది? ఆ యుద్ధ భూములెక్కడున్నాయి? దానిని సంహరించటం ఎట్లా? చాలా కాలంగా అది ఎక్కడ క్రీడిస్తోంది? మాపై కరుణతో ఈ విషయాలు విశదీకరించండి.

శ్రీవసిష్ఠ మహర్షి: 'నాకు ఏదో ఈ దృశ్యములో లభించాలి' అనే కోరికయే ఆ ఆడ ఏనుగు. ఈ 'దేహం' అనే అరణ్యంలో అది చాలా ఉల్లాసంగా పచార్లు చేస్తోంది. మదించిన ఇంద్రియాలే దాని శిశువులగు గున్న ఏనుగులు. 'మనస్సు' అనే కారడవిలో దాగి ఉండి అది తెలియకుండా వచ్చి పడుతోంది. 'శుభాశుభకర్మలు' దాని యొక్క రెండు దంతాలు. నలువైపులా విస్తరించి ఉన్న వాసనా సమూహములే దాని మదము. సంసార దృష్టులే ఆ యుద్ధభూమి.

'ఇచ్ఛ' అనబడే ఆ ఏనుగు అల్పజ్ఞులగు జీవులను అతి తేలికగా చుట్టచుట్టి గాలిలోకి విసరివేస్తోంది. ఇక ఆ జీవులు అనేక ఉపాధుల ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్నారు. 'వాసనా – చేష్ట – మనస్సు – చిత్తము – సంకల్పము – భావన – స్పృహ...' ఇవన్నీ కూడా చిత్తకోశములోగల ఇచ్ఛ యొక్క వివిధ నామములు.

'మహా ధైర్యము' అనే అస్త్రం చేబూని "నిరాదరణము" అను బలంతో సర్వ పదార్థ రూపములలో అన్ని వైపులా వ్యాపించియున్న ఈ ఇచ్ఛ అనే ఆడ ఏనుగును సర్వవిధాలా జయించాలి. ఎందుకంటావా? ఈ ఇచ్ఛ ఎంతెంతవరకు సమస్త వస్తు రూపమయి విజృంభిస్తూ ఉంటుందో ...అంతవరకూ మహా – భయంకరమైన 'దుష్ట సంసారము' అనే విష విషూచి ఉండియే తీరుతుంది.

ఏతావానేవ సంసారః ఇదమస్త్వితి యన్మనః,
అస్య తు ఉపశమో మోక్షః! ఇత్యేవం జ్ఞాన సంగ్రహః॥

'ఏదేదో నాకు లభించాలి...' అనురూపం గల మనస్సేదైతే ఉన్నదో ...అద్దానినే మనం 'సంసారం' అని అంటున్నాం. అట్టి దాహస్వభావం శమించిందా ...అదియే మోక్షం. సమస్త జ్ఞానసారం ఇదే. తెల్లటి పరిశుభ్రమైన వస్త్రంపై రంగు చక్కగా అంటుతుంది. అద్దముపై నూనెచుక్క ఇంకకుండా యథాతథంగా ఉంటుంది కదా! ఎవడైతే ఇచ్ఛారహితుడై నిర్మలాకారయుక్తుడై ఉంటాడో ...అట్టివాని హృదయంలో 1. ఉపదేశవాణి 2. అనుభవ ప్రకాశము. ఈ రెండూ వికసిస్తాయి.

అయితే, ఇచ్ఛ రహితమైయ్యేదెట్లా? - విషయములు స్మరించకపోయినంతమాత్రం చేతనే సంసారమునకు అంకురమైనట్టి ఇచ్ఛ ఉపశమించగలదు. ఇచ్ఛ అనేది కొంచెం ఉదయించినా సరే, అది అనర్థకారిణి కాగలదు. అందుచేత 'విషయములను విస్మరించటం' అనే శస్త్రంతో ఇచ్ఛ అనే అంకురం ఏర్పడకుండా తగు జాగ్రత్త తీసుకోవాలి.

ఇచ్ఛచే వ్యాపించిన హృదయం గల జీవుడు జీవస్వభావానికి అతీతుడు కాలేకపోతున్నాడు. "విషయేచ్ఛా విస్మరణ" అనబడే ప్రత్యాహార రూపమగు యత్నమున తత్పరుడగువాడు అత్యంత సులభంగా ఆత్మయందే స్థితి కలిగి ఉంటాడు. ఈ 'ప్రత్యాహారం' అనే దానికి రెండు దశలు ఉన్నాయి.

1. ప్రత్యాహార అభ్యాసదశ: "విషయముల పట్ల విస్మరణము" అనేది మొట్టమొదట సాధిస్తూ రావాలి. క్రమక్రమమైన ప్రయత్నము చేతనే ఇది సాధ్యం. క్రమంగా ధ్యాస – అభినివేశములను విషయముల నుండి విరమింపజేయాలి. శాస్త్రములు – శాస్త్రజ్ఞులు దైవారాధన – యోగాభ్యాసము వంటి అనేక ఉపాయములను అందించటంలో అంతర్లీనోద్దేశం ప్రత్యాహారమే అయి ఉన్నది.

2. ప్రత్యాహార పరిపక్వదశ: పరిపక్వదశయందు ఇక ప్రత్యాహారమునకు ప్రత్యేకమైన అవధానం అవసరం ఉండదు. నిద్ర మొదలైనవి స్వతఃసిద్ధంగా ఏర్పడునట్లే, ప్రత్యాహారం స్వతఃసిద్ధమగుచున్నది.

కల్పన - 'ఇది నాకు కలుగుగాక'... అనబడే తీవ్రేచ్ఛను విజ్ఞులు 'కల్పన' అని కూడా పిలుస్తున్నారు. 'పదార్థముల విస్మరణ' అనే ప్రత్యాహార ఫలం 'కల్పనాత్యాగం' అయి ఉన్నది. స్మృతి విషయాల గురించి స్మరణ లేకపోవటాన్ని 'శివరూపం' ...అని పిలుస్తున్నారు.

సంకల్పదశలో ఇతఃపూర్వం అనుభవించినవి, అనుభవించనివి కూడా పాల్గొనుచున్నాయి. అందుచేత రాఘవా! అనుభవించినవాటి గురించిగాని, అనుభవించనివాటి గురించి గాని ఏర్పడే 'స్మృతి'ని ఒక కాష్ఠం (కొయ్య) వలె శ్రీఘ్రంగా విస్మరించి ఉండు. ఆ రెండింటి చేత స్పర్శించబడని ఒకానొక రహస్యమైన రూపమును ధరించినవాడవై ఉండు.

❖

అసంకల్పమే శ్రేయం -

ఊర్ధ్వ బాహుర్విరౌమ్యేష, న చ కశ్చిత్ శృణోతి తత్!
"అసంకల్పః పరం శ్రేయం!" స కిమ్ అంతర్ న భావ్యతే?

ఓ జనులారా! 'సంకల్ప రహితుడై ఉండటమే పరమ శ్రేయం....' అని నేను రెండు చేతులు పైకెత్తి, ఎలుగెత్తి ప్రకటిస్తూనే ఉన్నాను కదా! అయినా అనేక మంది నా ఈ మాటలు వినిపించు కోవటమే లేదు. సంకల్పములలో ప్రవేశించి అందులో తారసపడే సుఖదుఃఖానుభవములను గొప్పగా నమ్ముకుని ఉంటున్నారు. అసంకల్ప స్థితియొక్క మహిమను ఈ జనులు ఎందుకో పట్టించుకోవటం లేదు. అసంకల్పత్వమును అంతఃకరణంలో ప్రతిక్షేపించుకోవటానికి యత్నించరేం?

నాయనలారా! సమస్త ఇంద్రియ – మనో వ్యాపారములను రహితం చేసి కేవలం 'తూష్ణీం' స్థితి యందు ఉండటం అభ్యసిస్తూ ఉన్నంతమాత్రం చేతనే ...అప్పుడు బ్రహ్మదేవుని మహా సామ్రాజ్య సుఖం కూడా ఒక గడ్డిపరకవలె స్వల్పమైనదిగా, తుచ్ఛమైనదిగా భాసించగలదు. ఇక ఈ ప్రాపంచిక సౌఖ్యాల గురించి వేరే చెప్పేదేమున్నది? అట్టి సంకల్పరాహిత్యస్థితే భౌమానందమైయుండగా మీరు 'అబ్బ! ఎప్పటికో ఆ స్థితి! అది మనకు లభ్యపడుతుందా? లేదు. ఎవరో గొప్ప గొప్ప వాళ్ళకి మాత్రమే' అని ఎందుకు వేదన చెందుతున్నారో చెప్పండి?

శ్రీరాముడు: మహర్షీ! సంకల్పములన్నిటికీ ముందే సత్ స్వరూపమున ఏర్పడియున్న స్వయమాత్మ స్వరూపులై ఉండి కూడా జనులలో అనేకులు 'అవశ్యం నిర్వర్తించవలసిన అనేక కార్యక్రమములు ఉండి ఉండగా అసంకల్పత్వం ఎలా సాధ్యం ...' అనే అభిప్రాయం కలిగి ఉండటం జరుగుతోంది. ఈ విషయమై తమ వ్యాఖ్యానం ప్రసాదించండి.

శ్రీ వసిష్ఠ మహర్షి:

గమ్యతి ఏకైక నిష్ఠస్య యథా పాంథస్య పాదయోః,
స్పన్దో విగత సంకల్పస్తథా స్పన్దః స్వకర్మసు ॥

ఒకడు ఒక ముఖ్యమైన పని మీద ఒకానొక చోటికి వెళ్ళాలనే ఉద్దేశంతో అడుగులు వేస్తూ బయలుదేరాడనుకో ....! అప్పుడా బాటసారి 'ఈ అడుగు ఇటు వేయాలి, ఆ అడుగు అటు'... అనే ప్రయత్నపూర్వకమైన సంకల్పము లేకుండానే బాటలో సాగిపోతూ గమ్యానికి చేరుతాడు చూచావా? యోగి కూడా అసంకల్ప పూర్వకంగా స్వకర్మలందు ప్రవర్తించుచున్నాడు. ఎక్కడ, సుఖదుః ఖమానావమానాది భావావేశాలు జత చేరి ఉంటాయో అక్కడ మాత్రమే సంకల్పం సంకల్పంగా

కొనసాగుతుంది. లేదా, ఆ సంకల్పత్వమును నిర్వరించవలసినది నిర్వర్తించగానే మటుమాయ మౌతుంది. ప్రతి జీవుడు తన దినచర్యలో అనేక సంకల్పాలు అసంకల్పంగా పరిణమింపజేయు చున్నాడు. ఒక తల్లి తన పిల్లవాడిపై చూపే కోపం కోపసంస్కారంగా రూపుదిద్దుకుంటుందా?... లేదు. పిల్లవాడు అల్లరి ఆపగానే ఆ కోప సంకల్పం అసంకల్పమైపోతోంది కదా! అట్లాగే సర్వ సంకల్పములను వ్యవహారము కొరకు మాత్రమే ధరించిన మరుక్షణం ఎందుకు అసంకల్పంగా చేసి వేయరాదు చెప్పు? తప్పకుండా ప్రయత్నంచేత సుసాధ్యమేనని సకల జనులకు నా మనవి.

ఈ విధంగా ... ఎక్కువగా చెప్పవలసిన పనేమున్నది? సంక్షేపంగా ఒక్కమాట మరల మరొక్కసారి ప్రకటిస్తున్నాను విను– **సంకల్పం పరోబంధః, తదభావో విముక్తతా ॥**

సంకల్పమే పరమబంధం, సంకల్పములు లేకుండటమే మోక్షం.

❖

ఓ రామచంద్రా! ఈ సమస్త ప్రపంచమును 'అజము – శాంతము – అనంతము – ధ్రువము – అవ్యయము – నిత్య సిద్ధము' అయినట్టి 'పరమార్థ చిద్రూపం'గా చూస్తూవుండు. యథాసుఖంగా ఉండి ఉండు.

సమస్త దృశ్యమును మఱచి, 'అక్షయము – శాంతము' అయిన రూపమును అవధరించి ఉండటమే యోగం అను శబ్దముచే ఉద్దేశించబడింది. కాబట్టి నీవు వాసనారహితుడవై యోగమునందు 'స్థితి' కలిగియుండి ఇక ఆపై యథాప్రాప్తములైన కర్మలను నిర్వర్తించు. లేదూ, కర్మలు త్యజించదలచావా...సమాధిపరుడవై కర్మలు చేయకుండుము.

"అహం...మమ...నేను...నాది" అనే అధ్యాసయొక్క త్యాజ్యమే చిత్తక్షయం. సమస్త దృశ్యం యొక్క అకృత్రిమం, స్వాభావికం అగు చిత్తరాహిత్యం. అదియే 'జీవబ్రహ్మముల యోగం' కూడా. అదే సంకల్ప త్యాగం అని కూడా చెప్పబడుతోంది. కాబట్టి నీవు ఆత్మమయుడవై, ఆత్మకు చెప్పబడిన అప్రమేయ – అసంగాది స్వభావమును సంతరించుకున్న వాడివై ప్రశాంతుడవై ఉండుము. పరమాత్మ సర్వదా శివమై, సర్వవ్యాపకమై, శాంతమై, బోధరూపమై, అజమై, శుభప్రదమైయున్నది. అట్టి పరమాత్మతోటి ఏకత్వభావనయే సర్వత్యాగం. అట్టి సర్వత్యాగ భావనను నీ అంతఃకరణమందు నిరంతరం చేస్తూ ఉండి, ఇక ఆపై కర్తవ్యములైన కార్యములను బాగుగా ఆచరించు.

ఓ సర్వజనులారా! నా ఈ మాటలు శ్రద్ధగా వినండి.

1. "నేను – నాది – అహం – మమ"...మొదలైన భావనలు ఉన్నంతవరకూ ఈ జీవుడు ఎన్నటికీ దుఃఖముల నుండి విముక్తుడు కానేరడు.

2. అహం – మమలను త్యజించటం చేత విముక్తుడౌతాడు.

ఈ రెండు విషయాలూ ఎఱిగినవారై, ఇక ఆపై మీరు కర్మలను నిర్వర్తించటమో త్యజించటమో మీ ఇష్టం ... ఏది ఎట్లైనా ఫరవాలేదు ... అట్లే నిర్వర్తించండి.

❖❖❖

XIV. శ్రీ వాల్మీకి మహర్షి ప్రవచనం

1. ఆత్మావలోకనం

భరద్వాజుడు : మహాత్మా! వాల్మీకి మహర్షీ! ఇంద్రభగవానుని కరుణచే, మీ పాదాలు నేటికి జేరగలిగాను. మీ యొక్క కథా సంవిధాన చమత్కారముచే శ్రీ వసిష్ఠ రామ సంవాదమును వింటున్నాను. వినడం చేత నేను మహత్తరమైన ప్రయోజనం పొందుచున్నాను. అనేక జన్మల తపస్సు ఫలీకరించుటచేతనే దేవదూత నన్ను మీ సమ్ముఖమునకు తీసుకురావడం, మీరు నాపై కరుణతో ఈ సంవాదమును వర్ణించి చెప్పటం జరుగుతోంది.

ఇప్పుడు చెప్పండి మహాత్మా ! శ్రీ వసిష్ఠ మహర్షి చెప్పిన జ్ఞానసారాన్ని వినిన శ్రీరామచంద్రుడు ఏం చేశాడు? ఆ ఉపదేశమాత్రంచేత సందేహరహితుడై పరమ సుఖమును పొందాడా? పూర్ణ బోధమయుడైనాడా? ఇంకా ఏమైనా ప్రశ్నించాడా?

స ఖలు పరమయోగీ విశ్వవన్ద్యః సురేశో,
జనన మరణహీనః, శుద్ధబోధ స్వభావః,
సకలగుణ నిధానం, సంనిధానం రమాయాః,
త్రిజగత్ ఉదయ రక్షా-అనుగ్రహాణమ్ అధీశః ॥

ఆ శ్రీరామచంద్రుడు స్వయంగా మహాయోగి. జగత్తుకు పూజార్హుడు. దేవతలకే దేవేశుడు. జనన మరణరహితుడు. శుద్ధబోధ స్వరూపుడు. సకల గుణనిధి. లక్ష్మీపతి. ఈ మూడులోకముల ఉత్పత్తి - స్థితి - రక్షణలకు కారణకారణుడై ఉన్నాడు. అట్టి రామచంద్రుడు నావంటి భక్తజనులను, ఆర్తులను దృష్టిలో పెట్టుకొని మహర్షిచే నిండు సభలో మహత్తరమైన జ్ఞానము ప్రవచింపజేశారు. ఎంతటి ఆశ్చర్యం! అప్పుడింకా ఏం జరిగిందో ...అది కూడా చెప్పండి.

శ్రీవాల్మీకి మహర్షి : ఓ భరద్వాజా! వేదాంత సంగ్రహరూపమైనట్టి శ్రీ వసిష్ఠ మహర్షి చెప్పిన ఆ వాక్యాలన్నీ శ్రీరామచంద్రుడు విన్నాడు.

సమస్త జ్ఞానం యొక్క పరాకాష్ఠను చవి చూచాడు. ఆతని చిత్తవృత్తియందు అఖండాకారవాక్య ప్రభావంచే ఒకానొక అనిర్వచనీయ నిరతిశయానందం తాండవించింది. 'ఆనందం యొక్క నిర్మల చిద్ఘనం' యొక్క చిహ్నములు ఆతని కమల నేత్రములలో ప్రకాశించాయి. అతడు చైన్యానందసాగర మగు స్వస్వరూపమునందు జాగృతుడైనాడు. ఇక ప్రశ్న-సమాధానం అనే వృత్తి భేదం స్వస్వరూపంలో విలీనమైనది. ఈ వర్తమాన క్షణంలో 'ఇది యుక్తం, అది అయుక్తం' అనే విభేదం, వివేచన ఆతనికి లేవు. ఎందుకంటే ఆతడు, మనో-బుద్ధి-ఇంద్రియ వ్యాపారశూన్యుడైనాడు. 'ఆత్మానందం' అనే అమృతంచే పూర్ణుడగుట చేత పులకిత శరీరుడైనాడు.

మహాసామాన్య రూపత్వాత్ చిద్వ్యాపకతయా స్థితః
నిత్యమ్ అష్టగుణైశ్వర్య తృణప్రాయ మనోరథః ॥

అతను 'మహాసామాన్య రూపము' అని, 'సర్వాధిష్ఠాన సన్మాత్ర' అని పిలువబడి సర్వాత్మకత్వం సంతరించుకున్నాడు. అంతటా ప్రసరితుడై ఉన్నాడు. అనగా, చిద్వ్యాపకత్వంచేత అంతటా స్థితి పొందినవాడై ఉన్నాడు. స్వయంగా ఉపాధికి అసంబంధితమైన అష్టగుణైశ్వరములను కూడి ఉండటం చేత భౌతిక పరిభాషితమగు సమస్త మనోరథములు ఆతనికి తృణప్రాయంగాను, తుచ్ఛంగాను గోచరిస్తున్నాయి. ఆ పిల్లవాడు నిరతిశయానందమగు బ్రహ్మముతో ఏకత్వం పొందియుండటం చేత ఏమియు చెప్పజాలక ఊరుకొని ఉన్నాడు.

❖

భరద్వాజుడు: ఆహాఁ! మహాత్మా! నాకు చాలా ఆశ్చర్యం కలుగుతోంది. శ్రీరామచంద్రుడు వాక్యములకు అందజాలని మహత్పదమును పొందినాడు కదా!

హే వాల్మీకి మహర్షీ! అటువంటి ఆత్మపదం మాకు కూడా ప్రాప్తించటమెట్లాగో చెప్పండి! మేం మూర్ఖులమై స్తబ్ధులమై, కించిజ్ఞులమై, పామరులమై ఈ సంసార మరుభూమిలో కాళ్ళు అరిగేటట్లు సంచరిస్తున్నాం. అటువంటి మేమెచట? బ్రహ్మ మొదలైన దేవతలకు కూడా ప్రార్థనీయము, దుర్లభము అయినట్టి ఆ శ్రీరామచంద్రుని ఉత్తమస్థితి ఎచట? హై గురువర్యా! మునీశ్వరా! నాకు శ్రీరాముని లాగానే విశ్రాంతి ఎట్లా లభిస్తుంది? దుస్తరమగు ఈ సంసారమును దాటగలగటం నా వల్ల అయ్యే పనేనా? చెప్పండి.

శ్రీవాల్మీకి మహర్షి : ప్రియ భరద్వాజా! ఇప్పటి దాకా వసిష్ఠ మునీంద్రులు రామచంద్రుల మధ్య జరిగిన సంవాదమంతా పూసగుచ్చినట్లు చెప్పుకొచ్చాను కదా! దీనినంతా నీవు స్వబుద్ధితో విచారించు. పరాపరవిమర్శ చేయి. అందులో వివిధ కోణాల నుండి చెప్పుచున్న ఆత్మజ్ఞాన సమాచార సారాన్ని నీ అనుభవంగా ఆరూఢం చేసుకో. అప్పుడు శ్రీరామచంద్రునిలాగానే విశ్రాంతి లభించకపోతే నన్నడుగు.

❖

ఓ భరద్వాజా! నీ నిరంజన – నిరాకార – శుద్ధతత్త్వము అనుభవం కావటానికి వీలుగా నేను కూడా నా అనుభవమంతా రంగరించి అవస్థాత్రయ సాక్షిత్వం మొదలైన కొన్ని విశేషాలు ఇక్కడ ప్రస్తావిస్తాను. విను.

మొట్టమొదట ఒక నగ్న సత్యం ప్రతిపాదిస్తున్నాను.

అవిద్యాయాః ప్రపంచోఽయం నాస్తి సత్యమిహాణ్వపి
వివేచయంతి విబుధా, వివదన్తి అవివేకినః ॥

ఈ జగత్తంగా కూడా 'అవిద్య' చేతనే పరికల్పితమై ఉన్నది. ఇందులో అణువంత కూడా (కొంచెమైనా) సత్యం లేదు. అయితే వివేకులు దీనిని వివేచనతో పరిశీలిస్తున్నారు. అవివేకులో, వివాదాలలో ప్రవేశించి దృశ్యవశులగుచున్నారు.

ఓ ప్రియ భరద్వాజా! ఇక్కడ చైతన్యమునకు భిన్నమైనదంటూ ఏదీ కొంచెం కూడా లేదు. ఉండజాలదు. నీవు ప్రణవము – మహావాక్యముల అర్థరహస్యాన్ని ఎఱిగి అభ్యసించు. అభ్యాసముచే శుద్ధచిత్తుడవు కమ్ము.

ఈ జీవునకు ప్రపంచ విషయాల పట్ల యావృత్తి ఉంటోంది కదా! ఈ యావృత్తిని ఆత్మానుభవం దృష్ట్యాం 'జాగ్రత్ నిద్ర...' అని పిలుస్తున్నారు. అట్టి జాగ్రత్ నిద్ర యొక్క అంతరమున నిరంజనమైనట్టి చైతన్య ప్రదీపము జాగృతమై ఉన్నది. చైతన్యం జాగ్రత్–స్వప్న–సుషుప్తులకు సాక్షీ భూతంగా దర్శిస్తోంది. అట్టి సాక్షి చైతన్యం వైపుగా నీ బుద్ధిని ప్రసరింపజేయటం అభ్యాసం చేయి.

ఇక ఈ ప్రపంచమంటావా? ... విను చెబుతాను.

శూన్యమూలః ప్రపంచోఽ యం శూన్యతా శిఖరః, సఖే!,
సారశూన్య తయామధ్యే అపి అనాస్థా సన్మనీషిణామ్ ॥

ఓ సఖుడా! ఈ ప్రపంచానికి మొదలుగాని, మధ్యగాని, చివరగానీ లేదు. ఎందుకంటే ఇది స్వయంగా శూన్యమూలమైనది. "ఇది ఎందుకు, ఎట్లా ఏర్పడుతోంది?...." అన్న ప్రశ్నకు నా నిర్మోహమాటమైన సమాధానం "అజ్ఞానము చేతనే".... అని సుమా! అందుచేత సజ్జనులగు బుద్ధిమంతులకు దీనిపట్ల అపేక్షయే ఏర్పడదు.

అనేక భ్రమలను కలుగజేయుచున్నట్టి ఈ దృశ్య ప్రపంచం స్వతహాగా అసత్తే అయి ఉన్నది.

"అట్లా అంటారేమండీ! మాకు ఈ దృశ్యజగత్తు కనిపిస్తోంది కదా?" – అని ఎవరైనా అంటారేమో? ఓ స్వయమాత్మ స్వరూపులగు ప్రియజనులారా! అంతరంగంలో ఉండే వాసనాదోషం చేతనే గంధర్వ నగరంలాగా మాయాకల్పిమై లేనిది ఉన్నట్లుగా ఇక్కడ గోచరించటం జరుగుతోంది. ఆ అంతరంగానికి ఆవల జగత్ సాక్షియగు స్వస్వరూపము ప్రతి జీవునిలోనూ జాజ్వల్యమానంగా వెలుగుతోంది. ఇప్పుడు నీకు, నాకు ప్రతిజీవునికి ఎదురుగా రెండు మార్గాలు వున్నాయి.

1. అనేక జన్మల వాసనల నుండి ఇంద్రియములను ఉపయోగించుచుండగా అనుభవమయ్యే ఈ దృశ్య జగత్.

2. సర్వమునకు సాక్షియగు నిర్వికార – నిరాకార – నిరంజన – అప్రమేయ – నిరాశ్రయ స్వస్వరూపం.

త్వమ్ అనభ్యస్య కల్యాణీం చైతన్యామృత కన్దలీమ్,
సంముహ్యసి కిమధ్యాస్య వాసనా విషవీరుధః?

ఓ భరద్వాజా! ఇప్పుడు చెప్పవయ్యా! శుభప్రదమగు అమృత కదలీ (అరటి) వృక్షమును ఆశ్రయించటం ఉచితమా? 'వాసన' అనే విషలతను ఆశ్రయించి విమోహితులం కావటం మంచిదా?

సమాధానం అక్కర్లేదనే అనుకుంటున్నాను. తత్త్వ దర్శనంచే నిరాలంబమైన నీ యందలి ఆత్మను పరిగ్రహించు. అప్పుడు పూర్వకాలికమైన అజ్ఞానావస్థలో కనిపించే జాగ్రత్ ప్రపంచం ఇక కనిపించదు. ఇదంతా కూడా ఆత్మస్వరూపంగానే కనిపిస్తుంది.

జాగ్రత్-స్వప్న-సుషుప్తులందు సర్వదా అస్పృశ్యమై విభేదరహితమై ఏర్పడియున్న సాక్షితత్త్వము యొక్క అనుభవము పొందియున్న మహనీయులెందరో ఉన్నారు. వీళ్ళని శాస్త్రకారులు 'తురీయ సంస్థితులు' అని పిలుస్తున్నారు. అట్టి వారి సమక్షంలో ఇదే ఘనీభూత సాంసారిక దృశ్యం ఒక కల్పితకథా సంఘటనలాగా అర్థరహితమై ఉంటోంది. అట్టి వానికి ఈ జాగ్రత్-స్వప్న-సుషుప్తులనే మూడు అవస్థలు ఉండవు. అతడిక తనకు తానే సర్వదా ఏర్పడి ఉన్నవాడగుచున్నాడు. విజ్ఞుడైనా, అజ్ఞుడైనా ప్రతి జీవుని వాస్తవ సత్యమిది. ఇక నీ ఇష్టం. దేన్ని ఏ ఉద్దేశంతో ఆశ్రయించటం ఉచితమో వివేచనచే గ్రహించు. అంతేగాని గుడ్డెద్దు చేనులో పడినట్లు ఈ దృశ్యాన్ని అనుకరించి ఉండకు.

❖

అమృత రూపమగు సత్ప్రవాహముతో కూడిన ఆ మహాచైతన్య సాగరమే నీవు. అంతేగాని, ఈ దేహ - జగత్ - భావాదులు నీవు కానే కావు. ఈ విషయం నీవు బుద్ధితో గ్రహించి ఉండు. బుద్ధిని ఆత్మమయం చేయనంతవరకు ఈ జగద్రూపతరంగాలు కనిపిస్తూనే ఉంటాయి. జ్ఞానకాలంలో ఆత్మగా భాసించేదే ...అజ్ఞానకాలంలో జగత్తుగా భాసిస్తోంది.

ప్రాక్ నాస్తి, చరమే నాస్తి వస్తుసర్వమిదం, సఖే ।
విద్ధి మధ్యేపి తన్నాస్తి స్వప్నవృత్తమిదం జగత్ ॥

మిత్రమా! ఏ జగత్తైతే ఘనీభూతమై ఉన్నదని, సంసారరూపంగా ఏర్పడి దాటుటకు అశక్యమౌతోందని అనుకుంటున్నావో ...అట్టి ఈ దృశ్యం ఒకప్పుడు నీ పట్ల లేదు. ఇది ఇంకొకప్పుడు ఉండ కుండా పోతోంది. జాగ్రత్‌లో స్వప్నం అవాస్తవం. స్వప్నంలో జాగ్రత్ అవాస్తవం. 'స్వప్నం' విషయంలో "అంతకు ముందు ఏమై ఉన్నది. ఆ తరువాత ఏమికానున్నది?..." అని మనం ప్రశ్నిస్తున్నామా! ఈ దృశ్యము కూడా అట్టిదే!

ఏదైతే ఆది-అంతాలలో లేదో... అది మధ్యలో కూడా లేనిదే అగుచున్నది. అందుచేత ఈ జగత్తు స్వప్నతుల్యంగానే ఎఱిగి ఉండు. ఈ సమస్త పదార్థ భేదం కూడా జలంలో బుద్బుదాల లాగా అవిద్యచేతనే ఉత్పన్నమౌతోంది. నీటిలో లేచిన బుడగ మరెప్పుడో నీటిలోనే లయం కావలసిందే కదా! సర్వ పదార్థ భేదమంతా భావనారూపంలో పైకి లేచి, కొద్ది క్షణాలుండి మరల జ్ఞాన సముద్రంలో విలీనమగుచున్నది. మధ్యలో కనిపించే తరంగం మధ్యలోనే లయమౌతోంది. సముద్రం మాత్రం సర్వదా యథాతథంగా ఉంటోంది. ప్రతి జీవుడు జ్ఞాన సముద్ర స్వరూపుడే. అయితే ఆతనిలో ఈ జాగ్రత్-స్వప్న-సుషుప్త్యాది భావానుభవమంతా ఎప్పుడో జనించి మరెప్పుడో అతని యందే లీనమౌతోంది. మధ్యలో ఏర్పడిన భావనానుగత బుద్బుదములను అనుసరించి "ఈతడు జీవుడు. ఆతడు బద్ధుడు. ఆ ప్రక్కాయన ముక్తుడు" ఇత్యాది ...శబ్ద ప్రయోగాలు శాస్త్రాలు చేస్తున్నాయి. మధ్యలో వచ్చిందంతా మధ్యలోనే పోక తప్పదు. అందుచేత 'నేను చైతన్య సాగరాన్ని'... అనే నీవు మననం చేయి గాని, "నేనీ దేహంలో చిక్కుకున్న పక్షి వంటివాడను" అని అల్పయోచనకు తావియ్యనే వద్దు. అత్యంత ప్రశాంతమగు ఆత్మ గురించి తెలుసుకో. ఆ ఆత్మసాగరంలో స్నానం చేయి. అప్పుడీ క్లేశ దాయకమైన 'బాహ్యభ్రాంతి' అనే మనోదేహ సంబంధమైన అపరిశుభ్రత తనకు తానే తొలగి పోతుంది.

ఈ జగత్తు అనే సముద్రం 'అజ్ఞానము' అనే గొప్ప ఉప్పురసంతో వ్యాపించియున్నది. అందులో 'అహంకారం' అనేది ప్రప్రథమ తరంగం. ఆ తరంగం అవిద్య అనే వాయువుచే ఉత్పన్నమై అన్ని వైపులా ప్రవహిస్తోంది. చిత్తము యొక్క అనేక విషయముల పట్ల ఏర్పడే ప్రవృత్తులున్నాయి చూచావు? అవియే రాగరూపంగా కనబడే చిన్న చిన్న తరంగాలు. "నాది, మమత్వం" అనే సుడి ఇక్కడ యథేచ్ఛగా ప్రవర్తిస్తోంది. ఈ సాగరంలో 'రాగము, ద్వేషము' అనే రెండు పెద్ద మొసలి జాతులు విహరిస్తున్నాయి. అవి కనుక పట్టుకున్నాయా ...ఇక ఈ జీవుడు 'అనర్థము' అనే పాతాళానికి చేరవలసిందే. మృత్యుముఖము వంటి అభినివేశములో ప్రవేశించాడా ...ఈ జీవుని ఎవరూ కాపాడలేరు. కనుక జాగ్రత్త!

"సముద్రస్నానం చేయాలి..." అని నీకు అభిలాష ఉన్నదా? అయితే ఈ దృశ్య సంసార సముద్రంలో ఎందుకు స్నానం చేయటం? ప్రశాంతము, అమృతమయ తరంగములచే అత్యంత శోభితము, అద్వైతరూపము ...అయినట్టి ఆత్మానంద సాగరంలోనే స్నానం చేయి. అంతేగాని ద్వైతరూప ఉప్పు సముద్రంలో ఎందుకు మునుగుచున్నావో చెప్పు?

❖

ఓ భరద్వాజా! 'అయ్యో! శ్రీరామచంద్రుని ప్రపంచం జ్ఞానముచే తొలగిపోయింది. నా ప్రపంచమో, ఇంకా మిగిలియే ఉన్నది...'అని అంటున్నావు కదా.

కస్తిష్ఠతి? గతః కోవా? కస్య కేన కిమాగతం?
కిం ను మజ్జసి మాయాయాం? పత మా త్వమతన్ద్రితః ॥

అసలు ఉన్నదేది? పోయేదేది? ఎవనికి ఏమి వస్తోంది? ఏమి పోతోంది? ఏమిటయ్యా, ఇంకా మాయయందే నిమగ్నమౌతున్నావ్? నాయనా! ఇన్ని రోజులుగా శ్రీ వసిష్ఠ – శ్రీరామ సంవాదం విన్నాం కదా! ఇకలే. జాగరూకుడవు కమ్ము. వివేకివగుము. అంతేకాని, ఈ మాయలో పడవలసిన అగత్యమేమున్నదో చెప్పు? వద్దు. పడనే వద్దు.

భరద్వాజుడు: హే వాల్మీకి మహర్షీ! నాదొక చిన్న సందేహం. అసలు నిర్విషయము, నిత్య నిర్మలము అగు బ్రహ్మము జగదాకారంగా ఎందుకు వివర్తం పొందుతోంది.

శ్రీవాల్మీకి మహర్షి: "బ్రహ్మము జగత్తుగా వివర్తం పొందుతోంది..." ఇటువంటి వాక్యాలన్నీ చిన్న పిల్లలతో హాస్య సంభాషణ చేయటానికి కల్పించబడ్డాయి. బ్రహ్మము సర్వదా నిర్విషయంగా, నిత్య నిర్మలంగా ఉన్నది. నీవు జ్ఞాని వగుచున్న కొలదీ అపరివర్తనశీలమగు ఆనంద బ్రహ్మను దర్శిస్తావు. అందులోనే స్థితి పొంది ఉంటావు. ఆ బ్రహ్మమే నీవు. నీవు సదాశివస్వరూపుడవు, సదా బ్రహ్మానంద స్వరూపుడవు సుమా!

అవివేకియగు జీవుడు ఒకప్పుడు "అబ్బో! నేను అంతటి వాడిని, ఇంతటి వాడిని ..." అని హర్షం పొందుతాడు. ఇంకొకప్పుడేమో "ఇదేంటిరా, ఇది ఇట్లా ఉన్నది..." అని దుఃఖిస్తూ ఉంటాడు. అకస్మాత్తుగా హర్షం, అకస్మాత్తుగా శోకం! ఇదీ అతని పని. తత్త్వవేత్తయో? ఆతడు ఎల్లప్పుడూ

ప్రసన్నంగానే ఉంటాడు. ఒకవేళ అతను కొంచెం బాహ్యానికి శోకం ప్రదర్శిస్తున్నాడూ అంటే ... అది అజ్ఞానులతో సహజీవనం కొరకు మాత్రమేగాని, తన స్వరూపం ఎట్టిదో తెలియక కాదు. అజ్ఞానులగు జీవులు జలమునందు స్థలభ్రాంతిని, స్థలమునందు జలభ్రాంతిని (ఎండమావులను) పొందుచున్నారు. సూక్ష్మమగు ఆత్మతత్త్వమును 'అవిద్య' అనే దర్పణంలోంచి చూస్తున్నారు. అందుచేత అవిద్యాచ్ఛాదితమైన 'అనాత్మ' యందు ఆత్మభ్రాంతి కలుగుతోంది. నీవు అవివేకివి కాదలచుకుంటే మనం ఎన్ని రోజులు సంభాషిస్తే ఏం ప్రయోజనం? అందుచేత వివేకివి అవటానికి ప్రయత్నించు. అంతేగాని, అవివేకి ఈ జగత్తును ఎట్లా చూస్తున్నాడో సమీకరించి, దానిని పట్టుకుని వ్రేలాడకు.

ఈ ప్రపంచంలో అనేక వస్తు సముదాయం కంటికి కనిపిస్తోంది కదా? ఇవన్నీ పరమాణువల కలయికయే కదా! అట్టి పరమాణువుల సంయోగ-వియోగములచే ఏర్పడే ఈ పాదార్థిక జగత్తు గురించి దుఃఖించవలసిన పనేమిటి? ఈ దేహం కూడా పరమాణువుల సంయోగంచే ఏర్పడి, వియోగముచే నశించినదగుచున్నది. నీవుగాని, నేనుగాని, మరెవరైనా గాని ...మనమంతా చిత్ స్వరూపులం. 'ఎరుగుట' అనునది మన స్వరూపం. పరమాణువుల సంయోగ - వియోగముచే పరమాణువుల కంటే అత్యంత సూక్ష్మమగు మన చిత్ స్వరూపం ఎట్లా స్పర్శించబడగలదు? అది మనలను దుఃఖింప జేయటమేమిటి? అది ఎలా సాధ్యం? కనుక దుఃఖానికి కారణం మన ప్రత్యక్ స్వరూపము యొక్క ఏమరుపేనని సిద్ధాంతీకరించబడుచున్నది.

అసతః సంభవోనాస్తి, నాస్తి అభావః సతః సఖే
అవిర్భావ-తిరోభావాః సంస్థానానామమీ పరమ్။

ఓ స్నేహితుడా! 'అసత్' పదార్థానికి ఉత్పత్తియే లేదు. 'సత్' పదార్థానికి వినాశనమనేదే లేదు. ఇక్కడల్లా ... కేవలం మాయారూపములైనట్టి ఈ 'దేహము' మొదలైన ఆయా పదార్థములు - 'పరమాణువుల కలయిక - విడిపోవడం' అనే ప్రక్రియచే - వాటివాటి ఆవిర్భావ - తిరోభావములు సంభవించటం జరుగుతోంది.

అయితే ...దృశ్యము ఈ విధంగా ఉండగా, ఇక దృక్ స్వరూపుడగు జీవుని విషయమేమిటి?

భరద్వాజుడు: అవును మహర్షీ! ఈ పదార్థిక జగత్తంతా పరమాణువుల సంయోగ-వియోగరూపములే. అయితే వీటి యొక్క అనుభవం పొందే ఈ జీవుడు అనబడు దృక్ స్వరూపుడు (లేక) ద్రష్ట, (లేక) అనుభవజ్ఞుడు ఎక్కడి నుండి వస్తున్నాడు. ఎక్కడికి వెళ్ళుచున్నాడు. ఈ విషయాలు శ్రీ వసిష్ఠ మహర్షి శ్రీరామచంద్రుని సమక్షంలో ప్రవచించారు. అయినా సరే, ఈ 'నిర్వాణ ప్రకరణం పూర్వార్థం' సమీక్షిస్తున్న ఈ సందర్భంలో మరొక్కసారి మీ అనుభవ - అభిప్రాయములను ప్రవచన రూపంగా విశదీకరించండి.

శ్రీవాల్మీకి మహర్షి : పంచభూతములలో ఒకటి అయిన 'ఆకాశము' తదితర భూతముల కంటే సూక్ష్మమైనది కదా! అట్టి ఆకాశపు అంతర్గతమైన ఒక విభాగాన్ని ఉద్దేశించి 'ఇది ఇక్కడి నుండి అక్కడికి వెళుతోంది. అది అక్కడి నుండి ఇక్కడికి వస్తోంది' అనే వాక్యాలు చెల్లుతాయా? ఆకాశము

ఒకచోట నుండి ఇంకొక చోటికి పోవటం – రావటం ఉండదు కదా! ఇక, ఆకాశము కంటే కూడా సూక్ష్మాతి సూక్ష్మము, ఈ జీవుని స్వస్వరూపము అయిన ఆత్మ అన్నిటా, అంతటా నిండి ఉంటోంది. అది తనయందు తానే నెలకొని ఉన్నది. అద్దాని రాకపోకలెక్కడుంటాయ్?

❖

అయితే,పూర్వ సంచితములైన అనేక పుణ్యపాపములను హేతువులుగా చేసుకొని ఈ దేహాదులు విషయతుల్యమైన 'మరణము' మొదలైన అనర్థాలను పొందటం జరుగుతోంది. దేహాదులపై భ్రాంతిని పెంచుకున్న ఈ జీవుడు అనుక్షణికంగా దుఃఖితుడు అగుచున్నాడు. "ఆ దుఃఖం తొలగేది ఎట్లా?"…. అనేది గొప్ప అవశ్యమైన ప్రశ్న. అందుకు మా సమాధానం ఒక్కటే! ఓ సర్వజనులారా! అట్టి సర్వ అనర్థాలు మీ పట్ల తొలగాలంటే జగద్గురువగు ఆ పరమేశ్వరుని మనసా, వాచా, కర్మణా శరణు వేడండి. ఉపాసించండి. ఓ భరద్వాజా! నీవు అన్నిటినీ త్యజించి గొప్ప తపస్సు చేశావు. నిర్మలమైన మనస్సును సంపాదించుకున్నావు. తపో ప్రభావం చేత అంతరంగమును పరిశుద్ధపరచుకొని తద్వారా 'వివేకత్యాగి'గా రూపుదిద్దుకున్నావు. అందుచేత నీ అంతరంగంలోని పుణ్యపాపాలన్నీ నిశ్చయంగా సంక్షయించాయి. 'ఆ పశుపతి యొక్క పాశాలు అనగా ప్రాణుల శుభాశుభకర్మలే! – అని శ్రుతి ప్రసిద్ధం. కనుక, ఇంక ఆగకు. నీ చిత్తము మరింత పరిశుద్ధమయ్యే వరకు ఆ భగవంతుని సాకార రూపం ధ్యానించు. భజించు. అట్లా ధ్యానిస్తూ ఉండగా ఉచితకాలంలో నిరాకారమగు బ్రహ్మమున నీకు స్వాభావికమైన స్థితి లభిస్తుంది. అనగా, సగుణేశ్వరోపాసన వలన హృదయం పరిశుద్ధమౌతుంది. అట్టి 'శుద్ధసత్వము'యొక్క బలం చేత ప్రచండమగు (ఇప్పుడు శేషించియున్న) అజ్ఞాన వ్యామోహాన్ని జయిస్తావు. నాయనా! అప్పుడు శాస్త్ర – గురువాక్యాలపైన నీకు గురి కుదురుతుంది. అట్టి విశ్వాసము యొక్క బలంచే 'ఇంద్రియాతీత మనో విభాగంచే ఇంద్రియ సహిత మనస్సును జయించటం…' లేక 'యమము' అను మార్గాన్ని నీవు అనుసరిస్తూ ఉండు. రోజూ కొద్ది క్షణాలైనా మనస్సును సమాధానపరచి ఉంచి "మనో సమాధానము"అనే సమాధిని ఆశ్రయించు.

'ప్రత్యగాత్మ'…అని పిలువబడే సాక్షి చైతన్యమును ఆశ్రయించు. అప్పుడు తమో – రజో గుణాచ్ఛాదన తప్పక తొలగుతుంది.

❖

ఓ సర్వ ముముక్షువులారా! మీరంతా ఆ సర్వేశ్వరుని ప్రేమించండి. ప్రేమయే భక్తి. భక్తి రహితమగు కేవల పురుష ప్రయత్నముచే, కేవల కర్మానుష్ఠానంచే ఏం ప్రయోజనం? ఆ సర్వేశ్వరుని మహిమ చేతనే ఈ జీవుడు ఉత్కృష్టతను, వాంఛిత ఫలమును పొందుచున్నాడు.

నాభిజాత్యం, న చారిత్ర్యం, న నయో న చ విక్రమః,
బలవన్తి పురాణాని సఖే, కర్మాణి కేవలమ్॥

ప్రియమిత్రమా! ఒకడు ఎంతో గొప్ప జాతిలో పుట్టి ఉండవచ్చు. లేదా, ఆతనికి గొప్ప చరిత్ర ఉండవచ్చుగాక! సదాచారం, తపస్సు, పరాక్రమం మొదలైనవి ఎన్నో ఉండవచ్చు గాక! అంత మాత్రం చేత ఆతడు ఆత్మానుభవం పొందలేడు.

భరద్వాజుడు : అదేమిటి స్వామీ ...?

శ్రీవాల్మీకి మహర్షి: అవును. ఎందుకంటే ఈ జీవుని పూర్వ సంచిత కర్మలు అంతులేనివై ఉన్నాయి. వాటిని జయించాలంటే తపస్సులు, సదాచారాలు ఏ మూలకి?

భరద్వాజుడు : మరెట్లా స్వామి?

శ్రీవాల్మీకి మహర్షి : అయితే, ఎవ్వరూ ఏమీ నిరుత్సాహపడవద్దు. సర్వేశ్వరుని పట్ల ప్రేమను పెంపొందించుకోండి. ఈశ్వరభక్తి యొక్క సహాయం లేకపోతే ఆత్మానుభవం లభించదు. భక్తి పరిపక్వమగుచుండగా జ్ఞానం వికసిస్తుంది. అట్టి సమూలాజ్ఞాన నాశనమగు జ్ఞానబలంతో ఆత్మానుభవంలో ప్రవేశించగలరు.

కేవలం ఉపాసనకు పరిమితమైతే ఈశ్వరుడు కూడా నొసటన వ్రాయబడిన 'అజ్ఞానము' అనే అక్షరములను తొలగించలేడని కూడా గ్రహించు. కాబట్టి ఉపాసనతో బాటు యమనియమాదుల ద్వారా జ్ఞానం కూడా సంపాదించుకోవాలి.

ఈ లోకంలో గురువు చక్కగా బోధిస్తున్నాడు. శిష్యుడు ఆత్మ సమాచారాన్ని వింటున్నాడు మంచిదే. ఇదంతా అవసరమే. అయితే మనోవాక్కులకు అగోచరమైన ఆ చిద్బ్రహ్మమును బోధమాత్రంచే ఎరుక పరచగల గురువెక్కడ? వినుటలో మనోవాక్కులకు పరిమితమైతే, ఆ శిష్యుడు ఆ గురువుచే బోధించబడినంత మాత్రంచేత మోహలత ఉపశమిస్తుందా? లేదు.

ఎద్దానిచే ఈ గురు, శిష్య, శమ, దమ, ఉపాసనాది సామాగ్రి అంతా పరస్పరం కలుస్తుందో, అట్టి ఈశ్వరనియతి అనిర్వచనీయమైనది.

❖

ఓ భరద్వాజా! ఏది ఎటైనా ఉండుగాక, ఈ జీవుడు ఈశ్వర స్వరూపుడేగాని ...ఏదో పరమాణువుల కలయిక అగు ఈ భౌతిక దేహమో, లేక వాసనల రూపమగు భావనల సంకలనమో కాదు. ఏ జీవుడు దేనిని ఎట్లు గ్రహించినా సరే... ఉన్న సత్యం మాత్రం ఇది. ఇది మా తపో-ధ్యానాదుల బలంతో గ్రహించాం. అందరికీ చెప్పుచున్నాం. ఇందుకు వేరుగా ఏ జీవునికి అనిపిస్తుందో ... ఆతడు ఉపాసన-భక్తి-వైరాగ్యాదుల సాధనలచే మనస్సును నిర్మలం చేసుకోవటానికి వెంటనే ఉపక్రమించాలి. "రేపు – మాపు" అనుకుంటూ తాత్సారం చేయరాదు సుమా! నాయనా! వివేకముచే మోహమును మొదలంటా పెకలించివేసే ప్రయత్నమునకు సన్నద్ధుడవు కమ్ము.

❖

ఒక మహారాజు ఉన్నాడు. ఆయన శాంతిసమయంలో మహాశయంతో ధనము, సేన సమకూర్చుకున్నాడు. ఇంకేం? ఇంక ఆయనకు దిగులు లేదు. అనుకోకుండా యుద్ధం చేయవలసి వచ్చినా, ఏదైనా సాధించవలసిన అగత్యం ఏర్పడినా ...ఆతడు సర్వ సమృద్ధితో సంసిద్ధంగా ఉన్నాడు. కాబట్టి ఎటువంటి ఇబ్బందులనైనా ఎదుర్కోగలడు. అంతేకాదు దుష్ట జనులను నిగ్రహించి చక్కగా ప్రజాపాలన చేయగలడు.

ఇంకొక రాజు ఉన్నాడు. ఈతడు ధనము – సైనిక బలము సమకూర్చుకోకుండా ఊరకే ఆట – పాటలతో రోజులు గడిపేస్తున్నాడు తనను పొగడే కొందరు వందిమాగధులకు ఉద్యోగం ఇచ్చి,

వారు చెప్పే పొగడ్తలకు ఉబ్బితబ్బిబ్బవుతూ బలమును సమకూర్చుకోకుండా అంతఃపురంలో కూర్చుని ఆకస - పోకస కబుర్లు మాత్రం చెప్పుచున్నాడు. ఈతని గతి ఏమిటి? చిన్న సామంతరాజు ఎదురు తిరిగితే గుండె గుభేలుమంటుంది. మంత్రులకు, సేనానాయకులకు సర్ది చెప్పలేడు, శాసించలేడు. ప్రజాహిత కార్యక్రమాలు నిర్వర్తించే సరంజామా గాని, శ్రద్ధగాని లేదు. అప్పుడు ఆతని ప్రజలే ఆతనిని దుయ్యబట్టుచున్నారు.

నీవు మొదటి రాజులాగా తపస్సు - భక్తి - ఉపాసన పెంపొందించుకుంటూ విషయములపై ప్రవేశించే మనస్సును ఆక్రమించివేయగల, జయించగల నిర్మల మనస్సును పెంపొందించుకోవాలి. అంతేగాని 'అది ఆయనకంటే లభించింది. మనకెట్లా?'...... అని తలచుచూ, కాలమును దిగులుతో వృథా చేసుకోవటం విజ్ఞుల లక్షణమే కాదు.

'ఆత్మానుభూతి' అను ప్రయోజనముగా గల బోధ స్వరూపం. ఈశ్వరోపాసన మొదలైన అనేక పుణ్యకార్యములకు అధీనమై ఉంటోంది. అనేక జన్మల ప్రయోజనంగా ప్రకటితమౌతోంది. జీవన్ముక్తుల అనుభవములకు సంబంధించిన అభిప్రాయములు పుణ్యవంతులగు ధీరులను మాత్రమే సమీపిస్తున్నాయి.

ద్విషద్భూతేన యేనైవ కర్మణా బంధ ఈదృశః
సుహృద్భూతేన తేనైవ మోక్షమాప్స్యసి, పుత్రక!

బిడ్డా! ఏ కర్మ అయినా సరే, ... రాగముతో కూడుకొన్న వాడవై నిర్వర్తించావా ... అది నీకు ఒకనాటికి బంధమే కానున్నది. అట్లా కాకుండా రాగహితంగా సుహృద్భావ సమన్వితుడవై కర్మలు నిర్వర్తిస్తే, అవే కర్మలు నీ మోక్ష మార్గానికి దోహదపడతాయి. సజ్జనుల రాగరహితమగు సత్కర్మలన్నీ పూర్వసంచితమైన పాపకర్మలను నశింపజేస్తున్నాయి. వర్షం పడితే దావానలం ఉపశమిస్తున్నట్లు రాగరహిత పుణ్యకర్మలు ఈ జీవుల త్రివిధ తాపములను చల్లార్చుచున్నాయి. ఇక్కడ 'సంసారము' అనే పెద్ద మహాచక్రం తిరుగాడుతోంది. అందులో ఈ జీవుడు చిక్కుకుని చెప్పనలవిగాని మానసిక తాపాలు అనుభవిస్తున్నాడు. తన బిడ్డలు దుఃఖస్థితులను గమనించిన ఆ సర్వేశ్వరుడు ఆధ్యాత్మ శాస్త్రమును ప్రకటించే ఉపనిషత్తులను, ఈ యోగవాసిష్ఠం వంటి గ్రంథాలను, ఆత్మతత్త్వాన్ని ప్రకటించే గురువులను ప్రసాదించారు. బ్రహ్మమునందు ఆసక్తిగలవారికి శాస్త్రముల - గురువుల సేవలు సిద్ధంగా ఉన్నాయి. కుమారా! ఈ 'సంసార చక్రము' అనే ఆవర్తము యొక్క భ్రమ నుండి నీవు బయల్వెడలదలచుకున్నావా? అయితే సత్వరంగా సమస్త కర్మలను కర్మఫలత్యాగ బలంతో, (లేక) సమర్పణ భావంతో వదలి, 'బ్రహ్మము'నందు అసక్తుడవై ఉండుము.

సముద్రం సంక్షోభంతో కూడి ఉన్నంతవరకు దానియందు చంచలత్వం ఉండనే ఉంటుంది. ఎప్పుడైతే జలము నిశ్చలంగా ఉంటుందో, అప్పుడు ఆ సముద్రంలో తరంగాలన్నీ లయించి నిశ్చల - శాంతిజలము మాత్రమే ఉంటుంది. అట్లాగే బాహ్య విషయములందు చిత్తము చంచలంగా ఉన్నంతవరకు ఆ చిత్తంలో 'జగత్తులు' అనే వికల్పాలు లేస్తూనే ఉంటాయి. ఒక్కొక్క చిత్తంలో ఎన్నెన్ని జగత్తులు సంస్కారరూపంలో దాగి, సమయంకోసం వేచి ఉన్నాయో... చెప్పనలవికాదు.

వివేకదృష్టిని ఆచ్ఛాదించే 'శోకము' అను దానిని నీవెందుకు అవలంబిస్తావు చెప్పు? శోకాంధకారము అలముకుంటున్నప్పుడు 'అకుంఠిత ప్రజ్ఞ' అనే చేతి కఱ్ఱతో, 'వివేకము' అనే దీపంతో ముందుకు సాగాలిగాని, అంధకారంలో చతికిలబడి కూర్చోకూడదు. అనేక మంది జీవులు 'హర్ష – శోకములు' అనే శుభాశుభ తరంగాలచే గడ్డిపరకలవలె ఎచటెచటికో కొట్టుకుపోబడుచున్నారు. మహాత్ముల మార్గం అదెన్నటికీ కాదు. నీవు మహాశయముతో మహాత్మత్వమును సంతరించుకోవటానికే ప్రయత్నించాలి. అంతేగాని అల్పాశయములతో అల్ప విషయములచే ఎందుకు ప్రభావితుడవై ఉండటం? బాలుర వంటి అనేకమంది సాంసారిక జీవులు కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే – ఆరు ఊర్ములు (కాళ్ళు) గల ఊయలలో హర్ష కోశాల మధ్య ఊయలలూగుచున్నారు. క్రీడా కుతూహలయగు 'కాలము' అనే ఆమె ఆయా జీవులను సృష్టించి పాలించి సంహరించి... తద్వారా ఆటాడుకుంటోంది.

కాలసర్పం ఈ జీవులను ఆక్రమించి ఈ అసంఖ్యాక భౌతిక దేహములను తనకు భక్ష్యంగా, మధుర ఉపాహారంగా చేసి వేసుకుంటోంది. ఆహారము కావటానికై పెంచే పక్షులవలె ఈ జీవులకు కొన్ని కాలగత హర్ష–శోకాదులను అందించి ఎప్పుడో సంహరించి దిగమ్రింగి వేస్తోంది. అటువంటి ఈ దృశ్య ప్రపంచంలో విశేష దృష్టిని, విశేష ధర్మము గాని, విశేష ధర్మిగాని లేదు. సర్వ జీవులను సమాన రూపంగానే ఆ కాలస్వరూపిణి భక్షించటం జరుగుతోంది. అల్పకాలస్థములగు మనుజదేహాల గురించి వేరే చెప్పేదేమున్నది? దీర్ఘ కాలస్థములగు దేవతల దేహములనే అది భక్షిస్తోంది కదా!

❖

మరొక్క విషయం. ఈ దేహము – ఈ దేహంలో ప్రవర్తించే ఇంద్రియాలు తమ తమ విశేష ధర్మములతో, ఇంద్రియ విషయాలతో సహా కాలముచే ఎటుతిరిగీ మ్రింగబడబోతున్నాయి. మరి విపత్తియందు వ్యాకులమైన మనోభావాలు ఉండవలసిన అవసరమేమిటి? ఈ కాలక్రమంలో ఏర్పడే విషయాల పట్ల ప్రీతి కలిగియుండి సంసారనాట్యశాలలో వాటికి అనుకూలంగా నీవు ఇంద్రియ విషయ సమాచారములతో కూడి నృత్యం చేయవలసిన పనేమిటి? అందుచేత ఓ భరద్వాజా! నీవు క్షణకాలం ఆత్మస్వరూపమునందు నిశ్చలంగా ఉన్నవాడవై, అప్పుడీ సంసారనాటకమును చూడు. అదియే మరల–మరల అభ్యాసం చేయి. క్రమక్రమంగా అదియే అనునిత్యత్వంగా సంతరించుకొనుగాక!

అస్యానేక తరంగస్య జగతః క్షణభంగినః
న విషీదతి మనస్వీ భరద్వాజ! మనాగపి ॥

ఓ భరద్వాజా! క్షణభంగురమైన అనేక తరంగములో కూడిన ఈ జగత్తును గూర్చి వివేకియగు జీవుడు కొంచెం కూడా దుఃఖించడు.

త్యజ శోకం అమంగల్యం, మంగలాని విచిన్తయ ।
చిదానందఘనం, స్వచ్ఛం ఆత్మానం చ విభావయ ॥

కనుక నీవు అమంగళమైనట్టి శోకమును త్యజించు. ఆత్మదర్శనసాధనములైన మంగళములను బాగుగా చింతన చేయి. చిదానందఘనము, స్వచ్ఛము అయినట్టి ఆత్మస్వరూపం గురించి బాగా విచారణ చేయి, దేవతల, బ్రహ్మాభ్యాసపరుల, గురువాక్యముల పట్ల శ్రద్ధచే పరిపూర్ణమైన చిత్తము కలవారు, వేద ప్రవచనములు ప్రమాణంగా కలవారు అగు మనుజులకు ఆ మహేశ్వరుని అనుగ్రహం తప్పకుండా కలుగుతోంది.

భరద్వాజుడు :

జ్ఞాతం తవ ప్రసాదేన సర్వమేతత్ అశేషతః
న వైరాగ్యాత్ పరో బంధుర్, న సంసారాత్ పరో రిపుః ॥

హే మహాత్మా! తమ అనుగ్రహం చేత నా అజ్ఞానం దేనిపట్ల ఎట్లా ఏర్పడియున్నదో గ్రహిస్తున్నాను. "వైరాగ్యాన్ని మించిన బంధువు లేదు. సంసారాన్ని మించిన శత్రువు లేదు" అని గ్రహిస్తున్నాను. మునీంద్రా! శ్రీ వసిష్ఠ మహర్షి ఇప్పటిదాకా చెప్పిన జ్ఞానసారాన్ని ఒక్కసారి సమీక్షించి చెప్పవలసినదిగా నా ప్రార్థన.

శ్రీవాల్మీకి మహర్షి : 'ముక్తిదాయకమ్, మహాజ్ఞానమ్' అని చెప్పబడుదాన్ని ఇక్కడ ప్రస్తావిస్తాను. విను.

సంహృతిస్థితి సంభూతి భేదైర్యోఽనేకథా స్థితః,
ఏకోఽపిసన్, నమస్తస్మై సచ్చిదానందమూర్తయే!

ఏ పరమాత్మ సర్వదా ఒక్కడే అయినప్పటికీ సృష్టి - స్థితి సంహార భేదం చేత అనేక రూపములుగా ఉండి ఉన్నాడో అట్టి సచ్చిదానందమూర్తికి ఇవే నమోవాక్కులు.

ఈ కనబడే ప్రపంచమును తన కారణమునందు లయమొనర్చుటంచేత ఏ విధంగా ఆత్మతత్త్వము ప్రకాశించగలదో ...అట్టి ఉపాయరూపమైన - ఇప్పటి వరకు జరిగిన సంవాదమును సంక్షేపంగా చెప్పుచున్నాను విను-

ఈ జీవుడు 'అహంకారము' అను ఒక కల్పితమును ఆశ్రయించుటచే ఆతని పూర్వాపర విచారయోగ్యమైన ఆత్మకు సంబంధించిన 'స్మృతి' ఆత్మయందు అప్రత్యక్షమై, దృశ్యమునందు ప్రవేశించి ప్రవర్తిస్తోంది.

అట్టి 'స్మృతి' యొక్క నిర్మలత్వము చేతనే సమస్తము స్వయంగా కరతలామలకమై గోచరించ గలదు. దేనిని పొందటం చేత ఈ జీవుడు మరల శోకించడో... అట్టి వస్తువు లభించేది ఎక్కడ? ఎక్కడో కాదు. స్వచిత్తమునందే, స్వయంగా విచారణ చేయటంచేత మాత్రమే లభించగలదు.

వైరాగ్యముతో కూడిన మనిషి ఈ క్రింది మార్గములలో ఆత్మతత్త్వమును ఎంత అధికంగా సాధ్యమైతే అంతగా విచారణ - విమర్శలు చేయవలసి ఉన్నది.

1. సత్సంగం, 2. సచ్ఛాస్త్రం, 3. స్వవివేకం.

❖❖❖

2. ఆత్మానంద సాగరం

శ్రీవాల్మీకి మహర్షి : ఓ భరద్వాజా! ఈ జీవుడు మొట్టమొదట "అజ్ఞానపూరితములు, పరమ దుఃఖ పూరితములు అగు విషయేంద్రియముల మధ్య దేహధారినై చిక్కుకున్నాను"- అని గుర్తించాలి. నేనెవరు? ఈ జగత్తంతా ఏమిటి? ఈ జన్మ - మృత్యు - జరా - వ్యాధి - దుఃఖములన్నీ ఎక్కడి నుండి వచ్చిపడుచున్నాయి? - అనే ప్రశ్నలకు రావాలి. 'నా దృష్టి అపవిత్రమై ఉండుటచేతనే నాకు ఈ దుఃఖాదులు దాపురిస్తున్నాయి. "ఇప్పుడు ఇద్దానిని పవిత్రపరచి జ్ఞాన విశేషాలతో నింపివేయాలి." ... అని మహత్తర కార్యక్రమమునకు సంసిద్ధుడు కావాలి.

ఇంద్రియ విషయములకై అఱ్ఱులు చాచే మనస్సును కించిత్తు శాంతపరచాలి. ఇంద్రియాలను విషయాల నుండి మరల్చటానికై వాటిని దమింపజేయాలి. శమము, దమము మొదలైన శాస్త్ర విహిత ఉపరతి కార్యక్రమాలు చేపట్టాలి. నిషిద్ధ కామ్యకర్మల నుండి, విషయేంద్రియ సంయోగంచే కలిగే సుఖాభాస నుండి విరతుడై స్వస్వరూపాత్మ వైపుగా దృష్టి సారించాలి.

శ్రద్ధావంతుడై మృదువైన ఆసనమును ఆశ్రయించాలి. ఇంద్రియములను జయిస్తూ ఈ మనస్సు ప్రసన్నమయ్యేంత వరకు 'ఓం'కారమును ఉచ్చరించాలి. అట్లాగే అంతఃకరణ శుద్ధికొరకై ప్రాణాయామము మొదలైనవి ఆచరించాలి. క్రమంగా మెల్ల మెల్లగా ఇంద్రియములను విషయములనుండి తొలగించాలి.

దేహము - ఇంద్రియములు - మనస్సు - బుద్ధి - జీవుడు వీటన్నిటి యొక్క చమత్కారమంతా దేనినుండి కలుగుతోందో అట్టి అధిష్ఠానమగు ఆత్మ గురించి తెలుసుకోవాలి. ఆ ఆత్మయందు తదితరమైనదంతా లయం చేస్తూ రావాలి.

❖

విరాజి ప్రథమం స్థిత్వా తత్రాత్మని తతః పరం
అవ్యాకృతే స్థితః పశ్చాత్, స్థితః పరమకారణే॥

అ : మొట్టమొదట 'అ' కారవాక్యమైనట్టి 'స్థూలభూత సమష్టి రూపమైన విరాట్టును నేనే' అనగా, 'ఈ స్థూలరూప బ్రహ్మాండముల ఉనికికి కారణకారణం నా అంతర్యామి స్వరూపమే' అని భావన చేయాలి.

ఉ : ఆ తరువాత ఆ 'విరాట్టు అహంభావన'ను 'ఉ' కారవాచ్యమగు 'సూక్ష్మభూత సమష్టిరూపము' అయిన హిరణ్యగర్భ జ్ఞానమునందు లయం చేయాలి. అనగా 'అట్టి సూక్ష్మభూత సమష్టి రూపహిరణ్యగర్భుడగు జ్ఞానిని నేనే' అను అహంభావనను ఆశ్రయించాలి.

మ : అప్పుడిక ఆ సమష్టి మనోరూపమును అద్దానికి కారణమైయున్న 'మ' కార్యవాచ్యమైనట్టి 'వ్యాకృతము' నందు లయం చేయాలి. అనగా, 'స్థూల-సూక్ష్మముల ఉభయములకు ఆశ్రయమైయున్న సాక్షితత్త్వమే నేను'..... అను రూపమైన అహంభావనను ఆశ్రయించాలి. అనంతరం ఆ మాయా

వ్యాకృతము కూడా అర్ధమాత్ర వాచ్యము – పరమకారణము అయిన శుద్ధబ్రహ్మమునందు లయం చేసి ... ఇక ఆపై ఆ శుద్ధ బ్రహ్మమునందే స్థితి కలిగి ఉండాలి.

❖

ఏది ఎందులోంచి వస్తే చివరికి అది అందులో లయం కావలసిందే కదా....అందుచేత ఉత్కృష్టులగు ఉద్దాలకుడు వంటి నిర్వాణయోగుల సంయోగసాధన గురించి విను.

ఈ దేహము యొక్క 'మాంసము' మొదలైన పృథివీ సంబంధ (పార్థివ సంబంధ) విభాగములను పృథివీతత్వంలో లయం చేయాలి. అనగా, దేహమును తదితర విరాట్ పృథివీతత్వంలోని ఒక చిన్న విభాగంగా దర్శించాలి. ఈ దేహమును తదితర బ్రహ్మాండముల వలెనే తనకు బాహ్యమైన ఒక భౌతిక పదార్థంగా దర్శించాలి.

అట్లాగే ...జల సంబంధమైన రక్తాదులను జలతత్వంలో, తేజోసంబంధమైన విభాగమును తేజోతత్త్వంలో, వాయుసంబంధ విభాగమును వాయువులో, ఆకాశసంబంధమైన విభాగమును ఆకాశంలో లయం చేయాలి. అనగా, అవన్నీ వాటివాటి తత్త్వములుగా చూడసాగాలి.

అదే విధంగా ఘ్రాణము, కళ్ళు, చెవులు మొదలైన ఇంద్రియములను తమ తమ కారణములగు దేవతోపాధిభూత సూక్ష్మతత్త్వములందు లయం చేసివేయాలి. వీటినన్నిటినీ ఆయా అధిదేవత సొత్తుగా, ప్రదర్శనగా గాంచాలి. అనగా ...అన్నిటికీ కర్త అయిన ఈ జీవుని యొక్క చెవులు, కళ్ళు, ముక్కు మొదలైన ఇంద్రియములలో ఆయా దేవతలు అధివసిస్తున్నారు కదా! కనుక ఇంద్రియ భావములన్నీ ఆయా అధిదేవతలకు సమర్పణ చేయాలి.

ఎట్లా అంటే ...

శ్రోతేంద్రియము (చెవులు)ను	... దిగ్దేవతలయందు (దిగ్దేవతల ప్రదర్శనా చమత్కారంగా)
త్వక్ఇంద్రియాన్ని (చర్మం, స్పర్శను)	... విద్యుత్ తేజోశక్తియందు,
నేత్రేంద్రియమును (కళ్ళు)	... సూర్య బింబమునందు,
జిహ్వేంద్రియమును	... వరుణుని యందు,
ప్రాణమును	... వాయువునందు,
వాక్కును	... అగ్నియందు
హస్తేంద్రియము (చేతులను)	... ఇంద్రునియందు
పాదేంద్రియమును (కాళ్ళను)	... విష్ణువునందు,
గుదేంద్రియమును	... మిత్రునియందు
ఉపస్థేంద్రియమును	... కశ్యపునియందు,
మనస్సును	... చంద్రునియందు
బుద్ధిని	... బ్రహ్మదేవునియందు

...లయింపజేయాలి. వీటన్నిటినీ ఆయా అధిదేవతల సొత్తుగా, సమర్పిత భావనతో దర్శనం చేయాలి.

ఓ భరద్వాజా! వాస్తవానికి 'ఇంద్రియములు"... అనబడే వేఱు వస్తువులేవీ లేవు. ఆ దేవతలే ఈ దేహంలో 'ఇంద్రియములు' అనే మిషచే స్థితినొందియున్నారు. ఈ వాక్యాలు నేను శ్రుతి వాక్యములను అనుసరించే చెప్పుచున్నాను గాని, ఏదో స్వకపోలకల్పితం కాదు.

ఈ విధంగా మనుజుడు ఈ తన దేహమును అద్దాని కారణమున లయింపజేసి "నేను విరాట్ పురుషుడను"..... అని భావనచేయాలి. నాయనా! ఈ సమస్త భూతములకు ఆధారం, కారణం కూడా సర్వ బ్రహ్మాండములకు ప్రభువైనవాడు, అర్ధనారీశ్వర స్వరూపుడు అగు ఆ ఈశ్వరుడే సుమా! ఇదంతా ఆయనదే అయి ఉన్నది. కనుక ఆయనకు సమర్పించడంలో కష్టమేమున్నది? ఆతడే తన యజ్ఞసృష్టి రూపములలో ఈ జగద్వ్యవహారమునందు అంతటా స్థితి కలిగియున్నాడు. ఇక్కడ కొన్ని శ్రుతి ప్రతిపాదిత సృష్టి చమత్కారాలు పురశ్చరణ చేద్దాం!

❖

ఈ బ్రహ్మాండమునకు బాహ్యమున దీనికి రెండింతలు పృథివీతత్త్వమున్నది. అట్టి పృథివికి ఆవల, దానికి రెండింతలు జలతత్త్వమున్నది. జలమునకు ఆవల రెండింతలు తేజము ఉన్నది. తేజమునకు ఆవల రెండింతలు వాయువు ఉన్నది. వాయువుకు ఆవల రెండింతలు ఆకాశము ఉన్నది... ఈ విధంగా ఉత్తరోత్తరక్రమముచే ఒకదానికంటే మరొకటి ద్విగుణీకృతమై ఉంటోంది.

ఈ ప్రపంచమంతా కూడా 1.పంచీకృతము, 2.అపంచీకృతము అగు భూతములచే నిండి ఉంటోంది. అందుచేత ఆత్మతత్త్వమును ఆశ్రయించాలనుకునే యోగి పృథివిని దానికి కారణమైన జలమునందు, జలమును అగ్నియందు, అగ్నిని వాయువునందు, వాయువును ఆకాశమునందు, ఆకాశమును సమస్తోత్పత్తికి కారణమగు హిరణ్యగర్భాశయమునందు లయమొనర్చి వేయాలి.

లింగ శరీరం - 1. వాసనలు, 2. సూక్ష్మభూతములు, 3. కర్మ, 4. అవిద్య, 5. దశేంద్రియములు, 6. మనస్సు, 7. బుద్ధి ... ఇవన్నీ చేరినదానినే పండితులు 'లింగశరీరం' అని పిలుస్తున్నారు.

ఈ విధంగా స్థూలోపాధియొక్క భావనావిలయముచే ఆ యోగి అర్థరూపము పొందినవానివలె ఉంటున్నాడు. ఆ తరువాత 'బ్రహ్మాండాభిమానత్యాగము'చే ఆతడు ఈ బ్రహ్మాండ వ్యవహారము నుండి బహిర్భూతుడౌతున్నాడు. అప్పుడు సూక్ష్మభూతాత్మకమైన సమష్టిలింగదేహమున 'నేను సర్వమునకు అధిష్ఠానమగు హిరణ్యగర్భుడనే'.... అని భావన (లేక) చింతన చేయాలి.

ఈ సమష్టి భూతాభిమానియే ప్రప్రథమంగా 'చతుర్ముఖ బ్రహ్మ...' అను రూపమున వ్యవస్థితుడై ఉన్నాడు. అట్టి లింగశరీరాన్ని కూడా ...దానికంటే కూడా సూక్ష్మమై అద్దానికి కారణభూతమైయున్నట్టి 'అవ్యాకృతము ...అని చెప్పబడుదానిలో ఆ బుద్ధిమంతుడు లయం చేయుగాక!

అవ్యాకృతం - దేనియందైతే ఈ సమస్తమైన జగత్తు కలదో ... అట్టి అవ్యాకృతం, లేక అవ్యక్తము నామరూపరహితమైనది. దానినే కొందరు 'ప్రకృతి' అని, మరికొందరు 'మాయ' అని ఇంకొందరు 'పరమాణుతత్త్వము' అని చెప్పుచున్నారు. అట్లాగే ఇంకాకొందరు తార్కికులు (బౌద్ధులు మొదలైనవారు) ఆయా తర్కములచే ఏర్పరచుకున్నవారే అదే 'సంవృతరూపము' అని, అవిద్య అని

ప్రతిపాదిస్తున్నారు. ప్రళయకాలంలో అద్దానియందే సమస్త పదార్థభావములు లయించి అవ్యక్తరూపంలో ఉంటున్నాయి. మరల సృష్టి ప్రారంభమయ్యే వరకు అవి అవ్యక్తమునందే పరస్పర సంబంధరహితములై ఉంటున్నాయి.

అనగా ...జగత్ సంబంధిత భావనలన్నీ తమ తమ భోగ్యత్వరూపాన్ని కోల్పోయి చిత్ స్వరూపం సంతరించుకుంటున్నాయి. మరల సృష్టి ప్రారంభంలో చిత్ నుండే ఉత్పన్నమౌతున్నాయి.

అధ్యారోప (లేక, అనులోమ) క్రమం చేత అవ్యక్తం నుండి అవి సృష్టిగా అగుచున్నాయి. అపవాద (లేక, ప్రతిలోమ) క్రమముచే సమస్తము అద్దానియందే లయిస్తున్నాయి.

స్థానత్రయాతీతమైన తురీయపద ధ్యానం

1. విరాట్	2. హిరణ్యగర్భ	3. అవ్యాకృతం
{ 1. స్థూలం	2. సూక్ష్మం	3. కారణం }
{ 1. జాగ్రత్	2. స్వప్నం	3. సుషుప్తం }

ఈ త్రిపుటీ సమూహములను జయించి నీవు నాశరహితమగు తురీయ పదమును ధ్యానించాలి. అట్టి తురీయపద ప్రాప్తి కొరకై 'చరమ సాక్షాత్కార వృత్తి'చే లింగ దేహమును కూడా వలయమొనర్చాలి. అనగా 'ధ్యాన - కర్మ - కరణ'వృత్తి రూపమగు లింగ దేహమును కూడా 'మూలాజ్ఞాన త్యాజ్యము' అను సాక్షాత్కారవృత్తిచే శుద్ధబ్రహ్మమునందు విలయమొనర్చాలి. కుండ పగిలితే కుండలోని ఆకాశం మహాకాశంలో విలీనమౌతుంది చూచావా? అట్లాగే నీవు నిరతిశయానందరూపమగు పరబ్రహ్మమున ప్రవేశించెదవు గాక.

❖

పంచభూతములు - మనస్సు, బుద్ధి, వాసన, కర్మ, ప్రాణవాయువులు... వీటన్నిటి యొక్క ప్రతిష్ఠ అజ్ఞానమే అయి ఉన్నది. శుద్ధ బ్రహ్మమున అజ్ఞాన రూపావరణ ఏర్పడుచటే అది తనకు తానే మొట్టమొదట అవ్యాకృతంగాను,ఆ తరువాతనే సూక్ష్మభూతలము ద్వారా లింగ శరీరంగాను జనిస్తున్నది. కనుక లింగ శరీరమునకు అజ్ఞానమే మూల ప్రతిష్ఠ. అజ్ఞాన నివృత్తిచే లింగ శరీరం అనే విశృంఖలములు తప్పకుండా స్వయంగా విచ్ఛిన్నమగుచున్నాయి.

❖

భరద్వాజ మహర్షి : హే మహర్షీ ! యొక్క చెప్పే మహత్తరమైన అవ్యాకృతాతీత తురీయస్థితి గురించిన విశ్లేషణా ప్రభావం చేత నేనిప్పుడు లింగ శరీర విశృంఖలముల నుండి సర్వదా విముక్తుడనైనాను. చిద్రూపసాగరమున ప్రవేశించిన వాడనైనాను. అట్టి చిద్రూపసాగరంలో 'అభేదం' పొందటం చేత సర్వోపాధివర్జితుడనగు పరమాత్మయే అయి ఉన్నాను. ఇట్టి "ఐక్యకూటస్థాత్మ" గురించి ఇతఃపూర్వం శ్రుతులు చెప్పగా విన్నాను. ఇప్పుడు మీ కృపచే తదనుభవజ్ఞుడనగుచున్నాను. అగ్నిలో వేయబడిన అగ్ని ఆ అగ్నితో ఐక్యం పొందినప్పుడు తన్మయత్వముచే 'అగ్ని' అనే పేరుతోనే చెప్పబడుతుంది కదా! అట్లాగే నా విశేషరూపం మరింకే పేరుతోనూ చెప్పబడటం లేదు. అది

'పరమాత్మయే' అనబడుతోంది. లవణ సముద్రంలో పడిన తృణ-కాష్ఠాదులు (గడ్డిపరక-కట్టె మొదలైనవి) లవణ మయమే అవుతాయి కదా! అట్లాగే అచేతనమగు ఈ జగత్తు చైతన్యమునందు లయమొనర్చబడిప్పుడు ఇది కూడా చైతన్యమే అగుచున్నది.

ఒక సైంధవ లవణపు బొమ్మ (ఉప్పుబొమ్మ) ఉన్నది. అది సముద్రపు లోతు ఎంతో కొలవటానికి బయలుదేరి, సముద్రంలో ప్రవేశించింది. అప్పుడేమౌతుంది. ఆ ఉప్పుబొమ్మ జలంలో ప్రవేశించగానే జలరూపంగా అయి తన నామరూపములు కోల్పోతుంది. పాల సముద్రంలో పోయబడిన పాలు ఇక క్షీరంగానే మారుతుంది. కడివెడి నేతిలో కలుపబడిన నేతిబొట్లు నేతిరూపమే అగుచున్నాయి. ఈ జలాదుల ఉపాధులన్నీ (మంచుగడ్డలన్నీ) జలంలో ప్రవేశిస్తే జలమే అవుతున్నాయి. అట్లాగే నేను కూడా సత్స్వరూపమగు చైతన్యమున ప్రవేశించి, చైతన్యరూపుడనై వెలయుచున్నాను.

నిత్యానందే సమస్తజ్ఞేష పరే, పరమకారణే,
నిత్యం, సర్వగతం, శాంతం, నిరవద్యం నిరంజనమ్॥
నిష్కలం, నిష్క్రియం, శుద్ధం, తద్బ్రహ్మాస్మి పరం పరమ్।
హేయోపాదేయ నిర్ముక్తం, సత్యరూపం, నిరింద్రియం॥
కేవలం సత్య సంకల్పం శుద్ధం బ్రహ్మాస్మ్యహం పరమ్,
పుణ్యాపాప వినిర్ముక్తం కారణం జగతః పరం॥
అద్వితీయం పరంజ్యోతిర్ బ్రహ్మాస్మ్యానన్దమవయం,
ఏవమ్ ఆది గుణైర్యుక్తం సత్వాది గుణవర్జితమ్,
ప్రవిష్ఠం సకలం బ్రహ్మ సదాధ్యాయేత్స్వకర్మకృత్॥

నిత్యానందరూపమై, సర్వజ్ఞమై, సర్వసాక్షియై పరమ కారణమైనట్టి పరబ్రహ్మమునందు నేను. నిత్యమై, సర్వ వ్యాపకమై, శాంతమై, దోషరహితమై, నిరంజనమైనట్టి బ్రహ్మరూపుడనై ఉన్నాను. నిష్కళమై, నిష్క్రియమై, హేయ ఉపాధేయ రహితమై, సత్యరూపమై, ఇంద్రియరహితమైనట్టి శుద్ధబ్రహ్మమే నేను. నా స్వరూపం కేవలమై సత్య సంకల్పయుతమై, పుణ్య-పాప వర్జితమై, జగత్తు యొక్క పరమకారణమై, శుద్ధమైనట్టి పరబ్రహ్మమే అయి ఉన్నది. నేను అద్వితీయమై, నాశనరహితమై, పరమప్రకాశమైనట్టి అవ్యయానంద బ్రహ్మమునే అని అనటంలో నాకు సందేహమే లేదు. నా స్వరూపం సత్య సంకల్పాది సౌరభ్యంతో కూడి ఉన్నది. మాయికములైనట్టి సత్వ-రజో-తమో గుణములు లేవు. సర్వ రూపమైనట్టి బ్రహ్మమగు నా స్వరూపమే సాధకులందరికి శ్రవణ-మననాది స్వకర్మలచే ఆరాధనార్హమైయున్నది.

ఈ విధంగా నేను బ్రహ్మమును ధ్యానించటం, అభ్యసించుట చేత నా మనస్సు ఆ బ్రహ్మమునందే లయం పొందుతోంది. మనస్సు లయించగానే నేను స్వయాత్మ స్వరూపుడనై అన్ని వైపులా ప్రకాశిస్తు న్నాను. ఆనందరూపమగు ఆత్మ ప్రకాశిస్తూ ఉండగా ఇక సమస్త దుఃఖాలు అనే క్రీనీడలు స్వయంగా తొలగిపోతున్నాయి. అప్పుడు ఆత్మ సహజసిద్ధమగు తన ఆనందరూపమును పొందుతోంది.

ఓ గురువర్యా! నా కంటే వేరైన సచ్చిదానందమయుడగు ప్రభువు మరొకడెవడూ లేడు. 'నేనొకడనే పరబ్రహ్మమును' అని నా సర్వరూపాత్మ లోలోన అనుభవించుచున్నది. ఎందుకంటే, తదితరులంతా నా స్వరూపులే!

శ్రీవాల్మీకి మహర్షి :

సఖే! సంన్యస్య కర్మాణి బ్రహ్మణః ప్రణయీ భవ
నేష్యేసే యది సంసారచక్రావర్త భ్రమః శమమ్॥

ఓ సఖుడా! నీ స్వస్వరూపము అంతటిదే! ఇందులో సందేహమే లేదు. సర్వ కర్మలు పరిత్యజించినవాడవై, బ్రహ్మప్రాప్తియందే ఏర్పడి ఉండుము. ఈ 'సంసారచక్రము'అనే పెద్ద ఆవర్తము భ్రమవంటిది మాత్రమే. 'ఇందులో ఏదో పొందవలసియున్నది ....' అని అల్పభ్రమను ఆశ్రయించకుండా ఉన్నావా...నీ బ్రాహ్మీస్థితికి రాగల లోటేమీ ఉండదు.

భరద్వాజుడు : గురుదేవా! తాము వచించిన జ్ఞానమంతా తమ కృపారసం చేత నేను గ్రహించాను. తమ అనుగ్రహంచేతనే నా బుద్ధి నిర్మలమైనది. ఇక ఈ 'సంసారభ్రమ'గురించి తెలుసుకొని ఉండటంలో ఏమాత్రం జంకుగాని, అనుమానం గాని, ఆలస్యంగాని నాకు లేవు. అయినా కూడా 'జ్ఞాని' యొక్క కర్మ విశేషములు ఎట్లా ఉంటూ ఉంటాయో మరల మీ నుండి వినాలని అభిలాష మాత్రం ఉన్నది. ప్రభూ! ఆతని కర్మ ప్రవృత్తి రూపంలో ఉంటుందా? లేక నివృత్తి రూపంలో ఉంటుందా? లేక ఆతనికి కర్తవ్యమంటూ ఏదైనా ఉంటుందా? ఏదీ ఉండదా? ఈ విషయంలో మీ అమూల్యమైన అభిప్రాయాలు దయచేసి నాకు తెలియజేయండి.

శ్రీవాల్మీకి మహర్షి :

తస్మాత్ యన్నకృతే దోషః తత్కర్తవ్యం ముముక్షుభిః,
కామ్యం కర్మ నిషిద్ధం చ న కర్తవ్యం విశేషతః ॥

ఓ భరద్వాజా! సమస్తము త్యజించి బ్రహ్మము గురించి మాత్రమే అభ్యాసపరుడవై ఉంటే కాలక్రమంగా సంసారమును జయిస్తావు. "సంసారభ్రమ నివర్తకం" అనేది లభించాలంటే సమస్తం త్యజించి బ్రహ్మమును గూర్చిన అభ్యాసమునే ఆశ్రయించాలి. అందుచేత ఏ కర్మలు ఆచరిస్తే దోషమేదీఉండదో...అవియే ముముక్షువులు ఆచరించతగినవై ఉంటాయి. ఇంతకు మించిన కామ్య – నిషిద్ధ కర్మలు ముముక్షువులు విశేషంగా ఆచరించవలసిన పని లేదు. దేహమునకు, మనస్సుకు బ్రహ్మమునకు వేరువేరైన చమత్కార ధర్మములు ఏర్పడి ఉన్నాయి.

1. దేహ గుణములు (లేక) దేహ ధర్మములు : ఈ దేహము ప్రకృతిచే నిర్మించబడి ప్రకృతి చేతనే ఉపసంహరించబడుతోంది. దీనికి బాల్యయౌవన వార్ధక్యాలున్నాయి. అనుక్షణం మార్పు చెందుతూనే ఉంటుంది. పరమాణువుల సంయోగ వియోగాలచే ఇది వృద్ధి, క్షయాలు పొందుతోంది.

2. మనో గుణములు (లేక) మనో ధర్మములు : ఇది ఏది ఎట్లు ఎంతకాలం ఏ రీతిలో ఆశ్రయిస్తే అద్దానిని అట్లే అంతకాలం ఆ రీతిలోనే పొందుతూ ఉంటుంది. అల్పకాలిక విషయములను

ఆశ్రయిస్తే అల్పత్వం పొందుతోంది. గుప్తము – శాశ్వతము అగు ఆత్మను ఆశ్రయిస్తే ఆత్మత్త్వము సంతరించుకుంటోంది.

3. బ్రహ్మము యొక్క ధర్మములు : ఆత్మ (లేక) బ్రహ్మము స్వయంజ్యోతి స్వరూపం. అఖండం. అప్రమేయం. నిత్యనిర్మలం, సత్యం. కారణ–కారణం. అంతటా ఏర్పడి వ్యాపించి ఉన్నది.

ఈ జీవుడు ఎప్పుడైతే దేహం యొక్క, మనస్సు యొక్క గుణాలను వదలి బ్రహ్మం యొక్క 'సత్–చిత్–ఆనందం' అనబడే గుణములతో కూడుకొని ఉంటాడో …అప్పుడు సమస్త ఇంద్రియములు కర్మల పట్ల నిరంజనం, నిరాకారత్వం, నిర్వికారత్వం వహించి ఉంటాయి. ఆ జీవుడి పట్ల ఇంద్రియత్వం శమించటం చేత, ఇక ఆతడు సర్వవ్యాపియగు ప్రభువై ఉంటాడు. అట్టి వానిని ఆతని కర్మలు అంటవు. అవి అతనిని నిర్వచించలేవు.

జీవుడు - విముక్తుడు : ఎప్పుడీ జీవుడు విముక్తుడు (లేక) విముచ్యుడు అయి ఉంటాడో అదిప్పుడు చెప్పుచున్నాను విను.

దేహేంద్రియమనోబుద్ధేః పరస్తస్మాచ్చ యః పరః,
సో హమస్మి యదా ధ్యాయేత్ తదా జీవో విముచ్యతే॥
కర్తృత్వ–భోక్త్రాది నిర్ముక్తః సర్వోపాధి వివర్జితః,
సుఖదుఃఖ వినిర్ముక్తస్తదానీం విప్రముచ్యతే॥
సర్వభూతేషుచ ఆత్మానం సర్వభూతాని చ ఆత్మని,
యదా పశ్యతి అభేదేన తథా జీవో విముచ్యతే॥
జాగ్రత్ స్వప్న సుషుప్తాఖ్యాం హిత్వాస్థానత్రయం యదా
విశేత్ తురీయమానందం తదా జీవో విముచ్యతే॥

'ఈ దేహ – ఇంద్రియ – మనో – బుద్ధుల కంటే పరమై, అన్నమయ – ప్రాణమయ – మనోమయ – విజ్ఞానమయ కోశములకంటే విశిష్టమైన ఆనందమయకోశం' ఉన్నది. ఆ ఆనందమయ కోశమునకు కూడా పరమై "బ్రహ్మము" ఏర్పడి ఉన్నది. అట్టి బ్రహ్మమే నేను … అను ధ్యానం చేత అతడు విముక్తుడౌతాడు.

ఎప్పుడైతే "నేను కర్తృత్వ – భోక్తృత్వ రహితుడను. సర్వ ఉపాధులలో ఉండికూడా, సర్వ ఉపాధులను త్యజించినదై, సర్వదా వాటినన్నిటికీ అతీతమై ఏ బ్రహ్మమున్నదో …అదే నేను…" అని గ్రహిస్తూ ఉంటాడో అప్పుడు సుఖ దుఃఖముల నుండి విడివడినవాడై విముచ్యుడౌతాడు.

"ఈ సమస్త జీవజాలాలో నేనున్నాను. ఇవన్నీ నా ఆత్మయందే, ఆత్మగానే ఉన్నాయి. అందుచేత ఒక జీవునికి మరొక జీవునికి భేదమే లేదు. నాతో సహా ప్రతి ఒక్క జీవి స్వయంగా ఆత్మయే అయి ఉండగా…ఇక ఇక్కడ అభేదమే సిద్ధిస్తోంది గాని భేదము కాదు…" అను అనుభవాన్ని ఆశ్రయించి ఉన్నవాడు సంసార విముక్తుడు స్వభావ సిద్ధంగా అగుచున్నాడు.

ఏ జీవుడైతే "నేను జాగ్రత్ సంవిత్తు కాదు. స్వప్న సంవిత్తు కాదు. సుషుప్త సంవిత్తు కూడా కాదు. అందుచేత ఈ మూడు అవస్థలను ఇక్కడే ఉండనిచ్చి, ఈ మూడింటికి ఆవల ఉన్న తురీయమునందు ఏర్పడి ఉంటున్నాను" అను నిత్య సంస్థితానుభవమును సంతరించుకుంటున్నాడో, ఆతడు మాయ నుండి ఇట్టే విడివడుచున్నాడు. అట్టి తురీయమే ఈ జీవుని యొక్క పరమాత్మయందలి స్థితి. అద్దానిలో ఈ జాగ్రత్-స్వప్న-సుషుప్త బీజవాసనలు లేవు. ఎందుకంటే అది స్వతః నిర్మలమైనది, స్వయంప్రకాశమైనది, సర్వమును వెలిగించునది కూడా. అది 'నిద్రాణవిరహితం' అని విజ్ఞులు ఎఱుగుచున్నారు. కర్మ-అజ్ఞానము మొదలైనవి అందులేవు. అది సుషుప్తికంటే కూడా పరమైనది. చైతన్య సుఖ సమన్వితమైయున్నది.

ఆ మహత్తర సుఖానుభవమే భక్తియొక్క, యోగము యొక్క, విచార మాత్రజనితమైన సాక్షాత్కారము యొక్క పరాకాష్ఠ.

ఏ జీవునికైనా సరే, ఆ తురీయ సంస్థితమునందు మాత్రమే వాస్తవమైన సుఖవిశ్రాంతులు లభిస్తున్నాయని కర్మ-భక్తి-యోగ-జ్ఞాన సాధకులందరు ముందుగానే గ్రహించి ఉండెదరు గాక! తరంగములు శమిస్తే ఇక సముద్రమంతా నిండి ఉండేది జలమే కదా! ఆత్మామృత సముద్రంలో మనస్సు లయించగా, అట్టి మనుజునికి ఆత్మ తప్ప మరింకేదీ గోచరించదు. అట్టి వానినే 'ఆత్మజ్ఞుడు. ఆత్మను మాత్రమే ఎరుగుచున్నవాడు' లేక 'ఆత్మ సంవిత్తు' అని పిలుస్తున్నాం.

ఓ భరద్వాజా! మరొక్కసారి గుర్తు చేస్తున్నాను. అట్టి ఆత్మ రూపమహాసముద్రంలోనే నీవు స్నానమాడాలి. అంతేగాని ద్వైతరూప ఉప్పు సముద్ర తరంగాలలో దూకవలసిన పనేమిటి చెప్పు?

భరద్వాజుడు : అట్టి జ్ఞానస్థితి నాకు సులభతరమయ్యేదెట్లా?

శ్రీవాల్మీకి మహర్షి :

మజ్జమజ్జసి కిం ద్వైతగ్రహక్షారాబ్ధి వీచిషు?
భజ సంభరితాభోగం పరమేశం జగద్గురుమ్॥

ఆ జగద్గురువగు పరమేశ్వరుడు తన భక్తులను అనుగ్రహించుట కొరకై 'అర్ధనారీశ్వరుడు' మొదలైన ఆయా రూపములను ధరించి భక్త జనులకు జ్ఞానము ప్రసాదిస్తున్నాడు. అట్టి సర్వాత్మకుని ఆయా అనుకూలరూపంతో జ్ఞాన సిద్ధి కొరకై భజించు, అర్చించు. అర్చనాదులచే భక్తి ప్రవృద్ధమగుచుండగా జ్ఞానము వికసించి జ్ఞానసిద్ధిచే చిదానందమగు తురీయమునుండి ఏర్పడి ఉండగలుగుతావు. అంతేని, ఈ ద్వైతరూప క్షార సముద్రంలో మునుగవలసిన పనేమిటి?

❖

పుత్రకా! భరద్వాజా! ఈ విధంగా శ్రీవసిష్ఠ మహర్షి విశ్వామిత్ర - నారదాది మహర్షులు, సిద్ధులు, తదితర మహనీయులు వేంచేసియున్న ఆ దశరథ మహారాజు యొక్క నిండు సభలో శ్రీరామచంద్రునికి ఇప్పటివరకూ చెప్పియున్న ఉపదేశమంతా పూసగుచ్చినట్లు చెప్పుకుంటూ వచ్చాను. దీనినంతా నీవు జ్ఞానమార్గంచేత, యోగమార్గం చేత చక్కగా నిశ్చయరూపంగా ఎఱుగుము.

ఎందుకంటే శాస్త్ర విచారణ చేతను, గురువాక్యముల అర్థము ఎఱుగుట చేతను, అభ్యాస యోగము చేతను సమస్త జ్ఞానము యొక్క సిద్ధి లభించగలదు.

తస్మాత్ త్వమ్ సర్వముత్సృజ్య కుర్వభ్యాసే స్థిరం మనః ॥

కాబట్టి నీవు సర్వమును త్యజించి అభ్యాసయోగం చేత మనస్సును స్థిరపరచుకో. అప్పుడు అంతా నీకు స్వయంగానే అత్యంత సులభంగా కరతలామలకమవగలదు.

❖❖❖

3. రామానంద సాగరం

భరద్వాజుడు : ఓ మునీశ్వరా! ఆ శ్రీరామచంద్రుడు శ్రీ వసిష్ఠ మహర్షి బోధించిన జ్ఞానయోగములను ఆలకించినవాడై సమాధిలో ప్రవేశించి ఈ ఉపాధి మొదలుగా గలవాటికి పరమైనట్టి బ్రహ్మముతో ఏకత్వము అనుభవిస్తు ఉపాధితో అసంబధిత్వము దర్శిస్తున్నాడు కదా! అట్టి రామచంద్రుని వసిష్ఠమహర్షి మరల ఏ విధంగా వ్యవహారపరునిగా తీర్చిదిద్దారు? ఈ విషయం చెప్పండి. ఈ విషయం ఎఱిగి నేను కూడా శ్రీరామచంద్రుని వలెనే బ్రహ్మాభ్యాసిని, దేహవ్యవహార నిర్వహణవర్తిని కూడా అయి ఉంటాను. 1. సమాధి 2. సమాధి యొక్క వ్యుత్థాన కాలము ... ఈ రెండింటినీ చక్కగా నా పట్ల సమన్వయించుకోగలుగుతాను.

శ్రీవాల్మీకి మహర్షి : అవును. ఆ విషయం ఇప్పుడు సుసందర్భమైన విషయం. విను. చెపుతాను.

❖

మహామనస్వి, అపరిచ్ఛిన్న బ్రహ్మాకార చిత్తుడు, శుభాచరణశీలుడు అగు ఆ శ్రీరామచంద్రుడు అఖండ-అప్రమేయ-నిర్వికల్ప స్వరూపమునందు పరిణతి చెందియున్నాడు కదా! అప్పుడు ఋషిసత్తముడైన శ్రీవసిష్ఠ మహర్షితో శ్రీవిశ్వామిత్ర మహర్షి ఇట్లా పలికాడు.

❖

శ్రీవిశ్వామిత్ర మహర్షి : హే మహాభాగా! బ్రహ్మపుత్రా! శ్రీ వసిష్ఠ మునీంద్రా! తమ అనుగ్రహదృష్టిమాత్రం చేత మీరు మీ ప్రియ శిష్యుడగు ఈ శ్రీరామచంద్రునియందు బ్రహ్మజ్ఞాన శక్తిని కలుగజేసి మీ గురుత్వ మహనీయత్వమును ఇప్పుడిక్కడే నిరూపించుకున్నారు.

దర్శనాత్ స్పర్శనాత్ శబ్దాః కృపయా శిష్యదేహ కే,
జనయేద్యః సమావేశం శాంభవం స హి దేశికః ॥

ఎవరైతే తన దర్శనం చేత స్పర్శనంచేత, శబ్ద ప్రయోగం చేత, కృపాకటాక్షవీక్షణచేత శిష్యుని దేహమందు 'శివరూపమగు పరమాత్మ' యొక్క సమావేశమును కలుగజేయగలరో ...వారే గురువు. వారే సద్గురువు. మీ శిష్యుడగు ఈ శ్రీరామచంద్రుడు స్వయంగా విశుద్ధాత్ముడై, ఈ సంసారవ్యవహారం పట్ల విరక్తుడై, కేవలం ఆత్మయందు విశ్రాంతిని కోరిన వాడై ఈ సంవాద ప్రారంభంలో మహత్తరంగా వైరాగ్యమును ప్రవచించాడు. ప్రయోజనంగా ఈ సంవాదము అనే రూపంలో సర్వ ముముక్షువులపై

జ్ఞానామృతవర్షం మీరు కురిపిస్తున్నారు. అయితే మీరు సిద్ధాంతీకరించినట్లు 'శిష్య ప్రజ్ఞైవకారణం...' అనేది కూడా సముచితమే!

శిష్య ప్రజ్ఞైవ బోధస్య కారణం గురువాక్యతః
మలత్రయమపక్వంచేత్ కథం బుధ్యతి పకవత్?

గురువాక్యములు శిష్యునితో మహత్తరమైన 'ఆత్మానుభవం' జనింపజేయటానికి శిష్యుడిలోని ప్రజ్ఞయే కారణమని మనం ఎఱిగినదే. ఎందుకంటే ఎవనిలో అయితే శారీరక-వాచిక-మానసిక దోషములు, దేహ-మనో-బుద్ధి మాలిన్యములు, కామ-కర్మ-వాసనలు తొలగవో అట్టి శిష్యుడు గురుబోధ యొక్క ఔన్నత్య సారాంశము గ్రహించలేడు కదా! ఈ రామచంద్రుడు ఆశ్చర్య జనితమైన బుద్ధికుశలత కలవాడు.

మీరీ కొద్ది రోజులుగా ఏదేది బోధించి అనేకమందిలో ఆత్మ యొక్క ప్రత్యక్ష జ్ఞానమును కలిగిస్తున్నారో ...అదే గురుశిష్యుల సమావేశ ప్రయోజనమై ఉన్నది. గురు-శిష్యులు ఇద్దరూ యోగ్యులైన వారైతే ఆ శిష్యుడు, అనేకమంది తదితరులు కూడా ఇటువంటి కైవల్య లక్షణమునకు పాత్రులు కాగలరు. అందుచేత మహాసమర్థులగు మీ గురు-శిష్య సమావేశం లోకకళ్యాణార్థమే అయి ఉన్నది.

ఇప్పుడు మీకొక విన్నపం చేస్తున్నాను. మాపై దయతో శ్రీరామచంద్రుని సమాధి నుండి మేలుకొలుపవలసినదిగా నా ప్రార్థన. హే వసిష్ఠ మహర్షీ ! మీరైతే 'పరమపదము'నందు పరిణతి చేత కృతకృత్యులై ఉన్నారు. మా సంగతి ఆ విధంగా లేదు. మేము ఇంకాకూడా లోకకార్యములందు ప్రవేశించియే ఉన్నాము. ప్రభూ ! నేను ఏ లోకకళ్యాణ కార్యక్రమమును ఉద్దేశించి ఈ అయోధ్యకు వచ్చానో, దేనికొరకై ఈ మహారాజు దశరథుని అతికష్టంగా స్వయంగా ప్రార్థించానో, దానిని ఒక్కసారి స్మరించండి. ఈ శ్రీరామచంద్రుని మీరే సమాధినుండి లేపవలసినదిగా మిమ్ములను అర్థిస్తున్నాను. మీరు సర్వజ్ఞులు. భూత-భవిష్యత్-వర్తమానములు ఎఱిగినవారు. రాగరహితులు. సర్వదా ఆత్మానుభవం సంతరించుకున్న మహనీయులు. మీకు కొత్తగా విన్నవించుకోవలసిన పనేమున్నది? ఈ శ్రీరామచంద్రుడు సమాధి నుండి లేచిన తరువాత ఈ అవతార ప్రయోజనమైన దేవకార్యము లోకములకు మనం సంపాదించిపెట్టవలసి ఉన్నది.

❖

ఈ వసిష్ఠ-రామ సంవాదము ముగించిన తరువాత నేను ఈ రామచంద్రుని నా సిద్ధాశ్రమానికి తీసుకు వెళ్ళటం జరుగుతుంది. 'నేను ఉద్దేశించిన యాగమును సంరక్షించటం' అనే మిషతో ఈతడు అనేక మంది లోకకంటకులగు దుష్టరాక్షసులను సంహరించనున్నాడు. ఆ తరువాత పరమ పవిత్రమగు తన పాదధూళి యొక్క స్పర్శచే అహల్యకు శాపవిమోచనం ప్రసాదిస్తాడు. ఆ తరవాత జనకుని సభలో ఇంద్రుని వలె ప్రవేశించి శివధనుస్సును విఱిచి సీతాదేవిని పరిణయమాడుతాడు. ఆ సీతారామ కళ్యాణం మనం చూచి తరించవలసిందే కదా!

ఆ తరువాత ఈతడు జమదగ్ని కుమారుడగు పరశురాముని ఎదుర్కొని ఆతని గతిని భంగం చేయగలడు. ఆ తరువాత పితృ పితామహప్రసాదితమైన ఈ అయోధ్యను పాలించటానికి అన్ని

విధాలా అర్హత ఆర్జించుకుని ఉంటాడు. అప్పుడొక చమత్కారమైన మిషచే తండ్రి ఇచ్చిన మాటకోసం వనవాసం ఆశ్రయిస్తాడు. భార్య-సోదర సమేతుడై దండకారణ్యంలో ప్రవేశిస్తాడు. అక్కడ తనను శరణువేడవచ్చిన సజ్జనులను సంతోషపరిచే నిమిత్తం దుర్మార్గవృత్తులను ఆశ్రయించే అనేకమంది రాక్షస జనాన్ని సంహరిస్తాడు. అనేక ఆశ్రమములను, ఋషులను, మునులను, తీర్థాలను దర్శిస్తూ అనేక మంది జీవులకు తన దర్శనముచే ఆనందం కలిగిస్తాడు. అక్కడ మోక్షార్థులగు అనేక మంది భక్తజనులు ఈ శ్రీరాముని దర్శనం కొరకై సుదీర్ఘకాలంగా వేచియున్నారు కదా! ఆ తరువాత సీతాదేవి అపహరణం జరుగుతుంది. అట్టి సీతా వియోగ దుఃఖమును ప్రదర్శించి ఈ అవతార పురుషుడు 'తన్నివారణము' అనే మిషచే లోకబాధకుడగు రావణాసురుని బంధు-మిత్ర-పరివార సమేతంగా హతం చేయనున్నాడు. 'పరస్త్రీ వ్యామోహము కలవానికి వినాశనము తప్పదు' ... అను దుష్టసంగము యొక్క దురవస్థను లోకములకు ప్రదర్శించనున్నాడు. అనంతరం ఇంద్రుని వరదానముచే యుద్ధంలో మృతి చెందినన వానరులు పునర్జీవులౌతారు. ఆ తరువాత సీతయొక్క అగ్ని ప్రవేశముచే విశుద్ధిని కోరినవాడై ... శిష్టజనులందు తన ఉత్తమ చరిత్ర యొక్క మాననీయత్వము ప్రకటించగలడు. అప్పుడు అయోధ్యా రాజ్యాభిషిక్తుడౌతాడు. జీవన్ముక్తుడై, నిస్పృహుడై కూడా క్రియాకాండ పారాయణుడై ఈ అయోధ్యారాజ్యం ఏలగలడు. అనేక యజ్ఞయాగములను నిర్వర్తించి జ్ఞానము-కర్మల ఉభయముల సముచ్చయ రూపమగు గతిని లోకములకు ఆదర్శప్రాయమై ప్రదర్శించగలడు.

యైర్ ద్రష్టో, యైః స్మృతోవాపి, యైః శ్రుతో, బోధితస్తుయైః
సర్వావస్థాగతానాం తు జీవన్ముక్తిం ప్రదాస్యతి ॥

ఎవరీ రామచంద్రుని దర్శిస్తారో, ఎవరీతని చరిత్రను స్మరిస్తారో, వింటారో, ఎవరీతని చరిత్రను తదితరులకు బోధిస్తారో .... అట్టి భక్తజనులందరికీ ఈతడు వారి సర్వావస్థలయందునూ జీవన్ముక్తిని ప్రసాదించగలడు.

ఈ విధంగా ఈ అవతారమూర్తి శ్రీరామచంద్రుని వలన ఈ ముల్లోకముల యొక్క నా యొక్క కార్యము సంపూర్ణంగా నెరవేరగలదు.

నమోస్మై జితమేవైతే కోఽప్యేవం చిరమేధతాం!

ఓ సర్వ సభికులారా! మీరంతా కూడా ఈ శ్రీరామచంద్రునికి నమస్కరించి తరించండి. ఈతని నమస్కరించినంత మాత్రం చేత మీరు ఈ సమస్త సంసారసాగరమును జయించి వేసినవారు కాగలరు. పురుషార్థములన్నీ వాటికవే సిద్ధించగలవు.

అంతేకాదు. మీలోని శ్రేష్ఠులగు వారు ఈ శ్రీరామచంద్రుని వలెనే చిరకాలం నిర్వికల్పసమాధి యందు ఆత్యంతికమైన విశ్రాంతిని, సుఖమును బడయగలరు. కనుక సమస్తజనులు ఈ శ్రీరామచంద్రుని ఆరాధించి మోక్షసుఖమును పొందెదరు గాక!

❖

శ్రీవిశ్వామిత్రుని పరతత్త్వార్థ వాక్యములు వినిన ఆ సభలోని సిద్ధులు, వసిష్ఠుడు మొదలైన శ్రేష్ఠ యోగీంద్రులు ... అందరూ కూడా శ్రీరామచంద్రుని కరచరణముల ధూళిని ఆదరంగా స్మరించారు.

ఋషిగణం శ్రీరామచంద్రుని కథాక్రమమంతా తమ హృదయంతో దర్శించి, ఆతని గుణగుణములను పరవశించి తృప్తి పొందారు.

❖

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ బ్రహ్మర్షీ! విశ్వామిత్రా! "ఈ శ్రీరామచంద్రుడు ఈ జన్మకు ముందు దేవుడా? మనుజుడా?" అనే విషయం శ్రోతలమగు మేమంతా చక్కగా గ్రహించే నిమిత్తం వచించండి.

శ్రీవిశ్వామిత్ర మహర్షి :

అత్రైవ కురు విశ్వాసమ్ అయమ్ స పురుషః పరః
విశ్వార్థమ్ అథిత అంబోధిః గంభీరాగమ్ గోచరః

ఓ సభికులారా! మీరంతా ఈ శ్రీరామచంద్రునియందు 'ఈతడు సాక్షాత్ భగవంతుడే'... అని నిస్సంకోచంగా విశ్వాసం కలిగి ఉండండి.

ఎప్పుడైతే ఈ విశ్వం కొరకై పాల సముద్రాన్ని మథించాడో, ఎవని గురించి శ్రుతులన్నీ ఒక్క చోటికిజేరి ప్రతిపాదిస్తూ గానం చేస్తున్నాయో, అట్టి పరమపురుషుడగు సాక్షాత్ వాసుదేవుడే ఈతడు.

పరిపూర్ణపరానందః సమః శ్రీ వత్సలాంఛనః
సర్వేషాం ప్రాణినాం రామః ప్రదాతా సుప్రసాదితః ॥

పరిపూర్ణ పరానంద స్వరూపుడు, సర్వసముడు, 'శ్రీవత్సమణి' మొదలైన మహత్తర చిహ్నములతో శోభితుడు, అగు ఈ శ్రీరామచంద్రుని ఎవరైతే తమతమ భక్తి-కర్మ-యోగ-జ్ఞానములచే ప్రసన్నం చేస్తారో, అట్టి ప్రాణులందరికీ ఈతడు పురుషార్థములన్నీ ప్రసాదిస్తున్నాడు.

అయం నిహన్తి కుపితః, సృజత్య అయమ్ అసత్‌సకాన్
విశ్వాదిర్, విశ్వజనకో, ధాతా, భర్తా, మహాసఖః ॥

ఈ రామచంద్రుడే క్రుద్ధుడైనప్పుడు సమస్తమును సంహరిస్తున్నాడు. మరల ఎప్పుడో ఎందుకో మిథ్యా పదార్థములచే ఈతడే ఇదంతా సృజిస్తున్నాడు. విశ్వమంతటికీ ఆది, జనకుడు, ధాత (ధరించువాడు) పాలకుడు, మహాసఖుడు ఈతడే!

నిర్మలమగు చిత్తము గలవారై ఎవరు ఆత్మానాత్మ విచారణచే నిస్సారము - అల్పము అగు ఈ సంసారముయొక్క కార్య-కారణ సంబంధములు జయించి వేస్తున్నారో ... అట్టి సంసారమును జయించిన వీతరాగులగు మహాత్ములు ప్రవేశించే విశాలానందసముద్రమే శ్రీరాముని స్వరూపం. ఈ రామానందసాగరమే సర్వసాధనముల అంతిమ ప్రయోజన ఫలం.

క్వచిన్ ముక్తఇవాత్మస్థః, క్వచిత్ తుర్యపదాభిదః,
క్వచిత్ ప్రణీత ప్రకృతిః, క్వచిత్తస్థః పుమానయమ్॥

ఈతడే ఒకచోట పరజ్ఞాన సంయుక్తుడై ఆత్మస్థితిచే ముక్తుడై ఉంటున్నాడు. మరొకచోట చిదానంద ఘన స్వభావుడై ప్రకాశిస్తున్నాడు. 'తురీయపదము' అనబడు మహోన్నతమగు సర్వమును ఆక్రమించియున్నట్టి రూపమును అవధరిస్తున్నాడు. ఒకచోట అప్రమేయుడు, నిర్గుణుడు, అసంగుడు అయి ఉంటున్నాడు. ఇంతలోనే కావాలని మాయయొక్క నియంత అగుచున్నాడు.

ఇంకా చమత్కారమేమంటే...ఒకచోట నిర్విషయుడుగా, మరొకచోట ఈ మాయకే రచయితగా, ఇంకొకచోట ఈ మాయకు బద్ధుడుగా అగుపిస్తున్నాడు.

అయం త్రయీమయో దేవః త్రైగుణ్య గహనాతిగః !
జయత్యంగేరయం షడ్భిః, వేదాత్మా, పురుషో అద్భుతః !

ఈతడే మూడు వేదములను ఆక్రమించియున్న మహత్పురుషుడగు భగవానుడు. ఈ విశ్వమంతా త్రిగుణముల వివిధ పాళ్ళ కలయిక మాత్రమే అయి ఉండగా, త్రిగుణములకు ఆవల ఏర్పడియున్న వేదాంత స్వరూపుడు ఈతడే. సృష్టి – స్థితి – లయ – శిక్ష – స్మృతి – కల్పములనబడే షడంగములతో శోభిల్లే నిత్యోదిత చైతన్య స్వరూపుడు. వేదాత్మ స్వరూపుడు, పారమార్థిక స్వరూపుడు, వేదప్రతిపాదిత స్వరూపుడు ఈ అద్భుత పురుషుడే.

అయం చతుర్బాహుః, అయం విశ్వస్రష్టా చతుర్ముఖః,
అయిమేవ మహాదేవః, సంహర్తా చ త్రిలోచనః ॥

చతుర్బాహువులతో ఈ ప్రపంచ మంతటినీ పరిపాలించే విష్ణుభగవాను డీతడే. ఈ ప్రపంచమునంతటినీ సృష్టించే చతుర్ముఖబ్రహ్మ కూడా ఈయనే! అంతేకాదు. ఈతడే త్రినేత్రుడగు మహేశ్వరుడై ఈ సృష్టి యొక్క సంహారం కూడా నిర్వర్తిస్తున్నాడు.

అజోఽయం జాయతే యోగాత్ జాగరూకః సదా మహాన్
భిభర్తి భగవానేతత్, విరూపో, విశ్వరూపవాన్॥

స్వతహాగా చూస్తే ఈయనకు జన్మాదులు లేవు. అయితే ఏం? తనయొక్క యోగమాయాశక్తి సంబంధంచేత జన్మించినవానివలె అవతరిస్తున్నాడు. ఈయనకు 'మోహనిద్ర'అనే ఆవరణ లేదు. అందుచేత 'నిత్యజాగరూకుడు' అనబడుచున్నారు. ఈయన వాస్తవానికి నామరూపరహితుడు. కానీ విశ్వరూపుడై సమస్తము యొక్క భారము వహిస్తున్నారు.

విజయో విక్రమేణేవ, సుపర్ణే ప్రకాశ ఇవ తేజసా,
ప్రజ్ఞోత్కర్షః శ్రుతేనేవ సుపర్ణే నాయముహ్యతే॥

వాక్ – మనస్సులకు ఈతడు అందనివాడు. మరి? ఈతడు ఆనందస్వరూపం అనుభవైకవేద్యమే. దృష్టాంతానికి ..."ఈతడు పరాక్రమవంతుడురా!" అంటాం. కానీ పరాక్రమమును కళ్ళతో చూడగలమా? లేదు. సాధించిన విజయములను చూచి పరాక్రమం ఊహించుకుంటాం. అట్లాగే ప్రజ్ఞను చూడగలమా? లేదు. కానీ, ఒకని శాస్త్ర పఠనాదులను చూచి "ఈతడు ప్రజ్ఞావంతుడురా!" అని గుర్తించగలం.

అట్లాగే సమస్త విషములందలి ఉత్తమత్వమే ఈయన రూపం. అందుచేత 'శ్రేష్ఠ పురుషుడు' అని వేదజ్ఞులు దర్శనం చేస్తున్నారు.

అయం దశరథో ధన్యః సుతోయస్య పరః పుమాన్ !
ధన్యః స దశకంఠోఽపి చిన్మశ్చిత్తేన యోమునా !

ఇట్టి సాక్షాత్ పరమపురుషుని ఎవడైతే తన కుమారునిగా సంపాదించుకున్నాడో అట్టి ఈ దశరథ మహారాజు ధన్యుడు. అంతేకాదు. ఎవ్వడైతే ఈతనిని 'ఈతడే నా శత్రువు' అని తన చిత్తంలో అహర్నిశలూ చింతన చేయబోతున్నాడో ...అట్టి దశకంఠుడగు రావణాసురుడు కూడా ధన్యుడే.

హాఽ! స్వర్గమమునా శూన్యం, హా పాతాలాది హాగతః !
తస్యాగమాత్ అయం లోకో మధ్యమః శ్రేష్ఠతాం గతః ॥

ఆహా! మధ్యదగు ఈ భూలోకంలో ఈ శ్రీరామచంద్రమూర్తి అవతరించటం చేత ఈ భూలోకమంతా శ్రేష్ఠత్వం సంతరించుకోగా... స్వర్గ, పాతాళ లోకాలు వెలవెలపోతున్నాయి కదా!

రామ ఇత్యవతీర్ణోఽ యమ్ అర్ణవాన్తిశయః పుమాన్,
చిదానందఘనో రామః పరమాత్మాయమవ్యయః ॥

క్షీర సముద్రంలో (సత్యసాగరంలో) శయనించియుండే ఆ విష్ణు భగవానుడే ఇక్కడ దశరథుని కుమారుడగు శ్రీరామచంద్రుడుగా అవతరించాడు. ఈయనే చిదానందఘనుడు, నాశనరహితుడు అగు పరమాత్మ అయి ఉన్నాడు.

నిగృహీతేన్ద్రియగ్రామా రామం జానన్తి యోగినః
వయం త్వవరమేవాస్య రూపం రూపయితుం క్షమాః ॥

ఇంద్రియసమూహములను జయించిన యోగులు మాత్రమే ఈ శ్రీరామచంద్రుని యథార్థరూపం ఎఱుగగలుగుతారు. ఓ వసిష్ఠ మహర్షీ! ఈతని ఇతఃపూర్వరూపం ఏమిటో మీరు, నేను ఎఱిగియే ఉన్నాం కదా! అందుచే నిరూపించుటకు సమర్థులమైయున్నాం.

హే వసిష్ఠ మహర్షీ! భగవంతుడగు ఆ మహావిష్ణువు రఘువంశంలో జన్మించి రఘువంశమును, సర్వలోకములను పావనం చేయబోతున్నాడని మనిద్దరం పెద్దలు చెప్పుకోగా వినియే ఉన్నాము కదా! కనుక ఈతనిని ఇప్పుడు వ్యవహారపరునిగా చేయవలసినదిగా మిమ్ములను ప్రార్థిస్తున్నాను.

❖❖❖

4. ఫలశ్రుతి

శ్రీవాల్మీకి మహర్షి : ఓ భరద్వాజా! ఆ విధంగా లోకహితైషుడగు విశ్వామిత్ర మహర్షి రామతత్త్వ మాహాత్మ్యాన్ని గానం చేసి, శ్రీరామచంద్రుని పునర్వ్యవహారపరునిగా చేయమని వసిష్ఠ మునీంద్రులను అభ్యర్థించి మౌనం వహించారు. అప్పుడు శ్రీ వసిష్ఠ మహర్షి విశ్వామిత్రుని ప్రేమాస్పదమైన చూపులతో అభినందించి రామచంద్రునివైపు చూచారు.

❖

శ్రీవసిష్ఠ మహర్షి :

రామ! రామ! మహాబాహో! మహా పురుషా! చిన్మయా!
నాయం విశ్రాంతి కాలోహి, లోకానందకరో భవ ॥

ఓ రామచంద్రా! రామయ్యా! హే మహాబాహో! చిన్మయ స్వరూపుడగు ఓ మహాపురుషా! ఇది లోకములను మరచి ఆత్మయందు విశ్రాంతి తీసుకుని ఉండే సమయం కాదయ్యా! ఈ లోకాలన్నీ తమ బాధనుండి విముక్తి పొందటానికి నిన్ను శరణువేడుచున్నాయి. లే! లేచి లోకములన్నిటికీ ఆనందకారకుడవు, "రమయతేతి రామా" అయ్యే సమయమిది. ఈ లోకముల క్షేమం కొరకే గదా, నీవు అవతరించావు! ఈ లోకములకు సంబంధించిన సాత్విక సంసారము ఇంకా మిగిలి ఉన్న యోగులకు స్థిరసమాధి సమయోచితం కాదు. కాబట్టి నశ్వరములగు (కాలముచే రహితం కాబోయే) ఈ రాజ్యాది వ్యవహారములు నీవింకా కొంతకాలం నిర్వర్తించవలసియున్నది. దైవ కార్యము కొరకై అవతరించిన నీవు బాగుగా దైవకార్యము నిర్వర్తించి, ఆ తరువాత సమాధిని ఆశ్రయించి సుఖుడవై ఉండవచ్చునని నా ఈ ప్రార్థన.

❖

శ్రీవసిష్ఠ మునీంద్రుని ఈ పలుకులు రామచంద్రుని చెవులలో ప్రవేశించనే లేదు. ఆతడు అట్లే నిర్వికల్పసమాధియందు బ్రహ్మముతోటి ఏకత్వము కొనసాగిస్తూ బదులు పలకలేదు. అప్పుడు వసిష్ఠ మహర్షి కనులు మూసుకొని మనోయోగ వైభవంచేత రామచంద్రుని సుషుమ్నానాడిలో ప్రవేశించారు. సుషుమ్నానాడి ద్వారా మెల్లమెల్లగా శ్రీరామచంద్రుని హృదయంలో సమీపించి అక్కడ తన జాగృత బోధనను కొనసాగించారు. అప్పటికి రామచంద్రుని హృదయాంతరంగము యొక్క అభ్యంతర విభాగం సద్గురువగు శ్రీ వసిష్ఠ మహర్షి యొక్క మేలుకొలుపుకు స్పందించింది. మొట్టమొదట క్రమరీతిగా ప్రాణ – మనస్సులు ఆ ప్రాణాదుల బీజరూపమైనట్టి 'ఆధారశక్తి'యందు ఆవిర్భావమైనాయి. క్రమక్రమంగా ప్రకాశరూపుడగు 'జీవుడు' రూపుదిద్దుకున్నాడు. అతడు 'అహం' అను వాహనం ద్వారా ప్రాణముల సహాయంతో సమస్త నాడీ మండలములలో ప్రవేశమునకు ఉపక్రమించాడు. నెమ్మది నెమ్మదిగా అట్లు ప్రవేశించుచుండగా జ్ఞాన కర్మేంద్రియములు క్రమరీతిలో పరిపోషించబడ్డాయి.

కొద్ది క్షణములిట్లు జరిగిన తరువాత శ్రీరాముడు మెలమెల్లగా కనులు తెరిచాడు. వసిష్ఠుడు మొదలైన ముఖ్య విద్వాంసుల వైపు చూచాడు. సర్వ అభిలాషలు వర్జించియున్నవాడై, కృతకృత్యముల గురించి (నిర్వర్తించియున్న–నిర్వర్తించబోయే ఆయా కృత్యముల గురించి) కించిత్ కూడా విచారవృత్తి లేనివాడై మహర్షి వాక్యములు వినటానికి సంసిద్ధుడైనాడు. అప్పుడు 'రామచంద్రా! రామయ్యా! మహాబాహూ!' –అని వసిష్ఠ మహర్షి కొద్ది క్షణముల క్రితం పలికిన వాక్యాలన్నీ ఒక్కటొక్కటిగా అతని చెవులకు సోకాయి. "అవును. గురువాక్యములు అనుల్లంఘనీయములు కదా!" అని అనుకున్నాడు. అప్పుడు తండ్రి, బంధువులు పలుకుచున్న అభ్యర్థన వాక్యాలు కూడా విన్నాడు.

❖

శ్రీరాముడు :

న విధేః, న నిషేధస్య త్వత్ప్రసాదాత్ అయం ప్రభుః !
తథాపి తవవాక్యం తు కరణీయం హి సర్వదా॥

హే మహాత్మా! శ్రీ వసిష్ఠ మహర్షీ! మీ అనుగ్రహం చేత ఈ 'రాముడు' అని పిలువబడే జీవుడు ఎట్టి విధి – నిషేధములకు అందనివాడై స్వయంగా సాక్షాత్ ప్రభురూపుడైనాడు. అయినప్పటికీ తమ వాక్యము ఎప్పటికీ అనుసరణీయమే!

వేదాగమపురాణేషు స్మృతిష్వపి మహామునే,
గురువాక్యం విధిః ప్రోక్తో నిషేధస్తద్విపర్యయః ॥

జీవుని క్షేమం కోరి ఏర్పడియున్న వేద-శాస్త్ర-పురాణ-స్మృత్యాదులచే 'గురువాక్యములు' పాలించటమే విధి. గురువు యొక్క అనుజ్ఞలను అతిక్రమించటం నిషేధం...' అని చెప్పుచున్నాయి కదా! కనుక మీ ఆజ్ఞ నాకు సర్వదా శిరోధార్యం.

❖

ఇట్లు పలికి సర్వాత్మకుడు, కృపానిధి అగు ఆ శ్రీరామచంద్రుడు లేచి నిలుచున్నాడు. శ్రీ వసిష్ఠ మహర్షిని సమీపించాడు. ఆయన కరచరణములను తన నుదుటితో స్పృశిస్తూ సాష్టాంగదండ ప్రణామం సమర్పించాడు. ఆ తరువాత ఒక్కసారి సభనంతా అమృత దృక్కులతో చూచాడు.

శ్రీరాముడు :

సర్వే శృణుత భద్రం వో నిశ్చయం, నః సునిశ్చితం!
ఆత్మజ్ఞానాత్ పరం నాస్తి! గురోరపి చ తద్విదః !

ఓ సర్వ సభికులారా! మీ కందరికీ శుభమగుగాక! సర్వ నిశ్చయములలో అత్యంత సునిశ్చయమైన ఒకానొక వాక్యం చెప్పుచున్నాను. వినండి. ఆత్మజ్ఞానము కంటే, దానిని ఎఱిగిన సద్గురువు కంటే ఉత్తమమైనది ఈ ప్రపంచంలో ఏదీ లేదు. ఉండబోదు.

అప్పుడు సభలో వేంచేసియున్న సిద్ధులంతా ఒక్కసారి నిలబడి శ్రీరామచంద్రుని మహిమను గానం చేశారు.

సిద్ధులు : ఓ వసిష్ఠ రామచంద్రులారా! మీ అనుగ్రహంచేత ఈ సభలో పాల్గొన్న మేమంతా 'ఆత్మభావన' అను మహత్తర స్థితిని పొందాం. తమ సంవాదం కొనసాగుచుండగా అది వాక్కుతో ప్రకటించలేనంతగా దృఢత్వం పొందింది. ఓ రామచంద్రా! మీ ఈ అవతారము అనేకమంది భక్తజనులకు మోక్షమార్గమై వెలుగొందుగాక! మీకు సర్వదా శుభమగుగాక! మీ కర-చరణ స్మరణము యుగయుగాలుగా భక్త జనులకు కొంగు బంగారమై, మోక్షమార్గ సౌలభ్యమై, ధైర్య-స్థైర్య ప్రసాదితమై తేజరిల్లునుగాక! క్రూరస్వభావులగు అనేకమంది రాక్షస జనులు తమ క్రౌర్యమును రామబాణమునకు సమర్పించి పవిత్రులగుదురుగాక!

ఇట్లు అనేక స్తోత్రములు చేస్తూ రామచంద్రునిపై, సద్గురువగు వసిష్ఠునిపై పూలవర్షం కురిపించారు.

❖

ఓ భరద్వాజా! ఈ విధంగా నిర్వాణ ప్రకరణ పూర్వార్ధ కథనమంతా నీకు తెలియజేశాను.

శ్రీరామచంద్రుని ఉద్దేశించిన సిద్ధమునియగు వసిష్ఠ మహర్షి ప్రవచితమైన వచనసమూహమగు రత్నమాల విచిత్రమైన ప్రభావం కలిగియున్నది. ఇది సమస్త కవికులమునకు, యోగులకు సేవించుటకు యోగ్యమైయున్నది.

పరమ గురువు యొక్క కటాక్షం చేత ఇది పఠించువానికి సులభమైన మోక్షమార్గమై పరిఢవిల్లుగాక!

య ఇమం శృణుయాత్ నిత్యం విధిం రామవసిష్ఠయోః
సర్వావస్థోపి శ్రవణాన్ ముచ్యతే, బ్రహ్మ గచ్ఛతి॥

ఎవరీ, 'శ్రీ వసిష్ఠ – శ్రీరామచంద్రుల సంవాదము'ను ప్రతిదినం శ్రవణం చేస్తారో, శ్రవణమాత్రంచేత అట్టివారి రాగాది సర్వదోషములు అతి సులభంగా తొలగుతాయి. ఎట్టివారైనా, ఏ తరగతి వారైనా సరే, సర్వ దోషములనుండి విడివడి శాంతి మొదలైన ఉత్తమ గుణములు ప్రాప్తించుకున్నవారై బ్రహ్మమే తమ స్వరూపంగా దర్శనానుభవం పొందగలరు.

❖❖❖

శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః ॥

శ్రీ వసిష్ఠ - విశ్వామిత్ర - వాల్మీకి - నారదాది మహర్షయో, మహానుభావో న తామః ॥

❖❖❖

రఘునాథాయ నాథాయా సీతాయాః పతయే నమః

శ్రీ వసిష్ఠ - రామ సంవాదము

నిర్వాణ ప్రకరణం

(ఉత్తరార్ధం)

I. ఉత్తరార్ధ ప్రథమ విభాగ ప్రకరణ పరిచయము

1. సంకల్పరాహిత్యము

శ్రీరాముడు : హే వసిష్ఠ మహర్షీ ! ముముక్షువ్యవహార - స్థితి - ఉపశమన - నిర్వాణ (పుర్వార్ధం) ప్రకరణాల వరకు మీరు మహత్తరమైన ఆత్మనిర్వచన సంబంధమైన అనేక విశేషాలు మాకు ప్రబోధించారు. మీ ప్రవచనం మహాద్భుతమైనదనటంలో సందేహమే లేదు.

మీ అమృతవాక్కులు ఇంకా ఆస్వాదించాలని, మోక్షసాధకులగు మహనీయుల మరికొన్ని కథన విశేషాలు వినాలని మా ఉత్సుకత మరింతగా కొనసాగుచూనే ఉన్నది. మన ఈ సంవాదము మరిన్ని తాత్త్విక విశేషాలు లోకములకు ప్రకటించటానికి వీలుగా కొన్ని ప్రశ్నలతో ప్రారంభించితే బాగుంటుందని నా మనవి.

శ్రీ వసిష్ఠ మహర్షి : మంచిది. అట్లే అగుగాక !

శ్రీరాముడు: ఈ జీవుడు బ్రహ్మానందానుభూతికి అర్హత సంపాదించుకోవటానికిగాను రెండు అతి ముఖ్యమైన సందేశాలు మాకు గతానుగతంగా ప్రసాదిస్తూ వచ్చారు- 1.నైష్కర్మ్య సిద్ధి; 2.అహంకార కల్పనా త్యాజ్యం...

అయితే మహర్షీ! "నైష్కర్మ్యము (Non Activity)" చేతను, దేహాదులందు ఏర్పడే అహంకార కల్పనను త్యజించటంచేతను ఈ దేహం శీఘ్రంగా నేలవ్రాలే అవకాశం లేదంటారా? అట్లా అయితే జీవించటం అనునది ఎట్లా సిద్ధిస్తుంది? అట్టి సిద్ధి-త్యాజ్యము ఆశ్రయించినవాడు అనివార్యమగు లోకవ్యవహారములు నిర్వర్తించటం ఎట్లా? జీవిస్తూ ఉండగా వ్యవహార త్యాజ్యం - కల్పనాత్యాగం అనేది కుదురుతాయా? కుదిరినప్పటికీ లోకవ్యవహారం దృష్ట్యా అది ఉచితమే నంటారా? కల్పనాత్యాగికి జీవితం దుర్భరం కాదా?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా ! జీవించే వానికే కల్పనలు అనేది ఉంటుంది. జీవించనివానికి కల్పనలనేది ఏం ఉంటుంది? కాబట్టి జీవించువానికే కల్పనాత్యాగం అనేది తగుతుంది.

అయితే... అ అహంభావ కల్పన గురించి ముమ్ముందుగా ప్రస్తావించుకుందాం, విను.

పరిచ్ఛిన్నమైన ఈ దేహదులపట్ల "ఈ శరీరమే నా స్వరూపం" అను అభిప్రాయం కలిగి ఉండడం "అహంభావన" అని చెప్పబడుతూ ఉంటోంది. ఒకడు తనపట్ల తదితరులపట్ల కూడా అపరిచ్ఛిన్నమగు బ్రహ్మ భావన నిర్వర్తిస్తూ ఉంటే అది "కల్పనాత్యాగం" అని అంటున్నారు. అదియే, "నిరహంకారం" కూడా! కల్పన గురించి పరిశోధించియున్న విజ్ఞులు "పరిచ్ఛిన్నమైనట్లు కనిపిస్తున్న

ఈ వేరువేరు దేహులను చూస్తున్నప్పుడు – నేను వేరు, అతను వేరు, నీవు వేరు – అను రూపంలో ఉండే పరిచ్ఛిన్న భావనను ఆశ్రయించటమే అహంకారం. అంతటా ఏకమైయున్న బ్రహ్మాకాశము యొక్క సత్తాను భావించుటను "కల్పనాత్యాగం" అని అంటున్నారు.

సంకల్పము అంటే దేహము మొదలైన పరిచ్ఛిన్నమైన దృశ్యవస్తువులను చూస్తున్నప్పుడు "ఈ కనబడే రీతిగా ఇవన్నీ సత్యమే" అను రూపమైన అభిమానము.

సంకల్పత్యాగం అంటే ఈ కనబడే వస్తువులు, దేహాలు పంచభూతాల వికారమేకదా? కాబట్టి వేరు – వేరు అనబడేదంతా సత్యం కాదు. సమస్తము బ్రహ్మాకాశమాత్రమే ...అనే ఎఱుక కలిగి ఉండటం. ఇంకొక విధంగా చెప్పాలంటే... పదార్థాల పట్ల ఏర్పడే అనురాగపూర్వకమైన స్మరణయే సంకల్పము. అట్టి స్మరణ (లేక, విషయ చింతన) లేనప్పుడు, ఆ స్థితిని "మోక్షం" అని పిలుస్తున్నారు.

ఈ 'స్మరణ' అనేది ఇతఃపూర్వం చూచిన–చూడని, అనుభవించిన–అనుభవించని విషయాల పట్ల కూడా ఏర్పడి ఉండటం జరుగుతోంది. అట్లా అనుభవించిన–అనుభవించని... ఉభయ విషయాలను అటుండనిచ్చి, బ్రహ్మం కంటే అన్యమైన సమస్త వృత్తులను శీఘ్రంగా విస్మరించి, బ్రహ్మంనందే లీనుడై ఉండేవాడు 'మోక్ష స్వరూపుడు' అగుచున్నాడు. కనుక ఓ రామచంద్రా! అంతరంగంలో సర్వదృశ్యవ్యవహారములూ, వాటి–వాటి ఏక–అనేకత్వాదులు విస్మరించి ఉండు. అయితే ఇక ఈ అవశ్యం నిర్వర్తించివలసి ఉన్న కార్యక్రమాల విషయ మంటావా? సగం నిద్రిస్తున్న బాలునివలె బ్రహ్మమునకు అనన్యమగు భావనతో అంతర్వృత్తులను ఆయా పనులలో ఉపయోగించే ఉపకరణములవలె గమనిస్తూ ఉండు. నీవు దేనికీ కారణం కాకుండానే, ఆయా వృత్తులే నిర్వర్తించ బడే క్రియాదులకు కారణమై ఉండుగాక! నీవు వాటికి కారణం కావద్దు. సంస్కారములకు కూడా ఆవల గల నీ స్వస్వరూపం అవధరించి ఉండటం అభ్యసిస్తూ ఉండు. కుమ్మరివాని చక్రం ఎట్లా తిరుగుతుందో అట్లే సంస్కారాలు జగత్క్రియలను నిర్వర్తించునుగాక! నీవు ఆ సర్వక్రియలకు సర్వదా అతీత్వం వహించి ఉండు. వాసనారహితుడవై నిర్మల చిత్తమును సంతరించుకున్నవాడవై, ఆ నీ చిత్తం యొక్క ఒక అల్ప విభాగమును ఒక పరికరమాత్రంగా గ్రహించి ప్రవాహ పతితములగు ఆయా కార్యాలను నిర్వర్తించు. ఎచ్చటైతే సమస్త బ్రహ్మాండం యొక్క ఆధిపత్యం కూడా తృణ ప్రాయంగా (గడ్డిపరకతో సమానంగా) గోచరిస్తుందో...అట్టి పరమపదం సంకల్పరహితుడవై ఉన్నంత మాత్రంచేతనే లభించగలదని గుర్తు చేస్తున్నాను.

"సంకల్పరహితుడనై ఉంటే ఈ ప్రపంచంలో ఆయా క్రియలు నిర్వర్తించటమెట్లా?"...అని ఎవరైనా అనుకుంటారేమో! ఓ జనులారా! ఒక బాటసారి కాళ్ళు ప్రత్యేకమైన సంకల్పం లేకుండానే వెళ్ళాలనుకున్న చోటువైపుగా బాటలో అడుగులు వేయటం లేదా? అట్లాగే ఎవరైనా సరే... ప్రవాహ పతితములగు ఈ జగద్వ్యవహారాలన్నీ కూడా సంకల్పరహితంగానే నిర్వర్తించవచ్చునని నా మనవి.

జాగ్రత్తులో కొంతవరకు సంకల్పితంగా ఊపిరి పీలుస్తున్నావు. మరి స్వప్న దశలోనో?... అసంకల్పితంగా ఊపిరి పీలుస్తున్నావు కదా! "అట్లాగే నా ఇచ్ఛచే నేను జీవిస్తున్నాను. ఇచ్ఛచే

కర్మలు నిర్వర్తిస్తున్నాను" ...అనే ధ్యాసను శాంతమునందు లయం చేసివేయి. అసంకల్పితంగా కల్పనారూపమగు ఈ దృశ్య జగత్తు నందు క్రీడగా – లీలగా విహరించు.

ఒక గడ్డిమొక్క ఉన్నది. అది స్వతహాగా ఎట్టి సంకల్పము లేకుండానే గాలివాటుకు కదలి ప్రక్కమొక్కలతో సంయోగ వియోగ చేష్టలు నిర్వర్తిస్తోంది కదా! అట్లాగే రామచంద్రా! నీవు కూడా సంకల్పరహితుడవై, సుఖ దుఃఖములకు సంబంధించిన ఎట్టి భావన చేయకుండానే ప్రవాహపతిత కార్యములను నిర్వర్తించమని మరల గుర్తుచేస్తున్నాను. తోలుబొమ్మలాటలో తోలుబొమ్మలు తమయందు ఎట్టి రస వికారాలు లేకుండానే ప్రేక్షకులకు మాత్రం శృంగారం మొదలైన భావనలను కలుగజేస్తున్నాయి చూచావా? అట్లాగే ఈ అవశ్య కర్తవ్యాల పట్ల – అంతరంగంలో శృంగార–సుఖ –దుఃఖాది రసభావనలు పెంపొందించుకోకుండానే లోకానుకూలంగా, సందర్భానుకూలంగా వ్యవహరించు. ఈ జగత్తును ఒక గొప్ప, సుదీర్ఘ నాటక సన్నివేశంగా ఆస్వాదించు.

ఊర్ధ్వబాహుః విరౌమ్యేష! న చ కశ్చిత్ శృణోతి మే ।
అసంకల్పః పరంశ్రేయః! స కిమ్ అంతర్ న భావ్యతే ॥

నేను చేతులెత్తి ఊర్ధ్వ స్వరంతో ప్రకటిస్తూ ఉన్నప్పటికీ ఈ జనులు నా ఈ వాక్యాలు ఎందుకో తగినంతగా వినిపించుకోవటమే లేదే! ఎట్టి సంకల్పములు ప్రవేశించనీయకుండా అంతరంగమున మౌనం వహించి ఉండటమే పరమశ్రేయోదాయకమగు స్థితి. అట్టి సంకల్పరాహిత్యాన్ని అంతరంలో ఎందుకు భావన చేయరాదు చెప్పు? ఆహా! ఈ మోహం యొక్క గొప్పతనం ఏమని చెప్పాలి? సర్వ దుఃఖాలను హరించగలిగినట్టి ఆత్మ విచారణ అను చింతామణిని ప్రతి ఒక్కరు తమలోనే ఉంచుకొని అద్దానిని వదలి ఈ జనులు సంకల్పాలలో ప్రవేశించి అనేక ఉపాధులతో గొప్ప సంచారం చేస్తున్నారే!

దృశ్య–దర్శన రహితమగు ఆత్మతత్త్వమే 'అసంకల్పం' అను దాని రూపం. అట్టి సంకల్ప రహితమగు స్వస్వరూపంతో తన్మయులై ఉండటం మాత్రంచేత పరమశ్రేయస్సు లభించగలదని ప్రకటిస్తున్నాను. అట్టి ఆత్మీస్థితి ఎవరికి వారే సముపార్జించుకోవాలి గాని, ఆ అనుభవం ఒకరికి మరొకరు ఎట్లా అందించగలరు? శాస్త్రములు – గురుస్థానమున గల మేము అట్టి అంతర అసంకల్ప సామ్రాజ్యమును గుర్తుచేస్తున్నాము. అంతవరకే మా పాత్ర!

అందుచేత రామా! నిద్రిస్తున్నవానికి జగత్ లేనట్లు సర్వకర్మఫలముల పట్ల పూర్ణమగు ఉదాసీనతను అంతరంగంలో వహించి అటుపై ఆయా ప్రవాహపతిత కార్యములను నిర్వర్తించేవానికి ఈ 14 లోకాలు ఆటవస్తువు వంటివి అవుతాయి. ఓ రామచంద్రా! సమస్త ఇంద్రియ విషయాలు నీకు రసరహితంగా కన్పట్టుగాక! హేమంత ఋతువులో పూతీగ ఉంటుంది గాని పూలు పూయవు చూచావా? అట్లా ఇవన్నీ ఆకార మాత్రాలేనని నీచే గ్రహించబడుగాక! నీవు జ్ఞాన సూర్యుని ఆశ్రయించి జ్ఞాన రసం మాత్రను ఆస్వాదించు. ఇక ఈ నీ యొక్క – తదితరుల యొక్క శరీరాల విషయమేమిటంటావా? యంత్రపుబొమ్మలు భావాభావాలు లేకుండా కదులుతాయి. చూచావా? ఈ దేహాలు కూడా ఆయా వివిధ "భావాభావ–గుణ–నిర్గుణ" మిశ్రమాలచే తయారుచేయ బడుచున్నాయి.

1. పంచకోశాలలో (అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ) ప్రతిబింబించే చిదాభాసుడు,
2. పంచప్రాణములు – మనస్సు (ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన – సప్రాణములు),
3. జ్ఞానేంద్రియ వర్గము (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు),
4. కర్మేంద్రియ వర్గము (చెవులు, చర్మము, కళ్ళు, నోరు, ముక్కు),
5. అంతఃకరణచతుష్టయం (మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము),
6. శరీర వర్గము (స్థూల, సూక్ష్మ, కారణ శరీరములు)...

ఈ ఆరు మిశ్రమాలతో తయారయిన సమ్మిళిత వస్తువే ఈ దేహము.

ఈ ఇంద్రియాలు స్వభావసిద్ధంగా బాహ్యరసాస్వాదనమునందు ప్రవృత్తములై ఉంటున్నాయి కదా! వీటిని జీవుని యొక్క ఉనికికే కారణమై ఉన్న భూమానందరూప చైతన్యరసంచే నింపి ఉంచాలి. బ్రహ్మానందమే ఈ సర్వరూప దృశ్య ప్రదర్శనంగా అనుక్షణికంగా ఆస్వాదించాలి.

శ్రీరాముడు: మహర్షీ! ఈ ఇంద్రియాలు స్వభావ సిద్ధంగా ఆయా విషయాలందు ప్రవేశిస్తూనే ఉంటాయి. కదా! కనులు చూస్తునే ఉంటాయి. చెవులు వింటూనే ఉంటాయి. విషయభోగాలు కూడా ఈ జీవుని ఏదో రూపంలో తప్పక సమీపిస్తునే ఉంటాయి. మరి విషయ రాహిత్యమనేది జీవించి ఉన్నంత వరకూ ఎట్లా కుదురుతుంది ?

శ్రీ వసిష్ఠ మహర్షి: అవును. దేహమంటేనే ఇంద్రియాలు – ఇంద్రియ విషయాలు. అయితే "ఇంద్రియాలను స్వయత్నం చేత ఇంద్రియవిషయాల నుండి నివారించటం" అనగా ఏమో వివరిస్తాను. సూక్ష్మగ్రాహివై విను–

ఇంద్రియములను ఇంద్రియ విషయములపై వినియోగించు సందర్భంలో 'ఇష్టం – అయిష్టం' అనే రూపంలో ఒకానొక 'వృత్తి' అంతరంగంలో ఏర్పడుతుంది. ఆ వృత్తియే క్రమంగా (అనేకసార్లు ఇష్టం కలిగి ఉండటంచేత) 'యా వృత్తి' (Habituated Avocation) గాను, సంస్కారాలుగాను, చిత్త ప్రవృత్తిగాను రూపుదిద్దుకొంటోంది. కనుక ఇంద్రియ జన్యమైన విషయరసమునందు నీవు 'వృత్తి' (లేక) 'అనురాగం' కలిగి ఉండకపోతే... ఇకప్పుడు నీవు విషయభోగం పొందినా, పొందకున్నా సంసారం యొక్క అనర్థం నీ పట్ల శమించియే ఉంటుంది. వృత్తి యొక్క ఉత్పత్తి స్థానం 'సంకల్పం' అయి ఉన్నది. కనుక సంకల్పరహితుడవై, ప్రసరిస్తున్నప్పుడు తారసపడే వస్తువుల పట్ల వాయువు ఎట్టి భావన పొందనట్లు, దహిస్తున్నప్పుడు అగ్ని ఎట్టి ఇష్టాయిష్టములు పొందనట్లు, యంత్రం పని చేస్తున్నప్పుడు లాభాలాభాల ప్రవృత్తి కలిగి ఉండనట్లు, జలం ఎట్టి భావవికారాలు పొందనట్లు, నీవు కూడా ఉండు. ఈ జీవుడు ప్రవాహపతిత కర్మలందు అధ్యస్తమై ఉన్నప్పుడు "నేనే వీటికి కర్తను" అను రూపంలో ఉండే కర్తృత్వ వాసన లేకపోవటమే 'జన్మ' అనే జ్వరానికి గొప్ప నివారణోపాయమై ఉన్నది. "నేను జన్మించువాడను" అను భ్రమ తొలగాలంటే జన్మలకు అతీతం – అప్రమేయం అగు స్వస్వరూపం ఆస్వాదించాలంటే "కర్తృత్వభ్రమ" ముందుగా తొలగాలి.

ఓ ప్రియ జనులారా! మీలో ప్రతి ఒక్కరు "విషయరస – అనురాగ నివృత్తస్థితికి సర్వదా అర్హులే! వాసనారహితులై సంకల్పవర్జితులై ఒక చక్రం వలె భ్రమణం పొందుతూ ఆయా వస్తువులను తాకుచున్నట్లు నిజకర్మలందు చేష్టలను సల్పుచూనే మెల్లమెల్లగా కర్మఫలం నందు గాని, కర్మఫల త్యాగం నందు గాని ఆసక్తి ఉండకుండు గాక. కర్మలను త్యజించండి, లేక ఆశ్రయించండి. అయితే ఆసక్తిని త్యజించండి. కర్మఫలాసక్తి లేనప్పుడు కర్మలను త్యజించినా, ఆశ్రయించినా అందులో మీ పట్ల విశేషమేమీ ఉండదని గ్రహించండి.

బహునాత్ర కిముక్తేన, సంక్షేపాత్ ఇదమ్ ఉచ్యతే ।
సంకల్పనం మనోబంధః! తదభావో విముక్తతా ॥

ఈ విషయమై మనము పెద్దగా చెప్పుకోవాల్సిన పనేమీలేదు. సంక్షిప్తంగా ఒక్కమాట చెప్పుచున్నాను, విను– సంకల్పమే మనస్సు యొక్క బంధం. అట్టి సంకల్పం లేకపోవటమే ముక్తి.

నేఽహకార్యం, న వా అకార్యమస్తి కించిన్, న కుత్రచిత్
సర్వం శివమ్, అజమ్, శాంతం, అనంతం ప్రాగ్వదాస్యతామ్ ॥

ఈ ప్రపంచంలో ఎక్కడాకూడా "చేయతగినది – చేయతగనిది"...అంటూ ఏదీ లేదు. ఎందుకంటే ఈ సమస్తం శివమై – అజమై – శాంతమై – అనంతరూపమైనట్టి బ్రహ్మరూపమే అయి ఉన్నది కదా! కాబట్టి ఓ రామచంద్రా! ఈ జగత్తు నీ పట్ల ఏర్పడక ముందే ఏ విధంగా ఆత్మ స్వరూపుడవై ఉన్నావో ఇప్పుడు కూడా అట్లే ఆత్మారాముడనై నిరభ్యంతరంగా సర్వత్రా స్థితి కలిగి ఉండు. సమస్త కర్మలందును నిష్క్రియమగు బ్రహ్మతత్త్వమును గాంచు. నిష్క్రియమగు బ్రహ్మము నందే ఈ అవశ్యకర్తవ్యములన్నిటినీ గాంచుచుండు. యథార్థచిద్రూపుడవై శాంతముగను, శివ రూపముగాను సుఖస్వరూపుడవుగాను సర్వత్రా ఏర్పడి ఉండు.

❖❖❖

2. 'యోగం' అంటే ఏమిటి ?

దృశ్య–దర్శనాతీతమగు ఆత్మతత్త్వమును అనుసంధానం చేయటమే 'యోగము' అను శబ్దము ఉద్దేశిస్తున్నదని గ్రహించు. అదియే 'స్వాభావికం – అకృత్రిమం' అగు చిత్తక్షయం కూడా! కాబట్టి ఆత్మయందు ఎప్పటియట్లే తన్మయుడవై ఆత్మారాముడవై వెలయుము. ప్రతిఒక్క జీవుని ఆత్మరూపం సమమై, శాంతమై, శివమై, సూక్ష్మమై, ద్వైతైక్య వర్జితమై, సర్వవ్యాపకమై అనంతమై, సమస్తమై, సమస్తానికి పరమై పరమశుద్ధమైయున్నది. అట్టి ఆత్మరూపమునకు ఎవడు, ఎచ్చట, ఎట్లా భేదాన్ని ఆపాదించగలడు? ఓ రామచంద్రా! ఎడారి ఇసుకలో గడ్డి మొలుస్తుందా? అట్లాగే నీ నిర్మల ఆత్మ స్వభావంలో 'సంకల్పం' అనునది ఉదయించదు. ఒకవేళ ఉదయించినా అది లీలా (క్రీడా) మాత్రమే.

'ఇచ్ఛ' (అభినివేశం) ఉన్నప్పుడే సంకల్పం ఉన్నట్లని గ్రహించు. సంకల్పరహితుడగు శాంత పురుషుడు తాను జీవించుచుండటంచేతగాని, జీవించకుండుటచేతగాని, ఈ ప్రపంచంలో ఏదైనా

కార్యం నిర్వర్తించుట చేతగాని, నిర్వర్తించకుండుట చేతగాని ఎట్టి ప్రయోజన - నిష్ప్రయోజనాలనూ గాంచడు. నీ అంతఃకరణము "ఇది కర్మ - అది అకర్మ" అనే ఉభయభావాలు శమించి ఉండును గాక! అనివార్యములగుచున్న ఉభయ స్థితుల పట్ల నిరంతరం 'ఆత్మానుభవము' అనే అభేదస్థితిని నీ అంతరంగము సంతరించుకొనుగాక! ఆత్మారాముడవగు నీకు కర్మ - కర్తృత్వము - భోక్తృత్వము - అకర్మ ...ఇవేవీ ఆపాదించబడజాలకుండును గాక !

ఓ రామచంద్రా! ఎవరికైనా సరే, ఈ దేహాదులందు "అహం - మమ " అనే అభిమానం ఉన్నదా... ఇక ఆ జీవుని దుఃఖాదులు తొలగే అవకాశమే లేదు. దేహాదులందు ఆత్మాభిమానం లేని వాడు ముక్తికి అత్యంత వేగంగా అర్హుడగుచున్నాడు.

ఓ సర్వజనులారా! ఇట్లు 1.దేహాభిమానం, 2.దేహాభిమానరాహిత్యం... అను ఈ రెండిటిలో మీకు ఏది శ్రేయోదాయకమో పరిశీలించి ఆపై అద్దానిని ఆశ్రయించవలసినదిగా నా మనవి. అసలు ఈ అహం, మమ అనేవి మొదలే లేవని గ్రహించండి. లేని దానిని పట్టుకుని వ్రేలాడడం అనుచితం కాక మరేమిటి? ఏదైతే ఉన్నదో... అది కేవలం పరమశివ రూపమై ఉంది. ఎందు కంటారా... ఆనందఘనమైనట్టి శివరూపమగు పరమాత్మ కంటే భిన్నంగా ఏదైనా దృశ్యం కనిపిస్తుంటే అదంతా అవస్తువే సుమా! ఆభరణం కంటే బంగారం వేరా? ఈ కనబడే జగత్తంతా కూడా ఆత్మకు భిన్నమైన అనుభవం పొందకపోవడమే దీని యొక్క నాశనం (లేక) ఉపశమనం. అట్లు జగత్తు (దృష్టి యందు) రహితమైనప్పుడు శేషించేదేదైతే ఉన్నదో... అదియే పరమార్థమగు సత్య స్వరూపమై ఉన్నది.

❖❖❖

3. కర్మ అంటే ఏమిటి

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ద్వైత-ఏకత్వ రహితం, మనన వర్జితం, పరమ శాంతం... అయినట్టి ఆత్మయే ఈ జగద్రూపంగా నెలకొని ఉన్నది. మట్టి బొమ్మలన్నీ తయారయినది మట్టితోనే కదా! అట్లాగే ఈ జగత్తంతా శివమయమే అయి ఉన్నది. ఈ కాల-ఆకార-క్రియ-శబ్ద-శక్తి సందర్భ సహితమగు మనో బుద్ధి చిత్త అహంకారాలుగా కనబడేదంతా కూడా చిన్మయమే అయి ఉన్నది.

శివపంకమయా ఏవ రూపాలోక మనః క్రమాః ।
తన్మయత్వాత్ అనంతత్వాత్, అతః కిం కేన చేత్యతే ॥

బొమ్మలన్నీ ఒకే మట్టిచే తయారుచేయబడి ఉండగా, ఇక ఆ బొమ్మలలో - శత్రు సైన్యం, మిత్ర సైన్యం, రాజు, మంత్రి, ఆయుధం, ఏనుగు... ఈ భేదాలన్నీ ఎక్కడున్నాయి ? ఈ కనబడే దంతా శివం అనే ఒకే మట్టితో తయారుచేయబడింది. ఇదంతా కూడా శివమయమై అనంత చిద్రూపమై వెలయుచుండగా, ఇక ఇందులో రూపం, ఆ రూపం యొక్క ఆలోకనం (చూడబడేది, చూచేది) ఆలోకనం చేయు మనస్సు... ఇవన్నీ ఎక్కడున్నాయి? ఏది దేనిని ఎట్లా చూస్తుంది? ఓ

రామా? ప్రమాత ప్రమేయము, ప్రమాణము 1. తెలుసుకునే ఆయన, 2.తెలియబడేది, 3.దేనిచేత తెలియుచున్నదో, అయ్యది... ఈ మూడు కూడా శివపంకమయములే. (పంకము అంటే మట్టి, మూల పదార్థం). అంతే కాదు. ఈ కనబడే దేశ-కాలాలు, దిక్కులు, ఇక్కడి భావ-అభావ వివర్తాదులు... ఇవన్నీ శివతన్మయములేనయ్యా! అందుచేత ఇక్కడ గాని, మరెక్కడ గాని సారభూత మైనది పరమేశ్వరుడు (శివం, లేక ఆత్మతత్త్వం) మాత్రమే!

అహం మమేత్యతః సారాన్నే౽తరత్ పరమేశ్వరాత్ ।
అసంసక్తమతిస్తిష్ఠ హే, శిలోదరమౌనవత్ ॥

అందుచేత ప్రియ రామచంద్రా సారభూతమైన పరమేశ్వరుడొక్కడే ఉన్నాడు. అతనికి భిన్నంగా "నేను – నీవు" మొదలైన వివర్తములేవీ లేనే లేవు. అందుచేత నీవు వీటన్నిటి పట్ల అసంసక్తమగు బుద్ధిని పెంపొందించుకొని, అటుపై శిలయొక్క అంతరాంతర విభాగం వలె పరమ మౌనం వహించి ఉండు. అంతేగాని, స్వతఃగా లేనివానిని పట్టుకొని వ్రేలాడనే వద్దు.

శ్రీరాముడు:

అహం-మమ ఇతి అసద్రూపం జ్ఞాస్యా భావయతః, ప్రభో ।
అశుభం కర్మణాం త్యాగాత్, అనుష్ఠానాచ్ఛ కిం శుభమ్ ॥

హే ప్రభూ! జ్ఞాని అనగా ఎవరు? ఏది ఉచితమో ఏది అనుచితమో ఏది నిర్వర్తించాలో, ఏది నిర్వర్తించకూడదో తెలిసియున్నవాడు కదా!

శ్రీ వసిష్ఠ మహర్షి : ఊ !

శ్రీరాముడు: "ఈ అహం – మమ (నేను – నాది)" ఇత్యాది దృశ్య సమూహాలన్నీ అసద్రూపమే అని ఎఱిగిన జ్ఞానికి త్యజించవలసిన అశుభ కర్మలేమి ఉంటాయి? నిర్వర్తించవలసిన శుభకర్మలేమి ఉంటాయి? ఎందుకంటే "నేను – నావి అనేవే లేవు"...అని కదా అతని అవగాహన? మీ ఉద్దేశంలో శుభకర్మలు, అశుభ కర్మలు లేవనా?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓహో! "ఉచిత-అనుచిత కర్మలు ఉన్నాయా, లేవా?" అనా నీ ప్రశ్న? అయితే నిన్ను కర్మల విషయమై కొన్ని ప్రశ్నలు అడుగుతాను. నీ అనుభవాన్ని, అవగాహనను దృష్టిలో ఉంచుకొని నీవు ఏమని అనుకుంటున్నావో అది సమాధానంగా నీకు ఏమి అనిపిస్తే అది చెప్పు.

1.'కర్మ' అంటే ఏమిటి? 2.కర్మ అనునది ఎంతవరకు విస్తరించియున్నది? 3.కర్మ అనబడేదాని మూలమేమిటి? 4.కర్మ అనబడుదాని యొక్క ఏ విభాగము నిపుణతతో నశింపజేయవలసియున్నది? 5.అట్టి నశింపజేయవలసిన అంశమేదైతే ఉన్నదో... అద్దానిని నశింపజేయటానికి నీ ఉద్దేశంలో ఉపాయాలేమిటి ?

శ్రీరాముడు: వైద్యుడు అడిగే ప్రశ్నలన్నిటికి రోగి తన అనుభవములన్నీ సత్యముగా చెప్పితేనే ఉత్తమ ప్రయోజనం కదా! మీ రడిగిన ప్రశ్నలకు నాకు ఏమని తెలియవస్తోందో... అది సమాధానంగా చెపుతాను, వినండి.

ఏదైతే (ఏ కర్మ వ్యవహార విభాగమైతే) నిపుణతతో నశింపజేయవలసియున్నదో అద్దానిని మూలఛేదంగా నశింపజేయాలేగాని, కొమ్మలు మాత్రమే నరికితే ఏం ప్రయోజనం? మరల అది ఎప్పుడో చిగురుస్తుంది కదా!

బుద్ధిమంతుడైనవాడు తన యొక్క శుభ - అశుభ కర్మల రెండిటినీ (ద్వంద్వమును) నశింపజేసుకోవలసియున్నదని నా అభిప్రాయం. అసలీ కర్మలయొక్క మూలమెక్కడ ఉన్నదో కనిపెట్టి ఆ మూలమునే నశింపజేయాలి. అయితే, దేని యొక్క ఏ మూలమును ఛేదించుటచే ఈ కర్మ వృక్షము మరల చిగురించదో.... అట్టి కర్మమూల వ్యవహారము గురించి చెప్పుచున్నాను. వినండి.

ఈ దేహమే 'కర్మవృక్షం'గా ప్రకటితమైయున్నది. కాళ్ళు, చేతులు మొదలైన ఆయా అంగాలు అనే లతలతో ఇది శోభిస్తుంది. ఈ దేహం సంసారం అనే ఒక మహారణ్యంలో చిక్కుకుని ఉన్నది. ఈ దేహం వల్లనే జీవునకు సుఖదుఃఖాలన్నీ కలుగుచున్నాయి. ఈ దేహ వృక్షమునకు కర్మయే బీజం. ఈ దేహవృక్షం యొక్క ఫలములే సుఖ-దుఃఖములు. ఇది క్షణికమగు యౌవనంతో భాసిస్తూ చివరికి 'ముసలితనం' అనే నిస్సహాయ భూములకు నడిపిస్తోంది.

కోతి చెట్టు ఎక్కి ఆ వృక్ష సౌందర్యమునంతా నాశనం చేస్తుంది చూచారా? అతి భయంకర మైన 'కాలం' అను రూపం గల మర్కటం ఈ దేహవృక్షాన్ని ఆశ్రయించి దీని ఈకృతిని నిమిష నిమిషానికి ధ్వంసం చేస్తుంది. ఆలోచనలే ఈ దేహవృక్షపు చిగుళ్లు. నిద్ర, ఆ నిద్రలో కలలు గనటం... ఇవి కూడా ఈ దేహవృక్షమునకు ఆకులు వంటివే!

ఈ దేహము 'జగత్తు' అనే ఒక మహారణ్యంలో జన్మించింది. "భార్య-భర్త-కొడుకులు-తదితరులగు అయినవాళ్లు-కానివాళ్ళు"... అనబడే సంబంధాలే ఈ దేహవృక్షం ప్రక్కన మొలచిన గడ్డి మొక్కలు. అట్టి ఈ దేహవృక్షము 'ముసలితనం' అనే శిశిర ఋతువులో తన ఆకులతో సహా నేలకూలుతోంది. ఈ కాళ్ళు- చేతులు దీని పల్లవాలు. లోనగల నాడులు-ప్రేగులు-ఎముకలు-రక్తం... ఇవన్నీ వృక్షం యొక్క వ్రేళ్ళు మొదలైన అంతర్విభాగాల వంటివి. ఈ గోళ్ళు-జుట్టు మొదలైనవన్నీ కోసినప్పటికీ మరల చిగురించే వృక్షపు లేపూత వంటిది.

కర్మప్రవాహ పరంపరయే ఈ దేహరూపంలో వికసితమగుచున్నది. కర్మేంద్రియాలే ఈ దేహ వృక్షపు మూలాలు. ఆ కర్మేంద్రియాలు దేహంలో ప్రవేశించే అన్నరసం చేత ప్రవృద్ధమవుతున్నాయి.

అయితే ఈ కర్మేంద్రియాలకు మూలం జ్ఞానేంద్రియములై ఉన్నాయి. వృక్షపు వేళ్ళు ఎంతో దూరం విస్తరించి ఉంటాయి చూచారా? ఈ దేహంలో గల జ్ఞానేంద్రియాలు కూడా నిజ విషయ రూపమున ఈ దృశ్య జగత్తులోనికి, సుదూరంగా విస్తరించి ఉన్నాయి. ఆ జ్ఞానేంద్రియాలు ఒక వైపు ఈ కళ్ళు - ముక్కు - చెవులు - నోరు మొదలైన పంచేంద్రియ స్థానమును, మరొకవైపు ఈ జగద్విషయ సమూహమును ఆశ్రయించి ఉన్నాయి.

కర్మేంద్రియములకు (చెవులు, చర్మం, కళ్లు, నోరు, ముక్కు) జ్ఞానేంద్రియాలు (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు) మూలం కదా! ఇక ఆ జ్ఞానేంద్రియాలకో ? మనస్సు మూలం. ఈ మనస్సు

చేతనే ఈ జీవుడనబడేవాడు చేత్యముల వైపుగా (విషయాల వైపుగా) ఉన్ముఖుడై ఉండటం జరుగుతోంది. మరి, "అట్టి ఈ మనస్సుకు మూలస్థానం ఏమిటి?" అని పరిశీలిస్తే "చిదాభాసుడు అనతగ్గ ఈ జీవుడే మనస్సుకు మూలస్థానం"... అని తెలియవస్తోంది. మరి, చేత్యాంశమును ప్రదర్శించే ఈ 'జీవుడు' అనబడేవానికి మూలమేమిటంటారా?

ఈ చిదాభాసాంశమునకు మూలము సర్వమూలములకు ఏకైక కారణమైనట్టి బ్రహ్మమే అయి ఉన్నది. ఆ బ్రహ్మము మనోవాక్కులకు అవిషయమైయున్నది. అనంతము, శుద్ధము, సత్యము అయి ఉన్న ఆ బ్రహ్మమునకు మరొక మూలమంటూ ఏదీ లేదు.

కనుక మహర్షీ! చైతన్యము విషయోన్ముఖమైనప్పుడు ఆ విషయోన్ముఖ చైతన్యమే సమస్త కర్మలకు మూలమైయున్నది. ఆ చైతన్యం తన నుండి బయల్వెడలిన అహంకారంతో తాదాత్మ్యం పొందినదైనప్పుడు క్రియారూపమగు స్పందము బయల్వెడలుతోంది. ఆ విధంగా కర్మలు – కర్మ ఫలములు – కర్మ ఫలజనిత తదనంతర కర్మలు... ఒక దాని ననుసరించి మరొకటి గొలుసులోని కొక్కెం వలే ఏర్పడి ఉంటున్నాయి.

ఓ మునీంద్రా! సమస్త కర్మలకు ఆదియగు బీజము జీవచైతన్యమే అయి ఉన్నది. ఎందుకంటే జీవచైతన్యం ఉంటే కదా ఈ దేహం ఉండేది! దేహం ఉంటే కదా కర్మలు ఉండేవి! అట్టి ఈ జీవచైతన్యము అహంకారాదులతో కూడి "నేను ఈ కర్మలకు కర్తయగు చైతన్యమును"... అను భావంతో కూడి ఉన్నప్పుడు, అట్టి కూటమియే కర్మలకు బీజమగుచున్నది. జీవ చైతన్యం అకర్తృత్వం వహించి ఉన్నప్పుడో, అదియే పరమపదరూపమగు 'సత్తు' అయి ఉన్నది. అనగా....

1. జీవచైతన్యము 'అహంకారము' మొదలైన భావనలతో కూడుకొని ఉన్నప్పుడు అది కర్మ వ్యవహారములన్నిటికీ తానే బీజమై ఉంటోంది.

2. జీవచైతన్యము అహంకారాదులన్నిటికీ విభిన్న మైన "శుద్ధ చిద్రూప భావన" కలిగి ఉన్నప్పుడు అదియే 'పరమపదరూపము' లేక 'బ్రహ్మము' అయి ఉంటోంది.

కాబట్టి ఈ దేహాదులకు సంబంధించిన 'అహంభావం' యొక్క భావనయే కర్మలకు బీజ కారణమై ఉన్నదని నా ఉద్దేశం.

స్వామీ! ఇప్పుడు నేను చెప్పిన విశేషాలన్నీ మీరు ఇతఃపూర్వమే చెప్పియున్నారు. మీ బోధను అనుసరించే నా బుద్ధికి కూడా 'అవును కదా' అని తోచుటచే మీ ప్రశ్నకు సమాధానంగా ఇప్పుడు చెప్పటం జరిగిందని నా మనవి.

శ్రీ వసిష్ఠ మహర్షి : సరే! నీవు చెప్పినదంతా దృష్టిలో పెట్టుకొని ఈ కర్మబీజము విషయమై మరికొంత పరిశీలిద్దాం.

ఎంతవరకైతే ఈ ఉపాధి ఉంటుందో... అంతవరకు జీవ చైతన్యమునకు అహంకారము, ఆ అహంకారమును ఆశ్రయించి కర్మ వ్యవహారం ఉంటాయి కదా? కనుక దేహమున్నంత వరకు 'కర్మలు' అనేవి ఉంటూనే ఉంటాయి.

నీవు చెప్పినట్లు ఈ జీవచైతన్యం ఏ దృశ్యం వైపుగా ఎట్లు ఉన్ముఖమౌతున్నతో అది అద్దానిని అట్లే పొందుతోంది. "ఆ దృశ్యం సత్యమా, అసత్యమా? అది బాహ్యమా, అంతరమా?"అనేది ఇక్కడ ప్రశ్న కాదు. జీవచైతన్యం ఏ రూపంగా ఉన్ముఖం అయితే ఆ రీతిగా అనుభవం పొందుతోంది. దేనిని ఎట్లా భావన చేస్తే అట్లా అది పొందుతోంది, అనుభవిస్తోంది కదా! అట్టి ఈ జీవచైతన్యం దృశ్యం వైపుగా ఉన్ముఖమే కాలేదనుకో? అప్పుడు? అది సంసారం నుండి విడివడిపోవుచున్నది. ఇక "సంసారం భ్రమా? సత్యమా?" అనేది అప్రస్తుతమే అవుతుంది. అటువంటి విచారణతో పనేంటి?

కాబట్టి ఈ జీవనచైతన్యమే వాసన, ఇచ్ఛ, మనస్సు, కర్మ, సంకల్పము... మొదలైన ఆయా రూపాలలో తనను తానే ప్రదర్శించుకుంటోంది. అది స్వయంగా భ్రమలను ఆశ్రయించి ఈ సంసారం యొక్క రూపమును వికసింపజేస్తోంది.

ఒకడు జ్ఞాని అయి ఉన్నా కూడా, అతనికి ఎంతవరకైతే ఈ దేహం ఉంటుందో అంతవరకు ఈ దేహగృహంలో అతనికి 'చిత్తం' అనేది ఉండియే ఉంటోంది. జీవించి ఉన్నంత వరకు చిత్తమును త్యజించుట ఎట్లా సాధ్యం? సాధ్యం కాదు. అయితే జ్ఞాని యొక్క జీవచైతన్యం "నేను అసంగమైన అద్వితీయమైన, కూటస్థమైనట్టి స్వరూపమును"... అను ఎఱుకను, అనుభూతిని, అనుభవమును సంతరించుకుని ఉంటోంది.

"సర్వకర్మలకు ఆవల, కర్మలన్నిటికీ సంబంధించనివాడనై శుద్ధ చిద్రూపుడనైన నేను ఏర్పడియున్నాను. అందుచేత కర్మాకర్మలతో నాకు ప్రమేయం లేదు. "నాఽహంకర్తా! నైవ కించిత్ కరోమి! నేనేమీ చేయటం లేదు"... అని ఈ విధంగా నిష్క్రియమైన ఆత్మస్వభావ స్థితిచే ఈ చిత్తమును ఆక్రమించివేసి ఉంటున్నాడు. తదితర జీవులవలెనే ఆయా కర్మలు ఈ దేహముచే నిర్వర్తిస్తున్నప్పటికీ స్వస్వరూపమునందు అతనికి కర్మ యొక్క భావనయే జనించదు. అతడు కర్మ – అకర్మల వికల్పం త్యజించివేసి ఉంటాడు. అట్టి జీవచైతన్యం స్వయంగా అజమైనట్టి బ్రహ్మరూపంగా అయి, తదనుకూల అనుభవమును అనిర్వచనీయంగా పొందుతూ ఉంటుంది.

కర్మ–అకర్మల వ్యవహారం త్యజించకుండా, ఆ ఉభయాలకూ అతీతత్త్వం సంతరించుకోకుండా, ఒకడు "ఈ శరీరమే కదా కర్మలకు మూలం! అందుకనే ఈ శరీరాన్ని నిష్క్రియంగా ఉంచుతాను"... అని తలచి శరీరముచే మాత్రమే విహితకర్మలను త్యజించేవాడు ఎన్నటికీ "కర్మత్యాగి" కాలేడని జనులందరికీ గుర్తు చేస్తున్నాను.

జ్ఞాన బలం చేత ఈ దృశ్య ప్రతిభాస స్వయంగా లయించగలదు. అప్పుడు "ఈ జగత్తు అనబడేది భావనామాత్రమే గాని స్వయంగా లేదు"... అనురూపంగా ఉండే జగత్తు యొక్క అత్యంత – అభావం సిద్ధించగలదు. అట్టి జగత్ అభావన, మరియు అప్రమేయ అఖండ ఆత్మభావనయే త్యాగం, అసంగం, మోక్షం అను శబ్దములచే ఉద్దేశించబడుతున్నది సుమా! సందర్భానుచితంగా ఇక్కడ వేద్య (తెలుసుకొనబడుచున్న విషయం) – వేదనముల (తెలుసుకొనుచున్న తత్త్వం (లేదా) చిదాభాసరూప చైతన్యం) గురించి కొన్ని విషయాలు ప్రస్తావించుకుందాం.

"వేదనము" ఉన్నప్పుడే (తెలుసుకొనుచున్నది ఉన్నప్పుడే) "తెలియబడే విషయాలు" అనేది ఉంటుంది. ఆ తెలుసుకొనుచున్న విభాగం ఎందులోంచి బయలుదేరుతుందో... (లేక) తెలుసుకొను చున్న విభాగమునకు ముందే ఉన్నదేమిటో... అది వేద్య దృష్టి కంటే కూడా సూక్ష్మమై, కారణ కారణమై ఉన్నది.

అట్టి మున్ముందుగా ఉన్న తత్త్వమును ఆశ్రయించడమే "వేద్య దృష్టిని అధిగమించి తత్త్వదృష్టిని ఆశ్రయించటం"... అని గ్రహించు.

ఏ తత్త్వ దృష్టి యొక్క పరిపుష్టి చేత "వేద్య దృష్టి యొక్క ఉత్పన్నమే లేదు"... అని గ్రహించ బడుతుందో అట్టి తత్త్వానుభవాన్ని సంతరించుకొన్న వానికి ఇక "తెలియబడే విషయాలు – వేదనము" అనునది ఎక్కడుంటుంది ? అనగా, వేద్యదృష్టి – వేదనము కూడా స్వతహాగా లేవని గ్రహించినచోట జగద్దృష్టి యొక్క అతీతత్వం రూపుదిద్దుకుంటుంది. దృశ్యం ద్రష్ట యొక్క అవగాహన – అభిప్రాయం – భావనలను అనుసరించే ఉంటోంది సుమా!

'జ్ఞానదృష్టి' (ఆత్మ దృష్టి) యొక్క పరిపుష్టి చేత ఒకడు వేద్యోన్ముఖత్వమును (విషయముల పట్ల గల మూలాధ్యాసను) త్యజించినాడనుకో, అనగా వేద్య దృష్టి ఉత్పన్నముకానప్పటి వేదనము యొక్క స్వరూపమేమికలదో... అద్దానిని ఏమని పిలవాలి?

అది 'వేదనం' కాదు. ఎందుకంటే తెలుసుకోవటం అను కార్యక్రమం కన్నా అది ముందే ఉన్నది కదా! అది కర్మ (లేక, క్రియారూపం) కాదు. ఎందుకంటే సర్వక్రియలకు అది ముందే ఏర్పడి ఉన్నది కదా! అందుకే అది "నిష్క్రియం" అని కూడా వర్ణించబడింది మరి! అది స్వతహాగా శాంతమగు బ్రహ్మమే అయి ఉన్నది.

ఆకాశంలో ఉండే మేఘాలు జలాదులందు ప్రతిబింబిస్తున్నట్లు, బుద్ధ్యాదులందు (ఆ బుద్ధికి అనుగుణంగా) ఈ దృశ్యం ప్రతిబింబిస్తోంది. అట్టి ప్రతిబింబాన్ని ఎఱుగుచున్న చైతన్య విభాగం "చిదాభాస చైతన్యం" అను పేరుతో ఉద్దేశించబడుతోంది. అట్టి చిదాభాస చైతన్యం క్రియారూపంగా ఈ జగత్తులో ప్రదర్శితమౌతోంది. "ఏ జీవుడైనా చిదాభాస – శూన్యత్వమును అవధరించి ఉంటే అట్టి అతని పరిశేష్యమును... 'మోక్షం' అని పిలుస్తున్నారు. అట్టి వారు ఈ లోకానికి ఉపదేశిస్తున్న దంతా శిష్యుని వాస్తవ స్వరూపం గురించే.

కాబట్టి రామా! దేహం ఎంతవరకు ఉంటుందో, అంతవరకు కర్మలయొక్క 'త్యాగం' అనేది సంభవించదు. కర్మలను ఆశ్రయిస్తున్నంత కాలం, ఆ కర్మలకు మూలమైన (వాసనాసంబంధమైన, మనో సంబంధమైన) చిదాభాసరూపసంవిత్తు ప్రవర్తిస్తున్నట్లే అవుతోంది. ఆ చిదాభాస సంవిత్తును అధిగమించి పరిశీలిస్తే 'శుద్ధసంవిత్తు' మనకు ద్యోతకమౌతుంది. అట్టి అధిగమనం జ్ఞానబలిమిచే సుసాధ్యం. శుద్ధ సంవిత్తు సర్వదా యథాతథంగా ఉండగానే అద్దాని 'చిత్కళ' అనతగిన చిదాభాస సంవిత్తు అంతఃకరణమునందు వాసనలను కలిగి ఉంటోంది. అట్టి వాసనారూపసంవిత్తు కర్మలకు కర్తృత్వాదులకు కారణత్వము వహించి ఉంటోంది.

ఎవడైతే చిదాభాసరూప సంవిత్తును అద్దాని మూలాజ్ఞానముతో సహా 'ఆత్మవిచారణ' అను స్వప్రయత్నముచే యథార్థముగా ఎఱుగుచున్నాడో... అట్టి వాడు ఆ చిదాభాస స్వరూపమును అధిగమించి శుద్ధ చిద్రూపమును ఎఱుగుచున్నాడు. "చిదాభాససంవిత్తును అనుసంధానం కావించకపోవటం"... అను అభ్యాసముచే మాత్రమే చిదాభాససంవిత్తు అధిగమించబడుతున్నది.

తేన సంసృతి వృక్షస్యం । మూలకాషో వితన్యతే ॥

అతడే ఈ సంసార వృక్షమును మూలాఛేదం కావించినవాడగుచున్నాడు. కనుక అవేదత్వమే మోక్షం (ఆవేదన విదుర్ మోక్షం)!

ఓ రాఘవా! ఇక్కడేగాని, మరెక్కడైనాగాని బ్రహ్మమొక్కటే ఉన్నది. అది చిదాభాసవర్జితమై మేఘవిభాగ రహిత ఆకాశము వలె ఉన్నది. సజాతీయ – విజాతీయ, స్వగతాది భేదములు అద్దానికి లేవు.

"చిదాకాశరూపమై నిరామయమైనట్టి ఆ బ్రహ్మమే సమస్త చేతనములయొక్క సారం"... అని బ్రహ్మవేత్తలు ఎలుగెత్తి పలుకుచున్నారు. ముముక్షువులంతా అది శ్రద్ధగా విని, అందు సూచించే అర్థసారాన్ని గ్రహించి తమ చిదాభాసాతీతమైన చిదాకాశత్వాన్ని గ్రహించి, అనువర్తించెదరు గాక!

❖❖❖

4. కర్మ త్యాగము

శ్రీరాముడు : మునీంద్రా! "అవేదనమే మోక్షం" (ఈ తెలియబడేదంతా తెలియకుండా ఉండటమే మోక్షం) అనే అర్థం మీరు సూచిస్తున్నట్లు నాకు అనిపిస్తోంది. "సర్వజ్ఞానాలకు పరాకాష్ఠ అయిన మోక్షం ఆత్మజ్ఞానం అనే ఎఱుక కూడా రహితమైన స్థితి" అని మీ ఉద్దేశమా? ఎందుకంటే, ఆత్మ జ్ఞానం కూడా తెలియబడే విషయాంతర్గత విభాగమే కదా! "అసత్తుకు ఉనికి లేదు. సత్తుకు లేమి లేదు... అని కదా శాస్త్ర సిద్ధాంతం? జ్ఞాన స్వరూపమగు సత్తు తెలియబడనిది" అనే నాకు వినిపిస్తున్న మీ అభిప్రాయం నేను సమన్వయించుకోలేకపోతున్నాను.


శ్రీ వసిష్ఠ మహర్షి : మొట్టమొదట ఆత్మ నిత్యోదిత చైతన్యస్వరూపమై ఉన్నది. ఇది సత్తు. మిగిలినదంతా అసత్తుగా (లేక) కల్పనగా ఏర్పడుతోంది. నిర్విషయ – అఖండ – అప్రమేయమగు ఆత్మ నుండి స్వయంకల్పితంగా ద్రష్టత్వం (లేక) అనుభవత్వం బయల్వెడలుతోంది. అదియే 'జీవుడు' అని 'చిదాభాసుడు' అని అంటున్నాం. ఈతనినే 'దృశ్యద్రష్ట' అని గమనించు. ఆ దృశ్యద్రష్ట స్వయంభావనచే పొందుచున్నదే ఈ దృశ్యము (లేక) వేదనము.

నాఽసతో విద్యతే భావో నాఽభావో విద్యతే సతః ।
యదా తదైవ సుకరం వేదనావేదనం స్వయమ్ ॥

ఓ రామచంద్రా! ఎప్పుడైతే "అసత్తుకు ఉనికి లేదు. సత్తుకు లేమి లేదు" అనేది సిద్ధాంతమై ఉన్నదో... అప్పుడు "వేదనం (దృశ్యమును ఎఱుగుచున్న విభాగం) అవేదనమగుట"... అని నేను ప్రతిపాదించే మోక్ష సిద్ధాంతం మరింత సుకరం అవుతోంది.

ఇప్పుడు మనం "వేద్యము (తెలియబడుచున్నది)" అనే శబ్దం ఉపయోగించాం కదా! అయితే అట్టి వేదనము అనబడు శబ్దము, దాని అర్థము కూడా "త్రాడునందు చూచే పాము" వలె "ఎండమావులలో కనిపించే జలతరంగాల" వలె భ్రమయుక్తములు మాత్రమేనని గ్రహించు. వేదనము అసత్యంగానే ఉదయించినదగుచున్నది. అందుచేత ఆ వేదన - వేద్యములు (ద్రష్టత్వ - దృశ్యములు) "వేదనము" (తెలియబడేది) అనబడే శబ్దార్థములను రెండిటి యొక్క విస్మరణయే పరమశ్రేయస్సును కలుగజేయగలదు సుమా!

ఎందుకంటావా? "తెలియబడేది"... అనుదాని చేతనే కదా, ఈ జీవునకు దుఃఖములన్నీ కలుగుచున్నవి! తెలియబడేదానికి మున్ముందుగానే "తెలుసుకుంటున్నది"... అనునది ఉండనే ఉంటోంది. ఆ "తెలుసుకుంటున్నది" అనబడేదే ఈ జీవుని వాస్తవ స్వరూపం.



అట్టి "తెలుసుకునుచున్నది" అనబడేది తెలియబడేదానిచే ఎట్లా తెలియబడుతుంది చెప్పు? అందుచేత ఓ రామచంద్రా! నీవు 'తెలుకొనుచున్నది (ద్రష్ట - జీవుడు)' అను ఒకానొక చమత్కారం తనయందు ప్రదర్శించే స్వస్వరూపమగు ఆత్మనే ఎఱుగుము. అంతేగాని ఈ చిదాభాసుని (ఆత్మ నుండి బయల్వెడలుచున్న ద్రష్ట - జీవుడు) గురించి ఎంతగా విచక్షణ చేసి ఏమి ప్రయోజనం?

మరొకసారి చెప్పుచున్నాను. వేదనము (తెలియబడేది - దృశ్యం) అను దానిలో చిక్కుకొనటం చేతనే వాస్తవానికి సత్-చిత్-ఆనందస్వరూపుడగు ఈ జీవుడు (చిక్కుకున్నట్లుగా ఏర్పడుచున్న భ్రమచేతనే) సర్వ దుఃఖములు, సర్వ అనర్థములు తెచ్చి పెట్టుకుంటున్నాడు. అందుచేత ఈ తెలియబడుచున్న దానికి సంబంధించిన 'జ్ఞప్తి' యొక్క శబ్దార్థముల రెండింటినీ త్యజించి సుఖస్వరూపుడవై ఉండు.

ఓ రామచంద్రా! 1. ద్రష్ట-దర్శనము-దృశ్యము... అనబడే త్రిపుటీ బోధ లక్షణము అయి ఉన్న ఈ వ్యవహారశీలత్వము; 2. వ్యావహారిక సంబంధమైన 'జ్ఞప్తి' లక్షణము; 3. సర్వార్థసారమైన పరమకూటస్థ చిన్మాత్రము... ఈ మూడింటిలోను మొదటి రెండు అధిగమించి అటుపై సర్వశబ్దపరం - మూడవది అయినట్టి 'ఓం' కారమును అన్వయించుకొని ఉండు. అట్టి పారవశ్యంనందు అనుభవ మయ్యే శుద్ధాత్మయే నిర్వాణోదయం సుమా! (అదియే ఈ వర్తమాన నిర్వాణ ప్రకరణసారం). అట్టి నిత్యోదిత శుద్ధాత్మయందు ఎట్టి విక్షేపము లేకుండా వ్యవహరించుము.

కర్మ, కర్మ త్యాగము –

శుభాశుభాత్మకర్మ స్వం నాశనీయం వివేకినా ।
తన్నాస్తీత్యవబోధేన, తత్త్వజ్ఞానేన సిద్ధ్యతి ॥

వివేకి అయినవాడు తన యొక్క శుభ – అశుభ కర్మల రెండింటినీ దాటివేసి ఉంటాడు. “అవి వాస్తవానికి లేవు”... అను బోధ చేతను, ఆ రెండింటిచేత స్పృశింపబడనట్టి ‘తత్త్వం’ యొక్క జ్ఞానం చేతను వాటి ‘రాహిత్యం’ లేక అతీతత్వం సిద్ధింపజేసుకోగలడు.

కర్మమూల నికాషేణ, సంసారః పరిశామ్యతి ।
సువిచారితమన్విష్టం యావత్ కర్మ న విద్యతే ॥

కర్మ యొక్క ఏ మూలమైతే ఉన్నదో... అదే చిత్ యొక్క “అభాసరూప సంవిత్తు” అని వర్ణించబడింది. అట్టి కర్మల యొక్క మూలాన్ని ఛేదించుటచేతనే సంసారం శమిస్తోంది. “మూల, ఫల, పుష్ప, శాఖ – ఉపశాఖసహితమగు కర్మ వృక్షమే మొదలే లేదు”... అనే పర్యవసానం, ప్రయోజనం కలిగి ఉండే “పూర్ణ విచారణ” చేతనే ఈ వృక్షం నశించగలదు. అనగా ఈ జీవుని పట్ల కర్మవృక్షం అప్రభావితమై ఉండాలంటే అది విచారణ శాస్త్రాన్వేషణలచే (కర్మ రాహిత్యత్వం – కర్మాతీతత్వం) తప్పక లభించగలదని నా మనవి.

శ్రీరాముడు : స్వామీ! ‘చిత్తము’ అనబడేదాని అసలైన రూపమేమిటి ?

శ్రీ వసిష్ఠ మహర్షి : బిల్వ వృక్షములోని మజ్జలో గల బీజతత్త్వమే బీజముగా బయల్వెడలుతోంది కదా! బిల్వబీజం బిల్వవృక్షం కంటే వేరా? ఎట్లా అవుతుంది? రెండింటిలోని ‘సత్త’ (జీవ తత్త్వం) అనేది ఒక్కటే. అట్లాగే ‘చిద్రూపం’ అనే బిల్వవృక్షం నుండి బయల్వెడలిన ‘చిత్తం’ అనబడు క్రియాకారాది త్రిపుటి ఆ చిద్రూపం కంటే లేశం కూడా వేరైనది కాదు. ఈ భూలోకంలో ఉండే ఒక ప్రదేశం భూలోకం కంటే వేరైనది కాదుకదా! అట్లాగే ఈ అవకాశం, ఆకాశమున అంతర్గతమై ఉంటున్న భూతజాలం, భవనాది వస్తుజాలం – ఇవన్నీ కూడా సన్మాత్రమగు పరమాత్మ కంటే వేరైనవి కానేకావు. “ జలమందలి తరంగత్వము జలం కంటే వేరు”... అని ఎవరైనా అనగలరా? చిత్తం కూడా చిద్రూపమే అయి ఉన్నది. చిత్తం చిత్తే! చిత్తు చైతన్యమే! జలంలో ద్రవత్వం, అగ్నిలో ప్రకాశం ఉన్నట్లే బ్రహ్మం నందు గ్రాహకత్వం (గ్రహించటం) అనే స్వభావం, స్మృత్యత్వం (స్మృతి అనే చమత్కారం)... అను వ్యవహారాల కంటే సూక్ష్మమైన చిత్తం ఉండి ఉన్నది.

అయితే “చేతనము”...అనే శబ్దం యొక్క అర్థం “క్రియాత్మకము” అని కదా! అయితే సర్వ క్రియలకూ ముందే ఏర్పడి ఉన్న నిష్క్రియ కూటస్థ చైతన్యం నందు యక్షుని భ్రమలాగా క్రియాత్మక చైతన్యం ప్రజ్వరిల్లుతోంది. అది స్వతహాగా అకారణం కనుక ‘క్రియాత్మకం’ అనబడేదంతా వాస్తవానికి “ఉదయించనిది, లేనిది” – అయి ఉన్నది. వాయువు – వాయు చలనము వేరు వేరా?

శ్రీరాముడు : కాదు. వాయువు – వాయు చలనము వేరు వేరుగా ఉండజాలవు.

శ్రీ వసిష్ఠ మహర్షి : అట్లాగే, చేతనము – దాని యొక్క అభివ్యక్తరూపం అగు క్రియ అభిన్నములై

ఉన్నాయి. ఈ సిద్ధాంతమును అనుసరించి ఇక్కడి బాహ్య అభ్యంతర రూపములగు, జాగ్రత్ – స్వప్న – సుషుప్తులందలి – పదార్థబుద్ధి కూడా ఆత్మరూపమే గాని... మరింకేదో మరొకటి కాదు.

విస్తారః కర్మణాం దేహః, సోఽహంతాత్మా, స సంసృతిః ।
అచేతనాన్ అనహన్త్వేన శామ్యతి అస్య స్పన్దవాతవత్ ॥

ఓ రాఘవా! కర్మల యొక్క విస్తారమే ఈ దేహం. అదియే అహంకారం, అదే సంసారం కూడా! కనుక నీవు చిదాభాసత్యాగ పూర్వకమైన "అనహం" భావన అనే గొడ్డలిచే ఈ సంసారం– ఈ దేహాహంకారాలను శమింపజేయి. అప్పుడు నిశ్చలస్థితిలోని వాయువు వలె సర్వాతీతమైన నీ వాస్తవ స్వభావం తేటతెల్లమవగలదు. ఆ విధంగా చిదాభాసుని త్యజించు. అనంతాత్ముడవగుము. చిద్రూపుడవై ఒక శిలవలె నిశ్చలత్వమును అవధరించి ఉండు. అట్టి నిశ్చలాత్మకత్వ బలిమిచే వరాహం రెల్లుగడ్డిని తొలచునట్లు, ఈ సంసార మూలమును (ఈ జన్మ కర్మ వ్యవహారత్వమును) ఛేదనమొనర్చివేయుము. ఈ మార్గంలో మాత్రమే ఈ కర్మబీజము యొక్క కోశము త్యజించ బడుతుంది. ఇక వేరే మార్గం లేదు.

ఈ ప్రకారంగా కర్మబీజకళ త్యజించబడుగాక! అప్పుడు క్రమంగా బ్రహ్మం కంటే భిన్నమైనది. కనిపించటానికి కారణమగుచున్న "చిదాభాసుడు", ఆ చిదాభాసునికి కనిపించే దృశ్యప్రపంచం జీవునకు మిథ్యగా తేలిపోవుచున్నది. ఇక అతడు వేద్యమగు పరబ్రహ్మమును స్వతఃసిద్ధంగానే ఎఱుగుచున్నాడు. ఇక పరమశాంతస్వరూపుడగు అట్టి మహాత్ముడు దేనినీ త్యజించడు. గ్రహించడు. అనగా అతడు "గ్రహణము – త్యాజ్యము" లకు సంబంధించిన అనుభవమే కలిగి ఉండడు. సర్వ ప్రాపంచిక వ్యవహారములకు నిమిత్తమాత్రుడై, శాంతచిత్తుడై ఉంటాడు. ఆకాశమువలె విశదమై దృశ్యరహితమైనట్టి తన ఆత్మస్వరూపమునందు స్థితి కలిగి ఉంటాడు. అంతేకాదు. అతడు ఆయా ప్రవాహపతితములగు కార్యములు చేయుచున్నప్పటికీ నిర్వర్తించనివాడుగానే ఉంటాడు. నదీ ప్రవాహంలో కొట్టుకువస్తున్న చెక్క – కొమ్మ మొదలైన వాటిని చూచి నదీ జలం చలిస్తుందా? అట్లాగే తత్త్వజ్ఞుడు తన "జీవుడు – అనబడు ద్రష్టత్వమును – కర్మేంద్రియ మనోవికారములను తన స్వరూపముపై (ఆత్మస్వరూపముపై) ఆపాదించుకోడు. అయితే సగం నిద్రిస్తున్న బాలునిలాగా ఆయా చేష్టలను మాత్రం సల్పుతూ ఉంటాడు. నిర్విషయమగు నిరతిశయానందం (బ్రహ్మం) లభించటం చేత అతని ఇంద్రియాలు ఆయా ఇంద్రియ విషయాల పట్ల రాగరహితమై ఉంటాయి. అవి అంతరమున గాని, బాహ్యమున గాని ఎట్టి ఉనికిని కలిగియే ఉండవు సుమా!

ఇప్పటిదాకా మనం చెప్పుకునే ఆత్మతోటి ఏకత్వానుభవమే (నేను శాశ్వతం – అప్రమేయం అగు ఆత్మను... అను అనుభవమే) 'కర్మత్యాగం' అను శబ్దంచే ఉద్దేశించబడుతోందని మరల ప్రకటిస్తున్నాను. అట్టి జ్ఞానం ఆత్మ ప్రబోధం వలననే సిద్ధిస్తోంది.

కర్మణో వేదనం త్యాగః స చ సిద్ధః ప్రబోధతః ।
అవస్తు నేతఽరేణార్థః కింకృతేన అకృతేనవా ॥

కర్మలతో 'రాహిత్యము' సంతరించుకోవటమే కర్మత్యాగం. ఇక ఈ దేహ – ఇంద్రియాదులతో జరిగే చేష్టలంటావా? అవన్నీ మిథ్యారూపాలని గ్రహించు. అవి ఒనర్చినా, ఒనర్చకున్నా... అందులో విశేషమేమీ లేదు. ఆత్మభావంతో (ఆత్మసాక్షాత్కార బుద్ధితో) ఈ దృశ్య – జగత్తులో చరిస్తున్న తన 'జీవుడు' అను పాత్రను తదితర దేహులను చూస్తున్న విధంగానే చూచేవానికి ఇక బంధమెక్కడిది?

ఓ రామచంద్రా! మరల చెప్పుచున్నాను. ఈ జీవుడు ఎట్లాగైనా సరే, తనకున్న అవకాశాలన్నీ ఉపయోగించుకుని ఆత్మస్థితిని సంపాదించుకోవాలి, అనగా... "నా యొక్క వాస్తవ తత్త్వం చిదాభాసవర్జితం – విషయజ్ఞాం కంటే ముందే ఏర్పడి ఉన్నది. కనుక... అది విషయజ్ఞాన వర్జితం.

అది పరమ శాంతస్వరూపము, సర్వదా సమస్వరూపము, అది సర్వవేళలా కృత – అకృత – ప్రతిసంధానరహిత స్వరూపము, అది వాసనారహితము, పరమ శుద్ధము" ...ఇటువంటి అవగాహన ఎవరు సంతరించుకుంటారో, అట్టి వారే "కర్మ త్యాగి" అని చెప్పబడుతారు.

అయినా.... ఒక్క విషయం. "సంసార బద్ధుడు" అని చెప్పబడే జీవుడు కూడా కొన్ని సంవత్సరాల క్రితం ఒకానొక రోజు నిర్వర్తించిన కర్మలేమిటో చెప్పమంటే చెప్పలేడు కదా! కానీ ఆతడు 1.ఇప్పటికి ఇది చేశాను, 2.అప్పటికి అది చేయవలసి ఉన్నది, 3. ఆ, ఇంత చేశానే! నాకేం వచ్చింది? 4.అయ్యో! ఇది ఎందుకో చేయలేకపోయాను... అనే ఈ నాలుగు రకాల కర్మ సంగమమును వర్తమానంలో కలిగి ఉంటున్నాడు. ఇక 'ముక్తుడు' అనువాడో, వర్తమానంలోనే సర్వ కర్మలు, సర్వదృశ్యములు విస్మరించి ఉండగలుగుచున్నాడు. అట్టి సునిశ్చితము, సునిశ్చలము అగు ఆత్మస్థితికి శాస్త్రములు 'కర్మత్యాగము' అని పేరు పెట్టాయి.

శ్రీరాముడు : అయితే 'కర్మత్యాగము' అనేది కర్మలను నిర్వర్తించటం మానివేయటం చేత వచ్చే స్థితి కాదని మీ ఉద్దేశమా!

శ్రీ వసిష్ఠ మహర్షి : కర్మరహిత స్థితియే మోక్షరూపమగు కర్మత్యాగస్థితి అయి ఉంటే జడరూపమగు గాఢ నిద్రాస్థితియే మోక్ష స్థితి అయి ఉండేది. కర్మలను మానివేసి ఒకచోట ఊరకే కూర్చుని ఉండటం 'కర్మత్యాగం' అనిపించుకోజాలదని మరల మరల ప్రకటిస్తూనే ఉన్నాను సుమా! అసలు మూలము అయినట్టి చిదాభాసుని త్యజించకుండా (దృశ్య–జగత్తులో చరించే ద్రష్టత్వము – జీవత్వములకు అతీతత్వం పుణికి పుచ్చుకోకుండా) కేవలం కర్మేంద్రియాలను గాలికి వదిలినంత మాత్రం చేత కర్మత్యాగం అని అనిపించుకోదని చేతులెత్తి మరల ప్రకటిస్తున్నాను. అట్టి వ్యర్థమైన అవగాహనతో కూడినవారిని 'మాంద్యము' అనే పిశాచము గుటుక్కున మ్రింగటానికి సిద్ధంగా ఉన్నదని గుర్తు చేస్తున్నాను. అట్లా అయితే మత్తుగా త్రాగి మొద్దుగా నిదురించేవాడు మోక్ష స్వరూపుడౌతాడు. అది అట్లు కాదు కదా!

ఇక 'సమూల కర్మ త్యాగము' సంతరించుకుని ఎవరైతే ప్రశాంతముగా ఉంటారో.... అట్టి వారికి ఈ ప్రపంచం విషయంలో కర్మలు నిర్వర్తించినా, నిర్వర్తించకున్నా వచ్చే ప్రయోజనం ఏమీ ఉండదు. వివేకి అయినవాడు 1."నేను కర్మలు నిర్వర్తించాలి; 2.ఎందుకు నిర్వర్తించాలి?"...

ఇటువంటి ఉభయ కర్మబీజకళలను సమూలంగా త్యజించి ఏకంగా ఆత్మయందే నిత్యసమాహితుడై వెలయుచున్నాడు. అనగా......

ప్రవాహపతితే కార్యే ఈషత్ స్పన్దా అతన్మయాః
ఘూర్ణమానాఇవ క్షీబాయంత్ర సంచారితా ఇవ
మోక్షలక్ష్మ్యాం విలాసిన్యా వ్యసనోపహతా ఇవ
అర్థసుప్త ప్రబుద్ధాభాః కామప్యవనిమాగతాః ॥

వివేకులు ఒకవైపేమో పూర్ణ అనాసక్తులై, అభిమానాది ఎట్టి వికారాలు లేని వారై ఆయా ప్రవాహపతితమైన కార్యాలను (ఆయా నియమిత క్రియాదులను) ఉత్సాహంగా నిర్వర్తిస్తూనే... మరొకవైపు మదిరోన్మత్తుని వలె, యంత్రాలచే చలింపబడే ఆట బొమ్మలాగా నిస్పృహులై ఉంటారు. 'మోక్ష లక్ష్మి' పట్ల మాత్రమే అత్యాసక్తియుతులై, ఈ దేహదులతో ఏమాత్రం సంబంధం లేనివారై ఉంటారు. సగం నిద్రలో ఉండే బాలునివలె ఉత్తమ భూమికలను అవధరించి ఉంటారు.

ఒక చెట్టును మొదలంట (వేళ్ళతో సహా) పెకలించిస్తేనే అది తొలగించబడినది అవుతుంది గాని కొమ్మలు నరికినంత మాత్రంచేత చెట్టును నశింపజేయటం అవుతుందా? లేదు కదా! "నేను కర్మ వ్యవహారములకు అప్రమేయుడను, అసంబంధితుడను, అతీతుడను"... అని గ్రహించటమే కర్మత్యాజ్యం గాని "నేను కర్మలు నిర్వర్తించను" అనేది కర్మత్యాజ్యం కాదు. జీవించటమనేది కూడా ఒక కర్మయే కదా! "నేను జీవన్ పరిమితుడను కాను"... అని గ్రహించటం చేతనే దేహాదులు జయించబడినవి అవుతున్నాయి. మూలాఛేదనం చేయకపోవటం చేతనే ఈ కర్మ వృక్షం మరల మరల చిగురించి, శాఖోపశాఖలై జీవుని దుఃఖమును వర్ధింపజేయుచున్నదని సాధకులు గ్రహించవలసినదిగా నా మనవి.

ఓ జనులారా! చిదాభాసుని ఛేదనం చేసినప్పుడు మాత్రమే (నేను జీవ – దేహ పరిమితుడను – అను భ్రమను వదలినప్పుడు మాత్రమే) 'కర్మత్యాగం'... అనేది సిద్ధిస్తోంది. ఇది గ్రహించి మీమీ సాధనలు కొనసాగించండి. ఇతర వ్యవహార పరంపరలతో, క్రియా క్రమములతో ఏమి పని?

ఎవరైతే ఈ 'కర్మత్యాగం'ను ఆచరించకుండా హఠాదులచే కేవలం కర్మేంద్రియాలను మాత్రం సంయమనం చేస్తారో... అదియే 'త్యాగము' అని తలుస్తూ ఉంటారో... అది వ్యర్థ ప్రయత్నమని చెప్పక తప్పదు. అది ఆకాశమును చేత్తో బాది వశం చేసుకోవాలని అనుకోవటం వంటిది.

శ్రీరాముడు : మహాత్మా! మీరు చెప్పే కర్మత్యాజ్యం సిద్ధింపజేసుకునేది ఎట్లా?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఆత్మజ్ఞానం సంపాదించుకోవటంచేతనే కర్మత్యాగం స్వయంగా సిద్ధించగలదు. వేయించబడిన విత్తనం మరల మొలకెత్తదు కదా! వాసనావర్జితులు, ఇచ్ఛారహితులు అయిన జీవన్ముక్తులు నిర్వర్తించే క్రియలన్నీ అక్రియలే అవుతాయని గ్రహించు. నాయనలారా! మీరంతా కూడా "కర్మ ఎప్పుడు, ఎందుచేత ఫలోన్ముఖమగుచున్నది? అది ఎప్పుడు ఫలరహితం, బంధనా రహితం కాగలదు?"... అనే విషయాన్ని జాగరూకులై గ్రహించాలి. బుద్ధి సహితమగు ఇంద్రియాల

చేత "భోగాసక్తి – రసభావన" కలిగి ఉండి కర్మలు నిర్వర్తిస్తేనే అవి ఫలోన్ముఖములై బంధహేతువులు అగుచున్నాయి. వాసనారహితమగు చేష్టలు ఎన్నటికీ కర్మసంగమునకు దారితీయజాలవు సుమా! పులుసులో ప్రవేశింపజేయబడిన గరిటకు పులుసులోని రుచులతో సంబంధమే లేదు కదా!

అందుచేత "జ్ఞానంచే కర్మలను త్యజించి ఉండేదెట్లా?"... అనే మార్గాన్ని మీరంతా ఆశ్రయించండి. వాసనారహితుడగు జీవన్ముక్తుడు ఇంట్లో ఉన్నా, లేక, అరణ్యంలో ఉన్నా, ధనాది సంపదలతో కూడుకొని ఉన్నా, నిరుపేదగా ఉన్నా... ఆయా సందర్భములచే అతడు స్పృశించబడటం లేదు. అవన్నీ అతనికి సమానమే! జ్ఞానముచే ప్రశాంతి పొందిన మనుజునికి గృహమే నిర్జనారణ్యమై ఉండగలదు. ఇక అజ్ఞానముచే అశాంతి కలిగియున్నవాని సంగతో?... అతనికి జనశూన్యమైన మహారణ్యం కూడా అనేక రకాలైన జనులు సమావేశమై ఉన్న పట్టణం వలె ప్రాప్తిస్తోంది. ప్రశాంత బుద్ధి సమన్వితుడగు జ్ఞానికి కలలో కూడా జనసంసర్గము ఉండటం లేదు. అతని హృదయం నిర్మలమై, విశాలమై, అత్యంత రమణీయమై విరాజిల్లుతోంది. అందుచేత జ్ఞానాగ్ని చేత ఈ 'దృశ్యము' అనబడే ఎండుటాకుల ప్రోగును దహింపజేయండి. జ్ఞానాగ్నిచే శ్రమించిన దృశ్యముగల జ్ఞానికి ఈ జగత్తు, ఇందలి పదార్థముల సంచలనము శూన్యమయమై గోచరిస్తాయి. సమస్త విశేషములు శమించినప్పటి మహారణ్యంలాగా ఇదంతా అతనికి గోచరించగలదు.

అజ్ఞాని హృదయం - అజ్ఞాని తన హృదయంలో అనేక సంకల్పపరంపరలు కలిగి ఉన్నవాడై తన హృదయం నందే 'జగత్తు' అనబడునది ధరిస్తున్నాడని గ్రహించబడు గాక! అజ్ఞానికి తన హృదయంలోనే ఈ సప్త సముద్రాలతో కూడిన పృథివి విద్యమానమగుచున్నదయ్యా! అతనికి ఇదంతా కూడా నానావిధ సుఖదుఃఖాది ద్వంద్వ సంకటాలతో వ్యాప్తమై అనేక కార్యారంభాలతో ఉన్నదై.... తన యొక్క హృదయం నందే ఏర్పడి ఉన్నదగుచున్నదని విజ్ఞులు ఎఱిగియే ఉన్నారు.

అద్దంలో అంతా ప్రతిబింబిస్తున్నట్లు మలిన హృదయంలో – "ధనం లభించితేనే శాంతి. ఈ ఈ వస్తువులు, ఈ ఈ స్నేహములు, ఈ ఈ విధంగా ఉంటేనే సంతోషంగా ఉండటం సాధ్యం. ఏదో పొందితేగాని ఇప్పటి ఈ అసంతృప్తి పోవటానికి అవకాశం లేదు"... ఇటువంటి వీచికలు వీస్తుండగా మోహ–శోక–భయాది ధూళికణ సమూహాలు తిష్ట వేసుకొని ఉంటున్నాయి. అటువంటి హృదయమునందు మాత్రమే దేశ–దేశాంతరాదులు, జీవ–జీవేతరులు, నేను–నీవు మొదలైనవి ప్రతిబింబస్తున్నాయి సుమా!

❖❖❖

5. అహంత్వమే సంసారం

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! తైలము తరిగిపోతూ ఉంటే దీపం కూడా క్షయిస్తూ ఉంటుంది చూచావా? అట్లాగే ఈ అహం – మమ రూపంలో ఉండే జగద్భావన తొలగుతూ ఉండగా సంసారము క్షీణిస్తూ ఉంటుంది. సంసారము తొలగుచూ ఉండగా, ఆత్మజ్ఞాన రూపమగు చిత్కళ

ప్రవృద్ధమౌతూ ఉంటుంది. సంసారము తొలగాలనుకుంటే ఆత్మజ్ఞానరూపమగు చైతన్యాశ్రయం కాక మరింకే ఉపాయమూ లేదు. దృశ్యమును వదలి "దృక్"ను ఆశ్రయించి ఉండటమే మోక్షం. అంతేగాని, మోక్షమనగా ఇక్కడి నుండి ఎక్కడికో వెళ్ళి మరింకేదో అవటం కాదని సర్వజనులకు గుర్తుచేస్తున్నాను.

న త్యాగః కర్మ సంత్యాగో, బోధః త్యాగ స్మృతః
అజగత్ ప్రతిభైకాత్మా యే అనహన్తాదిరవ్యయః ॥

కర్మత్యాగం 'త్యాగం' కాదు. సర్వదృశ్యగరూపమగు ఆత్మస్థితిని 'బోధ' అంటారు. అట్టి బోధయే త్యాగము అని చెప్పబడుతోంది. ఓ సర్వ సహోదరులారా! మీరంతా జగత్‌ప్రతిభ అంటూ లేనిది... సర్వదా ఏకమే అయినది, (ఏనాడూ అనేకం కానిది)... నాశనరహితమైనది, అహంత్వం చేత పరిమితం కానిది అయినట్టి మీ స్వస్వరూపమగు ఆత్మను ఆశ్రయించి ఉండండి.

అట్టి ఆత్మను ఆశ్రయించి ఉండటమే సర్వత్యాగరూపమగు మోక్షము.

"ఈ శరీరమే నేను. ఈ బంధువులు గృహాదులు నావి" – ఈ రూపంగా దృశ్య తాదాత్మ్యం ఏర్పడి ఉంటోంది. అట్టి దృశ్య తదాత్మ్య భావన ఎవని పట్ల శమిస్తుందో అతడే త్యాగి. అట్లు శమించ నంతకాలం జ్ఞానం గాని, త్యాగం గాని ఉండుటకు అవకాశమే లేదు. దేహభావం – మమకారం అను రూపంలో ప్రదర్శితమవుతున్న ఆవేశం శమిస్తేనే... అప్పుడు బోధరూపమై, శివరూపమై, సర్వదా శాంతరూపమైనట్టి ఆత్మ శేషిస్తుంది. ఆత్మకు అన్యమైనది. ఎక్కడా ఏమీ లేదని సర్వజనులు గమనించెదరు గాక! తత్త్వబోధ (సర్వం ఆత్మస్వరూపమే) అనునది సమాశ్రయిస్తేనే దేహాభిమాన రూపమైన 'అహం' క్షయించగలదు.

అహం క్షయిస్తే మమత్వరూపమైన (నాది–నాది అను రూపముతో కూడిన) ఈ జగత్తంతా కూడా క్షయించిపోతుంది. యథార్థానికి ఏదీ క్షయించదు. మరి? "సర్వత్రా ఆత్మయే ఆక్రమించుకొని ఉన్నది"... అనే సమరసభావనచే జగత్తు స్థానంలో స్వస్వరూపం ప్రదర్శితమౌతుంది. ఏ జీవుడైతే వర్తమానంలో (బద్ధుడై ఉన్నప్పుడు, "నేను బంధమునందు ఉన్నాను" అనుకొనుచున్నప్పుడు) అహంభావంతో కూడుకొని ఉన్నాడో... అట్టి అహంభావన 'అనహం' (నేను అహం – మమ భావనలకన్నా ఉత్కృష్టుడను)... అను భావనా మాత్రంచేత నిర్విఘ్నంగా శాంతిని పొందగలడు. 'అనహం' (ఇవి ఏమీ నేను కాదు) అనబడు ఇంతమాత్రపు సాధనచే ముక్తి సిద్ధించుచుండగా ఇక అన్య సాధనాల గురించి వాద–వివాదాలు ఎందుకు?

శ్రీరాముడు : "అనహం" భావన గురించి మరికొంత వివరించమని నా ప్రార్థన. ప్రభూ! "నేను దేహాదులు కాను"... అనేది కూడా ఒక భావనయే కదా! అప్పుడు కూడా అట్టివాడు భావనలయందే ఉన్నట్లే గాని భావాతీతుడు కాలేదు కదా! ఆత్మానుభవం భావాతీతమైనది కదా?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! "నేను దేహాదులు కాను. శుద్ధ చిన్మాత్రుడను" అను అనహం బుద్ధి ద్వైతం వలె ప్రారంభంలో అనిపించవచ్చు గాక! కాని ధూళి చిల్లగింజను ఆశ్రయించగా

జలం పరిశుద్ధమైపోవునట్లు... అనహంబుద్ధి చైతన్యమును నిర్మలమొనర్చి చైతన్యమునందు విలీనమై పోగలదు. కాబట్టి 'అనహం' చైతన్యం కంటే భిన్నం కాదు. అయినా, నాదొక ప్రశ్న! చిత్స్వరూపం వాస్తవానికి ఆకాశం వలె స్వచ్ఛమై ఉండగా, నిర్లేపమై ఉండగా... అందు జగద్భ్రాంతికి తావెక్కడిది?

న భ్రమో భ్రమణంనైవ, న భ్రాంతిర్ భ్రామకోస్తివా,
అనాలోకనమే వేదమ్, ఆలోకాన్నేదమస్తి తే ॥

వాస్తవానికి భ్రమ లేదు. భ్రమింపజేసేదీ లేదు. భ్రాంతి లేదు. భ్రాంతికి కారణమూ లేదు. మరి? అవన్నీ అజ్ఞానముచేత మాత్రమే సిద్ధిస్తున్నాయి. జ్ఞానముచే నివృత్తిస్తున్నాయి. లేక, 'లేనివి'గా అగుచున్నాయి. అంతే!

ఓ రామచంద్రా! ఈ కనబడేదంతా కూడా "చిన్మాత్రమే, అసద్రూపమును బోలి ఈ రీతిగా వ్యాపించి ఉన్నది"... అని ఎఱుగుము. ఈ సమస్తము నిర్వాణ రూపమగు "ఆత్మ మాత్రము"గా గ్రహించినవాడవై మౌనము వహించి ఉండుము.

ఏ క్షణమందైతే ఈ జీవునకు శరీరాదుల పట్ల 'అనహంబుద్ధి' ఏర్పడుతుందో... అప్పుడు ఆ అనహందేహ భావనాపటిమచే సర్వదుఃఖాలు వాటంతట అవే తొలగుతాయి. అందుచేత నిరంతరం 'అనహం' భావన యొక్క అభ్యాసం చేత 'అహం' అనుదానిని 'ఆకాశపుష్పం' వలె మిథ్యగా చేసి వేయాలి. నీవు ధనుస్సు నుండి విడివడిన బాణంవలె సదా అంతర్ముఖుడవై ఉండు. శీఘ్రంగా, దృఢంగా 'బ్రహ్మపథము'ను అవలంబించి శాశ్వత-తత్వమును సంతరించుకొని వెలయుము. సర్వ భావముల చేతను అప్రాప్యమై ఉన్న (భావాతీతమై ఉన్న) ఆత్మపదాన్ని పొంది ఈ సంసార సాగరాన్ని దాటినవాడవు కమ్ము. స్వాభావికమై ఉంటున్న ఈ అహంకార మాత్రమును జయించటానికి ఎవనికి వీర్యత్వము లేదో... అట్టివానికి ఇక బ్రహ్మపద ప్రాప్తి యొక్క మాట ఎక్కడిది చెప్పు?

షడ్వర్గో నిర్జితఃపూర్వం యేనోత్తమవిదా స్వతః
భాజనం స మహార్థానాం నేఽతరో నరగర్ధభః ॥

ఓ సర్వ జీవులారా! మీమీ శత్రువులు ఎక్కడో బాహ్యాన కాదు ఉన్నది. "కామ-క్రోధ-లోభ-మద-మాత్సర్యం"...అనే ఆరు శత్రువులు అంతరంగంలోనే తిష్ట వేసుకుని ఉన్నారు. ఎవడైతే తన అంతఃకరణంలో ప్రవేశిస్తున్న ఈ ఆరుగురు శత్రువులను గుర్తించి, వారిపై యుద్ధం ప్రకటించి, వాటిని జయిస్తాడో... అట్టివాడు మాత్రమే 'ముక్తి' అనబడే మహత్ పదార్థానికి అర్హత సంపాదించు కుంటున్నాడు. ఇక తదితరుల జీవితాలు గాడిదల జీవితాల వంటివే అగుచున్నాయి. ఎవని అంతః కరణంలో మనోవృత్తి జయింపబడుచున్నదో... అతడే వివేకానికి అర్హుడగుచున్నాడు. ఓ రామా! సముద్రంలో కొన్ని శిలలను పడవేశామనుకో. ఆ రాళ్ళు సముద్రంతో సంబంధం లేకుండా ఉంటు నట్లు నీవు కూడా నీకు సంప్రాప్తించే ప్రవాహపతిత క్రియలను "ఈ దేహాదులు నేను కాదు. నేను సర్వదా అసంగమగు ఆత్మనే"... అను అనహం భావన కలిగి ఉండియే నిర్వర్తించు. సర్వదా సర్వం పట్ల నిర్లిప్తం వహించియే అన్నిటినీ నిర్వహించు. మనం ఇన్ని రోజులుగా చెప్పుకొనే సంవాదం యొక్క ప్రభావం చేత "నీవు సర్వదా - ఆత్మ స్వభావుడవే గాని, దేహ స్వభావుడవు కాదు" అని

క్రొత్తగా చెప్పవలసిన అవసరం లేదు. కదా! ఇక ఎవరైనా సరే, అజ్ఞునివలె ఈ దృశ్యం పట్ల మోహం చెందవలసిన పనేమున్నది?

బంగారం గురించి తెలుసుకున్న తరువాత ఇక ఆభరణం గురించి కొత్తగా తెలుసుకోవలసిన దేముంది? అట్లాగే "సర్వకారణ కారణం" అనతగిన ఆత్మ గురించి ఎఱిగిన తరువాత ఇక దానికి అన్యమైన ఏ పదార్థం గురించి కారణతః ఎఱుగవలసి ఉన్నది చెప్పు? నామ రూపాత్మక సమస్తం కేవలం భ్రాంతిమాత్రమే అయి ఉంది. అట్టి భ్రాంతి శమించాలంటే ఆత్మజ్ఞాన మొక్కటే ఔషధం.

ఓ ముముక్షు మిత్ర జనులారా! వాయువు నందు చలనంలాగా అంతఃకరణంలో 'వృత్తులు' అనే వీచికలు వీస్తున్నాయి. చిదాకారవృత్తి (నేను చిదానందమగు ఆత్మను అను భావన) చే ఆ తదితర వృత్తులన్నిటినీ త్రోసిరాజనవలె! అనగా "ఈ తదితర వృత్తులు నా స్వరూపం కాదు" అను సునిశ్చయమును ప్రవృద్ధపరచుకోవాలి. తద్వారా ఆ తదితర వృత్తులన్నీ క్రమంగా నిరాధార మవుతాయి. అనహం భావనచే ఎవరైతే క్రోధ-లోభ-లజ్జ-మద-మోహాలను జయించటానికి ప్రయత్నించరో... అట్టి వారికి ఎంత అధ్యాత్మ జ్ఞానం బోధిస్తే మాత్రం ఏం ప్రయోజనం?... ఈ అధ్యాత్మ శాస్త్రం ప్రతిపాదించేది అతనికి వక్రగతిగానే అగబడుచున్నది. వాయువు కంటే చలనము వేఱుకానట్లు... నీ స్వరూపము కంటే పరమాత్మ వేఱు కాదు సుమా!

ఒకాయన పూలమాల ధరించి అనాలోచితంగా రహదారిలో నడుస్తూ వెళ్ళుచున్నాడు. ఇంతలో ఒక పోకిరి పిల్లవాడు "ఏమయ్యోయ్! నీ మెడలో ఆడత్రాచు పామును ధరించావేమిటి?" అని కేకవేశాడు. వెంటనే ఆ బాటసారి ఒళ్ళు ఝల్లుమన్నది. "అరె! ఈ త్రాచుపాము నా మెడలోకి ఎలా వచ్చి జేరిందిరా బాబు? నేను పూలమాలనుకొని చూచుకోకుండా ధరించానా ఎమిటి? ఇది పొరపాటున కరిచిందా నా పని ఆఖరు? ఏం చెయ్యాలి?" ...అని నిలబడి బిగ్గరగా విలపించ సాగాడు. ఇంతలో మరొక బాటసారి ఆ మార్గంలో వస్తూ "అయ్యా! ఎందుకు విలపిస్తున్నారు? మీ మెడలో ఆ పూలహారం ఎంత ముచ్చటగా ఉన్నది?"...అన్నాడు. వెంటనే మొదటి ఆయన "మెడలో పాము! మెడలో పాము! తీయండి! తీయండి!" ...అని కలవరించసాగాడు. అప్పుడా రెండవ బాటసారి దగ్గరగా వచ్చి పరిశీలనగా చూచి "అదేమిటండీ బాబు! ఇంత మంచి పూలహారం ధరించి 'పాము, పాము' అని అరుస్తారేం?"...అని అనునయంగా పలికాడు. అప్పుడా మొదటి బాటసారి మెడలోని హారంతీసి చూచుకొని "ఓస్! ఆ పోకిరీవాడెవడో పాము అనేసరికి నేనెంత భయపడ్డాను!" అని మరల హారమును ధరించి శాంతచిత్తుడై నడక కొనసాగించాడు.

ఈ సంఘటనలో లాగానే జీవుడు కూడా కూటస్థమగు అద్వయచిన్మాత్రం యొక్క జ్ఞానముచే పరమాత్మయందు విలీనమై తానే తద్రూపమై శోభించుచున్నాడు. యథార్థానికి పరమాత్మ ఉదయిం చటం లేదు. అస్తమించటం లేదు. అయ్యది సత్యసిద్ధమైయున్నది. కల్పిత వస్తువులైన "నేను - నీవు" మొదలైన వాటిచే అది బాధింపబడటమే లేదు. అంతేకాదు, పరమాత్మ కంటే అన్యమైనదంటూ ఎక్కడా ఏదీ లేనేలేదు. ఇక ఈ భావాభావముల గురించి వేరుగా చెప్పవలసినదేమున్నది?

"పరం పరే, పూర్ణం పూర్ణే, శాంతం శాంతే శివం శివే"
ఇత్యేవమాత్రం వితతం నాఽహం, న చ జగత్, న ధీః ॥

ఓ రామచంద్రా! ఇక్కడ జీవుడు లేడు. మరొకడూ లేడు. మరి ఇదంతా ఏమిటంటావా? నీకు జీవుడుగా ఏదైతే కనబడుతోందో... ఆ కనబడేదంతా కూడా... "పరమై, పూర్ణమై, శాంతమై, శివమైనట్టి పరమాత్మ... పరమై-పూర్ణమై-శాంతమై-శివవమైనట్టి పరమాత్మయందు అట్లు స్థితి కలిగియున్నది"... అని గ్రహించు.

అనగా... నీవు ఏ జీవుని చూస్తున్నప్పుడైనా సరే, "ఈతడు పరమై-పూర్ణమై-శాంతమై-శివ మైనట్టి పరమాత్మ స్వరూపుడే కదా! మరి నేనూ? నేనూ అదే స్వరూపుడను"...అనే అవగాహనను ప్రవృద్ధపరచుకోవటమే సరి అయిన మార్గం. అదియే తత్త్వమార్గం. ఇక అహంకారం గాని, బుద్ధిగాని, జగత్తు గాని ఎక్కడున్నాయి... ఉన్నదంతా ఆత్మయే అయినప్పుడు?

అనిర్వాణే వినిర్వాణం, శాంతం శాంతే, శివే శివమ్ ।
నిర్వాణమప్య నిర్వాణం స నభోర్థం న వాపి తత్ ॥

మరల చెప్పుచున్నాను. నాశనరహితమై, శాంతమై, శివమైనట్టి బ్రహ్మం నందు... నాశ రహితమై - శాంతమై - శివమైనట్టి (జీవుడుగా అనుకుంటున్న) బ్రహ్మమే స్థితినొంది ఉన్నది. త్రాడులో కల్పించబడిన పాము – త్రాడుగా తెలుసుకొన్న తర్వాత త్రాడునందే శమనం పొందుతుంది చూచావా? అట్లాగే, నామరూపాత్మకమైన కల్పిత జగత్తు బ్రహ్మమునందే శమించగలదు. వాస్తవానికి బ్రహ్మం ఆకాశాది ఆయా పదార్థములుగా ఎన్నడూ అవటమే లేదు. అవబోదు. బ్రహ్మం బ్రహ్మం గానే ఉంటోంది. ఇక ఒకప్పుడు కల్పన ప్రదర్శితమౌతోంది. ఆత్మజ్ఞానముచే అది మరొకప్పుడు శమిస్తోంది. బ్రహ్మం దృష్ట్యా చూస్తే ఏదీ క్రొత్తగా ఉదయించడం లేదు, శమించడం లేదు.

❖❖❖

6. తితిక్ష

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఈ మనుజుడు ఒక్కొక్క సందర్భంలో అనేక గాయములను, వ్యాధులను, మానసిక బాధలను ఓర్చుకుంటున్నాడు. తట్టుకుంటున్నాడు. మరి "ఈ శరీరాదులు నేను కాదు"... అను అనహంభావనను ఓర్పుగా ఎందుకు ఆశ్రయించి ధరించలేడు చెప్పు? ప్రతి ఒక్కరికి అట్టి అనహంభావన సాధ్యమే. వాస్తవానికి ఈ దేహాదులందు అహంభావన ఏర్పర్చుకో వటమే శ్రమతో కూడిన పని. ఎందుకంటే 'అనహం' అనునదే ప్రతి ఒక్క జీవుని స్వభావమే అయి ఉన్నది కదా! అహంభావన ఆపాదిత స్వభావమైయున్నది. జగత్తునందలి సమస్త పదార్థ సమూహాలకు దేహాదులందలి అహంభావనయే అక్షయమైన, అంకురమై ఉన్నదని జనులంతా గమనించెదరు గాక! ఆత్మ బోధచే అట్టి జగత్తు అనబడేది నిర్మూలనమగుచున్నది.

వాయు ఉపమానం - పరమాత్మ "వాయువు" అని అనుకుంటే అందు వాయు తరంగం వంటిది ఈ అహంకారం. వాయువు సంచలనం శమిస్తే (వాయు తరంగాలు ఉండవు కదా!

అట్లాగే అహంకారం శమిస్తే) అప్పుడిక జగద్దర్శనమంతా తనకు తానుగానే శమిస్తుంది. అప్పుడు 'అనిర్దేశం, చిదాభాసరహితం, అనంతం, అజం, అవ్యయం" అయినట్టి స్వస్వరూప చిదాకాశం మాత్రమే శేషించగలదు.

దర్పణ ఉపమానం - పరమాత్మ అనే స్వచ్ఛమైన అద్దముపై 'అహంకారము' అనే జలతుంపర మాలిన్య సహితంగా గోచరిస్తుంది. ఆ 'అహంకారము' అనే జలబిందు సమన్విత ధూళి కణములను తొలగించామా, అప్పుడు ఆత్మ యొక్క నిర్మలత్వం గోచరించగలదు. అహంకారమే ఎదుట ఉండే పదార్థములను చైతన్యం నందు వికారసమన్వితంగా ప్రతిబింబింపజేస్తోంది. అహంకారం శమిస్తే, చైతన్యం అభాసరహితమౌతుంది. అనంతమై, అజమై, అవ్యయమైన పరమాత్మ రూపాన్ని సంతరించు కుంటుంది.

మేఘ ఉపమానం - ఆకాశము మేఘావృతమైనప్పుడు సూర్యకాంతి ప్రసరించదు. ఎప్పుడైతే మేఘములు తొలగుతాయో... ఇక క్రొత్తగా ఎట్టి ప్రయత్నం లేకుండానే ఆకాశం సూర్య తేజస్సుతో ప్రకాశమానమౌతుంది. అట్లాగే అహంకారమేఘం తొలగగానే ఆత్మసూర్యప్రకాశం అంతటా అన్నిటా విరాజమానమై ప్రస్ఫుటం కాగలదు.

రాగితో కూడిన బంగారు ఉపమానం - చిరకాలంగా రాగితో కలిసి ఉన్న బంగారం తన స్వచ్ఛతను కోల్పోయి అల్పకాంతితో కనిపించవచ్చు గాక! ఆ బంగారాన్ని పుటం వేసి రాగిని తొలగిస్తే... బంగారం మరల ధగధగ ఛాయతో వెలుగొందుచున్నది కదా! చైతన్యం చిరకాలంగా అహంకారంతో కూడుకొని ఉండటం చేత 'జీవుడు' అనబడు రూపంలో కనబడుతోంది. ఎప్పుడైతే శ్రవణ, మననాది ఉపాయాలచే బ్రహ్మమును ఆవరించిన అహంకార దోషం తొలగుతుందో... ఆ మరుక్షణం బ్రహ్మము బ్రహ్మ రూపత్వముచే విరాజమానం కాగలదు.

సముద్రం చేరిన ఉప్పు... ఉపమానం - సముద్ర జలంలోంచి ఉప్పు బయల్వెడలుతోంది. అయితే, సముద్రంలో వేయబడిన ఉప్పు గడ్డ తన నామరూపాలు కోల్పోయి సముద్రజలంలో విలీనమైపోతుంది, చూచావా? అట్లాగే... అహంకారం బ్రహ్మమునందు ప్రవేశించగానే తన యొక్క జగదత్వమును కోల్పోయి బ్రహ్మముగానే పరిణమిస్తోంది.

వాస్తవానికి బ్రహ్మము సద్రూపమై, శాంతమై, నిత్య ప్రకాశమానమై అనిర్దేశ్యమై, అవాఙ్మానస గోచరమైయున్నది. అయితే (బ్రహ్మం, గుణాదుల కంటే అతీతమైనదైనప్పటికీ) అల్ప విషయాలైన అహంత్వం మొదలైనవాటికంటే బ్రహ్మం యొక్క ఔన్నత్యాన్ని నిరూపించటానికి అద్దానికి బృహదత్వం మొదలైన లక్షణాలు శాస్త్రములచే కల్పించబడ్డాయి. వాస్తవానికి అహంత్వ రూపంగా స్థితి కలిగి ఉన్నది కూడా బ్రహ్మమే! అహంకారాన్ని కూడా బ్రహ్మంగా దర్శించటమే అహంకారాన్ని అధిగమించటం (లేదా) జయించటం అనునదే శాస్త్రముల ముఖ్యోద్దేశము.

జగత్తు జగద్భావనచేతనే సిద్ధిస్తోంది. భావనచే సిద్ధించేది అభావనచే తొలగిపోక ఏం చేస్తుంది? అభావనచే (భావనామూలమగు అజ్ఞాన నాశనం) జగత్తుకు బీజమైన అహం పదార్థం స్వయంగా శమిస్తోంది. అప్పుడిక 'అహంత్వం-జగత్తు-బంధం'... ఇటువంటి కల్పనలకు తావేది?

సద్బ్రహ్మ శివమాత్మేతి పరే నామ కలంకితా
ఉదేత్య హన్తా కుంభత్వాదివ మృద్ధాతు విస్మృతిః ॥

ఆకారసమన్వితమైన కుండను చూస్తుండగా ఆకారాదులు వర్తించనట్టి మృత్తిక (మట్టి)ని ఏమరుస్తూ ఉంటారే! అట్లాగే ఎదురుగా కనబడే ఈ పాంచభౌతిక దేహం, గుణములు, మనస్సు-బుద్ధి-అహంకారము మొదలైన పరిమిత-కల్పనారూప విషయములను చూస్తూ స్వభావతః అపరిమితము, శుద్ధము, పరిపూర్ణము అగు (సత్తు-బ్రహ్మము-శివము అనబడే) ఆత్మను ఏమరచటం జరుగుచున్నప్పుడే 'జీవుడు' అనబడేది దర్శనమగుచున్నది. అనగా,.... ఆత్మ అనబడే "అపరోక్ష - చిదేక రసము" నందు అజ్ఞానముచేత మాత్రమే "ఆత్మకు అస్వభావమైనది, సంకోచరూపమైనది, నామాదులచే కళంకితమైనది, నేను-నీవు-మొదలైన పరిమిత దృష్టులను సంతరించుకున్నది" అయినట్టి అహంత్వము భ్రమచే స్ఫురిస్తోంది.

'అహ'మనే బీజం నుండి "దృశ్యసత్త" అనే ప్రతిబింబితమంతా గోచరిస్తోంది. ఈ 'దృశ్య సత్త'లో అనంత సంఖ్యలో "జగత్తులు" అనే ఫలాలు ఉత్పన్నమౌతున్నాయి. నశిస్తున్నాయి కూడా!

'అహంకారం' అనే చిన్న మిరియపు గింజలో ఈ పర్వత - సముద్ర - నది - భూమి సహిత బ్రహ్మాండం, రూపాలను సందర్శించే ఇంద్రియ స్వభావం, మనస్సు, ఆ మనస్సుకు గోచరించే కామ సంకల్పాది ఇంద్రియ వృత్తులు ఇవన్నీ చమత్కారంగా ఉదయిస్తున్నాయి. నీకు బాహ్యం వలె కనిపించే ఈ అంతరిక్షం, భూమి, వాయువు, ఆకాశం, దిక్కులు - ఇవన్నీ "అహంకారం" అను వికసించిన పుష్పం యొక్క సుగంధాలు మాత్రమే! తెల్లవారగానే వస్తువుల రూపాలు కనిపించటం ప్రారంభించినట్లు, ఆత్మయందు అహంకారం ఉదయించగానే జగత్తు ప్రకటితమౌతోంది. అనగా... అహంకారం భావనా మాత్రంచేత క్షణకాలంలో అసత్తగు ఈ జగత్తును నిర్మించుచున్నది. జలంలో చిన్న రాయి పడగానే ఆవృత్తాలు బయల్వెడలే విధంగా, నిశ్చల బ్రహ్మంలో 'అహంకారం' అనే గులకరాయి పడగానే, "ప్రవృత్తి" అనే ఆవృత్తం బయలుదేరి - అదికాస్తా ముల్లోకాల అనుభవానికి కారణభూతమగుచున్నది. కళ్ళుమూసుకుంటే ఏదీ కనిపించదు. కళ్ళు తెరిచిన మరుక్షణం అనేక వస్తువులు కనిపిస్తాయి. ఆ కళ్ళకు అసత్యాలైన ఆకారాలు సత్యం వలే అగుపిస్తాయి. అట్లాగే రెప్ప పాటు కాలంలో 'అహంత్వం' ఆత్మయందు ఉద్భవించి అదే అనేక జగత్తులను అనుభవిస్తోంది. ఎంత ఆశ్చర్యం! అట్టి అహంకారం రహితమవగానే 'జగదనుభవం' అనే బంధం ముడి వీడుతుంది.

శ్రీరాముడు : అహంకారమును మేము రహితం చేసుకొని ఆత్మస్వరూపులమై ప్రకాశించేది ఎట్లా?

శ్రీ వసిష్ఠ మహర్షి : అహంకారము ఆత్మస్వరూపమే! ఆత్మ యొక్క విన్యాసమే! నిరంతరమైన పరమాత్మ జ్ఞానముచే అహంకారము నిశ్శేషముగా నశించగలదు. అప్పుడు సంసారము అనే మృగతృష్ణ పూర్ణంగా శమించిపోగలదు. ఓ రామచంద్రా! ఈ జగత్తు జీవునికి ఎట్లా లభ్యమౌతోంది?

శ్రీరాముడు : "జగత్తు" అనగా అనుభవముయొక్క రూపమే కదా! అనుభవము "భావనచేయటం" అనే రజోగుణం నుండి బయల్వెడలుతోంది. కనుక జగత్తు భావనముండే పరిలక్ష్యం అగుచున్నది.

శ్రీ వసిష్ఠ మహర్షి : భేష్! సరిగ్గా చెప్పావు. కనుక... స్వతఃసిద్ధమగు ఆత్మ 'చిన్మాత్రము యొక్క భావన' అను చిన్న అభ్యాసం చేత సుసాధ్యమగుచున్నది. అట్టి ఆత్మానుభవి ఇక ఇక్కడ భ్రమనుగాని, భేదమునుగాని పొందనే పొందడు.

స్వయత్నమాత్ర సంసాద్యాదసహాయాది సాధనాత్
"అనహమ్ వేదనాన్ న అన్యత్ శ్రేయః" పస్యామి తే, అనఘ!

"ఈ దేహ-జగదాదులు నేను కాదు" అను భావనను ఈ జీవుడు ఎందుకు ఆశ్రయించ రాదు? అట్టి 'అనహం' అను భావనకు శ్రమ ఏమున్నది? అందుకు బాహ్యమైన ఎట్టి సాధనలు అవసరం లేదు కదా! అంతటి సులభ సాధ్యమైన 'అనహం' అను దానినిమించి శ్రేయమైనదేదీ లేనే లేదని నా అభిప్రాయం. కనుక – రామచంద్రా! నీవు 'అనహం' భావనను ఆశ్రయించు.

శ్రీరాముడు : మహర్షీ! అట్టి "అనహం" భావనను అతి త్వరగా సుస్థిరీకరించుకోవటానికి వీలుగా ఏదైనా సులువైన క్రమమార్గాన్ని ఈ సందర్భంలో ఉపదేశించండి.

శ్రీ వసిష్ఠ మహర్షి :

1. మొట్టమొదట "నేను ఒక వ్యష్టిని"... అనే అభిప్రాయమును తీసుకో. "ఈ వ్యష్టి అహంభావం సరి అయినది కాదు. అనగా వాస్తవమైనది కాదు. పైగా... అసమంజసం కూడా!"... అనే నిర్ణయమును ధ్రుపరచుకో.

2. "ఈ నలువైపులా విస్తరించియున్న జీవ – పర్వత-అంతరిక్ష – పృథివి-సముద్ర-వాయువులన్నీ నా స్వరూపము వంటివే"... అనే సమష్టి అహంకారమును ఆశ్రయించు.

3. క్రమంగా "ఈ పర్వతాదులు ఎందులో సమాగతమై ఉంటున్నాయో... అట్టి ఆకాశ స్వరూపుడను"... అను భావనను సమీపించి అభ్యసించు.

4. అట్లు ఆకాశస్వరూపమును అనుగతం చేసుకున్న తరువాత క్రమంగా నీ స్వరూపముతో ఈ విశ్వమంతటినీ పూరించివేయి. అట్లా సర్వమును పరిపూరితం చేసి దశదిశలా వ్యాపించిన విభవము కలవాడవగుము.

5. ఆ తరువాత "ఈ చరాచర జగత్తంతా నిష్ప్రపంచరూపమగు బ్రహ్మమే కదా"... అను అవగాహనను పెంపొందించుకో. ఆ విధంగా ఈ ప్రపంచమంతటినీ నిషేధము గావించివేయి.

ఆ తరువాత ఇక చెప్పవలసినదేమున్నది? ఆ నిష్ప్రపంచరూపమగు ఆత్మయే నీవు కదా! అదే ప్రతి జీవుడు కదా! కనుక స్వస్థుడవై, శాంతుడవై, దుఃఖరహితుడవై ఇంద్రియ దోషముచే స్పృశించబడనివాడవై కళాకళలు లేనివాడవై ఉండు. నిర్మలాత్ముడవై వెలయుము.

ఎందుకంటే... అధ్యారోపము, అపవాదము – అను రెండు సిద్ధాంతాలూ చివరికి నిష్ప్రపంచ రూపమగు శుద్ధాత్మనే ఉద్దేశిస్తున్నాయని మా అభిప్రాయం. అనగా....నిష్ప్రపంచమైనట్టి శుద్ధాత్మయే సర్వ వేదాంత సిద్ధాంత సారమైయున్నది.

❖❖❖

II. శ్రీ భుశుండ - విద్యాధర సంవాదము

1. బరువైన 18 వస్తువులు

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఈ నిర్వాణ ప్రకరణ ఉత్తరార్ధ పరిచయ వాక్యాలలో ఈ జీవుడు "వ్యష్టిఅహంకారభావన" నుండి "నేను నిష్ప్రపంచకరూపమగు బ్రహ్మాన్ని" – అనే సమున్నత స్థితిని సముపార్జించటమే వేదాంత సిద్ధాంతసారం అని అనుకున్నాం కదా!... అది సాధించడమెలా?

ఈ జీవుని స్వభావం అనిత్యమగు దేహము–ఇంద్రియ విషయములలో ప్రవేశించి ఉన్నది. అదియే పరిమితత్వమునకు, జడాజడములగు ఉపాధుల రాకపోకలకు కారణమగుచున్నది. కనుక, "అపరిమితమైన ఆత్మకు దుఃఖం ఎందుకు తారసపడుతోంది?" అను ప్రశ్నకు సమాధానం "అపరిమిత స్వభావుడగు ఈ జీవుడు పరిమిత వస్తువుల పట్ల నమ్మకం–ప్రీతి–అభ్యాసం కలిగించుకొని ఉండటమే"... అని చెప్పబడుతోంది.

కనుక ఓ జనులారా! "ఈ మనస్సు ఇంద్రియముల వైపుగా పరిగెడుచున్నది" అనే విషయం గమనించండి. అట్టి మనస్సహితమైన సర్వేంద్రియ విషయ స్వభావాన్ని మొదట జయించాలి సుమా! ఆ తరువాత "వివేకము" మొదలైన సాధనములను ఆశ్రయిస్తే సర్వము అతిశీఘ్రుంగా సిద్ధించగలదు.

స్వభావమాత్రం యేన అన్తర్ నజితం దగ్ధబుద్ధినా
తస్య ఉత్తమపదప్రాప్తిః సికతా తైలదుర్లభా ॥

ఎక్కడైనా ఇసుకను ఎంతగా పిండినప్పటికీ తైలం లభిస్తుందా? ఎవడైతే ఇంద్రియ విషయ లోలత్వ స్వభావంతో కూడిన అంతఃకరణాన్ని ముందుగా జయించడో... అట్టివానికి ఉత్తమ పద ప్రాప్తి ఎట్లా అభిస్తుంది?... అందుకే శాస్త్రాలు సాధనాలను మొట్టమొదటగా ప్రతిపాదిస్తున్నాయి.

తెల్లటి గుడ్డపై కొంచెం రంగైనప్పటికీ చక్కగా అంటుతుంది చూచావా? అట్లాగే శుద్ధమైన చిత్తంలో కొంచెం ఉపదేశం కూడా చక్కగా ప్రవేశించి బ్రహ్మానుభవం అనుభూత మొనర్చగలదు. సాధనచతుష్టయం లేని చిత్తమునకు ఎంత ఉపదేశించినా కూడా కంఠశోషయే మిగులుతుంది.

ఈ విషయం గురించి ఒకప్పుడు ఒక మహానుభావుడు నాకు చెప్పిన కొన్ని విశేషాలు గుర్తుకు వస్తున్నాయి అది వివరిస్తాను. విను.

పూర్వం ఒకప్పుడు నేను భుశుండ వాయసము వారిని (భుశుండుడు అనే కాకి స్వరూప మహాత్ముని) సందర్శించటం జరిగిందని చెప్పి ఉన్నాను కదా! ఆయన మేరుపర్వతం యొక్క శిఖరాగ్రంపై ఒక గుహలో ఏకాంత స్థానంలో విరాజమానుడై ఉన్నారు. అప్పుడు నేను ఆయన్ను ఇట్లా ప్రశ్నించాను.

ఓ భుశుండ మహాశయా! మీకు అనేకమంది జ్ఞానులు, అజ్ఞానులు తారసపడి ఉంటారు కదా! ఇంద్రియములను జయించనట్టి మందబుద్ధి ఆత్మజ్ఞానరహితంగా దీర్ఘకాలం జీవించిన ఎవ్వరైనా ప్రాణి గురించి చెప్పండి. తద్వారా మన ఈ అధ్యాత్మకథా ప్రసంగం రసవత్తరంగా ఉంటుందని నా అభిప్రాయం...

అప్పుడు భుశుండుడు చెప్పిన వృత్తాంతమేమిటో విను.

❖

శ్రీ భుశుండుడు : మహాత్మా! వసిష్ఠమహర్షీ! మీరు అడిగిన దానికి అనుకూలంగా ఒక సంఘటనను వివరిస్తాను, వినండి. పూర్వం ఒకానొక విద్యాధరుడు ఉండేవాడు. అతడు సదాచార సంపన్నుడు. చక్కటి విచారవంతుడు. కానీ అతడు ఇంద్రియయలోలుడు. అనగా ఇంద్రియ విషయాలలో తగినంత నిగ్రహం లేనివాడు. అయితే తపస్సు మొదలైనవి బాగా చేసి చేసి, దేహం శుష్కింప జేసుకున్నాడు. ఆత్మజ్ఞానం సముపార్జించకపోవటం చేత అతని ఇంద్రియాలే అతనికి క్రమేణా ఎంతో ఖేదాన్ని కలుగజేయసాగాయి. అతడు కూడా దీర్ఘమైన ఆయువుపొందాడు. నాలుగు కల్పాలు ఆ విధంగా ఆత్మజ్ఞాన రహితమైన కేవల తపో-యమ-నియమాలు నిర్వర్తించాడు. చేయగా చేయగా, నాలుగవ కల్పం ఆఖరులో అతని యందు వివేకం జనించింది.

విద్యాధరుడు : "ఏమిటిది? ఈ జీవునికి మరల జన్మ – మరల మృత్యువు – మరల వార్ధక్యము"... ఇట్లా కలుగుతూనే పోతున్నాయి కదా! ఇదంతా ఎంత సిగ్గుపడవలసిన విషయం! ఇటువంటి జన్మ – కర్మల వలన లాభమేమిటి? ఏదైతే సుస్థిరమైనదో... అట్టి వస్తువును ఆశ్రయించటం ఉచితం. అయితే అటువంటి స్థిరమైన వస్తువు ఏదైనా ఉన్నదా?"

... ఇట్లా వివేకముతో యోచించసాగాడు. ఆతడు అప్పటికే 18 వస్తువులతో కూడిన మోత బరువును (పంచప్రాణాలు, దశ ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి, స్థూలదేహాలతో కూడిన ఈ ఉపాధిని) అతి దీర్ఘకాలం ధరించి ఉన్నాడు కదా! అందుచేత వాటన్నిటి మూలంగా ఎంతగానో అలసిపోయాడు. ఈ సంసారం పట్ల విసుగు, విరక్తి జనించింది. ఆయా జ్ఞానులను సంప్రదించి వారి సలహాను అనుసరించి ఆ విద్యాధరుడు నా వద్దకు వచ్చాడు. వచ్చి ఆదరపూర్వకంగా నమస్కరించాడు. అప్పుడు స్వాగతమర్యాదలతో అభ్యాగతి పూజ సమర్పించి, ఇక ఆ తరువాత, "ఏమి విద్యాధరా! ఇటు వచ్చావు?" అని ప్రశ్నించాను.

విద్యాధరుడు : మహాత్మా! భుశుండా! నేను అనేక కల్పాలు ఈ దేహంతో ఎన్నో యమ – నియమాలు నిర్వర్తించాను. సుదీర్ఘకాలం కాయక తపస్సు చేశాను. ఈ ఇంద్రియ విషయాలను నేను ఇప్పటికీ జయించలేకపోయాను. ఈ నా ఇంద్రియాలను చూస్తున్నారు కదా! ఇవి విషయాలలో ప్రవేశించటంలో అతి ప్రావీణ్యం చూపుచున్నాయి. ఆ విషయాల నుండి ఎన్నో ప్రియాప్రియరూప బంధాలు ఏర్పడుచున్నాయి. ఈ నా ఇంద్రియాలు విషయాల నుండి తొలగటమే లేదాయె! మీదకు దూసుకువచ్చే సునిశితమైన బాణాల కన్నా ఈ ఇంద్రియ విషయాలు మరింత ప్రమాదకరమై ఉంటున్నాయని నేను గమనించాను.

ఇవి హృదయంలో అంధకారం వలె అలముకొని ఉన్నాయి. ఇక హృదయం తమోమయమై ఉంటోంది. 'కామం'అనే మర్కటం హృదయాన్ని అనుక్షణం వ్యాకులపరుస్తోంది. నేను ఇంద్రియాలను జయించనే లేదని, అవియే నన్ను జయించి నా హృదయమును ఆక్రమించుకుని ఉన్నాయని నేను గమనిస్తున్నాను. వీటిని జయించకపోతే నేనేమాత్రం సుఖవంతుడను కాలేనని తెలుసుకున్నాను. విద్యాధర ఉపాధికి అనేక భోగాలు లభించే మాట నిజమే! ఆ భోగాలన్నీ మానసిక మహారోగాలేనని, వాటిని ఎంతగా అనుభవించినా తనివి తీరదని, ప్రతిభోగం కలిగించేది స్పర్ధయే గాని శాంతి కాదని నేను గ్రహించాను. వాటిపట్ల విరక్తుడనైనాను. మహనీయుల ఉపదేశాన్ని అనుసరించి "మహత్ భాగ్యమే"... అన్నట్లుగా ఈనాటికి మీ దర్శనం చేసుకోవాలని, శరణు వేడాలని, మీ బోధ వాక్యాలు వినాలని బుద్ధి పుట్టింది.

❖❖❖

2. ఇంద్రియముల దురాక్రమణం

శ్రీ భుశుండవాయస మహాయోగి : ఓ విద్యాధరా! ముందుగా మీ అనుభవ – అవగాహనలను విశదీకరించండి.

విద్యాధరుడు : మహాత్మా! భుశుండమహాశయా!

యత్ ఉదారమ్ అనాయాసమ్ క్షయ – అతిశయ వర్జితమ్
పదం పావనమ్ ఆద్యంతరహితం తత్ వదాశు మే ॥

ఈ విద్యాధర ఉపాధితో అనేక కల్పములు వివిధ భోగములు రుచి చూచాను. కాని ఏం లాభం? ఇందులో దుఃఖరహితమైనది. శాశ్వతమైనది అయిన సుఖమేదీ అగుపించటమే లేదు.

ఏ స్థానమైతే ఉదారమై ఎట్టి దుఃఖాలకు కారణం లేనిదై, ప్రయాసరహితమై, సహజానంద రూపమై, క్షయం గాని – అతిశయం గాని లేనట్టినదై, పరమ పవిత్రమై, ఆది–అంతం లేనిదై ఉన్నదో... అద్దానిని గురించి విశదీకరించగల సమర్థులని చెప్పగా చెప్పగా విని, మిమ్ములను శరణు వేడుచున్నాను.

ఓ మునీంద్రా! ఇంతకాలం నేను జడాత్మకంగా (విషయాలలో) నిదురిస్తున్నానని నాకు తెలిసిపోయింది. చాలాకాలం తరువాత మనస్సు తీవ్ర వైరాగ్యంచే జాగృతమగుచున్నది.

కామము - మహాత్మా! ఏది ఎచ్చట ఎంతగా పొందినా కూడా... ఈ మనస్సు "ఇంకా ఏవేవో కావాలి" అను రూపంలో ఉండే కామంచే సంతప్తమగుచున్నది. ఆ కామం నుండి అజ్ఞానవృత్తులన్నీ ఒకదాని వెంట మరొకటి బయలుదేరి నింద్యముగ మహాక్షోభను కలుగజేస్తున్నాయి. ఫలితం? ఇక నేను దుశ్ఛేద్యములైన అనేక సాంసారిక క్రియాపరంపరలలో ఇరుక్కుపోతున్నాను. ఇంకేమున్నది? అనాత్మయందు ఆత్మాభిమానం ఏర్పడి, మోహం గుట్టలుగా ప్రోగగుచున్నది. ఇట్టి మోహం నుండి నన్ను సముద్ధరించండి.

దోషభూములు - విద్యాధరునిగా అనేక ఐశ్వర్యములు ఉండవచ్చు గాక! గుణ సంపద కూడా ఉండవచ్చు గాక! సుందరమైన ఆయా శాస్త్ర ప్రవచిత అభ్యాసాలు నిర్వహిస్తూనే ఉన్నాను కూడా, కాని ఏం లాభం? ఇప్పటికి కూడా ఈ ఇంద్రియాల ప్రబలత్వమును జయించలేకపోయానే! ఆత్మ జ్ఞాన రహితుడవై తదితర విద్యాధరులపై కామ-క్రోధాలు వదలలేకపోయాను. క్రోధ, భయ, దుః ఖ, కార్పణ్యాది ఆయా దోషాలు అసంఖ్యాకంగా నా హృదయ ప్రాంగణంలోకి వచ్చి పడుచూనే ఉన్నాయి. ఈ విద్యాధరాది దేవయోనులు కూడా ఆత్మజ్ఞానం లేనంతవరకు కమలాపై వ్రాలే దోమల వలె తుచ్ఛమైనవే కదా! జన్మ, మృత్యువులు విద్యాధరులకు కూడా తప్పేవి కావు కదా మరి!

ఈ శబ్దస్పర్శాది విషయాలన్నీ కూడా పూర్వం అనేకసార్లు అనుభవించినవే. అవియే మరల మరల అనుభవించటం జరుగుతోంది. అవి ఇచ్చేవన్నీ తుచ్ఛమైన అల్ప సుఖాలు మాత్రమే. ఈ విషయేంద్రియ స్పర్శలన్నీ వంచనోపాయాల ద్వారా మమ్మ అనేకసార్లు మోసం చేస్తున్నాయి. దాని ఫలితంగా దీర్ఘకాలంగా నేను ఖిన్నుడనై వీటి పాల పడి ఉన్నాను. మనస్సుకు విశ్రాంతియే లేదు. క్షణ భంగురాలైన అనేక విశేషాలతో కూడిన ఈ సంసారానికి అటు స్థిరత్వమూ లేదు. ఇటు అంతూ లేదు.

ఆపాతమధురారంభా, భంగురా, భవహేతవః,
అచిరేణ వికారిణ్యో భీషణా భోగ భూమయః ॥

సంసార దుఃఖాలకు హేతభూతాలైన భోగాలన్నీ ప్రారంభంలో మాత్రం కొద్దిసేపు రమణీ యంగా తోచుచున్నాయి. అవన్నీ క్షణభంగురాలే కదా! అందుచేత అతి శీఘ్రంగా అవన్నీ కూడా వికారయుక్తములై భయాన్ని గొలుపుచున్నాయి. ఈ విద్యాధర సంబంధమైన సంపదలు నమ్మ దగినవి ఎట్లా అవుతాయి? వాస్తవానికి ఈ సంపదలన్నీ అనేక మానావమానాలకు కారణమై ఉంటున్నాయి. దుష్టమగు అహంకారం ప్రవృద్ధమగుటకు ఇవియే ఆజ్యం. ఇవి 'వివేకం' అనుదానికి సుతరామూ వ్యతిరేకమై ఉంటున్నాయి. ఓ భుశుండ మహాశయా! అనేక మధుర ఆఘ్రాణాలకు ఆలవాలమైన సుందర నందనవనాలలో సంచరించాను. కల్పవృక్షం ప్రసాదించగల భోగాలన్నీ అనుభవించాను. అనేక విషయానందాలు చవిచూచాను. సుందర విద్యాధర స్త్రీలతో అనేకచోట్ల విహరించాను. క్రొత్తగా ప్రారంభమయ్యేదంతా మొదట ఒక వింతగా ఉండి, అతిత్వరలో రోతగా పరిణమిస్తుంది. కాలక్రమేణా ఇవన్నీ అయోగ్యమైనవేనని, స్వభావసిద్ధమగు సుఖాన్ని ప్రసాదించ జాలవని నేను గమనించాను. పైగా మానసిక వ్యధ నన్ను ఏమాత్రం వదలటం లేదని, ఆయా భోగాలన్నీ మానసిక వ్యధను కొద్ది సమయం దాచిపెట్టటానికి మాత్రమే కారణమగుచూ, చివరికి చూచుకుంటే... ఆ వ్యధను ఇనుమడింపజేస్తున్నాయని తెలిసిపోతోంది.

1. నేత్రేంద్రియము - ఈ కళ్ళు రూపాన్ని గుర్తించడానికి ప్రకృతి ప్రసాదించింది. అయితే ఇవి రూపగ్రహణం విషయంలో ఎంత చంచలంగా ఉంటున్నాయి? ఆహా! స్త్రీల ముఖాన్ని గాంచటంలో వీటికి ఎంతటి అభిలాష! అన్నిటిని చూడటానికి ఉపకరించే ఈ నేత్రేంద్రియాలు అనేక విషయాలలో సంగం కలిగి ఉన్న నాకు చివరికి దుఃఖకారకమే అగుచున్నాయి. ఇవి నన్ను ఎంతగానో మోసగిస్తు

న్నాయి కూడా! ఎందుకంటే ఇవి వివేకం లేకుండా బాహ్యరూపాలను చూచి ఆకర్షించబడి పరుగులు తీస్తున్నాయి గాని, ఆయా వస్తువుల ప్రక్కనే చాటుమాటుగా ఉన్న తుచ్ఛత్వమును గమనించటమే లేదు. స్త్రీల రంగు రంగు వస్త్రములు, కులుకు, బెళుకులను చూచి చంచలమగుచున్నాయి. అంతే గాని "ఈ జంతు, మనుష్య దేహాలన్నీ రక్త-మాంస మయాలే కదా!" అనే విషయం చూరగొనటమే లేదు. చిత్తం చంచలమై ఉండగా, అది నానావిధ బంధాలను కలుగజేసే కర్మలందు తత్పరమై ఉండగా, నరకం మొదలైన అనేక అనర్థములను కలిగించగల దుర్వ్యసనాలలో ఆసక్తి కలిగి ఉండగా... ఈ నేత్రేంద్రియానికి విశ్రాంతి ఎక్కడ ఎట్లా లభిస్తుంది? చిత్తం ఉపశమించే వరకు ఈ నేత్రేంద్రియం యొక్క గతి ఇట్లే అతి చంచలమై అలసిపోతూ ఉండక తప్పదు కదా!

2. ఘ్రాణేంద్రియము - అక్కడ ఇక్కడ ప్రత్యక్షమై ఉన్న ఆయా అనర్థాల వైపుకే పరుగులు తీస్తూ ఉంటే, పెంకి గుఱ్ఱములతో పోల్చతగిన ఈ ఘ్రాణేంద్రియాన్ని నేను నివారించలేక పోతున్నాను. అతి క్రూరుడగు మాంత్రికుడు తన మంత్రబలం చేత ఒక అమాయకుని బలవంతంగా తన వశం చేసుకొని దుర్గంధయుతమైన ప్రదేశాలలో నియమిస్తున్నట్లు ఈ ఘ్రాణేంద్రియం తనయందు శ్లేష్మాది దుర్గంధములతో కూడినదై ఉండి నన్ను మాత్రం ఆఘ్రాణిత వస్తువుల వైపు తరలించి బలంగా ఆ స్థానములందు బంధం కలుగజేస్తోంది!

3. జిహ్వేంద్రియము - "ఇది పొట్టకు మంచిది. ఇది కాదు. ఇది క్షేమకరం. ఇది అనారోగ్య కరం" అనే విచక్షణ లేకుండా ఈ నాలుక ఆయా రుచులందు ఆకర్షిత అయి ప్రవర్తిస్తోంది. ఆహా! మహత్తర సచ్చిదానంద స్వరూపుడగు ఈ జీవుడు పశువు, క్రిమికీటకాలు మొదలైన అవివేకపూరిత ఉపాధుల పరంపరలు సంపాదించుకుంటున్నాడంటే కారణం?... ఈ జిహ్వేంద్రియానికి దాసుడు అగుటచేతనే కదా!

4. త్వక్ ఇంద్రియం (స్పర్శేంద్రియం) - ఆహా! ఏమి ఈ చర్మేంద్రియం యొక్క స్పర్శలోలుత్వం! వేసవి కాలంలో ఎండవేడిమిని నిరోధించలేకపోతున్నట్లు, ఈ చర్మేంద్రియం యొక్క స్పర్శాశయాన్ని నిరోధించ లేకపోతున్నానే!

5. శ్రవణేంద్రియం - ఈ శ్రవణేంద్రియం (చెవులు) శబ్దతరంగాల యొక్క ఆస్వాదమునందు అనురాగం కలిగి ఉన్నది. కోమలమైన గడ్డిపరకలను అభిలషించిన జింక భయంకర మృగములున్న స్థానములలో ప్రవేశించునట్లు... ఈ శ్రవణేంద్రియం నన్ను అవివేకపూరితమైన స్థానములకు చేరుస్తోంది. దూషణ - భూషణ - తిరస్కార - పురస్కారములు కేవలం భాషాప్రయోగ మాత్రమే అయినప్పటికీ, శ్రవణేంద్రియం అందుకు కుస్పందనను ఆశ్రయించి ఒక్క క్షణంలో బుద్ధితత్త్వము వరకు ప్రకంపనలను కలుగజేస్తోంది. ప్రియ వాక్యములు పలికేవారు, వందనాలు సమర్పించేవారు, వినమ్రులైన భృత్యులు, స్తోత్రాలు ఉచ్చరించే వందిమాగధులు, వీళ్ళంతా పలికే అనేక శుభ శబ్దముల వైభవమును ఈ చెవులు విని ఉన్నాయి. కించిత్ సుఖమును, ఇంతలోనే దూషణ తిరస్కార శబ్దములు వినటంచే అవి కలిగించే దుర్భర దుఃఖములకు తీవ్రస్థాయిలో పొందుతూ పోతున్నాయి.

6. సుందర స్త్రీల లావణ్యములు - సరస వాక్యాలు పలికే సుందర స్త్రీల అభినయాలను ఆస్వాదించాను. వినమ్రులైన స్త్రీలు తమ చేతులతో అందిస్తుండగా అనేకసార్లు మధుర పానీయాలను గ్రోలాను. వారిచే తయారుచేయబడిన మధుర పదార్థములు రుచి చూచాను. వారు ధరించే పట్టు వస్త్రములను, హారములను, దేహములను ఈ చేతులో స్పృశించాను.

మునీంద్రా! ఈ విధంగా శబ్ద, స్పర్శ, రూప, రస, గంధ విశేషము లనేకములు అనేకసార్లు అనుభవించాను. కాని అవన్నీ 'అత్యంత శుష్కప్రాయాలు" అని ఇప్పుడు తెలిసిపోయింది.

భుక్త్వా వర్ష సహస్రాణి దుర్భోగపటలీమ్ ఇమామ్ ।
ఆబ్రహ్మస్తంభపర్యంతం న తృప్తిః ఉపజాయతే ॥

బ్రహ్మలోకం నుండి ఒక గడ్డిపరక వరకు గల ఈ భోగసమూహాలను వేల సంవత్సరాలు అనుభవించినప్పటికీ తృప్తి కలుగనే కలుగదు. ఒకడు విస్తారమైన సామ్రాజ్యానికి మహాచక్రవర్తిగా సుదీర్ఘకాలం ఉండవచ్చు గాక! అనేక మంది సుందరస్త్రీలను లాలించి ఉండవచ్చు గాక! అనేక శత్రు రాజ్యాలను హస్తగతం చేసుకొని ఉండవచ్చు గాక! అందులో "దేహము-ఇంద్రియములు-ఇంద్రియ విషయములు" అను పరిధిని మించి అపూర్వమైన విషయాలు గాని, పదార్థాలు గాని ఏమున్నాయి? ఎవరైతే "ఈ మూడు లోకాలలో నా పరాక్రమానికి ఎదురే లేదు కదా! నన్ను ఎవరూ ఏమీ చేయలేరు"... అని అనుకుంటూ విఱ్ఱవీగారో... వారంతా అతిత్వరలో కాలప్రభావం చేత గుప్పెడు బూడిదగా మిగిలిపోయారు! ఆ రాజ్యాలు, ఆ బల – పరాక్రమాలు వారిని మృత్యువు నుండి కాపాడాయా? లేదు. మూడు లోకాలలోని అనేక పదార్థములను పొందినప్పటికీ, "నేను పొందవలసినదంతా పొందాను. ఒక పొందవలసినది లేదు" అని ఒక్క రోజన్నా అనుకోగలిగారా? ...లేదు. వాస్తవానికి అవన్నీ వారు తపస్సు వంటి అనేక కష్టతర కార్యక్రములచే ఎంతో శ్రమించి సంపాదించుకున్నవే! వారికి తృప్తి అనేది ఎందుకు కలగలేదు?

ప్రాప్తేన యేన నో భూయః ప్రాప్తవ్యమ్ అవశిష్యతే,
తత్ ప్రాప్తౌ యత్నమాతిష్ఠేత్ కష్టయాపి హి చేష్టయా ॥

దేనినైతే పొందిన తరువాత ఇక పొందవలసిదంటూ ఏమీ ఉండదో... అద్దాన్ని ప్రాప్తి కొరకై ఎంత కష్టపడైనా ప్రయత్నించాలి. కాలంతో వచ్చి, కాలంతో పోయేది పొందిమాత్రం ఏం లాభం? కాలముచే బద్ధము కానిది పొందితేనే ప్రయోజనం.

ఎవడైతే చిరకాలం ధన-నారీ-తదితర విషయభోగాలను పొందాడో... ఆ తరువాత అతని శిరస్సుపై ఏమైనా కల్పవృక్షం మొలిచిందా? అతనికి క్రొత్తగా ఏదైనా శాశ్వత వస్తువు ప్రాప్తించిందా? లేనే లేదు. ఓ భుశుండమహాశయా! దురంతమైన (అంతు అనేదే లేని) 'విషయాలు' అనే మహారణ్యంలో సంచరించిన నేను – సౌమ్య బాలుడు అల్లరి బాలురచే వంచించబడినట్లు – అవే విషయాలచే వంచించబడ్డాను. ఈ ఇంద్రియాలు ఇంతకాలం నన్ను మోసం చేసి అవాస్తవ సుఖాలు, దుఃఖసమ్మిళిత పదార్థజాలాల వైపుగా తరలించాయి. ఈ శబ్ద స్పర్శ రూప రస గంధాది విషయ

– ఉప విషయాలన్నీ బయలుదేరింది మనస్సులోంచే కదా! అనగా నా మనస్సులోంచే ఈ విషయ శత్రువులు బయలుదేరి, నా మనస్సును తమ వైపుగా ఆకట్టుకొని నన్ను నిర్వీర్యునిగా, అర్థరహితునిగా చేసి ఉంచాయి. ఇంతకాలానికి "ఈ విషయాలే నా శత్రువులు"... అని తెలుసుకున్నాను. బోయ వాళ్లు జింకను వేటాడుచున్నట్లు ఈ విషయశత్రువులు నన్ను వేటాడుచున్నాయి.

ఆహా! అతి భయంకరమైన ఈ ఇంద్రియ విషయశత్రువులకు పట్టుబడనివారు ఈ భూతలముపై అతి కొద్దిమంది ఉంటారు. ఇక నావంటి మిగతావారి సంగతంటారా! ఈ దేహము అనే నగరం "విషయాలు" అనే శత్రుసేనచే ఆక్రమించబడటం జరుగుతోంది. ఇక్కడి భోగాలే ఆ విషయశత్రువుల భయంకరమైన గజబలగం. తృష్ణ వాళ్ళ పాశాలు. లోభం వారి ఖడ్గం. క్రోధం వారి ఈటెలు. శీతోష్ణాది ద్వంద్వాలు వారి రథబలం. అహంకారం వారి సేనాపతి. దుష్ట ఇంద్రియాలే వారి పతాకం. అటువంటి విషయ శత్రుసైన్యమును జయించుటకు సన్నద్ధుడైనవాడే వీరుడు గాని... ఈ రాజ్యాలు జయించేవారు నిజమైన వీరులు కానే కారు.

ఒక మదించిన ఏనుగు కుంభస్థలమును చీల్చటం సులభమేమో గాని, కుమార్గాలలో ఎప్పటి కప్పుడు ప్రవృత్తమగుచున్న ఈ ఇంద్రియాలను నిగ్రహించటం మాత్రం అంత సులభమైన పని కాదు. ఓ సాధూ! ఒకనికి అనేక తాత్త్విక విషయాలు తెలిసి ఉండవచ్చు గాక. గొప్ప పౌరుషం, మహత్తు, మహాధైర్యం కలిగి ఉండవచ్చు గాక! చివరికి వారంతా ఈ ఇంద్రియ శత్రువులతో పోరాడి జయిస్తేనే విశ్రాంతి. కుత్సితమైన ఈ ఇంద్రియాలను ఎవడు జయిస్తాడో అతడు దేవతలకు కూడా పూజార్హుడు అవుతాడు. జితేంద్రియులగు మహాత్ములు మాత్రమే 'మనుజుడు' అని అనిపించుకోవటానికి అర్హుడు. ఇక ఇంద్రియాలను జయించనివారు కేవలం మాంసపు ముద్దలతో సమానమే గాని 'మనుజుడు' అను పేరుకు అర్హులు కారు. అయితే ఈ పంచేంద్రియాలను జయించటం ఎట్లా? వీటికి సేనాపతి మనస్సు. కాబట్టి మనస్సును జయిస్తే ఈ ఇంద్రియాలు తమంతట తామే వశమౌతాయి.

అయితే, ఈ మనస్సును ఎట్లా వశం చేసుకోవాలో అర్థం కాక... ఈ రోజు మీ పాద పద్మములను ఆశ్రయిస్తున్నాను.

ఇంద్రియోత్తమ రోగాణాం భోగాశావర్జనాదృతే
నౌషధాని, న తీర్థాని, న చ మన్త్రాశ్చ శాంతయే ॥

ఈ ఇంద్రియములు నన్ను భయంకర రోగముల వలె పట్టుకున్నాయి. భోగములను గురించిన ఆశ చావదే! ఆశను త్యజించటమే ముఖ్యమైన ఔషధం. అంతేగాని తీర్థములు, మంత్రములు ఎన్ని సేవించినా లాభం లేదనే నిశ్చయానికి వచ్చాను.

ఈ ఇంద్రియములు ఎటువంటివి?

నీతోఽస్మి పరమం ఖేదమభిధావద్భిః ఇంద్రియైః
ఏక ఏవ మహారణ్యే, తస్కరైః పథికో యథా ॥

మహారణ్యంలో ఒంటరిగా ఉన్న బాటసారి "ఎప్పుడు దొంగలు వచ్చి పడతారో?"....అని భయపడునట్లు నేను ఈ ఇంద్రియ విషయముల మధ్య చిక్కి ఖేదంతో పరుగులు తీస్తున్నాను. ఈ

ఇంద్రియసమూహమును "బురదతోకూడి, అతిమలినమై, అత్యంత దౌర్భాగ్యంతో కూడినదై, దుర్గంధ భూయిష్ఠమై నాచువంటి తుచ్ఛములచే ఆక్రమించబడిన అల్పాశయము (మురుగు గుంట)తో పోల్చవచ్చు. దట్టంగా భయమును గొలిపే అరణ్యముతో పోల్చవచ్చు. బురదలో పుట్టి, అనేక తంతువులు కలిగిన తామరతూండ్ల వంటివి ఇవి. మొసళ్ళతో కూడిన ఉప్పునీరు వంటివి.

బాంధవోద్వేగదాయీని, దేహాంతరకరాణిచ,
కరుణాక్రందకారీణి, మరణానీంద్రియానిచ ॥

మృత్యువు 1.బంధువులకు ఉద్వేగము కలిగించునది, 2.మరొక దేహమునకు కారణభూతమైనది, 3.కరుణచే రోదనము కలిగించేది... అను మూడు లక్షణాలు కలిగి ఉన్నట్లే ఈ ఇంద్రియాలు కూడా ఆ మూడు (ఉద్వేగం, పునర్జన్మ, రోదనం అనే) లక్షణాలు కలిగియే ఉన్నాయి.

అవివేకిషు అమిత్రాణి, మిత్రాణి చ వివేకిషు,
గహనాంతర శూన్యాని, కాననాని ఇంద్రియాణి చ ॥

ఒకడు ఒక అరణ్యం మధ్యలో ఉన్నాడనుకోండి. అతనికి ఆ అరణ్యం గురించి చక్కగా తెలిసి ఉంటే అది స్నేహితుని వంటిది. తెలియకపోతే శత్రువు వంటిది. ఈ ఇంద్రియారణ్యం కూడా అట్టిదే! ఇంద్రియాలు అవివేకికి శత్రువులు. వివేకికి మిత్రులు. వివేకసూర్యుణ్ణి కప్పి ఉంచటంచేత ఇవి మేఘాలతో కూడా పోల్చవచ్చు. మహాత్ములు వీటిని మొదలంట జయిస్తున్నారు. తుచ్ఛసుఖాలలో ఆసక్తి గల ప్రాణులకు ఈ ఇంద్రియాలు గొప్పవిగా అగుపిస్తున్నాయి. వాటి నిండా రజో-తమో గుణాలు వ్యాపించి ఉన్నాయి. కనుక ఇవి మురికిగుంటల వంటివి. జీవుని క్రిందకు త్రోయటంలో ఈ ఇంద్రియాలకు అతి నైపుణ్యం ఉంది. లోపల విషం ఉండటంచేత అవి పాములతో సమానం. లోపల శిథిలత్వం జడత్వం కలిగి ఉండటంచేత కట్టెపుల్లలతో సమానం. ఇవి చోరత్వం, జూదం, కలహం మొదలైన దుర్వ్యసనాలు కలిగి ఉన్నాయి. శిథిలమైన నూతులు ఈ ఇంద్రియాలు ఒక్కటే.

మహాత్మా! ఈ ఇంద్రియాలు జనింపజేయు 'ఆపదలు' అనే మహాసముద్రంలో నేను మునిగి ఉన్నాను. ఇప్పుడు సమస్తము త్యజించి మిమ్ములను సమీపించాను. ఈ దీనుని తత్త్వోపదేశంతో ఉద్ధరించండి. తత్త్వజ్ఞులగు మహాత్ములతో సాంగత్యమే సర్వదుఃఖములకు పరిహారమని శాస్త్రజ్ఞులు ప్రవచిస్తున్నారు కదా! స్వామీ! జ్ఞాన - యోగానంద స్వరూపులగు మిమ్ములను మనసా - వాచా - కర్మణా - శరణు వేడుచున్నాను.

❖❖❖

3. దృశ్యమును వదలాలి - దృక్‌ను పట్టుకోవాలి

శ్రీ భుశుండుడు : ఓ వసిష్ఠ మహర్షీ! ఆ విధంగా సుదీర్ఘమైన ఆయుష్షును అనుభవించియున్న ఆ విద్యాధరుడు నాతో తన అంతరంగమథనాన్ని ప్రకటించాడు. అప్పుడు నేను ఇట్లు పలికాను.

శ్రీ భుశుండుడు : (విద్యాధరునితో) ఓ విద్యాధరచక్రవర్తీ! నీవు చెప్పే మాటలు నాకు ఆనందాన్ని కలుగజేస్తున్నాయయ్యా! ఎందుకంటే నీవు ఇంతకాలానికి 'ఆత్మజ్ఞానము' అనే సౌభాగ్యం కొరకై

జాగృతుడవైనావు. చాలా మంచిది. సంసారము అనే అంధకూపం నుండి నీవు వెలువడినవాడ వయ్యావు! అగ్ని చేత వ్యాప్తమైన బంగారములాగా నీ బుద్ధి వివేకముచే పూర్ణమైయున్నది. కాబట్టి ఇప్పుడు నీ బుద్ధి నా ఉపదేశవాక్యము యొక్క సూక్ష్మార్థమును పెద్ద ప్రయత్నం అవసరం లేకుండానే గ్రహించగలుగుతుంది. నిర్మలమైన అద్దంలో దృశ్యము స్పష్టంగా ప్రతిబింబిస్తుంది కదా!

❖

ఇప్పుడు నేను కొన్ని విశేషాలు చెప్పబోవుచున్నాను. నేనిప్పుడు చెప్పేదంతా ఇప్పటికి మాత్రం కొంత అంగీకారబుద్ధితో విను. తర్వాత నీకే అంతా సుబోధమౌతుంది. ఎందుకంటే మేము చాలా కాలంగా అనేక సందర్భాలలో సుదీర్ఘ విచారణ చేసి ఇప్పుడు ప్రతిపాదించబోతున్న నిర్ణయాలకు వచ్చాం. కనుక మేము చెప్పబోయే వాటి పట్ల అనుమానం అక్కర్లేదు. ఇదంతా మా స్వానుభవం. మొట్టమొదటగా నీవు ఒక ముఖ్యమైన కార్యక్రమం చేపట్టు – "అజ్ఞానాన్ని త్యజించటం!"

శ్రీ విద్యాధరుడు : స్వామీ! అజ్ఞానాన్ని త్యజించుటమంటే ఏమిటి? నేను దేనిని వదలాలి?

శ్రీ భుశుండుడు : అహంకారం మొదలుగా గల ఏ దృశ్య ప్రపంచం నీకు అంతరంగంలో అనుభూత మగుచున్నదో... "అదంతా నేను కాదు. నాకు సంబంధించినది కూడా కాదు, ఈ దృశ్యానికి సంబంధించిన వాడను కాను"... అని గ్రహించటమే అజ్ఞానమును త్యజించటం. ఎందుకంటే ఈ దృశ్య ప్రపంచంలో ఎంతకాలం నీ స్వరూపం కొరకై వెతకి వేసారినా... నీ రూపం ఈ దృశ్య ప్రపంచంలో లభించేది కాదు. ఈ దృశ్యాన్ని దాటివేసే ప్రయత్నానికి ఉపక్రమించు.

"ఆత్మ గురించి తెలుసుకో!" దృశ్యమాత్ర రూపమైనట్టి అజ్ఞానాన్ని వదిలిపెట్టి ఆ దృశ్యమునకు 'సాక్షి' అయిన ఆత్మ గురించి నీవు ఎఱుగు. "ఈ దృశ్యాన్ని, ఈ అహంకారాన్ని త్యజిస్తే ఏదేదో కోల్పోతామేమో?"... అని కొందరు జనులు సందేహిస్తూ ఉంటారు. కాని అది వాస్తవం కాదు.

"న అహమ్ – త్వమ్ అస్తి, న జగత్" ఇతి నిశ్చయినస్తవ ।
సర్వమస్తి శివం, తుచ్ఛ న దుఃఖాయ, సుఖాయ తే ॥

"నేను గాని, నీవు గాని, జగత్తుగాని లేవు. అంతా కూడా బ్రహ్మమయమైయున్నది"... అనే సుస్థిర నిశ్చయమే ఈ జీవునికి నిజమైన సుఖం కలిగిస్తుంది. అది దుఃఖం కలిగించదు సుమా! "అది కోల్పోవటం కాదు. సంపాదించవలసినది సంపాదించటం"... అని నిశ్చయించుకొని ఉండు.

"అజ్ఞానం యొక్క ఆను–పానులు కనిపెట్టు!" 'అజ్ఞానం' గురించి విచారణ చేయాలి. అయితే "ఎట్లా ఎక్కడ విచారణ చేయాలి?"... అనేది ఇప్పటి మన ప్రశ్న కదా?

శ్రీ విద్యాధరుడు : అవును స్వామీ! నా అజ్ఞానం ఎప్పుడు ప్రారంభమైనది ఎట్లా ప్రారంభమైనది?

శ్రీభుశుండుడు : 1.భావన నుండి జగత్తు పుడుతోందా?... లేక, జగత్తు నుండి భావన పుడుతోందా?

2. 'సుషుప్తి' అనే ప్రసిద్ధమైన అజ్ఞానం నుండి జాగ్రత్–స్వప్న రూప ఈ జగత్తు పుడుతోందా?... ...లేక, జాగ్రత్ నుండి స్వప్న సుషుప్తులు పుడుతున్నాయా?

3. కర్మల నుండి జన్మ పుడుతోందా? జన్మ నుండి కర్మలు పుడుతున్నాయా?... వీటిలో ఏది ముందు? ఏది వెనుక?...

ఈ విధంగా ప్రశ్నలు తయారుచేసుకొని... ఆ ప్రశ్నలకు సమాధానం కొరకై ఎన్ని జన్మలుగా వెతకినా ప్రయోజనం ఉండదు, సమాధానం లభించదు. అనగా, వాటియొక్క కార్య – కారణ భావనా వ్యవస్థ గురించి ఏమాత్రం ఎఱుగజాలం. కాబట్టి... "కాఠిన్యత్వం – ద్రవత్వం ఈ రెండూ ఒకే ఘృతము (నేయి) యొక్క లక్షణాలు"... అని మనం గమనిస్తున్నట్లు జాగ్రత్–స్వప్న–సుషుప్తులు మూడూ అజ్ఞాన వ్యవస్థలే కనుక... వాటి గురించిన విచారణ వ్యర్థమే అవుతుంది. ఆ మూడు వ్యవస్థలకు సంబంధించక, వాటిలో ఆయా సమయాలలో ప్రవేశ – నిష్క్రమణలను నిర్వర్తిస్తున్న సత్ – చిత్ తత్త్వం గురించే మనం విచారణ చేయటం అవసరం సుమా!

అజ్ఞానాన్ని ప్రక్కకుపెట్టి, జ్ఞానం కోసం అన్వేషించు.

మృగతృష్ణాంబువత్ విశ్వమ్, అవస్తుత్వాత్ సదప్యసత్
యచ్చేదం భాతి తద్బ్రహ్మ న కించిత్కించిదేవ వా॥

ఎండమావులలో ఎన్ని తరంగాలున్నాయి? ఎందుకున్నాయి? ఎప్పటి నుంచి ఉన్నాయి? అని తర్కించి ఏం లాభం? ఎండమావులలో జలం కనిపిస్తున్నప్పటికీ అది భ్రాంతిచేత మాత్రమే కదా! అట్లాగే ఈ జగత్తంతా "వాస్తవంగా, సత్తుగా" కనిపిస్తున్నప్పటికీ ఇది అసత్తే సుమా! అయితే ఈ భాసిస్తున్నదంతా అధిష్ఠాన రూపంచే బ్రహ్మమే అయి ఉన్నది. కాని 'జగత్తు'గా (బ్రహ్మం కానట్లుగా) అనిపించుచున్నది. "మృగతృష్ణలో జలం నాకు కనిపిస్తోంది. కనుక, లేదు అనే మాట నేను ఒప్పు కోను"... అని వాదించే వానితో మనమేం చెప్పగలం? అతని దృష్టికి అది ఉన్నట్లే అగుచున్నది. అట్లాగే ఈ జగత్తుకు 'నాస్థిత్వం–అస్థిత్వం' రెండూ లేవు. అభావాన్ని సిద్ధించుకున్న వానికి 'ప్రతిభాస' అనునది కూడా లేదు. (యథాదృష్టం – తథా స్థితర) ఇది అనిర్వచనీయమని చెప్పబడుతోంది.

కాబట్టి ఈ సమస్తము శివరూపమగు బ్రహ్మమే అయి ఉన్నది.

ఈ జగత్తంతా కూడా "మృగతృష్ణలోని జలం" లాగా అవస్తువు మాత్రమే! ఇది 'సత్తు' వలె భావిస్తున్నప్పటికీ అసత్తు మాత్రమే! ఇక్కడ భాసిస్తున్నదంతా అధిష్ఠానరూపం చేత బ్రహ్మమే అయి ఉన్నది. కాని జగద్రూపం చేత ఇది అవాస్తవం కనుక బ్రహ్మం కాదు. మృగతృష్ణలో (ఎండమావులలో) జలం ఉన్నదా?

"లేదు" అందామా... ఒక ద్రష్ట (అవిజ్ఞాత)కు జలం, జల తరంగాలు కనబడుచున్నాయి, అనుభవమగుచున్నాయి. కదా! అతడు ఆ జలం కొరకు పరుగులు తీస్తూ "నన్ను ఆపకండి. అక్కడ జలం ఉన్నది. నాకు అక్కడ తరంగాలు కనబడుతున్నాయి"... అని పల్కుచున్నాడు.

"గాలి తరంగాలు కాంతి కిరణాల సంయోగం చేత జలం యొక్క భ్రమ మాత్రమే కలిగి స్తుంది. అంతేగాని అక్కడ జలం ఉండటానికి అవకాశమే లేదు"... అని (మృగతృష్ణగా) గ్రహించిన వారికి అక్కడ జలభావం కలుగదు.

అభావ బలం చేత ఇక్కడ ప్రతిభాస కూడా లేకుండా పోతుంది. కాబట్టి సమస్తము శివ రూపమగు బ్రహ్మమే అయి ఉన్నది.

ఓ విద్యాధరా! మనం పైన చెప్పుకున్న విషయాలన్నీ దృష్టిలో పెట్టుకుని ఈ జగత్తునకు మూలం అహంకారమే అని గ్రహించు. అట్టి అహంకారం నుండే దిక్కులు, పృథివి, ఆకాశం, సముద్రాలు, పర్వతాదులతో కూడిన 'ఈ జగత్తు' అనే పురాతన వృక్షం బయలుదేరింది.

సూక్ష్మాహంకారం నుండి స్థూల జగత్ వృక్షం - సూక్ష్మమైనట్టి 'అహంకారం' అనే బీజం నుండి జగత్తు అనబడే ఈ స్థూల వృక్షం బయలుదేరింది. "ఇంద్రియ విషయాల పట్ల ఆసక్తి" అనే రసం ఆ వృక్షమంతటా నిండి ఉన్నది. "అతల, వితల, సుతల, తలాతల, రసాతల, మహాతల, పాతాళాలు" అను పేర్లతో చెప్పబడే అధోలోకాలు ఆ వృక్షం యొక్క మూలాలు. నక్షత్ర మండలాలు ఆ వృక్షం యొక్క మొగ్గలు. వాసనలు దాని పూగుత్తులు. స్వర్గం మొదలైన లోకాలు దీని కొమ్మలు. కాల ప్రవాహమే ఈ వృక్షమును తొలచుచున్న పురుగు.

అసలు ఈ వృక్షం ఏ ప్రదేశంలో ఉత్పత్తి అయింది? 'అజ్ఞానము' అనే చోట! ఈ అసంఖ్యాక దేహపరంపరలు ఈ వృక్షముపై వ్రాలే పక్షులు. భ్రాంతి ఈ వృక్షము యొక్క కాండము. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలనే ఇంద్రియ విషయాల యొక్క విషయ సాక్షాత్కారాలు; మనస్సు యొక్క సంకల్ప-వికల్పములు... ఇవి ఈ వృక్షము యొక్క గంధము.

హాస్య-విషాదాది రస ప్రకటనయే ఈ వృక్షం యొక్క చర్మం (డొల్ల). ఋతువులు దాని విచిత్రములైన ఉపశాఖలు. దశ దిక్కులు అద్దాని ప్రసరణ ప్రదేశాలు. ఆత్మసంవిత్తు దీని జీవన హేతువైన రసప్రవాహము. అవ్యాకృతాకాశము ఈ వృక్షము ఉన్న వనప్రదేశము. రాత్రింబవళ్ళు దీనిపై వ్రాలే తుమ్మెదల భ్రమణము.

ఈ విధంగా ఈ సంసారవృక్షము తన మూలముచే పాతాళమున, మధ్యభాగముచే ఈ దిక్సమూహమున, అగ్రభాగముచే అంతరిక్షమున వ్యాపించి ఉన్నది. అయితే ఈ సంసారవృక్షము వాస్తవానికి అసత్తే! అయితే ఏం? అది భ్రాంతిచేత సత్తువలె గోచరించటం జరుగుతోంది.

విద్యాధరుడు: అటువంటి మహాభయంకరం, సువిస్తీర్ణం, మహాదీర్ఘం అయిన సంసారవృక్షమును ఈ మా అంతరంగం నుండి మొదలంటా తొలగించటం మాకు సాధ్యమేనంటారా?

శ్రీ భుశుండుడు : ఓ! తప్పకుండా సాధ్యమే. ఎంతటి వృక్షానైనా అగ్ని దహించివేయ గలదుకదా! ఆత్మజ్ఞానరూపమైన 'అనహం అనే అగ్నిచే 'అహంకారం' అను బాహ్యాడంబర సమన్వితమైన సంసార విషవృక్షం దహించివేయబడగలదు. ఆపై "జన్మజన్మాంతర పరంపరలు"... అనే బీజరూప పునరుత్పత్తి స్వభావం కోల్పోయి ఈ వృక్షం నశించగలదు.

కనుక ఆత్మజ్ఞానాగ్నిని ఆశ్రయించి ఈ ఆగామి - ప్రారబ్ధ - సంచిత రూపమగు సంసారరూప వృక్షమును మొదలంటా నశింపజేసుకొనినప్పుడే సర్వదుఃఖములు శమించగలవు సుమా!

❖❖❖

4. నేను - నీవు మొదలైనవి ఉండజాలవు!

శ్రీ భుశుండుడు : ఓ విద్యాధరా! ఈ సంసారవృక్షం ఉత్పన్నమైనది 'అహంకారం' అనే బీజం నుండే! జ్ఞానాగ్నిచే అహంకార బీజాన్ని దహింపజేశామా... ఇక మరల సంసారవృక్ష సంబంధమైన పునరుత్పత్తికి హేతువు ఉండదు.

అందుకే వివేకం కలవాడు మునుముందుగా "ఈ ప్రపంచం యొక్క అసలైన రూపమేమిటి?" అనే ప్రశ్నకు సరైన సమాధానం సముపార్జించుకోవాలి. తత్త్వదృష్టిచే విచారణ చేయాలి. "ఈ సమస్తం బ్రహ్మమే" అనే నిశ్చయం సుదృఢమగుచుండగా... ఇక అహంకారం యొక్క ఛాయ కూడా ఉండ జాలదు. ఇంతమాత్రపు అవగాహన చేత అహంకారం దహించబడు చుండగా, ఇక దిగులెందుకు?

అహంత్వభావాచ్ఛ 'అహం - త్వమ్ అస్థి' సంసారబీజకమ్ ।
నాహంత్వభావాన్ 'నాహం - త్వమ్ అస్థి' ఇతిజ్ఞానముత్తమమ్ ॥

ఈ దేహాదులందు 'అహం' భావన ఏర్పరచుకొని ఉండటం చేతనే నేను వేరు - నీవు వేరు అనునది మొదలై అదికాస్తా సంసారమునకు బీజమగుచున్నది. "నేను గాని, ఇంకొకరు గాని ఈ దేహాదులు కాదు. కనిపించే ఈ దేహములను ఏ కనిపించని చిత్ చైతన్యము కదలిస్తోందో అదియే నేను-నీవు కూడా" అను ఇంతమాత్రపు జ్ఞానంచే అహంకారము తప్పక దహించివేయబడగలదు. సృష్టికి ముందు ఉన్నదేది? స్వస్వరూప చైతన్యమే కదా! అట్టి చిత్‌నందు అహంభావంగాని, నేను-నీవు అనునవి గాని ద్వైత-ఏకత్వ భ్రమలుగాని ఉండజాలవు. ఆ చైతన్యం సృష్టిని సిద్ధింపచేయ వచ్చుగాక! అంతమాత్రం చేత తన అనంత అప్రమేయ చిదానంద ఘనత్వము కోల్పోవుచున్నదా? లేదు. మరి ఈ దుఃఖాదులు ఎందుకు? ఎవరికి?

ఎవరైతే "నీవు సృష్టి కంటే ముందే ఏర్పడి ఉన్న నిర్విషయ చైతన్యమువు. ఇప్పటికీ మరెప్పటికీ యథాతథంగా అఖండ చైతన్యస్వరూపుడవే. ఈ సంసారాదులకు నీవు సంబంధితుడవు కాదు"... అను గురువాక్యం శ్రద్ధతో విని, తదనుసరణంగా సంకల్పాన్ని సమూలంగా త్యజించుటకై స్వయంగా యత్నం చేస్తారో... వారే ఈ సంసారాన్ని జయిస్తారు. జయించి నిస్సంకల్పమగు ఆత్మపద ప్రాప్తి యందు సఫలీకృతులౌతారు. అట్లా కాకుండా గురువాక్యాలను విని ఊరకుంటే లాభమేముంటుంది? ఒకాయన "వంట చేయటమెట్లా?" అనే విషయం బాగా పఠనం చేశాడు. అది తెలిసిన వాని వద్దకు వెళ్ళి "పదార్థాలు, వాటి పాళ్ళు, ఎప్పుడు ఎట్లా కలపాలి..." ఇవన్నీ నేర్చుకున్నాడు. అంత మాత్రం చేత సరిపోతుందా? ఆ నేర్చుకున్న విశేషాలన్నీ దృష్టిలో ఉంచుకుని ఇక వంట చేయటం ప్రారంభించాలి. వంట తయారుచేసి ఆ పదార్థం చక్కగా భుజించాలి. అప్పుడు కదా ఆహార ఆస్వాదనానందం! అట్లాగే వివేకవంతుడు ముందుగా గురువు వద్ద శ్రవణం చేయాలి. అంతటితో ఊరకుంటే సరిపోతుందా? లేదు. ఆ శ్రవణం చేసిన దానిని స్వప్రయత్నంతో, సత్-భావనతో కూడిన సాధన చేయాలి. అప్పుడే ఈ జీవుడు సంసారానికి ఆవలి ఒడ్డు చేరగలుగుతాడు. సంసారం

హృదయంలో ఏర్పడి ఉన్నంత వరకు శ్రవణం, సాధన వదలకూడదు సుమా! "ఈ కనబడే శత్రు – మిత్రాది సమస్తమూ బ్రహ్మమే – అని అనుకోవటం" సాధన. "సమస్తము బ్రహ్మమే – అని అనిపించటం" అంతిమ లక్ష్యం.

ఓ ప్రియ విద్యాధరా! నీకు "నేను–నీవు" మొదలైనవాటితో కూడిన ఏ ఈ జగత్తు కనిపిస్తోందో ...అదంతా చిత్ (చైతన్యం) యొక్క చమత్కారమనియే గ్రహించు. అందుచేతనే "చైతన్యమునకు అన్యమైనది ఎక్కడా ఏదీ లేదు" అని సిద్ధాంతీకరించబడుతోంది. ఒక చిత్రకారుడు ఆయా రంగులు మేళవించి ఒక గొప్ప ప్రకృతి దృశ్యమును చిత్రీకరించాడనుకో... ఆ చిత్రం యొక్క రూప విశేషా లన్నీ చిత్రకారుని సంకల్ప విశేషం నుండే రంగుల మేళవింపుచే బయల్వెడలినాయి. కదా! ఈ జగద్రూప చిత్రమంతా స్వ-సంకల్పం యొక్క ఆవిర్భావ విశేషం చేతనే కనిపిస్తోంది. సంకల్పం యొక్క అభావముచే జగద్భావన లయించగా, జగత్తు కూడా లేనిదిగా అగుచున్నది. ఈ లోకాలు, ఈ వెలుగు చీకట్లు, ఈ స్త్రీ–బాల–వృద్ధాది అనుభూతులు, ఈ కల్ప–కల్పాంతాలు చిరకాల సంకల్ప భావన యొక్క బాహ్య స్వరూపాలు మాత్రమే! అంతఃకరణంలో చిరకాలం దృశ్యం యొక్క భావనను నిర్వర్తించి ఉన్న తరువాతే అట్టి చిత్ లోంచి బయల్వెడలిన భావనారూప చిత్తమునకు ఈ బాహ్యమంతా గోచరించటం జరుగుతోంది.

చిత్రకారుని చిత్తములోని చిత్రము వలె ఈ జగద్రూప చిత్రం సంకల్పం యొక్క ఆవిర్భావం చేతనే కనిపిస్తూ... సంకల్పము యొక్క అభావముచే లయించటం జరుగుతోంది. మాంత్రికుడు మాయచే లేనివి ఉన్నట్లుగా కల్పించి చూపుచున్నట్లు – ప్రతిభాస చేత మాత్రమే సత్యమై, (కానీ వాస్తవానికి అసత్యమై) ఈ జగత్తు స్ఫురిస్తోంది. సువర్ణం సువర్ణంగా ఉంటూనే ఆభరణములుగా ప్రదర్శితమగుచున్నట్లు చిత్తు... చిత్తుగా ఉంటూనే చమత్కారంగా సంకల్ప–వికల్పాలను నిర్వర్తిస్తూ ఈ జగత్తును సముపార్జించుకుంటోంది.

అందుచేత ఓ విద్యాధరా! ఈ జగత్తు యొక్క ఉత్పత్తి – వినాశనములు ఈ మనుజుని యొక్క అధీనంలోనే ఉన్నాయని గ్రహించు. ఎట్లా అంటావా? జగత్ అనేది సంకల్పంలో జనిస్తూ సంకల్పాలు ఉపశమించగా తాను కూడా లయించేది కదా! మరి సంకల్పాన్ని ఆశ్రయించడం, త్యజించటం జీవుని చేతిలోనే ఉన్నాయి గాని, మరెవరి చేతులోనో కాదు కదా! కనుక సంసారమును కల్పించుకునేదీ ఈ జీవుడే, ఆ కల్పనలను త్యజించేదీ ఈ జీవుడే సుమా! ఇది గ్రహించి ఆపై నీకు ఏది ఎట్లు ఉచితమనిపిస్తే అది అట్లే నిర్వర్తించు. ఒక్క ముఖ్య విషయం మాత్రం గుర్తుచేస్తున్నాను.

అత్యంతమేవ స్వాయత్తో యథేచ్ఛసి తథాకురు
యశ్చ అన్న–పానదానాదానావనాదరముపేయివామ్
తస్యేదం పశ్చిమం జన్మ న సకర్మ మముజ్ఝతి ॥

ఎవడైతే అన్నపానాది ఐహిక భోగముల యొక్క, దాన – యజ్ఞాది ఆముష్మిక భోగముల యొక్క సర్వఫలములను కోరుకోక ఉంటాడో... అట్టి వానికి ఇదే ఆఖరి జన్మ కాగలదు. "నేను

జన్మ – కర్మ రహితుడను" అని అతిత్వరగా గ్రహించగలుగుతాడు. అట్టివాడు (తన అవగాహనను సుస్పష్టంగా, సునిర్మలంగా తీర్చిదిద్దుకున్న తరువాత) కర్మలను నిష్కామంగా ఆచరించగలుగుతాడు.

శుద్ధ బుద్ధివగు ఓ విద్యాధరా! నీవు ఇప్పటికే పతనహేతువగు అవివేకమును ఉల్లంఘించావు. కాబట్టే జ్ఞానార్థివై నా దగ్గరకు వచ్చావు. ముల్లోకములను పునీతం చేయగలిగినట్టి అతి పవిత్రమైన వివేకమును సంపాదించుకున్నావు. అట్టి వివేకయుక్తమైన నిర్మల మనస్సు సంపాదించుకున్న నీకు 'సంసారము' అనే పతనము ఉండజాలదని నా అభిప్రాయం.

కాబట్టి నీవు మనోవాక్కులకు పరమై, చిన్మాత్రమైనట్టి నిర్మల ఆత్మపదమును మాత్రమే అవలంబించు. మనస్సు ఇత్యాది దృశ్యసమూహములను సర్వదా త్యజించి ఉండు.

❖❖❖

5. బాహ్యాభ్యంతర చిద్రూపుడు

శ్రీ విద్యాధరుడు : ఓ భుశుండమహాశయా! మీ ప్రవచనం అత్యంత శిరోధార్యం. అయితే, ఈ మనస్సు మొదలైనవి నా పట్ల నిర్విషయమాత్రం అవటానికి గాను నేను చేయవలసినదేమిటి?

శ్రీ భుశుండుడు : సూర్య కిరణం నిర్మల జలంలో ప్రవేశించినప్పుడు తాపరహితమై, ప్రకాశమాత్రమై ఉంటుంది కదా! నీవు కూడా... "ఏ చిదాభాసుడైతే విషయాలలో, వాటి క్రియా–గుణ దోషాలలో, వాటిని ప్రకాశింపజేయటలో ప్రవేశిస్తున్నాడో... అట్టి చిదాభాసుని ఏ మాత్రం స్మరించనే వద్దు. పరమశాంతుడవై చిద్ఘనమాత్రుడవై కేవల చైతన్యమును ఆశ్రయించి అప్రమేయుడవై ఏర్పడి ఉండు.

శ్రీ విద్యాధరుడు: స్వామీ! మేము తమ వలె ఈ జగత్తును జయించి, కారణకారణమగు కేవల చైతన్యమును ఆశ్రయించు శక్తిని సంపాదించకపోవటం చేత కాబోలు... ఈ సంసారభ్రమ శేషించియే ఉంటోంది?

శ్రీ భుశుండుడు : నాయనా! విద్యాధరా! ఈ జగత్తు అనబడేది అజ్ఞాన జీవుని పట్ల అచేతనమై, జడమై, దుఃఖాది రూపంగా, చైతన్యంతో అసాదృశ్యంగా అనిపిస్తూ ఉండవచ్చు గాక! వాస్తవానికి ఈ జగత్తు చైతన్యం యొక్క చమత్కారమే కాబట్టి, ఇది కూడా బ్రహ్మమే! సముద్ర మధ్యంలో అగ్ని ఉంటున్నట్లు ఇదంతా చైతన్య సదృశమై చైతన్యమునందే వెలయుచున్నది సుమా! అంతేగాని, చైతన్యమునకు అన్యమైనదంటూ ఎక్కడా ఏదీ లేనే లేదు. అగ్ని పుట్టటానికి, అగ్ని ఆరటానికి కూడా వాయువే కారణమౌతోంది చూచావా? (గాలి లేనిచోట అగ్ని వెలగదు. గాలి యొక్క తీవ్రతచే అగ్ని ఆరిపోతుంది.) అట్లాగే చిత్తు తన చైతన్య శక్తిచే తనలోనే ఇదంతా గాంచుచున్నది. తానే ఈ సర్వ చేతనాచేతన పదార్థములకు కారణమైయున్నది.

నాఽహమస్తీతి చిద్రూపం చితి విశ్రాన్తిరస్తు తే
తతో యథా యాదృశేన భూయతే, తాదృశో భవ ॥

"నేను సంసారబద్ధుడను. అల్ప స్వభావుడను. అర్హతలు లేని వాడను"... ఇటువంటి సాంసారికమైన అభిప్రాయాలను వెంటనే త్యజించు. "నాఽహమస్థితి చిద్రూపం... నేను ఆత్మ రూపుడనుకాను" ...అనే జాడ్యాన్ని వదిలించుకో. "జీవుడుగా నేను ఒక కీటకం కంటే కూడా అధికం కాదు. ఆత్మగా ఈ 14 లోకాలకు అధిష్ఠానమై ఉన్నాను... నేను సర్వదా కేవల చిద్రూపుడనే" అను నిర్మలమైన సదవగాహనను సుస్థిరపరచుకొని అట్టి చిద్రూపంలో విశ్రాంతి కలిగి ఉండు. దేహాఽహంభావన సంపూర్ణంగా నశించగా, అప్పుడు ఏ (చిన్మాత్ర) స్వరూపం నీకు అనుభవం అవుతుందో... అట్టి చిన్మాత్ర స్వరూపుడవై ఉండు.

చిద్రూపః సర్వ భావానామ్ అన్తర్-బహిరపి స్థితః
ప్రసన్నాంబుభరస్య అన్తర్-బహిశ్చైవ యథా పయః

నదీజలం యొక్క అంతరమున, పైపైన ఉన్నది జలమే కదా! సర్వభావముల యొక్క అంతరమున, బాహ్యమున కూడా చిద్రూపమే స్థితి కలిగి ఉన్నది.

కాబట్టి "నేను ఒక అల్పుడను. చిద్రూపుడను కాను"... అనే వాక్యాలు కట్టిపెట్టు. దేహమనో సంబంధమైన అహంకారము చేత మాత్రమే ఆ విధంగా అనిపిస్తోంది అని గమనించు. అట్టి అహంకారమును త్యజించి, నీవు అఖండమగు చిద్రూపమునందే సంలగ్నుడవై ఉండు. అట్టి నీ చిద్రూపము స్వయంప్రకాశకమేగాని, మరింకేదానిచేతను అది ప్రకాశించటం లేదు సుమా!

యథా రంగమయం కుడ్యే జగత్ మౌనమివ స్థితిమ్
తథా చిచ్చిత్ర కచితం ఖే కుడ్యే చ ఆత్మసంస్థితమ్ ॥

తెల్లటి గోడపై రంగులతో కూడిన యుద్ధ దృశ్యం చిత్రీకరించబడినట్లు మౌన స్వరూపమగు చిదాకాశంపై ఈ అనేక సంరంభాలతో కూడిన త్రిలోక సమన్వితమైన జగత్తు చిత్రించబడుతోంది. వాస్తవానికి ఈ జగత్తంతా నిర్వికార అద్వయరూపమగు ఆత్మయే గాని మరింకేదీ కాదు. ఓ విద్యాధరా! ఏ చైతన్యమగు స్వతః విశేషముచే ఇటు అచేతనమగు జగత్తుగా, అటు చేతనమగు బ్రహ్మంగా ప్రకటనమగుచున్నదో అట్లే ఆయా విశేషాల అనుభవంగా కూడా చిత్తు పొందుతోంది. కాబట్టి "నేను సర్వదా నిర్వికార చైతన్యమునే"... అని గ్రహించి ఉంటూనే ఏది నీకు ఇష్టమైతే అద్దానినే (ఇటు జగత్తునుగాని, అటు బ్రహ్మమును గాని) ఆదరిస్తూ ఉండు. ఈ జగత్తు చేత నీ స్వస్వభావం కుంటువడుతోందనే భ్రమకు ఏమాత్రం తావు ఇయ్యవద్దు సుమా! "ఎండమావులలో నీరు ఉండదు"... అని ఎఱిగి ఉన్న తరువాత అందలి భ్రమాత్మకమగు జలతరంగ దృశ్యమును చూస్తూ ఉన్నా, చూడకుండినా – అందులో విశేషమేమీ ఉండదు కదా! అట్లాగే తత్త్వవేత్తలు ఈ జగద్రూప చమత్కారముల మధ్యగా ఉంటూనే పూర్ణావగాహనపరులై కూడా ఉంటున్నారు. ఈ జగత్తు ఉనికి వారి అఖండాత్మానుభవమును నిరోధించజాలదు!

తిమిర దోషం గల కలవానికి ఆకాశమంతా కేశమయంగా కనిపిస్తుంది చూచావా? అనాత్మ భావనలో ఉన్నవానికి మాత్రమే ఈ జగత్తు ఆత్మకంటే అన్యమైనదిగా గోచరించటం జరుగుతోంది.

ఈ విధంగా ఈ జగత్తంతా బోధరూపమగు ఆత్మయేనయ్యా! ఇది అభాసరూపమై అజ్ఞుల దృష్టికి ఉదయించినట్లు ఉండవచ్చుగాక. కానీ, తత్త్వజ్ఞుల దృష్టికి మాత్రం ఈ జగత్తనేది ఎప్పుడూ ఉదయించనిదే అయి ఉంటోంది. ఆకాశంలో (మేఘాలను చూచి) కొండలు ఉన్నట్లు అనిపిస్తున్నట్లు... లేని జగత్తు అజ్ఞాన దృష్టికి ఉన్నట్లే ఘనీభూతమై అనుభవమౌతోంది. ఈ జగత్తు యొక్క విశేషము ఇంతమాత్రమే.

❖❖❖

6. నీవే ఆ బ్రహ్మమువు (తత్త్వమసి)

శ్రీ భుశుండుడు : విద్యాధరా! "ఈ జగత్తు అనబడేది ఏ సమయమందునూ లేదు" అని గ్రహించు.

విద్యాధరుడు : మహాత్మా! మీ వాక్యాలు శిరోధార్యమే. కానీ ఎదురుగా ఈ జగత్తు కనిపించటం, ఇది ఇంద్రియ-మనస్సులకు విషయమయి ఉండటం, ఘనీభూతమైన ఈ జగత్తు దాటరానిదిగా అనిపించటం మాత్రం మాపట్ల జరుగుతోంది. ఇట్టి ఘనీభూతానుభవమును తిరస్కరించి "ఇది లేదు" అని అనటం ఎట్లా?

శ్రీ భుశుండుడు : ఓ విద్యాధరా! ఈ జగత్తు నీయందలి ఒకానొక 'స్ఫురణ'గా కదా, బాసిస్తున్నది? ఈ జగత్తును వదిలి నీ యందలి ఆ స్ఫురణను ఆశ్రయించు. ఆ స్ఫురణ చైతన్యమే కనుక ఆ స్ఫురణకు భాసించేది కూడా చైతన్యమే అనే నిశ్చయాన్ని కలిగి ఉండు. చైతన్యం నందలి స్ఫురణ చైతన్యమునకు వేరైనది కానేకాదు. దృష్టాంతానికి... జలంలో దీపపు కాంతి ప్రతిబింబిస్తోందనుకో... ఆ జలంలో ప్రతిబింబించే దీపం జలం కంటే వేఱు కాదు కదా! చిత్తు - ఆ చిత్తు యొక్క స్ఫురణచే తోచుచున్న జగత్తులోని దృశ్యత్వము వేఱు వేఱు కాదు.

ఇట్లు జ్ఞానాజ్ఞానముల అభేదమే సిద్ధించగలదు. అట్లు సిద్ధించుకుని, పరిచ్ఛేద రహితుడవై ఉండు. ఒక చిత్రకారుని చిత్రములోని చిత్రత్వము, ఆ చిత్రమునకు సంబంధించిన చిత్తములోని జ్ఞానము ఒక్కటే కదా! అట్లాగే చైతన్యములోని జగత్ సంబంధమైన స్ఫురణ స్వభావము, జగత్తుకు సంబంధించిన జ్ఞానము ఒక్కటే. ఈ సిద్ధాంతమును అనుసరించి ఈ జగత్తు చైతన్యమేగాని మరింకొకటేదీ కాదు. ఇది గ్రహించి ఊహాజనితమైన గంధర్వనగరముయొక్క అధిష్ఠానమైన ఆకాశము యొక్క మధ్య భాగం వలె సర్వదా స్వస్థుడవై ఉండు. ఈ జగత్తు సృష్టికాలంలో ఉంటోంది. సృష్టికి ముందు, ప్రళయానంతరం లేకుండా పోతోంది. చైతన్యం మాత్రం కాలాతీతమై, సృష్ట్యతీతమై సర్వదా యథాతథంగా ఉంటోంది. అట్టి నిర్మల-నిర్విషయ చైతన్యమే నీవు. ఇది గ్రహించి ప్రశాంత చిత్తుడవై మౌనస్వరూపం వహించి ఉండు. ఇక ఏది ఎట్లా ఉండాలో అట్లే ఉండుగాక! నీ యథాతథ స్థితికి వచ్చే లోటేమున్నది?

విద్యాధరుడు : హే సద్గురూ! నాదొక చిన్న సందేహం. సృష్టికి ముందు ప్రళయమునకు తదనంతరం ఈ జగత్తు అనబడేది ఉండటం లేదని అన్నారు. కదా! మరి సృష్ట్యాదియందు, ప్రళయానంతరం ఈ జగత్తు ఏ రూపంగా ఎచ్చట దాగి ఉంటోంది?

శ్రీ భుశుండుడు : ఒకచోట నిర్మలజలం ఉన్నదననుకో... ఆ జలంలో భావికాలపు నుఱుగు, బుడగలు ఏ రూపంగా, ఎచ్చట దాగి ఉంటున్నాయి? ఏం చెపుతాం? ఒక చిత్రకళాకారుని అద్భుత చిత్రకళా విన్యాసం ఆతని మునివ్రేళ్ళలోను – ఆ మునివ్రేళ్ళు ధరించే రంగులకుంచెలోను ఎట్లా ఒదిగి ఉన్నది? ఒక వాహన చోదకుని చోదకకళ ఆతనిలో ఏ రూపంగా దాగినదై ఉన్నది? అట్లాగే బ్రహ్మము అనంతశక్తియుతమైయున్న కారణంగా అద్దాని మాయా విభాగమునందు ఈ జగత్తు సూక్ష్మరూపమున మహాప్రళయసమయంలో దాగి ఉంటోంది. గాఢ నిద్రలో ఉన్న జీవుడు కేవల నిర్విషయుడై ఉండి కూడా తనయందు జగత్ జ్ఞాపకములన్నీ, కోప – ద్వేష – ప్రేమ – త్యాగాది భావావేశములన్నీ అప్రకటిత సూక్ష్మరూపంలో కలిగి ఉండటమే ఇందుకు మనకు దృష్టాంతం.

జలంలోనుంచే జలరూపమైన బుద్బుదములు అకారణంగా (జలము మరొకటిగా అగుటకు ఏ కారణం లేకుండానే) ప్రకటితమౌతున్నాయి. అట్లాగే బ్రహ్మము నుండి ఎట్టి కారణము లేకుండానే ఈ సృష్ట్యాదులు కూడా ఉద్భవించినట్లు కనిపిస్తున్నాయి. స్వయంగా అకారణమై ఉన్న బ్రహ్మము నందు సృష్టి రచనకు కారణమేదీ ఉండజాలదు. కనుక ఈ జగత్తులనబడేవేవీ ఉత్పత్తి కాజాలవు, నశించజాలవు. కారణము యొక్క అభావముచే... ఈ జగత్తు లేశమైనా ఉద్భవించటంలేదు సుమా! ఎండమావులలో జలము ఉద్భవించటానికి కారణం లేకపోయినా, జలం కనిపిస్తున్నట్లు... ఈ జగత్తు అజ్ఞానముచే అనుభూతమౌతోంది. కనుక... "బ్రహ్మము బ్రహ్మముగానే బ్రహ్మమునందు సృష్టి – స్థితి – లయ విన్యాససమన్వితమై ఉంటోంది" అని; "నేను నేనుగానే నాయందు ఈ సృష్టి. స్థితి, లయ ప్రదర్శిత రూపుడనై క్రీడగా, లీలగా, సరదాగా విన్యాసములు సలుపుచున్నాను" – అని గమనించు, గ్రహించు.

కాబట్టి ఏ 'సృష్టి' అనబడేది నీకు ఉన్నట్లుగా అనిపిస్తోందో... అదంతా 'అజమై (జన్మ రహితమై), శాంతమై, అనంతమై, అఖండమైనట్టి బ్రహ్మమే, నని గ్రహించి ఉండు. నీవు బ్రహ్మ స్వరూపుడవే! ఇది గ్రహించి శిలామధ్యభాగ కోశమువలె ప్రశాంతుడవై జన్మకర్మాది రహితుడవై, అవయవరహితుడవై చెన్నొందుము.

పరమాత్మ జన్మాది రహితుడు. స్వాభావిక నిత్యానందస్వరూపుడు. అందుచేత అతనికి కార్య నిమిత్తమైన ఎట్టి ప్రయోజనం యొక్క అపేక్ష ఉండదు. అందుచేత ఆయనయందు సృష్ట్యాది కార్యాలు అసంభవాలు. ఏదేది అతనియందు దీపించుచున్నదో... అదంతా అజమగు శివరూపమే అయి ఉంది. అప్రబుద్ధుల దృష్టిలో ఏ శివం, అజం, చిద్రూపం అగు బ్రహ్మం ఏమరపాటు పొందుతోందో ...అట్టి మూర్ఖ విలాస దృష్టికి కనబడే సృష్టి యొక్క నాశోత్పత్తులతో నీకు భావావేశాలతో కూడిన సంబంధం అవసరమే లేదు సుమా! ఆత్మజ్ఞుల అనుభవం అట్లాగే ఉంటోంది. ఇక అజ్ఞుల అనుభవం నీకెందుకు? ఆత్మజ్ఞుల అనుభవము మాత్రమే నీకు అనుసరణీయం కదా!

అప్రబుద్ధులు బ్రహ్మమును ఏమరిచి దృశ్యమును మాత్రమే చూస్తున్నారు. ఇక అర్ధప్రబుద్ధులు "ఎక్కడెక్కడ బ్రహ్మము ఉంటే అక్కడక్కడ జగత్తు (దృశ్యము) కూడా ఉండనే ఉంటోంది"... అను

విచారణను ప్రకటిస్తున్నారు. ఈ రెండూ అవగాహనలు అసంపూర్ణములే గాని, పూర్ణార్థములు కావు. ఎందుకంటే "బ్రహ్మము వేఱు–దృశ్యము వేఱు"... అనే అభిప్రాయం ఇక్కడ వినబడుతోంది కదా! అయితే, ఈ కనబడే తృణం (గడ్డి), కాష్ఠం (కట్టె), జలం, కుడ్యం (గోడ) మొదలైనవాటినన్నిటా పరబ్రహ్మమే స్థితినొందియున్నది. ఈ సృష్టి సమూహములన్నీ పరబ్రహ్మమునందే పరస్పరం గ్రుచ్చబడి ఉన్నాయి. ఇక్కడొక్క విషయం! అయితే...

బ్రహ్మణః కః స్వభావో అసావితి వక్తుం న యుజ్యతే
అనంతే పరమే తత్త్వే స్వత్వాస్వత్వాత్య అసంభవాత్॥

"ఇదియే బ్రహ్మము యొక్క స్వభావం" అని నిర్ణయించి చెప్పటానికి వీలేలేదు. ఎందుచేత నంటావా? అనంతమై, అద్వయమైనట్టి పరబ్రహ్మమునందు 'నిజస్వభావము – పరస్వభావము' మొదలైనవన్నీ అత్యంత అసంభవములైనవై ఉన్నాయి. అయ్యది అభావము అని అందామా? అప్పుడు "భావము అది కాదు"... అని అనవలసి వస్తుంది. పోనీ "అది భావనామాత్రము" అందామా... నిర్మల పరమాత్మ భావాభావముల దోషముచే పరిమితమైనదగుచున్నది. కనుక పరమాత్మయందు "స్వభావము" మొదలైన దుష్ట (పరిమిత) వచనములకు చోటు లభించదు.

ఓ సాధూ! కాస్త విచారణ చేసి చూస్తే "బ్రహ్మమునందు అహమ్ – త్వమ్ మొదలైనవి సంభవించనేరవు"... అని సుస్పష్టం కాగలదు. పరబ్రహ్మము నిత్యమైనది. అనంతమైనది. సర్వస్వరూపమైనది. అందులో నేను, నీవు, వారు అనబడునదంతా ఎట్లా ఉంటుంది? వాయువులో – "నీ వాయువు, నా వాయువు, వారి వాయువు", అగ్నిలో – "నీ అగ్ని, మా అగ్ని, వారి అగ్ని", భూమిలో – "నీ భూమి, నా భూమి, వారి భూమి" ... ఉంటాయా? వ్యవహారరీత్యా ఉన్నప్పటికీ, వాటి మొదలు–చివరలలో భ్రమయే దాగి ఉన్నది కదా!

అట్లాగే అద్దాని వ్యావర్తక పదార్థమనతగిన స్వ–త్వ (Sense of self) భావన కూడా ఉండ జాలదు. కనుక పరబ్రహ్మముపట్ల "స్వభావవచనము" కూడా సిద్ధించజాలదని, సంభవించనేరదని చెప్పటమైనది. ఏ ఏ "అహం–త్వమ్–సః" భావనలు (ఈ జీవునకు) అనుభవమౌతున్నాయో అవన్నీ బాలుడు చీకటిలో చూచే బేతాళునివలె భ్రమచేతనే అనుభవమౌతున్నాయి. అట్టి అల్పానుభవం శాస్త్రాచార్యుల అనుభవంతో పరీక్షించి తత్త్వదృష్టితో చూస్తే తప్పక నశించిపోతుంది.

జగత్తు బ్రహ్మము వేఱు వేఱు కాదు! జగత్తు – బ్రహ్మము అను శబ్దముల భేదమేదైతే ఉన్నదో... అది వాస్తవానికి అభేదమే అయి ఉన్నది. ఈ రెండూ పర్యాయపదములే. ఆభరణం – బంగారం, బంగారు ఆభరణం అను అభేద రూప శబ్దములవంటివే అవి. "రాహువు యొక్క శిరస్సు" అనునది (గ్రహణకాలంలో భూ – చంద్ర – సూర్యుల చలన సమయంలో సంభవించే) క్రీనీడమాత్రమేగాని, నిజమైన శిరస్సు కాదు కదా! అట్లాగే జగత్తు బ్రహ్మముల భేదం వికల్పము మాత్రమేనని విజ్ఞులు నిర్ణయిస్తున్నారు.

❖❖❖

7. తటస్థ భావముతో జగద్దర్శనం

శ్రీ విద్యాధరుడు : ఓ భుశుండ మహాశయా! మీరు చెప్పే జగత్-బ్రహ్మముల పర్యాయపదత్వం యుక్తియుక్తమే.. అయితే మా సాంసారిక దృష్టికి ఈ జగత్తు నిర్వికారమగు బ్రహ్మముగా ప్రాప్తించటం లేదు.

శ్రీ భుశుండుడు : ఔను! అభ్యాసవశంచేతనే అట్టి దర్శనము సంభవం. జితేంద్రియుడైనవాడే ఈ జగత్తు యొక్క బ్రహ్మముతోటి అభేదమును దర్శించగలడు. ఇంద్రియ విషయములచే చంచల మనస్కుడైనవాడు సంసారబద్ధుడై జన్మ-జరా-సుఖ-దుఃఖాది అనుభవ పరంపరలనే పొందుచున్నాడే గాని, ఇద్దానిని నిష్కళంక బ్రహ్మముగా గాంచలేకపోతున్నాడు. ఎవడైతే 1.స్త్రీ యొక్క వస్త్రరహితమైన కోమల అవయవాలు తనను తాకుచున్నప్పుడు. 2.శస్త్రములు తనను తాకుచు న్నప్పుడు... ఆ ఉభయ అనుభవములలోను వికారరహితుడై సమముగా ఉంటున్నాడో... అట్టి జితేంద్రియుడే జగత్తు యొక్క బ్రహ్మత్వమును దర్శించగల పరమపదము నందు నెలకొని ఉండగలుగుచున్నాడు.

కనుక ఓ విద్యాధరా! శస్త్రముల ఆఘాతములుగాని, స్త్రీల యొక్క అవయవములు గాని ఈ దేహమునకు సోకినప్పుడు "వీటితో అనివార్యంగా సంబంధం కలుగుచున్నప్పటికీ ఈ సంబంధము వస్తుతః మిథ్యయే. లేక ఇది విరసమే"... అని ఎఱిగి జాగ్రత్తునందే సుషుప్త మౌనస్థితిని సంపాదించుకో. అట్టి ఘనీభూతమైన సర్వ సమస్థితి అనబడే సుషుప్త మౌనం అలవడేవరకూ పురుషప్రయత్నముచేతను, ధైర్యం చేతను ఇంద్రియ .జయమును అభ్యసించు. నీవు సంసారములోనే ఉండవచ్చు గాక! ఈ సంసారము నీయందు ఉండవలసిన అగత్యమేమున్నదో చెప్పు?

యథా భూతార్థ తత్త్వజ్ఞ మాధయో ఽగ్రగతా అపి ।
న మనాగపి లింపన్తి పయాంసీవ సరోరుహమ్ ॥

కమలము జలంలో ఉన్నప్పటికీ ఆ జలం కమలమును స్పృశించలేకపోతోంది కదా! యథార్థమగు తత్త్వజ్ఞానము ఎఱిగిన జ్ఞానిని తీవ్ర మానసిక వ్యధలు కూడా లవలేశమైనా స్పృశించజాలవు. ఓ ప్రియ విద్యాధరా! అందుచేత మరల చెప్పుచున్నాను విను. స్త్రీ కోమల అవయవాలుగాని, శస్త్రముల ఆఘాతము (బాణపు దెబ్బలు) గాని తన శరీరమును తాకుచున్నప్పటికీ వికారరహితుడై, అతీతత్వము వహించిన వాడై 'ఆకాశము' వలె తాకబడజాలక ఎవడైతే ఉంటాడో... అట్టి శాంతుడగు మహాత్ముడే ఈ దృశ్య జగత్తు యొక్క వాస్తవతత్త్వమును దర్శించగలుగుచున్నాడు.

మట్టి మట్టిగా ఉంటూనే ఘటరూపంగా తయారగుచున్నది కదా! ఆ ఘటం (కుండ) మట్టి కన్నా వేఱుకాదు కదా! అట్లాగే ఆత్మ కూడా ఆత్మగా ఉంటూనే ఈ 'జీవుడు' అను రూపాన్ని దాల్చుతోంది. ఆత్మను గురించిన జ్ఞానంచే జీవరూపత్వం నశిస్తోంది. ఒక నటుడు తన వ్యక్తిత్వం కోల్పోకుండానే... నాటకంలో తాను నటిస్తున్న పాత్రయొక్క లక్షణాలు ధరించి నటిస్తున్నాడు కదా!

ఈ సుదీర్ఘ వేదాంత ప్రవచనం యొక్క సారమంతా ఇంతే. విషమును గుళికగా తయారు చేశామనుకో. ఆ గుళిక ఒకానొక ఆకారము పొందినప్పటికీ తనయొక్క "దేహమును చంపుట"

అను విషస్వభావమును విడచుటలేదు కదా! చిద్రూపమగు బ్రహ్మము కూడా తన స్వభావమును విడువకయే ఈ జడ-అజడమగు జీవరూపమును ధరిస్తోంది. ఓ స్వభావ మాధుర్యమగు ఆత్మ స్వరూపుడవగు విద్యాధరా! నీవు బ్రహ్మమువేగాని జీవుడుగా పరిణమించటం లేదని గ్రహించు.

ఈ సృష్టి ఏ క్షణమందు కూడా బ్రహ్మం నుండి వేఱు కాదు. వేఱు కానప్పటికీ వేఱుగా ఉన్నట్లు అనిపిస్తోంది. ఇదంతా వాస్తవానికి బ్రహ్మమునందే ఉన్నది. బ్రహ్మంగానే ఉన్నది. బ్రహ్మమే జీవుడు రూపంగా పొందుచున్నది. జనన మరణ రహితమగు బ్రహ్మమే జనన-మరణాల మధ్యగా ఉన్నట్లు అనిపించే ఈ జీవుడు సుమా! ఇది అనుభవమయ్యేది ఎట్లా? అందుకు ఉపాయం ఒక్కటే! ఈ దేహేంద్రియములందు తద్విషయములైన శబ్ద, స్పర్శ, రూపాదులందు అహంకార-మమత్వ రూపమైన ఆసక్తిని జయించాలి. గురుశుశ్రూష, శ్రవణ, మననాది సాధనాలు చేపట్టాలి. స్వ-ప్రయత్నం చేత మాత్రమే ఈ సంసారసాగరం గోష్పాద జలం వలె దాటబడుచున్నది. అంతేగాని ఏదో దైవం (అదృష్టం) చేత కాదు. స్వప్రయత్నం, వివేక దృష్టిని వీడి "ఎవరో నన్ను తరింప జేస్తారులే"... అని అనుకుంటూ ఊరకొని ఉండటం ఉచితమే కాదు.

ఓ బిడ్డా! ఈ దృశ్యజగత్తులో ఇంద్రియాలకు ప్రియాలుగా అనిపిస్తున్న కొన్ని వస్తువులు తారసపడవచ్చు గాక! సర్వ సాంసారిక సుఖములకంటే, సమస్త ప్రియతమ పదార్థములకంటే ఆత్మ సుఖమే అత్యుత్తమమైనది. అది నీయందే సర్వదా వేంచేసి వేచియే ఉన్నది. ఎప్పుడైతే అంతః కరణంలో ఆత్మసుఖరూపమైన శీతలత్వం ఉదయిస్తుందో... అప్పుడా జీవుడు పరమ దరిద్రుడై ఉండి కూడా పూర్ణమగు ఆత్మ విశ్రాంతిని బడయగలడు. ఎప్పుడైతే ఈ మనస్సు, బుద్ధి, అహంకారము మొదలైనవన్నీ సమస్తము యొక్క 'సత్తాసన్మాత్రము' అగు బ్రహ్మమునందు లయిస్తాయో... ఇక అట్టి నిర్మలబ్రాహ్మీస్థితి యందు కళంకమెచ్చట? కనుక ఓ విద్యాధరా! ఈ జగత్పదార్థములను తటస్థ భావంతో దర్శించటం అభ్యసించు.

తటస్థ భావన - ఈ జగత్తులో అనేక వస్తువులను తటస్థభావంగా చూడటం ఈ జీవునకు క్రొత్తేమీ కాదు. అపరిచితులను, అసంబంధితమైన ప్రాపంచిక వస్తువులను, నూతన ప్రదేశములను ఇంకా ఎన్నిటినో తటస్థభావంతో చూస్తూనే ఉన్నాడు కదా! అట్లాగే 'అహంత్వం' అను దానిని అతిక్రమించి ఉండు. ఈ శరీరమును, మనస్సును, బుద్ధిని, చిత్తమును, అహం అను దానిని కూడా తటస్థభావంతో గాంచుచూ ఉండు.

సాక్షి స్వరూపం - అటు తరువాత క్రమంగా సర్వసాక్షీస్వరూపము సంతరించుకో. సర్వసాక్షీ స్వరూపుడవై ఇటు బాహ్య జగత్ పదార్థాల, అటు అభ్యంతరాలగు మనోబుద్ధ్యాదుల -అనుభవాన్ని పొందవద్దు. అనగా, అంతరంగంలో వాటికి స్థానం కేటాయించనే వద్దు. ఆ అనుభవాలకు ఆవల సాక్షీమాత్రుడవై ఉండు. అనగా స్వాభావిక 'చిత్' యందు స్థితి కలిగి ఉండు. అట్టి జ్ఞానస్థితిని సుస్థిరీకరించుకున్న తరువాత ఇక ఈ సుఖ దుఃఖాదుల మధ్య నీవు ఉన్నా, ఉండకున్నా ఒక్కటే. ఎందుకంటే అవి నిన్ను తాకజాలవు కదా! అట్టి శుద్ధాత్మస్థితియందు కర్తృత్వ - భోక్తృత్వములు

ఉండజాలవు. అట్టి స్థితిని నీకుగా నీవే సముపార్జించుకోవాలి సుమా! అయితే శాస్త్రములు, గురువాక్యములు నీకు సహకరించుట కొరకై ఉన్నాయి.

❖❖❖

8. అహంభావము కల్పిత మాత్రమే!

శ్రీ విద్యాధరుడు : అయితే, 'అహంభావన' అనునదంతా కేవలం కల్పితమాత్రమేనంటారా?

శ్రీ భుశుండుడు : అవును. ఇందులో ఏమాత్రం సందేహం లేదు. ఒక దృష్టాంతం చెబుతాను. ఆకాశం సర్వత్రా వ్యాపించి ఉన్నది కదా! అందులో "తూర్పువైపు ఆకాశం – పశ్చిమ దిక్కున గల ఆకాశం – పైనున్న ఆకాశం – క్రింద ఉన్న ఆకాశం – కుండలో గల ఆకాశం... మొదలైనవన్నీ ఆకాశమునందు ఒనర్చబడే ద్వితీయాకాశకల్పనయే కదా! ఇంటికి లోపలి ఆకాశం – ఇంటికి బాహ్యమున గల ఆకాశం"... అనేదంతా కల్పన గాక మరేమిటి? అట్లాగే ఈ అహం – త్వమ్ – సః మొదలైనవన్నీ కూడా! అవన్నీ ఆత్మయందు భ్రాంతిచే కల్పించబడినవి మాత్రమే. "మహాకాశంలో ఈపైన కనబడే ఆకాశం కల్పించబడునది" అను దృష్టిగల ద్రష్టయొక్క అనుభవము ఎట్టిది? భ్రమయే కదా! అట్లాగే ఆత్మపట్ల అవిద్యచే కల్పన చేస్తున్న ద్రష్ట, ఆతని తదితరమైన దర్శనము.... ఇదంతా ఆత్మయేనని గ్రహించు. కల్పకుని చిద్రూపమే తనయొక్క సంకల్పాత్మక దేహమును 'జగత్తు'గాను, 'అహం'గాను తదితర 'త్వం' ఇత్యాది రూపములుగాను దర్శిస్తోంది. కాబట్టి 'నేను' అనే అహంకారంగాని, ఈ జగత్తుగాని అవిద్యయే తప్ప మరింకేమీ కాదు.

పంచభూతములన్నిటిలో కెల్లా ఆకాశము అతి సూక్ష్మమైనది. అయితే పరమసూక్ష్మమైనది – సమస్త స్థూల కల్పనలకు అధిష్ఠానమైనది అగు బ్రహ్మమునకు ఎదురుగా ఈ ఆకాశము అత్యంత స్థూలమైనదిగా గ్రహించు. అట్టి సూక్ష్మాతిసూక్ష్మమైన చిదాకాశమొక్కటే ఉనికిని కలిగి ఉంది. ఆ చిత్తు యొక్క కల్పనయే ఈ జగత్తంతా కూడా! అట్టి ఆకాశం కంటే కూడా అతి సూక్ష్మమైన చైతన్యం అహం, ఇదం (నేను, ఇది) అను రూపవాసనలను ఆశ్రయించి ఉత్తరోత్తరా ఈ దేహ, దృశ్య, జడ దాదులు పొందుతోంది. తనయందు స్వభావమును కల్పన చేసుకొని ఆ తదనంతరం 'తదితరమైనది' అను రూపంగా తనకు అన్యముగాని ఈ జగత్తును దర్శిస్తోంది.

చిత్తు యొక్క కల్పనయే ఈ సృష్టి - జలము ఆవర్తము, తరంగము, సుడిగుండము మొదలైనవి ప్రదర్శిస్తున్నప్పటికీ జలం జలంగానే ఉంటోంది కదా! చైతన్యము యథాతథంగా ఉంటూనే చమత్కారంగా జగత్తుగా అగుచు, తత్‌జగత్తును పొందుచున్నది. ఆత్మచైతన్యము 'అహం' అనబడు వివర్తము పొంది, ఈ విస్తార జగదనుభవమునకు తానే కారణకారణమై ఉంటోంది.

ప్రళయం - చిత్తు వివర్తరూపంగా (జగత్తుగా) విస్తారమొందుచున్నదని అనుకున్నాం కదా! ఒకానొకప్పుడు జగద్భావనను తనయందే ఉపశమింపజేసుకుంటోంది. తరంగాలన్నీ ప్రశాంత జలంలో లయమగుచున్నట్లు అది జగద్భావనను తనయందు లయింపజేసినప్పటి స్థితే 'జగత్ప్రళయం' అను పేరుతో చెప్పబడుతోంది.

ఈ ప్రకారంగా ఈ దేశకాలాదులన్నిటియందు చిత్తు యొక్క ప్రసరణ (వ్యాప్తి)యే సిద్ధించి ఉన్నది. చిత్తు యొక్క ఉనికిచేతనే దేశ – కాలములు, ఆకాశము, జలము, స్థలము, స్వప్నము, జాగ్రత్తు, జాగ్రత్తులోని మనోరాజ్యము... ఇవన్నీ అనుభవం కాగలుగుచున్నాయి. జగదనుభవ మంతా చిత్తుదే... చిత్తుకే! అందుచేత అది "ఒకచోటి నుండి మరొకచోటికి పోవటం"... అనే వికారము పొందటం లేదు. అద్దానికి విస్తరణముగాని, సంకోచముగాని అసంభవం.

కాబట్టి ఈ జగత్తుయొక్క ఉత్పత్తిగాని, వినాశనముగాని కేవలం అజ్ఞాన సిద్ధములే గాని... వాస్తవములైనవి కావు. ఇద్దరు కూర్చుని చెప్పుకునే 'కథ' లోని కథాసంఘటనల వంటివి. ఆకాశము ఒకచోట నిర్మలంగాను మరొకచోట కాంతిసమన్వితమైన వస్తువులతోను, ఇంకొకచోట చీకటి మయంగాను ఉంటున్నట్లే, చిదాకాశం ఒకచోట జ్ఞానమయంగాను, మరొకచోట అజ్ఞానమయం గాను ఉండటమే ఇక్కడి చమత్కారం.

ఈ దృశ్యము, ఈ జగత్తు, ఈ సుఖ దుఃఖములు మొదలైనవన్నీ మనస్సుకు సంబంధించిన వికారాలు మాత్రమే గాని... ఆత్మ ధర్మములు కావు. ఆత్మ సర్వదా జ్ఞానయుతమైయున్నది.

జ్ఞశ్చేతతి న భోగాది, న చైవ ఆత్మన్ అన్యసావహమ్ ।
ద్రవత్వమ్ అంభసీవ అంతర్ అద్వితీయ పరే స్థితః ॥

జ్ఞానమాత్రమగు ఆత్మ విషయజనితములగు భోగ – దుఃఖాదులతో చిక్కుకునేది కానేకాదు. అంతేకాదు అద్దానియందు "నేను–నీవు–మేము–మీరు"... మొదలైన వ్యవహారములు ఉండవు. జలంలో ద్రవత్వం స్వభావసిద్ధమై ఉన్నట్లుగా... ఆత్మ సర్వదా తన కూటస్థ స్వభావముననే ఏర్పడి ఉంటోంది. ఆత్మ సంకల్పములకు ఆవల ఏర్పడి ఉన్నదని గ్రహించు. సంకల్పములకు ఈవల మాత్రమే చింత, లజ్జ, హర్షము, భయము, స్మృతి, కీర్తి, ఇచ్ఛ మొదలైన మనోవృత్తులు సంకల్ప రూపమున ఉంటున్నాయి. కనుక ఆత్మ మనోవృత్తి సంబంధితమైనది కాదు సుమా! బ్రహ్మము చంద్రబింబము వంటిది అగుచుండగా... ఆ చంద్రబింబము ప్రతిబింబిస్తున్న జలమువంటిది ఈ సృష్టి. ఈ నేత్రాదులకు కనబడే జ్ఞానం చంద్రకిరణముల వంటిది. బ్రహ్మము – ఈ సృష్టి – దేశ – కాలములచే స్పృశించబడేది కాదు. జలంలో చంద్రప్రతిబింబం కనబడుచున్నంతమాత్రంచేత ఆకాశములోని బింబచంద్రుడు జలతరంగములచే స్పృశించబడటం లేదు కదా! పరమాత్మ సర్వదా తనయందు తానే తన నిజస్వరూపమునకు వేఱుకానట్టి జగదాకారంగా తనయొక్క సర్వసమాన్య సచ్చిదానంద రూపముచే స్ఫురిస్తున్నారు. అయితే "దేహములు" అనబడు ఒకానొకచోట విశేషాభిమానంచే జీవులు మానసిక చింతాయుతులై ఉంటున్నారు. 'అహంకారాత్మ'గా తమ స్వరూపమే వేఱుపడినట్లు స్ఫురిస్తున్నారు. అది జలమందు ప్రతిబింబించే ఆకాశాదులవంటివి మాత్రమే. ఈ సమస్త జీవ – బంధ – మోక్షాదులతో కూడిన జగద్రూపమంతా ఆత్మయందు కల్పితమై, భ్రాంతి దృష్టికి కనిపించేదేగాని ఆత్మయందు అవి లేవు. ఆత్మ వాటియందు లేదు. కథ అనునది కవియొక్క కల్పనయే అయినప్పటికీ,... కవిని కథలో వెతకి పట్టుకోగలమా?

ఈ 'సృష్టి' అనే సరోవరము మజ్జన-ఉన్మజ్జనము (మునగటం, తేలటం) వంటి అనేక శబనీఖిములతోను, భావాభావతరంగములతోను కన్పట్టవచ్చుగాక. ఇదంతా ఎండమావులలో కనిపించే భ్రమపూర్వక జలతరంగములు మాత్రమే.

శ్రీ విద్యాధరుడు : మరి ఆ జగత్‌భ్రమ దృష్టి తొలిగేది ఎట్లా?

శ్రీ భుశుండుడు : ఆత్మసాక్షాత్కారముచే అవన్నీ ఇట్టే మటుమాయమౌతాయి. ఆత్మకు సంబంధించిన అవగాహనాబలం చేత ఇక ఈ చూచేవాడు, కనబడేదీ, ఉభయము బ్రహ్మముగానే తెలియవస్తాయి. జలమే తరంగములుగా కనిపిస్తున్నట్లు పొగయే మేఘరూపంగా భాసిస్తున్నట్లు - బ్రహ్మమే మనస్సుగాను, జగత్తుగాను (జడ-అజడ రూపములై) భాసిస్తోందనునది అనుభవమౌతుంది. అంపమును కొయ్యపై అదిమినప్పుడు ఏర్పడే ఆవర్తనములు (గీతలు) ఆ కొయ్యకు వేఱుగాను, వేఱైనవి కానివిగానూ కూడా కనిపిస్తున్నాయి చూచావా? అట్లాగే దేశకాలముల వర్జితమైన పరమాత్మయందు ఈ సృష్టికూడా జడ-అజడ రూపములుగా భాసిస్తోంది.

ఆ అజ్ఞాన దృష్టికి కనిపించే సృష్టి మిథ్యమాత్రమే! జ్ఞానదృష్టితో చూచినంతమాత్రంచేతనే ఇది రహితమై పోతోంది. కనుక "ఇది అతి కోమలము"... అనతగినది. అయితే ఇదంతా బ్రహ్మమే కనుక, బ్రహ్మము సర్వదా సత్యమే కనుక ఈ జగత్తు శిలవలె ఘనీభూతమైనదని కూడా అనవచ్చు. స్ఫటిక శిలలో ప్రతిబింబించే అరటి చెట్టు ఎటువంటిదో, ఈ జగత్తు కూడా (జగత్తు అనగా ఆత్మ యందు భావనానుసారం కనబడే ప్రతిబింబమే కాబట్టి) ప్రతిబింబమాత్రమేనని కూడా చెప్పవచ్చు.

ఈ కనబడే వేలకొలది తలలు, కాళ్ళు, నేత్రములు... వాటి వాటి చేష్టలు ఇందులో కనిపించే తర్కవితర్కములు, ఇంకా ఈ దృశ్యంలో విద్యమానమయ్యే దిక్కులు, పర్వతములు, ప్రాణులు, నదులు మొదలైన వాటితో కూడిన ఈ జగత్తంతా అనంతస్వరూపుడగు పరమాత్మ యొక్క అంగుష్ట మాత్రమైన ఒకానొక పరిచ్ఛిన్న విభాగము అని కూడా అనవచ్చు సుమా!

అనగా... ఓ విద్యాధరా! ఏ ఈ జగత్తు నీకు అనుభూతమౌతుందో... ఇదంతా కలిపితే నీ యొక్క అనంత స్వరూపముయొక్క ఒకానొక అంగుష్టమాత్ర పరిచ్ఛిన్న విభాగము మాత్రమే! ప్రతి ఒక్క జీవుని విషయంకూడా ఇట్టిదే! - అని వివేక దృష్టితో గ్రహించు.

శ్రీ విద్యాధరుడు : స్వామీ! ఈ జగదత్వమంతా కలిపి నా ఆత్మ అనబడు అనంత స్వరూపం యొక్క ఒకానొక పరిచ్ఛిన్న విభాగంగా, అంగుష్ఠమాత్రంగా నిరూపిస్తున్నందుకు మీకు ధన్యవాదాలు. ఇదంతా ఆత్మయేనని తెలుపుటచే మీరు నాకు సద్గురువులయ్యారు. అనంతస్వరూపమగు ఆకాశాన్ని పరిమిత స్వరూపాలగు మేఘాలు కప్పి ఉంచినట్లుగా భ్రమింపజేసినట్లు ఈ జగదత్వం నా అప్రమేయ -నిర్వికల్ప స్వరూపాన్ని కప్పి ఉంచుతోందే! ఏమీ ఆశ్చర్యం! ఈ ప్రతిబంధకం తొలిగేది ఎట్లా?

శ్రీ భుశుండుడు : (చిరునవ్వు చిందిస్తూ) బిడ్డా! ఈ జగత్తు అసారమైనది. పైకి అనేక ప్రకారములైన కామాదులతో రంజితమై పటాటోపంగా కనిపిస్తోంది. లోనంతా శూన్యము (మిథ్య) మాత్రమే. అటువంటి ఈ జగత్తు కేవలము తీవ్రవైరాగ్యముచేత మాత్రమే తుడిచివేయబడగలదు.

❖❖❖

9. చంచల మనస్సే జగత్తు యొక్క రూపం

శ్రీభుశుండుడు: ఓ విద్యాధరా! ఈ జగత్తంతా సుర-అసుర-గంధర్వ-విద్యాధర-మహోరగాది సహితంగా అనేక సంరంభాలతో కనబడుతోంది కదా! అయితే ఇదంతా కూడా జడమైన వాయువు చేతనూ, సూత్రాత్మచేతనూ సంచలనశీలమై ఉంటోంది. అట్టి జగత్తంతా ద్రష్టయొక్క చైతన్యం చేతనే ప్రకాశితమౌతోంది. అట్టి ద్రష్ట చైతన్యమే పరమాత్మ చైతన్యమని గ్రహించు. ఒక చమత్కారమైన చిత్రకారుడు ఒక వస్త్రముపై "రాజసౌధం, తటాకాదులు, వీథులు" మొదలైనవాటితో కూడిన నగర సౌందర్యాన్ని చిత్రించాడనుకో... అదంతా వస్త్రముపై తాకించిన రంగుల మేళవమే కదా! అయితే చూచేవానికి అనేక వికల్పములతో బహురమణీయంగా అనేక విశేషములతో స్ఫురించవచ్చు గాక! పరిశీలనాత్మక దృష్టి కలవానికి అది వస్త్రము - రంగుల మేళవింపుకాక మరింకేమీ కాదు. అట్లాగే అనేక వికల్పాలతో కూడి 'మనస్సు' అను వస్త్రంపై చిత్రీకరించబడిన 'జగత్తు' అనబడే ఈ చిత్రం ఆత్మ విచారణచే తన వికల్పత్వం కోల్పోతుంది. అనేక వికల్పాలు జగత్తులో లేవు. మరి? ద్రష్ట యొక్క మనస్సులోనే ఉన్నాయి! జలంలో పడిన నూనెచుక్క జలం యొక్క కదలికచే నలువైపులా విస్తరిస్తోంది చూచావా? మనస్సు చంచలమై బ్రాహ్మీస్వరూపమగు జగత్తు ఆ మనస్సు నందు ప్రతిబింబించు నప్పుడు అనేక సరస - విరసానుభూతులను కలుగజేస్తోంది. అట్టి దర్శనమే సంసారము.

ఈ సంసారము హృదయమునకు గొప్ప క్షోభ కలుగజేస్తోంది. మనస్సంతా నామ, రూప, గుణ వాసనామయమై ఉండగా హృదయం దృశ్యానికి బంధితమౌతోంది. స్త్రీ, పుత్ర, ధనాది వ్యవహారాల పట్ల ఏర్పడే రాగమే ఈ సంసారానికి జీవుని కట్టి ఉంచు కట్టుత్రాళ్ళు. "అట్టి ఈ సంసారం మిథ్యయే"... అని ఆత్మజ్ఞాని మాత్రమే ఎఱుగుచున్నాడు. ఇది శబ్దస్పర్శాదుల ఆస్వాదనచే సుదీర్ఘంగా విస్తరించి ఉన్నది. మనం చెప్పుకున్నట్లు, వస్త్రముపై చిత్రమువలె ఇది హృదయముననే తిష్టవేసుకొని ఉన్నది. ఈ విధంగా అది చైతన్యం "అహంభావం" మొదలుగా గల వికల్పాలను ఆశ్రయిస్తోంది. ఆశ్రయించి బహిర్ముఖమౌతోంది. బహిర్ముఖమై జీవత్మం పొందుతోంది. అయినా కూడా చైతన్యం సర్వదా చైతన్యముగానే ఉంటోంది. జలం తరంగాలుగా అయినా కూడా జలం జలంగానే ఉంటోంది. కదా! మట్టి బొమ్మగా అయినా కూడా మట్టి మట్టిగానే ఉంటోంది కదా!

వాస్తవానికి పరమాత్మకంటే వేరైనది ఎక్కడా ఏదీ లేదు. 'చైతన్యం' అనే సూర్యుడే ఈ ఉపాధి యందు ప్రవేశించి తద్వారా 'అహం' మొదలైన పేర్లను సంపాదించుకున్నవాడై ఇక ఈ సృష్టిగా అగుచున్నాడు. యథార్థానికి చైతన్యమునకు అన్యంగా ద్రష్టలేదు, సృష్టిలేదు.

జలం తరంగత్వం వహిస్తున్నప్పుడుకూడా జలంగానే ఉంటోంది. తరంగాలు మాత్రం కదలుచున్నాయి. తరంగానికి ఆకారం ఉన్నప్పటికీ, జలం సర్వదా ఆకార రహితమే! జలము యథాతథంగా ఉంటూనే ఎట్లా చలనరూపసత్తయందు చలనరహితంగా ఉంటోందో... అట్లాగే ఆకాశము మొదలైన వాటితో కూడిన ఈ ప్రపంచమును రచిస్తూనే, చిదాత్మ ఈ ఆకాశాదుల

రూపంలో లేదు. కథారచయిత పాత్రల కల్పనకు కారకుడై ఉంటూనే, ఆ పాత్రలన్నిటికంటే విభిన్నుడై ఉన్నట్లు, చిదాత్మ జగత్తుకంటే విశిష్టరూపమై ఉన్నది. అంతేకాదు! పాఠకుల అభిరుచికొరకై కదా, కథారచయిత కథ, పాత్రలు రచించేది! అభిరుచిని అనుసరించి సాహిత్యం ఉంటోంది. ఈ జగద్రచన కూడా జీవుల అభిరుచిని అనుసరించే రచించబడుతోందని గ్రహించు. అందుచేత జగత్తు భ్రాంతి మాత్రమే.

మరొక రహస్యం. ఈ జగత్తుకు చిదాత్మ కర్త కూడా కాదు. అది వానిని ఎఱుగుటయులేదు. జలమునకు తరంగకర్తృత్వం ఆపాదితం అయినట్లు జగత్తుయొక్క కర్తృత్వం చిదాత్మకు ఆపాదించబడుతోంది.

శ్రీ విద్యాధరుడు : మహాశయా! మరి ఈ మనస్సు మొదలైనవాటికి సంబంధించిన వర్తమానానుభవమును ఏ విధంగా అన్వయించుకోవాలి?

శ్రీ భుశుండుడు : ఈ మనస్సు, అహంభావము, బుద్ధి మొదలైనవన్నీ "అవిద్య" చేతనే ఏర్పడినవై ఉంటున్నాయి. పురుష ప్రయత్నబలంచేత అవి తప్పక నశిస్తాయి. ఆత్మకు అన్యమైనది లేదు అని గురు వాక్యం. కాబట్టి వాటిని ఆత్మ స్వరూపములే అని భావిస్తూ ఉండు.

పురుష ప్రయత్నం అంటే – 1. శాస్త్రములలో చెప్పిన విధి విధానములను నిర్వర్తించటం, 2. శాస్త్రార్థములను వివేకముతో విచారణ చేయటం, 3. పుత్ర, దార, ధనాదులందు మమకారం (ఇవి నావి, నాకు చెందినవనే భ్రమ) తొలగించుకోవటం, 4. మనస్సును చంచలత్వము నుండి ఉపశమింపజేయటం.

ఇట్టి పురుష ప్రయత్నబలంచే క్రమంగాగాని, అప్పటికప్పుడే గాని ఆత్మానుభవం పరిఢవిల్ల గలదు. అవిద్య యొక్క అర్ధభాగం తత్త్వవేత్తలతో సంభాషించుచుండగా తొలగగలదు. మిగతా సగభాగం ఆత్మ విచారణచేత, ఆత్మ సాక్షాత్కారంచేత నశించగలదు. భ్రమలన్నీ తొలగితే శేషించేదే సన్మాత్రమగు ఆత్మ.

❖

శ్రీరాముడు : మహాత్మా! వసిష్ఠమహర్షీ! అవిద్య యొక్క అర్ధభాగం తత్త్వవేత్తలను ప్రసన్నం చేసుకొని, వారితో సంభాషించటం చేతను, మిగతా అర్ధభాగం శాస్త్రవిభాగముచేతను–ఆత్మ సాక్షాత్కారం చేతను... ఎట్లా తొలగుచున్నదో సవివరంగా చెప్పమని నా ప్రార్థన.

అట్లాగే "అవిద్య అప్పటికప్పుడేగాని, క్రమక్రమంగా గాని తొలగగలదు"... అని కూడా అన్నారు. ఇది కూడా విశదపరచమని విన్నపం. "సమకాలముగా గాని, క్రమక్రమంగా గాని"... అనే మాటలకు అర్థమేమిటి?

"అవిద్య తొలగితే నామరూపరహితమగు సన్మయం శేషించగలదు"... అని అన్నారు కదా! 'సత్' అనగా బ్రహ్మము. ఇక 'మయము' అనగా 'నిండి ఉన్నది' అని అర్థం. మయము – అనేది అసత్‌నే సూచిస్తోంది. కనుక "సన్మయము" అనుదానిలో సత్ – అసత్ అంశం లేవేవి ఉన్నాయో అవి విశదీకరించండి.

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా!

సుజనేన విరక్తేన సంసారోత్తరణార్థినా ।
సహచాపి ఆత్మవిదుషామ్ ప్రసృతిం ప్రవిచారయేత్॥

ఈ సంసారమును దాటివేయాలనుకున్నవాడు ముందుగా ఈ జగద్విషయాల పట్ల విరక్తిని సంపాదించుకోవాలి. అనగా జన్మ జన్మాంతరార్జితమైన అనురక్తిని ఉపశమింపజేసుకోవాలి. అప్పుడు తదితర ముముక్షువులతో కలిసి "ఈ సంసారము ఎట్టిది? ఎక్కడి నుంచి వస్తోంది? దీని మూల మేమిటి? పరిణామమేమిటి? దీని సారమేమిటి? మనుజుడు ఇద్దాని నుండి తరించేది ఎట్లా?" అనే ప్రశ్నల గురించి విచారణ చేయాలి. ఎడారిలో ఒయాసిస్సులు ఉన్నట్లు ఈ సంసార మహారణ్యంలో ఆత్మజ్ఞులగు సజ్జనులు కూడా ఉన్నారు. అట్టి బుద్ధిమంతుడు, విరక్తుడు, మాత్సర్యరహితుడు అగు మహనీయుని ఎట్లాగైనా సరే, ఎంత ప్రయత్నించైనా సరే... వెదకి సేవాదులచే ఆయన కృపకు పాత్రులు కావాలి. ఆ విధంగా "శుభేచ్ఛ" అను ప్రథమ భూమికను ఉదయింపజేసుకోవాలి. అప్పుడు తప్పకుండా అవిద్య తిరోగమించనారంభిస్తుంది. అవిద్యయొక్క అర్ధభాగం సజ్జనసాంగత్యం చేత తొలగుతుంది. ఇక నాలుగవభాగం శాస్త్రవిభవాలచే – స్వకీయమైన సునిశితావగాహనచే తోక ముడుస్తుంది. మిగతా భాగం ఆత్మసాక్షాత్కారరూపమైన స్వప్రయత్నముచే వైతొలగగలదు.

ఇన్ని మాటలెందుకయ్యా? కేవలం "మోక్షమును నేను సంపాదించాలి?"... అనే తీవ్రేచ్ఛ ముందుగా హృదయంలో జనిస్తే చాలు. అట్టి అభిలాషయే వైరాగ్యాది సంపత్తిని ప్రవృద్ధపరచి ఈ జీవుని సంసారము నుండి, భోగాభిలాషల నుండి బయటకు తీసుకురాగలదు. భోగాభ్యాసం నశిస్తూ ఉండగా స్వప్రయత్నము యొక్క తీవ్రత్వమును అనుసరించి ఈ అవిద్య తొలగగలదు.

1.సాధుజనసాంగత్యము, 2.శాస్త్రవిచారము, 3.స్వప్రయత్నము... ఈ మూడూ ఒకేసారి ఒనగూడితే ఈ అవిద్య ఒక్కసారిగా తొలగిపోతోంది. ఇవి క్రమ క్రమముగా ప్రాపిస్తూ ఉంటే అవిద్య కూడా క్రమక్రమంగానే తొలగుతుంది. అట్లు అవిద్య తొలగగా, ఇక శేషించుచున్న దేమిటో... అదియే 'పరమాత్మ' అను శబ్దముచే ఉద్దేశించబడుతోంది.

ఆత్మ అనబడేది దృశ్యమా?... కాదు. ఎందుకంటే అది దృశ్యమంతటి కంటే పరమ విశిష్ట మైనది. పోనీ అది ద్రష్టయా? దృశ్యం లేనప్పుడు ద్రష్ట కూడా ఉండదు కదా! కనుక అది దృశ్యం గాని, ద్రష్ట గాని కాదు. అయితే...? ద్రష్టగా ఏర్పడియున్నదంతా ఆత్మయే! అదే సమయంలో, దృశ్యమంతా కూడా అదియే! అది నీ యొక్క స్వస్వరూపమే అయి ఉంది (తత్త్వమసి). ఆ పరమాత్మ నామరూప రహితమైనది. అదియే సత్తు. అదియే అసత్తు కూడా!

శ్రీరాముడు : "సత్తు – అసత్తు కూడా అదియే" అనేది యుక్తియుక్తంగా చెప్పండి.

శ్రీ వసిష్ఠ మహర్షి : ఆత్మ అర్థ–క్రియా వ్యవహారానికి విషయం కాదు కాబట్టి (లోకంలో కనిపించే ఒక వస్తువు కాదు కాబట్టి) 'అసత్తు' అనవచ్చు. అదియే అబాధ్యమైన (అది విభాగంగా అవదు కాబట్టి) పరమ పురుషార్థమై ఉన్నది కనుక... అది సద్రూపమే.

ఓ రామచంద్రా! ఈ విధంగా సర్వదృశ్య వ్యవహారాలు తిరస్కరించబడగా అప్పుడు శేషించేదే ఆత్మ. అట్టి మన వాస్తవస్వరూపాన్ని మనం గాని, మరొకరు గాని తిరస్కరించటానికి కుదిరేది కాదు. ఆ ఆత్మ వస్తువు ఆనంద ఘనమైనది. అనంతమైనది. జన్మ జరామరణాది వికారాలు అద్దానికి లేవు. అది సర్వదా ఏకమే గాని... అనేకం కాదు. అద్దాని సమక్షంలో ఈ జీవ-జనన-మరణ జగద్రూపా లన్నీ సంకల్ప స్ఫురణా మాత్రాలేనని గ్రహించు. కనుక ఇవన్నీ కూడా అసత్తుల్యాలు మాత్రమే.

ఓ రామచంద్రా! అట్టి ఆత్మతత్త్వాన్ని ఎఱుగుము. ప్రమాణ, ప్రమాతృ, ప్రమేయాది త్రిపుటీ వ్యవహారమంతా పారద్రోలివేయి. నీవే ఆ బ్రహ్మంగా, పరమాత్మగా అగుము. (అహమ్ బ్రహ్మాస్మి) నిరతిశయరూపం చేత అంతటా వ్యాపించి విహరించు. అంతేగాని, 'ఇది దుఃఖం, అది సుఖం' అనుకుంటూ అప్రమేయ స్వస్వరూపానంద స్థితి నుండి దిగజారనేవద్దు. (బ్రహ్మైవ న బ్రహ్మవిత్)

సరే! ఇక మనం శ్రీ భుశుండ - విద్యాధర సంవాదమును కొనసాగిద్దామా?

❖❖❖

10. ద్రష్టయే దృశ్య జగత్తుకు రచయిత

శ్రీ విద్యాధరుడు : హే మహర్షీ! ఈ జీవుడు ఎక్కడినుండో వచ్చి ఇక్కడి దేశ కాలాలలో ప్రత్యక్షమగు చున్నాడు. ఇక్కడ ఈ జీవుడు దేహధారణ చేయకముందే దేశకాలాలు ఉండి ఉన్నాయి. కదా! ఈ దేశకాలాలను జీవునికొరకై కల్పించినదెవరు? ఎందుకు కల్పించి ఉంటారు? ఏమి ప్రయోజనాన్ని ఉద్దేశించి దేశకాలాలు కల్పన చేస్తున్నారు? ఆ కల్పన చేసినవారికి, ఇందులో ప్రవేశించిన జీవునికి గల సంబంధమేమిటి? ఆ సంబంధాన్ని కల్పించినది ఎవరు? ఎందుకు? దేశ కాలాలే లేకపోతే జీవుడి ప్రవేశం గాని, జన్మ కర్మలు గాని ఉండేవే కావు కదా! అసలీ జీవుడు ఎందు నిమిత్తం ఈ దేశకాలాలలో ప్రవేశిస్తున్నాడు? ఈ నా సందేహాన్ని సర్వజ్ఞులగు మీరే తొలగించ సమర్థులు.

శ్రీ భుశుండుడు : ఓ విద్యాధరా! ఒకచోట ఒక స్తంభము ఉన్నది. అది... "ఆకాశమంతటా ఏర్పడి ఉన్న ఈ వెలుగును నాయందు దాచుకుంటాను. ఎవరికీ దక్కన్వీను"... అని అనుకున్నదట? ఆ స్తంభం అంతటా నిండి ఉన్న వెలుగును మ్రింగి తనయందు దాచుకోగలదా?

విద్యాధరుడు : (నవ్వుతూ) స్తంభమునకు అంతా ఏర్పడి ఉన్న వెలుగును తనయందు దాచిపెట్టుకో గలటం ఎట్లా కుదురుతుంది?

శ్రీ భుశుండుడు : అట్లాగే... ఈ మాయా జగత్తు యొక్క విస్తారమును దేశ కాలాలు తమయందు దాచిపెట్టుకోలేవు. అసలీ 'జగత్తు' అనబడేది బాహ్యమున ఉన్నదని అనుకుంటున్నావా?... లేదు! దృశ్యమంతా ఉన్నది ద్రష్టలోనే!

ఈ ఇంద్రియ లక్ష్యమగుచున్న 'జగత్తు' అనేది ఆత్మయందు గల మనస్సు యొక్క కాల్పనిక రచన మాత్రమే. వాయువు నందు సుగంధం కళ్ళకు కనబడకుండా దాగి ఉన్నట్లు ఈ 'జగత్తు' అనే రూపంగా అనుభవమయ్యేదంతా అతి సూక్ష్మరూపంగా ద్రష్టయొక్క 'ద్రష్టత్వం' అను స్వకీయమైన

ఆరోపిత స్వభావం నందే దాగి ఉన్నదని గ్రహించు. ఈ దర్శనమంతా కూడా చైతన్యం యొక్క చమత్కారమైన ఒకానొక చిత్కళా విభాగం అని అనవచ్చు.

ద్రష్టచేతనే ఈ జగత్తు పరికల్పించబడి, అనుభవించబడుతోంది. అనగా, ఇదంతా మరెవరో ఎవరికొరకో కల్పిస్తున్నది కాదు.

విద్యాధరుడు : "జగత్తుకు కర్త జీవుడే" అను వాక్యం యొక్క సూక్ష్మార్థాన్ని నేను గ్రహించలేక పోతున్నాను.

జగత్తు యొక్క కర్త జీవుడేనా! -

శ్రీ భుశుండుడు : రెండు దృష్టాంతాల ద్వారా "ద్రష్టయే దృశ్య జగత్తు యొక్క రచయిత" అనే విషయం విశదపరుస్తాను.

1. మనో రాజ్యము - ఒక బాలుడు ఒక చోట సుఖాశీనుడై ఉన్నాడు. ఏదో ఉబుసుపోకగా ఊహాలోకంలో విహరించసాగాడు. తన మనస్సులో "ఒక రాజ్యంలో ప్రవేశించినట్లు, ఆ రాజ్యంలో తానే అన్ని ఆటలలో అందరినీ ఓడించినట్లు, ఇక తదితరులంతా ఆటలలో ఓడి నిస్సహాయు లగుచున్నట్లు..." ఊహ కొనసాగిస్తున్నాడు.

ఇట్టి ఊహాలోక విహారం జీవులందరికి దైనందినానుభవమే కదా! ఆ మనోరాజ్యంలో అతనికి తారసపడే తదితర బాలురను రచించిందెవరు? బయటి నుండి మరెవ్వరోనా? కాదే!... ఆ బాలుని మనస్సే కదా!... ఊహకు సాక్షి అయిన ఆ బాలుడే ఊహలోని పాత్రలకు, సంఘటనలకు రచయిత అయినట్లు... ఈ జగత్తు కూడా ద్రష్ట ఊహను అనుసరించే ఆతనికి అనుభవమవుతూ పోతోంది.

2. స్వప్నము - ఒకడు నిదిరిస్తూ ఒక సుదీర్ఘమైన కల కంటున్నాడు. ఆ స్వప్నంలో కొందరు మనుష్యులు. వారితో అనేక అనేక సుదీర్ఘమైన సంభాషణలు, సంబంధాలు!

ఇప్పుడు చెప్పు... స్వప్నద్రష్టకు ఆ కలలో కనిపించిన ఆ తదితర జనులంతా ఎవరు? ఎవరి చేత కల్పించబడ్డారు? బయటనుండి ఎవరైనా ఆ స్వప్నములోని పాత్రలను పంపించారా? లేక ఇంకెవరో జనులు ఆతని స్వప్నములో ప్రవేశించారా?

విద్యాధరుడు : (కొంచెం సేపు ఆలోచించి) లేదు. ఆ స్వప్నంలో కనిపించినవారంతా స్వప్న ద్రష్ట యొక్క ఊహాకల్పిత రూపాలే.

శ్రీ భుశుండుడు : సాక్షియగు ఆ ద్రష్టయే మనోరాజ్యంలోని వస్తువులను-మనుష్యులను, స్వప్న ద్రష్టయే స్వప్నంలో కనిపించే వస్తువులను, మనుష్యులను కల్పన చేసి పొందుచున్నారు కదా! అట్లాగే ఈ జీవునికి కనిపించే జగత్తంతా ఆ దర్శనక్రియ నిర్వర్తించే జీవుని స్వయంకల్పిత ఊహా పరంపరలే సుమా!

విద్యాధరుడు : మీరు చెప్పినట్లు 1.మనోరాజ్యములోని, 2.స్వప్న జగత్తులోని సర్వరూపములు, సంఘటనలు, వ్యవహారాలు ద్రష్టచే స్వయంకల్పితంగా పరికించబడినవేనని నేనూ ఒప్పుకుంటు

న్నాను. అయితే జాగ్రత్ విషయంలో "ఇదంతా ద్రష్టయొక్క ఊహాసదృశమైన అనుభవం మాత్రమే. కనుక ఈ కనబడే జగత్తు యొక్క నిర్మాత ద్రష్టయే"... అనే మీ అభిప్రాయం నాకు పూర్ణానుభవం కావటం లేదు.

శ్రీ భుశుండుడు : "దృశ్య జగత్తు యొక్క రచయిత ద్రష్టయే"... అని నిరూపించటానికి ఇతఃపూర్వం జరిగిన ఒకానొక యథార్థ సంఘటనను నీకు విశదపరుస్తాను, విను.

❖❖❖

11. ఇంద్ర - త్రసరేణు న్యాయం

శ్రీ భుశుండుడు : ఒకానొకప్పుడు ఒక కల్ప వృక్షం యొక్క ఒక యుగ-సంధి రూపమగు ఒకానొక శాఖయందు ఒక 'జగత్తు' అనే మేడిపండు కాచింది. ఆ జగత్తు అనే ఫలం దేవతలు-దానవులు మొదలుగా అనేక ప్రాణి సమూహాలతోను, స్వర్గ-భూ-పాతాళాది లోకాలతోను, నదీ-పర్వతాదులతోను పరివేష్టించబడి ఉన్నది. ఆయా జీవుల వాసనా ప్రదర్శనలతోను, ఆ వాసనా సమూహాలతో పరికల్పించబడే అనేక సూక్ష్మ జగత్ సమూహాలతోను నిండి ఉంది. చిత్ చమత్కృతిచే అలరారుతూ 'మోక్షం' అనే బహిర్ద్వారంతో శోభిల్లుతూ, అంతరాన పంచతన్మాత్రలచే అలంకరించబడి ఉంది. ఆ బ్రహ్మమహావృక్షమునకు కాచిన జగత్తు అనే ఫలం కల్పాంతమున పండి రాలటానికి సిద్ధంగా ఉన్న స్వభావం కనబరుస్తోంది. 'అవివేకులు' అనే కాకులచే, 'వివేకులు' అను కోయిలచే పరస్పర వ్యతిరిక్త దృష్టులచే ఆ జగత్తు చూపబడుచూ ఉన్నది. ఆ జగత్తు ఎప్పుడో పరిపక్వమై పండి, 'శాంతి' అనే బ్రహ్మభావం పొందటానికి సంసిద్ధమగుచున్నట్లున్నది.

ఆ జగత్తులోగల ముల్లోకాలకు ప్రభువై, దేవతలందరికీ కూడా నాయకుడై ఒకానొక పవిత్ర జీవుడు ఇంద్రుడుగా విరాజిల్లుచున్నాడు. ఆ ఇంద్రుడు గొప్ప జ్ఞానబలం కలవాడు. గురూపదేశ బలం చేత జగత్తు యొక్క పూర్వాపరాలన్నీ ఎఱిగి ఉన్నాడు. సంకల్పాలన్నీ త్యజించి శుద్ధాంతః కరణుడై ఉన్నాడు. ఆ విధంగా ప్రశాంతమైన అంతఃకరణంలో, జ్ఞానదృష్టితో ముల్లోకాలను పాలిస్తూ కాలం వెళ్ళబుచ్చుచున్నాడు. అట్లా సుదీర్ఘమైన కాలం గడచిపోతోంది. రోజులన్నీ ఒకే రకంగా ఉండకపోవటమే ఈ కాలగతి యొక్క చమత్కారం కదా! "మాకేం! హాయిగా ఉన్నాం" అని అనుకుంటూ ఉండగానే, ఎక్కడి నుండో ఏవేవో కష్టాలు వచ్చి పడుతుంటాయి. అట్లాగే ఆ ఇంద్రునికి కూడా కొన్ని కష్టాలు ప్రారంభమయ్యాయి.

అప్పుడొక సయయంలో త్రిలోకరక్షకుడగు శ్రీహరి క్షీరసాగరంలో శయనించి ఉన్నాడు. ఒక అదను చూచుకొని అసురులు దేవలోకంపై దండెత్తారు. అప్పుడు దేవతలకు, అసురులకు మధ్య గొప్ప సంగ్రామం జరిగింది. విధివశాత్తూ ఆ యుద్ధంలో అసురులదే పై చేయి అయింది. ఆ దేవతాసైన్యం, ఇంద్రుడు కూడా తలకొక దిక్కుగా పలాయనం చిత్తగించక తప్పలేదు. క్రూరులగు అసురనాయకులు ఇంద్రుని వెంబడించారు. ఇంద్రుడు ఎక్కడా కొంచెం విశ్రాంతి తీసుకోవటానికి కూడా అవకాశం దొరకక పరుగులు తీస్తూనే ఉండవలసి వచ్చింది.

అప్పుడు ఇంద్రుడు బాగా అలసిపోయాడు. ఎట్లాగైనా సరే కొంతకాలం అసురుల కళ్ళు కప్పి ఎక్కడైనా విశ్రాంతి తీసుకోవలసినంతగా అగత్యం వచ్చింది. ఒకచోట ఒక్క క్షణం ఆగి కళ్ళతో విశ్రాంతి స్థానం కొరకై పరికించి చూచాడు. ఎదురుగా సూర్యకిరణాలు ప్రసరిస్తూ కనిపించాయి. ఆ సూర్య కిరణాలలో త్రసరేణువులు (ధూళికణాలు) అనంత సంఖ్యలో ఉండటం కనిపించింది.

ఒక గొప్ప ఆలోచన వచ్చింది. "ఈ త్రసరేణువులలోని ఒకానొక రేణువులో నేను దాగి ఉంటే ఈ దుష్ట దానవ సైనికనాయకులు నన్ను కనిపెట్టలేరు కదా!" – అని అనుకున్నాడు. అనుకున్నదే తడవుగా అట్టి కార్యక్రమం కొరకై ఉపక్రమించాడు.

తన శరీరం యొక్క స్థూలాకార సంకల్పాలను తన అంతఃకరణంలోని సూక్ష్మభూతాలలో లయం చేశాడు. స్థూలత్వమంతా త్యజించి అత్యంత సూక్ష్మ రూపం సంతరించుకున్నాడు. సూక్ష్మ భూతరూపుడై బాహ్యప్రదేశంలో గల త్రసరేణువులలోని ఒకానొక త్రసరేణువులో ప్రవేశించాడు. "అమ్మయ్య! ఇక ఇక్కడ కొంతసేపు విశ్రాంతి తీసుకుంటాను"... అని అనుకొని ఆ త్రసరేణువులో విశ్రమించాడు. అసుర నాయకులు కొంతకాలం అతని కొరకు వెతికి వెతికి కూడా ఆ ఇంద్రుడు దాగి ఉన్నచోటు కనిపెట్టలేక పోయారు. అతడు కనబడకపోవటం చేత వెనుకకు మరలారు.

చాలాకాలం తరువాత ఇంద్రునికి తాను దాగి ఉన్న త్రసరేణువులో భౌతికమైన విశ్రాంతి లభించింది. ఇక కాలక్రమంగా యుద్ధం మొదలైనవన్నీ మఱచాడు. ఆ చోటును విడచి బయల్వెడలకుండా అచ్చటనే ప్రశాంత నిద్రా విశ్రాంతిని పొందాడు. అసురుల సంగతి కాస్త ఏమరచినప్పటికీ ఇంద్ర పదవికి సంబంధించిన సంస్కారాలు అతనిలో మేలుకొనియే ఉన్నాయి.

కొంతకాలం గడచిపోయింది. ఆ త్రసరేణువులోనే ఉండి ఎప్పుడో ఒక మనః స్వభావమును ఆశ్రయించసాగాడు. "ఇప్పుడు ఇంద్ర – రాజగృహంలో నేను ఉన్నాను"... అని అనుకోసాగాడు. అతడు అక్కడే ఒక గృహంలో ఉండటం జరిగింది. ఆ గృహంలో ఒకచోట పద్మాసనం వేసుకుని "స్వర్గలోకం, అమరావతి, దేవసభ, ఇక్కడ నా సింహాసనం, ఇప్పుడు నేను ఈ సింహాసనాన్ని అధిష్ఠించి ఉన్నాను, దిక్పాలకాది దేవతలు నన్ను పర్యవేష్టించి ఉన్నారు, ఈ స్వర్గానికి క్రిందగా భూలోకం ఉన్నది, దానికి కూడా నేనే అధిపతిని"... ఇట్టి రూపంతో కూడిన మనోకల్పనను పొందసాగాడు. ఇక ఆతని కల్పనలోని మూడు లోకాలకు అధిపతి అయి, ఇంద్రపదవి యొక్క కార్యక్రమమంతా నిర్వర్తించసాగాడు.

ఇంద్రభవనం నుండి బయల్వెడలి అమరావతి నగరమును, ఆ నగరం యొక్క చివరికి పోయి భూలోకాన్ని దర్శించాడు. అక్కడి పర్వత, నదీ, నదములు సక్రమగతిలో ఉన్నాయో, లేవో నని అంతా త్రిలోకపాలకునిగా పర్యవేక్షించాడు. భూమి అంతా ఆయా రాజ్యాలతో, రాజ్యపు సరిహద్దులతో ఉండునట్లుగా ప్రకృతి – కాలాలను సరిపోల్చి ఉంచాడు. క్రియా కలాపాలతో భూమి సక్రమంగా ఉన్నదని అనుకున్న తర్వాత ఇక పాతాళంలో ప్రవేశించాడు. అక్కడ కూడా రాజ్యాలు–రాజులు–ప్రజలు–విధి విధానాలు–యజ్ఞయాగాది వ్యవహారాలు పర్యవేక్షించాడు. ఏ దిక్పాలకులకు ఏ నిర్ణయాలు తెలియజేయాలో... అవన్నీ నిర్వర్తించి మరల స్వర్గలోకం జేరాడు.

ఇక ఇతఃపూర్వం లాగానే యథావిధిగా త్రిలోక పాలన చేస్తూ అష్టైశ్వర్యాలు అనుభవించసాగాడు. దేవతలకు ప్రభువై విరాజిల్లాడు.

ఆ విధంగా చాలా కాలం గడిచింది. ఆ తరువాత అతనికి మహాపరాక్రమశాలి అయిన పుత్రుడు జన్మించాడు.

విద్యాధరుడు : భుశుండ మహాశయా! మీ మాటకు అడ్డువస్తున్నాని అనుకోకండేం. ఆ ఇంద్రుడు మొట్టమొదట అసురులు తరుముచుండగా ఒక త్రసరేణువులో ప్రవేశించాడు కదా! ఆ త్రసరేణువులోనే ముల్లోకాలు ఏర్పాటు చేయబడ్డాయా?

శ్రీ భుశుండుడు : (చిరునవ్వుతో) ముల్లోకాలు త్రసరేణువులో లేవు. అవన్నీ సూక్ష్మాతిసూక్ష్మదేహం అవధరించిన ఇంద్రుని మనస్సులోనే ఉన్నాయి. అనగా అవన్నీ అతని మనస్సు చేతనే కల్పించబడి అనుభవింపబడుచున్నాయి. ఇక ఆ త్రసరేణువు గతి ఏమిటంటావా? అది తదితర త్రసరేణువుల లాగానే యథామార్గంలో ఎటో వెళ్ళిపడింది.

ఇక మనం ఆ ఇంద్రుని చరిత్ర కొనసాగిద్దాం. ఈ విధంగా మరికొంత కాలం గడిచి పోయింది. ఆ ఇంద్రుని కుమారునికి యుక్త వయస్సు రాగానే తదనంతర ఇంద్రుడుగా పట్టాభిషిక్తు డైనాడు. ముల్లోకాలను తన మనో వీథిలో సృష్టించిన మొట్ట మొదటి ఇంద్రుడు తన స్థూల-సూక్ష్మ దేహములను కాలక్రమంగా త్యజించి 'నిర్వాణము' అనే మోక్ష స్థితిని పొందాడు. అతని కుమారుడైన 'కుందుడు' అనువాడు కూడా ఇంద్ర పదవిని అధిష్ఠించి చాలాకాలం ముల్లోకములను పాలించి ఆ తరువాత తన కుమారునికి పట్టంగట్టి ఆతడు కూడా పరమపదమును పొందాడు.

ఈ విధంగా మన కథానాయకుడగు మొట్టమొదటి ఇంద్రుని తరువాత వందలకొలది పుత్ర – పౌత్రులు గడచిపోయారు. ఇప్పుడు అతని వందలాది వంశజుల పరంపరానంతరం వర్తమానంలో 'అంశకుడు' అను పేరుగలాయన ఇంద్రపదవిని అలంకరించి ఉన్నాడు.

చూచావా విద్యాధరా! మొట్టమొదటగా ఇంద్రుడు ప్రవేశించిన త్రసరేణువు ఎచ్చటనో విలీనమై, క్షయించి, నాశనం పొందింది. అయితే ఆ త్రసరేణువులో ప్రవేశించి విశ్రాంతికై ఉపక్రమించి, ఆ తరువాత తనయొక్క వాసనలచే ఆ ఇంద్రుడు దర్శించనారంభించిన త్రిలోక రాజ్యం మాత్రం ఇంకా ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నది.

❖❖❖

12. ఆత్మసాక్షాత్కార పర్యంతం దృశ్యం ఉంటోంది

శ్రీ భుశుండుడు : ఓ విద్యాధరా! ఈ సందర్భంలో మరో చమత్కారమైన విశేషం ప్రస్తావిస్తాను, విను.

ఇప్పుడిక ఆ ఇంద్రుని వంశంలో జన్మించి, దేవరాజు అయినట్టి ఒకానొకని గురించి మనం చెప్పుకుందాం. అతడు ఇంద్రవంశంలో జన్మించాడు. ఉత్తమ గుణాలచే పరిపూర్ణుడు. ఆ దేవరాజు శ్రీమంతుడు, వైరాగ్యాది సంపదలతో కూడుకొని ఉన్నవాడు. మోక్షార్థితచేత అతనికి అదియే అంతిమ శరీరధారణం కూడా! యౌవనంలోనే దేవగురువు బృహస్పతుల వారిచే బోధించబడి అతడు

ఆత్మజ్ఞాని అయ్యాడు. వేద్య వస్తువైన ఆత్మ గురించి అనుభవ సమన్వితంగా ఎఱిగి కూడా యథా విథంగా త్రిలోక సామ్రాజ్యాన్ని పరిపాలిస్తూ ఉండేవాడు. యథాప్రాప్తాలైన కర్మలన్నీ నిర్వర్తిస్తూ ఉండేవాడు. అతడు ఒకసారి అసురులతో గొప్ప యుద్ధం చేసి, వారినందరినీ జయించాడు. ఆతడు అజ్ఞానాన్ని దాటినట్టి విశుద్ధమైన మనస్సుతోనే వంశాచారానుసారం నూఱు అశ్వమేధయాగాలను నిర్వర్తించి ఉన్నాడు.

ఆతడు ఒకసారి ఏదో కార్యవశంగా ఒకానొక ప్రదేశానికి వెళ్ళటం జరిగింది. ఆ ప్రదేశంలో సుందరమైన మానస సరస్సు కనిపించింది. ఆ సరస్సులో బహుసౌకుమార్యమైన కమలాలు కనిపించాయి. అక్కడి ప్రశాంతమైన వాతావరణమును గమనించి, అనేక యుద్ధ సంరంభముల చేతను, అశ్వమేధాది యాగాల కార్యక్రమాల చేతను ఎంతగానో అలసిపోయిన ఆతని మనస్సుకు కించితు, విశ్రాంతి పొందాలనిపించింది. ఆలోచన వచ్చినదే తడవుగా ఇక విశ్రాంతి కొరకై ఉపక్రమించాడు. ఆ కమల నాడులలోని ఒకానొక అతి సౌరభమైన దానిని ఎన్నుకొని ఆ కమలము యొక్క ఒక 'తూడు'(సన్నని కాండం)లో సూక్ష్మదేహి అయి ప్రవేశించాడు. అక్కడ అతడు ఒక ప్రక్క దేహ పరంగా విశ్రాంతి పొందుతూనే మనస్సు పరంగా ఊహాపథంలో విహరించసాగాడు. మనస్సు తోనే రాజ్య ఏలటం, యుద్ధాలు చేయటం, ఆ యుద్ధాలలో గెలుపు – ఓటములు చవిచూడటం... ఇవన్నీ అనుభవించసాగాడు. ఇట్లా కొంతసేపు గడిచింది.

అతడు బృహస్పతిచే ఎంతగానో బోధించబడిన సుజ్ఞాని కదా! అందుచేత ఒక రోజు ఇట్లా అనుకున్నాడు. "ఇంతకాలం నేను మాయలో ఉన్నాను. ఇప్పుడిక ఈ మాయ నుండి బయటకు వచ్చి మాయకు సాక్షిగా ఉండి మాయను దర్శించెదను గాక! ఇక నేను బ్రహ్మతత్త్వాన్ని, ఆ బ్రహ్మం మాయతో కూడుకొని ఉన్న చమత్కారాన్ని దర్శించటానికి ఈ నా మనస్సును వినియోగిస్తాను గాక"!

తన మనస్సును రాజ్యం మొదలైన వాటి నుండి మరల్చి ఇక 'బ్రహ్మం – మాయ' అనే రెండిటినీ పరిశీలించే క్రమంలో నియమించినాడు. ధ్యాననిమగ్నుడైనాడు. బాహ్య–అభ్యంతరాలైన విక్షేపాలన్నీ త్యజించాడు. శాంతబుద్ధి కలవాడైనాడు. ఏకాంతస్థితుడైనాడు. ఇక ధ్యానం ద్వారా సర్వశక్తియుతం – సర్వ వస్తుమయం – సర్వ వ్యాపకం – సర్వదా సర్వవిధ స్వరూపం – సర్వత్రం – సర్వగామి... అయినట్టి పరబ్రహ్మమును వీక్షించసాగాడు.

పరబ్రహ్మము యొక్క వర్ణన (గానం) -

సర్వతః పాణిపాదంతం, సర్వతోక్షి శిరోముఖమ్ ।
సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య సంస్థితమ్ ॥

సర్వేంద్రియగుణైర్ముక్తం, సర్వేంద్రియ గుణాన్వితమ్ ।
అసక్తం సర్వభృచ్చైవ నిర్గుణం గుణభోక్తృచ ॥

బహిరంతశ్చ భూతానాం అచరం చరమేవచ ।
సూక్ష్మత్వాత్ తదవిజ్ఞేయం దూరస్థం చ అన్తికేచతత్ ॥

సర్వత్ర చంద్రార్కమయం, సర్వత్రైవ ధరామయమ్ ।
సర్వత్రపర్వతమయం, సర్వత్రిబ్ధిమయం తథా ॥

సర్వత్ర సార గురుకం సర్వత్రైవ నభోభయమ్ ।
సర్వత్ర సంసృతిమయం, సర్వత్రైవ జగన్మయమ్ ॥

సర్వత్రైవ చ మోక్షాత్మ, సర్వత్రైవాద్య చిన్మయమ్ ।
సర్వత్ర సర్వార్థమయం, సర్వత్ర సర్వ వర్జితమ్ ॥

ఘటే పటే వటే కుడ్యే శకటే వానరే తథా ।
ధామ్ని వ్యోమ్నితరావద్రావనిలే, సలిలే అనలే ॥

అత్యంతాశ్చర్యంగా పరబ్రహ్మం అతనికి కనిపించింది. ఆ పరబ్రహ్మం అంతటా చేతులు, కాళ్ళు, కళ్ళు, ముఖాలు, చెవులు కలదై ఉన్నది. సమస్త లోకాలలోనూ వ్యాపించి ఉన్నది. సర్వ ఇంద్రియ-గుణాలకు సంబంధించనిదై (వివర్జితమై) ఉంది. అయితే సర్వేంద్రియ - గుణాన్వితమై ఉన్నది. పరమార్థంగా చూస్తే అద్దానికి దేనితోనూ సక్తత (Allotment) లేదు. అనగా సర్వత్రా అసక్తమై ఉన్నది. వ్యవహారరీత్యా అన్నిటినీ భరిస్తున్నది అదే! అన్నిటియొక్క భారం వహిస్తున్నప్పటికీ దాని స్వభావం గుణములు కాదు. అది నిర్గుణం. అది సమస్త భూతాల యొక్క (పంచభూతాల-జీవుల) బాహ్య- అభ్యంతరాలలో ఏర్పడి ఉంది. తాను ఎట్టి కదలికా పొందనప్పటికీ కదలికలన్నీ దానివే. అది అత్యంత సూక్ష్మమై ఉండటం చేత అజ్ఞాతస్థూల దృష్టికి అది కనబడటమే లేదు. సూక్ష్మ దృష్టికి మాత్రం అత్యంత స్పష్టంగా కనబడుతోంది. అనుభూతమౌతోంది. అది సర్వత్రా చంద్ర-సూర్య-పృథివి-పర్వత-సముద్ర-ఆకాశమయమై, సర్వత్రా చిత్సార- గురురూపమై, సర్వత్రా సృష్టి పూర్ణమై- జగన్మయమై ఉన్నది. సర్వత్రా మోక్షరూపమై, ఆద్యచిన్మయమై, సర్వత్రా సర్వపదార్థమయమై ఉన్నది. సర్వత్రా సర్వవర్జితమై ఉన్నది. అయినా కూడా, ఘట-వస్త్ర-వృక్ష-శకట-గృహ-మందిర-ఆకాశ-పర్వత-వాయు-జల-అగ్న్యాది సమస్త పదార్థములందున్నదై నర - వానరాది సర్వజీవులుగా తానే అయి అన్ని వైపులా వెలయుచుండుటను ఆతడు చూచాడు. ఈ ముల్లోకాలు అనేక ఆచార-విచారాలతో వివిధ కార్య సంరంభాలతో కూడుకొని ఉండవచ్చు గాక, ఇట్టి త్రైలోక్యం ఆ పరబ్రహ్మం నందు ఒకానొక స్వల్ప అంశమాత్రంగా ఆ దేవరాజు వీక్షించాడు.

మిరియంలో కారం ఉన్నట్లు, ఆకాశంలో శూన్యత్వం ఉన్నట్లు ఆ కాలాత్ముడగు చిన్మయ పరమాత్మలో ఇట్టి అసంఖ్యాక ముల్లోకాల యొక్క ఆవిర్భావతిరోభావాలు ఏర్పడి ఉంటున్నాయి.

ఈ విధంగా జీవభావవర్జితుడై, శుద్ధజ్ఞానంచే ఆ ఇంద్ర శరీరంతో పరబ్రహ్మాన్ని గాంచుచూ క్రమంగా పూర్ణాత్మధ్యానవంతుడైనాడు. ఆ పరబ్రహ్మం యొక్క మాయావిభాగం నందు అనేక బ్రహ్మాండాలను గాంచసాగాడు. అట్లాగే ఈ మనం ఉన్న బ్రహ్మాండాన్ని కూడా వీక్షించటం జరిగింది.

ఆ తరువాత ఆతడు ఈ బ్రహ్మాండమంతా మనస్సుతో సంచరించుచూ, ఈ బ్రహ్మాండములోని ఇంద్రలోకంలో ప్రవేశించాడు. తానే ఇంద్రుడై ఇంద్రత్వమును మనస్సుతో అవధరించాడు... ఆ

ఇంద్ర పదవిచే అనేక లోకాలు పరిపాలించాడు. ఇప్పటికి ఈయన ఈ బ్రహ్మాండమును పరిపాలిస్తూనే ఉన్నాడు. చూచావా విద్యాధర నృపాలా! ఈ ప్రకారంగా మొట్టమొదటి త్రసరేణువు లో ప్రవేశించి ముల్లోకముల భావనా మాత్ర సృష్టికి కారణమైన ఇంద్రుని వంశానుగతంగా ఆతని వంశంలోని ఒకానొక దేవరాజే ఈ మన వర్తమాన బ్రహ్మాండంలోని ఇంద్రుడై ఉన్నాడు సుమా!

ఈ లోకమందలి ఇంద్ర పదవిని అవధరించిన తరువాత త్రసరేణు ప్రవేశితుడగు ఇంద్రుడు తనయందు సంస్కారరూపమున ఎక్కడో అంతరాంతరాళాలలో దాగి ఉన్న పూర్వపు జ్ఞానయోగ అభ్యాసం చేత అతడు తాను కమలనాళ సూత్రంలో ప్రవేశించటం, నివసించటం స్మరించాడు. పరబ్రహ్మం యొక్క నిర్వికల్ప – సవికల్పరూపాలను గ్రహించి బ్రహ్మానందం అనుభవిస్తూనే ఇంద్రుడుగా బ్రహ్మండానికి సంబంధించిన పరిపాలనను కొనసాగించటం జరిగింది. ఆతని వంశజుడు ఈ బ్రహ్మాండంలో ఇంద్రత్వాన్ని ఈ వర్తమానంలో అవధరిస్తున్నాడు.

ఓ విధ్యాధరా! మనం కమలనాళ తంతువులలో ప్రవేశించిన ఒకానొక ఇంద్రుని కథాక్రమ మెట్టిదో చెప్పుకున్నాం. ఇటువంటి ఇంద్రులు చిదాకాశంలో అక్కడ, ఇక్కడా, మరింకా ఎన్నోచోట్ల లక్షల కొలదిగా ఉండి ఉన్నారు. ఇప్పుడు కూడా ఉన్నారు. చిదాకాశంలో ఇటువంటి వ్యవహారా లెన్నో అసంఖ్యాకంగా గడచిపోయాయి. గడుస్తున్నాయి.

విద్యాధరుడు : స్వామీ! ఇదంతా చూస్తూ ఉంటే ప్రతి ఒక్క ద్రష్ట యొక్క దృశ్యపరంపరలు అనంతమని అనిపిస్తోంది. ఈ దృశ్యములకు అంతు లేదా? ఇవి ఎప్పటికీ ఉపశమించవా?

శ్రీ భుశుండుడు : ఆత్మసాక్షాత్కారం కానంత వరకు ఈ మహాప్రబలమైన 'దృశ్యము' అనునది ఇట్లా త్రెంపు లేకుండా ప్రవహిస్తూనే ఉంటుంది.

1. జీవుడు మాయలోనే ఉన్నంత వరకు ఎప్పటికప్పుడు ఆ ఉపాధి విశేషములే తన మొత్తం స్వరూపమని అనుకుంటూ ఉపాధిపరంపరలు పొందుతూనే ఉంటాడు.

2. అతడు పరబ్రహ్మము గురించి బ్రహ్మజ్ఞులచే విని సగము పరబ్రహ్మమున – సగము మాయయందు ఆరూఢుడైనాడా... "ఇదియే సుదీర్ఘమైన మాయ"... అని గమనించగలుగుతాడు. అనగా బ్రహ్మమును, మాయను వేఋవేఋగా దర్శించగలుగుతాడు.

3. సత్యమగు పరమాత్మ యొక్క సాక్షాత్కారమాత్రంచే ఈ అనుభవమయ్యే మాయ పూర్ణంగా విలయమొందగలదు. అనగా మాయను కూడా ఆత్మవిన్యాస చమత్కారంగా దర్శించగలడు.

విద్యాధరుడు : స్వామీ! భుశుండ మహాశయా! మీరు చెప్పిన అనేక విశేషాల ప్రభావం చేత ఆ మాయ యొక్క అనేక చమత్కారాలు తెలుసుకున్నాను. ఇప్పుడు నాదొక ప్రశ్న. మనం అందరం చిదాకాశ (లేక) పరబ్రహ్మ స్వరూపులమే కదా! అట్టి మనకు 'మాయ' అనే అనుభవం ఎందుకు, ఎక్కడి నుండి, ఏ విధంగా సంప్రాప్తించి మభ్యపెడుతోంది?

శ్రీ భుశుండుడు : పాపరహితుడగు ఓ విద్యాధరా! ఈ మాయ ఎట్లాగో, ఎచ్చట నుంచో, ఏ విధం గానో వచ్చిపడి అనుభవమౌతోంది. ఎక్కడి నుండి వస్తే ఏం? మొత్తం మీద నీకు మాయ అనుభవ మవుతోంది కదా! ఇప్పుడిక మాయ అంటే ఏమిటో గ్రహించడానికి ఉపక్రమించు.

'మాయ' అంటే ఏమిటి? 'యామా'... "ఏదైతే స్వయంగా (వాస్తవానికి) లేదో" అని కదా, అర్థం? లేనిది ఎందుకోస్తే ఏం? దృష్టాంతానికి... అక్కడ దయ్యం లేదు. కానీ ఏదో రూపం చూచి "ఇది దయ్యం" అనే భ్రాంతి కలిగింది. "భ్రాంతి ఎందుకు కలిగింది?"... అనే ప్రశ్న ముఖ్యమా? ఆ భ్రాంతిని తొలగించుకోవటం ముఖ్యమా?

విద్యాధరుడు : భ్రాంతిని తొలగించుకోవటమే ముఖ్యం.

శ్రీ భుశుండుడు : అదీ సంగతి. అది మాయయే కాబట్టి, భ్రమ కల్పితమే కాబట్టి దీని హేతుభూతము లందు గల విశేషములను సుదీర్ఘంగా వాదోపవాదాలకు ఉపక్రమించటం ఉచితం కాదని విజ్ఞుల అభిప్రాయం. నా అభిప్రాయం కూడా.

"మాయ ఎట్లా వచ్చింది?"... అనే చర్చ వృథా కాలయాపనయేనని చెప్పబడుతోంది. "మాయ ఎట్లా తొలగుతుంది?" అనేదే ఇక్కడ మనకు ముఖ్యం. ఆచరణయోగ్యం. స్వప్నంలో సంఘటనలకు కారణాలు వెతికి లాభమేమిటి? ఆ కారణాలు కూడా స్వప్నతుల్యమే కదా!

మేఘం లోంచి వర్షం పడుతోంది చూచావా? అట్లాగే 'అహంభావం' అను ఒక చమత్కారం నుండి ఈ మాయ వర్షిస్తోంది. అట్టి అహంభావం ఆత్మదర్శన మాత్రంచేత తొలగగలదు. అందుచేత ఆత్మను దర్శించు. తద్వారా అహంకారం దానంతట అదే తొలగగలదు. అంతే!

'జగత్తు' అనునది భావనల సమూహమే కదా! భావనాప్రకటలన్నీ భావికుని ప్రకటనా చమత్కారమే! భావికుడు భావనల కంటే ముందే చిదానంద ఘనస్వరూపుడుగా ఉండనే ఉన్నాడు. (భావనలు చేయువాడు ఆ భావనల కంటే ముందే ఉండాలి కదా!) కనుక చిత్‌చైతన్యమే భావనలు గాను, జగత్తు గాను వెల్లివిరిస్తున్నదని గ్రహించు. ఈ విధంగా ఈ జగత్తు పరమార్థమున బ్రహ్మస్వరూపమై, సర్వవికల్పరహితమై ఉన్నది.

మరొక విధంగా చెప్పాలంటే... జగత్తు భావనల కంటే వేఱు కాదు. భావనలు భావికుని కంటే వేరు కాదు. భావికుడు బ్రహ్మం కంటే వేఱు కాదు. ఇట్లు జగత్తు బ్రహ్మమే అయి ఉన్నది.

అహంకారవశంగా విస్తృతమగు మానసిక వికల్పములు తోచవచ్చుగాక! ఆ పరబ్రహ్మం నందు ఇంద్రియ జనితమైన వికల్పాలు లేవు, జాగ్రత్ మొదలైన అవస్థలు లేవు. అది వాసనా మయమగు సర్వస్వప్నపదార్థ రహితం అకాశం వలె సర్వదా పరిపూర్ణం. అట్టి చిద్రూపమగు ఆత్మయే నేను, నీవు, తదితరులతో కూడిన మనమంతా కూడా!

❖❖❖

13. ఇంద్రత్రసరేణు న్యాయ సారాంశం

విద్యాధరుడు : మహాత్మా! "ఇంద్రుడు – త్రసరేణువునందు ఇంద్రలోక దర్శనం"... అనే ఒక చమత్కారమైన వృత్తాంతం చెప్పారు. ఈ వృత్తాంతంలోని ముఖ్యోద్దేశం మరొక్కసారి సమీక్షించ వలసినదిగా నా విన్నపం.

శ్రీ భుశుండుడు : ఓ విద్యాధరా! ఆ ఇంద్రుడు సర్వమును త్యజించి సూక్ష్మ రూపి అయి ఒక త్రసరేణువులో ప్రవేశించి విశ్రమించాడు. అయితే జరిగినదేమిటి? ఆ త్రసరేణువునందు విశ్రమిస్తూ ఉండగానే అతని మనస్సు త్రిలోకములను అక్కడికక్కడే కల్పించింది. అతని దర్శనమంతా మన ఈ భౌతిక ప్రపంచంలాగానే ఘనీభూతంగా అనుభవమయింది.

దీని అర్థమేమిటి?...ఎచ్చట అహంభావం ఉంటుందో అచ్చట త్రసరేణువులోని (త్రసరేణువు = ముప్పది పరమాణువులు కలది) ఇంద్రరాజ్యంలాగా 'జగత్తు' అనబడునది – తగుదునమ్మా అని – వచ్చి కూర్చుంటుంది. కాబట్టి ఈ 'జగత్తు' అని అనబడేదానికి అహంకారమే ఆదిమూలంగా చెప్పబడుతోంది. అహంకారి (లేక అభిమానించువాని) రూపమగు అహంకారమే ఈ జగత్తు.

బ్రహ్మం అనే మహాపర్వతం. అద్దానిపై 'భ్రమ' అనే మహారణ్యం. ఆ భ్రమ మహారణ్యంలో 'అహంకారం' అనే బీజం. ఆ అహంకార బీజం 'వాసనలు' అనే జలంచే తడుపబడి మొలకెత్తి ప్రవృద్ధమవటం. అట్టి అహంకార బీజమే ఈ 'త్రిలోకాలు' అనే మహావృక్షంగా పరిణతి పొందటం ...ఇదియే "ఇంద్ర – త్రసరేణు న్యాయం" యొక్క ముఖ్యపాఠ్యాంశం. దుష్టవాసనలచే విస్తృతమైన ఈ త్రైలోక్యం 'అహంత్వం' అను జలం యొక్క సంచలనవిలాసమే నని గ్రహించు.

జన్మ–మరణ–పురోగమన–తిరోగమన–ఆవిర్భావ–తిరోభావ పరంపరలతోను, శరీరాదుల ఉత్పత్తి, వినాశనాలతోను, అహంభావ జనిత త్రైలోక్య జగత్తు బహుచమత్కారమై వెలయుచున్నది. అట్టి ఈ జగత్తు అహంత్వవాయువు యొక్క చలనమని, అహంత్వ కమలాల యొక్క సుగంధమని విజ్ఞులు ఎఱిగియే ఉన్నారు.

వాయువు, వాయు చలనాలు వేఱు వేఱా? ...కావు. జలం, ద్రవత్వం– భిన్నాలా? ...కానే కాదు. అగ్ని, ఉష్ణత్వము...రెండు వేఱు వేఱు విశేషాలా? కావు. కావు. అట్లాగే... అహంత్వము, జగత్తు – ఈ రెండూ సర్వదా అభిన్నరూపములేనని గ్రహించు.

ఈ జగత్తు అహంకారమునందే ఉన్నది, అహంకారం ఈ జగత్తునందే ఉన్నది... ఈ రెండూ ఒకదాని చేత మరొకటి ఉత్పన్నం కావించబడుచున్నాయి. పరస్పరం ఒకదాని ఆధీనంలో రెండవది స్థితి కలిగి ఉన్నది.

విద్యాధరుడు : అహంభావమును తొలగిస్తే జగత్తు కూడా 'లేనిదే' అగుచున్నది కదా! మరి అహంభావమును తొలగించటమెట్లా?

శ్రీ భుశుండుడు : ఈ జగత్తుకు ఏదైతే బీజమగుచున్నదో అట్టి అహంభావము (లేక, అహంకారము) 'అనహంభావము' అను రూపమగు జ్ఞానబలిమిచే మొదలంట్ల తొలగించవేయబడగలదు. కనుక జ్ఞానము అనే జలముచే 'అహంభావము' అనే మాలిన్యమును పూర్ణముగా కడిగివేయాలి సుమా!

అహన్త్వం నామ తత్కించిత్, విద్యాధర! నవిద్యతే ।
అకారణమవస్తుత్వాచ్ఛ శ్వశ్వశృంగమివ ఉదితమ్ ॥

ఓ విద్యాధరా! "కుందేటి కొమ్ములు" అనే శబ్దానికి అర్థం ఏమిటి? కుందేలుకు కొమ్ములు

అసలు ఉండవు కదా! కుందేటికి కొమ్ములు మొలచినదెప్పుడు? తొలగినదెప్పుడు? కుందేలు పరుగులు తీస్తూ ఉంటే అది చెవులు రిక్కపొడుచుకొని ఉండటం చేత కొమ్ముల వలె కనిపిస్తాయి. అట్లాగే యథార్థానికి 'అహంభావం' అనునదేదీ లేదు. ఆకాశంలో నీలత్వం కనబడుతోంది. అక్కడ నీలిరంగు గల ఏదైనా పదార్థం ఉదా? లేదు. శూన్యమగు ఆకాశం కంటి భ్రమచే నీలి రంగుగా కనబడటం జరుగుచున్నట్లు, వాస్తవానికి ఉనికియే లేని 'అహంత్వము' ఉన్నట్లే భ్రమింపజేస్తోంది.

ఎట్లా అంటావా?... సర్వస్వరూపమగు పరబ్రహ్మం మనస్సు కంటే, ఇంద్రియాదుల కంటే పరమై ఉన్నది. అది స్వతహాగానే అనంతం. ఆకాశం ఎల్లప్పుడు అఖండమే అయినట్లు పరబ్రహ్మం కూడా ఎల్లప్పుడు అఖండమే. అట్టి పరబ్రహ్మమునందు 'అహంత్వం' అనే ఖండత్వము ఏర్పడటానికి కారణం ఏముంటుంది? ఉండదు. లేనేలేదు. కారణ రాహిత్యంచే 'అహంత్వం' అనేది అసత్తే గాని సత్తు కాదు. అనగా... అద్దానికి స్వయంకృతమైన ఉనికి లేదు.

వస్తువులైతే ఖండత్వం అనేది ఉన్నది. పరబ్రహ్మం అన్నిటినీ ధరిస్తున్న అవస్తువు. అవస్తువునందు మార్పుగాని, చేర్పుగాని సంభవింపజేయగల కారణం ఉండజాలదు. అద్దానియందు "సృష్టి" అనేది జనింపజేయగల కారణమేమున్నది? లేదు. కనుక "గొడ్రాలి యొక్క రెండవ కుమారుడు" అనే మాటవలె అహంభావాదులు (నీవు – నేను మొదలైనవి) ఎక్కడా లేనివే అగుచున్నాయి.

'అహంకారం' అనే బీజమే లేనప్పుడు అద్దాని కార్యము అనతగినట్టి జగత్తు కూడా 'లేనిదే' అగుచున్నది కదా! కాబట్టి ఓ విద్యాధరా! "ఈ జగత్తు జీవుడు మొదలైనవన్నీ వాస్తవానికి లేవు" అను సూక్ష్మం – పరమవాస్తవం అగు 'జగత్‌జీవ – అభావన'ను అవధరించు. ఆ విధంగా జగత్తు – జీవుడు అభావించకబడగా అప్పుడు శేషించునట్టి చిద్రూపమైన 'నిర్వాణం' నందు శాంతంగాను, సుఖస్వరూపంగాను ఉండు. ఈ విధంగా జగత్తు – అహంభావాల అభావనచే, ఆ తదనంతరం కూడా ఏ నీ స్వస్వరూపం శేషించియున్నదో... అద్దాని యొక్క రూపమే ఈ బాహ్యా పాదార్థిక జగత్తని, అభ్యంతరమగు మానసికాది జగత్తు కూడానని గ్రహించు. అంతేగాని నీకు అన్యమైనదేదీ లేదు. ఇదియే 'అనన్య స్థితి' అని చెప్పబడుతోంది. 'నీవు – నేను' మొదలైనవిగా కనిపించేదంతా నీయొక్క పరమాత్మతత్త్వమేనని గ్రహించి శాంతం వహించి ఉండు.

యన్నాస్తి, తత్తు నాస్త్యేవ! శేషం శాన్తమసి ధ్రువమ్ ।
సంప్రబుద్ధోఽసి మా భూయో, నిర్మూలాం భ్రాంతిమాహర ॥

ఓ విద్యాధరా! ఏదైతే (నేను – నీవు – అయినవాళ్ళు – కానివాళ్ళు – ఇష్టులు – అయిష్టులు – నావి–నా జగత్తు మొదలైనవి) ఒకప్పుడు కూడా లేకయే ఉన్నదో... అది ఇప్పుడు కూడా లేదు. అనగా భూతకాలంలో లేనిది వర్తమానకాలంలోనూ లేదు. వర్తమానకాలంలో లేనిది భవిష్యత్తులోనూ లేదు. ఒకప్పుడు లేక, ఇప్పుడు మాత్రం అనుభవ మగుచున్నదంతా భ్రమ చేతనే అనుభూతమౌతోందని గ్రహించు. ఈ "నేను – జగత్తు"... అనునవి నీకు మధ్యలో వచ్చాయి. స్వతహాగా ఉన్నవి కావు. మధ్యలో వచ్చినవి మధ్యలోనే పోతున్నాయి. 'నేను' అను భావన కంటే మునుముందే

ఆ భావన చేయు నీవు ఉండనే ఉన్నావు. అట్టి 'నేను' అను భావన (అహంభావన) కు ముందే గల ఏ నీ శాంత-బుద్ధ రూపమున్నదో... అదియే బ్రహ్మం. ఓ విద్యాధరా! నీవిప్పుడు ప్రబుద్ధుడవైనావు. అనేక సాధనల ప్రయోజనంగా సర్వభ్రమలను నిర్మూలన మొనర్చుకొనియే ఉన్నావు. ఇంక మరల భ్రమను ధరించవలసిన పని లేదు.

వ్యపగత కలనా కలంక శుద్ధః, శివమఽసి, శాన్తమసి, ఈశ్వరోసి నిత్యః
ఖమపి భవతి పర్వతోపమానం, జగదపి వా పరమాణురూపమేవ॥

ఓ విద్యాధరా! నీవు పరబ్రహ్మమే స్వరూపంగా కలవాడవు. 'బాహ్య-అభ్యంతరాలు' అనే కళంకాలు నీయందు లేవు. పరమశుద్ధుడవు. శివరూపుగవు. శాంతుడవు. ఎల్లప్పుడు ఏర్పడి ఉన్నట్టి నిత్యస్వరూపుడవు. అత్యంత సూక్ష్మమైన ఈ ఆకాశం నీ స్వస్వరూపం ముందు పర్వతమంత స్థూలం. అనేక బ్రహ్మాండాలతో కూడిన ఈ మహత్తర జగత్తు నీ పరబ్రహ్మస్వరూపం ముందు ఒక అణువు ప్రమాణం కలది. సంసారం ఉన్నప్పుడు గాని, ఇప్పుడు గాని, మరొకప్పుడు గాని నీ స్వస్వరూపం నిర్విషయ - నిష్ప్రపంచ - అఖండ - అప్రమేయ - కాలాతీత - గుణాతీత పరబ్రహ్మమే అయి ఉన్నది.

నాటకంలోని పాత్రచే ఆ పాత్రధారి పరిమితుడా? కాదుకదా! అట్లాగే, నీవు దృశ్యత్వము చేతగాని, ద్రష్టత్వముచేతగాని పరిమితుడవు కావు.

నీవు అపరిమిత, అప్రమేయానంద స్వరూపుడవు. ఇదియే నీ స్వరూపానికి సంబంధించిన పరమ సత్యం. ఓ సహజీవులారా! మీ అందరి స్వరూపం అట్టి పరబ్రహ్మమేనని గ్రహిస్తారు గాక!

❖❖❖

14. అంతఃకరణ శుద్ధి

శ్రీ భుశుండుడు : ఓ వసిష్ఠ మునీంద్రా! వింటున్నారు కదా! నేను ఆ విధంగా చెప్పుచుండగానే ఆ విద్యాధరుని దృశ్యవృత్తులన్నీ శమించాయి. అతడు సమాధినిష్ఠుడైనాడు. అప్పుడు నేను నా వాక్ప్రవాహమును ఆపి ఆతనిని సమీపించి మరల మరల అటు - ఇటు కదల్చి మేల్కొల్పటానికి ప్రయత్నించాను. పరమ నిర్వాణ దశను పొందిన ఆతడు మరల శబ్దాది విషయములవైపుగా మరలనే లేదు. ఆతడు అప్పటికి పూర్వమే నిర్మలమైన అంతఃకరణము సంపాదించుకొని ఉండటం వలన కాబోలు, అంతమాత్రపు ఉపదేశంచేతనే, ఆ నిర్వాణమగు పరమపదము, (లేక) బ్రాహ్మీస్థితి సంతరించుకున్నాడు. ఎంతో శ్రవణ - మనన - నిధిధ్యాస మొదలైన అనేక ప్రయత్నములచే కూడా లభించనిది ఆ నా కొద్ది వాక్యములు విన్నంతనే కలిగినదంటే, ఆతని హృదయ నైర్మల్యము అంతటిది! అందుకే జలంలో పడ్డ నూనెబిందువు వలె శుద్ధచిత్తమునందు కొద్ది ఉపదేశము కూడా మహత్తరమై వ్యాపించగలదని ముందే చెప్పాను కదా!

❖

శ్రీ వసిష్ఠ మహర్షి : కనుక ఓ రామచంద్రా!

నాఽహమ్ ఇత్యస్తి తేనాస్త్వన్మైనం భావయ శాంతయే,
ఏతావత్ ఉపదేశోక్తిః పరమా నేఽతరాస్తి హి ॥

నీవు చిదేకరసస్వరూపుడవు, అట్టి నీ ప్రత్యగాత్మయందు 'అహంకారము' అనునది వాస్తవానికి ఉండజాలదు. ఇక అసత్యమగు అహంకారమును భావించనే వద్దు. ప్రశాంతచిత్తుడవై పరమాత్మ స్వభావమున వెల్లివిరియుము. నా ఇంతటి ఉపదేశముయొక్క సారము ఇదే!


"నాయందు అహంకారం (అహంభావన)కు చోటే లేదు. అహంభావన (నేను అనే భావన)కు ముందే సర్వదా అంతటా ఏర్పడి ఉన్నట్టి పరమాత్మతత్త్వమేవ అస్మత్ స్వభావమ్" అనేదే సారాంశం.

అవిచారులు / సంసారాసక్తులు - ఋషులమగు మేము ఈ పరమతత్త్వమును ప్రవచిస్తూనే ఉన్నాం. అయితే ఇక్కడ ఉంచిన ముత్యం అటువైపుగా త్రిపిపెట్టి ఉన్న అద్దంలో ప్రతిబింబించదు కదా! అట్లాగే అవిచారపరులు సంసారాసక్తులు అగు మనుజుల మనస్సులలో మా ఈ బోధ ప్రవేశించినప్పటికీ అది ప్రతిఫలించక అప్రభావితంగానూ, నిష్ప్రయోజనంగానూ ఉండిపోతున్నది!

విచారపరులు / సంసార అనాసక్తులు - విచారశీలమై, భవ్యము-శాంతము అయినట్టి మనస్సులో మా ఈ బోధ (ఉపదేశం) ప్రవేశించిందా... ఇక అది వృద్ధియే పొందుతుంది గాని, చ్యుతి పొందదు. అంతేకాదు. ఇటువైపు త్రిప్పి ఉన్న అద్దంలో ప్రతిబింబించే ముత్యం నూతన తేజః పుంజాలను ప్రదర్శించుచున్నట్లుగా సువిచారపరుల (సంసార అనాసక్తుల) హృదయంలో ప్రవేశించిన మా ఈ వాక్యాలు తిరిగి మహారణ్యాన్ని భస్మీభూతం చేయగల మహత్తర ప్రదర్శనంతో బయల్వెడలుతాయి. అందుకే అవతారమూర్తివగు నీ ముందు మేము గ్రహించిన పరమసత్యమును సుదీర్ఘంగా విశదీకరిస్తున్నాం. ఈ మా సందేశసారం అవతారమూర్తివగు నీ ద్వారా తరతరాలా విస్తరించి లోకకళ్యాణ దాయకమగు గాక! మరల భుశుండినితో నాకు కొనసాగిన సంవాదం కొనసాగిస్తాను, విను.

❖

శ్రీ భుశుండుడు : ఈ సంసారం దుఃఖరూపమైనదని ప్రతిఒక్కరికీ తెలిసిన విషయమే! అయితే ఇది బయల్వెడలేది ఎక్కడి నుండి? అహంభావము నుండే సుమా!



శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ భుశుండ మహాశయా! జ్ఞానబలం చేతను, అహంకార రాహిత్యముచేతనే మీరు దీర్ఘాయుష్మలై ఉంటున్నారు కదా!

శ్రీ భుశుండుడు : ఓ ప్రియుడగు మునిశ్రేష్ఠా! విషయలంపటులగు మూఢులు కూడా ఒక్కొక్కసారి సుదీర్ఘమైన ఆయుష్షు కలిగి ఉండవచ్చు. "జ్ఞానులకే దీర్ఘాయువు ఉంటుంది. ఇతరులకుండదు"... మొదలైన నియమాలేవీ లేవు. అభ్యాసం ముఖ్యం. నిర్మలమైన హృదయం సంపాదించుకోవటం ముఖ్యం. అంతేగాని సుదీర్ఘమైన ఆయుష్షు ముఖ్యం కాదు.

అంతః శుద్ధమనస్కాయే సుచిరాయాభయప్రదమ్ ।
మనాగపి ఉపదిష్టాస్తే ప్రాప్నువంతి పరం పదమ్ ॥

చిరకాలాభ్యాసంచేత ఎవరి అంతఃకరణం శుద్ధమై ఉంటుందో... అట్టివారు స్వల్పమైన ఉపదేశము చేతనే ఆత్మసాక్షాత్కారం పొందుచున్నారు. ఇక దేహధారణ – దేహవిసర్జన అంటావా, అదంతా వస్త్రధారణ – వస్త్ర విసర్జన వంటిది మాత్రమే కదా!

శ్రీ వసిష్ఠమహర్షి : ఓ రామచంద్రా! ఆ విధంగా మేరు పర్వత శిఖరంపై అధివసించే పక్షిరాజగు భుశుండమహాశయుడు నాకు చెప్పి అటుపై ఆ ముక్తాత్ముడు మౌనం వహించాడు.

ఆ తరువాత కొంతసేపైన తరువాత నేను అక్కడినుండి బయలుదేరాను. ఆ విద్యాధరుడు నివసించే ప్రదేశం సందర్శించాను. మహనీయుడైనట్టి ఆ విద్యాధరునితో కూడా సంభాషించి అటు తరువాత నిజాశ్రమమైనట్టి సప్తర్షిమండలం జేరాను.

ఆ విధంగా స్వల్ప సందేశం చేతనే విద్యాధరుడు ముక్తస్వరూపుడై ప్రకాశించాడు. ఈ విషయమై నేను ఆ భుశుండమహాశయునితో సంభాషించి ఇప్పటికి అనగా ఈ కల్ప ప్రారంభానికి ముందే 11 మహాయుగాలు గడచిపోయాయి.

❖❖❖

15. బ్రహ్మజ్ఞానాగ్ని జ్వాల

శ్రీరాముడు : మహర్షీ! హృదయాంతరాళాలలో ఎక్కడనో 'ఇచ్ఛ' అనే జాడ్యం జనించి అహంకారాన్ని పరిపోషించి ఈ జీవునకు భ్రమపూర్వకము – దుఃఖమయము అగు 'సంసారము' అనే సంకటమును తెచ్చిపెడుతోంది కదా! అనహంభావనాభ్యాసం చేత ఈ అహంకారము ఎటుపోతోంది? ఆ తరువాత అప్పటి వరకు హృదయంలో రాజ్యమేలినట్టి అహంభావనకు ఏమి కానున్నది?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రాఘవా! 'అనహమ్' భావనాప్రభావంచేత సంసారరూపము, శుభాశుభ ఫలప్రదాతయగు ఇచ్ఛ అంతఃకరణమున ఉపశమించగలదు. అట్టి అనహంభావనాభ్యాసబలంచేత మనుజుడు సువర్ణమును – మట్టిని కూడా సమముగా గాంచగలుగుతాడు. అతని సంసారమంతా ఉపశమించుటచే ఇక దుఃఖము ఆతనిని సమీపించజాలదు.

న జానే క్వాఽఽ గచ్ఛతి! - ఈ జీవుడు కనుక శ్రవణ–మననాది అభ్యాసమును ఆశ్రయించితే కాలక్రమంగా ఆతని స్వస్వరూపమునందు బ్రహ్మజ్ఞానము అనే జ్యోతివీచిక ఉద్భవిస్తుంది. అట్టి శక్తిచే ఈ 'అహంభావము' అనే శిల దూరంగా విసిరివేయబడగా – అది ఎక్కడికి పోయి పడగలదో ఏం చెప్పను? బ్రహ్మసాక్షాత్కారరూపుడగు వీరునిచే అహంభావనయే కాదు, ఈ "నేను దేహమును– దేహపరిమితుడను"... అను దేహాహంకారము తదితర జగద్వికారములతో సహా కూడగట్టుకొని ఈ సంసార వ్యవహారమంతా సుదూరంగా విసిరివేయబడగలదు.

ఓ రామచంద్రా! ఈ జీవుడు తనయొక్క జడదాతీత – దృశ్యాతీత – మనోబుద్ధ్యాతీతమగు స్వస్వరూపము యొక్క ఆత్మతత్త్వమును ఎఱిగినప్పుడే దృశ్యజాడ్యం తొలగుతుంది. తత్త్వజ్ఞానం లేకపోయిందా.... ఈ జీవుడు స్థూలదేహంలో ఉన్నా, స్థూలదేహరహితుడై ఉన్నా, శయ్యపై ఉన్నా, వృక్షముపై దాగినా, పర్వతములపై ఉన్నా, గృహంలో ఉన్నా, ఆకాశమందు ఉన్నా, స్థలమందు ఉన్నా, స్థూలంగా ఉన్నా, సూక్ష్మంగా ఉన్నా, సాకారంగా ఉన్నా, నిరాకారంగా ఉన్నా, రూపాంతరం పొందినా, ఎచ్చటెచ్చట ఉన్నా, నిదురించినా, మేలుకున్నా, అగ్నిలో దూకి భస్మీభూతమైనా, కమలంలో దాగినా, త్రసరేణువులో దాగినా, ఏదైనా ధరించినా, త్యజించినా, ఎందులోనో నిమగ్నమై ఉన్నా, అన్నిటినుండి దూరంగా పోయినా, దేనికైనా దగ్గిరగాజేరినా, ఎట్టి పరిస్థితులలో ఉన్నా కూడా.... అహంకారముయొక్క నూతనాంకురత్వం ఉండియే ఉంటుంది. కాస్త ఇచ్ఛతో కూడి ఆ అహంకారము యొక్క నూతనావతారం విస్తారమైన సంసారమును అక్కడికక్కడే కల్పించుకొని దర్శించగలదు. అహంకారము ఉన్నచోట ఇచ్ఛ, ఆ రెండిటి మేళవింపుచేత మనస్సు. ఆ మనస్సు యొక్క విస్తారము చేత జగత్ పరంపరలు ఒకదానివెంబడే మరొకటి తక్షణం బయల్వెడలగలవు. కాబట్టి ఇంతటికీ ఔషధం ఆత్మజ్ఞానమే!

ఒక చిన్న బీజములోనుంచి కాలక్రమంగా పెద్ద మహావృక్షం బయలుదేరుతోంది చూచావా? ఇక వృక్షముయొక్క ఘనమైన కాండము, కొమ్మలు, ఆకులు, చిగుళ్ళు, పూలు, పళ్ళు. లేచిగుళ్ళు... విస్తారమగుచున్నాయి! అట్లాగే 'అహంకారము' అనే సూక్ష్మబీజంలో అనేక దృశ్యవృత్తులతో కూడి దేహపరంపరలు ఏర్పడటం వివేకులు సూక్ష్మదృష్టిచే గాంచగలుగుచున్నారు.

"ఈ దేహాదులు వాస్తవానికి ఏమై ఉన్నాయి? ఈ 'అహంత్వము' అనుదానియొక్క అసలైన స్వరూపమేమిటి?" ...ఇట్టివాటి యొక్క విచారణచే నిత్యనిరతిశయానందమగు ఆత్మయొక్క జ్ఞానం పరిఢవిల్లుతోంది. అట్టి జ్ఞానాగ్నిచే ఈ అహంత్వబీజమనే కోశము దగ్ధమైపోతోంది.

దగ్ధమైన బీజం పైకి మామూలుగా ఉన్నప్పటికీ ఇక మొలకెత్తదు కదా! అంతరమున జ్ఞానాగ్నిచే దగ్ధమైన అహంకారము ఇక ఈ సంసారక్షేత్రంలో మరల మొలకెత్తదు. ఈ జీవులు ఇది ఎఱిగి "జీవితము" అనే పుణ్యకాలమును సద్వినియోగ పరచుకొనెదరు గాక!

❖❖❖

16. గాలిలో ఎగిరే జగత్ దూదిపుంజాలు

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! కాలముచే పుట్టుచున్న ఈ దేహములు కాలము చేతనే మ్రింగివేయబడవచ్చుగాక! అంతమాత్రంచేత ఈ జీవుడు మరణించుట లేదు. జనించుటలేదు.

శ్రీరాముడు : అది ఎట్లా మహర్షీ?

శ్రీ వసిష్ఠ మహర్షి : అవును. దేహము నశించినంతమాత్రంచేత జీవుడు సర్వనాశనమగుటలేదు.

మరణం సర్వనాశాత్మ న కదాచన విద్యతే ।
స్వసంకల్పాంతర స్థైర్యం మృతిరిత్యభిధీయతే ॥

జీవుని దేహం నాశనమైనంతమాత్రంచేత ఆతని మనోబుద్ధ్యంహకారాలు నశిస్తాయా? లేదు. అవి ఉండనే ఉంటాయి. అవి ఉంటాయి కాబట్టి ఆ జీవునికి నాశనరూపమగు మరణం కలగనట్లే కదా! 'జీవుడు' అనగా ఆతని అనుభూతులు – అనుభవాలేగాని ఈ భౌతికదేహం కాదుకదా! జీవుడు 'మరణించాలి' అంటే ఆతని మనోబుద్ధ్యహంకారాలు నశించాలి. అవి నశించటమనేది జ్ఞానబలంచేతనే సాధ్యం. ఈ దేహం పోవటం నిజమైన మరణం కాదు.

మరి? ఆత్మ జ్ఞానముచే తన యొక్క సమస్త కర్మల–సంకల్పముల అభావం ఏర్పడగలదు. అట్టి అభావమే జీవుని మరణం గాని, దేహం నశించటం మరణం కాదు. అయితే, అట్టి అభావనచే సర్వభావములకు ముందుగానే సర్వదా ఏర్పడి ఉన్న భావాతీత, గుణాతీత, అఖండ, అప్రమేయ చిదాకాశంగా ఈ జీవుడు పరిణమించగలడు. భావముల మధ్యనున్న ఈ సాంసారిక జీవుడు భావములకు 'ఆది' అయిన స్వస్వరూపమును సంతరించుకొనుటచే పరమాత్మగానే పరిణమిస్తున్నాడు. ఆతని పట్ల భావ జగదాదులు క్రీడామాత్రంగా మాత్రమే చోటు కలిగి ఉంటాయి.

గాలిలో ఎగురుచున్న జగత్‌భాండములు, మృతజన మానసిక జగత్తులు - ఓ రాఘవా! అదిగో అటు ఆకాశంలోకి చూడు! అనేక సంకల్ప పరంపరలు అనే ధూళికణములచే నిర్మించబడిన అసంఖ్యాక జగత్తులు గాలిచే ఎగురవేయబడి ఒకచోటి నుండి మరొక చోటికి తీసుకుపోబడటం కనిపిస్తోంది కదా! అయాజీవుల సంకల్పములచే కల్పితములైన మేరు – మందరములవంటి లక్షల – కోట్లాది సంకల్పపర్వతములు నాలుగు దిక్కులలోను ఎలా గాలిలో ఎగురుచున్నాయో చూడు! అరటి స్తంభముల పట్టలవలె ఒకదానిపై మరొకటి – ఒకదానియందు ఇంకొకటి ఉండి ఉన్నట్లు... ఆ జగత్సమూహములు పరస్పరం కూడియున్నాయి. కాని విడివిడిగా కూడా ఉన్నాయి. చూడు! అదంతా ఎంత చమత్కారమో!

శ్రీరాముడు : మునీంద్రా! మేరు పర్వతములతో పోల్చతగిన అనేక జగత్ భాండములు గాలిచే ఆకాశంలో కొట్టుకుపోతున్నాయని, నన్నుకూడా చూడమని అంటున్నారు.! ఈ మీ వాక్యము యొక్క అసలైన ఉద్దేశమేమిటో నేను కొంచెం కూడా గ్రహించలేకపోతున్నాను. 'జగత్సమూహాలు' అంటేనూ, అవి గాలిచే కొట్టుకుపోవటమంటేనూ మీ ఉద్దేశమేమిటో విశదపరచవలసినదిగా నా విన్నపం.

ఎందుకంటే ఆకాశంలోకి చూచినా కూడా మీరు వర్ణించి చెప్పే జగత్‌భాండములు నాకేమీ కనిపించటం లేదే?

శ్రీవసిష్ఠ మహర్షి : "ఆ జగత్‌భాండములు – అవి గాలిలో కొట్టుకుపోతూ ఉండటం, వాటిని నిన్ను చూడమనటం".... అను నా వాక్యముల యొక్క ఉద్దేశార్థమేమిటో చెబుతాను విను.

ఓ రామచంద్రా! ప్రతిరోజూ అనేక దేహాలు మరణిస్తున్నాయి. ఆ మరణించినవారి ప్రాణాలు ఆకాశంలోకి ఎగిరిపోవుచున్నాయి. అట్టి ప్రతి ప్రాణి యొక్క ప్రాణాలలో అంతర్గతంగా ఒక చిత్తం – (బీజంలో మహావృక్షం ఉన్నట్లు) ఉన్నది. అట్టి ప్రతి చిత్తంలో వివిధ ఆకారాలతో కూడిన జగత్తు కలదు. అటువంటి జగత్తులు అసంఖ్యాకంగా ఆకాశ వాయువులలో కొట్టుకుపోతున్నాయి.

ద్రవస్వభావం కలిగి ఉన్న నదీజలం ద్రవస్వభావ సమన్వితమైన సాగరజలంలో కలుస్తున్నట్లు ఈ జీవుడు మృతి చెందిన తరువాత ఈతని ప్రాణవాయువులు ఆకాశవాయువులలో కలుస్తున్నాయి. ఆకాశవాయువుచే మరికొంత ప్రేరణ పొందిన ఆ ప్రాణవాయువులందు గల సంకల్పరూప జగత్తులు అటూ ఇటూ పరిభ్రమిస్తున్నాయి. అట్టి సంకల్ప జగత్ సమేతమైన ప్రాణవాయువులు నలుదిక్కులలో నిండి ఉన్నట్లుగా నేను చూస్తున్నాను. నీవు కూడా గమనిస్తున్నావా? నా ఎదురుగా గాలిలో ఎగురుతూ కనిపించే ఈ జగత్ సమూహాలు నీకూ కనిపిస్తున్నాయి కదా! బుద్ధిని ఉపయోగించి చూస్తే అవి కనిపిస్తాయి సుమా!

ఈ ఆకాశంలో వాయువునందు మృతి చెందిన వారి ప్రాణాలు ఉన్నాయి. ప్రాణాలలో వారి మనస్సు, ఆ మనస్సులో జగత్తు ఉన్నది. ఆకాశమునకు వాయువు, ఆ వాయువునకు ఈ చనిపోయిన వారి ప్రాణములు, ఆ ప్రాణములకు ఆ జీవుల మనస్సులు... ఆ మనస్సులకు వారి ఊహా మాత్ర జగత్తులు ఆధారభూతమై ఎగురుచూ కనిపిస్తున్నాయి.

పూల నుంచి వాసన గాలిలోకి ప్రవహించి పరిభ్రమిస్తూ ఉంటే భౌతిక దృష్టికి కనిపించదు కదా! అట్లాగే ఈ గాలిలో ఎగురుచున్న ప్రాణ–మనో అంతర్గత జగత్తులు భౌతికమైన కళ్ళకు కనిపించవు. అయితే వాటిని సుతీక్ష్ణమైన బుద్ధితో గాంచవచ్చు.

శ్రీరాముడు : మహర్షీ! మీరు చెప్పేదంతా చాలా చమత్కారంగా ఉన్నది. అయితే యుక్తియుక్తమే నని కూడా ఒప్పుకుంటున్నాను. మీరు చెప్పే మృతజనమానసిక జగత్తులతో ఒక్కొక్కదానిలో మరల త్రిలోకములు ఉంటాయికదా! అట్టి ఈ మృతుల జగత్తులు తదనంతరం ఏమి కానున్నవి? అవి ఆకాశంలో ఒకానొక విభాగంగా ఉంటాయా ఏమిటి? లేక, అవన్నీ వాయువిభాగమూ?

శ్రీవసిష్ఠ మహర్షి : ఆ జగత్తులు సంకల్పజనితములు కదా! అనగా మనోకల్పితాలే కదా! కనుక అవి ఆకాశం కంటే కూడా అత్యంత సూక్ష్మమైనవి. పైగా అవి కల్పనామాత్రాలే కనుక ఆ జగత్తులు వాస్తవానికి లేవు కూడా! ఒకని స్వప్నంలో కనిపించిన బంగారుకొండ గురించి విని ఆతని స్నేహితుడు అద్దాని ఆనుపానులకై వెతుకుతాడా? ...వెతకడు కదా!

అయితే, చిదంశమే సర్వత్రా వ్యాపించి ఉన్నది కదా! అందుచేత ఆయా మృత జీవులు తమ తమ భోగ్య వస్తువులైనట్టి స్వర్గ–నరక–భూమ్యాదులను దృఢభావనతోనే గాంచుచున్నారు. ఆ స్వయం

సంకల్పమయ జగత్తులు ఆయా ద్రష్టలకు సుఖము, దుఃఖము మొదలైనవి కలుగజేస్తూనే ఉన్నాయి. నీవు నాకు ఎదురుగా ఎంతటి వాస్తవంగా కనిపించటం జరుగుతోందో ఆ మరణించిన జీవులకు కూడా వారివారి జగత్ కల్పనలు అంతటి వాస్తవంగానూ తోచుచున్నాయి. ఈ విధంగా ప్రాణరూప నదీజలంలో ప్రతిబింబిత నగరముల వలె ఈ జీవుల కల్పనాజగత్తులు ఆవిర్భవించి వాసనా మాత్రముచే ప్రభవిస్తూ ఎటో కొట్టుకుపోతున్నాయి.

కానీ, జగత్తులు లేవు. కొట్టుకుపోవటమూ లేదు. అవన్నీ ఊహాసమూహ సంపుటాలే కదా!

ఒకచోట ఒక కుండ ఉన్నదనుకో, దాన్ని అక్కడి నుండి తీసి ఎవరైనా దూరంగా ఏదో ప్రాంతానికి తీసుకుపోయి అక్కడ ఉంచారనుకో. ఆ కుండలోని ఆకాశంలో భేదమేమైనా ఉంటుందా?... ఉండదు కదా! అట్లాగే ఈ చిత్తం, అట్టి ఈ చిత్తంలో అంతర్గతమై ఉన్న జగత్తులు పరిభ్రమణం పొందితే పొందవచ్చు గాక! ఆత్మకు మాత్రం ఎట్టి పరిభ్రమణమూ లేదు, ఉండదు. ఆత్మయందు ఎట్టి ఖేదం గాని, మోదం గాని జనించదని ఎఱుగుటయే ఆత్మజ్ఞానము.

శ్రీరాముడు : మృతి చెందినవారి ప్రాణములందు గల జగత్తుల యొక్క వాస్తవమైన రూపమేమిటి?

శ్రీవసిష్ఠమహర్షి : చెప్పాను కదా! అదంతా సంకల్పమయమే కనుక కల్పనా మాత్రమే. అదంతా సప్న జగద్దృశ్యము వంటిదే!

శ్రీరాముడు : అట్టి మృతించినవారు మనోసంకల్పంతో గాంచుచున్న జగత్తుకు, మనం ఈ కళ్ళతో చూస్తున్న పాంచభౌతిక జగత్తుకు సంబంధమేమైనా ఉన్నదా? సారూప్యం – అనుభవం దృష్ట్యా ఒకే తీరువా, వేఱు–వేఱైనవా?

శ్రీవసిష్ఠ మహర్షి : ఒకానొక సామ్యత తప్పకుండా ఉన్నది. మృతించినవారి జగత్తు ఏ విధంగా భ్రాంతిమయమో, కల్పనామాత్రమో... అట్లాగే ఈ జీవించి ఉన్నవాని జగత్తు కూడా భ్రాంతి మయమై, అసత్యముగానే ఉదయించినదగుచున్నది.

యథార్థానికి భ్రాంతి కూడా ఉదయించటం లేదు. నశించటం లేదు. భ్రాంతి కూడా తత్త్వ దృష్టిచే బ్రహ్మమే అయి ఉన్నది. ఒకవేళ వ్యవహార దశయందు ఈ పృథివి ఉదయించినదే కదా... అని అంటావేమో?

నౌకలో జనులకు నౌక యథారీతిగా (కదలకుండా) ఉన్నట్లు, ఒడ్డున ఉన్న చెట్లు కదులుతు న్నట్లు కనిపిస్తాయి చూచావా? అట్లాగే వాయుప్రేరితమైన చలనం పొందుచున్నప్పటికీ ఈ భూమి ఎప్పటియట్లే కదలకుండా ఉన్నట్లు – భ్రమచేతమాత్రమే అనిపిస్తోంది. పృథివియందు ఉన్న ఈ జనులకు పృథివి యొక్క అనుక్షణికచలనం ఏమాత్రం గోచరించటమే లేదు. అలాగే ఈ దేహం కూడా. ఈ దేహం ఎప్పటికప్పుడు మార్పుచెందుతూనే ఉండగా ఈ జీవుడు "నా దేహం ఎప్పట లాగానే యథాతథంగానే ఉన్నది"... అని ప్రతి ఉదయం లేచి అనుకుంటున్నాడు.

ఒక చిత్రకారుడు అతి విస్తారమైన ప్రదేశమును చిన్నవిస్తీర్ణము కలిగిన కిత్తనార గుడ్డపై చిత్రీకరించుచున్నాడు కదా! అట్లాగే, ఒక పరమాణువునందు కూడా ఈ మనస్సు విస్తారమైన జగత్తును కల్పన చేసుకుంటోంది. అనుభవిస్తోంది.

ఈ జీవులు జీవించి ఉన్నంతకాలం అల్ప లక్ష్యాల పట్ల తమ ధ్యాసను పరిమితం చేసుకొని, అనేక వ్యాకులతలతో కాలం గడిపివేస్తున్నారు. జీవించినంత కాలం మరికొన్ని ప్రాపంచిక భ్రమలను ప్రోగుచేసుకొని వాటిని 'మనస్సు' అనే సంచిలో నింపుకొని ప్రాణములతో వాటిని మోసుకొంటూ దేహాలు త్యజిస్తున్నారు. నీకు నేను వాయువులో చూపిస్తున్న జగత్తులు అవే సుమా! ఒక ఎలుక ఒక రోజు ధనాగారం ప్రవేశించింది. అది రత్నములన్నీ వదిలి అక్కడ గల దోసిలి మాత్రపు అన్నాన్ని మహత్తరంగా భావిస్తుంది కదా! అట్లాగే ఈ జీవులు జ్ఞానమును సముపార్జించ టానికి అర్హమైన 'మానవుడు' వంటి ఉత్తమ జన్మలలో ప్రవేశించికూడా మహత్తరమగు ఆత్మజ్ఞాన విశేషాలను, అనుభవాలను వదిలి మరిన్ని ప్రాపంచిక వాసనలను ప్రోగుచేసుకోవటమే జరుగుతోంది. పసిబాలుడు అమూల్యమగు ఆభరణాను ప్రక్కకు పారవేసి మట్టి ముద్దను అధికమైనదిగా భావించు నట్లు ఈ జీవుడు చైతన్యతత్త్వమును వదలి పరమాణు నిర్మిత వస్తు సముదాయాలగు ఈ దేహం, గృహం మొ॥ వాటిని మహత్తరమని ఎంచి ఈ పాంచభౌతిక జగత్తులలో తారట్లాడు చున్నాడు.

ఓ రామా! నీవు "సజీవుని ఇహలోక జగత్తు - మరణించినవాని యొక్క పరలోక జగత్తు"ల సామ్యం గురించి అడిగావు కదా! ఈ చైతన్యము అజ్ఞానముచే ఆవరించబడి ఉన్నంతకాలం.... ఈ సజీవుడు చూస్తున్న ఈ పదార్థ రూప ఇహలోక జగత్తు, మృతునికి అనుభవమౌతున్న భావనామాత్ర (లేక, ఊహామాత్ర పరలోక) జగత్తు.... ఈ ఉభయము "వృద్ధి చెందిన చిత్తముముయొక్క సంకల్ప రూప భావనయే"నని గ్రహించు. ఇక్కడి - అక్కడి సుఖదుఃఖములు, ధర్మాధర్మ భావనలు.... అంతా కూడా చిత్తము యొక్క విన్యాసమే!

"ఇది త్యజింపతగినది. ఇది గ్రహింపవలసినది" అను రూపంలో ఎవనిలో ఉన్నదో... అదే మమత్వభావనయొక్క రూపం. ఎవని అంతఃకరణంలో అట్టి గ్రాహ్య - త్యాజ్య భావన ఉన్నదో... అదియే అజ్ఞానం యొక్క రూపం సుమా! ఎందుకంటే, సర్వజ్ఞుడైన జ్ఞాని ప్రారబ్ధక్షయ పర్యంతరము వ్యవహార నిమిత్తం కార్యసంరంభమునకు సంబంధించిన వ్యవహారత్వము వహించియే ఉంటాడు.

చైతన్య సహితుడగు ఈ జీవుడు ఈ హస్త-పాదాది ఆయా అవయవాలను తన మనస్సునందే మనస్సుచేతనే అనుభవిస్తున్నాడు. అట్లాగే హిరణ్యగర్భుడు కూడా! సమిష్టి జీవుడు తన మనస్సునందే ఈ త్రిలోకాలను తన అంతఃకరణం యొక్క వ్యాప్తిచే తనే అనుభవించుచున్నాడు. ఓరామా! ఈశ్వరుడు వాస్తవానికి చైతన్యస్వరూపుడై, చిదాకాశరూపుడై, అవ్యయుడై, జన్మాదులు లేనివాడై అనంతరూపుడై ఉన్నాడు. ఇక ఈ జగత్తుల విషయానికి వస్తే, ఇది ఆ ఈశ్వరుడు తన అవయవంగా దర్శించడం జరుగుతోంది. అనగా ఈ జీవుడు ఈశ్వరస్వరూపుడైకూడా తన ఈశ్వరత్వమును ఏమరచి ఈ ఇహ-పర దేహాలను అవిశ్రాంతంగా గాంచుచున్నాడు. ఇనుపగుండు అగ్ని యొక్క సహకారంచే కత్తి, సూది వంటి తన భావికాలపు వికారాలను గాంచుచున్నట్లు ఈశ్వరస్వరూప జీవుడు ప్రళయకాలానంతరం తనయందు ఈ ముల్లోకాల భ్రమను గాంచుచున్నాడు. అధిష్ఠానమగు మృత్తిక (మట్టి) తనయందు గల కుండను తన రూపంగా గాంచుచున్నట్లు ఈశ్వరుడు తన యొక్క

మాయచే జగత్తును తన అంగంగా గాంచుచున్నాడు. విత్తులో గల అంకురరూప సత్త కాలక్రమంగా వృక్షత్వభావనచే వృక్షమును తన అవయవముగా తలచుచున్నట్లు బ్రహ్మం తనయందు స్వీయ మాయచే ఈ త్రిలోకాల దర్శనం చేస్తోంది.

నిజరూపం దృష్ట్యా జడమాత్రమగు అద్దం తనయందు ప్రతిబింబించే నగరంలో ఆయా కార్యకలాపాలు చూపరులకు చూపుచున్నట్లు బ్రహ్మము నిర్విషయ - నిర్మలతత్త్వమై ఉండి కూడా జీవేశ్వర ఉపాధిసంబంధిత దృష్టిచే తనయందు ఈ త్రిలోకాలను దర్శించి అనుభవించుతోంది. శుద్ధ దృష్టిచే తనయందు తానే సర్వదా ఏర్పడి ఉంటోంది.

దేశ కాల క్రియా ద్రవ్య మాత్రమేవ జగత్త్రయమ్ ।
అహంత్వ జగతోస్తేన భేదో నాస్త్యేతదాత్మనోః ॥

ఇక్కడ కనబడే ముల్లోకాలు దేశ-కాల-క్రియ-ద్రవ్యమాత్రాలే అయి ఉన్నాయి కదా! అట్టి దేశ-కాల-క్రియా-ద్రవ్యాల పట్ల అభిమానం గల అహంకారం వాటితో తాదాత్మ్యం చెంది ఉండటం చేత వాటితో 'తత్సమానవస్వభావం' కలిగి ఉండటం జరుగుతోంది. కాబట్టి అహంకారానికి - జగత్తుకు భేదం లేదు.

ఓ రామచంద్రా! శ్రుతులు గాని, నేను గాని 'లోహం - మట్టి' మొదలైనవి దృష్టాంతాలుగా తీసుకుంటున్నప్పుడు కేవలం బోధ సూచకమైన ఒకానొక విశేషాన్ని ఉపమాన సామ్యంగా గ్రహించాలని ఉద్దేశిస్తున్నాం సుమా! అది గమనించవలసినదిగా శ్రోతలకు నా విన్నపం.

ఈ స్థూలంగా కనిపిస్తున్న స్థావర-జంగమ జగత్తంతా ఏమై ఉన్నది? తన సూక్ష్మ బ్రహ్మ భావాన్ని ఏమాత్రం త్యజించనట్టి చైతన్యం యొక్క వివర్తమాత్ర (Deduced) శరీరమే అయి ఉన్నది సుమా! నీవు జ్ఞానదృష్టితో దర్శించావా... ఈ వివర్తమంతా తొలగి శుద్ధము - పూర్ణము - సర్వత్రా వ్యాప్తము అయినట్టి నిస్సంగమగు ఆత్మయే కనబడుతోంది. అప్పుడిక జీవ - జగత్ భేదం కొంచెం కూడా కనిపించదు. ఒకడు తన యొక్క అజ్ఞానముచే ఏఏ వివర్తము చూస్తున్నాడో అదంతా ఆతని అజ్ఞానాంశము చేతనే అట్లగుపిస్తోందని గ్రహించు. ఎవరు ఏది ఎట్లు చూడటానికి సంకల్పిస్తే అది అట్లే అనుభూతమవటం చైతన్యముయొక్క విశేషము. అట్టి చైతన్యము యొక్క దర్శనమునే "చైతన్యాంశ వివర్తము" అని మనం పిలుస్తున్నాం.

ఈ సర్వము చైతన్యమే అయి ఉన్నది. చైతన్యముయొక్క సమక్షము చేతనే మనస్సు, ఆ మనస్సునందు సంకల్పములు ఉంటున్నాయి. చైతన్యము లేనిచోట సంకల్పములు ఉండజాలవు.

చైతన్య ప్రభావము చేతనే చిత్తము ఉంటోంది... చిత్తము యొక్క సంకల్పపరంపరలే జగత్తు యొక్క రూపం... కాబట్టి 'ఈ జగత్తు చైతన్యమే' అని శాస్త్ర నిర్ణయం. చిదాకాశము సర్వవ్యాపకము, అనంతము కదా! అందుచేత చైతన్యమే తన స్వరూపంగా గలిగి ఉన్న ద్రష్ట యొక్క జగద్దర్శనమంతా చిదాకాశమే అయి ఉన్నదనటంలో కించిత్ సందేహం కూడా ఉండనక్కర్లేదు. జ్ఞాని విషయానికి వస్తే... అతని అంతఃకరణమునకు ఏ వికల్ప సముదాయం ఉదయిస్తోందో, అదంతా ఆతని

(జ్ఞాన) దృష్టికి ఏమాత్రం ఉదయించనిదే అగుచున్నది. ఎందుకంటే... ఆ కనబడే జగద్విశేషమంతా ఆతడు మిథ్యగానే ఎఱుగుచున్నాడు కాబట్టి!

శ్రీరాముడు : మహాత్మా! ఈ జగత్తంతా బాలునికైనా, వృద్ధునికైనా సత్యం వలే అనిపిస్తోంది కదా?

శ్రీవసిష్ఠ మహర్షి : "బాలునికి వృద్ధునికి జగత్తు సత్యము వలె అనిపిస్తోంది కాబట్టి ఇది సత్యమే కదా"... అని కాసేపు మాటవరుసకు అనుకుందాం. మరి ఒకడు తన స్వప్నంలో వస్తు – వాహన – జనాది విశేషాలు చూస్తున్నాడు. ఆ స్వప్నం నుండి మైదొలగే వరకూ ఆ స్వప్నద్రష్ట స్వప్నంలోని బంధువులను, వస్తువులను వాస్తవమనియే ఆ కాసేపు తలచుచున్నాడు కదా! కాబట్టి స్వప్నంలో కనిపించిన బంధువులు, వస్తు – గృహ – వాహనాదులు వాస్తవమని అందామా? కాదు. మెళుకువ వచ్చేసరికి అవన్నీ లభించటం లేదు. కనుక అవి అవాస్తవమే కదా! అట్లాగే, ఈ చంచల జాగ్రత్తులో అజ్ఞానికి కనిపించే జగదంతర్గత సంబంధ బాంధవ్యములన్నీ జ్ఞానము పొందిన తరువాత "అవి భ్రమయే" అని తప్పక గ్రహిస్తున్నాడు. కనుక జగద్దర్శనమంతా భ్రమయేనని గ్రహించు.

శ్రీరాముడు : స్వామీ! స్వప్నమును ఈ జీవునికి కల్పిస్తున్నదెవరు? ఎవరి ఉద్దేశమును అనుసరించి ఒక జీవునికి స్వప్నంలో తదంతర్గత విశేషాలు అగుపిస్తున్నాయి?

శ్రీవసిష్ఠ మహర్షి : ఒకడు చూచే స్వప్నం మరొకరెవరో బయట నుండి నిర్మిస్తున్నారనునది హాస్యపు మాట. ఆ స్వప్నద్రష్ట యొక్క కూటస్థ చైతన్యమే తన స్వప్న ఫలకమునందు స్వప్న దృశ్యమును సంకల్ప పూర్వకంగా రచించి – అంతర్గత సంస్కారముల ప్రభావం చేత దర్శిస్తోంది. ఆ కూటస్థ చైతన్యమే "జాగ్రత్, స్వప్నములు" అనే సంకల్పమునందు, 'సుషుప్తి' అను వాసనయందు భోక్తగా ప్రతిబింబిస్తోంది. అనగా ఈ సంసారం అనేది కూటస్థ చైతన్యం తన 'స్వరూపం' అను కాగితంపై చిత్రించిన చిత్రీకరణమే గాని మరొకటేదీ కాదు. అనగా, చైతన్యం స్వప్న సమయంలో తాను రచించిన దానిని తానే వాస్తవమైనట్లు భావించి అనుభవిస్తోంది. "స్వప్న సదృశ జాగ్రత్ – జాగ్రత్ సదృశస్వప్నము" – ఈ ఉభయం సత్యంగా తోచుచున్నప్పటికీ సత్యం కాదు. కూటస్థ చైతన్యం యొక్క ప్రతిబింబంతో పోల్చతగిన ఈ జీవునకు అనుభూతమయ్యేదంతా ఒక నాటకంలోని పాత్ర యొక్క గుణాదుల వలె మొదలే అసత్యం.

కూటస్థ స్వరూపం దృష్ట్యా ఈ జీవుడు నిత్యసత్యం. గుణ – కర్మాదుల దృష్ట్యా మొదలే అసత్యం.

నిత్యముక్తుడు, సత్యస్వరూపుడు అగు పరమాత్మయే అసత్యరూపమైన ఈ జగత్తును ధరిస్తున్నాడు. ఇది ఎట్లా అంటావా? జ్ఞానము ద్వారా ఈ జీవుడు ఈ "సూక్ష్మ శరీర సహిత అజ్ఞానము"ను సంక్షయింపజేసుకున్నప్పుడు ఈతడు శివస్వరూపుడే అగుచున్నాడని శాస్త్రవాక్యం కదా!

[జీవశ్శివో శివోజీవః జీవో బ్రహ్మేతినాపరః । పాశబద్ధః తథాజీవో పాశముక్తః సదాశివః ॥]

కాబట్టి రామచంద్రా! "దూది పుంజములలాగా ఆకాశంలో ప్రాణవాయువులచే జగత్తులు కొట్టుకుపోబడుచున్నాయి"... అని చెప్పాను చూచావా? అటువంటి వాక్యాలన్నీ అజ్ఞానుల కొరకే

వారి జ్ఞానాభివృద్ధిని ఉద్దేశించి నేను కల్పితపార్యాంశంగా చెప్పాను. వాస్తవానికి అంతా కల్పనా మాత్రమే కనుక జగత్తులు లేవు, అవి కొట్టుకుపోవటం లేదు, అవి విద్యమానమవటమూ లేదు. "నాకు కనబడుచున్నాయి" అని చెప్పినవన్నీ ద్రష్టల స్వయంకృత కల్పనావిశేషాలే – అని గ్రహించు.

ఈ విధంగా చిదాకాశం సమస్త పదార్థసమూహాల కోశరూపమై సర్వత్రా వ్యాప్తమై ఉన్నది. ఆ చిదాకాశము అజ్ఞాన కారణం చేతనే అనేక బ్రహ్మాండాలు, వాటిలో కొన్ని ఒకదానితో మరొకటి కలియటం, మరికొన్ని వేఱు వేఱై ఉండటం – ఈ చమత్కారమంతా జరుగుతోంది. పరబ్రహ్మం సర్వశక్తిమంతమైనది. తత్కారణంగా ఈ బ్రహ్మాండాలన్నీ అనంతరూపాలై అనేక కార్యారంభాలతో కూడుకొన్నవై ఉంటున్నాయి. అందులోని ఈ బ్రహ్మాండాలు అనేకమంది జీవులతో పూర్ణమై, చంచల మేఘాలలోని నగర ప్రతిబింబాల వలె ఉంటున్నాయి. గంధర్వ నగరాలలాగా మాంత్రికునిచే కల్పించబడి కనిపింపజేసే మాయా వస్తువుల వలె ప్రవర్తిస్తున్నాయి. ఈ జగత్తులలోని దేహములు, పదార్థములు మొదలైనవి పైకి స్థిరంగా ఉంటున్నట్లు భ్రమింపజేస్తున్నప్పటికీ లోన అతిచంచల శీలమై ఉంటున్నాయి. జల తరంగాల వలె చిద్రూపమహాసముద్ర తరంగాలుగా ఈ బ్రహ్మాండాలు ఏర్పడి, కనబడి, ఉండి – ఇంతలోనే కాలగర్భంలోకి జారుకుంటున్నాయి. ఏది ఏమైనా ఆత్మ సర్వదా నిశ్చలంగానే ఉన్నది.

ఇక జీవునికి 'నిశ్చలత్వము'నకు సంబంధించిన భావన కలగటానికి కారణం స్వరూపతః ఆత్మయే కాబట్టి!

❖❖❖

17. సమష్టి రూప విరాట్ పురుషుడు – వ్యష్టి

శ్రీరాముడు : మహర్షీ! ఈ జీవునకు రెండు విధాలైన రూపములున్నాయి. కదా!... 1. ఆకృతరూపం (శాస్త్రీయ, వ్యవహారయుక్తమైన రూపం), 2. అవ్యాకృతరూపం (పారమార్థిక రూపం)... ఇప్పుడు నా ప్రశ్నలు విన్న విస్తాను–

1. జీవునికి వ్యవహారకారణమయ్యే ఈ స్థూలదేహం స్వీకరించటమనేది ఎట్లా సంభవించింది.

2. ఈ భౌతిక–వ్యావహారిక రూపాన్ని అతిక్రమించి పారమార్థిక స్వరూపాన్ని అతడు ఎట్లా సంతరించుకో గలుగుతాడు?

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! విను, చెపుతాను.

చిదాకాశము సర్వదా అనంతమైనది. అట్టి చిదాకాశబ్రహ్మము స్వ (తన యొక్క) సంకల్ప చమత్కారంచే మనోబుద్ధ్యహంకార రూపమగు సూక్ష్మోపాధియందు ప్రవేశిస్తోంది. అట్లు ప్రవేశించి ఈ నేత్రాలు మొదలైన ఇంద్రియాల ద్వారా విషయాలను అనుభవిస్తోంది. అట్టి అనుభవాన్ని అవధరించటం అను చర్యను దృష్టిలో పెట్టుకొని అది 'చేతనం' అని పిలువబడుతోంది. అయ్యది ప్రాణాలను అవధరించటంచేత 'జీవుడు' అను నామం చేత చెప్పబడుతోంది.

కాబట్టి... ఈ జీవుని రూపము సూక్ష్మమూ కాదు, స్థూలమూ కాదు, శూన్యమూ కాదు, ఒకానొక వస్తు రూపము కాదు, మరి?... అయ్యది సర్వత్రా వ్యాప్తమై, అంతటా ఉత్తేజతత్త్వమైనట్టి స్వానుభవమే అయి ఉన్నది. చిన్మాత్రమే 'జీవుడు' అను శబ్దముచే చెప్పబడుతోంది.

"జీవుని రూపం అణువువంటి సూక్ష్మపదార్థాల కంటే అత్యంత సూక్ష్మం. స్థూల పదార్థాలన్నిటి కంటే అత్యంత స్థూలం. అది ఇదేదీ కాదు కానీ, ఇదంతా అదే. బ్రహ్మమే ఈ జీవుని వాస్తవరూపం" ...అని విజ్ఞులు నిర్ణయిస్తున్నారు. ఏ ఏ పదార్థములకు ఏఏ జాతి-గుణాది అసాధారణ విశేషాలు అగుపిస్తున్నాయో... ఆయా రూపంచే జీవచైతన్యమే స్థితి కలిగి ఉందని గ్రహించు. ఎందుకంటావేమో? ఆ చైతన్యమే చిత్తవృత్తి ద్వారా ఆయా అనుభవమగుచున్న పదార్థంగా భాసించుచున్నది.

స్వస్వరూపం నుండి బయల్వెడలుచున్నట్టి సమష్టి జీవుడు (బ్రహ్మ, సృష్టికర, విరాట్ పురుషుడు) ఎప్పుడు ఎచ్చట ఏ అనుభవాన్ని ఆశ్రయిస్తాడో... అప్పుడు అచ్చట అట్లే శీఘ్రంగా అగుచున్నాడని సూక్ష్మదృష్టితో గ్రహించు. వాయువుకు చలనం స్వభావంగా అగుచున్నది చూచావా? సమష్టి జీవునికి ఈ సృష్టి తన యొక్క స్వభావమే అయి ఉంది. అంతేగాని ఇది - బాలునికి బేతాళుని భ్రాంతి వలె ఎవరో ఏదో చెప్పితే కలిగినది కాదు. జీవునకు ఎవరో చెప్పితే దర్శన ప్రతిభ కలిగినది కాదు. ఇది స్వభావమే అయి ఉన్నది. అయితే ఈ విషయం స్వ విజ్ఞాన మాత్రంచే నిర్ణయించ వలసినదే! ఒకరు బోధిస్తే మరొకరు పొందేది కాదు.

గాలి సంచలనం కలిగి ఉండటంచే దాని స్పర్శ తెలుస్తోంది. సంచలనం లేకపోతే? వాయువు ఉన్నప్పటికీ స్పర్శాస్పర్శలు ఉండవు. అట్లాగే ఈ జగత్తు ఇందలి పదార్థ విశేషాలు ఎదురుగా ఉంటున్నప్పటికీ ఎవరికైతే ఇవన్నీ అర్థరహితాలనీ, నిర్విషయాలనీ తెలియవస్తుందో (అనుభవమౌతుందో... అనగా, ఈ జగత్పదార్థాలన్నీ పరిగణార్హత కోల్పోతున్నాయో) అప్పుడు ఆతనికి బ్రహ్మభావం విద్యమానమౌతోంది. జగత్ భావన తొలగిపోతోంది.

జీవుడు స్వయంగా చిద్ఘనరూపుడే. అందుచేత ఆతని 'స్ఫురణ' అగు 'అహం' అను రూపంలో గల అహంకారం ఈ "దేశ-కాల-క్రియ-ద్రవ్య"... మొదలైన శక్తులను ఆవిర్భవింపజేసి వెలయుచున్నది. అట్టి అహం నుంచి చిత్తం యొక్క కల్పన కావించబడుతోంది. చిత్తం యొక్క రూపమేమిటి?

1. దేశకాలక్రియాదుల రూపమున తన సూక్ష్మసంస్కార చమత్కారంచే కించిత్ ఆవిర్భవించిన చిత్తు యొక్క చమత్కారమే చిత్తము.
2. సూక్ష్మత్వము నుంచి స్థూలమును సంతరించుకోవటమే చిత్తము.
3. అసత్యమైనప్పటికీ ఈ దృశ్యమును సత్యమువలె భాసింపజేయునదే చిత్తము.
4. జగదనుభవమే చిత్తము యొక్క రూపం. అంతకుమించే వేఱే ఏ రూపమూ లేదు.
6. చిత్తముయొక్క ఆకారము ఆ చిత్తమునకు అనుభవమయ్యే జగత్తు... రెండూ అవాస్తవాలే!
7. ఈ చిత్తము అతి సూక్ష్మమగుటచేత దాని వికారాలు సూక్ష్మ తరంగాలుగా హృదయంలో ప్రవహిస్తున్నాయి. అవియే జగత్తును నింపి ఉంచుతున్నాయి.

ఈ చిత్తం స్వప్నంలో కల్పిత పరంపరల వలే తన అభిలషిత పాంచభౌతిక శరీరాన్ని కల్పిత మాత్రంగా గాంచుచున్నది. స్వప్నంలో ఒకనికి తాను మరణించినట్లు, బంధువులు దుఃఖిస్తున్నట్లు సంఘటనలు ప్రాప్తమగుచున్నట్లే జీవునికి ఈ జాగ్రత్ శరీర పరంపరలు వస్తున్నాయి, పోతున్నాయి.

స్వప్నంలో కనిపించే ఆయా జనులు స్వప్నద్రష్ట యొక్క స్వప్న శరీర విభాగములే కదా! అయినా, స్వప్నద్రష్ట స్వప్నంలో తారసపడిన రూపాలు తనకు వేరైనట్లుగా భ్రమిస్తున్నాడు చూచావా?

ఈ జీవుడు స్వతహాగా బ్రహ్మానందమయుడు, అఖండ నిత్యత్వ సంపన్నుడు అయి ఉండి కూడా "వీరు-వారు-నా వారు-నీ వారు-స్వజనులు-పరజనులు" ఇత్యాది విశేషాలతో కూడిన పరిచ్ఛిన్న జగద్రూపాన్ని (తన స్వరూపానికి అన్యమైనట్లు) గాంచుచున్నాడు. ఇట్టి "అహం - చిత్తం - ఇంద్రియ జగత్" వరుస క్రమంలోనే సమష్టిజీవుడు చింతిస్తూ సమష్టి స్థూల రూపమగు ఈ విరాడ్రూపాన్ని (పాంచభౌతిక సమష్టి జగత్తును) పొందుచున్నాడు. అంతేకాదు. ఆతడు తన ఆత్మ యందే సమష్టి మనస్సును నీళ్ళలో ప్రతిబింబించే చంద్రబింబంలా గాంచుచున్నాడు. ఇదియే సమష్టి జీవుని హిరణ్యగర్భరూపం. ఆ తరువాత ఈ తన సమష్టి యుక్తమైన హిరణ్యగర్భరూపాన్ని కాకతాళీయ న్యాయంచే తనకు భిన్నమైనదానిగా పంచజ్ఞానేంద్రియాల ద్వారా గాంచుచున్నాడు. ఆ పంచజ్ఞానేంద్రియాల ఛిద్రసహిత స్థానాలైన ఇంద్రియ ద్వారాలను (కర్మేంద్రియాలను) చింతిస్తూ, ఆయా విషయానుభవాలను పొందుచూ విరాట్పురుషుడై శోభిస్తున్నాడు.

ఈ విధంగా "అవ్యక్తరూపుడు-నిరామయుడు-అనంతాకార జ్ఞానయుతుడు-పరమేశ్వర స్వరూపుడు" అయినట్టి ఈ జీవుడు అనబడువాడు పంచేంద్రియములు అవయవములుగా గలవాడై విరాజిల్లుచూ, ఆయా విషయములను (శబ, స్పర్శ, రూపాదులను) అనుభవిస్తూ పోతున్నాడు.

అనగా... మనస్సు ప్రప్రథమంగా పరబ్రహ్మం నుండి ఆవిర్భవించి అనేక దేహపరంపరలను అనుభవించటంలో నిమగ్నమై, తన ఉత్పత్తి స్థానమును తానే ఎఱుగక తబ్బిబ్బగుచున్నది.

ఈ జీవుడు వాస్తవానికి పంచభూత పరిమితుడు కాదు. కాని పంచభూత పరిమితునివలె తోచుచున్నాడు. కారణం? కదిలే దానిని చూస్తూ కదిలించేదానిని ఏమఱచుచుండటం చేతనే. ఏది ఏమైనా ఈ జీవుడు తన యొక్క అప్రమేయ - అనంతాది విశేష సంపన్నమైన చైతన్యనమునకే 'ఆది' అయిన చిదానంద ఘనముగాక, పరమాత్మగాక మరొకటేదో కానే కాడు. పరమాత్మస్వరూపుడుగా ఈతడు సర్వశక్తి సంపన్నుడేగాని ఏదో చావు-పుట్టుకుల మధ్య చిక్కుకున్న పిట్టవంటి వాడు కాదు. ఈతడు తనకు తానే స్వయంగా ఆవిర్భవిస్తున్నాడు, స్వయంగానే సంచాలనం నిర్వర్తిన్నాడు. స్వయంగానే లయం అగుచున్నాడు. ఈతడు స్వసంకల్పవశం చేత కల్పసమూహాలలోను, క్షణకాలములందు ప్రవేశించి మరల భావనను ఉపశమింపజేస్తూ శమించుచున్నాడు. ఈ జీవుడు దేహధారిగా కనిపించినా, సూక్ష్మదృష్టికి ఈతడు కేవల మనోమాత్రధారిగా తెలియవస్తున్నాడు.

మనస్సే శరీరములలో ప్రవేశించి, ఇంతలోనే నిష్క్రమిస్తోంది. ఏ చైతన్యాత్మ సమష్టి రచనా సంవిధానంలో ప్రవేశించి ఈ విరాడ్రూప విశ్వంగా ప్రకటనమగుచున్నాడో... ఆతడే వ్యక్తి జీవుల

యొక్క పుర్యష్టకంలో (పంచ కర్మేంద్రియాలు, పంచజ్ఞానేంద్రియాలు, మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం, వాసనలు, అవ్యక్తం) ప్రతిబింబిస్తున్నాడు.

సూక్ష్మః స్థూలో అంబరాత్మైష వ్యక్తో అవ్యక్తోంతవర్జితః
సర్వస్య బహిరన్తశ్చ న కించిత్ కించిదేవ చ॥

అవ్యక్త అనంతాకాశ రూపుడగు ఆ పరమాత్మయే సూక్ష్మ శరీరాలలో... సూక్ష్మంగా, స్థూల శరీరాలలో... స్థూలంగా – సమస్త పదార్థముల బాహ్య అభ్యంతరాలలో వెలయుచున్నాడు. పరమార్థమున ఈతడు సర్వదా అపరిచ్ఛిన్నుడే అయినా కూడా వ్యవహారమునకు వచ్చే సరికి పరిచ్ఛిన్నుని లాగా ఒప్పుచున్నాడు.

పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, మనస్సు, వీటన్నిటినీ ఆక్రమించి ఉన్న భావాభావాలతో కూడిన అహంకారం – ఇవన్నీ కలిసిన రూపమే జీవుడు.

ఈ జీవులలో ప్రకాశిస్తున్న ఆత్మయే చతుర్ముఖుడగు బ్రహ్మదేవునియందు కూడా ఉండినదై శబ్దార్థ కల్పనా సహితమైన నాలుగు వేదాలను గానం చేయుచున్నది. ఆ బ్రహ్మదేవుడే నేటి వరకు వ్యవస్థితమై ఉనట్టి నియతిని (శాస్త్రీయ, అశాస్త్రీయ సంచారాలను, విహిత, అవిహిత కర్మలను, కర్మల ఫలాదులను) స్థాపించినాడు. అతనినే “విరాట్పురుషుడు” అని కూడా అంటారు.

స్వర్గలోకం ఆ విరాట్ పురుషుని శిరస్సు, పృథివి ఆతని పాదం. మధ్యగా ఉన్న ఆకారం ఆతని ఉదరం. ఈ బ్రహ్మాండమండపం ఆతని శరీరం. అనంతమైన ఇతర లోకాలు ఆతని ప్రక్క అవయవవాలు. జలం ఆతని రక్తం. పర్వతాలు ఆతని మాంస పిండం. నిరంతర ప్రవాహ శీలాలగు నదులు ఆతని నాలుకలు. సముద్రాలు ఆతని రక్త సంచయస్థానాలు. సప్త ద్వీపాలు ఆతని ప్రేగులు. విశాలమగు దిక్కులు ఆతని బాహువులు. నక్షత్రాలు ఆతని రోమసమూహాలు. వాయువుల ఆతని ప్రాణవాయువులు. సూర్యమండలం ఆతని నేత్రం. చంద్రుడు ఆతని మనస్సు. ఆ మనస్సే ఈ శరీర వృక్షములకు బీజం. ఆ చంద్రమండలమే అన్నాదులకు హేతువు. మనస్సే ఈ జీవుడు.

చంద్ర రూపుడగు విరాట్ – జీవుని వలననే ఈ మూడు లోకములందలి సమస్త జీవులు, వారి మనస్సులు, కర్మలు సుఖములు, మోక్షములు – ఇవన్నీ ఏర్పడి ఉన్నాయి.

చంద్రరూప విరాట్ పురుషుని సంకల్ప రూపులే బ్రహ్మ – విష్ణు – మహేశ్వరులు కూడా! అంతేకాదు. సురులు, అసురులు, మానవులు, జంతువులు, పక్షులు – ఇవన్నీ ఆ సమష్టిచిత్తం యొక్క చమత్కారము మాత్రమే!

ఈ విధంగా సృష్టికర్తలోని చిత్తు, జీవునిలోని చిత్తు ఒక్కటేగాని వేఋవేరైనవి కావు. వాస్తవానికి నిర్విషయము, అనంతయుతము అగు చిత్ త్రికాలాభాద్యసత్యము. అందులోంచి ‘స్వభావము’ అనే చమత్కారం స్వయంకృతంగా అయి బయల్వెడలుతోంది. ఆ చిత్ స్వభావమే సూక్ష్మమగు అమృతకళకు సాక్షిగా దర్శించుటకు ఉపక్రమించి చంద్రునికి “కార్యం, కారణంగా” అగుచున్నది. ఆ చిత్కళ ఎప్పుడు ఏ ‘దేవత, ప్రజాపతి’ మొదలైన ఆకారాన్ని సంకల్పించుచున్నదో... అప్పుడు

అక్కడ అట్లా ఆ దేవత, ప్రజాపతి, మానవుడు, పురుగు మున్నగు రూపాలతో వెలయుచున్నది. అమృతకళతో కూడిన ఈ భౌతిక చంద్రుని ప్రభావం చేతనే భూమిపై ఓషధులు, పదార్థ – శరీర సృష్టి ఏర్పడుచుండుట చేతనే "జాగ్రద్దశగా అందరికీ అనుభూతమగుచున్న ఈ చంద్ర (విరాట్) మండలమే సమష్టి జీవుడగు విరాట్ పురుషుని శరీరం అపంచీకృత పంచభూతాలే ఆతని అవయవాలు"... అని శాస్త్రకారులు (సామవేదం మొ॥) ప్రవచిస్తున్నారు.

చంద్రరూపుడగు ఆ విరాట్ (సమష్టి) జీవుని నుండి చల్లటి కిరణ ప్రసరణ ద్వారా ఓషధుల రూపమున ఆ విరాట్‌తత్త్వరసతత్వము భూమిపై ప్రసరించి వ్యష్టి జీవులయొక్క ఆహారము–తదితర జీవశక్తులు–జీవనాడులూగా విస్తరించుచున్నది.

అనగా... విరాట్ పురుషుని నుండి బయలుదేరిన జీవ రసస్రవంతి చంద్రుని ద్వారా అమృత కళను సంతరించుకొని, అన్నరసరూపంగా భూమిపై ప్రసరించి ప్రాణధారణ ఒనర్చి, జీవుల దేహాలలో 'జీవం' అను రూపంగా ప్రవర్తిల్లుచున్నది. ఆ విరాట్ పురుష చైతన్య స్రవంతియే మనస్సు – జన్మ – కర్మలన్నిటికీ ముఖ్య కారణమై పరుగుచు, సర్వచేష్టలను ఒనర్చుచున్నది. ఇటువంటి విరాట్ పురుష శరీరాలు అసంఖ్యాకంగా ఒక్కొక్క కల్పంలో ఉన్నాయి. అటువంటి అసంఖ్యాక కల్పములు ఎన్నో గతించాయి. మరెన్నో గతించబోతున్నాయి. అయితే... ఇదంతా మాయా చమత్కారమే! ఎందుకంటే నిర్మల – నిర్విషయ – నిశ్చల బ్రహ్మం నుండి బయలుదేరిన ఈ విరాట్ పురుషుడు (సమష్టి జీవుడు) బ్రహ్మానికి వేఱు కాదు. కనుకనే ఆతడు అనంతుడై, అనుభవరూపుడుగా ఉంటున్నాడు. ఈ వ్యష్టి–సమష్టి సంబంధితమైన అధిష్ఠాన సత్తతో కూడుకొనినవాడుగా ఉంటున్నాడు.

సర్వ దేశ–కాలాలో ఆ విరాట్‌రూపుడు బ్రహ్మం యొక్క మాయావిభాగం నందే స్థితి కలిగి ఉంటున్నాడు. అందుచేతనే "అంతయు బ్రహ్మమయమే" అని సిద్ధాంతీకరించబడుతోంది.

❖❖❖

18. వ్యష్టి - విరాట్టు ఒక్కటే!

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! నిర్విషయ ఓంకార ప్రవచిత శుద్ధ – బుద్ధ పరతత్త్వమునుండి విరాట్ పురుషుడు స్వయంసంకల్ప ప్రభావంచే ఆవిర్భవిస్తున్నాడు. ఆ విరాట్ పురుషుడు సత్యసంకల్పుడై (దేనిని ఎట్లు సంకల్పిస్తే అది అట్లే ఏర్పడగల ప్రభావసంపన్నుడై) ఆ తదనంతరం పంచభూతాత్మకుడు అగుచున్నాడు. ఆ విరాట్ పురుషుడు ఏ వస్తువును ఎట్లెట్లు సంకల్పిస్తే అది ఆ విధంగానే స్వయంగా అగుచున్నది.

అనగా, చిదాకాశమగు బ్రహ్మమే ఈ జగత్తులోని ఆయా అనేక విశేషములుగా వివర్తము పొందుచున్నది. అందుచేతనే "ఈ జగత్సమూహమంతా విరాట్‌పురుషుని సంకల్పరూపము మాత్రమే" అని విజ్ఞులు నిర్వచిస్తున్నారు. ఎందుకంటే...

1. మొట్టమొదటి బ్రహ్మం తన యొక్క ఉపాసనా సంయుతమైన వాసనచే సృష్ట్యాదిలో పంచ భూతాత్మకమైన విరాడ్రూపంగా సంతరించుకుంటోంది.

2. ఆ తరువాత అట్టి ఉపాసనా ప్రయోజనమైనట్టి పంచమహాభూతాత్మకమైన విషయాల సమష్టి భోగాల పట్ల స్వయం ప్రేరణచే ఉన్ముఖమౌతోంది.

ఈ విధంగా సమస్త జగత్ పదార్థముల సమూహం యొక్క మూలకారణం విరాట్ పురుషుడే అయి ఉన్నాడు. ఇక ఈ జగత్-జీవ రూపాలగు కార్యాలన్నీ కూడా అట్టి మూలకారణమగు విరాట్ పురుషసంకల్పమును ఆశ్రయించి, అనుసరించి ఉన్నాయని విశదీకరించబడుతోంది. ఇందులో సందేహం లేదు కూడా!

ఇక వ్యష్టి జీవుని విషయానికి వద్దాం. ఈతడు కూడా "పరమాత్మతత్త్వము" అను ముడి పదార్థంతో తయారు చేయబడినవాడే కనుక ప్రతిఒక్క వ్యష్టిజీవుడు కూడా తనయందు తాను సర్వ సృష్టి సమర్థుడయ్యే ఉన్నాడు. ఏ విధంగా అయితే సమష్టి జీవుడు తనయందలి దివ్యచైతన్యశక్తిని ఆసరాగా తీసుకొని ఈ మహాభూతాత్మిక సృష్టిని సంకల్పిస్తున్నాడో... అట్లాగే దివ్య చైతన్యమే స్వరూపంగా గల ఈ వ్యష్టి జీవుడు కూడా, నిజమనోవృత్త్యానుసారం స్వానుభవజ్ఞానాన్ని ప్రసరింప జేసి ఆయా పదార్థముల జ్ఞానానుభవాలను పొందుచునే ఉన్నాడు. అనగా... ప్రతి వ్యష్టిజీవుడు ఏ ఏ జగద్విశేషాలు అనుభవిస్తున్నాడో అట్టి జగద్విశేషమంతా నిజమనో వృత్త్యానుసారమైన జ్ఞాన విశేషమే గాని మరొకరెవరో అద్దానికి కారణం కాదు. ఈ జీవుని జగత్ మనో వ్యాపారమంతా తన స్వరూపము నుండి స్వయంకల్పితంగా ప్రవహిస్తున్న జగత్‌లహరి మాత్రమే !

ఒక క్రిమి నుండి రుద్రుని వరకు జగదనుభవమంతా ఈ ప్రకారంగానే స్వస్వరూపమునుండి జగదాకారభ్రమరూపంగా ఉదయించటం జరుగుతోందని గ్రహించు. ఇదియే సృష్టి.

ఒక బీజంలో మహావృక్షం సంస్కారరూపంలో దాగి ఉండే విధంగా, ఒక అణువులో కూడా సముద్ర-పర్వతాది వస్తు పరంపరలచే విస్తారమైన అనేక జగత్తులు ఉంటున్నాయి. ప్రవర్తిస్తున్నాయి కూడా!

అయితే "ఒక పరమాణువునందు కూడా అనంతాత్మ కలదు" - అనే విషయం జ్ఞానం చేతనే తెలియవస్తోంది గాని, అజ్ఞానం చేత కాదు. ఒక కీటకం - దోమ మొదలుగా రుద్రుని వరకు గల ప్రత్యగాత్మ యందు (ప్రతి ప్రత్యేక ఆత్మయందు) విరాట్ సృష్టి ఉండియే ఉన్నది.

ఈ విధంగా "వ్యష్టి - సమష్టి ఉభయం ఒక్కటే" అనే ఒక మహోత్తరమైన సిద్ధాంతం మనకు ఇక్కడ సిద్ధిస్తోందని గమనించు. విరాడాత్మ యందు ఏ విధంగా ఈ సమస్తమైన జగత్తు యొక్క విస్తారము సిద్ధిస్తోందో, అట్లాగే అణుమాత్రమైన ఒక దోమ జీవునియందు కూడా విరాడాత్మ సంబంధమైన విస్తార జగత్తు సంభవించియే ఉంటోంది.

ప్రతిజీవుని విషయంలో ఈ సిద్ధాంతం వర్తిస్తున్నదని గ్రహించబడు గాక! ఇక ఆత్మ ఎటువంటిది?... అది పరమార్థమున స్థూలం కాదు, సూక్ష్మం కాదు, పరిచ్ఛిన్నమూ కాదు. అయితే అది తన యొక్క భ్రాంతి విభాగంచే ఎచ్చట ఎట్లు విస్తరించుచున్నదో, అచ్చట అట్లే శీఘ్రంగా అనుభవించబడుచున్నది. ఆత్మచేతనే ఆత్మ అనుభవించబడుతోంది సుమా!

లేక... చంద్రుని నుండి మనస్సు, మనస్సు నుండి చంద్రుడు... ఉత్పన్నమగుచున్నాయి చూచావా? (చంద్రమా మనసోజాతో); అట్లాగే ఆత్మయందు జీవుని నుండి ఆత్మయే అగు దృశ్యము కల్పితచమత్కారంచే ఉత్పన్నమౌతోంది. జలం, ద్రవత్వం... ఈ రెండూ వేరు వేరా?

శ్రీరాముడు : కావు.

శ్రీవసిష్ఠ మహర్షి : అట్లాగే సమష్టి – వ్యష్టి అనబడే రెండూ కూడా ఒకే 'సత్త' కలిగి ఉన్నాయి.

శ్రీరాముడు : "ఈ జీవుడు పరమాత్మ యొక్క ప్రతిబింబం. కనుక పరమాత్మయే జీవసంవిత్తు యొక్క కారణం. పరమాత్మ యొక్క కార్యం ఈ జీవుడు"... అను ఒకానొక కార్య–కారణ సిద్ధాంతం కొందరిచే ప్రతిపాదించబడుచున్నది కదా! అట్టి "పరమాత్మ కార్య – జీవ కారణ" సిద్ధాంతము గురించి మీ అభిప్రాయం వినాలని ఉన్నది.

శ్రీవసిష్ఠ మహర్షి :

శుక్రసారం విదుర్జీవం ప్రాలేయ కణ సంనిభమ్
ఆనన్దో అచలసందోహస్తత ఏవ ప్రవర్తతే॥
తం చేతతి తదాభాసం పూర్ణమాత్మస్థమాత్మనా
తత్ర తన్మయతాం ధత్తే తేన తన్మయరూపిణీ॥

"మంచుకణమును పోలినదగు వీర్యమే జీవునియొక్క సారం"... అని అంటూ ఉంటారు. మాతాపితరుల సమాగమ కాలమున చిత్తైకాగ్రతచే 'భోగాకారవృత్తి' యందు నిశ్చలమగు బ్రహ్మం యొక్క ప్రతిబింబం పడుచున్నది. అట్టి వీర్యమునుండి ఉపహితుడైన జీవుని నుండి అభాసరూపమగు 'ఆనందాతిశయం' ప్రవర్తిస్తోంది. అప్పుడు ఆ వీర్యోపహితమైన జీవచైతన్యం తనయందున్న వీర్య స్వభావంచే బ్రహ్మం యొక్క అభాసరూపమైన ఆనందాన్ని అనుభవిస్తోంది. ఇక ఆపై "ఈ నా అనుభవమైన వీర్య రూపమే ఆనందం, నేను ఇద్దాని చేత ప్రియతముడనగుచున్నాను" అని అనుకుంటూ, క్రమంగా వీర్యోపహితమైన స్థితిచే తాదాత్మ్యం పొందుచూ తన్మయమై వర్తిస్తోంది.

...ఇంకా ఆ తరువాత ఆ జీవ సంవిత్తు (లేక) గర్భస్థమైన వీర్యోపహిత చైతన్యం తదందర్గతమైన దేహరూపాన్ని 'తదాత్మ్యం' అనే చమత్కారంచే పొందుతోంది.

కాబట్టి... అట్టి 'దేహోత్పత్తి' అనే చమత్కారమునందు విరాట్టు–వ్యష్టి, కారణము–కార్యము అనునవి ఏమీ లేవు.

శ్రీరాముడు : ఈ సమష్టి – వ్యష్టి దేహసృష్టికంతటికి "పరబ్రహ్మం యొక్క స్వభావమే కారణం. తదితరమైనది కార్యం"... అని నిర్ణయించటం యుక్తియుక్తమేనా? కాదా?

శ్రీవసిష్ఠ మహర్షి : అట్లా యుక్తి యుక్తం కాదు. ఎందుకంటావేమో? శుద్ధ బ్రహ్మం నందు 'స్వ' శబ్దం వాచకం కానేరదు. అనగా శుద్ధబ్రహ్మానికి "స్వ–పర" శబ్దమునకు సంబంధించిన వాచకాలను ఆపాదించలేం, ప్రతిపాదించలేం. 'స్వ – పర' అను విభేదం బ్రహ్మమునకు అనువర్తించలేనప్పుడు

ఇక 'వ్యష్టి – సమష్టి' అను వ్యవహారం ఎట్లా ఒనగూడుతాయి? కనుక ఆ స్వ – పర మొదలైనవన్నిటికీ బ్రహ్మం కారణమని గాని, కార్యమని గాని ప్రతిపాదించటం భ్రమాత్మకమైన దర్శనపటాటోపం మాత్రమే. బ్రహ్మమునందు 1.ప్రతియోగి, 2.వ్యవచ్ఛేదము, 3.విరోధి – అనే విశేషములే లేవు. అట్లాగే బ్రహ్మమునందు 'స్వభావం' అనబడే బాహ్య–ఆంతరిక ఆవరణమేదీ లేదు. ఉంటే 'ఏకోసత్' అను ప్రమాణవాక్యం సిద్ధించదు కదా!

శ్రీరాముడు : మహర్షీ! "ఈ జీవుడు అనగా 'స్వ', 'స్వభావం' అను రెండింటి సంయోగం"... అనే ఒకానొక సిద్ధాంతం గురించి మీ అభిప్రాయం చెప్పమని నా ప్రార్థన.

శ్రీవసిష్ఠ మహర్షి : ఇప్పుడు నేను మరొక ప్రశ్నను ప్రతిపాదిస్తున్నాను.

జీవుడు అనగా... 'స్వ' అనబడు వాడా? లేక, దేహ, గుణములా? (అంటే స్వభావమా?) లేక రెండూ కలసియా?

'స్వ'యే ఉపహితుడగు జీవుడని మనం అనుకుంటే, ఇక స్వభావం అనేది ఆతనిలో ఒక విభాగమనటానికి కుదరదు. ఆతనికి స్వభావం బాహ్యమైనదీ కాదు. వాయువు యొక్క బాహ్య–అభ్యంతరాలలో వాయువే ఉన్నట్లు, జీవుని బాహ్య–అభ్యంతరాలలో స్వస్వరూపుడైన జీవుడే ఏర్పడి ఉన్నాడు. కనుక జీవత్వం – జీవుడు అనునది స్వతహాగా ఒక్కటే గాని వేరు వేరైనవి కాదు.

అట్టి ఈ జీవుడు ప్రాణం, ఇంద్రియాలు మొదలైన జడవస్తువులతో, "ఇవియే నేను. వీటిచే నేను పరిమితుడను"... అను రూపంతో తాదాత్మ్యం చెందుచున్నాడు. తద్వారా సంకుచితుడై, దృశ్య–విషయ–వస్తు పరాయణుడై జన్మాంధుని వలె ఉంటున్నాడు. అవిద్యాంశ పట్ల ధ్యాసచే ఆ అవిద్యా దశలో తన నిజమార్గమును (స్వస్వరూపమగు బ్రహ్మమును) గాంచటమే లేదు. తన నిశ్చల విభాగాన్ని ఏమరచి, చంచల విభాగాన్ని మాత్రమే నిరంతరం దర్శిస్తున్నాడు. 'చలనశక్తి'చే వాయువు కప్పబడినట్లు ఈ జీవుడు (నిశ్చల స్వరూపుడై ఉండి కూడా) జగదాకారంగా విజృంభిస్తున్న మాయాశక్తిచే కప్పబడి ఉంటున్నాడు. తన యొక్క ఏకత్వ రూపమునందు "ద్రష్ట – దృశ్యం" అను విభేదం గల ద్వైతరూపం కల్పన చేసుకుంటున్నాడు. అట్టి చంచలత్వమును అధిరోహించి తన శుద్ధ, సుస్థిరరూపమును గమనించలేకపోతున్నాడు.

ఏదైతే మిథ్యారూపమై, దృశ్యాత్మకమై, వాస్తవానికి అసత్తై ఉన్నదో... అదే అజ్ఞానం! జ్ఞానంచే అట్టి అజ్ఞాన మహాగ్రంధి భేదనమే మోక్షం. "ద్రష్టత్వమంతటి కంటే మున్ముందుగా ఉన్న నా స్వరూపం సర్వదా యథాతథంగా ఉంది"... అనే అనుభవమే 'మోక్షం' అను పరిభాషగా చెప్పబడుతోంది.

అందుచేత, ఓ రామచంద్రా! నీవు అజ్ఞానమేఘం తొలగినప్పటి చిత్ప్రకాశమాత్రుడవై ఉండు. అసలీ అహంకారమనబడేది లేనే లేదని గ్రహించు. మూర్త – అమూర్త వివర్జితమై, అజ్ఞానశూన్యమై, నిత్యోదితమైనట్టి చైతన్యఘనమును పొందినవాడవై, పరిపూర్ణుడవై, ఆనందపూర్వకంగా ప్రకాశిస్తావు గాక!

❖❖❖

19. జ్ఞాని - జ్ఞానబంధువు

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఈ మనుజుడు జ్ఞానబంధువైతే సరిపోదు. జ్ఞానియే కావాలి. ఎందుకంటే, ఒక్కోసారి జ్ఞానబంధువు కంటే అజ్ఞానియే మెఱుగేమో నని కూడా అనిపించవచ్చు.

శ్రీ రాముడు :

కిముచ్యతే జ్ఞానబంధుః? జ్ఞానీచైవ కి ముచ్యతే?
కిం ఫలం జ్ఞానబంధుత్వే? జ్ఞానిత్వేఽ పి చ కిం ఫలం?

మునీంద్రా! జ్ఞానబంధువు అంటే ఎవరు? జ్ఞాని అనగా ఎవరు? ఉభయముల ప్రయోజనాలు ఎట్లా ఉంటాయి?

శ్రీవసిష్ఠ మహర్షి :

వ్యాచష్టే యః పఠతి చ శాస్త్రం భోగాయ శిల్పివత్ ।
యతతే నతు అనుష్ఠానే "జ్ఞానబంధుః" స ఉచ్యతే॥

శిల్పి శిల్పమును చెక్కుతాడు. ఉత్తమ భక్తుడు (లేక) ఉపాసకుడు ఆ శిల్పంలో ఇష్టదైవం యొక్క స్ఫూర్తిని దర్శించి తరించగలుగుతాడు. శిల్పి "ముక్కు-నోరు బాగున్నాయా? లేదా?"... అని మాత్రమే గమనించగలడు. అట్లాగే ఎవరైతే శాస్త్రమును భోగం కొరకో (లేక) చిలకపలుకులు పలుకుట కొరకు మాత్రమే పఠిస్తాడో... అంతేగాని మనస్సుతో అనుష్ఠించ ప్రయత్నించడో అట్టివాడు 'జ్ఞాన బంధువు' అని పిలువబడతాడు.

అనగా, ఎవనికి శాస్త్రాభ్యాసం చేత లభించినట్టి శబ్దబోధ ఆతని దైనందిన జీవితావగాహనగా వ్యవహారాలలో ప్రస్ఫుటం కాదో, వైరాగ్యం హృదయస్థం కాదో, ఎవడు తత్త్వబోధను కథలుగా మాత్రమే వల్లిస్తాడో... ఆతడు జ్ఞానబంధువు మాత్రమే! ఎవడు శాస్త్రపఠనాన్ని కేవలం భుక్తి కొరకై వల్లిస్తాడో ఆతడూ జ్ఞానబంధువు. 'అగ్నిహోత్రం' మొదలైన ప్రవృత్తి రూపధర్మాలలో నిష్కాముడై ప్రవర్తించక, కేవలం డాంబికంగా నిర్వర్తిస్తూ ఆయా ప్రవృత్తి ధర్మాలను ఆత్మజ్ఞానం వైపుగాను, మనస్సు యొక్క పవిత్రత కొఱకై మలచుకోకపోతే ఆతడు జ్ఞానబంధువౌతాడే గాని, జ్ఞాని కాదు.

జ్ఞానం, జ్ఞానాభాస - ఆత్మ జ్ఞానాన్ని మాత్రమే 'జ్ఞానం' అని అంటారు. ఇక తక్కిన వివరణ-విశ్లేషణ-పదార్థ సంబంధ జ్ఞానమంటావా? అవన్నీ కూడా 'జగత్తు-జీవుడు' ఈ రెండిటికీ అధిష్ఠాన మైనట్టి బ్రహ్మం గురించి బోధించజాలవు. అందుచేత అవన్నీ జ్ఞానాభాసలు మాత్రమే!

'ఆత్మజ్ఞానం' గురించి యత్నించకుండా తదితర సాధనా విశేషాలను ఆశ్రయించి స్వర్గాది ఫలప్రాప్తికై ప్రయత్నించేవారిని 'అల్పశుభ జ్ఞానబంధువులు'... అని పిలుస్తూ ఉంటారు.

1.బాహ్య-అభ్యంతర దృశ్య రూపజ్ఞానం, 2.వాటి వృత్తులకు కారణమైన ప్రమాత, 3.ప్రమాతకు తెలియవచ్చే శబ్ద-స్పర్శ-రూప-రస-గంధాలు, 4.వాటి అనుభవవిశేష పరంపరలు.

...భాషాపూర్వకంగా ఇవన్నీ కూడా జ్ఞానమే. అయితే ఇవి అసలైన జ్ఞానం కాదు సుమా! ముముక్షువు అయినవాడు నిరతిశయానంద స్వరూపమగు బ్రహ్మముతోటి ఏకత్వం సంపాదించు కునే వరకు ఆగకూడదు. తృప్తి పొందరాదు. ఓ ప్రియ సభికులారా! మీరంతా జ్ఞానబంధువులై రోగరూపాలగు ఈ సంసార భోగాలందు రమిస్తూ కాలమును, అవకాశములను అల్ప వినియోగం చేయకుండెదరు గాక!

అత్రాహారార్థం కర్మకుర్యాత్ అనింద్యమ్, కుర్యాత్ ఆహారం ప్రాణసంధారణార్థమ్ ।
ప్రాణాః సంధార్యాత్ తత్త్వజిజ్ఞాసనార్థం, తత్త్వం జిజ్ఞాస్యం యేన భూయో నదుఃఖమ్ ॥

ఈ 'మానవజన్మ' అనే అవకాశం వచ్చినందుకు ముముక్షువు చేయవలసినదేమిటి?

1. సహజీవులను బాధించనట్టి, సానుకూలమైన అనింద్యమైన కర్మలు మాత్రమే నిర్వర్తించాలి.
2. అట్టి కర్మలు కూడా ఆహారం సంపాదించుకోవటానికి మాత్రమే పరిమితం చేయబడాలి.
3. మరి ఆహారం ఎందుకు? జిహ్వాచాపల్యము కొరకై కాకూడదు. కేవలం ఈ ప్రాణాలు నిలబెట్టు కోవాలి కాబట్టి అంతవరకే ఆహార సముపార్జన ఉద్దేశించబడాలి.
4. ఆపై ప్రాణాలు నిలబెట్టుకోవటం అనేది తత్త్వజిజ్ఞాస కొఱకే అయి ఉండాలి.
5. ఇక తత్త్వజ్ఞానం మరల దుఃఖరహిత స్థితి సంపాదించుకోవటానికి సద్వినియోగపడాలి.

...ఇట్లు జీవుడు జనన మరణ చక్రం నుండి తరించటానికే సర్వదా ప్రయత్నించటం ఉచితం.

❖❖❖

20. జ్ఞానియొక్క నిర్వచనం

శ్రీరామచంద్రుడు : స్వామీ! 'జ్ఞానబంధువు' గురించి, 'జ్ఞానాభాస' గురించి విశదపరిచారు. సాధకులగు, మేమంతా కృతజ్ఞులం. అట్లాగే జ్ఞాని – జ్ఞాన దర్శనం గురించి మరికొన్ని విశేషాలు విశదపరచవలసినదిగా నా ప్రార్థన.

శ్రీవసిష్ఠ మహర్షి : జ్ఞాని యొక్క నిర్వచనం విను.

ఆతడు తనయొక్క జ్ఞానప్రవృద్ధముచే జ్ఞేయమగు ఆత్మ గురించి నిష్ఠ పెంపొందించుకుంటూ ఉంటాడు. అట్టి చిన్మాత్ర బ్రహ్మమునందు నిష్ఠచే క్రమంగా శబ్దస్పర్శాది విషయసమూహమును, కర్మ ఫలాలను, "ఇవన్నీ బయటగా లేవు. నా చిత్తముయొక్క లక్షణవిశేషమే ఇదంతా"... అని గ్రహిస్తూ అవన్నీ అసత్యాలుగా గమనిస్తూ ఉంటాడు. ఈ కళ్ళు మొదలైన ఇంద్రియాలకు తారసపడే దృశ్యాదులను ప్రక్కకుపెట్టి, అట్టి కళ్ళలోను, తదితర ఇంద్రియములలోను, అంతఃకరణంలోను ఏ సాక్షితత్త్వమైతే ప్రత్యక్షమై ఉంటోందో... అట్టి చిత్తత్త్వమును గుర్తిస్తాడు. అట్టి సాక్షిగా ఉన్నట్టి చిన్మాత్రమగు పరమాత్మను బాగుగా ఎఱిగినవాడై ఈ దృశ్యమును అంతఃకరణం యొక్క వాసనా మాత్రంగా కూడా శేషించియే లేనట్లు గాంచుచూ ఉంటాడు.

ఇప్పుడు 'జ్ఞాని' యొక్క నిర్వచనం విను–

అన్తః శీతలతేహాసు ప్రాజ్ఞైర్యస్యావలోక్యతే ।
అకృత్రిమైక శాన్తస్య స జ్ఞానీత్యభిధియతే ॥

ప్రతి జీవుడు 'ఆత్మ' అను ఏకైక లాభమును సర్వదా అవధరించియే ఉన్నాడు. ఎవనియందైతే అట్టి ఆత్మైక్య లాభముచే సంతుష్టి, శాంతము, వ్యవహారములందు అంతఃకరణ శీతలత్వము మనకు కనిపిస్తాయో, అట్టివాడు, 'జ్ఞాని' అని మనం గుర్తించవచ్చు. ఏ సమాచార ప్రసాదితమైన అవగాహన చేత అజ్ఞాన మూలము తొలగుచుండగా పునర్జన్మత్వము (నాకు జన్మ-మృత్యువులు ఉన్నాయి - అనే భ్రమ) సమూలంగా కడిగివేయబడుతుందో అట్టి బోధయే జ్ఞానము. ఇక తక్కిన శబ్దజ్ఞాన చాతుర్యము శిల్పియొక్క శిల్పకళలాగా వస్త్రభోజనాదులు కొరకే గాని అనుభవము కొరకై కాదు.

పండితుడు :

ప్రవాహపతితే కార్యే కామసంకల్పవర్జితః ।
తిష్ఠత్యాకాశహృదయో యః స పండిత ఉచ్యతే ॥

ఎవడైతే యథాప్రాప్తములైనట్టి ఆయా కార్యాలలో కామసంకల్పవర్జితుడై నిర్మలాకాశమువలె హృదయము కలిగి ఉన్న వాడై ప్రవర్తిస్తూ ఉంటాడో... అట్టి వానిని 'పండితుడు' అని పిలుస్తారు.

ఓ రామచంద్రా! ఈ జగత్తు, అహంకారం మొదలైనవి లేవు. కాని ఉన్నట్లు అనిపిస్తున్నాయి. ఎందుచేత? దానికి కారణం లేదు. అభిలాష, అభిరుచులకు కారణం లేనట్లే, జగత్, అహంకారాలకు కూడా కారణం లేదు. అకారణంగా అనిపించేవన్నీ అకారణాలే. కారణం లేకయే ఉత్పన్నమైనాయి. కాబట్టి అవి వాస్తవానికి ఉత్పన్నము కానివే అగుచున్నాయి.

శ్రీరాముడు : "ఉత్పత్తియే కాలేదు. కానీ ఉన్నట్లుగా అనిపిస్తోంది" అను పరస్పర వ్యతిరిక్త వాక్యం ఎట్లా యుక్తియుక్తం స్వామీ?

శ్రీవసిష్ఠ మహర్షి : ఈ ప్రపంచంలో వాస్తవానికి లేకపోయినా కూడా ఉన్నట్లు అనిపించే అనేక దృష్టాంతాలు ఉన్నాయి.

1. కుందేటి కొమ్ము - పరిగెత్తే కుందేలుకి (చెవులు రిక్కి ఉండటం చేత) కొమ్ములు ఉన్నట్లు కనిపిస్తుండటం.

2. మృగతృష్ణాజలం - మృగాలు దాహంచే అటూ ఇటూ వెతుకుచుండగా, ఎండ యొక్క వాయుతరంగ సంబంధమైన క్రీనీడలు సరోవర జలంలాగా అనిపించటంచే ఆ మృగాలు జలంగా భ్రమించి పరుగులు తీయటం.

కుందేటికి కొమ్ము ఎందుకు కనిపించింది? భ్రమచేతనే కదా! మృగతృష్ణలో జలం ఎందుకు కనిపించింది? భ్రమ చేతనే! భ్రమ చేత అనిపించేవన్నీ అవాస్తవాలే కాబట్టి అవి అకారణాలే గాని, సకారణాలు కావు. లేదా, అవిచారణతో ఉన్న అజ్ఞానావేశమే అందుకు కారణమని అనక తప్పదు.

అట్టివే ఈ సోదర-మిత్ర-శత్రు-తదితర సర్వ సంబంధములు కూడా! అంతేకాదు. ఈ సర్వ జగత్తు అట్టి జగత్తులో జన్మాదిగా సంచరించే ఈ దేహము కూడా భ్రమయే కాబట్టి అవాస్తవము,

అకారణం కూడా! "కుందేటికి కొమ్ము ఎందుకు కనిపించింది?"... అనే ప్రశ్నకు "అసత్తైన ఈ దేహ-పుత్ర-తదితర దృశ్యవ్యవహారం సత్తు వలె ఎందుకున్నాయి" అనే ప్రశ్నకు సమాధానం ఎంత వెతికి ఏం ప్రయోజనం?... సత్తు సత్తుగా, అసత్తు అసత్తుగా గ్రహించటమే ఇక్కడ సముపార్జించు కోవాలి. అట్లా కాకుండా "ఈ దృశ్య సంబంధం ఎప్పటి నుండి ఎందుకు ఎట్లా ప్రాప్తించింది?"... అనే విషయంగా కార్య - కారణాలు వెతుకుతూ పోవటం "గొడ్రాలి యొక్క కుమారుని, మనుమని భుజాలపై కూర్చుని ఊరంతా చుట్టి రావడం ఎట్లా?" అనే వాక్యంలాగా నిరర్థకం.

ఆజ్ఞానమే అసదనుభవమునకు కారణం! అసత్తైనవి, అసద్రూపమైనవి అగు విశేషములగు పదార్థములకు కారణం అజ్ఞానమే అయి ఉన్నది. అజ్ఞానమునకు రూపమేమిటి? జ్ఞానం యొక్క అప్రకాశమే, (లేక) ఏమరుపే!

అజ్ఞానము యొక్క ఆశ్రయముచే జ్ఞానము ఆవరించబడి ఉంటోంది. జ్ఞానము యొక్క అప్రకాశమే అజ్ఞానం. జ్ఞానము యొక్క ప్రకాశముచే అజ్ఞానము తొలగుతోంది.

❖

జీవుడు ⟶ పరమాత్మ

నాటకంలో కనిపిస్తున్న పాత్ర - పాత్రధారి ఒక్కరే కదా!... అదేవిధంగా వాస్తవానికి ఈ జీవాత్మయే పరమాత్మ. అట్లాగే ఆ పరమాత్మయే ఈ జీవాత్మ.

అయితే, ఈ జీవుడు (జీవాత్మ) "నేనే పరమాత్మను"... అనే పరమసత్యమును సంతరించు కోవటం, (లేక) అనుభవైక వేద్యం చేసుకోవటం ఎట్లా?... అనే ప్రశ్నకు సమాధానమే ఈ మన సంవాదసారము.

❖❖❖

21. జీవాత్మయే పరమాత్మ!

శ్రీరాముడు : మహర్షీ! "నేను జీవాత్మను" అను భావమునందు, అటు తరువాత భ్రమపూర్వక - కల్పిత అనుభవపరంపరలందు తననుతానే ఏర్పరచుకొనియున్న ఈ జీవుడు తనయొక్క సత్స్వరూపమగు పరమాత్మత్త్వము సంతరించుకొనేది ఎట్లా?

శ్రీవసిష్ఠ మహర్షి :

పరమాత్మాయతే జీవో బుధ్యమానస్త్వచేతనమ్ ।
చేతనం బుధ్యమానస్తు జీవఏవావ తిష్ఠతే॥

"ఈ అహంకారము - దేహము అనునవి స్వయంప్రతిపత్తిగలవి కావు. చేతనములు కావు. ఇవి జడాలు. వీటిని ప్రవర్తింపజేసే (వీటికి వేరై ఉన్న) ఆత్మ మాత్రమే చేతనం"... అని ఏ జీవుడు గ్రహిస్తున్నాడో, ఆ జీవుడు పరమాత్మయే అగుచున్నాడు. అట్లా కాకుండా ఎవరైతే ఈ దేహ- అహంకారాలను చేతనాలుగా ఆత్మగా భావన చేస్తున్నవాడో, అట్టివాడు జీవభావ పరిమితుడై

ఉంటున్నాడు. హేమంత ఋతువులో మామిడి వృక్షం తనంతట తానే చిగురుస్తుంది చూచావా? అట్లాగే "ఈ దేహం – అహంకారం – మనస్సు అనేవన్నీ స్వయంగా చూస్తే అచేతనాలు. వీటిని ప్రవర్తింపజేసే నేను చేతన స్వరూపుడను"... అని గ్రహించిన మరుక్షణం ఆ జీవుడు పరమాత్మ అయి ప్రకాశిస్తాడు.

అనగా, అహంకారం, దేహం మొదలైనవాటిని గాంచుచున్నప్పుడు "ఇవి చేతనాలు" అని అనుకుంటూ ఉండటం చేత ఈ జీవుడు జీవరూపంగానే ఉండిపోతున్నాడు. తత్ఫలితంగా అనేక యోనులలో ప్రవేశిస్తూ శిథిలీభూతుడగుచున్నాడు.

అందుచేత ఈ జీవుడు బ్రాహ్మీదృష్టిని అలవరచుకోవాలి. "కదిలే ఈ దేహం, ఈ అహంకారం చేతనం కాదు. వీటిని కదిలించే ఆత్మయే చేతనం. అట్టి అఖండ – అద్వితీయ – నిత్యప్రకాశక చైతన్యమే నేను"... అను జ్ఞానమే ఆత్మజ్ఞానం.

యే పరాం దృష్టిమ్ ఆయాతా విద్ధి తేషామ్ అపామివ ।
ఆరూపాలోకమననం స్పన్దమస్పన్దనం సదా॥

ఎవరైతే అట్టి బ్రాహ్మీదృష్టిని సంపాదించుకుంటున్నారో... అట్టివారి రూప–సంకల్ప–క్రియాదులన్నీ అరూప–అసంకల్ప–అక్రియలు గానే ఉంటాయి. అభిమానరాహిత్యం చేత అవన్నీ ప్రవర్తించనివిగానే అవుతాయి. జలం తరంగంగా కనబడినంతమాత్రంచేత ఆ జలం తన స్వరూపం కోల్పోతుందా? లేదుకదా! దేహం, సంకల్పం మొదలైనవి ఆత్మీదృష్టిని మరల్చజాలవు. దృశ్యమును అధిగమించి ఆ దృశ్యమునకు కేవల సాక్షియగు 'దృక్' రూపాన్ని సంతరించుకొని ఉన్నవారు బ్రాహ్మీదృష్టిని సంపాదించుకున్నవారు అగుచున్నారు. అట్టి బ్రాహ్మీదృష్టి (కేవల దృక్స్థితి) సంతరించు కున్నవారు ఈ దృశ్యాన్ని చూస్తున్నా, లేక ఇందులో పాల్గొనుచున్నా కూడా ఇక్కడ వారికి ద్వైతదర్శనం ఉండదు. వారికి ఇక్కడ సర్వదా అంతటా బ్రహ్మమే దర్శనమౌతూ ఉంటుంది. వారి సమస్త క్రియలు కర్తృత్వ అభిమాన రహితాలై ఉంటాయి. ప్రవాహపతితంగా, ప్రారబ్ధానుసారం ఏదేది నిర్వర్తించ వలసి వచ్చుచున్నప్పటికీ వారు దృశ్యరహితులుగానే ఉండగలరు. అట్టి జ్ఞానుల సమస్త క్రియలు అక్రియలే అగుచున్నాయి. వారు బంధనం త్రెంచుకొనిన ఎద్దులాగా రూపాదులచే నిబద్ధులు కారు. వాయువు వృక్షంపై, ఆకులపై, పూలపై, పిందెలపై ప్రసరిస్తూ తాను యథాతథంగానే ఉంటున్నట్లు... ఆత్మీదృష్టి సముపార్జితులు ఈ దృశ్యంలో ఉంటూకూడా ఇక్కడి రూప–నామ–క్రియాదులచే స్పర్శించబడరు. నిబద్ధితులు కారు.

గంగానది ఒడ్డున నివసించేవారు ఎక్కడో కూపజలాన్ని ప్రశంసించరు కదా! అట్లాగే బ్రాహ్మీ దృష్టిని పొందినవారు ఇక్కడి సంసార విశేషాలను ప్రశంసించరు, నిరశించరు. ఓ రామా! వాసనలచే బద్ధులైన మూఢులే కర్మలను ప్రశంసిస్తూ తత్త్వజ్ఞానం యొక్క అభావంచే ఆ కర్మల ఫలాలను పొందుచున్నారు. ఆత్మదర్శులు కర్మలను నిర్వర్తించినా ఆ కర్మల యొక్క ఫలాలతో వారికి ఏ ప్రయోజనమూ కనిపించదు. కనుక వారు కర్మ ఫలాలను పొందనివారే అగుచున్నారు.

ఓ జనులారా! ఎక్కడో ఆకాశంలో ఎగిరే గ్రద్ద దృష్టి అంతా నేలపై కనిపించే మాంసపు ముక్కలపై ఉన్నట్లు ఈ ఇంద్రియములు జగత్ విషయములవైపుగానే ఆకర్షితమై ఉంటున్నాయి. కనుక జాగరూకత వహించాలి సుమా! ఎందుకంటే అట్టి ఇంద్రియ విషయసేవనాభ్యాసముచేతనే ఈ జీవుడు తన శివత్వము గాంచలేకపోతున్నాడు. కాబట్టి ఈ ఇంద్రియములను ఉపయోగించే టప్పుడు బుద్ధిమంతుడైనవాడు "కర్మలు-ప్రయోజనాలు" అనే దృష్టి నుండి మరల్చి వీటిని ఉపయోగి స్తున్న మనస్సును ఆత్మార్పణ చేయాలి సుమా! ఆత్మానుభవామృతం గ్రోలినవాడికి ఈ ఇంద్రియ విషయాలు ఆకర్షణ విషయాలై ఉండజాలవు.

శ్రీరాముడు : ఈ జీవుడు ఎదురుగా ఉన్న సృష్టిని త్యజించి ఆత్మను ఆశ్రయించాలి. కానీ అది సులభ సాధ్యమగుట లేదు.

శ్రీవసిష్ఠమహర్షి : ఆకారం లేని సువర్ణం ఉంటుందా? ముద్దగానో, ఆభరణంగానో... ఏదో ఆకారం కలిగియే ఉంటుంది కదా! అట్లాగే బ్రహ్మం-సృష్టి అనునవి స్వభావసిద్ధం, అయితే ఈ సృష్టి పట్ల జ్ఞాని యొక్క దృష్టి, అజ్ఞాని యొక్క దృష్టి వేరు వేరుగా ఉంటున్నాయి. వీటినే 1.ఆత్మదృష్టి, 2. సంసారదృష్టి అనే పేర్లతో చెప్పుకుంటున్నాం. దగ్ధమైన వస్త్రం యొక్క ఆకారం, అదగ్ధమైన వస్త్రం యొక్క ఆకారం ఒకే తీరుగా ఉన్నా కూడా ఆ రెండింటికి సంబంధమెక్కడిది? జ్ఞానికి ఈ సృష్టి కేవల శివరూపం గానే అనుభవమౌతోంది. ఇక అజ్ఞానికో... ఇదే సృష్టి అనేక సంసార- జన్మ - కర్మ - వ్యవహారభరితంగా అత్యంత భయంకరమై తోచుచున్నది. కనుక ఈ జీవుడు పవిత్రమైన దృష్టిని అలవరచుకోవాలే గాని, ఈ సృష్టిని వదిలి ఎక్కడికో పరుగులు తీయాలని మా బోధసారం కాదు. ఈ సృష్టి కల్పాంతంలో బ్రహ్మం యొక్క మాయా విభాగమునందు ఏ విధంగా నిర్విభాగమై, నిరాభాసమై జగత్ శబ్దార్థరహితమై ఉంటోందో... అట్లాగే వివేకవంతుని అవగాహనలో ఈ సృష్టి ఈ వర్తమానంలోనే నిర్విభాగమై, నిరాభాసమై, జగత్‌శబ్దార్థరహితమై అగుపిస్తోంది.

ఆకాశంలో మేఘాలు ఉన్నాయి. అవి చమత్కారంగా 'కొండలు-వృక్షం-గోపురం-గుహ' వంటి ఆకారాలు కనిపిస్తాయి. మరల ఆ మేఘాలు అటూ ఇటూ కదులుచూ ఉండగా ఆ కనబడే దృశ్యవిశేషచమత్కారం మటుమాయమౌతూ ఉంటుంది. గుహలా కనిపించే మేఘపంక్తి గుహను స్ఫురింపజేస్తోంది. మరల ఆ గుహ ఏమౌతోంది? మేఘాల కదలికచే మటుమాయ మవుతోంది. అట్లాగే అనేక విరుద్ధ ధర్మములచే కనిపించే ఈ జగత్తు మరల ఈశ్వరుని యందు విలీనమౌతోంది.

ఈ జగత్తు ఉపాధి. ఈశ్వరుడు ఔపాధికుడు. భావనయే జగత్తు. అజ్ఞానం చేత ఒకరీతిగా తోచే ఈ జగత్తు సుజ్ఞానం చేత శివంగా తెలియవస్తోంది. వస్తు దృష్టితో మేఘాలను చూస్తున్నప్పుడు కొండ-గోపురం మొదలైనవి కనిపించవచ్చుగాక! అంతా మేఘములే కదా! జలంలో అనేక తరంగాలు కనిపిస్తాయి. తరంగాలు శాంతించినప్పుడు ఆ శాంతజలంలోనే తరంగాలన్నీ లయిస్తు న్నాయి కదా! అసలు జలానికి - తరంగానికి భేదమెక్కడున్నది? తరంగానికి జలమునకు వేరైన ఉనికి (స్థితిత్వం-సత్త) ఉన్నదా?

బ్రహ్మానికి– బ్రహ్మం యొక్క చిదాభాసులగు ఈ జీవులకు బేధమెక్కడిది? ...లేదు. బ్రహ్మంలో కనిపించే భేదం అనిర్వచనీయం, ఆత్మదృష్టిచే అంతా బ్రహ్మంగా అనుభవం కాగలదు. అనగా "ఆత్మ స్వరూపుడగు ఈ ద్రష్ట తనయందు దర్శిస్తున్న భావతరంగాలే ఈ జగత్తు" గా వివేక దృష్టి కలవాడు గ్రహిస్తున్నాడు.

మనకు ఎదురుగా ఈ దిక్కులు ఉన్నాయి కదా! "ఇదిగో, ఇది తూర్పు, అది పడమర. అటు ఉత్తరం, ఇటు ఊర్ధ్వం" ...ఈ విధంగా దశదిశలు కనిపిస్తున్నాయి. అయితే 'ఆకాశం' అనే దానిలో దిక్కులు అనేవి ఉన్నాయా? "సూర్యోదయం–మనం నిలుచున్న స్థానం" – ఈ రెండిటిచేత మాత్రమే 'దిక్కులు' అనునవి మనం చెప్పుకుంటున్నాం కదా! కనుక... 1. ఆకాశంలో దిక్కులు లేని మాట నిజమే! 2.మనకు ఇది తూర్పు, అది పడమర అనేది నిజమే!

అట్లాగే బ్రహ్మము అకారణం. అది మరిదేనికి కారణం కాదు. కాని అన్నిటికి అధిష్ఠానం అదే! అట్లాగే ఈ జీవుడు – జగత్తు మొదలైనవన్నీ బ్రహ్మము కాక మరింకేమీ కాదు.

అనగా బ్రహ్మములోనే ఇవన్నీ ఉండి ఉండగా, బ్రహ్మము సర్వదా నిర్విషయమై ఉన్నది. ఈ విధంగా ద్వైత–అద్వైతములు బ్రహ్మమునకు సిద్ధిస్తున్నాయి. దిక్‌రహితమగు ఆకాశమే సర్వదిక్కులను ధరిస్తున్నట్లే నిరవయవమగు పరబ్రహ్మమే ఈ జీవ–జగత్ ఆదిగా గల ఈ సర్వరూపాత్మక సృష్టిని అవధరిస్తోంది.

❖

అహంకారం ఉన్నప్పుడే జగత్తు. అహంకారం లేకుంటే జగత్తు లేదు.

జగత్తులో అహంకారం, అహంకారంలో జగత్తు. ఈ విధంగా ఈ రెండు అరటిపట్టలవలె ఒకదానిని మరొకటి చుట్టుకొని ఉన్నాయి.

సృష్టి అనబడేది జీవునియందే ఉన్నది. హిమాలయపర్వతం తన నుండి జాలువారిన జలమునే తనకు బాహ్యమైన మానససరోవరంగా గాంచుచున్నది చూచావా? అట్లాగే ఈ జీవుడు కూడా తన యందు గల సృష్టినే ఇంద్రియ – మనస్సులందు గల వృత్తి చమత్కారం చేత ఇట్లా బాహ్యజగత్తుగా గాంచుచున్నాడు. బంగారంలో నుంచే ఉంగరము, ప్రక్కపిన్ను మొదలైన ఆయా భవిష్యత్ ఆభరణ ఆకారాలన్నీ బయల్వెడలుచున్నట్లుగా ఈ జీవుడు కూడా తన స్వరూపమునే అకారణంగా ఈ జగత్తు రూపముగా దర్శిస్తున్నాడు.

ఇక ఈ సంసారము యొక్క ఆవలి తీరమును దర్శించిన పవిత్రాత్ముల జీవనము – దర్శనము మరొక విధంగా ఉన్నది.

జీవన్తో అపి న జీవన్తి, మ్రియంతే న మృతా అపి,
సన్తోపి చ న సన్తీవ, పారావారవిదః శుభాః॥

అట్టి మహనీయులు ప్రాణములు ధరిస్తూకూడా ధరించనివారుగానే ఉన్నారు. శరీరము, ప్రాణములు ధరిస్తున్నప్పటికీ దేహ–ప్రాణాతీతులై ప్రకాశిస్తున్నారు.

ప్రబుద్ధః సర్వకర్మాణి కుర్వన్నపి న పశ్యతి,
గృహకర్మాణి గేహస్థో గోష్ఠభాండమనా ఇవ

ఒక ఖగోళ శాస్త్రజ్ఞుడు తన దృష్టి అంతా ఆకాశంలోనే ఉంచుకుని ఇంటిలోని ఆయా దైనందిన కర్మలు ఆచరించునట్లు, బ్రహ్మమునందు మాత్రమే ఆసక్తిగల జ్ఞాని ఈ శరీరయాత్రాది ఆయా కర్మలను నిర్వర్తిస్తూనే సర్వదా నిర్వర్తించనివాడుగానే ఉంటాడు. తన ధ్యాసనంతా – "ఇదంతా ఆత్మగా దర్శించటం" – అను సాధన కార్యక్రమంలో వినియోగిస్తూ జీవితమంతా గడపుచున్నాడు.

ఈ విరాట్ నందు చంద్రుడు ఉండి అంతటా తన అమృత కిరణాలతో ప్రసరిస్తున్నాడు చూచావా? అట్లాగే ప్రతి వ్యష్టిశరీరమునందు మంచుబిందువు వంటి ఆకృతి గల జీవుడు ఇటు స్థూలంలో సూక్ష్మం గాను, అటు సూక్ష్మంలో సర్వత్వం గానూ అంతటా ప్రసరించి ఉంటున్నాడు.

❖❖❖

22. అహంకారాత్మ - దేహాత్మ

శ్రీరాముడు : మహాత్మా! ఈ అహంకారం అనే చమత్కారం నిర్విషయమగు ఆత్మయందు ఎప్పుడు ఎందుకు ఎట్లా ప్రవృత్తమౌతోంది?

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రాఘవా! ఆత్మ అంతటా, అన్నిటా, అన్ని వేళలా ఏర్పడియే ఉన్నది. అట్టి ఆత్మ నుండి ప్రవృత్తి అనే ఒకానొక చిత్ వృత్తి (సముద్ర జలంలో తరంగం వలె) స్వయంగా బయలుదేరి క్రమంగా దేహాత్మగా ప్రవృద్ధం అవుతోంది. ప్రవృత్తి స్వరూపుడగు అహం స్వరూపాత్మ ధ్యానము నందు ప్రవేశించి, అక్కడి నుండి దేహమును ఆశ్రయిస్తున్నాడు.

దేహారంభం -

అహమాత్మా త్రికోణత్వమ్ ఉపగచ్ఛతి కల్పనమ్ ।
అసదేవ సదాభాసం మన్యతే చేతనాద్వపుః ॥

కర్మకోశే త్రికోణే చ శుక్రసారే అవతిష్ఠతే ।
దేహే జీవోఽహమిత్యాత్మా స్వామోదః కుసుమే యథా ॥

తండ్రి దేహం నుండి అహంకారత్ముడగు జీవుడు వీర్యరూపంలో తల్లి యొక్క త్రికోణాకారమగు యోని యందు పరిచ్ఛిన్న రూపమున కల్పన పొందుచున్నాడు. క్రమంగా అక్కడి రక్తాదులు పొంది బుద్బుద–పిండాది క్రమంగా దేహాశ్రయుడగుచున్నాడు. ఇక అక్కడి నుండి, అసత్తగు "శరీరమే నేను" అనే భ్రమకు లోనగుచున్నాడు. ఈ జడ దేహమును సత్తుగాను, చేతనముగాను గాంచుచు అందు "అహం" అను అభిమానమును గాంచుచున్నాడు.

❖

ఆహా! ఏమి ఆశ్చర్యం! స్వయంగా పరమానందమైన అఖండ చిదాకాశ స్వరూపుడు అయి ఉండి కూడా... అట్టి నిరంకుశ సత్యమును ఏమరచి ఈ జీవుడు స్వకర్మ నిర్మితమై, సంకుచితము

– పరిమితం అయిన దేహ పంజరంలో చిక్కుకున్నాడు. త్రికోణాకారమగు మాతృ గర్భాన నిర్మితమైన వీర్యమే సారంగా గలిగిన ఈ పంచభౌతాత్మిక దేహంపై అభిమానమును కల్పించుకొని ఇక పుష్పంలో సుగంధం ఉన్నట్లు ఈ దేహంలో అనుభవజ్ఞుడై పరిమితత్త్వం వహించి ఉండటం ప్రారంభిస్తున్నాడు.

చంద్రబింబం నుండి బయల్వెడలిన అమృత కిరణ సమన్వితమగు చంద్రిక బ్రహ్మాండమంతా విస్తరించి ప్రవహిస్తోంది చూచావా?

అట్లాగే... వీర్యమందు ఉన్నట్టి చంద్రకళా రూపమగు సంవిత్తు (జ్ఞాన స్ఫూర్తి) ఈ దేహమంతా కూడా ఆపాదమస్తకం వ్యాపించి ఉంటోంది. పొగ ఆకాశమంతా మేఘ రూపంగా వ్యాపించి ఉంటోందే! అట్లా అంతరం నుండి బాహ్యానికి ఇంద్రియాల ద్వారా ప్రసరితమగుచున్న జ్ఞాన స్ఫూర్తి ముల్లోకాలోకి (పాతాళ–భూ–స్వర్గములలో) వ్యాపించుచున్నది. ఈ సమస్త శరీరమునకు బాహ్య అభ్యంతరమున ఈ అహంకార రూప జ్ఞానం విస్తరించి (వ్యాపించి) ఉన్నప్పటికీ అది హృదయంలో గల వీర్య విశేషంలో ఘనవాసనారూపంపై అధికమైన అభిమానం ఏర్పరచుకొని ఉంది.

ఈ విధంగా ఈ అహంకార రూప జ్ఞానం హృదయమున అధికమైన అభిమాన సమన్వితమై ఉండటం చేత... అట్టి హృదయమున ఆ జీవుడు ఏదేది ఎట్లు సంకల్పిస్తున్నాడో, ఆ రూపంలో అట్లే బాహ్యంలో కూడా స్థితి కలిగి ఉంటున్నాడు. అనగా తత్సంకల్ప పూర్వకంగానే బాహ్యంలో కూడా వ్యవహరిస్తున్నాడు. చూచావా రామా! అయితే, అట్టి అహంకారాభిమానం కేవలం భ్రమ మాత్రమే!

అహంకారాభిమానం -

శ్రీరాముడు : జీవునికి ఏర్పడిన ఈ అహంకార రూప అభిమానమే అన్ని తదితర సాంసారిక దృష్టులకు కారణం కదా! అట్టి దురభిమానపూర్వక అహంకార భ్రమ తొలిగేది ఎట్లా?

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఈ జీవుని స్వభావసిద్ధమైన స్వరూపం దివ్య ఆత్మ చైతన్యం (ఆత్మ తేజం) అంతేగాని, ఈ అహంకార–దేహ–దృశ్యత్వాలు కావు. ఎందుకంటే అవన్నీ కూడా భేద రూపమైనవి. ఆత్మ చైతన్యమో... అభేదరూపమైనది.

కాబట్టి ఈ జీవుడు అస్వభావం నుండి స్వభావానికి ప్రయాణిస్తేనే ప్రశాంతత. కానీ ఈ అహంకార భ్రమ బలీయమైనది. అనేక జన్మ–కర్మల సముదాయం చేత ఉపార్జించుకున్నది కదా! అందుచేత చిన్నచిన్న ఔషధాలు, ఉపాయాలు సరిపోవు మరి? స్వభావసిద్ధమైన, చిత్త వర్జితమైన బ్రహ్మంతో అభేద జ్ఞానరూపమగు స్థితిని సంపాదించుకుంటే తప్ప తమరింకే ఉపాయం చేత కూడా అహంకార భ్రమ శమించదు. ఓ రామా! నీవు శ్రవణ–మనన–నిధిధ్యాసలచే బ్రహ్మం గురించి చింతన చేయి.

అంతటితో తృప్తి చెందకు. వాటినన్నిటినీ అనుభవైకవేద్యము వైపుగా తరలించు. సమాధి యొక్క అభ్యాసం చేత మౌనస్వరూపమై ఆకాశాన్ని బోలి నిశ్చలమైనట్టి చరమ భూమికను (సప్తమ భూమికను) సముపార్జించుకో. 'ఆత్మ స్థితి' సంపాదించుకునే వరకూ సాధకుడు ఎక్కడా ఆగకూడదు. జ్ఞానులు అందరిలాగే ఆయా ప్రవాహపతిత కర్మలు నిర్వర్తిస్తూ కూడా మానసికమైన సర్వ బాహ్య

అభ్యంతర దృశ్య– దర్శనాభిమానరహితులై ఉంటున్నారు. బాహ్య–భావనా వర్జితులై ఉంటున్నారు. చెక్కతో తయారు చేయబడిన మనుజుని వలె ఈ భౌతిక ప్రపంచంలో దిగులు–ఇష్టం–మమత్వం–అయిష్టం మొదలైనవి లేకుండా సంచరిస్తున్నారు.

అప్రమేయత్వం - సదా బ్రహ్మ భావన ఉండే వారు ఈ దేహాదులతో కూడి జీవిస్తూ ఉన్నప్పటికీ ఆకాశం వలె నిర్మలులై, వాస్తవానికి ఎట్టి బంధాలూ లేని వారై, ముక్తులై ఉంటున్నారు.

సూర్యప్రకాశం బ్రహ్మాండమంతటా వ్యాపించి ఉన్నట్లు వీర్యమునందున్న జీవ సంవిత్తే ఈ దేహమునందు అంతటా ఆపాదమస్తకం అహంభావ రూపంలో వ్యాపించి ఉంటోందని అనుకున్నాం కదా! ఆ వీర్య సంవిత్తు కళ్లు–నాలుక–చెవులు–చర్మము మొదలైన అన్ని ఇంద్రియాలలోనూ ప్రవేశించి వాటి నన్నిటినీ అహంభావబద్ధంగా చేస్తోంది. అక్కడి నుండి దర్శన–స్పర్శన–శ్రవణాదు లందు నిమగ్నమై ఆయా విషయాలను కూడా అహంభావరసంతో ముంచెత్తుతోంది. భూమి యందంతటా ఉన్న రసం విత్తనంలో అంకుర రూపంలో ఉదయించి వృక్ష విభాగాలుగా ప్రదర్శిత మౌతోందే! అట్లా అజ్ఞానం చేత ఆవరించబడిన సందర్భములో చైతన్యం సర్వత్రా ఉండి కూడా... ప్రప్రథమంగా మనస్సుగా అయి, ఆ తరువాత అహంభావ రూపం సంతరించుకుని దేహంలో ప్రవేశించి ఆయా ఇంద్రియాల రూపంగా ఉదయిస్తోంది.

జగత్తు లేదు : బ్రహ్మమే ఉన్నది - శ్రుతులు (*"నేఽ తి, నేఽ తి, నేఽ హ నానాస్తి కించన"* మొదలైన శ్రుతివాక్యాల ద్వారా) జగత్ నాస్తిత్వం ప్రతిపాదిస్తున్నాయి కదా! ఎవడైతే ఈ జగత్తులో ఆరూఢమై ఉన్న మనోహంకార దేహాదులకు అభావనను ఆశ్రయిస్తూ తద్వారా అతీత్వం వహిస్తాడో అతనికే బ్రహ్మం అనుభవమౌతోంది. ఎవడు అభావన ద్వారా ఈ దేహ – మనో – అహంకారాలకు అతీతత్వ భావన సంతరించుకోవటానికి ప్రయత్నించడో... అట్టి ప్రయత్నరహిత మనుజునికి అనంతమైన సంసార దుఃఖం ఎన్నటికీ శమించదు. జ్ఞానామృతముచే తృప్తుడైన మనుజుడు ఏది ఎట్లు ఉన్నా, ఏది ఎట్టైనా దుఃఖించడు. సుఖించడు. తాను ఏది ధరించినా, ఏది భుజించినా, ఎచ్చట పరుండినా సర్వదా సర్వోత్తమమైన ఆత్మసుఖమునే అనుభవిస్తూ చక్రవర్తి వలె శోభిస్తూ ఉంటాడు.

అతడు అనేక వాసనలతో కూడి ఉండినప్పటికీ తాను దగ్ధమైన వస్త్రాకారములాగా వాటిచే స్పర్శించబడకయే ఉంటాడు. అంతరాంతరమున సాంసారిక వృత్తులేవీ లేనివాడై, అశూన్యమగు చిన్మాత్ర రూపుడే అగుచు – ఆకాశం ప్రాణవాయువులను ధరించి ఉన్నట్లు – ఈ మనో దేహ అహంకారాదులను... అసంబంధితుడై ఉండియే... ధరిస్తూ ఉంటాడు.

ఆసనే శయనే యానే స్థితో యత్నైర్నబోధ్యతే
నిద్రాలురివ నిర్వాణ మనో మనన నిర్వృతః॥

అట్టి జ్ఞాని ఆసన–శయన–ప్రయాణ సమయాల్లో ఆరూఢమై ఉన్నప్పుడు కూడా నిర్వాణ దశను అవధరించి నిద్రాళువు వలె అతీతత్వం సిద్ధింపజేసుకొనియే ఉంటాడు. సంచిత్ స్వరూపుడగు పురుషుడు సర్వవ్యాపి అయికూడా శరీరంలో సారభూతమైనట్టి విభాగంలో స్థితి కలిగి ఉంటున్నాడు.

ఈ జీవుడు వాస్తవానికి సంవిన్మాత్రుడే (లేక) జ్ఞాన మాత్రుడే సుమా! ఆతని యొక్క విస్తారమే ఈ జగత్తు. అతడు జగత్తు పట్ల అభిమానం ఉన్నప్పుడు జగత్తును అనుభవిస్తున్నాడు. జగత్ రహితుడుగా ఉన్నప్పుడు పరమాత్మత్వము అనుభవిస్తున్నాడు. ఉపదేశసారమంతా ఇంత మాత్రమే సుమా!

కనుక జగత్తు ఉండవచ్చు గాక, ఉండకపోవచ్చుగాక! నీవు మాత్రం జగదతీత్వము వహించిన వాడవై ఉండు. ఈ సమస్త సాంసారిక పదార్థములందు, స్థితియందు విభవములందు, దారిద్ర్యములందు పొంగని - క్రుంగని స్థితి కలిగి ఉండు. సర్వదా విరాగివై హృదయమును శిలవలె ఇచ్ఛారహితంగా చేసేవేసి 'జ్ఞానము' అనే ఐశ్వర్యమునుకు పొందటానికి సర్వదా సంసిద్ధుడవై ఉండు.

జడమగు ఒక శిల యొక్క అంతర్భాగం ఛిద్రరహితమై మౌనము వహించి ఒప్పుచున్నది కదా! చిదాకాశరూపమగు నీ హృదయము కూడా అంతరమున ఛిద్రరహితమై 'జగత్తు' అను భూతాదులకు స్థానము పొందనిదై ఒప్పుగాక! కేవల చైతన్య సమన్వితమైన ప్రకాశించుగాక! హృదయమునందు సాంసారిక వాసనలకు స్థానమే లభించకుండు గాక! చైతన్యపూరిత హృదయాకాశమున కేవల చైతన్యమునే దర్శిస్తూ పరమానందము పొందుచుండెదవు గాక!

❖❖❖

23. జ్ఞాని - అజ్ఞాని - వారి వ్యవహార విశేషాలు

ఓ రామచంద్రా! జ్ఞానికి అజ్ఞానికి ఇక్కడి సమస్త భావ-అభావాల విషయంలోను, కర్మలు నిర్వర్తించే పద్ధతియందు పెద్ద తేడా ఉండదు. వారిద్దరిలోనూ ఉండే భేదమంతా ఒక్కటే!

1. జ్ఞాని ఆ పదార్థములందు, సంఘటనల యందు, కర్మల యందు, తదితర విశేషములందు వాసనారహితుడై ఉంటాడు. వాటియందు అతనికి సత్యత్వ బుద్ధి ఉండదు.

2. అజ్ఞాని వాటన్నిటి పట్ల వాసనా సహితుడై ఉంటాడు. వాటి పట్ల సత్యత్త్వ బుద్ధి కలిగి ఉంటాడు. వారిరువురిలో భేదమంతే!

చైతన్య సత్తయే
— వాసనలచే స్ఫురించుటచే ఈ జగద్రూపంగా అవుతోంది.
— వాసనల అభావముచే ఈ జగద్రూపం శమించి అపరిచ్ఛిన్నము నామరూపరహితము అగు మోక్ష స్వరూపమే అగుచున్నది.

ఇంత మాత్రమే జ్ఞానమంతా! ఇక ఈ 'దృశ్యం' అంటావా?

దృశ్యం వినశ్యతి అఖిలమ్, వినష్టం జాయతే పునః ।
యన్ననష్టం న చ ఉత్పన్నం! యత్ సత్ భవతి తత్ భవాన్ ॥

ఈ దృశ్య జగత్తంతా ఒకప్పుడు నశిస్తోంది. నశించినదంతా మరల మరొకప్పుడు ఉత్పన్నమౌతోంది. అయితే... ఏదైతే నశించుటయే లేదో, నశించడం లేదు కాబట్టి 'ఉత్పన్నం' అనేది కూడా లేదో ...అదియే సత్తు.

"ఆ సత్తయే నీవు" ఇట్టి బోధచే అజ్ఞాన మూలము నశించుచున్నది.

అజ్ఞాన మూలము నశించిన తరువాత 'జగద్భ్రాంతి' అనేది ఇక ఎంత వెతికినా కనిపించదు. "మృగతృష్ణలో భ్రమచేతనే జల తరంగాలు కనిపిస్తున్నాయి కదా!"... అని తెలిసే వరకే కదా, మృగతృష్ణ వైపుగా పరుగులు! అట్లాగే, "జగత్‌దర్శనమంతా భ్రమ చేతనే ఏర్పడుతోంది" అని గ్రహించబడిన తరువాత ఇక "ఈ జగత్తు ఎక్కడి నుండి వచ్చింది? దీని మొదలేమిటి? చివర ఏమిటి?"... అనే ప్రశ్నలకు తావు ఎక్కడిది?

ఏ 'అహంకారము' అను దాని గురించైతే 'ఇదేమిటిరా బాబు? ఇది ఎక్కడి నుండి వచ్చింది?" అని సాధకులంతా తర్జన భర్జనలు చేసుకుంటున్నారో... ఆత్మ దర్శనమైన తరువాత ఇట్టి అహంభావన గురించిన ఊసైనా ఉండదు.

ఆత్మజ్ఞానికి అంతఃకరణము ఉపకరణమే అవుతుంది. కాని అది సంసారమును కలుగజేయ జాలదు. దగ్ధమైన బీజము మరల మొలకెత్తదు కదా! వీత రాగుడు (రాగములను జయించినవాడు), మనోవికార రహితుడు అయిన జ్ఞాని కర్మలు చేయుచుండవచ్చు. లేక చేయకుండవచ్చు గాక! అతడు సదా అమనస్కుడై, నిత్యనిర్వాణ రూపుడై ...ఆత్మయందే స్థితి కలిగి ఉంటాడు.

ఎవరైతే ఈ తమ చిత్తమును సశాంతింపజేసుకుంటారో ...వారే శాంతియుతులై ఉండ గలుగుతారు. భోగ వాసనలు కలవారికి మాత్రమే భోగముల ఉనికి – లేములు బంధించడం, బాధించడం చేస్తున్నాయి. భోగాశ ఉన్నచోట మాత్రమే చిత్తమనేది ఏర్పడుతుంది. అట్టి వారికి శాంతి లేదు. ఎవరైతే సర్వాశలు సర్వదా త్యజించియే ఆయా ప్రవాహపతిత విధి విధానములను నిర్వర్తిస్తూ ఉంటారో ...వారికి చిత్తము లేనట్లే అవుతుంది. ఆ విధంగా చిత్త – దేహాదులుగా ఘనీభూతం కాని వాడు (వాటిపట్ల అహంకార బుద్ధి ఉంచనివాడు), కేవల చిన్మాత్ర రూపుడగు పరమాత్మయే! అహంభావముతో కూడి ఉండేవాడు ఇసుకపై నిలుచుని మధ్యాహ్న సూర్యుని తాపము అనుభవించువాడే అగుచున్నాడు.


శ్రీరాముడు: చిత్త రహితుడు పరమాత్మయే అగుచున్నాడని అనుచున్నారు కదా! అట్టి చిత్త రహిత పరమాత్మ స్వరూపము ఎట్టిదో ఏదైనా దృష్టాంతపూర్వకంగా చెప్పమని నా విన్నపం.

శ్రీ వసిష్ఠ మహర్షి:

ఏకదేశ స్థితాత్ పుంసో దూరాయాతస్య చేతనః ।
యద్రూపం సకలం మధ్యే తద్రూపం పరమాత్మనః ॥

ఒకడు ఒక ప్రదేశంలో నిలుచున్నాడనుకో. అతని చిత్తము (ధ్యాస) దూరంగా ఉన్న సూర్య – చంద్ర మండలమునకో వెళ్లినదనుకుందాం. ఆ మనుజుని చిత్తము అతడు నిలుచున్న చోటు నుండి బయలుదేరిన తరువాత, ఇంకా సూర్య మండలము చేరక ముందు ఆ మధ్య ప్రదేశములో ఏ చైతన్య స్ఫురణ కలదో అదియే 'పరమాత్మ' యొక్క రూపం. అనగా......

ఈ జీవ సంవిత్తు విషయములను పట్టుకొంటోంది కదా! ఇది ఒక విషయమును ఆశ్రయించి ఇంతలోనే ఏదో కారణం చేత ఆ విషయమును త్యజించి మరొక విషయమును ఆశ్రయిస్తోంది. ఇట్లు అవిశ్రాంతంగా విషయ పరంపరలను ఆశ్రయించి స్వభావమే 'చిత్తము' అనబడుతోంది.



విషయము - విషయముల మధ్య గల విషయ రహిత విరామం

చిత్త స్వభావమును ఆశ్రయించి విషయపరంపరలను అనుభవిస్తున్న జీవసంపత్తు విషయము - విషయముల మధ్య గల 'నిర్విషయ విరామము'ను గమనించటమే లేదు.

ఒక విషయము - మరొక విషయముల మధ్య ఈ జీవ సంవిత్తు యొక్క ఏ చైతన్య స్ఫురణ నిర్విషయమై ఉన్నదో అదియే 'పరమాత్మ' యొక్క స్వరూపం.

ఇక ఈ జగత్తంటావా? మనోహరమైన అనంత చిదాకాశము తాను స్వయంగా ఏ చమత్కారమైతే గావించుచున్నదో... అట్టి చమత్కారము యొక్క వ్యక్తీకరణ రూపమే ఈ జగత్తు. కనుక జ్ఞానులకు ఈ జగత్తు భ్రమ రహితమై, ప్రకాశశీలమై (కాంతి వంటి), నిర్వాణ రూపమై, అక్షయపరబ్రహ్మముగానే భాసిస్తోంది. ఇక అజ్ఞానులకో?... ఇదంతా నిరంతరమైన ఈశ్వరనియతి గాను, అనేక వ్యవస్థ - వ్యవహారములతో కూడుకొనియున్నదిగాను, అప్రతిహతమైనది గాను, అనేక భోగాదులతో కూడుకొని ఉన్నదిగాను గోచరిస్తుంది. ఇదంతా కూడా వాస్తవానికి పరమార్థమున వెలయుచున్నప్పటికీ, అజ్ఞానులకు మాత్రం అసద్రూపంగానే అనుభవమౌతోంది. కాబట్టి జ్ఞానము సంపాదించి అప్పుడు ఈ జగత్తు వైపుగా దృష్టి సారించమని సర్వ జీవులకు నా మనవి.

❖❖❖

III. శ్రీ వసిష్ఠ - మంకి సంవాదము

1. ప్రక్కదోవ పట్టుచున్న బహుదూరపు బాటసారి

(ఆత్మానంద స్థానమును ఏమఱచి దృశ్యము వైపుగా ఆకర్షించబడుచున్న ఒక బాటసారి)

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! పూర్వం ఒకప్పుడు 'మంకి' అను పేరుగల మహనీయునికి నేను ఆత్మ విషయమై బోధించటం జరిగింది. ఆ బ్రాహ్మణుడు తత్త్వమును విని సంసార వాసనా రహితుడై ఆత్మపదమును సముపార్జించుకున్నాడు. ఆ సంఘటనను ఇప్పుడు మనం చెప్పుకోవటం సందర్భోచితం. కనుక, విను! చెబుతాను.

❖

మీ తండ్రిగారి యొక్క తండ్రి (తాతగారు) అజుడు ఒకసారి ఒక గొప్ప యజ్ఞం తలబెట్టారు. తత్సంబంధిత కార్యనిర్వహణకై కొన్ని విషయాలు సంప్రదించాలనే ఉద్దేశంతో మీ వంశపురోహితుడ నైన నాకు కబురు పంపారు మీ తాతగారు. ఆ కబురు విన్న నేను ఒక సమయంలో ఆకాశము నుండి భూమికి వస్తున్నాను. అట్లా భూమిపైకి వస్తూ అయోధ్యానగరం సమీపిస్తూ ఉండగా త్రోవలో కాకతాళీయంగా ఒక విశాలమైన అరణ్యం తారసపడింది. ఆ అరణ్యం ఎండచే వేడెక్కిన ధూళితో కూడిన సుడిగాలులచే ధూసరమై ఉన్నది. నేలంతా ఇసుక దిబ్బలకు ఆలవాలమైయున్నది. ఆ దీర్ఘమైన అరణ్యంలో అక్కడక్కడ క్రూర ఆటవికుల గ్రామాలు ఉన్నాయి. కొన్ని ప్రదేశాలలో మాత్రం క్షోభరహితమైన ఆకాశం, వాయుతరంగములపై ప్రసరించే సూక్ష్మ సూర్య కిరణాల వలన ఏర్పడిన మృగతృష్ణలు కన్పిస్తున్నాయి.

అక్కడ అస్తవ్యస్తంగా ఉన్న కాలి బాటలలో ఎంతో శ్రమ, అలసటతో సంచరిస్తూ బాటసారులు కనిపించారు. అక్కడి ఆకాశం బ్రహ్మం వలె నిర్మలంగాను, ఖాళీ ప్రదేశాలు మృగతృష్ణలచే మోహ దాయకంగాను అగుపిస్తున్నాయి. అవిద్య వలె అక్కడి ఆయా ప్రదేశాలు జడత్వంతో కూడి అతి విశాలమై, కనిపిస్తున్నాయి. అక్కడక్కడా జనశూన్యమై కూడా కనిపిస్తున్నాయి.

నేను అట్లా పయనిస్తూ వస్తూ ఉన్నాను. ఇంతలో అక్కడ ఒక బాటసారి కనిపించాడు. అతడు ఎంతో అలసి విసుగును ప్రదర్శిస్తూ ఉన్నాడు. ఇట్లా పైకి పలకటం నాకు వినిపించింది.

బాటసారి: అబ్బా! ఏం ఎండ? ఒక పాపితో, దుర్జనునితో సాంగత్యం ఎంతగా పరితాపం కలిగి స్తుందో... ఈ ఎండ కూడా అంతగా పరితాపం కలిగిస్తోంది.

నా ఈ అవయవలన్నీ క్రుంగిపోతున్నాయి! ఈ ఎండ మంటలు చిలకరిస్తోందే! ఎండకు అరణ్యాలన్నీ సంతాపం పొందుతున్నాయి. ఇక లాభం లేదు. ఆ ప్రక్కన ఏదో పల్లె, గుడిసెలు

కనిపిస్తున్నాయి. అటు వెళ్లి ఏ ఇంట్లో అయినా కొంతసేపు సేద తీర్చుకొని అప్పుడు నా ఈ ప్రయాణం కొనసాగిస్తాను.

ఇట్లా అంటూ నడుస్తున్న బాటను వదలి కొంత దూరంలో ప్రక్కత్రోవగా నడవసాగాడు. నేను అది గమనించాను. అతడు అల్లంత దూరంగా కనిపిస్తున్న క్రూర ఆటవికుల గ్రామం వైపుగా తిరిగి అడుగులు వేయసాగాడు. అతడు వెళ్ళుచున్నది ప్రమాదమైన ప్రాంతానికి. "మరి అతనికి ఆ విషయం తెలుసా? లేదా?" అని నా మనస్సులో అనిపించింది. వెంటనే నేనప్పుడు అతనిని కొంచెం వెనుకకు పిలిచి ఇట్లా అన్నాను.

నేను (శ్రీ వసిష్ఠ మహర్షి) : శుభమైన ఆకృతితో వెలుగొందుచున్న ఓ మిత్రమా! ఒక్కమాట. రండి, రండి సుస్వాగతం! ఏమిటి, ఈ ముఖ్య మార్గమగు బాటను, మీరు వెళ్లవలసియున్న మార్గ-లక్ష్యములను వదలి ప్రక్కవైపుగా వెళ్లుచున్నారేమిటి? సరైన మార్గం తెలియక ప్రక్కకు వెళ్లుచున్నారా? మీరు వెళ్ళే ఆ ప్రదేశం ఎటువంటిదో మీకు తెలుసా? లేదా? (పాఠక మహాశయులు... అది ఇంద్రియ విషయముల వైపుగా అని గమనించ ప్రార్థన.)

బాటసారి : కొంచెం విశ్రాంతి లభిస్తుంది కదా అని ప్రక్కనున్న ఆటవిక గ్రామం వైపుగా వెళ్దామను కుంటున్నాను. ఇలా బాట వెంబడి వస్తూ అక్కడక్కడ పక్క కుగ్రామాలలో విశ్రాంతికై వెళుతూ వచ్చాను లెండి.

శ్రీవసిష్ఠ మహర్షి : నిమ్న మార్గములలోకి వెళుతూ వస్తున్న ఓ బాటసారీ! మీరు పూర్వ గ్రామాలలో (ఇంద్రియ గ్రామాలలో) అక్కడక్కడ కొంచెం విశ్రాంతి దొరుకుతుంది కదా అని వెళ్లి వచ్చి ఉండవచ్చు గాక! ఇప్పుడు మీరు వెళ్లాలనుకునే (విషయ పరంపరలు అనే) గ్రామం సంగతి మీకు తెలుసో? తెలియదో? అతిథి సత్కారాలు చేసే వారు ఇక్కడి గ్రామంలో ఉండరు. ఇక్కడంతా పైకి ప్రియం గానూ, లోన బంధప్రసాదితంగాను కనిపించే (శబ్దస్పర్శాది విషయ) ప్రదేశము సుమా! అటువైపుగా ప్రియంగా అనిపించినా, అక్కడి (ఇంద్రియ) గ్రామం శ్రేయం కాదు. తెలిసీ తెలియక ప్రవేశించే వారికి ఈ దేహాలు బంధములను ప్రవృద్ధపరుస్తాయని గ్రహించి ఉన్నారా?

పామరులకు మాత్రమే ఈ (దేహము అనే) గ్రామం నివాస స్థానమగుచుండగా, మీకు ఈ (దేహ) గ్రామంలో ఏం విశ్రాంతి లభిస్తుంది చెప్పండి?

బాటసారి : మీరు చెప్పింది నిజమే కావచ్చు! కానీ, ఈ (దేహ) గ్రామంలో విశ్రాంతికి వసతులు (ఇంద్రియాలు, ఇంద్రియ విషయాలు) ఉంటాయి కనుక, కాస్త విశ్రాంతి, కాలక్షేపం సాయంకాలం దాకా లభిస్తాయి... సాయంకాలం అవగానే ఎండ చల్లబడగానే మరల బయలుదేరుతాను కదా!

శ్రీవసిష్ఠ మహర్షి : ఉప్పు నీటిని త్రాగితే దాహం ఇంకా అధికమౌతుంది గాని, దాహం తీరుతుందా చెప్పండి? ఈ (ఇంద్రియ - దేహ) ఆటవిక గ్రామం చేరినా మీ దాహం తీరదు సుమా! ఈ గ్రామంలో క్రూరులైన (ప్రియాప్రియ స్వరూపములైన) మొరటు ఆటవికులు ఉంటారు. వారందరికి మహాత్ములన్నా, వివేకమన్నా వ్యతిరక్తము, ఎగతాళి, భయము కూడా!

వారంతా (ఈ ఇంద్రియాలన్నీ) అశాస్త్రీయమైన మార్గాల వైపుగానే అధికంగా ఆకర్షితులై ఉంటారు. ఇక్కడి కోయజాతి వారు 'కామం – క్రోధం' కలిగి పశుతుల్యులై (ఇంద్రియ పశువులై) ఉంటారు సుమా!

న స్ఫురన్ని విచారేషు ప్రజ్వలన్తి అనుభూతిషు ।

న త్రస్యన్తి దురాచారాదశ్మయన్త్రమయా ఇవ ॥

ఇక్కడి (ఇంద్రియ)గ్రామంలో ప్రజలకు(ఇంద్రియాలకు) 'తత్త్వ విచారణ' లేకపోవడం చేత మూఢులై ఉంటారు. వారివారి పరిమితానుభవాలలోనే ప్రజ్వలిస్తూ ఉంటారు. 'అయ్యో! ఇది దురాచారం కదా! సత్క్రమం కాదు కదా!"... అనే విజ్ఞత, జ్ఞానం అక్కడి (ఇంద్రియ)గ్రామ ప్రజలకు ఉండదు. అక్కడివారి పురుషార్థమంతా అర్థ–కామాల కొరకై రాగద్వేషములందే పరిసమాప్తమౌతూ ఉంటుంది. పైగా వారిలో సత్–అసత్, నిత్య–అనిత్య... వివేక – విచారణలు లేవు. అందుచేత ఆ బుద్ధిహీనులకు కర్మలయందే ప్రీతిగాని, జ్ఞానంలో కాదు. విశాలమైన ఎడారిలో ప్రవేశించిన మేఘాలకు ఆ ఎడారిపై నమ్మకం లేదు. కాబట్టి అక్కడ కురియవు కదా! అట్లే 'పూర్ణం – శీతలం – కాంతి రసం – బ్రహ్మానందం'... అనే ప్రజ్ఞావర్షం అక్కడివారి 'హృదయాలు' అనే ఎడారిలో కురియవు. విజ్ఞానం పట్ల వారికి విశ్వాసం లేకపోవడం చేత వారు మూర్ఖులుగానే ఉన్నారు.

బాటసారి : అయితే ఏం? నా పని నాది. ఏదో కొద్దిసేపు వారితో స్నేహంగా ఉండి ఆ తరువాత వచ్చేస్తాను కదా! వారితో (ఇంద్రియ విషయాలతో) వినోదించాలని నేను వెళ్ళుచుండగా... మీరెందుకు "వద్దు–వద్దు" అని నాకు చెప్పవస్తారు?

శ్రీవసిష్ఠ మహర్షి :

వర మన్ధ గుహాహిత్వం శిలాన్తః కీటతా వరమ్ ।

వరం మరౌ పఙ్గుమృగో న గ్రామ్య జన సంగమః ॥

మిత్రమా! ఓ బాటసారి! పైకి ప్రియుల వలె కనిపిస్తూ అనేక ఇష్ట–అయిష్ట, రాగ–ద్వేష ద్వంద్వాలకు బహు ఆవేశపూరితంగా కలిగి ఉండే అజ్ఞానులతో సాంగత్యం మంచిదా?... కాదు! అంతకంటే అంధకారంతో ఆకృతమైన కొండ గుహలో కొండచిలువ అయి ఉండటమో, దట్టమైన అడవిలో జింకగా జీవించటమో ఉచితమేమో! అంతేగాని, అక్కడి ఇంద్రియగ్రామ ప్రజలతో కొద్ది సేపు స్నేహం కూడా ఉచితం కాదు. నిమిషకాలం మంచిగా అనిపిస్తూ మరుక్షణమే స్నేహవిరతులు అయ్యేవాళ్లు. వాళ్ళాయె? 'బాధించటం – వేధించటం – హింసించటం – కృంగదీయటం' వంటి క్రియలలో అతి ప్రావీణ్యులు అయిన ఇక్కడి గ్రామ్య జనులు (ఇంద్రియ సమూహాలు) మధుర పదార్థములతో మిశ్రమమై ఉన్న విషగుళికల వంటి వారు సుమా!

❖

ఓ రామచంద్రా! నేనిట్లా అనే సరికి, నా వాక్యాలు విన్న ఆ బాటసారి కొంచెం శాంతించాడు. మండుటెండలో శ్రమించి, చల్లటి నీళ్లతో స్నానం చేసి సేదతీరిన వానివలె అయి, ఇట్లా పలికాడు–

త్వమ్ తత్ అసి! -

బాటసారి : మహాత్మా! తమరెవరు? చూడగా పూర్ణాత్మజ్ఞానుల వలె, ఆత్మవిద్యను కూలంకషంగా ఎఱిగినవారి వలె ఉన్నారే! అంతేకాదు. ఒకవైపు మేమీ సంసారారణ్యంలో దిగాలు పడి అక్కడా – ఇక్కడా ప్రక్క త్రోవలు పట్టుచుండగా మీరు మాత్రం "ఇక్కడి సంసారంలో నాకు చెందినది, చెంద వలసినది ఏమీ లేదు"... అని గ్రహించి కాబోలు ప్రక్క త్రోవకు మరలుచుండడమే లేదు. సుదూర ప్రయాణీకుడు త్రోవలో తారసపడే జనులను పట్టించుకోనట్లుగా మీరు వ్యాకుల రహితులై సాక్షీ మాత్రంగా ఈ పరిసరములను దర్శిస్తున్నట్లున్నారే!

కిం త్వయా సీతమమృతమ్? కిం త్వం సమ్రాడ్విరాడథ ।
సర్వార్థరిక్తో అపి, చిరమ్ సంపూర్ణఇవ రాజసే ॥

మీ ముఖారవిందం పరమ ప్రశాంతంగా, నిర్లిప్తంగా ఉన్నదే. తాము ఏమన్నా అమృత పానం చేసి ఉన్నారా ఏమిటి? లేక మీరు లోకేశ్వరులా? కాక విరాట్ పురుషులా? ఎందుకంటే ఒక వైపు సర్వ పదార్థ రహితులై ఉండి కూడా, ఇంకొక వైపుగా పరమార్థశోభితులై – పూర్ణ స్వరూపులై భాసిస్తున్నారే! మిమల్ని చూస్తూ ఉంటే.

శూన్యోఽసి, పరిపూర్ణోఽసి ఘూర్ణోఽసీవ స్థిరోఽసి చ।
న సర్వమపి సర్వం చ న కించిత్ కించిదేవ చ ॥

ఒక వైపు (సంసార దోష) శూన్యులుగా ఉన్నారు. మరొక వైపు నుంచి బ్రహ్మానందం చేతను, జీవన్ముక్త గుణముల చేతను పరిపూర్ణులై కన్పిస్తున్నారు. (ఈ దేహాదుల పట్ల అనుసంధానం లేక పోవుటచే) ఒక విధంగా జగద్విషయాలకు అతీతమైన మత్త చిత్తుని భంగి అగుపిస్తున్నారు.

(ఈ దేహమనో బుద్ధ్యాదులచే సంబంధం వహించకపోవుటచే) ఏదీ కానివారై ఉన్నారు. (అపవాద దృష్టి) ఈ దేహ మనో బుద్ధ్యాదులన్నీ తమ చమత్కారమే కనుక – "అంతయు తామేనా!" అన్నట్లుగా కూడా ఉన్నారు. (అధ్యారోపదృష్టి) పరిచ్ఛిన్నుల వలె కనిపిస్తూనే అపరిచ్ఛిన్ను లుగా అనిపిస్తున్నారు.

ఉపశాంతం చ, కాన్తం చ, దీప్తమ్ అప్రతిఘాతి చ
నివృత్తం చ ఊర్జితం తాదృగ్రూపం కిమితి తే మునే?

మీ రూపం పరమశాంతంగాను, అత్యంత ప్రకాశమానంగాను, ప్రదీప్తవంతంగాను, అప్రతిఘాతం గాను, సర్వ వ్యవహారముల నుండి నివృత్తిని సముపార్జించుకొన్న దాని వలెను, సర్వసామర్థ్యమును అవధరించిన దాని వలెను నాకు కన్పట్టుచున్నది. స్వామీ! మీరీ భూమిపై పాంచభౌతిక దేహంతో కనబడుచున్నప్పటికీ సర్వలోకాలకు ఆవల చిదాకాశస్వరూపమున స్థితిని పొందిన వారివలె ఉన్నారు. అంతేగాక, మీరు ఎక్కడా స్థితిని పొంది ఉండక నిరాకారులైనప్పటికి మావంటి రూప-నామాది సంసారబద్ధుల నిమిత్తమై రూపయుక్తులగుచున్న వారి వలె నాకు అనిపిస్తున్నారు. చంద్రుని చల్లటి కిరణాలు భూమిపై గల ఆయా పదార్థములపై ప్రసరిస్తూ

కూడా, ఆయా విషయాల దోషాలను తాను పొందక యథాతథంగా అమృతమయంగా ఉంటుంది చూచారా! మీరు కూడా, పరిపూర్ణంగా కళంకరహితులుగా, స్వభావసిద్ధమైన శీతలాంతఃకరణులుగా, ప్రకాశానందమయులుగా, సర్వత్రా సమరూప సముపార్జితులుగా, అమృత ప్రవాహపూరితులుగా, పూర్ణ చంద్ర శోభాయమానులుగా నాకు కనిపిస్తున్నారు.

హే మహాత్మా! ఒక విత్తనంలోనే వృక్ష-శాఖ-పత్ర-ఫలాదులన్నీ ఉన్నట్లు మనం గ్రహిస్తాం చూడండి! అట్లా, మీ ఆత్మయందే ఈ జగన్మండల వైశిష్యమంతా నేను వీక్షిస్తు న్నాను. చిత్ స్వరూపులగు తమ ఇచ్ఛయందే సత్-అసత్ భావ చమత్కారం అంతా ఉన్నట్లుగా నాకు గోచరిస్తోంది.

స్వామీ! మీరెవరో, తదితర మీకు సంబంధించిన విశేషా లేమిటో తెలుసుకోవాలని నాకు అనిపిస్తోంది. ప్రభూ! ముందుగా నా గురించి నేను పరిచయం చేసుకోవటానికి అనుజ్ఞనివ్వండి.

❖

నన్ను “మంకి” అనే పేరుతో పిలుస్తూ ఉంటారు. శాండిల్య గోత్రోద్భవుడనగు బ్రాహ్మణుడను. అహం భో అభివాదయే! తీర్థయాత్రలు చేసి వద్దామని చాలాకాలం క్రితం బయలుదేరాను. చాలా దూరదూరాలు సంచారం చేసి ఇక ఇంటికి చేరాలని తిరిగి వస్తున్నాను. చాలా చాలా ప్రదేశాలు సందర్శించి వస్తున్నాను. అనేక ప్రదేశములను, స్థానములను చూచిన నా మనస్సు “ఈ ప్రపంచం మెరుపుతో సమానమైన పంచభూత సంయోగ వియోగ చమత్కారమే...” అనే వివేకం చూచాయగా పొందింది. మనస్సు వైరాగ్యయుక్తం కాగా ‘ఈ ప్రాపంచిక విషయాలు ఏమి చూడాలి? ఇంటికి చేరి విశ్రాంతి పొందటమే ఉచితం కదా!... అని అనిపించసాగి, ఇక గృహోన్ముఖుడను అయ్యాను. నన్ను మీరు సంబోధించిన విధానం చూచి “మీరు శాస్త్రజ్ఞానులు, ఆత్మజ్ఞాన నిధి”...అని గ్రహించాను. హే మహాత్మా! ఈ బాటసారి అనేక బాటలలో సంచరించి సంచరించి అలసి పోయాడు సుమా! దయచేసి నా అలసట తీర్చగల ఆత్మజ్ఞానం వచించండి. సాధు మహాత్ముల చిత్తము గంభీరముగాను, నిర్మల సరోవర సదృశంగాను ఉంటుంది కదా! ఇక నా చిత్తం నాకే అర్థంకాని అనేక వ్యాకులతతో, దిగుళ్లతో సతమతమగుచు ఉడికిపోతోంది. కనుక నాకు ఆత్మజ్ఞానం ప్రసాదించమని మరల వినమ్రుడనై వేడుకొనుచున్నాను.

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ మంకి మహాశయా! నీవు ఆత్మజ్ఞానం కొఱకై అర్థించే నమ్రతతో కూడిన విధానం నాకు నచ్చింది. నీ విప్పుడు నన్ను సంబోధిస్తూ చెప్పినదంతా తత్త్వశాస్త్ర ప్రవచనమై ఉన్నది. ఇట్టి దృష్టితో చూడటమే తత్త్వశాస్త్రజ్ఞానోదయం.

ముందుగా నా వివరాలు కూడా చెప్పుతాను. నేను బ్రహ్మలోక నివాసిని. ‘వసిష్ఠుడు’ అను నామధేయుడను. రాజర్షి అయిన అజుడు ఏదో కార్యం నిమిత్తం నాకు కబురు పంపగా ఇటు వస్తున్నాను. నీవు ఆత్మజ్ఞానం కొరకై నన్ను అర్థించడం నాకు సంతోషం కలుగజేస్తోంది. ఎందుకంటే అనేకమంది జీవ నామధేయ బాటసారులు ఆత్మజ్ఞానం కొరకై యత్నించకుండా అనేక ఉపాధులు ఆశ్రయిస్తూ ఇక్కడి సంసారారణ్యంలో ఉపాధి పరంపరలు పొందుతూ సుదీర్ఘకాలం గడిపివేయడం నేను గమనిస్తున్నాను.

ఆత్మజ్ఞానము కొరకై నీవు అడుగుచున్నందునకు నిన్ను ముందుగా అభినందిస్తున్నాను. ఓ ప్రియ విప్రోత్తమా! నీవు ఈ కల్పిత విషయ ప్రపంచంలో దేని కొరకూ దుఃఖించవలసిన పనేలేదని మొట్టమొదటి వాక్యం చెప్పుచున్నాను.

మాగా విషాదం పంథానమ్ ఆగతోషి మనీషిణామ్
ప్రాయ ప్రాప్తోసి సంసారసాగరస్య పరం తటమ్!

నీవు దుఃఖించవలసిన అవసరమే లేదు. పైగా, బుద్ధిమంతులైన వారు పొందే మార్గం నీవు దాదాపు పొందావు. 'వైరాగ్యం' అనే వైభవం ఉన్నప్పుడే నీవలె ఇటువంటి ఉదారమైన బుద్ధి, యోచన, వచనములు, ఆకృతి ఉంటాయి.

నీవిప్పుడు ఆత్మజ్ఞానం గురించి అడిగావు కదా! ప్రతి జీవునిలోనూ 'ఆత్మజ్ఞానం' అనే రత్నం ఉన్నది. అయితే, రత్నమును సాన పెట్టనంతకాలం అప్రకాశమానంగానే ఉంటుంది కదా! అట్లాగే బుద్ధి అనే రత్నం "అనేక రాగద్వేషములు" అనే మాలిన్యములచే ఆవరించబడి ఉంటోంది. 'వివేకము' అనే సాన పెట్టితే ఆత్మజ్ఞానం స్వయంగానే ప్రకాశించగలదు.

అయితే ఓ విప్రుడా! నీవు తెలుసుకోవాలనుకుంటున్నది ఏమిటి? సంసారము నీకెట్లా అనుభవమౌతోంది?... శిష్యుడు తనకున్న అనుమానాలను సవివరంగా ప్రదర్శిస్తే గురువు అర్హమైన మార్గంలో ఉత్తమ అర్థయుక్తమైన బోధ నిర్వర్తించగలుగుతాడు. ఈ ప్రశ్న-ఉత్తరములు అనేవి గురు-శిష్యుల మధ్య అత్యంతావశ్యకమైన పాఠ్య విధానం. కాబట్టి నీవు చక్కగా నీకున్న అనుమానాలను బయటపెట్టు.

శిష్యుడిలో 5 లక్షణాలు ముఖ్యంగా ఉండాలి- 1. రాగాది దోషములు తొలగించుకోవడం, 2. నిర్మలమైన (ధ్యాన-పఠనాది) వాసనలు కలిగి ఉండడం, 3. వైరాగ్య సంబంధమైన సాధనాలతో కూడి ఉన్న మనస్సు, 4. నిత్యానిత్య వివేచనా సామర్థ్యం, 5. సమబుద్ధి. ఈ ఐదు లక్షణాలు శిష్యునిలో ఉంటేనే గురూపదేశం ప్రభావ సమర్థంగా అవుతుంది. అప్పుడు గురూపదేశ తేజస్సుచే ఆ శిష్యుడు శోక రహితుడుగాను, ఆత్మజ్ఞాన సుసంపన్నుడుగాను అగుచున్నాడు. యోగ్యత ఉన్నప్పుడే 'గురుబోధ' ప్రయోజనకరం.

నీవు ఏం తెలుసుకోవాలనుకుంటున్నావో నీ యందు గల అనుమానాలేమిటో ప్రశ్నించు. నీ ప్రశ్నలను అనుసరించి జననమరణాది దుఃఖముల నుండి తరించాలనే బుద్ధి పట్టుదల ఎంత వరకు ఉన్నాయో నాకు తెలుస్తుంది. నీవు తగిన అర్హత కలవాడివైతే నీకు తప్పక ఉపదేశిస్తాను.

❖

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! నేను ఆ 'మంకి' అను విప్రుని ఇట్లు తిరిగి ప్రశ్నించాను. అప్పుడు ఆతని కళ్లు ఆనందబాష్పములతో చమర్చడం గమనించాను. నా పాదములకు సాష్టాంగ ప్రణామం చేశాడు. ఆ ప్రక్కనే గల ఒక పెద్ద వృక్షపు నీడలో ఇద్దరం సుఖాసీనులమైనాం. ఇక అతడు ఇట్లా చెప్ప ప్రారంభించాడు.

❖❖❖

2. సంసార పంజరం

మంకి :

భగవన్! భూరిశోభ్రాన్తా, దిశో దశ దృశో యథా ।
మయా న తు పునః సాధు లబ్ధః సంశయనాశ కృత్॥

మహాత్మా! ఉపదేశం ప్రసాదించగల గురువుకోసం నేను పది దిక్కులలోనూ దృష్టిసారించి మరీ వెతికాను. కానీ, నా సంశయములను పోగొట్టగల మహాత్ముడెవడూ నాకింతవరకూ లభించనేలేదు. నేడు మీ దర్శనం అయినందుకుగాను, సమస్త దేహములలోనూ ఉత్తమమైన ఈ మానవజన్మ లభించిన సత్ఫలితం పొందిన వాడనగుచున్నాను.

పునర్జాతం పునర్నష్టం సుఖ దుఃఖ భ్రమః సదా ।
అవశ్యం భావి పర్యన్త దుఃఖత్వాత్ సకలానపి ॥
సుఖాన్యేన అతి దుఃఖాని వరం దుఃఖాన్యతో, మునే ॥

ఓ మునీశ్వరా! ఈ సంసారమును గమనించాను. ఇదంతా సదా సుఖ-దుఃఖ భ్రమలచే నిండి ఉంటోంది. పుట్టడం-చావటం, మరల జన్మ - ఇదియే ఈ సంసారం యొక్క రూపం. చివరికి ఇది దుఃఖాలనే కలుగజేస్తోంది. ఈ సమస్త సంసార సుఖాలు వాస్తవానికి దుఃఖం రూపాలే అయి ఉన్నాయి. అందుచేత ఈ సంసారంలో ఉండే సుఖాల కంటే దుఃఖాలే కాస్తంత మేలు అని నా కనిపిస్తూ ఉంటుంది. ఎందుకంటారేమో? ఈ సంసార సుఖాలు మోసగించి మరీ సుదీర్ఘ దుఃఖ సముద్రంలోకి మావంటి జీవులను త్రోసివేస్తున్నాయి.

ఇంక ఎవరి సంగతో మనకెందుకు? నా సంగతే చూడండి. వయస్సుతో బాటుగా ఈ ప్రేగులు దంతాలు, కేశాలు శిథిలమైనాయి. అయినా కూడా ఈ నా బుద్ధి ఉత్తరోత్తరా పొందగల ఏవేవో భోగాల యందే ఇంకా తత్పరమై ఉంటోంది. అంతేగాని పరమ పురుషార్థం వైపుగా మరలటమే లేదాయె?

ఇక ఈ మనస్సు! ఇది అనేక రాగ- ద్వేషాలతో, దుష్ట - నికృష్ట సంకల్ప పరపరలతో వివేక రహితంగా ఉంటోంది. సాక్షి చైతన్యం గురించిన వివేకం దీనికి ఎంత ప్రయత్నించినా, విన్నా కూడా కలగటం లేదు. మహాత్మా! ఎండిన ఆకులు చిందరవందరగా రాలి క్రుళ్లి దుర్వాసనా భూయిష్ఠం అయినట్లు ఈ మనస్సు నిండా దుర్వాసనలు, దుష్ట వ్యాపకాలు, సారహీనమైన పదార్థాలు ఉంటున్నాయి. ఇక ఈ ఇంద్రియాలను చూద్దామా? "ఎక్కడో వినీలాకాశంలో ఎగిరే గ్రద్ద దృష్టంతా నేలపైన గల చచ్చిన క్రుళ్ళిన జంతుదేహంపైనే" - అన్నట్లుగా, ఈ ఇంద్రియాల దృష్టి అంతా దుష్ట దురభ్యాసాలవైపే! దుష్ట గ్రామంలోని జనుల వ్యాపకాల వలె ఈ ఇంద్రియాలు నిత్యం పాప వ్యాపకాలే కలిగి ఉంటున్నాయి.

నా ఈ 'బుద్ధి' ఉంది చూచారూ! బురద నేలలోని ఈత ముళ్ళ వలె ఇది అతి కుటిలమై మహాభయంకరంగా తయారయింది. ఆయుష్షంతా అజ్ఞానాంధకారంలో నిరంతర విషయ చింతనతో

గడచిపోతోంది. చీకటి రాత్రిలో ఒదిగి ఉన్న కళ్లులాగా వ్యర్థంగా ఆయువు గడచిపోతోంది. అంతరాంతరాలలో ఏదో తృష్ణ! ఆ తృష్ణ దేని కొరకో అర్థం కాక, ఏమి పొంది ఆ తృష్ణను వదిలించుకోవాలో నాకేమీ పాలుపోవటం లేదు. సృష్టిలో అత్యంత అవివేకమైనది ఈ తృష్ణయే. వ్యర్థమైన వాటిని ఆశ్రయించి నేను నిరర్థకంగా మిగిలిపోతున్నాను. ఈ వ్యధ, ఈ తృష్ణ, ఈ దురాశ ఎక్కడి నుండి నన్ను పట్టుకున్నాయో తెలియదు. నేను ఎటువైపు పయనిస్తున్నానో నాకే తెలియక చాలా దూరం వచ్చేశాను. ఎండిపోయిన పూతీగకు ఇక చిగురించటమేమి ఉంటుంది? ఈ ఆశలు తీరటమనే దశయే నాకు కనిపించటం లేదు.

రోజూ నిదరలేచి నిత్య నైమిత్తిక కర్మలు నిర్వర్తిస్తున్నాను. కొన్ని సాధనలకు ఉపక్రమిస్తున్నాను. మంచిది. అయితే ఏం లాభం? పెద్ద కొండంత దుష్కర్మల రాశి పేరుకొని ఉండగా నా ఈ చిన్న కార్యక్రమాలు ఏ మూలకి? చిన్న అంపంతో పెద్ద పర్వతాన్ని గీయటం ప్రారంభిస్తే ఆ మహాపర్వతం అరిగేది ఎన్నటికి చెప్పండి? పూర్వపు దుష్కర్మరాశి కరగాలంటే ఎన్ని జన్మలు ఎత్తాలి? అంతు కనబడడమే లేదు. భోగ వాసనలచే ప్రభావితుడనై నేను రోజులు గడిపేస్తున్నాను. అట్టి భోగ బీజ ప్రభావం చేత నా ఉత్తరోత్తర కర్మలన్నీ అనర్థము కొరకే నిషిద్ధమార్గంలో ప్రవర్తిస్తున్నాయి.

జీవితం చ జనే జీర్ణం నైవోత్తీరో భవార్ణవః
దినానుదినముచ్ఛూనా భోగాశా భయదాయినీ ॥

పుత్ర – కళత్ర – మిత్రాది వ్యవహారములలో పడిపోయి ఈ జీవితం రోజురోజుకూ క్రమంగా శిథిలమైపోతోంది. అనేక ఆసక్తులతో నేను ఉండగా ఆయుష్షు క్రమంగా కరిగిపోతోంది. ఇన్ని రోజులు గడచిపోయాయి. నేను సంసార సాగరాన్ని దాటనే లేదు. భోగాశ వదలనే లేదు. వదలక పోగా భయంకరమైన ఈ భోగాశ రోజు రోజుకూ అధికం అవుతోంది. ఈ పుత్ర–మిత్ర–పశు–ధనాదుల మధ్య రోజులు గడుపుచున్న నాకు ఒక రోజు "నాకేం? ఏమీ ఫరవాలేదు"... అనిపిస్తోంది. ఆ రెండవ రోజే "భారమైన బ్రతుకు ఎన్నాళ్ళురా?"... అని మరల ఇంతలోనే అనిపిస్తోంది. అనేక చింతలతో ధనము ఆర్జించి గొప్ప ఆపదలు తెచ్చి పెట్టుకుంటూ పోతున్నాను. అల్లంత దూరంలో గల చీకటిమయమైన బిలంలో విషసర్పముపై గల మణి యొక్క ప్రకాశపు ఆకర్షణలాగా ఈ సంసార విశేషాలన్నీ పైకి అందంగా, లోన విషపూరితంగా ఉంటున్నాయి. కష్టపడి ధనం కూడబెట్టడం, దొంగలకు – చుట్టాలకు – శత్రువులకు భయపడి దుఃఖిస్తూ రోజులు గడపటం... ఇదీ నా దైనందిన తతంగం.

ఈ నా చిత్తం అనేకమైన ఆశాతరంగాలతో మలినమై ఉన్నది. ఇది ఎక్కడెక్కడికో పరుగులు తీస్తోంది. అది పొందే ప్రయోజనమూ లేదు. దాని ఆరాటం తీరేదీ కాదు. సముద్రం ఎండిపోతే... ఇంటి నుండి చెంబులతో నీళ్లు తెచ్చి సముద్రభూమిని తిరిగి నింప గలమా? అట్లాగే ఈ చిత్తమును పూడ్చడం ఎట్లాగో నాకేమీ తెలియటం లేదు. ఎవరైనా వివేకులను ఆశ్రయిద్దామా? ఇంద్రియములకు వశీభూతుడనై అటూ ఇటూ తిరిగే నన్ను వివేకులు దగ్గరకు రానీయటం లేదు.

ఈ మనస్సు అపవిత్ర స్థానములలో తిష్ఠ వేసుకొని ఉన్నది. అసత్తైనట్టి ఘనకార్యములు మహా సంరంభంతో ప్రారంభించటంలో మాత్రము ఈ మనస్సు ఎప్పుడూ సిద్ధమే. ఇక దీని చంచలత్వం ఏమని చెప్పమంటారు? పెనుగాలి వీచికలను కదలికలు ప్రదర్శించే మఱ్ఱి ఆకులు నా ఈ మనోచాంచల్యం ముందు సిగ్గుతో తలవంచవలసిందే! ఇది క్షణక్షణం చస్తూ కూడా చావదు. ఇష్టమొచ్చినట్లు కుళ్లిన పదార్థాలపై వ్రాలుచుండే ఈగకన్నా ఈ మనస్సే నికృష్టం.

నా దేహంలో 'అహంభావము' అనే ఒక గొప్ప కల్పిత యక్షుడున్నాడు. అట్టి అహంభావంతో కూడిన అజ్ఞానం క్షయించదాయె! ఈ అజ్ఞానం 'కర్మలు' అను గడ్డి పరకలను భక్షిస్తూ 'వాసనలు' అనే చీకటి నూతిలో చిక్కుకొని ఉపాధులు గడపివేస్తోంది. ఆ నూతిలో నుంచి బయటపడేది ఎన్నటికి, ఎట్లా? వివేక సూర్యుని దర్శనం అయ్యేనా? మహాత్మా! అవస్తువులైన వాటిని వస్తువులుగా నమ్మి నేను అవివేక నిబిడాంధకారంలో చిక్కుకొని దిక్కుతోచక ఉన్నాను.

ఇంద్రియాణి నికృన్తన్తి, న జానే కిం భవిష్యతి!
శాస్త్రదృష్టిరపి ప్రాజ్ఞైః న ఆశ్రితా తరణాయ యా॥

ఈ ఇంద్రియాలు నన్ను నీచ స్థితులకు దిగజారుస్తున్నాయి. ముందుముందు ఏమి కానున్నదో నాకు అవగతం కావటం లేదు. చక్కటి ఉపాయాలతో ఈ ఇంద్రియములను జయించిన ప్రాజ్ఞులను నేను శరణువేడటం లేదు. ఈ సంసారంలో కొట్టుకొంటూనే ఉన్నాను గాని ఉపాయం ఆశ్రయించటం చేతకావడం లేదు. నాకున్న కొద్దిపాటి శాస్త్ర దృష్టి నన్ను వాసనలకు మరికొంత దాసోహంగా చేయిస్తున్నాయి గాని, నన్ను ఉద్ధరించటం లేదు. నా శాస్త్ర దృష్టి నాలోని దోషదృష్టుల కారణంగా నన్ను మరికొంత గ్రుడ్డివానిగా చేస్తోంది.

విన్నారుగా మహాత్మా! నా పరిస్థితి ఇది. మీరడిగిన దానికి సమాధానంగా నా ప్రస్తుత స్థితి చెప్పుకొన్నాను. ఈ ప్రకారంగా అజ్ఞానంలో నిమగ్నుడనైన నేను శ్రేయము అయిన మోక్షము సంపాదించుకోవడానికి ఏమి చేయలో సెలవు ఇవ్వండి. తమవంటి లోక గురువులు ఇప్పుడు నాకు లభించడం ఒక గొప్ప భాగ్యం. మీ దయచేత మాత్రమే ఈ మీ శిష్యుని చిత్తములో పేరుకొని ఉన్న అజ్ఞాన మంచుకొండ కరగగలదు. సాధు పురుషులగు మీ వాక్కు, ఉపదేశము నాయందు ప్రవేశించి నా సంసార భ్రమను ఉపశమింపజేయగలందులకు నన్ను కరుణించండి.

మీ పాద పద్మములకు సాష్టాంగ దండ ప్రణామం ఆచరిస్తున్నాను.

❖

ఓ రామచంద్రా! ఇట్లా పలికి ఆ మంకి అను బహుదూరపు బాటసారి నా పాదములపై వ్రాలాడు. కనుల వెంట జాలువారిన కన్నీళ్లు నా పాదాలను స్పృశించాయి.

❖❖❖

3. ఏదైతే తెలుసుకొంటోందో - అదియే తెలియబడవలసినది!

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ మంకి మహాశయా! నీవు చెప్పినదంతా విన్నాను. ఒక్క విషయం! నీవు ఇప్పటికి కూడా దుఃఖించవలసిన అగత్యమేమీ లేదు. ఆనందమే నీ స్వభావం గాని దుఃఖం నీ స్వభావం కానేకాదు. మరి? సరి అయిన విశ్లేషణకు ఉపక్రమించనందు చేత ఆపాదితమైన దుఃఖం వచ్చిపడింది. ఎందుచేతనో విను.

కేవలం మిథ్యాభూతాలై ఉన్న ఒక 4 విశేషాలు ఈ ప్రపంచంలో అవిద్యచే విజృంభించటం జరుగుతోంది.

సంవేదనం భావనం చ, వాసనా కలనేతి చ
అనర్థాయేహ శబ్దార్థే విగతార్థో విజృంభతే ॥

1. అనుభవం (సంవేదనం) : ఇంద్రియములచే ఏర్పడే విషయ భోగరూపమైన అనుభవం
2. భావన : విషయాలు ఉన్నప్పుడు, లేనప్పుడు కూడా ఆయా విషయాల గూర్చి భావన
3. వాసన : చిత్తము నందలి విషయముల గురించి 'వాసన'
4. కలన : మరణకాలంలో కూడా వెంటనంటి ఉన్నటువంటి విషయాలకు సంబంధించిన స్మృతి

మంకి: స్వామీ! మీరు చెప్పినట్లు ఈ నాలుగు... ఈ జీవుణ్ణి జీవితపర్యంతం వెంటనంటి ఉంటున్న మాట వాస్తవమే. అయితే ఈ నాలుగింటిని 'అవిద్య' అని అంటున్నారు కదా! 'అవిద్య' అనగా?

శ్రీవసిష్ఠ మహర్షి : ఏది మిథ్య అయి ఉండి కూడా... ఒకానొక వ్యాపక దృష్టికి అత్యంత ఘనీభూత మైన సత్యం వలె అనిపించటం జరుగుతోందో... అద్దానిని 'అవిద్య' అని పిలుస్తున్నారు.

మంకి : మీరు చెప్పిన అవిద్య ఎందుచేత ఏర్పడుతోంది? 'సంసారం' అనగా ఏమిటి?

శ్రీవసిష్ఠ మహర్షి : సమస్త దోషముల యొక్క ఆశ్రయమే సంసారము.

1. విషయముల అనుభవం 2. వాటియొక్క భావన... ఈ రెండే సమస్త దోషాల ఆశ్రయం. అయితే... బ్రహ్మం గురించిన చింతన చేస్తూ, విషయాలలో ఏర్పడి ఉన్న దోషాలను గమనిస్తూ గ్రహిస్తూ ఉండగా... అట్టి వివేకికి 'సంసార భ్రమ' వాసనాసహితంగా క్రమంగా స్వయంగా క్షయించి పోగలదు. చూచావా? ఈ 'సంసారం' అనబడుదానిని వాసనయే పరిపోషించి వృద్ధి చెందింపజేస్తోంది. ఈ ప్రపంచం అనునది మనుజుని వాసనా రూపమే సుమా!

మంకి : ఈ ప్రపంచము భౌతికమగు వస్తు సమన్వితమా? వాసనామాత్రమా?

శ్రీవసిష్ఠ మహర్షి : వస్తు సముదాయంగా అనిపించటానికి కారణం? వాసనయే! కాబట్టి, ఈ ప్రపంచం వాసనామయమే. అజ్ఞానావృతం అయినట్టి జీవ చైతన్యం నందు వాసనా రూపమగు సంసారం ఉదయిస్తోంది. 'శూన్యత్వం' కంటే వేరుగా ఆకాశం అనేది ఎక్కడైనా ఉన్నదా?... లేదు. అట్లాగే యథార్థానికి ఈ ప్రపంచంలో బ్రహ్మం మాత్రమే ఉన్నది. బ్రహ్మానికి భిన్నంగా మరింకేమీ లేదు. అట్టి బ్రహ్మం అద్వైత నిర్మల – చిన్మాత్ర తత్త్వమైయున్నది.

తెలుసుకునేది (చిత్, చిన్మాత్రం); తెలియబడేది (వేదనం). చిన్మాత్ర రూపమగు వేదనాత్మ అంతటా, అన్నిటా ఏర్పడి ఉన్నది. అది సదా సర్వత్రా స్ఫురించుచున్నప్పటికీ దేహ – ఇంద్రియాదుల విషయముల కంటే అన్యముగా భాసించటం లేదు. అంతే కాదు.

దృశ్య రూపముగా స్ఫురించేదంతా భ్రాంతియే. ఈ దృశ్య రూప భ్రాంతికి రెండు విశేషాలు ఉన్నాయి– 1. ఆవరణ శక్తి ప్రాధాన్యమగు అవిద్య, 2. విక్షేప శక్తి ప్రాధాన్యమగు భ్రమ.

ఈ అవిద్య – భ్రమ ...అను ఉభయ రూపములే ఈ సంసారముగా వ్యాపించి ఉన్నది.

మంకి : ఈ జగత్తు సత్తా? అసత్తా? ఇది ఎట్లా ఎందుచేత సిద్ధించింది?

శ్రీవసిష్ఠ మహర్షి : ఈ జగత్తు అసత్తు మాత్రమే. అయితే సత్తు వలె భాసిస్తోంది. ఆత్మజ్ఞానం యొక్క లేమిచే (ఆత్మ యొక్క సమాచారాన్ని ఏమరచి ఉండటం చేత) ఈ 'జగత్తు' అనబడేది సిద్ధించింది. పసిబాలుడికి, "అది దయ్యం కాదు. పగటి పూట కనబడే చెట్టు మాత్రమే"... అని తెలిసిపోగానే దయ్యమునకు సంబంధించిన భయం మొదలైనవి తొలగుతాయి చూచావా? అట్లాగే జ్ఞాన వికాసం చేత ఈ జగత్ భ్రమ క్షణకాలంలో నశించగలదు.

మంకి : "జ్ఞానం యొక్క వికాసం"...అనుదాని తదనంతరం ఈ దృశ్యం ఏమి కానున్నది?

శ్రీ వసిష్ఠ మహర్షి : అనేక ప్రదేశాలలో ప్రవహిస్తూ పోతున్న నదుల జలమంతా సముద్రం చేర గానే ఏమి అవుతోంది?

మంకి : సముద్రంలో జేరిన తరువాత "ఈ జలం ఈ నదిది" అనే గుర్తు కూడా ఉండదు కదా!

శ్రీవసిష్ఠ మహర్షి : అవునా? అట్లాగే ఆత్మజ్ఞాన ప్రకాశముచే ఈ దృశ్యం అదృశ్యం అయిపోతుంది. సర్వ దృష్టులు సమసిపోగా... ఇక బోధరూపమగు ఆత్మయే శేషిస్తోంది. అనగా సర్వ దృశ్యములు బోధమయమగు ఆత్మరూపత్వమునే పొందుచున్నాయి.

మృన్మయం తు యధా భాణ్ణం మృచ్ఛూన్యం నోపలభ్యతే
చిన్మయాదితయా చేత్యం చిచ్ఛూన్యం నోపలభ్యతే॥

ఒకాయన కుమ్మరి వృత్తి నిర్వర్తించే ఒక మిత్రుని దగ్గిరకు ఉబుసుపోకగా వెళ్లి ఇట్లా అడిగాడు.

ఆ వచ్చిన పెద్ద మనిషి: మిత్రమా! ఉదయం ఈ అరుగు మీద కొంత మట్టి ఉండాలి కదా? ఏమైంది?

కుమ్మరి : ఇదిగో ఈ కుండ.

పెద్ద మనిషి : ఓహో! ఈ కుండ తెచ్చి ఇందులో మట్టిని ఉంచావా? (ఆ కుండలోకి తొంగి చూచి), అరె కుండలో ఆ మట్టి లేదే?

కుమ్మరి : కుండలో కాదయ్యా! ఈ కుండ ఆ మట్టే.

పెద్దమనిషి : నేను మట్టిని అడుగుతుంటే నీవు ఖాళీ కుండను చూపిస్తావేం?

కుమ్మరి : ఎందుకంటే ఆ మట్టే ఈ కుండగా తయారుచేశాను కనుక!

ఆ కుమ్మరి చెప్పుచున్నట్లు మట్టియే మట్టికుండగా అయింది. కుండంతా మట్టి తప్పితే ఇంకేమీ లేదు. అట్లాగే చిన్మయం యొక్క భావాభావాలే ఈ జగత్తు యొక్క ఉనికిలేములు. కనుక, ఈ జగద్రూపదృశ్య విషయమంతా సచ్చిన్మాత్రమగుపరమాత్మ తప్పితే మరింకేమీ అన్యంగా లేదు.

మంకి : అట్లాగా మహర్షీ! ఈ జగత్తే జీవునకు బంధము అని నా కనిపిస్తుంటే, మీరేమో 'ఈ జగత్తే పరమాత్మ'... అని ప్రతిపాదిస్తున్నారే! ఆశ్చర్యం! సరే, "ఈ జగత్తు పరమాత్మమయం" అనేది ఎట్లాగో విశదీకరించమని నా ప్రార్థన.

శ్రీవసిష్ఠ మహర్షి : ఈ ప్రపంచం దేని చేత ఎరుగబడుతోంది? జ్ఞానంచే కదా! జ్ఞానం చేత తెలియబడేది 'జ్ఞేయం' కదా! "జ్ఞానం చేత ఏది తెలియబడుతోందో అది జ్ఞానరూపం" అని గమనించు.

జ్ఞానము లేకపోతే జ్ఞేయమే (తెలియబడేది) ఉండేది కాదు (లేక) తెలివి అనేది మొట్టమొదటే ఉండి ఉండకపోతే, ఇక 'తెలియబడేది' అనుదానికి ఉనికియే ఏర్పడదు కదా! కనుక,

బోధావ బుద్ధం యదృస్తు బోధ ఏవ తదుచ్యతే ।
నా బోధం బుధ్వతే బోధో వైరూప్యాత్తేన నాఽన్యతా ॥

తెలుసుకొనుచున్న దాని 'తెలివి' ని అనుసరించే తెలియబడేది ఉంటోంది. తెలుసుకొనేది లేకపోతే 'తెలియబడేది' అనే దానికి ఉనికియే ఉండేది కాదు. కనుక, తెలుసుకొనేది తెలియబడే దానిలో తెలివి రూపంగా ఏర్పడి, ఆ తదనంతరం మాత్రమే 'అనుభవం' అనే సారరూపం ధరిస్తోంది.

కాబట్టి 'జ్ఞాన జ్ఞేయములు ఒక్కటే' అనే సిద్ధాంతం ఒనగూడుతోంది కదా! 'బ్రహ్మం' అనే రూపం గల ద్రష్ట యొక్క స్వయం పరికల్పిత దర్శన 'చమత్కారమే ఈ దృశ్య జగత్తు' అని వేదాంత శాస్త్ర నిర్ణయం.

ద్రష్ట - దర్శనం - దృశ్యం అనే మూడిటిలో, జాగ్రత్తగా పరిశీలించి చూస్తే 'జ్ఞానమే సారం' అని తెలిసిపోతోంది. జ్ఞానానికి భిన్నంగా ఏదైనా ఉన్నదని భావిస్తే ...అది 'ఆకాశ పుష్పం' అనే శబ్దంలాగా అర్థరహితం. ఆకాశం అంటేనే శూన్యం. శూన్యంలో పుష్పం ఉండటమేమిటి? 'శూన్యంలో జగత్తు' అనేది కూడా మొదలే అర్థరహితం.

మంకి : "చూచేవాడు చైతన్యం. ఈ చూడబడే జగత్తు జడం" అని ఎందుకు అనగూడదు? ఎందుకంటారా? ఈ జగత్తు చూచేవానిని అనుసరించే ఉన్నదని నేనూ ఒప్పుకుంటున్నాను. కాని జగత్తే లేకపోతే "చూడబడేది" అనే వ్యవహారమే ఉండేది కాదు కదా! కాబట్టి చూచేది - చూడబడేది వేరు వేరేనని ఎందుకు అనుకోకూడదు?

శ్రీవసిష్ఠ మహర్షి : భలే ప్రశ్న వేశావయ్యా! నీ ప్రశ్నకు సమాధానం విను. తెలుసుకొనేది- తెలియబడేది... ఈ రెండూ సజాతీయమా? విజాతీయమా? అనగా చైతన్యం, జడం అనేవి ఒకదానికి మరొకటి సంబంధించినవా? కావా?

మంకి : వేరు వేరైనవే కదా! అనుభవజ్ఞుడు వేరు - అనుభవము వేరు కదా!

శ్రీవసిష్ఠ మహర్షి : వేరు వేరైనవైతే ఆ రెండూ ఎందుకు కలుస్తాయి? ద్రవం ద్రవాదులతోనే కలుస్తుంది కాని మట్టితోనో, రాయితోనే కలిసిపోదు కదా! తెలుసుకునే చైతన్యం – తెలియబడే జగత్తులకు పరస్పర సంబంధం లేకపోతే అవి రెండు ఒకచోటికి వచ్చి ఎట్లా ఏకరూపం (అనుభవ రూపం)గా పరిణమిస్తున్నాయి?

మంకి : మీరు చెప్పినట్లు తెలియబడే జగత్తుకు, తెలుసుకునే 'చైతన్యం'నకు ఒకదానితో మరొకదానికి సంబంధం ఉండబట్టే కలుస్తున్నాయి. ఒకటి రెండవదానికి సంబంధించినదే కాకపోతే అవి ఒక దానితో మరొకటి కలియవు. ఆ రెండింటిలో అనుభవ రూపమైన ఏకత్వము అంతర్లీనమై ఉంది.

శ్రీవసిష్ఠ మహర్షి : ఆ రెండిటిలోను గల ఏకత్వమేదైతే ఉన్నదో ఆ ఏకత్వమునో "బోధ స్వరూపరసం" అని పిలుస్తున్నారు. చెక్క–రాయి మొదలైన వాటిలో సద్రూపమగు బోధరూపత్వం (బోధ స్వరూపం, బోధతత్త్వం) ఉండకపోతే కుందేటికి కొమ్ము లేనట్లుగా... 1. చెక్కగా–రాయిగా అనుభవించేవాడు. 2. చెక్క–రాయిగా అనుభవించబడేది అను రెండిటి మధ్య 'అనుభవము' అనేది ఏర్పడేదే కాదు.

ఈ విధంగా బోధ (లేక జ్ఞానము)చే ఈ దృశ్యమంతా కేవల బోధరూపమే అగుచున్నది.

మంకి : ఈ దృశ్యంలో రెండు వస్తువులు ఒకదానికి మరొకటి వేరువేరైనట్లు (అన్య–అన్యంగా) కనిపిస్తున్నాయి కదా!

శ్రీ వసిష్ఠ మహర్షి : అన్యంగా భాసించినప్పటికీ, ఆ రెండింటిలో బోధ (లేక జ్ఞానం) అనునది ఒకే రీతిగా ప్రవేశించి 'అనుభవం' అను ప్రదర్శనం నీవు గమనించు. "ఇది చెట్టు–అది పుట్ట" అని తెలుసుకుంటున్న తెలివి ఒక్కటే కదా! చెవితో వింటున్నట్టి–కళ్ళతో చూస్తున్నట్టి తెలివి ఒక్కటే కదా!

ఈ సిద్ధాంతం (లేక) సూత్రం నిరూపించటానికి ఇక్కడి 'జల–తరంగాలు' అనే దృష్టాంతం తీసుకుందాం. నీవు సముద్రం ఒడ్డున కూర్చున్నావు. ఇప్పుడు ఎడంచేతి వైపు కుడిచేతి వైపు అనేక తరంగాలు కనిపిస్తున్నాయి. ఆయా తరంగాలన్నీ వేరువేరా?

మంకి : అవును, వేరు వేరే.

శ్రీవసిష్ఠ మహర్షి : అయితే ఎడంచేతి వైపు తరంగాలు ఎట్లా ఏర్పడుతున్నాయి?... జలం యొక్క స్పందన చేత. మరి... కుడివైపు తరంగాలు? అదే జలం యొక్క స్పందన చేతనే కదా! స్పందన (కదలిక) వేరైనా అన్ని తరంగాలు సముద్ర జలమే కదా!

అట్లాగే వ్యాప్తమగు జగద్రూపదృశ్య మంతా బోధరూపమే అయి ఉన్నది. అనగా, వేరువేరుగా తెలియబడే విశేషాలన్నీ ఒకే 'తెలివి' యొక్క ప్రదర్శనలే అయి ఉన్నాయి. అయితే ఇక్కడ మరో చమత్కారం. "తెలివి" (బోధ, లేక జ్ఞానం) 'తెలియబడేది' గా (లేక బోధిత్వంగా, లేక జ్ఞేయంగా) మారిపోతోందా? లేదు.

తెలివి (జ్ఞానం) తెలివిగానే ఉంటూనే 'తెలియబడేది' అనే దర్శనమును మాత్రం నిర్వర్తిస్తోంది. ఒక కొయ్యముక్కపై లక్కను వేడిచేసి పోశామనుకో, అవి రెండూ కలసి ఉంటున్నా... వేరువేరుగానే

ఉండి ఉంటాయి కదా! కానీ 'బోధ' యందు తెలియబడే "ఆయా వేరువేరు విషయాలు" అనేది లేదు. కనుక "సమస్తము ఏకమే! అనేకం కాదు!" అనునది ఇక్కడ సిద్ధించుచున్నది.

కానీ, కొయ్య–లక్క అనే రెండిటికి 'సంయోగం' అనుదానిచే ఏకత్వం ఉండవచ్చు గాక! ద్రష్ట – దృశ్యాల సంబంధం అట్టిది కూడా కాదు. ద్రష్ట ద్రష్టగానే ఉంటున్నాడు. కానీ దృశ్యాన్ని పొందు చున్నాడు. దృశ్యం ద్రష్ట యొక్క కల్పనను అనుసరించి ఉంటోంది. ద్రష్ట యొక్క బోధ స్వరూపమే దృశ్యంలో ప్రవేశించి ఉన్నది. ద్రష్ట లేకపోతే దృశ్యమే లేదు. కనుక ద్రష్ట–దృశ్యం ఒక్కటే.

అట్టి అన్యోన్య–అనన్యత్వానుభవమే నిజమైన ఏకత్వము.

కాబట్టి ఓ ప్రియ బాటసారీ! మంకీ! ఇక్కడంతా ఏకత్వమే తాండవిస్తోంది గాని, అనేకత్వము లేనేలేదు. ఒకవేళ ఇంకా అనేకత్వము అనుభవమవుతుంటే ... అందుకు కారణం ఈ దేహాదుల పట్ల సుదీర్ఘ కాలంగా ఏర్పరచుకొని ఉన్న అహంభావన చేత మాత్రమే సుమా! "ఈ దృశ్యమంతా ఏదై ఉన్నదో, అదంతా నేనే" అనునదే 'సో஽హమ్' భవం (లేక) అద్వైతానుభవం.

ఇక్కడ ఒక రహస్యం (లేక) చమత్కారం.

"అహమ్॥ ఇత్యేవ బంధాయ, "నా஽హమ్" ఇత్యేవ ముక్తయే
ఏతావన్మాత్రకే బంధే స్వాయత్తే కిమ్ అశక్తతా?

ఈ దేహాదులందు ఏర్పరుచుకొన్న అహంభావనయే ఏకత్వానుభవమునకు ప్రతిబంధకంగా వచ్చి కూర్చుంటోంది. "ఈ దేహాదులు నేను కాదు" అను నా஽హంభావనను ఆశ్రయించావా, అప్పుడు నిన్ను పట్టి పీడిస్తున్న ద్వైతం నుండి నీకు ముక్తి కలుగుతుంది. "నేను శరీరాదులు కాదు. ఈ శరీరంలో గల ఇంద్రియాలకు విషయమగుచున్న జగద్విషయాలు నేను కాదు, నాది కాదు"... అని అనుకుంటూ ఉన్నంత మాత్రం చేత ఇక్కడ అనుభవమగుచున్న బంధం తనంతట తానే స్వయంగా తొలగిపోగలదు. ఈ మాత్రం ప్రయత్నం చేయటానికి ఏం కష్టం? ఇది కుదరదని అనుకో దలిస్తే అట్టి జీవుని ఈ సంసారం నుండి ఎవరూ కాపాడలేరు.

ఒకాయనకు మెల్లకన్ను దోషంచేత రెండవ చంద్రుడు కనిపిస్తున్నాడనుకో... "ఆ రెండవ చంద్రుడు ఎప్పటి నుండి ఎవరిచే సృష్టించబడి కనిపిస్తున్నాడు?" – అనే ప్రశ్నకు సమాధానమే మున్నది? అసలు ఆ రెండవ చంద్రుడు ఉంటే కదా, ఒకప్పటి నుండి ఉండటం? "మృగతృష్ణలో జలం ఎంత కాలం నుండి ఉన్నది?" అన్న ప్రశ్నకు సమాధానం ఏముంటుంది? మృగతృష్ణలో జలం భ్రమ మాత్రమే కదా! అలాగే 'అహంభావం' అనేది అసత్తుగా ఆవిర్భవించినదని, అసత్తు కాబట్టి ఆవిర్భవించనే లేదని కూడా అంటూ ఉంటారు. అట్టి దేహాహంకారమునకు అనుభవమయ్యే ఈ దృశ్య జగత్తు, అట్టి దృశ్య జగత్ సంబంధమైన అహంకారం కూడా అసత్తుల్యం మాత్రమే.

"మమే஽దమ్" ఇతి బంధాయ "నాహమ్" ఇత్యేవ ముక్తయే
ఏతావత్ మాత్రకే వస్తుః ఆత్మాయత్తే కిమజ్ఞ తా?

ఇదమ్ మమ (ఇది నాది)...అను మమత్వ బుద్ధి – ఇదే బంధానికి కారణం. నాఽహమితి (ఇవి నావి కావు) – అను మమత్వరాహిత్యమే బంధముక్తి.

1.ఇవి నావి అని తలచటం, 2. ఇవేవీ నావి కావు అని తలచటం... ఈ రెండూ ఎవరికి వారికే తమ చేతిలోనే ఉన్నది కదా! కనుక బంధము-బంధ విముక్తి ఎవరికి వారికే వారి చేతిలోనే ఉన్నది. 'నావి కావు' అనుబంధ విముక్తి ప్రయత్నంలో 'అయ్యో! నేను అజ్ఞానిని కదా'... అని వాపోవలసిన అగత్యమేమిటి? ఇందులో 'తెలియకపోవటం' అనే ప్రసక్తి ఎక్కడిది?

మంకి : ఇవేవీ నావి కావు – అని అనుకోగానే మోక్షం సిద్ధిస్తుందని మీరు ప్రవచిస్తున్నారు. కానీ అది అంత సులభమంటారా? ఈ సందర్భంగా లోక ప్రతీతమైన కొన్ని సిద్ధాంతాలు ఇక్కడ ఉదహరించి, వాటి పట్ల అనుభవం దృష్ట్యా మీ అభిప్రాయాలు చెప్ప వేడుకొంటున్నాను.

1. కుండ-బదర న్యాయం : ఒక రేగు పండు కుండలో ఉన్నది. ఆ రేగు పండు కుండచే కప్పబడి ఉండటం చేత మామూలుగా కనిపించటం లేదు. కుండలోకి చూడకుండా "రేగుపండు కనిపించడం లేదు కాబట్టి లేదు. కుండ కనిపిస్తోంది కాబట్టి ఉన్నది" అనేది యుక్తియుక్తం కాదు.

అట్లాగే సత్యమగు ఆత్మ అసత్యమగు అహంకారం నందు ప్రవేశించి ఉన్నది. అహంకారం చేత కప్పబడి ఉండటంచే ఆత్మ కనిపించడం లేదు. అహంకారం యొక్క అంతరంలోకి తొంగిచూస్తే ఆత్మ అగుపిస్తుంది.

2. ఘటాకాశన్యాయం : ఆకాశం అంతటా ఉన్నది. ఒక కుండలోను, బయట కూడా ఉన్నది. కుండ ఉన్నంత కాలం కుండ వల్ల – ఘటాంతరాకాశం, ఘట బాహ్యాకాశం – ఏర్పడుచున్నాయి. ఘటం పగిలితే ఉభయాకాశాలు ఏకమౌతాయి. అట్లాగే అహంకారం ఆత్మను జీవాత్మగా, పరిణమింపజేసింది. అహంకారం తొలగితే (కుండ పగిలితే ఉభయాకాశాలు ఏకమగునట్లు) జీవాత్మ – పరమాత్మ ఏకమౌతాయి. అప్పటిదాకా జీవుడు జీవుడుగానే ఉంటాడు.

3. జడాంశ-బోధాంశ సమాగమం : 1.జడము, 2.బోధ. ఈ రెండు ఎక్కడ కలుస్తాయో అక్కడ 'ఆత్మ' అనే నూతన విషయం ఏర్పడుచున్నది. అవి విడిపోతే ఆత్మ అనేది ఉండదు. ఆత్మ జడాంశంలో జడంగా, బోధాంశంలో బోధ రూపంగా ఉండి ఆ రెండూ కలసినప్పుడు స్ఫురిస్తోంది. కలియనప్పుడు నిర్విషయమై ఉంటోంది. (ఇది జైమిని మతానుయాయుల సిద్ధాంతం)

4. అనేకాత్మవాదం : ప్రతి జీవికి ఒక ఆత్మ ఉన్నది. ప్రతిజీవి ఒక్కొక్క ప్రత్యేక ఆత్మయే. ఇందులో జంతు ఆత్మలు, మానవ ఆత్మలు, దేవతా ఆత్మలు వేరు వేరుగా ఉన్నాయి. వీటన్నిటికీ పరమాత్మ సర్వాధికారి. జీవాత్మ వాసనలచే కప్పబడి ఉంటుంది. పరమాత్మ నిర్మలమై, వాసనారహితమై ఉంటుంది.

ఈ నాలుగే కాక, ఇంకా అనేక సిద్ధాంతాలు ప్రచారంలో ఉన్నాయి. వీటివీటిపై మీ ప్రవచనమేమిటో, ఇందులోని సత్యాసత్యాలు ఏమిటో వాటిని ఆశ్రయించటంచే ఆ తదనంతరం పర్యవసానమేమిటో విశదీకరించండి.

శ్రీవసిష్ఠ మహర్షి : ఆత్మ అపరిమితమైనది. ఈ జీవుడు దేహ-మనో-బుద్ధి స్వరూపుడు కాదు. దేహ-మనో-బుద్ధులు పరిమితమైనవి. కనుక, 'కుండలో రేగుపండు'... అనే 'కుండ బదర న్యాయం' యుక్తియుక్తం కాదు. అపరిమితమైన ఆత్మ పరిమితమగు దేహంలో దాగుకొని ఉండటమేమిటి? అది అసమంజసం.

ఆత్మ అపరిచ్ఛేద్యమైనది. అది దేహాదులచే పరిచ్ఛేదం పొందటమేమిటి? కుండలో ఆకాశం - బయటగల ఆకాశం... అనే ఘటాకాశ న్యాయం అనేది కూడా ఆత్మకు వర్తించజాలదు. ఆత్మకు 'ఈ దేహం-ఆ దేహం' అనే పరిభేదం, విభాగాలు ఉండవు. ఆత్మ సర్వదా అఖండము. (అది నిరూపిస్తోంది కనుకనే ఈ గ్రంథానికి 'అఖండ రామాయణం' అనే పేరు వచ్చింది). అది సర్వదా దేహ-మనో-బుద్ధ్యాదులకు అప్రమేయం. (వాటితో దేహానికి ప్రమేయం లేదు). కనుక 'ఘటాకాశ న్యాయం' అనేది కూడా ఆత్మకు యుక్తియుక్తం కాదు.

ఆత్మకు వేరుగా జడాదులకు ఉనికియే లేదు. 'జడము' అనే అనుభవం ఎవరికి? 'జడము' అనేది ఆత్మయొక్క అనంత అనుభవ పరంపరలలో ఒకానొకటేగాని జడమునకు (తెలియబడుదానికి) వేరుగా ఉనికి లేదు. ఆత్మ అనుభవించేది. జడము అనుభవించబడేది. అయితే, ఆత్మకు మాత్రమే ఉనికి ఉన్నది. ఆత్మ ఎక్కడ తన సత్‌విన్యాసం ప్రకటిస్తే అక్కడ మాత్రమే జడానుభవం అనేది భావాభావాలను అనుసరించి ఉండగలదు. కనుక "జడ-బోధల కలయికచే 'ఆత్మ' అనేది అనుభవమౌతోంది"... అనేది యుక్తి వాక్యం కాజాలదు.

'ఆత్మ ఉండటంచేత 'జడము' అనే ఒకానొక అనుభవంగా ఉండగలుగుతోంది'... అనునదే అసలైన సిద్ధాంతం. వాస్తవానికి 'జడము-అజడము'... అనే రెండు లేవు. ఉన్నట్లు కనబడటమంతా స్వప్న సదృశ్యమే. "ఆత్మ యొక్క ఒకానొక స్వభావమే జడము"... అనేది కూడా కుదరనది కాదు. "ఆత్మయొక్క దృష్టికి ముందే 'దృక్' స్వరూపమగు ఆత్మ ఉన్నది. 'స్వప్నద్రష్ట' లేదుగాని... స్వప్నం ఉన్నది".... అనే మాటకు అర్థం లేదు కదా! అట్లాగే ద్రష్ట లేకపోతే జడము లేదు, అజడము లేదు, జగత్తు లేదు.

'అనేక ఆత్మలు' అనేది దేహము దృష్ట్యా, మనస్సు దృష్ట్యా, బుద్ధి దృష్ట్యా అనిపించవచ్చు గాక! కానీ, ఆత్మ దేహ-మనోబుద్ధులకు మునుముందుగాని ఉన్నది.

❖

కనుక ఓ ద్విజుడా! నీవు అఖండం, అప్రమేయం, నిత్యం, సత్యం, దృశ్యరహితం, సర్వం అగు ఆత్మవే అయి ఉన్నావు. అట్టి నీ యొక్క సత్ చిత్ స్వరూపమునకు మనోబుధ్యహంకారాది ఏ జాడ్యమూ లేదు. 'కాదు. అనేక ఆత్మలు ఉన్నాయి. అందులో నేనొక ఆత్మను'... అనే రూపం గల అనేకాత్మవాదాన్ని ఆశ్రయించి ఉన్నావా.. స్వవాసనల చేత, దేహాభిమానం చేత ఆత్మతత్త్వమును ఏమరచి పర్వతం మీద నుండి క్రిందపడే శిలవలె ఉచ్చ-నీచ ఉపాధి పరంపరల ప్రవాహంలోకి జారిపడతావు సుమా! "వాసనలచే ఇటూ అటూ కదలే మనస్సే తన స్వభావంగా భావించే జీవుడు పొందే దుఃఖ పరంపరలను లెక్కించనలవి కాదు"... అని నా హెచ్చరిక.

తమ తమ వాసనలచే, దేహ అభిమానం చేత రాగాది ఆయా రసములందు అనురక్తులగు జనుల చేతితో కొట్టబడిన బంతి వలె అనేక జన్మలందు పరిభ్రమిస్తున్నారు. చిరకాల క్లేశాలచే ఎంతగానో శైథిల్యం అనుభవిస్తున్నారు. కాలాంతరమున స్థావర - క్రిమి - కీటకాది అన్య రూపత్వమును అవధరిస్తున్నారు.

ఓ బాటసారి! మంకీ! నీవు ఆత్మస్వరూపుడవేగాని, దేహ స్వరూపుడవు కాదు. ఇందులో నీవు సందేహించవలసినదేమీ లేదు. ఇక దుఃఖమెందుకో చెప్పు?

❖❖❖

4. బ్రహ్మామయమ్ జగత్

మంకి : అయితే, మునీంద్రా! మరి ఆత్మయే నా స్వరూపము అయి ఉండగా నాకు 'అసంతృప్తి'... అనే స్థితి, 'జడదేహధారిని' అనే భ్రమ ఎందుచేత, ఏ ప్రభావం చేత కలుగుచున్నాయి?

శ్రీవసిష్ఠ మహర్షి : ప్రతి జీవునికి ఎదురుగా రెండు మార్గాలు ఉన్నాయి. ఏ మార్గము ఉచితమో, ఏది అనుచితమో అతడే తేల్చుకోవాలి. అయితే, ఆ రెండు మార్గాలు ఏమిటో ఇక్కడి విశదపరుస్తాను.

1. ఆత్మతత్త్వ మార్గం , 2. సంసార మార్గం.

సంసార మార్గం : నేను వేరు - నీవు వేరు - తదితర జీవులు వేరు. నేను ఒక మానవుణ్ణి, అది ఒక కీటకం, ఈయన ఒక బ్రహ్మదేవుడు... ఈ సంసార మార్గంలో పయనించే జీవుడు స్థావర-క్రిమి-కీటకాది జన్మరూపమగు పరిస్థితులకు లోను అగుచున్నాడు. ఛేదన-భేదనాలు, ఆకలి-దప్పులు, జనన-మరణాలు ఆతనిని ఆయా దేహాదులతోబాటే వెంబడిస్తున్నాయి. 'అడవిలో ఉండే అనేక శిలలులాగా ఈ సమస్తం పరస్పరం వేరు వేరు' అను అనుభవం ఎక్కడి నుండి బయల్వెడలుతోంది? ఈ జీవుని భావనలో నుండే! భావన చిత్తం లోంచి బయల్వెడలుతోంది. చిత్తం అంధత్వంతో కూడి, పూర్వవృత్తాంత వాసనలతో నిండినదై, రాగ ద్వేషములనే రంగులు పులుముకున్నదై ప్రవర్తిస్తోంది. చిత్తమే భావనకు మూలం.

అహో!బత! విచిత్రాణి! వాసనావశతో అవశైః ।
భూతకైరనుభూయన్తే, సుఖదుఃఖాని జన్మసు ॥

ఆహా! ఏమి ఆశ్చర్యం! ఆత్మయే తమ స్వరూపమై ఉండి కూడా ఈ జీవులు తమ వాసనలకు వశులై వివిధ జన్మలు, ఆ జన్మలలో అనేక చిత్ర-విచిత్ర సుఖ-దుఃఖాలు అనుభవిస్తూ ఉన్నారే! దేని యొక్క ప్రభావం చేత మిథ్యాభూతాలైన త్రిపుటి రూప పదార్థములను (ద్రష్ట-దర్శనం-దృశ్యం, వినేవాడు-వినికిడి-వినబడేది మొదలైనవి)... ఈ జీవుడు అనుభవిస్తున్నాడో ...అట్టి వాసన ఎంత భయంకరమైనది!

ఈ ప్రపంచంలో జ్ఞానులు ఉన్నారు. అజ్ఞానులు ఉన్నారు. ఆ ఉభయులు కలసియే కాలం గడుపుచున్నారు. అయితే వాళ్లిద్దరి మధ్య అంతరం అంతఃకరణ సంబంధమైనది.

1. జ్ఞాని - ఈతడు ఆత్మానందముచే ప్రసన్నుడై ఉంటున్నాడు. నిరంతరం ఆత్మామృతమైన తృప్తిని అనుభవిస్తున్నాడు. తాను శుద్ధుడై, అంతటా తన యొక్క జ్ఞాన ప్రకాశముచే ప్రసరిస్తూ, ప్రకాశ ప్రదుడై ఉంటున్నాడు. సమస్త పదార్థముల పట్ల శీతలాంతఃకరణుడై మెలగుచున్నాడు. ఈతనిని పూర్ణచంద్రుని ప్రశాంతప్రకాశంతో పోల్చవచ్చు. ఆతడు – ఈ కనబడే సర్వజీవులను లోకాలను తన స్వరూపంగా గాంచుచున్నాడు.

2. అజ్ఞాని - ఈతడు తన సమక్షంలో తారసపడుచున్న ఆయా జగద్విషయాల పట్ల పూర్వాపర విచారణ చేయడం లేదు. సత్–అసత్ వివేకాన్ని వదలి ఉండటం చేత అనుచితమైన విషయాలను అసంఖ్యాకంగా, అవిశ్రాంతంగా కోరుకుంటున్నాడు. (ఉపనిషత్తు, బ్రహ్మసూత్రాలు, యోగ వాసిష్ఠం మొదలైన) శాస్త్రములు అందజేస్తున్న ఆతని స్వస్వరూపమునకు సంబంధించిన సమాచారం ఆతడు పట్టించుకోవడం లేదు. ఒకవేళ అక్కడా–ఇక్కడా కొంత విన్నప్పటికి "నేను ఈ కనబడే సర్వ పదార్థములకు, సర్వ సంఘటనలకు అసంబంధితమై, అప్రమేయమై, నిత్య నిర్మలమై... సర్వదా ప్రకాశించే ఆత్మనే" అనే అనుభవంలో ప్రవేశించక, ఎక్కడికెక్కడో తారట్లాడుచున్నాడు. పసిబాలుడు 'నాయనా! అట్లా దూకకురా! పడతావు. ఇది తినకురా! తెల్లవార్లు అరగక మూలుగుతావు'... అని చెప్పుచున్నా కూడా "అంతే! నేను దూకుతాను. నేను తింటాను"... అని మారాం చేస్తాడు చూచావా! అట్లాగే అజ్ఞాని చెప్పినా వినక, స్వస్వరూపాన్ని వివేక దృష్టితో అవగాహన చేసుకోక... మూర్ఖత్వం వహించి ఉంటున్నాడు.

అట్టి మూర్ఖత్వమే అన్ని దుఃఖాలకు మూల కారణం. "ఇది ఇష్టం, అది అయిష్టం. ఇది శుభము, అది అశుభం"... అనే సాంసారిక విశేష పరంపరలచే ఆకర్షించబడి ప్రాణాలు పోయే వరకు అవివేక మనస్కుడుగానే అజ్ఞాని ఉంటున్నాడు. అంతేగాని, శాస్త్రాలు అందించే ఉత్తమ పాఠ్యాంశాన్ని అంతర్గతం చేసుకోవటం లేదు. అట్టి అవివేకికి 'ఎఱ'ను చూచి గాలము వైపు పరుగులు తీసే చేపకు తేడా ఏమున్నది?

ఓ ప్రియ జనులారా! మీరు ప్రియం కదా! అని భావించే దేహ–స్త్రీ–పుత్ర–ధనాది సమస్త పదార్థములు కూడా ఎండిన ఇసుకతో తయారుచేయబడిన మూకుడు వలె అతి త్వరలో విచ్ఛిన్నం కానున్నాయి. ఏ ఇంద్రియాలతో విషయాలు పొందుచున్నారో, ఆ ఇంద్రియాలే కాలగతికి నశించటం (తదితర జీవుల పట్ల) మీరు గమనిస్తున్నదే కదా! ఇంద్రియాలు ఎంతగా నమ్మతగినవో, విషయాలు అంతే నమ్మతగినవి సుమా!

మంకి : 'అనేక జన్మ పరంపరలు' అనే సాంసారిక మార్గంలో ప్రవేశించిన మాకు గతి ఏమిటి? నిర్గతియేనా?

శ్రీవసిష్ఠ మహర్షి :

ఆ బ్రహ్మస్తమ్భ పర్యంన్తమపి యోని శతేషు తే ।
ఆకల్పం భ్రమతః చిత్తశాంతిః నాస్తి శమాదృతే ॥

పురుగు నుండి బ్రహ్మ వరకు గల అనేక వందల యోనులలో అవిశ్రాంతంగా ప్రవేశ–నిష్క్రమణలు నిర్వర్తిస్తూ పరిభ్రమించే ఈ జీవ బాటసారికి ఇంద్రియ విషయములపట్ల ధ్యాస కలిగి ఉన్నంత వరకు చిత్తశాంతి కలుగుట లేదు. చిత్తశాంతి కలగాలంటే ఇంద్రియములకు సంబంధించిన అభినివేశము శమింపజేసుకోవాలి. మఱింక దేనిచేతాకూడా చిత్తశాంతి కలుగదు. కాలి క్రింద చూచుకుని నడిచే వానికి బాటలోని ఎత్తు–పల్లాలు బాధించవు కదా! 'వివేకము' ఆశ్రయించి ఉండేవానికి బంధము యొక్క లేశము కూడా ఉండజాలదు. కనుక వివేకముచే శమమును ఆశ్రయించి ఉండాలి సుమా!

ఓ మంకీ! ఈ సాంసారిక వ్యవహారము పట్ల సావధానుడవై ఉంటే చాలు. (వివేక రహితంగా) అసావధానమైన చిత్తమును మాత్రమే 'కామము' అనే సాంసారిక పిశాచి మ్రింగగలుగుతోంది.

మంకి : 'సావధానుడనై ఉండటం'... అనగా మీ ఉద్దేశం?

శ్రీవసిష్ఠ మహర్షి : మనస్సు స్వస్వరూప విభాగమును ఏమరచి 'ఇచ్ఛ' అను మార్గముతో ప్రవేశించి ఈ కళ్లు మొదలైన ఇంద్రియముల ద్వారా ఇంద్రియవిషయముల వైపు ప్రసరణమై ఉంటోంది.

ఆత్మ⟶ మనస్సు⟶ ఇచ్ఛ⟶ కళ్లు మొదలైన ఇంద్రియాలు⟶ ఇంద్రియ విషయాలు (జగత్తు)

మనస్సు నందలి "రూపాదులను చూడాలి" అనే ఇచ్ఛ నేత్రాది ఇంద్రియాలలో ప్రవేశించి ఆయా విషయాల వైపు ప్రసరించి ఈ జగత్తును పొందుతోంది. ఆత్మను ఏమరచినప్పటి వివేక రాహిత్యమే అసావధానత్వం. అట్టి అసాధానపూర్వకమైన మనో విభాగం స్ఫురణమాత్రం చేత అహంకార సహితమగు ఈ సువిస్తార జగత్తుగా స్థితి పొంది ఉన్నది. కళ్లు తెఱచినప్పుడు రకరకాలైన ఆకారాదులుగా కనిపించే ఈ జగదృశ్య విశేషాలు కళ్లు మూయగానే కనిపించకుండాపోతాయి చూచావా? బహిర్ముఖమైన సంవిత్తు (జ్ఞానం) అంతర్ముఖమై ఆత్మయందు సంలగ్నం అయిన మరుక్షణం ఈ సమస్త దృశ్యం స్వయంగా క్షయించగలదు. ఒకే వాయువు తన యొక్క చలనాన్ని తానే విస్తరింపజేయునట్లు శుద్ధ చైతన్యం కొంచెం స్ఫురణమాత్రం చేత తనయందు తానే అసత్తే అయినట్టి అహంకార సహితమగు ఈ సమస్త జగత్తుగా విస్తరిస్తోంది. దృష్టాంతానికి–

1. వాయువు - ఒకానొక తరంగంగా 'అసత్తు'. తనయందు తానే అనేక తరంగాలుగా ప్రదర్శించే వాయువు 'సత్తు'.

2. జలం - తనయందు తానే అనేక తరంగాలుగా విస్తరిస్తోంది. ఒక్కొక్క తరంగంగా 'అసత్తు' ప్రతి తరంగం జలమే. కనుక అన్ని తరంగాలలోను ఉన్న జలంగా ప్రతితరంగం సత్తే! జలంలో అనేక తరంగాలు ఉన్నాయి కాని ఆ తరంగాలలో అనేక జలాలు లేవు. ఎందుకంటే ఈ తరంగ జలం – ఆ తరంగ జలం వేఱువేఱు కాదు. తరంగాలన్నిటిలో గల జలం చూస్తుంటే అది 'అంతర్ముఖం', జలంలో గల అనేక తరంగాలను చూస్తుంటే అది 'బహిర్ముఖం'.

అట్లాగే... చిదాకాశం ఈ అనేక జీవాహంకారాలుగా తన యందు తానే (తాను తానుగా ఉంటూనే) ప్రదర్శిస్తోంది. ప్రతి జీవాహంకారం తనదైన శైలిలో జగద్దర్శనం చేస్తోంది.

ఒక్కొక్క జీవునిగా (అహంకార సహిత జగత్ దర్శనానుభవంతో సహా) అసత్తు! చిదాకాశము తన యందు తానే ఈ అహంకార సహిత జగత్తు యొక్క దర్శనం చేస్తోంది. కనుక చిదాకాశంగా ప్రతి జీవుడు సత్తే.

ఈ ప్రత్యేక జీవరూపంలో చిదాకాశం తన యందు తానే అవిద్యావృత జగత్తుగా విస్తరింప జేస్తోంది. ఈ జగత్తు అనేకత్వం దృష్ట్యా అసత్తు. చిదాకాశమే ఇద్దాని 1. విస్తారణ, 2. కారణ కారణం. కనుక... ఇది చిదాకాశంగా సత్తు. యథార్థానికి బ్రహ్మసంవిత్తు తన నుండి తనకు వేఱుగా ఏదీ రచించడం లేదు. జలం తన నుండి వేరుగా 'తరంగం' అనేదేదీ రచించటం లేదు కదా! అసత్యమే అయి ఉండి కూడా ఈ జగత్తు 'సత్యం వలె' (చిదాకాశం కంటే వేరుగా ఉన్నట్లు) విజృంభిస్తోంది.

మంకి : స్వామీ! ఈ సత్ అసత్‌లను విడదీయగలగటానికి సామర్థ్యం పొందే ఉపాయం చెప్పండి.

శ్రీవసిష్ఠ మహర్షి :

సదివాసత్యమే వేదమ్ అకుర్వత్యన్య మేధతే ।
మృదా హేమ్నేవ కుంభత్వమ్ అపృథక్ లభ్యమాత్మగమ్ ॥

బంగారు ఆభరణం నుండి బంగారమును - ఆభరణమును వేరుచేసి చూపగలమా? మట్టి కుండలోంచి మట్టిని-కుండను విడిగా తీసి చూపగలమా?

మంకి : లేదు. బంగారమే ఆభరణమగుచున్నది. కనుక బంగారము-ఆభరణము వేరుకాదు. మట్టియే కుండ అగుచున్నది. మట్టిని-కుండను వేరు పరచడం అర్థం లేని మాట.

శ్రీ వసిష్ఠ మహర్షి : బాగు! మట్టి కుండలోనుంచి కుండను అట్టేబెట్టి మట్టిని వేరుగా ఎట్లా చేయ లేమో, బంగారు ఆభరణం లోనుంచి ఆభరణాన్ని అట్టేబెట్టి బంగారం వేరుగా ఎట్లా చేయలేమో... అట్లాగే ఈ జగత్తును బ్రహ్మచైతన్యం నుండి వేరుచేసి పొందటం (జగత్తు నుండి బ్రహ్మ చైతన్యాన్ని వేరు చేసి చూడటం) సాధ్యం కాదు.

ఎందుచేత?... ఆభరణం సత్యం కాదు. బంగారం సత్యం. కుండ సత్యం కాదు. మృత్తిక సత్యం. తరంగం సత్యం కాదు. జలం సత్యం.

అదే బంగారం ఎన్ని ఆకారాలైనా పొందగలదు. అదే మట్టి కుండ-బొమ్మ... ఎన్నెన్ని రూపాలైన పొందగలదు. అదే జలం తరంగాలుగా ఆవృత్తాలుగా ఎన్ని రూపాలైనా పొందగలదు. జీవుడుగా కనిపించే ఈ చైతన్యం (జీవ చైతన్యం, అదే చిదాకాశం కూడా)... పిపీలికాది బ్రహ్మ పర్యంతం ఏ స్వరూపమైనా పొందగలిగే తత్త్వం తనయందు ఇముడ్చుకునే ఉన్నది. ఏ ఆభరణత్వ మైనా (ఏ ఆకారమైనా) పొందగలిగే బంగారానికి ఆకారం ఉన్నట్లా? లేనట్లా? లేనట్లే. అట్లాగే జగత్తుగా ప్రదర్శితమయ్యే బ్రహ్మ సంవిత్తునకు జగదత్వం (రూప-నామాదులు) లేనట్లే. కనుక జగత్తు మిథ్య. (బంగారానికి ఆకారం మిథ్య. మృత్తికకు కుంభత్వము మిథ్య .. వలె)

శూన్యమాత్రం యథా వ్యోమ, స్పందమాత్రం యథా అనిలః
జలమాత్రం యథా ఊర్మ్యాది సంవిన్మాత్రమ్ తథా జగత్ ।

ఆకాశానికి 'ఇది తూర్పు ఆకాశం, అది పడమర ఆకాశం, ఇది నైరుతి ఆకాశం' – మొదలైనవి ఉన్నాయా?... లేవు. ఆకాశమంతా శూన్యమాత్రమే.

'ఇది పెద్ద తరంగ జలం అది చిన్న తరంగ జలం. ఇది ఆవృత జలం. అది నిశ్చల జలం" ... మొదలైనవి జలానికి ఉన్నాయా? లేవు. తరంగాలు, ఆవృత్తాలు, సుడులు, బుడగలు... అన్నీ కూడా జలమే! జలానికి ఆ అనేకత్వాలు లేవు. వాయువుకు ఇది పిల్లగాలి, అది సుడిగాలి, ఇది తుపాను గాలి, ఇది తరంగ రహిత వాయువు'... మొదలైనవి లేవు కదా! పిల్లగాలి, సుడిగాలి, తుపాను గాలి, కదలిక లేని గాలి... అన్నీ ఒకే గాలి. (ఒకే వాయువు)

అట్లాగే "ఈ జగత్తు – ఇందులో నేను–నీవు–వాడు మొదలైన విభాగాలు" ఇవేవీ లేవు. జగత్తంతా చిన్మాత్రమే!

మంకి : స్వామీ! మరి మనస్సు, ఆ మనస్సుకు అనుభవమయ్యే స్థావర – జంగమ పదార్థాలు కనిపిస్తున్నాయి కదా!

శ్రీవసిష్ఠ మహర్షి : కనిపిస్తున్నాయి. అయితే ...మనస్సుకు జగత్తుగా కనిపిస్తున్నదంతా ఏ విధంగా అభ్యసించాలో ...అది చెపుతాను.

అవ్యవచ్ఛిన్న నిర్భాగ సంవిన్మాత్రం జగత్రయం ।
విద్ధి శాంతం తథావ్యోమ యథా, 'వారిణి పర్వతమ్' ॥

జలంలో ఒక పెద్ద కొండ ప్రతిబింబిస్తోందనుకో... ఆ జలంలో ఉన్నది కొండా? కాదు. జలంలో జలం మాత్రమే ఉన్నది. అయితే కొండగా కనిపించేది? కొండగా కనిపించేది కూడా జలమే. అట్లాగే ఓ ప్రియ బాటసారీ! ఈ ముల్లోకాలు, ఇందులో కనిపించే సజాతీయ–విజాతీయ, స్వగత–పరగత వ్యవహారమంతా భేదరహితమగు 'బ్రహ్మ సంవిన్మాత్రమే' అని గ్రహించు.

ఈ ప్రకారంగా జగత్‌తత్వం గురించి ఎరిగి ఉపశాంతుడై, ముక్తుడై ఉన్న జ్ఞాని యొక్క అంతఃకరణం అపూర్వ శీతలత్వంతో పూర్ణ చంద్రుని వలె వెల్లివిరుస్తుంది. ఓ మిత్రమా! ఈ జగత్తు సర్వదా 'పరమశాంతమై, దృశ్య శూన్యమై, సర్వ వ్యాపకమై' ఉన్నట్టి బ్రహ్మం మాత్రమే అయి ఉండగా ఇక ఇందులో 'నేను అజ్ఞానిని. ఇది తెలుసు. అది తెలియదు'... అనే ప్రకాశ రాహిత్యం గాని, దీనిని ప్రకాశమానం చేసే మరొకటిగాని, దీనిని బ్రహ్మంగా మరల్చే ఏవో సాధ్యాసాధ్యాలు గాని ఎక్కడ ఎట్లా ఉంటాయి చెప్పు?

ఎందుకంటావా?...'బ్రహ్మము' అనే శబ్దంచే ఏ చైతన్య సత్త ఉద్దేశించబడుచున్నదో... అదియే సమస్త పదార్థముల యొక్క నిజరూపమై ఉన్నది. అందుచేత ఈ జగత్తు బాధ్య–బాధక రహితమై, అద్వయమైనట్టి బ్రహ్మమయంగానే వెలయుచున్నది. ఈ సమస్తం బ్రహ్మమే! (సర్వమ్ బ్రహ్మామయమ్ జగత్, సర్వమ్ ఖల్విదమ్ బ్రహ్మ, జీవో బ్రహ్మేతి నాపరా మొదలైన శ్రుతి వాక్యాలు)

❖❖❖

5. మనస్సును అధిగమించటం ఎట్లా?

మంకి : మహర్షీ! ఈ రోజెంత సుదినం! అనేక ప్రక్క త్రోవలు పట్టిపోతున్న దీనుడనగు ఈ మంకి నామధేయ బాటసారిని మీరు సంశుద్ధపరుస్తున్నారు. సముద్ధరిస్తున్నారు.

స్వామీ! ఇక్కడ నాదొక సందేహం. ఈ జగత్తులో ప్రవేశించి సదేహులమై మేము కొన్నిటిని చూచి సుఖిస్తున్నాం. మరికొన్నిటిని చూచి దుఃఖిస్తున్నాం. ఎప్పటి నుండి తెచ్చిపెట్టుకున్నామో గాని... ఈ సుఖ దుఃఖాలు మమ్ములను ఎక్కడినుండో తరిమి తరిమి ఇక్కడకు జేర్చాయి. మరి మీరేమో, "మీరంతా సుఖమయమగు ఆత్మస్వరూపులయ్యా"... అని సిద్ధాంతీకరిస్తున్నారు. ఈ సుఖదుఃఖాలు ఎక్కడి నుండి వచ్చాయి? ఎందుకు అనుభూతమౌతున్నాయి?

శ్రీవసిష్ఠ మహర్షి : వేనియొక్క 'బాధ' నీకు అనుభూతమౌతోందో... అట్టి పదార్థముల యొక్క విచారణ చేయి. విచారణ లేకపోవటమే అన్ని జాడ్యాలకు మూలం సుమా! వాస్తవానికి ఆయా బాధించే పదార్థముల యొక్క నామ-రూపములుగాని, ఆయా బాధాసాధనములుగాని, వాటి వ్యుత్పత్తి మొదలైన వికారాలుగాని (విచారణ చేసి చూస్తే) లేవు. ఆకాశపుష్పంలాగా అవి భ్రమచేతనే ఏర్పడుచున్నాయి. ఉదాహరణకు, "ఈ వాక్యం వినగానే నాకు కోపంగాని, సంతోషంగాని, దుఃఖం గాని, గర్వంగాని ఎందుకు అనిపిస్తోంది?" ...అని విచారణ చేస్తే వాటికి ఒక పరిధి తరువాత కారణమే దొరకదు. ఆకాశంలో పుష్పం కనిపించటానికి కారణం లేనట్లే స్వప్నంలో ఏవేవో కనిపించ టానికి కారణం లేనట్లే, వాటికీ కారణం లేదు. కారణం లేనివి మిథ్యమాత్రమే.

సోదరా! నీవు మనస్సును అధిగమించు. మనస్సు దృష్ట్యా కనబడేవన్నీ మనస్సును అధిగమిం చినపుడు రహితమౌతాయి. "మనస్సుకు అనిపించేవి మనస్సుకు సంబంధించినవే గాని నాకు సంబంధించినవి కావు" అని గ్రహిస్తూ ఉండు. జ్ఞాన బలంతో మాత్రమే మనస్సును అధిగమించ గలవు. అదే మనోరాహిత్యం. మనస్సును అధిగమించి, అప్పుడు శేషించే జ్ఞానరూపంచే ఒక మహాశిల వలె నిశ్చలంగా స్థితి పొంది ఉండు. అట్టి నీయొక్క జ్ఞానరూపం మనోవికల్ప రహితమై, ఈ నేత్రాది ఇంద్రియ వర్జితమై (వాటికి అసంబంధితమై), అనంతమై, అజమై, అవ్యయమై ఉన్నది. ఆ నీ ఘనీభూత జ్ఞానస్వరూపమే 'బ్రహ్మం' అనే పేరుతో చెప్పబడుతోంది.

మనస్సును అధిగమించటమంటే? మనస్సుకు అద్దాని చర్యలతో సహా చూరగొనకపోవటమే! అనగా, అద్దానిని (దాని చాంచల్యాది క్రియా విశేషములతో సహా) లెక్క చేయకపోవటమే! ఏ జ్ఞాని అయితే ఆకాశమును బోలి శుద్ధమైనట్టి తనయొక్క ఆత్మ రూపమున స్థితినొంది ఉంటాడో ఆ జ్ఞానికి నామ రూపాల ప్రతీతి ప్రసక్తి ఉండదు. అట్టి ఆత్మస్థితి యొక్క అభ్యాసదార్ఢ్యం లేకపోవుట చేతనే నామరూపాలు నిన్ను బాధిస్తున్నాయి. జాగరూకుడు కానివానికి నిద్రవచ్చి కలలు చోటుచేసు కుంటాయి చూచావా? అట్టి స్వప్న వికారాలు లాగానే తన యొక్క ఆత్మస్థితిని ఏమఱచినంత మాత్రం చేతే 'దేహం-దృశ్యం-జన్మ-మృత్యువు'... వంటి భ్రమలు ఎదురుగా నిలుస్తున్నాయి.

మనస్సులో నామ-రూపాలు ఉన్నప్పుడే బయట నామరూపాలు బాధ్య-బాధక రూపంగా ప్రవర్తిస్తున్నాయి. మనస్సు నిండా ఆత్మ యొక్క సత్-చిత్-ఆనందాది లక్షణాలు ఉన్నప్పుడో? బాధ్య-బాధకాలు సుదూరంగా తొలగిపోతాయి. క్రమంగా రహితత్వం సంతరించుకుంటుంది.

మంకి : ఈ జగత్తు ఎక్కడినుండి వచ్చింది?

శ్రీవసిష్ఠ మహర్షి : హిరణ్యగర్భుని మనస్సే... ఎటువంటి ఉపాదాన-నిమిత్త కారణాలు లేకుండా, (మట్టి, కుమ్మరి లేకుండా) సంకల్పమాత్రం చేత నిరాశ్రయమగు ఈ జగద్రూప చిత్రాన్ని (కుండను) గాంచుతోంది. కాబట్టి... ఈ జగన్నిర్మాణానికి మనస్సు తప్ప అన్యమైన కారణం గాని, కార్యం గాని లేవు.

తనోతి యత్తదాత్మైవ, తస్య తత్ర తథా స్థితమ్ ।
దృశ్యాభావాదసద్దృశ్యం తేన కః క్వ కరోతి కిమ్ ॥

మనస్సు దేనిని ఎట్లు వివర్తింపజేస్తోందో, అది ఆయా రూపాలుగా ఆ మనస్సుకే అనుభవ మవుతోంది. ఆత్మ నుండి బయల్వెడలిన మనస్సే మనస్సును జగత్తుగా చూస్తోంది. ఆత్మయే మనస్సుకు అట్లట్లు కల్పనను స్థితింపజేస్తోంది. ఆత్మ నుండి బయలుదేరిన మనస్సు ఆత్మకు కల్పనకు ఆపాదించి దర్శిస్తోంది. జగత్తుకు సంబంధించి ఇంతకుమించి విశేషం ఏదీ ఎక్కడా లేదు.

అందుచేత... 1.ఆత్మ కంటే వేఱుగా దృశ్యం లేదు. 2.దృశ్యం అసత్తు... ఈ రెండు సూత్రాలను అతి జాగరూకతతో సమన్వయించుకో! ఇప్పుడు చెప్పు... ఎవడు, ఎద్దానిని ఎట్లు ఏది నిర్మిస్తున్నాడు?

'అహం సుఖీ' ఇతి సుఖితా,' అహం దుఃఖీ' ఇతి దుఃఖితా ॥
సర్వ ఏవ సరూపస్థా వ్యోమాత్మానోఽపి పార్థివాః ॥

ఓ మిత్రమా! 'నేను సుఖిని' అని నీ మనస్సు అనుకున్నదా... సుఖియే అవుతోంది. 'నేను దుః ఖిని' అని అనుకుంటే దుఃఖియే అవుతోంది. ఇక సుఖ-దుఃఖ సాధనాలన్నీ కూడా మనస్సు యొక్క కల్పనను అనుసరించే ఉన్నాయి. సుఖ-దుఃఖాలు మనస్సు చేతనే కల్పించబడుచున్నాయి. వాస్తవానికి సుఖ-దుఃఖాలు, వాటికి సాధనభూతమైన శబ్ద-స్పర్శ-రూపాది విషయాలు-ఈ సమస్తము చిదాకాశరూపమగు ఆత్మ స్వరూపమే అయి ఉన్నాయి. సమస్త పదార్థములు చిదాకాశరూపమే అయినప్పటికీ మనస్సు మాత్రం వాటిని దృశ్యరూపంగా దర్శిస్తోంది. ఏ భౌతిక రూపత్వం మనస్సుకు గోచరిస్తోందో అదంతా కూడా 'కలలో కనిపించే కొండలు' లాగా మిథ్య మాత్రమే అయి ఉంది.

ఆత్మసత్త సర్వదా నిర్మలము, అప్రమేయము, నిత్యోదితము, నిత్యనూతనము, నిరాధారము సర్వ పదార్థ-కాల అతీతం అయి ఉండి కూడా అయ్యది తనయొక్క అహంభావం యొక్క స్ఫురణ మాత్రంచేత భ్రమమయమగు పదార్థముల వికారంతో కూడి ఉన్నదగుచున్నది. అహంభావం (నాది, నా సంబంధమైనది అను భావావేశం) శమిస్తే పదార్థ భావం కూడా తనంతట తానే శమిస్తుంది. అప్పుడు ఆ జీవుడు శివస్వరూపుడే అవుతాడు. అహంభావం శమించటం చేత శాంతిచే

శోభితుడై 'కేవల ఆత్మస్వరూప సత్త'గా శేషిస్తాడు. ఓయీ స్నేహితుడా! సహాత్మ స్వరూపా! బంగారం కంటే వేఱుగా ఆభరణం ఎక్కడున్నదయ్యా? ఆభరణం... అనే శబ్దం, అర్థం కూడా మిథ్యయే కదా! అట్లాగే శమాత్మకమైన ఆత్మ స్వరూపుడవగు నీకంటే వేఱుగా అహంభావము యొక్క సత్తయే మిథ్య.

నిర్వాణో నిర్మనా మౌనీ కర్తా అకర్తా చ శీతలః ।
'జ్ఞ' ఏవ శాన్త ఏవాస్తే శూన్యఏవాభిపూరితః ॥

కాబట్టి... నీవు మోక్ష స్వరూపుడవై, మనోరహితుడవై, క్రియాశూన్యుడవై, మహాకర్తవై, అకర్తవు కూడా అయి, శాంత స్వరూపుడవై, దర్శనమునకు అతీతమై ఉన్న 'దృక్' రూపుడవై, కేవల పరబ్రహ్మ రూపుడవై జ్ఞాన ప్రకాశముచే అంతా అన్నిటా వెలుగొందుచూ ఉండుము.

వాసనారహితుడగు జ్ఞాని ఈ జగత్తులో ఎక్కడ ఏమి నిర్వర్తించినా యంత్ర నిర్మితమైన శిలా విగ్రహంలాగా యథాతథంగా నిశ్చలుడై ఉండునట్లే అగుచున్నది. ఎందుకంటే... అతడు ఏదైనా కార్యం ఈ చేతులతో ఆచరించినప్పటికీ వాటియందు అభిమానవర్జితుడై ఆత్మస్వరూపమునందే సర్వదా స్థితి కలిగి ఉంటున్నాడు. కనుక! ఒక శిశువు ఊయలలో గాఢంగా నిద్రిస్తూవుండగా, ఊయల ఊగుచున్నప్పటికీ శిశువు యొక్క అవయవాలు చలించకయే ఉంటాయి కదా! శరీరం యొక్క అనుసంధానం లేని జ్ఞానికి అవయవాలు కదులుచున్నప్పటికీ తాను నిశ్చల స్వరూపుడై చేష్టారహితుడై ఉంటున్నాడు. ఆత్మగా తానేమీ జన్మించడంలేదని, మరణించడం లేదని, దేనికీ కర్తృత్వ, భోక్తృత్వ దశలను పొందటం లేదనీ ఎఱిగియే ఉంటున్నాడు. అన్నీ నిర్వర్తిస్తూ ఏమీ నిర్వర్తించనివాడై ఉండటమెట్లాగో ఆతడు ఎఱిగియే ఉంటున్నాడు. ఆతని ఆత్మస్థితుని కర్మలు, దృశ్యములు, మనస్సు మొదలైనవి ఏవీ స్పృశించజాలవు.

మంకి : దేహంతో, జగత్తుతో (దేహం దేహంగా ఉండగా జగత్తు జగత్తుగా ఉండగా) అనుసంధానం ఎట్లా తొలగేది?

శ్రీవసిష్ఠ మహర్షి : జ్ఞాని యొక్క విలక్షణమైన కొన్ని లక్షణాలు ఇక్కడ ప్రస్తావిస్తాను. నీవు కూడా అవి అలవరుచుకో, తద్ద్వారా నీవు జ్ఞానివి అవుతావు. జ్ఞాని యొక్క విశేష లక్షణాలు –

1. బహిర్ముఖ వృత్తిరహితుడు - అతని చిత్తము సర్వదా అంతర్ముఖమై ఉంటుంది. కనబడే దేహాలలో కనబడని దేహిని దర్శిస్తూ ఉంటాడు. కనబడే రూప–గుణాదులకు అతీతుడై ఉంటాడు.

2. అఖండ బోధ స్వరూపుడు - ఏ తత్త్వమైతే అనేక దేహాలుగా కనిపిస్తూ ఉంటుందో అది అతనికి ఏక – అఖండంగా అనుభవమౌతూ ఉంటుంది.

3. ప్రాప్తించని విషయముల పట్ల 'ఆశ - కామము' లేనివాడు - ఇంకా ఏదో పొందాలి అను అభినివేశమును 'కామము' అంటారు. ఏది ప్రాప్తించినా అతనికి క్రొత్తగావచ్చేది, పోయేది ఏదీ కనిపించదు. ఏది ఎట్లా ఉన్నా తాను తానుగానే ఉంటాడు కదా!

4. ప్రాప్తించిన విషయములందు 'రాగము' లేనివాడు – ఏదేది ఇప్పుడున్నదో అది కొంతకాలం క్రితం వచ్చి చేరింది. కాలంచేతనే మరల తొలగటం అనివార్యం, స్వభావసిద్ధం. (యత్ దృశ్యమ్... తత్ నశ్యం). కనుక దేనిని పట్టుకు వ్రేలాడవలసిన అగత్యం ఏమున్నది?

5. శాంతుడు - బాహ్య విశేషాలు ఆత్మలో సుస్థిరత సంపాదించనంతకాలం స్పర్థ కలిగిస్తాయి. "అంతటా ఉన్న ఆత్మను నేనే" అని ఎఱిగిన తరువాత ఏదీ ఆశ్చర్యపరచదు, సుఖ-దుఃఖ పరచదు.

6. అనంతాత్మ స్వరూపుడు - దేహానికి పొడవు, వెడల్పులు ఉన్నాయి. దేహిగా తనకు పొడవు, వెడల్పులు లేవు. పొడవు, వెడల్పులు లేనిది అనంతమై ఉంటుంది.

7. ద్రష్ట - దర్శన - దృశ్య రహితుడు - చూచేవానిని నియమించేవాడు తానుగాని, చూచేది-చూడబడేది-చూడడం తాను కాదు! చూడబడేది చూచేవానిని ఆకర్షించవచ్చు గాక! అయితే ఆ చూచే వానినే చూచేవాడుగా తాను ఉంటాడు.

8. స్వయంగా నిరాకారుడు - దేహానికో, మనస్సుకో, బుద్ధికో, అహంకారానికో, ఏదైనా ఆకారం ఉంటే ఉండవచ్చుగాక! తాను మాత్రం ఆకారాలకు సంబంధించినవాడు కాదు. కనుక నిరాకారుడు.

9. అపేక్షావర్జితుడు - "నేను అపేక్షను నియమించేవాణ్ణి, అపేక్ష కన్నా ముందే ఉన్నవాణ్ణి, మరి అపేక్ష చేత నేను బద్ధుడనవట మేమిటి? 'అది అర్థరహిత వాక్యం' అనే మహాసత్త్వ స్థితి అవధరించి ఉంటాడు.

10. ఆత్మ దర్శి - ఎవరినైనా చూస్తున్నప్పుడు అతని దేహ-మనో-బుద్ధి-అహంకారాలను అధిగమించి వాటికి సాక్షి, కారణము అయి వున్న అప్రమేయ దోషరహిత ఆత్మనే దర్శించెదనుగాక! అను మహా దృష్టిని కలిగి ఉంటాడు.

ఇట్టి విశేషాలతో జ్ఞాని ఈ జగత్తులో సంచరిస్తాడు. ఇక దేహాదులతో అతనికి అనుసంధానం ఎక్కడిది చెప్పు?

మంకి : అసలు బంధం - అనుసంధానం ఎందుకు ఏర్పడుతోంది?

శ్రీవసిష్ఠ మహర్షి :

అపేక్షైవ ఘనోబంధః ఉపేక్షైవ విముక్తతా ।
సర్వశబ్ధాన్వితా తస్యాం విశ్రాన్తేన కిమీక్ష్యతే ॥

కలలో ఉన్నవాడు "ఇది కలే! మెలుకువ రాగానే ఇదంతా లేకుండా పోతుంది"... అని గ్రహించిన తరువాత ఇక ఆ కలలో ఏ పదార్థాలు కావాలని కోరుకుంటాడు. చెప్పు?

ఈ జీవునికి... "అపేక్ష" అనునదే ఘనీభూతమైన బంధం. అపేక్ష ఎట్లా పోతుంది? ఉపేక్ష చేతనే. "ఉపేక్ష" యే విముక్తి! వేద - వేదాంత సారమంతా ఇంతే!

మంకి: 'అపేక్ష' అనునది నిర్వచిస్తూ మరింత వివరంగా చెప్ప ప్రార్థన.

శ్రీవసిష్ఠ మహర్షి : మిత్రమా! ఈ జగత్తు యొక్క అనుభవంలో ముఖ్యంగా 4 చోటు చేసుకుంటున్నాయి - 1. దేహం, 2. కోరికలు, 3. మోహం, 4. కర్తృత్వ - భోక్తృత్వ అభిమానం... ఈ నాలుగు భ్రమయే! దేహికి దేహం ఐహికమోహం!

"ఈ దేహం భ్రమమాత్రమే" అని తెలియటంచే దేహభావన జయించబడుతోంది. "ఈ దేహం లేకపోతే నేనే లేను. ఇక అనుభవాలూ లేవు" అని ఈ జీవుడు ఎందుకో భ్రమిస్తున్నాడు.

మంకి : అవును కదా స్వామీ! దేహమే లేకపోతే భావన – అనుభవం ఉండదు కదా?

శ్రీవసిష్ఠ మహర్షి : స్వప్నంలో అనుభవాలు, అనుభవజ్ఞుడు… ఈ రెండు ఉంటున్నాయి కదా! భౌతికదేహం జడప్రాయమై ఉండగా ఆ స్వప్నద్రష్ట ఏ దేహంతో 'అనుభవం' అనేది పొందుచున్నాడు? కనుక, దేహి దేహమాత్రుడు, దేహ పరిమితుడు కాదు. స్వప్నం తొలగగానే స్వప్నదేహం తొలగుచున్నట్లు… దేహ భ్రమ తొలగితే, ఇక అట్టి జీవుడు దేనినీ (ఏ పదార్థమును) కోరడు. దేహభావ రాహిత్యముచే కోరికలు నశిస్తాయి. కోరికలు తొలగితే 'మోహం' కూడా విడివడుతుంది. మోహం తొలగితే "దీనికి కర్తను–దానికి భోక్తను"… అనే మనోమాలిన్యం కూడా స్వభావసిద్ధంగా తొలగుతుంది. దేహాదులందు అభిమానం లేనివాడు "అపేక్ష" అనే గాలానికి చిక్కుకోడు.

మహాత్ముడైన అట్టి జ్ఞాని కేవలము తన ఆత్మయందే నెలకొని ఉంటాడు.

ఓ మంకి! నీవు ఆత్మయందే సర్వదా నెలకొని ఉండు. అనగా దేహ–మనో–బుద్ధి–అహంకారాలలో భ్రమచే నెలకొని ఉండకు. మనోబుద్ధులలో నెలకొని ఉన్నవానికి ప్రపంచంలో మనోబుద్ధులే అగుపిస్తాయి. ఆత్మయందు నెలకొని ఉన్నవారికి సర్వత్రా ఆత్మతత్త్వమే గోచర మౌతుంది. ఇదే మన ఈ సంవాదము యొక్క అసలైన సారాంశము.

❖

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! మహాత్ముడగు ఆ మంకి నా ఉపదేశం అతి శ్రద్ధగా విన్నాడు. అప్పటికప్పుడే పాము కుబుసమును విడుచునట్లు సంసారమోహమును సంపూర్ణంగా త్యజించాడు. వాసనారహితుడై, పూర్ణచంద్రుని వలె ప్రకాశించాడు. నా వద్ద సెలవు తీసుకొని గృహోన్ముఖంగా నడిచి వెళ్లాడు. ఇకప్పటి నుండి కొంతకాలం గృహంలో గడపి కొన్ని సంవత్సరాల తరువాత ఒక పర్వతంపై ఒకచోట సుఖాసీనుడైనాడు. మనస్సు–ఇంద్రియాలు మొదలైనవాటిని స్వస్వరూపంలో శమింపచేసి, ఆ యోగి శిల వలె నిశ్చల స్వరూపుడైనాడు. సమాధి యందు మగ్నుడై, ఇప్పటికీ ఆ పర్వతం పైనే ఉండి ఉన్నాడు. ఎవరైనా అతనిని మేల్కొలిపితేనే అతడు సమాధి నుండి లేవడం జరుగగలదు.

ఓ ప్రియ సభికులారా! మీరుకూడా మంకి వలె ఉత్తమ ఉపాయమును ఆశ్రయించండి. జ్ఞానం నందు ఉత్సాహంగల మనస్సుతో వివేకం ద్వారా స్వాత్మయందు విహరించుటకై శాంతిని సముపార్జించండి. అంతేగాని మీ బుద్ధి వివేకాన్ని వదలి దీనత్వం పొందటం ఉచితమే కాదు.

శరీరం పరిమితం! ఆత్మయో… అపరిమితం!

సౌమ్యుడగు ఓ రామచంద్రా! స్ఫటికంచే నిర్మించబడిన మనుజవిగ్రహం ఆకారం దృష్ట్యా మనుజ శరీరం లాగానే కనబడవచ్చు గాక! అయితే దానికి కోప–తాప–భయ–ఆశ–నిరాశలు ఉంటాయా? ఉండవు. అట్లాగే యథాప్రాప్తాలైన ఆయా కార్యాలను ఆచరిస్తూ కూడా నీవు శాంతాత్ముడవై, నిర్వాణరూపుడవై ఉండు.

'ఏకం' అగు ఆత్మయే ఇటు ఏకం నందు, అటు అనేక నందు కూడా కలదు. అట్టి ఏక–అనేకాలకు అప్రమేయమై ఉండే ఆత్మను గ్రహించిన తరువాత 'వ్యష్టి–సమష్టి' సంబంధితమైన సాంసారిక జాడ్యం తొలగగలదు.

శ్రీరాముడు : ఆత్మ సర్వదా ఏకమే అయిఉండికూడా, చిత్తము అనే అనేకత్వ దర్శనస్వభావం ఎందుకు పొందడం జరుగుతోంది? అనేక చిత్తములు ఎక్కడి నుండి వచ్చాయి?

శ్రీవసిష్ఠ మహర్షి :

> **ఆద్యన్తరహితం సర్వం వ్యోమ చిత్తత్త్వ నిర్భరమ్ ।**
> **శరీరోత్పత్తి నాశేషు కా చిత్తత్త్వస్య ఖండనా ॥**

చిద్వస్తువు (చిత్ తత్త్వం) ఆద్యంత రహితమైనది. సర్వవ్యాపకమైనది. చిదాకాశ రూపమైనది. నాశనవర్జితమైనది. అట్టి చిత్‌తత్త్వం చిత్తత్త్వము చేత, శరీరాదుల చేత ఎట్లా ఖండితం అవుతుంది? ఆత్మ పరిచ్ఛేదయుక్తమే కాదు.

ఇక ఈ దేహం? ఇది ఆద్యంతసహితమైనది, పరిమితస్వభావమైనది, పాంచభౌతిక స్వరూప మైనది, నాశన స్వభావమైనది. శరీర లక్షణాలు తీసుకొచ్చి ఆత్మకు ఎట్లా ఆపాదిస్తావు? కుదరదు. ఆత్మయే సమస్తంలోను... సమస్తంగాను ఉన్నదని, సమస్తానికీ అతీతంగా ప్రకాశిస్తూ ఉంటోందని గ్రహించటమే ఆత్మజ్ఞానం.

❖

శ్రీవసిష్ఠ మహర్షి : ప్రియ రామచంద్రా! స్ఫటికంతో నిర్మించబడిన ఇక మనుజ విగ్రహం యొక్క శరీరం కళ్ళకు కనబడుచున్నప్పటికీ ఆ స్ఫటిక విగ్రహానికి దేహస్పృహ ఉంటుందా? ఉండదు. అట్లాగే నీవు కూడా దేహమునకు కేవల సాక్షివై ఉంటూనే... యథా ప్రాప్తములైన ఆయా కార్యాలను ఆచరిస్తూ ఉండు. శాంతాత్ముడవై, నిర్వాణ (మోక్ష) రూపుడవై ప్రకాశించు. ఎట్టి విషయం గురించి నీకు (మోక్ష రూపాన్ని సునిశ్చితం చేసుకుంటూ ఉన్నప్పుడు) మరింకే సందేహం ఉండవలసిన పనిలేదు. "ఈ సృష్టి-వ్యష్టి-సమష్టి భేదాలు ఉపశమించేది ఎట్లా"... అనే అనుమానాలన్నీ "ఏక మగు ఆత్మయే వ్యష్టియందు - సమష్టి యందు కూడా వ్యవస్థితమై ఉన్నది"... అను అవగాహన చేత మాత్రమే తొలగుతాయి. ఆత్మయే సమస్తములోను, సమస్తంగాను ఉన్నది"... అను సుస్పష్టమైన అవగాహన వైపుగా నీ సకల సాధనలు, క్రియలు ఎక్కుబెట్టబడుగాక! క్రమంగా ఏకం-సర్వస్వం-వ్యష్టి-సమష్టికి సంబంధించిన ఈ జీవుడు సుదీర్ఘకాలంగా మోసుకువస్తున్న కల్పనలన్నీ వాటంతట అవే క్రమక్రమంగా తొలగుతాయి.

ప్రతి ఒక్క జీవుడు చిద్వస్తు స్వరూపుడే! చిద్వస్తువు ఆద్యంతరహితమై, సర్వవ్యాపకమై, చిదాకాశ రూపమై, నాశనవర్జితమై ఉన్నది. ఈ శరీరాల చేతనో చిత్తాల చేతనో చిద్వస్తువు ఖండితాలుగా (అనేక జీవులుగా, నీవు-నేను మొదలైనవిగా) పరిచ్ఛేదమెట్లా అవుతుంది?

పరిచ్ఛేదమయినట్లు ఏదైతే అనిపిస్తోందో అదియే సంసారము యొక్క రూపం. చిత్తు (ఆత్మ) సర్వదా అచంచలం. జలం యథాతథంగా ఉంటూ ఉండగానే అద్దాని యందు 'తరంగాలు' అనే చమత్కారం అగుపిస్తోంది కదా. అట్లాగే ఆత్మ సర్వదా యథాతథంగా ఉంటూనే తనయందు చంచలమగు 'మనస్సు' అనబడు దానిని ప్రదర్శిస్తోంది. అట్టి చంచల మనస్సు తన చంచలత్వం

త్యజించిందా... ఇక శేషించేది (అనుభవమయ్యేది) అచంచలమగు ఆత్మయే. ఒక పసిబాలుడు నల్లని మేఘాల మధ్యగా గల తెల్లని మేఘమును చూచి వాళ్ళ నాన్నను పిలిచి "నాన్నా! ఆకాశంలో అక్కడ ఎవరో తెల్లటి దుప్పటిని కట్టినట్లున్నారే?... ఎవరు కట్టారు?" అని ప్రశ్నించాడనుకో. ఆ బాలునికి కనిపించేది భ్రమ మాత్రమే కదా! అట్లాగే దేహాదులందు కనిపించే 'అహంకారం' అనేది భ్రాంతి మాత్రమే! "అట్టి అహంకారం యొక్క అనుభూతి అవాస్తవం, నిష్ఫలమైనది కూడా"... అని ముముక్షువు గ్రహించి ఉండుగాక! ఓ సర్వ సత్యాన్వేషులారా! మీరు భ్రమమాత్రమైన, మిథ్యా భూతమైన, సంసారరూప పరంపరను ప్రసాదించునట్టి ఈ దేహాదులందు, అహంకారం నందు నిమగ్నులై ఉండకండి. వాటిని నమ్మి "వీటిని ఏం చేయాలి? ఏం చేస్తే పోతాయి"– మొదలైన నమ్మక, అపనమ్మక భావాలను కూడా కలిగి ఉండవద్దు.

దేహం, అహంకారం మొదలైనవి భ్రమయే కాబట్టి, అవి నిర్వర్తించే పనులు కూడా భ్రమయే. మీరో?... అనంతాత్మస్వరూపులు కదా! దేహాదుల పట్ల ఏ భావన కలిగి ఉంటున్నారో, అట్టి భావనలో దాగి ఉన్న ఒకానొక అల్పత్వమే 'సంసారం' అనుదానికి ముడి పదార్థం. దేహ, అహంకా రాదులను భావించడాన్ని క్రమంగా సన్నగిల చేయండి. ఎందుకంటే అనంత సుఖప్రదమైన 'మోక్షం' కొరకై "ఆద్యం–భవ్యం–సత్యం–నాశరహితం" అగు ఆత్మవస్తువును మాత్రమే భావించడం అత్యవ సరం. చిదాకాశం అనంతమై, పరిమితం లేనిదై, సమరూపమై ఉన్నది. అదే సర్వానికి పరమై ఉన్న ఆత్మవస్తువు. ఇక ఈ ధ్యాత–ధ్యానం–ధ్యేయం.... అనే మూడూ కొంచెం కూడా సత్యం కానే కాదు.

అసత్యాలను అసత్యాలుగా గుర్తించినంత మాత్రం చేత "దోష రహితమగు ఆత్మను నేనే" అని ఎవరికి వారే ఎఱుగగలరు. ఈ ద్రష్ట, దర్శనం, దృశ్యం అనబడే మూడు ఆత్మ యొక్క విభూతులు మాత్రమే! ఎందుకంటావేమో? అనుభవజ్ఞరూపమైన చైతన్యమే లేకపోతే "ఇది జడం" అనే జడానుభవం ఎవరికి?... అనుభవజ్ఞుడే లేకపోతే అనుభవం ఎవరికి? ఎక్కడ ఉంటుంది?

'ధ్యేయము' అగు చిద్వస్తువు ధ్యానమునకు ముందే, ధ్యానం లేకున్నప్పుడు కూడా సిద్ధించియే ఉంటోందని గ్రహించబడుగాక! సముద్రమైతే శుక్లపాడ్యమి చంద్రుని చూచి క్షోభచెంది కెరటముల క్షోభ ప్రకటిస్తోంది. ప్రళయ వాయువీచికలచే శుష్కించిపోతోంది. ఇక, ఆత్మయో సర్వదా ఏకరూపమై, సమమై, సౌమ్యరూపమై క్షోభరహితమై ప్రకాశించుచున్నదని గ్రహించబడు గాక!

చిత్తము యొక్క భ్రమ! - రథంలో ప్రయాణిస్తూ బయటకు చూస్తున్న ప్రయాణీకునికి రహదారి ప్రక్కన ఉండే కొండలు, చెట్లు, రాళ్లు కదలుచున్నట్లుగా కనిపిస్తాయి. ఆ చెట్లు మొదలైనవి నిజంగా కదులుచున్నాయా?... లేదు. ముత్యపు చిప్పలో వెండి ఉన్నట్లు తెలుపు కనిపిస్తూ ఉంటుంది. ముత్యపుచిప్పలో నిజంగా వెండి ఉన్నదా?... లేదు. అట్లాగే అంతటా చిత్స్వరూపమే సర్వదా ఏర్పడి ఉండగా ఇక దేహాదులు గోచరించడం... ఇదంతాకూడా చిత్తం యొక్క భ్రమ మాత్రమే!

విచిత్రం చూడు! చిత్తం దృష్టిలో దేహాలు కనిపిస్తున్నట్లే, దేహాల దృష్టికి చిత్తం కనిపిస్తోంది. ఒక దానిచే రెండవది కల్పితంగా తోచుచున్నది. దేహ – చిత్తాల దృష్టిచే 'జీవుడు' అనునది కూడా

కల్పితమై సంప్రాప్తిస్తోంది. జీవదృష్టిచే దేహ చిత్తాలు కల్పితాలై ఉంటున్నాయి. అంతయూ కల్పిత మాత్రమే అయి ఉండగా... ఇక ఆ 'పరమపదం' అనుదానియందు ద్వైతానికి చోటెక్కడిది? శుద్ధ చైతన్యం యొక్క స్వయంకృతమైన ఏమఱుపు చేతనే దేహ-చిత్త-జీవాదులు మేఘాల ఆకారంచే ఆకాశంలో కనిపించే కొండ శిఖరరూపం వలె రూపుదిద్దుకుంటున్నాయి.

బ్రాహ్మీదృష్టిచే సమస్తమూ ఏకం, శాంతం, బ్రహ్మరూపం అయివున్నది. బ్రహ్మమునందు నామవాచకం-సర్వనామం గాని, తదితర భ్రమలు గాని లేనేలేవు. ఆకాశంలో మేఘాలు గుమిగూడి ఉండగా బాలునికి ఆకాశంలో కొండలు తోటలు ఉన్నట్లుగా కనిపిస్తూ ఉంటుంది. ఆకాశం శూన్య మాత్రమై ఉండగా అక్కడక్కడ తోట-బాట ఉండటమేమిటి? ఇసుకలో ఎక్కడైనా నూనె ఉంటుందా? చంద్రబింబంలో మెఱుపుతీగలుంటాయా? అవన్నీ భ్రమ మాత్రమే కదా! తత్త్వదృష్టిచే ఈ దేహాది పదార్థాలు లేనేలేవు. సత్యాన్ని ఎఱుగుటలో ఉత్తమోత్తముడవగు ఓ రామచంద్రా! "లేనిదే" అయినట్టి ఈ జగత్తు యొక్క భ్రమయందు నీవు చిక్కుకోకూడదు సుమా!

ఈ జగత్తు వాస్తవానికి లేదు. ఇది పరమసత్యం. సామాన్యంగా అనేకమంది "జగత్తే ఉన్నది. బ్రహ్మ సత్తా లేదు" - అను భ్రాంతికి లోను కావడం లోకపరిపాటి. అట్టి భ్రమ తొలగటానికి ఈ మన సంవాదం మహత్తరమై సహకరించుగాక! జగత్తే లేనప్పుడు ఇక బంధానికి కారణం ఎక్కడున్నది చెప్పు?... "కుండ-మూకుడు- చట్టి - పిడత - ప్రతిమ - ప్రమిద" ఇవన్నీ స్వతహాగా మట్టియే కదా! అట్లాగే అనేక విశేషాలతో కనిపిస్తున్న ఈ జగత్తంతా చిత్తం మాత్రమే! అయితే అట్టి చిత్తం విచారణచే తనంతట తానే (స్వయంగా) క్షయించిపోవుచున్నది.

ఓ రామచంద్రా! ఓ తదితర సర్వ స్వయమాత్మ ఘన చిదానంద స్వరూపులారా! నా ఉపదేశం యొక్క సారమంతా సులభవిషయమే కాని అసాధ్యమైన విషయం కాదు-

అహంకారం నేను కాదు. అహంకారం ఆమూలాగ్రంగా భ్రమ మాత్రమే! సంపదలందు హర్షించటం, విపత్తులందు శోకించటం... ఇవన్నీ మనోధర్మాలే గాని ఆత్మ యొక్క ధర్మాలు కాదు. మనస్సు "భ్రమ-దురవగాహన" అను వాటిచే కల్పించబడినది. మనస్సు ఉన్నా, ఎట్లా ఉన్నా... ఆత్మ యథాతథంగానే ఉన్నది. మీరంతా 'రాక-పోక' అను స్వభావం కలిగిన సుఖ దుఃఖాలను అధిగమించి "ఇవన్నీ ఏది ఎట్లా ఉన్నా కూడా నేను సర్వదా అఖండమగు ఆత్మ స్వభావినే" అనే స్థితిని సొంతం చేసుకుని ఉండండి.

మీరెవరూ దేహ స్వభావులు, మనో స్వభావులు కాదు. సర్వదా ఆత్మ స్వభావులు! దేశ-కాలాతీతులై, అప్రమేయులై, నిత్యోదిత ఆత్మ చైతన్యసూర్య స్వభావులై ప్రకాశించండి. 'ఎఱుక' అనే కిరణ సమూహాలై సర్వదా వెదజల్లుతూ కూడా నిర్విషయానందంతో కూడిన ఆత్మైశ్వర్యమయులై చొన్నొందండి.

ఓ రఘుకుల తిలకా! రామచంద్రా! ఓ ప్రియ సర్వజనులారా! మీరంతా యథాస్థితమగు ఆత్మ వస్తువును చక్కగా సాక్షాత్కరించుకోండి. చిత్తం యొక్క రూపం "హర్షం - శోకం - ఇచ్ఛ"

అను మూడూ కలిసినది మాత్రమే! మరి మీరో... ఈ హర్ష–శోక–ఇచ్ఛల కంటే కూడా అతీతమైన, సూక్ష్మమైన రూపం కలవారై ఉన్నారు. అట్టి మీ అనంతత్వాన్ని ఏమఱువకపోవటమే మోక్షం. ఇంతకు వేఱైన మోక్షశబ్దార్థం లేదని గ్రహించి, అటుపై యథేచ్ఛగా సమర్థించువారై ఉండండి. అప్పుడిక ఏది ఎట్లున్నప్పటికీ మీరు మోక్ష స్వరూపులే! ఓ సర్వ సహజీవులారా! మీరంతా ఆత్మారాములే!

❖❖❖

8. వాసనాక్షయం యొక్క ఆవశ్యకత

శ్రీరాముడు : ప్రభూ! ఈ పురుషకారం అనేది అనేక కర్మ వ్యవహారాలకు కారణమగుచున్నది. 'దైవం' అనే శబ్ద–అర్థములకు కారణం కూడా ఈ కర్మల వ్యవహారమే కదా! ఇదే మరల జనన మరణాలకు కూడా కారణం అగుచున్నదని శాస్త్ర ప్రసిద్ధి. అట్టి "బీజంలోంచి చెట్టు, చెట్టులో నుంచి బీజం" అను బీజ–వృక్ష న్యాయాన్ని ప్రదర్శిస్తున్న పురుషుడు – పురుషకారం లేక 'కర్త–భోక్త'ల తత్త్వాన్ని విశదీకరించవలసినదిగా నా ప్రార్థన.

శ్రీవసిష్ఠ మహర్షి : రామచంద్రా! నీ యొక్క "సర్వసాధక జనుల పట్ల గల అవ్యాజ ప్రేమ" చేతనే ఇటువంటి ప్రశ్నను ఈ సందర్భంలో ప్రస్తావించావు.

సరే, ఇప్పుడు 'కర్మలు – కర్త – భోక్త' అను వాటి గురించి కొన్ని విషయాలు చెప్పుకుందాం. కుండ కార్యరూపం, మట్టి కారణరూపం; వస్త్రం కార్యరూపం, దూది కారణరూపం; అట్లాగే "జీవుడు కార్యరూపం, దైవము, కర్మలు కారణరూపం" – అని సిద్ధాంతీకరించబడుతోంది.

అయితే 'దైవం–కర్మ' అను కారణరూపం, పురుషుడు (జీవుడు) అను కార్యరూపం... ఈ మొదలైనవన్నీ వాస్తవానికి 'చిత్‌స్పందం' యొక్క పర్యాయ పదాలే! చైతన్య స్పందమే లోకంలో ఆయా వివిధ రూపాలుగా పొందినదగుచున్నది. ఎట్లా అంటావా?... చిదాత్మయే ప్రాథమిక రూప మగు "చిత్ స్పందం"చే 1.సమష్టి మనస్సు, 2.వ్యష్టి మనస్సుగా అగుచున్నది. ఆ పిదప దేహాకార ధ్యాసచే పురుషకారం ఆశ్రయించి 'పురుషుడు' అను రూపాన్ని దాల్చుచున్నది. పురుషకారం నుండి 'కర్మలు' బయల్వెడలుచున్నాయి. క్రమంగా ఉచితానుచిత్యం రూపు పొందగా పుణ్య–పాపాలు దృష్టి మొదలైన ద్వంద్వాలు బయల్వెడలి జగద్రూపంగా వివర్తమొందుచున్నాయి.

చైతన్యం యొక్క స్పందం లేకపోతే పురుషుడు (జీవుడు) గాని, కర్మలు గాని ఎక్కడ? ఎవరికి? అవి స్వతహాగా చూస్తే అసద్రూపాలు మాత్రమే! చైతన్య సత్తాయే ఈ జగత్తుగా ప్రాప్తిస్తున్న అణువణువు కూడా! వాసనారహితమగు చైతన్యం యొక్క స్పందం చేత ఈ 'జగత్తు' అనే భావనా రూపానుభవం సుదూరంగా కనిపించే కుగ్రామం వలె బాహ్యవస్తువుగా అగుపించ నారంభిస్తుంది.

చైతన్యం సర్వదా యథాతథంగానే ఉంటున్నది సుమా! వాసనారహితమగు చైతన్యం యొక్క స్పందన అస్పందనమనియే చెప్పవచ్చు కూడా! ఎందుకంటే... తరంగాలు దృష్ట్యా సముద్రజలం సర్వదా చంచలమై ఉంటున్నప్పటికీ సముద్రం దృష్ట్యా (జలం దృష్ట్యా) సముద్రం సర్వదా ఏకమే

అయి ఉన్నది, నిశ్చలమే అయి ఉన్నది. జలం జలంగానే ఉంటోంది కదా! అనేకంగా కనిపించేదంతా ఏకంగా అనిపించే వరకు ముముక్షువు తన సాధనలను కొనసాగిస్తూనే ఉండుగాక!

ఓ రామచంద్రా! ఈ జీవునకు కర్మలలో కనిపించే భేదమంతా సృష్టియందు ప్రారంభమైన కల్పనాంశమే. వాస్తవానికి చైతన్యమునకు, చైతన్య స్పందనా రూపాలగు కర్మలకు ఒకించుక కూడా భేద లేదు. 'జలతరంగాలు' అను శబ్దార్థంలో జలానికి తరంగాలకు భేదమేమున్నది? ఏదైనా భేదం కనిపిస్తే అది సంకల్పమాత్ర జనితమే గాని వాస్తవం కానేకాదు! కర్మయే పురుషుడు. పురుషునిదే కర్మత్వం పురుషునికి కర్మలకు భేదం – మంచుగడ్డ, శీతలత్వము వలె భ్రమయే. పురుషునికి – అనిర్వచనీయ చైతన్యమునకు గల భేదం అట్టిదే.

'చైతన్యస్పందం' అనే రసమే దైవంగా చెప్పబడుతూ, ఆరాధించబడటం లోకంలో జరుగుతోంది. బీజమే కొమ్మలు, ఆకులు, పూలు అగుచున్నట్లుగా... చైతన్యరసమే దైవం, కర్మ, జీవులు అయి ఉన్నది. 'మనుష్యుడు, జంతువు, దేవత, త్రిమూర్తులు మొదలైనవన్నీ చైతన్యం యొక్క అంశ స్వరూపాలే! చైతన్య రసమునకు వేఱుగా మనుష్యులు, దేవతలు, జంతువులు, మొదలైనవీ లేవు.

చైతన్యం స్పందయుక్తం అగుటయే 'జగత్తు' అనబడే దానికి బీజం. చైతన్యం స్పందానికి ముందే ఉండటం చేత స్పందనసమయంలో కూడా యథాతథంగా ఉండడం చేత చైతన్యం దేనికీ బీజమగుట లేదు కూడా! చైతన్యం తనలో తానే స్వయంగా బీజత్వాన్ని కల్పించుకొని సూక్ష్మావయవ రూపమున కూడా ఉన్నదై క్రమంగా విస్తార జగత్ రచనకు కర్మల రూపంగా నిర్వర్తిస్తోంది.

చిత్త్వంచ క్వచిత్ అస్పంన్దం, క్వచిత్ స్పందమ్ స్వభావతః ।
అనంతమ్ ఏకార్ణవత్ "దిక్–కాల" క్రమ సంస్థితమ్ ॥

అనంత మహాసముద్రజలం ఒకచోట తరంగ సహితంగాను, మరొకచోట తరంగ రహితం గాను (చంచలంగాను, నిశ్చలంగాను) ఉంటోంది చూచావా?... చైతన్యం స్వయంగా స్వభావతః ఒకానొక చోట దేశకాలక్రమంతో కూడినదై ఉంటూనే... మరొకచోట దేశ కాలాదులచే స్పర్శించ బడకయే ఉంటోంది. 'చిత్' స్వయంగా అకారణమే అయివుండి కూడా, ఆ చిత్‌స్పందం వాసనా రహితమై దేహం – ఇంద్రియాలకు అంకురరూపంగా అవధరిస్తోంది. ఒక గడ్డిపరక గడ్డిపూలు పూయడానికి, ఒక పూతీగ పుష్పాలను, ఆకులను ప్రదర్శించడానికి, ఒక మఱ్ఱి గింజ మహావృక్షంగా పరిణమించడానికి... వీటన్నిటికీ కారణం చైతన్యమే!

ఓ రామచంద్రా! అగ్నికి, ఉష్ణత్వానికి భేదమేముంటుంది? బీజమునకు, ఆ బీజంలో నుంచి అంకురిస్తున్న వృక్షమునకు భేదమే లేదు. బీజంలో నిద్రాణమై ఉన్న చిత్‌తత్త్వమే స్పందమును స్వీకరించి "చిత్ చైతన్యము" అనబడు మహిమచే మహావృక్షంగా ప్రకటనమగున్నది కదా!

బీజమే అంకురచైతన్యం. 'అంకురశక్తి' కి వేఱుగా బీజమనబడునది లేదు. కర్మయే మనుజుడు. జలం తనయందు తానే బుద్బుదాలను రచించుకొనుచున్నది చూచావా? చైతన్యం అంకురసత్త రూపంగా విత్తనంలో స్ఫురిస్తున్నట్లే ఈ పృథ్వియందు కూడా ఓజోరూపంగా స్ఫురించి ఒకచోట

స్థూలం గాను, మరొకచోట సూక్ష్మం గాను, ఒకచోట మృదువుగాను, మరొకచోట అత్యంత కఠినంగాను తనను తాను రచించుకొనుచున్నది. చైతన్యం కాక మరింకేది భూగర్భంలో వజ్రం నిర్మితమగుటకు కారణం కాగలదు? చైతన్యం యొక్క అతికోమలమగు 'అంకురం' అను చమత్కారం ద్వారా అతి కఠినమగు రత్నం, వజ్రం మొదలైనవి ప్రాప్తిస్తున్నాయని గ్రహించు.

లత యందు 'రసము'నకు కారణమైన చైతన్యమే ఫలపుష్పాదులను విస్తరింపజేస్తోంది. ప్రాణి యొక్క వీర్యరసమందున్న చైతన్యము ఈ జంగమ జీవులను విస్తరింపజేస్తోంది.

సర్వవ్యాపకమగు సంవిత్ చైతన్యం అతి బలవత్తరమైనది కాబట్టే అది తనయందు దైవ-అసురాది-పర్వతాది సమస్తమును అవధరిస్తోంది. సమస్త స్థావర-జంగమ పదార్థముల యొక్క "ఆదిబీజం"... చైతన్యం యొక్క స్ఫురణ మాత్రమే అయి ఉన్నది. అట్టి చైతన్యమునకు బీజమైనదేది? ఏదీ లేదు. చైతన్యము సర్వమునకు బీజమై కూడా, తాను బీజ-అంకుర రహితము.

బీజము-అంకురము, పురుషుడు-క్రియ, దైవము-పురుషుడు, వాయువు-వాయువీచికలు... వీటన్నిటినికి పరస్పర భేదమేమి ఇసుమంత కూడా లేదు.

ద్విత్వంనృకర్మణోర్యస్య, బీజ-అంకురతయా తయోః ।
విపశ్చిత్ పశవే, తస్మై మహతే అస్తు సదా నమః ॥

ఎవరి దృష్టిలో "పురుషుడు వేరు - కర్మలు వేరు, బీజాంకుర శక్తి వేరు - కారణ శక్తివేరు, కార్యరూపమగు ఈ స్థావర జంగమ పదార్థములు వేరు, చిత్ చైతన్యము వేరు-కనబడే జీవులు వేరు- విత్తులోని అంకుర రసం-విత్తు-వేళ్లు, కొమ్మ వృక్షము వేరు, కాండము వేరు, కొమ్మ వేరు, పుష్పము వేరు..." ఇటువంటి అభిప్రాయాలు ఘనీభూతమై ఉంటాయో, అట్టి నరరూప పశువుకు నేనేం చెప్పగలను? - ఆ మహానుభావుడికి ఒక నమస్కారం.

ఓ రామచంద్రా! చైతన్యమునందు 'జన్మించటం' అనే దానికి సంబంధించిన ఏ బీజం లేక ఏ వాసనారూపమగు రసం కలదో... అదే జన్మరూపమగు అంకురానికి, దేహం చేత పొందబడే సమస్త వ్యవహారానికి కూడా "బీజం" అయి ఉన్నది. అట్టి చైతన్యంలో ప్రదర్శితమయ్యే వాసనారూప రసమే జన్మకర్మలకు కూడా కారణం. కనుక ఆ వాసనారూప రసం దహింపజేస్తే శేషించేది నిర్మల-జన్మ కర్మాతీత చిత్‌తత్త్వమే! అట్టి అప్రమేయ చిత్ తత్త్వం అనుభవయోగ్యం కావాలంటే 'అసంగం' అనే అగ్నిచే వాసనారూప రసమును శోషింపజేయాలి.

శ్రీరాముడు : 'అసంగం' అనుదాని గురించి మరికొంత సుస్పష్టం చేయండి.

అసంగము -

శ్రీవసిష్ఠ మహర్షి :

కుర్వతో అకుర్వతశ్చైవ మనసా యదమజ్జగమ్ ।
శుభాశుభేషు కార్యేషుతత్ "అసంగం" విదుర్ బుధాః" ॥

ఎద్దాని సహాయం చేతైతే "ఆయా క్రియలు చేస్తున్నప్పుడు, చేయకుండా ఉన్నప్పుడు కూడా ఆయా శుభ - అశుభ కర్మలందు మనస్సుచే ఈ జీవుడు తగుల్కొనకుండా ఉంటాడో"... అద్దానిని

"అసంగం" అని విజ్ఞులు పిలుస్తున్నారు. అయితే ఈ "తగుల్కోవటం" అనేది ఎట్లా ఏర్పడుతుంది? దానికి కారణం "అంతరంగంలోని వాసనలే" అని ప్రవచించబడుతోంది. వాసనలు అనగా ఏమిటి? అజ్ఞానవశంచేనిర్వర్తించబడిన అభ్యాసం యొక్క ఆంతరంగిక సమీకరణమే వాసనలు. జ్ఞానాభ్యాసం చేత అజ్ఞానాభ్యాస ప్రభావం సన్నగిల్లుతూ రాగా అప్పుడు వాసనలు వాటికవే తోకముడుస్తాయి. కనుకనే "వాసనల యొక్క నాశనమే అసంగం. వాసనల ప్రకోపమే సంగం" అని కూడా చెప్పబడు తోంది. ఓ రామచంద్రా! ఉపాయం ఏదైనా ఫరవాలేదుగాని, ఎలాగో అలా ఈ అంతరంగంలోని వాసనలను నశింపజేయాలి. "ఈ జగత్తే బ్రహ్మం. నీవే ఆ 'తత్' అయివున్నావు. నేను స్వయంగా సర్వదా బ్రహ్మాన్ని. నేనే నీయందున్నాను. నీవే నాయందు ఉన్నావు. నేనే అంతటా ఉన్నాను"... అనే వాక్యాల అనుభవార్థమేమిటో అప్పుడుగాని సుస్పష్టమవదు. ప్రియజనులారా! భావిసహజీవులారా! మీరంతా ఈ వాసనలు రహితం చేయడానికే మీమీ కార్యక్రమాలన్నీ ఉద్దేశించి ఉండండి. మీకు రాజయోగం, హఠయోగం, పూజ, ప్రార్థన, ఉపన్యసించండం, శ్రవణం మననం... మొదలైన ఆయా యుక్తులతో ఏది సులభమని అనిపిస్తే అదో (లేక) ఏ కొన్నియో అవలంబించండి. పురుష ప్రయత్నశీలురై ఉండండి. వాసనారాహిత్యమే పరమశుభప్రదం, పరమ మంగళమై ఉంది. వాసనా రహిత స్థితియే ప్రత్యగాత్మ స్వరూపం.

అహంభావమే సర్వ వాసనలకు మూలం. "నాఽహం" భావనయే వాసనాక్షయం యొక్క నాంది, విధానం, అంతిమ ప్రయోజనం కూడా! "అహం" అనబడు ప్రత్యయమునకు ముందే ఉన్న తన అప్రమేయరూపాన్ని ఏమఱచుట చేతనే 'సంగం' అనేది రూపుదిద్దుకుంటోంది. అందుకుగాను, ఇప్పుడు పురుషప్రయత్నం ఆశ్రయించవలసిందే .

నాస్త్యేవ పౌరుషాత్ అన్యా, సంసారోత్తరణే గతిః ।
'నిరహం' భావరూపే అస్మిన్ వాసనాక్షయనామని ॥

"సంసారం నుండి నేను ఉద్ధరించబడాలి" అని ఊరకే అనుకుంటూ ఉంటే ప్రయోజనం ఏమిటి ? వాసనలు క్షయిస్తే సంసారమూ లేదు, మరొకటీ లేదు. వాసనలు క్షయించాలంటే ఈ జీవుడు పురుషప్రయత్నం ఆశ్రయించడం తప్పించి వేఱే ఉపాయమే లేదు.

"అనాది, అనంతం" అయిన ఏ చైతన్యమైతే కలదో... అదే అంకురం, అదియే 'బీజం', అదే 'కర్మ'. అదే 'పురుషుడు'. అదే శుభాశుభప్రదమగు 'దైవం'. అదే 'అదృష్టం' కూడా! సృష్టి అనేది జీవుని యొక్క "వ్యష్టి-సమష్టి"ల భావావేశాల సమావేశమే గాని... వేరేమీ కాదు. సృష్టి యొక్క మొట్టమొదటి చైతన్యానికి అన్యంగా ఎక్కడా ఏదీ లేదు. సృష్ట్యాదిలో చైతన్యానికి అన్యంగా అంకురం గాని, బీజంగాని, పురుషుడుగాని, కర్మగాని, దైవాదులుగాని లేవు. కేవలం చైతన్యమే సర్వరూపంగా ప్రకటనమగుచున్నది. అనగా వర్తమానంలో 'జీవుడు'గా ఎవరిని పిలుస్తున్నా అతడు ఒకప్పుడు తన యొక్క నిర్వివాదసర్వాంశ చైతన్యంగానే అనుభవం కలిగి ఉన్నాడు. ఇప్పటికీ ఆతడు అట్టివాడే! అయితే, అట్టి తన సర్వత్త్వమును, నిత్యత్త్వమును ఏమఱచి ఆతడు ద్వైతాన్ని ఆశ్రయించి "నేను జీవుడను. నన్ను కర్మలు, పురుషుడు, దేహం మొదలైనవి బంధించాయి"... అని తలచుచున్నాడు.

పురుషుడు అనబడు జీవుడు "నేను బద్ధుడను" అను అపేక్షాసంప్రాప్తమైన దుస్థితిని త్యజిస్తేనే శాంతి అనుభవిస్తాడు. అట్లా త్యజించగలగాలంటే పురుషప్రయత్నంచే "నేను సర్వదా చైతన్యాన్నే"... అనే సంస్థితిని సముపార్జించుకోవటమొక్కటే ఉపాయం.

వాస్తవానికి బీజం గాని, అంకురం గాని, పురుషుడు గాని, కర్మలు గాని లేవు. ఏకైక చైతన్యమే ఈ సుర-అసుర-మనుష్యాది ఆయా వేషాలను ధరించి ఈ 'జగత్తు' అనే నామరూపాత్మక శోభతో ఉదితమై ఇక్కడ జగన్నాటకం ఆడుతోంది. కనుక ఓ రామా! లే! సందేహాలన్నీ త్యజించు. సందేహరహితం, సర్వస్వరూపం అగు బ్రహ్మాన్ని (చైతన్యాన్ని) భావన చేయి. అసత్యాలైనట్టి ఈ పురుష-కర్మాదుల గురించిన శంకలన్నీ పారద్రోలివేయి. ఈ పాంచభౌతిక దేహాన్ని అధిగమించు. "సమస్త కల్పనా వర్జితము, వాసనా వినిర్ముక్తము"... అయినట్టి చిన్మాత్ర శరీరాన్ని అవధరించు. సమాధి (సమ + అధి) యందు మాత్రమే సర్వదా ఏర్పడివుండు. సమాధి యందు మాత్రమే వ్యవహరించు. సమస్త కోరికలను, సంశయములను విడిచివేయి. నిర్మలమైన చిన్మాత్రమునందు మాత్రమే స్థితి కలిగి ఉన్నవాడవై, ప్రవాహపతితమైన సర్వకార్యాలను నిర్వర్తించు. ఆశాసమన్విత కర్మచరుడవు కాకుండానే స్వభావసిద్ధ కర్మ నిర్వహణ కలిగి ఉండు. కేవలం ఆత్మారాముడవై, పూర్ణ కాముడవై, శాంతిచే మనోహరుడవై, నిర్భయుడవై ప్రకాశించు. నీ మనస్సు అఖండాత్మయందు, హస్తములు లోకవ్యవహారములందు - వ్యవహరించును గాక!

❖❖❖

9. ప్రవాహపతితం కర్మ - అసంగపూర్వక నిర్వహణ

శ్రీరాముడు : మహర్షీ! "ప్రవాహపతితం" అను శబ్దం యొక్క అర్థమును మరికొంత వివరించ ప్రార్థన. అనివార్యములైన ఆయా క్రియలు నిర్వర్తించవలసి వచ్చుచుండగా... ఈ జీవుడు ఎట్టి జ్ఞాన యోగములను అవధరించాలో బోధించ వేడుకొంటున్నాను.

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఓ ప్రియా సహజీవులారా! మీ స్వరూపము ఆత్మయేగాని, ఈ దేహ-మనో-బుద్ధ్యాదులు కాదు కదా!

నిత్యమ్ అంతర్ముఖః తిష్ఠ, వీతరాగో, వివాసనః
చిన్మాత్రం అమలం, శాన్తం కర్మ సర్వత్ర భావయన్॥

ఈ రాగము, వాసన మొదలైనవన్నీ బహిర్ముఖుడై జగదర్శన సమయంలో ఈ జీవుని పట్ల అకస్మాత్తుగానో, క్రమక్రమంగానో ప్రోగవుతున్నాయి. అయితే యథా ప్రాప్తములైన ఆయా కర్మలను నిర్వర్తిస్తున్నప్పటికీ 'రాగ-వాసన'లను అధిగమించి (త్యజించినవాడవై) అంతర్ముఖుడవగుము. 'అంతర్ముఖమవటం' అనగా నిర్మలం-శాంతం-చిన్మాత్రం అయినట్టి ఆత్మ స్వరూపం అవధరించ టమే! ఆకాశం వలె నిర్మలమైన స్వరూపం కలవాడవై, ప్రాజ్ఞుడవై కేవలం 'చిన్మాత్రం' అయినట్టి ఆత్మ యందే సదా స్థితి కలిగి ఉండు. సమరూపుడవై, సౌమ్యుడవై, సమమగు ఆనందంతో కూడి

ఉండు. 'బ్రహ్మంతో అభేదం సంతరించుకోవాలి'... అను ఆశయమును నిర్దుష్టపరచుకో! యథా ప్రాప్తాలగుచున్న సర్వ అల్ప-మహత్తర కార్యాలలో, అట్లాగే, ఆయా శోక-ఆపద-సంకట-భయ సమయాలలో, నిమ్న - ఉచ్ఛ స్థితులలో ఆయా దుఃఖ హాసాదులను ఈ ప్రపంచంలో బాహ్యానికి నటించు. 'ఈ జగత్తు, ఈ పరిస్థితులు, ఈ దేహం - ఇవన్నీ కూడా అన్ని వేళలా ఒకే తీరుగా ఉండవు. వాటి స్వభావము అట్టిది మరి!... నేనో? ఆత్మయే స్వరూపంగా గలవాడను'... అనే మననం కలిగి ఉండు. అన్నీ తెలిసియే శీతోష్ణాది సర్వ ద్వంద్వాలను పొందుతూ పొందని వాడవై ఉండు. అంతరంగంలో సౌమ్యుడవై ఉంటూనే... బహిరంగంలో మాత్రం తదితరుల వలెనే తదితర అనుకూలంగా వర్తించు. బంధు మిత్ర సమాగమ-వియోగాలలో, ఉత్సవ-నిరుత్సవాలలో, వాసనా ప్రదర్శన - అప్రదర్శనలలో అందరిలాగానే సుఖ దుఃఖాలు ప్రదర్శిస్తూనే... అన్నీ ఎఱిగినవాడవై 'అతీతత్వం' వహించి ఉండు.

భూతాని మృత్యు కార్యేషు సంగ్రామాదిషు నిర్ధహ
దావానల తృణానీవ వాసనాక్రాంత మూఢవత్॥

అగ్ని రుచి-పచి తెలియకుండానే గడ్డిపరకలను దహిస్తున్నట్లు, పైకి మాత్రం యుద్ధంలో వాసనలచే ఆక్రమించబడిన మూఢుని వలె శత్రుసైన్యమును దహించివేయి. అయితే అంతరంగంలో ఎవరిపైనా ఇసుమంత కూడా క్రోధం కలిగి ఉండకు. ధనంపై మమకారం కలిగి ఉన్నవాడు ధనం ఆర్జించినట్లే నీవు ఆర్జించు. అయితే ధర్మనిరతిని వదలకు, మమకారాదులు లేకయే ఉండు.

దీనుల యెడ కరుణ, మహాత్ముల పట్ల ఉదారత్వం, దుష్టుల యెడ కఠినత్వం వహిస్తూనే సర్వాత్మకుడవై ఉండు.

ఏది ఎట్లు ఏ రీతిగా అగుచున్నప్పటికీ నీవు సర్వదా అంతర్ముఖుడవై, ఆత్మానందయుతుడవై, స్వాత్మారామత్వంతో కూడి ఉండు. 'శమం'చే పరిపూర్ణుడవై, ఉదారచిత్తుడవగుచు ఉన్నప్పుడు నీవు ఏ కార్యం నిర్వర్తించుచున్నప్పటికీ నిర్వర్తించనివాడవే (అకర్తవే) కాగలవు. ఓ సాధూ! రామచంద్రా! 'నేను అఖండము-అప్రమేయము అగు ఆత్మనే' అను ఆత్మ భావనచే ఎవని యొక్క వృత్తి నిత్యం అంతర్ముఖమై ఉంటుందో... అట్టివాని పట్ల ఇంద్రుని వజ్రాయుధం కూడా నిష్ఫలమైపోగలదు.

సంకల్ప కలనోన్ ముక్తే, స్వ సంవిన్మాత్రకోటరే
యః తిష్ఠతి ఆత్మనిస్వైరమ్ "ఆత్మారామో మహేశ్వరః"!

సంకల్ప కల్పనా విశేషాలను తన హృదయాకాశం నుండి బయటకు నెట్టి ఎవడైతే యథేచ్ఛగా ఆత్మయందు స్థితి కలిగి ఉంటాడో... అట్టి ఆత్మారాముడే మహేశ్వరుడు. అట్టి చిన్మాత్ర నిష్ఠుని ("నేను సర్వాతీతమగు ఆత్మను" - అను నిష్ఠను ఆశ్రయించిన వానిని) శస్త్రములు ఛేదించలేవు.

న తం భిన్దన్తి శస్త్రాణి, న దహన్తి హుతాశనాః
న క్లేదయన్తి వారీణి, శోషయన్తి న మారుతాః ॥

ఆత్మతో ఏకీభూతుడైన వానిని శస్త్రాలు ఛేదించజాలవు. అగ్ని దహించజాలదు. జలం తడుపలేదు. వాయువు ఎండించలేదు. కాబట్టి రామా! జన్మ-జరా-మరణాలు లేని నిత్య

నిరతిశయానంద రూపమైన 'స్వాత్మ' అను స్తంభమును ఆశ్రయించి ఉండు. ధీరుడవై నిశ్చలతను అవలంబించి ఉండు.

ఈ జగత్తుకు కారణము, ఆశ్రయము, సారభూతము అయిన శాంతమగు బ్రహ్మచైతన్యము మాత్రమే ఆశ్రయించతగినది. తదితర బాహ్యవృత్తులనన్నిటినీ అంతర్ముఖం చేసి చ్యుతిలేని స్థితిని సముపార్జించుకోవటమే సాధనలన్నిటియొక్క ఉత్తమ లక్ష్యమని జనులు గ్రహించెదరు గాక! నిత్యము అంతర్ముఖత్వము కలిగి బాహ్యమున యథా ప్రాప్తములగు కార్యములకు రాగ-మమకార రహితంగా నిర్వర్తించే వారికి 'వాసన' ఉదయించజాలదు.

ఈ మనస్సు మరల మరల సాంసారిక విషయాలలో నిమగ్నమౌతోంది. 1.నిర్వర్తించటం, 2.నిమగ్న మవటం... ఈ రెండిటి ఫలితమేమిటో గమనించు. ముముక్షువులైన వారు ఎక్కడెక్కడ తమ మనస్సులు వృత్తులతో కూడి ప్రవేశిస్తోందో ముందుగా గమనించాలి. ఎక్కడ ఆత్మ కంటే అతిరిక్తమైన (ఇష్ట-అయిష్ట-ఉచిత-అనుచిత మొదలుగా గల) భావన ఏర్పడుతోందో అక్కడక్కడ మనస్సు నిమగ్నమౌతున్నట్లే. తాబేలు తన అవయవాలు అంతర్ముఖం చేస్తున్నట్లు ఈ మనస్సును కూడా అంతర్ముఖం చేయాలి. కనబడే తదితర జీవులందరినీ ఆత్మ స్వరూపులుగా చూడటమే మనస్సు యొక్క అంతర్ముఖత్వం సుమా! ఓ రామా! అంతరంగమున వృత్తిరహితుడవై బహిర్గతంగా మాత్రం ఆయా నియమిత సమస్త కర్మలు ఆచరించు.

అంతర్ వృత్తి విహీనేన, బహిర్వృత్తిమతేవ చ ।
సుప్త ప్రబుద్ధ ప్రాయేణ కార్యమ్ ఆచర, చేతసా ॥

ఓ రామా! అభ్యంతరమున వృత్తి రహితంగాను, బాహ్యమున వృత్తి సహితుని వలెను ఉన్న వాడవై సగం నిద్రించే చిత్తముతో ప్రపంచమున కార్యములు ఒనర్చుము. బాలుడు అంతరమున వాసనలు లేకుండానే కేరింతలు, ఆటలు, చేతులు-కాళ్ల కదలికలు ప్రదర్శిస్తాడు కదా! మూగవాడు అనేక విషయాలు తెలిసికూడా ఏమీ మాట్లాడడు చూచావా? అట్లాగే అభ్యంతర వాసనలన్నీ త్యజించి ఒక బాలుని వలె, మూగవాని వలె ఈ జగత్తును దర్శించటం అలవరుచుకో. ఆసక్తి లేనప్పుడు ఏ కార్యము నిర్వర్తించినప్పటికీ - ఆకాశమును పదార్థములు స్పృశించజాలనట్లు - నిన్ను ఆ కార్యాకార్యములు స్పృశించజాలవు. సదా నిర్వికల్ప సమాధి యొక్క అభ్యాసము నిర్వర్తిస్తూ నీ చిత్తము బాహ్యమున ఒకింత ప్రసరించి అభ్యంతరమున మాత్రం అంతటా మౌనము వహించి ఉండుగాక! సంతాపరహితమై అంతటా ఆత్మయే ఈ సర్వ సహజీవులుగా అగుచున్నది కదా... అను దృఢత్వము నీ చిత్తము వహించును గాక! జ్ఞానముచే చిత్త - బాహ్య ప్రసరణము క్షయిస్తుంది. సంకల్ప కళంక వర్జితుడవై సదా సర్వదా, సర్వత్రా శుద్ధ బ్రహ్మ చైతన్యమున స్థితి కలిగి ఉండుము. ఆపైన ఇక వ్యవహరింపుము. లేదా వ్యవహరింపకుండా ఉండుము. ఏది ఎట్లో అట్లే అగుగాక!

సుషుప్త సమయా వృత్త్యా జాగ్రత్ వ్యవహరన్ వ్రజన్ ।
గృహీణి మా కించిదపి, మా వా కించిత్ పరిత్యజ ॥

నీవు మేలుకొని ఉన్నప్పుడు ఆయా అనేక వ్యవహారాలను నిర్వర్తిస్తున్నప్పుడు, రహదారిలో నడుస్తూ ఉన్నప్పుడు... తదితర సర్వసమయాలలో సుషుప్తసమయ-వృత్తితో కూడుకొన్నవాడవై ఉండు. ఇష్టం కదా అని ఏ వస్తువును గ్రహించనూ వద్దు. అయిష్టం కదా అని దేనిని త్యజించనూ వద్దు. జాగ్రత్తులో 1. స్థూల 2. సూక్ష్మ ఉభయ ఉపాధులు అనుభవమౌతున్నాయి కదా! ఈ రెండింటినీ అధిగమించినప్పటి స్థితిచే జాగ్రత్తులోనే సుషుప్త స్థితి అనుభూతమొనర్చుకున్న వాడవౌతావు. అట్లాగే 'అజ్ఞానం' యొక్క ఆవరణ తొలగుటచే సుషుప్తిలో జాగ్రత్తుడవే ఆగుచున్నావు. ఈ విధంగా జాగ్రత్ - సుషుప్తుల భేదకమైన అజ్ఞానం తొలగగా అప్పుడు ఆ ఉభయంలో ఒకానొక ఏకత్వం సిద్ధించుచున్నది. భేదమును అధిగమించటంచేతనే సర్వస్వరూపమగు ఆత్మస్థితి లభిస్తుంది. ఈ ప్రకారంగా అభ్యాసంచే మెల్లమెల్లగా 'ఆద్యంతరహితము, ద్వంద్వవర్జితము, సమస్త వస్తువులకు పరము' అయిన ఆత్మ పదము అనుభూతమవగలదు.

❖❖❖

10. ఆత్మ అవ్యాఖ్యానసగోచరం

శ్రీరాముడు :

యద్యేవం ముని శార్దూల! తదహం ప్రత్యయాత్మకః ।
భవానేవేహ కిం తావత్ వసిష్ఠాఖ్యః స్థితో, వద ॥

ఓ ముని శార్దూలా! మీరు 'సమస్త వస్తువులు మిథ్యయే. అఖండ పరమాత్మ ఒక్కటే సత్యం'... అనే సిద్ధాంతం ప్రతిపాదిస్తున్నారు కదా! అంతా మిథ్యయే అయినప్పుడు 'అహం (నేను)' అను ప్రత్యయ రూపుడనైన ఈ 'రాముడు' ఎవరు? 'వసిష్ఠ మహర్షి' అని పిలువబడే తమరు ఎవరు? గురువులగు మీకు, శిష్యుడనగు నాకు గల గురు శిష్య సంబంధం కూడా భ్రమయేనా? మీరెవరు? నేనెవరిని?... ఈ విషయం విశదీకరించండి.

❖

శ్రీవాల్మీక మహర్షి : ఓ భరద్వాజా! శ్రీరామచంద్రుడు ఇలా ప్రశ్నించగానే వక్తలలో శ్రేష్ఠుడగు శ్రీ వసిష్ఠ మహర్షి మౌనం వహించారు. ఆయన ముఖంలో కించిత్ చిఱునవ్వుతో కూడిన పరమ గాంభీర్యమైన శాంతి ప్రదర్శితమైంది. సభికులంతా ఇది గమనించి "ఆహా! ఇప్పుడు ఏమి కాను న్నదో? రాముడు సూటిగా అడిగిన ప్రశ్నకు వసిష్ఠ మహర్షి సమాధానం ఎట్లు ప్రారంభించను న్నారో!"... అని ఎంతో ఉత్సుకతతో నిశ్శబ్దంగా వేచి ఉన్నారు. ఆ విధంగా మౌనము తాండవిస్తూ ఉండగా నిశ్శబ్దంగా 45 నిమిషాలు గడచిపోయాయి. అప్పుడు మరల శ్రీరాముడే పెదవి విప్పాడు.

❖

శ్రీరాముడు : మహాత్మా! ఏమిటి మీరు మౌనం వహించి ఉన్నారు? విద్వాంసులు, లోకగురువులు అయిన మీరు ప్రత్యుత్తరమీయలేని ప్రశ్న ఉండజాలదని నాకు తెలుసు. సమస్త తర్కాలకు మీ వాక్కే సమాధానమగుచుండగా మీ జ్ఞాన విశేష లహరి మాపై ప్రసరింపజేయకున్నారేమి?

శ్రీవసిష్ఠ మహర్షి :

న మే వక్తుమ్ అశక్తత్వాత్ యుక్తిక్షయ ఉపస్థితః
కింతు ప్రశ్నస్య కోట్యాస్య తూష్ణీమేవ, అనఘ! ఉత్తరమ్ ॥

ఓ రామచంద్రా! చెప్పుటకు అశక్తుడనై మౌనం వహించాను. యుక్తి లేక కాదు. నీకు సమాధానం ఈ 45 నిమిషాలుగా చెప్పుచూనే ఉన్నాను కూడా! నీ ప్రశ్నకు పరమావధియగు సమాధానం మౌనమే నా ప్రత్యుత్తరం.

ఈ ప్రపంచంలో గురువును తాత్త్విక విషయమై ప్రశ్నించే వారిని రెండు రకాలుగా విడదీయ వచ్చు. 1.జ్ఞాని, 2.అజ్ఞాని. అజ్ఞానికి అజ్ఞానత్వమును జతచేర్చి చెప్పబడుతోంది. ఇక జ్ఞానికేమో జ్ఞానవిశేషం ద్వారానే ప్రత్యుత్తరం ఇవ్వవలసి ఉంటుంది. అనగా, శిష్యుడు కూడా ఎంత వరకు జ్ఞానానికి సమీపంగానో, దూరంగానో ఉన్నాడో గ్రహించి తదనుసారంగా సమాధానపరచాలి.

ఇతఃపూర్వం నీవు 'ఆత్మపదం' గురించి 'ఇంకనూ గ్రహించాలి' అని నాకు అనిపించనంత వరకు నేను వికల్ప సహితమగు ఆయా దృష్టాంత-సోదాహరణాలతో కూడిన సమాధానాన్ని చెప్పుచూ వచ్చాను. ఇప్పుడో? తత్త్వజ్ఞుడవై పరమ పదమున విశ్రాంతి పొందావు. ఇప్పుడు నీకు వికల్ప సహితములగు ఉదాహరణాదులతో ప్రత్యుత్తరం ఇవ్వవలసిన అవసరం లేదు. ఒకవేళ మాటలు ఉపయోగించి ఒక సూక్ష్మార్థాన్ని గాని, పరమార్థాన్ని గాని, లేక మరొక మామూలు అర్థాన్ని గాని ఆయా ఉదాహరణలు, దృష్టాంతాలు తీసుకొని చెప్పానే అనుకో.... అట్లా మాటలలో చెప్పే వర్ణనకు కొన్ని దోషాలు ఉండియే తీరుతాయి. ఉదాహరణకు సుదూరంగా ఒక ప్రదేశంలో గల ఒక సుందరమైన శిల్పం గురించి నీకు చెప్పాలనుకో... అప్పుడు "అది చాలా అందంగా ఉంటుంది. మన అయోధ్యలో గల మహా విష్ణువు యొక్క విగ్రహంలా ఎత్తుగా ఉంటుంది. మెఱుస్తూ ఉంటుంది. ముక్కు బుగ్గలు అందమైన స్త్రీ వలె అత్యంత సౌకుమార్యంగా ఉంటాయి." మొదలైన ఆయా ఉత్ప్రేక్షలు, ఉపమానాలు, విశేషణములు తీసుకొని చెప్పవలసి ఉంటుంది. అట్లా చెప్పుకొనే వాక్యాలన్నీ కొన్ని కల్పనా కళంకములతో కూడి ఉండక తప్పేది కాదు.

'కళ్లు కలువలవలె ఉంటాయి' అనే ఉపమానంలో 'కలువలకు రెక్కలెన్ని ఉంటాయో, కళ్లకు కూడా అన్నే కనురెప్పలు ఉంటాయి. కాబోలు'... అనే రూపంలో ఉండే దోషాలు ఉంటాయి. అనగా... 1.నిరూపక 2.వ్యావృత్తి 3.సంఖ్య 4.పరమార్థ-సాధన... మొదలైన ఆయా దోష కారకాలు ఉండే అవకాశం ఉంటుంది. జ్ఞాని కళంకసహితమైన సమాధానం చెప్పటానికి అర్హుడు కాదు. అజ్ఞానికి కళంకరహితమైన సమాధానం చెప్పినా అర్థం చేసుకోలేడు. ఓ ప్రియ రామచంద్రా! నీవిప్పుడు జ్ఞానులలో అగ్రగణ్యుడవు సుమా! జ్ఞాని అయిన శిష్యునితో సత్య వస్తువునకు ముక్కుకు సూటిగా, నేఱుగా, సమగ్రంగా ప్రతిపాదించవలసివస్తుంది.

'ఈ రామచంద్రుడెవరు? ఈ వసిష్ఠుడు ఎవరు'... అను నీ ప్రశ్నకు 'సమాధానం సత్యవస్తువగు ఆత్మయే' అను సమాధానమే ఉచితం. 'ఆత్మ' గురించిన పరిచ్ఛేదక కళంక రహితమైన సమాధానం

కాష్ఠం వంటి మౌనమే అయి ఉన్నది. ఆ కాష్ఠ మౌనమునే ఇప్పుడు నీ ముందు సమాధానంగా ప్రకటించాను.

జ్ఞానోదయానికి పూర్వం తత్త్వం తెలియపరచటానికి వాక్-వ్యవహార రూపం, సంకల్పమయం అగు బోధ అత్యావశ్యకం; జ్ఞానోదయానంతరం మౌనమే వ్యాఖ్యానం

కనుకనే జ్ఞానివగు నీకు ఆ సుందరమైనట్టి మౌనరూప ప్రత్యుత్తరం ఇచ్చాను. 'వసిష్ఠ మహర్షి నామధేయుడగు మీరు వాస్తవానికి ఎవరు?' - అని నీవు ప్రశ్నించినప్పుడు నేను వాక్కుకు కూడా అతీతము, అవిషయము అగు ఆత్మ స్థితిని అవధరించాను. మనుజుడు ఏ స్థితిలో ఉంటే ఆ స్థితిని బట్టే మాట్లాడతాడు. ఎప్పుడైతే నేను ఆత్మ స్థితుడనైనానో, ఆ స్థితి వాక్కుకు అతీతమైనది. మనస్సును కూడా అధిగమించినది. కనుక (యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ) అట్టి అనుభవ స్థితిలో వాగ్రూపాలను ఎట్లా పరిగ్రహించగలను? ఆత్మానుభవం అవాచ్యం. వాక్కు అనేక కళంకాలతో మాత్రమే నిర్మితమౌతుంది. కాబట్టి ఇక మౌనమే నా సమాధానంగా నాకు శరణ్యమైనది.

శ్రీరాముడు : మీ 'మౌనం' అనునది సముచిత సమాధానమేనని నేను శిరసు వంచి అంగీకరిస్తున్నాను. అయితే అట్టి సమాధానం గ్రహించడానికి మేము వాక్-మనో అతీతత్వ నిశ్చితత్త్వమును గ్రహించునంతటి సాధనా ఔన్నత్యం సముపార్జించి ఉండాలి. సాధక జనులలో అనేకులు అంతటి సూక్ష్మ-పక్వ దృష్టి పొంది ఉండకపోవటం లోకరీతి కనుక వాక్కుకు ఏ నిరూపక వ్యావృత్తాది దోషాలు ఉంటాయో, వాటిని పట్టించుకోకయే (వాటిని వదలి) భోగ-త్యాగ-లక్షణాది ఉపాయాలచే' వసిష్ఠ మహర్షి నామధేయుడగు మీరెవరు? అను నా ప్రశ్నకు సమాధానం ప్రసాదించ ప్రార్థన.

❖❖❖

11. మనమందరమూ అద్వితీయాత్మస్వరూపులమే!

శ్రీవసిష్ఠ మహర్షి :

ఏవం స్థితే రాఘవ హే! యథా భూతమిదం శృణు
కస్త్వం? కోహం? జగద్వా కిమితి? తత్త్వవిదాంవర!

తత్త్వజ్ఞులలో శ్రేష్ఠుడవగు ఓ రామచంద్రా! నీవు కోరుచున్నావు కాబట్టి "నీవెవరు? నేనెవరు? ఈ జగత్తు ఏమిటి?"... అనే ప్రశ్నకు వాచ్య-వాచకపూర్వకమైన సమాధానం చెబుతాను, విను.

ఏ చిదాకాశమైతే విషయ వర్జితమై, సమస్త కల్పనలకు పరమై, నిర్వికారమై ఉన్నదో అట్టి చిదాకాశమే నేను, నేనే కాదు. నేను-నీవు కూడా ఆ చిదాకాశరూపులమే! ఈ సమస్త జగత్తు కూడా చిదాకాశమే అయి ఉన్నది.

శుద్ధజ్ఞానమయ ఆత్మయందు శుద్ధజ్ఞానైకరూపుడనగు నేను అన్య విషయ జ్ఞానా లన్నింటికి అతీతుడనై నెలకొని ఉన్నాను. నాకంటే వేఱుగా ఏదీ అణుమాత్రంగా కూడా గోచరించటం లేదు. ఒకటి రెండవ దానికి వేరైనప్పుడు కదా, 'సంబంధం' అనే మాట? కనుక చిదాకాశమునకు నాకు

'సంబంధం' అనే మాట అనుచితం, అయుక్తియుక్తం. అయితే ఆత్మాకాశమే దివ్యానుభవంగా గల నన్ను శిష్యులు ఆశ్రయిస్తూ ఉండగా, వారికి వారి యొక్క స్వస్వరూపాన్ని బోధించాల్సిన సందర్భం ఏర్పడుతోంది. అట్టి సందర్భంలో వారి సందేహాలు నివర్తించటానికి, ప్రతివాదాలపై విజయం కొఱకు, అద్వైతపక్ష స్థానమునందు తత్పరులై ప్రయత్నశీలురై ఉన్న జ్ఞానుల సౌకర్యార్థం ఈ ఆత్మ తత్త్వమును సవివరంగా అభివర్ణిస్తున్నారు. అంతేగాని, అజ్ఞానుల వలె – వీరిది తప్పనో – వారిది ఒప్పనో – ఖండించి – శ్లాఘించడానికి కానే కాదు.

ప్రశాంతుడగు పూర్ణజ్ఞాని ఈ దేహము ఉన్నప్పుడు లేనప్పుడు కూడా ఏ పరమశాంతమగు స్థితిని అనుభవిస్తున్నాడో అట్టి అభిమానరహితమగు అఖండ – అప్రమేయ స్థితియే "పరమపదము."

అబహిఃసాధనం , శాంతమనన్తః, సాధనమ్ సమమ్ ।
న సుఖం నాఽసుఖం నాఽహమ్ న అన్యదిత్యాది తం "శివమ్"॥

అట్టి పరమ పదం (ఆత్మస్థితి) బాహ్య–అభ్యంతర సాధన రహితమైనది. శాంతం–అనంతం కూడా! సుఖ–దుఃఖ రహితమైనది. "అహం–త్వమ్" ఇత్యాది పదార్థశూన్యమైనది. అది కేవల శివస్వరూపమైనది.

'అహంత్వము' అనేది ముక్తి యొక్క అభావరూపం అయి ఉన్నది. మరప్పుడు అహంత్వముచే ముక్తి యొక్క అనుభవం ఎట్లా? కాబట్టి'అహంభావము'ను అంగీకరించి ఆపై ముక్తిని వెతుకువాడు – జన్మాంధుడు చిత్ర పటమును చూడజాలనట్లు – ముక్తత్వమును గాంచలేదు మరి?

స్పందనే అస్పందనే చైవ యత్ పాషాణవదాసితమ్
అజడస్యైవ తత్విద్ధి నిర్వాణం, అజరం పదమ్ ॥

మనస్సు–బుద్ధి–చిత్తం–అహంకారం మొదలైన చేష్టలు ఉన్నప్పుడు, అట్టి చేష్టలు లేనప్పుడు కూడా చైతన్యం యొక్క నిశ్చలమైన ప్రశాంతస్థితి కొనసాగుతూనే ఉంటోంది. అద్దానినే అజరమైన 'నిర్వాణపదం' అని గ్రహించు. ఒక అజ్ఞాని తన అంతరంగంలో కుండ–ఇల్లు–ఊరు మొదలైన వస్తువులను స్ఫురణరూపఫలంగా పొందుతూంటాడు చూచావా? లోకైషణా సహితుడు లోకంలోని వస్తువులను ఊహలద్వారా హృదయంలో – ఈ భౌతిక దేహం ఉన్నప్పుడు లేనప్పుడు కూడా గాంచుచూనే ఉన్నాడు.

ఇక లోకైషణారహితుడైన జ్ఞాని అంతే స్పష్టంగా తనలో "చిద్రూపం– స్వయంప్రకాశమయం" అగు ఆత్మను స్వయంగా అనుభవిస్తున్నాడు. ఆత్మకు వేరైనదేదీ అతనికి అనుభవం కావటమే లేదు. అట్టి ఆత్మపదమునందు 'నేను–నీవు' అను విశేషాలుగాని, అనహంత్వం – అన్యత్వం మొదలైన భావనలు కూడా గాని లేవు. కేవలం "కేవలీ భావమైన – నిర్వాణరూపమైన నిర్మలమగు శివరూప ఆత్మ" ఒక్కటే ఉన్నది. చైతన్యమునందు కించిత్ చమత్కారంగా విషయాల సంబంధితమైన "వ్యాప్తి రూప క్రియ" ఏర్పడటం జరుగుతోంది. అట్టి నిర్విషయ నిర్మల ఆత్మ యొక్క కించిత్ విషయాసక్త రూప ఆశ్రయమే మహత్తర క్లేశాన్ని కలిగించు బంధంగా కనబడుచున్నది.

విషయోన్ముఖత్వమే... సంసారము! చైతన్యం విషయోన్ముఖత్వం కాకుండుటయే... అవ్యయ పదమగు మోక్షం! వాస్తవానికి అపరిమితమగు చైతన్యం పరిమితమగు విషయాలచే బాధింపబడటం ఎట్లా కుదురుతుంది? దేశకాలాదులచే అపరిచ్ఛిన్నమై, శాంతమై, నిజశాంతస్వరూపమున స్థితి కలిగి ఉన్నదైనట్టి చైతన్యమునందు "విషయం" అనబడేదేదీ సంభవించజాలదు. ఇక అట్టి ఆత్మ చైతన్యం దేనిచే ఎట్లు బంధం పొందగలదు?

ఓ ప్రియశ్రోతలారా! ఒకడు ఒక కల కంటున్నాడనుకోండి. ఆ స్వప్నం ఎక్కడి నుండి ఎవరు కల్పించగా వచ్చింది? స్వప్నరూపమగు చైతన్యమునకు అంతర్గతంగానే వాసనా రూపసంకల్పంగా ఆ స్వప్న జగత్తు ఉబుకుచున్నది కదా! కనుక ఆ స్వప్నజగత్తు చైతన్యమునుండే వచ్చింది. వేరుగా ఎక్కడి నుండి రాలేదు. అనగా స్వప్న జగత్తు చైతన్యమునకు వేఱుకాదు. కానీ వేరుగా అజ్ఞానంచేత అనిపిస్తోంది. అట్లాగే... ఈ బాహ్యజగత్తు కూడా స్వస్వరూపమగు చైతన్యమునకు అభిన్నంగా 'అనన్యంగా' ఉన్నప్పటికీ భిన్నమైనట్లు బాహ్యజగద్రూపంగా అనిపిస్తోంది.

వాస్తవానికి ఈ జగత్తు ఆత్మ కంటే భిన్నం కాదు. జగత్తులాగానే మనో-బుద్ధి-చిత్త అహంకారాదులు కూడా బహిర్ముఖంగా కనిపిస్తున్నప్పటికీ అంతర్ముఖత్వం చేత అవన్నీ ఆత్మకు అభిన్నమైన చిద్రూపాలే. బాహ్య అభ్యంతరాలలో అంతటా కూడా "నిర్మలం-సమం-అభిన్నం"... అయినట్టి చైతన్యం మాత్రమే వ్యాపించి ఉండగా, ఇక అన్యమైనదెక్కడుంది చెప్పు? "చైతన్యంలో బహిర్ముఖత్వం" ...అనే భ్రమ చేత ఏ బుద్ధి ఉందో... ఆ బుద్ధియే ఈ 'సంసారం' అనే అనర్థమంతా కలిగిస్తోంది సుమా! శుద్ధమైన చైతన్యం, శూన్యం అను రెండింటి భేద-అభేదాలేమిటో విజ్ఞులు తమయందు అనుభవైకవేద్యంగా స్పష్టంగా గ్రహిస్తున్నారు. చిన్మాత్ర రూపమైన నిత్య నిరతిశయానందం ఎవరికి వారికే అనుభవైకవేద్యమేగాని వాక్కుతో చెప్పగలిగేది కాదు. మసక చీకటిలో వస్తువులు కొంత కనబడి కొంత కనబడక అవాస్తవతతో కూడి అనుభవమౌతాయి చూచావా? అట్లాగే ఈ జగత్తు కూడా అజ్ఞాన మసకచీకట్ల కారణంచేత "ఉన్నది ఒకటి, చూచేది మరొకటి"గా అనుభవమౌతోంది.

స్వతహాగా వాసనారహితుడను శాంతుడను అగుటచేత నేను చిదాకాశరూపుడను అయి ఉన్నాను. నేనే కాదు. నీవుగాని, మరెవరైనా గాని వాసనలను ధరించకపోతే మనసంతా సర్వదా స్వతఃసిద్ధమగు చిదాకాశరూపులమే అయి ఉన్నాము. ఓ రామా! వ్యవహారదశయందు అజ్ఞుని వలె ఉన్నప్పటికీ సర్వదా చిన్మాత్ర శరీరధారివై ఉండు. చిన్మాత్ర శరీరధారణ అను అనునిత్యమైన అభ్యాసం బలపడుతూ ఉండగా, ఇక ఈ దేహాదులతో కూడిన జగత్తు క్రమంగా అసత్తుల్యమై స్వయంగా శమం పొందుచూ పోగలదు.

"నేను అజ్ఞుడను"... అను స్వస్వరూపముపై గల అభిప్రాయమే సంసారరూపమగు అవిద్యాగ్ని. అది అజ్ఞానవాయువుచే ప్రజ్వలితం అవుతోంది. అయితే అదే జీవుడు "నేను సర్వదా అఖండము అప్రమేయము అగు బ్రహ్మమునే"... అను రూపం గల ఆత్మసాక్షాత్కార చరమవృత్తి రూపమైన 'పరిణతి' సంపాదించుకోవటం చేత సంసారాగ్ని తానంతట అదే చల్లారుతుంది.

"జీవుడుగా నేను ఒక చీమ కంటే కూడా అధికుడను గాను. కానీ ఆత్మగా నేను బ్రహ్మదేవుని కంటే కూడా అతీతుడను" అని ముక్తపురుషులు గ్రహించి ఉంటారు. అట్టి ముక్త పురుషులు కూడా ఈ జగత్తులోనే ఉన్నారు. వారు నిత్యనిరతిశయానంద రూపంలో స్థాణువు వలె అజ్ఞానం లేనట్టిది – దుఃఖక్షోభా వర్జితం... అయినట్టి "ఆత్మయందలి స్థితి"నే శాస్త్రములు అక్షయమైన "మోక్షము" అను శబ్దముచే ఉద్దేశిస్తున్నాయి.

ఆత్మను ఎఱుగకపోవటం చేత జీవుడు అజ్ఞాన దశను పొంది పశువృక్షాది జన్మలు సంపాదించుకుంటున్నాడు.

ఆత్మజ్ఞానం చేత ఆత్మరూపత్వం పొంది మానవుడు సాక్షాత్ "ముని"గా పరిణమిస్తున్నాడు. చీకటిలో వస్తువులు మిథ్యతో కూడిన ఆకారాలుగా కనిపిస్తాయి. అట్లాగే "నేను, జగత్తు, బ్రహ్మం" ఇవన్నీ వేరువేరు ఆకారాల వలె అవిద్యామయమగు భ్రమచేత అనిపిస్తున్నాయి. 'ఆత్మదర్శనం' అనే దీపం వెలుగగానే... అంతటా శివము, శాంతము అగు ఆత్మయే గోచరించటం జరుగగలదు. సంకల్పరహితుడు, దృశ్యమునకు సంబంధించిన వేదనను అధిగమించినవాడు, అహంకార–వాసనా వర్జితుడు, ప్రశాంతచిత్తుడు అయిన జీవన్ముక్తుడు ఈ ఇంద్రియ సమూహాలు, ఈ బాహ్య పదార్థాలు ఎదురుగా ఉన్నప్పటికీ త్యజించడు. ఒకింతగా కూడా ఆశించడు. అనగా, అవన్నీ మిథ్యగా చూడ గలుగుతాడు. గాఢనిద్రలో ప్రవేశించేవానికి జాగ్రత్ స్వప్న వ్యవహారాలు లేకుండా పోతాయి. చూచావా? అట్లాగే "ఆత్మాజ్ఞానానుభవి" విషయంలో సమస్త దృశ్య సమూహాలు ఆత్మయందు లయించిపోతాయి. అతనికి ఈ జగత్తంతా స్వాత్మరూపంగానే భాసిస్తూ (గోచరిస్తూ) ఉంటుంది.

ఆకాశంలో నీలత్వం కనిపించటమనేది కంటియొక్క భ్రమేకదా! అట్లాగే బ్రహ్మమునందు పృథివి మొదలైన ఆయా వస్తువులు, దేహములు కనిపించటమనేది భ్రాంతి మాత్రమే గాని, మరింకేమీ కాదు. ఆకాశం వాస్తవానికి నీలరంగు రహితంగా, స్వచ్ఛంగా ఉంటున్నట్లు బ్రహ్మం కూడా సర్వదా దృశ్య పదార్థరహితమై, నిర్మలమై ఉన్నది "ఈ సమస్తజగత్తు అసత్తుయే" అను చక్కని బుద్ధి ఎవడు పెంపొందించుకుంటాడో... అట్టివాడు సమస్త వాసనలు కలిగి ఉన్నప్పటికీ వాసనా రహితుడే సుమా!

భవ్యరూపుడవగు ఓ రామచంద్రా! స్వప్న–సంకల్ప– ఇంద్రజాలము లందు... కనిపించే సమస్త అద్భుత సృష్టి మాయామయము, అసత్తు మాత్రమే కదా!

అట్లాగే ఈ బ్రహ్మాండ సృష్టులన్నీ అసత్యములే అయి ఉన్నాయి. స్వప్నసమయమందలి స్వప్నంలాగానే ఈ బాహ్య వస్తు–వ్యవహారములందు వివేకులకు ఏమాత్రం విశ్వాసం జనించదు.

న దుఃఖమస్తి న సుఖం న పుణ్యం న చ పాతకమ్
న కించిత్ కస్యచిత్ నష్టం కర్తుర్భోక్తురసంభవాత్ ॥

స్వయంకృతమైన భ్రమచే అనుభవమగుచున్న కల్పితానుభవాలకు కర్త ఎవడు? భోక్త ఎవడు? ఇక సుఖదుఃఖ పుణ్యపాపాలు ఎక్కడివి? ఎవనికి ఏది నశిస్తోంది? ఏది ఉత్పన్నమౌతోంది? ఈ సమస్త జగత్తు కూడా "దృశ్యశూన్యమై నిరాధారమైన" ఆత్మయే అయి ఉన్నది. ఏ అహంకారమునకైతే

మమత్వము అనేది ప్రతీత మగుచున్నదో... అది కూడా రెండవ చంద్రునివలె, స్వప్ననగరంవలే "ఆ ఉభయములు కూడా లేనివే" సుమా!

ఓ రఘురామా! ఈ జగత్తుకు ఒక కారణం అంటూ ఉంటే... అది అకారణ - శాంత - నిరాకార అగు కూటస్థ బ్రహ్మమేగాని, మరింకేమీ కాదు.

ఈ సృష్టి, సంకల్పాత్మకమగు (కారణరూపమగు) చిత్తం, ఆ చిత్తము యొక్క కార్యరూపమగు ఏక-అనేక రూపములతో కూడిన బ్రహ్మాండరూప ప్రపంచము, ఆ బ్రహ్మాండరూప ప్రపంచము యొక్క అంతర్గతాలైనట్టి "పృథివి" మొదలైన పదార్థజాలం, దేహి-దేహం (అవయవి-అవయవాలు) యొక్క స్థితి-గతులు... ఇవన్నీ కూడా బ్రహ్మం యొక్క వివర్తం తప్ప మరింకేమీ కాదు.

మరింకేదియో అనటానికి యుక్తి కుదరదు. అనగా, అజ్ఞానముచే త్రాడే పాముగా భాసించునట్లు తత్త్వజ్ఞానం యొక్క లేమిచేత బ్రహ్మమే 'జగత్తు' రూపంగా భాసించటం జరుగుతోంది. "పాముగా కనిపించటం త్రాడు యొక్క స్వభావం"... అని అనగలమా? లేదు. అట్లాగే "జగత్తుగా భాసించటం బ్రహ్మం యొక్క స్వభావం" అను స్వభావం గూర్చిన వచనం యుక్తి యుక్తమే కాదు. అట్లాగే "ఈ ప్రకాశ్యకమైన జగత్తు మిథ్యయే అయినట్లు ప్రకాశమగు చైతన్యం అనేది కూడా మిథ్యయే"... అనే నాస్తికవాదం కూడా ఏమాత్రం యుక్తియుక్తం కాదు. ఎందుకంటే "సమస్తం లేదు. అంతా నాస్తి" అని చెప్పే ఆ నాస్తికుడు విద్యమానమే అయి ఉన్నాడు కదా! "ఇదంతా లేదు" అనే అనుభవం లేక అభిప్రాయం ఎవరిదో... అదియే పరమాత్మ యొక్క సత్త. "ఏదీ లేదు. (సర్వం నాస్తి). కనుక నేను కూడా లేను"... అని తనను తాను ఎవరూ నిషేధించలేరుకదా! ఎద్దాని ఉనికైతే నిషేధించటానికి ఏమాత్రం వీలుకాదో... అదే బ్రహ్మం. ఓ రామచంద్రా! ఏ పరమార్థసత్యమగు 'ఆత్మ' బ్రహ్మజ్ఞానులచే ఎల్లప్పుడూ సేవించబడుతుందో, ఏ స్వస్వరూపమైతే అన్యులచే అపహరించ బడటానికి ఏమాత్రం శక్యం కాదో ...అట్టి శాంతం-నిర్మలం-అజం-సమం-అక్షయం-నిత్యసిద్ధం అగు శివస్వరూపుడవై ఉండు. ఇక, వ్యవహార దశలందంటావా... తదితరులవలెనే నీవు కూడా భోజన-పాన-క్రీడాదులు నిర్వర్తించు. "ఏది ఎట్లు ఉంటున్నప్పటికీ, ఉండకపోయినప్పటికీ అస్మత్ స్వస్వరూపం త్రికాలలోనూ యథాతథం" అని గ్రహించి ఉండు. "స్వస్వరూపం, తదితరం" - ఈ ఉభయం గ్రహించి సమన్వయించుకొని పరమార్థమును సుస్థిరీకరించుకున్నావా... ఇక నీవు ముక్తుడవే అవుతావు. ఎందుకంటే, ఈ దృశ్యబంధమే నీకుండదు కాబట్టి! 'బంధం' అనబడేది స్వయంకల్పితమైన వైచిత్ర్య చమత్కారమే కాబట్టి!

❖❖❖

12. "అనహమ్" ఏవ ముక్తిః

శ్రీరాముడు : మహర్షీ! ఈ జీవుడు స్వతహాగా మోక్ష స్వరూపుడై ఉండి కూడా... అతని అట్టి అనుభవమునకు ఏది నిరోధమై ప్రాప్తిస్తోంది?

శ్రీవసిష్ఠ మహర్షి : రామచంద్రా! "అహంభావం (నేను-నాది)" అనేది సమస్త సాంసారిక వ్యవస్థలకు, అవిద్యకు మూలభూతమై ఆతని మోక్షపదానికి అడ్డుగా అగుచున్నది. అట్టి అహంభావమును కలిగియే ఉండి ఎవరు మూడు లోకాలలోనూ ముక్తి కొరకై వెతుకుతూ ఉంటారో... అట్టి మూఢుల ప్రయత్నమంతా 'పిచ్చివాని పరుగులు' వంటివేనయ్యా! అజ్ఞానంచే ఏర్పడిన అహంభావం యొక్క ఉనికియే 'ఇంకా అజ్ఞానం ఉన్నది' అనటానికి గుర్తు సుమా! శాంతుడగు జ్ఞానికి 'అహం-మమ' (నేను-నాది) అనే అభిమానం ఉండదు. జ్ఞాని తన యొక్క జ్ఞాన సముపార్జనాబలం చేత ఈ అహంభావ మాలిన్యాన్ని పూర్తిగా త్యజించివేసి ఆకాశం వలె నిర్మలుడై మోక్షరూపంలో వెలయుచున్నాడు. అట్టి జ్ఞాని దేహసహితుడై ఉన్నా, లేక, దేహరహితుడై ఉన్నా కూడా... సదా సంతాప రహితుడై వెలయుచున్నాడు. అట్టి అహంకారరహితుడై ప్రకాశించే జ్ఞాని శోభించే విధంగా పూర్ణ చంద్రబింబం గాని, కెరటత్వం వదలి అత్యంత శాంతం వహించిన సముద్రంగాని, శరత్కాలంలోని మేఘరహిత ఆకాశంగాని శోభించలేవు. ఒక చిత్రపటంలో చిత్రించబడిన సైన్యం ఏ విధంగా సంక్షోభవర్జితమై ఉంటుందో... అట్లా వ్యవహార నిమగ్నుడైనప్పుడు కూడా జ్ఞాని సదా సమత్వంతోనే కూడి పరమప్రశాంతుడై, నిర్లిప్తుడై, సుఖ విశ్రాంతి స్వరూపుడై ఉంటాడు.

తరత్తరంగో జలధిః జలమేవ యథాఖిలమ్
దృశ్యోచ్ఛూనమపి బ్రహ్మ, తథా బ్రహ్మైవ నేఽతరత్

చంచల తరంగాలతో కూడి ఉన్నప్పటికీ సముద్రమంతా జలమే కదా! దృశ్యంతో తాదాత్మ్యమై ఉన్నప్పటికీ బ్రహ్మం బ్రహ్మమేగాని అన్యం కాదు. తరంగాలతో కనిపించే సముద్రం బాహ్యానికి క్షోభయుతంగా ఉన్నప్పటికీ లోన ప్రశాంతంగానే ఉంటుంది కదా! అట్లాగే బాహ్యానికి ఆయా సందర్భానుచితంగా క్షుబ్ధంగా కనిపిస్తున్నప్పటికీ అభ్యంతరంలో ముక్తుడు పరమశాంతంగాను, సదా ప్రసన్నంగాను ఉంటాడు. అన్ని తరంగాలలోనూ జలమే స్ఫురిస్తూ ఉండగా, ఇక ఒక తరంగానికి మరొక తరంగానికి భేదమెక్కడున్నది? చైతన్యమగు ఆత్మయందు అహంకారాది సృష్టి రూపంగా చైతన్యమే స్ఫురిస్తూ ఉండగా, ఇక పదార్థముల అనేకత్వం ఎక్కడిది? ఆ అనేకంగా స్ఫురించేదంతా భ్రమచేత మాత్రమే! ఆకారంలో దట్టమైన పొగ ప్రవేశించినప్పుడు ఆ పొగ అనేక ఆకారాలుగా కనిపిస్తున్నప్పటికీ ఆ ఆకారాలన్నీ వస్తుతః పొగ (ధూమం) కంటే వేరు కానట్లే ఈ కనబడే సృష్టులన్నీ పరబ్రహ్మం కంటే, వేరు కాదు. ఓ విజ్ఞులకు సర్వసభికులారా! మీరంతా దేనిగురించి కూడా విషాదం పొందవలసిన అవసరమే లేదు. నేను చర్విత చర్వణంగా చెప్తూతూ వస్తున్నట్లు సమస్త విషాదాలకు హేతువుగా అనిపిస్తున్న ఈ ప్రపంచం కేవలం చైతన్యం యొక్క వివర్తం మాత్రమే! ఇది విచారణాబలం చేత గ్రహించండి. ఈ ప్రపంచం యొక్క భ్రాంతిని వదలి ఆత్మయందు విలాసశీలురై తత్ఫలితంగా సర్వోత్తమత్వముచే విరాజిల్లండి. మన ఈ సంభాషణా ప్రభావం చేత జ్ఞానులుగానే అగుచుండగా, ఇక అజ్ఞత్వ మెక్కడిది?

అంకుర దృష్టాంతం – విత్తనములో దాగి ఉండే ఆకార రహితమైన అంకురసత్త తనయందు వృక్షము ఆకులు పూలు మొదలైనవన్నీ అనుభవిస్తున్నట్లు, తాను నిరాకారుడైనప్పటికీ ఈ జీవుడు

ఆకాశమువలె నిర్మలము - విశాలము అయిన ఆత్మయందు జగత్తు - అహంకారము మొదలైనవన్నీ అనుభవించుచున్నాడు.

గాలిలో కదిలే అగ్నిజ్వాల దృష్టాంతం - ఒక కొఱివిని (లోహపు గొట్టానికి నూనె గుడ్డలు చుట్టి అంటించగా ప్రజ్వలించే అగ్నిజ్వాల) గాలిలో త్రిప్పుతూ ఉంటే అప్పుడు కంటికి (ఆ త్రిప్పే విధానాన్ని బట్టి) గాలిలో చక్ర-దండాది ఆకారం వలె కనిపిస్తుంది. అక్కడ కనిపించే ఆకారం భ్రమ అయినట్లు ఆత్మయే స్వరూపంగా కలిగి ఉన్నప్పటికీ ఇక్కడ జీవునకు జగత్తు అహంకారాది అనుభవమంతా ప్రాప్తిస్తోంది.

కాముకుడు, ప్రేయసి - ఎదురుగా ఉన్నది తదితర అన్ని దేహాల వలె రక్తమాంస నిర్మితమే అయినప్పటికీ... కాముకుని చిత్తానికి స్త్రీ రూపాలు కామినుల వలె అగుపిస్తున్నట్లు... జీవునికి తన అంతరంగంలో ప్రక్షిప్తమై ఉన్న వికారాలను అనుసరించి బాహ్యంలో రూపాదుల సత్త, అభ్యంతరంలో మనస్సు మొదలైన వాటి యొక్క సత్త అనుభవమౌతోంది. వాస్తవానికి అవన్నీ ఆత్మయే అయినా, విరుద్ధమైన లక్షణత్వంగా ప్రదర్శితమవుతోంది. ఆత్మ వ్యతిరిక్తంగా అనుభవమౌతోంది.

కాబట్టి ప్రియ శ్రోతలారా! ఈ జగత్తు ఎట్లా ఉత్పన్నమౌతోంది? ఎట్లా స్థితి కలిగి ఉంటోంది? ఎట్లా తన కార్య సంరంభమంతా ప్రదర్శిస్తోంది? ఇది ఎట్లా సుఖ దుఃఖాలు అనుభవిస్తోంది? ఎట్లా నశిస్తోంది? దీని దేశ-కాలములు ఎట్టివి?...

ఈ ప్రశ్నలకు సమాధానంగా మనం ఉత్పత్తి - స్థితి - ఉపశమనాది ప్రకరణాలలో అనేక విషయాలు చెప్పుకున్నాం కదా! అనేక యుక్తులతో ఇన్ని రోజులుగా మనం చెప్పుకున్న విషయాలన్నీ విమర్శించి 'జగత్తుగా' అనిపించేది భ్రమచేతనేనని, వాస్తవానికి ఇదంతా ఆత్మయే అయి ఉన్నదని గ్రహించి, దేహసంబంధ జరామరణాదులను స్వస్వరూపంపై ఆపాదించటం మానివేసి శాంతాన్ని వహించి ఉండెదరు గాక! ఎవడైతే ఈ జగత్తులో ఇష్ట-అయిష్టములు ప్రాప్తించే సందర్భంలో (సమయంలో) ఒక శవం వలె పరమశాంతచిత్తుడై ఉంటాడో, సమత్వం వహించగలిగి ఉండే యుక్తితో కూడిన శక్తిని సంపాదించుకుని ఉంటాడో - అట్టివాడే "జీవన్ముక్తుడు" అని అనిపించుకుంటాడు. ఈ ప్రపంచం నిండా భిన్నత్వం ఉన్నప్పటికీ అతనిలో భిన్నత్వం ఒకింత కూడా ఉదయించదు, సంభవించదు. వాసనారహితులగు జీవన్ముక్తుల అహంత్వమునకు, ఆ అహంత్వముచే భోక్తృత్వమునకు, చైతన్యమునకు ఒకింత కూడా భేదం ఉండదు. సముద్రంలో ఓడ భారంగా ఆయా వస్తువులను మోసుకు వెళ్ళుచున్నట్లు సాంసారిక జీవుడు తాను అహంకార - వాసనాది పాశములచే బంధించబడి తద్ద్వారా అనుభవించే జగత్ రూప వ్యవహారమంతా మోస్తున్నాడు. అట్టిమోత బరువు (ప్రాపంచిక సంస్కారాల ధారణ) భారం కొరకే అయి ఉన్నది. "ఈ జగత్తు-మనో-ప్రాణాదులన్నీ చిద్రూపమే, ఆత్మరూపమే"... అని గ్రహించినవాడు దేహ-మనో- ప్రాణాదులు ధరించి ఉన్నప్పటికీ ధరించనివాడే అగుచున్నాడు. కాదూ? ఈ జీవ-జగత్తుల రూపసత్త (భేద వ్యవహారాలను నమ్మకంతో) పొందు వారికి దుఃఖమే పరిణామంగా అగుచున్నది.

'అజ్ఞానం' అను జడత్వ రూపమైన అపరాధాన్ని దృష్టియందు, హృదయం నందు అట్టేబెట్టుకొన్నంత వరకు 'మోక్షము' యొక్క నిరతిశయానందము జీవునకు అలభ్యం

ఓ రామచంద్రా! ఏ పదార్థములు సంకల్పముచే సిద్ధించుచున్నాయో, ఆయా పదార్థములన్నీ కూడా సంకల్ప ప్రభావం చేతనే మరల తప్పక నశించబోతున్నాయి. సంకల్పాలకు ఈవల మోక్షం సిద్ధించదు. ఎచ్చటైతే సంకల్పం సంభవించదో... అదే సత్యమైన నాశరహితమైన మోక్షపదము. దేనిని ఆత్మకు అనన్యంగా చూస్తామో అద్దాని పట్ల అంతంత వరకూ మనం సంకల్ప రహితులమేనని సూక్ష్మదృష్టితో గ్రహించు.

"నా అన్యో, న చ అహమస్మి" ఇతి భావనాత్ నిర్భయోభవ
సత్యం యుక్తం భవతి ఏతత్ విషమపి అమృతం యథా ॥

'నేను' - అనునది స్వతహాగా దేహాతీతమైనది జగదతీతమైనది. ఓ ప్రియమైన శ్రోతలారా! "నేను గాని, దానికి అన్యమైన 'నీవు' మొదలైనవి గాని లేవు"... అను భావనచే మీరంతా నిర్భయత్వం పెంపొందించుకోండి. ఒక మూఢుడు అమృతమును "ఇది విషం" అని తలచి ఉపేక్షించవచ్చుగాక! విషమును అమృతమని తలచి అపేక్షించవచ్చుగాక! విజ్ఞుడైనవాడు బాగా పరిశీలించి అప్పుడు అమృతమును స్వీకరించటం, విషమును దూరంగా ఉంచటం చేస్తాడు కదా! అట్లాగే ప్రాజ్ఞుడైనవాడు విషప్రాయమగు 'అహంకారము'ను వదలి అమృతప్రాయమగు 'అనహమ్'ను చక్కగా గ్రహిస్తు న్నాడు. "సకల భయాలకు కారణ 'అహమ్' అనునదే" అని గుర్తిస్తున్నాడు. జ్ఞాని అయినవాడు అల్ప దృష్టికి తారసపడే సత్యములను ప్రక్కకు పెట్టి 'పరమార్థసత్యము'నందు మాత్రమే లక్ష్యశుద్ధి కలిగి ఉంటున్నాడు. ఎందుకంటావేమో? ఈ జగత్తు, దేహం మొదలుకొని చిత్తము వరకు గల ఈ ఉపాధిని ఎంతగా వెతకి వెతకి చూచినా కూడా "నేను" అనుదానికి ఎచ్చటా స్థానమే లభించటం లేదు. కాబట్టి "ఈ జడమైన దేహాదులు నేను కాదు" అనునదే ఇక్కడి పరమార్థసత్యము. ఆత్మ విచారణచే ఎవరిపట్లైతే ఈ చిత్తము మొదలైనవి అకృతముగాను, సహజంగాను శమించిపోతాయో (లేక) 'అవి లేనివే' అని తెలియవస్తాయో... అట్టివారియందు అహంత్వము అనేది కూడా స్వయంగా నిర్విషయరూపమై స్వయంగా ఆత్మత్వమునందు లయిస్తోంది, 'అది నశిస్తోంది' అని మనం అంటున్న ప్పటికీ వాస్తవానికి నశించదు. మరి? అది ఆత్మత్వము (అఖండత్వము అప్రమేయత్వము - నిర్గుణత్వము - నిర్మలత్వము) సంతరించుకొంటోందని గ్రహించు. అట్టి ముక్తత్వము సంతరించు కోవటానికి మూడు ఉపాయాలు-

1. భోగత్యాగము - తద్వారా క్రమక్రమంగా దృశ్యత్యాగము
2. ఆత్మవిచారణ - తద్వారా దృశ్యాతీతత్వము
3. మనో ఇంద్రియాదుల నిగ్రహరూప పురుష ప్రయత్నం (శాస్త్ర ప్రవచిత సాధనాభ్యాసం)

సర్వముముక్షువులారా! పై మూడు యత్నాలచే అనాత్మత్వాన్ని మొదలంటా పరిత్యజించి 'స్వాత్మ'ను శరణువేడండి. ఆత్మ స్వరూపం చే ఈ పృథివిని ఈ లోకాలను ఆక్రమించివేసి ఉండండి.

మోక్షము అనగా? - "వాసనలన్నీ క్షయింపగా అప్పటి మనస్సు యొక్క బ్రహ్మం తోటి ఏకత్వ సంబంధమైన స్థితియే మోక్షము" అని శ్రుతులు, విద్వాంసులు సిద్ధాంతీకరించుచున్నారు. ఈ ప్రపంచంలో సంఘటనల పట్ల, పదార్థములపట్ల, సంబంధాల పట్ల, వ్యవహారాల పట్ల మనస్సుకు సుఖ–దుఃఖ–భయ–క్రోధాది ఎటువంటి ప్రభావం కలగకపోతే, అప్పుడు ఆ మనస్సు వాసనా రహితమైన దానిగా చెప్తుతారు. అయితే, అట్టి 'మోక్షము' అనేది తత్త్వజ్ఞానం లేకపోతే ఎన్నటికీ సంభవించదు. "ఆత్మసత్యమ్–జగత్‌మిథ్యా" అననదే మోక్ష శాస్త్రం యొక్క సారం. కానీ, చాలా మంది జీవులకు రాగాదుల ప్రాబల్యం చేత "ఈ జగత్తు సత్యమే కదా"…అనే భ్రమతో కూడిన నమ్మకం తొలగటం లేదు. అందుచేతనే ఆత్మశాస్త్రాలపై, ఆత్మజ్ఞానంపై సరైన విశ్వాసం కలగటం లేదు. తత్ఫలితంగా అట్టి జీవులపట్ల సంసార బంధము నిత్యము అనువర్తిస్తూనే ఉంటుంది.

కనుక ఓ రామచంద్రా! ఈ జీవుడు ఆత్యవసరంగా "జగత్తు – అహంభావము అనేవి అసత్తు (లేక) భ్రమ మాత్రమే" అని ఎరుగునుగాక! గృహ–బంధు–దార–సుత–స్వశరీరాదులందు "ఇవి నావే" అనే మూర్ఖరూపమైన మమత్వము క్రమంగానో, ఒక్కసారిగానో ఎట్లాగో అట్లా వదలును గాక! అప్పుడు వర్తమానంలో పరిచ్ఛిన్నత్వం అనుభవిస్తున్న ఈ జీవుడు స్వయంగా బ్రహ్మమే అగుచున్నాడు. "ఇవి నావి కావు. ఎందుకంటే ఇవి ఎల్లప్పటికీ నా వద్దనే ఉండవు కదా"…అను భావన చేస్తున్నంతమాత్రంచేత ఈతడు బ్రహ్మత్వమును సంతరించుకొనుచుండగా, ఈ మాత్రం ప్రయత్నం చేయటానికి సిద్ధంగాని జీవులకు నేనేం చెప్పాలి?

1. ఇది నిత్యం, ఇది అనిత్యం, 2. ఇది సత్యం, ఇది భ్రమ – అని గ్రహించి ఉండటమే జీవన్ముక్తి. చివరికి జ్ఞానం కంటే వేఱుగా ముక్తి కొరకై మరే ఉపాయమూ లేదని మా అభిప్రాయం.

❖❖❖

13. అనంత స్వస్వరూపంలో అల్ప దృశ్య విభాగం

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! చైతన్యము యథాతథంగా ఉంటూనే… తన అనంత తత్త్వము యొక్క ఒకానొక స్వల్పరూపవిభాగమునందు స్వయంసంకల్పనానుసారంగా సత్తును–అసత్తును పరికల్పించు కొని, ఆపై అద్దానినే సత్తుగానో, అసత్తుగానో అనుభవించుచున్నది.

అ చైతన్యమే 'బాహ్య పదార్థముల అనుభవం' అనబడే తనయొక్క దృఢాభ్యాసం చేత బాహ్య మగు ఈ జగదాకారంగా స్ఫురిస్తోంది.

శ్రీరాముడు : అనగా చైతన్యమే అసలైన స్వరూపంగా గల జీవుడు పొందే బాహ్యానుభవమంతా అతని అంతరంగమునందలి దృఢాభ్యాస ప్రభావము మాత్రమేనని మీ ఉద్దేశమా?

శ్రీవసిష్ఠ మహర్షి : కచ్చితంగా అంతే! ఇక్కడ మనకు స్వప్నమే దృష్టాంతం. స్వప్నంలో కనిపించేదంతా స్వప్న ద్రష్ట యొక్క స్వస్వరూపకల్పిత విస్తారమే కదా? ద్రష్ట యొక్క అంతర్గత చైతన్యమే బాహ్యమున జగత్తువలె దర్శించబడుచున్నది కదా!

ఈ సమస్త జగత్తు చిత్తు యొక్క కల్పితరూపం తప్పితే మరింకేమీ కాదు. అట్టి చిత్తు సర్వదా అకాశంకంటేకూడా అత్యంత నిర్మలమై వెలయుచున్నది. నేయి తనయందు కాఠిన్యం విస్తరింప జేసుకొంటోంది కదా! అట్లాగే చిత్తు కూడా తనయందు ఈ సమస్తమును విస్తరింపజేసుకొంటోంది. అందుచేత ఈ జగత్తుగా కనిపించేదంతా చిత్తు మాత్రమే. చిత్తుకు అన్యంగా ఎక్కడా ఏదీ లేదు. వాస్తవానికి 'నాశనం అవటం' అనేది కాని, అనేక పదార్థ-జీవులు గాని, అ జీవుల సంబంధమైన జనన మరణాలు గాని, అటు ఆకాశం గాని, శూన్యత్వం గాని, అనేకత్వం గాని లేనే లేవు. అధిష్ఠాన రూపంగా సమస్తం బ్రహ్మమే గాని, ఏదీ పదార్థరూపం కాదు. వేఱుగా కనిపించే దంతా మిథ్యాదృష్టి ప్రభావం చేత మాత్రమే! ఆ జగత్తు అసత్తే! కాబట్టి, ఇక ఇందులో "అహంత్వం, పుట్టటం, ఉండటం, నశించటం" అనునదంతా భ్రమ చేత మాత్రమే అనిపిస్తోంది. వాస్తవానికి ఇక్కడ ఏదీ నశించటం లేదు. స్వప్నంలో అంతా కల్పితం, ఊహా జనితం అయి ఉండగా ఇక అందులో పదార్థాలు జనించటం ఏమున్నది? నశించటం ఏమున్నది? అట్లాగే శాస్త్రాలు ప్రవచించే జ్ఞాన దృష్టిచే 'అహం నశించటం' అనేది కూడా "స్వప్నంలోని పదార్థం నశించటం" వంటిది మాత్రమే!

"ఈ జగత్తు అసత్తే! వాస్తవానికి లేనిదే! మరిక అద్దాని ఆశ్రయమును నిందించటం, దానిని గురించిన సిద్ధాంతపూర్వక నిర్ణయాలు శాస్త్రాలు ఎందుకు చేస్తున్నాయి?" అని ఎవరైనా అంటే... ఆ మాట కూడా నిజమే! వాస్తవానికి అసత్తైనట్టి వస్తువు గురించి నిందగాని, నిర్ణయంగాని ఎలా సంభవం? స్వప్నంలో కనబడే గృహం "ఎవరు కట్టారు? వారి తెలివి ఎటువంటిది"... అనే ప్రశ్న లకు సమాధానం వెతకటం అర్థంలేని పని కదా! ఆకాశపుష్పం (తెల్లటి మేఘాలు, ఆ మేఘాల మధ్య ఊహాదృష్టికి కనిపించే సరోవరం, అందులో పుష్పం)... గురించి నిందగాని, నిర్ణయం గాని ఎవరికి ఉంటుంది? అది ఎవరికి కనబడుతుందో వారు ఊహలో తేలే పసిపిల్లల వంటివారే కదా!

అయితే శాస్త్రాలు జగత్ నిర్ణయం గురించి అద్దాని నింద మొదలైన వాటిని చెప్పటంలో ఒక ముఖ్యమైన కారణం ఉన్నది. "ఆత్మ యొక్క స్వరూపాన్ని జీవునకు సిద్ధింపజేయటం" అనే కార్యక్ర మాన్ని నిర్వర్తించటమే శాస్త్రములు నిర్వర్తించే కార్యక్రమం కదా! అట్టి ప్రయత్నంలో మొదటగా అసత్తైన వాటిని కొన్నిటిని సత్తు వలె నిర్ణయిస్తున్నాయి. అట్లా నిర్ణయించి మనస్సు-బుద్ధి-ఆత్మ ఇటువంటి వాటిని నిర్వచించి తద్వారా వైరాగ్య వివేకాది మార్గంగా తత్త్వసాక్షాత్కారానికి ఉపాయాలు కల్పిస్తున్నాయి. సృష్టి నిర్ణయం కూడా అట్టిదే! కాబట్టి ఓ రామచంద్రా! శాస్త్ర-ఆచార-సంప్రదాయాదు లకు అనుకూలంగా ముముక్షువు భూమికాక్రమమును అభ్యసించాలి. క్రమంగా ఆధ్యాత్మికమైన ప్రవృద్ధిని సముపార్జిస్తూండగా అంతరంగం పరిశుద్ధమౌతోంది. అప్పుడు "మనస్సు మొదలైనవి, జగత్ సంబంధిత శాస్త్ర నియమాదులు వాస్తవ సత్యం సమక్షంలో మిథ్యయే అగుచున్నాయి"... అని ఎఱుగుచు శిల వలె క్షోభ-వాసనాది వర్జితుడై ప్రకాశించు గాక! ఇకప్పుడు సాంసారిక పురుషార్థం యొక్క అభాసతో కూడి ఈ సంకల్పమాత్ర జగత్తు నిశ్శేషంగా ఆ ముముక్షువు పట్ల శమిస్తుంది. ఇదే భ్రమరూపమగు ఈ సృష్టిని గూర్చిన శాస్త్రప్రవచిత నిర్ణయం యొక్క ఉద్దేశం.

ఈ సృష్టి యొక్క మూలచ్ఛేదం బ్రహ్మజ్ఞానం చేతనే అగుచున్నది. ఇక 'సృష్టి' అనే భ్రమ కల్పన ఆ ప్రజ్ఞానియందు మరల ఉదయించదు. ఆత్మజ్ఞానం లేకపోయిందా... ఈ సృష్టి సుషుప్తి-ప్రళయాదులలో మౌనంగా ఉన్నప్పటికీ బీజరూపంలో ఉండియే ఉంటోంది. అనగా కార్యరూపంలో ఉండకపోయినా కూడా, కారణరూపంలో దాగియే ఉంటోంది. మనం ఐందవోపాఖ్యానంలో చెప్పుకున్నట్లు కారణరూపంలో అంతరాళాల్లో దాగిన జగత్తులు మరల ఎప్పుడో కార్యరూపం దాల్చుచున్నాయి. కనుక 'ఆత్మజ్ఞానం' అనే అగ్నిచే మాత్రమే కారణత్వము దహనం కాగలదు సుమా! స్వప్నంలో కనిపించే మనుజులు, వారి మాటలు కూడా అసద్రూపమేకదా! స్వప్నంలో కనిపించిన ఆ మిత్రుడు అట్లా ఎందుకు నన్నంత మాట అన్నాడు? అనే ప్రశ్నకు అర్థమేమున్నది? అట్లాగే ఏ మనుజుని దృష్టిలో ఏ 'సృష్టి' అనేది విద్యమానమై ఉన్నదో... ఆ సృష్టి - ఆ సృష్టిని పొందే జీవుడు కూడా మృగతృష్ణలోని జలతరంగాలు, జలం లాగా - అసద్రూపులే అయి ఉన్నారు. ఆ ఉభయములకు అప్రమేయమై ఉండే చిదానంద స్వరూపం మాత్రమే సర్వదా సత్యం, నిత్యం కూడా!

అసతామేవ సద్భావమివ ఏషామ్ ఉపేయుషామ్
న వయం నిర్ణయం విద్మో వంధ్యాపుత్రగిరామివ

"వంధ్యాపుత్రుని (గొడ్రాలి కుమారుని) మాటలు - అభిప్రాయాలు వింటుంటే ఎంత బాగున్నాయో!" - అనే నమ్మకం కలవారి నిర్ణయం ఏమిటో తెలియవస్తుందా? అట్లాగే అసత్పదార్థములను 'సద్భావం'గా అంగీకరించేవారికి కనిపించే నిర్ణయాలు మాకు తెలియటం లేదు. జీవ-జగత్ పదార్థాలను నిర్వచించే విషయంలో కొందరి నిర్ణయములు ఆత్మజ్ఞానం విషయంగా అసంబద్ధంగానే ఉంటున్నాయి. అయితే జ్ఞానులో? పరిపూర్ణమైన సముద్రంలాగా 'అద్వితీయ చిదానందం' యొక్క పూర్ణత్వము సదా వారిపట్ల సంతరించుకొని ఉంటోంది. వారు ఈ ద్రష్ట - దృశ్యాల దృష్టిని ఏ మాత్రం పొందటమే లేదు. వారు ఈ జగత్తును చూస్తూ కూడా పర్వతం వలె అచంచలులై ఉంటున్నారు. గాలి వీచని చోట ఉంచబడిన దీపం వలె నిర్విచారులై, నిర్వికారులై ప్రకాశిస్తున్నారు. ఆచార సహితులైనప్పటికీ ఆచారరహితులై సదా స్వస్థచిత్తులై ఉంటున్నారు.

అపూర్ణైకార్ణవ ప్రఖ్యా కాప్యన్తః పూర్ణతోదితా
అన్తః శీతలతా జ్ఞప్తిః జ్ఞస్యా పూర్వైవ లక్ష్యతే ॥

జ్ఞాని యొక్క హృదయంలో పూర్ణ సముద్రం వంటి అపూర్వమైన పూర్ణత్వం ఉదయిస్తోంది. జ్ఞానరూపమైనట్టి అపూర్వ శీతలత్వం అతని యందు కనిపిస్తోంది.

ఇక అజ్ఞానియో?... వాసనలే అజ్ఞానం కాబట్టి, ఆతడు వాసనారూపుడే అగుచున్నాడు. వాసనలు రహితమైనప్పుడు "ఇది జీవుడు - ఇది ఆత్మ (బ్రహ్మం)" అను భేదమే కానరాదు. అయితే వాసనలు తొలిగేది ఎట్లా? విచారణ చేయటం చేతనే!... "నా స్వరూపం వాసనాబద్ధం కాదు. అపరిమితమైన ఆత్మ పరిమిత వాసనలచే బద్ధమవటమేమిటి? అనంతమగు ఆకాశం పరిమితమైన మేఘాలచే ఆచ్ఛాదించబడవచ్చునేమో గాని, అది తన సహజ స్వభావమగు అనంతత్వం మేఘాల

కారణంగా కోల్పోతుందన్నదను మాట ఎక్కడిది?"... అనే నూతనమైన సహజ స్వభావం పునః దర్శనమగుచున్నది. విచారణ యొక్క ప్రభావం చేత వాసనలు తమ ఉనికినే కోల్పోతాయి. అనగా "ప్రపంచంలో జరిగేదంతా నా స్వరూపానికి అప్రమేయమైనది"... అను నూతనమైన అవగాహన రూపుదిద్దుకుంటుంది. కాబట్టి సంసారం అనేది తనంతటతానే అంతర్ధానమగుచున్నది. లేదూ? ఆత్మజ్ఞానం ఒనగూడనంతకాలం సంసారం ప్రత్యక్షమయ్యే ఉంటోంది.

ఓ రామచంద్రా! ఇక్కడ "ఆత్మయొక్క అనవలోకనం" అనే కారణం చేత సంబంధబాంధవ్య-స్వ-పర-కర్తృత్వ-భోక్తృత్వాలతో కూడిన మాయ అంతా అనుభవమౌతోంది. 'ఆత్మజ్ఞానము' అనే ప్రకాశముచే ఇవన్నీకూడా "అవలోకనసిద్ధి"యందు లయించిపోతాయి. చీకటి ఉన్నప్పుడు కనబడే భ్రమాకారాలు, "అక్కడ దయ్యం ఉందేమో? ఇటు దొంగలు వస్తారేమో?" మొదలైన భయాలు వెలుగురాగానే ఏమౌతున్నాయి? భ్రమ తొలగగా నలువైపులా బట్టబయలు కాగా "దయ్యాలు లేవు. ఆకారాలు లేవు. అవి చెట్లు, ఇది వీధి"...అని తెలియవస్తోంది. కదా! మాయా విరచితమైన మానావమాన - ఆశనిరాశ - ఆగామిసంచితాదులన్నీ "లేనివే" అని జ్ఞానకాంతి ప్రసరించగానే తెలిసిపోతుంది. అనగా జ్ఞానప్రకాశ ప్రభావం చేత-

1. ఈ దేహమాంసాది 'స్థూల శరీరం' - పంచభూతాలు ఆయాపాళ్ళలో కలవగా ఏర్పడిన పంచీకృత భూతసముదాయంగా, అసత్తుగా, భ్రమరూపంగా, జడమైనదిగా తెలిసిపోతోంది.

2. ఈ బుద్ధి - అహంకార - చిత్తాది రూపమైన "సూక్ష్మశరీరం" కూడా - అపంచీకృత భూతమయమై, వికారవంతమై, అసత్తే, జడమే అయి ఉన్నదని కూడా సుస్పష్టమౌతోంది.

బుద్ధి అహంకార - చిత్తాదుల అపంచీకృత భూతరూపత్వమును కూడా వదలాలి. అనగా "వాటన్నిటి నామ రూపములు మిథ్యయే" అని గ్రహించబడాలి!

అప్పుడు శేషించిఉండే స్వప్రకాశమగు చిన్మాత్రమునందు స్థితిపొందిన జీవుడు ఇక ముక్తిని పొందినట్లే! ఇంతకు మించి వేరే అర్థమేదీ 'ముక్తి' అను శబ్దమునకు లేదు... అనునదే మా ఉద్దేశం. అట్లా కాకుండా వాస్తవానికి స్వయంప్రకాశమగు ఆత్మచైతన్యము లింగ శరీరమునందు (మనో - బుద్ధి - అహంకారాదులందు) తాదాత్మ్యధ్యాస ఉంటే? అప్పుడు ఏర్పడుచున్న విషయోన్ముఖత్వముచే వాసనలు ఉంటున్నాయి. ఆ వాసనలు ఆత్మ చైతన్యమును ఆవరించి ఉండి 'జగత్తు' అనబడు కల్పిత వ్యవహారమును అనుభవింపజేస్తున్నాయి.

ముక్తిదశలో లింగశరీరమే బాధింపబడుతోంది కాబట్టి... ఆపై ఇక వాసన ఎచట ఏ ప్రకారంగా ఉండగలదు చెప్పు?

ఈ 'సంసారము' అనేది-భ్రమచేత మాత్రమే అనుభవమౌతోంది. తత్త్వదృష్టి సంపాదించుకున్న వారికి "మృగతృష్ణలో జలం లేనట్లే, ఈ సంసారం అసత్తు"... అని సుస్పష్టంగా తెలియవస్తోంది. అప్పుడిక సంసారబంధం ఏది, ఎవనికి, ఎచ్చట కలదో చెప్పు? అయితే ఒకడు ఆత్మజ్ఞానం నందు ప్రవృత్తుడై ఉంటూనే మరల ఎప్పుడైనా జగత్ విషయాల స్మరణ నిర్వర్తించటం ఆరంభించాడనుకో,

అప్పుడు ఏ 'చిత్తము' అనునది కల్పితంగా ఉదయించినదై ప్రవర్తించటం ఆరంభిస్తుందో... అదే ఈ సంసారానికి హేతువై ఇక సకల సంసారభ్రమలు కలిగించటానికి ఉద్యమిస్తోంది.

తస్మాత్ సర్వమ్ అనాశ్రిత్య వ్యోమవత్ సముపాస్యతామ్ ।
అపునః స్మరణం శ్రేయ ఇహ విస్మరణం పరమ్ ॥

కాబట్టి సమస్తము త్యజించి ఆకాశమువలె నిర్మలము - స్వచ్ఛము అయినట్టి ఆత్మనే ఉపాసించాలి. ఈ సంసారము మరల స్మరణమవనంతగా పూర్ణ విస్మరణమే మోక్షమార్గంగా ఆశ్రయించ తగిన ఉపాయం.

వాస్తవానికి ఇక్కడ ద్రష్టగాని, భోక్తగాని, అస్తిత్వముగాని, నాస్తిత్వముగాని లేవు. మరి? సముద్రమంతా సర్వదా జలముచే పరిపూర్ణమై ఉన్నట్లు (తరంగాలనేవి జలమునకు అభేదమే అయినట్లు)... ఇదంతా శాంతము - ఏకము - పూర్ణము అగు ఆత్మయే అయి ఉన్నది.

ఒక తటాకం ఉన్నది. అందలి జలంలో ఆకాశం, నక్షత్రాలు, చెట్లు ప్రతిబింబిస్తున్నాయి. అప్పుడు ఆ జలం ఎండిపోయిందనుకో. అందు ప్రతిబింబించిన దృశ్యాలన్నీ ఏమౌతున్నాయి? ప్రతిబింబమంతా తొలగిపోయి బింబరూపమగు ఆకాశనక్షత్రాదులే శేషిస్తాయి కదా! భ్రమ తొలగి పోతే సమస్త దృశ్య జగత్తు సద్రూపమగు బ్రహ్మమేననే విషయం స్పష్టంగా ఎఱుగబడుతుంది. అనగా దృశ్యం ఇట్లే ఉండి ఇది 'సంసారభ్రమ'గా కాకుండా కేవల శివస్వరూపంగా అనుభూత మౌతోంది. తత్ఫలితంగా ఆ జీవునకు తనయొక్క చిదాభాస-ఉపాధి మొదలైన భ్రమలు తొలగగా, అప్పుడు శివస్వరూపుడై నిత్యోదితంగా ప్రకాశించుచున్నాడు. అంతేకాదు ఈ ఇంద్రియ-త్రిగుణ-దేహ-విదేహ-జగదాదులకు ఆవల నిత్యోదితమై, నిత్యప్రకాశకమై పరతత్త్వము స్వయంజ్యోతి స్వరూపంగా వెలుగొందుచున్నది. అట్టి పరతత్త్వము నొందినవాడు, మరియు సందర్శియగు జ్ఞానికి "ఇటు సమాధి-అటు వ్యవహారము" -ఈ రెండు కూడా ఒకే రీతిగాను, రాగద్వేష రహితంగాను భాసిల్లుచున్నాయి.

సప్తమభూమికను పొందిన జ్ఞానికి సర్వత్రా కేవలం శాంతత్వమే శేషించుచున్నది. అతడు అంతటా వ్యవహరిస్తూనే వ్యవహరించనివాడుగా ఉంటున్నాడు. సప్తమభూమికయందు విశ్రాంతి లభించనంత వరకు జ్ఞాని ప్రవాహపతితమైన వ్యవహారత్వమును-రాగ ద్వేషవర్జితుడై తనయందు సంసారమును ప్రవేశించనీయ కుండానూ... నిర్వర్తిస్తూనే ఉంటాడు. అజ్ఞానికి ఈ సంసారము, ఇందలి వ్యవహారములు బంధములగు చుండగా... జ్ఞాని ఇదే సంసారమును తన ఆధ్యాత్మికోన్నతికి సాధనద్రవ్యముగా మలచుకోగలుగుచున్నాడు. ఇక సప్తమ భూమికను పొందిన తరువాత ఆ జ్ఞాని మునీశ్వరుడై, రాగ-ద్వేష-భయ-క్రోధ వర్జితుడై, మోక్షరూపుడై, శాంతమనస్కుడై శివ స్వరూపమున ప్రకాశిస్తున్నాడు. శిల వలె నిశ్చలస్వరూపుడై, కేవల చిద్రూపుడై వెలయుచున్నాడు .

శ్రీరాముడు : మహాత్మా! అట్టి కేవల శివస్వరూపియగు సప్తమ భూమికాగ్రహీత ఈ జగత్తును త్యజించి వ్యవహారరహితుడై మౌనం వహించి ఉంటాడా?

శ్రీవసిష్ఠ మహర్షి : నీవు చెప్పిన 'జగత్తు' అనబడేది సప్తమభూమికాప్రవేశికి అతని స్వస్వరూపమునకు అభిన్నంగానే అనుభవమౌతోంది. ఒక చింత విత్తనము యొక్క కోశమునందే చింతచెట్టు యొక్క సకల విశేషములు అభిన్నంగా ఉండి ఉన్నాయి కదా! స్వప్నభ్రాంతి వంటి ఈ జగత్తుయొక్క బాహ్యత్వము ఆత్మకు భిన్నంగా లేదు. అందుచేత సర్వము యథాతథమై ఉండగా అతడిక త్యాజ్య గ్రాహ్యముల కంటే అతీతమైన పదవి యందు ప్రకాశిస్తూ ఉంటాడు.

బాహ్యతా భావనాత్ బాహ్యమ్ ఆత్మైవ ఆత్మత్వభావనాత్ ।
భవతీదం పరే తత్త్వే భావనం తత్తదేవ హి ॥

ఆత్మయే "బాహ్యత్వము" అను భావనచే బాహ్యరూపముగా అగుచున్నది. ఆ బాహ్యత్వము ఆత్మత్వభావనచే ఆత్మరూపమే అగుచున్నది. కాబట్టి 1) బాహ్యత్వము, (2) అభ్యంతరత్వము అను ఈ రెండూ కూడా ఆత్మయొక్క ఆయా భావనా రూపములు మాత్రమేనని గ్రహించు.

మరొక విషయము. అంతఃకరణమున స్వప్నాది రూపంగా ఏ భ్రాంతి అయితే ముందుగానే ఉన్నదో... అదియే బాహ్యజగత్తు రూపంగా ఉదయించటం జరుగుతోంది.

స్వప్నంలో కనిపించేదంతా జాగ్రత్ సంబంధమైనదే అయినట్లు ఈ జాగ్రత్‌లో కనిపించేదంతా స్వప్న సంబంధమైనదేసుమా! జాగ్రత్‌కు-స్వప్నమునకు మా దృష్టిలో భేదమే లేదు. ఎందుకంటే ఆ రెండు కూడా ఆత్మయొక్క భావనను ఆశ్రయించి మాత్రమే ఉన్నాయి. రెండు పాత్రలలో గల పాలలో ఏమాత్రం భేదం లేనట్లు జాగ్రత్‌కు - స్వప్నమునకు భేదమే లేదు. అనగా జీవుడు జగత్తుగా అనుభవించుచున్నదంతా స్వప్నసదృశమేనని గ్రహించు.

శ్రీ రాముడు : అయితే, జాగ్రత్తులో కనబడే పదార్థములు స్థిరంగాను సుస్పష్టంగానూ, స్వప్నంలో కనబడే పదార్థములు అస్థిరంగాను, అస్పష్టంగాను భాసిస్తున్నాయి కదా!

శ్రీవసిష్ఠ మహర్షి :

స్థైర్య - అస్థైర్యే తథైవ అత్ర భ్రాంతిమాత్రమయే తతే ।
ఆధార - అధేయతే తే ద్వే యథా జలతరంగ తే ॥

ఓ రామా! జగత్తులో అనిపించే స్థిరత్వం, స్వప్నంలో అనిపించే అస్థిరత్వం - ఆ రెండింటి అనుభవం కూడా భ్రాంతి మాత్రమే అయి ఉన్నాయి.

స్వప్నంలో కనిపించే శరీరాలకు జాగ్రత్తు ఆధారం, స్వప్నం ఆధేయం. అయితే ఈ ఆధార - ఆధేయములు జల-తరంగముల వలె ఒకదానితో మరొకటి అభేదమైనవి. మనిషికి స్వప్నంలో ఆయా పదార్థములన్నీ ఎందుకు భాసిస్తున్నాయి? అజ్ఞానం చేతనేకదా! తన్ను ఎఱిగిన వెంటనే ఆ స్వప్న ద్రష్ట జాగ్రత్‌లో ప్రవేశిస్తున్నాడు. వెంటనే అతనికి జాగ్రత్ రూపం అనుభవమవుతుంది. అట్లాగే, శుద్ధాత్మజ్ఞానము యొక్క సముపార్జనచే ఈ జాగ్రత్ పదార్థములు ఇక పదార్థరూపముగా అనిపించక ఆత్మరూపముగా అనుభవమగుచున్నాయి. అనగా, "కల్పనారహితము - శాంతము" అయినట్టి పరమాత్మ యొక్క రూపమే ఆయా పదార్థముల భావనచే ఆయా రూపములుగా అనుభవ

మగుచున్నాయి. ఆయా పదార్థములు భావించకపోతే ఆయా రూపములన్నీ ఆత్మ పొందేదే కాదు. పదార్థ సంబంధమైన బాహ్యత్వపు భావన శమించగా అప్పుడు ఏ ఈశ్వరరూపము శేషిస్తోందో అది దేశ - కాలాదులకు అసంబంధమైనది కాబట్టి - 'అది ఉన్నది' అని అనలేం. ఆత్మయే స్వయంగా "సత్-ఉనికి" కాబట్టి "అది లేదు" అని కూడా అనలేము. అయ్యది వాక్కుకు విషయమే కానిదిగా అగుచున్నది. భ్రమయొక్క సంపూర్ణ వినాశన స్థితిని సమాధియందుండే యోగి మాత్రమే ఎఱుగగలడు. అది అనుభవవైకవేద్యమేగాని, మాటలతో "అది ఇట్టిది"... అని చెప్పలేం, సర్వ భ్రమ "ఆత్మసాక్షాత్కారం" అనేది ఉపదేశమునకు విషయమే కాదు. మరి? అది విజ్ఞుల యొక్క అనుభవమునకు మాత్రమే విషయమగుచున్నది.

శ్రీరాముడు : మరి ఈ గురు - శిష్య - ఆత్మబోధ వ్యవహారం?

శ్రీవసిష్ఠ మహర్షి : వాక్కుకు విషయమే కాని సర్వభ్రమనాశరూప ఆత్మసాక్షాత్కారం వైపుగా శిష్యుని బుద్ధిని ప్రవృత్తం చేయటానికే ఈ ఉపదేశక్రమము, గురుశిష్య బోధల ప్రయోజనమై ఉన్నది.

కాబట్టి ఓ సర్వ ప్రియజనులారా! అహంకారమును త్యజించండి. అభిమాన, విషాద, భయ లోభ, మోహములను పారద్రోలండి. దేహ, ఇంద్రియ, మనో, చిత్తాదుల సంబంధమైన జడత్వమును పాము కుబుసమువలె వదిలివేయండి. శాంతస్వరూపులై ప్రకాశించండి.

శాంతము - సమస్త భేద శూన్యము-అక్షయము- ఏకము - అజము - నిర్వాణరూపము అయిన బ్రహ్మమును సంతరించుకొని సమాధి వహించి ఉండటమే యుక్తం.

❖❖❖

14. తత్త్వజ్ఞులతో సాంగత్యం - స్వవిచారణ

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! తనయొక్క చలనముచే వాయువు సుడిగాలి మొదలైన రూపములను దాల్చి అనేక బీభత్సములను కలిగిస్తుంది చూచావా? అట్లాగే అవిద్యచే ఆకృతమైన చైతన్యము విషయములందు వ్యాపించుటకు ఉద్యమించిన మరుక్షణం అసద్రూపములే అయినట్టి అహంకారం మొదలైన వాటితో కూడిన ఈ జగద్భ్రమనంతా ఉదయింపజేస్తోంది. అయితే బ్రహ్మ రూప భావనాబలంచేత ఈ జగద్భ్రమ దుఃఖం కలిగించగలిగే శక్తిని కోల్పోగలదు. అట్లాకాదా... జగత్తు యొక్క శబ్దార్థ భావనచే అది మహానర్థమును కలుగజేయగలదు. ఈ కంటిచూపు ప్రసరించినంత మాత్రంచేత రూపానుభవం ప్రాప్తిస్తోంది చూచావా? చైతన్యము ప్రసరించినంత మాత్రం చేత ఈ జగద్భ్రమరూపమంతా స్థితి పొంది ఉంటోంది.

ఇక వాస్తవానికి వస్తే, కూటస్థచైతన్యమునకు రాకపోకలు ఉన్నాయా? లేవు! విషయముల అభావన చేత 'చాంచల్యము' అనే ప్రసరణ తొలగిపోతే నిర్విషయ చిదానందమే పరమసత్యమై అనుభవం కాగలదు. ఏ చైతన్యము యొక్క వ్యర్థ ప్రసరణమున్నదో... అది అసత్తే సుమా! అదంతా "గొడ్రాలి కుమారుడు ఏమి నృత్యం చేస్తున్నాడో కదా!"... అను అర్థరహిత వాక్యము వంటిదే!

చిత్తు యొక్క ప్రసరణం "అనుభవం" అను దాని ద్వారానే సిద్ధిస్తోంది. అయితే ఆ అనుభవం ఆత్మ – విద్యచే అతిక్రమించబడగలదు. బాలునికి పిశాచము యొక్క అనుభవం తొలిగేది ఎట్లా? పిశాచము యొక్క భ్రమ తొలగటంచేతనే కదా! అట్లాగే అసత్పదార్థము యొక్క అనుభవం తొలగాలంటే అసత్పదార్థమును అభావించటమే ఉపాయం. ఈ విధంగా చూస్తే చైతన్యము యొక్క ప్రసరణ అనబడేది మిథ్యయే అయి ఉన్నది సుమా! అదే రీతిగా "అహంభావముయొక్క ప్రసరణ" అనేది కూడా మిథ్యా వాక్యమనియే గ్రహించబడుగాక! లేదా, "అహంభావముయొక్క ప్రసరణ" అనేది కూడా మిథ్యా వాక్యమనియే గ్రహించబడుగాక! లేదా, అహంభావము యొక్క అనుభవము దుఃఖమునే కలిగించుచున్నది. అనహంభావనచే అహంభావన తొలగగా అప్పుడు మోక్షసుఖము జనిస్తోంది. ఈ విధంగా బంధ – మోక్షములు జీవునకు తన అధీనంలోనే ఉన్నాయిగాని, మీరెవరో బయటవారి ఆధీనంలో లేవు. అటువంటప్పుడు మోక్షము కొరకై ఎక్కడో వెతకి ఏం ప్రయోజనం?

తద్ధ్యానం స సమాధిర్వా యదవేదనమాసితమ్
అజడానాం జడమివ సమం శాన్తమనామయమ్

అజడములగు మనో–బుద్ధి–అహకారాదులపట్ల నిర్లిప్తమగు శిలామౌనాభ్యాసమే సమాధి. "తెలుసుకుంటున్నది – తెలియబడేది"... అనే ఉభయముపట్ల అతీతత్వముతో కూడిన స్థితియే ధ్యానము–నిశ్చలము–సమము–శాంతము–నిర్వికారము–ఏకము అగు చిద్రూపమున నెలకొని ఉండు స్థితియే "ధ్యానము" అని, 'సమాధి' అని కూడా చెప్పబడుతోంది.

వాదోపవాదాలలో సిద్ధాంతపూర్వకంగా ప్రవేశించే ఓ పండితులారా! వాదోపవాదాలు కలహ రూపాలగు వాక్భ్రమలకు కారణమే అగుచున్నవి. వ్యర్థమైన కంఠశోష బదులుగా శుద్ధ చిద్రూపంలో స్థితిపొంది ఉండే ఉపాయాలు ఆశ్రయించటమే అత్యావశ్యకమని మా అనుభవసారం!

ఈ జీవుడు అనేక దేహములలో ప్రయాణించి క్రమంగా ఘనీభూతములగు వాసనలతో కూడి ఉంటున్నాడు. సంకల్పరచితములు, స్వప్నతుల్యములు, అసత్తుల్యములు అగు అనేక బాహ్య – అభ్యంతర విషయములను ఆశ్రయించి తద్వారా అనేక విధములైన దుఃఖములకు భోక్తగా తనను తాను తీర్చిదిద్దుకుంటున్నాడు. ఎవరిపట్ల వాసనలు సన్నగిల్లుచున్నాయో, అట్టివాడు సంకల్ప రహితుడై ఈ బాహ్య – అభ్యంతర విషయములను మిథ్యగా ఎఱుగుచున్నాడు. గాఢంగా నిద్రించే మనుజుడు దోమ కుట్టినా బాధింపబడనట్లు... వాసనా రహితుడైనవాడు ప్రారబ్ధం చేత ఆయా సుఖ దుఃఖ సంఘటనలను పొందవలసి వస్తున్నప్పటికీ వాటిని ఆతడు అనుభవించడు. దేశ–కాల–క్రియా యోగం చేత పదార్థభావన ఏర్పడుచున్నట్లే దేశ–కాల–క్రియా పూర్వకమైన అభ్యాస యోగం చేత సూక్ష్మమగు వాసనలు కూడా ముక్తత్వదశను (తొలగిపోవటం) పొందుతాయి. అతి సూక్ష్మమగు పరమాణువులు అకాశరూపత్వము పొందునట్లే వాసనలు కూడా సాధనలో నిమగ్నమైన యోగి పట్ల తప్పక ముక్తత్వం సంపాదించుకోగలవు. పండితులతో సాంగత్యం కొనసాగిస్తూ రాగా క్రమంగా మూఢత్వం పోయి, పాండిత్యము అలవడుతుంది చూచావా? అట్లాగే బ్రహ్మాహంభావన

యొక్క అభ్యాసం చేత వాసనలు సూక్ష్మత్వం పొంది క్రమంగా శూన్య రూపం పొందుతాయి. "సర్వ సహజీవులు ఏ మూల పదార్థంచే తయారు కాబడినారో... అట్టి బ్రహ్మమే నేను" అనునదే బ్రహ్మోహంభావన సుమా! "నేను ఇహలోకంలోగాని, పరలోకంలోగాని సర్వదా శుద్ధ బ్రహ్మ రూపుడనే! అంతేగాని 'అహం' శబ్దార్థరూపమగు జీవుడను కాదు" అనే నిశ్చయం ఎప్పుడైతే కలుగుతుందో... అట్టి శాంతరూపుడగు మనుజుడు "దృఢ బోధ కలవాడు" అని చెప్పబడతాడు.

ఈ విధంగా... ఏ జగత్-జీవాదులన్నీ భాసిస్తున్నాయో అవన్నీ కూడా "నేనెవడను? ఈ జగత్తు ఎట్టిది?" అని ఈ ప్రకారంగా విచారణ చేయటం చేత తప్పక ఉపశమిస్తాయి.

"నేను ఈ దేహ-ఇంద్రియ-మనో-బుద్ధ్యాది రూపుడను గాను. నిర్వాణరూపమగు ఆత్మయే నేను" -అని ఇంతమాత్రం ఎఱుగటంలో కష్టం ,అసాధ్యం మొదలైనవి ఏమున్నాయి చెప్పు? సత్సాంగత్యము-శాస్త్ర విచారణ-ఈ రెండిటి సహాయం చేత - ఏజీవుడైనా సరే - తన యొక్క స్వస్వరూప అజ్ఞానమును తప్పకుండా అధిగమించగలడు.

"కో౽హం? కథమిదమ్ దృశ్యమ్? కో జీవః? కించ జీవనమ్?"
ఇతి తత్త్వజ్ఞ సంయోగాత్ యావజ్జీవం విచారయేత్ ॥

నే నెవరు? ఈ దృశ్యం ఎట్టిది? జీవుడు అనగా ఎవరు? అతని ప్రాణాదుల ధారణ ఎట్టిది? ...ఈ మార్గంగా తత్త్వజ్ఞానుల సాంగత్యంలో మోక్షపర్యంతమూ విచారణ చేస్తూనే ఉండాలి. అట్టి తత్త్వజ్ఞుల సాంగత్యం యొక్క ప్రయోజనం.

మొట్టమొదట	:	ఈ జగత్తంతా జ్ఞానానందమయమైనట్లు భాసిల్లుతుంది.
తరువాత	:	అహంభావం అనే అంధకారం నశిస్తుంది.
ఆ తరువాత	:	ఒక్కసారిగా ఆత్మ ప్రకాశం బోధకమౌతుంది.

అందుచేత ముముక్షువైనవాడు "తత్త్వజ్ఞాని" అనే సూర్యుణ్ణి తప్పక సేవించాలి. ఓ సభికులారా! తత్త్వజ్ఞులైన వారు ఎక్కడెక్కడున్నారో చూడండి, వెతకండి, వారిని అతి జాగరూకులై గుర్తించండి. ఎందుకంటే తత్త్వజ్ఞత కంటే అన్యంగా ఏవో కొన్ని సిద్ధాంతములతో, వాదోపవాదాలతో ఉండే వారి సమూహంలోంచి తత్త్వజ్ఞులను గుర్తించటం ఒక పెద్ద కార్యక్రమమే సుమా! "వాదం" అను పిశాచం ఉదయించగానే అది "అహంరూప ప్రత్యేకతత్త్వమే ముఖ్యము. అనహమ్ రూపసర్వాత్మకత్వము అనూహ్యము, అసంభవము, అసందర్భము, అనవసరము" అని అనిపించే విధంగా తర్క-వితర్క ప్రభావం చేత ఈ జీవుని శ్రుతి విరుద్ధమైన ప్రతిపాదనలచే ముంచెత్తగలదు. "ఇదియే చాలు. ఇంతే నీ పరిధి" అను మూర్ఖత్వముతో కూడిన అనర్థమును పండితులైన వారికి కూడా "వాదోపవాద వ్యవహారం కలిగించగలదు" అందుకే ఆత్మతత్త్వమును 'అతర్క్యమ్' (వాదోపవాదాలచే అలభ్యం, తర్కమునకు విషయం కానిది)" అని చెప్పబడింది. బాలురు "ఇంతే! ఇదే కావాలి! ఇంకేం వినను. ఈ పుస్తకంలో ఉన్నది చెప్పండి, ఇంకేం చెప్పొద్దు, మాట్లాడవద్దు"... అని అమాయకత్వంతో కూడిన మొండితనమును వహిస్తున్నట్లుగానే పండితులైన వారిలో కొందరు "ఏదో చెప్పుతారు. ఏం

వినకండి. ఇంతే చేయండి, ఇక ఆలోచంచకండి. ఊరుకోండి"...అని తమ అనుయాయిలకు బోధించి 'అంధగోలంగుల న్యాయం'లాగా తమకు కనబడేదానికే తదితరులను పరిమితులను చేయటం లోకంలో చూస్తూ ఉంటాం. కాబట్టి బుద్ధిమంతుడైనవాడు తత్త్వజ్ఞాని అయిన పండితుణ్ణి సమీపించి, తన వినయం, సేవ మొదలైన వాటిచే ప్రసన్నునిగా చేసుకోవాలి. ఏకాంతంగా ప్రశ్నించాలి. వారు చెప్పేది రెండు చెవులతోనూ వినాలి. వారు ఉపదేశించే అర్థములను అన్నిటినీ క్రోడీకరించుకొని స్వబుద్ధితో విచారణ చేసుకోవాలి. అందులోని సార విశేషాన్ని గంభీరంగా గ్రహించాలి. విశేషాల పట్ల మౌనం పెంపొందించుకోవాలి.

ఈ బుద్ధిని – 1.శుద్ధపరచుకోవటం; 2.వృద్ధి పరచుకోవటం, సునిశిత పరచుకోవటం; 3.సువిశాల పరచుకోవటం... ఇది 'గురుబోధ' యొక్క సద్వినియోగోద్దేశం. వారు వచించే శ్రుతి–యుక్త–స్వానుభవపూర్వక వాక్యాలను వాక్యార్థాలను హృదయంలో పదిలపరచుకోవాలి. "విద్వజ్ఞుల తోటి సంభాషణ" అను సదావకాశంతో సహాయంతో స్వబుద్ధిచేత విచారణ జేస్తూ క్రమక్రమంగా సర్వసందేహాలను నివృత్తింపజేసుకోవాలి. ఇంక ఆ తరువాత "నిధిధ్యాస" ద్వారా సర్వసంకల్ప రహితమైనట్టి, సద్రూప మైనట్టి 'బ్రహ్మము' నందు తన్మయత్వమును సముపార్జించుకోవాలి.

కనుక ఓ రామా! బుద్ధిమంతుడైనవాడు ప్రతిరోజు కూడా తత్త్వజ్ఞుల సాంగత్యంచే బుద్ధిని సుతీక్ష్ణం చేసుకోవాలి. 'అజ్ఞానం' అనే జన్మజన్మాంతర సముపార్జితమైన లతను ముక్కలు ముక్కలుగా ఖండించివేయాలి. అట్టి "జ్ఞానప్రాప్తి" అనే ఉత్తమ ప్రయోజనం తత్త్వజ్ఞులలో కలిగే సాంగత్యం చేత మాత్రమే సులభరీతిగా సంభవిస్తుంది. ఈ వాక్యమును నేను స్వానుభవమంతా రంగరించి చెప్పుచున్నాను. మేము అసమంజసమైన వాక్యములు పలికే బాలురంవంటివారం కాదు సుమా!

❖

ఓ సాధక జనులారా! ఈ జగద్వ్యవహారములన్నీ కూడా కొంత 'సానుకూలత' మరికొంత 'ప్రతికూలత' కలిగి ఉండే స్వభావం కలిగి ఉన్నాయి. సముద్రం చూచారా! అది తరంగములు విజృంభించటం చేతగాని, ఉపశాంతించటం చేతగాని ఏమైనా అనిష్టప్రాప్తిగాని, ఇష్టనాశనముగాని పొందుతోందా? లేదు. అటు ఆకాశాన్ని చూడండి! మేఘం – మంచు – ఎండ మొదలైనవి విజృంభించటం చేత తాను వృద్ధినిగాని, హానినిగాని పొందదు కదా! అట్లాగే సంకల్పరహితుడైన జ్ఞాని ఈ జగద్వ్యవహారములపట్ల కొంచెంకూడా ఇష్ట నాశనముగాని అయిష్టప్రాప్తినిగాని పొందటం లేదు. పొందవలసిన అవసరమూ లేదు.

ఈ జీవుడు నిర్వికారము–పరిపూర్ణము–శాంతము–సర్వవ్యాపకము అయినట్టి బ్రహ్మము యొక్క జ్ఞానముచే 'బుద్ధుడు' కాగలడు. వాస్తవానికి మృగతృష్ణాజలంలాగా ఈ జగత్తు భ్రమమాత్రమే అయినప్పటికీ, బ్రహ్మజ్ఞానికి ఈ సమస్త జగత్ – జీవాదులు ఆత్మరూపుడగు తనకంటే వేఱుగా భాసించదు.. తన స్వరూపంగానే భాసిస్తుంది. ఇక అట్టి తత్త్వజ్ఞానికి 'జగత్మననము' అనే విభ్రమములు ఎట్లు ఎందుకు కలుగుతాయి? కలగవు.

❖❖❖

15. పరలోకవ్యాధి - ఇహైవ చికిత్స

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! అధికార యోగ్యమైన శరీరం పొందిన తరువాత కూడా ఈ మనుజుడు ఆత్మోద్ధరణకై పురుషప్రయత్నమునకు ఉపక్రమించకపోతే ఎట్లా? ఇప్పుడే ఇక్కడే "సత్సాంగత్యము" సహాయంతో తనయొక్క బుద్ధిని వికసింపజేసుకోవాలి. ఇక్కడే స్వబుద్ధి చేత ఆత్మజ్ఞానం సంపాదించుకోవటం తప్పితే వేరే ఉపాయం ఏదీ లేదు. విషం కూడా వైద్యశాస్త్రయుక్తమైన ప్రయోగాదులచే తన మరణహేతుత్వమును వదలి దేహమునకు శ్రేయోదాయకం అవుతోంది చూచావా? అట్లాగే అశాస్త్రీయములు - కల్పితములు అగు వాసనాదులు కూడా అధ్యాత్మ శాస్త్రీయమైన ప్రతికల్పనచే అవి తమ బంధహేతుత్వము త్యజించి మోక్ష హేతుత్వమును అవధరించ గలవు. కల్పనలు ప్రతికల్పన (అధ్యాత్మికమైన కాల్పిక సాధనల)చే నశించగలవు. కల్పనలన్నీ పూర్తిగా నశించేవరకు ఆధ్యాత్మిక సాధన పూర్వకమైన ప్రతికల్పనను కొనసాగిస్తూనే ఉండక తప్పదు. సర్వకల్పనారహిత స్థితే ముక్తి. అట్టి ముక్త స్థితి భోగత్యాగానికి ముందే కలుగుట కుదిరేది కాదు.

1. శ్రవణ - మననములచే ఆత్మతత్త్వమును సునిశ్చితం చేసుకోవటం.
2. వాక్కుచేత, మనస్సుచేత లోన పదార్థములను భావించకపోవటం.
3. ప్రతి కల్పన అభ్యసించటం.

...ఇట్టి మార్గంలో వాక్-మననముల నిరోధం చేత మెల్లమెల్లగా కల్పనయొక్క శమనము వృద్ధి పొందగలదు.

ఆ తరువాత అహంభావాన్ని 'అనహమ్' భావన ద్వారా వర్జించాలి. ఎందుకంటే అహంభావం కంటే వేఱుగా అవిద్య అనేది లేదు. ఆ విధంగా అహంకారం బాధితం కాగా, సర్వభావనా రాహిత్యం చేత తత్త్వసాక్షాత్కారం ఉదయిస్తుంది. అదే మోక్ష స్థితి. అంతకు వేరుగా 'మోక్షం' అనేది ఎక్కడా ఏదీ లేదు. అట్టి సాక్షాత్కారమును పరిరక్షించుకోకుండా ఈ జగత్-జీవాది భావాలలో ప్రీతియుక్తుడై ఈ జీవుడు అట్టి కొంచెం అహంభావమును దేహ పర్యంతరం ఆశ్రయించి ఉన్నా కూడా... ఈతడు మరల సంసారం పొందటం జరుగగలదు. అందుచేత 'అహంభావాన్ని త్యజించటం' అనే ప్రతికల్పన అభ్యసిస్తూ వస్తే... అప్పుడా జీవుడు శాంతిని పొంది నిరతిశయానందస్థితిని పొందగలడు.

ప్రతికల్పన అనగా - బహిర్ముఖ వృత్తిచే ఈ జగత్తును గాంచకపోవటం, అంతర్ముఖ వృత్తిచే ఈ జగత్తును పరమాత్మతత్త్వంగా గాంచటం. పరమాత్మయే ఈ సర్వజీవాదుల రూపంగా ఉన్నట్లు గమనిస్తూ ఉండటం.

అట్టి ప్రతికల్పనచే ఎవనికి ఈ సమస్త జగత్తు కూడా ఎదురుగా ఉండి కూడా అసత్తుగాను, శిల వలె ప్రశాంతంగాను తోచుచున్నదో అట్టి మహాత్మునకు శిరస్సు వంచి మేము నమస్కరిస్తున్నాం. జేజేలు పలుకుచున్నాం.

పరబ్రహ్మమున లీనమైనట్టి చిత్తం కలవాడు దృశ్య శూన్యుడగుచున్నాడు. అనగా ఆతని చిత్తం బహిర్ముఖరహితమై ఉంటోంది. అతడు అభ్యంతరమున చైతన్యమాత్రభావనతో కూడి

ఉంటున్నాడు. అందుచేత ఈ జీవ – జగదాది సమస్త ప్రపంచము అతని దర్శనముచే శిలవలె ప్రశాంతమై ఉంటోంది.

కల్పన అనగా... "ఇది నాకుండుగాక, ఇది నాకు లేకుండుగాక, వాళ్లు అటువంటి వారు – మేం ఇంతటివాళ్లం – వీళ్లంటే ఇష్టం. వాళ్లు నాకు ఇష్టముండదు. ఇత్యాది ద్వంద్వములతో కూడిన" భావనా పరంపరలే సుమా! అట్టి కల్పనయే దుఃఖమును వృద్ధింపజేస్తోంది. బ్రహ్మాకారభావనచే దృశ్యముయొక్క రూప–నామ దర్శనరూపమైన చిత్తము బలహీనమగుచుండగా, అట్టి చిత్త నిరోధముచే ప్రతికల్పిత సుఖము అగు ఆత్మసుఖం లభిస్తోంది.

ద్వౌ వ్యాధీ దేహినౌ ఘోరవయం లోకస్తథా పరః ।
యాభ్యాం ఘోరాణి దుఃఖాని భుంక్తే సర్వైర్హి పీడితః ॥

ఈ జీవునికి రెండు వ్యాధులున్నాయి– 1.ఇహలోక వ్యాధి, 2.పరలోక వ్యాధి. ఈ రెండు వ్యాధుల వల్లనే ఈతడు ఆధిభౌతిక, ఆధిదైవిక, ఆధ్యాత్మికాది సమస్త దోషములచే పీడితుడై అనేక మహాదుఃఖములన్నీ అనుభవించుచున్నాడు.

ఇహలోక వ్యాధి - ఆకలి, దప్పిక మొదలైనవన్నీ. ఈ వ్యాధి యొక్క శమనము కొరకై అన్న పానాదులు సంపాదించుకుంటున్నారు. మంచిదే. అయితే కొందరు జీవులు ఇహజీవితము కొరకే జీవితమంతా తమకున్న శక్తినంతా ధారపోసుకుంటున్నారు. మరి పరలోక వ్యాధి మాట ఏమిటి?

పరలోక వ్యాధి - ఆ వ్యాధి జనన – మరణాది రూపాలుగా ఉంటోంది. పరలోక వ్యాధికి ఇక్కడి భోగాదులు ఔషధమే కాదు.

పరలోక మహావ్యాధౌ ప్రయతన్తే చికిత్సనమ్ ।
శమః సత్సంగ భోధాఖ్యైః అమృతైః పురుషోత్తమాః ॥

మరి? పరలోక వ్యాధికి శమం (ఇంద్రియనిగ్రహం), సత్సాంగత్యం, జ్ఞానం మొదలైనవి ఔషధములు. అట్టి అమృతతుల్యములగు ఔషధముల ప్రాముఖ్యమేమో ఎఱిగిన మహనీయులు అట్టి పరలోకవ్యాధి కొరకై ఔషధములు సేవించుచున్నారు. అవకాశములను సృష్టించుకుంటున్నాడు. ఉపయోగించుకుంటున్నారు.

పరలోక చికిత్సాయాం సావధానా భవన్తి యే ।
మోక్షమార్గమహేచ్ఛాయాం శమశక్త్యా జయన్తి తే ॥

ఓ జనులారా! ఇహలోక విభాగములైన ఈ రక్తమాంసమయ శరీరము దృష్ట్యా మాత్రమే జీవితమును ఉద్దేశించువారు సంసారముచే అనేకసార్లు మోసగించబడనున్నారు.

1. అపథ్యములైనట్టి ఇక్కడి భోగములను త్యజించి ఉండటం.
2. సంత్సంగము – జ్ఞాన సమాచార సేకరణ వంటి ఔషధ సేవనము.

ఈ రెండూ ఇప్పుడు కావాలి. ఉట్టి "మందు" తీసుకొని "పథ్యం" (తీసుకోవలసినవి, తీసుకోవటం, తీసుకోకూడనివి తీసుకోకపోవటం) విషయంలో అశ్రద్ధగా ఉన్నా, పథ్యం తీసుకొని మందును తీసుకోకపోయినా... వ్యాధికి చికిత్స కుదురదు కదా! పై ఉభయముల పట్ల సావధానులై

ఉండండి. అప్పుడు 'శమము' అనే ఔషధము యొక్క శక్తిచే మీ యొక్క మోక్ష 'సాధనము' అనే అభిలషితమార్గంలో విజయం పొందుతారు.

ఇహైవ నరకవ్యాధేః చికిత్సా న కరోతి యః ।
గత్వా నిరౌషధం స్థానం స రుజః కిం కరిష్యతి ॥

ఈ మనుష్యజన్మ మహత్తరమైన అవకాశం. ఇక్కడ 'నరకం' అనబడే పరలోకస్థిత వ్యాధికి 'సత్సంగం' మొదలైన ఔషధములు సేవించి, తద్వారా ఆత్మజ్ఞానము సముపార్జించి చికిత్స పొందాలి. ఎవడైతే అట్టి నరకవ్యాధికి చికిత్స ఇక్కడ పొందుటకు సిద్ధపడడో... అట్టివాడు సరి అయిన ఔషధములు లభించని స్థావర-జంగమాదులైన జన్మలకు పోయి ఏమి చేయగలడు? శాస్త్రాశ్రయం మొదలైన చికిత్సలు అక్కడ లభించక పోవచ్చు కదా!

ఇహలోక చికిత్సాభిః జీవితం యాతు మా క్షయమ్ ।
ఆత్మజ్ఞానౌషదైః అజ్ఞాః! పరలోకశ్చికిత్స్యతామ్ ॥

ఓ సహజీవులారా! మీపై గల అవ్యాజమైన ప్రేమచే మేము చెప్పే ఈ జాగరూక వాక్యాలు వినండి. మహత్తరమైన ఈ "మనుష్య-జీవితము" అనే దుర్లభమైన అవకాశమును ఇహలోక విషయములైన తినటం-త్రాగటం-భోగములు అనుభవించటం అనే కార్యక్రమాలకు మాత్రమే ఉద్దేశించి, తద్వారా, ఇహలోక చికిత్సాపరిమితులు కాకండి. 'ఆత్మజ్ఞానము' అనే ఔషధమును సేవించి పరలోకవ్యాధికి చికిత్స ఒనర్చుకోండి. "ఆ! ఆత్మజ్ఞానానికి అంతతొందరేం వచ్చిందిలే! తరువాత ఎప్పుడో చూసుకోవచ్చు"... అని కాలాయాపన చేయవద్దని నా మనవి. ఎందుకంటా రేమో? గాలిచే కదల్చబడుచున్న ఆకుపైగల అల్పమైన నీటిబిందువుల వలె ఈ ఆయుష్షు అత్యంత క్షణభంగురమైనది. కనుకనే సత్సంగము - స్వచ్ఛాస్త్ర అధ్యయనము మొదలైన యత్నములచే పరలోకవ్యాధికి వెంటనే చికిత్స కావించుకోవటమే ఉచితం సుమా!

పరలోక మహావ్యాధౌ యత్నేనాశు చికిత్సితే,
ఇహలోకమయో వ్యాధి స్వయమాశు ఉపశామ్యతి!

చక్కగా ప్రయత్నించి 'పరలోకము' అనే వ్యాధికి చికిత్స పొందారా... అప్పుడిక ఇహ లోకమునకు చెందిన వ్యాధి తనంతటతానే శీఘ్రంగా శమించిపోగలదు.

❖

ఈ జీవుడు చైతన్యమాత్రుడనియే కదా అధ్యాత్మశాస్త్ర నిర్ణయం అతనియొక్క ప్రసరణా వ్యాసంగమే ఈ జగత్తు. జీవునిలో గల చైతన్యమే ఒక పరమాణువులో కూడా వ్యాపించి ఉండటం చేత, అట్టి ఒక పరమాణువునందు కూడా అనేక భూ-పర్వతాదుల విస్తారముతో కూడిన జగత్తు కలదు. ఆ చైతన్యము యొక్క బహిర్ముఖత్వ ప్రసరణచే బాహ్యపదార్థ రూపములుగాను, అంతర్ముఖత్వ ప్రసరణచే కోరికలు మొదలైన మానసిక పదార్థ రూపాలుగాను చిదాకాశమున అనుభూతమగు చున్నాయి. కనుక ఈ జగద్భ్రమ సత్యంకాదు. ఇది స్వయంకల్పిత భ్రాంతి మాత్రమే. మిథ్యయే

అయిన ఈ దృశ్య జగత్తు ప్రళయంచే నశించేదీ కాదు, సృష్టులచే జనించేదీ కాదు మరి? భ్రమ ఉన్నప్పుడు జగత్తుగాను, భ్రమ తొలగుటచే కేవలం ఆత్మగాను ఇదంతా అనుభూతమగుచున్నది.

ఏ జీవుడైతే 'భోగం' అనే బురదలో చిక్కుకున్న తనయొక్క ఆత్మను ఇప్పుడికక్కడ స్వకీయపురుష ప్రయత్నంచే సముద్ధరించుకోవటానికి ప్రయత్నించడో అట్టివాడు దుఃఖ పరంపరలను అనివార్యంగా పొందవలసియే వస్తోంది. స్వకీయమైన పురుష ప్రయత్నం తప్పితే ఆత్మోద్ధరణకు వేరే ఉపాయం ఎక్కడా ఏదీ లేదు. అడ్డమైన నీళ్ళు వచ్చి సముద్రంలో జేరుచున్నాయి చూచావా? అట్లాగే ఇంద్రియ జయము లేనివాడు కేవలం 'భోగం' అనే బురదలో నిమగ్నమైనవాడు అగు మూఢుడు ప్రపంచంలోని అన్ని ఆపదలకు, అల్పజన్మలకు అర్హుడగుచున్నాడు.

ఏ విధంగా బాల్యావస్థ 'ఆయువు' అనబడుదానికి మొట్టమొదటి దశ అవుతుందో... ఆ విధంగానే నిర్వాణమునకు రాగాదుల శమనపూర్వకమైన భోగత్యాగం మొదటి నియమం అగుచున్నది. జ్ఞానికి కూడా సుఖదుఃఖాదులు ఉంటే ఉండవచ్చుగాక! అయితే ఏం? అవన్నీ కూడా చిత్రపటంలోని సాగరతరంగాలలాగా సౌమ్యం – సంభ్రమరాహిత్యం సంతరించుకొని ఉంటాయి. అజ్ఞానుల జీవితమో అట్టి సుఖ దుఃఖ సంఘటలు ఉన్నా, ఉండక పోయినాకూడా – హోరుగా శబ్దం చేసే నదీ జలతరంగాల వలె – కామాది అనేక వృత్తులతో మనోవ్యవస్థ పరంపరలతో, వ్యాకులత – విక్షోభములతో నిండి ఉంటోంది. మెల్లకన్నువానికి రెండు – మూడు చంద్రబింబాలు అగుపిస్తాయి చూచావా? బాలునికి గాలిలో దయ్యాలు కనబడతాయి! మూర్ఖ బాటసారికి ఎండమావులలో అనేక జలతరంగాలు గోచరమౌతాయ్! అట్లాగే అజ్ఞాని తనయొక్క అవిచారముచే స్వప్న సదృశమైన విమోహం పొందుచున్నాడు.

చైతన్యము యొక్క కించిత్ ప్రసరణరూపమగు ఈ సృష్టి సమూహాములు భ్రమచే దాటుటకు వీలుకాని–అర్థమేకాని సుదీర్ఘ దృశ్యపరంపరగా ఆతనికి అనుభవమౌతోంది. ఈ సృష్టులన్నీ కూడా 'చైతన్యం' అనే సముద్రం యొక్క తరంగ సమూహాలు మాత్రమే! తత్త్వ విచారణచే ఇవన్నీ అసత్యాలుగా తెలియవస్తున్నాయి. భ్రమానుభవం చేతనో... ఇవి సత్యములైనట్లే గోచరిస్తున్నాయి.

సుప్రసిద్ధమై కనిపించే ఈ భూతాకాశంలో చైతన్యం యొక్క స్వయంకృత చమత్కారమైన "ప్రసరణ" అను భ్రమచే అనేక జగత్తులు సత్యమే అయినట్లు అనుభూతమౌతున్నాయి.

వాస్తవానికి ఈ దృశ్య జగత్తులు సత్యం కాదు. ఈ సృష్టి వాస్తవానికి రూపరహితమైనప్పటికీ అహంభావం మొదలైన పదార్థముల వికారంచే రూపవంతంగా అవబడుచున్న ఈ సృష్టుల భ్రమంతా "చైతన్య ప్రసరణము" అనే జలంలో కనిపించే బుద్బుదములు (బుడగలు) వంటివి.

ప్రవృత్తిచే ఈ జగత్తులు అగుపిస్తున్నాయి. చైతన్యముయొక్క అంతర్ముఖత్వమే ఈ జగత్తులన్నిటి యొక్క నివృత్తి రూపం. అట్టి నివృత్తియే నిర్వాణము. అనగా, చైతన్యము యొక్క బహిర్ముఖత్వమే ఈ జగత్తులకు మూలపదార్థం. వాస్తవానికి చైతన్యం బాహ్యం కాదు, అభ్యంతరం కాదు, సత్యం కాదు, అసత్యం కాదు. (అధిష్ఠాన దృష్టిచే) సమస్తము అదే! బంగారమునకు రూపమెక్కడున్నది? అయితే గాజుకు రూపమున్నది. బంగారం కాకుండా గాజు ఎక్కడున్నది? బ్రహ్మము చిద్రూపమై,

జన్మాదులు లేనిదై, అవ్యక్తమై, అద్వితీయమై, నాశరహితమై ఈశ్వర స్వరూపమై మనోబుద్ధి అహంకారాదులకు ఆవల ఉన్నదై, పరమశాంతమై ఆకాశముకంటేకూడా అతి నిర్మలమై ఉన్నది.

శ్రీరాముడు : స్వామీ! స్వభావరహితమైన బ్రహ్మం స్వయంగా సృష్టిరూపంగా ఎందుకు స్ఫురిస్తోంది?

శ్రీవసిష్ఠ మహర్షి : మెల్లకన్నువానికి కనిపించే మూడు చంద్ర బింబాలలో మొదటి రెండు బింబాల మధ్య గల దూరం కంటే చివరి రెండు బింబాల మధ్య గల దూరం ఎందుకు అధికంగా ఉన్నది? మెల్లకన్ను దోషం చేత భ్రమచే కనిపించే మూడు చంద్రబింబాలకు అర్థమే లేదుకదా! అంతా భ్రమయే కదా!

వాయువు యొక్క చలనమునకు కారణం అంటూ ఏదీ లేనట్లే బ్రహ్మం సృష్టిరూపంగా స్ఫురించటానికి కారణం అంటూ ఏదీ లేదు. స్వప్నంలో ప్రాప్తించే అనుభవమంతా భ్రాంతిరూపమే కదా! స్వప్నంలో "ఆ ఇల్లు ప్రక్కనే ఆ చెట్టు ఎందుకున్నది"... అనే ప్రశ్నకు సమాధానమేమున్నది? ఆ ఇల్లు, ఆ చెట్టు కూడా భ్రాంతియే కదా! సముద్రంలో ఆ తరంగం పెద్దగా, ఆ ప్రక్కనే ఉన్న మరొక తరంగం చిన్నగా ఎందుకున్నది?" అనే దానికి కారణం లేనట్లే, ఒకవేళ కారణమున్నా... అది కూడా భ్రమచేతనే కూడుకొని ఉన్నట్లే... ఈ జగత్తు బ్రహ్మమునందు ప్రదర్శనమౌతోంది. కాబట్టి మనం 'అకారణం' అని చెప్పుకుంటున్నాం అట్లాగే బ్రహ్మము అను సముద్రంలో అనేక భేదములతో కనిపిస్తున్న 'సృష్టులు' అను తరంగాలకు కారణం లేదు.

బ్రహ్మ రూప స్థితి - మునిసత్తముడు -

ఏకమేవ నిరాభాసమ్ అచిత్తత్త్వమ్, అజడం సమమ్,
న సన్ న అసన్ నసత్ – అసత్ ఇదమ్ అవ్యయమ్ అద్వయమ్॥

"సర్పరజ్జు భ్రాంతి"లో త్రాడుకు పాముగా కనబడే ధర్మం ఉన్నది అని అనగలమా? పరమాత్మ యగు బ్రహ్మము ఏకమై, అభాసరహితమై, చిత్తధర్మములేనిదై, జడత్వరహితమై, సర్వత్రా సమ రూపమై, సత్తు గాని – అసత్తుగాని – సదసత్తుగాని కానిదై, అవ్యయమై ఒప్పుచున్నది. ఎవడైతే అట్టి బ్రహ్మరూపస్థితి కలిగి ఉంటాడో... అతనికి చిత్తము ఉండదు. అనగా ఆతని చిత్తము బాహ్యత్వము కోల్పోతుంది. అంతర్ముఖమౌతోంది. దృశ్యస్ఫురణ లేనిదౌతుంది. ప్రశాంతత్వము స్వభావసిద్ధంగా సంతరించుకుంటుంది. అట్టివాడు "మునిసత్తముడు"... అని చెప్పబడుచున్నాడు.

ముని శ్రేష్ఠుడు - ఎవడైతే అందరిలాగానే దేహధారియై కనిపిస్తూ కూడా ఒక మట్టితో తయారు కాబడిన బొమ్మవలె దృశ్యవేదనారహితుడై ఉంటాడో, ఎవని దృష్టిలో అయితే అహంభావంతో సహా ఈ జగత్తంతా తన స్వస్వరూప భావనయందు విలీలనమై ఉంటుందో... ఆతడు "ముని శ్రేష్ఠుడు."

దృశ్యవేదన లేకపోతే - జగత్తు లేదు - ఊహ (సంకల్పము) నందు అనుభవించబడే నగరం... ఆ ఊహ శమించగానే (ఆ నగరం కూడా) శమిస్తుంది కదా! అట్లాగే దృశ్యవేదనచే ఉత్పన్నమైన, అహంభావసహితమైన ఈ జగత్తు దృశ్యవేదన లేకపోయినప్పుడు తనంతటతానే శమిస్తోంది.

ముక్తి - ఈ జీవులయందు అనుగతమై జడత్వరూప సంబంధమై "స్వభావము" కలదు. అట్టి 'స్వభావము' యొక్క శబ్ద – అర్థములే "మూలావిద్య". ఆ స్వభావమును ప్రక్కకు పెట్టి చూస్తే, ఆ

తరువాతి పదార్థములన్నీ సహేతుకములే! అట్టి స్వభావమునకు హేతువు సాక్షిరూపమగు ఆత్మ. అట్టి ఆత్మయొక్క అనుభవము కలిగి ఉండుటే 'ముక్తి'.

వాస్తవానికి ఏ పదార్థమునకు (జీవునకు) తనదంటూ ప్రత్యేకమైన ఏ స్వభావమూ లేదు. మరి? సమస్త అనుభవములూ మహాచైతన్యము యొక్క దృశ్యత్వపు చమత్కారమేనని అనవచ్చు. ఈ 'అనుభవములు' అనబడేవన్నీ కూడా మహాచైతన్యము యొక్క చలనములే అయి ఉన్నాయి. అంతేకాకుండా వీటినన్నిటినీ కూడా 'బ్రహ్మము' అనే ఆకాశము యొక్క శూన్యత్వంగా కూడా మనం చెప్పుకోవచ్చు. వాయువు – వాయుచలనము – ఈ రెండూ ఒక్కటే కదా! అట్లాగే బ్రహ్మము – సృష్టి అనబడు రెండూ కూడా అభిన్నములే సుమా! ఒకవేళ ఆ రెండింటికీ ఏదైనా భేదమున్నట్లుగా ఎవరికైనా అనిపిస్తే ..., అది "స్వప్నంలో నేను మరణించాను" అని చెప్పుకొనే జీవుని పరిభాషవలె భ్రాంతి రూపము, మిథ్య. ఆత్మతత్త్వము గురించిన విచారము పరిపక్వము పొందనంతవరకు అట్టి భ్రాంతి ఉండియే తీరుతుంది. ఆత్మతత్త్వము సుస్పష్టము – కరతలామలకము అయిందా,... అప్పుడు ఆ భేదసంబంధమైన భ్రాంతి కూడా బ్రహ్మరూపమునే చెందుతుంది.

శ్రీరాముడు : మహాత్మా! భ్రాంతి కూడా బ్రహ్మరూపమునే చెందుతుందా!

శ్రీవసిష్ఠ మహర్షి : అవును. నా ఉద్దేశమేమంటే ఏ సత్తా స్ఫూర్తిరూపమైన అంశముచే భ్రాంతి ఏర్పడి ఉంటుందో, అట్టి సత్తాస్ఫూర్తి బ్రహ్మరూపత్వమే చెందగలదు. ఇక సత్తాస్ఫూర్తికి వేరుగా గల భ్రమ విభాగమంటావా? పరుగులు తీస్తున్న కుందేలును దూరంగా చూసినపుడు ఒకనికి చెవులు కొమ్ములుగా కనిపించినాయనుకో! అతడు కుందేలును దగ్గరగా చూసినపుడు ఇంతకు ముందు కనిపించిన కొమ్ములు ఏమైనాయి? తొలగాయా? ఉంటేగదా, తొలగటానికి? మరి ఎందుకు ఇంతకు ముందు కనిపించాయి? సమన్వయలోపమే కదా! ఆ విధంగా సత్తాస్ఫూర్తికి వేరుగా కనిపించేదంతా తత్త్వవిచారణానంతరం అవస్తువై మచ్చుకకు కూడా లభించదు. అప్పుడు అంతటా, అన్నిటా అతి నిర్మలమగు బ్రహ్మమే శేషించుచున్నది.

కాబట్టి ఓ రామచంద్రా! ఓ ప్రియసభికులారా! మీరంతా కూడా దేహ సంబంధముచే మాత్రమే సంప్రాప్తిస్తున్న సమస్త జర–జన్మ–మోహాది వికారభారరూపమగు భ్రాంతిని విడనాడండి. ఆదిమధ్యాంతరహితము, అనంతము, నిర్మలము, సమము, శాంతము, శివరూపము, శాశ్వతము, ఏకము అయినట్టి బ్రహ్మాకాశభావమును పొందండి.

❖❖❖

16. దృష్టియే సృష్టి

జగత్ అదర్శనమే జగత్ నాశనం -

శ్రీవసిష్ఠ మహర్షి : స్వామీ! ఆత్మ అత్యంత సుఖస్వరూపమైనది కదా! ఈ జీవుడు సర్వదా ఆత్మస్వరూపుడే అయినప్పటికీ ఎందుకో సుఖదుఃఖములు ఈ జీవుని ఏదో రూపంగా వెన్నంటియే ఉంటున్నాయి. అసలు ఈ సుఖదుఃఖముల స్వరూపం ఏమిటి?

శ్రీరాముడు : రామచంద్రా! సుఖదుఃఖాలు ప్రాప్తిస్తున్నప్పుడు ఏదైతే కాలంచే నాశనమవుతోందో... అదంతా ఇప్పటికే నశించియే ఉన్నదని ఈ జీవుడు గ్రహించుగాక! "తెలుసుకొంటున్నవాడు-తెలుసుకోవటం-తెలియబడేది" అనే త్రిపుటి ప్రతిక్షణం మార్పు చెందుతూనే ఉన్నది. ఇవన్నీ నశిస్తున్నప్పటికీ ఏదైతే తాను నశించక కేవల సాక్షి రూపంగా నిత్యోదితమైఉన్నదో... అదియే ఆత్మ, ఏదైతే ఇతఃపూర్వమే (త్రిపుటికి మునుముందుగానే) త్రిపుటికంటే వేఱుగా సదా, సర్వదా విద్యమానమై ఉన్నదో... అట్టి ఆత్మయే శాస్త్రసారం. ఇంతకంటే ఎక్కువగా శాస్త్రోపదేశంతో నిజానికి పనిలేదు. ఇక సుఖదుఃఖాదులు ఎందుకుంటున్నాయి?" అనే ప్రశ్నకు వద్దాం.

ఇచ్ఛ - ఎవనికి ఇచ్ఛ ఉదయిస్తుందో...వానికి అవశ్యం సుఖదుఃఖాదులు ఉండనే ఉంటాయి. ఇచ్ఛా రహితుడైన ఆత్మజ్ఞానికి అవి ఉండవు. కాబట్టి ఎవరైనా సరే "సుఖ దుఃఖములు" అనే రోగమును వదిలించుకోవాలంటే మొట్టమొదటిగా ఇచ్ఛను త్యజించాలి.

శ్రీరాముడు : శుద్ధ పరమపదంపై 'ఇచ్ఛ' – ఏ విధంగా ఏ కారణంగా ఎందుకొరకై ఏర్పడుతోంది?

శ్రీవసిష్ఠ మహర్షి : శుద్ధమగు పరమపదమునందు "అహంభావము – జగత్తు – ఇచ్ఛ" మొదలైన భ్రాంతి లేనేలేదు. ఈ సర్వము శుద్ధ పరబ్రహ్మమే అయి ఉన్నది. ఇదంతా కూడా సదా శాంతమై, నిరాధారమై అవ్యయమై, నిర్వాణరూపమైనట్టి చిదాకాశమే అయి ఉన్నది. ఇక "అహం – బ్రహ్మము – జగత్తు" ఇటువంటి శబ్దముల భ్రమను ఎవరో బోధ కొరకో, లేక, మరెందుకో కల్పించారు. సర్వాత్మకమై పరమశాంతమైనట్టి చిదాకాశమున అవన్నీ కల్పనారూపంగా దర్శించబడుచున్నాయి. చిదాకాశరూపమైనట్టి ఆత్మయందు జగత్తు-బ్రహ్మము-అహంకారము మొదలైన శబ్దార్థముల ప్రవృత్తియే లేదు. ఏకము-సర్వాత్మకము-శాంతము అగు ఆత్మకు కర్తృత్వంగాని, భోక్తృత్వంగాని ఎట్లా సంభవిస్తుంది? మరి ఈ కనబడే 'అనేక జీవులు' అనే వ్యవహారమంటావా?

...'చిద్రూపము' అనే ఒకానొక మట్టి "అనేక జగత్తులు" అనే పాత్రను తనయందు ధరిస్తుంది. ఆ చిద్రూపము దేనిని ఎట్లా స్మరిస్తే అది అట్లే తనకుతానై అనుభవిస్తోంది. ద్రవరూపమగు సముద్రం తనయందు అనేకతరంగములు ధరించటం లేదా? జలమే తరంగాలుగా భాసిస్తున్నట్లు బ్రహ్మమే తనయొక్క నిర్మలసత్తచే జగద్రూపంగా భాసిస్తోంది. వాస్తవానికి చైతన్యము రూపరహితమైనదే. అయితే అది తనయందు ఈ జగత్తు మొదలైన వస్తువులను స్మరిస్తోంది. అట్లు స్మరించినప్పుడు వానివాని ఆయా రూపములను తనయందే చమత్కారంగా గాంచుచున్నది. అది దేనిని స్మరించకుండా ఉన్నదో... అది గాంచకయే ఉన్నది.

మాయతో కూడుకొని ఉన్న బ్రహ్మము. బ్రహ్మము (లేక, ఈశ్వరుని) యొక్క మాయారూప దేహము-చేతనత్వము-అచేతనత్వము. వీటన్నిటి గూర్చిన కథనం కేవలం ఉపదేశం కొఱకు ఉద్దేశించి కల్పించబడ్డాయి యథార్థానికి అట్టి కథనమంతా కూడా శుద్ధాత్మ విషయము గూర్చి కాదుసుమా! అవన్నీ మధ్యేమార్గ వర్ణనలని గ్రహించు. ఆత్మ గురించిన పాఠ్యాంశములకు సంబంధించిన ఉపకరణములు మాత్రమేనని గమనించు.

ఈ జగత్తు సత్తు కాదు. అసత్తు కూడా కాదు. ఇదంతా చైతన్యమునందు ఆ చైతన్యముయొక్క విస్తరణచే భాసిస్తోంది. చైతన్యమునందు విస్తరణయే లేకపోతే అప్పుడు ఈ జగత్తు భాసించదు. ఇట్టి మిథ్యాజగత్తునందు మనం విశ్వాసం ఎందుకు ఉంచాలి?

స్వాధీనం - పరిశ్రమానంతర లభ్యం - ఈ ప్రపంచంలో జీవునికి సంబంధించి విషయాలు రెండు విధాలుగా ఉంటాయి – 1.ప్రయత్నిస్తేనే లభించేవి, 2. ఏ ప్రయత్నం లేకుండానే ఇప్పటికే స్వాధీనంలో ఉన్నవి. స్వభావసిద్ధమై ఉన్నవి. ఉదాహరణకు ఒకడు ధనం, పదవులు, గృహాలు సంపాదించాలంటే ప్రయత్నం చేసి సంపాదించుకోవాలి. ఆలోచించటం మొదలైనవి స్వభావ సిద్ధంగా ఉంటున్నాయి. ఒక స్ఫటికశిలలో ప్రతిబింబించే దృశ్యంలోని జీవుల, వస్తువుల కదలికలు ఆ స్ఫటిక శిలకు స్వభావసిద్ధంగాను స్వాధీనంగాను ఉంటున్నాయి కాని, ఆ శిల యొక్క ప్రయత్న సాధ్యమైనవి కావు. అట్లాగే చైతన్యాత్మకు కూడా తనలో "విస్తరణ, అవిస్తరణలు" స్వాధీనాలే గాని యత్నంచే సాధ్యమగుచున్నవి కావు. అద్దాని విస్తరణయే జగదనుభవం. అద్దాని అవిస్తరణయే జగత్‌రాహిత్యం.

శ్రీరాముడు : మహాత్మా! చైతన్యాత్మ 'అహంకారము' విషయమై మేము శాస్త్ర – స్వానుభవ – పరస్పర చర్చల సహాయంతో పరిశీలన చేశాం. అట్లు విచారణ చేయగా ఈ "అహంకారము"నకు "సత్తు (ఉనికి)గాని, ఆధారముగాని, కారణముగాని లేవు" అనియే తేలింది.

శ్రీవసిష్ఠ మహర్షి :

యస్యేక్షి తస్యనో సత్తా, నాఽఽధారో, న చ కారణమ్ ।
సో 'అహమ్' ఇత్యేవ యోయక్షో న జానే కుత ఉత్థితః ॥

ఏ అహంకారమునకు తనదైన ఉనికి గాని, ఆధారముగాని కారణముగాని ఏకించిత్‌కూడా లేదో, అట్టి అహంకార యక్షుడు ఎక్కడినుండి వచ్చాడంటే ఏమి చెప్పగలం? ఓ జనులారా!

యస్యాహమ్ ఇతి యక్షస్య సత్తైవాస్తి న సత్యతః ।
అహో ను చిత్రం! తేనేమే భవన్తో వివశీకృతాః ॥

నాయనలారా! ఏ 'అహంకారము' అనే పిశాచానికి వాస్తవానికి సత్తయే (ఉనికియే) లేదో, అట్టి దానికి మీరు వివశులు కావటం చాలా విచిత్రంగా ఉన్నది సుమా! ఓ రామా! కళ్ళలో ఉండే ఏదో దోషం చేత ఆ కళ్ళకు ఆకాశంలో వెంట్రుకలవంటి ఆకారాలు కనిపిస్తాయి చూచావా? అట్లాగే కాకతాళీయంగా భ్రాంతిచే తనయొక్క రూపమే తనయందు – భ్రమయందు "అహంభావము"గా భాసించుచున్నది. (స్వమేవ రూపం దృక్ భ్రాన్త్యా కేశోణ్డకమివ అంబరే).

అయితే... "అంతా బ్రహ్మమే" అయి ఉండగా ఇక అందులో "ఇది అహంకారము. అది జగత్తు" అనబడు విభాగములు ఎక్కడుంటాయి? అట్టి జగత్తు ఉత్పత్తి పొందటం, నశించటం మొదలైనవి మాత్రం ఎట్లా ఉంటాయి? కాబట్టి ఇక సంతోషించేందుకుగాని, దుఃఖించేందుకు గాని విషయమేమి? ఆశ్రయమేమి?

❖

ఓ రామచంద్రా! పరమాత్మ సర్వేశ్వరుడు, సర్వ శక్తిమంతుడు అయి ఉన్నాడు. అందుచేత ఆ పరమాత్మ యొక్క స్మరణమాత్రం చేత ఈ సమస్త విచిత్ర జగత్తు భాసించుచున్నది. స్మరించక పోయినంత మాత్రం చేత ఈ జగత్తు అనబడేది భాసించదు. కాబట్టి అద్దాని విస్మరణయే జగదతీతత్వం. అట్టి జగదతీతత్వం సిద్ధించు గాక! వాస్తవానికి ఈ 'జగత్తు' అనబడేది కూడా చిద్రూపమే కాబట్టి... "చిదాకాశమగు బ్రహ్మమే స్వప్న సంకల్పరచితమైన పురము వలె కాకతాళీయంగా జగద్రూపంగా భాసిస్తోంది"... అని కూడా సిద్ధాంతీకరించబడుచున్నది. కనుక పరమార్థమున బ్రహ్మం నుండి ఈ జగత్తును విడదీయటం ఎట్లా కుదురుతుంది? కుదరదు.

జలమందు తరంగాలున్నాయి. జలమును, తరంగములను విడదీయగలమా? కొయ్యలో (మనిషిదో-జంతువుదో-దేవతదో) విగ్రహం ఉన్నది. కొయ్య నుండి విగ్రహామును వేఱుచేయ గలమా? విగ్రహం నుండి కొయ్యను వేఱుచేయగలమా! మట్టిచే కుండ తయారవుతోంది. మట్టి లోంచి కుండను వేఱు చేయగలమా?

బ్రహ్మము నందు కూడా అట్లే ఈ సృష్టి ఉన్నది. అట్టి ఈ సృష్టిని బ్రహ్మము నుండి వేఱుచేసి చూడలేం. "అవయవరహితం-నిర్మలం" అగు బ్రహ్మం నందు ఏ జగత్తైతే అనుభూతమౌతుందో, అది కూడా బ్రహ్మమే! ఇక అహంకారం మాట వేఱే చెప్పాలా? అది కూడా బ్రహ్మమే! బ్రహ్మమునకు వేఱుగా అహంకారమును చూడటానికి ప్రయత్నించామా... అది మిథ్యయేనని అనక తప్పదు. జలం వేఱు చేసి చూస్తే తరంగం మిథ్యే కదా! మట్టిని వేరుచేసి చూస్తే కుండ మిథ్యయే కదా!

వాయువు యొక్క 'సత్త'యే చలన వైచిత్ర్యంగా భాసిస్తోంది కదా! అట్లాగే అవిద్యాస్వభావ రహితమై బ్రహ్మం యొక్క 'సత్త' ఉన్నది. ఆ బ్రహ్మము యొక్క సత్తయే అహంభావము - జగత్తు మొదలైన రూపములుగా భాసించుచున్నది. ఆకాశంలో మేఘాలను ఒక ఆకారం అంటూ ఏదీ లేదు కదా! అయితే ఆ మేఘమే వృక్షము - కొండ - గుఱ్ఱము - ఏనుగు మొదలైన ఆకారాలలో కనబడుతూ ఉంటుంది. చూచావా? అట్లాగే, నిరాకారమగు బ్రహ్మమున అహంకారము - జగత్తులతో కూడిన ఈ ప్రపంచ రూపం భాసిస్తోంది. సూక్ష్మమగు మఱ్ఱివిత్తులో మహావృక్షం యొక్క లక్షణములన్నీ దాగి ఉన్నట్లు సూక్ష్మీభూతమగు శివరూపమున ఇదంతా ప్రదర్శితమౌతోంది. పరమాత్మయందు ఈ సృష్టి అంతా కూడా అద్దాని అవయవములవలె వెలయుచున్నది.

ఓ రామచంద్రా! ఈ విధంగా "ఆత్మకంటే భిన్నంగా ఈ జగత్తు సంభవించదు" అని గ్రహించి అంతఃకరణంలో ప్రశాంతుడవై ఉండు. ఉపాధివర్జితుడవై ఆయాసరహితుడవై భ్రమ తొలగినవాడవై ఆకాశమువలె సమత్వము వహించి ఉండు.

న భవన్తో, న చ వయం, న జగన్తి, న ఖాదయః ।
సన్తి శాంతం అశేషేణ బ్రహ్మేదం నిర్భరమ్ స్థితిమ్॥

ఓ సభికులారా! యథార్థానికి మీరు, మేము, జగత్తులు, ఆకాశాదులు ఏవీ లేవు. మరి? సర్వదా శాంతమై పరిపూర్ణమైనట్టి బ్రహ్మం మాత్రమే ఉన్నది. ఇదంతా బ్రహ్మమే అయి ఉన్నది.

ఓ రామచంద్రా! ఈ కనబడే పదార్థములన్నిటికీ కూడా చైతన్యం కంటే భిన్నమైన రూపమును ఎవరూ నిరూపించలేరు. ఈ సమస్త పదార్థముల అవిశేషములే అయి ఉన్నాయి. కనుక విశేషత్వము గురించిన సర్వభ్రమలు త్యజించు. ముముక్షువులంతా మోక్షము కొఱకై "సర్వ విశేష రహితము" – పరమార్థ సత్యము అయినట్టి ఆ చైతన్యమే నేను" అని భావించెదరు గాక!

వేదనం బంధనం విద్ధి, విద్ధి మోక్షమ్ ఆవేదనమ్,
యథాస్థితం యథాచారమ్ భవ శాంతమ్ అవేదనమ్ ॥

"జగత్తు యొక్క స్మరణయే బంధం. జగత్తు యొక్క విస్మరణయే మోక్షం" – అని గ్రహించు. అందుచేత విజ్ఞులు అనుసరించే మార్గం అయినట్టి భూమికలను అభ్యసిస్తూ క్రమంగా జగత్తుయొక్క విస్మరణమును సముపార్జించాలి. ఈ జగత్తును జగత్తుగా కాకుండా శాంతమగు పరబ్రహ్మముగా దర్శించటమే జగత్తును త్యజించటం(జగత్తు విస్మరణ) గాని, మరింకేమీ కాదని కూడా గ్రహించు.

శ్రీరాముడు : స్వామీ! "చైతన్యమే జగత్తుగా, జగత్ పదార్థములుగా అగుచున్నది" అను భావనను అనుసరించమంటారా? అట్టి భావనచే శుద్ధ చైతన్యము ప్రకాశమానమవుతుంది కదా!

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ద్రష్టయే తన రూపముగా కలిగినట్టి ఈ జీవుడు దృశ్యములోని వాడా? కాదు. ఈ దేహము దృశ్యంలో ఉన్నప్పటికీ ద్రష్ట దృశ్యరూపము కానేరడు కదా! అట్లాగే చైతన్యము సర్వదా చైతన్యంగానే ఉంటుందికాని... ఎన్నటికీ చైతన్యం జడమగు విషయరూపత్వం పొందజాలదు. కాబట్టి జగద్రహితమైన శుద్ధ చైతన్యమును విషయభావనచే ఎవడూ ప్రకాశింపజేయజాలడు. ఎవడైనా సరే... తనకు తానై విషయాతీతత్వముచే జగద్రహితశుద్ధ చైతన్యత్వమును స్వానుభవంగా సంతరింపజేసుకోవాలిసిందే.

ఆత్మతోటి స్థితిని పొందియుండుటకు గాను... 1. ద్రష్ట–దృశ్యముల సంబంధము యొక్క అభావముచే జాగ్రత్తునందే సుషుప్తునివలె ఉండగలగటం; 2. శరత్కాలాకాశంలాగా నిర్మలత్వం – విషయశూన్యత్వం సంపాదించుకోగలగటం; 3. సర్వత్రా ప్రసరించియున్న తన ఆత్మతత్త్వమును గమనించగలగటం... అనునవి సముపార్జించు కోవాలి.

వాయువు అనేక వాయుతరంగాలుగా చలిస్తున్నప్పటికీ వాయువు సర్వదా ఏకమేగాని అనేకం కాదు కదా! "తరంగాలు వేఱువేఱు కాబట్టి ఆ వాయువు వేఱు. ఈ వాయువు వేఱు"... అని అనుకోవటం అవిజ్ఞత చేతనే కదా! అట్లాగే ఏకము–చిద్రూపము అగు బ్రహ్మమున అజ్ఞానం చేత భేదమే దర్శించబడుతోంది. తన చిత్స్వరూపమును ఏమరచిన సందర్భంలో "జీవుడు – జగత్తు" మొదలుగా గల భేదదర్శనమే "సృష్టి". వాని ఐక్యజ్ఞానమే 'మోక్షము'.

వాయువు అంతటా ఉన్నప్పటికీ అది ఎక్కడ సంచలనము ప్రదర్శిస్తుందో అక్కడ ఆయా క్రియా విశేషాలు ప్రకటితమౌతూ ఉంటాయి. కదా! (ఉదా: వాయు చలనముచే ఆకులు కదలటం, దేహంలో ప్రాణాపానాది క్రియలు మొదలైనవి). అట్లాగే 'బ్రహ్మము' అనే వాయువునందు ఎచ్చట "చిత్ యొక్క జగత్ రూప స్పందము" ఉన్నదో... అచ్చటనే సృష్టి ప్రదర్శితమౌతోంది. అట్టి చిత్

స్పందము లేనప్పుడు 'నిర్వాణము' అని చెప్పబడుతోంది. ఒక విత్తు (బీజము) తనయొక్క నిజరూపముననే పల్లవము (కొమ్మలు, ఆకులు, పళ్ళు మొదలైన) రూపంగా దర్శిస్తోంది. అట్లాగే మహాచైతన్యము కూడా తనయొక్క అభ్యంతరమును సృష్టిరూపంగా తనకు తానే ఎఱుగుచున్నది. బీజమే (బీజాంతర్గమైన బీజసత్తుయే) ఆ తదనందరం ఒకానొకచోట "ఆకులు" అను అనుభవంచే "ఆకులు"గా స్థితినొందినట్లు మహాచైతన్యము తనయొక్క "సృష్టి" అనబడు స్వీయకల్పనచే సృష్టిరూపంగా అగుచున్నది. బీజము యొక్క వృక్షరూపమునందు 1. ఉత్పత్తి, 2.స్థితి. 3.వృద్ధి, 4. అపక్షయము, 5.వినాశనము, 6.లయము అనబడే షడ్వికారాలు పొందుచున్నట్లే చైతన్యము యొక్క "వివర్తరూపము" అగు సృష్టియందుకూడా షడ్వికారాలు భాసిస్తున్నాయి. బీజము నందలి చైతన్యమే వృక్షమునందు కూడా ఉన్నట్లు సమస్త సృష్టి కూడా చిద్రూపము, చిన్మయము అయి ఉన్నది.

❖

ఓ రామచంద్రా! ఈ జగత్తంతా కూడా నిర్వికారమైనట్టి పరబ్రహ్మమే అయి ఉన్నదయ్యా! అందుచేత నీవు ఇదంతా నిర్వికారంగాను, ఆద్యంతరహితంగాను, నిరామయంగాను గ్రహించు. అయితే ద్వైతాద్వైత వికారాలతో కూడిన ఈ జగత్తు 'సంకల్పంలో నిర్మించబడిన నగరం'లాగా నిజ సంకల్పం యొక్క "అభావం"చే నశిస్తోంది. జగదుత్పత్తి, వినాశాలు అనగా ఇంత మాత్రమే!

ఆకాశం శూన్యమాత్రమై ఉన్నది కదా! అయితే... "ఆకాశమునకు, శూన్యత్వమునకు భేదం ఏదైతే అనిపిస్తోందో... అది మిథ్య మాత్రమే" - అని గ్రహించెదవుగాక! ఈ జగదనుభవమునకు ముందుగానే బ్రహ్మం సర్వదా సిద్ధించి ఉంది. అట్టి పూర్వసిద్ధమగు చిద్రూపం, శాంతం అగు బ్రహ్మ సత్తయే అజ్ఞానం చేత "నేను మనుష్యుడను" అను భావన వలన స్వయంగా అహంకారరూపం గాను, జగత్తు రూపంగాను స్థితినొంది ఉంటోంది. "జలంలో తరంగం జనిస్తోంది" అనే వాక్యం అపరిపూర్ణ వాక్యం. ఎందుకంటే, జలమే తరంగంగా కనిపిస్తూ కూడా జలం జలంగానే ఉంటుంది కదా! అదే విధంగా బ్రహ్మంలో ఈ జగత్తు జనిస్తున్నట్లున్నప్పటికీ జగత్తు అనబడేది జనించుటయే లేదని సుతీక్షణమైనబుద్ధితో గ్రహించు. అనగా జగత్తు జనించుటయూ లేదు, నశించుటయూ లేదు. జగత్తుగా కనిపిస్తున్నదంతా బ్రహ్మమే! బ్రహ్మమును గురించి ఎఱిగినవారికి ఇదంతా జగత్తుగా కనిపిస్తూనే బ్రహ్మంగా అనిపిస్తోంది.

వృక్షమే తన శాఖలు మొదలై అవయవాలలో స్థితిపొంది ఉన్నట్లు; ఆకాశమే ఆకాశమునందు ఉన్నట్లు; జలమే జల తరంగాలలో కూడా ఉన్నట్లు... బ్రహ్మము అటు నిర్వికార - నిర్విషయ బ్రహ్మరూపముగాను, ఇటు పదార్థ రూపంగాను కూడా స్ఫురిస్తూ వాస్తవానికి తన స్వరూపమునందు అవికార రూపముగా స్థితి కలిగియున్నది.

శ్రీరాముడు : మహాత్మా! బ్రహ్మమే అటు బ్రహ్మసత్తగా, ఇటు జగత్తుగా కూడా అనుభవ మగుచున్నదను వాక్యం యుక్తియుక్తమే! అయితే అనేక భేదములతో కూడిన జగద్దర్శనమునందు అభ్యాసపరులమై ఉన్న మేము బ్రహ్మమును ఉపాసించటం ఎట్లాగో చెప్ప ప్రార్థన.

శ్రీవసిష్ఠ మహర్షి :

నిమేషాత్ అర్ధభాగేన దేశాత్ దేశాన్తర స్థితౌ ।
యత్‌రూపం సంవిదో మధ్యే స స్వభావ ఉపాశ్యతామ్ ॥

ఓ రామచంద్రా! నీయొక్క జ్ఞానసత్త ఒక ప్రదేశమున ప్రవేశించి, ఇంతలోనే అర నిమిష కాలంలో ఆ ప్రదేశమును వదలి మరొక ప్రదేశమును ఆశ్రయిస్తోంది కదా! ఆ రెండింటి యొక్క మధ్యలో (ఒక విషయజ్ఞానము-మరొక విషయ జ్ఞానముల మధ్యలో) ఏమున్నది? నీ "జ్ఞానసత్త" ఆ ఉభయముల మధ్యలో నిర్విషయజ్ఞాన రూపంగా ఉన్నది కదా!

అట్టి నిర్విషయ జ్ఞానసత్తను ఉపాసించు. నీవు ఒక విషయము గురించి ఆలోచన చేస్తూ, ఇంతలోనే ఆ విషయమును వదలి మరొక విషయమును గురించి ఆలోచన చేయటం జరుగుచున్నది కదా! ఇట్టిదే జీవులందరి అనుభవం కూడా! ఇప్పుడు ఆ రెండు విషయముల మధ్య నిర్విషయమగు 'ప్రజ్ఞాసత్త' ఉన్నది. అట్టి ఆలోచనరహితమగు నిర్మల, నిర్విషయ ప్రజ్ఞాసత్తను ఆశ్రయించి ఉండు.

నీవు "భూమండలము"ను త్యజించి "సూర్య మండలము"ను ఆశ్రయిస్తున్నప్పుడు ఆ రెండింటి మధ్య (ఒకదానిని వదలిన తరువాత, రెండవ దానిని ఇంకనూ ఆశ్రయించనప్పటి) వేంచేసియున్న నిర్విషయజ్ఞాన సత్తను ఉపాసించు.

సంక్షుబ్ధమ్ అక్షుబ్ధమ్ ఇతి ద్విరూపం సంవిత్‌స్వరూపం ప్రవదంతి సన్తః ।
శ్రేయః పరం యేన సమీహసే త్వం తదేకనిష్ఠో భవ! మా అమతిర్భూః ॥

ఓ రామచంద్రా! మహనీయులగు ఆత్మజ్ఞులు చైతన్యము గురించి ప్రవచించేటప్పుడు రెండు మార్గాలుగా బోధిస్తున్నారు.

1. వివర్త రూప చైతన్యం : అజ్ఞానులకు అనుభవమగుచున్న ఈ సంక్షుబ్ధ సహిత జగత్తంతా వాస్తవానికి ఏకము, అద్వితీయము అగు చైతన్యమే! కనుక ఈ జగత్తును చైతన్యముగా, బ్రహ్మముగా ఆరాధన చేయటం.

2. నిర్విషయ చైతన్యం : చైతన్యము సర్వదా ఏకరూపమై, వివర్తరహితమై, అక్షుబ్ధమై పూర్ణానందైక రసరూపమై ఉన్నది. అయ్యది జగద్రహితం అనగా...

1. ఈ సంక్షుబ్ధ జగత్తే చైతన్యం; 2. చైతన్యం సర్వదా జగద్రహితం... ఈ రెండు మార్గాలలో ఏ ఉపాసన నీకు సానుకూలంగా అనిపిస్తే దానిని ఆశ్రయించు.

అయితే! భేదము, ఏకము ...అనబడే రెండింటిలో భేదము భ్రమ ఏకము వాస్తవము.

ఇది గ్రహించి ఉపాసన కొనసాగించు. అంతేగాని, గుడ్డి ఎద్దు చేలోపడ్డట్లు ఏ మార్గము ఎటు త్రోవతీస్తుందో గ్రహించకుండా అవివేకివై ఉండకు.

❖❖❖

17. ప్రపంచసహిత - ప్రపంచరహిత అఖండైక్య దృష్టి

శ్రీరాముడు : స్వామీ! "చైతన్యోపాసన" అనే విషయంలో "నిర్విషయ పరమాత్మను ఉపాసించటం" గురించి మరికొన్ని విషయాలు సాధక జనుల సుస్పష్టత కొరకై ప్రవచించండి.

శ్రీవసిష్ఠ మహర్షి : పరమాత్మ యొక్క ఉపాసన ఉపక్రమించే ముందు పరమాత్మ యొక్క స్వరూపం ఏమిటో సుస్పష్టం చేసుకోవాలికదా! ఏతద్విషంలో మరల మరికొన్ని దృష్ట్యాంతపూర్వకమైన విశేషాలు చెబుతాను విను.

దేశద్దేశాన్తరం దూరం ప్రాప్తాయాః సంవిదః క్షణాత్
యద్రూపమమలం మధ్యే పరం తద్రూపమాత్మనః ॥

ఓ రామచంద్రా! నీయొక్క "చూపు" క్షణకాలంలో ఒక వస్తువును చూస్తూ, ఇంతలోనే క్షణ కాలంలో ఆ వస్తువు నుండి మరల్చబడి దూరంగా ఉన్న మరొక వస్తువుపై ప్రసరించినదనుకో! ఆ నేత్రేంద్రియం ద్వారా ప్రయాణించిన నీ చూపుకు సంబంధించిన జ్ఞానం సమీపంలోని ఒక జ్ఞేయాన్ని (చూడబడి-తెలియబడుచున్న వస్తువును) వదలి మరొక జ్ఞేయాన్ని ఆశ్రయించటం జరుగుచున్నది. వదలిన - స్వీకరించబడిన వస్తువుల జ్ఞానమునకు మధ్యగా (దగ్గిర వస్తువును చూడటం మానివేసిన తరువాత దూరవస్తువును ఇంకా నీ చూపు గ్రహించక ముందు)... నిర్విషయ నేత్ర జ్ఞాన సత్త ఉన్నది. అది అత్యంత స్వల్పకాలమే ఉంటోంది. అయితే, అట్టి నిర్విషయ చిద్రూపమునే జ్ఞప్తియందు ఉంచుకుంటూ, అద్దానియందే నిత్యమూ తన్మయుడవై ఉండుము.

ఇక ఆయా వ్యవహారములంటావా? నీ యొక్క వర్తమాన (దేహ సంబంధమైన) స్థితిగతులను అనుసరించి ఆయా స్వకులాచారాలను నిర్వర్తిస్తూనే "ఆ నిరాభాస-నిర్విషయ-చిద్రూపమే నేను" అని మననం చేస్తూ అట్టి వాసనా వర్జితమైనట్టి చిద్రూపమునందు నిశ్చలుడవై ఉండుము. అద్దాని నుండి ఎన్నటికీ చలించనేవద్దు.

విద్య-అవిద్యల భేదమేమిటో గ్రహించు. ఏదైతే విచారణ చేసి చూచినప్పుడు లభించదో అదియే అవిద్య. విచారణ చేసి చూస్తే అంతిమంగా చెక్కు చెదరక లభించేదే పరవిద్య. అవిద్య లభించేదే కాదు. విద్య (ఆత్మ)కు అలభ్యమైన క్షణమే లేదు. ఇక చిత్తు, చేద్యములకు, అనగా... "తెలుసుకునేది, తెలియబడేది" అనబడే రెండింటికి భేదమెక్కడున్నది? ఈ జీవుడు స్వయముగా - తనకు తానే స్వతహాగా ప్రకాశరూపమైయున్నాడు. ఆతనిచే ఏది ప్రకాశించబడుచున్నదో అదియే 'ప్రకాశ్యకము' అగు జగత్తు. అంతకు మించి జగత్తుకు ఉనికి గాని, నిర్వచనముగాని, వాస్తవానికి లేదు. చైతన్యము దర్శించే భేద - అభేదములన్నీ ఈ చైతన్యము యొక్క ప్రకాశమాత్రములే! కనుక చిత్‌కు చేత్యమునకు (లేక, ద్రష్టకు - దృశ్యమునకు) భేదము లేదు. బ్రహ్మము సత్యము. జగత్తు మిథ్య. అట్టి మిథ్యాత్వము తొలగిస్తే శాంతము - నిర్వషయము అయినట్టి చిన్మాత్ర స్థితియే సర్వకాల - సర్వావస్థలయందు శేషించియున్నదగుచున్నది.

బ్రహ్మము - జగత్తు ఒక్కటే : బ్రహ్మమయం జగత్ - పరమార్థమున బ్రహ్మము, జగత్తు ఒక్కటే! కాని అజ్ఞానము చేత.... బ్రహ్మము ఏకమే అయినప్పటికీ, అనేకంగాను; పూర్ణమే అయినప్పటికీ అపూర్ణంగాను; శుద్ధమే అయినప్పటికీ అశుద్ధంగాను; అశూన్యమైనప్పటికీ శూన్యంగాను; పదార్థ రహితమైనప్పటికీ పదార్థసహితంగాను; పరిచ్ఛిన్నరహితమైనప్పటికీ, దేశకాలములచే పరిచ్ఛిన్న మైనట్లు; రూపరహితమైనప్పటికీ దేశ కాలాది రూపసహితమైనట్లు; వికారరహితమైనప్పటికీ వికారవంతంగాను; సమము, శాంతము అయినప్పటికీ అసమము, అశాంతముగాను; 'సత్తు' అయినప్పటికీ దృశ్యముకానందు వలన అసత్తుగాను; నిర్విభాగమైనప్పటికీ భాగసహితంగాను, చిద్రూపమైనప్పటికీ జడంగాను; విషయశూన్యమైనప్పటికీ విషయరూపంగాను; నిరంశమైనప్పటికీ అంశయుక్తంగాను; అహంకార రహితమైనప్పటికీ అహంకార సదృశంగాను; నాశరహితమైనప్పటికీ నాశవంతంగాను; కళంకవర్జితమైనప్పటికీ కళంకయుక్తంగాను; విషయవర్జితమైనప్పటికీ విషయ సహితంగాను; స్వయంప్రకాశమైనప్పటికీ పరప్రకాశభూతములగు అహంకారాదులవలెనూ; పురాతనమైనప్పటికీ నూతనంగాను; పరమాణువు కంటే కూడా సూక్ష్మమైనప్పటికీ తన ఉదరము నందు బ్రహ్మాండములు ధరించినదిగాను; సర్వరసమైనప్పటికీ వైరాగ్యాది ఉపాసనలచే దృశ్యమును త్యజించినదిగాను; ప్రపంచరహితమైనప్పటికీ ప్రపంచపూర్ణమైనదానివలెను; అద్వితీయ మైనప్పటికీ అనేక రూపాలతో ఉన్నట్లు గాను; మాయారహితమైనప్పటికీ మాయా కిరణములు బయలుదేరుచున్న సూర్యబింబమువలెను; శుద్ధజ్ఞానమాత్రమైనప్పటికీ అన్నిటినీ ఎఱుగుచూ ఉండేదిగాను; 'జగత్తులు' అనే రత్నములు గల మహాకోశము (గని) అయినప్పటికీ, 'వివేకము' అనే తక్కెడలో తూచినప్పుడు లవలేశము కంటే కూడా లఘువైనది గాను; దృష్టికి గోచరం కానిదైనప్పటికీ, కిరణ సమూహపు చంద్రునివలె సుస్పష్టంగా కనబడుచున్నట్లే అనిపించేది గాను; దేశకాలములచే అనంతమైనప్పటికీ, ఆయా దేశకాలముల రూపం సంతరించుకొనుచున్నట్లుగానూ; శూన్యస్థానమందు ఉన్నప్పటికీ వన పర్వతాదులను నిర్మించటంలో తత్పరమైయున్నది గాను... (బ్రహ్మము)... అగుచున్నది.

❖

బ్రహ్మము సూక్ష్మతరవస్తువుకంటే సూక్ష్మతరమైనది. స్థూలవస్తువులన్నిటికంటే స్థూలమైనది. గురుతర వస్తువులన్నిటికంటే గురుతరమైనది. శ్రేష్ఠ వస్తువులన్నిటికంటే శ్రేష్ఠతమమై వెలయుచున్నది.

అకర్తృ కర్మకరణమ్, అకారణమ్, అకారకమ్
అన్తః శూన్యతయైవై తచ్చిరాయ పరిపూరితమ్ ॥

బ్రహ్మము కర్త–కర్మ–కారణరహితమైనది. అది దేనికీ కారకము కాదు. అంతఃశూన్యము అయినప్పటికీ కూడా చిరకాలంగా కర్తృ–కర్మాదులచే పూర్ణమైయున్నట్లు తోచుచున్నది. అది 'జగత్తులు' అనే రత్నములకు పేటిక. కాని ఆకాశమువలె మహాకోమలము, సర్వ పదార్థరహితము. ప్రత్యేక వస్తు–కాలరూపంగా ప్రకాశించేదంతా అదే! పురాతనమై ఉండి కూడా నిత్యనూతనం. స్వప్రకాశరూపమై కూడా అజ్ఞానదృష్టికి అది అంధకారమే! ప్రకాశరూపమై సర్వదా అంతటా వ్యాపించి ఉంటూ కూడా ఈ జగత్తుల తిరోధాన స్థానం అదే!

బ్రహ్మము సర్వదా సాక్షిరూపమున ప్రత్యక్షమయ్యే ఉన్నది. కాని నేత్రములకు దుర్లక్ష్యమగుచున్నది. సాక్షిగా పరోక్షమైనా, ప్రత్యక్షంగా ఎదురుగానే ఉన్నది. చిద్రూపమై కూడా జడజగత్తుగా భాసిస్తున్నదంతా అదే!

అది సదా శుద్ధ చిన్మాత్రమే! - అహంభావ రహితంగా ఉండి కూడా అహంభావ రూపంగా భాసించేది అదే! పైగా, అది ద్రష్టకు అన్యమైనదిగా ఒప్పుచున్నట్లు అనిపించినా... ఆత్మరూపమే అది! ద్రష్ట యొక్క రూపమే అది! ఆ పూర్ణ చిద్రూప మహాసముద్రంలో ఈ మూడు లోకములు ద్రవరూప సముద్ర తరంగాలుగా వెలయుచున్నాయి.

మంచు తనయందు తెలుపుదనాన్ని ధరించుచున్నట్లు ఆ చైతన్యం తనలో సృష్టిని ధరిస్తోంది. అయితే మంచువలననే తెలుపుదనం భాసించటం జరుగుతోంది కదా! అట్లాగే చైతన్యము వలననే ఈ 'సృష్టి' అనబడేది భాసిస్తోంది. జలమునకు ఆకారం అంటూ ఏదీ లేకపోయినప్పటికీ ఆ జలమే ఆకార సహితమైన తరంగములను విస్తరింపజేస్తోంది. అట్లాగే దేశకాలాది అవయవరహితుడైన ఈ చిద్రూపభగవానుడు దివారాత్రములతోకూడిన ఈ అసలైన జగత్తును విస్తరింపజేస్తూ వెలయుచున్నాడు. 'చిదాకాశము' అనే మహారణ్యంలో పంచభూతములు అనే అనేక రంగుల కలయికతో 'జగత్తులు' అనే పురాతనమైన లతలు వికసిస్తున్నాయి.

❖

చిద్రూపుడగు పరమాత్మ యొక్క స్వప్రతిబింబమే ఈ జీవ-జగద్రూపం. ఆయన తన ప్రతిబింబమగు ఈ జీవ జగద్రూపములను తనకు అన్యమైన ఆకారంగా దర్శించు ఇచ్ఛయే ఈ దృశ్యాదులు. ఆతడు స్వస్వరూపదర్శనేచ్ఛచే స్వస్వరూపమును, అన్యదర్శనేచ్ఛచే దర్పణ ప్రతిబింబ రూప అహం-జగదాదులను పొందుచున్నాడు. బ్రహ్మచైతన్యం సర్వదా అపరిచ్ఛిన్నము. ఆ చైతన్యము ఆకాశంలో వృక్షంలాగా మిథ్యయగు తనయొక్క కల్పనా రూపమే అనతగిన స్వేచ్ఛా కల్పిత బ్రహ్మాండాదులను, త్రైలోక్యములను దర్శిస్తున్నది. ఈ సూర్యచంద్రాదులు, నేత్రాలు, మొదలైనవన్నీ అద్దానికి ఉపకరణ మాత్రములై ప్రవర్తిస్తున్నాయి.

ఆ పరమాత్మయే... అభ్యంతరమున వాసనామయ ప్రపంచంగాను, బాహ్యమున భువన రూప ప్రపంచంగాను, స్వప్నమున భావరూప ప్రపంచంగాను, సుషుప్తియందు ఏకమైన అవిద్యా రూపంగాను, ఆవిర్భావ, తిరోభావ రూపభావకుడుగానూ... ఉంటున్నాడు.

స్వయంగా అంతర్-బాహ్యములందు ఆయా బహువిధ విశేషములతో ప్రకాశిస్తున్నాడు. ఆతనికి అన్యంగా అణుమాత్రం కూడా ఎక్కడా ఏదీ లేదు.

ముఖం అనే బిలంతో జిహ్వ అనేక చమత్కారాలు నిర్వర్తిస్తోంది చూచావా? అట్లాగే చిదాత్మయందు చైతన్యం యొక్క ఇచ్ఛచే చిద్రూపాలే అగు ఆయా పదార్థములన్నీ చమత్కారాలు చేస్తున్నాయి.

చైతన్యము యొక్క సంవిత్తే (జ్ఞానమే) "అనుభవము" అనే తన యొక్క అంగములచే రూప రసాదులను జగత్తుగా ఆస్వాదిస్తోంది. అట్టి 'లోకములు' అనే 'అనుభవ రూప ఆస్వాదములు' అనే తరంగములచే ఈ ద్రవత్వ జగత్తు ఏర్పడుతోంది.

ఓ రామచంద్రా! ఈ సూర్యచంద్రాద్రి ప్రకాశమానములు, తదితర రూపాది పదార్థములు – ఇవన్నీ చిద్రూపమునందే ప్రకాశిస్తున్నాయి. అంతేకాదు. సమస్త ప్రళయములు అట్టి చిద్రూపము నందే లయిస్తున్నాయి. ఈ జాగ్రత్ – స్వప్నాదులన్నీ ఉద్భవించేది – లయించేది ఆ చిద్రూపము నుండే. ఈ జీవుడు చిద్రూపస్వభావుడే కాని దేహాత్మస్వభావుడు కానేకాదు. తెలుపుదనం మంచునందే ఉన్నట్లుగా ఆ చిద్రూప బ్రహ్మమునందే జగత్తంతా కలదు. కాబట్టి ఈ జగత్తు బ్రహ్మమే అయి ఉన్నది. ఎందుకంటే బ్రహ్మము నుండే ఈ సమస్తము వెలువడుచున్నది.

చైతన్యము అవయవరహితము, రంగుచే చిత్రము లిఖించబడునట్లు 'చైతన్యము' అనే రంగుచే ఈ 'జగత్తు' అనే చిత్రము లిఖించబడి ఉన్నది. కాబట్టి ఈ జగత్తును నీవు జన్మాదివికార రహితమైనది గాను, శాంతము – చిన్మయముగాను ఎరుగుము. 'చిద్రూపము' అనే ఒక మహావృక్షము నుండి (కొమ్మలు–ఆకులు వలె) ఈ దృశ్యరూప శాఖలు విస్తరించి ఉన్నాయి. 'బ్రహ్మము' అనే నిశ్చల పర్వతముపై చంచలజలము వంటి ఈ దృశ్య సమూహములన్నీ బయల్వెడలుచున్నాయి.

జగన్నాటకం - 'చిదాకాశము' అనే ఒక గొప్ప నాటకరంగంలో 'జగద్రచన' అనే భ్రమాత్మక మైన అభినయమంతా అత్యంత చమత్కారంగా విరాజిల్లుతోంది. 'నియతి' అనే ఒకానొక నర్తకి అనేక కార్యారంభములతో కూడినదై ఆ నాటకరంగముపై నృత్యం చేస్తోంది. కన్నుమూసి–తెరిచే లోపల అనేక బ్రహ్మాండముల ఉత్పత్తి– వినాశములు జరిగిపోతున్నాయి. 'కాలము' అనే బాలకుడు 'బ్రహ్మము' అనే మండపముపై మరల–మరల నాట్యం చేస్తూ ఇంతలోనే ఉపసంహరిస్తూ, మరల ఏతెంచుచూ ఉన్నాడు.

❖

అద్దంలో అనేక ప్రతిబింబములు ఉదయించి, ఉపసంహరణమయినంత మాత్రం చేత ఆ అద్దం ఏదైనా వికారం పొందుతోందా? లేనేలేదు. అట్లాగే ఈ అనేక బ్రహ్మాండాలు ఉత్పన్నమగుచు – నశించుచున్నప్పటికీ బ్రహ్మము సర్వదా వికార రహితంగాను, శాంతంగాను ఉంటూనే ఉన్నది.

ఈ కనబడే స్థూలపంచభూతములకు కారణమేమిటి? సూక్ష్మపంచభూతములు కదా! ఘనము–ద్రవము–వాయువు... ఇవన్నీ ఒకే సూక్ష్మ పదార్థము యొక్క వివిధ రూపాలు అని అనక తప్పదు. ఉదాహరణకు ఒకానొక సూక్ష్మపదార్థమే మంచు–జలము–నీటి ఆవిరి అను స్థితులను ఉష్ణోగ్రత యొక్క అల్ప–ఆధిక్యతల ననుసరించి పొందుతోంది. అట్లాగే తాను కారణరహిత మైనప్పటికీ చిన్మాత్రమగు బ్రహ్మము– భూత వర్తమాన–భవిష్యత్ సృష్టులన్నిటికీ కారణబీజమై ఒప్పుచున్నది. ఆ బ్రహ్మం యొక్క విస్తరణయే ఈ జగత్తు అట్టి విస్తరణ యొక్క అభావమే ప్రళయం. కానీ ఈ సృష్టి – స్థితి – లయములనబడే – మూడు విధములైన స్థితులందు బ్రహ్మము సమముగా తన స్వరూపమునందే స్థితినొందియున్నది.

ఓ రామచంద్రా! వాయువు యొక్క చలనములన్నీ వాయురూపములే కదా! సృష్టి ప్రళయ – జనన – మరణ – హాని – వృద్ధి ఆదిగాగల దశలతో కూడిన ఈ మహా మహా బ్రహ్మాండములన్నీ ఆ అపరిచ్ఛిన్నములగు చిదాకాశమునందే ఉత్పన్నమవుతున్నాయి. అయినా కూడా చిదాకాశంలో

తత్ వ్యతిరేకము, అన్యము అయినదేదీ ఉత్పన్నమగుటయే లేదు. బ్రహ్మమునందు సర్వదా బ్రహ్మమే సర్వతత్వస్వరూపమై ప్రదర్శితమగుచున్నది. ఈ జగత్తులన్నీ చిదాకాశము యొక్క రూపములేనని ఎఱిగి సశాంతుడవై ఉండుము.

❖❖❖

18. ఇచ్ఛా జాడ్యం

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! అసలీ సంసార చమత్కారమంతా ఎట్లా ఏర్పడుచున్నదో ఎట్లా రూపుదిద్దుకొనుచున్నదో చెపుతాను, విను–

తటాకంలోని జలం నిశ్చలంగా, శాంతముగా ఉన్నప్పుడు అంతటా ఒకే జలం ప్రశాంతంగా కనిపిస్తుంది. ఇంతలోనే అందులో అనేక తరంగములు కనబడగానే పొడవైన, పొట్టి అయిన, చిన్న పెద్ద, ఆదిగా గల అనేక తరంగాలు, ఒక తరంగానికి – మరొక తరంగానికి భేదాలు మొదలైనవన్నీ అగుపిస్తున్నాయి. ఆ తరువాత కొన్ని తరంగాలు సుందరంగాను, మరికొన్ని వంకర–టింకరగా (అస్తవ్యస్తంగాను) కూడా కనిపిస్తున్నాయి.

అట్లాగే అంతా బ్రహ్మమే అయి ఉండగా, అట్టి యథాతథత్వం కొనసాగుచూనే... క్రమంగా అద్దానిలో అనేక పదార్థములతో కూడిన 'జగత్తు' అనబడునది అగుపిస్తోంది. మరికొంత క్రమంచేత అద్దానిలో రాగద్వేషం, సుఖదుఃఖాది అనేక అనర్థాలన్నీ ఘనీభూతమై ప్రాప్తిస్తున్నాయి. తరంగాలన్నీ జలమే అయినట్లు, సర్వజీవ జడాదులన్నీ కూడా యథార్థానికి ఏకమగు బ్రహ్మమే స్వభావంగా కలిగి ఉన్నాయి. ఆ బ్రహ్మసత్త సర్వ పదార్థాలలో వ్యాపించి ఉన్నదై (కానీ) సర్వ నామరూపాలకు వేరై – కేవలం జ్ఞేయమై ఉన్నది. అనగా తెలుసుకొనేది తెలియబడేది అనే రెండూ అదే! అది సన్మాత్రరూపమై, చిదాకాశస్వరూపమై ఉన్నది. ఈ జగత్తు పట్ల ధ్యాస (భేద దర్శనమనే ధ్యాస) తొలగగా అట్టి సమాధి రూపమగు ఉపశమునందే ఈ సమస్త విశ్వం (జలంలో తరంగాలులాగా) ఏర్పడి ఉన్నది.

శ్రీరాముడు : ఈ జగత్తంతా ఏకరూపమగు బ్రహ్మమే అయినప్పటికీ... ఎందుకో అనేక భేదములు, తద్వారా ప్రాప్తిస్తున్న ఆయా సుఖ దుఃఖాదులు ఈ జీవుని వెంటబడి బాధిస్తూనే ఉన్నాయనునది కూడా మనం గమనిస్తున్నాం కదా?

శ్రీవసిష్ఠ మహర్షి : చీకట్లో గాలికి కదిలే చెట్లను చూస్తే ఒక బాలుని చింతనలో అనేక పిశాచాది రూపాలన్నీ కనిపించవచ్చు గాక. ఒక ప్రౌఢునికి అక్కడ చెట్లే స్ఫురిస్తాయి కాని, పిశాచాదులు స్ఫురించవు కదా! చిదాకాశంలో కల్పించబడిన ఈ జగత్తు విజ్ఞుల దృష్టికి మాత్రం చిదాకాశానికి అనన్యంగానే కనిపిస్తోంది. అజ్ఞుల చిత్తమునకు సత్యమని తోచే ఈ జగత్తు విజ్ఞులకు (చిదాకాశానికి వేరైనదంతా) స్వకీయకల్పనా మాత్రమని తెలియవస్తోంది. జ్ఞానియొక్క దృష్టియందు ఈ జగత్తు... శిలయందు చెక్కబడిన శిల్ప సంబంధమైన 'సైన్యం' మొదలైన చాతుర్యం వలె మాత్రమే కనిపిస్తోంది. ఈ అనేకంగా కనిపించేదంతా జ్ఞానికి ఏకంగాను, ఆత్మస్వరూపంగాను అనిపిస్తోంది. ఇదంతా

కూడా బాహ్యమున ప్రకాశరహితమై, అభ్యంతర సంబంధమైన కుసంకల్పాది మానసిక చేష్టా రహితమై శిల్పకళా రచనవలె అగుపిస్తోంది. ఇది ఇట్లుండగా ఇక జ్ఞాని దృష్టియందు విశ్వత్వం ఎచ్చట? అజ్ఞానికి మాత్రం ఇదంతా సంకల్పాదియుక్తమై భాసిస్తోంది.

కాస్త విచారణ చేసి చూస్తే... ఇక్కడ కనిపించే బాహ్య-అభ్యంతరములైనట్టి రూప ప్రకాశ-సంకల్పాదులన్నీ కూడా... వాటి సారం చిన్మాత్రమే అయి ఉన్నది. ఎందుకంటే చిన్మాత్రం కంటే భిన్నంగా జీవుడు-మనస్సు మొదలైనవి లభించే వస్తువులు కావు. బంగారానికి భిన్నంగా ఆభరణ మెక్కడ? కాబట్టి ఇక ప్రపంచమనేది ఎక్కడ? సంసారము ఎవరికి? ఓ రామచంద్రా! మరింత క్రోడికరించి ఒక సిద్ధాంతం రూపంగా ప్రతిపాదిస్తున్నాను... విను.

ఇదం జగత్ బ్రహ్మమేవ - సిద్ధాంతం - జ్ఞాతకు – ఈ జగత్తును జగత్తుగా (అనేక భేదములుగా) పొందటమే "జగద్భ్రాంతి" అయి ఉన్నది. అట్లు ఎఱుగకుండుటయే (ఈ జగత్తంతా ఏకరూప బ్రహ్మముగా ఎఱుగుటయే) సర్వభ్రమ ఉపశాంతి.

అనగా, ఈ జగత్తు యొక్క స్మరణం అనేది నీ ఆధీనంలోనే ఉన్నది కదా! ఈ విధంగానే బంధం, మోక్షం నీ ఆధీనంలోనే ఉన్నాయని గ్రహించు. వ్యాపకమగు చిదాకాశం అంతటా ఏర్పడి ఉన్న 'పరమాకాశ రూపమే' అయి ఉండగా, అందులో 'పరివర్తనం' అనేది ఎట్లా సంభవం? సంభవం కాదు. ఆకాశం ఎక్కడున్నా మూర్తివంతం అవుతుందా? కాదు. మూర్తివంతమే కాని దానికి ఉత్పత్తి – వినాశనాలు ఎక్కడుంటాయి? చిన్మయమగు ఈ విశ్వమునకు ఉత్పత్తి-వినాశనము అనబడే స్వభావ వికారత్వమేమీ లేదు. ఇక ఈ కనబడే నామరూపాత్మకమైన వికారమంటావా? విచారణ చేసి చూస్తే ఈ ద్రష్ట-దృశ్యములకు ఆకార-అనుబంధాలు, నామరూపాదులు లేవని తెలియవస్తోంది. చైతన్యమునందు అవన్నీ ఎట్లా (చైతన్యమునకు వేరై) ఉండగలుగుతాయి?

❖

ఈ కనబడే సమస్త ప్రపంచం చిదాకాశమాత్రమే అయి ఉన్నది. అట్టి 'చిత్' (జ్ఞానస్వరూపం) నందు అహంకారాది ఆయా వికారములు ఎన్నడూ లేవు. జ్ఞానమునకు అన్యంగా ఎక్కడా ఏదీ లభించుటయే లేదు.

సర్వం శాంతం శివం శుద్ధం త్వమ్-అహన్తాది విభ్రమమ్ ।
న కించిదపి పశ్యామి వ్యోమజం కాననం యథా ॥

ఆకాశాన్ని చూపించి ఎవడైనా 'అయ్యా! చూడండి! ఆకాశంలో గొప్ప కీకారణ్యం కనిపిస్తోంది"... అని అంటాడనుకో, అది నిజమా? కాదు! అట్లాగే త్వమ్, అహమ్ (నీవు, నేను) మొదలగు రూపములన్నీ సమావేశమైనట్లుగా అనిపించే ఈ సమస్త విభ్రమములన్నీ "శాంతము – శివము – శుద్ధము అయినట్టి బ్రహ్మరూపమే" అయి ఉన్నది. చైతన్యముకంటే వేఱుగా ఎక్కడా ఏదీ లేదు. చైతన్యమునందు 'అహమ్-త్వమ్' అనునవేవీ లేవు. ఓ మిత్రులారా! నాకు బ్రహ్మమే అంతటా కనిపిస్తోంది. అందులో 'నేను-నీవు' అనేవేవీ కించిత్ కూడా కనబడటం లేదు.

ఓ రామచంద్రా! నేను, నా వాక్యములు – ఇవన్నీ కూడా శుద్ధము దృశ్యరహితము అగు చిదాకాశంగానే ఎఱుగుము. ఎందుకంటే నీకు అనుభవమయ్యేదంతా నీయొక్క చిదాకాశరూపము నందే సంస్థితమైయున్నది గాని... ఎక్కడో జడస్వరూపమున కాదు.

పరపదము - "ఇచ్ఛ" అనబడే ఒకానొక భ్రమయే. ఈ జీవుని "పరమపదం" అనబడు ఆత్మ యొక్క స్థితిని అనుభవములోనికి రానీకుండా చేస్తోంది. ఒక శిలయందు చెక్కబడిన మనుజుని వలె, ఒక చిత్రమందు చిత్రించబడిన మనుజునివలె ఎప్పుడైతే అంతరంగము ఇచ్ఛారహిత మౌతుందో... ఆ మరుక్షణం ఈ జీవునికి 'చైతన్యస్థితి' అనబడే పరమపదం స్వయంగా అనుభవ మౌతుంది. ఎవని అవగాహన అయితే ఆయా యథాప్రాప్తములగుచున్న కర్మల పట్ల ఇచ్ఛా, వ్యాకులం అనునవి లేనిదై ఒక కొయ్యబొమ్మవలె ఉండగలుగుతోందో... అట్టి వానిని "విశ్రాంతి చిత్తుడైన జీవన్ముక్తుడు" అని పిలుస్తారు.

జ్ఞాని దృష్టి - జ్ఞానికి ఈ ప్రపంచం, ఇందలి తన–తదితరుల జీవనం... ఇదంతా వెదురునాళం వలె బాహ్య అభ్యంతరాలలో శూన్యంగాను, రసహీనంగాను, వాసనారహితంగాను, పిల్లల ఆటవలె అర్థరహితంగాను తోచుచున్నది. ఎవని హృదయంలో దృశ్య ప్రపంచం కించిత్ కూడా రుచించదో, అదృశ్యమగు 'చిన్మాత్ర బ్రహ్మం' మాత్రమే రుచిస్తుందో... అట్టివాడు మాత్రమే బాహ్య అభ్యంత రాలలో "శాంతి"ని దర్శించగలుగుతారు. అతడు మాత్రమే ఈ సంసారాన్ని దాటివేయ గలుగుతాడు.

ప్రియా ఆత్మబంధువులారా! మీరు 'ప్రారబ్ధకర్మ'ను నశింపజేయటానికి ఉపయోగించే మాటలు మాత్రమే మాట్లాడండి. అన్యశబ్దములను ఉచ్చరించనే వద్దు. క్రమక్రమంగా ఈ దేహాదుల పట్ల అహంకార, మమకారములను త్యజించండి. వాటితో సంబంధరాహిత్యమును ఒనగూర్చుకోండి. వేణువు తనయందు ఇచ్ఛ–అనిచ్ఛ అనేవేవీ లేకుండానే లోకానికి మధుర గానాన్ని వినిపిస్తుంది చూచారా? అట్లాగే మీరు కూడా వాసనారహితులై (ఆ వేణువు వలె) శబ్దములను ఉచ్చరించండి. దేనినైనా ప్రవాహపతితమైన వ్యవహారానుసారంగా స్పృశించవలసివచ్చిందా... అట్లే స్పృశించండి. అయితే క్షోభవర్జితులై, ఇచ్ఛారహితులై, వాసనలనేవేవీ లేకుండా ఆయా యథాప్రాప్తములైన చందమున–మాలాదులను ఈ త్వక్ ఇంద్రియము స్పృశించుగాక.

స్వాద్యన్తాం రసజాలాని విగతేచ్ఛాభయైషణమ్
అపరాగాభిలషణం యథా ప్రాప్తాని దర్వివత్ ॥

ఒక గరిట ఎటువంటి ఇచ్ఛ–భయ–క్రోధాలు లేకుండానే పులుసులో ప్రవేశించి తన విధిని నిర్వర్తిస్తూ ఉంటుంది చూచావా? అట్లాగే ఈ జిహ్వేంద్రియం కూడా ఎటువంటి ఇచ్ఛ–భయ–క్రోధములు లేకుండానే యథాప్రాప్తములైన పదార్థములను అస్వాదించునుగాక!

ఒక చిత్రంలోని మనుజుని కళ్ళు ఎవరిని చూచినప్పటికీ అభిమానరహితంగానూ, వాసనా రహితంగానూ, అమనస్కంగానూ యథాతథంగా ఉంటుంది కదా! అట్లాగే ఈ కళ్లు కూడా వాసనా రహితంగాను నిరభిమానంగాను, అమనస్కంగాను, రాగత్యాగ రహితంగాను యథాప్రాప్తమగుచున్న

ఆయా రూప సమూహములను దర్శించును గాక! అలాగే ఈ ఘ్రాణేంద్రియం ఆయా పుష్పాదుల సుగంధమును 'వనం' త్యజించినట్లు త్యజిస్తూనే పొందునుగాక!

ఈ ప్రకారంగా కర్మేంద్రియ, జ్ఞానేంద్రియ విషయాలలో మనస్సు నిస్సారత్వం సంపాదించుకుని ఉండటమే ముఖ్యమైన ఉపాయం. అట్లా మనస్సుకు పట్టిన 'భోగాలు' అనే రోగాలకు చికిత్స కావించబడకపోతే... ఇక ఈ జీవునికి 'శాంతి' యొక్క వార్త కూడా దరిజేరదు.

ఇచ్ఛాత్యాజ్యం - ఓ సాధక జనులారా! ఈ ఇంద్రియ విషయ భోగములతో కాలం వృథా చేసుకోకండి! 'కాలం' అనే మహత్తరమైన భగవత్ ప్రసాదితమైన ఉత్తమావకాశమును సద్వినియోగపరచుకోవాలే గాని, దుర్వినియోగపరచుకోవటం ఏమాత్రం ఉచితం కాదు సుమా!

యః స్వాదయన్ భోగ విషం రతిమేతి దినేదినే ।
సో అగ్నౌ స్వమూర్తిం జ్వలితే కక్షమక్షయముజ్ఝతి ॥

ఎవడైతే ఇక్కడ 'భోగములు' అనే విషమును ఆస్వాదిస్తూ రోజురోజుకు సంతోషిస్తూ కాలం వెళ్ళబుచ్చుతాడో... అట్టివాడు ప్రజ్వలించుచున్న అగ్నిని తన శరీరముపై ధరించి అద్దానిపై ఎండుగడ్డి పరకలను మరల మరల విసరుకొన్నవాడే అవుతాడు.

అందుచే ఎట్లాగైనాసరే "ఇచ్ఛగించటం" అను మనస్సు యొక్క అలవాటుకు ఇక్కడ చికిత్స చేసుకోవాలి. 'ఇచ్ఛ' అనే అడ్డు తొలగనంతకాలం ఈ జీవుడు సంసారంలో ఉంటూనే ఉంటాడుగాని... ఆనంద స్వరూపుడగు పరమాత్మ యొక్క తత్త్వమును గుర్తించనేలేడు. వేదవేత్తలలో శ్రేష్ఠులైనవారు "ఇచ్ఛారాహిత్యమే సమాధాన స్థితి. అదియే సమాధి. ఈ మనస్సు ఇచ్ఛారాహిత్యముచే శమించినట్లుగా వేల కొలది ఉపదేశములు విన్నప్పుడు కూడా శమించదు" అని అంటూ ఉంటారు.

ఇచ్ఛోదయే యథాదుఃఖం, ఇచ్ఛాశాంతిమ్ యథాసుఖమ్ ।
తథా న నరకేనాఽపి బ్రహ్మలోకే నానుభూయతే ॥

'ఇచ్ఛ' యొక్క ఉదయముచే కలిగే దుఃఖం నరకంలో కూడా అనుభవం కాదు. ఇచ్ఛ శమించినప్పుడు కలిగే సుఖం బ్రహ్మలోకంలో కూడా అనుభూతం కాదు సుమా! "ఇచ్ఛా మాత్రమే చిత్తం. ఇచ్ఛా రాహిత్యమే మోక్షం" అనేదే శాస్త్రసారం. ఇచ్ఛను జయించివేసినప్పటి (త్యజించినప్పటి, అతీతత్వం సంతరించుకున్నప్పటి) స్థితియే సమస్త శాస్త్రముల యొక్క, తపస్సుల యొక్క, యమ-నియమాదుల యొక్క తాత్పర్యం. ఎంతెంతవరకైతే ఏ ప్రకారాలుగా ఇచ్ఛ ఉదయించకుండా ఉంటుందో, అంత వరకు దుఃఖ సమూహబీజం వృద్ధి పొందదు. వివేకబలంచే జీవునిలో ఇచ్ఛ సన్నగిల్లుచున్న కొద్దీ 'దుఃఖచింత' అనే మహమ్మారి శమిస్తూ ఉంటుంది. 'రాగం'చే ఇచ్ఛ ప్రవృద్ధమౌతూ ఉంటుంది. ఇచ్ఛచే దుఃఖము అనే విషయతరంగాలు ప్రవృద్ధమౌతూ ఉంటాయి.

ఈ 'రాగం - ఇచ్ఛ' అనే వ్యాధికి "మనస్సును నిగ్రహించటం" అనే పురుష ప్రయత్నరూపమైన ఔషధమే శరణ్యం. పురుష ప్రయత్నంకంటే బలవత్తరమైన ఔషధం వేఱొకటేదీ లేదు. ఓ ప్రియ సహజీవులారా! మీరు ఒకే కాలంలో ఇచ్ఛలన్నీ జయించలేకపోతే, కనీసం కొంచెం కొంచెంగానైనా

వీటిని త్యజిస్తూ ఉండే ప్రయత్నంలో ఉండండి. మీరు అట్టి సన్మార్గంలో ఉంటే చాలు, ఇక దుః ఖాదులు మిమ్ములను సమీపించే సాహసం చేయలేవు.

యస్తు ఇచ్ఛాతానవే యత్నం న కరోతి నరాధమః ।
సోఽంధకూపే స్వమాత్మానం దినానుదినం ఉజ్ఝతి ॥

ఎవడైతే "తనయందలి ఇచ్ఛను సన్నగిల్లజేయటం" అనే ప్రయత్నంలో తనను నియమించుకుని ఉండడో... అట్టివాడు ప్రతిరోజు తననుతాను చీకటి నూతిలోని లోతులలోకి ప్రతిదినం పడదోసికొనినవాడే అగుచున్నాడని నా హెచ్చరిక. అట్టి నరాధముడు తననుతానే దుఃఖపరంపరలకు అప్పజెప్పుకొన్న వాడగుచున్నాడు. "దుఃఖములు" అనే పుష్పములచే శోభితమై ఉన్న ఈ సంసార లతకు "ఇచ్ఛ" అనేదే బీజం. అట్టి బీజం అంకురించకుండా ఉండాలంటే 'ఆత్మజ్ఞానం' అనే అగ్నిచే అద్దానిని దహించాలి. అప్పుడిక అది మరల మొలకెత్తదు.

రామచంద్రా! మరల మరల గుర్తు చేస్తున్నాను. 'ఇచ్ఛ'యే సంసారం. 'ఇచ్ఛ' యొక్క అభావమే నిర్వాణం. అందుచేత ఇచ్ఛ అనేది ఉత్పన్నమే కాకుండటానికి సమస్త ప్రయత్నాలు ఆచరించు. సకల ఉపాయాలు అనుసరించు. ఇక తక్కిన వ్యర్థ ప్రయత్నముల వలన ప్రయోజనమేమున్నది?

శాస్త్రోపదేశ గురవః ప్రేక్ష్యాన్తే కిమనర్థకమ్ ।
కిమ్ "ఇచ్ఛా న అనుసంధాన సమాధిః" న అధిగమ్యతే?

ఓ ప్రియ సహాత్మజనులారా! మీరు శాస్త్రములు కొఱకు, గురూపదేశముల కొఱకు ఎందుకు ప్రతీక్షించటం? చిత్తశాంతికి ఉపాయమైనట్టి "ఇచ్ఛా రాహిత్యము"ను ఎందుకు అభ్యాసపూర్వకంగా ఆశ్రయించటం లేదు? ఎందుకంటారేమో? ఎవనికైతే "తన యొక్క వివేకాదులచే ఇచ్ఛను సన్నగిల జేయటం"... అనేది "దుస్సాధ్యం!" అని అనిపిస్తూ ఉంటుందో అట్టి వానికి గురూపదేశాలు, శాస్త్ర పఠనాదులు ఎంతగా అందిస్తే ఏం లాభం? అవన్నీ చెవిటివానికి రాగయుక్తంగా శంఖం ఊది వినిపించటంలాగా నిరర్థకమే అవుతాయి. పులులతో నిండిన అరణ్యంలో ఒక జింక అటూ ఇటూ పచార్లు చేస్తూ ఉంటే, ఇక ఆ జింకకు మరణం నిశ్చయమైనట్లే కదా! "ఇచ్ఛ" అనే వికారముచే అనేక విషయసంబంధమైన వికారములతో కూడి, అనేక దుఃఖములను విస్తరింపజేసే స్వభావం గల ఈ సంసారంలో ప్రవేశించిన ఈ జీవునికి ఆ జింకలాగానే అధఃపతనం నిశ్చితమై ఉన్నది. ఈ జీవుడు సకల తదితర ఆధ్యాత్మిక సాధనలను ఒక్క ప్రక్క ఉంచి, ముందుగా ఈ ఇచ్ఛ' అనే దానిని సన్నగిల చేసుకోవటం ఎట్లాగో యోచించటం మంచిదని నా అభిప్రాయం. ఎందుకంటావా?

న బాలీక్రియతేతి ఈషత్ ఆత్మజ్ఞానాయ చేదసౌ ।
ఇచ్ఛోపశాన్తిః క్రియతాం తయాలం తదవ్యాపృతే ॥

బాలునిలాగా ఇచ్ఛచే చపలుడు కాకపోతే ఈ మానవునకు ఆత్మజ్ఞానం సంపాదించుకోవటానికి కొంచెం ప్రయత్నం సరిపోతుంది. ఓ సభికులారా! కొందరికి ఎంత ప్రయత్నించినా, ఎన్నో సాధనలు చేసినా, ఎంతగానో గురుపదేశములు విన్నా, ఎంతెంతగానో శాస్త్రములు కంఠో

పాఠంగా వచ్చినా, వారికి కూడా ఆత్మజ్ఞానం అనుభవానికి రాలేదంటే... దానికి అసలైన కారణం? వారి అంతరంగంలో ఈ దృశ్య విషయాల పట్ల నిర్మించుకొని ఉన్న 'ఇచ్ఛ' యొక్క ప్రభావం చేత ఏర్పడిన మనోచాంచల్యమేనని నా కనిపిస్తుంది. కాబట్టే మనుముందుగా ఇచ్ఛ యొక్క ఉపశాంతికై ఉపాయములు ఆశ్రయించటం ముముక్షువు చేయవలసిన పని – అని నా అభిప్రాయం. ఇచ్ఛ సన్నగిల్లితే ఆత్మజ్ఞానం అతి సులభంగా మనస్సుకు హత్తుకుంటుంది.

నిరిచ్ఛతై నిర్వాణం, స ఇచ్ఛతైవహి బంధనమ్
యథాశక్తి జయేదిచ్ఛాం! కిమేతావతి దుష్కరమ్?

ఇచ్ఛ యొక్క అభావమే నిర్వాణం (నిరిచ్ఛ); ఇచ్ఛ యొక్క ప్రవృద్ధమే బంధనం (సఇచ్ఛ)... కాబట్టి యథాశక్తి ఇచ్ఛను జయిస్తూ రావాలి.

ఇంతమాత్రం ప్రయత్నం "అబ్బో! కష్టసాధ్యం!"... అని అంటే ఇక మేము చేయగలిగిన దేమున్నది? (నిర్వాణ స్థితి ప్రాప్తికి) ఈ మాత్రం ప్రయత్నించటంలో దుస్సాధ్యం ఏమున్నది?

జరామరణజన్మాది కరఞ్జ ఖదిరావలేః
బీజమిచ్ఛా సదైవ అంతర్ దహ్యతాం శమవహ్నినా ॥

ఓ రామచంద్రా! ఈ "జరామరణ జన్మాదులు" అనే కంటక వృక్ష సమూహమునకు బీజము ఇచ్ఛయే సుమా! అందుచేత ఆ కంటక వృక్ష బీజమును "శమము (ఇంద్రియ నిగ్రహము)" అనే వివేకాగ్నిచే దహింపజేయాలి. ఎందుకంటే ఎక్కడెక్కడ ఇచ్ఛ ఉంటే అక్కడక్కడ బంధపాశములన్నీ వచ్చిపడుచున్నాయి. ఇచ్ఛ ఉన్నచోట పుణ్య–పాపరూప దుఃఖ రాసులన్నీ వచ్చి చేరుతున్నాయి. ఇక అట్టి జీవుని యొక్క మహాబాధలకు అంతూ–పొంతూ ఉండటం లేదు. సాధువైనవాడు ఇచ్ఛారహితం చేసుకోకుండా కొంచెం సమయం గడిపినా కూడా, ఆ కొద్ది సమయం ఏమఱచి ఉండడంచేత, దొంగలచే సంపదలు అపహరించబడిన గృహయజమానిలాగా, సర్వస్వం కోల్పోయిన బాటసారి లాగా – చిరకాలం రోదన, వేదనలు పొందవలసి వస్తుంది. మరి ఈ సంసారమార్గం అటువంటిది! ఎంతెంత వరకైతే ఇచ్ఛ అంతఃకరణంలో శమిస్తూ ఉంటుందో, అంతంత వరకు అతనిపట్ల మోక్షము కొఱకై శుభదాయకమగు సాధన చతుష్టయ సంపత్తి ప్రవృద్ధమౌతూ ఉంటుంది.

సంసారము = వాస్తవానికి ఆత్మ స్వరూపుడే అయిన ఈ జీవుడు, ఆత్మజ్ఞాన వివేకరహితుడై విషయోపభోగముల ద్వారా ఇచ్ఛను పరిపూర్ణం చేసుకోవాలని, ఎండమావుల వైపుగా నీటికొరకై ప్రయాణించే జింకలాగా, ఈ దృశ్య వ్యవహారంలో నిర్వర్తించే జన్మజరామరణములతో కూడిన నిరంతరమైన రాకపోకలు. ఇదే సంసారం! ఇంతకు మించి సంసారముగా ఎక్కడా ఏదీ లేదు.

'హృదయము' అనే వృక్షం యొక్క అగ్రభాగంలో ఎక్కడో ఈ 'ఇచ్ఛ' అనే నిప్పుకణం పుట్టి ఇక హృదయమును దహించివేస్తోంది.

'జీవుడు' అనే పశువు కాలుచున్న హృదయ గృహంలో చిక్కుకుని అల్లాల్లాడుచున్నాడు. 'పుణ్య పాపాలు' అనే స్వకీయ ఆశ్రయంచే ఎంతో శ్రమపడుతూ దీర్ఘకాలంగా వగరుస్తున్నాడు.

'మోహం' అనే పొగ అతని కళ్ళు కప్పి అంధునిగా చేసివేస్తోంది. 'రాగము-ద్వేషము' అనే కట్టుత్రాళ్ళచే అతడు బంధించపబడి ఉన్నాడు. 'ఆశ-నిరాశలు' అనే ఛట-ఛట ధ్వనులను వింటూ ఈ జీవుడు దిక్కుతోచకుండా ఉన్నాడు.

❖❖❖

19. ఇచ్ఛయొక్క ఉపశాంతి

శ్రీవసిష్ఠ మహర్షి : ఇచ్ఛారాహిత్యము, తద్వారా ఏర్పడగల ఆత్మతో సంయోగము గురించి మనం ఇప్పుడు కొన్ని విశేషాలు చెప్పుకున్నాం. అయినా కూడా "ఇచ్ఛ యొక్క సంపూర్ణశాంతి" గురించి ఇంకా మరికొన్ని విశేషాలు ఇప్పుడు చెప్పుకోవటం సందర్భోచితమని నాకు అనిపిస్తోంది. కనుక "ఇచ్ఛ యొక్క ఉపశాంతి" సంబంధితంగా మన సంవాదము కొనసాగిద్దాం.

"అసలు 'ఇచ్ఛ' యొక్క ఆవశ్యకత ఏమిటి?" అనే ప్రశ్నకు వద్దాం.

ఆత్మనో వ్యతిరిక్తం చేత్ విద్యతే తదిహ ఇచ్ఛయా!
ఇష్యతామ్ అసత్ ఇత్యేతత్ స్వాత్మాన్యత్వం కిమిష్యతే?

'ఆత్మ' కంటే వేరుగా ఎక్కడైనా ఏదైనా ఉంటే, అప్పుడు అద్దానిని కొఱుకోవటం భావ్యమే! అసలు ఆత్మకు వేరుగా ఏది ఎక్కడున్నది? అంతా ఆత్మయే అయి ఉండగా, ఆత్మకు వేఱుగా రెండవ వస్తువు కనిపించటమనేది భ్రాంతియే. అనగా "భ్రాంతి చేతనే ఇచ్ఛ ఉదయిస్తోంది" అనే కదా! ఆత్మ జ్ఞానం యొక్క ప్రవృద్ధి చేత "రెండవ వస్తువే ఉండజాలదు" అని గ్రహించుటచే ఇచ్ఛ సునాయాసంగా జయించబడుతుంది. ఇచ్ఛను అధిగమించాలంటే ఆత్మజ్ఞానమే ఉపాయం. "అవయవరహితం, ఆకాశం కంటే కూడా అత్యంత సూక్ష్మం, దృశ్య శూన్యం" అగు చైతన్యమేది కలదో... అదియే ఇటు అహంకారంగానూ, అటు జగత్తుగాను కనిపిస్తోంది. నీకు కనిపించేదంతా నీ రూపమేనని గ్రహించిన తర్వాత అందులో ఇక నీవు కోరవలసినదేముంటుంది? త్యజించవలసినదేముంటుంది?

ఈ ఆకాశము, ఇక్కడి విషయములు, ఆ విషయములు గ్రహించే జ్ఞాత... ఇవన్నీ కూడా చిదాకాశరూపమగు చైతన్యమే అయి ఉన్నాయి. ఈ జగత్తు యొక్క అభాస కూడా చిదాకాశ రూపమే! ఇకప్పుడు 'ఇచ్ఛ'కు విషయమెక్కడున్నది?

అజ్ఞాన దృష్టిచే అశాంత దృష్టి ఏర్పడుతోంది. అట్టి అశాంతదృష్టికి 'గ్రహించువాడు-గ్రహించ బడునది"... అనబడే గ్రాహ్య-గ్రాహక సంబంధం ఇక్కడ కనిపిస్తోంది. ప్రశాంత దృష్టికి ఆ సంబంధమే అగుపించదు. ప్రశాంత చిత్తులమగు మనకు ఇక గ్రాహ్యం ఎక్కడ? గ్రాహకం ఎక్కడ? ఎవరియందు ఈ గ్రాహ్య-గ్రాహక సంబంధము కనిపిస్తోందో... వారు కూడా ఆత్మకు వేఱైనవారు కాదు కదా! ఆ గ్రాహ్య - గ్రాహక సంబంధము పరిశీలించిచూస్తే అగుపించేదికాదు. ఎందుకంటే స్వతః అసత్తైనది ఎక్కడ ఎట్లా లభిస్తుంది? ఎవరికైనా చంద్రుడు ఆకుపచ్చగా కనిపిస్తాడా?... ఆకుపచ్చ రంగుటద్దంలోంచి చూచే వారికి తప్ప!

గ్రహించువాడు, గ్రహించబడునది - అజ్ఞానంచే ఆత్మయందు నిష్ఠ లేకపోవటమే "గ్రాహ్యము–గ్రాహకము"ల యొక్క 'సత్త' అయి ఉన్నది. అశాస్త్రీయమైన దృష్టి చేతనే ఈ అనేకాలుగా కనిపించేవన్నీ సత్యం వలె అనిపిస్తున్నాయి. శాస్త్రీయమగు తత్త్వ నివారణచే "గ్రహించువాడు గ్రహించబడునది" అనే విషయ–విశేషములన్నీ ఎచటికో పలాయనం చిత్తగిస్తాయి. ఓ ప్రియజనులారా! అజ్ఞానులగు వారిపై గల అవ్యాజమైన ప్రేమచే సుజ్ఞానులు "శాస్త్రములు" అనే అమృతపు జల్లు కురిపిస్తున్నారు. అట్టి శాస్త్రముల సహాయంతో అసత్యమగు "అహంత్వము"ను అధిగమించెదరు గాక! ఈ అహంత్వము ఆత్మతత్త్వజ్ఞాన ప్రభావంచే ఆత్మయందే విలీనమైపోతోంది. అదియే ద్రష్టృ–దృశ్యాదుల సంపూర్ణ క్షయరూపమైనట్టి 'నిర్వాణము'. అదియే ఆత్మతత్త్వము యొక్క స్వభావము.

దృశ్యము, నిర్వాణము - 'నిర్వాణం' నందు దృశ్యాదులు లేవు. దృశ్యాదులందు శాంతి రూప నిర్వాణం లేదు. 'ఎండ–నీడ' లాగానే ఆ నిర్వాణ–దృశ్య వ్యవహారములు రెండూ ఒక్కచోట ఏర్పడి ఉండేవి కావు. ఇక ఆ రెండిటి యొక్క 'సమభావన' కలుగవచ్చునంటావా? అవి రెండూ పరస్పరం బాధించుకుంటున్నాయి. కాబట్టి రెండూ అసత్యములేనని అనాలి. కానీ 'రెండూ అసత్యములే' అనే మాట విద్వజ్ఞుల అనుభవానికి భిన్నంగా ఉన్నది. ఎందుకంటే అసత్యమైన దానిలో శాంతి లేదు. ఇక నిర్వాణమో... దుఃఖ శూన్యముగాను, పరమశాంతముగాను తత్త్వజ్ఞులకు అనుభవమౌతోంది. ఈ దృశ్యాదులో... సదా దుఃఖదాయకంగాను, భ్రమ రూపములుగాను అయి ఉన్నాయి.

కాబట్టి ప్రియ రామచంద్రా! ఈ దృశ్యాదులను భావించనే వద్దు. సర్వ భావములకు ఆవల సర్వదా వేంచేసి ఉన్న 'నిర్వాణం' అనబడు ఆత్మ పదమునందే సదా సంస్థితుడవై ఉండు.

ఒకనికి ముత్యపు చిప్పలో వెండి ఉన్నట్లుగా అనిపించవచ్చు గాక! కాస్త విచారించి చూస్తే ముత్యపుచిప్పలో వెండి ఉన్నదా? అందులో లభించే దానితో మనకేమైనా వెండిరూపమైన ప్రయోజన మున్నదా? లేదు. అట్లాగే దృశ్యాదులలో వాస్తవంగా లభించేదేమీ లేదు. అందుచేత 'ఈ దృశ్యాదులు మిథ్య' అని ఎరుగటంలో హాని ఏమున్నది? 'ఈ దృశ్యం సత్యం' అని తలచటంలోనే మహా దుఃఖాలన్నీ దాగి ఉన్నాయి. 'ఈ దృశ్యం మొదలంట అసత్యం' అని గ్రహించటంలో మహా సుఖముంది.

శ్రీరాముడు : దృశ్యమును అనుక్షణం ఎంతగానో అనుభవిస్తున్న మాకు దృశ్యము అవాస్తవమని ఎరిగి ఉండటం ఏమంత తేలికంటారా?

శ్రీవసిష్ఠ మహర్షి : ఆత్మ యొక్క మనన సహితమగు 'నిధిధ్యాస'చే అట్టి దృశ్యం యొక్క అభావం తప్పక లభించగలదని నేను చేతులెత్తి ప్రకటన చేస్తున్నాను. (ఊర్ధ్వబాహుర్విరౌమ్యేష!)

ఆత్మకు బంధం లేదు - ఆత్మజ్ఞానమును ఏమరచి సంసారంలో సంచరించే బాటసారులారా! 'ఉత్పత్తి' మొదలైన వికారాలకు విషయమే కానట్టి ఆత్మ స్పష్టంగా కరతలామలకమై స్ఫురించు చుండగా అద్దానిని మీరు ఎందుచేత దర్శించలేకున్నారు? అట్టి ఆత్మకు బంధహేతురూపంగా ప్రకటనమగుచున్న దృశ్య సమూహాన్ని జ్ఞానాగ్నిచే ఎందుకు దహించివేయటం లేదు?

ఎప్పుడైతే కార్య–కారణ భావాదులు కూడా బ్రహ్మమే అని సునిశ్చితమౌతుందో... అప్పుడే దేహము మొదలుగా గల సర్వ పరిచ్ఛిన్న భావాలు వాటంతట అవే సమసిపోతాయి. అటు తర్వాత

మాత్రమే బ్రహ్మత్వము సిద్ధిస్తుంది. అంతేగాని అణుమాత్రం దృశ్యము మీ దృష్టిలో శేషించి ఉన్నప్పటికీ జగదత్వమే సిద్ధిస్తుంది కాని... బ్రహ్మత్వము కాదు.

చిదాకాశరూపం-ఏకం-సర్వవ్యాపకం-పరిపూర్ణం అయినట్టి సర్వాత్మయగు బ్రహ్మము నందు కార్య-కారణ సహితమగు దృశ్యాన్ని ముందుగా అంగీకరించి, తరువాత బ్రహ్మ ప్రబోధం కొరకు సాధనలను వెతుకువారు మా ఉద్దేశంలో పసిబాలుర వంటి వారే! అట్టి వారి కల్పితవాక్యములతో మాకు పని లేదు. వారి పరిశ్రమంతా వృథాయాసమేనని మా ఉద్దేశం! ఎందుచేతనంటావా? కార్యకారణ పూర్ణములగు వ్యాక్యములందు అవిద్య తప్ప మరింకేమి క్రమం ఉన్నది?

శ్రీరాముడు : మహాత్మా! నిర్విషయమని చెప్పబడే చిదాత్మయందు సృష్టిత్వము అనే చమత్కారం ఎందుకు ప్రత్యక్షమౌతోంది.

శ్రీవసిష్ఠ మహర్షి : వాయువు యొక్క చలనమునకు హేతువు ఏముంటుంది? జలము యొక్క ద్రవత్వమునకు కారణమేమున్నది? ఆకాశము యొక్క శూన్యత్వమునకు ఎవరు కారణమంటే ఏం చెపుతాం? చిదాత్మ యొక్క సృష్టిత్వమునందు కూడా అదే కారణమున్నది. గాలి, గాలి తరంగాలు ఒక్కటే అయినట్లు కార్య-కారణాదులన్నీ బ్రహ్మమే అయి ఉన్నాయి. ఎప్పుడైతే అవి రెండూ బ్రహ్మమే అయి ఉన్నాయో... ఇకప్పుడు సృష్టుల యొక్క కారణత్వము 'వెతకటం, ప్రబోధించడం' అనునది సిగ్గులేనిపనే అవుతుంది. (బ్రహ్మణి సర్గాణాం కారణార్థా విలజ్జతా)

న దుఃఖమస్తి న సుఖమ్ శాంతం శివమయం జగత్ ॥

కాబట్టి ఈ జగత్తు కేవలం శాంతము, శివమయము అయి ఉన్నది. అంతేగాని, ఇక్కడ సుఖము లేదు, దుఃఖము లేదు.

నాస్తి చిన్మాత్రతా అన్యత్వమ్, అత ఇచ్ఛోదయః కుతః?
మృత్ దేహయోధసేనాయాం న మృణ్మాత్రే ఇతరత్ యధా!

ఒక కళాకారుడు మట్టితో యుద్ధ దృశ్యమును తయారుచేసి ఎదురుగా పెట్టాడనుకో. మనకు ఆ మట్టి బొమ్మల దృశ్యంలో శత్రుసైన్యం, మిత్రసైన్యం, గుఱ్ఱాలు, ఏనుగులు, శూలాలు, గదలు, బల్లేలు మొదలైన సంరంభమంతా చిత్ర విచిత్రంగానూ, రసవత్తరంగాను అగుపించవచ్చు గాక! కానీ ఆ బొమ్మలన్నీ మట్టితోనే తయారయ్యాయి కదా! మట్టిగాక ఆ బొమ్మల సంబంధాలన్నీ (శత్రు సైనికుడు-మిత్ర సైనికుడు-శత్రు-మిత్ర సంబంధాలు మొదలైనవి) ఎక్కడున్నాయి? ఈ జగత్తంతా కూడా శాంతమగు చిన్మాత్రము తప్ప మరింకేమీ కాదు. ఇక ఇచ్ఛ యొక్క ఉదయము ఎవరికి? ఎట్లు సంభవం?

న స జగత్ - అహంతాదౌ దృశ్య బ్రహ్మేతరత్తథా ॥

నేను-నేను చూసే జగత్తు మొదలైన వాటితో కూడిన ఈ దృశ్యమునందు బ్రహ్మము కంటే వేరైనది అణుమాత్రం కూడా లేదు. ఉండ జాలదు. ఏదైనా బ్రహ్మము కంటే వేరుగా నవరసాల రూపంలో కనిపిస్తుంటే, అది సత్యము కాదు. కాబట్టి ఇక ఇచ్ఛతో పనేమున్నది?

ఇచ్ఛ కూడా బ్రహ్మమేనా? -

శ్రీరాముడు :

ఏవం చేత్ తత్ ఉదేత్ ఇచ్ఛా మావోదేతు, మునీశ్వర!
సా తు బ్రహ్మైవ కోఽర్థఃస్యాదస్యా విధి-నిషేధనే?

హే మునీశ్వరా! మీరు ఇంత వరకు 'ఇచ్ఛయే సంబంధం. ఇచ్ఛా రాహిత్యమే ముక్తి' అనే భావమును ఆయా కోణాలనుండి నిరూపిస్తూ వస్తున్నారు కదా! 'మట్టి బొమ్మలన్నీ మట్టియే అయినట్లు, సర్వము బ్రహ్మమే' అని ఇప్పుడు సిద్ధాంతీకరించారు. అంతయూ బ్రహ్మరూపమే అయినప్పుడు 'ఇచ్ఛ' అనేది కూడా బ్రహ్మమే కదా! అప్పుడిక ఇచ్ఛ ఉదయించినా, ఉదయించకున్నా కూడా ఒక్కటే కదా! ఇచ్ఛ ఉదయిస్తే మాత్రం హాని ఏమున్నది? ఇకప్పుడు 'ఇచ్ఛను త్యజించడం – ఇచ్ఛారాహిత్యాన్ని ఆశ్రయించడం'... అనే రూపంతో కూడిన విధి-నిషేధములతో పని ఏమున్నది? వాటి వల్ల క్రొత్తగా కలిగే ప్రయోజనమేముంటుంది? మరి, శాస్త్రములు గాని గురువులు గాని, మహనీయులగు తమవంటివారు గాని విధి-నిషేధములు చెప్పవలసిన అవసరమేమున్నది?

శ్రీవసిష్ఠ మహర్షి : ఆత్మజ్ఞానం ఉదయించిన తర్వాత "ఇచ్ఛ కూడా బ్రహ్మమే! బ్రహ్మమునకు అన్యంగా ఏదీ లేదు" అని నీవు చెప్పే విషయం నగ్న సత్యమే! అందులో అనుమానానికి తావులేదు. అయితే... ఇక్కడ ఒక్క విషయం నీవు గమనించెదవుగాక! ఎప్పుడైతే "ఇదంతా మట్టియే" అని గ్రహించబడుతోందో అప్పుడు ఇచ్ఛ కూడా స్వభావసిద్ధంగా శమిస్తుంది. ఎందుకంటే 'ఇచ్ఛ శమించటం' అనేది ఆత్మజ్ఞానము యొక్క స్వభావము అయి ఉన్నది. సూర్యుడు ఉదయించగానే చీకటి తొలగటం ఎంతగా స్వభావసిద్ధమో, అంతగా ఆత్మజ్ఞానం ఉదయించగానే ఇచ్ఛ మొదలైనవి అత్యంతస్వాభావికంగా శమిస్తాయి. ఎంతెంతగా జ్ఞానం ఉదయిస్తూ ఉంటుందో అంతంతగా ద్వైతశాంతి, వాసనా విలయము కూడా కలుగుతూ ఉంటాయి. అప్పుడిక ఇచ్ఛ క్రమంగా ఉదయించటమేలేకుండా పోతూ ఉంటుంది. ఎవనికైతే సమస్త దృశ్య పదార్థములందు వైరాగ్యము కలుగుతూ ఉండగా ఇక ఇచ్ఛ ఉదయింపకయే ఉంటుందో... అతనిపట్ల సంసారము గురించిన అవిద్య స్వయంగా నశించి (అతని యందు) నిర్మలమగు ముక్తి ఉదయిస్తూ ఉంటుంది.

అట్టి ఇచ్ఛా రహితునికి ఈ దృశ్య పదార్థాలను చూస్తూ ఉన్నప్పుడు అటు రాగం గాని, ఇటు ద్వేషంగాని ఉండదు. కేవలం స్వభావసిద్ధంగానే ఈ కనబడే దృశ్య విషయాల పట్ల రుచి కలుగదు. అట్టి జ్ఞాని ఒకవేళ ఆకస్మిక ఘటనచే (లేక) ఇతరుల ప్రేరణచే (కాదా)... శాస్త్ర నియమానుసారంగా ఏవైనా క్రియాదులు (దానం-ధర్మం మొ॥) నిర్వర్తిస్తూ ఉండవచ్చు. లేదా, నిర్వర్తించకనూ పోవచ్చు.

ఇచ్ఛ కూడా ఈ సృష్టిలోని ఒక చమత్కార వస్తువు అని ఎప్పుడు గ్రహించబడుతుందో... అప్పుడు మాత్రమే అట్టి జ్ఞానికి "ఇచ్ఛ-అనిచ్ఛ ఈ రెండూ కూడా బ్రహ్మరూపములే!" అనే అనుభవం కరతలామలకమౌతుంది. ఈ విధంగా ఆ రెండూ వాస్తవానికి బ్రహ్మరూపములేనని అనటంలో ఏమాత్రమూ సందేహములేదు. పైగా జ్ఞానియొక్క పూర్వాభ్యాస వశంచేత అతనికి క్రొత్తగా దేనిపట్లా 'ఇచ్ఛ, అనిచ్ఛలు' ఉండవలసిన ఆవశ్యకతయే కనిపించదు. ఈ జీవునికి ఎప్పుడైతే ఆత్మజ్ఞానం

ఉదయిస్తుందో... అప్పుడు ఇచ్ఛ దానంతట అదే శమిస్తుంది. లేదా, ఇచ్ఛను శమింపజేసుకున్న వానికి ఆత్మజ్ఞానం అతిసులభంగా కరతలామలకం అవుతుంది. ఎందుచేతనంటే... చీకటి - వెలుగు ఒకచోట ఉండలేవు కదా!

ప్రతిషేధ విధీనాం తు తజ్ఞో న విషయః క్వచిత్ ।
శాంత సర్వైషణ - ఇచ్ఛస్య కో౽స్య కింవక్తి, కిం కృతే?

శాస్త్రాలలో చెప్పబడిన విధినిషేధాలకు జ్ఞాని ఎన్నటికీ విషయమే కానేరదు. ఎందుకంటావా? సమస్త ఈషణలు, వాంఛలు నశించినవానికి నియమాల వల్ల క్రొత్తగా ఏది పొందవలసినదున్నది?

ఇచ్ఛ రహితం అవటమంటే - ఎప్పుడైతే ఈ సర్వదృశ్య పదార్థములు నీరసములై రుచించకయే ఉంటాయో, ఇవన్నీ అతిస్వల్ప సమాచార విశేషాలుగా అనిపిస్తాయో.... అప్పుడు అతని ఇచ్ఛ ప్రసరణను త్యజించి ఉన్నట్లౌతుంది. అదియే 'ముక్తి' యొక్క ఉదయం కూడా! ఎవడైతే ఆత్మజ్ఞానం చేత ద్వైత - అద్వైత రహితమగు శాంతిరూపమున నెలకొనిన స్థితి కలిగి ఉంటాడో... అట్టి వానికి ఇచ్ఛ - అనిచ్ఛాది సర్వ పదార్థములు బ్రహ్మ రూపములుగానే దర్శనమౌతాయి.

కనుక ఓ ప్రియ సభికులారా! మీరు జ్ఞానులు అయ్యెదరుగాక! ఆత్మజ్ఞానముచే ద్వైత వివర్జితులు, ద్వైత - అద్వైత రహితులు, నిర్మల స్వభావులు, వ్యాకుల రహితులు, ప్రశాంత చిత్తులు, ఆత్మయందే స్థితి పారాయణము కలిగియున్నవారు అయ్యెదరుగాక! ఆత్మయందే స్థితి కలిగి ఉన్న జ్ఞానికి ఈ ప్రపంచంలో ఏవైనా కార్యములు నిర్వర్తించటం చేతగాని, నిర్వర్తించకుండటం చేతగాని ఏ క్రొత్త ప్రయోజనమూ ఉండదు. అంతే కాకుండా సమస్త తదితర సహజీవులపట్ల అతనికి తన ప్రయోజన నిమిత్తమై ఆశ్రయించవలసిన పదార్థమేదీ కనబడదు.

నానిచ్ఛయా నే౽చ్ఛయాథ న సతా నాసతా సదా ।
నైవాత్మనా న చ అన్యేన నైతైర్ మరణజీవితైః ॥

అట్టి జ్ఞానికి ఇచ్ఛచేగాని, అనిచ్ఛచేగాని, సత్తుచేగాని, అసత్తుచేగాని, ఆత్మచేగాని, లేక మరింక దేనిచే గాని, జీవితంచే గాని, మరణంచే గాని ఎప్పుడునూ ఏ ప్రయోజనమూ అగుపించదు. "నిర్వాణరూపుడు-ప్రబుద్ధుడు" అయిన అట్టి జ్ఞానికి ఇచ్ఛయే ఉదయించదు. ఒకవేళ ఎప్పుడైనా ఉదయించినా అది కూడా అతనికి బ్రహ్మముగానే అనుభవమౌతుంది.

❖❖❖

20. ప్రబుద్ధుడు - అప్రబుద్ధుడు

శ్రీవసిష్ఠ మహర్షి :

న దుఃఖమస్తి న సుఖం, శాన్తం-శివమ్ అజమ్ జగత్ ।
ఇతి యో౽న్తః శిలేవ అస్తే తం 'ప్రబుద్ధం' విదుర్ బుధాః ॥

ఓ రామచంద్రా! "సుఖముగాని, దుఃఖముగాని లేదు. ఈ జగత్తు శాంతము-శివమయము అయి ఉన్నది"... అని ఎవడైతే తన అంతఃకరణంలో నిశ్చయం కలిగి ఉంటాడో, శిల యొక్క

అంతరము వలె నిశ్చలముగా ఉంటాడో... అట్టివాడే "ప్రబుద్ధుడు"... అని పండితులు మనకు చెప్పుచున్నారు.

దుఃఖం సుఖం భావనయా కుర్వన్ విషమివామృతమ్ ।
ఇతి నిశ్చత్య ధీరాత్మా 'ప్రబుద్ధ' ఇతి కథ్యతే ॥

"ఆత్మతత్త్వము ఇట్టిది కదా" అని నిశ్చయించుకొన్నవాడై ఎవడైతే విషయమును అమృతంగా మార్చినట్లు దుఃఖమును కూడా నిరతిశయానందాత్మ భావనచే సుఖమయంగా ఒనర్చి వేస్తాడో అట్టి ధీరచిత్తుడే ప్రబుద్ధుడు.

ప్రబుద్ధుని జ్ఞాన స్థితి - అట్టి జ్ఞానస్థితియందు ఉన్న వానికి... శాంతం–చిదాకాశరూపం–శివం–దృశ్యరహితం–సద్వస్తువు అయిన బ్రహ్మం నందు; శాంతం–చిదాకాశరూపం–శివం–దృశ్యాది రహితం సద్వస్తువు అయిన జగత్తు ...నెలకొని ఉన్నట్లు, స్థితికలిగి ఉన్నట్లు అత్యంత స్వభావసిద్ధంగా అనుభూతమౌతుంది. ఈ జగత్తు భేదయుక్తమై అనిపించటమే భ్రమ, బంధం, అనుబంధం కూడా!

ఇది భేదరహితం, స్వయంగా నిర్విషయం అని అనిపించటమే జ్ఞానం యొక్క పరాకాష్ఠ! ఈ జగత్తు బ్రహ్మమయమై బ్రహ్మం నందే సదా సర్వదా స్థితి కలిగి ఉన్నది. కనుక బ్రహ్మమునకు వేరుగా 'జగత్తు' అనబడేది ఎక్కడా లేదు. జగత్తుగా కనిపించేది, అనిపించేది వ్యాపక బ్రహ్మము తప్పితే మరింకేమీ కాదు. బ్రహ్మము తప్పితే మరింకెక్కడా ఏదీ లేదు.

శ్రీరాముడు : మరి ఈ 'అహంకారము' అనుదాని రూపము?

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! మరల రెండు వాక్యములు పునరుద్ఘాటిస్తున్నాను.

1. ఈ జగత్తు బ్రహ్మమయమైయున్నది. ఇక్కడ కనబడే అహంకారాదులతో, ఇచ్ఛాదులతో సహా సర్వము బ్రహ్మమే!
2. బహ్మం విషయవర్జితం–చిదాకాశం–సర్వవ్యాపకం–సౌమ్యం–సమం–శివం అయి ఉంది.

అట్టి బ్రహ్మమునందు అహంకారాదులకు తావెక్కడిది? "అంతయు బ్రహ్మమే" అనునది సుగ్రాహ్యమై అనుభవైకవేద్యమగుచుండగా అహంకారాదుల భ్రమ తనంతటతానే తొలగిపోతోంది. దృశ్యజగత్తు ఒకానొక మనోవ్యాపకం మాత్రమే!

శ్రీరాముడు : మరి ఈ ఎదురుగా కనిపించే స్థావరజంగమాత్మకమగు జగత్తు?

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ సూక్ష్మార్థగ్రాహీ! రామచంద్రా! ఈ స్థావర – జంగమాత్మక జగత్తు మనోరాజ్యనగరము వంటిదే సుమా! ఊహలో ఒక నగరం కళ్ళు మూసుకొని చూడటం ఎటువంటిదో కళ్ళు తెరచినపుడు కనిపించే స్థావరజంగమాత్మక జగత్తు అటువంటిదే! వాస్తవానికి ఈ జగత్తు శాంతమగు చిదాకాశమే అయి ఉన్నది.

శ్రీరాముడు : "ఈ జగత్తుగా కనిపించేది భ్రమయే! రసవత్తరమగు నాటక ప్రదర్శనమే!" అను ఎఱుక (లేక) జ్ఞానమును సిద్ధించుకొన్న జ్ఞానికి ఈ జగత్తునందు సంచారం, తదితరులతో సహ

జీవనం – ఇవన్నీ ఎట్లా (ఏ రూపంగా) అనిపిస్తున్నాయి? అట్టి ప్రబుద్ధుడు తదితర అప్రబుద్ధులతో సహజీవనం చేస్తున్నప్పుడు ఏవైనా గుర్తింపతగిన విశేష లక్షణములు కలిగి ఉంటాడా?

శ్రీవసిష్ఠ మహర్షి : ఒకాయన గొప్ప స్వప్నంలో ఉన్నాడనుకో! అతని స్వప్నదర్శనంలో నీ యొక్క రాక–పోకలు నీకు సంబంధం లేకుండానే ఎట్లా సిద్ధిస్తున్నాయో, ఆ విధంగా ఈ జగద్రూపమగు భ్రమయందు తత్త్వజ్ఞుని రాకపోకలు కూడా ఉంటున్నాయి. అతడు అంతా యథాతథంగా (అప్రబుద్ధులవలెనే) పొందుతూ కూడా ఇదంతాకూడా అన్యమనస్కంగా దర్శిస్తూ ఉంటాడు.

అన్యమనస్కం -

పరచిన్తా పురోమధ్యే గత విఘ్నం గమ–ఆగమౌ ।
యథాన్తస్తవ శూన్యత్వాత్ తథైవ అస్మిన్ జగత్‌భ్రమే ॥

ఎవరో ఒకాయన యొక్క మనోరాజ్యం (ఊహారాజ్యం)లో కల్పితమైన నగర మధ్యంలో నీ యొక్క రాక–పోకల వలె ఈ జగద్రూపభ్రమయందు ఈ జీవుల రాక–పోకలు సిద్ధిస్తున్నాయి సుమా! తత్త్వజ్ఞులు ఈ చమత్కార వ్యవహారం అట్లే గమనిస్తున్నారు. ఇక ఈ ఎదురుగా కనబడే సముద్ర–పృథ్వి–నది–పర్వతాదులతో కూడిన సృష్టి గురించి అడుగుతావా? బాగా దాహం వేస్తూ ఉన్నవాని కళ్ళకు జల రహిత ఎడారి ప్రదేశంలోని వాయు సంబంధమైన నీడ తరంగాలే జల తరంగాలుగా కనిపించి అతనిని పరుగులు తీయించినట్లుగా... ద్రష్ట యొక్క అంతఃకరణమే ఆయా సముద్రము మొదలైన రూపములుగా విజృంభిస్తోందని జ్ఞానుల నిర్వచనం. స్వప్న నగరంలో అంతా మిథ్యయే అయినట్లు, బాలునికి భూతాలు కనిపించటం భ్రమ మాత్రమే అయినట్లు ఈ జగత్తునందు అసత్యత్వమే తప్ప మరింకేమీ లేదు. సత్యమగు బ్రహ్మమే అసత్యమగు జగత్–అహంకారముల రూపమున భాసిస్తోంది. ఏదైతే భ్రాంతికి లభించకయే సర్వదా స్ఫురిస్తోందో అయ్యది మాత్రమే 'వాస్తవమగు సత్యము' అయి ఉన్నది. ఈ జగత్తు సత్తు కాదు. పోనీ అసత్తా? ఊహూ! అసత్తూ కాదు. సత్–అసత్‌మయము కూడా కాదు. ఇదంతా కూడా ఇంద్రియములచే నిశ్చయించబడజాలని తత్త్వమై ఉన్నది. ఇది అనిర్వచనీయమై ఆకాశంలో గంధర్వనగరంలాగా భావనచే స్వకల్పితమాత్రమై భాసిస్తోంది.

ఓ రామచంద్రా! తత్త్వ బోధ యొక్క బలం చేత జ్ఞాని పట్ల సర్వ విషయములు శమిస్తున్నాయి. ఇక అతని ఇచ్ఛ–అనిచ్ఛలు సమత్వమును పొందుచున్నాయి. విక్షేపరహితమై జీవన్ముక్త సుఖము కొరకై, శ్రేయము కొరకై 'అనిచ్ఛయే' పరమ ఫలదాయకమగుచున్నది.

శ్రీరాముడు : నిర్వికారమగు ఆత్మయందు సవికారమగు అహంకారము – జగత్తు అనబడేవి ఎందుకు స్ఫురిస్తున్నాయి.

శ్రీవసిష్ఠ మహర్షి : నిర్వికారమగు ఆకాశము నుండి వాయువు, వాయువు నుండి అగ్ని, అగ్ని నుండి ద్రవం (జలం), ద్రవం నుండి ఘనం (భూమి) అనే క్రమాల వలెనే నిర్వికారమగు ఆత్మ నుండి సవికారమగు అహంకారము–జగత్తు మొదలైనవన్నీ ప్రభవిస్తున్నాయి. అవి మొట్టమొదట ఆత్మయందు జ్ఞప్తి రూపంలోనే, నిశ్చల వాయువునందు చంచల వాయు తరంగత్వము వలె ఉండి

ఎప్పుడో ప్రదర్శితమౌతున్నాయి. నిశ్చల వాయువునందు చంచల వాయు తరంగ ప్రదర్శనమునకు కారణము లేనట్లే... నిర్వికారమగు ఆత్మయందు జ్ఞప్తి రూపంగా స్వయంకల్పిత జగత్తు అనబడేది ప్రదర్శితమౌతున్నది. నిర్వికారమగు ఆత్మయందు ఈ చంచల అహంకార జగదాదుల ప్రదర్శనకు కారణమంటూ ఏదీ లేదు.

చైతన్యము విషయముల వైపుగా అభిముఖమై ఉండటమే చిత్తము. అదియే సంసారము. అదియే 'ఇచ్ఛ' కూడా. అట్టి 'ఇచ్ఛ' నుండి ముక్తి అవటమునే 'ముక్తి' అంటున్నారు. కాబట్టి అట్టి ముక్తిని ఎఱిగినవాడై ఇచ్ఛారహితుడవై, శాంతుడవై ఉండెదవు గాక!

అయితే... ఇచ్ఛ ఉండవచ్చు గాక! ఉండకపోవచ్చు గాక! సృష్టి ఉండవచ్చు. లేక ప్రళయం వస్తూనో, లేక వచ్చియే ఉండవచ్చు. ఏది ఎట్లున్నా ఆత్మజ్ఞానికి సందేహాలే ఉండవు. ఎందుకంటే ఈ జగత్తు సత్యము కాదు కాబట్టి! ఆత్మజ్ఞాన రూపకమగు చిదాకాశమునందు "ఇచ్ఛ-అనిచ్ఛ-సత్తు-అసత్తు-భావము-సుఖము-దుఃఖము"-ఇటువంటి కల్పనలేవీ సంభవించజాలవు.

ఇచ్ఛానాం తానవం యస్య దిన - అనుదినమాగతమ్
వివేక-శమ-తృప్తస్య తమాహుః మోక్షభాగినమ్

ఏ మనుజుడైతే వివేకము చేతను, శమము చేతను ఇచ్ఛలు రోజు రోజుకు తగ్గించుకుంటూ స్వభావ సిద్ధమగు తృప్తిని పెంపొందించుకుంటూ ఉంటాడో... అట్టివాడే 'మోక్ష భాగినుడు' అని చెప్పబడతాడు.

'ఇచ్ఛ' అనే చాకుతో హృదయమును పొడవటం జరిగినప్పుడు మాత్రమే ఆ హృదయంలో శోకము-మోహము మొదలైన వేదన పుడుతోంది. ఆ శోకము-మోహము అను వేదన తొలగాలంటే మణి-మంత్ర-ఔషధముల వలన అయ్యే పని కాదు. బ్రహ్మదేవుని సృష్టిలోని పదార్థములైనట్టి ఈ మణి-మంత్ర-ఔషధములు దేహమునకు చికిత్స చేయగలుగుతాయేమో గాని,... అతని మనస్సుకు చికిత్స చేయలేవు. ఎందుకంటే మనిషి యొక్క దుఃఖ కారణమేమిటో, దానికి నివారణోపాయమేమిటో మేము ఎంతగానో ముందుగానే పరిశీలించి చూచాం. భ్రాంతితో కూడుకొని, మిథ్యారూపమైన ఉపాయములతో ఒకనికి ఒక విషయము పట్ల గల భ్రాంతిని తొలగించవచ్చునేమో గాని... అతని భ్రాంతి స్వభావమును తొలగించగలవా? లేదు. ఒకనియొక్క బహు యోజన విస్తారమైన మనో కల్పనలో మరొకడు ప్రవేశించగలడా? ఆ మరొకడు భ్రమచే దర్శించే స్వప్న సదృశ విషయాలను తొలగించడం మొదటివానికి కుదురుతుందా? కుదరదు. అనగా... నీ మిత్రుడు నిదురిస్తూ-పీడకలకంటూ దుఃఖ భాజనుడగుచుండగా జాగృత్‌లో ఉన్న నీవు నీ పొగడ్తల చేతనో, ధనాదులు ఇచ్చో ఆ దుఃఖము తొలగించడం కుదరనిది కదా! లేదు కదా! అందుచేతనే ప్రాపంచిక విషయాలు జీవునికి అనునిత్య శాంతిని ప్రసాదించలేకపోతున్నాయి.

అసత్పదార్థమును తీసుకొని అసత్తుగా ఏర్పడిన సంసార దుఃఖమును మొదలంటా తొలగించటం కుదేరేపని కాదు. పిల్లవాడు వస్తువుల కోసం ఏడుస్తుంటే ఏదో వస్తువు ఇచ్చి అప్పటి వరకు ఏడుపు మానిపించగలం. అంతమాత్రం చేత ఏడ్చే స్వభావం తొలగదు. ఆ వస్తువుపై అపేక్ష

తొలగగానే మరల మరొక వస్తువు కోసం దుఃఖిస్తూనే ఉంటాడు. అట్టి దుఃఖం జీవితాంతం ఏదో రూపంలో అనేక జీవులను వెంటనంటి ఉంటూనే ఉంటోంది. 'అసత్ పదార్థములచే దుఃఖం తొలగుతుంది' అని తలచటం 'కుందేటి కొమ్ములను తీసుకొచ్చి ఆకాశాన్ని కప్పి ఉంచాలనుకోవటం'... వంటిది.

శీతలం అధికం అయినప్పుడు జలం కొద్ది క్షణాలలో గడ్డకడుతుంది చూచావా? అట్లాగే చిదాకాశము కూడా ఈ దేహాదులపట్ల అహంభావ రూపమగు అభిమానమును పొందినప్పుడు మనస్సు ద్వారా దేహాది వ్యవహారాలను పొందుచున్నది. అయితే ఈ జడమగు దేహాదులు పొందిన ప్పటికీ చిదాకాశం యొక్క వాస్తవ తత్త్వమగు చిత్‌శక్తి అక్షయమయ్యే ఉంటోంది గాని, చిత్‌శక్తి ఏదీ పోగొట్టుకోవటం లేదు. కానీ అది అద్దాని యందే అసత్యములగు ఈ దేహాదులన్నీ అనుభవిస్తోంది. అనగా, ఈ దేహాదులు స్వప్న సదృశంగా పొందుచున్నంత మాత్రం చేత చిదాకాశానికి వచ్చిపడే లోటేమీ వాస్తవానికి ఉండదు. ఆకాశం నీలంగా కనిపించినంత మాత్రంచే అక్కడ నీలిరంగుతో కూడిన ఏదైనా పదార్థం ఉన్నదా? లేదు కదా! నీలం రంగు వాస్తవానికి అసత్యమైనప్పటికీ సత్యమే అయినట్లు కనిపిస్తోంది. అట్లాగే పరమాత్మయందు ఈ సృష్టి సత్యము కాదు. అసత్యము కాదు. అందుకనే దీనిని 'అనిర్వచనీయం' అని శాస్త్ర నిర్ణయం.

ఆకాశము-శూన్యత్వము అభేదము కదా! వాయువుకు-వాయు తరంగాలకు భేదమే మున్నది? అట్లాగే బ్రహ్మము-సృష్టులు అభేదమగు ఏక రూపములే సుమా!

నేఽ హ సంజాయతే కించిత్ జగదాది! న నశ్యతి,
స్వప్నో నిద్రాగతస్యేవ కేవలం ప్రతిభాసతే ॥

యథార్థానికి బ్రహ్మమున 'జగత్తు-అహంకారము' ఆదిగాగల పదార్థాలేవీ ఉత్పన్నం కావటం లేదు. నశించటయూ లేదు. నిద్రించేవాని స్వప్నంలోని పదార్థముల వలె అవన్నీ కేవలం 'ప్రతిభాస మాత్రములు' అయి ఉన్నాయి. స్వప్నంలో ఏ వస్తువులు పడుతున్నాయ్? ఏవి నశిస్తున్నాయ్? ఈ జగత్ పదార్థములు అట్టివే! ఈ విధంగా ఈ పృథ్వి మొదలైనవేవీ లేనివే! సృష్టి అంతా ప్రతిభాస మాత్రమే సుమా! కేవలం చిన్మాత్రము మాత్రమే తనయందు తానే స్థితి కలిగియున్నది! ద్వైత-ఏకత్వమూ రెండూ ఇక్కడ అసంభవమే! అందుచేత బుద్ధి మొదలైన వాటన్నిటి యొక్క కరణత్వమంతా అసత్యమే! ఎందుకంటావా? అంతా బ్రహ్మమే అయి ఉండగా 'దీని చేత ఇది నిర్వర్తించబడుతోంది. అది అద్దానిని నిర్వర్తించటం లేదు'... మొదలైన వ్యవహారమంతా అసత్తు కాక మరింకేమిటి? ఇక్కడగాని, మరింకెక్కడైనా గాని... పరమార్థ వస్తువు ఒక్కటే సంభవం. ఇక తదితరమైనదంతా ఆ పరమార్థ సద్రూపమునే పొందినదగుచున్నది. అట్టి నిర్విషయ చైతన్యమున ఈ కల్పములు, మహా కల్పములు, వాటి క్రియాసమూహములు సహేతుకంగాను-సక్రమంగాను ఉన్నట్లే ప్రతిభాసించ వచ్చుగాక! ఇవన్నీ స్వప్న సదృశము మాత్రమే! స్వప్నంలో కొద్ది క్షణముల కాలంలో సుదీర్ఘమైన సంఘటనలు, స్వమరణం వంటి అహేతుకమైన-క్రమరహితములైన విశేషములు అనుభూతము

లగునట్లు ఇదంతా చైతన్యము తనయందే తన స్వరూపమునే సృష్టి రూపంగా అనుభవం పొందుతోంది. కనుక ఈ కనబడే పృథ్వి, పర్వతాలు, ఈ కంటికి కనిపిస్తున్న గోడ మొ॥ తదితర సర్వ వస్తు సముదాయము, ఆయా వస్తువుల సంచలనము ఇవన్నీ చిదాకాశమే అయి ఉన్నాయి. స్వప్నంలో కనిపించే నది, ఆలయం, గుడిసె మొదలైనవన్నీ ఆ స్వప్నద్రష్ట యొక్క చిదాకాశ రూపమే అయినట్లు... ఈ జాగ్రత్ ద్రష్టదర్శనము కూడా జాగ్రత్ ద్రష్ట యొక్క చిదాకాశ రూపమే అయి ఉన్నది. 'చిదాకాశ'మనే గోడపై 'చైతన్యము' అను రంగుచే ఈ 'జగత్తు' అనే చిత్రం అంతటా పరిపూర్ణమై వ్యాపించియున్నది. అట్టి ఈ జగత్తు భావనచేతనే అనుభవమౌతోంది, కాబట్టి... అట్టి ఈ జగత్తు ఉదయించటమూ లేదు, అస్తమించటమూ లేదు. శమించటమూ లేదు, గ్లానిని పొందటమూ లేదు. 'చైతన్యం' అను ద్రవ రూపమైన జలమునందు 'జగత్తు' జలంగానే ఉంటోంది.

1. చైతన్యము సర్వదా యథాతథంగా నిర్వికారంగా జగత్ రహితంగా ఉన్నది.
2. అయితే జగత్తుగా కనించేది ఆ నిర్విషయ చైతన్యమే!

...అనే ఉభయ వాక్యములు సమంజసమే అనిపించుకుంటున్నాయి. వాస్తవానికి చైతన్యము నందు 'జగత్తు' అనునదేదీ ఉత్పన్నమవటం లేదు, శమించటమూ లేదు. 'శాంతము-జగత్ రహితము' అగు చైతన్యమునందు జగత్తు మొదలుగాగల ఈ ఈ విషయములు అత్యంత అసంభవమై ఉండగా, ఇక జగద్రూపముచే చైతన్యము ఉదయించిందని, జగత్ రాహిత్యముచే చైతన్యము అస్తమించిందని చెప్పటం ఎట్లా కుదురుతుంది? అది కుదిరేది కాదు.

ఎప్పుడైతే బ్రహ్మము తన యొక్క మాయచే సృష్టి రూపంగా వివర్తితం అవుచున్నదో, అప్పుడు చైతన్యం యొక్క వాసనానుసారంగా (సంకల్పముల చమత్కారంచే) పర్వతాలు ఆకాశ రూపంగాను, ఆకాశము పర్వతముల రూపంగాను అనుభవములు కాగలవు. ఇది ఇట్లా అయి ఉండగానే కొందరు యోగులైనవారు తాము సంపాదించిన యోగ శక్తి (తపోశక్తి) చేత 'చైతన్యం' అనే సిద్ధ చూర్ణం యొక్క ప్రయోగం చేత ఈ జగత్తును ఆకాశంగాను (శూన్యంగాను), శూన్యమగు ఆకాశమును ముల్లోకములుగాను అర్ధ నిమిషంలో కావించి వేయగలుగుచున్నారు. సిద్ధులచే కల్పితములైన ముల్లోక జగత్తులు ఆకాశంలో ఒకదాని నుండి మరొకటి రహస్యమై (గుప్తమై, తెలియబడనివై) ఏర్పడి ఉంటున్నాయి. మహా సముద్రంలో వేలాది తరంగాలు ఒకదానిలో మరొకటి మిళితం అయి ఉంటూనే తరంగములన్నీ కూడా వేర్వేరుగా కూడా కనిపిస్తాయి కదా! తరంగాలన్నీ వేర్వేరుగా కనిపిస్తున్నప్పటికీ అవన్నీ కూడా జలము కంటే వేరుకాదు కదా? అట్లాగే మహా చైతన్యమున అనేకములైన బ్రహ్మాండములు పరస్పరం కూడి ఉన్నప్పటికీ అవన్నీ కూడా చైతన్యము కంటే ఏమాత్రం వేఱు కాదు.

శ్రీరాముడు : హే సర్వజ్ఞా! వసిష్ఠ మహర్షీ! "యోగులు ఒక సృష్టిలోంచి ఇంకొక సృష్టిలోకి ప్రవేశించగలిగే సామర్థ్యము కలిగి ఉంటారు"... అని విజ్ఞులు అంటూ ఉంటారు. వారికది ఎలా సాధ్యమగుచున్నది?

శ్రీవసిష్ఠ మహర్షి : ఒక యోగి తన యోగ బలం చేత ఈ ఉపాధిని 'మూల ప్రకృతి' యందు లయింపజేసి... పరస్పరం రహస్యంగా (ఒకదానిచే మరొకటి) అగ్రాహ్యంగా ఉన్నట్టి ఒక సిద్ధ లోకంలోంచి మరొక సిద్ధ లోకంలోనికి ప్రవేశించటము అనే ప్రక్రియను 'ఒక సృష్టి నుండి మరొక సృష్టిని పొందటం'... అని విజ్ఞులు చెపుతూ ఉంటారు.

ఈ జీవులందరూ ఉన్నదెందులో? - ఓ రామచంద్రా! ఆకాశమునందు శూన్యత్వము ఉంటోంది చూచావా? అట్లాగే నాశనరహితమగు పరబ్రహ్మమునందు ఈ సమస్త భూతములు (జీవులు), వాటికి భోగ్యములగుచున్న సమస్త సృష్టి సమూహములు నిర్విఘ్నంగా స్థితి కలిగి ఉంటున్నాయి. ఈ సృష్టి విభ్రమములన్నీ కూడా పరమార్థమగు చిదాకాశము యొక్క నిజ క్రీడారూపములే! ఇవన్నీ స్వాభావికములే కూడా! స్ఫటిక శిలలో కనిపించే గీతలవలె అవి వాస్తవానికి చిదాకాశమునందు ఉదయించటం లేదు. అస్తమించటం లేదు. పుష్పము-సుగంధము వేర్వేరు కానప్పటికీ వేర్వేరుగా ఉన్నట్లు అనిపిస్తుంది చూచావా? చిదాకాశము-అందలి సృష్టులు వేర్వేరు కానప్పటికీ అవి వేర్వేరుగా ఉన్నట్లు అనిపిస్తూ ఉంటుంది.

స్వసంకల్పానుసారమే ఇదంతా! - ఈ ప్రపంచమంతా కూడా స్వసంకల్పానుసారం రూపము కలిగి ఉన్నది. కనుక స్థూల సంకల్పము-స్థూల మోహము గల సామాన్య దృష్టికి ఇదంతా స్థూలంగా కనిపిస్తోంది. సూక్ష్మదృష్టి గల వారికి సూక్ష్మ రూపంగాను, సూక్ష్మతర దృష్టి గల వారికి సూక్ష్మతరం గాను, సూక్ష్మతమ దృష్టిగలవారికి సూక్ష్మతమముగాను స్థితినొంది ఉన్నదగు చున్నది. ఈ విధంగా, వారి వారి అనుభవములను అనుసరించి వారందరి కథనము సత్యమే అయి ఉన్నది. అట్టి వేర్వేరు దృష్టులు కలవారు వేర్వేరు అనుభవాలు కలిగి ఉండి వాదోపవాదములు చేసుకొంటున్నారు గూడా! ఎవరి దృష్టి ఎట్టిదో... వారి వారికి అట్టి దర్శనము ఘనీభూత సత్యంగా అనుభవమౌతోంది.

విజ్ఞాన వాదులు : "అభ్యంతర విజ్ఞానం మాత్రమే సత్యము కాని, బాహ్యమున ఏదీ సత్యం కాదు."

వైశేషికులు : "బాహ్యమున గల దృశ్య వస్తువులైనట్టి ద్రవ్య-గుణ-కర్మాదులు సత్యమే! ఎదురుగా కనిపిస్తున్న వాటిని అన్యమని అనటమే మూర్ఖత్వం."

ఓ వాదోపవాదులారా! మీ మీ సంకల్పానుసారమే ఆయా విశేషములు సత్యమనియో, కాదనియో అనిపిస్తూ అట్లే ఫలీభూతములగుచున్నాయని గుర్తించెదరు గాక! ఈ కనబడేదంతా ఆత్మ స్వరూపమే!

ఏ చైతన్యమైతే ఈ జ్ఞాతృ-జ్ఞాన-జ్ఞేయములు... అనబడే త్రిపుటిని ప్రకాశింపజేసే శక్తి కలిగియున్నదో, ఆ చైతన్యమే ఈ జగత్తు రూపంగా కూడా భాసించుచున్నది. కాబట్టి జలము-ద్రవత్వములులాగానే చైతన్యమునకు-జగత్తుకు భేదమేమీ లేదు.

ఓ రామచంద్రా! సర్వమునకు ఆధారమైనట్టి కాలము, ఆ కాలమునకు అంతర్గతమైయున్న బ్రహ్మాండాలు, ఆ బ్రహ్మాండాలలో గల 14 లోకాలు, ఆ లోకాలలో గల అహమ్-త్వమ్ (నేను-నీవు) ఇత్యాది భోక్తలు, ఆ భోక్తలు ఉపకరణములై ఉంటున్న ఇంద్రియ సమూహాలు, ఆ ఇంద్రియ

సమూహాలకు విషయాలై ఉంటున్న శబ్ద-స్పర్శాది భోగ్య విషయాలు, వాటివాటి విచిత్ర భోగాలు... ఈ సమస్తం కూడా మాయక-సర్వజ్ఞ-సర్వశక్త్యాదులతో కూడుకొనియున్న ఈశ్వరాత్మయే! పరమార్థమున ఏకం-శాంతం-అజం అయినట్టి చిదాకాశం మాత్రమే ఉన్నది. చిదాకాశమే చిదాకశంలో "ద్రష్ట-దర్శన-దృశ్య" చమత్కారరూపంగా, జలంలో ఆకాశంలాగా ప్రతిబింబిస్తోంది.

ఇట్టి నిశ్చయము ఎవరు కలిగి ఉంటారో వారికి ఇక రాగాదులు ఏమాత్రం సంభవించవు. 'ఇచ్ఛ' మొదలైన సర్వదోషములు జయించడానికి ఇదొక్కటే ఉపాయం.

❖❖❖

21. జగత్తే పరమాత్మ స్వరూపం

శ్రీవసిష్ఠమహర్షి : ఓ రామచంద్రా! మాంత్రికునిచే మంత్రించబడిన కాటుక కళ్ళకు పూసుకున్నప్పుడు ఆకాశంలో ఉద్యానవనాలు, సుందర స్త్రీలు అగుపిస్తారు చూచావా....? అట్లాగే చైతన్యము తన యొక్క అబ్రహ్మత్వపు భ్రమచే "నేను జీవుడను మాత్రమే కదా"!... అని తలచుచూ చమత్కారంగా విక్షేపము పొంది తత్ఫలితంగా తన స్వరూపమునందే ఈ జగత్తును దర్శిస్తోంది. ఇక్కడ ఈ జగద్దర్శనమును రెండు విశేషాలుగా వివరించుకుందాం-

1. బ్రహ్మమునందు 'జగత్తు' అనబడేది ఉండటం.
2. జీవుడు 'జగత్తు' (దృశ్యం) అనే దానిని తన చిత్తంలో ఊహాత్మకంగా అనుభవించటం.

పరమార్థమున ఈ రెండూ ఏక స్వరూపాలే! బ్రహ్మము-జగత్తు... ఈ రెండూ కూడా సదా చిద్రూపాలే! ఈ రెండూ సర్వదా క్షోభవర్జితాలే అయి ఉన్నాయి. కాబట్టి 1. బ్రహ్మం యొక్క సృష్టి, 2. చిత్తంచే సంకల్పితమైన దృశ్యం... ఈ రెండూ కూడా సమానాలే అయి ఉన్నాయి.

ఓ రాఘవా! ఇదిగో... ఈ గోడ ఉన్నది. శిలచే నిర్మించబడిన గోడపై శిల్పిచే ఆయా విశేషాలతో లిఖించబడిన విశాల చిత్ర లేఖనం ఉన్నది. గోడపై చిత్రించబడిన చిత్రం కూడా గోడయే కదా! గోడకు వేరైనది కాదు కదా! అయితే అత్యంత చమత్కారంగా శిల్పకారునిచే నిర్మించబడిన ఈ చిత్ర కథనంలో లీనమైనవానికి గోడ దృష్టి యందు ఉండదు. గోడయందలి ఆయా స్థలవిభాగములే చిత్రకారుని కల్పనా చాతుర్యం చేత 'నది-పక్షులు-వినీలాకాశం-బాట-బాటసారులు' మొదలైన విశేషములుగా కనిపిస్తోంది. అట్లాగే...

జ్ఞానము (చిత్తు) నందు కల్పించబడిన ఈ జగద్రూప సృష్టి కూడా జ్ఞాన స్వరూపమే! అయితే ఏం? భ్రాంతి చేత ఇదంతా బాహ్యరూపంగా భాసిస్తోంది. జ్ఞానము సర్వదా సత్యమే కదా! కాబట్టి, 'జ్ఞాన రూపమే' అయి ఉన్న ఈ బాహ్య పదార్థరూపత్వము కూడా సత్యమే!... అని ఎటిగెదవు గాక!

విజ్ఞానవాదులు ఈ 'దృశ్యము సత్యమే! అసత్యం కాదు' అని అంటూ ఉంటారు కదా! అట్లాగే వేదాంతవాదులు 'ఇవన్నీ చిదాత్మ రూపాలే! చిదాత్మ ఎట్లా నిత్య సత్యమో, అట్లా ఇవన్నీ చిదాత్మ రూపంచే సత్యమే! ఆత్మ కంటే (సద్రూపం కంటే) బాహ్య ప్రపంచం వేరుగా స్థితియే కలిగి లేదు -

అని ప్రవచిస్తున్నారు. అందుచేత 1. బాహ్య పదార్థ వాదము 2.అభ్యంతర విజ్ఞాన వాదము, 3. మేము ప్రవచించే జీవ-దృశ్య-బ్రహ్మైక్య వాదము... ఈ మూడు సమన్వయమే అగుచున్నాయి గాని పరస్పర వ్యతిరిక్తం కావటంలేదని మా అభిప్రాయం.

ఈ సమస్తము పరమాత్మయే - సమస్త పదార్థములు చిద్రూపములే! అందుచేత, క్షుబ్ధముగా (కలత పెట్టబడినదిగా) కనిపించే ఆకాశ-వాయు-అగ్ని-జలము-భూమి అను పంచభూతముల యందు అంతటా కూడా క్షోభరహితము-శాంతిమయము, వ్యాపకము, మహాసంరంభ యుక్తము అగు బ్రహ్మసత్తయే ప్రవేశించి ప్రకాశించుచున్నది. ఇట్లు ఆ ఉభయ సత్త (బ్రహ్మము యొక్క సత్త-ఈ కనిపించే జగత్తు యొక్క సత్త).... ఏకైక సత్తయే గాని వేర్వేరు సత్త కాదు. అంతటా (ఇటు జీవుడుగాను-అటు దృశ్యముగాను) ఉన్నది ఆ బ్రహ్మ సత్తయే!

తస్మై సర్వం, తతఃసర్వం, తత్సర్వం, సర్వతశ్చ తత్ ।
తచ్చ సర్వమయం నిత్యం తస్మై సర్వాత్మనే నమః ॥

ఈ సమస్తము ఆ పరమాత్మ కొరకే అయి ఉన్నది. పరమాత్మ నుండే ఈ సమస్తము బహిర్గతమౌతోంది. ఈ సమస్తము పరమాత్మయే. ఇదంతా పరమాత్మచేతనే వ్యాపించబడి ఉన్నది. పరమాత్మయే సర్వమయుడై జాజ్వల్యమానంగా అంతటా ప్రకాశిస్తున్నాడు.

కుండలన్నీ మట్టే! అయితే సామాన్య దృష్టికి అనేక కుండల రకరకాల ఆకారాలే కనిపిస్తాయి. 'ఇది కుండ! అది కూజ! ఇదేమో మూస (మూత)!... అనే అనిపిస్తుంది గాని, అన్నీ మట్టియే అయి ఉన్నాయి'... అని అనిపించదు. అయితే, ఎప్పుడైతే దృష్టి ఆకారభావనను త్యజిస్తుందో, (ఆకారమునకు పరిమితమవదో) అప్పుడు అన్ని మట్టి పాత్రలలోని మట్టి దర్శనమివ్వగలదు.

అట్లాగే, ఈ సర్వము చిన్మయమే! ఈ బాహ్యమున కనిపించే నామరూపములు ఏ నేత్ర వృత్తికి కనిపిస్తున్నాయో, ఆ నేత్ర వృత్తి 'చైతన్యముతోటి వృత్తి' అను దాని ద్వారా జయించబడినపుడు ఇదంతా 'జగత్తు-జనులు'గా కాక ఏకైక చైతన్యంగా ప్రస్ఫుటం కాగలదు. కదిలే దేహాలలోగల కదిలించే ఏకైక చైతన్యం అనుభవమవగలదు. అటు తర్వాత 'చైతన్యములే!' అని స్పష్టమవగలదు. ఈ విధంగా 'ఈ జగత్తే చైతన్యము' అను ఆత్మానుభవం సిద్ధిస్తోంది.

చూచే వానిలో - చూడబడే దానిలోను గల చైతన్యము ఏకరూపములే! అందుచేత ద్రష్ట-దర్శనములు సాక్షియగు చైతన్యము సర్వదా ఏకత్వం పొందుచున్నాయి. ద్రష్ట - దృశ్యము కూడా ఏకైక చైతన్య స్వరూపులే

శ్రీరాముడు : అదేమిటి మహర్షీ! 'ద్రష్ట చైతన్య స్వరూపం-దృశ్యం జడం'... అని చెప్పబడుచున్నది కదా! ద్రష్ట-దృశ్యం... ఈ రెండూ ఏక రూపాలే'... అని మీరు ప్రతిపాదిస్తు న్నట్లు నా కనిపిస్తుంది.

శ్రీవసిష్ఠ మహర్షి : అవును. ద్రష్ట-దృశ్యము కూడా సాక్షియగు చైతన్యమున ఏక రూపములే. ఒకడు ఒక చెఱకు గడను చూచి భక్షిస్తున్నాడనుకో... చెఱకుగడలోని రసము జడము - అది భక్షించే జీవుడు మాత్రమే 'చైతన్యం' అయి ఉండి ఉంటే... అప్పుడు రసానుభవమే సిద్ధించేది కాదు.

జడమగువాడు రసానుభవం పొందలేడు. కనుక ఆ చెఱకు భక్షించేవాడు చైతన్యమే! జడమగు చెఱకు రసము 'మధురము' అనే రూపంగా స్ఫురించజాలదు. కాబట్టి అదీ చైతన్యమే!

జలంతో జారవిడువబడిన జల బిందువు ఆ జలముతో ఏకత్వం పొందుతుంది కదా! అట్లాగే విషయం కూడా చిన్మయ రూపమే అవటం చేతనే చైతన్యంతో లీనమై ఏకరూపమగుచున్నది. కాబట్టే 'నేను ఈ రసమును అస్వాదిస్తున్నాను. ఆ రూపమును చూస్తున్నాను'... అనే అనుభవం కలుగుతోంది. చిన్మయమునందు ద్రష్ట-దృశ్యము ఏకరూపత్వం పొందకపోతే ఒక కట్టె మరొక కట్టె యొక్క అనుభవం పొందజాలనట్లు అసలు 'అనుభవము' అనేదే ఉండేది కాదు.

శ్రీరాముడు : ఒక కట్టె-మరొక కట్టె సజాతీయమైన ఏకత్వము కలిగియే ఉన్నాయి కదా! మరి ఆ రెండూ ఒకదాని యొక్క అనుభవమును మరొకటి ఎందుకు పొందటం లేదు?

శ్రీవసిష్ఠ మహర్షి : ఆ కట్టెలు (కొయ్యముక్కలు) సజాతీయమే అయినప్పటికీ అవి భౌతికంగా మాత్రమే ఏకత్వం కలిగి ఉన్నాయి! ద్రష్టలో అనుభవం స్వీకరించు చైతన్య రూపంగాను, కట్టెలో అనుభవం ప్రసాదించు చైతన్యం - ఈ రెండూ ఒనగూడినప్పుడే 'అనుభవం' అనేది సిద్ధిస్తోంది. ఈ రెండూ ఒనగూడకపోతే అనుభవం ఉండదు. అయితే ఆ ద్రష్ట-దర్శనాలు చైతన్య రూపాలే నని ఇక్కడ నీవు గమనించవలసిన విషయం.

అయితే కాష్ఠము (కట్టె) మొదలైన దృశ్య పదార్థముల స్థితి ఏదైతే కలదో అట్టి ఆచేతన రూపమును మాత్రమే జనులు ఎఱుగుచూ ఉన్నారు. తద్విలక్షణమై సర్వత్రా వ్యాపించి ఉన్నట్టి (అటు ద్రష్టలో ఇటు దృశ్యంలో కూడా ఏకరూపంగా వ్యాపించి ఉన్నట్టి) ఏ చైతన్య రూపస్థితి కలదో... అద్దానిని గమనించలేకపోతున్నారు.

ద్రష్ట-దృశ్యం-ఈ రెండూ కూడా చైతన్య రూపాలే! అదే విధంగా జలం-వాయువు-భూమి-శిలలు మొదలైన పదార్థాలన్నీ కూడా చిద్రూపాలే! అయితే వాటిలో 'స్పందం-బుద్ధి-ప్రాణం-జీవం' మొదలైనవి లేవు.

ఈ ప్రాణ-బుద్ధి-జీవాదులు భావనావశం చేత (కల్పన చేత) సత్తను పొందుచున్నాయి. భావం ఎక్కడి నుండి బయల్వెడలుతోంది చెప్పు? చైతన్యము నుండే! కనుక చైతన్యం యొక్క చమత్కారమే అవన్నీ కూడా! అట్టి చమత్కారం యథేచ్ఛగా చైతన్యమునందే ఉదయిస్తోంది.

సర్వ దృశ్యముల సారం బ్రహ్మమే! - అట్టి బ్రహ్మసత్త యగు ఆత్మ... వీర్యమునందు పురుషశక్తి గాను, వట బీజం (మఱ్ఱి చెట్టు యొక్క విత్తునందు) వృక్షశక్తిగాను, జాగ్రత్-స్వప్నములందు విషయానంద శక్తిగాను ప్రకటితమై ఉంటోంది.

బీజమునందు ఏ సారమైన సత్తా పదార్థము కలదో... అదియే పరమాత్మ. ఆ పరమాత్మయే అంకుర రూపంగాను, శాఖాదుల రూపంగాను విస్తరిస్తూ మరల బీజ రూపుడగుచున్నాడు. బ్రహ్మము సర్వదృశ్య వస్తువుల కంటే కూడా అత్యంత సూక్ష్మము, అంతటికీ కారణ రూపము. అందుచేత బీజాదులలో ఏ సూక్ష్మరూప కారణ సత్త కలదో... అది బ్రహ్మమే అయి ఉంటుంది. ఇక స్థూల

రూపమైనట్టి బీజము-అంకురము-ఆకులు-కాయలు మొదలైనవి సూక్ష్మ బీజ సత్త యొక్క మాయక రూపములు. అవి మిథ్యయేనని కూడా గ్రహించవచ్చు. ఈ సిద్ధాంతమును అనుసరించి సర్వత్రా (ఈ దేహ-మనో-బుద్ధ్యాదులందంతటా) సారమైన వస్తువు బ్రహ్మమే అయి ఉన్నది.

ఒక కుండ లోపల-బయట-ఆ ప్రక్క-ఈ ప్రక్క... అంతటా కూడా ఎటువైపు చూచినా కూడా... మట్టియే అయి ఉన్నది కదా! అట్లాగే ఈ జగత్తు యొక్క ఆమూలాగ్రం ఎవరు ఎలా పరీక్షించి చూచినప్పటికీ... ఈ సమస్తము బ్రహ్మముగానే కనిపించగలదు. బంగారు ఆభరణంలో బంగారం తప్ప మరింక ఎక్కడ మాత్రం ఏముంటుంది? ఈ జగ-జ్జీవాది సర్వము బ్రహ్మమే!

ఓ రామచంద్రా! నీ ప్రక్కనే నిదురించు నీ మిత్రుని స్వప్నంలో కనిపించే గర్జిస్తున్న మేఘ సమూహాలు నీకేమియూ కనిపించవు కదా! అట్లాగే... నాకు ఇక్కడ సృష్టి-ప్రళయాది సంరంభాలేవీ కనిపించటమే లేదు. ఆకాశంలో కనిపించే ఊహా సంబంధమైన గంధర్వసైన్యం ఆకాశం మాత్రమే కదా! అట్లాగే ఈ సమస్త జగత్తు చిదాకాశమే అయి ఉన్నది. భూమిపై పడిన ఒక చిన్న మఱ్ఱివిత్తు జలముచే తడుపబడినదై మహావృక్షంగా అంకురించి అనేకమందికి నీడను ప్రసాదిస్తోంది. అట్లాగే అంతరంగమున గల ఒకానొక సంకల్ప భ్రమయే బాహ్యమున జగద్రూప ఫలాకారంగా ఆవిర్భవిస్తోంది. ఎప్పుడైతే ఈ జీవుడు అహంభావరహితుడై నిరతిశయానంద స్వరూపమగు బ్రహ్మముతోటి ఏకత్వం పొందుతాడో... అట్టి జ్ఞాని యొక్క దృష్టిలో ఈ జగత్తులోని సర్వ వస్తువులు, యోగాభ్యాసంచే లభించగల అణిమ-గరిమ-మహిమ- మొదలైన సిద్ధులు... ఇవన్నీ కూడా బాట ప్రక్కన పడి ఉన్న ఎండుగడ్డి పరకవలె అతిస్వల్ప విషయాలుగా కనిపిస్తాయి. బ్రహ్మంగా అనిపిస్తాయి.

త్రైలోక్యే తన్ న పశ్యామి సదేవ-అసుర-మానుషమ్,
ఏకే రోమాంశ విశ్వస్య యల్లోభాయ మహాత్మనః ॥

ఏ మహాత్ముడగు జ్ఞానికి ఈ బ్రహ్మాండమంతా ఒక కేశం యొక్క విభాగం వంటిది మాత్రమే (అతి లేశమైనది) అవుతుందో... అట్టి వానిని ప్రలోభపరచగల మానవుడు గాని, దేవతగాని, అసురుడుగాని నా కెక్కడా తారసపడలేదు. జ్ఞాని ఎక్కడకు ఏ రీతిగా వెళ్ళవలసి వచ్చినా కూడా... అక్కడ అతనికి ద్వైతరూపమైనదేదీ ఏమాత్రం కనిపించనే కనిపించదు. ఏ మహాత్ముని దృష్టియందు ఈ ప్రపంచమంతా కూడా ఆకాశం వలె శూన్యమాత్రమై ఉన్నదో... అట్టి వానికి ఈ భ్రమ మాత్రాలగు భోగాదులన్నిటిపట్ల ఇచ్ఛ ఉదయిస్తుందా? లేదు. సమస్త విషయములను మొదలంటా నిర్విషయములుగా గాంచ గల మహనీయుడు ధనాది సర్వ ఈషణలు శమించి ఉన్న వాడై... ఇక, ఇక్కడి విభవ-దారిద్ర్యములు రెండింటినీ సమదృష్టితో చూస్తూ ఉండగలుగుతాడు. అట్టి మహాత్ముని మహిమను వర్ణించటం ఎవరి వల్ల అవుతుంది?

మరణ హేతువులచే ఒకింతగా కూడా మరణించనివాడు, జీవన హేతువులచే ఒకింతగా కూడా జీవించనివాడు, బంధు మిత్రాదుల జనన మరణాలదులచే కించిత్తు కూడా హర్ష విషాదాలు పొందనివాడు, శుద్ధ జ్ఞానమయుడు, స్వ ప్రకాశరూపుడు ఆకాశం వలె నిర్మలం - సర్వ వ్యాపకం

అయిన నిత్యానుభవి... అగు మహనీయుని మహిమాతిశయం ఊహించటానికి కూడా అలవి అయినది కాదు సుమా!

బ్రహ్మరూపానుభవి - భ్రాంతి కలవానికి మృగతృష్ణలో నదీజల తరంగ సమూహం కనిపిస్తున్నట్లు అజ్ఞానికి తన భ్రాంతి యొక్క ప్రభావం చేత వాస్తవానికి లేనివన్నీ ఘనీభూతమై ఉన్నట్లే అగుపిస్తోంది. మిథ్య అయినవన్నీ సత్యము వలె అనిపిస్తోంది. కాస్త బాగా పరీక్షించి చూచిన వానికి... "భ్రాంతిని పొందేవాడు లేడు. అంతటా ఏకం-కేవలం-అవ్యయం అయినట్టి పరమాత్మ ప్రకాశమానుడై ఉన్నాడు"... అని సుస్పష్టంగా తెలియబడుచున్నది. భ్రాంతి యొక్క పరీక్షకుడు కూడా భ్రాంతి వలెనే వాస్తవానికి లేనిదే! ఎవడైతే శాంతుడై ఆత్మారాముడై, సర్వ దృశ్యాదులయెడల అత్యంత విరక్తుడై సంసార సముద్రమును దాటివేసినవాడై ఉంటాడో, అట్టి ఉత్త్వజ్ఞుడగు మహనీయుడు బ్రహ్మరూపానుభవి అవుతాడు. అతడు దేహ-ఇంద్రియాది రూపంచే అభాస మాత్రుడు గాను, ఆత్మపరంగా సర్వ లక్షణ-విలక్షణుడుగాను ఉంటాడు. అతని స్వానుభవం జన్మ-మరణాది సర్వ సంసార వ్యవహారాలకు అతీతమై, కేవలీమాత్రమై చెన్నొందుచున్నది. అతడు జగద్రహితుడై జగత్తును వీక్షించగలడు. అతని పట్ల మనస్సు యొక్క గతి అస్తమించి ఉంటుంది. అతడు ఆత్మయందే శాంతుడై బ్రహ్మరూపముతో విద్యమానుడై ఉంటాడు. అట్టి మహాత్ముడు నిశ్చల దీపంలాగా నిర్మల నిర్వాణ స్థితిని అవధరించి ఉంటాడు.

ముక్తుడు : ఎవనికైతే బుద్ధి మొదలుకొని జగత్తు వరకు సమస్త దృశ్యము నిర్విషయమై తోచుచున్నదో క్రొత్తగా లాభించవలసినదంటూ ఏదీ ఎక్కడా తోచదో, అట్టి ఆకాశం వలె ప్రశాంతుడగు మహనీయుని 'ముక్తుడు' అని వేదజ్ఞులు పిలుచుచున్నారు.

శ్రీరాముడు : మహాత్మా! అట్టి మహనీయునిపట్ల 'అహంకారము' అనునది ఉండదు కదా? ఒకవేళ ఉంటే ఏ రూపంగా ఉంటుంది?

అహంకారము యొక్క రూపమేమిటి? -

శ్రీవసిష్ఠ మహర్షి : అవిచారణ చేత 'అహంకారము' అనునది ఉన్నట్లుగా అనిపిస్తోంది.

'అహమ్' అస్థి అవిచారేణ, విచారేణ అహమస్తి నో!

అభావత్ 'అహమ్' అర్థస్య క్వ జగత్? క్వ చ సంసృతిః?

విచారణ చేత 'అహమ్' అనబడేదే లేదు - అని తెలియవస్తోంది సుమా! అహంభావమే లేకపోతే... ఇక జగత్తు ఎచట? జనన-మరణ రూపకమగు సంసారమెచ్చట? వాస్తవానికి చిదాకాశమే 'అన్యథా అనే రూపమగు బుద్ధి మొదలైన ఆకారాలుగా ఉంటోంది. చిదాకాశమే 'బుద్ధి' అను ఆకారాన్ని సంతరించుకొన్నదై రూప-ప్రకాశ-సంకల్పాది రూపమగు బాహ్యాభ్యంతర జగత్తును ఎఱుగుచున్నది.

శ్రీరాముడు : అయితే మనందరికీ కనబడుచున్న ఈ జగత్తు యొక్క రూపమేమిటి?

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఎప్పుడైతే నీ మనస్సు సర్వాత్మరూపమై, అదే తరుణంలో సర్వ పదార్థరహితమై ఒప్పుతుందో... అప్పుడు ఈ సమస్త జగత్తు, ఇందులో కనిపించే సర్వ క్రియా

వ్యవహారాలు బ్రహ్మరూపంగానే భాసించగలవు. ఇప్పుడు జగత్తుగా కనిపించేదే అప్పుడు 'పరమాత్మ'గా అనుభూతమౌతూ ఉండగలదు.

యత్కరోషి, యదశ్నాసి, యజ్జుహోషి, దదాసి యత్,
యత్ తపస్యసి హంస్యేషి తత్సర్వం శివమవ్యయమ్

నీవు ఏమి చేస్తున్నప్పటికీ, ఏది తింటున్నప్పటికీ, దేనిని హోమం చేస్తున్నప్పటికీ, ఏది ఇచ్చుచున్నప్పటికీ, ఏ తపస్సు చేస్తున్నప్పటికీ, దేనిని వధిస్తున్నప్పటికీ... అదంతా కూడా వాస్తవానికి బ్రహ్మమే అయి ఉన్నది. అంతేకాదు! నేను, నీవు, ఈ దిక్కులు, ఆకాశము మొదలైన పంచభూతాలు, ఇచ్ఛ, క్రియ, కాలం, లోక-అలోక పర్వతాలు, ఈ రూప-ప్రకాశ-సంకల్పాది రూపమగు బాహ్య-అభ్యంతర జగత్తు యొక్క అనుభవాలు, త్రికాలాలు, సమస్త బ్రహ్మాండాలు, జరా మరణాది దుఃఖాలు - ఇవన్నీకూడా వ్యాపకరూపమైనట్టి మహా చిదాకాశ రూపమగు బ్రహ్మమే సుమా! బ్రహ్మం తప్పించి మరింకెక్కడా ఏదీ లేదు. ఉండ జాలదు. కాబట్టి ప్రియ రాఘవా! నీవు సుఖ-దుఃఖ-ఆవేశ-చింతా రహితుడవు గాను, అభాసవర్జితుడవు గాను, (భిన్నాభిప్రాయాలు కలిగి ఉండక పోవటం), ఇచ్ఛారహితుడవు గాను, అమనస్కుడవు గాను, దృశ్యవర్జితుడవు గాను, మౌనివియు (సర్వ విశేషాల పట్ల మౌనం సముపార్జించుకున్నవాడి గాను), నిర్వాణరూపుడవు గాను అగుము. ఇక ఆపై ఏది ఎట్లో అట్లే వ్యవహరిస్తూ వెలయుము.

శ్రీరాముడు : మరి మేము ఆవశ్యం నిర్వర్తించవలసి ఉన్న ఆయా క్రియా-వ్యవహారముల పట్ల?

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ దశరథరామా! నీ పురుషోచితమైన క్రియలన్నీ కూడా వాసనారహితాలై 'శాస్త్రం' అను యంత్రవాహకునిచే నిర్వహించ బడుచున్నవగు గాక! అవన్నీ కల్పనావరితాలై, శాంత సమన్వితమై ఒక కొయ్య విగ్రహాన్ని పోలి ఉండుగాక! ఈ బాహ్యంలో మాతాపితృ ఇత్యాది బంధుజనాదుల తోటి నీ యొక్క ఆయా వ్యవహారాలన్నీ అతి స్నేహయుక్తం గానూ ఉండనక్కర్లేదు. లేక, కేవలమూ స్నేహరహితం గానూ ఉండవలసిన పని లేదు. ఇతరులు 'ఇది' అని నిర్దేశించ టానికి గాని, నిర్వచించటానికి గాని కుదరనట్టి నిశ్చల స్వభావుడవై ఉండు. ప్రశాంత మనస్కుడవై ఉండు. చిత్రంలో దేదీప్యమానంగా చిత్రించబడిన దీపం వలె అతి నిశ్చలత వహించి ఉంటూనే ఈ దేహాదుల కారణంగా ప్రవాహపతితంగా సంభవించే ఆయా విధి-నిషేధాలకు, నిర్విషయ-నిర్లిప్తాలకు అతీత స్వభావుడవై నిర్వర్తించు. రామచంద్రా! వాసనారహితుడు, వర్తమాన భోగాలలో విరసత్వం కలవాడు, భావి కాల భోగాలలో ఎట్టి ఆశ-నిరాశ-కోర్కెలు లేనివాడు అగు జ్ఞానికి సచ్ఛాస్త్రాలు ఆత్మసుఖాన్ని, విశ్రాంతిని కలుగజేస్తూ ఉంటాయి. అంతకుమించి అన్యమైనహేతువేదీ అతనికి విశేషరూపమై అగుపించదు. కాబట్టి... నిర్మల చిత్తుడగు తత్త్వజ్ఞానికి కూడా జీవిత వ్యవహారాలలో సచ్ఛాస్త్రాలు, సజ్జనులు, సజ్జనుల అభిమతానుసరణం, ఫలాభిసంధిరాహిత్యం - స్వభావ సిద్ధం గానే రుచిస్తూ ఉంటాయి. అట్లు వర్తించటయే జ్ఞానులు అసాధారణ చిహ్నమని చెప్పవచ్చు. అంతే గాని, యథేచ్ఛానుసరణం (తన ఇష్టం వచ్చినట్లు వ్యవహరించడం) జ్ఞానుల స్వభావమే అయి ఉండుటలేదు.

❖❖❖

22. సర్వరూపియగు చిదాత్మ

శ్రీరాముడు : మహర్షీ! సంసారబంధం క్షయించగా విశ్రాంతి పొందిన జ్ఞాని తదితరులతో కూడి ఈ సంసారమున పాల్గొనుచున్నప్పుడు ఆతని వ్యవహార సరళి అవగాహన, అనుభవం ఎట్లా ఉంటాయి?

శ్రీవసిష్ఠ మహర్షి : సంసార బంధం క్షయించినప్పుడు అట్టివాడు స్వాభావికమగు ఆత్మ సాక్షాత్కారం సంతరించుకొని ఉంటాడు. అతడు శాస్త్రానుసారంగా, లోకమర్యాదానుసారంగా వ్యవహరిస్తూనే మరొకవైపుగా సంకల్పరాహిత్యము వహించి ఉంటాడు.

శ్రీరాముడు : అనగా సంకల్పరహితుడై (సంకల్పములను వదలి) కాష్ఠ మౌనం వహించి ఉంటాడా?

శ్రీవసిష్ఠ మహర్షి : ఊఁహూ! కాదు. సర్వ వ్యవహారాలకు హేతువై ఉండే సంకల్పాలను కూడా 'స్వాత్మ' గానే గాంచుచూ ఉండడం చేత అతడు సంకల్పం అనబడేదేదీ తన నుండి వేరుగా ఎరుగకయే ఉంటాడు. స్వస్వరూపం నుండి సంకల్పాలను వేరుగా ఎరుగటయను సంకల్పాభాస అని అంటారు. అట్టి సంకల్పాభాస (అలీకమే గాని) అసత్తేగాని, సత్తు కాదు. అద్దముపై ధూళీ కణాలను నోటితో ఊది తొలగిస్తాం చూచావా? అట్లాగే ఏదైనా కారణంచే కించిత్ అహంభావం తత్త్వజ్ఞుని యందు ఎప్పుడైనా ఆవిర్భవించినా అది జ్ఞాన స్వభావంచే తొలగించబడుతుంది. ఆ అహంకారం అద్దంపై తుడిచివేయబడిన ధూళివలె మరల అగుపించదు.

అజ్ఞానావరణం క్షయించినవాడు. సర్వ కోర్కెలు ఉపశమించినవాడు. ఆనందముచే పరిపూరితమైన ఆత్మగా సంతరించుకున్నవాడు... అగు జ్ఞాని నిరతిశయా నందరూపమగు 'ఆత్మసత్త' గానే శోభిస్తూ ఉంటాడు.

అతడు సర్వుల 'సందేహాలు' అనే ధూళిని తొలగించే వాయువు వంటివాడు. నిరావరణమైనట్టి (ఆవరణలు లేనట్టి) ఆత్మ ప్రకాశంతో కూడిన బుద్ధి కలిగినవాడై ఉంటాడు. అట్టి జ్ఞాని ఎక్కడుంటే ఆ ప్రదేశము పూర్ణచంద్రోదయమైన ఆకాశం వలె ప్రకాశిస్తూ ఉంటుంది.

సంసార మోహరహితుడు... సర్వసందేహ వర్జితుడు, ఆత్మప్రకాశ స్వరూపుడు... శరత్కాల ఆకాశం వలె నిర్మలుడు. అగు తత్త్వ జ్ఞానికి – జ్ఞేయస్వరూపమగు ఆత్మకు అభేదమేనని గ్రహించు.

సంకల్పరహితుడు నిరాధారుడు. శాంతుడు అగు జ్ఞాని తన స్పర్శచే జనులను నిస్సందేహులు గాను, పాపరహితులుగాను స్వభావసిద్ధంగానే తీర్చిదిద్దగలుగుతాడు. వారందరి హృదయాలలోను బ్రహ్మలోకం నుండి వేంచేసిన 'వాయువు' వలె అకృత్రికమగు ఆహ్లాదత్వమును స్థాపింపజేయగలడు. అట్టి మహనీయులతో మరల మరల సంభాష కొనసాగించమని జనులకు నా మనవి.

అసద్రూప ఉపలంభానాం ఇయం వస్తు స్వభావతా ।
యత్ సర్గ వేదనం స్వప్న, వంధ్యా పుత్రో ఉపలంభవత్ ॥

ఓ సర్వ జనులారా! స్వచ్ఛము, త్రికాల అబాధ్యము అగు నిర్మలాత్మతత్త్వమును సంపాదించు కోవటం మానివేసి ఈ నిస్సార సంసారంలో మూర్ఖుల వలె సంచరించటం ఏం ఉచితం? ఈ

అసత్పదార్థ రూపాల ప్రాప్తి యొక్క వస్తు స్వభావం ఎటువంటిదో గమనిస్తున్నారా? ఇదంతా కల లోని స్వర్గానుభవం వంటిది! గొడ్రాలి కుమారులు ఎటు వెళ్ళారో తెలుసుకోవాలనుకోవటం వంటిది! ఇదంతా మొదలంట అవిద్యా మాత్రమైయున్నది. అట్టి ఈ స్వప్న సదృశ జగత్పదార్థముల అనుభవమునకు ప్రాకులాడటమే సంసారం యొక్క రూపం. అసత్పదార్థ ప్రాప్తియే జగత్తు యొక్క స్వభావమై ఉన్నది. అసత్యమగు ఈ సంసారమును పరికిస్తూ ఇందు సృష్టి-మోక్షములను ఎఱుగుట కొరకు ఎంత వెతికి ఏం ప్రయోజనం? ఇదంతా గొడ్రాలి కుమారులను చూడటానికి వెళ్ళటం లాగాను, స్వప్న సదృశంగాను ఉండి ఉండగా ఇక్కడ అర్థసిద్ధి ఎట్లా లభిస్తుంది? ఈ జగత్తు వాస్తవానికి అనిర్మితమైనది. భాషకు విషయమే కాదు. ఎందుకంటే 'ఇది ఇట్లు' అను స్థిరమైన భావనకు అర్హమైనదేదీ ఇక్కడ లేదు. 'ఇది దీనిపై ఆధారపడి ఉన్నది' అని చెప్పుటకు కూడా కుదరనిది. అట్టి ఈ జగత్తు బ్రహ్మరూపముచే మాత్రమే సత్యం. బ్రహ్మరూపమును అంగీకరించక పోతే ఈ జగత్తుకు గల రూపమేమిటో నాకు తెలియదు.

ఆత్మ యందు విశ్రాంతి -

శ్రీరాముడు : 'ఆత్మయందు విశ్రాంతి' అని శాస్త్రములచే చెప్పబడే వస్తు స్వభావము ఎట్టిది?

శ్రీవసిష్ఠ మహర్షి : అహంభావాదులుగాని, సృష్ట్యాదులుగాని, సుఖ దుఃఖాదులుగాని పొందక పోవటమే 'ఆత్మయందు విశ్రాంతి' అను వస్తువు యొక్క స్వభావం అయి ఉన్నది.

శ్రీరాముడు : ఆత్మ ఎట్లు ఎక్కడ దర్శనమౌతుంది?

శ్రీవసిష్ఠ మహర్షి : ఒకవ్యక్తి ఒక చోట నిలబడి తన చూపును భూమి పైనుండి మరల్చి లక్షలాది మైళ్ళ దూరంలో గల ఒకానొక ప్రదేశముపై నిలిపి ఉంచాడనుకో! అనగా? అతని సంవిత్తు (ప్రజ్ఞ/ఎఱుక) భూమిని వదలి దూరమున గల మరొక ప్రదేశంపై నిలిచినట్లు కదా! అయితే, అట్లు సంవిత్తు నేత్రవృత్తి ద్వారా సమీప వస్తువును త్యజించిన తర్వాత, మరియు ఇంకనూ సుదూర స్థానమును (ఉదా: సూర్యుని) చేరకముందు మధ్య నిర్విషయరూపమై ఉంటోంది కదా! అట్టి ఆ రెండు ప్రదేశముల మధ్య ఉండే ఏ నిర్విషయ చైతన్య స్వరూపము కలదో... అదే నిరంజనమగు ఆత్మ యొక్క రూపమై ఉన్నది. (సంవిత్తు 'భూమి' అను విషయమును త్యజించిన తర్వాత... ఆకాశంలోని సుదూర స్థానమును ఇంకను చేరకముందు... మధ్యలో నిర్విషయమై ఉంటుంది కదా! ఇదియే నిర్మల సంవిత్తు లేక ఆత్మరూపం). అట్టి భూతల-సూర్య స్థాన (ఆకాశ-ప్రదేశ స్థాన) ముల మధ్యగా గల చైతన్యం స్వరూపం... చలనము లేని వాయువు వంటిది. ఆకాశకోశం వలె అతి నిర్మలమైనది. విషయరహితమైనది (ఒక విషయమును త్యజించి, ఇంకనూ మరొక విషయమును స్వీకరించనట్టి స్థితి కదా!) పరమశాంతమైనది. చిన్మయ రూపమైనది. చిన్మాత్రము అని చెప్పబడునది. వికసించిన లత వలె నిత్యోదితమైనది.

'అదే సమస్త జీవ సమూహం యొక్క ప్రసిద్ధమైన స్వభావం'... అని విజ్ఞులు చెప్పుచున్నారు. అట్టి శుద్ధ-అచంచలిత భావాన్ని సంతరించుకొనినట్టి వివేకి దృష్టికి ఈ సృష్టి భాసింపకయే ఉంటోంది.

శ్రీరాముడు : స్వామీ! ఈ జగత్తులో పాల్గొనుచున్న జీవునికి అట్టి నిర్విషయత్వము అనుభవం అవటం సుసాధ్యమేనంటారా?

శ్రీవసిష్ఠ మహర్షి : స్వప్న సమయంలో జాగ్రత్తు లేదు. సుషుప్తిలో స్వప్నం లేదు. స్వప్నంలో సుషుప్తి లేదు. జాగ్రత్తులో స్వప్న–సుషుప్తులు లేవు. కానీ చైతన్యము సర్వత్రా సాక్షిరూపముచే ఆ మూడు స్థితులలోనూ ఆక్రమించుకొనియే ఉన్నది. వాస్తవానికి ఈ జీవునకు అనుభవమగుచున్న జాగ్రత్–స్వప్న–సుషుప్తులు భ్రమ రూపాలే నని గ్రహించు. అంతేకాదు. సృష్టి–ప్రళయాలు కూడా భ్రమ రూపాలే అయి ఉన్నాయి. యథార్థానికి ఆ స్వప్న–సుషుప్తి–సృష్టి–ప్రళయాలు భ్రాంతియే స్వభావంగా కలిగి ఉన్నాయి. అనగా వాస్తవానికి లేవు. మరి? సత్యం, శాంతం అయినట్టి చిద్రూపమే అంతటా పరిపూర్ణమై ఉన్నది. మనం దేనిని 'భ్రాంతి' అని పిలుస్తాం? ఏదైతే అనుభవమగుచూ, పరిశీలించి చూచినప్పుడు 'మొదలే లేదు' అని తెలియవస్తుందో... అద్దానిని భ్రాంతి అంటాం. ఉదాహరణకు 'ముత్యపు చిప్పలో వెండి కనిపిస్తోంది' అని ఒకనికి అనిపించవచ్చు. అతడు పరిశీల నకు ఉపక్రమించి అసలు విషయం గ్రహించినప్పుడు ముత్యపుచిప్ప ఇతఃపూర్వంలా కనిపిస్తున్న ప్పటికీ 'అందులో వెండి ఉండజాలదు. అది వెండి వంటి రంగు కలిగి ఉన్నది' అని గ్రహిస్తాడు కదా! తన యొక్క ఇతఃపూర్వపు దర్శనం గురించి చెప్పవలసి వచ్చినప్పుడు 'అది ఆ సమయం లోని నా భ్రాంతి'... అని అంటున్నట్లే ఈ జాగ్రత్–స్వప్న–సుషుప్తి–సృష్టి–ప్రళయములు కూడా! ఆత్మ వీటిచే ఆవరించబడినట్లు అనిపించినప్పటికీ, జ్ఞాన దర్శనముచే ఆత్మ వీటన్నిటికంటే విలక్షణమై, వీటికి ఆధారరూపమై, వీటిచే స్పర్శించబడనిదై ఉన్నదని గమనించబడుగాక!

భ్రాంతి అనగా అసత్యరూపం అని అర్థం. ఎందుకంటే, విచారణ చేసి చూస్తే ఏది లభించదో, అద్దానిని 'భ్రాంతి' అని పిలుస్తున్నాం. కాబట్టి పరమార్థమున 'భ్రాంతి' అనగా 'వాస్తవానికి పొంద బడనిది. లభించనిది'... అని కూడా గ్రహించు. భ్రాంతికి అన్యంగా ఉన్నది జ్ఞానరూపమే అవుతుంది. తెలియబడేది అనుదానికి వెనుకగా 'తెలుసుకునేది' ఉన్నది కదా! తెలియబడేదంతా అట్టి కేవల–అనునిత్యసాక్షి రూపమగు 'ప్రజ్ఞ' కంటే వేరు కాదు. కాబట్టి సాక్షియగు 'చిద్రూపము' కంటే అన్యమైనట్టి సత్య వస్తువు ఎక్కడా లేనే లేదు.

ఓ రామచంద్రా! సర్వదా 'ఏకము' అయినట్టి చిత్స్వభావము అట్లు ఏకమే అయినప్పటికీ, ఈ వివిధ రూపములుగా భాసించుచున్నది. సర్వజీవుల యందును సదా పరమ ప్రేమాస్పదరూపమై స్ఫురిస్తోంది. అట్టి సాక్షియగు చిద్రూపమునే సర్వదా భావన చేస్తూ ఉండు. ఇక వ్యర్థమగు తదితర సర్వ భావనలతో పని ఏముంది? వాటినన్నిటినీ వదలివేసి ఉండు. ఎందుకంటావా?

అస్వభావే మహద్దుఃఖం, స్వభావే కేవలం శమః ।
ఇతి బుద్ధ్వా విచార్య అంతర్, యదిష్టం తత్ విధీయతాన్ ॥

<u>కైవల్యము</u> - చిత్స్వభావం కంటే వేరుగా అనిపించేదంతా స్వకీయ కల్పన చేతనే అట్లు అనిపి స్తోందని గ్రహించు. అట్టి చిత్స్వభావానికి వేరైన కల్పనయే మహాదుఃఖం. అదియే సంసారం అనగా! అకల్పితమైనట్టి సాక్షి చిత్స్వభావమందలి స్థితియే 'కైవల్యము' అని, కేవల 'పరమశాంత స్థితి' అని

గ్రహించబడుతోంది. ఇట్లు 'కనబడేదంతా కూడా ఈ నేను-నీవు మొదలైన వాటన్నిటితో సహా సర్వదా ఏకమే అయి ఉన్న చిత్స్వభావమే! అస్వభావమైనదంటూ ఏదీ ఉండజాలదు' అను వాక్యార్థ సారాన్ని అంతరంగంలో బుద్ధిచే విచారణ చేయి, అటు తర్వాత నీకు ఏది ఇష్టమో దానినే గ్రహించు.

శ్రీరాముడు: హే మహనీయా! వసిష్ఠ మహర్షీ! అత్యంత సూక్ష్మము, నిర్విషయము అగు చిత్స్వభావం ఈ స్థూల-మూర్త జగత్తుగా ఎందుకు రూపం పొందుతోంది?

శ్రీ వసిష్ఠ మహర్షి: సూక్ష్మమగు ఒక బీజాంతర్గత రసమే - తన రస స్వరూపం కొనసాగిస్తూనే- స్థూలమగు మహావృక్షంగాను, ఆ వృక్షం యొక్క వివిధ విభాగాలు గాను అగుచున్నది కదా! అట్లాగే 'అమూర్తమగు శివరూప బ్రహ్మం నందే మూర్తివంతమగు ఈ జగత్తు కలదు' - అని వేదాల యొక్క ఉత్తమమైన కథనం అయి ఉన్నది. జలమునందు ద్రవత్వం జలమునకు అభేదమై, స్వభావయుతమై ఉన్నది. అట్లాగే ఈ రూప-సంకల్పాది బాహ్య-అభ్యంత విషయాలన్నీ కూడా పరబ్రహ్మమున చిదాకాశరూపాలే అయి ఉన్నాయి.

మూర్తివంతమైన ప్రాణి తన ఆత్మభూతాలనదగ్గ ఈ కాళ్ళు-చేతులు మొదలైన అవయవాలతో ఆయా క్రియాదులు నిర్వర్తిస్తోంది కదా! అట్లాగే అకర్త-సద్రూపం అగు చిదాకాశం తన యొక్క ఆత్మ భూతాలగు పంచభూతములచే జగదుత్పత్తి మొదలైన క్రియాదులన్నీ సలుపుచున్నది. తప్పెట వాయించే వాని ఉద్దేశమును అనుసరించి, అతని అభిప్రాయానుసారమే ఆ తప్పెట యందు వివిధ శబ్దములు ఉత్పన్నములగుచున్నాయి కదా! అంతేగాని తప్పెట తనదైన అభిప్రాయంచేత శబ్దములు పలకటం లేదే! ఈ వసిష్ఠ-రామాది పేర్లచే పిలవబడే ఈ దేహాలు జడత్వం కారణంగా స్వయంగా వ్యవహారములు నిర్వర్తించలేవు. మరి? ఈ వసిష్ఠ-రామాది దేహాలు, ఇందులో 'నేను' మొదలైన అభిప్రాయాలు తెలిపే శబ్దాలు... ఇవన్నీ కూడా చిదాత్మ యొక్క అధిష్ఠానత్వము చేతనే ఉనికిని పొంది ప్రవర్తిస్తున్నాయి. చిదాత్మ యొక్క అధిష్ఠానం వలననే ఈ నాలుక మొదలైన కరణాలు విశేషత్వం పొందుచున్నాయి. అనగా చిదాత్మయే ఈ నాలుక మొదలైన కరణాలన్నిటిలో ప్రవేశించి వాటిని ప్రవర్తింపజేస్తోంది. ఏదైతే సర్వదా ఏకమే అయి ఉన్నదో... అదియే అనేకంగా కనిపిస్తోంది. అయితే...

యద్భాతం ప్రేక్షయా నాస్తి, తన్నాస్త్యేవ నిరంతరమ్,
జగద్రూపమరూపాత్మ, బ్రహ్మ బ్రహ్మణి సంస్థితమ్ ॥

ఏదైనా కళ్ళకు కనబడుతూ, విచారణ చేసినప్పుడు 'అది లేదు' అని తెలియవస్తుందో... అట్టిది సర్వదా లేనిదే అగుచున్నది. కనుక అవిచారణ కారణంగా ఈ జగత్తు సిద్ధించవచ్చు గాక! విచారణచే 'ఈ జగత్తు యొక్క జడత్వాంశరూపం, ఈ జగత్తు యొక్క స్వరూపంగా కనిపించేది'... ఇదంతా వాస్తవానికి శూన్యమే అయి ఉన్నది. కాబట్టి బ్రహ్మం సర్వదా బ్రహ్మస్వరూపం నందే స్థితి కలిగియున్నది. ఇదియే ఈ జగత్తు యొక్క వాస్తవమగు స్థితి.

ఏ అజ్ఞానులకైతే "ఈ జగత్తు ఉన్నది కదా!" - అని అనిపిస్తూ ఉండియే ఉందో... అట్టి జగత్ స్వప్న శీలురకు తమ తమ ఆత్మయందు పరస్పరం లేకయే ఉన్నారు. (ఆకాశపుష్పం అనేది

ఉండటమనేది అసంభవం ఎట్లాగో), సర్వదా బ్రహ్మతత్త్వ దర్శకులమగు మా యొక్క దృష్టియందు ఈ జీవుల పరస్పరత్వ వ్యవహారమంతా లేకయే ఉన్నది. మా దృష్టిలో సర్వదా అవిభాజకమగు పరమాత్మ తత్త్వమే స్వభావికంగా ఏర్పడి ఉన్నది.

వాయువు యొక్క అనేక తరంగాలు వాయువుకన్నా వేరా? కాదు కదా! అట్లాగే తమకంటే వేరు కానట్టి తమ యొక్క వ్యవహారాలతో సహా ఈ తదితర జీవులంతా నాయందు ఉండి ఉన్నారు. నేనో, వారియందు ఉండి ఉన్నాను. ఎందుకంటే నేను – ఈ తదితర సర్వజీవులు కూడా ఆకాశ కోశం వలె ప్రశాంతమైనట్టి బ్రహ్మాత్మైక్య స్వరూపులమే అయి ఉన్నాం. వారి యందలి బ్రహ్మమే నా యొక్క ప్రత్యగాత్మ. స్వప్నద్రష్టకు స్వప్నము సత్యము వలె తోచునట్లు, అజ్ఞానుల దృష్టియందు నా యొక్క ఈ వసిష్ఠ రూపమే అగుపిస్తుంది. కాని నాకో... సుషుప్తిలో ఉన్న వానికి స్వప్న పురుషులు లేనివారే అగుచున్నారు కదా! అట్లా నా దృష్టియందు 'ఈ జీవుడు–ఆ జీవుడు' అనబడునవేవీ లేవు. వారందరు నా యొక్క ఆత్మయే స్వరూపముగా కలవారు (మమాత్మా సర్వ భూతాత్మా).

గురువు, శిష్యుడు ఏకరూపులే! -

శ్రీరాముడు : అయితే స్వామీ! మీరు గురువులై ఆత్మతత్త్వం బోధిస్తున్నారు. మీ యొక్క శిష్యులమై మేం మీరు ప్రసాదించే బోధామృతం గ్రోలుచున్నాం. ఈ వ్యవహార సిద్ధి తిరస్కారమైనది కాదుకదా! (కాదనలేం కదా?)

శ్రీ వసిష్ఠ మహర్షి : శిష్యులతో ఏ ఉపదేశాది వ్యవహారం నిర్వర్తించబడుతోందో అదంతా కూడా 'గాలిలో గాలి వీచికలు'లాగా 'బ్రహ్మం బ్రహ్మంనందే స్థితి కలిగి ఉండటం'గా నాకు తెలియవస్తోంది. ఇక మరొకరు ఎట్లు దర్శిస్తుంటే ఏం? దాని వల్ల నాకు ప్రయోజనం గాని, సంబంధం గాని లేదు.

నేను వాస్తవానికి ఈ వసిష్ఠ దేహ భాగముచే లేను. మరి? ఒకే వాయువు అన్ని వాయు తరంగాలలోనూ ఏర్పడి ఉన్నది కదా! ఒకే జలం సర్వ తరంగాలలోనూ ఏర్పడి ఉన్నది కదా! బ్రహ్మ సత్తయే ఈ వసిష్ఠాది ఆకారములలో వ్యాపించి ఉన్నది. మీకు లభించే బోధ అంటావా? ఆ బ్రహ్మసత్తయే గురూపదేశముగా కూడా వివర్తమొందినది అగుచున్నది. ఈ వాక్కు బ్రహ్మ సత్త యొక్క వివర్త భావనచే ఉపదేశాదుల రూపమున ఆవిర్భవించినదగుచున్నది.

ఓ రామచంద్రా! ఏ ఆత్మజ్ఞానికైతే విరుద్ధములగు దుఃఖాదులు కూడా అవిరుద్ధమగు శుద్ధ సచ్చిదా నందరూపములుగా భాసిస్తాయో, అట్టివాని హృదయంలో ఇక భోగేచ్ఛ గాని, మోక్షేచ్ఛగాని స్ఫురించనే స్ఫురించవు.

ఆహా! ఏం ఆశ్చర్యం! తమ తమ బ్రహ్మ స్వభావం ప్రతి వారికి తమ యొక్క ఆధీనంలోనే ఉన్నది కదా! తమ ఆధీనంలోనే ఉన్నట్టి తమయొక్క 'బ్రహ్మ స్వభావమాత్రం' నందు స్థితి కలిగి ఉన్నంత మాత్రం చేతనే ఈ జనులు బంధం నుండి విడివడి మోక్షస్థితిని సొంతం చేసుకోగలరే! అద్దానిని ఏమరచి అజ్ఞానంచే ఈ జనులు ఎన్నెన్ని బాధలు కొనితెచ్చుకుంటున్నారు! గోష్పాద జలమును చూచి' 'అయ్యో! ఇది సంసార సముద్రం! దీనిని దాటటమా? మా వలన అవుతుందా?' ...అని భ్రమ ఎందుకు పొందుచున్నారో కదా! 'అసత్తే' అయినట్టి దుఃఖమునకు వాస్తవమైన

ఉపశమన రూపమగు తన యొక్క 'బ్రహ్మ స్వభావ మాత్రమందలి స్థితి' అనే స్వగృహమును బోలిన మోక్ష స్థితి ఎవరికి వారే నిర్మించుకోవలసిన విషయం కదా! అట్టి మోక్ష సాధన విషయంలో ధనంగాని, మిత్రులు గాని, మరే విధమైన క్రియలు గాని ఉపకరించవు.

నూనెచుక్క నిర్మలమైన నీటిలో పడగానే అనేక చక్రాకారాలుగా అగుచున్నది కదా! విషయం యొక్క సంకల్పమాత్రంచే చైతన్యం అతి శీఘ్రంగా జగద్రూపంగా స్థితి కలిగిన దగుచున్నది. అయితే ఈ జగత్తు తత్ జగద్రూపంగా మిథ్య మాత్రమే! జాగ్రత్ సమయంలో మనుజుని స్వప్న వృత్తాంతమంతా ఏ విధంగా మిథ్యయో, ఆ విధంగా వర్తమాన జాగ్రత్తులో కనిపించేదంతా అనగా, అహంభావ సహితమగు ఈ జగత్సమూహమంతా తత్త్వజ్ఞానికి మిథ్యగానే తెలియవస్తోంది. అజ్ఞానికో... భవిష్యత్తులో వర్తమానము స్వప్నతుల్యంగానే అగుచున్నది.

అంతటికీ మునుముందుగానే నిత్యోదితమై సర్వదా వేంచేసి ఉన్న 'బ్రహ్మ స్వభావమాత్ర స్థితి' అనే అభ్యాసం గల వివేకవంతులగు యోగులకు ఈ జగజ్జాలమంతా అత్యంత సూక్ష్మమై పోతుంది. అనగా, అతి స్వల్పమైన విషయంగా కన్పట్టుచున్నది. అట్టి సమయంలో అతనికి అహంకారం గాని, జగత్తు గాని భాసించదు. శాంతమగు బ్రహ్మమే అంతటా సర్వదా శేషించి ఉన్నదగుచున్నది. ఎప్పుడెప్పుడు 'బ్రహ్మ స్వభావము' అనే సూర్యుడు ఉదయిస్తాడో... అప్పుడప్పుడు భోగరూపమైన అంధకారమంతా నశిస్తుంది. అప్పుడు 'ఈ భూత-భవిష్యత్-వర్తమాన కాలాలలో భోగాలరూపంగా కనిపించుచున్నవన్నీ కూడా అసత్యములు' అనే అనుభవం కూడా స్వయంసిద్ధమై కలుగుతుంది. ఆ విధంగా భోగరూపాలైన అంధకారం నశిస్తే... అప్పుడు 'నేను ఈ కనబడే ఇంద్రియ పరిమితుడను కాను. ఈ దేహ పరిమితుడను కాను'... అనే రూపంగా ఉండే ఇంద్రియాతీతత్వం సంతరించు కుంటాడు. క్రమంగా 'ఈ అంతఃకరణములైన మనస్సు-బుద్ధి-చిత్తము-అహంకారములచే కూడా నేను పరిమితుడను కాను. ఇవన్నీ పరిమిత వస్తువులు. నా స్వరూపమో... అపరిమితమైనది' అని సుస్పష్టంగా గ్రహిస్తాడు. ఈ విధంగా అతడు 'బాహ్య-అభ్యంతర కరణాదిరహితుడు' అగుచున్నాడు. సర్వ అజ్ఞానములను త్యజించివేస్తున్నాడు. అట్టి అజ్ఞానరహిత స్థితిలో స్థూల దేహముల అధ్యాసము లేనివాడై ప్రకాశిస్తున్నాడు. ఇకప్పుడు అతడు దీపము నుండి బయలుదేరిన ప్రకాశము వలె తన యొక్క బ్రహ్మ ప్రకాశముచే సర్వత్రా వ్యాపించినవాడై బ్రాహ్మీభూతుడై వెలయుచున్నాడు.

❖❖❖

23. జగద్భ్రాంతి

శ్రీరాముడు : స్వామీ! ఈ దేహ-మనో-బుద్ధి-బహిర్-అంతర్ ఇంద్రియములన్నీ నేను కానప్పుడు వీటన్నిటియొక్క అసలైన రూపం ఎట్టిది?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఈ రూపాది బాహ్య విషయాలు, సంకల్పాది అభ్యంతర విషయాలు, బుద్ధి మొదలైన అంతరింద్రియాల అనుభవం... ఈ సమస్త వస్తువుల యొక్క వాస్తవ స్వరూపం నిర్వికారమగు చైతన్యమేనని విజ్ఞులచే సిద్ధాంతీకరించబడింది. ఎట్లా అంటే, భావం

భావించువానిరూపమేగాని వేరుగా లేదు కదా! ఎప్పుడైతే 'అవిద్య సన్నగిల్లుతుందో అప్పుడు బ్రహ్మ స్వభావము యొక్క వ్యాప్త స్థితి గోచరిస్తుంది.' అనగా "బ్రహ్మమే తనయొక్క వ్యాప్త స్వభావముచే ఈ దృశ్య-బాహ్యాభ్యంతర కరణాదులన్నీ కల్పనచే పొందుచూ తన స్వరూపాన్ని తానే అట్లు అనుభవించుచున్నది"... అని బ్రహ్మజ్ఞానంచే సుస్పష్టమౌతుంది. అప్పుడిక ఈ సృష్టి భ్రమమాత్రంగా గోచరిస్తుంది. అనగా, ఎప్పుడైతే ఆత్మస్వరూపజ్ఞానంచే బ్రహ్మ స్వభావమున (అఖండ-అప్రమేయ-నిత్యత్వ-సత్యత్వాది విలక్షమైన లక్షణములచే) శాంతి రూపమైన విశ్రాంతి లభిస్తుందో... అప్పుడు సుషుప్తిలో స్వప్నం అదృశ్యమగుచున్నట్లుగా – ఈ జగత్తు అనే దృశ్యం కూడా శమించిపోవుచున్నది.

రామచంద్రా! ఆ రీతిగా ఆత్మలో విశ్రాంతిని సంపాదించుకోవటమే మనుజ జన్మ సార్థకత. అంతేగాని, ఈ దృశ్యంలో సంచరిస్తూ దేహ-మనో-బుద్ధ్యాది ధర్మాలు తన స్వరూపంపై నిష్కారణంగా ఆపాదించుకుంటూ ఆశ-నిరాశల మధ్య కొట్టుమిట్టాడటం సార్థకతయే కాదు.

ఆత్మయందు విశ్రాంతి -

భోగా భవమహారోగా, బంధవో దృఢ బంధనమ్
అనర్థాయా అర్థసంపత్తిరి, ఆత్మన్ ఆత్మని శామ్యతామ్ ॥

ఓ జనులారా! భోగములే ఈ సంసారం యొక్క మహారోగాలు. బంధువులే ఇక్కడి దృఢ బంధనాలు. ధనాన్ని ప్రోగుచేసి పెట్టుకోవటం అనర్థం కొరకే అగుచున్నది. కాబట్టి ఇవన్నీ చక్కగా పరిశీలించి గమనించి "ఆత్మయందు శాంతంగా స్థితినొంది ఉండటం"... అనేది అభ్యసించండి.

బ్రహ్మస్వరూపమునకు విరుద్ధమైన భావన చేయుటయే సృష్టి. బ్రహ్మ స్వరూపమందు స్థితి కలిగి ఉండటమే 'శివరూప బ్రహ్మము' గా చెప్పబడుతోంది. కాబట్టి ఓ రామచంద్రా! నీవు సర్వదా చిదాకాశరూపుడవై ఉండు. అంతేగాని, ఈ 'సంసారము' అనే గ్లానిని పొందనే వద్దు.

ఓ రఘురామా! నేను ఈ వసిష్ఠ రూపమందలి జీవునిగాని, దృశ్యమును గాని, జగద్భ్రమను గాని ఎఱుగుటయే లేదు. సర్వదా శాంతరూపమగు బ్రహ్మమున, బ్రహ్మముగా, నిత్యోదిత – ప్రకాశస్వరూపుడనై ఉంటున్నాను. నిర్వికారమగు బ్రహ్మముగానే ఉన్నాను. తదితరులెవరైనా 'నీవు వసిష్ఠుడవు' అని త్వమ్ బోధచే సంబోధిస్తున్నప్పుడు కూడా "ఈ 'త్వమ్' అనునది శాంతం-సర్వం-శాశ్వతం-అనంతం అగు చిదాకాశమే"... అనే నేను సర్వదా వీక్షిస్తున్నాను. శాంతం, పరం అగు చిదాకాశమే నేనని ఎఱిగియే ఈ వసిష్ఠ నామధేయ దేహ సమన్వితంగా జలంలోనే సంచరించే జల స్వరూపమాత్ర జలతరంగంగా ఈ జగత్తు అనబడే దానిలో సంచరిస్తున్నాను. నాకు అన్యమైన దంటూ జగత్తు అనబడేదేదీ మొదలంటా కూడా నాకు అగుపించటమే లేదు. ఏ తరంగానికైనా, తనకు అన్యమైనది ఏ మరొక తరంగంలో లభిస్తుంది? జలానికి వేరైన ఏ ఉనికి ఏ తరంగానికి ఉన్నది?

శ్రీరాముడు : మహర్షీ! సంసార జీవులమగు మా యొక్క అనుభవం మీ వలె లేదే?

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామా! నీకుగాని, నాకుగాని, మరొకరికిగాని చిదాకాశమగు బ్రహ్మమున ఈ శబ్ద-అర్థాది బాహ్య, అభ్యంతర విషయముల గూర్చిన భ్రమలన్నీ కూడా పరమార్థమున

అసలు జనించినవే కావు. ఈ విషయం సుస్పష్టమవటానికి గాను ఒకటి రెండు దృష్టాంతాలు తీసుకొని చెప్పుతాను.

వాయు - వాయుతరంగ దృష్టాంతం - 'వాయువు చలిస్తోంది' అంటాం. వాయువు ఏ రూపంగా చలిస్తోంది?...

శ్రీరాముడు : తరంగరూపంగా!

శ్రీవసిష్ఠ మహర్షి : వాయువులోనే వాయు తరంగం చలిస్తోంది. అంతేగాని వాయువు ఎక్కడి నుండి ఎక్కడికో చలించడం లేదు కదా! అట్లాగే ఆత్మయందే ఆత్మభూతములగు సర్వ శబ్దార్థ బాహ్యాంభ్యంతర భ్రమలు ఏర్పడి ఉంటున్నాయి. వాయు తరంగం కూడా వాయువే అయినట్లు... ఆత్మయందు భ్రమచే తోచేవన్నీ కూడా ఆత్మకంటే వేరైనవి కావు.

జలమునందు జల స్వరూపమే అయిన జల తరంగాలున్నట్లు మనోబుద్ధ్యహంకారాదులన్నీ కూడా ఆత్మయందే ఆత్మ స్వరూపమే అయినవై ఉంటున్నాయి.

స్వప్న సుషుప్త న్యాయం - సుషుప్తిలో ఉన్నవారికి స్వప్నం ఉండదు. స్వప్నంలో ఉన్నవాడు సుషుప్తిని ఎఱుగుట లేదు. అట్లాగే... బ్రహ్మ స్వరూపమునందు ఉన్న వానికి సృష్టి కనిపించడం లేదు. అనగా, (తదితరులకు) సృష్టిగా కనిపించేదంతా అతనిచే బ్రహ్మముగానే ఎఱుగబడుచున్నది. సృష్టి స్వరూపమునందు లీనమై ఉన్నవానికి బ్రహ్మము అనుభవమవటం లేదు. ఇంతకు మించి ఇక్కడ మరే విశేషమూ లేదు.

జీవన్ముక్తుడు, ప్రశాంతచిత్తుడు, ప్రబుద్ధుడు అగు జ్ఞాని బ్రహ్మ స్వరూపమును నిత్య జాగ్రత్తుగా ఎఱుగుచున్నాడు. ఇక ఈ జగత్తునో... స్వప్నము వలె గమనించుచున్నాడు. కాబట్టి అతనికి ఇక్కడ వ్యవహారాలన్నీ కూడా స్వప్నతుల్యంగానే సంభవిస్తున్నాయి. ప్రబుద్ధుడు, శుద్ధాత్ముడు అగు జ్ఞాని ఈ సమస్త జగత్తును పరమాత్మ స్వరూపంగా నిర్ద్వంద్వంగానూ, సంశయరహితంగానూ ఎఱుగుచున్నాడు. ఈ జగత్తు యొక్క సత్యరూపమును ఎఱిగి ఉండుటచే, అతడు శరత్కాల మేఘం వలె ప్రశాంతిని పొంది ఉంటున్నాడు. ఒకడు ఒక యుద్ధ సంరంభమును గురించి తనయొక్క స్మృతి యందు గాని (లేక) తన యొక్క కల్పనలో గాని ఎట్లు భావించుచున్నాడో... అట్లే జ్ఞానికి సత్-అసత్తులు (ఉండటం-ఉండకపోవటం మొదలైనవి), ఈ అహంకారాదులతో సహా జగత్ భ్రమలు భవనామాత్రములుగా భాసిస్తున్నాయి.

శ్రీరాముడు : మహర్షీ! ఈ 'జీవుడు' ఆత్మయందున్నట్టివాడా? లేక ఆత్మ జీవునియందు ఉన్నదా?

శ్రీవసిష్ఠ మహర్షి :

ఆత్మన్య నాస్తి హి యా ద్రష్టా యస్యా న విద్యతే కశ్చిత్ ।
న చ శూన్య నా శూన్యం భ్రాంతిరియం భాసతే సేతి ॥

పరమార్థ సత్యమగు ఆత్మయందు ఈ కనిపించే జగన్మాయ లేదు. ఈ 'జగత్తు యొక్క ద్రష్ట' అయిన 'జీవుడు' అనబడేవాడు వాస్తవానికి ఎవడూ లేదు. నివాసం దృష్టిలో పెట్టుకొని "పల్లెటూరి వాడు, పట్టణం వాడు"... అని విభజన పూర్వకంగా చెప్పుకొన్నంత మాత్రంచేత దేహాదులకు ఆ

విభజన ఉందా? ఉండదు కదా! జగత్తు యొక్క ద్రష్ట (జీవుడు) – తదాధారమగు పరమాత్మతత్వం అట్టివే!... ఆహా! ఈ విధంగా అనిర్వచనీయమైన జగద్భ్రాంతి ఇటు శూన్యము కాక, అటు అశూన్యము కాక... శూన్యాశూన్య విలక్షణమై... అనిర్వచనీయమై భాసించుచున్నది కదా! ఏది ఏమైనా కూడా... ఆత్మ ఒక్కటే ఉన్నది. ఆత్మకంటే వేరైన జగత్తనేది, జీవుడు అనబడేది – ఇదంతా మాకేదీ అగుపించటమే లేదు.

❖❖❖

24. వివేకముచే స్వాత్మభూతుడగు పరమాత్మారాధన

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! సర్వమునకు మునుముందుగా శాంతమగు 'కూటస్థాత్మ'యే ఉన్నది. అద్దానియందు నిశ్చల జలంలో ఏర్పడే ఆవృత్తంలాగా ప్రప్రథమంగా చిత్తరూప సమన్విత మైన జగత్‌స్ఫురణ ఏర్పడినది. అయితే జలంలో కనిపించే ఆవృత్తము జలమునకు అభిన్నమే కదా! అట్లాగే చిత్తము అనే శబ్దం యొక్క అర్థం ఉద్దేశం అయినటువంటి జగత్‌స్ఫురణ కూడా ఆ చిదాత్మకు అభేదం. వాస్తవానికి ఆత్మ అవ్యాకృతం! అందులో సృష్టి మొదలైనవి వేరైన ఆవృత్తం అంటూ ఎక్కడా లేదు. జలంలో జలమునకు అభేదమైన జలతరంగాలు ఉత్పన్నమగుచున్నట్లు, అయినా జలం సర్వదా యథాతథంగానే ఉన్నట్లు... ఆత్మకు బాహ్య-అభ్యంతర (దృశ్యం-దేహం; మనో బుద్ధి-చిత్త-అహంకారాలు) విషయాల యొక్క అనుభవమంతా యాదృచ్ఛికంగా కలుగు తోంది. మృగతృష్ణలో జల భ్రాంతిలాగా అదంతా అనుభవానికి వస్తోంది. అయితే మృగతృష్ణ సూర్య కిరణాల-వాయు వీచికల కలయికచే ఏర్పడే నీడల వంటివే గాని, అందులో కనిపించేదంతా జల తరంగాలు కావటానికే వీలులేదని తెలియవచ్చిన తర్వాత ఎవరికైనా మృగతృష్ణా జల తరంగాల భ్రాంతి ఉంటుందా? ఉండదు. సూర్యుడస్తమించగానే మృగతృష్ణా దృశ్యం అదృశ్యమౌతోంది కదా! అట్లాగే చిత్తం అనే సూర్యుడు అస్తమించగానే జగత్ విషయాల అనుభవం కూడా అదృశ్యమౌతోంది.

శ్రీరాముడు : హే మహర్షీ! ఈ జగత్తు పరమాత్మ యొక్క శరీరంలో విభాగంగా భావించవచ్చా? పరమాత్మ దేహములు అవధరించి ఈ దృశ్యమును అంగీకరించి, ఇందు ప్రవేశించుచున్నాడను సిద్ధాంతం యుక్తియుక్తమేనా? దేహ విలక్షణమైన పరమాత్మను దర్శించడమెట్లా?

శ్రీవసిష్ఠ మహర్షి : పరమాత్మయందు ఈ జగత్తు దేహములన్నిటికీ విలక్షణమై, కానీ దేహములన్నీ తానే ప్రకాశింపజేయుచున్నవాడై విస్తరించి ఉంటున్నాడు. ఎటువంటి కారణాలు అపేక్షించకుండానే వాయువు యొక్క చలనం, సూర్యుని యొక్క ప్రకాశం విస్తారాన్ని పొందుచున్నట్లే, పరమాత్మయందు ఈ జగత్తు విస్తారం పొందుతోంది. జలంలో ద్రవత్వం, ఆకాశంలో శూన్యత్వం, వాయువు నందు ప్రతిబింబత్వం స్వభావసిద్ధమై భాసిస్తున్నట్లు 'మహాచిత్' రూపమగు మహాకాశమున 'జగత్తు' అనునది స్ఫురించుచున్నదగుచున్నది.

జలమందు -ద్రవత్వం, ఆకాశమందు -శూన్యత్వం, వాయువునందు -సంచలనత్వం, మహాచైతన్యమునందు -జగదత్వము... స్వభావ సిద్ధమై అనిర్వచనీయమై ఉంటున్నాయి.

వాయువు తనయందు చలనమును ఎఱుగుచున్న విధంగానే చైతన్యము తనయందు ఈ జగత్తును ఎఱుగుచున్నది. కాబట్టి ఇక్కడ ద్వైత-ఏకత్వ భేదాలంటూ ఏవి సంభవించవు.

అవివేకంచే ఈ జగత్తు అనబడేది ప్రకాశశీలమై ఉంటోంది. వివేకం చేతనో, అది వినాశన శీలమై (స్వయంగా లేనేలేదను అనుభవంగా) ఒప్పుచున్నది. కానీ... ఇదంతా సదా 'కేవలం-సద్రూపం' అగు బ్రహ్మం మాత్రమే అయి ఉన్నది. ఎందుకంటే, 'ఆదిమధ్యాంత రహితం-కేవల జ్ఞానమాత్రం-శుద్ధం'... అయినట్టి మహాచిన్మాత్రమునకు అన్యంగా ఎక్కడా ఏదీ ఉండజాలదు - అనేది నిర్వివాదాంశమని వివేకులు నిర్ణయించియే ఉన్నారు. అట్టి మహాచైతన్య రూపమగు అప్రమేయ తత్త్వమును... కొందరు 'పరమాత్మ' గాను, మరికొందరు 'శాంతమైనట్టి శివరూపం' గాను, ఇంకొందరు 'నిత్యమైనట్టి బ్రహ్మము' గాను, ఇంకా కొందరు 'శూన్యమాత్రం' గాను, మరికొందరు 'జ్ఞానమాత్రము' గాను, ఉపాసిస్తున్నారు. ఆ మహా చైతన్యము తనయందు జ్ఞేయత్వము (లేక ఆత్మరూపత్వము)ను అట్టేబెట్టుకొనే... తాను అనంతాత్మయగు చిద్రూపము అయి ఉండి కూడా... అయ్యది విషయరూపమును భావించుచున్నదాని వలె ఉన్నదై అజ్ఞాని చందమున అగుచున్నది. ఎవరు ఎట్లు ఉపాసిస్తున్నారో... వారికి అట్లే అనుభూతిని ప్రసాదిస్తోంది.

❖

శూన్యం-కూటస్థం అగు ఆకాశం లేకపోతే వాయువునకు కారణం లేదు. వాయువే లేకపోతే వాయు స్పందానికి (వాయు వీచికలకు) కారణం ఉండదు. అట్లాగే, చైతన్య సత్త లేకపోతే దృశ్య సత్తకు కారణం ఉండజాలదు. దృశ్య సత్త లేకపోతే చిత్తం యొక్క చిత్తత్వం కూడా లేనిదే అగుచున్నది.

కనుక సృష్టి-సృష్టి రూప భ్రాంతులు బ్రహ్మ సత్త యొక్క ఆధీనంలోనే ఉన్నాయి. బ్రహ్మ సత్తకు అన్యమైన కారణాపేక్ష ఏదీ లేదు. ఈ విధంగా బ్రహ్మం ఈ జగత్తుకు అధిష్ఠాన రూపమై ఉంటోంది. ఈ జగత్తు అధిష్ఠాన రూపంచే నిత్యత్వమును, నిజ దృశ్య రూపముచే అనిత్యత్వమును సిద్ధింపజేసుకుంటోంది.

❖

ఈ రూపంగా, ఈ సృష్టి అంతా కూడా భ్రాంతి మాత్రమై చెన్నొందుతోంది. అయితే ఈ సృష్టి భ్రాంతు లందు కనిపించే చిత్, జడములు యొక్కయు; ద్వైత ఏకత్వము యొక్కయు అస్థిత్వమంతా స్వతఃసద్వస్తువు అయినట్టి ఆత్మయొక్క అధీనంలోనే ఉన్నది. ఇదియే శాస్త్ర సార రహస్యం.

కూటస్థం-అద్వయం అగు మహా చిదాకాశంలో ద్వితీయం-ఏకత్వం కల్పించే మరొకరెక్కడున్నారు? ఎవ్వరూ లేరు. ఇక ద్రష్టత్వం మొదలైనవన్నీ ఆత్మ స్వయంకృత క్రీడ వినోదరూపమైన చిద్విలాసం మాత్రమే! వాయువుకు వాయు తరంగాలకు (అద్దాని స్పందానికి) భేదమేమున్నది? అట్టి భేదం శబ్దమాత్రమే గాని, వాస్తవం కాదు కదా! అట్లాగే అనంతం-ఏకం అగు చిదాకాశానికి ఈ జగత్తుకు భేదం శబ్ద మాత్రమే గాని, వాస్తవమైనది కాదు! అంతే కాదు. 'విశ్వం వేరే-విశ్వేశ్వరుడు వేరు'... అని ఎవరికైనా ఇప్పుడు అనిపించవచ్చు గాక! జ్ఞానంచే అది అసత్యమైనది. 'ద్వైతం' అనేదే అసంభవం కాబట్టి ఈ విశ్వం చిత్స్వరూపమగు మహాచిన్మాత్రమే సుమా!

పరమాత్మయే జగత్తు వలె భాసించుచున్నాడు. ఇక ఈ కంటికి కనిపించే ప్రపంచమంటావా? ఇదంతా దేశ-కాలములకు లోబడి ఉంటోంది. పరమాత్మ సర్వదా దేశ కాలములకంటే ప్రత్యేకము - ముఖ్యము-అతీతము అయి ఉన్నాడు.

స్వప్నమునకు ఆధారమై, స్వప్నమునకు ఆదికారణమై, స్వప్నస్వరూపమంతా తానే అయి స్వప్నము కంటే ప్రత్యేకమై స్వప్న ద్రష్ట ఉన్నట్లుగా ద్రష్ట స్వరూపుడగు పరమాత్మ జగత్‌నందు జగత్తుగా వేంచేసి ఉంటున్నాడు. ఈ దృశ్యమునకు ఆధారమై, ఆదికారణమై, ఇదంతా తానే అయి, దీనికంతటికీ ప్రత్యేకమై ఉన్నాడు.

కాబట్టి ఈ ప్రపంచము ప్రపంచరూపంగా సత్యం కానే కాదు. 'ప్రపంచత్వము' అనేది ఎవరికీ కూడా వాస్తవము కాదు. బంగారు ఆభరణం బంగారమునకు భిన్నమైన సత్యం కాదు కదా!

"విశ్వం సత్యమే-విశ్వేశ్వరుడు సత్యమే" అనే వాక్యం "ఆకారం సత్యమే! బంగారం సత్యం!" అను వాక్యంలాంటిది మాత్రమే! అట్లాగే పరమాత్మ కంటే భిన్నంగా విశ్వమందు సత్యత్వం లేదు. ఈ విధంగా ద్వైత-ఏకత్వాల వ్యవహారమే అసంభవమగుచున్నది. బంగారానికి సత్యత్వం-బంగారు అభరణాలకు, జలానికి-జలతరంగాలకు ద్వైత-ఏకత్వాల కార్యకారణాలెక్కడివి? అట్లాగే 'అహం భావం'చే కనిపించే ద్వైత-ఏకత్వముల వ్యవహారాల కార్య-కారణత్వం మాత్రం పరమాత్మ యందు ఎట్లా ఉంటుంది?

శ్రీరాముడు : మరి ఈ జగత్తు అందరికీ అనుభవమౌతోంది. కదా! ఎందుకు అలా?

శ్రీవసిష్ఠ మహర్షి : 'కల్పన' అను అజ్ఞాన జనిత చమత్కారం చేత మాత్రమే జగత్తు సత్యం వలె అనుభవమౌతోంది. బంగారపు ఆభరణానికి "నీది-నాది-వారికి చెందినది"... అనే కల్పన జగత్తులో ఉంటున్నప్పటికీ... అవన్నీ బంగారం యొక్క ధర్మాలుగా ఆపాదించలేం కదా! అట్లాగే ఈ జగత్తుగా కనబడేది పరమాత్మయే అయినప్పటికీ పరమాత్మలో వాస్తవానికి జగదత్వం లేదు. జగదత్వంగా కనిపించేది కల్పన మాత్రమే! సత్ వస్తువును కల్పనతో ఆపాదించి దర్శించటమే 'సంకల్పం' యొక్క అర్థోత్పత్తి అంతటా నిండి ఉన్న ఆకాశం అత్యంత అభేదమైనప్పటికీ 'ఇటు సూర్యుడు ఉదయిస్తున్నాడు. కనుక ఇది తూర్పువైపు ఆకాశం. అటు పడమరవైపు ఆకాశం' అనే విశేష సంభాషణ ఉంటోంది. ఎట్లా? 'సూర్యోదయం' అను ఘటనా వ్యవహారం చేత! స్వయంగా ఆకాశమునకు తూర్పు-పడమరలు లేవు కదా! ఆకాశంలో ఆకాశరేఖ వలె బ్రహ్మము - జగత్తులకు గల భేదం కల్పిత భేదం మాత్రమే! వాస్తవానికి ఆకాశము యొక్క రూపం ఏమిటో, అదే ఆకాశ రేఖ యొక్క రూపం కదా! అట్లాగే, బ్రహ్మము యొక్క రూపం ఏమిటో, అదియే జగత్తు యొక్క రూపం కూడా అయి ఉన్నది. అది అట్లై ఉండగా, ఇక ద్వైతం ఎచ్చట? ఏకత్వం ఎచ్చట?

ఆకాశము-శూన్యత్వము అనునవి ఏకరూపములే కదా! అట్లాగే బ్రహ్మము-జగత్తు ఒకే రూపములు కలిగి ఉన్నాయి. అట్టి బ్రహ్మము ఏకము-ఆత్మ స్వరూపము-సర్వ రూపము అయి ఉన్నది. ఒకానొక శిలచే నిర్మించబడిన సైన్యమంతా ఏకైక శిలాతత్త్వమే కదా! ఇక ఆ శిలా

నిర్మితమైన శిల్పకళాఖండంలో శత్రు సైనికులు-మిత్ర సైనికులు (శిల దృష్ట్యా) ఎక్కడున్నారు? జగత్తంతా బ్రహ్మము చేతనే నిర్మించబడి ఉండగా, ఇక ఈ జగత్తుకు 'ఇది కారణం-అది కార్యం'... అనే వ్యవహారం ఎట్లా కుదురుతుంది? అట్టి వైచిత్ర్యం సంభవించ టమెట్లా? సంభవించదు. చిదాకాశమునందు రెండవ వస్తువు (జగత్తు) ఎట్లా ఉంటుంది? శిలయందు చెక్కబడిన శిల్పము శిలామయమే. అయితే శిలయందు చెక్కబడిన స్త్రీ విగ్రహమును చూచి "శిలలో ఈ స్త్రీ (స్త్రీ విగ్రహం) ఉన్నది" అనునది శబ్ద మాత్ర సంభవమేగాని... అర్థ మాత్ర సంభవం కాదు కదా! మహా చైతన్యమున ఈ సృష్టి కూడా చిత్ప్రకాశమయమై ఉండటంచేత ఇది బ్రహ్మ రూపమే అయి ఉన్నది. శిల్పంలోని చెవులు, ముక్కు, నోరు, కాళ్లు... అన్నీ కూడా శిలయే కదా! అట్లే ఈ కనబడే 'నేను-నీవు' మొదలైనవన్నీ బ్రహ్మ రూపమే సుమా! శిల గురించి ఎఱిగిన తర్వాత శిల్పం యొక్క ఆకారాదులు (శిల దృష్ట్యా) పరిగణలోకి రావు చూచావా? వాస్తవమగు బ్రహ్మతత్త్వము ఎఱిగిన తర్వాత ఈ జగత్తు తనంతటతానే అట్టి జ్ఞానదృష్టి యందు లయించిపోయినదగుచున్నది.

శ్రీరాముడు: ఇక్కడ రూప-సంకల్పాదులు ఉండి ఉంటున్నాయి కదా! ఇక ఇక్కడ అద్వితీయ బ్రహ్మము సులభంగా అనుభవమయ్యేది ఎట్లా?

శ్రీవసిష్ఠ మహర్షి : ఈ బాహ్య జగత్తు రూపాదులతోను, అభ్యంతర జగత్తు సంకల్పాదులతోను ప్రాప్తిస్తున్నాయి కదా! అట్టి రూప-సంకల్పాది బాహ్య-అభ్యంతర జగత్తు అంతా కూడా భావనారూప మనస్సు యొక్క చలన మాత్రంచే జనించుచున్నది. భావనా మాత్రంచే ప్రాప్తించేదంతా ఆ భావనా త్యాగంచే తొలగుచున్నది. ప్రపంచం నుండి దృష్టిని మరలించుటచే భావనా త్యాగం సముపార్జిత మగుచున్నది. సర్వ భావాలు త్యజించబడగా, అనగా, మానసిక బాహ్య సర్వ చేష్టలు ఉపశమించగా ...అప్పుడు లభించే ఏ 'కాష్ఠమౌనస్థితి' స్ఫురిస్తుందో అదియే శేషబ్రహ్మం. ప్రపంచాన్ని ప్రపంచంగా కాకుండా దీనినంతా బ్రహ్మంగానే దర్శించటం అభ్యసించేవారికి దృశ్యానికి అనునిత్యంగా ఆధారభూతమై ఉన్న కాష్ఠమౌన స్వరూపమగు బ్రహ్మం అతి సులభంగా అనుభవమగుచున్నది.

ఇక "ఈ ప్రపంచం ఎదురుగా ఉండగా బ్రహ్మము అనుభవమయ్యేది ఎట్లా?"... అనే ప్రశ్నకు వద్దాం. మనకు పదార్థాలు ఎదురుగా ఉన్నాయి. కనుక అనుభవమౌతున్నాయి. అయితే,... 'అనుభవం' అనేది ఉండటానికి పదార్థాలు ఉండవలసిందేనా? పదార్థాలు లేకుండానే, అనుభవం ఉండటం లేదా?

శ్రీరాముడు : పదార్థ సమన్వితమైన ఈ జగత్తు ఎదురుగా ఉంటేనే ఇద్దాని అనుభవం కూడా ఉంటుంది. లేకుంటే ఉండదు కదా?

దృశ్య వస్తువు లేకపోయినా అనుభూతులు కొనసాగగలవు! -

శ్రీవసిష్ఠ మహర్షి : కానీ, పదార్థములతో కూడిన ఈ జగత్తు లేకపోయినా కూడా చాలా సందర్భాలలో అనుభవాలు ఉంటున్నాయి. ఉదాహరణకు... స్వప్నంలో ఏ పదార్థాలు లేకపోయిన ప్పటికీ పదార్థాలతో కూడిన స్వప్న జగత్తు అనుభవమౌతోంది కదా! అలాగే జాగ్రత్తులో కూడా

సమ్ముఖమున లేని పదార్థములు, వ్యక్తులు, సంఘటనలు, తత్ భావనచేత ఆ భావికునకు అనుభవరూపంగా ప్రాప్తించుచున్నాయి కూడా! ఒకానొక విరహ వేదనతో తపించే ప్రియునికి తన ప్రియురాలి రూపమే నలువైపులా అగుపించటం జరుగుతోంది కదా! కాబట్టి భావనయే అనుభవానికి ముడి పదార్థమగుచున్నది. భావన లేకపోతే ఎదురుగా ఉన్న పదార్థాలు కూడా అనుభవానికి రావు. అనగా, ప్రపంచము వైపుకు దృష్టిని మరలించుటచే తత్ ప్రపంచ దృష్టి భావన ద్వారా ఈ రూప-సంకల్పాది బాహ్య-అభ్యంతర విషయ రూప జగత్‌భ్రమ భాసిస్తోంది. జగద్భ్రమకు భావనయే మూలంగాని, పదార్థములు కాదు. సంఘటనలు కూడా కావు. ఈ విధంగా స్వప్నంలోను, జాగ్రత్తులోను కూడా సమ్ముఖమున ఉండి-లేని పదార్థాలు కూడా తత్ భావనచే ఉన్నట్లుగా తోచుచున్నాయి.

దీని అర్థం...? జగత్‌భావనను ఉపశమింపజేసి ఆత్మయందు స్వాభావికంగా శిలవలె నిశ్చలంగా ఉండటం అభ్య సించాలి. అదియే సమాధి. అదియే బ్రహ్మానుభవం. అదియే బ్రహ్మ భావన. “నా స్వస్వరూప బ్రహ్మమే ఈ తదితరుల రూపంగా భాసిస్తోంది”... అని అద్వితీయ భావనచే జగత్‌భ్రమ ఉపశమిస్తోంది.

అందుకు మార్గం? - అందుకు పూర్ణ వివేకమే ఉపాహారం. యథా ప్రాప్తములైన పదార్థములను అసంగబుద్ధితో స్వీకరించటమే అందుకొరకై చేసే పూజ. కాబట్టి ఓ ప్రియ శ్రోతలారా! మీరంతా చైతన్య రూపమగు-సచ్చిదానంద ఘనమైనట్టి ఆత్మ స్వభావమును అవలంబించి సర్వము పట్ల సమత్వమును అభ్యసించండి. అట్టి ఆత్మబోధ నిర్మలమైన బుద్ధికే సాధ్యం. స్వబుద్ధిచే వివేకము-వైరాగ్యము అనే సాధన పుష్పాలతో ఆ సర్వాత్మకుడగు పరమేశ్వరుని పూజించాలి. అట్లు వివేకముచే పూజితుడైన పరమాత్మ తక్షణమే ‘నిరతిశయానందము’ అనే వరాన్ని ప్రసాదిస్తాడు.

ఓ రామచంద్రా! అట్టి పరమాత్మ యొక్క పూజను కొన్ని భౌతిక పుష్పాలతో అష్టోత్తర శతనామ పఠనములతో ఒకచోట కూర్చుని కొద్దిసేపు రుద్ర-ఉపేంద్రాదుల ఆకార కల్పనచే నిర్వర్తించటమనేది గౌణము (ప్రారంభస్థితి) అని గమనించు. ఎందుకంటే ఆ సర్వాత్మకుడు స్వాత్మ స్వరూపుడై నీ యందు నా యందు, సర్వమునందు వేంచేసి ఉండగా, అంతటా ఆక్రమించి ఉన్న వానిని ఎక్కడికి ఆహ్వానిస్తావు? అందుచేత 1. విచారణ, 2. శమం, 3. సత్సంగం, 4. సంతోషం – అనే కానుకలతో ఆయన పూజింపబడు గాక! అప్పుడా పరమేశ్వరుడు సంతోషించి ‘మోక్షము’ అనే ఫలాన్ని ప్రసాదిస్తాడు. సత్యావలోకనము అనే ఆత్మ దర్శనముచే మాత్రమే అతడు నిజమైన పూజితుడు అవుతాడు. తద్వారా సర్వోత్కృష్టమైన ఫలం లభించగలదు.

సత్సంగ-శమ-సంతోష పుష్పములచే ఆత్మను పూర్ణముగా పూజించువానికి అతని ఆత్మగానే వేంచేసియున్న పరమేశ్వరుడు సమస్త ఫలములను ప్రసాదించుచుండగా ఇక అన్యుని ఆశ్రయించే మూఢుడు ఎవడుంటాడు? సర్వ స్వరూపుడగు ఆత్మను పూజించువానికి శాస్త్రములు-విషము-అగ్ని మొదలైనవి కూడా విరిసిన మల్లెపూల వలె అతి కోమలములై ఉంటాయి.

ఇక అసంపూర్ణ వివేకులగు సాధకులను దృష్టిలో ఉంచుకొని ప్రతిపాదించబడిన దేహపూజ–తపస్సు–దానము మొదలైన వాటితో ఆత్మ పూజను జోడించినప్పుడు మహత్తర ఫలమును, అట్లా జోడించకపోతే అల్పప్రయోజనమును ఇచ్చుచున్నాయని గమనించు. 'ఆత్మపూజ' యొక్క సమక్షంలో అవన్నీ (అల్ప ప్రయోజనములకై ఉద్దేశించే పూజదులు) భస్మమువలె గోచరిస్తున్నాయి. వివేకముతో కూడి నిర్వర్తించబడిన దేవ పూజాదులే సఫలములగుచున్నాయి. మీరప్పుడు 'వాసనాత్యాగరూపము సత్యతత్త్వమగు ఆత్మ యొక్క విజ్ఞానము' అనే వివేకమును అంతఃకరణంలో సాధించటానికి అందరూ ఎందుకు ప్రయత్నించకూడదు? సాధనలు అందుకే మార్గంగా ఉన్నాయని గమనించబడుగాక!

లజ్జాం భయం విషాద ఈర్ష్యే సుఖం దుఃఖ జయేత్ సమమ్ ।
జగదాది శరీరాది నాస్త్యేవ ఆదౌ! కుతో௨ద్య తత్ ॥

ఆత్మ జ్ఞానముచే 'దేహము యొక్క సత్త మిథ్య' అని ఎరుగాలి. అట్టి 'దేహము మిథ్య' అను ఎఱుకనే 'సమత్వము' అను అగ్నిని ప్రజ్వలింపజేయాలి. లజ్జ–భయము–విషాదము–ఈర్ష్య–సుఖము–దుఃఖము మొదలైనవాటిని 'సమత్వము' అను అగ్ని ప్రజ్వలనముచే దహించి వేయాలి.

ఇది జీవుని ముఖ్య కార్యక్రమం - ఎందుకంటావా? ఈ దేహాదులు గాని, అట్టి దేహాదుల ఉనికికి కారణభూతం అయిన జగత్తు గాని, అట్టి ఈ జగత్తు మొదలైన వాటికి కారణమైన 'అవిద్య' గాని మొదలే లేవు. మొదలే లేనప్పుడు ఇప్పుడు ఎక్కడి నుండి వచ్చాయి? కాబట్టి జగత్తుగా దర్శించబడుచున్నది. మిథ్యయేనని మా అభిప్రాయం. మాకు అనుభవైకవేద్యం.

పోనీ ఈ 'జగత్తు' అనేది 'బ్రహ్మం' అనే కారణం యొక్క కార్యమనే అనుకుందాం! అప్పుడు కూడా ఇదంతా 'ప్రకాశమాత్రం–నిర్మలం' అయినట్టి బ్రహ్మం మాత్రమే అవుతుంది. మట్టి కారణ మనుకుంటే, కుండలు కార్యమనుకుంటే, కుండలలో ఉన్నదంతా మట్టియే కదా! కుండలో మట్టికి వేరైన పదార్థ మేమున్నది? ఈ దృశ్యమంతా 'జ్ఞానము' అను దానిలోంచే అనుభవమౌతోంది.

కాబట్టి,... ఇదంతా జ్ఞాన రూపమగు బ్రహ్మము కంటే భిన్నంగా ఏమాత్రం సత్యం కానేరదు. అనగా 'దృశ్య వికల్ప ప్రతిభ చిత్ యొక్క అభాసరూపమే కాబట్టి అదే ఈ జగత్తు అట్టి చిదాభాస రూపజ్ఞానం కూడా ఆత్మతత్త్వం యొక్క విభూతియే! లేక, ఆత్మ యొక్క విన్యాసమే! ఆభరణత్వం అను ఆకారాదులు బంగారం యొక్క విభూతియే కదా! అద్దంలో కనిపించే ముఖం యొక్క శోభ అద్దంలోని విభాగమే కదా! సాక్షి చైతన్యం యొక్క యథార్థ జ్ఞానముచే 'జగత్తుగా కనిపించేది' అనునది కూడా ఆమూలాగ్రం ఉపశమించగలదు. ఆత్మాంతర్భాగ విభాగమే కాగలదు.

కనుక ఓ సభికులారా! మీరంతా కూడా శిలా ప్రతిమ యొక్క కోశం వలె అంతఃకరణం నందు ప్రశాంతులై ఉండండి. స్వస్థచిత్తులై ఉండండి. ఈ ప్రపంచమున వ్యవహరిస్తున్నప్పుడు–వ్యవహరించ నప్పుడు కూడా పరమశాంత చిద్రూపమగు ఆత్మగానే ఉండండి. ఇక్కడి జ్ఞాతృ–జ్ఞాన–జ్ఞేయ రూపమగు త్రిపుటి కంటే అతీతులై ఉండండి. సద్రూపులై, సత్–అసత్‌లకు సారభూతమన దగ్గ ఆత్మస్వరూపులై ప్రకాశించండి. నిర్మలాకాశం వలె నిర్మల స్వరూపులై సర్వ సంసార భూములకు పరము అయినట్టి బ్రహ్మముననే స్థితి కలిగి ఉండండి.

యథా స్థితం చ తిష్ఠన్తి గచ్ఛన్తశ్చ యథాగతమ్ ।
యథా ప్రాప్తైక కర్మాణః సంపదన్త్యే బుధాః పరమ్ ॥

జ్ఞానులు తమ ఇచ్ఛాపూర్వకంగా ఒక చోటనే ఉన్నప్పటికీ, (లేక) అక్కడో ఇక్కడో సంచారం చేస్తూ ఉన్నప్పటికీ, యథాప్రాప్తములైన ఆయా వ్యవహారములను ఆచరిస్తూనే... మరొకవైపు నిశ్చల పరమాత్మ యందు స్థితి కలిగియే ఉంటున్నారు. లేక సర్వ వ్యవహారములను త్యజించి శాంతమైన అంతఃకరణముతో ఏకాంత స్థలమందు లిఖితమైన చిత్ర పటంలాగా నిశ్చల సమాధిని అవధరించి ఉంటున్నారు. ఆ రెండింటిలో వారికి తేడాయే కనిపించటం లేదు. సమస్త సంకల్పములు శమించినట్టి ఆ మహాత్మునికి (లేక) ఆ ప్రబుద్ధునికి ఈ జగత్తంతా సంకల్పములోని పట్టణంలాగా, లేక స్వప్నంలో కనిపించే అరణ్యంలాగా మొదలే అస్తమించియున్న దానివలె అగుపిస్తోంది.

అపరోక్ష ఆత్మజ్ఞానం -

స నేత్ర రూపానుభవం జాతి తో ఽన్ధ ఇవ భ్రమైః,
నిర్వాణం వర్ణయన్ అజ్ఞస్తు ఆప్యతే అంతర్ న శామ్యతి ॥

ఓ రామచంద్రా! ఈ జీవుడు అజ్ఞాన దశ నుండి జ్ఞానిగా తనను తాను తీర్చిదిద్దుకోవాలి. 'ఆత్మ నిర్మలము–సత్యము–అప్రమేయము–ఆద్యంతరహితము–అఖండము'...అను శాస్త్ర వాక్యాలు వింటూ కూడా అజ్ఞాన కారణంగా కొందరు ఆత్మ వర్ణనను పరోక్ష విషయంగా భావిస్తూ వస్తున్నారు. అప్పుడేమౌతోంది? నిర్వాణము గురించి వింటున్నప్పటికీ అపరోక్ష సాక్షాత్కారం (ఆయా వర్ణలకు విషయమగుచున్నది. తమ యొక్క స్వస్వరూపమే – అను సాక్షాత్కారం) లభించకయే పోతోంది. అట్టి వారికి ఎంత విన్నా కూడా వారిపట్ల సంసారం కొనసాగుతూనే పోతోందిగాని శమించటమే లేదు! ఒకడు కళ్ళు మూసుకొన్నప్పటికీ సంస్కారవశం చేత అతనికి నేత్ర రూపానుభవం కొనసాగు తూనే ఉంటుంది. చూచావా? అనగా – నేను ఏదీ చూడనే కూడదు అని ఒకడు కళ్ళు మూసుకొని కూర్చున్నప్పటికీ సంస్కారవశం చేత అతని మనోవీథిలో ఏదో ఒకటి దృశ్యరూప సంబంధమైన అనుభవంగా కొనసాగుతూనే ఉంటుందే! అట్లాగే ఒకడు ఆత్మ యొక్క మాహాత్మ్యం గురించి ఎంత వింటున్నా కూడా... "అదంతా మహాత్ములకే సాధ్యం, నాకెప్పటికి లభిస్తుందో?" అని అనుకుంటూ సంసారాన్ని తనకుతానే కొనసాగించుకొంటున్నాడేగాని 'ఆత్మ అనగా నేనే' కనుక నేనే! అఖండుడను. నిత్యుడను. అప్రమేయుడను. అనంతుడను'... అను ఆత్మానుభవంలో ప్రవేశించలేకపోతున్నాడు. అందుచేత ఓ సహ ఆత్మస్వరూపులారా! "శాస్త్రములు ప్రసాదించే 'ఆత్మ జ్ఞానం' అనే ప్రవచనమంతా మీ స్వస్వరూపము గురించే" అనే అపరోక్ష జ్ఞానం నిస్సందేహపూర్వకంగా ప్రవృద్ధపరచుకోండి. ఆత్మ జ్ఞానముచే అంతఃకరణ సంతృప్తిని, శాంతిని సుస్థిరపరచుకొనెదరు గాక!

పరోక్ష ఆత్మజ్ఞాన పరిమితత్వం - అజ్ఞానులు 'అవిద్యామయం–కల్పనారూపం' అగు పరోక్ష జ్ఞాన పరిమితమైన ఉపదేశాన్ని విని అజ్ఞత్వంచే 'మేం ఈ సమాచారం విన్నాం కదా! ఇక కృతార్థులమే'... అని తలచుచున్నారు. విన్నదంతా అపరోక్షజ్ఞానంగా రూపుదిద్దుకున్నప్పుడే 'కృతార్థత'... అని నేను గుర్తు చేస్తున్నాను. అంతేగాని మూర్ఖత్వం వహించి' 'పరోక్ష జ్ఞానంచే

కృతార్థులమైతిమి' అని తలచుచు పరిమిత ప్రయోజనంతో తృప్తిపడకండి. జ్ఞాని ఎదుట-ప్రశ్న-ఉత్తరాదుల ద్వారా అట్టి పరోక్ష-పరిమిత జ్ఞానుల అకృతార్థము క్షణాలలో వెల్లడి అవుతుంది.

కల్పనాత్మకమైన జ్ఞానము భావ-అభావ-ఇచ్ఛ-ద్వేషాది భ్రమలచే నిమిషమాత్రంలోనే మహా దుఃఖప్రదమగుచున్నది. అందుచేత ఆత్మజ్ఞాన సంపన్నులు అట్టి కల్పనా రూపమగు ఉపాయ-అపాయముల గురించి పెద్దగా వచించనే వచించరు. వారి సంవాదమంతా జీవుని యొక్క వాస్తవ-నిత్య-సత్యతత్త్వము వైపుగా ఉద్దేశించబడే ఉంటుంది.

కనుక ఓ రామచంద్రా! ఈ జగత్తును, ఇద్దాని భేదాభేదరూపముచే మిథ్యగానే దర్శించు. పురుగు నుండి హిరణ్యగర్భుని వరకు సమస్త విషయముల పట్ల వాసనారాహిత్యపూర్వకంగా విరక్తిని కలిగి ఉండు. ఆ విధంగా "నా అనంతము-అపరిమితము-సర్వాత్మకము అగు ఆత్మ స్వరూపము నందు ఈ దేహ జగత్తులు మొదలైనవి ఒకానొక స్వల్ప విభాగము" అను అనుభూతిచే ఆత్మయందు నెలకొని ఉండటమే 'నిర్వాణము' లేక 'మోక్షము' అని పెద్దలచే చెప్పబడుచున్నది.

కాబట్టి, నేను ఇప్పటిదాకా చెప్పిన ఉపదేశమంతా లౌకిక కథ వలె పరోక్ష రూపంగా ఎఱుగటం సరిపోదు. పరోక్ష రూపంగా ఎఱిగినంత మాత్రం చేత ఎవరూ కృతార్థులు కాలేరు. అపరోక్షంగా ఎఱగాలి. అట్టి అపరోక్ష జ్ఞానముచే పూర్ణము-నిర్మలము-అవేద్యమైనది (తెలుసుకునేదే అది కాబట్టి), భగవత్స్వరూపమైనది అగు ఈ జగత్తును సాక్షాత్తు స్వస్వరూప భావ చమత్కారముగా అనుభవించెదరు గాక! తద్వారా నిర్వాణ సుఖరూప శాంతిని సర్వదా అవధరించెదరు గాక!

జాత్యంధరూపానుభవాను రూపం, యదా గమైః బుద్ధమ్-అబోధ రూపమ్,
అథ స్వదీకృత్య తదన్తరే, అస్మిన్ బోధే నిపత్యానుభవో భవాభూః ॥


పైన మనం చెప్పుకున్న కారణాలచేత వేదశాస్త్ర ఉపదేశములచే బహిర్ముఖ భావన కొనసాగిస్తూ పరోక్షజ్ఞానానికి పరిమితం కాకూడదు. వేదశాస్త్ర ఉపదేశముల ఉద్దేశాన్ని పరిమిత బుద్ధితో స్వీకరించటం సరికాదు. అదంతా జన్మాంధుని రూపానుభవ సదృశం. అట్టి పరోక్ష జ్ఞానాన్ని కూడా అణగగొట్టి నిత్య అపరోక్షమైనట్టి ఆత్మ స్వరూపమున నిమగ్నులు కావలసినదిగా నా మనవి. ఇది బోధసారం కూడా! ఇట్లు జన్మాది రహితమగు నిర్వాణరూపులై ప్రకాశించెదరు గాక!

❖❖❖

25. 'అశాంతి' నుండి విశ్రాంతికి

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఈ జీవుని పట్ల అభ్యంతరమున అహంకారాదులు, బాహ్యమున ఈ జగత్తు అను భోక్తృ-భోగరూపమంతా ప్రవర్తిస్తోంది కదా! అయితే... అభ్యంతరంలోని అహంకారాదులు గాని, బాహ్య జగత్తు గాని... తదనుభవరూపమగు భోగం యొక్క తాదాత్మ్యం... అసత్యంగా భాసించుచున్నాయి. అనగా తత్త్వజ్ఞానం లేనప్పుడు అవి సత్యం వలె అనిపిస్తున్నప్పటికీ, తత్త్వజ్ఞానానంతరం అవన్నీ లేవనియే తెలియవస్తోంది.

ఎందుకంటావా ? అసలు, భోగము అంటే ఏమిటి?



భోక్త యొక్క భోగ్య వస్తువులతోటి సంబంధం యొక్క అనుభవమే భోగం. ఏదైతే ఆత్మయే అయి ఉన్నదో అదే మూఢులకు అజ్ఞానముచే భోగానుభవసహితంగా 'జీవుడు' అనబడునదిగా తోచుతోంది. వాస్తవానికి ఆత్మ బోగానుభవరహితమైన అనునిత్య సత్యమగు బ్రహ్మమే అయి ఉన్నది. 'అజ్ఞానము' అనే రుగ్మత తొలగినప్పుడు సర్వులు ఆత్మ స్వరూపులేనని, అంతా కూడా ఆత్మ యొక్క విన్యాసమేనని అనుభవసిద్ధి కాగలదు. 'జ్ఞానం' అనే శాంత స్వరూప శీతలత్వం సముపార్జించుకున్న వారికి ఇక ఈ జగత్ భోగములు స్వభావ సిద్ధంగానే 'రహదారిలో పడి ఉన్న ఎండుగడ్డి పరక' వలె అల్పంగాను, అరుచికరమైనవిగాను కనిపించగలవు.

ఓ రామచంద్రా! శాస్త్రములచే చెప్పబడే ఆయా పదజాలాలచే (ఆత్మ-పరమాత్మ-జీవుడు-బ్రహ్మం-సత్త్వం మొదలైన ఆయా శబ్ద జాలంతో)... పెద్దగా పనిలేదు. 'నిర్వాణం' అను జగదతీత సంస్థితి లభించాలంటే....

1. ఇంద్రియ సంబంధమైన భోగముల పట్ల అనురక్తి తొలగడం (విరక్తి కలగటం)

2. వ్యక్తిగత పరిమితమైన 'అహంభావం' అనునది రహితమవటం.... ఈ రెండూ చాలు!

అందుచేత ముముక్షువు ఈ రెండిటి కొరకై నిరంతరమైన ప్రయత్నపూర్వక కార్యక్రమంలో తనను తాను నియమించుకోవాలి. ఎవరికైనా స్వప్నంలో రుచిగా కనిపించిన పదార్థ సమూహముల కొరకు మేల్కొనిన తరువాత వెతికి సంపాదించాలని అనిపిస్తోందా? లేదు. ఎందుచేత అసలు అవి భ్రమయే కదా! మెలుకువ రాగానే అవన్నీ కనబడకుండానే పోతున్నాయి. ఇక ఆ స్వప్నంలోని తినుబండారాల కొరకై ఎవడూ ఏడ్వడు కదా! స్వప్నంలో కనిపించిన ఇళ్ళు-వాకిళ్లు-మనుష్యులు మొదలైనవి... మెలకువ తర్వాత 'అయ్యో! అవి పోయినాయే' అని ఎవరూ దుఃఖించటం లేదు కదా! "అలాగే ఈ జాగ్రత్‌లో సర్వ విషయాలు కూడా" అని గ్రహించబడు గాక! అజ్ఞానదశలో రుచికరంగా కనిపించే అహంకారము-జగదనుభవములు మొదలైనవన్నీ తత్త్వజ్ఞుడు (ఆత్మజ్ఞాన సహితుడు) అయిన తర్వాత అవన్నీ నిరర్థకంగాను, సార రహితమైనవిగాను, అరుచికరంగాను ఉంటాయి. అతని దృష్టియందు ఈ అహంకారము-జగత్తు మొదలైనవి 'లేనివే' అగుచున్నాయి. స్వతహాగానే మొదలంట లేని పదార్థముల వలన సంబంధమేమిటి? బంధమేమిటి? మోక్షమేమిటి? అవి బాధించటమేమిటి? ఎట్లా వదిలించుకోవాలి... అను సంఘర్షణ ఎందుకు? అరణ్యంలో ఉన్న యక్షుడు తన యొక్క సంకల్ప బలం చేత మాయాకల్పిత పురమును, అందులో స్వజనులను దర్శించి, అందులో ప్రవేశించి విహారంచేస్తూ ఉంటాడు చూచావా? ఆ యక్షనగరం మొదలే

అసత్యం కదా! అదే తీరుగా ఈ జీవుడు కూడా తన యొక్క 'అవిద్య' అను ప్రమత్తతచే 'మిథ్య మాత్రమే' అగు ఈ సంసారమును కల్పించుకొని, అందులో ప్రవేశించి అద్దానియందు తన కొఱకు తానే వెతకుకొనుచున్నాడు. తన కల్పనను తానే సంసారంగా గాంచుచున్నాడు. 'యక్షుడు-అతని నగరం' ఈ రెండూ కూడా భ్రమ సిద్ధమే అయినప్పటికీ, కల్పితమాత్రమే అయినప్పటికీ, అందులో వ్యవహారాలు మాత్రం అర్థ-క్రియా సమర్థములై వర్తించుచున్నాయి. అట్లాగే అజ్ఞానంచే ఇక్కడ అహంకారం-జగద్భ్రమ సత్యం వలె వర్తిస్తున్నాయి. అరణ్యంలో యక్ష-ప్రేతాదులు భ్రమ రూపమున వర్తిస్తున్నట్లు ఆవరణరహితమగు చైతన్యమున ఈ 14 లోకాలు భ్రమ రూపాలై స్ఫురిస్తున్నాయి. ఆకాశమున స్వతహాగా 'తూర్పు-పడమర-లోపల-వెలుపల-పైన-క్రింద' అను ఆవరణలు లేక పోయినప్పటికీ జగత్ వ్యవహారం దృష్ట్యా అవన్నీ ఒనగూడు చున్నట్లే, ఆత్మలో ఆవరణలు లేకపోయి నప్పటికీ అహంకారము-జగత్ భ్రమ మొదలైన ఆవరణలు సాపేక్షిక మాత్రంగా సిద్ధిస్తున్నాయి.

విచారణ - ఓయీ మానవుడా! ఆత్మ గురించి ముందుగా ఎఱుగవలసినదిగా మా విన్నపం! 'అహంకారము-జగత్తు' అనేవి మిథ్య మాత్రమే'... అని 'భ్రమ మాత్రమే' అని క్రమంగా గ్రహించు. అట్టి నిశ్చయము యొక్క ప్రభావం చేత చిత్తము అని చెప్పబడేది కూడా చైతన్యము నొందగలదు. కాబట్టి మీరంతా సమస్త సంశయములను విడనాడండి. గ్రహణ-త్యాగముల రెండిటినీ త్యజించినవారై ఉండండి. సర్వ సంశయములను విడనాడండి. కోర్కెలన్నిటినీ పారద్రోలినవారవండి. శాంత స్వరూపమును సంతరించుకొని ఉండండి. స్వతహాగా సత్తయే లేనట్టి ఈ దృశ్యము వాస్తవానికి ద్రష్టయొక్క రూపమే అయి ఉండి, ఇట్లు వ్యాపించి ఉన్నది సుమా! లేదా... (మరో విధంగా) ఇది ద్రష్ట యొక్క రూపం కూడా కాదు!

తరంగమంతా జలమయమే అయినప్పటికీ 'జలం తరంగంగా గుండ్రని పొడవైన ఆకారంగా ధర్మంగా కలిగి ఉన్నది'... అని అనలేం కదా! ఈ దృశ్యమంతా అనిర్వచనీయమగు చిత్స్వరూపమే అయి ఉన్నది. కానీ చిత్స్వరూపంలో ఈ జగత్తులు, దృశ్యాదులు లేవు. ఎందుకంటే...

1. దృశ్యమంతా ద్రష్ట స్వరూపమే! 2. 'పరమార్థ చిద్రూప సత్తా' అగు ద్రష్ట 'అసత్తు' అయినట్టి ఈ దృశ్యరూపంగా ఎట్లు గావించ బడుతుంది?

వసంతకాలపు రస ప్రవాహ రూపాలే ఈ వృక్ష-లత-లతా గృహాలు కదా! అట్లాగే ఈ సృష్టి అంతా కూడా ఆత్మ స్వరూపమాత్ర పరిపూర్ణమగు చైతన్యము యొక్క రూపమే అయి ఉన్నది.

జగత్తు యొక్క అభాస అని ఏది దర్శించబడుచున్నదో, అదంతా కూడా శుద్ధ చిన్మాత్రమే అయి ఉన్నది. ఇక ఇక్కడ ద్వైత-ఏకత్వములనబడేవి ఎట్లా ఉంటాయి? కాబట్టి ఓ సహప్రియా సర్వ జీవులారా! మీరంతా కూడా నిర్వాణ రూపమును సంతరించుకొని ఉండండి. చిదాకాశరూపులై ఉండెదరుగాక! నిరతిశయమగు ఆత్మానంద రసమును పానం చేసినవారై పరమశాంత మనస్కులు అవండి. సర్వ సంశయాలను పారద్రోలి 'నిర్వాణం' అనే పరమశాంత స్థానమున సుస్థిరులుకండి.

కిమ్ ఏతా ఆస్వతి శూన్యాసు సంసారారణ్య భూమిషు ।
మానవా! వాతహరిణా భ్రమథో భ్రాంత బుద్ధయః ॥

ఓయీ! మానవుడా! ఈ సంసారం అని పిలువడే అతి శూన్యమైన అరణ్య భూమిలో భ్రాంతి బుద్ధితో ఎందుకు తిరుగాడుచున్నావు? ఓ ప్రియ సహజనులారా! 'ముల్లోకాలు' అనే మృగతృష్ణా జలం చూచి మీరు మోసపోకండి. 'ఆశ' అనే ఆవరణచే ఏర్పడిన చిత్తమును నమ్మి తద్వారా ధైర్యాన్ని కోల్పోయి ఎచ్చటెచ్చటికో పరుగులు తీయటమెందుకు? ఇక్కడి రూపాలు, సంకల్పాలు, బాంధవ్యాలు నమ్ముకొని సంసారంలో సంచరించటమనేది మూర్ఖపు జింక ఎండమావు లలోని నీళ్ళు త్రాగి దాహం తీర్చుకుందామని పరుగులు తీయటం వంటిదే! అందుచేత ఈ సాంసారిక పరిశ్రమలలో మీ ఆయువును వ్యర్థం చేసుకోకండి. జగత్తు అనే గంధర్వ నగరాన్ని (గారడీ కల్పన) చూసుకొని 'మాకు అవి ఉన్నాయి. ఇవి తెలుసు' అనుకుంటూ మురియకండి. ఎక్కడైనా సంసార సుఖం కనిపిస్తున్నా కూడా అది భావి వినాశనరూపాలుగాను, దుఃఖ కారకాలు గాను పరికించండి.

దృష్టి యొక్క భ్రాంతి దోషం చేత ఆకాశంలో వెంట్రుకల వంటి ఆకారాలు కనిపిస్తున్నాయి చూచావా? అట్లాగే బ్రహ్మాకాశంలో 'జగత్తు' అనే ఆకారాలు అగుపిస్తున్నాయి. కాబట్టి రామా! భ్రాంతి రహితం-సత్యం అగు ఆత్మలో సదా విశ్రమించి ఉండు. వాస్తవానికి ఆత్మయే స్వస్వరూపంగా గల జీవునకు 'మానవ శరీరం' అనేది... ఒక మహత్తరమైన అవకాశం అయితే, వృక్షం యొక్క ఊర్ధ్వ భాగమున గల రెపరెపలాడే ఆకు చివరగల జలబిందువు వలె ఈ దేహం అతి చంచలమైనది. అట్టి ఈ దేహం ఏ క్షణమైనా మట్టిలో కలిసిపోవచ్చు. అట్టి మానవ దేహం యొక్క సంసార రూపాలైనట్టి 'అవయవాలు-తత్ సంబంధిత విషయాలు'... అనే గర్భశయ్యలో పరుండకండి. దేహ స్వభావమును ఆశ్రయించి నానా అగచాట్లు ఎందుకు పడాలి? 'ఆద్యంత రహితం-అఖండితం' అగు ఆత్మ స్వభావంలో శాంతంగా నెలకొని ఉండండి. అంతేగాని, ద్రష్టు-దృశ్య పరంపరలు మొదలుగాగల 'దృశ్య రూపం' అను దోషంతో కూడిన ఆ స్వభావం (అనాత్మ స్వభావం) నందు ప్రవేశించి దుఃఖ పరంపరలను కొనితెచ్చుకోవద్దు. అజ్ఞానికి మాత్రమే ఈ ప్రపంచం సత్యం వలె భాసిస్తోంది. ఆత్మ జ్ఞాని యొక్క దృష్టి నుండి ఈ ప్రపంచం సర్వదా వినాశనశీలమై, స్వప్న సదృశమై ఉండటంచేత అతనికి సత్యమగు శుద్ధాత్మవస్తువే అన్ని వైపులా తాండవిస్తూ అనుభవమౌతోంది. నామ రూపాత్మకంగా కనిపించే ఈ జగత్తు స్థానంలో వారికి నామరూపరహిత పరబ్రహ్మం మాత్రమే అనుభవమౌతోంది. అట్టి పరబ్రహ్మంలో 'జగత్తు' అనేది లేశమైనా కూడా వారికి అగుపించడం లేదు.

త్రోటయిత్వా తు తృష్ణాయః శృంఖలావలితం బలాత్,
సంసారపంజరం తిష్ఠ సర్వస్య ఊర్ధ్వమ్ మృగేంద్రవత్ ॥

ఓ రామచంద్రా! 'తృష్ణ' అనే గొలుసులతో 'సంసారం' అనే పంజరం చుట్టబడి ఉన్నది. అట్టి పంజరంలో చిక్కుక్కున్న ఈ జీవుడు 'ఆత్మ జ్ఞానం' అనే బలముచే తృష్ణారూప పంజరమును త్రెంచివేయు గాక! సింహం వలె పంజరమును చీల్చివేసి సర్వోత్కృష్టుడై వెలయుగాక!

ఓ రామచంద్రా! 'ముక్తి' అనగా ఏమిటి? 'నేను-నాది' అను రూపమైన అభిమానం శమించటమే ముక్తి. ఒకడు వ్యవహారమునందు ఉన్నప్పటికీ, లేక సమాధియందు ఉన్నప్పటికీ... 'స్వాత్మ సత్త' యొక్క అనునిత్య రసాస్వాదనయే ముక్తి యొక్క స్వరూపం. సంసార మార్గంలో ఖిన్నుడై

– 1. జగదత్వము, 2. వాసనా సమూహము, 3. త్రివిధ తాపములు, 4. అజ్ఞానము, 5. ఆధి భౌతిక–దైనిక–ఆత్మికములనబడే ...అయిదు దోషములు కలిగి ఉండటం చేతనే జన్మ–కర్మాదులు, తదితర భ్రమ అంతా అతని పట్ల ప్రవర్తిస్తోంది.

అందుకు ఉపాయములు, మార్గములు– 1. నిర్వాణత్వము, 2. వాసనారాహిత్యము, 3. త్రివిధ తాప శూన్యత్వము, 4. ఆత్మజ్ఞానము, 5. సర్వాతీతత్వము ...ఈ '5' కూడా ప్రశాంతాలైన విశ్రాంతి రూపాలు. అనగా జీవుడు ఈ అయిదింటినీ క్రమక్రమంగా పెంపొందించుకొనటం చేత మాత్రమే 'అశాంతి' నుండి 'విశ్రాంతి' స్థానములకు పయనించగలుగుతాడు.

తత్త్వజ్ఞానులు–అజ్ఞానులు కలిసియే ఈ జగత్తులో (భౌతికంగా) సంచరిస్తూ ఉన్నారు. అయితే ...తత్త్వజ్ఞులు ఈ జగత్తును ఏ విధంగా (ఏ అవగాహనతో) ఎఱుగుచున్నారో... అజ్ఞానులు ఆ విధంగా ఎఱుగటం లేదు. అట్లాగే, అజ్ఞానులు ఈ జగత్తును ఏ రీతిగా పొందుచున్నారో, ఆ రీతిగా తత్త్వజ్ఞులు పొందటం లేదు. వారిరువురి అనుభవం పరస్పరం చెప్పుకోవటానికి కూడా అనర్హమై ఉంటోంది. జ్ఞానికి ఈ జగత్తంతా ఆనందమయమై ఉంటోంది. ఇక అజ్ఞానికో... ఇది ఎంతగానో దుఃఖమయమై ప్రాప్తిస్తోంది. అనేక నదీ జలాలు సముద్రంలో ప్రవేశించిన తర్వాత... ఇక ఒడ్డును నిలబడ్డ వానికి 'ఇది ఈ నదీ జలం, అది ఆ నదీ జలం'... అనే తేడా ఏమాత్రం అగుపించదు కదా! అట్లాగే భ్రమ శమించినట్టి తత్త్వజ్ఞానికి ఈ జగత్తు కనిపిస్తున్నప్పటికీ ఇక్కడ వారికి 'సంసారం' అనే బంధం కనిపించడం లేదు. ఈ జగత్తు యథాతథంగా ఉండి ఉంటున్నప్పటికీ కూడా ప్రబుద్ధుడు–నిర్వాణ సముపార్జితుడు అగు జ్ఞానికి ఇదంతా లేనిదే అగుచున్నది. గాలి వీస్తూ ఉండగా ఎండు గడ్డి పరక ఎచటికో దొర్లుతూ పోతున్నట్లుగా ఆత్మ స్వభావమున విశ్రాంతిని పొందియున్న సజ్జనునికి ఈ జగత్తు అనునిత్యంగా ఎచటికో పలాయనం చిత్తగిస్తూనే ఉన్నట్లు అగుపిస్తోంది.

శ్రీరాముడు : మహర్షీ! ఈ జగత్తు అనుక్షణం పరిణామశీలమై 6 రకాలైన వికారాలతో (పుట్టుక–పెరగడం–ఏర్పడటం–తరగటం–సన్నగిల్లటం–నశించటం) ప్రవర్తిస్తూ ఉంటోంది కదా!

శ్రీవసిష్ఠ మహర్షి : అవును కదా!

శ్రీరాముడు : అయితే బ్రహ్మం సర్వదా యథాతథమై ఉంటున్నది. అవునా?

శ్రీవసిష్ఠ మహర్షి : అవును.

శ్రీరాముడు : మరి 'ఈ జగత్తు బ్రహ్మమే' అనే వాక్యం ఎట్లా యుక్తియుక్తం?

శ్రీవసిష్ఠ మహర్షి : పరబ్రహ్మం నుండి భావన ఏర్పడుతోంది. కనుక పరబ్రహ్మం–భావన అభేదమే కదా! భావన నుండి జగదనుభవం బయల్వెడలుతోంది. కనుక అనుభవం–అనుభవజ్ఞుడు అభేదమే అగుటచే జగత్తు బ్రహ్మంగా చెప్పబడింది. అయితే, ఆత్మజ్ఞాన నిత్యత్వము సముపార్జించుకున్నవారికి మాత్రమే ఈ జగత్తు అభేదం–నిరతిశయం అగు బ్రహ్మంగా గోచరిస్తోంది. కాని అజ్ఞానులకు మాత్రం ఇదంతా వివిధ జీవులతో–సంఘటనలతో అత్యంత సంక్లిష్టంగా ఉండవచ్చు. భావికుడు (జ్ఞాన–అజ్ఞాన భావన చేయువాడు) ఒక్కడే గదా! అనేక ఆకారాలతో, భంగిమలతో తరంగాలు

ఉండవచ్చు గాక! జలం ఒక్కటే కదా! జలం దృష్టిలో పెట్టుకున్న వారికి 'ఇది ఈశాన్యం మూల నుండి వస్తున్న పెద్ద తరంగం! అది నైఋతి వైపుగా సాగుతున్న చిన్న తరంగం'... అన్న విభేదాలన్నీ అర్థరహితంగా ఉంటాయి. త్రిగుణాత్మకమై ఈ జగత్తు 'గుణాలకు మునుముందే గుణాలకు ఆవల సర్వదా ఏర్పడి ఉన్న గుణి' అనబడు ఆత్మతత్త్వం దృష్టిలో గల వారికి ఇక్కడ సర్వం బ్రహ్మమయంగా గోచరిస్తోంది. దృష్టి జ్ఞానమయం అయ్యే వరకు ఇక్కడ షడ్వికారాలతో కూడి పరివర్తన శీలమగు జగత్తు కనిపిస్తోంది. శాస్త్ర-గురు పాఠాల ప్రభావం చేత, స్వయంకృషితో నిర్మలమైన-సూక్ష్మమైన దృష్టిని సంపాదించుకున్న తత్త్వవేత్తలకు ఇదే జగత్తు నిరతిశయానందమగు బ్రహ్మంగా గోచరిస్తోంది. అట్లు దర్శింపజేయుటమే శాస్త్రముల ముఖ్యోద్దేశం.

శ్రీరాముడు : స్వామీ! సామాన్యులమగు మాకు సహజీవులను దేహాల-గుణాల దృష్టితో కాకుండా "వీరు అద్వితీయం-గుణాతీతం-ఏకం అగు ఆత్మ స్వరూపులే" ...అనే దృష్టితో చూడటం సాధ్యమౌ తుందంటారా?

శ్రీవసిష్ఠ మహర్షి : ఎందుకు కాదు? దృశ్యాతీత దృష్టి అనేది జీవులందరికీ అభ్యాసంలో ఉన్న విషయమే. ఉదాహరణకు నిన్న నిన్ను కలిసిన ముగ్గురు నలుగురు స్నేహితుల పేర్లు చెప్పమంటే చెప్ప గలవు. కానీ వారు ఏ రంగు చొక్కా ధరించారు?... అంటే చాలా వరకు చెప్పలేవు కదా! ఎందుకని? వారిని వస్త్రాల దృష్టితో కాకుండా స్నేహదృష్టితో చూచి ఉన్నావు కాబట్టి! వస్త్రాలకు అతీతమైన స్నేహ దృష్టి సాధ్యమైనట్లే... గుణములకు అతీతమైన ఆత్మదృష్టి సుసాధ్యమేనని చేతులెత్తి చెప్పుచున్నాను.

ఓ రామచంద్రా! చింతలు మొదలైనవేవీ లేనివాడు, ప్రపంచం గురించి ఏమంతగా తెలియని వాడు అగు ఒక చిన్న పిల్లవానికి ఈ జగత్పదార్థములన్నీ ఆట వస్తువులవలె వికల్ప రహితంగా అగుపిస్తాయి చూచావా? అట్లాగే వాసనలు క్షయించినట్టి ఆత్మజ్ఞానికి ఇవన్నీ కూడా నిర్వికల్పంగా (కల్పన అనే వికారం ఏమాత్రం లేనివై) భగవత్ స్వరూపంగా (ఆత్మ మాత్రంగా) భాసిస్తున్నాయి.

యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ ।
యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః ॥

అజ్ఞానులందరికీ ఏది (ఆత్మ జ్ఞానం) రాత్రి అయి ఉన్నదో (ఏ విషయంలో నిద్రాముద్ర వహించి, పట్టించుకోవటానికి అనర్హంగా అనిపిస్తోందో)... అది (అట్టి ఆత్మ జ్ఞానం) ఆత్మజ్ఞాన శీలుడగు సంయమికి జాగరూకతకు అత్యంత అర్హమైనదిగా అనిపిస్తోంది. ఏది (ప్రాపంచిక విశేషాలు, సంబంధాలు మొదలైనవి) ఆత్మజ్ఞుడగు మునికి అత్యంత నిస్సారము-పట్టించుకోవటానికి అనర్హముగా అనిపిస్తుందో... అది అజ్ఞాన జీవులకు గొప్పగొప్ప విషయాల వలె అనిపిస్తోంది. అట్టి ప్రాపంచిక విషయాల పట్ల ఆత్మజ్ఞానికి దృష్టియే కలగటంలేదు. అంతేకాదు. సంసారిక దృష్టి గల జీవులకు అజ్ఞానాంధకారము ఆవరించి ఉండటంచేత ఆత్మ వస్తువు సుదూరంగా మరెక్కడో ఉన్నట్లు తోచుచున్నది. సుజ్ఞానికో?... ఆత్మ వస్తువు విరామ శూన్యమై సదా జగద్రూపంగా కూడా ప్రదర్శన మగుచున్నట్లు అనుభవమౌతోంది. అజ్ఞానికి జగద్రూపంగా ప్రసిద్ధమై కనిపిస్తున్న శబ్ద-స్పర్శ-

రూపాది విషయములు జ్ఞానికి చిత్రంలో లిఖించబడిన అరణ్యములోని వివిధ వృక్షముల ఆకులవలె ఎదుట వాస్తవానికి లేనివిగా అనుభూతమౌతున్నాయి. జన్మాంధునికి రూపానుభవమే ఉండనట్లు జ్ఞానికి అజ్ఞాన ప్రసిద్ధమైన జగత్తు భ్రాంతిప్రాయంగా, అసద్రూపంగా సుషుప్తి సమయంలోని అనుభవరాహిత్య స్థితిలాగా... భాసించకయే ఉంటోంది.

దుఃఖ రూపంగా ప్రసిద్ధమై ఉంటున్న ఈ త్రిజగత్తులు విమూఢులకు మాత్రమే విషయమగు చున్నది. జ్ఞానికి ఇదంతా విషయమగుటయే లేదు. ఎందుకంటే... ఈ జగత్తు సత్తు కాదు. స్వప్నం స్వప్నరూపంగా సుస్పష్టమైన తర్వాత ఆ స్వప్నంలో తారసపడిన రూపాలు, భావాలు, అందలి బాహ్యా-అభ్యంతర విషయాలు మేలుకొనిన వానికి అర్థరహితమౌతాయి కదా! అట్లాగే 'జ్ఞానం' అనే మెళకువ వచ్చిన తర్వాత ఈ జగత్తులో సాంసారిక దృష్టికి కనిపించే సంబంధాలు, భోగాలు మొదలైనవి మొదలంట సాంసారిక రూపం కోల్పోతాయి. అనగా జ్ఞానికి అవి స్ఫురించనే స్ఫురించవు. అతడు సదా విభాగరహితుడై ఉంటాడు. స్వస్థచిత్తుడౌతాడు. సర్వానికి అవిరోధమైన ఆ పరమాత్మను అనుభవిస్తూ ఉంటాడు. నిర్వాణ స్వరూపుడై శీతలాంతఃకరణుడై, అత్యంత తృప్తిని పొంది ఉన్నవాడు అగుచున్నాడు.

❖❖❖

26. మనస్సు - పదార్థములు

శ్రీరాముడు : మహాత్మా! మీరు ప్రవచిస్తూ వస్తున్న జ్ఞానస్థితికి కావలసిన 'ధ్యానం' ఎట్టిదో తెలపండి.

శ్రీవసిష్ఠ మహర్షి : 'ధ్యానం' అను ప్రక్రియ శాస్త్రములచే-భోగవాసనలతో కూడిన చిత్తం గల ముముక్షువుల కొరకై ప్రతిపాదించబడుతోంది. 'ధ్యానం' అనునది చిత్తం యొక్క ప్రవృత్తి స్వభావానికి ఔషధం. అయితే, భోగవాసనలచే ఆకర్షించబడని చిత్తం గల జ్ఞాని యొక్క స్థితి 'నిత్య ధ్యాన స్థితి' గా వర్ణించబడింది. అనగా, అతడు వేరే ధ్యానాభ్యాసం చేయకున్నప్పటికీ సర్వదా సర్వత్రా స్వభావసిద్ధంగా సమత్వం దర్శించగలుగుతాడు. సర్వత్రా సమదర్శనమే వాస్తవమైన ధ్యానం. ఒక తటాకంలోని జలం క్రింద తూము మొదలైన బహిర్గత మార్గాలు లేనప్పుడు ప్రవాహ స్వభావం లేక నిశ్చలంగా ఉంటుంది చూచావా? అట్లాగే జ్ఞాని యొక్క హృదయంలో పదార్థ సంబంధమైన వాసనలు ఉండవు. కనుక... అతని చిత్తం అటూ-ఇటూ వెళ్ళదు. ఎందుకంటే... పదార్థాలే మనస్సు. ఈ మనస్సే పదార్థాలను రంజింప జేసినవిగా చేస్తోంది. అట్టి పదార్థముల పట్ల ఎప్పుడైతే వాసనలు సన్నగిల్లుతాయో అప్పుడు మనో నిరోధము స్వయంగా సంభవిస్తోంది.

ఈ మనస్సే బాహ్యా-అభ్యంతర పదార్థాల అభాస. జలం వివిధ తరంగాలుగా స్ఫురిస్తున్నది చూచావా? అట్లాగే ఏ ఏ అర్థ-అనర్థ రూపాలుగా ఏ ఏ బాహ్యా-అభ్యంతర పదార్థాలు భాసిస్తున్నాయో... అవన్నీ కూడా మనస్సు యొక్క వివిధ రూపాలేనని గ్రహించు. ఈ మనస్సే అనేక చోట్లకు పరుగులెత్తి ఆయా చోట్ల తన యొక్క వివిధ ఆకారాలను ప్రదర్శిస్తోంది. ఏ విధంగా

జలానికి, తరంగాలకు భేదమే లేదో... అదేవిధంగా మనస్సుకు–జగత్ పదార్థాలకు భేదమే లేదు. వాయువును తొలగిస్తే వాయు సంచలనం పోతుంది. అట్లాగే వాయు సంచలనం తొలగిస్తే వాయువు తొలగుతుంది. పదార్థాలు తొలగించామా... మనస్సు తొలగుతుంది. మనస్సు తొలగిస్తే పదార్థాలు అనుభవం కావు. కాబట్టి సాధకుడు తత్త్వజ్ఞానంచే పదార్థములు నిస్సారమును గ్రహించాడా, ఇక మనస్సును తొలగించటానికి వేరే ప్రయత్నమేమీ అక్కర్లేదు. మనస్సు–పదార్థములు... ఇవి రెండూ ఒక్కటే! కాబట్టి జ్ఞానం వృద్ధి పొందుతూ ఉంటే అవి రెండూ ఏకకాలంలోనే తొలగిపోతూ వస్తున్నాయి. పదార్థములు అట్లు అనుభవమవటానికి సంకల్పమే కారణం. మనస్సు యొక్క మూల పదార్థం సంకల్పములే! కనుక విజ్ఞుడైన వాడు సంకల్ప రూపములైన పదార్థములను వాంఛించటం తగ్గిస్తూ వస్తాడు. క్రమంగా సమ్యక్ జ్ఞానం యొక్క బలిమి చేత మనస్సు–పదార్థములు ఈ రెండూ శమిస్తూ వస్తాయి. స్వప్నంలో పులి 'ఇది స్వప్నమే' అని ఎఱిగియున్న వానిని భయపెట్టలేదు కదా! జ్ఞానికి ఎదురుగా ఈ ప్రత్యక్ష జగత్తు ఏర్పడి ఉన్నప్పటికీ అది నశించియున్న దానిగానే అతనికి అనుభవమౌతుంది. అతనికి వాటిపట్ల 'కావాలి' అను జాడ్యం స్వయంగా తొలగిపోతోంది.

ఒక కుమ్మరి మట్టితో 'వీథిలో ఆడుకుంటున్న పిల్లలు–దూరంగా కొండలలోంచి లేచి వస్తున్న బ్రహ్మరాక్షసి' అనే రసవత్తరమైన సన్నివేశం తయారుచేశాడు. ఆ తయారు చేసిన మట్టి బొమ్మల కొలువును చూచిన ఒక పసిబాలుడు 'అయ్యా బాబోయ్! ఇది బ్రహ్మరాక్షసి! ఈ కొఱివిదయ్యం జట్టు విఱబోసుకొని మిడిగుడ్లతో నా వైపే చూస్తోంది. ఇక ఇది మీద పడిందా, చచ్చానే!'... అని తలచి భయంతో వణుకుచూ కెవ్వున ఏడుపు లంకించుకున్నాడు. అది చూచిన దాది, "బాబూ! ఇవన్నీ మట్టితో తయారు చేయబడిన ప్రతిమలు (బొమ్మలు) మాత్రమేనయ్యా!" అని తెలియజెప్పిన తర్వాతనో? ఆ మట్టి బొమ్మల పట్ల ఇతఃపూర్వం ఏర్పడిన భయము, భ్రమ, 'శత్రు–మిత్ర సైన్యము' అనే ఆయా భావావేశాలు తమంతట తామే తొలగిపోతాయి. అట్లాగే జ్ఞానికి మనస్సు–పదార్థములు ఈ రెండూ కూడా బ్రహ్మ స్వభావమునందే స్థితి పొంది ఉన్నవగుచున్నాయి. అందుచేత ఈ జగత్తు ఎదురుగా ఉన్నప్పటికీ వాని నామ రూపములు, వాటిచే జనించే ఆసక్తి–భయాదులు ఇవన్నీ జ్ఞాని యొక్క ఆంతరంగిక దృష్టికి సర్వదా నశించియే ఉంటాయి. అతడు సంసారదశ కంటే విలక్షణమైనట్టి పూర్ణానంద స్వరూపమును స్వయంగా సంతరించుకుని ఉంటున్నాడు. అతనికి అద్వితీయమైన పరమార్థ సద్రూపము అనుభవమగుచుండగా ఇక ఆపై ఈ ప్రపంచ దర్శనమంతా సంశుద్ధత పొందుతోంది. అటుపై ఇక్కడి జన్మాది వికారాలు, వాటి భోక్తయగు అజ్ఞానం, ఆ అజ్ఞానానికి విషయాలగుచున్నట్టి ఇక్కడి శబ్ద–స్పర్శ–రూపాదులు,... ఇవన్నీ కూడా ప్రక్కన నిద్రించుచున్న బాలుని యొక్క స్వప్నంలోని సంఘటనల వలె, బాలునిచే కల్పించబడిన యక్ష కథల వలె అసత్తుగా గోచరిస్తుంది. ధైర్యముతో కూడిన యువకునికి పిశాచాలకు సంబంధించిన బుద్ధి ఉండనట్లు... జ్ఞానికి విషయపరంపరలతో కూడిన 'జగత్తు' యొక్క బుద్ధియే ఉండదు.

అజ్ఞాని యొక్క బుద్ధికి జ్ఞాని అజ్ఞానివలె అనిపిస్తూ ఉంటాడు. అజ్ఞాని యొక్క అనుభవమునకు వంధ్య (గొడ్రాలు) యొక్క కుమార్తెలు చిరకాలం వర్ధిల్లుచున్నారు. జ్ఞానియో? జ్ఞానమునకు

విషయమే కానిది, పదార్థకారణంగా కనిపించనిది, ఆద్యంతరహితమైనది, సర్వ వ్యాపకమైనది, మనస్సు యొక్క శబ్ద-అర్థములకు కూడా సంబంధించనిది, విభాగ రహితమైనది, స్వయంగా జ్ఞాన స్వరూపమైనది అగు బ్రహ్మమే ఈ సృష్టికి వాస్తవ రూపంగా అయి ఉన్నదని గమనిస్తున్నాడు.

'జలంలో తరంగాలు' అనే శబ్దం అనుచితం కదా! ఎందుకంటే జలమే తరంగాలుగా అగుచున్నప్పుడు ఇక జలంలో తరంగాలు ఉండటమేమిటి? అట్లాగే 'బోధ' అనే చైతన్య జలము నందు మనో-బుద్ధులు నిర్మల తరంగాలు వంటివి. (లేదా) చైతన్యమే మనో-బుద్ధి స్వరూపముగా అగుచు తాను సర్వదా యథాతథంగానే ఉంటోంది. వాస్తవానికి శుద్ధాత్మయందు మనోబుద్ధి తరంగాలు ఎట్లా సంభవిస్తాయి? లేదు.

ఓ రామచంద్రా! ఈ మనస్సు యొక్క భ్రమ, ఈ జగత్ భ్రమ... ఇవన్నీ నిరర్థకమేనని అనక తప్పదు. అందుచేత బ్రహ్మ స్వభావమునందే స్థితి కలిగి ఉండటం సముచితం. ఆకాశంలోని 'సూర్యుడు' అనే జ్యోతిర్మండలములలో 'చీకటి' అనే ప్రసక్తియే ఉండదు కదా! బ్రహ్మ స్వభావమున నెలకొని ఉన్న విజ్ఞులకు జాగ్రత్-స్వప్న-సుషుప్తులు మొదలైన అవస్థలన్నీ నిర్విషయత్వమును సంతరించుకొని ఉంటాయి. అనగా అతని నిత్యోదిత స్వానుభవం వాటికి అతీత్వమును సంతరించుకుని ఉంటుంది. అతనికి ఈ అవస్థలన్నిటిలోనూ సాక్షిరూపంగా ఉన్న నిజాత్మయే సర్వత్రా అనుభూతమౌతూ ఉంటుంది. అట్టి అనుభూతి యొక్క సాంద్రత చేత అనంత రూపాలుగా ఉన్న ఈ జ్ఞేయ దృశ్య (తెలియబడే) పదార్థాలన్నీ మిథ్యగా ఎఱుగుచున్నాయి. త్రాడులో అధ్యస్తమగు సర్పంలాగా వారికి ఇదంతా నిర్వికార-చిద్ఘన ఆత్మ యొక్క స్వభావం గానే స్థితి నొంది ఉంటోంది.

రామచంద్రా! బీజమే కొమ్మలు-ఆకులు-ఫలాలు రూపం ధరించుచున్నట్లు... బుద్ధి యొక్క వృత్తియే ఈ బాహ్య-అభ్యంతర పదార్థాలన్నీ ధరిస్తోంది. బీజానికి అన్యమైనదేదీ వృక్షంలో ఉండ జాలనట్లుగా, బుద్ధికి వేరుగా దృశ్యం లేదు. మనస్సు గాని, పదార్థాలు గాని బుద్ధి యొక్క ఒకానొక పరిణామం మాత్రమే! ఇట్లు జ్ఞానమునకు వేరుగా జ్ఞేయం ఉండజాలదని గ్రహించటం చేత బుద్ధి యొక్క వృత్తి అనిర్వచనీయమగు ఆత్మత్వమును సంతరించుకోగలుగుతుంది. అట్టి బుద్ధి 'సర్వ విశేష రహితము - స్వ ప్రకాశము - సద్రూపము'... అగు ఆత్మగా తానే శేషిస్తోంది.

పదార్థములే ...మనస్సు; మనస్సే ...పదార్థాలు. అయితే, ఈ రెండూ కూడా భ్రమాత్మకాలు, అభావ రూపాలు అయి ఉన్నాయి. జన్మాదిరహితమగు బ్రహ్మము సర్వ వస్తువుల యొక్క ఆత్మయే అవటం చేత... మనోరూపమున కూడా అదియే అకారణంగా భాసింస్తున్నదగుచున్నది. బ్రహ్మం అకారణంగా మనస్సుగా భాసిస్తున్నట్లే... మనస్సు అకారణంగా పదార్థములుగా భాసిస్తోంది.

అట్లు మనస్సు, మనఃకారణంగా కనిపిస్తున్న పదార్థాలు వాస్తవానికి మిథ్యయే అయిన ప్పటికీ... భ్రమానుభవం చేత అవన్నీ సత్యాలుగా తోచుచున్నాయి. ఓ రామచంద్రా! మేఘాలలో కనిపించే మెరుపు తీగ వాస్తవమైన తీగయా? కాదు కదా? అట్లాగే ఈ మనస్సు, ఈ మనస్సుకు తోచుచున్న ఈ జగత్తు వాస్తవానికి మెఱుపు తీగ విలాసం లాగానే ఆకారమాత్రాలు, అస్థిరాలు,

అత్యంత చంచలములు అయి ఉన్నాయి. అజ్ఞానం ఆశ్రయించావా, నీవు మనోవ్యసన ప్రభావం చేత ఈ సంసారం పొందవలసి వస్తుంది సుమా! అయితే 'ఆత్మ' యొక్క స్వభావమేమిటో ఎఱుగటం జరిగిందా... ఇక అజ్ఞుడవయ్యే ప్రసక్తియే ఉండదు. భ్రమ కించిత్ కూడా కలుగదు. ఆత్మ జ్ఞానముచే మాత్రమే అదే మనస్సు ద్వారా ఈ సంసారము శమించిపోగలదు. ముత్యపుచిప్పలో వెండి యొక్క భ్రమ ముత్యపుచిప్ప గురించి తెలియనప్పుడు మాత్రమే ఉంటుంది కదా! ముత్యపుచిప్పలో వెండి ఉండియే ఉంటుందని కొందరు తలచుచున్నట్లే, భ్రాంతి రూప జగత్ భ్రమ యందు మిథ్యగానే ఈ జనులు అనేక దుఃఖ పరంపరలు అనుభవిస్తున్నారు. పరమాత్మ యొక్క 'యథార్థ జ్ఞానం' చేత మాత్రమే ఈ సంసారము యొక్క 'అభావము' సిద్ధించగలదు. 'శాంతమగు ఆత్మ' యే నిర్వాణము.

నిర్వాణాత్ ఇతరా సత్తా దుఃఖాయ 'అహమ్' ఇతి భ్రమః
మృగతృష్ణాంబు రూపో 'అహమ్' అసత్, శూన్య స్వరూపకః ॥

నిర్వాణం (శాంతమగు ఆత్మ) కంటే వేరైన 'నేను (అహం)' అనేది భ్రమ మాత్రమే! అట్టి అహంరూప భ్రమ దుఃఖమును మాత్రమే కలిగిస్తోంది. వాస్తవానికి మృగతృష్ణలో కనిపించే జలం లాగా 'అహం' అనేది శూన్యం, అసద్రూపం మాత్రమే! ఈ ప్రకారమైన శుద్ధాత్మ జ్ఞానం చేత అహంకారం శమిస్తోంది.

శ్రీరాముడు : అసలు భ్రమమాత్రము-అసత్యము అగు 'అహం' అనేది మొట్టమొదట ఎట్లా ఉత్పన్నమౌతోంది?

శ్రీవసిష్ఠ మహర్షి : నిర్మల-నిశ్చల జలం ఒకప్పుడు తరంగ రూపం పొందుతోంది. అయితే జలం తరంగరూపం పొందుచున్నప్పుడు తన యొక్క జలత్వము త్యజిస్తోందా? ...లేదు కదా!

శ్రీవసిష్ఠ మహర్షి : అట్లాగే బ్రహ్మము మొట్టమొదట అద్వితీయమై నిర్విషయ స్వరూపమై ఉన్నది. అట్టి నిర్లిప్త-అప్రమేయ బ్రహ్మము సృష్టి యొక్క ఆదియందు తన యొక్క 'సర్వజ్ఞత్వము' అనబడే ఒకానొక ప్రభావం చేత 'స్వాత్మభూతము' అనతగ్గ 'జ్ఞానమయుడగు హిరణ్యగర్భుడు' అను రూపం దాల్చుతోంది. అట్టి ప్రప్రథమ తరంగ రూపమగు హిరణ్యగర్భుని సంకల్పానుసారంగా స్వయంగా బాహ్య-అభ్యంతర పదార్థ రూపత్వము అవధరిస్తోంది. అట్లు అవధరిస్తూనే తాను యథాతథంగా (తరంగ సమయంలో జలంలాగా)నే ఉంటోంది. ఒక వృక్షము యొక్క మూలము నుండి శాఖాగ్రము వరకు ఒకే 'సత్తా' ఉన్నట్లే... జ్ఞాతృ-జ్ఞాన-జ్ఞేయ... రూపమగు ఈ జగత్తునందు అంతటా నిర్వికార రూపమగు బ్రహ్మసత్త ఒక్కటే భాసిస్తోంది. ఆకాశంలో లక్షల మైళ్ళు వెళ్ళి చూచినప్పటికీ అక్కడ కూడా అంతటా నిర్మలమగు ఆకాశమే వెలయుచున్నట్లుగా... చిద్రూపం అగు బ్రహ్మం ఒక్కటే జ్ఞాతృ-జ్ఞాన-జ్ఞేయ రూపమున ఈ జగత్తునందు అంతటా అఖండ రూపాలతో భాసిస్తోంది. శూన్యమే స్వరూపంగా గల ఆకాశమే అంతటా వ్యాపించి ఉన్నట్లు జ్ఞాన-జ్ఞేయాది అన్ని దశలలోను నిర్మలము-ఏకము అగు ఆత్మయే అంతటా వ్యాపించి ఉన్నది.

నేయి ఘనీభవించినప్పుడు ఘనరూపము (పొడవు–వెడల్పు మొదలైన రూపములతో) కనబడుతోంది కదా! చైతన్యము కూడా ఆ విధంగానే విషయరూపమై తనను తానే 'చిత్తము' అను రూపముగా గావించు కొంటోంది. ఆత్మ దేశ–కాలాదులు పొందటానికి మునుముందే తన స్వరూపమును ఏమఱచి చిత్తరూపముగా అగుచూ, పొందుచున్నది. వాస్తవానికి 'ఏకము' అయినట్టి ఆత్మ తన స్వరూపమునందే సదా స్థితిని పొంది ఉన్నది సుమా! అయితే... అవిద్యచే 'అజ్ఞానము' అనే స్వయంకృత కల్పితదశను పొందుతోంది. నిజానికి శుద్ధాత్మయందు అట్టి అజ్ఞానము మొదలైనవి సంభవించటానికి వీలేలేదు సుమా! అనగా జలంలో 'తరంగము' అనే ఏ పదార్థము ఎన్నటికీ ఉత్పన్నము కానట్లే (జలం జలంగానే ఉన్నట్లే) పరిశుద్ధమగు ఆత్మయందు 'చిత్తము' అనునదేదీ ఉత్పన్నమే కాలేదు!

శ్రీరాముడు : మరి శాస్త్రములు చిత్తమును గుర్తిస్తూ, ఆ చిత్తము యొక్క ప్రశమనము గురించి బోధిస్తున్నాయి కదా?

శ్రీవసిష్ఠ మహర్షి : ఔను. బోధిస్తున్నాయి. అయితే అవిద్యా దశయందు పరస్పర బోధ కొరకై ఈ 'చిత్తము' అనబడేది కల్పించబడుతోందని గ్రహించు.

ఓ రామచంద్రా! మహనీయులగు కొందరు జ్ఞానముచే తమ అజ్ఞాన మూలాన్ని శమింప జేసుకొంటున్నారు. నేయి యొక్క ఘనీభూతరూపం (తెలుపు–పొడవు వెడల్పులు మొదలైన లక్షణాలు) నెయ్యిని కరగించినప్పుడు స్వయంగా మటుమాయమౌతున్నాయి కదా! అట్లాగే అభిమాన రహితులగు మహానుభావులు తమ ఆత్మ స్వరూపమునందు లయత్వము సముపార్జించుకొని ఆత్మకు అభేదస్వరూపులుగా అగుచున్నారు. అందుచే వారు అనంతమగు ఆత్మానందముచే పరిపూర్ణుల గుచున్నారు. శాంతులుగాను, విక్షేపరహితులుగాను అగుచున్నారు. నిరంతరము సమాధితత్పరులై మెలగుచున్నారు.

అట్టి వారికి జన్మ – కర్మలు ఆపాదించటానికే వీలుకాదు! వారికి చిత్తము చిత్త ప్రశమనము అను పాఠ్యాంశము అనావశ్యకమగుచున్నది.

❖❖❖

IV. మనోమృగ విశ్రాంతి

1. సమాధి వృక్షము - చల్లటి నీడ

శ్రీరాముడు : 'సమాధి' అనే వృక్షం యొక్క చల్లటి నీడలో ఈ జీవునికి చక్కటి విశ్రాంతి కలుగగలదని విజ్ఞానవేత్తలు అంటూ ఉండటం విన్నాను. అట్టి సమాధి వృక్షం గురించి వివరించండి.

శ్రీవసిష్ఠ మహర్షి : అవును. సమాధి అనే వృక్షం 'వివేక జనులు' అనే వనంలో ఉన్నది. వివేకులకు అది సర్వదా జీవన మూలమై ఉన్నది. అతి విశాలమై, పత్ర-పుష్ప సహితమై కనిపిస్తున్న ఆ సమాధి వృక్షం గురించి విజ్ఞులు ప్రవచిస్తున్నదేమిటో చెప్పుతాను విను.

'సంసారం' అనే ఒక మహారణ్యం ఉన్నది. అందులో అనేక జీవులు అనేక సుఖ-దుఃఖాలను పరంపరగా పొందుతూ అతి దీర్ఘకాలంగా సంచరిస్తూ ఉన్నారు. 'ఆశ' అనే పాశంతో ఆయా జీవులు ఆయా చోట్ల బంధింపబడి, దిక్కు తోచక అలమటించటం మేము గమనిస్తూనే ఉన్నాం. అయితే అట్టి సంసారంలో అవిశ్రాంతంగా తిరుగాడుచున్న అసంఖ్యాక జీవులలో కొందరికి మాత్రం ఆ సంసారారణ్యం పట్ల వైరాగ్యం ఉద్భవిస్తోంది. అట్టి వైరాగ్యం ఉదయించటానికి కారణం :

1. స్వజనులచే గావించబడిన అవమానాదులు కావచ్చు... కాక,
2. ధనాదులకు సంబంధించిన వియోగ సంఘటనలు కావచ్చు... లేదా,
3. సౌభాగ్యవశం చేత కావచ్చు, కాదా...
4. మహాత్ముల ఉపదేశ ప్రభావం చేత వచ్చిన గుర్తు కావచ్చు.

కారణం ఏదైతేనేం... ఈ సంసారం కలిగించే అనేక దుఃఖాదులను గమనించిన కొందరు జీవులు ఈ సంసారం పట్ల పరమ వైరాగ్యాన్ని ఆశ్రయిస్తున్నారు. అట్టి వైరాగ్యమే సమాధి వృక్షం యొక్క బీజం. అట్టి బీజమునకు క్షేత్రం ఈ చిత్తమే! అయితే అట్టి చిత్త క్షేత్రం 'శుభకర్మలు' అనే నాగళ్ళతో దున్నబడి 'శాంతి' అనే జలముచే తడుపబడి, 'ప్రాణాయామం' మొదలైన పిల్ల కాలువ లతో నీళ్ళు పొందినదై ఆ సమాధి బీజం మొలకెత్తి సమాధి వృక్షంగా ప్రవృద్ధమౌతోంది. వివేకం చేత శుద్ధం చేయబడిన చిత్త భూమియందు వైరాగ్య సమాధి బీజం తనంతట తానే వచ్చి చేరుతుంది.

ఈ విధంగా స్వచిత్తమునందు వచ్చి చేరిన వైరాగ్య సమాధి బీజమును వృద్ధి నొందింప జేయాలి. దృఢబుద్ధితో సర్వభేద భావములను త్యజిస్తూ... ఆ వైరాగ్య బీజమును సమాధి వృక్షంగా పెంపొందించుకోవటం ఎట్లాగో చెప్పుతాను... విను.

మనోశుద్ధి - మనస్సును ముందుగా శుద్ధంగాను, పవిత్రంగాను, సుందరంగాను, మధురం గాను తయారు చేసుకోవాలి. 'సత్సాంగత్యం' అనే క్షీరంతో ఆ మనస్సును మరల మరల నానపెట్టాలి.

ఆ తర్వాత శాస్త్ర వాక్య మననం ప్రారంభించాలి. 'సంసార సాగరం దుఃఖమ్, జీవో బ్రహ్మేతి నాపర', నేఽతి నేఽతి... వంటి శాస్త్ర వాక్యముల అర్థసారాన్ని ఆ మనస్సులో నిండుగా ప్రవహింపజేయాలి. గురువాక్యాలు ఆశ్రయించాలి.

గురువు యొక్క 'హృదయం' అనే బ్రహ్మ సరోవరంలోంచి ప్రవేహించే ఆత్మజ్ఞాన వాక్యాలు వినాలి. ఆత్మతత్త్వ పరిపూర్ణులు, నిర్మలులు అగు సద్గురువులు వాక్యాలు సర్వ ద్వైతమును నిషేధిస్తూ వస్తాయి. అంతఃకరణమున సంసార శూన్యత్వను గురించి బోధిస్తూ ఉంటాయి. అమృత ప్రవాహాన్ని బోలిన ఆ గురువుల నుండి లభించే శాస్త్రార్థములను శ్రవణ-మననాదులచే గ్రోలాలి. వాటితో చిత్తములో ప్రవేశించిన వైరాగ్య బీజమును ప్రవృద్ధ పరచాలి.

అట్టి 'సంసార వైరాగ్యం'... అనే సమాధి బీజమును తీక్షణ బుద్ధితో చిత్త భూమిలో పరికించి, కనుగొని, ప్రయత్నపూర్వకంగా పరిరక్షించుకోవాలి. శరీరక-వాచిక-మానసిక తపస్సులు అందుకు దోహదపడతాయి. దాన-ధర్మాది గుణాల చేత, అమానిత్వ-అదంభిత్వాది సద్గుణ సంపత్తితో కూడిన క్రియా-ప్రయత్నాదుల చేత, పవిత్ర క్షేత్ర దర్శనాది వృత్తి విస్తార రూపకల్పనలచే ఆ సమాధి బీజమును పరిరక్షించుకోవాలి.

వైరాగ్యము - క్రమంగా ఆ వైరాగ్య బీజం అంకురించటం ప్రారంభిస్తుంది. అట్టి బీజాంకురాన్ని రక్షించుకునే ఉపాయాలను అతి జాగరూకతతో, నిపుణత్వంతో ఆశ్రయించి ఉండాలి. 'సంతోషము' అనే తోటమాలిని అహర్నిశలు బీజాంకురాన్ని కాపాడి ఉంచే ఉద్యోగంలో నియమించాలి.

ఆ వైరాగ్య-సమాధి బీజాన్ని హరిద్దామని కొన్ని పక్షులు కాపుకాస్తూ ఉంటాయి సుమా!ఆ పక్షులే పూర్వ వాసనలతో ఆవిర్భవించే దేహ-పుత్ర-మిత్ర-కళాత్రాదుల పట్ల కలిగే వ్యామోహాలు, అనురాగాలు మొదలైనవి. కామ క్రోధాది దేగలు దరిచేరకుండా చూచుకోవాలి. హింస-అహంకారం-దంభం-దర్పం-అభిమానం-క్రోధం-పారుష్యం-అభిజాత్యం మొదలైనవి ఆ మొలకెత్తే వృక్షాన్ని పట్టే చీడలాంటివి. వాటిని దరిజేరకుండా చూచుకోవాలి. అందుకుగాను, అహింసా ప్రధానత్వంచే మృదువైన 'యమ-నియమాలు' అనే చీపురుతో 'రజోగుణం' అనే ధూళిని చిత్త క్షేత్రం నుండి ఎప్పటికప్పుడు – ఊడ్చివేస్తూ ఉండాలి. ఇంకా, అంచిత్యమైన 'బ్రహ్మ ప్రకాశం' అనే వివేక సూర్యుని కిరణాలు ఆ వైరాగ్య-సమాధి బీజంపై నిరాటంకంగా ప్రసరించేటట్లు చూచుకుంటూ ఉండాలి. 'అజ్ఞానం' అనే చీకటి ఆవరించకుండా చిత్త క్షేత్రాన్ని కాపాడుకోవాలి. దుష్కృతాలు, క్షణ భంగురాలైన వనిత-సంపద మొదలైన భోగ వాసనలు అనే పిడుగులు ఆ సమాధి అంకురం వైపుగా రానీయకుండా చూచుకోవాలి. అందుకుగాను 'ప్రణవార్థం' అనే త్రిశూలమును ధరించి 'ధైర్యము-ఔదార్యం' అనే మంత్రాలను జపిస్తూ జప-తప-స్నాన-దానాదులచే భోగ వాసనలను సుదూరంగా ఉంచుతూ రావాలి.

ధ్యానము : ఈ విధంగా రక్షించబడిన వైరాగ్య బీజం క్రమంగా 'ధ్యానం' అనే మొక్కగా రూపు దాలుస్తోంది. ఆ మొక్కకు 'వివేకం' అనే నూతనమైన కొమ్మలు మొలకెత్తుచున్నాయి. అట్టి

వివేకాంకురం చే చిత్తభూమి ప్రకాశవంతంగాను, వికాసవంతంగాను, అతి శోభాయమానంగాను, రమణీయంగాను భాసిల్లగలదు. అప్పుడా వివేకాంకురం నుండి 'సచ్ఛాస్త్రములు–విచారణ–సాధు సంసర్గం' అనే ఆకులు బయల్వెడలుతాయి. ఆ చెట్టు 'సంతోషం' అనే గట్టి తోలుతో పరివేష్టితమౌతూ వస్తుంది. వైరాగ్యం అనే రసంతో ఆ వృక్షం శోభిస్తూ క్రమంగా బలమైన కాండాన్ని పెంపొందించు కొంటుంది. 'శాస్త్రములు' అనే వర్షమును పొందుతూ క్రమంగా ఆ సమాధి వృక్షం మహోన్నతిని పొందగలదు. అది ఇంకా ఇంకా శాస్త్ర విచారణ సాధు సంగమము–వైరాగ్యము అను రసములతో మరింత పరిపుష్టమగు గాక!

రాగ-ద్వేష విదూరకం - అట్లు పరిపుష్టమైన ఆ ధ్యాన వృక్షమునకు ఇంకెప్పుడు 'రాగ ద్వేషాలు' అనే వానరాలు కొంచెం కూడా క్షోభను కలిగించలేవు. వాటి దూకుళ్లకు అది చలించదు.

సద్గుణముల సముపార్జన - జ్ఞానముచే శోభితమైన ఆ వివేక వృక్షం వైరాగ్య రసంతో విశాలంగా విలాసవంతంగా ఆత్మ ప్రదేశము వరకు విస్తరించినదగుచున్నది. ఆ ధ్యాన వృక్షమును ఆశ్రయించ టానికి 'ఆత్మతత్త్వం యొక్క స్ఫుటత్వం, సత్యత్వం, ఆత్మస్థితి, ధీరత్వం, నిర్వికల్పత్వం, సమత్వం, శాంతి, మైత్రి, కరుణ, కీర్తి, ఆర్యత్వం' మొదలైన లతలు వచ్చి చేరుతాయి. 'శాంతి' మొదలైన ఆకులతో, పుష్పాలతో శోభించే ఆ సమాధి వృక్షమే యోగులకు విశ్రాంతి స్థానం. ఆ వివేక వృక్షం రోజు రోజుకు ప్రవృద్ధమై, క్రమంగా అజ్ఞానమూలాన్ని నశింపజేస్తుంది.

ఆ యోగికి సప్త భూమికా పర్యంతము విశ్రాంతిదాయకమౌతుంది. 'బ్రహ్మ సాక్షాత్కారము' అనే మహా ఫలాన్ని ప్రసాదిస్తుంది. ఉదారత్వాది గొప్ప గుణాలతో కూడిన ప్రజ్ఞను చిగురింప జేస్తుంది. శమమును, చిత్తాకాశంలోని దిక్కులన్నిటినీ శాంత పరుస్తుంది. సంసార తాపాన్ని నశింప జేసి ఆ యోగికి పరమ సుఖాన్ని ప్రసాదిస్తుంది. శమమును చిత్త స్థైర్యమును వృద్ధి పరుస్తుంది. 'ఆత్మజ్ఞానం' అనే పునాదిని గట్టి పరుస్తుంది. కైవల్యం అందిస్తుంది. హృదయవనంలో ఉద్భవించే ఈ సమాధివృక్షం హృదయం యొక్క త్రివిధ తాపాలను హరించి శీతలత్వం ప్రసాదిస్తుంది.

❖❖❖

2. మనో మృగము

శ్రీవసిష్ఠ మహర్షి : ఈ మనస్సు అనే ఒకానొక మృగం అనేక జన్మలలో ఎన్నెన్నో దుఃఖాలను అనుభవించి ఉంటోంది. ఒకవేళ దైవయోగం చేత సన్మార్గం లభించినప్పటికీ ఆయా వాద–ఉపవాదాల కోలాహలంలో పడటం చేత సన్మార్గమున ప్రయాణించటంలో అత్యంత జాప్యం జరుగుతోంది. ఆ మృగం (మనస్సు) అనేక భూములలో తిరిగి, తిరిగి, అలసి సొలసి చివరికి ఎట్లాగో వైరాగ్య వృక్షం క్రిందకు విశ్రాంతి కొరకై వెతుకుతోంది.

అహంకార-కామ-క్రోధ-భయ-ఉద్వేగముల నిరోధం - ఆ మృగ చర్మం సంపాదించాలని కామ–క్రోధాలు అనే బోయవారు తరుముకు వస్తున్నారు. ఇక ఆ మనో మృగమో, 'దేహాలు' అనే ముళ్ళ

పొదలలో దాగుకొనుచు అక్కడి ముళ్లచే బాధించబడుచూ భయం–ఉద్వేగాలచే శిథిలమై ఉంటోంది. ఇంతలోనే అది 'సంసారం' అనే అరణ్యంలో 'వాసనలు' అనే ఆవేశముచే ప్రేరితమై సంచరిస్తోంది. 'ఏదో పొందాలి' అనే ఆర్తిని వదలక 'అహంకారం' అనే మృగతృష్ణా జలంవైపు పరుగులు తీస్తూ... విష పీడితమైన అంతఃకరణం కలిగి ఉంటోంది. ఆ అంతఃకరణంలో తృష్ణాదాహం అంతకంతకు అధికమౌతోంది!

విషయ నిరోధం - ఆహా! ఏమని చెప్పాలి. ఈ మనస్సు 'సంపదలు' అనేచోట చిక్కుకుని తత్ఫలితంగా అనేక శోక–మోహాలు పొందుతూ ఎటో తెలియరాని చోట్లకు చేరుకొని దిక్కు తోచక ఉంటోంది. ఏ దేహాలలో తాను దాగుకొన్నదో... ఆ దేహాలు శిథిలమగుచుండగా, ఇక తానే శిథిల మగుచు బహు దుఃఖాలు అనుభవిస్తోంది. శరీర సంబంధితులైన పుత్ర–పౌత్రాదులతో ఏర్పడే సంబంధ–బాంధవ్యాలను నమ్ముకొని అనేకసార్లు మోసపోతూ శోకముచే, క్షుత్పిపాసచే అలమటి స్తోంది. జ్ఞానేంద్రియ–కర్మేంద్రియములచే లభించే శబ్దాది విషయాలే పైకి సుముఖంగాను, చివరికి వేటగాండ్ర బాణముల వలె బాధించేవిగాను అగుచున్నాయి. పూర్వకాలిక దుఃఖానుభవములన్నీ ఆ మనస్సు యొక్క అంతరాంతరమున పేరుకొని ఉండగా వర్తమానంలో అప్పటికప్పుడు మాత్రం ప్రక్క ప్రక్కన గల 'విషయములు' అనే గడ్డి పరకలు నలుముచూ రోజులు గడుపుతోంది.

మనోమృగం - ఈ మనస్సే స్వర్గ–నరకాది ఉన్నత–నీచ ప్రదేశాలలో పైకి–క్రిందికి వెళ్ళు చున్నది. 'ప్రాపంచిక వికారములు' అనే రాళ్ల మీద జారిపడి గాయములు పొందుతోంది.

ఈ మనోమృగమునకు 'తృష్ణ' అనే లతలలోను, 'దేహము' అనే పొదలలోను తిరుగాడటానికి బహు ప్రావీణ్యం పొందినదై ఉంది. స్వబుద్ధిచే అనేక ఆచారములు కల్పించుకొని వాటిలో తానే బంధించబడుతోంది. అంతేగాని స్వయంకల్పితమైన మాయ ఏమిటో గ్రహించటానికి స్వబుద్ధిని ఉపయోగించటం లేదు. ఏమని చెప్పాలి?

ఈ మనోమృగం 'ఇంద్రియములు' అనే గ్రామానికి వచ్చి గ్రామసింహంలాగా (కుక్కవలె) పరుగులెత్తటం ప్రారంభిస్తోంది. అక్కడ 'కామము' అనే దుస్సాధ్యమైన–భయంకరమైన పిచ్చి ఎత్తిన ఏనుగు ఎదురుపడగా ఆ ఏనుగు కాళ్ళ క్రిందపడి నుజ్జునుజ్జు అవుతోంది.

ఈ మనోమృగం యొక్క శరీర భాగములు 'క్రోధము' అనే దావాగ్నిచే దహించబడటంచే అనేక బొబ్బలు కలిగి ఉన్నదగుచున్నది. విషయాలలో మరల మరల సంచరించటం చేత 'చింత–శోకము' అనే దీర్ఘవ్యాధులు ఆ మనస్సు యొక్క అంతఃకరణమును ఎంతగానో బాధిస్తున్నాయి.

ఈ మనోమృగం తనయందు పేరుకొనియున్న అనేక అభిలాషలచే ఉపద్రవములెన్నిటినో తెచ్చి పెట్టుకొంటోంది. భోగేచ్ఛలతో కాళ్ళు అరిగిపోయేటట్లుగా సంసారమనే ఎడారిలో పచార్లు చేస్తోంది. స్వకర్మచే ఉత్పన్నమైన అనేక దారిద్ర్యములచే పీడించబడుతోంది. పుత్ర–మిత్ర కళాత్రాదుల పట్ల వ్యామోహంచే గ్రుడ్డిదిగా అయి 'కపటములు–నీచకృత్యములు' అనే గోతులలో మ్రగ్గుతోంది. 'మానము' అనే భూతమును తనయందు ఉంచుకొని తత్ఫలితంగా అనేకసార్లు అవమానములపాలు

అవుతోంది. తాను నమ్ముకొన్నవాటినన్నిటినీ 'మృత్యువు' అనే చోట పోగొట్టుకొని అలమటిస్తూ మరల మరొక చోట ప్రయాణానికి ఉపక్రమిస్తోంది.

'గర్వము' అనే కొండచిలువ ఆ మనస్సును అనేకసార్లు దిగమ్రింగగా అదిపడే పాట్లకు అంతులేదు. అనేక కోరికలు కలిగి ఉన్న కారణంగా దీనత్వమును, యాచకత్వమును పొందుతోంది. కాసేపు ఇంపైన దేహం ధరించి, ఇంద్రియములచే మోసగింపబడినదై... ఇంతలోనే ఆ ఇంద్రియములచే ఎచ్చటనెచ్చటనో నీచ ప్రదేశములలోకి విసరివేయబడుతోంది.

ఓ రామచంద్రా! రాత్రి పూట 'అంధకారం, (మరియు) భయంకరమైన చలిచే' పీడితుడగుచున్న ఓ మనుజుడు తెల్లవారి సూర్యుడు ఉదయించగానే సుఖ శాంతులను పొందుతాడు చూచావా! అనేక దోషములను తన యందు ప్రోగు చేసుకొని ఈ సంసార ముళ్ళ పొదలలో చిక్కుకున్న ఈ మనస్సు అనేక జన్మలలో ఆర్జించుకున్న పుణ్యవశం చేత అధికారి దేహము సంపాదించుకుని 'శమము-దమము' మొదలైన సాధనలచేత మనం ఇంతకుముందు చెప్పుకొన్న వైరాగ్య-సమాధి వృక్షం క్రింద చేరిందా... ఇక పరమ విశ్రాంతి పొందగలదు. ఓ ప్రియ సభికులారా! ఈ ప్రపంచంలో కనిపించే ఆయా భోగములలో మీ మనస్సు విశ్రాంతిని పొందింప జేయటమనేది - ఒక మృగం ఎండకు తాళలేక తాటి వృక్షం క్రిందకు వెళ్ళటం వంటిది. తాటి వృక్షపు నీడ వడగాలితో కూడిన ఎండనుండి కాపాడగలదా? లేనే లేదు. 'సమాధి' అనే చోట మాత్రమే మీ మనస్సు నిరతిశయమగు విశ్రాంతి పొందగలదని, సంపాదించుకోగలదని గమనించండి.

అనేక కార్యక్రమములలో ఉంటూ కూడా, 'సమాధి'ని తప్పక అభ్యాసపూర్వకంగా. నిర్వర్తించవచ్చని ఈ సందర్భంలో సకల జనులకు గుర్తు చేస్తున్నాను. అట్టి నిశ్చల ఆత్మదృష్టిని సకల జనులకు గుర్తు చేయడానికే నా తండ్రి, జగత్‌పిత అయిన బ్రహ్మదేవుడు నన్ను సృష్టించటం, ఈ అవతారమూర్తి రామచంద్రమూర్తి వేంచేయడం... మొదలైనవన్నీ ఉద్దేశింబడినాయి సుమా!

❖❖❖

3. ధ్యానము..... ఉత్తరోత్తర స్థితులు

శ్రీరాముడు : హే మహర్షీ! ఈ మనస్సు 'ధ్యానము' అనే సమాధి వృక్షమును సమీపించిన తర్వాత అప్పుడు ఉత్తరోత్తర స్థితులు ఎట్లా ఉంటాయి?

శ్రీవసిష్ఠ మహర్షి : చెబుతాను విను. 'ధ్యానము' అనే వృక్షపు నీడను జేరిన మనస్సు ఇక ఆ ధ్యానమునందే ప్రీతి కలిగి మరొక వృక్షమును దేనినీ కోరుకోదు. ధ్యానమే సమాధి యొక్క రూపం. మెల్లమెల్లగా ఆ మనస్సు ధ్యాన ప్రభావం చేత 'అన్నమయ-ప్రాణమయ-మనోమయ-విజ్ఞానమయ-ఆనందమయ' కోశములకావల ఉన్న 'ఆత్మ స్వరూపము' అనే కైవల్య ఫలముపై ధ్యాస మరలుతోంది. క్రమక్రమంగా ఉత్తరోత్తరభూమికలు పూర్ణముగా ప్రకటన మగుచున్నాయి. ఆ మనస్సు 'ఆత్మ సాక్షాత్కారం' వైపు దృష్టి సారించగానే ఇక ప్రాపంచిక వస్తువులపై విరక్తి స్వభావ

సిద్ధంగా (వేరే ప్రయత్నం ఏదీ లేకుండానే) కలుగుతోంది. మధురఫలం కనబడిన తర్వాత పచ్చికాయల వైపు నుండి దృష్టి మరలటం స్వభావసిద్ధమే కదా! ఇక ఆ మనస్సు వివేక వృక్ష - ఆరోహణం ప్రారంభిస్తోంది.

దేహాదులను అధిగమించటం - అట్టి మనస్సు దేహము-తత్సంబంధమైన ప్రాపంచిక వస్తువుల పట్ల అహంకార-మమకారాలు త్యజించటం ప్రారంభిస్తుంది. సంసార పదార్థాల పట్ల ఇష్టవృత్తి తొలగనారంభిస్తుంది. 'నేను-నాది అనేది భ్రమ మాత్రమే' అనే నూతనమైన అవగాహన అంకురించ నారంభిస్తుంది.

సాంసారిక సంస్కార త్యాజ్యం - వివేక వృక్షమును అధిరోహిస్తున్న మనస్సు 'ఆత్మ సాక్షాత్కారము' అనే మహాశయ ప్రభావం చేత నెమ్మది నెమ్మదిగా పూర్వార్జితమై సంస్కారములను త్యజించటం ప్రారంభిస్తుంది. అంతకుముందటి తన మానసిక స్థితిగతులను, విలువలను గమనించి ఇప్పుడు నవ్వుకోవటం ప్రారంభిస్తుంది.

హసతి ఉచ్చైః పదారూఢమ్ ఆత్మానమవలోకయన్ ।
'ఏతావన్తమ్ అహమ్ కాలం కృపణః కో అభవంతి?' ఇతి ॥

ఆత్మయొక్క ఔన్నత్యమేమిటో గ్రహించిన ఆ మనస్సు "అరెరే! ఇంత కాలంగా ఈ 'ఇంద్రియ విషయములు' అనే స్వల్ప విషయాలే గొప్పవనుకొని అనేక దేహ వృక్షాలలో సంచరిస్తూ... ఈ ధ్యాన వృక్షంపై గల మధురమైన 'ఆత్మావలోకనం' అనే పండును ఎందుకు ఏమరచాను? ఈ ప్రాపంచిక విషయాలు ఎంత స్వల్పమైనవి!"... అని బిగ్గరగా నవ్వటం ప్రారంభిస్తుంది.

మైత్రి-కరుణ : ఇక ఆ మనస్సు తదితర సహజీవులతో వ్యవహరిస్తున్నప్పుడు స్వభావ సిద్ధము-అకారణము-ఆత్యంతికము అగు మైత్రి, కరుణ ప్రదర్శిస్తూ ఉంటుంది. పూర్ణకాముడై లోభమును త్యజించినవాడై ఉంటాడు. దినదినము మనస్సు తృష్ణను జయించి ఉంటుంది.

ఉపేక్ష-అపేక్ష రాహిత్యము:

ఉపేక్షతే న సంప్రాప్తం, న అప్రాప్తం అభివాంఛతి ।
సోమ సౌమ్యో భవతి అన్తఃశీతలః సర్వవృత్తిషు ॥

ఆ మనస్సు ప్రాప్తించిన పదార్థాలను ఉపేక్షించదు. ప్రాప్తించని పదార్థములను అపేక్షించదు. సర్వ వృత్తులలో చంద్రుని వలె సౌమ్యమైన అంతఃకరణం కలవాడై, శీతలస్వభావుడై అతడు ఉంటాడు.

శాస్త్రముల అర్థ పరిశీలన - అట్టి సమాధి వృక్షముపైనే ఆసీనమై అతడు శాస్త్రార్థములోని అతిసూక్ష్మ తంతువుల శబ్దమును గ్రహిస్తూ ఉంటాడు.

ఇక ఉత్తోరత్తర భూమికలను అధిరోహిస్తూ, మనోహరమైన చిత్తవృత్తి సహితుడౌతాడు. జ్ఞానవంతుడై ఈ పుత్ర-మిత్ర-స్త్రీ-ధనాది సమస్త పదార్థములను స్వప్నములోని విషయాలవలెను, మరొక జన్మకు సంబంధించిన విశేషాలుగాను దర్శిస్తూ ఉంటాడు. అతనికి ఇక్కడ కనబడే రాగ-ద్వేష-భయ-ఉన్మాద-అభిమాన-మోహాల ఆధిక్యత నటులు ప్రదర్శించే (కృత్రిమ) నటనలాగా

కనిపిస్తుంది. వారికి ఎదురుగా ఈ సంసారము ఉన్నప్పటికీ ఇదంతా మృగతృష్ణ వలె మిథ్యగాను, నిస్సారంగాను అగుపడుతుంది. తరంగముల వలె క్షణభంగురంగాను, పిచ్చివాని చేష్టల వలె అర్థరహితంగాను కనిపిస్తుంది. ఆతడు అపూర్వము – నిత్య సంసిద్ధము అగు ఆత్మపదమునందు విశ్రాంతి పొందినవాడై జీవించియున్నను అజ్ఞానివలె లోకైషణ, దారైషణ, ధనైషణ మొదలైనవి లేకుండుటచే సాంసారిక జీవుల దృష్టికి జడునివలె ఉంటాడు.

అట్టి స్థితిలో అతడు కేవలం శుద్ధమైన, కేవలమైన, బోధమయమైన, మహోన్నతమైన ఆత్మ ఫలమునకు అర్హత సంపాదించుకొంటూ ఉంటాడు. పూర్వపు అజ్ఞాన దశల వలన కలిగిన ఆపదలను గుర్తించుకొంటూ జ్ఞాన బలంచే శ్రద్ధను వీడక ఉంటాడు. 'సంతోషము' అనే పానీయము త్రాగి భగవన్మత్తుడై ఉంటాడు. అనర్థ రూపములగు ధనాదులు నశించినప్పుడు కూడా అదంతా అతనికి సంతోషమే కలుగజేస్తుంది గాని, దుఃఖం కాదు. అది ఐదవ భూమికాస్థానం అని అంటూ ఉంటారు.

శ్రీరాముడు : స్వామీ! తదితరులు అతనిని బలవంతంగా భోగదాయకములగు ఆవశ్యకకార్యముల వైపుగా బలవంతంగా మేలుకొలుపుతూ ఉంటారు కదా! అప్పుడు ఆ ఐదవ భూమికలో ఉన్నవారికి ఇబ్బంది కదా!

శ్రీవసిష్ఠ మహర్షి : అవును. ఎవరైనా భోగదాయకములగు ఆశశ్యక కార్యముల వైపుగా అతనిని ప్రోద్బలం చేస్తున్నప్పుడు, అతనికి గాఢనిద్ర నుండి బలవంతంగా మేల్కొలుపబడిన మానవునివలె అప్రసన్నంగానే ఉంటుంది. దీర్ఘమైన ప్రయాణంచేసి ఒకచోట కొంచెం నడుం వాల్చిన వానిని మరల నడకకు ఉపక్రమించడమంటే ఇబ్బందిగా అనిపిస్తుంది కదా! దీర్ఘకాలంగా జనన–మరణాలతో కూడిన సాంసారిక బాటయందు అజ్ఞానంచేత చరించిన ఆ జీవబాటసారి ఇప్పటి వివేక సమాధియందు ఉదారతతో కూడిన అబాధితమైన ఆత్మ విశ్రాంతి అవిఘాతంగా ఉండాలని కోరుకొంటూ ఉంటాడు. ప్రాణధారణచే అతడు తదితర జనులలాగానే బయటకు కనబడు చున్నప్పటికీ అతడు అంతరమున అహంకార రహితుడై కట్టెలు లేని అగ్నివలె ప్రకాశిస్తూ ఆత్మ యందు శాంతిని చవిచూస్తూ ఉంటాడు. అభ్యాసవశంగా బాహ్యపదార్థముల పట్ల విరక్తి గలిగి ఉంటూనే, యథాప్రాప్తములయ్యే వాటిని నిరాకరించటానికి కూడా చిత్తము కలిగి ఉండడు.

ఈ ప్రకారంగా పరమార్థ ఫలమును కలుగజేసే గొప్పదగు ఆత్మ పదమువైపు ప్రయాణిస్తూ క్రమంగా మాటలకు అందజాలని, అగోచరమైన ఆఱవ భూమికను పొందుచున్నాడు. ఇకప్పుడు బాటసారికి బాటప్రక్కన ఉన్న శ్మశాన భూములపై ఇష్టము కలుగనట్లుగా సర్వ భోగముల పట్ల అతడు విరక్తి కలిగి ఉంటాడు. సంసార వృత్తులన్నిటిపట్ల అతడు నిదురించి ఉంటాడు. ఆత్మానందంచే మదోన్మత్తుడు అవుతాడు. క్రమంగా పరిపూర్ణమైన మనస్సు పొంది ఒకానొక అనిర్వచనీయ స్థితిని అనుభవిస్తూ ఉంటాడు. అట్టి స్థితి యందు అతడు 'మోక్షము' అనే పరమార్థ ఫలమునకు అత్యంత సమీపంలో ఉంటాడు. ఆ తర్వాత ఏడవ భూమిక పొందుచున్నాడు. అప్పుడిక ఆకాశం వలె

విశాలరూపుడై ఉంటాడు. సమస్త వాసనలను, బుద్ధి వృత్తులను త్యజించి ఆవరణ-విక్షేప రహితుడౌతాడు. నిరతిశయానందమగు 'బ్రహ్మభావం' అనే ఫలాన్ని అస్వాదిస్తూ, అద్దానిచే అత్యంత తృప్తుడౌతాడు. ఓ రామచంద్రా! 'పరమార్థ ప్రాప్తి' అనునదే ఈ జీవుని యొక్క పరమావధి సుమా!

సంకల్పార్థ పరిత్యాగాత్ దిన-అనుదినమ్ ఆతతా ।
శుద్ధ స్వభావ విశ్రాన్తిః 'పరమార్థాప్తిః' ఉచ్యతే ॥

సంకల్పిత పదార్థాల యొక్క పరిత్యాగపు ప్రభావం చేత ఆరోజుకారోజు సంభవించే విశాల మైన 'శుద్ధాత్మ స్వభావం' నందలి విశ్రాంతియే 'పరమార్థ ప్రాప్తి' అని చెప్పబడుతోంది.

శ్రీరాముడు : మహాత్మా! 'బ్రహ్మము' అని దేనిని విజ్ఞులు పిలుస్తున్నారో విశదపరచండి.

శ్రీవసిష్ఠ మహర్షి :

భేద బుద్ధిః విలీనార్థ అభేదేవ అవశిష్యతే ।
శుద్ధమ్ ఏకమ్ అనాద్యంతం "తత్ బ్రహ్మేతి" విదుర్ బుధాః ॥

చూచేవాడు-చూడటం-చూడబడేది, అనుభవించేవాడు-అనుభవించటం-అనుభవించబడేది ...ఇట్టి త్రిపుటిని గూర్చిన భేదబుద్ధి విలీనం కాగా... అప్పుడు అభేదం-శుద్ధం-ఏకం-అనాది-అనంతం అగు సాక్షిమాత్ర చైతన్యం శేషిస్తోంది. అట్టి శుద్ధ చైతన్యమునే విజ్ఞులగు శాస్త్రకారులు 'బ్రహ్మం' అనే పేరుతో పిలుస్తున్నారు. అట్టి బ్రహ్మానుభవమే బ్రహ్మపదము.

'లోకైషణా' విరక్తేన, త్యక్త 'దారైషణ' ఏన చ ।
'ధనైషణా' విముక్తేన తస్మిన్ విశ్రామ్యతే పదే ॥

లోకేషణ, దారైషణ, ధనైషణ... వీటిని ఈషణాత్రయం అంటారు. అట్టి త్రివిధములైన ఈషణము లను పరిత్యజించిన మనుజునకు బ్రహ్మపదమున విశ్రాంతి లభిస్తుంది.

సర్వ భేద బుద్ధులు విలీనమైపోవాలి సుమా! అప్పుడే ఈ చిత్తము 'చిత్' ను సందర్శించగలదు.

చిత్తశోధన - 'దృశ్యము' యొక్క తత్త్వశోధనచే 'సత్' మాత్రము శేషిస్తోంది. 'ద్రష్ట' యొక్క తత్త్వశోధనచే 'చిత్' మాత్రము (ఎఱుక) శేషిస్తోంది.

అఖండైక్యము వలన నిరతిశయానందరూపంగా ఈ చిత్తము పరిణమిస్తోంది. అప్పుడు చిత్తము యొక్క అంతిమ సాక్షాత్కార వృత్తి చేత 'భేదబుద్ధి' నశించిపోగలదు. కోమలమగు పూల దండను ఏ ఆకారంగా పరచినప్పటికీ మరల చేతితో తీసుకోగానే యథాతథమైన ఆకృతిని పొంద గలదు కదా! అట్లాగే, ఆత్మసాక్షాత్కారము పొందిన చిత్తము ఉన్నా కూడా... ఇతఃపూర్వపు అజ్ఞాన స్థితిని ఏమాత్రం పొందదు. అదిగో! ఆ ఎదురుగా కనబడే శిలను చూడు. ఆ శిలలో ఒక శిల్పి విష్ణుమూర్తి యొక్క నాలుగు చేతులను-పాదములను తన శిల్ప లాఘవంతో చిత్రీకరించగలడు. అనగా, కాబోయే శిల్పము శిలలోనే ఉన్నది కదా! కానీ ఇప్పుడు కనబడుతోందా? లేదు. శిలలో గల అప్రకటితమైన శిల్పము (విగ్రహము) ఉండియు లేకయు (సత్తుగాని-అసత్తుగాని) కూడా

ఎట్లున్నదో ...ఆ పరమాత్మ యందు ఈ విశ్వము యొక్క స్థితి ఉన్నదని గ్రహించు. ఆత్మసాక్షాత్కారము పొందిన చిత్తమునకు జగత్తు సత్తుగాను-అసత్తుగాను కాకయే ఉన్నది.

శ్రీరాముడు : పరమాత్మను సాకారునిగా కొందరు కొలచుచున్నారు. మరికొందరు అతడు సాకారుడు అవటానికే వీలులేదని వాదనలు చేస్తున్నారు. ఏది యుక్తియుక్తం?

శ్రీవసిష్ఠ మహర్షి : సాధక భక్త జనుల సౌకర్యార్థం నీవు ఇన్ని రోజుల సంవాదానంతరం కూడా ఇట్లు ప్రశ్నిస్తున్నావని నేను గమనిస్తున్నాను. సందేహ నివృత్తి అత్యంతావశ్యకం కాబట్టి సముచితమే!నీ ప్రశ్నకు సూటి అయిన సమాధానం మరల ఒక్కసారి చెప్పుచున్నాను. విను.

ధ్యానం నశక్యతే కర్తుం నచైతత్ ఉపయుజ్యతే ।
అబోధేన విబుద్ధస్తు స్వయమ్ అత్రైవ తిష్ఠతి ॥

ఓ రామచంద్రా! చిత్తం ప్రపంచమును నమ్మియున్నప్పటి అజ్ఞాన దశయందు నిష్ప్రపంచక మగు బ్రహ్మమును గూర్చిన ధ్యానం కష్టతరం అవగలదు. అజ్ఞానం యొక్క ప్రభావం చేత ప్రపంచ రహిత బ్రహ్మము ధ్యానించటం శక్యం కాదు... అని చెప్పవచ్చు. అంతేకాదు. అది యుక్తియుక్తం కూడా కాదు. అట్లాగే, ప్రబుద్ధమైన చిత్తమును సముపార్జించుకున్న తర్వాత స్వయంగానే తత్ బ్రహ్మ భావం (నిష్ప్రపంచ బ్రహ్మం) నందు స్థితి కలుగుతుంది. అట్టి స్థితిలో తన ఆరాధ్యమును సాకార పరిమితం చేయటం కూడా కష్టమే అవుతుంది. అయితే 'బ్రహ్మమే ఈ జగత్తు రూపంలో ఉన్నది' అను పూర్ణ గ్రాహ్య స్థితిలో సాకార-నిరాకార ధ్యానాలకు సంబంధించిన విరోధ భావాలన్నీ తమంతట తామే తొలగుతాయని కూడా గ్రహించు. సర్వ దృశ్య పదార్థములపట్ల ఎవనికి సంపూర్ణ వైరాగ్యం ఉంటుందో... అతడే జ్ఞాని. ఎందుకంటే జ్ఞాని మాత్రమే దృశ్యమును త్యజించగల సమర్థత కలిగి ఉంటాడు. అజ్ఞానికి దృశ్యమును త్యజించగలిగే సమర్థత ఉండదు. దృశ్యం యొక్క సాక్షీరూప బోధయే బ్రహ్మం. అట్టి సాక్షి రూప బోధచే మాత్రమే ఈ దృశ్యం యొక్క యథార్థ స్వరూప స్థాపనకు సమాధానం. అదియే సమాధి.

సమ్యక్ ఆధానం = సమాధానం (దృశ్యం యొక్క వాస్తవ రూపాన్ని గ్రహించటమే సమాధానం) అదియే సమాధి. అట్టి బోధచే ఈ దృశ్యము నాశరహితమగు బ్రహ్మమే అగుచున్నది.

ఎప్పుడైతే ద్రష్ట (సాక్షి)-దృశ్యముల యొక్క ఐక్యముతో మనోవృత్తి ఏకమగు అఖండాత్మా కారమున స్థితి కలిగి ఉంటుందో... అదియే సమాధి యందలి విశ్రాంతి. దృశ్య స్వభావ విరుద్ధమైన ('దృశ్యము తనకు అభేదం' అను అవగాహనతో కూడిన) చిదానంద స్వభావమే బ్రహ్మజ్ఞాని యొక్క నిజ స్వభావం. 'దృశ్యము వైపుగా ఉన్ముఖమవడమే (నేను చూచే వాడిని - ఇది చూడబడేది... అనే భేద భావమే) అజ్ఞానము'... అని విజ్ఞులు పలుకుచున్నారు.

ఈ సాంసారిక విషయాలు (ద్వితీయంగా) అజ్ఞానికి మాత్రమే వాటి వాటి భేద రూపాలుగా కొన్ని స్వాదిష్టములుగా తోచుచూ ఉంటాయి. జ్ఞానికి ఇందులో ఇష్ట-అయిష్టములు ఉండవు. అమృతం తాగేవాని దగ్గరకు వెళ్ళి 'ఏవయ్యా! ఆ అమృతం త్రాగటం ఆపి ఈ పాత్రలోని కల్లు తాగకూడదా?'... అంటే అతడు ఇష్టపడతాడా? లేదు.

ఓ రామచంద్రా! ఎవడు తన హృదయంలోని 'తృష్ణ' అను మకిలిని తొలగించుకొంటాడో, లోక-స్త్రీ-ధన ఈషణాలను పరిత్యజిస్తాడో, ఆత్మనిష్ఠ అభ్యసించ నారంభిస్తాడో... అట్టివానికి 'ధ్యానం - సమాధి' అనేవి అప్రయత్నంగానే కలుగుతాయి. తృష్ణ ఉన్న చోట ఆత్మ స్వరూప-అనుసంధాన రూపమగు బోధ చలించిపోతుంది. గురువుల వాక్యములు సత్ఫలితమగు ప్రయోజనం కలిగించ లేవు. ఎవనికి తృష్ణ ఉండదో, అట్టి తత్త్వజ్ఞునకు ద్రష్ట-దర్శన-దృశ్యములనే త్రిపుటికి చోటే దొరకదు.

మరొక విధంగా... తృష్ణారహితుడైన జ్ఞాని యొక్క తృష్ణ అనంతత్వము సంతరించుకోగలదని కూడా చెప్పవచ్చు. ఏ విధంగా అంటావా? తృష్ణారాహిత్యం యొక్క ప్రభావం చేత అకృత్రిమమైన సమాధిని అవధరించిన మహనీయుడు స్వయంగా విభాగరహితమైన అనంతాత్మ స్వరూపంగా ఉదయించుచున్నాడు. అనగా, సర్వ ధ్యానములు అతనివే అగుచున్నాయి. అతని యొక్క సర్వత్రా అనురాగమే విరాగమగుచున్నది. అట్టివాని చింతనీయమగు బాహ్య పదార్థ సంబంధమైన బోధ ఎట్లా ఉన్నప్పటికీ,... అతడు తన చిత్తమును సమాధియందు లగ్నము చేసినా (లేక) చేయకపోయినా కూడా... వ్యవహార తత్పరుడు అయినా (లేక) కాకపోయినా కూడా... అతడు సంసార ధ్యాత కాడు. అతని దృష్టియందు అంతా కూడా ఆత్మరూపంగానే ఉంటుంది. కనుక అతడు సమాధిని అవధరించినవాడే అవుతాడు. ఱెక్కలు లేని పక్షికి స్వయంగా నిశ్చలత్వం సంభవించినట్లుగా... తృష్ణారహితుడగు జ్ఞానికి అనంతాత్మ యొక్క ధ్యానం స్వయంగా (వేఱే ప్రయత్నమనేదేదీ లేకుండానే) కలుగుతోంది. అతనికి శుద్ధ బోధ రూపమగు ఆత్మ సాక్షాత్తుగా అనుభూతమౌతూ ఉండగా ఇక జ్ఞాన విరోధమైనదంటూ ఏదీ ఉండదు. ప్రజ్వలిస్తున్న అగ్నిలో నెయ్యి బిందువు ఉండదు కదా!

పరం విషయ వైతృష్ణ్యం సమాధానముదాహృతమ్ ।
అహృతం యేన తన్నూనం తస్మై నృబ్రహ్మణే నమః ॥

సంపూర్ణ విషయతృష్ణా రాహిత్యమే 'సమాధి'! విషయం తృష్ణారాహిత్యాన్ని ఎవరు సంపాదించు కుంటారో, అట్టి స్వయంబ్రహ్మ స్వరూపునికి నా నమస్కారాలు సమర్పిస్తున్నాను. ఎవరికి నిజమైన విషయతృష్ణా రాహిత్యం యొక్క ప్రభావం చేత, జ్ఞానం చేత సమస్త భేదాలు నశిస్తాయో, అతనిదే 'ఉత్తమం-దృఢం' అయిన ధ్యానం. వాని ఆత్మధ్యానం తొలగించటానికి ఇంద్రాది దేవతలు, అసురులు కూడా చాలరు. ఓ ముముక్షువులారా! మీరంతా కూడా అట్టి దృఢమైన-ఉత్తమమైన (తృష్ణారహిత) ధ్యానాన్ని సంపాదించుకొనెదరు గాక! తృణ ప్రాయమైన ఇతర ధ్యానాల వల్ల ఏం ప్రయోజనం?

❖❖❖

4. బ్రహ్మమునందు విశ్రాంతి - ఉపాయాలు

శ్రీరాముడు : మహర్షీ! ప్రపంచము-ప్రపంచాధీశుడగు పరమాత్మ... అను ఈ రెండింటినీ సమగ్రంగా అవగాహన చేసుకోవటమెట్లా?

శ్రీవసిష్ఠ మహర్షి : 'ప్రపంచం' అనే శబ్దం, అద్దాని అర్థం ప్రతిపాదించబడేదంతా అజ్ఞాని యొక్క అజ్ఞాన నాశనం కొఱకే గాని, జ్ఞాని కొఱకు కాదు. సర్వ సభికులారా! ఏ నిరతిశయానంద ప్రపంచం,

ప్రపంచాధీశుడు - ఇవన్నీ కూడా ఏకరూపమై అభిన్నంగా భాసిస్తాయో అట్టి బ్రహ్మం నందే విశ్రాంతిని పొందండి. ఎందుకంటారా? ఆత్మ తప్పితే ఇక్కడగాని, మరొక చోటగాని మరింకేదీ లేదు. 1. ఆరుక్షువుల యొక్క (సాధనపరుల), 2. ఆరూఢుల యొక్క (యోగాన్ని అధిరోహించినవారి) ... సర్వ మననాది ఆయా భూమికలన్నిటిలో ఆత్మకంటే వేరైన సత్త-అసత్తలు గాని, మరింకే ద్వైతాద్వైతములు గాని లేవు. అట్టి తదితరములైన ఏవైనా కార్యక్రమములు శాస్త్రములు ఎక్కడైనా చెప్పటం జరిగితే అవన్నీ అజ్ఞుల కొరకే గాని, విజ్ఞుల కొరకు కాదు.

శ్రీరాముడు : అట్టి బ్రహ్మమునందు విశ్రాంతి పొందటానికి సాధకులమగు మాకు ఏవైనా సులభోపాయలు చెప్పండి.

శ్రీవసిష్ఠ మహర్షి : అందుకు 3 సులభోపాయలు చెబుతాను, విను.

ఉపాయ ఏకః 'శాస్త్రార్థో', ద్వితీయో 'జ్ఞసమాగమః' ।
'ధ్యానం' తృతీయం నిర్వాణే శ్రేష్ఠః తత్ర ఉత్తరోత్తరః ॥

మొదటి ఉపాయం - నిరంతర శాస్త్రార్థములను అభ్యసించటం; రెండవ ఉపాయం - విజ్ఞులను సమీపించి, శరణువేడి వారితో సంభాషిస్తూ ఉండటం; మూడవ ఉపాయం - ధ్యానం (శాస్త్రార్థాలను వివేకంతో మననం చేస్తూ ధ్యాసను జగత్భ్రమ నుండి పరమాత్మవైపు తరలించడం) ...ఈ మూడు పై వరస ప్రకారం ఒక దానికంటే తరువాతది శ్రేష్ఠమైనది.

అపరిచ్ఛిన్నము, నిత్యం అపరోక్షమైనది (ప్రత్యక్షముగాని, పరోక్షముగాని కానిది) అగు బ్రహ్మ చైతన్యమే ఈ 'జీవుడు' అను రూపము పొందింది. స్వ ప్రతిబింబమే దర్పణంలో అగుపడునట్లు బ్రహ్మమే అంతఃకరణోపాధి వశంచేత పరస్పరం భిన్నం అయినట్టి ఈ జీవుడు అనబడు రూపం గ్రహిస్తోంది సుమా! ఈ జగత్తులో రాగద్వేషముల సంఘటనచే బ్రహ్మ మొదలు స్తంభము వరకు అనేక విశేషాలున్నాయి. అయితే స్వతఃసిద్ధము-శుద్ధము అగు చైతన్యమే ఈ సర్వ విశేషములందు అంతటా వ్యాపించి ఉన్నది. స్వకర్మ వైచిత్ర్యముచే ఈ కనబడే సమ-విషమ శరీర భేదములందు అంతటా ఉదయించి ఉన్నది ఆ చైతన్యమేనయ్యా! ఈ జీవుడు బ్రహ్మమే అయి ఉండి కూడా ఈ నిస్సార జగత్తులో జన్మకర్మాదులన్నీ ఆశ్రయిస్తూ సుదీర్ఘ కాలం వెళ్ళబుచ్చుచున్నాడు.

ఇట్లు సంసార చక్రంలో తిరుగాడుచున్న అసంఖ్యాక జీవులలో ఒకానొకడు సౌభాగ్యవశం చేత మోక్షమునకు అధికార యోగ్యమగు జన్మను పొందుచున్నాడు. అట్లా పొంది, శాస్త్ర జ్ఞానం, సజ్జనులతో సాంగత్యం... ఇటువంటి ఉపాయాలు ఆశ్రయిస్తున్నాడు... అప్పుడు సమస్త 'జనన-మరణ-భ్రమణ' రూపమగు ఈ 'జగత్తు' అనే ఆట యొక్క పూర్వపరాలేమిటో చక్కగా గ్రహిస్తున్నాడు. అట్లు బాగుగా ఎఱిగిన మహాత్ముడు 1. జ్ఞానం, 2. తృష్ణారాహిత్యం అనే రెండు దీపాలలో ఒకదానిని వెలిగిస్తున్నాడు. ఈ రెండింటిలో ఏ ఒక్కటి సిద్ధించినా కూడా రెండవది తనంతట తానే సిద్ధించగలదు. ఇక ఈ జగత్తు విషయమంటావా? అగ్నితో భస్మీభూతమైన దూదిప్రోగులు గాలిచే ఎగురగొట్టబడి ఆకాశంలోకి ఎగసిపోవునట్లు జగద్విషయాలన్నీ కూడా ఏదో అనామక ప్రదేశంలో

పడిపోతాయి! అట్లాగే జ్ఞానాగ్నితో భస్మీభూతమైన జగత్భావనలన్నీ ఆత్మ బుద్ధి అనే గాలిచే ఎరుగగొట్టబడి శాంతమగు పరమాత్మ అనే ఆకాశంలో ఎచ్చటనో లయమైపోతాయి.

శబ్దమాత్ర జ్ఞానం -

చిత్రాగ్నినేవ బోధేన తేన జాడ్యం న శామ్యతి ।
నిర్మూలాపి జగత్ భ్రాంతిః ఏనాశు న విలీయతే ॥

ఓ రామచంద్రా! కొందరు వేదాంత జ్ఞానాన్ని మాటలతో పలుకుచున్నారు గాని... అనుభవైక వేద్యం చేసుకొనే ప్రయత్నం చెయ్యటం లేదు. చిత్రపటంలోని అగ్నిచే చలిపోతుందా? పైపై జ్ఞానంచే అజ్ఞాన మూలం నశించదు. అట్టి ఆపాత జ్ఞానంచే జగద్భ్రాంతి త్వరగా తొలగిపోయినట్లే కనిపించి నప్పటికీ కూడా... వాస్తవానికి అజ్ఞానం "నిర్మూలనం కానిదే" అగుచున్నదని గుర్తు చేస్తున్నాను.

ఏ విధంగా అజ్ఞానికి అతని అజ్ఞత్వం కారణం చేత జగద్భ్రాంతి రోజు రోజుకూ అభివృద్ధి చెందుతూ ఉంటుందో... అదే విధంగా జ్ఞానికి తన యొక్క విజ్ఞాన కారణం చేత జగత్భ్రమ రోజు రోజుకూ తరుగుతూ వస్తుంది. అజ్ఞానం కలిగి ఉండకపోవటమే జ్ఞానానికి గుర్తు. అట్లు దహించివేయ బడిన అజ్ఞానం గల జ్ఞాని యొక్క దృష్టికి 'జగత్తు' శబ్దార్థ రహితమైనదిగా కనబడుతుంది. అజ్ఞానికి కనబడే జగత్తు జ్ఞానికి చిత్రపటంలోని స్వర్గ-మర్త్య-పాతాళ లోకాలుగానూ, 'శూన్యం' అనే మూల పదార్థంచే తయారుచేయబడిన బొమ్మలకొలువుగాను, నిద్రించిన వానిచే కల్పించబడిన స్వప్నదృశ్యం గాను అనిపిస్తోంది. జ్ఞాని యొక్క అనుభవమునకు ఇక్కడి చిత్తం, ఆ చిత్తం వెంటనంటి ఉండే ఇచ్ఛ, ఆ ఇచ్ఛకు కనిపించే జగత్తు ఇవన్నీ కూడా చిదాకాశముగానే తెలియవస్తున్నాయి. ఎందుకంటే బోధ ఉదయించిన తర్వాత జ్ఞానికి ఇచ్ఛా జగత్తులు రెండూ ఇక మచ్చుకనైనా ఉండజాలవు.

1. అహంకాం = "ఏకం – అఖండం-సర్వం అయిన చిదాకాశం (లేక, బ్రహ్మం) కంటే నేను వేఱుగా ఉనికి కలిగి ఉన్నాను. 'నేను'తో బాటు 'నాది' అనేది ఉంది..." అనే దర్శనం.

2. జగత్ స్థితి = 'పరమాత్మకు అన్యమై ఈ జగత్తు కలదు' అనే దర్శనం.

...పై ఉభయ దర్శనాలు పరమాత్మ గురించిన అద్వితీయ జ్ఞానం ఉదయించగానే సూర్యోదయా నంతర చీకటి తెరల వలె తొలగిపోతాయి. అట్టి జ్ఞానికి ఈ జగత్‌స్థితి పరమ ప్రకాశరూపమగు బ్రహ్మముగానే చెన్నొందుచున్నది. అది పూర్ణ ప్రబుద్ధుని స్థితి.

ఇక అర్ధ ప్రబుద్ధుని స్థితో?... అతని చిత్తమునకు ఈ జగత్ స్థితి అనుక్షణికమైన మార్పులతో కూడినదై ఉండటంచేత దీనికి 'ఇది' అని చెప్పగలిగిన రూపమేదీ కనిపించడం లేదు. అయినప్పటికీ అతనికి 1. బ్రహ్మం, 2. జగత్ స్వభావం అనబడే రెండు వేర్వేరైన తత్త్వములు ఉన్నట్లు అనిపిస్తోంది. ఆ అర్ధ ప్రబుద్ధుడు ఇంకా ఆత్మతత్త్వమును పూర్తిగా పొంది ఉండకపోవటం చేత... ఆత్మ యొక్క 'బోధాధిక్యత' చేత... ఒకప్పుడు ఈ జగత్తును 'ఏకం'గా గాంచుచున్నాడు. ఇక మరొకప్పుడు ఏమఱుపు చేత దీనినంతటినీ 'అనేకంగా గాంచుచున్నాడు. ఏక రూపం-అనేక రూపాల మధ్య అతడు సంచారం చేస్తున్నాడు. అంటే బోధ యొక్క ప్రభావం చేత ఒక సమయంలో 'మైత్రి-కరుణ' మొదలైన ఉత్తమ గుణములను ఆశ్రయిస్తున్నాడు. మరొక సమయంలో ఈ జగత్తును నమ్మి

ఉండటం చేత, అజ్ఞానవశం చేత ఇక్కడ పరస్పర-వివాదాలతో తాదాత్మ్యం పొందుతూ వ్యవహరిస్తు న్నాడు. అనగా ఆ అర్ధప్రబుద్ధుడు 'జ్ఞాన-అజ్ఞానాలు' అను రెండింటిలో ఏ భాగం ఎప్పుడు తన యందు ప్రబలంగా ఉంటుందో, ఆ సమయంలో అట్లే తన్మయుడై ఉంటాడు. అతడు తన యొక్క సాధనాక్రమమును కొనసాగిస్తూ ఉండగా పరిపక్వ స్థితిని పొందగలడు. పరిపక్వ స్థితిని పొందిన జ్ఞాని ఇక ఈ జగత్తు యొక్క భావాభావాలు పొందడు. తురీయావస్థలో ఉన్నవాడు జాగ్రత్-స్వప్న-సుషుప్తులను పొందకయే ఉన్నట్లుగా... జ్ఞాని ఈ జగత్తును చూస్తూ కూడా, దానిని పొందడు.

శ్రీరాముడు : హే మహానుభావా! ఈ మనస్సే కదా జగత్తును పొందుచున్నది?

శ్రీవసిష్ఠ మహర్షి : అవును. మనస్సే ఈ జగత్తును పొందుతోంది, త్యజిస్తోంది కూడా!

శ్రీరాముడు : ఈ మనస్సు యొక్క రూపం ఏమిటి? అది నశించేది ఎట్లా?

శ్రీవసిష్ఠ మహర్షి :

వాసనైవ మనః సేయం స్వ విచారేణ నశ్యతి ।
అవస్తుత్వాదతో మోక్షో నాత్మనాశే ప్రవర్తతే ॥

మనస్సు యొక్క రూపం వాసనలే! అయితే అట్టి వాసన 'ఆత్మ విచారణ' చే నశించగలదు. కాగా, మనస్సు అవస్తుమయమే (మాయ-అవిద్యామయమే) కదా! కాబట్టి మనస్సు (వాసనలు) అవిద్యమానమై ఉన్నంత వరకు మోక్షము సంభవించదు. వాసనలు నశించాయా, మోక్షం స్వతః సిద్ధంగానే ప్రాప్తించగలదు.

ఓ రామచంద్రా! ఈ విధంగా ముముక్షువు యొక్క మనోమృగం 'ధ్యానం' అనే వృక్షాన్ని సమీపించి అక్కడ 'బోధ' అనే ఫలం సంపాదించుకుంటోంది. పూర్ణపరిపక్వస్థితిని సంపాదించు కుంటోంది. 'పరమాత్మ బోధ స్వరూపము-పరమానంద లక్షణముతో కూడుకున్నది'... అయిన అమృత ఫలమును భుజిస్తోంది. అప్పుడు సంసార బంధనము నుండి విముక్తినొందుచున్నది.

కాబట్టి...'వివేకం-వైరాగ్యం' మొదలుగా గల సాధనల ద్వారా 'ధ్యానం' సహాయంతో మనస్సును 'జగత్తు' అనే అనేకములతో కూడిన స్థానం నుండి ఉపసంహరించి 'ఆత్మ' అను ఏకస్థానంలో లయింపజేయుటమే మోక్షప్రాప్తి. లేక "ఈ 'సంసారం'గా కనబడేదంతా సర్వదా పరమాత్మ యొక్క స్వరూప విన్యాసమే" అనే దృఢానుభవమే మోక్షం.

❖❖❖

5. అనురక్తి నుండి సమాధికి

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! 'పరమార్థ ఫలప్రాప్తి'కి సోపానములు ఈ విధంగా ఉంటాయి.

1. ప్రాపంచిక భేద విషయాలపట్ల అనురక్తి, తత్ఫలితంగా జన్మ-కర్మలు
2. అనురక్తి నుండి ... 'విరక్తి'
3. విరక్తి నుండి ... 'వైరాగ్యము'

4. వైరాగ్యము నుండి ... 'శాస్త్ర జ్ఞాన సముపార్జన'
5. అట్టి జ్ఞానము నుండి ... ధ్యానము
6. ధ్యానము నుండి ... సమాధి

ధ్యానముచే పరమార్థ ఫలం తిన్నగా అనుభూతం కాగలదు. అప్పుడీ జీవుడు ముక్తి రూపంగా పరిణామం పొందుతాడు. అప్పటి ముక్తి రూప స్థితిలో అజ్ఞానము నశించిన కారణం చేత-అప్పటి దాకా వెంటనంటి ఉన్న చరమ సాక్షాత్కార వృత్తి రూప బోధ కూడా అసత్తుగా పరిణమిస్తుంది. అప్పుడు ఇతఃపూర్వం ఉండి ఉన్న 'మనస్సు' కేవలం పరమార్థమగు ఆత్మ స్వరూపమే అగుచున్నది. ఆ మనస్సు యొక్క పూర్వకాలికమైన విషయాన్వేషణ అనే సంస్కారం 'నూనె అయిపోయిన తర్వాత దీపం' లాగా ఎక్కడికో వెళ్ళిపోతుంది. అక్కడ ఇక అనంతమైన ఆత్మ ప్రకాశరూపమగు పరమాత్మదశ మాత్రమే శేషించుచున్నది. అనగా, ధ్యానము యొక్క పరమార్థ ఫలము సంప్రాప్తించటం చేత మనస్సు బోధ రూపత్వం చెందుతోంది. అప్పుడే మనస్సు ఱెక్కలు తెగిన తర్వాత పడి ఉండే పర్వతం లాగా వజ్రతుల్యమైన దృఢనిశ్చల స్థితిని అవధరిస్తోంది. విషయముల గురించి చింతించుచుండే మనోస్వభావం ఎచ్చటికో పారిపోతుంది. 'బోధ రహితం-విభాగ శూన్యం-సర్వాత్మకం-సద్రూపం' అయినట్టి నిర్మల బోధ (చిన్మాత్రం) మాత్రమే శేషిస్తోంది. మనస్సు సర్వ భేదములను త్యజించినప్పుడు ఇక అద్దానిని 'బోధ స్వరూపం' అంటారు. అంతేగాని మనస్సు అని అనరు.

పూర్వ కాలంలో ఈ మనస్సు - ఈ జడ దేహాదుల గూర్చిన అవివేకముచే - జడంగానే ఉండేది. ఇప్పుడో, జ్ఞానబలిమిచే సువివేచనచే దేహమును జడమాత్రంగా అది దర్శిస్తోంది. అట్టి దర్శన ప్రభావం చేత బోధ రూపంగా ఉదయిస్తోంది. ఇక ఆ బోధరూప సత్త 'అనాది-అనంతము-నిర్మలము' అగు ఆత్మ ప్రకాశమును కలుగజేయునదిగా అగుచున్నది. సమస్త వాంఛలు త్యజించటం చేత... 'అనాది' గాను, అనంతమగు ఆత్మ యొక్క ధ్యానముచే... 'అనంతం' గాను, సంసార దోషం తొలగటంచే 'నిర్మలం' గాను, ఆ బోధరూపచిత్కళ స్వయంగా సిద్ధిస్తోంది.

ఎంతవరకైతే ఈ ప్రపంచం పట్ల ధ్యానం ఉంటుందో అంత వరకు ఆత్మధ్యానం కుదిరేది కాదు. ఎంత వరకు జీవుడు ఆత్మధ్యానం చేత బ్రహ్మమును పొందలేదో, అంత వరకు విషయాల మననం కారణంగా పరమపదమున విశ్రాంతి లభించదు. పరమార్థమగు ఆత్మతోటి ఏకత్వం పొందిన మరుక్షణం మనస్సు ఎచటికో తుఙ్ఞుమంటుంది. ఆ మనస్సుతోటే దాని సైనికులైనట్టి 'వాసన-కర్మ-హర్షం-క్రోధం'... వీటికి సంబంధించిన మనోవృత్తులు కూడా ఎచటికో పరుగులు తీస్తాయి. ఆ స్థితియందు యోగి కేవలం ధ్యాన నిష్ఠుడై కనిపిస్తాడు. అతని ఆత్మ ధ్యాన నిష్ఠ అత్యంత దృఢతరమై ఉంటుంది. సమాధిస్థితి ఎప్పుడు సిద్ధిస్తుంది?

ఓ రామచంద్రా! యోగికి సమాధి స్వయంగా సిద్ధించగలిగేది ఎప్పుడో చెబుతాను విను.

1. సమస్త భోగములందు విరక్తి కలిగినవాడు.
2. ఇంద్రియ వృత్తులన్నీ పూర్ణముగా శమించినవాడు

3. ఈ దృశ్యం పదార్థములన్నిటి పట్ల 'అ రుచి' కలిగియున్నవాడు

4. ఆత్మనే దర్శిస్తూ ఆత్మయందే రమించే వాడు. అనగా సహజీవులందరిలోని నిర్మలాత్మను అంతరంగ దృష్టిచే అన్నివేళలా దర్శించే అభ్యాసం కలవాడు.

5. క్రమంగా ప్రాపంచిక వృత్తులన్నీ నశించినవాడు.

6. మనస్సును ప్రపంచం నుండి ఉపశమింపజేసి విశ్రాంతిని పొందింపజేసినవాడు...

...అట్టి వానికి సమాధి స్వయంగా సిద్ధిస్తుంది. అప్పుడతనికి సమస్తము బ్రహ్మరూపమే అగుచుండగా ఇక దేనిని గురించి ధ్యానించాలి? ఇక అతనికి శాస్త్రములు ధ్యాననిష్ఠ యందు నియమించవలసిన బోధించవలసిన అగత్యమే ఉండదు. ఎందుకంటే ఆతని అనుక్షణిక దర్శనం ఆత్మభావనచే పరితప్తమై, పరిశ్రుతమై ఉంటుంది.

ఎంత వరకైతే భోగములు కనబడుతూ ఉంటాయో, అంత వరకు విషయ వైరాగ్యమును యోగులు సముపార్జిస్తూనే ఉంటారు. ఎప్పుడైతే ఆత్మవంతుడగు జ్ఞానికి వాసనల యొక్క అభావ బలం చేత జగత్పదార్థములు కనబడకయే పోతాయో, అప్పుడు ఆ జ్ఞాని సమాధియందున్నట్లే! అట్టివాడు తదితర సహజీవులను ఉద్దేశించి దేహముతో కర్మలు నిర్వర్తిస్తున్నప్పటికీ అతని సమాధి స్థితికి వచ్చే లోటేమీ ఉండదు.

'గుడ పిపీలికాన్యాయం'ను అనుసరించి (బెల్లమును ఆశ్రయించిన గండుచీమ ఆ బెల్లమును వదల లేకున్నట్లు) ఆత్మానందనమును ఆస్వాదించ ప్రారంభించిన మనుజుడు ఇక తన మనస్సును ఆత్మాస్వాదన నుండి మరలించనే లేడు.

ధ్యాన యుక్తమగు చిత్తమునందు 'జ్ఞానము' ద్వారా ఏ విషయ విరక్తి అతిస్వభావికమై ఉంటుందో... అదియే 'సమాధి'. తదితరమైనదేదీ నిజమైన సమాధి కాదు. రాగాదులతో కూడిన మనస్సు ఎక్కడున్నదో అక్కడ ఎవనికీ నిజమైన సమాధి జనించదని గ్రహించు. రాగము లేని మనస్సు సమాధి స్వరూపమే అవుతుంది.

శ్రీరాముడు : మహర్షీ! భోగాల పట్ల విరక్తి కలిగిన తర్వాత, ఇక ధ్యానాన్ని, సాధకుడు సంపాదించు కోవటమెట్లా?

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! భోగాల పట్ల విరక్తి కలిగిన తర్వాత ఇక 'ధ్యానం' అనే కార్య క్రమం, తత్సంబంధమైన బుద్ధి యొక్క అవసరం నాకేమీ కనిపించటం లేదు. భోగాల పట్ల అనురక్తి కలిగి ఉన్నప్పుడంటావా? అట్టి అనురక్తి ఉన్నంత కాలం ధ్యానం వలన ఏం ప్రయోజనం? విషయా నురక్తి ఉన్న చోట విషయధ్యాస స్వయంగానే కలుగుతుంది సుమా! కనుక ఈ సాధకుడు విషయాల పట్ల విరక్తి సంపాదించుకుంటే చాలు, ధ్యానం దానంతట అదే రూపుదిద్దుకుంటుంది. 'ఇదంతా ఆత్మ స్వరూపమే కదా!' అను దృశ్యం పట్ల ఏర్పడే దృఢమైన అభిప్రాయంతో చేసే మననమే ధ్యానం.

దృశ్యాస్వాదనముక్తస్య, సమ్యక్ జ్ఞానవతో మునేః ।
నిర్వికల్పం సమాధానం అవిరామం ప్రవర్తతే ॥

దృశ్యం యొక్క ఆస్వాదన లేనివాడు, ఉత్తమ జ్ఞానయుక్తుడు... అగు మునికి నిర్వికల్ప సమాధి నిరంతరం స్వయంగానే కలుగుతూ ఉంటుంది. ఎవనికి ఈ దృశ్యం కించిత్ కూడా రుచించకయే ఉంటుందో, అతడే 'ఉత్తమ జ్ఞాని' అని చెప్పబడుచున్నాడు. ఎందుకంటే, భోగాలు ఎప్పుడైతే రుచించవో, మరుక్షణం అతనిలో ఉత్తమ జ్ఞానం తనంతట తానే ఉదయిస్తోంది. ఎవనికైతే 'బ్రహ్మ స్వభావము' నందు విశ్రాంతి ప్రాప్తించిందో... అతనికి భోగాలలో రుచి ఎట్లా కలుగుతుంది. ఎందుకంటే బ్రహ్మ స్వభావ విరుద్ధమైన అజ్ఞానముచేతనే భోగము పట్ల రుచి ఏర్పడుతోంది. జ్ఞానంచే ఆ అజ్ఞానం తొలగిందా... అప్పుడిక భోగాల పట్ల అరుచి స్వయంగానే ఏర్పడగలదు.

శ్రీరాముడు : మహర్షీ! ఈ మనస్సును బోధరూపంగా మలచటానికి వేదాంత శ్రవణాది ఉపాయాలు అవసరం కదా! అట్టి శ్రవణం ఎప్పుడు ముగించవచ్చు? ఎప్పటికి సమాధిలో తత్పరుడై ఉండవచ్చు?

శ్రీవసిష్ఠ మహర్షి : (చిరునవ్వుతో) సాధకుడు మొట్టమొదట 1. వేదాంత శ్రవణం, 2. ఉపనిషత్తులు వంటి మోక్ష శాస్త్రాల పఠనం చేయటం, 3. ప్రణవాదుల జపం... మొదలైనవి కొనసాగిస్తూ క్రమంగా మనస్సును సమాధి యందు తత్పరం చేయాలి.

సమాధి నుండి లేచిన వెంటనే శ్రవణ-మనన-పఠన-జపాదులను అందుకోవాలి.

ఎట్లాగైనా సరే 'ఖేద రహితము-సర్వ సంశయ వర్జితము-అతి రమణీయము-సుషుప్తి వలె శాంతం-సమం-శుద్ధం' అగు చిత్తంతో నిర్వాణ రూపమగు సమాధిలో పై (ఉభయ సందర్భాల లోను) అతడు నెలకొని ఉండు గాక! యథా సమయంలో సర్వాత్మత్వానుభవం సిద్ధించిన తర్వాత అభ్యాసావశ్యకత స్వయంగానే ఉపశమించగలదు. అంతటా స్వస్వరూపమగు ఆత్మ విన్యాసమే ప్రత్యక్షమగుచుండగా ఇంక సమయాసమయములు, విధి-నిషేధములు ఎక్కడ మిగులుతాయి?

❖❖❖

6. ముముక్షువు - మొట్టమొదటి మెట్లు

శ్రీరాముడు : హే మహాత్మా! వసిష్ఠ మహర్షీ 'సమాధి గురించి మీరు ప్రవచించిన సూక్ష్మార్థం అత్యంత అమోఘమైనది. కేవలం 'మనస్సును సర్వ జగద్విషయ రహితమైన స్థానంలో ప్రతిక్షేపించటం'... అను సర్వజన-సర్వస్థితుల సుసాధ్యమైన అభ్యాసం చేత ధ్యాన-సమాధులు ఒనగూడుతాయి అనేది సర్వశాస్త్ర అమోదమైన ప్రవచనంగా నేను గమనిస్తున్నాను. అట్టి సులభతర మార్గాన్ని ప్రబోధించిన మీకు ముముక్షువులమగు మేమంతా సర్వదా కృతజ్ఞులం. స్వామీ! సంసార భారాన్ని మోస్తూ మిక్కిలి శ్రమ అనుభవిస్తూ, మరణ-మూర్ఛాది అనేక సంకటములలో దొరలుచున్న దేహికి ఆత్మలో విశ్రాంతి కలిగించగల సమాధిని సంపాదించటానికి గల వరుసక్రమమైన సోపానాలను (మెట్లను) మరల ఒకసారి ప్రవచించవలసినదిగా వేడుకొంటున్నాను.

శ్రీ వసిష్ఠ మహర్షి : రామచంద్రా! నీవు అడిగినట్లే సోపానరూపమైన విధానం చెప్పుతాను విను.

1. సంసారంముపట్ల వైరాగ్యం - సుదీర్ఘ మార్గంలో ప్రయాణిస్తూ సూర్య తాపముచే ఎంతగానో ఖేదం పొందిన బాటసారులు విశాలమైన నీడను ప్రసాదించే వృక్షం కనబడగానే ఆ విశాల వృక్షం

క్రిందకు పరుగులు తీస్తారు చూచావా?అట్లాగే పూర్వ జన్మలయందు గాని, ఈ జన్మయందు గాని గావించిన జప-తప-సత్కార్యముల ప్రయోజనంగా సంసార మార్గ బాటసారియగు జీవునికి ఎప్పుడో ఈ సంసారం పట్ల అరుచి (లేక) వైరాగ్యం కలుగుతోంది. "అనుక్షణం మార్పు చెందే ఈ సంసారమును నమ్మి ఉన్నందుకు నాకీ అవిశ్రాంతమైన దౌర్భాగ్యం వాటిల్లుతోంది కదా! ఇట్లా అజ్ఞానులతో సహవాసము, సంబంధ-బాంధవ్యములు కలిగి ఉన్నందుకు నాకు అనేకసార్లు దుః ఖం-బంధం-మోహం అధికమగుచున్నాయే!"... అనే వివేకం హృదయంలో ఉత్పన్న మౌతోంది. అట్టి వైరాగ్యమయమైన వివేకపు అంకురం మనస్సులో ఉదయించగానే ఇక అతను మెల్లగా కనులు తెరచి 'సాధుత్వముచే సువిశాలమైన హృదయము గల మహనీయులు ఎక్కడెక్కడున్నారా?'... అని పరికించి చూడటం ప్రారంభిస్తున్నాడు. మునుముందుగా అజ్ఞానులతో సహవాసమును తగ్గిస్తూ త్యజించి వేయటం మొదలెడుతున్నాడు. పవిత్రులగు విద్వజ్ఞుల మార్గంలో స్నాన-దాన-తపో-యజ్ఞాదులు ప్రారంభిస్తున్నాడు. తనకు యోగ్యము, కోమలము, తన స్వభావమునకు అనుకూలము, తదితర జనులకు హితము, అందరికీ కూడా ఆనందకరం అగు శ్రేయో విధులను ఆశ్రయిస్తున్నాడు. పెద్దల-విజ్ఞుల అభిప్రాయాలను గౌరవిస్తూ తనయందు దురహంకారములను పారద్రోలుచున్నాడు. సర్వజన ప్రియునిగా, భవ్యశీలునిగా పరోపకారిగా తనను తాను తీర్చిదిద్దుకుంటున్నాడు. శాస్త్ర సమ్మతాలైన పవిత్ర కార్యక్రమాలకు, భగవత్ స్తోత్ర పఠనాలు-సామూహిక పూజలు వంటి భగవత్ కార్యక్రమాలకు ఉత్సాహం చూప ప్రారంభిస్తున్నాడు. అతని మాట, క్రియ, ప్రవర్తన - సౌమ్యత సంతరించుకో నారంభిస్తున్నాయి.

2. సత్సంగం - ఇకప్పుడు దుస్సాంగత్యం త్యజిస్తూ సత్సాంగత్యాన్ని ఆశ్రయిస్తున్నాడు. మహనీయులు, పవిత్రమైన చరిత్ర గలవారు, వివేకవంతులు అగు వారితో సాంగత్యం మహత్తరమైన ప్రభావం కలిగి ఉంటుంది. అట్టి వివేకులతోటి సాంగత్యము వలన కలిగే భయరహితమైన విశ్రాంతి ఈ 14 లోకాలలో మరెక్కడా లభించదు. అది సాధకునికి శుద్ధత్వము ప్రసాదించగలదు. విరక్తులు-సంసారాన్ని దాటి వేసినవారు అగు మహనీయులను సర్వాత్మకుడైన పరమాత్మ ముముక్షువులకు తోడుగా ఈ సంసార నామ ఎడారిలో ఒయాసిస్సులుగా ప్రసాదిస్తున్నారని గ్రహించబడుగాక! వివేకశీలురతో కొద్దిసేపు సంభాషణ అనేక జన్మలుగా వెంటనంటి వచ్చే కారుచీకటి పొరలను పటాపంచలు చేసి వేయగలదు సుమా!

3. నిష్కామకర్మ, శాస్త్రాభ్యాసం - క్రమంగా అభ్యసిస్తూ వస్తున్న 'నిష్కామకర్మ' బుద్ధిని శుద్ధ పరుస్తూ వస్తుంది. అట్టి శుద్ధబుద్ధికి చక్కగా పరిశుభ్రపరుపబడిన అద్దంలోని ప్రతిబింబంలాగా గురు ముఖతఃగా వినినట్టి, స్వయంగా పఠించినట్టి శాస్త్రార్థములు, ఉపనిషత్-యోగవాసిష్ఠాది గ్రంథాలలోని అంతర్లీన గానం సులభంగా హృదయస్తమౌతాయి. వివేకయుక్తమైన హృదయంలో శాస్త్రార్థ రసం ప్రవేశించుచుండగా ఉత్తమ బుద్ధి సుతీక్షణం, విస్తారమగు అవగాహన పెంపొందుతూ వస్తుంది. నిర్మలత్వంచే శోభించే బుద్ధి తనయందు శాస్త్రార్థములను పూర్తిగాను, అతి లాఘవంగాను ధరించగలుగుతుంది.

సాధు జనుల సాంగత్యంచే శుద్ధమైన చిత్తమూ, అధ్యాత్మ శాస్త్రములచే శోధితమైన బుద్ధీ, సాత్విక కార్యక్రమాలచే పరిపోషించబడిన మనస్సూ ... గలవాడు వేడినీళ్లలో పరిశుభ్రం చేయబడ్డ వస్త్రం వలె ప్రకాశిస్తాడు. అతడు సూర్యుని వలె స్వవివేక తేజంచే భాసిస్తాడు. అట్టి వాడు అభ్యాస వశం చేత తన హృదయంలోని అలోచనలన్ని శాస్త్రార్థాల గురించి, గురు వాక్యాల మహోద్దేశాల గురించి ఎక్కుబెట్టబడి ఉంటాయి. కలలో కూడా వాటినే యోచిస్తూ ఉంటాడు. క్రమంగా శాస్త్రార్థాలలో స్నానం చేస్తు తద్వారా 'రాగ ద్వేషాలు' అనే ధూళిని కడిగి వేసుకుంటూ ఉంటాడు. 'క్రోధం, అసూయ' మొదలైన దుర్గుణాలు సమసిపోతూ ఉండగా, మైత్రి-భోగాల పట్ల 'వాటిని దాటివేసినట్టి స్వభావం' మొదలైనవి అలవడుచుండగా, ఇక అతడు బోనులోంచి వెలువడిన సింహం వలె గంభీరంగా శోభిస్తాడు. 'భోగానుసరణం' అనే దౌర్భాగ్యాన్ని తన వివేకంచే పరిత్యజిస్తూ ఉండగా ఆతడు, ఆతని వల్ల వంశం, ఆతడు ఉన్న పరిసరాలు, సమాజం – శోభిస్తూ ఉంటాయి.

4. భోగ త్యాజ్యం – ఆతనిలో 'భోగాలు పొందలేదే? పొంది ఉన్న భోగాలు తొలగుతాయేమో?' అనే రూపంలో ఉండే దీనత్వం వివేకాగ్నిచే కాల్చివేయబడుతుంది. కేతువుచే విడువబడిన పూర్ణచంద్రునిలాగా ఆతని ముఖం నూతన కాంతులు వెదజల్లుతూ ఉంటుంది. ముల్లోకాలలోని సర్వ పదార్థములను ఆతడు తృణప్రాయంగా ఎంచుతూ ఉండటం చేత మహాత్ముల మధ్య కూడా ఆతడు కీర్తనీయుడగుచున్నాడు. ప్రారబ్ధవశం చేత ఆతనిని సమీపించే భోగాలను 'త్యాగం' అనే రసంతో తడిపి ఉంచుతాడు. 'సర్వ ద్వేషములను త్యజించిన నేను ఈ భోగాలను మాత్రం ఎందుకు ద్వేషించటం?'...అని తలచుచూ, వాటి ప్రయోజనాల పట్ల లోలోన సిగ్గును కలిగి ఉంటాడు. భోగాల ప్రాప్తిచే సిగ్గు, భోగాల అప్రాప్తిచే సంతోషం ఆతని అంతరంలో ఏర్పడుతూ ఉంటాయి. అప్పుడాతడు స్త్రీ సాంగత్యాది క్రియలలోని ఉన్మాదాన్ని గుర్తు చేసుకొని అప్పటి తన అవివేకాన్ని చూచి నవ్వుకుంటూ ఉంటాడు.

5. సిద్ధులు-తత్ అనాదరణ-త్యాగ బుద్ధి – అటుపై భూమిపై ఉదయించిన చంద్రుని వంటి 'వివేకి'ని చూచి ఆనందించాలనే ఉద్దేశంతో మిత్రత్వంతో గూడి సిద్ధులు ఆతనిని సమీపిస్తాయి. నిరంతరం సర్వభోగాలను అనాదరించే ఆ వివేకి ఆ సిద్ధులను కూడా తన ఉదారబుద్ధితో అత్యంత సామాన్యమైన విషయాలుగా దర్శిస్తాడు. చూచావా రామచంద్రా! జడత్వ రహితుడు-గంభీర హృదయుడు అగు వివేకి యందు, మొట్టమొదట సంసారము పట్ల 'విరసత్వం' (లేక) వైరాగ్యం జనిస్తోంది. ఆరోగ్యం కావాలనుకునే రోగి వైద్యుణ్ణి సమీపిస్తాడు చూచావా? అట్లాగే ఆ వివేకి సజ్జనులతో సాంగత్యాన్ని స్వయంగా ఆశ్రయిస్తున్నాడు. ఆ సజ్జనులు చెప్పే వాక్యాలకు ప్రభావితుడై శాస్త్రార్థములను పఠించటంలోను, శ్రవణంలో, ధారణయందు నిమగ్నుడగుచున్నాడు. అతనిలో శాస్త్రార్థముల ప్రభావంచేత త్యాగబుద్ధి వచ్చి చేరుతోంది. అట్టి త్యాగబుద్ధికి, రెండు మహత్తరమైన గుణాలు వెంటనంటి ఉండి బలవత్తరమగుచున్నాయి.

1.ఇతరుల ధనాన్ని ఆశించటంలో అరుచి, 2.తనకున్న దానితో సంతృప్తి... ఆ త్యాగం

ఇంకనూ బలవత్తరమగుచుండగా, ఇక అతడు తన దగ్గర గల ధనాదులను కూడా ఇతరుల సుఖ-సంతోష-ఆనందాల కొరకై వినియోగించటం ఆరంభిస్తున్నాడు. తనను ఎవరైనా యాచించినప్పుడు ఆ త్యాగశీలియగు వివేకి తన దగ్గర ఉన్నదేదైన ఇచ్చివేయటానికి ఉత్సుకుడౌతున్నాడు.

దదాతి కణపిణ్యాకశాకాద్యపి హి యాచతే ।

తేనైవ అభ్యాసయోగేన స్వమాంసాని దదాత్య సౌ ॥

తనను ఎవరైనా యాచించినప్పుడు తన దగ్గర మిగిలి ఉన్న నూకలను-కూరలను కూడా ఇచ్చివేయటానికి సంసిద్ధుడగుచున్నాడు. అట్టి త్యాగముయొక్క అభ్యాసంచేత ఇక తనను అర్థించినవారికి తన శరీరంలోని మాంసాన్ని కూడా ఇచ్చివేయటానికి వెనుకాడని స్థితికి వస్తున్నాడు. క్రమంగా ఆతని చిత్తము లయించనారంభిస్తుంది. చిత్తము యొక్క రూపము ప్రాపంచిక పదార్థముల పట్ల ఇష్టమే గాని, మరింకేమీ కాదు కదా! వివేకము వైపుగా పరుగులు తీస్తున్న ఆ మహనీయుని అజ్ఞానం అల్పత్వం పొందసాగుతుంది. పరుగులు తీస్తున్నవాడు అతి సులభంగా చిన్ని-చిన్ని గుంటలను దాటివేయగలుగుచున్నట్లు ఆతడు చిత్తములోని ఆయా విషయ పరంపరలను అతిసులభంగా (ఆ స్థితిలో) జయించివేయగలుగుతాడు.

6. ధనాదుల పట్ల 'అనురక్తి' త్యజించటం - 1.ముముక్షువు మొదట ఇతరుల ధనాదుల పట్ల విరక్తిని అభ్యసించాలి. 2.ఆ తరువాత వివేకం చేత తన దగ్గర ఉన్న ధనాదుల పట్ల కూడా అనపేక్ష, విరక్తులను పెంపొందించుకోవాలి. ...ఇక ఆపై ఆత్మయందలి పరమ విశ్రాంతి కొరకై తన యొక్క ధనాదుల విరక్తితో బాటు విరాగము అను రూపంలో ఉండే భోగత్యాగం సంపాదించుకోవాలి.

న తాదృశం జగత్ యస్మిన్ దుఃఖం నరకకోటిషు ।

యాదృశం యావత్ ఆయుష్కం అర్థోపార్జన శాసనమ్ ॥

ఈ జీవితమును ధనోపార్జనయే ముఖ్యమైన లక్ష్యంగా వెచ్చించే వారి దుఃఖములు కోట్ల కొలది నరకములు అనుభవించే వారికి కూడా ఉండవు. ఎందుకంటావా?

ఆసనే, శయనే, యానే, గమనే, రమణే జనే ।

'ఆధి' చింతాపరాఏవ', నను మూఢా విదన్తు తామ్ ॥

ధన సముపార్జనలో బుద్ధిని నియమించిన వారు ఇక కూర్చున్నప్పుడు, పరుండినప్పుడు, నడుస్తున్నప్పుడు, క్రీడిస్తున్నప్పుడు, జనుల మధ్య ఉన్నప్పుడు... అన్ని వేళలా ఆలోచనలన్నీ "ధనాన్ని సంపాదించటం, దాచటం, కాపాడుకోవటం"... అనే వ్యవహారాల పట్లనే ధ్యాసంతా కలిగి ఉంటారు. వారు తమ మనసుకి పట్టిన చింతలేమిటో తమకే తెలియకుండానే అనేక చింతలలో సతమతమౌతూ ఉంటారు.

వారు తమ-తమ చింతల గురించి ఇతరులకు చెప్పుకోలేరు. తాము భరించలేరు! వివేకంతో విచారించి చూస్తే... ధనం మహా అనర్థముల కొరకే అయి ఉన్నది. సంపదలు నిరంతర ఆపదలవైపే ఎక్కుబెట్టబడి ఉన్నాయి. భోగములు సంసార రోగముల వృద్ధి కొరకే అగుచున్నవి. ఎంతెంతవరకైతే

ఈ జీవుడు 'ధనము' అనే అనర్థమును అభిలషించకయే ఉంటాడో, అంతంత వరకు ఈతడు 'విషయ చింతనలు' అనే సెగలచే దహించక ఉంటాడు. ఎవనికైతే 'శాశ్వతము-సర్వోత్తమము' అగు మోక్షము రుచించుచున్నదో, అంత వరకు ఆతడు ధనమును, విషయ జగత్తును గడ్డిపరక యొక్క చివరి ముక్కలాగా అతితుచ్ఛంగా గాంచగలుగుతాడు. ధనస్పృహాత్యాజ్యం సంపాదించుకొన్న వారికి ఆత్మయందే సుఖమును గాంచటం క్రమక్రమంగా అతిసులభమౌతుంది. అనేక శోక-మోహాది భావ వికారములు, అనేక దుష్కర్మలు, దీనత్వము, దుష్టచేష్టలు ఇవన్నీ కూడా ధనము పట్ల గల దురాశయే మూలముగా కలిగి ఉన్నాయని చెప్పబడుచున్నది.

7. సంతోషాభ్యాసం - ఓ రామచంద్రా! ఈ ప్రపంచంలో జరామరణాది చిత్త రోగములచే పూర్ణులై ఉన్న జీవులు అట్టి జరామరణాదుల నుండి విముక్తి పొందాలంటే 'సంతోషము' అనేదే ఉత్తమ ఔషధం. సంతోషమును అభ్యసించేవాని ఉత్తరోత్తర అనుభవం చక్రవర్తికిగాని, ఇంద్రలోకం పొందిన వారికిగాని లభించటం లేదు. 'సంతోషము' అభ్యసించేవాడే పూర్ణత్వముచే శోభించుచున్నాడు. 'అభిలాష' అనే దోషము గల జీవుడు నిష్కారణంగాను, అనాలోచితంగాను తన సంతోషమును కోల్పోయి, ఇక ఒక దుఃఖము నుండి మరొక దుఃఖమునకు పరుగులు తీస్తూ ఈ సంసారారణ్యంలో తిరుగాడుచున్నాడు. ఆతని పాట్లు చెప్పు క్రింద పడ్డ పురుగులాగా అతిదీనంగా ఉంటున్నాయి. 'ధనవాంఛ' అనే వికృతరూపము దాల్చిన జీవుడు ఎన్నటికీ శాంత స్థితికి చేరుకోనే లేడు సుమా!

అర్థోపార్జన-రక్షాణాం జానన్నపి కదర్థనామ్ ।
యఃకరోతి స్పృహాం మూఢో, 'నృపశుం' తం న సంస్పృశేత్ ॥

ధనము యొక్క 'ఆర్జన-రక్షణ' మొదలైన వాటిలో గల దుఃఖమును, కాలయాపనను గమనించి కూడా ఏ మూఢుడు అట్టి ఆశాపాశముల నుండి విడవడటానికి ఇష్టపడడో, అట్టి నరపశువును తాకనే కూడదు సుమా! ఎవడైతే "తృష్ణారాహిత్యము" అనే కొడవలితో మనస్సు యొక్క (1) బాహ్య విషయానుసరణము (2) అభ్యంతర సంకల్ప పరంపరలు అనే రెండు దోషాలనూ ఒకేసారి కోసివేయుచున్నాడో... అట్టి వాని హృదయక్షేత్రంలో 'ఆత్మజ్ఞానం' అత్యల్ప సమయంలో ప్రకాశించగలదు. జ్ఞాని ఈ దృశ్యవిషయ సముదాయమును స్వప్న విషయమువలె అసద్రూపంగా గమనిస్తున్నాడు. కాని అజ్ఞానులకు ఇదంతా సత్యంగా, శాశ్వతంగా, సద్రూపంగానూ అనిపిస్తోంది. అట్లా అనిపించటానికి కారణం సత్యము-నిత్యము అగు దానిపట్ల అభ్యాసరహిత్యమే సుమా!

ఓ రామచంద్రా! ఈ విధంగా - మొట్టమొదట ఈ సంసారం పట్ల వైరాగ్యం, తరువాత సత్సాంగత్యం, అటుపై అధ్యాత్మ శాస్త్రార్థముల యొక్క భావనచే భోగములను పరిత్యజించి ఉండటం, ఆపై తృష్ణారాహిత్యం యొక్క దృఢాభ్యాసం... పై సోపానముల ద్వారా జీవుడు పరమార్థమగు ఆత్మతత్త్వమును ఎఱిగి తనను తాను మోక్షార్హునిగా తీర్చిదిద్దుకుంటున్నాడు.

❖❖❖

7. ఈశ్వరుడు ఎక్కడున్నాడు?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! "ఈ జీవుడు పరమేశ్వరుని చేరేది ఎట్లా?" అనే విషయం మనం సంభాషిస్తున్నాం కదా! అందుకు ఏమేమి ఆవశ్యకమో మరల ఒక్కసారి గుర్తు చేసుకొని ఇక ఆ పై ఆత్మ యందు విశ్రాంతి ఎట్లా సుస్థిరపడుతుందో చెప్పుకుందాం.

ఆవశ్యకతలు

1. సంసారం పట్ల వైరాగ్యం దృఢపడటం; 2. సాధు జనులతో సాంగత్యం సిద్ధింపజేసుకోవటం; 3. నిర్మలబుద్ధితో శాస్త్రార్థములను భావించటం; 4. భోగాల పట్ల తృష్ణను రహితం చేసుకోవటం; 5. విషయాల పట్ల విరసత్వం; 6. సద్గుణాలను అభ్యసించటం, సజ్జనత్వం సంతరించుకోవటం; 7. హృదయంలో జ్ఞాన ప్రకాశాన్ని ఉదయింప జేసుకోవటం...

ఇట్లు జ్ఞానప్రకాశం వైపు ఉన్ముఖమైన వివేకి ఇక ధనాదులను వాంఛించడు. సర్వప్రాపంచిక విషయాలను హృదయం నుండి ఊడ్చివేసి ఉంటాడు. అప్పుడాతనికి స్త్రీ-ధన-బాంధవ్యాదులు కూడా భారంగా అనిపిస్తాయి. యథాశక్తి, యథాకాలం వాటిని మనస్సుచే త్యజించి వేసి ఉంటాడు. ఇక ఈ ఇంద్రియాలు ఇంద్రియార్థములలో ప్రవర్తిస్తూ ఉన్నప్పటికీ వాటియందు ఆతడు తప్పనిసరిగా సంలగ్నం కావలసి వస్తున్నప్పటికీ... అంతరంలో పరమ శాంతచిత్తుడై ఉండటం చేత... వాటినన్నిటిని పొందకయే ఉంటాడు.

ఆతనికి ఇక ఏకాంత దశలలో గాని, సరోవరాలలో గాని, అరణ్యాలలో గాని, వనవాటికలలో గాని, పవిత్రస్థానాలలో గాని, స్వగృహంలో గాని, మిత్రులతో ఏర్పడే క్రీడావిలాసాలలోగాని, ఉత్తమ ఉద్యానాలలో గాని, భోజనాది క్రియాకలాపాలలో గాని, శాస్త్ర తర్క-వితర్కాలలో గాని.... ఆసక్తి ఉండదు. వాటిలో వేటి యందూ దీర్ఘకాలం ఉండడు.

ఆతడు ఎల్లప్పుడూ తనయందే వెలయుచూ ఉంటాడు. ఆతడిక పరమశాంతుడై ఉంటాడు. దాంతుడై (ఇంద్రియాలను జయించినవాడై) ఉంటాడు. ఆత్మారాముడుగాను, మునిగాను, విజ్ఞానైక నిరతుడుగాను ఉంటాడు. తన దేహ-ఇంద్రియాలకే సాక్షి అయినట్టి 'ప్రత్యగాత్మ' యొక్క అన్వేషణలో మాత్రమే ఉంటాడు. తాపముచే సంతృప్తుడైన మనుజుడు చల్లటి నీళ్ళతో స్నానం చేసి విశ్రాంతి పొందుతాడు చూచావా? ఆ ప్రకారంగా 'ఆత్మాన్వేషణం' అనే అభ్యాసం చేత 'శాంతుడు' అగుచున్న యోగి పరమపదమగు 'ఆత్మ' యందు విశ్రాంతిని సంపాదించుకుంటున్నాడు.

శ్రీరాముడు : మహాత్మా! ఈ బాహ్య-అభ్యంతర రూపమైన దృశ్య పదార్థమంతా ఎట్లా ఉదయిస్తోంది? ఇదంతా ఏమైయున్నది? ఏమి కానున్నది?

శ్రీ వసిష్ఠ మహర్షి :

స బాహ్యా-అభ్యంతరం శాన్తా జ్ఞతైవార్థ తయోదితా ।
'న సంభవతి భిన్నో అర్థ' ఇత్యేవ పరమం పదమ్ ॥

స్వాత్మ గురించిన అజ్ఞానమే ఈ బాహ్య-అభ్యంతర దృశ్య పదార్థరూపంగా ఉదయిస్తోంది! కాబట్టి అట్టి అజ్ఞానం ఆ పదార్థముల కంటే భిన్నమైనది కాదు. అనగా ఆయా దృశ్య పదార్థముల పట్ల అనుభవరూపమే అజ్ఞానం యొక్క రూపం. పదార్థములకు వేఱుగా అజ్ఞానం ఎచ్చటా సంభవించదు. కనుక ఎప్పుడైతే ఈ దృశ్యం త్యజించబడుతుందో, అట్టి త్యాగము చేత మాత్రమే అజ్ఞానం శమిస్తుంది. అట్టి దృశ్య త్యాగం చేత అద్దాని సాక్షియగు ఆత్మయందు స్థితి కలుగుతుంది. సాక్షియందు స్థితి కలిగిన తరువాత శేషించే శాంతమగు ఆత్మస్థితియే 'పరమ పదం' అయి ఉన్నది.

శ్రీరాముడు : స్వామీ! 'పరమ పదము' అనగా?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఎచ్చటయితే కేవల చిత్తు లేక 'బోధ' తప్ప ఇక తదితరమైన పదార్థం గాని, శూన్యత్వం గానీ మచ్చుకైనా ఉండదో... అట్టి అంతరంగము నందలి నిజానుభవ స్థితియే 'పరమ పదం' అని చెప్పబడుతోంది. ఓ రామచంద్రా! సమస్త పదార్థములు కూడా ఉపరూపమగు బోధగా పరిణమించటం జరుగగా... ఇక ఎచ్చటైతే పదార్థం గాని, పదార్థత్వం గాని, శూన్యత్వం గాని లేకయే ఉన్నాయో, అట్టి స్థితికి శాస్త్రకారులు 'పరమపదం' అనే పేరుపెట్టారు.

ఓ రాఘవా! కేవలం స్వాత్మామాత్రమున విశ్రాంతి పొందిన మనో అతీత స్వభావులగు మహాత్ములకు విషయాల పట్ల 'కించిత్' కూడా రుచి ఉండదు. బహిర్ముఖత్వ నిరోధ రూపమగు స్వభావమును సంపాదించుకున్నవాడు, మౌని, ఈ శరీరాదులందు 'ఇవి సుస్థిరం' అను అభిప్రాయం లేనివాడు, ఆత్మజ్ఞుడు అగు మహనీయుడు 'చిత్రం'లో లిఖించబడిన 'నదీజలం' లాగా నిశ్చలంగా ఆత్మ స్వభావమునందే నెలకొని ఉంటాడు.

ఇక ఆత్మజ్ఞాని యొక్క హృదయం ...సర్వ పదార్థములతో కూడుకొని ఉన్నప్పటికీ... పదార్థ రహితంగాను, విస్తారమై ఉన్నప్పటికీ... పరమాణుసదృశంగాను, అశూన్యమైనప్పటికీ... శూన్య సమంగాను ఆత్మజ్ఞాని యొక్క హృదయం భాసిల్లుతోంది. ఈ అహంభావం, జగత్తు, ఈ జగత్తు యొక్క చేష్టలు, దేశ-కాలాదుల కల్పన, జ్ఞాతృ-జ్ఞాన-జ్ఞేయములతో కూడుకున్న త్రిపుటి, శూన్య - అశూన్యములు - ఈ మొదలైనవన్నీ ఎదురుగా ఉన్నప్పటికీ ఆత్మజ్ఞాని యొక్క దృష్టిలో ఇవన్నీ "మిథ్యమాత్రం" గాను, స్వతఃగా కించిత్ కూడా 'లేనివి' గాను అగుచున్నాయి.

మానవాకార జ్ఞాన సూర్యుడు : దీపం వెలగగానే అంధకారం పటాపంచలైపోతుంది చూచావా?... నిర్మలమగు ఆత్మపదమనే వెలుగును అధిరోహించినట్టి జ్ఞాని యొక్క హృదయంలో దృశ్యం-రాగం -ద్వేషం-భయం అనే అంధకారానికి చోటు ఉండదు.

ఎవని రజోగుణం సంపూర్ణంగా నశించి ఉంటుందో, తన శుద్ధ సత్త్వగుణం చేత ఎవని తమోగుణం మొదలంట అధిగమించబడి ఉంటుందో, ఎవని సమక్షంలో అజ్ఞానాంధకారం ఆతని జ్ఞానప్రకాశంచే మ్రింగివేయబడి ఉంటుందో... అట్టి మానవాకార సూర్యుడు తదితర జనులందరికీ నమస్కరించుటకై అర్హుడగుచున్నాడు. భేదం సంపూర్ణంగా శమించగా అప్పుడు చిత్తం అదృశ్యమవు తోంది. అప్పుడిక అట్టి ఆత్మజ్ఞాని స్థితి ఎట్టిదో... అది వాక్కుచే చెప్పటానికి సాధ్యపడేది కాదు.

రాత్రింబవళ్ళు చాలా కాలంగా ఒనర్చిన 'పరమ భక్తి'చే సంతోషించిన ఆ ఈశ్వరుడు నిష్కల్మష–నిర్భేద హృదయుడైన వివేకికి 'నిర్వాణం' అనబడే సర్వాత్మ దర్శన స్వరూపమగు ఉత్తమ స్థితిని ప్రసాదిస్తున్నాడు.

సర్వము ఈశ్వరమయం -

శ్రీరాముడు : స్వామీ! ఈశ్వరుడు అనగా?

ఈశ్వరఃకో? మునిశ్రేష్ఠ! కథం భక్త్యా ప్రసాద్యతే ।
ఏతన్మే తత్త్వతో బ్రూహి, సర్వతత్త్వ విదాంవర ॥

తత్త్వవేత్తలలో శ్రేష్ఠుడగు ఓ మునివరా! మీరు చెప్పిన ఆ 'ఈశ్వరుడు' అనగా ఎవరు? భక్తిచే ఆతడు ఎట్లా ప్రసన్నం అవుతాడు? దయచేసి నాకీ విషయం యథార్థంగా తెలియజేయండి.

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! నీ ప్రశ్నకు సూటి అయిన సమాధానం విను!

ఈశ్వరో న, మహాబుద్ధే! దూరే, న చ దుర్లభః,
మహా బోధమయైకాత్మా, 'స్వాత్మైవ పరమేశ్వరః'!

ఓ మహాబుద్ధీ! ఆ ఈశ్వరుడు ఎక్కడో దూరంగా లేడు. కొందరు 'ఆతడు అతి దుర్లభుడు. సామాన్యులకు లభించేవాడు కాదు'.... అని అంటూ ఉంటారు. అదీ నిజం కాదు. మరి? మహాబోధమయైక స్వరూపమగు స్వాత్మయే ఆ పరమేశ్వరుడు.

మహాబోధమయైక స్వరూపమగు స్వాత్మ అనగా... ఆత్మ యొక్క ప్రపంచాన్ని పొందే మనన విభాగమే మనస్సు (లేదా) మనోచైతన్యం. 'మనస్సు' నుండి ప్రపంచత్వాన్ని ప్రక్కకు పెట్టి నప్పుడు మిగిలి ఉండేదే నిర్మల చైతన్యం. అట్టి ప్రతి ఒక్కరి యొక్క నిర్మల చైతన్యమే పరమేశ్వరుని స్వరూపం.

అంటే, చైతన్యం ఎక్కడ 'దృశ్య సంబంధ తృష్ణ' అనే స్వభావాన్ని ప్రదర్శిస్తోందో, దానిని 'జీవుడు' అని పిలుస్తున్నాం. అద్దానినే 'మనస్సుతో కూడిన చైతన్యం' లేక 'మనో చైతన్యం' అని కూడా అంటున్నాం. చైతన్యం తన మనో స్వభావాన్ని అతిక్రమించి ఉన్నప్పుడు శివుడు – "శుద్ధచైతన్యం" అంటున్నాం. అట్టి శుద్ధ చైతన్యమే ఈ జీవుని నిజమైన రూపం.

మనస్సులో'జగద్దర్శనం' అనే అభ్యాసాన్ని తొలిగించి చూస్తే దానిని 'బోధ స్వరూపం' అంటాం. అట్టి బోధస్వరూపాన్ని దేహ మనో బుద్ధ్యాది పరిధులను త్యజించిస్తే 'మహాబోధ స్వరూపం' అంటాం. అట్టి మహాబోధ స్వరూపమగు స్వాత్మయే 'పరమేశ్వరుడు' అను శబ్దంచే ఉద్దేశింపబడుతోంది.

ఈ సమస్తమూ ఆ పరమేశ్వరుని కొరకే అయి ఉన్నది! ఆ పరమేశ్వరుని నుండే ఈ సమస్తం ఉత్పన్నమగుచున్నది! ఆ పరమేశ్వరుడే ఈ సమస్తం అయి, అంతటా కూడా వ్యాపించి ఉన్నాడు! సమస్త జీవుల హృదయంలో వెలుగొందుచున్నది ఆతడే! ఆ పరమాత్మయే సర్వాన్ని ఆక్రమించుకొని సర్వమయుడై ఉన్నాడు. సర్వమునందలి నిత్యుడు అతడు మాత్రమే. సర్వ స్వరూపుడు, సర్వాత్మకుడు అగు ఆ పరమేశ్వరునికి మేము నిత్యం ప్రణమిల్లుచున్నాము.

తస్మాదిమాః ప్రసూయన్తే సర్గ ప్రలయ విక్రియాః ।
అకారణం కారణతో గతయః పవనాదివ ॥

ఆ పరమేశ్వరుని నుండే ఈ 'సృష్టి-స్థితి-ప్రళయం' అనే చమత్కార విశేషాలన్నీ జనిస్తున్నాయ్! ప్రపంచంలో సర్వము కార్య-కారణ ములచే ఏర్పడుచున్నాయి. అయితే ఆ పరమేశ్వరుడో? ఆతడు స్వయంగా కారణ రహితుడు. అయినప్పటికీ ఆతడే సర్వ కారణములందు వ్యాపించి ఉన్నాడు. అంతే కాదయ్యా! సర్వ ప్రాణులలోని ప్రాణాదుల గతులన్నీ ఆతని వలననే సంభవిస్తున్నాయి. ఈ ప్రాణకోట్లంతా తాము కోరుకున్న పదార్థములను ప్రసాదిం టానికి గాను ఆయననే నిరంతరం ఆయా అన్ని చోట్లా అనేక నామ రూపాలతో పూజిస్తున్నారు. ఈ జీవులు తమ యథేష్టమగు రుచి ననుసరించి అనేక జన్మలలో ఆయనను పూజిస్తూ ఉండగా ఆయన వారి పట్ల ప్రసన్నుడగుచున్నాడు.

ప్రసన్నః స మహాదేవః, స్వయమాత్మా మహేశ్వరః ।
బోధాయ ప్రేరయత్యాశు దూతం పూతం శుభేహితైః ॥

మహాదేవుడు, పరమేశ్వరుడు, సర్వాత్మకుడు అగు ఆయన ఈ జీవులు చేసే పూజలకు ప్రసన్నుడై, 'బోధ' కొఱకై పవిత్రుడగు తన దూతను ప్రేరేపణ చేయుచున్నాడు.

వివేక మహత్యము -

శ్రీరాముడు : **ఆత్మనా పరమేశాన కోదూతః ప్రేత్యతే మునే?**
సదూతో బోధనం వాపి కరోతి? వద మే కథమ్?

శ్రీరాముడు : మునీంద్రా! ఆత్మస్వరూపుడగు ఆ పరమేశ్వరుడు ఏ తన దూతను ప్రేరేపిస్తున్నారు? ఆ దూత ఏ రీతిగా బోధ చేస్తున్నారు. వివరించండి.

శ్రీ వసిష్ఠ మహర్షి : ఆత్మ స్వరూపుడగు ఆ పరమేశ్వరునిచే ప్రేరేపించబడే దూత మరెవరో కాదు. ఆయన ఈ జీవులలో గల 'వివేకము'నే ప్రేరేపణ చేస్తున్నారయ్యా! హృదయంలో ప్రవేశించిన ఆ 'వివేకం' అనే దూత ఆకాశంలో ప్రవేశించిన చంద్రుని వలె అత్యంత ఆహ్లాదకారకుడగుచున్నాడు. ఆ 'వివేకము' అనే దూత వాసనామయుడగు ఆ జీవునికి క్రమక్రమంగా 'ఉద్బోధ' చేస్తున్నాడు. క్రమంగా ఆ జీవుని ఆ వివేకదూత సంసార సాగరం నుండి తరింపజేస్తున్నాడు.

బోధాత్మై ఏషో అంతరాత్మైవ పరమః పరమేశ్వరః
అస్యైవ వాచకోనామ ప్రణవో వేద సమ్మతః ॥

బోధస్వరూపుడగు ఆ 'అంతరాత్మ' యే ఉత్తముడగు పరమేశ్వరుడయ్యా! మరి ఆతని పేరు? నామరూపాలు ఆయనకి ఆపాదించటమెట్లా? అదట్లా ఉండగా, నామ-రూపాదుల సహాయం లేకపోతే ఆయనను మననం చేయటమెట్లా? అందుచేత వేద సమ్మతమైన 'ఓం' (అకార - ఉకార - మకారాలు) అనే ప్రణవమే ఆతని వాచకమై ఒప్పుచున్నది. ఈ దేవతలు, మనుజులు, నాగులు, అసురులు మొదలైన వారంతా కూడా వారి వారి బుద్ధి, ఊహ, ప్రమాణం, సంస్కారాలను అనుసరించి నామరూప సహితంగానో, లేక నామరూప రహితంగానో వారి వారి జప-హోమ-

తప-దాన-పఠన-యజ్ఞ-యాగాది ఆయా క్రియా క్రమములచే ఆ ఓంకారవాచక పరమేశ్వరునే నిత్యము ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు.

❖

స్వర్గం ఆ పరమేశ్వరుని శిరస్సు. భూమి ఆయన పాదాలు. నక్షత్రాలు ఆయన రోమ సమూహాలు. సమస్త ప్రాణికోట్లు ఆయన అస్థులు. ఆకాశం ఆయన హృదయం. చిత్స్వరూపుడైనట్టి ఆ పరమేశ్వరుడు అన్ని చోట్ల ప్రవేశిస్తున్నాడు.

సర్వత్రైష చిదాత్మత్వాత్ యాతి, జాగర్తి, పశ్యతి,
తేనైష సర్వతో లక్ష్య కర-కర్ణ-అక్షి-పాదభృత్ ॥

అంతటా నిరంకుశంగా ప్రవేశిస్తున్నాడు. సర్వదా ఆయన మేలుకొనియే ఉన్నాడు. సర్వులను గాంచుచునే ఉన్నాడు. సర్వుల లక్ష్య స్వరూపుడు అయి ఉన్నాడు. సర్వత్రా చేతులు-పాదములు-చెవులు-నేత్రములు మొదలైన ఇంద్రియములన్నీ ధరించుచున్నది ఆయనే! ఆ పరమాత్మ ఈ జీవుని ప్రార్థనాదులకు సంతోషించి ఆతనియందు వివేకము అనే దూతను ఉద్బోధిస్తున్నారు కదా! ఆ వివేక దూత హృదయంలో ప్రవేశించి 'చిత్తము' అనే పిశాచమును చంపి ఈ జీవునికి తన యొక్క మహత్తరమైన 'ఆత్మ పదము'ను పొందింపజేస్తున్నాడు.

స్వాత్మయగు పరమేశ్వరుని శరణువేడండి! - కాబట్టి ఓ ప్రియ జనులారా! మీరంతా మీ పురుష ప్రయత్నంచే అనర్థయుతాలైన సమస్త వికారాలను, సమస్త వికల్ప సమూహాలను త్యజించండి. సర్వ ప్రయత్నాలచే స్వయంగా ఆత్మ చేతనే ఆత్మ భూతుడగు ఆ సర్వాత్మకుని, పరమేశ్వరుని ప్రసన్నం చేసుకోండి. ఈ సంసారమనగా ఏమిటో కాస్త గమనించండి. అతి చపలమైనట్టి 'మనస్సు' అనే పిశాచంతో కూడుకొన్నదై, శోక-మోహాదులు అనే మేఘాలచే క్రమ్ముకొన్నదై ఈ సంసారం హృదయంలో వ్యాపించి ఉంది. మరిక స్వాత్మయగు పరమేశ్వరుని శరణు వేడటమే ఉపాయం. ఆయనే వివేక సూర్యుని రూపంలో ఈ సంసారాంధకారాన్ని పటాపంచలు చేయగలడు.

సంసారం ఎట్టిదో వినండి. ఇది ఒక అగాధం వంటిది. ఇందులో "మరణం పునర్జన్మ" మొదలైన దురవస్థలు-ఆవర్తాలు (సుడులు) కలిగి ఉన్నది. అతి వ్యాకులమై ఉంటోంది. 'తృష్ణ' అనే చంచల తరంగాలు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. మనస్సు అనే సుడిగాలి ఇందులో అవిశ్రాంతిగా వీస్తోంది. ఇందులో 'ఇంద్రియ విషయాపేక్షలు' అనే మొసళ్లు సంచరిస్తున్నాయి. అట్టి ఈ సంసార సముద్రాన్ని దాటటానికి ఉన్నది ఒక్కటే ఉపాయం - అదే 'వివేకం' అనే నావను ఆశ్రయించటం.

ఓ ప్రియ జనులారా! ముందుగా మీకు అభిమతమైన మార్గంలో పూజ-తపస్సు మొదలైన వాటితో ఆ పరమేశ్వరుని సంతోషింపజేయండి. ఆయన 'వివేకం' అనే పవిత్రమైన దూతను మీకు ప్రసాదిస్తున్నాడు. ఇక 'సత్సాంగత్యం, శాస్త్రాభ్యాసం' అనే పరమార్థ బోధను ప్రవృద్ధం చేసుకోండి. మీ వివేకం క్రమక్రమంగా వికసించుగాక! అప్పుడా వివేక దూత 'పరమార్థబోధ' ద్వారా ఈ జీవుని 'నిర్మలం-ఏకం-అద్వితీయం-ఆద్యం' అయినట్టి ఆత్మపదాన్ని పొందింపజేయగలడు.

❖❖❖

8. వివేకి యొక్క దర్శనం-మననం-అనుభవం

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! 'వాసనలు' అనే మలాన్ని తమయందు పూర్తిగా తొలగించుకొన్నట్టి దృఢ వివేకులగు మహనీయులలో లోకోత్తరమైన ఒకానొక మహనీయత్వముతో కూడిన బుద్ధి జనిస్తోంది. వారి బుద్ధి ఔదార్యం-మహనీయత్వం-మహత్వం-గాంభీర్యత్వం-అతి సౌందర్యం సంతరించుకొంటోంది. అట్టి బుద్ధికి అగుపించే తాత్త్వికదర్శనం తదితర సామాన్య జనులకు అర్థం కానిది. అట్టి బుద్ధిని ప్రలోభపరచగలిగేదేది ఈ 14 లోకాలలో ఎక్కడా ఏదీ లేదు. ఉండజాలదు.

"ఈ జగత్తు అనబడేది చిత్తభ్రాంతి మాత్రమే!" అనే విశ్వాసం సజ్జనులలో ఉంటోంది. వారిలో బాహ్యాలైన ఈ శబ్ద-స్పర్శ-రూపాది విషయాలు గాని, అభ్యంతరాలైన సంకల్పాలు-మనస్సు-ఇంద్రియార్థాలు గాని, వాటన్నిటి వల్ల జనించే అజ్ఞానం గాని చోటు పొందలేకయే పోతున్నాయి. 'రెండవ చంద్రుడు-మృగతృష్ణ-ఆకాశంలో కేశాలు'... వంటి జగత్ భ్రాంతిని స్ఫురింపజేసే వాసనావృత్తి వారి హృదయం నుండి తొలగి, దీపం వెలిగించిన తరువాతి చీకటిలాగా, ఎచటికో తొలగిపోతున్నది. వాసనావృత్తి హృదయంలో చోటు చేసుకొని ఉండటం చేతనే 'జగత్తు' అనబడే బహువిధ విషయ-విశేషముల సముదాయం ద్యోతకమౌతుంది. వాసనావృత్తి (లేక) దృశ్యవృత్తి నశించినప్పుడు అంతటా చిదాకాశమే ఉన్నట్లు అనుభవం కాగలదు. అయితే అట్టి వాసనాశూన్యావస్థ మనస్సు యొక్క 'అభావ స్థితి' యందు మాత్రమే (అమనస్క స్థితిలో మాత్రమే) సిద్ధించగలదు. వివేకి అయినవాడు అట్టి మనో అభావ స్థితిని ఎందుకు వదలుకోవాలి?

నాలుగవ అవస్థ - తురీయావస్థ -

శ్రీరాముడు : స్వామీ! మనస్సు యొక్క అభావ స్థితి (లేక) అమనస్క స్థితి అంటే ఏమిటి.

శ్రీ వసిష్ఠ మహర్షి : సామాన్యంగా జీవులందరికీ 1.జాగ్రదవస్థ, 2.స్వప్నావస్థ, 3.సుషుప్త్యావస్థ అనే మూడు అవస్థలే అనుభవమౌతున్నాయి. జనులందరూ ఈ మూడు అవస్థలను ఒకదాని తర్వాత మరొకదాన్ని ఆటవిడుపు లేకుండా అనుభవిస్తున్నారు కదా! వాస్తవానికి ఈ మూడు కాకుండా మరొక అవస్థ ఉన్నది. అది ఈ మూడు అవస్థలకు సంబంధించక, ఆ మూడిటిచే స్పర్శించబడక, ఆ మూడు సందర్భముల చేత అవిభాజ్యమై-అనిరోధకమై, అనుశ్రుతమై, అవిరామమై, అనునిత్యమై చెన్నొందుతోంది. ఆ అవస్థలకు శాస్త్రకారులు 'తురీయావస్థ' అని పేరు పెట్టారు.

ఉదాహరణకు... ఒకాయన ఇంట్లో ఉండటమో, వీధిలోకి వెళ్ళటమో, ఊరు వెళ్ళటమో జరిగిందనుకో. ఆయన ఇంట్లో ఉంటేనేమో 'ఇంట్లోని మనిషి' అంటాం. వీధిలోకి వెళ్ళినప్పుడు 'వీధిలోని మనిషి' అంటాం. ఊరు వెళ్ళినప్పుడు 'ఊరు వెళ్ళిన మనిషి' అంటాం. ఆ మూడు సందర్భాలలోను ఆయన ఒక్కడే-ఒకే రీతిగా ఉన్నాడు గాని మరొకటిగా అగుట లేదు కదా! ఆయన ఆయనగానే యథాతథంగా ఉన్నప్పటికీ, ఆయన గురించి చెప్పుకొనేవారి సౌలభ్యం కొరకై 'ఇంట్లోని ఆయన-వీధిలోని ఆయన-ఊరు వెళ్ళినాయన'... అనేవన్నీ వచ్చాయి. ఆయన వస్తు సంబంధంగా చూస్తే ఈ మూడిటికీ సంబంధించినవాడే కదా!

అట్లాగే తురీయావస్థ వాస్తవానికి ఒక అవస్థ కాదు. అది 'అవస్థాత్రయ సాక్షి' అని అనవచ్చు. అట్టి అవస్థాత్రయ సాక్షిత్వము సంపాదించుకొని ఉన్న వివేకియందు అజ్ఞానం నశించి ఉండటంచే వాస్తవానికి ఈ జగత్తును చూచుటయే లేదు. అయినా కూడా ప్రారబ్ధ విశేషం చేత అతడు ఈ జగత్తులో దేహాన్ని ధరించి కనబడుచున్నాడు. కాబట్టి, అతడు జగత్తును చూస్తూ ఉన్నట్లే అన్యులకు కనిపిస్తూ ఉంటుంది. అతని దృష్టి మాత్రం ఈ జాగ్రత్-స్వప్న-సుషుప్తులను అధిగమించినదై ఉంటోంది. ఆ వివేకి దృష్టి అవస్థాత్రయాన్ని తనలో కలుపుకొని ఉన్నట్టి అప్పటికీ శేషించి ఉన్నట్టి 'పరమావస్థ'ను దర్శిస్తూ ఉంటుంది.

శ్రీరాముడు : అనగా? వారు ప్రారబ్ధానంతరం ఈ దేహాదులు పొందరని అనుకోవచ్చా?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఈ దేహాలకు – ఆ వివేకులకు అనునిత్యంగా అనుభవమయ్యే తురీయావస్థకు సంబంధమే లేదు. అనగా వారి అసిధారావ్రతమైన తురీయానుభవం శరీరాలు వచ్చినప్పుడుగాని, లేక అవి తొలగుచున్నప్పుడు గాని ఆటవిడుపు పొందేది కాదు. వారి యొక్క వ్యుత్థాన కాలమందు సమాధి నుండి మరలుటలేదు. వారు ఈ జగత్తును ఘన పదార్థములుగా (భూమి మొదలైన వివిధ వికార రూపాలుగా) చూడరు. రత్నం యొక్క వివిధ కాంతిపుంజాలు వివిధమైన దిక్కులుగా ప్రసరిస్తూ ఉన్నప్పటికీ ఆ వేర్వేరు కాంతిపుంజాలు రత్నమునకు సంబంధించినవే కదా! అట్లాగే వారికి జగత్తులో కనిపించే భేదమంతా అభాసమాత్రంగా, పరమాత్మ యొక్క కిరణపుంజాలుగా కనిపిస్తుంది. వారికి ఈ జగత్తు జగత్తుగానే కనిపిస్తూనే, మరొక ప్రక్క ఇదంతా శూన్యమాత్రంగా సుస్పష్టమౌతూనే ఉంటుంది. స్వస్వరూపచమత్కారంగా అనుభవమౌతుంది.

న ఇహ సత్యాని భూతాని, న జగత్తా, న శూన్యతా,
ఇదం బ్రహ్మాఖ్యరత్నేశ ప్రభాజాలం విజృంభితమ్ ॥

వాస్తవానికి ఇక్కడ కనిపించే భూతజాలం (జీవులు, దేహములు మొదలైనవి) సత్యం కాదు. అట్లాగే జగత్తు కూడా! ఆ రీతిగానే 'శూన్యత్వము' అనునది కూడా! అవి లేవు. మరి 'ఉన్నట్లుగా కనిపిస్తున్నాయి కదా'... అని అంటావా? అవన్నీ కూడా సర్వ శక్తిమంతుడగు 'బ్రహ్మం' అనే రత్నం యొక్క కిరణ సమూహాల విలాసం మాత్రమే! జలం అనేక తరంగాలుగా కనిపిస్తున్నప్పటికీ అన్ని తరంగాలలోనూ కనిపించేది ఒకే జలమే కదా! అనేక బంగారు ఆభరణాలలో కనిపించేదంతా బంగారం ఒక్కటే కదా! అట్లాగే అనేకత్వము వాస్తవానికి లేదు కాబట్టి, ఇక సృష్టియే లేదు. సృష్టియే లేనప్పుడు నాశనరూపమగు ప్రళయం మాత్రం ఎక్కడున్నది? అదీ లేదు.

ఈ కనబడేదంతా స్వకీయకల్పనమే! -

శ్రీరాముడు : జగత్తులో కనిపించే సృష్టి-స్థితి-లయాలు, జన్మ-జీవన-మృత్యువుల మాటేమిటి?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఈ జీవుడు దేహం పొందవచ్చు. కోల్పోనూ వచ్చు. వాస్తవానికి ఈ జీవుడు స్వతఃసిద్ధమైన స్థితి దృష్ట్యా జన్మించటమూ లేదు, మరణించటమూ లేదు. ఇక ఇవన్నీ అంటావా? ఇవి 'కల్పన' అను చమత్కారము యొక్క విన్యాసము మాత్రమే!

అనగా, 'కల్పన'యే మూర్తివంతమై ఈ విధంగా జగత్తు రూపంగా భాసిస్తోంది. అంతేగాని ఇక్కడ మూర్తి వంతమైనదేదీ యథార్థానికి లేదు. నిరాకారమైన బంగారము రకరకాలైన ఆకారాలు ధరించి-గాజు-గొలుసు ఉంగరంగా కనిపిస్తోంది కదా! యథార్థానికి బంగారమునకు 'ఇది ఆకారం' అనునదేమున్నది? ఈ జగత్తులో కనిపించే మూర్తిత్వములన్నీ అట్టివే! ఎందుచేతనంటావా? ఈ జగత్తులో ఏఏ మూర్తిత్వములు (రూపాదులు) కనిపిస్తున్నాయో... అవన్నీ అట్లు ద్రష్ట యొక్క సంకల్ప ప్రభావం చేతనే కన్పిస్తున్నాయి. ఒకడు కళ్ళు మూసుకొని తన యొక్క మనోరాజ్యంలో అనేక వస్తువులు చూస్తున్నట్లే, కళ్ళు తెరచినప్పుడు కూడా మనోరాజ్య మాత్రంగా ఈ జగత్తును చూస్తున్నాడే గాని, యథాతథంగా చూచుటలేదని ఇక్కడ గమనించవలసిన విషయం సుమా! సంకల్పంలోనూ, స్వప్నంలోనూ కనిపించేవన్నీ నిరాకారమేనని అందరికీ తెలుసుకదా! ఈ జగత్తుగా దర్శించబడేది కూడా అట్టిదే! ఇట్టి శూన్యరూపమగు జగత్ స్థితియందు వివేకులకు రాగద్వేషాది భావాలు ఎట్లా కలుగుతాయి? ఎప్పుడో భవిష్యత్‌లో ఉండబోయే ఆకాశ వృక్షంపై ఏ పక్షి వ్రాలుతుంది? ఆకాశంలో వృక్షం ఎట్లా ఉంటుంది? అది ఎంత అర్థరహితమో... వివేకుల దృష్టిలో ఇక్కడ ఇష్ట-అయిష్ట విశేషాలు ఉండటం అంతటి అర్థరహితం.

ఇదంతా ఆత్మాంతర్గతం! - కాబట్టి రామచంద్రా! ఈ సమస్త జగత్తుకు గాని, ఇందలి ప్రాణులకు గాని వాస్తవానికి ఎట్టి మూర్తిత్వం లేదు. శూన్యత్వం లేదు. అందుచేత 'చిత్తం' అనునది కూడా ఎప్పుడో అస్తమించిన సూర్యుని రూపం వంటిదే! ఈ విధంగా ఎప్పుడైతే చిత్తం యొక్క రహితత్వాన్ని గమనించామో... ఇక ఆ పై శేషించేది సన్మాత్ర ఆత్మయే! అట్టి ఆత్మ 'అభావం' ఎన్నటికీ కాదు. భావాలన్నీ ఆ ఆత్మవే! అది భావనలకు ఆవల ఉండి ఆత్మభావనచే సులభ లభ్యమే అయి ఉన్నది.

తత్త్వవేత్తకు ఈ వివిధ రూపాలతో కూడిన జగత్తు ఈ వివిధరూపరహితమై, ఏకమగు ఆత్మగా మాత్రమే భాసిల్లుతోంది. సమస్తమగు అభరణములు ఏకమగు సువర్ణ పిండమున ఒదిగి ఉన్నట్లు... ఈ నానావిధ పదార్థములన్నీ ఏకమగు ఆత్మయందు అంతర్గతములై ఉన్నాయి. నిత్య సిద్ధమగు చిత్స్వభావమున 'స్థితి' కలిగి ఉన్న జ్ఞాని యొక్క దృష్టిలో ఈ అహంభావ సహిత జగత్తు, ఈ చిత్తం... ఇవన్నీ లయించిపోయినవై కనిపిస్తున్నాయి. అనగా, జగత్తు జగత్తుగా కాకుండా ఆత్మ గానే కనిపిస్తోంది. చిత్తం చిత్తంగా కాకుండా ఆత్మగానే తెలియవస్తోంది. ఈ జగత్తు-చిత్తం లయించి పోగా, అప్పుడు శేషించునట్టి 'చిదేకరసమును' వర్ణించి చెప్పటానికి అచిత్ స్వభావాశ్రయులకు కుదిరేది కాదు. జగత్ దృష్టి తొలగినపుడు మాత్రమే చిదేకరసానుభవుల దృష్టి అవగతమౌతుంది.

రామచంద్రా! ఇక్కడి ఉన్నత, అవనత విషయాల వైపుగా ఎవరి బుద్ధి పరుగులు తీస్తున్నదో... అట్టివారు పొందే క్లేశాలకు అంతూ పొంతూ ఉండటం లేదు. అందుచేత వారి బుద్ధికి సద్రూపమగు ఆత్మ భాసించటమే లేదు. వారికి అఖండ అప్రమేయ ఆత్మానుభవం ఎట్టిదో చెప్పినా, వారు గమనించ లేక పోతున్నారు. కాబట్టి కాస్త 'యుక్తి' (ఉపాయం) అభ్యసిస్తే సత్య పదార్థం తప్పక విదితమౌతుంది.

ఎవడైతే ఈ భూత-భవిష్యత్-వర్తమాన సర్వ పదార్థ రూపమగు ఈ జగత్తు యొక్క ఆవిర్భావాన్ని, దీని కార్యకారణత్వాదులను విమర్శించి చూస్తాడో... అట్టివాడు క్రమక్రమంగా ఈ

జగత్తులోని స్థూలత్వం నుండి సూక్ష్మత్వం వైపుగా పయనిస్తాడు. అనగా స్థూలంగా కనిపించేవన్నీ పదార్థాల వర్తమాన దశయేగాని, నిత్యమైన స్థితి కాదని గ్రహిస్తాడు. ఉష్ణభేదం చేత మంచు-జల-వాయు స్థితులు కనిపిస్తున్నాయి కదా! వాస్తవానికి ఈ జగత్తు యొక్క స్థూల-సూక్ష్మ స్థితులను అధిగమించి పరిశీలించినప్పుడు శేషించునది "సన్మాత్రం - అఖండబోధ రూపం" అగు ఆత్మయేనని గ్రహించబడగలదు.

అనగా, 'ఈ జీవుడు స్థూల విషయములైన దేహాదులు, తత్సంబంధమైన ఆయా విషయాలు కాదు. సూక్ష్మ భూతములైన 'భావన-మనస్సు-బుద్ధి-అహంకారం' మొదలైనవి కూడా కాదు. మరి? ఈతడు 'అఖండమగు బోధ స్వరూపుడే'... అని గ్రహించబడగలదు. అట్టి అద్వైత బ్రహ్మం నందు 'శాంతి'ని పొందినట్టి మనుజుని దృష్టియందు ఈ 'ప్రపంచం' అనేదేదీ లేనే లేదు. సద్గుణాలు గల సజ్జనునకు 'ఓర్పు-దయ-దాక్షిణ్యము' మొదలైనవి హృదయానికి హత్తుకుంటాయి చూచావా? అట్లాగే జగద్విషయముల పట్ల 'అపేక్ష'ను జయించిన జ్ఞానికి ఇప్పుడు మనం చెప్పుకునే 'జగత్తు వాస్తవానికి లేదు' అనే పాఠం అతిసులభంగా అనుభవైకవేద్యం అగుచున్నది.

❖❖❖

9. అనన్యం

శ్రీవసిష్ఠ మహర్షి :

పిండత్వం నాస్తి భూతానాం, శూన్యత్వంచాపి అసంభవాత్,
అతేవ మనో నాస్తి, శేషం 'సత్' తత్ అవస్థితిః ॥

ఓ రామచంద్రా! మట్టిబొమ్మలో ఆకారం కనిపిస్తున్నప్పటికీ మట్టికి వాస్తవానికి ఆకారం లేదు కదా! ఎందుకంటే మట్టి ముద్దతో ఏ ఆకారం తయారుచేస్తే అదే మట్టి యొక్క ఆకారంగా కనిపిస్తోంది! ఏ ఆకారమైనా తయారవటానికి సిద్ధమగుచుండగా ఇక మట్టికి 'ఇది దీని ఆకారం'... అని ఎట్లా కుదురుతుంది? అట్లాగే ఈ ప్రాణులకి మూర్తిత్వం (ఆకారాదులు) వాస్తవానికి లేదు. మరి వీరు శూన్యరూపులా? లేదు. శూన్యమైనట్టిది ప్రాప్తించటం ఎట్లా జరుగుతుంది? ఇక 'మనస్సు' అనేది కూడా ఎక్కడా లేదు. ఈ మూర్తి-శూన్య-అమూర్తి రూపములగు కల్పనలను వదిలివేస్తే అప్పుడు శేషించేదే 'సన్మాత్రము' అని, 'ఆత్మ' అని చెప్పబడుచున్నది. అదియే నీ యొక్క, నా యొక్క ప్రతి ప్రాణి యొక్క వాస్తవ స్థితి.

సంసారము... అనగా! -

శ్రీరాముడు : ఈ జీవుడు-జగత్తులు మొదలైనవన్నీ (మీరు చెప్పినట్లుగా)... లేనప్పుడు మరి 'సంసారము' అని దేనిని పిలుస్తున్నాం?

శ్రీవసిష్ఠ మహర్షి : 'కేవల సాక్షి చైతన్యం' అగు ప్రత్యగాత్మ ఒకానొకప్పుడు 'స్వస్వరూపానుభవ మాత్ర స్థితి' నుండి విషయముల వైపుకు ఉన్ముఖమౌతుంది. అట్టి ఉన్ముఖత్వమే సంసారము. కేవల

జ్ఞాన స్వరూపం సంసార జ్ఞానంగా ఉదయించుటయే 'సంసారం' అను అనర్థమునకు కారణం. అట్లు ఉదయించకుండుటయే 'శ్రేయము' కొరకు అయి ఉన్నది.

శీతలత్వంచే జలం ఘనీభవించి పొడవు-వెడల్పు మొదలైన ఆకారాలు కలిగిన మంచుగడ్డగా అగుచున్నది చూచావా! కేవల శుద్ధ జ్ఞానంలో ఉదయించిన సంసార జ్ఞానమే ఒకానొక సమయంలో బాహ్యత్వం పొంది మూర్తిత్వంగా ప్రాప్తించుచున్నది. ఈ జీవుడు సర్వదా ఆత్మ స్వరూపుడే! అయితే చిద్రూపమగు ఆత్మయే తన స్వరూపమును గూర్చిన 'అజ్ఞానం' చేత మూర్తిత్వమును గ్రహిస్తోంది.

ఒకడు అదమరచి నిదరపోయి, ఆ నిదురలో పొందిన స్వప్నంలో కనిపించిన ఆయా రూపాలన్నీ తనకు భిన్నములైనవని భ్రమిస్తూ ఉంటాడు చూచావా? అట్లాగే చిద్రూపమగు ఆత్మయే తన శుద్ధ జ్ఞానత్వమును ఏమఱచి పదార్థముల వలె మూర్తిత్వం తనకు అన్యంగా గ్రహిస్తోంది. అట్లా గ్రహించిన కారణంగా చిత్తత్వమును ధరిస్తోంది. అట్టి చిత్తం చేతనే ఈ దేహమును ధరిస్తోంది. అట్టి దేహం ద్వారా తదితరమైనట్లుగా శబ్ద-స్పర్శ-రూప-రసాదుల రూపంతో కూడిన 'జగత్తు' అనబడు దానిని కూడా ధారణ చేస్తోంది. అట్టి జగత్తులో అనేక ఆశాపాశములు కల్పించుకొని అనేక ఉపాధులు పొందటం, కోల్పోవటం కాలానుగతంగా చేస్తోంది.

ఏతావతీషు అవస్థాసు బోధస్యోదేతి నాన్యతా,

శబ్ద కల్పనయా భేదః కేవలం పరికల్పితః ॥

అయితే... ఆయా సర్వ అవస్థలలోనూ చైతన్యం చైతన్యంగానే ఉంటోంది గాని అన్యమైనదిగా (మూర్తిత్వం-చిత్తత్వం-దేహత్వం-విషయత్వం-జగదత్వం మొదలైనవిగా) తాను అవటమే లేదు. జలంగా, తరంగాలుగా, సుడులుగా, బుడగలుగా, బుడగరూపవృత్తంగా అగుచున్నప్పుడు జలం తన జలత్వం పోగొట్టుకొంటోందా? లేదే! మరి ఈ భేదమంతా ఏమిటంటావా? కేవలం శబ్దమాత్ర వ్యవహారంచే ఆయా భేదమంతా కల్పన చేయబడుతోంది. స్వప్న దర్శన సమయంలో మనస్సే బాహ్య-అభ్యంతర విషయరూపమున వికృతినొందుతూ భాసిస్తోంది కదా! అయితే స్వప్నద్రష్ట సర్వదా యథాతథంగానే ఉంటున్నాడు కదా! ఉంటున్నాడు కాబట్టే స్వప్న సంఘటనానంతరం మరల జాగ్రత్తులోకి వస్తున్నాడు. అట్లాగే 'ఆత్మ ఆయా విశేషములన్నీ పొందుచున్నప్పటికీ, తాను యథాతథంగానే ఉంటోంది'... అనునదే జ్ఞాన-విజ్ఞాన సారం.

బోధరూపమగు ఆత్మయందు ఎట్టి మూర్తిత్వ-చిత్తత్వ-దేహత్వాది వికారములు ఏర్పడటానికి అవకాశమే లేదు. ఆకారం లేని జలం ఒకప్పుడు తరంగాకారంగా కనిపిస్తున్నట్లు అమూర్త రూపమైన ఆత్మ ఒకప్పుడు చిత్తాకారంగా అగుపిస్తోంది. చిదాత్మ ఆకాశం వలె, కాలం వలె ఎల్లప్పుడు అవికృత రూపంగానే ఉంటోంది. స్వప్న పదార్థాలన్నీ స్వప్నద్రష్ట ఊహారూపాలే అయి ఉన్నట్లు, సమస్త పదార్థాలు చిదాకాశరూపమే అయి ఉన్నాయి. కానీ చిదాకాశం పదార్థ రూపాలుగా అవటం లేదు.

ఈ చిత్తం... చిదాకాశమే! అయితే చిదాకాశం చిత్తంగా అవటం లేదు. ఆభరణం... బంగారమే! అయితే బంగారం బంగారంగానే ఉన్నది గాని, 'ఆభరణం' అవటం లేదు. మట్టి బొమ్మలో బొమ్మగా అయినది మట్టియే! అయితే, మట్టి బొమ్మగా అవుతోందా? అవటం లేదు కదా!

శ్రీరాముడు : మహర్షీ! చైతన్యము ఎన్నటికీ జడపదార్థంగా (అట్లాగే, జీవుడు మొదలైనవిగా) అగుటకు అవకాశం లేదనునది యుక్తియుక్తమేనని అనుకుందాం. అయితే జడపదార్థం (అట్లాగే జీవుడు మొదలైనవి) చైతన్యముగా ఎప్పటికైనా కాకూడదా?

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! బాహ్య జడ పదార్థం తత్త్వబోధవశంగా కూడా అభ్యంతర చిదాకాశ రూపం పొందజాలదు! ఎందుకంటావా? ఈ జడ పదార్థం 'అత్యంత అసదృశం'. "తరంగం తన ఆకారం కోల్పోయి ఎప్పటికైనా జలంగా కాకూడదా?" అనే వాక్యం ఎట్టిదో అదీ అట్టిదే! జలానికి కనబడిన తరంగాకారం అసదృశమే కాని, ఆపాదితమే కాని - వాస్తవం కాదు కదా!

ఇక ఈ దృశ్య వ్యవహారానికి వస్తే, చిదాత్మయే వివర్త భావం చేత ఈ దృశ్య జడ స్థితిని పొందుతోంది. పరమార్థమున చైతన్యం జడ భావం పొందుటయే లేదని గ్రహించు. కదిలించేది చైతన్యం, కదిలేది జడం కదా! 'కదిలించేది' కదిలేదిగా అవుతోందా? లేదు. కదిలించే చైతన్యం సర్వ అవస్థలయందునూ తన స్వస్వరూపాన్నే యథాతథంగా ఎప్పటియట్లే స్థితినొంది ఉన్నదే గాని లేశంగా కూడా అది అన్య రూపత్వం పొందడం లేదు. ఒకని బుద్ధి సప్తమభూమిక వరకు పరిణామం పొందినదై, అచ్చట అత్యంత శుద్ధబోధైక రూపమగు ఆత్మ భావనలో ఉదయిస్తోంది. అట్టి అఖండ మగు ఆత్మత్వం ఉదయించగానే బోధ-అబోధ ఇటువంటి శబ్దాల పాత్ర కూడా అస్తమించిపోతోంది.

ఓ రాఘవా! ఈ చిత్తం యొక్క దృఢ భావనచేతనే సూక్ష్మ శరీరాలకు ఈ స్థూలమైనట్టి ఆధిభౌతిక రూపం ఉదయించటం జరుగుతోంది. ఒక నటుడు నాటకంలో పిశాచ వేషం ధరిస్తాడు చూచావా? అట్లాగే ఆకాశం వలె నిర్మలమైనట్టి సూక్ష్మ చిత్తం ఈ 'మిథ్య' అయినట్టి ఆధిభౌతిక రూపం ధరిస్తోంది.

ఈ చిత్తం తన యొక్క అన్యమనన స్వభావం కారణంగా ఈ దేహ-జగత్ రూపాలన్నీ భ్రమచే పొందుతోంది. 'నేను పిచ్చివాడను కాదు. అందరిలాగానే మంచి బుద్ధి కలవాడనే'... అనే మననముచే 'ఉన్మత్తత' శమిస్తుంది చూచావా? అట్లాగే, భ్రమ రహితమగు సత్య వస్తువును గురించిన అభ్యాసం చేత ఈ దేహ-జగత్ రూపమగు భ్రాంతి తప్పక శమించగలదయ్యా!

"నేను మనో స్వరూపడను గాను, ఆత్మ స్వరూపుడను (ఆత్మయే స్వరూపంగా కలవాడను) ఈ దేహము-పంచేంద్రియాలకు విషయాలయ్యే జగత్తు... ఇవన్నీ కూడా నా యొక్క క్రీడాకల్పనచే ప్రాప్తించేవి మాత్రమే."

అని మననం, మరియు 'జ్ఞానం'చే లేక 'బుద్ధి'చే వాసన ప్రశమనం పొందగలదు. ఏది ఎంతవరకు భ్రాంతియో గ్రహించటం చేత 'జగత్తు సత్యం' అనే వాసన వివర్తిస్తుంది. ఎట్లా అంటే స్వప్నం స్వప్నరూపంగా ఎఱుగబడిన తర్వాత ఇక ఆ స్వప్నంలో కనిపించే వస్తువులు-విషయములు-స్వప్న జీవులు సత్యమేనని ఎవరూ నమ్మి ఉండరు కదా! వాసన శమించటం చేత సంసారము శమించుచున్నది. వాసనయే మహాపిశాచి సుమా! అందుకే వివేకులైన వారు ఈ వాసనను, (లేక, దృశ్యము పట్ల ఏర్పడిన సత్యత్వ బుద్ధిని) ఛేదించివేయుటయందు తత్పరులై ఉంటారు.

ఏ విధంగా అజ్ఞానం యొక్క అభ్యాసం చేత అజ్ఞానరూపమగు 'భావనా ఉన్మత్తత, పుట్టు కొస్తోందో... ఆ విధంగానే జ్ఞానం యొక్క అభ్యాసం చేత కాలక్రమంగా ఆ ఉన్మత్తత శమించి పోతోంది. భావన చేతనే ఈ స్థూల-సూక్ష్మ శరీరాలన్నీ మరలమరల ప్రవర్తిస్తున్నాయి. ఈ స్థూల శరీరం భ్రాంతి మాత్రమే. "ఇది ఉన్నా, ఊడినా, మరల వచ్చిపడినా, నేను మాత్రం యథాతథ స్వరూపుడనై ఉంటాను" అనే అభ్యాసం చేత ఈ స్థూలశరీర భావన సూక్ష్మశరీర భావనతో లయమై పోతోంది. ఆ సూక్ష్మ శరీర భావనయో (అతివాహక శరీర భావనయో)... 'బ్రహ్మ మాత్రత్వం'గా రూపుదిద్దుకొంటోంది. 'నేను స్థూల శరీరుడనై జీవిస్తున్నాను' – అను స్థితి నుండి వివేకి క్రమంగా "నా యొక్క జీవనం సూక్ష్మ దేహంగాని, ఈ స్థూల దేహంగా కానీ కాదు" అను జ్ఞానమును సుస్థిరీకరించుకుంటూ వస్తున్నాడు.

ఈ విధంగా దృఢమైన జ్ఞానాభ్యాసం చేత ఆ సూక్ష్మ దేహపదమునకు కూడా బ్రహ్మత్వము పొందింపజేయాలి. "నా యందు ఉత్పన్నమైన పదార్థములు నా రూపాలే అవుతాయి కదా! అట్లాగే సమస్త పదార్థముల ఉత్పత్తి స్థానం పరమాత్మయే కాబట్టి ఇవన్నీ పరమాత్మ స్వరూపములే" అనే ఉద్బోధ (లేక) భావన (లేక) జ్ఞానము ఎప్పుడైతే కలుగుతుందో, అప్పుడు 'సూక్ష్మ దేహం అనేది మాత్రం ఎక్కడున్నది? అది కూడా స్థూల దేహంలాగే మిథ్యయే'... అనే నిశ్చయం కలుగుతుంది. అటువంటి నిశ్చయం కలగడానికి ఉద్దేశించకుండా, ఊరకే 'హూం హూం' వంటి ఎన్ని శబ్దాలు ఉచ్చరిస్తే మాత్రం ఏం ప్రయోజనం? సంసార గ్రంథి నివర్తమౌతుందా? లేదు.

మొట్టమొదట ఈ జగుత్తు తత్కారణమైన 'ఈశ్వరుడు' ఈ ఇరువురి ఏకత్వము గ్రహించాలి. అది 'తత్' పదార్థ శోధనం ద్వారా ఎఱుగబడగలదు. ఆ తర్వాత 'త్వం' పదార్థ శోధనం ద్వారా "ఈ ప్రత్యగాత్మ వాస్తవానికి అసంగుడు. పరమాత్మ కంటే ద్వితీయుడైన వాడు కాదు (అద్వితీయుడు)"... అని ఎఱుగబడుతోంది. ఈ విధంగా తన యొక్క 'భావన+బుద్ధి' కూడా క్రమక్రమంగా 'తత్త్వ స్వరూప-ఐక్యరూపమగు అఖండాకార వృత్తి' అనదగు ఆత్మ రూపంగా పరిణమించాలి. అటువంటి అఖండాకార వృత్తి యందు ప్రత్యగాత్మ లయించినదై అట్టి ఆత్మకు అన్యమైనదేదీ ఎఱుగనంతటి అఖండ బోధ జనించుగాక! ఎంత వరకు అట్టి అఖండ బోధ జనించదో... అంత వరకు శ్రుతులు చూపించిన మార్గంగా 'తత్-త్వమ్' పదార్థ ద్వయ శోధన ద్వారా దృఢ జ్ఞానాన్ని సంపాదించు కుంటూనే ఉండాలి. బాహ్య-అభ్యంతరాలలో చోటు చేసుకొని ఉన్న ఈ 'చిత్తం' పూర్తిగా ఎప్పుడైతే శమిస్తుందో, అప్పుడు అది తన సాక్షి రూపమగు 'చిత్స్వరూపం'గా ప్రకాశిస్తుంది. 'ఆకాశం వలె నిర్మలం-శీతలం' అయినట్టి అట్టి తన చిత్స్వభావమును ఆశ్రయించి ఈ మనుజుడు శాంత స్వరూపుడై అప్పుడు ఉండగలడు.

జ్ఞానవాన్ జ్ఞానయజ్ఞస్థో ధ్యానరూపం విరోపయన్ ।
జగత్ విజిత్య జయతి, సర్వత్యాగైక దక్షిణః ॥

జ్ఞాని అయినవాడు 'జ్ఞానము' అనే మహా యజ్ఞమునందు సర్వదా నెలకొని ఉంటాడు. ఆ జ్ఞాన యజ్ఞశాలలో 'ధ్యానము' అనే దృఢమైన, ఉన్నతమైన 'యజ్ఞ స్తంభము'ను నాటుకుంటాడు.

అట్లా జ్ఞానయజ్ఞతత్పరుడై 'చిత్స్వభావము' అను అధిదేవతకు 'సర్వ త్యాగము' అనే ముఖ్య దక్షిణను ఇచ్చివేసినవాడై ఈ విశ్వమును మొదలంట జయించివేయటమే నిజమైన 'విశ్వజిత్ యాగం'. అట్టి విశ్వమునకు సాక్షియై, సర్వోత్కృష్టుడై, మాటలకు అందనివాడై ఉంటాడు. అతడు ఆత్మయందు ఏకరూపుడై ప్రకాశిస్తూ ఉంటాడు. ఇక ఆపై, అగ్ని వర్షం కురిసినప్పటికీ, ప్రళయ వాయువు వీచి నప్పటికీ, ఈ భూతలం గాలికి ఎగిరిన కాగితపు ముక్కలాగా ఎటో ఆకాశంలోకి వెళ్ళిపోవుచున్న ప్పటికీ, ఏది ఏమైనప్పటికీ అతడు సర్వదా ఆత్మయందు ఏకరూపుడుగానే ఉంటాడు. అట్టి అనుక్షణిక అఖండాత్మానుభవమే వజ్రతుల్యమగు 'దృక్‌స్థితి' అనికూడా పిలువబడుతోంది. అయితే...

1. తృష్ణా రాహిత్యముచే శాంతి పొందిన మనస్సు గలవాడు, 2. ఇంద్రియ విషయాలన్నిటి పట్ల నిరోధ దశను సంపాదించుకున్నవాడు... ఈ రెండూ సంపాదించుకున్నట్టి మనుజునికి మాత్రమే అట్టి అకృత్రిమ సమాధియందలి వజ్రతుల్యమగు 'దృక్‌స్థితి' లభిస్తుంది.

మనో శమము -

శ్రీరాముడు : మహాత్మా! ఈ మనస్సు పూర్ణంగా శాంతించటానికి (శమించటానికి) సులభోపాయం ఏమిటి?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఈ మనస్సు శాస్త్రములు ప్రతిపాదించిన అభ్యాస క్రమాలచే, ఉపదేశాలచే, ఇంద్రియ దమంచే శమించగలదు. అయితే, 'బాహ్య పదార్థములన్నిటి పట్ల తృష్ణారాహిత్యం' అనే అభ్యాసంచే శమించినంత సులభంగా మరే విధంగానూ ఈ మనస్సు శమించదు. జీవుడెందుకో 'సంపత్తి పొందాలి' అను భావనకు లోను అవుచున్నాడు. అక్కడి నుండి తృష్ణ-అజ్ఞానాలు మహా వాయు వీచికల వలె బయల్వెడలుచున్నాయి. కాబట్టి 'సంపత్తి అంతా మహా అపత్తియే' అను భావనను, 'ఇవన్నీ నావి కానే కావు' అను ప్రజ్ఞచే సునిశ్చితం చేసుకోవాలి. ఏదేది 'నాది కాదు' అని గ్రహిస్తామో, అది త్యజించబడినదే అవుతుంది. ఆ విధంగా సర్వత్యాగం, తృష్ణారాహిత్యం అభ్యసిస్తూ చరమ సాక్షాత్కారమైన ఆత్మతత్త్వాన్ని హృదయంలో వెలిగించాలి. అట్టి జ్ఞానదీపంచే అజ్ఞానాంధ కారం, అద్దాని అలవాలమైన అహంకార-మమకార పిశాచాలు, ఆకారాదుల పట్ల ఏర్పడి ఉన్న ఆకర్షణ... ఇవన్నీ వాటంతట అవే తొలగుతాయి. ఆపై 'ఈ సమస్తం చిదాత్మయే. నా ఆత్మయే తన అఖండ స్వభావం చేత ఈ సర్వంగా ప్రకాశిస్తోంది' అను అవగాహన సుస్పష్టమవగలదు.

చైతన్యం సర్వదా యథాతథం - ఓ రామచంద్రా! పొగ ఆకాశంలో ప్రవేశించి అనేక ఆకారా లుగా కనిపిస్తుంది చూచావా? అట్లాగే, ఈ కనబడే మనుష్య-నాగ-అసురాది స్థానములు, పర్వత-గుహాది పదార్థములు ఇవన్నీ కూడా చైతన్యమే ఆయా వివిధ వైచిత్ర్యములుగా అగుచున్నదనీ, (కానీ) యథార్థానికి (పొగలాగానే) చైతన్యము సర్వదా యథాతథంగానే ఉన్నదనీ-భావన చేయి. రసరూపమగు వర్షజలం జడమగు భూమియందు ప్రవేశించి రసస్వరూపములగు ఈ వృక్ష-పుష్ప-ఫలాదులుగా అగుచున్నదే! అట్లాగే చైతన్యము బ్రహ్మాండమున ప్రవేశించి తన యొక్క ప్రాణ శక్తిచే ఆత్మ యొక్క వివర్త రూపములైన ఈ ప్రాణికోట్ల శరీరములందు చలించుచున్నది. జలంలో సంచరించే చేప ఒక రోజు వలలో చిక్కుకొని ఎటూ వెళ్ళలేక తిప్పలుపడుచున్నట్లుగా, 'చిదాకాశము'

అను దానిలో విహరించవలసిన ఈ జీవుడు 'దేహ స్వభావము' అనే మోహజాలంలో చిక్కుకొని ఆయా అగచాట్లన్నీ పడుచున్నాడు. తన ఆత్మ స్వరూపాన్ని (ఆత్మ స్థితిని) స్మరించక దృశ్యవస్తు సముదాయాన్ని స్మరిస్తూ 'తృష్ణ' అనే ఎఱ తగిలించబడిన గాలంలో చిక్కుకొని విలవిల్లాడుచున్నాడు.

ఓ రామచంద్రా! నిర్మల చైతన్యమే 'నిజ స్వరూపం' అనే ప్రాంగణంలో స్వర్గ-మర్త్య-పాతాళాలలోని అనేక పదార్థముల రూపంగా స్ఫురిస్తోందయ్యా! ఈ జీవులలో కనిపించే తేడా అంతా వాసనల యొక్క అల్ప-ఆధిక్యతలు మాత్రమే!

సర్వ ఏవ సమా జీవా వాసనాం అన్తరేణచ
శుష్క పర్ణవత్ ఉడ్డీనా జడాః శ్వసన వేణవః ॥

వాసనల యొక్క అల్ప-ఆధిక్యతలు తప్పిస్తే ఈ జీవులందరూ సమానులే! అందరూ కూడా చైతన్య స్వరూపులే! వాసనల వల్లనే వారు ఎండుటాకులవలె ఎగిరి స్వర్గ-భూ-పాతాళములలో పడుచున్నారు. ప్రాణవాయువు సహాయంతో ఆయా శబ్దములు పలుకుచున్నారు.

అందుచేత రామచంద్రా! మొట్టమొదట ఈ జీవుడు పురుషప్రయత్నం చేత సాధనా చతుష్టయ సంపత్తిని సముపార్జించుకోవాలి. ఆ తర్వాత అతని ఆత్మధ్యానమునకు విఘ్నము కలిగిస్తున్న దృశ్య ప్రకంపనములను ప్రాణయామాదుల అభ్యాసంచే జయించాలి. సమాధిచే బహిర్దృష్టిని విడనాడి నిర్వికల్ప సమాధియందు ప్రవేశించాలి. అట్లు ప్రవేశించటం ద్వారా పూర్వం సంపాదించుకొని ఉన్న వాసనా సమూహమును పారద్రోలాలి. ఈ సంసారపాశము అనే ఘనమైన పంజరమును విరగగొట్టాలి. అప్పుడాతడు పూర్ణానందైకరసమగు బ్రహ్మముగా ఉదయించగలడు. అటుపై ఇక అజ్ఞానము యొక్క ఛాయ కూడా ఉండదు. దీపం వెలిగిన తర్వాత చీకటి ఇంకా ఉంటుందా?

❖❖❖

10. వాసనలు - తరగతులు

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఈ కనబడే 10 దిక్కులలోనూ ఉన్న 'మనుజ-నాగ-దేవ-గంధర్వ'... ఆదిగా గల పేర్లతో కనబడే ఈ జీవసమూహాలన్నీకూడా వాసనా భేదం చేతనే వేర్వేరుగా ఉన్నాయి. వాసనలను ప్రక్కన పెట్టి చూచామా... వాటిలో ఎటువంటి తేడా లేదు. ఈ వాసనా వైచిత్ర్యమంతా 7 రకాలుగా విభజించి చెప్పబడింది.

వాసనావస్థలు - 1. స్వప్న జాగ్రదవస్థ, 2. సంకల్ప జాగ్రదవస్థ, 3. కేవల జాగ్రత్తు అవస్థ, 4. చిర జాగ్రత్తు అవస్థ, 5. ఘన జాగ్రదవస్థ, 6. జాగ్రత్ స్వప్నావస్థ, 7. క్షీణ జాగ్రదవస్థ

సముద్రంలో అనేక ఆకారాలు గల తరంగాలు ఉన్నట్లుగా, ఈ సప్తవిధ జీవులు చిదాకాశంలో ఉన్నారు.

శ్రీరాముడు : మీరు చెప్పిన 7 విధములైన వివిధ వాసనామయ జీవుల గురించి మరికొన్ని వివరణలు ప్రస్తావించ ప్రార్థన.

శ్రీ వసిష్ఠ మహర్షి : సరే వివరిస్తాను, విను.

1. స్వప్న జాగ్రత్తు జీవులు -

కస్మింశ్చిత్ ప్రాక్తనే కల్పే, కస్మింశ్చిత్ జగతి క్వచిత్ ।
కేచిత్ సుప్తాః స్థితా దేహైః జీవా జీవిత ధర్మిణః ।
యే స్వప్నమ్ అభిపశ్యన్తి తేషాం స్వప్నమిదం జగత్ ।
విద్ధి తే హి ఖలూచ్యన్తే జీవకాః స్వప్నజాగరాః ॥

ఓ రామచంద్రా! ఒకానొక పూర్వ కల్పమునందు... ఒకానొక జగత్తులో, ఒకానొక చోట, దేహమును ధరించి జీవించుచున్న ... ఏ కొందరో జీవులు నిద్రించుచూ... ఏ స్వప్నమును గాంచుచున్నారో... ఆ వారి యొక్క స్వప్నమే, ఈ జగత్తు అయి ఉన్నది!

ఆ స్వప్నమును గాంచుచున్న జీవులు 'స్వప్న జాగరులు' అని చెప్పబడుచున్నారు! ఆ ఒకానొక జగత్తునందు నిద్రించుచున్న జీవులకు స్వయంగా ఆవిర్భవించిన 'స్వప్న ప్రపంచం'లో మనం ప్రవేశించాం. ఎందుచేతనంటే, మనం కూడా సమాన కర్మ-వాసనాదులు కలిగి ఉండటం చేత మనం ఆ స్వప్నంలో ఉంటున్నాం. అతని స్వప్నంలోని విషయాలే మన యొక్క స్వప్న వశం చేత మనకు కూడా (అవి) విషయాలుగా అగుచున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే మనందరం అతని స్వప్నంలో మనుజులమే అవుతాం. చిరకాలత్వం కారణంగా వారి స్వప్నం ఈ విధంగా జాగ్రత్ రూపం పొందింది. కాబట్టి అట్టి అవస్థయందున్న ఆ జీవులు 'స్వప్న జాగరులు'గా పిలువబడుచున్నారు. 'జీవనోటోపాఖ్యానం'లో ఈ విషయం గమనించాం.

ఈశ్వరుడు సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, సర్వవ్యాపి, సర్వసత్తాప్రదుడు కదా! ఆ స్వప్న జాగరుడు ఈశ్వర స్వరూపుడే అయి ఉండటం చేత సర్వత్రా సర్వం సంభవిస్తోంది. ఈ విధంగా స్వప్నయుతులైన ఆ జనులకు మనమందరం స్వప్న మనుజులమై ఉన్నాం. అనగా ఆ స్వప్న జాగరుల స్వప్న సదృశ్య ఊహాస్వరూపమే మన ఈ జాగ్రత్ అవస్థ.

శ్రీరాముడు : మునీంద్రా! పూర్వపు ఏ కల్పమునందో ఆ స్వప్న జాగరులు స్వప్నం గాంచారని కదా, మీరు అంటున్నది?

శ్రీ వసిష్ఠ మహర్షి : అవును.

శ్రీరాముడు : ఆ స్వప్న జాగరుల పూర్వకాలిక స్వప్నమందలి సమస్త పదార్థాలు, దేహాలు నేటికి క్షయించిపోయి ఉండాలి కదా! ఇప్పుడు ఆ స్వప్నం నుండి మేల్కాంచిన ఆ జీవులకు మరల గడిచిపోయిన ఆ స్వప్న జగత్ కల్పంలో స్థితి ఎట్లా సంభవిస్తోంది? వారి గడచిపోయిన స్వప్నం మనకు ఎలా ప్రాప్తిస్తోంది?

శ్రీ వసిష్ఠ మహర్షి : రామచంద్రా! ఆ స్వప్నజాగ్రతులు తదనంతర దశలను పొందుతూ ఉంటారు.

1. ఆ స్వప్న జాగరులు మన ఈ ప్రపంచరూపమగు వారి స్వప్నమైన దైవయోగం చేత తత్త్వ జ్ఞానం పొందారనుకో. అప్పుడు వారి స్వప్నభ్రమ రూపమగు సంసారం నుండి విముక్తి పొందుతారు.

(లేదా) 2. అట్లా తమ (స్వప్న సదృశ) సంసారమునుండి విముక్తి పొందకుండానే నిద్రలేచారనుకో... అప్పుడో? అప్పుడు మరల సంకల్పానుసారంగా అన్య దేహాలను ఆశ్రయించి వ్యవహరిస్తూ ఉంటారు.

దృష్టి ఉన్నంత వరకు సృష్టి ఉంటూనే ఉంటుంది. కనుక దృష్టియే సృష్టి. దృష్టి కొనసాగటం అవుతుంది. అందుచేత ఒక విధంగా చూస్తే వారి స్వప్న జగత్తు కొనసాగుతున్నట్లే! వారు ఇతః పూర్వము వలెనే అన్యములైన కల్పిత జగత్తును, కల్పమును గాంచుచూనే ఉంటారు. ఆ కల్పనలకు అంతు ఎక్కడ? ఆత్మజ్ఞానమే ఆ అంతు. చిదాకాశము అనంతం కనుక, వారి కల్పనలకు, వారివారి స్వప్నాంతర్గత విశేషములకు చోటు లేకపోయే ప్రసక్తి ఉండదు. ఆ స్వప్న జాగరులు 'సంకల్పాత్మక మైన జగత్తులు' అనే మేడి పండ్లలోని కీటకముల వంటివారు.'

2. సంకల్ప జాగరులు – ఈ సంకల్ప జాగరుల గురించి ఐందవోపాఖ్యానంలో చెప్పుకున్నాం. వీరు ఒకానొక పూర్వ కల్పమున ఒకానొకచోట (ఐందవుల వలె) నిద్ర మేల్కొని ఉన్నారు. అయితే, అంతరంగమున సంకల్ప పరంపరలందు తత్పరులై ఉన్నారు. నిద్ర లేచి ఆలోచనలలోపడుచున్న మనిషితో వీరిని పోల్చవచ్చు. వీరు ధ్యానము నుండి చలింపబడినవారై జీవటోపాఖ్యానంలోని జీవటునివలె మనోరాజ్యంలో ప్రవేశించి ఉన్నవారు. సంకల్పము యొక్క దృఢత్వం చేత తమ సంకల్పములకు ముందే ఉన్న స్థితి యొక్క సంధానము కోల్పోయినవారై ఉంటున్నారు.

అనగా... వీరిలో 3 లక్షణాలు మనకు కనిపిస్తాయి.

1. ఈ సంకల్ప జాగరుల సంకల్పము చిరకాలం స్థిరంగా ఉండటం చేత ఆ సంకల్ప వ్యవహారం ఘనీభూతమై జాగ్రద్రూపంగా అగుచుండటం.

2. అట్టి సాంకల్పికమైన పదార్థములందే లయించిన మనశ్చేష్ఠ గలవారై పూర్వ-పర స్థితులు లేకయే ఉంటున్నారు.

3. ఆ సంకల్పము ఎప్పటికో శమిస్తుంది. అప్పుడు మరల అదే సంకల్ప కథనాన్ని గాని, (లేక) మరొక సంకల్పమునుగాని వారు ఆశ్రయిస్తూ ఉంటారు.

వారి సంకల్పమయ దేహంలో మనమందరం సంకల్పరూపులమై ఉన్నాం. వారి సంకల్పంలో మనం, తదితర జీవులు లోకములు ఉన్నాయి కదా! కనుక వారి దృష్టియందు ఈ సర్వము సంకల్ప జాగరరూపములు మాత్రమే! వారికి మనమంతా వారి ఊహలుగా అనిపిస్తూ ఉంటుంది.

3. కేవల జాగరులు – వీరు దామ-వ్యాళ-కటుల వంటివారు. వీరికి పూర్వపు-ఉత్పత్తి-వికాసము మొదలైన స్వప్న సదృశ విషయాలు ఉండవు. వీరు వర్ధమానశీలమగు బ్రహ్మము నుండి మొట్టమొదటిగా శరీరము ధరించినవారు. అందుచేత వీరిని 'కేవల జాగరులు' అని పిలుస్తారు.

4. చిర జాగరులు – కేవల జాగరులు ఇప్పుడే జన్మకు ఉపక్రమించారు కదా! వారే మరల తర్వాత తర్వాత జన్మలు పొందినవారై... కార్యములగు జాగ్రత్, స్వప్నాలలో; కారణములగు సుషుప్తి యందును... సంచరిస్తూ ఉంటారు. అట్లా సంచరిస్తూ ప్రౌఢత్వం చెందటం చేత వారిని 'చిర జాగరులు' అంటారు.

5. ఘన జాగరులు – ఆ చిరజాగరులలో కొందరు దుష్కర్మ వశం చేత జడ-స్థావర తుల్యమైన అజ్ఞాన దశకు పరిణమిస్తూ ఉంటారు. అట్టి ఘనీభూత జాగ్రత్ స్థితిని పొందటం చేత వారిని 'ఘన జాగరులు' అంటారు.

పైన చెప్పిన 5 విధములగు జీవులు 'బద్ధజీవులు' సుమా! ఇక ముక్తి వైపు ప్రయాణిస్తున్న తదితర 2 రకాల జీవుల గురించి విను.

6. జాగ్రత్ స్వప్నులు – పై 5గురిలోని ఏ ఒక్క జీవుడైనా శాస్త్ర అభ్యాసం చేత, సత్సంగత్యం చేత బోధితుడైనాడనుకో, అప్పుడు అతనికి జ్ఞానప్రాప్తి లభిస్తుంది. అట్టి వారికి ఈ జాగ్రత్ అంతా స్వప్నతుల్యంగా కనిపిస్తుంది. దీనినే పంచమ భూమిక లేక 'జ్ఞానారంభ భూమిక' అని కూడా అంటూ ఉంటారు.

7. క్షీణ జాగరులు – వీరు జాగ్రత్ స్వప్నదశ నుండి సాధనను కొనసాగిస్తూ క్రమంగా పరిపూర్ణ జ్ఞానము పొందినవారు అగుచున్నారు. పరమ పదమున విశ్రాంతి పొందుచున్నవారు, సమస్త భూమికయందు ఆరూఢులైనవారు అగుచున్నారు.

సంకల్పములకు మునుముందే స్వస్వరూపాత్మ – రామచంద్రా! ఈ విధంగా సముద్రంలో ఉన్నదంతా జలమే అయినప్పటికీ రకరకాల ఆకారాలు గల తరంగాలు ఉన్నట్లుగా ఈ జీవ మహాసముద్రంలో మనం పైన చెప్పుకున్న 7 రకాల జీవులు అన్ని జీవజాతులలోనూ ఉన్నారు. వీటిని తెలుసుకొన్నవాడవై ఉత్తరోత్తర భూమికలయందు తత్పరుడవై ఉండుము.

నాయనా! నీవిక ఈ జగత్తును గూర్చిన 'ద్వైతబుద్ధి' అనే భ్రాంతిని త్యజించు. ఎందుచేతనంటే నీవు ఇప్పటికే పూర్ణముగా బోధైక రూప ఘనత్వమును (ఘనీభూతమైన దృక్మాత్ర రూపమును) పొంది ఉన్నావు. తరంగాలలో భేదం ఉన్నా జలం సర్వదా ఒక్కటే కదా! ద్వితీయాదుల అభావం చేత ఏకత్వ భావన కూడా అవసరం లేదు. అందుచేత 'ఏకత్వ-ద్విత్వ-శూన్యత్వ-అశూన్యత్వ'... ఆదిగాగల సర్వ ధర్మములను వదిలినవాడవై ఉండు. కల్పనలన్నింటికంటే ఆది ఏమిటో గ్రహించు. అట్టి 'ఆది' అయిన అధిష్ఠాన సన్మాత్రుడవై శేషించుము. అదియే నీ స్వభావము.

ఓ సర్వ సభికులారా! మీ అందరి యొక్క వాస్తవరూపం సర్వ కల్పనలకు ముందే ఉన్న ఆత్మ రూపమేనని గ్రహించి తత్పరులై ఉండండి.

❖❖❖

11. ఈ జగత్తు ఉత్పత్తి రహితము - మిథ్య - నిరాకారము

శ్రీరాముడు : మహాత్మా! 'ఆకాశం నుండి వృక్షం జనించింది' అనేది ఎంతటి అర్థరహితమో పర బ్రహ్మం నుండి జగత్తు జనించడం అంతే అర్థరహితమని అనిపిస్తోంది. బ్రహ్మం నుండి అకారణంగా 'నిరర్థకం-జాగ్రత్ శరీరధారణమయం' అయినట్టి ఈ జీవులంతా ఎట్లా ఉత్పన్నాలౌతున్నారు? బ్రహ్మమే వీరి స్వరూపం గదా! వీరంతా బ్రహ్మము నుండి ఎందుకు, ఏ కారణం చేత జనిస్తున్నారు.

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! నీవు 'అకారణంగా' అని అంటున్నప్పుడు నిజమే చెప్పావు. కారణం (లేక) కార్యము ఎన్నటికీ ఉత్పన్నం కాదు. కాబట్టి వాస్తవానికి కేవల జాగ్రత్ జీవులు ఉత్పన్నమే అయి ఉండలేదు. అగ్ని శిఖలలో ఒక్కొక్క శిఖ ఒక్కొక్క ఆకారం కలిగి ఉన్నప్పటికీ అగ్నికి ఏ సమయమందునూ 'ఇట్టిది' అన్న ఆకారమేదీ లేనే లేదు చూచావా? అట్లాగే జాగ్రత్ జీవులు వాస్తవానికి ఉత్పన్నమే కాలేదు. కాబట్టి తదితర పరిణామ ఫలితమైన తక్కిన జీవభేదం ఏనాడు సంభవించి ఉండలేదు. అంతా కూడా యథాతథంగానే ఉన్నది.

నేఽహ ప్రజాయతే కించిత్! నేఽహ కించన నశ్యతి ।
ఉపదేశ్యోపదేశార్థం శబ్దార్థ కలనోదయః ॥

ఓ రామచంద్రా! వాస్తవానికి బ్రహ్మమునందు ఈ రకరకాల జీవులు మొదలైనవి ఉత్పన్నమవటమూ లేదు, నశించుటయూ లేదు. మరి? ఈ 7 రకాల జీవుల గురించి ఎందుకు చెప్పానంటావా? ఇదంతా కూడా కేవలం శిష్యునికి ఉపదేశించటానికి మాత్రమే శ్రుత్యాదులు ఈ శబ్దార్థ కల్పనలన్నీ చేశాయి. చివరికి జీవ భేదంతో సంబంధం లేని బ్రహ్మమును బోధించటమే ఆ శ్రుతుల అంతిమ లక్ష్యం.

శ్రీరాముడు :

కః కరోతి శరీరాణి, మనో బుద్ధ్యాది చేతనైః?
కో మోహయతి భూతాని, స్నేహరాగాది బంధనైః?

మునీంద్రా! నాదొక చిన్న సందేహం. బ్రహ్మమునందు జీవాది విశేషములేవీ జనించటం లేదని, బ్రహ్మము సర్వదా నిర్మలత్వముచే యథాతథంగానే ఉన్నదని అనుకుంటున్నాం కదా! మరి 'మనస్సు-బుద్ధి' ఇటువంటి చేతన వస్తువులన్నీ ఉపయోగించి భోగసాధనమగు ఈ శరీరమును తయారుచేస్తున్నది ఎవరు? మరియు ఈ జగత్తులో స్నేహము-రాగము మొదలైన ఆయా బంధనములన్నీ కల్పించి ఈ ప్రాణులందరినీ మోహపెట్టుచున్నది ఎవరు?

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! వాస్తవానికి ఈ శరీరాలను ఎవడూ ఎన్నడూ నిర్మించటమూ లేదు. ఈ ప్రాణులందరినీ ఎవడూ మోహపెట్టటమూ లేదు. జలంలో తరంగాలు, ఆవర్తాలు మొదలైన జలాకారాలన్నీ పొంది జలమే ఆయా రూపాలుగా కనిపిస్తోంది చూచావా? అనాది-అనంతం-బోధ రూపం అయినట్టి పరమాత్మయే ఈ అనేక పదార్థ రూపాలుగా తన స్వరూపముననే ఉండి ఉంటున్నాడు.

వాస్తవానికి బాహ్యపదార్థం అంటూ ఏదీ లేదు. మరి? బీజంలోంచే వృక్షం బయల్వెడలుచున్నట్లుగా అభ్యంతరమైన బోధ రూప హృదయం నుండే బోధయే (చైతన్యమే) బాహ్యపదార్థం వలె స్ఫురిస్తోంది.

ఒక శిలలో శిల్పం ఉన్నట్లుగా బోధ యందే ఈ 'ప్రపంచం' అనబడేది స్థితి నొంది ఉన్నది. అట్టి బోధ దేశ కాలాలచే ఏకం-అనంతం కూడా! అట్టి 'బోధ' యొక్క విస్తారమే ఈ బాహ్యాభ్యంతర జగత్తు అని గ్రహించు.

అంతేకాదు వాసనలచేతనే సిద్ధిస్తున్న బ్రహ్మలోకం మొదలైన తదితర లోకాలన్నీ కూడా పరమాత్మ యందే ఉన్నాయి. పరమాత్మయో, వాసనలన్నిటికీ ఆవల కేవలమై ఉన్నారు! కాబట్టి వాసనాక్షయమును నిరంతర భావన చేయాలి. అప్పుడు వాసనాక్షయ భావనా బలంచేత అనుభవం సిద్ధించగలదు. శాంతులగు జ్ఞానులు ఆత్మ కొఱకై ఆ లోకంలోనో ఈ లోకంలోనో వెతకరు.

ఆత్మ అంతటా నిండి ఉండటంచేత 'ఆత్మ ఎక్కడో ఉన్నది' అనురూపమైన వాసనలు వారియందు ఎన్నటికీ జొరబడవు.

సద్రూపమగు ఆత్మయే దేశ-కాల-క్రియా-ప్రకాశ-రూప-చిత్తాదులతో కూడి ఉన్నది. అయితే వాస్తవానికి దేశ-కాల-చిత్తాదుల శబ్ద-అర్థములు ఆత్మకు లేవు. అయినప్పటికీ ఆత్మ శూన్యం కాదు.

ఎవరి దృష్టియందైతే దృశ్యము సర్వదా శమించియే ఉన్నదో... అట్టి తత్త్వవేత్తలగు ద్రష్టలకు మాత్రమే ఆత్మ పదం యొక్క బోధస్థితి అనుభవమగుచున్నది. అన్యులకు అది సుబోధకం అవటం లేదు. అహంకారం అనే పిశాచం ఈ హృదయాన్ని అవహించి ఉన్నంత వరకు ఆత్మపదం సుబోధకం కాదు. 'చంచలం-విస్తారం' అయిన 'అహంకారం' అనే గోతిలో ఎవడు పడతాడో... అట్టి వాడు ఎప్పుడూ ఆత్మ ప్రకాశాన్ని గాంచలేడు.

ఓ రామచంద్రా! ఆత్మ జ్ఞానికి ఈ 14 లోకాలు, ఇందులోని సర్వజీవులు తన యొక్క అవయవాల వలె తోచుచూ ఉంటాయి. జ్ఞానుల యొక్క దృష్టికి ఈ 'సృష్టి' అనేది ఉదయించటమూ లేదు, అస్తమించటమూ లేదు. ఎందుకంటే ఏదైనా 'కారణం' అనేది ఉంటే కదా, 'కార్యం' అనేది ఉండేది? కారణమే లేకపోతే కార్యం ఎక్కడి నుండి వస్తుంది? పరమాత్మ అకారణుడు. అతడు దేనికి కారణం కాదు. కనుక ఈ సృష్టికి కారణమే లేదు. కారణమే లేదు కాబట్టి సృష్టియే లేదు. జ్ఞానులు ఈ సృష్టిని ఉదయం గాని, అస్తమయం గాని లేనిదానిగా దర్శిస్తున్నారు.

శ్రీరాముడు : మరి 'పరమాత్మ నుండే ఈ సృష్టి ఆవిర్భవిస్తోంది'... అని వేద వచనం కదా!

శ్రీ వసిష్ఠ మహర్షి : సరే, అయితే... కారణం యొక్క స్వభావమే కార్యం కూడా కలిగి ఉంటుంది కదా! కారణమగు పరమాత్మ ఎట్లు సత్-చిత్-నిరాకార రూపమే అయి ఉన్నదని జ్ఞానులు గ్రహిస్తున్నారో కార్య రూపమగు జగత్తు కూడా సత్‌చిత్ నిరాకార రూపమేనని గమనిస్తున్నారు. అజ్ఞానులో ఇదంతా ఆకార రూపంగా మాత్రమే దర్శిస్తున్నారు.

'బంగారు అభరణం' అనుదానిలో... అభరణం అనే కార్యం 'బంగారం' అనే కారణం నందే ఉన్నప్పుడు, 'ఆభరణం' అనే దానికి బంగారం కంటే వేరైన ఉనికి ఎక్కడ? అట్లాగే కారణమగు పరబ్రహ్మమునందే ఆ పరబ్రహ్మం రూపంగానే ఈ జగత్తు ఉన్నప్పుడు ఇక వేరే 'కారణత్వం' అనేది పరబ్రహ్మానికి ఏమున్నది? బంగారపు ముద్ద ఉంగరం మొ॥న ఆకారంగా ఉన్నప్పుడు ఆభరణం అంటున్నాం. ఆభరణంలో బంగారం తప్ప వాస్తవానికి మరింకేమీ లేదు కదా! అట్లాగే పరమాత్మయే సృష్టి రూపంగా కనిపిస్తోంది. అంతేగాని సృష్టికి పరమాత్మ కంటే వేరైన రూపం లేదు. ఒకవేళ

పరమాత్మ కంటే వేరుగా ఎక్కడైనా సృష్టి అనేది ఎవరికైనా అనుభవమౌతుంటే... అది అసత్తే గాని (వాస్తవానికి లేనిదే గాని) సత్తు కాదు. ఎప్పుడైతే (బంగారు ఆభరణంలో ఆభరణం వలె) అసత్తో, అప్పుడు పరమాత్మ యందు గల 'కారణత్వం' అనేది కూడా అసత్తే (లేనిదే) అగుచున్నది.

'మరి మాకు జగత్తు కనిపిస్తోంది కదా' అని ఎవ్వరైనా అంటారా?

శాంతమగు మహా సముద్రంలో 'తరంగాలు-ఆవర్తనాలు' ఉంటున్నట్లే, శాంతము-క్షోభరహితము అగు బ్రహ్మం నందు 'జగత్తులు-చిత్తములు' ఉంటున్నాయి. ఒకే మట్టి అనేక మట్టి పాత్రల రూపంగా అగుచున్నట్లు, ఒకే బంగారం అనేక పేర్లతో పిలువబడే ఆభరణాలుగా, అగు చున్నట్లు... ఒకే బ్రహ్మం అనే పిండం అనేక జీవులుగా, జగదృశ్యములుగా, చిత్తములుగా అగు చున్నది. అయినప్పటికీ కూడా బ్రహ్మపిండం సర్వదా ఏకం-నిర్మలం అయి ఉన్నది. మట్టి ఎన్ని పాత్రలుగా అగుచున్నప్పటికీ బంగారం ఎప్పటికీ బంగారమే! అట్లాగే బ్రహ్మం సర్వదా బ్రహ్మమే!

కుండగా ఉన్నప్పటికీ... అది మట్టియే! మట్టిగా ఉన్నప్పటికీ అందులో కుండగా అవగల తత్త్వం సర్వదా ఉన్నది. మట్టి మట్టిగా ఉన్నప్పుడు, కుండగా ఉన్నప్పుడు కూడా ఉభయ స్థితులందు ఏక వస్తువును కుమ్మరి దర్శించగలడు. అట్లాగే, జ్ఞాని సహజీవుల వైపు చూచేటప్పుడు ఆ సహజీవుల వాసనాయుక్తమైన మనస్సులను వదలిపెట్టి అతీత దృష్టితో చూడగలుగుతాడు. అతని యొక్క సత్యవస్తుజ్ఞాన ప్రభావం చేత సహజీవులంతా ఆత్మ స్వరూపంగానే అగుపిస్తారు. జ్ఞానులకు ఈ జాగ్రత్ స్వప్నతుల్యంగా తెలియవస్తుంది. స్వప్నం జాగ్రత్తు వంటిదే అవుతుంది. జాగ్రత్తు స్వప్నం వంటిదే అవుతుంది.

ఆత్మ కంటే వేఱుగా ఏదైనా వారికి కనిపిస్తే అద్దానినంతా వారు స్వప్నతుల్యంగా చూస్తారు. అందుచేత వారికి అంతటా అన్నిటా ఒకే వస్తువు భాసిస్తోంది. మృగతృష్ణ 'మృగతృష్ణ'గా తెలియబడిన తర్వాత ఇక ఆ మృగతృష్ణలో కనిపించే ఒక తరంగం-మరొక తరంగం మధ్య గల తేడా భ్రమగానే తెలియవస్తుంది గాని, ఆ తేడా వాస్తవమని అనుకోం కదా! ఈ అనేక విశేషములతో కనిపించే జగత్తు చిత్త మాత్రంగా ఎఱుగబడిన తర్వాత ఇదంతా స్వప్న తుల్యంగా అనిపించటంలో ఆశ్చర్యం ఏముంటుంది? ఆకాశంలో మేఘాలు అనేక ఆకారాలతో కనిపిస్తున్నాయి. అయితే మేఘాలన్నీ జలబిందువుల యొక్క ఘనీభూతమైన హిమ (మంచు) స్థితియే కదా! ఆ మేఘాలు వర్షించాయనుకో, ఇప్పుడేమైనది? ఆ మేఘాలన్నీ జల బిందువులై నేలపై వర్షించాయి కదా! మరి మునుముందటి మేఘాకారాలన్నీ ఏమైనాయి? అట్లాగే ఆత్మ యొక్క సమ్యక్ జ్ఞానం ఉదయించగానే జ్ఞానికి ఈ కనబడే సర్వ దేహాలతోసహా సమస్తం చిత్త త్యాజ్య రూపమున త్యజించబడుతుంది. ఇదంతా ఏకము-నిర్మలము అగు ఆత్మగా సుస్పష్టంగా అనుభవమగుచున్నది.

మేఘాలు ఆవరించినప్పుడు ఆకాశం కనిపించదు. మేఘాలే కనిపిస్తాయి. మరి మేఘాలు తొలగినప్పుడో? ఆకాశం యథాతథంగా నిర్మలము-అనంతము అయి కనిపిస్తుంది. మేఘాలు ఉన్నప్పుడు తొలగినపుడు కూడా ఆకాశం సర్వదా యథాతథమే కదా! 'సత్యము' యొక్క పరిజ్ఞానం

చేత అహంకార సహితమగు జగత్తు కూడా శమిస్తుంది. ఆ స్థానంలో ఏకము-అఖండము-అనంతము-అప్రమేయము అగు ఆత్మ మాత్రమే గోచరిస్తుంది. ఆత్మ జ్ఞానము సంతరించుకొన్న తర్వాత ఆపై అనుభవించబడే శబ్ద-స్పర్శ-రూప-రస-గంధాలన్ని కూడా మృగతృష్ణాజలం వలె మొదలే శమించియే అక్కడ ఉంటాయి. అగ్ని ప్రజ్వరిల్లుతూ ఉండగానే అందులో ఆకులు, వస్త్రములు, కట్టెలు మొదలైనవి వేశామనుకో, అవన్నీ ఏకం అయిపోతాయి కదా! అట్లాగే జ్ఞానాగ్నిచే జగత్తు-చిత్తము మొదలైనవన్నీ ఏకత్వం పొందుచున్నాయి. తెలివితేటలు గల బాలునికి చీకట్లో పిశాచాకారాలు కనిపించవు కదా! అట్లాగే జ్ఞానికి ఈ మూడు లోకములలో సాకారమంతా (మూర్తిత్వమంతా) క్రమక్రమంగా లేనిదిగా తెలియవస్తోంది.

చిత్తే చిత్తముగా భాసిస్తోంది! - అనంత రూపమైనట్టి 'బోధ' (చైతన్యము) తన నిజస్వరూపమున ఈ జగత్తు-చిత్తాదులుగా భాసిస్తోంది. మరి అప్పుడు బోధయందు మూర్తిత్వం (నామ-రూపాదులు) ఎచ్చటివి? ఆత్మను గూర్చిన అజ్ఞానం చేతనే 'జగత్తు-చిత్తం' అను వేర్వేరు రూపాలుగా అనిపించటం జరుగుతోంది. ఎప్పుడు ఆత్మ జ్ఞానముచే అజ్ఞానం నశిస్తుందో... అప్పుడు మూర్తిమంతం యొక్క అస్థిత్వం ఎచ్చట? అగ్నిచే బంగారం కరిగి అతి సూక్ష్మత్వం పొందుతోంది చూచావా? అప్పుడిక బంగారం యొక్క ఇతఃపూర్వపు ఆకారం ఏమయినట్లు? ఎప్పుడు ఆత్మ జ్ఞానంచే ఈ జగత్తు స్వప్న తుల్యమని ఎఱుగబడుతుందో... అప్పుడు ఈ జగత్తు మూర్తిత్వమును వీడుచున్నది. అనగా అప్పుడు ఈ జగత్తు నిరాకారమని, నామ-రూప భేదకల్పనా రహితమని ఎఱుగబడుచున్నది.

ద్రవ రూపంలో ఉన్న బంగారం క్రమక్రమంగా ఘన రూపం పొందుతూ ఉంటుంది చూచావా? అట్లాగే స్వస్వరూపమున ఉన్నట్టి బోధ రూపమగు ఆత్మ దేశ-కాలాలనేవి ఏర్పడటానికి ముందే తనయందు జాగ్రత్-స్వప్నాలను రచించుకొని ఘనత్వాన్ని పొందినదాని వలె అగుచున్నది. ఆత్మ విచారణచే జాగ్రత్-స్వప్నాలు కల్పిత మాత్రాలని, ఆ రెండింటికి 'కారణం-ఆధారం-అప్రమేయం' అయి ఆత్మ సర్వదా ప్రకాశించుచున్నదని తెలియబడగలదు. ఈ ప్రకారంగా ఆత్మ విచారణచే జాగ్రత్-స్వప్నములు తుచ్ఛములైనవని తెలియబడగానే ఇక భోగాల పట్ల అనురాగం దానంతట అదే సన్నగిల్లుతుంది.

ఈ 'దృశ్యం' అనబడేది వివేకికి అవివేకికీ కూడా విద్యమానమై ఉంటోంది. అయితే వివేకులకు ఈ దృశ్యము అత్యంత తుచ్ఛమైనదిగా కన్పట్టుచున్నది. స్వప్నంలో విద్యమాన మయ్యే పదార్థ జాలం ఏ విధంగా నమ్మకమునకు అనర్హమో, ఈ జాగ్రత్ పదార్థజాలం కూడా అంతే అనర్హం. ఎందుకంటావా? ఆత్మయందు లభించే సుఖ విశ్రాంతి ఎచ్చట? ఈ విషయాస్వాదనలు ఎచ్చట? తత్త్వజ్ఞానికి కూడా ఈ విషయాల పట్ల ప్రీతి-నమ్మకం కలుగుతుందంటే, ఇక జాగ్రత్-స్వప్నములు ఒక్కటే అవుతాయి. జ్ఞాన-అజ్ఞానాలు ఒక్కటే అవుతాయి. అది కుదిరేది కాదుకదా! కనుక తత్త్వజ్ఞానికి విషయాల పట్ల నమ్మకం ఉండదు. ఈ జగత్తు చిత్తము చేతనే సిద్ధిస్తోందని, ఇదంతా స్వప్నంలాగా భ్రాంతి మాత్రమేనని తెలియవచ్చిందో, ఇక ఆ సుజ్ఞానికి ఇక్కడి రూపం పట్ల, పదార్థాల పట్ల సత్యత్వ బుద్ధి స్వయంగా తొలగిపోతోంది. మృగతృష్ణలో జలం రుచిగా ఉంటుందని

ఆ జలం కోసం పరుగులు తీసేవాడు తెలియనివాడే గాని, తెలిసినవాడు కాదు కదా! అట్లాగే వివేకి అయినవాడు దృశ్య పదార్థముల పట్ల 'ఇవన్నీ సత్యము–నిత్యము'... అని తలచడు. బయట నుండి కిటికీ గుండా ప్రవేశించిన దీపకాంతికి ఆకారము కనబడవచ్చు గాక! అయితే మాత్రం దీపకాంతికి ఆకారం అంటూ ఏమున్నది? ఏమీ లేదు. శాంతుడగు వివేకికి ఈ జగత్తునందు ఆకారాదులు కనిపిస్తున్నప్పటికీ ఇదంతా నిరాకారంగాను, ఆకాశరూపంగాను గ్రహిస్తున్నాడు.

జాగ్రతో వస్తుతః శూన్యాత్ పరిజ్ఞాతాత్ నివర్తతే ।
చిత్త భ్రమాత్మనో భ్రాన్తిర్ రూపాస్వాదన భావనా ॥

ఒకడు మేలుకొనిన తర్వాత స్వప్నంలో కనిపించిన వస్తువుల కోసం వెతకాలని అనుకుంటాడా? అనుకోడు. ఎందుచేత? అవి అవాస్తవములని, శూన్య మాత్రములని, కేవలం భ్రమచే సిద్ధించాయని బాగా తెలుసు కనుక! అట్లాగే ఈ జగత్ పదార్థములన్నీ చిత్తం యొక్క భ్రమ–చాంచల్యములచే మాత్రమే సిద్ధిస్తున్నాయని తెలిసిన తర్వాత జ్ఞానికి వీటిని పొందాలనే ఉద్వేగమంతా మొదలంటా తొలగుతోంది. ఏ వస్తువు పట్ల అయినా గ్రాహ్య బుద్ధి (సంపాదించుకోవాలనే ఆలోచన) ఎట్లా కలుగుతుంది? ఆ వస్తువుపై గల నమ్మకం చేతనే కదా! జ్ఞానికి అదంతా స్వప్నంలో కనిపించిన బంగారు గొలుసు కావలసిందేనని కోరుకోవటం వంటిదే అవుతుంది. జ్ఞానికి సర్వదా సర్వ విశేషాల పట్ల రాగబుద్ధి తొలగుతోంది. 'ద్రష్ట–దృశ్యం' అనే దోషాన్ని అతడు తనయందు తొలగించుకొని ఉంటున్నాడు. లేదా దోష గ్రంథుల యొక్క ఛేదనం కొఱకై ప్రయత్నశీలుడై, నిమగ్నుడై ఉంటున్నాడు.

'జ్ఞాని' సకల బంధుత్వాలలో రాగ రహితుడై, దృశ్య పదార్థాల పట్ల మనన వర్జితుడై, అహంకార శూన్యుడై, ద్వేషమంటూ ఏదీ లేనివాడై, సాంసారిక ప్రయత్న రహితుడై, శాంతుడై వెలయుచున్నాడు.

వాసనలు - అపేక్ష - ఉపేక్ష - దీపశిఖ నశిస్తే దీపకిరణాలు నశిస్తాయి కదా! అట్లాగే భోగాలపై అపేక్ష తగ్గుచున్న కొలదీ వాసనలు సన్నగిల్లుతూ వస్తాయి. కాక, భోగాలపై అపేక్ష పెరుగు చున్నదా... వాసనలు ప్రవృద్ధమౌతూ ఉన్నట్లే. ఆపేక్ష తప్పించి వాసనలకు వేరే రూపమేదీ లేదు.

ఓ ప్రియ సహజీవులారా! ఈ జగత్తంతా గంధర్వ నగరంలాగా భ్రాంతి రూపమేనని మీరు గమనించండి! తత్త్వబోధచే ఇదంతా సూక్ష్మమైనట్టి సత్–చిత్ ఆకాశంగా గమనించ బడగలదు.

యత్రనాఽఽత్మా న శూన్యంచ న జగత్కలనాపిచ ।
న చిత్త దృశ్యో ఉదయ ధీః, సర్వంచ అస్తి యథా స్థితమ్ ॥

ఆ పరమాత్మ జీవుడు కాదు. శూన్యమా? కానే కాదు. ఆ పరమాత్మ పదమున జగత్కల్పన గాని, చిత్తం గాని, దృశ్యోదయం గూర్చిన బుద్ధిగాని లేవు. మరి? ఇదంతా కూడా యథాస్థితమగు బ్రహ్మమే అయి ఉన్నది. అజ్ఞానులకు కనిపించే సాకారమంతా జ్ఞాని దృష్టికి అతని యొక్క తత్త్వ జ్ఞానంచే లయించి పోవుచున్నది. అందుచేత దృశ్య విషయాల పట్ల ఉపేక్ష పెంపొందించుకోండి.

శ్రీరాముడు : అనగా అతని దృష్టికి ఈ జగత్తు అసలు కనిపించదా?

శ్రీవసిష్ఠ మహర్షి : కనిపిస్తుంది. ఇదంతా కనిపిస్తున్నప్పటికీ ఇవన్నీ శూన్య రూపాలుగాను, లేనివిగాను అగుపిస్తాయి. 'ఈ జలానికి ఆవర్తములు ఎందుకు వచ్చాయి?'... అని అనుకొని ఎవడైనా జలంలోని ఆవర్తములను తొలగించి జలమును పరిశుద్ధపరచాలని అనుకొంటాడా? జలమునందు ఆవర్తనములు ఉన్నప్పటికీ (లేక) ఉండనప్పటికీ జలం సర్వదా యథాతథంగా ఉంటోందని జల తత్త్వం తెలిసినవాడు అనుకుంటాడు కదా! జ్ఞాని ఈ వివిధ వికారాలతో కూడిన జగత్తు ఒక ప్రక్క కనిపిస్తున్నప్పటికీ ఇచ్చట ఆత్మ ఆత్మయందే యథారూపంగా ఉన్నదని గ్రహిస్తున్నాడు. అతడు (జ్ఞాని) ఆకాశం వలె నిర్మలుడై, సౌమ్యరూపుడై, సంగరహితుడై, కేవలమూ సమాధితత్పరుడై ఉన్ననూ, లేనివాడై ఒప్పుచూ ఉంటాడు. అతని మనస్సు సర్వదా అస్తమించియే ఉంటుంది. అతడు మౌనియై, ఇంద్రియ-మననాలను అధిగమించినవాడై ఉంటాడు. సమస్త కర్మల యొక్క అంతమును సంపాదించుకొని ఉంటాడు. సంసార సముద్రమును దాటివేసి ఉంటాడు.

1. స్థూల-సూక్ష్మ-కారణ-మహాకారణ చతుర్విధ దేహముల యొక్క
2. ఆ దేహమునకు ఆధారమై ఈ 14 లోకముల యొక్క,
3. ఆ 14 భువనములకు ఆధారమైన ఆకాశము యొక్క
4. పర్వత సమూహముల యొక్క,
5. విషయ సాధనా క్రమముల యొక్క

... వీటన్నిటి యొక్క ఉపాదాన కారణము 'మూలాజ్ఞానమే'! అట్టి మూలాజ్ఞానం నశించిందా, ఇక ఆపై ఈ శరీరము, ఈ భూమి మొదలైనవి కనబడుతూనే అతనికి 'లేనివి' గా తెలియవస్తున్నాయి. ఈ ప్రకారంగా జ్ఞాని... శాంతమైన అంతఃకరణం కలిగినవాడౌతాడు. వికల్ప రహితుడై ఉంటాడు. స్వరూపసారమయుడై ప్రకాశిస్తాడు. పరమానందమగు 'ఆత్మానందం'తో ఎల్లవేళలా పరితృప్తుడై ఉంటాడు, నిరావరణ భూమానంద స్వరూపుడై వర్తిస్తాడు.

❖❖❖

12. సృష్టి - ప్రళయములు

శ్రీరాముడు : మునీంద్రా! చిదాత్మ వాస్తవానికి కేవల బోధ రూపం కదా! మరి ఏ క్రమం చేత అది జగత్తు వలె భాసిస్తోంది? చిత్తము యొక్క భేదనివారణ కొరకై ఈ విషయం తెలియజేయ ప్రార్థన.

శ్రీవసిష్ఠ మహర్షి : రామచంద్రా! **వృక్షస్యేవ విమూఢస్య యదృష్టౌ తత్స్వచేతసి** - విత్తులోని ఒకే చేతనసత్త వృక్షం యొక్క మూలం-ఆకులు-పుష్పం-ఫలం మొదలైన ఆకారాలు పొందుచున్నది చూచావా? అట్లాగే అజ్ఞాని యొక్క అంతరంగంలోని అజ్ఞాన దృష్టియే ఇట్లు ఈ దృశ్య పదార్థాలుగా అనుభవమగుచున్నది.

యన్నదృష్టౌ న తచ్చిత్తే భవతి అల్పతరస్మృతే - దృష్టియందు ఉన్నదే చిత్తము నందు ఉంటోంది. చిత్తం నందు ఉన్నదే దృశ్యంగా ప్రాప్తిస్తోంది. దృష్టిలోను, చిత్తంలోను లేనిదేదీ దృశ్యంగా ప్రాప్తించుటలేదు. దృష్టిలో లేనిదేదీ కించిత్తు కూడా స్మరించబడటం లేదు, దర్శించబడటం లేదు.

అయితే, వివేకి అయిన వాడు శాస్త్రార్థముల పూర్వ-పరములను గ్రహించియే, ఆపై దర్శనం చేస్తాడు. అంతేగాని ఈ ఇంద్రియాలకు కనబడినట్లుగా కాదు. శాస్త్రములకు నిషిద్ధమైన విశేషాలను సమీపంగా ఉన్నప్పటికీ వాటిని చూడటానికి కూడా అతడు ఇచ్ఛగించడు. వీటిని గురించి ఎటువంటి చిత్త పరిశ్రమ కలిగి ఉండడు. కాబట్టి రామచంద్రా! నీవు కూడా చిత్తశుద్ధికి అనుకూల మైన అనుష్ఠానమునందు మాత్రమే తత్పరుడవై ఉండెదవు గాక! శాస్త్ర సమ్మతమైన చిత్తమును మాత్రమే పెంపొందించుకో. శాస్త్రముల యొక్క అత్యుత్తమార్థములందు మాత్రమే మననశీలుడవై ఉండు. శ్రవణములకు భూషణములైన ఈ ఉపదేశం విను.

❖

అవిద్య-దృశ్యభ్రాంతి పర్యాయపదాలే! ఈ దృశ్య సమూహం గూర్చిన భ్రాంతియే అవిద్య. ఇంతకు మించి అవిద్య అనగా ఏదీ లేదు. మృగతృష్ణలో జలం అంటూ ఏదీ లేనట్లు వేఱుగా అవిద్య అంటూ ఏదీ లేదు.

అయినా కూడా... మన ఈ ఉపదేశ్య-ఉపదేశముల కొఱకై కాసేపు 'అవిద్య అనునది ఏదో ఉన్నది' అని అనుకొని (కాసేపు అవిద్య వేరే నిజంగా ఉన్నదని అనుకొని)... ఈ నా వాక్యాలు విను. 'అవిద్య ఎట్టిది? ఎక్కడ నుండి వచ్చింది?'... మొదలైన వికల్పములను కాసేపు కట్టిపెట్టి నేను చెప్పబోయేది వింటే 'జగత్తు గాని, అవిద్యగాని లేవు' అని నీవే స్వయంగా గ్రహిస్తావు.

❖

అనేక విశేషాలతో, రకరకాల పదార్థాలతో పూర్ణమై ఉండి కనిపిస్తున్న ఈ స్థావర జంగమాత్మక ప్రపంచం 'కల్పాంతం' నందు నశిస్తోంది. కాస్త విమర్శించి చూస్తే... ఈ జగత్తు 'భూలోకం' మొదలైన విభాగాలు ఒక్కొక్కటి విశ్లేషిస్తూ వస్తే 'ఇది లేదు' అని ఆ ఒక్కొక్కటీ తొలగుతూ రాగలదు. ఒక కుండలో నీళ్లు ఉన్నాయనుకో, అందులో ఒక్కొక్క బిందువు తొలగించుతూ ఉండగా, ఆ కుండ లోని నీళ్లన్నీ ఒక నాటికి అయిపోక తప్పదు కదా! ఈ జగత్తు కూడా విమర్శచే అంతే!

1. "ఈ జగత్తు బ్రహ్మము యొక్క అవయవమా?" - ఈ జగత్తు బ్రహ్మం యొక్క అవయవ మనియే కొద్దిసేపు అనుకుందాం. అప్పుడు 'అవయవం' అగు ఈ జగత్తు నశిస్తే, 'అవయవి' అగు బ్రహ్మం కూడా నాశనం పొందాలి. బ్రహ్మమునకు 'నాశనం' అనే ధర్మమే ఉంటే 'ఆత్మ అనంతం' అనే వేదవాక్కుకు విఘ్నం కలుగుచున్నట్లే కదా! కాబట్టి 'ఆత్మ-చిదేకరసం-నిరవయవం' అయినట్టి బ్రహ్మమునకు ఈ జగత్తు అవయవం అవటానికి కూడా వీలు లేదు.

2. "పరమాణువుల సంయోగంలోంచి 'నేను' వస్తోందా? వియోగంచే పోతుందా?" - ఇక మరొక (చార్వాకుల) వాదం ఇక్కడ చెప్పుకుందాం.

"భూమి మొదలైన ఈ పంచభూతాలు స్వతహాగా జడమే. కానీ కల్లు త్రాగినప్పుడు దేహ మంతా 'నిషా' ప్రసరించినట్లుగానే ఈ పంచ భూతాలు ఒక చోట ఒక విధానంగా సమావేశం అయినప్పుడు చైతన్యం ఉదయిస్తోంది. అందుచేత ఈ దేహాలలో 'నేను' అను ప్రజ్ఞ ఉదయిస్తోంది. ఆ అణువులు విడిపోగానే 'నేను' అంతరిస్తుంది. ఇంతకు మించి ఏమీ లేదు."

ఈ వాదన మాకు సమ్మతం కాదు. ఎందుకంటావా? ఈ దేహం 'విజ్ఞానం' (ప్రజ్ఞ) పై ఆధారపడి ఉంది గాని, దేహంపై ప్రజ్ఞ ఆధారపడి లేదని మేం గమనిస్తున్నాం. ప్రజ్ఞయే దేహాన్ని నడిపిస్తోంది. అంతే గాని ప్రజ్ఞ దేహంలో 'కాలు–చేయి–జీర్ణకోశం' వలె ఒక విభాగం కాదు. చేతిని నీవు కదిలిస్తున్నావు. అంతేగాని, చేయి నిన్ను కదిలిస్తోందా? లేదు. అనగా 'నేను' అని స్ఫురించే చైతన్య అధీనంలోనే ఈ దేహం ఉన్నది. అంతేగాని దేహ అధీనంలో చైతన్యం లేదు.

3. "యథా ద్రష్టం - తథా దృశ్యం" - ఇక ఈ దృశ్యానికి వద్దాం. మా ఉద్దేశానుసారంగా కూడా ఈ దృశ్యం ఎట్లా ఒకనికి కనబడుచున్నదో... అది ఈ దృశ్యము యొక్క అసలు రూపం కాదు. దీని రూపం మరొకటేదీ కూడా కాదు. మరి? ఈ దృశ్యము ఎవరు ఏ దృష్టితో చూస్తే ఆ విధంగా అనుభవమౌతూ ఉంటోంది. కనుక ఇది 'అనిర్వచనీయం' అని చెప్పబడుతోంది. ఇది అవిద్యచే ఇట్లిట్లు అనుభవమౌతోంది. ఇది ఎట్లెట్లు అనుభవమౌతోందో,.. అదంతా కూడా విద్యచే తప్పక నశించగలదు. 'జగద్దర్శనము' అనేది మధ్యలో వచ్చి మధ్యలోనే పోవుచుండేది.(జగత్ = జనించి గతించేది) అందుచేత జ్ఞానముచే అవిద్యను నశింపజేయాలి. అట్లు బోధ గావించి బంధ నివృత్తికి మార్గం చూపటమే శాస్త్రముల సాఫల్యము.

4. "జగత్తు నశించి మరల మరొకప్పుడు మరొక జగత్తుగా జనిస్తోందా?" - ఇక మరికొందరి ప్రతిపాదనల ప్రకారం 'పూర్వ కల్పంలో ఏ ప్రపంచమైతే నశించిందో... అదే మరల తిరిగి ఉత్పన్నమైనది'... అని! 'ఇది పూర్వ కల్పంలో ఉన్నట్లే ఉన్నదా? లేక అన్యంగా ఉన్నదా?'... అనే విషయం చెప్పటానికి, నిరూపించటానికి శక్యమయ్యేది కాదు. కాబట్టి అది అనిర్వచనీయం. అయితే 'అనుభవం'ను వదిలిపెట్టి కేవలం 'ఊహ–అపోహలు' సహాయంతో ఎవరైనా ఏదైనా చెప్పితే అది ఒప్పుకోవటానికి కుదరదు కదా! అయినా, నశించిపోయినది మరల ఎట్లు (ఏ కారణం చేత) ఉత్పన్నమైనది? కారణం దొరకనంతవరకు ఈ సిద్ధాంతం నిర్ణయాత్మకం కాదు.

5. "సాకారం నిరాకారం అయి, మరల నిరాకారంలోంచి సాకారం వస్తోందా?" - ఇంకొక అభిప్రాయమేమిటంటే, "సాకారమగు ఈ జగత్తే 'ప్రళయం' అనే ఒకానొక సమయంలో నిరాకార మౌతోంది. అట్టి నిరాకార స్థితిలో ఆకాశరూపంగా అగుచున్నది. సాకార జగత్తు ఒకప్పటికి (ప్రళయ సమయంలో) నిరాకరం అవుతోంది కనుక ఈ జగత్తు శాశ్వతం కాదు."

ఇంత వరకు బాగానే ఉన్నది గాని, అసలు సాకారమైనది నిరాకారం ఎట్లా అవుతోంది? 'ప్రళయం తర్వాత తన రూపం ఈ జగత్తు తిరిగి పొందుతోంది'... అని అనదలచుకొంటే, అప్పుడు ప్రళయంలో కూడా నశించకయే ఉన్నది కదా! అట్లా ఉండకపోతే, (నశించిపోతే) నశించినది మరల ఎట్లా ఉత్పన్నం అవుతున్నట్లు? కనుక ప్రళయ సమయంలో కూడా ఈ జగత్తు నశించకయే ఉన్నది'... అని అనవలసిరాక తప్పదు. అనగా... "ప్రళయం" అనేది ఈ విధంగా 1. సృష్టిలోని విభాగమే ప్రళయం, 2. కారణమగు 'అవాక్యత్వము (నిర్విషయ చైతన్య తత్త్వం) కార్యమగు ఈ సృష్టి ఏ సమయమందును, వేర్వేరుగా లేవు'... అను మహావాక్యర్థము సిద్ధిస్తోంది.

ఈ సృష్టియే పరమాత్మ. అలా చెప్పుటలో మా ఉద్దేశం–

1. భావనయే 'సృష్టి' అను అనుభవమునకు మూల స్వరూపం;

2. భావన భావుకుని కంటే వేఱు కాదు;

3. భావుకుడు చిదాకాశము కంటే వేఱుగా లేడు.

కనుక ఈ సృష్టి పరమాత్మయే గాని మరింకేమీ కాదు. వేఱుగా ఎక్కడైనా ఏదైనా ఎవరికైనా కనిపిస్తుంటే, అది భ్రమ మాత్రమే! వేఱుగా కనిపించేదంతా కాలముచే మార్పు–చేర్పులు పొందుతూనే వస్తోంది.

దృష్టియే సృష్టి. దృష్టికి ఈ సృష్టి కనబడుతూనే ఉంటున్నప్పటికీ ఇది శూన్యమాత్రంగా (నిర్విషయ మాత్రంగా) ఎప్పుడు తెలియవస్తుందో... అట్టి నిర్విషయానుభవమే 'ప్రళయం'. ఇంతకు మించి 'సృష్టి నశించటం' అనేది ఎక్కడా ఏదైనా ఉంటే నాకు చెప్పు. అట్టిదేదీ లేనే లేదు.

6. "సృష్టి-ప్రళయాలు 'ఆలోచన వచ్చి-పోయి మరొక ఆలోచన రావటం' వంటివి" – ఈ జగత్తు ప్రళయంలో నశించి మరల ఈ జగత్తే సృష్టి సమయంలో సృజించబడుతోంది....,

అని అనటం కంటే....., ఈ జగత్తు నశించుచు మరల వేరైనది జనిస్తోంది... అని అనటమే యుక్తం. ఈ సృష్టి–ప్రళయాలు ఒక ఆలోచన వచ్చి–పోయి మరొక ఆలోచన ప్రారంభమవటం వంటిది.

7. "జగత్తు శాశ్వతం - సృష్టి ప్రళయాలు జగత్ సంఘటనలు?" - 'ఒకే వృక్షంలో మధ్య మధ్య కొమ్మలు–ఆకులు–పూలు భేదంగా ఉన్నట్లే సృష్టి–ప్రళయాలు ఒకే జగత్తులో విభాగంగా ఉన్నాయి. జగత్తు సర్వదా ఏకైక విభాగమైనప్పటికీ అందులో సృష్టి–ప్రళయాలు ఆయా అంతర్లీన సంఘటనలవలె ఉంటున్నాయి... అనునది మరొక వాదం.

అయితే, విత్తులోని ఒకే సత్త ఆయా వృక్ష విభాగాలుగా కనిపిస్తూ ఉండటం చేత వృక్ష సత్త మరొకటిగా అవటం... అనేది వాస్తవానికి లేదు.

ఏకమగు సత్‌తత్త్వము (సత్ మాత్రము) నిజ స్వభావమున ఉంటూనే మాయచే వివిధ దేశ–కాలాదుల రూపంగా కనిపిస్తోంది. పరమార్థంగా చూస్తే ఇక్కడ నానాత్వభేదం లేదు. మా దృష్టిలో ఈ సమస్తం ఆత్మరూపమే! తత్త్వవిచారణచేతనూ, తత్త్వజ్ఞానాంతర అనుభవ ప్రమాణం చేతనూ ఇదంతా కూడా 'శాంతం–అనాది ఆకాశం వలె నిర్మలము–కేవలము–బోధ మాత్రము'... అగు పరమాత్మగానే శేషించ గలదు. అయితే, సద్రూపమగు చిదాత్మ... ఏ విధంగా అయితే అనుభవమునకు రాగలదో, ఏ విధంగా అయితే అనుభవమునకు సిద్ధించదో ...అట్టి విషయ క్రమమును వివరిస్తున్నాను. విను.

❖❖❖

13. మహా కల్పాంతము

శ్రీవసిష్ఠ మహర్షి : 'సర్వ కల్పనారాహిత్య స్థితి' అని చెప్ప తగు "మహా కల్పాంతం" అను స్థితి గురించి శాస్త్రములు ప్రతిపాదించి చెప్పుచున్నాయి. అట్టి 'మహా కల్పాంతము'న పురుగు నుండి మహాదేవుని వరకు గల మనో-బుద్ధి-కర్మ సహితమగు సమస్త దృశ్యమండలం నశిస్తోంది. ఆకాశ-వాయు-అగ్ని మొదలైన పంచభూతాలు, కాలం మొదలైన అపంచీకృత విశేషాలు కూడా శమిస్తాయి. అప్పుడు అంధకారం కూడా ధ్వంసమైపోతుంది. జలము-పృథ్వి కూడా క్షయిస్తాయి. శబ్ద-అర్థ విభాగమంతా కూడా అస్తమిస్తుంది.

అప్పుడిక బోధ రూపమగు ఆత్మ మాత్రమే శేషించి ఉంటుంది. అట్టి సర్వశేష్యము, సర్వాత్మకము అగు ఆత్మ... పరమ శాంతము, నిర్మలము; అబాధితం (అది దేనిచేత బాధింప బడజాలదు); అనాది, అనంతం, సౌమ్యం; అవ్యయం, అవాచ్యం; అవ్యక్తం, అతీంద్రియం; నామ రూప రహితం, సర్వ భూతాత్మకం; సర్వవస్తు శూన్యం, అన్య పదార్థ రహితం; సర్వలక్షణ సమన్వితం, సర్వలక్షణ విలక్షణం; పదార్థముల దృష్ట్యా అసత్తుల్యం, సన్మాత్రం, సర్వోత్తమమగు 'బోధ' రూపం.

ఇదంతా మహాకల్పాంతంలో కూడా శేషించే ఆత్మ యొక్క మాహాత్మ్యము. ఆ పరమాత్మ వాయువు కాదు. ఆకాశము కాదు. మనస్సు-బుద్ధి మొదలైనవి కాదు. శూన్యము కూడా కాదు. అది ఏ పదార్థమూ కాదు. కానీ... సర్వ రూపములూ అదే! అది అనిర్వచనీయమైన చిదాకాశం!

తద్విదా, తత్పదస్థేన, తన్ముక్తేన అనుభూయతే ॥

"నేనే ఆత్మను" - అట్టి ఆత్మ గురించి ఎఱిగినవాడు, ఆత్మ పదమును ఆశ్రయించి ఆ పదము నందే ఉన్నవాడు, సర్వ కల్పనల నుండి విముక్తుడైనవాడు మాత్రమే తత్త్వజ్ఞాని అయి ఆత్మను అనుభవానికి తెచ్చుకోగలడు! అఖండము-అప్రమేయము-సర్వము అగు ఆత్మ తానేనని గ్రహించుటే జ్ఞాన సారం! ఇక తదితరుల విషయమంటావా?

అన్యైః కేవలమ్ ఆమ్నాతై రాగమైరేవ వర్ణ్యతే ॥ (ఆమ్నాయః = వేదం శిష్యపరంగా వర్ణించటం)

కొందరు ఆత్మ గురించి 'అది అప్రమేయం-అనంతం-నిత్యం-సత్యం-అఖండం'... ఇత్యాదిగా వర్ణించగలరు. ఏ గ్రంథంలో ఎట్లు చెప్పబడిందో, ఎవరిచే ఎచ్చోట ఏ విధమైన దృష్టాంతాలతో ఎట్లెట్లు వర్ణించబడిందో ఉపన్యసించగలరు. అనేక వాదోపవాదాలతో ఆత్మ ఎంతటిదో నిర్ణయించి ప్రవచించ గలరు. వేద ప్రమాణములు వల్లించగలరు. అవన్నీ మంచిదే కాని అంతటితో సరిపోదు.

'ఆత్మకు అన్యమైనది లేదు. కాబట్టి నేను స్వతఃసిద్ధమగు ఆత్మనే.' సహజీవులంతా నా స్వరూపులే. నేను సహజీవుల స్వరూపుడనే. స్వస్వరూపమగు నా ఆత్మ పదం జన్మ-మృత్యు-జరాదు లచే గాని, మనో-బుద్ధి-అహంకారాదులచే గాని, మార్పు-చేర్పులు పొందేది కాదు. నేను కేవల స్వరూపుడను. జాగ్రత్-స్వప్న-సుషుప్తులకు కేవల సాక్షిని. జన్మ-జరా-మరణములకు కూడా సాక్షిని. ఈ దేహము-మనస్సు-బుద్ధి-అహంకారములను చూచేవాడినే గాని, అవి నేను కాదు. అవి నావి

కావు... అను అనుభవమును పుణికిపుచ్చుకున్నప్పుడే అతడు 'ఆత్మజ్ఞాని' అవుతాడు. అనుభవజ్ఞుడు కానివాడు ఆత్మను వర్ణించువాడే గాని 'ఆత్మజ్ఞుడు' కాదు.

న కాలో, న మనో, నాఽ౭త్మా, న సన్నాసన్న దేశ-దిక్ ।
న మధ్యమేతయోః నాఽ౭న్తం న బోధో నాఽపి అబోధితమ్ ॥

ఆ ఆత్మ కాలము కాదు. మనస్సు కాదు. జీవుడు కాదు. సత్తు కాదు. అసత్తు కాదు. సత్తు-అసత్తుల మధ్యగా ఉన్నదేదో కాదు. దేహము కాదు. దిక్కు కాదు. అంతము కాదు. తన స్వరూపము కంటే అభిన్నమైన ఏదో 'బోధ' కాదు. 'అబోధ' కూడా కాదు.

ఆత్మ సర్వదా ఆత్మగానే ఉన్నది. అద్దాని యందు తదితరమైనదేదీ లేదు. ఏర్పడజాలదు.

ఇక ఈ కనబడే అనేక జీవులు, వారి మధ్య అనిపిస్తున్న అనుకూల-ప్రతికూల-ఉదాసీన ఆదిగా గల సంబంధాలంటావా? ఇవన్నీ జలంలో కనిపించే అనేక తరంగాల యొక్క సంఘాత-విఘాత చమత్కారాల వంటివే! ఒక తరంగం మరొక తరంగమును అనుసరించటం-ఢీకొనటం-ఎదురు-బొదురు అవటం.. ఇవన్నీ జలంలోని అంతర్గత విన్యాసాలయినప్పటికీ జలము సర్వదా సర్వతరంగాతర్గతము-యథాతథము కదా! ఈ అనంత జీవ (మనో-బుద్ధి-అహంకారాది) తరంగాలన్నీ ఆత్మ యొక్క విన్యాసమే అయినప్పటికీ ఆత్మ సర్వదా యథాతథము.

కిమప్యేవ తదత్యచ్ఛం బుధ్యతే బోధపారగైః
శాంత సంసార విస్తారైః పరాం భూమిముపాగతైః ॥

అయినప్పటికీ కూడా... 'బోధ' యందు పారంగతులు, 'సంసార విస్తారము' శమించినట్టి వారు, పంచమ-షష్ఠ-సప్తమ భూమికలను అధిరోహించినవారు... అగు మహాత్ములే ఆ 'విలక్షణం-అతి నిర్మలం'... అగు ఆత్మను అనుభవముగా కలిగి ఉంటున్నారు.

ఇక జగత్తు-మనస్సు-బుద్ధి మొదలైనవి వాస్తవానికి లేవు. లేకపోయినప్పటికీ శాస్త్రాలు అవి ఆత్మబోధ కొరకై కల్పించి, విశ్లేషించాయి. శాంత సముద్రంలో అనేక తరంగాలు ఉన్నట్లు శ్రుతులలో నిషేధించిన వాటిని నిషేధించి, ఉపదేశించిన వాటిని ఉపదేశిస్తూ నేను కూడా ఈ సభలో ఇన్ని రోజులుగా ప్రవచనం చేశాను, చేస్తున్నాను. అదంతా ఆత్మబోధ కొరకై మాత్రమే. అంతేగాని మనస్సు మొదలైన వాటి ఉనికి అంగీకరించి-నిషేధించటం కానే కాదు సుమా! కనుక మనస్సు మొదలైనవన్నీ ఆత్మ పార్థ్యాంశాన్ని బోధించటానికి, తత్ సౌలభ్యం కొరకు కల్పించి చెప్పబడేవి మాత్రమే – అని గమనించు.

అటు చూడు! ఆ పెద్ద శిల ఉన్నది. ఆ శిలలో శిల్పి అనేక శిల్పాలు చెక్కగలడు. అయితే ఆ చెక్కబోయే శిల్పరూపాలన్నీ ఈ కనబడే శిలలోనే ఉన్నాయి కదా! ఏ రూపంగా ఉన్నాయి?

శ్రీరాముడు : ఆ శిలలోనే శిల రూపంగానే – చిత్రీకరించబడబోయే శిల్పాలన్నీ-అప్రకటిత రూపంలో ఉన్నాయి.

శ్రీ వసిష్ఠ మహర్షి : అవునా! అట్లాగే నిజ స్వరూపముననే ఉన్న పరమాత్మయందు ఈ వివిధ జగత్తులు – జగత్ పదార్థములు ఒదిగి ఉన్నాయి.

ఈ ప్రకారంగా అధిష్ఠాన రూపము చేత మనోబుద్ధి – చిత్త – అహంకారాలు, దృశ్య వ్యవహారం, ఈ సమస్త పదార్థములు పరమాత్మయందే ఉన్నాయి. (శిల్ప రచన అంతా శిలల్లోనే ఉన్నట్లు!). అయినా కూడా దృశ్యరూపంగా చూస్తే (వేర్వేరు మృగాలు–చెట్లు–వ్యక్తులు... చిత్రీకరించబడిన శిల్పం వలె)... దృశ్యం లేదు. (శిల్పంలో ఉన్నదంతా శిలయే కదా!)

ఆ పరమాత్మయే సర్వ స్వరూపుడు. ఈ మనో–బుద్ధి–చిత్త–అహంకారాలు, ఈ సంగతి–సంబంధ–బాంధవ్యాదులు... ఇవన్నీ కూడా "పరమాత్మాంతర్గత –పరమాత్మ స్వరూపాలే!"

కానీ అతడు తనకు తదితరమైన ఏ రూపంగానూ అగుటయే లేదు. అతడే పదార్థ రూపుడుగా అగుచున్నాడు. కానీ అతడు అపదార్థ స్వరూపుడుగానే ఉన్నాడు.

శిలయందు ఇంకా విగ్రహం చెక్కబడుతున్నప్పుడు ఆ శిలలో విగ్రహం ఉన్నదా? లేదా? ఉన్నదనీ చెప్పవచ్చు. ఎందుకంటే... శిల్పి శిల నుండే కదా... విగ్రహం తయారు చేస్తున్నాడు! లేదని కూడా అనవచ్చు. ఎందుకంటే, శిల ఎల్లప్పుడూ శిలయే కదా!

"అంతా - అంతటా ఆత్మయే" - అట్లాగే, ఆత్మైక్యం పొందిన మహనీయులు తమ ఇచ్ఛను అనుసరించి ఆ పరమాత్మను 'సర్వ పదార్థయుక్తుడు' గాను, 'సర్వ పదార్థ రహితుడు' గాను కూడా దర్శిస్తూ ఉంటారు.

సర్వం సర్వాత్మకంచైవ సర్వార్థ రహితం పదమ్ ।
సర్వార్థ పరిపూర్ణం చ తత్ 'ఆద్యం' పరిదృశ్యతే ॥

'సమస్తమునకు ఆది' అయినట్టి ఆ 'ఆత్మపదము'ను జ్ఞానులు 'సర్వరూపంగాను, సర్వాత్మకంగాను, సర్వ పదార్థ రహితంగాను, సర్వ పదార్థ పరిపూర్ణంగాను'... వీక్షిస్తూ ఉంటారు.

అసంశయం - సమగ్రం - ఎవరైనా "సర్వ పదార్థముల ఉపశమనరూపమగు 'సమ్యక్ జ్ఞానం' ఉత్పన్నం కాలేదు... అని అనటానికి గుర్తు ఏమిటి?" అని అడిగితే... అందుకు గుర్తు వారికి ఇంకా సంశయములు మిగిలి ఉండటమే సుమా! సర్వ సంశయములు శమించినట్టి జ్ఞాని దృశ్యము యొక్క అభాస లేనివాడౌతాడు. స్వభావ సిద్ధంగానే నిర్మలాంతఃకరణుడు, శాంతుడు అవుతాడు. అట్టివాడు ఆత్మ స్వభావమును అప్రయత్నంగానే పరికిస్తాడు.

బంగారం ముద్దలో రకరకాల అభరణాలు ఉన్నట్లు, ఆ పరమాత్మలో 'నేను–నీవు–వాడు–వీడు' మొదలైన త్రికాల జగద్భ్రమ అగుపిస్తోంది. బంగారానికి వేరుగా అభరణం ఎక్కడున్నదయ్యా? పరమార్థఘనమగు పరమాత్మ కంటే వేఱుగా జగత్తు కూడా లభించనే లభించదు. 'గొలుసు–ఉంగరం' మొదలైన అభరణాల పేర్ల కంటే బంగారం వేఱుగా ఉన్నట్లుగానే... 'నామ రూపమయం–ద్వైతాత్మకం–మిథ్య' అయినట్టి జగత్తు కంటే 'నిజ స్వరూపభూతుడు' అగు పరమాత్మ వేఱుగా ఉన్నాడు. అట్టి ఆత్మకు దేశ–కాల–క్రియాది శబ్ద–అర్థములు లేవు. కానీ దేశ–కాల–క్రియాదులుగా కనిపిస్తున్నదీ, ఒప్పుచున్నదీ అదే! ఇంకా... యథా స్థితమైనట్టి ఈ సమస్త జగత్తు కూడా అధిష్ఠాన రూపం చేత అద్దానియందే ఉన్నది. అనగా, దీనికి ఆత్మకు వేరైన రూపమేదీ లేనే లేదు.

ఆత్మకు వేరుగా దృశ్యం లేదు. ఆత్మ దృశ్యంగా లేదు. శాంత సముద్రంలో తరంగాదులు ఉన్నట్లు, చిత్రకారుని చిత్తంలో చిత్రం ఉన్నట్లు, మట్టిలో మట్టి పాత్రల వివిధాకారములున్నట్లు,... బ్రహ్మమున ఈ జగత్తు ఉన్నది.

ఈ విధంగా జగత్తే బ్రహ్మము. బ్రహ్మమే జగత్తు. ఈ రెండూ అభేదమై ఉన్నాయి. కాబట్టి పరమాత్మలో జగత్తు ఉన్నది. జగత్తు లేదు కూడా!

తత్త్వజ్ఞానము సంపాదించుకొన్న తర్వాత, ఇక అట్టి దృష్టిచే ఈ జగత్తు 'నిత్యము-నిర్మలము-శాంతము'... అయినట్టి పరమాత్మయందు తన్మయము (బ్రహ్మము) గాను, శాంతముగాను వెలయుచున్నదే అగుచున్నది. గొప్ప కొయ్య నందు ఇంకను చెక్కబడని విగ్రహము అప్రకటితమై ఉన్నట్లుగానే,.. ఈ స్వర్గ-మర్త్య-పాతాళ లోకములు బ్రహ్మమునందు 'నిజసాక్షి చైతన్యము' అను శిల్పికి కనిపించుచున్నాయి. కొయ్యయందు విగ్రహం ఆ కొయ్యను చెక్కినప్పుడే కదా అగుపించేది! కానీ, బ్రహ్మము విషయానికి వస్తే... బ్రహ్మము సర్వదా వికార రహితము అయినప్పటికీ,... సృష్టాత్మకమైన వివర్త రూపంగా గోచరిస్తోంది. 'నిరతిశయానందము' అను పూర్ణానందమునందు 'చిన్మయము' నుండి జాలువారినవై ఈ సృష్టులు భాసిస్తున్నాయి. కానీ అవిద్య చేత మాత్రమే ఈ సృష్టులు 'చిద్ఘనము' నందు విభాగయుక్తంగాను, క్షోభ సహితంగాను, నిజమే అయినట్లుగా ప్రకాశించుచున్నాయి. అట్లు విభాగయుక్తంగా (అజ్ఞాన దృష్టికి) కనిపిస్తున్నప్పటికీ ఈ జగత్తులకు 'ఉనికి స్థానం' అనతగిన ఆత్మ (లేక) బ్రహ్మము సర్వదా విభాజక ధర్మరహితము, క్షోభవర్జితము, స్వయంప్రకాశకము అయి ఉన్నది.

పరమశాంతమగు బ్రహ్మమున అనేక భేదములతో కూడిన ఈ జగద్దృశ్యము బ్రహ్మమునకు కించిత్తు కూడా వేఱుకాకయే ఉంటోంది. 'చిద్ఘనరూపము' అగు బ్రహ్మము నందు అణువణువునా జగత్సమూహములు భాసిస్తున్నాయి.

ఆద్యంత రహితమగు బ్రహ్మమున ఆద్యంత సహితములగు జగత్తులు భ్రమచే ఆవిర్భవిస్తున్నాయి. అయితే కూడా... బ్రహ్మము సర్వదా బ్రహ్మముగానే ఉన్నది. ఈ జీవుడు బ్రహ్మమే స్వస్వరూపముగా కలిగి ఉన్నాడు. అత్యంత నిర్మలమగు బ్రహ్మమునందు ఈ జగత్తు మొదలైనవి ఉండజాలవు.

ఓ రామచంద్రా! 'అవయవ రహితము-నిరాకారము అగు బ్రహ్మము (లేక) పరమాత్మకు ఆ ఆకాశ-వాయు-కాల ఆదిగా గల పదార్థములు అవయవ రూపములు వంటివి'... అని వర్ణించి చెప్పటం కూడా వాస్తవానికి మిథ్యా వర్ణనమేనయ్యా! 'పరమాత్మ అంతయు అధిష్ఠించియున్నవాడు' అను వాక్యార్థమును శోధించగా, పరమాత్మ సర్వదా నిరవయవుడే! ఆత్మతత్త్వము సర్వభావ వికార రహితమై ఉన్నప్పటికీ,... 'అధ్యారోపదృష్టి' (అదియే ఇవన్నీ అవధరించుచున్నది.. అను దృష్టిచే) శ్రుతులు ఆ పరమాత్మను 'సర్వ రూపుడు' (ఈ సర్వము ఆయన రూపములే)... అని వర్ణించాయి.

❖❖❖

14. బ్రహ్మ సత్యమ్ - జగత్ మిథ్యా

శ్రీరాముడు : మహాత్మా! అల్పజ్ఞులగు శిష్యులకు మహనీయులగు తమ వంటి జగద్గురువులు సుబోధకమయ్యేంత వరకు సమస్త విషయములు చర్వితచర్వణంగా బోధిస్తూనే ఉంటారు కదా!

ఇప్పుడు నా ఈ విన్నపం వినండి - ఈ జగత్తులో అనేక అసాధారణ విశేషాలు వినిపిస్తున్నాయి.

చేత్యము (స్మృతి) యందు చేతనత్వం (స్మృతిత్వం); కాలము నందు కాలత్వం; ఆకాశం నందు ఆకాశత్వం; జడమునందు జడత్వం; వాయువునందు వాయుత్వం; భూత-భవిష్యత్-వర్తమానములందు త్రికాలత్వం; స్పందనము నందు స్పందత్వం; మూర్తము (ఆకారం) నందు మూర్తత్వం; భిన్నమునందు భిన్నత్వం; అనంతము నందు అనంతత్వం; దృశ్యమునందు దృశ్యత్వం; సృష్టులలో సృష్టిత్వం... ఈ విధంగా 'స్మృతిత్వం-ఆకారత్వం-జడత్వం-వాయుత్వం-త్రికాలత్వం-స్పందత్వం-మూర్తత్వం-భిన్నత్వం-అనంతత్వం-దృశ్యత్వం-సృష్టిత్వం... మొదలైన అసామాన్యమైన విశేషాలన్నీ సర్వసామాన్య రూపమగు బ్రహ్మం నుండి ఏ క్రమంచే ఏర్పడి పరిఢవిల్లుచున్నాయో... ఆ విశేషం చెప్పండి.

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! నీవు చెప్పిన ఆ సమస్త వస్తువులకు 'ఆధారము' ఏదైతే ఉన్నదో... అయ్యది మహాచిద్ఘనము అగు బ్రహ్మమే! అట్టి బ్రహ్మము పరమాకాశమై, అవేద్యమై (తెలుసుకునేదంతా అదే కాబట్టి అది తెలియబడనిదై), చిద్రూపమయమై (ఎఱుక), శాంతమై, ఏకమై (అది ఎప్పుడూ అనేకంగా అవటం లేదు), సర్వత్రా సమమై ఉన్నది.

దృష్టిచే సృష్టి కనిపిస్తోంది. సృష్టియందు నీవు చెప్పిన జ్ఞప్తిత్వాదులు దర్శనమగుచున్నాయి. అయితే కనిపించేదానినంతటినీ అధిగమించి చూస్తే... అప్పుడు నిత్య నిర్మల-నిర్విషయ చిదాకాశం మాత్రమే శేషించి ఉంటుంది, చూడబడే సర్వమునకు ఆవల చూచేవాడు ఉన్నాడు కదా! చూడబడేదంతా అధిగమించి పరిశీలిస్తేనే దృశ్య-దర్శన రహితుడగు శుద్ధాత్మ గమనించ బడతాడు.

అట్లు అధిగమించినప్పటి పరిశీలనయే 'మహా ప్రళయం'. అట్టి మహా ప్రళయంలో సర్వ విషయాలు 'లేనివిగా' తెలియవస్తాయి.అట్టి సర్వనాశన (సర్వ రాహిత్య స్థితిలో) బ్రహ్మ-విష్ణు-మహేశ్వరులతో సహా సర్వ నామ-రూపాలు అంతర్ధానమౌతాయి. అప్పటికీ ఏ శుద్ధ సన్మాత్రం శేషిస్తుందో ...అద్దానిలో ఈ జన్మకారకాలైన 'మాయ-మోహం-భ్రమ-పాపం' మొదలైన ఆకృతులు కలిగిన బీజాలే ఉండవు. అట్టి చిదాకాశం యొక్క ఘనత్వం ముందు ఈ అతిసూక్ష్మ మగు భౌతికాకాశం కూడా శిల వలె అత్యంత స్థూలంగా కన్పట్టుచున్నది. అట్టి పరమ సూక్ష్మం-కేవలం శాంతం -అతి నిర్మలం-ఆద్యంత రహితం-సన్మాత్రం అయి ఉన్నదానినే శాస్త్రములు 'బ్రహ్మం' అనే పేరుతో పిలుస్తున్నాయి. అది ఉన్నదా? ఉనికి లేనిదా?

నచ 'నాస్తి' ఇతి తద్వక్తుం, యజ్యతే చిద్వపుర్యదా ।
నచైవ 'అస్తి' ఇతి తద్వక్తుం, యుక్తం శాంతమలం తదా ॥

ఎప్పుడైతే ఆ చిన్మాత్ర స్థానం 'మాయ' అనే దోషము లేనిదై ఉంటుందో... అద్దానిని 'ఉన్నది–లేదు' అనే వాచ్య వృత్తిచే చెప్పలేం. ఒకానొకదానిని – 'ఉన్నది' అని 'లేదు' – అని ఇంద్రియార్థముల దృష్ట్యా (శబ్ద–స్పర్శ–రూప–రస–గంధముల దృష్ట్యా) మాత్రమే చెప్పుతూ ఉంటాం. ఆత్మయే, ఇంద్రియార్థములకు విషయం కాదు. కనుక 'లేదు' అనవచ్చేమో! కాని, ఈ ఇంద్రియార్థములు ఎద్దాని భావనచే ఏర్పడుచున్నాయో, ఎయ్యది భావనలన్నిటికీ ఆవిర్భావస్థానమో, అట్టి చిత్‌సత్తే లేకపోతే భావనలకు–ఇంద్రియార్థములకు ఉనికి ఎక్కడిది? కనుకనే "అది 'ఉన్నది–లేదు' అను చర్చకు విషయమే కాదు అని చెప్పబడుతోంది."

శ్రీరాముడు : శుద్ధతత్త్వమగు అట్టి శుద్ధ బ్రహ్మము మనకు అనుభవమయ్యేది ఎక్కడ?

శ్రీ వసిష్ఠ మహర్షి : కనబడుచున్న ఈ సర్వమునకు ఆధారము, వాస్తవ సత్త అగు బ్రహ్మము ఎచ్చట ఎట్లు ఉన్నదో, సూచించటానికి ఒకటి–రెండు విశేషాలు చెపుతాను, విను.

1. విషయం విషయం మధ్యగల నిర్విషయ చైతన్యమే బ్రహ్మము -

నిమేషే యోజనశతే ప్రాప్తాయామ్ ఆత్మ సంవిది
మధ్యే తస్యాస్తు యద్రూపం, రూపం తస్య పదస్య తత్ ॥

నీవు ఒకచోట నిలబడి వేలాది మైళ్ళ దూరంలో ఉన్న దేనినైనా (ఉదాహరణకు చంద్రుణ్ణి) చూస్తున్నావనుకో. ఇప్పుడు జరుగుతున్నదేమిటి? నిమిషమాత్రంలో ద్రష్టయగు నీ యొక్క సంవిత్తు (జ్ఞానము) నేత్రవృత్తి ద్వారా సుదూరంగా వేలాది మైళ్ళ దూరంలో ఉన్న చంద్రబింబాన్ని చూస్తోంది కదా! అట్లా ఒక వృక్షము యొక్క శాఖల మధ్యగా చంద్రబింబాన్ని చూస్తున్నావనుకో, అప్పుడు 'వృక్ష శాఖ'ను అధిగమించిన తర్వాత... చంద్రబింబమును ఇంకనూ చేరకముందు మధ్యలో ఏ నిర్విషయ జ్ఞాన (లేక) ప్రజ్ఞ స్వరూపము ఉన్నదో... అదియే పరమాత్మపదము.

ఈ మధ్య స్థానంలో దృష్టి సంవిత్తు నిర్విషయమై ఉన్నది. ఆ నిర్విషయ ప్రజ్ఞయే ఆత్మపదము యొక్క స్థానం. ఆ ప్రదేశంలోని విషయరహితమగు శుద్ధ ప్రజ్ఞయే ఆత్మ స్వరూపం

విషయ ప్రజ్ఞ (–) విషయములు = 'శుద్ధ సంవిత్తు'

2. నిశ్చల మనస్సు యొక్క స్వానుభవమే ఆత్మ - ప్రతి జీవునికి 'మనస్సు' అనేది ఉన్నది కదా! అయితే ఈ మనస్సు బాహ్య–అభ్యంతర వాసనాజాలంలో చిక్కుకొని ఉన్నది. (విషయాల పట్ల అభిలాషయే వాసనల రూపం). అది విషయాల భ్రమ యందు తారట్లాడుతోంది. అనేక చింతలు కలిగి ఉంటోంది. సుఖ–దుఃఖాలను పరంపరగా పొందుతోంది. అశాంతితో చంచలమై ఉంటోంది. అవునా? అయితే... అట్టి ఈ మనస్సు సాధన యొక్క (అభ్యాసం యొక్క) యోగ బలం చేత బాహ్య అభ్యంతర వాసనాజాలం నుండి బయల్వెడలి విషయ భ్రమను శమింప జేసుకొన్నదై, చింతా రహితమై, అప్పుడే పుట్టినవానివలె జగద్విషయములేవీ లేనిదై, విషయముల గూర్చిన సుఖ–దుఃఖ మననములను త్యజించినదై, శాంతి వహించినదై, 'సమాధి' యందు (సర్వ సమత్వంలో) ఆరూఢమై వెలయుచున్నదనుకో... అట్టి నిర్మల (విషయరహిత–విషయాలను అధిగమించివేసినట్టి) నిశ్చల మనస్సు యొక్క స్వరూపమే ఆ 'ఆత్మపదము'.

3. సత్తా సామాన్యము – ఏ సత్తా సామాన్యము దేహ పరిమితత్వము త్యజించి సర్వ దృశ్య పదార్థములందు వ్యాపించినదై, వాటన్నిటి ఉత్పత్తికి హేతుభూతమై ఏర్పడి ఉంటుందో... ఆ స్వానుభవమగు సత్తా సామాన్యమే ఆత్మ పదము.

ఓ రామచంద్రా! ఈ ఆకారయుక్తం-భేద సహితం-సకారణంగా తోచుచూ ఏ ఈ జగత్తు స్పష్టంగా కంటికి కనిపిస్తోందో... అట్టి ఇదంతా కూడా ఆత్మ పదంలో ఉత్పత్తియే అయి ఉండలేదు. ఎందుకంటే ఆత్మయందు 'జగత్తు' అనేది ఉత్పత్తి అవటానికి కారణమే లేదు కనుక! కాబట్టి ఇదంతా వాస్తవానికి ఆకారయుక్తంగానూ లేదు. ఏకమూ కాదు. ద్వైతమూ అయి ఉండలేదు. ఏది స్వతహాగా కారణరహితమై ఉన్నదో అయ్యది ఈ జగత్తులో విషయ సత్తగా లేదు. అంతే కాదు.

ఏది స్వయంగా 'అనునిత్యానుభూత స్వరూపం' అట్టి 'చిత్'ను ఇక్కడి నుండి తొలగించటం ఎవరి తరమూ కాదు.

శ్రీరాముడు : 'జగత్తుకు కారణం లేదు' అనే బదులు, 'బ్రహ్మమే జగత్తుకు కారణం'... అని అనవచ్చును కదా?

శ్రీ వసిష్ఠ మహర్షి : బ్రహ్మం జగత్తుకు కారణం కాజాలదు. ఎందుకంటావా? 'బ్రహ్మం దృశ్య శూన్యం, ఆద్యంతరహితం, చిద్రూపం, నిరాకారం' అని బ్రహ్మజ్ఞుల నిత్యానుభవం, అట్టి బ్రహ్మం సాకారం, దృశ్యం, అబ్రహ్మరూపం అగు జగత్తుకు కారణం ఎట్లా అవుతుంది చెప్పు?

తస్మాత్ తత్ర జగద్రూపం యదాభాతం తదేవ తత్,
స్వయమేవ తత్ ఆభాతి చిదాకాశమితి స్తితమ్ ॥

అందుచేత, కారణ రహితమగు బ్రహ్మమునందు ఏ జగత్తు భాసిస్తోందో అది 'చిదాకాశమే ఆ రూపంగా' భాసిస్తున్నదగుచున్నది.

గొలుసుగాను, గాజుగాను బంగారమే అగుచున్నప్పటికీ గొలుసు-గాజుల భేదానికి బంగారం కారణం కాదుకదా! బంగారం దృష్ట్యా ఏ భేదం గొలుసుకు-గాజుకు అగుపిస్తోందో అది భ్రమ మాత్రమే! ఈ జగత్తు చిద్రూపమగు బ్రహ్మమే అయి ఉండటం చేత జగత్తులో వేర్వేరు ధర్మాలుగా అగుపిస్తున్న వస్తువుల మధ్య భేదం భ్రమయే! అదంతా అనేక ఆకారములు గల తరంగాల వంటిది. ఒకే లోహం యొక్క అనేక పనిముట్ల వంటిది. కావున, సర్వత్రా 'ఏకం-అజం-శాంతం-ద్వైత-ఏకత్వ రహితం, సర్వరూపం-నిర్వికారం అగు బ్రహ్మమే అంతటా నిండి ఉన్నది.

పూర్ణాత్ పూర్ణం విసరతి, పూర్ణే పూర్ణం విరాజతే, ।
పూర్ణమేవ ఉదితం పూర్ణే, పూర్ణమేవ వ్యవస్థితమ్ ॥

భ్రమ శమించిందా... అంతటా బ్రహ్మమే! అప్పుడు పూర్ణమగు బ్రహ్మము నుండి పూర్ణమగు జగత్తు ప్రసరించినదగుచున్నది. పూర్ణమగు బ్రహ్మమున పూర్ణమగు జగత్తు ఉదయించినదై విరాజిల్లుచున్నదగుచున్నది.

కాబట్టి ఓ రామచంద్రా! 'బ్రహ్మము నుండి అనేక విషయములతో కూడిన ఈ జగత్తు ఏ క్రమమును అనుసరించి ఉద యించింది?'... అని అడిగావు కదా!

మా సమాధానం విను.ఈ జగత్తంతా కూడా... సదా, సర్వ ఆకారవర్జితము, శాంతము, సమము, ఉదయ-అస్తమయరహితము, ఆకాశము వలె నిర్మలము, ఏకము, సత్-అసత్ రూపమున వ్యక్తము అగు బ్రహ్మమే స్వయముగా అయి ఉన్నది. బ్రహ్మము తప్పించి 'జగత్తు' అనబడు శబ్దార్థములు ఆత్మానుభవ దృష్టికి అగుపించటమే లేదు.

❖❖❖

15. జలమందు ద్రవత్వం - బ్రహ్మమునందు జగదత్వం

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఈ జగత్తు అనే నిర్మలమైన ఆకాశము సద్రూపము అయిన 'బ్రహ్మాకాశము' నందే నెలకొని ఉన్నది.

జగత్ నామ నభః స్వచ్ఛం సత్ బ్రహ్మ నభసి స్థితమ్
నభో నభసి భాతీదం 'జగత్' శబ్దార్థ ఇతి అజమ్ ॥

చిదాకాశమే చిదాకాశమునందు 'జగత్తు' అను శబ్ద-అర్థములతో నెలకొని ఉన్నది. కనుక జగత్తు కూడా చిదాకాశము వలెనే వికార శూన్యమగు బ్రహ్మమే అయి ఉన్నది. 'నీవు-నేను-జగత్తు' ఇత్యాదిగా గల శబ్దములు, వాటి అర్థములు అంతర్హిత దృష్టిచే చిదాకాశముతోటి సమముగా భాసించుచున్నవి. అవన్నీ చిదాకాశమునకు వేరై లేకయే ఉన్నది. అవి సర్వదా సద్రూపమగు బ్రహ్మమే అగుచూ, బ్రహ్మమునందే వెలయుచున్నాయి. ఈ పృథ్వి-మేఘము-పర్వతము-సముద్రము మొదలైన సమస్త పదార్థములు... ఇవన్నీ కూడా 'జన్మాది రహితము-కాష్ఠమౌన స్వరూపము' అగు బ్రహ్మమునందే ఉండి ఉన్నాయి. అట్లే....

దృశ్య స్వభావరహితుడైన ద్రష్ట, కర్తవ్య-కారణ స్వభావరహితుడైన కర్త... వీరుభయులు చిన్మాత్ర స్వభావమగు స్వాత్మ యందే స్థితి కలిగి ఉన్నారు.

ద్రష్ట యొక్క భావనచే దృశ్యం అనుభవమౌతోంది. దృశ్యము యొక్క 'అభావము' చేతనో...? 'శుద్ధచిత్' స్వభావమున జ్ఞత్వము గాని, కర్తృత్వము గాని, జడత్వము గాని, శూన్యత్వము గాని, పదార్థముగాని, ఆకాశత్వముగాని... లేకయే ఉన్నాయి. ఈ కనబడే సమస్తం కూడా ఒక పెద్ద శిల యొక్క మధ్య భాగం వలె 'సత్‌చిత్' ఘనము-ఏకము-అజము-సర్వ వ్యాపకము - శాంతము - ఆద్యంతరహితము - విధినిషేధాలలో సమాన రూపము'... అయినట్టి పరబ్రహ్మమే అయి ఉంది.

మరణం జీవితం సత్యం అసత్యం చ శుభ-అశుభమ్ ।
సర్వం ఏకమ్ అజమ్ వ్యోమ, వీచిజాలజలం యథా ॥

తటాకంలో కనిపించే రకరకాల తరంగాలు, ఆవర్తాలు, ఆ తరంగాలు లయించటం, తరంగాలు ఒకదానిని ఒకటి ఢీ కొనటం, ఒకదానికొకటి అనుసరించటం ఇవన్నీ కూడా జల స్వరూపమే గాని... అవేవీ జలానికి అన్యం కాదు కదా! అట్లాగే ఇక్కడ దృశ్య విభాగమై కనిపించే జీవనము-మరణము-సత్యము-అసత్యము-శుభము-అశుభము ఇవన్నీ కూడా స్వప్నంలో కనిపించిన నగరంలోని ఆయా విశేషాలుగా భ్రమతుల్యమే!

సృష్టికి పూర్వం మొట్టమొదటగా ఏ నిష్ప్రపంచమగు బ్రహ్మము ఉండి ఉన్నదో... అదియే ఇప్పుడు కూడా తన నిర్మల చిదాకాశమున ఈ జగద్రూపంగా స్థితినొంది ఉన్నది. స్వప్న ద్రష్టలోనే స్వప్నం ఉన్నట్లుగా చిదాకాశమునందే ఈ జగత్తు ఉన్నది. కాబట్టి సర్వాత్మకమగు ఈ సర్వ జగత్తు కూడా నిష్ప్రపంచకమగు బ్రహ్మము రూపముననే ఇప్పుడు కూడా (సృష్టికి ముందువలె) ఉన్నది. ఆ పరమాత్మ నిర్విషయం కదా! ఒక ప్రదేశపు ధ్యాస నుండి మరొక ప్రదేశపు ధ్యాస మధ్య ఏ 'నిర్విషయ చైతన్యరూపం ఉన్నదో అదియే ఆ పరమాత్మ యొక్క రూపం'.

తరంగం యొక్క ముందు-మధ్య-ఉత్తర మూడు స్థితులూ జల రూపమే కదా! అట్లాగే ఈ జగత్తు యొక్క పూర్వ-మధ్య-ఉత్తర స్థితులందు ఇదంతా శాంత రూపమగు బ్రహ్మమే కానీ, మరింకేమీ కాదు. ఏది ఆరోపిత జగత్ రూపంగా ఉదయించినట్లు అనిపిస్తోందో... అదంతా జ్ఞాన దృష్టిచే ఉదయించనే లేదు. ఒక విషయం -మరొక విషయం మధ్య ఏది మనస్సుకు నిర్విషయమై లభిస్తుందో... అట్టిది నిర్విషయ చైతన్యం కంటే భిన్నం కాదు. తరంగం-తరంగం మధ్యగల జలం జలంగా సుస్పష్టంగా కనిపించునట్లు, తరంగం కూడా జలమే అయినప్పటికీ తరంగత్వదర్శనం చేత జలంగా అజ్ఞానజ్ఞప్తికి అనిపించకపోయినట్లు... నిర్విషయ చైతన్యం విషయాస్వాదన లయించిన ప్పటి స్థితిలో ఘనీభూతమై అనుభవమౌతోంది.

ఈ విధంగా సృష్టి చైతన్యము కంటే భిన్నం కాదు. ఒకవేళ ఎవరికైనా భిన్నంగా అనిపిస్తోందం టారా? దూరంగా కుందేలు కదలుతూ ఉంటే అద్దాని చెవులు నిక్క పొడుచుకోవటం చేత కుందేటికి కొమ్ములు ఉన్నట్లు అనిపిస్తుంది. అంతమాత్రం చేత కుందేటికి కొమ్ములు ఉన్నాయా? లేవు. మరి కొమ్ములు కనిపిస్తున్నాయి కదా? కుందేలును సమీపంగా చూస్తే 'కుందేటికి కొమ్ములు ఉండవు' అని తెలియగలదు కదా! జగత్తుగా కనబడేదంతా (చైతన్యమునకు వేరై తోచేదంతా) భ్రమ మాత్రమే! 'కుందేలుకు కొమ్మలు కనబడటానికి అసలు కారణమేమిటి?'... అని వెతికామనుకో. దానికి కారణం ఏముంటుందీ... 'భ్రమ' తప్పితే? అసత్యమగు భ్రమ సత్యమెట్లా అవుతుంది.

శ్రీరాముడు : స్వామీ! 'భ్రమ' అని దేనిని అంటున్నాం?

శ్రీ వసిష్ఠ మహర్షి :

యత్ అకారణం భాతి తదభాతం భ్రమాత్మకమ్ ।
భ్రమస్య, అసత్య రూపస్య 'సత్యతా' కథమ్ ఉచ్యతే ॥

ఏది కారణం లేకయే భాసిస్తుందో (అనుభవమౌతోందో)... అది భ్రమాత్మకం. అది వాస్తవా నికి భాసించనిదే (అనుభవార్హత లేనిదే) అగుచున్నది. కాబట్టి అసత్యం-భ్రామరూపం అగు జగత్తు 'సత్యం' అని ఎట్లా అంటారు? బ్రహ్మమున 'జగత్తు' అనబడేది ఉండటానికి కారణమే లేదు. కారణమే లేనిదానికి 'సత్త' ఎక్కడి నుండి వస్తుంది? గొడ్రాలికి కలలో కనిపించిన కుమారుడు నిజమైన కొడుకు ఎట్లా అవుతాడు? ఏది కారణం లేకయే భాసిస్తోందో, అది "ద్రష్ట యొక్క చైతన్యమే అట్లు ఆ స్వరూపంగా విజృంభిస్తోంది" అని అనక తప్పదు. ఉదాహరణకు ఒకడు స్వప్నంలో కొన్ని

వస్తువులను చూస్తున్నాడు. ఆ వస్తులన్నీ ఎచ్చటనుండి తయారయ్యాయి? స్వప్న ద్రష్ట యొక్క 'స్వప్న చైతన్యము' చేతనే ఆ స్వప్నాంతర్గత రూపాలన్నీ రూపుదిద్దుకున్నాయని అనక తప్పదు కదా!

ఏ 'సంవిత్తు' అయితే నేత్రవృత్తి ద్వారా ఒక దృశ్యం నుండి మరొక దృశ్యం వైపుకు వెళ్ళు చున్నదో... అదియే ఆ రెండు విషయాల (దృశ్యాల) మధ్యగా దృశ్య రహిత స్థితిలో ఉన్నది కదా! అదే 1. దృశ్య వృత్తి, 2. దృశ్యరూపము కూడా ధరిస్తోంది. కనుక 'జగత్తు'గా ద్రష్టకు అనుభవమయ్యే దంతా అతని సంవిత్తే నేత్ర వృత్తి ద్వారా దృశ్యరూపము అవధరించినదై... అతనికి అనుభవమౌతోం దని సూక్ష్మ దృష్టిచే గ్రహించు. అయితే చైతన్యం దృశ్య వృత్తి ద్వారా దృశ్యం పొందుచున్నప్పటికీ చైతన్యం సర్వదా యథాతథంగానే ఉన్నదని గ్రహించుటయే పూర్ణ జ్ఞానం. ఆకాశం కంటే కూడా 'అత్యంత సూక్ష్మం' అయినట్టి బోధరూపమగు చైతన్యమే పదార్థ రూపంగా కూడా ప్రకాశిస్తోంది. అంతఃకరణంలో కలిగే 'స్వప్నం-ఊహారూపాలు'... మొదలైనవే ఇక్కడ మనకు దృష్టాంతం.

శ్రీరాముడు : మహర్షీ! ఈ జగత్తు చైతన్య స్వరూపుడగు ద్రష్ట యొక్క కల్పనాదర్శనమే అని అనుకుందాం. అయితే ఈ జగత్తు 'అకారణం' అని మీరు సిద్ధాంతీకరిస్తున్నారు. 'ఒక మఱ్ఱి విత్తులో భావికాలపు సువిశాలమైన మఱ్ఱివృక్షం ఉన్న విధంగా చైతన్య పరమాణువునందు జడరూపంగా ఈ జగత్తు ఉన్నది' అని ఎందుకు అనుకోకూడదు?

శ్రీ వసిష్ఠ మహర్షి : బీజం సాకారం కాబట్టి అది ఒకప్పుడు మట్టి-జలముల సహకారి కారణం చేత కాలక్రమంగా అంకురించి సాకారమై అనేక శాఖలతో కూడిన మహా వృక్షముగా అగుచున్నది. కానీ చైతన్యము నిరాకారం కదా! నిరాకారంలో సాకారమైన ఏ సహకారి కారణం పొసగుతుంది చెప్పు? మహా ప్రళయంలో సమస్త జగత్తు నశించినప్పటి స్థితిలో జగత్తు మరల ఉత్పత్తి కావటానికి కారణం కాగల సాకారమగు బీజము ఎక్కడిది? ఆ బీజమునకు 'జగత్తు' అనే రూపంగా అంకురింపజేసే సహకారి కారణాలు ఎక్కడున్నాయి? ఎక్కడి నుండి వస్తాయి?

పైగా...'శాంతము-శుద్ధము-నిరాకారము' అగు పరబ్రహ్మమునందు ఆకారముల కల్పన ఎచ్చట? పరమా ణువు యొక్క సంబంధం ఏమున్నది? అందులో బీజం ఎట్లా ఉంటుంది?

కారణస్యైతి బీజస్య సత్య-అసత్యైక కారిణః
అసంభవాత్ జగసత్తా, కథం కేన కుతః క్వ కా?

కనుక 'సత్-అసత్' రూపమగు బీజరూప కారణమే అసంభవమైనప్పుడు ఇక చైతన్యమునందు జగత్తు యొక్క ఉత్పత్తి ఎట్లు, దేనిచే, ఎచట, ఏ రీతిగా సంభవం? సంభవం కాదు. కాబట్టి 'పరమాత్మ' అనే అణువునందు "జగత్తు కలదు" అని అనటం ఉచితం కాదు. ఆవగింజలో మేరుపర్వతం ఎట్లా దాగి ఉంటుంది? కాదు... 'జగత్తు కూడా నిరాకారమే కదా!'... అని అంటావా? సాకారమగు బీజం ఉన్నప్పుడు మాత్రమే 'కారణ-కార్య' దృష్టులు ప్రవర్తిస్తాయి. నిరాకారమగు దానిలో బీజమేమిటి? జన్య-జనక క్రమం ఎక్కడుంటుంది?

కనుక రామచంద్రా! ఏ పరతత్త్వమగు బ్రహ్మము కలదో... అదియే (మాయచే) ఈ జగత్తు

రూపంగా కనబడుచూ ఉన్నది. వాస్తవానికి ఇక్కడ ఏదీ ఉత్పన్నం కావటం లేదు, నశించటమూ లేదు. చిదాకాశమున చిదాకాశమే 'జగత్తు' రూపంగా నెలకొని ఉన్నది.

చిత్తము నందలి చైతన్యం యొక్క 'స్ఫురణ'చే ఈ 'జగత్ భ్రమ' ఉదయిస్తోంది. అశుద్ధ చిత్తం దీనిని అశుద్ధ జగత్తుగా (ఎక్కువ-తక్కువలు, జీవులు, అయినవాళ్ళు-కానివాళ్ళు మొదలైనవిగా) దర్శిస్తోంది. శుద్ధ చిత్తము దీనినంతటినీ నిత్య బ్రహ్మముగా దర్శిస్తోంది. ఇక్కడి జగద్విశేషం ఇంత మాత్రమే! ఆకాశమందు శూన్యత్వము, జలమునందు ద్రవత్వము ఉన్న విధంగానే ఆత్మయందు 'ఆత్మ వివర్తరూపము-శుద్ధము'... అగు ఈ సృష్టి రూప అన్యత్వం (అజ్ఞాన దృష్టికి) అనిపిస్తోంది.

ఇక మా సిద్ధాంతమేమిటో విను- ఈ జగత్తు సర్వదా 'శాంతం-వ్యాపకం-సత్యం-ఆద్యంత రహితం'... అగు బ్రహ్మమే అయి ఉన్నది. ఇది వాస్తవానికి ఉదయించనూ లేదు. అస్తమించబోవ టమూ లేదు. ఏ నిర్విషయ శుద్ధ చైతన్యం అంతటా ఉన్నదో అదియే ఈ ద్రష్ట-దృశ్యాలు కూడా. చిదాకాశమే అల్ప దృష్టికి ఇట్లా కనిపిస్తోంది. వాయువులో స్పందత్వం, జలంలో ద్రవత్వం, ఆకాశంలో శూన్యత్వం వాటివాటికి అభేదమై భాసించుచున్నట్లే... ఆత్మయందు ఈ జగత్తు అసంగ-అద్వయ స్వభావంతో భాసిస్తోంది. ఈ జగత్తు చిదాకాశమే అయి ఆత్మయందు స్థితి కలిగి ఉన్నది.

అట్లు స్థితి కలిగి ఉన్నదగు ఆత్మాకాశం భూతాకాశం వంటిది కాజాలదు. సూర్య రహితమై, ఆ సూర్య ఉదయ-అస్తమయాలు లేనట్టి ఆత్మయందు ఏ భూతాకాశం ఉంటుంది?... భూతాకాశం ఎక్కడా లేదు. దాని మూల రూపం బయటకు కనబడేది (కళ్ళకు-చెవులకు విషయం) కాదు.

ఈ సమస్తము ఆత్మకు స్వభావ సిద్ధమగు అంగభూతమే! ఆత్మ ఈ సమస్తము అయి కూడా, దీనంతటికీ వేరుగా ఉన్నది. కాబట్టి రామచంద్రా! నీవు సర్వ దృశ్య-నామ-రూప కల్పనను విడనాడి ఉండెదవు గాక! శుద్ధ చిదాకాశమాత్రుడవై స్థితి నొంది ఉండుము.

❖❖❖

16. జగత్ సర్వం అనుత్పన్నం

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఈ భావ-అభావాలు ఈ గ్రహణ త్యాగాలు ఈ స్థూల-సూక్ష్మములు, ఈ స్థావర జంగమాలు ఇవన్నీ చిదాత్మయందు ఉదయించటానికి కారణమేమీ లేనే లేదు. ఎందుకంటే చిదాత్మ సర్వదా అకారణం కదా! అందుచేత ఇవన్నీ సృష్ట్యాదిలో ఉత్పన్నమే అయి ఉండలేదు. నిరాకారం-స్వాత్మరూపం అగు చైతన్యం ఏ సమయమందూ సాకార పదార్థము లకు 'కారణం' కాజాలదు. సాకార పదార్థం మాత్రమే సాకారమునకు కారణం కాగలదు కదా!

ఈ కారణం చేత తత్త్వజ్ఞాని సమస్త జగత్తును 'చిత్స్వభావం' గానే భావిస్తూ ఉంటాడు. తత్ఫలితంగా సర్వదా ఆత్మయందే నెలకొని ఉంటాడు.

కల్లు తాగినవాడు క్షోభచే తన నీడను చూచి తానే ప్రలాపాదులతో కూడిన "ప్రమత్తత" కలిగి ఉంటాడు చూచావా? ఆకాశరూపమగు చైతన్యం కూడా తాను ఎట్లు భావన చేస్తున్నదో... ఆ ప్రకారంగానే తన నిజరూపమగు ఈ సృష్టిని పొందుతోంది. ఎప్పుడైతే ఎదురుగా కనిపిస్తున్న

ప్పటికీ, నిర్మలమైన దృష్టికి ఇదంతా కూడా భావనామయ మాత్రమై, వాస్తవానికి ఉత్పన్నం కాకయే ఉన్నట్లు అవుతుందో... అప్పుడు ఈ జగత్తు శాంతం-సమం అగు బ్రహ్మంగానే కనబడగలదు.

జలంలో జలం యొక్క ద్రవత్వమే ప్రదర్శనమగుచున్నది కదా! చిదాకాశంలో చిదాకాశమే జగత్తుగా వర్తిస్తోంది. "చిదాత్మ వలననే, చిదాత్మ చేతనే జగత్తు పొందబడటం" అనే సంఘటనను శ్రుతులు "చైతన్యముచే ఈ జగత్తు రచించబడింది..." అని చెప్పుచున్నాయి. స్వప్నంలో స్వప్న జగత్తు ఎట్లా పొందబడుతోంది? స్వప్న ద్రష్ట తన స్వభావమును ఏమరచుటచేతనే కదా! 'కాచ' అనే రోగముతో కూడిన కళ్ళకు ఆకాశంలో వెంట్రుకలు కనిపిస్తున్నాయి. ఎందుచేత? ఆ కంటి దోషంచేతనే కదా! అట్లాగే జగత్తు అనబడేది భ్రమ చేత స్ఫురిస్తోంది. ఈ జాగ్రత్-జగత్తు స్వప్న జగత్తులాగానే చిదాకాశమునందే ఉన్నది. "సృష్ట్యాది" యందు "హిరణ్యగర్భుడు" అను సమష్టి జీవునియందలి చైతన్యము యొక్క స్వప్నమే ఇక్కడ 'జగత్తు' అనబడుతోంది. ఈ రోజు రాత్రి వ్యష్టి జీవుని (నిద్రావస్థలో పనిచేసే) ఊహా వ్యవహారమును "స్వప్నం" అని అంటున్నాం. సమష్టి జీవుడగు హిరణ్యగర్భుడు స్వస్వరూప సమక్షంలో ఆశ్రయించిన కల్పనా చమత్కారమును 'జగత్తు' అంటున్నాం. ఈ సమష్టి జీవుని జగత్ స్వప్నానికి, వ్యష్టి జీవుని జాగ్రత్ స్వప్నానికి వాస్తవానికి భేదమేమీ లేదు.

శ్రీరాముడు : స్వామీ! సృష్టి 'అవాస్తవం' అనుకుంటున్నాం కదా! మరి ఇక్కడ 'నియతి' ఉన్నది కదా! ఉదాహరణకు మామిడి విత్తు మామిడి వృక్షంగానే అగుచున్నది కాని, ఆముదము వృక్షం కాదు కదా! ఆవు కడుపున గేద జనించదు కదా! మరి 'నియతి' దృష్ట్యా ఇక్కడ కార్యకారణములు ఉన్నట్లే కదా! ఇక జగత్తు లేనిది ఎట్లా అవుతుంది.?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! నియతి సృష్ట్యాదిలో ఎట్లా నియమించబడియున్నదో – అదియే ఇప్పటికీ కొనసాగుతోంది. పూర్వకాలంలో ప్రవర్తించిన నదీజల ప్రవాహం ఇప్పటికీ (ప్రతి సంవత్సరము ఆయా సమయములందు) అట్లే ప్రవర్తిస్తోంది. నదులయందలి జలము యొక్క "తరంగసత్త" ఆ జలసత్తా కంటే భిన్నమా? కాదుకదా! చిదాకాశమున సృష్టి రూపసత్త, అందులోని నియతి, అనియతి ఇదంతా చిదాకాశం కంటే భిన్నం కాదు!

శ్రీరాముడు : హే జగద్గురూ! ఈ జగత్తులో జీవుడు జనిస్తున్నాడు. పుట్టినప్పటినుండి అనేక భావాభావములు పొందుచున్నాడు. మరల ఎప్పుడో 'అభావస్థితి' అనదగు మరణము చేరుచున్నాడు. జీవించినంత కాలం సుఖ దుఃఖములు అనుభవిస్తున్నాడు. "మరి జగత్తు లేదు" అన్నది ఎట్లా యుక్తియుక్తం? అట్లా అనుకున్నంత మాత్రం చేత దుఃఖాదులు తొలగుతాయా? మృత్యువు ఏదో ఒకనాటికి అనివార్యం కదా! ఈ విధంగా జీవన-మృత్యువులు రెండూ దుఃఖప్రదములే కదా!

శ్రీ వసిష్ఠ మహర్షి :

మృతస్య అత్యంతనాశశ్చేత్ తన్నిద్రా సుఖమేవతత్ ।
భూయశ్చ ఉదేతి సంసారః తత్ సుఖం నవమేవతత్ ॥

మరణించిన తర్వాత అత్యంత అభావమే కలుగుతుందని కాసేపు అనుకుందాం. అప్పుడు అది కూడా గాఢ నిద్రాస్థితిలో జీవులు రోజూ పొందే నిరతిశయానంద సుఖము వంటిదే అవుతుంది

కదా! కాబట్టి మరణము అనేది కూడా చిదానంద సుఖస్వరూపమే! మరల ఆ జీవుడు దేహాది రూపముగా సంసారంలో ఉదయిస్తున్నాడనుకుందాం. ఆ నూతన దేహము, నూతన వ్యవహార పరంపరలూ సుఖస్వరూపమే. ఎందుచేతనంటే ప్రతి జీవుడు 'నేను దీర్ఘకాలం జీవించాలి. ఇంకా ఇంకా బ్రతకాలి'... అని అనుకుంటున్నాడు కదా! సుఖ స్వరూపం కాకపోతే జీవించాలని ఎందుకనుకుంటాడు? ఈ విధంగా జీవన-మరణములు రెండూ సుఖ స్వరూపములేనని అనిపించుకుంటున్నాయి. మనం అనేకసార్లు ఇప్పటివరకు చెప్పుకున్నట్లుగా జగత్‌సత్తా 'ఆత్మసత్తా' కంటే వేఱుకాదు. కాబట్టి జనన మరణభీతి జీవునికి అఖరయే లేదని... అది అజ్ఞానముచే మాత్రమే ఏర్పడుచున్నదని జ్ఞానుల ఉద్దేశం.

ఇక సుఖ-దుఃఖాలంటావా?... "దుష్కర్మలచే నాకు నరకాదుల దుఃఖం వచ్చిపడు తుందేమో...?" అనేది కూడా "సుఖసత్తా" యే మూలముగా కలిగి ఉన్నది. సుఖం లభించక పోవటమే దుఃఖం. దుఃఖం కలగక పోవటమే సుఖం. ఆ రెండిటి మూలభావం ఒక్కటే. కాబట్టి సుఖ దుఃఖములు అనేవి అవినాభావ సంబంధంచే ఏర్పడేవే గాని స్వతఃసిద్ధమైనవి కావు. సుఖ-దుః ఖములందు ఇంతకుమించి నిర్మాణ విశేషమేమీ లేదు.

దృష్టాంతానికి,...ఒక వస్తువు లభించి తద్వారా 'సుఖభావన' ఉదయించిందనుకో... తక్షణం లోనే "ఇది కోల్పోతామేమో....' అనే దుఃఖభావం వెంటనంటే ఉన్నది. ఏ కారణం చేతనో (లభించ వలసినది లభించకపోవటమో, అనుకున్నది జరగకపోవటమో, ఆశించినది సిద్ధించక పోవటమో) దుఃఖం ఏర్పడిందనుకో, "ఇది తొలగగానే నాకు సుఖం లభిస్తుంది" అనే భావన వెంటనంటే ఉన్నది కదా! అట్టి దుఃఖ భయం మరణానంతరం కూడా కొనసాగుతూనే ఉన్నది. కాబట్టే జీవుడు మరల దేహధారుడగుచున్నాడు. కనుక దేహధారణ-దేహత్యాగ స్థితులు సుఖ దుఃఖములు రెండూ అందరికీ ఒకేరీతిగా సుఖ దుఃఖ సమన్వితములై ఉంటున్నాయి.

సుఖ దుఃఖములు రెండూ వాస్తవానికి లేవు. ఆ రెండూ అనుభవించేవాడు మాత్రమే వాస్తవమైన 'సత్త' కలిగి ఉన్నాడు.

అంతఃశీలుడు -

మరణం - జీవితం నాస్తు సహజే వాసనే తయోః ।
ఇతి విశ్రాంత చిత్తో యః సో "అన్తఃశీతల" ఉచ్యతే ॥

మరణమైనా జీవితమైనా అవి రెండూ దేహసంబంధమైనవి గాని దేహికి సంబంధించినవి కాదు. దేహి పుట్టడు, చావడు. ఎవనికైతే జీవించటం - మరణించటం అను రెండూ కూడా స్వాభావిక బ్రహ్మసుఖ రూపములుగా ఉంటాయో..అట్టి అనునిత్య విశ్రాంత చిత్తుడగు జీవుని "అంతఃశీలుడు" అని పిలుస్తారు.

ముక్తుడు - వృత్తులన్నీ ఎవరియందు నశించి, ఎవడు దశ్యస్ఫురణ లేకయే ఉంటాడో... అట్టివాడు సర్వబంధ వినిర్ముక్తుడు అవుతాడు. అట్టివాడు. చిద్రూపమగు ఆత్మయందు తన్మయుడై

ఉంటాడు. అట్టివాడు "ముక్తుడు" అని అనిపించుకుంటాడు. ముక్తునికి (ఆత్మ తన్మయునికి) సుఖ దుఃఖములు, జీవన్మరణములు సమానంగానే కనబడతాయి.

అందుచేత రామచంద్రా! ఆత్మజ్ఞాన ప్రభావం చేత ఈ దృశ్యమంతా "స్వప్నతుల్యము" అను భావనా పటిమ పటిష్టమగుచున్నది. దృశ్యము యొక్క "అత్యంతాభావన" చేత (అట్టి కారణంగా) ఈ సృష్టి ఉంటున్నా లేక ఉండకపోయినా ఆ ఆత్మజ్ఞానానికి ఒక్కటే అవుతుంది.

"దేహిగా నేను ఏదై ఉన్నాను? ఈ దృశ్యము ఏమై ఉన్నది?" అను రెండు విషయాలు జ్ఞానముచే సుస్పష్ట పరచుకున్నవానికి దృశ్యము ఉన్నా కూడా లేనట్లే! జన్మ మృత్యువులు కనబడుచున్నా అవి దూరంగా ఉన్న అపరిచిత గ్రామంలోని దైనందిన సంఘటనలవలె చూడబడతాయి. జ్ఞానియందు సర్వ దృశ్యానుభవరహితమగు "శుద్ధ నిర్విషయచైతన్యము" నిత్యోదయమై ఉంటోంది. అట్టి శుద్ధ చైతన్యము దృశ్యరూపం కాదు. విషయరూపం కాదు. చేతనావృత్తి రూపం కాదు. చేతితము కాదు. అట్టి చైతన్యముతోటి ఏకత్వము పొందిన మహనీయులు సంసార వ్యవహారరహితులై ఉంటారు. వారి పట్ల సంసారము ఏదో ఉబుసుపోకకు చదివే కథలోని సంఘటనల వలె ఉంటోందిగాని సుఖ-దుఃఖ కారకము కాజాలదు.

"అతి నిర్మలము" అగు చిదాకాశమున "చైతన్యము" అను గాజు (కళ్ళజోడు) యొక్క నిరంతర స్ఫురణయే ఈ జగత్తు. కాబట్టి అంతా చైతన్యమే అయి ఉండగా, ఇక బంధ మోక్షములు ఎచట? ఈ జగత్తు చిదాకాశము యొక్క స్ఫురణమాత్రము, సంకల్ప రూపము అయి ఉన్నది. కాబట్టి ఇదంతా సత్‌చిన్మయమే గాని మట్టి-గాలి కాదు. ఇక్కడ వాస్తవానికి దేశము-కాలము-పదార్థము-క్రియ-ఆకాశము మొదలైనవి ఆత్యంతిక దృష్టిచే లేవు. ఈ జగత్తు ప్రతిభాసమాత్రంగా అన్యోన్యత్వం చేత వృద్ధి చెందనీ, చెందకపోనీ... అట్టి స్వకీయ కల్పన దృష్ట్యా (కల్పన చేత ఏర్పడి ఉంటోంది కాబట్టి) ఇది లేనిదే, అసత్తే! అధిష్ఠాన రూపం చేతనో... ఇదంతా ఆత్మయే. కనుక సత్తే.

ఈ ప్రకారంగా ఈ 'జగత్తు' రూపంగా కేవల ఘనమగు ఆత్మయే ప్రకాశిస్తోంది.అట్టి ఆత్మ ఆకాశము కంటే కూడా అతి నిర్మలము అయి ఉన్నది. అది శూన్యం కాదు, అశూన్యం కాదు. అది "సాకారం"గా ఉన్నట్లు తోచినప్పటికీ వాస్తవానికి నిరాకారంగానే ఉన్నది. అసత్తువలె కన్పట్టినప్పటికీ మిక్కిలి ప్రకాశవంతమై ఉన్నది. అతి శుద్ధం. స్వప్న నగరం వలె అంతులేని విస్తీర్ణం కలిగి ఉన్నది.

ఈ ప్రకారంగా చిదాకాశము యొక్క కలుషిత జగద్రూపం, వాస్తవానికి, శుద్ధవ్యాపక నిర్వాణ రూపమే అయి ఉన్నది. అట్టి నిర్వాణరూపముచే వ్యాపించబడనిదేదీ లేదు. ఆకాశంలో శూన్యత్వంవలె, జలమునందు ద్రవత్వంలాగా ఈ జగత్తు పరమాత్మ రూపమే! అంతేగాని ఇది నానావిధ రూపములుగా కూడి ఉన్నది కాదు.

❖❖❖

శ్రీరాముడు : నిర్లిప్తము, నిర్విషయము అగు ఆత్మ నుండి విషయరూపమగు మనస్సు ఉద్భవించటం చమత్కారమే కాదా!

శ్రీవసిష్ఠ మహర్షి : ఎవడైతే 'సూర్య కిరణములు సూర్యుని కంటే వేరే'... అని అనుకుంటాడో, వానికి ఆ సూర్య కిరణములు అన్యమైనట్లే భాసిస్తాయి. 'బంగారము కంటే అభరణములు వేరైనవి'... అనుకునే వాని అనుభవం అట్లే (వేరైనట్లుగానే) ఉంటుంది గాని, అది 'బంగారం కదా' అని అతను అనుకోవటం లేదు. కానీ, 'సూర్యబింబము నుంచే బయలుదేరిన కిరణములు సూర్యునికి వేరైనవి ఎట్లా అవుతాయి? బంగారము కంటే ఆభరణం వేరైనదని అనటం ఎట్లా?'... అని భావించావనుకో? అప్పుడు మొదటి వానికంటే వ్యతిరిక్తమైన అనుభవమే ఉంటుంది.

తరంగములు చూచేవానికి తరంగబుద్ధియే ఉంటుందిగాని, జలబుద్ధి ఉండదు. "తరంగములు జలము కుంటే వేరు కాదు" అని తలచేవాడికో? ఇతనికి జలబుద్ధియే ఉంటుంది గాని, తరంగ బుద్ధి ఉండదు. "బంగారము యొక్క ఆకారములైన ఆభరణములందు కూడా ఉన్నది బంగారమే"... గ్రహించేవాడు మహాబుద్ధిమంతుడై ఉంటాడు. అట్టివాడు "నిర్వికల్పుడు" అని చెప్పబడతాడు. "త్రిగుణాత్మకమై కనిపించే ఈ దృశ్యాంతర్గత జీవులంతా త్రిగుణాతీతమగు పరమాత్మ యొక్క సంప్రదర్శనా విన్యాసమే" – అని గమనించడాన్నే 'నిర్వికల్పము' అను శబ్దముచే ఉద్దేశించబడుతోంది.

పుట: 522

CONQUER YOURSELF
ISBN 93-83972-14-2 (Set)
9789383972142

రామకృష్ణ మఠం
దోమలగూడ, హైదరాబాదు-29
email : publication@rkmath.org

www.rkmath.org
Vasishta Rama Samvadam : Vol 3
ISBN 93-83972-12-8 ₹ 1000/- (set)